ఈనాడు
అల్లూరి సీతారామరాజు
బుధవారం 25 ఫిబ్రవరి 2026 5

విజేతలతో రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ విశాఖ బ్రాంచి మేనేజర్ వీవీఎస్ రాఘవేంద్రరావు, న్యాయ నిర్ణేతలు,తదితరులు

ఆలోచనల ప్రభంజనం.. అమోఘ ప్రయో'జనం'!!

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సీతంపేట, కార్పొరేషన్: సమాజంలో నిత్యం ఎదురయ్యే ప్రధాన సమస్యలపై విద్యార్థులు దృష్టి సారించారు. తమ సృజనాత్మకతను జోడించి ఆధునిక పరిజ్ఞానంతో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 77 ప్రాజెక్టులు రూపొందించారు. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు- గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ' సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు అనూహ్య స్పందన వచ్చింది. సుస్థిరాభివృద్ధి విధానాలు, పర్యావరణ హిత ప్రాజెక్టులపై ఎక్కువ మంది విద్యార్థులు దృష్టి పెట్టారు.

● నగరంలోని రామాటాకీస్ సమీప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ భవన్‌లో.. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వాటిలో మూడు ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించగా.. నాలుగింటికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

● ప్రదర్శనలను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ తదితరులు పరిశీలించి పలు సూచనలు చేశారు

విద్యార్థులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విద్యార్థులకు కలెక్టర్ దిశానిర్దేశం..: ఈ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ ప్రాజెక్టులను తిలకించారు. 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర', ఘన వ్యర్థాలు, అపార్ట్‌మెంట్లలో మురుగు నీటి నిర్వహణ తదితర ప్రాజెక్టులను పరిశీలించి వాటిని ఎలా మెరుగుపరచుకోవచ్చో సూచించారు. వ్యవసాయ రంగానికి మేలు చేసే అంశాలపై దృష్టిసారించాలన్నారు.

GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారాలు

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

ప్రాజెక్టు: నెక్సస్ అథేరియా
పాఠశాల: మాలతాంబ విద్యానికేతన్, పీఎంపాలెం
విద్యార్థులు: పి.హర్షిత్, రాము
ఉపయోగం: కూలిపోయిన ఇళ్ల వ్యర్థాలతో ప్లాస్టిక్‌ను కలిపి త్రీడీ ప్రింటింగ్ ద్వారా కొత్త ఇళ్ల నమూనా తయారు చేసి గృహాలు నిర్మిస్తారు. ఇందులోని అంశాలను పరిశీలిస్తే.. భూకంపాలు వచ్చినపుడు బేస్ ఐసోలేషన్ వల్ల భవనాలు కూలిపోకుండా రక్షిస్తుంది. ఫిజియో ఎలక్ట్రికల్ సామగ్రితో మనుషుల అడుగుజాడలను ఎనర్జీగా మారుస్తుంది.
వైర్‌లెస్ కార్ ఛార్జింగ్ స్టేషన్ : పార్కింగ్ వద్ద ట్రాన్స్‌మీటర్లు ఏర్పాటు చేస్తారు. అవి ఎలక్ట్రో మాగ్నెటిక్ వేవ్స్‌ను కారులోని రిసీవర్‌కు పంపించడం వల్ల వాటి సాయంతో వాహన బ్యాటరీ ఛార్జింగ్ అవుతుంది.
టెస్లాకోయిల్ : ఇది తీగలు లేకుండా విద్యుత్తును పంపిస్తుంది.

కాఫీ విత్తనోత్పత్తి కేంద్రంగా 'ఆర్‌వీనగర్'

మేలురకం కాఫీ విత్తనాల తయారీలో సిబ్బంది

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే
ఆర్‌వీనగర్‌లోని ప్రాంతీయ కాఫీ పరిశోధనా స్థానం మేలు రకం కాఫీ విత్తనాలను అభివృద్ధి చేయడంతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ ప్రత్యేకతను చాటుతోంది. 1976 నుంచి ఐదు దశాబ్దాలుగా గిరిజన రైతులకు సేవలందిస్తోంది. కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కాఫీలో కొత్త వంగడాలను పరిచయం చేయడంతోపాటు శాస్త్రీయ విధానాలు, అధిక దిగుబడులు, నాణ్యతకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఈ పరిశోధనా స్థానానికి ప్రభుత్వం వంద ఎకరాల భూములను కేటాయించింది. ఇందులో అనేక రకాల కాఫీ వంగడాలు పెరుగుతున్నాయి.

● శాస్త్రవేత్తలు మేలు రకం కాఫీ విత్తనాల తయారీపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఏటా ఇక్కడి క్షేత్రాల్లో పండించిన కాఫీ ద్వారా సుమారు 8 వేల కేజీల మేలురకం విత్తనాలను తయారు చేసి ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులకు అందజేస్తున్నారు. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థకే (ఐటీడీఏ) పరిమితం కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది లక్ష్యానికి మించి 10,700 కేజీల విత్తనాలను అభివృద్ధి చేసి ఐటీడీఏతోపాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసినట్లు పరిశోధనా స్థానం అధికారి సునీల్‌బాబు చెప్పారు. బెర్రీబోరర్ కీటకం వ్యాప్తి చెందిన నేపథ్యంలో ఆంక్షల కారణంగా కొన్ని ప్రాంతాలకు ఎగుమతి చేయలేదన్నారు.

ప్రోత్సాహక బహుమతుల విజేతలు

ప్రయోగం : వ్యర్థాల నుంచి కాగితం తయారీ
విద్యార్థులు : ఆర్.వైష్ణవి(8వ తరగతి), డి.పార్థసారథి(6వ తరగతి), జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల, బుచ్చిరాజుపాలెం

★ దేశంలో కాగితం తయారీకి చెట్లు నరకాల్సి వస్తుంది. దీంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుంది. ఈ సమస్యను అధిగమించేలా ఇంట్లో సేకరించే కాయగూరలు, పండ్ల వ్యర్థాల నుంచి కాగితం తయారు చేసే విధానాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఎలా చేయొచ్చో వివరించారు.

ప్రయోగం: ట్రాలీ సూట్‌కేసును మెట్లు ఎక్కించేలా...!
విద్యార్థులు : ఆర్.దీక్షిత, ఎస్.దీపిక(6వ తరగతి), జడ్పీహెచ్‌ఎస్, వెంకటాపురం

★ రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో ట్రాలీ సూట్‌కేస్‌లు తీసుకెళ్లే ప్రయాణికులు మెట్లు ఎక్కే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ సమస్యను పరిష్కరించేలా... ట్రాలీ సూట్‌కేస్ వెనుక వైపు రెండు ఇనుప రాడ్లను 'ఎక్స్' ఆకారంలో అమర్చారు. మెట్లు ఉన్నచోట ఆయా రాడ్లను తెరిచి వాటి సాయంతో సూట్‌కేసును పైకి ఎక్కించేలా ఏర్పాట్లు చేశారు. మెట్లు ఎక్కగానే, తిరిగి వాటిని మడిచే వీలుంటుంది.

ప్రాజెక్టు: స్మార్ట్ సిటీ
పాఠశాల: సంస్కృతి గ్లోబల్ స్కూల్, పరవాడ
విద్యార్థులు: జి.జతిన్‌చౌదరి, పి.ఆష్మాన్ గుప్త
ఉపయోగం: ఇందులోని సోలార్ ట్రాకర్ వల్ల సూర్య కిరణాలు ఎటువైపు ఉంటే సోలార్ ప్యానల్ అటు వైపునకు తిరుగుతుంది. **స్మార్ట్ డస్ట్‌బిన్ :** డస్ట్‌బిన్ నిండితే బెల్ మోగుతుంది. **వైర్‌లెస్ కార్ ఛార్జర్ :** ఛార్జింగ్ ప్లాట్‌ఫాంపై కారు కింది భాగంలో కాపర్ కాయిల్ ఏర్పాటు చేసి విద్యుత్తు అందిస్తే... దాని నుంచి ప్రత్యేక పరికరాల ద్వారా విద్యుత్తు ట్రాన్స్‌మిట్ అవుతుంది. **వర్టికల్ విన్ టర్బైన్ :** రహదారిపై వాహనాలు వెళ్లేటప్పుడు వచ్చే గాలితో టర్బైన్‌లు తిరిగి విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాన్ని స్టోరేజ్ చేసుకోవచ్చు. **స్మార్ట్ వీధి దీపం:** చీకటి పడినప్పుడు దానంతటదే వెలిగి, సూర్యరశ్మి పడగానే ఆగిపోతుంది.

ప్రయోగం : పంట ఉత్పత్తులు తడవకుండా...!
విద్యార్థులు : సీహెచ్.రఘువీర్, టి.జ్ఞానేశ్వరి, ఎస్.దేవన్ (9వ తరగతి), జడ్పీహెచ్‌ఎస్, వేపగుంట

★ పొలాల్లో ఆరబెట్టిన పంటలు తడవకుండా రక్షించే ప్రాజెక్టు ఇది. ప్రత్యేకంగా పైకప్పు తెరిచి ఉన్న గదిని తయారు చేసి, అందులో ధాన్యం, ఇతర పంట గింజల్ని ఆరబోస్తారు. పైకప్పునకు సెన్సర్లు ఏర్పాటు చేస్తారు. వాటిపై ఒక్క చుక్క వర్షం పడినా, వెంటనే తెరిచి ఉన్న పైకప్పు పూర్తిగా మూసుకుపోయేలా సెన్సర్లు పని చేస్తాయి.

ప్రయోగం : సమస్యలకు 'సాంకేతిక' పరిష్కారం
విద్యార్థులు : ఎస్.హర్ష, కె.ఆదిత్య (9వ తరగతి), సీహెచ్.నవనీత్ (8వ తరగతి), ప్రతిభా విద్యాలయం, సబ్బవరం.

★ గాలిలో కాలుష్య కారకాలు గుర్తించడం, సౌర పలకల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయడం, వాణిజ్య సముదాయం సెల్లార్లు వాహనాలతో నిండితే, బయట నుంచి లోపలకు వచ్చే వాహనచోదకులకు ఆ విషయాన్ని తెలియజేయడం...ఇలా పలు సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించిన ప్రదర్శన ఇది. అలాగే చెత్తను మండించి, ఆ వేడి నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం ఆకట్టుకుంది.

ప్రాజెక్టు: స్మార్ట్ హెల్మెట్
పాఠశాల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడుపూరు
విద్యార్థి: టి.ఉదయ్ కిరణ్

ఉపయోగం: శిరస్త్రాణం ధరించక ఎంతో మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి పరిష్కారమే స్మార్ట్ హెల్మెట్. ★ హెల్మెట్, ట్రాన్స్‌మీటర్, సెన్సర్, రిసీవర్, 298 ఎన్ మోటార్ రిసీవర్ మాడ్యుల్, డీసీ మోటార్, బ్యాటరీ.. వీటిని వినియోగించి స్మార్ట్ హెల్మెట్ తయారు చేశారు. తలకు హెల్మెట్ తగిలిస్తేనే మోటార్ సైకిల్ ఇంజిన్ స్టార్ట్ అవుతుంది. దీనివల్ల వాహన చోదకులు తప్పనిసరిగా ధరించాల్సి వస్తుంది.

ద్వితీయ ఇంటరు పరీక్షకు 224 మంది గైర్హాజరు

పాడేరులో పరీక్ష కేంద్రం గేటు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

పాడేరు, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుకాగా 4,237 మంది విద్యార్థులకు 224 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ భీమ శంకరరావు చెప్పారు. పాడేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాల పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులను తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. లగిశపల్లి కస్తూర్బా, కుమ్మరిపుట్టు గురుకులం, కస్తూర్బా కళాశాల విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు. పాడేరు జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థినులు బస్సు రావడం ఆలస్యం కావడంతో అరగంట పాటు రోడ్డుపై ఎండలో నిరీక్షించాల్సి వచ్చింది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్:బుధవారం సాయంత్రం 6:11 గం॥లకు
సహరి: గురువారం తెల్లవారుజాము 4:59 గం॥లకు

అంత తొందరొద్దు.. అప్పుడే బండి తీయొద్దు

పాడేరు, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

● ఈనెల 22న మధ్యాహ్నం పాడేరు మండలం చింతలవీధి - హుకుంపేట మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదానికి కారణం ముగ్గురు ఒకే బైక్‌పై అతివేగంతో దూసుకురావడమే. వీరు ముగురూ మైనర్లే. ఒకరు ప్రథమ సంవత్సరం ఇంటర్, ఇద్దరు డిగ్రీ చదువుతున్నారు.

● గతేడాది డిసెంబర్ 7న వంజంగి మేఘాలకొండ అందాలు చూసేందుకు ఇద్దరు బాలలు వెళ్లారు. అధిక వేగంతో వెళ్తూ ప్రధాన రహదారిపై ఉన్న సిగ్నల్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు.

ప్రమాదాలకు తావిస్తున్న మైనర్ల డ్రైవింగ్

ఏబులం కట్టువీధిలో గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

జిల్లాలో వాహనప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇందుకు మైనర్ల డ్రైవింగ్ కూడా ఒక కారణం. పిల్లలు గొడవ పెడుతున్నారని తల్లిదండ్రులు వారు అడిగిన ద్విచక్రవాహనాలు కొనిస్తున్నారు. వారేమో నిబంధనలకు విరుద్ధంగా దూసుకెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో లైకుల కోసం విన్యాసాలు చేస్తూ వీడియోలు పోస్టు చేస్తున్నారు. ఈ ప్రయత్నాల్లో కొన్నిసార్లు తమతోపాటు ఇతరులనూ గాయాలపాలు చేస్తున్నారు.

★ 18 ఏళ్లు నిండకుండా, లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనం నడపడం చట్టరీత్యా నేరం. జిల్లాలోని చాలా జూనియర్ కళాశాలలతో పాటు పాఠశాలకు సైతం పలువురు ద్విచక్రవాహనాలపై వస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం సరికాదని ఉపాధ్యాయులు హితవు పలుకుతున్నా ఖాతరు చేయడం లేదు.

★ మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు ఎంతా హెచ్చరిస్తున్నా పరిస్థితి మారడం లేదు.

★ జాతీయ రహదారి నిర్మాణం తరవాత విశాలమైన హైవే అందుబాటులోకి రావడంతో అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరులో యువత అతివేగంతో బైక్‌లు నడిపేస్తున్నారు. అదుపు చేయలేక.. చివరకు గాయాలతో ఆసుపత్రి పాలవుతున్నారు.

■ పాడేరు సబ్ డివిజన్ పరిధిలో గతనెలలో దాదాపు 440 మంది మైనర్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెలలో ఇంత వరకు 270 మందిని గుర్తించారు.

■ గూడెంకొత్తవీధి మండలం ఏబులం కట్టువీధిలో ఓ గిరిజన రైతు కుమారుడి కోరిక కాదనలేక పసుపు తోట భూమితో సహా అమ్మి రూ. 85 వేలకు అమ్మి ఖరీదైన ద్విచక్రవాహనం కొనిచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న గూడెంకొత్తవీధి సీఐ సుధాకర్ మంగళవారం గ్రామానికి వెళ్లి ఆ బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే.. పిల్లల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉల్లంఘనలకు శిక్షలు ఇలా..

✦ మైనర్లు వాహనం నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడితే ఆ వాహనాన్ని సీజ్ చేస్తారు. అంతేకాకుండా రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు జరిమానా విధిస్తారు.

✦ మైనరు ద్విచక్రవాహనం నడుపుతూ ప్రమాదానికి కారణమైతే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడికి జైలుశిక్ష విధించడంతోపాటు వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు.

✦ వాహనాలపై విన్యాసాలు చేయడమే కాదు, వాటి రూపురేఖలు మార్చి.. నంబరు ప్లేట్లు, సైలెన్సర్లు తొలగించినా నేరమే.

ఇకపై ప్రత్యేక డ్రైవ్‌లు

మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదు. డీజీపీ ఉత్తర్వుల మేరకు ఇకపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతాం. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే బండి ఇచ్చినవారికి కూడా శిక్ష తప్పదు. ఒత్తిడి తెచ్చినా ఇవ్వొద్దు. ప్రమాదాల తీవ్రత, కేసుల్లో ఇరుక్కుంటే కలిగే ఇబ్బందులను వివరించాలి. ఇకపై వీటిపై కేసులు నమోదు చేస్తాం. ఈ ఏడాది 10 మందిపై మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశాం.

– అభిషేక్, పాడేరు డీఎస్పీ

ఆనందాల వేదిక.. ఆత్మీయ వేడుక

చింతపల్లిలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలతో మంగళవారం సందడి వాతావరణం నెలకొంది. పదో తరగతి విద్యార్థినులకు వారి జూనియర్లు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అందరూ గ్రూపుగా ఫొటోలు దిగారు. ప్రధానోపాధ్యాయుడు రాజు, వార్డెన్ నూక రత్నం ఏర్పాట్లను పర్యవేక్షించారు.
– న్యూస్‌టుడే, చింతపల్లి గ్రామీణం

ఘనంగా ఐటీడీఏ పీఓ వివాహం

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, మేఘాలయలో సంయుక్త కలెక్టర్‌గా పని చేస్తున్న ఆదిత్యవర్మ వివాహం ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరిలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ ఇద్దరు యువ ఐఏఎస్ అధికారులు ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో ఒక్కటయ్యారు. ముందుగా డిసెంబర్‌లో విశాఖపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో వీరి వివాహాన్ని రిజిస్టర్ చేసుకున్నారు. మంగళవారం సంప్రదాయ పద్ధతిలో వివాహ వేడుక జరిగింది. వరుడు ఆదిత్యవర్మ లక్నో వాస్తవ్యుడు. శ్రీపూజ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 28న రిసెప్షన్ వేడుక జరగనుంది.

వివాహ వేడుకలో నవదంపతులు

(c) eenadu

మరింత బాధ్యతగా రోగులకు వైద్యసేవలు

గొడిచెర్ల ఆసుపత్రి ఆవరణలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ హైమావతి

నక్కపల్లి, పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఆసుపత్రుల్లో రోగులకు అందించే సేవల విషయంలో వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.హైమావతి సూచించారు. నక్కపల్లి మండలం గొడిచెర్ల, పాయకరావుపేట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల నిల్వ గది, స్టాకు రికార్డులతోపాటు ఓపీ ఇతర రికార్డులు ఆమె పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల మర్యాదగా వ్యవహరించాలని, గర్భిణులకు ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకునేలాచూడాలన్నారు. ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. వార్డులు పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తుండాలన్నారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. పాయకరావుపేటలో మాతా శిశు మరణాలు, ల్యాబ్ పరీక్షలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమీక్షించారు. వైద్యాధికారులు డి. సుభాష్, వి.ఎస్.సౌందర్య, శ్రావణసంధ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం కట్టడే కీలకం

గంగవరం పోర్టు వద్ద ఇనుప ఖనిజ మిశ్రమ కేంద్రం

ఈనాడు–విశాఖపట్నం: పోర్టుల కాలుష్యం కట్టడి చేయకుంటే దిల్లీని విశాఖ మించి పోయేలా ఉంది. తాజాగా గంగవరం పోర్టులో ఇనుప ఖనిజం మిశ్రమ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న తరువాత ఈ విషయం మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఈ ఒప్పందంతో అదానీ గంగవరం పోర్టు సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరుతుంది. మేజర్ పోర్టుగా విశాఖ, ఆ పక్కనే 20 కి.మీ. దూరంలో గంగవరం పోర్టు, ఇటీవల అనుమతులిచ్చిన నక్కపల్లిలో ఆర్సెలార్ మిత్తల్‌కు క్యాప్టివ్ పోర్టు, ఇలా మూడింటి నుంచి వచ్చే కాలుష్యం కట్టడి ఎలా? అనేది అందరిని వేధిస్తున్న ప్రశ్న. బల్క్‌గా బొగ్గు, ఇనుప ఖనిజాల రవాణా జరిగే పరిస్థితి ఉండటమే ఇందుకు కారణం.

★ ఇప్పటికే గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యం గాజువాక, కూర్మన్నపాలెం, కణితి రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్రభావం చూపుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

పెల్లెట్ ప్లాంటు పెడితే విశాఖ ఉక్కుకు ఉపయోగమంటూ గతేడాది జనవరిలో స్టీలు ప్లాంటుకు చెందిన 1,100 ఎకరాలను ఎన్ఎండీసీకి అప్పగించారు. ఈ భూముల రిజిస్ట్రేషన్ కూడా పూర్తయిన ఏడాదిగా ఖాళీగానే ఉన్నాయి. అదానీ, వేల్, ఎన్ఎండీసీకి మధ్య ఒప్పందం జరగడంతో ఆ ఇనుప ఖనిజ మిశ్రమం పెట్టేందుకు ఎన్ఎండీసీ ప్లాంటు నుంచి తీసుకున్న భూముల్లోనే ఉపయోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదానీ పోర్టుకు వచ్చే ఇతర నిల్వలు సైతం ఇక్కడే ఉండే అవకాశం ఉందని, భవిష్యత్తులో పోర్టు సామర్థ్యం పెరిగితే విశాఖ ఉక్కు భూముల వైపే చూస్తారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వంలో

విశాఖ ఉక్కును ఉపయోగమని చెప్పి..

జగన్ రూ.3 వేల కోట్ల విలువైన రాష్ట్ర వాటాను అదానీకి రూ.600కోట్లకే కట్టబెట్టారు. అప్పటి నుంచి స్టీలు ప్లాంటుకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. గంగవరం పోర్టు పూర్తిగా అదానీ చేతుల్లోకి వెళ్లాక పరిస్థితులు మారిపోయాయి. స్టీలు ప్లాంటు కోసం ప్రత్యేకంగా ఉండే బెర్త్ రద్దు చేశారు. కన్వేయర్ ఛార్జీలు పెంచడం, మార్జిన్ (ఫ్యూ) లేకుండా పాతబకాయిలు చెల్లిస్తేనే అనే నిబంధన పెట్టడం, నౌకల్లో సరకు సకాలంలో దింపని పరిస్థితులతో డెమరేజ్ ఛార్జీలు ప్లాంటుపై పడటం, పోర్టులో కార్మికుల సమ్మె.. ఇలాంటి ఎన్నో అంశాలతో విశాఖ ఉక్కుకు ఇబ్బందులు తలెత్తాయని కార్మిక సంఘాలు గుర్తు చేస్తున్నాయి.

సూక్ష్మ తాజ్‌మహల్‌కు లిమ్కాబుక్‌లో చోటు

నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. వెంకటేష్ ఇటీవల అగరుబత్తీల పాటు శ్రమించి పెన్సిల్ ముల్లుపై నాలుగు మిల్లీ మీటర్ల ఎత్తు, నాలుగు మి.మీ. వెడల్పుతో తాజ్ మహల్ రూపొందించారు. దీన్ని లిమ్కాబుక్‌కు పంపించగా, ప్రతినిధులు దీనిని గుర్తిస్తూ ఈయనకు ప్రశంసాపత్రం పంపించారు. – నక్కపల్లి, న్యూస్‌టుడే

సీపీఎస్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ ఎన్నిక

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్‌ఈఏ) జిల్లా కార్యవర్గ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య భవనంలో జరిగిన ఎన్నికలో సంఘ జిల్లా అధ్యక్షుడిగా జి.రాజు, ప్రధాన కార్యదర్శిగా వి.కృష్ణమోహన్, ఆర్థిక కార్యదర్శిగా రాజాన సన్యాసినాయుడు, సహాధ్యక్షులుగా వేదూరి శ్రీనివాసరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా కనిశెట్టి ఉమ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా మళ్ల ఉమామహేశ్వరి, ఎం.సూర్యకుమారి తదితరులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సి.గణేష్, ఎం.ఈశ్వరరావు, అబ్రహం సునంద తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మార్చి ఒకటిన విశాఖలో సాగర ఘోష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా కార్యవర్గం

28న పింఛన్ల పంపిణీ

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ఈ నెల 28న చేపడుతున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి పేర్కొన్నారు. మార్చి ఒకటి ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛను అందిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 2,53,987 మంది లబ్ధిదారులకు రూ. 107 కోట్ల మేర నగదును సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి అందిస్తారన్నారు. అనివార్య కారణాలతో ఆ రోజు అందుకోలేనివారు మార్చి రెండున మధ్యాహ్నం స్వగ్రామం, స్వగ్రామాల వద్దకు వెళ్లి పింఛను నగదు తీసుకోవచ్చన్నారు. 28న ఉదయం ఏడు గంటలకే పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

రెండోరోజు హోరాహోరీ..

సబ్బవరం, న్యూస్‌టుడే: జాతీయ దివ్యాంగుల 5వ వీల్‌చైర్ క్రికెట్ పోటీలు రెండో రోజు మంగళవారం కూడా అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గుల్లేపల్లి సమీపంలోని ఓ ప్రైవేటు స్టేడియంలో కొనసాగాయి. ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 201 పరుగులు చేసింది. రేవతి శ్రీను 42 బంతుల్లో 82 పరుగులు, ప్రశాంత్ 39 బంతుల్లో 52 పరుగులు, సంతోష్ 30 బంతుల్లో 34 పరుగులు చేసి భారీ స్కోరుకు తోడ్పడ్డారు. రెండో బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 155 పరుగులు సాధించింది. దీంతో ఆంధ్ర జట్టు 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఏపీ జట్టు విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శ్రీను నిలిచాడు. మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తెలంగాణ 20 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 282 పరుగుల భారీ స్కోర్ చేసింది. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు దిగిన ఒడిశా జట్టు 20ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేయడంతో తెలంగాణ జట్టు విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షేక్ మోను నిలిచాడు. విజేతలను దివ్యాంగుల కమిటీ ఛైర్మన్ రమణ్ సుబ్బారావు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కమిటీ కార్యదర్శి ఎర్రపల్లి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.వి. రమణ, జాయింట్ కార్యదర్శి ఏసు బాబు, కె.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య మ్యాచ్‌లో దివ్యాంగ క్రీడాకారులు

అనధికార మార్గాల మూసివేత

స్పందనకు వందనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నక్కపల్లి మండల పరిధిలో పలు అనధికార మార్గాలను మూసివేస్తున్నారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై 'ఈనాడు'లో వస్తున్న కథనాలపై పోలీసు ఉన్నతాధికారులు, హైవే నిర్వహణ సంస్థ ప్రతినిధులు స్పందించారు. నక్కపల్లి మండల పరిధిలో పరిస్థితిపై సీఐ జె.మురళి దృష్టి సారించారు. సారిపల్లిపాలెం, నక్కపల్లి, ఉద్దండపురం తదితర ప్రాంతాలలో అక్రమంగా రోడ్డు దాటుతున్న ప్రాంతాలను గుర్తించారు. హైవే ప్రతినిధుల ద్వారా భారీ సిమెంట్ పలకలు రప్పించి ఆయా మార్గాలను అడ్డుగా పెడుతున్నారు. మిగిలిన చోట్ల పూర్తిగా గుర్తించి పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ఎస్సై పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

సారిపల్లిపాలెం వద్ద అనధికార మార్గం మూయిస్తున్న పోలీసులు

ఉద్యోగాలకు 108 మంది ఎంపిక

నియామక పత్రం అందజేస్తున్న సతీష్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా ఏర్పాటైంది. 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి 108 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి కళాశాల కరస్పాండెంట్ సతీష్ నియామక పత్రాలు అందజేశారు. ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎవరెస్టు పర్వతారోహణ శిక్షణకు పయనం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నుంచి ముగ్గురు దివ్యాంగ విద్యార్థులు ఎవరెస్టు పర్వతారోహణ శిక్షణకు పయనమయ్యారు. అనకాపల్లి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి లద్దాఖ్ వెళ్లేందుకు విమానం ఎక్కారు. అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఎవరెస్టు బేస్ క్యాంపునకు జిల్లా నుంచి పవన్‌కుమార్, దుర్గాప్రసాద్, రాము ఎంపికైన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి 22 మంది 12 రోజులపాటు జిల్లా ప్రత్యేక శిక్షణకు వెళ్లారని సమగ్ర శిక్షా పీవో శ్రీనివాస్ చెప్పారు.

విమానంలో దివ్యాంగ విద్యార్థులు

సైక్లింగ్ పోటీలో క్రీడాకారుల జోరు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల్లో పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపారు. షవలీగ్ క్రీడ పోటీల్లో భాగంగా అండర్ 18 విభాగంలో నిర్వహించిన పోటీలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. పట్టణంలోని సుంకరిమెట్ట నుంచి దేవీపురం వరకు సైక్లింగ్ చేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి శైలజ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఒకటి వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు.

అనకాపల్లి రహదారిపై పోటీలో క్రీడాకారులు

రాష్ట్రపోటీకి కశింకోట విద్యార్థి

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు కశింకోట డీపీఎన్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు వి. ప్రభాకర్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లిలో జిల్లాస్థాయి సైక్లింగ్ రేస్ పోటీలలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి పీతల కిశోర్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 28, మార్చి 1వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటాడని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు ఎన్.జె.వి.ప్రసాద్ వ్యాయామ ఉపాధ్యాయిని కమల, ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి అభినందించారు.

పీతల కిశోర్

గణిత ఒలింపియాడ్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర గణిత ఒలింపియాడ్‌లో నక్కపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ ఉషారాణి మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పూడి వర్షిత ఇటీవల జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ చూపించిందన్నారు. ఈ విద్యార్థినికి గుంటూరు వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం, బహుమతి అందించారన్నారు. పాఠశాలకు వచ్చిన వర్షితను ప్రిన్సిపల్ తోపాటు వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

విద్యార్థిని వర్షితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఉషారాణి తదితరులు

రగ్బీలో ఎం.జగన్నాథపురం విద్యార్థిని..

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రగ్బీ జాతీయస్థాయి పోటీల్లో ఎం.జగన్నాథపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎం.ఇందు ఆంధ్ర జట్టు తరపున పోటీల్లో పాల్గొని కాంస్యం పతకం సాధించింది. జాతీయ పోటీల్లో ప్రతిభ చూపించి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకొచ్చిన విద్యార్థినిని మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కె.రాజా రత్నకుమార్, సర్పంచి కరెడ్ల బుల్లమ్మ, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఉష తదితరులు శిక్షకుడు వెంకట్, వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మిరెడ్డి రాజును అభినందించారు.

ఎం.ఇందు

'దేశప్రతిష్ఠను దిగజార్చడం దారుణం'

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దేశ ప్రతిష్ఠను దిగజార్చిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లిలో భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఒరుగంటి నాగమణి మాట్లాడుతూ దిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ అనుచరుల చర్యలు దారుణమని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాన్ని భగ్నం చేయాలని చూసినవారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, మహిళా మోర్చా పదాధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో భాజపా నాయకుల ధర్నా

సోలార్ ప్లాంటు ఏర్పాటుకు భూసేకరణ

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలో మెగా ఇంజినీరింగ్ సంస్థ సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చింది. దీనికోసం 120 ఎకరాల డీపట్టా భూములు అవసరమని సంస్థ తెలిపింది. దీనిపై మంగళవారం బైలపూడిలో తహసీల్దార్ కోరోలింకర్ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సోలార్ పవర్ ప్లాంటుకు బైలపూడి, జి.కొత్తపల్లి, అడవి అగ్రహారం, చినగోగాడ రైతుల నుంచి 120 ఎకరాల డీపట్టా భూములను లీజుకుంటున్నామన్నారు. రైతులకు సంస్థ ఎకరాకి సంవత్సరానికి రూ. 31 వేల వరకు చెల్లిస్తుందన్నారు. ఇలా రెండేళ్లకు ఒకసారి ఐదుశాతం పెంచుతారన్నారు. దీనిపై బైలపూడి రైతులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై మరోసారి గురువారం రైతులతో సమావేశం నిర్వహిస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సిబ్బంది తరలింపు సరికాదు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఆర్టీసీ గ్యారేజీ వద్ద మంగళవారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో ఎర్ర బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. డిపో అధ్యక్షుడు ఎ.ఎన్.రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి పి.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 12 డిపోల్లో ఎలక్ట్రికల్ బస్సులను పినాకిల్ సంస్థ ద్వారా నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించడం సరికాదన్నారు. అందులో నాలుగు డిపోల షెడ్యూల్స్, సిబ్బందిని ఇతర డిపోలకు తరలించే చర్యలను ఆపాలని కోరారు. రీజియన్ కార్యదర్శి ఎల్.వి.ఆర్.బాబు పాల్గొన్నారు.

నిరసనలో ఎన్ఎంయూఏ ప్రతినిధులు

సచివాలయ ఉద్యోగినంటూ మోసం.. ఒకరి అరెస్టు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సచివాలయం ఉద్యోగినంటూ మోసం చేసి.. నగలు కాజేసిన వ్యక్తిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ శ్రావణి వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని పీఎం పాలెంకి చెందిన ఎల్లమెల్లి వెంకట రమణ గత ఏడాది డిసెంబరులో అనకాపల్లి కరణాల వీధిలో ఇల్లు అద్దెకు కావాలని వచ్చాడు. తాను సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నానని.. పింఛను ఇప్పిస్తానని ఇంటి యజమానురాలైన మహిళను నమ్మించాడు. ఫొటో తీయడానికి బంగారు వస్తువులు మెడలో నుంచి తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఎస్ రాయవరం మండలం కొరుప్రోలులో కూడా సచివాలయం ఉద్యోగినంటూ కొత్త పథకం కింద డబ్బులు వచ్చాయని మహిళను నమ్మించాడు. ఆధార్‌కార్డు, ఫొటో కావాలని చెప్పి ఫొటో తీయడానికి బంగారు వస్తువులను తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఇలా రెండు చోట్ల 87.70 గ్రాముల బంగారు వస్తువులను కాజేశాడు నిందితుడు వెంకట రమణను మంగళవారం అనకాపల్లిలో కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. 1998 నుంచి ఈ తరహా మోసానికి పాల్పడుతున్న ఘటనల్లో ఇతనిపై 42 కేసులు నమోదయ్యాయి. పలుమార్లు జైలు శిక్ష కూడా అనుభవించాడు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సైలు సంతోష్‌కుమార్, అల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి

ధర్మ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: దేశం కోసం ధర్మం కోసం చిత్తశుద్ధితో పనిచేయడమే హైందవ ధర్మమని స్వామి రాధామనోహర్ దాస్ అన్నారు. అరకులోయలో మంగళవారం హైందవ సంఘాల ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్వామి రాధా మనోహర్‌దాస్, ఆర్ఎస్ఎస్ ప్రాంత శారీరక్ ప్రముఖ్ చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. శంభాజీ మహారాజ్ స్ఫూర్తితో మన ధర్మాన్ని కాపాడుకుందామని, కాలాన్ని వృథా చేయకుండా కర్తవ్యాన్ని పూర్తిచేయాలన్నారు. అరకులోయలో ఎన్టీఆర్ విగ్రహం మైదానం నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు సాగిన శోభాయాత్రలో యువత, మహిళలు, కోలాటం, థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. హరేకృష్ణ అనకాపల్లి దుర్లభ కృష్ణప్రేమదాస్, ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర, అప్పలరామ్, బాలాజీ రమేష్, శ్రీనురాజు, చంటి పాల్గొన్నారు.

శోభాయాత్రలో భక్తుల కోలాహలం

గ్రామీణుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: టొయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా లిమిటెడ్ (టీఆర్ఇఐ) ఆర్థిక సహకారంతో ఇవ్వనున్న ఉచిత వసతి, శిక్షణ, ఉపాధి అవకాశాలకు గ్రామీణ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెమ్స్ సీవోవో కమాండర్ (ఆర్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ దరఖాస్తులను ఫిబ్రవరి 28వ తేదీలోగా పంపాలని పేర్కొన్నారు. సంబంధిత కోర్సుల్లో రెండు నెలల శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సింధియా దరి సెమ్స్ కార్యాలయంలోగాని, 7794840934, 8331901237, 0891-2704010 నెంబర్లలోగాని సంప్రదించాలన్నారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, గ్రామ, వార్డు సచివాలయ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 24 మండలాల్లో ప్రతి మండలానికి అయిదు గ్రామాల చొప్పున ఎంపిక చేశామని పేర్కొన్నారు. గ్రామాలను పూర్తిస్థాయిలో శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో అన్ని వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు మురుగు కాలువలు శుభ్రం చేయాలన్నారు. తడి, పొడి చెత్త నుంచి సంపద తయారీ చేయాలన్నారు ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. వృథా వస్తువులను స్వచ్ఛ రథం వాహనాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) కార్యనిర్వాహక ఇంజినీర్ అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

▮ కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పీ-4 విధానం అమలులో, ఆచరణలో అందరూ కలిసి రావాలన్నారు. సీపీవో రామారావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, అధికారులు పాల్గొన్నారు.

29 మద్యం సీసాల స్వాధీనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో మద్యం అక్రమ విక్రయాలు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై సాహిబా అంజుమ్ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో సీఐ జె.మురళీ ఆధ్వర్యంలో దాడులు చేశామన్నారు. ఈ క్రమంలో దేవవరంలో 20, గొడిచెర్లలో తొమ్మిది సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు.. సింహాచలం దేవస్థానం భూ పరిరక్షణ విభాగం ఎస్‌డీసీగా ఉన్న గీతాంజలిని స్టేట్ ఎయిర్‌పోర్టు అథారిటీ ఎస్డీసీగా నియమించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వోగా ఉన్న సీహెచ్.సత్తిబాబును విజయనగరం జిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు. పద్మనాభం తహసీల్దార్ కె.ఆనందరావుకు ఎస్‌డీసీగా పదోన్నతి కల్పించి, రాజధానిలో సీఆర్‌డీఏకు బదిలీ చేశారు. జిల్లాకు సంబంధించి ప్రకృతి విపత్తుల సంస్థ డిప్యూటీ మేనేజర్‌గా ఎస్‌డీసీ పి.గోవింద్, పోర్టు డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్‌గా డి.పుష్పమణిని నియమించారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు 16 మంది ఎంపిక

పాడేరు, న్యూస్‌టుడే: శాప్ లీగ్ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-18 జూనియర్ సైక్లింగ్ పోటీల్లో 16 మంది బాలబాలికలు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన రావు మంగళవారం జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారు ఈనెల 28 నుంచి మార్చి 1 వరకు విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూరిబాబు, ఉపాధ్యాయులు నాగేంద్రబాబు, దిలీప్, లింగన్న భూపతి రాజు పాల్గొన్నారు.

గురుకుల కేంద్రంలో 95 శాతం హాజరు

పెదబయలు, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా రెండోరోజు ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు గురుకుల కళాశాల కేంద్రంలో 95 శాతం హాజరు నమోదైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కేశవరావు, డీవో వేణు చెప్పారు. ద్వితీయ సంవత్సరం జనరల్ తెలుగుకు 243 మందికి 236 మంది, ఒకేషనల్ జీఎఫ్‌సీకి 14 మందికి 14 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

పాడేరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 443 మంది విద్యార్థులకు 15 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ రమాదేవి చెప్పారు. కుమ్మరిపుట్టు గురుకుల కళాశాల కేంద్రంలో 403 విద్యార్థులకు 8 మంది హాజరు కాలేదని ప్రిన్సిపల్ ధనలక్ష్మి పేర్కొన్నారు.

కొయ్యూరు: కాకరపాడు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల జూనియరు కళాశాలలో 157 మంది విద్యార్థులకు 151 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ లక్ష్మణ్ చెప్పారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారి పర్యటన

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ మానవ హక్కుల కమిషన్ (గిరిజన సంక్షేమం) అధికారి ఆర్.హేమంత్ కుమార్ మంగళవారం లంబసింగిలో పర్యటించారు. రాజుబందలో నేషనల్ మల్టీపర్పస్ కేంద్రాన్ని సందర్శించారు. లంబసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కృష్ణాపురం ఎకో టూరిజం కేంద్రాన్ని పరిశీలించారు. ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీడీ సీతయ్య వెంట ఉన్నారు.

ఎకో టూరిజం కేంద్రం నుంచి వస్తున్న హేమంత్‌కుమార్

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీసీసీబీ ఎలమంచిలి కార్యాలయం ఎదుట ఉద్యోగులు, సంఘ నాయకులు మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీన్ని నిరసిస్తూ జిల్లాస్థాయిలో నిరాహార దీక్ష శిబిరాన్ని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ రైతులకు నిరంతర సేవలు అందిస్తున్న వీరి న్యాయపరమైన కోర్కెలు నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శివరామకృష్ణ, ఎలమంచిలి, నక్కపల్లి, అచ్యుతాపురం, అడ్డురోడ్డు, పాయకరావుపేట, కోటవురట్ల పరిధిలోని అన్ని పీఏసీఎస్ శాఖల ఉద్యోగులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న పీఏసీఎస్ ఉద్యోగులు, సంఘ నాయకులు

న్యాయవాదుల నిరసన

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులు మంగళవారం నిరసన తెలిపారు. కర్నూలులో న్యాయవాది పవన్‌పై పోలీస్ అధికారి దాడిని నిరసిస్తూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిళ్లా హరశ్రీనివాసరావు, కార్యదర్శి బంధం వెంకట రమణ, సభ్యులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో పాల్గొన్న న్యాయవాదులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	115
లైవ్	152	135
డ్రెస్డ్	220	240
స్కిన్‌లెస్	251	250

(c) eenadu

బస్సులు రావు.. బాధలు తప్పవు

చింతపల్లి, న్యూస్‌టుడే

మన్యంలో గిరిజనులకు రవాణా కష్టాలు దూరాభారంగా మారాయి. కూటమి ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాలకూ రోడ్లు నిర్మిస్తున్నా.. ఆర్టీసీ బస్సులు రాక గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రాల నుంచి ప్రధాన మార్గాల్లోనూ సరిపడా బస్సు సర్వీసులు లేక గిరిజనులు ఆటోలు, జీపులను ఆశ్రయిస్తూ ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

▼ గూడెంకొత్తవీధి నుంచి నర్సీపట్నం వెళ్లేందుకు బస్సు సర్వీసు లేదు. గతంలో గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి ఉదయాన్నే ఏడు గంటలకు నర్సీపట్నం నుంచి ఆర్టీసీ బస్సు వచ్చేది. ప్రస్తుతం ఆ సర్వీసును ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. రాత్రి సర్వీసూ రద్దవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

▼ గూడెంకొత్తవీధి నుంచి జిల్లా కేంద్రం పాడేరు వెళ్లేందుకు ఉదయం 5 గంటలకు ఒకటి, 6 గంటలకు ఒకటి, రాత్రికి ఒక సర్వీసు ఉండేది. డొంకరాయి నుంచి పాడేరు వెళ్లే సర్వీసు బస్సు ఉదయం 7.30 గంటలకు గూడెం వస్తుంది. విశాఖపట్నం వెళ్లే రాత్రి సర్వీసు ఎక్స్‌ప్రెస్ బస్సు ఉదయం 8 గంటలకు గూడెం వస్తుంది. ఇవి తప్పితే నర్సీపట్నం వెళ్లేందుకు మరో బస్సు సర్వీసు లేదు.

గూడెంకొత్తవీధిలో జీపు ఎక్కేందుకు వేచి ఉన్న ప్రయాణికులు

▼ గూడెంకొత్తవీధి నుంచి చింతపల్లికి ఆటోలు, జీపుల్లో చేరుకుని, అక్కడి నుంచి నర్సీపట్నం వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. నర్సీపట్నం నుంచి తిరుగు ప్రయాణంలోనూ ఇక్కట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సీలేరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు నర్సీపట్నంలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతుంది. అది తప్పిపోతే రాత్రి 9 గంటలకు భద్రాచలం వెళ్లే బస్సును అందుకోవాలి. ఆ రెండు బస్సులు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కావడంతో ముందుగానే సీట్లు రిజర్వేషన్ అయి ఖాళీ ఉండటం లేదు. చింతపల్లి, గూడెంకొత్తవీధి వెళ్లే వారంతా 70 కిలోమీటర్ల దూరం బస్సులో నిల్చొని ప్రయాణం చేయాల్సి వస్తోంది.

▼ నర్సీపట్నం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో గూడెంకొత్తవీధి పల్లె వెలుగు బస్సును నడపాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో విశాఖపట్నం నుంచి హైదరాబాద్, ఒడిశాలోని మల్కాన్‌గిరి, చిత్రకొండ, మోతుగూడెం ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఉండేవి. రహదారి బాగోలేదని, ఆదాయం రావడం లేదన్న కారణాలతో ఆ సర్వీసులను రద్దు చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రధాన మార్గాల్లో బస్సు సర్వీసులు నడపాల్సిన అవసరముంది.

అసంపూర్తి నిర్మాణాలు.. పరాయిపంచన విధులు

నిరుపయోగంగా సచివాలయ భవనాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ఏళ్ల కిందట ప్రారంభమైన గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. రూ.లక్షల్లో నిధులు కేటాయించినా భవనాలు వినియోగంలోకి రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది పరాయి పంచన విధులు నిర్వహించాల్సి వస్తోంది.

❖ ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం 18 గ్రామ సచివాలయాలుగా విభజించింది. కించాయిపుట్టు, బూసీపుట్టు, కుమడ, వనుగుమ్మ, లక్ష్మీపురం, కిలగాడ, దారెల, ఏనుగురాయి, సుజనకోట, కరిముఖిపుట్టు, బాబుసాల, బుంగాపుట్టు, పెదగుడ, బంగారుమెట్ట, దోడిపుట్టు, మాకవరం, జోలాపుట్టు, జర్జుల గ్రామాల్లో సచివాలయ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.40 లక్షలు కేటాయించింది. నిర్మాణాలు ప్రారంభమై నాలుగేళ్లు అవుతున్నా నేటికీ పూర్తి కాలేదు.

దారెలలో నాలుగేళ్లుగా పూర్తి కాని సచివాలయ భవనం

❖ సుజనకోటలో భవనం పూర్తికాగా, మిగతా చోట్ల అసంపూర్తిగా ఉండిపోయాయి. కించాయిపుట్టు సచివాలయ సిబ్బంది ముంచంగిపుట్టులోని జడ్పీ అతిథి గృహంలో విధులు నిర్వహిస్తున్నారు. బంగారుమెట్ట సచివాలయం స్థానిక రైతు సేవా కేంద్రంలో కొనసాగుతోంది. కుమడ, బూసీపుట్టు గ్రామాల్లో సచివాలయాలను కుమడలోని సామాజిక భవనంలో ఏర్పాటు చేశారు. కిలగాడ, దారెల, ఏనుగురాయి గ్రామాల్లో భవనాలు పూర్తికాక పంచాయతీ భవనాల్లో సిబ్బంది ఇబ్బంది పడుతూనే విధులు నిర్వహిస్తున్నారు.

❖ గ్రామ సచివాలయ వ్యవస్థ ఆరంభం కావడంతో పంచాయతీ వ్యవస్థపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. పంచాయతీల్లో కనీస వసతుల్లేవు. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీలు ఉండగా.. మాకవరం, దోడిపుట్టు, ఏనుగురాయి, కరిముఖిపుట్టు, దారెల, కిలగాడ, పెదగుడ, కుమడ గ్రామాల్లోని భవనాలు శిథిలావస్థకు చేరాయి. స్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం పడితే నీరు కారుతోంది. కించాయిపుట్టు, బూసీపుట్టు పంచాయతీలకు భవనాలే లేవు. పాలకులు స్పందించి సచివాలయాలు, పంచాయతీలకు భవనాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

అతిథి గృహాల్లో అసాంఘిక శక్తులు!

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అతిథి గృహాలు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతున్నాయి. వాటి నిర్వహణను భారంగా పరిగణించి యంత్రాంగం వదిలేయడంతో అసాంఘిక శక్తులు చేరుతున్నాయి. పాడేరు శివారులో కొత్త పాడేరుకు వెళ్లే మార్గంలో ఐదు దశాబ్దాల కిందట ఆర్‌అండ్‌బీ బంగ్లా నిర్మితమైంది. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రులు, ఉన్నతాధికారులు పర్యటనలకు వచ్చినప్పుడు ఇందులో బస చేసేవారు. ఆ తర్వాత నిర్వహణ కొరవడి నిరుపయోగంగా మారింది. అల్లూరి జిల్లా ఏర్పాటయ్యాక ఈ భవనానికి మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువస్తారనుకుంటే.. సంబంధిత శాఖ దృష్టిసారించలేదు. ప్రస్తుతం భవనం గోడలు బీటలు వారి శిథిలావస్థకు చేరింది.

★ కలెక్టర్, ఐటీడీఏ పీవో బంగ్లాలకు సమీపంలో ఉన్న అటవీ శాఖ అతిథి గృహాన్ని గతంలో అద్దె ప్రాతిపదికన ఇచ్చే వారు. అటవీ శాఖ కార్యాలయంలో నూతన అతిథి గృహ నిర్మాణంతో పాత భవనం నిర్వహణను గాలికొదిలేశారు. ప్రస్తుతం అతిథి గృహం చుట్టూ తుప్పలు పెరిగాయి. రాత్రి సమయంలో అటుగా వెళ్లాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. పర్యాటక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రంలోని అతిథి గృహాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరముంది. – న్యూస్‌టుడే, పాడేరు పట్టణం

శిథిలావస్థకు చేరిన అటవీ శాఖ అతిథి గృహం

చెట్ల కింద చదువులు

మారుమూల గిరిజన గ్రామాల్లో చాలచోట్ల పాఠశాలలకు భవనాలు లేవు. విద్యార్థులకు చెట్ల కింద తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి. ఎన్ఆర్ పురం, రొంపల్లి పంచాయతీల్లోని చిమిడివలస, బురుగు గ్రామాలకు చెందిన విద్యార్థులు రోజూ చెట్ల కిందే చదువులు సాగిస్తున్నారు. చిమిడివలస పాఠశాలలో 35 మంది, బురుగు గ్రామంలో 45 మంది విద్యార్థులున్నారు. వర్షం పడితే ఆ రోజు తరగతులకు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు అప్పలరాజు, సింహాచలం పేర్కొన్నారు. అధికారులు స్పందించి రెండు పాఠశాలలకు భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అనంతగిరి గ్రామీణం

కల్వర్టు నిర్మాణం కలేనా?

జి.మాడుగుల మండలం గెమ్మెలి నుంచి పెద్దకొతూరు వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మించక వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ఇటీవలే బీటీ రహదారి నిర్మించారు. కల్వర్టు నిర్మించక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. వర్షం కురిస్తే అటువైపు వెళ్లడం కష్టతరంగా మారుతుంది. గెడ్డ వద్ద కల్వర్టు నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జి.మాడుగుల

రెండో రోజూ కొనసాగిన ఆందోళనలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండోరోజు మంగళవారం చింతపల్లి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ మండల నాయకులు రాములమ్మ, పెంటమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలపై 42 రోజులపాటు సమ్మె చేస్తే ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని, లబ్ధిదారులకు అందించే బియ్యం, నూనె, పప్పుల నాణ్యత ఉండాలని, మెనూ ఛార్జీలు పెంచాలన్నారు.

జి.మాడుగుల, కొయ్యూరు, సీలేరు, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. జి.మాడుగులలో యూనియన్ నాయకులు మోదకొండమ్మ, వెంకటలక్ష్మి, సింహాచలం, వరలక్ష్మి, సత్యవతి, చంద్రమణి, రమ, వరహాలమ్మ, సింహాచలం శిబిరంలో పాల్గొన్నారు. కొయ్యూరులో సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్.సూరిబాబు దీక్షలకు మద్దతు పలికారు. అచ్చియమ్మ, ముత్యాలమ్మ దీక్షలో కూర్చున్నారు. గూడెంకొత్తవీధిలో యూనియన్ మండల అధ్యక్షుడు సత్యవతి తదితరులు ప్రసంగించారు.

చింతపల్లిలో రిలే దీక్ష శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

అ.వీ.ఇ.వీ

26, 27 తేదీల్లో విద్యారంగ సమస్యలపై ధర్నా

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై పాత తాలూకా కేంద్రాల్లో ఈ నెల 26, 27 తేదీల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పలస జగన్నాథరావు, గంగరాజు మంగళవారం చెప్పారు. ఉపాధ్యాయులంతా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

27, 28 తేదీల్లో ఎమ్మెల్యే పర్యటన

కొయ్యూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి దూరంగా ఉన్న యు.చీడిపాలెం, మఠం భీమవరం పంచాయతీల్లో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ఈ నెల 27, 28 తేదీల్లో పర్యటించనున్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారని వైకాపా మండల అధ్యక్షుడు అప్పారావు మంగళవారం చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ తీరు గర్హనీయం

పాడేరు, న్యూస్‌టుడే: ఏఐ సమ్మిట్‌లో దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు గర్హనీయమని భాజపా జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఐటీడీఏ ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు కెజియారాణి, నాయకులు రవికుమార్, గోపాలపాత్రుడు, రాజు, సత్యవతి, లక్ష్మి, సూర్యకళ, సీతమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ నివారణ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: క్షయను సమూలంగా నివారించేందుకు అవగాహన అవసరమని గూడెంకొత్తవీధ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఉషశ్రీ, శివరాం అన్నారు. రింతాడ-1 సబ్ సెంటర్ పరిధిలో వైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, నీరసం, రాత్రిపూట జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, క్రమంగా బరువు తగ్గడం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎస్‌టీఎస్ అశోక్, ఎస్‌టీఎల్ఎస్ రావు, ఎల్‌ఎంహెచ్‌పీ నిర్మల, ఆరోగ్య సహాయకులు సత్యనారాయణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డోలీమోతే శరణ్యం!

అనంతగిరి, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో నేటికీ డోలీ మోతలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేకపోవటంతో రోగులు, గర్భిణులు, బాలింతలను డోలీలో ఆసుపత్రులకు తరలిస్తున్నారు. రొంపల్లి పంచాయతీ బందవలసకు చెందిన శ్రీను అనారోగ్యానికి గురయ్యారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో స్థానికులు డోలీలో రోడ్డు పాయింట్ వరకు తీసుకువచ్చి అక్కడి నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం తిరిగి డోలీలో గ్రామానికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వీఆర్వో సంఘ కార్యవర్గ ఎన్నిక

హుకుంపేట, న్యూస్‌టుడే: వీఆర్వోల మండల కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షురాలిగా రత్నకుమారి, కార్యదర్శిగా ఈశ్వరమ్మ, కోశాధికారిగా చంద్రశేఖర్ ఎన్నికైనట్లు గౌరవాధ్యక్షులు భీమన్నదొర, విజయవేణి ప్రకటించారు.

నూతన కమిటీ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కిలగాడ కూడలి నుంచి పెదపేట, పేటమాలిపుట్టు గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. కొత్తులబయలు కూడలి వద్ద కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. – ఉర్ధోబు, స్థానికుడు

✔: కిలగాడ - పెదపేట రోడ్డును పరిశీలించాం. మరమ్మతుకు చర్యలు చేపడతాం. – మురళీకృష్ణ, ఏఈ, ముంచంగిపుట్టు

పెదబయలు, న్యూస్‌టుడే: గలగండ పంచాయతీ ఈదులపుట్టులో కల్వర్టు వద్ద రోడ్డుపై గోతులు పడ్డాయి. – [illegible], ఈదులపుట్టు

✔: గోతులు పూడ్చి రోడ్డు మరమ్మతు చేస్తాం. – శ్రీదేవి, ఆర్‌అండ్‌బీ ఏఈ

స్పందనకు వందనం

చింతపల్లి, న్యూస్‌టుడే: లంబసింగి ఘాట్ రోడ్డులో మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించారు. నిత్యం రద్దీగా ఉండే ఘాట్‌రోడ్లోని పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే క్రమంలో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన గత నెల 26న వార్త ప్రచురితమైంది. ఆర్‌అండ్‌బీ జేఈ జయరాజ్ స్పందించి చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగించారు.

అల్లూరి పోరాటం చిరస్మరణీయం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బ్రిటిష్ పాలకులపై అల్లూరి సీతారామ రాజు సాగించిన పోరాటం చిరస్మరణీయమని జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. చింతపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అధ్యక్షతన మంగళవారం ఏర్పాటైన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, బాలరాజు తదితరులు

సదుపాయాల కల్పనకు చర్యలు: మన్యం సందర్శనకు వచ్చే పర్యాటకులకు ప్రత్యేకంగా సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర చెప్పారు. చింతపల్లిలో రూ.20 లక్షలతో నవీకరించిన జడ్పీ అతిథి గృహాన్ని ప్రారంభించారు. ఎంపీపీ అనూషాదేవి, సర్పంచి పుష్పలత, శోభ సీతారాణి, రాజబాబు, ఆనంద్, బేతాళుడు [?] తదితరులు పాల్గొన్నారు.

తాడిపుట్టులో సచివాలయ భవనం ప్రారంభం

హుకుంపేట, న్యూస్‌టుడే: తాడిపుట్టు పంచాయతీ కేంద్రంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మంగళవారం ప్రారంభించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రయోగాలతోనే సృజనాత్మకత

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ఆధునిక ప్రపంచంలో విజ్ఞాన ప్రదర్శనలు, ప్రయోగాలతోనే సృజనాత్మకత అలవడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రామకృష్ణారావు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక నిర్వహించే విజ్ఞాన ప్రదర్శన, ప్రయోగ రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన గోడ పత్రికను డీఈఓ రామకృష్ణారావు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం పిల్లలు తరచూ ప్రయోగ, విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని భావి శాస్త్రవేత్తలు కావాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి విద్యార్థులు సాంకేతిక, వినూత్న, వ్యవసాయ, పర్యావరణ వంటి రంగాలపై ఐదు నిమిషాలు వీడియో చిత్రీకరించి వచ్చే నెల 8వ తేదీ లోపు జిల్లా విజ్ఞాన కార్యదర్శికి పంపించాలన్నారు. ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శన పోటీల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న డీఈవో రామకృష్ణారావు, ఉపాధ్యాయులు

బాక్సైట్ తవ్వకాలపై అఖిలపక్ష సమావేశం

పెదబయలు, న్యూస్‌టుడే: బాక్సైట్ తవ్వకాలపై ఏపీఎండీసీ నివేదికపై కూటమి ప్రభుత్వ వైఖరేంటో స్పష్టం చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన భవన్‌లో మంగళవారం అఖిలపక్ష నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ గిరిజన సలహా మండలిలో తీర్మానం చేయాలని కోరుతూ మార్చి 2న తహసీల్దార్, ఎంపీడీవోకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మానపడాల్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సూర్యనారాయణ, ఉమామహేశ్వరరావు, సూరయ్య, సునీల్‌కుమార్, గంగాధరం, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు

'జీరో స్థాయికి గంజాయి సాగు'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గంజాయి సాగును జీరో స్థాయికి తెచ్చినట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి చెప్పారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. 2021-22లో అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 7,515 ఎకరాల్లో గంజాయి సాగు ఉండగా 2024-25 నాటికి 93.05 ఎకరాలకు, 2026 జనవరి నాటికి జీరో స్థాయికి తీసుకొచ్చామన్నారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇప్పించి 415 మందికి, సీఈఎంఎస్ ద్వారా శిక్షణ ఇప్పించి మరో 360 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు.

గిరిజన సంఘ ఉపాధ్యాయులకు సత్కారం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జరిగింది. ఉపాధ్యాయులు పలాసి కృష్ణారావు, గంగన్న పడాల్‌ను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ సత్కరించారు. నాగేశ్వరరావు, ప్రసాదరావు, రామారావు, చిట్టిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెదేపా మండల కార్యదర్శి జగన్రాయ్ అన్నారు. పనసపుట్టులో మైటీడీపీ యాప్ గోడపత్రికలను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. తెదేపా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని గ్రామాల్లో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను, సభలు, సమావేశాల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. నాయకులు చిరంజీవి, గంగాధర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పనసపుట్టులో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జగన్రాయ్

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం దుప్పిలవాడ పంచాయతీ పరిధిలో నిమ్మచెట్టు, చెక్కలమద్ది పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయురాలు మంగళవారం దుస్తులు అందజేశారు. దుప్పిలవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న టి.సూర్యకళ తన స్నేహితుల సహకారంతో నిమ్మచెట్టు, చెక్కలమద్ది పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దుస్తులు, పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. ఆమెను గ్రామస్థులు అభినందించారు.

దివ్యాంగ బాలికకు చక్రాల కుర్చీ

సీలేరు, న్యూస్‌టుడే: రామగెడ్డకు చెందిన దివ్యాంగ బాలికకు నర్సీపట్నం శారదా స్కూలు పూర్వ విద్యార్థులు ట్రస్ట్ తరఫున మంగళవారం సాయం చేశారు. చక్రాల కుర్చీ, రెండు జతలు దుస్తులు, రూ.500 నగదు ట్రస్ట్ ప్రతినిధి మల్లేశ్వరరావు దివ్యాంగ బాలికకు అందజేశారు.

బాలికతో ట్రస్టు ప్రతినిధులు

వాట్సాప్ మన మిత్రపై అవగాహన

సీలేరు, న్యూస్‌టుడే: రింతాడలో వాట్సాప్ మన మిత్రపై ఎంపీడీవో రమణబాబు మంగళవారం స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందవచ్చని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రామలింగేశ్వరస్వామి విగ్రహాల ఊరేగింపు

సీలేరు: సీలేరు జలాశయం దరి గుంటవాడ వద్ద ప్రతిష్ఠించనున్న రామలింగేశ్వరస్వామి విగ్రహాలను మంగళవారం ఊరేగించారు. భక్తులు పసుపు నీటితో విగ్రహాలకు అభిషేకం చేశారు. అర్చకుడు దామోదర్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపులో భక్తులు

తాగునీటి సౌకర్యం కల్పించరూ..

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పినకొత్తూరు గ్రామ గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి కోరారు. గ్రామంలోనున్న బోరు వద్ద ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోరు మాత్రమే ఏర్పాటు చేశారని, మోటారు, ట్యాంకు నుంచి ఇంటింటికీ పైపులు వేయలేదన్నారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. బోరుకు మోటారు బిగించి పైపులు ద్వారా తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. గ్రామస్థులు పాంగి రాజు, లక్ష్మి, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

పినకొత్తూరులో బోరు వద్ద గిరిజనుల నిరసన

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం దారకొండ పంచాయతీ పేట్రాయి నుంచి ఒడిశా సరిహద్దు వరకూ రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు మంగళవారం దారకొండ సర్పంచి ఎన్.రాజు ప్రారంభించారు. రహదారి నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ నిధులు విడుదల చేయడంతో మంగళవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. పెసా కమిటీ ఉపాధ్యక్షుడు చిట్టినాయుడు, వైకాపా నాయకుడు పి.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచి రాజు తదితరులు

అకాల వర్షం.. రైతుకు నష్టం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: అకాల వర్షానికి రైతులు నష్టపోయారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పసుపు, పిప్పలి రైతులు ఇబ్బందులకు గురయ్యారు. కిలగాడ పంచాయతీ కొపేరిమామిడి, తరిగెడ ప్రాంతాల్లో రెండో పంటకు సిద్ధం చేసిన నారు మడులు ముంపుబారిన పడ్డాయి. కుమడ, కరిముఖిపుట్టు, కుమ్మరిపుట్టు, సుజనకోట, పెదగుడ ప్రాంతాల్లో ఉడికించిన పసుపు తడిసిపోవడంతో కల్లాల్లో ఆరబెట్టారు. పొలాల్లోకి నీరు చేరడంతో పసుపు మొలకెత్తే ఆస్కారముండటంతో రైతులు తవ్వకం పనులు ముమ్మరం చేశారు. మాకవరం, పనసపుట్టు, జోలాపుట్టు ప్రాంతాల్లో మామిడి పూత నేల రాలింది.

కిలగాడలో నీటి మునిగిన నారుమడి

అధ్వాన రోడ్లపై అవస్థల ప్రయాణం

మారుమూల గిరిజన ప్రాంతాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. లక్ష్మీపేట పంచాయతీ కప్పాడ గ్రామానికి ప్రధాన రహదారి నుంచి 4.5 కి.మీ. దూరం ఉంటుంది. తెదేపా ప్రభుత్వ హయాంలో కొత్తాపుట్టు నుంచి లక్ష్మీపేట వరకు సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు మరమ్మతుకు గురవడంతో వైకాపా ప్రభుత్వం పనులు చేపట్టి మధ్యలో వదిలేసింది. దమ్ముగూడ, కూడాసింగి, పందిగుంట, ఉక్కుర్బ గ్రామాలకూ వెళ్లే రోడ్లూ అధ్వానంగా ఉన్నాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు గ్రామీణం

రాళ్లు తేలిన రహదారి

(c) eenadu

క్షీరమా.. గరళమా?

పాల నాణ్యత తనిఖీలెక్కడ

ఈనాడు - అమరావతి

తెల్లనివన్నీ పాలేనా...? మనం రోజూ తాగేది నాణ్యమైన క్షీరమేనా...?

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పాలే విషంగా మారి ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితి ఏమిటన్నది ఆందోళన కలిగిస్తోంది. ఆహార తనిఖీ అధికారులు, పశుసంవర్ధకశాఖ యంత్రాంగం తనిఖీలు చేయకపోవడంతో కల్తీకి ఆస్కారమేర్పడుతోంది. పాలు పాడైపోయాయని ఫిర్యాదులొస్తేనే యంత్రాంగం కదులుతోంది. రాష్ట్రంలో ఎక్కడైనా ఇబ్బందికర పరిణామాలు ఏర్పడితే హడావుడి చేసి మిన్నకుండిపోతోంది. రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించి నాణ్యత నిర్ధారించాలని కలెక్టర్ తమీమ్ ఆదేశించారు.

తాజా పేరుతో....

జిల్లాలో ఉత్పత్తికి.. డిమాండ్‌కు మధ్య చాలా తేడా ఉంది. దీన్ని సహకార, ప్రైవేటు రంగంలోని డెయిరీలు భర్తీ చేస్తున్నాయి. డెయిరీల్లో.. సేకరణ నుంచి సరఫరా వరకు ప్రతి దశలో నాణ్యత తనిఖీ వ్యవస్థలుండడం వల్ల కల్తీకి అవకాశాలు తక్కువ. పాడి రైతు నుంచి వినియోగదారుడి దగ్గరకు వచ్చే మార్గంలోనే తేడా చోటుచేసుకునే వీలుంది. ■ కేంద్రాల ద్వారా విక్రేతలు.. లీటరు, అరలీటరు, పావులీటరు పరిమాణాల్లో ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు. సరైన విధానాలు, శుభ్రత పాటించకపోతే కల్తీ అయ్యే అవకాశం ఉంది. ■ పాలు పితికిన తరువాత 3 గంటల్లోపు శీతలీకరణ చేయని పక్షంలో నాణ్యత దెబ్బతింటుంది. ■ కొందరు వెండర్లు చేతిపంపులు, కుళాయిల నీటిని కలుపుతున్నారు. ■ నీరు కలపకుండా విక్రయిస్తే ఒక ధర.. నీటిని కలిపే పరిమాణం ఆధారంగా రెండు రకాల ధరలు వసూలు చేస్తున్నారు.

జిల్లాలోని పాడి పశువులు:	2.20 లక్షలు
రోజూ పాల ఉత్పత్తి	5 లక్షల నుంచి 6 లక్షల లీటర్లు
రోజువారీ అమ్మకాలు	10 లక్షల లీటర్లు

నగరంలో 15 విక్రయ కేంద్రాలు

గుంటూరు నగరంలో 15 కేంద్రాల ద్వారా లూజుకు విక్రయిస్తున్నారు. ఇందులో కొంతమంది నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఉత్పత్తి తగ్గినప్పుడు కొందరు వెండర్లు పాలపొడి కలుపుతున్నారు. డెయిరీ ప్యాకెట్లు కొనుగోలు చేసి వాటిని రైతుల నుంచి సేకరిస్తున్న పాలలో కలిపి విక్రయిస్తున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. ● రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేస్తారన్న భయంతో కొంతమంది వ్యాపారులు పాత నిల్వలను తరలించి దుకాణాలు మూసేయడం గమనార్హం.

కలెక్టర్ ఆదేశాల మేరకు... రెవెన్యూ, పోలీసు, పశుసంవర్ధకశాఖ, ఆహార తనిఖీ, ఆరోగ్య అధికారులతో కలిసి బృందాలుగా ఏర్పడి పాలు సేకరణ నుంచి విక్రయాల వరకు తనిఖీలు చేసి నమూనాలు సేకరిస్తాం. వాటిని విశాఖపట్టణంలోని ప్రయోగశాలకు పంపి నాణ్యత నిర్ధారిస్తాం. **- సత్యనారాయణ, జేడీ, పశుసంవర్ధకశాఖ**

హనుమంత వాహనంపై నృసింహస్వామి

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చూసిన కనులదే భాగ్యం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవీ సమేత శ్రీలక్ష్మీ నృసింహస్వామి అభయ ప్రదాత హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని రంగురంగుల పూలదండలతో అలంకరించి మంగళగిరి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈనాడు అమరావతి

గుంటూరు

బుధవారం ఫిబ్రవరి 25, 2026

8 డీపీఆర్‌లు

- అనుమతించిన ప్రభుత్వం
- జీఎంసీ ప్రగతి ప్రతిపాదనల్లో కదలిక

ఈనాడు - అమరావతి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో మరో కీలక అడుగు పడింది. ఎనిమిది ముఖ్యాంశాలకు సవివర పథక నివేదికలు (డీపీఆర్) తయారు చేయడానికి అపిడ్కో కన్సల్టెన్సీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో మరిన్ని ప్రగతి పనులను పట్టాలెక్కించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రూ.600 కోట్ల విలువైన పనులు జరుగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరిన్ని పనులను అధికారులు ప్రతిపాదించారు. ఎనిమిది అంశాలను ప్రాధాన్యత జాబితాలో చేర్చారు. వీటికి డీపీఆర్ తయారీ బాధ్యతను అపిడ్కో కన్సల్టెన్సీకి అప్పగించడానికి అనుమతించాలని కోరుతూ మూడు నెలల క్రితం ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ప్రభుత్వం అదనపు సమాచారం కోరగా అదీ పంపించారు. అక్కడి నుంచి అనుమతి రాకపోవడంతో.. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ చొరవ చూపించారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు స్పందించారు.

తొలి ప్రాధాన్యంగా మూడు.. ఎనిమిది అంశాలో తొలి ప్రాధాన్యాంశాలుగా మూడింటిని ఎంపిక చేసినట్టు జీఎంసీ వర్గాలు తెలిపాయి. ఎన్టీఆర్ మానస సరోవరం పార్కు, ట్రావెలర్స్ బంగ్లా, నల్లపాడు పార్కుకు డీపీఆర్‌లు సిద్ధం చేయించడంపై అధికారులు దృష్టి పెట్టారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పీపీపీ విధానంలో పెట్టుబడిదారులను గుర్తిస్తారు.

ప్రతిపాదనల్లో.. నాలుగు ప్రభుత్వ వాణిజ్య సముదాయాలు, మూడు తాగునీటి ట్యాంకుల నిర్మాణం, మానస సరోవరం పార్కు.. ఉన్నాయి.

ఎట్టకేలకు మోక్షం.. మానస సరోవరం పార్కుకు ప్రాధాన్యం ఇవ్వడం కీలకంగా మారింది. గుంటూరు శివారులో సుమారు 53 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. కొవిడ్ కల్లోలంలో మూసేశారు. అప్పట్నుంచి పట్టించుకోకపోవడంతో విలువైన పరికరాలు పాడైపోయాయి. రూ.కోట్ల ఖరీదైన స్థలం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. గతంలో ఇద్దరు కమిషనర్లు ప్రభుత్వానికి నివేదించినా పరిస్థితి మారలేదు. ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. సాస్కీ పథకం కింద అభివృద్ధికి ప్రతిపాదించగా.. తాజాగా డీపీఆర్ తయారీకి అనుమతి వచ్చింది.

హోరాహోరీ

ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026లో భాగంగా విజయవాడలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులును అడ్డుకుంటున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

6 నుంచి 8 వరకు మహాకుంభాభిషేకం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మార్చి 6 నుంచి 8 వరకు ఇంద్రకీలాద్రిపై కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్‌లతో కలిసి ఎంపీ కుంభాభిషేక మహోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆలయ అధికారులు, వైదిక కమిటీ, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

సరదాల జోష్.. సంబరాలు అదుర్స్

వీఐటీ-ఏపీలో ఆకట్టుకున్న విటోపియా-2026 ఫెస్ట్

విద్యార్థుల నాటక ప్రదర్శన

ఈనాడు - అమరావతి

సంస్కృతి ఉట్టిపడింది. సంప్రదాయం కనువిందు చేసింది. సంగీతం, నృత్యం, నాటక పోటీలతో అడుగడుగునా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే ప్రయత్నం జరిగింది. అమరావతిలోని వీఐటీ-ఏపీ ప్రాంగణంలో నాలుగురోజులపాటు నిర్వహించిన విటోపియా-2026 ఫెస్ట్ యువతలో జోష్ నింపింది. ప్రాచీన కళారూపాల నుంచి ఆధునిక సంగీత ప్రదర్శనల వరకు అనేక కార్యక్రమాల్లో విద్యార్థులు సత్తా చాటారు.

ఆలోచింపజేసిన వి.నూక్కడ్ నాటకం.. కార్నివాల్ గేమ్స్, నాన్‌ప్రైమ్ ఈవెంట్స్‌లో పిల్లో ఫైట్, సాక్‌రేస్, విస్పర్ ఛాలెంజ్, రింగ్ ఛైర్స్, బెలూన్ బర్స్ట్, స్ప్లాష్ అండ్ డాష్. . ఇలా అనేకం నిర్వహించారు. న్యూటన్ హాలులో వి-రిథమ్, వి-స్టాండప్ కార్యక్రమాలు జరగ్గా.. ఆడిటోరియంలో నిర్వహించిన స్పెషల్ గెస్ట్ కామిడీ షో హాస్యాన్ని కురిపించింది. వి-నూక్కడ్ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే వాటిల్లే నష్టాలు, డ్రగ్స్‌కు యువత ఎలా బానిసవుతోంది? ఆ ఊబి నుంచి బయటపడడానికి ఉన్న మార్గాలు.. మహిళలపై అఘాయిత్యాలు-నిరోధించే మార్గాలు. . ఓటు అమ్ముకోవడం వల్ల సమాజానికి జరుగుతున్న నష్టం ఏమిటి? ఇలా.. అనేక సందేశాత్మక ప్రదర్శనలతో విద్యార్థులు ఆలోచింపజేశారు. సాయంత్రం ప్రో-షోలో పైనాపిల్ ఎక్స్‌ప్రెస్, మోహన్ సిస్టర్స్ లైవ్, పృథ్వీసాయి డీజే అలరించాయి.

ప్రత్యేకం.. బీడ్ బ్రాస్లెట్స్..

బీడ్ బ్రాస్లెట్స్ పేరుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్ యువతను ఆకట్టుకుంది. నచ్చిన బ్రీడ్స్‌తో బ్రాస్లెట్ రూపొందించుకునే అవకాశం కల్పించారు. విభిన్న రీతుల్లో రూపొందించిన ఫొటోఫ్రేమ్స్‌లో విద్యార్థులు స్వీయచిత్రాలు తీసుకుంటూ సందడి చేశారు.

బీడ్ బ్రాస్లెట్ కార్యక్రమంలో విద్యార్థులు

వేడుకలు బావున్నాయి

విటోపియా వేడుకలు ఏటా ఘనంగా నిర్వహించడం చాలా బాగుంది. గతంలో నేను చదివిన చోట్ల ఎక్కడా ఇలాంటి వేడుకలు చూడలేదు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు చక్కని అవకాశం ఇది. **- గౌరి, ఎర్నాకుళం, కేరళ**

చాలా ఆనందంగా ఉంది

విటోపియా-2026 వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి ఉత్సవాలు ఏటా నిర్వహించడం వల్ల విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు చక్కగా దోహదపడుతుంది. విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన మేమంతా ఓ కుటుంబంలా కలిసిపోవడానికి మంచి వేదికైంది. **- శ్రీమన్ సెంథిల్, చెన్నై**

నాటక ప్రదర్శనలో పాల్గొన్నా

నేను విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల నుంచి వచ్చా. బోధిసత్వ అంశంపై ప్రదర్శన ఇచ్చాం. మా బృంద సభ్యులు సమాజంలో ప్రస్తుత పరిస్థితులు, మార్పులో యువత భాగస్వామ్యం.. ఇలా అనేక అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. **- సూర్యచరణ్, విజయవాడ**

14వ వర్ధంతి నివాళులు

గౌరవమర్యాదలు, మంచితనం, మమకారం మా అందరికి అలవర్చి, మా అభివృద్ధికి ఎంతగానో పాటుపడిన శ్రీ పోలినేని నాగేశ్వరరావు గారి 14వ వర్ధంతి సందర్భంగా అశ్రునివాళులు అర్పిస్తున్నాం. వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

కీ॥శే॥ పోలినేని నాగేశ్వరరావు, B.A., B.L.
జననం : 01-07-1932, మరణం : 01-03-2012

భార్య : పోలినేని వెంకట సుబ్బమ్మ (సుబ్బాయమ్మ)

కుమారులు - కోడళ్ళు
పోలినేని బాలశ్రీనివాస్ - పోలినేని శైలజ
పోలినేని సుబ్రహ్మణ్య ప్రసాద్ - పోలినేని అన్నపూర్ణ

కూతురు - అల్లుడు
నల్లమోతు దుర్గారాణి - నల్లమోతు మధుకర్

మనుమలు, మనుమరాండ్రు :
జ్యోత్స్న, మధుల్లిక, జ్ఞానప్రసూన, విఘ్నేష్, పూర్ణ యశస్వి, మోనిక, శివవెంకటసాయి జగన్నాథ్

KALYANI ADS 9849983589

గండం గట్టెక్కేదెలా..!

- త్వరలో రిలీవ్ కానున్న 250 మంది హౌస్‌సర్జన్లు
- ప్రత్యామ్నాయాలపై జీజీహెచ్ అధికారుల దృష్టి

ఈనాడు - అమరావతి

గుంటూరు వైద్య కళాశాల నుంచి ఈ నెలాఖరునాటికి 250 మంది హౌస్ సర్జన్లు రిలీవ్ అవుతున్నారు. కొత్త బ్యాచ్ రావడానికి రెండు నెలల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో వైద్య సేవలపై ప్రభావం పడకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలపై దృష్టి పెట్టింది. ఇప్పటికే జీజీహెచ్‌లోని అనేక కీలక విభాగాల్లో వైద్యుల కొరత పీడిస్తోంది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఇటీవల ఉన్నతాధికారులకు అభ్యర్థన వెళ్లింది. ప్రస్తుతం ఉన్న వైద్యుల్లో కొందరు సమయపాలన పాటించకపోవడాన్ని అందులో ప్రస్తావించారు.

రెండు నెలలు కష్టకాలం

హౌస్ సర్జన్లు రిలీవ్ అయితే వైద్య సేవల పరంగా ఇబ్బందులు ఎదురవుతాయి. సీజన్ మారుతున్న నేపథ్యంలో వైద్య సేవల కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అడ్డంకులను ఎలా అధిగమించాలన్నదానిపై అధికారులు దృష్టి సారించారు. మే నాటికి కొత్త బ్యాచ్ వచ్చే అవకాశం ఉంది.

కళాశాలలతో చర్చలు

జిల్లాలో ఉన్న నాలుగు ప్రముఖ దంత వైద్య కళాశాలలతో జీజీహెచ్ వర్గాలు మంగళవారం చర్చలు జరిపాయి. విద్యార్థులు జీజీహెచ్‌లో సేవలందించేలా సహకరించాలని కోరాయి. నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాల పీజీలు, ఎస్ఆర్‌ల సేవలు తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఉద్యోగ మేళా 27న

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరులోని డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేఫ్ కాఫీ డే సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి, వయసు 18-35 సంవత్సరాల్లోపు యువత మేళాకు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 63020 96189 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బాలల అతివేగం.. గర్భస్థ శిశువుకు మరణశాసనం

ద్విచక్ర వాహనంతో గర్భిణిని ఢీకొన్న మైనర్లు

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఇద్దరు బాలల అత్యుత్సాహం... ఓ నిండు గర్భిణి ఆశలను చిదిమేసింది. చేతిలో బైక్ ఉంది కదా అని విపరీతమైన వేగంతో వెళ్తూ ఆమెను ఢీకొనడంతో గర్భస్థ శిశువుకు నూరేళ్లు నిండిపోయాయి. మైనర్లకు బైకులు ఇవ్వొద్దని పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా.. మారని తల్లిదండ్రులు ఆ తల్లికి ఏం సమాధానం చెబుతారు? పోలీసులు తెలిపిన వివరాలిలా... తాడేపల్లి మండలం మెల్లెంపూడికి చెందిన రజియాకు తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. ఏడు నెలలు గర్భిణిగా ఉన్న ఆమె బుధవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళగిరి వచ్చారు. వారంతా వైద్య శాలకు వెళ్లేందుకు గౌతమ బుద్ధ రోడ్డు దాటుతుండగా.. విజయవాడ వెళ్లే మార్గంలో సుమారు పదిహేనేళ్ల వయసున్న ఇద్దరు బాలలు తమ ద్విచక్ర వాహనంతో శరవేగంగా దూసుకొచ్చి రజియాను బలంగా ఢీకొట్టారు. ఆ ధాటికి ఆమె బోర్లా పడిపోగా.. ద్విచక్రవాహనం కొద్దిదూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. వెంటనే స్పందించిన అక్కడివారు ఆమెను వైద్యశాలకు తరలించారు. అప్పటికే గర్భస్థ శిశువు కన్ను మూసినట్టు వైద్యులు నిర్ధారించారు. బాధితురాలి తండ్రి గాలిబ్ ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ పనుల్లో భారీగా అక్రమాలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: రూరల్ మండలంలో 11 పంచాయతీల్లో 2024-25లో జరిగిన రూ.3.64 కోట్ల ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు బయటపడ్డాయి. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డ్వామా పీడీ శంకర్ ఆధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. అక్రమాలకు పాల్పడిన వారు డబ్బులు తిరిగి చెల్లించాలని పీడీ ఆదేశించారు. కూలీల డబ్బులు అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. జొన్నలగడ్డలో ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటకుండానే బిల్లులు డ్రా చేసుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్:(బుధవారం) సాయంత్రం: 6.19
సహరి: (గురువారం) ఉదయం: 5.11

అమృతమూర్తికి అశ్రుతాంజలి

కీ॥శే॥ అక్కిశెట్టి అన్నపూర్ణమ్మ గారు

(W/o. కీ॥శే॥ అక్కిశెట్టి వెంకయ్య గారు)

కాకానివారిపాలెం(గ్రా.), కారంపూడి(మం.), పల్నాడు జిల్లా.

జననం : 01-01-1927 ★ మరణం : 11-02-2026

మీ జీవన గమనంలో
ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని,
మా అందరి శ్రేయస్సు కోసం
అహర్నిశలు శ్రమించి, మా ఇంటి ఇలవేల్పుగా,
మాకు తోడు నీడగా నిలచిన మీరు
భౌతికంగా మా నుండి దూరమైనా...
మీ అనురాగ స్మృతులను ఎన్నటికీ మరువలేము.
దివి నుండి మీరందించే దీవెనలే
మాకు శుభాశీస్సులు.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు : అక్కిశెట్టి బాల గురవయ్య-అనంతరాములు; అక్కిశెట్టి బాబూరావు-సుజాత; అక్కిశెట్టి కొండలరావు-జ్యోతి

కుమార్తెలు - అల్లుళ్ళు : ఆవుల కుమారి-రామకోటయ్య; గాజుల సుజాత-సైదులు

మనుమలు & మనుమరాళ్ళు : చిల్లర వెంకట రమణ (లేటు); శింగంశెట్టి వెంకాయమ్మ; అక్కిశెట్టి రామారావు M.Sc.(Ag.)-త్రివేణి B.Com.; అక్కిశెట్టి రమాశ్రీ M.B.B.S.,; అక్కిశెట్టి వెంకటకృష్ణ శేషసాయి B.B.A., LLB; అక్కిశెట్టి వైష్ణవి B.B.A.,; అక్కిశెట్టి విష్ణుదేవరాయలు; తన్నీరు ఫణీంద్ర B.Tech.-విజయభారతి M.Sc. (Bio.Tech.); అక్కిశెట్టి విజయభార్గవ్ M.Sc.,-స్వరూప B.Tech.; ఆవుల ప్రకాష్-సువర్ణ; ఆవుల సుధాకర్ (లేటు)-శైలజ; పసుపులేటి కొండలరావు-విజయమాధవి; ఆకుల శ్రీనుబాబు M.S. (USA)-శైలజ M.S. (USA); గాజుల సైదారావు M.S. (USA)-నీరజ B.Tech.(USA); గాజుల ఝాన్సీరాణి M.B.B.S., D.Ch. (Pediatrics)

మునిమనుమలు & మునిమనుమరాళ్ళు : అక్కిశెట్టి చేతన్ వెంకట రాయలు, అక్కిశెట్టి దేవాన్ష్ రాయలు, చిల్లర వేణుగోపాల్ B.Sc. (Ag.), ఆవుల భార్గవ్ మనోజ్ B.Sc. (Pharma Science), ఆవుల సాయిరాజేష్, ఆవుల నాగనందిని B.Tech., శింగంశెట్టి నిఖిత B.Tech, శింగంశెట్టి యశ్వంత్ B.Sc. (Ag.), పసుపులేటి నాగజ్యోతిర్మయి, పసుపులేటి నాగసుధా శ్రీరామ్ చరణ్, ఆకుల శ్రీజై నిధిన్, గాజుల స్మృతి ఆద్య, గాజుల సాధ్విశ్రీ ఆర్య, తన్నీరు లాలిత్య, తన్నీరు నాగ రేయాన్ష్

పెద్దకర్మ : ది.25-02-2026 బుధవారం
పల్నాడు జిల్లా, కారంపూడి (మం.), కాకానివారిపాలెం, బ్రహ్మనాయుడు కాలనీ లోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియపరచడమైనది. సెల్ : 9912165194

ఆరోగ్య సంరక్షణలో రెండవ వార్షికోత్సవం

2nd ANNIVERSARY

శ్రేష్ఠ హాస్పిటల్స్®

శ్రేష్ఠ హాస్పిటల్స్‌తో మీ అనుబంధానికి రెండేళ్లు పూర్తయ్యాయి.
గత రెండు వసంతాలుగా మీ ఆరోగ్య నేస్తంగా సేవలందిస్తూ,
వేలాది మంది నమ్మకాన్ని అందుకున్నాం. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,
మీ సంరక్షణ కోసం ఇదే నిబద్ధతతో ముందుకు సాగుతామని హామీ ఇస్తున్నాం.

మీ ఆరోగ్య సంరక్షణలోనే సదా మా ప్రయాణం...



డా॥ యడ్లపల్లి లక్ష్మణ స్వామి
ఫౌండర్ ఛైర్మన్ & చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్

డా॥ నాగార్జున గొట్టిపాటి
డైరెక్టర్ & ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

నగదు రహిత సౌకర్యం | 24/7 ఎమర్జెన్సీ సర్వీస్

0863 352 5252 | 77999 88108 | జెకెసి కాలేజ్ రోడ్, గుజ్జనగుండ్ల, గుంటూరు | www.sreshtahospitals.in

KALYANI ADS

5వ తరగతి, ప్రథమ ఇంటర్ ప్రవేశ పరీక్షలు 1న

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా ఏడాదికి 5వ తరగతి, ప్రథమ ఇంటర్, ఐఐటీ/నీట్ ప్రవేశపరీక్షలు మార్చి 1న నిర్వహించనున్నామని జిల్లా సమన్వయకర్త ఎస్.శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి పరీక్ష ఆదివారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, ఇంటర్ పరీక్ష మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు, ఐఐటీ, నీట్ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఆయా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 8న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను కలవాలని సూచించారు.

జనగణనపై పూర్తి అవగాహన అవసరం

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన అధికారులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ యాప్ ద్వారా చేపట్టే జనగణనపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో జనాభా లెక్కల సేకరణ-2027 ఇళ్ల జాబితా తయారీ, కుటుంబ జనాభా గణన అంశంపై మున్సిపల్ కార్పొరేషన్, మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో జనగణన చేసే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు మండల స్థాయిలో ప్రత్యేకంగా శిక్షణ అందిస్తారన్నారు. జనగణన వివరాల సేకరణ కీలకం.. అన్ని విషయాలపై అవగాహన అవసరమన్నారు. మూడు రోజుల శిక్షణ పూర్తయిన తర్వాత ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించి పరిజ్ఞానాన్ని తెలుసుకుంటామన్నారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జనాభా లెక్కల నమోదును పక్కాగా చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్(హెచ్ఎల్ఓ), రెండో దశ పాపులేషన్ ఎన్యూమరేషన్ (పీఈ) జరుగుతుందని తెలిపారు. జనాభా లెక్కల కార్యనిర్వాహక అధికారి, జేడీ జి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను డిజిటల్ విధానంలో చేపట్టాలని కేంద్రం నిర్ణయించిందని, అందుకనుగుణంగా మొబైల్ అప్లికేషన్, వెబ్ పోర్టల్ రూపొందించినట్లు తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో కచ్చితమైన వివరాలతో కూడిన జనాభా లెక్కల సేకరణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులుగా కలెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్లలో మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారన్నారు. నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో ఖాజావలి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందిన వారికి పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ సీఆర్‌డీఏ ప్రత్యేక ఉప కలెక్టర్లుగా పి.మధుసూదన, జి.సుజాత, జి.వెంకటేష్, పి.మధుసూదనరావు, వి.పద్మావతి, కె.ఆనందరావు, కె.సుధారాణి, కె.వినాయక, వి.శైలజ, వి.సుబ్బారావు, ఆర్.చంద్రముని, టి.బాబిరెడ్డి, డి.ఏలీషా, జొంత రత్నకుమారిలకు పోస్టింగ్ ఇచ్చింది.

కాటూరి వైద్యకళాశాలకు గవర్నర్ రాక నేడు

ఈదులపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ బుధవారం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం సమీపంలోని కాటూరి వైద్యకళాశాలకు రానున్నారు. అక్కడ నిర్వహించనున్న 22వ గ్రాడ్యుయేషన్ డేలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని కళాశాల సూపరింటెండెంట్ వై.కిరణ్‌కుమార్ చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకు గవర్నర్ హాజరవుతారని, వైద్య విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

బాలికపై అకృత్యం కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: బాలికను ప్రేమిస్తున్నట్టు నటించి.. ఆమె తండ్రిని హతమారుస్తానని బెదిరించి.. మోసంతో తాళికట్టి అత్యాచారానికి పాల్పడ్డ కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.49వేల జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక విజయవాడలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు ఆమె ఇంటి సమీపంలో ఉంటున్న ఆరోగ్యస్వామి అజయ్‌కుమార్(21) ప్రేమిస్తున్నానని వెంటపడి వేధించాడు. ఆమె తిరస్కరించి.. విషయం తన తండ్రి దృష్టికి తీసుకెళ్లింది. ఆయన తన కుమార్తె వెంటపడొద్దని అజయ్‌కుమార్‌ను హెచ్చరించారు. కొంతకాలం మౌనంగా ఉన్న అజయ్ కొన్నాళ్ల తరువాత బాలిక వెంటపడ్డాడు. ప్రేమించకపోతే ఆమె తండ్రిని హతమారుస్తానని బెదిరించాడు. 2021 మార్చి 21న ఆమె కళాశాలకు వెళ్తున్నప్పుడు బెదిరించి విజయవాడలోని కనకదుర్గమ్మ గుడికి తీసుకెళ్లి బలవంతంగా ఆమె మెడలో తాళి కట్టాడు. ఆ సమయంలో అతని తండ్రి కూడా అక్కడే ఉన్నారు. అనంతరం ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే దండిస్తారన్న భయంతో ఆమె చెప్పలేదు. కొంతకాలం తరువాత తన కోరిక తీర్చేందుకు రావాలని లేదంటే వివాహం విషయాన్ని బయటపెడతానని మళ్లీ బెదిరింపులకు దిగాడు. ఓ దశలో ఆమె తండ్రిని హతమారుస్తానని మళ్లీ బెదిరించాడు. విసిగిపోయిన ఆమె అదే సంవత్సరం జూన్ 2న గుంటూరులోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రాసిక్యూషన్ నిందితుడిపై నమోదైన అన్ని అభియోగాలను రుజువు చేయడంతో కోర్టు శిక్ష విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.దుర్గాప్రసాద్ ప్రాసిక్యూషన్ నిర్వహించగా.. డీఎస్పీ రవికుమార్ కేసు దర్యాప్తు చేశారు.

బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం: బాలికకు జరిగిన నష్టం వెలకట్టలేమని ఆమె కుటుంబం పడిన క్షోభను ఎవరూ తీర్చలేరని న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అభిప్రాయపడ్డారు. చిన్న వయసులో అత్యాచారానికి గురై మానసికంగా, శారీరకంగా వేదన అనుభవించిందని, సమాజంలో ఆమె మళ్లీ నిలదొక్కుకోవడానికి నష్ట పరిహారం కింద రూ.5 లక్షలు ప్రభుత్వం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. తీర్పు నకలును గుంటూరు కలెక్టర్‌తో పాటు న్యాయ సేవాధికారసంస్థ ఛైర్మన్, కార్యదర్శులకు కూడా పంపాలని ఆదేశించారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

వన్‌స్టాప్ కేంద్రంలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మిషన్ శక్తి కింద ఉన్న వన్‌స్టాప్ కేంద్రంలో ఖాళీగా ఉన్న 14 పోస్టుల భర్తీకి మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ శాఖ జిల్లా అధికారి ప్రసూన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రం అడ్మినిస్ట్రేటర్, కేస్ వర్కర్, పారాలీగల్ పర్సనల్/న్యాయవాది, పారామెడికల్ పర్సనల్, సోషల్ కౌన్సెలర్, ఆఫీస్ అసిస్టెంట్, మల్టీపర్పస్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డ్ పోస్టుల్లో ఒప్పంద విధానంలో పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీ ఉదయం 10.30 నుంచి మార్చి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్, గుంటూరు నగరంలోని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫ్‌సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ పి. శ్రావణ్ కుమార్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 81217 65159
ఆస్తి తనిఖీ కొరకు : 83328 35007

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీ సగినాల వెంకటేశ్వర్లు, తండ్రి: ఏడుకొండలు, ఇంటి నెం.26-42-95/11, యస్ యఫ్.302, పివిఆర్ రెసిడెన్సి, ఏటి అగ్రహారం, గుంటూరు-522001 వారు డిమాండ్ నోటీసు తేది.11-10-2021 ప్రకారం తేది.30-09-2021 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.29,73,810/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల డెబ్భై మూడు వేల ఎనిమిది వందల పది రూపాయలు మాత్రమే)+ తేది.01.10.2021 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రీకోర్స్ లేకుండా" పద్ధతిపై" తేది: 16-03-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

శ్రీ సగినాల వెంకటేశ్వర్లు, తండ్రి: ఏడుకొండలు గారికి చెందిన ఆస్తి: షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, పూర్వం గోరంట్ల గ్రామ పంచాయితీ, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గోరంట్ల గ్రామం, సర్వే నెం.471లోని ప్లాట్ నెం.267ఎ మరియు 267బి (దక్షిణం వైపు)తో గల 708.5 చ॥గ॥ల స్థలం. షెడ్యూల్-ఎ (స్థలమునకు) హద్దులు: తూర్పు: 40 అ॥ల రోడ్డు-99'0", దక్షిణం: సర్కారు డొంక-70'0", పడమర: ఇతరుల ఆస్తి-91'0', ఉత్తరం: ప్లాట్ నెం.267బి (భాగం)-64'3'.
షెడ్యూల్-బి: పైన తెలిపిన ఆస్తిలో ఫార్చ్యూన్ హోమ్స్ మొదటి అంతస్తు నందు 1160 చ॥అ॥ల ప్లింత్ ఏరియాతో (కామన్ ఏరియాలు మరియు ఒక కార్ పార్కింగ్‌తో సహా) ఫ్లాట్ నెం.201. (డాక్యుమెంట్ నెం.4919/2018, తేది.08-11-2018 ప్రకారం). షెడ్యూల్-బి (ఫ్లాట్‌కు) హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై మరియు ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.202కు మధ్య గల లిఫ్ట్, ఉత్తరం: కామన్ కారిడార్.

రిజర్వు ధర : రూ.23,00,000/- ధరావత్తు : రూ.2,30,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 16-03-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:25-02-2026 నుండి 15-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

తేది: 24-02-2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫ్‌సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. ముక్తేశ్వరరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 88866 40777
ఆస్తి తనిఖీ కొరకు : 98856 03986

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీ కేశాని కృష్ణారావు, తండ్రి : కె. వెంకటేశ్వర్లు, డి.నెం.27-7-02, 4వ లైన్, కన్నవారితోట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522004. వేరొక చిరునామా: శ్రీ కేశాని కృష్ణారావు, తండ్రి : కె. వెంకటేశ్వర్లు, నెం.87, పుట్లలమ్మ గుడి, కర్లపాలెం, గుంటూరు రూరల్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522111. వేరొక చిరునామా: శ్రీ కేశాని కృష్ణారావు, తండ్రి : కె. వెంకటేశ్వర్లు, పోలీస్ కానిస్టేబుల్, ఎపి పోలీస్ డిపార్ట్‌మెంట్, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఎదురుగా, నగరంపాలెం ఏరియా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522004 వారు డిమాండ్ నోటీసు తేది.01-10-2024 ప్రకారం తేది.01-10-2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.32,02,086/- (అక్షరాల ముప్పై రెండు లక్షల రెండు వేల ఎనభై ఆరు రూపాయలు మాత్రమే) + తేది.02.10.2024 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రీకోర్స్ లేకుండా" పద్ధతిపై" తేది.04-04-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతలు & హామీదారులకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

ఎ-షెడ్యూలు: గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏరియా, అంకిరెడ్డిపాలెం, చల్లారెడ్డి పాలెం గ్రామ పంచాయితీ పరిధిలో, చల్లారెడ్డిపాలెం గ్రామ డి.నెం.823 వద్ద గల ఆస్తి. అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు: రోడ్డు - 151.6 అ॥లు, దక్షిణం : ఎస్. వెంకటేశ్వర్లు మరియు ఇతరుల ఆస్తి - 146.6 అ॥లు, పడమర: పొన్నెగంటి లక్ష్మి మరియు ఇతరుల ఆస్తి - 169.6 అ॥లు, ఉత్తరం: వై. రాధాకృష్ణ మూర్తి గారి ఆస్తి - 141.0 అ॥లు.,
ఈ నాలుగు హద్దులలోని విస్తీర్ణం 2148.55 చ॥గ॥లు లేదా 1796.46 చ॥మీ॥ల స్థలం, దీనిలో 42.971 చ॥గ॥లు లేదా 35.93 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా
బి-షెడ్యూలు: ఎ-షెడ్యూలు నందు నిర్మించిన "కన్నా టవర్స్" అను పేరు గల అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.402 (పూర్తికాని ఫ్లాట్) ఆస్తి రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.882/2022, తేది.07.02.2022, నల్లపాడు ఎస్ఆర్ఓ ప్రకారం శ్రీ కేశాని కృష్ణారావు, తండ్రి : కె. వెంకటేశ్వర్లు గారికి చెందినది. ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర: కామన్ కారిడార్, ఉత్తరం : ఓపెన్ టు స్కై.
ఈ నాలుగు హద్దులలోని విస్తీర్ణం 1150 చ॥అ॥లు (కామన్ మరియు పార్కింగ్ ఏరియాతో సహా), అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజర్వు ధర : రూ.16,10,000/- ధరావత్తు : రూ.1,61,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 04-04-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

పై ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:25-02-2026 నుండి 03-04-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

తేది: 24-02-2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బొప్పాయి సాగు.. ఆదాయం బాగు



దుగ్గిరాల, న్యూస్‌టుడే

పంటల్లో బొప్పాయికి ఎంతో ప్రాధాన్యం ఉంది. బొప్పాయి ప్రస్తుతం మంచి ఆదాయాన్ని ఇస్తుందని రేవేంద్రపాడులో సాగు చేస్తున్న సూతక్క కొత్తపాలేనికి చెందిన శ్యామల సాంబిరెడ్డి చెప్పారు. బొప్పాయి సాగు కయ్య ఖర్చు, వచ్చే ఆదాయం వివరాలను ఆయన వివరించారు. దుక్కికి రూ.1200 అయ్యింది. గొర్రె ఎరువు, పశువుల ఎరువు కలిపి నాలుగు ట్రక్కులు వేశారు. ట్రక్కు రూ.800 చొప్పున రూ.3200 అయింది. మొక్కలు రూ.16 చొప్పున కొన్నారు. అరెకరానికి 500 మొక్కలు వేశారు. దీనికి రూ.8 వేలు అయింది. మొక్క నాటినందుకు రూ.3 వేలు ఖర్చు పెట్టారు. ఏడు నెలలకు కాపు వచ్చింది. తద్వకు పైపాటు మందు, కూలీ కలిపి రూ.1300 అయ్యింది. 8 సార్లు మందు కొట్టాను అంటే రూ.10,400 వ్యయం అయింది. కౌలు రేవేంద్రపాడులో ఎకరాకు రూ.60 వేలు ఉంది. వెరసి మొత్తం రూ.85,500 అవుతోంది. దిగుబడి గమనిస్తే కాయ 2 కిలోల నుంచి 4 కిలోల వరకు ఉంటుంది. సగటున 3 కిలోలుగా లెక్కిస్తే వచ్చు. చెట్టుకు 10 నుంచి 12 కాయలు వరకు వస్తాయి. అంటే ఒక్కొక్క చెట్టు 30 కిలోల నుంచి 36 కిలోల వరకు దిగుబడి ఇస్తుంది. కాయ ధర నెల క్రితం వరకూ రూ.15 కొన్నారు. ప్రస్తుతం కిలో రూ.18 చొప్పున మాదగ్గర కొంటున్నారు. సగటున రూ.16 చొప్పున వేసుకున్నా చెట్టుకు రూ.480 నుంచి రూ.576 వరకు ఆదాయం వస్తోంది. సగటున చూసుకున్నా రూ.525 వరకు ఆదాయం ఉంటుంది. నేను వేసిన అరెకరంలో 500 మొక్కలున్నాయి. కాబట్టి రూ.2,62,500 లక్షల ఆదాయం ఉంది. కౌలు పోను ఆదాయం రూ.1.50 లక్షలకు పైగానే ఉంది. మార్కెట్‌కు మేము తీసుకెళ్లక్కర్లేదు. వచ్చే వ్యాపారులు కొంటున్నారు. వాతావరణం అనుకూలిస్తే అదే చెట్టు మూడేళ్ల వరకు ఉంటుంది.

సంప్రదించొచ్చు.. సలహా పొందొచ్చు

రైతులకు డిజిటల్ సేవలు అందించేందుకు వీలుగా 'పాడి పంట' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సహకారంతో రూపొందించిన ఈ యాప్ ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, కోళ్లు, మేకల పెంపకం, మత్స్య సాగుకు సంబంధించిన మెలకువలు, తెగుళ్ల నివారణ తదితర వివరాలు తెలుసుకోవచ్చు. స్థానిక భాషలో సమాచారం అందించడం దీని ప్రత్యేకత. గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సందేహాలు- సమాధానాలు: ★ మొబైల్ ఫోన్‌లో లొకేషన్ ఆధారంగా ఆరోజు, వచ్చే నాలుగైదు రోజుల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియజేస్తుంది. ★ సాగు చేసే పంటలకు సంబంధించి ఎలాంటి సలహాలు కావాలన్నా వాయిస్ రూపంలో సంక్షిప్త సందేశం పంపడం ద్వారా పొందవచ్చు. ★ పంటలకు సోకే చీడపీడల గుర్తింపు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ పంటకు ఏ ఎరువు వేయాలి. నీరు ఎప్పుడు పెట్టాలి. కీటకాల నివారణ చర్యలపై సలహాలు ఇస్తుంది. ★ ఎంచుకున్న భాషలో పంట సాగవుతున్న ప్రాంతానికి అనుగుణంగా సూచనలు పొందొచ్చు. వివిధ పంటలకు సంబంధించిన తెగుళ్ల నివారణ వీడియోలను వీక్షించొచ్చు. మార్కెట్ సమాచారం తెలుసుకోవచ్చు. ★ 24 గంటల్లో ఎప్పుడైనా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. వ్యవసాయశాఖ డిజిటల్ సహాయకులు అందుబాటులో ఉంటూ అవసరమైన సలహాలు ఇస్తారు.

– ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

మేలైన టమాట దిగుబడికి మార్గం

చేబ్రోలు: టమాటాలో నాణ్యమైన దిగుబడికి ఉద్యాన శాఖ సహాయ సంచాలకుడు రవీంద్రబాబు సూచనలు చేశారు. ప్రతి టమాటా మొక్క పక్కన కర్ర పాతితే..దానిని ఆసరాగా చేసుకుని పెరుగుతుంది. దీనివల్ల కాయలు నేలకు తగిలి పాడవవు. మంచి పరిమాణంతో దిగుబడి వస్తుంది. గాలి, వెలుతురు తగిలి తెగుళ్ల బెడద తగ్గుతుంది.

రాయితీ పొందొచ్చు: టమాటా సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం అందిస్తుంది. హైబ్రిడ్ వెజిటబుల్ కల్టివేషన్ పథకంలో భాగంగా విత్తనాలు, నారు, సేంద్రియ, రసాయన ఎరువుల కొనుగోలు, సమీకృత తెగుళ్ల నివారణకు అవసరమయ్యే మందుల ఖర్చులో 40 శాతం రాయితీ అందుతుంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా హెక్టారుకు రూ.24 వేల వరకు ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యానాధికారులను సంప్రదించి, తగు పత్రాలు సమర్పించాలి.

మిర్చి కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?: మోహన్‌రావు, బడేపురం, తాడికొండ మండలం

సమాధానం: మిరప కాయల రంగు, మాట నాణ్యతను నిర్దేశిస్తాయి. మిరప నాణ్యతాప్రమాణాల్లో తేమ ప్రముఖ పాత్ర వహిస్తుంది. కోత సమయంలో కాయల్లో 75-80 శాతం తేమ ఉంటుంది. దీనిని 10 నుంచి 11 శాతం వచ్చే వరకు ఆరబెట్టుకోవాలి. మిరకాయలు పొడవుగా ఉండి గింజలు బరువు, కాయ మంచి రంగు, మాట ఉంటే అవి నాణ్యమైనవి. నాణ్యమైన ఎండు మిర్చిని పొందడానికి కోతకు ముందు, కోత సమయంలో, కోత అనంతరం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

కోతకు ముందు జాగ్రత్తలు: కోతకు ముందే పంటకు నీటి తడులు ఇవ్వాలి. కోతకు 15 రోజుల ముందు నుంచి ఎటువంటి సస్యరక్షణ మందులు పిచికారీ చేయకూడదు. దీనివలన పురుగు మందు అవశేషాలు లేకుండా మిర్చి ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

కోత సమయంలో..: మొక్కల మీద పూర్తి పక్వానికి వచ్చి రంగు తిరిగిన వెంటనే కాయలను పొడి వాతావరణంలో కోయాలి. ఇందువల్ల కాయలు ఎండిపోవడానికి ముడతలు పడక మంచి నిగారింపు వస్తుంది. కాయ నాణ్యత, దిగుబడి పెరగాలంటే సరైన సమయంలో కోయాలి. కాయలను 7-8 సార్లు కోస్తే మంచి నాణ్యత వస్తుంది. కాయలను కోసిన తరువాత జాగ్రత్తగా ఒక రోజు రాశిగా పోసి పట్టాలు కప్పి పని సమానంగా పండేలా చూడాలి. కాయలను నేలపైన గాని, ఇసుకపైన గాని పేడ అలికిన కల్లాలపై అర బెట్టుకోవాలి. పట్టాలపైగాని లేదా కాంక్రీటు కల్లాలపై ఆర బెట్టుకోవాలి. 10 శాతం తేమ వచ్చే వరకు 15-20 రోజుల వరకు ఎండ బెట్టుకోవాలి. కాయలు సరిగా ఎండక పోతే రంగు, మెరుపు కోల్పోతాయి. రాత్రిళ్లు మంచు బారిన పడకుండా పరదాలను కప్పి ఉంచాలి.

ఎండు మిర్చిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

-డాక్టర్ ఎం.నగేష్, ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త

– జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు

మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు, రాజా మాస్టారు, వేములకొండ శ్రీనివాస్ తదితరులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి అంబటి రాంబాబు కాపు నాయకుడని, వంగవీటి రంగా వారసుడని వైకాపా నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని తెదేపా జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాణిక్యరావు మాట్లాడుతూ 'అంబటిని గొప్ప నాయకుడిగా చిత్రీకరించడానికి వైకాపా నాయకులు గుంటూరుకు పరామర్శల పేరుతో వరుస కడుతున్నారు. రంగా పేదల కోసం పోరాటం చేసిన వ్యక్తి. అటువంటి వ్యక్తితో అంబటిని పోల్చడానికి తమ్మినేని సీతారామ్‌కు, ముద్రగడకు మనసెలా వచ్చింది. కాపు సామాజికవర్గంలో అంబటి పులి అని కొందరు జాకీలేసి లేపుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డిలు ఎంత మంది వచ్చినా కూటమిని ఏమీ చేయలేరు. అభివృద్ధిని ఆపలేరు'.. అని స్పష్టం చేశారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాస్టారు మాట్లాడుతూ ప్రజాసేవ చేయడానికి రాజకీయం ఒక వేదికగా ఉండాలే తప్ప, రాజకీయాల్లో ఎదిగేందుకు కులాలను వేదికగా చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కాపులకు సముచిత స్థానం కల్పించింది మొదట నుంచి తెదేపా అన్నారు. కాపులను దూషించిన అంబటిని ముద్రగడ వెనకేసుకు రావడం జగన్ కళ్లల్లో ఆనందం చూడడం కోసమేనని విమర్శించారు. తెదేపా జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రాంబాబును పరామర్శించే కార్యక్రమంలో వైకాపా నాయకులు కులాల ప్రస్తావన తీసుకొస్తూ చిచ్చు పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాలవారిని గౌరవిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. తెదేపా నాయకుడు కంచర్ల శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, రిటైల్ ధర - 154, చికెన్ విత్‌స్కిన్ - 223, చికెన్ స్కిన్‌లెస్ - 254.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

కాంగ్రెస్ తీరుపై భాజపా నిరసన

ప్రదర్శనలో నాగమల్లేశ్వరి తదితరులు

గుంటూరు నగరం: దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌లో కాంగ్రెస్ శ్రేణుల ప్రవర్తన దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించిందని భాజపా మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ మల్లేశ్వరి అన్నారు. కాంగ్రెస్ తీరుకు వ్యతిరేకంగా భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం పట్నంబజారులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ కాంగ్రెస్ చర్యలు దేశగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రాధా మాధవి, మిర్చియార్డు డైరెక్టర్ శ్రావణకుమారి, హరిపావని, శ్రీదేవి, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	1,00,860
అమ్మకాలు:	98,920
నిల్వలు:	26,333

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	13,500-20,000
నంబర్ 5	13,500-20,000
341	14,000-20,500

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,000-18,000
బాడిగ	14,000-20,500
దేవనూరు డీలక్స్	15,500-21,000
ఆర్మూర్	13,000-16,500

ఏసీ కామన్ వెరైటీ

334	13,000-19,000
నెంబర్5	13,000-19,500
341	14,000-20,000
సూపర్10	13,500-22,500

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13,000-17,000
బాడిగ	14,000-20,500
తాలు	7,500-11,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

జరీబు భూములను మెట్టగా మార్చి అన్యాయం చేయొద్దు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తమకున్న జరీబు భూములను మెట్ట భూములుగా పరిగణించి అన్యాయం చేయవద్దని తుళ్లూరు మండలం కొండమరాజుపాలెం రెవెన్యూ పరిధిలో భూములు ఉన్న రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయమై సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు పత్రం అందించారు. అదేవిధంగా మంగళవారం రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయం వద్ద మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. కొండమరాజుపాలెంలోని సర్వే నంబరు 87/ఏలో ఎకరం భూమి ఉందని గ్రామానికి చెందిన ధనలక్ష్మి తెలిపారు. 2015లో రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చామని, తమ భూముల్లో విద్యుత్తు కనెక్షన్‌లు, బోర్లు ఉన్నాయని తెలిపారు. గతంలో అరటి తోటలు వేసి పంటలు పండించేవాళ్లమని పేర్కొన్నారు. చివరిలో మొక్క జొన్న వేశాం. 2016 నుంచి 2018 వరకు 3 ఏళ్ల పాటు సీఆర్డీఏ కౌలు కూడా చెల్లించింది. ఆ తరువాత ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే తమది మెట్ట భూమి అని చెప్పారు. ఆ తరువాత కౌలు కూడా చెల్లించలేదు. ఇప్పుడు 2026లో మా భూములను జీవో నంబరు 196 ప్రకారం మెట్టగా తేల్చారు. దీంతో మాకు తీరని అన్యాయం జరుగుతుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని లేదంటే తమకు మరణమే శరణ్యమని ధనలక్ష్మితో పాటు మరికొంత మంది రైతులు వాపోయారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUILDING CONSTRUCTION

BOREWELLS

నాగార్జున బోర్‌వెల్స్: బోర్‌వెల్స్ వేయబడును. గ్రౌండ్ వాటర్ సర్వే చేయబడును. సంప్రదించండి. దేవినేని ప్రసాద్: గుంటూరు 94901 14326.

JOBS

EXP. Designers with Security features in Printing for Parjanya paper production Guntur ✆ 96768 11066, 90594 05366.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-, NTR Circle, Vijayawada. ✆ 63043 28479

కావలెను. స్థానిక లక్ష్మీపురం 4వ లైన్ మాంటిస్సోరి స్కూల్ నందు పని చేయుటకు వాచ్ మెన్ ఫ్యామిలి (వసతి కలదు), ఆయమ్మలు కావలెను. ✆ 8121400100.

MNY ఫామ్ ల్యాండ్స్ కోసం గుంటూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం + Inc. ఇవ్వబడును. వయస్సుతో పనిలేదు. సం: 10am-6pm. ✆0863-4616071.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ నందు Senior Civil Engineersగా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము 50,000/- నుండి 60,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 8978480429.

నిరుద్యోగ యువతకి సువర్ణావకాశం. డా.రెడ్డీస్ ఫౌండేషన్ వారిచే కమ్యూనికేషన్ ఇంటర్వ్యూ, స్కిల్స్, కంప్యూటర్ కోర్స్‌లో 60 రోజుల ఉచిత శిక్షణ, ఉద్యోగం కల్పించబడును. వ: 18-28, 9063817157

కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయీస్, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ: 35-70, Q:10th, జీ: 12-15 వేలు ✆ 63041 81391

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

పల్నాడు, బొజ్జాపురం, రావెల, పొన్నెకల్లు, జొన్నలగడ్డ, మల్లాది, అమరావతి, కర్లపూడి, మోతడక, నిడుముక్కల, తుళ్ళూరు, బడేపురం, తాడికొండ, సంఖురావు, కంతేరు, కొప్పురావూరు, వెనిగండ్ల, దొండపాడు, అనంతవరప్పాడు, నెక్కల్లు మరియు పరిసర గ్రామాలలో ప్రముఖ విద్యాసంస్థ కోసం పని చేయుటకు టీమ్ లీడర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్. సంప్ర: 8712618882, గుంటూరు.

SECURITY GUARDS

ప్రముఖ బ్యాంకులలో పని చేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21to45, అర్హత: 10th. PF+ESI కలదు. ✆ 96522 40528, 97049 64931, 94918 84025.

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్, 50 సం. వయసు, 12hr డ్యూటీ. జీతం 14000/-. ✆ 7288004466.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

తెనాలి

• తెనాలి • పొన్నూరు

విద్యార్థులకు అభినందన

పొన్నూరు, న్యూస్‌టుడే: గుంటూరులోని జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం నిర్వహించిన 29వ ఎడిషన్ చందూస్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచిందని ఇన్‌ఛార్జి ఉపకులపతి కె.వి.కృష్ణకిశోర్ తెలిపారు. గత నాలుగేళ్లల్లో విజ్ఞాన్ జట్టు మూడుసార్లు కప్పు సాధించిందన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టు సభ్యులను మంగళవారం విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, అధ్యాపకులు అభినందించారు.

గెలుపొందిన జట్టును అభినందిస్తున్న లావు రత్తయ్య

తాగునీటి పంపిణీ నిలిపివేత నేడు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని కృష్ణా నదీ జలాల శుద్ధి కేంద్రంలో బుధవారం మోటార్ మరమ్మతులు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కుళాయిల ద్వారా అందిస్తున్న తాగునీటి పంపిణీని నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాగునీటి పంపిణీని గురువారం ఉదయం నుంచి పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 7200

అత్యల్పం: 5800

సగటు: 6500

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి నందులపేట వినాయకుడి గుడి బజార్‌లో పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **- సాంబశివరావు, స్థానికుడు** ✔ మరమ్మతులు చేయిస్తాం. ? తెనాలి రామలింగేశ్వరపేట డిపో కూడలిలోని ప్రధాన కాలువ పూడికతో నిండిపోయింది. **- కుమార్, స్థానికుడు** ✔ పూడికలు తొలగిస్తాం.

- పై ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు సమాధానాలు ఇచ్చారు.

స్పందన: తెనాలి యడ్లలింగయ్య కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేయించారు. – న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తుప్పు పట్టిస్తున్నారు..

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

పట్టణంలోని మున్సిపాలిటీ కంపోస్టు యార్డులో మానవ ఘన వ్యర్థాల శుద్ధి యంత్రాన్ని గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నడుపుతున్నట్లు దస్త్రాల్లో లెక్కలు చూపుతున్నారు. ఇటీవల కురిసిన వానలకు కంపోస్టు యార్డులోని వ్యర్థాల కింద నీరు ఈ యంత్రంలోకి చేరింది. తుప్పు పట్టి వినియోగానికి దూరంగా ఉన్న దానికి మరమ్మతుల పేరుతో రంగులు వేయించి మున్సిపల్ అధికారులు బిల్లులు చేసుకున్నారు.

★ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మున్సిపల్ అధికారులు రూ.లక్షల విలువ కలిగిన ఎఫ్ఎస్‌టీపీ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, ఇతరులు నడుపుతున్న మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలు ఎఫ్ఎస్‌టీపీకి తేవడానికి ప్రత్యేకంగా గల్పర్ కొన్నారు. వ్యర్థాలు శుద్ధి చేశాక వచ్చిన నీటిని మొక్కలకు వాడుకోవచ్చని, మట్టిని పొలాల్లో ఎరువుగా వినియోగించుకోవచ్చని అవగాహన కల్పించారు. ఇళ్లల్లోని సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు తీసుకెళ్లే ప్రైవేటు ట్యాంకర్ల వారిని పిలిచి ఇక నుంచి వ్యర్థాలను ఇక్కడికి తేవాలని సూచించారు. కాని దీన్ని కూడా ఆచరణలోకి తీసుకు రాలేదు.

★ ఇటీవల పట్టణంలోని ఓ కాలనీలో రూ.30 కోట్లతో మురుగు నీటిశుద్ధి ప్లాంటు నిర్మించారు. టెండర్ నిబంధనల ప్రకారం పదేళ్ల పాటు దీని నిర్వహణ పనులు గుత్తేదారు చూసుకుంటున్నారు. సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు తెస్తే శుద్ధి చేయనున్నట్లు గుత్తేదారు మున్సిపల్ అధికారులకు సూచించారు. దీనిపై మున్సిపల్ అధికారులను సంప్రదించగా ఎఫ్ఎస్‌టీపీని పరిశీలించనున్నట్లు తెలిపారు.

సిబ్బంది కొరత.. ప్రజలకు అవస్థ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయ పరిధిలోని ఇంజినీర్ల నియామకాలు ఊసే లేదు. దీంతో ప్రభుత్వ లేఔట్లలో ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణ అధికారులు కరవయ్యారు. ఉన్న ఇంజినీర్లు తమ, అదనపు విధులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. పొరుగు సేవల ఉద్యోగులతో మమ అనిపిస్తున్నారు.

☛ నియోజకవర్గాల వారీగా తెనాలి, పొన్నూరు, మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ, గుంటూరు ఈస్ట్, వెస్ట్ పరిధిలో 21 మంది సహాయ ఇంజినీర్లకు ఏడుగురు మాత్రమే ఉన్నారు. వీరికి ఇన్‌ఛార్జి ఏఈ, డీఈల అదనపు బాధ్యతలు పురమాయించారు. డివిజనల్ ఇంజినీర్లు ఏడుగురు ఉద్యోగ విరమణ చేశారు. జిల్లాలోని రెండు ఈఈ పోస్టులకు గాను తెనాలి డివిజన్‌లో ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆయనకు గుంటూరు డివిజన్ ఇన్‌ఛార్జి ఈఈ, ఇన్‌ఛార్జి డీఈ బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి రెండు మూడు అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండడంతో సకాలంలో పనులు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొందరు అధికారులు జూన్, జులైలో ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం. జిల్లాలో గత ప్రభుత్వం వేసిన ప్రభుత్వ లేఔట్లలో సుమారు 40 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి ఎక్కువ మంది గుత్తేదార్లు ఆసక్తి చూపట్లేదు. ఇప్పటికే కలెక్టర్ నిబంధనల మేరకు నిర్మాణ పనులు చేయని గుత్తేదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పనులు సక్రమంగా చేస్తారా లేదా అన్న ప్రశ్న ప్రజల్లో నెలకొంది.

జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మార్చి 14వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై రాజీ పడదగిన కేసుల వారికి అవగాహన కలిగించాలని, వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా సహకారం అందించాలని న్యాయమూర్తి పి.రాజశేఖర్ కోరారు. తెనాలి న్యాయస్థానాల ప్రాంగణంలో ఆయన మంగళవారం తెనాలి, దుగ్గిరాల, చుండూరు, వేమూరు, అమర్తలూరు, కొల్లిపర, కొల్లూరు పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు.

పోలీసులతో సమావేశమైన న్యాయమూర్తి రాజశేఖర్

మార్చి 29 నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మార్చి 29 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు తెనాలిలో జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు పర్యవేక్షక ప్రతినిధులు మంగళవారం తెలిపారు. తెనాలి మార్కెట్ ప్రాంగణం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఏర్పాట్ల పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెదేపా నాయకులతో కలిసి యార్డు ప్రాంగణంలో ఏర్పాట్లపై చర్చించారు.

వైభవంగా రథోత్సవం

చేబ్రోలు, న్యూస్‌టుడే: మండల పరిధి వడ్లమూడిలోని గంగా పార్వతీ సమేత చంద్రమౌళేశ్వర స్వామి దివ్య రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గత వారం రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి విద్యుత్తు దీపాలు, పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించిన పెద్ద రథంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి రథం లాగేందుకు అధిక సంఖ్యలో భక్తులు పోటీపడ్డారు. ఈవో నరసింహారావు, పాలకమండలి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్తు కాంతుల్లో రథం

సమస్యల వలయంలో పెదకాకాని

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకానిలో కొన్ని సమస్యలు ఏళ్ల తరబడి తిష్ఠ వేశాయి. వీటిని పరిష్కరించడంలో అధికారులు చొరవ తీసుకోవడం లేదు. గ్రామంలో మురుగు కాలువల నిర్వహణ అధ్వానంగా ఉంది. ముఖ్యంగా గౌడపాలెం, యాదవపాలెం, లూథర్‌గిరి కాలనీల్లోని మురుగు కాలువల్లో పూడికలు తీయడం లేదు. దోమల వ్యాప్తి అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అంబేడ్కర్ నగర్ వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డును కొందరు ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు చేస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గౌడపాలేనికి వెళ్లే జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ఓ భవనం అడ్డుగా ఉంది. దాన్ని తొలగించకపోవడంతో హైవే అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామంలోని మురుగు నీరు అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి మీదుగా బయటకు వెళ్లాల్సి ఉన్నా నిర్మాణం లోపంతో.. నీరు రోడ్డు వెంబడి ఉన్న ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. ఇప్పటికైనా పంచాయతీ, హైవే అధికారులు స్పందించి ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్‌నగర్ వద్ద ఆక్రమణకు గురైన రోడ్డు

దస్త్రాల తనిఖీ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: జ్వర పీడితుల నుంచి రక్త పూతలు సేకరించడం.. వాటి పరీక్షా ఫలితాలను దస్త్రాల్లో నమోదు చేయడం వంటి పనులను సాలిపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కిషోర్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆయన యూపీహెచ్‌సీ సిబ్బంది వద్ద దస్త్రాలను తనిఖీ చేశారు. సరైన వైద్యం అందించేందుకు అవి ముఖ్యమని చెప్పారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న కిషోర్ కుమార్

పెండ్లి కుమార్తెలుగా అలంకరణ

కొల్లిపర, న్యూస్‌టుడే: కొల్లిపరలోని జనార్దన స్వామి ఆలయం వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి దేవేరులను పెండ్లి కుమార్తెలుగా అర్చకులు పరాశరం జగన్నాథాచార్యులు అలంకరించారు. ఈ నెల 26న స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తాడేపల్లి, న్యూస్‌టుడే: మహిళలు విద్య, ఉద్యోగ, పరిశోధన రంగాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాతీయ మహిళా సమిట్‌లో పాల్గొని మాట్లాడారు. మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. కేఎల్‌యూ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి శివకాంచనలత, నిఖిల్, ఉపకులపతి డాక్టర్ పార్థసారథివర్మ, వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకట్రామ్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ సోని, ప్రసన్న, సమ్మిట్ కన్వీనర్ డాక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తరలించాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కాలువల్లో పూడిక తీసిన వ్యర్థాలను వెంటనే తరలించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డా.ఎం.ఏసుబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన నరేంద్రదేవ్ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు పర్యటించారు. కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేయాలని ఆదేశించారు.

పనులు పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో ఏసుబాబు

కార్మికుల హామీల అమలుకు డిమాండ్

కొల్లిపర, న్యూస్‌టుడే: పంచాయితీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు ముళకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లిపర గ్రామ పంచాయితీ కార్మికులతో సమావేశమయ్యారు. టెండరు విధానం రద్దు చేయాలని, కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్మికుల హక్కుల సాధించుకునేందుకు ఈనెల 27న చేపట్టిన చలో కలెక్టరేటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్యటనలో సీఐటీయూ నాయకులు కోటా చంద్రశేఖర్, శేషయ్య, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు చూపుతున్న కార్మికులు

అయిల్‌పామ్ సాగు లాభదాయకం

కొల్లిపర, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని ఉద్యానశాఖ అధికారి వరదరాజన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్నవరం, అన్నవరపులంక, కొత్తూరులంక గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. సాగుకు నేల స్వభావం అనుకూలమని, సాగు నీరు పుష్కలంగా ఉందని.. అధిక దిగుబడులు సాధించగలమని పేర్కొన్నారు. పంట కొనుగోలుకు పారిశ్రామిక వర్గాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పర్యటనలో ఉద్యానశాఖ అధికారిణి పద్మావతి, శ్రీనిత్య, ఏవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు గ్రామం, డో నెం: 8-92బి కాపురస్థులు ప్రస్తుతం పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామ కాపురస్థులు కూచిపూడి శ్రీనివాసరావు భార్య కూచిపూడి దానమ్మ డి.నెం: 5649/2018, డి.నెం:152/[illegible] 96 [illegible] 19-02-26 తక్కెళ్లపాడు నుంచి కొమెరపూడి బైక్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికిన వారు సంప్రదించ:

79934 14073

వంతెన వద్ద రంధ్రం..

తెనాలి-గుంటూరు ప్రధాన మార్గంలో అంగలకుదురు వద్ద కాలువపై ఉన్న వంతెన మలుపులో పెద్ద రంధ్రం ఏర్పడింది. దీని వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రంధ్రం కనిపించక ప్రమాదాలకు గురి అవుతున్నారు. వంతెన అందుబాటులోకి వచ్చిన మూడేళ్లకే ఇలా రంధ్రం ఏర్పడడం ఏంటని ప్రజలు ఆరోపిస్తున్నారు. **– న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

తాగునీరు వృథా

తెనాలి పట్టణ నాజర్‌పేట పురుషోత్తం వారి వీధిలో పైపులైను తెగిపోవడంతో గత కొన్ని రోజులుగా తాగు నీరు ఇలా వృథా అవుతుంది. ఈ తీరు కొనసాగితే పైపులోకి వ్యర్థాలు సైతం చేరి జలాలు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉంది. అధికారులు సత్వరం మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

రైతులు రాయితీ వినియోగించుకోండి

వెనిగండ్ల(పెదకాకాని), న్యూస్‌టుడే: వెదురు బొంగులు, ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన అధికారి దీపిక పేర్కొన్నారు. వెనిగండ్ల, కొప్పురావూరు గ్రామాల్లోని మిరప పంటను లాం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. మిరపలో వచ్చే నల్ల తామర పురుగు, బొబ్బర తెగులు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా అన్నదాతలకు కలిగే ప్రయోజనాలు తెలిపారు. గ్రామ ఉద్యాన సహాయకుడు దుర్గానాయక్, రైతులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో మిరప పంటను పరిశీలిస్తున్న దీపిక

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

పట్టణ యడ్లలింగయ్య కాలనీలో ఎస్టీలకు ప్రత్యామ్నాయం చూపకుండా కొత్త మరుగుదొడ్లు నిర్మించకుండా ఉండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. కాలనీలోని రైల్వే ట్రాకు సమీపంలోని మున్సిపాలిటీ స్థలంలో పరదాల కింద జీవనం వెళ్లదీస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లు కాల క్రమంలో దెబ్బతిన్నాయని.. వైకాపా హయాంలో కొత్తవి నిర్మాణానికి టెండర్ పిలిచి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

PUBLIC NOTICE

We have been duly instructed by our client **Chandu Santhi Kumar S/o. Venkata Rao,** R/o. Erukalapudi Village, Tenali Mandal, Guntur District do hereby inform the general public

That one Katiki Satyanarayana, S/o. Nancharaiah, R/o. Nandivelugu, Guntur District purchased an extent of Acs.0.65 cents bearing D.No.1225/B of Kolakaluru Village on 11-08-1960 vide Doc. No.1491/1960 from Nadimpalli Savithramma rep. by her GPA holder Annamraju Madhava Rao. The said Katiki Satyanarayana died on 26-05-2005 leaving behind his wife Sitharavamma, Son Venkata Ramaiah daughters Mullapudi Venkata Ramanamma as his legal heirs, corroborated by Death and Family Certificates. The said Katiki Sitharavamma and Mullapudi Venkata Ramanamma died intestate corroborated by Death Certificates. The husband of Mullapudi Venkata Ramanamma i.e., Janaiah also died on 23-09-2005 corroborated by Death Certificate. The children of Mullapudi Venkata Ramanamma and janaiah i.e., Pardha Saradhi also died on 30-10-2003 and daughter Govada Leelavathi also died on 24-03-2011 corroborated by Death Certificates. The husband of Govada Leelavathi i.e., Govada Nanda Kishore also died 10-08-2001 corroborated by Death Certificate.

The said 1) Katiki Venkata Ramaiah and his son 2) Katiki Narendra Babu daughters 3) Durga Bhavani, W/o.Murali Seshagiri Rao 4) Alladi Prameela W/o. Sambasiva Rao 5) Mullapudi Purnachandika W/o. Pardha Saradhi 6) Adusumalli Radhika, W/o. Srinivasa Rao executed a Regd. Sale Deed on 14-03-2024 vide Doc.No.4650/2024 at SRO, Duggirala in favour of Chandu Santhi Kumar to an extent of Acs.0.65 cents bearing Kolakaluru Village No.773 as per Patta D.No.1225/B of site reciting in the said document that they are only the legal heirs of aforementioned deceased, stating that they are only the absolute owners of the notice mentioned schedule property got a clear, absolute, unencumbered, undisputed title, possession and enjoyment over the schedule property and they have every right and entitlements to assign, convey, grant and transfer all sorts of rights, title, possession and enjoyment. If anyone has objections, claims, encumbrances like mortgages, charges, liens, leases, licenses, litigations, injunctions, attachments, third party claims, minor disputes, any kind of transactions, agreements, understandings etc., over the below mentioned schedule property, within 7 days from the date of publication either to us or to our client, with the documentary evidence, failing which the property covered under schedule mentioned property will be treated as objection-less and if anyone claims right, objection after lapse of the due date will not be considered and the same will not bind our client or documents.

Property covered under Doc.No.4650/2024 @ @ SRO, Duggirala belonging to Chandu Santhi Kumar

Guntur District, Duggirala Sub-District, within Kolakaluru Village Panchayat Area, Kolakaluru Village D.No.773, as per Patta bearing D.No.1225/B, as per Sub-Divisional Adangal and Form 1B statement in which an extent of Acs.0.65 cents out of Acs.2.34 cents, is being bounded by: East: Circar Polimera Donka, South: Land belongs to Kolli Siva Rami Reddy; West: Land belongs to others; North: Guntur to Hanumanpalem Road; Within these boundaries as per triangular measurement an extent of Acs.0.65 cents of Land or 0.262 hectors of Seri Dry Land with all easement rights.

G.JAGADEESA CHANDRA BABU, NELAKUDITI ANURADHA, VIJAYA KUMARI.M, PERLA PRASAD, ADVOCATES GANGARAJU MANSION, DOOR No.5-50-24A, 6/14 BRODIPET, GUNTUR-522 002. CELL No.94904 50566.

‘వెట్టి చాకిరీ తగదు’

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: గౌరవ వేతనం పేరుతో అంగన్‌వాడీలతో వివిధ రకాల పనులు చేయించడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.బాబూ ప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ సమీపంలో నిరాహార దీక్ష చేస్తున్న కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి పక్షంలో ఉండగా అన్యాయమని పేర్కొనడం పాలకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన చెప్పారు. సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్ వలి, మధులత, సుమతి, పున్నమ్మ, వెంకాయమ్మ, ప్రమీల, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సహకార ఉద్యోగులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: సహకార ఉద్యోగుల డిమాండ్లు పరిష్కారించాలని మూడు నెలల నుంచి నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం మొండి వైఖరిని వీడడం లేదని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాల సహకార సంఘాల ఉద్యోగులు తెనాలి కేంద్ర సహకార బ్యాంకు వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను, బ్యాంకు సేవలను రైతులకు అందించడంలో ఉద్యోగులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్లకార్డులతో మంగళవారం నిరసన ప్రదర్శించారు. జిల్లా అధ్యక్షుడు కె.చిన్నారావు, ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు, కోశాధికారి బాషా పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పనులు వేగవంతం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

పట్టణ నాజర్‌పేట శివారులోని మున్సిపల్ స్థలంలో చేపట్టిన టిడ్కో ఇళ్ల పనులను పునరుద్ధరించారు. చేసిన పనుల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించడంతో పనులు వేగవంతం చేశారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ రెండో విడత టిడ్కో ఇళ్లను మున్సిపల్ స్థలంలో నిర్మించాలని చేసిన సూచనకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వాటి టెండర్ పనులు దక్కించుకున్న గుత్తేదారు సుమారు 1,008 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రకటించారు. ఈ క్రమంలో వైకాపా అధికారంలోకి వచ్చింది. బకాయిలు చెల్లించకుండా వదిలేసింది. దీనికి తోడు అధికారుల మధ్య సమన్వయ లోపంతో అసంపూర్తి ఇళ్ల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సొంతింటి కల సాకారం కానుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో వాటి సముదాయాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రెండో రోజు శిక్షణ తరగతులు కొనసాగాయి. ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో వివిధ రకాల నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ తౌసీఫ్ అహ్మద్, ప్రిన్సిపల్ లింగరాజు, వైస్ ప్రిన్సిపల్స్ గోపీకృష్ణ, చంద్రమౌళి, అధ్యాపకులు ధనలక్ష్మి, పుణ్యశేఖర్, చైతన్య, సతీష్‌కుమార్, అఖిల జాన్, బోయపాటి పూర్ణ చంద్రశేఖర్, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలంలో గందరగోళం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: సిండికేట్ అయినా వేలం పాటదారుల నిర్వాకంతో తెనాలి వైకుంఠపురం సన్నిధిలోని ఆరు రకాల భక్తుల వసతుల వేలాన్ని అధికారులు వాయిదా వేశారు. మంగళవారం శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 10 రకాల భక్తుల వసతులకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పెళ్లి మండపాల, విద్యుత్తు దీపాల అలంకరణకు వేలంలో పాల్గొన్న పాటదారులు డిపాజిట్లు చెల్లించి పాట పాడలేదు. వెంటనే ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈవో అనుపమ సీల్డ్ టెండర్ బాక్సు తెరిచి హెచ్చు పాట ఖరారు చేశారు. మిగిలిన వాటి వేలంలో పాల్గొనడానికి వచ్చిన వారిని బయటి వ్యక్తులు వేలం వద్దకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు ఎవరూ రాలేదని వాటిని వాయిదా వేశారు. డిపాజిట్లు చెల్లించిన పాటదారుల మినహా ఇతరులు వేలం పాటల వద్దకు రాకుండా అధికారులు కట్టడి చేయలేదు. దీంతో వారు పాల్గొనడానికి వచ్చిన వారితో కలిసి పోయి వాగ్వాదాలకు దిగారు. ఎట్టకేలకు అధికారులు కేటరింగు, ఫొటోలు తీసుకొను లైసెన్సు హక్కు, చరవాణి, లగేజీ కౌంటరుకు నిర్వహించిన వేలంలో హెచ్చు పాటదారులను ఖరారు చేశారు. బహిరంగ వేలంలో పాల్గొన్న పాటదారులను పాడనీయకుండా ఉండడం.. వచ్చిన వారు పాడరని ఈ సందర్భంగా అధికారులు చర్చించుకోవడం గమనార్హం.

ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈవో అనుపమ

ఆటో డ్రైవర్ అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ పినపాడుకు చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాసరావు గత నెల 27వ తేదిన చరవాణి ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

కారు చోదకుడు..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ చెంచుపేటకు చెందిన వెంకటసతీష్ హోల్డింగ్ డ్రైవర్‌గా పని చేస్తూ ఉంటారు. ఈ నెల 11న ఫోన్ రావడంతో ఇంటి నుంచి వెళ్లి ఈ రోజు వరకు తిరిగి రాలేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తుందని కుటుంబ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి

తెనాలి టౌన్: వృద్ధురాలిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన తెనాలి న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం నివాళి అర్పించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ చట్ట కేసుల విషయంలో పోలీసులు బాధితులకు అండగా నిలవడం లేదని, వారే సెటిల్ చేసుకోమని సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కళాకారుడు మోహనరావు మృతికి సంతాపం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: రంగస్థల కళాకారుడు దివంగత బడుగు మోహనరావు మృతి నాటక రంగానికి తీరని లోటని పలువురు కళాకారులు, రచయితలు పేర్కొన్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో నిర్వహించిన ఆయన సంతాప సభలో పలువురు మాట్లాడారు. ఆయన నాటక రంగానికి అందించిన సేవలను, పొందిన అవార్డుల గురించి వారు గుర్తు చేశారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. బుర్రా జయలక్ష్మి, ఆరాధ్యుల కోటేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, ఆరాధ్యుల ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

తెనాలి టౌన్: గుంటూరు-2 డిపోలోని ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడానికి ప్రయత్నించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో తెనాలిలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు ఎరుపు రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

తప్పుచేసి.. గుట్టుగా సరిచేసి..

★ అసలు యజమాని పేరున అడంగల్‌లో భూమి నమోదు

రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలు

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండకు చెందిన ఓ వ్యక్తి భూమిని నకిలీ ధ్రువపత్రాలతో రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ పేరుతో తప్పుగా నమోదు చేసి నిర్వాకం చాటుకున్న రెవెన్యూ అధికారులు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో గుట్టుచప్పుడు కాకుండా ఆ పొరపాటును సరిచేశారు. తాడికొండకు చెందిన మంగెర హనుమంత సుబ్రహ్మణ్యశాస్త్రికి తాడికొండలోని సర్వే నంబరు 1051, 1150లో 9.47 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై కొందరు కన్నేశారు. అతను అమెరికాలోని కొడుకు వద్దకు వెళ్లిన సమయాన్ని చూసి వారు తప్పుడు మరణ ధ్రువపత్రం, వీలునామాతో సలుమూరి వరలక్ష్మి పేరుతో అడంగల్‌లో భూమిని ఎక్కించేశారు. ఈ కుంభకోణంపై జనవరి 20న 'బతికుండానే మరణ ధ్రువీకరణ పత్రం' అనే శీర్షికతో 'ఈనాడు' వెలుగులోకి తెచ్చింది. అవాక్కయిన రెవెన్యూ అధికారులు విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న సుబ్రహ్మణ్యశాస్త్రి అమెరికా నుంచి జిల్లా ఉన్నతాధికారులకు, కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు విచారణ చేపట్టగా నకిలీ ధ్రువపత్రాలతో వరలక్ష్మి 9.47 ఎకరాలు ఎక్కించారని తేలింది. అనంతరం సుబ్రహ్మణ్యశాస్త్రి అమెరికా నుంచి తన కొడుకు బయలుదేరి స్వగ్రామానికి వచ్చారు. కలెక్టరుకు, తాడికొండ పోలీస్ స్టేషన్‌లో వేరుగా ఫిర్యాదు చేశారు. తాడికొండ తహసీల్దారుతో సహా మరో ఐదుగురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది వివరణ ఇవ్వాలని గుంటూరు ఆర్డీవో ఆదేశించారు. వరలక్ష్మి దరఖాస్తులో జతచేసిన ధ్రువపత్రాల ఆధారంగా ఆన్‌లైన్‌లో పేరు మార్చామని అధికారుల వివరణ

కుంభకోణం వెనుక పాత్రధారులు ఎవరు?: ఉన్నతాధికారుల నుంచి ఫిబ్రవరి 20న తాడికొండ తహసీల్దార్‌తో పాటు కార్యాలయంలో అధికారులందరికీ షోకాజు నోటీసులు అందాయి. ఆ వెంటనే ఫిబ్రవరి 23న సలుమూరి వరలక్ష్మి పేరు నుంచి యథావిధిగా మంగెర హనుమంత సుబ్రహ్మణ్యశాస్త్రి పేరు మీద ఆ భూమిని ఆన్‌లైన్ అడంగల్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఎక్కించేశారు. ఇదిలా ఉండగా.. ఈ వ్యవహారంలో వరలక్ష్మి ఎవరు? ఈ భూమితో ఆమెకు సంబంధం ఏంటి? నకిలీ ధ్రువపత్రాలు ఎవరు ఆమోదించారు? రూ.20 కోట్ల ఈ భూకుంభకోణం వెనుక ఎవరి పాత్ర ఉందనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగా ఉంది.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

తాడేపల్లి, న్యూస్‌టుడే: మహిళలు విద్య, ఉద్యోగ, పరిశోధనా రంగాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా సమిట్‌లో పాల్గొని మాట్లాడారు. మహిళలు తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేఎల్‌యూ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి శివాంజనేశ్వర్, నిఖిల్, ఉపకులపతి డాక్టర్ పార్థసారథివర్మ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకట్రామ్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ సోని, ప్రసన్న, సమ్మిట్ కన్వీనర్ డాక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శైలజను జ్ఞాపికతో సత్కరిస్తున్న డీన్ ప్రసాద్, రమ్య తదితరులు

పేదల గూడు.. అధనం తోడు

2,088 గృహాలకు రూ.10.96 కోట్ల మంజూరు ● ఊపందుకున్న నిర్మాణాలు

మేడికొండూరు, తుళ్లూరు, తాడికొండ, ఫిరంగిపురం న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వంలో ఆర్భాటంగా చేపట్టి వదిలేసిన ఇళ్ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం అదనపు సాయం మంజూరు చేసింది. దీంతో లబ్ధిదారులు తమ గృహ కల వెరవేరుతోందన్న సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. వీటి నిర్మాణాలకు ఈ మొత్తం చాలక

పోయినా గత వైకాపా ప్రభుత్వం ఎటువంటి సాయం చేయలేదు. సరికాదా పనులు చేపట్టాలని లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చింది. దీంతో కొంతమంది పనులు ప్రారంభించి ఆర్థిక ఇబ్బందులతో మధ్యలో నిలిపి వేశారు. ఇటువంటి నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ అయితే రూ.75 వేలు చొప్పున అదనపు ఆర్థిక సాయం మంజూరు చేసింది. దీంతో తాడికొండ నియోజకవర్గంలో పలుచోట్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి.

తాడికొండ నియోజకవర్గం పరిధిలో..					
మండలం	లేఔట్లు	గృహాల మంజూరు	పూర్తయినవి	స్లాబ్ దశ	పునాది
మేడికొండూరు	19	1,190	351	-	618
ఫిరంగిపురం	23	921	278	38	364
తాడికొండ	24	1094	464	45	310
తుళ్లూరు	02	275	82	19	106

● **ఉగాది నాటికి గృహ ప్రవేశాలు :** ఉగాది నాటికి ఇంటి పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఈ మేరకు సంబంధిత అధికారులు ఆ దిశగా కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 68 లేఔట్లు ఏర్పాటు చేయగా.. 3480 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 102 స్లాబ్ దశలో, 1698 పునాది వరకు వచ్చాయి. 144 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభించలేదు. ఇవన్నీ మేడుకొండూరు మండలంలోనే ఉన్నాయి. నియోజకవర్గంలో 2,088 గృహాలకు రూ.10.96 కోట్ల అదనపు ఆర్థిక సాయం మంజూరు అయ్యింది. ఇందులో ఉగాది నాటికి కొత్తగా 1,921 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు.

42 మందికి కొలువులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. 12 కంపెనీలు ఎంపికలు నిర్వహించగా.. 217 అభ్యర్థుల్లో 42 మంది అర్హత సాధించారన్నారు. ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సహకారంతో కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించామని తెలిపారు. ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆట విడుపులో ఎమ్మెల్యే బూర్ల

ప్రత్తిపాడు: ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంగళవారం ప్రారంభమైన శాసన వ్యవస్థ ఆట విడుపు కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరుగు పందెం, వాలీబాల్ పోటీల్లో ప్రత్యర్థులతో తలపడ్డారు.

కాకుమాను ఎస్సైగా హరికృష్ణ

కాకుమాను, న్యూస్‌టుడే: కాకుమాను మండల ఎస్సైగా బి.హరికృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మంగళగిరి రూరల్ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై పృథ్వీ ఏకనాథ్ పట్టాభిపురం స్టేషనుకు బదిలీ అయ్యారు. స్టేషన్ సిబ్బంది హరికృష్ణకు స్వాగతం పలికారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పాతమల్లాయపాలెం(ప్రత్తిపాడు): శనగ పంట సాగు చేసిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఏడీఏ ఎన్.మోహన్‌రావు చెప్పారు. ప్రత్తిపాడులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి షేక్.సుగుణ బేగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్
మంగళగిరి బ్రాంచి, మంగళగిరి, గుంటూరు జిల్లా. ఫోన్ : 08645-233345

APPENDEX IV [RULE 8(1)]
స్వాధీనత ప్రకటన (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 క్రింద ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, మంగళగిరి బ్రాంచి యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) రూల్స్ 2002 అందలి రూల్ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఒక డిమాండు నోటీసు తేది 27-11-2025 న ఇచ్చియున్నారు. ఆ నోటీసు తేది నుండి 60 రోజుల లోపుగా రూ. 4,52,739.50 పై. (అక్షరములా నాలుగు లక్షల యాభై రెండు వేల ఏడు వందల ముప్పయి తొమ్మిది రూపాయిల యాభై పైసలు మాత్రమే) తేది 31-10-2025 నాటికి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/ కో-ఆబ్లిగెంట్/హామీదారులు అయిన 1) శ్రీ కాలకోటి శామ్యూల్, S/o. ప్రభుదాసు, 2) శ్రీమతి కాలకోటి సలోమి, W/o. శామ్యూల్, 3) శ్రీ కాలకోటి ప్రమోద్‌కుమార్, S/o. శామ్యూల్, 4) శ్రీ కాలకోటి అక్షయ్ కుమార్, S/o. శామ్యూల్ వారిని కోరడమైనది.

కానీ ఋణగ్రహీతలు/ కోఆబ్లిగెంట్/హామీదారులు ఋణమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు/కోఆబ్లిగెంట్/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకోవాల్సిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిపై తేది 19-02-2026 న స్వాధీనత తీసుకొని యున్నారు.

కావున సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు/ కోఆబ్లిగెంట్/ హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్థితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు, మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైనా రూ. 4,52,739.50 పై. మొత్తానికి మరియు తేది 01-11-2025 నుండి దాని మీద దర్శలా వడ్డీ మరియు ఖర్చులు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, మంగళగిరి బ్రాంచి, మంగళగిరి వారి చార్జికి లోబడి ఉంటాయి. సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేసిన తర్వాత ఋణగ్రహీత కేవలం 8,500/-లు మాత్రమే చెల్లించియున్నారు.

స్థిరాస్థి వివరములు : మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ, D.నెం. 207/1A, గాగల గుంటూరు జిల్లా, తాడేపల్లి, మంగళగిరి, బాప్టిస్ట్ పేటలో వార్డు నెం. 5, పాత డోర్ నెం. 3-5-587, కొత్త డోర్ నెం. 5-583గాగల నిర్మాణంలో ఉన్న ఆర్.సి.సి. స్లాబ్ ఇల్లు.
హద్దులు : తూర్పు : కాలకోటి చిన్న శామ్యూల్ & కాలకోటి రాంబాబు గారి ఆస్థి, దక్షిణం : కాలకోటి జాన్‌బాబు గారి ఆస్థి, పడమర : మున్సిపల్ రోడ్డు, ఉత్తరం : కాలకోటి చిన్న శామ్యూల్ & రాంబాబు గారి ఆస్థి. విస్తీర్ణం : 80.40 చ॥గజములు

తేది : 24-2-2026, మంగళగిరి — అధీకృత అధికారి, మంగళగిరి బ్రాంచి

కాలువ ఇలా.. సాగునీరెలా?

కృష్ణా పశ్చిమ డెల్టాలో విస్తరించిన అప్పాపురం ప్రధాన వాహినికి అనుబంధంగా ఉన్న మూడో బ్రాంచి కాలువ గుర్రపు డెక్క, తూటికాడతో నిండిపోయింది. దీంతో నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. ఈ కాలువ పరిధిలో 1300 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో మొక్కజొన్న, తెల్లజొన్న, మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారు. పంట ఉత్పత్తులు చేతికందాలంటే ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు అందించాలి. ముట్లూరు గ్రామం వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లోని పల్లపాడు, కారంపూడిపాడు, ముట్లూరు, సోపాను, లింగంగుంటపాలెం, బీకేపాలెం, కొప్పుర్రు గ్రామాల్లో పంట పొలాలకు సాగునీటి కొరత ఉంది. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

కల్వర్టుకు రక్షణ గోడ నిర్మించరూ..

మండలంలోని పాలడుగు మేజర్, యలవర్తిపాడు బీ-మైనర్, పేరేచర్ల వ్యవసాయ తయారీ కేంద్రం వద్ద గోడలు ధ్వంసమై దెబ్బతిన్నాయి. దీనికితోడు అవి ఎత్తు తక్కువగా ఉండడంతో రాత్రిళ్లు కనిపించడం లేదు. గతంలో బీ మైనర్ పంట కాలువ వద్ద రోడ్డు ప్రమాదం జరిగి ఒక లారీ కాలువలోకి దూసుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టులను బాగుచేయించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - మేడికొండూరు, న్యూస్‌టుడే

పూడిక తీయక.. మురుగు పారక

మోతడక ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు పూడిపోయాయి. వ్యర్థాలు రోడ్డుపై చేరి రాకపోకలకు జనం అవస్థలు పడుతున్నారు. దుర్వాసన, దోమలతో నిత్యం నరకం చూస్తున్నామని పంచాయతీ అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడికొండ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
లక్ష్మీ నగర్ బ్రాంచ్, లక్ష్మీ వెంకటేశ్వర నివాస్, భగత్ సింగ్ రోడ్డు, విజయవాడ - 520011.
Email id : ubin0813176@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)ల నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు "ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)"లకు ప్రత్యేకముగా తెలుపునది ఏమనగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారిచే భౌతిక/లాంఛనాత్మక స్వాధీనం తీసుకొనబడిన బ్యాంక్ తనఖాలో / ఛార్జీలో ఉన్న దిగువ పేర్కొన్న స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదారులు బకాయి పడిన దిగువ తెలిపిన బకాయిలు మొత్తం + వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులతో సహా సదరు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తులను 'ఎక్కడ ఉన్నది అలాగే' "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నదో అలాగే" పద్ధతిలో తేది:27-03-2026న అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇ-వేలం తేది&సమయం: 27-03-2026, ఉ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేది: ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీతలు / హామీదారులు / సహ ఋణగ్రహీతలు, బకాయి మరియు రిజర్వుధర, ధరావత్తు వివరములు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత/తనఖాదారు పేరు : ఋణగ్రహీత: 1.శ్రీమతి లేకిరెడ్డి దుర్గా రాణి, భర్త: లేకిరెడ్డి మోహన్ రెడ్డి, మూడవ అంతస్తు, డి.నెం.30/1, సమీప డోర్ నెం.5-44/1, ప్రాతూరు రోడ్డు, గుండిమెడ గ్రామం, తాడేపల్లి మండలం, ఆంధ్రప్రదేశ్-522303. కో-అప్లికెంట్: 2.శ్రీ లేకిరెడ్డి మోహన్ రెడ్డి, తండ్రి: లేకిరెడ్డి చిదంబరప్ప, మూడవ అంతస్తు, డి.నెం.30/1, సమీప డోర్ నెం.5-44/1, ప్రాతూరు రోడ్డు, గుండిమెడ గ్రామం, తాడేపల్లి మండలం, ఆంధ్రప్రదేశ్ - 522303.

బకాయి మొత్తం: తేది: 06.11.2025 నాటికి రూ.41,37,530.65 పై. (అక్షరాల నలభై ఒక లక్షల ముప్పై ఏడు వేల అయిదు వందల ముప్పై రూపాయల అరవై అయిదు పైసలు మాత్రమే) తేది: 06.11.2025 నుండి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు మొదలగు వాటితో.

స్థిరాస్తి వివరములు: గుంటూరు జిల్లా-522303, తాడేపల్లి మండలం, తాడేపల్లి టౌన్, గుండిమెడ గ్రామం, ప్రాతూరు రోడ్డు, డి.నెం.30/1లోని 1183.11 చ॥గ॥లు (అపార్ట్‌మెంట్స్ యొక్క భూమి మొత్తం విస్తీర్ణం) మొత్తంలో 42.20 చ॥గ॥ల యుడిఎస్ విస్తీర్ణంతో గల "క్యాపిటల్ ప్రైడ్" మూడవ అంతస్తు నందు 811 చ॥అ॥లు (ఫ్లాట్ యొక్క ప్లింత్ ఏరియా), కామన్ ఏరియా-223 చ॥అ॥లు, పార్కింగ్ ఏరియా-120 చ॥అ॥ల విస్తీర్ణంతో గల నివాస ఫ్లాట్ నెం.402 శ్రీమతి లేకి రెడ్డి దుర్గా రాణి, భర్త: లేకి రెడ్డి మోహన్ రెడ్డి గారికి చెందినది. ఫ్లాట్ హద్దులు: ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : కామన్ కారిడార్, పడమర : ఓపెన్ టు స్కై, అపార్ట్‌మెంట్ హద్దులు: తూర్పు : కొండెపాటి మనోజ్ గారికి చెందిన ఆస్తి, పడమర : కొర్రపాటి వెంకట సుబ్బయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, ఉత్తరం : సర్కార్ డొంక, దక్షిణం: రెడ్డిబత్తుల ఈశ్వర రెడ్డి మరియు ఇతరులకు చెందిన ఆస్తి.

రిజర్వు ధర: రూ.46,35,000/- ధరావత్తు: రూ.4,63,500/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ www.unionbankofindia.co.in నందు చూడగలరు. అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్, గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం సంప్రదించు మొబైల్ నెం.91379 13171, Mail ID : ubin0813176@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చును.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)/రూల్ 9(1)ల ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం ఈ నోటీసు ప్రకటన పైన తెలిపిన లోనుకు సంబంధించిన ఋణగ్రహీత(ల)కు, హామీదారు(ల)కు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8ల క్రింద పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం జరుపబడునని తెలియజేస్తూ ఇచ్చిన ప్రకటనగా కూడా పరిగణించవలెను.

తేది : 24.02.2026, ప్రదేశం : విజయవాడ — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లక్ష్మీ నగర్ బ్రాంచ్

రక్తదానానికి ముందుకు రావాలి

ధ్రువపత్రం అందజేస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారేందుకు విద్యార్థులు ముందుకు రావాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ రవినాయుడు పిలుపునిచ్చారు. విజయవాడ ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో మంగళవారం అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆ కులపతి ఆచార్య సతీశ్ కుమార్ ప్రారంభించారు. రవినాయుడు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని పర్యవేక్షించి ప్రసంగించారు. మొత్తం 410 మంది విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇన్‌ఛార్జి రవికుమార్, డా.జ్యోత్స్నదేవి, డా.పవన్, అసోసియేట్ డైరెక్టర్ రేవతి, రిజిస్ట్రార్ డా. ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దళితవాడకు తాగునీటి కష్టాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న మందడం దళితవాడకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని జిల్లా సీపీఎం కార్యదర్శి నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం మందడంలోని దళితవాడను సందర్శించి స్థానికుల కష్టాలను తెలుసుకుని మాట్లాడారు. గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులు లీకుల వల్ల సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. సీఆర్‌డీఏ, పంచాయతీరాజ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఫలితం

గుంటూరురూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని అమెరికాకు చెందిన స్పెల్‌బీ సంస్థ సహ వ్యవస్థాపకుడు రాజా కర్నం తెలిపారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సదస్సు నిర్వహించారు.

అమరావతి అమ్మ వంటకు ఆదరణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలోని మహిళలు ఏపీ సీఆర్డీఏ సహాయంతో అమరావతి అమ్మ వంటలు పేరుతో ఆహార పదార్థాల తయారీని చేపట్టారు. వాటిని ఈ నెల 22 నుంచి 23 వరకు స్థానిక ఏపీ వీఐటీ యూనివర్సిటీలో జరిగిన విటోపియా-2026 కార్యక్రమంలో ప్రత్యేక స్టాల్ ద్వారా విక్రయించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉద్యోగుల నుంచి మంచి ఆదరణ లభించింది. సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, సామాజిక అభివృద్ధి విభాగం గ్రూప్ డైరెక్టర్ వి.రాములు ఆధ్వర్యంలో మహిళలకు వివిధ ఆహార పదార్థాల తయారీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

చలో ఫిబ్రవరి విజయవంతం చేయండి

దుగ్గిరాల: ఈ నెల 25న చలో ఫిబ్రవరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని మంగళవారం స్థానిక హైస్కూల్‌లో ఆవిష్కరించారు.

మహిళ అదృశ్యం

మేడికొండూరు, న్యూస్‌టుడే: మహిళ అదృశ్యంపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల ప్రకారం.. మండలంలోని పేరేచర్లకు చెందిన వ్యక్తికి గుంటూరుకు చెందిన మహిళతో 8 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు. ఈ నెల 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహిళ అదృశ్యమైంది. ఎంత వెతికినా ఆమె ఆచూకీ కనిపించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హ్యాకథాన్ పోటీల్లో విద్యార్థుల సత్తా

గుంటూరురూరల్, న్యూస్‌టుడే: చెన్నైలో నిర్వహించిన వెల్ ఐడియా ఫోర్జ్ 2కే26 జాతీయస్థాయి హ్యాకథాన్ పోటీల్లో కళ్లం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. సీఎస్ఈ చదువుతున్న జోష్ కుమార్, బిందు మోహన సాయి, ఎస్‌కే ఫర్వీలు ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపల్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. కళాశాల యాజమాన్యం ఉమాశంకరరెడ్డి, భరద్వాజ్, సీఎస్ఈ విభాగాధిపతి హనుమంత్ ప్రసాద్‌లు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులతో ఉమాశంకరరెడ్డి, బీఎస్‌బీ రెడ్డి తదితరులు

కాకుమాను, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి భాషోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో కాకుమాను మండలం కొండపాటూరు జడ్పీ పాఠశాలకు చెందిన టి.కోమలి ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రథమ, సంజన తెలుగులో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా వీరికి ప్రశంసాపత్రాలు అందించారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

చమళ్లమూడి (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: చమళ్లమూడి గ్రామ సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో రైతులకు, ఇతర పనులకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11.30 గంటల వరకు ఎదురు చూసినా సిబ్బంది ఎవరూ రాలేదని కాట్రపాడు సర్పంచి యం. శంకర్ ఆరోపించారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మిరప తెగులు నివారణపై అవగాహన

తాడికొండ, న్యూస్‌టుడే: మిరప తెగులు, పురుగు బెడదను నివారించేందుకు పొలం చుట్టూ జొన్న పంట వేసుకోవడం ఉత్తమమని వ్యవసాయాధికారి శ్రీనివాస్ నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని పొన్నెకల్లులో ఉద్యానవన శాఖ అధికారి జనని ఆధ్వర్యంలో మిరప రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ అనిల్ కుమార్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సజావుగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం సజావుగా జరిగాయి. 97 మంది విద్యార్థులు హాజరుకాగా ఆరుగురు గైర్హాజరైనట్లు వీరరాఘవయ్య తెలిపారు. స్క్వాడ్ అధికారులు పీటర్‌పాల్, వెంకటేశ్వర్లు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

శిరస్త్రాణం ధరించాలి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వాహనాలు నడిపేటప్పుడు శిరస్త్రాణాలు, సీట్‌బెల్టు ధరించాలని విద్యార్థులు ర్యాలీలో పేర్కొన్నారు. పట్టణంలో గాలిగోపురం నుంచి మార్కెట్ వరకు కేఎల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఆక్టివిటీస్, సీఎస్ఐటీ విభాగంలో రోడ్డు భద్రతపై ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సమీపంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ చొరవతో నూతక్కిలో అనారోగ్యంతో బాధపడుతున్న నూతక్కి సుబ్బారావుకు సీఎం సహాయ నిధి కింద రూ.70,000 చెక్కును తేదేపా నాయకులు మంగళవారం అందజేశారు.

కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.26, ఆయాలకు రూ.20వేలు వేతనం ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు ధనలక్ష్మి డిమాండు చేశారు. సీఐటీయూ పిలుపు మేరకు స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. యూనియన్ నాయకులు గౌతమి, విజయలక్ష్మి, ఝాన్సీ, శ్రీలత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి గ్రామీణం: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. దీని ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు.

ఎన్ఆర్ఐటీ-ఎస్ఆర్ యూనివర్సిటీ మధ్య ఒప్పందం

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎన్ఆర్ఐటీ కళాశాల, వరంగల్‌కు చెందిన ఎస్ఆర్ యూనివర్సిటీ మధ్య మంగళవారం పరిశోధన రంగంపై అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదిరింది. దానికి సంబంధించిన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు, కళాశాల ప్రిన్సిపల్ సంజయ్, అధ్యాపకులు, ఎస్ఆర్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చినజీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్న మంత్రి రవీంద్ర

తాడేపల్లి, న్యూస్‌టుడే:: ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లి రవీంద్ర మంగళవారం సీతానగరం కొండపై విజయకీలాద్రి దివ్యక్షేత్రాన్ని సందర్శించారు. చినజీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి చిత్రపటాన్ని బహూకరించారు.

రుణాలు ఇప్పిస్తామని మోసం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గృహ రుణాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ కథనం ప్రకారం.. విశాఖకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి గృహ రుణాలు ఇప్పిస్తానని మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామంలో పలువుర్ని నమ్మబలికాడు. ఈ క్రమంలో ఆ గ్రామంలో నివసిస్తున్న మజ్జి శ్రావణి, ఆమె స్నేహితురాలు మల్లేశ్వరిలను పరిచయడం చేసుకున్నాడు. తనకు అన్ని బ్యాంకుల అధికారులతో పరిచయాలు ఉన్నాయని, రుణాలు ఇప్పిస్తానని నమ్మించాడు. శ్రావణి నుంచి రూ.30 వేలు, మల్లేశ్వరి నుంచి రూ.58వేలు వసూలు చేశాడు. అలాగే శ్రావణి నుంచి ఫోన్ ద్వారా రూ.98వేలు తీసుకున్నాడు. ఎప్పటికీ రుణాలు మంజూరు కాకపోవడంతో వారు ప్రశ్నించగా.. అసభ్యంగా దూషిస్తూ బెదిరించాడు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
పొన్నూరు బ్రాంచ్, 15-1-85, జిబిసి రోడ్డు, పొన్నూరు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522124.
ఫోన్ : 8925952628, ఇ-మెయిల్ ఐడి : iob2628@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి గారు దిగువ ఋణ సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది" అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ఫ్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: 1. మెస్సర్స్ ఆర్‌డి చప్పల్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీ కొత్తపల్లి రామిరెడ్డి (ఋణగ్రహీత), డి.నెం.1-7-1ఎ, మెయిన్ రోడ్డు, బస్ స్టాండ్ ఎదురుగా, ప్రత్తిపాడు గ్రామం & పంచాయితీ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522019. 2. శ్రీ గౌరక నాగిరెడ్డి, తండ్రి : సుబ్బారెడ్డి (తనఖాదారు), డి.నెం.25-21-202, కొండా వెంకటప్పయ్య కాలనీ, గుంటూరు టౌన్ & జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522002.

బకాయి మొత్తం : తేది.31.12.2025 నాటికి రూ.35,47,161.72/-, NPA తేది. 30.04.2013, డిమాండ్ నోటీసు తేది : 12.02.2016,
డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.12.02.2016 నాటికి రూ.9,45,106/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.
స్వాధీనత నోటీసు తేది: 23-05-2016
స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: తేది.23.05.2016 నాటికి రూ.9,99,683/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు

స్థిరాస్తి వివరములు: ఆంధ్రప్రదేశ్ - 522019, గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామం మరియు పంచాయితీ, సమీప డి.నెం.1-8, డి.నెం.221 & 222, ప్లాట్ నెం.19 వద్ద 120 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ నివాస స్థలం యావత్తు ఆస్తి. కామన్ హద్దులు: తూర్పు : 20 అ॥ల వెడల్పు గల రోడ్డు - 27'-0", దక్షిణం: ప్లాట్ నెం.20 స్థలం - 40'-0", పడమర : ప్లాట్ నెం.13 - 27'-0", ఉత్తరం: బృందావనం శ్రీ కృష్ణమాచార్యులు మరియు ఇతరులు - 40'-0".

రిజర్వుధర: రూ.3,84,000/- ధరావత్తు ధర : రూ.38,400/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-

వేలం తేది మరియు సమయం: తేది.12-03-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని 10-03-2026, సాయంత్రం 5.00 గంటలలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి జంఝాటములు (ఎన్‌కంబరెన్స్) : లేదు
ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.25-02-2026 నుండి
ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది:25-02-2026 నుండి
ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.10-03-2026, సా॥ 5.00 గం॥ల వరకు

* ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : URL: https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పొన్నూరు బ్రాంచ్, 15-1-85, జిబిసి రోడ్డు, పొన్నూరు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522124. ఫోన్ : 8925952628 లేదా సర్వీస్ ప్రొవైడర్ : M/s. Bank Asset Auction Network, రిజిస్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.BAANKNET@psballiance.com (Website: https://baanknet.com) (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 24-02-2026, ప్రదేశం : పొన్నూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

గుంటూరు తూర్పు

మూడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు మంజూరు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌లో భాగంగా జిల్లాలో మూడు అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరులోని పిచుకలగుంట, మంగళగిరి పరిధిలోని వడ్డేశ్వరంలో ఏర్పాటుకు ప్రతిపాదించారు. కుంచనపల్లిలోని యూపీహెచ్‌సీని యుఏఏఎంగా అప్‌గ్రేడ్ చేయనున్నారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 13, వంగ 19, బెండ 20, పచ్చిమిర్చి 46, కాకర 42, క్యారెట్ 26, క్యాబేజీ 18, బీర 30, దొండ 29, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుడు 24, దోస 28, పొట్ల 24, చామ 23, గోంగూర 10, తోటకూర 15, చుక్కకూర 15, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 22, కీర 39, క్యాప్సికం 59, అల్లం 75, ఫ్రెంచ్ బీన్స్ 55, సొర 8, అరటి 8. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందన: వినోబానగర్ 2వ లైన్‌లో సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకం కలుగుతోందని స్థానికుడు జానీ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను పారిశుద్ధ్య సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి కాలువల్లో పూడికలు తీయించారు. ✤ అరుంధతినగర్ ప్రధాన రోడ్డు చెత్త కుప్పలు రెండురోజులుగా తీయకపోవడంతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు ప్రసాద్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో ట్రాక్టర్ పంపి చెత్త కుప్పలు తొలగించి తరలించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

సైడు కాలువల నిర్మాణం.. వినోబానగర్ రైల్వే క్యాబిన్ రోడ్డులో సైడు కాలువల నిర్మాణ పనులను అధికారులు ప్రారంభం చుట్టారు. స్థానికుల ఫిర్యాదును 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో సరైన కాలువలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. - పట్నంబజారు, న్యూస్‌టుడే

గంజి పంపిణీ

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తోటి వారిపై ప్రేమ, కరుణ కలిగి ఉండాలని డిప్యూటీ మేయర్ షేక్ సజీల అన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే ముస్లిం సోదరులకు మాయాబజారులో ఉచిత గంజి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ షౌకత్, కృష్ణ, బాజీ, బాషా, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైద్య ప్రదర్శనలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలో జరుగుతున్న వైద్య విజ్ఞాన ప్రదర్శనలో రేడియాలజీ విభాగం ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. మంగళవారం వారు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎగ్జిబిషన్‌లో ఉన్న వివిధ విభాగాలను తిలకించారు. ఆధునిక వైద్య రంగంలో కీలకమైన పొజిట్రాన్ సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, పీఈటీ-సీటీ వంటి చిత్రీకరణ పద్ధతుల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు యంత్రాలు ఎలా పనిచేస్తాయో వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి రేడియాలజీ విభాగం ప్రదర్శనలను పరిశీలించారు.

యంత్ర పరికరం గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

కర్మకాండలకూ కష్టాలేనా?

పొగతో అధ్వానంగా గది

శిథిలావస్థకు చేరిన బల్లలు

న్యూస్‌టుడే - పట్నంబజారు

పాతగుంటూరులోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోవటం లేదు. దాదాపు లక్షన్నర మంది జనాభా ఉన్న ఈ ప్రాంతంలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మృతదేహాలను దహనం చేసే గది పొగతో నల్లగా మారింది. దీంతో కొందరు ఇక్కడి ఖాళీ స్థలంలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అంత్యక్రియల అనంతరం శ్మశానవాటిక నుంచి ఇళ్లకు వెళ్లేవారు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు ఇక్కడి బావిలోని నీటిని వినియోగిస్తున్నారు. అయితే ఆ నీరంతా పాచి పట్టి ఉంది. దీన్ని శుభ్రం చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ఆ నీటితో స్నానాలు చేసే పరిస్థితి లేదని పలువురు వాపోయారు. ఇక్కడ కూర్చోడానికి సరైన బల్లలు సైతం లేవు. కొందరు దాతలు ఇచ్చిన బల్లలు పగుళ్లిచ్చి శిథిలావస్థకు చేరాయి. నగరంలోని బృందావన్‌గార్డెన్స్, బొంగరాలబీడు ప్రాంతాల్లోని శ్మశానవాటికలు అభివృద్ధి చెందినట్లుగా దీని అభివృద్ధిపై పాలకులు శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు. రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వెచ్చించి ప్రైవేటు స్థలాలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తల్లి ఇంట్లో చోరీ కేసులో నిందితులను వారం రోజుల్లో పట్టుకున్నందుకు ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ కృష్ణయ్య, ఎస్సై శ్రీహరి, ఎస్సై వీర నారాయణ, ఎస్సై శ్రీనివాసరావు. - న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

దేశాభివృద్ధిలో సీఏలది కీలక పాత్ర

ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముప్పాళ్ల సుబ్బారావు, భరద్వాజ్, వనిమిరెడ్డి వెంకట నరేష్, కె.ముత్యాలునాయుడు తదితరులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: దేశ ఆర్థికాభివృద్ధిలో సీఏలు కీలకపాత్ర పోషిస్తున్నారని డి.ప్రసన్నకుమార్ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గుంటూరు బ్రాంచి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బండ్లమూడి గార్డెన్స్‌లో నిర్వహించారు. తొలుత ముప్పాళ్ల సుబ్బారావు ఇంటి నుంచి బండ్లమూడి గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గుంటూరు శాఖను జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలపాలని సూచించారు. దక్షిణ భారత మండలి అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ సీఏ సభ్యులు, విద్యార్థులు, వర్తక సంఘాలు, ప్రభుత్వ రంగ సంస్థల మధ్య గుంటూరు బ్రాంచి ఒక వారధిగా పనిచేస్తూ దేశ ఉన్నతికి తోడ్పడాలన్నారు. గుంటూరు బ్రాంచి చైర్మన్ రుద్రవరపు భరద్వాజ్ మాట్లాడుతూ నూతన కార్యవర్గ సహకారంతో బ్రాంచి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండవ సునీల్‌కుమార్, ఎర్ర శివ, వనిమిరెడ్డి వెంకట నరేష్, ముత్యాలునాయుడు, రాజశేఖర్, షేక్ బాజీ, దేవ సంపత్, చింతా రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు అదనపు నైపుణ్యాలు అవసరం

విజేతలను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు అదనపు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో సలీం బాషా పేర్కొన్నారు. మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరం జిల్లా స్థాయి బాలోత్సవం పోటీలు నిర్వహించారు. తెలుగు, హిందీ, ఉర్దూ, ఆంగ్లం, సంస్కృతం, గిరిజన భాషల్లో ప్రాథమిక, సెకండరీ, సీనియర్ సెకండరీ విద్యార్థులకు స్పెల్ బీ, గీతాలాపన, కథలు చెప్పటం, రాయడం, చదవడం, విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో 133 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. అక్కడ గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీలకు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన వారికి డీఈవో ప్రశంసాపత్రంతోపాటు మెడల్, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ పద్మావతి, ఏఎంవో రమ్య, ఎంఐఎస్ సమన్వయకర్త సీతారామయ్య, ఏజీ సీడీవో సుజాత, ఏఎస్‌వో శేషగిరిరావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు లేకపోతే చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన అనుమతుల మేరకే భవన నిర్మాణాలుండాలని కమిషనర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. మంగళవారం శ్యామలానగర్, ఇన్నర్ రింగురోడ్డు, టీచర్స్ కాలనీల్లో ఆక్యుపెన్సీ కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆయా భవనాలను పరిశీలించారు. ఒక భవనం ప్లాన్‌కు భిన్నంగా సెల్లార్‌లో అదనపు రూం ఏర్పాటు చేయడంతో సంబంధిత టీపీవోకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీపీని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ నుంచి తీసుకున్న ప్లానుకు అనుగుణంగానే నిర్మాణాలుండాలని స్పష్టం చేశారు. ఆక్యుపెన్సీ, మార్టిగేజ్ మంజూరు దస్త్రాలు తనకు పంపే ముందే సీపీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. కొన్ని అపార్ట్‌మెంట్లలో పచ్చదనానికి చోటు కేటాయింపు సరిగా లేదని, సెట్‌బ్యాక్‌లో కూడా ట్రాన్స్‌ఫారాలు, జనరేటర్లు ఉన్నాయని చెప్పారు. వాటిని తొలగిస్తేనే తదుపరి అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. బృందావన్‌గార్డెన్స్ ప్రధానరోడ్డు, కుందులరోడ్డు విస్తరణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుబజారు ప్రతిపాదిత జీఎంసీ స్థలాన్ని, కామమ్మ కాలనీ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కుందులరోడ్డులోని రైతుబజారు వద్ద క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఈఈ విష్ణు, ఎస్ఎస్‌లు ప్రసాద్, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, కార్పొరేటర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవనం కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

ఇంటర్ ద్వితీయ పరీక్షకు 98.42 శాతం హాజరు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 87 కేంద్రాల్లో పరీక్ష జరగ్గా జనరల్ విద్యార్థులు 31,197 మందికిగాను 30,748 మంది, వృత్తి విద్యలో 1,090 మందికిగాను 1,029 మంది హాజరయ్యారు. మొత్తం హాజరుశాతం 98.42గా నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో సునీత తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఏసీఎస్‌లుగా సంబంధిత పరీక్ష కేంద్రాల ప్రధానాచార్యులు వ్యవహరిస్తున్నారు. వీరు ఉదయం పరీక్ష ప్రారంభ ఏర్పాట్లతోపాటు పూర్తయ్యాక సంబంధిత జవాబు పత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులకు తరలిస్తారు. మరునాడు పరీక్షకు ఏర్పాట్లు చూస్తారు. వీరికి గుర్తింపు ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వారికి రెమ్యునరేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

☛ సాంబశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష తీరును జిల్లా పాలనాధికారి తమీమ్ అన్సారియా పరిశీలించారు. తాగునీరు, వైద్యశిబిరాల ఏర్పాట్లు గమనించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు.. చుట్టుపక్కల ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్ల మూసివేత తదితర అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. పరీక్ష సమయంలో వదంతులకు పాల్పడే వారిపై దృష్టి సారించాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టామని చెప్పారు.

పరీక్ష తీరు పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి తమీమ్ అన్సారియా, చిత్రంలో ఆర్ఐవో సునీత

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నేడు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కొత్తపేట శివాలయంలో బాలాత్రిపురసుందరీదేవి, నందీశ్వరుల విగ్రహాల పునః ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా మంగళవారం మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ, వేణుగోపాల్ బృందం పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. ఈవో వీరారెడ్డి, ధర్మకర్తలమండలి ఛైర్మన్ శేషతల్పసాయి, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. బుధవారం ఉదయం 10-26 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, 11 గంటలకు ప్రాణ ప్రతిష్ఠ, 12 గంటలకు స్వామివార్ల కల్యాణోత్సవం ఉంటాయని ఈవో తెలిపారు.

నూతన విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

రాళ్లు తొలగించరూ..

కొత్తపేట పెద్ద మహాలక్ష్మమ్మ ఆలయం ఎదురు నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. దీని చివర వాహనాలు వెళ్లటానికి వీలుగా చదును చేయకుండా రాళ్లముక్కలు వేసి వదిలేశారు. వీటిపై వాహనాలు అదుపుతప్పి పోతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

రోడ్లున్నది ఇందుకేనా?

నగరపాలక సంస్థ నిధులతో ప్రజల కోసం నిర్మించిన రహదారులను కొందరు వ్యాపారులు తమ వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్నా.. ప్రజలు అవస్థలు పడుతున్నా.. వారికి పట్టడం లేదు. పట్నంబజారు, లాలాపేట, కొత్తపేట, బస్టాండ్ కూడలి, పొన్నూరు రోడ్డు, రైలుపేట, నాజ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది. -న్యూస్‌టుడే, గుంటూరు నగరం

తవ్వారు.. వదిలేశారు

సంగడిగుంట 2వ లైను రోడ్డు అధ్వానంగా ఉంది. ఇటీవల పైపులైన్ల ఏర్పాటు కోసం రోడ్డు పక్కన తవ్వించారు. పనులు పూర్తయ్యాక పునర్నిర్మాణం పట్టించుకోలేదు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

ఈవీఎం గోదాములో ఆకస్మిక తనిఖీ

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాముకు వేసిన తాళాల సీళ్లు, సీసీ కెమెరాల పనితీరు, ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఏడీఎఫ్‌వో కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు లోచర్ల రమేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మల్లీశ్వరి, ఏపీఎస్పీ బెటాలియన్ ఏఆర్ ఎస్ఐ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములో తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

26 నుంచి శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 26 నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య తెలిపారు. గుంటూరులోని ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆయన కార్యక్రమ వివరాలు తెలిపారు. ఈ నెల 26న అంకురార్పణ, 27న శేషవాహన సేవ, 28న హనుమత్, గరుడవాహన సేవలు, మార్చి 1న గజవాహన సేవ, సాయంత్రం స్వామి శాంతి కల్యాణం, 2న సువాసిని పూజ, దివ్య రథోత్సవం, 3న పూర్ణాహుతి, ధ్వజావరోహణం, అన్నసమారాధన జరుగుతాయన్నారు. రోజూ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు, పారాయణం, రోజూ సాయంత్రం బ్రహ్మోత్సవాల ఉపన్యాస కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, సభ్యులు యడ్లపాటి అశోక్‌కుమార్, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, ఎ.సుధాకర్, అర్చకుడు మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న మస్తానయ్య, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, రాజేష్ డిమాండ్ చేశారు. గుంటూరులోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 27న విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గోడప్రతులు ఆవిష్కరించారు. పవన్, ధీరజ్, చిన్న పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న భాస్కర్, రాజేష్, పవన్, ధీరజ్, చిన్న

మద్యం మత్తులో వాహనాలు నడిపిన ముగ్గురిపై కేసులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: మూడు వంతెనల సెంటర్‌లో మంగళవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లోనూ ప్రతిభ చాటాలి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి లింగినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలను పాతగుంటూరు ఏఎస్ఐ షేక్ నసీర్, కార్పొరేటర్ షేక్ మీరావలి ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి 94 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మాస్ స్టార్ట్, ఐటీటీ విభాగాల్లో పోటీలు జరిగాయి. రెండు విభాగాల్లో మొదట నాలుగు స్థానాల్లో నిలిచిన బాలబాలికలకు మీరావలి పతకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల ఉంటే క్రీడాకారులు సులభంగా విజయం సాధించవచ్చన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు విజయవాడలో మార్చి 1న జరిగే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు పంపుతామని వివరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి భాను ప్రసాద్, శిక్షకుడు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్ఐ నసీర్, కార్పొరేటర్ మీరావలి

సింహాద్రి ఆదర్శనీయులు

సింహాద్రి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న నేతాజీ, పాశం రామారావు, చిష్టి, పద్మ, శ్రీనివాసరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి సింహాద్రి శివారెడ్డి ఆదర్శనీయులని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నేతాజీ అన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో సింహాద్రి శివారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. పాశం రామారావు, భావన్నారాయణ, చిష్టి, పద్మ, శ్రీనివాసరావు, వలి, షహీద్, శంకరరావు, జాన్‌బాబు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మీ నారాయణుల కల్యాణం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధానార్చకుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో ఆదిలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీచక్ర మేరువుకు అభిషేకాలు చేశారు.

పవిత్ర మాంగల్య దర్శనం

ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

నిరసన తెలుపుతున్న గనిరాజు, కృష్ణ, మల్లేశ్వరరావు, నరసింహారావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎస్ఎం) రాష్ట్ర కార్యదర్శి గనిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐకేఎస్ఎం ఆధ్వర్యంలో నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ, మల్లేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లున్నా... మళ్లీ వేసేస్తున్నారు..

మురుగు కాలువల సాకుతో ప్రజాధనం దుర్వినియోగం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇంజినీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కై రోడ్లు ఉన్నచోటే.. మళ్లీ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. నల్లచెరువు నాలుగో లైన్‌లో గతంలో సిమెంటు రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుపై ఎక్కడా ఎలాంటి గుంతలు లేవు. ఇక్కడ రోడ్డు అవసరం లేనప్పటికీ మురుగు కాలువల నిర్మాణం సాకుగా చూపి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. రూ.45 లక్షలతో మురుగు కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. తొలుత మురుగు కాలువల నిర్మాణం పూర్తి చేసి సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఉన్న కాలువలు తొలగించి ఎత్తుగా నిర్మించడంతో స్థానికులు ఇళ్లలోకి అంతర్గత వీధుల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నల్లచెరువు నాలుగో లైన్‌లో సిమెంటు రోడ్డుపై మళ్లీ వేసిన కంకర

✤ కొరిటెపాడు పరిధిలోని రామన్నపేటలో పలు అంతర్గత వీధుల్లో కాలువలు నిర్మిస్తున్నారు. సుమారు రూ.90 లక్షలతో ఇక్కడ పనులు జరుగుతున్నాయి. ఇక్కడా గతంలో సీసీ రోడ్లు ఉన్నాయి. కాలువలు ఎత్తుగా నిర్మించడంతో.. ఉన్న సిమెంటు రోడ్డుపై మళ్లీ సీసీ రోడ్డు నిర్మిస్తూ.. ప్రజాధనాన్ని గుత్తేదారులకు దోచిపెడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

✤ నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తేదారులు తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని చెబుతుండటంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు. మట్టి రోడ్లు ఉన్న ప్రాంతాలను వదిలేసి సిమెంటు రోడ్లు ఉన్నచోట మళ్లీ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. మురుగు కాలువలు నిర్మిస్తే.. సరిపోయే అవకాశం ఉన్నప్పటికీ వర్షం పడితే నీరు నిలుస్తాయన్న సాకు చూపి ప్రజాధనాన్ని వృథా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని గుంటూరు పశ్చిమ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముత్తినేని శివలీల పేర్కొన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహిళల నుంచి అర్జీలు స్వీకరించారు. కుటుంబ, సంక్షేమ పింఛన్లు, గృహ సమస్యలు, ఉపాధి, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై మహిళలు వినతిపత్రాలు అందజేశారు. శివలీల మాట్లాడుతూ అర్జీలను ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకురాళ్లు చెంబేటి మణికుమారి, షేక్ కరిమూన్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ముత్తినేని శివలీల

విష ప్రచారం ఆపాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా షేక్ జన్నత్ హుస్సేన్ నియామకంపై కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న విష ప్రచారం ఆపాలని తెదేపా మైనార్టీ నాయకులు పఠాన్ అస్మా, షేక్ నాగూర్ పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. 2014 నుంచి జన్నత్ హుస్సేన్ తెదేపాలో క్రియాశీలకంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికల అనంతరం ఏర్పడిన రాజకీయ పరిణామాలతో ఆయన వైకాపాలో చేరాల్సి వచ్చిందన్నారు. ఎన్నికలకు ఏడాది ముందు ఆయన మళ్లీ తెదేపాలో చేరారన్నారు. కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో తెదేపా మైనార్టీ నాయకులు అబ్దుల్ రహీం, చినమస్తాన్ వలి, ఇమ్రాన్, హుస్సేన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

ఇంటర్ ద్వితీయ పరీక్షకు 98.42 శాతం హాజరు

పరీక్ష తీరు పరిశీలిస్తున్న పాలనాధికారి తమీమ్ అన్సారియా, ఆర్ఐవో సునీత

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 87 కేంద్రాల్లో పరీక్ష జరగ్గా జనరల్ విద్యార్థులు 31,197 మందికిగాను 30,748 మంది, వృత్తి విద్యలో 1,090 మందికిగాను 1,029 మంది హాజరయ్యారు. మొత్తం హాజరుశాతం 98.42గా నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో సునీత తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఏసీఎస్‌లుగా సంబంధిత పరీక్ష కేంద్రాల ప్రధానాచార్యులు వ్యవహరిస్తున్నారు. వీరు ఉదయం పరీక్ష ప్రారంభ ఏర్పాట్లతోపాటు పూర్తయ్యాక సంబంధిత జవాబు పత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులకు తరలిస్తారు. మరునాడు పరీక్షకు ఏర్పాట్లు చూస్తారు. వీరికి గుర్తింపు ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వారికి రెన్యుమరేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ✤ సాంబశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటరు ద్వితీయ సంవత్సర పరీక్షల తీరును జిల్లా పాలనాధికారి తమీమ్ అన్సారియా పరిశీలించారు. తాగు నీరు, వైద్యశిబిరాల ఏర్పాట్లు గమనించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు.. చుట్టుపక్కల ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్ల మూసివేత తదితర అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. పరీక్ష సమయంలో వదంతులకు పాల్పడే వారిపై దృష్టి సారించాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

? లక్ష్మీనగర్ 2వ లైన్‌లో రహదారి పక్కన చెత్తతో కూడిన వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. **- స్థానికులు** ✔ పారిశుధ్య సిబ్బందితో చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్** ? శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులోని కాలువలో మురుగు ముందుకు కదలకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. దోమల బెడద ఎక్కువైంది. **- స్థానికులు** ✔ సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగిస్తాం. **-పాపారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 15, వంగ 19, బెండ 20, పచ్చిమిర్చి 40, కాకర 35, బీర 36, క్యాలీఫ్లవర్ 26, క్యాబేజి 18, క్యారెట్ 26, దొండ 29, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుళ్లు 25, దోస 28, సొర 12, పొట్లకాయ 25, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 45, చామదుంప 24, బీట్‌రూట్ 23, మునగ 15, కీరదోసకాయ 40, బీన్స్ 55, క్యాప్సికం 59, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 55, అల్లం 75, వెల్లుల్లి 140. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

సిమెంటు రోడ్లున్నా... మళ్లీ వేసేస్తున్నారు..

మురుగు కాలువల సాకుతో ప్రజాధనం దుర్వినియోగం

నల్లచెరువు నాలుగో లైన్‌లో గతంలో ఉన్న సిమెంటు రోడ్డుపై పోసిన కంకర

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇంజినీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కై రోడ్లు ఉన్నచోటే.. మళ్లీ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని నల్లచెరువు నాలుగో లైన్‌లో గతంలో సిమెంటు రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుపై ఎక్కడా ఎలాంటి గుంతలు లేవు. ఇక్కడ రోడ్డు అవసరం లేనప్పటికీ మురుగు కాలువల నిర్మాణం సాకుగా చూపి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. రూ.45 లక్షలతో మురుగు కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. తొలుత మురుగు కాలువల నిర్మాణం పూర్తి చేసి సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఉన్న కాలువలు తొలగించి ఎత్తుగా నిర్మించడంతో స్థానికులు ఇళ్లలోకి అంతర్గత వీధుల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

✤ కొరిటెపాడు పరిధిలోని రామన్నపేటలో పలు అంతర్గత వీధుల్లో కాలువలు నిర్మిస్తున్నారు. సుమారు రూ.90 లక్షలతో ఇక్కడ పనులు జరుగుతున్నాయి. ఇక్కడా గతంలో సీసీ రోడ్లు ఉన్నాయి. కాలువలు ఎత్తుగా నిర్మించడంతో.. ఉన్న సిమెంటు రోడ్డుపై మళ్లీ సీసీ రోడ్డు నిర్మిస్తూ.. ప్రజాధనాన్ని గుత్తేదారులకు దోచిపెడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ✤ నగరంలోని మట్టి రోడ్లు ఉన్న ప్రాంతాలను వదిలేసి సిమెంటు రోడ్లు ఉన్నచోట మళ్లీ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. మురుగు కాలువలు నిర్మిస్తే.. సరిపోయే అవకాశం ఉన్నప్పటికీ వర్షం పడితే నీరు నిలుస్తాయన్న సాకు చూపి ప్రజాధనాన్ని వృథా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ✤ సిమెంట్ రోడ్లున్నచోట మళ్లీ రోడ్డు నిర్మించడాన్ని ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. మురుగు సక్రమంగా పారేందుకు కాలువలు ఎత్తులో నిర్మిస్తున్నామని, దీంతో రోడ్డు మళ్లీ వేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఓటర్ల జాబితా సర్వే వేగవంతం చేయాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఈఆర్వోలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్, క్లెయిమ్స్ పరిష్కారాలను నియోజకవర్గాల వారీగా పరిశీలించి, మూడు రోజుల్లోగా వేగవంతం చేసేలా ఈఆర్వోలు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు టి.సేవాకుమార్(ఆప్), వాసు(బీఎస్పీ), వై.వి.సుబ్బారావు(భాజపా), కె.కె.గుప్తా (కాంగ్రెస్), ఓంకార్(తెదేపా), సీహెచ్.త్రినాథ్(జనసేన), డీఆర్వో ఖాజావలి, ఈఆర్వోలు పాల్గొన్నారు.

స్పందించారు.. సమస్య తీర్చారు..

ఏటీ అగ్రహారానికి వెళ్లే దారిలో ఫ్యూజ్ బాక్స్‌కు రక్షణ కవచాన్ని అమర్చారిలా..

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఎస్బీఐ బంగ్లా రోడ్డు నుంచి ఏటీ అగ్రహారానికి వెళ్లే రహదారిలో గెలాక్సీ అపార్ట్‌మెంట్ దగ్గర విద్యుత్తు స్తంభానికి ఉన్న ఫ్యూజ్ బాక్స్ తలుపులు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యపై ఈ నెల 15న 'ఈనాడు'లో 'ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి ఏఈ సాంబశివరావు స్పందించి లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, సిబ్బందితో ఫ్యూజ్ బాక్స్‌కు రక్షణ కవచాన్ని అమర్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తీగలు సరి చేశారు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: అంకమ్మనగర్ నాలుగో లైన్‌లో రహదారి పక్కన విద్యుత్తు సర్వీస్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ సమస్యపై ఈనెల 16న 'ఈనాడు'లో 'వేలాడే తీగలు.. ప్రమాద హేతువులు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ సమస్యపై ఏఈ సాంబశివరావు స్పందించి విద్యుత్తు సిబ్బందితో సర్వీస్ తీగలను సరిచేయించి సమస్య పరిష్కరించారు.

26 నుంచి శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలు

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న మస్తానయ్య, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 26 నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య తెలిపారు. గుంటూరులోని ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆయన కార్యక్రమ వివరాలు తెలిపారు. ఈ నెల 26న అంకురార్పణ, 27న శేషవాహన సేవ, 28న హనుమత్, గరుడవాహన సేవలు, మార్చి 1న గజవాహన సేవ, స్వామి శాంతి కల్యాణం, 2న సువాసిని పూజ, దివ్య రథోత్సవం, 3న పూర్ణాహుతి, ధ్వజావరోహణం, అన్నసమారాధన జరుగుతాయన్నారు. రోజూ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు, పారాయణం, రోజూ సాయంత్రం బ్రహ్మోత్సవాల ఉపన్యాస కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, సభ్యులు యడ్లపాటి అశోక్‌కుమార్, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, ఎ.సుధాకర్, అర్చకుడు మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మీ నారాయణుల కల్యాణం

పవిత్ర మాంగల్య దర్శనం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అరండల్‌పేట అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధానార్చకుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో ఆదిలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీచక్ర మేరువుకు అభిషేకాలు చేశారు.

మొక్కే కదా అని వదిలేస్తే..

నగరంలోని కంకరగుంట పైవంతెన ఇరువైపులా గోడలకు పిచ్చి మొక్కలు పెరిగాయి. చిన్నవే కదా అని వదిలేస్తే.. అవి పెద్దవై వంతెనకు ముప్పు తెచ్చే అవకాశముంది. మొక్కలున్న ప్రాంతంలో గోడలు బీటలు వారుతున్నాయి. దీంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు పశ్చిమ**

అల్లుకున్న తీగలు తొలగించారు

ఏటీ అగ్రహారం నాలుగో లైన్‌లో నేతాజీనగర్ విజేత గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభం, నియంత్రికలను పిచ్చిమొక్కలు అల్లుకుపోయి గాలులు వీచినప్పుడల్లా నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయి. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. సమస్యపై ఈనెల 23న 'ఈనాడు'లో 'పచ్చని తీగలు ప్రమాదమే..!' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి ఏఈ సాంబశివరావు స్పందించి అల్లుకున్న పిచ్చి మొక్కలను తొలగించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

ఇసుక కుప్ప తొలగించరూ..!

గుజ్జనగుండ్లలో ప్రజావైద్యశాల పక్క రహదారిలో ఉన్న ఇసుక కుప్పతో వాహనచోదకులు పడుతున్న వెతలు అన్నీ ఇన్నీ కావు. డ్రెయిన్ నిర్మించేందుకు ఇసుకను రోడ్డుపై వేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా పరిణమించింది. ఇసుక రోడ్డంతా వ్యాపించడంతో జేకేసీ కళాశాల వైపు వెళ్లేవారు, గుజ్జనగుండ్ల వైపు వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

దేశాభివృద్ధిలో సీఏలది కీలక పాత్ర

ప్రమాణ స్వీకార మహోత్సవంలో సుబ్బారావు, భరద్వాజ్, వెంకట నరేష్, మృత్యుంజయరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: దేశ ఆర్థికాభివృద్ధిలో సి.ఎ.లు కీలకపాత్ర పోషిస్తున్నారని డి.ప్రసన్నకుమార్ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గుంటూరు బ్రాంచి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బండ్లమూడి గార్డెన్స్‌లో నిర్వహించారు. తొలుత ముప్పాళ్ల సుబ్బారావు ఇంటి నుంచి బండ్లమూడి గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గుంటూరు శాఖను జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలపాలని సూచించారు. దక్షిణ భారత మండలి అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ సీఏ సభ్యులు, విద్యార్థులు, వర్తక సంఘాలు, ప్రభుత్వ రంగ సంస్థల మధ్య గుంటూరు బ్రాంచి ఒక వారధిగా పనిచేస్తూ దేశ ఉన్నతికి తోడ్పడాలన్నారు. గుంటూరు బ్రాంచి ఛైర్మన్ రుద్రరవరపు భరద్వాజ్ మాట్లాడుతూ నూతన కార్యవర్గ సహకారంతో బ్రాంచి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండవ సునీల్‌కుమార్, దీపక్ లడ్డా, ఎర్ర తిరుపతయ్య, వనిమిరెడ్డి వెంకట నరేష్, కన్నెగంటి మృత్యుంజయరావు, రాజశేఖర్, షేక్ బాజీ, దేసు సంపత్, చింతా రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మురుగు కాలువ నిర్మాణం

విద్యుత్తు స్తంభాలు తొలగించకుండానే పనులు

ఇన్నర్ రింగ్ రోడ్డులో కాలువ నిర్మాణానికి అడ్డుగా ఉన్నా తొలగించని స్తంభాలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడు లేడు. గతంలో పలు ప్రాంతాల్లో పనులకు అడ్డుగా స్తంభాలు ఉన్నప్పటికీ వాటిని తొలగించకుండానే సీసీ రోడ్లు నిర్మించారు. రెడ్డిపాలెం, సాయి బొమ్మిడాల నగర్, బొంతపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో స్తంభాలు తొలగించకుండానే రోడ్లు వేశారు. తాజాగా మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు రెండో ఫేజ్‌లో రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. పనులు చేపట్టకముందే స్తంభాలు తొలగించాల్సి ఉన్నప్పటికీ ఎవరూ నిబంధనలు పాటించలేదు. రూ.కోట్ల నిధులతో చేపట్టిన పనులపై ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో గుత్తేదారుడు స్తంభాలు తొలగించకుండానే పనులు చేస్తున్నారు. స్తంభాలు ఉన్నచోట పనులు చేయకుండా వదిలేశారు. కొన్నిచోట్ల కాలువలను వంకర్లు తిప్పారు. మురుగు పారుదలకు ఆటంకం కలిగేవిధంగా ఉన్నప్పటికీ కొందరు భవన యజమానుల నుంచి ముడుపులు తీసుకుని అలైన్‌మెంట్‌ను మార్చేస్తున్నారు. గుత్తేదారులు పనులు ఎలా చేస్తున్నా అధికారులు అటువైపు తొంగిచూడడంలేదు.

✤ అమరావతి రోడ్డు దగ్గర నుంచి శిల్పారామం వరకు కాలువల నిర్మాణం చేపట్టారు. రహదారికి ఇరువైపులా 20 వరకు స్తంభాలు అలానే వదిలేసి పనులు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు పరిశీలించి కాలువల నిర్మాణ పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులను ఆకట్టుకున్న ప్రదర్శనలు

యంత్రాల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలో జరుగుతున్న వైద్య విజ్ఞానిక ప్రదర్శనలో రేడియాలజీ విభాగం ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. మంగళవారం వారు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎగ్జిబిషన్‌లో ఉన్న వివిధ విభాగాలను తిలకించారు. ఆధునిక వైద్య రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, పీఈటీ-సిటీ వంటి చిత్రీకరణ పద్ధతుల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు యంత్రాలు ఎలా పనిచేస్తాయో వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి రేడియాలజీ విభాగం ప్రదర్శనలను పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లోనూ ప్రతిభ చాటాలి

పోటీలు ప్రారంభిస్తున్న ఏఎస్ఐ నసీర్, కార్పొరేటర్ మీరావలి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి లింగినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలను పాత గుంటూరు ఏఎస్ఐ షేక్ నసీర్, కార్పొరేటర్ షేక్ మీరావలి ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి 94 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మాస్ స్టార్ట్, ఐటీటీ విభాగాల్లో పోటీలు జరిగాయి. రెండు విభాగాల్లో మొదట నాలుగు స్థానాల్లో నిలిచిన బాలబాలికలకు మీరావలి పతకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల ఉంటే క్రీడాకారులు సులభంగా విజయం సాధించవచ్చన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు విజయవాడలో మార్చి 1న జరిగే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు పంపుతామని వివరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి భానుప్రసాద్, శిక్షకుడు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్రింటర్స్ నగర కార్యవర్గం ఎన్నిక

కొత్త కార్యవర్గ సభ్యులు వీరే

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఏపీ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా, నగర శాఖల ఆధ్వర్యంలో ముద్రణాయంత్ర సృష్టికర్త జాన్ గుటెన్‌బర్గ్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాలాపేట ప్రింటర్స్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. అనంతరం 2026-2028 సంవత్సరానికి నగర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా వెలుగూరి కృష్ణమూర్తి, కార్యదర్శిగా కోట శివకృష్ణ, కోశాధికారిగా కొలిపాకుల లక్ష్మీకాంత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో భాగంగా 1000 మంది పేదలకు అన్నదానం చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు చక్కా సత్యనారాయణ, నగర అధ్యక్షుడు తోట శ్రీనివాస్, కార్యదర్శి ఫిలిప్స్, కోశాధికారి పిచ్చయ్య, గుణకాల మణికంఠ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము ఆకస్మిక తనిఖీ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాముకు వేసిన తాళాల సీళ్లు, సీసీ కెమెరాల పనితీరు, ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఏడీఎఫ్‌వో కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు లోచర్ల రమేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మల్లీశ్వరి, ఏపీఎస్పీ బెటాలియన్ ఏఆర్ ఎస్ఐ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చదువుతోపాటు అదనపు నైపుణ్యాలు అవసరం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు అదనపు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో సలీం బాషా పేర్కొన్నారు. మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరం జిల్లా స్థాయి భాషోత్సవం పోటీలు నిర్వహించారు. తెలుగు, హిందీ, ఉర్దూ, ఆంగ్లం, సంస్కృతం, గిరిజన భాషల్లో ప్రాథమిక, సెకండరీ, సీనియర్ సెకండరీ విద్యార్థులకు స్పెల్ చెక్, గీతాలాపన, కథలు చెప్పటం, రాయడం, చదవడం, విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

సభ్యత్వ నమోదుకు ప్రత్యేక ప్రణాళిక

సమావేశంలో జనసేన నేతలు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సభ్యత్వాల నమోదుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనబోయిన శ్రీనివాస్ అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని జిల్లా, నగర కమిటీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బొనబోయిన మాట్లాడుతూ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మహాయజ్ఞంలా చేపట్టాలని సూచించారు. ఎటువంటి సందేహాలున్నా పరిష్కరించేందుకు పార్టీ కార్యాలయంలో ఐటీ నిపుణులు అన్ని వేళలా అందుబాటులో ఉంటారన్నారు. జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం ఉమ్మడి జిల్లాలో లక్ష సభ్యత్వాలు చేశామని, ఇప్పుడు మూడు నుంచి నాలుగు లక్షల సభ్యత్వాలే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. యువత, విద్యార్థులను భాగస్వాములను చేయాలని సూచించారు. పార్టీ నేతలు మాణిక్యాలరావు, ఆళ్ల హరి, కార్పొరేటర్ వెంకటరమణ, మిర్చియార్డు డైరెక్టర్లు వంశీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

అర్జీలు స్వీకరిస్తున్న ముత్తినేని శివలీల

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని గుంటూరు పశ్చిమ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముత్తినేని శివలీల పేర్కొన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహిళల నుంచి అర్జీలు స్వీకరించారు. కుటుంబ, సంక్షేమ పింఛన్లు, గృహ సమస్యలు, ఉపాధి, ఆర్యోగం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై మహిళలు వినతిపత్రాలు అందజేశారు. శివలీల మాట్లాడుతూ అర్జీలను ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకురాళ్లు చెంబేటి మణికుమారి, షేక్ కరిమూన్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గోపాలరావు నాటక రంగ కృషి ప్రశంసనీయం

అతిథుల నుంచి పురస్కారం అందుకుంటున్న గోపాలరావు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై పి.సత్యనారాయణ రాజు కళావేదిక ఆధ్వర్యంలో సూర్యకాంతం స్మారక పురస్కార ప్రదాన సభ మంగళవారం రాత్రి జరిగింది. పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్ల గోపాలరావుకు సూర్యకాంతం స్మారక పురస్కారమిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ, ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, పసుపులేటి శ్రీధర్, సెట్లం చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. వక్తలు సూర్యకాంతం నటజీవిత విశేషాలు, యడ్ల గోపాలరావు నాటక రంగ కృషిని ప్రశంసించారు. అనంతరం మహాభారతంలోని శయనఘట్టాన్ని ప్రదర్శించారు.

జిల్లాకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి రాక నేడు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్‌కుమార్ లోహాని జిల్లాలో బుధవారం పర్యటించనున్నారు. విజయవాడ నుంచి బుధవారం ఉదయం 9.30కి బయలుదేరి 10.30 గంటలకు గుంటూరు జిల్లాపరిషత్తు క్వార్టర్స్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న డీపీఆర్‌సీ భవనం పనులను పరిశీలిస్తారు. 11 గంటలకు బయలుదేరి కొల్లిపర మండలం కుంచవరం చేరుకుని పంచాయతీ భవనాన్ని తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు దంతులూరు గ్రామాన్ని సందర్శిస్తారు. అనంతరం బయలుదేరి 1.30కి విజయవాడ చేరుకుంటారు. సుశీల్‌కుమార్ లోహాని పర్యటనకు ఏర్పాట్లు చేయాలని జిల్లాపరిషత్తు సీఈవో, డ్వామా పీడీ, డీపీవోలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ఆదేశించారు.

అంబటిని పరామర్శించిన వైకాపా నేతలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు సిద్ధార్థనగర్‌లోని కార్యాలయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబును పలువురు వైకాపా నేతలు మంగళవారం పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావుండకూడదని, వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే దాడులు చేస్తున్నారన్నారు. వైకాపా నేత వరికూటి అశోక్‌బాబు మాట్లాడారు.

విష ప్రచారం ఆపాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా షేక్ జన్నత్ హుస్సేన్ నియామకంపై కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న విష ప్రచారం ఆపాలని తెదేపా మైనార్టీ నాయకులు పఠాన్ అస్మా, షేక్ నాగూర్ పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. 2014 నుంచి జన్నత్ హుస్సేన్ తెదేపాలో క్రియాశీలకంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికల అనంతరం ఏర్పడిన రాజకీయ పరిణామాలతో ఆయన వైకాపాలో చేరాల్సి వచ్చిందన్నారు. ఎన్నికలకు ఏడాది ముందు ఆయన మళ్లీ తెదేపాలో చేరారన్నారు. కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో తెదేపా మైనార్టీ నాయకులు అబ్దుల్ రహీం, చినమస్తాన్ వలి, ఇమ్రాన్, హుస్సేన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

మూడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు మంజూరు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌లో భాగంగా జిల్లాలో మూడు అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరులోని పిచుకులగుంట, మంగళగిరి పరిధిలోని వడ్డేశ్వరంలో ఏర్పాటుకు ప్రతిపాదించారు. కుంచనపల్లిలోని యుపీహెచ్‌సీని యుఏఏఎంగా అప్‌గ్రేడ్ చేయనున్నారు.

ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు లేకపోతే చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన అనుమతుల మేరకే భవన నిర్మాణాలుండాలని కమిషనర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. మంగళవారం శ్యామలానగర్, ఇన్నర్ రింగురోడ్డు, టీచర్స్ కాలనీల్లో ఆక్యుపెన్సీ కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆయా భవనాలను పరిశీలించారు. ఒక భవనం ప్లాన్‌కు భిన్నంగా సెల్లార్‌లో అదనపు రూం ఏర్పాటు చేయడంతో సంబంధిత టీపీవోకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీపీని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ నుంచి తీసుకున్న ప్లానుకు అనుగుణంగానే నిర్మాణాలుండాలని స్పష్టం చేశారు. ఆక్యుపెన్సీ, మార్టిగేజ్ మంజూరు దస్త్రాలు తనకు పంపే ముందే సీపీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు.

(c) eenadu

ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు మూర్ఖులు

జస్టిస్ జీఆర్ స్వామినాథన్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు దుర్మార్గులు, మూర్ఖులు, అటువంటివారని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు. తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దర్గావద్ద ఉన్న రాతిస్తంభంపై మురుగన్ భక్తులు కార్తీకదీపం వెలిగించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది, అమలుచేయలేదు. డీఎంకే నేతలు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ స్వామినాథన్ మాట్లాడుతూ... గురువు అంటే భగవంతుని స్వరూపమన్నారు. భగవంతుని పాదాలు తాకలేమని, అయితే గురువు పాదాలను తాకడం సులభమని చెప్పారు. తమిళనాడులో హేతువాదులు గురువును భగవంతునిగా చూస్తున్న మనల్ని దుర్మార్గులు, మూర్ఖులు, అటువంటివారిగా భావిస్తున్నారన్నారు. కానీ నిజమైన దుర్మార్గులు, మూర్ఖులు, అటువంటివారు వారేనని తెలిపారు. గురువు అనుగ్రహం వల్ల ధైర్యం, సాంత్వన లభిస్తాయన్నారు. గురువుల దగ్గరకు వెళ్లినప్పుడు వారి ప్రకాశం భక్తుల బలహీనతలను తొలగించడానికి సహాయపడుతుందని చెప్పారు. తన పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉందని, మరింత ధైర్యంతో పనిచేయాలని అనుకుంటున్నట్లు జస్టిస్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు.

పులివెందుల చేరుకున్న జగన్

ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: మూడురోజుల పర్యటనలో భాగంగా వైకాపా అధ్యక్షుడు జగన్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల చేరుకున్నారు. మంగళవారం ఆయన బెంగళూరు నుంచి పులివెందుల సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు స్వాగతం పలికారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సాయంత్రం జగన్ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. గతంలో కార్యకర్తల మధ్య తోపులాట జరిగిన నేపథ్యంలో గోడలపైనా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజాదర్బార్ అనంతరం జగన్ తన స్వగృహానికి వెళ్లారు. బుధవారం ఉదయం వేంపల్లె మండలం నందిపల్లెలోని నందీశ్వరాలయం ప్రారంభోత్సవానికి ఆయన హాజరు కానున్నారు.

అక్రమ మైనింగ్‌తో ఖజానాకు ఎంత నష్టం జరిగిందో చెప్పండి

- **జస్టిస్ సుధాంశు ధులియా కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశం**

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దుల్లోని ఏపీ భూభాగంలో ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి ఇచ్చిన ఇనుప గనులు, అక్కడి అటవీప్రాంత హద్దులను ఖరారు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నాలుగు విషయాలను తన నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. తవ్వకాలకు అనుమతి పొందిన సంస్థలు రిజర్వ్ ఫారెస్టును ఆక్రమించాయా? లేదా? అక్రమ మైనింగ్, ఇతర అనధికార కార్యకలాపాల తీవ్రత ఎంతమేర ఉంది? ప్రభుత్వ ఖజానాకు ఎంతమేర నష్టం జరిగిందన్నది చెప్పాలని నిర్దేశించారు. ఓఎంసీ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు 2009 నవంబరు 19న సమ్మిరెడ్డి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఖనిజం తవ్వకాలను సస్పెండ్ చేయగా, ఆ ఉత్తర్వును కొట్టేస్తూ ఏపీ హైకోర్టు 2010 ఫిబ్రవరి 26న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. దానిపై మంగళవారం జస్టిస్ జోయ్‌మల్య బాగ్చితో కలిసి విచారించిన సందర్భంగా సీజేఐ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. గత ఏడాది సెప్టెంబరు 19న జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో సుప్రీం ధర్మాసనం ఏర్పాటుచేసిన కమిటీ మరో ఆరువారాల గడువు అడగడంతో మంగళవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అందుకు అంగీకరించారు.

సీబీఐ నుంచి ఏం ఆశించగలం?

కర్ణాటకకు చెందిన సమాజ పరివర్తన సముదాయ తరఫు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ వాదనలు వినిపిస్తూ 'అంతర్రాష్ట్ర సరిహద్దులో పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరిగింది. దీనిపై దర్యాప్తు జరిపిన సీబీఐ 2014 వరకే రిపోర్టు దాఖలుచేసింది. తర్వాత జరిగిన దర్యాప్తు ఏమైందో తెలియదు. ఇక్కడ ఆరు గనుల లీజుదారులు సరిహద్దులు, కొండలు, ఆలయాలను ధ్వంసం చేశారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ 'సరిహద్దుల అంశం చాలా సున్నితమైనది. దురదృష్టవశాత్తు 11 ఏళ్లుగా ఏమీచేయని సీబీఐ నుంచి మనం ఇప్పటికప్పుడు ఏం ఆశించగలం? ఇప్పుడు జస్టిస్ సుధాంశు ధులియా కమిటీ సరిహద్దుల ఆవల మైనింగ్ జరిగినట్లు చెబితే సీబీఐ దర్యాప్తు మళ్లీ మొదలుపెట్టవచ్చు' అని పేర్కొన్నారు. కర్ణాటకలోని మైనింగ్ సంస్థల తరఫు న్యాయవాది బసవప్రభు పాటిల్ వాదనలు వినిపిస్తూ 'ఇప్పుడు లీజు హద్దులను ఖరారుచేయడం ఒక్కటే మిగిలింది. ఆ బాధ్యతలనే జస్టిస్ ధులియా కమిటీకి అప్పగించారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ అక్రమంగా దండుకున్నవారి సంగతేంటని ప్రశ్నించారు. 'ఉదాహరణకు మీరు ఆంధ్రావైపు లీజు ఇచ్చారు.. కానీ లీజు పొందిన వ్యక్తి అది కర్ణాటక కిందికి వస్తుందని చెప్పి తవ్వకాలు చేపట్టి ఉండొచ్చు. అలాగే కర్ణాటక వైపు లీజులు ఉంటే అది ఆంధ్రా వైపని చెప్పి తవ్వి ఉండొచ్చు. వాళ్లు తమ పని చక్కబెట్టుకొని వెళ్లిపోయారు' అని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బదులిస్తూ 'నిజాలు బయటికి రావాలన్న ఉద్దేశంతో స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలని మేం కోరాం. ఆ కమిటీ ఆరు వారాల సమయం అడిగినందున అంత వరకు వేచిచూడటం మంచిది' అన్నారు. దీంతో సీజేఐ ఆ కమిటీకి ఆ గడువునిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

7 వేల ఆయా పోస్టులు భర్తీ చేస్తాం

మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు కొత్తగా 7 వేల ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి సంధ్యారాణి సభ్యుల ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 'రాష్ట్రంలో 257 ఐసీడీఎస్ ప్రాజెక్టులు, 55,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. గత ఏడాది అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు 70 శాతంగా ఉంది.. ప్రస్తుతం అది 96 శాతానికి పెరిగింది' అని మంత్రి వెల్లడించారు.

విచారణార్హతపై వాదనలు వింటాం

చంద్రబాబు ముందస్తు బెయిలు రద్దుపై వేసిన పిటిషన్ విషయంలో ఆళ్లకు స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారంపై నమోదుచేసిన కేసులో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంజూరుచేసిన ముందస్తు బెయిలును రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ విచారణార్హతపై వాదనలు వింటామని పిటిషనర్, వైకాపా మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టు చెప్పింది. సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది మాధవ్ ఖురానా వాదనలు వినిపిస్తూ.. పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. అభ్యంతరం ఉంటే ఏసీబీ కోర్టులో పిటిషనర్ ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలుచేసుకోవాలి తప్ప.. బెయిలు రద్దు కోసం హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. మొదట వ్యాజ్య విచారణార్హతపై వాదనలు వింటామని స్పష్టం చేస్తూ విచారణను మార్చి 10కి వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

శ్రీకాకుళంలో విజృంభిస్తున్న అతిసారం

- **3 రోజుల్లో 76 కేసులు, ఒకరి మృతి**
- **మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేత**

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో అతిసారం ప్రబలుతోంది. మూడు రోజుల్లో 76 కేసులు నమోదయ్యాయి. దీంతో సీఎం చంద్రబాబు మంగళవారం రెండుసార్లు జిల్లా అధికారులతో మాట్లాడారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక బృందాలను నియమించారు. బాధితుల్లో మెండేటివీధికి చెందిన ఎం. సురేష్(43) మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబానికి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే శంకర్ రూ.10 లక్షల పరిహారం అందజేశారు. మరొకరు కూడా ప్రాణాలు కోల్పోగా అతిసారంతోనా లేక మరేదైనా కారణం ఉందా అనే విషయంపై స్పష్టత లేదు.

కలుషిత నీరే కారణమా?

అతిసారం ప్రబలడానికి తాగునీరు కలుషితం కావడమే కారణమని అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని వీధుల్లో రోడ్డువిస్తరణ పనులు చేపట్టారు. పైపులైన్లు పగలడంతో వాటిలోకి మురుగునీరు చేరిందని భావిస్తున్నారు. ఎక్కువగా దమ్మల వీధి, గుడి వీధి, మంగువారితోట, కాకివీధి ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. దీంతో మున్సిపల్ కాలువల్లో పైపులైన్లు, లీకేజీల గుర్తింపునకు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య బృందాలను రంగంలోకి దించారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం విశాఖలోని ల్యాబ్‌కు పంపారు. ప్రభావిత ప్రాంతాల్లో రెండురోజులుగా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు.

శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజారోగ్య రక్షణలో వైఫల్యం: జగన్

ఈనాడు, అమరావతి: ప్రజల ప్రాణాలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. శ్రీకాకుళంలో అతిసారం వ్యాప్తిచెంది పలువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రక్షణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడి హత్య

ఒడిశాలో ఓ బాలిక ఘాతుకం

అనుష్క పరిడా

అహిం పరిడా

జయపురం, న్యూస్‌టుడే: తన ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడిని ఓ బాలిక హత్యచేసింది. ఈ ఘటన ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బొరిగుమ్మలో చోటుచేసుకుంది. ఎస్‌డీపీవో సత్యబ్రత లెంకా తెలిపిన వివరాల ప్రకారం.. సదరు సమితికి చెందిన 16 ఏళ్ల బాలిక తన ప్రేమను అంగీకరించలేదని తల్లి అనుష్క పరిడా(45), సోదరుడు అహిం పరిడా(14)లను ప్రియుడితో కలిసి కాళ్లు, చేతులు కట్టేసి కడుపులో కత్తితో పొడిచి హత్య చేసింది. అనంతరం స్థానిక కాలువలో పడేసింది. సోమవారం ఈ మేరకు బాలిక ఠాణాకు వచ్చి అంగీకరించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అహిం మృతదేహాన్ని కాలువ ఒడ్డున గుర్తించగా, అనుష్క మృతదేహం కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ గాలింపును ప్రారంభించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తమిళనాట కొత్త పార్టీ ప్రారంభించిన శశికళ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు, దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త పార్టీని ప్రారంభించారు. రామనాథపురం జిల్లా కముదిలో మంగళవారం రాత్రి జరిగిన జయలలిత జయంతి వేడుకల్లో ఆమె పార్టీ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జయలలిత మరణం తర్వాత పార్టీలో చాలా సమస్యలు తలెత్తాయని, తాను ముఖ్యమంత్రిగా నియమించిన వ్యక్తి తనకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తొమ్మిదేళ్లు మౌనంగా ఉన్నానని, ఇకపై ఉండటం కుదరదని, ఇంకా మౌనంగా ఉంటే కార్యకర్తలకు, ప్రజలకు ద్రోహం చేసినట్లు అవుతుందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండా మధ్యలో అన్నా, ఎంజీఆర్, జయలలిత చిత్రాలున్నాయి. పార్టీ పేరు తర్వాత ప్రకటిస్తామని శశికళ పేర్కొన్నారు.

పార్టీ జెండాను చూపుతున్న శశికళ

వాటికి మించింది లేదు

మీ మానసిక, శారీరక ఆరోగ్యం కంటే మీకు ముఖ్యమైంది ఏదీ లేదు. ఈ విషయంలో డబ్బు, స్నేహితులు, ఆఖరికి మీ కుటుంబం కూడా తర్వాతే. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడుకునేందుకు సూర్యరశ్మి, పౌష్టికాహారం, వ్యాయామాన్ని వదలకండి.

– స్టీవ్, కంటెంట్ క్రియేటర్

వైకాపా పాపాన్ని వైఎస్‌కు చుట్టడం తగదు

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: తిరుమల పవిత్రత విషయంలో వైకాపా చేసిన పాపాన్ని వైఎస్‌ఆర్‌కు చుట్టడం కూటమి ప్రభుత్వానికి తగదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. 'వైకాపా కల్తీ పనులు వైఎస్ హయాం నుంచే ప్రారంభమయ్యాయని అనడం సీఎం చంద్రబాబునాయుడి స్థాయికి సబబు కాదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అసెంబ్లీ వేదికగా వైఎస్‌పై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. ఆ వ్యాఖ్యలు సభ రికార్డుల నుంచి తొలగించి, చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి. వైఎస్ ఏడు కొండలను రెండు కొండలు చేయాలని ఏనాడూ అనుకోలేదు. ఏడుకొండలూ వేంకటేశ్వరస్వామివేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చింది వైఎస్సే. వైకాపా అరాచకాలకు ఆయనకు ఎలాంటి సంబంధం లేదు' అని షర్మిల అన్నారు.

అమరావతిలో పర్యాటక రంగ అభివృద్ధే లక్ష్యం

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పలు దేశాల ప్రతినిధులను అమరావతికి ఆహ్వానిస్తోంది. తాజాగా నమీ ఐలాండ్, సియోల్ నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం సోమ, మంగళవారాల్లో అమరావతిలో పర్యటించింది. హైదరాబాద్‌లోని దక్షిణ కొరియా గౌరవ కాన్సులేట్ జనరల్ సహకారంతో ఈ పర్యటన జరిగింది. పర్యాటక రంగంలో పరస్పర సహకారం, సాంస్కృతిక మార్పిడి, బౌద్ధ వారసత్వ సంబంధాలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా పర్యటన సాగింది. ఈ వివరాలను సీఆర్‌డీఏ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

❖ రాజధాని సీడ్‌యాక్సెస్ రహదారి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలు, సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ ఐకానిక్ టవర్ల నిర్మాణాలు, అదేవిధంగా అమరావతిలోని బౌద్ధ విగ్రహం, అమరావతి పురావస్తు మ్యూజియం, అమరలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు.

❖ నమీ ఐలాండ్ సీఈవో కియాంగ్‌పూ మిన్, సియోల్ నేషనల్ యూనివర్సిటీ ఆసియా సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంగ్ యాంగ్ కాంగ్ నేతృత్వంలోని బృందం పర్యటనలో పాల్గొంది. ఫీనిక్స్ గ్రూప్ ఛైర్మన్, కొరియా రిపబ్లిక్ గౌరవ కాన్సులేట్ జనరల్ సురేష్ చుక్కపల్లి ఈ పర్యటనకు మార్గదర్శకత్వం వహించారు. ❖ ఏపీటీఏ, ఏపీటీడీసీ సీఈవో ఆమ్రపాలితో బృందం సమావేశమైంది.

❖ మంగళవారం రాయపూడి సమీపంలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబుతో బృందం సమావేశమైంది. అమరావతి విజన్, డిజిటల్ ట్విన్ అమరావతి మౌలిక సదుపాయాల కల్పన గురించి కమిషనర్ ప్రజెంటేషన్ ద్వారా బృందానికి వివరించారు. ❖ అమరావతిలో ప్రణాళికాయుతంగా జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతి, రాజధాని నిర్మాణంలో అమలు చేస్తున్న సమగ్ర మౌలిక వసతుల ప్రణాళికలు, దీర్ఘకాలిక రాజధాని అభివృద్ధి వ్యూహాలను అధికారులు విదేశీ బృందానికి వివరించారు. పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి, టూరిజం ప్రాజెక్టులు, విద్య, పరిశోధన అంశాల్లో ఉన్న విస్తృత అవకాశాలు వివరించారు.

సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో చర్చిస్తున్న దక్షిణ కొరియా బృందం

❖ దక్షిణ కొరియాలోని నమీ ఐలాండ్ తరహాలో అమరావతిలోని పర్యాటక ప్రాంతాలను బ్లూ, గ్రీన్‌సిటీ నమూనాలో పర్యావరణ హితంగా తీర్చిదిద్దే అంశంపై చర్చలు జరిగాయి. సియోల్ నేషనల్ యూనివర్సిటీ ద్వారా బౌద్ధ చరిత్రపై విద్యాపరమైన పరిశోధనలు, సాంస్కృతిక మార్పిడికి ఇవి దోహదపడే అవకాశం ఉంది. సమావేశం అనంతరం కొరియా బృందానికి అమరావతి సాంస్కృతిక చిహ్నంగా జీఐ ట్యాగ్ ఉన్న గిఫ్ట్ బ్యాగులు అందజేశారు.

❖ ఈ పర్యటన అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో ఒక వినూత్న రాజధానిగా సాంస్కృతికంగా అభివృద్ధి చేయడానికి దోహదపడడమే కాకుండా పెట్టుబడుల గమ్యస్థానంగా అమరావతి మారుతుందని సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

మళ్లీ అవే తప్పిదాలా ఆచార్య..?

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరీక్షల నిర్వహణ పాఠశాల స్థాయి కన్నా దిగజారిపోతోంది. ఈ ఏడాది నిర్వహిస్తున్న పీజీ, బీఈడీ పరీక్షల్లోనూ ప్రశ్నపత్రాలను తప్పుల తడకగా ఇస్తున్నారు. గతేడాది పీజీ పరీక్షల పత్రాలలో తప్పులు, మరో ప్రశ్నపత్రం ఇవ్వడం లాంటివి జరిగినా.. వాటి నుంచి అధికారులు పాఠాలు నేర్చుకోవడం లేదు. తాజాగా నిర్వహిస్తున్న పరీక్షల్లోనూ గత తప్పులే పునరావృతం అవుతున్నాయి. కనీసం ఆంగ్ల అక్షరాలు కూడా సరిచూడకుండానే ప్రశ్నపత్రాలు ఇస్తుండటం ఇబ్బందికరంగా మారింది. గతంలో పేపర్ సెట్టింగ్‌కు సమయం లేకపోవడంతో చేతిరాతతో ప్రశ్నపత్రం ఇచ్చారు. ఈసారీ అవే తప్పులు పునరావృతం అవుతుంటే ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం సమస్యగా మారింది. ఇక బయాలజీ పరీక్ష ప్రశ్నపత్రంలో ఒక సబ్జెక్టుకు బదులు మరో సబ్జెక్టు ప్రశ్నలు ఇచ్చారు. బయో కెమిస్ట్రీలో బ్యాక్టీరియాలో ఇచ్చిన ఐదు ప్రశ్నలలో రెండు వైరాలజీ నుంచి వచ్చాయి. దీంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇవిగో సాక్ష్యాలు...

✦ రేపల్లె ఎస్ఎన్‌బీటీ పరీక్షా కేంద్రంలో రెగ్యులర్ పరీక్ష పత్రానికి బదులు సప్లిమెంటరీ పేపర్ ఇచ్చారు. విద్యార్థులు రెండు గంటల పాటు పరీక్ష రాసిన తర్వాత తప్పులు తెలుసుకున్న అధికారులు మరో ప్రశ్నపత్రం ఇచ్చి రాత్రి ఏడుగంటల వరకు సమయం ఇచ్చారు. మధ్యలో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రశ్నపత్రాలను బయట నెట్ సెంటర్ నుంచి ప్రింట్ తీయించినట్లు తెలుస్తోంది.

✦ బాపట్ల జిల్లాలోని ఓ పరీక్షా కేంద్రంలో వంద మంది విద్యార్థులకే పరీక్ష రాసేందుకు ఎన్‌సీటీఈ అనుమతి ఇచ్చింది. కానీ ఆ కేంద్రంలో 600 మంది విద్యార్థుల వరకు పరీక్ష రాస్తున్నారు. ఈ పరీక్షా కేంద్రంలోనూ రాత్రి ఏడు గంటల వరకు పరీక్షలు నిర్వహించారు.

✦ బాపట్లలోని ఓ కళాశాలకు సెల్ఫ్ సెంటర్ కేటాయించడంతో భారీగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు నియమించిన స్క్వాడ్ చూసీచూడనట్లు వదిలేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

✦ గతంలో వినుకొండలో ప్రశ్నపత్రం లీకైన కళాశాలకే ఈసారి పరీక్షా కేంద్రం కేటాయించారు.

పొన్నూరు ఎమ్మెల్యే తల్లి ఇంట్లో చోరీ కేసులో...

ఐదుగురు సభ్యుల ముఠా అరెస్టు

నిందితుల్లో వైకాపా సర్పంచి గుడిపూడి రఘు

42 సవర్ల బంగారు, 10.50 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తల్లి ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో వైకాపాకు చెందిన ఏలూరు జిల్లా చాటపర్రు సర్పంచి గుడిపూడి రఘు ఉన్నారు. నిందితుల నుంచి 42 సవర్ల బంగారు ఆభరణాలు, 10.50 కిలోల వెండి, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలు వెల్లడించారు. ఏలూరు జిల్లాకు చెందిన సత్తెనపల్లి రాకేష్ చోరీలు చేయడంలో దిట్ట. ఇతనిపై 34 కేసులున్నాయి. ఇతని స్నేహితులు ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కలపాలేనికి చెందిన కొక్కిలిగడ్డ ఆశీర్వాదం, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన జల్లి డెయిన్‌కుమార్ అలియాస్ ఆశిష్, ఏలూరుకు చెందిన నక్కల దుర్గాప్రసాద్, పమ్మి కృపాశామ్యూల్ అలియాస్ బన్నీ, దగ్గుమల్లి చినబాబు అలియాస్ విక్కీలు ఈ నెల 15న చీరాల బీచ్‌కు వెళ్లి కారు దొంగతనం చేశారు. 16న ఎమ్మెల్యే నరేంద్ర తల్లి ప్రమీలాదేవి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి.. అదే రోజు ఇంట్లోకి ప్రవేశించి 42 సవర్ల బంగారు ఆభరణాలు, 10.50 కిలోల వెండి, రూ.లక్ష నగదు చోరీ చేశారు.

నిందితుల వివరాలు తెలుపుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ జనార్దనరావు, సీఐ కృష్ణయ్య

వెండి కరిగించిన వైకాపా సర్పంచి.. ముఠా సభ్యులు తమకు పరిచయం ఉన్న ఏలూరు జిల్లా చాటపర్రు సర్పంచి గుడుపూడి రఘుకు వెండి ఆభరణాలు విక్రయించారు. ఇతను వాటిని కరిగించి వెండి ఇటుకలా మార్చాడు. ఐదు దశాబ్దాల కిందటి సరస్వతీ విగ్రహాన్ని కరిగించలేదు. ఇతనిపై రౌడీషీట్‌తోపాటు ఎనిమిది కేసులున్నాయి. కొన్ని బంగారు ఆభరణాలను రాకేష్ తల్లి దాచిపెట్టింది. ఘటనాస్థలిలో లభించిన వేలిముద్రలు, సాంకేతిక ఆధారాలతో డీఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో సీఐ కృష్ణయ్య ఎస్సైలు శ్రీహరి, వీరనారాయణ బృందం ముఠాను పట్టుకుంది. సత్తెనపల్లి రాకేష్, ఆశీర్వాదం, డెయిన్‌కుమార్, దుర్గాప్రసాద్, రఘులను అరెస్టు చేశామని ఎస్పీ చెప్పారు.

ఏప్రిల్ 7న కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్లు

కొండపాటూరు (కాకుమాను), న్యూస్‌టుడే: మండలంలోని కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం ఏప్రిల్ 7న నిర్వహించనున్నట్లు తహసీల్దారు వెంకటస్వామి తెలిపారు. మంగళవారం తిరునాళ్ల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని అందరూ సమన్వయంతో పని చేసి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ శాఖ వారు ఆయా డిపోల నుంచి సరిపడ బస్సులను నడపాలని కోరారు. మార్చి 31న సాయంత్రం 6 గంటలకు లక్ష మల్లెల పూజ.. ఏప్రిల్ 3న కుంకుమ పూజ జరుగుతాయన్నారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ట్రాఫిక్ విషయంలో ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ఈవో జక్కా శ్రీనివాసరావులు ఎస్సైలు హరికృష్ణ, దేవాదాయ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటస్వామి

కథలు.. కవితల పోటీలకు ఆహ్వానం

గుంటూరు సంస్కృతికం, న్యూస్‌టుడే: అరసం 20వ రాష్ట్ర మహాసభలు మే నెలలో తిరుపతిలో జరగనున్న నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని యువతకు కథ, కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువ కవులు, కథకులను ప్రోత్సహించేందుకు పెదపరిమికి చెందిన మువ్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. 40 సంవత్సరాల లోపు యువతీ యువకులు అర్హులని చెప్పారు. తెలుగు వారి జీవితానికి సంబంధించిన ఏ అంశాన్ని అయినా కథా వస్తువుగా తీసుకోవచ్చని, కవితా వస్తువు రచయిత ఇష్టమన్నారు. కథలు, కవితలు అభ్యుదయ దృక్పథంతో ఉండాలన్నారు. రచనలను వల్లూరు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, 401 శ్రావణి రెసిడెన్సీ, 63, ఎస్.వి.ఎన్.కాలనీ, గుంటూరు 522006 చిరునామాకు పోస్ట్, కొరియర్ ద్వారా ఏప్రిల్ 13వ తేదీ లోపు అందేలా పంపాలన్నారు. వివరాలకు 9291530714 నంబరును సంప్రదించాలన్నారు.

9 నుంచి ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మహిళ, పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మార్చి 9వ తేదీ నుంచి గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో ప్రారంభమవుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూటింగ్ డైరెక్టర్, వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ మార్చి 9, 10 తేదీల్లో బాలికలకు, 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురుష అభ్యర్థులకు, 15, 16 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర పురుష అభ్యర్థులకు ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు. 2005, జులై 2 నుంచి 2009, జనవరి 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కనీస ఎత్తు 152 సెం.మీ., ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష, మూడేళ్ల డిప్లొమా ఇంజినీరింగ్, రెండేళ్ల ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆయా విద్యార్హతల్లో మొత్తం మార్కుల్లో 50 శాతం, ఆంగ్లంలో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోనవసరం లేదని, నేరుగా ర్యాలీకి హాజరుకావచ్చన్నారు. ఒరిజినల్ లేదా డిజీలాకర్ ద్వారా ధ్రువపర్చిన విద్యార్హత ధ్రువపత్రాలు, నివాస పత్రం, ఎన్‌సీసీ సర్టిఫికెట్ (ఉంటే), ఆధార్ కార్డు, ఇ-మెయిల్ నంబర్, ఇటీవల తీసుకున్న 10 పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు, ప్రతి ధ్రువపత్రానికి సంబంధించిన 6 నకళ్ల కాపీలు తెచ్చుకోవాలన్నారు. ఏపీ, తెలంగాణ మహిళా అభ్యర్థులు మార్చి 9న, ఏపీ పురుష అభ్యర్థులు 12న, తెలంగాణ పురుష అభ్యర్థులు 15న ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఏఎన్‌యూ ప్రాంగణంలో హాజరుకావాలని కోరారు. 1.6 కిలోమీటర్ల పరుగు పోటీ, భౌతిక, శారీరక పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఆంగ్లం, హిందీ భాషల్లో రాత పరీక్ష ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి, డీటీసీ కె.సీతారామిరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల, ఎంటీఎంసీ ఉప కమిషనర్ శ్రీధర్, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, పక్కన వింగ్ కమాండర్ యాకూబ్ అలీ, డీఆర్వో ఖాజావలి

తప్పించుకు తిరుగుతున్న అద్విక ఏజెంట్లకు నోటీసులు

ఈనాడు – అమరావతి

అద్విక ట్రేడింగ్ మోసం కేసులో దక్కాల్సిన దాని కంటే ఎక్కువ లబ్ధి పొందిన ఏజెంట్ల నుంచి రికవరీపై పోలీసులు దృష్టి సారించారు. ఎక్కువ దక్కించుకున్న ఏజెంట్లు.. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. పదే పదే పిలిపించి గడువు ఇచ్చినా స్పందన కొరవడింది. తక్కువ మొత్తం చెల్లించాల్సిన వారే స్పందిస్తున్నారు. ప్రత్యేక ఖాతాలో ఆ మొత్తాన్ని జమచేస్తున్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఏజెంట్ల చిరునామాలకు వెళ్లి నోటీసులు ఇస్తున్నారు. హైదరాబాద్, ఒంగోలు, భీమవరం, గుంటూరు, తదితర ప్రాంతాల్లో ఉన్న వీరి ఇళ్లకు వెళ్లి తాఖీదులను ఇస్తున్నారు.

చెల్లిస్తే సరి.. లేకుంటే అరెస్టు...: హైదరాబాద్ సహా పలు జిల్లాల పరిధిలో దాదాపు రూ.413 కోట్లు వసూలు చేసి.. అద్విక ట్రేడింగ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఆదిత్య, ఆయన భార్య సుజాత కలసి.. హైదరాబాద్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 60 మందికిపైగా ఏజెంట్లను నియమించుకున్నారు. దాదాపు 1,450 మంది నుంచి రూ.413 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేశారు. 1,139 మంది డిపాజిటర్లు రూ.255 కోట్లు పెట్టుబడి పెట్టగా.. ఇందులో రూ.120 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.135 కోట్లు మేర పెట్టుబడిదారులు నష్టపోయారు. రూ.35 కోట్లు డిపాజిట్ చేసిన 204 మంది.. రావాల్సిన దాని కంటే అదనంగా రూ.21 కోట్లు అనుచిత లబ్ధి పొందారు. 32 మంది ఏజెంట్లు రావాల్సిన కమిషన్ కంటే అదనంగా రూ.49 కోట్లు తీసుకున్నారు. 30 మంది ఏజెంట్లు రూ.9 కోట్లు వరకు నష్టపోయారు. వెరసి డిపాజిటర్లు, ఏజెంట్లు కలిపి రూ.144 కోట్లు నష్టపోయినట్లు పోలీసులు తేల్చారు. ఇంకా చెల్లించాల్సిన ఏజెంట్లకు నోటీసుల్లో గడువు నిర్దేశించారు. ఆ సమయంలోగా చెల్లించకుంటే.. నిందితులుగా చేర్చి, అరెస్టు చేయనున్నట్లు హెచ్చరిస్తున్నారు. త్వరలోనే కేసును కొలిక్కి తెచ్చి అభియోగపత్రం దాఖలు చేసే యోచనలో ఉన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?

- విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి అవకాశం
- 'ఈనాడు-ఈటీవీ-విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ నేడు

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీపడుతూ ఎవరికి వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తూ వారికి ప్రత్యేకంగా బోధిస్తోంది. అయితే పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయో.. మంచి మార్కులు వస్తాయో లేదో అన్న ఆందోళన అందరిలోనూ ఉంటుంది. తల్లిదండ్రులకు కూడా అనేక సందేహాలు ఉంటాయి. ఎలా చదివితే మంచి మార్కులు వస్తాయి.ఏయే సబ్జెక్టులకు ఎంత సమయం కేటాయించాలి.ఏయే చాప్టర్లలో ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నల సరళి ఎలా ఉంటుంది.సిలబస్ బయట ప్రశ్నలు కూడా అడిగే అవకాశం ఉంటుందా? మంచి మార్కులు సాధించడం ఎలా? ఇలాంటి అనేక సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఈనాడు కల్పిస్తోంది. దీనిలో భాగంగానే జిల్లా విద్యాశాఖాధికారితో పాటు ఆయా సబ్జెక్టుల నిపుణులు అందరినీ ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఉపాధ్యాయుడు	సబ్జెక్టు	ఫోన్ నంబరు
కె.బాలకృష్ణ	తెలుగు	99492 77148
జె.ఝాన్సీ	హిందీ	92929 09954
పీఆర్ సీతాకుమారి	ఇంగ్లిష్	92904 50064
కె.వాహిని	గణితం	94417 63640
కె.అంకాలరావు	భౌతికశాస్త్రం	93904 31368
వీఎస్ మల్లేశ్వరరావు	జీవశాస్త్రం	98495 01067
షాజహాబేగం	సాంఘికశాస్త్రం	92939 45076
బి.దుర్గాదీప్తి	సంస్కృతం	98494 58556
ఎండీ హనీఫ్	ఉర్దూ	89786 77336

ఫోన్ చేయాల్సిన సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తేదీ: ఫిబ్రవరి 25, బుధవారం

28 వరకే జీవన ప్రమాణ ధ్రువీకరణ

ఎన్టీఆర్ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాల (లైఫ్ సర్టిఫికెట్) నమోదు గడువు ఈ నెల 28 వరకే ఉందని, ఇంకా దాఖలు చేయని వారు సత్వరమే అందజేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ ఐకాస అమరావతి అనుబంధం) నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సూర్యారావు, కె. ఎస్. హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

కుదిరితే బేరం.. కదిలేను దస్త్రం!

- రెవెన్యూలో పని కావాలంటే చెయ్యి తడపాల్సిందే
- తహసీల్దార్ల నుంచి సర్వేయర్ల వరకు వసూళ్లు...

ఈనాడు, అమరావతి

రెవెన్యూ శాఖలో పని జరగాలంటే చేయి తడపాల్సిందే. పాస్‌పుస్తకం మొదలు సర్వే వరకు ఏ పత్రం కావాలన్నా ఇచ్చుకోవాల్సిందే. కాదంటే ఎక్కడ లేని కొర్రీలు పెట్టి వేధిస్తున్నారు. తహసీల్దార్లు తెర వెనుక ఉండి.. వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులతో కథ నడిపిస్తున్నారు.

స్థాయిని బట్టి రేటు...

గుడివాడ మండల పరిధిలో కొందరు వీఆర్వోలు, ఆర్‌ఐలు కలిసి దందా చేస్తున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలంటే దరఖాస్తుదారుల ఆర్థిక పరిస్థితి బట్టి రేట్లు నిర్ణయించారు. సాధారణ కుటుంబం అయితే రూ.5 వేలు మొదలు.. ఎక్కువ ఆస్తి లావాదేవీలు, తిరకాసులు ఉంటే రేటు.. రూ.50 వేల వరకు వెళుతుంది. మండల పరిధిలో ఓ వ్యక్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయగా వీఆర్వో, ఆర్‌ఐ కలిసి ముక్కుపిండి మరీ రూ.10 వేలు వసూలు చేశారు.

★ ఎకరం పాస్‌పుస్తకం ఇవ్వాలంటే.. రూ.5-10 వేలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు రూ.10-15 వేలు, సర్వేకు రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. కాదూకూడదంటే దరఖాస్తు చెత్తబుట్టలోకే.. రైతులు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోరు. చేసేది లేక అడిగినంత ఇచ్చి పని చేయించుకుంటున్నారు.

రూ.3 లక్షలు కొట్టేసి

★ కూచిపూడి పరిధిలో ఓ సచివాలయ సర్వేయర్ రీసర్వేలో తప్పులు సరిచేయాలని దరఖాస్తు చేసిన 20 మంది రైతుల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారు. ఈ వేళ..రేపు అని రైతులను మభ్యపెట్టి గుట్టు చప్పుడు కాకుండా మరో మండలానికి బదిలీపై జారుకున్నారు. ఈ విషయంపై రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ చర్యలు లేవు. చేసేదేమీ లేక రైతులు లబోదిబోమంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రైవేటుగా పిలిచి బేరాలు..

★ ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ అధికారుల దందా హద్దు మీరుతోంది. ఒక్కో ధ్రువపత్రానికి ఒక రేటు పెట్టి గుంజుతున్నారు. అర్జీదారులను సాయంత్రం ఆరు తర్వాత ప్రైవేటుగా పిలిచి బేరమాడుతున్నారు. ఈ కథలో వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు కీలకం. కొందరు అధికారులకు వాటాలున్నా.. తెర వెనక ఉండి ఆమ్యామ్యా తీసుకుంటున్నారు.

★ **కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ..** ప్రభుత్వం మంజూరు చేసే ఏ పత్రానికీ లంచం ఇవ్వొద్దు. అధికారులు, సిబ్బంది అడిగినా ఇబ్బందిపెట్టినా నా దృష్టికి తెస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పసిగడితే లోపాలు.. కావండీ శాపాలు!

- రాజమహేంద్రవరం ఘటనతో ఉలిక్కిపడిన ఉమ్మడి కృష్ణా
- కల్తీ పాల విషయంలో అవగాహన ఎంతైనా అవశ్యం...

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో ఐదుగురి ప్రాణాలు పోవడంతో ఉమ్మడి జిల్లావాసులు ఉలిక్కిపడ్డారు. పాల వినియోగంలో మనమెంత భద్రం అనే సందేహాలు అలుముకున్నాయి. జీవన విధానంలో భాగమైన పాలను కొందరు అక్రమార్కులు కాసుల కక్కుర్తితో కల్తీ చేస్తూనే ఉంటారు. వారి నుంచి మనల్ని కాపాడుకునేందుకు అవగాహన, అప్రమత్తతే ఆయుధం. రాజమహేంద్రవరం ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం విజయవాడ నగరంలో 13 ప్రాంతాల్లో పాల నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించారు.

సులభంగా కనుక్కోవచ్చు మిత్రమా..!

★ జిల్లాకు ఒంగోలు నుంచి కూడా పాలు వస్తుంటాయి. కర్ణాటక నుంచి ఇక్కడికి పాలు తెచ్చి పౌడర్ తయారు చేస్తున్నారు. పాలు తీశాక 4 గంటలకు మించి నిల్వ ఉండవు. ఇవి నిల్వ ఉండేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ కలుపుతున్నారు. దీంతో అనేక అనారోగ్య సమస్యలు వచ్చే వీలుందని నిపుణులు చెబుతున్నారు.

★ పాలు చిక్కగా ఉండేందుకు మొక్కజొన్న పిండి, వెన్న శాతం ఎక్కువ ఉండేందుకు వంట నూనెలు, నురగ కోసం డిటర్జెంట్, యూరియా కలుపుతున్నారు. కొన్ని రసాయనాలతో సింథటిక్ పాలు తయారు చేస్తారు. నూనె కలిపిన పాలు సాధారణంగా పాలలో ఉండే వెన్న శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. పాలు, పెరుగు జిగటగా ఉంటాయి.

ఉమ్మడి జిల్లాలో వివరాలు..

- ★ పాలిచ్చే పశువులు: 3,18,274
- ★ పాడి రైతులు: 95,000
- ✪ పాల దిగుబడి: 21,50,182
- ✪ గృహావసరాలకు: 9,00,000
- ✪ వ్యాపార, ఇతరాలు: 12,50,000

(✪ రోజుకు లీటర్లలో)

కృష్ణలంక శ్రీనివాస్ టవర్స్ వద్ద పాల తనిఖీ

★ పిండి కలిపిన పాలను గుర్తించేందుకు కొంచెం పాలు చేతిలో వేసుకుని నలిపితే పిండి అవశేషాలు స్పష్టంగా కనిపిస్తాయి. 3 మి.లీ. పాలను అంతే మొత్తం నీటితో మరగబెట్టి చల్లార్చాక అందులో 5 చుక్కల అయోడిన్ ద్రావణం వేస్తే పాలు నీలం రంగులోకి మారితే పిండితో కల్తీ చేసినట్లే లెక్క. పాల రుచి చేదుగా ఉంటే కల్తీ జరిగినట్లే.

★ ఎక్కువ సమయం నిల్వ ఉంటే కల్తీ పాలు అని అర్థం. పాలను స్టీల్ పాత్రలోనే ఉంచాలి..ప్లాస్టిక్, అల్యూమినియం వాడకూడదు. కానీ జిల్లాలో 80 శాతంపైగా ప్లాస్టిక్ బాటిల్స్‌లోనే అమ్ముతున్నారు.

★ కొందరు పాలలో 20 శాతం పైగా నీరు కలిపి విక్రయిస్తున్నారు. కొంత కాలం కిందట ఉమ్మడి జిల్లాలో ఆహార భద్రత అధికారులు 12 ప్రాంతాల్లో నమూనాలు సేకరించగా 7 నమూనాల్లో నీరు కలిపినట్లు నిర్ధారణ అయింది.

★ స్వచ్ఛమైన పాలు 0.55 డిగ్రీల దగ్గర గడ్డ కడతాయి. ఈ ఉష్ణోగ్రత మారితే నీరు కలిపినట్లే. మందుల దుకాణంలో యూరియా స్ట్రిప్స్‌పై పాల చుక్కలు వేయగానే గీతలు కనిపిస్తే యూరియా కలిపినట్లే. మిల్క్ అడల్ట్రేషన్ టెస్టింగ్ కిట్ ద్వారా కల్తీని గుర్తించవచ్చు.



వస్తుసేవల పన్ను సక్రమంగా వసూలు చేయాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో వస్తు సేవల పన్ను సక్రమంగా వసూలు చేసేలా బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పన్ను వసూళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి వివిధ సూచనలు చేశారు. ఆస్తులు, భూములకు సంబంధించిన క్రయవిక్రయాల వివరాలను వాణిజ్య పన్నుల అధికారులకు తెలపాలని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులకు చెప్పారు. ఆయా వ్యక్తుల బ్యాంకు వివరాలు సమర్పించాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసే గుత్తేదారుల నుంచి విధిగా వస్తు సేవల పన్ను వసూలు చేయాలన్నారు. పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, గనులు, భూగర్భ జలవనరుల శాఖల అధికారులు టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పాటై పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. అన్ని ప్రైవేటు పాఠశాలలు వృత్తి పన్ను చెల్లించాలని కోరారు. వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ కల్పన, ఏఎస్పీ వీవీనాయుడు, వాణిజ్య పన్నుల సహాయ కమిషనర్లు సౌమ్య, జగదీష్, రాజ్‌కుమార్, డీపీవో అరుణ, తదితర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

క్రీడా సంరంభం

'ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ – 2026'కు మంగళవారం అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధుల క్రీడా పోటీల సంరంభానికి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికైంది. ప్రజాప్రతినిధుల మధ్య స్నేహభావం.. క్రీడాస్ఫూర్తిని పెంచేలా నిర్వహించిన ఆటల పోటీలు ఆద్యంతం సందడిగా సాగాయి. - ఈనాడు, అమరావతి

మీరితే ఆపద.. క్షేమంగా పద..

ఈ చిత్రం చూడండి.. మైనర్‌తోనే బండి నడిపిస్తున్నారు. పిల్లలపై ప్రేమ మంచిదే కానీ.. ట్రాఫిక్ నియమాలు పాటించకపోయినా.. వాహనాలపై ఎదురుగా వచ్చే వారు తప్పు చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త. -ఈనాడు, అమరావతి

చెన్నై చరవాణి.. చిక్కని చోర బాణీ!

- అద్దె ఖాతాల విశ్లేషణలో నయా వ్యవహారాలు...
- ప్రాథమిక వడపోతలో రూ.3.50 కోట్లుగా అంచనా

ఈనాడు, అమరావతి: తమ చట్టవ్యతిరేక వ్యవహారాలు బయటకు రాకుండా చెన్నై నుంచి వచ్చిన ఫోన్‌ను రవికుమార్ గుట్టుగా ఉపయోగించాడు. ఇతర మొబైళ్లను సంభాషణలు, చాట్స్‌కు ఉపయోగించకుండా కట్టడి చేసేందుకే కీలక సూత్రధారి సుబ్రమణి వెంకట్ ఈ ఎత్తుగడ వేశాడు. చెన్నైలో ఒక ఫోన్ కొని.. అక్కడే సిమ్ తీసుకుని యాక్టివేట్ చేశాడు. మొబైల్‌లో కాంటాక్ట్‌లు, వాట్సాప్‌లో గ్రూప్‌లను క్రియేట్ చేశాక దానిని కొరియర్‌లో విజయవాడకు పంపాడు. ఇందులో వాట్సాప్ ద్వారానే రవికుమార్, స్టీవెన్‌లు సమాచారాన్ని చెన్నై పంపేవారు. ఆయా ఖాతాలకు వచ్చే ఓటీపీలు, నగదు లావాదేవీల సమాచారాన్ని పంపేందుకు ఈ ఫోన్‌ను వాడారు.

ఆకాశ్ ఆచూకీ దొరకలేదు... ఏ అంచెలో ఎవరున్నారు? వారి వివరాలు తెలియకుండా ఈ పద్ధతి అవలంబించారు. ఒక అంచెలో వారు పోలీసులకు పట్టుబడినా.. మిగిలిన వారి సమాచారం తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రెండో రోజు కస్టడీలో నలుగురు నిందితుల నుంచి పోలీసులు పలు సమాధానాలు రాబట్టారు. చెన్నై నుంచి పంపిన మొబైల్‌లోని కాంటాక్ట్ లిస్టులో ఆకాశ్ పేరుంది. అతనెవరో తమకు తెలియదని రవికుమార్, స్టీవెన్‌లు చెప్పారు. సుబ్రమణి వెంకట్‌కు తెలుసని చెప్పారు. దీంతో ఇతని పాత్ర తేలలేదు.

వినియోగంలోకి రాని 23 ఖాతాలు... అమాయకుల నుంచి తీసుకున్న అద్దె ఖాతాల్లో రూ.కోట్లలో లావాదేవీలు సాగాయి. విజయవాడలో నిందితులు తీసిన 37 ఖాతాలను తెరిపించారు. ఇందులో రెండు ఎకౌంట్లు మూసేశారు. వీటిలోనూ 23 ఖాతాలను లావాదేవీల కోసం సిద్ధం చేసుకున్నారు. ఇంకా వినియోగంలోకి రాలేదు. 13 ఖాతాల ప్రాథమిక విశ్లేషణలో దాదాపు రూ.3.50 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు తేలింది. వీటి స్టేట్‌మెంట్లను సంబంధిత బ్యాంకుల నుంచి పోలీసులు తెప్పించారు. ఇతర రాష్ట్రాల్లో తెరిచిన వాటి వివరాలు ఇంకా బ్యాంకుల నుంచి రాలేదు.

వచ్చిందెంత? పోయిందెంత?...

ఖాతాల్లో నగదు లావాదేవీల తీరును పోలీసులు వడపోస్తున్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో లావాదేవీల చిట్టా ఉంది. ఇంటరాగేషన్‌లో ఈ వివరాలను రవికుమార్, స్టీవెన్ ముందుంచి ఆరా తీశారు. ఏ లావాదేవీ.. ఏ ఖాతాకు పంపారు? ఆ మొత్తం ఎవరికి చేరిందనే వివరాలను రాబట్టేందుకు ప్రయత్నించారు. ఏ ఖాతా ఎప్పుడు తెరిచారు? ఎప్పుడు మూసేశారు. లావాదేవీలు ఎన్ని? అని పోలీసులు సమగ్రంగా విశ్లేషిస్తున్నారు.

మిత్రమా... ప్రాణం విలువైంది!

- ★ నాసిరకం హెల్మెట్లతో ప్రమాదమే
- ★ ధర తక్కువని కొని తల్లడిల్లవద్దు

ఈనాడు, అమరావతి

జిల్లాలో రహదారి ప్రమాద మరణాల్లో అధిక ప్రమాదాలు ద్విచక్ర వాహనాల కారణంగానే జరుగుతున్నాయి. ఇందులోనూ తలకు గాయమైనవే అధికం. హెల్మెట్ వినియోగించక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల తనిఖీలు కొంత తగ్గేసరికి.. శిరస్త్రాణం వాడకాన్ని తగ్గించారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ల వాడకంపై పోలీసులు దృష్టిపెట్టారు. నాసిరకం శిరస్త్రాణాలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ద్విచక్ర వాహనదారులకు సూచిస్తున్నారు.

శిరస్త్రాణం లేకనే బలి...

నిత్యం నమోదవుతున్న ఉల్లంఘనల్లో ఎక్కువ భాగం హెల్మెట్ లేనివే. హెల్మెట్ ధరించకనే నగరంలో జరిగే ప్రమాదాలలో మరణాలు సంభవిస్తున్నాయి. ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్ వినియోగిస్తే.. ప్రాణం దక్కించుకోవచ్చు.

2025లో ఏ వాహన ప్రమాదాలు ఎన్నంటే..

- ★ రహదారి ప్రమాదాలు: 369
- ★ ద్విచక్ర వాహనాలు: 138
- ★ భారీ వాహనాలు: 102
- ★ కార్లు, నాలుగు చక్రాలు: 69
- ★ ఆటోలు 27 ★ ఇతర: 33

మృతులు: 106 మంది

తలకు గాయంతో అధిక మరణాలు

★ నగరంలో రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ నాసిరకం శిరస్త్రాణాలను విక్రయిస్తున్నారు. ★ రూ. 400లకే అమ్ముతూ.. కంపెనీవి అని అంటగడుతున్నారు. ★ తనిఖీలు తప్పించుకోవడానికి ఏదో ఒకటని కొంటే అసలుకే మోసం వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ★ షోరూమ్‌లలో ప్రామాణికమైనవే కొనాలి. ★ నాణ్యమైన అయితేనే.. ప్రమాదాల వేళ ప్రాణాపాయం నుంచి రక్షిస్తుంది. ★ వీటి తయారీవేళనే కఠిన పరీక్షలను తట్టుకునేలా తయారు చేస్తారు. నాణ్యమైనవి రూ.800-1000 ఉంటున్నాయి. ధర ఎక్కువైనా విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. ★ ప్రధానంగా తలకు గాయం కాకుండా కాపాడి.. మెదడుకు హాని జరగకుండా ఉంటుంది. ★ నాసివి అయితే ప్రమాద వేళ పగలడంతోపాటు తలకు గుచ్చుకుని ఎక్కువ ఇబ్బంది కలుగుతుంది.

రహదారులపై ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు ఎక్కువగా ఉన్నప్పుడు ధరించడం, లేనప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. హెల్మెట్ ధరించేది మీ ప్రాణరక్షణ కోసమే గానీ పోలీసుల కోసం కాదు అని గమనించాలి.

అపోహలు వీడాలి - వైద్య నిపుణులు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు. జుట్టు రాలడం.. స్పాండిలైటిస్ వస్తుందనే వాదన ఎంతమాత్రం సరికాదు. దీని బరువు చాలా తక్కువ. 800-850 గ్రాములు ఉంటుంది. ఈ మాత్రానికే నరాలపై ప్రభావం చూపుతుందనే అపోహలను వీడాలి. స్పాండిలైటిస్ ఉన్న వారూ నిరభ్యంతరంగా వాడవచ్చు. నాణ్యమైనవి వాడితే ప్రమాదాల వేళ పగలవు. తలకు గాయమైతే చాలా అరోగ్య సమస్యలు వస్తాయి. పక్షవాతం రావొచ్చు.. కోమాలోకీ వెళ్లే ప్రమాదం ఉంది.

రూ.7.08 కోట్ల దుర్వినియోగం

గోకవరం సొసైటీలో 51 విచారణ నివేదికలో వెల్లడి

మాట్లాడుతున్న ఛైర్మన్ నాగేశ్వరరావు

గోకవరం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: మచిలీపట్నం ఉత్తర మండలంలోని గోకవరం పీఏసీఎస్‌లో రూ. 7.08 కోట్లు దుర్వినియోగమైనట్లు అధికారులు నిర్ధారించారు. మంగళవారం గోకవరం సొసైటీ ప్రాంగణంలో జరిగిన మహాసభలో ఇన్‌ఛార్జి సీఈవో అనూష 51 విచారణ నివేదికను వెల్లడించారు. నిధుల దుర్వినియోగానికి మాజీ సీఈవో మట్టా భాస్కరబాబుతో పాటు పెదవెంకయ్య, మధుసూదనరావు, సుబ్బారెడ్డి, స్వామి కారణమని గుర్తించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులపై విచారణ జరుగుతుందని, నిధులు రాబట్టేందుకు వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని వేలం వేయడం, వారిపై క్రిమినల్ కేసుల నమోదు వంటి చట్టపరమైన చర్యలు ఉన్నతాధికారులు తీసుకుంటారన్నారు. నిధులు ఎలా దుర్వినియోగం చేశారో వివరించారు.

★ రైతుల నుంచి నగదు వసూలు చేసి వారికి రసీదులు ఇచ్చారు. క్యాష్‌బుక్‌కు జమ చేయలేదు. ఈ మొత్తాన్ని రూ. 1,13,69,946గా తేల్చారు. ★ సంఘ రికార్డులను తారుమారు చేయడం ద్వారా రూ. 83,78,872 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ★ మరణించిన రైతుల పేరిట రుణాలను రెన్యువల్ చేసి రూ. 4,27,878 స్వాహా చేశారు. ★ రైతులు రుణాన్ని పూర్తిగా చెల్లించగా వారికి నోడ్యూస్ సర్టిఫికెట్ ఇచ్చి, నగదు సొసైటీకి జమ చేయకుండా ఆస్తులను తనఖా నుంచి విడిపించారు. ఈ తరహా మోసంలో రూ. 51లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ★ ఒకే పొలానికి రైతునేస్తం, ఎల్టీ రుణాలు మంజూరు చేయించి రూ. 16లక్షలు దిగమింగారు. ★ ఫోన్‌పే ద్వారా డబ్బు వేయించుకుని సొసైటీకి జమ చేయకుండా రూ. 13.28 లక్షలు స్వాహా చేశారు. ★ ఒక ఖాతాదారుడి ఆస్తిని మరొకరిదిగా చూపించి రూ. 11లక్షలు రుణం తీసుకున్నారు. 4 ట్రిప్లికేట్ పుస్తకాలు దాచి నకిలీ రసీదులను రైతులకిచ్చి రూ. 11 లక్షలు మోసానికి పాల్పడ్డారు. ★ హమాలీ ఛార్జీల పేరిట రూ. 4లక్షలు, సంఘ సభ్యులు కాని వారి పేరుతో రూ. 4లక్షలు కాజేశారు. ★ రూ. 1. 12కోట్ల మోసానికి పాల్పడినందుకు మాజీ సీఈవో భాస్కరబాబుకు, పెదవెంకయ్యకు సర్‌ఛార్జీ నోటీసు ఇచ్చారు. ★ రూ. 4. 38కోట్ల మోసానికి పాల్పడినందుకు మాజీ సీఈవో భాస్కరబాబుకు సర్‌ఛార్జి నోటీసు ఇచ్చారు.

మూడు నెలల్లో రైతుల ఖాతాకు జమ

సీఈవోగా పని చేసిన భాస్కరబాబు చేతిలో మోసపోయిన రైతులకు న్యాయం చేస్తాం. మూడు నెలల్లో రసీదులు ఉన్న ఖాతాదారులందరి ఖాతాల్లో వారు చెల్లించిన మొత్తాన్ని జమ చేస్తాం. నిధుల దుర్వినియోగంలో పాత్రధారులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. – ఎం. నాగేశ్వరరావు, ఛైర్మన్

సేంద్రియ రామయ్య.. సేవలు భేషయ్య..

కూరగాయలు, పండ్లు పండిస్తూ.. ఉచితంగా పంచేస్తూ..

కంకిపాడు(మంతెన), న్యూస్‌టుడే

ఎనిమిది పదుల వయసులో..మనుమలు..మనుమరాళ్లతో సరదాగా గడిపే సమయంలో మండలంలోని మంతెనకు చెందిన పెండ్యాల రామారావు మాత్రం గ్రామానికి సేవ చేసేందుకు సంకల్పించారు. ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. కుమార్తె, కుమారుడు విదేశాల్లో స్థిరపడ్డారు. కానీ ఈయన మాత్రం పుట్టిపెరిగిన పల్లె, కుటుంబ ఉన్నత స్థితికి సహకరించిన పాఠశాల, తోటి గ్రామస్థుల సేవలో చరమాంకం గడపాలని నిశ్చయించుకున్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా శక్తిమేర ఆదుకుంటున్నారు. గత ఐదేళ్లుగా 40సెంట్ల స్థలంలో సేంద్రియ విధానంలో కూరగాయలు, పండ్లు స్వయంగా పండిస్తూ, ప్రతి రోజూ స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

సస్యరక్షణతో..: ఆరేళ్ల కిందట మొత్తం స్థలాన్ని లోతు దుక్కి చేయించి వానపాములు, మాగిన పశువుల ఎరువుతో కలగలిపారు. చీడపీడల నివారణకు పచ్చిమిర్చి, వెల్లుల్లి, వేపాకు, పొగాకు నుంచి తీసిన కషాయాన్ని పిచికారీ చేస్తున్నారు. 10 రకాల ఆకు కూరలు, 15 రకాల కాయగూరలు, ఐదు రకాల దుంపలు పండిస్తున్నారు. మరో 10 రకాల పండ్ల మొక్కలు దిగుబడి ఇస్తున్నాయి. రోజుకి సరాసరిన 10 కిలోల కూరగాయలు, మూడు కిలోల పండ్లు చేతికి వస్తున్నాయి.

తోటలో కూరగాయలు, పండ్ల మొక్కలు

అందరికీ సమంగా..: ఆరోజు కోతకు వచ్చిన కూరగాయలను సాయంత్రం 5 గంటలకు స్థానిక రెండు కూడళ్లలో ఉంచుతారు. అందరికీ సమంగా అందేలా భార్య విజయలక్ష్మి, మహిళా మండలి సభ్యులు పర్యవేక్షిస్తారు. పండ్లను రామారావు స్వయంగా ద్విచక్రవాహనంపై ఇంటింటికీ, స్థానిక జడ్పీ, ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు సమంగా పంపిణీ చేస్తారు. పది సెంట్లలో విత్తనం వేసిన ముల్లంగి దిగుబడి అనూహ్యంగా రావడంతో వారం పాటు దాదాపు 500 కిలోల పంటను ఊరంతా పంచేశారు. ఇవేకాక గ్రామంలో పేదలకు వైద్య శిబిరాలు, పాఠశాలలకు క్రీడా సామగ్రి అందజేత లాంటి సాయం చేస్తున్నారు.

అన్నీ ఇచ్చిన గ్రామం రుణం తీసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. దీనికి నా తండ్రి స్ఫూర్తి కాగా కుటుంబసభ్యులు, గ్రామస్థుల సహకారం అందిస్తున్నారు. శరీరం సహకరించినంతవరకు సేవలు అందిస్తా. - పెండ్యాల రామారావు

మార్చి 6 నుంచి 8 వరకు మహాకుంభాభిషేకం

మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్. పక్కన కలెక్టర్ సీపీ, దుర్గగుడి ఛైర్మన్, ఈవో తదితరులు

ఇంద్రకీలాద్రి: మార్చి 6 నుంచి 8 వరకు కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్‌లతో కలిసి ఎంపీ కుంభాభిషేక మహోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం వైదిక కమిటీ, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. కనకదుర్గమ్మ ప్రధాన ఆలయ శిఖ విమాన గోపురాన్ని అభిమంత్రించిన అనేక పుష్కర మహా జీవనదులు, సముద్రోదకాలతో 12 ఏళ్లకు ఒకసారి కుంభాభిషేకం చేయడం ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయమని చెప్పారు. దేశవిదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తుల సమక్షంలో వేదపండితుల ఆధ్వర్యంలో క్రతువు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. కుంభాభిషేక మహోత్సవాలకు టీమ్ ఎన్టీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. కుంభాభిషేక మహోత్సవాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తామన్నారు. ఆలయ ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు స్థానాచార్య శివప్రసాదశర్మ, షణ్ముఖశాస్త్రి మహాకుంభాభిషేక కార్యక్రమ వివరాలను తెలియజేశారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

తప్పించుకు తిరుగుతున్న అద్విక ఏజెంట్లకు నోటీసులు

ఈనాడు - అమరావతి

అద్విక ట్రేడింగ్ మోసం కేసులో దక్కాల్సిన దాని కంటే ఎక్కువ లబ్ధి పొందిన ఏజెంట్ల నుంచి రికవరీపై పోలీసులు దృష్టి సారించారు. ఎక్కువ దక్కించుకున్న ఏజెంట్లు.. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. పదే పదే పిలిపించి గడువు ఇచ్చినా స్పందన కొరవడింది. తక్కువ మొత్తం చెల్లించాల్సిన వారే స్పందిస్తున్నారు. ప్రత్యేక ఖాతాలో ఆ మొత్తాన్ని జమచేస్తున్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఏజెంట్ల చిరునామాలకు వెళ్లి నోటీసులు ఇస్తున్నారు. హైదరాబాద్, ఒంగోలు, భీమవరం, గుంటూరు, తదితర ప్రాంతాల్లో ఉన్న వీరి ఇళ్లకు వెళ్లి తాఖీదులను ఇస్తున్నారు.

చెల్లిస్తే సరి.. లేకుంటే అరెస్టు...: హైదరాబాద్ సహా పలు జిల్లాల పరిధిలో దాదాపు రూ.413 కోట్లు వసూలు చేసి.. అద్విక ట్రేడింగ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఆదిత్య, ఆయన భార్య సుజాత కలసి.. హైదరాబాద్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 60 మందిపైగా ఏజెంట్లను నియమించుకున్నారు. దాదాపు 1,450 మంది నుంచి రూ.413 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేశారు. 1,139 మంది డిపాజిటర్లు రూ.255 కోట్లు పెట్టుబడి పెట్టగా.. ఇందులో రూ.120 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.135 కోట్లు మేర పెట్టుబడిదారులు నష్టపోయారు. రూ.35 కోట్లు డిపాజిట్ చేసిన 204 మంది.. రావాల్సిన దాని కంటే అదనంగా రూ.21 కోట్లు అనుచిత లబ్ధి పొందారు. 32 మంది ఏజెంట్లు రావాల్సిన కమీషన్ కంటే అదనంగా రూ.49 కోట్లు తీసుకున్నారు. 30 మంది ఏజెంట్లు రూ.9 కోట్లు వరకు నష్టపోయారు. వెరసి డిపాజిటర్లు, ఏజెంట్లు కలిపి రూ.144 కోట్లు నష్టపోయినట్లు పోలీసులు తేల్చారు. ఇంకా చెల్లించాల్సిన ఏజెంట్లకు నోటీసుల్లో గడువు నిర్దేశించారు. ఆ సమయంలోగా చెల్లించకుంటే.. నిందితులుగా చేర్చి, అరెస్టు చేయనున్నట్లు హెచ్చరిస్తున్నారు. త్వరలోనే కేసును కొలిక్కి తెచ్చి అభియోగపత్రం దాఖలు చేసే యోచనలో ఉన్నారు.

మచిలీపట్నం ఆర్కే కళాశాల కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

సజావుగా ఇంటర్ పరీక్షలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర సెకండ్ లాంగ్వేజ్‌లో విద్యార్థి ఎంపికను బట్టి తెలుగు, సంస్కృతం, హిందీ తదితర సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 63 పరీక్షా కేంద్రాల్లో 21,763 మంది విద్యార్థులకు 21,584 మంది హాజరయ్యారు. 179 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సరళకుమారి తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

క్రమబద్ధీకరించుకోరు.. పట్టించుకోరు..

మందకొడిగా ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: భూములు, నిర్మాణాలు క్రమబద్ధీకరించుకోవడంతో పాటు ఆయా పురపాలక సంఘాల్లో ఆదాయాన్ని పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు మందకొడిగా సాగుతున్నాయి. ప్లాట్ల క్రమబద్ధీకరణకు లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్), అనధికారికంగా నిర్మించిన భవనాలు, నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్)లు గతేడాది ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జిల్లాలో ఆయా పథకాల తీరు పరిశీలిస్తే ఎల్ఆర్ఎస్‌లో 65.28 శాతంతో ఉయ్యూరు పురపాలక సంఘం ప్రథమస్థానంలో, చివరి స్థానంలో గుడివాడ, బీపీఎస్‌లో 34.86 శాతంతో మచిలీపట్నం పురపాలక సంఘం ప్రథమ స్థానంలో నిలిచాయి. బీపీఎస్‌లో పెడన చివరి స్థానంలో ఉంది.

జిల్లాలో ఇప్పటివరకు పరిస్థితి

పురపాలిక		దరఖాస్తులు	ఆమోదం	తిరస్కరణ	పెండింగ్	వసూలు (లక్షల్లో)	పూర్తయిన శాతం
గుడివాడ	(ఎల్ఆర్ఎస్)	230	14	0	185	26.3	19.57
	(బీపీఎస్)	105	22	9	71	61.92	32.38
మచిలీపట్నం		282	18	0	226	54.93	19.86
		393	42	32	256	140.46	34.86
పెడన		44	5	0	27	7.21	38.64
		39	5	1	33	11.37	15.38
తాడిగడప		1234	130	0	754	300.84	39.90
		1572	286	34	1104	1951.88	29.77
ఉయ్యూరు		72	15	0	25	28.55	65.28
		335	64	9	237	135.09	29.27

స్పందన కరవు..: జిల్లా మొత్తంలో మచిలీపట్నం, గుడివాడ, పెడన, తాడిగడప, ఉయ్యూరు పురపాలక సంఘాలు, గ్రామీణ ప్రాంతపరంగా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఆయా పథకాలు అమలులో ఉన్నాయి. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(ముడా), సీఆర్డీఏ విభాగాలు ఎంత ప్రయత్నం చేస్తున్నా లేఔట్ భూముల, ప్లాట్ల కొనుగోలుదారులు, అక్రమ నిర్మాణ యజమానుల్లో ఆశించిన స్పందన లేదు.

ప్రయత్నాలు చేస్తున్నా..: ఇప్పటివరకు జరిగిన అధికారుల రివ్యూలో జిల్లాలోని ఆయా పథకాల పరిస్థితి పరిశీలిస్తే ముడా, 5 పురపాలక సంఘాల్లో గుర్తించిన అనధికార భూములు ఎల్ఆర్ఎస్‌లో 66.09 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే బీపీఎస్‌లో 71.77 శాతం నిర్మాణాలు పెండింగ్‌లో పడనున్నాయి. ఆయా యజమానులను ముందుకు తీసుకొచ్చేందుకు ఆయా శాఖలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ యజమానుల నుంచి ఆశించిన మేరకు స్పందన కనపడడం లేదు.

'వినూత్న ఆలోచనలే విజేతలుగా నిలుపుతాయి'

మాట్లాడుతున్న ఉపకులపతి రాంజీ

రుద్రవరం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: వినూత్నమైన ఆలోచనలే ప్రపంచంలో విజేతలుగా నిలుపుతాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ అన్నారు. సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో ఏర్పాటు చేసిన లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అచీవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ఉపకులపతి ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు 7, 8, 9 పాయింట్లను పాటించాలని సూచించారు. ఏడుగంటల నిద్ర, ఎనిమిది గంటల చదువు, తొమ్మిది గంటలు ఇతర వ్యాపకాలకు కేటాయించాలని సూచించారు. రెక్టర్ ఎం.వి.బసవేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని విదేశాల్లో చాటిన వివేకానందుడి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్.ఉష, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయకుమార్, మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఆంజనేయకుమార్, సౌందర్యలక్ష్మి, సాయికృష్ణ చైతన్య తదితరులు ప్రసంగించారు. లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అచీవ్‌మెంట్ ప్రోగ్రామ్‌పై జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

పోరాడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు



ఎమ్మెల్యేలతో చర్చిస్తున్న వీరంకి గురుమూర్తి

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: తెదేపా ప్రతిపక్షంలో ఉన్నపుడు పోరాడిన ప్రతి తెదేపా కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తామని తెదేపా జిల్లా అధ్యక్షుడు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. మంగళవారం మంగళగిరిలోని జాతీయ తెదేపా కార్యాలయంలో కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలతో గురుమూర్తి సమావేశమయ్యారు. జిల్లాలో తెదేపా బలోపేతానికి పార్లమెంటరీ అనుబంధ కమిటీల నియామకంపై చర్చించారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలకు పార్టీ భవిష్యత్తు కార్యాచరణ గురించి వివరించాలన్నారు. తెదేపాలో కష్టపడిన ప్రతి వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్(పెనమలూరు), కాగిత కృష్ణప్రసాద్(పెడన), వర్ల కుమార్‌రాజా(పామర్రు), వెనిగండ్ల రాము(గుడివాడ), అవనిగడ్డ తెదేపా పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న వన్ టౌన్ సీఐ శ్రీనివాస్

గుడివాడ, న్యూస్‌టుడే: యువత మత్తుపదార్థాలను వినియోగిస్తే వారి భవిత నాశనం అవుతుందని వన్ టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో వివిధ రకాల చట్టాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ. . తల్లిదండ్రులు వారి బిడ్డల నడవడికపై శ్రద్ధ చూపాలని ఏవైనా తేడా ఉంటే వెంటనే కౌన్సెలర్‌ను సంప్రదించాలన్నారు. మత్తుపదార్థాలు గురించి తెలిస్తే వెంటనే 112కు ఫోన్ చేయాలన్నారు. పాలకవర్గ అధ్యక్షుడు ప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపల్ డాక్టర్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ పద్మజ, ఎన్‌సీసీ అధికారి ఎండీ.సలీం, ఎన్ఎస్ఎస్ అధికారి జేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సామర్థ్య రంగాన్ని బలోపేతం చేయాలి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఇంధన సామర్థ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రాజెక్టుల అమలు వేగవంతం చేయాలని ఏపీ జెన్‌కో ఇన్‌ఛార్జి ఎండీ, ఏపీ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ బజార్ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నిర్వహించిన అయిదు ఇన్వెస్ట్‌మెంట్ బజార్ల ద్వారా సుమారు రూ.408 కోట్ల విలువైన ఇంధన ప్రాజెక్టులు గుర్తించామని తెలిపారు. వీటిని ఫైనాన్షియల్ క్లోజర్ త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఎనర్జీ ఎఫిషియెన్సీ పాలసీ 2024-2028 ప్రకారం 123 స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)-2017 అమలును తప్పనిసరి చేశామన్నారు. ఇప్పటి వరకు 1800 కంటే ఎక్కువ ఈసీబీసీ భవనాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. పరిశ్రమలు విద్యుత్తును పొదుపు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ఈ పథకం కింద సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు 5 శాతం, మధ్య తరహా పరిశ్రమలకు 3 శాతం వడ్డీ రాయితీగా అందిస్తామన్నారు. 14 ప్రధాన రంగాలకు ఈ సదుపాయం వర్తిస్తుందని వివరించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఆధ్వర్యంలో 59 పరిశ్రమలు పెద్ద మొత్తంలో ఇంధన పొదుపు సాధించాయన్నారు. ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించేందుకు 11 బ్యాంకులు, 2 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ వైస్ ఛైర్మన్, ఎండీ ఎం.కమలాకర్‌బాబు, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ డైరెక్టర్ పి.శ్యామ్ సుందర్, సుమారు 50 పరిశ్రమలు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా సైక్లింగ్ పోటీలు

పోటీల్లో యువత

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన సైక్లింగ్ పోటీలను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. యువతను చైతన్యపర్చేలా ప్రాధికార సంస్థ ద్వారా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నగరంలోని ఒకటో డివిజన్ ఎన్టీఆర్, అటల్‌బిహారీ వాజ్‌పేయీ సర్కిల్ వద్ద నుంచి మగవారికి 10 కి.మీ, ఆడవారికి 6 కి.మీ మేర మాస్ పార్టిసిపేషన్, టైమింగ్ విభాగాల్లో పోటీ నిర్వహించారు. గన్నవరం, కంకిపాడు, గుడివాడ, గూడూరు, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు చెందిన వారు పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 18కు నిర్వహించిన పోటీలో విజేతలు ఈ నెల 28న విజయవాడ నున్నలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని క్రీడాప్రాధికార సంస్థ జిల్లా అధికారిణి ఝాన్సీలక్ష్మి తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్, బత్తిన దాస్, సైక్లింగ్ అసోషియేషన్ ప్రతినిధి మురళి తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చలేదని మహిళా కండక్టర్ దుశ్చర్య

సహచర ఉద్యోగి కొడుకు, కూతురు ఫొటోలు అసభ్యంగా చిత్రీకరణ

విజయవాడ నేరవార్తలు: సహచర ఉద్యోగి తన వద్ద తీసుకున్న అప్పులు తీర్చలేదని ఆర్టీసీ మహిళా కండక్టర్ దుశ్చర్యకు పాల్పడింది. అతని కుమారుడు, కూతురు ఫొటోలను అసభ్యంగా చిత్రీకరించి వేధింపులకు పాల్పడడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ శివారు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. భార్య 20 సంవత్సరాల క్రితం విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి కొడుకు, కూతురుతో కలిసి ఉంటున్నారు. నరసరావుపేట డిపోలో పని చేసే సమయంలో.. అక్కడే కండక్టర్‌గా పని చేస్తున్న సైదాబి వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నారు. కొంత తిరిగి చెల్లించారు. ఆరోగ్యం సరిగా లేక.. మిగతావి చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో గన్నవరం బదిలీ అయ్యారు. సైదాబి అక్కడకు వచ్చి.. ఆయనతో గొడవపడింది. అధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగం ఊడగొట్టింది. అతని కొడుకు, కూతురు ఫొటోలను ఏఐతో అసభ్యంగా చిత్రీకరించి.. అతనికే వాట్సాప్ చేసింది. ఆ ఫొటోలతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు తెరిచి. . అందరినీ డబ్బులు అడుగుతోంది. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరింపులకు దిగడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి ఫిర్యాదు చేయగా.. ఆమెపై కేసు నమోదైంది.

సెంథిల్ కస్టడీ పిటిషన్‌పై విచారణ 26కు వాయిదా

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో సెంథిల్ (ఏ22) కస్టడీ కోసం ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన పిటిషన్ మంగళవారం ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిని వాదనల నిమిత్తం ఈనెల 26కు వాయిదా పడింది. నిందితుడి బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు జరిగాయి. తదుపరి విచారణ వచ్చే నెల 2కు కోర్టు వాయిదా వేసింది. ● ఇదే కేసులో జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ ఏడో ఏడీజే కోర్టులో వచ్చింది. నిందితులకు నోటీసులను కోర్టు ద్వారా రిజిస్టర్డ్ పోస్టులో పంపించారు. అనంతరం ఈనెల 26కు వాయిదా పడింది.

వాసుదేవరెడ్డి కస్టడీ కోరుతూ సిట్ పిటిషన్

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు వాసుదేవరెడ్డి (ఏ2)ని వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో 21న నిందితుడిని సిట్ అరెస్టు చేసింది. అప్పటి నుంచి గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. మంగళవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన కస్టడీ పిటిషన్.. బుధవారం విచారణకు వచ్చే వీలుంది. నిందితుడి తరఫు న్యాయవాదికి నోటీసులు జారీ చేయనున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లిలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురిటిగడ్డ చేనేత కాలనీకి చెందిన తుమ్మలచర్ల నాగేశ్వరరావు(67) చల్లపల్లి నారాయణరావునగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 22న సైకిల్‌పై బస్టాండ్ సెంటర్‌కు వెళ్లగా అక్కడ ఆర్టీసీ బస్సు ఢీకొంది. తలకు తీవ్రగాయాలవడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్.ఐ. డి.దుర్గాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే గేటు మరమ్మతులు.. దారి మళ్లింపు

గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గుడివాడ - భీమవరం రైల్వే గేటు(ఎల్‌సీ- 52)ను ఐదు రోజుల పాటు మరమ్మతుల్లో భాగంగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ గేటు మీదుగా ప్రయాణాలు సాగించేవారు కేటీఆర్ రైల్వే గేటు మీదుగా దారి మళ్లింపునకు శ్రీకారం చుట్టారు. గుడివాడలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైల్వే గేటు వద్ద పిల్లర్లను నిర్మించాల్సి వచ్చింది. ఈ క్రమంలో గుత్తేదారు సంస్థ రైల్వే అధికారులకు విన్నపం చేసిన దరిమిలా ఈ నెల 25 నుంచి మార్చి 1 వరకు మరమ్మతు పనులు జరగనున్నాయి. అప్పటి వరకు ఈ గేటు సమీపంలోనే మరో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేయనున్నారు.

కామేష్‌బాబుపై సస్పెన్షన్

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులకు 20 ఏళ్లుగా రావాల్సిన ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్ బిల్లుల వ్యవహారంలో సుమారు రూ.12 లక్షలకు పైగా లంచాలు వసూళ్లు చేశారంటూ వచ్చిన ఆరోపణలపై ఎఫ్1 కామేష్ బాబును పురపాలక సంఘ ప్రాంతీయ సంచాలకులు నాగ నరసింహారావు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కామేష్‌పై వచ్చిన ఆరోపణలు పూర్తి స్థాయిలో విచారణ చేసేంత వరకు సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని ఉత్తర్వులలో సూచించినట్లు పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్ స్పష్టం చేశారు. గతంలో ఈనాడులో ఈ విషయమై పలు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే.

పాల విక్రయ.. సేకరణ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని పాల విక్రయ, సేకరణ కేంద్రాల్లో సమగ్ర తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిషేధిత మందులు (ఔషధాలు), గడువు తీరిన వాటి విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. మెడికల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు జరిగినట్టు గుర్తిస్తే సదరు ఔషధాలను స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయండి

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాల ద్వారా చేపట్టిన మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాల నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,900 మరుగుదొడ్లకు ఇప్పటివరకు 2,101 పూర్తి చేశారని, మిగిలిన పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రేవాటర్ మేనేజ్‌మెంట్‌లో మంజూరైన మేజిక్ డ్రైన్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, 490 సామాజిక పారిశుద్ధ్య సముదాయాలకు 184 మాత్రమే పూర్తయ్యాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, ఎంపీలాడ్స్, పీఎంఏజీవై, జలజీవన్‌మిషన్ పథకంలో చేపట్టిన పనులు ఇలా వివిధ పనులపై ఆరా తీసి వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగాధికారి సోమశేఖర్, డీఈలు నటరాజ్, సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల ద్వారా నేరాల కట్టడి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: డ్రోన్ కెమెరాల పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేరాల కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అన్నారు. మంగళవారం యూనియన్ బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖకు రెండు డ్రోన్ కెమెరాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక డ్రోన్‌లను అందించడం ప్రశంసనీయమన్నారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇప్పటివరకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏడు డ్రోన్‌లు ఉండగా ప్రస్తుతం మరో రెండు రావడం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. యూనియన్ బ్యాంకు డిప్యూటీ జోనల్ హెడ్ ఎంవీవీ రవిశంకర్, రీజనల్ మేనేజర్ కె.వెంకట్రావు, కేయూఆర్ఎల్ రెడ్డి, జడ్పీ బ్రాంచి మేనేజర్ ని.నవక్రాంత్, ఏఎస్పీలు వీవీ నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి డ్రోన్‌లు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

లిటరసీ అండ్ న్యూమరసీపై శిక్షణ

శిక్షణ పుస్తకాలను ప్రదర్శిస్తున్న అధికారులు

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు ప్రగతి మహిళా కళాశాలలో జోన్- 2లో ఉన్న జిల్లాల ఎంఈవోలు, డైట్ ఫ్యాకల్టీ లందరికీ గ్యారంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీపై శిక్షణ నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు తెలిపారు. మంగళవారం 350 మంది ఎంఈవోలు, డైట్ ఫ్యాకల్టీ వారు శిక్షణకు హాజరయ్యారన్నారు. వీరికి జీఎఫ్ఎల్ఎన్‌పై నిపుణ్‌భారత్, దీక్షాకోర్సుల గురించి మండలస్థాయిలోని పాఠశాలల్లో మానిటరింగ్ నిమిత్తం శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యఅతిథిగా రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ముగిసేనాటికి విద్యార్థులందరికీ చతుర్విధ ప్రక్రియలపై అవగాహన వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ మేరకు ఎంఈవోలు టెక్నాలజీని అందిపుచ్చుకుని మానిటరింగ్ వ్యవస్థని బలోపేతం చేయాలని తెలిపారు. డైట్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉయ్యూరు డీవైఈవో పద్మరాణి, పామర్రు ఎంఈవో- 1 భానుప్రకాష్, ఎంఈవో- 2 పద్మవాణి, ప్రగతి విద్యాసంస్థల అధినేత పూర్ణచంద్రరావు, జిల్లాల ఏఎంవోలు శ్యాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అర్ధనగ్న ప్రదర్శన

వీధులను శుభ్రం చేస్తున్న సహకార ఉద్యోగులు

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ రెండు నెలలుగా చేస్తున్న నిరసనలకు ప్రభుత్వం స్పందించక పోవడంతో సహకార ఉద్యోగులు గుడివాడ పట్టణంలో మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన చేసి చీపురుతో రోడ్లను శుభ్రం చేస్తూ వారి ఆవేదన తెలియజేశారు. ఏపీ పీఏసీఎస్ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ.. తక్షణమే సమస్యలను పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా సహకార బ్యాంకు పరిధిలోని 12 సంఘాలు నిరవధిక సమ్మె చేస్తున్నాయన్నారు. సంఘ నేతలు నాగరాజు, కుమారి, గాయత్రి, రమేష్ బాబు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపడం నేరం

బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న సిబ్బందితో టూటౌన్ సీఐ హనీష్

గుడివాడ, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలను నడపడం నేరమని దీనికి రూ.10 వేల జరిమానా విధించవచ్చని టూటౌన్ సీఐ హనీష్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం టూటౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. వాహనచోదకులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే అన్ని పత్రాలను వెంటకలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం, నాలుగు చక్రాల వాహనాల చోదకులు సీటు బెల్టు ధరించాలన్నారు. ఎస్సైలు లోవరాజు, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును: బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక మార్కెట్ ధరకు కొనబడును. స్వర్ణలక్ష్మి: 81422 92071

REAL ESTATE
HOUSE FOR SALE
గుడివాడ 200 గజాలు, ... ✆ 81064 03490

PLOT FOR SALE
✆ 82970 14769

TO LET

WANTED
5000 S.Ft - 8000 S.Ft Shed / Godown Needed in and Around Vijayawada City Limits for Rent. ✆ 91770 01020, 98482 28128.

JOBS
Sweet Mantra, Kanuru, M.G. Road, Vijayawada. ★ Wanted Male/ Female Accountant. Experience in Talley and able to deal With Income Tax, GST & Internal Audit, etc., ✆ 92957 58489
✆ 81798 69909
✆ 93816 68359
✆ 89777 96932
PROs, Marketing Managers Required. Salary: 27,500/-, NTR Circle, Vijayawada. ✆ 63043 28479
✆ 99087 92999, 98494 48871.

FACULTY/ TEACHERS
Santiniketan Jr College, Redupugallu. 1. Principal (only science) 2. Vice- Principal 3. Lecturers 4. coordinators 5. Telecaller's Contact: 94944 04160, 91608 89162

MEDICAL
A Reputed 100Bedded Hospital -VJA is Looking for Positions: 1.Staff Nurses-15, G.GNM/B.Sc Nursing With Valid Regl. Exp:2-5Yrs, Cardiac ICU/MICU 2.Manager- Operations With Hospital Exp: 10Yrs, 3.Wardboys-10, 4.Marketing WG Dist-3 ✆ 83328 05807

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) Ph: 98496 97616

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మెహెర్‌బాబా జయంతి కార్యక్రమాలు నేడు

చల్లపల్లి, న్యూస్‌టుడే: మానవాళికి ముక్తిమార్గాలను అందించిన అవతార్ మెహెర్‌బాబా జయంతి ఉత్సవం చల్లపల్లిలో బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం సంకీర్తన, మధ్యాహ్నం ప్రేమవిందు, మహిళలచే పేరంటం, ఉయ్యాల హారతి, గ్రామంలో ఊరేగింపు ఉత్సవం జరుగుతుందని తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పులిగడ్డ గురుకులం(బాలురు)లో 2026-27 విద్యా సంవత్సరానికి 5, 6 తరగతుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని ప్రధానాచార్యులు కె.జాన్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో మార్చి 31వ తేదీలోపు సమర్పించాలన్నారు.

వైభవంగా విమాన శిఖర ప్రతిష్ఠ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక నేరెళ్లపాలెంలో సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి ఆలయ నూతన శిఖర ఉత్సవ మూర్తుల ప్రతిష్ఠ మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పర్చూరి దుర్గాప్రసాద్, జాన్సీవాణి దంపతుల పర్యవేక్షణలో పూజలు హోమాలు జరిగాయి. పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు పూజలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల అందజేత

చల్లపల్లి, న్యూస్‌టుడే: మచిలీపట్నంలో నవంబరులో నిర్వహించిన నాలెడ్జి అసెస్మెంట్ టెస్ట్‌కి సంబంధించి విజేతలైన రామానగరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు మంగళవారం నగదు బహుమతుల్ని అందజేశారు. సబ్జెక్టుల వారీగా మ్యాథ్స్‌లో 20మందికి, ఫిజిక్స్‌లో 13 మందికి, కెమిస్ట్రీలో 20 మందికి చెక్కులతోపాటు బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లను అందించారు. ప్రిన్సిపల్ సురేష్, టెక్నో డీన్ టి.రమ్య, ఇన్‌ఛార్జి రవికుమార్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సులభం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సులభమని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి హెచ్‌వోడీ కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం కురుమద్దాలిలో కొసరాజు ఫౌండేషన్, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆసుపత్రి వారు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరం నిర్వహించగా తెదేపా నేత వర్ల చైతన్య, వైద్యులు కలిసి ప్రారంభించారు. డాక్టర్ శ్రావణ్‌కుమారి, జ్యోతి, మన్విత, రవిశంకర్, శరత్, లక్ష్మణ్ 150 మందిని పరీక్షించి సూచనలిచ్చారు. కొసరాజు ఫౌండేషన్ ప్రతినిధులు కొసరాజు స్వప్న, రాంబాబు దంపతులు, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ ఛైర్మన్ గూడూరు సత్యనారాయణ, పామర్రు డీసీ ఛైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, నేతలు

ఘనంగా రాజగోపాలస్వామి వార్షికోత్సవం

కాజ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం కాజలో రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వార్ల వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివార్లకి విష్వక్సేన పూజ, పుణ్యాహము, పంచామృతాభిషేకం అనంతరం శాంతి కల్యాణం జరిపారు. ఎమ్మెల్యే సోదరుడు వర్ల చైతన్య, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వామివార్ల శాంతి కల్యాణం

లేగ దూడల అందాల పోటీలు

కోడూరు, న్యూస్‌టుడే: లింగారెడ్డిపాలెం గ్రామంలో 'లేగ దూడల అందాల పోటీలు' మంగళవారం నిర్వహించారు. సర్పంచి వై.శ్రీదుర్గ ప్రారంభించారు. 58 మంది పశుపోషకులు తమ లేగ దూడలను ప్రదర్శించారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సీహెచ్. చిన్ననరసింహులు, డాక్టర్ నాగభూషణం బాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ నాగభూషణరావు, అవనిగడ్డ సహాయ సంచాలకులు డాక్టర్ తోట వేణు, పశువైద్యాధికారి రోహిత్ చంద్ర, పీఏసీఎస్ అధ్యక్షులు కోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పోటీల సందర్భంగా లేగ దూడలకు మినరల్ బ్రిక్స్, లివర్ టానిక్స్, రైతులకు పాల క్యానులు అందించారు.

పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచి వై.శ్రీదుర్గ

దాతల సౌజన్యంతో పది విద్యార్థులకు అల్పాహారం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే

పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు పలువురు దాతలు అండగా నిలుస్తున్నారు. పరీక్షల వేళలో విద్యార్థులు ఖాళీ కడుపుతో ఉండకూడదనే ఉద్దేశంతో ఉదయం, సంధ్యాకాలం సమయాల్లో అల్పాహారం వంటివి అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పామర్రు మండలం జమీదగ్గుమిల్లిలో నూరుశాతం ఉత్తీర్ణతకై ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచి కూనపరెడ్డి చంద్రశేఖర్ ఈ నెల 15 నుంచి చివరి పరీక్ష వరకు రోజూ ఉదయం రూ.400 విలువైన బ్రేక్‌ఫాస్ట్ అందిస్తుండగా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలమలశెట్టి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సాయంత్రం వేళ ప్రతి దినం రూ.200 వెచ్చించి అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులపై తీసుకుంటున్న శ్రద్ధకు తల్లిదండ్రులు వారిని కొనియాడుతున్నారు.

అల్పాహారం అందుకుంటున్న పది విద్యార్థులు (ఇన్‌సెట్లో సర్పంచి కూనపరెడ్డి చంద్రశేఖర్)

పుస్తకాల వితరణ

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీసాయి విద్యానికేతన్‌లో మంగళవారం దివంగత ఘంటా నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కృష్ణప్రసాద్ వితరణతో విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగ, చర్మకారుల అభివృద్ధికి చర్యలు

విన్నకోట (గుడ్లవల్లేరు): మండలంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ చర్మకారుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్యాగరాజు, ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్, హౌసింగ్ ఏఈఈ సురేంద్రలకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

శనివారమే పింఛన్ల పంపిణీ

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మార్చి 1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 28వ తేదీనే పింఛను పంపిణీ చేస్తున్నామని మొవ్వ ఎంపీడీవో డి.సుహాసిని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద ఫిబ్రవరికి సంబంధించి 8,315 మంది లబ్ధిదారులకు రూ.3,59,83,500 అందించనున్నామని ఆమె తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న లస్కర్లు

అవనిగడ్డ : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కృష్ణా డెల్టాలోని జలవనరుల శాఖలో ఔట్ సోర్సింగ్ లస్కర్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏడాదిలో 12 నెలలు జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

విద్యుత్తు సరఫరా అంతరాయం నేడు

నందివాడ (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: నందివాడలోని విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద నూతన ఆర్‌డీఎస్ఎస్ లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నందివాడ, తుమ్మలపల్లి, తమిరిశ గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రకటించారు.

అలంకరణ చేపల పెంపకంతో అదనపు ఆదాయం

ఘంటసాల, న్యూస్‌టుడే: గ్రామీణ యువత అలంకరణ చేపల పెంపకంలో నైపుణ్యం అలవర్చుకుని అదనపు ఆదాయం పొందవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి అన్నారు. మంగళవారం గ్రామీణ యువతకు నిర్వహించిన శిక్షణలో మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ మంచినీటి, సముద్రపు నీటిలో లభించే అలంకరణ చేపలు, అక్వేరియం తయారీపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మాట్లాడుతున్న సమన్వయకర్త సుధారాణి

డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం

ఆందోళన చేస్తున్న సొసైటీ ఉద్యోగులు, యూనియన్ నేతలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: సహకార సంఘ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించేవరకు పోరాటం కొనసాగుతుందని ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్ర రవికుమార్ అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని 37 సొసైటీల్లోని సీఈవోలు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం చల్లపల్లి కేడీసీసీ బ్యాంక్ వద్ద నిరసన చేపట్టారు. మంగళవారం నాటికి ఈ సమ్మె 9వ రోజుకు చేరుకుంది. నేతలు తోట కృష్ణారావు, కోసూరు రామాంజనేయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు రెన్యువల్ చేసుకోవాలి

గుడివాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్ని రకాల వ్యాపారులు, దుకాణదారులు తమ ట్రేడ్ లైసెన్సులను తక్షణమే రెన్యువల్ చేసుకోవాలని మార్చి 1 నుంచి 25 శాతం పెనాల్టీ ఉంటుందని పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. స్థానిక పురపాలక మందిరంలో మంగళవారం సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ట్రేడ్ లైసెన్సును వెంటనే ఆన్‌లైన్ ద్వారా రెన్యువల్ చేయాలని సూచించారు.

పాదయాత్రికుడికి సన్మానం

బి.ఎల్.నరసింహులును సన్మానిస్తున్న తెదేపా నేతలు

అవనిగడ్డ, నాగాయలంక, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు 'భారతరత్న' ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన బి.ఎల్.నరసింహులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం అవనిగడ్డ, నాగాయలంకకు చేరుకుంది. అవనిగడ్డలో దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి రామమోహన్‌రావు, రాజమోహన్‌రావు, దాసినేని శ్రీనివాసరావు, మాదివాడ రత్నారావు, కంచర్ల ఆనంద్, కూరాకుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. నాగాయలంకలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెదేపా నేతలు స్వాగతం పలికి సత్కరించారు. మెండు లక్ష్మణరావు, సనకా సురేష్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

కోడూరు : ఏలూరులో నిర్వహించిన 'రాష్ట్ర స్థాయి అబాకస్ - వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో' కోడూరు మండలంలోని లక్ష్యా ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్లు విస్సంశెట్టి శివనాగరాజు, సుబ్రహ్మణ్యం తెలిపారు. కడవకొల్లు వినయ్, తోట హితాన్స్, అప్పికట్ల రిత్విక్, ఒడుగు నిహారిక, బి.శామ్యూల్, ఎం.భానుశ్రీల ప్రతిభతో బెస్ట్ స్కూల్ అవార్డు, జ్ఞాపికలు పొందామన్నారు.

జ్ఞాపికలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కేంద్ర పథకంపై అవగాహన

ఉపాధి కూలీలతో భాజపా నాయకులు

అవనిగడ్డ, అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన వీబీజీ రామ్ జీ పథకం కింద కూలీలకు పనులు చేసే ప్రాంతంలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు పథకం జిల్లా కన్వీనర్ జీవి నగరాయలు చెప్పారు. మంగళవారం రామచంద్రపురం గ్రామంలో, అవనిగడ్డ కృష్ణా కరకట్ట దిగువన మామిడి తోటల్లో పనులు చేస్తున్న కూలీలకు అవగాహన కల్పించారు. భాజపా నేతలు బోగాది చంద్రశేఖర్, భూపతి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తయారు చేయాలి

ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

పెదపారుపూడి: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అరుణకుమారి అన్నారు. అప్పికట్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దీని వల్ల కలిగే నష్టాలు, పోషకాహార లోపంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

తాడంకి(పమిడిముక్కల): చట్ట ప్రకారం బాల్య వివాహాలు నేరమని, వీటిని ఎవరూ ప్రోత్సహించరాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలీమున్నీసా అన్నారు. తాడంకిలోని అంగన్‌వాడీ కేంద్రం- 2లో మంగళవారం తల్లుల కమిటీ సమావేశం జరిగింది. బాల్యవివాహాలను అరికట్టాలని కమిటీ సభ్యులు ర్యాలీ నిర్వహించారు.

చురుగ్గా తారురోడ్డు అభివృద్ధి పనులు

పూషడం (ఘంటసాల), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఉపాధి పథకం నిధులు రూ.1.40 లక్షలతో పూషడం ప్రధాన రోడ్డు 3 కిలోమీటర్ల మేర తారురోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు గత 5సంవత్సరాలుగా ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక చొరవతో తారురోడ్డు సుందరంగా నిర్మాణం అవుతోందని సర్పంచి అంకం మారుతీరావు, గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

పూషడం ప్రధాన రహదారి

తాగునీటి వృథాను అరికట్టరా?

ఐలూరు నుంచి నిడుమోలు వెళుతున్న తాగునీటి పైప్‌లైన్ పగిలి శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదంటూ సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, అవురుపూడి (కూచిపూడి)

వారం రోజులైనా కానరాని పరిష్కారం

నిడుమోలు (కూచిపూడి), న్యూస్‌టుడే: నిడుమోలు శివారు వీరాయిలంకలో వారం రోజులుగా తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని మహిళలు ఆందోళన వెల్లడిస్తున్నారు. ఐలూరు కృష్ణానది నుంచి వేసిన పైప్‌లైన్‌తో తాగునీటిని వీరాయిలంక ప్రజలకు అందిస్తున్నారు. ఇందుకోసం కుళాయి ట్యాప్‌ను గ్రామంలో బిగించారు. అది పాడైపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని తెదేపా నాయకుడు ఈడే గిరిశ్రీనివాసరావు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తాగునీటి కోసం నిరీక్షిస్తున్న మహిళలు

అడ్డదిడ్డంగా కేబుళ్లు.. ప్రసరించని వెలుగులు..

గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: పట్టణంలోని పెదకాలువ సెంటర్ వద్ద ఆంజనేయ స్వామి గుడి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభానికి కేబుళ్లు అడ్డదిడ్డంగా కట్టారు. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపం ధ్వంసమై వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. కేబుళ్లు అలా ఉండటం వల్ల విద్యుదాఘాతం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్ డీలర్ల నివాళి

దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలలో భాగంగా మంగళవారం అవనిగడ్డ మండల రేషన్ డీలర్లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి కృష్ణారావు చేసిన సేవలను కొనియాడారు. అదే ఈ దృశ్యం. **- అవనిగడ్డ, న్యూస్‌టుడే**

జాతర ఏర్పాట్లపై సమీక్ష

కోడూరు, న్యూస్‌టుడే: విశ్వనాథపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీఅద్దంకి నాంచారమ్మ జాతరకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అవనిగడ్డ సీఐ యువకుమార్ అన్నారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్న జాతర ఏర్పాట్లు గురించి మంగళవారం ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో ఆలయ ఇన్‌ఛార్జి ఈవో టీవీవీ.మోహనరావు, కమిటీ అధ్యక్షులు తోట వెంకట సూర్య నరసింహారావు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, తహసీల్దార్ జె.సౌజన్య కిరణ్మయి, ఎస్సై కె.చాణక్య పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరులో మంగళవారం రాత్రి ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువతి విషయంలో పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన వి.శ్రీమంత్, గంగరాజు అనే యువకుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో శ్రీమంత్.. గంగరాజును గాయపరిచాడు. గాయాలైన అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదర్సాకు నిత్యావసర సరకుల వితరణ

చల్లపల్లి, న్యూస్‌టుడే: రంజాన్ మాసం సందర్భంగా అరబ్బీ మదర్సా విద్యార్థులకు మచిలీపట్నానికి చెందిన రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ చొరవతో స్టార్ విద్యా సంస్థల విద్యార్థులు 150 కిలోల బియ్యం, 20 కిలోల కందిపప్పు, 15 లీటర్ల ఆయిల్ మంగళవారం అందించారు. తెదేపా నేతలు మహమ్మద్ హఫీజుర్ రెహమాన్, మోర్ల శివ, షేక్ నబీఘోరి, షేక్ ఇబ్రహీం, అమీర్‌జానీ తదితరులు పాల్గొన్నారు.

సరకులను అందిస్తున్న ముస్లిం ప్రముఖులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలు దగాని రాజారత్నం, కార్యదర్శి టి.శివకుమారి, గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సహాయకులు పాల్గొన్నారు.

పామర్రు: అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం రిలే నిరాహార దీక్షలో పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టుకు చెందిన హెల్పర్లు పాల్గొన్నారు. వృత్తి సంఘాల జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం, ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.ఉమారాణి, రమ్య, దీపిక, అరుణ, నాగలక్ష్మి, పార్వతి, నాగభవాని, తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష

ప్రతిష్ఠామూర్తులకు అభిషేకాలు

నూతన విగ్రహాల ప్రతిష్ఠ

తాడంకి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: తాడంకిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు గోపూజ, అభిషేకాలు నిర్వహించారు.

తండ్రిని చంపిన తనయుడు అరెస్టు

పామర్రు, న్యూస్‌టుడే: కొండిపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని డీపీగూడేంలో మద్యం మత్తులో తండ్రి సురేశ్‌ను హత్య చేసిన కుమారుడు చంద్ర మహేష్‌ను అరెస్టు చేసినట్లు పామర్రు సీఐ సుభాకర్ అన్నారు. సురేష్ తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువుకావడంతో మంగళవారం మహేష్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

మాట్లాడుతున్న సీఐ సుభాకర్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయభాస్కర్

పామర్రు, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పామర్రు ఎస్ఐ- 2 విజయభాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే ప్రమాదాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ

విజేతలతో ప్రిన్సిపల్ లక్ష్మణరావు, రజనీ

గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఫార్మశీ విద్యార్థులు విజయవాడ కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో నిర్వహించిన స్పాక్స్ యుటోరియా 26వ కార్యక్రమంలో పలు పోటీలలో బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మణరావు వెల్లడించారు. క్విజ్‌లో ఐశ్వర్య, రూపాదేవి, సాయిచరణ్, ప్రవీణ్‌కుమార్‌లు ప్రథమ, రోహిణీ ప్రియ, మైత్రిలు డ్యూయెట్ ఫ్యాషన్‌లో ప్రథమ, తన్మయి, కాంక్షలు వెస్టర్న్ డ్యాన్స్‌లో ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలను, సాంస్కృతిక కో-ఆర్డినేటర్ రజనీలను అభినందించారు.

గ్రామ సచివాలయం పరిశీలన

నందివాడ (గుడ్లవల్లేరు): మండల కేంద్రమైన నందివాడ గ్రామ సచివాలయాన్ని మంగళవారం జేసీ నవీన్‌కుమార్ తనిఖీ చేశారు. గుడివాడ ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి సచివాలయానికి వచ్చారు. అన్ని విభాగాల పనితీరును పరిశీలించారు. ప్రజల ఫిర్యాదులు, వాటి పరిష్కారాల నమోదు ఇతర కార్యాలయాల రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

మంటాడ(పమిడిముక్కల): మంటాడలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి మార్చి 4 వరకు జరుగుతాయని ఆలయ పాలకవర్గ ఛైర్మన్ అగస్త్యరాజు రామమోహనరావు, కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు గ్రామ పంచాయతీకి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కార్యదర్శి అబ్దుల్ సలీమ్ అన్నారు. మంగళవారం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పన్నుల వసూళ్ల ఛాంబర్‌ను పర్యవేక్షించారు. చెల్లించాల్సిన వారు వెంటనే చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

శరీర నిర్మాణానికి పోషకాహారం అవసరం

పద్దారాయుడుతోట(కూచిపూడి), న్యూస్‌టుడే: శరీరానికి అవసరమైన పిండిపదార్థాలు, మాంసకృతులు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని ఘంటసాల కె.వి.కె. సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మొవ్వ మండలం పద్దారాయుడుతోటలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటసాల)వారి ఆధ్వర్యంలో మహిళలకు పోషకాహారం ప్రాముఖ్యతపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై పోలీసుల వినూత్న ప్రదర్శన

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలపై పామర్రు పోలీసులు మంగళవారం వినూత్న ప్రదర్శన నిర్వహించారు. పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ-1 రాజేంద్రప్రసాద్, ఎస్ఐ-2 విజయ్‌భాస్కర్, సిబ్బందితో కలిసి విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన వాహనాన్ని ప్రదర్శిస్తూ రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల తీవ్రతను చూపించేందుకు తాము ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. అధిక వేగం, మద్యం తాగి డ్రైవింగ్, చరవాణి వినియోగిస్తూ వాహనాలు నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రమాదానికి గురైన వాహనాన్ని చూపుతున్న సీఐ, ఎస్ఐ, సిబ్బంది

కరాటేలో ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పూర్ణచంద్రారెడ్డి

పామర్రు, న్యూస్‌టుడే: నిడదవోలులో నిర్వహించిన దక్షిణ భారత కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏఎన్‌ఎం విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపల్ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అండర్ 14 బాలుర విభాగంలో వి.వర్షిత, కె.మురారి, సాయికార్తీక్ ప్రథమ, వై.కిషన్ ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. బాలికల విభాగంలో భువశ్రీజ, డి.యూన్సీలక్ష్మి, జి.ఎస్తేరు ప్రథమ స్థానంలో గెలుపొందారని చెప్పారు. బంగారు, వెండి పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని వివరించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం

పామర్రు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని చీఫ్ సూపరింటెండెంట్ నాగవేణు తెలిపారు. పరీక్షకు 278 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 276 మంది హాజరయ్యారన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ కృష్ణా జిల్లా అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E. P. 08/2018
In O.S. 18/2016
Between:
చక్రావధానుల విశాలక్ష్మి ..D.Hr
మరియు
మాదివాడ నాగ మల్లేశ్వరరావు @ బాబూజీ ..J.Dr

పై నెంబరు డిక్రీ బాకీని రాబట్టుకునే నిమిత్తం J.Dr యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో గల యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 24-03-2026న ఉదయం గం 10.30 ని.ల నుండి పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. కావున పాడుకొనదలచినవారు సదరు వేలం పాటలో పాల్గొని వేలం షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, నాగాయలంక మండలం, నాగాయలంక గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన నాగాయలంక గ్రామములోని R.S.No. 124/2 నందు గల యి॥ 0.23 సెంట్లులోని చ॥గ॥ 371.03ల నివేశ స్థలమునకు హద్దులు:- **తూర్పు:** బండారు సుబ్బారావు గారి స్థలం హద్దు, **దక్షిణం:** ఆవుల దేవరాజు మణి గారి స్థలం హద్దు, **పడమర:** పంచాయతీ రోడ్డు హద్దు, **ఉత్తరం:** మేకా శ్రీనివాసరావు గారి స్థలం హద్దు.
D.Hr కిమ్మత్తు Rs. 10,00,000/-
అమీనా కిమ్మత్తు Rs. 35,00,000/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వేలం తేది. 24-03-2026
Ch.V. ఫణి కేశవరావు
D.Hr తరపున అడ్వకేట్, మచిలీపట్నం

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్‌, 98486 27585

★ కానూరు మురళీనగర్‌లోని మురుగుకాల్వల్లో పూడిక తీత పనులు జరగక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ షేక్ నజీర్ సిబ్బందిని పంపి పూడిక తీత పనులు చేయించి సమస్య పరిష్కరించారు.

★ పోరంకి- నిడమానూరురోడ్డులో కొన్ని రోజులుగా చెత్త తీయడంలేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సుధాకర్ సిబ్బందిని పంపి చెత్తతీయించి సమస్య పరిష్కరించారు.

★ పోరంకి రామాపురంకాలనీకి వెళ్లే ప్రధానరహదారి మొదట్లో గోతులమయంగా మారిన సమస్యపై ఈనాడులో మంగళవారం 'రాకపోకలకు నరకయాతనే' శీర్షికన ప్రచురితమైన కథనానికి పురపాలిక కమిషనర్ షేక్‌నజీర్ స్పందించారు. అక్కడ ఇరువైపులా మట్టితో గోతులు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. - న్యూస్‌టుడే, కానూరు, పోరంకి

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్‌ అభయాంజనేయస్వామి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన గుమ్మడి సాయికుమార్, లక్ష్మీప్రసన్న, దేవినేని రాజా వెంకట కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం 350 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నిడమర్తి శ్రీనివాసరావు, ఈవో పి.తారకేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

★ అభయాంజనేయస్వామి ఆలయానికి హనుమాన్‌జంక్షన్‌కు చెందిన పాతూరి నిలేష్ రూ.30 వేలు విరాళంగా అందించారు. ఈవో తారకేశ్వరరావుకు అందజేశారు.

దివ్యాంగులకు భోజనం పంపిణీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: శారీరక, మానసిక లోపాలతో సాధారణ జీవనం సాగించలేని దివ్యాంగులకు సేవలందించడం ఎంతో గొప్ప విషయమని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలమలశెట్టి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు సతీమణి అరుణతో కలిసి భోజనం సమకూర్చారు. నాయకులు చింతల వెంకటశివఅప్పారావు, వేగిరెడ్డి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మలుపు.. వెళ్లేందుకు వణుకు

ఉయ్యూరు పట్టణంలో బస్టాండ్ దగ్గర నుంచి 3, 4, 5, 6 వార్డులకు వెళ్లే ప్రధాన రహదారిలో కపిలేశ్వరపురం ఛానల్ పక్కగా వెళ్లే మార్గంలో ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. చాంద్‌నగర్, శ్రీలంకకాలనీ, అంబేద్కర్ నగర్, రాజేంద్రనగర్, సౌభాగ్యనగర్ ప్రాంత వాసులు నిత్యం వందలాది మంది ఈ రహదారిపై తిరుగుతుంటారు. రాత్రి సమయంలో ఈ మలుపు వద్ద భయంగా ప్రయాణిస్తున్నారు. దీనికి తోడు నీటి ప్రవాహంతో రోడ్డు కోసుకుపోతోంది. ఇప్పటికైనా మలుపు వద్ద గోడ, సూచికలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉయ్యూరు

బోర్డు పెడితే భారం తగ్గును

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో గండిగుంటపై వంతెన నుంచి ఉయ్యూరు పట్టణం, కడవకొల్లు, కాటూరు తదితర గ్రామాలకు వెళ్లేందుకు సర్వీస్ రహదారిలోకి దిగుతారు. ఇక్కడ కనీసం సూచిక బోర్డులు లేవు. వీటి వల్ల వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలియక అత్యధిక దూరం వెళ్లిపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గండిగుంట(ఉయ్యూరుగ్రామీణం)

రాత్రి వేళ ప్రమాదమే

బాపులపాడు గ్రామ పంచాయతీ పరిధిలో సిమెంట్ రోడ్ల నిర్వహణ సక్రమంగా లేదు. బీటలు వారిన, కుంగిపోయి, అక్కడక్కడా విరిగిపోయిన రహదార్లకు కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. సిద్ధార్థ పాఠశాల రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ ఎదురు వీధి ఇందుకు నిదర్శనం. తాజాగా కేడీసీసీ బ్యాంకుకు వెళ్లే పుట్టగుంట సతీష్‌కుమార్ వీధి ఆరంభంలో ఓ పక్క సిమెంట్ రోడ్డు ధ్వంసమైపోయింది. రాత్రి వేళ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు డ్రెయినేజీలో పడే ప్రమాదం ఉంది. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

మార్చేందుకు ఇదే తరుణం

ఈడుపుగల్లు శివాలయం ఎదుట నాలుగు రోడ్ల కూడలిలో రాకపోకలు అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభం, నియంత్రికను పక్కకు మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ట్రాఫిక్ అధికంగా ఉండే ఈడుపుగల్లు-ఉప్పులూరు రహదారి అంచున మలుపు తిరిగే చోట స్తంభాలు ఉండడంతో లారీలు, బస్‌లు ఢీ కొట్టడంతో కొంత భాగంగా దెబ్బతింది. ప్రస్తుతం ఈ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేస్తున్నారు. మరోచోటకి మార్చడానికి ఇదే అనువైన సమయంగా గ్రామస్థులు భావిస్తున్నారు.
- న్యూస్‌టుడే, ఈడుపుగల్లు (కంకిపాడు)

వ్యర్థాలకు నిప్పు.. వృక్షాలకు ముప్పు

కాటూరు-ఉయ్యూరు ప్రధాన రహదారి పక్కన కడవకొల్లు గ్రామపంచాయతీ పరిధిలో చెట్ల పక్కన ఉన్న వ్యర్థాలను సిబ్బంది తొలగించడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా నిప్పు పెడుతున్నారు. దీని వల్ల వృక్షాల మొదల్లు కాలిపోతున్నాయి. ఇలా చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కడవకొల్లు(ఉయ్యూరుగ్రామీణం)

శివారు కాలనీలు.. చింతలే తెల్లార్లు

చిన్న వానకూ నిండిపోతున్న రహదారులు

ప్రసాదంపాడులోని పెట్రోల్ బంక్ పక్క రోడ్డు పరిస్థితి ఇది

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే: నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రధానంగా నగరానికి అనుకుని ఉన్న రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామంలో నూతనంగా కాలనీలు ఏర్పడుతున్నాయి. కానీ ప్రధానంగా రామవరప్పాడు, ప్రసాదంపాడులోని రాఘవేంద్ర నగర్, సిద్ధి వినాయక కాలనీ, హనుమాన్ నగర్, పటేల్ నగర్, సాయి నగర్.. నిడమానూరులోని సొసైటీ రోడ్డు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మంగళవారం పడిన చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా సమస్యలు పరిష్కరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు, డ్రెయినేజీ లేక..: డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు పారడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో నివాసితులు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు వదులుతున్నారు. వర్షాలకు నీరు నిలవ ఉండి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల బెడద ఎక్కువ అవుతోంది. కొన్ని కాలనీల్లో రోడ్లు నిర్మిస్తున్నప్పటికీ అనేక కాలనీల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. శివారు ప్రాంతం కావడంతో రాత్రి సమయాల్లో ఆకతాయిలు ఇక్కడికి చేరి గంజాయి, మద్యం సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. రైల్వే ట్రాక్, హైవేలకు సమీపంలో కింద, నూతనంగా నిర్మిస్తున్న భవనాల వద్ద ఆకతాయిలు చేరుకుని సాయంత్రం నుంచే మద్యం, గంజాయి సేవించడంతో ఇటువైపు రాకపోకలు సాగించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలపై అధికారులు ఆలోచించి పరిష్కరించేందుకు ప్రయత్నించాలని అందుబాటులోకి రాలేదు.

500 కుటుంబాలకు సమస్య..

నిడమానూరులో సొసైటీ రోడ్డులో 500 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలంటూ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశాం. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు పారుదల లేక అవస్థలు పడుతున్నాం. వర్షాకాలం, ఎండాకాలం అనే తేడా లేకుండా నిత్యం రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది.
–వెంకటేశ్వరరావు, నిడమానూరు సొసైటీ రోడ్డు

అధికారులు దృష్టి పెట్టాలి..

హనుమాన్ నగర్, పటేల్ నగర్, రోడ్లతో పాటు డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. వర్షాలు పడిన సమయాల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ పెంచి ఆకతాయిల తాకిడి సమస్యలను అరికట్టాలి.
–సాయి, పటేల్‌నగర్

విశ్రాంత ఉద్యోగులకు ఉచిత సేవలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద పెన్షనర్లకు ఉచిత సేవలందించనున్నట్లు ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు జీవన ధ్రువపత్రాన్ని తప్పనిసరిగా గన్నవరం ఉపఖజానాధికారి కార్యాలయంలో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్ సమస్యలతో బాధపడేవారు ఇతర విశ్రాంత ఉద్యోగులు ఉపఖజానాధికారి కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా సంఘం భవనం వద్ద జీవన ప్రమాణ ధ్రువపత్రం, ఇతర సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్తు యంత్రాల మరమ్మతులపై శిక్షణ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రం సహకారంతో ఏసీ, ఫ్రిజ్ మరమ్మతులపై యువతకు ఉచిత వైవిధ్య శిక్షణ అందిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి చంద్రశేఖర్ తెలిపారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో నిర్వహించే శిక్షణకు పదో తరగతి, ఆ పైచదివిన యువతీ యువకులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 99595 71399, 89852 60747 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న హోమియో వైద్య శిబిరం

గన్నవరం గ్రామీణం: గన్నవరం మండలం కేసరపల్లిలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక శ్రీశక్తి చంద్రమౌళి సేవా సదన్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో తనిఖీ

ఉయ్యూరు: ఉయ్యూరులోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం పురపాలక సంఘం ఛైర్మన్ జె.రామారావు, కమిటీ ఛైర్మన్ బి.రమణలు సందర్శించి పరిశీలించారు. ఆహారం నాణ్యత, వడ్డించే విధానాన్ని గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత తీరుపై సిబ్బందికి పలు సూచనలందించారు.

రహదారుల అభివృద్ధికి కృషి చేస్తాం

రోడ్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

యనమలకుదురు, తాడిగడప, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలికలోని ప్రతి సర్కిల్‌ను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. మంగళవారం యనమలకుదురు, తాడిగడప గ్రామాల్లో సీసీరోడ్లు, రోడ్డువేయాల్సిన ప్రాంతాలను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..త్వరలో యనమలకుదురులోని నీలం సంజీవయ్యరోడ్డు, ముప్పవరపు రామయ్య, జానకమ్మవీధుల రోడ్డు పనులను ప్రారంభిస్తామన్నారు. అధికారులు, కూటమి నేతలు ఆయన వెంట ఉన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం ముఖ్యమంత్రి ఆశయమని అందుకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. తల్లిదండ్రిని పోగొట్టుకున్న ఉయ్యూరుకు చెందిన ఆరేపల్లి నవీన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఆయన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. జిల్లా తెదేపా అధ్యక్షుడు వి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ స్థలం జాతీయ రహదారికి చెందినదే

కొలతలు వేస్తున్న సిబ్బంది

ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన సర్వీస్‌రోడ్డులో కాటూరురోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని జాతీయ రహదారులు, మండల రెవెన్యూ సిబ్బంది మంగళవారం సర్వే చేశారు. ఈ స్థలం మాదేనని కొద్ది రోజుల కిందట అక్కడ రేకుల షెడ్డు నిర్మించారు. దీనిపై తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు జాతీయ రహదారుల విభాగం సిబ్బంది నిర్మాణ పనులను నిలిపివేయించారు. ఈ స్థలం మాదేనని, దీనికి సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయని..రేకుల షెడ్డు నిర్మించిన వారు కూడా సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేయగా..జాతీయ రహదారుల విభాగం సర్వేయర్ శ్యామ్‌బాబు, మండల సర్వేయర్ డి.సురేశ్, ఆర్.ఐ టి.యతీంద్రులు ఆ స్థలాన్ని రెవెన్యూ సిబ్బందితో కొలతలు వేయించారు. ఈ క్రమంలో ఆ స్థలం జాతీయ రహదారుల పరిధిలోనే ఉందని వారు నిర్ధారించారు. ఈ సందర్భంగా శ్యామ్‌బాబు మాట్లాడుతూ జాతీయ రహదారుల విభాగం స్థలాన్ని ఆక్రమించుకున్న వారందరికీ నోటీసులు జారీ చేస్తామన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యాన్ డ్రైవర్ మృతి

కిరణ్‌తేజ (పాత చిత్రం)

పెనమలూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పెనమలూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెనమలూరు ఆశ్రమం కట్టపై వ్యాన్‌డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న లింగాల కిరణ్‌తేజ(30) మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లోని బాత్రూమ్‌లో లైటు వెలగకపోడంతో మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు పోరంకిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కిరణ్‌తేజకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం స్వాధీనం

పెనమలూరు,న్యూస్‌టుడే: పోరంకిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పెనమలూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 55 ఏళ్ల వయసు గల మహిళ ఆదివారం ఉదయం అపస్మారక స్థితిలో పడిపోయి ఉండడాన్ని గమనించిన ఓ వ్యక్తి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈమె స్థానికంగా కొంతకాలం నుంచి యాచిస్తూ జీవిస్తుండేదని పోలీసులు తెలిపారు.

ఇద్దరి మధ్య ఘర్షణ..ఒకరికి గాయాలు

ఉయ్యూరు: ఉయ్యూరులో మంగళవారం రాత్రి ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువతి విషయంలో పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన వి.శ్రీమంత్, గంగరాజు అనే యువకుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో శ్రీమంత్.. గంగరాజును గాయపరిచాడు. గాయాలైన అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం..ప్రాణదానం

రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలం దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ కర్మాగారంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం శిబిరాన్ని ప్రారంభించారు. ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ, మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు ఉద్యోగులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. మొత్తం 50 యూనిట్లు సేకరించినట్లు రెడ్‌క్రాస్ వైద్యులు ఎంబీఎస్వీ ప్రసాద్ తెలిపారు. దీపక్ నెక్స్‌జెన్ డైరెక్టర్లు అడుసుమిల్లి చైతన్యవాసు, రాజశేఖర్, హెచ్‌ఆర్ మేనేజర్లు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, రెడ్‌క్రాస్ పీఆర్వో కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు కీలకం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు అత్యంత కీలకమని మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త రాధారాణి సూచించారు. జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మల్లవల్లిలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు పలు మామిడి తోటలను పరిశీలించి..ఎక్కువగా తేనె మంచు పురుగు, బూడిద తెగులు కనిపిస్తున్నాయని వీటిని సమర్థంగా నివారించకుంటే దిగుబడులపై గణనీయ ప్రభావం చూపుతాయని రైతులకు వివరించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఉద్యానాధికారి చందు జోసెఫ్ సుందరం, ఇతర నిపుణులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాధారాణి

పాఠశాల నిర్వహణపై సంతృప్తి

సమీక్షలో సమగ్ర శిక్షా రాష్ట్ర కమిటీ బృందం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో పీఎంశ్రీ ద్వారా ఏర్పాటైన పరిశోధనాశాల, పాఠశాల విద్యావిషయాల నిర్వహణ ఇతర అంశాలను సమగ్ర శిక్షా రాష్ట్ర కమిటీ బృందం మంగళవారం పాఠశాలను సందర్శించి సమీక్షించింది. పరిశోధనాశాల వినియోగం, విద్యావిషయాల పరంగా సాధిస్తున్న అభివృద్ధి, అవసరమైన సదుపాయాలు, సౌకర్యాల సమకూర్చిన అంశాలు, విద్యాబోధన ఇతరేతర అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.నాగేశ్వరరావుతో మాట్లాడింది. పాఠశాల స్థితిగతుల పరిశీలన అనంతరం నిర్వహణపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జాకిర్ అహ్మద్, బృంద బాధ్యులు అపర్ణ, శారద, లక్ష్మీప్రసన్న, రాజేశ్వరి, ఎం.బ్రహ్మానందరెడ్డి, రాజశేఖర్ తదితరులున్నారు.

తాత్కాలిక రహదారి ఏర్పాటు

పెదపులిపాక(పెనమలూరు), న్యూస్‌టుడే: పెదపులిపాక గణపతిన గర్‌కాలనీకి కరకట్ట నుంచి తాత్కాలిక రహదారి సౌకర్యం ఏర్పడింది. కరకట్ట నుంచి ఈ కాలనీకి ఏర్పాటు చేసిన ర్యాంపు దుస్థితికి చేరడంతో తెదేపా నేత మునునూరు నిర్మల్‌కుమార్ తన సొంత వ్యయంతో మరమ్మతులు చేయించారు. ఈ ర్యాంపును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణల తొలగింపు

యనమలకుదురు, న్యూస్‌టుడే: యనమలకుదురు కరకట్టపై అవనిగడ్డ వెళ్లేరోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఆక్రమణలను పురపాలిక టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ఆక్రమణల తొలగింపు జరిగింది. కమిషనర్ షేక్‌నజీర్ పర్యవేక్షించారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

పెనమలూరు, న్యూస్‌టుడే: పెదపులిపాక శ్రీవిజయరాజరాజేశ్వరీదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీవాసుదేవానంద గిరి, ప్రముఖ యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీలు పాల్గొన్నారు. గురువు ద్వారా జ్ఞానాన్ని, భక్తిని ఎలా పెంపొందించుకోవాలి, గురువు విశిష్టత, శ్రీవిజయరాజేశ్వరీదేవి వైభవాలను ప్రవచనాల్లో వివరించారు. సామూహిక హనుమాన్‌చాలీసా భక్తిప్రపత్తులతో సాగింది. ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కానూరు: కానూరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు జరుగుతాయని ఆలయ అభివృద్ధి దాత అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ధ్వజారోహణం, 26న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణమహోత్సవం, 27న అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

హామీలు నెరవేర్చాల్సిందే

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: హామీలు నెరవేర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద చేస్తున్న ధర్నా మంగళవారం కొనసాగింది. మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ, సంఘ నాయకులు పాల్గొన్నారు. ప్రాజెక్ట్ కార్యదర్శి ఏ.కనకదుర్గ, సీఐటీయూ మండల కన్వీనర్ తాతబ్బాయి, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శాంతి, నాయకులు సత్యవతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కానూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీసవేతనం రూ.26 వేలకు పెంచడంతోపాటు, చట్టసౌకర్యాలు కల్పించాలని, ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విజయవాడ, అర్బన్, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో కానూరులో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. మార్చి 2 ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విజయవంతంగా గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలు

శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్య బృందం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం చిన్నఅవుటపల్లి డా.సుధా, నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ఆవరణలో అంగిలి చీలిక, గ్రహణంమొర్రి శస్త్రచికిత్సలను సోమ, మంగళవారాల్లో విజయవంతంగా నిర్వహించారు. మాక్సిల్లో ఫేసియల్ సర్జరీ, ఆర్థోడోంటిక్స్, పిడో డోంటిక్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన, శస్త్రచికిత్సల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రీతమ్ యెన్‌శెట్టి, ప్రొఫెసర్, మాక్సిల్లో ఫేసియల్ సర్జరీ, బెంగుళూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, బెంగుళూరు నుంచి వచ్చిన బృందం పీజీ విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. ముగ్గురు రోగులకు గ్రహణంమొర్రి శస్త్రచికిత్స చేసి వారి ముఖాల్లో కొత్త వెలుగులు తీసుకువచ్చారు. ఈ శస్త్రచికిత్సల్లో స్మైల్ ట్రైన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ గుంటూరు తోడ్పాటు అందించారు. ప్రిన్సిపల్ డా.రామోజీరావు తెలిపారు. సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు కన్వీనర్ పాలడుగు సాయి, ఏవో మధుసూదనరావు, పీజీ విద్యార్థులు, అధ్యాపకులు, విభాగాధిపతులు నాదెళ్ల కోటేశ్వరరావు, కిరణ్ కుమార్, రవిచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల హడావుడి.. ఎక్కడికక్కడ వాహనాలు నిలబడి

గోసాల(పునాదిపాడు) పరీక్ష కేంద్రం నుంచి సర్వీస్ రహదారిపైకి వస్తున్న బస్‌లు

ఇంటర్ విద్యార్థుల పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. కానూరు నుంచి కంకిపాడు వరకు జాతీయ రహదారి పక్కనే ఉన్న 15 క్యాంపస్‌లు, కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష సమయానికి ముందు, తర్వాత ఒక్కసారిగా బస్‌లు, ఇతర వాహనాలు రహదారిపై బారులుదీరుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ స్తంభిస్తున్నాయి. కొన్ని క్యాంపస్‌ల వద్ద యాజమాన్యాలే ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది నియమించాయి. గోసాల (పునాదిపాడు) పరిధిలోని మూడు పరీక్ష కేంద్రాల నుంచి వచ్చే బస్‌లు అడ్డదారిలో సర్వీస్ రహదారులపైకి చేరుతున్నాయి. ఇరుకైన రహదారులున్న చోట ఒక్కో బస్ మలుపు తిరగడానికి ఐదు నిమిషాలు పడుతోంది. దీంతో వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇంకా పరీక్షలు పది రోజుల పాటు జరగాల్సిఉంది. అవస్థలను దృష్టిలో ఉంచుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంకిపాడు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్: విద్యార్థి దశలోనే చట్టాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని హనుమాన్‌జంక్షన్ ఎస్సై వెలుగుల సురేష్ సూచించారు. మంగళవారం స్థానిక సిద్ధార్థ విద్యాలయంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, శక్తి యాప్, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల ప్రభావం, ట్రాఫిక్ నిబంధనలు, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరగాళ్ల విషయంలో కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపల్ వీరమాచనేని ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారా మాత్రమే నడపాలని డిమాండ్ చేస్తూ సంస్థ ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. గన్నవరం ఆర్టీసీ డిపో ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ వద్ద ఆందోళన చేశారు. ఉద్యోగుల భద్రత, ఆరోగ్య విషయాలను పరిగణలోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, డిపో కార్యదర్శి బి.నాగిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు టీవీకే రావు, డిపో ఛైర్మన్ దుర్గారావు, కేఎస్.రావు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

డాక్యుమెంట్స్ పోయినవి
నడకుదిటి కుమారి W/o. నడకుదిటి వెంకట లక్ష్మీ నారాయణరావు, D.No. 58-3-8, అచ్చమ్మవీధి, పటమట, విజయవాడ అను పేరుమీద గల డాక్యుమెంటు No.1628/2020 Joint Sub Registrar, Avanigadda గల డాక్యుమెంట్లు ది. 23-2-2026 తాడిగడప మేడసాని వెంకయ్య వీధి నుండి ఫొటోస్టాట్ కోసం వెళుతుండగా దారిలో పోయినవి. దొరికినచో తెలియజేయగలరు.
Cell No. 94401 87405

(c) eenadu

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన

మచిలీపట్నం ఆర్డీవోగా సాంబశివరావు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మచిలీపట్నం ఆర్డీవోగా కె.సాంబశివరావు నియమితులయ్యారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సాంబశివరావును బందరు ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్డీవోగా ఉన్న స్వాతి దీర్ఘకాలిక సెలవుపై ఉండగా జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి పోతురాజు ఇన్‌ఛార్జి ఆర్డీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

దివ్యాంగుడికి విద్యుత్తు వాహనం వితరణ

కష్టంలో ఉన్నవారికి చేయూత అందించాలనే లక్ష్యంతో నగరానికి చెందిన తిరుమలశెట్టి ఆదినారాయణ ఓ దివ్యాంగుడికి రూ.40వేల విలువ చేసే విద్యుత్తు వాహనాన్ని సమకూర్చారు. జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ వాహనాన్ని డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ చేతులమీదుగా పెదకానూరుకు చెందిన పట్టపు వెంకటస్వామికి అందజేశారు.

-న్యూస్‌టుడే, మచిలీపట్నం (కోనేరుసెంటరు)

వాహనాల తనిఖీ

బంటుమిల్లి: జాతీయ రహదారి 216 పరిధిలోని నారాయణపురం కూడలి వద్ద ఎస్సై గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ తనిఖీ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ అవార్డు గ్రహీతతో విద్యార్థులు

భారతీయ హస్తకళల్లో అగ్రగామి కలంకారీ

పెడన, న్యూస్‌టుడే: భారతీయ హస్తకళల్లో కలంకారీ అగ్రగామిగా నిలుస్తుందని విశాఖ సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఈ కళాశాలకు చెందిన హోంసైన్స్ విద్యార్థులు మంగళవారం పెడనలోని కలంకారీ పరిశ్రమను సందర్శించారు. ఈ హస్తకళలు రూపుదిద్దుకునే విధానాన్ని అధ్యయనం చేశారు. భారతీయ పురాతన హస్తకళల్లో కలంకారీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కళలు నేటి తరాన్ని ఆకర్షిస్తూ రూపుదిద్దుకుంటున్నాయని, తద్వారా మార్కెటింగ్ విస్తృతమైందని పరిశ్రమ నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా జాతీయ హస్తకళల అవార్డు గ్రహీత కొండ్రు గంగాధర్‌ను కలిసిన విద్యార్థులు పరిశ్రమ చరిత్రను మరింతగా తెలుసుకున్నారు.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారు
(W/o. కీ॥శే॥ పంచపర్వాల వెంకట సుబ్బారావు గారు), సర్కారుతోట, మచిలీపట్నం

మాకు అత్యంత ఆప్తులు, ప్రియ మిత్రులు, సేవాతత్పరులు శ్రీ పంచపర్వాల శ్రీనివాసరావు గారి మాతృమూర్తి, పెద్దలు, మా అందరికీ తల్లిలాంటి వారు అయిన కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారి మరణానికి చింతిస్తూ..
దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ..

చలమలశెట్టి నరసింహారావు మేనేజింగ్ డైరెక్టర్, గోల్డ్ ప్రిన్స్ జ్యుయల్ ఇండస్ట్రీ ఇండియా ప్రై॥లి॥	సాదు మురళి సుధ గోల్డ్ కవరింగ్ ఇండస్ట్రీస్, మచిలీపట్నం	ఇమడాబత్తుల దిలీప్ కుమార్ IDK ఐరన్ సెంట్రింగ్ వర్క్స్, మచిలీపట్నం
బొడ్డు శ్యామలరావు Retd. LIC డెవలప్‌మెంట్ ఆఫీసర్, మచిలీపట్నం	కొప్పర్తి రవికుమార్ ప్రొ॥ కొప్పర్తి జ్యుయలర్స్, మచిలీపట్నం	ఉదయగిరి సతీష్ ప్రొ॥ ఉదయగిరి జ్యుయలర్స్, మచిలీపట్నం
పెరుమాళ్ల మురళి మాటూరి స్టీల్ & సిమెంట్, మచిలీపట్నం	కంతేటి జగదీష్ మద్దుల జ్యుయలర్స్, మచిలీపట్నం	చలమలశెట్టి ఏడుకొండలు ఇమిటేషన్ జ్యుయలరీ, మచిలీపట్నం
చలమలశెట్టి రమణ కుమార్ పశుగణాభివృద్ధి శాఖ Ex.జిల్లా డైరెక్టర్, మచిలీపట్నం	మట్టా గోపీ కృష్ణ ఇమిటేషన్ జ్యుయలరీ, మచిలీపట్నం	కాట్రగడ్డ రమేష్ రమ్య గోల్డ్ కవరింగ్ వర్క్స్, రాజుపేట
చలమలశెట్టి ఆనంద లక్ష్మీనారాయణ లెక్చరర్, మచిలీపట్నం	కాట్రగడ్డ వెంకటరమణ భార్గవ ట్రేడర్స్, మచిలీపట్నం	బండ్రెడ్డి రాజేష్ శ్రీ సూర్య ట్రేడర్స్, మచిలీపట్నం
కంచర్లపల్లి సతీష్ N.R.I.	పొట్నూరి శ్రీనివాస్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మచిలీపట్నం	తుమ్మల సతీష్ మల్లవోలు
తోట అజయ్‌కుమార్ టీచర్, మచిలీపట్నం	చలమలశెట్టి సత్య శ్రీ కృష్ణవేణి మెడికల్ ఏజెన్సీ, మచిలీపట్నం	అప్పికట్ల శ్రీనివాసరావు రైతుబజారు, మచిలీపట్నం
కూనసాని శ్రీహరి శ్రీ దేవాఘ్న ట్రేడర్స్, మచిలీపట్నం	తోట రామమోహనరావు & సన్స్ ఆదర్శ గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం	V.V.N.V. ప్రసాద్ శ్రీ అక్షయ గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం

సినిమాలు

రేవతి: నవాబ్ కేఫ్
మినీరేవతి: బూకీ
సిరికృష్ణ: మనశంకరవరప్రసాద్
సిరివెంకట్: హే బల్‌వంత్

- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

ధర వరలు

టమాట 14, వంగ 20, బెండ 24, పచ్చిమిర్చి 38, కాకర 32, క్యాబేజీ 16, క్యారెట్ 24, దొండ 30, బంగాళ దుంప 23, ఉల్లిపాయలు 22, గోరు చిక్కుడు 24, దోస 26, సొర 10,08, అరటికాయ 7,6, చిక్కుళ్లు 26, బీర 24, చామదుంప 24, మునగ 08/10, కంద 40, బీట్‌రూట్ 24, కీరదోస 40, బీన్స్ 50, క్యాప్సికం 58, అలసందలు 26, చిలకడదుంప 28, కొత్తిమీర 12/06, పుదీనా 15/05. బుధవారం రైతుబజారుకు సెలవు. గురువారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

శ్రద్ధాంజలి

మరణం
ది. 11-02-2026

కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారు
(W/o. కీ॥శే॥ పంచపర్వాల వెంకట సుబ్బారావు గారు)
సర్కారుతోట, మచిలీపట్నం

మాకు మంచితనం, మమతానురాగాలు పంచి, ఆత్మీయత, అనుబంధాలతో కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, మా బంగారు భవిష్యత్‌కు పూలబాట వేసిన మా అమ్మ గారు
కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారి మరణం మాకు ఎన్నటికీ తీరని లోటు. దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కుమారుడు కోడలు
పంచపర్వాల శ్రీనివాసరావు - శివపార్వతి
ప్రొ॥ స్వర్ణ ఫ్యాషన్ జ్యుయలరీ
స్వర్ణిక ఆర్ట్ జ్యుయలరీ
Z.P. సెంటర్, మచిలీపట్నం

మనుమడు, మనుమరాండ్రు
పంచపర్వాల లక్ష్మీ అంచిత
పంచపర్వాల లక్ష్మీ స్రవంతి
పంచపర్వాల మణికంఠ శుభువన్

అశ్రునివాళి

కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారు
(W/o కీ॥శే॥ పంచపర్వాల వెంకట సుబ్బారావు గారు)
సర్కార్‌తోట, మచిలీపట్నం

మంచితనం, మానవత్వానికి మారుపేరుగా నిలచిన, మా అందరి శ్రేయోభిలాషి, మా సంస్థల అధినేత శ్రీ పంచపర్వాల శ్రీనివాసరావు గారి తల్లి గారు, ప్రేమ, ఆప్యాయత, చిరునవ్వులతో పలుకరించే ప్రేమమూర్తి కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారి మరణానికి చింతిస్తూ... దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...

STAFF
స్వర్ణ ఫ్యాషన్ జ్యుయలరీ, స్వర్ణిక ఆర్ట్ జ్యుయలరీ
Z.P. సెంటర్, మచిలీపట్నం

అశ్రుతాంజలి

కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారు
(W/o. కీ॥శే॥ పంచపర్వాల వెంకట సుబ్బారావు గారు)
సర్కారుతోట, మచిలీపట్నం

మా ప్రియ మిత్రుడు, మా అందరి శ్రేయోభిలాషి
శ్రీ పంచపర్వాల శ్రీనివాసరావు గారి మాతృమూర్తి
సేవాతత్పరురాలు, మృధు స్వభావి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన
కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారి మరణానికి చింతిస్తూ..
దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..
వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..

మీ మిత్రులు
సైక్లింగ్ టీమ్

(c) eenadu

ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు మూర్ఖులు

జస్టిస్ జీఆర్ స్వామినాథన్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు దుర్మార్గులు, మూర్ఖులు, అవివేకులని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసన న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు. తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దర్గావద్ద ఉన్న రాతిస్తంభంపై మురుగన్ భక్తులు కార్తీకదీపం వెలిగించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది, అమలుచేయలేదు. డీఎంకే నేతలు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో పొల్లాచ్చిలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ స్వామినాథన్ మాట్లాడుతూ... గురువు అంటే భగవంతుని స్వరూపమన్నారు. భగవంతుని పాదాలు తాకలేమని, అయితే గురువు పాదాలను తాకడం సులభమని చెప్పారు. తమిళనాడులో హేతువాదులు గురువును భగవంతునిగా చూస్తున్న మనల్ని దుర్మార్గులు, మూర్ఖులు, అవివేకులుగా భావిస్తున్నారన్నారు. కానీ నిజమైన దుర్మార్గులు, మూర్ఖులు, అవివేకులు వారేనని తెలిపారు. గురువు అనుగ్రహం వల్ల ధైర్యం, సాంత్వన లభిస్తాయన్నారు. గురువుల దగ్గరకు వెళ్లినప్పుడు వారి ప్రకాశం భక్తుల బలహీనతలను తొలగించడానికి సహాయపడుతుందని చెప్పారు. తన పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉందని, మరింత ధైర్యంతో పనిచేయాలని అనుకుంటున్నట్లు జస్టిస్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు.

పులివెందుల చేరుకున్న జగన్

ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: మూడురోజుల పర్యటనలో భాగంగా వైకాపా అధ్యక్షుడు జగన్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల చేరుకున్నారు. మంగళవారం ఆయన బెంగళూరు నుంచి పులివెందుల సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్లో చేరుకోగానే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డైరెక్టర్‌మాజీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సాయంత్రం జగన్ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. గతంలో కార్యకర్తల మధ్య తోపులాట జరిగిన నేపథ్యంలో గోడలపైనా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజాదర్బార్ అనంతరం జగన్ తన స్వగృహానికి వెళ్లారు. బుధవారం ఉదయం వేంపల్లె మండలం నందిపల్లెలోని నందీశ్వరాలయం ప్రారంభోత్సవానికి ఆయన హాజరు కానున్నారు.

అక్రమ మైనింగ్‌తో ఖజానాకు ఎంత నష్టం జరిగిందో చెప్పండి

- జస్టిస్ సుధాంశు ధులియా కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దుల్లోని ఏపీ భూభాగంలో ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి ఇచ్చిన ఇనుప గనుల, అక్కడి అటవీప్రాంత తవ్వకాలను ఖరారు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నాలుగు విషయాలను తన నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. తవ్వకాలకు అనుమతి పొందిన సంస్థలు రిజర్వ్ ఫారెస్టు ను ఆక్రమించాయా? లేదా? అక్రమ మైనింగ్, ఇతర అనధికార కార్యకలాపాల తీవ్రత ఎంతమేర ఉంది? ప్రభుత్వ ఖజానాకు ఎంతమేర నష్టం జరిగిందన్నది చెప్పాలని నిర్దేశించారు. ఓఎంసీ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు 2009 నవంబరు 19న సమ్మిరెడ్డి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గనుల తవ్వకాలను సస్పెండ్ చేయగా, ఆ ఉత్తర్వులను కొట్టేస్తూ ఏపీ హైకోర్టు 2010 ఫిబ్రవరి 26న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. దానిపై మంగళవారం జస్టిస్ జోయ్‌మల్య బాగ్చితో కలిసి విచారించిన సందర్భంగా సీజేఐ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. గత ఏడాది సెప్టెంబరు 19న జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో సుప్రీం ధర్మాసనం ఏర్పాటుచేసిన కమిటీ మరో ఆరువారాల గడువు అడగడంతో మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ అందుకు అంగీకరించారు.

సీఈసీ నుంచి ఏం ఆశించగలం?

కర్ణాటకకు చెందిన సమాజ పరివర్తన సముదాయ తరఫు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ వాదనలు వినిపిస్తూ 'అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరిగింది. దీనిపై దర్యాప్తు జరిపిన సీఈసీ 2014 వరకే రిపోర్టు దాఖలుచేసింది. తర్వాత జరిగిన దర్యాప్తు ఏమైందో తెలియదు. ఇక్కడ ఆరు గనుల లీజుదారులు సరిహద్దులు, కొండలు, ఆలయాలను ధ్వంసం చేశారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ 'సరిహద్దుల అంశం చాలా సున్నితమైనది. దురదృష్టవశాత్తు 11 ఏళ్లుగా ఏమీచేయని సీఈసీ నుంచి మనం ఇప్పటికిప్పుడు ఏం ఆశించగలం? ఇప్పుడు జస్టిస్ సుధాంశు ధులియా కమిటీ సరిహద్దుల అవతల మైనింగ్ జరిగినట్లు చెబితే సీఈసీ దర్యాప్తు మళ్లీ మొదలుపెట్టవచ్చు' అని పేర్కొన్నారు. కర్ణాటకలోని మైనింగ్ లీజుల సంస్థల తరఫు న్యాయవాది బసవప్రభు పాటిల్ వాదనలు వినిపిస్తూ 'ఇప్పుడు లీజు హద్దులను ఖరారుచేయడం ఒక్కటే మిగిలింది. ఆ బాధ్యతనే జస్టిస్ ధులియా కమిటీకి అప్పగించారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ 'అక్రమంగా దండుకున్నవారి సంగతేంటని ప్రశ్నించారు. 'ఉదాహరణకు మీరు ఆంధ్రావైపు లీజు ఇచ్చారు. కానీ లీజు పొందిన వ్యక్తి అది కర్ణాటక కిందికి వస్తుందని చెప్పి తవ్వకాలు చేపట్టి ఉండొచ్చు. అలాగే కర్ణాటక వైపు లీజులు ఉంటే అది ఆంధ్రా వైపని చెప్పి తవ్వి ఉండొచ్చు. వాళ్లు తమ పని చక్కబెట్టుకొని వెళ్లిపోయారు' అని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బదులిస్తూ 'నిజాలు బయటికి రావాలన్న ఉద్దేశంతో సుప్రీంకోర్టు కమిటీ ఏర్పాటు చేయాలని మేం కోరాం. ఆ కమిటీ ఆరు వారాల సమయం అడిగినందున అంత వరకు వేచిచూడటం మంచిది' అన్నారు. దీంతో సీజేఐ ఆ కమిటీకి ఆ గడువునిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

7 వేల ఆయా పోస్టులు భర్తీ చేస్తాం

మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు కొత్తగా 7 వేల ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు మంత్రి సంధ్యారాణి శాసనమండలి ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 'రాష్ట్రంలో 257 ఐసీడీఎస్ ప్రాజెక్టులు, 55,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. గత ఐదేళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు 70 శాతంగా ఉండని.. ప్రస్తుతం అది 96 శాతానికి పెరిగింది' అని మంత్రి వెల్లడించారు.

విచారణార్హతపై వాదనలు వింటాం

చంద్రబాబు ముందస్తు బెయిలు రద్దుపై వేసిన పిటిషన్ విషయంలో ఆళ్లకు స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారంపై నమోదుచేసిన కేసులో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంజూరుచేసిన ముందస్తు బెయిలును రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ విచారణార్హతపై వాదనలు వింటామని పిటిషనర్, వైకాపా మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టు తెలిపింది. సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది మాధవ్ ఖురానా వాదనలు వినిపిస్తూ.. పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. అభ్యంతరం ఉంటే ఏసీబీ కోర్టులో పిటిషనర్ ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలుచేసుకోవాలి తప్ప.. బెయిలు రద్దు కోసం హైకోర్టును ఆశ్రయించలేరని వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. మొదట వ్యాజ్య విచారణార్హతపై వాదనలు వింటామని స్పష్టం చేస్తూ విచారణను మార్చి 10కి వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడి హత్య

ఒడిశాలో ఓ బాలిక ఘాతుకం

అనుష్య, పరిడా

అహీం పరిడా

జయపురం, న్యూస్‌టుడే: తన ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడిని ఓ బాలిక హత్యచేసింది. ఈ ఘటన ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బొరిగుమ్మలో చోటుచేసుకుంది. ఎస్‌డీపీవో సత్యబ్రత లెంకా తెలిపిన వివరాల ప్రకారం.. సరస సమితికి చెందిన 16 ఏళ్ల బాలిక తన ప్రేమను అంగీకరించలేదని తల్లి అనుష్య పరిడా(45), సోదరుడు అహీం పరిడా(14)లను ప్రియుడితో కలిసి కాళ్లు, చేతులు కట్టేసి కడుపులో కత్తితో పొడిచి హత్య చేసింది. అనంతరం స్థానిక కాలువలో పడేసింది. సోమవారం ఈ ఘటన జరగ్గా గ్రామస్థుల అలజడితో వెలుగులోకి వచ్చింది. అహీం మృతదేహాన్ని కాలువ ఒడ్డున గుర్తించగా, అనుష్య మృతదేహం కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ గాలింపులు ప్రారంభించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

శ్రీకాకుళంలో విజృంభిస్తున్న అతిసారం

- 3 రోజుల్లో 76 కేసులు, ఒకరి మృతి
- మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేత

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో అతిసారం ప్రబలుతోంది. మూడు రోజుల్లో 76 కేసులు నమోదయ్యాయి. దీంతో సీఎం చంద్రబాబు మంగళవారం రెండుసార్లు జిల్లా అధికారులతో సమీక్షించారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందుతున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక బృందాలు నియమించారు. బాధితుల్లో మొండేటివీధికి చెందిన ఎ.సురేష్(43) మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబానికి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే శంకర్ రూ.10 లక్షల పరిహారం అందజేశారు. మరోవైపు కూడా ప్రాణాలు కోల్పోగా అతిసారంతోనే లేక మరేదైనా కారణం ఉందా అనే విషయంపై స్పష్టత లేదు.

కలుషిత నీరే కారణమా?

అతిసారం ప్రబలడానికి తాగునీరు కలుషితం కావడమే కారణమని అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని వీధుల్లో రోడ్డువిస్తరణ పనులు చేపట్టారు. పైపులైన్లు పగలడంతో వాటిలోకి మురుగునీరు చేరిందని భావిస్తున్నారు. ఎక్కువగా దమ్మల వీధి, గుడి వీధి, మంగువారితోట, కాకివీధి ప్రాంతాల్లో కేసులు నమోదవుతున్నాయి. దీంతో మురుగునీటి కాలువల్లో పైపులైన్లు, లీకేజీలు గుర్తించేందుకు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య బృందాలను రంగంలోకి దించారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు విశాఖలోని ల్యాబ్‌కు పంపారు. ప్రభావిత ప్రాంతాల్లో రెండురోజులుగా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు.

శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజారోగ్య రక్షణలో వైఫల్యం: జగన్

ఈనాడు, అమరావతి: ప్రజల ప్రాణాలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. శ్రీకాకుళంలో అతిసారం వ్యాప్తితో పలువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రక్షణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

తమిళనాట కొత్త పార్టీ ప్రారంభించిన శశికళ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు, దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త పార్టీని ప్రారంభించారు. రామనాథపురం జిల్లా కముదిలో మంగళవారం రాత్రి జరిగిన జయలలిత జయంతి వేడుకల్లో ఆమె పార్టీ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జయలలిత మరణం తర్వాత పార్టీలో చాలా సమస్యలు తలెత్తాయని, తాను ముఖ్యమంత్రిగా నియమించిన వ్యక్తి తనకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తొమ్మిదేళ్లు మౌనంగా ఉన్నానని, ఇకపై ఉండటం కుదరదని, ఇంకా మౌనంగా ఉంటే కార్యకర్తలకు, ప్రజలకు ద్రోహం చేసినట్లు అవుతుందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండా మధ్యలో అన్నా, ఎంజీఆర్, జయలలిత చిత్రాలున్నాయి. పార్టీ పేరు తర్వాత ప్రకటిస్తామని శశికళ పేర్కొన్నారు.

పార్టీ జెండాను చూపుతున్న శశికళ

వాటికి మించింది లేదు

మీ మానసిక, శారీరక ఆరోగ్యం కంటే మీకు ముఖ్యమైంది ఏదీ లేదు. ఈ విషయంలో డబ్బు, స్నేహితులు, ఆఖరికి మీ కుటుంబం కూడా తర్వాతే. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడుకునేందుకు సూర్యరశ్మి, పౌష్టికాహారం, వ్యాయామాన్ని వదలకండి.

– స్టీవ్, కంటెంట్ క్రియేటర్

వైకాపా పాపాన్ని వైఎస్‌కు చుట్టడం తగదు

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: తిరుమల పవిత్రత విషయంలో వైకాపా చేసిన పాపాన్ని వైఎస్సార్‌కు చుట్టడం కూటమి ప్రభుత్వానికి భావ్యం కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. వైకాపా కల్తీ పనులు వైఎస్ హయాంలో ప్రారంభమయ్యాయని అనడం సీఎం చంద్రబాబుకు సబబు కాదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అసెంబ్లీ వేదికగా వైఎస్‌పై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. ఆ వ్యాఖ్యలు సభ రికార్డుల నుంచి తొలగించి, చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి. వైఎస్ ఏడు కొండలను రెండు కొండలు చేయాలని ఏనాడూ అనుకోలేదు. ఏడుకొండలూ వేంకటేశ్వరస్వామివేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చింది వైఎస్సే. వైకాపా అరాచకాలకు ఆయనకు ఎలాంటి సంబంధం లేదు' అని షర్మిల అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనలు.. ★ నగరంలోని చెమ్మనగిరిపేట కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లే దారిలో ప్రధాన రోడ్డు పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆ ప్రాంత వాసులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావడంతో స్పందించి సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ★ నగరంలోని సుకర్లాబాదలో అంతర్గత డ్రెయిన్‌లో వ్యర్థాలు మేట వేసుకుపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. సమస్యను ఆ ప్రాంత వాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు. -మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

? పెడనలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో వాష్‌రూంల సౌకర్యం లేక ఇబ్బందిగా ఉంది. -షాపుల లీజుదారులు

✔ వాష్‌రూంలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. - కొండయ్య, కమిషనర్. – న్యూస్‌టుడే పెడన

105 గృహాల మంజూరు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో పీఎంఏవై 2.ఓ కింద 105 గృహాలు మంజూరైనట్లు పట్టణ గృహనిర్మాణ శాఖ ఏఈ మాధవి తెలిపారు. వీటిలో 30కి పైగా గృహాల నిర్మాణం ప్రారంభమైందని పేర్కొన్నారు. ఈ పథకం కింద కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఒక సెంటుకు పైగా సొంత స్థలం ఉన్న వారికి ఈ గృహాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరై పట్టణంలో గృహాలు నిర్మించుకోని వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు వివరించారు. పట్టణంలో మూడు లేఔట్లలో 600 గృహాలు వేర్వేరు దశల్లో ఉన్నాయని తెలిపారు.

బాలికలు మానసికంగా దృఢంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై దివ్యప్రకాష్

గూడూరు, న్యూస్‌టుడే: బాలికలు మానసిక దృఢత్వం పెంపొందించుకుని ధైర్యంగా ముందుకు సాగాలని ఎస్సై దివ్యప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలపై వేధింపులు, ఈవ్ టీజింగ్ లాంటి ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాంటి ఘటనలు జరిగితే భయపడకుండా ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోక్సో చట్టం ద్వారా కఠిన శిక్షలు విధించనున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీడీవో

గూడూరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛరథాన్ని ఎంపీడీవో శైలజాకుమారి పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. చెత్త తీసుకుని నిత్యావసర సరకులు అందించనున్నట్లు పేర్కొన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు గోపి నాగబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు తలుపుల వెంకట కృష్ణారావు, సర్పంచి మహ్మద్‌రఫీ, కూటమి నాయకులు అన్నం హరి రామకృష్ణ, యారా ప్రసాద్, ఎన్ఏబేగ్, బేతాళస్వామి పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

పామర్రు, న్యూస్‌టుడే: కొండిపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని డీపీ గూడెంలో మద్యం మత్తులో తండ్రిని హత్య చేసిన చదువుల సురేష్‌ను అరెస్టు చేసినట్లు పామర్రు సీఐ సుభాకర్ అన్నారు. సురేష్ తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువుకావడంతో మంగళవారం మహేష్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

భోగరాజు స్మారక భవనానికి తొలగని ఆటంకం

వాదోపవాదాల మధ్య కౌన్సిల్ సమావేశం

మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ ★ పాలకపక్ష తీరును ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష సభ్యులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కావాలంటున్నారు. మరి వైకాపా కార్యాలయానికి ఏం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అయినా ఇన్నేళ్లు ఏం చేశారంటూ' నగరపాలక సంస్థ ప్రతిపక్ష సభ్యులు మరకాని సమతాకీర్తి... చిత్తజల్లు నాగరాము తదితరులు ప్రశ్నించారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఎప్పటిలాగే వాదోపవాదాలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతోనే ముగిసింది.

ప్రశ్నోత్తరాలకు పట్టు..ప్రశ్నించిన ప్రతిపక్షం : అజెండాకు ముందుగానే ప్రశ్నోత్తరాలకు సమయం ఇవ్వాలని పాలకపక్ష సభ్యుడు జోగి చిరంజీవి మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మను కోరారు. దీనిపై ప్రతిపక్ష సభ్యులు జోక్యం చేసుకుని గతంలో ప్రశ్నోత్తరాల సమయం అడిగినా ఇవ్వలేదని, అదేమంటే సందేహాలు ఉంటే మేయర్ వద్దకు వెళ్లి మాట్లాడాలని సమాధానమిచ్చిన విషయం మరచిపోయారా.. ఎప్పుడూ లేని విధంగా అజెండాకంటే ముందుగా ప్రశ్నోత్తరాల సమయం ఏమిటని నిలదీశారు.

మీరు అడ్డుకున్నా.. మేము కట్టి తీరతాం : అజెండాలో 5వ అంశమైన భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి భూమి బదలాయింపు అంశంపై పాలకపక్ష సభ్యులు సుబ్బన్న మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఉత్తర్వులు, కలెక్టర్ ఆదేశాలే కానీ ఇంతవరకు యూనియన్ బ్యాంకు అధికారులు వచ్చి సంప్రదించలేదని, ఎవరో ఒకరు వచ్చి కల్పించే వసతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. దీనిపై ప్రతిపక్ష సభ్యుడు నాగరాము మాట్లాడుతూ నగరపాలక సంస్థ పాలకవర్గ గడువు ముగింపు సమయం దగ్గర పడిందని, ఇప్పటికైనా వ్యక్తిగత స్వలాభాలు, విభేదాలు వీడి అనుమతులు జారీచేస్తే పాలకవర్గానికి గుర్తింపు ఉంటుందని, అందరూ సహకరించాలని కోరారు. దీనిపై సుబ్బన్న మాట్లాడుతూ అధికారుల వివరణ ఇవ్వాల్సిందేనని, ఈలోపు అధికారులు ఆ దిశగా చర్యలుతీసుకుంటే మరో సమావేశం పెట్టుకుందామన్నారు. దీనిపై ఇరుపక్షాల మధ్య మళ్లీ వివాదం రాజుకుంది. నాగరాము మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుని స్మారకభవనాన్ని అడ్డుకోవాలని చూసినా కూటమి ప్రభుత్వం కట్టి తీరుతుందన్నారు. డిప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, నగరపాలకసంస్థ కమిషనర్ బాపిరాజు, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆరోపణలు

నగరపాలక సంస్థ పరంగా వీధి దీపాల నిర్వహణపై పర్యవేక్షణ లేకుండా పోయిందని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పాలకపక్షసభ్యులు తెలిపారు. గూటాలమ్మచెరువు వద్ద ఇళ్లు నిర్మించుకున్నవారికి పైపులైను ఏర్పాటు తదితర అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఈ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేయాలని సుబ్బన్న డిమాండ్ చేయగా, ఆయన వైకాపా హయాంలోనూ ఉన్నారని ప్రతిపక్ష సభ్యులు చెప్పారు.

ఇలా ఐతే.. రాకపోకలు ఎలా?

నగరంలోని కోనేరు సెంటరు పచారీ కొట్ల సందులో దుకాణాల ఎదుట వాహనాలు పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. ఇరువైపులా ఇలా వాహనాలు నిలిపివేయడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

డ్రెయిన్‌లో తూడు.. అల్లుకుంది చూడు..

బందరు నగరం ఆంధ్ర జాతీయ కళాశాల నుంచి బైపాస్ రోడ్డు పక్కన ఉన్న డ్రెయిన్ అధ్వానంగా తయారైంది. దీంతో ఎగువ నుంచి వచ్చే మురుగు పారుదలకు ఆటంకంగా మారుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు అంతా ఈ డ్రెయిన్ ద్వారా ప్రధానమైన శివగంగ డ్రెయిన్‌లో కలుస్తోంది. అధికారులు స్పందించి పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

వృథాగా నీరు..శివారుకు కన్నీరు..

బందరు నగరం చింతగుంటపాలెం బీబీఆస్థానా వీధి ప్రారంభంలో ప్రధాన పైపులైను నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ఎప్పటి నుంచో ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో శివారు ప్రాంతాల ప్రజలు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

–న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

స్వచ్ఛాంధ్రకు తూట్లు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేయండి అని ఉన్నతాధికారులు హితవు పలికినా కింది స్థాయి ఉద్యోగులకు చెవికెక్కడం లేదు. గోకవరం పంచాయతీ కార్యాలయం సమీప ప్రదేశం మురుగు నీరు, తాటి చెట్ల వ్యర్థాలతో నిండిపోయి దోమలకు ఆవాసంగా నిలుస్తోంది. –న్యూస్‌టుడే, గోకవరం (మచిలీపట్నంరూరల్)

మంచి నీళ్లివ్వండి మహాప్రభో..

తాగునీటి కోసం గోకవరం ప్రజలు తపిస్తున్నారు. మచిలీపట్నం ఉత్తర మండలం గోకవరంలో కొన్ని వారాలుగా కుళాయిలకు మంచి నీరు సరఫరా కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ సమీపంలోని ఆలయం వద్ద కుళాయి నీటి జాడ లేకుండా కనిపించింది. అనధికారికంగా గ్రామంలో వేసిన కుళాయిల కారణంగానే తమ ప్రాంతంలో కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదని ఆరోపిస్తున్నారు. స్పందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

–న్యూస్‌టుడే, గోకవరం (మచిలీపట్నంరూరల్)

ఉద్యోగ భద్రత కల్పించాలి



రిలే దీక్షలో అంగన్‌వాడీ కార్యకర్తలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు అన్నారు. యూనియన్ పిలుపు మేరకు బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రెండో రోజు రిలే దీక్ష చేపట్టారు. కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారి డిమాండ్లు పరిష్కరించాలని నాయకులు అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు లంకదాసుల అజయ్‌ఘోష్ పాల్గొని మద్దతు తెలిపారు.

రహదారులను ఆక్రమిస్తే ఉపేక్షించం

ఆక్రమణల తొలగింపునకు ఆదేశిస్తున్న టీపీబీవో

పెడన, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలో ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ బండి కిరణ్ స్పష్టం చేశారు. స్థానిక మచిలీపట్నం-గుడివాడ రహదారిని ఇరువైపులా ఆక్రమించి వ్యాపారం చేస్తున్న పలువురికి అధికారులు నోటీసులు జారీ చేశారు. అప్పటికప్పుడు ఆక్రమణలను వెనక్కి జరిపించారు. ఆక్రమణలతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని, దీనిపై టౌన్ ప్లానింగ్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు తాళ్ల సాయి దుర్గ, కొసనం జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లపై అవగాహన

కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీఈఈ శ్రీనివాసులు, ఉద్యోగులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో నగరంలో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించి స్మార్ట్‌మీటర్ల వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. విద్యుత్తు శాఖ డీఈఈ శ్రీనివాసులు మాట్లాడుతూ వినియోగదారులు అపోహలు వీడి తమ ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోజూ ఎంత వినియోగించుకున్నామో ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే అన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు. విద్యుత్తు వినియోగాన్ని పర్యవేక్షించడం ద్వారా విద్యుత్తుతో పాటు డబ్బు ఆదా అవుతుందని చెప్పారు.

(c) eenadu

ఒంటరిగా ప్రయాణించాలంటే భయం..!

నేనో ప్రైవేటు ఉద్యోగిని. మూడునెలల క్రితం పదోన్నతి వచ్చింది. ఉద్యోగరీత్యా భారతదేశంలోని అన్ని బ్రాంచ్ ఆఫీసులకూ ప్రయాణిస్తూ ఉండాలి. కానీ, ఇదివరకు నేను సోలో ట్రావెలింగ్ చేసింది అరుదు. దాంతో ప్రయాణాల్లో భయం ఆవరిస్తోంది. అది పోవాలంటే?

- ఓ సోదరి

విమానాశ్రయాలూ, రైల్వేస్టేషన్లలో ఇప్పుడు ఎక్కడ చూసినా మహిళా ప్రయాణికులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా, ఉద్యోగరీత్యా మహిళలు మునుపటి కంటే ఎక్కువగా ప్రయాణాలు చేస్తున్నారు. వాళ్లకి అనుకూలంగానే రవాణా వ్యవస్థలోనూ మార్పులు చేస్తూ వస్తున్నాయి. అయితే, ఇంకా కొన్నిచోట్ల పూర్తిగా అందుబాటులో లేవు. కాబట్టి స్వీయ రక్షణ మీ బాధ్యత. అందుకే ఒంటరిగా ప్రయాణించేటప్పుడు ఈ క్రింది విషయాల్ని గమనించుకోండి.

1. హ్యాండ్ లగేజ్ ఎప్పుడూ అనుకూలంగా, బరువు తక్కువగా ఉండేట్టు చూసుకోండి. బ్యాగులో క్రెడిట్, డెబిట్ కార్డులు ఉంచుకోండి. వీలైనంత వరకూ నగదు తక్కువగా ఉండేట్టు చూసుకోండి.
2. ఒంటరిగా ప్రయాణిస్తున్నట్టు, మొదటిసారి సంబంధిత ప్రాంతాన్ని సందర్శిస్తున్నట్టు ఎవరికీ తెలియకపోతే మంచిది. ఒక్కరే వెళుతున్నారా? మొదటిసారా లాంటి ప్రశ్నలు ఎదురైతే కాదని చెప్పడమే మేలు.
3. ఇంటి నుంచి బయలుదేరే ముందే మీ ప్రయాణ ప్రణాళికని పూర్తిగా సిద్ధం చేసుకోండి. ఎక్కడికి వెళ్లాలి, చుట్టుపక్కల హాస్పిటల్స్, పోలీస్ స్టేషన్లు వంటి వాటి గురించి తెలుసుకోండి. ఆఫీస్ క్యాబ్‌లో వెళ్లినా సరే జీపీఎస్ ఆన్ చేసుకోవడం మరిచిపోకండి.
4. కంగారు పడుతూ ఒకే చోట ఉండిపోకండి. దీనివల్ల అపరిచితులకు అవకాశం ఇచ్చిన వాళ్లం అవుతాం. జనాలు తిరుగుతున్న ప్రాంతంలోనే ఉండండి. అలానే, ఖరీదైన వాటిని ధరించకుండా సాదాగా ఉండేందుకు ప్రాధాన్యం ఇవ్వండి.
5. హోటల్, స్టేషన్లలో చెక్ ఇన్ చేసేటప్పుడు మీ గది వివరాలు మీ వరకే పరిమితం అయ్యేలా చూసుకోండి. మహిళా సిబ్బంది మిమ్మల్ని గైడ్ చేసేలా జాగ్రత్తలు తీసుకోండి. రూమ్‌లోకి వెళ్లాక కూడా, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోండి.

ఒంటరి ప్రయాణాల్లో చాలా జాగ్రత్తలు అవసరం. మీకేమీ కాదని ఇవన్నీ చేసుకోవాలి. అప్పుడే సురక్షిత భావన కలుగుతుంది. వెళ్లిన పని సకాలంలో పూర్తిచేసుకుని రాగలుగుతారు.

డియర్ వసుంధర

కవితా గూడపాటి

వసుంధర

vasundhara@eenadu.in

పెన్సిల్ తిన్నగా పట్టుకోవడమైనా రాదు... ఆ పిచ్చి గీతల్లోనూ ఎన్నెన్ని బొమ్మలు చూపేవాళ్లమో! నెమ్మదిగా పిట్ట, ఇల్లు, హరివిల్లు అని మొదలుపెట్టి... మన సృజనాత్మకతకి రెక్కలిచ్చేవాళ్లం. ఆ అందమైన ఊహాలోకం తరవాత హాబీ, టైమ్‌పాస్‌గా మారి... ఎప్పుడు కనుమరుగవుతోందో కూడా తెలీదు. చాగంటి సాధనకీ ఇది అనుభవమే! అందుకే చిన్ననాటి ఆ అనుభూతిని 'నగుమోము'తో అందరికీ తిరిగి పరిచయం చేస్తూ ఆర్ట్‌ప్రెన్యూర్‌గా మారారామె. అదెలాగో మనతో పంచుకున్నారిలా...

నగుమోము చూడాలని!

మాది హైదరాబాద్. చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడమంటే నాకెంతో ఇష్టం. కానీ, పెద్దయ్యాక... చదువు, కెరియర్‌లే నా ప్రాధాన్యం అయిపోయాయి. మధ్యతరగతి కుటుంబం కదా! నాన్న లేకపోవడంతో అమ్మ ఇంకా గట్టిగా నా చదువు మీద దృష్టిపెట్టారు. ఏ ఇబ్బంది లేకుండా త్వరగా సెటిల్ అవ్వాలనేది ఆవిడ తాపత్రయం. అందుకే, నేను మొదట డాక్టర్ కావాలనుకున్నా. ఆపై బ్యాచిలర్స్, మాస్టర్స్, యూపీఎస్సీ ప్రిపరేషన్... ఇలా సాగిపోయా. చదువుల్లో టాపర్‌గా అమ్మని సంతోషపెట్టాను. కానీ, నేను మాత్రం సంతోషంగా ఉండలేకపోయాను. ఒక్కసారి జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే... నా సంతోషం ఆర్ట్‌లోనే ఉందనిపించింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో పీజీ, పీహెచ్‌డీ చేశా. ప్రస్తుతం ఇండో-జర్మన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్‌లో క్లైమేట్ చేంజ్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నా. ప్రకృతికి హాని చేయని హస్తకళలకు ప్రాధాన్యం ఇవ్వాలనేదే నా లక్ష్యం. అందుకే 'నగుమోము' స్థాపించి ప్రజల్లో సస్టైనబుల్ ఆర్ట్‌పై అవగాహన కల్పిస్తున్నా. కలంకారీ, చెరియాల్, బాతిక్... వంటి భారతీయ సంప్రదాయ హస్తకళలకు పూర్వ వైభవాన్ని తేవాలనేది నా కోరిక. గ్రామీణ కళాకారులకు, ముఖ్యంగా మహిళలకు ఆదాయం కల్పించడం, వీటికోసం నిధులు సేకరించడం... వంటివెన్నో చేస్తున్నా. ఇందుకోసం కళాకారులు, స్వచ్ఛంద, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నా.

నిపుణుల సాయంతో...

మా నగుమోము నిర్వహించే వర్క్‌షాప్‌ల కోసం ఆయా కళలకు ప్రసిద్ధమైన ప్రాంతాల నుంచి మెటీరియల్ తెప్పిస్తాం. అందులో నిపుణులైన కళాకారులనూ రప్పిస్తున్నా. చింతగింజల పొడితో బొమ్మలు వేయడం, పాలల్లో ముంచిన వస్త్రం మీద రస్టిక్ బ్లర్‌తో పెయింటింగ్ చేయడం వంటివన్నీ కొత్తగా నేర్చుకునేవాళ్లకి ప్రత్యేకమైనవే. వర్క్‌షాప్‌లు, రిక్రియేషన్ కమ్యూనిటీలు, కల్చరల్ క్లబ్స్, ఎగ్జిబిషన్లు, కార్పొరేట్స్... ఇలా ఒకటేమిటి ఎక్కడ వేదిక దొరికినా... ఈ కళల్ని నేర్పించడానికి నా వంతుగా ప్రయత్నిస్తున్నా. హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్‌లో వందల మంది ఔత్సాహికులకు నేర్పించగలిగా. తాజాగా జరిగిన ఇంటర్నేషనల్ యూత్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌లోనూ వర్క్‌షాప్ నిర్వహించా.

కష్టాలెన్నో దాటి...

ఈ ప్రయాణంలో కష్టాలు లేకపోలేదు. మెటీరియల్ 21 రోజుల ముందు నుంచే ప్రిపేర్ చేయాలి. కళ అంటే సృజనను మార్చకుండా తెలియాలి. ఈజీ ఆర్ట్‌కి అలవాటు పడిపోయారు కాబట్టి ప్రజల మైండ్‌సెట్ మార్చాలి. ఓ పక్క పీహెచ్‌డీ, మరో పక్క కెరియర్‌ని సమన్వయం చేసుకుంటూ ఈ అభిరుచినీ కొనసాగించడం అంత సులువేం కాదు. కుటుంబ సహకారంతోనే చేయగలుగుతున్నా. ఈ కళ ద్వారా అందరినీ నగుమోముతో చూడాలనుకుంటున్నా.

కూర్చొని నిల్చోగలిగితే... ఫిట్!

నేటి జీవనశైలి కారణంగా చిన్న వయసులోనే అనారోగ్యాలు పలకరిస్తున్నాయి. ప్రతి చిన్న మార్పుని గమనించుకోవాల్సిందే. అయితే మనం ఆరోగ్యంగా ఉన్నామా లేదా అన్న విషయాన్ని ఒక చిన్న యాక్టివిటీతో నిర్ధారించుకోవచ్చు అంటున్నారు పరిశోధకులు. నేల మీద కూర్చొని ఏ ఇబ్బంది లేకుండా సులభంగా లేచి నిల్చోగలిగితే... ఆరోగ్యంగా ఉన్నట్లేనని చెబుతున్నారు. బ్రెజిల్, ఫిన్లాండ్, కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఉమ్మడిగా ఓ అధ్యయనం చేశారు. ఇందుకోసం 46-75 ఏళ్ల మధ్య వయసులో ఉన్న 4200 మంది ఈ పరిశోధనలో భాగమయ్యారు. వీళ్లను 12 ఏళ్లపాటు పరిశీలనలో ఉంచారు. కూర్చున్న చోటునుంచి ఏ ఊతమూ లేకుండా, ఇబ్బంది పడకుండా నిల్చున్నవాళ్లకు ఆయుర్దాయం ఎక్కువని తేలిందట. అలా లేవలేనివారికి గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువట. ఈ చిన్న యాక్టివిటీ ద్వారా ఏరోబిక్ ఫిట్‌నెస్, ఫ్లెక్సిబిలిటీ, బ్యాలెన్స్, గ్రిప్ స్ట్రెంత్ వంటి వాటన్నింటినీ పరీక్షించుకోవచ్చు అంటున్నారు. లేవలేనివారు ఇబ్బంది పడకుండా వ్యాయామాలు చేయడం, మెట్లు ఎక్కడం, ఇంట్లోపని చేయడం లాంటివి అలవాటు చేసుకోవాలి. పెద్దవాళ్లు మనవలూ, మనవరాళ్లతో ఆడుకుంటూ కింద కూర్చొని లేస్తుంటే శరీరంలో ఫ్లెక్సిబిలిటీ, బలం పెరుగుతాయని చెబుతున్నారు వైద్యులు.

ఎలిఫెంట్ పేరెంటింగ్ పాటిస్తారా!

పిల్లల పెంపక విధానాలు ఎన్నో రకాలు. తాజాగా 'ఎలిఫెంట్ పేరెంటింగ్' అంటూ ఓ కొత్త విధానం చర్చలోకి వచ్చింది. దీన్లో ఏం ఉంటుందంటే....

టైగర్ పేరెంటింగ్... లక్ష్య సాధన దిశగా సూటిగా సాగే విధానం ఇది. దీన్లో తల్లిదండ్రులదే పైచేయి. హెలికాప్టర్ పేరెంటింగ్‌లో తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలపై ఓ కన్నేసి ఉంచుతారు. దీనివల్ల వాళ్లను తప్పులు, పొరపాట్లు చేయకుండా, రిస్కు తీసుకోనీయకుండా నియంత్రిస్తుంటారు. దాంతో పిల్లలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేరు. అదే, జెల్లీఫిష్ పేరెంటింగ్‌లో పిల్లలపైన తల్లిదండ్రులకు నియంత్రణ తక్కువగా ఉంటుంది. వాళ్లు ఆడిందే ఆట, పాడిందే పాటలా సాగుతుంది. ఎలిఫెంట్ పేరెంటింగ్‌లో ఫ్లెక్సిబిలిటీ ఎక్కువ. పిల్లలపై సహానుభూతి, ప్రేమను చూపడం, వాళ్ల అవసరాలకు తగ్గట్టు ఆ క్షణంలో స్పందించడం దీన్లో ప్రధానం. వాళ్లను స్వతంత్రంగా ఎదగనిస్తూనే అవసరమైనప్పుడు తల్లిదండ్రుల మార్గనిర్దేశం అందేలా ఉంటుంది. దీనివల్ల పిల్లలకు భావోద్వేగపరమైన మద్దతు లభిస్తుంది. అలానే వాళ్ల వేగానికి తగ్గట్టుగా నేర్చుకునే స్వేచ్ఛనిస్తారు. చదువులూ, క్రీడల్లో భాగం కావడం వరకే కానీ ర్యాంకులూ, విజేతలుగా నిలవడం గురించి ఒత్తిడి చేయరు. అదే సమయంలో తల్లిదండ్రుల నుంచి అందే భద్రత, ప్రోత్సాహం వాళ్లను వివిధ అంశాల్ని నేర్చుకునేలా చేస్తుంది. ఈ వాతావరణంలో పిల్లలు తమ ఆలోచనల్ని స్వేచ్ఛగా పంచుకుంటారు. పిల్లల సమస్యల్ని తాము పరిష్కరించడంకంటే వాటిని తెలుసుకోవడం, సలహాలు, సూచనలు ఇవ్వడం దీన్లో ముఖ్యం. పిల్లలూ, తల్లిదండ్రుల మధ్య మంచి కమ్యూనికేషన్ ఉంటుంది. ఆత్మవిశ్వాసంతో, భావోద్వేగ నియంత్రణతో పిల్లలు పెరుగుతారు. ఎలిఫెంట్ పేరెంటింగ్ విధానంలో మంచి విషయాలెన్నో ఉన్నా, ఇదే సరైనదని కచ్చితంగా చెప్పలేమంటారు నిపుణులు. పిల్లలు ఎవరికి వాళ్లు ప్రత్యేకమని... వాళ్ల వయసు, స్పందించే తీరునిబట్టి పేరెంటింగ్ విధానాల్ని ఎంపికచేసుకోవాలంటారు.

గుర్తించడమే అసలు సమస్య!

నేటితరం ఉద్యోగినుల్లోనే కాదు విద్యార్థినులూ, గృహిణుల్లోనూ ఒత్తిడి ఎక్కువేనంటున్నాయి పలు అధ్యయనాలు. కాకపోతే దాన్నసలు కొందరు పని ఒత్తిడిగానే గుర్తించరట. అది పెరిగి తీవ్ర రూపం దాల్చకముందే గుర్తించి అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. మీలో ఈ లక్షణాలేమైనా ఉన్నాయేమో గమనించుకోండి.

- ఒత్తిడెక్కువైతే నిద్రపట్టదంటారు చాలామంది. కానీ, మితిమీరిన అలసటతో త్వరగానే నిద్రపోయినా అంతే త్వరగా మెలకువ వచ్చేస్తుందట. లేదంటే తరచూ పీడకలలతో కలత నిద్రకు గురవుతున్నా... మీలో ఏదో ఆందోళన, ఒత్తిడి ఉన్నట్లేనని గుర్తించండి. రోజూ కాసేపు ధ్యానంచేస్తే ప్రాథమిక దశలోనే దీని బారిన పడకుండా ఉంటారు.
- ఒత్తిడి పెరిగేకొద్దీ ఆహారం... అందులోనూ తీపి పదార్థాలు ఎక్కువగా తినాలనే ఆలోచన కలుగుతుందని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు చెప్పాయి. కానీ, అదే సమయంలో కొందరు ఆకలినీ కోల్పోతుంటారు. అతిగా ఆకలి వేస్తే స్వీట్లకు బదులు ఖర్జూరం, ఎండు ఫలాలు, పండ్ల ముక్కలు, మంచినీళ్లు వంటివి తీసుకోండి. ఈ స్ట్రెస్ నుంచి బయటపడాలంటే కాసేపు ఆరుబయట నడవండి. దీర్ఘంగా శ్వాస తీసుకోండి. ఇవన్నీ చేసినా ఫలితం లేదంటే సైకాలజిస్ట్ లేదా సైకియాట్రిస్ట్‌ని కలవడానికి సందేహించకండి.

మీకు తెలుసా!

రుతువిరతి తర్వాత మహిళలకు హృదయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందట. ఈస్ట్రోజన్ స్థాయిలు తగ్గడం వల్ల గుండె ధమనుల్లో కొవ్వు, కాల్షియం, ఇతర పదార్థాలన్నీ పేరుకోవడమే ఇందుకు కారణమని అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ తమ నివేదికలో వెల్లడించింది.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి

24న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,62,590	1,48,700	2,65,962
విజయవాడ	1,59,080	1,48,300	2,75,000
ప్రొద్దుటూరు	1,57,600	1,44,990	2,73,200
రాజమహేంద్రవరం	1,61,780	1,48,300	2,90,000
విశాఖపట్నం	1,61,800	1,48,300	2,75,000
తమిళనాడు	-----	1,48,900	2,90,000

సన్మానం అందుకున్నవారితో ప్రతినిధులు

కులమతాలకు అతీతంగా కృషి చేయాలి

మచిలీపట్నం (గొడుగుపేట): ప్రతి ఒక్కరూ కుల, మతాలకు అతీతంగా సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని దివ్యజ్ఞాన సమాజం ప్రతినిధి, ఆడిటర్ శేషాచార్యులు అన్నారు. మంగళవారం సాయంత్రం ఈడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచ శాంతి కోసం దివ్యజ్ఞాన సమాజం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వయం కృషితో ఎదగాలని, ఆత్మజ్ఞానం పొందాలన్నారు. సంస్థ జాతీయ స్పీకర్, విశ్రాంత అధ్యాపకులు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ మతాల సర్వోన్నత సత్యాన్ని అందరూ గ్రహించాలన్నారు. సంస్థ మచిలీపట్నంశాఖ అధ్యక్షుడు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ యువతలో నైతిక విలువలు పెంచడం కోసం దివ్యజ్ఞాన సమాజం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతినిధులు కొత్తగుండు రమేష్, కారుమూరి రాజేంద్రప్రసాద్, ఎం.సత్యనారాయణ, గుడిశేవ మురళి తదితరులు ప్రసంగించారు. రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న వారిని సత్కరించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No. 14/2024 in O.S.No. 220/2016
Between:
సమ్మెట రాంబాబు ... D.Hr
మరియు
కోమటి వెంకట జయరామ్ ... J.Dr

పై నెంబరు డిక్రీ బాకీని రాబట్టుకునే నిమిత్తం J.Dr యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలోగల యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 18-03-2026న ఉదయం గం. 10.30 ని.ల నుండి పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. కావున పాడుకొనదలచినవారు సదరు వేలం పాటలో పాల్గొని వేలం షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, పెడన సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా పెడన మండలం, నందమూరు గ్రామంలోని R.S. No. 108-1రు నందు గల య. 2.07 సెంట్లు మరియు R.S. No.108-2రు నందు య. 0.51 సెంట్లు వెరశి పూరా య. 2.58 సెంట్లు ఏకబిట్టుగా గల శేరీ మెరక భూమికి గల **హద్దులు: తూర్పు:** పరసా రామారావు మరియు కానూరి లింగమూర్తి, **దక్షిణం:** పంటబోదె & కానూరి లింగమూర్తి, **పడమర:** సమ్మెట సుజాత, **ఉత్తరం:** పరసా నాగమల్లేశ్వరరావు.

D.Hr కిమ్మత్తు: Rs.8,00,000/-
అమీనా కిమ్మత్తు: Rs.30,00,000/-
మార్కెట్ విలువ: Rs.33,54,000/-

NOTE: సదరు షెడ్యూలు ఆస్తిపై E.C. దాఖలా తనఖా బాకీకి లోబడి వేలం జరుగును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సోడిశెట్టి బాలాజీరావు
D.Hr తరపున అడ్వకేట్, మచిలీపట్నం

మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I. P. No. 22/2023
Between:
MAR జ్యువెలరీ మరియు వర్క్ షాప్, రిప్రజెంటెడ్ బై ప్రొప్రయిటర్ మానేపల్లి అప్పారావు ....పిటీషనర్
మరియు
మురాల అశోక్ కుమార్ & అదర్స్ ... రెస్పాండెంట్స్
To 1వ రెస్పాండెంట్ : మురాల అశోక్ కుమార్, S/o వెంకటేశ్వరరావు, R/o. MIG-175, APHB కాలనీ, మచిలీపట్నం.

పై నెంబరు I.P.లో 1వ రెస్పాండెంటు అయిన మీకు నోటీసు నిమిత్తం ది.10-03-2026నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10.30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సోడిశెట్టి బాలాజీరావు
పిటీషనర్ తరపున న్యాయవాది, మచిలీపట్నం.

ఊళ్లకు స్వచ్ఛరథాలు.. చెత్తకు సరకులు

న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు

ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రం ఉందన్న మాటే కానీ వైకాపా ప్రభుత్వ పాలనలో పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంది. ఇంటి వద్దే వ్యర్థాల విభజన చేస్తున్నారు. చెత్త తీసుకుని సరకులు ఇచ్చేలా స్వచ్ఛ రథాలను ప్రారంభిస్తున్నారు.

ఉన్నా.. ఉపయోగం లేక..

బందరు, పెడన నియోజకవర్గాల్లో ఏ గ్రామంలో సంపద కేంద్రాన్ని చూసినా వాటిల్లో షెడ్లు కనిపిస్తాయి. 2014-2019 తెదేపా ప్రభుత్వ హయాంలో వీటిని ఏర్పాటు చేశారు. వైకాపా పాలనలో ఇవన్నీ నిర్వీర్యమయ్యాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కేంద్రాలకు తరలించేందుకు పంపిణీ చేసిన ఈ-ఆటోలు, రిక్షాలు తుప్పు పట్టి పాడైపోయాయి. చెత్త సేకరించే సిబ్బందికి సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారిలో చాలా మంది మానేశారు. రెండు నియోజకవర్గాల్లో అక్కడక్కడా ఒకటి, రెండుచోట్ల మినహా ఎక్కడా ఎరువు తయారీ జరగడం లేదు. కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టి ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో ఇళ్ల నుంచి చెత్త సేకరించేలా చర్యలు తీసుకున్నారు.

గూడూరులో స్వచ్ఛరథం వద్ద సరకులు తీసుకుంటూ..

ప్రతి మండలానికి ఒకటి..

ఇంటి వద్దే తడి, పొడి చెత్త విభజన జరిగేలా చూస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నారు. ఆ రథాల ద్వారా వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజల నుంచి సేకరించిన చెత్తకు నిత్యావసర సరకులు అందిస్తున్నారు. ఇప్పటికే బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఒక రథం పర్యటిస్తోంది. తాజాగా గూడూరు మండలంలో ఓ రథాన్ని అధికారులు ప్రారంభించారు. పెడన మండలానికి చెందిన రథాన్ని సిద్ధం చేయగా ఈ నెల 28న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేతులమీదుగా ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోనూ ఆ దిశగా కార్యాచరణ చేపట్టారు. ఈ రెండు మండలాల్లోనూ త్వరితగతిన ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ముమ్మరంగా అయోధ్య దివ్య రామమందిర ధర్మప్రచారం

మాట్లం(కృత్తివెన్ను): మండలంలోని మాట్లం గ్రామ పంచాయతీలో అయోధ్య దివ్య రామ మందిర ధర్మప్రచార రథంతో మంగళవారం ఘనంగా ప్రచారం నిర్వహించారు. హిందూ బంధువులంతా ఎంతో వైభవంగా ఈ రథాన్ని తిలకించి పూజలు చేయడం చాలా సంతోషంగా ఉందని జిల్లా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ధర్మప్రచార సహప్రముఖ్ బస్వాని నీలాజలం అన్నారు. కృత్తివెన్ను పంచాయతీలోని పల్లెపాలెం గ్రామంలో ఈ ప్రచారం నిర్వహించారు.

అశ్రుతాంజలి

మంచితనం, ఆత్మీయత, అనుబంధాలతో అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకుని, పరోపకారిగా, సేవాతత్పరులుగా పేరుగాంచిన కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారి మరణానికి చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ..

కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారు
(W/o. కీ॥శే॥ పంచపర్వాల వెంకట సుబ్బారావు గారు)
సర్కారుతోట, మచిలీపట్నం

పంచపర్వాల సత్యనారాయణరావు
పంచపర్వాల శేషగిరిరావు
పంచపర్వాల ప్రభాకరరావు
పంచపర్వాల సాయి
రాజా గోల్డ్ కవరింగ్ జ్యూయలర్స్, మచిలీపట్నం

ఆలపాటి రమేష్
అధ్యక్షులు: మచిలీపట్నం రోల్డ్ గోల్డ్ అసోసియేషన్
ఛైర్మన్: శ్రీ సువర్చల సమేత ఆంజనేయస్వామి దేవస్థానం, పరాసుపేట.

పంచపర్వాల వెంకట సుబ్బారావు
డా॥ పంచపర్వాల కృష్ణ
రాజా గోల్డ్ ప్లేటింగ్ జ్యూయలర్స్

పంచపర్వాల వెంకట సుబ్బారావు
పంచపర్వాల పవన్‌కుమార్
రాజా గోల్డ్ కవరింగ్ కంపెనీ

పంచపర్వాల నాగశేష ప్రసాదరావు (శేషు)
పంచపర్వాల మణికంఠ
వంశీకృష్ణ ఎలక్ట్రానిక్స్, మచిలీపట్నం

విద్యార్థితో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ప్రతిభచాటిన విద్యార్థికి ప్రశంసలు

మచిలీపట్నంకార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎస్.నవకిషాంత్ 52వ గణిత ఒలింపియాడ్ పరీక్షల్లో జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు కె.సుబ్బారావు, జె.రాజేశ్వరి తదితరులు విద్యార్థిని అభినందించారు. మిగిలిన విద్యార్థులు కిషాంత్‌ను ఆదర్శంగా తీసుకుని రాణించాలని సూచించారు.

సునందను ఆదర్శంగా తీసుకోవాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నంకు చెందిన యోగా సభ్యురాలు సీహెచ్ సునంద మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన 45వ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానం సాధించారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఉదయపు నడకమిత్ర మండలి భవనంలో ఏపీ యోగా సభ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆమెను సత్కరించి అభినందించారు. యోగా గురువు గురునాథబాబు, కలెక్టర్ తండ్రి కృష్ణయ్యశెట్టి తదితరులు ఆమెను అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సునందను సత్కరించి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

సీఎం సహాయనిధి పేదల పాలిట వరం

39వ డివిజన్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలపాలిట వరమని పలువురు కూటమి నాయకులు అన్నారు. మంగళవారం నగరంలోని వివిధ డివిజన్లలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన సాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. 39వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, నాయకులు కట్టా అంజిబాబు, మెట్టు సూర్యనారాయణ, పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 47వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, నాయకులు ఆళ్ల మాధవ, 50వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పడమట నాగరాజు, గోవిందు, గౌరి తదితరులు పాల్గొన్నారు.

చిట్టిపాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: అరిశేపల్లి పంచాయతీ చిట్టిపాలెం గ్రామంలో అనారోగ్యానికి గురైన చండిక పద్మావతికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.31,377 చెక్కును తెదేపా నాయకులు మంగళవారం అందజేశారు. పద్మావతి అనారోగ్యం గురించి మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లగా సాయం మంజూరు చేయించారు. తమ కష్టాన్ని గుర్తించి సాయం అందించిన మంత్రికి, తెదేపా నాయకులకు పద్మావతి, ఆమె భర్త సుబ్బారావు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అమ్మిరెడ్డి శివయ్య, చండిక ఉపేంద్ర పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మాకు అత్యంత ఆప్తులు, మిత్రులు, మనసున్న మంచి మనిషి శ్రీ పంచపర్వాల శ్రీనివాసరావు గారి తల్లి గారు ఆత్మీయ పలకరింపుతో అందరినీ తనవారుగా చేసుకున్న కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారి మరణానికి చింతిస్తూ... దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారు
(W/o కీ॥శే॥ పంచపర్వాల వెంకట సుబ్బారావు గారు)
సర్కార్‌తోట, మచిలీపట్నం

అక్కుమహంతి రాజా - రాష్ట్ర అధ్యక్షులు: శిష్టకరణం సంక్షేమ సంఘం, రాష్ట్ర కన్వీనర్: TDP శిష్టకరణం సాధికార సమితి, చిత్ర గోల్డ్ కవరింగ్ వర్క్స్
సింహాద్రి నానాజీ - ప్రొ॥ సుకన్య గోల్డ్‌కవరింగ్ వర్క్స్, నిజాంపేట, మచిలీపట్నం
వినుకొండ అనిల్‌కుమార్ - సిద్ధాంతి, మచిలీపట్నం
తోట తారక - ప్రొ॥ సీతారామ జ్యూయలరీ, కోనేరు సెంటర్, మచిలీపట్నం
వూచ వెంకట కృష్ణార్జునరావు - ప్రొ॥ G.V.G. మైక్రో ప్లేటింగ్ వర్క్స్, మచిలీపట్నం
బడే సుబ్రహ్మణ్యం - ప్రొ॥ స్నేహిత ఫ్యాషన్ జ్యూయలరీ, మచిలీపట్నం
పొట్లూరి నరేంద్ర - ప్రొ॥ నరేంద్ర గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం
టేకి బుజ్జి - నిజాంపేట, మచిలీపట్నం
అనుముకొండ ప్రసాద్ - ప్రొ॥ దివ్యశ్రీ గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం
మెండు శ్రీనివాసరావు - ప్రొ॥ శ్రీను గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం
వూచ రామాంజనేయులు (రాజేష్) - ప్రొ॥ దేవి వైభవ్ గోల్డ్, మచిలీపట్నం
వూచ ప్రసాద్ - ప్రొ॥ శ్రీ అక్షయ గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం
చలమలశెట్టి శ్రీరంగం శ్రీనివాసరావు - ప్రిన్స్ ఇమిటేషన్ జ్యూయలరీ, మచిలీపట్నం

శ్రద్ధాంజలి

మాకు అత్యంత ఆప్తులు, మనసున్న మంచి మనిషి శ్రీ పంచపర్వాల శ్రీనివాసరావు గారి తల్లి గారు, పెద్దలు, ఆత్మీయ పలకరింపుతో అందరి మనస్సులు చూరగొన్న కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారి మరణానికి చింతిస్తూ.. దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..

కీ॥శే॥ శ్రీమతి పంచపర్వాల నాగమణి గారు
(W/o. కీ॥శే॥ పంచపర్వాల వెంకట సుబ్బారావు గారు)
సర్కార్‌తోట - మచిలీపట్నం

చలమలశెట్టి నరసింహారావు - మేనేజింగ్ డైరెక్టర్: గోల్డ్‌ప్రిన్స్ జ్యూయలరీ ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మచిలీపట్నం
చలమలశెట్టి దుర్గా వర ప్రసాదరావు - ప్రొ॥ యశశ్రీ గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం
ధవలేశ్వరపు ఉమా మహేశ్వరరావు - ప్రొ॥ శ్యామ్ గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం
లయన్ G. రామబ్రహ్మం - ప్రొ॥ విజేత గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం
సాధు గాంధీ & సన్స్ - సుధ గోల్డ్ కవరింగ్ ఇండస్ట్రీస్, మచిలీపట్నం
పెద్దేటి వెంకట సుబ్బారావు - ప్రొ॥ బాబా గోల్డ్ కవరింగ్ వర్క్స్, మచిలీపట్నం

పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?

- విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి అవకాశం
- 'ఈనాడు-ఈటీవీ-విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ నేడు

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీపడుతూ ఎవరికి వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తూ వారికి ప్రత్యేకంగా బోధిస్తోంది. అయితే పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయో.. మంచి మార్కులు వస్తాయో లేదో అన్న ఆందోళన అందరిలోనూ ఉంటుంది. తల్లిదండ్రులకు కూడా అనేక సందేహాలు ఉంటాయి. ఎలా చదివితే మంచి మార్కులు వస్తాయి. ఏయే సబ్జెక్టులకు ఎంత సమయం కేటాయించాలి. ఏయే చాప్టర్లలో ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నల సరళి ఎలా ఉంటుంది. సిలబస్ బయట ప్రశ్నలు కూడా అడిగే అవకాశం ఉంటుందా? మంచి మార్కులు సాధించడం ఎలా? ఇలాంటి అనేక సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఈనాడు కల్పిస్తోంది. దీనిలో భాగంగానే జిల్లా విద్యాశాఖాధికారితో పాటు ఆయా సబ్జెక్టుల నిపుణులు అందరినీ ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఉపాధ్యాయుడు	సబ్జెక్టు	ఫోన్ నంబరు
కె.బాలకృష్ణ	తెలుగు	99492 77148
జె.ఝాన్సీ	హిందీ	92929 09954
పీఆర్ సీతాకుమారి	ఇంగ్లిష్	92904 50064
కె.వాహిని	గణితం	94417 63640
కె.అంకాలరావు	భౌతికశాస్త్రం	93904 31368
వీఎన్ మల్లేశ్వరరావు	జీవశాస్త్రం	98495 01067
షాజహాబేగం	సాంఘికశాస్త్రం	92939 45076
బి.దుర్గాదీప్తి	సంస్కృతం	98494 58556
ఎండీ హనీఫ్	ఉర్దూ	89786 77336

ఫోన్ చేయాల్సిన సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తేదీ: ఫిబ్రవరి 25, బుధవారం

28 వరకే జీవన ప్రమాణ ధ్రువీకరణ

ఎన్టీఆర్ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాల (లైఫ్ సర్టిఫికెట్) నమోదు గడువు ఈ నెల 28 వరకే ఉందని, ఇంకా దాఖలు చేయని వారు సత్వరమే అందజేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ ఐకాస అమరావతి అనుబంధం) నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సూర్యారావు, కె.ఎస్.హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

కుదిరితే బేరం.. కదిలేను దస్త్రం!

- రెవెన్యూలో పని కావాలంటే చెయ్యి తడపాల్సిందే
- తహసీల్దార్ల నుంచి సర్వేయర్ల వరకు వసూళ్లు...

ఈనాడు, అమరావతి

రెవెన్యూ శాఖలో పని జరగాలంటే చేయి తడపాల్సిందే. పాస్‌పుస్తకం మొదలు సర్వే వరకు ఏ పత్రం కావాలన్నా ఇచ్చుకోవాల్సిందే. కాదంటే ఎక్కడ లేని కొర్రీలు పెట్టి వేధిస్తున్నారు. తహసీల్దార్లు తెర వెనుక ఉండి.. వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులతో కథ నడిపిస్తున్నారు.

ఆ అధికారి లెక్కే వేరు..

★ తిరువూరు డివిజన్‌లో అనువంశిక భూముల ఆన్‌లైన్ ప్రక్రియలో భారీగా దండుకుంటున్నారు. గతంలో రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో వారసుల విభేదాలను సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో దరఖాస్తును ఆన్‌లైన్ చేసి.. పాస్‌పుస్తకం తెప్పించేందుకు రూ.50 వేలుపైనే బాదేస్తున్నారు. ఓ రెవెన్యూ ఉన్నతాధికారికి భారీగా మామూళ్లు వెళుతున్నాయి. కొన్నాళ్ల కిందట ఆయన ఓ ఉద్యోగిని ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. తన ఉద్యోగం పోతుందని వేడుకున్నా వినకపోవడంతో ఆమె సెలవుపై వెళ్లిపోయారు.

★ ఎకరం పాస్‌పుస్తకం ఇవ్వాలంటే.. రూ.5-10 వేలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు రూ.10-15 వేలు, సర్వేకు రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. కాదూకూడదంటే దరఖాస్తు చెత్తబుట్టలోకే.. రైతులు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోరు. చేసేది లేక ఇచ్చేస్తున్నారు.

వీరంతే.. మారరింతే..

★ నందిగామ రెవెన్యూలో... కొన్ని గ్రామాల్లో పాస్‌పుస్తకం దరఖాస్తుకు ముందే రూ.5 వేలు ఇవ్వాలి. సర్వేయర్‌కు రాచమర్యాదలు చేసి రూ.3-5 వేలు ఇస్తేనే సర్వే చేసేది. గతంలో నందిగామ రెవెన్యూ కార్యాలయంలో అనిశా తనిఖీల్లో దస్త్రాలు, విధి నిర్వహణలో అవకతవకలు, మంజూరైన పాస్‌పుస్తకాలు ఇవ్వకపోవడం వంటి అక్రమాలు గుర్తించారు. ఏకంగా 23 మందిపై క్రమశిక్షణ చర్యలకు ఉత్తర్వులు ఇచ్చినా మార్పు లేదు.

ప్రైవేటుగా పిలిచి బేరాలు..

★ ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ అధికారుల దందా హద్దు మీరుతోంది. ఒక్కో ధ్రువపత్రానికి ఒక రేటు పెట్టి గుంజుతున్నారు. అర్జీదారులను సాయంత్రం ఆరు తర్వాత ప్రైవేటుగా పిలిచి బేరమాడుతున్నారు. ఈ కథలో వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు కీలకం. కొందరు అధికారులకు వాటాలున్నా.. తెర వెనక ఉండి ఆమ్యామ్యా తీసుకుంటున్నారు.

★ **ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ..** 'ప్రభుత్వం మంజూరు చేసే ఏ పత్రానికీ లంచం ఇవ్వొద్దు. అధికారులు, సిబ్బంది అడిగినా ఇబ్బందిపెట్టినా నా దృష్టికి తెస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

పసిగడితే లోపాలు.. కావండీ శాపాలు!

- రాజమహేంద్రవరం ఘటనతో ఉలిక్కిపడిన ఉమ్మడి కృష్ణా
- కల్తీ పాల విషయంలో అవగాహన ఎంతైనా అవశ్యం...

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో ఐదుగురి ప్రాణాలు పోవడంతో ఉమ్మడి జిల్లావాసులు ఉలిక్కిపడ్డారు. పాల వినియోగంలో మనమెంత భద్రం అనే సందేహాలు అలుముకున్నాయి. జీవన విధానంలో భాగమైన పాలను కొందరు అక్రమార్కులు కాసుల కక్కుర్తితో కల్తీ చేస్తూనే ఉంటారు. వారి నుంచి మనల్ని కాపాడుకునేందుకు అవగాహన, అప్రమత్తతే ఆయుధం. రాజమహేంద్రవరం ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం విజయవాడ నగరంలో 13 ప్రాంతాల్లో పాల నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు..

- ★ పాలిచ్చే పశువులు: 3,18,274
- ★ పాడి రైతులు: 95,000
- ✪ పాల దిగుబడి: 21,50,182
- ✪ గృహావసరాలకు: 9,00,000
- ✪ వ్యాపార, ఇతరాలు: 12,50,000

(✪ రోజుకు లీటర్లలో)

కృష్ణలంక శ్రీనివాస్ టవర్స్ వద్ద పాల తనిఖీ

సులభంగా కనుక్కోవచ్చు మిత్రమా..!

★ జిల్లాకు ఒంగోలు నుంచి కూడా పాలు వస్తుంటాయి. కర్ణాటక నుంచి ఇక్కడికి పాలు తెచ్చి పౌడర్ తయారు చేస్తున్నారు. పాలు తీశాక 4 గంటలకు మించి నిల్వ ఉండవు. ఇవి నిల్వ ఉండేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ కలుపుతున్నారు. దీంతో అనేక అనారోగ్య సమస్యలు వచ్చే వీలుందని నిపుణులు చెబుతున్నారు.

★ పాలు చిక్కగా ఉండేందుకు మొక్కజొన్న పిండి, వెన్న శాతం ఎక్కువ ఉండేందుకు వంట నూనెలు, నురగ కోసం డిటర్జెంట్, యూరియా కలుపుతున్నారు. కొన్ని రసాయనాలతో సింథటిక్ పాలు తయారు చేస్తారు. నూనె కలిపిన పాలు సాధారణంగా పాలలో ఉండే వెన్న శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. పాలు, పెరుగు జిగటగా ఉంటాయి.

★ పిండి కలిపిన పాలను గుర్తించేందుకు కొంచెం పాలు చేతిలో వేసుకుని నలిపితే పిండి అవశేషాలు స్పష్టంగా కనిపిస్తాయి. 3 మి.లీ. పాలను అంతే మొత్తం నీటితో మరగబెట్టి చల్లార్చాక అందులో 5 చుక్కల అయోడిన్ ద్రావణం వేస్తే పాలు నీలం రంగులోకి మారితే పిండితో కల్తీ చేసినట్లే లెక్క. పాల రుచి చేదుగా ఉంటే కల్తీ జరిగినట్లే.

★ ఎక్కువ సమయం నిల్వ ఉంటే కల్తీ పాలు అని అర్థం. పాలను స్టీల్ పాత్రలోనే ఉంచాలి.. ప్లాస్టిక్, అల్యూమినియం వాడకూడదు. కానీ జిల్లాలో 80 శాతంపైగా ప్లాస్టిక్ బాటిల్స్‌లోనే అమ్ముతున్నారు.

★ కొందరు పాలలో 20 శాతం పైగా నీరు కలిపి విక్రయిస్తున్నారు. కొంత కాలం కిందట ఉమ్మడి జిల్లాలో ఆహార భద్రత అధికారులు 12 ప్రాంతాల్లో నమూనాలు సేకరించగా 7 నమూనాల్లో నీరు కలిపినట్లు నిర్ధారణ అయింది.

★ స్వచ్ఛమైన పాలు 0.55 డిగ్రీల దగ్గర గడ్డకడతాయి. ఈ ఉష్ణోగ్రత మారితే నీరు కలిపినట్లే. మందుల దుకాణంలో యూరియా స్ట్రిప్స్‌పై పాల చుక్కలు వేయగానే గీతలు కనిపిస్తే యూరియా కలిపినట్లే. మిల్క్ అడల్ట్రేషన్ టెస్టింగ్ కిట్ ద్వారా కల్తీని గుర్తించవచ్చు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్: (బుధవారం) సాయంత్రం: 6.17

సహరి: (గురువారం) ఉదయం: 5.10

వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళికలు

కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో కుళాయిలపై నివేదిక

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో వచ్చే వేసవికి ఎక్కడా తాగునీటికి కొరత లేకుండా పకడ్బందీ ప్రణాళికలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. నాణ్యమైన తాగునీరు నిరంతరం సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా జల, పారిశుద్ధ్య మిషన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జల జీవన్ మిషన్ (జేజేఎం) పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి, సదరు పథకం ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. ఎ.కొండూరు మండలంలోని మూత్రపిండ వ్యాధి (సీకేడీ) ప్రభావిత ప్రాంతాల్లో ఇంటి కుళాయి కనెక్షన్ల భౌతికస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. నూరు శాతం కనెక్షన్లు కల్పించేందుకు డీపీవోకు ఆదేశాలిచ్చారు. గొల్లమందల తండా, జమలగడ్డ, దీప్లానగర్ వంటి గిరిజన ఆవాసాలకు అవసరమైన క్లియర్ వాటర్ సంప్ నిర్మాణం పూర్తి చేసి, మార్చి నాటికి తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్)- ఓడీఎఫ్ ప్లస్, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, నిఘా తదితరాలపై చర్చించారు. చేతి పంపులు, బోర్ల మరమ్మతులు, పైపు లైన్ల లీకేజీలు, కలుషిత నీటి నివారణ వంటి పనులు జరిగేలా చూడాలన్నారు. నీటి వనరుల నమూనాలను పరీక్షించి, ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ రామకృష్ణారావు, డీపీవో లావణ్య కుమారి, డ్వామా పీడీ ఎ.రాము, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయకుమారి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడా సంరంభం

'ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ - 2026'కు మంగళవారం అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధుల క్రీడా పోటీల సంరంభానికి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికైంది. ప్రజాప్రతినిధుల మధ్య స్నేహభావం.. క్రీడాస్ఫూర్తిని పెంచేలా నిర్వహించిన ఆటల పోటీలు ఆద్యంతం సందడిగా సాగాయి. - ఈనాడు, అమరావతి

చెన్నై చరవాణి.. చిక్కని చోర బాణీ!

- అద్దె ఖాతాల విశ్లేషణలో నయా వ్యవహారాలు...
- ప్రాథమిక వడపోతలో రూ.3.50 కోట్లుగా అంచనా

ఈనాడు, అమరావతి: తమ చట్టవ్యతిరేక వ్యవహారాలు బయటకు రాకుండా చెన్నై నుంచి వచ్చిన ఫోన్‌ను రవికుమార్ గుట్టుగా ఉపయోగించాడు. ఇతర మొబైళ్లను సంభాషణలు, చాట్స్‌కు ఉపయోగించకుండా కట్టడి చేసేందుకే కీలక సూత్రధారి సుబ్రమణి వెంకట్ ఈ ఎత్తుగడ వేశాడు. చెన్నైలో ఒక ఫోన్ కొని.. అక్కడే సిమ్ తీసుకుని యాక్టివేట్ చేశాడు. మొబైల్‌లో కాంటాక్ట్‌లు, వాట్సాప్‌లో గ్రూప్‌లను క్రియేట్ చేశాక దానిని కొరియర్‌లో విజయవాడకు పంపాడు. ఇందులో వాట్సాప్ ద్వారానే రవికుమార్, స్టీవెన్‌లు సమాచారాన్ని చెన్నై పంపేవారు. ఆయా ఖాతాలకు వచ్చే ఓటీపీలు, నగదు లావాదేవీల సమాచారాన్ని పంపేందుకు ఈ ఫోన్‌ను వాడారు.

ఆకాశ్ ఆచూకీ దొరకలేదు... ఏ అంచెలో ఎవరున్నారు? వారి వివరాలు తెలియకుండా ఈ పద్ధతి అవలంబించారు. ఒక అంచెలో వారు పోలీసులకు పట్టుబడినా.. మిగిలిన వారి సమాచారం తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రెండో రోజు కస్టడీలో నలుగురు నిందితుల నుంచి పోలీసులు పలు సమాధానాలు రాబట్టారు. చెన్నై నుంచి పంపిన మొబైల్‌లోని కాంటాక్ట్ లిస్టులో ఆకాశ్ పేరుంది. అతనెవరో తమకు తెలియదని రవికుమార్, స్టీవెన్‌లు చెప్పారు. సుబ్రమణి వెంకట్‌కు తెలుసని చెప్పారు. దీంతో ఇతని పాత్ర తేలలేదు.

వినియోగంలోకి రాని 23 ఖాతాలు... అమాయకుల నుంచి తీసుకున్న అద్దె ఖాతాల్లో రూ.కోట్లలో లావాదేవీలు సాగాయి. విజయవాడలో నిందితులు తీసిన 37 ఖాతాలను తెరిపించారు. ఇందులో రెండు ఎకౌంట్లు మూసేశారు. వీటిలోనూ 23 ఖాతాలను లావాదేవీల కోసం సిద్ధం చేసుకున్నారు. ఇంకా వినియోగంలోకి రాలేదు. 13 ఖాతాల ప్రాథమిక విశ్లేషణలో దాదాపు రూ.3.50 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు తేలింది. వీటి స్టేట్‌మెంట్లను సంబంధిత బ్యాంకుల నుంచి పోలీసులు తెప్పించారు. ఇతర రాష్ట్రాల్లో తెరిచిన వాటి వివరాలు ఇంకా బ్యాంకుల నుంచి రాలేదు.

వచ్చిందెంత? పోయిందెంత?...

ఖాతాల్లో నగదు లావాదేవీల తీరును పోలీసులు వడపోస్తున్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో లావాదేవీల చిట్టా ఉంది. ఇంటరాగేషన్‌లో ఈ వివరాలను రవికుమార్, స్టీవెన్ ముందుంచి ఆరా తీశారు. ఏ లావాదేవీ.. ఏ ఖాతాకు పంపారు? ఆ మొత్తం ఎవరికి చేరిందనే వివరాలను రాబట్టేందుకు ప్రయత్నించారు. ఏ ఖాతా ఎప్పుడు తెరిచారు? ఎప్పుడు మూసేశారు. లావాదేవీలు ఎన్ని? అని పోలీసులు సమగ్రంగా విశ్లేషిస్తున్నారు.

మిత్రమా... ప్రాణం విలువైంది!

- ★ నాసిరకం హెల్మెట్లతో ప్రమాదమే
- ★ ధర తక్కువని కొని తలడిల్లవద్దు

ఈనాడు, అమరావతి

జిల్లాలో రహదారి ప్రమాద మరణాల్లో అధిక ప్రమాదాలు ద్విచక్ర వాహనాల కారణంగానే జరుగుతున్నాయి. ఇందులోనూ తలకు గాయమైనవే అధికం. హెల్మెట్ వినియోగించక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల తనిఖీలు కొంత తగ్గేసరికి.. శిరస్త్రాణం వాడకాన్ని తగ్గించారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ల వాడకంపై పోలీసులు దృష్టిపెట్టారు. నాసిరకం శిరస్త్రాణాలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ద్విచక్ర వాహనదారులకు సూచిస్తున్నారు.

శిరస్త్రాణం లేకనే బలి...

నిత్యం నమోదవుతున్న ఉల్లంఘనల్లో ఎక్కువ భాగం హెల్మెట్ లేనివే. హెల్మెట్ ధరించకనే నగరంలో జరిగే ప్రమాదాలలో మరణాలు సంభవిస్తున్నాయి. ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్ వినియోగిస్తే.. ప్రాణం దక్కించుకోవచ్చు.

తలకు గాయంతో అధిక మరణాలు

★ నగరంలో రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ నాసిరకం శిరస్త్రాణాలను విక్రయిస్తున్నారు. ★ రూ.400లకే అమ్ముతూ.. కంపెనీవి అని అంటగడుతున్నారు. ★ తనిఖీలు తప్పించుకోవడానికి ఏదో ఒకటని కొంటే అసలుకే మోసం వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ★ షోరూమ్‌లలో ప్రామాణికమైనవే కొనాలి. ★ నాణ్యమైనవి అయితేనే.. ప్రమాదాల వేళ ప్రాణాపాయం నుంచి రక్షిస్తుంది. ★ వీటి తయారీవేళనే కఠిన పరీక్షలను తట్టుకునేలా తయారు చేస్తారు. నాణ్యమైనవి రూ.800-1000 ఉంటున్నాయి. ధర ఎక్కువైనా విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. ★ ప్రధానంగా తలకు గాయం కాకుండా కాపాడి.. మెదడుకు హాని జరగకుండా ఉంటుంది. ★ నాసివి అయితే ప్రమాద వేళ పగలడంతోపాటు తలకు గుచ్చుకుని ఎక్కువ ఇబ్బంది కలుగుతుంది.

రహదారులపై ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు ఎక్కువగా ఉన్నప్పుడు ధరించడం, లేనప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. హెల్మెట్ ధరించేది మీ ప్రాణరక్షణ కోసమే గానీ పోలీసుల కోసం కాదు అని గమనించాలి.

అపోహలు వీడాలి

- వైద్య నిపుణులు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు. జుట్టు రాలడం.. స్పాండిలైటిస్ వస్తుందనే వాదన ఎంతమాత్రం సరికాదు. దీని బరువు చాలా తక్కువ. 800-850 గ్రాములు ఉంటుంది. ఈ మాత్రానికే నరాలపై ప్రభావం చూపుతుందనే అపోహలను వీడాలి. స్పాండిలైటిస్ ఉన్న వారూ నిరభ్యంతరంగా వాడవచ్చు. నాణ్యమైనవి వాడితే ప్రమాదాల వేళ పగలవు. తలకు గాయమైతే చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయి. పక్షవాతం రావొచ్చు.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

2025లో ఏ వాహన ప్రమాదాలు ఎన్నంటే..

- ★ రహదారి ప్రమాదాలు: 369
- ★ ద్విచక్ర వాహనాలు: 138
- ★ భారీ వాహనాలు: 102
- ★ కార్లు, నాలుగు చక్రాలు: 69
- ★ ఆటోలు 27 ★ ఇతర: 33

మృతులు: 106 మంది

రైతుల ఆశల్ని చిదిమేసిన గాలివాన

గంపలగూడెం, మైలవరం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: గాలివాన రైతుల ఆశలను చిదిమేసింది. గంపలగూడెం, మైలవరం, ఎ.కొండూరు మండలాల్లో సోమవారం అర్ధరాత్రి కురిసిన నాలుగైదు సెం.మీల వాన మొక్కజొన్న, మామిడి, మిరప రైతులను కన్నీటిపాలు చేసింది. మరో రెండు మూడు వారాల్లో చేతికందనున్న మొక్కజొన్న పంట వందల ఎకరాల్లో నేలవాలింది. పాలుపోసుకునే దశలో ఉన్న కండెల్లోకి నీరుచేరి బూజుపట్టే అవకాశం ఉందని రైతులు వాపోయారు. నేలవాలిన మొక్కలను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మామిడి పూత గుట్టలుగా రాలిపోవడంతో దిగుబడులపై గణనీయ ప్రభావం పడనుందని రైతులు వాపోయారు. కల్లాల్లో ఆరబెట్టిన మిరపకాయలు తడిసి బూజుపట్టనున్నాయని, తాలు కాయ ఎక్కువ వస్తుందంటున్నారు. ప్రభుత్వం సకాలంలో పంట నష్టం అంచనాలు వేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఎ. కొండూరులో పడిపోయిన మొక్కజొన్న పంటను సరిచేస్తున్న మహిళా రైతు

మీరితే ఆపద.. క్షేమంగా పద..

బండిపై ముగ్గురు ఆడపిల్లలను కూర్చోపెట్టుకుని జాతీయ రహదారిపై ఒకరు వెళ్తుంటే. .మైనర్‌తోనే బండి నడిపిస్తున్నారు ఇంకొకరు.. పిల్లలపై ప్రేమ మంచిదే కానీ.. ట్రాఫిక్ నియమాలు పాటించకపోయినా.. వాహనాలపై ఎదురుగా వచ్చే వారు తప్పు చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త. -ఈనాడు, అమరావతి

సేంద్రియ రామయ్య.. సేవలు భేషయ్య..

కూరగాయలు, పండ్లు పండిస్తూ.. ఉచితంగా పంచేస్తూ..

కంకిపాడు(మంతెన), న్యూస్‌టుడే

ఎనిమిది పదుల వయసులో.. మనుమలు..మనుమరాళ్లతో సరదాగా గడిపే సమయంలో మండలంలోని మంతెనకు చెందిన పెండ్యాల రామారావు మాత్రం గ్రామానికి సేవ చేసేందుకు సంకల్పించారు. ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. కుమార్తె, కుమారుడు విదేశాల్లో స్థిరపడ్డారు. కానీ ఈయన మాత్రం పుట్టిపెరిగిన పల్లె, కుటుంబ ఉన్నత స్థితికి సహకరించిన పాఠశాల, తోటి గ్రామస్థుల సేవలో చరమాంకం గడపాలని నిశ్చయించుకున్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా శక్తిమేర ఆదుకుంటున్నారు. గత ఐదేళ్లుగా 40సెంట్ల స్థలంలో సేంద్రియ విధానంలో కూరగాయలు, పండ్లు స్వయంగా పండిస్తూ, ప్రతి రోజూ స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

సస్యరక్షణతో..: ఆరేళ్ల కిందట మొత్తం స్థలాన్ని లోతు దుక్కి చేయించి వానపాములు, మాగిన పశువుల ఎరువుతో కలగలిపారు. చీడపీడల నివారణకు పచ్చిమిర్చి, వెల్లుల్లి, వేపాకు, పొగాకు నుంచి తీసిన కషాయాన్ని పిచికారీ చేస్తున్నారు. 10 రకాల ఆకుకూరలు, 15 రకాల కాయగూరలు, ఐదు రకాల దుంపలు పండిస్తున్నారు. మరో 10 రకాల పండ్ల మొక్కలు దిగుబడి ఇస్తున్నాయి. రోజుకి సరాసరిన 10 కిలోల కూరగాయలు, మూడు కిలోల పండ్లు చేతికి వస్తున్నాయి.

తోటలో కూరగాయలు, పండ్ల మొక్కలు

అందరికీ సమంగా..: ఆరోజు కోతకు వచ్చిన కూరగాయలను సాయంత్రం 5 గంటలకు స్థానిక రెండు కూడళ్లలో ఉంచుతారు. అందరికీ సమంగా అందేలా భార్య విజయలక్ష్మి, మహిళా మండలి సభ్యులు పర్యవేక్షిస్తారు. పండ్లను రామారావు స్వయంగా ద్విచక్రవాహనంపై ఇంటింటికీ, స్థానిక జడ్పీ, ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు సమంగా పంపిణీ చేస్తారు. పది సెంట్లలో విత్తనం వేసిన ముల్లంగి దిగుబడి అనూహ్యంగా రావడంతో వారం పాటు దాదాపు 500 కిలోల పంటను ఊరంతా పంచేశారు. ఇవేకాక గ్రామంలో పేదలకు వైద్య శిబిరాలు, పాఠశాలలకు క్రీడా సామగ్రి అందజేత లాంటి సాయం చేస్తున్నారు.

అన్నీ ఇచ్చిన గ్రామం రుణం తీసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. దీనికి నా తండ్రి స్ఫూర్తి కాగా కుటుంబసభ్యులు, గ్రామస్థుల సహకారం అందిస్తున్నారు. శరీరం సహకరించినంతవరకు సేవలు అందిస్తా.

- పెండ్యాల రామారావు

మార్చి 6 నుంచి 8 వరకు మహాకుంభాభిషేకం

మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్. పక్కన కలెక్టర్ సీపీ, దుర్గగుడి ఛైర్మన్, ఈవో తదితరులు

ఇంద్రకీలాద్రి: మార్చి 6 నుంచి 8 వరకు కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్‌లతో కలిసి ఎంపీ కుంభాభిషేక మహోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం వైదిక కమిటీ, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. కనకదుర్గమ్మ ప్రధాన ఆలయ శిఖ విమాన గోపురాన్ని అభిమంత్రించిన అనేక పుష్కర మహా జీవనదులు, సముద్రోదకాలతో 12 ఏళ్లకు ఒకసారి కుంభాభిషేకం చేయడం ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయమని చెప్పారు. దేశవిదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తుల సమక్షంలో వేదపండితుల ఆధ్వర్యంలో క్రతువు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. కుంభాభిషేక మహోత్సవాలకు టీమ్ ఎన్టీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. కుంభాభిషేక మహోత్సవాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తామన్నారు. ఆలయ ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు స్థానాచార్య శివప్రసాదశర్మ, షణ్ముఖశాస్త్రి మహాకుంభాభిషేక కార్యక్రమ వివరాలను తెలియజేశారు.

(c) eenadu

తప్పించుకు తిరుగుతున్న అద్విక ఏజెంట్లకు నోటీసులు

ఈనాడు - అమరావతి

అద్విక ట్రేడింగ్ మోసం కేసులో దక్కాల్సిన దాని కంటే ఎక్కువ లబ్ధి పొందిన ఏజెంట్ల నుంచి రికవరీపై పోలీసులు దృష్టి సారించారు. ఎక్కువ దక్కించుకున్న ఏజెంట్లు.. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. పదే పదే పిలిపించి గడువు ఇచ్చినా స్పందన కొరవడింది. తక్కువ మొత్తం చెల్లించాల్సిన వారే స్పందిస్తున్నారు. ప్రత్యేక ఖాతాలో ఆ మొత్తాన్ని జమచేస్తున్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఏజెంట్ల చిరునామాలకు వెళ్లి నోటీసులు ఇస్తున్నారు. హైదరాబాద్, ఒంగోలు, భీమవరం, గుంటూరు, తదితర ప్రాంతాల్లో ఉన్న వీరి ఇళ్లకు వెళ్లి తాఖీదులను ఇస్తున్నారు.

చెల్లిస్తే సరి.. లేకుంటే అరెస్టు...: హైదరాబాద్ సహా పలు జిల్లాల పరిధిలో దాదాపు రూ.413 కోట్లు వసూలు చేసి.. అద్విక ట్రేడింగ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఆదిత్య, ఆయన భార్య సుజాత కలిసి.. హైదరాబాద్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 60 మందిపైగా ఏజెంట్లను నియమించుకున్నారు. దాదాపు 1,450 మంది నుంచి రూ.413 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేశారు. 1,139 మంది డిపాజిటర్లు రూ.255 కోట్లు పెట్టుబడి పెట్టగా.. ఇందులో రూ.120 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.135 కోట్లు మేర పెట్టుబడిదారులు నష్టపోయారు. రూ.35 కోట్లు డిపాజిట్ చేసిన 204 మంది.. రావాల్సిన దాని కంటే అదనంగా రూ.21 కోట్లు అనుచిత లబ్ధి పొందారు. 32 మంది ఏజెంట్లు రావాల్సిన కమీషన్ కంటే అదనంగా రూ.49 కోట్లు తీసుకున్నారు. 30 మంది ఏజెంట్లు రూ.9 కోట్లు వరకు నష్టపోయారు. వెరసి డిపాజిటర్లు, ఏజెంట్లు కలిపి రూ.144 కోట్లు నష్టపోయినట్లు పోలీసులు తేల్చారు. ఇంకా చెల్లించాల్సిన ఏజెంట్లకు నోటీసుల్లో గడువు నిర్దేశించారు. ఆ సమయంలోగా చెల్లించకుంటే.. నిందితులుగా చేర్చి, అరెస్టు చేయనున్నట్లు హెచ్చరిస్తున్నారు. త్వరలోనే కేసును కొలిక్కి తెచ్చి అభియోగపత్రం దాఖలు చేసే యోచనలో ఉన్నారు.

విద్యుత్తు అదాలత్‌కు స్పందన

వినియోగదారుడి సమస్య వింటున్న విక్టర్ ఇమ్మానియేల్. వేదికపై రవీంద్రబాబు, కృష్ణనాయక్, కృష్ణ, సునీత

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు మంగళవారం ఉదయం విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్తు అదాలత్‌కు 12 ఫిర్యాదులు వచ్చాయి. వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్, పూర్వ జిల్లా జడ్జి ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ ఫిర్యాదులు స్వీకరించారు. గన్నవరానికి చెందిన కె.గుప్తా, జి.శివ, తారాపేటకు చెందిన ఎల్.మధులు. స్మార్ట్ మీటరు పెట్టాక బిల్లు ఎక్కువగా వస్తోందని ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్మార్ట్ మీటర్లు పని తీరును ప్రత్యక్షంగా చూపిస్తామని చెప్పారు. బిల్ కట్టినా మీటర్ తొలగించారంటూ కొండపల్లికి చెందిన అలీ ఫిర్యాదు చేశారు.

లో ఓల్టేజీతో తప్పని ఇబ్బందులు

మహాత్మా గాంధీ రోడ్డుకు చెందిన కె.వెంకటప్పయ్య లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. గుణదలకు చెందిన కె.వెంకటేశ్వరరావు.. లైను మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కృష్ణలంకకు చెందిన పుణ్యవతి తమ పెంట్ హౌస్‌కు కొత్త విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలని కోరారు. మాజీ కార్పొరేటర్ బహదూర్.. విద్యుత్తు వైర్లు లూజుగా ఉండి ప్రమాదభరితంగా ఉన్నాయని అదాలత్ దృష్టికి తీసుకురాగా.. వాటిని వెంటనే సరి చేయిస్తామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. పటమట జేడీనగర్‌కు చెందిన ఎ.కృష్ణప్రసాద్.. నెట్ మీటరింగ్ లాభాలు తక్కువగా వస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ఆయనకు ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ.. వినియోగదారులు ఏ సమస్య వచ్చినా అధికారుల దృష్టికి తీసుకువస్తే, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సాంకేతిక సభ్యుడు డి.కృష్ణనాయక్, ఆర్థిక సభ్యుడు కె.కృష్ణ, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, ఎన్టీఆర్ జిల్లా ఎస్ఈ యు.హనుమయ్య, టౌన్ ఈఈ పి.రవీంద్రబాబు, ఏడీఈలు, 16 విద్యుత్తు సెక్షన్లకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.

ఆధునికంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రణాళిక: ఎంపీ

అధికారులతో సమావేశమైన ఎంపీ శివనాథ్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఆధునిక నగరంగా విజయవాడను తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నగరాభివృద్ధిపై కమిషనర్ ధ్యానచంద్ర, ఇంజినీరింగ్ అధికారులతో ఎంపీ సమీక్ష నిర్వహించారు. స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు నగరపాలక సంస్థ తయారు చేసిన డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)పై సమీక్షించారు. ఎంపీ మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం పంట కాలువ డ్రెయిన్ వెడల్పు 2.5 మీటర్లు ఉండగా.. డీపీఆర్ ప్రకారం 8 మీటర్లకు పెంచడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోతుందన్నారు. వర్షపు నీటి డ్రెయిన్ల పూర్తి, కొండ ప్రాంతాల్లో వాన నీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్లు నిర్మించేలా డీపీఆర్ తయారు చేశామని వెల్లడించారు. తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మరో డీపీఆర్ తయారు చేయాలని సూచించినట్లు తెలిపారు. పార్కుల అభివృద్ధిపై నివేదిక ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. కృష్ణలంకలో మరో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కొత్త వంతెనల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని కోరినట్లు వెల్లడించారు. రైల్వే, ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారుల సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని సూచించినట్లు పేర్కొన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధిపై నివేదిక సమర్పిస్తామని, మార్చికల్లా మంచినీటి పైపులైన్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై డీపీఆర్ అందిస్తామని తెలిపారు. ఫుడ్ కోర్టు విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎస్ఈ(వర్క్స్) వి.చంద్రశేఖర్, ఈఈలు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణ పనులపై ఎంపీ ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ ఆలయానికి భక్తులు సమర్పించే రూ.కోట్ల ఆదాయంతో నిర్మిస్తున్న అన్నదాన భవనం కేవలం రెండు అంతస్తులతో సరిపెట్టి ఎలివేషన్ పనులు చేయడమేమిటని అధికారులపై ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనకదుర్గానగర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌లతో కలిసి మంగళవారం పరిశీలించారు. దుర్గగుడి ప్రాంగణంలో అత్యంత విలువైన కనకదుర్గానగర్‌లో నిర్మాణం చేస్తున్న అన్నదాన భవన నిర్మాణం రెండు అంతస్తులకు పరిమితం చేయడం సరికాదన్నారు. ఇంత విలువైన స్థలం సరిగా ఉపయోగించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో నాలుగు అంతస్తులు నిర్మించి భక్తులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అవసరమైతే కేంద్రప్రభుత్వం ప్రసాద్ పథకం కింద నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీ పేర్కొన్నారు. కారణాలు చెప్పకుండా వెంటనే నాలుగు అంతస్తులకు స్లాబ్ వేసే పనులు ప్రారంభించాలని సూచించారు.

కార్మికుల జీతాల విడుదలకు రాజీలేని పోరాటం

ఐక్యత చాటుతున్న శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, నూకరాజు, వెంకట్రావు, బలరామ్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికుల జీతాల కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జీవో నంబరు 1615 ప్రకారం పీఆర్సీ జీతాలు, డీఏ, ఐఆర్, 12వ వేతన కమిషన్‌ను నియమించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాచౌక్‌లో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పక్షపాత ధోరణి విడనాడాలని పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. గత సమ్మె కాలంలో 17 రోజుల ఒప్పందాలపై జీవో జారీ చేయకుండా కాలయాపన చేయడం విచారకరమన్నారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.నూకరాజు, ధనాల వెంకట్రావు, ఎన్.బలరామ్, ఎం.లక్ష్మీనారాయణ, ఎస్.జ్యోతిబసు, సునీల్, కె.శ్రీనివాసరావు, వి.చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాల విక్రయ.. సేకరణ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పాల విక్రయ, సేకరణ కేంద్రాల్లో సమగ్ర తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిషేధిత మందులు (ఔషధాలు), గడువు తీరిన వాటి విక్రయ నిల్వలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. మెడికల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తిస్తే సదరు ఔషధాలను స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లతో నగరంలోని కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తూర్పు గోదావరి జిల్లాలో కల్తీ పాల విషాద ఘటన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, మిఠాయి దుకాణాలు, బేకరీలు తదితరాల్లో పరిశుభ్రత, గడువు తేదీలు, నిల్వ విధానం, నాణ్యత ప్రమాణాలపై తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే పదార్థాలను విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు.. అనుమానస్పద పాలు, ఆహార పదార్థాలు, మందులు విక్రయిస్తే వాటిపై అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

13 దుకాణాల్లో నమూనాల సేకరణ

పటమటలోని ఓ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో కొందరు మృతి చెందడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. మంగళవారం నగర వ్యాప్తంగా ఉన్న పాల మొబైల్ కేంద్రాలు, పాల అమ్మకాల కేంద్రాల్లో జిల్లా ఆహార నియంత్రణ అధికారి శ్రీనివాస్ సారథ్యంలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 13 దుకాణాల్లో పాలను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార నియంత్రణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు [illegible] తనిఖీలు నిర్వహించామని, మరో వారం రోజుల్లో ఫలితాలు వస్తాయన్నారు. ఆ తర్వాత అధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాతబస్తీ, విద్యాధరపురం, కృష్ణలంక, కొత్తపేట, గాంధీనగర్, కరెన్సీ నగర్, పటమట రోడ్డు, గురునానక్ నగర్ తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశామని చెప్పారు.

28 నుంచి నెమలి ఆలయ బ్రహ్మోత్సవాలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. 28న వేణుగోపాలస్వామిని పెండ్లి కుమారునిగా అలంకరించి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 1న సాయంత్రం శేషవాహన మహోత్సవం, రాత్రి ఎదురుకోలు ఉత్సవం, 2న రాత్రి రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి తిరుకల్యాణం నిర్వహిస్తారు. 3న చంద్ర గ్రహణంతో ఆలయం మూసివేస్తారు. 4న రథోత్సవం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, పల్లకి ఉత్సవం, రాత్రి కోనేరులో తెప్పోత్సవం, 5న శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయ ప్రధానార్చకులు తిరునగరి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికుల బృందం బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, పాలకవర్గ అధ్యక్షులు కె.శశిరేఖ వర్మ వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో రూపాయల్లో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర -125 [illegible] 220 [illegible] స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ [illegible] - 148, 152, 168 [illegible] - 270 [illegible] - 280.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను మంగళవారం బదిలీ చేశారు. కొద్ది నెలల క్రితమే పలువురు తహసీల్దార్లు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి పోస్టింగులు ఇచ్చారు. విజయవాడ ఎన్టీఆర్ కలెక్టరేట్ కేఆర్‌సీ విభాగ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా వి.సుస్వాగతంను నియమించారు. ప్రస్తుత కేఆర్‌సీ విభాగ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబును విజయవాడ పోర్ట్స్ సెటిల్‌మెంట్ అధికారి (ఎస్.ఎస్.ఒ.)గా బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఎస్.ఎస్.ఒ. ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన.. ఇక పూర్తి స్థాయిలో కొనసాగనున్నారు. విజయవాడ ఉత్తర (అజిత్‌సింగ్‌నగర్) తహసీల్దార్ ఎం.సూర్యారావును డిప్యూటీ కలెక్టర్ హోదాలో మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో సహాయ కార్యదర్శిగా బదిలీ చేశారు. పల్నాడు జిల్లా పులిచింతల ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్‌కు పీఏగా ఉన్న ఆర్.రమేష్‌బాబును ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా, మచిలీపట్నం ఆర్డీవోగా కె.సాంబశివరావును నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో అకాల వర్షం

తెలంగాణ సరిహద్దులో అధికంగా నమోదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో అకాల వర్షాలు కురిశాయి. తెలంగాణ సరిహద్దు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. వత్సవాయిలో అత్యధికంగా 56.2 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. మైలవరం 40, నందిగామ 32.2, జగ్గయ్యపేట 26.4, జి.కొండూరు 18.4, పెనుగంచిప్రోలు 17.2, వీరులపాడు 16.2, ఎ.కొండూరు 15, చందర్లపాడు 13, ఇబ్రహీంపట్నం 10.4, విజయవాడ సెంట్రల్, విజయవాడ పశ్చిమ 8.4, తిరువూరు 8.2, విజయవాడ పటమట 8, విజయవాడ ఉత్తరం 7.8, గంపలగూడెం 3.4, విస్సన్నపేట, కంచికచర్ల 2.6, రెడ్డిగూడెం 2.4, విజయవాడ గ్రామీణం మండలంలో 1.2 మి.మీ. మేర వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 14.90 మి.మీ.గా ఉంది.

IN THE COURT OF THE XIV ADDL. DISTRICT CUM FAMILY JUDGE AT VIJAYAWADA
FCOP No.1065/2021
Varri Ashok Kumar ....Petitioner
And
1) Varri Jayalakshmi R1
2) Gaddam Vignesh R2
....Respondents
R/o. D.No.: 9-71-11, Syed Gulam Mohiddin Street, Vijayawada-520001.
[illegible] తెలుసుకొనవలెను లేని యెడల పై పిటీషన్ మీరు పరోక్షముగా తీర్మానింపబడును అని తెలియజేయడమైనది.
శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం వాయిదా తేది.11-03-2026.
ఇట్లు,
కూరపాటి అనంతబాబు, అడ్వకేట్
చిట్టినగర్, విజయవాడ, ఫోన్ : 98484 58237

ఇంధన సామర్థ్య రంగాన్ని బలోపేతం చేయాలి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఇంధన సామర్థ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని [illegible] ఒప్పందాలు, పరిశ్రమల భాగస్వామ్యంపై [illegible] క్లోజర్ త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఎనర్జీ ఎఫిషియెన్సీ పాలసీ 2024-2028 ప్రకారం 123 స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)-2017 అమలును తప్పనిసరి చేశామన్నారు. ఇప్పటి వరకు 1800 కంటే ఎక్కువ ఈసీబీసీ భవనా[illegible] ఫైనాన్షియల్ కంపెనీలతో [illegible] చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ వైస్ ఛైర్మన్, ఎండీ ఎం.కమలాకర్‌బాబు, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ డైరెక్టర్ పి.శ్యామ్‌సుందర్, సుమారు 50 పరిశ్రమలు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పు తీర్చలేదని మహిళా కండక్టర్ దుశ్చర్య

సహచర ఉద్యోగి కొడుకు, కూతురు ఫొటోలు అసభ్యంగా చిత్రీకరణ

విజయవాడ నేరవార్తలు: సహచర ఉద్యోగి తన వద్ద తీసుకున్న అప్పులు తీర్చలేదని ఆర్టీసీ మహిళా కండక్టర్ దుశ్చర్యకు పాల్పడింది. అతని కుమారుడు, కూతురు ఫొటోలను అసభ్యంగా చిత్రీకరించి వేధింపులకు పాల్పడడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ శివారు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. భార్య 20 సంవత్సరాల క్రితం విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి కొడుకు, కూతురుతో కలిసి ఉంటున్నారు. నరసరావుపేట డిపోలో పని చేసే సమయంలో.. అక్కడే కండక్టర్‌గా పని చేస్తున్న సైదాబి వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నారు. కొంత తిరిగి చెల్లించారు. ఆరోగ్యం సరిగా లేక.. మిగతావి చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో గన్నవరం బదిలీ అయ్యారు. సైదాబి అక్కడకు వచ్చి.. ఆయనతో గొడవపడింది. అధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగం ఊడగొట్టింది. అతని కొడుకు, కూతురు ఫొటోలను ఏఐతో అసభ్యంగా చిత్రీకరించి.. అతనికే వాట్సాప్ చేసింది. ఆ ఫొటోలతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు తెరిచి.. అందరినీ డబ్బులు అడుగుతోంది. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరింపులకు దిగడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి ఫిర్యాదు చేయగా.. ఆమెపై కేసు నమోదైంది.

బాలుడిపై వీధి కుక్కల దాడి

గాయాలతో బాలుడు

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: వీధి కుక్కలు బాలుడిపై దాడి చేసి విచక్షణా రహితంగా కరిచాయి. సేకరించిన కథనం మేరకు.. విజయవాడ ఆంజనేయ వాగు ప్రాంతానికి చెందిన రాచకొండ శివ, చిన్ని దంపతులు నివాసం ఉంటున్నారు. కొత్తపేట చేపల మార్కెట్ వద్ద పాత దుస్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు రిషి(9) 2వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్థానిక బాల భక్త సమాజం కల్యాణ మండపం ప్రాంతంలో సైకిల్ తొక్కుతూ ఉండగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా ఆ బాలుడిపై దాడి చేశాయి. ముక్కుపై తీవ్రంగా గాయమైంది. బాలుడు పెద్దగా ఏడుస్తుండడంతో స్థానికులు వచ్చి రక్షించారు. వెంటనే తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని బాలుడిని కొత్తపేటలోని షేక్ రాజాసాహెబ్ వైద్యశాలకు తీసుకుని వెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బాలుడిని పరీక్షించి సర్జరీ చేయాలని సూచించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. వీధి కుక్కల విషయమై పలుమార్లు వీఎంసీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని 48వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్‌డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫిసి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ పి. శ్రావణ్ కుమార్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 81217 65159
ఆస్తి తనిఖీ కొరకు : 77082 27771

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి ఋణగ్రహీత: శ్రీమతి చుండి కవిత, తండ్రి : సిహెచ్. సుబ్బారావు, డోర్ నెం. 60-21-2, వెల్లంకి రామ్మోహనరావు వీధి, ఐటిఐ బస్ స్టాప్ దగ్గర, అశోక్ నగర్, వెంకటేశ్వరపురం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారు డిమాండ్ నోటీసు తేది. 10-10-2024 ప్రకారం తేది.09-10-2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.28,60,913/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల అరవై వేల తొమ్మిది వందల పదమూడు రూపాయలు మాత్రమే) + తేది.10.10.2024 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రికోర్స్ లేకుండా" పద్ధతిపై తేది:25-03-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరములు:
షెడ్యూల్-ఎ: కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రార్ డిస్ట్రిక్ట్ యొక్క జ్యూరిస్‌డిక్షన్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, విజయవాడ టౌన్, గుణదల, శ్రీ రామచంద్రానగర్, ఆర్.ఎస్.నెం.334/2ఎ, తదుపరి ఉపభాగం ఆర్ఎస్ నెం.334/2ఎ4, ప్లాటు నెంలు. 3 మరియు 18లోని డోర్ నెం.48-13-4, అసెస్‌మెంట్ నెంలు. 625051 మరియు 625052తో గల 816 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు: అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు: రోడ్డు-39.0 అ॥లు, దక్షిణం : వసంత్ విలాస్ మరియు వసంత్ నివాస్‌ల ఉమ్మడి నడకదారి-188.5 అ॥లు, పడమర : ఎఆర్‌సి భవనం-39.0 అ॥లు, ఉత్తరం : రామినేని కనస్ట్రక్షన్ కంపెనీ వారి ఆస్తి-188.5 అ॥లు.
పైన తెలిపిన హద్దుల మధ్య 816 చ॥గ॥లు లేదా 682.282చ॥మీ॥ల స్థలం అందు 38 చ॥గ॥లు లేదా 31.76 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్ధేశపు ఉమ్మడి వాటాతో గల స్థలం.
షెడ్యూల్-బి: షెడ్యూల్-ఎలో తెలిపిన స్థలం అందు వసంత నివాస్ పేరుతో నిర్మితమైన అపార్ట్‌మెంట్స్ నందు మొదటి అంతస్తులో గల ఫ్లాట్ నెం.203 రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.976/2014, తేది: 03.03.2014, రిజిస్టర్డ్ డిఆర్ఓ తూర్పు, కృష్ణాజిల్లా వారి ప్రకారం చుండి కవిత, తండ్రి: లేటు చుండి సుబ్బారావు గారికి చెందినది. ఫ్లాట్ నెం.203కు హద్దులు: తూర్పు: లిఫ్ట్ & ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : మెట్లు & ఓపెన్ టు స్కై, ఉత్తరం : కామన్ కారిడార్.
పైన తెలిపిన హద్దుల మధ్య 850 చ॥అ॥లు ప్లింత్ ఏరియా, 200 చ॥అ॥ల కామన్ ఏరియా, 60 చ॥అ॥ల కార్‌పార్కింగ్ ఏరియాతో అని ఫిక్చర్స్, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, ఉమ్మడి హక్కులు, కామన్ సదుపాయాలు, మెట్లు, లిఫ్ట్, కామన్ ఏరియాలు, వాటర్, సహ యజమానుల డ్రైనేజీ, అన్ని హక్కులతో కలదు.

రిజర్వు ధర : రూ.36,60,000/- ధరావత్తు : రూ.3,66,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 25-03-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : తేది:25-02-2026 నుండి 24-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.
తేది: 24-02-2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సెంథిల్ కస్టడీ పిటిషన్‌పై విచారణ 26కు వాయిదా

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో సెంథిల్ (ఏ22) కస్టడీ కోసం ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన పిటిషన్ మంగళవారం ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిని వాదనల నిమిత్తం ఈనెల 26కు వాయిదా పడింది. నిందితుడి బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు జరిగాయి. తదుపరి విచారణ వచ్చే నెల 2కు కోర్టు వాయిదా వేసింది. ● ఇదే కేసులో జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ ఏడో ఏడీజే కోర్టులో వచ్చింది. నిందితులకు నోటీసులను కోర్టు ద్వారా రిజిస్టర్డ్ పోస్టులో పంపించారు. అనంతరం ఈనెల 26కు వాయిదా పడింది.

వాసుదేవరెడ్డి కస్టడీ కోరుతూ సిట్ పిటిషన్

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు వాసుదేవరెడ్డి (ఏ2)ని వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో 21న నిందితుడిని సిట్ అరెస్టు చేసింది. అప్పటి నుంచి గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. మంగళవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన కస్టడీ పిటిషన్.. బుధవారం విచారణకు వచ్చే వీలుంది. నిందితుడి తరఫు న్యాయవాదికి నోటీసులు జారీ చేయనున్నారు.

పాన్ దుకాణాల్లో మెరుపు దాడులు

విజయవాడ నేరవార్తలు: విద్యా సంస్థలకు 100 మీటర్ల లోపు దూరంలో ఉన్న పాన్ దుకాణాలపై మంగళవారం ఈగల్ సెల్ మెరుపుదాడులు చేసింది. విద్యా సంస్థల పరిసరాల్లో మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తుల నివారణే లక్ష్యంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈగల్ ఐజీ ఆకె.రవికృష్ణ ఆదేశాల మేరకు సీఐ ఎం.రవీంద్ర, ఎస్సైలు ఎం.వీరాంజనేయులు, పి.రాంబాబు ఇతర సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ దంత వైద్య కళాశాల, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, పీబీ సిద్ధార్థ కళాశాల, ఎస్ఆర్ఎం చెన్నై హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిసరాల్లో తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలపై జరిమానాలు విధించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే.. చర్యలు తీసుకుంటామన్నారు.

అడ్డగోలు దర్శనాలపై ఛైర్మన్ ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో అడ్డగోలు దర్శనాలపై పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. మాజీ స్పీకర్‌గా ఆయనకు ప్రొటోకాల్ దర్శనం చేయించేందుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంట వచ్చారు. స్పీకర్ కుటుంబంతోపాటు మరో పది మంది వీఐపీ మార్గంలో వెళ్తుండటంతో స్కానింగ్ పాయింట్ వద్ద ఉన్న ఛైర్మన్ రాధాకృష్ణ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పిలిపించారు. ఇరవై మందిని ఎందుకు తీసుకు వెళ్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ కుటుంబ సభ్యులు ఎనిమిది మంది మాత్రమే ఉన్నారని, మిగతా వారు తనకు తెలియదని వివరణ ఇచ్చారు. ఈ వివాదంతో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు ఆశీర్వచన మండపానికి రాకుండా వెళ్లిపోయారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. 81422 92071

REAL ESTATE
HOUSE FOR SALE
గుడివాడ 200 గజాలు, నీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తులు ఇంటితో అమ్మకానికి కలదు. గజం-75వేలు. సంప్ర: 81064 03490

PLOT FOR SALE
బందరురోడ్డు, కంకిపాడు ఔటర్ రింగురోడ్డు దగ్గర్లో, చలివేంద్రపాలెం, భవిష్యరాగా CRDA వెంచర్‌లో ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు ✆ 82970 14789

TO LET

WANTED
5000 S.Ft - 8000 S.Ft Shed / Godown Needed in and Around Vijayawada City Limits for Rent. ✆ 91770 01020, 98482 28128.

JOBS
Sweet Mantra, Kanuru, M.G. Road, Vijayawada. ★ Wanted Male/ Female Accountant: Experience in Talley and able to deal With Income Tax, GST & Internal Audit, etc., ✆ 92957 58489

క్రాంతిరోడ్ ట్రాన్స్‌పోర్ట్ VJA ఆటోనగర్ ఆఫీస్ నందు గుమస్తాలుగా పని చేయుటకు 10 ఆపై చదివి 30సం||లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: 81798 68999

నిరుద్యోగ యువతకి సువర్ణావకాశం. డా.రెడ్డీస్ ఫౌండేషన్ వారిచే కమ్యూనికేషన్ ఇంటర్వ్యూ, స్కిల్స్, కంప్యూటర్ కోర్స్‌లో 60రోజుల ఉచితశిక్షణ, ఉద్యోగం కల్పించబడును. వ:18-28. 93816 68359

విజయవాడలోని ప్రముఖ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు డేటాఎంట్రీ ఆపరేటర్స్, టెలీకాలర్స్, కౌన్సిలర్స్ కావలెను. Age:18-30Yrs. ✆ 89777 96932

PROs, Marketing Managers Required. Salary: 27,500/-, NTR Circle, Vijayawada. ✆ 63043 28479

ప్రముఖ బ్యాంక్ విజయవాడలో పని చేయుటకు సేల్స్ ఆఫీసర్స్ కావలెను. శాలరీ: 15K to 25K మరియు ఇన్సెంటివ్స్. కాంటాక్ట్: ✆ 99087 92999, 98494 48871.

FACULTY/ TEACHERS
Santiniketan Jr College, Eedupugallu. 1. Principal (only science) 2. Vice- Principal 3. Lecturers 4. coordinators 5. Telecaller's Contact: 94944 04160, 91608 89162

MEDICAL
A Reputed 100Bedded Hospital -VJA is Looking for Positions: 1.Staff Nurses-15, Q:GNM/B.Sc Nursing With Valid Regi. Exp:2-5Yrs, Cardiac ICU/MICU 2.Manager- Operations With Hospital Exp: 10Yrs, 3.Wardboys-10, 4.Marketing WG Dist-3 ✆ 83328 05807

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

భవిత కేంద్రం సందర్శన

రెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని జిల్లా ఐఈ కోఆర్డినేటర్ కె.నారాయణ మంగళవారం సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు, ఫిజియోథెరపీ శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ క్రమం తప్పకుండా పిల్లలను భవిత కేంద్రానికి తీసుకురావాలన్నారు.

అసెంబ్లీ ముట్టడిస్తాం

మైలవరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాల పెంపు అంశాన్ని వెంటనే తేల్చకపోతే, అసెంబ్లీ ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సుధాకర్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పుష్పకుమారి, శారద, సరోజిని, ఉష, అపర్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

మైలవరం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యలో చేరిన దగ్గర్నుంచి విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని మైక్రోలింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ ఎండీ ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నచ్చిన కోర్సులను ఎంచుకుని, ఇష్టంగా చదవాలని సూచించారు. సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌ను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీ పసందకుమార్‌రెడ్డి, ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగిరెడ్డి, రిసోర్స్ పర్సన్ మేకా శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

ఎ.కొండూరు: కంభంపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు మంగళవారం ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున 540 బస్తాలు అందజేశామని సంఘం ఛైర్మన్ కృష్ణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన.. జి.కొండూరు: వెలగలేరు రజక బజార్‌లో మరమ్మతుకు గురైన చేతి పంపు విషయమై పంచాయతీ కార్యదర్శి సరోజ దృష్టికి తీసుకురాగా ఆమె స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు.

తిరువూరు: పట్టణంలోని 8, 15వ వార్డుల్లోని కాలువల్లో దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సులేమాన్, అరుణ్‌కుమార్ సమస్యను మేమున్నాం మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టరు విజయ్ సిబ్బందితో దోమల మందు ఫాగింగ్ చేయించారు. పిచ్చి మొక్కలు తీయించారు.

? వేమిరెడ్డిపల్లిలో ప్రధాన రోడ్డులో విద్యుత్తు నియంత్రిక ఎత్తు తక్కువలో ఉండి ప్రమాదకరంగా ఉంది. - గ్రామస్థులు

✔ త్వరలో నియంత్రిక ఎత్తు పెంచుతాం. - ఎస్.విజయ్ భాస్కర్, ఏఈ, విస్సన్నపేట - విస్సన్నపేట, న్యూస్‌టుడే

గాలివాన బీభత్సం

గంపలగూడెం: తునికిపాడులో మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న ఏవో హరీష్‌కుమార్ ★ చల్లగుండ్లవారిపాలెంలో తడిసిన మిరపకాయలను ఆరబెడుతున్న రైతులు ★ గట్టు చెరువులో పూత రాలిన మామిడి కాడలను చూపిస్తున్న రైతు

గంపలగూడెం, మైలవరం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం అర్ధరాత్రి బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన అకాలవర్షం మొక్కజొన్న, మామిడి, మిరప పంటల్ని దెబ్బతీసింది. గంపలగూడెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి మంగళవారం వేకువజాము వరకు 5 సెం.మీ వరకు వర్షం కురిసింది. గంపలగూడెం మండలం తునికిపాడు, దుందిరాలపాడు, రాజవరం తదితర గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న ఈదురు గాలులకు నేలమట్టమైందని వ్యవసాయాధికారి వి.హరీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కండెలు పాలు పోసుకుంటున్న తరుణంలో కురిసిన వానకు అవి పాడైపోతాయన్నారు. మామిడి తోటల్లో సన్నపిందె, లేత పూత గుట్టలుగా రాలిపోయింది. పలు గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిరప కాయలకు అడుగున నీరు చేరి కొంత పంట తడిసింది. ఎ.కొండూరులో తండాలో, రేపూడి, పోలిశెట్టిపాడు, వల్లంపట్ల, పాత రేపూడి గ్రామాలలో ఈదురు గాలుల బీభత్సానికి మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. ఎ కొండూరు అడ్డరోడ్డు సమీపంలో కల్లాల్లోని మిరపకాయలు సైతం తడిచిపోయాయి. పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో అప్పులు చేసి సాగు చేసిన రైతులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంట నేలకు వాలిపోవడంతో కోత ఖర్చు కూడా అధికం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలో అత్యధికంగా 4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కొన్ని గ్రామాల్లో గాలులకు మొక్కజొన్న చేలు నేలవాలాయి. పొందుగల, మొర్సుమిల్లి పంచాయతీల పరిధిలో కొంత నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల కల్లాల్లో ఉన్న మిర్చిని టార్పాలిన్ పట్టలతో కాపాడుకునే ప్రయత్నం చేయగా, మరికొన్ని చోట్ల బస్తాల్లో నింపిన కాయలు తడిచాయని రైతులు వాపోయారు. మండలంలో సుమారు 28 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలినట్లు ప్రాథమిక అంచనా వేశామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ ప్రసాదరావు, పక్కన ఎస్సై అనిల్

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం నెమలి క్షేత్రాన్ని సందర్శించి బందోబస్తుపై అధికారులతో చర్చించారు. క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, కల్యాణ మండపం వద్ద గ్యాలరీలు, భక్తుల ప్రవేశం, దండవత లిఖితాలు పోయడం, కల్యాణం జరిగేటప్పుడు భక్తుల రాకపోకల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. 28 నుంచి ఆలయం వద్ద పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు. గుడి ప్రాంగణంలో సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, ఎస్సై ఎ.అనిల్, తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు వి.రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ ఎ.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె మగువకు చేరువైన మగ్గం వర్కు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

బ్లౌజ్ క్లాత్‌కు డిజైన్ వేస్తున్న కార్మికుడు

వివాహాలు ప్రారంభం కావడంతో బ్లౌజ్‌లు, చీరలపై రకరకాల డిజైన్లు వేసే మగ్గం వర్క్ దుకాణాలు మహిళలతో కళకళలాడుతున్నాయి. నాడు పట్టణాలకే పరిమితమైన ఈ కళ నేడు గ్రామాలకు చేరింది. గ్రామీణ మహిళలను ఆకర్షిస్తోంది. కొండపల్లి పురపాలికతోపాటు ఆయా మండల కేంద్రాల్లో సుమారు 150కి పైగా మగ్గం దుకాణాలు వెలిశాయి. వీటిలో పని చేసేవారు అధికులు ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన వారే. దశాబ్ద కాలంగా వారు మగ్గం వర్క్ చేస్తున్నారు. వేడుక ఏదైనా అలంకరణకు ప్రాధాన్యమిచ్చే మగువలు బ్లౌజ్‌లపై డిజైన్లు వేయించుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో ఖర్చుకు వెనకాడకుండా చీరలకు కూడా మగ్గం వర్క్ చేయించుకుంటున్నారు. సాధారణంగా ఒక్కో బ్లౌజ్‌పై డిజైన్ వర్క్ చేసేందుకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. ఎక్కువ డిజైన్లు ఉంటే రూ.10 వేల వరకు తీసుకుంటున్నారు. మహిళలు తమ ఆర్థిక స్థితి, అభిరుచుల మేరకు డిజైన్లను ఎంచుకుంటున్నారు. బ్లౌజ్ కుట్టు కూలీ ధర కంటే డిజైన్ వర్క్‌కు నాలుగైదు రెట్లు ఎక్కువ ఖర్చు అవుతున్నా వెనకాడటం లేదు.

వర్కు పూర్తయిన బ్లౌజ్

ఆదరణ పెరిగింది: ఐదేళ్ల కిందట సంపన్న వర్గాలకు చెందిన మహిళలే మగ్గం వర్క్ చేయించుకునే వారు. నాడు ఒకటి రెండు దుకాణాలే ఉండేవి. నేడు అన్ని వర్గాల మహిళలు ఈ కళ పట్ల మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో మరింత డిమాండ్ పెరిగింది. యూపీ నుంచి పనివారిని తెప్పించి వారికి అన్నిసౌకర్యాలు కల్పిస్తున్నాం. దీంతో ఖర్చు ఎక్కువ అవుతోంది. స్థానికులు కూడా ఈ కళ నేర్చుకుంటే ఖర్చు తగ్గుతుంది. -వెంకటేశ్వరరావు, మగ్గం వర్క్ షాపు నిర్వాహకుడు, ఇబ్రహీంపట్నం

పడిపోయిన మల్లెల ధర

చంద్రగూడెం మార్కెట్‌కు వచ్చిన మల్లెపూలు

మైలవరం, న్యూస్‌టుడే: నెల రోజులపాటు రైతుల్లో ఆశలు నింపిన మల్లెపూల ధర ఒక్కసారిగా పడిపోయింది. మొన్నటి వరకు కిలో సరాసరి రూ.600 వరకు పలికిన ధర మంగళవారం రూ.120కు పడిపోయింది. ఇప్పుడిప్పుడే దిగుబడులు పెరుగుతుండటంతో మార్కెట్లో ధరల పతనం మొదలైందని రైతులు వాపోతున్నారు. మల్లెసాగు మార్కెటింగ్ ప్రధాన కేంద్రంగా ఉన్న చంద్రగూడెంలో వారం పది రోజులుగా పూల సరఫరా పెరిగింది. రోజుకి నాలుగైదు టన్నులకు పైగా వస్తుండగా, స్థానికంగా ఉన్న వ్యాపారులే వాటిని కొని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. వివాహాది శుభకార్యాలు మొదలైనా ధర తగ్గిపోవటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కోత ఖర్చులకే రాదని ఆందోళన చెందుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన

ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ కార్మికుల సమావేశం

ఇబ్రహీంపట్నం,న్యూస్‌టుడే: ఆర్టీసీలో కార్మిక వ్యతిరేక విధానాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని ఎన్ఎంయూఏ(నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షులు సీహెచ్ రామకృష్ణ అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం డిపోలో గేటు మీటింగ్‌ను మంగళవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం ఆలోచన దుర్మార్గమన్నారు. విద్యాధరపురం డిపోలో సిబ్బందిని పంపివేయడం, దానిని ఇతర సంస్థలకు అప్పగించడం హేయమని పేర్కొన్నారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవడానికి యూనియన్ ఆధ్వర్యంలో ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలకు అపార నష్టం

ముద్దగా మారిన పచ్చి ఇటుకలు

మైలవరం, న్యూస్‌టుడే: సోమవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఇటుక బట్టీలపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. నియోజకవర్గ పరిధిలో సుమారు 250 వరకు ఉన్న ఈ బట్టీల్లో కాల్చడానికి సిద్ధంగా ఉన్న సుమారు 5 లక్షల ఇటుకలు వర్షానికి తడిసి ముద్దగా మారి పనికిరాకుండా పోయాయి. మంగళవారం తెల్లవారుజామున బట్టీలను చూసిన నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ఒక్కో ఇటుక మీద ఖర్చు చేసిన సుమారు రూ.3 నుంచి రూ.5 వరకు నష్టం వాటిల్లినట్లేనని, మరో 15 రోజులపాటు కార్మికులతో ఎటువంటి పనిచేయించలేని పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోయామని బట్టీల నిర్వాహకులు వాపోతున్నారు.

శిరస్త్రాణంపై అవగాహన ప్రదర్శన

జి.కొండూరులో శిరస్త్రాణంపై అవగాహన ప్రదర్శన చేస్తున్న ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు కోరారు. కట్టుబడిపాలెం, పినపాక, జి.కొండూరు గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ద్విచక్ర వాహనాలపై అవగాహన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్, వాహనదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన రహదారులు

పెనుగొలను ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మురుగు

గంపలగూడెం, న్యూస్‌టుడే: సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో పలు గ్రామాల్లో రహదారులపై బురద పేరుకుపోయింది. గంపలగూడెం, పెనుగొలను తదితర గ్రామాల్లో మురుగు రహదారులపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. సిమెంట్ రోడ్లు మురుగుతో నల్లగా మారాయి.

వైభవంగా గ్రామోత్సవం

సత్యాలపాడు గ్రామోత్సవంలో దేవతా మూర్తుల విగ్రహాలు

సత్యాలపాడు (గంపలగూడెం), న్యూస్‌టుడే: సత్యాలపాడు సమీప చెన్నవరం క్రాస్ రోడ్డులో విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠించనున్న దేవతా మూర్తుల విగ్రహాలకు మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం కుంకుమ పూజలు, హోమం, ధాన్యాధివాసం చేసి అనంతరం చెన్నవరం, సత్యాలపాడులో మేళతాళాలతో గ్రామోత్సవం చేశారు. బుధవారం ఉదయం 10.14 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో గంగా పార్వతీ సమేత కాశీ విశ్వనాథ శివలింగం, గణపతి, ద్వారపాలకులు, నందీశ్వరుడు, నవగ్రహాలు, శిఖరం, దక్షిణామూర్తి, ఈశ్వరీదేవి, మత్స్య యంత్రం, కాలభైరవుడు, చండీశ్వరుడు, వీరభద్ర స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, జంట నాగుల విగ్రహాలు, ధ్వజస్తంభం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠిస్తారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ వార్షికోత్సవం

మెట్టగుట్టలో కల్యాణం నిర్వహించిన ఉత్సవమూర్తులతో కమిటీ సభ్యులు

గంపలగూడెం: మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ 13వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్యామ్‌సుందర్ శ్రీనివాసాచార్యులు, యోగానందాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని శాంతి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, ఉత్సవ నిర్వాహకులు ఎన్.నారాయణరావు, ఎం.నరసింహమూర్తి, పి.లక్ష్మణరావు, ఆర్.వెంకటసుబ్బారెడ్డి తదితరులు కల్యాణ వేడుకలో పాల్గొన్నారు.

భద్రావతిదేవి కల్యాణమహోత్సవం

తిరువూరు: తిరువూరు శ్రీ భక్తమార్కండేయ నగర్ పద్మశాలీ కమ్యూనిటీ భవనంలో భక్తులతో కిటకిటలాడింది. వేద మంత్రోచ్ఛరణల నడుమ భద్రావతి సమేత భావనారుషి స్వామివారి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో వెంకటాచల స్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ పర్వతం శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

కంభంపాడులో.. శివాలయం

ఎ. కొండూరు: కంభంపాడులో మంగళవారం శ్రీ గంగా విజయదుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామి వారి దేవాలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణను 2000 మందికి చేశారు.

బారికేడ్లను గుర్తించక.. మృత్యువుకు చేరిక

న్యూస్‌టుడే, కొండపల్లి

★ ఈ నెల 6న కొండపల్లి నుంచి ఇబ్రహీంపట్నం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లే బాలుడు ఎన్‌హెచ్ఏఐ(30) రహదారిపై ఉంచిన బారికేడ్‌ను ఢీకొని మృతిచెందాడు.

★ మూలపాడు కూడలి జాతీయ రహదారి (ఎన్‌హెచ్ఏఐ 65)పై ఈ నెల 14న బారికేడును ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు గాయాలపాలయ్యారు.

★ ఎన్టీటీపీఎస్ విశ్రాంత ఉద్యోగి ఏసుబాబు ఆదివారం సాయంత్రం కొండపల్లి డీఏవీ పాఠశాల జాతీయ రహదారిపై ఉంచిన బారికేడును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రహదారిపై ఉంచిన బారికేడ్లు

వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద ద్విచక్ర వాహనదార్లు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారులైన 30, 65లపై ఈ ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. బారికేడ్లను గుర్తించి వాటిని తప్పించే సమయానికే ప్రమాదాలు జరిగిపోతున్నాయి. కొందరు మృత్యువాత పడుతుంటే అనేక మంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

మితిమీరిన వేగమే కారణమా : వరుసగా సంభవిస్తున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ద్విచక్ర వాహనదార్లు అందరూ అతివేగంతో వెళ్లడమే కారణంగా కనిపిస్తోంది. మద్యం తాగి వాహనాలు నడిపే క్రమంలో కూడా మత్తులో బారికేడ్ల వద్ద వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. వీటితో పాటు కంకర, ఇసుక కూడా ద్విచక్ర వాహనదార్లకు శాపంగా మారింది. బారికేడ్ల వద్ద మలుపు తిరిగే చోట ఇసుక, కంకర వాహనాల నుంచి రహదారిపై కంకర, ఇసుక పడిపోతున్నాయి. ఈక్రమంలో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనాలు వాటి మీదుగా వెళ్లినప్పుడు జారి ప్రమాదాలకు గురవుతున్నారు.

నిబంధనలపై అవగాహన లేకనే.. : ప్రమాదాల నివారణకు నిర్వహిస్తున్న కార్యక్రమాలతోపాటు ట్రాఫిక్ నిబంధనలపై వాహనదార్లకు అవగాహన లేక పోవడమే ప్రమాదాలకు తావిస్తోంది. ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి వేగం పాటించాల్సిన సూచిక బోర్డులను, రాత్రి వేళ బ్లింకింగ్‌ను, జాతీయ రహదారిపై యల్లో రంగుల్లో తంబుల్ స్టిక్స్‌ను ఏర్పాటు చేశాం. బ్లాక్ స్పాట్స్‌లో బారికేడ్లను ఏర్పాటు చేశాం. రెండు బారికేడ్ల మధ్య నుంచి భారీ కంటెయినర్ సైతం వెళ్లే వీలున్నా వాటిని పట్టించుకోకుండా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. - ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ

పెన్నులు, అట్టల వితరణ

తిరువూరు, న్యూస్‌టుడే: మునుకుళ్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 2013-14 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం పరీక్ష అట్టలు, కలాలు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు భారతి పూర్వ విద్యార్థులను అభినందించారు.

సమస్య పరిష్కరించరూ..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం ప్రసాద్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే పోరాటాలు తప్పవంటూ ఆ ప్రాంత వాసి, ఆర్ఎంపీ దాస్ మంగళవారం రాత్రి మురుగు నీటిలో కూర్చొని నిరసన తెలిపారు. మురుగు నీటి పారుదల వ్యవస్థ సరిగ్గా ఏర్పాటు చేయకుండా కాలువపై దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం సరైంది కాదన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తిపై హర్షం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామంలో ఇటీవల రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తెదేపా ప్రజా ప్రతినిధులు, అధికారులకూ ధన్యవాదాలు తెలిపారు.

ప్రశాంతంగా సీనియర్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

విస్సన్నపేటలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేటలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం నాలుగు కేంద్రాల్లో 1501 మందికి గాను 1463 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని కస్టోడియన్ అధికారి రెబ్బ మురళీకృష్ణ తెలిపారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు మొత్తం 133 మంది గాను 129 మంది హాజరయ్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో మంగళవారం ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఐదు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రం లోపలకు అనుమతించారు.

మైలవరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష మంగళవారం ప్రారంభమవగా, మైలవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 218 మందికి, ముగ్గురు, స్థానిక ఎస్వీఆర్‌జీ కళాశాలలో 261 మందికి నలుగురు గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

నిర్లక్ష్యాలను సహించేది లేదు

కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ షరీనా బేగం, ఏడీసీపీ రామకృష్ణ, ఎస్సైలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే సహించేది లేదని ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం అన్నారు. ఇబ్రహీంపట్నం కూడలిలో ద్విచక్ర వాహనదార్లకు మంగళవారం రాత్రి ప్రత్యేక డ్రైవ్‌పై నిర్వహించారు. శిరస్త్రాణం ధరించని వారిని, మద్యం తాగి వాహనం నడిపేవారిని, వ్యతిరేక మార్గాల్లో ద్విచక్ర వాహనంతో వెళ్లే వారిని స్థానిక స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి పలు హెచ్చరికలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీపీ జి.రామకృష్ణ, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి చేయరూ..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులు పంట పొలాలకు వెళ్లే రహదారిపై రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. రుద్రవరం గ్రామం కొత్తూరు నుంచి తూర్పు వైపు ఉన్న పంట పొలాకు వెళ్లే మట్టి రోడ్డు బురదకయ్యగా మారి అవస్థలు పడుతున్నారు. పంటలకు ఎరువులు, మందులు తరలించాలంటే కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. తారు రహదారిగా అభివృద్ధి చేసి పండించిన పంటలు గృహాలకు తరలించుకొనే సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

క్రీడాకారులకు అభినందనలు

అభినందిస్తున్న ఛైర్మన్ కొల్లి రవికుమార్

జి.కొండూరు: విజయవాడ సిద్ధార్థ కళాశాలలో జరిగిన స్పోర్ట్స్ ఫెస్ట్‌లో జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలోని శ్రీవాణి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫార్మసీ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 22 క్రికెట్ టీములు పాల్గొనగా శ్రీవాణి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఫైనల్‌కు చేరుకుని కప్ చేజిక్కించుకున్నారు. ప్రతిభ చాటిన వారిని మంగళవారం కళాశాలలో ఛైర్మన్ కొల్లి రవికుమార్, ప్రిన్సిపల్ ఎన్.ఉషారాణి అభినందించారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు పౌరుల సహకారం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి పౌర సమాజం సహకారం అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల కట్టడిపై మంగళవారం ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త ఎస్.ఆర్. పరిమి మాట్లాడుతూ.. పోలీస్ యంత్రాంగం, రాజకీయ ప్రమేయం లేకుండా విద్యాసంస్థల పరిసరాల్లోకి గంజాయి ఎలా ప్రవేశిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు గమనించాలని సూచించారు. ప్రముఖ వైద్యుడు ఎస్.సుధాకర్ మాట్లాడుతూ.. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికా సామ్రాజ్యవాదం ఆఫ్ఘనిస్తాన్‌లో రైతులను అధిక ఆదాయం ప్రలోభంతో గంజాయి పండించేలా ప్రోత్సహించిందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపేలా ప్రజా ఉద్యమం చేయాలని పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మానవ జాతి అంతరించేలా మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది మొత్తంలో కేసులు పట్టుకునే పోలీసులు.. టన్నుల కొద్దీ సరఫరాను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మాదకద్రవ్యాల అంశంపై ప్రభుత్వం పాలసీని ప్రకటించాలని కోరారు.

వైద్యురాలికి వరకట్న వేధింపులు

మధురానగర్, న్యూస్‌టుడే : పెళ్లై నాలుగు సంవత్సరాలు అవుతున్నా.. అదనపు కట్నం కోసం వైద్యురాలిని వేధిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. రామలింగేశ్వరపేటకు చెందిన ఓ యువతి ఎంబీబీఎస్ చదివారు. 2022, మే నెలలో సాయి గణేష్‌తో ఆమెకు వివాహమైంది. కట్నం కింద రూ.15 లక్షల నగదు, 30 గ్రాముల బంగారం ఇచ్చారు. ఆ తర్వాత భర్త రోజూ తాగివచ్చి వేధిస్తున్నాడు. ఇంకా కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో.. బాధితురాలు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మామిడితోట అమ్మకం
A. కొండూరు మండలం,
కుమ్మరికుంట నుండి బుద్దారం
మెయిన్‌రోడ్‌లో తూర్పుఫేస్
6.00 ఎకరములు,
15 సం॥ వయస్సుగల
మామిడితోట అమ్మబడును.
94481 11707
88843 31116

(c) eenadu

విజయవాడ తూర్పు

బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

కరెన్సీనగర్: బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ... కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. సమాజంలో అసమానతలు తగ్గించడమే లక్ష్యంగా 'పీ4' విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం 5వ డివిజన్ క్రీస్తురాజపురానికి చెందిన మేకల ఈస్టర్ బాబు కుమార్తె శశిరేఖకు కళాశాల ఫీజు నిమిత్తం ఆయన రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు. డివిజన్ అధ్యక్షుడు బచ్చులకూరి అజయ్, నందిపాటి దేవానంద్, రాచమళ్ల ఆంజనేయులు, షేక్ షరీఫ్, బోరుగడ్డ వరప్రసాద్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కరెన్సీనగర్: 80085 74652

స్పందన: ❖ మూడో డివిజన్ ఈఎస్ఐ హాస్పిటల్ నుంచి గుణదల సెంటర్‌కు వెళ్లే మార్గంలో భూగర్భ డ్రైనేజీ పొంగుతోందని స్థానిక నివాసి నాగ శ్రీనివాస్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో పూడిక తీయించారు. ❖ 4వ డివిజన్ వెంకటేశ్వర నగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త తొలగించాలని స్థానిక నివాసి శివ శంకర్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా శానిటరీ అధికారి జానకీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో చెత్త తీయించివేశారు. ❖ 3వ డివిజన్ విజయలక్ష్మి కాలనీ 3-10/13 విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి వేణుగోపాల్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

లక్ష్యం బాగు.. పంపిణీ జాగు!

94.1 శాతమే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

నిత్యావసర సరకుల పంపిణీ పారదర్శకంగా జరగాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గతేడాది ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించింది. ఆరు నెలలు గడుస్తున్నా.. ఆ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఇంకా కార్డులు తీసుకోవాల్సిన వారు ఉన్నారు. వారందరికీ అధికారులు సమాచారం ఇచ్చి తీసుకెళ్లాలని కోరుతున్నారు. లబ్ధిదారులు స్పందిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

వేర్వేరు ప్రాంతాల్లో ఉంటూ..

● తూర్పు నియోజకవర్గంలోని 21 డివిజన్ల పరిధిలో 89 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. 68,658 మంది కార్డుదారులు ఉన్నారు. ● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసింది. స్మార్ట్ కార్డులు అందించి లబ్ధిదారులకే నేరుగా సరకులు ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా గతేడాది ఆగస్టు నుంచి అధికారులు పంపిణీ ప్రారంభించారు. ● తొలుత డీలర్లు, సిబ్బంది కార్డుదారుల ఇళ్లకు వెళ్లి కార్డులు అందజేశారు. అనంతరం రేషన్ దుకాణానికి వచ్చిన వారికి ఇచ్చారు. ఇప్పటివరకు 64,611 మంది వాటిని తీసుకున్నారు. అంటే 94.1 శాతమే పంపిణీ పూర్తయింది. ● ఉపాధి కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కృష్ణలంక, రాణిగారి తోట, మొగల్రాజపురం, గుణదల, క్రీస్తురాజపురం ప్రాంతాల్లో చాలామంది ఉన్నారు. వారికి కూడా రేషన్ కార్డులు ఉన్నాయి. ● నగరానికి వచ్చిన వారిలో కొందరు తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు. మరికొందరు పక్క నియోజకవర్గాలైన పెనమలూరు, గన్నవరం, విజయవాడ మధ్యలో స్థిరపడ్డారు. కొంత మంది ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఉన్నారు. ● మొత్తం మీద కార్డులు తీసుకోని లబ్ధిదారులు 4,047 మంది ఉన్నట్లు తేలింది. వారి వివరాలు సిబ్బంది సేకరించి సమాచారం ఇస్తున్నారు.

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు

కార్డుదారులు వివిధ జిల్లాల్లో ఉన్నారు. వారందరికీ ఫోన్లు చేసి చెబుతున్నాం. వెంటనే రేషన్ డీలర్ దగ్గరికి వెళ్లి స్మార్టు కార్డులు తీసుకోవాలని సూచిస్తున్నాం. ఆ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. - శ్రీనివాస్, ఏఎస్‌ఓ

వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు

అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్

బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : రద్దీ ప్రాంతాలైన బెంజి సర్కిల్, లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్, జ్యోతి కన్వెన్షన్ పరిసరాల్లో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించడానికి అనువుగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బెంజి సర్కిల్‌లోని జ్యోతి కన్వెన్షన్ పరిసర ప్రాంతాలను నగర పాలక సంస్థ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పైవంతెనల వల్ల ట్రాఫిక్ సమస్య కొంత తగ్గిందని, స్థానికులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పైవంతెన కింద గ్రీనరీని కొంతమేర కుదించి రోడ్డు నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య కొంత పరిష్కారం అవుతుందని అన్నారు. పటమట లంక వాసులు స్క్యూబ్రిడ్జి కింద నుంచి పకీర్‌గూడెం వైపు రావడానికి రోడ్డు మార్గం కావాలని అడుగుతున్నారని, అందుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఎంపీ శివనాథ్, నగరపాలక సంస్థ, ఎన్‌హెచ్ అధికారులు, స్థానికులతో కలిసి మరోసారి ఆయా ప్రాంతాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నాయకుడు చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, నాగు మోతు రాజా, కేవీ రమేశ్, వైవీ ఈశ్వరరావు, కేవీ రామారావు, చెన్నుపాటి వజీర్, ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు పౌరుల సహకారం అవసరం

కృష్ణలంక: మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి పౌర సమాజం సహకారం అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల కట్టడిపై మంగళవారం ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త ఎస్.ఆర్. పరిమి మాట్లాడుతూ.. పోలీస్ యంత్రాంగం, ప్రభుత్వ ఏజెన్సీల కళ్లుగప్పి విద్యాసంస్థల పరిసరాల్లోకి గంజాయి ఎలా ప్రవేశిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. వైద్యుడు ఎస్.సుధాకర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపేలా ప్రజా ఉద్యమం చేయాలన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. మానవ జాతి అంతరించేలా మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబీవీకే బాధ్యుడు పి.మురళీకృష్ణ.. ఈ సామాజిక రుగ్మతను రూపుమాపేందుకు బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు.

ఆదాయ పన్ను విధానంపై అవగాహన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం, ఐక్యూఏసీ సంయుక్త సహకారంతో సెంట్రల్ ఎక్సైజ్ డేని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆదాయపు పన్ను శాఖ అధికారి బి.వీరబ్రహ్మయ్య హాజరై ఆదాయ పన్ను విధింపు, జీఎస్టీ విధానాలను వివరించారు. ఐక్యూఏసీ సమన్వయకర్త సిస్టర్ క్యాండీ డి కున్హా, ఎంబీఏ విభాగాధిపతి ఎం.విజయ్ కుమార్ పర్యవేక్షించారు.

వీరబ్రహ్మయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న సిస్టర్ క్యాండీ తదితరులు

ప్రతిభావంతులకు పురస్కారాల ప్రదానం

కరెన్సీనగర్: మారుతున్న పరిశోధన, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా జీవ విజ్ఞాన విద్యను రూపొందించాలని భారత టెలికమ్యూనికేషన్స్ అకౌంట్స్ కంట్రోలర్ తారా చంద్ అన్నారు. ఆంధ్రా లయోలా కళాశాల వృక్ష, జంతు, సూక్ష్మ జీవ, బయో టెక్నాలజీ, ఆహార సాంకేతిక, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు యంగ్ సైంటిస్ట్, జూనియర్ సైంటిస్ట్ అవార్డులు ప్రదానం చేశారు. 25 మౌఖిక, 35 పోస్టర్ ప్రజంటేషన్లు ఇచ్చారు. స్టెమ్ సెల్ టెక్నాలజీ, 3డి కణజాలం, అవయవ పునర్నిర్మాణం, ప్రో బయాటిక్స్ తదితర ఆధునిక అంశాలపై వక్తలు వీరబ్రహ్మచారి, ఆర్.ఎస్.ప్రకాశం, హరికాంత్ మాట్లాడారు. ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కియోర్, కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజిలో అతిథులను సన్మానించారు. సదస్సు కన్వీనర్ కె.బాలచంద్ర, కో-కన్వీనర్ టి.రోజ్‌మేరీ, వైస్ ప్రిన్సిపల్ శివకుమారి, శ్రీలక్ష్మి, సంధ్యశ్రీ, జెమీమా పాల్గొన్నారు.

తారాచంద్‌ను సత్కరించిన ప్రిన్సిపల్ మిల్కియోర్ తదితరులు

ఎగుమతులు పెరిగితేనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న నదీరసూల్, పక్కన రాజేశ్

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దేశంలో ఎగుమతులు వాటా పెరిగితేనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, ఏపీ సెంటర్ ప్రతినిధి డాక్టర్ నదీరసూల్ అన్నారు. వీపీ సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో "సేద్యం, తోటల పెంపకం, ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి వ్యాపారంతో ఉపాధి" అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ఆహార ఉత్పత్తుల్లో మన దేశానికి ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. బహుళ జాతి సంస్థలు అమ్మే చాలా ఆహార పదార్థాలు మన దేశానికి చెందినవే అయినా.. ఆ నిజం ఎక్కువ మందికి తెలియదని వివరించారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య రాజేశ్ సి. జంపాల, అధ్యాపకుడు రెహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో వ్యర్థాల తిష్ఠ

మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్ నుంచి బాయన బాబూజీ రోడ్డుకు వెళ్లే పంట కాలువ డ్రెయిన్‌లో వ్యర్థాలు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త పేరుకున్న నేపథ్యంలో దోమలు కూడా పెరిగిపోతున్నాయి. సాయంత్రమైతే బయట నిలబడలేని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

తిరగబడిన పారిశుద్ధ్య డబ్బాలు

పటమట లంకలోని చేపల మార్కెట్ వద్ద చెత్త కోసం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డబ్బాలు ఎప్పుడూ కింది వైపునకు తిరిగి ఉంటున్నాయి. నెలల తరబడి డబ్బాలు అలాగే ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్లపై చెత్త వేయకుండా.. ఆయా డబ్బాల్లో వేసుకునేందుకు ఏర్పాటు చేసినవి నిరుపయోగంగా మారాయని, వాటిని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పటమట

ఇరుకు రోడ్డు... ట్రాఫిక్ కష్టాలు

మహాత్మా గాంధీ రోడ్డు నుంచి మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీకి వెళ్లే రహదారి ఇరుకుగా మారింది. తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో ఓ కల్యాణ మండపం ఉంది. వేడుకల సమయంలో అక్కడికి కార్లు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారిని వన్ వే చేసి కార్ల ప్రవేశాన్ని ఆపితే కాలనీకి వెళ్లే వారికి వెసులుబాటుగా ఉంటుంది. అధికారులు స్పందించాలి. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ప్రమాదకరంగా చప్టా

పటమటలోని యాదవుల బజారులో చప్టా ధ్వంసమై గుంతలా ఏర్పడింది. ఇటు వైపు రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పటమట

పేరుకుపోయిన చెత్త తొలగించండి

కృష్ణలంక 20వ డివిజన్ నెహ్రూ నగర్ రెండో రోడ్డు మొదట్లో వ్యర్థాలు కొంతకాలంగా పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని తొలగించడం లేదని స్థానికులు చెబుతున్నారు. చెత్త వల్ల ఇబ్బంది పడుతున్నామని, డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టి సారించి, వాటిని అక్కడ నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కృష్ణలంక

మురుగు పారదు.. దోమలు వీడవు

పటమట, న్యూస్‌టుడే

సచ్చిదానంద ఆశ్రమం రోడ్డులో ఇలా..

నియోజకవర్గంలోని 11వ డివిజన్ వాసులు మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల కిందట అప్పటి జనాభా అవసరాల మేరకు కాలువలు నిర్మించారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేశారు. కాలక్రమేణా జనాభా విపరీతంగా పెరిగింది. ప్రస్తుత మురుగునీటి వ్యవస్థ ప్రజల అవసరాలు తీర్చలేకపోతోంది. కాలం చెల్లిన పైపులైన్లపై ఒత్తిడి పెరిగి తరచూ మ్యాన్‌హోల్స్ పొంగి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల కాలువలు ధ్వంసం కావడమే కాకుండా వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు ప్రవహించడం లేదు. ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతోంది. దుర్వాసన వెదజల్లుతోంది. కరణంగారి వీధి, వివేకానంద కాలనీ, సచ్చిదానంద ఆశ్రమం రోడ్డు తదితర ప్రాంతాల్లో సమస్య మరింత ఎక్కువగా ఉంది. దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. తరచూ ఫాగింగ్ కూడా చేయడం లేదని వాపోతున్నారు. డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించి, దోమల నివారణ మందు పిచికారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కరాటే పోటీలో పతకాలు

ప్రతిభ చూపిన క్రీడాకారులతో దుర్గారావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని వాంకన్-డొ కరాటే సమాఖ్య రాష్ట్ర శాఖకు చెందిన క్రీడాకారులు దక్షిణ భారత స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్నారని రాష్ట్ర శాఖ చీఫ్ ఎస్.దుర్గారావు తెలిపారు. నిడదవోలులో ఈ నెల 22న జరిగిన పోటీలో తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 600 మంది క్రీడాకారులు తలపడ్డారని పేర్కొన్నారు. పురుషుల వైట్ బెల్ట్ కటాలో ఉప్పల కోటేశ్వరరావు (40 ఏళ్లు) పసిడి, ఆయన కుమారుడు ఉప్పల మురళీ మోహన్ (9 ఏళ్లు) రజత పతకం సొంతం చేసుకున్నాడు. సంకు అనన్య (8 ఏళ్లు) కటాలో పసిడి పతకం కైవసం చేసుకుంది.

జాతీయ రహదారిపై వేగనిరోధకాల ఏర్పాటు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రజలను ప్రమాదాల బారి నుంచి రక్షించే క్రమంలో జాతీయ రహదారిపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేసినట్లు కృష్ణలంక సీఐ ఎస్వీవీఎస్ నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... కృష్ణలంక, రాణిగారితోట ప్రాంత ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా సీతమ్మ వారి పాదాల సెంటర్ నుంచి బెంజి సర్కిల్ పైవంతెన వరకు 28 చోట్ల వేగ నిరోధకాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయా ప్రాంతాల ప్రజలు జాతీయ రహదారి దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకొని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు సుమారు రూ.4.80 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు మంగళవారం పూర్తయినట్లు సీఐ తెలిపారు. ఫలితంగా ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందన్నారు.

మద్యం మత్తులో బీరు సీసాతో దాడి

గుణదల (పటమట), న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు తన మేనత్త ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేసిన ఘటన కార్మిక నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... చీరాలకు చెందిన బండి ప్రసాద్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటారు. పనులు ఉన్నప్పుడు విజయవాడ వచ్చి.. పూర్తవగానే తిరిగి వెళ్లిపోతుంటారు. విజయవాడ వచ్చినప్పుడు గుణదల కార్మికనగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటారు. సోమవారం ప్రసాద్ ఇంటి బయట ఫోన్ మాట్లాడుతున్నారు. ఇంతలో ఇంటి యజమాని బంధువు షౌకత్ అలీఖాన్ మద్యం మత్తులో బీరు సీసా పట్టుకొని అక్కడికి వచ్చాడు. తన మేనత్త ఇంట్లో ఎందుకు ఉన్నావని ప్రసాద్‌తో గొడవ పడ్డాడు. తాను అద్దెకు ఉన్నానని చెబుతుండగానే.. బీరు సీసాతో అతని తలపై దాడి చేశాడు. తల, చెవికి తీవ్ర గాయమై ఆయన కింద పడిపోయాడు. మళ్లీ కర్రతో దాడి చేశాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు గాయపడిన ప్రసాద్‌ను ఆసుపత్రికి, నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. నిందితుడిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

సమస్యలతో సతమతం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

సగమే వేసిన షెడ్డు

నియోజకవర్గంలోని పున్నమ్మ తోట, లబ్బీపేట, పకీర్ గూడెం, మొగల్రాజపురం, రాణిగారితోట, కృష్ణలంక ప్రాంతాల్లో సుమారు 250 కుటుంబాలు దుస్తులు శుభ్రం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాయి. వారి సౌకర్యార్థం నగర పాలక సంస్థ పున్నమ్మ తోటలో బందరు కాలువ పక్కన దోబీఖానా ఏర్పాటు చేసింది. దుస్తులు ఉతికేందుకు అనువుగా దిమ్మెలు, నీటి నిల్వకు తొట్టె నిర్మించింది. బోరు ద్వారా తొట్టెలోకి నీరు నింపితే.. రోజూ ఆయా కుటుంబ సభ్యులు వచ్చి దుస్తులు ఉతికి ఆరబెడతారు. కొంత మంది ఉతుక్కొని తీసుకెళ్తారు. దుస్తులు ఉతికే చోట ఎండ తగలకుండా గత ప్రభుత్వం సగం షెడ్డు వేసింది. కూటమి ప్రభుత్వం మిగతా ప్రాంతంలోనూ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. దోబీఖానా పక్కన చెట్లు ఉండడంతో వాటి వేళ్లు లోపలికి చొచ్చుకొచ్చాయి. వినియోగించిన నీరు కాలువలోకి వెళ్లేందుకు నిర్మించిన డ్రెయినేజీ రక్షణ గోడ, నేల మధ్య నెర్రలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల డ్రెయినేజీ రక్షణ గోడలు పగిలిపోయాయి. సమస్యలు పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏప్రిల్ 25న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ విజయసారథి, అధ్యాపకులు

కరెన్సీనగర్: 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ ఏడాది ఏప్రిల్ 25న పరీక్ష నిర్వహించనున్నట్లు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ సమన్వయకర్త ఎం.విజయ సారథి తెలిపారు. మంగళవారం కళాశాలలో పరీక్షకు సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. అధ్యాపకులు జి.వి.ఈశ్వర్‌రెడ్డి, బాబూరావు, శోభన్‌బాబు, మధుసూదనరావు, మూర్తి, నాగరాజు, రవికిరణ్, హమీద్ పాల్గొన్నారు.

586 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థుల గైర్హాజరు

మాచవరం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 38,211 మందికిగాను 586 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లాలోని 98 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని, ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆయన చెప్పారు.

శ్రద్ధాంజలి



కీ॥శే॥ ఐలాపురం వెంకయ్య గారు
మాజీ ఎమ్.ఎల్.సి., ఛైర్మన్ : హోటల్ ఐలాపురం, విజయవాడ

ఆతిథ్య వ్యాపార రంగంలో అగ్రగామిగా వెలుగొందిన మహనీయులు...
తన ఇంటి పేరుతో నగరానికి ఖ్యాతి తెచ్చిన నిత్య కృషీవలురు...
వందలాదిమంది కార్మికులకు ఉపాధి కల్పించిన నిరంతర శ్రామికులు...
విజయవాడ హోటల్ వ్యాపార రంగానికి అమూల్యమైన సేవలు అందించిన దార్శనికులు
ఐలాపురం వెంకయ్య గారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ..
వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము...

MUTHAVARAPU SRINIVASABABU - SWARNA GROUP
Hon. President : A.P. Hotel's Association

R.V. SWAMY
President : A.P. Hotel's Association
Chairman : Hyatt Place

P.V. RAMANA - RR DURBAR
President : Vijayawada Hotel Owner's Association

M. MADHUSUDHAN RAO
Joint Secretary : A.P. Hotel's Association
Vindu Bhojanam

Ch. MALLIKARJUNA RAO
Sri Satya Sai Hotels

P. SIVA PRASANTH
Hotel Alankar Inn

T. RAVI KUMAR
Cherry's

A. SAI PRASAD
MITHAI SHOP SWEET MAGIC®

SUREDDY VENKATA REDDY
Hotel Goldenway & V Grand

K.V.V. PRASAD
Alankar Sweets & Bakery

MUPPA VENKATESWARA RAO
Ex. Corporator

VIJAYAWADA HOTEL OWNER'S ASSOCIATION

నందిగామ

●నందిగామ ●జగ్గయ్యపేట

డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె

కంచికచర్ల కేడీసీసీ బ్యాంకు ఎదుట సమ్మెలో ఉద్యోగులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధన కోసం సహకార సంఘాల ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరింది. కంచికచర్ల కేడీసీసీ బ్యాంకు కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన పలువురు సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు. జీవో నంబరు 36 వెంటనే అమలు చేయాలని, వేతన సవరణలు వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పలు సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు కృషి చేద్దాం

ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం గౌరవరం గ్రామంలో నిర్వహించారు. డీసీపీ లక్ష్మీనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు సూర్యశ్రీనివాస్, మణికంఠ పాల్గొని.. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే ప్రమాదాన్ని ప్రజలకు వివరించారు. నివారణకు ప్రజలు, ప్రభుత్వం, సమాజం, ఉపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని డీసీపీ తెలిపారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మహేశ్వర వెంకటేశ్వరరావు పాల్గొని 'యువత మేలుకో డ్రగ్స్‌కు దూరంగా ఉండు' అంటూ ప్రచురించిన కరపత్రాలను గ్రామ పెద్దలకు, విద్యార్థులకు, ప్రజలకు అందించారు.

మునేరు రక్షిత మంచినీటి బోర్లకు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

పనులు పరిశీలిస్తున్న కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణిశ్రీనివాసరావు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలోని మునేరు రక్షిత మంచినీటి పథకం బోర్లు, పైపులైన్ మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. 'ఈనాడు' దినపత్రికలో సోమవారం 'గొంతు తడవడం కష్టమే' శీర్షికతో వచ్చిన కథనానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు స్పందించారు. మునేరుకు గతంలో వచ్చిన వరదలకు దెబ్బతిన్న బోర్లు, పైపులైన్‌కు అత్యవసర పనులు చేపట్టారు. దీని కోసం తాగునీటి సరఫరా నిలిపివేశారు. కొత్తగా బోర్లు, పైపులైన్లు, విద్యుత్తు లైన్లు పునరుద్ధరించే పనులు చేపట్టారు. అప్పటి వరకు నందిగామకు కీసర రక్షిత మంచినీటి పథకం నుంచి మాత్రమే తాగునీరు సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు. సరఫరా పర్యవేక్షణకు వార్డుల వారీగా సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు. నీటి సరఫరాపై సమాచారం కోసం ఏఈ చరవాణి నంబరు 94907 81856ను సంప్రదించాలన్నారు.

కాలువలు అధ్వానం.. అన్నదాతల కలవరం

న్యూస్‌టుడే, నందిగామ, పెనుగంచిప్రోలు

నాగార్జునసాగర్ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వం మరమ్మతులకు నిధులివ్వకపోవడంతో కాలువల్లో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి నీరు దిగువకు వెళ్లట్లేదు. ఫలితంగా ఆయకట్టు చివరి భూములకు నీరందక అన్నదాతలు ఇబ్బందిపడుతున్నారు. పైర్లకు నీరందించటానికి భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జగ్గయ్యపేట ఎన్నెస్పీ డివిజన్ పరిధిలో రూ.2.30 కోట్ల పనులకు పరిపాలన ఆమోదం తెలిపారు. నిధులు విడుదల చేయకపోవడంతో ముందుగా పనులు చేస్తే డబ్బులు వస్తాయో లేదోనని సాగునీటి సంఘాల ప్రతినిధులు ముందుకు రావట్లేదు. ఒకరిద్దరు డీసీ అధ్యక్షులు మాత్రం కొన్ని పనులు చేశారు. ఈపరిస్థితుల్లో నిధుల విడుదలకు ఎన్నెస్పీ అధికారులు, ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, డీసీ అధ్యక్షులు ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులు నీటి శిస్తు సకాలంలో చెల్లించకపోవటం వల్ల నిధుల సమస్య వస్తోందంటున్నారు.

నందిగామ వద్ద కంచల మేజర్ కాలువ ఇలా

ఎన్నెస్పీ ఆయకట్టు (ఎకరాల్లో)	
★ సబ్‌డివిజన్‌లు	: మూడు
★ కంచల మేజర్ పొడవు	: 22 కి.మీ
★ ఏటూరు మేజర్ పొడవు	: 25 కి.మీ
★ మిర్చి సాగు	: 15,000
★ పత్తి	: 50,000
★ పసుపు	: 2,000
★ మొక్కజొన్న రబీలో	: 15,000

గత తెదేపా ప్రభుత్వంలో బ్రాంచి కెనాల్‌తోపాటు మేజర్ కాల్వల్లోనూ అభివృద్ధి పనులు చేశారు. ప్రస్తుతం కంచల, ఏటూరు మేజర్, శనగపాడు -1,2, పెనుగంచిప్రోలు మేజర్‌తో పాటు ఇతర కాలువల్లో పిచ్చి చెట్లు దట్టంగా పెరిగి అధ్వానంగా మారాయి. కాలువల తూములు దెబ్బతిన్నాయి. దీనివల్ల దిగువకు సాగునీరు సరఫరా కాక మిర్చి, మొక్కజొన్న, పసుపు, పత్తి రైతులు ఇబ్బందిపడుతున్నారు. మరోవైపు 70 మంది లస్కర్లకు గాను కేవలం పది మంది మాత్రమే ఉండటంతో కాల్వలపై పర్యవేక్షణ కొరవడింది.

ఇదీ దుస్థితి

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధి జోన్-2లో జగ్గయ్యపేట ఎన్నెస్పీ డివిజన్ ఉంది. దీని కింద జగ్గయ్యపేట-1, 2, నందిగామ సబ్‌డివిజన్‌లు ఉన్నాయి. మేజర్, మైనర్, సబ్‌మైనర్ కాలువల ద్వారా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ఐదు మండలాలకు సాగునీరు సరఫరా అవుతుంది. దేవినేని వెంకటరమణ బ్రాంచి కెనాల్ ద్వారా 900 క్యూసెక్కుల నీరు ఆయా కాలువలకు అందుతుంది.

నిధులు రాగానే మరమ్మతులు: కిషోర్, ఈఈ, ఎన్నెస్పీ

కాలువల అభివృద్ధికి నిధులు విడుదలకు ప్రయత్నిస్తున్నాం. రాగానే మరమ్మతులు చేయిస్తాం. లస్కరు ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు పంపాం. రైతులు శిస్తు చెల్లించి సహకరించాలి.

కల్తీ నెయ్యి పాపం ఊరికే పోదు

ప్రభుత్వ విప్ సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి వినియోగం పాపం పక్కా ఆధారాలతో నిరూపితమైందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీలో మంగళవారం సీఎం చంద్రబాబు పూర్తి ఆధారాలతో వీడియోలు ప్రదర్శించారని చెప్పారు. సనాతన ధర్మానికి ఎదురవుతున్న సవాళ్ల గురించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉద్వేగ భరితంగా వివరించారన్నారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైకాపా డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. దీంట్లో భాగంగానే హెరిటేజ్ సంస్థపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కల్తీ నెయ్యి పాపం ఊరినే పోదని.. దేవుడు తగిన విధంగా శిక్షిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తు వారి అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో రామకోటి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. చల్లా బ్రహ్మేశ్వరరావు, అనూరాధ దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించి స్వామివారికి నూతన వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సీతారామనామ సంకీర్తనా సంఘం అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, కార్యదర్శి వెంకట సత్యనారాయణగుప్తా, కోశాధికారి నాగ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

✦ అంబారుపేట బోధానంద స్వామి ఆశ్రమ ఆవరణలో శ్రీకృష్ణ మందిర తృతీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. రాధాకృష్ణుల మూలమూర్తులకు పంచామృతాభిషేకం, అర్చన, పుష్పాలంకరణ చేసి హారతులు ఇచ్చారు. నిర్వాహకులు బొగ్గవరపు సీతారామకృష్ణ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో రాధాకృష్ణుల మూలమూర్తి

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎంపీడీవో నితిన్

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్ వద్ద ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అధికారులతో కలిసి స్వచ్ఛ రథాన్ని మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, వ్యర్థాలతో సంపద సృష్టించి ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛ రథం కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఇంటింటికి వచ్చే స్వచ్ఛ రథానికి పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, బాటిళ్లు, కవర్లు, ప్యాకెట్లు, గాజు సీసాలు, పేపర్లు, ఇనుము, నూనె డబ్బాలు, స్టీల్, అల్యూమినియం వ్యర్థాలను ఇస్తే వాటిని తూకం వేస్తారని.. ఆ విలువకు సమానమైన సబ్బులు, టూత్ పేస్టులు, ఉల్లిపాయలు వంటి సుమారు 20 రకాల నిత్యావసర వస్తువులు అందజేస్తారని చెప్పారు. గ్రామాలను చెత్త రహితంగా మార్చడం, ప్రజలకు ఇంటి వద్ద సరకులు అందించడం, వాహనదారులకు ఉపాధి కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. ఎంపీడీఓ జి.నితిన్, నాయకులు ధూళిపాళ్ల లక్ష్మణరావు, నరసింహారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రషీద్‌ను సన్మానిస్తున్న విప్ తంగిరాల సౌమ్య

ప్రభుత్వ ఖాజీగా అబ్దుల్ రషీద్

నందిగామ, న్యూస్‌టుడే: కంచికచర్ల మండలానికి ప్రభుత్వ ఖాజీగా షేక్ అబ్దుల్ రషీద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నందిగామలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యను అబ్దుల్ రషీద్, ముస్లిం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను సౌమ్య ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ.. మైనార్టీల సామాజిక, ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. హైకోర్టు వక్ఫ్‌బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ షేక్ కరీముల్లా, తెదేపా పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనలపై అవగాహన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లింగాలపాడు పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులు మంగళవారం గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీకే) సందర్శించారు. అగ్రికల్చర్ ఒకేషనల్ విద్య అభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులకు శాస్త్రవేత్త డాక్టర్ పీఎం శివప్రసాద్, హోంసైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.ప్రభావతి వ్యవసాయ పరిశోధనల గురించి చెప్పారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ ద్వారా ఆదాయం పొందొచ్చని వివరించారు. ప్రధానోపాధ్యాయులు ఆర్ రాంబాబు, ఒకేషనల్ వాలంటీర్లు ఎ.నరేష్, ఎస్.శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో లింగాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులు

డొంక రోడ్డుకు మోక్షం

స్పందనకు స్పందన

కొడవటికల్లులో పొలాలకు వెళ్లే డొంక రోడ్డుకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించింది. గత ప్రభుత్వం డొంక రోడ్ల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించడంతో అధ్వానంగా మారి రాకపోకలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు రోడ్డుపై పడిన గుంతల్లో నీళ్లు నిలిచి నడవడానికి కూడా వీలు లేకుండా మారింది. దీనిపై న్యూస్‌టుడేలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వం స్పందించి రూ.10 లక్షల నిధులను కేటాయించి ముత్యాలమ్మ తల్లి గుడి నుంచి 600 మీటర్ల వరకు అభివృద్ధి చేసింది. రోడ్డు పనులు చేపట్టడంతో పొలాలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కొడవటికల్లు (చందర్లపాడు)

రోగులకు అన్నప్రసాద వితరణ

అన్నప్రసాదాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు సద్గురు బోధానంద స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు వితరణ చేశారు. వైద్యశాలలో మంగళవారం రోగులకు, ప్రజలకు అంబారుపేటలోని ఆశ్రమ ప్రతినిధులు భోజనాలు అందించారు. దాతలు, భక్తుల సహకారంతో రోజూ రోగులకు అన్నప్రసాదాలు ప్రత్యేకంగా తయారు చేయించి తీసుకొచ్చి వడ్డిస్తున్నారు. దీనివల్ల రోగులకు ప్రయోజనం కలుగుతుంది.

అకాల వర్షం.. రైతుకు కష్టం

కంచికచర్ల సమీపంలో నేలవాలిన మొక్కజొన్న

మంగళవారం ఉదయం కల్లాల్లో ఆరబోసిన మిర్చి..

పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, నందిగామ గ్రామీణం: నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. కంచికచర్లలో మొక్కజొన్న పంట నేలవాలడంతో నష్టాలు తప్పేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లోని పలు గ్రామాల్లో మిర్చి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొందరు కోసిన కల్లాల్లో ఆరబోశారు. మంచి ధర ఉన్న సమయంలో తడవడం వల్ల మిర్చి దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం పరదాలు తీసి పంట ఆరబెట్టారు. ✦ కంచికచర్ల స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కళ్లాలు ఆరబోసిన రైతులు పంటను తడవకుండా కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. ✦ నందిగామ పరిసర గ్రామాల్లోని రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ, పెద్దవరం, చెర్వుకొమ్ముపాలెం, అడవిరావులపాడు తదితర గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిరపకాయలు స్వల్పంగా తడిశాయి. వత్సవాయి మండలంలో అత్యధికంగా 56.2, నందిగామలో 32.2, జగ్గయ్యపేటలో 26.4, పెనుగంచిప్రోలులో 17.2, చందర్లపాడులో 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏప్రిల్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఏప్రిల్‌లో తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసే చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని గోళ్లమూడి, రుద్రవరం, జొన్నలగడ్డ, చందాపురం, తక్కెళ్లపాడు గ్రామాల్లో మంగళవారం రైతులకు ఈపీబీ పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రెండోవిడత రీ సర్వే పూర్తయిన ఈ గ్రామాల్లోని రైతులకు 3446 పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని అన్నారు. పేర్లు, విస్తీర్ణం, సర్వే నంబర్ల తప్పులు లేకుండా ముందుగానే సవరించి ఈపీబీ అందజేశామని, ఆ తరువాత పాస్ పుస్తకాలు ముద్రిస్తామని చెప్పారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు శ్రీరాములు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఈపీబీ పత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దారు సురేష్‌బాబు

కనీస వేతనం అమలు చేయాలి

నందిగామ: దీక్షలో అంగన్‌వాడీ కార్యకర్తలు

నందిగామ, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నందిగామలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం రెండోరోజు సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. మే లో వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి, యాప్‌లు, కంప్యూటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అర్హులైన అంగన్‌వాడీ పిల్లలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టరు గోపాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు గోపీనాయక్, కర్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో 2వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష చేశారు. వారు మాట్లాడుతూ.. కనీస వేతనం అమలు చేయాలని, గ్రాట్యూటీ అమలుకు ప్రణాళిక రూపకల్పన చేయాలని, పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మార్చి 2న విజయవాడ వేదికగా మహా ధర్నా చేపడతామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: ✦ మునగచర్ల జెండా చెట్టు సెంటరులో కాలువలో మురుగునీరు ప్రవహించడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పూడిక తీయించారు. ✦ కమ్మవారిపాలెం ఓసీ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదనే ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు స్పందించారు. దీపాలకు మరమ్మతులు చేయించారు. ✦ మాగల్లు కొట్ల బజారులో మురుగునీరు ప్రవహించడం లేదనే ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి కనకపూడి నాగరాణి స్పందించారు. కాలువల్లో పూడిక తీయించారు. ✦ కొండూరులో ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి రవి స్పందించారు. మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

14న జాతీయ లోక్‌అదాలత్

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో మార్చి 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు స్థానిక జిల్లా అదనపు న్యాయమూర్తి, కోర్టు న్యాయాధికారి పి.శ్రీనివాసరావు తెలిపారు. నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సత్వరం కేసులు పరిష్కరించి ఇరు వర్గాలకు న్యాయం చేయాలనే సంకల్పంతో లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు కోర్టుల పరిధిలోని కేసులను రాజీ మార్గంలో కక్షిదారులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇరుపక్షాలు రాజీపడి వస్తే కేసులను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తాగునీటి సరఫరాకు విఘాతం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏటిపట్టు గ్రామాల్లో రెండు రోజులుగా తాగునీటి సరఫరా జరగడం లేదు. వేసవి తీవ్రత పెరుగుతున్న సమయంలో పైపులైన్ పగిలి సరఫరాకు విఘాతం ఏర్పడింది. మరోవైపు మునేటి ఒడ్డున రాఘవాపురం పైలెట్ ప్రాజెక్టులో విద్యుత్తు ప్యానల్ బోర్డులు కాలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పైపులైన్ పగిలి జొన్నలగడ్డకు నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచింది. మాగల్లు పంచాయతీ తాగునీటి పథకం పైపులైన్ పగిలి నీటిసరఫరా నిలిచింది. పబ్లిక్ కుళాయిల ద్వారా తాగునీరు అందక జనం ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం పైపులైన్‌కు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. పైలెట్ ప్రాజెక్టులో విద్యుత్తు ప్యానల్స్‌కు మరమ్మతులు చేసి నీటిసరఫరా పునరుద్ధరించారు. వేసవిలో ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా చేయాలని జనం కోరుతున్నారు.

మాగల్లు వద్ద పగిలిన తాగునీటి పైపు

దుర్గామల్లేశ్వరస్వామి వార్షికోత్సవం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని దుర్గాపురంలో వెలసిన దుర్గామల్లేశ్వరస్వామి 32వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, రుద్ర చండి మూలమంత్ర సహిత రాజశ్యామల నవగ్రహ హోమం, మహా నివేదన తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తన్నీరు నాగేశ్వరరావు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2వ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ హోమం, తులసి అర్చన, అభయాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, వివిధ పూలతో పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మురుగు నీటితో అవస్థలు

కోదాడ రోడ్డులో ఇలా..

పట్టణంలోని కోదాడ రోడ్డు కోర్టు సమీపంలో రహదారి పక్కన డ్రెయిన్లు లేకపోవడం వల్ల మురుగు నీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో అటుగా ప్రయాణించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దోమలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద వివిధ కళాశాలల బస్సులు, వాహనాలతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. నందిగామ-జొన్నలగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో నందిగామ వద్ద తేజ డీవీఆర్ కళాశాల, పల్లగిరి కొండ వద్ద మరియ నివాస్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలున్నాయి. విద్యార్థులను ప్రైవేట్ కళాశాలల బస్సుల్లో కేంద్రానికి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో ఆయా వాహనాలను రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. పరీక్ష ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని చోదకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

పల్లగిరి కొండ వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై ఇలా..

మరియనివాస్ పరీక్ష కేంద్రం వద్ద వరుసలో నిల్చున్న విద్యార్థినులు

తొలిరోజు సజావుగా సీనియర్ ఇంటర్ పరీక్షలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామలోని ఏడు కేంద్రాల్లో మంగళవారం సీనియర్ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. నందిగామ కేవీఆర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 225/220, చైతన్య జూనియర్ కళాశాలలో 398/381, సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 381/379, తేజ డీవీఆర్ కళాశాలలో 398/388, మరియనివాస్ జూనియర్ కళాశాలలో 213/210, దీక్ష జూనియర్ కళాశాలలో 193/187, సరస్వతి జూనియర్ కళాశాలలో 262/256 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. తొలిరోజు విద్యార్థులు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు రాశారు. అధికారులు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

తప్పిపోయిన గంటల వ్యవధిలోనే తల్లి ఒడికి

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగా లేని బాలుడు తప్పిపోయిన గంటల వ్యవధిలోనే తల్లి ఒడికి చేరిన ఘటన జుజ్జూరులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మంగళవారం ఉదయం అల్లూరు-జుజ్జూరు గ్రామాల మధ్య బాలుడు ఒంటరిగా తిరుగుతుండటంతో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ జుజ్జూరులో వదిలి వెళ్లిపోయాడు. అనంతరం ఇంటికి వెళ్లే దారి తెలియక శివాలయం పరిసరాల్లో తిరుగుతుండగా గమనించిన అక్కడి మెడికల్ షాపు యజమాని పంచాయతీ కార్యాలయంలో అతన్ని అప్పగించాడు. గ్రామ సర్పంచి కోటి తప్పిపోయిన బాలుడి సమాచారాన్ని వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేశారు. సమాచారం తెలుసుకున్న బాలుడి తల్లి లక్ష్మీ ప్రసన్న, కుటుంబ సభ్యులు పంచాయతీ సిబ్బందిని సంప్రదించగా బాలుడిని అప్పగించారు.

రోడ్డుపై నిలిచిపోయిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం

పెద్దాపురం (వీరులపాడు), న్యూస్‌టుడే: కమాను కట్ట విరగడంతో సుబాబుల్ లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ అప్రమత్తమై నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. మంగళవారం రాత్రి కంచికచర్ల నుంచి తెలంగాణలోని భద్రాచలానికి సుబాబుల్ లోడుతో వెళ్తున్న లారీ మండల పరిధి పెద్దాపురంలో మూల మలుపు వద్ద కమాను కట్ట విరిగింది. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపైనే నిలిపారు. దీంతో కంచికచర్ల-మధిర రహదారిలో సుమారు 4 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

పెద్దాపురంలో రోడ్డు మధ్యలో నిలిచిందిలా..

సీపీఐ నాయకుడు పుల్లయ్య మృతి

నందిగామ, న్యూస్‌టుడే: మండలంలోని హనుమంతుపాలెంలో భూపోరాట యోధుడు, సీపీఐ నాయకుడు మందా పుల్లయ్య(85) వయోభారంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య మరియమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గ్రామంలోని 22 ఎకరాల భూమి పేదలకు పంపిణీ చేయాలని ఆయన సుదీర్ఘకాలంగా ఉద్యమాలు చేశాడు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు వెంకటసుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ నాయకులు తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ఏప్రిల్ 25న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ ఏడాది ఏప్రిల్ 25న పరీక్ష నిర్వహించనున్నట్లు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ సమన్వయకర్త ఎం.విజయసారథి తెలిపారు. మంగళవారం కళాశాలలో పరీక్షకు సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. అధ్యాపకులు జి.వి. ఈశ్వర్‌రెడ్డి, బాబూరావు, శోభన్‌బాబు, మధుసూదనరావు, మూర్తి, నాగరాజు, రవికిరణ్, హమీద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకారం అభినందనీయం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీ కాన్వెంట్ స్ట్రీట్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావడం ప్రశంసనీయమని వన్‌టౌన్ ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. పాతబస్తీ కాన్వెంట్ వీధిలో వన్ వే అమలు చేసేందుకు వీలుగా సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు ముందుకొచ్చారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు స్పందించి సెక్యూరిటీ గార్డును గౌరవ వేతనం ఇచ్చి మంగళవారం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వన్‌వే అమలు చేయడం, వాహనాలను పార్కింగ్ కేంద్రాల్లో మాత్రమే నిలపడంలో వాహనచోదకులు సెక్యూరిటీ గార్డు సహకరిస్తారని సీఐ తెలిపారు. టాక్టికల్ అర్బనిజం కార్యక్రమంలో భాగంగా సీపీ రాజశేఖరబాబు, డీసీపీ షిరీన్ బేగం ఇచ్చిన ఆదేశాల మేరకు వన్‌ట్రాఫిక్ పరిధిలో స్టాపర్స్, నోఎంట్రీ బోర్డులు, రేడియం జాకెట్స్‌ను ఏసీపీ రామచంద్రరావు సిబ్బందికి అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందన: ★ చిట్టినగర్ సర్కిల్-1 కార్యాలయం వెనుక వీధిలో కుళాయి నుంచి మంచినీరు లీకవుతుండటంతో స్థానికులు మేమున్నాం మీకు తోడుగా కు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన మంచి నీటి విభాగం అధికారులు వృథా అరికట్టారు. ★ కుమ్మరిపాలెం ఐదోలైన్‌లో కాలువలో పూడిక పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? చిట్టినగర్ ఫ్లైఓవర్ చర్చి వెనుక మెట్ల మార్గం ధ్వంసమైంది. - రత్నాకర్, స్థానికుడు ✔ మరమ్మతులు నిర్వహిస్తాం. - శ్రీనివాస్, సర్కిల్-1, ఈఈ

? టేనర్‌పేట అడ్డరోడ్డు మార్గంలో రోడ్డుపై చెత్త తీయడం లేదు. - రజాక్, స్థానికుడు ✔ చెత్త తరలిస్తాం. - నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

కష్టాల కడలి.. కరుణించాలి మరి

పింఛన్ల కోసం ఎదురుచూపులు

చిట్టినగర్, న్యూస్‌టుడే

ప్రభుత్వాలు అందించే సామాజిక పింఛన్లు ఎందరికో బతుకు నిలుపుతుంది. అలాంటి వచ్చే పింఛను వైకాపా ప్రభుత్వం తొలగించింది. 48 ఏళ్లకే అన్నీ మంచంలోనే నరక యాతన అనుభవిస్తున్న మరో వ్యక్తి శరీరం 83 శాతం వైకల్యం ఉందని ధ్రువపత్రం ఇచ్చినా పింఛను మంజూరు కాక కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నామంటూ కన్నీరు పర్యంతం. వారి గురించి న్యూస్‌టుడే కథనం.

పింఛను ఇచ్చి ఆదుకోండి..

బెజ్జాలమేడ వీధిలో **సియాద్రి ప్రసాద్**(48), అరుణ దంపతులు ఉంటున్నారు. ప్రసాద్‌కు రక్తపోటు అధికం కావడంతో రక్తనాళాలు దెబ్బతిన్నాయి. అన్నీ మంచంపైనే. ఇద్దరు సంతానం. భార్య ఓ వస్త్ర మార్కెట్‌లో పని చేస్తున్నారు. కుమార్తె బీటెక్, కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. సైకిల్ మెకానిక్‌గా చేస్తూ వచ్చిన సంపాదన కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు ఉపయోగిస్తారు. ప్రస్తుతం భార్య పనికి వెళ్లినే పూట గడిచేది. కుమార్తె ఒక రోజు కళాశాలకు వెళ్లి, ఒక రోజు ఇంట్లోనే తండ్రికి సపర్యలు చేస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసి 83 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువపత్రం అందించారు. పింఛనుకు దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు దాని ఊసే లేదు.

గత ప్రభుత్వంలో తొలగింపు

గొల్లపాలెంగట్టు, పంపింగ్ బూస్టర్ ఎదురుగా కొండప్రాంతంలో నివసిస్తున్న **ఆకుల సుబ్బమ్మ** (70) మాగ. కొడుకు వద్ద ఉంటున్నారు. పోషణ చూస్తున్నా మందులు ఖర్చు భరించలేకపోతున్నారు. ఒక్కొక్కసారి మందులు కూడా తెచ్చుకోలేని దయనీయ పరిస్థితి. తెదేపా ప్రభుత్వంలో పింఛను తీసుకునే వారు. వైకాపా ప్రభుత్వంలో 2022లో సాంకేతిక కారణాలు చూపించి తీసుకునే పింఛను తొలగించింది. కూటమి ప్రభుత్వంలో కూడా దరఖాస్తు చేసినా ఇంతవరకు పింఛను మంజూరు చేయలేదు. పింఛను ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పోషణకు ఇబ్బంది

క్వారీ ప్రాంతంలో నివసిస్తున్న **గొల్లి రాజేశ్వరి**కి భర్త చనిపోయారు. గ్యాస్ట్రో సమస్యతో ఇబ్బంది పడుతుండగా వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం కుమార్తె ఇంట్లో ఉంటున్నారు. వైకాపా హయాంలో పింఛను మంజూరైనట్లు జాబితాలో పేరు వచ్చింది. సచివాలయం చుట్టూ తిరిగినా స్పందన లేదు. పలుమార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తు చేసినా నేటికీ మమ్మల్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రద్ధాంజలి

నిబద్ధతే పెట్టుబడిగా, కష్టమే ఊపిరిగా, సాధారణ వ్యక్తి నుండి స్టార్ హోటల్ అధినేతగా హోటల్ రంగంలో ఐలాపురం అనే ఒక అద్భుతాన్ని విజయవాడ నగరానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి మీరు.. MLC గా B.C. వర్గాల అభ్యున్నతికి మీరు చేసిన పోరాటాలు చెప్పలేనివి. మీ ఆకస్మిక మరణం మాకు తీరని లోటు. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

శ్రీ ఐలాపురం వెంకయ్య గారు
Ex. MLC
వ్యవస్థాపకులు : హోటల్ ఐలాపురం, విజయవాడ
గౌరవ అధ్యక్షులు : బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్

డా॥ నాగోతి వెంకటేశ్వరరావు (N.V.Rao) M.A., M.A., M.Ed., Ph.D
రాకేష్ విద్యా సంస్థలు
సిండికేట్ బ్యాంక్ కాలని, చిట్టినగర్, విజయవాడ-1
అధ్యక్షులు : బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్

N.V. రావు అధ్యక్షులు : బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్	నమ్మి అప్పారావు ప్రధాన కార్యదర్శి : బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్	అవ్వారు బుల్లబ్బాయి కోశాధికారి : బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్
తట్టి అర్జునరావు ఉపాధ్యక్షులు : బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, విజయ విద్యాసంస్థలు	టి. శోభనాద్రి గౌరవ సలహాదారు రిటైర్డ్ ఇంజినీర్ : ప్రకాశం బ్యారేజి	దోనేపూడి శంకర్ సి.పి.ఐ నాయకులు
బాయన బాబ్జి నగరాల కుల నాయకులు పారిశ్రామికవేత్త	జవ్వాది కూర్మాచార్యులు విశ్వబ్రాహ్మణ కుల నాయకులు ఉపాధ్యక్షులు : బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్	ఎరుబోతు రమణ ఛైర్మన్ : నాగవంశకుల వెల్ఫేర్ కార్పొరేషన్
ఈది సాంబశివరావు మాజీ ధర్మకర్త : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి టెంపుల్, నగరాల కుల నాయకులు	వి.వి. సుబ్బారావు మాజీ ప్రిన్సిపల్: సయ్యద్ అప్పలస్వామి డిగ్రీ కాలేజి	ఆలా బాలయ్య యాదవ్ కార్యదర్శి యాదవుల కుల నాయకులు
గంటా శ్రీనివాసరావు కొప్పువెలమ కుల నాయకులు	వాసిరెడ్డి అనురాధ కొప్పువెలమ కుల నాయకులు	బలివాడ శివకుమార్ పట్నాయక్ బి.జె.పి. నాయకులు శిష్టకరణాల కుల నాయకులు
పిళ్ళా రవి, అడ్వకేట్ మాజీ అధ్యక్షులు : బెజవాడ బార్ అసోసియేషన్	కరిభక్తుల ప్రకాశరావు నాగవంశం కుల నాయకులు	బాయన శేఖర్‌బాబు కార్యదర్శి నగరాల కుల నాయకులు
గోగుల వెంకట రమణ మాజీ డిప్యూటీ మేయర్ యాదవ కుల నాయకులు	ఉమ్మడి వెంకటేశ్వరరావు కార్పొరేటర్, విజయవాడ మున్సిపాలిటీ	బెవర సూర్యనారాయణ టిడిపి నాయకులు

బెవర రమేష్ ఎన్నారై	కోరాడ శంకర్ బి.సి. నాయకులు
జి. కోటేశ్వరరావు C.P.I. నగర కార్యదర్శి	డా॥ గుంజ నరసింహారావు, గౌరవ సలహాదారు బి.సి. ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్
వేముల వెంకటరావు అధ్యక్షులు : అబ్దుల్ కలామ్ సేవాసంస్థ	మురిపాల దుర్గారావు బి.సి. నాయకులు

బీసీల అభ్యున్నతికి వెంకయ్య కృషి

మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వర్ తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బీసీల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య చేసిన కృషి చిరస్మరణీయమని రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వర్ పేర్కొన్నారు. నాలుగు స్తంభాల సెంటర్ సమీపంలోని రామ మందిరం వద్ద బీసీ సంఘం నాయకుడు నెల్లూరి వీర్రాజు ఆధ్వర్యంలో ఐలాపురం వెంకయ్య సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. స్థానిక నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ. . శాలివాహన సంఘీయుల అభివృద్ధికి వెంకయ్య అండగా నిలిచారన్నారు. నెల్లూరి వీర్రాజు మాట్లాడుతూ.. ప్రముఖ రచయిత్రి మొల్లమాంబ విగ్రహం ఏర్పాటులో ఆయన ప్రాత మరచిపోలేమన్నారు. బలహీన వర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ప్రజాప్రతినిధిగా పరిష్కరించడానికి చొరవ చూపుతారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుండారపు హరిబాబు, జి.కోటేశ్వరరావు, బీసీ నాయకులు బి.బాబు, బి.వెంకట కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

దాత వెంకటేశ్వరరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణ

ఆశీర్వచన మండపంలో అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధులు బ్రయిన్, చేతన్, స్వాతి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడ కొత్తపేటకు చెందిన సుంకర వెంటేశ్వర రావు రూ.1,00,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దుర్గమ్మ సేవలో అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధులు

ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధులు బ్రయిన్, చేతన్, స్వాతి మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సుందర రామరాజు వారికి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

జగన్మాత సేవలో ప్రముఖులు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి హరి జవహర్‌లాల్ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రాజగోపురం వద్ద హరిజవహర్‌లాల్ కుటుంబం

దుర్గగుడి ఈఈగా రమాదేవి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడి ఈఈగా రమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈఈ రాంబాబు డిప్యూటేషన్‌పై విశాఖపట్నంలోని సింహాచలం దేవస్థానానికి బదిలీ అయ్యారు. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానంలో ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న రమాదేవిని డిప్యుటేషన్‌పై దుర్గగుడికి బదిలీ చేశారు. దేవస్థానం అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకొని ఈ మార్పులు చేపట్టినట్లు సమాచారం.

ఆర్టీసీ జై భీమ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఏపీపీటీడీ జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కోశాధికారి లక్ష్మణ రావు తెలిపారు. మంగళవారం స్వాతంత్య్ర సమరయోధుల భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ బుజ్జి, ప్రధాన కార్యదర్శి బీవీఎస్ఎస్ నారాయణ రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నిక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జోనల్ కమిటీ అధ్యక్షుడిగా వీకే మూర్తి, కార్యదర్శిగా సీహెచ్ వీకే రావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా టీవీజీ రెడ్డి, ఏఎస్ఆర్ రాజు, విజయవాడ డిపో కమిటీ అధ్యక్షుడిగా బి.నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అనంతరం నూతన కమిటీతో పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని విజయవాడ జోన్-2 ఈడీ విజయరత్నంను కలిసి నూతన కమిటీని పరిచయం చేశారు.

ఈడీ విజయరత్నంకు నూతన కమిటీని పరిచయం చేస్తున్న జైభీమ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE AT VIJAYAWADA

M.V.O.P.No. 362/2023

Between
Sikhakolli Baby Rani & Others
.... Petitioners
and
Durwas Baag & Others
...Respondents

To
2nd Respondent : Marupilla Damodar Rao, S/o. Krishna, D.No. 5-6-5-/42/2, Lambadipeta, Raja Sharma Nagar, Vijayawada.

పై నెంబరు పిటీషన్ నందు 2వ రెస్పాండెంట్‌కు నోటీసులు జారీ చేయు నిమిత్తం శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ చేసియున్నారు. కావున 2వ రెస్పాండెంట్ పైనెంబరు పిటీషన్ నందు ది 25-03-2026న ఉదయం గం. 10-30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వారి న్యాయవాది గారి ద్వారా గాని, హజరై అభ్యంతరము ఏమైన ఉన్నయడల తెలియజేయ గలరు లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //

వాయిదా తేది: 25/03/2026

ఇట్లు: **గుండవు రాజేష్ కుమార్**, అడ్వకేట్, కృష్ణలంక, విజయవాడ-13.ఫోన్: 9246470144

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న బొమ్మిడి నాయకర్, పక్కన నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: క్రియాశీలక సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొమ్మిడి నాయకర్ తెలిపారు. భవానీపురం ఆర్టీసీ వర్కుషాపు రోడ్డులోని జనసేన కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంపై జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభాను, మైలవరం ఇన్‌ఛార్జి గాంధీ, తూర్పు, సెంట్రల్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు వాసు, వంశీకృష్ణ, నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త రమాదేవిలతో కలిసి క్రియశీలక సభ్యత్వ నమోదుపై నాయకర్ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కలిగించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి ఎన్టీఆర్ జిల్లాలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మండలి రాజేష్, పోతిరెడ్డి అనిత, మల్లెపు విజయలక్ష్మి, కార్పొరేటర్లు అప్పాజీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలపై రాత పరీక్ష

గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రవక్త మహ్మద్ జీవిత బోధనలను ప్రోత్సహించడానికి రాష్ట్ర స్థాయిలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఖాజీ ఇలియాజ్ ఖాదరి తెలిపారు. చిట్టినగర్‌లోని ఈద్గా ప్రాంగణంలో షమా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17 నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న వారు ఈ పరీక్షకు అర్హులని వివరించారు. జూన్ 6న చిట్టినగర్‌లోని ఈద్గాలో తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేలు లేదా మక్కా యాత్ర అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. ద్వితీయ బహుమతి రూ.15 వేలు నగదు, తృతీయ బహుమతి రూ.10 వేలు నగదు అందిస్తామని తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామని, జూన్ 6న పరీక్ష నిర్వహించి ఆగస్టు 16న విజేతలకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

విద్యాధరపురం, విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు అన్నారు. విద్యాధరపురం డిపోను పూర్తి స్థాయిలో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు చేస్తున్న చర్యలను వ్యతిరేకిస్తూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో మంగళవారం డిపో వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. కీలకమైన డిపోలో పని చేస్తున్న ఉద్యోగులను ఇతర డిపోలకు బదిలీ చేయడం ద్వారా ఆర్టీసీని నష్టాలకు చేరువ చేస్తున్నారన్నారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడేందుకు తమ పోరాటం మరింత ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు రామారావు, రామకృష్ణ, మల్లేశ్వరరావు నాయక్, పి. శ్రీనివాసరావు, మధుకర్, ఎం.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

✦ విద్యుత్తు బస్సుల నిర్వహణకు పినాకిల్ మొబిలిటీ సంస్థకు అప్పగించిన 12 డిపోల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని స్వాతంత్య్ర సమరయోధుల భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జై భీమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి బీవీఎస్ఎస్ నారాయణ డిమాండ్ చేశారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న ఎం.పెద్ద చెన్నయ్యపై భవానీపురం పోలీసులు కేసు మంగళవారం నమోదు చేశారు. ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డులో నివసిస్తున్న ఆటో డ్రైవర్ వెంకట రమణకు 15 ఏళ్ల కిందట పెద్ద చెన్నయ్యతో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కుటుంబాన్ని పట్టించుకోకుండా మద్యం తాగి వచ్చి నిత్యం గొడవలకు దిగడం, కొట్టడం చేస్తున్నాడని భార్య వెంకటరమణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మోసం చేసిన వ్యక్తులపై కేసు: అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.1.30 లక్షలు నగదు తీసుకొని మోసం చేసిన దాసి వెంకట రమణారావు, కిరణ్‌కుమార్‌లపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జెట్టి రామారావు కుమారుడు డిగ్రీ చదివాడు. అతడికి అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఉందని చెప్పి దాసి వెంకట రమణారావు, కిరణ్‌కుమార్ విడతల వారిగా రూ.1.30 లక్షలు నగదు, మరో రూ.2 లక్షలకు ఖాళీ చెక్కులు, నోటు తీసుకున్నారు. ఐదు నెలలు గడిచినా ఉద్యోగం రాకపోగా డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హౌసింగ్ లోన్ సెంటర్-2, డోర్ నెం: 54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520008

Appendix – IV-A
[See Proviso to rule 8(6) R/W 9(1)]

స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది 24-03-2026

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ మరియు దానిక్రింద చేయబడిన రూల్స్ మేరకు భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే చూపట్టబడిన దిగువ తెలిపిన వివరముల ప్రకారం సెక్షన్ 13(4) నిబంధనల ప్రకారం ఆస్థి యొక్క స్వాధీనతకు కొనసాగింపుగా దిగువ షెడ్యూల్‌లో తెలిపిన ఆస్థిని దిగువ నిర్దేశించబడిన 13(2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నియమ నిబంధనలకు లోబడి **"ఎక్కడ ఎలా ఉన్నది, అక్కడ అది అలానే"** ప్రాతి పదికన దిగువ తెలిపిన వివరముల ప్రకారం ఇ-వేలం వెబ్ పోర్టల్ **https://baanknet.com** ద్వారా విక్రయించబడును.

ఋణగ్రహీత(ల) పేరు: 1) శ్రీ పంచపర్వాల దొంతులేశ్వరరావు, తండ్రి: వెంకట హరినాద బాబు రావు, 2) శ్రీమతి పంచపర్వాల దివ్యలక్ష్మి, భర్త: దొంతులేశ్వరరావు, డోర్‌నెం.76-14-227/4, టీచర్స్ కాలని, పంతులుగారి బజారు, భవానిపురం, విజయవాడ-520012.

స్థిరాస్తి యజమాని పేరు: శ్రీ పంచపర్వాల దొంతులేశ్వరరావు, తండ్రి: వెంకట హరినాద బాబు రావు

బకాయి మొత్తం: రూ. 75,74,046/- మరియు ది. 09-06-2025 నుండి తదుపరి వడ్డీతో సహా.

డిమాండ్ నోటీసు తేది: 10-06-2025

స్థిరాస్తి వివరము: యన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, భవానిపురం, టీచర్స్ కాలని, డోర్ నెం.76-14-227ఎ, కొత్త అసెస్‌మెంట్ నెం.85549, పాత అసెస్‌మెంట్ నెం.31246డి/1, మునిసిపల్ వార్డు నెం.4, ప్లాట్ నెం.32, ఆర్‌యస్ నెం.44/1లోని 175 చ॥గ॥ల విస్తీర్ణములో గ్రౌండు, మొదటి, రెండవ అంతస్థులతో నిర్మించిన ఆర్‌సిసి భవనము శ్రీ పంచపర్వాల దొంతులేశ్వరరావు, తండ్రి: వెంకట హరినాద బాబు రావు గారికి చెందిన రిజిష్టర్డ్ గిఫ్ట్ డీడ్ నెం.1713/2013, తేది:11-03-2013, విజయవాడ డిఆర్ఒ, కృష్ణా జిల్లా.

భవనము హద్దులు: తూర్పు: ఆల్తి శివనాగేశ్వరరావు గారి ప్రహరీ గోడ, దక్షిణం: ప్లాట్ నెం.31, పడమర: మునిసిపల్ రోడ్డు, ఉత్తరం: షేక్ మహబూబ్ గాలెబ్ గారి ఆస్థి.

రిజర్వు ధర: రూ.1,51,00,000/- ధరావత్తు: రూ. 15,10,000/- బిడ్ పెంపుదల: రూ.25,000/-

ఇ-వేలం తేదీ & సమయం: 24-03-2026 ఉ॥ 11.00 గం॥ నుండి సా॥ 4.00 గం॥ ల వరకు

NEFT/RTGS సొమ్మును సమర్పించుటకు **https://baanknet.com** వెబ్‌పోర్టల్ ద్వారా (యూజర్ ఐడి & పాస్‌వర్డ్ ఉచితంగా **https://baanknet.com** లో రిజిష్టర్ చేసుకొన్న పేరు మీద లభించును) ద్వారా పాస్‌వర్డ్ & లాగిన్ ఐడి కలిగివుండవలెను. తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా మెస్సర్స్ పియస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్, టోల్ ఫ్రీ నెం: **+91 8291220220** వారి వెబ్ పోర్టల్ **https://baanknet.com** మరియు పై లభించు ఇ-వేలపు నియమ నిబంధనల పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరుచున్నాము. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్థుల తనిఖీ కొరకు ఆథరైజ్డ్ ఆఫీసర్, SBI, HLC-2, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ, **ఫోన్ నెం.9441127661**, **ఇ-మెయిల్ ఐడి: sbi.21017@sbi.co.in** మరియు రికవరీ ఏజెన్సి: **M/s.PRS Associates**, మొబైల్ నెం:**7013439314** వారిని బ్యాంకు పనిదినములలో సంప్రదించవచ్చును.

ప్రదేశం : విజయవాడ
తేది : 24-02-2026

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

శ్రద్ధాంజలి

కీ॥శే॥ ఐలాపురం వెంకయ్య గారు

మాజీ ఎమ్.ఎల్.సి., ఛైర్మన్ : హోటల్ ఐలాపురం, విజయవాడ

ఆతిథ్య వ్యాపార రంగంలో అగ్రగామిగా వెలుగొందిన మహనీయులు...
తన ఇంటిపేరుతో నగరానికి ఖ్యాతి తెచ్చిన నిత్య కృషీవలురు...
వందలాదిమంది కార్మికులకు ఉపాధి కల్పించిన నిరంతర శ్రామికులు...
విజయవాడ హోటల్ వ్యాపార రంగానికి అమూల్యమైన సేవలు అందించిన దార్శనికులు
ఐలాపురం వెంకయ్య గారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ..
వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము...

MUTHAVARAPU SRINIVASABABU - SWARNA GROUP
Hon. President : A.P. Hotel's Association

R.V. SWAMY President : A.P. Hotel's Association Chairman : Hyatt Place	P.V. RAMANA - RR DURBAR President : Vijayawada Hotel Owner's Association

M. MADHUSUDHAN RAO Joint Secretary : A.P. Hotel's Association Vindu Bhojanam	Ch. MALLIKARJUNA RAO Sri Satya Sai Hotels	P. SIVA PRASANTH Hotel Alankar Inn
T. RAVI KUMAR Cherry's	A. SAI PRASAD MITHAI SHOP SWEET MAGIC	SUREDDY VENKATA REDDY Hotel Goldenway & V Grand
K.V.V. PRASAD Alankar Sweets & Bakery	MUPPA VENKATESWARA RAO Ex. Corporator	VIJAYAWADA HOTEL OWNER'S ASSOCIATION

విజయవాడ మధ్య

'కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శన సిగ్గుచేటు'

ర్యాలీలో లక్ష్మి, మాధవి, పద్మజ, నాగలక్ష్మి, నాగమల్లేశ్వరి యాదవ్, రత్నకుమారి తదితరులు

సీతారాంపురం, న్యూస్‌టుడే : ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026 సదస్సులో రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం పుష్పా హోటల్ నుంచి సీతారాంపురం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి చిగురుపాటి లక్ష్మి మాట్లాడుతూ.. ఏఐ సదస్సుకు వందకుపైగా దేశాల ప్రతినిధులు, 200 మంది గ్లోబల్ టెక్ దిగ్గజాలు హాజరయ్యార న్నారు. సుమారు 80 శాతం దేశాలు భారత ఏఐ విధానాలకు మద్దతుగా దిల్లీ డిక్లరేషన్ మీద సంతకాలు చేశాయన్నారు. ప్రధాని మోదీ దేశ సాంకేతిక శక్తిని ప్రపంచానికి చాటిచెబుతుంటే.. రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు అక్కడకు వెళ్లి 'అర్ధనగ్న ప్రదర్శన' చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి చర్యలు దేశ ప్రతిష్ఠను దిగజారుస్తాయ న్నారు. దేశ గౌరవానికి భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాజపా మహిళా మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి మాధవి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు పద్మజ, భాజపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, రాష్ట్ర మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నాగమల్లేశ్వరి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మదేవర రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

586 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థుల గైర్హాజరు

మాచవరం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 38,211 మందికిగాను 586 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లాలోని 98 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని, మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆయన వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలే

మాట్లాడుతున్న డీసీపీ షిరీన్‌బేగం

గాంధీనగర్, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం హెచ్చరించారు. నగర సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెంజిసర్కిల్‌లోని ఆదిత్య కళాశాల సహకారంతో ట్రాఫిక్ సీఐ కొత్తూరు కిషోర్ బాబు ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిబ్బంది విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ద్విచక్ర వాహన చోదకుడితో పాటు వెనుక కూర్చున్న వారు సైతం తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏ క్షణాన.. ఏమవునో..?

స్తంభాలపై కేబుల్ వైర్లతో ప్రమాదాలు

తగలబడుతున్న కేబుల్ వైర్లను కర్రతో కొట్టి ఆర్పుతున్న విద్యుత్తు సిబ్బంది

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

నగరంలో విద్యుత్తు స్తంభాలపై చుట్టలుగా ఉన్న కేబుల్ వైర్లు ప్రమాదాలకు కేంద్రంగా మారుతున్నాయి. చుట్టలు చుట్టలుగా పేర్చేస్తున్నారు. ఫలితంగా అత్యవసర పరిస్థితిలో సిబ్బంది స్తంభం ఎక్కే పరిస్థితి ఉండడం లేదు. రాత్రి సమయంలో ఎక్కడైనా లోపం ఏర్పడి, సరఫరా నిలిచిపోతే.. పైకి ఎక్కడం అసాధ్యమని విద్యుత్తు సిబ్బంది వాపోతున్నారు. గవర్నర్‌పేట, సూర్యారావుపేట, మొగల్రాజపురం, పటమట, కృష్ణలంక... ఇలా ప్రతి ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరమ్మతు పనుల్లో లైన్‌మెన్లు అష్టకష్టాలు పడుతుంటే.. అధికారులు మాత్రం చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

నోటీసులతో సరిపెడుతూ... విద్యుత్తు స్తంభాలపై చుట్టలుగా ఉన్న వైర్లను తొలగించాలని విద్యుత్తు అధికారులు సదరు కేబుల్ సంస్థల నిర్వాహకులకు అనేక సార్లు నోటీసులు ఇచ్చారు. గడువు దాటినా.. చర్యలు తీసుకోకుండా వదిలేశారు. ఫలితంగా ఎప్పుడు ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనుకుంటూ విద్యుత్తు వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం: చుట్టుగుంట కూడలి వద్ద విద్యుత్తు స్తంభంపై ఉన్న కేబుల్ వైర్లు మంగళవారం దగ్ధమయ్యాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో విద్యుత్తు శాఖాధికారులు హుటాహుటిన అక్కడకు విచ్చేశారు. వ్యయప్రయాసలు కోర్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే నగరపాలకసంస్థకు చెందిన వీధిదీపాల వైర్లు కాలిపోయి, సరఫరా నిలిచిపోయింది. స్తంభంపై ఉన్న 11 కె.వి. విద్యుత్తు లైను ఇన్సులేటర్ కాలిపోయింది. ఇక్కడ తక్కువ మొత్తంలోనే కేబుల్ వైర్లు ఉన్నాయి. ఇలా కాకుండా చుట్టలు చుట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లు ఉన్న గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక తదితర ప్రాంతాల్లోని స్తంభాలపై మంటలు రేగితే.. పెను ప్రమాదం సంభవిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గంటల తరబడి సరఫరా నిలిచిపోతుంది. అదే అర్ధరాత్రి సమయంలో మంటలు రేగితే.. లైన్లను బాగు చేయడం దాదాపు అసాధ్యం. వచ్చేది వేసవి కాలం. అధికారులు తూతూ మంత్రంగా నోటీసులతో సరిపెట్టకుండా. . పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం

స్తంభాలపై కేబుల్ వైర్లు చుట్టలుగా పెట్టిన సంస్థలకు నోటీసులు ఇచ్చాం. వైర్లను సరిచేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరాం. మరోసారి నోటీసులు ఇస్తాం. ప్రమాదకరంగా ఉన్నవాటిని తొలగించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటాం.

- యు.హనుమయ్య, ఎస్ఈ, విద్యుత్తు

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఇందిరానాయక్ నగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్ర బాబు తెలిపారు. అల్లూరి సీతారామరాజు వీధి, పోస్ట్‌మ్యాన్ రామచంద్రరావు వీధి, జమ్మిచెట్టు సెంటర్ రోడ్డు, వనపాల వారి వీధి, సాయిరామ్ వీధి, అయ్యప్ప స్వామి ఆలయం వీధి, అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ రోడ్డు, జార హోటల్ రోడ్డు, హోండా షోరూమ్, హెచ్‌పీ బంక్, ఇండియన్ ఆయిల్ బంక్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని.. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు చేయూత

విద్యార్థులతో అప్పలరాజు, మనోహరం తదితరులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి మున్సిపల్ పాఠశాలలో పి.అప్పలరాజు, కుచ్చర్లపాటి రామరాజు ఆధ్వర్యంలో 150 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. పాఠశాల సూచిక బోర్డు లేదని ప్రధానోపాధ్యాయులు తెలపగా.. త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా విద్యార్థులకు తోడుగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.మనోహరం, సి.హెచ్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పౌరుల సహకారంతో మాదకద్రవ్యాల నియంత్రణ

మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్. వేదికపై స్వరూపరాణి, సత్యవతి, పరిమి తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి పౌర సమాజం సహకారం అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల కట్టడిపై మంగళవారం ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త ఎస్.ఆర్. పరిమి మాట్లాడుతూ.. పోలీస్ యంత్రాంగం, రాజకీయ ప్రమేయం లేకుండా విద్యాసంస్థల పరిసరాల్లోకి గంజాయి ఎలా ప్రవేశిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు గమనించాలని సూచించారు. ప్రముఖ వైద్యుడు ఎస్.సుధాకర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపేలా ప్రజా ఉద్యమం చేయాలని పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. మానవ జాతి అంతరించేలా మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది మొత్తంలో సరకు పట్టుకునే పోలీసులు.. టన్నుల కొద్దీ సరఫరాను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రతి విద్యాసంస్థలో విద్యార్థి సంఘాలు, మేనేజ్‌మెంట్, ఇతర పెద్దలతో కమిటీలు వేయాలని సూచించారు. ఎంబీవీకే బాధ్యుడు పి.మురళీకృష్ణ.. ఈ సామాజిక రుగ్మతను రూపుమాపేందుకు బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. హ్యాపీ సండే మాదిరిగా మరో వారాన్ని మాదకద్రవ్యాల నిరోధక దినంగా ప్రకటించాలని కోరారు. ఎంబీవీకే బాధ్యురాలు కె.స్వరూపరాణి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సత్యవతి, బాయన వెంకట్రావు, వై.వి.ఈశ్వరరావు, చిత్రం సుధీర్, రామిశెట్టి కొండలరావు, కె.సుబ్బరావమ్మ, అశోక్, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుబజారుల్లో కూరగాయల ధరలు

వంకాయలు-20/22, టమాటా-13, బెండ-24, పచ్చిమిర్చి-38, కాకర-32, బీర-26/24, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-24, దొండ-30, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-24, దోస-16/26, సొర-8/7, పొట్ల-30, అరటికాయ-5/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్ రూట్-24, కీరదోస-40, బీన్స్-50, క్యాప్సికమ్-58, చింతకాయలు-65, నిమ్మ (డజను)-36/48, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/25/30. (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

వెంకట సుబ్బమ్మ దాతృత్వం.. ఆదర్శనీయం

ఆహార పదార్థాలు వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : దాతృత్వానికి మారుపేరు దివంగత భాగవతుల వెంకట సుబ్బమ్మ అని హనుమంతరాయ గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు దోనెపూడి శంకర్ అన్నారు. వెంకటసుబ్బమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం గ్రంథాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ భవన నిర్మాణానికి ఆమె విరాళాలు ఇచ్చారని గుర్తు చేశారు. భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆమె సేవలు మరువలేనివని కొనియాడారు. కమిటీ గౌరవాధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు, కార్యదర్శి గడ్డం సత్యనారాయణ మాట్లాడుతూ.. సుబ్బమ్మ బాటలోనే సభ్యులు సేవలు అందించాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందివాడ నాని, మహ్మద్ ఆజామ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటారు.. సంరక్షణ మరిచారు...

అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైపుల రోడ్డు నుంచి వాంబే కాలనీ వైపు వెళ్లే రహదారిలో నగరపాలక సంస్థ అధికారులు పచ్చదనం కోసం మొక్కలు నాటారు. కానీ వాటికి నీళ్లు పోసి, సంరక్షించడం మరిచారు. దీంతో వరుసగా పెట్టిన మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి.. తరచూ వాటికి నీరు పోసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

ఇళ్ల ముందే మురుగు

అజిత్‌సింగ్‌నగర్, రామ్‌నగర్ కాలనీలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాకుల వద్ద యూజీడీ లీకవుతోంది. నివాసాల ముందు మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలను సరిచేయాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

సొమ్ము కాజేశాడు.. ఆడిట్‌లో దొరికిపోయాడు

సంస్థ నిధులు రూ.8.23 లక్షల గోల్‌మాల్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సంస్థకు వచ్చిన గిఫ్ట్ కూపన్ల సొమ్ము, ఇతర లావాదేవీల సొమ్మును కాజేసి.. వ్యక్తిగత ఖాతాకు జమ చేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో ఆటలు ఆడి.. డబ్బంతా పోగొట్టుకున్నాడు. చివరకు వార్షిక ఆడిట్‌లో దొరికిపోయాడు. నగరంలోని మ్యూజియం రోడ్డులో ది కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ మ్యుచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ స్టోర్స్ ఉంది. ఈ సంస్థ పెట్రోల్, డీజిల్‌తో పాటు ఇంజిన్ ఆయిల్స్, ల్యూబ్రికెంట్స్ విక్రయిస్తుంటుంది. దీని నిమిత్తం ఆయా కంపెనీలు బహుమతులు ఇస్తుంటాయి. ఆ బహుమతుల సొమ్మును స్టోర్స్ కరెంట్ ఎకౌంట్‌లో జమ చేస్తుంటారు. 2022 నుంచి 2025 వరకు క్యాషియర్‌గా పని చేసిన దొండపాటి అనిల్‌కుమార్.. బహుమతుల రూపంలో వచ్చిన సొమ్ములో కొంత నగదును తన ఖాతాకు మళ్లించుకున్నాడు. వాటి సాయంతో రమ్మీ వంటి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి, డబ్బంతా పోగొట్టుకున్నాడు. అదే విధంగా అమెజాన్ ద్వారా సంస్థ విక్రయాలు సాగిస్తుంటుంది. ఈ లావాదేవీలను కూడా అనిల్‌కుమార్ నిర్వహిస్తూ.. కొంత డబ్బును వాడేసుకున్నాడు. కంపెనీ వార్షిక ఆడిట్‌లో పెద్ద మొత్తంలో నగదు తేడా రావడంతో అంతర్గత విచారణ చేయడంతో అసలు మోసం బయటపడింది. రూ.8,23,566లు దుర్వినియోగం అయినట్లు తేలింది. సంస్థ కార్యదర్శి గోపిశెట్టి వీరవెంకయ్య.. సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు జారిపడి కూలి మృతి

గాంధీనగర్, న్యూస్‌టుడే : చెట్టు పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సత్యనారాయణపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూర్ణానందంపేట గుర్రాల వీధికి చెందిన కేసరిపల్లి శ్రీను కూలి పనులు చేస్తుంటారు. పక్క వీధిలో ఇంటి గోడపైకి వచ్చిన చెట్టును నరికే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం

పాయకాపురం, న్యూస్‌టుడే : బాలికపై ఆటో డ్రైవర్ అత్యాచార యత్నం చేసిన ఘటన మంగళవారం నున్న పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహారాష్ట్రకి చెందిన దంపతులు పదేళ్ల క్రితం విజయవాడ, జక్కంపూడి కాలనీకి వచ్చి స్థిరపడ్డారు. గత మూడు నెలల నుంచి రాజీవ్‌నగర్‌లో ఉంటున్నారు. భర్త. . రైల్వేస్టేషన్ పరిసరాల్లో సమోసాలు విక్రయిస్తుంటారు. వీరి కుమార్తె (11) ప్రకాష్‌నగర్‌లో మూడో తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. డ్రైవర్ స్కూల్ వద్ద దించకుండా.. ఇన్నర్ రింగ్‌రోడ్డు వైపు తీసుకెళ్లాడు. నీకు రూ.100 ఇస్తాను.. నేను చెప్పినట్టు చేయాలని బెదిరించాడు. బాలిక అలా చేయకపోవడంతో గొంతు నులిమేందుకు యత్నించగా.. పారిపోయింది. మెయిన్ రోడ్డు మీదకు వచ్చి.. స్థానికుల సాయంతో తండ్రికి ఫోన్ చేసింది. ఆయన వచ్చి చూడగా.. కుమార్తెకు గాయాలు తగిలి ఉండడం గమనించారు. ఆరా తీస్తే.. జరిగిన విషయం చెప్పింది. ఇంతలో ఆటో డ్రైవర్ పారిపోయాడు. ఆటో నంబరు గుర్తించి.. నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటనపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలిక ఆటోలో నుంచి దూకేయడంతో గాయాలయ్యాయని సీఐ కృష్ణమోహన్ తెలిపారు. మద్యం మత్తులో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

ఏప్రిల్ 25న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈ ఏడాది ఏప్రిల్ 25న పరీక్ష నిర్వహించనున్నట్లు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ సమన్వయకర్త ఎం.విజయసారథి తెలిపారు. మంగళవారం కళాశాలలో పరీక్షకు సంబంధించిన గోడ పత్రికలు ఆవిష్కరించారు. అధ్యాపకులు జి.వి.ఈశ్వర్‌రెడ్డి, బాబూరావు, శోభన్‌బాబు, మధుసూదనరావు, మూర్తి, నాగరాజు, రవికిరణ్, హమీద్ పాల్గొన్నారు.

జగన్మాత సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి హరిజవహర్‌లాల్ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వైద్యురాలికి వరకట్న వేధింపులు

మధురానగర్, న్యూస్‌టుడే : పెళ్లై నాలుగు సంవత్సరాలు అవుతున్నా.. అదనపు కట్నం కోసం వైద్యురాలిని వేధిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. రామలింగేశ్వరపేటకు చెందిన ఓ యువతి ఎంబీబీఎస్ చదివారు. 2022, మే నెలలో సాయి గణేష్‌తో ఆమెకు వివాహమైంది. కట్నం కింద రూ.15 లక్షల నగదు, 30 గ్రాముల బంగారం ఇచ్చారు. ఆ తర్వాత భర్త రోజూ తాగివచ్చి వేధిస్తున్నాడు. ఇంకా కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో.. బాధితురాలు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు

మధురానగర్, న్యూస్‌టుడే : భర్త చనిపోయిన యువతికి కుటుంబ సభ్యులు రెండో పెళ్లి చేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో.. ఆమె అదృశ్యమైన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందిరానాయక్‌నగర్‌లో ఉండే ఒక మహిళ భర్త 5 నెలల క్రితం చనిపోయారు. ఆమెకు రెండో పెళ్లి చేయాలని సోదరుడు నిర్ణయించి, ఈ నెల 22న ముహూర్తం ఖరారు చేశారు. ఈ క్రమంలో 21వ తేదీ సాయంత్రం దుర్గగుడికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన ఆమె.. తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఎక్కడా కనిపించకపోవడంతో సోమవారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

విజేతలతో రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ విశాఖ బ్రాంచి మేనేజర్ వీవీఎస్ రాఘవేంద్రరావు, న్యాయ నిర్ణేతలు, తదితరులు

● ప్రదర్శనలను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ తదితరులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

● నగరంలోని రామాటాకీస్ సమీప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ భవన్‌లో.. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వాటిలో మూడు ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించగా.. నాలుగింటికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఆలోచనల ప్రభంజనం.. అమోఘ ప్రయో‘జనం’!!

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సీతంపేట, కార్పొరేషన్: సమాజంలో నిత్యం ఎదురయ్యే ప్రధాన సమస్యలపై విద్యార్థులు దృష్టి సారించారు. తమ సృజనాత్మకతను జోడించి ఆధునిక పరిజ్ఞానంతో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 77 ప్రాజెక్టులు రూపొందించారు. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘ఈనాడు- గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ’ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు అనూహ్య స్పందన వచ్చింది. సుస్థిరాభివృద్ధి విధానాలు, పర్యావరణ హిత ప్రాజెక్టులపై ఎక్కువ మంది విద్యార్థులు దృష్టి పెట్టారు.

సీపీ శంఖబ్రత బాగ్చీకి ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థి

విద్యార్థులకు కలెక్టర్ దిశానిర్దేశం..: ఈ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వివిధ ప్రాజెక్టులను తిలకించారు. ‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’, ఘన వ్యర్థాలు, అపార్ట్‌మెంట్లలో మురుగు నీటి నిర్వహణ తదితర ప్రాజెక్టులను పరిశీలించి వాటిని ఎలా మెరుగుపరచుకోవచ్చో సూచించారు. వ్యవసాయ రంగానికి మేలు చేసే అంశాలపై దృష్టిసారించాలన్నారు.

GGU
GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారాలు

‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

1

ప్రాజెక్టు: **నెక్సెస్ అథేరియా**
పాఠశాల: **మాలతాంబ విద్యానికేతన్, పీఎంపాలెం**
విద్యార్థులు: **పి.హర్షిత్, రాము**
ఉపయోగం: కూలిపోయిన ఇళ్ల వ్యర్థాలతో ప్లాస్టిక్‌ను కలిపి త్రీడీ ప్రింటింగ్ ద్వారా కొత్త ఇళ్ల నమూనా తయారు చేసి గృహాలు నిర్మిస్తారు. ఇందులోని అంశాలను పరిశీలిస్తే.. భూకంపాలు వచ్చినపుడు బేస్ ఐసొలేషన్ వల్ల భవనాలు కూలిపోకుండా రక్షిస్తుంది. పిజియో ఎలక్ట్రికల్ సామగ్రితో మనుషుల అడుగుజాడలను ఎనర్జీగా మారుస్తుంది.

వైర్‌లెస్ కార్ ఛార్జింగ్ స్టేషన్ : పార్కింగ్ వద్ద ట్రాన్స్‌మీటర్లు ఏర్పాటు చేస్తారు. అవి ఎలక్ట్రో మాగ్నెటిక్ వేవ్స్‌ను కారులోని రిసీవర్‌కు పంపించడం వల్ల వాటి సాయంతో వాహన బ్యాటరీ ఛార్జింగ్ అవుతుంది.

టెస్లాకోయిల్ : ఇది తీగలు లేకుండా విద్యుత్తును పంపిస్తుంది.

ప్రోత్సాహక బహుమతుల విజేతలు

ప్రయోగం : **వ్యర్థాల నుంచి కాగితం తయారీ**
విద్యార్థులు : **ఆర్.వైష్ణవి (8వ తరగతి), డి.పార్థసారథి (6వ తరగతి), జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల, బుచ్చిరాజుపాలెం**

★ దేశంలో కాగితం తయారీకి చెట్లు నరకాల్సి వస్తుంది. దీంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుంది. ఈ సమస్యను అధిగమించేలా ఇంట్లో సేకరించే కాయగూరలు, పండ్ల వ్యర్థాల నుంచి కాగితం తయారు చేసే విధానాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఎలా చేయొచ్చో వివరించారు.

ప్రయోగం: **ట్రాలీ సూట్‌కేసును మెట్లు ఎక్కించేలా...!**
విద్యార్థులు : **ఆర్.దీక్షిత, ఎస్.దీపిక(6వ తరగతి), జడ్పీహెచ్ఎస్, వెంకటాపురం**

★ రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో ట్రాలీ సూట్‌కేస్‌లు తీసుకెళ్లే ప్రయాణికులు మెట్లు ఎక్కే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ సమస్యను పరిష్కరించేలా... ట్రాలీ సూట్‌కేస్ వెనుక వైపు రెండు ఇనుప రాడ్లను ‘ఎక్స్’ ఆకారంలో అమర్చారు. మెట్లు ఉన్నచోట ఆయా రాడ్లను తెరిచి వాటి సాయంతో సూట్‌కేసును పైకి ఎక్కించేలా ఏర్పాట్లు చేశారు. మెట్లు ఎక్కగానే, తిరిగి వాటిని మడిచే వీలుంటుంది.

2

ప్రాజెక్టు: **స్మార్ట్ సిటీ**
పాఠశాల: **సంస్కృతి గ్లోబల్ స్కూల్, పరవాడ**
విద్యార్థులు: **జి.జతిన్‌చౌదరి, పి.అష్మాన్ గుప్త**

ఉపయోగం: ఇందులోని సోలార్ ట్రాకర్ వల్ల సూర్య కిరణాలు ఎటువైపు ఉంటే సోలార్ ప్యానల్ అటు వైపునకు తిరుగుతుంది.
స్మార్ట్ డస్ట్‌బిన్ : డస్ట్‌బిన్ నిండితే బెల్ మోగుతుంది. **వైర్‌లెస్ కార్ ఛార్జర్ :** ఛార్జింగ్ ప్లాట్‌ఫాంపై కారు కింది భాగంలో కాపర్ కాయిల్ ఏర్పాటు చేసి విద్యుత్తు అందిస్తే... దాని నుంచి ప్రత్యేక పరికరాల ద్వారా విద్యుత్తు ట్రాన్స్‌మిట్ అవుతుంది. **వర్టికల్ విన్ టర్బైన్ :** రహదారిపై వాహనాలు వెళ్లేటప్పుడు వచ్చే గాలితో టర్బైన్‌లు తిరిగి విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాన్ని స్టోరేజ్ చేసుకోవచ్చు. **స్మార్ట్ వీధి దీపం:** చీకటి పడినప్పుడు దానంతటదే వెలిగి, సూర్యరశ్మి పడగానే ఆగిపోతుంది.

ప్రయోగం : **పంట ఉత్పత్తులు తడవకుండా...!**
విద్యార్థులు : **సీహెచ్.రఘువీర్, టి.జ్ఞానేశ్వరి, ఎస్.దేవన్ (9వ తరగతి), జడ్పీహెచ్ఎస్, వేపగుంట**

★ పొలాల్లో ఆరబెట్టిన పంటలు తడవకుండా రక్షించే ప్రాజెక్టు ఇది. ప్రత్యేకంగా పైకప్పు తెరిచి ఉన్న గదిని తయారు చేసి, అందులో ధాన్యం, ఇతర పంట గింజల్ని ఆరబోస్తారు. పైకప్పునకు సెన్సర్లు ఏర్పాటు చేస్తారు. వాటిపై ఒక్క చుక్క వర్షం పడినా, వెంటనే తెరిచి ఉన్న పైకప్పు పూర్తిగా మూసుకుపోయేలా సెన్సర్లు పని చేస్తాయి.

ప్రయోగం : **సమస్యలకు ‘సాంకేతిక’ పరిష్కారం**
విద్యార్థులు : **ఎస్.హర్ష, కె.ఆదిత్య (9వ తరగతి), సీహెచ్.నవనీత్ (8వ తరగతి), ప్రతిభా విద్యాలయం, సబ్బవరం.**

★ గాలిలో కాలుష్య కారకాలు గుర్తించడం, సౌర పలకల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయడం, వాణిజ్య సముదాయం సెల్లార్లు వాహనాలతో నిండితే, బయట నుంచి లోపలకు వచ్చే వాహనచోదకులకు ఆ విషయాన్ని తెలియజేయడం...ఇలా పలు సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించిన ప్రదర్శన ఇది. అలాగే చెత్తను మండించి, ఆ వేడి నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం ఆకట్టుకుంది.

3

ప్రాజెక్టు: **స్మార్ట్ హెల్మెట్**
పాఠశాల: **జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడుపూరు**
విద్యార్థి: **టి.ఉదయ్ కిరణ్**

ఉపయోగం: శిరస్త్రాణం ధరించక ఎంతో మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి పరిష్కారమే స్మార్ట్ హెల్మెట్. ★ హెల్మెట్, ట్రాన్స్‌మీటర్, సెన్సర్, రిసీవర్, 298 ఎన్ మోటార్ రిసీవర్ మాడ్యుల్, డీసీ మోటార్, బ్యాటరీ.. వీటిని వినియోగించి స్మార్ట్ హెల్మెట్ తయారు చేశారు. తలకు హెల్మెట్ తగిలిస్తేనే మోటార్ సైకిల్ ఇంజిన్ స్టార్ట్ అవుతుంది. దీనివల్ల వాహన చోదకులు తప్పనిసరిగా ధరించాల్సి వస్తుంది.

రక్తపోటు.. ఆరోగ్యంపై కాటు

జిల్లాలో పెరుగుతున్న బీపీ బాధితులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారిలో రక్తపోటు బాధితులు పెరుగుతున్నారు. ఆర్థిక సంబంధ వ్యవహారాలను చక్కదిద్దే వారిలో చాలా మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నా.. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. బీపీ లెక్కలనూ ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. ఇది తీవ్రమైతే ప్రాణాలకే ముప్పుగా పరిణమిస్తుంది. ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రభుత్వం చేపట్టిన ఎన్‌సీడీ సర్వేలో జిల్లాలో అధికమవుతున్న బీపీ బాధితుల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు నిర్వహించిన సర్వేలో 1,71,502 మంది రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది.

➤ సాధారణంగా 50 ఏళ్లు దాటిన తర్వాతే బీపీ వస్తుందని భావిస్తుంటారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో ప్రస్తుతం అన్ని వయసుల వారిలో రక్తపోటు బాధితులు ఉంటున్నారు. జిల్లాలో ఇప్పటికి మూడు దశల్లో నిర్వహించిన సర్వేలో 5,41,158 మందిని ఆరోగ్య సిబ్బంది పరీక్షించారని ఎన్‌సీడీ పీఓ ఏస్తేరురాణి చెబుతున్నారు. 1,71,502 మందిలో బీపీ అధికంగా ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న మూడో దశ ఎన్‌సీడీ 4.0 సర్వేలో కొత్తగా 2,531 మంది రక్తపోటు బాధితులను గుర్తించారు. 21,080 మంది అనుమానితులు ఉన్నట్లు అంచనా.

➤ ఎంఎంహెచ్‌జీ పేరిట బీపీ హెచ్చుతగ్గులను లెక్కిస్తుంటారు. 120/80 కంటే తక్కువగా ఉంటే సాధారణం. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకుంటే నియంత్రణలో ఉంచుకోవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

▸▸ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి. మద్యం, పొగతాగడం మానేయాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించుకోవడంతోపాటు మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చూసుకోవాలి. ఉప్పు వినియోగం బాగా తగ్గించాలి. ఎక్కువగా పండ్లు, కూరగాయలు, గింజలు, పప్పులు ఆహారంగా తీసుకోవాలి. మాంసాహారులు చికెన్, చేపలు, వెన్న తీసిన పాలు ఆహారంగా తీసుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

219 మంది గైర్హాజరు

అనకాపల్లి పట్టణం: జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 12,422 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12,203 మంది పరీక్షరాశారు. 219 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారి వినోద్‌బాబు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: బుధవారం 6:05 గం॥లకు
సహరి: గురువారం 5:01 గం॥లకు

లోపాలు.. ఇలా గుర్తిద్దాం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: రోజులు మారాయి. కాసులకు కక్కుర్తిపడి సంపూర్ణ ఆహారమైన పాలను కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. చాలాచోట్ల ఈ కల్తీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇది ఇప్పుడు తీవ్ర రూపం దాల్చి రాజమహేంద్రవరంలో అయిదు నిండుప్రాణాలను బలిగొంది. ముఖ్యంగా పిల్లలున్న ఇంట్లో పాల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో తాగుతున్న పాలు సురక్షితమేనా అన్న ఒకింత సందేహం కలగక మానదు. పాలలో కల్తీ తెలుసుకోవడానికి సులువుగా మార్గం ఉందని.. ఇంటి వద్దే అందరూ ఈ పరీక్ష చేసే వీలుందని నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ **ఏడీ రాంబాబు** చెబుతున్నారు.

★ సాధారణంగా పాలలో నీటితోపాటు స్టార్చ్ (పిండి పదార్థం), డిటర్జెంట్ వంటి హానికారక పదార్థాలు కలుపుతున్నారు. ఇవి ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. చిక్కగా కనిపించడానికి పిండిపదార్థం (స్టార్చ్), నురుగు బాగా రావడానికి డిటర్జెంట్‌ను ఉపయోగిస్తుంటారు. సింథటిక్ రసాయనాలతో ప్రొటీన్ శాతం పెరిగినట్లు చూపిస్తుంటారు.

పరీక్షలు ఇలా..

» వీటిని గుర్తించడానికి ఇంటిలోనే ఒక గాజు పలకపై ఒక చుక్క పాలు ఉంచితే అది వెంటనే జారిపోతే కల్తీగా గుర్తించవచ్చు. స్వచ్ఛమైనవి అయితే మందంగా జారుతూ తెల్లటి గీత ముద్రను విడిచిపెడుతుంది. రెండు మూడు చుక్కలు అయోడిన్ ద్రావణం వేశాక.. నీలం రంగులోకి మారితే అందులో స్టార్చ్ కలిసినట్లు గుర్తించాలి.

» సీసాలో పాలు పోసి దానిని బాగా కుదిపితే అధిక నురుగు వచ్చినట్లయితే డిటర్జెంట్ కలిపినట్లు గుర్తించవచ్చు. బాగా మరిగించినప్పుడు పాలు అసహజంగా గడ్డకడితే తేడా ఉన్నట్లు. అలా కాకుండా పై భాగంలో మీగడపొరలా ఏర్పడితే మంచివిగా నిర్ధారించవచ్చు. లాక్టోమీటరు పరీక్ష ద్వారా వీటి కచ్చితత్వాన్ని తెలుసుకోవచ్చు. విశ్వసనీయమైన డెయిరీ సంస్థలు.. సీలు చేసిన ప్యాకెట్లను మాత్రమే వినియోగిస్తే మేలని ఏడీ పేర్కొన్నారు.

అక్రమార్కుల దర్జా.. అడ్డుకోరా కబ్జా?

ఖాళీగా భూమి కనిపిస్తే అక్రమార్కులు వాలిపోతున్నారు. మాకవరపాలెం మండలం తూటిపాలలో జాజిగెడ్డ ఆక్రమణకు గురైంది. నదిలో ఎనిమిది అడుగుల మేర స్థలాన్ని మట్టితో ఎత్తు చేసి సాగు చేసేందుకు సిద్ధం చేశారు. గతంలో జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వ స్థలమంటూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను సైతం అక్రమార్కులు తొలగించారు. ఇప్పటికే నదిలో సగభాగం సరుగుడు తోటలు సాగవుతున్నాయి. ఇటీవల వంతెనకు సమీపంలో సుమారు అర ఎకరా భూమిని చదును చేసి చుట్టూ గట్టు ఏర్పాటు చేశారు. సుమారు వందడుగుల వెడల్పు ఉండాల్సిన గెడ్డ ఆక్రమణలతో 25 అడుగులకు కుచించుకుపోయిందని రైతులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

– మాకవరపాలెం, న్యూస్‌టుడే

28న పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ఈ నెల 28న చేపడుతున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి పేర్కొన్నారు. మార్చి ఒకటి ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛను అందిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 2,53,987 మంది లబ్ధిదారులకు రూ. 107 కోట్ల మేర నగదును సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి అందిస్తారన్నారు. అనివార్య కారణాలతో ఆ రోజు అందుకోలేనివారు మార్చి రెండున మధ్యాహ్నం స్వర్ణగ్రామం, స్వర్ణవార్డుల వద్దకు వెళ్లి పింఛను నగదు తీసుకోవచ్చన్నారు. 28న ఉదయం ఏడు గంటలకే పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

ర్యాంపు కానరాదు.. చక్రాల కుర్చీ ఊసేలేదు

రావికమతం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద దివ్యాంగ విద్యార్థుల కోసం ర్యాంపు, వీల్‌ఛైర్ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాల్సి. కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అలాంటివి లేకపోవడంతో దివ్యాంగ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు తప్ప ఇతరులను అనుమతించేందుకు వీలులేకపోవడంతో ద్వితీయ ఇంటర్ పరీక్ష రాసేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లేందుకు హైరానా పడ్డారు.

కుమార్తె ఆదిలక్ష్మిని పరీక్ష కేంద్రానికి ఎత్తుకొని తీసుకొస్తున్న తల్లి

★ తోటకూరపాలెంకు చెందిన గూనూరు ఆదిలక్ష్మి మరుపాక ఏపీ మోడల్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతోంది. ఈమెకు రెండు కాళ్లు పనిచేయవు. సహాయకులు లేనిదే నడవలేదు. కూర్చుంటే లేవలేని పరిస్థితి. ఈమె తల్లి వెంకటలక్ష్మితో కలిసి స్కూటీపై తోటకూరపాలెం నుంచి సుమారు 20 కి.మీ. దూరం నుంచి కొత్తకోట పరీక్ష కేంద్రానికి వచ్చింది. ప్రధాన గేటు నుంచి కళాశాల భవనం వరకు చాలా దూరం నడిచి రావాల్సి ఉంటుంది. నడవలేని పరిస్థితిలో ఉన్న ఆదిలక్ష్మిని ఆమె తల్లి వెంకటలక్ష్మి ఎత్తుకొని కళాశాల వరకు తీసుకొచ్చింది. అక్కడి నుంచి పరీక్ష హాల్లోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కాల్సి రావడంతో ఆమె ఇబ్బంది పడింది. వీల్‌ఛైర్ సదుపాయం కల్పించని తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

(c) eenadu

మరింత బాధ్యతగా రోగులకు వైద్యసేవలు

గొడిచెర్ల ఆసుపత్రి ఆవరణలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ హైమావతి

నక్కపల్లి, పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఆసుపత్రుల్లో రోగులకు అందించే సేవల విషయంలో వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.హైమావతి సూచించారు. నక్కపల్లి మండలం గొడిచెర్ల, పాయకరావుపేట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల నిల్వ గది, స్టాక్ రిజిస్టర్లతోపాటు ఓపీ ఇతర రికార్డులను ఆమె పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల మర్యాదగా వ్యవహరించాలని, గర్భిణులను ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకునేలా చూడాలన్నారు. ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. వార్డులు పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తుండాలన్నారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. పాయకరావుపేటలో మాతా శిశు మరణాలు, ల్యాబ్ పరీక్షలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమీక్షించారు. వైద్యాధికారులు డి.సుభాష్, వి.ఎస్.సౌందర్య, శ్రావణసంధ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం కట్టడే కీలకం

గంగవరం పోర్టు వద్ద ఇనుప ఖనిజ మిశ్రమ కేంద్రం

ఈనాడు-విశాఖపట్నం: పోర్టుల కాలుష్యం కట్టడి చేయకుంటే దిల్లీని విశాఖ మించి పోయేలా ఉంది. తాజాగా గంగవరం పోర్టులో ఇనుప ఖనిజం మిశ్రమ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న తరువాత ఈ విషయం మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఈ ఒప్పందంతో అదానీ గంగవరం పోర్టు సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరుతుంది. మేజర్ పోర్టుగా విశాఖ, ఆ పక్కనే 20 కి.మీ. దూరంలో గంగవరం పోర్టు, ఇటీవల అనుమతులిచ్చిన నక్కపల్లిలో ఆర్సెలార్ మిత్తల్‌కు క్యాప్టివ్ పోర్టు, ఇలా మూడింటి నుంచి వచ్చే కాలుష్యం కట్టడి ఎలా? అనేది అందరిని వేధిస్తున్న ప్రశ్న. బల్క్‌గా బొగ్గు, ఇనుప ఖనిజాల రవాణా జరిగే పరిస్థితి ఉండటమే ఇందుకు కారణం.

★ ఇప్పటికే గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యం గాజువాక, కూర్మన్నపాలెం, కణితి రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్రభావం చూపుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

విశాఖ ఉక్కుకు ఉపయోగమని చెప్పి..

పెల్లెట్ ప్లాంటు పెడితే విశాఖ ఉక్కుకు ఉపయోగమంటూ గతేడాది జనవరిలో స్టీలు ప్లాంటుకు చెందిన 1,100 ఎకరాలను ఎన్ఎండీసీకి అప్పగించారు. ఈ భూముల రిజిస్ట్రేషన్ కూడా పూర్తవగా ఏడాదిగా ఖాళీగానే ఉన్నాయి. అదానీ, వేల్, ఎన్ఎండీసీకి మధ్య ఒప్పందం జరగడంతో ఆ ఇనుప ఖనిజ నిల్వలు పెట్టేందుకు ఎన్ఎండీసీ ప్లాంటు నుంచి తీసుకున్న భూములనే ఉపయోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదానీ పోర్టుకు వచ్చే ఇతర నిల్వలు సైతం ఇక్కడే ఉంచే అవకాశం ఉందని, భవిష్యత్‌లో పోర్టు సామర్థ్యం పెరిగితే విశాఖ ఉక్కు భూముల వైపే చూస్తారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వంలో జగన్ రూ.3 వేల కోట్ల విలువైన రాష్ట్ర వాటాను అదానీకి రూ.600కోట్లకే కట్టబెట్టారు. అప్పటి నుంచి స్టీలు ప్లాంటుకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. గంగవరం పోర్టు పూర్తిగా అదానీ చేతుల్లోకి వెళ్లాక పరిస్థితులు మారిపోయాయి. స్టీలు ప్లాంటు కోసం ప్రత్యేకంగా ఉండే బెర్త్ రద్దు చేశారు. కన్వేయర్ ఛార్జీలు పెంచడం, మార్జిన్ (డ్యూ) లేకుండా పాతబకాయిలు చెల్లిస్తేనే అనే నిబంధన పెట్టడం, నౌకల్లో సరకు సకాలంలో దించని పరిస్థితుల్లో డెమరేజ్ ఛార్జీలు ప్లాంటుపై పడటం, పోర్టులో కార్మికుల సమ్మె... ఇలాంటి ఎన్నో అంశాలతో విశాఖ ఉక్కుకు ఇబ్బందులు తలెత్తాయని కార్మిక సంఘాలు గుర్తు చేస్తున్నాయి.

సూక్ష్మ తాజ్‌మహల్‌కు లిమ్కాబుక్‌లో చోటు

నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. వెంకటేష్ ఇటీవల ఆరుగంటల పాటు శ్రమించి పెన్సిల్ ముల్లుపై నాలుగు మిల్లీ మీటర్ల ఎత్తు, నాలుగు మి.మీ. వెడల్పుతో తాజ్ మహల్ రూపొందించారు. దీన్ని లిమ్కాబుక్‌కు పంపించగా, ప్రతినిధులు దీనిని గుర్తిస్తూ ఈయనకు ప్రశంసాపత్రం పంపించారు. - నక్కపల్లి, న్యూస్‌టుడే

సీపీఎస్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా కార్యవర్గం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) జిల్లా కార్యవర్గ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య భవనంలో జరిగిన ఎన్నికలో సంఘ జిల్లా అధ్యక్షుడిగా జి.రాజు, ప్రధాన కార్యదర్శిగా వి.కృష్ణమోహన్, ఆర్థిక కార్యదర్శిగా రాజాన సన్యాసినాయుడు, సహాధ్యక్షులుగా వేదూరి శ్రీనివాసరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా కనిశెట్టి ఉమ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా మళ్ల ఉమామహేశ్వరి, ఎం.సూర్యకుమారి తదితరులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సి.గణేష్, ఎం.ఈశ్వరరావు, అబ్రహం సునంద తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మార్చి ఒకటిన విశాఖలో సాగర ఘోష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఘనంగా ఐటీడీఏ పీఓ వివాహం

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, మేఘాలయలో సంయుక్త కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆదిత్యవర్మ వివాహం ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరీలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ ఇద్దరు యువ ఐఏఎస్‌లు ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో ఒక్కటయ్యారు. ముందుగా డిసెంబర్ నెలలోనే విశాఖపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో వీరి వివాహాన్ని రిజిస్టర్ చేసుకున్నారు. పెద్దల సమక్షంలో మంగళవారం సంప్రదాయ పద్ధతిలో వివాహ వేడుక జరిగింది. వరుడు ఆదిత్యవర్మ లక్నో వాస్తవ్యుడు. శ్రీపూజ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 28న రిసెప్షన్ వేడుక జరగనుంది.

రెండోరోజు హోరాహోరీ..

సబ్బవరం, న్యూస్‌టుడే: జాతీయ దివ్యాంగుల 5వ వీల్‌ఛైర్ క్రికెట్ పోటీలు రెండో రోజు మంగళవారం కూడా అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గుల్లేపల్లి సమీపంలోని ఓ ప్రైవేటు స్టేడియంలో కొనసాగాయి. ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 201 పరుగులు చేసింది. రేవతి శ్రీను 42 బంతుల్లో 82 పరుగులు, ప్రకృద్ధిన్ 39 బంతుల్లో 52 పరుగులు, సంతోష్ 30 బంతుల్లో 34 పరుగులు చేసి భారీ స్కోరుకు తోడ్పడ్డారు. రెండో బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 155 పరుగులు సాధించింది. దీంతో ఆంధ్ర జట్టు 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌లలో ఏపీ జట్టు విజయం సాధించింది.

ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య మ్యాచ్‌లో దివ్యాంగ క్రీడాకారులు

ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శ్రీను నిలిచారు. మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తెలంగాణ 20 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 282 పరుగుల భారీ స్కోర్ చేసింది. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు దిగిన ఒడిశా జట్టు 20ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేయడంతో తెలంగాణ జట్టు విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మోను నిలిచారు. విజేతలను దివ్యాంగుల కమిటీ ఛైర్మన్ రమాన్ సుబ్బారావు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కమిటీ కార్యదర్శి ఎడ్లపల్లి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.వి.రమణ, జాయింట్ కార్యదర్శి ఏసుబాబు, కె.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార మార్గాల మూసివేత

స్పందనకు వందనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నక్కపల్లి మండల పరిధిలో పలు అనధికార మార్గాలను మూసివేస్తున్నారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై 'ఈనాడు'లో వస్తున్న కథనాలపై పోలీసు ఉన్నతాధికారులు, హైవే నిర్వహణ సంస్థ ప్రతినిధులు స్పందించారు. నక్కపల్లి మండల పరిధిలో పరిస్థితిపై సీఐ జె.మురళి దృష్టి సారించారు. సారిపల్లిపాలెం, నక్కపల్లి, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో అక్రమంగా రోడ్డు దాటుతున్న ప్రాంతాలను గుర్తించారు. హైవే ప్రతినిధుల ద్వారా భారీ సిమెంట్ పలకలు రప్పించి ఆయా మార్గాలకు అడ్డుగా పెడుతున్నారు. మిగిలిన చోట్ల పూర్తిగా గుర్తించి పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ఎస్పీ పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

సారిపల్లిపాలెం వద్ద అనధికార మార్గం మూయిస్తున్న పోలీసులు

ఉద్యోగాలకు 108 మంది ఎంపిక

నియామక పత్రం అందజేస్తున్న సతీష్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రిషి డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా ఏర్పాటైంది. 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి 108 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి కళాశాల కరస్పాండెంట్ సతీష్ నియామక పత్రాలు అందజేశారు. ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎవరెస్టు పర్వతారోహణ శిక్షణకు పయనం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నుంచి ముగ్గురు దివ్యాంగ విద్యార్థులు ఎవరెస్టు పర్వతారోహణ శిక్షణకు పయనమయ్యారు. అనకాపల్లి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి లద్దాఖ్ వెళ్లేందుకు విమానం ఎక్కారు. అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఎవరెస్టు బేస్ క్యాంపునకు జిల్లా నుంచి పవన్‌కుమార్, దుర్గాప్రసాద్, రాము ఎంపికైన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి 22 మంది 12 రోజులపాటు జరిగే ప్రత్యేక శిక్షణకు వెళ్లారని సమగ్ర శిక్షా పీవో శ్రీనివాస్ చెప్పారు.

విమానంలో దివ్యాంగ విద్యార్థులు

సైక్లింగ్ పోటీలో క్రీడాకారుల జోరు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీల్లో పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపారు. శాప్‌లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా అండర్ 18 విభాగంలో నిర్వహించిన పోటీలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. పట్టణంలోని సుంకరమెట్ట నుంచి దేవీపురం వరకు సైక్లింగ్ చేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి శైలజ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఒకటి వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు.

అనకాపల్లి రహదారిపై పోటీలో క్రీడాకారులు

రాష్ట్రస్థాయికి కశింకోట విద్యార్థి

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు కశింకోట డీపీఎన్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు వి.ప్రభాకర్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సైక్లింగ్ రేస్ పోటీలలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి **పీతల కిశోర్** రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 28, మార్చి 1వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు ఎన్.జె.వి.ప్రసాద్ వ్యాయామ ఉపాధ్యాయిని కమల, ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి అభినందించారు.

గణిత ఒలింపియాడ్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ

విద్యార్థిని వర్షితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఉషారాణి తదితరులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర గణిత ఒలింపియాడ్‌లో నక్కపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ ఉషారాణి మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పూడి వర్షిత ఇటీవల జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. ఈ విద్యార్థినికి గుంటూరు వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం, బహుమతి అందించారన్నారు. పాఠశాలకు వచ్చిన వర్షితను ప్రిన్సిపల్ తోపాటు వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

రగ్బీలో ఎం.జగన్నాథపురం విద్యార్థిని..

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రగ్బీ జాతీయస్థాయి పోటీల్లో ఎం.జగన్నాథపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని **ఎం.ఇందు** ఏపీ జట్టు తరపున పోటీల్లో పాల్గొని కాంస్యం పతకం సాధించింది. జాతీయ పోటీల్లో ప్రతిభ చూపించి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకొచ్చిన విద్యార్థినిని మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కె.రాజా రత్నకుమార్, సర్పంచి కరెడ్ల బుల్లమ్మ, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఉష తదితరులు శిక్షకుడు వెంకట్, వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మిరెడ్డి రాజును అభినందించారు.

'దేశప్రతిష్ఠను దిగజార్చడం దారుణం'

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దేశ ప్రతిష్ఠను దిగజార్చిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లిలో భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి మాట్లాడుతూ దిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ అనుచరుల చర్యలు దారుణమని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాన్ని భగ్నం చేయాలని చూసినవారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, మహిళా మోర్చా పదాధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో భాజపా నాయకుల ధర్నా

సోలార్ ప్లాంటు ఏర్పాటుకు భూసేకరణ

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలో మెగా ఇంజినీరింగ్ సంస్థ సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చింది. దీనికోసం 120 ఎకరాల డీఫాం భూములు అవసరమని సంస్థ తెలిపింది. దీనిపై మంగళవారం బైలపూడిలో తహసీల్దార్ కిశోర్‌లింకన్ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సోలార్ పవర్ ప్లాంటుకు బైలపూడి, జి.కొత్తపల్లి, అడవి అగ్రహారం, చినగోగాడ రైతుల నుంచి 120 ఎకరాల డీఫాం భూములను తీసుకుంటున్నామన్నారు. రైతులకు సంస్థ ఎకరాకి సంవత్సరానికి రూ. 31 వేల వరకు చెల్లిస్తుందన్నారు. ఇలా రెండేళ్లకు ఒకసారి ఐదుశాతం పెంచుతారన్నారు. దీనిపై బైలపూడి రైతులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై మరోసారి గురువారం రైతులతో సమావేశం నిర్వహిస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సిబ్బంది తరలింపు సరికాదు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఆర్టీసీ గ్యారేజీ వద్ద మంగళవారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో ఎర్ర బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. డిపో అధ్యక్షుడు ఎ.ఎన్.రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి పి.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 12 డిపోల్లో ఎలక్ట్రికల్ బస్సులను పినాకిల్ సంస్థ ద్వారా నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించడం సరికాదన్నారు. అందులో నాలుగు డిపోల షెడ్యూల్స్, సిబ్బందిని ఇతర డిపోలకు తరలించే చర్యలను ఆపాలని కోరారు. రీజియన్ కార్యదర్శి ఎల్.వి.ఆర్.బాబు పాల్గొన్నారు.

నిరసనలో ఎన్ఎంయూఏ ప్రతినిధులు

సచివాలయ ఉద్యోగినంటూ మోసం.. ఒకరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సచివాలయం ఉద్యోగినంటూ మోసం చేసి.. నగలు కాజేసిన వ్యక్తిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ శ్రావణి వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని పీఎం పాలెంకి చెందిన ఎల్లమెల్లి వెంకట రమణ గత ఏడాది డిసెంబరులో అనకాపల్లి కరణాల వీధిలో ఇల్లు అద్దెకు కావాలని వచ్చాడు. తాను సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నానని.. పింఛను ఇప్పిస్తానని ఇంటి యజమానురాలైన మహిళను నమ్మించాడు. ఫొటో తీయడానికి బంగారు వస్తువులు మెడలో నుంచి తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఎస్ రాయవరం మండలం కొరుప్రోలులో కూడా సచివాలయం ఉద్యోగినంటూ కొత్త పథకం కింద డబ్బులు వచ్చాయని మహిళను నమ్మించాడు. ఆధార్‌కార్డు, ఫొటో కావాలని చెప్పి ఫొటో తీయడానికి బంగారు వస్తువులను తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఇలా రెండు చోట్ల 87.70 గ్రాముల బంగారు వస్తువులను కాజేశాడు నిందితుడు వెంకట రమణను మంగళవారం అనకాపల్లిలో కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. 1998 నుంచి ఈ తరహా మోసానికి పాల్పడుతున్న ఘటనల్లో ఇతనిపై 42 కేసులు నమోదయ్యాయి. పలుమార్లు జైలు శిక్ష కూడా అనుభవించాడు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సైలు పంతోష్‌కుమార్, అల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

INDUSTRY

INDUSTRIAL SHED

పెందుర్తి MSME ఇండస్ట్రియల్ పార్క్‌లో అద్దెకు షెడ్‌కలదు. సైజు (65x150) సంప్ర॥ 9848294957, 9494126429.

REAL ESTATE

PLOT FOR SALE

KOTHAVALASA

కొత్తవలస-రాయపూర్ హైవేకి1KMలో 516E పెందుర్తి-అరకు రానున్న హైవేకి 2KMలో VMRDA PLOTS గజం: 12వేలు. 7416862947, 9182857713.

TO LET

MADHURAWADA

3BHK, 3rd ఫ్లోర్, 304, శ్రీవెంకటేశ్వర రెసిడెన్సీ, FCI లేఅవుట్ PM పాలెం, మధురవాడ, వైజాగ్. 24 గం॥ వాటర్, కార్ పార్కింగ్. ✆ 9490557700.

WANTED

GENERAL

RK బీచ్‌రోడ్డుకు దగ్గరగా 2BHK (or)3BHK Full Furnished House required 3Months ఇల్లు అద్దెకు కావలెను. ✆ 9848299619.

JOBS

Required a Female Tele caller and Office Boy in Vechile Finace Company 2-3Years Experience. Ph: 9182018251.

Required Sr. Accountant (F) Experience in GST Filing and Tally & MS Office for our Granite Export Comp., VSP. 9908664521.

Urgent Requirement following Senior Positions * Chief Administration Managers: 5 No's, M/F, Experienced / Retd. in any field. Interviews on: 11th & 12th Feb.26. ✆ 9553021026, 7702999763.

Wanted South Indian Cook for Home. Salary 12,000/- Near Narsimhanagar ✆ 9912464444.

Vacancy for Cashier cum Manager (Female), Near Dolphin Hotel, Auto Crate India. Ct: 9885445286.

గాజువాకలో ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు లేడి PRO's కావలెను. Qlf: Degree. జీతం: 10K. ✆ 9848677745.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, all (డిగ్రీ, B.Tech., Dip. & ITI) కావలెను. Sal: 18-25K, Age 35 లోపు, స్పాట్ జాయిన్ ✆ 7995439539

ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్టర్స్‌వద్ద సూపర్‌వైజర్స్ కం॥ ఆపరేటర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ, స్టాఫ్ ఇన్‌ఛార్జ్, ఫైర్ & సేఫ్టీ. 10th- డిగ్రీ, ITI, BTech జీ॥ 20K-35K. 9573635594, 9121044796

మానుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో B.టెక్, డిప్లమో, ITI, డిగ్రీ సిస్టంఆపరేటర్స్ సేఫ్టీ సూపర్‌వైజర్స్ స్టోర్స్ 45సం॥ Sr.ఇంజినీర్స్, 8019647888, 8341177761.

DRIVERS

పరవాడ ప్లాస్టిక్ కంపెనీకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & డ్రైవర్స్ (హెవీ/లైట్) మరియు హెల్పర్స్ కావలెను. జీతం: 15 నుండి 20వేలు సంప్ర 9493969749/ 9848899279

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్:- మధురవాడ ఏరియాలో చేయుటకు గార్డ్స్ కావలెను. 8 గం॥ డ్యూటీ, వ: 25-45, 10th, మంచి జీతం, ✆ 9440387815, 0891-2721672

సెక్యూరిటీ గార్డులు కావలెను. మధురవాడ, కొమ్మాది, ఎండాడ, వైజాగ్ సిటీలలో పనిచేయుటకు. జీతం : 14,000 నుండి. ✆ 73967 46222, 78421 81184

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గ్రామీణుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: టొయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా లిమిటెడ్ (టీఆర్ఐఐ) ఆర్థిక సహకారంతో ఇవ్వనున్న ఉచిత వసతి, శిక్షణ, ఉపాధి అవకాశాలకు గ్రామీణ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సెమ్స్ సీవోవో కమాండర్ (ఆర్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ దరఖాస్తులను ఫిబ్రవరి 28వ తేదీలోగా పంపాలని పేర్కొన్నారు. సంబంధిత కోర్సుల్లో రెండు నెలల శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సింధియా దరి సెమ్స్ కార్యాలయంలోగాని, 7794840934, 8331901237, 0891-2704010 నెంబర్లలోగాని సంప్రదించాలన్నారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, గ్రామ, వార్డు సచివాలయ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 24 మండలాల్లో ప్రతి మండలానికి అయిదు గ్రామాల చొప్పున ఎంపిక చేశామని పేర్కొన్నారు. గ్రామాలను పూర్తిస్థాయిలో శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో అన్ని వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు మురుగు కాలువలు శుభ్రం చేయాలన్నారు. తడి, పొడి చెత్త నుంచి సంపద తయారీ చేయాలన్నారు ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. వృథా వస్తువులను స్వచ్ఛ రథం వాహనాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) కార్యనిర్వాహక ఇంజినీర్ అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

▌కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పీ-4 విధానం అమలులో, ఆచరణలో అందరూ కలిసి రావాలన్నారు. సీపీవో రామారావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, అధికారులు పాల్గొన్నారు.

29 మద్యం సీసాల స్వాధీనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో మద్యం అక్రమ విక్రయాలు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై సాహిబా అంజుమ్ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో సీఐ జె.మురళీ ఆధ్వర్యంలో దాడులు చేశామన్నారు. ఈ క్రమంలో దేవవరంలో 20, గొడిచెర్లలో తొమ్మిది సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు.. సింహాచలం దేవస్థానం భూ పరిరక్షణ విభాగం ఎస్‌డీసీగా ఉన్న గీతాంజలిని స్టేట్ ఎయిర్‌పోర్టు అథారిటీ ఎస్డీసీగా నియమించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వోగా ఉన్న సీహెచ్.సత్తిబాబును విజయనగరం జిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు. పద్మనాభం తహసీల్దార్ కె.ఆనందరావుకు ఎస్‌డీసీగా పదోన్నతి కల్పించి, రాజధానిలో సీఆర్‌డీఏకు బదిలీ చేశారు. జిల్లాకు సంబంధించి ప్రకృతి విపత్తుల సంస్థ డిప్యూటీ మేనేజర్‌గా ఎస్‌డీసీ పి.గోవింద్, పోర్టు డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్‌గా డి.పుష్పమణిని నియమించారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

దీక్షలో కూర్చున్న పీఏసీఎస్ ఉద్యోగులు, సంఘ నాయకులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీసీసీబీ ఎలమంచిలి కార్యాలయం ఎదుట ఉద్యోగులు, సంఘ నాయకులు మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీన్ని నిరసిస్తూ జిల్లాస్థాయిలో నిరాహార దీక్ష శిబిరాన్ని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ రైతులకు నిరంతర సేవలు అందిస్తున్న వీరి న్యాయపరమైన కోర్కెలు నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శివరామకృష్ణ, ఎలమంచిలి, నక్కపల్లి, అచ్యుతాపురం, అడ్డురోడ్డు, పాయకరావుపేట, కోటవురట్ల పరిధిలోని అన్ని పీఏసీఎస్ శాఖల ఉద్యోగులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులు మంగళవారం నిరసన తెలిపారు. కర్నూలులో న్యాయవాది పవన్‌పై పోలీస్ అధికారి దాడిని నిరసిస్తూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిళ్లా హరశ్రీనివాసరావు, కార్యదర్శి బంధం వెంకట రమణ, సభ్యులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో పాల్గొన్న న్యాయవాదులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	115
లైవ్	152	135
డ్రెస్డ్	220	240
స్కిన్‌లెస్	251	250

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి పట్టణం: రాజా: **హాయ్ బల్వంత్,** రామచంద్ర: **నిలవే,** వెంకటేశ్వర: **స్కయ్,** ఉదయం, మొదటి ఆట, **చథా పత్ర** మేట్నీ, రెండోఆట, సత్యనారాయణ స్క్రీన్1: **అనగనగా ఒకరాజు,** స్క్రీన్2: **ఆల్ఫా,** పర్తిసాయి: **మన శంకర వరప్రసాద్‌గారు,** షిర్డీసాయి: **విత్‌లవ్,** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **కపుల్ ఫ్రెండ్లీ,** స్క్రీన్-2: **ఫంకీ.**

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: సమస్యలన్నీ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని రింగురోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను అడిగి తెలుసుకున్నారు.. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.

అ వీ ఇ వీ

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పెదపాడు, హరిపాలెం, తిమ్మరాజుపేట, ఖాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాల్లో గురువారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు

ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు హర్షణీయం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని జిల్లా పోలీసు కార్యాలయాల్లో మాజీ సైనికుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని మాజీ సైనికుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మాజీ సైనికుల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. మాజీ సైనికులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుకు హోం మంత్రి అనిత విశేషంగా కృషి చేశారన్నారు. గత ప్రభుత్వాలు మాజీ సైనికులను పట్టించుకోలేదన్నారు.

ఉపమాకలో చెరువు పరిశీలన

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్నను ఏషియన్ పెయింట్స్ అచ్యుతాపురం ప్లాంట్ హెడ్ మౌనిక్ చటర్జీ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు పీఏసీఎస్ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తదితరులు స్వాగతం పలికారు. తర్వాత చటర్జీ ఇక్కడ తమ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో జరుగుతున్న చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, కంపెనీ ప్రతినిధులు, నాయకులు మేడిశెట్టి శంకర్, కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

సోమవరంలో రహదారి పనులు ప్రారంభం

కశింకోట, న్యూస్‌టుడే: సోమవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం శ్రీకారం చుట్టారు. రూ.45 లక్షలతో గ్రామం నుంచి నర్సాపురం ఆనకట్ట మీదుగా గణపర్తి వరకు సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. మట్టిరోడ్డుతో రెండు నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డంతో తెదేపా మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే నిధులతో సుమారు 800 మీటర్ల మేర రహదారి పనులు చేపట్టారు. గ్రామంలో రూ.96 లక్షలతో మురుగు కాలువలు, రూ.30 లక్షలతో రెండు కల్వర్టుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ. కోటితో చేపట్టిన సోమవరం ఏనుగుతుని రహదారి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

ఎలమంచిలిలో లాడ్జిల తనిఖీ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని లాడ్జిలను మంగళవారం రాత్రి సీఐ ధనుంజయరావు, ఎస్సైలు సావిత్రి, రామకృష్ణ తనిఖీ చేశారు. లాడ్జిలో దిగిన ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకోవాలన్నారు. వారి వివరాలు రికార్డుల్లో విధిగా నమోదు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం లాడ్జిలు నడపాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. పట్టణ, ట్రాఫిక్ ఎస్సైలు సావిత్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

4న చలో విజయవాడ

కొత్తూరు (అనకాపల్లి): రాష్ట్రంలోని గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, జిల్లా కార్యదర్శి గోకాడ దేముడు కోరారు. అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం జరిగిన సంఘ జిల్లా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు పర్యాయాలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాక పోవడంతో మార్చి 4న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మన బాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి

కశింకోట, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు పేర్కొన్నారు. నర్సింగబిల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు రాయితీపై వరివిత్తనాలను పంపిణీ చేశారు. సర్పంచి కొట్టే రాము, జెర్రిపోతుల నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నడిపేది.. నిలిపేది.. నడిరోడ్డుపైనే!

అచ్యుతాపురంలో పార్కింగ్ కష్టాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

సెజ్ కేంద్రంగా విస్తరిస్తున్న అచ్యుతాపురంలో వాణిజ్య దుకాణాలు, మార్కెట్లు, ఆసుపత్రులు, పాఠశాలలు పెరుగుతున్నాయి. అయితే పార్కింగ్ స్థలాలు విడిచిపెట్టకుండా వాణిజ్య సముదాయాలు నిర్మించడంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేస్తున్నారు. పంచాయతీ, వీఎంఆర్‌డీఏ అధికారులు కాసులకు కక్కుర్తిపడి నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులు మంజూరు చేశారని మండిపడుతున్నారు.

రోడ్డు మీద నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలు

అచ్యుతాపురం కూడలి నుంచి నాలుగు వైపులా రహదారుల పక్కన వాణిజ్య సముదాయాలు వెలిశాయి. ఎక్కువ అద్దెలు రావడంతో పార్కింగ్ స్థలాలను చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ఇచ్చేశారు. ప్రస్తుతం ఉన్న ఇరుకు రోడ్డులోనే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను పార్కింగ్ చేసి దుకాణాల్లోకి కొనుగోలుదారులు వెళ్లడంతో నిత్యం ఇబ్బందిగా మారుతోంది. కొందరు నచ్చినట్లు వాహనాలు రోడ్డుమీద నిలిపివేసి సెజ్ కంపెనీలకు ఇక్కడి నుంచి బయలుదేరే బస్సుల్లో వెళ్లిపోయి మళ్లీ విధులు ముగించుకొన్న తరువాత వచ్చి తీసుకెళ్తున్నారు. సంత జరిగే శుక్రవారం నాడు ప్రజల కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. రామన్నపాలెం రోడ్డులో ప్రతి సోమ, బుధ, శుక్రవారం, ఆదివారం వరసగా నాలుగు రోజులు రోజువారీ మార్కెట్ నిర్వహిస్తున్నారు. మార్కెట్ జరిగే సమయం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ రోడ్డులో వాహనాలు కదలడం కష్టంగా మారుతోంది. దుకాణాల ముందు కనీసం పది అడుగుల స్థలం కూడా ఉంచకుండా నిర్మించేశారు. దీంతో ద్విచక్ర వాహనమైనా రోడ్డు మీదే నిలపాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో నిర్మించిన భవనాలకు సైతం కాగితాల్లో పార్కింగ్ స్థలాన్ని చూపించి అనుమతులు మంజూరు చేశారు. పెద్ద ఆసుపత్రులు సైతం పార్కింగ్ స్థలం లేకుండా నడుస్తున్నాయంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో? అర్థం చేసుకోవచ్చు. అచ్యుతాపురంలో 70 వేల మంది జనాభా నివాసం ఉండగా ప్రతిరోజు లక్షకుపైగా సెజ్ ఉద్యోగులు, కార్మికులు రాకపోకలు సాగిస్తున్నారు.

పెరుగుతున్న కోతి, కుక్క కాటు బాధితులు

రోడ్డుపై వానరాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో కోతి, కుక్క బాధితులు ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. రోజురోజుకి వీటి సంతతి పెరిగి ఆగడాలకు అడ్డేలేకుండా పోతోంది. పేటలో ఇటీవల ఒక్కరోజే సుమారు 20 మంది ఆసుపత్రికి వచ్చి ఏంటి రేబిస్ ఇంజక్షన్లు చేయించుకున్నారంటే పరిస్థితి ఇట్టే అర్థమవుతుంది. సగటున నెలకు 300 వరకు బాధితులుంటున్నారు. పట్టణంలోని బృందావనంలో వారం రోజుల క్రితం అయిదుగురిని కోతులు కరిచాయి. వీరిలో చిన్నారులు, విద్యార్థులు ఉన్నారు. ఇక ఒంటరిగా రోడ్డుపైకి వెళ్తే గ్రామసింహాల దాడిలో గాయపడుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. అరట్లకోట, సత్యవరం, కుమారపురం, పెదరామభద్రపురం, మంగవరం, మాసాహెబ్‌పేట, పెంటకోట సహా నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి తదితర మండలాల్లో ఇదే పరిస్థితి. పంట పొలాల్లోకి అడుగుపెట్టాలంటే రైతుల చేతిలో కత్తి, కర్ర ఉండాల్సిందే. ఒక్కోసారి ఒంటరిగా ఉన్న రైతులపై కోతుల గుంపు దాడికి పాల్పడుతున్నాయి. పంటలను సైతం నాశనం చేస్తున్నాయి. దీంతో కూరగాయల సాగు ను చాలావరకు మానుకున్నారు. తోటల్లో కొబ్బరికాయలు సైతం ఇవి తినేస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీటిని అదుపు చేసేందుకు సమగ్రమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నీరు లేకుండా ఇళ్ల నిర్మాణం ఎలా..!

ఈఈని ప్రశ్నించిన లబ్ధిదారులు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ ఉమాశంకర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నీటి సదుపాయం కల్పించకుండా ఇల్లు ఏవిధంగా నిర్మించుకోవాలని గృహ నిర్మాణ సంస్థ ఈఈని లబ్ధిదారులు ప్రశ్నించారు. పూడిమడక జగనన్న కాలనీలో ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని కోరడానికి వెళ్లిన అధికారులు వద్ద లబ్ధిదారులు సౌకర్యాల లేమిపై ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఈఈ వెంటనే ఎంపీడీఓ చిన్నారావుతో ఫోన్లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వపరంగా చేయాల్సిన అన్ని పనులు చేస్తామని ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. నీటి సమస్య పరిష్కరిస్తే నిర్మిస్తామని లబ్ధిదారులు తెలిపారు. ఏఈ మమత, డీఏ.రాజు, సర్పంచి చేపల సహాసిని పాల్గొన్నారు.

కదలని మురుగు

పురుషోత్తపురం గ్రామంలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహించి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగిపోయాయని పరిసరాల్లో నివసించేవారు ఆందోళన చెందుతున్నారు. వాహనదారులు, పాదచారులు మురుగులో నుంచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఎలమంచిలి గ్రామీణం

చెత్తకుప్పల మధ్య తాగునీటి పైపు

మునగపాక మండలం గవర్ల అనకాపల్లి ఏటిబ్రిడ్జి వద్ద తాగునీటి పైపునకు భారీ రంధ్రంపడి నీరంతా వృధాగా పోతోంది. దీంతోపాటు తాగునీరు కలుషితం అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గవర్ల అనకాపల్లి నుంచి ఎస్సీ కాలనీ అవతల నివాసాలుంటున్న ప్రజలకు పైపుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో ఉన్న చెత్తను పైపులైనుపైనే పోస్తున్నారు. పైపు తుప్పుపట్టి భారీ రంధ్రం పడింది. తాగునీరంతా చెత్తకుప్పల మధ్య వృధాగా పోతోంది. తక్షణమే పైపు మరమ్మతు చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే మునగపాక

బోరు బాగు చేయరూ...?

మండలంలోని బోడపాలెం శివారు కొత్తూరులో తాండవ కాలువ పక్కన తాగునీటి బోరు నిరుపయోగంగా ఉంది. ఈ ప్రాంతంలో కూలీలు, రైతులు రాకపోకలు సాగిస్తారు. కొద్ది నెలలుగా ఈ బోరు నిరుపయోగంగా ఉండటం వల్ల, తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల నుంచి కూడా సక్రమంగా నీరు రావటం లేదని చెబుతున్నారు. పాడైన బోరుకు మరమ్మతు చేపట్టి, అందుబాటులో ఉంచాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోటవురట్ల

ఇకపై హాయిగా ప్రయాణం...

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని దార్లపూడి ప్రధాన రహదారి కష్టాలు తీరాయి. 20 ఏళ్ల క్రితం నిర్మించిన రహదారిపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడిన ప్రజలు ఇకపై హాయిగా ప్రయాణించవచ్చు. చిన్నపాటి వర్షం కురిసిన గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడేవారు. గ్రామంలో రహదారి ఇబ్బందులను స్థానిక తెదేపా నేతలు హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి, నాబార్డు నిధులు రూ.కోటి మంజూరు చేయించారు. గత నెలలో హోంమంత్రి అనిత రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీవీఎల పనులు మొదలుపెట్టిన గుర్రాజు దార్లపూడి కూడలి నుంచి గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయం వరకు 1.66 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మించారు. రహదారి నిర్మాణం పూర్తికావడంతో ఏళ్ల నిరీక్షణ ఫలించిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముస్తాబైన రహదారి

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభంలో క్రీడాజ్యోతిని సహచర ఎమ్మెల్యేలతో కలిసి తీసుకొస్తున్న ఎలమంచిలి ఎమ్మెల్యే సుదరపు విజయ్ కుమార్. ఈయన వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– ఈనాడు, విజయవాడ

వైభవంగా అమ్మవార్ల పండగలు

మునగపాక, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో మంగళవాం అమ్మవార్ల జాతరలు వైభవంగా జరిగాయి. మునగపాక మండలం గవర్ల అనకాపల్లిలో మంగళవారం పోలిపల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. గవర్లఅనకాపల్లి, తోటాడ, టి.సిరసపల్లి, నారాయుడుపాలెం, పాటిపల్లి, మూలపేటగ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. విజయనగరానికి చెందిన 'రేలారే రేలా' జానపద నృత్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. అమ్మవారిని దర్శించుకొన్న వారిలో సర్పంచి దొడ్డి మంగవేణి, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, కోటేశ్వరరావు, పి. ఆనందరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పరదేశమ్మ జాతర

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రేబాకలో గ్రామదేవత పరదేశమ్మ, గొర్లివానిపాలెంలో పోలిపల్లి అమ్మవారి జాతరలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు పసుపు, కుంకుమ, అరటిగెలలు, పిండివంటలతో ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించారు. పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. పట్టణంలోని వేల్పులవీధిలో రాఘవేంద్ర స్వామి ఆలయంలో స్వామి 431వ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పూలఅలంకరణలో పరదేశమ్మ

సత్యదేవుని కల్యాణ మహోత్సవం నేటి నుంచి

కొత్తూరు (అనకాపల్లి): సత్యనారాయణపురంలో సత్యనారాయణ స్వామి ఆలయంలో వార్షిక కల్యాణ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ అప్పికొండ గణేష్ తెలిపారు. ఆరు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ధర్మకర్తలు పొలమరశెట్టి నూకరాజు, పప్పల రామకృష్ణ, ముత్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గవర్ల అనకాపల్లిలో రేలారే రేలా ప్రదర్శన

నక్కపల్లి: వేంపాడు రామాలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజలు మొదలయ్యాయి. దీనిలో భాగంగా మంగళవారం పండితుల ఆధ్వర్యంలో వాస్తు పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం పలు పూజలు, గురువారం ప్రతిష్ఠ, భారీ అన్న సమారాధన జరుగుతుందని కమిటీ ఛైర్మన్ నాగులు రాజు, సభ్యులు వెల్లడించారు.

వెంకన్న ఆలయానికి స్వామి వారి ఆభరణాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: కల్యాణోత్సవాల్లో ఉపమాక వెంకన్నకు అలంకరించే ఆభరణాలు మంగళవారం భద్రత నడుమ ఆలయానికి చేరుకున్నాయి. సీఐ జె.మురళీ ఆధ్వర్యంలో విశాఖ నుంచి ఏఆర్ బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో వీటిని ఆలయానికి తీసుకువచ్చారు. స్వామివారి ఎదుట ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది కాస్త ముందుగానే ఆభరణాలను అధికారులు రప్పించారు. ప్రధాన వేడుకల అయిదు రోజులపాటు వీటిని అలంకరించేలా ఆలోచన చేస్తున్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల పెట్టెతో అర్చకులు, అధికారులు

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీప్రకాష్, తిరుమల, కార్తికేయ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

పరీక్షకు వెళ్లే ముందు విజయచిహ్నం చూపుతున్న నక్కపల్లి కేజీబీవీ విద్యార్థినులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభం కాగా, నక్కపల్లిలో ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు పలు కళాశాలల విద్యార్థులు ఇక్కడకు చేరుకుని పరీక్షలు రాశారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. స్థానిక కేజీబీవీ విద్యార్థినులు పరీక్షకు వెళ్లేముందుకు విజయ చిహ్నం చూపి ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు అడ్డురోడ్డులోని పరీక్షా కేంద్రంలో 557 మంది విద్యార్థులకు 550 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరంతా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో సందడి మారింది.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగించడానికి అన్ని రకాలైన ఏర్పాట్లు చేసినట్లు సీఐ చంద్రశేఖరరావు తెలిపారు. అచ్యుతాపురం ప్రశాంతి కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రెండోరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఇక్కడ పరీక్షలకు హాజరవుతున్నారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా...

కోటవురట్ల, న్యూస్‌టుడే: మండలంలో కె.వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని మంగళవారం సందడిగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు అలరించాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాలని ఉపాధ్యాయులంతా విద్యార్థులకు సూచించారు.

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

గురుకుల ప్రవేశ పరీక్ష మార్చి 8కి మార్పు

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షల తేదీని ఉన్నతాధికారులు మార్చి 2 నుంచి 8కి మార్చినట్లు ప్రిన్సిపల్ ఉషారాణి మంగళవారం తెలిపారు. 6, 7 తరగతులకు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, 8, 9 తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు నిర్వహిస్తామన్నారు. సందేహాలుంటే గురుకులంలో సంప్రదించాలన్నారు.

లక్ష్మీనారాయణ నగర్‌లో కాల్వల నిర్మాణం

అనకాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లో రూ.కోటితో రహదారులు, మురుగుకాలువలు నిర్మిస్తున్నారు. కాలువ పనులను మంగళవారం తెదేపా నాయకులు పరిశీలించారు. వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలిబాబు, అధ్యక్షులు తలారి లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై 16న ధర్నా

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు నుంచి వారి బకాయిలన్నీ చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు కోరారు. అనకాపల్లి సీఐటీయూ భవనంలో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారం కోరుతూ మార్చి 16న పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ప్రకటించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అడిగర్ల రాజు, జిల్లా అధ్యక్షుడు కె రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రామకృష్ణ, కార్యదర్శి జి అప్పారావు, వర్కింగ్ అధ్యక్షులు ఎస్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

మంచి భవిష్యత్తే లక్ష్యం కావాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి మంచి భవిష్యత్తుని లక్ష్యంగా చేసుకోవాలని ఎస్సై సాహిబా అంజుమ్ సూచించారు. చినదొడ్డిగల్లు ఉన్నత పాఠశాలలో మంగళవారం వివిధ అంశాలపై సీఐ జె. మురళీ ఆధ్వర్యంలో ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వ్యసనాలబాట పట్టొద్దన్నారు. ప్రధానంగా ఆన్‌లైన్ గేములు, పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. అది సమాజానికే ప్రమాదమన్నారు. చదువుతో పాటు, క్రీడలపై దృష్టి సారిస్తే మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు, ఉన్నత స్థాయికి చేరుకోగలమన్నారు. ఆడపిల్లల పట్ల చెడుగా ప్రవర్తిస్తే పోక్సో కేసు తప్పదన్నారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే పెద్దవారికి, ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి వారి లక్ష్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్.ఎం. వి.బాలాజీ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సై సాహిబా అంజుమ్

నాణ్యతాలోపం లేకుండా పనులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూసుకోవాలని ఎంపీడీఓ బి. చైతన్య సూచించారు. మామిడివానిపాలెంలో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను మంగళవారం పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జితో కలిసి పరిశీలించారు.

పాఠశాలలో ఆంగ్ల భాషా వేడుకలు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే వేడుకలు జరిగాయి. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆంగ్ల భాష ఆవశ్యకత, అవసరాన్ని వివరించారు. ఆంగ్ల భాషను సులభంగా నేర్చుకునే విధానాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయ సంఘ నాయకులు గొంది చినబ్బాయ్, వరప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

టిప్పర్ ఢీ కొని ఒకరికి తీవ్రగాయాలు

నర్సీపట్నం గ్రామీణం: నర్సీపట్నం నుంచి ఏటిగైరంపేట ద్విచక్రవాహనంపై వెళ్తున్న పీనారిపాలేనికి చెందిన గరగ శ్రీనివాసరావును టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో ఆయన రెండు కాళ్లు టైర్ల కింద పడి నుజ్జయ్యాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | ఎలమంచిలి- 80085 74726 | పాయకరావుపేట- 80085 74750

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ?: అడ్డురోడ్డు - రేవుపోలవరం రహదారిలో కొరుప్రోలు వద్ద వేగ నిరోధకాలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. – పక్కుర్తి ప్రసాద్, కొరుప్రోలు ✓: కొరుప్రోలు వద్ద రహదారిని పరిశీలిస్తాం, అధికారులతో చర్చించి వేగనిరోధకాలు ఏర్పాటుపై చర్యలు తీసుకుంటాం.

– రామన్, ఆర్‌అండ్‌బీ, ఏఈ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పట్టణంలోనీ దేవినగర్, చక్కానగర్‌లో పూర్తిస్థాయిలో కుళాయిలు ఏర్పాటు చేయాలి. నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నాం. – కె.వంశీ, స్థానికుడు ✓: ప్రతి వీధికి కుళాయిలు ఏర్పాటు చేయిస్తాం. – వై.సత్యనారాయణ, పంచాయతీ ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఎల్.టి.కాలనీ వద్ద ఉన్న కాలిబాటపై నడిచేందుకు వీలుండటం లేదు. పిచ్చిమొక్కలు మొలిచాయి. – ప్రశాంత్, స్థానికుడు ✓: కాలిబాటను శుభ్రం చేయిస్తాం. నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తాం.

– వై.సత్యనారాయణ, పంచాయతీ ఈవో

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: విద్యుత్తు స్తంభాల మార్పు పేరుతో తరుచూ కోతలు విధిస్తున్నారు. – శ్రీనివాసరావు, ఎం.జగన్నాథపురం ✓: ముందస్తు సమాచారం అందించి సరఫరా నిలుపుతున్నాం. – భానుప్రకాశ్, ఏఈ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పట్టపగలు లైట్లు వెలుగుతున్నాయి. – రాంబాబు, ఎలమంచిలి ✓: పగటి పూట లైట్లు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.– వి.ప్రవీణ, ప్రజారవాణా అధికారి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని జీవీ కోటేశ్వరరావు వీధిలో మురుగు కాలువ నిర్మించక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.– రాజేంద్ర, అనకాపల్లి. ✓: కాలువ నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం. – గోపాలకృష్ణ, జీవీఎంసీ ఈఈ, అనకాపల్లి.

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: ప్రధాన రహదారిలో న్యాయ సముదాయాల ఎదురుగా ఉన్న బోరు చుట్టూ చెత్త, మురుగు ఉంది. నీరు తాగడానికి ఇబ్బందిగా ఉంది. – ఎన్.రామారావు, అనకాపల్లి. ✓: చెత్త, చెదారం తొలగిస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి.

ఎలమంచిలి, న్యూస్‌టుడే:?: పట్టణంలోని ఎర్రవరంలో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. ఇళ్లలో చొరబడి దాడులు చేస్తున్నాయి. చాలా ఇబ్బంది పడుతున్నాం. – ఎం.రమణ ఎలమంచిలి ✓: కోతులు పట్టే వారితో మాట్లాడుతున్నాం. వీటి పట్టివేతకు ఒక ప్రణాళిక తయారు చేస్తున్నాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. – బాకూరి ప్రసాదరాజు, కమిషనర్, ఎలమంచిలి.

కాలిబాట ఆక్రమణ...

పాయకరావుపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం, మేజర్ పంచాయతీ పాయకరావుపేటలో ఆక్రమణలకు అడ్డే లేకుండా పోతోంది. ప్రభుత్వ స్థలమైనా, కాలిబాటైనా దర్జాగా నిర్మాణాలు చేపట్టవచ్చు. పంచాయతీ సిబ్బందిని ప్రసన్నం చేసుకుంటే చాలు అన్ని అనుమతులు ఇట్టే వచ్చేస్తాయి. అక్రమాలకు అడ్డాగా పేట మారుతోంది. ఇటీవలే ప్రధాన రహదారిలోని ఆక్రమణలు తొలగించిన విషయం తెల్సిందే. పెద్దఎత్తున రోడ్డు కబ్జా గురికావడంతో పంచాయతీ సిబ్బంది పాత్రే కీలకం. ఎట్టకేలకు రహదారికి మోక్షం వచ్చింది. అయితే గౌతమ్ కూడలి నుంచి తుని వరకు తాండవ నదిపై ఉన్న వంతెన కాలిబాటను అక్రమార్కులు కబ్జా చేశారు. నాగరాజుపేట వైపు ఉన్న స్థలాల్లో భవనాలు నిర్మించారు. వాటిని పొడిగించి వంతెన కాలిబాటకు అనుసంధానం చేశారు. దీనిపై మెట్లు నిర్మించారు. దుకాణాలు ఏర్పాటు చేశారు. రాకపోకలకు వీలులేని విధంగా దుకాణాల్లోని సామగ్రిని కాలిబాటపై ఉంచి విక్రయిస్తున్నారు. నాగరాజుపేటవైపు రోడ్డును కబ్జాచేసి దానిపై స్లాబులు వేశారు. మూడు దుకాణాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ఆక్రమణలు తొలగించలేదు. అధికారులు స్పందించి రోడ్డుపై వేసిన స్లాబులు, దుకాణాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పాండురంగస్వామి దేవస్థానం ఎదురుగా వంతెన కాలిబాటపై ఆక్రమణలు

ప్రకటన

నా క్లయింటు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సీతారాంపురం గ్రామ వాస్తవ్యులు **దారబోయిన అచ్చియ్యమ్మ,** W/o పెంటయ్య గారి తరపున B.V.శ్రీనివాసరావు, Advocate, పాయకరావుపేట వారు యిచ్చు పేపరు ప్రకటన, నా క్లయింటు Propertyకి సంబంధించిన Link Document No.4865/2013 క్రయ దస్తావేజు Dt.20-01-2026న నామవరం Village, Highway వద్ద ద్విచక్ర వాహనంపై వస్తుండగా సదరు దస్తావేజు పడిపోయినట్లు నా క్లయింట్ గుర్తించినారు. కాబట్టి ఎవరికైన దొరికిన లేదా ఈ దస్తావేజులపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నయెడల వెంటనే ఈ పేపరు ప్రకటన లగాయితు 7 రోజులలోగా తెలియపరచవలెను.

B.V.SRINIVASA RAO, Advocate
తేది: 24-02-2026 సెల్: 73865 61115

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: 100 డేస్ లవ్ స్టోరీ, ఒన్ ప్లస్ ఒన్ ఆఫర్, సైక్, అమరావతికి ఆహ్వానం, **ఆడి2:** యుఫోరియా, **ఆడి3:** ఫన్‌కీ, **ఆడి4:** ఓ రోమియో, క్రైం 101. **చోడవరం:** సాయిలక్ష్మి: హే భగవాన్, శ్రీసాయిలక్ష్మి: ఫిబ్-14, పూర్ణా: మన శంకర వరప్రసాద్ గారు

కాశీపురం కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: కాశీపురం కూడలిలో దేవరాపల్లి పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కె.కోటపాడు ఇన్‌స్పెక్టరు కృష్ణ పర్యవేక్షణలో వీటిని అమర్చారు. దీంతో పోలీసు నిఘా మరింత బలోపేతమవుతుందని పోలీసులు తెలిపారు. అనంతరం దేవరాపల్లి పరీక్షా కేంద్రాన్ని సీఐ, ఎస్ఐ పరిశీలించారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛ సంకల్పం.. ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహనపై కళాజాత నిర్వహించారు. కళాకారులు ఊరూరా ప్రదర్శించిన కళాజాత ఆకట్టుకుంది. జానపద గీతాల రూపంలో పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంపై సూచనలు చేశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలన్నారు. బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జానపద గీతాలను తిలకిస్తున్న జనం

విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ

రోలుగుంట, న్యూస్‌టుడే: స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో చదువుతూ దృష్టిలోపంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులకు మంగళవారం కళ్లద్దాలు అందజేశారు. కశింకోటకు చెందిన డాక్టర్.శ్రావణ్‌గోపీకృష్ణ ఆధ్వర్యంలో గతంలోనే ఇక్కడి విద్యార్థినులకు నేత్రపరీక్షలను నిర్వహించారు. వారిలో దృష్టిలోపంతో ఇబ్బంది పడుతున్న 31మందిని గుర్తించి కళ్లజోళ్లు అందజేశారు.

టిప్పర్ ఢీకొని తీవ్రగాయాలు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సీపట్నం నుంచి ఏటిగైరంపేట వ్యాపారం పని మీద ద్విచక్రవాహనంపై వెళుతున్న పట్టణంలోని పీనారిపాలేనికి చెందిన గరగ శ్రీనివాసరావును పిక్కరాయి లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఆయన రెండు కాళ్లు టైర్ల కింద పడి నుజ్జయ్యాయి. ప్రాంతీయాసుపత్రిలో చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. సభాపతి అయ్యన్న సతీమణి చింతకాయల పద్మావతి ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రుడికి ధైర్యం చెప్పారు. విశాఖపట్నం వైద్యులతో ఫోన్‌ద్వారా మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజారావు తెలిపారు.

వెన్న శాతం పెరిగితేనే ధర గిట్టుబాటు

పచ్చిగడ్డి, దాణాతో పాల దిగుబడులు వృద్ధి

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పాల వ్యాపారంలో జాగ్రత్తలు పాటిస్తే మంచి రాబడి ఉంటుంది. అవగాహన లేక రైతులు కొందరు అసంతృప్తి వ్యక్తం చేయడాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. కొన్ని మెలకువలు, ముఖ్య సూత్రాలు తెలియక పశుపోషకులు ఆదాయం పొందలేకపోతున్నారని గ్రహించారు. నాణ్యతతోనే పాలకు గిట్టుబాటు ధర లభిస్తుంది. తగినంత వెన్న శాతం లోపించడంతో రైతులు తక్కువ రాబడితో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వీరంతా లాభాలు గడించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

▼ రైతులు పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించకోవడం చాలా ముఖ్యమని అధికారులు సూచిస్తున్నారు. పశువులకు దాణా, గడ్డి అలాగే కూలి తదితర వ్యయాలను లెక్కగడితే లీటరుకు రూ.35 ఖర్చవుతోందని చెబుతున్నారు. లీటరుకు డెయిరీ చెల్లించే ధర రూ.40 నుంచి రూ.50 వరకు ఉంటోంది. దీంతో పెద్దగా ఆదాయం లేని పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీని నివారణకు ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని నాణ్యత వృద్ధికి జాగ్రత్తలు తీసుకుంటే రాబడి పెరుగుతుందంటున్నారు.

▼ జిల్లాలో పాడి పరిశ్రమపై 2 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. పాల విక్రయాలే వీరికి ప్రధాన ఆదాయ వనరులు. జిల్లా వ్యాప్తంగా ఆవులు, గేదెలు 4.5 లక్షలున్నాయి. పాల ఉత్పత్తిదారుల్లో అధిక శాతం మంది అవగాహన లేమితో ఆదాయం పొందలేకపోతున్నారు. పశువైద్య శిబిరాలు, లేగ దూడల ప్రదర్శన తదితర కార్యక్రమాల్లో రైతులు పలువురు పాల ధర ఆశాజనకంగా లేదని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రోజువారీ పాల ఉత్పత్తి 8 నుంచి 10 లక్షల లీటర్లు ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో సుమారు 5 లక్షల లీటర్ల వరకు వివిధ డెయిరీలకు చేరుతున్నాయి.

▼ పాడి పశువులకు పచ్చి గడ్డితోపాటు ఎండుగడ్డి, దాణా సరైన నిష్పత్తిలో అందజేయాలని నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు సూచిస్తున్నారు. పచ్చి గింజల చెక్క, వేరుసెనగ చెక్క వంటి పోషకాహారం అందించాలి. దాణాలో 50 గ్రాముల లవణాల మిశ్రమ కలపాలి. పాలు పితికేటప్పుడు చేతులతోపాటు పాత్రలన్నీ శుభ్రంగా ఉండాలి. పితికిన గంటలోగా పాల సేకరణ కేంద్రానికి తీసుకువెళ్లాలి. ఇలా చేయడం ద్వారా పాల దిగుబడి ఖర్చు తగ్గి వెన్నశాతం పెరిగి ఆదాయం మెరుగుపడుతుంది. సందేహాల నివృత్తికి పశువైద్యశాలల్లో సంప్రదించవచ్చని ఏడీ పేర్కొన్నారు.



రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే : వర్షా కాలంలో కొండగెడ్డలు పొంగి పైడిపాల వామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం ముంపునకు గురవుతోంది. సమస్యను తెదేపా నాయకులు సభాపతి అయ్యన్నపాత్రుడి దృష్టికి తీసుకువెళ్లడంతో రక్షణ గోడ, కాలువ, కల్వర్టుల నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఈ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మాకవరపాలెంలో శ్రీకృష్ణుడి కాలనీ, కొత్తవీధి ప్రాంతాల్లో అభివృద్ధి పనులకూ నిధులు మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుట్టారు. పంచాయతీరాజ్, జలవనరుల శాఖ ఏఈలు సోమశేఖర్, రామన్నపాత్రుడు పనులను పరిశీలించారు.

నిర్మాణ దశలో ఉన్న కాలువ

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో సత్యం పథకంలో భాగంగా పోషణ వాటికలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా మహిళా సాధికారత అధికారి (ఐసీడీఎస్ పీడీ) ఎస్.సూర్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అంగన్‌వాడీ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ఆకుకూరలు, కూరగాయలతో పాటు పోషక విలువలతో కూడిన పంటలు పండిస్తున్నారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో వీటి నిర్వహణకు రూ.10 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. దేవరాపల్లి మండలంలోని రైవాడ, శంభువానిపాలెం, వాలాబు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బాల్యవివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాములమ్మ, ఆదిలక్ష్మి తదితరులున్నారు.

శంభువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం బోధకురాలితో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

ఆరుగురిని అరెస్టు చేశాం: సీఐ

నర్సీపట్నం గ్రామీణం, నాతవరం, న్యూస్‌టుడే: మోసపూరితంగా తప్పుడు పత్రాలను చూపి పన్నెండు సెంట్ల గ్రామకంఠం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని లింగంపేట పంచాయతీ కార్యదర్శి బాబూజీ ఇచ్చిన ఫిర్యాదుపై ఆరుగురిని అరెస్టు చేశామని గ్రామీణ సీఐ రేవతమ్మ తెలిపారు. మంగళవారం నర్సీపట్నం గ్రామీణ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ లోకవరపు నూకరాజు, మంగ, కొండబాబు, నారాయణమూర్తి, వరహాలబాబు, పైల సీతారామ నాగ జెమీలును అరెస్టు చేసినట్టు వివరించారు. కేసు దర్యాప్తు జరుగుతోందని వివరించారు. నాతవరం తహసీల్దార్ చందనరేఖ, ఎంపీడీఓ సత్యశ్రీనివాస్, కార్యదర్శి బాబూజీ, ఎస్సై తారకేశ్వరరావు పాల్గొన్నారు.

పత్రాన్ని చూపుతున్న తహసీల్దార్ చందనరేఖ, సీఐ రేవతమ్మ

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

సామగ్రి అందుకున్న కొంతలం విద్యార్థులు

రోలుగుంట, న్యూస్‌టుడే: కొంతలం, బి.బి.పట్నం గ్రామాల్లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతూ త్వరలోనే పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన క్షత్రియ యూత్ ఫెడరేషన్ పరీక్ష సామగ్రి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులతోపాటు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర వివరాలు నమోదు చేయాలి

చీడికాడ, న్యూస్‌టుడే: దివ్యాంగ విద్యార్థుల సమగ్ర వివరాలను నమోదు చేయాలని, దీంతోనే వారికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని సమగ్ర శిక్షా సహిత విద్య ప్రాజెక్టు దృష్టి రాష్ట్ర పరిశీలకుడు మహాలక్ష్మినాయుడు సూచించారు. చీడికాడ మండలం తురువోలు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మండల భవిత కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ట్యాబ్‌లోని దృష్టి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్న వివరాలు, రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థుల వివరాలను ఈనెల 26వ తేదీలోగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్.దేముడు, సీహెచ్.సరస్వతి పాల్గొన్నారు.

వివరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు మహాలక్ష్మినాయుడు

పరమేశ్వరుడి క్షేత్రం.. పరమానందం

మూడురోజుల పాటు ఉత్సవాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కోమళ్లపూడిలో కోటిన్నర వ్యయంతో ప్రకృతి అందాల మధ్య నిర్మించిన పరమశివుని క్షేత్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 25 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 27న శివపార్వతుల విగ్రహాల ఆవిష్కరణ, ద్వాదశ జ్యోతిర్లింగాలు, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి.

చెరువు మధ్యలో నిర్మించిన శివపార్వతుల మండపం

▼ బుచ్చెయ్యపేట-రావికమతం మండలాల సరిహద్దులో ప్రధాన రహదారి పక్కన ఆధ్యాత్మిక కేంద్రం రూపుదిద్దుకుంది. విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ తల్లిదండ్రులు కృష్ణం నాయుడు, వెంకయ్యమ్మల పేరిట సొంతనిధులతో పాటు దాతలు, భక్తులు సహకారంతో ఈ క్షేత్రాన్ని నిర్మించారు. కైలాసగిరిలో మాదిరిగా బురదవానిచెరువు మధ్యలో భారీ శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. దీనికి ఆకర్షణీయంగా గోపురం నిర్మించారు.

▼ చెరువులోకి స్నానాలు ఆచరించేందుకు, దీపాలు వెలిగించేందుకు ఒకవైపున మెట్లు నిర్మించారు. గుట్టపై ద్వాదశ జ్యోతిర్లింగాలు, ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డు నుంచి శివపార్వతులను దర్శించుకోవడానికి వెళ్లే మార్గంలో ఆలయ ముఖద్వారాన్ని నిర్మించారు.

ఈనెల 25, 26, 27 తేదీల్లో ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. హోమాలు, ప్రత్యేక పూజల కోసం యాగశాలను నిర్మించాం. పరిసర గ్రామాల నుంచి వేలాది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నాం. మూడురోజులూ అన్నసంతర్పణ, జిల్లా స్థాయి ఎడ్లపరుగు పోటీలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఎంపీ సి.ఎం రమేష్, స్థానిక ఎమ్మెల్యే కేఎస్‌ఎన్ఎస్ రాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ తదితరులు పాల్గొంటారు. - గేదెల సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపకులు, విశాఖ డెయిరీ డైరెక్టరు

రోడ్డు పక్కన వాహనం గుర్తింపు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: బూరుగుపాలెం నుంచి తూటిపాల వెళ్లే దారిలో నెల రోజులుగా ఓ ద్విచక్ర వాహనం రోడ్డు పక్కన ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిపోయారు. 'ఏపీ 31 బీజే 7557' నంబరు గల ఈ వాహనాన్ని చోరీ చేసి ఇక్కడ వదిలేసి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు స్పందించి వాహనాన్ని స్టేషన్‌కు తరలించాలని కోరుతున్నారు.

జీడి రైతుకు న్యాయం చేయాలి

మాడుగుల, న్యూస్‌టుడే: జీడిపిక్కల పంటకు కేజీకి రూ.200 ఇవ్వాలని సీపీఎం నాయకుడు ఇరటా నర్సింహమూర్తి, కార్లి భవాని డిమాండు చేశారు. మండలంలోని 90 వేల హెక్టార్లలో ఈ పంట పండుతోంది. 25 వేల మెట్రిక్ టన్నుల దిగుమతి అవుతున్న జీడిపిక్కలకు సరైన ధరలు లేవన్నారు. నీటి సౌకర్యం లేని ప్రాంతంలో కష్టపడి పండిస్తున్న గిరిజన రైతులకు న్యాయం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎం.అలమండలో రైతులకు శిక్షణ నేడు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: రబీలో పప్పు ధాన్యాల సాగుపై ఎం.అలమండలో మండల స్థాయి రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి వై.కాంతమ్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా నిర్వహించే ఈ శిక్షణకు హాజరయ్యే రైతులకు శాస్త్రవేత్తల బృందం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించండి

చోడవరం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ పనుల కోసం వేచి ఉండే స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను తొలగించి ఎప్పటి మాదిరిగానే కూలీలు వేచి ఉండేలా చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మికుల సంఘ ప్రతినిధులు కోన నూకరాజు, ఎన్.ప్రసాదు కార్యదర్శిని కోరారు.

సేంద్రియ ఎరువుల వాడకం శ్రేయస్కరం

పంటల్ని పరిశీలిస్తున్న వెంకటరత్నం తదితరులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: సాగులో సేంద్రియ ఎరువుల వాడకం శ్రేయస్కరమని విజయ కుమార్ గ్రీన్ క్లైమెట్ టీం ప్రతినిధి జనపరెడ్డి వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని పల్లపుకొడాబులో సనపల జగదీష్, విష్ణుప్రియ దంపతులు నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన బృందం మంగళవారం సందర్శించింది. రసాయన ఎరువులు వాడకుండా, సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న పంటల్ని చూసి వారు ఆనందం వ్యక్తం చేశారు.

పదోతరగతి ఓ మైలురాయి

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉషోదయ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. విద్యార్థిని యోగిత కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ జెట్టిబోయిన రమణాజీ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థి దశలో ఓ మైలురాయిగా పేర్కొన్నారు. కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ వెంకటరావు, ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న బాలికలు

శరవేగంగా ప్రయోగశాల నిర్మాణం

కుసర్లపూడి పాఠశాలలో మొదలైన నిర్మాణపనులు

రోలుగుంట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో ప్రతిపాదనలకే పరిమితమైన జడ్పీ ఉన్నత పాఠశాలలోని ప్రయోగశాలకు ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. పాఠశాల ప్రాంగణంలో భవన నిర్మాణపనులకు శ్రీకారం చుడుతున్నారు. ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అప్పట్లోనే ప్రతిపాదించిన నిధులను కూటమి సర్కారు నేడు పచ్చజెండా ఊపడంతో పనులు పునఃప్రారంభమయ్యాయి. మండలంలోని కుసర్లపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సమగ్ర శిక్షలో సైన్స్‌కు సంబంధించి ప్రయోగశాలతో పాటు క్రాఫ్ట్‌రూం అదనపు గదులకు సుమారు రూ.14.8లక్షలు గతంలోనే మంజూరయ్యాయని మంజూరయ్యాయని ఏఈ పి.వి.సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం పనులు పునాదుల స్థాయిలో ఉన్నాయని హెచ్.ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు తెలిపారు.

శాశ్వత క్యూలైన్ల ఏర్పాటు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది వెంకటేశ్వరస్వామి కొండపై ఆలయ ప్రాంగణంలో స్టీలు రైలింగ్‌తో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని నివారించడానికి గతంలో ఆలయం వద్ద తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేసేవారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత వాటిని తొలగించి తీసుకువెళ్లిపోయేవారు. శాశ్వత క్యూలైన్ల ఏర్పాటు కోసం గ్రామానికి చెందిన మందాల సత్యనారాయణ, ఆయన భార్య ప్రమీలాదేవి రూ. 3 లక్షలు ఆర్థికసాయం చేశారు. ప్రమీలాదేవి విజయనగరం టూటౌన్ ఎస్సైగా పనిచేస్తున్నారు. వీరి సహకారంతో ఆలయం చుట్టూ స్టీలు రైలింగ్‌తో క్యూలైను ఏర్పాటు పనులు పూర్తిచేశారు.

బాల్యవివాహాలు నేరం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు చేయడం నేరమని, వాటిని ప్రోత్సహిస్తున్నవారికి కఠిన శిక్షలుంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ తెలిపారు. పొంగలిపాకలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నాయన సత్యనారాయణ, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కింతలి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ ఉండూరు దేముడు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామపెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు

అకాలవర్షంతో ఇక్కట్లు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పొలాల్లో ఎక్కువగా అపరాలు సాగు పంట దశకు చేరుకున్నాయి. కొందరు రైతులు కోతలు మొదలు పెట్టారు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీర్థం.. తరలివచ్చిన జనం

ఆర్లిలో పందిరికి వేలాడదీసిన పండ్లు, నోట్లకట్టలు

గొలుగొండ, న్యూస్‌టుడే: పప్పుశెట్టిపాలెం శివారు నర్సింగబిల్లిలో తలుపులమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

బుచ్చెయ్యపేట: కొత్తకొండెంపూడి గ్రామంలో రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో హోమాధికాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ▼ వడ్డాది కూడలి వద్ద మోదమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ దొండా గిరిబాబు పాల్గొన్నారు.

రావికమతం: మట్టవానిపాలెంలో పరిదేశమ్మ పండగను ఘనంగా జరిగింది. పరిదేశమ్మ మాలాధార భక్తులు, మహిళలు ఘటాలు, వివిధ రకాల పిండి వంటల సారెతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు గుమ్మాల శంకరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మైచర్ల నాయుడు పాల్గొన్నారు.

ఘటాలు, పిండి వంటల సారెతో ఊరేగింపు

కె.కోటపాడు, చీడికాడ: ఆర్లిలో గంగాదేవి గావు పండగ మంగళవారం కనుల పండువుగా జరిగింది. ఇక్కడి వారి సాంప్రదాయం ప్రకారం పెద్ద పందిరి వేసి నోట్ల కట్టలు, అరటిగెలలు, కొబ్బరి బొండాలు, అనేక రకాల పండ్లు ఫలాలు తదితరమైనవి వేలాడదీశారు. ▼ పిండ్రంగిలో సీతారామాంజనేయులు, దీక్షితుల అగ్రహారంలో పైడితల్లమ్మ అమ్మవారి తీర్థాలు ఘనంగా జరిగాయి.

మాడుగుల గ్రామీణం : ఎం.కోటపాడులో ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఉదయం మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేటలో ఎడ్ల పరుగులు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

మాడుగులలో ఎడ్లబండి పరుగు

వంద రోజుల పని కల్పించండి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని కల్పించాలని పీడీ పూర్ణిమాదేవి స్పష్టం చేశారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం 31 పంచాయతీల్లోని గ్రామాల్లో చేపట్టిన సర్వే వివరాలను వెల్లడించారు. చాలా చోట్ల ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదని, వీఆర్పీలు పనులు చేయించి ఇష్టానుసారం మస్తర్లు వేసినట్లు బృంద సభ్యులు పేర్కొన్నారు. బూరుగుపాలెంలో వంద రోజుల పని కల్పించలేదని, ఆరు రోజులు పనికి వెళ్తే మూడు రోజులకే మస్తర్లు వేశారని సర్పంచి వెంకటరమణ ఫిర్యాదు చేశారు. పేద కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టాల్సిన ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యంగా ఉండటమేంటని ఎంపీడీవో ఛాయాసుధ, ఏపీఓ కాశీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచి వెంకటరమణ

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

చోడవరం పట్టణం, స్థానిక బోళ్లవీధి కూడలిలో తాగునీటి బోరు వద్ద చెత్త పేరుకుపోయింది. కాలువల్లో పూడికలు తీయకపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **రమేశ్, స్థానికుడు,** ✔: పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించి కాలువలో పూడికలు తీయిస్తాం. - **శ్రీనివాస్, కార్యదర్శి**

కృష్ణదేవిపేట, కొత్తమల్లంపేట బొడ్డువారి వీధిలో బోరు చుట్టూ మురుగు నిలుస్తోంది. నీటిని పట్టుకునేందుకు మహిళలు ఇబ్బంది పడుతున్నారు. - **వైదేహి ఆచారి, కొత్తమల్లంపేట,** ✔: సమస్య మాదృష్టికి వచ్చింది. పరిష్కారానికి చర్యలు చేపడతాం. - **శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

కృష్ణదేవిపేట, కొత్తమల్లంపేట, చిన్నయ్యపాలెం మార్గంలో గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. - **కె.సన్యాశినాయుడు, సామాజిక కార్యకర్త,** ✔: గోతులు పూడ్చి రహదారి మరమ్మతు చేస్తాం. - **ప్రసాదరావు, జేఈ, రభశా, గొలుగొండ**

గొలుగొండ, న్యూస్‌టుడే: గొలుగొండ పీహెచ్‌సీకి వెళ్లే రహదారి కూడలిలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నేలకు రెండు అడుగుల ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. - **అప్పలనాయుడు, సామాజిక కార్యకర్త,** ✔: తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటుకు చర్యలు చేపడతాం. - **రాజేంద్రప్రసాద్, విద్యుత్తు ఏఈ**

స్పందనకు వందనం

గొలుగొండ: లింగంపేట శివారు గవిరంపేట వద్ద తాగునీటి సరఫరా పైపులు దెబ్బతిని నీరంతా రోడ్డుపై వృథాగా పోతోంది. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 22న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించారు.

నర్సీపట్నం అర్బన్: పోలీసుస్టేషన్ ఎదుట నాటిన మొక్క నిర్వహణ లేక నేలవాలడంపై 'నరికారు.. నాటారు... నిర్వహణ మరిచారు' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు కర్రను దన్నుగా ఏర్పాటు చేసి మొక్కను నిలబెట్టారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామపెద్దలు, వైద్యులు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన మాడుగులలో మంగళవారం ఉచిత మోగా వైద్య శిబిరం పాలకేంద్రం వద్ద భారత నిర్మాణ సేన ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మోగా కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చింది. 83 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా, 30 మందిని శస్త్రచికిత్స నిమిత్తం ప్రత్యేక బస్సులో తరలించారు. సర్పంచి కళావతి, శ్రీనాధు శ్రీనివాసరావు, హరిచందన, క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంచున పొంచివున్న ప్రమాదం

చీడికాడ మండలంలోని ఖండివరం-మాడుగుల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. కాలువ పక్కన ఉన్న ఈ రహదారి అంచులు కోతకు గురయ్యాయి. ఈ రహదారి పొడువునా.. కాలువ ఉంటుంది. రక్షణ గోడలు లేనిచోట్ల రోడ్డు భారీగా కోతకు గురికావడంతో చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం తప్పదని భయాందోళన చెందుతున్నారు. నియోజకవర్గ కేంద్రానికి ప్రధాన రహదారి కావడంతో నాలుగు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

- న్యూస్‌టుడే, చీడికాడ

రామాలయం నిర్మాణానికి రూ.30 లక్షల విరాళం

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని గుడ్డిప గ్రామంలో రాముల వారి నూతన ఆలయ నిర్మాణానికి ఆ గామంలోని గ్రానైట్ క్వారీ యాజమాన్యం రూ.30లక్షల విరాళం ప్రకటించింది. ఇటీవల ఎమ్మెల్యే కేఎస్‌ఎన్ఎస్ రాజు ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గుడ్డిప రెవెన్యూ పరిధిలో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్న యాజమాన్యం గ్రామాభివృద్ధిలో భాగంగా రామాలయ నిర్మాణానికి రూ.30 విరాళాన్ని ప్రకటించింది. తొలివిడతగా రూ.5 లక్షల చెక్‌ను క్వారీ యజమాని ఆరీఫ్ మంగళవారం సర్పంచి గణేష్, మాజీ సర్పంచులు గల్లా సత్యారావు, అడ్డూరి సత్యారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దుప్పట్ల బాలరాజు తదితరుల సమక్షంలో అందజేశారు.

చెక్ అందజేస్తున్న క్వారీ యజమాని ఆరీఫ్

వృద్ధురాలికి ఆర్థిక సాయం

రావికమతం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో కాళ్లు, నడుముకి గాయపడి మంచానికి పరిమితమైన వృద్ధురాలు చెల్లయ్యమ్మ వైద్యానికి కొత్తకోట స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆ సంస్థ యువకులు మంగళవారం అందజేశారు. గతంలో ఈమెకు ఆపరేషన్ చేయించినా ఫలితం లేకపోవడం, అప్పు చేసి మరో మారు ఆపరేషన్ చేయించే పరిస్థితి లేకపోవడంతో ఆమెకు వైద్యం కోసం ఆర్గనైజేషన్ తరపున సభ్యులు దొండా రమేష్, బొడ్డేటి శేఖర్, ద్వారపూడి పూడి నల్లయ్య తదితరులు అందజేశారు.

LOST PASSPORT
I, **MAKARAPU SRAVANKUMAR**, S/o. Venkatarao, Resident of Door No. 10-81, Gavarapeta, Chowduvada Village, K.Kotapadu Mandal, Anakapalle District 531034. I have lost my Passport bearing **No. L7753531** while I was travelling from my house towards K.Kotapadu by my Motor Cycle. If anybody finds, please return to the above address.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్
స్క్రీన్-1: హే బలవంత్
స్క్రీన్-2: ఆల్ఫా

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పరవాడ, సబ్బవరం, న్యూస్‌టుడే: పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఈ కేంద్రానికి 477మందిని కేటాయించగా 471మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపల్ వినోద్‌బాబు పేర్కొన్నారు. * సబ్బవరంలో ద్వితీయ ఇంటర్ తొలి పరీక్షకు ఆరుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పి.సూర్యశ్రీ, డిపార్టుమెంటల్ అధికారి బి.మురళీధర్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: చీమలాపల్లి గెడ్డలో పూడికలు పేరుకుపోయాయి. –రాజేశ్వరరావు, వెంకటరావు, స్థానికులు ✓: వెంటనే పరిశీలించి సిబ్బందితో పూడిక తీయిస్తాం. –రమణమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడలో కుక్కల బెడద వెంటాడుతోంది. –శ్రీనివాసరావు, పరవాడ ✓: మీప్రాంతంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం. –మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

‘భవిత’కు భరోసా..

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఎన్టీపీసీ చేయూత
ఆటపాటలతో కూడిన డిజిటల్ విద్య

పరవాడ, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత కేంద్రాలు ఎంతో అండగా నిలవడంతో పాటు భరోసా ఇస్తున్నాయి. ముఖ్యంగా బుద్ధి మాంద్యం, వినికిడిలోపం, అభ్యసనలో వెనుకబడడం, దృష్టిలోపం, వైకల్యం తదితర ప్రత్యేక అవసరాల పిల్లలకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చి సాధారణ విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దేందుకు ఈ కేంద్రాలు విశేష సేవలు అందిస్తున్నాయి. వీరికి విద్య, ఫిజియోథెరపీ ఇతర ఆరోగ్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు ఆటపాటలతో కూడిన డిజిటల్ బోధన చేస్తున్నారు. ప్రభుత్వ సర్వ శిక్షా అభియాన్ విభాగం ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ప్రతి కేంద్రంలో ఇద్దరు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్ (ఐఈఆర్పీ)లు, ఒక ఆయా, ఒక ఫిజియోథెరపిస్టును ఉన్నతాధికారులు నియమించారు. వీరు ప్రత్యేక అవసరాల పిల్లలను...సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ఈ తరహా చిన్నారులపై తల్లిదండ్రులు కొంత శ్రద్ధ వహిస్తే వారిలో అనూహ్య మార్పులు చూడవచ్చునని ఆయా కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు.

పరవాడ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న సిబ్బంది

అందుబాటులో సేవలు: ■ ఈ పిల్లలకు ఒక రోజు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ శిబిరం ఏర్పాటు ■ వైకల్యాన్ని బట్టి ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు తదితర యంత్రాల పంపిణీ ■ మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్న వారికి సిబ్బంది వారానికొకసారి ఇంటికెళ్లి బోధన, ఆరోగ్య సేవలు అందిస్తారు. ■ చిన్నారులను కేంద్రాలకు తెచ్చేందుకు ఏడాదికి ఎస్కార్ట్ అలవెన్స్ రూ.6వేలు, రవాణా ఛార్జీలు రూ.6వేలు ఇస్తారు. ■ కేంద్రాలకు రాలేని పిల్లలకు హోమ్‌బేస్డ్ అలవెన్స్ కింద రూ.3వేలు అందిస్తారు. ■ పరవాడ భవిత కేంద్రానికి సొంత గూడు లేకపోవడంతో ఎన్టీపీసీ యాజమాన్యం అన్ని సౌకర్యాలతో కూడిన సొంత భవనం సమకూర్చింది. పిల్లల రక్షణకు భవనం చుట్టూ మరో రూ.10లక్షలతో ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించింది. కావాల్సిన ఫర్నీచర్, ఆట పరికరాలను అందించింది. గత ఏడాది మార్చిలో జిల్లాలోని 24 భవిత కేంద్రాలకు, ఆరు రిసోర్స్‌రూమ్‌లకు రూ.13లక్షలతో ఉపకరణాలు సమకూర్చింది. గత డిసెంబరులో జిల్లాలోని 90 మంది దివ్యాంగులకు రూ.9.25 లక్షలు వెచ్చించి వీల్ ఛైర్లు, వినికిడి పరికరాలు, స్టాండింగ్ ఫ్రేమ్స్, వాకింగ్ స్టిక్స్ అందించి అండగా నిలిచింది.

■ మండలాల వారీగా ప్రత్యేక అవసరాల పిల్లల గణాంకాలు పరిశీలిస్తే.. పెందుర్తిలో 171, పరవాడ-169, సబ్బవరం-171 మంది ఉన్నారు.

■ భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించి సాధారణ విద్యార్థులకు దీటుగా రాణిస్తున్నారు. ఈ కేంద్రంలో సౌకర్యాల కల్పనకు, దివ్యాంగులకు ఎన్టీపీసీ యాజమాన్యం అందిస్తున్న సహకారం మరువలేనిది.
–టి.కుమారి, సహిత విద్య ప్రత్యేక ఉపాధ్యాయిని, పరవాడ భవిత కేంద్రం

ఆర్టీసీతోనే ఎలక్ట్రిక్ బస్సులు నడపాలి

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ బస్సుల (బ్యాటరీ బస్సులు) నిర్వహణ కోసం పినాకిల్ ప్రయివేటు సంస్థకు ఆర్టీసీ స్థలాలను ఇవ్వాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఎన్ఎంయూ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు గేటుమీటింగ్ చేపట్టాక ధర్నా నిర్వహించారు. డిపో కార్యదర్శి జేఎస్ఎన్.రాజు, గ్యారేజీ కార్యదర్శి బి.ఎస్.రాజు, జోనల్ కార్యాలయం బ్యారర్ ఎం.ఎస్.ఎస్.రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సింహాచలం డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ సభ్యులు

నిర్వాహకులకు చెక్కును అందజేస్తున్న రాధాకృష్ణ

ఆలయ నిర్మాణానికి చేయూత

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ శ్రీపైడిమాంబ ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం స్థానిక బీసీకాలనీకి చెందిన పైలా రాధాకృష్ణ దంపతులు రూ.1,00,116 మొత్తాన్ని విరాళంగా అందించారు. ఈమేరకు ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో విరాళానికి చెందిన మొత్తాన్ని చెక్కు రూపంలో మంగళవారం సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు తదితర నాయకులకు అందజేశారు.

తెలుగు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్వహించిన తెలుగు భాష పోటీల్లో చినముషిడివాడలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చేశారని ప్రధానోపాధ్యాయిని చైతన్య తెలిపారు. పద్య భావం, తెలుగు అక్షరాలతో చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు, తెలుగు ప్రసంగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ప్రతిభ చూపిన బాలలతో ప్రధానోపాధ్యాయిని చైతన్య, ఉపాధ్యాయులు

ప్రాంగణ ఎంపికల్లో కొలువులు

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 13 మంది విద్యార్థులు కొలువులు సాధించినట్లు ప్రిన్సిపల్ ఫ్లోరా తెలిపారు. ఈపీఎల్ లెవ్వ, హానర్ ల్యాబ్ సంస్థల హెచ్ఆర్‌లు జి.వెంకటనరేంద్ర, కె.పవన్‌కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. నైపుణ్యాలున్న వారికే ఉద్యోగావకాశాలు లభిస్తాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ థియోఫిలస్, ప్లేస్‌మెంటు అధికారి కమలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్ఆర్ వెంకట నరేంద్ర

అవీ ఇవీ

నేడు 50వేల కిలోల మత్తు పదార్థాల దహనం

పరవాడ,, న్యూస్‌టుడే: విశాఖ రేంజ్ పరిధిలోని వివిధ జిల్లాల్లో పట్టుబడిన సుమారు 50వేల కిలోల గంజాయి తదితర మత్తు పదార్థాలను దహనం (ధ్వంసం) చేసే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని రాంకీ కోస్టల్ వేస్టు మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (సీడబ్ల్యుఎంపీ)లో చేపట్టనున్నట్లు అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటిని ఉన్నతాధికారుల సమక్షంలో అధునాతన శాస్త్రీయ పద్ధతులలో దహనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

భవనాల కేటాయింపునకు విన్నపం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయం, జిల్లా గ్రంథాలయాలకు ప్రభుత్వ భవనాలు కేటాయించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సతీష్‌కుమార్, కార్యదర్శి కుమార్‌రాజు కోరారు. మంగళవారం వారు జిల్లా సంయుక్త కలెక్టర్ విద్యాధరిని కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ సంస్థ దండు బజార్‌లో ఉన్న సొంత స్థలంలో నూతన నిర్మాణం చేపట్టే వరకు ప్రత్యామ్నాయంగా వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ భవనాలు కేటాయించాలన్నారు. గ్రంథాలయ సెస్ కింద జీవీఎంసీ భారీ మొత్తంలో బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆయా నిధులు విడుదలయ్యేలా చూడాలని, గ్రంథాలయాల్లో డిజిటల్ పాఠ్యాలు, హైస్పీడ్ ఇంటర్నెట్, నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షల తాజా పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి జేసీ హామీ ఇచ్చారు.

రేషన్ డిపోల్లో సమయపాలన తప్పనిసరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని రేషన్ డిపో డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచించారు. జేసీ విద్యాధరి ఆదేశాలతో డీఎస్‌వో వి.భాస్కర్‌రావు సూచనల మేరకు సహాయ సరఫరా అధికారులు కల్యాణి, శ్రీహరి తమ పరిధిలోని డీలర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరిచే ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అర్హులైన కార్డుదారులకు మాత్రమే సరకులు పంపిణీ చేయాలన్నారు. గత నెలలో అవకతవకలకు పాల్పడిన 61 మందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, వారిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందన్నారు.

అట్టహాసంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో బండారు ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసస్వామి సారథ్యంలో జరిగిన ఈ వేడుకల్లో 95వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, తదితర నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చక్రస్నానం వేడుకలో పాల్గొన్న భక్తులు

ఘనంగా దుర్గమాంబ తీర్థం

సబ్బవరం న్యూస్‌టుడే: సబ్బవరం గ్రామదేవత శ్రీదుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, పంచకర్ల వెంకటేశ్వరరావు తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అమ్మవారి సన్నిధిలో పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ తదితరులు

పోలమాంబకు జేజేలు

దేశపాత్రునిపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం గ్రామాల్లో మంగళవారం శ్రీపోలమాంబ అమ్మవారి అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఘటాలను ఊరేగించారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సిరులతల్లి సన్నిధిలో సామూహిక పారాయణం

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రి క్షేత్రంలో జరుగుతున్న మహాలక్ష్మి అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు, సామూహిక పారాయణాలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీవారికి, మహాలక్ష్మి అమ్మవారికి విశేష ఆరాధనలు, ధూపదీప సేవలు నిర్వహించారు. శ్రీసూక్త సహితంగా కుంకుమార్చన జరిపారు. భక్తులు జగన్మాత హారతులిచ్చి కొలిచారు. అనంతరం సామూహిక లక్ష్మీ స్తోత్ర పారాయణంలో పాల్గొన్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

కల్యాణం.. కమనీయం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లోని స్వయంభూ లింగాల మల్లికార్జున స్వామి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దేవతామూర్తులను సేవించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పరవాడ పైడిమాంబ జాతర

పూజలందుకున్న అమ్మవారు

దర్శనానికి బారులు తీరిన భక్తులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శ్రీపైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ పైల వెంకటలక్ష్మి, నాయకులు సిరిపురపు అప్పలనాయుడు, పైలా శ్రీనివాసరావు, మజ్జి రామునాయుడు, పైలా అప్పారావు(పెదబాబు), పైలా సన్యాసిరావు, కాండ్రేగుల సోమునాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలు యువజన సంఘాల సహకారంతో ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి గరగతో బోనాలను ఊరేగించాక అనుపోత్సవం చేపట్టారు. రాత్రి 7 భారీ వేదికలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోస్తు నిర్వహించారు.

వేడుకగా త్రిపురాంతక స్వామి గ్రామ తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయంలో జరుగుతున్న ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామ తిరువీధి వేడుకగా జరిగింది. ఉదయం అర్చకులు, వేదపండితులు వాస్తు పూజ, హోమం నిర్వహించారు. ధ్వజస్తంభం నమూనాకు జలాధివాసం, జలాధివాసాంగ హోమం నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల గ్రామ తిరువీధి నిర్వహించారు. భక్తులు వేడుకలను తిలకించారు.

చెత్త నుంచి సంపద సృష్టికి ప్రత్యేక కార్యాచరణ

గ్రీనింగ్ ఇండస్ట్రియల్, బిల్డింగ్స్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలెస్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు-సీఐఐ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ‘సర్క్యులర్ ఎకానమీ అండ్ గ్రీన్ కంపెనీస్’ అంశంపై మంగళవారం కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో పేర్కొన్న 10 కీలక సూత్రాల్లో స్వచ్ఛాంధ్ర కీలకమైందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రీ సైక్లింగ్ పరిశ్రమలకు ముడి పదార్థాల కొరత రాకుండా త్వరలో ప్రత్యేక రియల్ టైమ్ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ రీసైక్లింగ్ విధానాలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సువర్ణావకాశంగా మారుతుందన్నారు. తద్వారా యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పెరుగుతున్న పర్యావరణ సవాళ్లను సర్క్యులర్ ఎకానమీ సాయంతో సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం విశాఖలో సముద్ర మట్టం సుమారు 98 సెంటీమీటర్లు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. గాలి నాణ్యత కూడా ఆందోళనకరంగా మారుతోందన్నారు. నగరంలో పేరుకుపోతున్న భవన నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయడం సవాల్‌గా మారిందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐఐ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (బిజినెస్ సెంటర్) ముత్తు సెజియన్, ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, పరిశ్రమలశాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎన్.యువరాజ్, సీఐఐ విజయవాడ చాప్టర్ పూర్వ ఛైర్మన్ వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరదేశిమాంబ పండగ

తానాంలో బోనాల ఊరేగింపు

తానాం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం గ్రామంలో మంగళవారం శ్రీపరదేశిమాంబ పండగ కనులపండువగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, సర్పంచి కన్నూరు దేవి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, స్థానిక నాయకులు పైలా జగన్నాథరావు, పైలా సన్యాసిరాజు, కన్నూరు వెంకటరమణ, రొంగలి గోపాలకృష్ణ, వర్రి పరదేశినాయుడు, చీపురుపల్లి శ్రీను తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఘటాలతో పాటు బోనాల ఊరేగింపు చేపట్టాక అనుపోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తవ్వవానిపాలెంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం తవ్వవానిపాలెం గ్రామదేవత పరదేశిమాంబ పండగను స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ తదితర పోటీలను, గుర్రాల పరుగు పందాలను కూటమి నేతలు పంచకర్ల వెంకటేశ్వరరావు, చొక్కాకుల వెంకట్రావు ప్రారంభించారు. విజేతలకు బోకం శ్రీను బహుమతులు అందజేశారు. సాయంత్రం బాణసంచా కాల్పుల పోటీలు, అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎడ్ల బండ్ల పరుగు పందాలను, గుర్రపు బండ్ల పరుగు పోటీలను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పోటీలను ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు

పెందుర్తి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు వద్దు - ఆరోగ్యం, జీవితమే ముద్దు అన్న నినాదంతో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. పెందుర్తి రైతుబజార్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ కె.వి. సతీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలు, వ్యాపారులనుద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత ఆరోగ్యవంతమైన జీవితం గడపాలన్నారు. మత్తు పదార్థాల గురించి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ గోపాలపట్నం జోన్ కార్యదర్శి ప్రభుదేవా, సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

30.51 చ.కి.మీ విస్తీర్ణంలో కంబాలకొండ ‘ఈఎస్‌జెడ్’

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కంబాలకొండ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై కీలక భాగస్వాముల సంప్రదింపుల సమావేశం మంగళవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధ్యక్షత వహించారు. లియా అసోసియేట్స్ సౌత్ ఏసియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన కన్సల్టెంట్లు పర్యావరణ, అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ జారీ చేసిన ఈఎస్‌జెడ్ మాస్టర్ ప్లాన్‌ను సమర్పించి అభిప్రాయాలను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్‌జెడ్ నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 30.51 చదరపు కి.మీ. విస్తీర్ణానికి జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారిణి వి.శిల్ప, వి.ఎం.ఆర్.డి.ఎ. ఎస్టేట్ అధికారి దయానిధి, డీఎఫ్‌సీ శిరీష, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తేజ్ భరత్

‘సారథి’పై కమిషనర్ సమీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అమలు చేస్తున్న ‘సారథి’ ప్రాజెక్టుపై కమిషనర్ కేతన్‌గార్గ్ సమీక్ష నిర్వహించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరంలోని 90 కూడళ్లలో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టంను అమల్లోకి తీసురానున్న నేపథ్యంలో ప్రాజెక్టు టెండర్లపై కమిషనర్ ఆరా తీశారు. ముగ్గురు ఔత్సాహికులు టెండర్లు దాఖలు చేసి, ప్రాథమికంగా అర్హత సాధించారని కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు వివరించారు. టెండర్లలో పాల్గొన్న వారికి మూడు కూడళ్ల బాధ్యతలు అప్పగించి, నిర్వహణ తీరును పరిశీలిస్తామని పేర్కొన్నారు. సమీక్షలో అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, స్మార్ట్ సిటీ అధికారి కేవీఎన్.రవి, ప్రధాన ఇంజినీర్ పీవీవీ. సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో కలిసి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ కేతన్‌గార్గ్

26 నుంచి జనసేన సభ్యత్వాలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జనసేన ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు జనసేన గాజువాక ఇన్‌ఛార్జి, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు అన్నారు. మంగళవారం గాజువాక భాగ్యలక్ష్మి ఫంక్షన్ హాల్లో జనసేన సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ్యత్వ గోడపత్రికను ఆవిష్కరించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

కొమ్మాది, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శాప్ లీగ్స్ పేరిట మారికవలస ఏపీ గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల వద్ద మంగళవారం చేపట్టిన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ ఎల్. శివప్రసాద్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అండర్-18 విభాగంలో బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వి.దేవన్‌దీక్షిత్, కె.మౌర్య, షేక్ మెహబూబ్‌భాషా నిలిచారు. బాలికల విభాగంలో పి.తనూజ, ఇమంది పూజిత, డి.రమ్య తొలి మూడు స్థానాల్లో రాణించారు. వీరు ఈ నెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జూన్ గాల్లోయట్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ శివప్రసాద్



(c) eenadu

ఈనాడు అనంతపురం

బుధవారం ఫిబ్రవరి 25, 2026

అభివృద్ధి బాట పట్టిస్తాం..!

ఈనాడు, అనంతపురం: మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి, అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్ అధ్యక్షతన మంగళవారం అనంతపురం జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీశ్‌తోపాటు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం జిల్లా తెదేపా అధ్యక్షుడు పూలనాగరాజు, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. రానున్నరోజుల్లో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

రానున్న 5 రోజుల్లో పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వచ్చే ఐదు రోజులూ పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 35.3 నుంచి 37.0 డిగ్రీలు గాను, రాత్రి 23.0 నుంచి 24.0 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 5 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 62 శాతం, మధ్యాహ్నం పూట 35 శాతం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

చెన్నకేశవుడి బ్రహ్మోత్సవం

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అంకురార్పణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామ వీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు.

ఏమీ మారలేదు!

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:

యావత్తు ప్రపంచమే అత్యంత వేగంగా పుంజుకున్న ఇంటర్నెట్ వ్యవస్థపై ఆధారపడిన ఆధునిక యుగంలో జిల్లా వెబ్‌సైట్ ఎంత దయనీయంగా ఉందో తేటతెల్లం చేస్తోంది. ప్రతి అంశాన్ని తెలుసుకోడానికి గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను చూస్తే అంతే సంగతి. అనంత కలెక్టరేట్ ఆవరణలోనే జాతీయ సాంకేతిక సమాచార కేంద్రం (ఎన్ఐసీ) ఉంది. ఇక్కడి నుంచే నిర్దేశిత వివరాలు, సమాచారం ఎప్పటికప్పుడు నవీకరించాల్సి ఉంది. ఇందుకు ప్రత్యేక అధికార యంత్రాంగం ఉన్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

మచ్చుకు కొన్ని.. ✦ జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ గతేడాది సెప్టెంబరు 13న, ప్రస్తుత జేసీ విష్ణుచరణ్ ఈ ఏడాది జనవరి 21న పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పాలనలో కీలక అధికారులు వీరిద్దరే. ఈ అధికారిక వెబ్‌సైట్‌లో కలెక్టర్, జేసీ ఫొటోలు, కార్యక్రమ వివరాల చిత్రమాలిక.. వంటివి లేవు. పాత కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చెందిన ఫొటోలు, వీడియోలే ఉన్నాయి. మొన్ననే జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వివరాలేవీ లేవు. ✦ 2022 ఏప్రిల్‌లో జిల్లా విభజన జరిగింది. విభజన సమాచారం, ఆ తర్వాత మ్యాప్, ఇతరత్రా వివరాలు అరకొరగానే ఉన్నాయి. విభజన తర్వాత జిల్లాలో 32 మండలాలు ఉంటే.. 31 అని చూపించారు. వివరాల్లో మాత్రం 63 మండలాల పేర్లు నమోదు చేశారు. ✦ సంక్షిప్త వివరాల్లో గ్రామాలు 503 అని చూపించారు. వివరాల్లో మాత్రం 577 గ్రామాలు ఉన్నట్లు జాబితాను ఇచ్చారు.

పాతవే : జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://ananthapuramu.ap.gov.in ఏ మాత్రం నవీకరించడం లేదు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి, శాఖల వివరాలు.. ఇలా అన్నీ పాతవే..

గందరగోళం : ఉమ్మడి జిల్లా వివరాలిలా.. విభజన జిల్లా సమాచారామా? అన్నది ఏ మాత్రం అర్థం కాని దుస్థితి.

అశ్రద్ధ: జిల్లా అధికార యంత్రాంగం ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు.

ఐస్ అయిపోవద్దు!

కలుషిత నీటితో తయారుచేస్తున్న అక్రమార్కులు

ఈనాడు, అనంతపురం: వేసవి సమీపిస్తోంది. ప్రస్తుతం ఎండవేడిమి ప్రభావం కనిపిస్తోంది. పండ్ల రసాలు, నన్నారీ వంటి పానీయాలు సేవిస్తుంటారు. జ్యూస్ షాపులు, రోడ్డు పక్కన తోపుడు బండ్లలో చల్లదనం కోసం పానీయాల్లో వినియోగిస్తున్న ఐస్ ఎక్కడ తయారవుతోంది? అందులో వాడే నీరు మంచిదేనా అనే పర్యవేక్షణ కొరవడింది. ఉమ్మడి జిల్లాలో 120 వరకు ఐస్ తయారీ యూనిట్లు ఉన్నాయి. ఏ ఒక్కదాంట్లోనూ నిబంధనలు పాటించడం లేదు. 90 శాతం మేర అనుమతులే లేవు. తుప్పు పట్టిన బాక్సుల్లో బోరు నీటిని నింపి ఐస్ తయారు చేస్తున్నారు. స్టోరేజీ కోసం వినియోగించాల్సిన ఐస్‌ను రెండు జిల్లాల్లోని జ్యూస్ షాపులకు సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

అనంత నగరంలో ఐస్ తయారుచేస్తున్న పెద్ద ఫ్యాక్టరీలు మూడు ఉన్నాయి. ఇళ్లల్లో తయారుచేస్తున్న వారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. వాటిలో ఏ ఒక్కదానికీ అనుమతులు లేవు. ఆహార భద్రత అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయాల్లో చేపలు, రొయ్యల స్టోరేజీకి మాత్రమే ఐస్ వినియోగిస్తున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు. నగరంలో జ్యూస్ దుకాణాలకు ఇక్కడి నుంచే ఐస్ సరఫరా చేస్తున్నారు.

కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో స్థానిక బ్రాండ్ పేరుతో నిర్వహిస్తున్న ఐస్‌క్రీం తయారీ యూనిట్లలో నిబంధనలు పాటించడం లేదు. ఐస్‌క్రీం తయారీకి కలుషిత నీటినే వినియోగిస్తున్నట్లు క్షేత్రస్థాయిలో పరిశీలనలో తేలింది.

ఏం చేయాలి.. ఎలా చేస్తున్నారు?

❖ శుద్ధజలంతోనే ఐస్ తయారుచేయాలి. మలినాలను తొలగించడానికి రివర్స్ ఆస్మాసిస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. నీటి నాణ్యతను తరచూ పరీక్షించాల్సి ఉంటుంది. ❖ బాక్సులను ప్రతిసారీ శుభ్రం చేయడంతో పాటు శానిటేషన్ చేయాలి. కార్మికుల చేతులకు గ్లౌజులు తప్పనిసరి.

❖ అనంత నగరంతో పాటు, హిందూపురంలోని ఐస్ ఫ్యాక్టరీల నిర్వాహకులు ఇవేమి పాటించడం లేదు.

బోరు నీటితోనే..

ఐస్ తయారు చేసే వ్యాపారులు క్వింటాలు రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. బోరు నీటిని శుద్ధి చేయకుండానే వినియోగిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండటంతో యజమాన నిర్వాహకులు ఒక్కొక్కరు నిత్యం 20 నుంచి 30 కిలోలు కొనుగోలు చేస్తున్నారు. చాలా సందర్భాల్లో ఐస్‌లో చెత్త, ఇసుక ముక్కలు వస్తున్నాయని జ్యూస్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు.

పిల్లలపై తీవ్ర ప్రభావం

కలుషిత నీటితో తయారుచేసిన ఐస్‌లోని సూక్ష్మజీవుల వల్ల అతిసారం, టైఫాయిడ్, కలరా, పచ్చ కామెర్లు, గ్యాస్ట్రిక్ సమస్యలు, గొంతు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. ఐస్ తయారీకి వినియోగించే నీటిలో ఫ్లోరైడ్ ఉంటే ఫ్లోరోసిస్, నైట్రేట్ వల్ల చిన్న పిల్లల్లో బ్లూబేబి సిండ్రోమ్‌కు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

❖ గోనె సంచుల్లో వరిపొట్టును నింపేసి ఐస్‌ను తరలిస్తున్నారు.

ముళ్లకంపల్లో.. పసిప్రాణం

అమ్మ పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు.. ముళ్ల కంపల్లో కనిపించింది. ఏ పరిస్థితుల్లో కుటుంబీకులెవరైనా తల్లి నుంచి ఎత్తుకొచ్చి పడేశారో, లోకానికి భయపడి అమ్మే వదిలేసిందో తెలియదు.. గుక్కపట్టి ఏడుస్తున్న అరుపులు విని గ్రామస్థులు దగ్గరికెళ్లి చూశారు. చిన్నారిని సంచిలో పెట్టి పడేసిన స్థితిలో హృదయవిదారకంగా కనిపించింది. ఆ దృశ్యం చూసి చలించిన గ్రామస్థులు మానవత్వం చూపారు. ఆరోగ్య కార్యకర్త చెన్నమ్మకు విషయం తెలిపి సిబ్బందిని రప్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ ఘటన బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. చిన్నారి నేమకల్లు గ్రామానికి చెందిందా? లేక ఎవరైనా వచ్చి ఇక్కడ పడేసి వెళ్లారా? అనే విషయంపై విచారిస్తున్నట్లు వైద్యాధికారి కార్తీక్ శ్రీలక్ష్మి తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

నిలువెత్తు ప్రమాద ఘంటిక

మూడంతస్తుల మేడ.. అందంగా కట్టుకున్న ఇల్లు. 33 కేవీ విద్యుత్తు లైను వెళ్లే స్తంభం తాకుతున్నా అలానే కట్టుకోవడం ప్రమాదాన్ని తలపిస్తోంది. మూడో అంతస్తులో ఉండేవాళ్లకు ఆ విద్యుత్తు తీగలు అతి సమీపంలో ఉంటాయి. జరగరానిది ఏమైనా జరగక ముందే స్తంభాన్ని వేరొక చోటికి తరలించాల్సి ఉంది. - ఈనాడు, అనంతపురం

అధ్వాన సేవలు.. అందులోనూ ఆఖరు!

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు అందుతున్న సేవలపై ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో సేవలు అధ్వానంగా ఉన్నాయని తేలిపోయింది. అనంతపురం జిల్లా 25, శ్రీసత్యసాయి జిల్లా 24 ర్యాంకుల్లో ఉండటంపై ఉద్యోగుల సేవలు చాలా దయనీయ స్థితిలో ఉన్నాయని అర్థం అవుతోంది.

వినియోగదారులను అడిగిన ప్రశ్నలు

అనంతపురం జిల్లాలో (శాతంలో)	అవును	లేదు
1. మీకు నిరంతరాయ సరఫరా జరుగుతుందా?	74.8	25.2
2. మీ ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందుతుందా?	72.5	27.5
3. సిబ్బంది అందుబాటులో ఉన్నారా?	69	31

సర్వే ఎప్పుడు చేశారు?: గత ఏడాది జూన్ 24 నుంచి మే 25, జూన్ 25 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 26 వరకు.

కారణాలివే: ఎస్పీడీసీఎల్ పరిధిలో కొన్ని డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు స్థానికంగా ఉండకపోవటం, పర్యవేక్షణ గాలికి వదిలేసి చుట్టపుచూపుగా కార్యాలయాలకు వస్తున్నారు. ఏఈల కొరత ఉండటంతో కార్యాలయాల్లో పని చేయాల్సిన జేఈలకు క్షేత్రస్థాయిలో రెండు సెక్షన్లు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించటంతో వారు రెండు చోట్ల పనిచేయలేకపోతున్నారు. కొంతమంది అధికారులు పర్యవేక్షణ మరచిపోవడంతో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు ఆడింది ఆట పాడింది పాటగా వ్యవహారం సాగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

వెనుకబడిన సెక్షన్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అమరాపురం, కంబదూరు, గోరంట్ల, సి.కె.పల్లి, కళ్యాణదుర్గం రూరల్, శెట్టూరు, కుందుర్పి, అనంతపురం డీ-5, బుక్కరాయసముద్రం, గుడిబండ, ముదిగుబ్బ, పుట్టపర్తి రూరల్, ఆత్మకూరు ఉన్నాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
అనంతపురం	6.28	5.22
గుంతకల్లు	6.32	5.18
తాడిపత్రి	6.29	5.15

సజావుగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రెండో రోజు సజావుగా జరిగాయి. మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 20,919 మందికి 20,588 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,900 మందికి 1,872 మంది పరీక్ష రాశారు. పరీక్షల నిర్వహణ కన్వీనర్ వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, డీవీఈవో గురవయ్యశెట్టి 6 కేంద్రాలు, కమిటీ సభ్యులు 4 కేంద్రాలు.. సిట్టింగ్‌స్క్వాడ్ 8, ఫ్లయింగ్‌స్క్వాడ్ 10 కేంద్రాలు తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

పత్రమేదని భూములడుగుతున్నాయ్!

తహసీల్దార్ కార్యాలయంలో వేలాడుతున్న సీసీకెమెరా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ప్రాంతీయ తహసీల్దారు కార్యాలయంలో వివాదాల్లో ఉన్న విలువైన భూములకు సంబంధించిన పత్రాలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. బుక్కరాయసముద్రం మండలం అనంతపురం జిల్లా కేంద్రానికి పక్కనే ఉంటుంది. దీంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. పేదలకు ఇచ్చిన రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూముల రికార్డులను రెవెన్యూ అధికారులు మాయం చేసి ఇతరుల పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా పత్రాలు కోరినపుడు రికార్డులు లేవన్న విషయం వెలుగులోకి వచ్చింది. కార్యాలయంలో కొన్ని చోట్ల సీసీ కెమెరాలు తొలగించడం, ఉన్నవి పని చేయకపోవడం గమనార్హం.

✦ గోవిందపల్లి రెవెన్యూ గ్రామంలో 83-2 సర్వే నంబరులో ఉన్న 5 ఎకరాల భూమి రికార్డులు కార్యాలయంలో అందుబాటులో లేవు. రిటైర్డ్ మిలటరీ ఉద్యోగికి అసైన్‌మెంట్ చేసిన ఈ భూమిని ఓ వైకాపా నాయకుడు బంధువుల పేరుతో మార్చుకున్నాడు.

✦ జంతులూరు రెవెన్యూ గ్రామంలో సర్వేనంబరు 276-4లో 276-1లో 5 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన ముఖ్యమైన పత్రాలు అందుబాటులో లేవు. వీఆర్వో రికార్డులు మాయం చేసి ఈ భూమిని తన భార్య పేరుతో ఆన్‌లైన్ చేసుకున్నాడని గ్రామస్థుల ఆరోపణ.

✦ రోటరీపురంలో సర్వే నంబరు 19-బి1లో 4 ఎకరాలకు సంబంధించిన భూమి దళితులకు కేటాయించారు. ఈ భూమికి సంబంధించిన అసైన్‌మెంట్ పత్రాలు కార్యాలయంలో లేవు.

✦ చెదుళ్లలో సర్వే నంబరు 161-14లో 2.26 ఎకరాలకు సంబంధించిన రికార్డులు మాయం చేసిన రెవెన్యూ అధికారులు ఈ భూమిని అనంతపురానికి చెందిన ఒక వ్యాపారి పేరుతో ఆన్‌లైన్ నమోదు చేశారు.

➤ ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని కార్యాలయంలో రికార్డుల మాయంపై విచారణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఆర్డీవో కేశవనాయుడు, డిప్యూటీ తహసీల్దారు నాగరాజు చరవాణిలో వివరణ కోరడానికి యత్నించగా అందుబాటులోకి రాలేదు.

మహిళకు సెల్‌తో ఐరిస్ తీస్తున్న ఏజెన్సీ సిబ్బంది

గ్యాస్ అక్రమ కనెక్షన్లకు కళ్లెం

అడ్డుకట్టకు ఈ-కేవైసీ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అక్రమ గ్యాస్ కనెక్షన్లు కూటమి ప్రభుత్వం పూర్తిగా అడ్డుకట్ట వేసి, అర్హులకు గ్యాస్ కనెక్షన్లు అందించాలనే ఉద్దేశంతో దీపం-2 పథకాన్ని అమలులోకి తీసుకొచ్చారు. దీనికి అనుగుణంగా ఈ-కేవైసీ పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

✦ ఒక్కో ఆయిల్ కంపెనీ ఒక్కో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి సంవత్సరం గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. వినియోగదారుడి ఐరిస్, వేలిముద్ర ఏదో ఒకటి తీసుకుంటున్నారు. గ్యాస్ వినియోగదారుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తున్నారు. ఇంటి వద్దకు వచ్చే ఆటోవాల ద్వారా కానీ, నేరుగా ఏజెన్సీ వద్ద కానీ వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవడం వినియోగదారుల కర్తవ్యం.

✦ మృతులు, వలసలు పోయిన వారి పేరు మీద ఇప్పటికీ చనిపోయిన వాళ్ల పేర్ల మీదుగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్నారు. వాటికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో అసలైన లబ్ధిదారునికి గుర్తించేందుకే ఈ-కేవైసీ తీసుకొచ్చారు. ✦ మృతులు వందల సంఖ్యలో ఉన్నారని, వారి లెక్కలను ఆయిల్ కంపెనీలు నేరుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖకు అందజేస్తారని ఓ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు పేర్కొనడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో...

- ✦ ఏజెన్సీలు : 87
- ✦ దీపం పథకం కనెక్షన్లు : 4,93,336
- ✦ ఇతరులు : 6,47,059
- ✦ సీఎస్ఆర్ : 84,239
- ✦ ఉజ్వల : 16,984

✦ జిల్లాలో మూడు ప్రధాన కంపెనీలున్నాయి. ఒక్కో కంపెనీకి ఒక్కో యాప్‌ను ఆయిల్ కంపెనీలు అందుబాటులోకి తెచ్చారు. యాప్ ఓపెన్ కాగానే గ్యాస్ నంబరు నమోదు చేస్తే చాలు వినియోగదారుని వివరాలు కనిపిస్తాయి. ఐరిస్ కాని వేలిముద్ర వేయగానే సక్సెస్ అని వస్తోంది.

✦ గ్యాస్ పుస్తకం, ఆధార్ కార్డు, లింక్ అయిన మొబైల్ నంబరు తప్పనిసరి తీసుకెళ్లాలి. ఒకవేళ ఆన్‌లైన్‌లో కాకపోతే గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లి వేలిముద్ర కూడా వేయవచ్చు.

లేకుంటే రద్దు: వెంకటేశ్వర్లు

- జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోకపోతే కనెక్షన్ రద్దవుతోంది. అక్రమంగా పొందుతున్న గ్యాస్ సిలిండర్, రాయితీకి పూర్తి అడ్డుకట్ట వేయాలన్నదే ప్రధాన ఉద్దేశం.

సౌర సూత్రం.. ఆదా మంత్రం

నందలపాడు వద్ద సౌర ప్లాంట్ కోసం భూమిని చదును చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాడిపత్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పురపాలికలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యుత్తు బిల్లులు తగ్గించాలని కంకణం కట్టుకున్నారు మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి. పురపాలికకు సొంతంగా సోలార్ ప్లాంటు ఉంటే ప్రతి నెలా లక్షల్లో ఆదాయం మిగులుతుందని ఆలోచించి రూ.6 కోట్లతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు.

విద్యుత్తు ఛార్జీల చెల్లింపులు ఇలా..

● **రూ.35 లక్షలు:** మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలు, పంప్‌హౌస్, ఇతరత్రా.. ప్రతి నెలా చెల్లిస్తోన్న బిల్లులు

● **రూ.3 కోట్లు:** విద్యుత్తు వగైరా ప్రతి ఏటా రూ.3 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది.

● **6 ఎకరాలు :** నందలపాడులోని పెన్నానది తీరాన 6 ఎకరాల్లో ప్లాంటును ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. 1.5 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు రూ.6కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 0.5 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్‌ను నిర్మాణం చేపట్టారు. తరువాత దశల్లో వాటిని కూడా నిర్మించి పురపాలికకు పూర్తిగా విద్యుత్తుఛార్జీల భారం నుంచి విముక్తి కలగనుంది.

పలు సౌకర్యాల కల్పన..

విద్యుత్తు ఛార్జీలు ఆదా అయితే ప్రతి నెలా రూ.30 లక్షలకు పైగానే మిగులుతుంది. ప్రతి ఏటా పుర ప్రజలకు ఏదో ఒక సౌకర్యం కల్పించవచ్చు. ప్రభుత్వం అందించే గ్రాంట్లు వచ్చేవరకు చూడకుండా మన సమస్యలు మనమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నాం. త్వరలోనే తాడిపత్రిని జాతీయ స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

- జేసీ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్, తాడిపత్రి

మెరుగులద్దుకున్న మహా మండపం శిలలు

జూన్‌లో నెట్టికంటి ఆలయ పునర్నిర్మాణం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గుంతకల్లు మండలం, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థాన ముఖ చిత్రం మారనుంది. దేవస్థానం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా గర్భాలయం, విమాన గోపురం, శిఖరం, అర్ధమండపం, మహా మండపం రాతితో నిర్మాణం పనులు కొన్ని రోజుల్లో ప్రారంభమవుతున్నాయి. రాయచూర్‌కు చెందిన దాత రాజేంద్రరెడ్డి రూ.5 కోట్లు, హైదరాబాద్‌కు చెందిన దాత చల్లా అంజనప్రసాద్ రూ.4 కోట్లను బ్యాంకులో డిపాజిట్ చేయడంతో పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు.

స్తంభాల పనులు

తమిళనాడు చెందిన 40 మంది శిల్పులు గ్రానైట్ కృష్ణ శిలలకు స్తంభవర్గ పనులు చేస్తున్నారు. గర్భాలయం ఉపపీఠం, అధిష్ఠానంలో జగతి, కుముదకం, పట్టిక నమూనాల పూర్తియ్యాయి. విమానం గోపురంలో కర్ణప్రసాదంలో వేదిక, స్తంభవర్గం, ప్రస్తరం, కంఠం, శిఖరం నమూనాల జరుగుతున్నాయి. మహామండపం చెందిన శిలలకు డిజైన్లు చేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా 50 శాతం పూర్తికానుంది.

రూ.30 కోట్ల అంచనాతో అభివృద్ధి

దాతలు, భక్తులు ఇచ్చిన విరాళాలతో దేవస్థానం పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టాం. రూ.30 కోట్ల అంచనాతో అభివృద్ధి జరుగుతుంది. మే నెల ఆఖరి కల్లా ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేసి జూన్‌లో నూతన దేవాలయం ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

107 వసతి గదులు

✦ భక్తుల దాతృత్వంతో 107 వసతి గదుల నిర్మాణాలకు రూ.16 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ప్లాన్, ఎస్టిమేషన్ వేసి కమిషనర్ అనుమతి కోసం ప్రతిపాదనలు తయారీ చేసి పంపుతున్నారు.

✦ బెంగళూరు చెందిన భక్తుడు రూ.78 లక్షలతో దేవస్థానం ఈశాన్య భాగంలో నూతన కోనేటి నిర్మాణానికి ముందుకు వచ్చారు. దేవస్థానం నిధులతో లడ్డు, పులహోర ప్రసాదాల తయారీ, విక్రయ కౌంటర్లు, టికెట్ బుకింగ్ కౌంటరు నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.

(c) eenadu

ఇద్దరికి ఉప కలెక్టర్లుగా కొలువులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో తహసీల్దార్లుగా పని చేస్తున్న ఇద్దరికి పదోన్నతి కల్పించి ఉప కలెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 50 మంది ఉప కలెక్టర్లకు పోస్టింగ్ కల్పించగా.. ఇందులో అనంత జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లు ఉన్నారు. మూడు మాసాల క్రితమే ఉప కలెక్టర్లుగా పదోన్నతి కల్పించినా పోస్టింగ్ ఇవ్వలేదు. తాజాగా ఉరవకొండ తహసీల్దారు మహబూబ్‌బాషాను సీసీఎల్ఏలో సహాయ కార్యదర్శిగా, రాయదుర్గం తహసీల్దారు జి.నాగరాజును వైఎస్సార్ కడప జిల్లా కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీగా నియమించారు.

మాజీ సైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో ఖాళీగా ఉన్న పాయింట్స్‌మెన్ పోస్టుల భర్తీ కోసం మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎండీ రజాక్ తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసే 16 పోస్టులకు కనీస విద్యార్హత పదో తరగతి లేదా ఐటీఐ ఉత్తీర్ణులై ఏ2 మెడికల్ ఫిట్‌నెస్ ఉండాలని ఆయన వివరించారు. వయస్సు 55 ఏళ్లలోపు ఉండాలన్నారు. రైల్వేబోర్డు ఆదేశాల మేరకు రెగ్యులర్ అభ్యర్థులు చేరే వరకు మాత్రమే వీరిని కొనసాగిస్తారు. ఎంపికైన వారికి నెలకు జీతం రూ. 18వేలతో పాటు ఇతర భత్యాలు చెల్లిస్తారు. దరఖాస్తులు జిల్లా సైనిక సంక్షేమ బోర్డు ధ్రువీకరణతో వచ్చే నెల 6లోగా గుంతకల్లు రైల్వే డివిజన్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

అమ్మాయిలు.. క్రికెట్‌లో ఆదిశక్తులే

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: క్రికెట్ ఆటలో మెరికల్ని గుర్తించాలంటే లీగ్ పోటీలు కీలకం. ఆంధ్ర క్రికెట్ సంఘం ఇదే ప్రయోగం చేయడానికి సిద్ధమైంది. జిల్లాల్లో లీగ్ పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చాటిన వారిని గుర్తించడానికి సన్నద్ధమైంది. చిరుప్రాయంలోనే ప్రతిభావంతుల్ని గుర్తించి సానబెడితే భవిష్యత్తులో దేశానికి కలికితురాళ్లుగా తయారవుతారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల అండర్-15 విభాగంలో లీగ్ పోటీలు నిర్వహించారు. అందులో ఇద్దరు బాలికలు అద్వితీయమైన ఆటతీరుతో ఆకట్టుకున్నారు. బంతితో వికెట్లు, బ్యాటుతో పరుగుల వరద పారించారు.

పేరు: ఈ.పూర్ణచంద్రిక
తరగతి: తొమ్మిది
బ్యాటింగ్ శైలి: కుడిచేతి వాటం బ్యాటింగ్, వికెట్ కీపింగ్
సాధన: రోజు 3 గంటలు
పరుగులు: రెండు లీగ్ పోటీల్లో 172 పరుగులు
అత్యధికం: 136* పరుగులు, రాప్తాడు ఏఎస్‌వీ జట్టుపై
ప్రాతినిధ్యం: ఆంధ్ర అండర్-16 జోన్ జట్టుకు
లక్ష్యం: భారత సీనియర్ మహిళా జట్టులో చోటు

పేరు: ఎ.మాన్విత
తరగతి: తొమ్మిది
బౌలింగ్ శైలి: ఎడమ చేతి వాటం స్పిన్నర్, కుడి చేతి వాటం బ్యాటరు
సాధన: అనంతపురం స్పోర్ట్స్‌అకాడమీలో.
వికెట్లు: రెండు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు
ఉత్తమ ప్రతిభ: ఒకే మ్యాచ్‌లో ఆరు వికెట్లు
ప్రాతినిధ్యం: అండర్-15 విభాగం ఆంధ్ర బి జట్టుకు, రెండేళ్ల నుంచి జోన్ పోటీలకు ఎంపిక
భవిష్యత్తు లక్ష్యం: మహిళా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో ఆడాలని..

వైభవం... పీఠాధిపతి అడ్డపల్లకీ ఉత్సవం

ఐరావత వాహనంపై ఊరేగుతున్న చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ, న్యూస్‌టుడే: గవి గజలక్ష్మి ముందు నడువగా.. మంగళ వాద్యాలు... భారీ భక్త జనం మధ్య ఉరవకొండ కరిబసవస్వామి గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామి అడ్డపల్లకీ ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది. చంద్ర మౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పీఠాధిపతిని అడ్డపల్లిలో కూర్చోబెట్టి వడ్డెర్లు పల్లకీని మోశారు. ప్రత్యేక వేషధారణలు, కళాకారుల నృత్యాలు పల్లకీ ఉత్సవంలో ప్రత్యేకంగా నిలిచాయి. దారి పొడవునా జనం పీఠాధిపతిని దర్శించుకుంటూ ప్రసాదం స్వీకరించారు. ఐరావతంపై చంద్రమౌళీశ్వరస్వామి ఊరేగింపు వేడుక ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోనిచౌకి మఠం కళ్యాణ స్వామి, ఆలయ సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, ఈవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అడ్డపల్లకీలో ఊరేగుతున్న పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి

విభిన్న ప్రతిభావంతులకు మౌఖిక పరీక్ష

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే : బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జేసీ విష్ణు చరణ్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లోని విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల పెట్రోల్ వాహనం అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించారు. 132 మంది దరఖాస్తు చేసుకున్నారు. మౌఖిక పరీక్షకు హాజరైన వారిని వైద్యుల బృంద సభ్యులు పలు అంశాలపై నిశితంగా పరిశీలించారు. ఎంపికైన వారికి ఉచితంగా వాహనాలను అందజేయనున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే : జేఎన్‌టీయూ పరిధిలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. ఎంబీఏ ఒకటి, రెండు సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు, ఎంసీఏ ఒకటి, రెండు సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి.. వీసీ, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పరీక్షల విభాగం అధికారులు నాగప్రసాద్‌నాయుడు, శివకుమార్, శారద, అంకారావు, శ్రీధర్ కార్యాచరణ పూర్తి చేశారు.

పీజీ ప్రవేశాల పెంపునకు కృషి చేయండి



ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, జేవీవీ నాయకులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ ప్రవేశాలు పెరగడానికి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విజ్ఞప్తి చేశారు. ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనితకి మంగళవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యార్థులతో విశ్వవిద్యాలయం కళకళ లాడుతూ ఉండేదన్నారు. ఇటీవల ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. 1100 సీట్లు ఉండగా కేవలం 300 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయన్నారు. జేవీవీ నాయకులు భాస్కర్, చిత్తప్ప, వీరరావు, మహమ్మద్‌జిలాన్, తిరుపాలు, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

సత్వరమే సెనగల కొనుగోలుకు చర్యలు : జేసీ

అధికారులతో సమీక్షిస్తున్న జేసీ విష్ణు చరణ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో సెనగల కొనుగోలు చేసేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని జేసీ విష్ణు చరణ్ పేర్కొన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపిక చేసిన ఏజెన్సీలను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమావేశం జరిగింది. సెనగల కొనుగోలు పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టాలని జేసీ అన్నారు. ఈ ఏడాది సెనగలు క్వింటాలుకు రూ. 5875 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఖాళీ సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. జేడీఏ రవి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్ర, రవాణా జిల్లా అధికారి సురేశ్‌నాయుడు, డీఎల్పీఓ వెంకటరామిరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారతస్థాయి ఆర్చరీ పోటీలకు శ్రీలేఖ

శ్రీలేఖను అభినందిస్తున్న ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ

అనంతపురం క్రీడలు: పుదుచ్చేరిలో జరగనున్న దక్షిణ భారతస్థాయి ఖేలో ఇండియా ఓపెన్ ఆర్చరీ పోటీలకు జిల్లా నుంచి జి. శ్రీలేఖ ఎంపికైంది. అనంతపురానికి చెందిన ఈ బాలిక ఆర్డీటీ సహకారంతో సాధన చేసింది. ఇప్పటికే ఐదుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన ఆమె ఈసారి అద్భుత ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీలేఖను ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ పి. సాయికృష్ణ, ఆర్చరీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. శివశంకర్, శిక్షకురాలు ఎస్. లక్ష్మీదేవి ఆమెను అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ 7382114647.

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3kmలో అద్భుతంగా డెవలప్ చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ కలవు. సం: 6281824204

JOBS

WANTED
AXIS BANK కొరకు అనంతపురం నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. లలితా ఫైనాన్స్ లింక్స్ కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ. ✆7729989278

ప్రముఖ ఎడ్యుకేషన్ ఆఫీసు ATPలో జాబ్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qua: ఇంటర్ పైన Ph: 9515671633, 9391075143.

తెలుగు ఇంగ్లీష్ టైప్ రైటింగ్ మరియు కంప్యూటర్ స్కానింగ్ కలిగిన స్త్రీ/పు వ్యక్తి కావలెను. జీతం నెలకు 30,000/- సంప్ర: జయరాములు డాక్యుమెంట్ రైటర్, హిందూపురం. 9440248010.

FACULTY/ TEACHERS

Wanted: Jr & Sr Lecturers in Maths, Physics, Chemistry, Botany, Zoology, English, Sanskrit ATP 6302037812.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

IDBI BANK ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, రిటైల్ అసెట్ సెంటర్ నెం.12, 1వ అంతస్తు, సిద్ధి ప్లాజా, 8వ & 9వ క్రాస్ మధ్య, మార్గోస రోడ్, మల్లేశ్వరం, బెంగళూరు - 560003, కర్ణాటక

సమర్థ ప్రాధికారి ద్వారా ఉత్తర్వు

జివిజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో సిఎంఆర్ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడేది) నెం.589, 3వ అంతస్తు, ఎస్‌బిఐ పైన, సి-బ్లాక్, ఎఇసిఎస్ లేఔట్, బ్రూక్ ఫీల్డ్, కుందలహళ్లి, బెంగళూరు-560037.

బెంగళూరు-560037, వర్తూరు, వర్తూరు గ్రామం లోని "మల్బెర్రి మిస్ట్" (గ్రాండ్యూర్ పార్క్‌గా పిలువబడుతుంది) ప్రాజెక్ట్ పేరుతో ఉన్న నివాస అపార్ట్‌మెంట్ల అభివృద్ధి మరియు నిర్మాణంలో చేసిన మోసానికి సంబంధించి **జివిజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్** (గతంలో సిఎంఆర్ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడేది) (బిల్డర్) మరియు దాని ప్రమోటర్ & ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వర్గీకరణ విషయంలో దిగువ తెలిపిన వ్యక్తులకు తెలియజేయునది ఏమనగా కమర్షియల్ బ్యాంక్స్ (ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు కలుపుకొని) మరియు అఖిల భారత ఆర్థిక సంస్థలలో ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ పై ఆర్‌బిఐ మాస్టర్ డైరెక్షన్స్ ప్రకారం బ్యాంక్‌చే జారీచేయబడిన 15 జులై 2024 తేదీ గల ఉత్తర్వు ("మాస్టర్ డైరెక్షన్స్") అందజేయబడక తిరిగి వచ్చినది.

పేరు	చిరునామా	హోదా
జివిజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో సిఎంఆర్ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పిలువబడేది)	నెం. 589, 3వ అంతస్తు, ఎస్‌బిఐ పైన, సి-బ్లాక్, ఎఇసిఎస్ లేఔట్, బ్రూక్ ఫీల్డ్, కుందలహళ్లి, బెంగళూరు-560037, కర్ణాటక.	బిల్డర్
శ్రీ యుఎస్ఎస్‌వి ప్రసాద్	ఫ్లాట్ నెం. 420, VI బ్లాక్, ఎలిల్ ఎడోబ్ అపార్ట్‌మెంట్స్, సుబ్బన్న కాంపౌండ్, మహదేవపుర, బెంగళూరు -560048, కర్ణాటక.	ప్రమోటర్ & ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
శ్రీ యు ఉమా మహేశ్వర రెడ్డి	నెం. 28/5/458, హౌసింగ్ బోర్డ్ కాలనీ, అనంతపురం-515001, ఆంధ్రప్రదేశ్.	ప్రమోటర్ & ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
శ్రీ చెన్నం రంగస్వామి	నెం. హెచ్ 108, శ్రీరామ్ స్ఫూర్తి, ఎఇసిఎస్ లేఔట్, బ్రూక్ ఫీల్డ్, సిఎంఆర్ఐటి కాలేజ్ ప్రక్కన, బెంగళూరు-560037, కర్ణాటక.	ప్రమోటర్ & ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

పైన తెలిపిన వ్యక్తులు (వారు పొందదలిచినచో) తిరిగి వచ్చిన, బట్వాడా కాని రిజిస్టర్ ఆర్డర్‌ను స్వయంగా లేదా అధికారమివ్వబడిన వ్యక్తిచే గుర్తింపు రుజువు దాఖలు చేయడం ద్వారా పైన ఇచ్చిన చిరునామాలోని దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.

తేదీ: 24.02.2026

సం/- చక్రధర్ కుమార్ నేతి
సెంటర్ హెడ్ / డిజిఎం
ఆర్ఏసి మల్లేశ్వరం, బెంగళూరు

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda
తాడిపత్రి శాఖ, ఎల్లనూరు రోడ్డు, తాడిపత్రి, అనంతపురం జిల్లా.

చర / స్థిరాస్తుల విక్రయము కొరకు అమ్మకం ప్రకటన

అనుబంధం- IV-A [నిబంధన 6 (2) & 8 (6)కి చూడండి]

[illegible]

తేదీ: 21-02-2026, ప్రదేశం: తాడిపత్రి

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda

చర / స్థిరాస్తుల విక్రయము కొరకు అమ్మకం ప్రకటన

అనుబంధం- IV-A [నిబంధన 6 (2) & 8 (6)కి చూడండి]

[illegible]

తేదీ: 24-02-2026, ప్రదేశం: ధర్మవరం

కోర్టులకు మూడోసారి బాంబు బెదిరింపు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే : జిల్లాలోని పలు కోర్టులకు ముచ్చటగా మూడోసారి మంగళవారం బాంబు బెదిరింపు లేఖలు ఈ-మెయిల్ ద్వారా పంపారు. అనంతపురంతో పాటు హిందూపురం, కదిరి, ఉరవకొండ కోర్టులకు బాంబు పెట్టినట్లు బెదిరింపు లేఖలు వచ్చాయి. కోర్టు సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు కోర్టు భవనాల్లో తనిఖీలు చేశారు. ఈ సారి రజియా హుస్సేన్ పేరుతో ఈ లేఖలు కోర్టులకు చేరాయి. అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో పోలీసులకు అంతు పట్టడం లేదు. ఓ డీఎస్పీ స్థాయి అధికారి కోర్టుకు చేరుకొని భద్రతా చర్యలు తీసుకుంటే బాగుంటుందా? అనే కోణంలో ఆలోచిస్తే బాగుంటుందని న్యాయవాదులు అంటున్నారు. పోలీసులు కోర్టులపై దృష్టి సారించి బాంబులు పెట్టడానికి అవకాశం లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరుతున్నారు.

అనంత కోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పార్టీ నుంచి వెళ్లి తిరిగొస్తే ఊరుకోను..

వైకాపా కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి హెచ్చరిక

మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: 'శత్రువునైనా పార్టీలోకి రానిస్తానేమోగాని, ఇక్కడ డబ్బులు సంపాదించుకుని, దాన్ని నిలబెట్టుకునేందుకు వేరే పార్టీలోకి వెళ్లిన వారు మళ్లీ తిరిగి వస్తామంటే, గేటు దగ్గరే వారిని చెప్పు సైజు నంబర్ ముద్ర పడేలా కొడతా' అంటూ వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఇటీవల కొత్తగా పదవులు పొందిన నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో ఆయన మంగళవారం పట్టణంలోని వైకాపా కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. బంధుప్రీతి, స్నేహ సంబంధాలను ఉపయోగించి మళ్లీ పార్టీలోకి వస్తామంటే వారిని రానిచ్చేది లేదన్నారు. క్యారెక్టర్‌లెస్ ఫెలోస్‌ను, అర్హత లేనివారిని పార్టీలోకి తిరిగి తీసుకోమన్నారు. సూరి (వరదాపురం సూర్యనారాయణ) కాలంలో పార్టీ కార్యక్రమాలకు వెళ్తే పటాకులు, డప్పులు, పూలదండలు, మేకలు, మసాలాలు ఆయనే ఇచ్చేవారన్నారు. తనకు ఆ దుస్థితి కలగలేదని, పార్టీ నాయకులే భోజనం పెట్టేవారన్నారు. పార్టీకి కష్టకాలంలో నిలబడిన కార్యకర్తలు, నాయకులకు అన్నివిధాలుగా అండగా ఉంటానని స్పష్టం చేశారు. సమావేశంలో వైకాపా పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు నారాయణరెడ్డి, సాయికుమార్, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శాప్ లీగ్ జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు శకుంతల, శ్రీనివాసులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శాప్ లీగ్ జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. అనంతపురం గ్రామీణ మండలం పాములరాయి గ్రామం నుంచి తాడిపత్రికి వెళ్లే జాతీయ రహదారిపై ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల హాజరై ప్రారంభించారు. ప్రతిభ చూపిన వారు ఈ నెల 28, మార్చి ఒకటవ తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన జాబితాను బుధవారం ప్రకటిస్తామని డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల తెలిపారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల సునీత

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : రాప్తాడు నియోజకవర్గంలోని తాగునీరు, రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఛాంబర్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి పథకాల నిర్వహణ కోసం రూ. 50 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతపురం గ్రామీణ ప్రాంతాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును, పైప్‌లైన్ మరమ్మతులు చేయడంతో పాటు 2 ఎంఎల్‌డీ స్లో సాండ్ ఫిల్టర్ల స్థానంలో 6 ఎంఎల్‌డీ రాపిడ్ సాండ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. శ్రీసత్యసాయి పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని అన్ని గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం గొల్లపల్లి జలాశయం నుంచి సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్మాణానికి రూ. 180 కోట్లు మంజూరు చేయాలని కోరారు. రామగిరి, కనగానపల్లి, సీకేపల్లి, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లోని రహదారుల పునఃనిర్మాణంకు రూ. 11.50 కోట్లు మంజూరు చేయాలన్నారు.

● ఆత్మకూరులోని జూనియర్ కళాశాల ఆడిటోరియం, ప్రహరీ నిర్మాణానికి రూ. 60 లక్షలు నిధులు కేటాయించాలని, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల మంజూరు చేయాలని, ననసకోట ఎంజేపీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల దస్త్రం ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉందని మంత్రి లోకేశ్ దృష్టికి ఎమ్మెల్యే సునీత తీసుకెళ్లారు. రామగిరిలో జూనియర్ కళాశాల కోసం వసతి గృహం మంజూరుకు రూ. 2.50 కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు.

కట్టుకున్నోడే నరకం చూపించాడు!

● కానిస్టేబుల్ వివాహేతర సంబంధం ● మనోవేదనతో భార్య ఆత్మహత్య

తొమ్మిదేళ్ల కుమారుడి ఎదుటే కన్నతల్లి బలవన్మరణానికి పాల్పడింది. అమ్మా చనిపోవద్దని వేడుకున్నా ఆ మాతృమూర్తి వినకుండా ఉరిబిగించుకొని జీవితాన్ని చాలించింది. భర్త వేరొకరితో వివాహేతర సంబంధం కొనసాగించడాన్ని తట్టుకోలేకపోయింది. కట్టుకున్నోడే సర్వస్వమనుకొని బతికిన ఆమెకు నరకం చూపించాడు. అతను చేసిన మోసం ముందు కన్నపేగు గుర్తుకు రాలేదు. కళ్లనిండా నీరుపెట్టుకొని లోకం విడిచింది.

లలిత

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : భర్త చేసిన మోసాన్ని తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన అనంతపురంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి ఆజాద్‌నగర్‌లో మంగళవారం జరిగింది. సీఐ జగదీశ్ తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మోహన్‌కృష్ణ నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ముచ్చుకోటకు చెందిన లలిత(30)ను పదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ధర్మయోగి ఉన్నాడు. వీరు కళ్యాణదుర్గం రోడ్డులో నివాసం ఉంటున్నారు. సదరు కానిస్టేబుల్ ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం భార్యకు తెలియడంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. కొంతకాలంగా ఇద్దరూ విడిగా ఉంటున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు రెండు రోజుల కిందట 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో లలిత మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ సమయంలో కుమారుడు వారించినా వినకుండా అఘాయిత్యానికి పాల్పడింది. సీఐ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. మృతురాలి తండ్రి సాయిప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పౌరసరఫరాల శాఖలో సీఎస్‌డీటీల బదిలీ

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలోని పౌరసరఫరాలశాఖ, పౌరసరఫరాల సంస్థలో పని చేస్తూ ఐదేళ్లు దాటిన సీఎస్‌డీటీలను బదిలీ చేస్తూ సంయుక్త కలెక్టర్ విష్ణుచరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాయదుర్గం ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఐదేళ్లుగా పనిచేస్తున్న సీఎస్‌డీటీ టి. సుబ్రహ్మణ్యం మాతృశాఖ అయిన పౌరసరఫరాలశాఖకు బదిలీ అయ్యారు. డి. హీరేహాళ్ మండలంలో జి. సురేఖ గుత్తి, పెద్దవడుగూరు మండలాల సీఎస్‌డీటీగాను, అనంతపురం అర్బన్, అనంతపురం గ్రామీణంలో పని చేస్తున్న బి.ఎం. బాషాను శింగనమల, నార్పల సీఎస్‌డీటీగాను, గుత్తి, పెద్దవడుగూరు మండలాల్లో పనిచేస్తున్న సీఎస్‌డీటీ జి. ప్రవీణ్‌కుమార్, డి. హిరేహాళ్ మండలంలో పనిచేస్తున్న సీఎస్‌డీటీ జి. రమాదేవిని జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ చేసిన సీఎస్‌డీటీలంతా తక్షణమే విధుల్లో చేరాలని జేసీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గంజాయిని చూపుతున్న పోలీసులు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో పది మంది గంజాయి విక్రేతలు పట్టుబడ్డారు. సీఐ రామారావు, ఎస్.ఐ సురేశ్, అమీర్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం గుత్తి మండలం టి.కొత్తపల్లికి చెందిన నవీన్.. ముఠాను ఏర్పాటు చేసుకుని గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఇతడిపై గుత్తి, అనంతపురంలో గంజాయి, దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గుత్తి ఆర్.ఎస్.కు చెందిన గోవర్ధన్‌తోపాటు మరో 8మందితో కలిసి గంజాయిని విక్రయిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గుత్తిలోని ఎస్సీకాలనీ, రాయల్‌టాకీస్, చర్చిరోడ్డులో నివాసం ఉంటున్న నిందితులు ముంబయి నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు చేసి తురకపల్లిరోడ్డులోని రైల్వేట్రాక్ వద్ద పది మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 2 తులాల బంగారు నగలు, నగదుతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టుకు హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం



మల్లిస్వామి

బెళుగుప్ప: రోడ్డు ప్రమాదం తల్లిదండ్రుల ఆశలను చిదిమేసింది. కొడుకు ఉన్నత చదువులు చదువుకుని ప్రయోజకుడు అవుతాడని సంబరపడిన ఆ తల్లిదండ్రుల కలలు టిప్పర్ రూపంలో కబళించివేయడంతో వారి రోదనలు మిన్నంటాయి. రమణేపల్లికి చెందిన వెంకటేశులు- రత్నమ్మల కుమారుడు మల్లిస్వామి(22) కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డబళ్లాపూర్‌లో గీతం కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లిస్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆరు నెలల్లో ఉద్యోగం వస్తుందని తల్లిదండ్రులకు చెప్పిన కుమారుడు ప్రమాదంలో మృతిచెందటంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

స్టార్ హోటళ్లలో బస.. పబ్బుల్లో జల్సా

రూ.56 లక్షలతో పరారైన వ్యాన్‌డ్రైవర్ అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణ గౌడ్, చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు

గచ్చిబౌలి (హైదరాబాద్), న్యూస్‌టుడే: గోపనపల్లిలో రూ. 56 లక్షలతో పరారైన ఏటీఎం క్యాష్ డిపాజిట్ వ్యాన్ డ్రైవర్‌ను గచ్చిబౌలి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ. 34.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన డబ్బుతో నిందితుడు పుణె, బెంగళూరు, ముంబయి, సోలాపూర్ ప్రాంతాల్లో సంచరిస్తూ జల్సాలు చేసి రూ. 21 లక్షలు ఖర్చు చేశాడు. సోమవారం గచ్చిబౌలి ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో నార్సింగి ఏసీపీ రమణ గౌడ్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ బాలరాజు, డీఐ నరేశ్ వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్‌కు చెందిన బడిగెరె అజిత్‌కుమార్ (34) కొంతకాలంగా సికింద్రాబాద్‌లో ఉంటున్నాడు. ఏటీఎంలో నగదు నిర్వహణ పనులు చూసే సంగం సెక్యూరిటీ ఏజెన్సీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12న కస్టోడియన్లు రామకృష్ణ, అబ్దుల్ మాలిక్, సెక్యూరిటీ గార్డు పెరుమాల్.. అజిత్ నడిపే వ్యానులో డబ్బులతో బయలుదేరారు. వివిధ ప్రాంతాల్లోని ఏటీఎంలో నగదు డిపాజిట్ చేస్తూ సాయంత్రం 4.30 సమయంలో గచ్చిబౌలి గోపనపల్లికి వచ్చారు. అక్కడ మిగతా సిబ్బంది కన్నుగప్పి, అజిత్ డబ్బుల వ్యాన్‌తో పారిపోయాడు. తోటి సిబ్బంది ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

మొదట బళ్లారికి చేరి..

తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వద్ద వ్యాన్‌ను వదిలేసిన అజిత్.. నగదుతో ఆటోలో ఆర్టీసీ క్రాస్ రోడ్డుకు వెళ్లాడు. అక్కడో లాడ్జిలో బస చేసి, యాక్సా బ్లేడ్‌తో నగదు పెట్టె తెరిచి డబ్బును సంచిలోకి మార్చుకున్నాడు. అనంతరం అదే రాత్రి బస్సు ఎక్కి బళ్లారి చేరుకున్నాడు. రెండు రోజులు తర్వాత బెంగళూరు, తర్వాత ముంబయి, సోలాపూర్ వెళ్లాడు. అనంతరం అనంతపురంలోని సోదరి ఇంటికి చేరాడు. ఇలా క్యాబ్‌లో ప్రయాణిస్తూ స్టార్ హోటళ్లలో బస చేస్తూ.. పబ్బులకు వెళ్తూ.. పది రోజుల్లో రూ. 20 లక్షలు ఖర్చు చేశాడు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు ఇతరుల పేర్లతో సిమ్‌లు తీసుకొని ఫోన్ ఉపయోగించాడు. ఈ క్రమంలో వైజాగ్‌లో ఉంటున్న ప్రియురాలికి పలుమార్లు ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

గుంత పూడ్చారు.. చింత తీర్చారు

స్పందనకు వందనం

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని గనిగెర గ్రామ 'హెచ్చెల్సీ' వంతెన ఇరువైపులా అంచుల వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతను ర.భ. అధికారులు పూడ్చి బాగు చేయించారు. 'వంతెన ఇంకెన్నాళ్లో భయాందోళన' అనే శీర్షికన ఈనెల 2న 'ఈనాడు' జిల్లా ప్రధాన సంచికలో ప్రచురించిన కథనానికి ర.భ. డీఈ రవీంద్రనాథ్ స్పందించారు. గుత్తేదారుతో గుంతలో కంకర పోసి, తారు రోడ్డు వేయించి తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. రాకపోకలకు చింత తీరేలా అంతరాయం తొలగడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ... అధికారులకు, 'ఈనాడు'కు కృతజ్ఞతలు తెలిపారు.

లీకేజీలకు మరమ్మతులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని అనంతపురం మార్గంలో జూనియర్ కళాశాల వెళ్లే ప్రాంతంలో శ్రీరామిరెడ్డి నీటి పథకం పైపులైన్ లీకేజీ ఏర్పడింది. దీనిపై ఈనెల 19న 'పది రోజులైనా పట్టింపు శూన్యం' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం వెలువడింది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు సిబ్బంది చేత మంగళవారం మరమ్మతులు చేయించారు. దీంతో స్థానిక సమస్య పరిష్కారమైంది.

తాగునీటి సదుపాయమే లక్ష్యం

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని పయ్యావుల-1 కాలనీలో రూ.8లక్షలతో ఆ కాలనీకి ప్రత్యేకంగా నిర్మించిన తాగునీటి పైపులైన్లను మంగళవారం ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్, మాజీ ఛైర్మన్ రేగటి నాగరాజు, పీఏసీఎస్ ఛైర్మన్ ప్యారం కేశవానంద, మాజీ ఎంపీపీ సుంకర్రప్పలు ప్రారంభించారు. స్థానికులు సద్వినియోగం చేసుకుని, ఇన్నాళ్లు పడిన కష్టం నుంచి ఉపశమనం పొందాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పెద్దిరెడ్డి రాజేశ్, వేల్పుల నరసింహులు, పద్మావతి, మోపిడి గోవిందు, ఖలందర్, పద్మనాభస్వామి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపైనే వైకాపా నాయకుల దాడి : కాలవ

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంపై ఇప్పటి వరకు జరిగిన సిట్ దర్యాప్తులో అసలు దోషులు బయటకు రావడంతో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో ప్రభుత్వం రాజీ పడబోదని విశ్వాసం, నమ్మకాన్ని కోట్లాది మంది భక్తుల్లో కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మంగళవారం అనంతపురంలో తిరుమల లడ్డు కల్తీ అంశంపై జరిగిన చర్చల్లో కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయ పవిత్రతను దెబ్బతీయడం, వెంకన్న లడ్డు కల్తీ చేయడంలాంటి దుశ్చర్యలను ఆషామాషీగా తీసుకోలేమన్నారు. భక్తుల మనోభావాలను వైకాపా నాయకులు దారుణంగా దెబ్బతీశారన్నారు. పూర్తి తిరిగి వైకాపా నాయకులను కఠినంగా శిక్షిస్తేనే ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలుగుతుందని తెలిపారు.

అతివల కృషి.. ఉపాధికి బాటలు

పిండి మిషన్‌తో ఆదాయం

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలువురు మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరి రుణాలు తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. నిత్యం ఇలా వచ్చే ఆదాయంతో ఇంటిల్లిపాది ఉన్నతమైన జీవనం గడుపుతూనే పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. ఏర్పాటు చేసుకున్న వ్యాపారం ద్వారా మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. - న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం, రాయదుర్గం పట్టణం, ఉరవకొండ

కళ్యాణదుర్గం మండలం నారాయణపురంలోని 'మదర్ థెరిసా' మహిళా సంఘంలో 15 సంవత్సరాలుగా సభ్యురాలిగా ఉన్నా. మొదట్లో రూ.20 వేల రుణం తీసుకుని... క్రమంగా కుటుంబ అవసరాల కోసం ఇంట్లోనే కిరాణా దుకాణంతోపాటు గ్రైండర్, పిండి మిషన్లు ఏర్పాటు చేసుకున్నా. తద్వారా నిత్యం రూ.500 నుంచి రూ.2 వేల వరకు ఆదాయం వస్తోంది. కొత్త ఇంటి నిర్మాణం చేసుకోవడంతోపాటు పిల్లల్ని బీటెక్, ఇంటర్ చదివిస్తున్నా. తీసుకున్న రుణం కంతులు క్రమంగా చెల్లిస్తున్నా. **- శ్రీదేవి, కళ్యాణదుర్గం**

వడ్డీల బాధ తగ్గింది

గతంలో దళారుల వద్ద అప్పు తీసుకున్నప్పుడు అధిక వడ్డీ చెల్లించవలసి వచ్చేది. ప్రస్తుతం మహిళా సంఘంలో రుణం వల్ల వడ్డీ భారం తగ్గింది. పదేళ్ల కిందట శ్రీసాయి సంఘంలో సభ్యురాలిగా చేరా. ప్రస్తుతం సంఘం నుంచి రూ.2 లక్షల రుణం తీసుకుని దుకాణం ఏర్పాటు చేసుకున్నా. ఖర్చులుపోగా నెలకు రూ.20 వేల వరకు మిగులుతున్నాయి. గతంలో బయట వ్యక్తుల వద్ద రూ.3 చొప్పున వడ్డీకి అప్పులు తీసుకునే వాళ్లం. ఇప్పుడు మహిళా సంఘం రుణంతో ఆ బాధ తప్పింది. **- ఫమీదా, రాయదుర్గం**

ఓళిగ దుకాణంతో లబ్ధి

స్థానికంగా ఉన్న రామచంద్ర మహిళా సంఘంలో పదేళ్లుగా సభ్యురాలిగా ఉన్నా. రూ.3 లక్షల రుణం తీసుకుని ఓళిగ దుకాణం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నా. తాజాగా ఆహార ఉత్పత్తుల తయారీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో తక్కువ వడ్డీకే మరింత రుణాన్ని ఇప్పించేందుకు అధికారులు చొరవ తీసుకున్నారు. ఖర్చులు పోగా నెలకు రూ.20 వేల మిగులుతోంది. **- రామలక్ష్మి, ఇంద్రావతి గ్రామం**

ఈ-పంట నమోదు 94 శాతం పూర్తి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో రబీలో ఈ-పంట నమోదు వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం డీఏఓ రవి తెలిపారు. నియోజకవర్గంలోని మలపనగుడి, సిద్దాపురం గ్రామాల్లోని రైతుల పొలాలను ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 94 శాతం ఈ- పంట నమోదు పూర్తయిందని, ఈనెల 28లోపు 100 శాతం పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అనంతపురం, సత్యసాయి జిల్లాలు ఈ- పంట నమోదులో ప్రథమ స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పంట నమోదు పూర్తిచేసుకున్న వారికి సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, రాయితీలు అందుతాయన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, ఆర్ఎస్‌కేలు, ప్రైవేటు డీలర్ల వద్ద స్టాకు ఉన్నట్లు ఆయన వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: కణేకల్లులోని దళితవాడలో మురుగునీరు వెళ్లడానికి డ్రైనేజీలను నిర్మించాలి. **-కాలనీవాసులు**

సమాధానం: కాలనీని పరిశీలించి డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం. **-వెంకటరమణ, ఉప ఎంపీడీవో** - న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

సమస్య: గడేహొతూరు, చిన్నహొతూరు గ్రామాల్లో నాలుగు రోజులుగా తాగునీరు రావడం లేదు. నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. **- మహిళలు**

సమాధానం: సమస్యను ఇప్పటికే గుర్తించాం. అనుమతి లేని నల్లాలు తొలగించి నీళ్లు వదులుతాం. **- నీటి సరఫరా అధికారులు**
– న్యూస్‌టుడే, వజ్రకరూరు

సమస్య: బసవేశ్వరుడి ఆలయం వద్ద వీధి దీపం వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. **-వండ్రప్ప, మాల్యం**

సమాధానం: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. **-చంద్రమౌళి, ఈఓఆర్‌డీ**
– న్యూస్‌టుడే, కణేకల్లు

సీసీ రోడ్డు నిర్మించండి

గుమ్మఘట్ట మండలం చెరువుదొడ్డి నూతన కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఒక కాలనీలో మాత్రమే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారని, మిగతా వీధుల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు విన్నవించారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీఓ జయరాములు మాట్లాడుతూ ఇప్పటికే చెరువు దొడ్డి గ్రామంలో మూడు రోడ్లు వేస్తున్నామని, మిగతా ప్రాంతాల్లోనూ నిర్మాణాలు చేపడ్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, గుమ్మఘట్ట

నీటితొట్టె.. నిరుపయోగం

కుందుర్పి మండలంలోని శీగలపల్లి గ్రామంలో.. పశువులు, మూగజీవాల దాహార్తి తీర్చేందుకు బస్టాండ్ వద్ద గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి తొట్టి నీరు లేక వృథాగా మారింది. తొట్టికున్న పైపులు గతంలోనే ధ్వంసమైనప్పటికీ మరమ్మతులు చేయించడంలో అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదు. దీంతో పశువులకు నీరు అందక దాహంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికైనా తొట్టికి మరమ్మతులు చేయించి జీవాల తాగు నీటి ఇక్కట్లు తీర్చాలని కాపర్లు, రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కుందుర్పి

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

బెళుగుప్ప మండలంలోని హనిమిరెడ్డిపల్లి గ్రామంలో పలు కాలనీల్లో వీధి లైట్లు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో దీపాలు వెలగకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నామన్నారు. ఈ సమస్య బీసీ కాలనీ, ఎస్టీ కాలనీలో ఎక్కువ ఉన్నట్లు వాపోయారు. పాత విద్యుత్తు స్తంభాలు తొలగించినప్పుడు దీపాలు తొలగించారని,నూతన స్తంభాలు నాటిన తరువాత వాటిని అమర్చలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి విధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, బెళుగుప్ప

ఇలాగైతే.. నీటిని పట్టుకునేదెలా?

ఉరవకొండలోని కామక్కట్ల సమీపంలో నివాస గృహాల మధ్యన ఉన్న నీటి ట్యాంకు(సిస్టర్న్) వద్ద పాచి పేరుకుపోయింది. దీని కారణంగా అక్కడి జలాలయ ద్వారా నీటిని పట్టుకోవాలంటే.. స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు నీటి బిందెలు ఎత్తుకునేటప్పుడు పాచి మీద కాలు పడి తరచుగా జారీ కిందపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ట్యాంకు వద్ద శుభ్రత చర్యలు చేపట్టకపోవడంతో సమస్య అధికం అవుతోంది. దీనిని పంచాయతీ అధికారులు గుర్తించి ట్యాంకు చుట్టూ శుభ్రత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఉరవకొండ

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ రంజిత్‌కుమార్ తెలిపారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మజదేవి పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63012 61938, 83742 92207 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

కంబదూరు: నూతిమడుగు ఏపీఆర్ఎస్ బాలుర పాఠశాలలో ప్రవేశాలకు మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జయప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24న ఉంటుందని పేర్కొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఉరవకొండ: శతశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో సాధన చేసేలా దృష్టి సారిస్తున్నట్లు చిన్న ముష్టూరులో ఉరవకొండ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హనుమంతరాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా చిన్న ముష్టూరు, ఇంద్రావతి, మోపిడి గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లను ఆయన మంగళవారం సందర్శించారు.

విద్యుత్తు బస్సులు ఆర్టీసీనే నడపాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సుల పేర్లతో ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థకు అప్పగించరాదని, ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని కోరుతూ ఏపీఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ సంస్థ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఎంయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ ప్రజల భద్రత దృష్ట్యా ఆర్టీసీ డిపోలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూటీ డిపో అధ్యక్షుడు రామాంజినేయులు, జోనల్ సహాయ కార్యదర్శి ఎం.ఎం.డి. షఫీ, ప్రాంతీయ నాయకులు సిద్దేశులు, దామోదర్, రవినాయక్, డిపో ఛైర్మన్ వలి, చంద్రశేఖర్, తిమ్మరాజు, దూద్‌పీరా, సతీష్‌కుమార్ హాజరయ్యారు.

రాయదుర్గం డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

కళ్యాణదుర్గం గ్రామీణం : ఆర్టీసీ సంస్థ మొండి వైఖరి వీడాలని, ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయరాదని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) డిపో ఛైర్మన్ నారాయణ, అధ్యక్షుడు వెంకటస్వామి, గ్యారేజీ కార్యదర్శి రామదాసు పేర్కొన్నారు. మంగళవారం డిపో వద్ద ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.

ఉరవకొండ: ఆర్టీసీ డిపోలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని ఎన్ఎంయూఏ డిపో కార్యదర్శి నారాయణస్వామి పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేఖిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. సంఘానికి చెందిన ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎన్ఎంయూఏ నాయకులు వీరేశ్‌గౌడ్, సాంబశివ, శ్రీరాములు, వలి, గోవిందప్ప, మీరాన్‌బాషా, ఇక్బాల్ పాల్గొన్నారు.

ఉరవకొండ కోర్టులో స్తంభించిన కార్యకలాపాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు మంగళవారం బాంబు బెదిరింపు వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో జడ్జి దుర్గాకల్యాణి, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు కోర్టు నుంచి బయటికి వచ్చారు. వారం వ్యవధిలోనే రెండోసారి బాంబు బెదిరింపు రావడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. దీంతో ఇక్కడ కార్యకలాపాలు స్తంభించాయి. ఎస్సై జనార్దన్‌నాయుడు పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. బెదిరింపులకు కారకులను కఠినంగా శిక్షించాలని బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖరప్రసాద్ కోరారు.

బాల్యవివాహాలు నిర్మూలించాలి

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం జనార్దనపల్లి, మాళాపురం, విడపనకల్లులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్' కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచులు జనార్దననాయుడు, చంద్రశేఖర్, ఆశాలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, పుష్పవతి, పద్మ, కార్యదర్శులు మహేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి

ఉరవకొండ, న్యూస్‌టుడే: పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, దేవదాయ సహాయ కమిషనరు మల్లికార్జునప్రసాద్ పేర్కొన్నారు. చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం వివిధ అంశాలపై విద్యార్థులకు 'నిస్వార్థ ఫౌండేషన్' మఠం ప్రాంగణంలో పోటీలు నిర్వహించగా.. వారు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన స్వర్ణమహల్ మఠం నాగభూషణం దాతగా నిలిచినట్లు వారు తెలిపారు.

నేడు రైతులకు అవగాహన

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని స్థానిక దొడగట్ట రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మామిడి సాగు చేసిన రైతులకు శాస్త్రీయ పద్ధతులపై బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారి కృష్ణతేజ తెలిపారు. మామిడిలో సంరక్షణ పద్ధతులు, పురుగు, రోగాల నియంత్రణ, పంట నిర్వహణ, కవర్ల వాడకం తదితరాలపై అవగాహన కల్పించనున్నారు.

'డివిజన్' బదలాయింపు ప్రక్రియ ఆపండి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గంలోని రోడ్లు భవనాల శాఖ డివిజన్ కార్యాలయం బదలాయింపును ఆపాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పలు సంఘాల నాయకులు రమేష్, అక్కులప్ప, వన్నూరుస్వామి, మారెన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

తాగునీటి సమస్యకు పరిష్కారం

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని తెనగల్లులోని పలు వీధుల్లో తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు స్థానికులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీశంకర్, గ్రామ తెదేపా నాయకులను కోరారు. దీంతో మంగళవారం ఎంపీడీఓ లక్ష్మీశంకర్, తెదేపా గ్రామ కమిటీ నాయకులు బోరు బావిని తవ్వించారు. తాగునీరు లభ్యం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

బెళుగుప్ప: బెళుగుప్ప, తగ్గుపర్తి స్వర్ణగ్రామాల పరిధిలో పారిశుద్ధ్య కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా 'ఆరోగ్య పరిరక్షణకు సుజలాన్ సంస్థ' సహకారంతో గ్లౌజ్‌లు, బూట్లు, మాస్కులు, దుస్తులు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కంబదూరు: కొన్నేళ్ల కిందట భర్త చనిపోగా ఒంటరి జీవితం గడుపుతున్న ములకనూరుకు చెందిన కమ్మ పార్వతమ్మ(63) జీవితంపై విరక్తితో సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్ తెలిపారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

కంబదూరు, న్యూస్‌టుడే: వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటుసారాను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రేవతి సుబ్రమణ్యం సమక్షంలో మంగళవారం ధ్వంసం చేశారు. కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రహదారి వంతెన మీద సుమారు 20 కేసుల్లో పట్టుబడిన మద్యంతోపాటు నాటు సారాను ధ్వంసం చేశారు. సీఐ సునీల్ కుమార్, ఎస్సై బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే స్తంభాలు

కణేకల్లు: ఆర్‌డీఎస్ఎస్ విద్యుత్తు లైను ఏర్పాటులో భాగంగా పలుచోట్ల రోడ్ల పక్కనే పాతిన విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని బ్రహ్మసముద్రం-బెణికల్లు, సీతారామనగర్ క్యాంపు గ్రామాల నడుమ విద్యుత్తు లైను ఏర్పాటులో పలుచోట్ల ర.భ. ప్రధాన రోడ్డు పక్కనే పాతిన స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. వాహనాల రాకపోకల సమయాల్లో ప్రమాదవశాత్తు, రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాలను ఢీకొని ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన కాకుండా కొంత దూరంగా స్తంభాలు పాతేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బ్రహ్మసముద్రం- బెణికల్లు దారిలో...

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

బెళుగుప్ప: పింఛన్ సొమ్మును చెల్లించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సచివాలయ సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. నరసాపురం స్వర్ణ గ్రామం సంక్షేమ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న కార్తీక్ కుమార్ సెప్టెంబర్, డిసెంబర్ నెలలో లబ్ధిదారులకు పింఛను అందజేసి మిగిలిన రూ.96 వేలు వెనక్కు డిపాజిట్ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఉన్నతాధికారులు ఇచ్చిన తాఖీదులకు వివరణ ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని దీక్ష

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పాతక్క పేర్కొన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి రెండోరోజు దీక్ష కొనసాగించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జాయింట్ ఎల్‌పీఎం భూముల పరిష్కారానికి కృషి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా సర్వే డిప్యూటీ డైరెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో మలపనగుడి గ్రామంలోని జాయింట్ ఎల్‌పీఎం భూములను జిల్లా, మండల స్థాయి సర్వే అధికారులు మంగళవారం పరిశీలించారు. జాయింట్ అయిన ఫారెస్ట్ సర్వే నంబర్లు: 1, 2లకు చెందిన భూముల దస్త్రాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. జిల్లా సర్వే అధికారులు అంజలిదేవి, పార్థసారథి, మండల సర్వేయరు రవితేజ, గ్రామ రెవెన్యూ అధికారి బాలాజినాయక్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మ్యాపు పరిశీలిస్తున్న జిల్లా సర్వే విభాగం అధికారులు

ఆస్పత్రి ఆవరణ.. అస్తవ్యస్తం

కంబదూరు మండలం పాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి పట్టిన గ్రహణం వీడేదెన్నడోనని గ్రామస్థులు వాపోతున్నారు. నలుగురు సిబ్బంది ఉన్నా.. వారంలో ఎక్కువ రోజులు కేంద్రం తలుపులు మూసే ఉంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ఉప కేంద్రంలోకి వెళ్తే ఏ విష పురుగులు కరుస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని అపరిశుభ్రత తొలగించి క్రమంగా రోగులకు వైద్యం అందేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కంబదూరు**

ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

కరవు బకాయిలు చెల్లించండి

కళ్యాణదుర్గం: కరవు భృతి బకాయిలు పెన్షనర్లకు, మరణించిన వారి వారసుల ఖాతాల్లో జమ కాలేదని, తక్షణమే ఈ ప్రయోజనం చెల్లించాలని విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సహాయ ఖజానాధికారిణి సరస్వతి, ఉప ఖజానాధికారి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, శివప్రసాద్, మారెన్న, అంపన్న, విజయ్ కుమార్, ఇస్మాయిల్, గంగప్ప, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డి.హీరేహాళ్ మండలం తెలుగుదేశం పార్టీ పరిశీలకులు ఆవుల కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం చెర్లోపల్లి గ్రామంలో తెదేపా మండల కన్వీనరు పాటిల్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని 20, 21 బూత్‌స్థాయి, గ్రామ కమిటీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

నెట్టికంటయ్యకు విశేష పూజలు

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తికి ప్రాకారోత్సవ పూజలు చేశారు. ఆలయాధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు. గుంతకల్లులో వెంకటేశ్వరస్వామి ఆలయంలో లలితా దేవికి ప్రత్యేక పూజలు చేశారు.

జిరాక్స్ కేంద్రాల మూసివేత

తాడిపత్రి, న్యూస్‌టుడే: ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ ప్రధాన పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలు కనబడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆరోహణరావు తెలిపారు. మంగళవారం ఆయన యల్లనూరు రోడ్డులోని నారాయణ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పర్యటించారు. యల్లనూరు రోడ్డులో రెండు జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వివరించారు.

జిరాక్స్ సెంటర్‌ను మూసివేయిస్తున్న పట్టణ సీఐ ఆరోహణరావు

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశం

రైల్వే కాలనీల్లోని సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైల్వే కాలనీల్లో నివాసముంటున్న రైల్వే కుటుంబాల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అధికారులను ఆదేశించారు. ఆయన శాఖాధికారులతో కలిసి పట్టణంలోని రైల్వేకు చెందిన ప్రభాత్‌నగర్, హనుమాన్‌నగర్‌లను పరిశీలించారు. కాలనీల్లోని దొంగలు కానీ, అసాంఘిక శక్తులు కానీ ప్రవేశిస్తే పసిగట్టడానికి సీసీ కెమెరాలు చాలా అవసరమని తెలిపారు. క్వార్టర్ల చుట్టూ ఉన్న ముళ్లపొదలను, మట్టి దిబ్బలను తొలగించి కాలనీలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కాలనీల్లోని అన్ని వీధుల్లో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోడ్లు, మురుగు కాలువల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ శ్రీనివాస్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వరు.. సమస్యలు తీర్చరు!

సౌకర్యాలు లేని శ్రీలంక కాందిశీకుల కాలనీ

సమాచారం
- కాలనీలు : మిల్లు, శ్రీలంక కాందిశీకుల కాలనీలు
- గృహాలు : 650
- జనాభా : 3500

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వం శ్రీలంక కాందిశీకులకు ఇంటి స్థలాలు కేటాయించక పోవడంతో వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్లు మిల్లుకు చెందిన స్థలం కావడంతో మున్సిపాలిటీ అధికారులు కూడా సౌకర్యాలు కల్పించడం లేదు. నివసిస్తున్న ఇళ్లకు పట్టాలు ఇస్తామని గతంలో ప్రజాప్రతినిధులు వారికి హామీలు ఇచ్చి వదిలేశారు.

● మిల్లులోని, శ్రీలంక కాందిశీకుల కాలనీల్లో ప్రజలు గత 40 సంవత్సరాల నుంచి మిల్లు స్థలంలో కొట్టాలు, షెడ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. గతంలో కాందిశీకులకు దోనిముకల రహదారి పక్కన ప్రభుత్వం 200 ఇళ్లను నిర్మించగా వారు ఇళ్లలోకి చేరకముందే కొందరు స్వార్థపరులు ఇళ్లను పడగొట్టి వాటికి వినియోగించిన రాళ్లు, సామగ్రిని దోచుకెళ్లారు. దీంతో వారు మిల్లు స్థలంలోని కొట్టాలలో నివాసం ఉంటున్నారు.

● కాందిశీకుల కాలనీలో వీధి దీపాలు లేక, కుళాయిల కనెక్షన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెళ్లడానికి రోడ్డు కూడా లేదు. మిల్లు స్థలంలో ఇళ్లను నిర్మించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

● ఇళ్ల పట్టాలు ఇస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి వదిలేస్తున్నారు. తమకు స్థలం దక్కుతుందో లేదో అని చాలా మంది పక్కాఇళ్లను నిర్మించుకోకుండా అతి కష్టంగా ఇరుకైన ఇళ్లలో జీవనాన్ని సాగిస్తున్నారు. రెండు కాలనీల్లో పార్కులను ఏర్పాటు చేయలేదు. కాందిశీకుల కాలనీలో మంచినీటి పథకాన్ని కూడా ఏర్పాటు చేయలేదు.

సమస్యలను పరిష్కరిస్తాం

శ్రీలంక కాందిశీకుల కాలనీలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడానికి పైపులైను, కుళాయిలను ఏర్పాటు చేస్తాం. విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలను ఏర్పాటు చేస్తాం. మట్టిరోడ్లను నిర్మిస్తాం. మిగిలిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
- హరికృష్ణ, ఏఈ గుంతకల్లు పురపాలక సంఘం

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: అంజలినగర్‌లో ప్రతిభా విజన్ స్కూల్ ఏరియాలో పందుల బెడద ఎక్కువగా ఉంది. - కమల, స్థానికురాలు

సమాధానం: పందుల రాకుండా పెంపకందారులకు నోటీసులు ఇస్తాం. - వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం

సమస్య: గంగానగర్ ట్యాంకు దగ్గర చెత్తకుప్పలు ఉన్నాయి. - ప్రకాశ్, స్థానికుడు

సమాధానం: చెత్తకుప్పలను తొలగిస్తాం.

పై రెండు ప్రశ్నలకు గుంతకల్లు పురపాలక సంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సమాధానం తెలిపారు.
- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం గుంతకల్లులో శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వారోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్, తెలుగు విభాగాధిపతి క్రిష్టయ్య మాట్లాడారు. కన్నతల్లిని, మాతృభాషను మరవకూడదన్నారు. తెలుగు అధ్యాపకులు వెంకటసుబ్బయ్య మాతృభాష పరిరక్షణలో విద్యార్థులు పాలుపంచుకోవాలన్నారు. అలాగే ఇన్వోవ్ ఫస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డ్రోన్ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక యుగంలో డ్రోన్ టెక్నాలజీకి డిమాండు ఎక్కువగా ఉంటుందని విద్యార్థులు తెలుసుకోవడం చాలా అవసరమని ప్రిన్సిపల్ తెలిపారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, తెలుగు విభాగం అధ్యాపకులు

కాశేపల్లిలో పశుగ్రాసానికి నిప్పు

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లిలో సుదర్శనరెడ్డికి చెందిన గడ్డివామికి సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధం అయినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామ సమీపంలో గడ్డివామిని వేసుకోగా తనను ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో నిప్పు పెట్టారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సుదర్శన్ రెడ్డి తండ్రి ముత్యాలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి జయంతి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని గాంధీనగర్‌లో ఉన్న రాఘవేంద్రస్వామి ఆలయంలో జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఐందులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

గుంతకల్లు, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదాలు జరగకుండా ఓవైపు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రమాదాలు జరిగిన సమయంలో ఏవిధంగా స్పందించాలో విద్యార్థులకు అవగాహన ఉండాలని రైల్వే సివిల్ డిఫెన్స్ ప్రమాద ప్రదర్శకులు భరత్‌భూషణ్, రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారుల సూచన మేరకు మంగళవారం అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో గాయపడ్డవారిని కాపాడుకోవడం, అగ్నిని నియంత్రించడం చాలా ముఖ్యమని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో ఒక్క సెకను కూడా చాలా విలువైనదని, ప్రాణాలను కాపాడవచ్చని వెల్లడించారు. మిగతా అంశాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సివిల్ డిఫెన్స్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

యాడికి: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ ఆర్.శ్రీనివాసులు పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అంతర్జాతీయస్థాయిలో రాణించాలన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని క్రీడలను ప్రోత్సహించడంపై స్థానికులను సీఐ అభినందించారు. సీనియర్ విభాగంలో 20, జూనియర్ విభాగంలో 10 జట్లు వచ్చాయి. తొలిరోజు 10 జట్లు తలపడ్డాయి. రెండో రోజు ఫైనల్ పోటీలు కొనసాగనున్నాయి.

కబడ్డీలో తలపడుతున్న ఆటగాళ్లు

ఎన్ఎంయూ నాయకుల నిరసన

తాడిపత్రి, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సులను ప్రైవేటు పరం చేయకుండా నేరుగా ఆర్టీసీకే అప్పగించాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయం ముందు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ డిపోలకు ప్రభుత్వం పెద్దఎత్తున విద్యుత్తు బస్సులను తీసుకొస్తోందని, కానీ వాటిని ప్రైవేటు సంస్థకు అప్పగించాలని చూస్తోందన్నారు. దీంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని వాపోయారు. జీసీసీ విధానాన్ని కూడా పూర్తిగా రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి ప్రాణ్‌నారాయణ, డిపో అధ్యక్షుడు కేజీఎన్ బాబు, నాయకులు మహేశ్, నాగేశ్వరరెడ్డి, రంగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నల్లమ్మకు ప్రత్యేక పూజలు

ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

గార్లదిన్నె గ్రామీణం: మండల పరిధిలోని కనుంపల్లి గ్రామంలో వెలసిన శ్రీ నల్లమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

తుప్పు పడుతున్నా పట్టించుకోరేం!

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గాలికి వదిలేశారు. ఏళ్లుగా వాహనాలను ఎండ, వానలో వదిలేయడంతో తుప్పు పట్టి పూర్తిగా దెబ్బతింటున్నాయి. గుత్తిలోని తహసీల్దార్, పోలీసు స్టేషన్లలలో పదుల సంఖ్యలో వాహనాలు వదిలేయడంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. అధికారులు స్పందించి తుప్పు పట్టిన వాహనాలను వేలం వేస్తే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే,గుత్తి గ్రామీణం

పైప్‌లైను లీకేజీతో భారీ గుంత

నార్పల మండల పరిధిలోని బి.పప్పూరులో రోడ్డు పక్కనే ఉన్న పైప్‌లైను లీకేజీ కారణంగా నీరు రోడ్డుపై చేరి పెద్ద గుంత ఏర్పడింది. ఈ మార్గంలో భారీ వాహనాలు తరచూ రాకపోకలు సాగించడంతో గుంత మరింత విస్తరించి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో గుంత కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పైప్‌లైను, రహదారి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే నార్పల

ప్రమాదకరంగా నియంత్రిక

పట్టణంలోని కథలగేరిలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఏ సమయంలో కూలిపోతుందో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నాసిరకంగా నిర్మించిన రాతిదిమ్మెపై దీన్ని ఉంచారు. ప్రస్తుతం రాతిదిమ్మె చాలావరకు శిథిలమైంది. కూలితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్తు అధికారులు ముందే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు

కళ్లప్పగించి చూడండయ్యా!

శింగనమల మండలంలోని నాయనపల్లి క్రాస్ నుంచి ఉల్లికల్లు మీదుగా పెద్దపప్పూరుకి వెళ్లే రహదారి ఎనిమిదేళ్ల క్రితం ఉల్లికల్లు వరకు అప్పటి ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టింది. గుత్తేదారులు కొన్ని కారణాల వల్ల పూర్తి చేయలేదు. అనంతర వచ్చిన వైకాపా ప్రభుత్వం విస్మరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న పనులు ఇంకా ప్రారంభించలేదు. సగం రహదారితో రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు, నాయకులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, శింగనమల

ముళ్ల పొదల్లో భవనాలు

గుంతకల్లులోని కసాపురం రోడ్డుకు ఆనుకుని గతంలో తహసీల్దార్ కార్యాలయం కోసం గదులు నిర్మించారు. ఇందులో తహసీల్దార్, హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కార్యాలయాల్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి వేరే గదులు నిర్మించారు. దీంతో అధికారులు పాత భవనాలు వినియోగించుకోకుండా గాలికొదిలేశారు. ఇందులో ప్రభుత్వ కార్యాలయాన్ని నిర్వహించడానికి అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల మధ్య ఉంది. వాటిని వినియోగించుకోవాలని పలువురు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు

ఒప్పంద ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని ఏపీఆర్ పాఠశాలలో ఒప్పంద పద్ధతిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు ప్రిన్సిపల్ స్వాతి తెలిపారు. పదో తరగతికి గణితం, భౌతికశాస్త్రం బోధించేందుకు ఎమ్మెస్సీ ఫిజిక్స్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. మరింత సమాచారం కోసం 8712625063 నంబరును సంప్రదించాలని తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు..

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: గార్లదిన్నె ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఇప్పటి నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ, ఓసీ విద్యార్థులు 2014 సెప్టెంబరు 1, 2016 ఆగస్టు31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1, 2016ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ.125, బీసీ, ఓసీలు రూ.200లు చెల్లించాలని తెలిపారు.

అంగన్‌వాడీల ఆందోళన

తాడిపత్రి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు చేస్తామని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఆపమన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ, ఏఐటీయూ, సీఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు, మహిళలు

బస్సు, కారు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

శింగనమల, న్యూస్‌టుడే : శివపురంలోని పెద్దమ్మ గుడి దగ్గర అమరావతి-అనంతపురం రహదారిపైన బస్సు, కారు ఢీకొంది. అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పింది. శింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న చిన్న పిల్లల వైద్యుడు డా.ప్రవీణ్ కూమార్ విధులు ముగించుకొని కారులో అనంతపురానికి బయలుదేరాడు. శివపురంలోని పెద్దమ్మ ఆలయం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా అనంతపురం నుంచి తాడిపత్రికి వెళ్తున్న బస్సు వెనక నుంచి కారును ఢీకొంది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో వైద్యుడు ప్రవీణ్ కూమార్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. బస్సులో 62 మంది దాకా ప్రయాణికులు ఉన్నారని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

స్థలం కబ్జాపై ఫిర్యాదు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి మండలం రాయలచెరువులోని నగరూరు రోడ్డులో తమ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన చాగంటి వెంకటరమణమూర్తి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల మేరకు కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత లేని కారణంగా వివాదం తలెత్తడంతో స్థలంపై కోర్టు కెళ్లామన్నారు. ఖాళీగా ఉన్న స్థలంపై కన్నేసిన కొందరు చదును చేశారన్నారు. దౌర్జన్యంగా కబ్జా చేసేందుకు యత్నించిన ఐదుగురిపై పోలీసులు, తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశామని బాధితుడు తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులతో కలిసి విచారించనున్నట్లు సీఐ ఆర్.శ్రీనివాసులు తెలిపారు.

అంతర్ జిల్లా చోరుల అరెస్టు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి రూ.11 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు పట్టణ ఇన్‌ఛార్జి సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక ఠాణాలో విలేకరులతో కేసు వివరాలు వెల్లడించారు. గత నెల 30న జమ్మలమడుగు మండలం ధర్మాపురానికి చెందిన వెంకట శివారెడ్డి తన బైక్ అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం కోవెలకుంట్ల బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, పేరు సోముల గ్రామానికి చెందిన మహమ్మద్ ఆలీ అక్బర్ బాషా, జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడుకు చెందిన హరిప్రసాద్ పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా జమ్మలమడుగు, పెద్దముడియం, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, బనగానపల్లె, కొలిమిగుండ్ల, తాడిపత్రి, ముద్దనూరు, పోలీసు స్టేషన్‌లలో కేసులున్నట్లు గుర్తించారు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు చోరీలకు పాల్పడ్డారు.

'కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు తగవు'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ప్రజా ఆదరణ పొందుతున్న కూటమి ప్రభుత్వంపై వైకాపా నాయకుడు శైలజానాథ్ అసత్య ఆరోపణలు చేయడం తగదని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు బండి ఆదినారాయణ హితవు పలికారు. బుక్కరాయసముద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు ఇచ్చి అఖండ విజయాన్ని కట్టబెట్టారన్నారు. ఇది ఓర్వలేని శైలజానాథ్ ఈవీఎంల మాయాజాలంతో గెలిచారని వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున మూడుసార్లు శింగనమల బరిలో దిగిన శైలజానాథ్ డిపాజిట్లు కూడా దక్కలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైకాపా టికెట్టు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఎలాగైనా జగన్‌రెడ్డి దృష్టిలో పడి టికెట్ పొందడానికి ఇలా అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఓబులపతి, రాము, రామయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమావేశం

నార్పల, న్యూస్‌టుడే: నార్పల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మమతాదేవి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృంద సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పనుల పురోగతి, రికార్డుల నిర్వహణ, పారదర్శకత వంటి అంశాలపై సమీక్షించారు. సామాజిక తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించి, లోపాలు ఉంటే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు, న్యూస్‌టుడే: సామాజిక తనిఖీపై అనేక ఆరోపణలు రావడంతో జిల్లా అధికారి లోకేశ్వర్ రెడ్డి మంగళవారం మండల పరిధిలోని కల్లూరు, సింగవరం, గొడ్డుమర్రి పంచాయతీలలో పర్యటించారు. పనులు జరిగిన తీరును పరిశీలించారు. పూర్తి నివేదికను తెలపడానికి సమయం పడుతుందని తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

● పట్టించుకోని అధికారులు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకం, రవాణా ఆగడంలేదు. అధికారుల కళ్లముందే కొందరు అక్రమంగా తరలిస్తున్నా వారు నోరుమెదపడం లేదు. కొన్నిచోట్ల ట్రాక్టర్ల యజమానులే ఇసుక వ్యాపారం చేస్తున్నారు. కొందరు నాయకుల అండతో ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ప్రభుత్వం పేదలకు ఉచిత ఇసుకను సరఫరా చేస్తామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి వేరేలా ఉంది. కొందరు గ్రామాల్లో వంకలు, చెరువులను వదలడం లేదు. గుత్తి మండలంలోని లాచ్చానిపల్లి, తురకపల్లి, యంగన్నపల్లి, బసినేపల్లి, జక్కలచెరువు, మామిళ్లచెరువు, పెద్దొడ్డి, అనగానదొడ్డి, పి.ఎర్రగుడి, ఈశ్వరపల్లి తదితర గ్రామాల్లో ఇసుక దందా సాగుతోంది. తురకపల్లి గ్రామంలో ఏకంగా పదుల సంఖ్యలో కొందరు నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. మరికొందరు ఏకంగా గ్రామాల్లో డంపులు పెట్టి ఒక్కో ఇసుక ట్రాక్టర్ ధర రూ.2500 చొప్పున విక్రయిస్తున్నారు. బేతాపల్లి, అబ్బేదొడ్డి గ్రామాల్లో కూడా ఇలాంటి పరిస్థితే. లచ్చానిపల్లి గ్రామ సమీపంలోని పెద్ద వంక వద్ద సుమారు వందల ఎకరాల్లో ఇసుకను తరలించి పెద్ద పెద్ద గుంతలు పడేలా చేశారు. ఇసుక అక్రమ రవాణాను పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈశ్వరపల్లి వంకలో ఇసుక తవ్వుతున్నారు ఇలా..

నిఘా ఉంచుతాం

గ్రామాల్లో ఎక్కడెక్కడ ఇసుక అక్రమంగా తరలిస్తున్నారో తెలుసుకొని నిఘా పెడతాం. ఇసుక ట్రాక్టర్లు దొరికితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. - రామారావు, సీఐ, గుత్తి

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

గుంతకల్లు: ప్రభుత్వం విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఫీజులను చెల్లించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలని, విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని కోరారు. విద్యాలయాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వినోద్, భరత్, రోహిత్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం

గుంతకల్లు, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువకు రాగులపాడు వద్ద తూమును ఏర్పాటు చేసి కాలువను నిర్మించి మండలంలోని చెరువులు, కుంటలకు కృష్ణా జలాలను సరఫరా చేయాలని కోరుతూ దీక్షలు చేస్తున్న రైతులకు తాము మద్దతు ఇస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేంద్రగౌడ్ వెల్లడించారు. ఆయన మంగళవారం శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామని, తరువాత ప్రభుత్వం మారడంతో పనులను ప్రారంభించలేక పోయామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కాలువ గురించి నిర్ణయం తీసుకునే విధంగా సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతులు పట్టణంలో చేపట్టిన దీక్షలు ఐదో రోజుకు చేరాయి. మంగళవారం నాగసముద్రం గ్రామానికి చెందిన రైతులు దీక్షల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జయన్న, మందాలప్ప, సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, రాములరాయల్, మహమ్మద్‌గౌస్, మహేశ్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరం వద్ద మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేంద్రగౌడ్

ప్రజా సంక్షేమమే లక్ష్యం

పామిడి, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పామిడి, గుత్తి మండలాల బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని చైతన్యకాలనీకి చెందిన షేక్ మహబూబ్‌జాన్ అనే మహిళ ఇంటి వద్దకు వెళ్లి రూ.51వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నిరుపేదలకు అండగా నిలుస్తూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

(c) eenadu

అనంతపురం

● అనంతపురం ● రాప్తాడు

సహకార బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

తపోవనం (అనంత గ్రామీణం): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల నిరసనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఊపందుకున్నాయి. ఇప్పటికే సమ్మెలో ఉంటూ విధులను బహిష్కరించిన ఉద్యోగులంతా మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు చేశారు. సహకార బ్యాంకు శాఖల ఎదుట నినాదాలతో హోరెత్తించారు. అనంతపురం నగరంలోని రాంనగర్, ఆత్మకూరు, పామిడి, ఉరవకొండ శాఖల ఎదుట నిరసనలు వ్యక్తం చేశారు. రెండు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ఆంజనేయులు, హరికృష్ణ, ప్రతాప్‌రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్రుడి జయంతి

అనంత సాంస్కృతికం : నగరంలోని మొదటిరోడ్డు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం స్వామివారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సుప్రభాత సేవ, అష్టోత్తర సహిత పంచామృతాభిషేకం, అష్టాక్షర హోమం, కనక మహాపూజ, పుష్పార్చన మంగళం, రజత రథోత్సవ సేవ, మహానివేదన, మహామంగళ హారతులు, తీర్థప్రసాద పంపిణీ జరిగింది. మఠం మేనేజరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలంకరణలో రాఘవేంద్రుడు

స్వామి సన్నిధిలో..

వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథ మందిరంలో..

● ఉదయం 5.15కు సుప్రభాత సేవ ● 5.30కు కాకడ హారతి ● 6.30కు క్షీరాభిషేకం ● 7.15కు పంచామృత అభిషేకం ● 7.45కు అష్టోత్తర పూజ ● 8.00కు మంత్ర పుష్పం ● 8.30కు ప్రసాద వితరణ ● 12.00కు మధ్యాహ్న హారతి ● సా. 6.00కు ధూప్ హారతి ● 6.30కు సాయి భజన కీర్తనలు ● 8.30కు సేజ్ హారతి (పాన్పు సేవ)

రైల్వే స్టేషన్ వరసిద్ధి వినాయక దేవస్థానంలో..

✦ ఉదయం 7.00కు సర్వ దర్శనం ✦ 8.00కు పంచామృతాభిషేకం ✦ 8.15కు అలంకరణ సేవ ✦ 8.45కు మహా మంగళ హారతులు ✦ సాయంత్రం 5.30కు సర్వ దర్శనం ✦ 9.00కు పవళింపు సేవ, మహా మంగళ హారతులు

దేవాంగ రామలింగ చౌడేశ్వరీ దేవి ఆలయంలో...

● ఉదయం 6.00కు సర్వ దర్శనం ప్రారంభం ● 7.00 అలంకరణ సేవ ● 8.00కు అర్చన, సర్వదర్శనం ● 9.30కు మహామంగళ హారతులు, ప్రసాద వితరణ ● 10.30నుంచి 12.00వరకు రాహుకేతు పూజలు ● సాయంత్రం 5.00 నుంచి రాత్రి 8.00వరకు సర్వ దర్శనం ● 8.30కు మహా మంగళ హారతులు

మొదటి రోడ్డు శివాలయంలో..

✦ ఉదయం 5.00కు అభిషేకం ✦ 5.30కు సర్వదర్శనం ✦ 8.00కు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ✦ 8.45కు అలంకరణ సేవ ✦ 8.30కు మహా మంగళ హారతులు ✦ 8.45కు తీర్థ ప్రసాద పంపిణీ

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

రూ.లక్షలు పెట్టి కొన్నారు.. మూలన పెట్టారు!

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగరంలో రోజురోజుకూ పారిశుద్ధ్య సమస్యలు తాండవిస్తున్నా.. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రహదారులపై దుమ్మూ ధూళి పేరుకుపోయి వాహనదారులు శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ. కోట్లు వెచ్చించి మూలన పెట్టిన వాహనాలే అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యాలుగా నిలిచాయి.

● కొత్త యంత్రాలు, వాహనాలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తున్నా వాటిని ఉపయోగించుకోవడానికి అధికారులు మాత్రం సిద్ధంగా లేరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని ప్రధాన రోడ్లు సుభాష్‌రోడ్డు, రాజురోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, గడియార స్తంభం, బళ్లారి బైపాస్, సప్తగిరి కూడలి నుంచి ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా రాంనగర్, విద్యుత్తు కూడలి, హౌసింగ్ బోర్డు మీదుగా వెళ్లే స్మార్ట్ సిటీ రహదారుల్లో దుమ్ము లేస్తోంది. ముఖ్యంగా ఈ మార్గాల్లోనే వాహనాల తాకిడి అధికంగా ఉంటోంది.

ఏడాది తిరక్కుండానే

జాతీయ స్వచ్ఛత గాలి పథకం ద్వారా గతేడాది రూ.కోటి వెచ్చించి రెండు మిషన్లు కొనుగోలు చేశారు. అవి కొన్ని రోజులు మాత్రమే వినియోగించి అనంతరం వాటిని మూలకే అంకితం చేశారు. రోడ్లపై దుమ్ము తగ్గించడానికి స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేశారు. వేసవిలో రోడ్ల మీద చల్లదనంతోపాటు శుభ్రంగా ఉండటానికి వాటర్ స్ప్రింక్లర్ మిషన్‌కు రూ. 47 లక్షలు వెచ్చించారు. కనీసం నెల రోజులు కూడా వాటిని వినియోగించకుండా అలా పక్కన పెట్టి గాలికొదిలేశారు.

సాంకేతికత అందుబాటులో ఉన్నా

వినియోగంలో లేని స్వీపింగ్ మిషన్లు

ప్రధాన రహదారుల్లో దుమ్ము ఎక్కువగా ఉన్నా స్వీపింగ్ మిషన్లను వినియోగించకుండా పక్కన పెట్టారు. పారిశుద్ధ్య కార్మికులు పెద్ద రోడ్లల్లో శుభ్రం చేయాలంటే గ్యాంగ్ వర్కు పెట్టాల్సి ఉంటుంది. సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వచ్చినా.. మిషనరీలు ఉపయోగించే ప్రాంతాల్లో కార్మికులతోనే శుభ్రం చేయించడం గమనార్హం. స్వీపింగ్ మిషన్ల ద్వారా శుభ్రం చేయడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. అప్పట్లోనే రూ. కోటి వరకు వెచ్చించారు. కొన్ని రోజులు ఉపయోగించి మూలన పడేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

మేమున్నాం...మీకు తోడుగా
సమస్య: మారుతీనగర్ కేజీబీవీ పాఠశాల సమీపంలో రాత్రి 8,9గంటలకు తాగుబోతులు వస్తున్నారు.-నారాయణస్వామి
సమాధానం : పరిశీలించి తాగుబోతులు రాకుండా చర్యలు తీసుకుంటాం.
సమస్య : రాంనగర్ ఆర్టీ కార్యాలయం వద్ద ఎద్దులకట్టి పేరుకుపోయింది. వాహనాల్లో వెళ్లేవారికి ఇబ్బందిగా ఉంది.-ప్రదీప్‌కుమార్
సమాధానం : పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.
(పై ప్రశ్నలకు నగరపాలక ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఓ నరసింహ, డీఈ సత్యనారాయణ సమాధానాలు ఇచ్చారు.)
- న్యూస్‌టుడే, అశోక్‌నగర్

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : గౌరి : బూకీ, గాయత్రి : నవాబ్ కేఫ్, గౌతమి : వన్ లవ్, నీలిమ : అల్ఫా, లక్ష్మీ : కపుల్ ఫ్రెండ్లీ, ఎస్వీ సినిమా : పంకీ, శాంతి : హే బల్వంత్, సుధా : మన శంకర వరప్రసాద్.

నగరంలో ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : ● జనసేన ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా నేడు రాంనగర్‌లోని యాదవ కల్యాణ భవన్‌లో జనసేన నాయకుల సమావేశం...పాల్గొననున్న ఏపీ హస్తకళ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్.

● అయ్యవారిపల్లి గ్రామంలో బుధవారం ఎద్దులచే బండలాగుడు పోటీలు.

'ఆ ఘాట్ రజకులదే'

రాప్తాడు, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు ఆక్రమించిన ధోబీ ఘాట్‌పై రజకులకు సానుకూలంగా తీర్పు వచ్చిందని కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పరమేశ్వర్ తెలిపారు. రాప్తాడు మండలం యర్రగుంట గ్రామంలో సర్వే నంబరు 169లో ఉన్న 9 ఎకరాల భూమిని ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రజకుల ధోబీ ఘాట్ కోసం కేటాయించారు. అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు కేశవరెడ్డి ముగ్గురు పేర మీద నకిలీ పట్టాలు సృష్టించి దౌర్జన్యంగా ఆక్రమణ చేశారన్నారు. ఆర్డీఓ కోర్టు ఆ భూమి రజకులకు చెందుతుందని తీర్పు ఇచ్చిందన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను కేంద్ర బృందం పరిశీలకులు సచ్చిదానంద ప్రసాద్ తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న డిజిటల్ తరగతులు, రసాయన, భౌతికశాస్త్రం ల్యాబ్‌లు, తాగునీటి వసతులు, మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం, విద్యార్థులకు అందించే బోధన అంశాలను క్షుణ్ణంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులపై విద్యార్థుల అభిప్రాయాలను సేకరించారు.

బస్సు, కారు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

శింగనమల, న్యూస్‌టుడే : శివపురంలోని పెద్దమ్మ గుడి దగ్గర అమరావతి-అనంతపురం రహదారిపైన బస్సు, కారు ఢీకొంది. అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పింది. శింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న చిన్న పిల్లల వైద్యుడు డా. ప్రవీణ్ కూమార్ విధులు ముగించుకొని కారులో అనంతపురానికి బయలుదేరాడు. శివపురంలోని పెద్దమ్మ ఆలయం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా అనంతపురం నుంచి తాడిపత్రికి వెళ్తున్న బస్సు వెనక నుంచి కారును ఢీకొంది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో వైద్యుడు ప్రవీణ్ కూమార్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. బస్సులో 62 మంది దాకా ప్రయాణికులు ఉన్నారని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

స్వచ్ఛందంగా రక్తదానం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ రక్తనిధి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉపకులపతి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడడానికి యువత ముందుకు రావాలన్నారు. రక్తదాతలకు ధ్రువపత్రాలు, రూ.3లక్షల బీమా సదుపాయం ఉంటుందని రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. 182 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి మమత, శోభారాణి, రామశేఖర్‌రెడ్డి, నాగప్రసాద్‌నాయుడు, కళ్యాణరావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి పట్టాభిషేకానికి సర్వం సిద్ధం

అనంత సాంస్కృతికం : వీరబ్రహ్మేంద్ర స్వామి కొలువుదీరిన బ్రహ్మంగారి మఠం 12వ పీఠాధిపతి వెంకటాద్రి స్వామికి ఈనెల 26న వైభవంగా జరగనున్న రత్న సింహాసన పట్టాభిషేకం మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆమేరకు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కుర్లపల్లి రంగాచారి ఒక ప్రకటనలో తెలిపారు.

హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావును కలిసిన జలవనరుల ఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు

జలవనరుల ఎన్జీఓ డైరీ ఆవిష్కరణ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే : ఏపీ ప్రభుత్వ జలవనరుల ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో 2026 సంవత్సర డైరీని ఆవిష్కరించారు. మంగళవారం హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, హంద్రీనీవా ఎస్ఈ స్వరూప్‌కుమార్ వేర్వేరుగా డైరీలను విడుదల చేశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఎన్జీఓ నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సహాధ్యక్షుడు ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు శివనాగప్రసాద్, హంద్రీనీవా విభాగం అధ్యక్షుడు మహమ్మద్ బాబా, కార్యదర్శి రాజేశ్, జలవనరుల విభాగం అధ్యక్షుడు నారాయణస్వామి, వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్మయ మిషన్ అమృత శోభాయాత్ర

అనంత సాంస్కృతికం: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 'చిన్మయ అమృత శోభాయాత్ర' భక్తిశ్రద్ధలతో జరిగింది. చిన్మయ మిషన్ స్థాపించబడి 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న చిన్మయ మిషన్ అమృతోత్సవాల్లో భాగంగా నగరానికి వచ్చిన స్వామి పాదుకలను శోభాయాత్రగా పురవీధుల్లో ఊరేగించారు. ప్రముఖుల ప్రసంగం అనంతరం తపోవనం వాణి ఆధ్వర్యంలో కోలాటం, కూచిపూడి నృత్యాలు, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కోయంబత్తూరు చిన్మయ మిషన్ బాధ్యులు అనుకూలానంద స్వామీజీ, ఒంగోలు జిల్లా చిన్మయ మిషన్ బాధ్యుడు సత్యానంద స్వామీజీ, అనంత జిల్లా బాధ్యుడు ఆత్మ విదానంద స్వామీజీ, చిన్మయ మిషన్ అనంత అధ్యక్షుడు తాళంకి సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

పురవీధుల్లో కొనసాగుతున్న శోభాయాత్ర

నగర పారిశుద్ధ్యం మెరుగుపడాల్సిందే!

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : అనంతపురం నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలని సహాయ కలెక్టరు సచిన్ రహర్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరపాలక కౌన్సిల్ హాల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలతో పారిశుద్ధ్యం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఉదయం 5.30గంటల నుంచి 10.30 గంటల వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో ఉండాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడైనా విధుల్లో లేకున్నా, రోడ్డు మీద చెత్త కనిపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఈ రాజశేఖర్, డిప్యూటీ కమిషనరు అంజయ్య, ఈఈ షాకీర్, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఓ నరసింహ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తలుపూరులో మంగళవారం జరిగింది. కుటుంబ సమస్యలు, భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోవడంతో కూలి పనులు చేసుకునే **ధర్మతేజ** (27) మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో ఉరేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు ధర్మతేజను ప్రభుత్వాసుపత్రికి తరలించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌతమ్ తెలిపారు.

మోసం కేసులో 12 మంది అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మానవహక్కుల సంరక్షణ, అవినీతి నిర్మూలన దళం సిబ్బంది పేరుతో ఓ వ్యక్తిని బెదిరించి రూ.24 లక్షలు తీసుకుని మోసగించిన 12 మంది నిందితులను దేవనహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి- అనంతపురం నివాసి కృష్ణకుమార్‌రెడ్డి, బెంగళూరు గ్రామీణ జిల్లా సూలిబెలె నివాసి అహ్మద్ షరీఫ్, బాగేపల్లికు చెందిన వేణుగోపాల్, ఆనేకల్ సంపంగిరామ, శిడ్లఘట్ట నారాయణస్వామి, చింతామణి కేవీ శివ, మదనపల్లి టీవీ మురుగేశ్, అనంతపురం నివాసి లతీఫ్, కోలారు జిల్లా భట్టరహళ్లి వెంకటేశ్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 14. 60 లక్షలు నగదు, మానవహక్కుల సంరక్షణ అవినీతి నిర్మూలన దళం బోర్డుతో కూడిన వాహనాన్ని, 13 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీటీ పరిరక్షణకు పోస్టు కార్డు ఉద్యమం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : సేవ్ ఆర్డీటీ పేరుతో లక్షమందితో పోస్టు కార్డులను ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పంపనున్నామని అనంతపురం జిల్లా వైకాపా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైకాపా జిల్లా కార్యాలయంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం బాధ్యులు రంగయ్యతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 10న కుందుర్పిలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. ఆర్డీటీని రక్షించుకోవడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో అందరూ పాలుపంచుకోవాలనాన్నరు.

భూ స్వాధీన అవార్డు ప్రక్రియలో అక్రమాలపై విచారణ

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామ సర్వే నంబరు 47-3లో భూ స్వాధీన అవార్డు ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. డ్రాఫ్ట్ అవార్డు, తుది అవార్డు జారీ సమయంలో విధివిధానాలు పాటించలేదని ప్రభుత్వం గుర్తించింది. 2013 భూ స్వాధీన చట్టం సెక్షన్76 ప్రకారం వివాదాన్ని ఎల్ఏ, ఆర్ అండ్ఆర్ అథారిటీకి పంపకపోవడమే ప్రధాన అభియోగం. అప్పటి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ. మలోల(అనంతపురం డీఆర్వో), విశ్రాంత తహసీల్దారు ఎం. సర్వేశ్వర శ్రీనివాస్‌పై విచారణకు మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. జేసీ మొగిలి వెంకటేశ్వర్లును విచారణాధికారిగా నియమించారు. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు డీఆర్వో ఎన్. విజయకుమార్‌ను నియమించారు. ఆరు వారాల్లోగా విచారణ నివేదికను అందించాల్సి ఉంది.

విచారణకు గైర్హాజరు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : అనంతపురానికి చెందిన డీలరు సురేశ్‌కుమార్‌రెడ్డి అనంతపురం ఏడీఏ అల్తాఫ్‌అలీఖాన్‌పై జేసీ విష్ణుచరణ్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. జేడీఏ ముదిగల్లు రవి ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్ ఓబుళపతిని విచారణ అధికారిగా నియమించారు. మంగళవారం ఏపీ ఆగ్రోస్ కార్యాలయంలో విచారణకు డీలరు, ఏడీఏ హాజరవ్వాల్సి ఉంది. డీలరు మాత్రమే హాజరై లిఖిత పూర్వకంగా తనకు జరిగిన అన్యాయాన్ని రాసిచ్చారు. ఇదివరకు డీలరు బిల్లులు ఇవ్వకుండా ఓ రైతుకు మందులు విక్రయించారన్న ఫిర్యాదు నేపథ్యంలో తప్పుడు నివేదిక ఇచ్చి తన దుకాణ అనుమతులను రద్దు చేసినందుకు ఏడీఏపై డీలరు ఫిర్యాదు చేయడం గమనార్హం.

'ఆర్టీసీని పరిరక్షించుకుంటాం'

అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే : ఆర్టీసీ ప్రైవేటు పరం కాకుండా పరిరక్షించుకుంటామని నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జోనల్ సంయుక్త కార్యదర్శి డీఎన్. రెడ్డి మాట్లాడుతూ డిపోలను విద్యుత్తు బస్సుల పేరిట ప్రైవేట్‌కు అప్పగించడం తగదన్నారు. ఆర్టీసీ డిపోలను, స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. విద్యుత్తు బస్సులను నేరుగా ఆర్టీసీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ జిల్లా ఛైర్మన్ సూరిబాబు, డిపో కార్యదర్శి రామాంజినేయులు, నేతలు శ్రీరాములు, నారాయణస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

చెత్త కుండీ ఏర్పాటు చేయరూ!

నగరంలోని ఆర్ట్స్ కళాశాల, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపైనే చెత్తా చెదారం పేరుకుపోతోంది. నిత్యం చెత్తను తరలిస్తున్నారు. అయితే చుట్టుపక్కల హోటల్ నిర్వాహకులు రాత్రి సమయానికి పెద్ద ఎత్తున చెత్తను రోడ్డుపై పడేస్తున్నారు. చెత్తపై పశువులు సంచరిస్తున్నాయి. వాహనదారులకు అడ్డుగా వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కనీసం చెత్త కుండీ ఉంటే చెత్తను అందులో పడేసేవారు. ఆదిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కమలానగర్

'పీఎంశ్రీపై అలసత్వం చూపొద్దు'

సహాయ కార్యదర్శి సచ్చిదానంద ప్రసాద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిర్లక్ష్యం, బాధ్యతలేని తనం కనిపిస్తోంది. దీని మూలంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఉంటుందని, ఏ దశలోనూ అలసత్వం చూపొద్దని కేంద్ర పీఎంశ్రీ పథకం సహాయ కార్యదర్శి సచ్చిదానంద ప్రసాద్ పేర్కొన్నారు. ఒక రోజు పర్యటన నిమిత్తం ఆయన అనంతకు వచ్చారు. తొలుత ఆత్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆ తర్వాత కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో జేసీ విష్ణు చరణ్‌తో కలిసి రెండు జిల్లాల విద్యాశాఖ, ఎస్ఎస్ఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఈ పథకం ఎంతగానో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. జేసీ మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలలపై మరింత శ్రద్ధ పెడతాం. పథకాన్ని వంద శాతం అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏవైనా లోపాలు ఉంటే సత్వరమే సరిచేస్తామన్నారు. సమావేశం ప్రారంభంలో జేసీ విష్ణుచరణ్ కేంద్ర సహాయ కార్యదర్శి సచ్చిదానంద ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సమావేశంలో అనంత, శ్రీసత్యసాయి జిల్లాల డీఈఓలు ప్రసాద్‌బాబు, క్రిష్టప్ప, రాష్ట్ర పరిశీలనకుడు వెంకటరమణ, ఏపీసీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

'స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడండి'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : కార్పొరేషన్‌కు చెందిన స్థలాలను కబ్జాకోరుల నుంచి కాపాడాలని సీపీఐ నగరకార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. మంగళవారం నగరపాలకలో నిరసన తెలిపి కొత్త కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సమస్యలను వివరించారు. నగరపాలకకు సంబంధించిన సెంట్రల్ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోవడం లేదన్నారు. గతంలోనే ఈ అంశంపై ఈనాడులో కథనాలు వచ్చిన అంశాన్ని ప్రస్తావించారు. వేసవి సమీపిస్తుండటంతో శివారు కాలనీల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చెత్త సేకరణ అధ్వానంగా ఉందని, వెంటనే ఇంటింటా చెత్త సేకరణ చేయాలన్నారు. నగరపాలకలో ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, తగు చర్యలు తీసుకోవాలన్నారు.

నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అసంపూర్తి భవనాలు.. తప్పని తిప్పలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నాటి ప్రభుత్వం నాడు-నేడు పేరుతో మోసం చేసింది. ప్రస్తుతం అసంపూర్తి పనులు, చాలీచాలని గదుల మధ్య విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

● తోపుదుర్తి ప్రాథమిక పాఠశాలలో సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. గత వైకాపా పాలనలో నాడు-నేడు పనుల ద్వారా అదనపు తరగతి గది నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. దాదాపు మూడేళ్ల పాటు నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయకుండా వదిలేశారు. ఇనుప చువ్వలు తేలి విద్యార్థులకు ఇబ్బందిగా మారడంతో నేడు అధికారులు స్పందించి అరకొరగా పూర్తి చేశారు.

● పాఠశాలలో మొత్తం 5 తరగతులకు 114 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే 5 గదులు అందుబాటులో ఉండగా ఒక గదిని ఉపాధ్యాయులు వినియోగిస్తున్నారు. ఒక తరగతికి చెందిన విద్యార్థులను అసంపూర్తి భవనంలో ఉంచి పాఠాలు చెబుతున్నారు. పాఠశాల బయట ఉన్న కంకరలో విద్యార్థులు వెళుతూ కిందపడి గాయాలపాలవుతున్నారు. ఎంఈవో నరసింహారెడ్డిని వివరణ కోరగా నిధులు వచ్చిన వెంటనే నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు.

కొల్హాపురమ్మ గుడిలో విద్యార్థులకు తరగతులు

గదుల్లేక.. గుడిలోనే బడి

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం పాలబావి ప్రాథమిక పాఠశాలలో 68 మంది విద్యార్థులకు 2 గదులు ఉన్నాయి. వాటిలో ఒక గది పూర్తిగా దెబ్బతినింది. ఒక గది మాత్రమే ఉపయోగంలో ఉంది. ఇందులో 5 తరగతులు నిర్వహించలేక సమీపంలోనే కొల్హాపురమ్మ గుడినే బడిగా చేసుకొన్ని 3వ తరగతి విద్యార్థులకు, పక్కనే ఉన్న చర్చిలో 1వ తరగతి, పాఠశాల వరండాలో 5వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వంటశాల, భోజనశాల లేకపోవడంతో ఆరుబయట వండి తినాల్సిన పరిస్థితి నెలకొంది.

సాత్‌గుడి చీనీ రకం అనుకూలం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాకు సాత్‌గుడి చీనీ రకం సాగు అనుకూలమని, అన్ని తెగుళ్లకు తట్టుకుని మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానశాఖ ఉప సంచాలకులు ఉమాదేవి పేర్కొన్నారు. జైన్ ఇరిగేషన్ సంస్థ శాస్త్రవేత్తల బృందం లడానియా, చేతన్‌గుల్వే, శంకరమానే, హనుమంతరెడ్డి జిల్లాకు వచ్చింది. జిల్లాలో ఉద్యానశాఖ అధికారులతో కలిసి మూడురోజులుగా చీనీతోటలను సందర్శించారు. చీనీ కాయల్లో రసాన్ని పరిశీలించారు. నార్పల, పుట్లూరు, అనంతపురం గ్రామీణంలోని చీనీ తోటల్లో యాజమాన్య పద్ధతులు, పంటకు ఆశించే తెగుళ్లపై రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం డీడీహెచ్ ఉమాదేవి మాట్లాడుతూ జిల్లాలో 35 వేల హెక్టార్లలో సాత్‌గుడి చీనీ రకం సాగులో ఉందన్నారు. ఈ రకం పంట వేరుకుళ్లు, సిట్రస్ మెజాయిక్ వైరస్, పొలుసు పురుగు, నల్లమంగు వంటి తెగుళ్లతో పంట దిగుబడులు తగ్గి నష్టపోతున్నారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా బ్రెజిలియన్ ఆరెంజ్ రకమైన సాత్‌గుడి రకాన్ని జైన్ ఇరిగేషన్ సంస్థ ప్రయోగాత్మకంగా జిల్లాలో ఐదేళ్ల కిందటే చీనీ సాగు చేయించిందన్నారు. ఈరకం చీనీతోటలు కాపుకొచ్చి మంచి దిగుబడులు వస్తున్నాయని డీడీహెచ్ వివరించారు.

విద్యార్థి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : ధర్మవరం మండలం ఉప్పునేసనపల్లికి చెందిన సోమర లక్ష్మీనారాయణ మృతి చెందాడు. ఆయన కూతురు సోమర అర్చన బెంగళూరులోని గీతం యూనివర్సిటీలో బీటెక్ నాలుగో ఏడాది చదువుతోంది. చదువుకునేందుకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కమ్మ సంఘం నాయకులు ముందుకొచ్చారు. సంఘంలో సభ్యులంతా చందాలు వేసుకుని రూ. లక్ష వసూలు చేశారు. మంగళవారం కమ్మభవన్‌లో విద్యార్థి తల్లి లలితమ్మకు ఆర్థిక సాయంగా చెక్కును అందజేశారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాంబే డైయింగ్ నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, సీవీ కొండయ్య, రామకృష్ణ, శ్రీరాములు, వెంకటనారాయణ, కోనంకి రామయ్య పాల్గొన్నారు.

లలితమ్మకు చెక్కు అందజేస్తున్న నాగన్న, సూర్యనారాయణ, తదితరులు

ఒప్పంద ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని ఏపీఆర్ పాఠశాలలో ఒప్పంద పద్ధతిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు ప్రిన్సిపల్ స్వాతి తెలిపారు. పదో తరగతికి గణితం, భౌతికశాస్త్రం బోధించేందుకు ఎమ్మెస్సీ ఫిజిక్స్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

CHANGE OF NAME

I, Challa Sreenivasulu, hereby declare that my spouse's name has been wrongly mentioned as BHARATHI BOMINENI in Passport.The correct name of my spouse is BHARATHI BOMMINENI. Henceforth, I declare that my spouse's name shall be written as BHARATHI BOMMINENI for all passport purposes.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా అనంతపురము పట్టణ ప్రజలకు తెలియజేయడం ఏమనగా, అనంతపురము రూరల్ సిండికేట్ నగర్‌లో నివాసం వుంటున్న మాసుల సునీత, భర్త: లేట్ యర్రంశెట్టి సుధాకర్ బాబు, డి.నెం.2-1-114, సిండికేట్ నగర్, రామకృష్ణపురం, రాచానపల్లి, అనంతపురము జిల్లా. నా క్లైంటు సునీత, భర్త: సుధాకర్ గారి మొదటి భార్య పిల్లలు యర్రంశెట్టి సామిక నాయుడు మరియు యర్రంశెట్టి సాత్విక నాయుడు మధ్య అనంతపురము జిల్లా కోర్టులో దిగువ ఇచ్చిన ఆస్తిపై సివిల్ కేసు నడుస్తున్నది. కేసు నెం.ఓయస్. 691/2025. కావున సదరు ఆస్తిపై ఎటువంటి క్రయ, విక్రయాలు జరుపకూడదు. ఒకవేళ లావాదేవీలు జరిపినచో రాసిచ్చిన వారిపై వ్రాయించుకొన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

ఆస్తి వివరములు

Govt.Dry	S.No	A-c	A-c	A-c	H.S	Plot No.
Govt.Dry	112-1 112-3	20.74 pyki	4.50 pyki	0.03	0.012	28

Boundaries: East: Plot No.29, **South:** Plot No.7, **West:** Plot No.27, **North:** Road.

Measurements: East-West: 25 feet or 7.75 Meters, **North-South:** 52 Feet or 16.12 Meters. Total Measurements: 0.03 cents or 144.44 Sq. yards only

వై.గోవిందరాజులు, అడ్వకేట్,
డి.నెం. 6-198-1, భైరవనగర్, అనంతపురము. సెల్: 8555067626

(c) eenadu

21 రోజులే అవకాశం..
గడువు దాటితే అపరాధం!

జనన, మరణ నమోదుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. పాఠశాలల్లో ప్రవేశాలు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్సులు, ఆధార్, పాస్‌పోర్టు తదితర పత్రాలు పొందేందుకు జనన ధ్రువీకరణ తప్పనిసరి. ఆస్తి వ్యవహారాలు, బ్యాంకు ఖాతాల్లో నిధులు బదలాయించడం తదితర పనులకు మరణ ధ్రువీకరణ పత్రాలు కీలకమైనవి. ఈ పత్రాల కోసం నమోదులో చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

ధ్రువ పత్రాలను తీసుకుంటున్న లబ్ధిదారులు

- జనన, మరణాలు సంభవిస్తే తప్పనిసరిగా 21 రోజుల్లో నమోదు చేసుకోవాలి. తరువాత 21 నుంచి 30 రోజుల్లో నమోదు చేస్తే రూ.25 అపరాధ రుసుం చెల్లించాలి.
- 30 రోజుల తరువాత నుంచి ఏడాదిలోపైతే జిల్లా రిజిస్ట్రార్ (జనన, మరణాలు) రాత పూర్వక వినతితో పాటు రూ.250 రుసుం చెల్లించాల్సి ఉంటుంది.
- ఏడాది దాటితే కలెక్టర్ (జిల్లా మేజిస్ట్రేట్) లేదా ఆర్డీవో (సబ్ డివిజన్ మేజిస్ట్రేట్) అనుమతితో పాటు అపరాధ రుసుం కింద రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఫారం-14 ద్వారా అఫిడవిట్ సమర్పించాలి.
- బిడ్డ పుట్టిన వెంటనే కొందరు జనన ధ్రువపత్రాల్లో పేరు నమోదు చేయడం లేదు. అలాంటి వారు 12 నెలల్లోపు ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చు. 12 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పేరు చేర్చాలనుకుంటే రూ.250 రుసుం చెల్లించాలి.
- జననం లేదా మరణం అసుపత్రిలో జరిగితే ఆ సంస్థ అధికారులు బాధ్యతగా నిర్ణీత ఫార్మెట్‌లో సమాచారాన్ని రిజిస్ట్రార్‌కు పంపిస్తారు. ఇంట్లో జరిగితే ఇంటి యజమాని లేదా కుటుంబ పెద్ద ఆ సమాచారాన్ని అందించే బాధ్యత తీసుకోవాలి. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టినా, మృతి చెందిన ఆసుపత్రి సిబ్బందే ధ్రువపత్రాలు ఇస్తారు.

జిల్లాలో జననాలు : 20,474, మరణాలు 11,838
(2025 జనవరి నుంచి ఈ నెల 20 వరకు)

గస్తీకి సుస్తీ..
దొంగల జబర్దస్తీ
అటకెక్కుతున్న నైట్ బీట్లు

పోలీసు గస్తీ లేదంటే చోరీలకు దొంగలను ఆహ్వానించినట్లే.. జిల్లాలో వేసవి కాలంలో తమ చేతలతో సవాలు విసిరే చోరులు ఈసారి ముందే బెంబేలెత్తిస్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లే కాకుండా ఆలయాలను కూడా వదలడం లేదు. చిన్న ఆలయాల్లో హుండీలు, పెద్ద కోవెల అయితే ఆభరణాలు ఎత్తుకెళ్తున్నారు. ప్రధాన పట్టణాల్లో రాత్రిళ్లు పోలీసులు గస్తీలు నిర్వహించకపోవడమే దీనికి కారణమన్న ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. - న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు, లక్కిరెడ్డిపల్లె

కొన్ని ఉదాహరణలివి..

- మదనపల్లె పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని గోవర్ధనగిరి శ్రీకృష్ణాలయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి ఆలయంలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. రూ.30 లక్షలు విలువైన నగలు, హుండీలు దోచుకెళ్లడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు.
- ములకలచెరువు మండలం సోంపాలెం గ్రామంలో 16వ శతాబ్దంలో నిర్మించిన పురాతన చెన్నకేశవ స్వామి ఆలయంలోని మొగ్గను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గుప్తనిధుల అన్వేషణలో భాగమేనని పోలీసులు అనుమానిస్తున్నారు.
- లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేటలో చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలోని హుండీని దుండగులు చోరీ చేశారు. ఆలయానికి కొంత దూరం తీసుకెళ్లి డబ్బు తీసుకుని హుండీని పడేసి వెళ్లారు.. గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించారు.
- మదనపల్లె పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో పట్టపగలే తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి రూ.10 లక్షలు విలువైన బంగారు నగలు, డబ్బు ఎత్తుకెళ్లారు. ఇంటి యజమానులు తిరిగి వచ్చే సరికి ఇళ్లు ఖాళీ అయింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

మదనపల్లెలో దొంగలు పగులగొట్టిన బీరువా

- ఈ నెల 8వ తేదీన మదనపల్లె పట్టణానికి చెందిన మాజీ సైనికుడు తన భార్యతో కలసి నిమ్మనపల్లె మండలంలోని తవళం నేలమల్లేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఇంట్లో ఉన్న రూ.10 లక్షలు విలువైన బంగారు నగలు ఎత్తుకెళ్లి పోయారు.
- జిల్లాలో దొంగలు పేట్రేగిపోతున్నారు.. రెండు నెలల కాలంలో మూడు ఆలయాల్లో చోరీలు జరగ్గా పట్టణంలోని రెండిళ్లలో చోరీలు జరిగాయి. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ దుండగులు హార్డ్‌డిస్కును అపహరించి మరీ చోరీ చేస్తున్నారు.
- ములకలచెరువు మండలంలో జరిగిన చోరీలో దుండగులు ఆలయానికి విద్యుత్తు సరఫరా తొలగించి మరీ ఆలయం లోపల గోపురం కింద ఉన్న మొగ్గను ధ్వంసం చేశారు. అందులో పురాతన నాణేలు ఉంటాయనే ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. దేవుళ్లకు కూడా రక్షణ లేకుండా పోతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.
- ఓ వైపు బంగారు ధరలు పెరుగుతుండటంతో దుండగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో ఆలయాల వద్ద విజిట్ పుస్తకం ఏర్పాటు చేసి రాత్రుళ్ల పోలీసు గస్తీ వెళ్లిన సమయంలో సంతకాలు చేసి వచ్చే వారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ ఆగిపోయిందని ఆలయాల నిర్వాహకులు అంటున్నారు. అధికారులు స్పందించి గస్తీ పెంచాలని కోరుతున్నారు.

ప్రత్యేక బృందాలతో విచారణ

జిల్లాలో ఇటీవల జరిగిన చోరీ కేసులపై మూడు బృందాలతో పాటు సాంకేతిక బృందంతో నిఘా పెట్టాం. క్లూస్, డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దింపి ఆధారాల కోసం గాలిస్తున్నాం. ఆలయాల వద్ద విజిట్ బుక్ పద్ధతిని పటిష్ఠం చేస్తున్నాం. సిబ్బందికి పింగర్ ప్రింట్ యంత్రాలిచ్చి అనుమానాస్పదంగా తిరిగే వారి వేలిముద్రలు సేకరిస్తాం. ఆలయాల వద్ద కమిటీ సభ్యులు సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది.
- వెంకటాద్రి, అదనపు ఎస్పీ, అన్నమయ్య జిల్లా

ఎంత పనిచేశావు భువనా!

- చదవడం.. చావడానికేనా?
- ఉరికి వేలాడిన బీటెక్ విద్యార్థిని

ఏం చెబుతున్నాం బిడ్డలకు?
ఏం నేర్పుతున్నాం విద్యార్థులకు?
కష్టం వచ్చినప్పుడు ఎదుర్కొనే ధైర్యం చెప్పలేని చదువులెందుకు?
బాధ కలిగినప్పుడు తట్టుకునే ఓర్పునివ్వని విద్యలెందుకు?
ఆర్థిక స్థితిని అర్థం చేసుకోవాలని వివరించని వ్యవస్థలెందుకు?
బీటెక్ చదువుతుండగానే ఉద్యోగం సాధించిన విద్యార్థిని కారణాలు చెప్పకుండానే ఉరికి వేలాడింది

చిన్న చిన్న కారణాలకే ప్రాణాలు తీసుకుంటే తప్పెవరిది?
ఆలోచన నేర్పని పుస్తకాలదా?
అణకువను చెప్పని పెద్దలదా?
ఆవేశం ఇచ్చిన సమాజానిదా?

ఏం నేర్చుకుంటున్నారు?
ఏం చదువుతున్నారు?
అన్ని అవయవాలు సక్రమంగా లేకున్నా చక్కటి జీవితాన్ని గడుపుతున్న వారిని చూడరా!
... మనకే ఈ ప్రశ్నలు

పుంగనూరు మండలం మంగళం గ్రామానికి చెందిన భువన (22) తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రంగంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ నాలుగో ఏడాది చదువుతోంది. సోమవారం సాయంత్రం గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సురేంద్రరెడ్డి, జానమ్మలకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె భువన బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. కొన్నిరోజుల క్రితం కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికైంది. ఈ ఏడాది మే నెలలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. రెండు రోజుల క్రితం ఇంటికి వెళ్లి అందరితో ఎంతో సంతోషంగా గడిపి, ఉద్యోగం వచ్చిందన్న ఆనందాన్ని అందరితో పంచుకుంది. సోమవారం మళ్లీ కళాశాలకు వెళ్లిన ఆమె ఏం జరిగిందో తెలియదుగానీ గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కుమార్తె మృతదేహాన్ని చూసి హృదయం ద్రవించేలా కన్నీరుమున్నీరయ్యారు. ఎంతో చలాకీగా ఉంటూ పది, ఇంటర్‌లో టౌన్, రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభావంతురాలైన కుమార్తె చనిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు బోరున విలపిస్తున్నారు. చేతికొచ్చిన బిడ్డ బలవన్మరణానికి పాల్పడడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక తల్లడిల్లుతున్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

తల్లిదండ్రులు సర్వం ధారపోసినా..
ప్రాణం పోయాక బతకలేమన్న స్పృహ కలగడం లేదా?
చచ్చి ఏం సాధిస్తారు..
బతికి కోరుకున్నది పొందాలన్న ఆలోచన చేయడం లేదా?
....విద్యార్థులారా మీకే ఈ ప్రశ్నలు

రక్తదానమా..
మేమున్నాం!
అరుదైన గ్రూపుల బృందం భరోసా ☛ అత్యవసరాల్లో అండగా యువత

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని పెద్దలు చెబుతుంటారు.. అత్యవసరాల్లో రక్తదానం ప్రాణదానంతో సమానం. సాధారణ రక్త గ్రూపులైతే ఎక్కడైనా దొరకవచ్చు. కానీ అరుదైన రుధిరం మాత్రం దొరకాలంటే తిప్పలు తప్పవు. కానీ అరుదైన అలాంటి రక్తం మేమిస్తామంటూ భరోసా ఇస్తున్నారు పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. బ్లడ్ గ్రూపింగ్ ద్వారా తమ రక్తం గ్రూపును తెలుసుకుని అరుదైన రక్తదాతలంతా మేమున్నామంటూ ఆపన్నహస్తం అందిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ వెంకట్రామయ్య, బోధనా సిబ్బంది వీరిని అభినందిస్తున్నారు.

రక్తదాన శిబిరంలో పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రాణం నిలిపినట్లే

నాది అరుదైన రక్తం. ప్రమాదాలు, శస్త్ర చికిత్సల సమయంలో బీ-నెగటివ్ గ్రూపు రక్తం అవసరమైతే సమాచారం అందిస్తే చాలు స్పందిస్తున్నా. రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాను. నేనిచ్చే రక్తంతో ఒక ప్రాణం నిలుస్తుందంటే అంతకంటే గొప్ప విషయం ఇంకొకటి ఉండదు. మా బృందంలో నేను రక్తదానానికి సిద్ధం. - అప్సానా, బీకామ్

సాయానికి ఎప్పుడూ సిద్ధం

అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక అనేక మంది ప్రాణాలు పోగొట్టుకోవడం బాధాకరం. నేటికీ రక్తదానంపై అవగాహన లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. అరుదైన ఓ నెగెటివ్ రక్తదానాన్ని దానం చేస్తున్నా. - ఆశాబీ, రక్తదాత

- మా కళాశాలలో అరుదైన రక్తదాతలంతా ఒక బృందంగా ఏర్పడి రక్తదానం చేస్తున్నాం. నాది 'ఏ' నెగటివ్ గ్రూపు. కళాశాలలో పలుమార్లు శిబిరాల్లో రక్తదానం చేశాను. ఎన్‌సీసీ ద్వారా ఇప్పటికే అవగాహన శిబిరాలు కూడా నిర్వహించి రక్తదాతలను సమీకరించాం. నేటి యువతంతా ముందుకు రావాలి. - రెడ్డిసాయి, బీకామ్

దేవుడిచ్చిన వరం

మానవ జన్మ దేవుడిచ్చిన వరమని నా అభిప్రాయం. మనం బతికున్నంత కాలం మరొకరికి సహకరిస్తూ ఉండాలి. అందులో మరొకరికి ప్రాణం పోసే అవకాశం ఒక్క రక్తదాన సమయంలోనే అవకాశం ఉంటుంది. అందరూ రక్తదానానికి ముందుకు వస్తే రక్తం కొరతతో మరణాలే ఉండవు. - దేవేంద్ర, ఓ నెగటివ్

కన్నేసి..
కబ్జా చేసి!

ఊళ్లో వందలాది కళ్లు చేస్తున్నా.. ఆక్రమణపై వింటున్నా.. కబ్జాలపై ఫిర్యాదులు చేస్తున్నా.. ప్రకృతి వనరుల విధ్వంసం ఆగడం లేదు.. నేటికీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అదను దొరికితే చాలు కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. రామసముద్రం మండలం మినికి రెవెన్యూ పరిధిలోని గుంతవారిపల్లెలో పట్టపగలు గుట్ట ఆక్రమించి చదును చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొక్లెయిన్‌తో గుట్టలను చదును చేసి ఆక్రమించారు. బండరాళ్లను తొలగించి గ్రామానికి ఉన్న కాలిబాటకు అడ్డుగా వేశారు. ఈ విషయంపై గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అజారుద్దీన్ తెలిపారు. - న్యూస్‌టుడే, రామసముద్రం

మృత్యువులోనూ
వీడని బంధం

నాగులు, నారాయణమ్మ (పాతచిత్రం)

జీవితాంతం కలిసి బతుకుదామని పెళ్లిరోజు బాస చేసుకున్న ఆ జంట.. మృత్యువులోనూ వారి అనుబంధాన్ని వీడలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న భర్తకు సేవ చేస్తూ ఆయనే లోకంగా బతికిన ఆ ఇల్లాలి గుండె భర్త మరణాన్ని జీర్ణించుకోలేక రెండు గంటల వ్యవధిలోనే ఆగిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ బాకివానివడ్డెపల్లెకు చెందిన ఆవులకుంట నాగులు (80) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. భర్త మృతితో భార్య నారాయణమ్మ (75) ఆ మృతదేహం వద్దే కుప్పకూలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్యాభర్తలు ఒకే రోజు మృతి చెందడంతో పరిసర గ్రామాల ప్రజలు వారి మృతదేహాలను సందర్శించి సంతాపం తెలిపారు. భార్యాభర్తలిద్దరికీ ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, కలకడ

టమాట రైతుకు మిగిలింది ఏడుపే

ములకలచెరువు, మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ములకలచెరువులో టమాట ధరలు పూర్తిగా పతనమయ్యాయి. జిల్లా కేంద్రమైన మదనపల్లె మార్కెట్‌లో మొదటి రకం టమాట కిలో రూ.14లు పలకగా ములకలచెరువులో మొదట రూ.8లు అనంతరం రూ.7కు పడిపోయింది. ధరలు పతనం కావడంతో రైతులు కాయలు కోయకుండా పొలాల్లోనే పశువులకు మేతగా వదిలేస్తున్నారు. ములకలచెరువు మార్కెట్ నుంచి తమిళనాడు రాష్ట్రానికి మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం బయటి రాష్ట్రాల వ్యాపారులు లేకపోవడంతో టమాట ఎగుమతికి డిమాండ్ తగ్గింది. మదనపల్లె మార్కెట్‌కు 66 మెట్రిక్ టన్నులు, ములకలచెరువు మార్కెట్‌కు 45 మెట్రిక్ టన్నులు ఎగుమతి అవుతున్నట్లు మార్కెట్ సిబ్బంది తెలిపారు.

రంజాన్ వేళలు	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం (ఉ)
మదనపల్లె	6.29	5.14
రాయచోటి	6.27	5.12

చూడండి..
చదువుకోండి!

అరచేతిలో డిజిటల్ గ్రంథాలయం.. స్మార్ట్‌ఫోన్, డెస్క్‌టాప్, ల్యాప్‌ట్యాప్‌లో డిజిటల్ గ్రంథాలయాన్ని సులువుగా వినియోగించవచ్చు. తొలుత ఏదైనా సెర్చ్ ఇంజిన్‌లోకి వెళ్లి ndl.iitkgp.ac.in లింకుపై క్లిక్ చేయాలి. డిజిటల్ లైబ్రరీ తెరుచుకున్న తర్వాత ఏ అంశం కావాలో ఎంపిక చేసుకుని చదువుకోవచ్చు. ఆ విషయానికి సంబంధించిన డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా (ఎన్‌డీఎల్‌ఐ) అని టైప్ చేస్తే ప్లేస్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అరచేతిలోనే గ్రంథాలయన్నీ చూడచ్చు.. చదువుకోవచ్చు. - న్యూస్‌టుడే, గాలివీడు

ముస్తాబు మూణ్నాళ్లే!
ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం

కలికిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై చైతన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల 'ముస్తాబు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బడికి వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. 'శుభ్రతతోనే ఆరోగ్యం- ఆరోగ్యమే ఆయుష్షు' అనే నినాదంతో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు, వసతి గృహాల్లో ఈ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టింది. అధికారుల నిర్లక్ష్యంతో ఇది ఆరంభ శూరత్వంగా మారింది.

కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు అలసత్వం వహిస్తున్నారు. ప్రారంభంలో ఏర్పాటు చేసిన వస్తువులు ప్రస్తుతం చాలాచోట్ల కనిపించడం లేదు. ఫలితంగా దీని అమలు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణగా కోరగా పరిశుభ్రత అంశాలు చిన్నతనం నుంచే నేర్చుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. సక్రమంగా అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

సబ్బు లేకుండా ప్లేట్లు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

- జిల్లాలో 25 మండలాలుండగా 2,103 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఇవికాక నాలుగేసి చొప్పున ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, 81 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 20 వసతి గృహాలున్నాయి. వీటిలో 1,15,649 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఇదీ కార్యక్రమం

ముస్తాబు కార్యక్రమంలో విద్యార్థుల కోసం అద్దం, దువ్వెన, సబ్బు, కొబ్బరి నూనె, గోళ్ల కత్తెర, హ్యాండ్ వాష్, బకెట్, తువ్వాలు తదితర వస్తువులను అందుబాటులో ఉంచాలి. ఇంటి నుంచి క్రమశిక్షణ లేకుండా సరిగా ముస్తాబు కాకుండా వచ్చిన వారిని గుర్తించి పాఠశాలకు ఎలా రావాలో నేర్పించాలి. ఈ కార్యక్రమం ప్రారంభంలో ఎంతో ఉత్సాహంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాటించారు. కానీ ఆ తరువాత మరిచిపోయారు. ఎక్కడా పాటించడం లేదు. దీంతో బాలల ఆరోగ్యం మెరుగుపడడం లేదు.

ప్రవేశాలకు అదను..
ప్రతిభకు పదును
గురుకులాల్లో 5, ఇంటర్ చేరికకు అవకాశం ☛ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలు, కళాశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్తోమత లేనివారు, చదువుకోవడానికి సౌకర్యాలు లేని విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతారు. అక్కడ సీటు సాధిస్తే భవిష్యత్తు బంగారం అవుతుందన్నది వారి అభిప్రాయం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత ప్రమాణాలు, ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, వసతి, పౌష్టికాహారంతో పాటు అన్ని సౌకర్యాలును ప్రభుత్వం కల్పిస్తుంది.

ప్రవేశ పరీక్ష ఇలా..

5వ తరగతి, మిగిలిన తరగతుల బ్యాక్ లాగ్ సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరుటకు మార్చి 31 వరకు గడువుండగా ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24వ తేదీ జరుగనుంది. ● **వయసు:** 5వ తరగతిలో ప్రవేశానికి పదకొండు సంవత్సరాల లోపుండాలి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం నాటికి 17 సంవత్సరాలు మించకుండా ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించరాదు. ● **విద్యార్హతలు :** 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 4వ తరగతి పూర్తి చేసి ఉండాలి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

● **ఖాళీలివి..** జిల్లాలో గురుకుల పాఠశాలలు గ్యారంపల్లె (బాలురు), పీలేరు, వాల్మీకిపురం (మైనారిటీ) గుర్రంకొండ, రాయచోటిలో కళాశాలలు గ్యారంపల్లె, వాల్మీకిపురంలో ఉన్నాయి. ఆయా గురుకులాల్లో 5వ తరగతిలో 80 సీట్లు, వాల్మీకిపురం 40 సీట్లున్నాయి. కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయి. ఎంపీసీలో 60 సీట్లు, బైపీసీలో 40 సీట్లు, ఎంఈసీలో 30 సీట్లు, హెచ్ఈసీలో 30 సీట్లు ఉన్నాయి. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి

5వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24న ఉంటుంది. వివరాలకు సంబంధిత ఉపాధ్యాయులను సంప్రదించాలి. - **నూర్ మహమ్మద్, గ్యారంపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్**

(c) eenadu

అల్లరి మూకల దాడులకు అంతం లేదా..!

- రాయచోటిలో పెరుగుతున్న దౌర్జన్యాలు
- కేసులు నమోదు కాకుండా నేతల ఒత్తిళ్లు
- ఫిర్యాదులు అందితేనే స్పందిస్తున్న పోలీసులు

● ఇటీవల అర్ధరాత్రి పట్టణంలోని జగదాంబ కూడలి ప్రాంతంలో యువకుల మధ్య రాడ్లు, కట్టెలతో దాడులు, ప్రతిదాడులు జరిగాయి. ఓ యువకుడు తీవ్రంగా గాయపడటంతో పోలీసులు ఇరువర్గాలను మందలించినా మార్పులేదు.

ఇటీవలి గ్యాంగ్ దాడుల్లో ఓ వ్యక్తి తలకు బలమైన గాయం

రాయచోటిలో అల్లరిమూకల చేష్టలు పెరిగిపోయాయి.. గుంపులుగా చేరి ప్రజా బాహుళ్యంలోనే దాడులకు తెగబడుతున్నారు.. అల్లరిమూకలు వర్గాలుగా ఏర్పడి పట్టణంలో హల్‌చల్ చేస్తున్నా వారిని వారించే చర్యలు కనిపించడం లేదు. యువత జల్సాలకు అలవాటు పడి గ్యాంగ్‌లుగా మారడంతో గంజాయి బ్యాచ్‌లు వీరికి తోడవుతున్నారు. దీంతో ఎప్పుడు ఎక్కడ దాడులు చేస్తారోననే భయంతో కొన్ని ప్రాంతాల్లో స్థానికులు భయపడుతున్నారు.
- న్యూస్‌టుడే, రాయచోటి

పట్టణంలోని నేతాజీ కూడలి, జగదాంబ సెంటర్, రాజుల కాలనీలోని ఎర్రమసీదు, సుద్దలోళ్ల పల్లి రోడ్డు, కాలనీ ప్రాంతాల్లో ఈ గ్యాంగ్‌లు విచ్చలవిడిగా తిరుగుతుంటాయి. దాడి చేసే సమయానికి రాడ్లు, కత్తులతోనే తెగబడటంతో గాయపడే వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంటోంది. దుకాణాల వద్ద మాటు వేసి ప్రత్యర్థి వర్గాలపై దాడులు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించినా నేతల ఒత్తిళ్లతో పటిష్ఠ చర్యలు చేపట్టడంలో వెనుకాడుతున్నారు.

రాత్రి 10 గంటల తర్వాత దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు మూసివేస్తున్నారు. పట్టణంలో మాత్రం రాత్రి 11.30 గంటలకు సైతం దుకాణాలు తెరిచే ఉంటున్నాయి. మద్యం, గంజాయి మత్తులో రాత్రి వేళ అల్లరి మూకలు గుమికూడి మర్దనలకు దిగుతున్నాయి. గతంలో మద్యం మత్తులో పడేవారు కత్తులు, కట్టెలతో దాడులు చేసుకోగా.. తాజాగా ఆదివారం అర్ధ రాత్రి రాజులకాలనిలో జరిగిన దాడిలో రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి పోలీసు ఉన్నతాధికారులకే ఫిర్యాదు చేశారు. అటుగా వెళ్తున్న వ్యక్తులను పిలిచి గొడవ పెట్టుకొని కత్తులతో దాడికి తెగబడటం చూస్తే మారణాయుధాలతో రహదారులపై ఎలా విచ్చలవిడిగా తిరుగుతున్నారో అర్థమవుతుంది.

ఆయుధాలతో తిరుగుతూ..

■ భవిత బుగ్గిపాలు

అల్లరిమూకల గ్యాంగ్‌లోని వారందరూ 20-35 ఏళ్ల వయసు వారే. ఇంటర్, డిగ్రీ చదివి ఇళ్ల వద్ద ఖాళీగా ఉన్నవారిని గ్యాంగ్‌లోకి చేరదీస్తున్నారు. ఎక్కడ దాడి చేయాలనుకున్నా 10-20 మంది తక్కువ కాకుండా మూగుతున్నారు. పోలీసులు గుర్తించిన వారిపై కేసులు నమోదు చేయడంతో వారి భవిత బుగ్గిపాలయ్యే పరిస్థితి. నేరంలో ముద్దాయిలుగా తేలితే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతారు. ఎక్కువ నేరాలతో సంబంధం ఉన్నవారిని రౌడీషీటర్లుగా నమోదు చేసే అవకాశం ఉంది.

కట్టడికి కఠిన చర్యలు..

గ్యాంగులను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు శాంతిభద్రతల కల్పనలో పోలీసుశాఖ ముందుంటుంది. పట్టణంలో ఇటీవల ఘటనలు సీరియస్‌గా పరిగణిస్తున్నాం. రెండు మూడ్రోజుల్లో ఫలితం చూపుతాం. రాత్రి గస్తీ పెంచి అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
- కృష్ణమోహన్, డీఎస్పీ, రాయచోటి

■ వరుస ఘటనలు ఇలా..

- ■ సుద్దలోళ్లపల్లె రోడ్డులో పట్టపగలే యువకులు బాహాబాహీకి దిగారు. కేకలు, ఈలలతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది. వ్యాపారులు పరుగులు తీశారు. అంతకుముందు రోజు రాత్రి జగదాంబ కూడలిలో జరిగిన దాడుల్లో ఒక వ్యక్తి తలపై బలమైన గాయమైంది.
- ■ శివాలయం కూడలిలో రాత్రి 8 గంటల సమయంలో రెండు గ్యాంగ్‌లు విచ్చలవిడిగా దాడికి తెగబడ్డాయి.
- ■ కొత్తపల్లి, రాజులకాలనీల్లో ఇటీవలి దాడుల్లో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు.
- ■ లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో వరుస దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.
- ■ రింగ్‌రోడ్లలో బైక్ స్టంట్లు చేస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ విరామ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ప్రముఖ వ్యాపారవేత్త లగడపాటి రాజగోపాల్, పుదుచ్చేరి విద్య ఉద్యమ, తెదేపా ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, హీరోయిన్ రవీనాటాండన్ కుమార్తె రషా టాండన్ తదితరులు దర్శించుకున్నారు.

కుమార్తెతో హీరోయిన్ రవీనా టాండన్

మార్చి 10లోగా పన్నుల వసూళ్లకు ఆదేశం

మదనపల్లె (గ్రామీణ, న్యూస్‌టుడే: అన్ని రకాల పన్నులు మార్చి 10లోగా వంద శాతం వసూలు చేయాలని అధికారులను డీపీవో రాధమ్మ ఆదేశించారు. మంగళవారం మదనపల్లె ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమయ్యారు. జిల్లాలో ట్యాక్స్, నాన్‌ట్యాక్స్ రూ.27 కోట్ల లక్ష్యానికి ప్రస్తుతం రూ.15.05 కోట్లు వసూలు చేశామన్నారు. మరో రూ.12.24 కోట్లు రావాల్సి ఉందన్నారు. ట్యాక్సులకు సంబంధించి రూ.19.06 కోట్లకు రూ.10.63 కోట్లు వసూలైనట్లు చెప్పారు. మిగిలిన రూ.8.43 కోట్లు గడువులోగా పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా పర్యవేక్షణ ఇన్‌ఛార్జి అధికారి లక్ష్మీపతి, డీఎల్‌డీవో అమరనాథ్, డీఎల్‌పీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మదనపల్లె విద్య, రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని 50 పరీక్ష కేంద్రాల్లో మంగళవారం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. కేంద్రాలను సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. జనరల్, ఒకేషనల్ విభాగాలకు చెందిన 13,448 మంది విద్యార్థులకు 13,026 మంది హాజరయ్యారు. 422 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవి తెలిపారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, యర్రగుంట్ల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

డీఎస్‌డీవో చంద్రశేఖర్, పీఈటీతో ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: జిల్లా సైక్లింగ్ జట్టు ఎంపిక మంగళవారం మదనపల్లెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు డీఎస్‌డీవో చంద్రశేఖర్ తెలిపారు. షేక్ అష్రఫ్ ఆలీ ఎస్‌ఆర్‌టీఎస్ సహకారంతో పోటీలు నిర్వహించాం. అండర్ 18 బాలబాలికలు, మాస్టర్స్ (పురుషులు, మహిళలు) విభాగాల్లో 60 మంది పాల్గొన్నారు. బాలిక విభాగంలో పి.నిహారిక, ఎం.తనూష, ఎస్.శ్రీలత, కె.పవిత్ర, ఎం.మేఘన, ఎస్.జైనబ్, ఎల్.శరణ్య, బాలురు: మధుసూదన్, చరణ్‌కుమార్, మహమ్మద్ అనీష్, సంజయ్‌రెడ్డి, ఎం.పుర్తేంద్ర, జ్యోతిష్, జి.లోహిత్, ప్రత్యూష్‌రంజన్‌లు ఎంపిక చేశారు. వీరు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, జిల్లా క్రీడాభారతి కార్యదర్శి నరేష్‌బాబు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు దేవకుమ్మ, అన్వర్‌బాషా, భారతి, శరత్, జగదీష్, ఆలీ పాల్గొన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైనట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు. . ఉపాధ్యాయుడు వెంకటేశ్ రెండు నెలలుగా ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవరిస్తున్నట్లు చెప్పారు. మనస్తాపానికి గురైన బాలిక సోమవారం పశువులకు వినియోగించే మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను తిరుపతి రుయాలో చేర్చారు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మదనపల్లె ఘటన బాధాకరం

మంత్రి మండిపల్లి

రాయచోటి, న్యూస్‌టుడే: మదనపల్లెలో చోటుచేసుకున్న చిన్నారి హత్యాచార ఘటన అత్యంత బాధాకరమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. మంగళవారం అమరావతిలోని సచివాలయ ఛాంబర్‌లో మంత్రిని బాలిక తల్లిదండ్రులు కలిసి విషాద ఘటన గురించి తెలియజేశారు. చిన్నారి తల్లిదండ్రులను ఆయన ఓదార్చారు. ప్రభుత్వం వారి కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు రూ.15 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా), చిత్తూరు

ఆర్.ఒ.సి.నెం. 15/2025/చుడా తేది: 24.02.2026.

ముసాయిదా ప్రకటన

ఆంధ్రప్రదేశ్ మెట్రో పాలిటన్ రీజియన్ & పట్టణాభివృద్ధి సంస్థ చట్టం, 2016, లోని సెక్షన్ 15 (1) ద్వారా ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతమునకు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. 122 పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ తేది: 24.08.2022 ననుసరించి ప్రతిపాదించడమైనది. ఈ ముసాయిదా ప్రకటన వెలువడిన 15 (పదిహేను రోజుల లోపల ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు వలన వ్యక్తులు లేదా సంస్థలకు అభ్యంతరములు లేదా సలహాలను ఉపాధ్యక్షులు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు వారికి వ్రాతపూర్వకముగా తెలిపిన విషయములను ముఖ్య కార్యదర్శి, పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర సచివాలయం, వెలగపూడి వారికి, వారి పరిశీలన మరియు తగు చర్యల నిమిత్తము పంపబడునని తెలియజేయడమైనది.

భూ వినియోగ మార్పు ముసాయిదా ప్రకటన

ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. 122 పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ తేది: 24.08.2022 నందు ఆమోదించబడిన బృహత్తర ప్రణాళికా యందు చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ భూ వినియోగ ఆమోదము పొందిన ప్లాను నందు 72. జంగాలపల్లి రెవిన్యూ గ్రామంలోని సర్వే సంఖ్య. Sy.No.356/1 (LPM No.1299) లో ఎ.4.74 సెంట్ల విస్తీర్ణము కలిగి ప్రతిపాదిత రక్షిత (ఆకుపచ్చ) వినియోగ మండలము రద్దు చేయుటకు మరియు సదరు స్థలమును ప్రజా ప్రయోజన వినియోగ మండలము నకు మార్పుదల చేయుచూ మరియు బృహత్తర ప్రణాళిక యం.యం.పి. సంఖ్య.03/2025/చుడా, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించడమైనది. సదరు ముసాయిదా భూ.వినియోగ మార్పు సంఖ్య. 03/2025/చుడా, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు కార్యాలయములో పనిదినముల వేళయందు ప్రజలు సందర్శించి పరిశీలించుటకు ఏర్పాటు చేయడమైనది.

భూ వినియోగ మార్పు భూమి హద్దులు

ఉత్తరము : గుట్ట (Sy. No. 359) LPM No.1400, L.PM No. 1298) జంగాలపల్లి రెవిన్యూ **దక్షిణము :** ప్రస్తుత 12 మీటర్ల వెడల్పు గల రోడ్డు, **తూర్పు :** ప్రస్తుత 12 మీటర్ల వెడల్పు గల రోడ్డు **పడమర :** గుట్ట (Sy. No. 338/1)L.PM No.1365, LPM No.1367) జంగాలపల్లి రెవిన్యూ

సం/- ఉపాధ్యక్షులు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు.

మదనపల్లె పురపాలక సంఘము

ఆర్.ఒ.సి.నెం: 106/A1/2026 తేది: 24.02.2026

1వ టెండర్ కమ్ వేలము నోటీసు

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన దినసరి కూరగాయల మార్కెట్లు, వారపు సంత, జంతువధశాల, దినసరి మాంసము మార్కెట్ మరియు ప్రైవేట్ బస్టాండ్‌లకు లీజు వసూలు చేసుకొనే హక్కును (G.O.MS.No.68 (MA&UD) ది: 31.05.2022 నందలి మరియు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టంలో రాబడులు మరియు వ్యయములు రూలు, 1968 లోని రూలు నెంబరు 7 (7) ప్రకారము), 2025-26 ఆర్థిక సం॥ లీజుకు ఇచ్చుటకు తేది: 04-03-2026 టెండర్ కమ్ వేలము పాట నిర్వహించబడును. కావున సదరు టెండర్ కమ్ వేలము పాట నందు పాల్గొనదలచిన వారు టెండరు రుసుము రూ. 100/- లను మున్సిపల్ ఖజానాలో చెల్లించి, మదనపల్లె పురపాలక సంఘంచే జారీ చేయబడిన టెండరు షెడ్యూలును తేది: 02-03-2026వ తేది సాయంత్రం 5:00 గం॥లు లోగా తీసుకొని, సదరు టెండరును తేది: 04-03-2026, మధ్యాహ్నం 3:00 లు లోగా తమ టెండరును జిల్లా గెజిట్ నెం:15/2026 తేది: 20.01.2026 నందు తెలిపిన షరతుల మేరకు దాఖలు చేయవలెను. టెండరు దాఖలు పరచిన తదుపరి, టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరచి అదే రోజు బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. సం.	కేటగిరి	సాల్వెన్సి సర్టిఫికేట్ (విలువతో కూడిన)	చెల్లించవలసిన డిపాజిట్ (డి.డి.లు మాత్రమే స్వీకరించబడును)	రిజిస్ట్రేషన్ ఛార్జీలు నిమిత్తం చెల్లించవలసిన డిపాజిట్ రూ.
1	2	3	4	5
1	వారపు సంత	రూ.10,00,000/-	రూ.20,00,000/-	రూ.50,000/-
2	దినసరికూరగాయల మార్కెట్లు	రూ.30,00,000/-	రూ.20,00,000/-	రూ.75,000/-
3	దినసరి మాంసం మార్కెట్లు	రూ.2,00,000/-	రూ.50,000/-	రూ.20,000/-
4	జంతువధశాల	రూ.1,00,000/-	రూ.50,000/-	రూ.15,000/-
5	ప్రైవేట్ బస్టాండు	రూ.1,00,000/-	రూ.30,000/-	రూ.15,000/-

షరతులు:

1. జిల్లా గెజిట్ నెం:15/2026 తేది: 20.01.2026 నందు షరతులకు లోబడి పాటలో పాల్గొనవలెను.
2. పాట పాడుటకు ముందుగా గెజిట్‌ను పూర్తిగా చదువుకొని పాటలో పాల్గొనవలెను.
3. టెండరు ఫారముపై టెండర్ పైకమును స్పష్టముగా అంకెలులోను మరియు అక్షరములోను తప్పునిసరిగా వ్రాయవలెను.
4. పాటదారుని పేరున మునిసిపాలిటీకి ఏ విధమైన బకాయిలు వుండరాదు, అట్టి వారు అనర్హులు.
5. బహిరంగ వేలము పాట సొమ్ముపై 18% GST ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారము తప్పని సరిగ చెల్లించవలెను.
6. పాట ఖాయ పరచిన వెంటనే బహిరంగ వేలము యొక్క లీజుకు సంబంధించి అగ్రిమెంటు రిజిస్ట్రేషన్ చేయించి దాఖలు చేయవలెను, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పూర్తిగా పాట దారులు చెల్లించు కొనవలెను.
7. పాటఖాయ పరచిన 7 దినములు లోగా 3 నెలసరి కిస్తులు ముందుగా అడ్వాన్స్‌గా చెల్లించి, మిగిలిన నెలలు కిస్తులుకు పోస్ట్ డేట్ చెక్కులు ఇవ్వవలెను. సదరు చెక్కులు పాట ఆమోదించిన నెల నుండి డిసెంబరు-2026 వరకు నెలకొక్కటి చొప్పున పురపాలక సంఘ నిధులకు నిర్ణయించిన గడువు తేదిన జమ చేసుకొనబడును.
8. ప్రతి నెల నెలసరి కిస్తు ఆ నెల 5వ తేది లోగా చెల్లించవలెను, నిర్ణీత సమయం దాటిన నాటికి నెలకి 2.5% శాతము అపరాధ రుసుము చెల్లించవలెను.
9. పాట రద్దు పరుచుటకుగాని వాయిదా వేయుటకు పూర్తిగా అధికారము క్రింది సంతకందారు వారికి కలవు.
10. మిగిలిన షరతులు కార్యాలయము పనిచేయు సమయములో రెవెన్యూ విభాగము తెలుసుకొనవచ్చును.

సం/- కమిషనరు, మదనపల్లె పురపాలక సంఘము

మాట్లాడుతున్న అయూబ్‌ఖాన్, చిత్రంలో అధికారులు

సోలార్ పనుల్లో వేగం పెంచాలి

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: సోలార్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలకు చేర్చే పనులు వేగంగా చేపట్టాలని ఎస్పీడీసీఎల్ ప్రాజెక్టు, ఐటీ విభాగం డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్ ఆదేశించారు. గొల్లపల్లెలో ఆ శాఖ ఇంజినీర్లతో సమావేశమయ్యారు. ప్రతి మండలంలోనూ రెండు నెలల్లో లక్ష్యాలు చేరుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు వేగంగా ఇవ్వాలన్నారు. అనంతరం రేగంటివారిపల్లెలో ఏఈ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన జనబాట కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లాలో ఎదురయ్యే విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సోలార్ జీఎం విజయన్, హెచ్‌ఆర్‌డీ సీజీఎం రామచంద్రరావు, ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, ఈఈ గంగాధరం, ఏడీఈలు హరికుమార్, సురేంద్రనాయక్, సీజీఎంలు రామచంద్రరావు, ఉమాపతి ఉన్నారు.

వంగ.. రైతుల్లో బెంగ

పశ్చిమ మండలాల్లో రైతులు విస్తారంగా వంగ పంట సాగుచేశారు. కనీసం పంట కోసే కూలి కూడా గిట్టుబాటు కానీ పరిస్థితుల్లో.. పొలాల్లోనే వంకాయలు మగ్గుతున్నాయి. కలికిరి మండలంలో వంగ పంటను కోయకుండా వదిలేసిన చిత్రమిది. **- న్యూస్‌టుడే, కలికిరి**

పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక అమలు

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి గ్యారెంటెడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ సాధించేలా 75 రోజుల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో డాక్టరు కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాయచోటిలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం నిర్వహించిన రాయలసీమ జిల్లాల ఎంఈవోలు, డైట్ అధ్యాపకులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కడప డీఈవో షంషుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యాచరణ ప్రణాళిక అమలులో తెలుగు, ఇంగ్లిషు, గణిత అంశాలపై దినసరి కార్యకలాపాలు సమగ్రంగా పొందుపరుస్తామని వివరించారు. క్లస్టర్ కాంప్లెక్స్ హెడ్‌లు, ఉపాధ్యాయులు పాఠశాలలకు పంపిణీ చేసిన టీఎల్ఏలను సమర్థంగా ఉపయోగించి రోజువారీ బోధించాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి, మదనపల్లె, చిత్తూరు, తిరుపతి, పుత్తూరు ఉప విద్యాశాఖాధికారులు నాగయ్య, లోకేశ్వర్‌రెడ్డి, ఇందిర, ఇందిరాదేవి, మహేశ్వర్, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఐసర్‌లో పరిశోధనలపై అవగాహన

మూడు రోజుల పాటు సైన్స్ దినోత్సవం

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్)లో ఈ నెల 28 నుంచి మార్చి 2వరకు జాతీయ సైన్స్ దినోత్సవాలు జరగనున్నాయి. పదేళ్లుగా జరుపుకొన్నట్లుగానే ఈ ఏడాది సైతం దేశవ్యాప్తంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 200కు పైబడి ఇంటరాక్టివ్ కార్యకలాపాలు, ఆచరణాత్మకమైన ప్రయోగాలు ప్రదర్శించనున్నారు. గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, భూమి, వాతావరణ శాస్త్రాలు, కంప్యూటర్ సైన్స్‌పై ప్రదర్శనలు ఉంటాయి. ప్రముఖ శాస్త్రవేత్తల ప్రసంగాలు, పరిశోధన అవకాశాలు, విమర్శనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలు వివరించనున్నారు. బోస్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కౌస్తువ్ సన్యాల్, ఐఐటీ బాంబే రసాయనశాస్త్రం డీన్ ప్రొఫెసర్ రుచిఆనంద్, ఎన్ఎస్‌సీబీ ప్రభుత్వ వైద్య కళాశాల సర్జరీ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ధనంజయశర్మ హాజరు కానున్నారు.

అంబులెన్సులు ఉన్నా.. ఎడ్ల బండికే ప్రాధాన్యం

ఫోన్ చేస్తే క్షణాల్లోనే 108. అంబులెన్సు వచ్చే వీలున్నా.. ఆ కుటుంబం మాత్రం సొంత ఎడ్ల బండినే నమ్ముకుంది. అన్నమయ్య జిల్లా పుంగనూరు మండలంలోని మేలుందొడ్డికి చెందిన వృద్ధురాలు నారాయణమ్మ మంగళవారం ఉదయం వాంతులు, విరేచనాలకు గురయ్యారు. కుమారుడు ద్విచక్ర వాహనం తీసుకొని రాగా.. కూర్చోలేనని ఆమె చెప్పారు. ఆటోలోనూ ఉండలేనని చెప్పడంతో భర్త రామయ్య ఎడ్ల బండిపై ఆమెను పుంగనూరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. ఆసుపత్రి దగ్గర కావడంతో 108కు ఫోన్ చేయాలనే ఆలోచన తమకు రాలేదని రామయ్య తెలిపారు. ఎడ్ల బండిపై రోజు తిరిగే అలవాటు ఉందన్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు**

పనుల్లో జాప్యంపై సీఐ, డీఈల వాగ్వాదం

సీఐ యుగంధర్‌తో మాట్లాడుతున్న డీఈ సుజాత

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు రైల్వేవంతెన పనుల విషయంలో మంగళవారం పీలేరు సీఐ యుగంధర్, ఎన్‌హెచ్ డీఈ సుజాతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో డీఈ కంటతడి పెట్టారు. రైల్వేవంతెన పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని ప్రజలు సీఐ దృష్టికి తేవడంతో ఆయన గుత్తేదారు సంస్థ ఉద్యోగిని సోమవారం స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. మంగళవారం ఎన్‌హెచ్ డీఈ సుజాత, ఏఈ మాధవ్‌లు పీలేరు వచ్చి రైల్వేగేటు వద్ద సీఐ యుగంధర్‌ను కలిశారు. పనులు ఏళ్ల తరబడి జరుగుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నామని ప్రజలు తన దృష్టికి తెచ్చారని, త్వరితగతిన చేయించాలని సీఐ మాట్లాడారు. ఈ క్రమంలో పనులు ఆలస్యంగా జరగడంపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఇంజినీర్లపై కూడా కేసు నమోదు చేస్తానని డీఈని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో కలత చెందిన డీఈ.. తాము కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సున్నితంగా సమాధానం ఇచ్చారు. చివరకు తెదేపా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి జోక్యం చేసుకుని సముదాయించడంతో సీఐ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

శ్రీకృష్ణుడి ఆలయంలో భారీ చోరీ

రూ.25 లక్షల విలువైన బంగారు, వెండి నగల అపహరణ

మదనపల్లె నేరవార్తలు: మదనపల్లె శివారులోని శ్రీవారినగర్ గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయంలో భారీ చోరీ జరిగింది. రూ.25 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను దుండగులు అపహరించుకుపోయారు. సోమవారం రాత్రి 9 గంటలకు అర్చకులు తాళం వేసి వెళ్లారు. ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. వెండి కిరీటాలు 3, శంఖు చక్రాలు, అమ్మవారి బంగారు మంగళసూత్రాలు, నగలు, వెండి శఠారి, పంచపాత్ర, స్వామివారి వెండి కళ్లు, నామాలు ఎత్తుకెళ్లారు. రెండు పెద్ద హుండీల్లోని నగదు తీసుకెళ్లిపోయారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లిపోయినట్లు గుర్తించారు. విషయం కమిటీ అధ్యక్షుడు గురుశంకర్‌యాదవ్, సభ్యులు, పోలీసులకు అర్చకులు తెలియజేశారు. సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ రహీముల్లా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మదనపల్లె, రాయచోటి నుంచి డాగ్‌స్క్వాడ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. చోరీకి గురైన ఆలయ పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళ ఎక్కువగా గంజాయి బ్యాచ్ తిరుగుతుంటుందని స్థానికులు చెబుతున్నారు. దుండగుల కోసం మూడు ప్రత్యేక బృందాలను నియమించామని ఏఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

డబ్బులు చెల్లించినా ప్యానళ్లు బిగించలేదు

సౌర కంపెనీపై పోలీసులకు బాధితుల ఫిర్యాదు

సంబేపల్లె, న్యూస్‌టుడే: సంబేపల్లె మండలం మోటకట్ల, సంబేపల్లె, దేవపట్ల, గుట్టపల్లె గ్రామాలకు చెందిన ఎనిమిది మంది గృహ విద్యుత్ వినియోగదారులు ఓ సౌర కంపెనీపై సంబేపల్లె పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు. . కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సౌర ప్యానళ్లను ఏర్పాటు చేయడానికి ఓ కంపెనీ ప్రతినిధులు విద్యుత్తు సంస్థ ద్వారా పలు గ్రామాల్లో పథకం గురించి వివరించారన్నారు. ప్రయోజనం చేకూరుతుందని ప్యానళ్ల ఏర్పాటుకు ప్రజల వద్ద బ్యాంకు పాస్‌పుస్తకం, ఆధార్, పాన్‌కార్డు, ఇంటి విద్యుత్ బిల్లుల నకళ్లు తీసుకున్నారన్నారు. 3 కిలో వాట్లకు రూ.2.10 లక్షలు చెల్లించాలనడంతో.. గతేడాది అక్టోబర్‌లో బ్యాంకు ద్వారా రూ.1.90 లక్షలు రుణంతో పాటు మరో రూ.20 వేలు చేతి నుంచి ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. మూడు కిలోవాట్లకు సంబంధించి ఆరుగురు రూ.12.60 లక్షలు, 2 కిలోవాట్లకు సంబంధించి ఇద్దరు రూ.3.20 లక్షలు చొప్పున మొత్తం రూ.15.80 లక్షలు చెల్లించామన్నారు. సదరు సౌర కంపెనీ ఐదు నెలలు గడుస్తున్నా ప్యానళ్ల ఏర్పాటు చేయలేదన్నారు. ఈ క్రమంలో తమ బ్యాంకు ఖాతాల నుంచి ప్రతి నెల రూ.3,672 చొప్పున కంతుగా సదరు సోలార్ కంపెనీకి జమ అవుతోందని వాపోయారు.

30 శాతం ఐఆర్ ఇవ్వాలి

రాయచోటి, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు నల్లమల రామాంజులు తెలిపారు. మంగళవారం రాయచోటిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 సంవత్సరం కరవు భత్యం బకాయిలు, చాలామంది ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ జమ కాలేదన్నారు. పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు పూర్తి కావస్తోందన్నారు. ఉగాది కానుకగా పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ఆర్థిక కార్యదర్శి మురళీమోహన్‌రాజు, కులశేఖర్‌రెడ్డి, రెడ్డెన్న, నాగరాజు, వెంకట్రామరాజు, రమణ, రాచయ్య, బాలాజీ, ఆర్.వి.రమణ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ ఈవోగా బీకే వెంకటేశులు

ఈనాడు- తిరుపతి: రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతి పొందిన పలువురు డిప్యూటీ కలెక్టర్లతో పాటు మరికొందరిని బదిలీ చేస్తూ సీఎస్ విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో టి.బాపిరెడ్డిని సీఆర్‌డీఏ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ)గా స్థానచలనం కలిగించారు. ఆయన స్థానంలో కడప జిల్లాలో గాలేరు-నగరి యూనిట్‌లో ఎస్‌డీసీగా ఉన్న బీకే వెంకటేశులుకు అవకాశం కల్పించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేస్తోన్న అనుపమను నగరి ఆర్డీవోగా నియమించారు. ప్రస్తుతం నగరి ఆర్డీవోగా ఉన్న భవానీ శంకరికి పోస్టింగ్ ఇవ్వలేదు. పరిశ్రమల శాఖలో విధులు నిర్వర్తిస్తోన్న జి.విజయలక్ష్మిని విశాఖ-చెన్నై పారిశ్రామిక నడవ (వీసీఐసీ) ఎస్‌డీసీగా నియమించారు. పదోన్నతి పొందిన ఎన్.చంద్రశేఖర్‌రెడ్డిని మదనపల్లెలోని కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ, ఎంవీఎస్ నారాయణరెడ్డిని పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మాధవ కృష్ణారెడ్డికి మదనపల్లె హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా పోస్టింగ్ ఇచ్చారు.

మోసం కేసులో 12 మంది అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: మానవహక్కుల సంరక్షణ, అవినీతి నిర్మూలన దళం సిబ్బంది పేరుతో ఓ వ్యక్తిని బెదిరించి రూ.24 లక్షలు తీసుకుని మోసగించిన 12 మంది నిందితులను దేవనహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి- అనంతపురం నివాసి కృష్ణకుమార్‌రెడ్డి (50), బెంగళూరు గ్రామీణ జిల్లా సూలిబెలె నివాసి అహ్మద్ షరీఫ్ (48), బాగేపల్లికు చెందిన వేణుగోపాల్ (49), ఆనేకల్ సంపంగిరామ (47), శిడ్లఘట్ట నారాయణస్వామి (52), చింతామణి కేవీ శివ (42), మదనపల్లె టీవీ మురుగేశ్ (65), అనంతపురం నివాసి లతీఫ్ (53), కోలారు జిల్లా భట్టరహళ్లి వెంకటేశ్ (52) అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.14.60 లక్షలు నగదు, మానవహక్కుల సంరక్షణ అవినీతి నిర్మూలన దళం బోర్డుతో కూడిన వాహనాన్ని, 13 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరు సాయిలేఔట్ నివాసి కె.శంకరప్ప ఇచ్చిన ఫిర్యాదుతో ఆ నిందితులను అరెస్టు చేశామని మంగళవారం ధ్రువీకరించారు. రూ.30 లక్షలు ఇస్తే.. వివిధ రూపాల్లో మదుపు చేసి రూ.90 లక్షలు ఇస్తానని ఆశ చూపించి బాధితుడిని వలలో కూరుకుపోయేలా చేశారు. వారడిగిన నగదు తీసుకొస్తున్న సమయంలో దుండగులంతా అధికారుల వేషంలో వెంటాడి, శంకరప్పను బెదిరించి, డబ్బు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర తదితర ప్రాంతాల్లో గాలించి నిందితులను అరెస్టు చేశారు.

EENADU Classifieds

AUTO
VEHICLES FOR SALE
AP-40-AU-9502 New Maruti Nexa Fronx Alpha - 2023 Model Vehicle for Sale. Sundaram Finance LTD, TPT. ✆ 9490166247, 9440909784.

FINANCIAL SERVICES
WANTED
Need Finance/loan for apartment project in tirupati work in progress Rs. 20 to 50 Lakhs. ✆ 9963029295

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL
తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు AB AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

JOBS
JOB OPENINGS at Unit Run Canteen NCC Tirupati. For more information. ✆ 83280 15125.

WANTED CHEMIST: (Male/ Female) B.Sc., Chemistry/ B.Pharmacy M/s Coastal Laboratories, Akkampeta Post, Tada M. Ph: 70133 32427 E Mail: info@coastal-labs.com

అడ్మినిస్ట్రేటివ్ పర్సన్స్ కావలెను. Qly: డిగ్రీ/ MBA అనుభవం, ఉత్సాహవంతులైన వారు తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు. ఆకర్షణీయమైన జీతం. ✆ 9703402722

ఆటో డ్రైవర్ కావలెను. అనుభవం, లైసెన్స్ కలిగి ఉండవలెను. (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722

SECURITY GUARDS
ప్రముఖ బ్యాంకులలో పని చేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21 to 45, అర్హత: 10th. PF+ ESI కలదు. ✆ 96522 40528, 97049 64931, 94918 84025.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా వనజ

మదనపల్లె విద్య: మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా రాజనీతిశాస్త్రం అధ్యాపకురాలు వై.వనజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా ఉన్న సూర్యశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ప్రిన్సిపల్‌ను వైస్ ప్రిన్సిపల్ మోహన్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం మంజూరు

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెం జడ్పీ బాలికోన్నత పాఠశాలకు పదో తరగతి పరీక్ష కేంద్రం మంజూరైంది. ఇప్పటి వరకు ఆదర్శ పాఠశాలలో రెండు కేంద్రాలుండేవి. అక్కడ ఒక కేంద్రాన్ని తగ్గించి బాలికల పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉండటంతో 140 మంది విద్యార్థులతో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. ఆదర్శ పాఠశాలకు 250 మందిని కేటాయించారని ఎంఈవోలు శివానాయక్, ఆంజనేయులు నాయుడు తెలిపారు.

రాయచోటి

• రాయచోటి • పీలేరు

నేటి నుంచి సామాజిక తనిఖీలు

రామాపురం, న్యూస్‌టుడే: మండలంలోని 13 పంచాయతీల్లో వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు బుధవారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహిస్తామని ఏపీవో వెంకటయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా పనులకు రూ.15.59 కోట్లు వ్యయం చేశామన్నారు.

పీలేరులో ప్రజాదర్బార్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరులో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి, పీలేరు ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పింఛను అందక.. బతుకులు భారంగా

న్యూస్‌టుడే బృందం: ఒకవైపు కుటుంబ ఆర్థిక సమస్యలు.. మరోవైపు అనారోగ్యంతో పనులు చేయలేని పరిస్థితులతో బతుకు భారం.. ప్రభుత్వం మంజూరు చేసే పింఛన్ల కోసం ఎదురుచూస్తూ పలువురు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నూతన పింఛన్లు మంజూరుకు అర్జీలు సమర్పిస్తున్నా న్యాయం జరగక కన్నీరుమున్నీరు అవుతున్నారు. పలు ప్రాంతాల నుంచి నిత్యం కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా..

కుమార్తె రెడ్డెమ్మ పుట్టుకతో మతిస్థిమితం లేదు. భర్త అప్పన్న మృతి చెందాడు. కూలి పనులు చేసుకుంటున్నాను. చిన్నప్పటి నుంచి తిరుపతి రూయా ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నాను. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను.

- రెడ్డెమ్మతో తల్లి నారాయణమ్మ, కలకడ

పక్షవాతంతో పనిచేయలేని పరిస్థితి

నేను భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబపోషణ చేశాను. గత మూడేళ్ల కింద పక్షవాతంతో చెయ్యిలు పనిచేయడం లేదు. చికిత్స, కుటుంబపోషణకు ఆర్థిక భారంగా మారింది. సదరం ధ్రువీకరణ పత్రం లేదు. పింఛనుకు దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయడం లేదు. ఇబ్బందిగా ఉంది. పింఛను మంజూరు చేసి ఆర్థిక సమస్య లేకుండా న్యాయం చేయండి. **- బాబు, రాయచోటి**

వైకాపా హయాంలో తొలగించారు



వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబపోషణ చేసుకుంటున్నాను. నా వయసు 74. వ్యవసాయం చేసే పరిస్థితి లేదు. పిల్లలు ప్రైవేటు, చిరు ఉద్యోగాలు చేస్తున్నారు. నాకు గతంలో పింఛను వచ్చేది. వైకాపా ప్రభుత్వంలో పింఛను రద్దు చేశారు. ఎందుకని ప్రశ్నిస్తే సమాధానం లేదు. కార్యాలయాల్లో అర్జీలు ఇస్తున్నాను.

- శ్రీనివాసులు, కలకడ

మహిళలకు కవచం.. శక్తి యాప్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరసింహులు

కలికిరి, కలికిరి గ్రామీణ, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న మహిళలకు శక్తి యాప్ కవచంలా పనిచేస్తుందని కలికిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నరసింహులు తెలిపారు. సీఐ అనిల్‌కుమార్ సూచనలతో మంగళవారం స్థానిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టం ఉందని ఏఎస్ఐ నరసింహులు, హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, శక్తి టీం సభ్యులు సుధాకర్ రాజేష్, శోభారాణి, దుర్గ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ చరవాణిలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, యాప్ పనితీరును వివరించారు. పాఠశాల విద్యార్థినులకు చిన్న వయసులోనే ఆపదను గుర్తించేలా 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'పై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా నాయకులు

దాడి చేసిన వారిని శిక్షించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: రజకులపై దాడి చేసిన వారిపై హత్యా నేరం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ నెల 18న మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనం కోసం టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించారని అక్కడి వారు విచక్షణ రహితంగా దాడి చేశారన్నారు. అహంకారంతో రజకులపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.వి.రమణ, వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ స్థలాలు ప్రైవేటుపరం చేయవద్దు'

పీలేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 13 డిపోల్లోని ఖాళీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం మానుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పీలేరు ఆర్టీసీ బస్సుల మరమ్మతుల కేంద్రం వద్ద ఎన్ఎంయూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పీఎస్ఎం రాజు మాట్లాడుతూ కొత్తగా ప్రవేశపెడుతున్న విద్యుత్తు బస్సుల నిర్వహణ ఆర్టీసీ చూడాలని.. ప్రైవేటుకు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు సీవీ రమణ, హరినాథ్, ఆదినారాయణ, రామయ్య, మధు, ఎల్లయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కవర్లతో తెగుళ్ల నివారణ

రాయచోటి గ్రామీణ,న్యూస్‌టుడే: మామిడిలో ఫ్రూట్ కవర్లు వినియోగించడం ద్వారా తెగుళ్లను నివారించడంతో పాటు నాణ్యమైన దిగుబడి పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి సురేష్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాధవరం, కాటిమాయకుంట, చెన్నముక్కపల్లె, పెమ్మాడపల్లెలో మామిడి రైతులకు ఉద్యానశాఖ అధికారులు ఫ్రూట్ కవర్ల వినియోగం, రాయితీలపై అవగాహన కల్పించారు. 50 శాతం రాయితీపై ఒక్కో రైతుకు 2,500 నుంచి 30 వేల ఫ్రూట్ కవర్లు ఇస్తామన్నారు.

ఉపాధికి తరుణం

ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రోత్సాహంతో మగువలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకొన్న రుణాలతో ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. మండలంలో 724 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 7,236 మంది సభ్యులున్నారు. వీరికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలు వెలుగు ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. గతంలో కన్నా మిన్నగా తీసుకొన్న రుణాలతో మహిళలు రోజువారీగా ఆదాయం సమకూరే యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా నిలబడుతున్నారు. పిల్లలకు చదువులు చెప్పించుకోవడంతో పాటు బయట అప్పులు లేకుండా సంతోషకర జీవనం సాగిస్తూ నెలసరి కంతులు కట్టుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మిల్లుతో జీవనం

స్త్రీనిధి కింద రూ.లక్ష రుణం తీసుకున్నా. ధాన్యం, ఇతర పిండి కొట్టేందుకు అనువుగా ఉండే మిషను ఏర్పాటు చేసుకున్నా. ప్రకృతి వ్యవసాయంలో పండించే జొన్నలు, సజ్జలు వంటివి ఆడించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నా. దీనికి తోడు పసుపు, ధనియాలు, మిరపకాయలు వంటి వాటిని పిండి కొట్టి విక్రయిస్తాం. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.15వేలు తగ్గకుండా ఆదాయం పొందుతున్నాం. భర్త ఆదాయానికి నా ఆదాయం వేసి సంతోషంగా జీవనం సాగిస్తున్నాం.

- శైలజ, చిన్నర్సుపల్లె

కిరాణా దుకాణం నిర్వహిస్తూ..

నేను బ్యాంకు లింకేజీ కింద రూ.1.50 లక్షల రుణం తీసుకున్నా. కాలనీలోనే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నా. రోజువారీగా రూ.1500 తగ్గకుండా వ్యాపారం సాగుతుంది. పెట్టుబడి, నెలసరి కంతులు పోనూ నెలకు రూ.10వేల ఆదాయం పొందుతున్నా. భర్త సంపాదనకు తోడుగా నా ఆదాయంతో కుటుంబం సాఫీగా సాగుతోంది. పిల్లలను మంచి విద్యాసంస్థల్లో చదివిస్తున్నాం.

- అరుణకుమారి, చిన్నమండెం అంబేడ్కర్‌కాలనీ

జీవాలతో కుటుంబ పోషణ

రాజశేఖర స్వయం సహాయక సంఘంలో ఉన్నాను. బ్యాంకు లింకేజీ కింద రూ.1.20లక్షల రుణం తీసుకున్నా. ఈ సొమ్ముతో మేకలు కొనుగోలు చేశాం. కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరు వెళ్లి మేపుకొంటున్నాం. ఇవే మాకు జీవనాధారమయ్యాయి. మేకపోతులను అమ్ముతూ నెలసరి కంతులు సక్రమంగా కడుతున్నాం. మిగిలిన సొమ్మును ఇంటి అవసరాలకు వాడుకుంటున్నాం. **- సుశీల, చిన్నమండెం అంబేడ్కర్‌కాలనీ**

అంగన్‌వాడీల సంక్షేమానికి పథకాలు అమలుచేయాలి

మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలు అమలు చేయాలని సంఘం నాయకురాలు అపర్ణ అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే నిరాహార దీక్షలో వాల్మీకిపురం ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలోని కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి మండలాల అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. మినీ సెంటర్లను అంగన్‌వాడీ ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 164 సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు చంద్రమ్మ, భూకైలేశ్వరి, అమ్మాజీ, దేవసేన, శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు.. మత సామరస్యానికి ప్రతీక

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: పవిత్రమైన రంజాన్ సమాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఫాతిమా మసీదులో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలతో కలిసి విందు ఆరగించారు. పేదల ఆకలి విలువ తెలుసుకోవడమే రోజా ముఖ్య ఉద్దేశమన్నారు. హిందు-ముస్లింలు ఐక్యతగా ఇఫ్తార్‌లో పాల్గొనడం సామాజికవర్గాల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు బేపారి మహమ్మద్‌ఖాన్, వైకాపా నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఉపాధి పనులు కల్పించాలి

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మండెం సుధీర్‌కుమార్

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ ప్రాంత పేదలకు తక్షణం ఉపాధి పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2025-26 ఏడాదిలో కనీసం 50 రోజులు కూడా గ్రామీణ పేదలకు ప్రభుత్వం ఉపాధి కల్పించలేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్రం కేటాయించిన నిధులు వెనక్కి వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని తొలగించాలని కేంద్రం కుట్రలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుధాకర్, జాఫర్, అంజి పాల్గొన్నారు.

పర్యాటక దారిలో వ్యర్థాల కొలువు

స్థానిక కుషావతి వంతెన వద్ద ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థాలు, చెత్త పడేస్తున్నారు. దారిలో నడిచే వారికి దుర్వాసన వెదజల్లుతోంది. వెలిగల్లు జలాశయానికి సందర్శకులు వెళ్తూ నదీ అందాలు తిలకించేందుకు ఆగుతున్నారు. చెత్తను తొలగించి.. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చెత్త కుప్పలను తొలగిస్తామని గాలివీడు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు నాయక్ తెలిపారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

సంచార పుస్తక విక్రయశాల

రాయచోటి తహసీల్దార్ కార్యాలయం పక్కన విశాలాంధ్ర సంచార పుస్తక విక్రయ కార్యాలయం ఏర్పాటు చేశారు. బుధవారం కూడ అదే ప్రదేశంలో వాహనం ఉంటుందని సంచార వాహన ఇన్‌ఛార్జి శంకర్ తెలిపారు. పుస్తక ప్రియులకు ఇది మంచి అవకాశమని సూచించారు.

- న్యూస్‌టుడే, రాయచోటి

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి..

రాయచోటి పట్టణం: స్థానిక మాసాపేటలోని జెండామాను సమీపంలో దూడ రోడ్డు విభాగిని పైకి ఎక్కి ఇనుప చువ్వల మధ్య నుంచి ఆహారాన్ని తినేందుకు యత్నించింది. దీంతో తల ఇనుప చువ్వల మధ్య ఇరుక్కుపోయింది. తల బయటకు లాగేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. స్థానికులు దూడను రక్షించేందుకు ఇనుప చువ్వను విరిచేందుకు యత్నించినా ఫలితం లేదు. ఇనుప కడ్డీలను కత్తిరించే యంత్రంతో చువ్వను కోసి దూడను రక్షించారు.

గోవుకు వైద్యసేవలు

రాయచోటి ఎస్.ఎన్.కాలనీ స్టేట్ బ్యాంకు వద్ద రోడ్డుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం తగిలి గోవు ముందరి కాలు విరిగి కదలలేకుంది. విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ వారు వైద్యసేవలు అందించి యజమానికి అప్పగించారు. ఇలా పశువులను వదలడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ అని యజమానికి వివరించారు. పురపాలిక అధికారులు స్పందించి, గోవులను రోడ్లపై వదిలే వారిని మందలించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, రాయచోటి

నిషేధం పట్టదు.. అనర్థం తప్పదు

● విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచుల వినియోగం

గాలివీడు, న్యూస్‌టుడే: పాలిథిన్ సంచుల వినియోగంపై ప్రభుత్వ నిషేధం విధించినా క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. 125 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే వాటిని వినియోగించరాదని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. దుకాణాల్లో ఇప్పటికీ 75 శాతం మైక్రాన్ల మందం కలిగిన సంచులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

గాలివీడు, గోరాన్‌చెరువు గ్రామాల మధ్యనున్న మద్యం దుకాణాల పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో కొందరు మద్యం తాగి ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు ఎక్కడికక్కడే పడేస్తున్నారు. గ్రామాల శివారులో రోడ్డు పక్కన కుప్పలుగా సంచులు దర్శనమిస్తున్నాయి. పలువురు వీటికి మంట పెడుతుండటంతో విపరీతమైన దుర్వాసన వచ్చి భరించలేకున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక శుభకార్యాలకు వినియోగించే ప్లాస్టిక్ సంచులను ఇష్టారీతిలో రహదారుల పక్కన పడేస్తుండటంతో మూగజీవాలు వ్యర్థాలతో పాటు ఆ సంచులను తిని మృత్యువాత పడుతున్నాయి. కాలువల్లో వేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. వారపు సంతల్లో కూరగాయలు తీసుకెళ్లేందుకు వాటిని ఉపయోగిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

పాలిథిన్ వినియోగంతో కలిగే అనర్థాలపై విక్రేతలకు వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లోనూ ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

- చంద్రమౌళీశ్వర్, ఎంపీడీవో, గాలివీడు

27న చలో కలెక్టరేట్

కరపత్రాలు ప్రదర్శిస్తున్న కార్మికులు

పీలేరు, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దనాసి వెంకట్రామయ్య కోరారు. మంగళవారం పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద కరపత్రాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకట్రమణ, పులి రెడ్డెప్ప, నాగార్జున, మస్తాన్, రాధారాణి, గోపి, సరోజ, ధనభాగ్య, ప్రతాప్‌రెడ్డి, సరోజ, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామాపురం: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రామాపురం పశువుల సంత స్థలంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించే యత్నం చేయడంతో స్థానికులు రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సర్వే నంబర్ 317 లోని 1.55 సెంట్లలో ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు పాతామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పంచసూత్రాలతో డీజిల్ పొదుపు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పంచ సూత్రాలతో డీజిల్ పొదుపు సాధ్యమని, డ్రైవర్లు సంస్థ నిబంధనలు పాటించాలని మదనపల్లె ఒకటో డిపో మేనేజరు ఎం.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. డిపో పరిధిలో డీజిల్ పొదుపు చేయని డ్రైవర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. డ్రైవర్లతో కలిసి బస్సుల్లో ప్రయాణించి సూచనలు చేశారు. ఆన్‌కాల్, అద్దె బస్సు, రెగ్యులర్ డ్రైవర్లు సైతం పంచ సూత్రాలు పాటించాలన్నారు.

కాఫీ గోదాంలో అగ్నిప్రమాదం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని బెంగళూరు బస్టాండు, మల్లికార్జున కూడలి మధ్యలోని వరుణ్‌కుమార్‌వర్మ కాఫీ వర్క్స్ గోదాంలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. నిర్వాహకుడు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారి శివప్ప ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు. యంత్రాలు, కవర్లు, ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయి. రూ.లక్ష నష్టం వాటిల్లిందని అధికారి శివప్ప చెప్పారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

ప్రతిజ్ఞ చేస్తున్న ట్రాఫిక్ సీఐ కుళాయప్ప, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయచోటి, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలని పట్టణ ట్రాఫిక్ సీఐ కుళాయప్ప తెలిపారు. స్థానిక మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తుందన్నారు. రాయచోటి ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు మనిషిని మానసికంగా, శారీరకంగా ఆర్థికంగా కుంగదీస్తాయన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లతో బాల్యం నుంచే చిన్నపిల్లల్లో మధుమేహం వస్తుందని డాక్టరు కిరణ్‌కుమార్ తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సుగవాసి ఆనందబాబు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు కారంశెట్టి గిరి పాల్గొన్నారు.

ప్రారంభానికి రైతు బజారు సిద్ధం

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెం సంత వీధిలో రైతు బజారు పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమైంది. ప్రతి శుక్రవారం ఈ ప్రాంతంలో వారపు సంత జరుగుతోంది. పంచాయతీకి దీని ద్వారా ఏటా రూ.2లక్షల వరకు ఆదాయమున్నా కనీస వసతులు కల్పించలేదు. ఈ నేపథ్యంలో దీన్ని రైతు బజారుగా మార్చేందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించడంతో పనులు పూర్తయ్యాయి. ఇందులో 24 దుకాణాల ఏర్పాటుకు ప్లాట్‌ఫాంలు రూపొందించారు. ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నా వసతి ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వండాడి గ్రామానికి చెందిన సీనియర్ తెదేపా నాయకుడు చిన్నరెడ్డెన్న మృతికి పలువురు సంతాపం తెలిపారు. తెదేపా పార్లమెంటు అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు.. చిన్నరెడ్డెన్న భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

టైరు పగిలి ఆటో బోల్తా

13 మంది కూలీలకు గాయాలు

రాయచోటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నక్షతగాత్రులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: టైరు పగలడంతో కడప-బెంగళూరు ప్రధాన రహదారిపై చిన్నమండెం సమీపంలో మంగళవారం రాత్రి నాలుగు చక్రాల ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలోని 13 మంది కూలీలు గాయాలపాలయ్యారు. రాయచోటి, సంబేపల్లె, వీరబల్లి మండలాలకు చెందిన 15 మంది కూలీలు గుర్రంకొండ మండలం సరిమడుగు వద్ద పుచ్చకాయలు కోసే పనులకు వెళ్లారు. సాయంత్రం ఆటోలో స్వగ్రామాలకు బయలుదేరారు. రాత్రి 8 గంటలపైన చిన్నమండెం టీ టైం సమీపంలోకి వచ్చేసరికి ఆటో ముందు భాగంలోని ఎడమ టైరు పగిలిపోవడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలోని 13 మంది కూలీలకు గాయాలయ్యాయి. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మూడు 108 వాహనాల్లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో రాయచోటి మండలం గొర్లముదివేడు గ్రామం చెర్లోపల్లెకు చెందిన హరిత, కృష్ణవేణి, గణేష్, శ్రీవాణి, ఎస్టీకాలనీకి చెందిన చందానాయక్, రెడ్డినాయక్, మహేష్, గోపాల్‌నాయక్, కవిత, సరస్వతి, సంబేపల్లె మండలం ఎర్రగుంట్లకు చెందిన చిన్న నాగరాణి, వీరబల్లి మండలం వడ్లమాడివాండ్లపల్లెకు చెందిన ప్రభాకర్‌నాయుడు ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న కృష్ణవేణిని కడప తరలించారు.

ఆసుపత్రి పైకప్పు నుంచి జారిపడి గాయాలు



గాయపడిన బిహార్‌వాసి

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి ప్రాంతీయ ఆసుపత్రి పైకప్పు నుంచి సోమవారం రాత్రి జారి పడి ఓ వ్యక్తి గాయపడ్డారు. కలకడ ప్రాంతంలోని రోడ్డుపై మద్యం మత్తులో పడిపోయి ఉన్న బిహార్‌కు చెందిన వ్యక్తిని 108లో రాయచోటి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఇతను బెడ్‌పై నుంచి లేచిపోయి ఆసుపత్రిపైకి వెళ్లాడు. అక్కడ గోడకున్న పైపుల సాయంతో కిందకు దిగే యత్నంలో పైపులు ఊడి కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రి సిబ్బంది, పోలీసులకు సమాచారమిచ్చారు. వైద్య సిబ్బంది చికిత్సలు అందించడంతో అతని ఆరోగ్య పరిస్థితి మెరుగు పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

CHANGE OF NAME

I, N.Syamala (OldName) W/o Yarragolla Giribabu Yadav, R/o D.No:37/49-15, G.K.Road, S.N.Colony,Rayachoty Town & Mandal, Annamayya Dist., A.P. 516269. I have changed my Name to **YARRAGOLLA LAKSHMI SYAMALA.** Hence forth I will be known as **YARRAGOLLA LAKSHMI SYAMALA (New Name).**

CHANGE OF NAME

I, Yerragolla Giribabu (Old Name) S/o Yarragolla Ramamurthy, R/o D.No: 37/49-15,G.K.Road,S.N.Colony,Rayachoty Town & Mandal, Annamayya Dist., A.P. 516269. I have changed my Name to **YARRAGOLLA GIRIBABU YADAV.** Hence forth I will be known as **YARRAGOLLA GIRIBABU YADAV (New Name).**



(c) eenadu

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు కల్యాణ వెంకటర మణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహన సేవలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవితో శ్రీవారు విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టరు కృష్ణ మూర్తి, ఉభయదారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆడిటర్లతో వేగలేకపోతున్నాం

చైర్‌పర్సన్ ఎదుట గుత్తేదారుల ఆవేదన

గుత్తేదారులతో సమావేశమైన చైర్‌పర్సన్ వి.మనూజ, వైస్‌చైర్మన్ వెంకటచలపతి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: ఆడిటర్లతో వేగ లేకపోతున్నామని, వేధింపులకు గురి చేస్తున్నారని పుర అధ్యక్షురాలు వి.మనూజ, ఉపాధ్యక్షుడు వెంకటచలపతి ఎదుట గుత్తేదారులు ఆవేదన చెందారు. నెలల తరబడి బిల్లులు రావడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆడిటింగ్ చేయడం లేదని, పనులు ఎలా చేయాలని ప్రశ్నించారు. అప్పులు చేసి పనులు చేపడుతుంటే, బిల్లుల కోసం ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వారి నిర్లక్ష్యంతో రూ.కోట్ల విలువైన పనులు ఆగుతున్నట్లు చెప్పారు. మదనపల్లెలో బుధ, గురువారాల్లో ఆడిట్ చేయాల్సి ఉన్నా.. అధికారులు ఎప్పుడు వస్తున్నారో తెలియడం లేదన్నారు. కార్యాలయంలో ఫైళ్లు సైతం మాయమవుతున్నట్లు చెప్పారు. సమస్య పరిష్కరిస్తామని అధ్యక్షురాలు తెలిపారు. ఇదే విషయంపై కమిషనర్ ప్రమీలతో చర్చించారు. డీఈఈ శ్రావణి, ఏఈఈ రవీంద్ర నాయక్ తదితరులున్నారు.

పంచసూత్రాలతో డీజిల్ పొదుపు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పంచ సూత్రాలతో డీజిల్ పొదుపు సాధ్యమని, డ్రైవర్లు సంస్థ నిబంధనలు పాటించాలని మదనపల్లె ఒకటో డిపో మేనేజరు ఎం.వి. రమణారెడ్డి పేర్కొన్నారు. డిపో పరిధిలో డీజిల్ పొదుపు చేయని డ్రైవర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. డ్రైవర్లతో కలిసి బస్సులో ప్రయాణించి సూచనలు చేశారు. ఆన్‌కాల్, అద్దె బస్సు, రెగ్యులర్ డ్రైవర్లు సైతం పంచ సూత్రాలు పాటించాలన్నారు. ఎస్డీఐ రెడ్డిబాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని బద్దిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కమిషనరు రమాదేవి, ఏఈ లోకేష్‌రెడ్డికి వినతులు ఇచ్చారు. బోరు వేసి మోటారు అమర్చకపోవడంతో సమస్య వచ్చినట్లు చెప్పారు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కమిషనరు హామీ ఇచ్చారు.

పంటకు తెగుళ్లు.. రైతుకు కన్నీళ్లు

ములకలచెరువు, తంబళ్లపల్లె, పీటీఎం, పెద్దమండ్యం, న్యూస్‌టుడే: వేసవిలో ఎండ నుంచి అందరికీ సాంత్వన కలిగించే కర్బూజ, దోస పంటలు రైతులకు నష్టాలు మిగుల్చుతున్నాయి. వాతావరణ మార్పులు, తెగుళ్ల ధాటికి చేతికి వచ్చే సమయంలో పంటలు పాడవుతూ అన్నదాతకు కన్నీరు మిగుల్చుతున్నాయి.

వందల ఎకరాల్లో నష్టం

నాసిరకం విత్తనాలతో..

నియోజకవర్గంలోని ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట, కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో దోస రకం కుందన్, లాయల్‌పూర్, కర్బూజ రకం కృష్ణ, నామదారి తదితర విత్తనాలు వేశారు. కుందన్ రకం కిలో రూ.57 వేలు, కృష్ణ కిలో రూ.25 వేలు చొప్పున కొనుగోలు చేశారు. వైరస్‌లు, తెగుళ్లు, నాసిరకం విత్తనాల కారణంగా మొక్కలు, కాయల సైజు పెరగకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు.

అంతంతమాత్రంగా కాసిన కాయలు

పిందె రాలుతోంది..

✦ మండల కేంద్రానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి దోస వేయగా వైరస్ కారణంగా దెబ్బతినడంతో పంట తొలగించాడు. సుమారు రూ.2 లక్షలు నష్టం వచ్చినట్లు చెబుతున్నాడు. ✦ తంబళ్లపల్లె మండలం కుతికబండతండాకు చెందిన రెడ్డెప్పనాయక్ 4 ఎకరాల్లో కర్బూజ వేశారు. వర్షాలతో తెగుళ్లు సోకాయి. పిందె రాలిపోవడంతో రూ.4 లక్షల మేర నష్టం వచ్చినట్లు రైతు చెబుతున్నాడు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

విత్తన సమస్య, వాతావరణంలో మార్పుల కారణంగా పుచ్చకాయ, దోస పంటలను రైతులు నష్టపోయారు. ఇప్పటికే పలువురి నుంచి ఫిర్యాదులు వచ్చాయి. విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. - **భీమేష్ ఉద్యాన శాఖాధికారి, ములకలచెరువు**

రూ.3 లక్షల మేర రానట్లే..

నేను మూడు ఎకరాల్లో కర్బూజ వేశా. రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. పంట చేతికి వచ్చే సమయానికి కాయ సైజు తగ్గి తెగుళ్లు సోకాయి. రూ.లక్ష విలువైన పంట చేతికి అందింది. మరో రూ.3 లక్షలు నష్టమే మిగిలింది. - **మంజునాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె**

అడియాసలే మిగిలాయి..

బంగారు నగలు తాకట్టు పెట్టి ఎన్నో ఆశలతో మూడు ఎకరాల్లో కందుకూరు రకం కర్బూజ వేశాను. నాసికరం విత్తనాలు కావడంతో 40 రోజులు అవుతున్నా ఇంకా మొక్కలు ఎదగలేదు. సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశా. ప్రస్తుతం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకోవాలి. - **జి.ఉత్తన్న, రైతు, ములకలచెరువు**

మేమున్నాం.. మీకు తోడుగా..

మదనపల్లె పట్టణం: 80085 74611
తంబళ్లపల్లె: 94416 29636
పుంగనూరు: 80085 74622
(10 AM TO 1 PM)

? కందూరు పంచాయతీ పఠాన్ వీధిలో పైపులైను పాడైంది. - **స్థానికులు** ★ పఠాన్ వీధిలో పైపులైను బాగు చేస్తాం. - **జయశంకర్, కార్యదర్శి – సోమల**

? కొత్తిండ్లు దోసెల రెడ్డెమ్మ వీధిలో పైపులైను లీకవుతోంది. నీరు కలుషితం అవుతోంది. - **ఖాదర్‌షరీఫ్** ★ లీకులు అరికడతాం. - **తాజ్‌మస్రూర్, ఎంపీడీవో**

? బసినికొండ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **చలపతి** ★ శుభ్రత పనులు చేపడతాం. - **భారతి, డిప్యూటీ ఎంపీడీవో** ? సీటీఎం - మదనపల్లె మార్గంలోని నేతాజీకాలనీలో ఇళ్ల మధ్య మురుగు చేరుతోంది. - **రమణ, సీటీఎం రోడ్డు** ★ మురుగు నిల్వలు లేకుండా చూస్తాం. - **తిరుపాల్‌నాయక్, డిప్యూటీ ఎంపీడీవో – మదనపల్లె గ్రామీణం** ? బి.కొత్తకోట వ్యవసాయ కార్యాలయంలో సిబ్బంది లేక పని వేళల్లోనూ మూసేస్తున్నారు. - **ఎస్.ఆర్.రెడ్డి, రైతు** ★ త్వరలోనే సిబ్బందిని నియమిస్తాం. - **చంద్రశేఖర్, ఏవో**

– న్యూస్‌టుడే, బి.కొత్తకోట

నీటి సరఫరా పునరుద్ధరణ

స్పందనకు వందనం

బి.కొత్తకోట: కురవానికుంట కాలనీలో బోరు మోటారు పాడైందని ఈ నెల 18న 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన నగర పంచాయతీ ఏఈ లోకేశ్‌రెడ్డి మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

సొసైటీ కాలనీలో కాలువ శుభ్రం

మదనపల్లె గ్రామీణం: పట్టణంలోని సొసైటీ కాలనీలో కాలువలను మంగళవారం శుభ్రం చేశారు. ఇక్కడ సమస్యపై ఈనెల 16న 'ఈనాడు'లో వార్త ప్రచురితమవగా కమిషనర్ ప్రమీల స్పందించి చర్యలు చేపట్టారు.

ఇందిరమ్మ కాలనీలో ఎన్నో సమస్యలు

రామసముద్రంలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కరవయ్యాయి. 2012లో ఇక్కడ 250 మంది పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించలేదు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. విషయం ఎంపీడీవో లతీఫ్ ఖాన్ వద్ద ప్రస్తావించగా.. కాలనీలో సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, రామసముద్రం

శుద్ధజలం అందించండి మహాప్రభో

పుంగనూరు పట్టణ పరిధిలో ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు మూత పడింది. రెండు రోజులకోసారి నీరు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నా తాగేందుకు ఉపయోగపడటం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. సంత గేటులో ఆర్వో ప్లాంటు బాగు చేయాలని కోరారు. - న్యూస్‌టుడే, పుంగనూరు

యూరియా.. బారులు తీరారయ్యా..

యూరియా ఉందని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చౌడేపల్లె మండలంలోని చారాల సచివాలయం వద్ద పంపిణీ చేస్తున్నారని తెలుసుకున్న రైతులు మంగళవారం యూరియా కోసం బారులు దీరారు. ఉదయం నుంచే వరుసలు కట్టి నిరీక్షించారు. ఏవో మోహన్‌కుమార్ గుర్తించి.. అదనపు సిబ్బందిని తీసుకొచ్చి వేగంగా పంపిణీ చేయించారు. - న్యూస్‌టుడే, చౌడేపల్లె

వీధులు.. ఇళ్లు.. అన్నిచోట్లా మురుగే

పుంగనూరు మండలం మంగళం గ్రామంలో కొంత మంది చెరువులోకి మురుగు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో గ్రామంలోని ఇళ్లు, వీధుల్లోకి మురుగు వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. ఎంపీడీవో అల్లాజ్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

కాలువలో వ్యర్థాలతో దుర్వాసన

బి.కొత్తకోటలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న వారపుసంత ప్రాంతం ఇరుగ్గా మారింది. ఇక్కడి మురుగు కాలువ అధ్వానంగా ఉండటంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు సంతతో పాటు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల మీదుగా దిగువకు వెళ్తోంది. సంత వద్ద కాలువలో కుళ్లిన కూరగాయలు, చెత్త వేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుభ్రం చేయిస్తామని కమిషనరు రమాదేవి తెలిపారు.

- న్యూస్‌టుడే, బి.కొత్తకోట

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా వనజ

ప్రిన్సిపల్ వనజను అభినందిస్తున్న అధ్యాపకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా రాజనీతిశాస్త్రం అధ్యాపకురాలు వై.వనజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా ఉన్న సూర్యశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ప్రిన్సిపల్‌ను వైస్ ప్రిన్సిపల్ మోహన్‌బాబు, అధ్యాపకులు శ్రీనివాసులు, గురుమూర్తి, విష్ణుప్రియ, మోహనవల్లి, జ్యోతి, సుబ్బరాయుడు, హాజీరా ఖానమ్, కుసుమప్రియ అభినందించారు.

కాఫీ గోదాములో అగ్నిప్రమాదం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని బెంగళూరు బస్టాండు, మల్లికార్జున కూడలి మధ్యలోని వరుణ్‌కుమార్‌వర్మ కాఫీ వర్క్స్ గోదాములో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. నిర్వాహకుడు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారి శివప్ప ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు. యంత్రాలు, కవర్లు, ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయి. రూ.లక్ష నష్టం వాటిల్లిందని అధికారి శివప్ప చెప్పారు.

గొర్రెల కాపరిపై హత్యాయత్నం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని రఘునాథపురానికి చెందిన గొర్రెల కాపరి కృష్ణప్ప (60)పై హత్యాయత్నం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ గోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గొర్రెలు తోలుకుని వెళ్లే దారి విషయంలో గొడవ జరగడంతో ఈనెల 21న బాధితుడిపై తిమ్మారెడ్డి, ఆరుగురు కుటుంబ సభ్యులు కొట్టి గాయపర్చారు. ఆయన కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం తిమ్మారెడ్డి, అనసూయ, సరస్వతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేడి నీరు పడి బాలుడికి గాయాలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని సుబ్బిరెడ్డిగారిపల్లెకు చెందిన అయిదేళ్ల బాలుడు అనిరుధ్ ఆడుకుంటుండగా వేడినీరు మీద పడ్డాయి. శరీరంపై గాయాలు కావడంతో 108లో మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

వైకాపా ఎంపీటీసీ భర్తపై ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని మొరుసుపల్లెకు చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన వైకాపా ఎంపీటీసీ భర్త శ్రీనివాసులురెడ్డి తీసుకెళ్లిపోయాడని ఆమె భర్త వెంకటరమణ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు.

వైకల్యం ఓడాలని.. విద్యతో గెలవాలని..

పుట్టుకతోనే వారు దివ్యాంగులు. కానీ కష్టాన్ని లెక్క చేయకుండా.. విధికి ఎదురీదుతూ చదువుకున్నారు. మంగళవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షకు తల్లిదండ్రుల సాయంతో హాజరయ్యారు. తంబళ్లపల్లె మండల కేంద్రానికి చెందిన కుసుమను ద్విచక్ర వాహనంలో తీసుకొచ్చి.. తల్లి ఇలా ఎత్తుకొని కేంద్రంలోకి తీసుకెళ్తూ కనిపించింది. మరో దివ్యాంగ విద్యార్థిని ఉషారాణి సైతం తల్లిదండ్రుల సాయంతో కేంద్రానికి చేరుకొని పరీక్ష రాసింది. – న్యూస్‌టుడే, ములకలచెరువు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తంబళ్లపల్లె, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలంలోని మార్కిరివారిపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. పద్మావతమ్మ వ్యవసాయ కూలి పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఆమెకు సమాచారం ఇచ్చారు. వచ్చి చూసేసరికి ఇంట్లోని నిత్యావసర సరకులు, విలువైన వస్తువులు, నగదు, బంగారు ఆభరణాలు కాలిపోయినట్లు చెప్పారు. ట్రాన్స్‌కో ఏఈ సురేంద్ర, వీఆర్వో వెంకటేష్ ఇంటిని పరిశీలించారు. రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విద్యా సామగ్రి చూపుతున్న విద్యార్థులు

తంబళ్లపల్లె, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ అన్నారు. మంగళవారం తంబళ్లపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు 48 మందికి విద్యా సామగ్రి అందజేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మొయినుద్దీన్, సురేంద్రనాయక్, దొరస్వామినాయుడు, ప్రతాప్‌రెడ్డి, సంస్థ సభ్యులు బసీర్, సిరాజ్, కల్యాణ్, అబ్దుల్లా, అమీన్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు సన్నద్ధం

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: జనసేన పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పార్టీ మండలాధ్యక్షుడు ప్రదీప్‌సింగ్ అన్నారు. సభ్యులు పార్టీలో గుర్తింపు పొంది నాయకులుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. రూ.5 లక్షల ప్రమాదబీమా వస్తుందన్నారు. ఈనెల 26 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

సదుం, న్యూస్‌టుడే: సదుం నుంచి కందూరు, నిమ్మనపల్లె మీదుగా మదనపల్లె వెళ్లే ఆర్టీసీ బస్సు సదుం ప్రాథమిక పాఠశాల సమీపంలో మొరాయించింది. ఎంత సేపటికీ కదలకపోవడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. ఆటోల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.

ఇంటర్ విద్యార్థిని మృతిపై కేసు

రేణిగుంట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని జ్వరంతో మృతి చెందింది. ఆమె తల్లి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని సీఐ మంజునాథరెడ్డి చెప్పారు. రామసముద్రం మండలానికి చెందిన బాలిక రేణిగుంటలో చదువుతోంది. ఈనెల 20న ఆమెకు జ్వరం రావడంతో కళాశాల వార్డెన్ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇంజెక్షన్ వేసి కళాశాలకు పంపించారు. ఆదివారం జ్వరం పెరిగి, ఇంజెక్షన్ వేసిన చోట బొబ్బలు వచ్చి మృతి చెందినట్లు ఆమె తల్లి ఫిర్యాదు చేశారని సీఐ చెప్పారు.

మట్టి తరలింపు అడ్డగింత

కురబలకోట: చింతమాకులపల్లిలో నార్లపల్లి చెరువు నుంచి కొందరు రైతుల పేర్లతో అనుమతులు తీసుకొని రియలెస్టేట్ భూములకు మట్టి తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

CHANGE OF NAME

DINNIPATI SREELATHA (Old Name), W/o DINNIPATI VENKATASHESHA REDDY, D.No. 27-56-a, Billurivaripalle, H/o Sompalle Village, Mulakala Cheruvu Mandal, Annammayya District, A.P., My name has been changed to DINNIPATI SRILATHA (New Name).

గొడవలకు దిగితే చర్యలు తప్పవు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్సై రామకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఠాణాలో రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. సెటిల్‌మెంట్లు, పంచాయితీలు నిర్వహించడం, గొడవలు, బెదిరింపులకు దిగితే కఠిన చర్యలు చేపడతామన్నారు. ★ పుంగనూరు గ్రామీణం: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరిగితే సమాచారం ఇవ్వాలని ఎస్సైలు అన్సార్‌బాషా, రమణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అవగాహన కల్పించారు. ప్రజలు గంజాయి, మద్యం, మత్తు పదార్థాలు, దొంగతనాలకు దూరంగా ఉండాలన్నారు.

రూ.10 లక్షలతో రోడ్డు పనులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా జిల్లా కార్యదర్శి వై.సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కోటచౌడేశ్వరి నగర్‌లో రూ.10.40 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను ఎంపీడీవో హరినారాయణతో కలిసి ప్రారంభించారు. నాయకులు శంకర, సిరాజ్, మాజీ వైస్ సర్పంచి రఫీ, మునిస్వామి, రెడ్డెప్ప, బాబ్‌జాన్ ఉన్నారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

దండాలు పెడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మదనపల్లె గ్రామీణ, పుంగనూరు, న్యూస్‌టుడే: వేతనాలు పెంచి. పనిభారం తగ్గించాలని సిటు జిల్లా కార్యదర్శి రాజేశ్వరి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలపై మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం మోకాళ్లపై నిల్చొని దండాలు పెట్టారు. నాయకులు భాగ్యమ్మ, షాహినా, మౌలాలి, మధురవాణి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు. ✦ అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు పీవీ రెడ్డి, పట్టణ సీపీఐ కార్యదర్శి రామ్మూర్తి డిమాండు చేశారు. మంగళవారం పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రిలేదీక్షలు చేపట్టిన కార్యకర్తలకు మద్దతు ఇచ్చారు.

(c) eenadu

97.64 శాతం విద్యార్థులు హాజరు

బాపట్ల, న్యూస్‌టుడే: సీనియర్ ఇంటర్ పరీక్షలు జిల్లాలో మంగళవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 9126 మంది విద్యార్థులకు 8911 మంది పరీక్షకు హాజరయ్యారు. 97.64 శాతం హాజరు నమోదైంది. ఉదయం తొమ్మిది గంటల్లోగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉండగా.. కొందరు విద్యార్థులు ఆఖరి నిమిషాల్లో పరుగులు తీస్తూ పట్టణంలోని సరస్వతీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రానికి చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు సాయిసుబ్బారావు తనిఖీ చేశారు.

విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

హనుమంత వాహనంపై నృసింహుడు

చూసిన కనులదే భాగ్యం

మంగళగిరి: మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి అభయ ప్రదాత హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని రంగురంగుల పూల దండలతో అలంకరించి మంగళగిరి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బీచ్‌ల స్వచ్ఛత.. పర్యాటకుల భద్రత

- స్వయం సహాయక సంఘాలతో హోంస్టేల నిర్వహణ
- గోవా పర్యాటక విధానాలు జిల్లాలో అమలుకు ప్రణాళిక

బాపట్ల, న్యూస్‌టుడే

దేశంలో గోవా పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తోంది. ఏటా లక్షల సంఖ్యలో విదేశీ, స్వదేశీ పర్యాటకులు తరలివస్తున్నారు. చిన్న రాష్ట్రానికి పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. ఈ క్రమంలో బాపట్లను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గోవాలో అమలవుతున్న ఉత్తమ పర్యాటక విధానాలు అధ్యయనం చేసి సూర్యలంక కేంద్రంగా బీచ్ పర్యాటక క్లస్టర్ మాస్టర్ ప్లాన్ రూపొందించి అమలుచేయడానికి కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందాన్ని నాలుగు రోజుల పర్యటనకు ప్రభుత్వం పంపించింది. గవర్నర్, సీఎం, పర్యాటక శాఖ అధికారులను కలెక్టర్ బృందం కలిసి ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంది.

నిర్వహణపై ప్రత్యేక దృష్టి

దేశవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేలా గోవా తరహాలో జిల్లాలో బీచ్‌ల నిర్వహణ, పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. బీచ్‌లను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా మార్చడం, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టడం ద్వారా స్వచ్ఛంగా తీర్చిదిద్దనున్నారు. తీర ప్రాంతానికి అనువైన కొబ్బరి, జీడిమామిడి, ఈత, మడ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బీచ్‌లలో ప్రమాదాల నివారణకు పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీనికోసం అక్కడ వినియోగిస్తున్న ఏఐ ఆధారిత రోవర్ వంటి ఆధునిక వాహనాల పనితీరు పరిశీలించారు. వీటిని జిల్లాలోని బీచ్‌లలో ప్రవేశపెట్టి ప్రమాదాలను ముందుగానే పసిగట్టి.. సముద్ర స్నానానికి దిగినవారిని, భద్రత విధుల్లో ఉన్న సిబ్బందిని రోవర్లు అప్రమత్తం చేస్తాయి. పర్యాటకుల భద్రతకు ప్రత్యేక పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్లతో బీచ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

హోంస్టేల నిర్వహణపై స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

మాస్టర్ ప్లాన్ రూపొందిస్తాం

కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పర్యాటక రంగంలో గోవా దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. నాలుగు రోజుల పర్యటన ద్వారా చాలా కొత్త విషయాలు తెలుసుకున్నామన్నారు. పర్యావరణ హితంగా ఉత్తమ పర్యాటక విధానాలను జిల్లాలో అమలు చేయడానికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామన్నారు. జిల్లాలో బీచ్ పర్యాటకాన్ని మరో స్థాయికి తీసుకెళ్లడం ద్వారా లక్షల సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించి అమరావతికి సమీపంలో అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వివరించారు.

పర్యావరణ హిత షాక్‌ల ఏర్పాటు

జిల్లాలో బీచ్ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా పర్యాటకులు బీచ్‌లలో సేద తీరడానికి సీఆర్‌జెడ్ నిబంధనలు పాటిస్తూ పర్యావరణ హిత షాక్‌లు ఏర్పాటు చేయనున్నారు. గోవాలో ప్రసిద్ధి చెందిన షాక్‌లను ఆదర్శంగా తీసుకుని జిల్లాలో బీచ్ ఒడ్డున తాటి ఆకులు, వెదురుతో నిర్మించిన తాత్కాలిక గుడిసెలు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. సన్‌బెడ్లు, పెద్ద గొడుగులను ఏర్పాటు చేయనున్నారు. సూర్యలంక, రామాపురం బీచ్‌ల సందర్శనలో పర్యాటకులు కేవలం భోజనం కోసమే కాకుండా సూర్యోదయం, సూర్యాస్తమయం వీక్షిస్తూ ప్రశాంతంగా సమయం గడపనున్నారు. సూర్యలంక, నిజాంపట్నం మధ్య సముద్ర వెనుక జలాల్లో జలక్రీడలైన పారాసెయిలింగ్, జెట్ స్కీయింగ్, కయాకింగ్, వాటర్ స్కీయింగ్‌లను ప్రవేశపెట్టనున్నారు.

గోవా బీచ్‌లో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన షాక్‌లు

★ గోవాలోని తీర ప్రాంతం హోమ్‌స్టేలకు ప్రసిద్ధి. చిన్న గ్రామాల్లో పర్యాటకులకు గృహవసతి అక్కడి స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా కల్పిస్తున్నారు. వీరితో కలెక్టర్ నేతృత్వంలోని అధికారుల బృందం ప్రత్యేకంగా మాట్లాడి గృహవసతి నిర్వహణ విధానాలను అడిగి తెలుసుకుంది. జిల్లాలోని బాపట్ల, చీరాల పట్టణాలు, తీర గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా పర్యాటకుల కోసం హోంస్టేలను అందుబాటులోకి తీసుకురావడానికి సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నారు.

ఆటలాడించాల్సిందే!

ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలన్న ప్రభుత్వం

బాపట్ల, న్యూస్‌టుడే

తెల్లారి లేచింది మొదలు ఉరుకులు పరుగులు.. పుస్తకాలతో కుస్తీలు.. ఆపై సెల్‌ఫోన్‌లో ఆటలు, చదువులు.. చాలా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల ప్రస్తుత పరిస్థితి ఇది. శారీరక శ్రమ లేక అనారోగ్యం బారిన పడుతున్న బాలల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కచ్చితంగా వ్యాయామ విద్య అమలు చేయాలంటూ ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలవుతోంది. దీనిలో భాగంగా రోజూ ఓ గంటసేపు ఆటలాడేందుకు సమయం కేటాయిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం విరామ సమయాల్లోనూ పిల్లలకు చాలామంది ఆటలాడుతుంటారు. ప్రైవేటు బడుల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. కొన్ని పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేలా ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను ఆటలు ఆడించాల్సిందేనంటూ విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది.

★ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 1744 ఉన్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,66,511 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాపట్ల, చీరాల, రేపల్లె, పర్చూరు, మార్టూరు, ఇంకొల్లులో ప్రైవేటు పాఠశాలలు అధికం. ఇకపై అన్ని పాఠశాలల్లోనూ గంట పాటు ఆటలు ఆడించాల్సిందే.

ఆరోగ్య విద్యకూ ప్రాధాన్యం.. ప్రతి విద్యార్థికి వారానికి ఆరు పీరియడ్లు చొప్పున ఆటలాడించాలి. ఉదయం అసెంబ్లీ సమయంలో పది నిమిషాల పాటు ధ్యానం తప్పనిసరి. ప్రతిరోజు కచ్చితంగా ఆటలు ఉండాలి. వారంలో ఒక పీరియడ్ ఆరోగ్య విద్యకు కేటాయించాలి. ఇందులో ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

❖ ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగానే ప్రైవేటు బడుల్లో విద్యార్థులకు క్రీడలను నిత్యకృత్యం చేయడం చాలా అవసరమని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు.

ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు రూ.4.36 కోట్ల సాయం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం 163 యూనిట్లు స్థాపించి 815 మందికి ఉపాధి కల్పించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు కొత్తగా వచ్చిన 55 దరఖాస్తులు పరిశీలించి అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు రూ.4.36 కోట్ల సాయం అందించినట్లు వివరించారు. తయారీ పరిశ్రమలకు వివిధ రాయితీల కింద రూ.1.60 కోట్లు విడుదల చేశామన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి రామకృష్ణ, ఏపీఐఐసీ జెడ్ఎం నరసింహారావు, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం శివకృష్ణ పాల్గొన్నారు.

9 నుంచి ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మహిళ, పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మార్చి 9వ తేదీ నుంచి గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో ప్రారంభమవుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూటింగ్ డైరెక్టర్, వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ మార్చి 9, 10 తేదీల్లో బాలికలకు, 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురుష అభ్యర్థులకు, 15, 16 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర పురుష అభ్యర్థులకు ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు. 2005, జులై 2 నుంచి 2009, జనవరి 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కనీస ఎత్తు 152 సెం.మీ., ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష, మూడేళ్ల డిప్లొమా ఇంజినీరింగ్, రెండేళ్ల ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోనవసరం లేదని, నేరుగా ర్యాలీకి హాజరుకావచ్చన్నారు. ఒరిజినల్ లేదా డిజీలాకర్ ద్వారా ధ్రువపర్చిన విద్యార్హత ధ్రువపత్రాలు, నివాస పత్రం, ఎన్‌సీసీ సర్టిఫికెట్ (ఉంటే), ఆధార్ కార్డు, ఇ-మెయిల్ నంబర్, ఇటీవల తీసుకున్న 10 పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు, ప్రతి ధ్రువపత్రానికి సంబంధించిన 6 నకళ్ల కాపీలు తెచ్చుకోవాలని సూచించారు.

14వ వర్ధంతి నివాళులు

గౌరవమర్యాదలు, మంచితనం, మమకారం
మా అందరికి అలవర్చి, మా అభివృద్ధికి
ఎంతగానో పాటుపడిన
శ్రీ పోలినేని నాగేశ్వరరావు గారి
14వ వర్ధంతి సందర్భంగా
అశ్రునివాళులు అర్పిస్తున్నాం.
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

కీ॥శే॥ పోలినేని నాగేశ్వరరావు, B.A., B.L.
జననం : 01-07-1932, మరణం : 01-03-2012
భార్య : పోలినేని వెంకట సుబ్బమ్మ (సుబ్బాయమ్మ)

కుమారులు - కోడళ్ళు
పోలినేని బాలశ్రీనివాస్ - పోలినేని శైలజ
పోలినేని సుబ్రహ్మణ్య ప్రసాద్ - పోలినేని అన్నపూర్ణ

కూతురు - అల్లుడు
నల్లమోతు దుర్గారాణి - నల్లమోతు మధుకర్

మనుమలు, మనుమరాండ్రు :
జ్యోత్స్న, మధుల్లిక, జ్ఞానప్రసూన, విఘ్నేష్, పూర్ణ యశస్వి, మోనిక, శివవెంకటసాయి జగన్నాథ్

KALYANIADS : 9849383669

అంగన్‌వాడీలకు బీమా ధీమా

పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై వర్తింపు

బాపట్ల, న్యూస్‌టుడే

మాతాశిశు సంరక్షణలో కీలకంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు బీమా ధీమా కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వైకాపా ప్రభుత్వంలో అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయలేదు. అధిక ఆదాయం పొందుతున్నారనే సాకుతో నవరత్నాల్ని వారి కుటుంబాలకు దూరం చేశారు. అనుకోని ప్రమాదం వాటిల్లి.. అనారోగ్య సమస్యతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందితే ఎలాంటి సహాయం అందేది కాదు. విధుల్లో ఉండి మరణించిన వారికి కూటమి ప్రభుత్వం సాయం అందించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకుంది. తద్వారా అంగన్‌వాడీల కుటుంబాలకు బీమా రక్షణ కలగనుంది.

★ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై)కు జిల్లాలో 1,426 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు (18 నుంచి 50 ఏళ్లలోపు వారు) అర్హులుగా గుర్తించారు. వారు ఏడాదికి రూ.436 నగదు బ్యాంకు ఖాతా లేదా తపాలా శాఖ ద్వారా చెల్లిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందినా, సహజ మరణం పొందినా బీమా నగదు అందుతుంది. 50 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇది వర్తించదు.

★ పద్దెనిమిది నుంచి 70 ఏళ్లలోపు వారికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) వర్తింపజేయనున్నారు. పథకం లబ్ధికి వార్షిక ప్రీమియంగా రూ.20 నగదు చెల్లిస్తే సరిపోతుంది. ఇది ప్రమాదవశాత్తు మరణానికి వర్తిస్తుంది. మృతి చెందినా, పూర్తి వైకల్యం పొందినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష అందిస్తారు. ఏటా జూన్ 1వ తేదీ నుంచి మరుసటి ఏడాది మే 31 వరకు బీమా కవరేజి ఉంటుంది. ఆటో డెబిట్ ద్వారా ప్రీమియం నగదు చెల్లించవచ్చు.

★ జిల్లాలోని 1,888 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సేవలందిస్తున్నారు. అందరితో బీమా ప్రీమియం కట్టించి వారితోపాటు కుటుంబాలకు రక్షణ కల్పించేలా స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారులు చొరవ చూపిస్తున్నారు. అర్హులందరూ ప్రీమియం చెల్లించి బీమా పథకాల్లో చేరాలని ఐసీడీఎస్ పీడీ రాధామాధవి కోరారు.

సాగర్ నీటిమట్టం 539.20 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం సాయంత్రం 6 గంటలకు 539.20 అడుగులకు చేరింది. ఇది 186.6644 టీఎంసీలకు సమానం. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 28,514 క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయం నుంచి ప్రధాన జల విద్యుత్తు కేంద్రానికి 28,846, కుడి కాలువకు 8,831, ఎడమ కాలువకు 7,768, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2,000, లోలెవల్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు విడుదలచేస్తున్నారు.

వినూత్నం.. పది మూల్యాంకనం

దిద్దిన రోజే మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు

న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల పత్రాల మూల్యాంకనంలో ఈసారి విద్యాశాఖ వినూత్న విధానానికి తెరతీసింది. పత్రాన్ని దిద్దిన వారే మార్కులు సైతం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేలా చేశారు. వేగవంతంగా ఫలితాలు అందించడం, తప్పులు క్షేత్రస్థాయిలోనే కనిపెట్టి సరిదిద్దుకోవడం లక్ష్యంగా సాంకేతిక పరిజ్ఞానం మిళితం చేయనున్నారు.

ఇప్పటివరకు ఇలా.. పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో పేపర్లు దిద్దే ఏఈలకు ప్రతిరోజు 40 నుంచి 50 వరకు పత్రాలు అందించేవారు. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన తర్వాత మొదటి పేజీలోని ఓఎంఆర్ షీటును పూరించాలి. ఏ ప్రశ్నకు ఎన్ని మార్కులు వచ్చాయో నమోదు చేసి మరో కాలమ్‌లో మొత్తం మార్కులు, అక్షరాల్లో వేసి పెన్సిల్‌తో బబుల్ చేయాలి. వీటిని సీఈ, ప్రత్యేక సహాయకులు పరిశీలిస్తారు. అన్ని సరిగా ఉంటే మార్కులు సూచించే డాకెట్ పత్రాలను కట్ట కట్టి స్ట్రాంగ్ రూముకు తరలిస్తారు. అక్కడ మరో బృందం పరిశీలిస్తుంది. తప్పులు ఉంటే సీఈ, ఏఈ, ప్రత్యేక సహాయకులను అక్కడికి రప్పించి సరిచేయిస్తారు. ఆపై డాకెట్లను విజయవాడకు తరలించి స్కాన్ చేయిస్తారు.

ప్రస్తుతం.. ఈసారి ప్రతి సీఈకి ఒక ట్యాబ్ అందిస్తారు. ప్రత్యేక యాప్ ద్వారా అక్కడికక్కడే డాకెట్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో మార్కులు నిక్షిప్తం అయ్యేలా చూస్తారు. తద్వారా క్షేత్రస్థాయిలోనే తప్పులను పూర్తిగా పరిహరించి వేగంగా ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రయోగం ఫలిస్తే రీకౌంటింగ్ వెతలు తీరే అవకాశం ఉంది.

ఉపాధ్యాయుల వద్ద ట్యాబ్‌ల సేకరణ.. 2022-23 విద్యా సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఎస్ఏ ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేసింది. పాఠ్యాంశాల వీడియోలు అందులో వీక్షించేలా ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని సేకరించి అందులో లీప్ యాప్ ప్రవేశపెడతారు. ఇందుకు బాపట్ల కర్లపాలెం, పిట్టువారిపాలెం, చెరుకుపల్లి, చీరాల వేటపాలెం, కారంచేడు మండలాల్లో పనిచేసే 400 మంది ఉపాధ్యాయుల నుంచి ట్యాబులు సేకరించాలని నిర్ణయించారు.

ట్యాబ్‌లు తిరిగి ఇచ్చేస్తాం

ప్రభుత్వం ఈసారి మార్కుల్ని ఆన్‌లైన్లో నమోదు చేయాలని సంకల్పించింది. ఇందుకు ఉపాధ్యాయుల వద్ద ఉన్న ట్యాబ్‌లు సేకరిస్తున్నాం. వాటిల్లో వ్యక్తిగత యాప్‌లు, ఇతర సమాచారం తొలగించి లీప్‌యాప్ నిక్షిప్తం చేస్తాం. పదో తరగతి మూల్యాంకనం పూర్తయ్యాక తిరిగి వాటిని ఉపాధ్యాయులకు ఇచ్చేస్తాం.
– డి.శ్రీనివాస్, డీఈవో, బాపట్ల

ఆరోగ్య సంరక్షణలో రెండవ వార్షికోత్సవం

2nd ANNIVERSARY
శ్రేష్ఠ హాస్పిటల్స్®

శ్రేష్ఠ హాస్పిటల్స్‌తో మీ అనుబంధానికి రెండేళ్లు పూర్తయ్యాయి.
గత రెండు వసంతాలుగా మీ ఆరోగ్య నేస్తంగా సేవలందిస్తూ,
వేలాది మంది నమ్మకాన్ని అందుకున్నాం. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,
మీ సంరక్షణ కోసం ఇదే నిబద్ధతతో ముందుకు సాగుతామని హామీ ఇస్తున్నాం.

మీ ఆరోగ్య సంరక్షణలోనే సదా మా ప్రయాణం...


డా॥ యడ్లపల్లి లక్ష్మణ స్వామి
ఫౌండర్ చైర్మన్ & చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్

డా॥ నాగార్జున గొట్టిపాటి
డైరెక్టర్ & ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

నగదు రహిత సౌకర్యం
24/7 ఎమర్జెన్సీ సర్వీస్

0863 352 5252
77999 88108
జెకెసి కాలేజ్ రోడ్, గుజ్జనగుండ్ల, గుంటూరు
www.sreshtahospitals.in
KALYANI ADS

అమృతమూర్తికి అశ్రుతాంజలి

కీ॥శే॥ అక్కిశెట్టి అన్నపూర్ణమ్మ గారు
(W/o. కీ॥శే॥ అక్కిశెట్టి వెంకయ్య గారు)
కాకానివారిపాలెం(గ్రా.), కారంపూడి(మం.), పల్నాడు జిల్లా.
జననం : 01-01-1927 ★ మరణం : 11-02-2026

మీ జీవన గమనంలో
ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని,
మా అందరి శ్రేయస్సు కోసం
అహర్నిశలు శ్రమించి, మా ఇంటి ఇలవేల్పుగా,
మాకు తోడు నీడగా నిలచిన మీరు
భౌతికంగా మా నుండి దూరమైనా...
మీ అనురాగ స్మృతులను ఎన్నటికీ మరువలేము.
దివి నుండి మీరందించే దీవెనలే
మాకు శుభాశీస్సులు.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు : అక్కిశెట్టి బాల గురవయ్య-అనంతరాములు;
అక్కిశెట్టి బాబూరావు-సుజాత; అక్కిశెట్టి కొండలరావు-జ్యోతి
కుమార్తెలు - అల్లుళ్ళు : ఆవుల కుమారి-రామకోటయ్య; గాజుల సుజాత-సైదులు

మనుమలు & మనుమరాళ్ళు : చిల్లర వెంకట రమణ (లేటు); శింగంశెట్టి వెంకాయమ్మ;
అక్కిశెట్టి రామారావు M.Sc.(Ag.)-త్రివేణి B.Com.; అక్కిశెట్టి రమాశ్రీ M.B.B.S., ; అక్కిశెట్టి వెంకటకృష్ణ శేషసాయి B.B.A., LLB ;
అక్కిశెట్టి వైష్ణవి B.B.A., ; అక్కిశెట్టి విష్ణుదేవరాయలు; తన్నీరు ఫణీంద్ర B,Tech.-విజయభారతి M.Sc. (Bio.Tech.) ;
అక్కిశెట్టి విజయభార్గవ్ M.Sc.,-స్వరూప B.Tech. ; ఆవుల ప్రకాష్-సువర్ణ; ఆవుల సుధాకర్ (లేటు)-శైలజ;
పసుపులేటి కొండలరావు-విజయమాధవి; ఆకుల శ్రీనుబాబు M.S. (USA)-శైలజ M.S. (USA) ;
గాజుల సైదారావు M.S. (USA)-నీరజ B.Tech.(USA) ; గాజుల ఝాన్సీరాణి M.B.B.S., D.Ch. (Pediatrics)

మునిమనుమలు & మునిమనుమరాళ్ళు : అక్కిశెట్టి చేతన్ వెంకట రాయలు, అక్కిశెట్టి దేవాన్ష్ రాయలు, చిల్లర వేణుగోపాల్ B.Sc. (Ag.), ఆవుల భార్గవ్ మనోజ్ B.Sc. (Pharma Science), ఆవుల సాయిరాజేష్, ఆవుల నాగనందిని B.Tech., శింగంశెట్టి నిఖిత B.Tech , శింగంశెట్టి యశ్వంత్ B.Sc. (Ag.), పసుపులేటి నాగజ్యోతిర్మయి, పసుపులేటి నాగసుధా శ్రీరామ్ చరణ్, ఆకుల శ్రీజై నిథిన్, గాజుల స్మృతి ఆద్య, గాజుల సాధ్విశ్రీ ఆర్వ, తన్నీరు లాలిత్య, తన్నీరు నాగ రేయాన్ష్

పెద్దకర్మ : ది.25-02-2026 బుధవారం
పల్నాడు జిల్లా, కారంపూడి (మం.), కాకానివారిపాలెం, బ్రహ్మనాయుడు కాలనీ లోని
మా స్వగృహము నందు జరుగును. కావున తెలియపరచడమైనది. సెల్ : 9912165194

(c) eenadu

గొనసపూడిలో కలెక్టర్ పర్యటన

మహిళతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

చినగంజాం, న్యూస్‌టుడే: కలెక్టర్ వి.వినోద్ కుమార్ గొనసపూడిలో మంగళవారం సాయంత్రం పర్యటించారు. గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం 12 మంది దరఖాస్తు చేశారు. వారి ఆర్థిక స్థితిగతులను పరిశీలించి, లబ్ధిదారుల వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు వచ్చారు. అర్జీ చేసుకున్న వారిలో మెడబలిమి ధనమ్మ ఇంటికి కలెక్టర్ వెళ్లారు. ఆమెతో స్వయంగా మాట్లాడారు. తనకు భర్త లేడని, ఉండటానికి ఇల్లు లేదని ధనమ్మ కలెక్టర్‌కు విన్నవించారు. ప్రస్తుతం తన మామ ఇంట్లో ఉంటున్నానని చెప్పారు. అనంతరం గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం ఎంపిక చేసిన 36 సెంట్ల భూమిని కలెక్టర్ పరిశీలించారు. చీరాల డివిజన్ పరిధిలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వాటిపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి వీరాస్వామి, గ్రామ పెద్దలు, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ రాజశేఖర్, ఆర్ఐ దానియేలు, వీఆర్వోలు నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు. సాయంత్రం మూడు గంటలకు చినగంజాం మండల పరిషత్ సమావేశపు భవనంలో మండల పరిధిలోని పలుశాఖల అధికారులతో సమీక్ష జరుగుతుందని చెప్పడంతో ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. సమయానికి అక్కడే వారంతా ఉండిపోయారు. ఈలోగా కలెక్టర్ చినగంజాం రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. అక్కడ పరిశీలించి గొనసపూడి వెళ్లాలని చెప్పడంతో ఆర్డీవో, తహసీల్దార్, హౌసింగ్ ఏఈ సిబ్బంది ఆయన వెంట వెళ్లారు. గొనసపూడి పర్యటన అనంతరం కడవకుదురు నుంచి బాపట్ల కలెక్టర్ వెళ్లిపోయారు. సమావేశానికి కలెక్టర్ రావడం లేదని చెప్పడంతో అక్కడున్న అధికారులందరూ వెనుతిరిగి వెళ్లిపోయారు. వాస్తవానికి సమావేశం కలెక్టర్ షెడ్యూల్‌లో లేదని సమాచారం. స్థానిక అధికారులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

రీసర్వే గ్రామాల్లో సర్వేయర్ల డిప్యుటేషన్ రద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో సర్వేయర్ల డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లో చుండూరు మండల అధికారులకు మంగళవారం నిర్వహించిన ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో పురోగతి లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు సరిగా పని చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. 15 గ్రామ సచివాలయాల పరిధిలో అక్షరాంధ్ర కార్యక్రమానికి కేవలం 2,280 మందిని మాత్రమే ఎంపిక చేయడం ఏంటన్నారు. నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులను చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లిప్తత ఉండరాదన్నారు. క్రమశిక్షణ, చిత్తశుద్ధి కనబరిచి పునరుత్తేజంతో పని చేయాలని పేర్కొన్నారు. జేసీ భావన, ఉద్యానశాఖ ఏడీ కలీం, మండల అధికారులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ సమన్వయకర్త, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పార్టీ నేతలతో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో జనసేనను బలోపేతం చేయాలన్నారు. సభ్యత్వ నమోదుకు ప్రజలు, కార్యకర్తల నుంచి గొప్ప స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం కూటమి ఏర్పాటులో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలకపాత్ర పోషించి ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేనను బలమైన శక్తిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నాయకులు, శ్రేణులపై ఉందన్నారు. జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, అసెంబ్లీ సమన్వయకర్త నామన శివనారాయణ, తూర్పు సత్రం ఛైర్మన్ గుంటుపల్లి తులసికుమారి, నేతలు విన్నకోట సురేష్, కారుమూరి అంజనీష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో జిల్లా కేంద్రం

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లా కేంద్రం బాపట్లలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో వాహనాల రాకపోకల నియంత్రణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడియార స్తంభం కూడలిలో నిత్యం ట్రాఫిక్ నిలిచి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వాహనాల రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రత్యేక పోలీస్‌స్టేషన్, పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

216 ఏ జాతీయ రహదారి పట్టణంలో నుంచి వెళ్తోంది. మార్కెట్‌యార్డు నుంచి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వరకు 8.75 కి.మీ. బైపాస్ నిర్మించారు. జాతీయ రహదారిని విస్తరించారు. పట్టణంలో చీలురోడ్డు, పాత బస్టాండ్, గడియార స్తంభం, బీఆర్ అంబేడ్కర్ విగ్రహ కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. గడియార స్తంభం కూడలి నుంచే సూర్యలంక బీచ్‌కు వెళ్లే మార్గం ఉంది. రథం బజారు, జాతీయ రహదారి, సూర్యలంక మార్గం రోడ్లు కలిసే కీలకమైన కూడలి ఇది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విపరీతమైన రద్దీ ఉంటోంది.

ప్రత్యేక పోలీస్‌స్టేషన్ అవసరం

గడియార స్తంభం కూడలిలో రద్దీ

కనీసం ఇద్దరు, ముగ్గురు ట్రాఫిక్ పోలీసులు ఉండి వాహనాల రద్దీని నియంత్రించాల్సి ఉంది. గతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు.

పార్కింగ్ స్థలాలు లేక..

పట్టణంలో రాజకీయ పార్టీలు, సంఘాల ప్రదర్శనలు ఉన్న సమయంలో పోలీసు సిబ్బంది అంతా అటువైపు వెళ్తున్నారు. ఈ సమయంలో ట్రాఫిక్ నియంత్రించే వారు కరవు. ఈ సమయంలో గడియారస్తంభం వద్ద ట్రాఫిక్ నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలాలు లేవు. రథం బజారు, ఎంజీరోడ్డు, సూర్యలంక రహదారిలో ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. పార్కింగ్ స్థలాలు కేటాయించటంపై తక్షణమే పురపాలక అధికారులు దృష్టి సారించాలి.

రద్దీ పెరగడంతో..

గడియార స్తంభంతో పాటు పాతబస్టాండ్, చీలురోడ్డు కూడలిలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సూర్యలంక పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. గత రెండేళ్లలో వాహనాల సంఖ్య బాగా పెరిగింది. బీచ్‌కు వచ్చే పర్యాటకుల వాహనాలు ఎక్కువయ్యాయి. ఇద్దరు ట్రాఫిక్ ఎస్సైలు, 30 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తక్షణమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో సిబ్బంది కొరత ఎక్కువ. పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ విధుల నిర్వహణకు అదనంగా సిబ్బందిని నియమించాలి. రద్దీ ప్రాంతాల్లో రోజూ మూడుషిఫ్టుల్లో సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు

అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

బాపట్ల, న్యూస్‌టుడే: అయోడిన్ లోపంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడతారని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. పట్టణంలోని వీబీ కాలనీలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వైద్యాధికారులు చేసిన అయోడిన్ పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయోడిన లోపాల నివారణ సర్వేలో భాగంగా జిల్లాలోని 30 పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అయోడిన్ లోపం వల్ల అలసట, బలహీనత, బరువు పెరగటం తదితర అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. అయోడిన్ కోసం ఉప్పుతో పాటు చేపలు, రొయ్యలు, గుడ్లు, పాలు, పెరుగు తినాలని సూచించారు. వైద్యాధికారులు లలిత రాజేశ్వరి, మనోజ్, మౌనిక పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ జిల్లా ఛైర్మన్‌గా నాగేశ్వరరావు ఎన్నిక

ఐక్యత చాటుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఏపీ జేఏసీ జిల్లా ఛైర్మన్‌గా ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్జీవో హోంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పింఛనుదారులకు రావాల్సిన బకాయిలు, నూతన పీఆర్సీ, ఐఆర్ సాధనకు జేఏసీ పోరాడుతుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కారమయ్యేలా ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ కింద ఆరోగ్యానికి గుర్తింపు, పింఛనుదారులు, ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

పది గ్రామాల్లో రీసర్వే

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పది గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సీసీఎల్‌ఏ జయలక్ష్మి మంగళవారం నిర్వహించిన వీసీలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 6400 పట్టాదారు పాసు పుస్తకాలకుగాను ఇప్పటి వరకు 1287 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన పట్టాదారు పాసుపుస్తకాలు త్వరగా పంపిణీ చేస్తామన్నారు. ఈకేవైసీ ప్రక్రియ 68.32 శాతానికి చేరుకున్నట్లు, రాష్ట్రంలో జిల్లా ఐదో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. జేసీ భావన పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

రికార్డులు పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విజిలెన్స్ అధికారి నాయక్

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, వైద్యులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విజిలెన్స్ అధికారి తోటీ నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అన్ని రకాల పరీక్షలు ఆసుపత్రిలో ఉచితంగా చేయాలని, ఓపీ, ఐపీ విభాగాల్లో సేవలు నాణ్యంగా ఉండాలన్నారు. ఓపీ టికెట్ స్కాన్ అండ్ షేర్ పద్ధతిలో రోగులకు సేవలందించాలని ఆదేశించారు. ఈ-ఆసుపత్రి విధానాన్ని మరింత పటిష్ఠం చేయాలన్నారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయని రోగుల్ని ఆరా తీశారు. ఆసుపత్రిలో థైరాయిడ్ పరీక్ష పరికరాలు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున్‌రావు విజిలెన్స్ అధికారి దృష్టికి తీసుకెళ్లగా వాటిని సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆర్‌ఎంవో డాక్టర్ కృష్ణమూర్తి, వైద్యులు సుజాత, సుమన్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ పాల్గొన్నారు.

ఏజీ కళాశాలను విశ్వవిద్యాలయం స్థాయికి పెంచాలి

కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల వ్యవసాయ కళాశాలను ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాయికి పెంచాలని పూర్వ విద్యార్థుల సంఘం నేతలు కోరారు. కళాశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న 1965-69 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం ముగిసింది. పూర్వ విద్యార్థులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల ఏజీ కళాశాలకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కళాశాల ఏడీ ప్రసూనారాణిని పూర్వ విద్యార్థులు సత్కరించారు. సంఘం నేతలు వెంకటరామయ్య, రామ్మోహనరావు, పెద్దిరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఈపూరుపాలెం కాలువ సముద్ర ముఖద్వారం పునరుద్ధరణకు డిమాండ్

సముద్ర ముఖద్వారాన్ని పార్టీ నేతలతో కలిసి పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

బాపట్ల, న్యూస్‌టుడే: ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ కాలువ సముద్ర ముఖద్వారాన్ని అధికారులు పునరుద్ధరించాలని మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. చీరాల మండల పరిధిలోని ఆదివి పల్లెపాలెం సమీపంలో ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ కాలువ సముద్ర ముఖద్వారాన్ని సీపీఎం నేతలతో కలిసి మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు న్యాయం చేయటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సముద్ర ముఖద్వారాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరంగా సున్నితమైన ప్రాంతాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. ముఖద్వారాన్ని పూడ్చివేయడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దిబ్బలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌జెడ్ మార్గదర్శకాలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ సైతం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించిందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించాలని ఏపీ ఉపలోకాయుక్త ఆదేశాలు జారీ చేసినా అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. వెంకట్రావు ఇచ్చిన డీకేటీ పట్టాను రద్దు చేయాలన్నారు. కలెక్టర్ వినోద్‌కు మంగళవారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నేతలు ప్రభాకర్, సింగరయ్య, శామ్యూల్, ప్రకాష్, వీరాంజనేయస్వామి, రాజారెడ్డి, మాజీ సర్పంచి రమణ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

నెల్లూరు: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, రిటైల్ ధర - 154, చికెన్ విత్ స్కిన్ - 223, చికెన్ స్కిన్‌లెస్ - 254.
ప్రకాశం జిల్లా: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

వ్యాపారవేత్త రావి అంకినీడు ప్రసాద్ మృతి

ప్రసాద్ (పాత చిత్రం)

కుంకలమర్రు(కారంచేడు), న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త, గ్రామాభివృద్ధికి విశేష కృషి చేసిన రావి అంకినీడు ప్రసాద్(88) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అస్వస్థతకు గురైన ఆయన హైదరాబాద్‌లో నివసిస్తూ కన్నుమూసినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన ఆయన వ్యాపార రంగంలో రాణిస్తూ కొన్నాళ్లు విదేశాల్లో స్థిరపడ్డారు. అనంతరం హైదరాబాద్ వచ్చి నివసిస్తున్నారు. ఆయనకు భార్య సుశీలాదేవి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గ్రామంపై మక్కువతో తన కుమారులు రావి సుధాకర్, శ్రీకాంత్ రావి ఛారిటబుల్ ట్రస్ట్ పేరుతో గ్రామంలో పాఠశాల, సీసీ రోడ్లు, మంచినీటి చెరువు, దేవాలయాల నిర్మాణాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధిచేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుమారులు విదేశాల్లో ఉండటంతో హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరుగుతాయని గ్రామ ప్రజలు తెలిపారు.

ఆసుపత్రిలో చెప్పకుండా వచ్చి.. కాలువలో దూకి..

వృద్ధుడి బలవన్మరణం

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో గుంటూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఎవరికి చెప్పాపెట్టకుండా వచ్చారు. సొంతూరికి సమీపంలో బస్సు దిగి నేరుగా కాలువలో దూకి బలవన్మరణం చెందారు. ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన వృద్ధుడు కటికల పెద్ద కాశయ్య(65) గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో ఎవరికి చెప్పకుండా ఆయన మంగళవారం తన గ్రామానికి బస్సులో వచ్చారు. స్థానిక గుంటూరు బ్రాంచి కాలువ (జీబీసీ)లో దూకారు. స్థానికులు గమనించి రక్షించే ప్రయత్నం చేయగా లోతులోకి వెళ్లి మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించి సంఘటనపై విచారణ చేశారు. పెద్ద కాశయ్య బలవన్మరణంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం అందించాలి

ధర్నా శిబిరంలో కౌలురైతు సంఘం నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: కౌలు రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప జేసి రూ.20 వేల సాయాన్ని అందించాలని కౌలురైతుల సంఘ రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని చీలు రోడ్డు కూడలిలో కౌలురైతులు చేపట్టిన ధర్నా శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. హరిబాబు మాట్లాడుతూ భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు ప్రభుత్వం సీఆర్సీ కార్డులు అందజేసి బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలని కోరారు. ప్రభుత్వం రాయితీలు అందించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో 80 శాతం కౌలురైతులే ఉన్నారని తెలిపారు. బడ్జెట్లో కౌలురైతుల ఊసే లేదన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య, నేతలు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్స్‌ల ధరల పట్టిక ఆవిష్కరణ

బాపట్ల: ప్రయాణ దూరం ఆధారంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలనే రోగుల నుంచి వసూలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ప్రైవేటు అంబులెన్స్‌ల ధరల పట్టికను ఆయన ఆవిష్కరించారు. ఎవరైనా అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ఛార్జీలపై టోల్‌ఫ్రీ నంబరు 77028 06804కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

5వ తరగతి, ప్రథమ ఇంటర్ ప్రవేశ పరీక్షలు 1న

గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా ఏడాదికి 5వ తరగతి, ప్రథమ ఇంటర్, ఐఐటీ/నీట్ ప్రవేశపరీక్షలు మార్చి 1న నిర్వహించనున్నామని జిల్లా సమన్వయకర్త ఎస్.శ్రీదేవి మంగళవారం తెలిపారు. 5వ తరగతి పరీక్ష ఆదివారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, ఇంటర్ పరీక్ష మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు, ఐఐటీ, నీట్ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయన్నారు. 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 8న ప్రవేశపరీక్ష ఉంటుందని చెప్పారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

Union Bank of India — భృగుబండ బ్రాంచి-02431
డి.నెం.2-103, వార్డు నెం.5, మెయిన్ రోడ్డు, భృగుబండ, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522403, ఫోన్: 9010484321, Email: ubin0802433@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన ...

ఇ-వేలం తేది మరియు సమయము: 13-03-2026 ఉ. 12.00 గం.ల నుండి సా. 5.00 గం.ల వరకు (10 ని.ల అపరిమిత స్వయం పొడిగింపుతో)

రిజర్వుధర: రూ.37,90,000/- ధరావత్తు సొమ్ము: రూ.3,79,000/- బిడ్ పెంపుదల: రూ.37,900/-

https://www.unionbankofindia.bank.in/auction-property/viewauction-property.aspx or https://baanknet.com
ప్రదేశం: భృగుబండ, తేది: 24-02-2026

Union Bank of India — ఒంగోలు మెయిన్ బ్రాంచ్ -2
డోర్.నెం. 337-1-350, ట్రంక్‌రోడ్, ఒంగోలు, ఫోన్: 08592-233033, 280067, ఇ-మెయిల్: ubin0804002@unionbankofindia.bank.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన

రిజర్వు ధర: రూ.4,55,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.45,50,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.4,55,000/-

రిజర్వు ధర: రూ.49,26,000/- ధరావత్తు సొమ్ము: రూ.4,92,600/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.49,260/-

ఈ-వేలం తేది మరియు సమయము: 13.03.2026, మధ్యాహ్నం 12.00 గం.ల నుండి 5.00 గం.ల వరకు

www.unionbankofindia.bank.in ... website BAANKNET@psballiance.com ... ubin0804002@unionbankofindia.bank.in

ప్రదేశం: ఒంగోలు, తేది: 20.02.2026

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUILDING CONSTRUCTION

BOREWELLS

నాగార్జున బోర్‌వెల్స్: బోర్‌వెల్స్ వేయబడును. గ్రౌండ్ వాటర్ సర్వే చేయబడును. సంప్రదించండి. దేవినేని ప్రసాద్: గుంటూరు 94901 14326.

JOBS

EXP. Designers with Security features in Printing for Parjanya paper production Guntur ✆ 96768 11066, 90594 05366.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-, NTR Circle, Vijayawada. ✆ 63043 28479

కావలెను. స్థానిక లక్ష్మీపురం 4వ లైన్ మాంటిస్సోరి స్కూల్ నందు పని చేయుటకు వాచ్ మెన్ ఫ్యామిలి (వసతి కలదు), ఆయమ్మలు కావలెను. ✆ 8121400100.

MNY ఫామ్ ల్యాండ్స్ కోసం గుంటూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం + Inc. ఇవ్వబడును. వయస్సుతో పనిలేదు. సంప్ర: 10am-6pm. ✆0863-4616071.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ నందు Senior Civil Engineersగా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము 50,000/- నుండి 60,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 8978480429.

నిరుద్యోగ యువతకి సువర్ణావకాశం. డా.రెడ్డీస్ ఫౌండేషన్ వారిచే కమ్యూనికేషన్ ఇంటర్వ్యూ, స్కిల్స్, కంప్యూటర్ కోర్స్‌లో 60 రోజుల ఉచిత శిక్షణ, ఉద్యోగం కల్పించబడును. వ: 18-28, 9063817157

కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయీస్, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ: 35-70, Q:10th, జీ: 12-15 వేలు ✆ 63041 81391

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

పల్లపాడు, బెజాత్‌పురం, రావెల, పొన్నెకల్లు, జొన్నలగడ్డ, మల్లాది, అమరావతి, కర్లపూడి, మోతడక, నిడుముక్కల, తుళ్ళూరు, బడేపురం, తాడికొండ, సంబూరు, కంతేరు, కొప్పురావూరు, వెనిగండ్ల, దొండపాడు, అనంతవరప్పాడు, నెక్కల్లు మరియు పరిసర గ్రామాలలో ప్రముఖ విద్యాసంస్థ కోసం పని చేయుటకు టీమ్ లీడర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్. సంప్ర: 8712618882, గుంటూరు.

SECURITY GUARDS

ప్రముఖ బ్యాంకులలో పని చేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21to45, అర్హత: 10th. PF+ESI కలదు. ✆ 96522 40528, 97049 64931, 94918 84025.

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్, 50 సం. వయస్సు, 12hr డ్యూటీ. జీతం 14000/-. ✆ 7288004466.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాల అందజేత

మంజూరు పత్రాలు అందజేస్తున్న తెదేపా నేత అనగాని శివప్రసాద్

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని తెదేపా నేత అనగాని శివప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న 29 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.19,09,257 విలువైన పత్రాలను రేపల్లె తెదేపా కార్యాలయంలో మంగళవారం అందజేశారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. నాయకులు నాగేశ్వరరావు, వేణుగోపాలరావు, ధర్మతేజ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై 'ఫోన్‌ఇన్' రేపు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె నియోజకవర్గం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ డీఈ పంతాని రామ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని ఫోన్‌ఇన్ కార్యక్రమం ద్వారా 'ఈనాడు' కల్పిస్తోంది. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో తాగునీరు సరఫరా కాకున్నా, పైపులైన్లు పాడైనా, కలుషిత నీరు తదితర సమస్యలకు డీఈ సమాధానాలిచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. మీరు చేయాల్సిందల్లా కింది నంబర్లకు ఫోను చేయడమే.

91001 21420, 80085 73136 | 26-02-2026 (గురువారం) | సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ?: పాత రేపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఒకటి, 26వ వార్డులో రెండు చేతిపంపులు పనిచేయడం లేదు. **-రాఘవ, కోటేశ్వరరావు**

✔ వెంటనే రెండు ప్రాంతాల్లో చేతిపంపులను బాగు చేసేలా చర్యలు తీసుకుంటాం. **-శామ్యూల్, మున్సిపల్ ఏఈ రేపల్లె.**

నగరం, న్యూస్‌టుడే: ? నగరం, బోరమాదిగపల్లి గ్రామాల పరిధిలోని రేపల్లె రహదారిలో వీధి దీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. **-గుంటూరు సుబ్బారావు, బోరమాదిగపల్లి.** ✔ పగటి వేళల్లో వెలగకుండా చర్యలు తీసుకుంటాం. **-బొర్రా శ్రీనివాస్, ఎంపీడీవో, నగరం.**

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: సమస్య: చందోలు ప్రధాన రహదారి పక్కన బండ్లమ్మ దేవస్థానం ఎదురుగా రహదారిపై వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **-కరీముల్లా, చందోలు**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి వెంటనే తొలగిస్తాం. **-సుజాత, పంచాయతీ కార్యదర్శి, చందోలు**

స్పందనకు వందనం

దీపాలు ఏర్పాటు.. రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె నుంచి పేటేరు వెళ్లే ప్రధాన రహదారిలో ముఖద్వారం బోర్డుపై దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను మేమున్నాం..మీకుతోడుగా శీర్షికన ఈనెల 21న ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన మున్సిపల్ ఏఈ శామ్యూల్ మంగళవారం దీపాలు వెలిగించేలా చర్యలు చేపట్టారు.

రహదారిపై నీరు తొలగింపు

పిట్టలవానిపాలెం,న్యూస్‌టుడే: మండలంలోని ఖాజీపాలెం శివాలయం వెనక వీధిలో సీసీ రహదారిపైకి ఇళ్లలో నీరు చేరుతుండటంతో సమస్యను మేమున్నాం మీకు తోడుగా శీర్షికన 'ఈనాడు' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కార్యదర్శి ప్రసాదరావు సిబ్బందితో కాలువ తీయించి సమస్య పరిష్కరించారు.

మొక్కలు ఎండిపోతున్నాయి!

న్యూస్‌టుడే, బాపట్ల, బాపట్ల టౌన్ అంకమ్మచెట్టు (రేపల్లె అర్బన్)

రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా నిర్వహణ కరవు

పట్టణంలో సుందరీకరణకు మొక్కలు నాటుతున్నా నిర్వహణ లేక ఎండిపోతున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. గత ప్రభుత్వ పాలనలో పురపాలక ఉద్యానాల నిర్వహణలో నిర్లక్ష్యం రాజ్యమేలింది. మొక్కలు ఎండిపోయి పచ్చదనం కనుమరుగవుతున్నా పట్టించుకోలేదు. పార్కుల్లో కనీస వసతులు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పచ్చదనం పెంపుపై దృష్టి సారించింది. పురపాలక సంఘంలో 216ఏ ఎన్‌హెచ్ విభాగినిపై రూ.30 లక్షలు ఖర్చు చేసి మొక్కలు నాటారు. వివేకానందకాలనీ పార్కును రూ.15 లక్షలతో సుందరీకరించారు. జీబీసీ రోడ్డు ఆర్వోబీపై రూ.8 లక్షల వ్యయంతో పూల కుండీలు ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్ మార్గంలో ఎండిన మొక్కలు

రెడ్‌క్రాస్ భాగస్వామ్యంతో వెయిటర్ కాలనీ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. కలెక్టరేట్ సమీపంలో ఆర్వోబీ కింద స్వచ్ఛభారత్ పార్కు, పునరుద్ధరణ పనులు చేపట్టారు. చంద్రకళ పార్కులో పచ్చదనం పెంచారు. పురపాలక కార్యాలయ ఆవరణలో రూ.పది లక్షలతో కొత్త పార్కు అభివృద్ధి చేశారు. ❖ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలో 2022-23లో వందల సంఖ్యలో చెట్లు తొలగించారు. వాటి స్థానంలో రోడ్డు వెంబడి ఖాళీ స్థలంలో, కలెక్టరేట్ మార్గంలో మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతను తొలుత స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఆరంభంలో బాగానే పెరిగాయి. పురపాలక ట్యాంకర్ ద్వారా రోజూ నీరు పెట్టారు. ప్రస్తుతం ఫిబ్రవరిలో ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటింది. ఎండతీవ్రతకు పదుల సంఖ్యలో మొక్కలు ఎండిపోతున్నాయి. వందల సంఖ్యలో మొక్కలు వడబడ్డాయి. రేపల్లె పట్టణంలోనూ ఇదే పరిస్థితి.

సంరక్షణకు చర్యలు

కుండీల్లో మొక్కలు సైతం ఎండుముఖం పడుతున్నాయి. విశ్వబ్రాహ్మణ కాలనీ, భీమావారిపాలెం రైలుపేట పార్కుల్లో పచ్చదనం తగ్గిపోతోంది. బ్యాంకు కాలనీ పార్కులో మొక్కలు నాటాల్సి ఉంది. మార్చిలో ఎండలు మరింత పెరుగుతాయి. మొక్కలు పూర్తిగా ఎండిపోతే రూ.లక్షల నిధులు దుర్వినియోగమవుతాయి. సుందరీకరణ పనులతో పాటు మొక్కల సంరక్షణపైన పురపాలక అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటిస్తామన్నారు. సంరక్షణకు చర్యలు చేపడతామని పైపులైన్లు, ట్యాంకర్ల ద్వారా తడులిచ్చి పచ్చదనాన్ని కాపాడతామని తెలిపారు.

ఎట్టకేలకు వంతెన పనులు ప్రారంభం

వేమూరు-చింతలచెరువు రోడ్డులో వంతెన పనుల కోసం తవ్వకాలు

వేమూరు, న్యూస్‌టుడే: వేమూరు నుంచి చింతలచెరువు ఆర్ అండ్‌బీ రహదారిలో రెండేళ్ల క్రితం రైస్‌మిల్లుల వద్ద తూములతో కూడిన కల్వర్టు కుంగింది. అక్కడ రోడ్డుపై రంధ్రం పడడంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూశారు. ప్రస్తుతం రూ.20 లక్షలతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆ శాఖ డీఈ రాజేష్ తెలిపారు. పనులు జరుగుతుండటంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి'

పెదపులివర్రు(భట్టిప్రోలు), న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో అమెరికాలో విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని నార్త్ అమెరికా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధి కోమటి జయరామ్ అన్నారు. మండలంలోని పెదపులివర్రు పంచాయతీ గుత్తావారిపాలెంలో మంగళవారం అమెరికా తానా మాజీ అధ్యక్షుడు నాదెండ్ల కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు. ఈసందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చాక ఉద్యోగ అవకాశాలు తగ్గాయని వివరించారు. త్వరలో అమెరికాలో పరిస్థితులు మారతాయని, మనదేశ యువత అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. వైద్యుడు పరుచూరి ఆంజనేయులు, నల్లూరి వెంకట్రామయ్య, గుత్తా వెంకటరత్నం పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల వీక్షణ

చుండూరు, చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: చుండూరు మండలం యడ్లపల్లి ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు శాసన సభాపర్వం వీక్షించడానికి మంగళవారం సచివాలయం వెళ్లారు. అక్కడ కొద్దిసేపు సభ జరుగుతున్న తీరును పరిశీలించారు. చెరుకుపల్లి మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం అసెంబ్లీ సమావేశాలు వీక్షించారు. విద్యార్థులు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అవకాశం కల్పించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు, స్పీకర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం అసెంబ్లీ సమావేశాలు వీక్షించారు. ఈ నేపథ్యంలో 9వ తరగతి విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు ఆధ్వర్యంలో అసెంబ్లీలో సభ జరుగుతున్న తీరును ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సభాపతి అయ్యన్న పాత్రుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులతో ఫొటోలు దిగారు. ఉపాధ్యాయులు మాజేటి వెంకటేశ్వరావు, స్వరూపరాణి ఉన్నారు.

సభాపతి అయ్యన్నపాత్రుడితో యడ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో అమృతలూరు జడ్పీ విద్యార్థులు

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో..

విద్యుత్తు స్తంభానికి మరమ్మతులు చేయండి

పొలాల్లో ఒరిగిన స్తంభం

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: మండల పరిధి మర్రిపూడి గ్రామం సంగం డెయిరీ పక్కన పొలాల్లో విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై బాపట్ల రూరల్ విద్యుత్తు ఏఈ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదం లేకుండా స్తంభాన్ని సరిచేయిస్తామన్నారు.

గూటెన్‌బర్గ్‌కు నివాళి

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: ముద్రణ యంత్ర సృష్టికర్త జాన్ గూటెన్‌బర్గ్ జయంతిని పట్టణంలోని భావనారాయణస్వామి గుడిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రింటింగ్ యజమానులు జాన్ గూటెన్‌బర్గ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రింటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రింటింగ్‌తో జ్ఞానం ఇతర ప్రాంతాలకు చేరిందన్నారు. ఈసందర్భంగా ఇద్దరి ప్రింటింగ్ కార్మికులకు ఆర్థిక సహకారం అందించారు.

వేలం నోటీసు

మహారాజశ్రీ రేపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్): రేపల్లె వారి కోర్టులో
ఇ.పి.16/2025 ఇన్ ఒ.యస్.209/2020

బిట్వీన్:–
తూనుగుంట్ల సీతారామాంజనేయులు ..డి.హెచ్.ఆర్.
ఎదిరి
కన్నా చెంచవరాజు అలియాస్ చెంచమరాజు ..జె.డి.ఆర్.

పై నెంబరు అమలులో జెడిఆర్ తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి పై నెంబరు డిక్రీ బాకీ క్రింద ఎటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంటు కాబడి అమలు బాకీ క్రింద ది.12-03-2026వ తేదీన పై కోర్టువారిచే బహిరంగ వేలం జరుపబడును. ఆసక్తి కలవారు వాయిదా తేదీన ఉదయం గం.10.30లకు కోర్టువారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును. వేలం కావలసిన ఆస్తి వివరం:-

షెడ్యూలు: గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా, మంతెనవారిపాలెం సబ్ డి॥ యిలాకా పిట్టలవానిపాలెం మండలం, అల్లూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామము తాలూకు జె.డి.ఆర్.కు సర్వహక్కులు గల సర్వే నెం.575/21రు య.0-34ట్లున్నూ, డిటో గ్రామ సర్వే నెం.575/22రు య.0-14ట్లున్నూ, డిటో గ్రామ సర్వే నెం.577/3రు య.0-25ట్లున్నూ, ఏకమొత్తముగా వున్న య.0-73ట్లుకు **హద్దులు:- తూర్పు:** సర్కారు రోడ్డు దరిమిలా పంటబోదె హద్దు, **దక్షిణం:** ఉలిసి నరసింహం వగైరా గార్ల భూమి దరిమిలా, మురుగు కాలువ హద్దు, **పడమర:** బిట్రా సుబ్బారావు, ఉలిసి నరసింహం వగైరాల భూమి హద్దు, **ఉత్తరం:** కె.వెంకట శేషాచార్యులు గారి భూమి హద్దు.

డిహెచ్ఐర్ వాల్యూ : రూ.6,00,000/–
అమీనా వాల్యూ : రూ.16,00,000/–
సబ్ రిజిష్ట్రారు వాల్యూ : రూ.7,30,000/–
బెస్ట్ వారెంట్ విలువ : రూ.17,00,000/–
వేలం వాయిదా : ది.12-03-2026.
ఫర్దర్ హియరింగ్ : ది.19-03-2026.

E.C. దాఖలా ది.27-2-2015వ తేదీన జెడిఆర్ ఇమ్మడిశెట్టి మురళీకృష్ణగారికి రు.2,00,000/-లకు వ్రాయించి యిచ్చిన రిజిష్టరు తనఖా బాకీకి లోబడి వేలం కావలెను.

టి.కె.వి.గుప్త, డిహెచ్ఐర్ తరుపు న్యాయవాది. రేపల్లె

కనీస వేతనం కోరుతూ అంగన్‌వాడీల ఆందోళన

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రేపల్లె మాతాశిశు సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాపట్ల జిల్లా కోశాధికారి సీహెచ్ మణిలాల్, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా నాయకులు ఝాన్సీ, వాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహార నాణ్యత పెంచాలి, పనిభారం తగ్గించాలి, కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఏఐటీయూసీ, ఐద్వా నాయకులు బిక్షాలు, సుదీప్తి, ధనమ్మ, అహల్య రిలేదీక్షకు మద్దతు తెలిపారు.

హామీలు అమలు చేయాలని నిరసన

అమృతలూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ అమృతలూరులో సిబ్బంది మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం సభావేదికపై రిలే దీక్షలను వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అమృతలూరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కోశాధికారి బసవమ్మ, రమాదేవి ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐటీయూ బాపట్ల జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్, ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షుడు అగస్టీన్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే జీతాలు పెంచుతామని హామీలు ఇచ్చి 22 నెలలు గడుస్తున్నా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ అమృతలూరు ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి సుజాత, సావిత్రి, భాగ్యమ్మ, పద్మావతి, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో మోకాళ్లపై కూర్చొని నిరసన

అమృతలూరులో రిలే దీక్షలో..

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటుకు ఇవ్వడం తగదు

నినాదాలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సుల పేరుతో ప్రైవేటు కంపెనీకి ఆర్టీసీ స్థలాలు అప్పగించడం, డిపోల మూసివేతను వ్యతిరేకిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రేపల్లె ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఆస్తుల ప్రైవేటీకరణ ప్రక్రియను వెంటనే ఆపాలని, ప్రైవేటు సంస్థకు డిపోల కేటాయింపు కార్మికులకు ద్రోహం చేయడమేనన్నారు. మా డిపోలు మాకే కావాలి, ప్రైవేటు వ్యక్తులకు వద్దు, సిబ్బందిని మార్చడం ఆపాలి, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు వాసు, బ్రహ్మరాజు, శ్రీనివాసరావు, శ్రీధర్, నారాయణ, సాంబశివరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

వేలం నోటీసు

మహారాజశ్రీ రేపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్): రేపల్లె వారి కోర్టులో
ఇ.పి.40/2023 ఇన్ ఒ.యస్.143/2022

బిట్వీన్:–
అమిరినేని వెంకటేశ్వరరావు ..డి.హెచ్.ఆర్.
ఎదిరి
తలశిల యుగంధర్ ..జె.డి.ఆర్.

పై నెంబరు అమలులో జెడిఆర్ తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి పై నెంబరు డిక్రీ బాకీ క్రింద ఎటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంటు కాబడి అమలు బాకీ క్రింద ది.12-03-2026వ తేదీన పై కోర్టువారిచే బహిరంగ వేలం జరుపబడును. ఆసక్తి కలవారు వాయిదా తేదీన ఉదయం గం.10.30లకు కోర్టువారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును. వేలం కావలసిన ఆస్తి వివరం:-

షెడ్యూలు: 1వ అయిటం:– గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా, రేపల్లె సబ్ డి॥ యిలాకా నల్లూరిపాలెం గ్రామ పంచాయతీ, శింగుపాలెం గ్రామం సర్వే నెం.122/4రు య.0-26ట్లు మాగాణి భూమికి **హద్దులు:- తూర్పు:** తలశిల వరలక్ష్మీగారి భూమి, **దక్షిణం:** తలశిల వరలక్ష్మీగారి భూమి, **పడమర:** జెడిఆర్ తాలూకు 2వ అయిటం భూమి, **ఉత్తరం:** మండవ ఝాన్సీలక్ష్మీగారి భూమి.

డిహెచ్ఆర్ వాల్యూ: రూ.2,00,000/–
అమీనా వాల్యూ: రూ.3,50,000/–
సబ్ రిజిష్ట్రారు వాల్యూ: రూ.2,08,000/–

2వ అయిటం:– గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా, రేపల్లె సబ్ డి॥ యిలాకా నల్లూరిపాలెం గ్రామ పంచాయతీ, శింగుపాలెం గ్రామం సర్వే నెం.35/4రు య.1-00ట్లు మాగాణి భూమికి **హద్దులు:- తూర్పు:** ప్రతివాది/జెడిఆర్ తాలుకు 1వ అయిటం భూమి, **దక్షిణం:** తలశిల వరలక్ష్మీగారి భూమి, **పడమర:** పంచాయతీ డొంక, **ఉత్తరం:** మండవ ఝాన్సీలక్ష్మీగారి భూమి.

E.C. దాఖలా 1/6, 2/6 కాలంలో దాఖలా తనఖా బాకీలకు లోబడి వేలం జరుపబడును.

డిహెచ్ఆర్ వాల్యూ: రూ.10,00,000/–
అమీనా వాల్యూ: రూ.15,00,000/–
సబ్ రిజిష్ట్రారు వాల్యూ: రూ.15,25,000/–
వేలం వాయిదా : ది.12-03-2026.
ఫర్దర్ హియరింగ్ : ది.19-03-2026.

టి.కె.వి.గుప్త, డిహెచ్ఐర్ తరుపు న్యాయవాది, రేపల్లె

రచయిత్రి రాజ్యలక్ష్మికి ఘన నివాళి

నివాళులు అర్పిస్తున్న వయోవృద్ధులు

బాపట్ల టౌన్: తెలుగు నవల రచయిత్రి పోలాప్రగడ రాజ్యలక్ష్మి మృతిచెందిన నేపథ్యంలో పట్టణంలోని కళాభారతి, సాంస్కృతిక సమాఖ్య, సాహితీ మండలి ప్రతినిధులు, కళాకారులు, వయోవృద్ధులు మంగళవారం ఆమె చిత్ర పటానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. జీవీ బ్రహ్మం, సాయిబాబు, ఎన్.సిద్దయ్య, ఎం.ఎల్.వి. ప్రసాద్, కాళిదాసు, జేవీ కృష్ణారావు, ఆర్. నరసింహవర్మ, ఎం.మాల్యాద్రి తదితరులున్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

మంట అదుపు చేసే విధానాన్ని విద్యార్థులతో చేయిస్తున్న సిబ్బంది

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని రేపల్లె అగ్నిమాపక కేంద్రం అధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. రామకృష్ణ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు స్వీయ సంరక్షణ, ఇతరులకు ఎలా సహాయం చేయాలో వివరించారు. ఇంట్లో వంట చేసేటప్పుడు సిలిండరు నుంచి గ్యాస్ లీకై మంటలు రేగితే ఎలా అదుపుచేయాలో సిబ్బంది చేసి చూపించారు. అనంతరం విద్యార్థులతో చేయించారు. నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులతోపాటు బంధువులకు వివరించాలని కరస్పాండెంట్ అవర్ల విద్యార్థులకు సూచించారు. సిబ్బంది జనార్దన్, శ్రీనివాసరావు, రవి, చంద్రమోహన్, పవన్, సుబ్బారావు, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రహదారి నిర్మించి.. అంచులు మరిచి..

నిజాంపట్నం, న్యూస్‌టుడే: నిజాంపట్నం పంచాయతీ మిర్యాలపాలెం పక్కన ఉన్న మహ్మదీయపాలెంలో రెండేళ్ల క్రితమే సిమెంటు రహదారి నిర్మించారు. ఇప్పటి వరకు అంచుల్లో మెరకవేయక పోవటంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోలేని దుస్థితి. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి మాట్లాడుతూ రహదారి పూర్తయ్యేసరికి ఎన్నికల నియమావళి అమలులోకి రావటంతో పనులు అసంపూర్తిగా నిలిచాయని, సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు.

రైతుబజారు ఏర్పాటుకు స్థల పరిశీలన

మార్కెట్ యార్డులో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: భట్టిప్రోలు మార్కెట్ యార్డు ఆవరణలో రైతుబజారు ఏర్పాటుకు మంగళవారం మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం డీఈ హరినాథ్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. యార్డు ఆవరణలో కావాల్సిన స్థలాన్ని కొలిచి షెడ్డుల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక రైతుబజారు ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పది నుంచి 15 దుకాణాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ రాజారావు, యార్డు కార్యదర్శి ఆంజనేయసింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిద్దాం

కర్లపాలెం, న్యూస్‌టుడే: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిద్దామని కర్లపాలెం మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇనకొల్లు పోలీసురావు చెప్పారు. తారకరామానగర్ ఎస్టీ కాలనీలో బడి ఈడు పిల్లలు, వారి తల్లిదండ్రులను కలిసి చదువు ఆవశ్యకత వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు ప్రసన్న లక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

యువకుల మృతి బాధాకరం

బాపట్ల: నల్లమడ వాగులో ఈతకు దిగి గల్లంతైన యువకులు పీటా లీలా వంశీకృష్ణ, వేటగిరి చందుల మృతి బాధాకరమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తెదేపా అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

విజయమే లక్ష్యంగా సాధన

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ మహిళ జట్టు కోచింగ్ క్యాంపు మంగళవారం ముగిసింది. వీరు మంగుళూరులో ఈనెల 27 నుంచి జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా వారం రోజుల పాటు సాధన చేయటం జరిగిందన్నారు. ఏఎన్‌యూ జట్టు ప్రథమ స్థానం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల జట్టు సభ్యులు లీలా ప్రవల్లిక, నాగజాశ్విని, అంకమ్మ, అనురాధ, జాస్మినీలను కళాశాల జాయింట్ సెక్రటరీ మంతెన కృష్ణంరాజు విజయం సాధించాలని దీవించారు. కార్యక్రమంలో పీడీ రామకృష్ణారెడ్డి, కోచ్ సాంబశివరావు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ మహిళ జట్టుతో ప్రిన్సిపల్, కోచ్, పీడీలు

మొక్క మానైతే.. వంతెన అధోగతే!

చందోలు వద్ద తెనాలి డ్రెయిన్‌పై ఇలా..

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: పిట్టలవానిపాలెం మండలం చందోలు వద్ద తెనాలి డ్రెయిన్‌పై ఉన్న వంతెన దిమ్మెలపై మొక్కలు ఏపుగా పెరిగాయి. దీని వేర్లు కట్టడంలోకి దిగడంతో వంతెన శిథిలమవుతోంది. కొన్నేళ్లుగా మొక్కలు పెరుగుతున్నా వీటిని తొలగించే వారు కరవయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలు తొలగించి వంతెనకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

यूनियन बैंक Union Bank of India | **గోవాడ బ్రాంచి** గోవాడ గ్రామం, అమర్తలూరు మండలం, బాపట్ల జిల్లా, నరసరావుపేట రీజియన్, ఫోన్:+91 86442 55250,

బంగారు నగల ముందస్తు వేలము నోటీసు

ఈ క్రింద తెలుపబడిన గోల్డ్‌లోన్ ఖాతాకు సంబంధించి ది.17-02-2026 నాటికి రూ.37,500/- (అక్షరాల ముప్పైఏడు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే) బకాయి ఉందని ఇందుమూలముగా తెలియజేయడమైనది. మేము మొదటి నోటీసును వరుసగా 06-12-2025న మరియు రెండవ నోటీసును 17-02-2026న పంపియున్నాము. సదరు చిరునామా నందు ఋణగ్రహీత అందుబాటులో లేనందున నోటీసు తిరిగివచ్చినది, కావున ఈ పత్రికా ప్రకటన జారీ చేయటమైనది. ఈ ఖాతాదారులు ఈ పత్రికా ప్రకటన ప్రచురింపబడిన 15 రోజులలోగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోవాడ బ్రాంచి నందు సంప్రదించి బాకీ చెల్లించవలసినదిగా కోరడమైనది. లేనిచో సదరు బంగారు ఆభరణములు ఏదైనా అనుకూలమైన తేదీలో వేలం వేయబడును.

ఋణ ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాములలో	నికర తూకం గ్రాములలో
092016540004481	కూచిపూడి నాగేంద్రవర్మ, తండ్రి: కె.సంజీవరావు, ఎలవర్రు గ్రామం, అమర్తలూరు మండలం, బాపట్ల జిల్లా.	8	6.6

తేది: 25-02-2026, ప్రదేశం: గోవాడ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియ, గోవాడ బ్రాంచి, బాపట్ల జిల్లా.

(c) eenadu

చీరాల

•చీరాల •పర్చూరు

చేనేత సమస్యలపై స్పందించాలి

చీరాల, న్యూస్‌టుడే: చేనేత సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు స్పందించాలని, అసెంబ్లీలో గళం విప్పాలని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంగలకుర్తి నారాయణ పేర్కొన్నారు. మంగళవారం సాయికాలనీలో జరిగిన సమావేశంలో నారాయణ మాట్లాడుతూ చేనేత సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన చీరాల ఎమ్మెల్యే కొండయ్యకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా చేనేతలు ఉన్న ప్రాంతాల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నేతన్నల వృత్తిపరమైన అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. నరసింహమూర్తి, సాంబయ్య, గిరిధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీహెచ్‌సీ వైద్యురాలిపై విచారణ

దగ్గుబాడు (కారంచేడు), న్యూస్‌టుడే: మండలంలోని దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తమను వేధిస్తున్నారంటూ పలువురు వైద్యశాల సిబ్బంది గతేడాది ఆగస్టులో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు బుధవారం విచారణ చేపట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

180 మంది విద్యార్థులు హాజరు

పర్చూరు, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వీపీ ఆర్‌అండ్‌టీవీ కళాశాలలో మొదటిరోజైన తెలుగు, సంస్కృతం పరీక్షకు 187 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ జి.రవికుమార్, పరీక్షల నిర్వహణాధికారి కె.ఉషారాణి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

వంట గదుల్లేవు... పర్యవేక్షణ లేదు!

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనం తయారీపై తప్పనిసరిగా ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యా శాఖ చెబుతోంది. వంట గదులున్న పాఠశాలల్లో సరే.. లేని చోట్ల ఇవి అమలు కాని పరిస్థితి. పందిళ్లపల్లి జడ్పీ పాఠశాలలో 475 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో సగం మంది వరకు మధ్యాహ్న భోజనం తీసుకుంటున్నారు. ఇక్కడ వంట గది లేకపోవడంతో వేరే ప్రాంతంలో వండి, తీసుకొస్తున్నారు. అదే పాఠశాలలో వంట గది ఉంటే ఉపాధ్యాయుల పర్యవేక్షణతో పాటు మరింత రుచికరంగా తయారు చేయడానికి అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కొన్ని చోట్ల స్థలం లేకపోవడం, మరికొన్నింటిలో 30 మంది లోపు పిల్లలు ఉంటే వంటగది మంజూరు కావడంలేదని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

లేని పాఠశాలలు ఇవే: చీరాల మండలంలో వాడరేవు జడ్పీ పాఠశాల, బొగ్గులవారిపాలెం, ఈగావారిపాలెం, ఈపూరుపాలెం, కొత్తపాలెం, కృపానగర్, కీర్తివారిపాలెం, ఎన్జీఓ నగర్ ఎంపీపీ పాఠశాలలు. ఇక వేటపాలెం మండలంలో సాయికాలనీ, ప్రతిభా భారతి నగర్, అక్కాయపాలెం, చినజరుగు, వాకావారిపాలెం, సిద్దార్థ కాలనీ, కొత్తపేట (వైస్), నీలకంఠాపురం మండల పరిషత్ పాఠశాలలున్నాయి.

దాతలు ముందుకు రావాలి: ప్రభుత్వం ప్రత్యేకంగా దాతల కోసం విద్యాంజలి-2.0 వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. దాతలు ఎవరైనా స్పందించి వంట గదుల నిర్మాణాల కోసం ముందుకొస్తే ఇందులో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మక్కినవారిపాలెంలో ఉన్నా వినియోగించని వంట గది

అకాల వర్షం.. కర్షకుల కలవరం

యద్దనపూడి: పొలంలో శనగ నూర్పిడి చేస్తున్న రైతులు

ఆరబోసిన వేరుసెనగ కాయలపై కప్పిన పట్టలు

మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: వేలాది ఎకరాల్లో శనగ నూర్పిళ్లు, మిరప పంట కల్లాల్లో ఉండగా చిరుజల్లులతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు పడ్డాయి. పర్చూరు నియోజకవర్గంలోని 69 వేల ఎకరాల్లో శనగ నూర్పిళ్లు ఊపందుకోగా, ఏడు వేల ఎకరాల్లో మిరప కోతకొచ్చి కొంత పంట కల్లాల్లో ఆరబోశారు. కల్లాల్లోని మిరపకాయ తడిస్తే తాలు తేలుతుందని బెంగ రైతుల్లో నెలకొంది. ఇక 22 వేల ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంటకు, కంకి, కండె, కోత దశలో ఉంది. చేతికందొచ్చిన పంట వానజల్లులకు తడుస్తుందని బెంగ రైతుల్లో అలుముకొంది. దీంతో కొందరు అందుబాటులో ఉన్న టార్పాలిన్ పట్టలతో పంట ఉత్పత్తులను భద్రపరిచేందుకు తీవ్రంగా శ్రమించారు. శనగ నూర్పిడి చేసిన విత్తనాలను శీతల గిడ్డంగుల్లో భద్రపరిచేందుకు ట్రాక్టర్లు, లారీలతో తరలింపు చేపట్టారు. నిల్వ చేసేందుకు రోడ్లపైనే వాహనాలు బారులు తీరాయి. పెట్టుబడులు కలిస్తే ఎకరాకు రూ. 1.50 లక్షలు పైగా నష్టం చేకూరుతుందని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. కారంచేడు ప్రాంతంలో రబీ కింద ఈ ఏడాది రైతులు ఆరు వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం ఆధునిక యంత్ర పరికరాలతో కోతలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం చినుకులు రాలితే తీవ్రంగా నష్టపోతామని అన్నదాతలు బెంబేలెత్తుతున్నారు. జల్లులు పడకూడదని వేడుకుంటున్నారు.

చినగంజాం: చినగంజాంలో ఆకాశం ఉదయం మేఘావృతమై కొద్దిసేపు జల్లులు కురిశాయి. దీంతో వేరుసెనగ, ఉప్పు, వరి రైతులు అప్రమత్తమయ్యారు. వేరుసెనగ పీకి కాయలను పట్టలపై ఆరబోశారు. మంచు కారణంతో రాత్రుల తేమ శాతం పెరిగి కాయలపై ప్లాస్టిక్ పట్టలు కప్పారు. ఇక ఎక్కువగా ఉప్పు ఉప్పును రైతులు కూలీలతో గట్టుపైకి మోయించారు. కొన్ని ప్రాంతాల్లో వరి కుప్పలు కొడుతున్న రైతులు ఒకింత భయపడినా అప్రమత్తమయ్యారు.

నేటి నుంచి శనగల కొనుగోళ్లు

19 కేంద్రాలు కేటాయింపు

పర్చూరు, మార్టూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం, యద్దనపూడి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఏలూరి సూచనతో ఈ నెల 25వ తేదీ నుంచి శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, ఏడీఏ జీజీవీ ప్రవీణ మంగళవారం రాత్రి తెలిపారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 69 వేల ఎకరాల్లో రైతులు శనగ పంటను పండిస్తున్నారు. పంట దిగుబడి దృష్టిలో పెట్టుకుని 19 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతుల సౌకర్యార్థం చినగంజాం మండలంలో చింతగుంపల్లి, సంతరావూరు పీఏసీఎస్, ఇంకొల్లు మండలంలో ఇంకొల్లు, భీమవరం, కొణికి, పావులూరు పీఏసీఎస్, కారంచేడు మండలంలో ఆదిపూడి, దగ్గుబాడు, నాయుడువారిపాలెం, కొడవలివారిపాలెం పీఏసీఎస్, మార్టూరు మండలంలో కోలలపూడి, పర్చూరు మండలంలో బోడవాడ, మండుగుంట, నాగులపాలెం, నూతలపాడు, రమణాయపాలెం, వీరన్నపాలెం, పోతుకట్ల, పర్చూరు పీఏసీఎస్, యద్దనపూడి మండలంలో పూనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు ఈ-పంటతోపాటు ఆధార్ తీసి సేవా కేంద్రాల్లో సీఎం యాప్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని కేంద్రాల్లో తమ పంటలు విక్రయించుకోవచ్చన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

చట్టసభలపై అవగాహన అవసరం

విద్యార్థులతో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే చట్టసభలపై అవగాహన ఉండాలని, అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య పేర్కొన్నారు. చీరాల ఎస్ ఆర్‌పీఎం పాఠశాల విద్యార్థులు మంగళవారం అసెంబ్లీని సందర్శించారు. సభలో జరుగుతున్న కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వారిని కలిసి మాట్లాడారు. సభ నిర్వహణ గురించి, చట్టాలు రూపొందించడం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రజాస్వామ్యానికి దేవాలయం అసెంబ్లీ అని, ఇక్కడ చర్చించి ఆమోదించిన బిల్లులు చట్టాలుగా మారతాయని వాటిని అందరూ అమలు చేయాలన్నారు. అంత కీలకమైన చట్టసభలకు మంచివారిని పంపితే మన భవిష్యత్తు బాగుంటుందని, ప్రలోభాలకు లొంగితే భవిష్యత్తు అంధకారమేనన్నారు. ప్రతిఒక్కరికీ ఓటు హక్కు వచ్చిన తరువాత ఈ విషయాలు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు హైమావతి, జైచంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చినగంజాం: మండల పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రకటనలో తెలిపారు. పెదగంజాం, నీలాయపాలెం, గొల్లపాలెం, పల్లెపాలెం, కొటంవారిపాలెం, కోమలినారిపాలెం గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు.

సచివాలయ సిబ్బందికి అభినందనలు

చినగంజాం, న్యూస్‌టుడే: మున్నంవారిపాలెం గ్రామ సచివాలయ సిబ్బందిని డీఆర్‌డీఏ పీడీ బి.సింగయ్య, చినగంజాం మండల పరిషత్ ఏవో సీహెచ్ పూర్ణచంద్రరావు అభినందించారు. గ్రామంలో 2026, జనవరి నెల పింఛన్ పంపిణీకి సంబంధించి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా 100 శాతం సంతృప్తి రేటు వచ్చినందున పీడీ, ఏవోలు మంగళవారం మున్నంవారిపాలెం సచివాలయంలో సిబ్బందిని అభినందించారు. చినగంజాం మండల పరిధిలో ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా 95 శాతం ఉందని పీడీ, ఏవోలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

? మండలంలోని భూషాయపాలెంలో రహదారి ఇరువైపులా ముళ్ల చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించడం లేదు. - స్థానికుడు

✔ రెండు రోజుల్లో రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు తొలగిస్తాం. - పోతురాజు, పంచాయతీ కార్యదర్శి, భూషాయపాలెం

—న్యూస్‌టుడే, పర్చూరు

స్పందనకు వందనం: కాలువ శుభ్రం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల పట్టణం శివాలయం, కృష్ణుని గుడి కూడలిలో కొంత కాలంగా మురుగు కదలడం లేదని 'ఈనాడు'లో ఈనెల 23న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పురపాలక ఛైర్మన్ మించాల సాంబశివరావు, వార్డు ప్రతినిధి రామకృష్ణ, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ప్రదీప్ మంగళవారం పరిశీలించారు. వెంటనే సిబ్బందితో బాగు చేయించారు. కాలువలో వ్యర్థాలతో పాటు పాత చీరలు వేయడంతో మురుగు ప్రవాహం నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. కాలువలో వ్యర్థాలు వేయకుండా స్థానికుల్లో అవగాహన కల్పించారు.

ఆలోచనలకు అక్షర రూపమే ప్రింటింగ్

గూటెన్‌బర్గ్ చిత్రపటంతో ప్రదర్శన

చీరాల, న్యూస్‌టుడే: మనిషి ఆలోచనలకు అక్షర రూపం కల్పించేదే ప్రింటింగ్ అని అటువంటి ముద్రణ యంత్రం రూపొందించిన గూటెన్‌బర్గ్ చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. ప్రింటర్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత జెండాను ఎగురవేసిన ప్రతినిధులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రోటరీ భవనంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు నక్కల శ్రీనివాసరావు, అరవింద్ మాట్లాడుతూ ముద్రణ రంగంలో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నతి సాధించాలన్నారు. ఎ.నాగేశ్వరరావును సన్మానించారు. కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్లు అందజేత

వేటపాలెం, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు ఇక్కడ చదువుతున్న రామచంద్ర, హరివర్ధన్, శశివర్ధన్, దిలీప్‌కుమార్‌ల తల్లిదండ్రులు నాలుగు సీలింగ్ ఫ్యాన్లను మంగళవారం అందజేశారు. వీరిని ప్రధానాచార్యురాలు మహ్మద్ నహీదా, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బోయజ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐఎల్‌టీడీ సొసైటీ అధ్యక్షుడిగా ప్రసాద్

అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు డీఎం మోజెస్‌లను సత్కరించిన ఉద్యోగులు

కొత్తపేట (వేటపాలెం), న్యూస్‌టుడే: ఐఎల్‌టీడీ స్టాఫ్ కోఆపరేటివ్ హౌస్ కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రియల్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా పీజే ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా డీఎం మోజెస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని ఉద్యోగులు సత్కరించారు. అంతకు ముందు ఎన్నిక ధ్రువపత్రాలను న్యాయవాది, ఎన్నికల అధికారి మాగంటి సాయికృష్ణ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు జె.శివకుమార్, డి.అశోక్, కె.సుధలకు అందజేశారు.

రచయిత్రి రాజ్యలక్ష్మికి నివాళి

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: తెలుగు నవల రచయిత్రి పోలాప్రగడ రాజ్యలక్ష్మి మృతిచెందిన నేపథ్యంలో పట్టణంలోని కళాభారతి, సాంస్కృతిక సమాఖ్య, సాహితీ మండలి ప్రతినిధులు, కళాకారులు, వయోవృద్ధులు మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు.

విద్యుత్తు స్తంభాన్ని నిలబెట్టరూ

భూషాయపాలెం (పర్చూరు), న్యూస్‌టుడే: మండల పరిధి భూషాయపాలెంలో విద్యుత్తు స్తంభం ఒక పక్కకు ఒరిగి ప్రమాదభరితంగా మారింది. ఇటీవల అడుసుమల్లి నుంచి భూషాయపాలెం శివారు వరకు రహదారి నిర్మించి, పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంతో ఎక్కువ శాతం మంది ప్రజలు ఇటుగానే ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈక్రమంలో ఒరిగిన స్తంభాన్ని నిలబెట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఇరువైపులా చూడు.. జాగ్రత్తగా వెళ్లు!

పేరాల, న్యూస్‌టుడే: చీరాల పట్టణం నుంచి జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రోడ్డు కొత్తపేట వద్ద అధ్వానంగా మారింది. స్థానిక శ్రీవారి పాదాల నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డులో నిత్యం ప్రజా రవాణా వాహనాలతో పాటు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జాతీయ రహదారికి ఆనుకొని కొత్తపేట వైపు సుమారు 150 మీటర్ల పొడవునా రోడ్డు పూర్తిగా రెండు వైపులా దెబ్బతింది. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాల ప్రయాణం నరకంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా దెబ్బతినడంతో ద్విచక్రవాహన చోదకులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చెరువుకు నీరు తరలించే పనులు ప్రారంభం

శుభ్రం చేస్తున్న కాలువలు

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రజల దాహార్తిని తీర్చేందుకు బాలకృష్ణ కుంటకు సాగర్ జలాలు తరలించే పనులను మంగళవారం పంచాయతీ అధికారులు ప్రారంభించారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా ఈ చెరువును సాగర్ జలాలతో నింపాలని కోరుతూ గ్రామస్థులు ఇటీవల పంచాయతీ అధికారులను కోరారు. దీంతో పూర్తిస్థాయిలో బాలకృష్ణ కుంటను నీటితో నింపేందుకు జేసీబీలతో కాలువలో పూడిక తీత, నీరు సక్రమంగా చేరేలా పనులు చేస్తున్నారు.

లీకులు పట్టవా..?

భూషాయపాలెం (పర్చూరు), న్యూస్‌టుడే: మంచినీటి పైపులైన్లకు లీకులుపడి తాగునీరు వృథాగా పోతుంది. మండల పరిధిలోని గొల్లపూడి, తిక్కరాజుపాలెం గ్రామాలకు మంచినీటిని చెరుకూరు గ్రామం నుంచి పైపులైన్ల ద్వారా అందిస్తారు. ఈ నీటిని సరఫరా చేసే పైపులైన్లకు భూషాయపాలెం గ్రామ ప్రారంభంలో, శివారులో రెండు లీకులు పడి వృథాగా పోతున్నాయి. దీంతో మురుగు పైపులైన్లలో కలిసి, రంగుమారుతున్నాయని కొందరు గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు లీకులు పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాడి రైతుల అభ్యున్నతికి పథకాలు

రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న అధికారులు

యద్దనపూడి, న్యూస్‌టుడే: పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని ప్రకాశం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ బి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం పోలూరులో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వైద్యులు రావెళ్ల శ్రీనివాస్, ఎన్.మాధవీలత, పి.శారదా, జగదీష్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా అబ్బాయి.. చైనా అమ్మాయి

సింగపూర్‌లో ప్రేమ
నేడు చీరాలలో పెళ్లి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా అబ్బాయి.. చైనా అమ్మాయి.. పెళ్లిపీటలెక్కబోతున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా.. బాపట్ల మండలం కంకటపాలేనికి చెందిన యార్లగడ్డ వెంకట సుబ్బారావు కుమారుడు సాయి సూర్య, చైనాకు చెందిన ఎన్‌జీ షా చ్యూ - వాంగ్ క్వేయిన్ దంపతుల కుమార్తె రోయని ఎన్‌జీ లువో యాన్ ప్రేమించుకున్నారు. తొలుత అక్కడే పెళ్లికి ఏర్పాట్లు చేశారు. నిశ్చితార్థం చేశారు. కొన్ని రోజుల క్రితం వధువు, వరుడు కలిసి కంకటపాలెం వచ్చారు. షాపింగ్ కోసం బాపట్ల ప్రాంతంలో తిరిగారు. ఈసందర్భంగా ఇక్కడ వాతావరణ వీరిని బాగా ఆకట్టుకోవడంతో తమ వివాహ వేదిక ఇక్కడికి మార్చాలని పట్టుబట్టారు. బాపట్లలో కల్యాణ వేదికలు దొరకకపోవడంతో చీరాలలో బుధవారం చేయడానికి ఏర్పాట్లు చేశారు.

'వైకాపా పాలనలో పశుసంవర్ధక శాఖ నిర్వీర్యం'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకంగా నిలిచే పాడి పరిశ్రమను వైకాపా పాలనలో పూర్తిగా విస్మరించి, నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగించుకుంటూ పాడిపరిశ్రమపై ప్రసంగించారు. వైకాపా అయిదేళ్ల విధ్వంసకర పాలనలో పాడి రైతులు అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినాటి నుంచే పాడిరైతు వ్యతిరేక విధానాలకు స్వస్తిపలికి, ప్రక్షాళన చేయడంతోపాటు గాడినపెట్టి తద్వారా రైతుల సంక్షేమానికి వివిధ పథకాలను చేరువచేసిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. రాష్ట్ర డీఎస్‌డీపీలో 11.23 శాతం వాటా కలిగిన ఘనత పశుసంవర్ధక శాఖదే అన్నారు. అలాంటి కీలక రంగాన్ని 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో స్పెషాలిటీ ఆసుపత్రులు, వెటర్నరీ పాలీక్లినిక్‌లు, డిస్పెన్సరీలు, పశువైద్యశాలలు దాదాపు 1500 పైగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో చేసిన నిర్లక్ష్యంతో మొబైల్స్ అంబులెన్సుల్లో కనీసం మందులు, సిబ్బంది లేకుండా చేశారన్నారు. ఒక్క పశువైద్యాధికారిని నియమించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన పిదప కొంత ప్రక్షాళన జరిగి పశుపోషకుల ఉన్నతికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నిలిపిన రాయితీలను పునరుద్ధరించి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు.

వ్యర్థాలు తొలగించి.. బాగు చేసి

కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే: కడవకుదురు ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే బీసీల శ్మశానానికి సంబంధించి సుమారు ఎకరం భూమి ఉండగా సమీప ఇళ్లకు చెందిన కొందరు కోళ్ల వ్యర్థాలు, చెత్తాచెదారం తెచ్చి రోడ్డు పక్కనే వేసి వెళుతున్నారు. దీనివల్ల ఇక్కడ రోడ్డుకు తూర్పు వైపున ఉన్న స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈ నెల 19న 'ఈనాడు'లో 'రుద్రభూమి స్థలం.. వ్యర్థాల మయం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు స్పందించారు. పొక్లెయిన్‌తో మంగళవారం బాగు చేయించారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించి సమస్యను పరిష్కరించారు.

ఈనాడు కథనానికి స్పందన

పేదలకు అత్యవసర చికిత్సకు నిధులు

చాందినికి పత్రం అందిస్తున్న తెదేపా నాయకులు

ఇసుకదర్శి (మార్టూరు), ఇంకొల్లు, న్యూస్‌టుడే: పేదలకు కార్పొరేట్ సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో అత్యవసర చికిత్సకు విడుదల చేసిన రూ.3,02,598 నిధులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు లబ్ధిదారుకు అందజేశారు. మంగళవారం ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఇంకొల్లుకు చెందిన లారీ డ్రైవర్ మహబూబ్‌జానీ కుమార్తె వైద్యం కోసం ఎమ్మెల్యే ఏలూరికి విజ్ఞప్తిచేయగా ఆయన సీఎం సహాయ నిధి కోసం సిఫార్సు చేశారు. దీంతో నిధులు మంజూరుచేస్తూ విడుదల చేసిన పత్రాలను ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, తెదేపా నేతలు నాయుడు హనుమంతరావు, కామేపల్లి హరిబాబులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతోపాటు ఎమ్మెల్యే సాంబశివరావు రూ.50 వేలు ఆర్థిక సాయం చేయగా వాటిని పాప తల్లి చాందినికి అందించారు. అలాగే కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన నక్కల గంగమ్మకు మంజూరైన రూ.49,492 నిధుల పత్రాన్ని ధూళిపాల వెంకటస్వామి, ముద్దుకూరి నహేమ్యారావు, కొమ్మినేని వెంకట్‌లు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

ఇంకొల్లు: దీక్షలో కార్యకర్తలు

పర్చూరు, ఇంకొల్లు, వేటపాలెం, న్యూస్‌టుడే: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), ఆయా ప్రాజెక్ట్ కమిటీల ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, యాప్‌ల వినియోగం తగ్గించాలని, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని కోరారు. పర్చూరు సీడీపీవో కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టగా వినతిపత్రాన్ని సీడీపీవో కార్యాలయ ఉద్యోగులకు అందజేశారు. కార్యకర్తలు టి.రాణి, ఎ.రేవతి, కె.భార్గవి, సీహెచ్ జ్యోత్స్న, టి.శ్యామలాదేవి, బి.కుసుమాంబ పాల్గొన్నారు. ఇంకొల్లులో శిబిరాన్ని మండల సీఐటీయూ కార్యదర్శి వెంకట్రావు ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎలిజిబెత్‌రేఖ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదన్నారు. మస్తాన్‌బీ, శ్రీలక్ష్మి, సరళ, హైమవతి, అనూరాధ, రమాదేవి, సుజాత, లత పాల్గొన్నారు. వేటపాలెం ఐసీడీఎస్ కార్యాలయం దీక్షలను ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పి.ప్రమీల ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.వసంతరావు మాట్లాడారు. ప్రాజెక్ట్ కార్యదర్శి బ్యూలా కుమారి, నిర్మల, జ్యోతి, నాగజ్యోతి, పద్మావతి, లక్ష్మీలత, కృష్ణవేణి, టి.పద్మావతి కూర్చున్నారు.

నీరు ప్రవహించేలా చర్యలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పావులూరు మైనరు సాగరు కాలువలో వ్యర్థాలను సిబ్బంది తొలగించారు. 'కాలువలో వ్యర్థాలు...సాగునీటికి ఆటంకాలు' శీర్షికతో మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎన్ఎస్పీ ఏఈ బాలకృష్ణ నాయక్ స్పందించారు. వారబంది విధానంలో మంగళవారం పావులూరు మైనరుకు నీరు విడుదల చేశారు. ఇడుపులపాడు డొంక దగ్గర పేరుకుపోయిన వ్యర్థాలను ప్రత్యేక సాధనాలతో తొలగించి, నీరు దిగువకు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. సకాలంలో స్పందించిన అధికారులకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం మత్తులో బీరు సీసాతో దాడి

గుణదల (పటమట), న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు తన మేనత్త ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేసిన ఘటన కార్మిక నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... చీరాలకు చెందిన బండి ప్రసాద్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటారు. పనులు ఉన్నప్పుడు విజయవాడ వచ్చి.. పూర్తవగానే తిరిగి వెళ్లిపోతుంటారు. విజయవాడ వచ్చినప్పుడు గుణదల కార్మికనగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటారు. సోమవారం ప్రసాద్ ఇంటి బయట ఫోన్ మాట్లాడుతున్నారు. ఇంతలో ఇంటి యజమాని బంధువు షౌకత్ అలీఖాన్ మద్యం మత్తులో బీరు సీసా పట్టుకొని అక్కడికి వచ్చాడు. తన మేనత్త ఇంట్లో ఎందుకు ఉన్నావని ప్రసాద్‌తో గొడవ పడ్డాడు. తాను అద్దెకు ఉన్నానని చెబుతుండగానే.. బీరు సీసాతో అతని తలపై దాడి చేశాడు. తల, చెవికి తీవ్ర గాయమై ఆయన కింద పడిపోయాడు. మళ్లీ కర్రతో దాడి చేశాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు గాయపడిన ప్రసాద్‌ను ఆసుపత్రికి, నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. నిందితుడిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటుకు ఇవ్వడం తగదు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సుల పేరుతో ప్రైవేటు కంపెనీకి ఆర్టీసీ స్థలాలు అప్పగించడం, డిపోల మూసివేతను వ్యతిరేకిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రేపల్లె ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఆస్తుల ప్రైవేటీకరణ ప్రక్రియను వెంటనే ఆపాలని, ప్రైవేటు సంస్థకు డిపోల కేటాయింపు కార్మికులకు ద్రోహం చేయడమేనన్నారు. మా డిపోలు మాకే కావాలి, ప్రైవేటు వ్యక్తులకు వద్దు, సిబ్బందిని మార్చడం ఆపాలి, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు వాసు, బ్రహ్మరాజు, శ్రీనివాసరావు, శ్రీధర్, నారాయణ, సాంబశివరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

మొక్క మానైతే.. వంతెన అధోగతే!

చందోలు వద్ద తెనాలి డ్రెయిన్‌పై ఇలా..

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: పిట్టలవానిపాలెం మండలం చందోలు వద్ద తెనాలి డ్రెయిన్‌పై ఉన్న వంతెన దిమ్మెలపై మొక్కలు ఏపుగా పెరిగాయి. దీని వేర్లు కట్టడంలోకి దిగడంతో వంతెన శిథిలమవుతోంది. కొన్నేళ్లుగా మొక్కలు పెరుగుతున్నా వీటిని తొలగించేవారు కరవయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలు తొలగించి వంతెనకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని రేపల్లె అగ్నిమాపక కేంద్రం అధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు స్వీయ సంరక్షణ, ఇతరులకు ఎలా సహాయం చేయాలో వివరించారు. ఇంట్లో వంట చేసేటప్పుడు సిలిండరు నుంచి గ్యాస్ లీకై మంటలు రేగితే ఎలా అదుపుచేయాలో సిబ్బంది చేసి చూపించారు. అనంతరం విద్యార్థులతో చేయించారు. నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులతోపాటు బంధువులకు వివరించాలని కరస్పాండెంట్ కుర్రా అవర్ణ విద్యార్థులకు సూచించారు. సిబ్బంది జనార్దన్, శ్రీనివాసరావు, రవి, చంద్రమోహన్, పవన్, సుబ్బారావు, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu

మాతృ మరణాలు జరగకూడదు: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైద్యసేవలు అందక ఎక్కడా మాతృ మరణాలు జరగకూడదని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యశాఖ అధికారుల్ని ఆదేశించారు. జనవరిలో జరిగిన రెండు మాతృ మరణాలపై మంగళవారం వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ సమయం నుంచి ప్రసవం వరకూ మహిళల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలని, సకాలంలో ఆస్పత్రికి చేర్చి సుఖ ప్రసవం జరిగేలా వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

● మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

కాణిపాకం ఆలయం 3న మూసివేత

కాణిపాకం, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా... చిత్తూరు కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయాన్ని మార్చి 3న మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో పెంచల కిశోర్ మంగళవారం తెలిపారు. గ్రహణం నేపథ్యంలో 3వ తేదీ ఉదయం 6.20 నిమిషాలకు ఆలయాన్ని మూసివేసి.. గ్రహణ మోక్షానంతరం సాయంత్రం 6.47 నిమిషాలకు తెరచి సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యహావచనం కార్యక్రమాలను ఏకాంతంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మార్చి 4న ఉదయం నుంచి ఆలయంలో స్వామివారి దర్శనం, ఆర్జిత సేవలు, ఇతర కార్యక్రమాలను యథావిధిగా నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రహణ కాలానికి 9 గంటలకు ముందు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు.

ఆలయానికి 18.6 ఎకరాలు కేటాయింపు: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి.. చిత్తూరు-తిరుపతి ఆరు వరుసల రహదారి కె.పట్నం సమీపంలో 18.6 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ.. రాష్ట్ర మంత్రిమండలి మంగళవారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా రాతికొండతో కూడుకున్న భూమి ఉంది. ఈ భూమి ఆలయానికి కేవలం రెండు కి.మీ. దూరంలో ఉన్న నేపథ్యంలో.. భవిష్యత్తులో భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించుకొనే విధంగా కేటాయించారు. త్వరలో కొండను తొలగించి... అక్కడ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

మృత్యువు మాటేసి.. జీవితాలను కాటేసి

రహదారులపై 'బ్లాక్ స్పాట్స్' మృత్యుఘోష ● మూడేళ్లలో 1,500 మందికి పైగా బలి

ఈనాడు డిజిటల్, తిరుపతి: పుణ్యక్షేత్రాల దర్శనానికి వచ్చే భక్తులు, నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులతో కళకళలాడాల్సిన ఉమ్మడి జిల్లా రహదారులు రక్తంతో తడిసి ముద్దవుతున్నాయి. ఎటు చూసినా మృత్యువు మాటువేసిన 'బ్లాక్ స్పాట్లు'. ఎటు వెళ్లినా 'యమపాశాల్లాంటి' మలుపులు. ఏటా వందలాది మంది మృత్యువాత పడుతూనే ఉన్నారు. ఇవి కేవలం ప్రమాదాలు కాదు.. వ్యవస్థీకృత నిర్లక్ష్యం..

● **2023** నుంచి **2025** వరకు జిల్లాలో ఏకంగా **3,368** ప్రమాదాలు జరగగా, **1,600** మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాదాలకు ప్రధాన కారణాలు..

● హైవే మధ్యలో డివైడర్లను ఇష్టానుసారంగా తొలగించి ద్విచక్ర వాహనాలు దాటడం.

● భాకరపేట ఘాట్ రోడ్డు వంటి చోట్ల సరైన రేడియస్ లేని మలుపులు, దెబ్బతిన్న క్రాష్ బారియర్లు.

● రాత్రి వేళల్లో జంక్షన్ల వద్ద సరైన వెలుతురు లేక రోడ్డు దాటే పాదచారులు ప్రమాదానికి గురవ్వడం.

● హైవే పక్కన హోటళ్ల (దాబాల) వద్ద లారీలను నిలపడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొట్టడం.

నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో వకుల మాత ఆలయ మార్గంలో బ్లాక్ స్పాట్

తిరుపతి జిల్లా బ్లాక్ స్పాట్లలో ..

	2023	2024	2025
ప్రమాదాల సంఖ్య	141	140	73
మరణాలు	85	73	28

పౌర స్పృహ పెరగాలి!

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యం. పౌర స్పృహ ఉండాలి. 10 ప్రమాదాల్లో కనీసం 4 నుంచి 5 రోడ్డు డిజైన్ లోపాల వల్లే జరుగుతున్నాయి. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక మొబైల్ వెహికల్, అంబులెన్స్ ఉండాలి. పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు, ప్రజలు కలిసి బాధ్యతగా ఉంటేనే ఈ మరణాలను అరికట్టగలం.

– సుబ్బరాయుడు, ఎస్పీ, తిరుపతి

మానవ తప్పిదాలే ఎక్కువ..

● అతి వేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనం నడపడం ఇలా 60-70 శాతం ప్రమాదానికి కారణాలు. ● గత మూడేళ్లలో జరిగిన మరణాల్లో దాదాపు 50 శాతం ద్విచక్ర వాహనదారులవే. పది మందిలో ఎనిమిది మంది యువకుల ప్రాణాలే గాల్లో కలిసిపోతున్నాయి.

● జిల్లాలో చాలా చోట్ల గ్రామీణ రోడ్లు నేరుగా హైవేలోకి కలుస్తున్నాయి. 100 కి.మీ వేగంతో వచ్చే వాహనాన్ని 20 కి.మీ వేగంతో వచ్చే స్కూటర్ ఢీకొట్టడం ఇక్కడ సాధారణమైపోయింది.

● గూడూరు రూరల్, నాయుడుపేట, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి పరిసరాల్లో ఏకంగా 48 ప్రధాన బ్లాక్ స్పాట్లను గుర్తించారు. వీటిలో ఆర్.సి. పురం జంక్షన్, భాకరపేట ఘాట్ రోడ్డు, తిరుచానూరు క్రాస్ వంటివి నిత్యం రక్తమోడుతున్నాయి.

ఎక్కడెక్కడ

● ఈ ప్రాంతాల్లో గత మూడేళ్లలో 354 ప్రమాదాలు జరగ్గా.. 186 మంది మృత్యువాత పడ్డారు.

● ఎన్ హెచ్ -16 (కోల్‌కతా హైవే) లో చిల్లకూరు బైపాస్, ఆదిశంకర కాలేజీ, వరగాళి క్రాస్, పండ్లూరు, శ్రీసిటీ 'వీ' పాయింట్, తడ చెక్ పోస్ట్.

● ఎన్ హెచ్-71(నాయుడుపేట హైవే), ఎన్ హెచ్-140 (చిత్తూరు రోడ్)లో, ఎన్ హెచ్-716 (చెన్నై రోడ్) లో .. తదితర ప్రాంతాల్లో ఉన్నాయి..

ప్రమాణాలు పెంపు.. పరిశోధనలు బలోపేతం

'న్యూస్‌టుడే'తో మహిళా వర్సిటీ వీసీ వి.ఉమ

ఉమ

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో వందలోపు స్థానం సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, విద్యా ప్రమాణాలు, పరిశోధనల బలోపేతం, విద్యార్థినుల ప్రవేశాల పెంపు, అకడమిక్ ప్రతిష్ఠ పెంచడం వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.ఉమ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించేలా

వర్సిటీలో చాలామంది గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. మంచి ఉద్యోగాలు సాధించాలంటే ఆంగ్ల భాషపై పట్టు ఉండాలి. ఇంటర్వ్యూలను ఎదుర్కొనడానికి అమెరికా నుంచి ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఫెలో ఒకరు వర్సిటీలో పని చేస్తున్నారు. ఆమె శిక్షణతో ఎంతో మార్పు వచ్చింది.

నాణ్యమైన జర్నల్స్‌కు అవకాశం

విదేశీ విద్యార్థినులు వర్సిటీలో చదువుకోడానికి, పరిశోధనలు కొనసాగించడానికి అవకాశం కల్పిస్తున్నాం. ఇంటర్నేషనల్ హాస్టల్ నిర్మిస్తున్నాం. జర్నల్స్‌ను ప్రోత్సహించేందుకు, పబ్లికేషన్లు పెంచేందుకు గతేడాది గ్రాంట్ల, గమనం పేరుతో జర్నల్స్ ప్రారంభించాం. మన దేశంతోపాటు ఇతర దేశాల నుంచి ప్రచురణ కోసం జర్నల్స్ వస్తున్నాయి.

నూతన భవనాలు

సెరికల్చర్, బాటనీ, జువాలజీ అధ్యాపకులు, విద్యార్థినులు పరిశోధనలు చేసుకోవడానికి వీలుగా నానో టెక్నాలజీ భవనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఫార్మసీ, బయోటెక్నాలజీ విభాగాల కోసం డ్రగ్ డెలివరీ, డ్రగ్ డిస్కవరీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవనం, సోషల్ సైన్సెస్ పరిశోధనల కోసం సోషల్ ఇన్నోవేషన్ సెంటర్ అండ్ ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ భవనం అందుబాటులోకి రానుంది. పరిశోధనలు చేసుకోవడానికి రూ.20 కోట్ల విలువైన పరికరాలు కొనుగోలు చేయనున్నాం.

పీహెచ్‌డీలు త్వరగా పూర్తయ్యేలా..

గతంలో పలు కారణాలతో వర్సిటీలో పీహెచ్‌డీలు పూర్తిచేయడానికి ఎక్కువకాలం పట్టేది. చాలామంది వివాహాలు, కుటుంబ బాధ్యతలు తదితర కారణాలతో పీహెచ్‌డీలు త్వరగా పూర్తిచేయడం లేదు. వారితో మాట్లాడి సమయానికి పూర్తయ్యేలా గతేడాది నుంచే చర్యలు తీసుకున్నాం. పరిశోధకులు, గైడ్లతో సమావేశం నిర్వహించి ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలనే నిబంధన పెట్టాం. దీంతో 2025లో 78 మంది పూర్తిచేశారు.

పబ్లికేషన్ల పెంపునకు చర్యలు

గతేడాది నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో వర్సిటీ 101-150 ర్యాంకు సాధించింది. 2027 లోగా వందలోపు ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో వీసీగా బాధ్యతలు తీసుకోగానే సమీక్షించాం. ప్రాజెక్టులు, పబ్లికేషన్లు, పీహెచ్‌డీల్లో వెనుకబడ్డాం. దీన్ని అధిగమించేందుకు పీఎం ఉష సాఫ్ట్ కాంపోనెంట్ యాక్టివిటీ-12 కింద రూ.5.50 కోట్లు ప్రాజెక్టులకు మంజూరు చేశాం.

30 ప్రశ్నలు.. 15 నిమిషాలు..!

ఏకీకృత కుటుంబ సర్వే తీరిది

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏకీకృత కుటుంబ సర్వే (యూఎఫ్ఎస్) ప్రక్రియ జిల్లాలో చురుగ్గా సాగుతోంది. స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ కార్యాలయాల పరిధిలోని ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాల్ని సేకరిస్తున్నారు. సర్వేలో 30 వరకూ ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక ఇంటి వివరాల్ని నిర్ణీత ఫార్మెట్‌లో వివరాల్ని నమోదు చేసి అప్‌లోడ్ చేసే సరికి 15 నిమిషాలకుపైగా సమయం పడుతోంది. సర్వే పూర్తికి ఈ నెలాఖరు వరకే గడువు ఉండటంతో సిబ్బంది ఉరుకులు పరుగులు తీస్తున్నారు. సోమవారం సుమారు 4,625 హౌస్ హోల్డ్స్‌ను సర్వే చేసినట్లు సమాచారం.

ప్రశ్నలిలా

సర్వేలో కుటుంబ యజమాని పేరు, ఇల్లు, హోదా, సభ్యుల సంఖ్య, ఆర్థిక పరిస్థితి, లబ్ధి పొందుతున్న పథకాల వివరాలు, ఇంటి స్వరూపం, ఆధార్, ఓటరు కార్డుల్లో తదితర వివరాల పరిశీలన, ఇతర అంశాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇంటి వద్దే ఫొటో తీసి అథంటికేషన్‌తో వివరాలను క్రోడీకరిస్తున్నారు.

మండలాల వారీగా నమోదు శాతం

గుడిపాల, నగరి పట్టణంలో సర్వే ప్రక్రియ 90 శాతం దాటింది. చిత్తూరు గ్రామీణ, జీడీనెల్లూరు, గంగవరం, కార్వేటినగరం, నగరి గ్రామీణ, నింద్ర, పలమనేరు, పెనుమూరు, పూతలపట్టు, రొంపిచెర్ల, శాంతిపురం, తవణంపల్లె, వెదురుకుప్పం, విజయపురం, యాదమరిలో 80 శాతం. బైరెడ్డిపల్లె, చిత్తూరు అర్బన్, ఐరాల, కుప్పం పట్టణం, పెద్దపంజాణి, రామకుప్పం, ఎస్ఆర్‌పురం మండలాల్లో 70 శాతం. బంగారుపాళ్యం, గుడుపల్లె, కుప్పం గ్రామీణ, పలమనేరు గ్రామీణ, పాలసముద్రం, పులిచెర్ల, వి.కోటలో 60 శాతం పూర్తయ్యింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా సంక్షేమ పథకాలు తెస్తే సర్వే చేయాల్సి వస్తోంది. హౌస్ హోల్డ్, కులగణన, సంక్షేమం.. ఇలా గతంలో ఎన్నో సర్వేలు చేశారు. భవిష్యత్తులో వీటి అవసరం లేకుండా ప్రజల సమగ్ర సమాచారాన్ని ఒకే చోట పొందేలా ఏకీకృత కుటుంబ సర్వేను చేపట్టింది. ప్రతి

ప్రయోజనాలు..

కుటుంబం, అందులోని ప్రతి సభ్యుడి సమాచారాన్ని పక్కాగా సేకరిస్తోంది. భవిష్యత్తులో ఈ సర్వే ఆధారంగానే ప్రభుత్వ పథకాలు అమలుకానున్నాయి. సర్వే పూర్తయ్యాక ప్రతి కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు కార్డుని అందిస్తారు.

జిల్లా గణాంకాలిలా..

- జిల్లాలోని స్వర్ణ వార్డు/గ్రామ కార్యాలయాలు: **536**
- మొత్తం ఉద్యోగులు: **3,912**
- మొత్తం కుటుంబాలు: **5,14,727**
- సర్వే పూర్తయినవి: **3,97,009**
- పెండింగ్: **1,17,718**
- పూర్తి శాతం: **77.1**

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 13,950 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 13,537 మంది హాజరయ్యారని డీఐఈవో రఘుపతి తెలిపారు. జనరల్ సబ్జెక్టుల్లో 12,320మందికి గాను 11,967 మంది, వృత్తి విద్య కోర్సుల్లో 1630 మందికి 1570 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు.

పశు బీమా.. ఇవ్వాలి ధీమా

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా పాడి పరిశ్రమకు ప్రసిద్ధి. వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా 90 శాతం మంది రైతులు పశుపోషణను ఎంచుకొని జీవనం సాగిస్తున్నారు. పశువులకు అనుకోకుండా వ్యాధులు, ఇతర ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించి మృత్యువాత పడితే పశుపోషకులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదముంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పశువులు, మేకలు, గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించింది. అందులోనూ 85 శాతం రాయితీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. పెంపకందారులు కేవలం 15 శాతం చెల్లిస్తే మూడేళ్ల వ్యవధి కల్పిస్తోంది.

రూ.12లక్షలే విడుదల

పశుబీమా పథకానికి జిల్లాకు కేవలం రూ.12 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి 19 నుంచి నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. రూ.30 వేలు ఖరీదు చేసే పశువుకు రాయితీ పోను.. రూ.298 చెల్లిస్తే మూడేళ్ల వరకు బీమా ఉండటంతో పాడి రైతులు ముందుకొచ్చి 900 పశువులకు బీమా చేయించుకున్నారు. ఇప్పటికే పశుబీమా రాయితీ సొమ్ము ప్రస్తుతం అయిపోయింది. నెల రోజుల నుంచే రాయితీ సొమ్ములేక. . బీమా చేయలేకపోతున్నామని పశు వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది వాపోతున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు రాగానే బీమా వేగవంతం చేస్తామని పశుసంవర్ధక శాఖ జేడీ ఉమామహేశ్వరి తెలిపారు.

జిల్లా వివరాలిలా..

మేకలు	ఆవులు	గేదెలు	గొర్రెలు
1,79,866	4,97,172	2,860	3,86,031

ప్రియుడితో కలిసి కుమార్తె హత్య

తిరుపతి(నేరవిభాగం): రెండో పెళ్లికి అడ్డుగా ఉందని కుమార్తెను ప్రియుడితో కలిసి కడతేర్చింది ఓ తల్లి. తిరుపతి ఆటోనగర్‌కు చెందిన నాగరత్నమ్మ కుమార్తె ఆశాలత (19)కు నాలుగేళ్ల కిందట రాజేష్‌తో వివాహమైంది. వారికి రెండున్నరేళ్ల కుమార్తె దుర్గ ఉంది. భర్తతో మనస్పర్థల కారణంగా విడిపోయి ఆశాలత కుమార్తెతో కలిసి పోస్టల్ కాలనీలో ఉంటుంది. ఏర్పేడు మండలం చెన్నంపల్లికి చెందిన రెడ్డికుమార్‌తో ఆమెకు వివాహేతర బంధం ఏర్పడింది. పెళ్లి చేసుకోవాలని భావించిన వీరు అడ్డుగా ఉన్న మొదటి భర్త కుమార్తె దుర్గను అడ్డు తొలగించుకోవాలని అనుకున్నారు. పథకం ప్రకారం చిన్నారిని హతమార్చి రెడ్డికుమార్ స్వగ్రామానికి సమీపంలోని నదిలో పూడ్చి వేసినట్లు సమాచారం. ఈ నెల 19న ఆశాలత తల్లి నాగరత్నమ్మ మనవరాలు కనిపించడం లేదని తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు వాస్తవం వెలుగులోకి తెచ్చారు.

సూచికల్లేవు.. చూసెళ్లండి..!

చిత్తూరు నుంచి పెనుమూరు మీదుగా వెదురుకుప్పానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనున్న బావి వాహనదారులను భయాందోళనకు గురి చేస్తోంది. వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామ శివారులో ఉన్న ఈ వ్యవసాయ బావి పురాతనమైనది. దీని పక్కనే ఉన్న రోడ్డుపై నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ ఎలాంటి సూచికలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది.– ఈనాడు, చిత్తూరు

నగరి ఆర్డీవోగా అనుపమ

అనుపమ

ఈనాడు– తిరుపతి, నగరి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతి పొందిన పలువురు డిప్యూటీ కలెక్టర్లతోపాటు మరి కొందరిని బదిలీ చేస్తూ సీఎస్ విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేస్తోన్న అనుపమను నగరి ఆర్డీవోగా నియమించారు. ప్రస్తుతం నగరి ఆర్డీవోగా ఉన్న భవానీ శంకరికి పోస్టింగ్ ఇవ్వలేదు. 2018 గ్రూప్- 1 బ్యాచ్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్లు.. ప్రాధాన్యత ఉన్న పోస్టుల్లో పనిచేస్తుంటే వారిని బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈమెను బదిలీ చేశారు. పరిశ్రమల శాఖలో విధులు నిర్వర్తిస్తోన్న జి.విజయలక్ష్మిని విశాఖ- చెన్నై పారిశ్రామిక నడవా (వీసీఐసీ) ఎస్‌డీసీగా నియమించారు. పదోన్నతి పొందిన ఎన్.చంద్రశేఖర్‌రెడ్డిని మదనపల్లెలోని కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ, ఎంవీఎస్ నారాయణరెడ్డిని పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మాధవ కృష్ణారెడ్డికి మదనపల్లె హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతిలోని లీగల్ సెల్ ఎస్‌డీసీగా అనురాధను నియమించారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: నేరుగా వచ్చే భక్తులకు పది గంటల్లో, రూ.300 టికెట్లు కలిగినవారికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 76,506 మంది భక్తులు దర్శించుకోగా రూ.4.20 కోట్ల హుండీ కానుకలు లభించాయి. శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద మంగళవారం 12 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి పది గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు మరో రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

బోధన రుసుము విడుదల

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉన్నత విద్య అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు బోధన రుసుమును కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇప్పటికే బోధన రుసుం విడుదల కాగా.. తాజాగా చిత్తూరు, తిరుపతి జిల్లాలోని బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ విద్యార్థులు 36,735 మందికి రూ.70.96 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తం త్వరలో కళాశాలల ఖాతాల్లో జమ కానుంది. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశాయి. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో మంత్రి లోకేశ్ ఉన్నత విద్యా, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించి బోధన రుసుం విడుదల చేయించారు.

వివరాలిలా..

జిల్లా	విద్యార్థులు	విడుదలైంది (రూ.కోట్లలో)
చిత్తూరు	14544	27.69
తిరుపతి	22191	43.26

ఎస్సీ విద్యార్థులకు గతంలోనే..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బోధన రుసుమును కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఎస్సీలకు 60 శాతం, ఎస్టీలకు 75 శాతం విడుదల చేస్తుంది. గతంలో కేంద్రం విడుదల చేసే మొత్తానికి రాష్ట్ర వాటాను సకాలంలో విడుదల చేయకుండా ఇతర పథకాలకు మళ్లించే వారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఇస్తే గానీ, తమ వాటాను విడుదల చేయబోమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఎప్పటికప్పుడు రాష్ట్ర వాటాను అందిస్తోంది.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

(c) eenadu

ఏం చెబుతున్నాం అక్షరంలా?
ఏం నేర్పుతున్నాం విద్యార్థులకు?
కష్టం వచ్చినప్పుడు ఎదుర్కొనే ధైర్యం
చెప్పలేక చతికిలపడుతున్నాం?
బాధ కలిగినప్పుడు తట్టుకునే
దిక్కులేకపోతున్నాం ఎందుకని?
ఆత్మీయ స్పర్శ అర్థం చేసుకోలేక
బలవంతపు పుడ్పులెందుకు?
17 సంవత్సరాల చదువు,
22 ఏళ్ల బతుకు ఉరికే విద్యార్థిని
చదువుకుంటూనే ఉద్యోగం సాధించిందని..
కాలేజీలు చెప్పుకుంటారే ఆపై వేలాడింది
■ తల్లిదండ్రుల గుండె పగిలిపోయేటట్లు..
ప్రాణం తీసుకునే ఆలోచనలేమిటో
స్పృతి కలగడం లేదా?
చావు ఏం సాధిస్తుంది?
బతికి కొనసాగడం పోరాడాలని
ఆలోచన చేయడం లేదా?
...విద్యార్థులారా మీకే ఈ ప్రశ్నలు

ఎంత పనిచేశావు భువనా!

భువన (పాతచిత్రం)

■ చదవడం.. చావడానికేనా?
■ ఉరికి వేలాడిన బీటెక్ విద్యార్థిని

పుంగనూరు మండలం మంగళంత చెందిన భువన (22) తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రంగంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ నాలుగో ఏడాది చదువుతోంది. పీజీ వసతి గృహంలో సోమవారం గదిలో ఫ్యానుకు ఉరివేసు కుని మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మంగళం గ్రామానికి చెందిన సురేంద్రరెడ్డి, జానమ్మలకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె భువన బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. ఇటీవలే కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఇన్ఫోసిస్ కంపెనీలో ఏడాదికి రూ.9లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికైంది. మేలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. రెండు రోజుల క్రితం ఇంటికి వెళ్లి అందరితో సంతోషంగా గడిపి, ఉద్యోగం వచ్చిందన్న ఆనం దాన్ని అందరితో పంచుకుంది. సోమవారం మళ్లీ కళాశాలకు చేరింది. గదిలో ఎవరూ లేని సమ యంలో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపిం చింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కుమార్తె మృతదేహాన్ని చూసి హృదయం ద్రవించేలా కన్నీరు మున్నీరయ్యారు. ఎంతో చలాకీగా ఉంటూ పది, ఇంటర్‌లో టాప్, రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన కుమార్తె చనిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు బోరున విలపిస్తున్నారు. చేతికొచ్చిన బిడ్డ బలవన్మరణానికి పాల్పడటాన్ని జీర్ణించుకోలేకపోయారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ, తిరుపతి (వైద్యవిభాగం), పుంగనూరు గ్రామీణ

పనితీరు గాడిన పడేనా..!

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'రెవెన్యూ శాఖకు ఉన్న చెడ్డ పేరు పోవాలి. రెవెన్యూ శాఖలో ప్రెండ్‌లిస్ట్ తీసుకురావాల్సి ఉంది. సరిగా పనిచేయని కారణంగా తహసీల్దార్లను పక్కన పెట్టాల్సిన దుస్థితి రాకూడదు. ఇదే తాజాగా సీఎం రెవెన్యూ శాఖపై చేసిన వ్యాఖ్యలు. ప్రజలకు మెరు గైన సేవలు అందించడం, సేవలను సులభతరం చేయడమే లక్ష్యం.. ఉద్యోగులు, అధికారుల పనితీరును మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాగా పనిచేసే ఉద్యోగులను అభి నందించి వెయిటేజ్ ఇవ్వాలని, వ్యక్తిగత రికా ర్డుల్లో నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. రీసర్వేతో అన్ని రకాల సమస్యలు పోవా

వివిధ సేవలకు సంబంధించి వివరాలిలా.. (ఈ నెల 1 నుంచి 24 వరకు)

సేవ	మొత్తం దరఖాస్తులు	గడువు దాటినా పరిష్కరించనివి	24 గంటల్లో గడువు తీరేవి	48 గంటల్లో గడువు తీరేవి
కుటుంబ సభ్యుల ధ్రువపత్రం	839	42	10	21
ఆదాయ ధ్రువపత్రం	2545	17	33	72
ఈపాస్ బుక్ సర్వీస్	189	34	6	4

పౌర సేవలు సక్రమంగా అమలు చేస్తేనే

పీజీఆర్ఎస్‌లో నిత్యం భూ వ్యవహారాలపైనే అత్యధిక ఫిర్యాదులొస్తున్నాయి. పరిష్కారం చూప కున్నా చూపినట్లుగా నమోదు చేస్తుండటంతో అవే అర్జీలు రీఓపెన్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా నిత్యం ప్రజలు వివిధ రెవెన్యూ సేవల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పౌర సేవా చట్టం ప్రకారం దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాల్సి ఉంది. మ్యూటే షన్, సర్వేకు సంబంధించి దరఖాస్తులకు సరైన పరిష్కారం చూపకనే క్లోజ్ చేస్తున్నట్లు విమర్శలు న్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పటి ష్ఠంగా అమలు చేస్తేనే పౌర సేవలు ప్రజలకు మెరుగ్గా అందే అవకాశం ఉంది.

లని, మళ్లీ వివాదాలు రాకుండా చూడాలని, ఎవ రైనా సర్వేయర్లు సరిగా వ్యవహరించకపోతే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఎన్నికైన ఐకాస జిల్లా కార్యవర్గం

ఐకాస జిల్లా ఛైర్మన్‌గా రాఘవులు

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా ఛైర్మన్‌గా ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘ వులు ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం జేఏసీ జిల్లా కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సెక్రెటరీ జనరల్‌గా కిరణ్‌కుమార్ (ఏపీటీఎఫ్ 1938), కో-ఛైర్మన్లుగా రెడ్డప్పనాయుడు(యూటీఎఫ్), మదనమోహన్ రెడ్డి(ఎస్టీయూ), ఉపేంద్ర(ఆర్టీసీ), జగదీష్(ఏపీటీఎఫ్), వైస్ ఛైర్మన్లుగా శశి ధర్(పంచాయతీరాజ్), ఆదం(పురపాలక సంస్థ), రామకృష్ణారెడ్డి(పే అండ్ అకౌంట్స్), కోశాధికారిగా బాలసుబ్రహ్మణ్యం(ఖజానా), కార్యనిర్వాహక కార్య దర్శి ప్రదీప్‌కుమార్(ఐటీఏ), సంయుక్త కార్యదర్శులుగా రేణుక, ప్రసాద్(వైద్య ఆరోగ్యం), త్యాగరాణి(సహకారశాఖ), కార్యనిర్వాహక సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా జేఏసీ ఛైర్మన్ రాఘవులు తెలిపారు.

చిత్తూరు వచ్చిన పీఎంశ్రీ పాఠశాలల సంయుక్త కార్యదర్శి

అంషు మనీష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీసీ వెంకటరమణ, పక్కన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలల సంయుక్త కార్యదర్శి అంషు మనీష్ మంగళవారం చిత్తూరుకు వచ్చారు. ఆయన్ను స్థానిక ర.భ.శాఖ అతిథి గృహంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన వెంట సమగ్ర శిక్షా ఏపీసీ వెంకటరమణ ఉన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఐరాల, న్యూస్‌టుడే: పాడి పరిశ్ర మలో జిల్లా అగ్రస్థానంలో ఉందని జిల్లాలో కరవు ఏర్పడినప్పుడు పాడిపరిశ్రమ ప్రజలను ఆదుకుందని ఎమ్మెల్యే మురళీమోహన్ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం ప్రస్తావించారు. జిల్లాలో పశుసంవర్ధక శాఖకు సంబంధించి 30 పోస్టు కొత్త భవ నాలు, తొమ్మిది పాత భవనాల మరమ్మతులు చేపట్టా లన్నారు. జిల్లాలో 4.97లక్షల పశువులు, 3.67లక్షల గొర్రెలు, 1.78లక్షల మేకలు, 1.50లక్షల కోళ్లు ఉన్నాయ న్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో కాణిపాకం(ఐరాల), బిటిమండ, నద కుప్పం, రాగిమానుపెంట(బంగారుపాళ్యం), కొండకిందపల్లె(పూతలపట్టు), ఎడమవారిపల్లె (తవణంపల్లె)లో పశువైద్య కేంద్రాలకు కొత్త భవనాలు నిర్మించాలన్నారు. జిల్లాలో రోజుకు 20 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి ఉందని. . జిల్లాకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అసెంబ్లీలో ప్రస్తావించారు.

వేసవిలో విద్యుత్తు సమస్యలు తలెత్తకూడదు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: రానున్న వేసవిలో విద్యుత్తు సమ స్యలు.. సరఫరాలో అంతరాయాలు తలెత్తకూడదు.. ఇంజినీర్లు, సిబ్బంది జవాబుదారితనంగా వ్యవహరించాలని ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం సీజీఎం కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎస్ఈ కార్యాలయంలో ఇంజినీర్లు, అధికారులతో సమీక్షించారు. సీజీఎం మాట్లాడుతూ... వేసవిలో విద్యుత్తు కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సెక్షన్‌కు అదనంగా రెండు నియం త్రికలు అమర్చాలి. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు, లైన్లను సత్వ రమే మార్పు చేయాలని..అందుకు అవసరమయ్యే నిధులను సమకూర్చు తామన్నారు. కరెంటోళ్ల జనబాట, డయల్ యువర్ సీఎండీ, ఎస్ఈ కార్య క్రమాల్లో ప్రస్తావనకు వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మోహనమ్మ, మునిచంద్ర, సురేష్‌బాబు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఇంజినీర్లతో సమీక్షిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం కృష్ణారెడ్డి

పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక అమలు

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి గ్యారెంటెడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ సాధించే లా 75 రోజుల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం తెలిపారు. రాయచో టిలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం నిర్వహించిన రాయలసీమ జిల్లాల ఎంఈ వోలు, టెస్ట్ అడ్మినిస్ట్రేటర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కడప డీఈవో షంషుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి జీవిత అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాల న్నారు. కార్యాచరణ ప్రణాళిక అమలులో తెలుగు, ఇంగ్లిష్, గణిత అంశాలపై దినసరి కార్యకలాపాలు సమగ్రంగా పొందుపరుస్తామని వివరించారు. క్లస్టర్ కాంప్లెక్స్ హెడ్‌లు, ఉపాధ్యాయులు పాఠశాలలకు పంపిణీ చేసిన టీఎల్ఏలను సమర్థంగా ఉపయోగించి రోజువారీ బోధించాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి, మదనపల్లె, చిత్తూరు, తిరుపతి, పుత్తూరు ఉప విద్యాశాఖాధికారులు నాగయ్య, లోకేశ్వర్‌రెడ్డి, ఇందిర, ఇందిరా దేవి, మహేశ్వర్, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడావిజేతలకు అభినందనలు

▶ కీర్తి ▶ భవ్యశ్రీ ▶ పావని ▶ వరుణ్ ▶ కుసుమ ▶ ప్రియ

గంగాధరనెల్లూరు: రాష్ట్రస్థాయి కబడ్డీ, హాకీ, వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన నెల్లేపల్లె హైస్కూలు విద్యార్థులైన కీర్తి, భవ్యశ్రీ, పావని, వరుణ్, కుసుమ, ప్రియకు మంగ ళవారం పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హెచ్ఎం సుబ్బర త్నమ్మ, వ్యాయామ సంచాలకురాలు లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనడంతో వారిపై ఉండే మానసిక ఒత్తిడి తొలగిపోయి..చక్కగా చదువుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

పుత్తూరుకు 7.34 లక్షల మామిడి కవర్లు

పుత్తూరు, న్యూస్‌టుడే: మామిడిలో నాణ్యమైన పంట దిగుబడుల కోసం ప్రభుత్వం రాయితీపై ఫ్రూట్ కవర్లు అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి వెంకటసౌజన్య పేర్కొ న్నారు. పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాల్లోని మామిడి రైతులకు ఫ్రూట్ కవర్లు 50 శాతం రాయితీపై మొదటి విడతగా 7.34 లక్షల కవర్లు వచ్చాయన్నారు. మండలంలోని పరమేశ్వరమంగళం రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచామ న్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

గణనాథుడి హుండీ ఆదాయం రూ.1.30 కోట్లు



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవ రసిద్ధి వినాయక స్వామికి భక్తులు హుండీల్లో సమ ర్పించిన కానుల లెక్కింపు ద్వారా గడిచిన 18 రోజుల్లో రూ. 1,30,10,749 ఆదాయం సమకూరినట్లు ఆలయ పాలకమండలి ఛైర్మన్ ఎం.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో హుండీల్లోని కానుకలను మంగళవారం లెక్కించారు. 88 గ్రాముల బంగారం, 1.189 కిలోల వెండి వచ్చినట్లు చెప్పారు. నిత్యాన్నదానం హుండీలో రూ.87,484, గోసంరక్షణ హుండీ ద్వారా రూ.12,832 ఆదాయం వచ్చింద న్నారు. జిల్లా దేవాదాయశాఖ ఏసీ చిట్టెమ్మ, పాలకమండలి సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమా ధవరెడ్డి, ధనపాల్, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, ఆలయ, స్థానిక యూనియన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్ష తేదీలో మార్పు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అంబేడ్కర్ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి మార్చి 2న నిర్వహించా ల్సిన పరీక్షను మార్చి 8వ తేదీ ఆదివారానికి మార్పు చేసినట్లు గురుకుల పాఠశాలల చిత్తూరు, తిరుపతి జిల్లాల సమన్వయ కర్త పద్మజ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీలున్నాయని.. 9వ తరగతి విద్యా ర్థులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రవేశపరీక్ష తేదీ మార్పును విద్యార్థులు గమనించా లని ఆమె సూచించారు.

ఒకరోజు ముందే ఎన్టీఆర్ భరోసా

చిత్తూరు (జిల్లా పంచాయతీ): మార్చి నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల సొమ్ము ఈ నెల 28నే పంపిణీ చేయనున్నారు. మార్చి 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే, పింఛను మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయనున్నారు. అని వార్య కారణాలతో 28న పింఛను అందుకోలేని వారికి మార్చి 2న సోమవారం మధ్యాహ్నం నుంచి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల వద్ద అందజేయనున్నట్లు అధికారులు చెప్పారు.

99.84 శాతం మాత్రల పంపిణీ

చిత్తూరు (వైద్యవిభాగం): జిల్లాలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 99.84 శాతం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3,62,534 మంది పిల్లలు ఉండగా.. 17వ తేదీన పిల్లలకు మాత్రలను పంపిణీ చేయగా, ఆ రోజు పాఠశాలలకు రాని విద్యార్థులకు మంగళవారం మాత్ర లను అందించినట్లు చెప్పారు.

చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా), చిత్తూరు

ఆర్.ఒ.సి.నెం. 15/2025/చుడా తేది: 24.02.2026.

ముసాయిదా ప్రకటన

ఆంధ్రప్రదేశ్ మెట్రో పాలిటన్ రీజియన్ & పట్టణాభివృద్ధి సంస్థ చట్టం, 2016, లోని సెక్షన్ 15 (1) ద్వారా ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతమునకు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. 122 పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ తేది: 24.08.2022 ననుసరించి ప్రతిపాదించడమైనది. ఈ ముసాయిదా ప్రకటన వెలువడిన 15 (పదిహేను రోజుల లోపల ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు వలన వ్యక్తులు లేదా సంస్థలకు అభ్యంతరములు లేదా సలహాలను ఉపాధ్యక్షులు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు వారికి వ్రాతపూర్వకముగా తెలిపిన విషయములను ముఖ్య కార్యదర్శి, పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర సచివాలయం, వెలగపూడి వారికి, వారి పరిశీలన మరియు తగు చర్యల నిమిత్తము పంపబడునని తెలియజేయడమైనది.

భూ వినియోగ మార్పు ముసాయిదా ప్రకటన

ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య. 122 పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ తేది: 24.08.2022 నందు ఆమోదించబడిన బృహత్తర ప్రణాళికా యందు చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ భూ వినియోగ ఆమోదము పొందిన ప్లాను నందు 72. జంగాలపల్లి రెవిన్యూ గ్రామంలోని సర్వే సంఖ్య. Sy.No.356/1 (LPM No.1299) లో ఎ.4.74 సెంట్ల విస్తీర్ణము కలిగి ప్రతిపాదిత రక్షిత (ఆకుపచ్చ) వినియోగ మండలము రద్దు చేయుటకు మరియు సదరు స్థలమును ప్రజా ప్రయోజన వినియోగ మండలము నకు మార్పుదల చేయుచూ మరియు బృహత్తర ప్రణాళిక యం.యం.పి. సంఖ్య.03/2025/చుడా, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించడమైనది. సదరు ముసాయిదా భూ.వినియోగ మార్పు సంఖ్య. 03/2025/చుడా, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు కార్యాలయములో పనిదిన ముల వేళయందు ప్రజలు సందర్శించి పరిశీలించుటకు ఏర్పాటు చేయడమైనది.

భూ వినియోగ మార్పు భూమి హద్దులు

ఉత్తరము : గుట్ట (Sy. No. 359) LPM No.1400, L.PM No. 1298) జంగాలపల్లి రెవిన్యూ **దక్షిణము :** ప్రస్తుత 12 మీటర్ల వెడల్పు గల రోడ్డు, **తూర్పు :** ప్రస్తుత 12 మీటర్ల వెడల్పు గల రోడ్డు **పడమర :** గుట్ట (Sy. No. 338/1)L.PM No.1365, LPM No.1367) జంగాలపల్లి రెవిన్యూ

సం/- ఉపాధ్యక్షులు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ, చిత్తూరు.

నగరి పురపాలక సంఘము

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 2555/2025/ఇ1 తేదీ : 24.02.2026

కమిషనరు, నగరి పురపాలక సంఘమునకు సంబంధించి General Fund నుండి రూ.3.00 లక్షలకు గాను 1 పనికి సంబంధించిన టెండరు తేదీలు ఈ క్రింది విధముగా తెలపుబడినది.

1. బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ చేసుకొనుటకు తేదీ : 25.02.2026, ఉదయం 11.00 గం॥లు
2. బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు చివర తేదీ : 11.03.2026, సాయంత్రం 04.00 గం॥లు
3. బిడ్ డాక్యుమెంట్ సమర్పించుటకు చివర తేదీ : 11.03.2026, సాయంత్రం 05.00 గం॥లు
4. బిడ్ ఓపనింగ్ తేదీ : 11.03.2026, సాయంత్రం 05.11 గం॥లు

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ రి-కాల్ టెండరు నోటీసు

కమిషనరు, నగరి పురపాలక సంఘమునకు సంబంధించి 15th FC Tied Grant 2020-21 (2nd Installment) నుండి రూ.79.00 లక్షలకు గాను 2 పనులకు మరియు General Fund నుండి రూ.2.00 లక్షలకు గాను 1 పనికి సంబంధించిన టెండరు తేదీలు ఈ క్రింది విధముగా తెలపబడినది.

1. బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ చేసుకొనుటకు తేదీ : 25.02.2026, ఉదయం 11.00 గం॥లు
2. బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు చివర తేదీ : 11.03.2026, సాయంత్రం 04.00 గం॥లు
3. బిడ్ డాక్యుమెంట్ సమర్పించుటకు చివర తేదీ : 11.03.2026, సాయంత్రం 05.00 గం॥లు
4. బిడ్ ఓపనింగ్ తేది : 11.03.2026, సాయంత్రం 05.11 గం॥లు

తదుపరి వివరములు https://tender.apeprocurement.gov.in/ 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

సం//- శ్రీ బి.బాలాజీ నాయక్,
కమిషనరు, నగరి పురపాలక సంఘం

తొమ్మిదికి పది పాఠాలు

■ ముందుగానే అభ్యసనం ■ 13 నుంచి బ్రిడ్జి కోర్సు ప్రారంభం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ సిద్ధమవుతోంది. కార్పొరేట్‌కు దీటుగా బ్రిడ్జి కోర్సు అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదువుతున్న వారికి వచ్చే నెల, మార్చి 13 నుంచి పదో తరగతి పాఠ్యాంశాలు బోధించనున్నారు.

పదో తరగతిలో ఆయా సబ్జెక్టులపై భయం పోగొ ట్టడానికి బ్రిడ్జి కోర్సు ఉపయోగపడుతుందని ఉపా ధ్యాయులు, విద్యావేత్తలు చెబుతున్నారు. గణితం, సైన్స్, హిందీ, ఇంగ్లిషు సబ్జెక్టుల్లో పట్టు సాధనకు ఉపయుక్తంగా ఉంటుంది. గణితంలో ఉత్తమ మార్కులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, సైన్స్‌లో ప్రాథమిక పాఠ్యాంశాల ద్వారా మంచి మార్కులు వచ్చేందుకు అవసరమైన పాఠాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు. పదో తరగతి పరీక్ష తీరు, పాత ప్రశ్న పత్రాలిచ్చి సమాధానాలు ఏలా రాయాలి? వ్యాకరణం, సూత్రాలపై పట్టు పెంచుకునే విధంగా మెలకువలు నేర్పేందుకు సంబంధిత ఉపా ధ్యాయులు అవగాహన కల్పిస్తారు.

మార్గదర్శకాలు ఇలా..

జిల్లాలో తొమ్మిదో తరగతిలో 16,315 మంది విద్యా ర్థులున్నారు. అందులో 8,055 మంది బాలురు, 8,260 మంది బాలికలు చదువుతున్నారు. పబ్లిక్ పరీక్షలకు ముందుగానే తర్ఫీదు పొందితే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ముందస్తుగా ఈ విద్యా సంవత్సరం నుంచి సరికొ త్తగా బోధించనున్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. వచ్చే నెల 13 నుంచి పదోతరగతి పాఠ్యాంశాలతో బ్రిడ్జి కోర్సును నెల రోజుల పాటు బోధిస్తారు.

విద్యార్థులకు ఉపయుక్తం

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బ్రిడ్జి కోర్సు అమలు చేయడం ద్వారా విద్యార్థులు సామర్థ్యం పెంచుకుంటారు. వేసవి సెలవుల్లో వారు చదువుకోవడానికి ఉపయోగపడుతుంది. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ముందుగానే గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వొచ్చు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

- రాజేంద్రప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి

మామిడి తోటలకు.. తేలికపాటి నీటి తడులివ్వండి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో మామిడి పంట సుమారు 1.30 లక్షల ఎకరాల్లో విస్తరించిందని జిల్లా ఉద్యాన శాఖ డీడీ రామాంజనేయులు తెలిపారు. ఈ ఏడాది అధిక శాతం ప్రాంతాల్లో విస్తా రంగా పూత రాగా..వాతావరణంలో మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో పూత రాలేదన్నారు. ముందస్తుగా పూత వచ్చిన తోటలు పిందె దశలో ఉన్నాయని చెప్పారు. పిందె పట్టి, పూత రాని తోట లకు సైతం ప్రస్తుతం తేలికపాటి నీటి తడులు ఇవ్వాలని రైతులకు సూచిం చారు. మామిడి తోటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలపై జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. నాణ్యమైన మామిడి దిగుబడులు, మంచి ధర దక్కేందుకు రైతులకు 50 శాతం రాయి తీపై రూ.4కోట్ల మామిడి కవర్లను అందజేయనున్నామన్నారు. కవర్లు కావాల్సిన రైతులు ఉద్యాన శాఖ అధికారులు, రైతుసేవా కేంద్రాల సహాయ కులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

వైద్యచికిత్సల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వైద్య చికిత్సల్లో నిర్లక్ష్యం వహిం చిన ఆసుపత్రులపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలకు ఆదేశించారు. ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థి జ్వరంతో రేణిగుంటలోని ఓ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వేసిన సూదిమందుతో చేయి వాచింది. తీరా హాస్టల్‌కు వెళ్లాక జ్వరం పెరగడంతో మళ్లీ అదే ఆసుపత్రికి వచ్చారు. మాత్రలు ఇచ్చి పెద్ద ఆసుపత్రికి వెళ్లమని చెప్పి వదిలేయడంతో సూది మందు వికటించి విద్యార్థి మృతి చెందినట్లు ఆరోపణలు రావడంతో ఘట నపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యశాఖను కలెక్టర్ ఆదేశించారు. నగరంలోని మరో కంటి ఆసుపత్రిలో ఇంజినీరుకు చేసిన కంటి వైద్యం వికటించినట్లు సీపీఎం నేతలు ఆరోపిస్తూ ధర్నా చేశారు. దీంతో రెండు కమిటీలతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

పెనుమూరు, న్యూస్‌టుడే: అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సాతంబాకం బస్టాపు వద్ద మంగళవారం చోటుచే సుకుందని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. వేలూరుకు చెందిన కుమార్(47)కు సాతంబాకం గ్రామానికి చెందిన మహిళతో వివాహమైంది. రెండు రోజుల కిందట భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవ కారణంగా కుమార్ అత్తగారి గ్రామం సాతంబాకం వచ్చారు. అప్పటినుంచి రోజూ మద్యం తాగేవాడు. సోమవారం రాత్రి కూడా పూటుగా మద్యం తాగాడు. ఆ సమయంలో ఫిట్స్ రావడంతో అక్కడే పడిపోయాడు. అతనితో పాటు ఉన్న బంధువులు కూడ మద్యం మత్తులో అక్కడే పడుకున్నారు. మంగ ళవారం ఉదయం చూడగా కుమార్ మరణించినట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు మార్చి 15 వరకు గడువు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు మార్చి 15 వరకు గడువు పొడిగించినట్లు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పేర్కొ న్నారు. మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల పంచాయతీ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో రూ.27.41 కోట్లు పన్నుల వసూలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 68 శాతం రూ.18.63 కోట్లు వసూలు చేసినట్లు డీపీవో సుధాకర్‌రావు వివరించారు. గడువులోపు లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసు కుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మార్చి 9న ఓటర్ల జాబితా..

మార్చి 9న ఓటర్ల జాబితా, అనంతరం పంచాయతీ ఎన్నికలపై డీపీవో సుధాకర్‌రావు డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. మార్చి 9న ఓటర్ల జాబి తాను ప్రదర్శించాలని, అందుకు అవసరమైన అంశాలపై ఇది వరకే సిబ్బందికి శిక్షణ ఇచ్చి నట్లు గుర్తు చేశారు. ఈఆర్ఎంఎస్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. శాస నసభ ఓటర్ల జాబితా 2025 జనవరి 1 నుంచి 2026 ఫిబ్రవరి 5వ తేదీ వరకు అప్‌డేట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. హార్డ్ కాపీలను డిప్యూటీ ఎంపీడీవోలకు అంద జేయాలని కార్యదర్శులు తమ పంచాయతీకి సంబంధించిన ఓటర్లను పరిశీలించాలన్నారు.

సీజ్ చేసినవి భద్రపరచాలి

చిత్తూరు కలెక్టరేట్: ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన మాదకద్రవ్యాలను సురక్షితంగా భద్రపరచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పాత కలెక్టరేట్ ఆవర ణలో సీజ్ చేసిన వస్తువుల్ని భద్రపరిచేందుకు సిద్ధం చేసిన భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, శుభ్రత, అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై మాట్లాడారు. డీఆర్వో మోహన్‌కుమార్, ర.భ.శాఖ ఈఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేణిగుంటలో అంతర్రాష్ట్ర దొంగ..

స్వాధీనం చేసుకున్న బంగారం, నిందితుడిని చూపుతున్న పోలీసులు

రేణిగుంట, న్యూస్‌టుడే: పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి, రూ.14 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆయన కేసు వివరాలు వెల్ల డించారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా వంగత్తూరుకు చెందిన ప్రభాకరన్ దొంగ. గతంలో ఇతన్ని మూడుచోట్ల అరెస్టు చేశారు. జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి చోరీలకు పాల్పడేవాడని తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక వేణుగోపాలపురం క్రాస్ వద్ద సీఐ జయచంద్ర, ఎస్సై ధర్మారెడ్డి, సిబ్బందితో కలిసి ప్రభాకరన్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి 97 గ్రాముల బంగారం, 110 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారని డీఎస్పీ తెలిపారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

AP-40-AU-9502 New Maruti Nexa Fronx Alpha - 2023 Model Vehicle for Sale. Sundaram Finance LTD, TPT. ✆ 9490166247, 9440909784.

FINANCIAL SERVICES

WANTED

Need Finance/loan for apartment project in tirupati work in progress Rs. 20 to 50 Lakhs. ✆ 9963029295

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు AB AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

JOBS

JOB OPENINGS at Unit Run Canteen NCC Tirupati. For more information. ✆ 83280 15125.

WANTED CHEMIST: (Male/ Female) B.Sc., Chemistry/ B.Pharmacy M/s Coastal Laboratories, Akkampeta Post, Tada M. Ph: 70133 32427 E Mail: info@coastal-labs.com

అడ్మినిస్ట్రేటివ్ పర్సన్స్ కావలెను. Qly: డిగ్రీ/ MBA అనుభవం, ఉత్సాహవంతులైన వారు తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు. ఆకర్షణీయమైన జీతం. ✆ 9703402722

ఆటో డ్రైవర్ కావలెను. అనుభవం, లైసెన్స్ కలిగి ఉండవలెను. (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722

SECURITY GUARDS

ప్రముఖ బ్యాంకులలో పని చేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21 to 45, అర్హత: 10th. PF+ ESI కలదు. ✆ 96522 40528, 97049 64931, 94918 84025.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పం దించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అత నిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

●చిత్తూరు ● పూతలపట్టు ●గంగాధరనెల్లూరు ●నగరి

పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రామక్కమ్మ ఉత్సవం

విజయపురం, న్యూస్‌టుడే: మండలంలోని కోసల నగరం మిట్టూరు రామక్కమ్మ ఆలయంలో మంగళవారం ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

గుడిపాల, న్యూస్‌టుడే: మండల ఎంపీపీ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభివృద్ధి పనులకు, నిధులు కేటాయింపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఈ నెల 17న జరిగిన జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా ఎంత మంది పిల్లలకు మాత్రలు వేశారు. అందులో మాత్రలు మింగని, పాఠశాలలకు హాజరు కాని, అనారోగ్యానికి గురైన పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిరీష, డిప్యూటీ ఎంపీడీవో భాస్కర్ నాయుడు, సీహెచ్‌వో సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు విజయ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాల ప్రైవేటుపరం తగదు

పుత్తూరు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పుత్తూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వాలనే ఆలోచనను విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ జోనల్ కమిటీ సభ్యుడు ఆర్ముగం పేర్కొన్నారు. పుత్తూరు ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం ఆ మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో 12 డిపోలను ఖాళీ చేయించి ఫినాకిల్ అనే ప్రైవేటు సంస్థకు అప్పజెప్పి, ఉద్యోగులను, బస్సులను ఇతర డిపోలకు తరలించాలని మేనేజ్‌మెంట్, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. కార్యక్రమంలో పుత్తూరు డిపో అధ్యక్షుడు సుందరం, తిరుపతి జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్‌కుమార్, డిపో కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాగితీగ దొంగల పనిపట్టేదెవ్వరు..?

★ పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపురం, పాతపల్లూరు, కొత్త పల్లూరు తదితర గ్రామాల్లో ఇటీవల 30 స్టార్టర్లు పగులగొట్టి అందులోని కాపర్ తీగను తీసుకెళ్లారు. ఒక్కో స్టార్టర్‌లోని రాగి వైరు విలువ రూ.2వేలు మాత్రమే. అదే ఆ స్టార్టర్ రైతు కొనుగోలు చేయాలంటే రూ.10వేల నుంచి రూ.15వేలు అవుతుంది. ఇలా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో చోరీలు జరుగుతుండటంతో రైతులు నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారు.

పుత్తూరులో నియంత్రికను పగులగొట్టి రాగి వైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగ వద్దకు వెళ్లాలంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. అలాంటిది అందులోని కొద్దిపాటి రాగి తీగ కోసం పరివర్తకాన్నే ధ్వంసం చేస్తున్నారు. పుత్తూరు విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, కేవీబీపురం, పిచ్చాటూరు. నాగలాపురం, చెరివి, సత్యవేడు, వరదయ్యపాళెంలలో ఇలాంటి చోరీలు నిత్యకృత్యంగా మారాయి. ఫలితంగా పంటలు సాగు చేసిన రైతుల అవస్థలు వర్ణనాతీతం. కొంతకాలంగా పుత్తూరు, కేవీబీపురం, నాగలాపురం, సత్యవేడు వంటి ప్రాంతాల్లో ఈ ముఠా ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. దీనికి పోలీసులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా మూడు, నాలుగు, ఐదు మోటార్లు కలిసి సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ నియంత్రికలు ఏర్పాటు చేసింది. గతంలో అయితే గ్రామాల వద్ద పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేవారు. దీనికి స్వస్తి చెప్పి ప్రత్యేకంగా అక్కడక్కడ ఏర్పాటు చేశారు. ఇవన్నీ కూడా పంట పొలాల్లో ఏర్పాటు చేశారు. ఇవి దుండగులకు వరంలా మారాయి. సింగిల్ ఫేజ్ నియంత్రిక రూ.65వేలు కాగా, త్రీఫేజ్ నియంత్రిక ఖరీదు రూ.2లక్షల వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 30 నియంత్రికలను దుండగులు పగులగొట్టి అందులోని వైర్లను తీసుకెళ్లారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

చేతి చమురు వదులుతోంది..

చోరీ అయిన స్థానంలో కొత్త నియంత్రిక ఏర్పాటు చేయాలంటే రైతులకు చేతి చమురు వదులుతోంది. నియంత్రిక చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశాక కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్తుశాఖ వాహనంలో తరలించి ఏర్పాటు చేయాలి. ఇది ఎక్కడా అమలు కావడంలేదు. రైతులే ట్రాక్టర్లు తీసుకొచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఒక్కో సమయంలో ఎఫ్ఐఆర్ ఇవ్వడం ఆలస్యం అయితే పంటలు ఎండిపోయిన ఘటనలు గతంలో ఉన్నాయి.

ఇబ్బంది లేకుండా చూస్తాం

విద్యుత్తు నియంత్రికలు చోరీ జరిగిన సమయంలో రైతులకు ఇబ్బంది లేకుండా నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్ఐఆర్ అయిన వెంటనే నియంత్రికలు ఏర్పాటు చేసి పంటలు ఎండకుండా చర్యలు చేపడుతున్నాం. రైతులు కూడా అప్రమత్తంగా ఉండి సమాచారం పోలీసులకు, తమకు తెలపాలి. చోరీల అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- దేవ ఆశీర్వాదం, విద్యుత్తుశాఖ ఈఈ, పుత్తూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే:

సమస్య : స్థానిక నీవానది వేల్కూరు శ్మశాన వాటికలో రాత్రివేళల్లో అక్రమార్కులు చేపడుతున్న ఇసుక తవ్వకాలను అరికట్టాలి. **- బాబు**

సమాధానం: సిబ్బందిని పంపి ఇసుక తవ్వకాలను నివారిస్తాం. **- శ్రీనివాసులు, తహసీల్దారు, జీడీనెల్లూరు**

తవణంపల్లె, న్యూస్‌టుడే:

సమస్య: పత్రపల్లిలోని కొన్ని వీధుల్లో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

సమాధానం: పంచాయతీ పరిధిలోని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **- హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో**

పునాదులకు గ్రావెల్

స్పందనకు వందనం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రి ఆవరణలో రూ.30 లక్షలతో హోమియో వైద్యశాల నిర్మాణ పనుల్లో 'పర్యవేక్షణ లేక నాణ్యతా లోపం' అనే శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 22న వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పాత మట్టిని తొలగించి పునాదులకు గ్రావెల్ తరలించి పనుల్లో నాణ్యత పెంచారు.

మాంసపు దుకాణాలకు నోటీసులు

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: స్థానిక నీవానదిలో మాంసపు వ్యర్థాలను పడేయడంతో సమస్యపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో మనోహర్ గౌడ్ మాంసపు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు.

విద్యుత్తు స్తంభాల పరిశీలన

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని గుంటూరు వాండ్లఊరులో దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలను లైన్‌మ్యాన్ రాజేంద్రరెడ్డి మంగళవారం పరిశీలించారు. 'ఈనాడు'లో 'ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభాలు' అన్న శీర్షికన సమస్యపై వార్త రావడంతో అధికారులు స్పందించారు.

మార్పునకు మేం సిద్ధమే

నగరి, న్యూస్‌టుడే: భూగర్భ జలాల కలుషితానికి కారణమైన రంగు నీటి రసాయనాల వ్యర్థాలను ఇకపై మురుగు కాలువలో వదలమని మార్పునకు మేము సహకరిస్తామని డైయింగ్ యూనిట్ల యజమానులు తెలిపినట్లు కమిషనర్ బాలాజీ నాయక్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డైయింగ్ యూనిట్ల నిర్వాహకులు రంగు నీటి వ్యర్థాలను నది, కాలువల్లో వదలడం సరికాదన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని ఆయన సూచించారు. అందుకు వారు స్పందిస్తూ 15 రోజుల్లో పూర్తిస్థాయిలో మార్పు తీసుకొస్తామని... ప్రజా ఆరోగ్యం దృష్ట్యా మేం కూడా సహకరిస్తామని తెలిపారు.

భాస్కర్‌రాజు సేవలు మరువలేనివి

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరులో విశ్రాంత ఉద్యోగుల భవనం కోసం దివంగత భాస్కర్‌రాజు అహర్నిశలు కృషి చేశారని విశ్రాంత డీఈవో శేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం భాస్కర్‌రాజు ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు కృపావరమ్మ అందించిన భాస్కర్‌రాజు చిత్రపటాన్ని కార్యాలయంలో ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏలుమలై, నాయకులు యుగంధరరాజు, రవిశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

తవణంపల్లె, న్యూస్‌టుడే: ఏపీని బాల్యవివాహ రహిత రాష్ట్రంగా మార్చాలని సీడీపీవో నిర్మల కోరారు. యాదిపల్లె గ్రామంలో డ్వాక్రా సంఘం సభ్యుల వీవో సమావేశంలో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వృథా బాటిల్లే.. పంటకు రక్ష

పెనుమూరు మండలం సోమనందాపురంలో ఓ రైతు సాగు చేస్తున్న వరి పంటను కాపాడుకోవటానికి వృథా బాటిళ్లను పంటను రక్షగా వినియోగిస్తున్నారు. గాలికి బాటిళ్ల నుంచి శబ్దాలు రావడంతో పొలంలోకి పక్షులు, జంతువులు రాకుండా ఉంటాయని రైతు చెబుతున్నారు. **- ఈనాడు, చిత్తూరు**

వేగంగా కాలువ నిర్మాణం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలోని బంగారుపాళ్యంలో మురుగుకాలువ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దశాబ్ద కాలంగా కాలువ వసతి లేకపోవడంతో వర్షం పడిన సమయంలో జాతీయ రహదారిపై భారీగా నీరు నిలిచేది. బంగారుపాళ్యం సర్పంచి ఉమాదేవి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. స్థానిక పోస్టాఫీసు వీధి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు రూ.5 లక్షలతో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు.

పోయేది.. ప్రభుత్వ సొమ్మేగా..!

మండలంలోని నారగళ్లు ఎస్సీ కాలనీలో భూములు లేని 42 మంది పేదలకు కాలనీ సమీపంలో సీఎల్‌డీపీ పథకం కింద ఒక్కొక్కరికి ఒకటిన్నర ఎకరా చొప్పున సుమారు ఇరవై సంవత్సరాల కిందట లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. భూములకు నీటి వసతి కల్పించేందుకు బోరు వేసి అందులో మోటారు అమర్చారు. విద్యుత్తు కనెక్షన్ కోసం సమీపంలో నియంత్రిక, స్టాటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే అధికారులు భూమిని చదును చేసి ఇవ్వకపోవడంతో నియంత్రిక తుప్పు పడుతోంది. స్టాటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, గుడిపాల**

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. పుత్తూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రెండో రోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు.

పుత్తూరు: రిలేదీక్ష చేపట్టిన అంగన్‌వాడీలు

తెలుగు సంస్కృతి ప్రాచీనమైనది

వాలంటీర్లకు కిట్ అందిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలుగు సంస్కృతి ప్రాచీనమైనదని మై భారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. చిత్తూరులోని జిల్లా శిక్షణ కేంద్రంలో అంతర్రాష్ట్ర యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. తమిళనాడులోని కడలూరు, తిరువళ్లూరు జిల్లాలకు చెందిన 37 మంది మై భారత్ వాలంటీర్లు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణలో జిల్లా ప్రత్యేకతలు, చారిత్రక అంశాలు, ఆలయాలు, ప్రకృతి సంపద తదితరాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, బాబురెడ్డి, శ్రీనివాసులునాయుడు, రాజకుమారి, హరీష్, నిత్యానందం పాల్గొన్నారు.

కుటుంబానికి ఆర్థికసాయం

చిత్తూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ.. మంచానికే పరిమితమైన తన భర్త సుబ్రహ్మణ్యం పింఛను మంజూరు చేసి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని తమిళనాడులో అగరంపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన లోకేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మంగళవారం ఆమె మాట్లాడారు. స్పందించిన సామాజిక సేవకుడు పార్తిసారథి తనవంతు సాయంగా రూ.10వేలు అందించారు.

అండర్-18 సైక్లింగ్ జట్ల ఎంపిక

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: ఖో లీగ్‌లో భాగంగా అండర్-18 సైక్లింగ్ పోటీలు మంగళవారం చిత్తూరులోని మెసానికల్ మైదానంలో జరిగాయి. మెసానికల్ మైదానం నుంచి పీవీకేఎన్ కళాశాల వరకు, అక్కడి నుంచి మెసానికల్ మైదానం వరకు సైక్లింగ్ రేస్ నిర్వహించారు. అబ్బాయిల విభాగంలో ప్రైత్వ, షేక్ హుస్సేన్‌షా, జాన్‌బాబ్, మేఘనాదన్, శ్రీసాయిబాలాజీ, దనుష్, యశ్వంత్, దీరజ్, అమ్మాయిల విభాగంలో బీనాజ్ఞా, హరిత, బింధు త్వరలో ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని డీఎస్‌డీవో ఉదయభాస్కర్ తెలిపారు. పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఎంపికైన ఆటగాళ్లతో అధికారులు

పరస్పర అవగాహన అవసరం

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పరమైన కార్యక్రమాలు చేపట్టే సమయంలో అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం, కార్యక్రమ నిర్వహణపై పరస్పర అవగాహన అవసరమని ఎంపీపీ నాగరాజ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ నాగరాజ్ అధ్యక్షతన ఎంపీడీవో పురుషోత్తం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వపరమైన కార్యక్రమాల వివరాలను స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులకు తెలపాలన్నారు. దేవరగుడిపల్లె సర్పంచి ఆశీర్వాదం మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు రేషన్ కార్డుల్లో వివరాల నమోదు కోసం రెవెన్యూ యంత్రాంగం అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన తహసీల్దారు బాబు మాట్లాడుతూ.. ఎవరికైనా ఆధార్ తప్పనిసరని, ఆధార్ నమోదు చేయించిన తర్వాత రేషన్ కార్డుల్లో చేర్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల సింగిల్ విండో ఛైర్మన్ సుబ్రహ్మణ్యంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

యువత మాత్రమే డ్రగ్స్‌ను కట్టడి చేయగలదు

పాలసముద్రం, న్యూస్‌టుడే: సమాజంలో మాదకద్రవ్యాలను పూర్తిగా కట్టడి చేయడం ఒక్క యువతతోనే సాధ్యమవుతుందని ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బలిజకండ్రిగ జడ్పీ హైస్కూల్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులతో సే నో టు డ్రగ్స్ అక్షరాల ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రవి, ప్రధానోపాధ్యాయురాలు హరిత, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సే నో టూ డ్రగ్స్ అక్షర ఆకారంలో కూర్చున్న విద్యార్థులు, పోలీసులు

ఇంటర్ పరీక్షల తనిఖీ

కార్వేటినగరం, వెదురుకుప్పం : కార్వేటినగరం, వెదురుకుప్పంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను నగరి డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట సీఐ హనుమంతప్ప ఎస్సై తేజస్విని, పరీక్షల పర్యవేక్షకులు స్వరూప ఉన్నారు.

జయలలిత జయంతి

నగరి: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా నగరిలో ఏఐఏడీఎంకే నాయకులు అన్నదానం చేశారు. చింతలపట్టడలో ఎంజీఆర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు.

పరుగు పందెంలో ఎమ్మెల్యే ప్రతిభ

విజయచిహ్నాం చూపుతున్న ఎమ్మెల్యే థామస్

పెనుమూరు, న్యూస్‌టుడే: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ మైదానంలో మంగళవారం నిర్వహించిన శాసనసభ్యుల క్రీడల్లో జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ సత్తా చాటారు. వంద మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన ఆయనను పలువురు అభినందించారు.

దేశమ్మను దర్శించుకున్న మంత్రి కుటుంబసభ్యులు

నగరి, న్యూస్‌టుడే: మంత్రి పయ్యావుల కేశవ్ కుటుంబసభ్యులు నగరిలో దేశమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వారికి తీర్థప్రసాదాలు అందించారు.

ఆలయ ఆవరణలో మంత్రి పయ్యావుల కేశవ్ కుటుంబసభ్యులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

నగరి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో లారీ డ్రైవర్ వాహనాన్ని నడపటంతో కారుని ఢీకొన్న ఘటన తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో రామాపురం వద్ద సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. చెన్నై నుంచి తిరుమల వెళ్తున్న కారును వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన సిమెంట్ లారీ ఢీకొంది. ప్రమాదంలో కారులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కారును ఢీకొట్టిన లారీ

నింద్ర, న్యూస్‌టుడే: కారును లారీ ఢీకొనడంతో అదృష్టవశాత్తు ఎలాంటి గాయం లేకుండా ఓ కుటుంబం ప్రమాదం నుంచి బయటపడింది. ఈ ఘటన నింద్ర మండల పరిధిలోని నేటమ్స్ షుగర్స్ కూడలి వద్ద చెన్నై-కడప జాతీయ రహదారిలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఊత్తుకోటకు చెందిన బాన్సిలాల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి తిరుపతికి వచ్చి తిరిగి వెళ్తుండగా.. కర్నూలు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం స్వాధీనం.. కేసు నమోదు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని పాలేరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.

'ఇంటి స్థలం కబ్జా చేస్తున్నారు'

యాదమరి, న్యూస్‌టుడే: తమ ఇంటి స్థలాన్ని కబ్జా చేయాలని కొందరు యత్నిస్తున్నారని కె.కొత్తూరుకు చెందిన పి.కోమల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. తన మామ(భర్త తండ్రి) వరదరాజులునాయుడు 1988లో ఇంటి స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టగా గ్రామానికి చెందిన గంగయ్య కుటుంబసభ్యులు తమపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

ఉత్సవాలు అధికారికంగా చేపట్టాలి

వడమాలపేట, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయలు జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని తహసీల్దార్ జరీనాకు బలిజ సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకుడు గోపిరాయల్, నాయకులు గణపతి, శివరాయల్, అంజయ్య, పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే నాణ్యమైన దిగుబడి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: సస్యరక్షణతోనే మామిడిలో నాణ్యమైన దిగుబడి సాధ్యమని మండల ఉద్యాన శాఖాధికారిణి సాగరిక తెలిపారు. మండలంలోని నల్లగాంపల్లె సచివాలయంలో మంగళవారం మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి పూత, పిందె దశలో సోకే తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రకృతి వ్యవసాయాధికారిణి అంబికాగాంధీ, తెదేపా మండల కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT JUDGE, CHITTOOR

E.P.No. 117 / 2024
Arb. No. 54 / 2023

Between:
M/s. Shriram Finance Ltd., Chittoor Branch
rep., by its S.P.A. Holder ..... Decree Holder
And:
1. R. Srinivasulu, 2. V. Usttar 3. K. Amudha ..... Judgment debtors

PROCLAMATION & SALE U/o. XXI RULE 66 & 67 OF C.P.C

That the above E.P. is filed by the D.Hr against the J.Dr.No.3 viz., K. Amudha, W/oK. Rajendra residing at D.No: 1-473 , Janapa Street , Kaliyamman Koil Street , Kattamanchi, Chittoor -517001 for attachment and sale of the schedule mentioned immovable propertydescribed hereunder towards realization of the amount payable by the above named J.Drs to the D.Hr company and the Hon'ble court directed for sale of schedule mentionedimmovable property in Public Auction on **17-03-2026.** So, it is informed that the interestedbidders/purchasers may participate in the auction sale to be conducted by the above said Hon'ble court on the above said date.

SCHEDULE

Andhra Pradesh - Chittoor District – Chittoor Sub - District – Chittoor Municipal Corporation – No. 76 – Kattamanchi Village Revenue Accounts – Gramakantam Survey No 221-1, Sub Divided as 221 – 1C, Kattamanchi Gandla Street (Janapa Street) Municipal D. No. 1-473, Thorse House R.C.C Moulding House, House vacant site within the following boundaries :
East : 4 ft. common passage; West : Site belongs to C. Ranganatham ; North : Sandhu Veedhi; South : Kaliyamma Temple;
East to west 29.5 feets or 8.899 meters, North to south 49.5 feet or 15.098 metersadmeasuring 1460.25 sq.ft or 162.25 sq.yds, in the above land constructed area east to west29.5 ft., North to south 32 ft. admeasuring 944sq.ft with thorse house ad fitted doors,doorframes, almirah, windows, floor, electric wiring, including roof.
And constructed R.C.C. Molded house, in the above area of east to west 29.5 ft. north to south 17.5 ft. admeasuring 516.25 sq.ft fitted to doors, door frames, almirah, window, floor electric wiring, including roof, electric service connection service No. 1569, municipal assessment No.1008002178.

Note:
1) The E.P Schedule Property is valued at Rs.3,00,000/- (Decree Holder Value)
2) Amin Value :- 30,00,000 /-
3) Market Value :- 3,00,000 /-

Auction Date : **17-03-2026,Time: 10:30 A.M. onwards**
Place: **Hon'ble IX Addl. District Judge's Court, Chittoor**
(By Order of the Court)

K.C. KISHOR KUMAR,B.Com.,L.L.B.,**Advocates for Decree Holder**

మురుగు కాలువలు మెరుగుపడేది ఎప్పటికో..?

నగరి, న్యూస్‌టుడే: పంచాయతీలు కలిసి మున్సిపాలిటీగా ఏర్పడి నేటికి 21 సంవత్సరాలు గడిచినా.. మురుగు కాలువల ఆధునీకరణ కనిపించని పరిస్థితి నగరిలో నెలకొంది. పట్టణం విస్తరించినా, కొత్త కాలనీలు ఏర్పడినా అధికారులు మాత్రం కనీస వసతులు సమకూర్చడం లేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. కాలువలు ఉన్నా అవి పంచాయతీ కాలం నాటివి కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి.

వారానికి ఒకరోజు మాత్రమే..

నగరిలో 29 వార్డులుంటే, అందులో 16 పేదల వాడలున్నాయి. ఈ వాడల్లో పారిశుద్ధ్య చర్యలు వారానికి ఒకరోజు మాత్రమే. ఇక కాలువల్లో పూడికతీత పనులు నెలలో ఒకరోజు మాత్రమే చేస్తున్నారు. దీంతో మురుగు సక్రమంగా పారక రోడ్డుపై నిల్వ ఉంటోంది. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవగాహన కల్పించే అధికారులు మురుగునీరు ఊరి బయటకు తరలించే మార్గాలు చూపకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నాలుగు నెలల ముందు ఎమ్మెల్యే భానుప్రకాష్ కాలువల ఆధునీకరణకు ప్రత్యేకంగా తుడా నుంచి రూ.3కోట్లు నిధులు మంజూరు చేయించారు. వివిధ కారణాలతో పాలకవర్గం రెండు సమావేశాల్లో ఆమోదం తెలపకపోవడంతో ఆ నిధుల వినియోగంలో జాప్యం జరుగుతోంది.

పళ్లిపట్టు రోడ్డులో కాలువ దుస్థితి

పనులు ప్రారంభించాం

ఇటీవల బీపీఎస్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు ప్రారంభించాం. అందులో మురుగు కాలువలు కూడా నిర్మించనున్నాం. తుడా నిధులకు సంబంధించి ప్రతిపాదనలు పంపిచాం. త్వరలో కాలువలను ఆధునికీకరిస్తాం.

- బాలాజీ నాయక్, కమిషనర్, నగరి

కరెంటోళ్ల జనబాట

నగరి, న్యూస్‌టుడే: నాణ్యమైన విద్యుత్తు సరఫరా కోసం ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో కరెంటోళ్ల జనబాట చేపట్టినట్లు నగరి విద్యుత్తు సబ్ డివిజన్ డీఈ ప్రభాకర్ తెలిపారు. కీళ్లపట్టు బీసీ కాలనీలో మంగళవారం కరంటోళ్ల జనబాటలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రజలను అడిగి విద్యుత్తు సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఏఈ బాలసుబ్రహ్మణ్యం, విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కీళ్లపట్టు బీసీకాలనీలో అవగాహన కల్పిస్తున్న డీఈ ప్రభాకర్

నియామక పత్రాల అందజేత

నియామక ప్రతులు అందుకున్న నాయకులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ఐకమత్యంతో పనిచేసి సమస్యలు పరిష్కరించుకోవాలని చిత్తూరు నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మురళి తెలిపారు. స్థానిక కొంగారెడ్డిపల్లెలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంఘంలో నూతనంగా ఎన్నికైన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. నాయకులు ధనశేఖర్, అశోక్, మేఘనాథ్, కార్తీక్, బాలగురునాదం పాల్గొన్నారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

గుడిపాల, న్యూస్‌టుడే: మండల ఎంపీపీ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభివృద్ధి పనులకు, నిధులు కేటాయింపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఈ నెల 17న జరిగిన జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా ఎంత మంది పిల్లలకు మాత్రలు వేశారు. అందులో మాత్రలు మింగని, పాఠశాలలకు హాజరు కాని, అనారోగ్యానికి గురైన పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిరీష, డిప్యూటీ ఎంపీడీవో భాస్కర్ నాయుడు, సీహెచ్‌వో సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు విజయ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పలమనేరు, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సీడీపీవో ఉమారాణి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త-2, సహాయకురాలి పోస్టులు-58 ఖాళీ ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై స్థానికంగా నివాసం ఉండే అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మార్చి 7లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అతిథి అధ్యాపకులకు..

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని మల్లానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్, జువాలజీ, కెమిస్ట్రీ, గణితం సబ్జెక్టులను బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రామక్రిష్ణ చౌదరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి సీజీఎం కృష్ణారెడ్డి, చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తదితరులు

నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడమే లక్ష్యం

పలమనేరు: వ్యవసాయ, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడమే లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ కృషి చేస్తోందని తిరుపతి సీజీఎం కృష్ణారెడ్డి పేర్కొన్నారు. 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంగవరం, పలమనేరు గ్రామీణ మండలాలలోని ముసలిమడుగు, జల్లిపేట, బొమ్మిదొడ్డి, బేరుపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. బేరుపల్లెలో 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛార్జింగ్ చేశారు. లోవోల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. గంగవరంలో శిథిలావస్థలోని విద్యుత్ స్తంభాలు, ఒరిగిపోయిన, తక్కువ ఎత్తులోని తీగలను సరిచేయాలని అన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు త్వరగా మంజూరు చేయాలని రైతులు కోరారు. ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తి, పలమనేరు డీఈఈ జీవన్‌కుమార్, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఎర్ర బ్యాడ్జీలతో ధర్నా

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. డిపో అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి జయపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 129 డిపోలలో 12 డిపోల ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు కంపెనీకి ఇవ్వాలనే విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు వారితో కాకుండా ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలన్నారు. తక్షణమే కండక్టర్, డ్రైవర్, మెకానిక్‌లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మొరళీశ్వర్, సుభాన్, రమణ, ఖలీల్, బాలకృష్ణ, ఎల్లస్వామి, రామచంద్ర, నాయక్ పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే నాణ్యమైన దిగుబడి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: సస్యరక్షణతోనే మామిడిలో నాణ్యమైన దిగుబడి సాధ్యమని మండల ఉద్యాన శాఖాధికారిణి సాగరిక తెలిపారు. మండలంలోని నల్లగాంపల్లె సచివాలయంలో మంగళవారం మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి పూత, పిందె దశలో సోకే తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రకృతి వ్యవసాయాధికారిణి అంబికాగాంధీ, తెదేపా మండల కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు.. ఆదర్శ పాఠశాల

6 నుంచి ఇంటర్ వరకూ ఉచిత విద్య

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు నిత్యం విలువలతో కూడిన నాణ్యమైన విద్యా బోధనే లక్ష్యం. తల్లిదండ్రులకు ఎలాంటి ఫీజుల భారం లేకుండా కార్పొరేట్‌కు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో మెరుగైన విద్యా బోధన ఆదర్శ పాఠశాల ప్రత్యేకత. 6వ తరగతిలో చేరితే ఇంటర్ వరకూ ఏడేళ్లు ఉచిత విద్యను అభ్యసించవచ్చు. ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, బాలికలకు వసతి గృహ సదుపాయం, సువిశాల తరగతి గదులు, క్రీడా మైదానం, అధునాతన వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందాల చేత విద్యా బోధన ఆదర్శ బడి సొంతం. పరీక్షా ఫలితాల్లో ఆదర్శంగా నిలుస్తోంది.

ప్రవేశాలు ఇలా..

ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ప్రతి ఏటా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను ఎంపిక చేస్తారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన 80 మంది విద్యార్థులను 6వ తరగతిలో చేర్చుకుంటారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక చేస్తారు. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ

బైరెడ్డిపల్లెలోని ఆదర్శ పాఠశాల భవనం

గ్రూపులు ఉన్నాయి. ప్రతి గ్రూపులో 20 మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. మండల పరిధిలోని విద్యార్థులకే మొదటి ప్రాధాన్యం. సీట్లు భర్తీ కాకుండా ఖాళీ ఏర్పడితే ఇతర మండలాల విద్యార్థులకు అవకాశం ఉంటుంది. 2026- 2027 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు మార్చి 31వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీలు రూ. 125. బీసీ, ఓసీ విద్యార్థులు రూ. 200 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

బాలికలకు వసతి గృహ సదుపాయం

ఆదర్శ బడిలో బాలికలకు వసతి గృహ సదుపాయం కలదు. పాఠశాలలో 9, 10 తరగతులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే బాలికలకు కూడా అందుబాటులో ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 19 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. బైరెడ్డిపల్లెలో దాతల సహకారంతో సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటుతో విద్యార్థినులకు వేడినీటి సౌకర్యం కలదు.

అటల్‌టింకరింగ్ ల్యాబ్

కంప్యూటర్ ల్యాబ్, సైన్సు ల్యాబ్‌లతో పాటు అటల్‌టింకరింగ్ ల్యాబ్ కలదు. విద్యార్థుల ఆలోచన విధానంలో మార్పు తీసుకొచ్చి సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణల శ్రీకారానికీ ఈ ల్యాబ్ ఏర్పాటు చేశారు. రూ. 12 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఐదు ల్యాప్‌టాప్‌లు, ప్రొజెక్టరు, టెలిస్కోప్, త్రీడీ ప్రింటింగ్, పెయింటింగ్ తయారీ విధానాన్ని తెలిపే పరికరాలు, రోబోటిక్ పరికరాలు, నూతన ఆవిష్కరణలకు ఉపయోగపడే ఎన్నో అధునాతన పరికరాలను అందజేయడం జరిగింది.

ఇవీ ప్రత్యేకతలు..

- ✦ ఆదర్శ బడిలో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, గ్రంథాలయం
- ✦ 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలు
- ✦ అనుభవజ్ఞులైన అధ్యాపక బృందాల చేత బోధన, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ✦ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు ఉపకార వేతనాలు మంజూరు
- ✦ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రతి నెల తల్లిదండ్రులతో సమావేశం
- ✦ ఆటోమొబైల్, ఐటీ వంటి వృత్తి విద్యా కోర్సులు కలవు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు కూడలిలో తాగునీటి పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. - **తరుణ్, స్థానికుడు**

సమాధానం: మరమ్మతులు చేయించి, నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసరావు, కమిషనర్, కుప్పం పురపాలిక**

ల్యాబ్ ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ రవీంద్రబాబు

ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ ప్రారంభం

గంగవరం: స్థానిక మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను కరస్పాండెంట్ రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోగశాలతో కళాశాల విద్యార్థులకు, పలమనేరు పరిసర ప్రాంతాల్లో ఉన్న పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులకు, ఇతర కళాశాలల్లో చదివే అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రయోగశాలల ముఖ్య ఉద్దేశం విద్యార్థుల కొత్త విషయాలను కనుగొనడం, వాటిని అభివృద్ధి చేయడం, యువతలో కొత్త ఆలోచనలకు ప్రయోగశాల ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సునీల్, శాస్త్రవేత్త వెంకటరమణ, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై శ్రీనలగుండ్రాయస్వామి ఊరేగింపు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కడపనత్తంలో వెలసిన శ్రీనలగుండ్రాయ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారి ఊరేగింపు వేడుకగా జరిగింది. ఆలయంలో ఉదయం అర్చకులు రామకృష్ణమాచార్యులు స్వామివారికి సుప్రభాతసేవ, కలశారాధన హోమం, అభిషేకం, పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు జరిపారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఊరేగుతున్న శ్రీఅలివేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీనలగుండ్రాయ స్వామి ఉత్సవమూర్తులు

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహన సేవలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఉభయదారులు, అర్చకులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

కల్లూరు (మంగళంపేట), న్యూస్‌టుడే: మంగళంపేటలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. స్వామివారు హనుమంత, కల్పవృక్ష వాహనాలపై ఊరేగారు. మంగళంపేటకు చెందిన రామచంద్రయ్య, బండారువారిపల్లె కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు.

నులి పురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి నులి పురుగుల నిర్మూలన తప్పక చేపట్టాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి అన్నారు. కమ్మనపల్లె గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యోగా, ధ్యానం చేయడం వల్ల చదువుపై ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని సూచించారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సాయిదివ్య, స్టాఫ్‌నర్సు రాధాకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజుకు చేరింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరత్న, సరోజమ్మ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంతో ఆదాయం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: స్థానిక మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం నిర్వహించినట్లు పెద్దపంజాణి ఎస్సై మారెప్ప తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన 10 ద్విచక్ర వాహనాలు, కారును వేలం నిర్వహించగా.. 7 ద్విచక్ర వాహనాలను వేలం పాటలో తీసుకున్నారు. వేలం ద్వారా ప్రభుత్వానికి రూ. 1.52లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైనట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఉపాధ్యాయుడు వెంకటేశ్ రెండు నెలలుగా ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు చెప్పారు. మనస్తాపానికి గురైన బాలిక సోమవారం పశువులకు వినియోగించే మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను తిరుపతి రుయాలో చేర్చారు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నాలుగేళ్లుగా.. అసంపూర్తిగా..!

వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలోనే తొలిసారిగా ఇక్కడ సచివాలయ, రైతు సేవా కేంద్రం భవన పనులు చేపట్టారు. అయితే వీటిని పూర్తి చేయడంలో అప్పటి పాలకులు, అధికారులు విఫలమయ్యారు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు స్థానిక గ్రామపంచాయతీ భవనంలోనే సచివాలయ, రైతు సేవా కేంద్రం పాలనా వ్యవహారాలు సాగుతున్నాయి. రెండు కార్యాలయాలు ఒకే భవనంలో ఉండటంతో ఇటు ప్రజలు, అటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పెద్దపంజాణి

కాలువలు లేక.. తప్పని తిప్పలు

మండలంలోని తెట్టుమిట్టలో వీధిలో మురుగునీరు పారుతోంది. సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. అధికారులకు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకపోతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గంగవరం

పూర్తికాని వంతెనతో ప్రజల అగచాట్లు

చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రహదారిలో గోపాలపురం వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెనతో ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. ఇక్కడ రెండేళ్లుగా వంతెన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు కి.మీ దూరం చుట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. వెళ్లే మార్గంలో 30 అడుగులకు పైగా పల్లంలో దిగి ఎక్కాలంటే వాహన చోదకులు సైతం అవస్థలు పడాల్సి వస్తోంది. వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని 10 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె**

దివ్యాంగ భక్తులకు వెంకన్న దర్శనం

కుప్పం పట్టణం: చుక్కల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడు నడు వెంకటన్న కడపకు కార్యక్రమంలో భాగంగా కుప్పం నియోజకవర్గంలోని 40 మంది దివ్యాంగ భక్తులకు మంగళవారం దర్శనం కల్పించినట్లు తితిదే పాలకవర్గ సభ్యుడు శాంతారామ్ తెలిపారు. 40 మంది దివ్యాంగ భక్తులు, 20 మంది సేవా వాలంటీర్లు ఈ యాత్రలో పాల్గొన్నారన్నారు. ఈ 13వ యాత్రతో ఇప్పటి వరకు 2,969 మంది దివ్యాంగ భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు చెప్పారు. తమకు దర్శనం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు డా. వేణు, తితిదే సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులతో తితిదే పాలకవర్గ సభ్యుడు శాంతారామ్, చుక్కల ట్రస్టు స్థాపకుడు వేణు

ఘనంగా పశువుల పరస

రామకుప్పం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బందార్లపల్లి గడ్డూరులో మంగళవారం ఘనంగా పశువుల పరస నిర్వహించారు. కనుమ పండుగ పురస్కరించుకుని కుప్పం నియోజకవర్గంలో జరిగే పండగకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వీటిని చూసేందుకు కుప్పం, పలమనేరు నియోజకవర్గాలతో పాటు తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. రైతులు పశువులను తీసుకువచ్చి బరిలో పరిగెత్తించారు. తక్కువ సమయంలో పరుగెత్తిన పశువుకు రూ. 30 వేల మొదటి బహుమతిని అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని చలమంగళం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం 'పర్యావరణ పరిరక్షణ- మనందరి బాధ్యత' అనే అంశంపై విద్యార్థి ప్రగతి పథం సేవా సంస్థ నిర్వాహకులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న 30 మంది విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీపురం సీతారామయ్య ఛారిటబుల్ ట్రస్టు, గురుశిష్య సేవా సంఘం ప్రతినిధులు వీరభద్రగౌడు, చంద్రశేఖరయ్య, విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

సదుం, న్యూస్‌టుడే: సదుం నుంచి కందూరు, నిమ్మనపల్లె మీదుగా మదనపల్లె వెళ్లే ఆర్టీసీ బస్సు సదుం ప్రాథమిక పాఠశాల సమీపంలో మొరాయించింది. దీంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. ఆటోల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.

నియామక పత్రాల అందజేత

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ఐకమత్యంతో పనిచేసి సమస్యలు పరిష్కరించుకోవాలని చిత్తూరు నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మురళి తెలిపారు. స్థానిక కొంగారెడ్డిపల్లెలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంఘంలో నూతనంగా ఎన్నికైన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. నాయకులు ధనశేఖర్, అశోక్, మేఘనాథ్, కార్తీక్, బాలగురునాధం పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందుకున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన కొలమాసనపల్లెకు చెందిన హరి, ఎం.కోటూరుకు చెందిన లక్ష్మీపతిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత

కుప్పం పట్టణం (గుడుపల్లె), న్యూస్‌టుడే: గుడుపల్లె మహాత్మ జ్యోతిరావు పులె ఏపీ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైనట్లు ప్రిన్సిపల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఆరు గంటల్లో ఇద్దరు విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించినట్లు గ్రామీణ సర్కిల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా.. మాదనపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైనట్లు మంగళవారం ఉదయం 10 గంటలకు గుడుపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి ఆరు గంటల్లో అదృశ్యాన్ని చేధించి తల్లిదండ్రుల సమయంలో పాఠశాలకు అప్పగించినట్లు వివరించారు. రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలు ఇక్కడ.. చెరువు ఎక్కడ?

అసలే కరవు ప్రాంతం.. వరుణుడు కరుణించకుంటే చెరువులన్నీ నెర్రెలు బారడమే కాకుండా తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పదు. ఇలాంటి ప్రాంతానికి హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా కృష్ణమ్మ జలాలను నింపడంతో నేడు చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. అయితే కొందరు శిథిలమైన ఇంటిని తొలగించి, వ్యర్థాలను చెరువు కట్టలపై పారబోస్తున్నారు. దీని కారణంగా చెరువులు ఆక్రమణలకు గురవుతూ, తూములు పూడిపోయే స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ పూడికను తొలగించేందుకు అధికారులు రూ. లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కృష్ణగిరి-పలమనేరు జాతీయ రహదారిలోని కుప్పం బైపాసులో ఉన్న వరమలనాయుని చెరువు కట్టపై ఈ మధ్య కాలంలో శిథిల భవనాలను తొలగించిన వ్యర్థాలను పారబోస్తున్నారు. దీని కారణంగా చెరువు నిల్వలకు ప్రమాదం ఏర్పడతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయమై పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు వివరణ కోరగా, చెరువు కట్టలపై ఇంటి వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

వసతులు కల్పించరు.. సమస్యలు తీర్చరు



లే-అవుట్-2లో నిలిచిన నిర్మాణాలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా పాలనలో కుప్పం పురపాలిక పరిధిలో ఎనిమిది లే-అవుట్లను ఎంపిక చేసి.. ఆరు మాత్రమే కాలనీ ఇళ్లకు సిద్ధం చేసింది. అందులో నామమాత్రపు వసతులు కల్పించారు. చెరువు కట్ట సమీపంలో మంజూరు చేయడంతో కొంత మంది లబ్ధిదారులు మాత్రం ఇళ్లు నిర్మించుకొని అధిక సంఖ్యలో పనులు నిలిపేశారు. పునాదులకే పరిమితమైన ఇళ్లపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. మురుగు నీటి కాలువలు మరిచారు. కనీస రోడ్డు సౌకర్యం లేక గుంతలమైన మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా నిర్మించినా అవస్థల నడుమ జీవించాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు.

మంజూరు ఇలా..

ఆరు లే- అవుట్లకు 1,206 ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు 490 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి చేశారు. మిగిలిన ఇళ్లు మాత్రం పునాదులు, గోడలకు పరిమితమైంది. లక్ష్మీపురం గెర్చిబావి వద్ద ఉబ్బకుంట సమీపంలో ఉన్న లే-అవుట్‌లోకి చెరువులో నీరు ఉండటంతో అది మొత్తం చెమ్మచేరుతోంది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగనన్న లే-అవుట్-1 కాలనీలో అర్ధాంతరంగా నిలిచి ఇళ్లను చేతులు మార్చారు. ఇటీవల ఓ వ్యక్తిని హతమార్చి, పునాదుల్లో పూడ్చి పెట్టిన సంఘటనలో కాలనీ ఇళ్లంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది.

నీటి దాహార్తి తీరేదుందా?

నీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పలమనేరు, న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలోని ప్రధాన కూడళ్లల్లో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గతంలో పంచాయతీలు ఉన్నప్పుడు పబ్లిక్ ట్యాపులు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేవారు. ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గాలు ఈ సమస్యను పట్టించుకోక పోవడంతో ప్రధాన కూడళ్లలో తాగునీటి కోసం ప్రజలు డబ్బు పెట్టి అనారోగ్యాన్ని కొంటున్నామని వాపోతున్నారు.

నిబంధనలు పాటించకుండా..

ఇదే అదునుగా వ్యాపారులు నాసిరకం నీటిని నకిలీ కంపెనీల పేర్లతో బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. ఆ నీరు తాగటం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. పట్టణంలోని కొన్ని ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్లు ఏ మాత్రం నిబంధనలను పాటించకుండా కలుషిత నీటిని క్యాన్లలో సరఫరా చేస్తున్నారు. వారే దుకాణాలకు, హోటళ్లకు కూడా నీళ్ల క్యాన్లు ఇస్తుంటారు. ఆ నీరు ఏమాత్రం నాణ్యతగా ఉండటం లేదు. అధికారులు వీటిని అధిగమించడానికి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ప్రధాన కూడళ్లలో ప్రజల అవసరాలు తీరుతాయి.

ఎక్కడెక్కడంటే..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసరాల్లో ఒక ఆర్వో ప్లాంటు అవసరమవుతుందని గతంలో పాలకవర్గ సభ్యులు సూచించారు. అక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు కూడా ఉన్నాయి. ఇంకా ప్రైవేటు పాఠశాలలు కూడా ఉండటంతో నిత్యం వేలాది మంది విద్యార్థులు ఇక్కడ తిరుగుతుంటారు. వీరికి ఆర్వో ప్లాంటు ద్వారా మంచి నీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఉన్నా అది తరచూ మరమ్మతులకు గురవుతోంది.

వైకాపా హయాంలో..

గత వైకాపా హయాంలో సరఫరా చేసిన పరికరాలు నాసిరకం కావడంతో అవి ఉపయోగపడటం లేదు. విద్యార్థులకే కాకుండా ఆ ప్రాంతంలోని ప్రజలకు కూడా మేలు చేకూరడం లేదు. ఇంకా పట్టణంలోని కోర్టు పరిసరాల్లో నిత్యం నియోజకవర్గం పరిధిలోని ప్రజలే కాకుండా కుప్పం నుంచి కూడా కక్షిదారులు వస్తుంటారు. వారి కోసం అక్కడ ఒక ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ బస్టాండు సమీపంలో, మదనపల్లె రోడ్డు ప్రాంతంలో కూడా అవసరం ఉంది. ప్లాంట్లు ఏర్పాటు చేసే విషయంలో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతున్నామని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు.

(c) eenadu

చిన్నశేష వాహనంపై ఊరేగిన వెంకన్న

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్కు సమీపంలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని చిన్నశేష వాహనంపై ఊరేగించారు. అర్చకులు కమల్‌నాథ్ ఆధ్వర్యంలో సరస్వతి హోమాన్ని నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గోవిందమాలధారులు స్వామి, అమ్మవార్లను హంస వాహనంపై ఊరేగించారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌మీనా, ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పేర్కొన్నారు. ఎస్పీ రాహుల్‌మీనా మంగళవారం పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రోన్ల వినియోగం, 112 అత్యవసర సేవలు, ఇ-చలానా వసూళ్లు, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవందించాలని సూచించారు. జాతరలు, పండగల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. మార్చి 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ ప్రసాద్‌లు డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్, సుంకర మురళీకృష్ణ, రఘువీర్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, సీబీసీఐ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ క్లినిక్‌లతో భూ సమస్యలకు పరిష్కారం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన రెవెన్యూ క్లినిక్‌లు భూ సమస్యల పరిష్కారానికి దోహద పడుతున్నాయని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ సంబంధిత సమస్యలపై సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి వాటికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. వీటిలో మ్యుటేషన్లు, పేర్ల సవరణ వంటి వాటిని చేపడుతున్నట్లు తెలిపారు. జేసీ నిశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఆధునిక సాంకేతికత ద్వారా రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు.

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

గోల్‌మాల్.. గప్‌చుప్

మరుగుదొడ్ల నిధులు రూ.55.55 లక్షలు స్వాహాపై విచారణ ఎప్పుడో..?

న్యూస్‌టుడే, కాట్రేనికోన

కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీలోని బలుసుతిప్పలో స్వచ్ఛభారత్ మరుగుదొడ్ల నిధుల స్వాహాపై విచారణకు ముందడుగు పడటం లేదు. కంప్యూటర్ ఆపరేటర్ 55.55 లక్షలు పక్కదారి పట్టించిన విషయం 20 రోజుల క్రితం వెలుగు చేసింది. దీనిపై సంబంధిత అధికారులు నేటికీ కార్యాలయంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టకపోవడం చర్చాంశనీయంగా మారింది.

ఏం జరిగిందంటే..?

2014-19 మధ్య తెదేపా హయాంలో స్వచ్ఛభారత్(ఓడీఎఫ్)లో భాగంగా ఈ గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించారు. చాలామంది వీటి నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో 2018లో అప్పటి పంచాయతీ కార్యదర్శి రూ.57,27,083 పంచాయతీ ఖాతాకు జమాచేశారు. ఆ నిధుల్ని కంప్యూటర్ ఆపరేటర్ ఇసుకపట్ల నాగేంద్ర 2024- 2025 మధ్య పంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసి సుమారు రూ.55.55 లక్షలు నగదును 16 మంది ఖాతాల్లోకి మళ్లించాడు. బ్యాంకు స్టేట్‌మెంట్ ఆధారంగా పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన సంతకం ఫోర్జరీ చేసి నిధులు పక్కదారి పట్టించినందుకు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని నాటి కార్యదర్శి కాట్రేనికోన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై అవినాష్ తెలిపారు.

అప్పటి వాలంటీర్లకూ జగదు జమా

కంప్యూటర్ ఆపరేటర్ నాగేంద్ర నగదు జమ చేసిన వారిలో తిరుమాని గంగాద్రివర్మ, సంగాని ధనుంజయ గత వైకాపా హయాంలో గ్రామ వాలంటీర్లుగా పనిచేశారు. వీరిలో ఎక్కువ మంది వైకాపా మద్దతుదారులు ఉన్నారు. ఏయే పనుల విషయమై, ఏ అంగీకారంతో ఈ నగదు జమా చేశారో విచారణలో తేలాల్సి ఉంది. దీనిపై ఎంపీడీవో రాజేశ్వరరావును వివరణ కోరగా కార్యాలయంలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపడతామని తెలిపారు. ఇప్పటికే కేసు నమోదుచేశామని, నిధులు జమ జరిగిన వ్యక్తులను పిలిపించి విచారణ చేస్తామని ఎస్సై అవినాష్ తెలిపారు.

వీరికే నగదు మళ్లించారు	సొమ్ము (రూ. లక్షల్లో..)
చింతా వీరబాబు	23.15
తిరుమాని గంగాద్రి వర్మ	4.65
హరీంద్ర	4.50
నిమ్మితి నాగరాజు	0.75
మల్లాడి ఏడుకొండలు (ప్రస్తుత సర్పంచి)	3.75
నల్లా దివాకర్	3.00
ఓలేటి దుర్గారావు	2.25
నిమ్మతి మంగ	1.00
మల్లాడి ఆదినారాయణ	0.50
సంగాని ధనుంజయ	3.75
ఇసుకపట్ల శ్రీనివాస్	0.75
సంగాని సతీష్	0.75
సత్యనారాయణదేవ్	0.75
ఇసుకపట్ల నాగేంద్ర	4.50

ఉత్పత్తి కొంతే.. వినియోగం ఎంతో..

- అదే ఆసరాగా పాలలో కల్తీ
- తాగు నీటిదీ అదే పరిస్థితి

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

గతంలో పాలలో నీళ్లు కలపడం ఒక్కటే సమస్యగా ఉండేది. కొన్నాళ్లుగా పరిస్థితి మారింది. కల్తీ కొత్తరూపాలు ధరించి ప్రాణాలు తీస్తోంది. రాజమహేంద్రవరంలో పాలకల్తీ వల్ల పలువురు మృత్యువాత పడటంతో జిల్లా వ్యాప్తంగా అమ్మకాలు సాగిస్తున్న పాల నాణ్యతపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో తాగు నీటి పరిస్థితి సైతం ఇలాగే ఉంది.

పాలకు గిరాకీ పెరగడంతో..

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి మనిషికి రోజుకు 180 మిల్లీలీటర్ల పాలు అవసరం. జిల్లాలో సుమారు 20 లక్షల జనాభాకు 3.60 లక్షల లీటర్ల పాలు కావాలి. వ్యాపారాలు, శుభకార్యాలను పరిగణనలోకి తీసుకుంటే రోజుకు మరో లక్ష లీటర్లు అదనం. జిల్లాలో 55,221 ఆవులు, 1,10,123 గేదెలు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 1.50 లక్షల లీటర్ల పాలు మాత్రమే వస్తున్నాయి. వివిధ కంపెనీల పాల ప్యాకెట్లు కొంత వరకు అందుబాటులో ఉంటున్నాయి. ఈ కొరతను తీర్చేందుకు కొందరు కల్తీ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

నీటి నాణ్యత గాలికి..

జిల్లాలో ఆక్వా సాగు పెరగడంతో భూగర్భ జలాల్లో ఉప్పు శాతం పెరుగుతోంది. పల్లెల్లో సైతం డబ్బా నీళ్లపైనే ఆధారపడుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా ప్రైవేటు నీటి శుద్ధి కేంద్రాలు వెలిశాయి. వీరు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఓ వ్యక్తి రోజుకు 100-150 మిల్లీలీటర్ల పాలు వినియోగిస్తే, 3 నుంచి 4 లీటర్ల వరకు నీరు తాగుతారు.

అమలాపురంలో పాల విక్రయ కేంద్రాల నుంచి ఆహార భద్రతా అధికారులు సేకరించిన నమూనాలు

ఆ పాలు ఎక్కడివి..?

రోజువారీగా ఇళ్లకు పాలు తెచ్చే వ్యక్తులు సొంతగా పశువులను మేపుతున్నారా? ఎక్కడి నుంచైనా సేకరించి విక్రయిస్తున్నారా..? అనే విషయాలు తెలుసుకుని కొనుగోలు చేయాలి. అతను రోజూ ఎన్ని లీటర్ల విక్రయిస్తున్నాడు..? పాలు మరీ చిక్కగా ఉంటున్నాయా? అనే విషయాలను తెలుసుకోవాలి.

జిల్లాలో వివరాలు ఇలా

జనాభా:	20 లక్షలు
రోజువారీ పాల వినియోగం:	4.60 లక్షల లీటర్లు
ఆవులు:	55,221
గేదెలు:	1,10,123
తాగునీటి విక్రయ కేంద్రాలు:	1600

తాగునీటి స్వచ్ఛత ఇలా..

లీటరు నీటిలో టీడీఎస్ 500-2000 ఎంజీ, ఫ్లోరైడ్ 0.5-1.00, కాల్షియం 75-200, మెగ్నీషియం 30-100, క్లోరైడ్ 250-1000, నైట్రేట్ 45, సల్ఫేట్ 200-400 ఎంజీ వరకు ఉంటేనే ఆ నీరు తాగేందుకు సురక్షితం. నీటి శుద్ధి పరికరాల్లో వినియోగించే ఫిల్టర్లను నిర్ణీత సమయంలో మార్చుకోవాలి.

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడతాం

జిల్లా వ్యాప్తంగా పాలు విక్రయ కేంద్రాలపై నిఘా ఉంచాం. గత రెండు రోజుల్లో అమలాపురం పట్టణం పరిధిలో అమ్మకాలు సాగిస్తున్న వాటి నుంచి నమూనాలు సేకరించాం. వారం రోజుల్లో జిల్లాలోని అన్ని కేంద్రాల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు చేయిస్తాం. - రామయ్య, ఆహార భద్రతాధికారి

అంతులేని వేదన

- ఆసుపత్రుల్లో 15 మంది కల్తీ పాల బాధితులు
- కేసులు పెరగడంపై ఆందోళన
- చిన్నారి మృతితో స్వరూప్‌నగర్‌లో విషాదం

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, టి.నగర్, కంబాల చెరువు, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలో కల్తీ పాల కల్లోలం కొనసాగుతోంది. బాధితులు, మృతుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆందోళన నెలకొంది. సోమవారానికి 12 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, మంగళవారానికి ఆ సంఖ్య 15కు చేరింది. విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బి.మనోహర్ (6) అనే బాలుడు మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మరో 8 మంది పరిస్థితి విషమంగానే ఉందని వైద్యాధికారులు తెలపడంతో వారి కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బీవీ చౌదరితో కలిసి ఎంపీ పురందేశ్వరి పరామర్శించారు.

110 కుటుంబాల రక్తనమూనాల విశ్లేషణ..

కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన పాల వ్యాపారి గణేశ్వరరావు పాలు వేసిన 110 ఇళ్లను అధికారులు మ్యాపింగ్ చేసి ఆయా కుటుంబాల్లో 315 మంది రక్తనమూనాలు సేకరించారు. ఇద్దరికి సీరం క్రియేటిన్ స్థాయి మోతాదుకు మించి ఉన్నట్లు గుర్తించారు. వారిలో ఒకరిని ఆసుపత్రిలో చేర్చగా మరొకరిని చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుటుంబాలన్నింటికీ మరో దఫా రక్తపరీక్షలు చేయాలని, కొన్ని రోజులు ఈ ప్రక్రియ కొనసాగించాలని కలెక్టర్ కీర్తి చేకూరి వైద్యాధికారులను ఆదేశించారు. లాలాచెరువు పరిసర ప్రాంతాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్క్రీనింగ్ చేశాయి. అక్కడ వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

చౌడేశ్వరినగర్‌లో రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

అందరికీ అత్యవసర విభాగంలోనే..

ఆసుపత్రుల్లో 15 మంది చికిత్స పొందుతుండగా కడలి కృష్ణారావు (64), రితిక్ (2), సూర్యకుమారి (62)లను వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ చేస్తున్నారు. రుహన్య (అయిదు నెలలు), ఆర్.రామలక్ష్మి (75) వెంటిలేటర్‌పై ఉండగా, పి.నాగేశ్వరరావు (70), జి.వెంకటేశ్వరరావు (67), జి.వెంకటలక్ష్మి (69)లకు డయాలసిస్ చేస్తున్నారు. రెడ్డి అనంతలక్ష్మి (65), ఎన్.నూకరాజు (62), బి.అనంతలక్ష్మి (72), జైక్రిత్‌రాజ్ (2.9), జి.సూర్యారావు (79), బండారు వీరలక్ష్మి (60), కె.సత్యనారాయణ (82) ఐసీయూలో ఉన్నారు.

రాజమహేంద్రవరంలోని ఆసుపత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎంపీ పురందేశ్వరి

అందుబాటులో హెల్ప్‌లైన్ నంబరు..

పాల వ్యాపారి నుంచి కొనుగోలు చేసిన పాలు, ఇతర పదార్థాలు ఇళ్లలో ఏమున్నా తినొద్దని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. వాంతులు, మూత్ర విసర్జన సంబంధిత సమస్యలు, అనుమానిత లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్నట్లయితే 94940 60060 హెల్ప్‌లైన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

ఆత్మీయ విందులో ఆనంద క్షణాలు

ముమ్మిడివరం, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఏర్పాటు చేసిన విందు సమావేశంలో జిల్లా ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సందడి చేశారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌తో అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్

లోకేష్‌తో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కుటుంబ సభ్యులు

సీనియర్ ఇంటర్ పరీక్షలకు 97.12 శాతం హాజరు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి లాంగ్వేజ్ తెలుగు, హిందీ, సంస్కృతం విభాగాలకు సంబంధించి జిల్లాలోని 40 కేంద్రాల్లో 11,902 మందికి 11,560 మంది (97.12 శాతం) హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని. . ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. 25న మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్ష జరుగుతుందన్నారు.

రక్షణ సేవలకు తక్షణ స్పందన

హైవే ప్రయాణికులకు 1033 నంబర్‌తో ప్రయోజనం

మీ కోసం

న్యూస్‌టుడే, ఆలమూరు

ప్రయాణికులకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పలు ఉచిత సేవలు అందిస్తోంది. జాతీయ రహదారిపై ప్రయాణించే సమయంలో ఏర్పడే ఇబ్బందులు తొలగించేందుకు, ప్రమాదాల సమయంలో సహాయ పడేందుకు, ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు 1033 నంబర్‌కు ఫోన్ చేస్తే ఆ సంస్థ సిబ్బంది వెంటనే స్పందిస్తారు. ఉమ్మడి జిల్లాలో 16, 216-ఎ, 216 నంబర్ల హైవేలపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఏదైనా సమస్య ఎదురైతే ఉచిత సేవలను వినియోగించుకోవచ్చు.

చెముడులంక వద్ద హైవేపై బోర్డు

సేవలు ఇలా పొందొచ్చు

- జాతీయ రహదారి పరిధిలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా.. ఎవరైనా గాయపడినా 1033 నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు హైవే అంబులెన్స్‌తో పాటు పెట్రోలింగ్ మొబైల్ వాహనం అక్కడికి చేరుకుని బాధితులను ప్రాథమిక చికిత్స అందిస్తూనే ఆసుపత్రికి తరలిస్తుంది. ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా పోలీసుల సాయంతో కలిసి చర్యలు చేపడతాయి.
- ప్రయాణిస్తున్న వాహనం ఇంధనం లేక నిలిచిపోతే అవసరమైన ఇంధనాన్ని తెచ్చి ఇస్తారు. ఇందుకుగాను కేవలం ఇంధన రుసుము తప్ప అదనంగా చెల్లించనక్కర్లేదు.
- జాతీయ రహదారి ఎక్కడైనా బాగా దెబ్బతిన్నా.. ఆనుకుని ఆక్రమణలు ఉన్నా.. హోర్డింగ్‌లు, చెట్లు వంటివి పడిపోయే పరిస్థితుల్లో ఉన్నా పై నంబరుకు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటారు.
- ఎక్కడైనా ప్రమాదకరంగా వాహనాలు ఆపినా, నిలిచిపోయినా మెకానిక్‌ను తీసుకురావడం లేదా క్రేన్ సాయంతో ఆ వాహనాన్ని మరమ్మతు ప్రాంతానికి తీసుకెళ్లడం, మరో చోటుకు తరలించడం చేస్తారు.
- టోల్‌ప్లాజాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు లేకపోయినా, సిబ్బంది సక్రమంగా వ్యవహరించకున్నా ఫిర్యాదు చేయవచ్చు.
- అంబులెన్స్, పెట్రోలింగ్ వాహనం ప్రతి 45 కి.మీ.ల పరిధిలో నిరంతర సేవలందిస్తుంది.



అమలాపురం రంజాన్ వేళలు	
ఇఫ్తార్ (సా)	సహరి (ఉ)
బుధవారం	గురువారం
6.17	5.03

జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆకస్మిక తొలగింపు

రాజమహేంద్రవరం వైద్యం: రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పీవీవీ సత్యనారాయణను ప్రభుత్వం ఆకస్మికంగా తొలగించింది. ఆసుపత్రిలోని న్యూరో సర్జరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రాజశేఖర్ కెనడీని కొత్త సూపరింటెండెంట్‌గా నియమిస్తూ, పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఆర్ఎంసీలో కొత్తగా నియోనాటాలజీ విభాగం

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో కొత్తగా నియోనాటాలజీ విభాగం ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విభాగం ఏర్పాటుతో ఆర్ఎంసీ కళాశాలకు ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు అందుబాటులోకి వస్తాయి. పుట్టిన శిశువులకు మెరుగైన వైద్యం త్వరితగతిన అందించేందుకు వీలు కలుగుతుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ విభాగం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కళాశాలకు నియోనాటాలజీ విభాగం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ హర్షం వ్యక్తం చేశారు.

(c) eenadu

కల్తీ పాపాలు.. తీస్తున్నాయ్ ప్రాణాలు!

● యూరియా, డిటర్జెంట్, నూనెలతో తయారయ్యే సింథటిక్ పాలతో ప్రమాదం

ఈనాడు, కాకినాడ: కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లు పాల నుంచి తినే ఆహార పదార్థాల వరకు అన్నీ కలుషితం చేస్తున్నారు. అక్రమార్జనలో సంపాదన కోసం ప్రజారోగ్యాన్ని బలిపెడుతున్నారు. మితిమీరిన రసాయనాలు, రంగులు కలిపి అన్నపానీయాలను విషతుల్యం చేస్తున్నారు. రాజమహేంద్రవరంతో కల్తీ పాలతో ఆరోగ్య ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో ఉమ్మడి జిల్లాలోనూ కల్తీ పాలు పట్టుబడ్డాయి. పాల కల్తీతో ఆహార భద్రత ప్రమాణాలశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. నీళ్లు కలిపిన పాలు కొంత వరకు కలిపిన కానీ అవులు, గేదెల నుంచి పాలు తీయనట్లు తయారు చేసిన సింథటిక్ పాల తోనే ప్రాణాలకు ప్రమాదం ముంచుకొస్తున్నాయి. పాల కల్తీలను ముందే గుర్తించవచ్చని చెబుతున్నారు.

పాలల్లో వీటి ఆధారంగా నాణ్యత పరీక్షిస్తారు (శాతం)

	ఫ్యాట్	ఎస్ఎన్ఎఫ్
ఆవు పాలు	3-5	8-8.5
గేదె పాలు	8-9	8.5-9

ఫిర్యాదు చేయండి.. ఆహార కల్తీలతోపాటు పాలు, నిత్యావసరాలు కల్తీ జరిగినట్లు అను మానం వస్తే ఆహార భద్రత తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేయండి. నమూనాలు సేకరించి కల్తీ పరీక్షలు చేయించుకో వచ్చు. 7702999946 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వ వచ్చు. గతంలో కొన్ని కల్తీ పాలకేసులపై కేసీ కోర్టులో అప రాధ రుసుము విధించిన ఘటనలు ఉన్నాయి. - నందాజీ, సహాయ నియంత్రణ అధికారి, ఆహార భద్రతా ప్రమాణాల శాఖ

ఫార్మాలిన్ వాడి.. ● అసలు ఆవులు, గేదెల నుంచి పాలు సేకరించి తర్వాత రసాయనాలు కలపడంతో పాటు, నీళ్లు, డిటర్జెంట్, వెజిటబుల్ ఆయిల్, యూరియా, ఇతర రసాయనాలన్ని కలిపి సింథటిక్ పాలు తయారుచేస్తారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండడానికి ఫార్మాలిన్ వాడుతారు. ఈ పాలను వినియోగిస్తే కిడ్నీ రోగాలతో పాటు మంచాన పడడం ఖాయమని కాకినాడ చెందిన పశుసంవర్ధకశాఖ ఏడీ డా. వరప్రసాద్ చెబుతున్నారు.

నీళ్లు కలిపి.. ● పాల పరిమాణం పెంచడానికి ఎక్కువగా నీళ్లు కలుపుతుంటారు. వీటిల్లో, పాల కేంద్రాల వద్ద లీటర్, అర లీటర్ పొట్లాలలో అమ్మేవారు ఇటువంటి చర్యలకు పాల్పడతారు. కలిపిన నీళ్లు మంచివి కావంటే ఆ పాలు తాగేవారిలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

గుర్తించవచ్చిలా.. ఈ కల్తీని గుర్తించాలంటే నున్నటి గచ్చు/ టైల్స్ మీద రెండు చుక్కలు పాలు వేస్తే వెంటనే చెదిరి పోతే నీళ్ల కలిపినట్లే.. అదే స్వచ్ఛమైన పాలు నెమ్మదిగా జారుతాయి. అక్కడ తెల్లటి మచ్చకూడా ఏర్పడుతుంది.

పిండి పదార్థం.. ● నీళ్లు కలిపిన పాలు పలచగా ఉంటాయి. చిక్కదనం కోసం స్టార్చ్ అనే పిండి పదార్థాన్ని పాలల్లో కలిపేస్తారు. చేతి వేలను పాలల్లో ముంచితే చిక్కగా అనిపిస్తుంది. నాణ్యమైన పాలు అనుకుంటారు.

● చిన్న పాల నమూనాలో అయోడిన్ చుక్క వేస్తే నీలం రంగులోకి మారింది అంటే పిండి కలిపినట్లే లెక్క.

యూరియా.. ● పాలలో ప్రోటీన్ ఎక్కువగా ఉందని చూపడానికి యూరియా కలిపేస్తుంటారు. దీనివల్ల పాలల్లో ఎస్ఎన్ఎఫ్ రీడు ఎక్కువగా చూపి మంచి రేటు పలుకుతుంది. ఈ పాలను వినియోగిస్తే దీర్ఘకాలంలో కిడ్నీ సమస్యల బారిన పడతారు.

● పాల నమూనాలో లిట్మస్ పేపర్ ముంచినప్పుడు నీలంగా మారితే యూరియా కలిపారని అర్థం.

కాటన్ అక్విడక్టుకు ఏదీ ఆ వైభవం!

పందులను కట్టేసిన చిత్రం

పి.గన్నవరం, న్యూస్టుడే: పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాల్సిన అపురూప కట్టడం పందులదొడ్డిగా తయారైంది. గత అయిదేళ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా పట్టించు కునే వారు కరవయ్యారు. పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై 1852లో కాటన్, 1948 ప్రాంతంలో మద్రాసు ప్రభుత్వం ఒకటి చొప్పున మొత్తం రెండు అక్విడక్టులు నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరుకోవడంతో 2000 సంవత్సరంలో కొత్తగా డొక్కా సీతమ్మ అక్విడక్టు అందుబాటులోకి వచ్చింది. కాటన్ నిర్మించిన అక్విడక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. తరువాత కూడా పలువురు ఎమ్మెల్యేలు హామీలు ఇచ్చారు. ఇంతటి సేవలందించిన కాటన్ అక్విడక్టు పాత కట్టడాల చెంతన ఓ వ్యక్తి పందులదొడ్డి నిర్వహిస్తున్నాడు. ఈ కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా తయారై దుర్వాసన వస్తోంది. జలవనరులశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పసుపు నాణ్యతలో జాగ్రత్తలిలా..

రైతేరాజు

ఆలమూరు, న్యూస్టుడే: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పసుపు రంగు అట్లలను పండిస్తున్నారు. ఆకుపచ్చని పురుగులను అదుపులో ఉంచవచ్చని ఆలమూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డా.ఎస్.హెచ్. కె.వి.చౌదరి తెలియజేశారు. ముఖ్యంగా వంగ, మిరప, టమాట వంటి కూరగాయలు, పొద్దుతిరుగుడు తదితర వాణిజ్య పంటలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

మీ కోసం

తోటలలో... అట్టలతో మేలు


చొప్పెల్లో వంగతోటలో పసుపు అట్టలు

ఎత్తులో వీటిని ఏర్పాటు చేయాలి. తెల్ల, పచ్చదోమ, తామర పురుగుల ఉధృతిని అరికట్టడానికి బాగా పనిచేస్తాయి. వీటికి జిగురు లేదా గ్రీజు పూస్తే తెల్లదోమ, పచ్చదోమ, ఎర్రనల్లి, తామర పురుగులు అంటుకుని చనిపోతాయి. ముఖ్య తెగులు సైతం తగ్గుతుంది. ఎకరాకు సుమారు 25 నుంచి 30 వరకు పసుపు రంగు అట్టలు అమర్చుకోవాలి.

ఆత్రేయపురం, న్యూస్టుడే: పసుపు పంటను సాగుచేసే రైతులు కొన్ని మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు పొందొచ్చని ఆత్రేయపురం ఉద్యానాధికారి కోటేశ్వరరావు సూచించారు. పొలంలో తవ్వి తెచ్చిన పచ్చి కొమ్ములను త్వరగా ఉడికించి ఆరబెట్టాలి. ఆలస్యమైతే నాణ్యత తగ్గుతుంది. దుంపలు, కొమ్ములను వేర్వేరుగా ఉడికించాలి. ఉడకబెట్టే సమయంలో అవి మునిగే వరకు నీరు పోయాలి. సమంగా మంట పెట్టాలి. 45-60 నిమిషాలకు తెల్ల నురగ గడప తాయి. మెత్తబడితే కన్నా ...

ఆత్రేయపురంలో ఉడక బెట్టేందుకు సిద్ధం చేసిన పచ్చికొమ్ములు

పొంగుతో మంచి సువాసన, పొగలు వస్తాయి. అప్పుడు చేతితో ఒత్తితే మెత్తగా ఉంటాయి. ఆ దశలో బయటకు తీసేయాలి.

ఎక్కువసేపు ఉడికిస్తే ఆరబెట్టిన తర్వాత రంగు తగ్గిపోతుంది.

ఉడికించడం ఇలా..

తల్లి, పిల్ల దుంపలను జల్లెడ రంధ్రాలున్న ఇనుప తొట్టెలో వేయాలి. ఇరువైపులా పట్టుకొని దీని కంటే కొంచెం పెద్ద పరిమాణం ఉన్న ఇనుప కళాయిలో దించాలి. దుంపలు మునిగే వరకు నీరు పోయాలి. మెత్తబడే వరకు ఉడికించాలి. తర్వాత దుంపలున్న తొట్టెను పైకితీసి పట్టుకుంటే ద్రావణం కళాయిలోకి దిగిపోతుంది. ఉడికిన పసుపు కొమ్ములను పరిశుభ్రమైన నేలపై పోయాలి.

ఆరబెట్టడమిలా..

సమంగా ఉడికిన కొమ్ములను పరిశుభ్రమైన సమాంతరంగా ఉన్న నేలపైన లేదా టార్పాలిన్ లేదా సిమెంటు ప్లాట్‌ఫారం పైన పోయాలి. 24 గంటల తర్వాత రెండు, మూడు అంగుళాల మందం ఉండేలా పరచాలి. పలుచగా పరిస్తే ఎండిన పసుపు రంగు చెడిపోతుంది. 10-15 రోజులకు పసుపు తయారై కొమ్ములన్నీ ఒకే మాదిరిగా కనిపిస్తాయి. అప్పుడప్పుడు తిరగబెట్టి ఆరిన తర్వాత ఒక్కచోటికి చేరుకోవాలి.

పశుసంపద వృద్ధికి మెలకువలు

పాడి పశువులు

కరప, న్యూస్టుడే: పాడి పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై కరప ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.ఎన్.ఎస్. సురేష్ బాబు వివరించారు.

✦ సాధారణంగా గేదెలు చూలి ఎక్కువగా ఉండే శీతాకాలంలో ఎదకు వస్తాయి. పిల్లలు పుట్టాక రెండో ఈత కాలం ముగుస్తుంది. ఈ నెలలో గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయించకపోతే మళ్లీ జూలై, ఆగస్టు వరకు సరిగా ఎదకు రావు. ఎద లక్షణాలను గమనించి వెంటనే గర్భధారణ చేయించాలి.

✦ 90 శాతం పెయ్యి దూడలు పుట్టడానికి ఉన్న అవకాశం ఉన్న మేలుజాతి వీర్యాన్ని రాయితీపై కేవలం రూ.150కే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పాడి రైతులు వినియోగించుకోవాలి. తద్వారా పశుసంపదను త్వరితగతిన వృద్ధి చేసుకోవచ్చు.

తెలుసుకుందాం..

పశువులు పాలు ఇవ్వడంతో పాటు చూడు కట్టేవిధంగా పాడి లాభదాయకంగా ఉంటుంది. ✦ నవంబరు లేదా అంతకుముందే ముందుగా కృత్రిమ గర్భధారణ చేయించిన పశువులకు వైద్యులతో చూడి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. ఒకవేళ చూడి కట్టకపోతే మందులు వాడాలి. లేదంటే 6 నెలల కాలం వృథా అవుతుంది. ✦ వేసవిలో పశుగ్రాసం కొరత నివారించుకోవడానికి ఇప్పటినుంచి సన్నద్ధంగా ఉండాలి. నీటివసతి ఉన్న భూముల్లో గ్రాసం పెంచుకోవడానికి ఏర్పాటు చేసుకోవాలి. అవకాశం లేనివారు యూరియాతో ఊరవేసిన వరిగడ్డిని తయారు చేసుకోవడం మంచిది.

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

వనామి సాగుకు సన్నద్ధమవుదాం

ఆక్వా సీజన్ ప్రారంభమైంది. రొయ్యల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరంభం నుంచి ప్రణాళికాబద్ధంగా సాగాలని ఉప్పలగుప్తం మత్స్యశాఖ అధికారి వి.హేమానంద్ సూచిస్తున్నారు.

రొయ్యల సాగుకు సిద్ధం చేసిన చెరువు

● ముందుగా చెరువు నెలలు తీసేలా ఎండగట్టి ట్రాక్టరుతో దున్ని పైపొరను తొలగించి శుభ్రం చేయాలి. ఊలలు పడకుండా గట్లను పటిష్ఠం చేసుకోవాలి. అవసరం మేరకు చెరువులో సున్నం చల్లాలి. దీంతో వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులు, అవశేషాలు నశిస్తాయి.

● గత ఏడాది పంటలో ఈహెచ్‌పీ, వ్యాధి సోకినట్లయితే మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. ఎకరా చెరువుకు మూడు టన్నుల రాతిసున్నం వల్ల నేల పీహెచ్‌ను 12 వరకు పెంచాలి. రెండు అడుగుల మేర నీటిని నింపి రెండు రోజులు ఉంచి తిరిగి బయటకు తోడేయాలి. దీంతో సంబంధిత వ్యాధి కారకాలు చాలావరకు నశిస్తాయి. తిరిగి తగిన మోతాదులో పొటాషియం పర్మాంగనేట్ (పీపీ) వంటి ద్రావణాన్ని చల్లి పీహెచ్‌ను 7.5కు తగ్గించడానికి చర్యలు చేపట్టాలి.

● పాములు, తాబేళ్లు, పీతలు, కప్పలు, పక్షులు సమీప వ్యాధిగ్రస్త చెరువుల నుంచి రాకుండా బయో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి.

● చెరువులో ఐదు అడుగుల మేర నీరు నింపి ఉప్పదనం అనుకూలంగా రొయ్య పిల్లలను సీఏఏ అనుమతి పొందిన హేచరీల నుంచి సేకరించాలి. ప్రయోగ శాలల్లో ప్రాముఖ్యమైన ఈహెచ్‌పీ, డబ్ల్యూఎస్ఎస్‌వీ, విబ్రియో వంటి పరీక్షలు నిర్వహించి ఈ వ్యాధులు లేని సీడు ఎంచుకుని తగిన సాంద్రతతో సాగు చేపట్టాలి.

వృక్ష మిత్రమా.. వీడిపోతున్నా!

వైనతేయ నదీ తీరంలో పచ్చదనంతో కళకళలాడుతున్న కొబ్బరి చెట్లకు నదీకోత పెనుముప్పుగా మారింది. ఒక్కోచెట్టు నదీ గర్భంలో కలిసిపోతోంది. మామిడికుదురు మండలం పాశర్లపూడిబాడవలో వారధికి సమీపంలో చింతలమెరకలోని ఓ చెట్టు కోతకు గురై మొదలుతో సహా నదిలోకి జారిపోతోంది. రాతికట్టుతో ఒడ్డుకు రక్షణ కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే ప్రతిపాదనలు చేసి పంపామని, నిధులు వచ్చిన వెంటనే రక్షణ పనులు చేస్తామని సంబంధిత హెడ్‌వర్క్స్ అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

మెట్రో రైలు బోగీలు వచ్చాయోచ్..

రావులపాలెం మండలం రావులపాడు శివారు సుందర్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై కోల్‌కతా నుంచి బెంగళూరు వెళుతున్న మెట్రో రైలు బోగీల ట్రాలీ లారీలు మంగళవారం కనిపించాయి. ఆరు ట్రాలీలపై వచ్చిన కొత్త బోగీలకు పూర్తిగా సీలువేసి తరలిస్తున్నారు. వీటిని చూసిన పలువురు కోనసీమకు రైలు రాకపోయినా.. మెట్రో రైలు బోగీలు వచ్చాయంటూ చమత్కరించారు. - న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

నీటిపిల్లిని కాపాడుకోవాలి

మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వరప్రసాద్

తాళ్లరేవు, న్యూస్‌టుడే: వన్యప్రాణుల్లో ఒకటైన నీటి పిల్లిని కాపాడుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.వి. వరప్రసాద్ అన్నారు. కోరింగ జీవవైవిధ్య కేంద్రంలో ప్రపంచ నీటిపిల్లి దినోత్సవం ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నీటి పిల్లి సంరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోరింగ అభయారణ్యంలో నీటి పిల్లుల సంతతి ఎక్కువగానే ఉందన్నారు. ఇది చేపలను ఆహారంగా తీసుకుంటుందన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ, ఎఫ్‌బీవోలు జి.గోపీనాగేంద్రకుమార్, కె.ధనంజయరావు పాల్గొన్నారు.

వైభవం.. భక్తవత్సలుని బ్రహ్మోత్సవం

సర్వాభరణాలతో స్వామివారు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం సామూహిక కుంకుమార్చన వైభవంగా సాగింది. ఈ సందర్భంగా స్వామివారికి పారిశ్రామికవేత్త పాతపాటి వెంకటసత్యనారాయణరాజు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు విలువైన సర్వాభరణాలు చేయించారు. వాటికి సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరించారు. రాత్రి శ్రీవారు పురవీధుల్లో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు.

పంచాయతీల్లో ఖాళీలు భర్తీ చేయాలి

రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

మలికిపురం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో జూనియర్ అసిస్టెంట్ల ఖాళీలను డిజిటల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని ఎన్జీవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడి ఏసుబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లుతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణలకు మంగళవారం విజయవాడలో వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. పంచాయతీల్లో భవిష్యత్తులో ఏర్పడే జూనియర్ అసిస్టెంట్ల ఖాళీలను ప్రాధాన్య క్రమంలో డిజిటల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని, పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న వెటర్నరీ అటెండర్లకు టైంస్కేలు ఇవ్వాలని, వీరి సర్వీసును రెగ్యులర్ ప్రాతిపదికన లేదా కాంట్రాక్టు ప్రాతిపదికగా పరిగణించాలని కోరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించి అభినందించారు. జిల్లా బాధ్యులు మోటూరి రామారావు, జేఏసీ కోశాధికారి, ఎన్.వి. రామారావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, మాజీ సీఎం బృందానికి చేదు అనుభవం

నిలదీసిన నాలుగు గ్రామాల ప్రజలు

శిబిరం వద్ద నుంచి వెనుతిరుగుతున్న వైథిలింగం, నారాయణసామి బృందం

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి లోక్‌సభ ఎంపీ వి.వైథిలింగం, మాజీ సీఎం వి.నారాయణసామి బృందానికి దరియాలతిప్పలో చేదు అనుభవం ఎదురైంది. గత ఏడాది ఆగస్టు 22న జరిగిన గ్యాస్‌పైపులైన్ లీకేజీ, అగ్నిప్రమాదం నేపథ్యంలో తమకు పరిహారం ఇవ్వాలంటూ దరియాలతిప్ప, బాలయోగికాలనీ, సీతారాంనగర్, దొమ్మేటిపేట ప్రజలు 134 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. మంగళవారం యానాం పర్యటనకు వచ్చిన వైథిలింగం బృందం మాట్లాడేందుకు వారి వద్దకు వెళ్లగా నిరసన వ్యక్తమైంది. రెండు పర్యాయాలు వినతిపత్రాలు ఇచ్చిన ఈ అంశం గురించి పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదని మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు ఎంపీని నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీకి, గిడ్లకు మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సీఎం, మల్లాడి ఏం చేస్తున్నారని వైథిలింగం ప్రశ్నించారు. ఆందోళనకారుల శిబిరం వద్ద ఎంపీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేయడంతో వారు వెనుతిరిగారు. గ్రామస్థుల నిరసన నేపథ్యంలో ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమై వారిని నియంత్రించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

JOBS

Wanted DTP Operator (Male/Female). Part Time Work. Location: Nagamallithota Junction, Kakinada. Contact Cell: 99489 14446.

ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి కోర్లమ్మపేట, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ దగ్గరలో D.No:21-7-1 సౌత్ ఫేసింగ్ 150 చ॥గ॥ ఇల్లు అమ్మకం. Contact Cell:94400 00214

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NH కి చేర్చి 100 అ॥ రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్), ✆ 9032988265.

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 చదరపు గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/వాట్సాప్: 80748 57055.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-80 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	125-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని వినతి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తమను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ నాయకులు కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు సరైన వేతనాలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా మార్చి 6న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీకి అందజేశారు.

ఏపీసీ మమ్మీకి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

ప్రమాదంతో.. పరీక్ష రాయలేకపోయిన ఇంటర్ విద్యార్థిని

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ముందు రోజు రాత్రంతా చదువుకుని పరీక్ష రాయడానికి వెళ్తున్న ఆ విద్యార్థి ఆశలను రహదారి ప్రమాదం చిదిమేసింది. వివరాల ప్రకారం.. యు.కొత్తపల్లి మండలం అమీనాబాదుకు చెందిన కారే జెస్సీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష రాసేందుకు అన్నయ్య జాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం పిఠాపురంలోని కేంద్రానికి బయలుదేరింది. వాకతిప్ప శివారు సూరప్ప చెరువు సమీపంలో ప్రమాదకర మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో జాన్ తీవ్రంగా గాయపడడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జెస్సీకి స్వల్పగాయాలైనప్పటికీ మానసిక ఆందోళనకు గురైంది. దాంతో పరీక్షకు వెళ్లలేక తిరిగి ఇంటికి చేరుకుంది.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

గోకవరం: బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వివరాలివీ.. ఓ గ్రామానికి చెందిన కాళ్ల రాజేష్ (19) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో ఆపి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనిపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం ఒకటో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ట్రాన్స్‌కో ఏఈ ఫోన్ హ్యాక్

తుని, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ లక్ష్మణరావు ఫోన్‌ను సోమవారం అర్ధరాత్రి హ్యాక్ చేశారు. ఆయన వినియోగిస్తున్న ప్రభుత్వం అందించిన సిమ్ నంబరు హ్యాక్ అయ్యింది. వాట్సాప్ ద్వారా గ్రూపుల్లో ఎస్‌బీఐ కేవైసీ అప్‌డేట్ లింకును ఏఈ పంపినట్లు ఏపీకె ఫైల్‌ను నేరగాళ్లు వేశారు. అంతేకాకుండా ఆయన ఉన్న వివిధ వాట్సాప్ గ్రూపుల ఐకాన్లు కూడా ఎస్‌బీఐ యోనో లోగోతో, ఎస్బీఐ గ్రూపులుగా ఏఈ లక్ష్మణరావు మార్చినట్లు సమాచారం వచ్చేలా పన్నాగం పన్నారు. దీన్ని మంగళవారం ఉదయం గమనించిన ఆయన తక్షణం బంధుమిత్రులు, సహోద్యోగులకు జాగ్రత్తగా ఉండాలని సమాచారం ఇచ్చారు. దీనిపై ఎవరూ స్పందించవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. గతంలో తునికి చెందిన ఓ ఉద్యోగి ఇలా ఏపీకె ఫైల్‌ను ఓపెన్ చేయడంతో రూ.60 వేలు పోగొట్టుకున్నారు.

స్వగ్రామానికి గల్ఫ్ బాధితులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఇద్దరు మహిళలను సురక్షితంగా స్వగ్రామాలకు తీసుకువచ్చినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. రాజోలు మండలం తాటిపాకకు చెందిన కర్రి సౌజన్య, కాట్రేనికోన మండలం కందికుప్ప ప్రాంతానికి చెందిన బొజ్జ లక్ష్మీ దుర్గ గతేడాది ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. వారికి అక్కడ సరైన ఉపాధి చూపకుండా ఇబ్బందులకు గురిచేశారు. స్వదేశాలకు పంపాలంటే నగదు చెల్లించాలని ఏజెంట్ చెప్పడంతో అప్పులు చేసి కొంత మొత్తం ఇచ్చారు. మరికొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితులు కుటుంబ సభ్యులు కలెక్టరేట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అధికారులు స్పందించి బాధితులను ఇద్దరినీ మంగళవారం స్వగ్రామాలకు తీసుకువచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అమలాపురంలోని డీఎస్ఏ స్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైక్లింగ్ లీగ్ పోటీల్లో ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బృంద విభాగంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.. 9వ తరగతి విద్యార్థులు ఎస్. ధనుష్, జె.ధనుష్‌బాబు, బాలికల విభాగంలో ఎం. రూపా ప్రత్యూష ప్రతిభ కనబరిచారు. వీరు ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు కోన సందీప్ తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, డీసీఈబీ కార్యదర్శి బి. హనుమంతరావు అభినందించారు.

పరిశ్రమతో ప్రజలకు సమస్య రాకుండా చూడాలి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కంపెనీ కార్యకలాపాల ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు సూచించారు. తాళ్లరేవులోని రెడ్డివారిపాలెం సమీపంలో 2025, అక్టోబరులో గమిని భాస్కర్ ఐస్, కోల్డ్ స్టోరేజ్ ఫ్యాక్టరీ నుంచి అమ్మోనియం గ్యాస్ లీకైంది. గాలి, నీరు, పంట పొలాలు కలుషితంపై రెడ్డివారిపాలెం గ్రామస్థులు అప్పట్లో ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం సకాలంలో స్పందించక పోవడంపై గ్రామస్థులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భశాఖ, మత్స్య, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఐస్ ఫ్యాక్టరీని పరిశీలించారు. కంపెనీకి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని అధికారుల బృందం రెవెన్యూ శాఖకు నివేదిక అందించింది. దీంతో ఆరు నెలల పాటు కంపెనీ మూతపడింది. ఈ సమస్యపై తాళ్లరేవు రెవెన్యూ కార్యాలయంలో గ్రామస్థులు, కంపెనీ ప్రతినిధులతో డిప్యూటీ తహసీల్దారు సూరిబాబు మంగళవారం సమావేశం నిర్వహించారు. కంపెనీ నుంచి వచ్చే నీరును డ్రెయిన్ ద్వారా బయటకు తరలించాలని, గాలి, నీరు, పంట పొలాలు దెబ్బ తినకుండా చూడాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కంపెనీ ప్రతినిధులు ఎటువంటి సమస్య రాకుండా చూస్తామని రెవెన్యూ అధికారుల సమక్షంలో హామీ ఇచ్చారు. దీంతో తిరిగి కంపెనీని నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. కంపెనీ వల్ల ఎటువంటి సమస్య వచ్చినా గ్రామస్థులు ఫిర్యాదు చేయవచ్చునని డిప్యూటీ తహసీల్దారు తెలిపారు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

మలికిపురం, న్యూస్‌టుడే: యాంత్రీకరణతో వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించాలని వ్యవసాయాధికారి ఏడీ ఎస్‌.రాజేశ్ కోరారు. దిండిలో డ్రోన్ వినియోగం, ప్రకృతి వ్యవసాయంలో కషాయాల తయారీ, వినియోగంపై మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పెట్టుబడులు తగ్గించుకుని ఆరోగ్యకర ఉత్పత్తులతో ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. కషాయాలను తయారు చేసే విధానాలను వివరించారు. వరి చేలో పిచికారీ చేయడానికి డ్రోన్‌ను వినియోగించడంపై రైతులకు అవగాహన కల్పించారు. మలికిపురం ఏవో సీహెచ్ రమ్యప్రియాంక, ప్రకృతి వ్యవసాయ జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ఎం.వి.సత్యనారాయణ, ఏఈవో జి.షణ్ముఖ్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

28న జేవీవీ ఆవిర్భావ వేడుకలు

మలికిపురం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆవిర్భావ వేడుకలను ఈ నెల 28న జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.సత్యనారాయణ, వీవీవీ ప్రసాద్ మంగళవారం చెప్పారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణలు, సైన్సు ఎగ్జిబిషన్లతో వేదిక ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీ సమస్యలను తెలపాల్సిన ఫోన్ నంబరు: రాజోలు: 80085 74174
ఉ. 10 - మ. 1
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

స్పందనకు సంతసం

తుప్పల తొలగింపు

రావులపాలెం(గ్రామీణం): రావులపాడు మార్కెట్ యార్డు నుంచి వెదిరేశ్వరం వెళ్లే కాలువ గట్టు రోడ్డు వెంబడి తుప్పలు పెరిగిపోవడంతో రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా తుప్పలు తొలగించారు.

వీధి దీపాలకు మరమ్మతులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పులిదిండి గ్రామంలో రేవు నుంచి గ్రామంలోకి వచ్చే రహదారిలో అక్కడక్కడ వీధి దీపాలు వెలగడం లేదు. ఈ విషయాన్ని సర్పంచి కమిడి సూర్య సుందర సీతారామారావు వద్ద ప్రస్తావించగా సిబ్బందితో లైట్లకు మరమ్మతులు చేయించారు.

డ్రెయిన్‌లో పూడికతీత

రావులపాలెం(గ్రామీణం), న్యూస్‌టుడే: గోపాలపురంలోని డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోతోంది. సమస్యను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా పూడిక తీయించారు.

చురుగ్గా ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులు

మలికిపురం(గుడిమెళ్లంక వంతెన కూడలి)-విశ్వేశ్వరాయపురం ఫీడరు గారి మలుపు వరకు సుమారు 2 కిలో మీటర్ల మేర రోడ్డు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇది గత ఐదు సంవత్సరాలుగా పూర్తిగా ధ్వంసమై స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం గుడిమెళ్లంక వంతెన నుంచి విశ్వేశ్వరాయపురం వంతెన(మండలాధికారి కార్యాలయం సమీపంలో) వరకు 620 మీటర్ల మేర 7 మీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేస్తున్నట్లు ర.భ.శాఖ ఏఈ కె.రవీంద్ర చెప్పారు. 5 మీటర్ల వెడల్పు ఉన్న దీన్ని 7 మీటర్లకు పెంచుతున్నారు. విశ్వేశ్వరాయపురం వంతెన నుంచి ఫీడరు గారి మలుపు వరకు గతంలో మాదిరిగానే ఐదు మీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేస్తారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

మంత్రి లోకేశ్ ఆత్మీయ విందు

కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్‌కు విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆత్మీయ విందు ఇచ్చారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుటుంబ సభ్యులతో సహా పాల్గొన్నారు. గోదావరి జిల్లాల ప్రత్యేకమైన వంటకాలు, ప్రముఖ ప్రతిమలతో మంత్రిని సత్కరించారు. – న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం, పి.గన్నవరం

దొక్కా సీతమ్మ చిత్రపటం అందిస్తున్న గిడ్డి సత్యనారాయణ

కుటుంబ సభ్యులతో బండారు సత్యానందరావు..

సాగునీరు అందక యాతన

శివారు చేలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వంతువారీ విధానం కారణంగా పంటలకు సక్రమంగా చేరడం లేదు. నగరం శివారు తాడివానిమెరకలో బైపాస్ రహదారి కారణంగా తూర కూరుకుపోవడంతో నీరు అందడం లేదు. సమీపంలోని డ్రెయిన్ నుంచి ఇంజిన్ ద్వారా నీటిని మళ్లించుకుంటూ రైతులు అవస్థలు పడుతున్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

అలరించిన విద్యార్థుల నృత్యం

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాశర్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు జరిగిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం అలరించింది. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అంతా ఆకాంక్షించారు. అనంతరం జరిగిన పలు నృత్య రూపకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయిని ఆర్‌వీఎస్ రమాదేవి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ తోరం నాగరాజు పాల్గొన్నారు.

రాజోలులో నిరసన వ్యక్తం చేస్తున్న సొసైటీల సిబ్బంది

నిర్లక్ష్యం.. రహదారి రుధిరం

– న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, నిబంధనలను పట్టించుకోకపోవడం.. వెరసి రహదారులు రక్తసిక్తంగా మారుతున్నాయి. రాజోలు మండలం తాటిపాక కూడలి నుంచి మామిడికుదురు మండలం మొగలికుదురు, గెద్దాడ మీదుగా మలికిపల్లి వరకు పంటకాలువ ఆనుకుని ఉన్న ర.భ.శాఖ పరిధిలోని రహదారి అంటే అంతా హడలెత్తిపోతున్నారు. ఇటీవల కాలంలో వరుస ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడడంతో ఆందోళన రేగుతోంది.

గెద్దాడ పంట కాలువపై ప్రమాదకరంగా ఇరుకు కల్వర్టు

● మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, నిబంధనలు పాటించకపోవడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో ఊహించని ఘటనలు జరుగుతున్నాయి.

ప్రధాన కారణాలు ఇలా..

● రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభాలు, కొబ్బరి చెట్లు, పలుచోట్ల నెలకొన్న ఆక్రమణలు, రక్షణ కరవై ఇరుగ్గా ఉన్న కల్వర్టులు ఆందోళనకరంగా ఉన్నాయి.

● శిరస్త్రాణాలను ధరించకపోవడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం, కొందరు మద్యంతాగి నడపడం, ఆకతాయిగా విన్యాసాలు చేయడం ప్రమాదకరంగా మారుతోంది.

ఇవీ సంఘటనలు

● ఈ నెల 11న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కడలిలో జరిగిన ప్రమాదంలో వాసంశెట్టివారిపాలేనికి చెందిన 33 ఏళ్ల మెట్టి దుర్గాప్రసాద్ ద్విచక్ర వాహనంతో కొబ్బరి చెట్టును ఢీకొట్టడంతో మృతిచెందాడు.

● ఈ నెల 18న రాత్రి కడలిలో జరిగిన ప్రమాదంలో కేశనపల్లికి చెందిన 9వ తరగతి విద్యార్థి నాతిని యశ్వంత్ మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

● డిసెంబరు 7న కడలి పంటకాలువలోకి కారు దూసుకెళ్లిన ప్రమాదంలో మలికిపల్లికి చెందిన 20 ఏళ్ల కలిగితి శ్యామ్‌తేజ మృతిచెందాడు.

విస్తరణ పనులు చేపడతాం..

216 బైపాస్ నుంచి మొగలికుదురు వరకు రూ.2.2 కోట్ల వ్యయంతో 10 మీటర్ల వెడల్పున ఎస్‌.ఎం. రోడ్డును విస్తరించేందుకు త్వరలో కార్యాచరణ జరుగుతుంది. అక్కడి శిథిల కల్వర్టు పునర్నిర్మాణానికి రూ.47 లక్షలు మంజూరయ్యాయి. మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించేందుకు కార్యాచరణ చేపడతాం. – కె.సురేష్, ఏఈఈ, ర.భ.శాఖ

ప్రమాదాలపై పరిశీలన చేశాం..

తాటిపాక-మలికిపల్లి రోడ్డులో ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలపై పరిశీలన చేశాం. అవసరమైన చోట్ల వేగ నియంత్రణ చర్యలు చేపడతాం. రహదారి చెంత తొలగించాల్సిన కొబ్బరి చెట్లు, విద్యుత్తు స్తంభాలను గుర్తించాం. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో దీనిపై ప్రత్యేకంగా చర్చిస్తాం.
– దేవిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా రవాణాధికారి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మలికిపురం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సీపీఎం(కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్) బి.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. బట్టేలంక, ఇరుసుమండ, పడమటిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. పరీక్షల్లో విజయం సాధించడానికి అనుసరించాల్సిన మెలకువలు వివరించారు. మిగిలిన ఈ ఇరవై రోజులు కష్టపడి చదవాలని సూచించారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. పడమటిపాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు 3డి ప్రింటింగ్ కార్యక్రమాన్ని పరిశీలించి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.హనుమంతరావు, బి.మెహర్‌మూర్తి, ఎస్ఎస్ సుందరశర్మ, సీఆర్‌ఎంటీ వి.రామకృష్ణ పాల్గొన్నారు.

పిల్లల విద్యా సామర్థ్యాల పరిశీలన

మామిడికుదురు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి రూపొందించిన ప్రకారం 3 నుంచి 5 తరగతుల విద్యార్థుల్లో అన్ని పాఠ్యాంశాలపై సామర్థ్యాలు పెంచేందుకు ఉద్దేశించిన 75 రోజుల కార్యక్రమాన్ని సమర్థంగా పూర్తి చేయాలని సమగ్రశిక్షా సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. పాశర్లపూడిలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను మంగళవారం ఆయన పరిశీలించారు. చక్కగా చదవడం, రాయడం, గణితాన్ని అర్థం చేసుకుని నైపుణ్యాలను పెంచుకునేలా తీర్చిదిద్దాలన్నారు. 2026-27 విద్యాసంవత్సరానికి ఇవ్వనున్న బూట్ల కొలతల వివరాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయిని ఎన్.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు పోరాటం

రాజోలు, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధన కోసం సహకార సంఘాల ఉద్యోగులు మంగళవారం రాజోలు డీసీసీబీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 36ను రద్దు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 2019, 2024 వేతన సవరణ వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. వీరికి సొసైటీల అధ్యక్షులు కసుకుర్తి త్రినాథస్వామి, పిప్పళ్ల రాంబాబు, కాండ్రేగుల కుశులుడు, ఆకుల సత్యనారాయణమూర్తి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లీలాకృష్ణ, భాస్కరరావు, నాయుడు, ఏడుకొండలు, రవి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ధరల బోర్డులు ప్రదర్శించాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఔషధ దుకాణాల వద్ద జీఎస్టీ తగ్గింపు ధరల బోర్డులు ప్రదర్శించాలని కోనసీమ వినియోగదారుల సమాఖ్య ఛైర్మన్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు అరిగెల బలరామ్మూర్తి కోరారు. ఏ మందు ఎంతమేర తగ్గిందో ప్రజలకు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు.

పి.గన్నవరంలో హాల్‌టికెట్ నంబరు చూసుకుంటూ..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

రాజోలు, మలికిపురం, పి.గన్నవరం, అయినవిల్లి, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాజోలు మండలంలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 275 మందికి గాను 272 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. మలికిపురం ఏఎఫ్‌డీటీ, దీప్తి జూనియర్ కళాశాలల్లో 332 మంది హాజరయ్యారు. పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 99 మందికి గాను ఒకరు గైర్హాజరైనట్టు డిపార్ట్‌మెంటల్ అధికారి కె.గంగాధరరావు తెలిపారు. అయినవిల్లి ఎస్‌ఎన్‌వీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 170 విద్యార్థుల హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అంబటి రామారావు తెలిపారు.

నిరుపయోగంగా ఆరోగ్య కేంద్రం

నేదునూరు సచివాలయం వద్ద ఏడాది కిందట నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. భవనం చుట్టూ చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. పనులు పూర్తిచేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

కాలువ పొంగి.. ఇళ్లను ముంచెత్తి

రాజోలు గ్రామ పంచాయతీని ఆనుకుని ఉన్న మురుగు కాలువ దుర్భరంగా మారడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలోని మురుగు ఎదురుగా ఉన్న ఇళ్లల్లోకి చేరడంతో ఆయా కుటుంబాల వారు నానాయాతన పడుతున్నారు. ఇంట్లోకి మురుగు చేరి వస్తువులన్నీ పాడైపోయాయని దైవాల సీతారత్నం ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రెహ్మాన్‌ను వివరణ కోరగా కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తామన్నారు.– న్యూస్‌టుడే, రాజోలు

మలికిపురంలో ట్రాఫిక్ గజిబిజి

మలికిపురం కూడలిలో ట్రాఫిక్ గజిబిజిగా మారుతోంది. ఉదయం 8-10, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరక విపరీతమైన రద్దీ ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రాజోలు, సఖినేటిపల్లిరేవు మధ్య వాహనాల రాకపోకలతో పాటు పాఠశాలలు, హైదరాబాద్ వెళ్లే ప్రైవేట్ బస్సులు ఒకేసారి రావడంతో ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యపై ఎస్సై పి.సురేశ్‌ను వివరణ కోరగా ఆయా సమయాల్లో కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ నియంత్రణ చేపడుతున్నామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

పనులు పూర్తికాక.. తాగునీరు అందక

మామిడికుదురు పరిధి చేరీతోటలో నిర్మించిన 30 వేల లీటర్ల సామర్థ్యమున్న మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు చివరి దశలో నిలిచిపోయాయి. దీనికి నీటిని సరఫరా చేసేందుకు గొట్టాలు అమర్చడంలో తీవ్ర జాప్యం నెలకొంది. శివారు నివాసిత ప్రాంతం కావడంతో తాగునీటి ఇబ్బందులు శ్రుతిమించాయని, వెంటనే ట్యాంకును ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాచరణ చేస్తామని సంబంధిత ఏఈఈ జయశ్రీ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

ప్రహరీ లేకపోవడంతో ఇక్కట్లు

ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పశువులు రావడంతో పాటు కుక్కలు వంటివి సంచరిస్తున్నాయి. ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీంతో వైద్యసేవలకు విఘాతం కలుగుతోంది. ఈ విషయాన్ని ఎంపీడీవో బీకేఎస్‌ఎస్ వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా ప్రహరీ నిర్మాణం విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం శివకోటి లాకుల వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివకోటికి చెందిన నల్లి మధుసూదనరావు(65) దిండి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా లోడు ఆటోను వెనక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అతని కుమారుడు అజయ్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

రాజోలు, న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు రాజోలు స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు చెవ్వాకుల సూర్యప్రకాశ్, ఐద్వా నాయకురాలు కందికట్ల గిరిజ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బళ్ల పర్వతాలు సంఘీభావం తెలిపారు. రత్నకుమారి, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు చోట్ల మోస్తరు వర్షం

పి.గన్నవరం, మలికిపురం, అంబాజీపేట, న్యూస్‌టుడే: పి.గన్నవరం మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. వారపు సంతలో దుకాణాలు తడిసిపోకుండా దుకాణదారులు బరకాలు కప్పి హైరానా పడ్డారు. పి.గన్నవరం, కె.ఏనుగుపల్లి, ముంగండ, లంకలగన్నవరం ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈదురుగాలులు తోడయ్యాయి. ● మలికిపురం మండలంలో ఆకాశంలో మబ్బులు ఆవరించి వాతావరణం చల్లబడింది. సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. అంబాజీపేటలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. గుంతల్లో నీరు చేరింది.

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న అధికారులు

బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: బీమా పాలసీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అశోక్‌నాగరాజన్ అన్నారు. ఆత్రేయపురం బ్రాంచ్‌లో మట్టా సత్యనారాయణ రూ.200తో పాలసీ చేశారు. ఆయన ఇటీవల మృతి చెందడంతో రూ.4 లక్షల బీమా సొమ్ము మంజూరైంది. కుటుంబం సభ్యులకు మంగళవారం చెక్కును బ్యాంకు అధికారులు అందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం పట్టణ పరిధిలోని గానుగవీధికి చెందిన లలితా ఎండోకేర్ అండ్ స్కిన్‌కేర్ హాస్పిటల్స్ ప్రతినిధి పి.మిధున్‌చక్రవర్తి రూ.1,01,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం పర్యవేక్షకుడు రాంబాబు అభినందించారు.

దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామేశ్వరంలో భాషోత్సవాలు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: రామేశ్వరం పీఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి భాషోత్సవాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జడ్పీ, ఎంపీపీ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరు తెలుగులో పద్యపఠనం, వక్తృత్వం, కథారచన, హిందీలో శ్లోకల పఠనం, కథాపఠనం, భాషా ప్రాముఖ్యతపై చర్చ, ఆంగ్లంలో చదవడం, స్పెల్లింగ్ పోటీ, కథారచనలు నిర్వహించారు. ప్రతిభ చూపిన జి.జెరోష(గొంది), సరోజిని(రామేశ్వరం), సుష్మ(రామేశ్వరం), మణిశ్రీ(అంతర్వేది దేవస్థానం), శ్యాంసన్(సఖినేటిపల్లి లంక), దాత్రి(కేశవదాసుపాలెం), సుదర్శన్(ఎస్.అగ్రహారం), అవినాష్(సఖినేటిపల్లి), జోషిత(వీవీమెరక)లను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఏడుకొండలు, ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: నాగుల్లంక గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ నాలుగో వార్షిక పునఃప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మహిళలు చలివిడి పానకాల కావిళ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అరకొర మందులు.. రోగుల పాట్లు

న్యూస్‌టుడే, అంబాజీపేట, రాజోలు

అంబాజీపేటకు చెందిన నారాయణమూర్తి రోజువారీ కూలీ. ఇతనికి రెండు, మూడు రోజులుగా విపరీతమైన దగ్గు వస్తోంది. వైద్యం కోసం స్థానిక పీహెచ్‌సీకి వెళితే దగ్గు అరుకు లేదనే సమాధానం రావడంతో ప్రైవేటుగా కొనుక్కోవాల్సి వచ్చింది. మరో మహిళకు రక్తపోటు(బీపీ) మాత్రలు కావాలని అడిగితే అవి కూడా లేవని చెప్పడంతో ఏమిచేయాలో తెలియక ఇబ్బంది పడ్డారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో ఔషధాలు సరఫరా చేస్తున్నామని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అనేక చోట్ల కొరత వెంటాడుతోంది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా వీటి కొరత ఎక్కువ..

రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 14 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిల్లో చాలా ఆసుపత్రుల్లో ఔషధాలు లేవు. ప్రధానంగా రక్తపోటు, పారాసెటమాల్, దగ్గు అరుకు కొరత ఉన్నట్లు రోగుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. సి.పి.ఎం. సిరప్ యాంబ్రోక్సిన్, అముడాల్‌సిన్-5 ఎంజీ, ఎటెనోలోల్-50 ఎంజీ, టెల్మా-40 ఎంజీ, మెటాఫార్మిన్ గ్లిమిసి 1 ఎంజీ, 2 ఎంజీల కొరత ఉంది.

సామాన్యులకు ఇబ్బందే..

ప్రస్తుతం ఎక్కువగా రక్తపోటుతో ఇబ్బందులు పడుతున్నారు. దీని నివారణకు ఎటెనోలోల్-50 ఎంజీ మాత్రలు వైద్యులు ఇస్తుంటారు. ఇవికూడా పీహెచ్‌సీల్లో అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారు. బీపీ మాత్రలు, శారీరక నొప్పులకు సంబంధించిన డైక్లోఫెనాక్ సోడియం, జ్వరానికి ఇచ్చే పారాసెటమాల్-500 మాత్రలు లేకపోవడంతో ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సర్దుబాటు చేస్తాం

ఔషధాల కొరత లేకుండా చూస్తాం. కొన్ని లేకపోతే సమీపంలో ఉన్న పీహెచ్‌సీల నుంచి తెచ్చి సర్దుబాటు చేస్తాం. ఆయా పీహెచ్‌సీల వారీగా తప్పనిసరిగా అవసరమైనవి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం.
- దుర్గారావుదొర, డీఎంహెచ్‌వో

చలో విజయవాడ విజయవంతానికి పిలుపు

కాట్రేనికోన, న్యూస్‌టుడే : సమగ్రశిక్షా ఉద్యోగులు వచ్చే నెల 6న చేపట్టిన చలో విజయవాడ విజయవంతానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని కాట్రేనికోన ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది తెలిపారు. దీనిపై మంగళవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద వారు మాట్లాడారు. జి.శ్రీనివాస్, ఎం.స్వామి, గౌతమ్ ప్రసాద్, మూర్తి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

భాజపాతోనే దేశ అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసనగేష్

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. అంతర్వేదికరలో మండల శాఖ అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలతో వివిధ రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మార్చి 7 నుంచి ఏప్రిల్ 14 వరకు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్-2026 కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇది ప్రతి కార్యకర్తకు శిక్షణ అందించే కార్యక్రమం అన్నారు. పార్టీ ప్రవేశపెడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. చంపాటి శివరామకృష్ణంరాజు, బోణంనాయుడు, రావూరి బాబ్జి, పండు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ల పరిశీలన

ఇంటర్ పరీక్షలకు 44 మంది గైర్హాజరు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డా.ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో జనరల్ విద్యార్థులు 70 మందికి 59 మంది, ఒకేషనల్ విద్యార్థులు 103 మందికి 91 మంది పరీక్ష రాశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 206 మందికి 202 మంది, తారా జూనియర్ కళాశాలలో 259 మందికి 241 మంది హాజరయ్యారు. 44 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల డీవోలు తెలిపారు.

రైతుబజార్‌లో ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - 14, వంకాయలు నలుపు - 24, తెలుపు - 20, బెండకాయలు - 32, పచ్చిమిర్చి - 42, కాకరకాయ - 40, బీరకాయలు - 34, కాలీఫ్లవర్ - 20, క్యాబేజీ - 20, క్యారెట్ - 35, దొండకాయలు - 36, బంగాళదుంపలు - 20, ఉల్లిపాయలు - 18, 25, గోరుచిక్కుళ్లు - 40, దోసకాయలు - 28, చిక్కుడు కాయలు - 30, చేమదుంపలు - 35, కంద - 54, బీట్‌రూట్ - 30, కీరదోసకాయలు - 33, అల్లం - 75, క్యాప్సికం - 75, చిలగడ దుంపలు - 40, 50, గుమ్మడి - 30, ఉసిరి - 80, ముల్లంగి - 40, కరివేపాకు - 90, నిమ్మకాయలు - 76, మామిడికాయ - 110. ● అనబకాయ - 15, పొట్లకాయ -20, అరటికాయ -6, మునగకాయ - 15, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 8, కొబ్బరికాయ - 25.

సీతారామచంద్రమూర్తి ఆలయంలో యాగశాల ప్రవేశం

యాగశాలలోకి వస్తున్న దంపతులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం భూపయ్యఅగ్రహారంలోని సీతారామచంద్రమూర్తి స్వామి నూతన ఆలయంలో మంగళవారం యాగశాల ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు యాగం చేశారు. 50 మంది కూచిపూడి కళాకారులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

మే 12న శ్రీరామ నామ లిఖిత జప మహాయజ్ఞం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఏకాదశ కోటి శ్రీరామ నామ లిఖిత జప మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం మే 12న నిర్వహిస్తున్నట్లు శృంగవృక్షం శ్రీదత్తపీఠం పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతి స్వామిజీ తెలిపారు. చెన్నమలేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ పూర్ణాహుతి మహోత్సవం కరపత్రికలను సాయిదత్త స్వామిజీ ఆధ్వర్యంలో హిందూ సంఘ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, గోదశి గంగరాజు, శిరంగు నాయుడు, నల్లా పవన్, అడబాల నరసింహారావు, దున్నాల బాబి, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, ఏబీవీపీ, హిందూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

చేపల చెరువుగా మార్చకుంటే చర్యలు

కాట్రేనికోన: దొంతికుర్రులో చేపల చెరువుకు అనుమతులు తీసుకుని రొయ్యల సాగు చేపట్టడంతో ఉప్పునీటితో తమ పొలాలు పాడయ్యాయని, తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ రవికిరణ్ ఆధ్వర్యంలో విద్యుత్తుశాఖ ఏఈ శ్రీనివాస్, ఎఫ్‌డీవో చలపతి, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో చెరువును పరిశీలించారు. చేపల చెరువుగా మార్చుకోవాలని, లేకుంటే విద్యుత్తు కనెక్షన్ తొలగిస్తామని సదరు ఆక్వా రైతుకు తెలిపి నోటీసులు అందించారు.

చలో విజయవాడ విజయవంతానికి పిలుపు

కాట్రేనికోన, న్యూస్‌టుడే : సమగ్రశిక్షా ఉద్యోగులు వచ్చే నెల 6న చేపట్టిన చలో విజయవాడ విజయవంతానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని కాట్రేనికోన ఎస్ఎస్ఏ సిబ్బంది తెలిపారు. దీనిపై మంగళవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద వారు మాట్లాడారు. జి.శ్రీనివాస్, ఎం.స్వామి, గౌతమ్ ప్రసాద్, మూర్తి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

పల్లంలో పోలీసుల పల్లెనిద్ర

స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై

కాట్రేనికోన : తీరగ్రామం పల్లంలో సోమవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై అవినాష్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

వీధి కుక్కల స్వైరవిహారం

● పట్టణ ప్రజల బెంబేలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అమలాపురం పట్టణంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులతోపాటు పశువులపై దాడులకు పాల్పడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జనం వీధిలోకి వచ్చేందుకు భయపడే పరిస్థితి నెలకొంది. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా.. పురపాలక యంత్రాంగంలో కదలిక లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

దూడను చుట్టుముట్టి..

ఇటీవల అమలాపురం దేవాంగులవీధిలో ఆవుదూడ నడుచుకుని వెళ్తుంటే కుక్కల గుంపు చుట్టుముట్టి దాడి చేశాయి. తీవ్ర గాయాలపాలై నరకయాతన అనుభవించింది. ఈ దృశ్యాలు అక్కడి సీసీటీవీలో నమోదయ్యాయి. గతంలో కబేళా వద్ద కార్యాలయంలో కుక్కలకు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. సిబ్బంది లేకపోవడంతో తర్వాత దానిని మూసివేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కల నియంత్రణ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దేవాంగులవీధిలో దూడపై కుక్కల దాడి

బయటకు రావాలంటే భయం..

అమలాపురంలో శునకాలు పగలూ రాత్రీ తేడా లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నాయి. రాత్రివేళ చీకటి ప్రదేశాల్లో వాహనాలతో, నడుచుకుంటూ వెళ్లేవారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బాధితులుగా మారుతున్నారు.

చర్యలు చేపడతాం..

కుక్కలకు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కార్యాలయ ఆవరణలో దీనికోసం ఓ గది కేటాయించాం. కుక్కల కేజ్‌లు సిద్ధంగా ఉన్నా వాటిని సంరక్షించేవారు లేరు. అందుకే ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. -వి.నిర్మల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: అమలాపురం నల్లవంతెన దిగువన రావులచెరువుకు వెళ్లే ప్రాంతంలో మురుగుకాలువ పూడుకుపోయి దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. -కేశవ, స్థానికుడు

సమస్య: సూర్యనగర్ శివారున చెత్తవ్యర్థాలు పేరుకుపోయాయి. -మహాలక్ష్మి, స్థానికురాలు

సమస్య: పురపాలక సంఘ కార్యాలయం ఎదురుగా మురుగుకాలువలో పూడికలు పేరుకుపోయి మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. -కాశీ, వ్యాపారి

సమస్య: సినిమారోడ్డులో మురుగుకాలువ రాళ్లవ్యర్థాలతో నిండి పూడుకుపోయింది. -అబ్బస్, వ్యాపారి

సమస్య: శ్రీరామ్‌నగర్‌లో చెట్లను కొట్టి రోడ్డుకు అడ్డంగా పడవేశారు. -ప్రకాష్, స్థానికుడు

పరిష్కారం: ఈ సమస్యలను సచివాలయ కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948

అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166

కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

యానాంలో కాంగ్రెస్ పాదయాత్ర

పాదయాత్రలో వైద్యలింగం, మాజీ సీఎం నారాయణసామి బృందం

యానాం, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి వైఫల్యాలపై ప్రజల్ని చైతన్యపరిచే లక్ష్యంతో కాంగ్రెస్ తలపెట్టిన పాదయాత్ర 'వాక్ ఫర్ యానాం' మంగళవారం యానాంలో సాగింది. స్థానిక సుబ్రహ్మణ్యభారతి వీధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన యాత్రలో పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ వి.వైథిలింగం, మాజీ సీఎం వి.నారాయణసామి, ఎమ్మెల్యే వైద్యనాథన్, కార్తికేయన్, ఇళయరాజా పాల్గొన్నారు. యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరదాని దినేష్, ఇన్‌ఛార్జి కాటంశెట్టి రామ్మూర్తి, విళ్ల చిన్ని, మేధానిధిశర్మ యాత్రను నిర్వహించారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న మల్లాడి: కాంగ్రెస్ పాదయాత్ర అనంతరం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ నేతలంతా దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును తీవ్రంగా విమర్శించారు. మల్లాడికి తన వ్యక్తిగత అభివృద్ధి తప్ప ప్రజల సంక్షేమం పట్టదని ఎంపీ వైథిలింగం ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మల్లాడి గో బ్యాక్ ప్రజల నినాదం కావాలన్నారు. ఓటమి భయంతోనే 2021 ఎన్నికల్లో మల్లాడి పోటీ చేయలేదన్నారు. గత అయిదేళ్లలో యానాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని మాజీ సీఎం వి.నారాయణసామి అన్నారు. యానాం అభివృద్ధిని మల్లాడి అడ్డుకుంటున్నారన్నారు.

'గో బ్యాక్ వ్యాఖ్యలు సరికాదు'

యానాం, న్యూస్‌టుడే: దరియాల తిప్ప వచ్చిన ఎంపీ వి.వైథిలింగంను స్వార్థ రాజకీయం కోసం గో బ్యాక్ అంటూ కొందరు నిరసన తెలపడం సరికాదని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన సమస్యల్ని పార్లమెంటులో ప్రస్తావించాల్సిన ఒకే ఒక ఎంపీ ఆయన మాత్రమేనని అన్నారు. ఇలా నిరసన తెలపడంవల్ల మన కన్ను మనమే పొడుచుకున్నట్లు అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనందాల డోలిక

● నారా లోకేశ్‌తో ప్రజాప్రతినిధుల భేటీ

అమలాపురం పట్టణం, ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ కూటమి ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో మంగళవారం విందు ఇచ్చారు. ఈసందర్భంగా లోకేశ్ నేతలతో సంభాషిస్తూ.. తన తమ్ముడు, అమలాపురం ఎంపీ జీఎం హరీష్ బాలయోగికి మూడు నెలల్లో పెళ్లి చేయాలని, సంబంధాలు చూడాలని వ్యాఖ్యానించారు.

లోకేశ్‌కు ఆయన కుటుంబ చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, కుటుంబ సభ్యులు

మంత్రి లోకేశ్‌తో అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు కుటుంబ సభ్యులు

ప్రేమ పెళ్లిళ్లపై చర్చ..

ప్రేమ పెళ్లిళ్లపై ఆసక్తికరమైన చర్చ సాగింది. ప్రేమించి, ఇరుపక్షాలనూ ఒప్పించి పెళ్లి చేసుకున్నామని, ప్రేమ వివాహమే మా జీవితాలకు వెలుగునిచ్చిందని ఎంపీ సానా సతీష్‌బాబు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తమ ప్రేమ కథలను ప్రస్తావించారు.

జాతీయస్థాయి పోటీలకు యశస్విని

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాలిదేవర యశస్వినికి అండర్-14 సబ్ జూనియర్ జాతీయస్థాయి వాలీబాల్ ఆంధ్రప్రదేశ్ జట్టులో చోటు దక్కింది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లోని జరుగుతున్న పోటీల్లో ఆమె ఆడుతోంది. ఆ విద్యార్థినిని ఎమ్మెల్యే ఆనందరావు, ఏఎస్ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, అరిగెల ముసలయ్య, హెచ్ఎం కనకదుర్గ, పీడీలు అభినందించారు.

పిల్లల విద్యా సామర్థ్యాల పరిశీలన

మామిడికుదురు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి రూపొందించిన ప్రకారం 3 నుంచి 5 తరగతుల విద్యార్థుల్లో అన్ని పాఠ్యాంశాలపై సామర్థ్యాలు పెంచేందుకు ఉద్దేశించిన 75 రోజుల కార్యక్రమాన్ని సమర్థంగా పూర్తి చేయాలని సమగ్రశిక్షా సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. పాశర్లపూడిలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను మంగళవారం ఆయన పరిశీలించారు. చక్కగా చదవడం, రాయడం, గణితాన్ని అర్థం చేసుకుని నైపుణ్యాలను పెంచుకునేలా తీర్చిదిద్దాలన్నారు. 2026-27 విద్యాసంవత్సరానికి ఇవ్వనున్న బూట్ల కొలతల వివరాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయిని ఎన్.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరల బోర్డులు ప్రదర్శించాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఔషధ దుకాణాల వద్ద జీఎస్టీ తగ్గింపు ధరల బోర్డులు ప్రదర్శించాలని కోనసీమ వినియోగదారుల సమాఖ్య ఛైర్మన్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు అరిగెల బలరామ్మూర్తి కోరారు. ఏ మందు ఎంతమేర తగ్గిందో ప్రజలకు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు.

మట్టిలో మాణిక్యాలు

● ఎస్సై పోస్టులకు ఎంపికైన యువకులు

న్యూస్‌టుడే, యానాం

ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదివితే లక్ష్యం ఎంత కష్టమైనా సాధించవచ్చని ఈ యువకులు నిరూపించారు. పుదుచ్చేరి పోలీసుశాఖ 70 ఎస్సై పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల్లో యానాం నుంచి ఆరుగురు యువకులు ఎంపికయ్యారు. వారిలో కొందరి కోసం.

ఇటు చదువు.. అటు కుటుంబ భారం..

21 ఏళ్ల గొల్లపల్లి కుమార్ రాజా నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన కుమార్ రాజా పదో తరగతి పరీక్షలు రాసిన తర్వాత నుంచి పేపర్‌బాయ్‌గా పని చేస్తూ తల్లిదండ్రులు హనుమంతరావు, పార్వతిలకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఎస్ఆర్‌కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థి తండ్రికి రెండేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. తల్లి గృహిణి. సోదరి పీజీ చదువుతున్నారు.

కుమార్ రాజా

స్థానిక విష్ణాలయంవీధిలోని పాల దుకాణంలో పనిచేస్తున్న రాజా రోజూ రెండు పూటలా ఇంటింటికీ పాలు సరఫరా చేసి నెలకు రూ.5వేలు సంపాదిస్తున్నాడు. అమ్మమ్మ అందించే ఆర్థిక సహకారం తన జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఎస్సైగా ఎంపికవడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆ యువకుడు పేర్కొన్నాడు. మనసు, మాట, చేత ఒకటిగా ఉంటే విజయం సాధ్యమని స్వామి వివేకానందుడు చెప్పిన మాటలు తనలో ధైర్యాన్ని నింపి వెన్నుదన్నుగా నిలిచాయని పేర్కొన్నాడు.

సొంతంగా చదివి..

ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగా చదివి మట్టపర్తి జ్యోతిప్రకాష్ ఎస్సైగా ఎంపికై తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. పాండిచ్చేరి ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ చదివి, చెన్నై టీసీఎస్‌లో పనిచేస్తున్న ఈ 23 ఏళ్ల యువకుడు కష్టపడి చదివి ఎస్సై పోస్టుకు ఎంపికయ్యాడు. జ్యోతిప్రకాష్ తండ్రి గణేష్ తాపీ మేస్త్రిగా పనిచేస్తుండగా తల్లి భవాని గృహిణి. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే తాను ఈ విషయం సాధించానని చెప్పాడు. ప్రకాష్ సోదరుడు లక్ష్మీనారాయణ ఇటీవలే పుదుచ్చేరి ప్రభుత్వం నిర్వహించిన అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపియ్యాడు.

జ్యోతిప్రకాష్

ముగిసిన టెక్ మేనియా వేడుకలు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్ మేనియా 2026 ముగింపు వేడుకలను మంగళవారం నిర్వహించారు. జేఎన్‌టీయూకే అధ్యాపకుడు డాక్టర్ ఎన్.రామకృష్ణయ్య, ఇన్నోవేషన్ డైరెక్టర్ పెన్మెత్స వంశీకృష్ణంరాజు అతిథులుగా హాజరయ్యారు. సాంకేతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. బీవీసీ గ్రూప్ అధినేత బోనం కనకయ్య, కన్వీనర్లు ఎ.ఎన్.వి.జె.రాజగోపాల్, డాక్టర్ టి.ఎస్.ఎన్.ఫణి, ఏవో జక్కం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్ సేవలు ప్రశంసనీయం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీగా మధుసూదన్ అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు అధికారులు కొనియాడారు. జడ్పీ సీఈవోగా ఉద్యోగోన్నతిపై ఆయన బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనను సత్కరించారు.

మధుసూదన్‌ను సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

మహారాజశ్రీ నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టు, రాజమండ్రి

O.S.No. 770/2023

Between:

సదా ఉషశ్రీ ... వాది

And

మరుకుర్తి రాజయ్య మరియు 7 గురు ఇతరులు ...ప్రతివాదులు

6వ ప్రతివాది

ఎలప్రోలు పద్మ, భర్త చిట్టిబాబు, డోరు నెం 3-765, విష్ణు వీధి, యానాం, పాండిచ్చేరి

పై నెంబరు దావాలో 6వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుంచి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు కావాలనీ తీసుకోకుండా, తిప్పి పంపుచున్నారు. అందువలన కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన చేయించడమైనది. అందువలన పై కేసు వాయిదా అయిన 02-03-2026న ఉదయం 10:30 ని॥లకు మీరు స్వయముగా గాని, మీ లాయరు ద్వారా గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలియ చేయవలెను. లేనిచో మీ పరోక్షములో వ్యవహారము నిర్ణయించబడును.

పి. సూర్యనారాయణ మూర్తి

వాది యొక్క లాయరు రాజమండ్రి

సెల్: 98856 65808

మన్‌కీ బాత్.. విద్యార్థుల భావి జీవితానికి ఉపయుక్తం

పామర్రు : దేశ సమగ్రాభివృద్ధికి, విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి, వారి భావి జీవితం ప్రకాశానికి ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమం దోహదం చేస్తోందని భాజపా నాయకులు వ్యాఖ్యానించారు. పామర్రులో విద్యార్థులతో కలిసి మంగళవారం కార్యక్రమ గోడపత్రికలు ఆవిష్కరించారు. నాయకులు కొప్పిశెట్టి చంద్రరావు, ఎ.వి.రమణమూర్తి, సలాది శేఖర్, గుర్రాల సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీవెంకటరమణ, వాసంశెట్టి గోవిందు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు యర్రా ఈశ్వరుడు పర్యవేక్షించారు.

'ముద్రగడ కాపులకు చేసిందేమీ లేదు'

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: కాపునేతగా చెప్పుకునే ముద్రగడ పద్మనాభం కాపులకు చేసింది ఏమీ లేదని రాష్ట్ర ఆక్వాకల్చర్ అథారిటీ బోర్డు డైరెక్టర్ దేశంశెట్టి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో మంగళవారం కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న రోజే.. మీరు కాపుల శ్రేయస్సు గురించి మాట్లాడే అర్హత కోల్పోయారని, అంబటి రాంబాబు వంటి నేరస్థులను కులం పేరుతో వెనకేసుకు రావడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వంలో మాత్రమే కాపులకు పూర్తి న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, చిక్కం సుధ, సూర్యమోహన్, గణిశెట్టి అరవింద్, మంచెం బాలకృష్ణ, రవణం మధు, మద్దిశెట్టి సీతారామస్వామి, నల్లా సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, చీకట్ల ఏసుబాబు, సలాది నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ద్రాక్షారామ విద్యార్థుల ప్రతిభ

చిన్నారులను అభినందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఆర్సీఎం చర్చిలో ఈనెల 22న నిర్వహించిన కరాటే పోటీల్లో ద్రాక్షారామకు చెందిన పలువురు చిన్నారులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ (కటా) విభాగంలో కె.విష్ణువర్ధన్, ఎ.సంతోష్, వి.మహేష్‌కార్తీక బంగారు పతకాలు, కుమితే విభాగంలో కె.విష్ణు, జి.శ్యామ్, టి.ధనుష్, సీహెచ్.మోక్షసాత్విక, వి.మహేష్‌కార్తీక్, ఎ.సంతోష ప్రథమస్థానాలు సాధించారు. జూనియర్ కుమితే విభాగంలో పి.కిషోర్‌రాజు, బి.సంతోష్, ఎ.జయరామ్ విష్ణు ద్వితీయ స్థానాలు, ఎస్.ఇష్ణ, పి.చైతన్య, ఆర్.రీతు, ఆర్.ధనుష్, కె.విఘ్నేష్, ఆర్.పవన్‌వెంకటరెడ్డి తృతీయ స్థానాల్లో నిలిచారు. వారిని మంగళవారం పీవీఆర్ కళాశాల ప్రాంగణంలో వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

హసనబాదలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: హసనబాద గ్రామంలో మంగళవారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మెయిన్‌రోడ్డు ప్రధాన డ్రైనేజీలో పేరుకుపోయిన పూడిక తొలగించారు. కార్యదర్శి ఎస్.ప్రసాదరెడ్డి, వీఆర్వో సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో పశు వైద్య శిబిరం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం కొత్తూరులో పశువైద్య సహాయ సంచాలకుడు ఒ.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సేవలందించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి ప్రారంభించిన శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి విశ్వతేజ, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు గుణ్ణం రామకృష్ణ తదితరులు సహకారం అందించారు. ఈ సందర్భంగా గుణ్ణం రామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో పి.అనిల్ విల్సన్‌వాస్, డాక్టర్ ఎం.కృష్ణార్జున పాల్గొన్నారు.

ఈశ్వరీబాయికి నివాళి

ముమ్మిడివరం: భారత రిపబ్లికన్ పార్టీ నాయకురాలు, మహిళల హక్కుల పోరాట యోధురాలు ఈశ్వరీబాయి వర్ధంతిని ముమ్మిడివరంలో ఆర్పీఐ జిల్లా కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. స్థానిక బుద్ధాపార్కు వద్ద ఈశ్వరీబాయి చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దోనిపాటి ఆంజనేయులు, గిడ్డి ప్రసాద్, వడ్డి నాగేశ్వరరావు, పీవీ చక్రవర్తి, కాశి సత్యనారాయణ, సింహాద్రివర్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానంలో విద్యుత్తు దీపాలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం చంద్రబాబు ఉద్యానంలో త్వరలో పూర్తిస్థాయిలో కొత్త విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం ఉద్యానాన్ని పరిశీలించారు. కొన్ని రోజులుగా విద్యుత్తు దీపాలు వెలగక అంధకారం అలముకుంటోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ డీఈ సత్యనారాయణ, ఏఈలు వెంకటేష్, భాస్కర్, త్రినాథ్‌లతో చర్చించారు. రూ.8 లక్షల వ్యయంతో 24 విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి, లైట్లు అమర్చేందుకు అనుమతులు జారీ చేశామన్నారు. నెలరోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారును ఆదేశించారు. అంతవరకు తాత్కాలికంగా విద్యుత్తుదీపాలు ఏర్పాటు చేస్తామన్నారు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ప్రపంచానికి శాంతిని పంచిన బుద్ధుడి బోధనలు ఆచరణీయమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) జిల్లా అధ్యక్షుడు కుశల రత్న బోధి అన్నారు. ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టు వద్ద బుద్ధాపార్కులో బీఎస్ఐ జిల్లా లీగల్ సెల్ సలహాదారు దోనిపాటి ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కుశల రత్న బోధి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాశీబాబు జగజ్జీవన్‌రామ్, దాసరి వెంకటరమణ, వడ్డి నాగేశ్వరరావు, యలమంచిలి బాలరాజు, పీవీ చక్రవర్తి, బుడితి శరత్ తదితరులు పాలొన్నారు.

సహకార ఉద్యోగుల భిక్షాటన

ముమ్మిడివరంలో భిక్షాటన నిర్వహిస్తున్న సహకార ఉద్యోగులు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. ముమ్మిడివరం సబ్ డివిజన్ పరిధిలోని సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. సమ్మెకు కూటమి నాయకులు, పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్లు గొలకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు, గోదశి పుండరీష్ మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన

రామచంద్రపురం: రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్‌వాడీ సిబ్బంది మోకాళ్లపై నిల్చుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీరలక్ష్మి మాట్లాడారు.

ముమ్మిడివరం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం కొనసాగాయి. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.జయలక్ష్మి, జి.అనంతలక్ష్మి, వెంకటరమణ, సీఐటీయూ నాయకులు జి.దుర్గాప్రసాద్, సకిలే సూర్యనారాయణ పాల్గొన్నారు.

అరికట్టలేరా.. పాపాలు

ఈనాడు, రాజమహేంద్రవరం, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఒకప్పుడు రైతులు పాడి పశువులను పోషిస్తూ పాల వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం ఉపాధి మార్గంగా మార్చుకొన్న కొంతమంది ఇందులోకి వస్తున్నారు. నగరాల్లో కాస్త స్థలం ఉంటే షెడ్డు వేసి గేదెలను పెట్టి, వ్యాపారం ప్రారంభించేస్తున్నారు. నీళ్లు కలపని పాలు అంటూ ప్రచారం చేస్తూ లీటరు రూ.100కు పైగా విక్రయిస్తున్నారు. రాజమహేంద్రవరం, చుట్టుపక్కల పట్టణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఇంత జరుగుతున్నా పురపాలిక, పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. లాలాచెరువు పరిధిలోని పాల కల్తీ ఘటనతో యంత్రాంగం నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

1.60 లక్షల కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాలో 1.60 లక్షల పాల కేంద్రాలు ఉండగా 50 శాతం పట్టణాల్లోనే ఉండటం గమనార్హం. అందులో ఎక్కువ శాతం రైతులు కాకుండా వ్యాపారులే నిర్వహిస్తున్నారు. వీరికి పశువుల పెంపకంలో ఎలాంటి అవగాహన ఉండట్లేదు. దీనికితోడు నాణ్యతా ప్రమాణాలు పాటించడం కూడా ప్రశ్నార్థకంగానే మారింది. అధిక దిగుబడి కోసం గేదెలకు ఇంజక్షన్లు, నిల్వ ఉండటానికి, పాల చిక్కదనం కోసం రసాయనాలు కలుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పురపాలిక అధికారులు తనిఖీలు చేయాల్సి ఉండగా మామూళ్ల మత్తులో చూడట్లేదనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

అధిక లాభాల కోసం..

కొంత మంది పశుపోషకులమనే పేరుతో రోజూ 10 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి నగరాలకు సరఫరా చేస్తున్నారు. దీనికోసం గ్రామాల్లో పాలను సేకరించి అక్కడే ప్రాసెసింగ్ చేస్తున్నారు. వెన్న గ్రేడింగ్ బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. దీనికోసం అసలైన రైతుల నుంచి సేకరించి, అధిక లాభాల కోసం వివిధ ప్రక్రియల పేరుతో ఏవేవో కలిపేస్తున్నారు.

6 లక్షల జనాభా..

రాజమహేంద్రవరం నగరం, గ్రామీణం పరిధిలో 6లక్షలకు పైగా జనాభా ఉంది. రోజుకు ఒక వ్యక్తికి పావులీటరు పాలు అవసరమని పశుసంవర్ధక శాఖ చెబుతోంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం అంత మందికి అందించే పరిస్థితి లేదు. కానీ డిమాండ్ ఉండటంతో కల్తీ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

నరసాపురంలో అనధికారికంగా నిర్వహిస్తున్న వరలక్ష్మి డెయిరీ

గుర్తించిన ప్రధాన అంశాలు

- కోరుకొండ, రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల నుంచి రాజమహేంద్రవరానికి సుమారు 61 మంది పాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.
- లాలాచెరువు పరిధిలో కల్తీ నేపథ్యంలో నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నారు. ఇప్పటివరకు 30 మంది నుంచి సేకరించగా, మిగిలిన వారి నుంచి బుధవారం సేకరించనున్నారు.
- చాలామంది అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇలాంటివి సుమారు 10 ఉంటాయని అంచనా. వాస్తవానికి వీటి ఏర్పాటుకు ఏ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి, పర్యవేక్షణ ఎవరనే దానిపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో మాయగాళ్లు రెచ్చిపోతున్నారు.

సర్వజన.. సౌకర్యాలు మమ..

- కిడ్నీ వైద్యనిపుణుడు లేక రోగులంతా ప్రైవేటుకే
- రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఇక్కట్లు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

కల్తీ పాల ఘటనతో రాజమహేంద్రవరం వణుకుతోంది. ఆరుగురు మృత్యువాత పడడంతో పాటు పలువురు నగరంలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇలాంటి సమయంలో సర్కారు ఆసుపత్రి చేతులెత్తేయడం కలవరపెడుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రాధాన్యమున్న నగరానికి వైద్యపరంగా కష్టమొస్తే 60 కి.మీ.ల దూరంలోని కాకినాడ జీజీహెచ్ లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి. రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రిలో నెఫ్రాలజీ (మూత్రపిండాల వైద్య విభాగం) అందుబాటులో లేక రోగులు నరకం చూస్తున్నారు.

- రాజమహేంద్రవరంలో కిడ్నీ కల్లోలానికి సంబంధించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 17న మూత్రం అవ్వక చేరిన మూడేళ్ల బాలుడికి ఇక్కడ చికిత్స అందుబాటులో లేక కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లారు. అక్కడా సరైన వైద్యం అందక మళ్లీ రాజమహేంద్రవరానికి తీసుకొచ్చి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మరికొంతమందిదీ అదే పరిస్థితి.

అప్‌గ్రేడ్ చేసినా..

రాజమహేంద్రవరం వైద్యశాలను 2022లో బోధనాసుపత్రిగా మార్చి వైద్యకళాశాలకు కేటాయించారు. దీంతో రోగుల తాకిడి విపరీతంగా పెరిగింది. సౌకర్యాలు పెంచలేదు. వైద్యులు, సిబ్బందిని కేటాయించలేదు. పేరుకే వైద్యకళాశాల నెఫ్రాలజీతోపాటు గుండె, గ్యాస్ట్రో ఎంటరాలజీ వంటి వసతులు కల్పించలేదు. మొదటి బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు బయటికొచ్చాక ఒక్కొక్కటిగా సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

రోజుకు 100 మంది..

ప్రస్తుత జీవనశైలి ప్రకారం జిల్లాలో 30 శాతం మందికి అధిక రక్తపోటు(బీపీ), మధుమేహం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదుపు లేని మధుమేహం, బీపీతో కిడ్నీ సంబంధిత సమస్యలు వస్తాయి. ఈ జంట జబ్బులతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు రోజుకు సుమారు 100 మంది వస్తుంటారు. వీరిలో 30-40 శాతం మందికి కిడ్నీ సంబంధిత ఇబ్బందులు ఉంటున్నాయని ఓ వైద్యనిపుణుడు నిర్ధారించారు.

జీజీహెచ్‌లో పీపీపీ విధానంలో నడుస్తున్న డయాలసిస్ యూనిట్

విపత్తులోనూ వైద్యం లేదు..

ఇంతటి విపత్తులోనూ కిడ్నీ రోగులకు సేవలు లేవు. ఇక్కడ పీపీపీ విధానంలో డయాలసిస్ యూనిట్ నడుస్తోంది. 200 మంది రోగుల్లో రోజుకు 75-80 మందికి డయాలసిస్ చేస్తున్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ వినియోగంలోకి వస్తే 4 డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి వస్తాయి. నెఫ్రాలజీ విభాగాన్ని కేటాయిస్తే మేలు జరుగుతుంది.

చిన్నశేష వాహనంపై చిద్విలాసుడు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్కు సమీపంలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని చిన్నశేష వాహనంపై ఊరేగించారు. రాత్రి గోవిందమాలధారులు స్వామి, అమ్మవార్లను హంస వాహనంపై ఊరేగించారు.

ఆర్ఎంసీలో కొత్తగా నియోనాటాలజీ విభాగం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో కొత్తగా నియోనాటాలజీ విభాగం ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విభాగం ఏర్పాటుతో ఆర్ఎంసీ కళాశాలకు ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు అందుబాటులోకి వస్తాయి. పుట్టిన శిశువులకు మెరుగైన వైద్యం త్వరితగతిన అందించేందుకు వీలు కలుగుతుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ విభాగం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కళాశాలకు నియోనాటాలజీ విభాగం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ హర్షం వ్యక్తం చేశారు.

అంతులేని వేదన

- ఆసుపత్రుల్లో 15 మంది కల్తీ పాల బాధితులు
- కేసులు పెరగడంపై ఆందోళన
- చిన్నారి మృతితో స్వరూప్‌నగర్‌లో విషాదం

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, టి.నగర్, కంబాలచెరువు, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలో కల్తీ పాల కల్లోలం కొనసాగుతోంది. బాధితులు, మృతుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆందోళన నెలకొంది. సోమవారానికి 12 మంది బాధితులు ఉండగా మంగళవారానికి ఆ సంఖ్య 15కు చేరింది. విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బి.మనోహర్ (6) అనే బాలుడు మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మరో 8 మంది పరిస్థితి విషమంగానే ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. బాధితులను మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బీవీ చౌదరితో కలిసి ఎంపీ పురందేశ్వరి పరామర్శించారు.

110 కుటుంబాల రక్తనమూనాల విశ్లేషణ..

కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన పాల వ్యాపారి గణేశ్వరరావు పాలు వేసిన 110 ఇళ్లను అధికారులు మ్యాపింగ్ చేసి ఆయా కుటుంబాల్లో 315 మంది రక్తనమూనాలు సేకరించారు. ఇద్దరికి సీరం క్రియేటిన్ స్థాయి మోతాదుకు మించి ఉన్నట్లు గుర్తించారు. వారిలో ఒకరిని ఆసుపత్రిలో చేర్చగా మరొకరిని చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుటుంబాలన్నింటికీ మరో దఫా రక్తపరీక్షలు చేయాలని, కొన్ని రోజులు ఈ ప్రక్రియ కొనసాగించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. లాలాచెరువు పరిసర ప్రాంతాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్క్రీనింగ్ చేశాయి.

మృతుడు శేషగిరిరావు బంధువులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి, రుడా ఛైర్మన్ బీవీఆర్ తదితరులు

రాజమహేంద్రవరంలోని ఆసుపత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎంపీ పురందేశ్వరి

అందరికీ అత్యవసర విభాగంలోనే..

ఆసుపత్రుల్లో 15 మంది చికిత్స పొందుతుండగా కడలి కృష్ణారావు (64), రితిక్ (2), సూర్యకుమారి (62)లను వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ చేస్తున్నారు. రుహన్య (అయిదు నెలలు), ఆర్.రామలక్ష్మి (75) వెంటిలేటర్‌పై ఉండగా, పి.నాగేశ్వరరావు (70), జి.వెంకటేశ్వరరావు (67), జి.వెంకటలక్ష్మి (69)లకు డయాలసిస్ చేస్తున్నారు. రెడ్డి అనంతలక్ష్మి (65), ఎన్.నూకరాజు (62), బి.అనంతలక్ష్మి (72), జైక్రిత్‌రాజ్ (2.9), జి.సూర్యారావు (79), బందారు వీరలక్ష్మి (60), కె.సత్యనారాయణ (82) ఐసీయూలో ఉన్నారు.

గణేశ్వరరావును కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

ప్రైవేటు ఆసుపత్రులో చికిత్స పొందుతున్న బాధితుల మెరుగైన వైద్యానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వారి వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

అందుబాటులో హెల్ప్‌లైన్ నంబరు..

పాల వ్యాపారి నుంచి కొనుగోలు చేసిన పాలు, ఇతర పదార్థాలు ఇళ్లలో ఏమున్నా తినొద్దని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. వాంతులు, మూత్ర విసర్జన సంబంధిత సమస్యలు, అనుమానిత లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్నట్లయితే **94940 60060** హెల్ప్‌లైన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

లక్ష్మీనరసింహా.. సమస్యలు కనుమా..

ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఒకటి. రెండురోజుల్లో స్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. కొన్ని వేల మంది వస్తారు. కొండ ప్రదక్షిణకు ఏర్పాటు చేసిన కాలిబాట మార్గం అధ్వానంగా ఉంది. కొండ చుట్టూ రహదారికి ఆనుకుని అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పలుచోట్ల వ్యర్థాలు పేరుకుపోయాయి. దేవుని కోనేరులో స్నానాలు చేయడానికి మెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. – న్యూస్‌టుడే, కోరుకొండ

గిరి ప్రదక్షిణ మార్గం దుస్థితి

6 నెలలు.. 10 వేల మంది సందర్శకులు

- బొమ్మూరు సైన్స్ సెంటర్‌కు విశేష ఆదరణ

న్యూటన్ చలన నియమాలు అంటే ఏమిటి..? సాపేక్ష సిద్ధాంతం ఎలా పనిచేస్తుంది..? ఆధునిక భౌతికశాస్త్రంలో ఏయే అంశాలు ఉంటాయి.. వంటి విషయాలు ఎన్నిసార్లు విన్నా, చదివినా అర్థం కావట్లేదా? అయితే బొమ్మూరులోని సైన్స్ సెంటర్‌కు వెళ్తే టక్కున అర్థం అవుతాయి. వివిధ ప్రయోగాలను నేరుగా చూడటంతో త్వరగా అర్థం అవుతున్నాయని పిల్లలే చెబుతున్నారు.

గోదావరి ప్రవాహ నమూనాను వీక్షిస్తున్న విద్యార్థులు

బొమ్మూరు, హుకుంపేట, న్యూస్‌టుడే: బొమ్మూరులోని సైన్స్ సెంటర్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలోనే రెండో సెంటర్‌గా ప్రారంభమైన ఈ కేంద్రాన్ని 6 నెలల్లో 50కు పైగా పాఠశాలలు, కళాశాలల నుంచి 10వేల మంది విద్యార్థులు సందర్శించారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇక్కడకు వస్తున్నారు.

ఎన్నెన్నో విశేషాలు..

- కేంద్రంలో భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి సుమారు 50కు పైగా ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయి. గ్రీన్‌పార్కులో డైనోసార్, సముద్ర అలలు, సంగీత ధ్వనులు, సూర్యమండలం వంటి 18 విషయాలు చూడొచ్చు.
- కేంద్రంలోని కింద గదుల్లో సైన్స్‌తో సరదా ఆటలు, నీరు, కాంతి, విద్యుత్తుతో ప్రయోగాలు వంటివి ఉంటాయి.
- సెంటర్ పైభాగంలో అంతరిక్ష విశేషాలు, యాక్టివిటీ హాల్, ఇన్నోవేషన్ హబ్ వంటివి చూడొచ్చు. ఆటోరియంలో కొన్ని ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి వివరిస్తారు. మరికొన్నింటినీ విద్యార్థులూ చేయచ్చు.

సందర్శన నియమాలు..

- సోమవారం నుంచి శనివారం వరకు. ఆదివారం సెలవు. ఉదయం 9.30 నుంచి 5 గంటల వరకు సందర్శించవచ్చు.
- ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు రూ.25, ప్రైవేటు విద్యార్థులకు రూ.40, పెద్దవారికి రూ.50 ప్రవేశ రుసుం.
- ఆసక్తి ఉన్నవారు ఎవరైనా వెళ్లొచ్చు.
- కేంద్రానికి వచ్చే ఆదాయం విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి చేరుతుంది.

విద్యార్థులకు చక్కని వేదిక..

సైన్స్‌కు సంబంధించి అవగాహన పెంచుకోడానికి ఇదొక చక్కని వేదిక. స్వయంగా ప్రయోగాలు చూడటంతో ఎప్పటికీ గుర్తుంటుంది. సబ్జెక్టుపై పట్టు వస్తుంది. పెద్దలు సైతం చూడొచ్చు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి..

- ఎం.దుర్గాప్రసాద్, సైన్సు సెంటర్ మేనేజర్

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

శ్యామలా సెంటర్: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 52 కేంద్రాల్లో 18,888 మందికి 18,617 మంది హాజరవ్వగా 271 మంది గైర్హాజరయ్యారు. ● ఒకేషనల్ విభాగంలో 1,885 మందికి 1,794 మంది హాజరయ్యారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆకస్మిక తొలగింపు

- కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాజశేఖర్ కెనడీ

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పీవీవీ సత్యనారాయణను ప్రభుత్వం ఆకస్మికంగా తొలగించింది. ఆసుపత్రిలోని న్యూరో సర్జరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రాజశేఖర్ కెనడీని కొత్త సూపరింటెండెంట్‌గా నియమిస్తూ, పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. డాక్టర్ సత్యనారాయణ గతేడాది నవంబరు నుంచి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి జీజీహెచ్ వివాదాలకు కేంద్రంగా మారిందనే ఆరోపణలున్నాయి.

డాక్టర్ రాజశేఖర్ కెనడీ సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు రోగులకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన తెలిపారు.

యూపీకి గంజాయి రవాణా..

- అడ్డొస్తే తుపాకీతో బెదిరింపులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నుంచి ఉత్తరప్రదేశ్‌కు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను మంగళవారం మూడోపట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద తుపాకీ(పిస్టల్), 13 రౌండ్ల బుల్లెట్లు దొరకడంతో అవాక్కయ్యారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు 15 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరంలోని మల్లయ్యపేటకు వచ్చి స్థిరపడ్డారు. వారు, మరో ఇద్దరు స్థానికులు, యూపీకి చెందిన మరొకరు రాజమహేంద్రవరం నుంచి ఆ రాష్ట్రానికి గంజాయి తరలిస్తున్నారు. దారిలో ఎవరైనా ఆపితే వారిని తుపాకీతో బెదిరించి జారుకుంటారు. మంగళవారం కాతేరు వంతెన వద్ద కారులో వెళ్తున్న వీరిని పోలీసులు పట్టుకుని తనిఖీ చేశారు. అయిదు కిలోల గంజాయి, ఒక పిస్టల్, 13 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



(c) eenadu

17కిలోల బంగారు ధనస్సు దర్శనం

పాలంగిలో శివధనుస్సును దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఉండ్రాజవరం: అయోధ్య రామాలయంలో రాముల వారికి అందించనున్న 17 కిలోల బంగారంతో తయారు చేసిన శివధనస్సును పాలంగిలోని రామమందిరం వద్ద భక్తుల కోసం మంగళవారం అందుబాటులో ఉంచారు. హరివిల్లుతో పాటు బంగారు సీతాదేవి విగ్రహాన్ని, పాదుకలను తీసుకొచ్చారు. ఉండ్రాజవరం, తణుకు, నిడదవోలు నియోజకవర్గాల నుంచి తండోపతండాలుగా భక్తులు విచ్చేసి దర్శనం చేసుకున్నారు. స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ నెక్కంటి ప్రకాశ్, నిర్వాహకులు హరికృష్ణ, భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దర్శనం కోసం అందుబాటులో ఉంచిన బంగారు సీతాదేవి విగ్రహం

కెనరా బ్యాంక్ Canara Bank — ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591)
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాబాగ్, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్-530020, ఫోన్: 8332956773, 7095199455

హైపాథికేషన్ (P& M / STOCK) క్రింద డిమాండ్ నోటీసు

టు:
ఋణగ్రహీత : M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి మల్లిన శ్రీ దేవి, #12-1-10, ఇండస్ట్రియల్ ఏరియా, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
హామీదారులు/పార్ట్‌నర్స్ : 1) శ్రీమతి మల్లిన శ్రీ దేవి, భర్త : వెంకట శ్రీహరి రావు, 5-3-18, మెరక వీధి, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
2) శ్రీమతి మల్లిన లక్ష్మి తులసి, భర్త : ఎమ్. సత్యనారాయణ, 5-3-18, మెరక వీధి, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
3) శ్రీమతి పెమ్మసాని అన్నపూర్ణ, భర్త : మధు ప్రతాప్, డి నెం.18-03-62/29, న్యూ శాంతి నగర్, తిరుపతి-517502.
4) శ్రీమతి పి. ప్రశాంతి, భర్త : వెంకట రమణ, డి నెం.73-22-1/26, వెంకట రామయ్య నగర్, గెయిల్ ఆఫీస్ దగ్గర, వి ఎ రోడ్, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533101.
5) శ్రీ మల్లిన సత్యనారాయణ రావు, తండ్రి : వెంకటరావు, 5-3-18, మెరక వీధి, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
డియర్ సర్/మేడమ్,

విషయం: మా బ్యాంకుకు అనుకూలంగా ఋణగ్రహీత M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ వారిచే సృష్టించబడిన హైపోథికేషన్ యొక్క ఇన్వోకేషన్.

మా కెనరా బ్యాంక్ నుండి శ్రీమతి మల్లిన శ్రీ దేవి, శ్రీమతి మల్లిన లక్ష్మి తులసి, శ్రీమతి పెమ్మసాని అన్నపూర్ణ, శ్రీమతి పి. ప్రశాంతి, శ్రీ మల్లిన సత్యనారాయణ రావు వారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేదీ	ప్రస్తుత తేదీ నాటికి బకాయి మొత్తం వడ్డీతో	వడ్డీ రేటు
Synd MSE A/c No. 32517910000685	02.09.2015 తేదీన రూ.4,50,00,000/-	రూ.10,01,65,182.24/- తేది.21.02.2026 నాటికి	13.85%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని 29.06.2017 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన బకాయి రూ.10,01,65,182.24 (అక్షరాల పది కోట్ల ఒక లక్ష అరవై ఐదు వేల నూట ఎనభై రెండు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

P&M/Stock వివరములు : పశ్చిమ గోదావరి జిల్లా-534350, కోవూరు, ఇండస్ట్రియల్ ఏరియా, # 12-1-10 వద్ద మ్యానుఫాక్చరింగ్ ఆఫ్ క్యాటిల్ ఫీడ్స్‌కు చెందిన మెషినరీ M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ పేరున కలదు.
ఐటమ్ యొక్క పేరు : HARD CASE make animal feed plant poultry / Animal feed milling Plant, capacity 60 to 65 T/shift (08 hrs per shift)

1) Auto Batch weighing section -01 Nos	21) Transfer conveyor 02
2) Intake dumping hopper with magnetic grill - 02 Nos	22) Bucket elevator 2
3) Godown Chain Conveyor - 01 Nos	23) Batch Binn above the mixer -01
4) Bucket elevator - 01	24) Feed mixer -01
5) Cascading magnetic sapperator - 01 Nos	25) Variable freeqency drive-01
6) 3 way flap gate -01 Nos	26) Surge bin below the mixer -01
7) Distribution conveyor - 01 Nos	27) Transfer conveyor 3
8) Slide gate Pnuematically operated - 01	28) Bucket elevator 3
9) 2 way flap gate pneumatically operated - 02 Nos.	29) 2way flap gate pneumatic operated
10) Batching Binns -06.	30) Bin above molasis mixer
11) Discharges/screw feeders - 06 Nos.	31) Slide gate Pnuematic operated
12) Way hopper - 01 No.	32) Mollasis dosing system
13) Surge Hopper - 01.	33) Molasis mixer -01
14) Transfer conveyor.	34) Baging bin -01
15) Process control electronic -01 Nos.	35) 2way flap gate pneumatically operated -01
16) Connecting chutes & Hoppers	36) Automatic weiging & bagging machine -01
17) Main feed plant processing section.	37) Bage stiching machine
18) Bucket elevator -01	38) Mixing cycle monitoring
19) Bin above grinder with paddle feeder	39) MCC
20) Feed grinder -01	40) Cable & Motors
	41) Molasis tank with loading pump with motor

Total : Rs. 20,41,200/-
Remark if any : As per valuation dated 03/08/2025 issued by Er.Srinivasa Rao.
టైటిల్ హోల్డర్ : M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్
గమనిక: సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13 (2) ప్రకారం తేది.17.01.2026 నాటి మా మునుపటి డిమాండ్ నోటీసును రద్దు చేస్తూ ఈ నోటీసున జారీ చేయబడినది.

తేది : 21.02.2026 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం — కెనరా బ్యాంక్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, సికింద్రాబాద్, ఇ.నెం.5-9-76, 2వ అంతస్తు, ప్రభాత్ టవర్స్, అమరావతి LHO ఎదురుగా, చాపెల్ రోడ్డు, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్ - 500001. E-mail ID: team1samb.sec@sbi.co.in, Tel: 040-23251921
సంప్రదించవలసిన అధీకృత అధికారి యొక్క మొబైల్ నెం.: 9676057436 & 9912551100

[See to rule 8 (6) R/W 9(1)]

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8(6) R/W 9 (1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తి అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) వారికి ఋణగ్రహీత: మెస్సర్స్ కరుటూరి సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, మరియు హామీదారులు: 1. శ్రీ అమిత్ చతుర్వేది, తండ్రి : శ్రీ హృదయనాథ్ చతుర్వేది, డి.నెం.23-16-44, హరిపురం, జై గోపాల్ భవన్, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 533105. 2. శ్రీమతి రుచిత చతుర్వేది, భర్త : శ్రీ అమిత్ చతుర్వేది, డి.నెం.23-16-44, హరిపురం, జై గోపాల్ భవన్, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 533105 వారి నుండి రావలసిన తేది.31-01-2026 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.102,50,53,879/- (అక్షరాల నూట రెండు కోట్ల యాభై లక్షల యాభై మూడు వేల ఎనిమిది వందల డెబ్బై తొమ్మిది రూపాయలు మాత్రమే) + తేది.01.02.2026 నుండి ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే భౌతిక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/ఛార్జ్‌లో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతిపై" తేది: 16-03-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

ఇ-వేలం తేదీ : 16-03-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:25-02-2026 నుండి 15-03-2026 వరకు ఉ॥11.00 గం॥ల నుండి మ॥ 02.00 గం॥ల వరకు

షెడ్యూలు ఆస్తి వివరములు: లాట్-1: ఆస్తి నెం.1: ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, హరిపురం, లలిత నగర్ వద్ద వార్డు నెం.10, ఆర్.ఎస్.నెం.34 లోని డోర్ నెం.23-16-44తో, టిపి నెం.24/72, ప్లాట్ నెం.140-బి లోని 600 చ॥గ॥లు విస్తీర్ణం రెండు భాగాలుగా (పార్ట్ -ఎ: 250 చ॥గ॥లు లేదా 209.02 చ॥మీ॥లు మరియు పార్ట్ - బి: 350 చ॥గ॥లు లేదా 292.63 చ॥మీ॥లు) గల నివాస ఆస్తి యావత్తు (క్రిందీ అంతస్తు + మొదటి అంతస్తు) శ్రీ అమిత్ చతుర్వేది, తండ్రి : లేటు శ్రీ హృదయనాథ్ చతుర్వేది గారికి చెందినది. పార్ట్-ఎ: 250 చ॥గ॥లకు హద్దులు: తూర్పు : ప్లాట్ నెం.140-ఎకు చెందిన స్థలం (56'.3"), దక్షిణం : కొనుగోలుదారుకి చెందిన స్థలం (40'.0"), పడమర : ప్లాట్ నెం.141కు చెందిన స్థలం (40'.0"), ఉత్తరం : కో ఆపరేటివ్ మార్కెటింగ్ యార్డు (56'.3"). (డాక్యుమెంట్ నెం.2235/91, తేది.08.04.1991 ప్రకారం). పార్ట్-బి : 350 చ॥గ॥లకు హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.140-ఎకు చెందిన స్థలం (78'.9"), దక్షిణం : రోడ్డు (40'.0"), పడమర : ప్లాట్ నెం.141కు చెందిన స్థలం (78'.9"), ఉత్తరం: ఈ ప్లాటు (పార్ట్-1) లోని అమ్మకందారుని మిగిలిన స్థలం (40'.0"). (డాక్యుమెంట్ నెం.7092/90, తేది.05.10.1990 ప్రకారం).
డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్స్ ఆఫీస్, రాజమండ్రి వద్ద శ్రీ అమిత్ చతుర్వేది గారి తరపున రిజిష్టర్డు కాబడిన లేటు శ్రీ హృదయనాథ్ చతుర్వేది గారి రిజిష్టర్డు విల్ డాక్యుమెంట్ నెం.179/2008, తేది.04.06.2008 ప్రకారం.

రిజర్వు ధర : రూ.2,66,00,000/- ధరావత్తు : రూ.26,60,000/- బిడ్ పెంపుదల : రూ.50,000/-

లాట్-2: ఆస్తి నెం.2: ఎ) ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, హరిపురం, లలిత నగర్ వద్ద డోర్ నెం.23-16-1/1తో, టిపి నెం.20/53, ఆర్.ఎస్.నెం.34, ప్లాట్ నెం.129 & 130 లోని 240 చ॥గ॥లు లేదా 200.66 చ॥మీ॥ల విస్తీర్ణం గల నివాస ఆస్తి యావత్తు శ్రీ అమిత్ చతుర్వేది, తండ్రి : లేటు శ్రీ హృదయనాథ్ చతుర్వేది గారికి చెందినది. హద్దులు: తూర్పు : C.T.R.I. నకు చెందిన ఆస్తి (27'.0"), దక్షిణం : అమ్మకందారుని యొక్క తల్లి గారి ఆస్తి (80'.0"), పడమర : రోడ్డు (27'.0"), ఉత్తరం : అమ్మకందారుని మిగిలిన ఆస్తి (80'.0"). (డి.ఆర్.ఓ. రాజమండ్రి వద్ద రిజిష్టరు కాబడిన డాక్యుమెంట్ నెం.2442/2011, తేది.28.04.2011 ప్రకారం).
బి) ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, హరిపురం, లలిత నగర్ వద్ద డోర్ నెం.23-16-1/1తో, ఆర్.ఎస్.నెం.34, ప్లాట్ నెం.129 & 130 లోని 353.33 చ॥గ॥లు లేదా 295.41 చ॥మీ॥ల విస్తీర్ణం గల నివాస ఆస్తి యావత్తు శ్రీమతి రుచిత చతుర్వేది, భర్త : శ్రీ అమిత్ చతుర్వేది గారికి చెందినది. హద్దులు: తూర్పు : C.T.R.I. నకు చెందిన ఆస్తి (39'.6"), దక్షిణం : శ్రీ అమిత్ చతుర్వేది గారికి చెందిన ఆస్తి (80'.0"), పడమర : రోడ్డు (40'.0"), ఉత్తరం : రోడ్డు (80'.0"). (డి.ఆర్.ఓ. రాజమండ్రి వద్ద రిజిష్టరు కాబడిన డాక్యుమెంట్ నెం.2496/2012, తేది.23.04.2012 ప్రకారం).

రిజర్వు ధర : రూ.2,74,00,000/- ధరావత్తు : రూ.27,40,000/- బిడ్ పెంపుదల : రూ.50,000/-

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 19-02-2026, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SAM బ్రాంచ్, సికింద్రాబాద్

ఇక పరిమిత సమయమే!

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదుకు నాలుగు రోజులే గడువు

✦ చాగల్లు మండలం చిక్కాలలో పది వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఇది పది మండలాలకు చెందిన 150 మంది రైతుల పేరిట నమోదై ఉంది. వీరిలో ఎక్కువ మంది విదేశాల్లో ఉండడం, చనిపోవడం, వరవారి సంఖ్యల అనుసంధానం కాకపోవడం, చిరునామాలు మారిపోవడంతో అందుబాటులో లేరు. దీంతో రోజూ వీరి కోసం వ్యవసాయాధికారి, సిబ్బంది అన్వేషించాల్సి వస్తోంది.

– ఇక్కడే కాదు.. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి

పుడమి తల్లిని నమ్ముకుని ఆరుగాలం శ్రమించినా ఆ పంట చేతికందే అన్నదాతకు దిగులు తప్పడం లేదు. ప్రకృతి విపత్తులతో మద్దతు ధర పొందడం ఏటా ప్రహసనంగా మారుతోంది. ఇటు వంటి విపత్కర పరిస్థితుల్లో వారికి అండగా నిలిచేందుకు ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతుల నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది.

క్షేత్రస్థాయి వెతలివీ..

జిల్లా వ్యాప్తంగా 17,889 మంది ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కావాల్సిన వారిలో 19 మండలాల్లో కలిపి పొలాలు అమ్ముకుని వెళ్లిపోయిన వారు, చనిపోయిన వారు, ఇతరత్రా కారణాలతో 6743 మంది పేర్లు గుర్తించాల్సి ఉన్నాయి.

✦ చాలా మంది రైతులు సొంతూళ్లు వదిలి వ్యాపారం, పిల్లల సంరక్షణ కోసం వెళ్లిపోయారు. వారంతా స్థానికంగా అందుబాటులో ఉండటం లేదు.

✦ మరణించిన యజమానుల వారసులు భూములను తమ పేరిట మార్చుకోకపోవడం, ఆధార్‌తో ఫోను నంబరు అనుసంధానం కాకపోవడం వంటి సమస్యలతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

వెనుకబడిన మండలాలు

రాజానగరం, రంగంపేట, కోరుకొండ, గోపాలపురం, నిడదవోలు, అనపర్తి వంటి మండలాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రకారం రైతుల వివరాలు నమోదు సరిగా కాలేదని తెలుస్తోంది.

ఈనెలాఖరులోగా నమోదవ్వాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రైతు సంక్షేమ పథకాలు, ఆర్థిక చేయూత వంటి అంశాలకు విశిష్ట గుర్తింపు సంఖ్య కీలకం కానుంది. ఈనెలాఖరులోగా రైతులంతా విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేయించుకోవాలి.

- రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో ఇలా | రైతులు : 99524 | నమోదైనవారు : 81635 | ఇంకా కావాల్సినవారు : 11,146

వైభవం.. భక్తవత్సలుని బ్రహ్మోత్సవం

ఆత్రేయపురం: ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఏకాహ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సామూహిక కుంకుమార్చన వైభవంగా సాగింది. ఈ సందర్భంగా స్వామివారికి పారిశ్రామికవేత్త పాతపాటి వెంకట సత్యనారాయణరాజు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు విలువైన సర్వాభరణాలు చేయించారు. వాటికి సంప్రోక్షణ చేసి స్వామి వారిని అలంకరించారు. రాత్రి శ్రీవారు పురవీధుల్లో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు.

సర్వాభరణాలతో స్వామివారు

పాపికొండ నేషనల్ పార్కులోనే పెద్దపులి: సీసీఎఫ్

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలోని జనావాసాల్లో పట్టుకొన్న పెద్దపులి ప్రస్తుతం పాపికొండ నేషనల్ పార్కులోనే ఉందని, అది మళ్లీ జనావాసాల్లోకి రాకుండా అన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని రాజమహేంద్రవరం ప్రాంతీయ ముఖ్య అటవీ సంరక్షణాధికారి(సీసీఎఫ్) శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సాంకేతికతతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. రంపచోడవరం దగ్గర సున్నంపాడు తదితర ప్రాంతాల్లో జనావాసాల్లో మళ్లీ పెద్దపులి తిరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో కొన్ని వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోలు ఆ పులి సంబంధించినవి కావన్నారు. రేడియో కాలర్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఆ పులి స్వేచ్ఛగా అక్కడే రెడ్‌జోన్‌లో తిరుగుతుందని, దానికి ఆహారం కూడా అందుబాటులో ఉందన్నారు.

రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రాంతీయ ముఖ్య అటవీ సంరక్షణాధికారి శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి

త్వరలో టైగర్ జోన్ ఏర్పాటు..

పాపికొండ నేషనల్ పార్కులో గతంలో పెద్దపులులు, చిరుత పులులు ఎక్కువగా ఉండేవని, ఇప్పుడవి తగ్గిపోయాయన్నారు. ఇటీవల పట్టుకున్న పులి ప్రవర్తన మంచిగా ఉందని, పూర్తిగా పరిశీలించిన తర్వాతే పాపికొండల నేషనల్ పార్కులో వదిలిపెట్టామన్నారు. తోడు కోసం తిరుగుతూ ఇటు వచ్చినట్లుగా గుర్తించామన్నారు. దీనిని భర్తీ చేసేందుకు ఇతర రాష్ట్రాల అటవీ అధికారులతో మాట్లాడి రెండు ఆడ పులులను పాపికొండలు నేషనల్ పార్కుకు తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పులుల వృద్ధితో ఇక్కడి నేషనల్ పార్కులో టైగర్ జోన్ ఏర్పాటుకు బీజం పడుతుందన్నారు. వన్యప్రాణుల సంరక్షణ, అవగాహనకు మార్చి 3న గుంటూరులో 'హనుమాన్' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు.

బాధితులకు మెరుగైన వైద్యసేవలు: ఎంపీ పురందేశ్వరి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కల్తీ పాల ఘటనకు సంబంధించి బాధితులకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు చేపడుతున్నామని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరితో కలిసి ఆమె పరామర్శించారు. అనంతరం ఓ ఆసుపత్రి వద్ద ఆమె విలేకర్లతో మాట్లాడారు. సదరు పాల వ్యాపారి 42 మంది రైతుల దగ్గర నుంచి సేకరించి ఇళ్లకు పోస్తుంటారన్నారు. ఆ రోజు రాత్రి సేకరించిన పాలు డీప్ ఫ్రీజర్లో పెట్టగా చిల్లింగ్ రసాయనం ఇథలీన్ గ్లైకోల్ పాలల్లో కలిసిపోయిందన్నారు. దీంతో 60 ఏళ్లు పైబడిన వారు, అయిదేళ్లలోపు చిన్నారులపై ప్రభావం పడిందన్నారు. మధుమేహం, బీపీ ఉన్నవారికి మరింత ఇబ్బంది ఏర్పడిందని నిపుణులు చెబుతున్నారన్నారు. జిల్లా యంత్రాంగం దీనిపై వేగంగా స్పందించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి, బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే చిల్లింగ్ పరికరాల పనితీరుపై యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలపై సమీక్షించి చర్యలు చేపడతామన్నారు.

పసుపు నాణ్యతలో జాగ్రత్తలిలా..

రైతేరాజు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పసుపు పంటను సాగుచేసే రైతులు కొన్ని మెళకువలు పాటిస్తే మంచి ఫలితాలు పొందొచ్చని ఆత్రేయపురం ఉద్యానాధికారి కోటేశ్వరరావు సూచించారు. పొలంలో తవ్వి తెచ్చిన పచ్చి కొమ్ములను త్వరగా ఉడికించి ఆరబెట్టాలి. ఆలస్యమైతే నాణ్యత తగ్గుతుంది. దుంపలు, కొమ్ములను వేర్వేరుగా ఉడికించాలి. ఉడకబెట్టే సమయంలో అవి మునిగే వరకు నీరు పోయాలి. సమానంగా మంట పెట్టాలి. 45-60 నిమిషాలకు తెల్ల నురగ వచ్చి పొంగుతో మంచి సువాసన, పొగలు వస్తాయి. అప్పుడు చేతితో ఒత్తితే మెత్తగా ఉంటాయి. ఆ దశలో బయటకు తీసేయాలి.

ఆత్రేయపురంలో ఉడక బెట్టేందుకు సిద్ధం చేసిన పచ్చికొమ్ములు

ఎక్కువసేపు ఉడికిస్తే ఆరబెట్టిన తర్వాత రంగు తగ్గిపోతుంది.

ఉడికించడం ఇలా..

తల్లి, పిల్ల దుంపలను జల్లెడ రంధ్రాలున్న ఇనుప తొట్టెలో వేయాలి. ఇనుపతొట్టెలు ఉపయోగించకపోతే దీని కంటే కొంచెం పెద్ద పరిమాణం ఉన్న ఇనుప కాయిలో దించాలి. దుంపలు మునిగే వరకు నీరు పోయాలి. మెత్తబడే వరకు ఉడికించాలి. తర్వాత దుంపలున్న తొట్టెని పైకెత్తి పట్టుకుంటే ద్రావణం కాయిలోకి దిగిపోతుంది. ఉడికిన పసుపు కొమ్ములను పరిశుభ్రమైన నేలపై పోయాలి.

ఆరబెట్టండి ఇలా..

సమంగా ఉడికిన కొమ్ములను పరిశుభ్రమైన సమతలంగా ఉన్న నేలపైన లేదా టార్పాలిన్ లేదా సిమెంటు ప్లాట్‌ఫాంపైన పోయాలి. 24 గంటల తర్వాత రెండు, మూడు అంగుళాల మందం ఉండేలా పరచాలి. పలుచగా పరిస్తే ఎండిన పసుపు రంగు చెడిపోతుంది. 10-15 రోజులకు పసుపు తయారై కొమ్ములన్నీ ఒకే మాదిరిగా కనిపిస్తాయి. అప్పుడప్పుడు తిరగబెట్టి ఆరిన తర్వాత ఒక్కచోట చేసుకోవాలి.

తోటలలో.. అట్టలతో మేలు

మీ కోసం

అలమూరు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పసుపు రంగు అట్టలు వాడి పంటలను ఆశించే రసంపీల్చే పురుగులను అదుపులో ఉంచవచ్చని అలమూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డా.ఎస్.హెచ్.కె.వి.చౌదరి తెలియజేశారు. ముఖ్యంగా వంగ, మిరప, టమాట వంటి కూరగాయలు, పొద్దుతిరుగుడు తదితర వాణిజ్య పంటలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. మొక్కల కన్నా ఎత్తులో వీటిని ఏర్పాటు చేయాలి. తెల్ల, పచ్చదోమ, తామర పురుగుల ఉధృతిని అరికట్టడానికి బాగా పనిచేస్తాయి. వీటికి జిగురు లేదా గ్రీజు పూస్తే తెల్లదోమ, పచ్చదోమ, ఎర్రనల్లి, తామర పురుగులు అంటుకుని చనిపోతాయి. ముడత తెగులు సైతం తగ్గుతుంది. ఎకరాకు సుమారు 25 నుంచి 30 వరకు పసుపు రంగు అట్టలు అమర్చుకోవాలి.



చొప్పెల్లలో వంగతోటలో పసుపు అట్టలు

పశుసంపద వృద్ధికి మెలకువలు

కరప, న్యూస్‌టుడే: పాడి పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై కరప ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్ బాబు వివరించారు.

పాడి పశువులు

✦ సాధారణంగా గేదెలు చలి ఎక్కువగా ఉండే శీతాకాలంలో ఎదకు వస్తాయి. ఫిబ్రవరిలోనే ఈ కాలం ముగుస్తుంది. ఈ నెలలో గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయించకపోతే మళ్లీ జులై, ఆగస్టు వరకు సరిగా ఎదకు రావు. ఎద లక్షణాలను గమనించి వెంటనే గర్భధారణ చేయించాలి.

తెలుసుకుందాం..

✦ 90 శాతం పెయ్యి దూడలు పుట్టడానికి అవకాశం ఉన్న మేలుజాతి వీర్యాన్ని రాయితీపై కేవలం రూ.150కే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పాడి రైతులు వినియోగించుకోవాలి. తద్వారా పశుసంపదను త్వరితగతిన వృద్ధి చేసుకోవచ్చు.

పశువులు పాలు ఇస్తుండగానే చూడు కట్టినట్లయితే పాడి లాభదాయకంగా ఉంటుంది. ✦ నవంబరు లేదా అంతకంటే ముందుగా కృత్రిమ గర్భధారణ చేయించిన పశువులకు ఫిబ్రవరిలో చూడి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. ఒకవేళ చూడి కట్టకపోతే మందులు వాడాలి. లేదంటే 6 నెలల కాలం వృథా అవుతుంది. ✦ వేసవిలో పశుగ్రాసం కొరత నివారించుకోవడానికి ఇప్పటినుంచి సన్నద్ధంగా ఉండాలి. నీటివసతి ఉన్న భూముల్లో గ్రాసం పెంచుకోవడానికి ఏర్పాటు చేసుకోవాలి. అవకాశం లేనివారు యూరియాతో ఊరవేసిన వరిగడ్డిని తయారు చేసుకోవడం మంచిది.

వనామి సాగుకు సన్నద్ధమవుదాం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఆక్వా సీజన్ ప్రారంభమైంది. రొయ్యల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరంభం నుంచి ప్రణాళికాబద్ధంగా సాగాలని ఉప్పలగుప్తం మత్స్యశాఖ అధికారి బి.హేమానంద్ సూచిస్తున్నారు.

రొయ్యల సాగుకు సిద్ధం చేసిన చెరువు

● ముందుగా చెరువును నెర్రలు తీసేలా ఎండగట్టి ట్రాక్టరుతో దున్ని పైపొరను తొలగించి శుభ్రం చేయాలి. ఊలలు పడకుండా గట్లను పటిష్ఠం చేసుకోవాలి. అవసరం మేరకు చెరువులో సున్నం చల్లాలి. దీంతో వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులు, అవశేషాలు నశిస్తాయి.

● గత ఏడాది పంటలో ఈహెచ్‌పీ వ్యాధి సోకినట్లయితే మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. ఎకరా చెరువుకు మూడు టన్నుల రాతిసున్నం చల్లి నేల పీహెచ్‌ను 12 వరకు పెంచాలి. రెండు అడుగుల మేర నీటిని నింపి రెండు రోజులు ఉంచి తిరిగి బయటకు తోడేయాలి. దీంతో సంబంధిత వ్యాధి కారకాలు చాలావరకు నశిస్తాయి. తిరిగి తగిన మోతాదులో పొటాషియం పర్మాంగనేట్(పీపీ) వంటి ద్రావణాన్ని చల్లి పీహెచ్‌ను 7.5కు తగ్గించడానికి చర్యలు చేపట్టాలి.

● పాములు, తాబేళ్లు, పీతలు, కప్పలు, పక్షులు సమీప వ్యాధిగ్రస్త చెరువుల నుంచి రాకుండా బయో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి.

● చెరువులో ఐదు అడుగుల మేర నీరు నింపి ఉప్పదనానికి అనుకూలమైన రొయ్య పిల్లలను సీఏఏ అనుమతి పొందిన హేచరీల నుంచి సేకరించాలి. ప్రయోగశాలల్లో ప్రాముఖ్యమైన ఈహెచ్‌పీ, డబ్ల్యూఎస్ఎస్‌వీ, విబ్రియో వంటి పరీక్షలు నిర్వహించి ఈ వ్యాధులు లేని సీడు ఎంచుకుని తగిన సాంద్రతతో సాగు చేపట్టాలి.

ఆ పదార్థాలు వినియోగించొద్దు: కలెక్టర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో పాల కల్తీకి సంబంధించి వ్యాపారి గణేశ్వరరావు నుంచి కొనుగోలు చేసి నిల్వచేసిన పాలు, ఇతర పదార్థాలను వినియోగించవద్దని కలెక్టర్ కీర్తి చేకూరి ప్రకటించారు. వైద్యఆరోగ్యశాఖ వివరాల మేరకు మంగళవారం ఆమె మాట్లాడారు. ఈనెల 22న ప్రైవేటు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు చికిత్స పొందుతున్న వారికి పరీక్షలు చేయగా విషపూరితమైందన్నారు. నగరంలోని చౌడేశ్వరినగర్, లాలాచెరువు, స్వరూప్‌నగర్ తదితర ప్రాంతాల వాసులకు పరీక్షలు చేశామన్నారు. ప్రాథమికంగా పాల వినియోగంలోనే తేడా ఉందని తేలిందన్నారు. 14 క్షేత్ర సర్వేలెన్సు బృందాలు 957 కుటుంబాలకు స్క్రీనింగ్ చేశాయన్నారు. 315 రక్త నమూనాలు సేకరించగా అందులో 313 మందికి సాధారణంగానే ఉందని, ఇద్దరికి క్రియాటినిన్ స్థాయి అధికంగా ఉన్నట్లు తేలిందన్నారు. నరసాపురంలోని డెయిరీ వద్ద నమూనాలను సేకరించడంతోపాటు ప్రభావిత ప్రాంతాల్లోనూ సేకరించి కాకినాడ జేఎన్టీయూకు పంపామన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

గోకవరం: బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వివరాలివీ.. ఓ గ్రామానికి చెందిన కాళ్ల రాజేష్ (19) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో ఆపి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనిపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం ఒకటో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ఆరుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం): అమాయకుల బ్యాంకు ఖాతాలు అద్దం పెట్టుకుని కోట్లాది రూపాయల సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా కార్యకలాపాలను సైబర్ క్రైం పోలీసులు ఛేదించి ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. సీపీ శంఖబ్రత బాగ్చీ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం ఎండాడ నగరానికి చెందిన ఓ విశ్రాంత ప్రొఫెసర్‌ను సుప్రీంకోర్టు, సీబీఐ అధికారులమని భయపెట్టి డిజిటల్ అరెస్టు పేరుతో రూ.1.05 కోట్లు దోచుకున్నారు. ఈ కేసులో మురళీనగర్ హిల్‌పార్క్ అపార్టుమెంట్లో ఉంటున్న కొలుకుల వీరేంద్రనాథ్, నిడదవోలు సమీప సమిశ్రగూడెం వాసి మహమ్మద్ ఇమ్దాద్‌హుస్సేన్, నిడదవోలు కోటమ్మవారి వీధికి చెందిన గారిగె రాజేష్‌కుమార్‌లను అరెస్టు చేశారు. మరో కేసులో 84 ఏళ్ల విశ్రాంత బ్యాంకు ఉద్యోగి నుంచి డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి మూడు విడతలుగా రూ.89.30 లక్షలు కాజేశారు. ఈ మోసంలో విజయనగరానికి చెందిన చింతా రవిని నిందితుడిగా గుర్తించారు. హాంప్టన్ స్కై రియాలిటీ లిమిటెడ్ పేరుతో నకిలీ సంస్థల పేరిట వాట్సాప్ గ్రూపుల ద్వారా నమ్మించి ఓ బాధితుడి నుంచి రూ.48.21 లక్షలు వసూలు చేశారు. సంబంధిత కేసులో రాజమహేంద్రవరానికి చెందిన బిక్కిన రఘువంశీ, కాకినాడ గ్రామీణ ప్రాంత వాసి మలగాల సుబ్బారావు అరెస్టయ్యారు. వీరి నుంచి పోలీసులు ల్యాప్‌టాప్‌లు, స్వైపింగ్ మెషిన్లు, క్యూఆర్ కోడ్ స్కానర్లను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా అధిక కమీషన్‌కు ఆశపడి కాంబోడియా, మయన్మార్ తదితర దేశాల్లోని సైబర్ ముఠాలకు మ్యూల్ ఖాతాలు అందించి నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		18,000
పాతకాయ:	గండేరా	30,500
	గటగట	29,000
కొత్తకాయ:	గండేరా	30,000
	గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		18,000-21,000
కొత్త (పచ్చి) కాయ		16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		5,000
కిలో		350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	125-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE
HOUSE FOR SALE
RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి కోర్లమ్మపేట, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ దగ్గరలో D.No:21-7-1 సౌత్ ఫేసింగ్ 150 చ॥గ॥ ఇల్లు అమ్మకం. Contact Cell:94400 00214

LAND FOR SALE
JAGGAMPETA
రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NHకి చేర్చి 100 అ॥ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్), ✆ 9032988265.

PLOT FOR SALE
RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 చదరపు గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/ వాట్సాప్: 80748 57055.

JOBS
Wanted DTP Operator (Male/Female). Part Time Work. Location: Nagamallithota Junction, Kakinada. Contact Cell: 99489 14446.
ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-80 పై
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాటా-12, వంకాయలు నలుపు-16/గులాబీ-22/తెలుపు-16/దొమ్మేరు-24, బెండ-22, కాకర-34, బీర పందిరి-32, దొండ-24, క్యారెట్-24, బీట్‌రూట్-24, గోరు చిక్కుళ్లు-32, దోస-20, ఆనపకాయ-17/18, చిక్కుళ్లు-24, పచ్చిమిర్చి-42, బంగాళదుంపలు-18, ఉల్లిపాయలు-19.

స్వర్ణాంధ్రాలో ఉచిత శిక్షణకు ఆహ్వానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: స్వర్ణాంధ్రా సేవాసంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న ఉచిత కుట్టుశిక్షణ, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు గుబ్బల రాంబాబు తెలిపారు. ప్రవేశంలో చేరేవారు కనీసం ఏడోతరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఈనెల 27నుంచి తరగతులు మొదలవుతాయని, శిక్షణ సమయంలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు లాలాచెరువులోని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న శిబిరాలు

వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: కల్తీ పాల ఘటనలో బాధితులను గుర్తించే ప్రక్రియలో భాగంగా శిబిరాలు కొనసాగుతున్నాయి. అర్బన్, గ్రామీణం, రాజానగరం పరిధిలో 106 కుటుంబాలకు పాలు వేసినట్లు నిర్ధారణ కావడంతో వారి నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. వీటి సేకరణకు 24 శిబిరాలను ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాల్లో ఇప్పటివరకు 200 నమూనాలు సేకరించినట్లు ఆరోగ్య విభాగం అధికారులు తెలిపారు. చౌడేశ్వరినగర్‌లో వైద్య శిబిరాన్ని ఎంపీ పురందేశ్వరి సందర్శించారు. అక్కడ పరిస్థితిని తెలుసుకున్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం మంగళవారపుపేట వద్ద ఉన్న గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ అత్యున్నత విద్యాధ్యయన సంస్థలో (బీఈడీ కళాశాల) జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా వేడుక నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.దుర్గాలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విజ్ఞానశాస్త్ర పరిశోధనలో కృత్రిమ మేధ, నానో టెక్నాలజీ అభివృద్ధి వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.వి.సత్యాజీ సైన్స్ దినోత్సవ ఆవశ్యకత వివరించారు.

విద్యావంతులు.. కళల్లో ప్రతిభావంతులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: వారు ఉన్నతోద్యోగాలు చేశారు. అయినా చిన్నతనం నుంచి ఇష్టపడుతున్న వ్యాపకాలను కొనసాగించారు. కళల్లో విశేష కృషి చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వారే.. నగరానికి చెందిన నటుడు, గాయకుడు జిత్‌మోహన్‌మిత్రా, రచయిత, రంగస్థల నటుడు దీపక్ రాజ్. తాము చేస్తున్న సేవలకు పలు సంస్థల నుంచి పురస్కారాలు అందుకుంటున్నారు. వారిలో కొందరి మనోగతం వారి మాటల్లో...

హ్యూమనిస్ట్ అవార్డు పురస్కారం అందుకుంటున్న దీపక్‌రాజ్

విభిన్న రంగాల్లో అభిరుచి..

నాకు చిన్నతనం నుంచి పుస్తక పఠనం, నాటకాలు చూడడం ఇష్టం. పాఠశాల స్థాయిలోనే కవితలు రాసేవాడిని. అవి పుస్తకాలు, పత్రికల్లో ప్రచురితమైతే చాలా ఆనందంగా ఉండేది. చదువు అయ్యాక సెంట్రల్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూనే తీరిక సమయంలో రచనలు చేసేవాడిని. సుమారుగా 70 కథలు, రెండు సీరియల్స్, 200 కవితలు రాశాను. నేను పుట్టింది కోనసీమలోని కొత్తపేట కావడంతో పుట్టిన గడ్డపై మమకారంతో 21కథలతో 'మన కోనసీమ కథలు' పేరుతో కథల సంపుటి ప్రచురించాను. వీటితోపాటు చిన్నతనంలో ఆసక్తితో కూచిపూడి నేర్చుకున్నా. కొన్ని వేదికలపై అన్నమాచార్య కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి ప్రశంసలు అందుకున్నాను. నాటకాలపై మమకారంతో రంగస్థల కళాకారుడిగా పరిషత్ నాటకాల్లో ప్రదర్శనలు చేస్తున్నా. రంగస్థల నటుడిగా, రచయితగా, కవిగా చూపుతున్న ప్రతిభకు అనేక సంస్థల నుంచి పురస్కారాలు, సత్కారాలు పొందడం అదృష్టంగా భావిస్తున్నా.

- దీపక్ రాజ్, కవి, రచయిత, నటుడు

సాంస్కృతిక సేవలతో..

పాఠశాల స్థాయిలో ఉండగా స్కూల్లో పాటల పోటీల్లో పాల్గొని మొదటి సారిగా బహుమతి అందుకున్నా. అలా మొదలైన సంగీతాభిమానం నాతో పాటు పెరిగింది. గోదావరి తీరం నుంచి మొదలైన జిత్‌మోహన్‌మిత్రా ఆర్కెస్ట్రా బృందంతో కలిసి దేశమంతా తిరుగుతూ 5వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాము. ఈ ప్రాంతంలో కొన్ని వందల చిత్రాల షూటింగ్‌లు జరిగాయి. చాలావాటిలో సహాయ నటుడిగా చేశాను. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన సూత్రధారులు, శంకరాభరణం, సప్తపది, శారద, స్వాతిముత్యం వంటివాటితో పాటు 200కు పైగా చిత్రాల్లో నటించాను. వృత్తిరీత్యా న్యాయవాది కావడంతో 1969లో రాజమండ్రి బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా చేరాను. మా ఇంట్లోనే ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి నటులు, గాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తున్నా.

- శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా, నటుడు, గాయకుడు

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నగరంలోని 16వ డివిజన్ వాంబే కాలనీకి చెందిన భాజపా యువజన నాయకుడు అడపా వరప్రసాద్ కోరికపై వాంబే గృహాల్లో నివసిస్తున్న పిల్లలకు క్రీడాసామగ్రిని రోటరీ క్లబ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ తరఫున పంపిణీ చేశామని క్లబ్ చార్టర్ అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో పిల్లలకు క్రికెట్, వాలీబాల్, షటిల్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. స్థానికులు తమ సమస్యలను పరిష్కరించాలని క్లబ్ సభ్యులను అడిగారని, తమకు వీలైనంత వరకు వాటిని పరిష్కరిస్తామని క్లబ్ అధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు చెప్పారు. క్లబ్ ప్రతినిధులు ఇమ్మని వెంకట్, మద్దూరి శంకర్, రఘునాథరాజు, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం పట్టణ పరిధిలోని గానుగవీధికి చెందిన లలితా ఎండోకేర్ అండ్ స్కిన్‌కేర్ హాస్పిటల్స్ ప్రతినిధి పి.మిధున్ చక్రవర్తి రూ.1,01,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం పర్యవేక్షకుడు రాంబాబు అభినందించారు.

ప్రభుత్వ నిర్ణయంపై తూర్పుకాపుల హర్షం

కలెక్టర్ కీర్తి చేకూరికి కృతజ్ఞతలు తెలుపుతున్న తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, సంఘ నాయకులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: తూర్పు కాపు సామాజిక వర్గం 40 ఏళ్లుగా ఎదుర్కొంటున్న కుల ధ్రువీకరణ పత్రాల సమస్యకు పరిష్కారం లభించిందని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి అన్నారు. తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్లు మంజూరులో ఎదురవుతున్న సమస్యను పరిష్కరిస్తూ మైగ్రేషన్ పత్రాలు, వారికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లకు జీవోలు జారీ చేసిన కలెక్టర్ కీర్తి చేకూరిని మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ తూర్పుకాపులకు బీసీ కులధ్రువీకరణ పత్రాల కోసం 40 ఏళ్లుగా పోరాడుతున్నారన్నారు. ఉత్తరాంధ్రలో తప్పితే ఇతర జిల్లాలో తూర్పుకాపులకు కులధ్రువీకరణ సమస్య ఉందన్నారు. 2026లో ఈ సమస్యకు పరిష్కారం లభించినప్పటికీ ఓబీసీ సర్టిఫికెట్ల మంజూరులో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ లేనిదే ఓబీసీ సర్టిఫికెట్ మంజూరు చేయట్లేదన్నారు. దీంతో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందటం ద్వారా విద్య, ఉద్యోగాల విషయంలో న్యాయం జరుగుతాదనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తూర్పుకాపులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు మంజూరుకు చర్యలు తీసుకుని జిల్లాస్థాయిలో ఆర్డీవోలు, తహసీల్దార్లకు జీవోలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. తూర్పుకాపు సంక్షేమ సంఘ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు ఎల్.చిరంజీవి, కార్యదర్శి రాంబాబు, నాయకులు సత్యనారాయణ, త్రిమూర్తులు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం మంగళవారపుపేటలోని ట్రైనింగ్ కళాశాల ఆవరణలో ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంకాలం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతి రోజు అదనపు తరగతుల సమయంలో అల్పాహారం అందిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం పూర్వవిద్యార్థి పి.మధుసూదనరావు సహకారంతో అల్పాహారం అందించారు. విఠోబా మహారాజ్, చక్కా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సోమాలమ్మ జాతర

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నగర దేవత పాత సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపారు. శ్యామలానగర్‌లో కొలువైన ఆలయాన్ని ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ప్రాంగణమంతా రంగులేసి, అందమైన ముగ్గులు తీర్చిదిద్దారు. విద్యుత్తు దీపాలను అలంకరించారు.

● 26న దశమి గురువారం తెల్లవారుజామున 4గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం, ఉదయం 10.10 గంటలకు కలశస్థాపన, 10.30గంటలకు లక్ష్మీగణపతి హోమం జరుగుతుంది. సాయంత్రం 7గంటల నుంచి శ్రీఉమా నృత్య నికేతన్ శిష్యబృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుంది. ● 27న శుక్రవారం ఉదయం 8గంటలకు చండీహోమం, సాయంత్రం 6గంటలకు కూచిపూడి నృత్యం, 7గంటలకు సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహిస్తారు. ● 28న శనివారం ఉదయం 8.30 గంటలకు అమ్మవారికి లక్ష పుష్పార్చన, సాయంత్రం 6గంటలకు వేంకటేశ్వరస్వామి గానామృతం ఉంటుంది. ● మార్చి 1న ఆదివారం ఉదయం 9గంటలకు సౌభాగ్య వ్రతం, సాయంత్రం 6గంటలకు శ్రీమహా గురుస్థాన్ క్షేత్రం వారితో అమ్మవారి పల్లకీసేవ, ఊయల సేవ, సాయిబాబా భజన ఉంటాయి. ● 2న సోమవారం తెల్లవారుజామున 4గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, జాతర మహోత్సవం సందర్భంగా విశేష అలంకారం ఉంటుంది. మధ్యాహ్నం 3గంటల నుంచి గరగ నృత్యాలు, కాళీనృత్యం, అమ్మవారి వేషధారణలు, మేళతాళాలతో సోమాలమ్మ జాతర మహోత్సవం నగర వీధుల్లో ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారు. ● 26నుంచి మార్చి 2వరకు ఆలయ ఆవరణలోని వేదికపై అమ్మవారికి ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 8గంటల వరకు కుంకుమ పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు వివరించారు.

పాత సోమాలమ్మ అమ్మవారు

ముస్తాబైన ఆలయం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కాతేరులోని సుబ్బారావుపేట, సంజీవ్‌నగర్ కాలనీ, మిలటరీకాలనీ, వేణుగోపాలపురం, పంచాయతీ ప్రాంతం, శాంతినగర్, భరత్‌నగర్, కాతేరు-కొంతమూరు రోడ్డు, దాసరినగర్, దేవాంగుల వీధి, సీటీఆర్‌ఐ రోడ్డు, జీఎస్‌ఆర్ ఆన్‌లైన్ ప్రాంతం, గణపతినగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రహదారిపైనే వ్యర్థాలు

నగరపాలక సంస్థ అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ నగరంలో ఇష్టానుసారంగా చెత్త వేస్తున్నారు. ఇంటింటికీ చెత్త సేకరణకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి ఇబ్బంది ఎదరవుతోంది. జయకృష్ణపురంలోని పార్కు సమీపంలో రోడ్డుపై ఇష్టానుసారంగా పడేయడంతో మంగళవారం సిబ్బంది వాటిని ట్రాక్టర్‌లోకి ఎత్తారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, దేవీచౌక్

స్లాబ్‌పై మూత ఏర్పాటు

నగరంలోని లాలాచెరువు చౌడేశ్వరీ నగర్‌లో ప్రధాన రహదారిలో రహదారి మధ్యలో మ్యాన్‌హోల్ పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ఈనాడు'లో ప్రచురించిన చిత్రవార్తకు అధికారులు స్పందించారు. కొత్తగా మూత ఏర్పాటు చేశారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

తీరని సమస్యేనా..!

పట్టణంలో పలు ప్రాంతాల్లో పగలు విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. రాత్రిపూట వెలగట్లేదు. చిన్న వీధులతో పాటు ప్రధాన రహదారుల్లోనూ ఇదే పరిస్థితి. దీపాల నిర్వహణ సరిగా లేదని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా పరిష్కరించినా సమస్య మళ్లీ మొదటికొస్తుందని అంటున్నారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రాజవోలు ప్రాంతంలో..

వైకాపా నాయకుల పరామర్శ

బాధితులను పరామర్శించిన అనంతరం మాట్లాడుతున్న వైకాపా నాయకులు అప్పలరాజు, వేణు, వి.రజని తదితరులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కల్తీ పాల ఘటనకు సంబంధించి రాజమహేంద్రవరంలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, విడదల రజనీ, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు తదితరులతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం ఓ ఆసుపత్రి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపా హయాంలో మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ చట్టాన్ని తీసుకొచ్చి లైసెన్సులు తీసుకునే పాలు ప్రొక్యూర్ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు.

అయ్యో చిన్నారి...

కల్తీపాల ఘటనలో రాజమహేంద్రవరం శివారు స్వరూప్‌నగర్‌కు చెందిన బత్తిన మనోహర్(6) విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో స్థానికంగా విషాదం నెలకొంది.

- న్యూస్‌టుడే, రాజానగరం

'ఆర్టీసీ ఆస్తుల ప్రైవేటీకరణ తగదు'

నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఆస్తుల ప్రైవేటీకరణ తగదని, డిపోలను ప్రైవేటు సంస్థకు కేటాయించే యోచన విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. త్వరలో రానున్న విద్యుత్తు బస్సుల నిర్వహణ బాధ్యతలు పినాకిల్ సంస్థకు అప్పగించనుండటం, సిబ్బందిని వేరే డిపోలకు బదిలీ చేసే విధానాలను వ్యతిరేకిస్తూ ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎర్ర బ్యాడ్జీలు ధరించి మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ప్రధాన ద్వారం వద్ద గేట్‌మీటింగ్ నిర్వహించారు. పినాకిల్ సంస్థకు డిపోల కేటాయింపు మానుకోవాలని, త్వరలో వచ్చే విద్యుత్తు బస్సులను ఆర్టీసీయే నిర్వహించాలని, పీటీడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.ఆర్.కె.కుమారి తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎన్‌ఎంయూఏ జోనల్ ఛైర్మన్ పి.ఎల్.రావు, డిపో అధ్యక్షుడు వి.వి.రమణ, కార్యదర్శి టి.ఎస్.వాసు, ఇతర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్సలో మెలకువలపై దిశానిర్దేశం

ఆసుపత్రిలో రోగుల పరిస్థితి తెలుసుకుంటున్న ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజు బృందం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కల్తీపాల ఘటనతో రాజమహేంద్రవరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని కచ్చితంగా అంచనా వేసి వారికి ఇంకా ఏదైనా మెరుగైన చికిత్స అందించే వీలు, ఇతర సూచనలు, సలహాల కోసం ప్రభుత్వం బృందాన్ని నియమించింది. మంగళవారం విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజు బృందాన్ని తీసుకొచ్చింది. నగరంలోని రెండు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 11 మంది రోగులను ఈ బృందం పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసింది. చికిత్సలో అనుసరించాల్సిన విధానాలను స్థానిక వైద్యులకు వివరించారు. ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇక్కడ చికిత్స అందుతోందన్నారు. ఔషధాలు, డయాలసిస్ సౌకర్యాలు, నిపుణుల పర్యవేక్షణ సైతం ఉందన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ముందుకెళ్తోందన్నారు. అవసరమైతే మరోసారి వచ్చి ఈ బృందం సూచనలు, సలహాలు అందిస్తుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 5 రోజులపాటు క్వాంటమ్ టెక్నాలజీ, అనువర్తనాలు అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.అశోక్ మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీలో ప్రాసెసింగ్ స్పీడ్, సంప్రదాయ కంప్యూటర్లలో జరిగే స్పీడ్ కన్నా అధికంగా ఉంటుందన్నారు. కాలం ఆదా అవుతుందని, కచ్చితత్వం పెరుగుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంటర్ వసంతలక్ష్మి మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీ దేశంలో పారిశ్రామిక రంగాన్ని విప్లవాత్మకంగా మారుస్తుందన్నారు. ప్రొఫెసర్ జి.భగవాన్ నారాయణ, జ్ఞాన్ ఎల్లా, జి.దుర్గాబాబు తదితరులు ప్రసంగించారు. కళాశాల పీఎం ఉషా కోఆర్డినేటర్ జి.శరత్‌బాబు తెలిపారు. సదస్సు వైస్ ఛైర్మన్ డి.వి.రమణమూర్తి పర్యవేక్షించారు.

బహిరంగ వేలం

తేది: 26-02-2026 (గురువారం)

Veh. No.	Vehicle Description	Year
AP39MV4852	MARUTHIERTIGA ZXI+BS6-P	2021
AP05TM3779	TATA ACE GOLD	2018
AP05TD6678	BHARAT BENZ 2523 FBT-T	2015
AP05TG3839	TATA LPT 1109 FBT	2013
AP16DJ-0239	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2015
AP39UP-2542	MARUTI DZIRE BS6 PETROL -P	2022
AP39JL8880	ERTIGA VDI BSIV	2014

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.

శ్రీరామ్ ఫైనాన్స్ Ltd.,

D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి,

0883-2465088, 98499 81384

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులు

26 నుంచి ఆర్ట్స్ కళాశాలలో విజ్ఞానోత్సవం

దేవీచౌక్, న్యూస్‌టుడే: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విజ్ఞానోత్సవాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఇతర అధ్యాపకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 26వ తేదీన కళాశాలలోని అన్ని ప్రయోగశాలలు విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించేందుకు తెరిచి ఉంటాయన్నారు. 27న ప్రముఖ ఆచార్యులు, నిపుణుల ఉపన్యాసాలు, 28న ప్రముఖ భారత్ శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత రామన్ ప్రభావంపై ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. నగర ప్రజలు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పన్ను విధింపులో జాగ్రత్తలు తప్పనిసరి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: వినియోగంలో ఉన్న ప్రతీ నిర్మాణానికి పన్ను విధించాలని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. మంగళవారం నగరంలో భవనాలను పరిశీలించారు. నిర్మాణ విస్తీర్ణం మేరకు సిబ్బంది పన్నుల వసూళ్లు చేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాస భవనాలను ఎక్కడా వాణిజ్య అవసరాలకు వినియోగించకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మార్చి నాటికి పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకట రమణ, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఈఓ వాసుదేవరావు

మాతృ భాషను కాపాడుకుందాం

శ్యామలాసెంటర్: మాతృభాషను కాపాడుకోవటం అంటే మన సంస్కృతిని, మూలాలను కాపాడుకోవటమేనని డీఈఓ కె.వాసుదేవరావు అన్నారు. ఎస్‌కేటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి భాషోత్సవ కార్యక్రమాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మాట్లాడుతూ ఈనెల 18నుంచి 21వరకు పాఠశాల స్థాయిలో తెలుగు, హిందీ, సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. విజయం సాధించిన విద్యార్థులకు 23న మండలస్థాయి, 24న జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలకు 170మంది విద్యార్థులు హాజరవ్వగా 40 మంది విజేతలుగా నిలిచారన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అధికారిణి ఎస్.సుభాషిణి, డీసీఈబీ సెక్రటరీ దేవా అనిత, సీఎంఓ శ్రీనివాసరావు, డి.గౌరీశంకర్, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పరీక్షకు ఉరుకులు.. పరుగులు..

నగరంలో ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. పలువురు ఆఖరి క్షణంలో పరుగులు పెడుతూ వచ్చారు. ఓ విద్యార్థిని పొరపాటున మరొక సెంటర్‌కు రాగా పోలీసులు ట్రాఫిక్ సమస్య లేకుండా ఎస్కార్ట్‌గా అసలు కేంద్రానికి తీసుకెళ్లారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు మరో విద్యార్థిని వచ్చింది. హాల్‌టికెట్ అడిగితే ఫీజు కట్టలేదని కాలేజీ వాళ్లు ఇవ్వలేదు అని సమాధానం చెప్పింది. విషయం తెలుసుకునేందుకు అక్కడ డ్యూటీలో ఉన్న సీఐ, ఐసీడీఎస్ అధికారిణి విద్యార్థితో ఆమె కళాశాలకు వెళ్లారు. ఆర్ఐఓ శారదను వివరణ కోరగా ఆ విద్యార్థిని పరీక్ష రుసుం కట్టలేదని, ప్రయోగ పరీక్షలకూ రాలేదన్నారు.

ట్రాఫిక్ లేకుండా ఎస్కార్ట్‌గా పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న పోలీసులు

మహారాజశ్రీ 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S.No. 20/2026

Between

1.శ్రీమత్ తిరుమల వెంకటకృష్ణకాంత్

2.శ్రీమతి దోమ్మేటి లావణ్య ... వాదులు

AND

NIL ... ప్రతివాదులు

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై గ్రంథంలో చనిపోయిన శ్రీమత్ తిరుమల వెంకట (వింజమూరి) లక్ష్మి, W/o శ్రీనివాసాచార్యులు కి వాదులు వారసులు అని లీగల్‌హైర్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం O.S. 20/2026 దావా దాఖలు చేసియున్నారు. కావున పై నెంబరులో ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ది.19-3-2026న ఉదయం 10.30 నిIIలకు పై కోర్టులో తెలియపర్చుకోవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

రాజమండ్రి, **Y.అశోక్ కుమార్**, అడ్వకేట్

24-2-2026. రాజమండ్రి, 9397918434

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

కోరుకొండ తీర్థానికి ఏర్పాట్లు సిద్ధం

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు ఈనెల 26న శ్రీకారం చేయనున్నారు. 27 నుంచి అయిదు రోజుల పాటు కల్యాణోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయం ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ప్రత్యేక కల్యాణ వేదికను సిద్ధం చేస్తున్నారు. ఆలయానికి, మెట్ల మార్గానికి రంగులు అద్దుతున్నారు. ఉత్సవాలకు అవసరమైన షామియానాలు, బందోబస్తు, బారికేడ్లు, విద్యుద్దీపాలంకరణ, కల్యాణం, రథోత్సవం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వర్ణాంధ్రాలో ఉచిత శిక్షణకు ఆహ్వానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: స్వర్ణాంధ్రా సేవాసంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న ఉచిత కుట్టుశిక్షణ, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు గుబ్బల రాంబాబు తెలిపారు. ప్రవేశంలో చేరేవారు కనీసం ఏడోతరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఈనెల 27 నుంచి తరగతులు మొదలవుతాయని, శిక్షణ సమయంలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు లాలా చెరువులోని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన	ధవళేశ్వరం: 91212 29057	కడియం: 91212 29062
	బొమ్మూరు 91549 78039	మోరంపూడి 94935 92696
	రాజానగరం 98492 36167	కోరుకొండ 80085 74213

పూడికతో ఇబ్బంది

సమస్య: రాజవోలు రోడ్డులోని కాలువలో రెండురోజులుగా పూడికలు పేరుకుపోయాయి. మలుపు వద్ద చెత్తతో కాలువ పారట్లేదు. - **చరణ్, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపించి పూడికలు తీయిస్తాం.

- శ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి, రాజవోలు

– న్యూస్‌టుడే, బొమ్మూరు

నీరు రావడం లేదు

సమస్య: హుకుంపేట రామకృష్ణనగర్ మూడో వీధిలో కొళాయి నీరు రావడం లేదు. ఇబ్బంది పడుతున్నాం.- **రాజా, స్థానికుడు**

సమాధానం: మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం.

- శ్రీదేవి, గ్రామకార్యదర్శి, హుకుంపేట

– న్యూస్‌టుడే, బొమ్మూరు

లక్ష్యం దిశగా కసరత్తు..

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన బెస్ట్ ఫిజిక్ పోటీల్లో అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో తమ ప్రతిభ చాటారు. బంగారు, కాంస్య పతకాలు సాధించారు. 'న్యూస్‌టుడే'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా..

ఆర్మీలో చేరాలన్నది కల..

విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన బెస్ట్‌ఫిజిక్ 60 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాను. మార్చి 3న జరిగే పోటీలకు ఎంపికయ్యాను. ఇందులో కూడా సత్తా చాటేందుకు కసరత్తు చేస్తున్నా. 2023, 2024లో మిస్టర్ ఆంధ్రప్రదేశ్‌కు ఎంపికై కాంస్య, వెండి పతకాలు గెలుపొందాను. ఒకసారి మిస్టర్ అమలాపురంగా, రెండుసార్లు మిస్టర్ భీమవరంగా అవార్డులు అందుకున్నా. దీనికోసం గంటలపాటు వ్యాయామం చేయడంతో పాటు ప్రత్యేకమైన ఆహారం తీసుకుంటున్నా. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. ఆర్థిక సమస్యలతో చాలామంది ఈ రంగంలోకి రారు. వారిని ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు.

– నర్రా పూర్ణసతీష్, ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం

సర్కారు కొలువు సాధిస్తా..

అఖిల భారత అంతరఇండియా ఇంటర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో 7వ స్థానంలో నిలిచాను. వచ్చేనెలలో కర్ణాటకలో నిర్వహించే ఖేలో ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించాను. ఇందులో పతకం తేవాలన్నదే నా ధ్యేయం. రెండు నెలల క్రితం నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాంపిటీషన్స్‌లో ప్రథమ, జనవరిలో సౌత్‌ఇండియా ఇంటర్ విశ్వవిద్యాలయ పోటీల్లో ద్వితీయ స్థానాల్లో నిలిచాను. దేహదారుఢ్య పోటీల్లో అమ్మాయిలను ఎక్కువగా ప్రోత్సహించాలి. అవసరమైన సదుపాయాలు, భరోసా కల్పించాలి. రోజూ ఉదయం రెండు గంటలు, సాయంత్రం గంట సాధన చేస్తాను. ప్రత్యేకమైన డైట్ పాటిస్తాను. జంక్‌ఫుడ్ అసలు తినను. సర్కారు కొలువు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా.

– బైరెడ్డి చంద్రిక, బీఏ ప్రథమ సంవత్సరం

కోరుకొండ తహసీల్దార్‌కు పదోన్నతి

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వి.సుస్వాగతం పదోన్నతి పొందారు. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి ఇస్తూ ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంకా కొంత కాలం పాటు ఇక్కడే విధులు నిర్వహించనున్నారు.

ఆర్ అండ్ బీ రహదారిపై వంటా-వార్పు

రాజానగరం : గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రాజానగరం నుంచి కలవచర్ల, సీతారాంపురం మీదుగా గాదరాడ వరకు గల ఆర్ అండ్ బి రహదారిని పూర్తి చేయాలని వైకాపా నాయకులు మంగళవారం ఆ రహదారిపై వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు దూలం పెద్ద, అడబాల చినబాబు, జగదీష్, దాట్ల రఘు పాల్గొన్నారు.

కల్తీపాల తయారీకి అడ్డుకట్ట వేయాలి

శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, న్యూస్‌టుడే: కల్తీపాల తయారీదారులపై కఠిన చర్యలు చేపట్టాలని రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శాసనసభలో డిమాండ్ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అనువుగా ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా సైకిళ్లపై తెచ్చే పాలు నేరుగా ప్రజల వద్దకు చేరుతున్నాయని, ఇటువంటి అనధికార విక్రయాలతో ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరించారు.

బాధితులకు సీఎం సహాయనిధి అందజేత

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, ఆర్డీవో కృష్ణనాయక్

రాజానగరం, న్యూస్‌టుడే: ఆక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మంగళవారం మంగళవారం మండలంలోని స్వరూప్‌నగర్‌కు వెళ్లి కల్తీపాలు తాగి మృతి చెందిన మంది రాధాకృష్ణమూర్తి(74) కుటుంబాన్ని ఎమ్మెల్యే, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్‌లు పరామర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల విలువైన చెక్కును వారికి అందజేశారు. ● స్వరూప్‌నగర్‌లో నివాసం ఉంటూ కల్తీపాలు తాగి వైజాగ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన బత్తిన మనోహర్(6) కుటుంబానికి ఎమ్మెల్యే బత్తుల సొంత నిధుల నుంచి రూ.50 వేలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

కొవ్వూరు పట్టణం: అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు అన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. గోష్పదేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతులు గోపూజలు చేశారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సుబ్రహ్మణ్యేశ్వర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలకు 1500 లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకు, వేములూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు కంచాలు అందించారు. సంఘ అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫెడరేషన్ సహాయ కార్యదర్శి ఉప్పల శ్రీవల్లి, సంఘ కార్యదర్శి కాకి అనిల్‌కుమార్, పూర్వాధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్, కంకటాల రామారావు, కొల్లేపర శ్రీను, గ్రంధి ప్రవీణ్, కేతికే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కడియంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యప్రసాద్

కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే జీవనోపాధి శిక్షణను అందిపుచ్చుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సూచించారు. ఆ సందర్భంగా కడియంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సుగంధ ద్రవ్యాల కొత్తూరు తయారీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ డీఆర్‌డీఏ నగేష్, ఏపీడీ సత్యనారాయణ మాట్లాడుతూ అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధికి అడుగులు వేయాలని సూచించారు. అనంతరం స్థానిక భాస్కర్ నగర్‌లో నెలకొల్పిన కొబ్బరిపీచు పరిశ్రమను సందర్శించి వాటి తయారీ విధానాన్ని పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఏపీఎం నాగేశ్వరం, సిబ్బంది తిలక్, నాగేశ్వరరావు, కొండేటి ప్రసాద్, మహిళా పారిశ్రామిక వేత్త అల్లం గౌతమి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో కలవచర్ల విద్యార్థి ప్రతిభ

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఎస్‌డీవో వాసుదేవరావు

రాజానగరం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ నిర్వహించిన జిల్లాస్థాయి బాలోత్సవ పోటీల్లో కలవచర్ల విద్యార్థికి ప్రథమస్థానం లభించిందని ఎంఈవో రమణదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వై.హేమేశ్వర్ ఆంగ్ల విభాగంలో ప్రతిభ కనబరిచాడన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో వాసుదేవరావు విద్యార్థికి పతకం, ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.

పాలకేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో

కోరుకొండలో పాలకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీరంగపట్నం, పశ్చిమగోనగూడెం, కోరుకొండ ప్రాంతాల్లోని పలు పాల సేకరణ కేంద్రాలను ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాల సేకరణ విధానం, కొలతల పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, అక్రమాలు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుస్వాగతం, ఆర్ఐ రెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ నాతి బుజ్జి

గోకవరం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ నాతి బుజ్జి లబ్ధిదారులకు సూచించారు. గుమ్మళ్ళదొడ్డి, కొత్తపల్లి గ్రామాల్లో కాలనీలను మంగళవారం ఆమె సందర్శించారు. పీఎంఏవై స్లాబు స్థాయికి చేరగా, 102 గృహాలు పునాది దశలో ఉన్నట్లు గుర్తించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన పనులు పూర్తిచేసిన వారికి అయిదు రోజుల వ్యవధిలోనే సొమ్ములను జమ చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఎంపీడీవో గోవింద్, హౌసింగ్ డీఈ రామారావు, ఏఈ సాయిబాబా, ఏపీవో అప్పలరాజు తదితరులు ఉన్నారు.

CHANGE OF NAME

I KANDREGULA SUBBALAXMI W/o Kandregula Srinivasa Rao, D.No. 64-10-15, Ramakrishna Nagar, Rajamahendravaram (U) E.G.Dt., A.P. I have changed my Name from MATTAPARTHI SUBBA LAKSHMI (Old Name) to KANDREGULA SUBBALAXMI (New Name). Henceforth I am being called as KANDREGULA SUBBALAXMI W/o Kandregula Srinivasa Rao for all purposes.

కాలువలలో వ్యర్థాలు తొలగించరూ..

కొంతమూరు ఎయిర్‌పోర్టు వైపునకు వెళ్లే ప్రధాన రహదారి పొడవునా ఉన్న కాలువలలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మురుగు పారక రోడ్లపైకి చేరి, దోమల బెడద పెరిగిందని వాపోతున్నారు. సమస్యపై కోలమూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

ప్రయాణం ప్రమాదకరం

లోడుతో వెళ్తున్న భారీ వాహనల పైన కూర్చొని ప్రయాణించడం ప్రమాదకరమని పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం రాజానగరం జాతీయ రహదారిపై అధిక లోడుతో ఉన్న ఓ లారీ అంచున కూర్చొని ప్రయాణిస్తున్నారు. ఇలాంటివి జరగకుండా అధికారులు లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలని పలువురు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

నిరుపయోగంగా బస్‌షెల్టర్

రాజానగరంలోని జాతీయ రహదారి పక్కన నరేంద్రపురం కూడలి వద్ద నిర్మించిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉంది. రెండు లైన్ల జాతీయ రహదారిని నాలుగులైన్లుగా విస్తరించడంతో ప్రయాణికుల సౌకర్యార్థం దీనిని

ఏర్పాటు చేశారు. అయితే ఆర్టీసీ బస్సులు వచ్చేందుకు అనుకూలంగా లేకపోవడంతో ఎవరూ ఉపయోగించుకోవడం లేదు. కొంతమంది మోటారుసైకిళ్ల స్టాండ్‌గా వినియోగించుకుంటున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

రహదారిపై ఇసుకతో అవస్థలు

ఇసుక తరలించే లారీలపై అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ధవళేశ్వరం నుంచి వేమగిరి, వేమగిరి నుంచి కడియం వరకూ ఎడమవైపు ప్రయాణం కష్టతరంగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇసుక

ఉండడం వల్ల ద్విచక్రవాహనాలు జారుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కడియం

బహిరంగ వేలం

తేది: 26-02-2026 (గురువారం)

Veh. No.	Vehicle Description	Year
AP39MV4852	MARUTHIERTIGA ZXI+BS6-P	2021
AP05TM3779	TATA ACE GOLD	2018
AP05TD6678	BHARAT BENZ 2523 FBT-T	2015
AP05TG3839	TATA LPT 1109 FBT	2013
AP16DJ-0239	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2015
AP39UP-2542	MARUTI DZIRE BS6 PETROL -P	2022
AP39JL8880	ERTIGA VDI BSIV	2014

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.

శ్రీరామ్ ఫైనాన్స్ Ltd.,

D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి,

0883-2465088, 98499 81384

నిత్యాన్నదాన పథకానికి విరాళం

స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం పట్టణ పరిధిలోని గానుగవీధికి చెందిన లలితా ఎండోకేర్ అండ్ స్కిన్‌కేర్ హాస్పిటల్స్ ప్రతినిధి పి.మిధున్‌చక్రవర్తి రూ.1,01,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం పర్యవేక్షకుడు రాంబాబు అభినందించారు.

మహిళా భద్రతపై అవగాహన కల్పించాలి

రాజానగరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలతో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, ఉమెన్స్‌సెల్ సభ్యులు పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్ శైలజ మాట్లాడుతూ.. మహిళా భద్రత, చట్టపరమైన హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. మహిళా పరిశోధనా అధ్యయనాలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్, న్యాయమూర్తులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతలో స్ఫూర్తిని నింపుతున్నామన్నారు. ఉమెన్స్‌సెల్ కో-ఆర్డినేటర్ పి.ఉమామహేశ్వరి, ప్రిన్సిపల్స్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరంలోని 16వ డివిజన్ వాంబే కాలనీకి చెందిన భాజపా యువజన నాయకుడు అడపా వరప్రసాద్ కోరికపై వాంబే గృహాల్లో నివసిస్తున్న పిల్లలకు క్రీడాసామగ్రిని రోటరీ క్లబ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ తరఫున పంపిణీ చేశామని క్లబ్ చార్టర్ అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో పిల్లలకు క్రికెట్, వాలీబాల్, షటిల్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. స్థానికులు తమ సమస్యలను పరిష్కరించాలని క్లబ్ సభ్యులను అడిగారని, తమకు వీలైనంత వరకు వాటిని పరిష్కరిస్తామని క్లబ్ అధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు చెప్పారు. క్లబ్ ప్రతినిధులు ఇమ్మని వెంకట్, మద్దూరి శంకర్, రఘునాథరాజు, కార్తిక్ పాల్గొన్నారు.

చికిత్సలో మెలకువలపై దిశానిర్దేశం

ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజు బృందం పర్యటన

ఆసుపత్రిలో రోగుల పరిస్థితి తెలుసుకుంటున్న రవిరాజు బృందం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కల్తీపాల ఘటనతో రాజమహేంద్రవరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని కచ్చితంగా అంచనా వేసి వారికి ఇంకా ఏదైనా మెరుగైన చికిత్స అందించే వీలు, ఇతర సూచనలు, సలహాల కోసం ప్రభుత్వం మంగళవారం విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రవి రాజు బృందాన్ని తీసుకొచ్చింది. నగరంలోని రెండు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 11 మంది రోగులను ఈ బృందం పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసింది. చికిత్సలో అనుసరించాల్సిన విధానాలను స్థానిక వైద్యులకు వివరించారు. ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇక్కడ చికిత్స అందుతోందన్నారు. ఔషధాలు, డయాలసిస్ సౌకర్యాలు, నిపుణుల పర్యవేక్షణ సైతం ఉందన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ముందుకెళ్తోందన్నారు. అవసరమైతే మరోసారి వచ్చి ఈ బృందం సూచనలు, సలహాలు అందిస్తుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

తెగుళ్ల నివారణకు కవర్లు వినియోగించాలి

సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త విజయప్రసాద్

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: మామిడికాయలకు చుట్టే కవర్లు రాయితీతో అందిస్తున్నామని, వీటిని వినియోగించడం వల్ల పురుగులు, వాతావరణ మార్పులు వల్ల వచ్చే తెగుళ్లను నివారించవచ్చని విశ్రాంత శాస్త్రవేత్త ఇ.విజయప్రసాద్ సూచించారు. మంగళవారం సీతానగరం మండలం నల్గొండలో ఉద్యానశాఖాధికారిణి పి.రిని ఆధ్వర్యంలో రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మామిడి, కూరగాయల పంటల విషయంలో పూత నిలబడి, పిందెగా మారి పెరగడానికి చేపట్టవలసిన చర్యలు వివరించారు. రైతులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా కానరాని పురోగతి

విస్తరణకు నోచుకోని గోకవరం ప్రధాన రహదారి

నిలిచిన వాహనాలు..

గోకవరం, న్యూస్‌టుడే: రెండు భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే కనీసం తప్పుకొనేందుకు వీలులేని దుస్థితిలో గోకవరం ప్రధాన రహదారి ఉంది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారి విస్తరణ జరగలేదు. రోడ్లపైకి దుకాణాలను విస్తరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత పుష్కరాల సమయంలో 2014లోనే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ చేయాలని అధికారులు చర్యలు చేపట్టారు. మొదట కోరుకొండలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్డును విస్తరించారు. అనంతరం గోకవరంలోను కొన్నిచోట్ల రోడ్డుపై వేసిన షెడ్లను తొలగించారు. అయితే అప్పుడే ఈ రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించడంతో ఆ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆక్రమణలు తొలగకపోగా అనంతరం దుకాణాలు రోడ్డుపైకి మరింత ముందుకు రావడంతో రహదారి ఇరుకుగా మారింది. మరలా పుష్కరాలు వస్తున్న ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల రద్దీతో ఇబ్బందులు

పోలవరం ప్రాజెక్టులో ముంపు కారణంగా దేవీపట్నం మండలంలోని చాలా గ్రామాల ప్రజలు గోకవరంతో పాటు సమీప ప్రాంతాలలో స్థిరపడుతున్నారు. ఏ చిన్నపని ఉన్నా వీరు గోకవరం రావాలి. దీంతో గోకవరంలో జనాభాతో పాటు వాహనాల రద్దీ బాగా పెరిగింది. సుమారు 30 ఏళ్లుగా ఇక్కడ ప్రధాన రహదారి విస్తరణ జరగలేదు. జాతీయ రహదారి నెంబర్ 516 ఈ కావడంతో రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వైపు వెళ్లే వాహనాలు, ఇటు భద్రాచలం, ఒడిశా, చత్తీస్‌గఢ్ వెళ్లే భారీ వాహనాలు ఈరోడ్డుపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. వీటికి తోడు ఏజెన్సీ ప్రాంతం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే క్వారీ రాళ్లతో వెళ్లే టిప్పర్లతో రోడ్డు పూర్తిగా రద్దీగా మారుతుంది. ఇక రాణా సెంటర్ ఇరుకు వంతెనపై ఒకసారి ట్రాఫిక్ నిలిచిపోతే తొలగేందుకు పావుగంటపైనే సమయం పడుతుంది. ఇప్పటికైన సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ చేయాలని స్థానికులు వేడుకొంటున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం..

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళుతున్నాం. అనంతరం ఆక్రమణల తొలగింపు దిశగా చర్యలు చేపడతాం.

- రామకృష్ణ, తహసీల్దార్

ప్రకటన

మా క్లయింట్లు తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగర కాపురస్తులు చలుమూరు వెంకట శ్రీనివాస్ గారి కుమారుడు చలుమూరు వెంకట మహేష్ మరియు చలుమూరు వెంకటేశ్వరరావు గారి కుమారుడు చలుమూరు కృష్ణ మోహనసూర్య వరప్రసాద్ గార్లు మాకు ఇచ్చిన సంజాయిషీపైన యావన్మందికీ ఈ దిగువ సంగతులు తెలియజేయడమైనది.

మా క్లయింట్లు ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, పాలచర్ల గ్రామ కాపురస్తులు కోరంగి రాంబహుద్దూర్ గారి కుమారుడు కోరంగి హరిప్రసాద్ మరియు రాజమహేంద్రవరం రూరల్ మండలం, పిడింగొయ్యి పంచాయతీ కాపురస్తులు మొమ్మిలేటి సుబ్రహ్మణ్యం గారి కుమారుడు హనుమంతరావు గార్ల వద్ద నుండి కొనుగోలు చేయదలచియున్నారు. సదరు కోరంగి హరిప్రసాద్ గారు మరియు హనుమంతరావు గారు క్రింది షెడ్యూల్ ఆస్తిని ది.వి.09-09-2024 న రిజిస్టర్డ్ దస్తావేజు రీత్యా రాజమహేంద్రవరం సబ్ రిజిస్టర్ నందు Doc. No.22315/2024గా రిజిస్టర్ కాబడిన దస్తావేజు రీత్యా రాజానగరం మండలం, శ్రీరాంపురం గ్రామ కాపురస్తులు పంతం సీతారామయ్య వగైరాల నుండి ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని క్రియం పొంది అనుభవించుచున్నారని, సదరు ఆస్తి నిర్వివాద, నిష్పేచీ ఆస్తి అని మా క్లయింట్లుకు చెప్పి సదరు భూమిని మా క్లయింట్లుకు అమ్మ జూపినందున, అందుకు ఎవరికైనా ఏవిధమైన క్లయిములు, హక్కులు, ఆక్షేపణలు వగైరాలు ఉండియున్నచో వారు ఈ తేదీ నుండి ఒక వారంరోజులలోగా అట్టి క్లయిములకు తగు ఆధారములతో వ్రాతమూలకముగా ఈ దిగువ అడ్రస్‌కు తెలియపర్చవలెను. లేనిచో తదుపరి అట్టి క్లయిములు మా క్లయింట్లును ఎంత మాత్రం బైండు చెయ్యవని, దర్మిలా మా క్లయింట్లు సదరు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా పరిగణించి క్రియం పొందుదురని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం సబ్‌రిజిస్ట్రీ, రాజానగరం మండలం, శ్రీకృష్ణపట్నం గ్రామం, R.S.No.183/1 మరియు 183/2, ప్రస్తుత L.P.No.350 దాఖలా Ac.1.7930 Cts.

సిహెచ్.ప్రభాకరరావు

అడ్వకేట్ D.No.46-17-22/1

దానవాయిపేట, రాజమహేంద్రవరం

Canara Bank

కృతజ్ఞతాభివందనములు

13వ వార్షికోత్సవ శుభాకాంక్షలు, కెనరా బ్యాంక్ (సిండికేట్ బ్యాంక్), దివాన్‌చెరువు

కెనరా బ్యాంక్ (సిండికేట్ బ్యాంక్), దివాన్‌చెరువు బ్రాంచి అభివృద్ధికి సహకరిస్తూ, బ్రాంచి 125 కోట్ల టర్నోవర్ పూర్తి చేసుకున్నందుకు, మా కస్టమర్లందరికి శుభాకాంక్షలు. వార్షికోత్సవం సందర్భంగా పత్రికలలో, ప్రత్యక్షంగా వచ్చి శుభాకాంక్షలు తెలిపిన అందరికి కృతజ్ఞతలు.

ఆకుల తిరుమల వెంకటేష్‌బాబు

బ్రాంచి మేనేజరు & సిబ్బంది

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ఇంటర్ ద్వితీయ పరీక్షకు 260 మంది హాజరు

వేగేశ్వరపురం: కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాళ్లపూడి : వేగేశ్వరపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం పరీక్షలకు 267మందికిగాను 260 మంది హాజరైనట్లు సీఎస్ సూర్యకళ, డీవో సునీల్ తెలిపారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచాలి

కొవ్వూరు పట్టణం: ప్రభుత్వ శాఖలో పనిచేసే ఉద్యోగుల మాదిరిగా తమకు ఉద్యోగ విరమణ వయసు పెంచాలని ప్రాథమిక సహకార సంఘాల సీఈవోలు డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. కొవ్వూరులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆవరణలో ఉద్యోగులు చెవుల్లో పువ్వులు పెట్టుకుని వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. సీఈవోలు మాట్లాడుతూ వేతన సవరణతో పాటు మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలు పర్చాలన్నారు. ఆయా సంఘాల సీఈవోలు దావా ప్రసాద్, కొఠంది ప్రసాద్, అమలాల నాగేశ్వరరావు, పసలపూడి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సకాలంలో చెత్త తొలగించాలి..

సమస్య : తొట్టెలలో పోసిన చెత్తను వెంటనే తొలగించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తొట్టెలు నిండిపోవడంతో వాటి పక్కన చెత్త, వ్యర్థాలు పోస్తుండడంతో కుక్కలు, పందులు చేరుతున్నాయి. - ఎం.నాగు, కొవ్వూరు

సమాధానం : తొట్టెలలో పోసిన చెత్త, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు సిబ్బందిని పంపిస్తాం.

\- సీహెచ్ వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్

\- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

మాట్లాడుతున్న 9వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అనురాధ

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : ఇరుపక్షాల ఒప్పందంతో కేసుల సత్వర పరిష్కారానికి లోక్అదాలత్ వేదికగా నిలుస్తుందని కొవ్వూరు 9వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎం.అనురాధ అన్నారు. వచ్చేనెల 14న జాతీయ లోక్అదాలత్ నేపథ్యంలో పోలీసు అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. క్రిమినల్ వారీగా పెండింగులో ఉన్న కేసులు, రాజీ చేయదగ్గవి ఎన్ని, వాటి ప్రగతిని తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జరిగే లోక్అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించాల్సి ఉందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయిశ్రీ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ రథానికి ఆదరణ

స్వచ్ఛ రథం వద్ద సర్పంచులు, కార్యదర్శులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: పల్లెల్లో స్వచ్ఛ రథానికి ఆదరణ లభిస్తుంది. ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని ఎంపీడీవో మడిపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉండ్రాజవరం, పాలంగి తదితర గ్రామాల్లో రథం ఇంటింటా మంగళవారం పర్యటించింది. స్థానికులు ప్లాస్టిక్, గాజు, స్టీలు, అల్యూమినియం, పేపర్లు, పుస్తకాలను అందజేసి నిత్యావసరాలు తీసుకున్నారు. సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కోకో గింజల ధర పతనం

• అరటి తోటలు తొలగించి సాగు చేపట్టిన రైతులకు నిరాశ

న్యూస్‌టుడే, ఉండ్రాజవరం, చాగల్లు

గతేడాది కోకో ధర కిలో సుమారు రూ. 1300 పలికింది. ఈ ఏడాది అదేస్థాయిలో ధర ఉంటుందని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. వందలాది ఎకరాల్లో అరటి తోటలను తొలగించి మొక్కలు నాటగా అవి కాపునకు వచ్చే సమయానికి కోకో ధర పతనమైంది. ప్రస్తుతం కిలో గింజలు ధర కేవలం రూ. 350 మాత్రమే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి విస్తీర్ణం తగ్గటంతో ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టాయి.

కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గతంలో 26 వేల ఎకరాల్లో అరటి తోటలు ఉండేవి. ప్రస్తుతం సాగు విస్తీర్ణం సుమారు 19 వేల ఎకరాలకు తగ్గిపోయింది. గతంలో 13 లారీల వరకు అరటి గెలలు ఒడిశా, బీహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం సాగు విస్తీర్ణం తగ్గటంతో ఉత్పత్తి పడిపోయింది. జిల్లాలో రోజుకు 1.5 లక్షల వరకు అరటి ఆకులు

గతంలో 26 వేల ఎకరాల్లో..

ఎగుమతి చేసేవారు. తద్వారా సుమారు 1800ల మంది ఉపాధి పొందేవారు. ప్రస్తుతం అరటి సాగు తగ్గటంతో అరటి ఆకుల ఉత్పత్తి తగ్గింది. ఆకుల కొరత ఏర్పడింది. కోకో సాగు విస్తీర్ణం 14 వేల ఎకరాల నుంచి 18 వేల ఎకరాలకు పెరిగినా ధర పతనం కావటంతోపాటు ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో దిగుబడి కూడా తగ్గింది. భవిష్యత్తులోనైనా కోకో ధర పెరుగుతుందా అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

ధర అనుకూలంగా ఉన్నా..

ప్రస్తుతం అరటి ధర అనుకూలంగా ఉన్నా డిమాండుకు తగ్గట్టుగా ఉత్పత్తి లేదు. రెండేళ్ల క్రితం అధిక విస్తీర్ణంలో సాగు చేసినా ధర అంతంత మాత్రంగా ఉండటంతో నష్టపోయాం. ఇప్పుడు సాగు తగ్గింది. దీంతో ధర ఉన్నా గెలలు తక్కువగా ఉన్నాయి.

\- పిండి ఏసుబాబు, అరటి రైతు, వెలగదుర్రు

చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బంది..

అరటి ధర వరుసగా తగ్గడం, అదే సమయంలో కోకో ధర ఒక్కసారిగా పెరగటంతో చిన్న, సన్నకారు రైతులు సైతం కోకో సాగు వైపు దృష్టిమళ్లించారు. అరఎకరం, ఎకరం పొలం ఉన్న రైతులు సైతం కోకో సాగు చేపట్టారు. ప్రస్తుతం కోకో ధర తగ్గడంతో పెట్టుబడి గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొన్నాయి.

\- మారిశెట్టి సూరరాజు, రైతు, తాడిపర్రు

బహుళ పంటల సాగు వైపు దృష్టి..

కొవ్వూరు డివిజన్ పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతంలో అనువైన సారవంతమైన వ్యవసాయ భూమి అందుబాటులో ఉండటంతో ఉద్యాన సాగు ఎక్కువగా చేపడుతున్నారు. అన్ని కాలాల్లో రైతులు ఆదాయం పొందేలా బహుళ పంటల సాగు వైపు దృష్టి మళ్లించాం. ఈ మేరకు కోకోలో అంతర పంటగా అరటి, కొబ్బరి, ఆయిల్ పామ్ తదితర పంటల సాగు చేసేలా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

\- డి.సుధీర్, ఉద్యానశాఖాధికారి, కొవ్వూరు

ఆర్యవైశ్యులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

కొవ్వూరు పట్టణం: అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు అన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతులు గోపూజలు చేశారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సుబ్రహ్మణ్యేశ్వర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలకు 1500 లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకు, వేములూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు కంచాలు అందించారు. సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫెడరేషన్ సహాయ కార్యదర్శి ఉప్పల భాస్కర్, సంఘ కార్యదర్శి కాకి అనిల్‌కుమార్, పూర్వాధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్, కంకటాల రాంబాబు, కోట్లేపర శ్రీను, గ్రంథి ప్రవీణ్, కేజేకే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో నష్ట నివారణ

మొక్కను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి మల్లిఖార్జున్

చాగల్లు, న్యూస్‌టుడే: పొగమంచు వాతావరణం, గాలిలో అధిక తేమతో కోకో పంటకు కొలెటోట్రికమ్ వ్యాధి సోకి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎన్.మల్లికార్జున్ పేర్కొన్నారు. చాగల్లులో కోకో తోటలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కొలెటోట్రికమ్ వ్యాధిని రైతులు సకాలంలో గుర్తించి, సస్య రక్షణ చర్యలు చేపడితే నష్టాన్ని నివారించవచ్చన్నారు. దీని కోసం లీటరు నీటికి 1.5 మి.లీ. హెక్సాకోనజోల్‌ను కలిపి మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. మండల ఉద్యానాధికారి డి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె కాలపు హామీలు నెరవేర్చాలి

ఆర్డీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది రిలే నిరాహారదీక్ష

కొవ్వూరు పట్టణం, గోపాలపురం, న్యూస్‌టుడే : పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు కేటాయించాలని, సమ్మె కాలపు హామీలను నెరవేర్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యం కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది నిరాహార దీక్ష చేపట్టారు. ★ గోపాలపురంలోని ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ★ పెరవలి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి జేబీరాజ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.ప్రవీణ్, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు జువ్వల రాంబాబు మాట్లాడారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

నిడదవోలు డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నిడదవోలు, న్యూస్‌టుడే: ఏపీఎస్ ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్రశాఖ పిలుపు మేరకు మంగళవారం నిడదవోలులో ఎన్ఎంయూ సంఘ నాయకులు డిపో వద్ద ధర్నా నిర్వహించారు. బస్టాండ్లను ప్రైవేటీకరించడంలో భాగంగా వివిధ ప్రైవేట్ కంపెనీలకు డిపోలను అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. డిపో అధ్యక్షుడు బి.రాము, గ్యారుజీ కార్యదర్శి ఎన్‌వీవీ ధనరాజు, నాయకులు జగదీష్, కె.రమేష్, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

తాళ్లపూడి : మలకపల్లి విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతులు చేపడుతున్నందున మలకపల్లి, తిరుగుడుమెట్ట, ధర్మవరం, పెనకనమెట్ట, పెద్దేవం, రాఘవాపురం సబ్‌స్టేషన్లలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

క్రీడా దుస్తులు బహూకరణ

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం యర్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని సుమారు 40 మంది విద్యార్థులకు దాతలు క్రీడా దుస్తులు బహూకరించారని హెచ్ఎం చంద్రరావు తెలిపారు. దేవరపల్లికి చెందిన కవల భరత్, జంగారెడ్డి హనుమంత్ కలిసి 40 జతల క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్.బుజ్జిబాబు, కొల్లేపల్లి మాణిక్యం, వనిత, ఎం.రామారావు, తదితరులు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నిడదవోలు, న్యూస్‌టుడే: ఇటీవల రహదారి ప్రమాదానికి గురై రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అవిడి మోహనసాయిరాం వైద్య ఖర్చులకు జిల్లా భాజపా కార్యదర్శి సత్యదురంగా వెంకటేశ్వరరావు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. రూ.10వేల నగదును అతని తల్లి భవానీకి అందచేశారు. భాజపా నాయకులు దేవన పాపారావు, చింతల బాలాజీ తదితరులు ఉన్నారు.

దేవరపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సేవలో తమ వంతు కృషి చేస్తున్న మన బ్రంద చారిటబుల్ ట్రస్టు దేవరపల్లిలోని సుమంత్ మల్టీ స్పెషాలిటీ అధినేత డా..కె.సుమంత్ రూ.10 వేలు ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. ట్రస్ట్ సభ్యులు జాలిశెట్టి శ్యాంబాబు, ప్రవీణ్‌కుమార్, నాగరాజు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం రహదారికి మహర్దశ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ఉండ్రాజవరం రహదారికి మహర్దశ లభించింది. మంత్రి కందుల దుర్గేష్, ఏపీ వైద్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావుల ఆధ్వర్యంలో ఉండ్రాజవరం నుంచి మోర్త, దమ్మెన్ను మీదుగా కానూరు వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.45 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో 7.5 కిలోమీటర్ల మేర పనులు మంగళవారం చురుగ్గా చేపట్టారు. ఉండ్రాజవరం, మోర్త, కానూరు గ్రామాల్లో సిమెంటు రహదారి, మిగిలిన ప్రాంతంలో తారు రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు. దీంతో గ్రామస్థులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యర్థాలు తొలగక.. మురుగు పారక

కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని కలెక్టర్ అతిథి గృహం ప్రహరీ కుడివైపున ధ్వంసమై కూలి మురుగు కాలువలో పడింది. ఈ ఘటన జరిగి సుమారు రెండు నెలలు అవుతోంది. దీంతో మురుగు కదలడం లేదు. రెవెన్యూ అధికారులు, పురపాలక పారిశుద్ధ్య సిబ్బంది ఇటువైపు చూడడం లేదు. డ్రెయిన్‌పైనున్న కల్వర్టు వద్ద చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఈ ప్రదేశంలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ అంశాన్ని ఆర్డీవో రాణి సుస్మిత దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

అధ్వానంగా గోదావరి ఏటిగట్టు

గోదావరి ఏటిగట్టుపై పలు ప్రాంతాల్లో తుప్పలు పెరిగి అధ్వానంగా కనిపిస్తోంది. ప్రధానంగా నిడదవోలు మండలం విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పందలర్రు, జీడిగుంట, పెండ్యాల గ్రామాల పరిధిలో ఏటిగట్టుపై నుంచి తరచు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో గోతులు ఏర్పడ్డాయి. రాళ్లు తేలడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏటిగట్టు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నిడదవోలు

గుట్టలుగా చెత్తకుప్పలు

దేవరపల్లి మండలం కురుకూరులోని సొసైటీ రహదారిలో చెత్తాచెదారాలు గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగిపోవడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ని వివరణ కోరగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, దేవరపల్లి

కోతుల బెడదతో ఇక్కట్లు

శెట్టిపేట బౌడన్‌పేటలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, మహిళలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకున్నాయి. ఇళ్లలోకి వచ్చి నిత్యావసరాలు, కూరగాయలు, తినుబండారాలు వంటి వస్తువులను పట్టుకుపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కోతుల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

గుండెపోటుతో చోదకుడి మృతి

చింతలపూడి పట్టణం: గుండెపోటుతో చోదకుడు మృతిచెందిన సంఘటన చింతలపూడి మండలం సీతానగరం పామాయిల్ కర్మాగారంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన సొంగా శ్రీనివాసరావు శనివారం ఆయిల్‌పామ్ గెలల లారీతో సీతానగరం కర్మాగారానికి వచ్చాడు. గెలలు అన్‌లోడ్ చేయడం ఆలస్యం కావడంతో అక్కడే ఉన్నారు. సోమవారం మధ్యాహ్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కర్మాగారంలోని ప్రథమ చికిత్స కేంద్రంలో పరీక్షలు చేయించుకున్నారు. కాసేపటికి లారీల మధ్యలో అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసరావును చోదకులు గుర్తించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

నల్లజర్ల: అదనపు కట్నం కోసం కావాలంటూ భార్యను వేధిస్తున్న భర్తపై నల్లజర్ల పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల మేరకు జగన్నాధపురానికి చెందిన తానెం మధుకు కృష్ణా జిల్లా తమిడిముక్కల మండలం కపిలేశ్వరపురానికి చెందిన శ్రీదుర్గతో 12 ఏళ్లక్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా మధు అదనపు కట్నం కావాలంటూ ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఆమె పిల్లలతో కలసి నల్లజర్లలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈ నెల 8న శ్రీదుర్గ దగ్గరకు మధు వెళ్లి ఘర్షణకు దిగాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధుపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

నిడదవోలు: శెట్టిపేటలో సెల్ టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో, గ్రామ కార్యదర్శికి గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. నిబంధనలను తొక్కిపెట్టి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఇళ్ల మధ్య టవర్ నిర్మాణం తక్షణమే నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని కోరారు. ఏపీ భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రామకృష్ణ, ఎంపీటీసీ బయ్యే కృష్ణబాబు, సహకార సంఘ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు పాటంశెట్టి శివన్నారాయణ, స్థానికులు బయ్యే విజయ్, ధనుంజయ్ పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో వినతి అందిస్తున్న రామకృష్ణ తదితరులు

మితిమీరిన వేగంతో ఇబ్బందులు

నిడదవోలు: గత కొంతకాలంగా యువత ద్విచక్ర వాహనాలను నిర్లక్ష్యంగా అతి వేగంగా నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీరు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్స్ తీసివేసి పట్టణ వీధులో చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తున్నారు. ఇదే తరహాలో మంగళవారం మధ్యాహ్నం సమయంలో గాంధీనగర్ రెండోవీధిలో ఓ ద్విచక్రవాహనానికి సైలెన్సర్ తీసివేసి వెళ్లడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీనిపై పోలీసులకు అందిన సమాచారంతో ఆ ద్విచక్రవాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు.

సమష్టిగా కృషిచేయాలి

దేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయడం వల్ల పంచాయతీల ఆదాయం పెరిగి అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ కె.వి.కె.దుర్గారావు అన్నారు. 2025-2026 సంవత్సరానికి సంబంధించి పంచాయతీల సొంత ఆదాయ వనరులను స్వర్ణ పంచాయతీ పోర్టల్ నందు సమలేఖనం చేయడంపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో సీహెచ్. నాగార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో వై.రాజారావు, కె.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

నల్లజర్ల, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నుంచి పోతవరానికి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ చీపురుగూడెం వద్దకు వచ్చే సరికి ట్రాలీ మధ్య ఉన్న రాడ్డు విరిగిపోవడంతో అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. ఆసమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనాస్థలాన్ని పరిశీలించిన విద్యుత్తు శాఖ అధికారులు ట్రాక్టర్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం యాదవోలులోని వంగవీటి రంగా జంక్షన్, ఎస్సీ ఏరియాలో వ్యర్థాల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

డాక్యుమెంట్ పోయినది

ఉప్పలపాటి పాపారాయుడు, S/o వీరవెంకట కృష్ణారావు, దేవరపల్లి గ్రామం, దేవరపల్లి మండలం, తూ॥గో॥జిల్లా, AP. అను నాయొక్క దస్తావేజులు నెం.777/2005, R.S. నెం.124 య.2.00 సెంట్లు ది.17-03-2005లో రిజిస్ట్రేషన్ చేయ బడినది. ది.18-02-2026న మా ఇంటి వద్ద నుండి దేవరపల్లి సెంటర్‌లో జిరాక్స్ కోసం వెళ్తుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రసుకుగాని, ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు గాని తెలియపరచగలరు.

సెల్: 88976 44879

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) తణుకు

I.P.No. 14/2020

Between

కప్పల విమలమ్మ అనే విమల కుమారి(died) వగైరాలు ..పిటీషనర్లు

And

గుడివాడ శ్రీనివాసరావు వగైరాలు .. రెస్పాండెంట్లు

Summons

10వ రెస్పాండెంట్:-గుడివాడ వెంకట నాగలక్ష్మి, భర్త శ్రీనివాసరావు, డోర్ నెంబర్ 2-90/1, కొత్తపల్లి గ్రామం, పెరవలి మండలం, తూర్పుగోదావరి జిల్లా.

1వ రెస్పాండెంట్ గుడివాడ శ్రీనివాసరావుగారు 1 పిటిషనరు దగ్గర డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించకుండా అతని పేరుమీద ఉన్న ఆస్తిని ఇతరులకు 2,3 రెస్పాండెంట్స్‌కు నామినీలుగా రిజిస్ట్రేషన్ చేసినందున, 1వ రెస్పాండెంట్‌ను Insolvent గా ప్రకటించమని కోరుతూ పిటిషన్ దాఖలు చేసి నందున పిటిషన్ పెండింగ్లో ఉండగా 2వ రెస్పాండెంట్ చనిపోయినందున అందు మిమ్ములను పార్టీగా చేర్చమని కోర్టులో పిటిషన్ వేసినారు. సదరు పిటిషన్, సమన్లు పంపించినను అవి అములు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది: **10-3-2026** న ఉదయం **10-30** నిమిషాలకు మీరు స్వయంగా గాని ప్లీడర్ గా ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షము సదరు విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

ఈద రామకృష్ణ

తణుకు అడ్వకేట్, తణుకు.

ది:24-2-2026. సెల్..9440120445

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ సివిల్ జడ్జి)

EP No. 30/2024 OS No. 5/2015

D.H.R:- కొంజేటి సురేష్‌కుమార్

And

J.D.R:- 1. నిమ్మల అమ్మాజీ W/o రామకృష్ణ, కానూరు

2. నిమ్మల రామకృష్ణ S/o రామారావు, కానూరు

ప్రకటన

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి D.H.R. తనఖా బాకీ తీర్మానం నిమిత్తం శ్రీ Court వారు ది.వి. 16-03-2026 తేదీన శ్రీ Court వారి ఎదుట వేలం వేయుటకు శ్రీ Court వారు తీర్మానం చేసిరి. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా పాటదారులు కోర్టు వారి ఎదుట ఆస్తిని పాడుకొనగలందులకు తెలియజేయడమైనది.

షెడ్యూలు: తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు SRO పెరవలి మండలం, కానూరు గ్రామం R.S.No. 222/7 మెరక భూమి పూర్తి Ac. 0-42 సెంట్లులో ఈశాన్యం ప్రతి Ac. 0-16 సెంట్లు సమస్త ఈజిమెంటు హక్కులతో సరిహద్దులు: **తూర్పు:** సాధనాల వెంకటేశ్వరరావు భూమి, **దక్షిణం:** తామర చెరువుగట్టు, **పడమర:** J.D.R.ల మిగిలిన భూమి, **ఉత్తరం:** కానూరు కాల్వ ఈ హద్దుల మధ్య R.S.No. 222/7 లో Ac. 0-16 సెంట్లు భూమి సమస్త హక్కులతో సహా నీటి వాళ్లు, ఈజిమెంటు హక్కులతో సహా

తణుకు సం/- బండారు సుబ్బారావు, అడ్వకేట్,

23-02-2026 తణుకు, సెల్: 93817 84461

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చాగల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.ముప్పవరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన సీహెచ్ నాని(23) మరో మహిళతో నిడదవోలు నుంచి చాగల్లు వైపు ద్విచక్ర వాహనంపై వస్తూ చాగల్లు మండలం ఎస్.ముప్పవరంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో నాని తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. పరిస్థితి విషమించడంతో ఆయన మంగళవారం మృతి చెందారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..

నిడదవోలు: మండలంలోని సమిశ్రగూడెం లోహియానగర్ రొయ్యల చెరువులో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన మోతీ పరదార్(33) ఓ గ్రామానికి చెందిన రొయ్యల చెరువుల్లో పనిచేస్తున్నారు. మంగళవారం చెరువులో పడి మృతి చెంది ఉన్నట్లు గుర్తించి అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని నిడదవోలు ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు.

ఆక్రమణల మాటున.. పొంచి ఉన్న ప్రమాదం

నిడదవోలు , న్యూస్‌టుడే: రహదారులు, కాలువల పొడవునా చోటుచేసుకున్న ఆక్రమణలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అయినా అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ర.భ.శాఖ ప్రధాన రహదారి పొడవునా ఆక్రమణలు గురికావడంతో అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారులపైనే వాహనాలు..

నిడదవోలు మండలం విజ్జేశ్వరానికి వెళ్లే రహదారి నుంచి గుబ్బాలమ్మ ఆలయం వరకు కాలువ గట్టుపై పక్కా భవనాలు, గోపవరం నుంచి డి.ముప్పవరం వరకు పక్కా ఇళ్లు నిర్మించారు. మద్దూరు వంతెన సమీపంలో రహదారికి కాలువకు మధ్య ఉన్న గట్టుపై రేకుల షెడ్డుతో ఒక హోటల్ ఏర్పాటు చేశారు. ఇటీవల రాత్రి సమయంలో సరాసరి కారు ఆ హోటల్‌పైకి దూసుకుపోయింది. అయితే ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. అదే ఉదయం జరిగి ఉంటే అనేక మందికి ప్రాణహాని కూడా జరిగేది. పైగా హోటల్ తెరిచి ఉన్న సమయంలో రహదారులపైనే వాహనాలు నిలుపుతున్నారు. ఇవి మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. రహదారి పొడవునా ఇదే పరిస్థితి.

షెడ్లను నిర్మించడంతో..

డి.ముప్పవరం నుంచి కలవచర్ల, మునిపల్లి వరకు పలువురు రోడ్లను ఆక్రమించుకుని పక్కాగా షెడ్లు నిర్మించారు. కొందరైతే అరటి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే రహదారిలో కాలువ, ర.భ.శాఖ రహదారి మధ్య ఏర్పాటు చేసిన షెడ్లు కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజ్జేశ్వరం బ్యారేజీ కూడలిలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై జలవనరులశాఖ ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావును వివరణ కోరగా కానూరు కాలువ, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు దశల వారీ చర్యలు చేపడతామన్నారు.

నిడదవోలు-రాజమహేంద్రవరం రహదారిలో కాలువ గట్టుపై షెడ్డు

(c) eenadu

మండపేట

•మండపేట •అనపర్తి

అభివృద్ధి పనుల పరిశీలన

మండపేట గ్రామీణం: గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులను అధికంగా విడుదల చేస్తోందని మండపేట నియోజకవర్గ భాజపా కన్వీనర్ కె.వి.వి.సాయిరామ్ వెల్లడించారు. ద్వారపూడి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన సీసీ రహదారులు, డ్రైనేజీల అభివృద్ధి పనులను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కంకటాల మురళీకృష్ణ, పాలిక రమణ, రాయి వీర్రాజు, నీలా చిన్న, దూలం శ్రీనివాస్, గుత్తుల సత్యనారాయణ, పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

పెదపూడి, న్యూస్‌టుడే: రైతులు గుర్తింపు సంఖ్య కోసం తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎన్.సత్యప్రసాద్ సూచించారు. మంగళవారం గండ్రేడు గ్రామంలో నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటివరకు 9,125 మంది రైతులు వివరాలు నమోదు చేసుకున్నారని, మరో 986 మంది చేయించుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్, పంటల బీమా, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు అర్హులకు వర్తిస్తాయన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబరుతో నమోదు చేసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు	
మండపేట: 80085 74183	ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637	అంగర: 97044 16418
రాయవరం: 80085 74185	

వీధి దీపాలు వెలిగాయి..

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడు ఎస్సీకాలనీలో వీధిదీపాలు వెలగక అంధకారంలో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– కె.రవికుమార్, జడ్.మేడపాడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తికి తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి దీపాలకు మరమ్మతులు చేయించారు.
– న్యూస్‌టుడే, ద్వారపూడి

మంత్రి లోకేశ్‌తో ఆత్మీయ సమావేశం

మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే వేగుళ్ల, కుటుంబ సభ్యులు

మండపేట, న్యూస్‌టుడే: కుటుంబ విలువలు పెంపొందించేలా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఉండవల్లిలోని తన స్వగృహంలో ప్రజాప్రతినిధులకు విందు ఏర్పాటు చేశారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తన పెద్ద కుమార్తె మణిమంజరి, అల్లుడు సురేష్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యుల వివరాలను లోకేశ్‌కు ఎమ్మెల్యే వివరించారు.

ఇంటర్ పరీక్షకు 30 మంది గైర్హాజరు

మండపేట, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మొదటి రోజు మంగళవారం పరీక్షకు 30 మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ సమర్ల జశుమార్ తెలిపారు. మొత్తం 1,797 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1767 మంది రాసినట్లు వివరించారు.

రాయవరం: రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల తొలిరోజు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సంస్కృతం, తెలుగు, ఒకేషనల్ పరీక్షలకు 223 మంది హాజరుకావాల్సి ఉండగా ఆరుగురు విద్యార్థులు హాజరుకాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిపార్ట్‌మెంటల్ అధికారి సూర్యనారాయణ వెల్లడించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేటలోని శ్రీవుండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. హెల్పింగ్ హేండ్స్ ఛారిటబుల్ ట్రస్టు సమకూర్చిన వీటిని తహసీల్దారు కె.అనసూయ, హెచ్‌ఎం వి.పార్థసారథి, వీఆర్వోలు, ట్రస్టు ప్రతినిధులు పంపిణీ చేశారు.

దాతలూ రండి.. భవిత మార్చండి

ప్రభుత్వ పాఠశాలల దత్తతకు విద్యాంజలి

రాయవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు విద్యాంజలి పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. సేవాభావంతో ముందుకు వచ్చే దాతల సహకారంతో పాఠశాలల్లో వసతులు కల్పించాలనేది ఈ పథకం ఉద్దేశం. దీనికోసం విద్యాంజలి 2.0 పేరుతో ప్రత్యేక పోర్టల్ సిద్ధం చేసింది. పాఠశాలల వారీగా అవసరాలు గుర్తించి వాటిని అందులో నమోదుచేస్తారు. వాటిని కల్పించడానికి పూర్వ విద్యార్థులు, స్థానికులు, ప్రవాసాంధ్రులు, పలు సంస్థలకు చెందిన దాతల సహకారం తీసుకుంటారు. దీనివల్ల పాఠశాలల్లో వసతులు మెరుగుపడటంతో పాటు విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి సకాలంలో సమకూరి విద్యాభివృద్ధికి దోహదపడుతుంది. మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లో 289 పాఠశాలల్లో సుమారు 48 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఏం చేయాలంటే..

● నర్సరీ నుంచి ఇంటర్ వరకు తరగతులు బోధించవచ్చు. ● కథలు చెప్పడంతో పాటు పిల్లల్లో సృజనాత్మకత పెంచడం, రాయడంలో నైపుణ్యాలు రూపొందించడం. ● కళలు వృత్తి నైపుణ్యాలు నేర్పడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడం. ● దివ్యాంగులకు సేవలు, వయోజన విద్య, పాఠశాలల్లో పరిశుభ్రత సహకారం, సాంకేతిక విద్యకు అవసరమైన స్మార్ట్‌టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, క్రీడా పరికరాలు ఇవ్వొచ్చు.

ఎవరైనా స్పందించొచ్చు..

పిల్లలకు పుస్తకాల నుంచి మొదలు.. వసతుల కల్పన వరకు ఏ సహకారమైనా అందించొచ్చు. విద్యాలయాలకు విజ్ఞానం పంచుకోవచ్చు. వస్తు రూపంలో, తాగునీటి పరికరాలు, బల్లలు, కంప్యూటర్లు, టీవీలు, ప్రయోగ పరికరాలు, క్రీడా సామగ్రి, స్వయం ఉపాధికి ఉపయోగపడే పరికరాలు సమకూర్చాలనుకునేవారు విద్యాంజలిలో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

పోర్టల్‌లో నమోదు ఇలా..

విద్యాంజలి 2.0 పోర్టల్‌లో యూడీఐఎస్‌ఈ కోడ్, పాఠశాల పేరు, చిరునామా, ప్రధానోపాధ్యాయుడి పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాలలో సదుపాయాలు, అదనంగా కావాల్సినవి, వాటికయ్యే వ్యయం వివరాలను పొందుపర్చాలి. ఆర్థిక సాయానికి ముందుకొచ్చే దాతలు, వెబ్‌సైట్‌లోని వాలంటీర్ రిజిస్ట్రేషన్ విభాగంలో నమోదు చేసుకోవాలి. విద్యార్థులకు ఏదైనా సబ్జెక్ట్‌పై బోధనకు ఆసక్తి ఉన్నవారు సైతం వివరాలను నమోదు చేసుకోవచ్చు. దీనిపై స్కూల్ రిజిస్ట్రేషన్ ట్రైనింగ్ నోట్స్ పేరుతో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ః ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో చేయూత అందించడానికి ముందుకొచ్చినవారితో పాటు పాఠశాలలకు అవసరమైన వివరాలన్నీ పక్కాగా నమోదు చేసేలా చర్యలు చేపట్టారు. దీనికోసం vidyanjali.education.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.



విద్యాంజలి వెబ్‌సైట్

దాతలు సహకారమందించాలి..

విద్యాంజలి 2.0 వెబ్‌సైట్‌లో దాతలు వివరాలు నమోదుచేసుకుని, తమకు నచ్చిన పాఠశాలకు సహకారం అందించవచ్చు. అక్కడ ఏయే సేవలు సమకూర్చగలరో ముందుగా తెలియజేయాలి. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు చేయూతనందిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి.
– ప్రత్తి రామలక్ష్మణమూర్తి, డీవైఈవో, రామచంద్రపురం

స్వచ్ఛ రథం వచ్చేసింది..

బిక్కవోలు, న్యూస్‌టుడే: గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నపుడే గ్రామీణులు ఆరోగ్యంగా ఉంటారనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామీణ ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోంది. దీనిలో భాగంగా స్వచ్ఛరథం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మండలానికి ఒక రథాన్ని కేటాయించి వారానికి ఒకసారి గ్రామాల్లో వాహనం తిరగాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి మండలానికి జనవరి నెలలోనే వాహనాన్ని కేటాయించారు. బిక్కవోలు మండలానికి ఫిబ్రవరి నెలలో అందించారు. రంగంపేట మండలానికి వచ్చే మార్చిలో పంపుతారు. ఇలా ప్రతి నెలా కొన్ని మండలాలు ఎంపికచేసి చెత్త రహిత గ్రామాలుగా మార్చేందుకు చర్యలు చేపట్టారు.

మనం ఇచ్చే వస్తువులకు ఇలా..

వస్తువు	కిలో ధర (రూ.లలో)
ఇనుము	20
కాగితాలు	15
పుస్తకాలు	10
అట్టపెట్టెలు	10
ప్లాస్టిక్ సీసాలు	20
గాజు సీసాలు	2
స్టీలువస్తువులు	40
అల్యూమినియం	120

తీసుకునే వస్తువులు ఇవే..

పాత ఇనుపముక్కలు, కాగితాలు, పుస్తకాలు, అట్టలు, ప్లాస్టిక్ వస్తువులు, గాజు వస్తువులు, అల్యూమినియం తదితర వస్తువులను గృహస్థుల నుంచి స్వచ్ఛరథం నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం నగదుకు బదులుగా కొన్ని వస్తువులు అందిస్తారు. ఇలా మొత్తం 17 రకాల నిత్యావసర వస్తువులతో వాహనం గ్రామాల్లో తిరుగుతుంది.

వాహనంలో ఉండేవి..

కందిపప్పు, షాంపూలు, కొబ్బరినూనె, డిటర్జెంట్ ప్యాకెట్లు, సబ్బులు, దుస్తులు ఉతికే సబ్బులు, టీపొడి, కాఫీపొడి, టూత్ పేస్టు, ఉల్లిపాయలు, బ్రష్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, గోధుమపిండి, వేరుసెనగపప్పు, మినపప్పు 250 గ్రాముల చొప్పున ప్యాకెట్లలో అందుబాటులో ఉంటాయి.

బిక్కవోలు చేరిన స్వచ్ఛరథం

స్వచ్ఛ రథాన్ని వినియోగించుకోండి..

పనికి రాని వస్తువుల్ని పారేసేకన్నా స్వచ్ఛరథానికి ఇస్తే వాటికి విలువకట్టి నిత్యావసరాలు ఇస్తారు. ఇలా ఇళ్లలో పేరుకుపోయే వ్యర్థాలను వదిలించుకోవచ్చు. – శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు

విద్యుత్తు స్తంభాలపై కేబుళ్లు తొలగించాలి

కేబుల్ ఆపరేటర్లతో మాట్లాడుతున్న కమిషనర్

మండపేట, న్యూస్‌టుడే: వారం రోజుల్లోగా విద్యుత్తు స్తంభాలపై ఉన్న అదనపు కేబుల్ తుట్టలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు ఆపరేటర్లకు సూచించారు. మంగళవారం తన ఛాంబర్‌లో పట్టణంలోని ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. కేబుళ్లు అడ్డదిడ్డంగా ఉండడంతో విద్యుత్తు తీగలకు మరమ్మతులు చేసేందుకు ఆ శాఖ సిబ్బందికి అడ్డంకులు ఎదురవుతున్నాయని చెప్పారు. కొన్నిచోట్ల తెగి రోడ్డపై పడుతున్న, వేలాడుతున్న కేబుళ్లు ప్రమాదకరంగా మారుతున్నాయని వివరించారు. వాటితో పాటు అదనపు తీగల కట్టలను తొలగించకపోతే విద్యుత్ శాఖకు అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో విద్యుత్ శాఖ డీఈఈ సిహెచ్.శ్రీధర్, ఏఈ ముని, మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస్, ఏఈ అనూషలక్ష్మి, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

భాషోత్సవాల్లో బిక్కవోలు విద్యార్థుల ప్రతిభ

మెళ్లూరు విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఈవో వాసుదేవరావు

బిక్కవోలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జిల్లాస్థాయిలో మంగళవారం నిర్వహించిన భాషోత్సవాల్లో బిక్కవోలు మండలం మెళ్లూరు ఎంపీపీ మోడల్ పాఠశాల విద్యార్థిని కుందుమర్తి లక్ష్మీధరణి ప్రత్యేక ప్రతిభా విభాగంలో ద్వితీయ బహుమతి లభించిందని హెచ్‌ఎం కొవ్వూరి సత్తిరెడ్డి తెలిపారు. డీఈవో కె.వాసుదేవరావు చేతుల మీదుగా విద్యార్థిని బహుమతి అందుకుందని వివరించారు. బిక్కవోలు ఎంపీపీ మెయిన్ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని పల్లి రక్షిత పద్య పఠనంలో తృతీయ బహుమతి అందుకుందని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు.

వేతనాలు పెంచాలని కోరుతూ రిలే నిరాహారదీక్ష

మండపేట, న్యూస్‌టుడే: కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండపేట ప్రాజెక్టు అధ్యక్షురాలు బేబీరాణి, మండల నాయకులు కుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

దీక్షలో అంగన్‌వాడీ కార్యకర్తలు

జీజీయూలో మార్కెటింగ్‌పై కార్యశాల

రాజానగరం : గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'ఫొటోగ్రఫీ మార్కెటింగ్ టూల్' అనే అంశంపై విద్యార్థులకు ఆర్‌కే బ్లాక్‌లో కార్యశాలను మంగళవారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్‌గా మార్కెటింగ్ మేనేజర్ సిద్దార్థ్ పండా, వీవో రిటైల్ మేనేజర్ శ్రీహరి హాజరయ్యారు. ఏ.ఐ ఆధారిత టూల్స్ మార్కెటింగ్ రంగంలో తీసుకువస్తున్న మార్పులపై అవగాహన కల్పించారు. స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ వల్లీమాధవి, బీబీఏ విభాగాధిపతి వెంకటేశ్వర్లు, ఎమ్‌బీఏ విభాగాధిపతి రాజా తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు మండపేట కల్యాణ బోండాలు

మండపేట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్టపై బుధవారం రాత్రి నిర్వహించే లక్ష్మీ నరసింహస్వామి కల్యాణానికి మండపేటకు చెందిన భక్తుడు కేవీఏ రామారెడ్డి అలంకరించిన కొబ్బరి బోండాలను పంపించారు. ఈయన దాదాపు 25 సంవత్సరాలుగా భద్రాచలంలోని సీతారాముల వారి కల్యాణానికి బోండాలు అందిస్తున్నారు. యాదగిరిగుట్ట కల్యాణానికి గత ఏడాది నుంచి వీటిని పంపుతున్నట్లు వివరించారు. మంగళవారం రాత్రి బస్సులో తీసుకువెళ్లి యాదగిరిగుట్టలో అందిస్తామని తెలిపారు.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

అంగర శ్రీవేణుగోపాలస్వామి

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో కొలువైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 5 వరకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీదేవి తెలిపారు. గురువారం స్వామి వారిని పెండ్లికుమారుడిగా చేయడం, 27న రథోత్సవం, పోలేరమ్మ ఆలయం వద్ద తీర్థం, 28న గ్రామసేవ, మార్చి ఒకటో తేదీన పండిత సదస్యం, 2న నూకాలమ్మ ఆలయం వద్ద చోర సంవాద కథా శ్రవణం, గ్రామోత్సవం, 4న పుష్పయాగం, 5న అన్నసమారాధన ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో చలువపందిళ్లు నిర్మించి విద్యుదీపాలతో అలంకరించారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మండపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని పట్టణ సీఐ సురేష్ కోరారు. మంగళవారం భాష్యం పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో.. పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించారు. పరీక్షల సమయంలో బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ పెరుమాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

రహదారి పనులను పరిశీలిస్తున్న డీఈఈ సూర్యనారాయణ

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని సోమేశ్వరం-లొల్ల, లొల్ల-రాయవరం గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న రాజానగరం-సోమేశ్వరం (ఎస్‌ఆర్) రహదారి పనులను ర.భ.శాఖ రామచంద్రపురం డివిజన్ డీఈఈ టీవీఎస్ సూర్యనారాయణ పరిశీలించారు. మంగళవారం సీసీ రహదారి పనుల నాణ్యతను తనిఖీ చేశారు. రూ.3.5 కోట్లతో పది మీటర్ల వెడల్పుతో బీటీ, సీసీ పనులు చేపట్టినట్లు డీఈఈ చెప్పారు. రహదారి పనుల్లో నాణ్యత పాటించేలా పర్యవేక్షణ చేస్తున్నామని ఏఈ బి.వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. పనులను సకాలంలో నాణ్యతతో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని లొల్ల సర్పంచి చాట్రాతి జానకీ రాంబాబు అధికారులను కోరారు.

కోరుకొండ తహసీల్దార్‌కు పదోన్నతి

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వి.సుస్వాగతం పదోన్నతి పొందారు. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి ఇస్తూ ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంకా కొంత కాలం పాటు ఇక్కడే విధులు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ అధికారుల సందర్శన

బస్టాండ్‌లో తనిఖీల అనంతరం ఆర్టీసీ అధికారులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం ద్వారపూడి గ్రామంలోని బస్టాండ్ వద్ద ఆర్టీసీ అద్దె బస్సులు నిలపడం లేదనే స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం విజయవాడకి చెందిన ఆర్టీసీ ఉన్నతాధికారి శివరాం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల అధికారులతో కూడిన బృందం బస్టాండ్‌ను సందర్శించింది. అద్దె బస్సుల యూనియన్ నాయకులు, బస్సుల యాజమాన్యంతో చర్చించి త్వరితగతిన గ్రామంలో బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం రీజనల్ మేనేజర్ మూర్తి, కాకినాడ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ మాధవ్, కాకినాడ డిపో మేనేజర్ మనోహర్, రావులపాలెం డిపో మేనేజర్ కుమార్, కూటమి నాయకులు అడబాల బుల్లబ్బు, యరగతపు బాబ్జి, చింతా దొరబాబు, కంకటాల మురళి తదితరులు పాల్గొన్నారు.

తెదేపా సీనియర్ నేత సుబ్బారెడ్డి మృతి

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు మండలం కొంకుదురుకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ ఉపాధ్యక్షుడు కొవ్వూరి సుబ్బారెడ్డి (76) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. ఈయన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మామయ్య. రెండు నెలల క్రితమే సుబ్బారెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి (65) కూడా మృతిచెందారు.

రంగంపేటలో సినీ నటి శ్రీదేవికి నివాళి

రంగంపేట, న్యూస్‌టుడే: దివంగత సినీ నటి శ్రీదేవి వర్ధంతిని మంగళవారం రంగంపేటలో నిర్వహించారు. స్థానిక పెద్దలు గోలి దొరబాబు, అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో శ్రీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉభయ గోదావరి జిల్లాలతో ఆమెకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఇక్కడ నిర్మించిన పదహారేళ్ల వయస్సు సినిమా ఆమెకు మైలురాయిగా నిలిచిందని మరిడయ్య అన్నారు.

కథా చక్రవర్తి ముద్రలు కరవయ్యాయి..

నేడు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వర్ధంతి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: తెలుగుభాషపై అభిమానంతో వ్యవహారిక భాషను స్వాగతించి కథానికలతో కథా చక్రవర్తిగా పేరొందిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను సాహితీవేత్తలు మననం చేసుకుంటున్నారు. అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో 1891 ఏప్రిల్ 23న పండిత కుటుంబంలో జన్మించినా సంస్కృతానికి స్వస్తి చెప్పి తెలుగులో కథలు రాసిన వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. కథలకే పరిమితం కాకుండా సంగీతం, జ్యోతిషంలో ప్రావీణ్యం పొందారు. రాయవరం మల్లిడి సత్తిరెడ్డి ప్రింటింగ్ ప్రెస్ ద్వారా 'రెడ్డి రాణి', 'ప్రబుద్ధాంధ్ర' వంటి పత్రికలు నడిపించారు. ఆయన రాసిన అనుభవాలు-జ్ఞాపకాలు ఆత్మకథ పుస్తకంలో సైతం ఆయన పొలమూరు, మహేంద్రవాడలో తాను గడిపిన బాల్యం గురించి రాశారు. తెలుగు సాహిత్యానికి విలువైన రచనలు అందించిన ఆయన 1961 ఫిబ్రవరి 25న రాజమహేంద్రవరంలో మృతిచెందారు.

కొన్ని జ్ఞాపకాలు..

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి పేరిట సాహిత్యరంగంలో సేవలు అందించిన పలువురికి బుద్ధవరపు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందించినా కొన్నేళ్లుగా నిలిపివేశారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అనుభవాలు-జ్ఞాపకాలు పుస్తక ముఖచిత్రం

● 2018 డిసెంబరు 8న తెలుగు రాష్ట్రాల్లోని కవులు, సాహిత్య అభిమానులు, తెలుగు భాషాభిమానులు పొలమూరు నుంచి పాదయాత్ర చేపట్టారు. ఆయన విగ్రహాన్ని నెలకొల్పాలని, ఆయన సేవలను భావితరాలకు సురక్షితంగా అందించాలని కోరుతున్నారు.

శ్రీపాద జ్ఞాపకాలకు శాశ్వత రూపం..

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి పొలమూరులో జన్మించినా ఆయన విగ్రహం ఇక్కడ లేకపోవడం బాధాకరం. త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు శ్రీపాద గౌరవాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటాం. బుధవారం సుబ్రహ్మణ్యశాస్త్రి వర్ధంతి సందర్భంగా శాసనసభలో ఆయన గురించి ప్రస్తావించాలనుకున్నా వ్యక్తిగత కారణాలతో శాసనసభకు హాజరుకాలేకపోతున్నాను.
– నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే

మున్సిపల్ మార్కెట్ ఆశీలు వేలం

మండపేట: మున్సిపల్ కూరగాయల మార్కెట్, రోడ్డు మార్జిన్‌లో వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసే హక్కును మంగళవారం నిర్వహించిన వేలంలో రూ.26.90 లక్షలకు చింతలపూడి సత్యనారాయణకు అప్పగించినట్లు మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు చెప్పారు. మేకల కబేళాకు నిర్వహించిన వేలంలో రూ.1.66 లక్షలు చెల్లించి షేక్ మదీనా సొంతం చేసుకున్నారు. బస్టాండ్ వద్ద మరుగుదొడ్ల నిర్వహణకు నిర్వహించిన వేలంలో రూ.1.95 లక్షలు చెల్లించేందుకు మీజాల గౌరీ ముందుకొచ్చారని వివరించారు. మున్సిపల్ ఆర్వో మాచిరాజు రవి, ఆర్ఐ కొత్తపల్లి సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాల విక్రయదారులకు లైసెన్సు ఇవ్వాలి

మండపేట: రాష్ట్రవ్యాప్తంగా పాల విక్రయదారులకు లైసెన్సులు జారీచేసి పంచాయితీల పరిధిలో నిఘా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో కల్తీపాలు తాగి ఆరుగురు మృతిచెందగా, పలువురు అనారోగ్యానికి గురవడంపై ఆయన స్పందించారు. దీనిపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

వారాహిమాత ఆలయానికి విరాళం

బిక్కవోలు, న్యూస్‌టుడే: బలభద్రపురంలో నిర్మిస్తున్న వారాహిమాత ఆలయ గర్భగుడిలో ఫ్లోరింగ్ పనుల నిమిత్తం మంగళవారం రూ.50,229 విరాళంగా సమకూరింది. బలభద్రపురంలోని నాగార్జున పౌల్ట్రీ యజమానులు తాడి బ్రహ్మారెడ్డి, వరలక్ష్మి దంపతులు, వెంకటధర్మారెడ్డి, వీరవెంకట మహానాగలక్ష్మి దంపతులు విరాళం అందించారు. ఓ భక్తుడు రూ.18,000, బలభద్రపురం వీఆర్వో మాచవరపు శ్రీనివాస్ రూ.5,116, సత్తి వెంకటరెడ్డి, అనూరాధ దంపతులు రూ.5,116 విరాళంగా అందించారు. అయ్యప్పస్వామి, సంతోషిమాత, గీతామందిరం నిర్మాణానికి అనపర్తికి చెందిన పడాల వెంకటరామారెడ్డి, పద్మావతి దంపతులు రూ.25,116 అందించారు. కొవ్వూరి రామారెడ్డి, కరుణ దంపతులు రూ.10,116 విరాళం అందించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే జీవనోపాధి శిక్షణను అందిపుచ్చుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా స్థిరపడాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సూచించారు. కడియంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సుగంధ ద్రవ్యాల కొవ్వొత్తుల తయారీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ డీఆర్డీఏ నగేశ్, ఏపీడీ సత్యంనాయుడు మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధికి అడుగులు వేయాలని సూచించారు. అనంతరం స్థానిక భాస్కర్ నగర్‌లో నెలకొల్పిన కొబ్బరిపీచు పరిశ్రమను సందర్శించి వాటి తయారీ విధానాన్ని పరిశీలించారు.

శివసాయి ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం టేకిలో కొలువైన శ్రీశివసాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా జరిపించారు. విశాఖకు చెందిన బ్రహ్మశ్రీ ఎలమంచిలి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో బాబావారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బుధవారం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటుచేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం అర్తమూరు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, శాంతిహోమం, చక్రస్నానం యజ్ఞాచార్యులు కొండూరి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మాలధారులు పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు, న్యూస్‌టుడే: శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కాల సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. ఆలయ ఈవో భాస్కర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, మండపేట బ్రాంచి మేనేజరు గారు ఇచ్చిన సందేశంపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

మండపేట పట్టణానికి చెందిన **M/s. MM FIBER FOAM Industry** యొక్క మేనేజింగ్ పార్టనర్ షేక్ మౌలానా, S/o బుడే సాహేబ్ గారు తన యొక్క ఒరిజినల్ ద.నెం 5564/2023 of S.R.O., మండపేట, దస్తావేజు రీత్యా సంక్రమించిన R.S.నెం.30-1B దాఖలా 781 చ॥గ॥ స్థలం మా బ్యాంకుకు హామీగా ఇచ్చి, ఋణం పొందుటకు దరఖాస్తు చేసుకునియున్నారు. మా బ్యాంకు సదరు దస్తావేజు హామీగా డిపాజిట్ చేసుకుని ఋణము మంజూరు చేయుటకు అంగీకరించియున్నది. సదరు ఈ ఆస్తిపై ఎవరికి అయినసూ హక్కులు గాని, హామీలు గాని ఉన్న యెడల ఈ ప్రకటన లగాయితు వారము రోజులలోగా లిఖితపూర్వకముగా మా క్లయింటుకు గాని, ఈ క్రింది అడ్రస్ గల వారికి గాని తెలియజేయవలెను, లేనిచో సదరు ఆస్తిని, నిర్వివాద ఆస్తి అని నమ్మి మా క్లయింటుకు ఋణం మంజూరు చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఆలమూరు, 24-02-2026.
S.V.V.S.N.Murty
బ్యాంకు ప్యానెల్ Advocate, Alamuru.

(c) eenadu

ఆడేస్తాం.. గెలిచేస్తాం

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ఉల్లాసంగా ఆటల పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చూపారు.
- ఈనాడు, విజయవాడ

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ద్వితీయ ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 56 కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు/సంస్కృతం/హిందీ/ఉర్దూ/జీఎఫ్‌సీ పరీక్షలకు 16433 మంది విద్యార్థులకు 16046 మంది హాజరయ్యారు. సాధారణ కోర్సుల వారు 14474 మందికి 14209 మంది వచ్చారు. వృత్తివిద్య కోర్సుల వారు 1959 మందికి 1837 మంది రాశారు. ఏ విధమైన చూచిరాత కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు.

ఏలూరు: సీఆర్ఆర్ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

ఆ 'పైన ఏం జరిగిందో'!

- కొండపై 3వ అంతస్తు నిర్మాణంలో మతలబు
- రూ.10 కోట్లకు పైగా పనులకు టెండర్లు లేవు

నిర్మాణంలో ధర్మ అప్పారావు నిలయం

ఈనాడు-ఏలూరు: వైకాపా ప్రభుత్వ హయాంలో ద్వారకాతిరుమల దేవస్థానంలో చోటుచేసుకున్న బాగోతమిది. ఆలయంలో ధర్మ అప్పారావు నిలయాన్ని (కాటేజీ) 2012లో జీ+1గా నిర్మించారు. దీనిపై 2023లో రెండో అంతస్తు నిర్మాణం(3792 చ.మీ) కోసం రూ.6.98 కోట్లతో ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. రివర్స్ టెండరింగ్‌లో 13 శాతం తక్కువకు ఓ గుత్తేదారు దక్కించుకున్నారు. ఆ పనులు చేస్తుండగానే దానిపై మూడో అంతస్తును ప్రతిపాదించారు.

పనులు రివైజ్డ్ పేరుతో దీనికి టెండర్లు పిలవకుండానే రెండో అంతస్తు నిర్మిస్తున్న అదే గుత్తేదారుకే దేవదాయ శాఖ కమిషనర్ అప్రూవల్ తీసుకుని ఇచ్చారు. 2, 3 అంతస్తుల నిర్మాణం, రంగులకు కలిపి రూ.17 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇందులో రూ.6.98 కోట్ల పనులకే టెండర్లు పిలిచారు. మిగిలిన వాటికి టెండర్లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారు. టెండర్లు పిలిస్తే గుత్తేదారులు పోటీ పడి ఎక్కువ లెస్‌కు వెళ్తారు. దీనివల్ల శ్రీవారికి ఎంతో మిగులుతుంది. దీనిపై అనిశా, విజిలెన్స్ దృష్టి సారిస్తే అసలు టెండర్లు పిలవకుండా పనులు ఇవ్వడం వెనుక ఏం జరిగిందో బయటకు వస్తుంది.

పనుల సాగతీత.. 18 మాసాల్లో పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ గడువు పూర్తయింది. రెండు సార్లు పొడిగించినా పూర్తికాలేదు. ఆఖరుకు మార్చి నాటికి చేయాలని గడువు పొడిగించారు. రెండు, మూడు అంతస్తుల్లో కొత్తగా 94 గదులు నిర్మిస్తున్నారు. వాటిలో వైరింగ్, మరుగుదొడ్ల సామగ్రి, టైల్స్, రంగులు వేసే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. నాలుగు లిఫ్టులు అమర్చాలి. ఇవన్నీ పూర్తి కావాలంటే మరో 2-3 మాసాలు పడుతుంది.

జీవో 94కు తూట్లు జీవో నంబరు 94 ప్రకారం పురోగతిలో ఉన్న పనులకు ఏమైనా మార్పు, చేర్పులు చేయాల్సి వస్తే అది నిర్దేశిత అంచనా వ్యయంపై 10 శాతం లోపు పూర్తవుతాయనుకుంటే టెండర్లు లేకుండా ఇవ్వొచ్చని స్పష్టంగా ఉంది. అంతకు మించి వ్యయంతో చేసే ఏ పనులకైనా టెండర్లు తప్పనిసరి. లేదా మంత్రి మండలి ఆమోదం పొందాలని ఇంజినీరింగ్ అధికారులే చెబుతున్నారు.

ఎందుకో గోప్యత? పౌరులు కోరితే నోట్ ఫైల్స్‌తో సహా పనుల వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం చెబుతోంది. కానీ దేవస్థానంలో రూ.కోట్ల విలువైన పనులను ఏ ప్రాతిపదికన కేటాయించారని ఇంజినీరింగ్ విభాగం ఈఈ భాస్కర్‌ను ప్రశ్నిస్తే దేవదాయ శాఖ కమిషనర్ ఆమోదంతో టెండర్లు పిలవకుండా పనులు కేటాయించామని చెప్పారు. ఆ పనుల కేటాయింపు ఒప్పంద పత్రం (అగ్రిమెంట్) అడిగితే బయటకు ఇవ్వకూడదన్నారు. కనీసం దస్త్రమైనా చూపించండి అందులో ఏం రాశారో చూస్తామంటే దానికి ససేమిరా అన్నారు. నిబంధనలు పాటిస్తే అగ్రిమెంట్ కాపీ ఇవ్వటానికి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదు.

పల్లె పోరుకు సన్నద్ధం

ఓటర్ల జాబితా తయారీలో నిమగ్నమైన సిబ్బంది

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : పల్లె పోరు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రావడంతో ఆ దిశగా జిల్లా పంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఓటర్ల జాబితాల తయారీలో పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గ తాజా జాబితాలను కలెక్టరేట్ నుంచి మండలాలకు పంపారు. వీటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు జాబితాల్లో పేర్లు, చేర్పులు, మార్పులు, సవరణలు తదితర అంశాలను పరిశీలించి కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు.

జిల్లాల విభజన తర్వాత తొలిసారిగా.. జిల్లాల విభజన తర్వాత తొలి పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ఏలూరు జిల్లాలో 544, పశ్చిమగోదావరి జిల్లాలో 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 909 గ్రామ పంచాయతీలకు, 9,588 వార్డు స్థానాలకు సంబంధించి నాలుగు విడతల్లో గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయా పాలకవర్గాల పదవీకాలం గడువు సమీపిస్తుండంతో దీనికి ముందుగానే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాల ఆధారంగా పంచాయతీ, వార్డుల వారీ జాబితాలను విభజించనున్నారు. జనవరి 1వ తేదీ అనంతరం ఓటుహక్కు పొందిన వారి పేర్లను చివరి వార్డులో కలుపుతారు.

9న ప్రదర్శన.. గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా మార్చి 9లోగా ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఇప్పటికే కలెక్టర్లతోపాటు డీపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీ అనంతరం పంచాయతీ సర్పంచి, వార్డు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా తయారీపై దృష్టి సారించినట్లు డీపీవో కె.అనురాధ తెలిపారు.

అనిశా వలలో అటవీ అధికారి

రూ.4 లక్షలు తీసుకుంటూ చిక్కిన వైనం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఓ సామిల్లు యజమాని నుంచి రూ.4 లక్షలు లంచంగా తీసుకుంటున్న నరసాపురం అటవీ శాఖ సెక్షన్ అధికారి (ఎఫ్ఎస్‌వో) ఎస్.సురేష్‌కుమార్‌ను అనిశా అధికారులు పట్టుకున్నారు. భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇంట్లోనే అతన్ని పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనిశా డీఎస్పీ జి.వి.కృష్ణారావు, సీఐలు ఎం.బాలకృష్ణ, కె.శ్రీనివాసు, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఇంట్లో, కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.

ఏం జరిగిందంటే!.. పాలకోడేరు మండలం శృంగవృక్షం ప్రాంతంలోని సామిల్లు పునరుద్ధరణ నిమిత్తం యజమాని ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. దానిపై గత నెలలో వివరాలను అటవీ అధికారులు తీసుకున్నారు. పునరుద్ధరణ చేయకపోగా రూ.4 లక్షలు ఇవ్వాలని అడగడంతో బాధితుడు అనిశా అధికారులను ఆశ్రయించారు.

దస్త్రం దాచి పెట్టి.. కొన్ని రోజుల కిందటే మిల్లు వివరాలను అటవీ అధికారులు తీసుకున్నట్లు తెలుస్తుంది. అప్పట్నుంచి దస్త్రం దాచిపెట్టి నగదుకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రస్తుతం పట్టుబడిన తీరును బట్టి వెల్లడవుతుంది. రూ.6 లక్షలు డిమాండ్ చేయగా విసుగుచెందిన బాధితుడు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించినట్లు సమాచారం. మంగళవారం ఉదయం అనిశా అధికారులు భీమవరం చేరుకున్నారు. భీమవరం ఇన్‌ఛార్జిగా ఉన్న ఎఫ్ఎస్‌వో సురేష్‌కుమార్ నగదును బాధితుడి నుంచి తీసుకుంటుండగా నేరుగా పట్టుకున్నారు.

కూపీ లాగితే?.. అటవీ అధికారి ఒకరు అనిశా అధికారులకు పట్టుబడ్డారన్న సమాచారంతో పలువురు ఉలిక్కిపడ్డారు. తీగ లాగితే డొంక కదులుతుందేమోనని అటవీ అధికారులు ఆందోళన చెందారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరి పాత్ర అయినా ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలు తీసుకున్న తర్వాత కొన్ని రోజుల పాటు దస్త్రం బహిర్గతం కాకుండా ఉంచడం వెనుక ఇంకెవరిదైనా హస్తం ఉందా అనేది విచారణలో తేలాల్సి ఉందనే వార్తలు గుప్పుమంటున్నాయి.

అభయారణ్యంలో 140 ట్రాప్ కెమెరాలు

పోలవరం, న్యూస్‌టుడే: పులుల సంచారం నేపథ్యంలో పాపికొండల అభయారణ్యంలో అటవీశాఖ అధికారులు మరిన్ని ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. బేస్ క్యాంపులు పటిష్ఠం చేయడంతో పాటు రేడియో కాలర్ ద్వారా పులి కదలికలు పరిశీలించేందుకు ప్రతి రేంజ్ పరిధిలోని పది మంది సిబ్బందికి రాజమహేంద్రవరంలో శిక్షణ ఇచ్చినట్లు పోలవరం రేంజర్ ఎస్కే.వలీ చెప్పారు.

ఉడతపల్లి, మెత్తప్పకోట గ్రామాల పరిధిలోని అభయారణ్యంలో వన్యప్రాణి విభాగం అధికారులు గుర్తించిన పాయింట్లలో ట్రాప్ కెమెరాలు అమర్చే పనులు మంగళవారం ప్రారంభించారు. ఇందుకోసం 140 కెమెరాలు కొత్తగా తీసుకొచ్చా రు. అత్యవసర పరిస్థితుల్లో అభయారణ్యంలో ఉండేందుకు రూ.3 లక్షలతో సున్నాలగండిలోని వన సంరక్షణ సమితి కమ్యూనిటీ హాల్‌ను క్యాంపు స్టేషన్‌గా పునఃనిర్మించారు. ప్రస్తుతం అభయారణ్యంలో వదిలిన పులి పోలవరం జిల్లా పరిధిలో సంచరిస్తోంది. దాని కదలికలను ఎప్పటికప్పుడు అటవీ శాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు రేంజర్ ఎస్కే.వలీ పేర్కొన్నారు.

నినదించిన అంగన్‌వాడీలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.భారతి నాయకత్వం వహించారు. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి రామారావు దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు గత ఆరేడేళ్లుగా వేతనాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, ప్రసాద్ మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని కోరారు.

మేమింతే.. ఇవ్వాల్సింది అంతే!

దోచుకుంటున్న కొందరు అధికారులు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, తణుకు,ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉన్నత ఉద్యోగం, రూ.వేలల్లో వేతనం.. అయినా బల్ల కింద చెయ్యి పెడతారు. అడిగినంత ఆ చేతిలో పెట్టనిదే దస్త్రం కదపరు.. ఏ పనీ చేయరు.

☛ ఇటీవల తణుకు పట్టణ పోలీసు స్టేషన్ రైటర్ ఒక కేసు విషయమై రూ.25 వేలు లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు.

☛ ఈ నెల 21న మందుల (ఔషధ) దుకాణం అనుమతుల కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌కుమార్, సహాయకుడు శివరామకృష్ణ అనిశాకు పట్టుబడ్డారు.

ఉమ్మడి జిల్లాలోని కొందరు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో అవినీతి పెరిగిపోతోంది. లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడి కేసుల్లో చిక్కుకుని జైళ్లకు వెళ్తున్నా మార్పు రావడం లేదు. ప్రతి పనికీ ఓ రేటు పెడుతున్నారు. అడిగింది ఇవ్వకుంటే చేయాల్సిన పనులపై జాప్యం చేస్తున్నారు.

* ఇటీవల ఏ పని చేయాలన్నా లంచం డిమాండ్ చేస్తున్నారని, ఇలాగైతే అనిశా అధికారులకు పట్టిస్తానని భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు పురపాలక ఉద్యోగులను ఉద్దేశించి అన్నారు. దీన్ని బట్టి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రధాన శాఖలివే.. ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. ప్రధానంగా పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్యం, మున్సిపల్, నీటి పారుదల, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ తదితర శాఖల్లో కొందరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.. ప్రభుత్వాధికారులు పనులకు డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా అనిశాకు ఫిర్యాదు చేయాలి. టోల్‌ఫ్రీ నంబరు 1064 లేదా 94404 46157, 94404 46158, 94404 46159 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.
- జి.వి.కృష్ణారావు, అనిశా డీఎస్పీ

వాళ్లని ఆపలేం నిన్ను కాపాడలేం

ఏలూరు నగర వాసులు చెత్త తెచ్చి ఆర్.ఆర్.పేట బాలయోగి వంతెనపై నుంచి తమ్మిలేరు కాలువలో పోసేస్తున్నారు. ఈ నేపథ్యంలో వంతెనకు ఇరువైపులా గతంలో ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు కాలువ కనిపించకుండా పరదాలు ఏర్పాటు చేశారు. కొందరు వాటిని చింపేసి చెత్త పోస్తున్నారు. చనిపోయిన జీవాలు, కుళ్లిన పదార్థాలు సైతం వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పగలు రాత్రులు తేడా లేకుండా దోమలు పెరిగిపోయాయి.
- న్యూస్‌టుడే, ఏలూరు

మామిడి ఆశలపై వర్షం జల్లులు

తెగుళ్ల ఉద్ధృతితో ఆందోళనలో అన్నదాతలు

పిందెలు వచ్చిన మామిడి చెట్టు

నూజివీడు, న్యూస్‌టుడే: మామిడి రైతులకు ఈ ఏడాదీ నిరాశ తప్పేలా లేదు. కొన్నేళ్లుగా సరైన దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం పూత బాగానే వస్తున్నప్పటికీ పిందె దశకు వచ్చేసరికి రాలిపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో తెగుళ్ల ఉద్ధృతి పెరుగుతుందేమోనని రైతులు భయపడుతున్నారు.

ఇలా చేయాలి.. **పక్షి కన్ను తెగులు:** 3గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బెండిజిమ్ 1 గ్రాము, మ్యాంకోజెబ్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సస్య రక్షణ చర్యలతో మేలు.. ప్రస్తుత వర్షంతో పక్షి కన్ను, మసి మంగు తెగుళ్లు వచ్చే అవకాశం ఉంది. రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా పూత, పిందెలను కాపాడుకోవచ్చని ఉద్యానశాఖ అధికారిణి ఆర్.హేమ, మామిడి శాస్త్రవేత్త జేకేఎం లక్ష్మి తెలిపారు.

మసి మంగు: ఆకులపై మసిని తొలగించడానికి 2 కిలోల గంజి పొడిని 3 లీటర్ల గోరు వెచ్చటి నీటిలో కలిపి ఉడికించాలి. తర్వాత నీరు పోసి 100 లీటర్ల గంజి ద్రావణం తయారు చేసి తెగుళ్లు కనిపించిన భాగాలపై ఎండ బాగా ఉన్న రోజుల్లో పిచికారీ చేయాలి. 4-5 రోజుల తర్వాత నీటిని పిచికారీ చేస్తే మసి మంగు మాయమవుతుంది.

జిల్లా	మామిడి సాగు (ఎకరాలు)	దిగుబడి (టన్నులు)
ఏలూరు	39,000	1,50,000
పశ్చిమ	2,609	13,200

గురుకులం పిలుస్తోంది 6లో చీకట్లోనే వైద్యం

ఖరీఫ్‌లో సన్న విత్తనం మేలు

కిలో, రెండు కిలోల చొప్పున మేలో అందజేస్తాం • 'న్యూస్‌టుడే'తో మార్టేరు ఏడీఆర్ శ్రీనివాస్

ఉండి, న్యూస్‌టుడే: గోదావరి జిల్లాల ప్రజలు తినడానికి ఇష్టపడే సన్నరకాల విత్తనోత్పత్తిలో ఎంటీయూ 1426 రకం మంచి ఫలితాలు ఇస్తోందని మార్టేరు వరి పరిశోధన స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడిని ఇస్తున్న ఈ రకం రానున్న ఖరీఫ్ సీజన్ సాగుకు లాభసాటి అని 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వెల్లడించారు.

➤ ఎంటీయూ 1426 చిరు ప్రదర్శనల్లో ఉంది. దోమపోటు, అగ్గితెగులుతో పాటు పురుగులు, తెగుళ్లను తట్టుకోగలదని నిరూపితమైంది. ఎంటీయూ 1121 శ్రీధృతి మధ్యస్థ సన్నగింజ రకం. దానికి ప్రత్యామ్నాయంగా ఈ విత్తనాన్ని తెచ్చాం.

మే నెలలో తమ పరిశోధన స్థానాన్ని సంప్రదిస్తే 1,2,4, కిలోల ప్యాకెట్ల చొప్పున విత్తనాలు అందిస్తాం.

➤ ఎంటీయూ 1010 (కాటన్ దొరసన్నాలు)లో గింజ రాలిక ఎక్కువగా ఉండటంతో దానికి ప్రత్యామ్నాయంగా 2015లో ఎంటీయూ 1121 (శ్రీధృతి) మార్టేరు నుంచి విడుదలైంది. గింజ పక్వానికొచ్చిన తర్వాత కోత ఆలస్యమైనా గింజ రాలిక ఉండదు. దిగుబడి 50 బస్తాలకు పైమాటే. ముడిబియ్యంగా వినియోగిస్తున్నారు.

➤ రబీ వరి చేలల్లో జింకుధాతు లోపం, దుబ్బు కుళ్లు తెగులు, సల్ఫైడ్ ఇంజూరీ, చౌడు సమస్యలు ఉన్నాయి. దుబ్బు కుళ్లు తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. మందు లీటరు నీటిలో కలిపి రెండుసార్లు చల్లి అరికట్టవచ్చు. సల్ఫైడ్ కలిగిన కాంప్లెక్స్ ఎరువులు చల్లకూడదు. సల్ఫైడ్ ఎక్కువైన చోట్ల నీటిలో బుడగలు వస్తాయి. వేరు వ్యవస్థ నల్లబడి మొక్కలు మాడిపోయి దెబ్బతింటున్నాయి. చౌడు నివారణకు మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుచుకోవాలి. జీలుగ, పిల్లిపెసర, జనుము పచ్చిరొట్ట ఎరువులు వేసవిలో చల్లుకొని అంతర సేద్యం చేస్తే సరిపోతోంది.

నల్లగా మారిన వరి దుబ్బు

3న మద్ది ఆలయం మూసివేత

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మార్చి 3వ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం మూసివేస్తామని ఆలయ ఈవో ఆర్వీ చందన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి 4వ తేదీ ఉదయం నుంచి స్వామి దర్శనం, పూజా కైంకర్యాలు ప్రారంభమవుతాయని వివరించారు.

26న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 9.30 గంటలకు ఏలూరు సమీపంలోని టీటీడీసీలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఆపై కోర్సులు చదివి, 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన వారు హాజరు కావచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు 92476 30162 నంబరులో సంప్రదించవచ్చని తెలియజేశారు.

ఉత్సాహంగా తొక్కేస్తాం..

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు ఇండోర్ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయిలో సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-18 లోపు వయసు గల బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి డీఎస్‌డీవో ఎం.రమేశ్‌బాబు ముందుగా జెండా ఊపి పోటీలు ప్రారంభించారు.

డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీగా మడకం సావిత్రి ఉద్యోగోన్నతిపై నియమితులయ్యారు. ఇదే జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎంగా పనిచేస్తున్న పెంచల ప్రభాకర్ మార్కాపురం ఆర్డీవోగా, ఏలూరు జిల్లా ఆర్ఎంసీ యూనిట్-2 ఎస్‌డీసీగా జీవీ సత్యవాణి నియమితులయ్యారు.

అన్న క్యాంటీన్లు అదుర్స్

80 శాతానికి పైగా జైకొట్టిన ప్రజలు

తాడేపల్లిగూడెంలో భోజనం చేస్తున్న ప్రజలు

ఉంగుటూరు, తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్.. దీనికి పేద, ధనిక తేడా లేదు. ఆకలి మాత్రమే చూస్తోంది. అల్పాహారమైనా, భోజనమైనా రూ.5కు అందిస్తోంది. రోడ్డు పక్కన ఉంటే చిన్న బడ్డీ దుకాణంలో టీ తాగితే రూ.10కి తక్కువ తీసుకోవడం లేదు. అన్ని వర్గాల ప్రజల ఆకలి తీరుస్తున్న 'అన్న క్యాంటీన్ల'కు ఆదరణ పెరుగుతోంది. 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో వీటిని అందుబాటులోకి తీసుకొస్తుంది. తాజాగా అన్న క్యాంటీన్ల నిర్వహణపై ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించింది. 80 శాతానికి పైగా అన్న క్యాంటీన్లకు జైకొట్టారు.

వీటిపై ఆరా.. అన్న క్యాంటీన్లలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఎలా ఉంటుంది, ఆహార నాణ్యత ఎలా ఉంటుంది, సమయానికి తెరుస్తున్నారా వంటి అంశాలపై ప్రభుత్వం ఆరా తీసింది. సంతృప్తి శాతంలో రాష్ట్రంలో ఏలూరు జిల్లా 85.2 శాతంతో 12వ స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా 83.8 శాతంతో 16వ స్థానంలో నిలిచాయి. పశ్చిమలో 12, ఏలూరు జిల్లాలో 10 అన్న క్యాంటీన్లు ఉన్నాయి.

బాగుంది బాలేదు	జిల్లా ఏలూరు		పశ్చిమగోదావరి	
పారిశుద్ధ్యం, పరిశుభ్రత	86.9	13.1	82.5	17.5
ఆహారం నాణ్యత	84.2	15.8	83.9	16.1
సకాలంలో తెరుస్తున్నారా	85.4	14.6	84.8	15.2

(c) eenadu

జన గణనకు సిద్ధం కావాలి : కలెక్టర్

మాట్లాడుతున్న వెట్రిసెల్వి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జనాభా లెక్కింపునకు సిద్ధం కావాలని కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. భారత జనాభా లెక్కింపు-2027 మొదటి దశలో భాగంగా సంబంధిత సిబ్బందికి మంగళవారం కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ నెల 26 వరకు ఇవి కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శకాలను పూర్తిగా అర్థం చేసుకుని కచ్చితత్వం, పారదర్శకతతో గణన చేపట్టాలన్నారు. తొలుత గ్రామాల జాబితా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో జన గణన అధికారులుగా పురపాలక కమిషనర్లు, గ్రామాల్లో తహసీల్దార్లు ఉంటారని పేర్కొన్నారు. అదనపు ఛార్జి అధికారులుగా ఎంపీడీవోలు, సాంకేతిక సహాయకులుగా సహాయ గణాంకాధికారులు ఉంటారని చెప్పారు. ✦ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన శాఖ ముఖ్య కమిషనర్లు మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే పూర్తయిన 182 గ్రామాల్లో 79,500 పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 24 మండలాలకు సంబంధించి 248 గ్రామాల్లో రీసర్వే ప్రారంభంకాగా మొదటి దశలో 14 గ్రామాలు, రెండో దశలో 30, మూడో దశలో 59 గ్రామాల్లో సర్వే పూర్తయిందని వివరించారు. నాలుగో దశలో 40 గ్రామాల్లో రీసర్వే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 2వ తేదీ నాటికి సర్వే పూర్తి చేస్తామని తెలిపారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల పెంపుపై మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ జలాల గణాంకాలపై దృష్టి సారించి, పెరుగుదల దిశగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలు తవ్వడం, మురుగు, పొదల తొలగింపు తదితర కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని 194 గ్రామాల్లో 8 నుంచి 20 మీటర్ల లోతులో, 200 గ్రామాల్లో 20 మీటర్లకు పైబడి భూగర్భ జలాలు ఉన్నాయని తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో లింగ్విస్టిక్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కార్యశాల

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈ నెల 25, 26 తేదీల్లో లింగ్విస్టిక్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కార్యశాల నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ వర్క్‌షాపులో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, కథలు రాయడం, అనువాదం చేయడం వంటి పనులు సులభంగా చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ప్రధాన వక్తలుగా ఆచార్య దేవిరెడ్డి విజయలక్ష్మి(సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్), రహీమునిద్దీన్(గ్నోరెక్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్) నేరుగా ప్రసంగిస్తారన్నారు. డా.తొట్టెంపూడి గణేశ్(హిడెల్బర్గ్ యూనివర్శిటీ, జర్మనీ), ఎర్రా చిరంజీవి(ఐఐటీ, హైదరాబాద్) ఆన్‌లైన్‌లో విద్యార్థులతో మాట్లాడతారని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే కార్యశాలకు తెలుగు శాఖ విభాగాధిపతి ఉడుము ఝాన్సీ కన్వీనర్‌గా, ఇతర ఆచార్యులు కో కన్వీనర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు.

బోధనలోనే విశ్రాంతి.. సమాజానికి చక్కని స్ఫూర్తి!

పాలకొల్లు, యలమంచిలి, భీమవరం పట్టణం, పోడూరు, న్యూస్‌టుడే: సమాజం మనకేమి ఇచ్చిందని కాకుండా.. మనకు ఎన్నో ఇచ్చిన సమాజానికి తిరిగి ఏమిస్తున్నామని ఆలోచించే ఉపాధ్యాయులు వారు. సర్వీసు అంతా నిబద్ధతతో పని చేసి వేలాది మంది విద్యార్థుల భవితకు బాటలు వేశారు. ఉద్యోగ విరమణ చేశాక కూడా అవసరం ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి పాఠాలు బోధిస్తున్నారు. పరీక్షలు సమీపించిన తరుణంలో ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తూ పేద విద్యార్థుల ప్రగతికి పాటుపడుతున్నారు.

పిల్లల బాగు కోసం..

యలమంచిలి మండలం పైబోలంకకు చెందిన బొలిశెట్టి శివన్నారాయణ హిందీ సబ్జెక్టు బోధించే వారు. ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. బాడవ యూపీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు లేరని తెలుసుకుని నిత్యం 8 కిలోమీటర్లు రాకపోకలు

పేద విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠాలు

సాగిస్తూ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. తనకు ఓపిక ఉన్నంత వరకు అవసరం ఉన్న పాఠశాలలకు వెళ్లి బోధన కొనసాగిస్తానని శ్రీమన్నారాయణ చెబుతున్నారు.

స్వచ్ఛందంగా..

పోడూరు మండలం మట్టపర్రుకు చెందిన బండి సుదర్శనరావు 2017లో ఉద్యోగ విరమణ చేశారు. తన స్వగ్రామంలోని మట్టపర్రు ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు నేటికీ సాంఘిక శాస్త్రం పాఠాలను స్వచ్ఛందంగా బోధిస్తూ ఆదర్శ గురువుగా నిలుస్తున్నారు. గతేడాది ఈ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడు జయప్రకాశ్ ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత ఆ పోస్టు భర్తీ కాలేదు. దీంతో సుదర్శనరావు గతేడాది జూన్ నుంచి క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ ఎనిమిది నెలల కాలంలో ఆయన ఒక్క రోజు కూడా సెలవు పెట్టలేదంటే విద్యార్థుల భవిష్యత్తుపై ఆయనకున్న శ్రద్ధను తెలియజేస్తోంది.

బోధిస్తున్న సుదర్శనరావు

30 పాఠశాలల్లో..

గురుతర బాధ్యతలో అవిశ్రాంతం పనిచేస్తానని చెబుతున్నారు భీమవరానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కలిగితి గోపాలశర్మ. ఆరేళ్ల కిందట ఉద్యోగ విరమణ పొందిన ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లోని 30 పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. పదో తరగతి తెలుగు పరీక్షలో మార్కులు సాధించడం, అక్షర దోషాలు లేకుండా రాయడంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న గోపాలశర్మ

ముగిసిన టోర్నమెంట్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో ద్వారకా స్పోర్ట్స్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నాన్ మెడలిస్ట్ షటిల్ టోర్నమెంట్ సోమవారం రాత్రి ముగిసింది. సింగిల్స్ విభాగంలో భీమవరానికి చెందిన విజయ్, డబుల్స్ విభాగంలో కాకినాడకు చెందిన ప్రవీణ్, నాని విజేతలుగా నిలిచారు. వీరికి దాతలు మొగతడకల శ్రీనివాసరావు, మొగతడకల ఓం ప్రకాశ్ చౌదరి, ఇమ్మడి రత్నాజీ, మల్లిపెద్ది రాజేంద్ర, మహంకాళీ గంగాధర్, గువ్వల మావుళ్లు, గోరింట్ల చంద్రం, ఇమ్మడి శ్రీను నగదు బహుమతులు అందజేశారు. సింగిల్స్ డబుల్స్ విభాగాల్లో విన్నర్స్‌కి రూ.15 వేలు, రన్నర్స్‌కి రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

విజేతలతో దాతలు, నిర్వాహకులు

ఆయుధ డిపో ఏర్పాటుకు భూములివ్వబోమంటూ ఆందోళన

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై చర్చించేందుకు మంగళవారం మంగపతిదేవిపేట వెళ్లిన తెదేపా నాయకులను రెండు గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసు, తెదేపా కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల అధ్యక్షులు పారేపల్లి రామారావు, మొగపర్తి సోంబాబు తదితర తెదేపా నాయకులను గ్రామంలోకి రాకుండా నిలిపివేశారు. మొదట పారేపల్లి రామారావు కొందరు నాయకులతో కలిసి మంగపతిదేవిపేట వెళ్లగా.. స్థానికులు తమ భూములు డిపోకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. పచ్చని సాగులో ఉన్న పంట పొలాలను ఇస్తే తమకు ఆధారం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిసేపటి తర్వాత బొరగం శ్రీనివాసు, ఇతర నాయకులు అక్కడకు రాగా.. మంగపతిదేవిపేట, బోడిగూడెం గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని నినాదాలు చేస్తూ గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గ్రామస్థుల నిరసనలతో నాయకులంతా అక్కడ నుంచి వెనుదిరిగారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నాయకులను అడ్డుకున్న ఆందోళనకారులు

అకాల వర్షం.. మొక్కజొన్నకు నష్టం

చాట్రాయి, న్యూస్‌టుడే: అకాల వర్షం మొక్కజొన్న రైతులను ఆందోళనకు చేసింది. సోమవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షంతో మొక్కజొన్న, మామిడి పంటలకు తీరని నష్టం వాటిల్లింది. జిల్లాలో అత్యధికంగా 11,450 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసే మండలాల్లో చాట్రాయి ఉంది. మరో రెండు మూడు రోజులు వర్ష సూచనలతో రైతులకు కంటిమీద కునుకు ఉండటంలేదు. కండె పాలు పోసుకుని గింజ గట్టి పడుతున్న తరుణంలో భారీ వర్షంతో పైరు నేలవాలడంతో ఎందుకూ పనికిరాకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. పడిన పైరును తిరిగి నిలబెట్టాలనే యత్నాలు చేసినా సాధ్యం కాదని వారు వాపోతున్నారు.

చనుబండలో నేలవాలిన పైరు

ఎకరాకు రూ.20 వేల పెట్టుబడి.. తెలంగాణ రాష్ట్రం వేంసూరు మండలం వైపు నుంచి గాలి తీవ్రతతో కూడిన వర్షం రావడంతో చనుబండ, కృష్ణారావుపాలెం, సి.గుడిపాడు, నరసింహారావుపాలెం గ్రామాల పరిధిలో పైరుకు నష్టం వాటిల్లింది. మండలంలో వివిధ గ్రామాల్లో స్వల్ప మేరకు నష్టాలు జరిగాయి. ఆహార అవసరాలకు కండెలను అమ్మాలనే ప్రయత్నాలు చేసినా గింజ పూర్తిస్థాయిలో గట్టి పడక వ్యాపారులు సైతం నిరాకరిస్తున్నారని చనుబండకు చెందిన బుస్సు నాగరాజు తెలిపారు. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టామని, అవి వస్తాయనే నమ్మకం కూడా లేదని వాపోయారు. కండెతో ఉన్న మొక్కలను తిరిగి నిలపాలనే చేసినా సాధ్యం కాలేదని తెలిపారు. నష్టంపై సర్వే చేయాలన్నారు.

పొలంలో నిలిచిన నీరు బయటకు వదలాలి: ఏవో.. పైరులో నిలిచిన నీటిని బయటకు పంపాలని, మొక్కజొన్న కర్రలకు తడి లేకుండా చూడాలని వ్యవసాయాధికారి శివశంకర్ తెలిపారు. నరసింహారావుపాలెంలో మంగళవారం పైరును పరిశీలించి సూచనలు చేశారు.

ఐక్యత చాటుతున్న ఐకాస నాయకులు

ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఛైర్మన్‌గా చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శిగా టి.రామారావు, కో-ఛైర్మన్లుగా ఆర్.రవికుమార్, ఎన్.రామారావు, కేఆర్ పవన్, పి.ఆంజనేయులు, జి.మోహన్, జీవీ గణేశ్ నియమితులయ్యారు. మొత్తం 27 మందితో నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఏపీఎన్‌జీజీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని వినతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా విద్యారంగంలో అనుభవం ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలనడం సబబు కాదన్నారు. రెండేళ్లలోపు ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగ అర్హత కోల్పోతారని, పదోన్నతి రాదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. టెట్ నుంచి మినహాయించేలా పార్లమెంటులో చట్ట సవరణ చేసేలా కృషి చేయాలని కోరారు.

26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ఆశయాలతో నిండిన మహాయజ్ఞమని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అన్నారు. ఉద్యమి పేరిట నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదుపై భీమవరం నియోజకవర్గ సమావేశాన్ని భీమవరంలోని త్యాగరాజ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు.

ఏలూరు ఎంపీకి అరుదైన స్థానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్‌కు అరుదైన స్థానం లభించింది. ఇతర దేశాల పార్లమెంట్ సభ్యులతో మెరుగైన సంబంధాలు ఏర్పరచుకునే లక్ష్యంతో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సోమవారం 64 దేశాలకు పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ బృందాలను ప్రకటించారు. ఇందులో భాగంగా ఇండియా-పోలాండ్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూపు సభ్యునిగా మహేశ్ కుమార్‌ను నియమించారని ఏలూరులోని ఎంపీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

గురుకులం పిలుస్తోంది

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు, న్యూస్‌టుడే: 2026-27 విద్యా సంవత్సరంలో గురుకుల పాఠశాలల్లో చేపట్టే ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. అయిదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లాలోని 4 గురుకులాల్లో 320 సీట్లు ఉన్నాయి. ఆసక్తి కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగో తరగతి పూర్తి చేసిన బాలికలు మార్చి 31లోగా ఏపీఆర్ఎస్, ఏపీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 25న రాత పరీక్ష నిర్వహించనున్నారు.

జిల్లాలో ఇలా

పాఠశాలలు	సీట్ల ఖాళీలు
ముసునూరు బాలికలు	80
అప్పారాజుగూడెం బాలుర	80
నాగిరెడ్డిగూడెం బాలికలు	80
బొద్దనపల్లి మైనార్టీ బాలికలు	80

కావాల్సిన పత్రాలు.. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థి ముందుగా ఫోన్ నెంబర్ నమోదు చేయాలి. అనంతరం ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన తర్వాత దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతోంది. ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు రుసుము రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. కుల, ఆదాయ ధ్రువ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, జనన ధ్రువీకరణ లేదా ప్రభుత్వం ఆమోదించిన గుర్తింపు పత్రం సమర్పించాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50 లక్షల లోపు ఉండాలి.

గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోవడానికి ఆర్థిక స్థోమత, సౌకర్యాలు లేని పేద విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతారు. ఇక్కడ నాణ్యమైన విద్యాబోధన, పోషకాహారం, ఏకరూప దుస్తులు, మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఒక్కసారి 5వ తరగతిలోకి ప్రవేశం పొందితే పదో తరగతి వరకు గురుకులాల్లోనే చదువుకోవచ్చు. చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రత్యేక శిక్షణ ఇచ్చి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నాం. పేద, మధ్య తరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం 87126 25032 నంబరును సంప్రదించాలి. -కె.లక్ష్మీకుమారి, జిల్లా కోఆర్డినేటర్

డైట్ టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం. 614/G1/DCHS/ELURU/2026, Dt. 24-02-2026

ఏలూరు జిల్లాలోని 100 పడకల ఏరియా ఆసుపత్రులు అనగా జంగారెడ్డిగూడెం మరియు చింతలపూడి, 50 పడకల కమ్యూనిటీ ఆసుపత్రి కైకలూరు మరియు 30 పడకల కమ్యూనిటీ ఆసుపత్రులు అనగా బుట్టాయగూడెం, దెందులూరు, పోలవరం. రోగులకు మరియు డ్యూటీ డాక్టర్లకు ఆహారము సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు పిలవడమయినది. టెండర్ అప్లికేషన్ ఫారములు ది. 27-02-2026 నుండి ది. 13-03-2026 సాయంత్రం 3 గంటల వరకు Rs. 2000/- DCHS, Eluru పేరున డి.డి. సమర్పించి పొందగలరు. పూర్తిచేసిన టెండర్ ఫారమును 27-02-2026 నుండి 13-03-2026 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే Eluru నందు DCHS, Eluru ఆఫీస్‌లో టెండర్ ఫారమును స్వీకరించబడును. టెండర్లో ఇతర వివరణ కొరకు www.eluru.ap.nic.in వెబ్‌సైట్ నందు సంప్రదించగలరు.

సం/- **D.D.M.C. Convener**
జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి
ఏలూరు, ఏలూరు జిల్లా

జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం. 39/2025-A1 తేదీ: 24-02-2026.

బహిరంగ వేలం నోటీసు

2026-2027 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి జంగారెడ్డిగూడెం పురపాలక సంఘమునకు చెందిన రోజువారీ మార్కెట్, వీక్లీ మార్కెట్ మరియు జంతు వధ శాలల యందు రుసుము వసూలు చేసుకొను హక్కులకు సంబంధించి బహిరంగ వేలమును ది. 05-03-2026వ తేదీ గురువారం ఉదయం గం. 11.00లకు సదరు పాటలు పూర్తి అగు వరకు పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీయుత కమిషనరు వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. వేలము నందు పాల్గొను వారు ముందుగా అందుకు సంబంధించి ధరావతు మరియు సాల్వెన్సీ ధృవపత్రములు దాఖలు పరచి కౌన్సిల్ వారిచే 2026-2027 సంవత్సరమునకు ఆమోదించిన వేలము నోటిఫికేషను నందలి షరతులకు లోబడి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును. పాటలు ఆమోదించుటకు, వాయిదా వేయుటకు లేక తిరస్కరించుటకు పాటలు నిర్వహించు అధికారికి సర్వాధికారములు కలవు. అదనపు సమాచారము కావలసిన యెడల కార్యాలయము పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.

పురపాలక సంఘ కార్యాలయమునకు ఏవిధమైన బకాయిలు ఉన్నను వేలములో పాల్గొనుటకు అర్హులు కారు.

వ. నెం.	గుత్త వివరములు	వేలము సమయమునకు 2 రోజులు ముందుగా DD లేదా నగదు రూపంలో చెల్లించవలసిన ధరావత్తు	సాల్వెన్సీ విలువ
(1)	(2)	(3)	(4)
1	జంగారెడ్డిగూడెం పురపాలక సంఘమునకు సంబంధించిన రోజువారీ మార్కెట్టు, వీక్లీ మార్కెట్‌తో సహా	రూ. 16,00,000/-	రూ. 25,00,000/-
2	పశువుల కబేళా నందు ఫీజులు వసూలు చేసుకొనే హక్కు	రూ. 1,50,000/-	రూ. 5,00,000/-

షరతులు: 1. గెజిట్ నోటిఫికేషన్ నెం. 11, తేది 03-02-2026 గల షరతులకు లోబడి సదరు వేలం పాట యందు పాల్గొనవలెను. ఇతర వివరములు ఆఫీసు పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.
2. బహిరంగ వేలములో పాల్గొనువారు సాల్వెన్సీకి సంబంధిత ఆస్తికి ఎన్ కంబరెన్సు సర్టిఫికెట్ (EC) నకలు జతపర్చి దాఖలుపరిచిన వారు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు.
3. పాటలో పాల్గొనువారు సాల్వెన్సీ సర్టిఫికేట్ మున్సిపల్ కమిషనర్ జంగారెడ్డిగూడెం పురపాలసంఘం వారు గాని లేక శ్రీ తహశీల్దార్ జంగారెడ్డిగూడెం వారి ద్వారా పొందిన వారు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు.
4. బహిరంగ వేలములో పాల్గొను వారు పై సూచించిన డిపాజిట్ 2 రోజులు ముందుగా అనగా 03-03-2026వ తేదీ సాయంత్రం గం. 5.00 లోపు కార్యాలయమునకు ఏదేని జాతీయ బ్యాంకు నందు తీసిన DD మరియు నగదు రూపంలో చెల్లించిన వారు మాత్రమే ది. 05-03-2026వ తేదీన జరుగు బహిరంగ వేలం పాటలో పాల్గొనుటకు అర్హులు.
5. హెచ్చుపాటదారుడు సంత మార్కెటులోని షెడ్లలో వ్యాపారము చేసుకొనే వారి నుండి ఎలాంటి రుసుములు వసూలు చేయరాదు.
6. పురపాలక సంఘము కబేళాను వేరొకచోటకు తరలించు సందర్భములో పాటదారుడు పురపాలక సంఘమునకు సహకరించవలెను.

గమనిక: ప్రకటించిన గెజిట్ నందలి నెం. 9 గల షరతు ప్రకారము సాల్వెన్సీ మరియు సంబంధిత ఆస్తికి సంబంధించి ఎన్ కంబరెన్సు సర్టిఫికెట్ (EC) నకలు జతపర్చి దాఖలుపరిచిన వారు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు. పాటలో పాల్గొనుటకు సాల్వెన్సీ విలువ నగదుగా స్వీకరించబడును.

పట్టికలోని 3వ కాలము నందు చూపిన ప్రకారము 2 రోజులు ముందుగా DD మరియు నగదు రూపంలో చెల్లించిన వారు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు.

సం/- **కమిషనరు,** జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం

పొన్నూరు ఎమ్మెల్యే తల్లి ఇంట్లో చోరీ కేసులో... ఐదుగురు సభ్యుల ముఠా అరెస్టు

నిందితుల్లో వైకాపా సర్పంచి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తల్లి ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో వైకాపాకు చెందిన ఏలూరు జిల్లా చాటపర్రు సర్పంచి గుడిపూడి రఘు ఉన్నారు. నిందితుల నుంచి 42 సవర్ల బంగారు ఆభరణాలు, 10.50 కిలోల వెండి, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలు వెల్లడించారు. ఏలూరు జిల్లాకు చెందిన సత్తెనపల్లి రాకేశ్ చోరీలు చేయడంలో దిట్ట. ఇతనిపై 34 కేసులున్నాయి. ఇతని స్నేహితులు ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కలపాలేనికి చెందిన కొక్కిలిగడ్డ ఆశీర్వాదం, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన జల్లి డెయిన్‌కుమార్ అలియాస్ ఆశిష్, ఏలూరుకు చెందిన నక్కల దుర్గాప్రసాద్, పమ్మి కృపాశామ్యూల్ అలియాస్ బన్నీ, దగ్గుమల్లి చినబాబు అలియాస్ విక్కీలు ఈ నెల 15న చీరాల బీచ్‌కు వెళ్లి కారు దొంగతనం చేశారు. 16న ఎమ్మెల్యే నరేంద్ర తల్లి ప్రమీలాదేవి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి.. అదే రోజు ఇంట్లోకి ప్రవేశించి 42 సవర్ల బంగారు ఆభరణాలు, 10.50 కిలోల వెండి, రూ.లక్ష నగదు చోరీ చేశారు.

వెండి కరిగించిన సర్పంచి.. ముఠా సభ్యులు తమకు పరిచయం ఉన్న ఏలూరు జిల్లా చాటపర్రు సర్పంచి గుడుపూడి రఘుకు వెండి ఆభరణాలు విక్రయించారు. ఇతను వాటిని కరిగించి వెండి ఇటుకలా మార్చాడు. ఐదు దశాబ్దాల కిందటి సరస్వతీ విగ్రహాన్ని కరిగించలేదు. ఇతనిపై రౌడీషీట్‌తోపాటు ఎనిమిది కేసులున్నాయి. కొన్ని బంగారు ఆభరణాలను రాకేశ్ తల్లి దాచిపెట్టింది. ఘటనాస్థలిలో లభించిన వేలిముద్రలు, సాంకేతిక ఆధారాలతో డీఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో సీఐ కృష్ణయ్య ఎస్సైలు శ్రీహరి, వీరనారాయణ బృందం ముఠాను పట్టుకుంది. సత్తెనపల్లి రాకేశ్, ఆశీర్వాదం, డెయిన్‌కుమార్, దుర్గాప్రసాద్, రఘులను అరెస్టు చేశామని ఎస్పీ చెప్పారు.

పన్నుల వసూళ్లపై సమన్వయంతో ముందుకెళ్లాలి : డీపీవో

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పన్నుల వసూళ్లపై అధికారులు సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ తెలిపారు. ఏలూరు డీపీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు, ఏవోలతో గ్రామాల్లో జరుగుతున్న పన్నుల చెల్లింపులపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రూ.83 కోట్ల పన్నులు, పన్నేతరాలకు సంబంధించి డిమాండ్ ఉండగా, అందులో ఇప్పటి వరకు రూ.35 కోట్లు వసూలు చేశారన్నారు.

చీకట్లోనే వైద్యం

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: క్షతగాత్రునికి చరవాణి వెలుగుల్లో వైద్యం చేసిన సంఘటన వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి గాయాలతో ఆసుపత్రికి వచ్చారు. ఆ సమయంలో వర్షం పడటంతో వేలేరుపాడులో విద్యుత్తు సరఫరా లేదు. ఆసుపత్రిలో ఇన్వెర్టర్ ఉన్నా.. అది కంప్యూటర్ గదికే అమర్చి ఉంది. దీంతో సిబ్బంది చరవాణి లైట్ వేసి చికిత్స అందించారు.

సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కమిటీ నియమించింది. సమస్యలన్నీ కమిటీలో చర్చించి పరిష్కరిస్తామని ఆ శాఖ మంత్రి, రాష్ట్ర సహకార బ్యాంకు ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు హామీ ఇచ్చినట్లు జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, పి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల్లోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు ప్రస్తుతం ఉద్యోగులు సమ్మె విరమిస్తున్నట్లు యూనియన్ల ఐక్యవేదిక నిర్ణయించినట్లు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు ప్రాధాన్యం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ అన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణ సమయంలో సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి నిందితులను శిక్ష పడేలా సాక్ష్యాధారాలు సమర్పించాలన్నారు. ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ హబీబ్ బాషా, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి నరేంద్ర, డీఎస్పీలు, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

గుత్తేదారుపై మోసం కేసు

కలిదిండి, న్యూస్‌టుడే : డబ్బు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించక పోవడంతో బాధితురాలి ఫిర్యాదుమేరకు మోసం కేసు నమోదు చేసినట్లు కలిదిండి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన రామ్మోహనరావు రైల్వేలో పని చేస్తున్నారు. ఆయన కార్యాలయం వద్ద గుత్తేదారుగా పని చేస్తున్న కోరుకొల్లుకు చెందిన బాలాజీ అయిదేళ్లుగా రామ్మోహనరావు కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్నారు. ఈ క్రమంలో బాలాజీకి అవసరం అయినప్పుడల్లా రామ్మోహనరావు భార్య రాజ్యలక్ష్మి వద్ద అప్పు తీసుకుని తిరిగి ఇచ్చేసేవారు. బాలాజీపై వాళ్లకు నమ్మకం కుదరడంతో భార్యాభర్తల క్రెడిట్ కార్డులు కూడా ఆయనకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో దఫదఫాలుగా రూ.87.55 లక్షల వరకు బాలాజీ అప్పు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మొత్తం డబ్బు చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినా.. బిల్లులు వచ్చాక ఇస్తానంటూ కాలయాపన చేస్తుండటంతో రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

రైలులో ప్రయాణికుడు మృతి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పో కంపెనీలో సెల్ కంపెనీ సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న సందీప్ సిల్లీ(32) హౌరా వెళ్తున్న షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. రైలు విజయవాడ దాటుతుండగా అతనితో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అల్పాహారం చేయమని అడగగా ఉలుకు పలుకు లేకుండా పడి ఉన్నాడు. ఏలూరు రైల్వే స్టేషన్ నుంచి 108 వాహనంలో అతడిని ఏలూరు సర్వ జన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఏలూరు జీఆర్పీ పోలీసు స్టేషన్ ఎస్సై దానం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

పారిశ్రామికవేత్త రామచంద్రరావు కన్నుమూత

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, గౌతమి సాల్వెంట్స్ పరిశ్రమ అధినేత మల్లిన రామచంద్రరావు (93) మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య భద్రమ్మ, కుమారులు వెంకట రాయుడు, రవికాంత్, కుమార్తె ఇందిరాదేవి ఉన్నారు. 1970లోనే పరిశ్రమలు స్థాపించడం ప్రారంభించారు. తణుకు, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో ఆయిల్, స్పిన్నింగ్, పవర్ తదితర పరిశ్రమలు స్థాపించారు. కరోనా సమయంలో పట్టణంలోని 27, 28, 29, 30 వార్డులను దత్తత తీసుకొని కూరగాయలు, నిత్యావసర సరకులు అందించడంతోపాటు రోటరీ క్లబ్, రామకృష్ణ సేవా సమిత ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీఎస్ఆర్ నిధులతో పట్టణంలోని సెంటర్ లైటింగ్‌తో పాటు వివిధ అభివృద్ధి పనులకు విరాళాలు అందజేసి పట్టణాభివృద్ధికి తోడ్పడ్డారు. ఆయన మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతోపాటు పలువురు సంతాపం ప్రకటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


రామచంద్రరావు (పాత చిత్రం)

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU eClassifieds
BUSINESS SERVICES
REAL ESTATE
HOUSE FOR SALE
ఏలూరు సత్యంపాడు MRC ... 90598 45535, 90595 24018.
JOBS
WANTED
AXIS BANK కొరకు ఏలూరు నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను
DRA సర్టిఫికేట్ కలిగినవారికి [illegible]
లలితా ఫైనాన్షియల్ లింక్స్
7729989278
LAND FOR SALE
+16303867373
PLOT FOR SALE
ఏలూరు నిమ్మకాయల ... SMR ... 93810 31968.
ఉద్యోగం: E&W ... RJY, 9963327756.
పాలకొల్లులో ప్రముఖ ... Fresh/Exp. Qul: 10th to డిగ్రీ. 86398 28914.
SECURITY GUARDS
ప్రముఖ ... Age: 21to45, ... 10th. PF/ESI ... 96522 40526, 97049 64931, 94918 84025.
గమనిక
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
నెక్ సూచించిన కోడిగుడ్ల ధర ... 4.80 ...

రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉపాధి హామీ నిధులతో గ్రామంలో పలు రహదారులను అభివృద్ధి చేసుకోగలిగామని సర్పంచి జాన్సీ రాణి అన్నారు. కొత్త కాలనీలో రూ.29 లక్షలతో చేపట్టిన మెటల్ రోడ్లు నిర్మాణ పనులకు మంగళవారం భూమి పూజ చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే : పెదవేగి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పథకం పనుల నిమిత్తం ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తుశాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గార్లమడుగు ఫీడర్లలో వ్యవసాయబోర్లకు తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 10 గంటలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతలుగా సరఫరా ఉంటుందని వెల్లడించారు.

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

తెదేపా కార్యకర్త కుటుంబానికి సాయం

పవరుపేట (ఏలూరు అర్బన్), న్యూస్‌టుడే: స్థానిక ఒకటో డివిజన్ పోలాగూడెం ఇందిరమ్మ కాలనీకి చెందిన తెదేపా కార్యకర్త పి.రాజేష్ ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు మంగళవారం స్థానిక ఎంపీ బడేటి చంటి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: ? హనుమాన్‌నగర్ రోడ్డులో శివాలయం సమీపంలో వీధి దీపం వెలగడం లేదు. చీకట్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకటరావు, స్థానికుడు**
✔ సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించి వీధి దీపం వెలిగిస్తాం. **- పవన్, విద్యుత్తు ఏఈ, ఏలూరు నగరపాలక సంస్థ**

దెందులూరు, న్యూస్‌టుడే: ? గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి పగలు తేడా లేకుండా కుడుతున్నాయి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. **- రంగారావు, స్థానికుడు**
✔ దోమల నివారణ మందులు చల్లిస్తాం. **- గాయత్రి, పంచాయతీ కార్యదర్శి, దెందులూరు**

పెదవేగి, న్యూస్‌టుడే: ? జగన్నాథపురంలో 1956లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిల దశకు చేరుకుంది. ట్యాంకుపై మూత లేకపోవడంతో వ్యర్థాలు చేరుతున్నాయి. **- చంటి, జగన్నాథపురం**
✔ సమస్య ఎమ్మెల్యే ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తాం. కొత్తట్యాంకు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. **- సాయిపవన్, పంచాయతీ కార్యదర్శి, జగన్నాథపురం**

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే: ? వట్లూరు నుంచి మడిచర్ల వెళ్లే మార్గంలో భోగాపురం వద్ద గల మలుపులో గోతులు పడి ప్రమాదకరంగా మారింది. **- వాహనచోదకులు, భోగాపురం**
✔ రహదారిని పరిశీలించి గోతులు పడిన చోట మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీకర్, ర.భ.శాఖ డీఈ, ఏలూరు**

సుందరీకరణ పనుల్లో నాణ్యతకు పాతర

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు నగరంలో సుందరీకరణ పేరుతో రంగేస్తూ నిధులు మింగేస్తున్నారు. పనుల్లో నాణ్యతకు పాతరేస్తున్నారు. రూ. లక్షలు వెచ్చించి నగరంలోని విభాగినులు, కూడళ్లకు రంగులు వేయించారు. నాసిరకం రంగులు వేస్తుండటంతో కొంతకాలానికే రంగులు తేలిపోతున్నాయి. పలు చోట్ల పొరలుగా ఊడిపోతున్నాయి. రంగులు వెలసిపోతుండటంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే పనుల్లో నాణ్యత కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వసంతమహల్ వంతెన సమీపంలో విభాగినికి పొరలుగా ఊడిపోయిన రంగులు

పెచ్చులు ఊడిపోయి.. శాంతినగర్ నుంచి సీఆర్‌ఆర్ కళాశాల సమీపంలోని వంతెన, కొత్తబస్టాండ్, అగ్నిమాపక కూడలి, ఓవర్‌బ్రిడ్జి, జూట్ మిల్లు కూడలి, వసంతమహల్, పాతబస్టాండ్ వరకు విభాగినులకు రంగులు వేశారు. దానిపై ఆర్ట్ వర్క్ చేశారు. పలు చోట్ల విభాగినులు, వంతెనలపై సిమెంటు పెచ్చులు ఊడిపోయాయి. అక్కడ మళ్లీ ప్లాస్టింగ్ చేసి రంగులు వేయాల్సి ఉన్నా అలాగే వదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతతో కూడిన రంగులు వేయించాలని నగర వాసులు కోరుతున్నారు.

కూలే వరకూ స్పందించరా...?

వీరమ్మకుంట (పెదపాడు), న్యూస్‌టుడే: పెదపాడు మండలం వీరమ్మకుంటలోని రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకు కొన్నేళ్లుగా శిథిలస్థితికి చేరి, ప్రమాదకరంగా ఉంది. గతంలో దీన్ని తొలగించి కొత్తది నిర్మిస్తామని చెప్పినా గత వైకాపా ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దీంతో తాగునీటిని సరఫరా చేసే ట్యాంకు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి డీఈ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా నివేదికను తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గ్రామీణాభివృద్ధే లక్ష్యం : చింతమనేని..

అర్జీలపై సంతకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

దుగ్గిరాల(పెదవేగి), న్యూస్‌టుడే : గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం పెదవేగి మండలం దుగ్గిరాల విడిది కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ను పలువురు నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛాలతో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు గ్రామాల ప్రజల వినతులు స్వీకరించి వాటిని సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అప్పనవీడు (పెదపాడు), న్యూస్‌టుడే: అప్పనవీడులోని అభయాంజనేయస్వామిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకున్నారు. జనసేన నాయకుడు చలమలశెట్టి రమేశ్‌బాబు జన్మదినం సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ● హనుమాన్‌జంక్షన్‌కు చెందిన పాబోలు నితీశ్ అభయాంజనేయస్వామి ఆలయానికి రూ.30 వేలు విరాళంగా అందజేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి తారకేశ్వరరావు తెలిపారు.

వైభవంగా పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవం

రాచూరు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారికి 11 ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. జనసేన నాయకుడు వట్టి పవన్‌కుమార్, బొమ్మిడి సొసైటీ అధ్యక్షుడు మైలవరపు గోపాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు.

సిందూరధారి

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఏలూరు సత్రంపాడులోని అంబికాదేవి ఆలయంలో ఫాల్గుణ మాస సందర్భంగా మంగళవారం వీరాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక నరసింహారావుపేటలోని కొత్త బస్టాండ్ సమీప దాసాంజనేయస్వామి ఆలయంలో సిందూరధారి ఆంజనేయస్వామిని వివిధ వర్ణ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

చదరంగంలో ప్రథమ స్థానం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని ఎ.తేజస్విని చదరంగం పోటీలో ప్రతిభ కనబరిచింది. శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ఈమె పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రధానాచార్యుడు సతీశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

పునర్విక కోసం విరాళాల సేకరణ

భీమడోలు, న్యూస్‌టుడే: అరుదైన ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న చిన్నారి పునర్వికకు అవసరమైన వైద్యం అందాలన్న కాంక్ష అందరిలోనూ బలపడుతుండగా తమ వంతు ఆర్థిక సహాయం అందించేందుకు గ్రామాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సోషల్ మీడియా ప్రతినిధులు ముందుకు వస్తున్నారు. భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో పలువురు పునర్విక వైద్యం కోసం మంగళవారం విరాళాలు సేకరించారు.

మేలో మహాసభలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ఈ ఏడాది మేలో ఏలూరులో నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య తెలిపారు. ఏలూరులోని అన్నేభవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడారు.

పక్కకు జారి.. ప్రమాదకరంగా మారి..

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రు మండల పరిధి ఆముదాలపల్లి గ్రామ శివారు మలుపు వద్ద ఉన్న సూచిక కిందికి జారి మలుపును సూచించే అవకాశం లేకుండా పోయింది. ఈ మార్గంలో తోకలపల్లి, పత్తేపురం తదితర గ్రామాలకు ప్రైవేటు వాహనాలు తిరుగుతుంటాయి. వీటితోపాటు ద్విచక్ర వాహనాల చోదకులు నిత్యం ప్రయాణిస్తుంటారు. మలుపు వద్ద సూచిక సరిగా లేకపోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

అనాథ బాలల గుర్తింపు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఏలూరు శక్తి టీం సభ్యులు డ్రోన్ నిఘాతో పోణంగి రోడ్డులోని డంపింగ్‌యార్డు పరిసర ప్రాంతాల్లో నలుగురు అనాథ బాలలను గుర్తించి వారిని బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అనాథ పిల్లల విద్య, సంరక్షణ మనందరి బాధ్యతని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: నాణ్యమైన విద్యాబోధన ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలంటూ గుండుగొలనులో విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడి పిలుస్తోంది పేరిట గుండుగొలను గ్రామంలోని ఎంపీపీ-1 పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదిహేను మంది విద్యార్థులను వివిధ తరగతుల్లో చేర్పించారు.

రూ.80 లక్షలతో రహదారి అభివృద్ధి

నిడమర్రు, న్యూస్‌టుడే: ఎట్టకేలకు నిడమర్రు - పెదనిండ్రకొలనుల మధ్య రభశా రహదారి పనులు ప్రారంభమయ్యాయి. రూ. 80 లక్షలతో ఈ పనులు ప్రారంభించారు. గత ఎనిమిదేళ్లుగా రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలంలో ప్రయాణికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితిపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పత్తేపురం నుంచి పెదనిండ్రకొలను వరకు రూ. 3 కోట్లతో రహదారి నిర్మాణ పనులు పూర్తి చేశారు. నిధుల కొరత వల్ల 1.6 కి.మీ. రహదారిని మాత్రం అలాగే వదిలేశారు. దీంతో ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. ఎట్టకేలకు మిగిలిన 1.6 కిమీ రహదారి పనులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు రూ. 80లక్షలు మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభించారు.

గడ్డి ట్రాక్టర్ ట్రక్కు దగ్ధం

పెదపాడు, న్యూస్‌టుడే : ఎండు గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కుకు పెదపాడులోని పెట్రోలు బంకు వద్ద విద్యుత్తు తీగలు తగలడంతో తీగలు రాసుకొని నిప్పురవ్వలు గడ్డిపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగి ట్రక్కు తగలపడిపోయింది. ఏలూరు అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు.

CHANGE OF NAME

I, SUNKAVALLI KRISHNAVENI, W/o. S.Sreeram, R/o. D.No. 13-52/1, Sunkavalli vari Street, Nachugunta village, Unguturu Mandal, Eluru District. Changing my name From **SUNKAVALI KRISHNAVENI** (Old name) to **SUNKAVALLI KRISHNAVENI** W/o. S.Sreeram (New name). Hence fourth Iam being called as **SUNKAVALLI KRISHNAVENI** (New name) for all purposes.

అధ్వానంగా.. వ్యాధులకు మూలంలా..

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు ఒకటో పట్టణంలోని పాండురంగా థియేటర్ సమీపంలోని మురుగు నీరు నిల్వ ఉంది. జంతు జీవాల ఆవాసంగా, సమస్యల వలయంగా మారింది. ఆ ప్రాంతమంతా చెత్త కుప్పలు పేరుకుపోయి..మంట పెట్టి.. అధ్వానంగా కనిపిస్తోంది. నిల్వ ఉన్న మురుగునీటిలో పందులు, కుక్కలు చేరి ఛిద్రం చేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల ఆవాసంగా మారి వ్యాధులకు కారణం అవుతోంది.

గోతులమయం.. అవస్థల పయనం..

గణపవరం, న్యూస్‌టుడే: సరిపల్లె నుంచి కొత్తపల్లి వెళ్లే ర.భ.శా రహదారి అధ్వానంగా ఉంది. దశాబ్దాల నుంచి రహదారిని అభివృద్ధి చేయకపోవడంతో ఆ మార్గం పుంత దారిని తలపిస్తోంది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దారంతా రాళ్లు లేచి గుంతలు పడటంతో విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. రహదారి నిర్మాణం మాట అటుంచి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నాచుతో నిండిన బోదె

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలనులో మంచినీటి చెరువులకు నీరు వెళ్లే బోదె నాచుతో నిండి పోయింది. చెరువుల్లోకి నీరు ఈ నాచును దాటి వెళ్తోంది. అసలే చెరువులోకి వెళ్లే నీటి నాణ్యత అంతంత మాత్రంగా ఉంది. దీనికి నాచు తోడవ్వడంతో నీరు మరింత పాడవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. పంచాయతీ వారు ఇటీవల బోదెను బాగు చేసినప్పటికీ నాచును పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి సాజానాయక్, వ్యవసాయ శాస్త్రవేత్తలు సుజాత, కాళిదాసు

కోకో తోటల పరిశీలన

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి మండలం కొండలరావుపాలెం, విజయరాయి గ్రామాల్లోని కోకో తోటలను జిల్లా ఉద్యానశాఖాధికారి కె.సాజానాయక్, ఏపీఎంఐపీ పీడీ ఎస్.రామ్మోహన్, విజయరాయి మొక్కజొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుశీల, ఐఐఓపీఆర్ విశ్రాంత శాస్త్రవేత్త కాళిదాసులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కోకో రైతులతో మాట్లాడుతూ కోకో పంటలో కోలెటోట్రైకమ్, అంట్రాక్నోజ్ వ్యాధి, పాడ్‌బోరర్ పురుగు ప్రభావం ఉండటాన్ని గమనించినట్లు తెలిపారు. కోకో పండ్లపై నలుపు, గోధుమ రంగు మచ్చలు, పండ్లు కుళ్లిపోవడం, పూతలు ఎండిపోవడం, వంటి లక్షణాలు కనిపించినట్లు రైతులకు చెప్పారు. వ్యాధి, పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న శ్రీనివాస్ డాంగే

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే కోరారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఏఐటీయూసీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాంగే మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు గౌరవ వేతనంతో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీపై కేసు

పెదపాడు, న్యూస్‌టుడే: ఇంట్లో దాచుకున్న బంగారు వస్తువుల చోరీపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై ఆర్. శ్రీను తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాడు మండలం తోటగూడెం గ్రామానికి చెందిన కోటప్రోలు ప్రభావతి ఈ నెల 4న ఉదయం తన భర్త నాగేశ్వరరావుతో కలిసి ద్విచక్రవాహనంపై ఏలూరులోని కంటి ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి దాదాపు 10 కాసుల బంగారు వస్తువులను తీసి పరుసులో పెట్టి ఇంట్లోని చెక్కబీరువాలో భద్రపరిచారు. తిరిగి ఈ నెల 23 సాయంత్రం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్దామని చెక్కబీరువాలో భద్రపరిచిన పరుసు తీశారు. అందులో ఉండాల్సిన బంగారు వస్తువులు కనిపించకపోవడంతో పెదపాడు పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

గోడపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పెండింగులో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని కోరారు. బకాయిల విడుదల కోసం ఆ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న విజయవాడలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను మంగళవారం స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు ఉపకార వేతనాలను విడుదల చేయాలని చెప్పారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అదనపు కట్నం కోసం వివాహితను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అత్తిలి మండలం బల్లిపాడుకు చెందిన చెన్నంశెట్టి శివకు గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన చెన్నంశెట్టి మధు(25)కి ఏడేళ్ల కిందట వివాహమైంది. వివాహమైన నెల రోజులకే భర్త శివ కువైట్‌కు వెళ్లాడు. అనంతరం భార్యను కూడా తీసుకెళ్తానని చెప్పి తీసుకువెళ్లలేదు. భర్త కువైట్ నుంచి వచ్చిన తర్వాత అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్తతోపాటు అత్త నాగమణి, ఆడపడుచు ఉరదాళ్ల సత్యవతి, చిన్న ఆడపడుచు తిరుమలశెట్టి దేవి తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసి పుట్టింటికి పంపించేశారని బాధితురాలు చెన్నంశెట్టి మధు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కపుల్ ఫ్రెండ్లీ
అంబిక మినీ	హే బల్‌వంత్
సాయి బాలాజీ	ఆల్ఫా
బాలాజీ	అమరావతికి ఆహ్వానం
సత్యనారాయణ 1	సీతా పయనం
సత్యనారాయణ 2	బూకి
సత్యనారాయణ 3	నావాబ్ కేఫ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	లవ్ స్టోరీ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	సీతా పయనం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఫంకీ
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మన శంకర వరప్రసాద్ గారు
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	అనగనగా ఒక రాజు

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో జైలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వరుసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన అన్నదమ్ములకు మొబైల్ కోర్టు జైలు శిక్ష విధించింది. గుడివాడకు చెందిన సయ్యద్ రజాక్, కరీముల్లా ఇద్దరూ అన్నదమ్ములు. వీరు వృత్తి రీత్యా ద్విచక్ర వాహనాల మెకానిక్‌లు. ఆ అనుభవంతో ద్విచక్ర వాహనాలను సులభంగా చోరీ చేసేవారు. వీరిద్దరిపై ఏడు బైక్ చోరీ కేసులు నమోదయ్యాయి. గత ఏడాది జులైలో వరుస దొంగతనాలపై విచారణ చేపట్టిన ఏలూరు త్రీ టౌన్ ఎస్సై రాంబాబు, సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మొత్తం 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులపై నమోదైన ఏడు కేసుల్లో నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష, రూ. 600 జరిమానా విధిస్తూ ఏలూరులోని మొబైల్ కోర్టు న్యాయమూర్తి మేరీ మంగళవారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ఏపీపీ హేమలత తమ వాదనలు వినిపించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆగి ఉన్న లారీని ఢీ కొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . కొవ్వూరు నుంచి చెన్నై వెళ్తున్న క్లోరిన్ సిలిండర్ల లోడ్ లారీ త్రీటౌన్ స్టేషన్ పరిధిలోని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఐరన్ రాడ్స్ లోడు లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్ (వెనుక లారీ) మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు .. ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు నగరంలోని అగ్నిమాపక కూడలిలోని సెయింట్ థెరిస్సా కాన్వెంట్ వీధిలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతని వయస్సు 50 సంవత్సరాలు ఉంటాయని, మద్యం అధికంగా తాగడం వలన కిందపడి మృతి చెంది ఉంటాడని..పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



(c) eenadu

చింతలపూడి

•చింతలపూడి • పోలవరం

రూ.10 లక్షల మంజూరు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసన్నపాలెంలో మూత్రపిండాల సంబంధిత సమస్యతో బాధపడుతున్న భూమాల విరాట్ మహదేవ్‌కు శస్త్ర చికిత్స నిమిత్తం ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు తెదేపా మండల మాజీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు చెక్కును బాధితుడు చికిత్స పొందుతున్న ఆసుపత్రి యాజమాన్యానికి అందజేసినట్లు తెలిపారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురంలో అనారోగ్యానికి గురైన బుడాకుల వెంకటేశ్వరరావు శస్త్ర చికిత్సకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.73 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును తెదేపా సీనియర్ నాయకుడు పాపాచార్యుల వీరేశలింగం స్థానిక నాయకులతో కలిసి మంగళవారం బాధితుడికి అందజేశారు.

కార్మిక నమోదుతో ప్రయోజనం

మాట్లాడుతున్న సహాయ కార్మిక అధికారిణి లలితకుమారి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కార్మిక నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రతి కార్మికుడు గుర్తించాలని సహాయ కార్మిక అధికారిణి లలిత కుమారి పేర్కొన్నారు. కొయ్యలగూడెంలోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ముఠా కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అనేక పథకాలను కార్మికుల కోసం ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ అధ్యక్షుడు బొబ్బర చిట్టిబాబు అధ్యక్షత వహించారు. సీపీఐ మండల కార్యదర్శి టి.ఆంజనేయరాజు, నాయకులు పాల్గొన్నారు.

హనుమకు విశేషపూజలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తరం వంటి పూజలు ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ముఖమండపం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ.1,68,700 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

నిర్మాణాలకు నోచుకోక.. ప్రయాణించే దారిలేక..

జంగారెడ్డిగూడెం పట్టణం, టి.నరసాపురం, కామవరపుకోట, న్యూస్‌టుడే: చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల పరిధిలో పలు పంచాయతీ రాజ్ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవ్వడంతో పాటు వెన్నెముక, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చోదకులు వాపోతున్నారు. అలాగే రహదారుల వెంబడి దుకాణాలు, ఇళ్లు దుమ్ముతో నిండిపోతున్నాయని, పంటలు సైతం దుమ్ము కారణంగా సరిగా దిగుబడి రావడం లేదని ప్రజలు, రైతులు వాపోతున్నారు. 'జంగారెడ్డిగూడెం మండలంలోని కేతవరం, అమ్మపాలెం, తిరుమలాపురం రోడ్లకు సంబంధించి రూ.6.13 కోట్లు నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలుస్తాం' అని పంచాయితీరాజ్ ఏఈ అంకిరెడ్డి తెలిపారు.

● 'తల్లాడ- దేవరపల్లి' జాతీయ రహదారి నుంచి శోభనాద్రిపురం, కేతవరం గ్రామాల మీదుగా కొయ్యలగూడెం మండలం రాజవరం వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. సుమారు పదిహేనేళ్ల కిందట కేతవరం గ్రామ శివారు వరకు తారు రోడ్డు నిర్మించారు. కాలక్రమేణా రోడ్డు పూర్తిగా శిథిలమైంది. వైకాపా హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా రూ.1.50 కోట్లతో నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి కంకరతో మొదటి లేయర్ పోశారు. అనంతరం బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు. అలాగే లక్కవరం-అమ్మపాలెం, దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారి నుంచి తిరుమలాపురం రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

● కామవరపుకోట మండలం తడికలపూడి నుంచి వేంపాడు వెళ్లే రహదారి ఇది. సుమారు పదేళ్లుగా రాళ్లు లేచిపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కామవరపుకోట అడ్డరోడ్డు- వడ్లపట్ల, తడికలపూడి-సాగిపాడు రోడ్లు సైతం దారుణంగా ఉన్నాయి.

● టి.నరసాపురం నుంచి గండిగూడెం వెళ్లే రహదారి. సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి రాళ్లు లేచిపోయి రాకపోకలకు వీలులేకుండా ఉంది. వీటితో పాటు బొర్రంపాలెం- కామవరపుకోట, మర్రిగూడెం-మక్కినవారిగూడెం, బొర్రంపాలెం-సింగరాయపాలెం గ్రామాలకు వెళ్లే రహదారులు ఛిద్రంగా మారాయి. టి.నరసాపురం మండలంలోని సుమారు 60 కిలోమీటర్ల వరకు పంచాయతీరాజ్ రహదారులు ఉండగా వాటిలో కేవలం 15 కి.మీ. వరకు మాత్రమే రోడ్డు నిర్మాణాలు జరిగాయి.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ? జంగారెడ్డిగూడెం పట్టణంలోని అశ్వారావుపేటరోడ్డు వినాయకుని గుడి నుంచి రామచంద్రాపురం వెళ్లే రోడ్డులో మంచినీటి గేటు వాల్వులపై సిమెంటు మూతలు లేకుండా ప్రమాదభరితంగా ఉన్నాయి. **-వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం**

✔ మూతలు ఏర్పాటు చేయిస్తాం. **-కేవీ.రమణ, కమిషనర్**

? జంగారెడ్డిగూడెం పట్టణంలోని రాముడుకుంట చెరువులోని మురుగు కాలువల్లో నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెలజల్లుతోంది. **-కృష్ణ, జంగారెడ్డిగూడెం**

✔ చర్యలు తీసుకుంటాం. **-కేవీ.రమణ, కమిషనర్**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం ఎన్‌వీఎన్ కాలనీకి వెళ్లే రహదారి గుంతలుపడి అసౌకర్యంగా ఉంది. ఇరువైపులా పిచ్చి మొక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. **-అప్పారావు, స్థానికుడు**

✔ రహదారి మరమ్మతులు చేస్తాం. పిచ్చి మొక్కలు తొలగిస్తాం. **-రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ? జంగారెడ్డిగూడెం పట్టణం బైనేరు శివాలయం వద్ద ఓ కర్మాగారంలో టైర్లు కాల్చడం వల్ల పొగ వ్యాప్తిచెందుతోంది. **-చిటికెల అప్పారావు, వెలమపేట**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-కేవీ రమణ, కమిషనర్**

? జంగారెడ్డిగూడెం పట్టణం రామచంద్రాపురంలోని రామాలయం వెనుక వీధిలో దీపం చాలా రోజులుగా వెలగడం లేదు. **-రంగారావు, రామచంద్రాపురం**

✔ దీపం ఏర్పాటు చేస్తాం. **-కేవీ.రమణ, కమిషనర్**

జగదాంబా.. కరుణించమ్మా

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

వేలేరుపాడు(జీలుగుమిల్లి), న్యూస్‌టుడే: జీలుగుమిల్లిలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న జగదాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి గాజులు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ●జగదంబ ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అర్చకులు ప్రసాద్, చిరంజీవి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

రామాలయానికి విరాళం

టి.నరసాపురం: న్యూస్‌టుడే: వీరభద్రవరంలో పునఃనిర్మించిన రామాలయానికి వైకాపా పంచాయితీరాజ్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి తేజబాబు మంగళవారం రూ.50 వేలు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మామిళ్ల శ్రీను, గోవింద్, సత్తిబాబు, గోపి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

మాట్లాడుతున్న డీపీఎం సుబ్బారావు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లోని డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు మరింత తోడ్పాటును అందిస్తున్నట్లు వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (ఫైనాన్స్) సుబ్బారావు తెలిపారు. మండలంలోని డ్వాక్రా సంఘాల్లోని ఈసీ సభ్యులకు బుట్టాయగూడెం మండల సమాఖ్య భవనంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమయ్యింది. డీపీఎం (ఐబీ) విజయకుమారి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల వ్యాపారాభివృద్ధికి ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీఎం పద్మావతి, లీగల్ కో-ఆర్డినేటర్ భూషణం, పలువురు సీసీలు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి వద్ద పోలవరం కుడి కాలువ గట్టుపై మట్టి అక్రమ తవ్వకాలను పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం రాత్రి కొంత మంది పోలవరం కుడి కాలువ గట్టును జేసీబీతో తవ్వి టిప్పర్లపై మట్టిని తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సుధీర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆకస్మిక వర్షంతో ఆందోళన

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ముంపు మండలమైన వేలేరుపాడులో మిర్చి సాగు చేయాలంటే అన్నదాతలకు కత్తిమీద సాములా మారుతోంది. మొదట్లో గోదావరి వరదలకు మొక్కలు చనిపోయి కొంత నష్టపోయారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఇంకొంత నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. కల్లంలో ఆరబోసుకున్న మిర్చి పంట తడవకుండా ఉండేందుకు బరకాలు కప్పుతున్నారు. వాటిపై నీరు నిలిచి కాయలు తేమబారాయి. దీంతో మిర్చి కాయలకు నలుపు మచ్చలు వచ్చే అవకాశముందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

శ్మశానాన్ని ఆక్రమిస్తున్నారని రాస్తారోకో

రహదారిపై బైఠాయించిన స్థానికులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: శ్మశానంలో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ గవరవరం గ్రామానికి చెందిన పలువురు కొయ్యలగూడెం, పోతవరం ప్రధాన రహదారిపై మంగళవారం రాస్తారోకో చేశారు. రహదారి పక్కనే దుకాణం నిర్వహిస్తోన్న వ్యక్తులు శాశ్వత నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని, అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదని ఆరోపించారు. అధికారులు జోక్యం చేసుకుని వెంటనే ఆక్రమణలు తొలగించాలని రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. వీరి ఆందోళనతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఘటనాస్థలానికి చేరుకున్న ఆర్ఐ రేణుకప్రియ ఆందోళనకారులతో కలిసి వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు జోక్యం చేసుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

జనసేన పార్టీని బలోపేతం చేస్తాం

మాట్లాడుతున్న ఈశ్వరయ్య

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేస్తామని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య తెలిపారు. చింతలపూడిలో మంగళవారం ఆ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మార్చి 10వ తేదీ వరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి 50 మంది వాలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. పార్టీ సభ్యత్వంతో బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

కళ్లజోళ్ల వితరణ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద వారధి ట్రస్టు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంగళవారం కళ్లజోళ్లను అందించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు వలవల తాతాజీ మాట్లాడుతూ ఈనెల 9న ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న రోగులకు జంగారెడ్డిగూడెం సుశీల హాస్పటల్స్ అధినేత కాకర్ల రామచంద్రబాబు రూ.30 వేల సొంత నిధులతో కళ్లజోళ్లు అందించారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని డీపీఎం బి.వెంకటేశ్ అన్నారు. ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటలో ఐదు రోజుల బీఆర్‌సీ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మాస్టర్ ట్రైనర్ ఒబిలిశెట్టి గోపాలకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి మొత్తం 44 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ రైతులు రూ.1000 విలువైన రసాయన ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా కేవలం రూ.100 ఖర్చుతో ప్రకృతి వ్యవసాయ పదార్థాలతో నాణ్యత కలిగిన ఎరువులను స్వయంగా తయారు చేసుకోవచ్చని సూచించారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు: డీఎస్‌వో

మాట్లాడుతున్న విలియమ్స్

పోలవరం, న్యూస్‌టుడే: సమయపాలన పాటించి రేషన్ కార్డుదారులకు నాణ్యమైన నిత్యావసరాలు అందజేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్ సూచించారు. పోలవరం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం, సాయంత్రం సక్రమంగా రేషన్ డిపోలు తెరవాలని, స్టాక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, వృద్ధుల ఇళ్లకు వెళ్లి సరకులు అందజేయాలన్నారు. రేషన్ కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్‌వో ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నా లేనట్లే.. చూస్తూ మురవాలంతే..

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: మన్యంలోని మారుమూల గ్రామాల్లో కొండరెడ్డి తెగ గిరిజనులకు తాగునీరు సరఫరా చేసేందుకు కేఆర్‌పురం ఐటీడీఏ ద్వారా నెలకొల్పిన సోలార్ ఆధారిత మంచినీటి ట్యాంకులు వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో పాడయ్యాయి. మరమ్మతులకు నోచుకోక ఏళ్ల తరబడి వెక్కిరిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల సోర పలకలు ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. వీటి దుస్థితి పట్టించుకున్న నాథుడు లేక ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

కాకిసనూరిలో మరమ్మతులకు గురైన పథకం

నాలుగేళ్లుగా మూలకు.. మండలంలో మొత్తం 7 సోర విద్యుత్తు ట్యాంకులుండగా.. నార్లవరం కాలనీ, మోదెలలో పనిచేస్తున్నాయి. ఊటగుంపు, తెల్లపల్లి, కాకిసనూరు, పూసగొందిలో మోటార్లు చెడిపోయి మరమ్మతులకు నోచుకోక నాలుగేళ్ల కిందటే మూలకు చేరాయి. వీటి మరమ్మతులకు ఒక్కో పథకానికి సుమారు రూ.1.20 లక్షల చొప్పున ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. 'నిరుపయోగంగా ఉన్న ట్యాంకులను పరిశీలించి మరమ్మతులు చేయించేందుకు సత్వర చర్యలు తీసుకుంటాం' అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీశ్ తెలిపారు.

ఇంటర్ పరీక్షాకేంద్రాల పరిశీలన

పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న రాములు నాయక్

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు సంస్కృతం, తెలుగు పరీక్షలు రాశారు. కొయ్యలగూడెంలోని పరీక్షా కేంద్రాలను ఐటీడీఏ కేఆర్‌పురం పీవో కె.రాములు నాయక్ మంగళవారం పరిశీలించారు. మొత్తం కేంద్రాలకు సంబంధించి 564 మంది అభ్యర్థులకు 33 మంది గైర్హాజరయ్యారు. ● పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 69 మంది విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరయ్యారు.

కొనసాగిన సహకార ఉద్యోగుల సమ్మె

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోరుతూ సహకార బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ద్వారకాతిరుమలలో మంగళవారం కొనసాగింది. సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

27న చలో కలెక్టరేట్

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంపు కోరుతూ ఈ నెల 27న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆర్.సూరిబాబు, హైమావతి, దుర్గారావు, షేక్ ఇమామ్, మంగరాజు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PENMETHSA NAGA KRISHNAM RAJU** Residence at Plot No 159, Bata Ganganamma Layout Colony, Jangareddygudem. Changing my name from **PENMITHSA NAGA KRISHNAM RAJU** (Old name) to **PENMETHSA NAGA KRISHNAM RAJU** (New name). Hence fourth Iam being called as **PENMETHSA NAGA KRISHNAM RAJU** For all purposes.

గుండెపోటుతో చోదకుడి మృతి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: గుండెపోటుతో చోదకుడు మృతిచెందిన సంఘటన చింతలపూడి మండలం సీతానగరం పామాయిల్ కర్మాగారంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన సొంగా శ్రీనివాసరావు శనివారం ఆయిల్‌పామ్ గెలల లారీతో సీతానగరం కర్మాగారానికి వచ్చారు. గెలలు అన్‌లోడ్ చేయడం ఆలస్యం కావడంతో అక్కడే ఉన్నారు. సోమవారం మధ్యాహ్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కర్మాగారంలోని ప్రథమ చికిత్స కేంద్రంలో పరీక్షలు చేయించుకున్నారు. కాసేపటికి లారీల మధ్యలో అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసరావును చోదకులు గుర్తించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.10 వేల చొప్పున జరిమానా

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 15 మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ నక్కా వెంకటేశ్వర్లు పట్టుబడ్డ వారందరికి రూ.15 వేల చొప్పున జరిమానా విధించారు.

ఇద్దరి బైండోవర్

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ అశోక్ మంగళవారం తెలిపారు. చింతలపూడి మండలానికి చెందిన ఇద్దరు పాత ముద్దాయిలను తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారన్నారు. లింగపాలెం మడంలం వెస్ట్ యడవల్లిలో కల్లు దుకాణాలను తనిఖీ చేసి పరీక్షల నిమిత్తం నమూనాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి ఉత్పత్తుల తయారీతో సాధికారత

పంటలను పరిశీలిస్తున్న శిక్షణార్థులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రకృతి వనరుల ఉత్పత్తుల తయారీపై శిక్షణ సభ్యుల సాధికారతకు దోహదపడుతుందని రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజరు మన్మోహన్ బీఆర్‌సీ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. బయ్యనగూడెం గోశాలలో ప్రారంభమైన మూడో విడత శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కాకినాడ, కోనసీమ, పోలవరం, ఎన్టీఆర్, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 41 మంది శిక్షణకు హాజరు కాగా.. వారిలో 21 మంది మహిళలే కావడం విశేషం. అయిదు రోజులపాటు కొనసాగనున్న శిక్షణలో భాగంగా క్షేత్ర సందర్శన, పలు కషాయాల తయారీ, ఏటీఎం సాగు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని గోశాల కేంద్రం నిర్వాహకుడు సుంకర సత్తిరాజు తెలిపారు.

సేవాభావం అలవర్చుకోండి

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవాభావం అలవరచుకోవాలని జిల్లా స్కౌట్స్ శిక్షణ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 83 మంది విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ పరీక్షా శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు.

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పరిశీలకురాలు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 రోజుల పాటు శిబిరం నిర్వహిస్తామని, విద్యార్థులు నేర్చుకున్న పలు అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పరిశీలకులు దారం ప్రసాద్, వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి, స్వర్ణ, దుర్గారాణి, చాంద్ బీబీ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇరపా గంగాదేవి పాల్గొన్నారు.

దుకాణాలు తెరచి.. దొంగతనాలకు పాల్పడి..

జంగారెడ్డిగూడెం పట్టణంలో దొంగ హల్‌చల్

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని పలు దుకాణాల్లో ఒకేరోజు దొంగతనాలు జరగడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఓ దొంగ పట్టణంలోని 5 దుకాణాల తాళాలు పగులగొట్టి నగదు భారీగా దొరకక మెల్లగా జారుకున్న ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, వ్యాపారులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణంలోని జేపీ సెంటర్‌లో చెప్పుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి ఆయన దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లి.. తిరిగి మంగళవారం ఉదయం తెరిచేందుకు రాగా.. షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపల నగదు ఏమీ లేకపోవడంతో దొంగ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అదే ప్రాంతంలో చిన్నం జాజీకి చెందిన చికెన్ దుకాణం పైభాగంలోని రేకులను పగులగొట్టి దొంగ లోనికి ప్రవేశించాడు. సుమారు 5 కోళ్ల వరకు దొంగిలించడంతో పాటు కెమెరాలను ధ్వంసం చేశాడు. అదేవిధంగా సాలిపేట జంక్షన్ వద్ద సుమన్ అనే వ్యక్తికి చెందిన ఓ రెడీమేడ్ పూరీ విక్రయ దుకాణం తాళాలు పగులగొట్టి కౌంటర్‌లో రూ.4 వేలు, సీసీ కెమెరాను దొంగ కాజేశాడు. అలాగే పక్కనే ఉన్న జితేంద్రకు చెందిన మరో రెండు దుకాణాలను గునపంతో తెరిచే ప్రయత్నం చేయగా.. వాటికి సెంట్రల్ లాకింగ్ ఉండటంతో సాధ్యపడలేదు. దీంతో అక్కడ నుంచి జారుకున్నాడు. కాగా అతడు దొంగతనాలకు పాల్పడుతున్న దృశ్యాలు పలు దుకాణాల్లోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. సైకిల్ మీద వచ్చిన దొంగ ముఖానికి మాస్కు ధరించి, చేతిలో చిన్నపాటి గునపాన్ని పట్టుకుని దుకాణ తాళాలు పగులగొడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. పలువురు బాధితులు మంగళవారం జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గత మూడు రోజుల కిందట చింతలబజార్ ప్రాంతంలోని పలు దుకాణాల షట్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

సాలిపేట జంక్షన్‌లో ఓ దుకాణాన్ని తెరిచేందుకు యత్నిస్తున్న దొంగ

ప్రజా రవాణాకు అనుసంధానం చేయాలి

మాట్లాడుతున్న రవి

టి.నరసాపురం: న్యూస్‌టుడే: గ్రీన్ ఫీల్డ్ హైవేను ప్రజా రవాణాకు అనుసంధానం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. టి.నరసాపురంలో మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి పక్కన సర్వీసు రోడ్లు లేక రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి, రైతులకు ఇవ్వాల్సిన పరిహారం వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, కుమారి, సూర్యారావు పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

మాకు అత్యంత ఆప్తులు, మాజీ శాసనమండలి సభ్యులు ఆంధ్రప్రదేశ్ కుమ్మరి, శాలివాహన సంఘం అధ్యక్షులు, హోటల్ ఐలాపురం చైర్మన్ కీ॥శే॥ శ్రీ ఐలాపురం వెంకయ్య గారి మరణానికి చింతిస్తూ.. వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

ఏలూరు జిల్లా శాలివాహన సంఘం

కొంతేటి షణ్ముఖరావు జిల్లా కార్యదర్శి, జంగారెడ్డిగూడెం	మల్లవరపు సత్యనారాయణ (MS) రాష్ట్ర ఉపాధ్యక్షులు, జంగారెడ్డిగూడెం
నాదెళ్ళ శ్రీను జోనల్ కార్యదర్శి, రావికంపాడు	పండూరి సత్యనారాయణ గాయత్రి పెయింట్స్, జంగారెడ్డిగూడెం
పండూరి పోతురాజు జిల్లా ఉపాధ్యక్షులు, T. నర్సాపురం	పాటిమళ్ళ సుబ్బారావు టి.డి.పి. నాయకులు, కళ్ళచెర్వు
ఆదుర్తి శ్రీనివాసరావు కొయ్యలగూడెం (పాలి శ్రీను)	మల్లవరపు బాబూరావు కోశాధికారి, కొయ్యలగూడెం
నల్లూరి బాలకృష్ణ కాంట్రాక్టర్, బుట్టాయగూడెం	పెనుగొండ నాగపోశి అడ్వకేట్
కరపా చంద్రమౌళేశ్వరావు రిటైర్డ్ అగ్రికల్చర్ డైరెక్టరు, ఏలూరు	లాంగు వెంకట్రావు కాంట్రాక్టరు, ఏలూరు
వీరవాసరపు వీరన్న L.I.C.ఏజెంటు, ఏలూరు	మల్లారపు రామలింగేశ్వరావు మహాలక్ష్మి గోపాలస్వామి కళ్యాణ మండపం, ఏలూరు
మానికొండ సత్యరాజు శ్రీ రామభద్రాద్రి ఏజెన్సీస్, ఏలూరు	మల్లారపు నరేంద్ర బిజినెస్, ఏలూరు
జజ్జవరపు భాస్కరరావు బ్రిక్స్ బిజినెస్, ఏలూరు	రాయ్యూరి రమేష్ బిజినెస్, ఏలూరు
బొమ్ములూరి కోటేశ్వరరావు బిజినెస్, ఏలూరు	కొండపేటి ఆదిశేషు కాంట్రాక్టరు, ఏలూరు

పెదప్రూడి బాలాజి ఫోకస్ పెయింట్స్, ఏలూరు

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

27న వైవీఎన్నార్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

కైకలూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ వై.శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా ఉదయం 9.గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని సుమారు 800 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ అర్హతలు ఉన్న యువతీ యువకులు అర్హులని వివరించారు.

ముస్లింల ఉన్నతికి బంగారు బాటలు

మంత్రి ఫరూక్‌తో ఎమ్మెల్యే కామినేని, నాయకులు

కలిదిండి, న్యూస్‌టుడే : కూటమి ఏలుబడిలో ముస్లింల ఉన్నతికి బంగారు బాటలు వేస్తామని మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూక్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ నాయకులతో మంగళవారం ఏపీ సచివాలయంలో మంత్రి ఫరూక్, ప్రిన్సిపల్ సెక్రటరీ సుధీర్‌ను కలిశారు. కలిదిండిలో నూతన షాదీఖానా నిర్మాణం, కైకలూరులో షాదీఖానాకు మరమ్మతులు, కైకలూరు, కలిదిండి, అల్లినగరం, సంఘర్షణపురం గ్రామాల్లోని ఖబరస్తాన్లకు ప్రహరీల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటికి మంత్రి వెంటనే ఆమోదం తెలిపినట్లు వివరించారు. ముస్లిం నేతలు ఎండీ జానీ, అబ్దుల్ అస్లాం, ఉస్మాన్ ఖాన్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సిలువ గట్టు రహదారి అభివృద్ధికి రూ.1.50 కోట్లు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలో పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న సిలువ గట్టు రహదారికి మహర్దశ పట్టింది. స్థానికుల కోరిక మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మంత్రి కొలుసు పార్థసారథి రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. పనులు ప్రారంభానికి కొద్ది రోజులు జాప్యం కావడంతో వైకాపా సానుభూతిపరులు రకరకాల ఊహాగానాలను ప్రచారం చేశారు. అయినప్పటికి పట్టువదలని విక్రమార్కుడిలా మంత్రి సిలువ గట్టు తిరునాళ్ల నాటికి రహదారి నిర్మాణం పూర్తి చేయిస్తానని పలు సందర్భాల్లో ప్రకటించారు. అన్నట్లుగానే రూ. కోటి నిధులతో కొన్నకుంట రహదారి నుంచి 900 మీటర్లు తారు రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులను పంచాయతీరాజ్ డీఈ కమల్ కిశోర్, ఏఈ విజయగోపాల్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. రూ.50 లక్షలతో గట్టు దిగువ నుంచి 800 మీటర్లు సిమెంటు రోడ్డు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో సిలువ గట్టు తిరునాళ్లను నిర్వహించేందుకు ఆర్సీఎం సంఘ పెద్దలు, పట్టణ ప్రముఖులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

మురుగు కదలదు.. దోమ వదలదు!

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

నూజివీడు, న్యూస్‌టుడే

సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించే దిశగా అధికారులు తీసుకున్న చర్యలు కానరావడం లేదు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగు కాలువలు, గుంతల్లో నీరు నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. నియోజకవర్గంలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి పరిధిలో 86 గ్రామ పంచాయతీల్లో 2,44,372 మంది ప్రజలు నివశిస్తున్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలు దోమల దండయాత్రతో కంటి మీద కునుకు లేకుండా ఉంటున్నారు. ఇప్పటికే చాలా చోట్ల జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో సక్రమంగా ఫాగింగ్ చేయడం లేదు.

నూజివీడు-గన్నవరం ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి కొలిమి బజారు వద్ద పేరుకుపోయిన చెత్త

మూలకు చేరిన యంత్రాలు.. వైకాపా ప్రభుత్వం రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను సమకూర్చింది. ఒక్కోదానికి సుమారు రూ.45 వేలు వెచ్చించారు. కొన్ని పంచాయతీల్లో ఆ యంత్రాలను ఎలా వినియోగించాలో కనీస అవగాహన లేకపోవడంతో అటకెక్కించేశారు. కొన్ని పంచాయతీల్లో రెండు మూడు సార్లు వినియోగించగానే మరమ్మతులకు గురై మూలకు చేరాయి.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు.. పల్లెల్లో ఉత్పన్నమయ్యే చెత్త నుంచి సంపద సృష్టించేందుకు పంచాయతీకి ఒక ఘన వ్యర్థ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వీటికి ఒక్కోదాని నిర్మాణానికి రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు నిధులు ఖర్చు చేశారు. మొదట్లో ఇవి బాగానే నడిచినా ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అవి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. వీటిని అందుబాటులోకి తెచ్చి సంపద సృష్టించాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గ సమాచారం

గ్రామ పంచాయతీలు		జనాభా
నూజివీడు	27	70,963
ఆగిరిపల్లి	25	62,310
ముసునూరు	16	57,197
చాట్రాయి	18	53,902

సమస్యల పరిష్కారానికి చర్యలు..

ఆర్థిక భారమైనా గ్రామ పంచాయతీల్లో అవసరమైన మేరకు ఫాగింగ్ చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా దోమల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం.

- జ్ఞాన సుందరి, డీఎల్పీవో, నూజివీడు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	90594 84862	ముదినేపల్లి:	8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని వదర్లపాడు ఎంపీపీ పాఠశాల సమీపంలో సీసీ రోడ్డుపై మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తుంది. దీనిపై స్థానికురాలు వనజ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మురుగు నీరు మళ్లించి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

బుక్ చేస్తే.. డ్రోన్ వచ్చేస్తుంది!

అడవినెక్కలం(ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో డ్రోన్ సేవలను కూటమి ప్రభుత్వం మరింత సులభతరం చేసి, ర్యాపిడో తరహాలో ఫోన్‌లో బుక్ చేసుకుంటే. . పొలం వద్దకే కిసాన్ డ్రోన్ వచ్చేలా ఏర్పాట్లు చేసిందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి జె.భవాని తెలిపారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం, కనసానపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారుల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈఈ నెల 25తో ఈ-పంట నమోదు ముగుస్తుందని, రైతులు సమీప ఆర్ఎస్‌కేల్లో పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారిణి ఆర్.హేమ మాట్లాడుతూ.. మామిడి కాయ సంచుల రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు

లోక పావనీ.. పెద్దింట్లమ్మ

కైకలూరు, న్యూస్‌టుడే: పార్వతీ దేవి స్వరూపంగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్న లోక పావని పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. మంగళవారం 7వ రోజు పలు మండలాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో జల దుర్గా సమేత పెద్దింట్లమ్మకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, సహస్ర నామ కుంకుమ పూజ, ధూప సేవ, బాలభోగం వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పాల పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ఈవో కె.శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నయనోత్సవం.. సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జన్మ నక్షత్రం కృత్తికను పురస్కరించుకుని మంగళవారం శాంతి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సుమారు 30 మంది దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆలయ ఏసీ ఆర్.గంగా శ్రీదేవి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

3న ఆలయం మూసివేత .. చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న మూసివేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం అభిషేకం అనంతరం 9 గంటలకు స్వామివారి దర్శనం నిలిపివేయడం జరుగుతుందన్నారు. తిరిగి 4న సంప్రోక్షణల అనంతరం ఉదయం 8 గంటలకు స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని ఆమె చెప్పారు.

నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు

కైకలూరు, న్యూస్‌టుడే: పంట కాలువల్లో అనధికారిక తూరలు ఏర్పాటు చేసి తాగునీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని డీసీ ఛైర్మన్ పొత్తూరి వాసురాజు, మండల తెదేపా అధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు అన్నారు. పంట కాలువలకు నీరు విడుదల చేసిన తరుణంలో మంగళవారం కూటమి శ్రేణులతో కలిసి కైకలూరు కెనాల్‌ను పరిశీలించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని రాజీవ్ జలాశయంలో మోటార్ల ద్వారా నీరు నింపుతున్న క్రమంలో నీటి స్థాయిని పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ముందస్తు చర్యలు చేపడుతున్నారని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి చెరువులను పూర్తిస్థాయిలో నింపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో నాయకులు పూల రామచంద్రరావు, కె.కె.బాబు, వీరాబత్తిన సుధ, పడమట వాసు, ఎండీ జానీ, బషీర్, ఉస్మాన్, పంచాయతీ అధికారులు శ్రీరంగం, శ్యామలరావు పాల్గొన్నారు.

గోడపత్రులు ప్రదర్శిస్తున్న నాయకులు

మై తెదేపా యాప్, పోస్టర్ల ఆవిష్కరణ

ముసునూరు, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు, పార్టీ సమాచారాన్ని కార్యకర్తలకు వేగంగా చేరవేసేందుకు రూపొందించిన మై తెదేపా యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకుని సంక్షేమం, అభివృద్ధి వివరాలను రాష్ట్రస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు తెలియజేయాలని తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రఘు, గ్రామ అధ్యక్షుడు, సొసైటీ ఛైర్మన్ ఉప్పలపాటి గణేశ్ అన్నారు. మంగళవారం ముసునూరు మండలం గోపవరంలో మై తెదేపా యాప్, పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేశ్ ఆలోచనలతో ప్రతి తెదేపా కార్యకర్తలకు ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు.

ప్రేమ తత్వమే క్రీస్తు మార్గం

ఘనంగా ముగిసిన వరప్రసాదమాత మహోత్సవాలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రేమ తత్వమే క్రీస్తు మార్గమని రెవ.ఫాదర్ గంటెల మరియదాసు తెలిపారు. ఆగిరిపల్లి మండల పరిధిలోని రాజవరంలో మూడు రోజులుగా జరుగుతున్న వరప్రసాద మాత మహోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు రెవ. ఫాదర్ గంటెల మరియదాసు ముఖ్య అతిథిగా పాల్గొని సమష్టి దివ్య పూజా బలి కార్యక్రమం నిర్వహించారు. దివ్య సందేశంలో ఫాదర్లు మాట్లాడుతూ.. క్రైస్తవులు ప్రేమ, శాంతితో మెలగాలని పిలుపునిచ్చారు. దనవంతుడు, బీద లాజరు బైబిల్ నాటకం, బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో విచారణ గురువులు రెవ. ఫాదర్ అల్లం ప్రతాపరెడ్డి, సర్పంచి జాలా భూషణం, గురువులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆంగ్ల భాష ఉత్సవం

మండవల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో భాషా నైపుణ్యం, సృజనాత్మకత, వంటి ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని చింతపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఆంగ్లంలో కథా రచన, వక్తృత్వం, ఇంగ్లిష్ ప్రాముఖ్యం వంటి అంశాలపై నిర్వహించిన పోటీల్లో 3 నుంచి పదో తరగతికి చెందిన పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలో ప్రతిభను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5, 7, 8, 9 తరగతుల విద్యార్థులు జయశ్రీ, సత్య, తేజస్విని, జరిష్మా, రేవతి, లీలాకృష్ణ, అక్షరోలిక, అంజూర, రుషి, శివలను అభినందించారు. వీరంతా మండల స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, రమేశ్ పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న చిన్నారి

ధర్నా విజయవంతానికి పిలుపు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం ఈనెల 26, 27 పాత తాలుకా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎ.కృపాకర్, ప్రధాన కార్యదర్శి వెంకట రత్నం పిలుపునిచ్చారు. ముదినేపల్లిలో మంగళవారం వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఆన్‌లైన్ వర్క్‌ల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఈ ధర్నా నిర్వహిస్తున్నామని వివరించారు.

మత్తు పదార్థాలతో యువత భవిత చిత్తు

అడవినెక్కలం(ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో యువత ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతోందని జోనల్ కోఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం 'మత్తు పదార్థాలు.. ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'నీ తోడు' మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్లు పి.విజయకుమార్, ఎన్.దేవమణి మాట్లాడుతూ. . ధూమపానంతో క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

తాగునీటి ట్యాంకర్ ఏర్పాటు అభినందనీయం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామ సర్పంచి జాలా భూషణం తెలిపారు. ఆగిరిపల్లి మండలం రాజవరం వరప్రసాద మాత మహోత్సవాల సందర్భంగా పాలేటి కోటేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకర్‌ను సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి ఉమామహేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నెరుసు సతీశ్, నరదల రాంబాబు, పాలేటి శ్రావణ్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరులకు జరిమానా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో ఎమ్మార్ అప్పారావు కాలనీలో మంగళవారం జూదం ఆడుతున్న వారిపై పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.300 జరిమానా విధించినట్లు ఎస్.ఐ. తెలిపారు.

మండవల్లి సహకార బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

పీఏసీఎస్ ఉద్యోగుల ర్యాలీ

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: సహకార బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తక్షణం ఉద్యోగ భద్రత కల్పించాలని పీఏసీఎస్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కోరుతూ మంగళవారం నియోజకవర్గంలోని 47 సంఘాల ఉద్యోగులు కైకలూరు బ్రాంచి నుంచి కలిదిండి, ముదినేపల్లి మీదుగా మండవల్లి వరకు ద్విచక్ర వాహనాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి పీఏసీఎస్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మలుపుల్లో.. ముప్పు..

ప్రధాన రహదారుల్లో కానరాని సూచికలు

నూజివీడు, న్యూస్‌టుడే

నూజివీడు నియోజకవర్గంలోని కీలక మార్గాల్లో మలుపులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో ప్రధాన రహదారుల్లో 32 చోట్ల భారీ మలుపులు ఉన్నాయి. కొన్ని చోట్ల ఎదురుగా వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేవరకు కనపడటం లేదు.

నూజివీడు- విజయవాడ ప్రధాన రహదారిలో.. కొన్నంగుంట, వడ్లమాను, ఆగిరిపల్లి మసీదు కూడలి దగ్గర, పోతవరప్పాడు, నెక్కలం గొల్లగూడెం కుశలవ కేంద్రం, అడవినెక్కలం ప్రధాన రహదారిలో ● నూజివీడు-ఏలూరు రహదారిలో సింహాద్రిపురం, పోతురెడ్డిపల్లి, ముసునూరు, గోపవరం, ● నూజివీడు- మైలవరం రహదారిలో సుంకొల్లు, బత్తులవారిగూడెం, చంద్రాల, వెల్వడం, యనమదల గ్రామాల్లో, ● నూజివీడు- విస్సన్నపేట రహదారిలో బైపాస్ దగ్గర, అన్నవరం, వెంకటాద్రిపురం ● నూజివీడు-గన్నవరం రహదారిలో చిన్నఆగిరిపల్లి, తోటపల్లి, గొల్లనపల్లి ● ఆగిరిపల్లి-మైలవరం రహదారిలో శోభనాపురం, ఈదర, గణపవరం ● ఆగిరిపల్లి- హనుమాన్ జంక్షన్ రహదారిలో అమ్మవారిగూడెం, నరసింగపాలెం, సగ్గూరు, కొమ్మూరు, కృష్ణవరం, సూరవరం ● ఆగిరిపల్లి- ఎస్.ఏ.పేట రహదారిలో నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, రాజవరం గ్రామాల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి.

ఆగిరిపల్లి స్టేట్ బ్యాంక్ కూడలి వద్ద ప్రమాదకరంగా ఇలా

త్వరలో బోర్డులు ఏర్పాటు.. నూజివీడు డివిజన్‌లో పలు రహదారుల్లో వేగ నిరోధకాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో ఆ పనులు చేపడతాం.

- సీహెచ్ బాబూరావు, ర.భ.శాఖ డీఈ, నూజివీడు

బకాయిలు చెల్లించాలని డిమాండ్

ముసునూరు, న్యూస్‌టుడే: ఇరవై ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకపోవడం దారుణమని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య అన్నారు. మంగళవారం ముసునూరు మండలం సూరేపల్లిలో మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ.. ఇన్నేళ్లుగా వేతనాలు చెల్లించకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులందరికీ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 2న కలెక్టరు కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను పాఠశాల కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రఘునాథస్వామిని దర్శించుకున్న పీఠాధిపతులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లిలో ఉన్న రఘునాథస్వామి ఆలయాన్ని పలువురు పీఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలు దర్శించుకుని సోమవారం రాత్రి పూజలను నిర్వహించారు. బృందావన గోవర్ధన పీఠాధిపతి నారాయణ ప్రవీణ్, కాశీ నుంచి దిలీప్ రామానుజన్ బృందం, కేదార్‌నాథ్ నుంచి చమన్ దాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూజలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి ప్రధాన కూడలిలో జాతీయ రహదారి సమీపంలో పంచాయతీ తాగునీటి పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురి కావడంతో నీటి ఇబ్బందులతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారుల నడుమ సమన్వయం లేక కొన్నేళ్లుగా ఈ సమస్యతో ప్రజలు అవస్థ పడుతున్న తరుణంలో ఎట్టకేలకు ఎన్‌హెచ్ అధికారులు స్పందించారు. వారి సూచనలతో మంగళవారం పైపులైను మరమ్మతులు చేపట్టారు. రోడ్డు అడుగు భాగంలో పైపులైను ఉన్న క్రమంలో భారీ వాహనాలు వెళ్లినా సమస్య పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

డీడీవో అధికారాల తొలగింపు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా పని చేస్తున్న షకీనా ఇవాంజెలిన్‌పై ఆసుపత్రి నిర్వహణలో పదేపదే వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డీడీవో అధికారాలను తొలగిస్తూ జిల్లా వైద్యాధికారిణి అమృతం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూజివీడు మండలం దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఎం.శ్రీనివాసరావుకు ముసునూరు పీహెచ్సీ డీడీవోగా అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శ్రీనివాసరావుకు వెంటనే బాధ్యతలను అప్పగించి కార్యాలయానికి నివేదికను సమర్పించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు.

బాలిక అదృశ్యంపై కేసు

కైకలూరు, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యమైన సంఘటనపై కైకలూరు పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు... కైకలూరుకు చెందిన బాలిక సోమవారం మధ్యాహ్నం నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు తన చెల్లితో కలిసి కైకలూరు గాంధీ బొమ్మ కూడలికి వచ్చింది. దుస్తులు కొనుగోలు చేసిన అనంతరం తాను తరువాత ఇంటికి వస్తానని చెప్పి తన సోదరిని ఆటో ఎక్కించి ఇంటికి పంపించేసింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పట్టణమంతా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీసులను ఆశ్రయించగా.. ఎస్సై వెంకట్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ సహాయకుడి దుర్మరణం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతం కారణంగా బత్తులవారిగూడెం విద్యుత్తు లైన్‌మేన్ పిల్లి శ్రీనివాసరావు ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న సహాయకుడు డొంకాడ శ్రీనివాసరావు(56) మృతి చెందారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ సంఘటన జరిగినా రాత్రి 8.30 గంటల వరకు కేసు నమోదు కాలేదు. విద్యుత్తు అధికారులు, యూనియన్ బాధ్యులు మృతుడి కుటుంబ సభ్యులతో మంతనాలు చేశారు. రూరల్ ఎస్.ఐ. జ్యోతిబాసు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తులవారిగూడెంలో 11 కేవీ స్తంభాలను మంగళవారం వేకువజామున ఒక లారీ ఢీకొట్టింది. దీంతో యనమదల, బత్తులవారిగూడెం గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న లైన్‌మేన్, మరికొందరు సిబ్బంది కలిసి విద్యుత్తు లైన్‌కు మరమ్మతులు పూర్తి చేశారు. అనంతరం యనమదలలోని విద్యుత్తు స్తంభం వద్ద లైన్ కలిపేందుకు లైన్‌మేన్ వద్ద హెల్పర్‌గా పని చేస్తున్న డొంకాడ శ్రీనివాసరావును స్తంభం ఎక్కించారు. ఆయన పైన ఉండగానే సబ్ స్టేషన్‌లోని సిబ్బంది విద్యుత్తు సరఫరా పునరుద్ధరించడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసిందన్నారు.

బాధిత కుటుంబంతో ఒప్పందం?..

కుటుంబ సభ్యులతో రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలోనే మంతనాలు నిర్వహించిన యూనియన్ నాయకులు, రూరల్ ఏఈ, ఇతర అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు లైన్‌మేన్ ద్వారా రూ.2 లక్షలు, ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు వచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. నూజివీడు నియోజకవర్గ పరిధిలో పలువురు లైన్‌మెన్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్లను అనధికారికంగా నియమించుకుని విధులు నిర్వర్తిస్తుండటంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కోరుకొల్లులో చేపల చోరీ

కలిదిండి, న్యూస్‌టుడే : 'కాదేదీ చోరీకి అనర్హం' అన్న చందంగా చేపల దొంగతనానికి పాల్పడ్డారు కొందరు వ్యక్తులు. వివరాల్లోకి వెళితే.. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామానికి చెందిన ఓ రైతు కోరుకొల్లులో 32 ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఈ చెరువులో గొరకలు ఎక్కువగా ఉండటంతో చేపలకు వేసిన మేతను అవే తినేస్తున్నాయి. దీంతో మేత వృథా అవడంతో పాటు చేపల ఎదుగుదలపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో చెరువులోని గొరకలు పట్టుకునేందుకు కొందరు కార్మికులను కుదుర్చుకున్నారు. రైతుకు కిలో గొరకలకు రూ.10 చెల్లించే విధంగా మాట్లాడుకున్నారు. పట్టుబడి ఖర్చులు కార్మికులదే. 20 రోజులుగా గొరకలు పట్టుబడి చేస్తున్నారు. ఈ క్రమంలో గొరకలతో పాటు చేపలు కూడా పట్టుకెళ్లి పోతున్నారనే అనుమానం రైతుకు రావడంతో రెండ్రోజులుగా నిఘా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున 20 మంది కార్మికులు గొరకలతో పాటు 3 టన్నులు చేపలు వ్యానులో వేసుకుని వెళ్తుండగా రైతు పట్టుకున్నారు. దీంతో ఆ ప్రదేశానికి ఆక్వా రైతులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. రూ.లక్షలు, కోట్లు చెరువులో కుమ్మరించి సాగు చేస్తుంటే.. ఈ విధంగా చోరీలు జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వాపోతున్నారు.

గందరగోళంగా చేవూరు గ్రామసభ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మురుగు బోదె సమస్య పరిష్కారంపై మండలంలోని చేవూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా మారింది. చేవూరు ఎస్సీ కాలనీలో కొందరు రైతులు ఇటీవల మురుగు బోదెలు లేకుండా చెరువులు తవ్వకాలు చేయగా, మురుగు కాలనీలోకి వచ్చి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్చించేందుకు అన్ని శాఖల అధికారులతో మంగళవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఇందులో ఏడు శాఖల అధికారులు రావాల్సి ఉండగా కేవలం ముగ్గురు అధికారులే హాజరుకావడం.. సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని, కొందరు ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేసి వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎవరి ప్రమేయం లేకుండా మురుగు బోదెలు ఏర్పాటు చేసేలా రైతులు, కాలనీ వాసులు, అధికారులు మాత్రమే చర్చిస్తే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. భవిష్యత్తులో కాలనీ ముంపు బారిన పడకుండా చూడాలని కోరారు.

భాజపా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాధిక

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భాజపా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా అల్లూరుకు చెందిన రెడ్డి రాధిక నియమితులయ్యారు. మండల మహిళా కార్యదర్శిగా, సభ్యత్వ ప్రముఖ్‌గా ఆమె పనిచేశారు. మంగళవారం ఆమెకు జిల్లా అధ్యక్షుడు అగ్రహారపు వెంకటేశ్వరరావు నియామక పత్రాన్ని అందించారు.

గుర్వాయిపాలెం(కలిదిండి), న్యూస్‌టుడే : భాజపా ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా గుర్వాయిపాలేనికి చెందిన రాగాని రమాదేవిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అగ్రహారపు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు రమాదేవికి మంగళవారం నియామక పత్రం అందించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆమె వివరించారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం ప్రశంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షకు 167మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు ద్వారకాతిరుమల కళాశాల అధికారిణి శ్రీలక్ష్మి, ఏలూరు డీటీ ప్రియ తనిఖీ చేశారు. పరీక్షల చీఫ్ సూపరిండెంట్ ఓఎస్ఎన్ మూర్తి, డిపార్ట్‌మెంటల్ అధికారి విక్టర్ పరీక్షలను పర్యవేక్షించారు.


ముదినేపల్లి కేంద్రం వద్ద విద్యార్థులు

నూరు శాతం.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు 89 మంది హాజరు కావాల్సి ఉండగా నూరు శాతం హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ జి.సుజాతఫ్లారెన్స్ తెలిపారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన సీఐ.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇంటర్ పబ్లిక్ పరీక్ష కేంద్రాలను సీఐ సత్య శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు అవుతుందన్నారు.

ప్రమాదభరితంగా ముదినేపల్లి పంచాయతీ రహదారి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలో జాతీయ రహదారి నం.165 విస్తరణ పనుల వల్ల పంచాయతీ రహదారి ప్రమాద భరితంగా మారింది. ఈ రహదారికి సర్వీసు రోడ్డు లేకపోవడంతో పాటు నిర్మించిన డ్రెయినేజీపైనే రహదారిని ఏర్పాటు చేశారు. అయితే డ్రెయినేజీపై వేసిన శ్లాబు ప్లేట్లు విరిగిపోతూ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా ఎన్‌హెచ్ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. మంగళవారం ఆ రహదారిలోకి ఓ కారు వెళ్తూ ప్రమాదవశాత్తు డ్రెయినేజీలోకి జారిపోయింది. దీంతో కారులోని వారందరూ భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు వెంటనే స్పందించి డ్రెయినేజీలో నుంచి బయటకు లాగారు.

డ్రెయినేజీలోకి వెళ్లిన కారు

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	....
సత్యనారాయణ మినీ	హే బల్‌వంత్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	సీతా పయనం
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మన శివశంకరవరప్రసాద్ గారు
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	....
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	మన శివశంకరవరప్రసాద్ గారు
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3	హే బల్‌వంత్
మాగంటి సినిమాస్	సీతా పయనం
శ్రీవెంకటరమణ సినిమాస్	ఆల్ఫా
ముదినేపల్లి: పూర్ణిమ	సీతా పయనం

పబ్లిక్ నోటీసు

నా క్లయింటున్నూ కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు రెవెన్యూ మండలం, ముక్కొల్లుపాడు గ్రామ కాపురస్తులు మాగంటి శ్రీకాంత్ గారి భార్య మాగంటి శశికళ గారు నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా:-

నా క్లయింట్లు కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, ఎలుకపాడు గ్రామ పంచాయతీ ఏరియాలో రి.సర్వే నెం. 64/1 దాఖలా య. 0-79 సెంట్లు మరియు రి.సర్వే నెంబరు 65/1 దాఖలా య. 1-21 సెంట్లు వెరసి య. 2-00 సెంట్ల భూమికి యజమాని అయివున్నారు. ఇట్లుండగా ది. 22-02-2026వ తేదీన ఉదయం సుమారు గం. 9.00ల సమయంలో సదరు పై తెలిపిన ఆస్తికి సంబంధించి ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 873/1967రును నా క్లయింటు సంచిలో పెట్టుకొని తన ఇంటి నుండి నూజివీడులోని చిన్నగాంధీ బొమ్మ సెంటరులో గల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళగా, సదరు దస్తావేజు మార్గమధ్యంలో జారి క్రింద పడిపోయినది. దర్మిలా నా క్లయింటు చుట్టు ప్రక్కల వెతికి చూసినప్పటికీ సదరు దస్తావేజు కనపడి యుండలేదు. కావున పై తెలిపిన దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేయగలరు.

సం/- ఇటికాల జానకీరామ్,
నూజివీడు న్యాయవాది, నూజివీడు
ది: 24-02-2026 సెల్ నెం. 99633 00213

చిన్నశేష వాహనంపై ఊరేగిన వెంకన్న

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్కు సమీపంలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని చిన్నశేష వాహనంపై ఊరేగించారు. అర్చకులు కమల్‌నాథ్ ఆధ్వర్యంలో సరస్వతి హోమాన్ని నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గోవిందమాలధారులు స్వామి, అమ్మవార్లను హంస వాహనంపై ఊరేగించారు.

ప్రమాదానికి ఎదురెళుతూ..!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా వెళ్లే 16వ నెంబరు జాతీయ రహదారిలో ఎక్కడో చోట నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

తలపులమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గం వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఇలా..

అయినా కొంతమంది నిర్లక్ష్యం వీడడం లేదు. చాలా చోట్ల ప్రమాదకరంగా డివైడర్లను దాటుతుండగా, మరికొందరు చరవాణిలో మాట్లాడుతూ, అపసవ్యదిశలో వాహనాలు నడుపుతున్నారు. ఇలాంటి చర్యలతో వారు ప్రమాదంలో పడటమే కాకుండా ఇతర వాహనదారులనూ ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. – ఈనాడు, కాకినాడ

రామవరం వద్ద ప్రమాదకరంగా డివైడర్‌ను దాటుతూ..

‘ఉపాధి’ బిల్లుల్లో ముందంజ

- రెండో స్థానంలో కాకినాడ జిల్లా
- పోర్టల్‌కు చేరిన రూ.123 కోట్ల పద్దు

నియోజకవర్గం/ మండలం	అప్‌లోడ్ చేసిన బిల్లులు(రూ.కోట్లలో)
పిఠాపురం	23.66
జగ్గంపేట	20.85
ప్రత్తిపాడు	24.73
తుని	15.30
పెద్దాపురం	17.11
కాకినాడ గ్రామీణం	10.31

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విబి-జి రామ్ జిగా పేరు మార్పు చేయనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద సమకూరిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, వీటి బిల్లులు ఎన్ఐసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తేనే సొమ్ము లొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసి, వీటి బిల్లులను అప్‌లోడ్ చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చూస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ద్వారా ఈ పనులు చేపట్టడంతో, ఈ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కాకినాడ జిల్లాపై ప్రత్యేక దృష్టిసారించారు. దీనికి అనుగుణంగా కలెక్టర్, డ్వామా, పంచాయతీ రాజ్, ఆర్‌డ బ్ల్యూఎస్, సమగ్రశిక్షా, పశుసంవర్ధకశాఖల అధికారులు పనులు పూర్తికి చొరవ తీసుకుంటున్నారు. ● మరో నాలుగు రోజులే సమయం ఉండటంతో రాత్రి, పగలు బిల్లులు అప్‌లోడ్ చేసే పనిలో మండలస్థాయి కంప్యూటర్ సెంటర్లలో సిబ్బంది పనిచేస్తున్నారు. ● ఈ నెల 28లోగా మొత్తం పనులు పూర్తిచేసి, బిల్లులను నూరుశాతం అప్‌లోడ్ చేస్తామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి చెప్పారు.

కొత్తపల్లి మండలంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

- రూ.123.47కోట్ల మేర బిల్లులను ఎన్ఐసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, రాష్ట్రంలో రెండో స్థానంలో జిల్లాను నిలిపారు.
- జిల్లాలో రూ.138.77 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో 1,208 పనులకు కలెక్టర్ పరిపాలనా ఆమోదం ఇవ్వగా, ఇప్పటికి 89 శాతం పనులు పూర్తి చేశారు.

ఆ స్థలం.. మాకంటే మాకు!

- కాకినాడలో ప్రజాప్రతినిధుల పట్టు
- అధికారులకు తలనొప్పిగా లీజు పంచాయితీ

ఈనాడు, కాకినాడ: కాకినాడ నగరం నడిబొడ్డున పురపాలక శాఖకు చెందిన ఓ స్థలం లీజు కోసం ఇద్దరు ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. తమ అనుచరుల వ్యాపారం నిర్వహణకు, ఆ స్థలాన్ని వారి పేరున లీజుకు కేటాయించాలంటూ నగరపాలక సంస్థ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. వేర్వేరు చోట్ల స్థలాలు చూపించినా తాము కోరిన ఆ స్థలాన్నే అప్పగించాలని పట్టుబట్టడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ పంచాయితీ నగరపాలక సంస్థను దాటి ఇప్పుడు కలెక్టరేట్‌కు చేరుకుంది.

నగరంలోని వివేకానంద పార్క్‌ను అనుకుని ఫ్యాబిన్ కన్వెన్షన్ సెంటర్, స్మార్ట్ సిటీ బస్ షెల్టర్ మధ్య పురపాలక శాఖకు సుమారు 400 గజాల స్థలం ఉంది. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య వాహనాలు ఇక్కడ ఛార్జింగ్ పెట్టుకునేలా గతంలో షెడ్ నిర్మించారు. విద్యుత్తు వాహనాలు పాడైపోవడంతో కొంత కాలంగా ఈ స్థలం ఖాళీగానే ఉంది. చెత్త రిక్షాలు పార్కింగ్ చేసుకుంటున్నారు. ఈ స్థలాన్ని తమకు కేటాయిస్తే రెస్టారెంట్ పెట్టుకుంటామని ఒక వర్గం, ప్రింటింగ్ ప్రెస్ పెడతామని మరో వర్గం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. దీంతో ఏం చేయాలో అధికారులకు పాలుపోలేదు. వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో వ్యాపార సంస్థలకు స్థలాన్ని కేటాయిస్తే ట్రాఫిక్ పరంగా ఇబ్బందవుతుందని భావిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా పురపాలక శాఖకు చెందిన ఇతర స్థలాలు కేటాయిస్తామన్న ప్రతిపాదనకు నేతలు సానుకూలంగానే స్పందించారు. వారి అనుచరులు మాత్రం పట్టు వీడకపోవడంతో స్థల వివాదం రాజుకుంటోంది.

నేతలు కోరుతున్నది ఈ స్థలమే..

సమృద్ధిగా సన్న బియ్యం!

20 వేల టన్నుల సేకరణకు ఏర్పాట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ వసతిగృహాలకు సన్న బియ్యం సరఫరాకు స్థానికంగా ఏర్పాట్లు చేశారు. సీఎంఆర్ ద్వారా పౌరసరఫరాల సంస్థ 20 వేల టన్నుల సేకరణకు చర్యలు చేపట్టింది. ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగంగా కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి 72,878 టన్నుల ధాన్యాన్ని జిల్లా పౌరసరఫరాల సంస్థ సేకరించింది. వీటిలో 28,537 టన్నుల సన్న రకాలు కొనుగోలు చేసింది. దీని ద్వారా 20 వేల టన్నుల బియ్యం అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ హాస్టళ్లకు నెలకు 350 టన్నుల సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.

సాధారణ రకం సేకరణకు చర్యలు

జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ రకం, గ్రేడ్-ఎ ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి పౌరసరఫరాల సంస్థ సేకరించింది. 3,72,259 టన్నులు కొనుగోలు చేసి, 119 సీఎంఆర్ రైస్ మిల్లులకు సరఫరా చేశారు. వీటి ద్వారా 2,35,319 టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఇప్పటికి 1,29,834 టన్నులు మిల్లర్ల నుంచి బఫర్ గోదాములకు చేరాయి. ఇంకా 1,05,485 టన్నుల మేర మిల్లర్ల నుంచి రావాలి. మార్చి 31 వరకు గడువు ఉన్న నేపథ్యంలో ఈ లోగా లక్ష్యాల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవుల నాయక్ తెలిపారు. జిల్లాలో ఖరీఫ్‌లో 58,714 మంది రైతుల నుంచి కొన్న ధాన్యానికి ఇప్పటికి రూ.678 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.1.55 కోట్లు ఖాతాలకు జమ చేయాల్సి ఉందని చెప్పారు.

ఇతర జిల్లాలకూ ఇక్కడి నుంచే..

జిల్లా అవసరాలకు ఏడాదికి 4,200 టన్నుల బియ్యం అవసరం కానున్నాయి. ఈ నేపథ్యంలో సీఎంఆర్ కింద సేకరించే సన్న బియ్యంలో ఇక్కడికి సరిపోను.. కొంత మొత్తాన్ని ఇతర జిల్లాలకు సరఫరా చేయనున్నారు. ఆసియాలోనే అతిపెద్ద రైస్ మిల్లులు జిల్లాలో ఉన్నాయి. దీని దృష్ట్యా కూటమి ప్రభుత్వం ఇతర జిల్లాల నుంచి ధాన్యాన్ని సరఫరా చేసి, బియ్యం తయారీకి చర్యలు చేపట్టింది.

విద్యుత్తు తీగలు.. యమపాశాలు

పెరుగుతున్న ప్రమాదాలు

కాకినాడలోని డెయిరీ ఫారం కూడలిలో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు ఇనుప ఊచను పైకి ఎత్తి తీసుకువస్తుండగా తీగలకు తగిలాయి. గాయపడిన అతను చికిత్స పొందుతూ మరణించాడు.

కాకినాడ గ్రామీణ మండలం, వాకలపూడిలో 33/11కేవీ లైను ఓ ఇంటికి అతి సమీపంలో వెళుతోంది. ఇంటి యజమానురాలు మేడపై చీర ఆరేసినప్పుడు కొంత భాగం తీగలపై పడింది. గమనించకుండా ఆమె చీర తీయడానికి ప్రయత్నించగా విద్యుత్తు షాక్‌కు గురై రెండు కాళ్లు కోల్పోవాల్సి వచ్చింది.

గతంలో విద్యుత్తు ప్రమాదాలు బయట ప్రదేశాల్లో జరిగేవి. ఇటీవల కాలంలో ఇళ్ల వద్దే ఎక్కువగా జరుగుతున్నాయి. నిర్మాణ రంగంలో పనులు చేసేటప్పుడు ఇనుప ఊచలు పైకి ఎత్తే క్రమంలో, ఇంటి పిట్టగోడకు ఆనుకుని వెళుతున్నప్పుడు, మేడపై దుస్తులు ఆరవేసేటప్పుడు ఎక్కువగా జరుగుతున్నాయి. 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి వరకు జిల్లాలో విద్యుత్తు ప్రమాదాల్లో 58 మంది ప్రాణాలు కోల్పోయారు. – న్యూస్‌టుడే, బాలాజీచెరువు

కాకినాడ అంబేడ్కర్‌నగర్‌లో ఇళ్లకు అతి సమీపంలో విద్యుత్తు తీగలు

ఈ జాగ్రత్తలు పాటించాలి..

● భవనాలకు ప్లాస్టరింగ్, రంగులు వేసేటప్పుడు తీగలను పరిశీలించుకోవాలి. ● ఆక్వా రంగంలో చెరువుల వద్ద ఏరియేటర్లకు గట్ల మీద నుంచి కనెక్షన్ లాగుతున్నారు. గట్లపై గడ్డి కోసేటప్పుడు, నడిచేప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ● పామాయిల్ తోటల్లో గెలలు కోసేటప్పుడు మరింత అప్రమత్తత అవసరం. ● వ్యవసాయ పంపుసెట్లు ఆన్, ఆఫ్ చేసేటప్పుడు వైర్లను గమనిస్తూ ఉండాలి. ● పంటను నాశనం చేస్తున్నాయని జంతువుల కోసం ఫెన్సింగ్‌కు తీగలు అమర్చుతున్నారు. ఇక్కడ పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి. ● 2024-25లో విద్యుత్తు ప్రమాదాల్లో 28 మరణాలు సంభవించాయి. వీటిలో 19 మరణాలకు సంబంధించి రూ.64 లక్షల పరిహారం చెల్లించారు. ఇంకా 9 కేసుల్లో రూ.36 లక్షలు చెల్లించాలి. ● 2025-26లో జనవరి నాటికి 30 మరణాలు సంభవించగా, వీటికి రూ.1.07 కోట్లు పరిహారం రావాలి. ఇప్పటికీ విడుదల చేయలేదు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

విద్యుత్తు విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. భవన నిర్మాణాలు చేసేటప్పుడు రహదారికి, ఇంటికి మధ్య 7 మీటర్లు సెట్ బ్యాక్ ఉండాలి. ఈ నిబంధనను ఉల్లంఘించడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎక్కడైనా తీగలు ఇంటికి సమీపంగా ఉన్నా, తెగిపడినా, స్తంభాలు పడిపోయే పరిస్థితిలో ఉన్నా టోల్‌ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందించాలి.

– జి.ప్రసాద్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, కాకినాడ సర్కిల్

రీసర్వే గ్రామాల్లో.. ఉప తహసీల్దార్లు, సర్వేయర్ల డిప్యుటేషన్ల రద్దు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో భూముల రీసర్వే జరుగుతున్న ప్రాంతాల్లో ఉప తహసీల్దార్లు, సర్వేయర్ల డిప్యుటేషన్లు రద్దు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మిలు జిల్లా కలెక్టర్లు, జేసీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రీసర్వే, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లు, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీపై సమీక్షించారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వభరత్, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11 మండలాల పరిధిలో 24 గ్రామాల్లో నాలుగో విడత భూముల రీసర్వే జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లోనే సర్వేయర్లు ఉండాలని ఆదేశించారు. వెంటనే ప్రక్రియ పూర్తి చేసి రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను తప్పుల్లేకుండా ఉండేలా చూడాలని చెప్పారు. పీజీఆర్ఎస్ విషయంలో ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల సంతృప్తిస్థాయిని పెంచేలా కృషి చేయాలని సూచించారు. ఉప కలెక్టర్ రత్నమణి, సర్వేశాఖ ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

WANTED
Very Attractive Salary
Well Established Exporting Company required below mentioned posts.
ACCOUNTANTS - 2 No's, Good Accounting Knowledge With Experience in Tally and Basic Knowledge in GST & TDS
Interested Candidates can Attend
Interview On : 28-02-2026 Saturday 10.00 am to 5.00 pm
Venue: BEBO INTERNATIONAL
Yanam Road, Chollangi, Kakinada, KKD Dt.533 461
Send your resume: beboriceprocessingunit@yahoo.com, PH : 81253 91984

అమలాపురం రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సా)	సహరి (ఉ)
బుధవారం	గురువారం
6.17	5.03

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

ఆర్ఎంసీలో కొత్తగా నియోనాటాలజీ విభాగం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో కొత్తగా నియోనాటాలజీ విభాగం ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విభాగం ఏర్పాటుతో ఆర్ఎంసీ కళాశాలకు ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు అందుబాటులోకి వస్తాయి. పుట్టిన శిశువులకు మెరుగైన వైద్యం త్వరితగతిన అందించేందుకు వీలు కలుగుతుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ విభాగం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కళాశాలకు నియోనాటాలజీ విభాగం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ హర్షం వ్యక్తం చేశారు.

అంతులేని వేదన

- ఆసుపత్రుల్లో 15 మంది కల్తీ పాల బాధితులు
- కేసులు పెరగడంపై ఆందోళన
- చిన్నారి మృతితో స్వరూప్ నగర్‌లో విషాదం

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, టి.నగర్, కంబాలచెరువు, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలో కల్తీ పాల కల్లోలం కొనసాగుతోంది. బాధితులు, మృతుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆందోళన నెలకొంది. సోమవారానికి 12 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, మంగళవారానికి ఆ సంఖ్య 15కు చేరింది. విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బి.మనోహర్ (6) అనే బాలుడు మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మరో 8 మంది పరిస్థితి విషమంగానే ఉందని వైద్యాధికారులు తెలపడంతో వారి కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరితో కలిసి ఎంపీ పురందేశ్వరి పరామర్శించారు.

రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎంపీ పురందేశ్వరి

అందరికీ అత్యవసర విభాగంలోనే..

ఆసుపత్రుల్లో 15 మంది చికిత్స పొందుతుండగా కడలి కృష్ణారావు (64), రితిక్ (2), సూర్యకుమారి (62)లను వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ చేస్తున్నారు. రుహన్య (అయిదు నెలలు), ఆర్.రామలక్ష్మి (75) వెంటిలేటర్‌పై ఉండగా, పి.నాగేశ్వరరావు (70), జి.వెంకటేశ్వరరావు (67), జి.వెంకటలక్ష్మి (69)లకు డయాలసిస్ చేస్తున్నారు. రెడ్డి అనంతలక్ష్మి (65), ఎన్.నూకరాజు (62), బి.అనంతలక్ష్మి (72), జైక్రిత్‌రాజ్ (2.9), జి.సూర్యారావు (79), బండారు వీరలక్ష్మి (60), కె.సత్యనారాయణ (82) ఐసీయూలో ఉన్నారు.

అందుబాటులో హెల్ప్‌లైన్ నంబరు..

పాల వ్యాపారి నుంచి కొనుగోలు చేసిన పాలు, ఇతర పదార్థాలు ఇళ్లలో ఏమున్నా తినొద్దని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. వాంతులు, మూత్ర విసర్జన సంబంధిత సమస్యలు, అనుమానిత లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్నట్లయితే 94940 60060 హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించాలన్నారు.

110 కుటుంబాల రక్తనమూనాల విశ్లేషణ..

కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన పాల వ్యాపారి గణేశ్వరరావు పాలు పోసిన 110 ఇళ్లను అధికారులు మ్యాపింగ్ చేసి ఆయా కుటుంబాల్లో 315 మంది రక్తనమూనాలు సేకరించారు. ఇద్దరికి సీరం క్రియేటిన్ స్థాయి మోతాదుకు మించి ఉన్నట్లు గుర్తించారు. వారిలో ఒకరిని ఆసుపత్రిలో చేర్చగా మరొకరిని చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుటుంబాలన్నింటికీ మరో దఫా రక్తపరీక్షలు చేయాలని, కొన్ని రోజులు ఈ ప్రక్రియ కొనసాగించాలని కలెక్టర్ కీర్తి చేకూరి వైద్యాధికారులను ఆదేశించారు. లాలాచెరువు పరిసర ప్రాంతాల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్క్రీనింగ్ చేశాయి. అక్కడ వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. మంగళవారం రాష్ట్ర మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ అధికారులు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో పర్యటించారు. గత నెలలో పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చిన సమస్యలను వారు పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ పనులు పట్టాలెక్కించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీకి డంపింగ్‌యార్డు సమస్య, భవన నిర్మాణం, చెరువుకు ఆనుకుని కాంప్లెక్స్ నిర్మాణం సాధ్యాసాధ్యాలపై చర్చించారు. పిఠాపురం పురపాలికలో బుధవారం మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డా.సంపత్ సమీక్షించనున్నారు.

స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలపై నిరంతరం నిఘా కొనసాగించాలని డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం(పీసీపీఎన్‌డీటీ)పై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కేంద్రాల్లో డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. చట్ట విరుద్ధంగా ఎక్కడైనా స్కానింగ్‌లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో గుర్తింపు పొందిన 161 స్కానింగ్‌కేంద్రాల్లో 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి వరకు నిర్వహించిన తనిఖీలపై సమీక్షించారు. వీటి ఏర్పాటు, పాత వాటిలో యంత్రాలు, ఉద్యోగుల మార్పుకు వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. డీఎస్పీ కేవీ సత్యనారాయణ, వైద్యాధికారులు చలమయ్య, సుబ్బరాజు, కోమల, మహేశ్వరరావు, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఐకాస జిల్లా ఛైర్మన్‌గా రామ్మోహనరావు

రామ్మోహనరావు, నగేశ్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ ఐకాస జిల్లా ఛైర్మన్‌గా ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఏపీఎన్‌జీజీఓ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్మన్‌గా రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా కేవీవీ నగేశ్(యూటీఎఫ్)తో పాటు 16 మంది కార్యవర్గ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారం రోజుల్లో తాలూకా యూనిట్ల ఏపీ ఐకాస కార్యవర్గాలను ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఉద్యోగుల సమస్యలపై దశల వారీ పోరాటాలు చేయాలని నిర్ణయించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – దేవాదాయ ధర్మాదాయ శాఖ

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

1.	Rehabilitation and Restoration of three (3) Storied Raja Gopuram and Other Improvements to temple	Tender Notice No. S/COE/238/2024	Rs.150.00 Lakhs

సం/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఫోన్: 99669 77771, 99124 44467

Canara Bank కెనరా బ్యాంక్ | ఏఆర్ఎం బ్రాంచ్ (13591), విశాఖపట్నం, ఫోన్: 8332956773

హైపోథికేషన్ క్రింద స్వాధీనత ప్రకటన (చరాస్తి కొరకు)

కెనరా బ్యాంక్, ARM విశాఖపట్నం బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు హైపోథికేషన్ ఒప్పందం ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత: M/s లక్ష్మి వెంకటేశ్వర క్యాష్యూ ఇండస్ట్రీస్, ... రూ.6,66,34,148.52 ... తేది 17.01.2026 ... ఈ నోటీసు అందిన తేది నుండి 15 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరడమైనది.

ఋణగ్రహీతలు బకాయి చెల్లించడంలో విఫలమైనందున, ... తేది 25.08.2020 ... తేది.21.02.2026 ... రూ.6,24,48,551.52/- ...

హైపోథికేటెడ్ వాహనం/P&M/స్టాక్ యొక్క వివరములు: P&M/Stock యొక్క వివరములు:

Sl No.	Name of Item	Unit	Amount at the time Sanction/ Last Stock Statement
1.	Cashew Peeling Machine & Air Compressor Air Dryer filters with PLC	1	8,94,600/-
2	Raw Cashew Calibrator	1	54,000/-
3	Manual Cashew De-shelling machines along with table	1	36,000/-
4	Wooden steam boiler for steam generation	1	1,63,800/-
5	Air Dryer and Air Filters	1	30,600/-
6	Cashew peeling machine	1	6,21,000/-
7	Air Compressor with accessories	1	1,51,200/-
8	Steam Cookers	1	21,600/-
9	Cashew Dryer	1	1,77,840/-
10	Troleys in Dryer 12 Nos.	1	2,10,600/-
11	Humidification set up in room	1	13,860/-
12	Automatic Cashew shelling line new version cutting machine with 4 shelling and accessories	1	3,46,743/-
13	Bench Grinder	1	5,400/-
14	Material moving trolleys	1	25,200/-
15	Grading Tables	1	23,400/-
16	Essage Weighing scale 150 kg capacity digital	1	4,500/-
17	Weighing scale 60 kg capacity digital	1	3,600/-
18	Material Moving Buckets	1	7,200/-
19	Blue crates 100 Nos	1	26,460/-
20	Crates 100 Nos	1	28,800/-
21	Electrical Transformer and Accessories	1	23,400/-
22	Electrical Panel board with switch gear & accessories	1	54,000/-
23	3 HP Feed pump with motors	1	21,780/-
24	Piping & steam insulation materials	1	43,200/-
25	4 tins filling machine	1	54,000/-
26	Metal detection machine	1	43,200/-
27	Sieving machine	1	35,100/-
28	Vaccume packing machine	1	18,000/-
29	Vertical Vaccume machine	1	18,000/-
30	Sprectum Hank Eye	1	90,000/-
31	Tube lights fans and exhaust fans	1	49,140/-
32	Sharp high resolution cameras & accessories	1	38,304/-
33	Air Coolers 2 nos.	1	18,000/-
34	Scrap Iron Lot (Appx.500 kg.)	1	14,400/-
	TOTAL		33,66,927/-

Remark if any : As per Valuation report dt 06.08.2025.

తేది : 21.02.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం కెనరా బ్యాంక్

కల్తీ పాపాలు.. తీస్తున్నాయ్ ప్రాణాలు!

● యూరియా, డిటర్జెంట్, నూనెలతో తయారయ్యే సింథటిక్ పాలతో ప్రమాదం

ఈనాడు, కాకినాడ

కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లు ఉదయం నుంచి తినే ఆహారం వరకు అన్నీ కలుషితం చేస్తున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా సంపాదన కోసం ప్రజారోగ్యాన్ని బలిపెడుతున్నారు. మితిమీరిన రసాయనాలు, రంగులు కలిపి అన్నపానీయాలను విషతుల్యం చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో అదుపు ప్రాణాలు కోల్పోగా మరికొందరు చికిత్స పొందుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలోనూ కల్తీ పాలు కలకలం సృష్టించాయి. పాల నమూనాలపై ఆహార భద్రత ప్రమాణాలశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. నీళ్ల కలి... దమవుతున్నారు. పాల కల్తీలను ముందే గుర్తించవచ్చని చెబుతున్నారు.

పాలలో వీటి ఆధారంగా నాణ్యత పరీక్షిస్తారు (శాతం)

	ఫ్యాట్	ఎస్ఎన్ఎఫ్
ఆవు పాలు	3-5	8-8.5
గేదె పాలు	8-9	8.5-9

ఫిర్యాదు చేయండి..

ఆహార కల్తీలతోపాటు పాలు, నిత్యావసరాల్లో కల్తీ జరిగినట్లు అనుమానం వస్తే ఆహార భద్రత తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేయండి. నమూనాలు తీసుకుని కల్తీ పరీక్షలు చేయించుకోవచ్చు. 7702999946 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు. గతంలో కొన్ని కల్తీ పాలకేసులపై జేసీ కోర్టులో అపరాధ రుసుము విధించిన ఘటనలు ఉన్నాయి. **- నందాజీ, సహాయ నియంత్రణ అధికారి, ఆహార భద్రతా ప్రమాణాల శాఖ**

ఫార్మాలిన్ వాడి..

అసలు ఆవులు, గేదెల నుంచి ఎక్కువ పాలు సేకరించలేని చోట ఉండదు. నీళ్లు, డిటర్జెంట్, వెజిటబుల్ ఆయిల్, యూరియా, ఇతర రసాయనాలన్నీ కలిపి సింథటిక్ పాలు తయారుచేస్తారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండడానికి ఫార్మాలిన్ వాడుతారు. ఈ పాలను వినియోగిస్తే కొద్ది రోజుల్లోనే మంచాన పడడం ఖాయమని కాకినాడకు చెందిన పశుసంవర్ధకశాఖ ఏడీ డా. వరప్రసాద్ చెబుతున్నారు.

నీళ్లు కలిపి..

● పాల పరిమాణం పెంచడానికి ఎక్కువగా నీళ్లు కలుపుతుంటారు. వీధుల్లో, పాల కేంద్రాల వద్ద లీటర్, అర లీటర్ పొట్లాలు అమ్మేవారు ఇటువంటి చర్యలకు పాల్పడతారు. కలిపిన నీళ్లు మంచివి కాకుంటే ఆ పాలు తాగేవారికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

గుర్తించవచ్చిలా..

● ఈ కల్తీని గుర్తించాలంటే నున్నటి గచ్చు, టైల్స్ మీద రెండు చుక్కల పాలు వేస్తే వెంటనే చెదిరిపోతే నీళ్లు కలిసినట్లే. అదే స్వచ్ఛమైన పాలు నెమ్మదిగా జారుతాయి. అక్కడ తెల్లటి మచ్చ కూడా ఏర్పడుతుంది.

పిండి పదార్థం..

● నీళ్లు కలిపిన పాలు పలచగా ఉంటాయి. చిక్కదనం కోసం స్టార్చ్ అనే పిండి పదార్థాన్ని పాలల్లో కలిపేస్తారు. చేతి వేలను పాలల్లో ముంచితే చిక్కగా అనిపిస్తుంది. నాణ్యమైన పాలు అనుకుంటారు.

● చిన్న పాల నమూనాలో అయోడిన్ చుక్క వేస్తే నీలం రంగులోకి మారింది అంటే పిండి కలిపినట్లే లెక్క.

యూరియా..

● పాలలో ప్రొటీన్ ఎక్కువగా ఉందని చూపడానికి యూరియా కలిపేస్తుంటారు. దీనివల్ల పాలల్లో ఎస్ఎన్ఎఫ్ రేటు ఎక్కువగా చూపి మంచి రేటు పలుకుతుంది. ఈ పాలను వినియోగిస్తే దీర్ఘకాలంలో కిడ్నీ సమస్యల బారిన పడతారు.

● పాల నమూనాలో లిట్మస్ పేపర్ ముంచినప్పుడు నీలంగా మారితే యూరియా కలిపారని అర్థం.

పట్టణాల్లో పౌర సౌకర్యాలను మెరుగుపర్చాలి: కలెక్టర్

సూచనలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో పౌర సౌకర్యాలను మెరుగుపర్చాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, తుని, ఏలేశ్వరం, గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్య విభాగం అధికారులతో ఐవీఆర్ఎస్ సర్వేపై సమీక్షించారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, అన్న క్యాంటీన్లు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ మరింత పటిష్ఠంగా చేపట్టాలన్నారు. ప్రజారోగ్యంపై పరిసరాల పరిశుభ్రత అధిక ప్రభావం చూపే అవకాశం ఉందని, విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాడైన వీధి దీపాల స్థానంలో కొత్తవి అమర్చాలని ఆదేశించారు.

భారత్-బల్గేరియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూపు సభ్యునిగా సానా

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: భారత్- బల్గేరియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యునిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నియమితులయ్యారు. ఈ నియామకాన్ని లోక్‌సభ స్పీకర్ ఖరారు చేసినట్లు ఎంపీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇరు దేశాల మధ్య పార్లమెంట్ సంబంధాల బలోపేతం, ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడం ఈ గ్రూపు ప్రధాన ఉద్దేశమన్నారు.

మాతా శిశు మరణాలను అరికట్టాలి

సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్, వైద్యాధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మాతా,శిశు మరణాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం గత ఏడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో సంభవించిన మాతా, శిశు మరణాలపై సమీక్షించారు. తేటగుంట, చేబ్రోలు, గాడిమొగ, జె.అన్నవరం పీహెచ్‌సీలు, కాకినాడలోని సీతారామనగర్, తునిలోని వీరవరపుపేట యూపీహెచ్‌సీల్లో ఏడు మాతృమరణాలకు గల కారణాలను విశ్లేషించారు. కరప, కాత్రావులపల్లి పీహెచ్‌సీలు, కాకినాడలోని గాంధీనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో మూడు శిశు మరణాలు సంభవించగా, వీటిపై సమీక్షించారు. మాతా, శిశు మరణాల్లో సిబ్బంది నిర్లక్ష్యం గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారులు కోమల, మహేశ్వరరావు, చలమయ్య, సుబ్బరాజు, రాధాకృష్ణ, డిప్యూటీ డెమో సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటిపిల్లిని కాపాడుకోవాలి

మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వరప్రసాద్

తాళ్లరేవు, న్యూస్‌టుడే: వన్యప్రాణుల్లో ఒకటైన నీటి పిల్లిని కాపాడుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.వి. వరప్రసాద్ అన్నారు. కోరింగ జీవవైవిధ్య కేంద్రంలో ప్రపంచ నీటిపిల్లి దినోత్సవం ముగింపు కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నీటి పిల్లి సంరక్షణపై జరిగిన అవగాహన సదస్సులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోరింగ అభయారణ్యంలో నీటి పిల్లుల సంతతి ఎక్కువగానే ఉందన్నారు. ఇది చేపలను ఆహారంగా తీసుకుంటుందన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ, ఎఫ్‌బీవోలు జి.గోపీనాగేంద్రకుమార్, కె.ధనంజయరావు పాల్గొన్నారు.

రైతేరాజు

పసుపు నాణ్యతలో జాగ్రత్తలిలా..

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పసుపు పంటను సాగుచేసే రైతులు కొన్ని మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు పొందొచ్చని ఆత్రేయపురం ఉద్యానాధికారి కోటేశ్వరరావు సూచించారు. పొలంలో తవ్వి తెచ్చిన పచ్చి కొమ్ములను త్వరగా ఉడికించి ఆరబెట్టాలి. ఆలస్యమైతే నాణ్యత తగ్గుతుంది. దుంపలు, కొమ్ములను వేర్వేరుగా ఉడికించాలి. ఉడకబెట్టే సమయంలో అవి మునిగే వరకు నీరు పోయాలి. సమంగా మంట పెట్టాలి. 45-60 నిమిషాలకు తెల్ల నురగ పొంగుతో మంచి సువాసన, పొగలు వస్తాయి. అప్పుడు చేతితో ఒత్తితే మెత్తగా ఉంటాయి. ఆ దశలో బయటకు తీసేయాలి.

ఆత్రేయపురంలో ఉడక బెట్టేందుకు సిద్ధం చేసిన పచ్చికొమ్ములు

ఎక్కువసేపు ఉడికిస్తే ఆరబెట్టిన తర్వాత రంగు తగ్గిపోతుంది.

ఉడికించడం ఇలా..

తల్లి, పిల్ల దుంపలను జల్లెడ రంధ్రాలున్న ఇనుప తొట్టెలో వేయాలి. ఇరుపక్కలా పట్టుకొని దీని కంటే కొంచెం పెద్ద పరిమాణం ఉన్న ఇనుప కళాయిలో దించాలి. దుంపలు మునిగే వరకు నీరు పోయాలి. మెత్తబడే వరకు ఉడికించాలి. తర్వాత దుంపలున్న తొట్టిని పైకితీసి పట్టుకుంటే ద్రావణం కళాయిలోకి దిగిపోతుంది. ఉడికిన పసుపు కొమ్ములను పరిశుభ్రమైన నేలపై పోయాలి.

ఆరబెట్టండి ఇలా..

సమంగా ఉడికిన కొమ్ములను పరిశుభ్రమైన సమాంతరంగా ఉన్న నేలపైన లేదా టార్పాలిన్ లేదా సిమెంటు ప్లాట్‌ఫారం పైన పోయాలి. 24 గంటల తర్వాత రెండు, మూడు అంగుళాల మందం ఉండేలా పరచాలి. పలుచగా పరిస్తే ఎండిన పసుపు రంగు చెడిపోతుంది. 10-15 రోజులకు పసుపు తయారై కొమ్ములన్నీ ఒకే మాదిరిగా కనిపిస్తాయి. అప్పుడప్పుడు తిరగబెట్టి ఆరిన తర్వాత ఒబ్బిడి చేసుకోవాలి.

తోటలలో... అట్టలతో మేలు

ఆలమూరు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పసుపు రంగు అట్టలను వాడి పంటలను ఆశించే రసంపీల్చే పురుగులను అదుపులో ఉంచవచ్చని ఆలమూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డా.సి.హెచ్.కె.వి.చౌదరి తెలియజేశారు. ముఖ్యంగా వంగ, మిరప, టమాటా వంటి కూరగాయలు, పొద్దుతిరుగుడు తదితర వాణిజ్య పంటలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. మొక్కల కన్నా ఎత్తులో వీటిని ఏర్పాటు చేయాలి. తెల్ల, పచ్చదోమ, తామర పురుగుల ఉద్ధృతిని అరికట్టడానికి బాగా పనిచేస్తాయి. వీటికి జిగురు లేదా గ్రీజు పూస్తే తెల్లదోమ, పచ్చదోమ, ఎర్రనల్లి, తామర పురుగులు అంటుకుని చనిపోతాయి. ముడత తెగులు సైతం తగ్గుతుంది. ఎకరాకు సుమారు 25 నుంచి 30 వరకు పసుపు రంగు అట్టలు అమర్చుకోవాలి.


చొప్పెల్లలో వంగతోటలో పసుపు అట్టలు

పశుసంపద వృద్ధికి మెలకువలు

పాడి పశువులు

కరప, న్యూస్‌టుడే: పాడి పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై కరప ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్ బాబు వివరించారు. ✦ సాధారణంగా గేదెలు చలి ఎక్కువగా ఉండే శీతాకాలంలో ఎదకు వస్తాయి. ఫిబ్రవరిలోనే ఈ కాలం ముగుస్తుంది. ఈ నెలలో గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయించకపోతే మళ్లీ జులై, ఆగస్టు వరకు సరిగా ఎదకు రావు. ఎద లక్షణాలను గమనించి వెంటనే గర్భధారణ చేయించాలి. పశువులు పాలు ఇస్తుండగానే చూడు కట్టినట్లయితే పాడి లాభదాయకంగా ఉంటుంది. ✦ నవంబరు లేదా అంతకంటే ముందుగా కృత్రిమ గర్భధారణ చేయించిన పశువులకు ఫిబ్రవరిలో చూడి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. ఒకవేళ చూడి కట్టకపోతే మందులు వాడాలి. లేదంటే 6 నెలల కాలం వృథా అవుతుంది. ✦ వేసవిలో పశుగ్రాసం కొరత నివారించుకోవడానికి ఇప్పటినుంచి సన్నద్ధంగా ఉండాలి. నీటివసతి ఉన్న భూముల్లో గ్రాసం పెంచుకోవడానికి ఏర్పాటు చేసుకోవాలి. అవకాశం లేనివారు యూరియాతో ఊరవేసిన వరిగడ్డిని తయారు చేసుకోవడం మంచిది.

తెలుసుకుందాం..

✦ 90 శాతం పెయ్యి దూడలు పుట్టడానికి అవకాశం ఉన్న మేలుజాతి వీర్యాన్ని రాయితీపై కేవలం రూ.150కే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పాడి రైతులు వినియోగించుకోవాలి. తద్వారా పశుసంపదను త్వరితగతిన వృద్ధి చేసుకోవచ్చు.

వనామి సాగుకు సన్నద్ధమవుదాం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఆక్వా సీజన్ ప్రారంభమైంది. రొయ్యల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరంభం నుంచి ప్రణాళికాబద్ధంగా సాగాలని ఉప్పలగుప్తం మత్స్యశాఖ అధికారి బి.హేమానంద్ సూచిస్తున్నారు.

రొయ్యల సాగుకు సిద్ధం చేసిన చెరువు

● ముందుగా చెరువును నెర్రలు తీసేలా ఎండగట్టి ట్రాక్టరుతో దున్ని పైపొరను తొలగించి శుభ్రం చేయాలి. ఊలలు పడకుండా గట్లను పటిష్ఠం చేసుకోవాలి. అవసరం మేరకు చెరువులో సున్నం చల్లాలి. దీంతో వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులు, అవశేషాలు నశిస్తాయి.

● గత ఏడాది పంటలో ఈహెచ్‌పీ వ్యాధి సోకినట్లయితే మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. ఎకరా చెరువుకు మూడు టన్నుల రాతిసున్నం చల్లి నేల పీహెచ్‌ను 12 వరకు పెంచాలి. రెండు అడుగుల మేర నీటిని నింపి రెండు రోజులు ఉంచి తిరిగి బయటకు తోడేయాలి. దీంతో సంబంధిత వ్యాధి కారకాలు చాలావరకు నశిస్తాయి. తిరిగి తగిన మోతాదులో పొటాషియం పర్మాంగనేట్(పీపీ) వంటి ద్రావణాన్ని చల్లి పీహెచ్‌ను 7.5కు తగ్గించడానికి చర్యలు చేపట్టాలి.

● పాములు, తాబేళ్లు, పీతలు, కప్పలు, పక్షులు సమీప వ్యాధిగ్రస్త చెరువుల నుంచి రాకుండా బయో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి.

● చెరువులో ఐదు అడుగుల మేర నీరు నింపి ఉప్పదనానికి అనుకూలమైన రొయ్య పిల్లలను సీఏఏ అనుమతి పొందిన హేచరీల నుంచి సేకరించాలి. ప్రయోగశాలల్లో ప్రాముఖ్యమైన ఈహెచ్‌పీ, డబ్ల్యూఎస్ఎస్‌వీ, విబ్రియో వంటి పరీక్షలు నిర్వహించి ఈ వ్యాధులు లేని సీడు ఎంచుకుని తగిన సాంద్రతతో సాగు చేపట్టాలి.

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI | భానుగుడి జంక్షన్ బ్రాంచ్, డి.నెం. 2-1-11, భానుగుడి జంక్షన్, కాకినాడ-533003, ఫోన్: 0884-2342650/2375943, 89730 93066

సెక్యూరిటైజేషన్ చట్టం నెం.54/2002 ప్రకారం ఇ-వేలం ద్వారా అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన బ్యాంక్ ఆఫ్ ఇండియా, భానుగుడి జంక్షన్ బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): 1) శ్రీ యెనుగంటి జగన్నాథం, తండ్రి: లక్ష్మణుడు మరియు 2) శ్రీమతి యెనుగంటి సత్య నాగ భవాని, భర్త: యెనుగంటి జగన్నాథం వారు చెల్లించవలసిన బకాయి రూ.19,76,307/- + తేది.30.11.2024 నుండి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 13.03.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏముస్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారులకు తెలియజేయడమైనది. డిమాండ్ నోటీసు తర్వాత చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడతాయి.

సదరు వేలం అమ్మకం ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ యొక్క సర్వీస్ ప్రొవైడర్: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ-వేలం పోర్టల్: https://baanknet.com వెబ్‌సైట్ ద్వారా క్రింది పేర్కొన్న తేది, సమయంలో జరుగునని ఇందుమూలంగా ప్రకటన. ఆసక్తిగల బిడ్డర్లు ఇ-మెయిల్ చిరునామా, పాన్ కార్డు మరియు ఇ-వ్యాలెట్ కలిగియుండవలెను. ఆన్‌లైన్ శిక్షణ, ఇ-వ్యాలెట్ ద్వారా ఇఎమ్‌డి సొమ్ము డిపాజిట్ చేసేందుకు మరియు ఇ-వేలంలో పాల్గొనేందుకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించగలరు: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com. ఇ.ఎం.డి. సొమ్మును చెల్లించి, బిడ్స్ కాపీలు, పాన్‌కార్డ్ కాపీ, యుటిఆర్ నెం. తెలియజేస్తూ దిగువ తెలిపిన అధీకృత అధికారికి పంపవలెను.

ఇ-వేలం తేది & సమయం: 13.03.2026, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 5.00 గం॥ వరకు
(అమ్మకం ముగిసే వరకు బిడ్డింగ్ కొనసాగితే 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ధరావత్తును RTGS/NEFT ద్వారా చలాన్‌లోని ఖాతా వివరములుకు పొందుపరిచి జమచేయాలి

స్థిరాస్తి వివరములు
(సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3081/2018 తేది. 31-03-2018):

షెడ్యూల్-ఎ: ఐటమ్ నెం.1: కాకినాడ ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం.8298/2016 తేది.12-08-2016: ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లా (మునుపు తూర్పుగోదావరి జిల్లా), కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, మధురానగర్, యస్.అచ్యుతాపురం గ్రామ పంచాయితీ, సూర్యారావుపేట, ఎస్.నెం. 156/3, 5 (పాత ఎస్.నెం. 144) లోని మొత్తం ఎ. 1.79 సెంట్ల భూమిని ఎల్ పి నెం. 82/96 ద్వారా ప్లాన్ ప్రకారం ఇంటి స్థలాలుగా విభజించబడిన "సాయి ధరణి" అనే పేరు గల లేఅవుట్‌లో ప్లాట్ నెం.401 లోని 531.66 చ॥గ॥ స్థలం. హద్దులు: తూర్పు: 82' 0" లేదా 24.99 మీ. – 60 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: 77' 6" లేదా 23.65 మీ. – ప్లాట్ నెం. 420 భూమి (ఇక్కడ 2వ ఐటమ్ మరియు 3వ ఐటమ్ స్థలం), ఉత్తరం: 60' 0" లేదా 18.29 మీ. – 40 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం: 60' 0" లేదా 18.29 మీ. – ప్లాట్ నెం.402 భూమి. ఈ హద్దులలో మరియు కొలతలతో 531.66 చ॥గ॥ లేదా 444.52 చ॥మీ॥ స్థలంతో ఉమ్మడి దారులు, నీటి దారులు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు.

ఐటమ్ నెం.2: కాకినాడ ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం.8376/2016 తేది.16-08-2016: ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లా (మునుపు తూర్పుగోదావరి జిల్లా), కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, మధురానగర్, యస్.అచ్యుతాపురం గ్రామ పంచాయితీ, సూర్యారావుపేట గ్రామం, ఎస్.నెం. 156/3, 5 (పాత ఎస్.నెం. 144) లోని మొత్తం ఎ. 1.79 సెంట్ల భూమిని ఎల్ పి నెం. 82/96 ద్వారా ప్లాన్ ప్రకారం ఇంటి స్థలాలుగా విభజించబడిన "సాయి ధరణి" అనే పేరు గల లేఅవుట్‌లో ప్లాట్ నెం. 420 లోని 504 చ॥గ॥ విస్తీర్ణంలో తూర్పు వైపు 204.66 చ॥గ॥ స్థలం. హద్దులు: తూర్పు: 77' 6" లేదా 23.68 మీ. – ప్లాట్ నెం. 401లో స్థలం, పడమర: 76' 0" లేదా 23.16 మీ. – ఈ ప్లాట్ 299.32 చ॥గ॥ విస్తీర్ణంలో స్థలం (ఇక్కడ 3వ ఐటమ్), ఉత్తరం: 24' 0" లేదా 7.31 మీ. – 40 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం: 24' 0" లేదా 7.31 మీ. – ప్లాట్ నెం.419లో స్థలం. ఈ హద్దులలో మరియు కొలతలతో 204.66 చ॥గ॥ లేదా 171.11 చ॥మీ॥ స్థలంతో ఉమ్మడి దారులు, నీటి దారులు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు.

ఐటమ్ నెం.3: కాకినాడ ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం.8656/2016 తేది: 24-08-2016: ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లా (మునుపు తూర్పుగోదావరి జిల్లా), కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, మధురానగర్, యస్.అచ్యుతాపురం గ్రామ పంచాయితీ, సూర్యారావుపేట గ్రామం, ఎస్.నెం. 156/3, 5 (పాత ఎస్.నెం. 144) లోని మొత్తం ఎ. 1.79 సెంట్ల భూమిని ఎల్ పి నెం. 82/96 ద్వారా ప్లాన్ ప్రకారం ఇంటి స్థలాలుగా విభజించబడిన "సాయి ధరణి" అనే పేరు గల లేఅవుట్‌లో ప్లాట్ నెం. 420 లోని 504 చ॥గ॥ విస్తీర్ణంలో పడమర వైపు 299.32 చ॥గ॥ స్థలం. హద్దులు: తూర్పు: 76' 0" లేదా 23.16 మీ. – 204.66 చ॥గ॥ విస్తీర్ణం స్థలంలో ప్లాట్ నెం. 420 (ఇక్కడ 2వ ఐటమ్), పడమర: 73' 8" లేదా 22.42 మీ. – 33 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: 36' 0" లేదా 10.97 మీ. – 40 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం: 36' 0" లేదా 10.97 మీ. – ప్లాట్ నెం. 419లో స్థలం. ఈ హద్దులలో మరియు కొలతలతో 299.32 చ॥గ॥ లేదా 250.26 చ॥మీ॥ స్థలంతో ఉమ్మడి దారులు, నీటి దారులు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. పైన తెలిపిన హద్దులలో మొత్తం 3 ఐటమ్స్ మొత్తం స్థలం 1035.64 చ॥గ॥లో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు 50 చ॥గ॥ లేదా 41.80 చ॥మీ॥ స్థలం. ఉమ్మడి దారులు, నీటి దారులు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో.

షెడ్యూల్-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ స్థలంలో నిర్మించిన స్టిల్ట్, గ్రౌండ్, మొదటి, రెండవ, మూడవ మరియు నాల్గువ అంతస్తులు గల "తనీషా హోమ్స్" అనే పేరు గల అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులోని 748 చ॥అ॥ ప్లింత్ ఏరియా, ఉమ్మడి ఏరియా మరియు కారు పార్కింగ్ ఏరియా కలుపుకొని మొత్తం ఏరియా 935 చ॥అ॥లోని రెసిడెన్షియల్ డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.S-3. ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం. S-2, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ఉమ్మడి వరండా మరియు మెట్లు, దక్షిణం: శూన్యాకాశం. పైన తెలిపిన హద్దులు, కొలతలతో షెడ్యూలు ఎ లోని అవిభాజ్యపు మరియు అనిర్దేశపు స్థలం మరియు షెడ్యూలు బి లోని ఫ్లాట్, ఉమ్మడి దారులు, నీటి దారులు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులుతో శ్రీ యెనుగంటి జగన్నాథం పేరున గలదు.

రిజర్వు ధర: రూ. 24,53,000/- | ధరావత్తు: రూ. 2,45,300/- | బిడ్ పెంపుదల: రూ. 50,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ https://www.bankofindia.co.in/tenders లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి లేదా బ్యాంక్ ఆఫ్ ఇండియా, భానుగుడి జంక్షన్ బ్రాంచ్, మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ నెం: 89730 93066.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 24.02.2026, ప్రదేశం: కాకినాడ సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

'ఫ్యాక్టరీతో ప్రజలకు సమస్య రాకుండా చూడాలి'

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కంపెనీ కార్యకలాపాల ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు సూచించారు. తాళ్లరేవులోని రెడ్డివారిపాలెం సమీపంలో 2025, అక్టోబరులో గమిని భాస్కర్ ఐస్, కోల్డ్ స్టోరేజ్ ఫ్యాక్టరీ నుంచి అమ్మోనియం గ్యాస్ లీకైంది. గాలి, నీరు, పంట పొలాలు కలుషితంపై రెడ్డివారిపాలెం గ్రామస్థులు అప్పట్లో ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం సకాలంలో స్పందించక పోవడంపై గ్రామస్థులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భశాఖ, మత్స్య, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఐస్ ఫ్యాక్టరీని పరిశీలించారు. కంపెనీని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని అధికారుల బృందం రెవెన్యూ శాఖకు నివేదిక అందించింది. దీంతో ఆరు నెలల పాటు కంపెనీ మూతపడింది. ఈ సమస్యపై తాళ్లరేవు రెవెన్యూ కార్యాలయంలో గ్రామస్థులు, కంపెనీ ప్రతినిధులతో డిప్యూటీ తహసీల్దారు సూరిబాబు మంగళవారం సమావేశం నిర్వహించారు. కంపెనీ నుంచి వచ్చే నీరును డ్రెయిన్ ద్వారా బయటకు తరలించాలని, గాలి, నీరు, పంట పొలాలు దెబ్బ తినకుండా చూడాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కంపెనీ ప్రతినిధులు ఎటువంటి సమస్య రాకుండా చూస్తామని రెవెన్యూ అధికారుల సమక్షంలో హామీ ఇచ్చారు. దీంతో తిరిగి కంపెనీకి నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. కంపెనీ వల్ల ఎటువంటి సమస్య వచ్చినా గ్రామస్థులు ఫిర్యాదు చేయవచ్చునని డిప్యూటీ తహసీల్దారు తెలిపారు.

ట్రాన్స్‌కో ఏఈ ఫోన్ హ్యాక్

తుని, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ లక్ష్మణరావు ఫోన్‌ను సోమవారం అర్ధరాత్రి హ్యాక్ చేశారు. ఆయన వినియోగిస్తున్న ప్రభుత్వం అందించిన సిమ్ నంబరు హ్యాక్ అయ్యింది. వాట్సాప్ ద్వారా గ్రూపుల్లో ఎస్‌బీఐ కేవైసీ అప్‌డేట్ లింకును ఏఈ పంపినట్లు ఏపీకే ఫైల్‌ను నేరగాళ్లు వేశారు. అంతేకాకుండా ఆయన ఉన్న వివిధ వాట్సాప్ గ్రూపుల ఐకాన్లు కూడా ఎస్‌బీఐ యోనో లోగోతో, ఎస్బీఐ గ్రూపులుగా ఏఈ లక్ష్మణరావు మార్చినట్లు సమాచారం వచ్చేలా పన్నాగం పన్నారు. దీన్ని మంగళవారం ఉదయం గమనించిన ఆయన తక్షణం బంధుమిత్రులు, సహోద్యోగులకు జాగ్రత్తగా ఉండాలని సమాచారం ఇచ్చారు. దీనిపై ఎవరూ స్పందించవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. గతంలో తునికి చెందిన ఓ ఉద్యోగి ఇలా ఏపీకె ఫైల్‌ను ఓపెన్ చేయడంతో రూ.60 వేలు పోగొట్టుకున్నారు.

ప్రమాదంతో.. పరీక్ష రాయలేకపోయిన ఇంటర్ విద్యార్థిని

కొత్తపల్లి: ముందు రోజు రాత్రంతా చదువుకుని పరీక్ష రాయడానికి వెళ్తున్న ఆ విద్యార్థి ఆశలను రహదారి ప్రమాదం చిదిమేసింది. వివరాల ప్రకారం.. యు.కొత్తపల్లి మండలం అమినాబాదుకు చెందిన కారే జెస్సీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష రాసేందుకు అన్నయ్య జాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం పిఠాపురంలోని కేంద్రానికి బయలుదేరింది. వాకతిప్ప శివారు సూరప్పచెరువు సమీపంలో ప్రమాదకర మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో జాన్ తీవ్రంగా గాయపడడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జెస్సీకి స్వల్పగాయాలైనప్పటికీ మానసిక ఆందోళనకు గురైంది. దాంతో పరీక్షకు వెళ్లలేక తిరిగి ఇంటికి చేరుకుంది.

ఆటోబోల్తా.. విద్యార్థికి గాయాలు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులతో ఓ లోడు ఆటో కొమరగిరి నుంచి కొత్తపల్లి వెళ్తున్న సమయంలో మార్గం మధ్యలో ఓ ప్రమాదకర మలుపు వద్ద అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఆ సమయంలో ఆటోలో 15 మంది ఉండగా లోవరాజు అనే విద్యార్థి తీవ్రంగా గాయపడడంతో కాకినాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. యు.కొత్తపల్లి మండలంలోనే ఈ మలుపు అత్యంత ప్రమాదకరమైందని ఇదివరకే గుర్తించారు. గతంలో ఇదే మలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకుని ముగ్గురు ప్రాణాలు కోల్పోయినా.. అధికారులు నివారణ చర్యలు చేపట్టలేదని పలువురు విమర్శిస్తున్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	125-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

HOUSE FOR SALE
RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి కోర్లమ్మపేట, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ దగ్గరలో D.No:21-7-1 సౌత్ ఫేసింగ్ 150 చ॥గ॥ ఇల్లు అమ్మకం. Contact Cell:94400 00214

LAND FOR SALE
JAGGAMPETA
రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NH కి చేర్చి 100 అ॥ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్), ✆ 9032988265.

PLOT FOR SALE
RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 చదరపు గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/వాట్సాప్: 80748 57055.

JOBS

Wanted DTP Operator (Male/Female). Part Time Work. Location: Nagamallithota Junction, Kakinada. Contact Cell: 99489 14446.

ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్. RJY, 99633 27756.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-80 పైసలు
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

సజావుగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో జనరల్, వృత్తి విద్య కోర్సులకు సంబంధించి 20,147 మంది విద్యార్థులకుగాను 19,763 మంది హాజరయ్యారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి కేశవరావు, పరీక్షల కమిటీ సభ్యులు ఆయా కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని కేశవరావు తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- బూకి, నవాబ్ కేఫ్, కపుల్ ఫ్రెండ్లీ, మన శంకరవరప్రసాద్ గారు, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- నవాబ్ కేఫ్, బూకి, కపుల్ ఫ్రెండ్లీ, విత్ లవ్, లక్ష్మి- సీతాపయనం, సత్యగౌరి - కపుల్ ఫ్రెండ్లీ, తిరుమల- మన శంకరవరప్రసాద్ గారు, సీఅండ్‌సీ 1- ఫంకీ, సీఅండ్‌సీ 2- నారీనారీ నడుమ మురారి, శ్రీప్రియ - హే బలవంత్, పద్మప్రియ- ఫంకీ, సూర్య1(వాకలపూడి) - ఫంకీ, సూర్య 2.- ఆల్ఫా మెన్ లవ్ వెన్‌జీయన్స్.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ॥ 10 - మ॥ 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

స్పందనకు వందనం

ఆక్రమణల తొలగింపు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ నాలుగో డివిజన్‌లోని శ్రీవిద్యాకాలనీ నగరపాలకసంస్థ ఉద్యానం మెయిన్‌గేటు వద్ద అడ్డుగా బడ్డీ ఏర్పాటుచేశారు. దీంతో పార్కుకు వచ్చే సందర్శకుల ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు సమస్య ఏర్పడింది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. అడ్డుగా ఏర్పాటు చేసిన బడ్డీకొట్టును క్రేన్ సహాయంతో తొలగించారు.

'దేవుడినీ రాజకీయాలకు వాడుకుంటున్న వైకాపా'

కాకినాడ నగరం: వైకాపా నాయకులకు దేవుడంటే భయం, భక్తి లేదని పెరిక కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ వనపర్తి వీరభద్రరావు (బద్రి) పేర్కొన్నారు. దేవుడిని సైతం రాజకీయాలకు వాడుకునే స్థాయికి మాజీ సీఎం జగన్, ఆ పార్టీ నాయకులు దిగజారారని ఆయన ఆరోపించారు. స్థానిక ఎస్.అచ్యుతాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మండలిలో వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను చెప్పులు, బూట్లు దరించి ప్రదర్శించడం దారుణమన్నారు. హిందూ మత విశ్వాసాల పట్ల మాజీ సీఎం జగన్‌కు మొదటి నుంచీ చిన్నచూపేనని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జగన్‌తో సహా ఆ పార్టీ నాయకులు క్షమాపణ కోరాలన్నారు.

మెరుగైన సమాజానికి మేము సైతం..

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలగడానికి, మానవీయ విలువలు పెంపొందించుకునేందుకు జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దోహదపడుతోంది. నగరంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మెరుగైన సమాజానికి తమ వంతు అడుగులు వేస్తున్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు జి.పావనిదేవి, పి.లీనా సహకారంతో బృందాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలతో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలతోపాటు నగర వీధుల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టడం, పలురకాల మొక్కలు నాటడం వంటివి చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పర్యావరణ పరిరక్షణ, బాలికల విద్య, తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఓటు ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు

నాయకత్వ లక్షణాలకు దోహదం

ఎన్ఎస్ఎస్ ద్వారా ర్యాలీలు చేపట్టి పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. కళాశాల ఆవరణతో పాటు నగర వీధుల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతున్నాం. మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, బాలికా చదువు ఆవశ్యకత వంటి పలు అంశాలపై చైతన్యం కలిగిస్తున్నాం. ఇవన్నీ నాయకత్వ లక్షణాల పెంపునకు దోహదం చేస్తాయి.
– ఎం.అఖిల, ద్వితీయ సంవత్సరం

బాధ్యతలు తెలుస్తాయి..

చిన్నప్పటి నుంచి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణుల సహకారంతో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. జీవితంలో చదువు ఒక్కటే ముఖ్యం కాదు. 'సమాజంలో.. నా బాధ్యత ఏమిటి' అని అందరూ తెలుసుకుంటే ఎంతో అభివృద్ధి సాధించవచ్చు. ఎన్ఎస్ఎస్ ద్వారా ఎంతో తెలుసుకున్నాం.
– ఎం.సాదియ, విద్యార్థిని

సేవ చేసేందుకు మంచి అవకాశం

ఎన్ఎస్ఎస్ ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు సమాజంలో ప్రజలకు సేవ చేసేందుకు మంచి అవకాశం దొరుకుతుంది. వీటి ద్వారా సామాజిక సమస్యలపై అవగాహన ఏర్పడుతుంది. వాటి పరిష్కారానికి ఎలా ముందుకెళ్లాలో తెలుసుకున్నాం. కళాశాలతోపాటు ఇతర స్వచ్ఛంద సంస్థలు చేపట్టే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా.
–కె.తేజస్విని, విద్యార్థిని

26 నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు

గాంధీనగర్: భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా పూజలందుకుంటున్న మెహర్‌నగర్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలను ఈ నెల 26వ తేదీ మార్చి 8 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మల్లిపూడి వెంకటేష్, చత్రపతి శివాజీ గణేష్, ప్రెసిడెంట్ ముమ్మిడి నాగేశ్వరరావు తెలియజేశారు. 26న అంకురార్పణ, 27వతేది రాత్రి కల్యాణోత్సవం, మార్చి 4న స్వామివారి పవళింపు సేవ, 8న మహాన్నదానం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ నిత్య హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, సంగీత విభావరులు నిర్వహిస్తామన్నారు.

చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ

గాంధీనగర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో తలసేమియా బాధిత చిన్నారులు రక్తం ఎక్కిస్తుంటారు. ఈ సందర్భంగా మంగళవారం వారికి హోప్ 4 స్పందన ఛాప్టర్ ఎన్ఆర్ఐ సంస్థ చేయూతతో బలవర్థక పౌష్టికాహార కిట్లను అందజేశారు. ముఖ్య అతిథిగా శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రెసిడెంట్ వివిల్ గాంధీ హాజరయ్యారు. రెడ్‌క్రాస్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పాత డివిజన్‌లో కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు శస్త్ర చికిత్సలు, రేబిస్ వ్యాక్సిన్లకు సంబంధించి చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. వీధి కుక్కల వల్ల అనేక సమస్యలున్న మాట వాస్తవమన్నారు. వాటి సంతానోత్పత్తిని నియంత్రించేందుకు శస్త్ర చికిత్సలు, టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు స్థానికులు సహకరించాలని కోరారు. ఎంహెచ్‌వో డా.పృథ్వీచరణ్, డీఈ ప్రవీణ్, టీపీసీ రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేకు సహకరించండి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరంలో జరుగుతున్న కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే)కు ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ కోరారు. నగరంలో 10వ డివిజన్ దుమ్ములపేట సచివాలయంలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికి చేర్చేందుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు.

రహదారి మూసివేత

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ డీప్ వాటర్ పోర్టు నాలుగో గేటు-కుంభాభిషేకం గుడి మధ్య(ఎడీబీ ఎన్‌హెచ్16ఎఫ్) రోడ్డులోని లెవల్ క్రాసింగ్ గేటు మేజర్ మరమ్మతులు, ట్రాక్ రిపేర్ల నిమిత్తం ఈ మార్గాన్ని మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 28వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మూసివేస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఆత్మీయ కలయిక.. ఆనందాల డోలిక

● నారా లోకేశ్‌తో ప్రజాప్రతినిధుల భేటీ

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గాల కూటమి ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో మంగళవారం విందు ఇచ్చారు. గోదావరి జిల్లాకే ప్రత్యేకమైన రుచులు, వంటకాలు, ప్రేమ, ఆతిథ్యం ఇచ్చిన లోకేశ్‌ను ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఈసందర్భంగా లోకేశ్ నేతలపై ఓ బాధ్యత మోపారు. తన తమ్ముడు, అమలాపురం ఎంపీ జీఎం హరీశ్ బాలయోగికి మూడు నెలల్లో పెళ్లి చేయాలని, సంబంధాలు చూడాలని సరదాగా వ్యాఖ్యానించారు.

ప్రేమ పెళ్లిళ్లపై చర్చ.. ప్రేమ పెళ్లిళ్లపై ఆసక్తికరమైన చర్చ సాగింది. ప్రేమించి, ఇరుపక్షాలను ఒప్పించి పెళ్లి చేసుకున్నామని, ప్రేమ విషయంలో మా జీవితాలు వెలుగునిచ్చిందని ఎంపీ సానా సతీష్‌బాబు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తమ ప్రేమ కథలను ప్రస్తావించారు. ఆయా ప్రతినిధులు తమ పరిధిలో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోసం మంత్రి నారా లోకేశ్‌కు ఇచ్చిన దరఖాస్తుల తాజా స్థితిని తెలుపుతూ ఓ నివేదికను ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఆత్మీయ కలయికను పురస్కరించుకుని ప్రజాప్రతినిధుల కుటుంబసభ్యులకు మంగళగిరి పట్టుచీరలు బహూకరించారు.

మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక అందిస్తున్న కాకినాడ నగర ఎమ్మెల్యే కొండబాబు, కుటుంబ సభ్యులు

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కుటుంబం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కుటుంబం

విద్యుత్తు బస్సులు ఆర్టీసీనే నడపాలి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సులు ఆర్టీసీ యాజమాన్యమే నడపాలని, ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని తదితర డిమాండ్లతో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) నాయకులు మంగళవారం కాకినాడ డిపో గ్యారేజ్ గేటు వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉదయం విధులకు హాజరయ్యే ముందు ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం గేట్ మీట్ నిర్వహించి ధర్నా చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి పి.వస్తు, ఓబులేశు, జిల్లా కార్యదర్శి ఏవీ రావు, జిల్లా చైర్మన్ కేఎస్ రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, అన్ని కేడర్లలో ఖాళీలను భర్తీ చేయాలని, స్త్రీ శక్తి పథకానికి సరిపడా బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు జె.గోవింద్, బీవీ చక్రం, ఉద్యోగులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు

పాల కేంద్రాలు, ఆర్వో ప్లాంట్లు తనిఖీలు చేయాలి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన నేపథ్యంలో కాకినాడ నగరంలో పాల కేంద్రాలు, ఆర్వో ప్లాంట్లను తనిఖీలు చేపట్టాలని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సభ్యులు నందమూరి వినోద్, స్వాతి లక్ష్మి, సోనీ ఫ్లోరెన్స్ ఆహార భద్రతా విభాగం అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి జీవీబీ నందాజీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నగరంలోని అన్ని హోటళ్లలో కూడా తనిఖీలు చేపట్టి నిల్వ మాంసం అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బేకరీలు, ఇతర ఆహార సంబంధిత దుకాణాల్లో చేపడుతున్న శుభ్రతా చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

నందాజీకి వినతిపత్రం అందజేస్తున్న దిశ కమిటీ సభ్యులు

వీధుల్లో అంధకారం

కాకినాడ శాంతినగర్ సంజీవ్ రావు నగర్‌లోని మూడు రోడ్ల కూడలి వద్ద వీధి దీపం గత కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి చీకటిలో మలుపులో వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అధ్వానంగా నడకదారి..

కాకినాడ మెయిన్‌రోడ్డు పక్కన ఫుట్‌పాత్ అధ్వానంగా ఉంది. నడిచేందుకు వీలు లేకుండా టైల్స్ పగిలిపోయి, కాలువపై రాళ్లు ఎగుడుదిగుడుగా ఉంటూ అధ్వానంగా దర్శనమిస్తోంది. దీంతో పాదచారులు ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
– న్యూస్‌టుడే, మసీదు సెంటర్

మేలుకోకుంటే ముంచేస్తారు..

కాకినాడలోని ఇంద్రపాలెం వంతెన వద్ద ఉప్పుటేరు, ఇతర పంట, మురుగు కాలువలు కలిసే ప్రధాన కూడలి వద్ద కొంతమంది చిరు వ్యాపారులు ఖాళీ కొబ్బరిబొండాలు, చెరకు వ్యర్థాలను పారబోస్తున్నారు. ఇలానే సాగితే కొన్నాళ్లకు కాలువలో పూడికపెరిగే ప్రమాదముంది. వరదలు సమయంలో నీటి ప్రవాహానికి వ్యర్థాలు అడ్డుగా మారి నగరానికి ముంపు ముప్పు పొంచి ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.
– ఈనాడు, కాకినాడ

ప్రమాదకరంగా విద్యుత్తు పెట్టె

కాకినాడ కొండయ్యపాలెంలోని ఓ వీధిలో రహదారి పక్కన విద్యుత్తు పెట్టె మూతలేకుండా ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ వైర్లు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. పిల్లలు, వాహనదారులు పొరపాటున తాకితే పెనుప్రమాదం వాటిల్లే అవకాశముంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, మసీదు సెంటర్

19,593 మంది లబ్ధిదారులకు ఉచితంగా సౌరఫలకల ఏర్పాటు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఉచిత విద్యుత్తు పథకం పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా సౌరఫలకలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీఈపీడీసీఎల్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రూఫ్‌టాప్‌లు అనువుగా ఉన్న 19,593 ఎస్సీ, ఎస్టీ వర్గాల గృహాలపై ఉచితంగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే సర్వే పూర్తయిందని, వెండర్లను గుర్తించామని, వీలైనంత త్వరగా వీటిని బిగిస్తామని పేర్కొన్నారు. పీఎం కుసుమ్‌పథకం కింద రైతులకు సోలారు పంపుసెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో వ్యవసాయ ఫీడర్లు ఉన్న విద్యుత్తు ఉప కేంద్రాల సమీపంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించామని, అక్కడే సోలారు ప్లాంట్లు నెలకొల్పి పగటి పూట నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా చేస్తామన్నారు. కొమరగిరి వద్ద 42 మెగావాట్స్ సౌర విద్యుత్తు ఉత్పత్తికి 82 ఎకరాలు గుర్తించామని, ఇంకా 88 ఎకరాల భూమి అవసరమని వెల్లడించారు. ఏపీఈపీడీసీఎల్ కాకినాడ సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈలు ఎన్.ఉదయ్‌భాస్కర్, డి.ప్రభాకర్, బి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కౌలురైతుల 30 గంటల దీక్ష

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కౌలురైతుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన మూల్యం తప్పదని ఏపీ కౌలు రైతు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ప్రారంభించిన 30 గంటల దీక్ష మంగళవారం సాయంత్రం ముగిసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, ఐద్వా ప్రతినిధులు సీహెచ్. రమణి, జి.భూలక్ష్మి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కృష్ణమోహన్, రైతు సంఘ ప్రతినిధి నీలపాల సూరిబాబు, లిబరేషన్ నాయకుడు గొడుగు సత్యనారాయణ, మత్స్యకార్మిక సంఘ ప్రతినిధి యు. సత్యనారాయణ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘ జిల్లా అధ్యక్షుడు మోర్త రాజశేఖర్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. సాగుచేసే రైతుకు కౌలుకార్డు ఉన్నా లేకపోయినా అతడి పేరుతో ఈ- పంట నమోదు చేయాలని, కేరళ తరహాలో ధాన్యానికి బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. కేవీఎస్ శ్రీనివాస్, చల్లా సంతోష్‌కుమార్, వాసంశెట్టి చంద్రరావు, నారాయణ రెడ్డి, ఎస్.గోవిందు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు దీక్ష చేస్తున్న కౌలురైతులు

పింఛనర్ల సమస్యలను పరిష్కరించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ స్వామి డిమాండ్ చేశారు. ఈ నెల 22, 23 తేదీల్లో హరియాణాలో జరిగిన అఖిల భారత పెన్షనర్స్ ఫెడరేషన్ మహాసభలకు జిల్లా నుంచి హాజరైన అసోసియేషన్ ప్రతినిధులు పలు అంశాలను అక్కడ చర్చించినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎన్‌జీవో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఆచంట రామారాయుడు ఈ సభల్లో కేంద్ర తీసుకువచ్చిన బిల్లుపై చర్చించారని తెలిపారు. ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్పందించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేపీ జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

మహాసభలకు హాజరైన జిల్లా ప్రతినిధులు

కొత్తగా 28 వేల గృహాల మంజూరు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో సొంత స్థలాలున్న పేదలకు ఏప్రిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 28 వేల గృహాలు మంజూరు చేయనున్నారని హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన ఈఈ, డీఈఈ, ఏఈఈ, వర్కు ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పీఎంఏవై-2.0(గ్రామీణ్) కింద గుర్తించిన 28 వేల మంది లబ్ధిదారులకు ఇవి మంజూరవుతాయని ఆశిస్తున్నామన్నారు. ఉగాది నాటికి పీఎంఏవై-1.0 కింద మంజూరైన 13,588 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందని, ఇప్పటికి 400 గృహాలు నిర్మించారని, మిగతా లక్ష్యాలు త్వరగా చేరుకోవాలన్నారు. మండలాల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. ఈఈలు కె.సత్యనారాయణరెడ్డి, ఎల్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ, హాజరైన ఇంజినీర్లు

వైద్యారోగ్యశాఖలో పోస్టులకు దరఖాస్తులు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా పలు పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారని డీఎంహెచ్‌వో డా.నరసింహ నాయక్ మంగళవారం తెలిపారు. ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్‌థెరపిస్ట్ (3 పోస్టులు), క్లినికల్ సైకాలజిస్ట్(2), ఆప్టో మీటరిస్ట్(1), డెంటల్ టెక్నీషియన్(2), స్టాఫ్ నర్సు(1).. మొత్తం 9 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. మార్చి 2 నుంచి 11వ తేదీ వరకూ కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఉన్నతాధికారుల పాత్రపై విచారణ జరపాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో అప్పటి పోలీసు ఉన్నతాధికారుల పాత్రపై విచారణ జరపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, సిట్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులను మాత్రమే సస్పెండ్ చేశారన్నారు. అప్పటి ఎస్పీ, డీజీపీ, తదితర పోలీసు ఉన్నతాధికారుల పనితీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: మద్యంతాగి వాహనాలు నడపుతున్న 47 మందిపై కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచామని కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారిలో 8 మందికి 3 రోజులు, నలుగురికి 2 రోజులు, 5 మందికి ఒకరోజు జైలు శిక్ష విధించారని చెప్పారు. మిగిలిన 30 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని వెల్లడించారు.

షూటింగ్‌బాల్‌లో ప్రతిభ

గాంధీనగర్, న్యూస్‌టుడే: తిరుపతిలోని ఎస్వి ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన సౌత్‌జోన్ షూటింగ్‌బాల్ ఛాంపియన్ షిప్-2026లో జేఎన్‌టీయూకేలో ఏఐఎంఎల్ రెండో ఏడాది చదువుతున్న కె.సింధూర సాహితి ప్రతిభ చూపింది. మహిళల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఆమెను మంగళవారం జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్ అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. స్టూడెంట్స్ అఫైర్స్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింధూర సాహితిని అభినందిస్తున్న వీసీ ప్రసాద్

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన 2012 బ్యాచ్‌కి చెందిన కానిస్టేబుల్ నందిక అర్జున్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆ బ్యాచ్‌కి చెందిన సహచరులు కుటుంబానికి అండగా నిలిచారు. తమ వంతుగా రూ. 2,80,000 సమకూర్చారు. ఆ చెక్కును మంగళవారం ఎస్పీ బిందుమాధవ్ చేతుల మీదుగా మృతుడి తల్లి మేరీ శాంతకుమారికి అందజేశారు. అర్జున్ చివరిగా కిర్లంపూడి పీఎస్‌లో పనిచేశారు. అతని కుటుంబానికి పోలీసు శాఖ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఉత్సాహంగా జిల్లాస్థాయి సైక్లింగ్ జట్టు ఎంపికలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక డీఎస్ఏ మైదానంలో జిల్లాస్థాయి సైక్లింగ్ జట్టు ఎంపికలు మంగళవారం నిర్వహించారు. డీఎస్‌డీవో వి.సతీష్‌కుమార్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఎంపికైన వారిని డీఎస్‌డీవో అభినందించి, ఇకపై జరిగే పోటీల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో సతీష్‌కుమార్

ప్రకటన

నా క్లయింట్ కాకినాడ, అశోక్‌నగర్, గోకులం గుడి వద్ద నివాసం గల నారాయణం మురళీ గారి కుమారుడు శిశిర్ నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ తాతగారు అయిన, అనగా, తల్లి తండ్రి అయిన అంత్యం రాజేశ్వరరావు గారి కుమారుడు విజయకుమార్‌బాబు గారు మంచి వ్యక్తిత్వంతో ది. 10-03-2016న వ్రాయించిన ఒక అన్‌రిజిస్ట్రీ వీలునామా రీత్యా వీలునామాలో 3వ అయిటం అయిన కాకినాడ పట్టణం, జయేంద్రనగర్‌లో త్రివేణి పార్క్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, డో.నెం. 70-14-13/2 నందు 60 గజముల అనిర్దిష్టపు స్థలము, అందు గల ఫ్లాట్ నెం. డి2 యొక్క 1528 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్ ఆయన మరణానంతరం అనగా 10-10-2017న కాలం చేసిన పిదప నా క్లయింట్‌కు దఖలు పడినది. సదరు వీలునామా ఇద్దరు సాక్షులు ఎదుట నా క్లయింట్ తాత గారు వ్రాయించి సంతకం చేయుట జరిగినది. ఆయన కాలం చేసిన తదుపరి సదరు వీలునామా రీత్యా సదరు అపార్ట్‌మెంట్ నా క్లయింట్‌కు దఖలుపడి సంపూర్ణ స్వాధీనతతో అనుభవించుచున్నారు. సదరు అపార్ట్‌మెంట్ నా క్లయింట్‌కు క్రియపరచుటకు అంగీకరించియున్నారు. సదరు వీలునామా, అన్‌రిజిస్టర్ అగుటచే ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియపరచవలెను. లేనిచో ఏవిధమైన అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ సదరు అపార్ట్‌మెంట్‌ను క్రియపరచుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

మర్ల నరసింహారావు, అడ్వకేట్
MA శాస్త్రి స్ట్రీట్, D.No.1-9-7, శ్రీరామ్‌నగర్, కాకినాడ - 533003, సెల్: 98482 77373

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఆర్థిక అక్షరాస్యతతో అభ్యున్నతి

పిఠాపురం: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని, అలాంటి వారే అభ్యున్నతి సాధిస్తారని వక్తలు అన్నారు. మంగళవారం పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక బీఎం ఆర్ బాలికోన్నత పాఠశాలలో సదస్సు నిర్వహించారు. విద్యార్థులు రోజువారీ ఖర్చులు, ఆదాయం, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను అంచనా వేస్తుండాలన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

పిఠాపురం, గొల్లప్రోలు: గ్రామ, వార్డు స్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏపీ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నేత పెంకే జగదీష్ పిలుపునిచ్చారు. మంగళవారం చిత్రాడలో ఇంటింటా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. చేబ్రోలులో జనసేన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ సభ్యత్వాలను నమోదు చేయించారు.

సభ్యత్వం నమోదు చేస్తున్న జగదీష్

బహుముఖ ప్రజ్ఞాశాలి దేవులపల్లి

సర్పవరం జంక్షన్(కరప): ప్రముఖ కవి దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి తెలుగు కవితా రంగంలో చెరగని ముద్ర వేశారని, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని సాహిత్యవేత్త డా. శిరీష కొనియాడారు. కాకినాడ గ్రామీణ పరిధి బొట్టుకట్ ఉద్యానంలో మంగళవారం కృష్ణశాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి వాసవ్య సంఘం ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. రత్నప్రసాద్, సుబ్బారావు, ప్రసాదనాయుడు, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

భాషోత్సవ్ పోటీల్లో ప్రథమం

సామర్లకోట: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన భాషోత్సవ్ పోటీల్లో సామర్లకోట మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయుడు సాయిరాజశేఖర్ మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయి ఇంగ్లిష్ డిబేట్‌లో వీవీడీ చాందిని, టి.హారిణి సాయిలక్ష్మి ప్రతిభ చాటారన్నారు. వీరిని డీఈవో రమేష్, డిప్యూటీ ఈవో సత్యనారాయణ, ఎంఈవో జగన్మోహన్, ఎంఈవో లక్ష్మీకుమారి అభినందించారు.

శిక్షణ ఎఫ్‌బీవోల చొల్లంగి సందర్శన

తాళ్లరేవు: కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ దూలపల్లి శిక్షణ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మంగళవారం సందర్శించారు. మడ అడవులు, జంతు, పక్షి, వృక్ష, మత్స్య జాతులపై అధ్యయనం చేశారు.

పరిశీలన

కేంద్రానికి చేరడమే.. 'పరీక్ష'!

న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. మరో 20 రోజుల పాటు విద్యార్థులు ఆయా కేంద్రాలకు వచ్చిపోతుంటారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్ష రాసేందుకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్యలతో సతమతం అవుతున్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించమని ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు పెట్టింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆందోళన మధ్య, అవస్థల్లో కేంద్రాలకు చేరుకోవాల్సి వస్తోంది. మరోపక్క సమయానికి బస్సులు రావడం లేదు. ఆ సౌకర్యం లేని గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూ వాహనాలపై కేంద్రాలకు వస్తున్నారు. ఇంటర్ పరీక్ష రాసేవారికి డ్రైవింగ్ లైసెన్సు కూడా ఉండదు. ర.భ.శాఖ, జాతీయ రహదారిపై వేగంగా ప్రయాణం చేయడంతో ప్రమాదాలకు ఆస్కారం అధికం. పోలీసు, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి, విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేలా మెరుగైన సదుపాయాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల సంఖ్య ఇలా..

మండలం	కేంద్రాలు	ప్రథమ	ద్వితీయ
పిఠాపురం	5	1275	1107
సామర్లకోట	3	1059	1037
పెద్దాపురం	2	1275	1107
వేళంగి	1	125	78

ఇవిగో ఇబ్బందులు..

● పిఠాపురంలో ఉప్పాడ రైల్వే గేటు దాటుకుని కొత్తపల్లి మండల విద్యార్థులు పిఠాపురంలోని హనుమంతరాయ, గురుకుల కళాశాల, అంజనా కళాశాలలకు వస్తున్నారు.

● పిఠాపురంలోని పలు కళాశాలల విద్యార్థులకు కొత్తపల్లి వీవీఎస్ కళాశాలలో పది కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి అదే గేటు దాటి వెళ్తున్నారు. మరోపక్క ఈ మార్గంలో ర.భ. శాఖ రహదారి నిర్మాణంలో ఉంది. దాంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. బస్సుల సదుపాయం కూడా తక్కువగా ఉంది. ముఖ్యంగా కోటగుమ్మం సెంటర్ సమీపంలో అంజనా కళాశాల కేంద్రానికి చేరుకునేటప్పుడు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో అక్కడున్న నాలుగు కార్పొరేట్ పాఠశాలలకు కూడా అదే సమయంలో విద్యార్థులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో బస్సుల రాకపోకల సందర్భంగా ట్రాఫిక్ సమస్య నెలకొంటున్నా.. క్రమబద్ధీకరణకు పోలీసు సిబ్బంది ఉండడం లేదు. మరో

అంజనా కళాశాల పరీక్ష కేంద్రానికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్

రైల్వేగేటు మూత, బస్సుల్లేక విద్యార్థులకు యాతన

పక్క పాదగయ కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. అది దాటే విద్యార్థులు గురుకుల కళాశాలకు వెళ్లాలి. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల కేంద్రం వద్ద రోడ్డు నిత్యం రద్దీగా ఉండడం పరీక్షార్థులకు ఇబ్బందే. ● సామర్లకోట, పెద్దాపురంలోనూ ఇదే పరిస్థితి. ఈ మార్గాలు నిత్యం రద్దీగా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఈ పట్టణాల్లోని కేంద్రాలకు చేరుకునేందుకు సరైన బస్సు సదుపాయం ఉండడం లేదు. ఒకే ఆటోలో 10 మంది వరకు విద్యార్థులు కేంద్రాలకు చేరుకుంటున్నారు. ఈ రెండు పట్టణాలను దాటుకుని సూరంపాలేనికి పదుల సంఖ్యలో కార్పొరేట్ కళాశాలల బస్సులు వెళ్తుంటాయి. ఆ సమయంలో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.

● కాకినాడ గ్రామీణంలో ఏపీఎస్పీ, నాగమల్లితోట కూడలిలోని కేంద్రాలకు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చేరుకోవడం కష్టంగా ఉంటోంది. ఉదయాన్నే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. దాంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. బస్సులు కూడా సమయానికి ఉండడం లేదు. కరపలో యండమూరు, కూరాడ, సిరిపురం, జి.భావవరం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. వీళ్ల సైకిళ్ల, ద్విచక్ర వాహనాలపైనే పరీక్షలు రాసేందుకు వెళ్తున్నారు. వేళంగిలోని కేంద్రానికి దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు.

దృష్టి సారిస్తాం..

ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందిపడకుండా చర్యలు చేపడతాం. నిత్యం రద్దీ కూడళ్లలో ఉదయం, సాయంత్రం పోలీసులతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాం. అదనంగా సిబ్బందిని నియమిస్తాం. సమయానికి ముందుగా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడం మంచిది.

– జి.శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

ఆర్థిక సాయం

గొల్లప్రోలు: చిన్నారి పునర్వి చికిత్సకు దుర్గాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. దుర్గాడ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు, యువకులు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులను కలిసి విరాళాలు సేకరించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆర్థిక సాయాన్ని హెచ్ఎం విజయకుమార్ ద్వారా అందించారు. ✦ తాళ్లరేవు: ఇంజరం, సుంకరపాలెం, లచ్చిపాలెం, ఉప్పంగల, చినబొడ్డలంక, పిల్లంక, కోలంక, పల్లిపాలెం పంచాయతీ పరిధిలో మృతదేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్సు లేక ఇబ్బందులు పడుతున్నారు. దాంతో పిల్లంకకు చెందిన చింతలపాటి శ్రీనివాసరాజు రూ.55 వేలు ఇచ్చారు.

'ఆ రోజు సెలూన్‌లు తెరవొద్దు'

పిఠాపురం: పట్టణంలో ప్రతి మంగళవారం సెలూన్ దుకాణాలు తెరవొద్దని ఆ సంఘ నాయకులు హెచ్చరించారు. పిఠాపురం గార్డుపేట సమీపంలో తెరిచిఉంచిన ఓ కార్పొరేట్ సెలూన్ ఎదుట వారు శాంతియుతంగా నిరసన తెలిపారు. అర్జునకుమార్, వెంకటపతి, శివ, పవన్‌కుమార్, దత్తు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి

పిఠాపురం: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు దాతలు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత అధ్యాపకురాలు బెజవాడ మంగతాయారు సూచించారు. మంగళవారం పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయానికి రూ.15 వేల విలువైన పుస్తకాలను బహూకరించారు. గ్రంథాలయ కార్యదర్శి శంకరరావు అభినందనలు తెలిపారు. పెమ్మరాజు సత్య రామచంద్రరావు, ఎ.గణేష్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వైద్యసేవలు

కరప: పల్లెల్లో ఆర్ఎంపీల వైద్య సేవలు కీలకమని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిబంధనల మేరకు ప్రథమ చికిత్స సేవలు అందించేలా కృషి చేయాలని ఆర్థోపెడీషియన్ డా.బొండా సూర్యారావు కోరారు. కరపలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా.చప్పిడి వెంకటేశ్వరరావు, స్త్రీవైద్య నిపుణురాలు డా.ఉషారాణితో కలిసి సూచనలు చేశారు.

గుంత చూడండి.. పూడ్చండి

పట్టణంలోని రామారావుపేటలో సీసీ రహదారిపై గుంత పడింది. ప్రధాన మార్గం కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. గుంతతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని అడగ్గా గుంతను పూడ్చిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

పాఠశాల తీరు.. బేజారు



తూరంగి గోపీకృష్ణకాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో తీగమొక్కలు అల్లుకోవడంతోపాటు పాఠశాల చుట్టూ అపరిశుభ్రంగా ఉంది. దాంతో విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విషపురుగుల సంచారం అధికమై భయాందోళన చెందుతున్నారు. ఎంఈవో శ్రీనివాసకుమార్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

నీటి వృథా.. ఎవరికీ పట్టదా..

పిఠాపురం పాత ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని కుళాయిలకు మూతలు అమర్చలేదు. దాంతో ఉదయం, సాయంత్ర వేళల్లో సరఫరా చేస్తున్న సమయంలో మంచి నీరంతా వృథాగా పోతోంది. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పర్యవేక్షణాధికారి జనార్దన్‌కు చెప్పగా మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

ఉద్యానం.. ఉల్లాసం పొందలేం

పిఠాపురం అగ్రహారంలో పశువుల సంత ఎదుట ఉన్న ఉద్యానం చెత్తాచెదారంతో అధ్వానంగా కనిపిస్తోంది. సమీప ఇళ్లలోంచి మురుగు వచ్చి చేరుతోంది. చెత్త తెచ్చి అక్కడే పడేస్తుండడంతో ఆవరణ దారుణంగా మారుతోంది. వెంటనే శుభ్రం చేసి, చిన్నారులు ఆడుకునేలా చేయాలని కోరుతున్నారు. కమిషనర్ కనకారావు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

దారి ఇలా ఉంటే.. రాకపోక చింతే..

నడకుదురు బంటాల తూము బస్టాండ్ వద్ద మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో గృహాల్లో వాడకం నీరు సీసీరోడ్డుపైకొస్తోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు పడుతున్నామని, శుభ్రం చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి వారిజకు చెప్పగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

తెదేపా ఫ్లెక్సీల తొలగింపుపై ఆగ్రహం

కొత్తపల్లి: యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ ప్రధాన కూడలిలో ఉన్న తెదేపాకు చెందిన ఫ్లెక్సీలను పంచాయతీ అధికారులు తొలగించడంపై ఆ పార్టీ నేతలు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటర్‌లోని ఓ దుకాణానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీని తొలగించాలని యజమాని మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. దానితోపాటు మిగతా వాటినీ తొలగించడం వివాదానికి దారితీసింది. దీంతో మండిపడిన తెదేపా నేతలు పంచాయతీ కార్యదర్శి నాగన్నదొరను నిలదీయగా ఎంపీడీవో లక్ష్మిరెడ్డి తొలగించాలని ఆదేశించినట్లు చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ రాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవోను నిలదీశారు. ఆయన సరిగా సమాధానం చెప్పకపోవడంతో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎంపీడీవో స్పందించడంతో ఆందోళన విరమించారు. ఫ్లెక్సీలను యథాస్థానంలో తిరిగి ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యానందరెడ్డి, సనపయ్య, ప్రసాద్, అప్పారావు, కృష్ణారెడ్డి, రామకృష్ణ, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో లక్ష్మిరెడ్డిని నిలదీస్తున్న తెదేపా నాయకులు

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

కరప: వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. 78 మంది విద్యార్థులు ఇక్కడికి హాజరవ్వాల్సిఉండగా ఒక విద్యార్థి పరీక్ష రాయలేదని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎన్ వాణి, డిపార్టుమెంట్ అధికారి చక్రధర్ తెలిపారు. ✦ పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలోని మహారాణి, సాగర్ జూనియర్ కళాశాలల్లోని రెండు కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మహారాణి కళాశాలలో 473 కు 462 మంది, సాగర్ జూనియర్ కళాశాలలో 412 కు 406 మంది హాజరయ్యారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ✦ తాళ్లరేవు: తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తొలి పరీక్ష జరిగింది. 263 మందికి 250 మంది రాశారు.

వేళంగిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

అరెస్టైన సైబర్ నేరగాళ్లలో కాకినాడ గ్రామీణ వాసి

ఎండాడ(విశాఖ): రూ.కోట్లలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చీ మంగళవారం తెలిపారు. ఈ ముఠా సభ్యులు తాము అధికారులమని నమ్మించి ఎండాడ నగరానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్‌ను భయపెట్టి డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.1.05 కోట్లు దోచుకున్నారు. ఈ కేసులో కొలుకుల వీరేంద్రనాథ్(విశాఖ), ఇమ్దాద్ హుస్సేన్(నిడదవోలు సమీప సమిశ్రగూడెం), గారిగె రాజేష్‌కుమార్ (నిడదవోలు)లను అరెస్టు చేశారు. రూ.48.21 లక్షలు కాజేసిన మరో కేసులో అరెస్టైన ముగ్గురిలో కాకినాడ గ్రామీణ ప్రాంతవాసి ఎం.సుబ్బారావు ఉన్నారని సీపీ తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్ కాకినాడ, అశోక్‌నగర్, గోకులం గుడి వద్ద నివాసం గల నారాయణం మురళీ గారి కుమారుడు శిశిర్ నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ తాతగారు అయిన, అనగా, తల్లి తండ్రి అయిన అంత్యం రాజేశ్వరరావు గారి కుమారుడు విజయకుమార్‌బాబు గారు మంచి వ్యక్తిత్వంతో ది.10-03-2016న వ్రాయించిన ఒక అన్‌రిజిస్ట్రీ వీలునామా రీత్యా వీలునామాలో 3వ అయిటం అయిన కాకినాడ పట్టణం, జయేంద్రనగర్‌లో త్రివేణి పార్క్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, డో.నెం.70-14-13/2 నందు 60 గజముల అవిభక్త స్థలము, అందు గల ఫ్లాట్ నెం. డి2 యొక్క 1528 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్ ఆయన మరణానంతరం అనగా 10-10-2017న కాలం చేసిన పిదప నా క్లయింట్‌కు దఖలు పడినది. సదరు వీలునామా ఇద్దరు సాక్షులు ఎదుట నా క్లయింట్ తాత గారు వ్రాయించి సంతకం చేయుట జరిగినది. ఆయన కాలం చేసిన తదుపరి సదరు వీలునామా రీత్యా సదరు అపార్ట్‌మెంట్ నా క్లయింట్‌కు దఖలుపడి సంపూర్ణ స్వాధీనతతో అనుభవించుచున్నారు. సదరు అపార్ట్‌మెంట్ నా క్లయింట్‌కు క్రియపరమటకు అంగీకరించియున్నారు. సదరు వీలునామా, అన్‌రిజిస్టర్ అగుటచే ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియపరచవలెను. లేనిచో ఏవిధమైన అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ సదరు అపార్ట్‌మెంట్‌ను క్రియపరముదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

మర్ల నరసింహారావు, అడ్వకేట్

MA శాస్త్రి స్ట్రీట్, D.No.1-9-7, శ్రీరామ్‌నగర్, కాకినాడ - 533003, సెల్: 98482 77373

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక

పిఠాపురం, సర్పవరం: కాకినాడ జిల్లా కూటమి పార్టీల నేతలతో మంత్రి లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో ఆత్మీయంగా సమావేశమయ్యారు. మంగళవారం రాత్రి వారందరికీ విందు ఇచ్చారు. ఎమ్మెల్యే నానాజీ కుటుంబ సభ్యులను లోకేశ్ ఆప్యాయంగా పలకరించి, కుటుంబ విషయాలు తెలుసుకున్నారు. వారికి బహుమతి అందించారు. ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ దంపతులు కూడా ఆత్మీయ విందులో పాల్గొన్నారు.

లోకేశ్ నుంచి బహుమతి తీసుకుంటున్న ఎమ్మెల్యే నానాజీ కుటుంబ సభ్యులు

మహాలక్ష్మమ్మకు పూజలు

తాళ్లరేవు: జార్జిపేట గ్రామదేవత మహాలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గామల్లేశ్వర ఆలయం నుంచి మహాలక్ష్మమ్మ ఆలయం వరకు 300మంది మహిళలు కలశాలతో ర్యాలీగా వెళ్లారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

కాజులూరు: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలను సామాజిక తనిఖీలో గుర్తించి సంబంధిత వ్యక్తుల నుంచి రూ.2.49 లక్షలు వసూలు చేయాలని ఆదేశించినట్లు డ్వామా పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ నివేదికపై మాట్లాడారు. ఎంపీడీవో జె.రాంబాబు, ఏపీడీ వసంతమాధవి పాల్గొన్నారు.

రైస్ మిల్లులో జేసీ తనిఖీలు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: వేట్లపాలెంలోని రైస్ మిల్లులో మంగళవారం జేసీ అపూర్వభరత్ తనిఖీలు నిర్వహించారు. మిల్లు రికార్డులు, నిల్వ వివరాలు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సామర్లకోట తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బందితో సమీక్ష జరిపారు.

పిఠాపురానికి 40 మంది పారిశుద్ధ్య కార్మికులు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారు. జనవరిలో సంక్రాంతి సంబరాలకు వచ్చిన ఆయన ఇక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క కార్మికుల సంఖ్య పెంచాలని ప్రజాసంఘాలు, కౌన్సిలర్లు చాన్నాళ్లుగా కమిషనర్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ఆ మేరకు అవసరాలపై ఈ నెల 9న ప్రత్యేక సమావేశంలో కౌన్సిలర్లు తీర్మానం ఆమోదించారు. ఇందుకు సంబంధించి సోమవారం కమిషనర్ కనకారావు విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో మంగళవారం రాత్రి 40 మంది కార్మికులను పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) పద్ధతిలో నియమించుకునేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అనాథ పిల్లలకు పవన్‌కల్యాణ్ ఆసరా

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గంలో అనాథ పిల్లలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆసరా కల్పిస్తున్నారని జనసేన పార్టీ నాయకుడు జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వన్నెపూడిలో ఉపముఖ్యమంత్రి తన జీతం నుంచి పంపిన నగదును రూ.5 వేల చొప్పున పలువురికి అందజేశారు. అనంతరం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సభ్యత్వం నమోదు చేయించుకుని, ప్రయోజనాలు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తమ్మారావు, వార్డు, బూత్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

SHOW CAUSE NOTICE

UIN-10250364, CT (GD) Melam Venkata Maneendra, S/o Sh. Melam Venkata Ramana, Resident of Village-Mallam, P.O.-Mallam, P.S.-Pithapuram Rural, District-East Godavari, Andhra Pradesh (PIN-533433), of 14 Bn SSB, Nagam (J&K), failed to report to duty after expiry of leave despite repeated directions and has been declared a deserter w.e.f. 02.02.2026. He is hereby directed to report for duty within 15 days from the date of publication of this notice, failing which action, including dismissal from service, will be taken as per rules.

Commandant
14 Bn SSB, Nagam (J&K)

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: నువ్వులగుంటవీధిలోని కాలువలో మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయించండి. – శ్రీనివాసరావు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: గొల్లప్రోలు కొత్తపేట వీధిలో రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: వాకతిప్ప గ్రామంలోని ప్రధాన రహదారి వెంట మురుగు కాలువ పూడికతో మూసుకుపోయింది. – స్థానికులు

పరిష్కారం: డిప్యూటీ ఎంపీడీవో గోవిందరాజు పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: కరప మండలం వేళంగి స్టేట్‌బ్యాంక్ పక్కన డ్రెయినేజీలో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. – చంద్రరావు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరికి చెప్పగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, కరప

సమస్య: పిఠాపురం చిట్టోడితోటలో కాలువల్లోంచి తీసిన పూడిక వ్యర్థాలు అక్కడే వదిలేశారు. వెంటనే ఎత్తించాలి. – కిరణ్

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా వ్యర్థాలను కార్మికులతో ఎత్తించారు.

- న్యూస్‌టుడే, పిఠాపురం



పిఠాపురంలో దీక్షలో సహకార సంఘాల సిబ్బంది

ఉద్యోగుల ఉద్యమ పథం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం డీసీసీబీ బ్యాంకు వద్ద సహకార సంఘ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. పిఠాపురం, కొత్తపల్లి శాఖల సిబ్బంది ఆందోళనలో పాల్గొన్నారు. వేతన సవరణ, రిటైర్మెంట్ వయసు పెంపు, క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● సామర్లకోట: రథం సెంటర్‌లోని సహకార బ్యాంకు వద్ద ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ జీవో నంబరు 36ను వెంటనే అమలు చేయాలని, తమ న్యాయపరమైన సమస్యలు తీర్చాలన్నారు. ● కరప: కరపలోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయం వద్ద మంగళవారం నిరసనలో పీఏసీఎస్ సీఈవో వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, పరుశురామ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆగ్రహ స్వరం

పెద్దాపురం, న్యూస్‌టుడే: కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ పెద్దాపురం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఆయాలు, సహాయకులు మంగళవారం రిలే దీక్షలు కొనసాగించారు. సీఐటీయూ నాయకుడు సత్తిబాబు, యూనియన్ నాయకులు పద్మ, రాణి, పాపాయమ్మ, వరలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు. ● సర్పవరం జంక్షన్(కరప): కాకినాడ గ్రామీణం సీడీపీవో కార్యాలయం వద్ద మంగళవారం రిలే నిరాహార దీక్షల్లో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రమణి, సీఐటీయూ మండల కార్యదర్శి టి.రాజా, భవానీ, సత్యవేణి, నాగమణి, దివ్య, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● పిఠాపురం: పిఠాపురంలో సంఘ నేతలు పద్మ, ప్రేమలత, కుసుమ, అమ్మాజీ, కృప తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్

పిఠాపురం బ్రాంచి, పిఠాపురం, ఫోన్ : 08869-252522

APPENDEX IV [RULE 8(1)]
స్వాధీనత ప్రకటన (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 క్రింద ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, పిఠాపురం బ్రాంచి యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) రూల్స్ 2002 అందలి రూల్ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఒక డిమాండు నోటీసు తేది 24-10-2025 న ఇచ్చియున్నారు. ఆ నోటీసు తేది నుండి 60 రోజుల లోపుగా రూ. 1,87,414/- (అక్షరములా ఒక లక్షా ఎనభై ఏడు వేల నాలుగు వందల పద్నాలుగు రూపాయిలు మాత్రమే) తేది 30-09-2025 నాటికి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/కో-ఆబ్లిగెంట్/హామీదారులు అయిన 1) శ్రీ కాకరాపల్లి సింహాచలం, S/o. లోవరాజు, 2) శ్రీమతి కాకరాపల్లి సరస్వతి, W/o. సింహాచలం, 3) శ్రీ కాకరాపల్లి దుర్గాప్రసాద్, S/o. సింహాచలం, 4) శ్రీ కాకరాపల్లి కృష్ణ అర్జున, S/o. సింహాచలం. వారిని కోరడమైనది.

కానీ ఋణగ్రహీతలు/ కోఆబ్లిగెంట్/హామీదారులు ఋణమును తిరిగి చెల్లించుటలో విఫలమై నందున ఋణగ్రహీతలకు/కోఆబ్లిగెంట్/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకోవాల్సిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిపై తేది 20-02-2026 న స్వాధీనత తీసుకొని యున్నారు.

కావున సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు/ కోఆబ్లిగెంట్/హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు, మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైనా రూ. 1,87,414/- మొత్తానికి మరియు తేది 01-10-2025 నుండి దాని మీద దర్శిలా వడ్డీ మరియు ఖర్చులు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, పిఠాపురం బ్రాంచి, పిఠాపురం వారి చార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు : కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, చిత్రాడ గ్రామం, సెట్టి బలిజపేట, దుర్గాదేవి గుడి దగ్గర, డోర్ నెం. 4-109 గాగల సర్వే నెం. 140లో రిజిష్టర్డు పార్టీషన్ డీడ్ డాక్యుమెంట్ నెం. 7693/2020, తేది 30-09-2020 గా ఉన్నటువంటి ఆర్‌సిసి. స్లాబ్ ఇల్లు.

హద్దులు: తూర్పు : సిమెంటు రోడ్డు, దక్షిణం : సందు మార్గం (దారి), పడమర : గీసాల అబ్బాయి గారి ఇల్లు, ఉత్తరం : రాతా వీధి. విస్తీర్ణం : 100 చ॥గజములు

తేది: 24-2-2026, పిఠాపురం — అధీకృత అధికారి, పిఠాపురం బ్రాంచి

(c) eenadu

మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే నెహ్రూ కుటుంబ సభ్యులు

లోకేశ్ ఆత్మీయ విందు

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కాకినాడ జిల్లా ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులకు మంగళవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో ఆత్మీయ విందు ఇచ్చారు. జగ్గంపేట ఎమ్మెల్యే, తితిదే బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తదితరులు కుటుంబసమేతంగా హాజరయ్యారు.

మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే సత్యప్రభ..

చిన్నారి వైద్యానికి చేయూత

ప్రత్తిపాడు: చిన్నారి పునర్జిక చికిత్సకు అవిలే స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.30 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని స్కూల్ కరస్పాండెంట్ గంగాధర్ చిన్నారి బంధువులకు అందజేశారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

మసీదుసెంటర్: జిల్లాకు చెందిన 2012 బ్యాచ్‌కి చెందిన కానిస్టేబుల్ నందిక అర్జున్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆ బ్యాచ్‌కి చెందిన సహచరులు ఆ కుటుంబానికి రూ.2,80,000 సమకూర్చారు. ఆ చెక్కును మంగళవారం ఎస్పీ బిందుమాధవ్ చేతుల మీదుగా మృతుడి తల్లి మేరీ శాంతకుమారికి అందజేశారు. అర్జున్ చివరిగా కిర్లంపూడి పీఎస్‌లో పనిచేశారు. పోలీసు శాఖ తరఫున అండగా నిలుస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

నీటి ఛార్జీల చెల్లింపులో నిర్లక్ష్యమేల..?

రూ.1.20 కోట్ల బకాయిలు

న్యూస్‌టుడే, తుని

పురపాలక సంఘానికి ఏటా చెల్లించాల్సిన నీటి ఛార్జీల విషయంలో అనేక మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయి. కొన్నేళ్లుగా అయితే ఇంటి యజమానులు కొళాయి పన్ను సక్రమంగా చెల్లించకపోవడంతో రూ.1.20 కోట్లు బకాయిల బండ పురపాలక సంఘంపై పడింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎలాగైనా వసూలు చేయాలని రెవెన్యూ విభాగాధికారులు నీటి ఛార్జీల బకాయిదారులకు 'రెడ్ నోటీసులు' జారీ చేస్తున్నారు. దీంతో తడిసిమోపెడైన నీటి ఛార్జీలు చూసి పలువురు లబోదిబోమంటున్నారు.


అధికారులు జారీ చేసిన రెడ్‌నోటీస్..

వడ్డీ పడకపోవడమే కారణం..

సాధారణంగా ఆరు నెలలకోసారి చెల్లించే ఆస్తిపన్ను ఆలస్యమైతే రూ.100కు రూ.2 చొప్పున అపరాధ వడ్డీ పడుతుంది. అయితే నీటి ఛార్జీలకు వడ్డీ లేకపోవడంతో పలువురు నిర్లక్ష్యం చేస్తున్నారు. పట్టణంలోని 30 వార్డుల్లో 5,500 ఇంటి కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.100 చొప్పున ఛార్జీలు పురపాలక సంఘం వసూలు చేస్తోంది. దీని ద్వారా ఏటా సుమారు రూ.65 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. అయితే తర్వాత కడదాం.. అన్న ధీమాతో పలువురు ఆస్తిపన్ను చెల్లించి నీటి ఛార్జీలు చెల్లించడం లేదు. ఇలా ఏళ్లతరబడి ఒక్కొక్కరు రూ.1,200 చొప్పున కన్నేళ్లుగా రూ.వేలల్లో పేరుకుపోయినవి చెల్లించాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ ఏడాది మార్చి చివరికి ఆస్తిపన్నుతో కలిపి నీటి ఛార్జీలు కూడా చెల్లించి సహకరించాలి. లేకుంటే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రెండేళ్లకు పైబడి బకాయిలున్న 800 మందికి రెడ్‌నోటీసులు జారీ చేశాం. ఎప్పటికప్పుడు నీటి ఛార్జీలు చెల్లిస్తే ఇబ్బందులు ఉండవు.

\- వలీ, పురపాలక ఆర్వో, తుని

పరీక్షల సందడి

తునిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే బృందం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు ప్రశాంతంగా మంగళవారం జరిగాయి. తుని పట్టణంలోని ఏడు కేంద్రాల్లో 2,476 మంది విద్యార్థులకు గాను, 65 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. ● కోటనందూరులోని మదర్ కళాశాలలో 285 మందికి 266 మంది హాజరయ్యారని ముఖ్య పర్యవేక్షకుడు ఎ. రాజబాబు తెలిపారు. ● ఏలేశ్వరం మండలంలో 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సూపరింటెండెంట్లు చంద్రశర, బాబ్జి తెలిపారు. ● శంఖవరం మండలంలోని కత్తిపూడి సీతారామ, కేజీబీవీల్లో జరిగిన పరీక్షకు 11 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ● కిర్లంపూడి మండలంలోని రెండు కళాశాలల్లో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షకు 18మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ● రౌతులపూడి మండలం ఎ. మల్లవరం గురుకుల కళాశాలలో 168 మంది విద్యార్థులకు గాను 163 మంది హాజరయ్యారని ముఖ్య పర్యవేక్షకుడు శ్రీనివాసరావు తెలిపారు.

జగన్ పాలనంతా విధ్వంసమే: ఎమ్మెల్యే

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా గత పాలకులు వ్యవహరించారని ఎమ్మెల్యే, తితిదే పాలక వర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలన విధ్వంసంతోనే మొదలైందన్నారు. అంతర్వేది, రామతీర్థం ఇలా సుమారు వందకు పైగా హిందువుల ఆలయాలపై దాడులు చేశారన్నారు. . ఒక పదార్థాన్ని సృష్టించి దానిలో రకరకాల రసాయనాలు కలిపి నెయ్యిగా చూపి లడ్డూ తయారీలో ఉపయోగించారన్నారు. ఈ కల్తీ బాగోతం 2020 ఫిబ్రవరి 29న ప్రారంభమైందన్నారు. దీనికి ఎవరైతే బాధ్యులో వారిని శిక్షించాల్సిన అవసరం ఉందని, సభలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

పూడిక తీయించరూ..!

ప్రశ్న: యల్లమిల్లి గ్రామంలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పూడిక తీసి ఇబ్బందులు కలగకుండా చేయాలి. **- శ్రీను, గ్రామస్థుడు**

సమాధానం: గ్రామంలో పూడికలు తీసి గ్రామస్థులకు ఇబ్బందులు రానీయం.

- సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

\- న్యూస్‌టుడే, గండేపల్లి

పాఠశాల వద్ద పరిసరాలు అపరిశుభ్రం

సమస్య: వేమవరం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. శుభ్రం చేయించాలి.

- సూరిబాబు, గ్రామస్థుడు

సమాధానం: పంచాయతీ సిబ్బందికి తెలియజేసి పరిసరాలు శుభ్రం చేయిస్తాం.

- నాగమణి, పంచాయతీ కార్యదర్శి

\- న్యూస్‌టుడే, తొండంగి

స్పందనకు వందనం

పూడిక తొలగించారు

శంఖవరం: కత్తిపూడి ప్రధాన రహదారి పక్కనే ఉన్న డ్రైయినేజీలో పూడిక తీయక మురుగు పేరుకుపోయింది. సమస్యను పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్‌కు తెలియజేయడంతో వెంటనే సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

మోహినీ అవతారంలో స్వామి దర్శనం

జగ్గంపేట గ్రామీణం: కాట్రావులపల్లిలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారు మోహిని అవతారంలో దర్శనమివ్వగా ఉదయం యాగశాలలో ప్రధాన హోమాలు, మోహినీ తిరుక్కోళం, లక్ష్మీపూజ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగింపు నిర్వహించగా ఇళ్లముందు రంగవల్లులు వేసి మహిళలు స్వాగతం పలికారు. ● రాజపూడి పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా, చిన్నారులు కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి ముమ్మరంగా పనులు

బెండపూడి వద్ద పోలవరం కాలువపై నిర్మిస్తున్న వంతెన

పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా జాతీయ రహదారిపై బెండపూడి వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వాహనాలు రెండు వైపులా వెళ్లేలా రెండు వంతెనలు నిర్మిస్తున్నారు. త్వరలో ప్రధాన రహదారిపై రాకపోకలను మళ్లిస్తామని అధికారులు పేర్కొన్నారు. రోజూ గ్రావెల్ లోడు లారీలు రాకపోకలతో దుమ్ము రేగి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి దిబ్బలు రహదారిపై పడడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల అన్నవరం దేవస్థానంలో విధులు నిర్వహించే పురోహితుడు వాహనం అదుపుతప్పి గాయపడ్డారు.. ఈ పనులు పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తొండంగి

విద్యుత్తు బిల్లులు సకాలంలో చెల్లించాలి

జగ్గంపేట గ్రామీణం : విద్యుత్తు బిల్లులు సకాలంలో చెల్లించి సహకరించాలని ఆ శాఖ ఏఈ మాధురి కోరారు. జగ్గంపేట ఎస్సీ కాలనీలో మంగళవారం లైన్‌మెన్ శివప్రసాద్, సిబ్బందితో కలిసి బకాయిలు ఉన్న ఇళ్లకు వెళ్లి వసూలు కార్యక్రమం చేపట్టారు. నెలలు తరబడి బిల్లులు చెల్లింపులు చేయని పలు కనెక్షన్లు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

తునిలో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలు

తుని పట్టణం, ప్రత్తిపాడు, జగ్గంపేట గ్రామీణం,న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు నిరాహారదీక్షలు చేశారు. తుని పట్టణంలోని బ్యాంకుకాలనీ బాలభవన్ వద్ద, ప్రత్తిపాడు, జగ్గంపేటలలో ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. తునిలో యూనియన్ నాయకులు ఎస్కె పద్మ, ధనలక్ష్మీ, రాణి, ప్రత్తిపాడులో నాయకులు కాకరాపల్లి సునీత, అల్లాడి లక్ష్మి, హేమలత తదితరులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించి, గౌరవ వేతనం పెంచాలన్నారు. బకాయిలు విడుదల చేయాలని, ప్రధాన కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు కూడా వర్తింపజేయాలన్నారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు మద్దతు పలికారు.

ఎగ్‌కార్ట్‌ను ప్రారంభిస్తున్న రాజేష్, అధికారులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం

తొండంగి, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. మహిళా సమాఖ్య ద్వారా వంద శాతం రాయితీపై ప్రభుత్వం అందించిన ఎగ్ కార్ట్‌ను ఆయన తెలుగు యువత అధ్యక్షుడు బంటుపల్లి అన్వేష్, కార్యదర్శి దూలం మురళి తదితరులతో కలిసి మంగళవారం ప్రారంభించారు.

మండలకేంద్రంలో సీసీరోడ్లుగా..

మట్టి దారులను సీసీ రోడ్లుగా మారుస్తామని యనమల రాజేష్ అన్నారు. తొండంగిలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను నాయకులు బంటుపల్లి అన్వేష్, కందా మురళి తదితరులతో కలిసి ప్రారంభించారు. తొండంగిలో ఇప్పటివరకు రూ.80 లక్షల నిధులతో సీసీ రహదారులు నిర్మించామన్నారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

నేడు తపోవనం ఆశ్రమంలో స్వామిజీ ఆరాధనోత్సవం

తుని గ్రామీణం: కుమ్మరిలోవ కాశీతపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ ఈ నెల 13న శివైక్యం పొందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో 25న స్వామిజీ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అన్నసమారాధనలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

విద్యుత్తు బస్సులు ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలి

తుని పట్టణం, ఏలేశ్వరం, న్యూస్‌టుడే : డిమాండ్లు పరిష్కరించాలని తుని, ఏలేశ్వరం డిపోల వద్ద మంగళవారం ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఏలేశ్వరం: ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

సంస్థ విద్యుత్తు బస్సులను కొని నడపాలని, డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాన్ని విడనాడాలని, ఖాళీలు భర్తీ చేసి, పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎం.ఎస్.ఎన్. రాజు, కేరావు, సాయిరామ్, త్రిమూర్తులు, శేఖర్,అప్పలరాజు, సూరిబాబు, నారాయణ, సతీష్, కార్మికులు పాల్గొన్నారు.

జీవోలు అమలుచేయాలి

గండేపల్లి, న్యూస్‌టుడే: సహకార సంఘ ఉద్యోగుల జీవో నంబరు 36ను అమలు చేస్తూ వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకురాలు చంద్రావతి అన్నారు. గండేపల్లిలో డీసీసీబీ బ్యాంకు ఎదురుగా 9వ రోజు సమ్మెకు సీఐటీయూ సభ్యులు మద్దతు పలికారు.

వినోద్‌మిశ్రా పార్టీ నూతన కార్యవర్గం

సీపీఐఎంఎల్ నూతన కార్యవర్గం

ఏలేశ్వరం : వినోద్ మిశ్రా (సీపీఐఎంఎల్) పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం లింగంపర్తిలో జరిగింది. రాష్ట్ర కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నాగమణి, సహాయ కార్యదర్శులుగా క్రాంతికుమార్, పాదాలమ్మ, సాయి, రాజారావు ఎన్నుకున్నారు.

సీసీ రోడ్లపై రయ్..రయ్

పల్లెపండగతో మహర్దశ

గండేపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి జగ్గంపేట నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 1.0లో భాగంగా మూడు మండలాల్లో పనులు పూర్తవ్వగా, పల్లెపండగ 2.0లో ప్రస్తుతం పనులు సాగుతున్నాయి.

గ్రామాల వారీగా నిధులు..(రూ.లక్షల్లో)

గండేపల్లి మండలంలో 1.0లో 20 పనులు జరిగాయి. గండేపల్లి 30, మల్లేపల్లి 40, మురారి 5 పనులకు 150లక్షలతో 565 మీటర్ల రోడ్లు వేశారు. పి.నాయకంపల్లిలో 15, సుబ్బయమ్మపేట 50, తాళ్లూరు 40, ఉప్పలపాడు 1.15, యల్లమిల్లి 40, జడ్.రాగంపేట 10తో రోడ్లు వేశారు. 2.0లో 20 పనులకు పి.నాయకంపల్లి 70, బొర్రంపాలెం 10, గండేపల్లి 30, మల్లేపల్లి 30, మురారి 50, నీలాద్రిరావుపేట 30, సూరంపాలెం 10, సింగరంపాలెం 10, సుబ్బయమ్మపేట 20, తాళ్లూరు 10 ఉప్పలపాడు 20 యర్రంపాలెం 10, జడ్.రాగంపేట 30 లక్షలతో పనులు పూర్తయ్యాయి.

మండలం	1.0లో పనులు	వెచ్చించిన నిధులు	2.0లో పనులు	వెచ్చిస్తున్న నిధులు
గండేపల్లి	17	5.3కోట్లు	20	3.5కోట్లు
జగ్గంపేట	48	7.98కోట్లు	16	3 కోట్లు
కిర్లంపూడి	23	6కోట్లు	19	6.3కోట్లు

మురారిలో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

మార్చి 31వరకు పూర్తి..

కొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. మార్చి 31 వరకు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు పూర్తిచేస్తాం.

- రాజేష్, ఇన్‌ఛార్జి జేఈ, పంచాయతీరాజ్‌శాఖ, గండేపల్లి

పేదల ఆకలి తీర్చడంలో డొక్కా సీతమ్మ ఆదర్శం

ఆహారపదార్థాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల ఆకలి తీర్చడంలో డొక్కా సీతమ్మ ఆదర్శం కావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. జగ్గంపేట పాత పోలీసు స్టేషన్ వద్ద భూపతి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా మంగళవారం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డన చేశారు. మాదారపు వీరబాబు, ముత్యాల వెంకటరాజు, మేడుబోయిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సైన్స్ క్విజ్ పోటీ

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి శ్రీహర్ష పాఠశాలలో సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం క్విజ్ పోటీ నిర్వహించారు. హెచ్ఎం గాలి కృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మౌనిక, సతీష్ పోటీని ఏర్పాటుచేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన విభిన్న అంశాలపై పోటీ జరిగింది. సీవీరామన్, చార్లెస్ డార్విన్, న్యూటన్, ఫ్లెమింగ్, ఆర్కిమెడిస్, ఐన్‌స్టీన్ శాస్త్రవేత్తల పేర్లతో పలు బృందాలు పోటీలో పాల్గొన్నాయి.

అవీ ఇవీ అన్నీ

నేటి నుంచి 'ఉపాధి' పనుల ఆడిట్

తొండంగి : ఉపాధిహామీ పథకం 2024-25కు సంబంధించి రూ.10 కోట్ల నిధులతో 945 పనులు తొండంగి మండలంలో జరిగినట్లు ఎస్ఆర్‌పీ లక్ష్మణ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో రామచంద్ర అధ్యక్షతన మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల క్షేత్ర సహాయకులు, గృహ నిర్మాణశాఖ అధికారులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలో జరిగిన ఉపాధి పనులను 20 రోజుల పాటు రెండు బృందాలు గ్రామాల్లో తిరిగి వివరాలు సేకరిస్తారన్నారు.

కిర్లంపూడి: గ్రామాల్లో గత ఏడాదిలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రారంభమైంది. మంగళవారం రాజుపాలెం, గెద్దనాపల్లి గ్రామాలలో చేపట్టిన పనులను సామాజిక తనిఖీ సిబ్బంది పరిశీలించారు. వీటికి సంబంధించి తనిఖీ పూర్తయిన అనంతరం 27వ తేదీ రాజుపాలెం, 28వ తేదీన గెద్దనాపల్లి గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల ఉపాధిహామీ ఏపీవో ఏవీబీ నాయుడు తెలిపారు.

'పది' విద్యార్థులకు సామగ్రి అందజేత

జగ్గంపేట గ్రామీణం: రాజపూడి వనదుర్గ మహాపీఠం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఉపకరణాలు అందజేశారు. మల్లిసాల 71, మన్యంవారిపాలెం ఉన్నత పాఠశాలలో 31 మంది విద్యార్థులకు మంగళవారం వీటిని అందజేశారు. తాళ్లూరి మహేష్‌బాబు, జగన్నాథస్వామి మరుద్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజా క్రీడా మైదానంలో ఇండస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్, ఇతరులకు మధుమేహం, రక్తపోటు, బరువు, ఎత్తు ఇతర పరీక్షలు చేసి వైద్యులు ఆరోగ్య సూచనలు చేశారు. ఆసుపత్రిలో ప్రతి శుక్రవారం గైనిక్ విభాగం ఓపీ ఉచితంగా చూస్తామని సీఈవో డా. చంద్ర మౌళీశ్వరరావు తెలిపారు. యూనిట్ హెడ్ లక్ష్మాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

తొండంగి, న్యూస్‌టుడే: మైభారత్ యూత్ స్పోర్ట్స్ వారు వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, తదితర క్రీడా సామగ్రిని కేపీపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మెహర్‌కు అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శంఖవరం: కత్తిపూడి జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలివీ.. కొంతంగి కొత్తూరు గ్రామానికి చెందిన గొర్లి అర్జున్ ద్విచక్రవాహనంపై వెళుతూ తుని వైపు ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన అర్జున్‌ను 108 సహాయంతో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు.

పునాది దశ దాటని సచివాలయం

గత ప్రభుత్వం సచివాలయ భవనం నిర్మాణానికి పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో ఆరేళ్లుగా శృంగవృక్షం సచివాలయ భవనం పునాదిదశ దాటలేదు. సుడి చెరువు సమీపంలో ఈ నిర్మాణం ప్రారంభించడంతో ఆ నీరు నిల్వ ఉంటోంది. దీంతో నాచుకట్టి దుర్వాసన వస్తోంది. సచివాలయానికి భవనం లేకపోవడంతో రైతు సేవా కేంద్రంలో కొనసాగుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తొండంగి

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్

గండేపల్లి మండలం తాళ్లూరు ప్రాథమిక పాఠశాల-2లో ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు 72 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక ఆర్వోప్లాంటు సరిపోతుంది. గత ప్రభుత్వం 'నాడు-నేడు' కింద అవసరానికి మించి రెండు ప్లాంట్లు ఏర్పాటుచేయడంతో ఒకటి అలంకారప్రాయంగా ఉంది. హెచ్ఎం నాగమణి మాట్లాడుతూ.. ఈ ప్లాంట్‌ను ఎంఈవోతో మాట్లాడి అవసరమున్న పాఠశాలకు అందజేసే ఏర్పాటుచేస్తాం. - న్యూస్‌టుడే, గండేపల్లి

తాగునీటి వృథాను అరికట్టరూ..!

జగ్గంపేట శెట్టిబలిజపేటలో తాగునీటి కుళాయిల ద్వారా అధికమొత్తంలో నీరు వృథాగా పోతోంది. కుళాయిలకు నిరోధకాలు లేకపోవడంతో నిరంతరాయంగా తాగునీరు మురుగుకాలువలోకి వెళ్తోంది. రెండ్రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. పంచాయతీ సిబ్బందికి సమాచారం తెలియజేసినా స్పందనలేదని కాలనీవాసులు పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : వాతావరణంలో వచ్చే పెనుమార్పులను ఎదుర్కొనే సన్నద్ధతపై ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం కార్యశాల నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.సునీత మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను అవగాహన చేసుకోవడం వల్ల నష్టాలను నివారించవచ్చన్నారు. అనంతరం లయ సంస్థ ప్రతినిధి శ్రీను, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ప్రయాగ మూర్తి నేతృత్వంలో పట్టణంలోని 20 వార్డుల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సర్వే చేసి మౌలిక అవసరాలను గుర్తించారు.

వాసవి సత్ర సముదాయము

శ్రీశైలం

స్థలం కావలెను

అన్నవరం దేవస్థానం పరిసర ప్రాంతాలలో సత్రం నిర్మించుటకు నివాస స్థలాల మధ్య 1/2 ఎకరం నుండి 1 ఎకరం వరకు స్థలం కావలెను.

ఆసక్తి గలవారు ఈ క్రిందివారిని సంప్రదించండి

దేవకి వెంకటేశ్వర్లు అధ్యక్షులు సెల్: 7993124155

CA పెనుగొండ సుబ్బారాయుడు ఆర్బిట్రేటర్ సెల్: 9440172460

శిద్ధా నాగేశ్వరరావు గౌ॥ అధ్యక్షులు సెల్: 9948293199

ఇల్లూరి లక్ష్మయ్య ప్రధాన కార్యదర్శి సెల్: 7095544444

మమ్మేలు.. దుర్గమ్మ

బళ్లారి వాసుల కొంగుబంగారం.. కనకదుర్గమ్మ దేవి సిడిబండి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా కొనసాగింది. లక్షలాది మంది భక్తులు కదలిరావడంతో నగర సమీపంలోని అమ్మవారి కోవెల పరిసరాలు కిక్కిరిసిపోయాయిలా.. మూలవిరాట్టుకు బంగారు కవచాలతో ప్రత్యేకంగా అలంకరించి.. భక్తుల దర్శనానికి అవకాశం కల్పించారు.

- న్యూస్‌టుడే, బళ్లారి

చల్లారని బాగలకోటె

బాగలకోటె, న్యూస్‌టుడే : శివాజీ జయంతి ఊరేగింపు సమయంలో వారం కిందట చోటుచేసుకున్న ఘర్షణల తాలూకు రగడను నివురుగప్పిన నిప్పులా బాగలకోటె పట్టణాన్ని వెన్నాడుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో నిషేధాజ్ఞలను ఈ నెల 28 వరకు పొడిగిస్తూ జిల్లా ఎస్పీ సిద్ధార్థ గోయల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో విధించిన నిషేధాజ్ఞలు మంగళవారంతో ముగిశాయి. తాము గురువారం మరోసారి జయంతి వేడుకలను ఆచరిస్తామని హిందూ సంఘాల ప్రతినిధులు చెప్పడంతో నిషేధాజ్ఞలను మరోసారి విస్తరిస్తున్నామని ఆయన వెల్లడించారు.

సెలబ్రిటీలపై మరింత బాధ్యత

రణ్‌వీర్‌కు హైకోర్టు చురకలు

ఈనాడు, బెంగళూరు : కన్నడ నటుడు రిషబ్‌శెట్టి నటించిన కాంతార ను అనుకరిస్తూ హిందీ నటుడు రణ్‌వీర్ సింగ్ ఇటీవల గోవాలోని ఓ వేదికపై చేసిన హావభావాలను కర్ణాటక హైకోర్టు తప్పుబట్టింది. రణ్‌వీర్ సింగ్ చేసిన అనుకరణ, ఆపై దేవతలను ఆడ దయ్యాలంటూ చేసిన వ్యాఖ్యలను ఆక్షేపిస్తూ కర్ణాటక హైకోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు కాగా.. మంగళవారం విచారణ చేపట్టారు. హైకోర్టు జస్టిస్ నాగప్రసన్న నేతృత్వంలోని ధర్మాసనం రణ్‌వీర్‌సింగ్ చర్యలను తీవ్రంగా తప్పుబట్టింది. రణ్‌వీర్ సింగ్ కానీ, ఇంకెవరైనా కానీ ఇతరుల సంస్కృతి, సంప్రదాయాలను అవమానపరిచే హక్కు ఉండదన్నారు. పైగా.. అందరూ హాజరైన వేదికలపై నోరు జారకుండా మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా రణ్‌వీర్ తరఫున ప్రముఖ న్యాయవాది సాజన్ పూవయ్య తన వాదనలను వినిపిస్తూ రణ్‌వీర్ సింగ్ చేసింది పూర్తిగా అవగాహన లోపంతోనేనని విన్నవించారు. ఆయనలో ఇతరులను బాధించాలన్న ఉద్దేశం లేదన్నారు. ఆయనకు స్థానిక సంప్రదాయాలపై అంతగా అవగాహన లేదన్నారు. తాను చేసింది తప్పని వెంటనే క్షమాపణ చెప్పినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ న్యాయవాది జగదీశ్ ఈ సందర్భంగా వాదిస్తూ కన్నడ నటీమణి దీపికా పదుకొనే ద్వారా స్థానిక సంప్రదాయాలు, విశ్వాసాలపై రణ్‌వీర్ సింగ్ తెలుసుకుని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. పైగా రిషబ్ శెట్టి వారిస్తున్నా రణ్‌వీర్ సింగ్ ఆగకుండా అనుకరణ చేస్తూనే ఉండటం వెనుక మంచి ఉద్దేశం ఉందని చెప్పలేమన్నారు. జస్టిస్ కలగజేసుకుని.. క్షమాపణ చెప్పగానే గతంలో చేసిందంతా సమసిపోయినట్లు భావించలేమన్నారు. ఆ నటుడు చేసిన అనుకరణ తాలూకూ వీడియోలు సామాజిక మాధ్యమంలో లభ్యమవుతున్నాయి కదా? అని నిలదీశారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అంత వరకు పోలీసులు రణ్‌వీర్‌పై బలవంతపు చర్యలకు పాల్పడాల్సిన అవసరం లేదన్నారు. విచారణకు సహకరించాలని నటుడి న్యాయవాదికి సూచించారు. రణ్‌వీర్‌సింగ్ అనుకరణను తప్పుబడుతూ న్యాయవాది ప్రశాంత్ మెథల్ ప్రైవేటు పిటిషన్ వేయగా, బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీసు స్టేషన్‌లోనూ కేసు నమోదైంది. తనపై వేసిన పిటిషన్‌ను, కేసును రద్దు చేయాలని కోరుతూ రణ్‌వీర్ సింగ్ ఇటీవలే హైకోర్టుకు మనవి చేశారు.



కన్నడిగులను వెక్కిరించిన రణ్‌వీర్ సింగ్ హావభావాలివే (పాతచిత్రం)

విమానాశ్రయంలో భారీగా గంజాయి స్వాధీనం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : బెంగళూరు శివార్లలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు రూ.2.8 కోట్ల విలువ చేసే హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడి తోపుడు సంచి (ట్రాలీ బ్యాగ్) పరిశీలించినప్పుడు ఆ సరకు ఉన్నట్లు గుర్తించారు. ఆ సంచి తరలించుకొస్తున్న ప్రయాణికుడిని అరెస్టు చేశారు. హాంకాంగ్ నుంచి వచ్చిన మరో ప్రయాణికుడి నుంచి తొమ్మిది వందల గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. దానివిలువ రూ.31.25 లక్షలని తేల్చారు. ఈ రెండు కేసుల దర్యాప్తు చేపట్టామని మంగళవారం ఇక్కడ ఓ ప్రకటనలో వెల్లడించారు.

శివుడి చుట్టూ చక్రవ్యూహం

సిద్ధరామయ్య వారసుడెవరో?

ఈనాడు, బెంగళూరు : దిల్లీ పెద్దల మనసులో ఏముందో తెలియకున్నా వారు తీసుకునే నిర్ణయాన్ని సవాలు చేసేందుకు అధికార కాంగ్రెస్‌లో ఓ బృందం తీవ్ర కసరత్తు చేస్తోంది. గత వారం రోజులుగా ఈ బృందం సుడిగాలి వేగంతో పావులు కదుపుతూ అవసరమైతే దిల్లీకి వెళ్లి వస్తూ తాము అనుకున్నది అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కసరత్తు అగ్రరాలా డీకే శివకుమార్ నాయకత్వానికి ప్రత్యామ్నాయం కానుందనేది ఆసక్తికరం. గత రెండువారాలుగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిర్వేద సందేశాలు, డీకే ధీమా వ్యాఖ్యలు, కొత్తతరం ఎమ్మెల్యేల లేఖాస్త్రం.. వెరసి రాష్ట్ర రాజకీయాల్లో ఏదో ఊహించని పరిణామం ఒకటి రాబోతోందన్న సంకేతాన్నిస్తోంది.

చెక్ పెట్టేందుకే..

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికార పీఠానికి దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తన రికార్డు స్థాయి బడ్జెట్ ఎలాగైనా ప్రవేశపెడతానంటూనే ఆయన ఆ తర్వాతైనా కొత్తతరానికి దారి చూపాల్సిందే. క్రమంగా సిద్ధు అధికార పట్టు చేజారిపోతోందని తెలియగానే ఆయన వారసుడి కోసం వెతుకులాట ప్రారంభమైంది. ప్రస్తుతానికి ఆయనకు పోటీ డీకే శివకుమార్ మాత్రమే కనిపిస్తున్నా ఆయన తరం నేతలు కొందరు అత్యున్నత స్థానం కోసం కన్నేయడం ప్రారంభించారు. వీరిలో సతీశ్ జార్కిహొళి, డాక్టర్ జి.పరమేశ్వర్ ముందు వరుసలో ఉన్నారు. సతీశ్ జార్కిహొళి అహింద నాయకుడిగా, డా.జి.పరమేశ్వర్ దళిత నాయకుడిగా తమ అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సతీశ్‌జార్కిహొళి గత వారం రోజుల్లోనే రెండు సార్లు దిల్లీకి వెళ్లారు, అఖిల ఏఐసీసీ అధ్యక్షుడి ఖర్గేతో నేరుగా చర్చించి స్పష్టమైన భరోసా పొందినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు సిద్ధరామయ్య చెప్పినట్లు దళిత సీఎం ప్రస్తావనతో డా.జి.పరమేశ్వర్ కూడా సీఎం రేసులోకి వచ్చారు.

నోటికి పదును

బహిరంగ అభిప్రాయం నుంచి ఏదైనా స్పష్టత అందుకున్నట్లుగానే కొందరు సీనియర్లు సిద్ధు నాయకత్వానికి ప్రత్యామ్నాయం కోసం పట్టుబిగిస్తున్నారు. వీరిలో మాజీ మంత్రి కె.రాజణ్ణ నేరుగా డీకే కంటే డా.జి.పరమేశ్వర్‌కు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. దళితనేత ముఖ్యమంత్రి కావాలనే అవకాశం ఇదేనంటూ ఆయన అభిప్రాయపడ్డారు. మల్లికార్జున ఖర్గే ఆ పదవిని చేపడితే మంచిదే..ఆయన కాకుంటే ఇప్పటికే రెండు పర్యాయాలు ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవం, సరిపడా కాలి అందుకోని డా.జి.పరమేశ్వర్‌కు ముందు అవకాశం ఇచ్చి ఆ తర్వాత డీకేకు కాలి చెల్లించాలని నేరుగా చెప్పారు. మరోవైపు పరమేశ్వర్ స్వయంగా దళిత సీఎం చర్చ మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ కమాండ్ మరే పార్టీలోనూ ఆ అవకాశం ఉండదు. కానీ అధిష్ఠానం మాత్రమే ఆ అవకాశాన్ని అందించగలదన్నారు. మంత్రి హెచ్.సి.మహదేవప్ప కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఆయన దారెటు?

పార్టీ అధ్యక్షులైన డీకే శివకుమార్‌కు సీనియర్ల నుంచి సహకారం అంతంత మాత్రమే. ఆయనకు అధిష్ఠానం అవకాశం కల్పించినా ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించే సీనియర్లు బారులు తీరడమే డీకేకు సవాలు విసిరే అంశం. తమ ప్రాంతాల్లో పార్టీపై నేరుగా ప్రభావం చూపగలిగే సీనియర్లు సతీశ్ జార్కిహొళి, పరమేశ్వర్, ఎం.బి.పాటిల్, హెచ్.కె.పాటిల్ తదితరులెవరూ డీకే నాయకత్వాన్ని స్వాగతించే స్థితిలో లేరు. ఈ సమయంలోనే ఆయన కొత్తతరం ఎమ్మెల్యేల ద్వారా మద్దతు సమీకరిస్తున్నారు. కానీ వీరంతా డీకేకు అడ్డుగా నిలిచే సిద్ధంగా లేరు. సముదాయాల వారీగా చూసినా డీకేకు ఒక్కలిగ ఎమ్మెల్యేలు తప్ప అహింద, అల్పసంఖ్యాక, ఎస్‌టీ సముదాయం నుంచి మద్దతు అంతంత మాత్రమే. ఈ సమయంలోనే ఆయన బయటి నుంచి మద్దతు కూడబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే జరిగితే పార్టీ పునాదులే కదిలే అవకాశం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా ఉండాలంటే మల్లికార్జున ఖర్గే స్వయంగా సీఎం పదవిని చేపట్టక తప్పదు.

శివకుమార్‌ను సత్కరిస్తున్న శివరాత్రి దేశికేంద్ర స్వామి

సిద్ధు స్పందిస్తేనే.. వారి నోళ్లకు తాళాలు

తేల్చిచెప్పిన డీకే

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి పీఠానికి సంబంధించి మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలను సిద్ధరామయ్యే నియంత్రించాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన విషయాలను తాను ఎప్పటికప్పుడు అధిష్ఠానంతో చర్చిస్తూ వస్తున్నానని తెలిపారు. మైసూరుకు సంబంధించి మంత్రి మహదేవప్ప వద్ద సమాచారం ఉండి ఉంటుందని, ఆయనే దళిత నాయకుడు ముఖ్యమంత్రి కావాలని వ్యాఖ్యలు చేసినట్లుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సుత్తూరు సదన్‌లో మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామి ఉప ముఖ్యమంత్రిని సత్కరించారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో డీకే మాట్లాడుతూ అధిష్ఠానం నుంచి తనకు ఎటువంటి ఫోన్‌కాల్ రాలేదన్నారు. ముఖ్యమంత్రి విషయం తనకు తెలియదని చెప్పారు. మా శాఖ పనులు, అనుమతులకు సంబంధించి దిల్లీకి వెళ్లవలసిన అవసరం ఉంటున్నారు. మంత్రి సతీశ్ జార్కిహొళి సీనియర్ నాయకుడని, తనతో కలిసి కార్యకర్తృత్వంలో సేవలు అందించారని చెప్పారు. వారిది ఒకసారైనా తామిద్దరం మాట్లాడుకుంటామన్నారు. పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడమే మా నాయకులందరి ఏకైక అజెండా అని చెప్పారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలు తమను మంత్రులుగా చేయాలని కోరారని, అందులో తప్పు కనిపించలేదన్నారు. తాను కూడా మొదటిసారి గెలిచి, సేవలు అందించానని గుర్తు చేశారు. తాను మొదటిసారి మంత్రి అయి 36 ఏళ్లయిందని, కొత్త వారికి అవకాశం ఇవ్వకుండా ఇప్పుడే పాతుకుపోయి ఉండడం కుదరదని వ్యాఖ్యానించారు. శివకుమార్‌ను ప్రభుత్వం కేటాయించిన నివాసంలో బీజేపీ నాయకులు మునిరత్న, రేణుకాచార్య కూడా వేర్వేరుగా కలిసి చర్చించారు. తమ నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలని కోరడానికే శివన్నను భేటీ అయ్యామని వారు పేర్కొన్నారు.

కోడలిని కాపాడిన అత్తమ్మ!

విజయపుర, న్యూస్‌టుడే : అత్తా కోడళ్లు అంటే ఉప్పు నిప్పు, పాము- ముంగిస అంటూ పోలికలు, పెడార్థాలు తీస్తుంటారు. యాదగిరి జిల్లా సురపుర తాలూకా మాళూరు గ్రామానికి చెందిన శాంతాబాయి అనే అత్త తన కోడలు బసమ్మకు మూత్రపిండాన్ని దానం చేశారు. తన కుమారుడు ప్రశాంత్ భార్య బసమ్మ తొమ్మిది నెలల నుంచి మూత్రపిండాలు రెండూ పని చేయకపోవడంతో డయాలసిస్ చేయించుకుంటోంది. బంధువుల్లో ఎవరూ మూత్రపిండాన్ని దానం చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆమె వైద్య పరీక్షలు చేయించుకుంది. కోడలికి మూత్రపిండం దానం చేయవచ్చని వైద్యులు చెప్పారు. విజయపురలోని ఆసుపత్రిలో అత్త మూత్రపిండాన్ని కోడలికి అమర్చారు. 'తన కుమార్తె ఇదే స్థితిలో ఉంటే తాను మూత్రపిండాన్ని ఇవ్వకుండా ఉంటానా' అని శాంతాబాయి పేర్కొనగా, 'మా అత్త నాకు దేవునితో సమానం. ఆమె నాకు పునర్జన్మను ప్రసాదించింది' అని బసమ్మ పేర్కొంది.

'అగ్నిమాపక' ఉద్యోగాల భర్తీకి చర్యలు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రాష్ట్ర అగ్నిమాపక శాఖలో ఉన్న 1600 ఉద్యోగ ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని హోంశాఖ మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ప్రకటించారు. ఆయన స్థానిక బన్నేరుఘట్ట రోడ్డులోని ఆర్.ఎ. ముండ్కూర్ అగ్నిమాపక శిక్షణ అకాడమీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖ, హోమ్‌గార్డు, పౌరరక్షణ, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులకు ముఖ్యమంత్రి పతకాలను ప్రదానం చేశారు. ఆ శాఖకు 40 నూతన వాహనాలను సమకూర్చి ప్రారంభించారు. పోలీసు గృహ పథకం కింద 40 వేల గృహాలను నిర్మించామని వివరించారు. అగ్నిమాపక సిబ్బందికీ ఈ సేవలు విస్తరిస్తామన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు అనుమతించాలని ముఖ్యమంత్రికి విన్నవించానన్నారు. ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించడం మరింత బాధ్యతతో కూడుకున్న పూనిగా గుర్తుచేశారు.

ప్రిన్సిపల్‌కు ఊరట

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : గాంధీజయంతికి శుభాకాంక్షలు చెప్పే హడావిడిలో జాతీయ పతాకంపై చెప్పులు ధరించి నిలబడినట్లు ఎడిట్ చేసిన ఫొటోను వాట్సప్ స్టేటస్‌లో ఉంచుకున్న బీసీ వేణుగోపాల్ అనే ప్రిన్సిపల్‌పై నమోదైన కేసును జస్టిస్ ఎం.నాగప్రసన్న కొట్టివేశారు. తనపై నమోదైన కేసు రద్దు చేయాలని కోరుతూ నాగసంద్రలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రిన్సిపల్ అర్జీ వేసుకున్నారు. తన చిత్రాన్ని విద్యార్థి ఎడిట్ చేసి ఇవ్వగా, తాను దాన్ని చూసుకోకుండా వాట్సప్ స్టేటస్‌లో ఉంచానని వేణుగోపాల్ తెలిపారు. ఇది పొరపాటున జరిగిన ఘటనగా పరిగణనలోకి తీసుకుని, ప్రిన్సిపల్‌పై నమోదైన కేసును న్యాయమూర్తి కొట్టివేశారు.

దద్దరిల్లిన ధార్వాడ

ఆందోళనకారులకు మద్దతుగా కదలివచ్చిన భాజపా నాయకుడు ఆర్.అశోక్ తదితరులు

ధార్వాడ, న్యూస్‌టుడే : ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీనగర కూడలిలో వేలాది మంది నిరుద్యోగులు మంగళవారం ధర్నాకు దిగారు. ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడంతో అఖిల కర్ణాటక విద్యార్థి సంఘం ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. విచారణ మార్చి 3కు వాయిదా పడింది. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా, నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఫొటోలను ప్రదర్శిస్తూ వారికి

ఉద్యమించిన నిరుద్యోగులు

వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీనగర కూడలి నుంచి జయనగర కూడలికి వెళుతున్న ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకు భాజపా నాయకులు మద్దతు పలికారు. అవాంఛిత ఘటనలకు తావివ్వకుండా నగర కొత్వాలు శశికుమార్ అక్కడకు వచ్చి పరిస్థితులు అదుపు తప్పకుండా చర్చలు చేపట్టడంతో నిరుద్యోగులు వెనక్కితగ్గారు.

ప్రభుత్వం దివాలా తీసింది

ప్రభుత్వం పూర్తిగా దివాలా తీయడంతోనే ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదని విపక్ష నాయకుడు అశోక్ ఆరోపించారు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇద్దరూ ముఖ్యమంత్రి పీఠం కోసం పరోక్షంగా యుద్ధం చేసుకుంటూ, ఖాళీగా ఉన్న 2.5 లక్షల పోస్టులను భర్తీ చేయలేదని ఆరోపించారు. తక్షణమే 65 వేల పోస్టులను భర్తీ చేయాలని ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేసి ఆరు నెలలైనా ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు.

ధార్వాడ వీధుల్లో హోరెత్తిన నిరుద్యోగుల ఆందోళన

దుస్థితికి కారణమేంటి?

భాజపా అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడిందని, ఆ కారణంతోనే నేటి యువత నిరుద్యోగులుగా మారారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. భాజపా అధికారంలో ఉన్నప్పుడు 2019 నుంచి 2023 వరకు నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలతోనే పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతోందని చెప్పారు. యువత, నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుందన్నారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి అభ్యర్థి కలలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి 2.64 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తు చేశారు. గత రెండున్నరేళ్లలో ఆయా శాఖల్లో 40 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశామన్నారు. నియామక ప్రక్రియలకు గరిష్ఠ వయోపరిమితిని అదనంగా ఐదేళ్ల పాటు సడలించామని గుర్తు చేశారు. విద్యార్థులను తన రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్న భాజపా నాయకులు తాము చేసిన తప్పులను ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

సర్కారు.. శుభవార్త

బెంగళూరు (మల్లేశ్వరం) : రాష్ట్రంలోని 32 శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి సర్కారు ముందడుగు వేసింది. ఇప్పటికిప్పుడు 24,300 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ మంగళవారం ఆమోదం పలికింది. ధార్వాడలో నిరుద్యోగులు ధర్నాకు దిగిన వెంటనే ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. వీటిలో ఏ గ్రేడు 542, బి గ్రేడు 619 ఉండగా, ఎఫ్ డీ సీ గ్రూపుల పోస్టులు 23,119 ఉన్నాయి.

నిరుద్యోగులను అడ్డుకోవడానికి రంగంలోకి దిగిన రక్షకభటులు

మారికాంబ మాత

మారికాంబ మహోత్సవం!

శివమొగ్గ, న్యూస్‌టుడే : మలెనాడు పాదప్రాంత మహా నగరి.. శివమొగ్గ ఊరి దేవత మారికాంబ దేవి జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 28న అమ్మవారి ఉత్సవమూర్తిని అడవిలో విడిచి పెట్టి రావడంతో జాతరకు తెరపడుతుంది. మార్చి 6న మారికాంబ దేవాలయం సమితి తరపున కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు. గాంధీబజార్ ప్రాంతంలోని మారికాంబ పుట్టిన ఇంట్లో పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం.. బ్రాహ్మణ నాడిగరు పుట్టింటి నుంచి తెచ్చిన బాసింగాన్ని నుదుటన కట్టివివాహం చేయించారు. మాంగల్యధారణ అనంతరం అమ్మవారికి పూజ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం వేకువ జాము నుంచే భక్తులు కదలి వచ్చారు. ఉప్పార సముదాయం భక్తులు అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఊరేగించారు.

విద్యార్థిపై రాక్షసంగా దాడి

సంకేత్

శివమొగ్గ, న్యూస్‌టుడే : ప్రత్యేక తరగతులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో తన స్నేహితునితో గొడవ పడుతున్న వారిని అడ్డుకునే ప్రయత్నంలో పదో తరగతి విద్యార్థి సంకేత్ (16) సోమవారం రాత్రి హత్యకు గురయ్యాడు. సూళెబైలు ప్రభుత్వ పాఠశాల ఆవరణ వెలుపల అతనిపై ఐదుగురు బాలలు దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ప్రభుత్వ మెగ్గాన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. దాడి చేసిన వారిలో నలుగురు బాలలను తుంగానగర ఠాణా పోలీసులు అదుపులోనికి తీసుకున్నారని ఎస్పీ నిఖిల్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. తరగతులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో తన పొరుగింట్లో ఉంటున్న గిరీశ్‌పై ఐదుగురు బాలలు దాడి చేస్తున్నట్లు గుర్తించి సంకేత్ వారిని వారించేందుకు ప్రయత్నించాడు. వారంతా కలిసి సంకేత్‌పై దాడి చేశారు. ఛాతీపై వారు ముష్టిఘాతాలు కురిపించడంతో సంకేత్ తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. ఆ బాలుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు, విద్యాశాఖ రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించిందని జిల్లాధికారి ప్రభులింగ తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ హామీనిచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇతర మతాలకు చెందిన వారి ఆగడాలు ఎక్కువయ్యాయని హిందూ జాగరణ వేదికె, భాజపా నాయకులు ఆరోపించారు. శివమొగ్గలో కొద్ది రోజులుగా ముస్లిం యువకుల ఆగడాలు ఎక్కువయ్యాయని ధ్వజమెత్తారు. పరిస్థితులు అదుపు తప్పకుండా తుంగానగర ఠాణా పరిధిలో ముందు జాగ్రత్తగా కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు.

కాంగ్రెస్ కార్యకర్తల కన్నెర్ర

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలను ఇష్టానుసారం విమర్శించిన భాజపా బహిష్కృత శాసనసభ్యుడు బసనగౌడ పాటిల్ యత్నాళ్‌ను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బెంగళూరులోని ఆనందరావు కూడలి వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నాకు దిగారు. జాతిపిత మహాత్మాగాంధీని పాక్ జాతిపితగా తప్పుబట్టిన యత్నాళ్‌పై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండు చేశారు. ఆందోళనలో నేతలు ఎ.ఆనంద్, కుశాల్ హరువేగౌడ, ఆనందకుమార్, పుట్టరాజు, ఉమేష్, నవీన్‌సుంకదకట్టి, హేమరాజ్,నవీన్‌సాయి, ప్రవీణ్‌రావు, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

6న గుత్తేదార్ల ధర్నా

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : తాము చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి తదితరులను పలుమార్లు భేటీ అయినా స్పందించలేదని రాష్ట్ర గుత్తేదార్ల సంఘం అధ్యక్షుడు మంజునాథ్ ఆరోపించారు. ఆయా శాఖల అధికారులు, మంత్రులకు లేఖలు రాశామని తెలిపారు. తుమకూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 6న బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో అన్ని ప్రాంతాలకు చెందిన గుత్తేదార్లతో ధర్నాను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం తమకు ఇవ్వవలసిన రూ.35 వేల కోట్ల బకాయిలను విడుదల చేసేంత వరకు పనులు నిలిపివేయాలని ఇప్పటికే తీర్మానించామని చెప్పారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

దుర్గమ్మకు భక్త నీరాజనం

- వైభవంగా సిడిబండి రథోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు

దుర్గమ్మకు బోనాలు తెస్తున్న మహిళా భక్తులు

బళ్లారి, న్యూస్‌టుడే: అమ్మలగన్న అమ్మ.. బళ్లారి కనకదుర్గమ్మ..జై దుర్గమ్మ...జై జై బళ్లారి దుర్గమ్మ అనే స్మరణాలతో దుర్గమ్మ ఆలయం మారుమోగింది. భక్తుల కొంగు బంగారంగా కొలిచే బళ్లారి కనక దుర్గమ్మ సిడి బండి రథోత్సవం మంగళవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల మధ్య సిడిబండి రథోత్సవం జరిగింది. దుర్గమ్మ దేవస్థానం వద్ద భక్తిపారవశ్యం నెలకొంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యారు. ఈ


ఆలయ రాజగోపురానికి ముస్తాబు

సందర్భంగా గానుగ సముదాయం ప్రజలు స్థానిక కౌల్‌బజార్‌లోని గానుగ వీధి నుంచి మూడు జతల ఎద్దులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. మొదట దుర్గమ్మ ఆలయం తూర్పు దిక్కున ఉన్న పోలేరమ్మ గుడిలో ఎద్దులకు ప్రత్యేక పూజలు చేయించారు. బళ్లారి సణ్ణ దుర్గమ్మ గుడి నుంచి ధర్మకర్త, ప్రధాన అర్చకుడు రాజశేఖర్ నేతృత్వంలో కుంభ బోనాలను అమ్మకు సమర్పించి సిడి బండి వద్దకు తెచ్చారు. ఎద్దులకు ప్రత్యేక పూజలు చేయించి సిడిబండి రథోత్సవాన్ని ప్రారంభించారు. గుడి చుట్టూ సిడిబండిని మూడు ప్రదక్షిణలు చేశారు. బండిపైకి పలువురు భక్తులు కోళ్లు, అరటి పండ్లు, పూలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. రథం వద్దకు భక్తులు రాకుండా ఎస్పీ డా.డి. సుమన్ పెన్నేకర్, ఏఎస్పీలు రవికుమార్, నవీన్‌కు మార్‌ల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తాడు సాయంతో రక్షణకవచం ఏర్పాటు చేసి నియంత్రించారు.

పోటెత్తిన భక్తులు

బళ్లారి కనక దుర్గమ్మ సిడిబండి రథోత్సవం సందర్భంగా అమ్మకు బంగారు ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్ధ రాత్రి దాటిన తర్వాత తరలివచ్చిన భక్తులు అమ్మను దర్శించుకొని పునీతులయ్యారు. ఎస్పీ కార్యాలయం వరకు నిలబడిపోయారు. ఉదయం 4 గంటలకు వరుసలో ఉన్న భక్తులు 9 గంటల తర్వాత దర్శనం

విద్యుత్తు దీపాలతో అమ్మవారి దేవస్థానం అలంకరణ

చేసుకున్నారు. చిన్న పిల్లలతో వచ్చిన తల్లులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. వారికి ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేయకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సిడిబండిపై నిలబడి ఆలయం చుట్టూ తిరిగారు. ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాలి సోమశేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు సిడిబండిని దర్శనం చేసుకున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలకు భక్తులకు ప్రసాదం, మంచి నీళ్లు, మజ్జిగ వితరణ చేశారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాలతో అలంకరణ

అనుమతుల్లేని రిసార్టులపై చర్యలు

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళ జిల్లాలో అనుమతులు లేని రిసార్టులు, హోంస్టేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాలనాధికారి సురేశ్ ఇట్నాళ సూచించారు. ఆయన ఈ విషయమై మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశమై చర్చించారు. ఇప్పటికే ఎఫ్‌ఐఆర్‌లు నమోదైన వాటి ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. ప్రతి ఒక్కటీ పాలనాధికారే చెప్పాలా? అలా అయితే మీ బాధ్యతలు ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దాఖలాలు పరిశీలించక హోంస్టేలు, రిసార్టులకు నిర్మాణ అనుమతులు ఇచ్చిన అధికారులపై సైతం చర్యలు తప్పవన్నారు. పర్యావరణ సూక్ష్మ ప్రాంతాల్లో రిసార్టులకు అనుమతులు ఇవ్వరాదన్నారు. రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా సర్వే చేసి వీటిని గుర్తించాలన్నారు. హంపీ ప్రాధికార పరిధిలో రిసార్టులకు అనుమతి ఇవ్వరాదన్నారు. హంపీ కెఫె, మిడోస్ రిసార్టుల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఉప లోకాయుక్త దాఖలు చేసుకున్న సుమోటో కేసుకు సంబంధించి నివేదికలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రామ్ అరసిద్ధి, జడ్పీ సీఈవో వర్ణిత్ నేగి, డీఎఫ్‌ఓ నిర్మలా, పర్యాటక శాఖ సహాయక సంచాలకులు నాగరాజ పాల్గొన్నారు.

అనుమతుల్లేని రిసార్టులపై అధికారులతో చర్చిస్తున్న పాలనాధికారి సురేశ్ ఇట్నాళ

ఆమె విసిరింది.. తేనెవల

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : శీతల పానీయంలో మత్తు మందు కలిసి తనపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపణలు చేసిన యువతికి వ్యతిరేకంగా ఓ యువకుడు మలేశ్వరం ఠాణాలో ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. 'తేనెవల' విసిరి నగదు కోసం తనను ఆ యువతితో పాటు ఓ ప్రైవేట్ ఛానల్ ఉద్యోగి ఇమ్రాన్ బెదిరిస్తున్నారని బాధితుడు నిఖిల్ ఆరోపించారు. నిఖిల్ ఫిర్యాదుతో ఇమ్రాన్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి విచారణ చేపట్టారు. స్నేహితుడు డిక్సన్ చంద్ర ద్వారా ఆ యువతి పరిచయమైందని, ఈనెల 14న జక్కూరులోని ఓ విల్లాలో విందులో ఆమెతో కలిసి నృత్యం చేసినట్లు బాధితుడు వివరించాడు. డబ్బు కోసం ఆ ఇద్దరూ 'వీడియో'లతో బెదిరిస్తున్నట్లు వివరించాడు.

జలసాహస క్రీడలతో దేహదారుఢ్యం

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: విద్యార్థుల మానసిక, శారీరిక సామర్థ్యాన్ని జలసాహస క్రీడలు పెంచుతాయని భారత్ స్కౌట్స్, గైడ్స్ సంస్థ రాష్ట్ర ప్రధాన కమిషనర్, మాజీ మంత్రి పి.జి.ఆర్. సింధ్యా పేర్కొన్నారు. మంగళవారం హిరియూరు సమీపంలోని వాణివిలాస్ సాగర్ జలాశయంలో బెంగళూరుకు చెందిన జనరల్ తిమ్మయ్య సాహస అకాడమీ, జిల్లా స్కౌట్స్, గైడ్స్ సంస్థ సంయుక్తంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన జలసాహస క్రీడల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జలసాహస క్రీడల్లో శిక్షణ పొందితే విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. జిల్లా కమిషనర్ మంజునాథ్, కార్యదర్శి లింగారెడ్డి, తాలూకా విద్యాశాఖ అధికారి మహ్మద్ మహసిన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్కౌట్స్, గైడ్స్ కమిషనర్ పి.జి.ఆర్. సింధ్యాను సత్కరిస్తున్న జిల్లా అధికారులు

మాదక ద్రవ్యాల విక్రేతల అరెస్టు

జప్తు చేసుకున్న మాదక ద్రవ్యాలు. నిందితులు

మైసూరు : రాచనగరిలో యువతకు మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నలుగురిని మండి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. జియావుల్లా, జావెద్ అహ్మద్, సోహెల్, నూయేద్‌లను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.10.30 లక్షల విలువైన 103 గ్రాముల ఎండీఎంఏ గుళికలను జప్తు చేసుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వీరు మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

రాజధానిలో వాహనాల సోదా

నగరంలోకి పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు వస్తున్నాయని వచ్చిన సమాచారంతో బెంగళూరు ఉత్తర విభాగం పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాలను నిలిపి సోదా చేశారు. మల్లేశ్వరం, యశవంతపుర, రాజాజీనగర, ఆర్ఎంసీ యార్డు తదితర ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల నియంత్రణ విభాగం అధికారులతో కలిసి పోలీసులు సోదాలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వ్యవహరించిన కొందరిని ఠాణాలకు తీసుకువెళ్లి, విచారణ అనంతరం వారిని విడిచి పెట్టారు.

పథకాలు అర్హులకు చేర్చడమే లక్ష్యం

- వక్ఫ్ ఆస్తుల సంరక్షణకు చర్యలు

మైనార్టీ శాఖ ప్రగతి పరిశీలన సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్ నాసీర్ హుసేన్, చిత్రంలో అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలు, నిధుల విడుదలపై అవగాహన కల్పించాలని రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్ నాసీర్ హుసేన్ అధికారులకు సూచించారు. బళ్లారి పాలనాధికారి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రగతి పరిశీలన సమావేశంలో రాజ్యసభ సభ్యుడు మాట్లాడారు. ఆయా శాఖల్లో మైనార్టీల కోసం ప్రవేశపెట్టిన పథకాల జాబితాను సిద్ధం చేసి అర్హులకు అందడానికి తగిన ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వాలు మైనార్టీల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి 15 అంశాల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. వాటిని క్షేత్ర స్థాయిలో అర్హులకు అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సరైన అవగాహన లేక పోవడంతో పథకాలు వారి దరిచేరడంలేదని విచారం వ్యక్తం చేశారు. మైనార్టీ సంక్షేమశాఖాధికారులు, ఇతర అధికారుల సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకొనేవిధంగా సమాచార శాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

పురోగతి సాధించాలి

వివిధ విభాగాల్లో మైనార్టీలకు అందించాల్సిన సౌకర్యాలు, పథకాల అమల్లో పురోగతి సాధించాలి. ప్రజలు దరఖాస్తులు చేసుకోవడం లేదు. బ్యాంకులు రుణాలు అందించడం లేక పోవడంతో పురోగతి సాధించడం లేదని అధికారులు చెబుతున్నారని రాజ్యసభ సభ్యుడు పేర్కొన్నారు. అధికారులు, బ్యాంకు అధికారులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేస్తే పథకాల సద్వినియోగం అనుకూలంగా ఉంటుందని నాసీర్ చెప్పారు.

ఆక్రమణదారులపై చర్యలేవీ?

నగరంలో వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకున్న కేసు వెలుగులోకి వచ్చింది. నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విచారం వ్యక్తం చేశారు. అధికారులు ఏమి చేస్తారో తెలియదు. సంబంధిత సమాచారం, పత్రాలన్నింటినీ వెంటనే తనిఖీ చేసి సమర్పించాలని రాజ్యసభ్యుడు సయ్యద్ నాసీర్ హుసేన్ అధికారులకు, జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులకు గట్టిగా చెప్పారు. డీసీ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు, తమ శాఖల నిర్దేశించిన ప్రణాళికలు, సౌకర్యాలు, భౌతిక, ఆర్థిక లక్ష్యాలు గురించి సమావేశానికి, అనుబంధ సమాచారాన్ని అందించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్, జడ్పీ ఉప కార్యదర్శి శశికాంత్ శివపురే, కర్ణాటక మైనార్టీ అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ మహబూబ్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న క్రిస్టియన్ అభివృద్ధి మండలి రాష్ట్ర సభ్యుడు రవికుమార్, కార్పొరేటర్ కుబేర్, అధికారులు

పులుల రాజ్యంలో విహారి రాజసం!

ఆబాల గోపాలాన్నీ ఆకట్టుకునే పులుల సఫారీ

స్వేచ్ఛగా సంచరిస్తున్న పులులు

యశ్వంతపుర, మైసూరు, న్యూస్‌టుడే : ప్రజల నిరసనలు మధ్య బండీపుర జాతీయ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు అటవీశాఖ అనుమతించింది. ఆకులు రాలే కాలంలో అటవీ ప్రదేశంలోకి సందర్శకులను అనుమతించరాదని పర్యావరణ ఉద్యమకారులు, గ్రామీణులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా.. అధికారులు స్పందించలేదు. వన్యజీవులకు ప్రమాదం వాటిల్లుతుందనే ఆందోళన నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకుంటూ సఫారీకి అనుమతించారు. వన్యజీవులకు ప్రమాదాలు ఎదురవుతున్న నేపథ్యంలో కొన్ని నెలలుగా సందర్శకులను అనుమతించలేదు. వేసవి ముంచుకు రావడంతో కుటుంబసభ్యులతో కలిసి ఈ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు పెద్దలు ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి సిద్ధమైన వన్యజీవులు సంచరించే అటవీ ప్రదేశాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీ, పర్యాటక శాఖలు అన్ని రకాల సౌకర్యాలూ కల్పించాయి. మైసూరుకు దగ్గరలో చామరాజనగర జిల్లాలో ఉన్న ఈ ప్రాంతంలో పులులు, ఏనుగులు, జింకల సంఖ్యకు కొదవేలేదు. మైసూరు నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. వివిధ ప్రాంతాల వారు మైసూరుకు చేరుకుంటే.. అక్కడి నుంచి సురక్షిత వాహనాల్లో ఉద్యానవన సందర్శనకు కదలవచ్చు. అటవీ ప్రదేశంలో జంగిల్ లాడ్జిలలో రాత్రి బస ఓ మధురానుభూతి. ఆన్‌లైన్‌లోనే గదులు రిజర్వు చేసుకునే సౌకర్యం కల్పించారు. పులుల సఫారీ

సఫారీలో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు

బండీపురలో తరచుగా కనిపించే ఏనుగుల దండు

ఇక్కడ ప్రత్యేకం. బండీపుర జాతీయ ఉద్యానవనంలో 73 పులులున్నాయి. దేశంలోనే అరుదైన నల్లపులులు చూడొచ్చు. మొత్తం 874 చదరపు కిలోమీటర్ల పరిధిలో బండీపుర విస్తరించగా.. దీని పరిధిలో సహజసిద్ధ కొండలు, చెరువులు, కుంటలు లెక్కలేనన్ని చూడొచ్చు. పులులు, ఏనుగుల కదలికలను తెలుసుకునేందుకు వాటి చెవులకు మైక్రో చిప్స్‌ను అమర్చి.. సందర్శకులకు వాటిని చూపి సంతోషపరచడం సఫారీ నిర్వాహకుల వంతు. వేటగాళ్లను నియంత్రించేందుకు 68 సీసీ కెమెరాలతో కాపలా కాస్తున్నారు. 1973లో మైసూరు మహారాజులు 90 చదరపు కిలోమీటర్ల పరిధిలో వేణుగోపాల్ అటవీ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయగా.. తదనంతర కాలంలో ఇది బండీపురగా రూపాంతరం చెందింది. తొలినాళ్లలో 12 పులులే ఉండేవి.

ఉక్కు కార్ఖానాల విస్తరణకు నిరసనగా కొప్పళ బంద్

గంగావతి,న్యూస్‌టుడే: బల్డోటా, మరికొన్ని ఉక్కు కార్ఖానాల విస్తరణకు వ్యతిరేకంగా జిల్లా బచావో ఆందోళన సమితి మంగళవారం పాటించిన కొప్పళ బంద్ విజయవంతమైంది. పట్టణంలో వాహన సంచారం స్తంభించింది. పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడంతో దుకాణాలు మూతపడి వీధులు, ప్రయాణ ప్రాంగణం నిర్మానుష్యంగా కనిపించాయి. ఆందోళనకారులు గవిమఠం మైదానం నుంచి నగర సభ వద్ద నిర్మించిన వేదిక వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. బాధిత గ్రామాల ప్రజలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్ఖానాల పొగకు మసిబారిన పంటలను ఎడ్లబండ్లపై ప్రదర్శించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో తదుపరి పోరాటంపై నిర్ణయాలు తీసుకున్నారు. బల్డోటా విస్తరణ రద్దయ్యే దాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా మంత్రి, ప్రజాప్రతినిధులు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లి ప్రభుత్వంతో చర్చించాలన్నారు. ఐఐఎస్‌సీ, ఐఐఐఎంఎస్ బృందాలతో పర్యావరణ, ఆరోగ్య సమీక్షలు నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి బాధిత గ్రామాలను సందర్శించాలని డిమాండ్ చేశారు. స్వామీజీలతో కలిసి బాధిత గ్రామాలకు పాదయాత్రలు చేయనున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ, శాసనసభ్యుడు రాఘవేంద్ర హిట్నాళ, మాజీ సభ్యులు సంగణ్ణ కరడి, ఏటీ రామస్వామి, రైతు సంఘం రాష్ట్ర ప్రతినిధులు బడగలపుర నాగేంద్ర, చామరస మాలీపాటిల్, పోరాట సమితి సభ్యులు అల్లమ ప్రభు బెట్టదూరు పాల్గొన్నారు.

కొప్పళలో ఆందోళనకారుల ప్రదర్శన

నిర్మానుష్యంగా కొప్పళ వీధులు

'కాళింగ' మనుగడకే గడ్డుకాలం

మంగళూరు, న్యూస్‌టుడే : పిలికుల జైవిక ఉద్యానవనంలో కాళింగ సర్పాల సంతానాభివృద్ధి కేంద్రానికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2 కోట్లకు పైగా విడుదల చేసింది. వాటికి సరైన ఆహారం, సంరక్షణ లేకపోవడంతో పాములు, వాటి పిల్లలు మరణిస్తూ వస్తున్నాయి. ఈ కేంద్రంలో 2022 జులైలో గుడ్ల నుంచి 38 కాళింగ సర్పాల పిల్లలు బయటకు వచ్చాయి. వాటిలో ఒక్కటీ ఇప్పటి వరకు బతికి లేవు. పాలక మండలి ప్రతినిధులు మాత్రం వాటిని చార్మాడి ఘాట్ వద్ద అడవిలో విడిచి పెట్టామని నిర్లక్ష్యపు సమాచారం ఇచ్చారు. పశ్చిమ కనుమల్లో పాము పిల్లలు, ఇతర వన్యప్రాణులను విడిచి పెట్టాలంటే అటవీశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.

స్నాతకోత్సవ సంబరం

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ విశ్వవిద్యాలయంలో కన్నడ డిండిమ మార్మోగింది. మంగళవారం సాయంత్రం వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన 34వ స్నాతకోత్సవం, నుడి హబ్బ కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ పాల్గొని ఆచార్య సి.మహాదేవప్ప, డాక్టర్ హెచ్.సి.సత్యన్‌లకు ప్రతిష్ఠాత్మక నాడోజ పురస్కారం ప్రదానం చేశారు. మార్క్సవాది జి.రామకృష్ణ గైర్హాజరయ్యారు. ఇదే సందర్భంగా 107 మంది పరిశోధక విద్యార్థులు పిహెచ్.డి., పట్టా అందుకున్నారు. మంత్రి డాక్టర్ సుధాకర్, వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి, కులసచివుడు డాక్టర్ విరూపాక్షి పూజారహళ్లి, సిండికేట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మహాదేవప్ప, డాక్టర్ సత్యన్‌లకు నాడోజ పురస్కారం ప్రదానం చేస్తున్న గరవ్నర్ థావర్ చంద్ గహ్లోత్

ఓ గ్యాలరీలో క్రికెట్ పోటీ వీక్షించేందుకు విచ్చేసిన అభిమానులు

హుబ్బళ్లిలో 'రంజీ' క్రికెట్ జోష్

మైదానంలో వెంకటేశ్‌ప్రసాద్, సునీల్‌జోషి, మిథున్‌మన్హాస్, కేఎస్‌సీఏ సభ్యులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : హుబ్బళ్లిలోని కేఎస్‌సీఏ మైదానంలో మంగళవారం నుంచి ప్రారంభమైన రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీల ఫైనల్స్ వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు కదలివచ్చారు. కర్ణాటక- జమ్ము కశ్మీర్ జట్ల మధ్య పోరు చూడటానికి ఉదయం నుంచే టికెట్లను కొనుగోలు చేశారు. కర్ణాటక జట్టు పదేళ్ల తర్వాత ఫైనల్స్‌కు చేరడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అంచనాకు మించి అభిమానులు కదలిరావడంతో గ్యాలరీలు కిటకిటలాడాయి. పోటీ ఐదు రోజుల పాటు కొనసాగుతుంది. రానున్న రోజుల్లో ఇక్కడ ఐపీఎల్ పోటీలూ కొనసాగించాలని అభిమానులు కోరారు. కొందరు యువతీ, యువకులు భారత జట్టు జెర్సీలతో అలరించారు. దుకాణాల్లో ఆటగాళ్ల జెర్సీలకు భారీ గిరాకీ ఏర్పడింది. అత్యధికులు కె.ఎల్.రాహుల్ జెర్సీ కొనుగోలుకు పోటీ పడుతున్నట్టు ఓ వ్యాపారి తెలిపారు.

● భారత జట్టు తరపున పాల్గొనడం తనకు గర్వకారణంగా ఉందని అంతర్జాతీయ మాజీ క్రికెటర్ సునీల్‌జోషి ఆనందాన్ని వ్యక్తం చేశారు. హుబ్బళ్లిలోని రాజానగర కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) మైదానం పెవిలియన్ ఒకటో బ్లాక్‌కు ఆయన పేరు పెట్టారు. ఆ సందర్భంగా జోషి ఆనందానికి అవధులు లేవు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీసీఐ అధ్యక్షుడు మిథున్‌మన్హాస్ నూతన పెవిలియన్ బ్లాక్‌ను ఆవిష్కరించారు. తనకు ఇంతటి గౌరవం లభిస్తుందని అనుకోలేదని సత్కార కర్త స్పందించారు. రాష్ట్రకవి కువెంపు చెప్పినట్టు మన సాధనలు ఎవ్వరికైనా స్ఫూర్తి కావచ్చునన్నారు. 14 సంవత్సరాల వయస్సులో గదగ నుంచి హుబ్బళ్లికి క్రికెట్ ఆడేందుకు వచ్చేవాడినని తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. సొంత ఊరు గదగ.. ఇష్టమైన క్రికెట్ నేర్పింది మాత్రం హుబ్బళ్లి నగరమేనని గుర్తుచేసుకున్నారు. కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్‌ప్రసాద్, కార్యదర్శి సంతోష్ మెనెన్, సంయుక్త కార్యదర్శి బి.కె.రవి, కోశాధికారి మధుకర, ఉపాధ్యక్షులు సుజిత సోమసుందర్, వీరణ్ణసవడి, డాక్టర్ నవనీత జోషి తదితరులు పాల్గొన్నారు.

చిక్కఒడెయరు తల్లి సమాధి గుర్తింపు

మేడాపురం (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో విజయనగర రాజుల కాలం నాటి శాసనాలను గుర్తించినట్లు చరిత్రకారుడు బుక్కపట్నం గోపి పేర్కొన్నారు. చరిత్ర అధ్యాపకుడు తొండూరు అహ్మద్‌తో కలిసి ఆయన గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా 14, 15 శతాబ్దాలకు చెందిన రెండు శాసనాలను గుర్తించామన్నారు. ఇందులో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శాసనాన్ని క్రీ.శ. 1551లో శ్రీకృష్ణదేవరాయలు అల్లుడు అళియరామరాయలు వేయించారన్నారు. చెరువు తూము వద్ద ఉన్న రెండో వీరగల్లు శాసనాన్ని 14వ శతాబ్దంలో మొదటి బుక్కరాయల ప్రధాని చిక్క ఒడెయరు వేయించారన్నారు. చిక్క ఒడెయరు తల్లి మేడమ్మ అదే గ్రామంలో మరణించడంతో చెరువు తూము వద్ద అంత్యక్రియలు నిర్వహించి సమాధి ఏర్పాటు చేశారన్నారు.

చిక్కఒడెయరు మాతృమూర్తి మేడమ్మ సమాధి

మహిళ ఆత్మహత్యాయత్నం

హాసన, న్యూస్‌టుడే : ప్రముఖ న్యాయవాది, భాజపా నాయకుడు దేవరాజేగౌడ తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఒక మహిళ (36) విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బాధితురాలిని చికిత్స కోసం హిమ్స్‌లో చేర్పించారు. బాధితురాలు హొళెనరసీపుర నివాసి. ఆమె 'తేనెవల' విసురుతోందని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవరాజేగౌడ ఆరోపించాడని ఆమె హొళెనరసీపుర ఠాణాలో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి వేధింపులు ఎక్కువ అయ్యాయని ఆరోపిస్తూ ఆమె ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు.

బలమైన జాతి నిర్మాణంలో భాగస్వాములవుదాం

- గవర్నర్ గహ్లోత్ పిలుపు

పరిశోధక పట్టా అందుకుంటున్న విద్యార్థిని

హొసపేటె, న్యూస్‌టుడే: బలిష్ఠమైన జాతి నిర్మాణంలో ప్రతి పౌరుడూ పాలుపంచుకోవాలి. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన అన్ని పథకాలు అర్హులకు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన హంపీ కన్నడ విశ్వవిద్యాలయం 34వ స్నాతకోత్సవం, నుడిహబ్బ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్ మన లక్ష్యం కావాలని సూచించారు. రాబోయే రోజుల్లో మన దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో నిలబడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలను పోల్చుకుంటే హంపీ కన్నడ విశ్వవిద్యాలయం చాలా విభిన్నమైంది. ఇక్కడ విద్యార్థులు చేసే ప్రతి పరిశోధన విలువైందని ఆరుబయలు పర్యాటక కేంద్రం హంపీ ఒడిలో ఆవిర్భవించిన కన్నడ సారస్వత కేంద్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కన్నగిడులపైన ఉందని గుర్తు చేశారు.

● మాతృభాష పరిరక్షణ సమష్టి బాధ్యత

మాతృభాషను ఎవరో వచ్చి సంస్కరిస్తారని ఎదురు చూడకుండా, స్వయంగా తల్లిభాష పరిరక్షణకు అందరూ నడుం బిగించాలని ఆచార్య కె.మరుళ సిద్ధప్ప పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ మాతృభాషా పరరిక్షణకు బాధ్యులేనని తేల్చిచెప్పారు. తల్లిభాషను విస్మరిస్తే, కన్నతల్లిని విస్మరించినట్లేనని స్పష్టం చేశారు. ఇతర భాషల ప్రభావంతో మన రాష్ట్రంలో మాతృభాష చివరి స్థానానికి చేరుకుంది. అందులో ఆంగ్లభాషా వ్యామోహం తారస్థాయికి చేరుకుందని విచారం వ్యక్తం చేశారు. కావేరి నుంచి గోదావరి వరకూ కన్నడ విస్తరించి ఉండేదని 9వ శతాబ్దంలోనే 'కవిరాజమార్గ' కృతి ద్వారా తెలుస్తోంది. మాతృభాషను కాపాడుకునేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి తోడు సుమారు 7 వేల కన్నడ పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలు జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. మన దేశంలో సంస్కృత, హిందీ భాషలకు దొరికిన ప్రాధాన్యం ఇతర భాషలకు దక్కలేదని విచారం వ్యక్తం చేశారు. నాలుగు విభాగాల ముఖ్యులు మాధవ పెరాజె, హెచ్.డి.ప్రశాంత్, శివానంద విరక్తిమఠ, శైలజా హిరేమఠ తదితరులు పాల్గొన్నారు.


పరిశోధక పట్టాలు అందుకోవటానికి వచ్చిన విద్యార్థులు

● వర్సిటీ ఆవరణలో సంబరం

స్నాతకోత్సవ సందర్భంగా వర్సిటీ ఆవరణలో ఉదయం నుంచి పండగ వాతావరణం నెలకొంది. సాయంత్రం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. ఎంతో ఉత్సాహంగా పరిశోధన విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. క్రియాశక్తి భవనం నుంచి వేదికదాకా ప్రముఖులను తీసుకొచ్చారు. కులసచివుడు, సిండికేట్ సభ్యులు, సిబ్బంది శ్వేతవస్త్రాలు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. నాడోజ పురస్కారానికి ఎంపికైన ముగ్గురు సాధకుల్లో మార్క్సవాది జి.రామకృష్ణ గైర్హాజరయ్యారు. గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించబోనని ఆయన బెంగళూరులో వెల్లడించారు.

మాట్లాడుతున్న ఆచార్య కె.మరుళసిద్ధప్ప

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

ప్రభుత్వం ఆదుకోవాలని ఒంటరి మహిళల వినతి

తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం సభ్యులు

కంప్లి: ఒంటరి మహిళల సంరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఒంటరి మహిళల సంరక్షణ సంఘం సభ్యులు డిమాండు చేశారు. ఈ విషయమై కంప్లి తహసీల్దార్ మంజు నాయక్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం తాలూకా సంచాలకుడు ఎ. స్వామి మాట్లాడుతూ దేవదాసీ, ఒంటరి, భర్త వదిలేసిన మహిళలకు ప్రభుత్వం పునర్వసతి కల్పించాలన్నారు. ఒంటరి మహిళ సామాజిక బహిష్కార నిషేధ చట్టం అమలు చేయాలన్నారు. సభ్యులు అంబమ్మ, దుర్గమ్మ, కమలమ్మ, జ్యోతి, పార్వతి పాల్గొన్నారు.

దుకాణాలపై పురసభ అధికారుల దాడి

దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పట్టణం నవలి మార్గంలోని కిరాణా, హార్డ్‌వేర్, స్టేషనరీ, బేకరీ తదితర దుకాణాలపై పురసభ అధికారులు మంగళవారం దాడి చేశారు. వివిధ దుకాణాల్లోని 44 కిలోల ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు దుకాణాల యజమానులకు తలా రూ.5 వేల జరిమానా విధించారు. పురసభ ఆరోగ్య, రెవెన్యూ అధికారులు అక్షతా కుంబార, సీమా రాణి మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించినట్లు చెప్పారు. ఇంకా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తుండటంతో సోదాలు చేశామన్నారు.

బాధిత రైతుకు పరిహారాన్ని చెల్లించండి

కాలిపోయిన జొన్న పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్

మాన్వి (రాయచూరు), న్యూస్‌టుడే: జొన్న పంటను కోల్పోయిన రైతు యంకోబా కుటుంబానికి తగిన పరిహారాన్ని చెల్లించాలని జేడీ(ఎస్) నాయకుడు, మాన్వి మాజీ శాసనసభ్యుడు రాజా వెంకటప్ప నాయక్ ప్రభుత్వాన్ని ఒత్తిడి తెచ్చారు. మూడు రోజుల క్రితం జాగీర పన్నూరు గ్రామంలోని యంకోబాకు చెందిన ఆరు ఎకరాల జొన్న రాశిని అల్లరిమూకలు తగలబెట్టిన విషయం తెలిసిందే. వెంకటప్ప నాయక్ మంగళవారం రైతు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జాప్యం చేయకుండా పరిహారాన్ని ప్రకటించాలని డిమాండు చేశారు. ఘటనకు కారణమైన వారిని ఉపేక్షించవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట దళ్(ఎస్) రాష్ట్ర యువ విభాగం అధ్యక్షుడు రాజా రామచంద్రనాయక్, దళ పతులు శరణప్పగౌడ, విజయనాయక్, బసాపూర్, జాసింసాబ్, బసవరాజ స్వామి, న్యాయవాదులు రవికుమార్, యల్లప్ప నాయక్ పాల్గొన్నారు.

గనినాడులో విదేశీ విహంగాల హంగామా

పక్షుల ఫొటో తీస్తున్న వన్యప్రాణుల సంరక్షకుడు పనమేశులు బి.జె.కెరె

బళ్లారి, న్యూస్‌టుడే: దేశ, విదేశీ పక్షులు అంటేనే టక్కున గుర్తుకు వచ్చేది... తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతమైన అంకసముద్రం. ఇటీవల బళ్లారి తాలూకాలోని మోకా, సంగనకల్లు ప్రాంతాల్లో దేశ, విదేశీ పక్షుల సందడి కనిపిస్తోంది. ఈ ప్రాంతంలో నీటితో పాటు పక్షులకు ఇష్టమైన ఆహారం, సంరక్షణ, సంతానోత్పత్తి చేసుకోవడానికి అనువైన ప్రాంతంగా మారింది. ఈ మధ్య వన్యప్రాణులు సంరక్షకులు, ప్రకృతి ప్రేమికులు వెలుగులోకి తీసుకుని రావడంతో అటవీశాఖ ఆ ప్రాంతాలను సంరక్షించే పనిలో ఉన్నారు. బళ్లారి తాలూకా సంగనకల్లుకు ఎనిమిది కిలోమీటర్ల

సంరక్షణకు అధికారుల అడుగులు

దూరంలో మారుమూల ప్రాంతం.. ఇక్కడ క్వారీ తవ్వకాలు చేయడంతో ఐదు ఎకరాల ప్రాంతం జౌకు (చెరువు)గా మారింది. ఈ నీటిలో మొక్కలు ఉండటం, చుట్టుపక్కల తుమ్మ, ఇతర చెట్లు ఉండటంతో పక్షులు విశ్రాంతి తీసుకోవడం, సంతానోత్పత్తి చేసుకోవడం, పక్షులకు సరిపడే వరి గింజలు, కుంటలో చేపపిల్లలు లభిస్తుండటంతో వీటి సంఖ్య పెరిగింది. ఇలాంటి ప్రాంతం నేటి వరకు వెలుగులోకి రాలేదు. వన్యప్రాణి సంరక్షకుడు పనమేశులు బి.జె.కెరె, శిష్యులు వినయ్ ప్రసాద్, వివేక్ వెలుగులోకి తీసుకొచ్చి అటవీశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతం సంరక్షణపై అటవీశాఖాధికారులు పరిశీలించి చర్యలు చేపట్టనున్నారు.

విశ్రాంతి తీసుకుంటున్న జంట పక్షులు

కిలకిలరావాలతో కళ..

ఐదు ఎకరాల జౌకు (చెరువు)లో దేశీయ పక్షులైన పెయింటెడ్ స్టోర్క్, గ్రే హెరాన్, పర్పుల్ హెరాన్, ఎగ్రెట్స్, నైట్ హెరాన్, వైట్ ఎబిస్ తదితర అరుదైన పక్షులు కనిపిస్తున్నాయి. వీటితో పాటు విజిలింగ్ డాక్, గార్గ్నీ డాక్, షోవిలర్ డాక్ వంటి విదేశీ విహంగాలు ఉన్నాయి. యూరప్, చైనా, రష్యా, ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల నుంచి వెచ్చదనం, ఆహారం, సంతానోత్పత్తి కోసం ఇక్కడికి వస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికి సొంత ప్రదేశాలకు వెళ్తాయి. దేశీయ పక్షులు ఇక్కడ తుమ్మ, జాలి చెట్లు ఉండటంతో గూళ్లు కట్టుకుని గుడ్లు పెట్టి పొదిగేవి. వాటికి అక్కడ సరిపడే వాతావరణంతో పాటు, ఆహారం, నీరు లభించడంతో వీటి సంతతి పెరుగుతోంది.

చెట్లపై వాలిన విహంగాలు

ప్రత్యేక ప్రదేశాలుగా గుర్తించాలి

బళ్లారి తాలూకాలో ఇలాంటి ప్రదేశాలు అరదుగా కనిపిస్తాయి. క్వారీ తవ్వకాలతో గుంత పడిన ప్రదేశంలో వర్షపునీరు నిలబడి చెరువుగా మారింది. చుట్టుపక్కల చెట్లు ఉండటంతో పక్షిధామాగా మారింది. ఈ ప్రాంతంలో సీసాలు, ప్లాస్టిక్ వస్తువులు కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రాంతాలను అటవీశాఖ సంరక్షించడంతో పాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది. **- పనమేశులు బి.జె.కెరె, వన్య జీవుల సంరక్షకుడు, బళ్లారి**

లింగారెడ్డి సేవలు చిరస్మరణీయం

లింగారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సంఘం గౌరవ అధ్యక్షుడు చన్నప్ప, కార్యదర్శి ప్రకాశ్, కుటుంబసభ్యులు

బళ్లారి (గ్రామీణ, న్యూస్‌టుడే: రాఘవ స్మారక సంఘం అధ్యక్షుడిగా ఆ రోజుల్లో రాఘవ కళామందిర నిర్మాణానికి దివంగత లింగారెడ్డి సేవలు అనన్యమని సంఘం కార్యదర్శి ప్రకాశ్ పేర్కొన్నారు. లింగారెడ్డి 50వ వర్ధంతిని పురస్కరించుకుని రాఘవ కళామందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. శాసనసభ్యుడిగా, కంప్లి చక్కెర కర్మాగారం, జనతాబజార్, దారపుమిల్లు నిర్మాణం చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. చక్కెర కర్మాగారం నిర్వహణ క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇంట్లోని బంగారాన్ని ఇచ్చి ఆదుకున్న మహనీయుడని కొనియాడారు. న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, సహకార రంగ నిపుణుడిగా, కళాపోషకుడిగా ఎనలేని సేవలు అందించిన గొప్ప మానవతావాది అని ఆయన సేవలను కీర్తించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చన్నప్ప, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్ గౌడ, సహకార్యదర్శి నటరాజ్, బసవరాజు, రామాంజనేయులు, హేమచంద్రరెడ్డి, రామప్రకాశ్‌రెడ్డి, సభ్యులు, లింగారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భూఆక్రమణలపై ఆందోళన

డీసీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న రైతు సంఘం సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: సిరుగుప్ప తాలూకా హళేకోటె, సిరిగేరి గ్రామాల్లో వందలాది ఎకరాల భూమిని కొంత మంది ఆక్రమించుకుని భూకబ్జాలకు పాల్పడ్డారు. వెంటనే ప్రభుత్వ స్వాధీనం చేసుకుని పేదలు, దళిత, గిరిజన రైతులకు పంపిణీ చేయాలని కోరుతూ కర్ణాటక ప్రాంత రైతు సంఘం నేతృత్వంలో మంగళవారం డీసీ కార్యాలయం ఎదుట ప్రదర్శన నిర్వహించారు. సిరుగుప్ప సబ్ రిజిస్ట్రార్ రూ.50 కోట్ల విలువైన 130 ఎకరాల ప్రభుత్వ భూమిని చట్ట విరుద్ధంగా వేరే వ్యక్తులకు రిజిస్ట్రార్ చేయించారు. సబ్ రిజిస్ట్రార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్, ఏసీ ఈ భూమిని స్వాధీనం చేసుకోవడంపై నివేదిక సిద్ధం చేసి డీసీకి అందజేసి, రెండేళ్లు గడిచినా నేటికీ జిల్లా యంత్రాంగం భూమిని వెనక్కి తీసుకోలేదని ఆరోపించారు. భూమిని స్వాధీనం చేసుకోకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందని రైతు సంఘం సభ్యులు శివశంకర్, గాళి బసవరాజు, రైతు సంఘసభ్యులు గట్టిగా హెచ్చరించారు.

ఆత్మరక్షణ విద్యలు అవసరం

కరాటే బెల్టు పరీక్షలో విద్యార్థినుల ప్రదర్శన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి సంప్రదాయ కరాటే సమాఖ్య, కర్ణాటక సంప్రదాయ కరాటే అకాడమీ సంయుక్తంగా మంగళవారం నంది పాఠశాల ఆవరణలో కరాటే బెల్టు పరీక్ష పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో వారు శారీరక వ్యాయామం, బలం, కిహాన్ కరాటే నైపుణ్యాలను ప్రదర్శించారు. మాస్టర్లు కట్టె స్వామి, సెన్సై సుభాష్ చంద్ర ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టెస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో పాఠ్యేతర కార్యకలాపాల్లో భాగంగా కరాటే శిక్షణను తప్పనిసరి చేయడం మంచి విషయమన్నారు. ఇది విద్యార్థినులకు ఆత్మరక్షణలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు నైమా నాయక్, ఆనంద్, రిజ్వాన్ మోహిన్, మారేష్, నాగరాజ్, కుమారస్వామి, వసీం అక్రమ్, ఉదయ్‌కుమార్, జాదెవ్, హులుగన్న, ప్రసాద, హనుమంత, నాగరాజ్, సంతోష్, సోమశేఖర్, హరిప్రసాద్, ప్రశాంత్, దినేష్, ఆశా, నవీన్ పాల్గొన్నారు.

కరాటే బెల్టులు సాధించిన విద్యార్థినులతో మాస్టర్లు

కార్మికుడి హత్య కేసులో ఆరుగురి అరెస్టు

కార్మికుడు ఓబణ్ణ హత్య కేసులో అరెస్టైన నిందితులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: మొలకాల్మూరు తాలూకా సూలేనహళ్లి వద్ద ఇటుకల బట్టీలో కార్మికుడు ఓబణ్ణ (45)ను ఈ నెల 17న దారుణంగా హత్య చేసిన కేసులో ఆరుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... నిందితులు జితేంద్ర, బోరయ్య, అజ్జణ్ణ, బోరమ్మ, కరిబసమ్మ, మరో బాలుడిని అరెస్టు చేశారన్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరచగా న్యాయాంగ నిర్బంధానికి పంపారన్నారు. మొలకాల్మూరు పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారన్నారు.

జేడీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మంజునాథ్

మంజునాథ్‌ను పూలమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

చెళ్లకెర (చిత్రదుర్గ), న్యూస్‌టుడే: రానున్న జడ్పీ, టీపీ, జీపీ ఎన్నికలలో జేడీఎస్ అభ్యర్థులను అధికసంఖ్యలో గెలిపించి అధికారం చేపట్టడానికి కృషి చేస్తానని ఆ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ పేర్కొన్నారు. ఇక్కడ జేడీఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సంచరించి పార్టీ కార్యకర్తలను సంఘటిత పరచడానికి అందరూ కలిసికట్టుగా ప్రయత్నించాలన్నారు. జిల్లాలో పార్టీకి గత వైభవం తేవడానికి కృషి చేయాలన్నారు. ఇదే సందర్భంలో నూతన తాలూకా అధ్యక్షుడిగా నియమితుడైన సణ్ణతిమ్మణ్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాజీ అధ్యక్షుడు జయణ్ణ, యశోధర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతరాజ్, జిల్లా కార్యదర్శి గోపాలస్వామి నాయక, పార్టీ నేతలు రవీంద్రప్ప, తిప్పేస్వామి, జి.బి. శేఖర్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు కిట్ల పంపిణీ

మత్స్యకారులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్, అధికారులు శివన్న, భావన , తదితరులు

బళ్లారి: జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో దళిత, గిరిజనుల కోసం ప్రత్యేక యూనిట్ ఉప పథకం కింద మంగళవారం కురుగోడు, కంప్లి ప్రాంతాలకు చెందిన మత్స్యకారులకు ఎమ్మెల్యే జె. ఎన్. గణేష్ చేతులమీదుగా కిట్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు నాలుగు చక్రాలు వాహనం కొనుగోలు కోసం చేపల విక్రేత రాహుల్ నాగప్పకు ఎమ్మెల్యే రాయితీ చెక్కును అందజేశారు. పలువురికి పక్కా గృహాల నిర్మాణానికి వర్క్ ఆర్డర్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి శివన్న, బళ్లారి తాలూకా స్థాయి అధికారిణి భావన, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-02-2026 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1601.79	1609.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	403	7,983
నీటి నిల్వ (టి.ఎం.సి)	23.924	35.793

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

వచన సాహిత్యంతో వ్యక్తిత్వ వికాసం

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నాగనగౌడ

సిరుగుప్ప, న్యూస్‌టుడే: వ్యక్తిత్వ వికాసానికి వచన సాహిత్యం దోహదపడుతుందని చార్టర్డ్ అకౌంటెంట్ నాగనగౌడ పేర్కొన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ పట్టణంలోని ఎస్ఈఎస్ డిప్లొమా కళాశాలలో మంగళవారం 'వ్యక్తిత్వ వికాసానికి వచన సాహిత్యం' అనే అంశంపై దత్తి ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథిగా హాజరైన గౌడ మాట్లాడుతూ వచనాలు, సాహిత్యం కేవలం భక్తికి సంబంధించినవి కావని చెబుతూ నైతిక విలువలను నేర్పించి, మెరుగైన జీవితానికి దారి చూపించే పాఠాలుగా పేర్కొన్నారు. బసవణ్ణ, అక్క మహాదేవి, అల్లం ప్రభు వచన సాహిత్యాల్లో ఆత్మ విమర్శ, సమానత్వం, శ్రమ గురించి వివరించారు. విద్యార్థులు చదువుకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందేందుకు పరిమితం కాకుండా వచనాల సందేశాలను తెలుసుకోవాలని కోరారు. కసాప అధ్యక్షుడు మధుసూదన్, బసవ బృందం సభ్యులు సర్వ మంగళ, శివకుమార్, ఆచార్యుడు సతీష్ బాబు వేదికను అలంకరించారు.

శ్రద్ధగా చదివితే చక్కటి ఫలితాలు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మస్కి శాసనసభ్యుడు ఆర్.బసనగౌడ

సింధనూరు, న్యూస్‌టుడే: గతంలో విద్యార్థులకు చదువుకోవాలంటే ఎన్నో కష్టాలు ఉండేవి. కళాశాలల్లోనే అసౌకర్యాలు ఉండేవి ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రభుత్వాలు విద్యా అవసరాలకు ఎంతో వెచ్చిస్తున్నాయి.. నాణ్యత గల విద్య కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి.. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలని మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ విద్యార్థులతో అన్నారు. శ్రద్ధపెట్టి చదవండి చక్కని ఫలితాలు వాటంతట అవే వస్తాయని చెప్పారు. స్థానిక అనికేతన కళాశాల విద్యార్థుల వార్షిక స్నేహసమ్మేళన కార్యక్రమం మంగళవారం శ్రీసత్యాగార్డెన్స్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్. బసనగౌడ మాట్లాడారు. మరో అతిథి సింధనూరు డీఎస్పీ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు బుద్ధ, బసవ, అంబేడ్కర్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. భాజపా నాయకుడు కె. కరియప్ప, క్రాంతివీర సంగొళ్లి నాయకుడు సురేశ్, అనికేతన కళాశాల పాలక సమితి అధ్యక్షుడు డీహెచ్. కంబళి, సాహిత్య పరిషత్ తాలూకా మాజీ అధ్యక్షురాలు రమాదేవి, శేఖర్ యరదిహాళ పాల్గొన్నారు.

ప్రాణులు, పక్షులపై దయ చూపుదాం !

సింధనూరు, న్యూస్‌టుడే: ఈ భూ ప్రపంచంలో జీవించే హక్కు అన్ని జీవరాశులకూ ఉంది, నోరులేని జీవాలపై ప్రాణిదయ చూపుదామని శారదా మహిళా కళాశాల ప్రాచార్యులు బసవరాజ్ బాదర్లి విద్యార్థినులకు హితవు పలికారు. రాష్ట్రీయ సేవాయోజనలో భాగంగా శారదా మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థినులు మంగళవారం స్థానిక పీడబ్ల్యూడీ క్యాంపులోని అమరశ్రీ ఉద్యానవనంలో శ్రమదానం చేశారు. వనసిరి ఫౌండేషన్ ప్రతినిధుల సహకారంతో ఉద్యానవనంలోని చెట్లకు పక్షుల కోసం ఉట్లు కట్టి వాటిలో తిండి గింజలు, నీళ్లు పోశారు. వనసిరి అధ్యక్షుడు అమరేగౌడ మల్లాపూరు మాట్లాడుతూ..ఏటా మా వనసిరి సంస్థ వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చే కార్యాలు తలపెడుతుంటుంది.. అది ఈ ఏడాది ముందుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థుల చేతుల మీదుగా ఆరంభం కావడం హర్షణీయం అన్నారు. వనసిరి మస్కి విభాగం రాజు పత్తార్, ఎన్ఎస్ఎస్ అధికారి కరిబసణ్ణ, దొడ్డబసవ హిరేమఠ్ పాల్గొన్నారు.

అమరశ్రీ ఉద్యానవనంలో పక్షుల కోసం ఉట్టి కడుతున్న విద్యార్థినులు

కమనీయం.. రాఘవుడి ఉత్సవం

తేరువీధి రాఘవేంద్రుడికి వెన్నతో అలంకరణ

సత్యనారాయణ పేట రాఘవేంద్ర మఠంలో స్వామివారికి ముస్తాబు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఉత్సవం మంగళవారం సత్యనారాయణపేట రాఘవేంద్రస్వామి మఠంలో అత్యంత కమనీయంగా జరిపారు. స్వామివారి బృందావనానికి అభిషేకాలు, పూజలు చేపట్టారు. పుష్పాలు, కవచాలు, వస్త్రాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి మఠం చుట్టూ ఊరేగించారు. పండితులు ప్రవచనం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటం, భజన కీర్తనలు ఆలపించారు. తేరువీధి రాఘవుడి మఠంలో గురుసార్వభౌములకు వెన్నతో అలంకరించి పూజించారు. వ్యాసరాజ మఠంలో రథోత్సవం ఘనంగా ఆచరించారు. అన్ని మఠాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మఠం వ్యవస్థాపకులు ప్రసన్నాచార్, పాండురంగాచార్, ఐకూర్ ఆచార్, హరికుమార్, శ్రీధర్, గురురాజ్, నేమకల్లురావు, డా. శ్రీనాథ్, క్రిష్టాచార్, మఠం సిబ్బంది, భక్తులు, భజనమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గురురాయుడికి విశేష పూజలు

శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో హోమం కైంకర్యంలో పాల్గొన్న మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప

సింధనూరు, న్యూస్‌టుడే: శ్రీగురురాయుడి ఉత్సవం సందర్భంగా సింధనూరు పాతబజార్ పురాతన శ్రీరామమందిరం, పీడబ్ల్యూడీ క్యాంపులోని రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం రోజంతా ఘనంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. పురాతన శ్రీరామమందిరలో అర్చక స్వాములు శ్రీరామచంద్ర దేవుడికి, వాయుదేవునికి, గురురాయుడికి విశేష ఫలపంచామృత సమేత అష్టోత్తర కార్యక్రమం జరిపినట్లు స్వాములు వెల్లడించారు. శ్రీగురురాఘవేంద్ర స్వామి మఠంలో ఉదయం నుంచి అష్టోత్తర కైంకర్యాలు, హోమాలు జరిపి మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నప్రసాదం సమర్పించారు. హోమం కార్యక్రమంలో మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప పాల్గొని లోక కల్యాణం కోసం ఆ గురుసార్వభౌముని కీర్తించినట్లు చెప్పారు.

సామూహిక వివాహాలతో సమైక్య భావం

సామూహిక వివాహ బంధంతో ఒక్కటైన జంటలు

సిరివార(మాన్వి,రాయచూరు): సామూహిక వివాహాలు ఒక కులానికి పరిమితం కాదు. పేదలు, శ్రీమంతులు, ఉన్నత, అణగారిన వర్గాల అన్న భేదం లేకుండా అంతా ఒక్కటే అని చాటి చెప్పేవని కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు పేర్కొన్నారు. సిరివార తాలూకా నవలకల్ గ్రామంలోని శాంభవి మఠంలో 29వ జాతర సందర్భంగా సామూహిక వివాహాలు జరిగాయి. నూతన దంపతులను స్వామీజీ ఆశీర్వదించి మాట్లాడారు. సంసారంలో ఎదురయ్యే కష్ట సుఖాలను అధిగమించి అన్యోన్యంగా జీవిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. రాచోటి వీరశివాచార్య స్వామి ప్రసంగిస్తూ కలిసిమెలిసి ఉండే భార్యాభర్తలు శివుడికి ప్రీతిపాత్రులవుతారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గంగాధర నాయక్, ఆర్‌డీసీసీ బ్యాంకు నిర్దేశకుడు రాజశేఖర్ నాయక్, పీఠాధిపతి సోమనాథ శివాచార్యులు, స్వాములు బూది బసవేశ్వర, శివమూర్తి శివాచార్య, వీర సంగమేశ్వర పాల్గొన్నారు.

సన్యాస దీక్షకు ముగ్గురు యువతులు సిద్ధం

సన్యాస దీక్ష తీసుకోనున్న జైన యువతులు సవితా కుమారి, ఛవికుమారి, దివ్యకుమారి

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: జైన సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు యువతులు సన్యాస దీక్ష తీసుకొనేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారిని అందంగా అలంకరించిన వాహనంలో పట్టణ వీధుల్లో ఊరేగించారు. మంగళవారం ఉదయం గోడి పార్శ్వనాథ దేవాలయం వద్ద నుంచి బయలుదేరిన ఊరేగింపు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రయాణించి వాల్మీకి భవనం చేరుకొంది. లలితా కుమార్ జీ, సుశీలా బెహన్ దంపతుల ఇద్దరు కుమార్తెలు ఛవి కుమారి, దివ్య కుమారి, మాజీలాల్, సుఖీబాయి దంపతుల కుమార్తె సవితా కుమారి సన్యాస దీక్షను తీసుకోనున్నారు. జైన్‌ల ఆధ్యాత్మిక గురువు అభయశేఖర్ సురేశ్వరాజీ తారకేశ్వర్ యువతులకు బుధవారం ఉదయం 9 గంటలకు సన్యాస దీక్షలను ఇవ్వనున్నారు. సవితా కుమారి మాట్లాడుతూ ఆధునిక ఆడంబర జీవనం కంటే ఆధ్యాత్మిక జీవనం, భగవంతుని సేవ ఆనందాన్ని ఇస్తుందన్నారు.

నేడు దిశా సమితి సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11గంటలకు జిల్లా పంచాయతీ నజీర్ సభాభవనంలో జిల్లా అభివృద్ధి సమన్వయ ఇన్‌ఛార్జ్ సమితి (దిశా) మూడో త్రైమాసిక సమావేశం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ అధ్యక్షత వహిస్తారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రక్తదానంపై అపోహలు వద్దు

రక్తదానం చేస్తున్న యువకుడు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి బసవరాజేశ్వరి శిక్షణ సంస్థల సంస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్వయం ప్రేరిత రక్తదాన శిబిరం నిర్వహించారు. యువ రెడ్‌క్రాస్ అధికారి, సహాయ అధ్యాపకులు వైశాక్, కళాశాల ప్రధాన ఆచార్యులు రామచంద్ర పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం ఎలాంటి అపోహలు వద్దని, ఆరోగ్య వంతులు ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. ఒకరు రక్తదానం చేస్తే నలుగురికి ప్రాణాలు పోసినట్లు అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

(c) eenadu

ఓ గ్యాలరీలో క్రికెట్ పోటీ వీక్షించేందుకు విచ్చేసిన అభిమానులు

హుబ్బళ్లిలో 'రంజీ' క్రికెట్ జోష్

మైదానంలో వెంకటేశ్‌ప్రసాద్, సునీల్‌జోషి, మిథున్‌మన్హాస్, కేఎస్‌సీఏ సభ్యులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : హుబ్బళ్లిలోని కేఎస్‌సీఏ మైదానంలో మంగళవారం నుంచి ప్రారంభమైన రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీల ఫైనల్ వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు కదలివచ్చారు. కర్ణాటక- జమ్ము కశ్మీర్ జట్ల మధ్య పోరు చూడటానికి ఉదయం నుంచే టికెట్లను కొనుగోలు చేశారు. కర్ణాటక జట్టు పదేళ్ల తర్వాత ఫైనల్స్‌కు చేరడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అంచనాకు మించి అభిమానులు కదలిరావడంతో గ్యాలరీలు కిటకిటలాడాయి. పోటీ ఐదు రోజుల పాటు కొనసాగుతుంది. రానున్న రోజుల్లో ఇక్కడ ఐపీఎల్ పోటీలూ కొనసాగించాలని అభిమానులు కోరారు. కొందరు యువతీ, యువకులు భారత జట్టు జెర్సీలతో అలరించారు. దుకాణాల్లో ఆటగాళ్ల జెర్సీలకు భారీ గిరాకీ ఏర్పడింది. అత్యధికులు కె.ఎల్.రాహుల్ జెర్సీ కొనుగోలుకు పోటీ పడుతున్నట్లు ఓ వ్యాపారి తెలిపారు.

● భారత జట్టు తరఫున పాల్గొనడం తనకు గర్వకారణంగా ఉందని అంతర్జాతీయ మాజీ క్రికెటర్ సునీల్‌జోషి ఆనందాన్ని వ్యక్తం చేశారు. హుబ్బళ్లిలోని రాజనగర కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) మైదానం పెవిలియన్ ఒకటో బ్లాక్‌కు ఆయన పేరు పెట్టారు. ఆ సందర్భంగా జోషి ఆనందానికి అవధులు లేవు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీసీఐ అధ్యక్షుడు మిథున్‌మన్హాస్ నూతన పెవిలియన్ బ్లాక్‌ను ఆవిష్కరించారు. తనకు ఇంతటి గౌరవం లభిస్తుందని అనుకోలేదని సత్కారం తర్వాత స్పందించారు. రాష్ట్రానికి కుటుంబం చెప్పేందుకు మన సాధనలు ఎప్పటికైనా స్ఫూర్తి కావచ్చున్నారు. 14 సంవత్సరాల వయస్సులో గదగ నుంచి హుబ్బళ్లికి క్రికెట్ ఆడేందుకు వచ్చేవాడినని తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. సొంత ఊరు గదగ. ఇష్టమైన క్రికెట్ నేర్పింది మాత్రం హుబ్బళ్లి నగరమేనని గుర్తుచేసుకున్నారు. కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్‌ప్రసాద్, కార్యదర్శి సంతోష్ మెనెన్, సంయుక్త కార్యదర్శి బి.కె.రవి, కోశాధికారి మధుకర, ఉపాధ్యక్షులు సుజిత సోమసుందర్, వీరణ్ణసవడి, డాక్టర్ నవనీత జోషి తదితరులు పాల్గొన్నారు.

పులుల రాజ్యంలో విహారి రాజసం!

ఆబాల గోపాలాన్నీ ఆకట్టుకునే పులుల సఫారీ

స్వేచ్ఛగా సంచరిస్తున్న పులులు

యశ్వంతపుర, మైసూరు, న్యూస్‌టుడే : ప్రజల నిరసనలు మధ్య బండీపుర జాతీయ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు అటవీశాఖ అనుమతించింది. ఆకులు రాలే కాలంలో అటవీ ప్రదేశంలోకి సందర్శకులను అనుమతించరాదని పర్యావరణ ఉద్యమకారులు, గ్రామీణులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా.. అధికారులు స్పందించలేదు. వన్యజీవులకు ప్రమాదం వాటిల్లుతుందనే ఆందోళన నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకుంటూ సఫారీకి అనుమతించారు. వన్యజీవులకు ప్రమాదాలు ఎదురవుతున్న నేపథ్యంలో కొన్ని నెలలుగా సందర్శకులను అనుమతించలేదు. వేసవి ముంచుకు రావడంతో కుటుంబసభ్యులతో కలిసి ఈ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు పెద్దలు ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి సిద్ధమైన వన్యజీవులు సంచరించే అటవీ ప్రదేశాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీ, పర్యాటక శాఖలు అన్ని రకాల సౌకర్యాలూ కల్పించాయి. మైసూరుకు దగ్గరలో చామరాజనగర జిల్లాలో ఉన్న ఈ ప్రాంతంలో పులులు, ఏనుగులు, జింకల సంఖ్యకు కొదవేలేదు. మైసూరు నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. వివిధ ప్రాంతాల వారు మైసూరుకు చేరుకుంటే.. అక్కడి నుంచి సురక్షిత వాహనాల్లో ఉద్యానవన సందర్శనకు కదలవచ్చు. అటవీ ప్రదేశంలో జంగిల్ లాడ్జిలలో రాత్రి బస ఓ మధురానుభూతి. ఆన్‌లైన్‌లోనే గదులు రిజర్వు చేసుకునే సౌకర్యం కల్పించారు. పులుల సఫారీ ఇక్కడ ప్రత్యేకం. బండీపుర జాతీయ ఉద్యానవనంలో 73 పులులున్నాయి. దేశంలోనే అరుదైన నల్లపులులు చూడొచ్చు. మొత్తం 874 చదరపు కిలోమీటర్ల పరిధిలో బండీపుర విస్తరించగా.. దీని పరిధిలో సహజసిద్ధ కొండలు, చెరువులు, కుంటలు లెక్కలేనన్ని చూడొచ్చు. పులులు, ఏనుగుల కదలికలను తెలుసుకునేందుకు వాటి చెవులకు మైక్రో చిప్స్‌ను అమర్చి.. సందర్శకులకు వాటిని చూపి సంతోషపరచడం సఫారీ నిర్వాహకుల వంతు. వేటగాళ్లను నియంత్రించేందుకు 68 సీసీ కెమెరాలతో కాపలా కాస్తున్నారు. 1973లో మైసూరు మహారాజులు 90 చదరపు కిలోమీటర్ల పరిధిలో వేణుగోపాల్ అటవీ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయగా.. తదనంతర కాలంలో ఇది బండీపురగా రూపాంతరం చెందింది. తొలినాళ్లలో 12 పులులే ఉండేవి.

బండీపురలో తరచుగా కనిపించే ఏనుగుల దండు

సఫారీలో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు

ఆర్థిక వ్యవహారాలపై కీలక సదస్సు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : ఇండియన్ బిజినెస్ అకాడమీ, ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఎకోఫ్లుయెన్స్ 3.0 సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ప్రముఖ రచయితలు ఆచార్య ప్రశాంత్ కులకర్ణి, డాక్టర్ మాన్సి బన్సాల్ రచించిన 'మైక్రో మోటివ్స్ అండ్ మాక్రో బిహేవియర్ ఆఫ్ మోడినోమిక్స్' అనే పుస్తకాన్ని సదస్సులో ఆవిష్కరించారు. 'కర్ణాటక, భారతదేశాల డిజిటల్ ఆర్థికత' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో డాక్టర్ నీలకంఠ, ఎం మహేశ్, డాక్టర్ శివసుబ్రహ్మణియన్, బీఎం నాసిర్‌ఖాన్ పాల్గొన్నారు. ప్రధానమంత్రుల ఆర్థిక సలహా మండలి అధ్యక్షుడు ఎస్.మహేంద్రదేవ్, ఐఐఎంబీ మాజీ ఆచార్యుడు డాక్టర్ చరణ్‌సింగ్, భారతీయ ఆర్థికవేత్తల సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్ర బ్రహ్మ తదితరులు పరిశోధన ఛాంపియన్‌షిప్‌ల ప్రాథమిక రౌండ్లు, చర్చాగోష్ఠులకు నేతృత్వం వహించారు.

పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న రచయితలతో డాక్టర్ చరణ్ సింగ్, ఆర్ఎస్ దేశ్‌పాండే, రవీంద్ర బ్రహ్మ తదితరులు

గర్భిణిని పొడిచి.. భర్త ఆత్మహత్య

ఉమేశ్

బెళగావి, న్యూస్‌టుడే : చిన్న విషయానికే గర్భిణిగా ఉన్న భార్యను కత్తితో పొడిచిన ఉమేశ్ బడిగేర (34) అనే వ్యక్తి చివరికి బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితురాలిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా.. ఆమెకు ప్రాణాపాయం తప్పింది. రామదుర్గ పట్టణానికి చెందిన ఉమేశ్ నాలుగేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే విషయంలో భార్యతో నిత్యం గొడవ పడేవాడు. పుట్టబోయే బిడ్డ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మద్యం మానమని ఉమేశ్‌ను ఆమె పోరుతూ వచ్చింది. ఇదే విషయమై తన భార్యను కత్తితో పొడిచి, అతను ఆత్మహత్య చేసుకున్నాడని రామదుర్గ ఠాణా పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

బెంగళూరులో భట్టి విక్రమార్క పర్యటన

భట్టి నుంచి శుభలేఖ అందుకుంటున్న సిద్ధరామయ్య

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కావేరి నివాసంలో, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కుమారకృపలోని ప్రభుత్వ నివాసంలో మంగళవారం భేటీ అయ్యారు. తన కుమారుని వివాహానికి హాజరు కావాలని కోరుతూ శుభలేఖలను అందించారు. మైసూరు తలపాగా, శాలువాతో భట్టిని ఉప ముఖ్యమంత్రి ఘనంగా సత్కరించారు. మంత్రి ప్రియాంక్ ఖర్గే, మరికొందరు మంత్రులకు కూడా భట్టి శుభలేఖలను అందజేశారు.

మైసూరు తలపాగా, శాలువాతో భట్టిని సత్కరించి, పండ్ల బుట్ట అందిస్తున్న శివకుమార్

వైద్య, ఆరోగ్యశాఖలో సమ్మె గంట

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మె అనివార్యమని ప్రభుత్వ వైద్యాధికారుల సంఘం స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 11 నుంచి 15 వరకు నల్లపట్టీలను చేతులకు కట్టుకుని కేవలం అత్యవసర సేవలను మాత్రమే అందిస్తామని వైద్యుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షడక్షరితో కలిసి సంఘం ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే మార్చి 16 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్యేతర సిబ్బంది పోస్టుల భర్తీ, సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు, ఔషధాలకు కొరత లేకుండా చర్యలు తీసుకోవడం, అవైజ్ఞానికంగా చేసుకున్న బదిలీలను నిలపడం, ఒప్పంద పద్ధతిలో చేస్తున్న వైద్యులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత తదితరాలు తమ ప్రధాన డిమాండ్లని వివరించారు.

సమ్మెకు సంబధించి గోడ పత్రికను ప్రదర్శిస్తున్న సంఘం సభ్యులు

ఆమె విసిరింది.. తేనెవల

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : శీతల పానీయంలో మత్తు మందు కలిపి తనపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపణలు చేసిన యువతికి వ్యతిరేకంగా ఓ యువకుడు మల్లేశ్వరం ఠాణాలో ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. 'తేనెవల' విసిరి నగదు కోసం తనను ఆ యువతితో పాటు ఓ ప్రైవేట్ ఛానల్ ఉద్యోగి ఇమ్రాన్ బెదిరిస్తున్నారని బాధితుడు నిఖిల్ ఆరోపించారు. నిఖిల్ ఫిర్యాదుతో ఇమ్రాన్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి విచారణ చేపట్టారు. స్నేహితుడు డిక్సన్ చంద్ర ద్వారా ఆ యువతి పరిచయమైందని, ఈనెల 14న జక్కూరులోని ఓ విల్లాలో విందులో ఆమెతో కలిసి నృత్యం చేసినట్లు బాధితుడు వివరించాడు. ఆమె తనతో చాలా సన్నిహితంగా గదిలో గడిపిన దృశ్యాలను ఇమ్రాన్ చిత్రీకరించి వెంటాడుతున్నట్లు ఆరోపించాడు. మరుసటి రోజు నుంచే డబ్బు కోసం ఆ ఇద్దరూ 'వీడియో'లతో బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో వివరించాడు.

బీఎంటీసీ సేవల విస్తరణ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) సేవల పరిధిని 40 కి.మీ. నుంచి 80 కి.మీ.కు పెంచాలని రవాణాశాఖ నిర్ణయించింది. మైసూరు శాటిలైట్ బస్టాండ్ నుంచి రామనగరకు, బనశంకరి బస్టాండ్ నుంచి కనకపురకు కూడా బీఎంటీసీ బస్సులను నడపాలని అధికారులు సూచించారు. మెజెస్టిక్ నుంచి ఇప్పటికే నెలమంగల, హొసకోటె, దేవనహళ్లి, దొడ్డబళ్లాపుర, చిక్కబళ్లాపురకు బీఎంటీసీ సేవలు అందిస్తోంది. ఇతర ప్రాంతాలకు కూడా సేవలను విస్తరించడం ద్వారా ఆర్టీసీ బస్సులపై ఒత్తిడి తగ్గి, విద్యార్థులు, ఉద్యోగులు బెంగళూరుకు వచ్చి వెళ్లేందుకు అవకాశం మరింత పెరుగుతుంది. బీఎంటీసీలో ఎలక్ట్రిక్ బస్సులతో కలిసి 6,750 వాహనాలున్నాయి. వీటిలో సుమారు 45 లక్షల మంది సగటున నిత్యం 13 లక్షల కి.మీ. దూరం ప్రయాణిస్తున్నారు. సేవల విస్తరణకు అనుగుణంగా కొత్త బస్సులను సమకూర్చుకునే దిశలో రవాణా శాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది.

అంతకంతకూ విస్తరిస్తున్న బీఎంటీసీపరిధి

ఆలయాల్లో చిత్రీకరణలకు నిబంధన

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : దేవాదాయ శాఖ పరిధికి అన్ని ఆలయాల్లో సినిమాలు, ధారావాహికలు, డాక్యుమెంటరీలు, వాణిజ్య ఉద్దేశవీడియోలు, వార్తల కోసం చేసే వీడియోలు అన్నింటికీ ఇకపై రుసుము చెల్లించవలసి ఉంటుంది. ఇటీవల చరవాణులతో ఆలయాల ఆవరణలో రీల్స్, యూట్యూబ్ వీడియోలు చేసేవారి సంఖ్య పెరగడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని ఆ శాఖ అధికారులు తెలిపారు. అనుమతి లేకుండా, నగదు చెల్లించకుండా వీడియోలు తీస్తే వాటిని తొలగించి, ఆ పరికరాలను వెనక్కు తిరిగి ఇస్తామని దొడ్డగణపతి దేవాలయం కార్యనిర్వాహక అధికారి రుద్రేశ్ తెలిపారు. బెంగళూరులోని ఆలయాల్లో సినిమా చిత్రీకరణలకు రూ.15 వేలు, ఇతర ప్రాంతాల్లోని ఆలయాలకు రూ.10 వేలు చెల్లించవలసి ఉంటుంది. ధారావాహికలు, డాక్యుమెంటరీలు, ఇతర వాణిజ్య చిత్రాల చిత్రీకరణకు రోజుకు రూ.5 వేలు చెల్లించాలి. ఆలయాలకు సంబంధించిన కథనాల కోసం ఐదు నిమిషాల వీడియోకు రూ.250 చెల్లించాలి. భక్తుల దర్శనాలకు అడ్డు లేకుండా చిత్రీకరణ చేసుకోవలసి ఉంటుంది. గర్భగుడి, మూలవిరాట్టు విగ్రహాలను చిత్రీకరించుకునేందుకు అనుమతి ఉండదని దేవాదాయ శాఖ కమిషనర్ బి శరత్ తెలిపారు. రాష్ట్రంలో 34,563 ఆలయాలు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నాయి. వీటిలో రూ.25 లక్షలకు పైగా ఆదాయం ఉన్న 205 ఆలయాలను ఏ గ్రేడ్‌గా, రూ.5 లక్షల ఆదాయం ఉన్న 193 ఆలయాలను బీ.గ్రేడ్‌గా, మిగిలిన ఆలయాలను సీ-గ్రేడ్‌గా విభజించారు.

యువకుడిపై విపరీత దాడి

మండ్య, న్యూస్‌టుడే : పాండవపుర తాలూకా డింకా గ్రామంలో నవీన్ (42) అనే వ్యక్తిపై దాడి చేసిన దుండగులు అతని దుస్తులు విప్పదీయించి తీవ్రంగా కొట్టి పరారయ్యారు. ఒక యువతితో కలిసి బైకు వెళుతుండగా, కారు, బైకుపై వచ్చి దాడి చేసిన నిందితులు దాన్ని చరవాణిలో రికార్డు చేసుకున్నారు. బాధితునితో ఉన్న యువతి కూడా ఘటనలో గాయపడింది. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుంటున్నట్లు గుర్తించి నిందితులు పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో పాండవపుర ఠాణా పోలీసులు 14 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	65
క్యారెట్-	55
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	115
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	35
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	280

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	45
పైనాపిల్-	65
బొప్పాయి-	40
ఆరంజి-	110
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

మోసం కేసులో 12 మంది అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మానవహక్కుల సంరక్షణ, అవినీతి నిర్మూలన దళం సిబ్బంది పేరుతో ఓ వ్యక్తిని బెదిరించి రూ.24 లక్షలు తీసుకుని మోసగించిన 12 మంది నిందితులను దేవనహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి- అనంతపురం నివాసి కృష్ణకుమార్‌రెడ్డి (50), బెంగళూరు గ్రామీణ జిల్లా సూలిబెలె నివాసి అహ్మద్ షరీఫ్ (48), బాగేపల్లికు చెందిన వేణుగోపాల్(49), ఆనేకల్ సంపంగిరామ (47), శిడ్లఘట్ట నారాయణస్వామి (52), చింతామణి కేవీ శివ (42), మదనపల్లి టీవీ మురుగేశ్ (65), అనంతపురం నివాసి లతీఫ్ (53), కోలారు జిల్లా భట్టరహళ్లి వెంకటేశ్ (52) అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.14.60 లక్షలు నగదు, మానవహక్కుల సంరక్షణ అవినీతి నిర్మూలన దళం బోర్డుతో కూడిన వాహనాన్ని, 13 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బెంగళూరు సాయిలేఔట్ నివాసి కె.శంకరప్ప ఇచ్చిన ఫిర్యాదుతో ఆ నిందితులను అరెస్టు చేశామని మంగళవారం ధ్రువీకరించారు. రూ.30 లక్షలు ఇస్తే.. వివిధ రూపాల్లో మదుపు చేసి రూ.90 లక్షలు ఇస్తానని ఆశ చూపించి బాధితుడిని వలలో కూరుకుపోయేలా చేశారు. వారడిగిన నగదు తీసుకువస్తున్న సమయంలో దుండగులంతా అధికారుల వేషంలో వెంటాడి, శంకరప్పను బెదిరించి, డబ్బు తీసుకుని బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర తదితర ప్రాంతాల్లో గాలించి నిందితులను అరెస్టు చేశారు.

రాచనగరికి స్వచ్ఛ రాయబారులు

మైసూరు, న్యూస్‌టుడే : నటులు వశిష్ఠ సింహ, హరిప్రియ, శిల్పి అరుణ్ యోగరాజ్, గాయని అనన్యభట్, వివిధ రంగాలకు చెందిన సూరజ్‌సింగ్, అలోక్‌లను మైసూరు పాలికె తన స్వచ్ఛతా రాయబారులుగా నియమించుకుంది. వీరంతా రాచనగరిపై గౌరవం, ఇష్టంతో ఉచితంగా సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రజా జాగృతి కల్పించేందుకు వీరంతా పాఠశాలలు, కూడళ్లు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొని యువతకు, స్థానికులకు జాగృతి కల్పిస్తామని పాలికె అధికారులు తెలిపారు.

'కాళింగ' మనుగడకే గడ్డుకాలం

మంగళూరు, న్యూస్‌టుడే : పిలికుల జైవిక ఉద్యానవనంలో కాళింగ సర్పాల సంతానాభివృద్ధి కేంద్రానికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2 కోట్లకు పైగా విడుదల చేసింది. వాటికి సరైన ఆహారం, సంరక్షణ లేకపోవడంతో పాములు, వాటి పిల్లలు మరణిస్తూ వస్తున్నాయి. ఈ కేంద్రంలో 2022 జులైలో గుడ్ల నుంచి 38 కాళింగ సర్పాల పిల్లలు బయటకు వచ్చాయి. వాటిలో ఒక్కటీ ఇప్పటి వరకు బతికి లేవు. పాలక మండలి ప్రతినిధులు మాత్రం వాటిని చార్మాడి ఘాట్ వద్ద అడవిలో విడిచి పెట్టామని నిర్లక్ష్యపు సమాచారం ఇచ్చారు. పశ్చిమ కనుమల్లో పాము పిల్లలు, ఇతర వన్యప్రాణులను విడిచి పెట్టాలంటే అటవీశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. దీనికి సంబంధించి ఎటువంటి అనుమతులూ తీసుకోలేదని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. పాములకు ఆహారం సమకూర్చినట్లు స్థానిక మాంసం వ్యాపారుల నుంచి నకిలీ బిల్లులు తీసుకున్నారని వన్యప్రాణుల సంరక్షకుడు భువన్ ఆరోపించారు. దీనిపై తాను వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్‌కు ఫిర్యాదు ఇస్తున్నానని తెలిపారు.

ఉక్కు కార్ఖానాల విస్తరణకు నిరసనగా కొప్పళ బంద్

గంగావతి,న్యూస్‌టుడే: బల్డోటా, మరికొన్ని ఉక్కు కార్ఖానాల విస్తరణకు వ్యతిరేకంగా జిల్లా బచావో ఆందోళన సమితి మంగళవారం పాటించిన కొప్పళ బంద్ విజయవంతమైంది. పట్టణంలో వాహన సంచారం స్తంభించింది. పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడంతో దుకాణాలు మూతపడి వీధులు, ప్రయాణ ప్రాంగణం నిర్మానుష్యంగా కనిపించింది. ఆందోళనకారులు గవిమఠం మైదానం నుంచి నగర సభ వద్ద నిర్మించిన వేదిక వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. బాధిత గ్రామాల ప్రజలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్ఖానాల పొగకు మసిబారిన పంటలను ఎడ్ల బండ్లపై ప్రదర్శించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో తదుపరి పోరాటంపై నిర్ణయాలు తీసుకున్నారు. బల్డోటా విస్తరణ రద్దయ్యే దాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా మంత్రి, ప్రజాప్రతినిధులు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లి ప్రభుత్వంతో చర్చించాలన్నారు. ఐఐఎస్‌సీ, ఐఐఐఎంఎస్ బృందాలతో పర్యావరణ, ఆరోగ్య సమీక్షలు నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి బాధిత గ్రామాలను సందర్శించాలని డిమాండ్ చేశారు. స్వామీజీలతో కలిసి బాధిత గ్రామాలకు పాదయాత్రలు చేయనున్నట్లు చెప్పారు.

స్నాతకోత్సవ సంబరం

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ విశ్వవిద్యాలయంలో కన్నడ డిండిమ మార్మోగింది. మంగళవారం సాయంత్రం వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన 34వ స్నాతకోత్సవం, నుడిహబ్బ కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ పాల్గొని ఆచార్య సి.మహాదేవప్ప, డాక్టర్ హెచ్.సి.సత్యన్‌లకు ప్రతిష్ఠాత్మక నాడోజ పురస్కారం ప్రదానం చేశారు. మార్క్సవాది జి.రామకృష్ణ గైర్హాజరయ్యారు. ఇదే సందర్భంగా 107 మంది పరిశోధక విద్యార్థులు పిహెచ్.డి., పట్టా అందుకున్నారు. మంత్రి డాక్టర్ సుధాకర్, వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి, కులసచివుడు డాక్టర్ విరూపాక్షి పూజారహళ్లి, సిండికేట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మహాదేవప్ప, డాక్టర్ సత్యన్‌లకు నాడోజ పురస్కారం ప్రదానం చేస్తున్న గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్

మహిళ ఆత్మహత్యాయత్నం

హాసన, న్యూస్‌టుడే : ప్రముఖ న్యాయవాది, భాజపా నాయకుడు దేవరాజేగౌడ తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఒక మహిళ (36) విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బాధితురాలిని చికిత్స కోసం హిమ్స్‌లో చేర్పించారు. బాధితురాలు హొళెనరసీపుర నివాసి. ఆమె 'తేనెవల' విసురుతోందని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవరాజేగౌడ ఆరోపించాడని ఆమె హొళెనరసీపుర ఠాణాలో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి వేధింపులు ఎక్కువ అయ్యాయని ఆరోపిస్తూ ఆమె ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు.

మాదక ద్రవ్యాల విక్రేతల అరెస్టు

జప్తు చేసుకున్న మాదక ద్రవ్యాలు. నిందితులు

మైసూరు, న్యూస్‌టుడే : రాచనగరిలో యువతకు మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నలుగురిని మండి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. జియావుల్లా, జావెద్ అహ్మద్, సోహెల్, నూయేద్‌లను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి రూ.10.30 లక్షల విలువైన 103 గ్రాముల ఎండీఎంఏ గుళికలను జప్తు చేసుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వీరు మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

రాజధానిలో వాహనాల సోదా

నగరంలోకి పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు వస్తున్నాయని వచ్చిన సమాచారంతో బెంగళూరు ఉత్తర విభాగం పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాలను నిలిపి సోదా చేశారు. మల్లేశ్వరం, యశవంతపుర, రాజాజీనగర, ఆర్ఎంసీ యార్డు తదితర ప్రాంతాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి పోలీసులు సోదాలు నిర్వహించారు. అనుమాస్పదంగా వ్యవహరించిన కొందరిని ఠాణాలకు తీసుకువెళ్లి, విచారణ అనంతరం వారిని విడిచి పెట్టారు.

బస్సు ఢీకొని మహిళలకు గాయాలు

గదగ, న్యూస్‌టుడే : గదగ కొత్త బస్టాండ్ వద్ద సంభవించిన ప్రమాదంలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. రాయచూరు విభాగం మస్కి డిపోకు చెందిన కేకేఆర్టీసీ బస్సు బస్టాండ్ వద్ద వెళుతున్న ముగ్గురు మహిళలను ఢీకొంది. సుణగా గ్రామానికి చెందిన శాంతవ్వ సిద్ధప్ప కోర్తి అనే మహిళ ఒక కాలు పూర్తిగా విరిగిపోయింది. వెన్నుకు కూడా గాయాలు అయ్యాయి. ఇదే ప్రమాదంలో మరో ఇద్దరు మహిళలూ గాయపడ్డారు. బాధితులను చికిత్స కోసం ఎస్‌డీఎం ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాదానికి సంబంధించి వీడియో స్థానిక సీసీ కెమెరాలో రికార్డయింది. గదగ ట్రాఫిక్ ఠాణా దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

ఘనంగా మడివాళ జయంతి

మాచదేవ ఊరేగింపులో పాల్గొన్న సముదాయ నాయకులు

పావగడ,న్యూస్‌టుడే: పావగడ పట్టణంలో మడివాళ మాచదేవ జయంతిని మంగళవారం ఘనంగా ఆచరించారు. వెండి రథంపై మడివాళ మాచదేవ చిత్రపటంతో పాటు చిత్రదుర్గం మడివాళ మాచదేవ పీఠాధ్యక్షుడు బసవ మాచదేవ స్వామిని కూర్చోబెట్టి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు శింగరెడ్డిహళ్లి తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు కతెక్యాతనహళ్లి తిప్పేస్వామి, ఖజాంచి గంగాధర్, మాజీ కార్యదర్శి రొప్ప రాము, సభ్యుడు కిరణ్, టైలర్ గోవిందప్ప, చంద్రశేఖర్, సర్వేంద్ర పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సులువుగా కేసుల పరిష్కారం

ముళబాగిలు, న్యూస్‌టుడే: జాతీయ లోక్‌దాలత్, మధ్యవర్తిత్వ కార్యక్రమం సందర్భంగా మార్చి 14న న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న వ్యాజ్యాలను మధ్యవర్తిత్వంతో పరిష్కరించడానికి ముందుకు రావాలని ముళబాగిలు సివిల్ న్యాయమూర్తి గౌడ జగదీశ్ రుద్రే సూచించారు. ముళబాగిలు న్యాయస్థానంలో మంగళవారం నిర్వహించిన జాతీయ లోక్‌దాలత్, మధ్యవర్తిత్వ సమావేశంలో మాట్లాడారు. జెఎంఎఫ్‌సీ న్యాయమూర్తి జి.హరీష్, అడిషనల్ జడ్జి డి.రోహిణి, తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎన్.సతీష్‌కుమార్ మాజీ అధ్యక్షుడు ఎం.ఎస్.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు సి.వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు కబుర్లు

హోసూరులో 3,38,295 మంది ఓటర్లు

● జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 15,54,040

● జిల్లా తుది ఓటర్ల జాబితా విడుదల

హోసూరు, న్యూస్‌టుడే: తమిళనాడులో మార్చి, ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. కృష్ణగిరి జిల్లాలో హోసూరు, తళి, వేపనహళ్లి, కృష్ణగిరి, బర్గూరు, ఉత్తంగరై అసెంబ్లీ స్థానాలున్నాయి. జిల్లాలో మొత్తం 15,54,040 మంది ఓటర్లు ఉన్నారు. ఆరు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన జాబితా..

ఓటర్ల వివరాలు..

	పురుషులు	మహిళలు	హిజ్రాలు	మొత్తం
హోసూరు:	1,69,099	1,69,124	72	3,38,295.
తళి	1,20,000	1,15,947	37	2,35,984.
వేపనహళ్లి	1,23,389	1,20,449	37	2,43,875.
కృష్ణగిరి	1,29,777	1,35,200	60	2,65,037.
బర్గూరు	1,17,135	1,20197	17	2,37,349.
ఉత్తంగరై	1,16,918	1,16,541	41	2,33,500.

సౌకర్యాల వారధిగా డబుల్‌డెక్కర్ ర్యాంప్

సిల్క్‌బోర్డు కూడలి వద్ద నిర్మిస్తున్న వంతెన

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నగరంలోని రాగిగుడ్డ నుంచి సిల్క్‌బోర్డు కూడలి వరకు డబుల్‌డెక్కర్ ర్యాంప్ వంతెన పనులు పూర్తి దశకు వచ్చాయి. 3.5 కిలోమీటర్ల మెట్రో రైలు వంతెన కింద ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. రెండు ప్రదేశాల్లో వాహనాలు దిగేందుకు బీటీఎం లేఔట్, సిల్క్‌బోర్డు కూడలి వద్ద ర్యాంప్‌లను నిర్మిస్తున్నారు. వంతెన నిర్మాణ సమయంలో ర్యాంపు వంతెనలు నిర్మించలేదు. రాగిగుడ్డ వద్ద వాహనం డబుల్‌డెక్కర్ వంతెనపైకి ఎక్కితే సిల్క్‌బోర్డు వద్ద దిగుతారు. మధ్యలో దిగేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వాహనదారులు నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో బీఎంఆర్‌సీఎల్ అధికారులు స్పందించారు. మార్గం మధ్యలో మూడు ర్యాంప్ వంతెనల నిర్మాణాల్ని ప్రారంభించారు. నిర్మాణ పనులు చివరి దశకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ర్యాంప్ వంతెన పనులు పూర్తయిన తర్వాత వాహనాల రాకపోకలకు అనుమతిస్తారు.

నిరుద్యోగులకు రూ.3 వేలు ఇస్తున్నాం:డీకే

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న నిరుద్యోగులకు తమ ప్రభుత్వం ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గుర్తుచేశారు. యువ నిధి పథకాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ధార్వాడలో విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు వెనుక విపక్ష నాయకులు ఉండడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియామకాలు జరగకపోవడంతోనే ఆ భారం తమ ప్రభుత్వంపై పడిందని వివరించారు.

మట్టి కుండల హవా!

నాగరబావిలో కుళాయి ఉన్న నీటి కుండల్ని పరిశీలిస్తున్న మహిళలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: శివరాత్రితో చలి 'శివ శివా' అంటూ వెళ్లిపోయింది. బెంగళూరుతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా పగటి వేళల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. బెంగళూరులో ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 32 డిగ్రీలకు, రాచనగరి మైసూరులో 34 చేరుకోగా, మంగళూరు, కార్వారల్లో 33 డిగ్రీలు, బెళగావి, కలబురగి, రాయచూరుల్లో 35 డిగ్రీలకు చేరుకుంది. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా పాటరీ టౌన్‌లో నీటి కుండల తయారీ ఊపందుకుంది. వివిధ పరిమాణాల్లో, కుళాయితో కూడిన కుండల కొనుగోలుకు వినియోగదారులు ప్రాధాన్యమిస్తున్నారు. పండ్ల రసాలు, శీతలపానీయాలు, పుచ్చకాయలు, కర్బూజా, కొబ్బరి బొండాల విక్రయాలు గణనీయంగా పెరిగాయి.

వైభవంగా పురుచ్చితలైవి జయంతి

పూలరథంలో జయలలిత చిత్రపటంతో ఊరేగింపుగా తరలివచ్చిన కార్యకర్తలు

హోసూరు, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జయలలిత పుట్టినరోజును పట్టణంలోని పలుప్రాంతాల్లో ఘనంగా ఆచరించారు. మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో వాడవాడల్లో వైభవంగా నిర్వహించిన కార్యక్రమాల్లో అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎ.ఐ.ఎ.డి.ఎం.కె.కు చెందిన కార్పొరేటర్లు అశోక, హెచ్.శ్రీధర్, ఆ పార్టీ కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసన్ తదితరులు అధ్యక్షత వహించారు. జూజువాడిలో పార్టీ పతాకాన్ని ఎగుర వేసి లడ్డూలను పంచారు. రామనగరులో అలంకరించిన క్రేన్‌లో ప్రియతమ నేత జయలలిత చిత్రపటాన్ని ప్రదర్శించి మేళతాళాలతో కరగ నృత్యాలతో హోసూరు పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకులైన ఎం.జి.ఆర్ విగ్రహానికి మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి, పాల్ ఎస్.నారాయణ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

డెంకణీకోటలో నివాళులు

కేకు కోస్తున్న నాయకులు

డెంకణీకోట న్యూస్‌టుడే: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత 78వ జయంతిని మంగళవారం డెంకణీకోటలో అన్నాడీఎంకే తరఫున ఘనంగా ఆచరించారు. జయలలిత ఫొటోను పూలతో అలంకరించి పూజలు చేసి కేకు కోశారు. ఈ సందర్భంగా ఆమె పరిపాలన దక్షతను కొనియాడారు. ఎం.జి.ఆర్ నగర కార్యదర్శి, మాజీ పట్టణ పంచాయతీ అధ్యక్షుడు నాగేశ్ అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో నాయకులు రామమూర్తి, సంపంగిరామరెడ్డి, వెంకటచలపతిశెట్టి, పూసమని, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

అత్తిముగంలో జయలలిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఏడీఎంకే నాయకులు

బేరికె, బాగలూరు, (న్యూస్‌టుడే): బేరికెలో దివంగత నేత జయలలిత జయంతిని మాజీ అధ్యక్షుడు చిన్నబ్బయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్థానిక మహిళలకు అమ్మ పేరిట చీరలు పంపిణీ చేశారు. శూలగిరి యూనియన్ అత్తిముగంలో జయంతి వేడుకలను ఉదయం ఆ పార్టీ యూనియన్ కార్యదర్శి వెంకటాచలం బాబు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. బాగలూరు బస్టాండులో హోసూరు యూనియన్ కార్యదర్శి టి.ఆర్‌కె.రవికుమార్ నేతృత్వంలో 78 కిలోల భారీ కేకును కత్తిరించి స్థానికులకు పంచిపెట్టారు.

పరీక్షల నిర్వాహణకు సన్నాహాలు

కృష్ణగిరి(డెంకణీకోట), న్యూస్‌టుడే: వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో 10, 12వ తరగతి విద్యార్థులు, గత ఏడాది తప్పిన అభ్యర్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కృష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగింది. కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ హోసూరు, కృష్ణగిరి విద్యా జిల్లాల్లో మొత్తం 22,648 విద్యార్థులు 88 కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారని, వారికి కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, ఆరోగ్య సదుపాయాలు, పోలీసు బందోబస్తు, స్క్వాడ్ తదితరాల్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మదన్‌కుమార్, సహాయకులు సర్రార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గొర్రెల కాపర్లకు తుపాకులివ్వాలి

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: గొర్రెల కాపర్ల మండలికి గొర్రెల కాపర్లనే అధ్యక్షునిగా చేయాలని కర్ణాటక సంప్రదాయాక సంచార గొర్రెల కాపర్ల హిత రక్షణ సమితి సభ్యులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరారు. వన్యప్రాణుల దాడులు, ఇతర ప్రమాదాల్లో గొర్రెలు, మేకలు చనిపోతే పరిహారం రావడం లేదని ఫిర్యాదు చేశారు. పశువుల ఆసుపత్రికి తీసుకువెళితే జీవాలకు చికిత్సలు అందడం లేదని చెప్పారు. తుపాకీ వినియోగించేందుకు అనుమతి ఇస్తామని ప్రకటించి, ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. మండలికి నిధుల కొరత ఉందని, వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సంఘం అధ్యక్షుడు మంజునాథ్ ముఖ్యమంత్రిని కోరారు. గొర్రెల కాపర్ల రక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. జీవాల దొంగతనాలను అడ్డుకునేందుకు అవసరానికి అనుగుణంగా తుపాకీలకు లైసెన్సులను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్వచ్ఛతపై అవగాహన

ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: స్వచ్ఛతపై విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు మంగళవారం ఇక్కడ బెంగళూరు ఉత్తర నగర పాలికె పరిధిలోని యలహంక చౌడేశ్వరి వార్డులోని వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రత సంరక్షణ కోసం విద్యార్థులు పాటు పడాలని అధికారులు సూచించారు. స్వచ్ఛతతో పాటు పరిసర సంరక్షణ కోసం మొక్కలు పెంచాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ-2025-26లో బెంగళూరు ముందజలో ఉండే విధంగా అందరూ కలిసి శ్రమించాలని తెలిపారు.

డీకేతో మునిరత్న భేటీ

మునిరత్న అందించిన పత్రాలను పరిశీలిస్తున్న డీకే శివకుమార్

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: మాజీ మంత్రి, రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో మంగళవారం భేటీ అయ్యారు. వారి భేటీ 30 నిమిషాలకు పైగా కొనసాగింది. మొదటి నుంచి వారిద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతూ వస్తోంది. తన నియోజకవర్గం అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, ఇటీవల ప్రత్యేకంగా నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో కోరానని మునిరత్న గుర్తు చేశారు. ఇవే అంశాలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని కోరగా శివకుమార్ అంగీకరించారని చెప్పారు. రాజరాజేశ్వరినగర నియోజకవర్గంలో వంతెనలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ఈత కొలనుల నిర్మాణం, జాలహళ్లి కూడలి వద్ద వాహన రద్దీ నియంత్రణకు చర్యలకు సంబంధించి తాను వినతిపత్రాన్ని ఇచ్చానని చెప్పారు. తన నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించి మినహా తానేమీ చర్చించలేదని మునిరత్న స్పష్టం చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి తాను ఎవరి కాళ్లయినా పట్టుకునేందుకు సిద్ధమని గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన మరోసారి గుర్తుచేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్, కర్ణాటక స్వయం ప్రేరిత రక్తదాన సంఘం, ఈఎస్ఎస్-ఏపీఆర్ ఫౌండేషన్ సహకారంతో కెంగేరిలోని శేషాద్రిపురం అకాడమి ఆఫ్ బిజినెస్ స్టడీస్-ఎస్ఏబీఎస్ కె.ఎం.నంజప్ప స్మారక రక్తదాన శిబిరంలో కళాశాల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని రక్తదానం చేశారు. మంగళవారం కళాశాల సభాంగణంలో నాడోజా డాక్టర్ వుడే.పి.కృష్ణ నేతృత్వంలో జరిగిన ఈ రక్తదాన శిబిరాన్ని శేషాద్రిపురం విద్యాసంస్థ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ ఎస్.చౌక, బెంగళూరు నగర పోలీసు శాఖ కెంగేరి ఉపవిభాగం ఏసీపీ ఎ.బసవరాజతేలి, ప్రిన్సిపల్ డాక్టర్ జయరామ్, రోటేరియన్ డాక్టర్ అనుపమా పంచాక్షరి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రేష్మా మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని సేవించాలని సలహానిచ్చారు. ఎస్ఐపీయూసీ ప్రిన్సిపల్ డాక్టర్ మంజునాథ రక్తదానం ప్రాధాన్యాన్ని వివరించారు.

రూ.380 కోట్లతో రోటరీ వంతెన

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: నగరంలోని బాణసవాడి ప్రధాన రహదారిలో ఐటీసీ కూడలి వద్ద సంచార రద్దీ నియంత్రణకు శాశ్వత పరిష్కారం కోసం రూ.380కోట్లతో ఎలివేటెడ్ రోటరీ ఉపరితల వంతెన పథకాన్ని సిద్ధం చేసినట్లు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు. బి.స్మైల్, కె.రైడ్ అధికారులతో కలిసి ఆయన ఆప్రదేశాన్ని పరిశీలించారు. ఐటీసీ కూడలి వద్ద మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల పొడవు కలిగిన ఎలివేటెడ్ రోటరీ ఉపరితల వంతెన పథకాన్ని సిద్ధం చేశామన్నారు. దాంతో పాటు బయ్యప్పనహళ్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద అదనంగా రెండు మార్గాల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన యత్నాల్

యాదగిరి: గురుమఠకల్‌లో నిర్వహించిన శివాజీ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. మహాత్ముడు జాతిపిత కాదని, పాకిస్థాన్‌కు జాతిపిత అంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నెహ్రూను కూడా తాము మొదటి ప్రధాని అని అంగీకరించమంటూ మరో వివాదాస్పద వ్యాఖ్యను కూడా ఆయన ఇదే సందర్భంలో చేశారు.

రెండు ఆటోల స్వాధీనం

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: ఆటోలను దొంగిలిస్తున్నాడనే ఆరోపణపై వేణుగోపాల్ రెడ్డి లేఔట్ నివాసి మంజును కుణనకుంటె పోలీసులు అరెస్టుచేశారు. అతడు దొంగిలించిన రూ.4 లక్షలు విలువ చేసే రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

అరసికెరెలో ఉల్లాసంగా ఉత్సవం

గ్రామోత్సవంలో జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ, న్యూస్‌టుడే: తాలూకాలోని అరసికెరె, కొండాపురం గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవత కొల్లాపురమ్మ ఉత్సవం వైభవంగా జరిగింది. మూడ్రోజుల ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవత కొల్లాపురమ్మ దేవిని సోమవారం ఉదయం నిడిగల్లు దుర్గంలోని రామతీర్థంలో జలది మహోత్సవం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం అరసికెరె గ్రామంలో కొల్లాపురమ్మ దేవాలయం నుంచి ఊరేగింపు ప్రారంభించి బస్టాండు, శిరా రహదారి మీదుగా గ్రామ శివార్లలోని దిబ్బదమ్మ ఆలయానికి చేరుకొని అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలాచరించారు. ఊరేగింపులో ప్రతి ఇంటి నుంచి మహిళలు పూలతో అలంకరించిన జ్యోతులను మోసి అమ్మవారికి సమర్పించుకొన్నారు. మంగళవారం రాత్రి అమ్మవారికి భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకొని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఉత్సవాల్లో భాగంగా అరసికెరెలో సోమవారం రాత్రి నిర్వహించిన దక్షయజ్ఞం, విషాద ప్రేమికులు అనే పౌరాణిక నాటకాలు ప్రేక్షకుల్ని అలరించాయి.

తనూజ నాయక్‌కు దత్తి ప్రశస్తి

బెంగళూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: గదగ జిల్లా పాత్రికేయ సంఘం ప్రదానం చేసే అవ్వ ప్రతిష్ఠాన-2025 దత్తి ప్రశస్తికి పాత్రికేయురాలు తనూజా (సంయుక్త కర్ణాటక దినపత్రిక సీనియర్ ఉపసంపాదకురాలు, హుబ్బళ్లి) నాయక్ ఎంపికైనట్లు పేర్కొంది. గ్రామ గంగోత్రి ఆవరణలోగల కౌశల్య వికాస భవన ఆడిటోరియంలో గురువారం ఆమెకు ప్రశస్తి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చామరాజపేటలో స్వామి వేడుకలు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: బసవనగుడి చామరాజపేటలోగల శ్రీరాఘవేంద్ర కాలనీలోని శ్రీపాదరాజుల మఠంలో శ్రీరాఘవేంద్రస్వామి జయంతి వేడుకలను ఘనంగా ఆచరించారు. మంగళవారం శ్రీపాదరాజ మఠంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేషంగా ఫలపంచామృత అభిషేకం, తులసీ, సుగంధ పుష్పాలతో అలంకరించారు.

నగరం.. సమస్యల వలయం

బిలమార్గం మూత తొలగిపోవడంతో అడ్డుగా ఉంచిన కట్టె ముక్కలు, బ్యారికేడ్లు

సుజాత థియేటర్ సమీపంలోని వ్యర్థాలను వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: పారిశుధ్య కార్మికులు, చెత్తను తరలించే వాహనాల కొరతతో నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. ఇళ్ల వద్ద చెత్తను సేకరించుకునేందుకు కార్మికులు క్రమం తప్పకుండా రాకపోవడంతో కొందరు రహదారులపైనే చెత్తను పారబోసి వెళ్తున్నారు. రహదారులపై గుంతలు, బిలమార్గాల మరమ్మతులకు సంబంధించి కొత్తగా గుత్తేదార్లు ముందుకు రాకపోవడంతో ఆ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఈ రెండు చిత్రాలు వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

'రాష్ట్రం అప్పులు రూ.3 లక్షల కోట్లు'

సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడు అశోక్

చిత్రదుర్గం,న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ అయింది, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు దాదాపు రూ.3 లక్షల కోట్లకు చేరుకొన్నాయని విధానసభలో ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు నిండుకొన్నా బడ్జెటు తయారీ పేరుతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పార్టీ నేతల్ని తనచుట్టూ తిప్పుకొంటూ ఎత్తుగడలు వేస్తున్నారని విమర్శించారు. రానున్న బడ్జెట్‌లో ప్రజలు ఆశించిన ఎలాంటి ప్రయోజనాలు ఉండబోవన్నారు. రానున్నది వసూలు బడ్జెటు అని ఎద్దేవా చేశారు. ఎగువ భద్రా సాగునీటి పారుదల పథకం సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదని చెప్పారు. ఇంత వరకు ఎలాంటి సమావేశాలను జరపలేదని, కేంద్ర ప్రభుత్వానికి అవసరమయిన వివరాలను పంపలేదన్నారు. సీఎం జీఎస్టీ, నీతి ఆయోగ్ సభలకు గైర్హాజరు కావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి దానికి కేంద్ర ప్రభుత్వాన్ని దూషించడం వల్ల ప్రయోజనం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో 2.50 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీ కలవని వాటి భర్తీ చేయడానికి ప్రయత్నించడం లేదని విమర్శించారు.

వీధికుక్కల దాడిలో 11గొర్రెలు బలి

చింతామణి, న్యూస్‌టుడే: గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో 11 గొర్రెలు మృతి చెందాయి. 10 గొర్రెలు తీవ్ర గాయాలకు గురైన ఘటన కెంచార్లహళ్లి పీఎస్ పరిధిలోని అగ్రహారహళ్లిలో జరిగింది. సత్యనారాయణ అనే రైతు 50 గొర్రెలను సాకుతున్నాడు. గత రాత్రి సుమారు రెండు గంటల సమయంలో షెడ్డులో ఉన్న గొర్రెలపై దాడి చేసింది. పశువైద్యుడు డాక్టర్ అమరనాథరెడ్డి గాయపడ్డ గొర్రెలకు వైద్యం చేశారు. రెవెన్యూ శాఖ అధికారి నరసింహమూర్తి, సిబ్బంది స్థల పరిశీలన జరిపి పై అధికారులకు వివరాలను పంపారు.

నీటి కుంటలో పడి బాలుడు మృతి

చింతామణి, (న్యూస్‌టుడే): ఆకస్మికంగా కాలు జారి వ్యవసాయ కుంటలో పడిన మూడేళ్ల కరుణకర అనే బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన తాలూకాలోని కనిశెట్టిహళ్లిలో జరిగింది. ఇంటి ముందు ఆడుతున్న కరుణాకర కనిపించక పోవడంతో గ్రామంలో గాలించినా ఫలితం లేకపోయింది, రాత్రి గడిచాక అనుమానంతో సమీపంలో ఉన్న వ్యవసాయ కుంటను తల్లిదండ్రులు, బంధువులు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో శోధిస్తుండగా బాలుడి శవం లభించింది.

పప్పికి సహకరించిన వారిపై కేసుల నమోదు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: చిత్రదుర్గం ఎమ్మెల్యే వీరేంద్ర పప్పికి సహకరించిన ఆరోపణలపై ఆయనకు మద్దతు ఇచ్చిన వారిపై మరో కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్, అక్రమ బెట్టింగ్‌లకు సంబంధించి పప్పి అనుచరులు పృథ్వి ఎన్ రాజ్, కేసీ తిప్పుస్వామి, గుల్షన్ ఖట్టార్, అర్జున్ నాగభూషణ్, అభిజిత్ సజ్జన్, ఫోన్ పైసా పేమెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, లాజిక్ ఫోర్జ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితరాలపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఈడీ అధికారులు వెల్లడించారు.



(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

మారికాంబ మహోత్సవం!

శివమొగ్గ, న్యూస్‌టుడే: మలెనాడు పాదప్రాంత మహా నగరి.. శివమొగ్గ ఊరి దేవత మారికాంబ దేవి జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 28న అమ్మవారి ఉత్సవమూర్తిని అడవిలో విడిచి పెట్టి రావడంతో జాతరకు తెరపడుతుంది. మార్చి 6న మారికాంబ దేవాలయం సమితి తరఫున కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు. గాంధీబజార్ ప్రాంతంలోని మారికాంబ పుట్టిన ఇంట్లో పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం.. బ్రాహ్మణ నాడిగరు పుట్టింటి నుంచి తెచ్చిన బాసింగాన్ని నుదుట కట్టి వివాహం చేయించారు. మాంగల్యధారణ అనంతరం అమ్మవారికి పూజ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం వేకువ జాము నుంచే భక్తులు కదలి వచ్చారు. ఉప్పార సముదాయం భక్తులు అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఊరేగించారు.

ఆమె విసిరింది.. తేనెవల

బెంగళూరు (యలహంక): శీతల పానీయంలో మత్తు మందు కలిపి తనపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించిన యువతిపై ప్రతిగా ఓ యువకుడు ఠాణాలో ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. 'తేనెవల' విసిరి నగదు కోసం తనను ఆ యువతితో పాటు ఓ ప్రైవేట్ ఛానల్ ఉద్యోగి ఇమ్రాన్ బెదిరిస్తున్నారని బాధితుడు నిఖిల్ ఆరోపించారు. నిఖిల్ ఫిర్యాదుతో ఇమ్రాన్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి విచారణ చేపట్టారు. స్నేహితుడు డిక్సన్ చంద్ర ద్వారా ఆ యువతి పరిచయమైందని, ఈనెల 14న జక్కూరులోని ఓ విల్లాలో విందులో ఆమెతో కలిసి నృత్యం చేసినట్లు బాధితుడు వివరించాడు. ఆమె తనతో చాలా సన్నిహితంగా గదిలో గడిపిన దృశ్యాలను ఇమ్రాన్ చిత్రీకరించి వెంటాడుతున్నట్లు ఆరోపించాడు. మరుసటి రోజు నుంచే డబ్బు కోసం ఆ ఇద్దరూ 'వీడియో'లతో బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో వివరించాడు.

అందరూ చదవాల్సిన పుస్తకం 'కృతి సౌహార్ద భారత'

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీఎస్సై హులిగేశ్

రాయచూరు, న్యూస్‌టుడే: ప్రగతి పర విషయాల ఆధారంగా సాహితీ బరగూరు రామచంద్రప్ప రచించిన కృతి సౌహార్ద భారత పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని అధ్యాపకురాలు రేఖా పాటిల్ కోరారు. కన్నడ పుస్తక ప్రాధికార (బెంగళూరు), విరాట డిగ్రీ కళాశాల (యాపలదిన్ని) సంయుక్తంగా కళాశాల్లో పుస్తక పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా రేఖా ప్రసంగిస్తూ ప్రజల జీవన విధానం, సంస్కృతి, శాస్త్రీయ భావాలు పెంపొందించేలా, సామాజిక న్యాయ పరికల్పనను పుస్తకంలో చక్కగా వివరించారని తెలిపారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువకుల సమస్యలను ప్రస్తావించారని, వివేకానందుడి సౌహార్దత, గాంధీ, అంబేడ్కర్ సందేశాలను వివరించారని తెలిపారు. జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన యాపలదిన్ని ఠాణా పీఎస్సై హులిగేశ్ మాట్లాడుతూ జ్ఞానార్జనకు నిత్యం పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని కోరారు. ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్న వారు ఉల్లాసం కోసం కొంతసేపు కథలు, కథానికలు చదవాలని సూచించారు. కన్నడ పుస్తక ప్రాధికార సభ్యుడు నిరగుడి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహేశ్ నాయక్, ప్రిన్సిపల్ వెంకటేష్ వేదికను అలంకరించారు.

నగరం మునకేసింది

రాయచూరులో జోరుగా కురిసిన వర్షం

విద్యాభారతి వంతెన వద్ద చోదకుల ఇక్కట్లు

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. సోమవారం రాత్రి ఈదురుగాలులు వీయడంతో వాన సంకేతాలు కన్పించాయి. అంతా నిద్రిస్తున్న వేళ దంచి కొట్టింది. వర్షం ధాటికి

రాయచూరులోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యాభారతి రైల్వే వంతెన దిగువన నీరు నిలవడంతో వాహన చోదకులు ముప్పుతిప్పలు పడ్డారు. మరోవైపు వర్షం కారణంగా ఎండ నుంచి ఉపశమనం కల్గింది. చల్లటి వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదించారు.

తడిసిన జొన్న పంట

మరోవైపు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు వరుణుడి ప్రతాపానికి నాశనమయ్యాయి. రాయచూరు తాలూకాలోని పలు గ్రామాల్లో జొన్నల రాశులు తడిసిపోయాయి. మన్సలాపూరు, హొసపేట, మర్చడ్, మల్లాపూరు, జేగరకల్ తదితర గ్రామాల అన్నదాతలు అపారంగా నష్టపోయారు. ఆర్థికంగా ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండు చేస్తున్నాయి.

ఒక పాఠశాల ఆవరణలో నిలిచిన వాన నీరు

జిల్లా వ్యాప్తంగా...

జిల్లాలోని మాన్వి, సింధనూరులో తప్పా మిగిలిన తాలూకాల్లో వాన పడిందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. మి.మీ.లో రాయచూరు 5.8, దేవదుర్గ 3.0. లింగసూగూరు 1.1, మస్కి 0.6, సిరివార 0.3 నమోదైంది. సగటున1.9 సెం.మీ వాన పడింది.

అమరశ్రీ ఉద్యానవనంలో పక్షుల కోసం ఉట్టి కడుతున్న విద్యార్థినులు

ప్రాణులు, పక్షులపై దయ చూపుదాం !

సింధనూరు, న్యూస్‌టుడే: ఈ భూ ప్రపంచంలో జీవించే హక్కు అన్ని జీవరాశులకూ ఉంది, నోరులేని జీవాలపై ప్రాణి దయ చూపుదామని శారదా మహిళా కళాశాల ప్రాచార్యులు బసవరాజ్ బాదర్లి విద్యార్థినులకు హితవు పలికారు. రాష్ట్రీయ సేవాయోజనలో భాగంగా శారదా మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థినులు మంగళవారం స్థానిక పీడబ్ల్యూడీ క్యాంపులోని అమరశ్రీ ఉద్యానవనంలో శ్రమదానం చేశారు. వనసిరి ఫౌండేషన్ ప్రతినిధుల సహకారంతో ఉద్యానవనంలోని చెట్లకు పక్షుల కోసం ఉట్లు కట్టి వాటిలో తిండి గింజలు, నీళ్లు పోశారు. వనసిరి అధ్యక్షుడు అమరేగౌడ మల్లాపూరు మాట్లాడుతూ. .ఏటా మా వనసిరి సంస్థ వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చే కార్యాలు తలపెడుతుంటుంది.. అది ఈ ఏడాది ముందుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థుల చేతుల మీదుగా ఆరంభం కావడం హర్షణీయం అన్నారు. వనసిరి మస్కి విభాగం రాజు పత్తార్, ఎన్ఎస్ఎస్ అధికారి కరిబసణ్ణ, దొడ్డబసవ హిరేమఠ్ పాల్గొన్నారు.

విమానాశ్రయంలో భారీగా గంజాయి స్వాధీనం

బెంగళూరు (యలహంక): బెంగళూరు శివార్లలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు రూ.2.8 కోట్ల విలువ చేసే హైడ్రో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడి తోపుడు సంచి (ట్రాలీ బ్యాగ్) పరిశీలించినప్పుడు ఆ సరకు ఉన్నట్లు గుర్తించారు. ఆ సంచి తరలించుకొస్తున్న ప్రయాణికుడిని అరెస్టు చేశారు. హాంకాంగ్ నుంచి వచ్చిన మరో ప్రయాణికుడి నుంచి తొమ్మిది వందల గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. దానివిలువ రూ.31.25 లక్షలని తేల్చారు. ఈ రెండు కేసుల దర్యాప్తు చేపట్టామని మంగళవారం ఇక్కడ ఓ ప్రకటనలో వెల్లడించారు.

తగిన పరిహారాన్ని చెల్లించండి

మాన్వి, న్యూస్‌టుడే: జొన్న పంటను కోల్పోయిన రైతు యంకోబా కుటుంబానికి తగిన పరిహారాన్ని చెల్లించాలని దళ్(ఎస్) నాయకుడు, మాన్వి మాజీ శాసనసభ్యుడు రాజా వెంకటప్ప నాయక్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. మూడు రోజుల క్రితం జాగీర పన్నూరు గ్రామంలోని యంకోబాకు చెందిన ఆరు ఎకరాల జొన్న రాశిని అల్లరిమూకలు తగులబెట్టిన విషయం తెలిసిందే. వెంకటప్ప నాయక్ మంగళవారం రైతు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జాప్యం చేయకుండా పరిహారాన్ని ప్రకటించాలని డిమాండు చేశారు. ఘటనకు కారణమైన వారిని ఉపేక్షించ వద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట దళ్(ఎస్) రాష్ట్ర యువ విభాగం అధ్యక్షుడు రాజా రామచంద్రనాయక్, దళపతులు శరణప్పగౌడ, బాషాసాబ్, విజయనాయక్, ఖాసింసాబ్, బసవరాజ స్వామి, న్యాయవాదులు రవికుమార్, యల్లప్ప నాయక్ పాల్గొన్నారు.

కాలిన పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బడ్జెట్‌లో పౌష్టికాహార పథకాన్ని ప్రకటించాలి

రాయచూరు, న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని వాల్మీకి నాయక్ సముదాయం ప్రజలకు బడ్జెట్‌లో పౌష్టికాహార కిట్ పథకాన్ని ప్రకటించాలని విభాగం కార్యదర్శి రఘువీరనాయక్ ఒత్తిడి తెచ్చారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయచూరు, యాదగిరి, కలబురగి, బీదర్, కొప్పళ, విజయనగర, బళ్లారి జిల్లాల్లో వాల్మీకి నాయక్‌ల జనాభా అధికమని, వీరు కుల వృత్తిని కోల్పోయినందున ఆర్థిక పరిస్థితి దిగజారిందని తెలిపారు. కుటుంబ పెద్దలు నగరాలకు ఉపాధికి వలసలు వెళ్లినందున సొంతూళ్లలోనే ఉంటున్న మహిళలు పోషకాహారం లోపంతో అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషకాల కిట్లను పంపిణీ చేసేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎస్టీ సంక్షేమ నిర్దేశనాలయం కొన్ని వర్గాలకు కిట్స్‌ను ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో ప్రతినిధులు మల్లికార్జున, రాము, బోళబండి, రమేశ్, నరేంద్ర ఉన్నారు.

సమావేశంలో వివరిస్తున్న రఘువీర

ఎరువులు మితంగా చల్లితేనే భూసార రక్షణ

జయంతరావ్‌కు స్వాగతం పలుకుతున్న అధికారి

రాయచూరు, న్యూస్‌టుడే: భూసారాన్ని రక్షించుకునేందుకు రసాయన ఎరువులను మితంగా చల్లాలని, సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆర్‌పీఎంసీ అధ్యక్షుడు జయంతరావ్ అన్నదాతలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సభా భవనంలో డీలర్స్ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యాపారులు పై విషయాలను రైతులకు తెలియజేయాలని కోరారు. గత ఖరీఫ్ సీజన్ ఆరంభంలో జిల్లాలో యూరియా, డీఏపీ కొరత ఏర్పడగా.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాణ్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన స్పందించారని తెలిపారు. ఈ ఏడాది రెండు సీజన్లలో ఎరువుల కొరత ఏర్పడకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ మనోహర్ తన ప్రసంగంలో మట్టి పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇచ్చారు. అత్యధిక ప్రమాణంలో ఎరువులను తయారు చేసే పరిశ్రమలు స్థాపించారని వెల్లడించారు.

జ్ఞాన సంపాదనకు పుస్తకాల సేకరణ

రాయచూరు: పిల్లల భవిష్యత్తు కోసం విలువైన సమాచారం కల్గిన పుస్తకాలను ఇళ్లలో భద్రంగా దాచాలని ఆచార్య ప్రాణేశ్ కులకర్ణి కోరారు. కన్నడ పుస్తక ప్రాధికార చైతన్య సమితి మంగళవారం నగరంలోని డాక్టర్ వెంకటేష్ నవలి గృహంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. దీన్ని ప్రాణేష్ ప్రారంభించి ఉపన్యసించారు. విత్తనాలు ఎలా వృక్షాలుగా ఎదిగి నీడనిస్తాయో అలాగే ఒక్కో పుస్తకాన్ని సేకరిస్తే జ్ఞాన వృక్షాలను అందిస్తాయని వివరించారు. గ్రంథాలయాలు మన యోచన పరిధిని విస్తృతం చేస్తాయని, రచయిత భావాలకు స్పందించే తత్వం ఏర్పడుతుందని చెప్పారు. విశ్రాంత ప్రిన్సిపల్ రాజశ్రీ, ఇంటికో గ్రంథాలయం సభ్యుడు బాబు భండారిగల్, సాహితీవేత్త వీరహనుమాన్, జిల్లా కసాప గౌరవ కార్యదర్శి రావుతరావురు బరూరు హాజరయ్యారు.

ప్రసంగిస్తున్న ప్రాణేశ్

శారీరక దృఢత్వానికి క్రీడలు అవసరం

క్రీడా జ్యోతిని అందిస్తున్న సీఈవో

రాయచూరు, న్యూస్‌టుడే: విధుల ఒత్తిళ్లతో సతమతమయ్యే ఉద్యోగులు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి తరచూ క్రీడా పోటీల్లో పాల్గొనాలని జడ్పీ సీఈవో ఈశ్వరకుమార్ సూచించారు. ఆయన మంగళవారం వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం మైదానంలో గ్రామీణాభివృద్ధి, పంచాయత్ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా, సాంస్కృతిక రెండు రోజుల ఉత్సవాలను ప్రారంభించారు. సీఈవో మాట్లాడుతూ ఎక్కడ పోటీలు జరిగినా ఉత్సాహంగా హాజరు కావాలని కోరారు. గెలుపోటములను పట్టించుకోకుండా ఆడాలన్న లక్ష్యంతో పాల్గొనాలన్నారు. అలాగే సామాజిక మాధ్యమాలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సలహా ఇచ్చారు. సామాన్యుల అంచనాలకు అనుగుణంగా సేవలందించాలని కోరారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణ శావంతగేరా ప్రసంగిస్తూ ఉద్యోగం జంజాటం నుంచి ఉపశమనం కల్గించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతిభకు పదును పెట్టేందుకు క్రీడా వేదికను సద్వినియోగం చేసుకుని రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. జడ్పీ అధికారులు హాల సిద్ధప్ప పూజారి, శరణబసవరాజు, రోణె, విజయశంకర్, తాలూకా పంచాయతీ ఈవో చంద్రశేఖర్ పవార్, డీహెచ్ఓ డాక్టర్ సురేంద్రబాబు, యువజన క్రీడాశాఖ అధికారి వీరేశ్ నాయక్ హాజరయ్యారు.

క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

గురురాయుడికి విశేష ఫలపంచామృతాలు

పురాతన రామమందిరంలో గురురాయుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చక స్వాములు

శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో హోమం కైంకర్యంలో పాల్గొన్న మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప

సింధనూరు, న్యూస్‌టుడే: శ్రీగురురాయుని 431వ వర్ధంతి ఉత్సవం సందర్భంగా సింధనూరు పాతబజార్ పురాతన శ్రీరామమందిరం, పీడబ్ల్యూడీ క్యాంపులోని రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం రోజంతా ఘనంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. పురాతన శ్రీరామమందిరలో అర్చకస్వాములు శ్రీరామచంద్ర దేవుడికి, వాయుదేవునికి, గురురాయుడికి విశేష ఫలపంచామృత సమేత అష్టోత్తర కార్యక్రమం జరిపినట్లు స్వాములు వెల్లడించారు. శ్రీగురురాఘవేంద్రస్వామి మఠంలో ఉదయం నుంచి అష్టోత్తర కైంకర్యాలు, హోమాలు జరిపి మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నప్రసాదం సమర్పించారు. హోమం కార్యక్రమంలో మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప పాల్గొని లోక కల్యాణం కోసం ఆ గురుసార్వభౌముని కీర్తించినట్లు చెప్పారు.

శ్రద్ధగా చదివితే చక్కటి ఫలితాలు

సింధనూరు, న్యూస్‌టుడే: గతంలో విద్యార్థులకు చదువుకోవాలంటే ఎన్నో కష్టాలు ఉండేవి. కళాశాలల్లోనే అసౌకర్యాలు ఉండేవి అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రభుత్వాలు విద్యా అవసరాలకు ఎంతో వెచ్చిస్తున్నాయి.. నాణ్యత గల విద్య కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి.. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తమ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలి అని మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ విద్యార్థులతో అన్నారు. శ్రద్ధపెట్టి చదవండి చక్కని ఫలితాలు వాటంతట అవే వస్తాయని చెప్పారు. స్థానిక అనికేతన కళాశాల విద్యార్థుల వార్షిక స్నేహసమ్మేళన కార్యక్రమం మంగళవారం శ్రీసత్యాగార్డెన్స్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్.బసనగౌడ మాట్లాడారు. మరో అతిథి సింధనూరు డీఎస్పీ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు బుద్ధ, బసవ, అంబేడ్కర్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. భాజపా నాయకుడు కె.కరియప్ప, క్రాంతివీర సంగొళ్లి నాయకుడు సురేశ్, అనికేతన కళాశాల పాలక సమితి అధ్యక్షుడు డీహెచ్.కంబళి, సాహిత్య పరిషత్ తాలూకా మాజీ అధ్యక్షురాలు రమాదేవి, శేఖర్ యరదిహాళ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మస్కి శాసనసభ్యుడు ఆర్.బసనగౌడ

ఇడపనూరు పరిధిలో విద్యుత్తు కోత

రాయచూరు, న్యూస్‌టుడే: రాయచూరు తాలూకా ఇడపనూరు ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు. సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనులు చేయాల్సిన నిమిత్తం సరఫరాను స్తంభింప చేస్తామని జెస్కాం గ్రామీణ విభాగం ఇంజినీర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు అంతరాయానికి సహకరించాలని వినియోగదారులను కోరుతున్నారు.

నిగమకు భారీగా నిధులివ్వాలని వినతి

రాయచూరు: బోవి అభివృద్ధి నిగమకు బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రికి విన్నవించినట్లు నిగమ అధ్యక్షుడు రామప్ప వెల్లడించారు. మంగళవారం రాయచూరు పర్యటనకు విచ్చేసిన ఆయన విలేకరుల గోష్ఠిలో మాట్లాడారు. నిరుడు బడ్జెట్‌లో రూ.93.75 కోట్ల నిధులు సమకూర్చారని, ఇంతవరకూ మంజూరైన రూ.68.81 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు. పథకాలకు లబ్ధిదారులను త్వరగా ఎంపిక చేసి, వేగంగా ఆర్థిక సాయం అందేందుకు సహకరించాలని శాసనసభ్యులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. స్వయం ఉపాధి నేర రుణం యోజనలో జిల్లాలో 2021 నుంచి 2026 వరకు 168 మంది లబ్ధిదారులకు రూ.1.35 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. ఉద్యమశీల సహాయ ధనం పథకంలో 33 మందికి రూ.66 లక్షలు, గంగా కల్యాణ యోజనలో 120 మందికి రూ.30 లక్షలు, భూ సంబంధ పథకంలో 436 మంది లబ్ధిదారులకు రూ.4.80 కోట్లను మంజూరు చేసినట్లు విపులీకరించారు. బోవి సామాజిక వర్గం జనాభా అధికంగా ఉన్న 11 జిల్లాల్లో ప్రగతిని సమీక్షించేందుకు పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సమాజం ప్రముఖులు యల్లప్ప, శశికళ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రామప్ప

ఉరేసుకొని బాలుడి ఆత్మహత్య

మియాపూర్ (హైదరాబాద్), న్యూస్‌టుడే: మియాపూర్ ఠాణా పరిధిలో ఉరేసుకొని బాలుడు ఆత్మహత్య పాల్పడిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. ఎస్సై కృష్ణ గౌడ్ కథనం ప్రకారం.. కర్ణాటక బీదర్‌కు చెందిన దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి హఫీజ్‌పేట సాయినగర్‌లో ఉంటున్నారు. వారి కుమారుడు (17) గతేడాది పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించలేక పోయాడు. తండ్రి అనారోగ్యం కారణంగా కుటుంబ సభ్యులు సోమవారం చికిత్స నిమిత్తం బీదర్ వెళ్లారు. బంధువుల అబ్బాయితో కలిసి బాలుడు ఇక్కడే ఉన్నాడు. బంధువుల అబ్బాయి మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లి వచ్చేసరికి తలుపులు పెట్టి ఉన్నాయి. కిటికీ పగలగొట్టి చూడగా, చీరతో ఫ్యానుకు ఉరేసుకుని కనిపించాడు. పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఇటీవల ఫీజు చెల్లించాడని, ఈ నేపథ్యంలోనే భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేదా ఏదైనా ఇతర కారణాలు ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భేదాల్లేవని చాటే సామూహిక వివాహాలు

వివాహబంధంతో ఒక్కటైన జంటలు

సిరివార(మాన్వి) న్యూస్‌టుడే: సామూహిక వివాహాలు ఒకే కులానికి పరిమితం కాదు. పేదలు, శ్రీమంతులు, ఉన్నత, అణగారిన వర్గాల అన్న భేదం లేకుండా అంతా ఒక్కటే అని చాటి చెప్పేవని కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు పేర్కొన్నారు. సిరివార తాలూకా నవలకల్ గ్రామంలోని శాంభవి మఠంలో 29వ జాతర సందర్భంగా సామూహిక వివాహాలు జరిగాయి. నూతన దంపతులను స్వామీజీ ఆశీర్వదించి మాట్లాడారు. సంసారంలో ఎదురయ్యే కష్ట సుఖాలను అధిగమించి అన్యోన్యంగా జీవిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. రాచోటి వీరశివాచార్య స్వామి ప్రసంగిస్తూ కలిసిమెలిసి ఉండే భార్య భర్తలు శివుడికి ప్రీతిపాత్రులవుతారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గంగాధర నాయక్, ఆర్‌డీసీసీ బ్యాంకు నిర్దేశకుడు రాజశేఖర్ నాయక్, పీఠాధిపతి సోమనాథ శివాచార్యులు, స్వాములు బూది బసవేశ్వర, శివమూర్తి శివాచార్య, వీర సంగమేశ్వర పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-02-2026 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1601.79	1609.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	403	7983
నీటి నిల్వ (టి.ఎం.సి)	23.924	35.793

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

సర్కారు.. శుభవార్త

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని 32 శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి సర్కారు ముందడుగు వేసింది. ఇప్పటికిప్పుడు 24,300 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ మంగళవారం ఆమోదం పలికింది. ధార్వాడలో నిరుద్యోగులు ధర్నాకు దిగిన వెంటనే ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. వీటిలో ఏ గ్రేడు 542, బి గ్రేడు 619 ఉండగా, ఎఫ్ డీ సీ గ్రూపుల పోస్టులు 23,119 ఉన్నాయి.

పులుల రాజ్యంలో విహారి రాజసం!

ఆబాల గోపాలాన్నీ ఆకట్టుకునే పులుల సఫారీ

స్వేచ్ఛగా సంచరిస్తున్న పులులు

యశ్వంతపుర, మైసూరు, న్యూస్‌టుడే : ప్రజల నిరసనలు మధ్య బండీపుర జాతీయ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు అటవీశాఖ అనుమతించింది. ఆకులు రాలే కాలంలో అటవీ ప్రదేశంలోకి సందర్శకులను అనుమతించరాదని పర్యావరణ ఉద్యమకారులు, గ్రామీణులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా.. అధికారులు స్పందించలేదు. వన్యజీవులకు ప్రమాదం వాటిల్లుతుందనే ఆందోళన నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకుంటూ సఫారీకి అనుమతించారు. వన్యజీవులకు ప్రమాదాలు ఎదురవుతున్న నేపథ్యంలో కొన్ని నెలలుగా సందర్శకులను అనుమతించలేదు. వేసవి ముంచుకు రావడంతో కుటుంబసభ్యులతో కలిసి ఈ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు పెద్దలు ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి సిద్ధమైన వన్యజీవులు సంచరించే అటవీ ప్రదేశాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీ, పర్యాటక శాఖలు అన్ని రకాల సౌకర్యాలూ కల్పించాయి. మైసూరుకు దగ్గరలో చామరాజనగర జిల్లాలో ఉన్న ఈ ప్రాంతంలో పులులు, ఏనుగులు, జింకల సంఖ్యకు కొదవేలేదు. మైసూరు నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. వివిధ ప్రాంతాల వారు మైసూరుకు చేరుకుంటే.. అక్కడి నుంచి సురక్షిత వాహనాల్లో ఉద్యానవన సందర్శనకు కదలవచ్చు. అటవీ ప్రదేశంలో జంగల్ లాడ్జీలలో రాత్రి బస ఓ మధురానుభూతి. ఆన్‌లైన్‌లోనే గదులు రిజర్వు చేసుకునే సౌకర్యం కల్పించారు. పులుల సఫారీ ఇక్కడ ప్రత్యేకం. బండీపుర జాతీయ ఉద్యానవనంలో 73 పులులున్నాయి. దేశంలోనే అరుదైన నల్లపులులు చూడొచ్చు. మొత్తం 874 చదరపు కిలోమీటర్ల పరిధిలో బండీపుర విస్తరించగా.. దీని పరిధిలో సహజసిద్ధ కొండలు, చెరువులు, కుంటలు లెక్కలేనన్ని చూడొచ్చు. పులులు, ఏనుగుల కదలికలను తెలుసుకునేందుకు వాటి చెవులకు మైక్రో చిప్స్‌ను అమర్చి.. సందర్శకులకు వాటిని చూపి సంతోషపరచడం సఫారీ నిర్వాహకుల వంతు. వేటగాళ్లను నియంత్రించేందుకు 68 సీసీ కెమెరాలతో కాపలా కాస్తున్నారు. 1973లో మైసూరు మహారాజులు 90 చదరపు కిలోమీటర్ల పరిధిలో వేణుగోపాల్ అటవీ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయగా.. తదనంతర కాలంలో ఇది బండీపురగా రూపాంతరం చెందింది. తొలినాళ్లలో 12 పులులే ఉండేవి.

బండీపురలో తరచుగా కనిపించే ఏనుగుల మంద

సఫారీలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు

(c) eenadu

ఈనాడు కర్నూలు
బుధవారం ఫిబ్రవరి 25, 2026 5

తుంగభద్రలో తోడేళ్లు

తుంగభద్ర నదిలో నుంచి ఇసుకను తరలిస్తూ...

తుంగభద్ర నది ఇసుకాసురులకు అడ్డాగా మారింది. నిత్యం నదిలోంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్నారు. అధికారుల తనిఖీలు మామూళ్లకే పరిమితమయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా జరుపుతున్న ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని గ్రామస్థులు మండిపడుతున్నారు. స్థానిక అవసరాలకే కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. – న్యూస్‌టుడే, నందవరం

- నందవరం మండలం నాగలదిన్నె, నదికైరవాడి, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గంగవరం, గురజాల, రాయచోటి గ్రామాల పరిధిలో నిత్యం 30 నుంచి 50 ట్రాక్టర్ల ద్వారా మూడు ట్రిప్పుల చొప్పున ఇసుక తరలిపోతోంది. నిత్యం రూ.2 లక్షల వరకు ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.
- ఇక్కడి నుంచి మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలకు రవాణా అవుతోంది. రాత్రి సమయంలో ఏకంగా తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు 3-4 వేల వరకు తీసుకుని సొమ్ము చేసుకుంటున్నారు.
- ఇసుక అక్రమ రవాణా ఆపాల్సిన బాధ్యత పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్ శాఖల అధికారులది. పోలీసులు అప్పుడప్పుడు ట్రాక్టర్లు పట్టుకుంటున్నా చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయి. మిగతా శాఖలు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ప్రజల అవసరాలకు ఇసుక తరలించేందుకు ప్రభుత్వం బుకింగ్ సదుపాయం కల్పించింది. కానీ అక్రమ రవాణాతో ఆదాయానికి గండి పడుతోంది.

బనగానపల్లి ఆర్డీవోగా నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు నెలల కిందట ఉప కలెక్టర్లుగా పదోన్నతి పొందిన ఇద్దరు తహసీల్దార్లకు తాజాగా పోస్టింగులు ఇచ్చారు. కర్నూలు కలెక్టరేట్ ఏవోగా పనిచేస్తూ పదోన్నతి పొందిన ఆర్.శివరాముడును కడప జిల్లా తెలుగుగంగ ప్రాజెక్టు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం జీవో ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా పాణ్యం తహసీల్దారుగా పనిచేస్తూ ఉప కలెక్టర్‌గా పదోన్నతి పొందిన వై.నరేంద్రనాథ్‌రెడ్డిని కొత్తగా ఏర్పడిన బనగానపల్లి రెవెన్యూ డివిజన్ ఆర్డీవోగా నియమించారు.

అతివల ఉపాధికి అండాదండ

◆ ఎగ్‌మార్ట్‌ల ఏర్పాటుకు కసరత్తు
◆ నెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్న మెప్మా

మహిళలను వ్యాపారులు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మెప్మా ద్వారా మహిళలకు ర్యాపిడో బైక్‌లు, ఆటోలు ఇప్పిస్తున్నారు. అతివలు తయారు చేసిన ఆహార, ఇతర ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. డిజి లక్ష్మి, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు, తృప్తి క్యాంటీన్లు ఇలా పలు వినూత్న వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నారు. తాజాగా నగర, పట్టణ పొదుపు మహిళలతో ఎగ్ మార్ట్‌లు ఏర్పాటు చేయించి.. స్వయం ఉపాధికి బాటలు వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

రద్దీ కూడళ్లలో దుకాణాలు

నగరాలు, పట్టణాల్లో గృహిణులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎగ్ మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మెప్మా, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్‌ఈసీసీ) ఆధ్వర్యంలో వీటిని నిర్వహించనున్నారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు ప్రభుత్వం రూ.50 వేల విలువైన అత్యాధునికమైన వ్యాపార సామగ్రిని అందించనుంది. ప్రధాన రహదారులు, రద్దీ కూడళ్లలో ఎగ్‌మార్ట్‌లు ఏర్పాటు చేయించడం.. స్థిరమైన ఆదాయం వచ్చేలా చూస్తారు. వీటిని అల్పాహార విక్రయ కేంద్రాలుగా రూపొందిస్తున్నారు. వినియోగదారులను ఆకర్షించేలా తక్కువ స్థలంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

అర్హులు వీరే..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళలై ఉండాలి. నగర, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద మహిళలు.. స్వయం సహాయ సంఘాల సభ్యులకు ప్రాధాన్యం ఉంటుంది. వితంతువులు, ఒంటరి మహిళలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వారిలోనూ వివిధ ఉత్పత్తుల తయారీలో అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

రెండు జిల్లాల్లో 20 కేంద్రాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పది పురపాలక సంఘాలు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో పది చొప్పున ఎగ్ మార్ట్‌లు ఏర్పాటు చేయాలని మెప్మా లక్ష్యం నిర్దేశించింది. మెప్మా నుంచి ఇంకా విధివిధానాలు రాలేదు. స్వయం సహాయ సంఘాల్లోని మహిళలను ఎంపిక చేసి వారి ద్వారా త్వరలో కోడిగుడ్ల ఆధారిత ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా మెప్మా అధికారులు తెలిపారు. ఎంపికైన మహిళలకు వ్యాపారం ఎలా నిర్వహించాలి, వినియోగదారులతో ఎలా వ్యవహరించాలి, లాభాలు ఎలా రాబట్టాలో నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించనున్నారు.

పాపాలే అధికం.. ఆరోగ్యం భద్రం

● ఉమ్మడి జిల్లాలో తగ్గిన క్షీర ఉత్పత్తి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాలు, పాల పదార్థాల కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రజల అవసరాలకు తగ్గట్లు పాల ఉత్పత్తి లేకపోవడంతో విపరీతమైన డిమాండు ఉంటోంది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు అక్రమార్జన కోసం కల్తీకి పాల్పడుతున్నారు. వీటివల్ల ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉన్నా అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతుండటం శాపంగా మారింది. కాకినాడ జిల్లాలో కల్తీ పాలు పలువురి ప్రాణాలు తీసిన నేపథ్యంలో.. జిల్లా అధికారులు అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈనాడు, కర్నూలు
– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్, వైద్యాలయం

తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి..

- 2024 మే 24న ఎ.క్యాంపు ప్రాంతంలో ఆహార తనిఖీ అధికారులు దూద్‌పేడ ఫ్యాక్టరీను తనిఖీ చేసి అందులో ఫంగస్ ఉన్నట్లు గుర్తించారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు.
- 2025 డిసెంబరు 27న నగరంలోని సాయి ఈశ్వర్ హోటల్‌లో, జనవరి 31న లాస్య రెస్టారెంట్‌లో తనిఖీలు చేసి పెరుగులో నాణ్యత లేనట్లు నిర్ధారించారు.
- గతేడాది జులై 22న స్థితప్రజ్ఞ హోటల్‌లో నెయ్యిని తనిఖీ చేసి నాసిరకమని గుర్తించారు. 2024 అక్టోబరు 24న ఓ నెయ్యి ట్యాంకరును పోలీసులు పట్టుకుని ఆహార తనిఖీ అధికారులను పిలిపించి నాణ్యత పరీక్షలు నిర్వహించగా అందులోని నెయ్యిలో నాణ్యత లేదని తేలింది.
- నంద్యాల జిల్లాలో 24 పాల నమూనాలు సేకరించగా రెండింటిలో నీరు ఎక్కువగా కలిపినట్లు గుర్తించారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టానికి అనుగుణంగా లేవని తేలింది.
- కోవెలకుంట్లలో స్థానిక పాల విక్రయదారులు నీళ్లు కలిపినట్లు వెల్లడైంది.

ఉత్పత్తిలో వెనుకబాటు

- కర్నూలు జిల్లాలో 3.36 లక్షల పశువులు ఉన్నాయి. వీటిలో 70 వేల పశువులు మాత్రమే పాలు ఇస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పాల ఉత్పత్తి లక్ష్యం 2,45,600 మెట్రిక్ టన్నులు. కాగా గతేడాది డిసెంబరు నెలాఖరు వరకు 1,68,767 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి జరిగింది.
- నంద్యాల జిల్లాలో 4.14 లక్షల పాడి పశువులు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం 4 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. 3.15 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేయగలిగారు.

స్థానిక విక్రేతల అడ్డదారులు

- కొందరు చిరువ్యాపారులు ఎలాంటి బ్రాండు లేకుండా పాలు, పెరుగు, నెయ్యి తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఆయా ఉత్పత్తులు నాణ్యంగా ఉండటానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రజలకు నాసిరకం పాల ఉత్పత్తులు అంటగడుతున్నారు.
- పల్లెల్లో పాడి రైతుల నుంచి పాలు కొనుగోలు చేసి సమీప పట్టణాల్లో విక్రయించే చిరు వ్యాపారులు మార్గ మధ్యలో కాలువల్లో నీటిని కలిపేస్తున్న ఉదంతాలున్నాయి. వారు కలిపే నీళ్లు శుభ్రంగా లేకపోతే ఆయా పాలను వినియోగించిన వారు అనారోగ్యాల బారినపడే ముప్పు ఉంది.
- కొందరు రైతులు కృత్రిమ పద్ధతుల్లో పాల దిగుబడిని పెంచేందుకు పశువులకు నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఔషధ వ్యాపారులు వీటిని గుట్టుగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పాలు తాగిన వారికి హార్మోన్ల సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. కొందరు పాలలో నీళ్లు కలుపుతున్నారు. చిక్కదనం కోసం గంజి పొడి కలుపుతున్నారు.

అనుమానమొస్తే ఫిర్యాదు చేయండి

– కూర్మనాయకులు, సహాయ ఆహార నియంత్రణాధికారి, ఉమ్మడి కర్నూలు జిల్లా

ఆహార ఉత్పత్తుల్లో కల్తీ జరిగినట్లు ఎలాంటి అనుమానాలున్నా 9441439787 నంబరుకు ఫోన్ చేయవచ్చు. అధికారుల బృందాలను పంపి ఆయా ఆహార పదార్థాల నమూనాలను సేకరించి రాష్ట్ర ప్రయోగశాలకు పంపించి నాణ్యత పరీక్షలు చేయిస్తాం. నాణ్యత లోపించినట్లు గాని, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమైందిగా గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

కర్నూలులో స్వామి నారాయణ్ గురుకులం

● భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం

ఈనాడు, కర్నూలు: కర్నూలులో స్వామినారాయణ్ అంతర్జాతీయ గురుకుల పాఠశాల ఏర్పాటుకానుంది. ఆమేరకు మంగళవారం అమరావతిలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో భూకేటాయింపునకు ఆమోదముద్ర వేశారు. ఆ సంస్థకు కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని సర్వే నెంబరు 818లో ఉన్న పది ఎకరాలను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరానికి రూ.71.36 లక్షల చొప్పున ఆ సంస్థ ప్రభుత్వానికి చెల్లించనుంది.

- ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు క్లస్టర్లో సింథటిక్ ఆర్గానిక్ రసాయనాలు, ఏపీఐ తయారీ పరిశ్రమ ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చిన సిగాచి ఇండస్ట్రీస్‌కు, విరూపాక్ష ఆర్గానిక్ సంస్థలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఆలూరు, చిప్పగిరి, హొళగుంద మండలాల పరిధిలో ఎన్టీపీసీ రెనెవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ 900 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్రాజెక్టును ఏర్పాటుచేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

హంస వాహనంపై ప్రహ్లాదవరదుడు

ఎగువ అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా జ్వాలా నృసింహస్వామివారు మంగళవారం యోగ నృసింహస్వామి అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. రాత్రి స్వామివారి విశేష అలంకరణలో హనుమంత వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. గరుడాద్రి పర్వతాన కొలువుదీరిన అహోబిలేశుడు రాముని రూపంలో కారంజ నృసింహస్వామిగా ఆంజనేయస్వామికి దర్శనమిచ్చారు. దీనికి సూచికగా హనుమంతుడిపై జ్వాలా నృసింహస్వామి దర్శనమిచ్చారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదుడు హంస వాహనంపై విహరించారు.

ఉత్సవంలో భాగంగా మఠానికి చేరుకున్న స్వామిని పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ప్రత్యేకంగా ఆరాధించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం జరిపారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

రాఘవుడి జన్మదినం భక్తజన సంబరం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 431వ జన్మదిన వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి మూల బృందావనానికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అభిషేకం నిర్వహించారు. మూల బృందావనాన్ని అలంకరించి స్వామివారికి ప్రత్యేక హారతినిచ్చారు. అనంతరం ప్రాకారంలో ఉన్న డోలోత్సవ మండపంలో ఏర్పాటు చేసిన ప్రతిమకు ప్రత్యేక అలంకరణ చేశారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రుని చరిత్ర, మహిమలపై ఉపన్యసించారు. అనంతరం నవరత్నాల రథంపై స్వామి బంగారు ప్రతిమను ఉంచి పీఠాధిపతి హారతినిచ్చారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం

ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనం

నవరత్నాల రథంపై రాఘవేంద్ర స్వామి

నిర్లక్ష్యం దహిస్తోంది

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో క్రిమిటోరియం పనులు ముందుకు సాగడం లేదు. గ్యాస్ ఆధారిత దహన సంస్కారాలు చేసుకొనేందుకు, కేంద్రం 14వ ఆర్థిక సంఘం కింద పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఒక్కో నిర్మాణానికి రూ.70-80 లక్షలు, సివిల్ పనులకు రూ.40 లక్షలు, యంత్రాల ఏర్పాటుకు రూ.33-35 లక్షలు మంజూరు చేసింది. సివిల్ పనులు పురపాలికలకు, యాంత్రీకరణ పనులు ప్రజారోగ్య విభాగానికి అప్పగించారు. ఐదేళ్లలో పనులు పూర్తి చేయకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదు. కర్నూలు, నంద్యాలలో చివరి దశలో ఉన్నాయి. కొద్ది పాటు పనులు పూర్తిచేసి ట్రయల్ రన్ చేసి పరీక్షించాల్సి ఉంది.

–న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

తక్కువ ఖర్చుతో..

- ప్రస్తుతం దహన సంస్కారాలు చేయాలంటే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భారం ఉంటోంది. ఇక కర్రలతో సంప్రదాయబద్ధంగా దహనం చేయాలంటే రూ.50 వేలు వెచ్చించాల్సిందే.
- ఆర్థిక భారం తగ్గడంతో పాటు కాలుష్యం లేకుండా.. మున్ముందు స్థల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు క్రిమిటోరియం సేవలు తెరపైకి తెచ్చారు.
- ఒక్క శవం దహనం చేసేందుకు గంట సమయం పడుతుంది, రెండు వాయుబండలు అవసరమవుతాయి. నిర్వహణ బాధ్యతలు పూర్తిగా పురపాలికలకే అప్పగించారు. నామమాత్రపు సేవా రుసుం చెల్లిస్తే సరిపోతుంది. క్రిమిటోరియం సేవల కోసం ముందుకొచ్చే వారితో పాటు అనాథ శవాల దహన క్రియలకు ఉపయుక్తంగా ఉంటుంది.

ఆదోని పట్టణం బండమెట్ట ప్రాంతంలోని శ్మశాన వాటికలో ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. ఇందుకు కావాల్సిన యంత్ర సామగ్రిని రాంజల చెరువు ప్రాంతంలో నిల్వ చేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ.. తుప్పు పట్టి రూపు కోల్పోయాయి. 14వ ఆర్థిక సంఘం కాలం ముగిసింది. నిలిచిన పనులు ఎలా పూర్తిచేయాలో అధికారులకు అంతు చిక్కడం లేదు.

చుక్క తొలగదు.. హక్కు దక్కదు

కదలని 22ఎ(1)సీ దస్త్రం ● పెండింగ్‌లో వందలాది వినతులు

రెవెన్యూ అధికారులు సకాలంలో సమస్య పరిష్కరించకపోవడంతో పలువురు రైతులు 'చుక్క'లు చూస్తున్నారు. రెవెన్యూ శాఖల్లో అత్యధికంగా ఫిర్యాదులు అందుతున్న వాటిలో 22ఎ భూముల సమస్య కాగా.. ఇందులో 22ఎ(1)సీ ప్రధానంగా ఉంది. ఈ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు నివేదికలు తీసుకుని ఆర్డీవో స్థాయిలో పరిష్కరించాలని ప్రభుత్వంతో పాటు సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేశారు. రెండు జిల్లాల్లో ఈ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. సమస్యకు పరిష్కారం ఎలా చూపాలో తెలియజేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మార్గదర్శకాలు జారీ చేసినా వాటిని ఉమ్మడి జిల్లాలో అమలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, కర్నూలు సచివాలయం

బాధితుల గోడు

- ఉమ్మడి జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య 22ఎ(1)సీ. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రీసర్వే సమయంలో పట్టా భూముల్ని ఇందులో చేర్చారు. అంతకుముందు మున్సిపాల్టీలు, పట్టణాల్లోని వివిధ ప్రాంతాలనూ దీనిలోకి చేర్చారు. సమస్యను పరిష్కరించాలని ఈ ఏడాది జనవరి 1న ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆర్డీవోలే వీటిని పరిష్కరించాల్సి ఉంది.
- 22ఎ భూముల జాబితా నుంచి తొలగించాలని యజమానులు విన్నవించుకొంటున్నా అధికారుల నుంచి స్పందన కొరవడింది. తొలగిస్తే ఏమవుతుందో నన్న భయం కొందరు అధికారులను వెన్నాడుతుండటం గమనార్హం.

జిల్లా	22ఎ(1)సీ వినతులు	పరిష్కారం
నంద్యాల	246	0
కర్నూలు	182	0

నంద్యాల పట్టణం ఎస్బీఐ కాలనీలో కొంత విభాగం సర్వే నంబరు-2279లో విస్తరించి ఉంది. బహుళ అంతస్తులు, విల్లాలు, ఇళ్లు వెలుస్తున్నాయి. ఇక్కడ సెంటు రూ.30 లక్షలు పలుకుతోంది. ఇక్కడ 24 ఎకరాలు సర్వీసు ఇనాం కింద చూపిస్తోంది. దీంతో స్థలం కొనుగోలు చేసిన యజమానులు అవస్థ పడుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన కొంతమంది రెవెన్యూ క్లినిక్‌లో విన్నవించుకొన్నారు. ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు.

ఆర్డీవోలకు అధికారం ఇచ్చినా...

22ఎ కింద వివిధ రకాల భూములు ఉన్నాయి. ఇందులో ఐదు రకాల భూముల్ని 22ఎ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం ఆర్డీవోలకు అధికారం ఇచ్చింది. ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు.

రెవెన్యూ క్లినిక్‌లలో వినతులు పోటెత్తుతున్నాయి. పట్టా భూములతో పాటు, స్థలాలు పొరపాటున ఈనామ్ భూమిగా చూపిస్తూ 22ఎ జాబితాలో ఉంటే 15 రోజుల్లోగా వాటిని తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు ఆర్డీవోలకు ఇచ్చారు. కానీ ఇంత వరకు ఒక్క దరఖాస్తు ఆ స్థాయిలో పరిష్కారం కాకపోవడం గమనార్హం.

కర్నూలు జిల్లాలో చుక్కల భూముల సమస్యలు రెవెన్యూ క్లినిక్‌లు పెట్టక ముందు పరిష్కారం కాగా ఆ తర్వాత ఒక్కటీ పరిష్కారం కాలేదు. వినతులు పరిష్కారం కాకపోవడంతో ఆర్డీవో కార్యాలయాలతో పాటు పీజీఆర్ఎస్‌ల్లో వినతులు రీఓపెన్ అవుతున్నాయి. దీంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల వివాహాలు పెట్టుకుని ఈ సమస్యతో వాటిని విక్రయించలేక, బదిలీ చేయించలేక అవస్థలు పడుతున్నారు.

అమ్మ.. ఇచ్చింది పునర్జన్మ

కుమారుడికి కిడ్నీ దానం చేసిన తల్లి ఖాదర్‌బీ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : మూత్రపిండాలు విఫలమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న.. కుమారుడికి తన కిడ్నీ ఇచ్చి పునర్జన్మ ప్రసాదించింది ఏడు పదుల వయసుగల తల్లి ఖాదర్‌బీ. కర్నూలు మెడికవర్ ఆసుపత్రి యూరాలజీ సర్జన్ డాక్టర్ అబ్దుల్ సమద్, నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్ధార్థ్ హెరూర్ వెల్లడించిన వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా నరసాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా మూత్రపిండాల వైఫల్యంతో ఈనెల మొదటి వారంలో ఆసుపత్రిలో చేరారు. కిడ్నీ మార్పిడి చేయాల్సిందేనని వైద్యులు తేల్చారు. కుమారుడికి కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ఖాదర్‌బీ ముందుకొచ్చారు. ఈనెల 15న ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద శస్త్రచికిత్స చేసి తల్లి నుంచి ఓ కిడ్నీ సేకరించి కుమారుడికి అమర్చారు. శస్త్రచికిత్స చేయించుకున్న మహబూబ్‌బాషా, ఖాదర్‌బీ ఆరోగ్యంగా ఉండటంతో మంగళవారం డిశ్చార్జి చేశామని వైద్యులు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఎస్ పర్యావరణ సర్వేకు ప్రభుత్వ అనుమతి

● రూ.66.08 లక్షల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు

కర్నూలు జలమండలి, ఎమ్మిగనూరు న్యూస్‌టుడే : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కీలకమైన ఆర్డీఎస్ (రాజోలి బండ మళ్లింపు పథకం) ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఈనెల 6న ఎమ్మిగనూరు పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. దీని అమలు దిశగా ప్రస్తుతం అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతులకు సంబంధించి సమగ్ర సర్వే కోసం ఏజెన్సీని నియమించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సర్వే నిర్వహణకు రూ.66.08 లక్షల నిధులు విడుదల చేస్తూ జల వనరులశాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

◆ ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి 4 టీఎంసీల నీటిని తరలించడం ద్వారా 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. కోసిగి మండలం బాత్ర బొమ్మలాపురం గ్రామ సమీపంలోని ఆర్డీఎస్ నుంచి 160 కి.మీ పొడవున కాలువ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం 1380 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించాలి. కోసిగి, పెద్దకడబూరు, కోటకల్, చిన్నమర్రివీడులో పంపుహౌస్‌లు నిర్మించాల్సి ఉంది. ఈ పనుల వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందస్తుగా సర్వే నిర్వహిస్తోంది.

రంజాన్ వేళలు

పట్టణం	ఇఫ్తార్ (బుధ)	సహెరీ (గురు)
కర్నూలు	6:29	5:16
నంద్యాల	6:26	5:16
ఆదోని	6:27	5:15

–న్యూస్‌టుడే (కర్నూలు పాతబస్తీ)

ఉపాధి పనుల్లో అవినీతి మేటలు

● రూ.1.64 లక్షల రికవరీకి ఆదేశం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల మండలంలో 2024-25 సంవత్సరంలో రూ.14.19 కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి మేటలు తేలాయి. సామాజిక తనిఖీ బృందం విచారణ చేపట్టగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. వేముగోడు రూ.27,061, పుట్టపాశం రూ.23,128, పెద్దమరివీడు రూ.10,285, అల్వాల రూ.18,682 రికవరీకి ఆదేశించారు. నిర్దేశించిన సమయంలోగా రికవరీ సొమ్ము చెల్లించాలని ఉపాధి సిబ్బందిని పీడీ మాధవిలత ఆదేశించారు. ఎంపీడీవో అనంతశయన అధ్యక్షతన జరిగిన విచారణలో అంబుడ్స్‌మన్ సురేంద్రకుమార్, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ శంకర్, ఏపీడీ లోకేశ్వర, ఏపీవో మహబూబ్ బాషా, ఈసీ వెంకటేశ్వర్లు, బషీర్, శ్రీనివాసులు, రఫీక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మొద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. నిరుద్యోగులు వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు అధికారిక నోటిఫికేషన్, పరీక్షలు, ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తారని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రకృతి సాగు.. పత్రంలో సేద్యం

● అధికారుల లెక్కలపై పలు అనుమానాలు
● మట్టి పరీక్షలతో నిగ్గు తేల్చాలని ప్రభుత్వం ఆదేశం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.. మరి ప్రకృతి సాగు ఇంతలా పెరిగితే ఎరువుల వినియోగం తగ్గాలి.. కానీ 3.75 లక్షల టన్నుల వినియోగంతో నంద్యాల రాష్ట్రంలోనే మొదటి స్థానంలో, దేశంలో రెండో స్థానంలో నిలవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల జాబితా కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు పంపించారు. సేద్యం చేస్తున్న రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్షించి ఫలితాలు పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 17,945 నమూనాలు సేకరించారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం, ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయం

పాలం బాట చూడని సిబ్బంది

- ప్రకృతి సాగు పెంచాలని ప్రభుత్వం ఓ విభాగాన్ని ఏర్పాటు చేసింది. 790 మంది పొరుగు సేవల సిబ్బందిని నియమించారు. వీరికి ఏటా వేతనాల కోసం రూ.9 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. వీరిని పర్యవేక్షించడానికి ఏడీఏ స్థాయి అధికారి డీపీఎంగా, మరో ఏవో స్థాయి అధికారి ఉన్నారు. ప్రస్తుతం ఏవోనే ఇన్‌ఛార్జి డీపీఎంగా విధులు నిర్వహిస్తున్నారు.
- ఈ విభాగంలో పనిచేసే గ్రామస్థాయి ఉద్యోగి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ ప్రకృతి సాగు చేపట్టాలి. ఐసీఆర్‌పీలు ఎకరా, ఎల్-1 కేడర్‌వారు ఐదెకరాలు, ఎల్-2 కేడర్‌వారు రెండెకరాలు, మాస్టర్ ట్రైనర్లు 10 ఎకరాలు, ఎన్ఎఫ్ఏలు 20 ఎకరాలు సాగు చేయాలని రైతు సాధికార సంస్థ చెబుతోంది. ఏ ఒక్కరూ పాటించడం లేదు.

పది మందికి పంచరు

- ఐసీఆర్‌పీలు ప్రకృతి సాగులో పంటలు సాగు చేయడంతోపాటు 25 సెంట్ల పొలంలో ఏటీఎం మోడల్ పద్ధతిలో కూరగాయల సాగును పది మంది రైతులతో చేయించాలి.
- 1.10 ఎకరాల్లో ఏ గ్రేడ్ పద్ధతిలో పత్తి, కంది, మొక్కజొన్న, ఆముదాలు, మినుములు తదితర పంటలను ఎరువులు.. పురుగు మందులు లేకుండా సాగు చేయడంతోపాటు పది మంది రైతులతో ఈ పద్ధతిలో సాగు చేయించాలి.
- ఉమ్మడి జిల్లాలో 490 మంది ఐసీఆర్‌పీలు ఉండగా.. ఇందులో పది శాతం మంది కూడా అనుసరించడం లేదు.

ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు

జిల్లా	పాక్షికంగా	పూర్తిగా	సాగు(ఎకరాల్లో)
కర్నూలు	39,500	3,200	64,141
నంద్యాల	54,272	7,015	74,652

నిధులు బొక్కేస్తున్నారు

- గ్రామస్థాయి సమావేశాలకు సంబంధించి ఒక్కో గ్రామానికి రూ.5 వేలు మంజూరు చేస్తే అందులో రూ.500 ఖర్చు చేసి మిగిలిన సొమ్ము అధికారులు స్వాహా చేస్తున్నారు. మండల స్థాయి సమావేశాలకు రూ.15 వేలు మంజూరైతే అందులో కనీసం రూ.5 వేలు కూడా ఖర్చు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.
- గ్రామస్థాయిలో కనీసం ఎకరా సొంత పొలం లేదా.. కౌలుకు తీసుకున్న పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగుచేసే వారిని ఐసీఆర్‌పీలుగా ఎంపిక చేయాలి. వీరిలో 80 శాతం మందికి సొంత పొలాలు లేవు. కానీ వీరంతా ప్రకృతి సాగు చేస్తున్నామని చెప్పి నెలకు రూ.6 నుంచి రూ.8 వేల వరకు వేతనాలు తీసుకుంటున్నారు.



(c) eenadu

శ్రీగిరిలో నృత్య సిరులు

శ్రీశైలం, నంది సర్కిల్, న్యూస్‌టుడే: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహ క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న కళారాధనలో మంగళవారం భక్తులను ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన కళానికేతన్ బృందం పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు.

అదుపుతప్పితే అపాయంలోకి దిగుడే

గోనెగండ్లలో ఎమ్మిగనూరు-కర్నూలు రహదారి నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఐలాంటి రోడ్డులో పాత బస్టాండు వద్ద రహదారి పక్కనే దిగుడు బావి ప్రమాదకరంగా ఉంది. వాహనాలు అదుపు తప్పితే ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డు చిన్నగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతోంది. గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదకరంగా ఉన్న బావిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోనెగండ్ల

దాతల సాయం.. చిన్నారి పునర్వికాసం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తికి చెందిన సురేశ్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్విక్రశ్రీ పేరు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రచారం సాగుతోంది. పునర్విక గత ఏడాది ఏప్రిల్ 12న జన్మించింది. పుట్టిన మూడు నెలల అనంతరం పాపలో కదలికలు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కోట్లలో ఒకరికి ప్రబలే ఎస్‌ఎమ్‌ఏ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి నివారణకు రూ.16కోట్లు విలువ చేసే ఔషధం అవసరం. చిన్నారి వైద్యసేవలకు దాతలు సహకరించాలని తల్లిదండ్రులు సురేశ్, పుష్పావతి కోరారు. నిత్యం పద యాతనపై గత ఏడాది నవంబరు 29న 'ఈనాడు'లో 'ఉందికే సాయం.. మోముల్లో 'పునర్వికాసం' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో పాప పరిస్థితి తెలుసుకున్న దాతలు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. వీటితో పాటు సామాజిక మాధ్యమాల్లో సైతం ఈ విషయం చెక్కర్లు కొట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సైతం స్పందించి.. విరాళాలు సేకరించడం మొదలు పెట్టారు.

చేయి చేయి కలిపారు

చిన్నారి పునర్విక వేదనను దిన పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో చూసిన పలు సేవా సంస్థలు సైతం సాయం చేసేందుకు ముందుకొచ్చాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని యువత, విద్యార్థులు, దాతలు సాయం చేయడంతో పాటు వారికి తెలిసిన వారి నుంచి సైతం విరాళాలు సేకరించారు. మరి కొందరు రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపడుతూ. . కదిలారు. ఇంపాక్ట్ గురు యాప్ నుంచి 95 రోజుల్లో 72,705 మంది సుమారు రూ. 1,91,54,068 విరాళాలు వచ్చాయి. వీటితో పాటు పాప తండ్రి బ్యాంకు ఖాతాకు సైతం ఇప్పటికదాక రూ. 2.45 కోట్లు వచ్చిన్నట్లు తెలుస్తోంది.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

కరెంటోళ్ల జనబాటలో విద్యుత్తుశాఖ నోడల్ అధికారిణి పద్మ తదితరులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకాల పనులను గుత్తేదారులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం, కర్నూలు జిల్లా నోడల్ అధికారిణి ఆర్. పద్మ అధికారులను ఆదేశించారు. కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె విద్యుత్తుశాఖ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్‌తో కలిసి మంగళవారం కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవనకొండ, తెర్నేకల్ గ్రామాల్లో పర్యటించి విద్యుత్తు వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం ప్రగతిని ఎంఎన్ఆర్ఈ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యుత్తు భవన్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం అయ్యారు. డీఈటీ వై.వి.మహేశ్వరరెడ్డి, కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి, ఆదోని డివిజన్ ఈఈ విజయ రాజు పాల్గొన్నారు.

నివురుగప్పిన ముప్పు

☛ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు అవసరం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

కర్నూలు నేరవిభాగం, వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: వేసవికాలం ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. కర్నూలు జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. జనవరి మాసం నుంచే అగ్ని ప్రమాదాలు పెరిగిన నేపథ్యంలో రానున్న మూడు మాసాల్లో అగ్నిప్రమాదాలు మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. అగ్నిప్రమాదంతో ఆస్తితో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు స్పందన అగ్నిమాపకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఇక్కడే అధికం..

జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో ఉంచిన పంట నిల్వల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. 2025 జనవరి నుంచి 2026 జనవరి వరకు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలు-291, ఇళ్లు-28, దుకాణాలు-15, ఫ్యాక్టరీలు-10, వాహనాలు-15, పొలాలు-13, అటవీ ప్రాంతాలు-7, ఆసుపత్రులు-3 అగ్నిప్రమాదాలు జరిగాయి.

జనవరి-మే మధ్య ఎక్కువ

కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరు అగ్నిమాపకశాఖ కేంద్రాలు న్నాయి. జిల్లాలో జనవరి నుంచి మే మధ్యకాలంలోనే ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. 2025 జనవరి-80, ఫిబ్రవరి-139, మార్చి-129, ఏప్రిల్-84, మే-50, జూన్-14, జులై-13, ఆగస్టు-13, సెప్టెంబర్-9, అక్టోబర్-17, నవంబర్-33, డిసెంబర్-33 జరిగాయి. 2026 జనవరి-41 అగ్నిప్రమాదాలు జరిగాయి.

అప్రమత్తంగా ఉండాలి

● బాలరాజు, ఇన్‌ఛార్జి విపత్తు స్పందన అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి వేసవికాలంలో గాలి, అధిక ఉష్ణోగ్రతల వల్ల అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. సమస్యలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. ప్రజలు మంటలు ఆర్పే విధానం పట్ల అవగాహన పెంచుకుంటే నష్టం తగ్గించుకోవచ్చు. ఫ్యాక్టరీల నిర్వాహకులు అగ్నిమాపక పరికరాలు పునఃపరిశీలించుకోవాలి. జిల్లాలోని ఆరు అగ్నిమాపకశాఖ కేంద్రాల సిబ్బందిని నిత్యం అప్రమత్తం చేస్తున్నాం. ప్రజల అగ్నిప్రమాదం గుర్తించిన వెంటనే అగ్నిమాపకశాఖ డయల్ 101కు సమాచారం ఇవ్వాలి.

నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు

● జిల్లాలో అత్యధికంగా నిర్లక్ష్యంగా పొగతాగి పడేసే వారి వల్లే ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బీడీ, సిగరేట్ సరిగా ఆర్పకుండా పడేయడం వల్ల గడ్డివాములు, గుడిసెలు నిప్పంటుకొని కాలిపోతున్నాయి. అందువల్ల రైతులు గడ్డివాములు, గుడిసెలు, పంటలను ఉంచే చోట నీరు ఎక్కువగా నిల్వ ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ● విద్యుదాఘాతం వల్ల కూడా అధికంగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ● ఇళ్లలో ఉపయోగించే ఎలక్ట్రికల్ ఉపకరణాల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటం అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయి. ● అవిశ్రాంతంగా సుదూరం ప్రయాణించే వాహనాలు సైతం ఎక్కువగా కాలిపోతున్నాయి. ● వేసవికాలంలో ఏసీలు ఎక్కువగా ఉపయోగించనున్న నేపథ్యంలో విద్యుదాఘాతం సంభవించి అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉంది. పదేళ్లు పైబడితే వైరింగ్ మార్చుకోవాలని, తీగలు అతుకులు లేకుండా ఉంచుకోవాలని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు. ● 2025 జనవరి నుంచి 2026 జనవరి వరకు జిల్లా వ్యాప్తంగా నిర్లక్ష్యంగా పొగతాగి పడేయటం వల్ల 305, విద్యుదాఘాతంతో 57 అగ్నిప్రమాదాలు జరిగాయి. ఇళ్లలో గ్యాస్ సిలిండర్ వల్ల నాలుగు ప్రమాదాలు జరిగాయి.

జిల్లా కారాగారం తనిఖీ

ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలు మండలం పంచలింగాల పరిధిలోని జిల్లా కారాగారాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా తదితరులు మంగళవారం తనిఖీ చేశారు. భోజనం, ఇతర సౌకర్యాలు, బ్యారెక్‌ల నిర్వహణ, ఆసుపత్రిలోని వైద్యసేవలపై ఆరా తీశారు. వంటశాలను పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ హెల్ప్‌డెస్క్ క్లినిక్, దస్త్రాలు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. న్యాయ సహాయం, బెయిల్, ఇతర అంశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఖైదీలకు అవగాహన కల్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మి, పీడబ్ల్యూడీ ఈఈ విజయరాజు, ఉద్యోగ కల్పనాధికారిణి దీప్తి, జిల్లా పారిశ్రామిక అధికారి అశోక్‌కుమార్, డాక్టర్ మహేశ్వరప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ సునీల్‌రెడ్డి, జైలు అధికారులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు

☛ తొలి ప్రయత్నంలోనే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యువతి

మనీషా

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే: క్రీడల్లో మహిళలు రాణించి సత్తా చాటుతున్నారు. క్రీడల్లో శిక్షణ పొందేందుకు, సాధన చేసేందుకు మహిళలకు సరైన సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో రాణించడమంటే కత్తిమీద సామే. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూనే ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. నంద్యాల పట్టణం భరత్‌సింగ్ కాలనీకి చెందిన మనీషాకు క్రీడలపై ఆసక్తి ఉండేది. ఉన్నత చదువులు చదువుతూనే జిమ్‌కు వెళ్లేవారు. ఈ క్రమంలో 2025 నుంచి పవర్ లిఫ్టింగ్‌లో హాజీ అనే శిక్షకుడి వద్ద శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని తొలి ప్రయత్నంలోనే జిల్లాస్థాయిలో బంగారు పతకం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

● జనవరి 27న కర్నూలులో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 63 కిలోల విభాగంలో 210 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు.

● ఈనెల 15న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57 కిలోల విభాగంలో 205 కిలోల బరువు ఎత్తి వెండి పతకం సాధించారు.

● త్వరలో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నారు.

రైతుల జాతర..

ప్రత్యేక పూజలు అందుకుంటున్న గాదిలింగేశ్వరస్వామి

గూళ్యం (హాలహర్వి), న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఇలవేల్పుగా కొలిచే గాదిలింగేశ్వరస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వహణాధికారి రాధకృష్ణ తెలిపారు. జాతరలో ఎద్దులు పరుషలో అన్నదాతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రకాల జాతులకు చెందిన ఎడ్లను ప్రదర్శనకు ఉంచారు. ఒక్కో జత ఎద్దు ధర రూ. లక్షలు పలికింది. వ్యవసాయానికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. నేటితో జాతర ముగింపు కార్యక్రమం ఉంటుందని ఈవో తెలిపారు. గ్రామంలో భక్తులకు సలహాలు, సూచనలు అందిచేందుకు ఆలయ అభివృద్ధి సేవా సమితి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దిగువ అహోబిలం హుండీ ఆదాయం రూ.28.57 లక్షలు

సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో హుండీ సొమ్మును ఆలయ నిర్వాహకులు మంగళవారం లెక్కించారు. ఆలయానికి రూ. 28.57 లక్షల ఆదాయం సమకూరింది. 14.3 గ్రాముల బంగారం, 443 గ్రాముల వెండి లభించినట్లు సీఏవో రామానుజన్ తెలిపారు. మూడు నెలలపాటు భక్తులు కానుకల రూపంలో హుండీలో నగదు, నగలు సమర్పించగా ఈ మొత్తం వచ్చిందని పేర్కొన్నారు. పార్వేట ఉత్సవం హుండీ లెక్కించగా రూ. 9.14 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. 1.8 గ్రాముల బంగారం, 80 గ్రాముల వెండి వచ్చినట్లు రామానుజన్ చెప్పారు.

ముగిసిన రాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాలు

● ప్రముఖులకు అవార్డుల ప్రదానం

పరిమళ తీర్థ కోనేరులో రాఘవేంద్ర స్వామి తెప్పోత్సవం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు రాత్రి రాఘవేంద్ర స్వామి ప్రతిమను ఊరేగింపుగా పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పరిమళ తీర్థ కోనేరు వద్దకు చేర్చారు. తెప్పపై రాఘవేంద్ర స్వామి ప్రతిమతో పాటు పీఠాధిపతి కూడా ఆశీనులై తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటకకు చెందిన సుగుణభట్, శ్రీరఘుభట్ టీఎస్‌ఐటీ దర్శకత్వం వహించిన శ్రీరాయర దర్శన సినిమా టీజర్‌ను పీఠాధిపతి చేతులమీదుగా విడుదల చేశారు. అనంతరం కన్నడ సినీ ప్రముఖులు రిషబ్‌శెట్టి, జగ్గేష్, రాఘవేంద్ర రావు, పారిశ్రామికవేత్త రఘుభట్ తదితరులకు సుబుదేంద్ర తీర్థుల చేతులమీదుగా అనుగ్రహ ప్రశస్తి పురస్కారాలను అందజేశారు.

నిరవధిక విధుల బహిష్కరణకు న్యాయవాదుల నిర్ణయం

ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యుడు పవన్‌కుమార్‌పై స్థానిక నాలుగో పట్టణ సీఐ విక్రమ్‌సింహ దాడికి నిరసనగా న్యాయవాదులు ఆందోళనలు ఉద్ధృతం చేశారు. రాయలసీమ వ్యాప్తంగా విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో సీఐతో రాజీ కుదిరినట్లు న్యాయవాది పవన్‌కుమార్ చెబుతున్న వీడియో వైరల్‌గా మారింది. బార్ అసోసియేషన్‌కు సమాచారం ఇవ్వకుండా రాజీ చేసుకున్న విషయంపై వివరణ కోరేందుకు న్యాయవాది పవన్‌కుమార్‌ను మంగళవారం స్థానిక జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయానికి పిలిపించారు. కర్నూలు మూడో పట్టణ సీఐ శేషయ్య, నాలుగో పట్టణ సీఐ తన ఇంటికొచ్చి రాజీ అయినట్లు చెప్పాలని బెదిరించారని, ప్రాణభయంతోనే తాను సీఐ విక్రమ్‌సింహతో సమస్య పరిష్కారమైందని వీడియోలో చెప్పానని ఆయన వివరించారు. సీఐ శేషయ్య తన చరవాణి ద్వారా రికార్డు చేసి ఎస్పీకి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షునికి పంపారన్నారు.

మిద్దె కూలి వృద్ధురాలి దుర్మరణం

కూలిన మట్టి మిద్దె

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పిండి గిర్ని మట్టి మిద్దె కూలి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కొణిదెల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొణిదెల గ్రామంలోని కురువపేటలో జిలాని బాషా అనే వ్యక్తి మట్టి మిద్దెలో పిండి గిర్ని నిర్వహిస్తున్నారు. గ్రంధే లక్ష్మీదేవమ్మ(80), కురువ సాలమ్మ మరో ఇద్దరు మహిళలు గిర్ని వద్దకు వెళ్లారు. గిర్ని ఆడుతుండగా మిద్దెపై కప్పు మట్టి రాలుతున్నట్లు శబ్దం వస్తుండటంతో ఇద్దరు మహిళలు, జిలానీబాషా బయట చూసేందుకు వెళుతుండగా ఒక్కసారిగా కూలింది. దాంతో లక్ష్మీదేవమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెంది. సాలమ్మ అనే మహిళ చేతికి తీవ్రగాయం కావడంతో నందికొట్కూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కాలిన గాయాలతో వివాహిత మృతి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణం అల్లూరు రహదారిలో నివాసం ఉంటున్న వివాహిత కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19వ తేదీ మద్యం మత్తులో భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన తెలిసిందే. అల్లూరు రహదారిలో మల్లికార్జున, కల్యాణి(28) దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త మద్యానికి బానిసయ్యాడు. దీంతో ప్రతి రోజూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. మల్లికార్జున మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనానికి తెచ్చుకున్న పెట్రోల్‌ను కల్యాణి ఒంటిపై పోసి నిప్పు పెట్టాడు. కాలిన గాయాలతో నందికొట్కూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కల్యాణి తండ్రి శేఖరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

దొంగతనం కేసులో నలుగురికి రిమాండ్

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. దొంగతనం కేసులో కుమ్మరి హరినాథ్, షేక్ మసూద్, చాకలిరాజు, షేక్ ఇమ్రాన్ అనే నలుగురు వ్యక్తులను అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. గత ఏడాది వేసవి సెలవుల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రొజెక్టర్, స్పీకర్లు అపహరణకు గురయ్యాయి. డిసెంబరులో పట్టణంలోని పగ్గాల రాముడు ఇంట్లో రూ.లక్ష నగదు చోరీ జరగడంతో అప్పట్లో కేసు నమోదైంది. నలుగురు వ్యక్తుల నుంచి పోయిన సొమ్మును రికవరీ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురిపై కేసు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బాలుడిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఆలూరు ఎస్సై మన్మథవిజయ్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. రెండు రోజుల కిందట అరికెర గురుకులంలో బాలుడిపై అర్ధరాత్రి తనతోపాటు చదువుకునే వారు లైంగికదాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అలంకార ప్రియుడిగా..

ఏటా సెప్టెంబరులో ఏడు రోజుల పాటు పంచాక్షరి జప యజ్ఞంతో పాటు సప్త భజనలు చేస్తారు. అందులో భాగంగా ఏడు రోజుల పాటు హుచ్చు వీరప్పతాతకు ప్రత్యేక పుష్పాలంకరణ చేపడతారు. ఒక్కో రోజు ఒక్కో కులానికి చెందిన వారు బెంగళూరు నుంచి సుమారు రూ. లక్షకు పైగా విలువ చేసే వివిధ రకాల పూలు తెప్పించి అలంకరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. రోజూ సుమారు వెయ్యి మందికి పైగా అన్నదానం చేస్తారు. హంపీకి పాదయాత్రగా వెళ్లి అక్కడ నదీ జలాలు తెచ్చి ఆలయంలో జలాభిషేకం నిర్వహిస్తారు.

పెద్దహోతూరు.. మేడలు లేని ఊరు

■ హుచ్చు వీరప్పతాత ఉత్సవాలకు సిద్ధం ■ ఈ నెల 26న రథోత్సవం

పుష్పాలంకరణలో హుచ్చువీరప్ప తాత విగ్రహం

ఆలూరు, న్యూస్‌టుడే: ఆ ఊరిలో ఎటు చూసినా.. మేడ ఉన్న ఇల్లు కనిపించదు. నిర్మించుకొనే ఆర్థిక స్థోమత లేక కాదు. . ఆ ఊరి కట్టుబాటు కాదనలేక. గ్రామంలో కర్ణాటక, రాయలసీమ ప్రాంతంలో పేరెన్నికగన్న హుచ్చు వీరప్పతాత ఆలయం ఆవరణలో ఉన్న మేడపై మరో నిర్మాణం చేపట్టాకే.. రెండంతస్తుల మేడ నిర్మించుకోవాలనేది తరతరాలుగా వస్తున్న కట్టుబాటని గ్రామస్థులు చెబుతున్నారు. అలా మేడలు కట్టేందుకు ప్రయత్నించిన వారు ఇబ్బందుల పాలయ్యారని ఆ ఊరి జనం విశ్వాసం. ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామస్థులు కుల దైవంగా భావించే హుచ్చు వీరప్పతాత ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 26న ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం రథోత్సవం జరపనున్నారు. 27న జాతరతో ఉత్సవాలు ముగియనున్నాయి. గ్రామంలోనే సజీవ సమాధి అయిన ఆయనకు గ్రామస్థులు ప్రత్యేకంగా ఆలయం నిర్మించి ఆరాదిస్తున్నారు. ఏదైనా అనారోగ్యం సోకితే.. ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటే వెంటనే తగ్గిపోతుందని గ్రామస్థుల విశ్వాసం. ఏటా హుచ్చు వీరప్ప తాత ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆ పేర్లే అధికం

గ్రామంలో ఉచ్చీరప్ప, హోతూరప్ప, ఉచ్చీరమ్మ పేర్లు ఉన్న వారే అధిక సంఖ్యలో ఉన్నారు. పూర్వం కొంత మంది ఇళ్లలో పిల్లలు తీవ్ర అనారోగ్యంతో ఉండటం వల్ల తల్లిదండ్రులు ఆలయానికి వెళ్లి మొక్కుకున్నారు. దీంతో పిల్లల ఆరోగ్యం కుదటపడింది. ఇలా తమ పిల్లల ఆరోగ్యం కుదటపడటంతో వారికి హుచ్చు వీరప్పతాత పేరు కలిసొచ్చేలా నామకరణం చేశారు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు గ్రామంలో ఆ పేరునే కొనసాగిస్తున్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

● రూ. 11 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి రూ. 11 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు పట్టణ ఇన్‌ఛార్జి సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక ఠాణాలో విలేకరులతో కేసు వివరాలు వెల్లడించారు. గత నెల 30న జమ్మలమడుగు మండలం ధర్మాపురానికి చెందిన వెంకట శివారెడ్డి తన బైక్ అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మంగళవారం కోవెలకుంట్ల బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, పేరుసోముల గ్రామానికి చెందిన మహమ్మద్ ఆలీ అక్బర్ బాషా, జమ్మలమడుగు మండలం ఎస్. ఉప్పలపాడుకు చెందిన హరిప్రసాద్ పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా జమ్మలమడుగు, పెద్దముడియం, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, బనగానపల్లి, కొలిమిగుండ్ల, తాడిపత్రి, ముద్దనూరు, పోలీసు స్టేషన్‌లలో కేసులున్నట్లు గుర్తించారు. జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడ్డారు. ఎస్ఐ హైమావతి, కానిస్టేబుళ్లు నాగేంద్ర, కృష్ణారెడ్డిని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

నంద్యాల- బి జట్టు విజయం

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పవన్‌కుమార్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని ఆదర్శ విద్యా మందిరం క్రీడా మైదానంలో జరుగుతున్న ఎంఏ ఇస్సాన్ మెమోరియల్ ట్రోఫీ క్రికెట్ లీగ్ పోటీల్లో నంద్యాల- బి జట్టు విజయం సాధించింది. నంద్యాల- సి జట్టు మొదటి ఇన్నింగ్‌లో 111, రెండో ఇన్నింగ్‌లో 150 పరుగులు చేసింది. నంద్యాల- బి జట్టు మొదటి ఇన్నింగ్‌లో 113 పరుగులు, రెండో ఇన్నింగ్‌లో నాలుగు వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసి విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన నంద్యాల- సి బౌలర్ పవన్‌కుమార్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. నంద్యాల- బి జట్టు క్రీడాకారులు యశస్విగౌడ్ బెస్ట్ బ్యాటర్‌గా, సాయి నికిత సులక్షణరెడ్డి స్టార్ పెర్ఫార్మెన్స్ ప్లేయర్ అవార్డు అందుకున్నారు.

విద్యుత్తు ఉపకేంద్రంలో ఆపరేటర్ చేతివాటం

ద్విచక్ర వాహనంపై సామగ్రి తరలిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి విద్యుత్తు సబ్ స్టేషన్‌లో ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. దాదాపు రూ. 5 లక్షలు విలువజేసే సామగ్రిని ఆ కార్యాలయంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న జి. ప్రసాద్ తరలించాడు. ఇందుకు సంబంధించిన ద్విచక్ర వాహనంపై సామగ్రి తీసుకెళ్తున్న వీడియోలు, ఫొటోలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ జి. ప్రసాద్ వైరు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్తున్న వీడియోలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి. గతేడాది అక్టోబర్ నుంచి గత నెల వరకు సబ్ స్టేషన్‌లో విద్యుత్తు సామగ్రి దొంగతనం జరిగినట్లు సమాచారం. ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ ఈరేష్‌ను వివరణ కోరగా.. ఆపరేటర్ సామగ్రి దొంగతనం చేయడం వాస్తవమేనన్నారు. ఈ విషయంపై ఆ ఉద్యోగిపై సదరు గుత్తేదారుడు, ఏడీకి ఫిర్యాదు చేశామన్నారు.

బాలుడి మృతిపై కేసు నమోదు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడకు చెందిన కేశవ (8) మృతిపై కర్నూలు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న జయలక్ష్మికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. భర్త చనిపోయారు. పిల్లల పోషణ కష్టంగా మారడంతో వసతిగృహాల్లో చేర్పించారు. కుమారులు శేఖర్, కేశవ నగరంలోని చిదంబర్‌రావువీధిలో ఉన్న అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. ఈనెల 18వ తేదీన కేశవ బాత్‌రూంలో కాలు జారి పడిపోవడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన వార్డన్ చంద్రశేఖర్ మొదట ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈనెల 20వ తేదీన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Network Leaders for New Network plan in EV - Bike rentals for details what'sapp: 90001 86267.

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని 73821 14647.

JOBS

KUN United Hyundai Kurnool. Wanted Accountants/ Service Advisors/ Sales Executives/ Team Leaders. Attractive Salary, Incentives. Contact: 98858 21222, 70936 85777, 97030 76555, 98855 37222, 91333 14336, 91601 14474. Experienced will be Preferred.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

మంత్రులను కలిసిన తెదేపా నాయకులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును తెదేపా ఆదోని బాధ్యుడు మీనాక్షినాయుడు మంగళవారం కలిశారు. తెదేపా పార్లమెంటు కమిటీ సమావేశాల కోసం ఆయన వెళ్లారు. ఆదోని నియోజకవర్గ పరిస్థితులను వివరించినట్లు తెలిపారు.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మైనింగ్ భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, ఆలూరు నియోజకవర్గ బాధ్యురాలు వైకుంఠం జ్యోతి మంగళవారం కలిశారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని చైతన్యవంతులు కావాలని ఆదోని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుభాష్ అన్నారు. ఆదోని పట్టణం శంకర్‌నగర్‌లోని విద్యశ్రీ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగేంద్ర, ప్రధానోపాధ్యాయిని జ్యోతి, న్యాయవాదులు లోకేశ్‌కుమార్, ఈరన్న పాల్గొన్నారు.

లస్కర్ వ్యవస్థను పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో పనిచేసే లస్కర్ వ్యవస్థను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని శాసనసభలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు ప్రస్తావించారు. తుంగభద్ర దిగువ కాల్వకు సంబంధించిన చివరి ఆయకట్టుకు నీరందేలా చూసుకునే లస్కర్ నియామకాలను గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. రైతులను దృష్టిలో పెట్టుకొని నియామక ప్రక్రియ చేపట్టే ప్రతిపాదన ఏమైనా ఉందా? అని అడిగారు.

శాసనసభలో మంత్రులతో పాటు ఎమ్మెల్సీ బీటీ నాయుడు

యువకుడిపై కేసు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని వేధింపులకు గురిచేసిన మనోహర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు. ఇటీవల యువతికి పెళ్లి నిశ్చయం అయిందని, పెళ్లి జరగకుండా చేశారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో అవస్థల చికిత్స

☛ అద్దె గదుల్లోనే నిర్వహణ ☛ సిబ్బందికి తప్పని ఇబ్బంది

హంప గ్రామంలో గత ఐదేళ్లలో ఆరోగ్య కేంద్ర నిర్మాణం పూర్తి కాలేదు. సిబ్బంది ఇలా ఓ రేకుల షెడ్డును అద్దెకు తీసుకుని విధులు నిర్వహిస్తున్నారు. రోగులను పరీక్షించేందుకు అవసరమైన వసతులు లేవు. కనీసం మరుగుదొడ్లు కూడా లేక మహిళా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మండలంలో గత వైకాపా సర్కారు ఆరంభంలో మొదలుపెట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఇప్పటికీ కొన్నిచోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. మరికొన్ని చోట్ల పూర్తయినా వాటి పరిసరాల్లో అధ్వానంగా ఉండటంతో వైద్య సిబ్బంది సేవలు అందించలేని దుస్థితి. ఇలా పలు రకాల సమస్యలతో ఆరోగ్య కేంద్రాలకు అనారోగ్యం పట్టుకుంది. ఒక్కో భవనాన్ని రూ.22 లక్షలతో నిర్మాణం చేపట్టినా ప్రజలకు అక్కరకు రాకున్నాయి.

నిరుపయోగంగా పరికరాలు

వెల్‌నెస్ కేంద్రాలకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలను అందించారు. అయితే పలు చోట్ల నిర్మాణాలు పూర్తి కానందున పరికరాలు నిరుపయోగంగా మారాయి. అవి పూర్తిగా పాడైపోక ముందే కేంద్రాల వ్యవహారం కొలిక్కి తేవాల్సిన అవసరముంది.

భవనం ఉన్నా.. నిర్వహణ సున్నా

అగ్రహారంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ పరిసర ప్రాంతాలు వ్యర్థాలతో నిండిపోయాయి. గ్రామంలో నుంచి వచ్చే మురుగు ఇక్కడ నిలుస్తోంది. ఈ కేంద్రాన్ని అధికారికంగా ఇంకా ప్రారంభించలేదు. గ్రామంలోని 5 వేల మంది జనాభాకు వైద్య సేవలు అందించేందుకు ఇక్కడ నిర్మించిన భవనం ఇంకా వినియోగంలోకి రాలేదు. సంబంధిత గుత్తేదారు ప్రాథమిక వైద్యశాల అధికారులకు అప్పగించారు. అయినా ఇక్కడ నెలకొన్న అపరిశుభ్రత కారణంగా ఇప్పటివరకు తెరవలేదు. ఇక్కడ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ కేంద్రాన్ని నిర్వహించలేక అద్దె భవనంలో కొనసాగిస్తున్నామని వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి ఆరోగ్య కేంద్రాలను వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని జనం, ఆరోగ్య సిబ్బంది కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణ శివారులోని శారద నగర్‌లో ఇంటి సంఖ్య 2-276 ప్రాంతంలో ప్రజారోగ్య సిబ్బంది చెత్తను ఊడ్చి ఎత్తకుండా.. నిప్పు పెడుతున్నారు. ఇబ్బంది పడుతున్నాం. - ఖాసీమ్, న్యాయవాది, ఆదోని ✔: ప్రజారోగ్య సిబ్బందితో మాట్లాడి, సమస్య పరిష్కరిస్తాం. - శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, మండగిరి

పత్తికొండ, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - ప్రసాద్, మద్దికెర ✔: పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: గ్రామంలో నీటి కుళాయి పైపు మాత్రమే ఉంది. మినీ ట్యాంకు నిర్మించి నీటి వృథాను అరికట్టాలి. - నారాయణ, రాజు, ఐనకల్లు ✔: మినీ ట్యాంకు ఏర్పాటు కోసం ప్రతి పాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - హనుమంతు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ. ఆస్పరి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: నగరడోణ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద పరిసారాలు శుభ్రం చేయాలి. - లింగారెడ్డి, నగరడోణ ✔: రెండు, మూడు రోజుల్లో పరిసారాలు శుభ్రం చేయిస్తాం. - సిసింద్రినాథ్, పంచాయతీ కార్యదర్శి నగరడోణ

పత్తికొండ, న్యూస్‌టుడే: మద్దికెరలోని నాగులబావి శివాలయం వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. - వెంకటరాముడు ✔: సమస్యను వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటాం. - సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

రక్షణకు... రాళ్లే అడ్డుగా

మద్దికెరలోని ఆదర్శ పాఠశాల, బాలికల వసతి గృహం గ్రామానికి దూరంగా ఉన్నాయి. చుట్టూ పొలాలే. అయినా వసతి గృహానికి ఇప్పటికీ ప్రహరీ నిర్మించలేదు. గతంలో నిధులు మంజూరైనా పాఠశాలకు కొంత మేరకే ప్రహరీ నిర్మించారు. మిగతాది అలాగే వదిలేశారు. దీంతో పొలాల్లోంచి పాములు, విషకీటకాలతో పాటు, రాత్రి సమయంలో ఈ ప్రాంతాల్లోనే మందు బాబులు మద్యం తాగుతూ ఉంటారు. గ్రామానికి దూరంగా ఉన్న బాలికల వసతి గృహాలకు రక్షణ లేకుండా పోయింది. పక్కనే పొలాలు, ముళ్లపొదల మధ్యలోనే ఉన్నాయి. రాత్రి వేళల్లో మరింత ఇబ్బందిగా మారింది. - న్యూస్‌టుడే, పత్తికొండ

రహదారిపై జల ప్రవాహం

ఆలూరు పట్టణంలోని హొళగుంద వెళ్లే ప్రధాన రహదారిపై తాగునీరు పెద్ద ఎత్తున నిలిచింది. స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపంలో మంగళవారం తాగునీటి పైపు పగిలిపోయింది. దీంతో తాగు నీరంతా రహదారిపైకి చేరింది. వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పంచాయతీరాజ్ కార్యాలయం నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు సీసీ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఓ వైపు రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చింది. ఒక వైపు నుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నీటి నిల్వతో ఇబ్బందులు పడ్డారు. - న్యూస్‌టుడే, ఆలూరు

పింఛను మంజూరు చేయండి

లీలావతమ్మ

ఆస్పరి, న్యూస్‌టుడే: అమ్మా.. నాకు పింఛను రావడం లేదు. నా అన్నవారు ఎవరూ లేరు. ఒంటరి దివ్యాంగ వృద్ధురాలిని.. ఐదేళ్లుగా పింఛను రావడం లేదు.. అని బిళ్లేకల్లు గ్రామానికి చెందిన దివ్యాంగ ఒంటరి వృద్ధురాలు లీలావతమ్మ ఆవేదన వెలిబుచ్చారు. దివ్యాంగ ఒంటరి వృద్ధురాలు లీలావతమ్మ ఆటోలో వచ్చి ఎంపీడీవో కార్యాలయం ఎదుట కూర్చున్నారు. తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయని గత ప్రభుత్వం తన పింఛను తొలగించిందన్నారు. విషయం తెలుసుకొని ఎంపీడీవో గీతావాణి బయటకు వెళ్లి.. సమస్య విన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదని, ఇంటి పక్కల వాళ్లు ముద్ద పెడితే తిని, జీవనం గడుపుతున్నానని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తన పింఛను మంజూరు చేసి, న్యాయం చేయాలని కోరారు. ఎంపీడీవో వెంటనే స్పందిస్తూ.. పంచాయతీ కార్యదర్శితో చరవాణిలో మాట్లాడారు. వృద్ధురాలి దగ్గర ఉన్న పత్రాలు పరిశీలించి.. దివ్యాంగ ఒంటరి వృద్ధురాలికి పింఛను వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి

తుగ్గలి, న్యూస్‌టుడే: వేసవి ప్రారంభమైందని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, ఎంపీపీ రామాంజినమ్మ అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన తుగ్గలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. వేసవి లోపు జలజీవన్ పథకం కింద చేపట్టిన పనులు గ్రామాల్లో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మయూర్ తెలిపారు. పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారని, సమస్య పరిష్కరించాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమోహన్, వైస్ ఎంపీపీలు ఎర్రిగుప్ప, పక్కీరప్ప, తహసీల్దార్ రవి, ఎంపీడీవో విశ్వమోహన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి పీఎంశ్రీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను పీఎంశ్రీ కేంద్ర కమిటీ నోడల్ అధికారి డాక్టర్ ఇషిత గంగూలీ త్రిపాఠి మంగళవారం తనిఖీ చేశారు. పథకం కింద మంజూరైన రూ.60లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్, సమగ్ర శిక్షా అధికారి లోకరాజు, రాష్ట్ర పరిశీలకులు జయలక్ష్మి, జీసీడీవో స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో వెలుగులు

హొళగుంద, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలో నాలుగు రోజులుగా వీధి దీపాలు వెలగక కాలనీ వాసులు రాత్రిపూట ఇబ్బంది పడ్డారు. దీనిపై ఈ నెల 24న 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన సమస్య ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అభివృద్ధి అధికారి రాజశేఖర్ గౌడ్, సిబ్బందికి తెలిపి వీధి దీపాలు మంగళవారం ఏర్పాటు చేయించి, సమస్య పరిష్కరించారు.

మురుగు కాల్వలు శుభ్రం చేయరూ!

పౌర పాత్రికేయం

ఆదోని పట్టణంలోని అరుణ్‌జ్యోతినగర్‌లో మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. కొన్ని రోజులుగా మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. కాల్వలు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య విభాగం అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడంలేదు. పురపాలక అధికారులు స్పందించి కాలనీలో పర్యటించి మురుగు కాల్వలు శుభ్రం చేయించాలి.

- జె.నాగరాజు, అరుణ్‌జ్యోతినగర్
- న్యూస్‌టుడే, ఆదోని ఎస్కేడీ కాలని

చిత్రాలు పంపాల్సిన: 90142 01212

సంక్షిప్త సమాచారం

పత్తికొండ, న్యూస్‌టుడే: మద్దికెరలోని రైతు సేవా కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు గుండాల నాయక్, ఏవో రవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్న తదితరులు అన్నారు. క్వింటా రూ.5,875కు కొనుగోలు చేస్తామన్నారు.

పత్తికొండ, న్యూస్‌టుడే: మద్దికెర సమీపంలో హంద్రీనీవా కాల్వకు ఏర్పాటు చేసిన తూము ద్వారా నీటి సరఫరా తగ్గించకుండా.. ఉలవకు పంటలు చేతికందే వరకు కొనసాగించాలిన మద్దికెర, యడవలి, కొత్తపల్లి, బొమ్మనపల్లి, గుంతకల్లు మండలం మొలకలపెంట, కొంగనపల్లి, శంకరబండ తదితర గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో టీబీ విభాగాన్ని టీబీ ముక్త్ భారత్ విభాగం జిల్లా కార్యక్రమ అధికారి రామకృష్ణ పరిశీలించారు. అనంతరం వైద్యాధికారిని షేకున్‌బాను అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది బాబురాజు, స్వరూప్‌రాజ్ కుమార్, భాస్కర్, సుబ్బమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని జీఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రామయ్య, పాఠశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సత్యశ్రీ, డైరెక్టర్ విజయ్‌కుమార్, కో-ఆర్డినేటర్ వెంకటేశు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలి రావాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇ.రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని వీకే నగర్, దిడ్డిచేను కాలనీల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు పట్టించుకోవటంలేదని సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు ఎంపీడీవో కవితకు వినతి పత్రం అందజేశారు.

హొళగుంద, న్యూస్‌టుడే: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలలిత అధ్యక్షతన లబ్ధిదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్విలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఆలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు చెంగలరాయుడు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జిలానీబాషా, మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకాశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే: మండలానికి మంజూరైన స్వచ్ఛ రథాన్ని జడ్పీటీసీ జిల్లా సంఘం మాజీ సభ్యుడు ఏరూరు మీనాక్షినాయుడు, తెదేపా నాయకులు పురుషోత్తం, రామాంజనేయులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్లబకాష్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సర్పంచి గోవిందరాజులు, నాయకులు దానప్ప, జయన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దేవి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా దుర్గమ్మ సిడిబండ

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్విలో మంగళవారం ప్రథమ దుర్గమ్మ సిడిబండ వైభవంగా జరిగింది. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహిళలు ప్రత్యేక కలశాలతో అమ్మవారి ఊరేగింపులో వైభవంగా చేపట్టారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

కనులపండువగా ఆలయ వార్షికోత్సవం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం కిలిచినపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో మధ్య స్వామి వారి కల్యాణోత్సవం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కార్యక్రమానికి హాజరైన భక్తులు

కమనీయం శ్రీరంగనాథుని కల్యాణం

పులికొండ(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: పులికొండలో వెలసిన సంతాన వరదుడు రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి కల్యాణం వైభవంగా సాగింది. కల్యాణోత్సవం, రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ప్రధాన ఘట్టమైన కల్యాణం, రథోత్సవం ప్రశాంతంగా ముగిసినట్లు ఆలయ ఈవో వీరయ్య తెలిపారు.

వైకాపా హయాంలో ఆలయాలు ధ్వంసం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత వైకాపా హయాంలో హైందవ ఆలయాల ధ్వంస రచన నిరంతరం కొనసాగిందని ఆదోని నియోజకవర్గ భాజపా ఎమ్మెల్యే పార్థసారథి మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. ఐదేళ్ల వైకాపా పాలనలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ రథం దహనంతో మొదలై విజయనగరం రామతీర్థం శ్రీరాముడు విగ్రహం శిరస్సు తొలగించే వరకు సాగిందన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహ వాహన విగ్రహాలు చోరీ చేశారన్నారు. ఇలా మొత్తం 125 ఆలయాలు ధ్వంసమయ్యాయన్నారు. 151 సీట్ల గర్వంతో విర్రవీగిన వైకాపా.. హైందవుల కోపానికి 11 సీట్లకు పరిమితమై, కనీసం ప్రతిపక్ష హోదా దక్కలేదన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తి.తి.దే లడ్డూ ప్రసాదం కల్తీ ఘటన తెలిసి దేశంలోని హైందవులు రగిలిపోతున్నారన్నారు.

కాలనీ కబుర్లు

పత్తికొండ, న్యూస్‌టుడే: మద్దికెర సమీపంలోని పొలాల్లో వెలసిన సుంకులమ్మ దేవర వేడుకలను సర్పంచి సుహాసిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

చందోలి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: చందోలి గ్రామ మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకురాలు తలారి లక్ష్మీదేవి(70) మంగళవారం మృతిచెందారు. ఆమె మృతికి గ్రామస్థులు, పలువురు తెదేపా నాయకులు, అభిమానులు సంతాపం తెలిపారు.

బొందిమడుగుల (తుగ్గలి), న్యూస్‌టుడే: తుగ్గలి మాజీ ఎంపీపీ బొందిమడుగు వెంకటేశ్వర్లు(80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. వామపక్షాల నాయకులు రామచంద్రయ్య, గిడ్డయ్య, జగన్నాథం, నబీరశూల్, సుల్తాన్, శ్రీరాములు తదితరులు వెంకటేశ్వర్లు నివాళి అర్పించారు.

చిన్నహుల్తి (పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామ సమీపంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయంలో పూజలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణయ్య, సంఘం నాయకులు నెట్టికంఠయ్య, రంగన్న, మాదన్న, ఎర్రిస్వామి, సోమశేఖర్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ, న్యూస్‌టుడే: ఈదులదేవరబండ, గద్దరాళ్ల, తెర్నేకల్, పి.కోటకొండ గ్రామాల్లో పీఎం కుసుమ్ 6 మెగావాట్స్ విద్యుత్తు ఉత్పత్తికి సంబంధించిన ప్రాజెక్ట్ పనులను సీజీఎం పద్మ, ఎస్ఈ ప్రదీప్‌కుమార్ పరిశీలించారు. ప్రతి ప్రాజెక్ట్‌లో 20 ఎకరాలు రైతుల నుంచి తీసుకొని 6 మెగా వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనుంది.

టీజీ.పాండురంగయ్య శెట్టిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఉరుకుంద ఆలయాభివృద్ధికి కృషి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఆలయ కమిటీ ఛైర్మన్ టీజీ.పాండురంగయ్యశెట్టి అన్నారు. ఆదోని డివిజన్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ఛైర్మన్‌గా ఎన్నికైన ఆయనను ఆర్యవైశ్య సంఘం నాయకులతో పాటు రైస్ మిల్లు అసోసియేషన్ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు.

గురురాఘవుని వైభవం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని మంత్రాలయం గురురాఘవేంద్ర స్వామి అనుబంధ ఆలయమైన కోట మంగరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో గురురాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. బృందావనానికి అభిషేకాల అనంతరం ఆలయ ఆవరణలో భక్తులతో కలిసి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు గురురాజాచార్, మేనేజరు భీమ్‌రావు, నకాతే శ్యాంప్రసాద్‌రావు, శ్రీధర్, ఎస్డీ.గిరి, చక్రవర్తి దేశాయ్, వాదిరాజ్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణంలో రథం లాగుతున్న భక్తులు

పేదలకు ఆసరా.. ఆరోగ్యానికి భరోసా

☛ అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

ఆదోని గ్రామీణం, నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆసరాగా నిలుస్తోంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు మేమున్నాం అని భరోసా ఇస్తోంది. వెనుకబడిన, బడుగు బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యం బారిన పడి.. ఆస్పత్రిలో చికిత్స కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఆరోగ్యం కోసం అప్పులపాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోంది. చికిత్సలకు సంబంధించిన బిల్లులు ఇస్తే ఆర్థిక సాయం అందుతుంది. ఆదోని నియోజకవర్గంలో వందలాది మందికి రూ.కోట్ల ఆర్థిక సాయం పంపిణీ చేశారు.

634 మందికి లబ్ధి

ఆదోని నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 634 మంది లబ్ధిదారులకు రూ.2,53,02,416 చెక్కులు అందజేశారు. మరో 420 మందికి సంబంధించిన దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న చెక్కులు మంజూరు చేసేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆదోని తెదేపా బాధ్యుడు మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేపడుతున్నారు. తెదేపా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకుంటున్న వారికి దిశానిర్దేశం చేసి, సాయం అందేలా చూస్తున్నామని సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు.

ఆదోనిలో చెక్కులు పంపిణీ చేసిన తెదేపా బాధ్యుడు మీనాక్షినాయుడు, తెదేపా సీనియర్ నేత ఉమాపతినాయుడు, లబ్ధిదారులు

కష్టాల్లో ఉన్నవారికి ఊరట

- రఘు, ఆదోని పట్టణం

ముఖ్యమంత్రి సహాయ నిధి కష్టాల్లో ఉన్నవారికి ఊరట ఇస్తోంది. నాకు పక్షవాతం వచ్చి ఆస్పత్రి పాలయ్యా. ఆర్థికంగా లేకపోయినా.. అప్పు చేసి చికిత్స చేయించుకున్నా. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సంప్రదించి దరఖాస్తు చేసుకున్నా. ప్రస్తుతం నాకు రూ.40,355 చెక్కు అందింది. ఆర్థికంగా ఇబ్బందులు ఉండే మాకు కాస్త ఉపశమనం లభించింది.

పేద మధ్యతరగతి ప్రజలకు అండ

- రమేష్, గొనబావి (ఆదోని)

మాలాంటి మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక చేయూత ఇవ్వడం సంతోషించదగ్గ విషయం. కడుపులో పేగుల సమస్య రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శస్త్రచికిత్స చేయించుకున్నా. బిల్లులు అందిస్తే ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని చెబితే దరఖాస్తు చేసుకున్నా. రూ.49,258 చెక్కు వచ్చింది. కష్టాల్లో మాలాంటి ఆర్థికం సాయం ఎంతో ఉపయోగ పడింది. మనిషి ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం.

పరిశ్రమను సందర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నైపుణ్యంతో ఉత్తమ ఫలితాలు

ఎమ్మిగనూరు: విద్యార్థుల నైపుణ్యానికి సాంకేతిక రంగం జోడిస్తే ఉజ్వల భవిష్యత్తుకు పునాది పడుతుందని వీవర్స్‌కాలనీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణంరెడ్డి అన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని పరిశ్రమలను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం ఒకేషనల్ కోర్సుల ద్వారా విద్యార్థులు స్వయంగా ఎదిగే విధంగా అవగాహన కల్పిస్తోందన్నారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

పరీక్ష తేదీలో మార్పు

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలిన 6, 7, 8, 9, 10 తరగతుల ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష తేదీలో మార్పు చేసినట్లు ప్రిన్సిపల్ చింతలయ్య పేర్కొన్నారు. ఎస్‌ఏ పరీక్షల కారణంగా మార్చి 2వ తేదీ జరగాల్సిన పరీక్షను 8వ తేదీకి వాయిదా వేశారన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మార్పును గమనించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: లక్ష్మీపేట ఏరియాలో నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నాం. **- లక్ష్మన్న కాలనీవాసి** ✔: సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. **- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్** ?: పెద్దబావి ప్రాంతంలో ఉన్న మూడోరోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. **- వీరేష్, కాలనీవాసి** ✔: కొత్త రహదారికి ప్రతిపాదనలు తయారు చేశాం. **- రాజునాయక్, డీఈ** ?: రామయ్య కొట్టాల వద్ద ప్రధాన రహదారి పక్కన ఉన్న కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- మల్లేష్ కాలనీవాసి** ✔: సిబ్బందిని పంపించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. **- శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: కల్లుకుంట గ్రామ దళితవాడలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- విజయ్, గ్రామస్థుడు** ✔: సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు**

నందవరం, న్యూస్‌టుడే: ?: హాలహర్వి గ్రామంలో హాలహర్వి- బాపురం వెళ్లే ప్రధాన రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. సత్వరం మరమ్మతులు చేయండి. **- రామకృష్ణ, బాపురం** ✔: రహదారిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- సుజాత, పంచాయతీ కార్యదర్శి, హాలహర్వి గ్రామం** ?: పోనకలదిన్నె గ్రామంలో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. **- కొండన్న, గ్రామస్థుడు** ✔: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. **- పుల్లయ్య, ఎంపీడీవో, నందవరం మండలం**

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్ ఎన్టీఆర్ కాలనీలో రైతు సేవా కేంద్రం నుంచి సీసీ రహదారి, కాలువలు నిర్మించాలి. **- లక్ష్మన్న, స్థానికుడు**

✔: మండల ఏఈ వెంకటప్రకాష్ దృష్టికి తీసుకెళ్లి కాలువలు, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్**

సమస్యలు సత్వరం పరిష్కరిస్తాం

■ 'వాక్ విత్ కమిషనర్' కార్యక్రమంలో కమిషనర్ గంగిరెడ్డి

కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సంజీవ్‌నగర్ కాలనీవాసులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీరు, శుభ్రం చేయని కాలువలు, తొలగించని పూడిక, తాగునీటికి ఇబ్బందులు.. ఇలా కాలనీల్లో సమస్యలు పేరుకుపోయాయి. దీనిపై 'ఈనాడు' ఆధ్వర్యంలో సంజీవ్‌నగర్‌లో 'వాక్ విత్ కమిషనర్' నిర్వహించగా కమిషనర్ గంగిరెడ్డికి ప్రజలు తమ ఇక్కట్లను వివరించారు. ఆయన ఇంటింటా తిరుగుతూ సమస్యలు విన్నారు. కొన్నింటిని తక్షణమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రాజునాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఏఈలు కరుణాకర్, పారిశుద్ధ్య సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

?: కాలనీలో కాల్వల్లో మురుగు నీరు ముందుకు పారడం లేదు. **- విజయలక్ష్మి**
✔: పారిశుద్ధ్య సిబ్బందితో కాల్వలు శుభ్రం చేయిస్తాం.
?: కుళాయిలు ఉన్నా నీరు రావడం లేదు. తాగు నీటికి కోసం ఇబ్బందులు పడుతున్నాం. **- లక్ష్మి**
✔: కొత్త పైపులైన్ వేసి నీటి సమస్య తీరుస్తాం.
?: కుళాయి కోసం గుంత తవ్వడంతో అందులో మురుగు నీరు చేరుతున్నాయి. దీంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. **- రామకృష్ణమ్మ**
✔: గుంతలను వీలైనంత త్వరగా పూడ్చిస్తాం.
?: పెద్ద కాలువ చెత్తతో నిండిపోయి నీళ్లు ముందుకు కదలడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది. **- నాగలక్ష్మి**
✔: చెత్తను ఎత్తివేయాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు.
?: మా ఇంటి సమీపంలో వీధి దీపం లేక చీకట్లో ఉంటున్నాం. **- రమేష్**
✔: కొత్త వీధి దీపం వేసేందుకు చర్యలు తీసుకుంటాం.
?: రోడ్డుపై చెత్త కుప్పలు వేసి తొలగించలేదు. దారంతా అపరిశుభ్రంగా మారింది. **- వీరేశమ్మ**
✔: ట్రాక్టర్‌తో చెత్తను తరలిస్తాం.
?: ఇంటింటి చెత్త సేకరణకు సిబ్బంది రోజు రావడం లేదు. **- సుమిత్ర**
✔: చెత్త సేకరణకు సిబ్బందిని రోజూ పంపిస్తాం.
?: శివారు ప్రాంతంలో రోడ్డు లేక మట్టి మార్గంలో ఇబ్బందులు పడుతున్నాం. **- సోమేష్**
✔: కాలనీలో కచ్చా రోడ్లు ఉన్న మూడు చోట్ల రోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరు చేశాం. త్వరలో పనులు మొదలు పెట్టిస్తాం.
?: పెద్ద డ్రైనేజీ పూడికతో నిండిపోయింది. వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించడండి. **- రఘు**
✔: వెంటనే డ్రైనేజీని శుభ్రం చేయిస్తాం.
?: కాలనీలో వీధి కుళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నాం. కొత్త కుళాయిలు మంజూరు చేయండి. **- సోమప్ప**
✔: కొత్త కుళాయిలు మంజూరు చేస్తాం.
?: గుడి వద్ద విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. **- నరసన్న**
✔: విద్యుత్తు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి రక్షణ వలయం ఏర్పాటు చేస్తాం.

ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు పెంచాలి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా ప్రోత్సహించాలని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. కె.నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు పోషకాహారం, రక్తహీనత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. పోషకాహార లోపంతో బాధపడే వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని పౌష్టికాహార పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి ఉమామహేశ్వరి, ఆరోగ్య కార్యకర్త కృష్ణవేణి, ఖలీల్,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ రఘు

చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పిల్లలో రక్తహీనత, పోషకాహార లోపాలు, ఆకలి మందగించడం, కడుపునొప్పి వంటి ఆరోగ్య సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో నులిపురుగుల కారణంగా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. 19 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జాహ్నవి, విజయకృష్ణ, రాజేశ్వరి, ఆనంద్‌రాజ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిస్తున్నా పట్టించుకోరు

పట్టణంలోని కొత్త ఇందిరానగర్ కాలనీలో వెంకటసాయి గుడి సమీపంలో మున్సిపల్ ఖాళీ స్థలం ఉంది. దినికి ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఆర్నెళ్ల గడిచినా పట్టించుకోలేదు. ఖాళీ స్థలంలో కొంతభాగాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. స్థలాన్ని ఆనుకొని ఉన్న ప్రైవేటు వెంచర్లో ఓ వ్యక్తి కొంత స్థలాన్ని ఆక్రమించినా అధికారులు పట్టించుకోలేదు. రూ.కోట్ల విలువ చేసే స్థలానికి అధికారులు రక్షణ కల్పించాల్సిన అవసరముంది. **- న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు**

పొంచి ఉన్న ప్రమాదం

మండలంలోని బసలదొడ్డి గ్రామంలో ఈశ్వర దేవాలయం ముందున్న కాలనీలో విద్యుత్తు తీగలు మిద్దెలను తాకుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. అత్యవసర సమయంలో మిద్దెలపైకి వెళ్లినప్పుడు ప్రమాదకర తీగల వల్ల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సమస్య ఏళ్ల తరబడి వేధిస్తున్నా పట్టించుకొనే నాథుడే లేడని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రమాదకర విద్యుత్తు తీగలు తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెద్దకడబూరు**

ఉత్సాహంగా గిరక బండ్ల పోటీలు

పోటీల్లో తలపడుతున్న వృషభాలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని బాపురం గ్రామంలో గంగాదేవి రథోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా స్థాయి గిరక బండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఇందులో కంబళదిన్నెకు చెందిన గజ్జెల్లి నాగన్న వృషభాలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని రూ.16,116 దక్కించుకున్నాయి. హనుమాపురం గ్రామానికి చెందిన గోవిందప్ప వృషభాలు రెండో స్థానంలో నిలిచి 10,116 గెలుచుకున్నాయి. మూడో బహుమతిని చిన్నకజూరుకు చెందిన నాగేశ్ వృషభాలు రూ.5116 దక్కించుకున్నాయి. నిర్వాహకులు సీపీఎం హనుమంతు, వీరేశ్ గౌడు తెలిపారు.

అంతర్గత రహదారులకు మహర్దశ

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: కూటమి రాకతో పెద్దకడబూరు మండలంలో అంతర్గత రహదారులకు మహర్దశ వచ్చిందని తెదేపా రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి తెలిపారు. పెద్దకడబూరులో ఆయన మంగళవారం అంతర్గత రహదారుల భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వివిధ గ్రామాల్లో 29 పనులకు రూ.1.95 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లికార్జున, ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరులో పనులు ప్రారంభిస్తున్న రమాకాంతరెడ్డి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మిగనూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేలు, ఇతర పనుల కోసం వార్డు ఉద్యోగులు పని చేస్తున్నా తమ సమస్యలను పరిష్కరించడం లేదని వార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు ఆందోళన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వార్డు ఉద్యోగులతో సర్వేలు చేయించడం దారుణమన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రాఘవేంద్రుడికి విశేష పూజలు

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తకోట శివారులో రాఘవేంద్ర స్వామి బృందావనంలో మంత్రాలయం రాఘవేంద్ర స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ డిపో పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ మండిపడ్డారు. డిపోలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న 12 డిపోల పరిధిలో ఏర్పాట్లు చేస్తున్నారని, సిబ్బందిని బదిలీ చేసి ఆ డిపోలను ప్రైవేటు వారికి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రైవేటు సంస్థ ద్వారా ఏపీఎస్ఆర్టీసీని నడిపే ఆలోచనలు మానుకోవాలన్నారు. ధర్నాలో కార్మిక సంఘం నాయకులు ఎన్‌ఎమ్‌యూ సాహెబ్, సురేష్‌బాబు, బాషా, మంజుల, నీలకంఠ, బాలరాజు, మునిస్వామి, ప్రసాద్, ఓంకార్, శ్రీనివాసులు, అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సేవలపై విద్యార్థులకు అవగాహన

ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరిస్తున్న సూపరింటెండెంట్ అబిగెయిల్

ఎమ్మిగనూరు నేరవాడ్లు, న్యూస్‌టుడే: మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఒకేషనల్ కోర్సులో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అబిగెయిల్ వంద పడకల ఆసుపత్రి ద్వారా అందిస్తున్న సేవలు, వైద్యులు, నర్సుల విధులు వంటి అంశాల గురించి విద్యార్థులకు వివరించారు.

ఆలయ కమిటీ సభ్యురాలిగా ఈడిగ పల్లవి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కమిటీలో పాలకవర్గ సభ్యురాలిగా మండలంలోని గాజులదిన్నెకు చెందిన తెదేపా నాయకుడు ఈడిగ వినోదుకుమార్‌గౌడ్ భార్య ఈడిగ పల్లకి ఎన్నికైనట్లు మండల తెదేపా నాయకులు మంగళవారం తెలిపారు. ఆలయ కమిటీలో గోనెగండ్ల మండలానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ప్రాముఖ్యత కల్పించడం సంతోషకరమన్నారు. పార్టీలో కష్టపడిన వారిని ఎమ్మెల్యే గుర్తించి తగిన గుర్తింపు కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఈడిగ పల్లవి

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.9,770

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.9,770, మధ్యస్థ ధర రూ.8,570 కనిష్ఠ ధర రూ.4,446కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు 191 మంది రైతులు 6,585 బస్తాల వేరుసెనగ అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు గరిష్ఠ, మధ్యస్థ ధర రూ.5,955, కనిష్ఠ ధర రూ.5,843 పలికింది. కందులు గరిష్ఠ ధర రూ.7,272, మధ్యస్థ ధర రూ.5,870, కనిష్ఠ ధర రూ.5,670కు కొన్నారు.

ముగిసిన బడేసాహెబ్ స్వామి ఉరుసు

గోనెగండ్ల: మండలంలోని గంజహళ్లిలో నిర్వహిస్తున్న మహత్మ బడేసాహెబ్ స్వామి ఉరుసు మంగళవారంతో ముగిసింది. చివరి రోజు దర్గాలో పీఠాధిపతులు జయరామ్ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి దర్గాను సందర్శించారు. దర్శనానంతరం పీఠాధిపతులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 9 మంది గైర్హాజరు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గూడూరులో రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 125 మంది విద్యార్థులకు గాను 120 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ రమణ తెలిపారు. శ్రీసాయి వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 305 మంది విద్యార్థులకు గాను 301 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ రామచంద్రుడు తెలిపారు.

శనగ రైతుకు మద్దతు ధర

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో రైతులు పండించిన శనగ దిగుబడులను క్వింటా రూ.5875 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి దస్తగిరి రెడ్డి తెలిపారు. మంగళవారం గూడూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగు చేసిన శనగ దిగుబడులను మద్దతు ధరకు విక్రయించాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, ఎంపీఈవో నాగేష్, రైతులు పాల్గొన్నారు.

కొర్ర పంటలో మెలకువలు తెలుపుతున్న సిబ్బంది

మూడో పంటగా కొర్ర సాగు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శనగ పంట పూర్తి చేసుకున్న రైతులు మూడో పంటగా కొర్ర సాగును దాదాపు 200 ఎకరాలు వేశారు. కోడుమూరులో మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో రమేష్ మాట్లాడుతూ గాజులదిన్నె ప్రాజెక్టు కింద కాలువ నీళ్లు వస్తుండటంతో రైతులు వేసవిలో ఈ పంటను వేశారన్నారు. 2025-26కు సంబంధించి పొలం పిలుస్తోంది కార్యక్రమం ముగిసిందన్నారు. వ్యవసాయ సహాయకులు శ్రీలేఖ, విజయశాంతి, నగేష్ పాల్గొన్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పెద్ద ఆసుపత్రి పక్కన ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం పురపాలక సంఘం కార్యాలయంలో నివాసాలు ఉంటున్న కాలనీవాసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కోర్టు ఆదేశాల ప్రకారం ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న కాలనీవాసులు అందరూ సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయంగా టిడ్కో గృహాల్లో ప్లాట్లు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్వో అస్లాంబాషా, టీపీవో రాజేష్, లవకుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

కౌతాళం మండలంలో రాజీనామాల పర్వం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం ఛైర్మన్‌గా టీజీ పాండురంగా శెట్టిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో శ్రేణులు, సర్పంచులు పార్టీ సభ్యత్వానికి రాజీనామాలు చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఇందులో ఉరుకుంద సర్పంచి టి.రాజ, దొమ్మలదిన్నె కుంబళనూరు, గోతులదొడ్డి సర్పంచులు డి.మమత, వీరేష్, ఎల్.గోవిందు ఉన్నారు. అలాగే తెదేపా సీనియర్ నాయకులు వల్లూరి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి వల్లూరి పట్టాభిలు ఇప్పటికే రాజీనామాలు ప్రకటించినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వారి బాటలో మరి అనుచరులు కూడా పార్టీ సభ్యత్వానికి రాజీనామాలు చేస్తున్నారు. కుంబళనూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈరన్న, మాజీ సర్పంచి బి.మల్లన్న, కుంబళనూరు క్లాస్టర్ తెదేపా గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు రాజీనామాలు ప్రకటించారు.

సుంకులా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

పూజలందుకున్న అమ్మవారు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురంలో వెలసిన సుంకులా పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారి మూల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. శుభకార్యాలు ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

వెంకటాపురంలో దేవర

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురంలో మంగళవారం గ్రామ దేవత దేవర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మారెమ్మ, సుంకులమ్మకు పూర్ణ కుంభాలతో ఊరేగింపుగా వెళ్లి భక్తులు నైవేద్యం సమర్పించారు. గ్రామ దేవతలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

స్నేహితుడికి చేయూత

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: కష్టసమయంలో మిత్రుడికి అండగా నిలిచి స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది 10వ తరగతి మిత్ర బృందం. కోడుమూరు 2005-2006 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి బి.రామాంజనేయులు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్రులు ఆయనకు రూ.42,300 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శివప్రసాద్, రాంప్రసాద్, రంగముని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కల్లపరిలో వెలసిన దుర్గాదేవిని గురువారం పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. **కోడుమూరు గ్రామీణం:** ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన అంగన్‌వాడీ ఆయాల, కార్యకర్తల రిలే దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరాయి. గూడూరు, సి.బెళగల్, కోడుమూరు, కర్నూలు నుంచి 200 మంది దీక్షలో పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం: పట్టణంలోని కర్నూలు, బళ్లారి ప్రధాన రహదారిపై దుమ్ము, ధూళితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని.. వారి ప్రాణాలను కాపాడాలంటూ సీపీఐ మండల కార్యదర్శి రాజు కోరారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ కార్యాలయంలో డీఈ లేకపోవటంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేశారు.

సి.బెళగల్ గ్రామీణం: మండల పరిధిలోని కె.శింగవరంలో ఎస్ఐ వేణుగోపాల్‌రాజు మంగళవారం క్రిమినల్, న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. వేధింపులు, గృహ హింస, సైబర్ నేరాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

విజ్ఞాన భాండాగారం

☛ సరైన వసతులు లేక ఇబ్బందులు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠకులకు జ్ఞానాన్ని నింపుతూ గ్రంథాలయాలు అందిస్తున్న సేవలు ఎనలేనివి. ఇలా ఎంతో ప్రాధాన్యమున్న గ్రంథాలయాలు నేడు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నగర పంచాయతీలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం పక్కనే అద్దె భవనంలో ప్రస్తుతం గ్రంథాలయం కొనసాగుతోంది. ఇక్కడ 10,100 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 1000 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. రోజూ 30 నుంచి 40 మంది వరకు పాఠకులు వస్తుండగా.. 15 కుర్చీలే ఉన్నాయి. శుద్ధజల యంత్రం లేక బయట నుంచి మంచినీటిని తెప్పిస్తున్నారు. ప్రస్తుత అద్దె భవనం కూడా మరమ్మతులకు గురైంది.

గ్రంథాలయంలో వార్తా పత్రిక చదువుకుంటున్న పాఠకులు

అరకొరగా పుస్తకాలు

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వరుసగా పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు ఇస్తోంది. ఈ క్రమంలో నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. దీంతో పాఠకులు కోరిన విధంగా పుస్తకాలు సిద్ధం చేయాల్సి ఉండగా.. నిధుల కొరత వేధిస్తోంది. నాలుగైదు ఏళ్ల క్రితం వచ్చిన పుస్తకాలే ఇక్కడ ఉండడంతో ఉద్యోగార్థులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.

సెస్సు అందక..

ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులో 8 శాతం నగర పంచాయతీ, పంచాయతీ గ్రంథాలయాల సంస్థకు అందించాల్సి ఉంటుంది. సెస్సు రూపంలో చెల్లించే సొమ్ము సకాలంలో గ్రంథాలయాలకు చేరకపోవడంతో వాటి నిర్వహణ, అభివృద్ధి నానాటికీ దయనీయంగా మారుతోంది.

దాతలు స్పందించాలి - కవిత, గ్రంథాలయాధికారిణి

మూడు నెలల నుంచి జీతాలు రావటం లేదు. రెండు నెలల నుంచి భవనం బాడుగ కూడా చెల్లించలేదు. సొంత భవనానికి స్థల దాతలు ముందుకు వస్తే నిర్మాణం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సెస్సు బకాయిలు చెల్లించాలని అధికారులను కోరాం.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి సర్కారు హామీలను విస్మరించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ పేర్కొన్నారు. అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షకు మంగళవారం మద్దతు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ వర్కర్లపై పని భారం పెరిగిందని.. దీనిపై ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం గోవిందు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్ల సంఘం అధ్యక్షురాలు గోవర్ధనమ్మ, సీఐటీయూ నాయకులు రాముడు, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, నాగశిరోమణి, రేణుక, రాధ, హేమలత, సుశీల, రోజామణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ

మామిడి కాయలకు కవర్లతో రక్షణ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మామిడి కాయలకు కవర్లు కట్టడంతో చీడ పీడల బారిన పడవని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రాజా కృష్ణారెడ్డి పేర్కొన్నారు. లద్దగిరిలో మంగళవారం మామిడి తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కవర్లు కట్టడంతో బంక తెగులు నుంచి రక్షణ కలగడంతో పాటు కాయ నాణ్యంగా ఉంటుందన్నారు. కవర్లను ప్రభుత్వం రాయితీపై అందిస్తోందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో ఉద్యాన శాఖ అధికారి మదన్‌మోహన్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై చిన్నచూపు

నందవరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి పది శాతం నిధులు కేటాయించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, మండల కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నందవరంలో ఉప తహసీల్దార్ మహేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు.

నాయకుల మధ్య వాగ్వాదం

కర్నూలు, న్యూస్‌టుడే: పేదలకు, పార్కుకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వైకాపా నాయకులు కబ్జా చేశారని ఆరోపిస్తూ తెదేపా నాయకులు సోమవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం తెదేపా, వైకాపా నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సాయంత్రం తెదేపా నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కేసు నమోదు చేయాలని ఆందోళన నిర్వహించారు. వారు వెళ్లిన కొద్దిసేపటికి వైకాపా నాయకులు కేసు నమోదు చేయాలంటూ అక్కడకు వచ్చారు. పోలీసులు సర్దిచెప్పడంతో వెనుదిరిగారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్సైలు రాజకుళ్లాయప్ప, డీవై స్వామి, వేణుగోపాల్ రాజు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి గుడి ముందు మంగళవారం కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు మంత్రాలయం ఎస్సై మల్లికార్జున తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

సవరణ

24-2-2026వ తేదీన ఈనాడులో పబ్లిష్ అయిన G.W.O.P.10/2026 లో In the Court of the Prl. Dist. Civil Judge, Kurnool గా చదువుకొనగలరు.
బి.మోహన క్రిష్ణ, బి.శివశంకర్, ఎ.రామాంజనేయులు, అర్జీదారుపరం అడ్వకేట్లు
కర్నూలు. సెల్: 85008 40030.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

డ్రోన్ సాంకేతికతతోనే భవిష్యత్తు

సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : నేటి యువత డ్రోన్ సాంకేతికతపై పట్టు సాధిస్తేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ట్రిపుల్ ఐటీ డీఎం రిజిస్ట్రార్ కృష్ణనాయక్ పేర్కొన్నారు. నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

2న హనుమాన్ ధర్మజ్యోతి ఉత్సవం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : నగరంలో మార్చి 2న హనుమాన్ ధర్మజ్యోతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలిపారు. జగన్నాథ గట్టుపై ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రతి పౌర్ణమిరోజు నిర్వహించే హనుమత్ ధర్మ జ్యోతి ఉత్సవానికి సంబంధించిన గోడపత్రాలను మంగళవారం నగరంలో ఆవిష్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణ : 85010 05408 ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: కల్లూరులో దోమల బెడద అధికంగా ఉంది. ఫాగింగ్ చేయాలి. - **రమేష్** ?: జొహరాపురంలో వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రివేళల్లో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. - **స్థానికులు** ?: సంతోష్‌నగర్, విజయలక్ష్మీనగర్‌లో మురుగుకాలువలు పూడిపోయాయి. మురుగు నిల్వ ఉండటంతో దోమల సమస్య తీవ్రమైంది. - **మహేశ్** ?: ధర్మపేటలో దోమలు ఎక్కువయ్యాయి.- **నాగరాజు** ✔: నగరంలో ఫాగింగ్ చేయిస్తాం. జొహరాపురంలో వీధిదీపాలు బాగుచేయిస్తాం. - **నగరపాలక అధికారులు**

బళ్లారి చౌరస్తాలో రహదారి విస్తరణ

మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని బళ్లారి చౌరస్తాలోని బైపాస్ వద్ద మలుపు ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన బళ్లారి చౌరస్తా ప్రాంతంలో పర్యటించారు. ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆయన మద్దూరునగర్‌లో పింగళి సూరన తెలుగు తోటను పరిశీలించారు. అక్కడ ఉద్యానవనం అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్ఐఆర్‌కు సహకరించాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను వేగవంతం చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని కర్నూలు నియోజకవర్గ ఆర్వో, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. వెంకటరమణ కాలనీలోని నగరపాలక తాత్కాలిక కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, తహసీల్దారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భరించలేని దుర్వాసన.. సర్వజన వేదన

★ జీజీహెచ్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం ★ వార్డుల మధ్య మురుగు నిల్వతో వైద్యులు, రోగుల అవస్థ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వివిధ వార్డుల పరిధిలో సుమారు ఏడు దశాబ్దాల కిందట.. అప్పటి అవసరాలకు తగ్గట్లు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా కాలువలు శిథిలమయ్యాయి. పక్క గోడలు కూలిపోయాయి. కొన్నిచోట్ల పూర్తిగా పూడిపోయాయి. పాత భవనాల స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టారు. ఇందులో భాగంగా కొన్నిచోట్ల డ్రైనేజీని పగులగొట్టారు. తర్వాత పునరుద్ధరించలేదు. మరోవైపు వివిధ వార్డు భవనాల సముదాయాల్లో ఏర్పాటు చేసిన పైపులు లీకవుతున్నాయి. ఫలితంగా ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ చేరి భరించలేని దుర్వాసనతో వైద్యులు, సిబ్బందితో పాటు రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ట్రామాకేర్ వద్ద కాలువలు పూర్తిగా పూడిపోయిన ప్రాంతాల్లో కొత్తగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. నెల రోజులైనా ఈ పనులు ఇంతవరకు పూర్తికాలేదు.

జనరల్ మెడిసిన్ మహిళల వార్డు వెనక మురుగు నిలిచి పాచి పట్టిందిలా..

ప్రణాళిక లేకుండా పైపులైను ఏర్పాటు

పాత భవనాలైన ట్రామాకేర్, జనరల్ మెడిసిన్ విభాగం (పాత పీడియాట్రిక్), జనరల్ సర్జరీ విభాగం, ఫిమేల్ యూనిట్, సూపర్ స్పెషాలిటీ వార్డు, శుశ్రుత భవన్‌తో పాటు కొత్తగా నిర్మించిన పీడియాట్రిక్, గైనిక్ విభాగాల్లో ఎక్కడా పైప్‌లైన్ నిర్మాణాలు సరిగాలేవు. దీంతో చాలా వార్డుల్లో మురుగునీరు కాలువల్లోకి చేరడం లేదు. దీంతో మూత్రశాలలు, మరుగుదొడ్లలో వాడిన నీరంతా వార్డుల మధ్యే నిలుస్తోంది. దీనికితోడు కాలువల్లో పూడిక సక్రమంగా తీయడం లేదు. ఫలితంగా అవి పూడిపోయి మురుగునీరు పరిసరాల్లో నిల్వ చేరుతోంది.

అంతా ఇష్టారాజ్యం

బాలాజీ క్యాంటీన్, ట్రామాకేర్, ఆక్సిజన్ ప్లాంటు వరకు ఉన్న కాలువలో ఏడాదిగా పూడిక తీయకపోవడంతో పూడిపోయింది. మురుగు ప్రవహించకపోవడంతో సీసీరోడ్డు మధ్యలో తవ్వి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేసి పూడిక తీశారు. రెండు నెలలు దాటినా దానిపై కప్పు ఏర్పాటు చేయకుండా ప్రమాదకరంగా వదిలేశారు.

● వాస్తవంగా కాలువల్లో పూడిక తీయాల్సిన బాధ్యత శానిటేషన్ గుత్తేదారుది. కాని అధికారులు ఆసుపత్రి నిధులు ఖర్చు చేయడంతో పాటు వైద్యశాలలో పనిచేసే సిబ్బందితో పనులు చేయిస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● పీడియాట్రిక్ విభాగం వార్డుల నుంచి వస్తున్న పైపులైన్ దెబ్బతిని మురుగు, మరుగుదొడ్ల నీరు బయట ప్రవహిస్తోంది. దుర్వాసన కారణంగా ఆ ప్రాంతంలో కాసేపు కూడా ఉండలేని పరిస్థితి.

విజయం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడల్లో విజయాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక డీఎస్ఏ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి శాప్ లీగ్ అండర్-18 బాల, బాలికల సైక్లింగ్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, డీఎస్ఏ శిక్షకులతో కలిసి ఆయన ప్రారంభించారు. బాలుర విభాగంలో మధు సురేంద్ర, ఉమర్‌బాషా, హర్షవర్ధన్, జస్వంత్‌రామ్, చరణ్‌రెడ్డి, ఓంకార్, నందకిషోర్, లోహిత్, బాలికల విభాగంలో రక్షిత, షేక్ ఐమామ్, అక్షయ, పరిమళ, రాధ, తనూష, శ్రుతి, సోనాక్షి గెలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు

అంచులకెళ్తే.. ముంచుతుంది

నగరంలోని బిర్లాగేట్ నుంచి పోస్టాఫీసు మీదుగా జడ్జి కార్యాలయం వరకు సీసీ రహదారి నిర్మించారు. క్లస్టర్ యూనివర్సిటీ, పోలీస్ అతిథిగృహం ఎదురుగా పైపులైన్ల వాల్వ్‌లకు సంబంధించిన గుంతల వద్ద ఐదడుగుల మేర రోడ్డు వేయకుండా వదిలేశారు. దీంతో ఇక్కడ అడుగు లోతు గుంతలు ఉన్నాయి. ఇక్కడ హెచ్చరిక బోర్డు కూడా లేదు. వాహనదారులు రోడ్డు అంచులకు వెళ్తే ప్రమాదాలు జరిగే ఆస్కారముంది.– న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

పీఎంశ్రీని పకడ్బందీగా అమలు చేయాలి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : విద్యార్థులను సంపూర్ణంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పీఎంశ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పీఎంశ్రీ పథకం కేంద్ర నోడల్ అధికారిణి డాక్టర్ ఇషిత గంగూలి త్రిపాఠి సూచించారు. ఓర్వకల్లులోని ఆదర్శ పాఠశాలను మంగళవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. పీఎంశ్రీ పథకం అమలును పరిశీలించారు. వసతులు, సైన్సు ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, దస్త్రాలను చూశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జీసీడీవోలు స్నేహలత, జయలక్ష్మి, డీఈవో సుధాకర్, ఏపీసీ లోకరాజు, సీఎంవో ధనరాజ్, ఎంఈవో ఓంకార్‌యాదవ్, ప్రిన్సిపల్ జోషిలావాట్స్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

నాణ్యమైన విద్య అందించండి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐఈఎస్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఇషితా గంగూలి త్రిపాఠి సూచించారు. నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాన్ని, ఓర్వకల్లులోని ఆదర్శ పాఠశాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. అనంతరం సైన్స్ లాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ఇన్నోవేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను పరిశీలించారు.

రేపటి నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈనెల 26 నుంచి మార్చి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కర్నూలు పార్లమెంటరీ ఉద్యమి సభ్యత్వ పర్యవేక్షకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, నాయకుడు సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గానికి 70 నుంచి వంద మంది సాధకులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వారు ప్రతి కార్యకర్తకు ఉద్యమి సభ్యత్వం కల్పిస్తారని తెలిపారు.

మాట్లాడుతున్న సురేష్‌బాబు, చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రమాద ఘటనలపై న్యాయమూర్తి విచారణ

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : నగరంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో విద్యార్థులు గాయపడిన ఘటనలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి మంగళవారం విచారణ చేపట్టారు. బండిమెట్ట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంపై ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని షేక్ హీనాను పరామర్శించారు. స్థానిక నారాయణ హైస్కూలును సందర్శించి సీలింగ్ ఫ్యాను ఊడిపడి విద్యార్థి గాయపడిన ఘటనపై ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించారు. గాయపడిన సాయిచరణ్‌ను పరామర్శించారు. న్యాయ సేవలపై అవగాహన కల్పించారు.

విద్యార్థినితో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

హనుమత్ వాహనంపై రంగనాథుడి విహారం

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : నగర శివారులోని గోదా గోకుల క్షేత్రంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రంగనాథస్వామిని ఉదయం హనుమత్ వాహనం, రాత్రి గరుడ వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

హనుమత్ వాహనంపై దర్శనమిచ్చిన రంగనాథుడు

గోశాల కేంద్రంలో గీతా యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గీతా యజ్ఞం

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : నగరంలోని పార్కురోడ్డులో ఉన్న గోశాల కేంద్రంలో గీతా స్వాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గీతాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోమాతలకు పూజలు చేశారు. తులాభారం, 701 భగవద్గీత శ్లోకాల పఠనం జరిగింది. గీతా స్వాధ్యాయ సంస్థ నిర్వాహకురాలు సౌజన్య మాట్లాడుతూ మానవులంతా సంతోషంగా ఉండాలని యజ్ఞాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు, మహిళా సేవాదల్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ పెంపుతో బీసీలకు న్యాయం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : వెనుకబడిన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమని నాయీ బ్రాహ్మణ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బి.క్యాంపులోని బీసీ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఉన్న 33 శాతం రిజర్వేషన్‌ను గత వైకాపా ప్రభుత్వం 24 శాతానికి కుదించి అన్యాయం చేసిందన్నారు. బీసీ సెల్ రాష్ట్ర నాయకులు రాంబాబు, కృష్ణాజీరావు, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాలకవీటి విజయకుమార్

మాట్లాడుతున్న దండువీరయ్య మాదిగ

దళితులపై దాడులు అరికట్టాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : దళితులపై దాడులను అరికట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలో దళితులు, మాదిగలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు ఉదాసీన వైఖరి విడనాడి దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ధరూర్ గోపి, నాయకులు భైరాపురం రాజు, దేవకొండ ఆంజనేయులు, రెడ్డిపోగు రాజశేఖర్, ప్రతాప్ పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఓర్వకల్లులోని ఐటీసీ పొగాకు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రైతులకు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కంపెనీకి వచ్చిన దిగుబడులను తిప్పిపంపకుండా గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకరరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రంగనాథగౌడ్, వైకాపా నాయకుడు శంకరరెడ్డి పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు న్యాయం చేయాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలో పనిచేసే ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఒప్పంద ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిబాబు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 27న నిర్వహించే ఆందోళనలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక విద్యుత్తు భవన్‌లో సోమవారం విడుదల చేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ధర్నాచౌక్ వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. కార్యక్రమానికి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నాయకురాలు బాలదర్గమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమాలు నాయకులు ఎం.గోపాల్, నగేష్, నరసింహులు, చంద్రశేఖర్, వెంకటేష్, కృష్ణవేణి, విజయ, పద్మ, మల్లేశ్వరి, సుమతి, ఆదిలక్ష్మి, కర్నూలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆయాలు పాల్గొన్నారు.

నిరసన దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక నాయకుడు బి.ఆరిఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ సహకార ఉద్యోగులు స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన దీక్షలు మంగళవారం 8వ రోజూ కొనసాగాయి. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఖాజామొహిద్దీన్, మహేంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న సహకార ఉద్యోగులు

ఆర్టీసీ స్థలాలు ప్రైవేటుపరం చేయడం తగదు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ఆర్టీసీ స్థలాలను ప్రైవేటుపరం చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ డిమాండ్ చేశారు. స్థానిక కర్నూలు-1, 2 డిపోల వద్ద మంగళవారం సంఘం నాయకులు, ఉద్యోగులు ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ-బస్సులను ఆర్టీసీ సంస్థనే నిర్వహించాలని కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పీఏ వలి, 1, 2 డిపోల కార్యదర్శులు ఇసాక్, ఫక్రుద్దీన్, జిల్లా ఛైర్మన్ రవీంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు

న్యాయం చేయకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కౌలు రైతుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని కౌలు రైతుల సంఘం నాయకులు కృష్ణ, రామకృష్ణ, వెంకటేష్, వీరశేఖర్, నారాయణ హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ చేపట్టిన 30 గంటల దీక్ష మంగళవారం కూడా కొనసాగింది. నాయకులు దస్తగిరి బాషా, సూర్యనారాయణ, రంగస్వామి పాల్గొన్నారు.

దీక్ష చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

వడ్డేగేరి.. సమస్యలతో ఉక్కిరిబిక్కిరి

వడ్డేగేరి కల్లుపెంట సమీపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చెత్త కుప్పల మధ్యనే స్థానికులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కోల్స్ చర్చి వెనకాల కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కార్మికులకు వీధుల్లో సేకరించిన చెత్తను తెచ్చి ఈ ప్రాంతాల్లో పాడేస్తున్నారు. రోజుల తరబడి ఇక్కడి నుంచి తరలించకపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని వడ్డేగేరివీధి సమస్యలకు నిలయంగా మారింది. రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. కాలువలు పూడిపోయాయి. జన సాంద్రత అధికంగా ఉండే ఈ ప్రాంతంలో అడుగడుగునా సమస్యలు తిష్టవేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● నెల రోజుల కిందట ఈ కాలనీలో సీసీ డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. కాలువలు నిర్మాణాన్ని చేపట్టిన గుత్తేదారు పనులు నత్తనడకన చేశారు. రహదారిపై మట్టి, ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెలరోజులు దాటినా వీధులను శుభ్రం చేయడం లేదు.

● ఈ ప్రాంతంలో విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులోనే ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. ఈ సమస్యలను నగరపాలక అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

● వడ్డేగేరి ప్రధాన రహదారిలో ఓ మార్గబిలం ప్రమాదకరంగా మారింది. దీనిపై ఏర్పాటు చేసిన ఇనుప చట్రం ఒకవైపు పైకిలేచి భయపడుతోంది.

నెల రోజుల కిందట మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు కాంక్రీటు వ్యర్థాలు, మట్టిని రోడ్డుపైనే కుప్పగా వేసి చేతులు దులిపేసుకున్నారు. ఇరుకు దారుల్లో మట్టి, రాళ్ల

కుప్పల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు.

వందశాతం పన్ను వసూలే లక్ష్యం

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీల్లో మార్చి 15వ తేదీ నాటికి వందశాతం పన్నులు వసూలు చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విభాగం కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. అమరావతి నుంచి మంగళవారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు డీపీవో కార్యాలయం నుంచి డీపీవో భాస్కర్, కర్నూలు డీఎల్‌పీవో లక్ష్మి, పత్తికొండ డీఎల్‌డీవో రామచంద్రరెడ్డి, ఈవోఆర్డీలు, మేజరు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. మార్చి 9 నాటికి పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : చిన్నటేకూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు నగరానికి చెందిన మహిళ మృతి చెందారు. ఉలిందకొండ ఎస్సై ధనుంజయ తెలిపిన వివరాల మేరకు.. చిన్నటేకూరు సమీపంలోని అశోక ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న భైరవి (30) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకులు గాయపడగా.. వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

(c) eenadu

ఈనాడు



ఒంగోలు 25-2-2026 బుధవారం సిటీ సంపుటి 24 సంచిక 236 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 16 | www.eenadu.net

Ongole, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Mahaboobnagar, Chennai, Bengaluru

పొదిలి డిపో బయట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

డిపో స్థలాల ప్రైవేటీకరణ తగదు

పొదిలి, న్యూస్‌టుడే: ఆర్టీసీ డిపో స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం మానుకోవాలని ఆర్టీసి పొదిలి డిపో ఎన్ఎంయూ కార్యదర్శి అలీ అన్నారు. మంగళవారం పొదిలి డిపో ఎదుట ఆ సంఘం నాయకులు ఎర్రబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెల్లూరు-2, గుంటూరు-2, విద్యాధరపురం తదితర డిపోలను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంతో అక్కడ పనిచేసే ఉద్యోగులను వేరే డిపోలకు పంపిస్తున్నారన్నారు. ఒక్కొక్క డిపోలో 400 నుంచి 500 కార్మికులు ఉన్నారన్నారు. మరో 8 డిపోలు త్వరలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే విధానం చేస్తుందన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు కొనండి ఆ బస్సులను ఆర్టీసి గ్యారేజిలోనే మెయింటెనెన్స్ పెట్టాలని కోరుతున్నామన్నారు. రూ. కోట్ల విలువైన ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తే ఊరుకోమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్టీసి మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్మికులు ఎర్రబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు, గ్యారేజి, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

కోలాహలంగా లక్ష్మీనారాయణుడి రథోత్సవం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో గల శ్రీదేవీ భూదేవీ సమేత అమలక లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి రథోత్సవ సేవ కోలాహలంగా జరిగింది. వికాస తరంగిణి మహిళల కోలాట నృత్యాలతో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో స్వామి వారి రథోత్సవం కనులపండువగా నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దేవదాయ ధర్మదాయ శాఖ - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానము

మిట్టపాలెం గ్రామం, కోవిలంపాడు పోస్టు, సి.యస్.పురం మండలం, మార్కాపురం జిల్లా.

మార్కాపురం జిల్లా, సి.యస్.పురం మండలం, కోవిలంపాడు పోస్టు, మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానములో ఈ క్రింది పేర్కొనబడిన ఐటెములు తేది. **01.04.2026** నుండి తేది. **31.03.2027** వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు లీజు హక్కులకు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ కం- సీల్డు టెండరు కం- బహిరంగ పాటలు తేది. 02.03.2026 సోమవారం ఉదయం 11.00** గం.లకు సదరు దేవస్థానము వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో కార్యనిర్వహణాధికారి వారిచే పాటలు నిర్వహించబడును. ఐటెం నెం. 1, 2లకు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ కం-సీల్డు టెండరు కం- బహిరంగ పాటలు** జరుగును. అదేవిధముగా ఐటెం నెం. 3 నుండి 13 వరకు **సీల్డు టెండరు కం-బహిరంగ పాటలు జరుగును.** సీల్డు టెండర్లు పాల్గొనువారు **తేది. 02.03.2026 సోమవారం ఉదయం 10.00 గం.లోపల దేవస్థానము వద్దకు వచ్చి ఇవ్వవలెను.** మిగిలిన వేలంపాట షరతులు కార్యనిర్వహణాధికారి కార్యాలయములో అడిగి తెలుసుకొనవచ్చును. ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు www.apeprocurement.gov.in endowments department marketing నందు చూడగలరు.

ప.నెం.	ఐటెము పేరు	డిపాజిట్
1.	తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కు	రూ. 10,00,000/-
2.	కొబ్బరికాయలు, పూజాద్రవ్యములు, పండ్లు, పూలు అమ్ముకొను హక్కు	రూ. 5,00,000/-
3.	ఫ్యాన్సీ ఐటమ్స్ అమ్ముకొను హక్కు	రూ. 3,00,000/-
4.	వాహన పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను హక్కు	రూ. 3,00,000/-
5.	కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొను హక్కు	రూ. 3,00,000/-
6.	కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ అమ్ముకొను హక్కు	రూ. 1,00,000/-
7.	గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకొను లైసెన్సు హక్కు	రూ. 1,00,000/-
8.	ఫలహారశాల నడుపుకొను, మిఠాయిలు అమ్ముకొను హక్కు	రూ. 1,00,000/-
9.	గాజులు అమ్ముకొను హక్కు	రూ. 1,00,000/-
10.	చిల్లర సరుకులు అమ్ముకొను హక్కు	రూ. 1,00,000/-
11.	పడి బియ్యం ప్రోగు చేసుకొను హక్కు	రూ. 50,000/-
12.	భక్తుల పాదరక్షలు భద్రపరుచుకొను హక్కు	రూ. 5,000/-
13.	గోరింటాకు అమ్ముకొను హక్కు	రూ. 5,000/-

గమనిక:- షాపులను దేవస్థానము వారు కేటాయించిన స్థలములో మాత్రమే పెట్టుకొనవలెను.

శ్రీస్వామివారి సేవలో వ్యవస్థాపక ధర్మకర్త | మిట్టపాలెం, తేదీ:-21.02.2026 | శ్రీస్వామివారి సేవలో కార్యనిర్వహణాధికారి

यूनियन बैंक ऑफ़ इंडिया Union Bank of India A Government of India Undertaking

ఒంగోలు మెయిన్ బ్రాంచ్ -2

డోర్.నెం. 337-1-350, ట్రంక్‌రోడ్, ఒంగోలు, ఫోన్ : 08592-233033, 280067, ఇ మెయిల్ :ubin0804002@unionbankofindia.bank.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ... [illegible]

రిజర్వ్ ధర: రూ.4,55,00,000/- | ధరావత్తు రిజర్వ్ ధరలో 10% : రూ.45,50,000/- | బిడ్ పెంపుదల మొత్తం: రూ.4,55,000/-

[illegible]

రిజర్వ్ ధర: రూ.49,26,000/- | ధరావత్తు రిజర్వ్ ధరలో 10% : రూ.4,92,600/- | బిడ్ పెంపుదల మొత్తం: రూ.49,260/-

ఈ- వేలం తేదీ మరియు సమయం : 13.03.2026, మధ్యాహ్నం 12.00 గం॥ల నుండి 5.00 గం॥ల వరకు

[illegible] https://baanknet.com [illegible] www.unionbankofindia.co.in [illegible] website BAANKNET@psballiance.com [illegible] ubin0804002@unionbankofindia.bank.in [illegible]

[illegible]

ప్రదేశం : ఒంగోలు, తేది : 20.02.2026 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒంగోలు మెయిన్ బ్రాంచ్ - 2

సీఎం సారూ.. మమ్మల్ని పట్టించుకోండి!

☛ వెలిగొండ నిర్వాసితుల వినతి

న్యూస్‌టుడే, మార్కాపురం:

ఉమ్మడి ప్రకాశం పరిధిలోని వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు బుధవారం (నేడు) సీఎం చంద్రబాబు నాయుడు వస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు తమ గోడు వినాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

మూడు దశాబ్దాలుగా హడావుడితో సరి

మూడు దశాబ్దాలుగా సీఎంలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో పర్యటించి హడావిడి చేశారేగానీ నిర్వాసితులకు ఏమీ చేయలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం కోసం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్ఐలు, వీఆర్వోలు ఇలా ప్రతి ఒక్క అధికారిని 30 బృందాలుగా విభజన చేసి విచారణ కమిటీలుగా వేశారు. అధికారులు ముంపు ప్రాంతాల్లో తిరిగారు. కానీ కనీసం వంద మందికి కూడా పరిహారం ఇవ్వలేదని వాపోతున్నారు.

ఇవే ముంపు గ్రామాలు..

మార్కాపురం జిల్లాలో ముంపు గ్రామాలైన మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతండా, పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, కాటం రాజు తండా, చింతలముడిపి, అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, కృష్ణనగర్, సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం తదితర గ్రామాలు.

● వెలిగొండ ప్రాజెక్టులో ముంపు గ్రామాలైన 11లో పరిహారం కోసం ఇంకా 7,200 మంది నిరీక్షిస్తున్నారు. ప్రాజెక్టులో నిర్వాసితులకు కీలకమైనది పునరావాసం. మొత్తం ఏడు పునరావాస కేంద్రాల్లో అయిదు మాత్రమే పూర్తి చేశారు.



వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామం గొట్టిపడియ

సౌకర్యాలు కల్పిస్తేనే వెళ్లేది

ఇప్పటికి ఇప్పుడు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం తీసుకుని పశువులతో పాటు పిల్లలు, అందరూ ఏ ఊరికి వెళ్లాలి. పునరావాసంలో ఇల్లు నిర్మాణం చేసి, కాలనీలో సౌకర్యాలు కల్పించిన తర్వాతనే బయటకు వెళ్లిపోతాం.
- పుప్పాల గాలెయ్య, నిర్వాసితుడు, గొట్టిపడియ

అయిదు నెలల సమయం ఇవ్వాలి

పునరావాసం కల్పించే కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాత ఇల్లు నిర్మాణం చేసుకోవడానికి కనీసం అయిదు నెలల సమయం ఇవ్వాలి. ప్రభుత్వం నిర్వాసితుల పట్ల ఆలోచన చేసి మంచి నిర్ణయం తీసుకోవాలి.
- పి.శ్రీనివాసులు, నిర్వాసితుడు, గొట్టిపడియ

చట్టాలను ఎవరూ అతిక్రమించొద్దు

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం సబ్ జైలును మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్ అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టాలను ఎవరూ అతిక్రమించకూడదన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఖైదీలకు ఉచిత న్యాయం, బెయిల్ పొందడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం. అన్వర్, షేక్ జహీర్ సలీమ్, సబ్ జైలు పర్యవేక్షణాధికారి ఎం. విజయ్‌కుమార్, పి.ఎల్.వి. షేక్ బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం ఆర్డీవోగా పెంచల ప్రభాకర్ నియామకం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా పెంచల ప్రభాకర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాకర్ ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలో పౌరసరఫరాల జిల్లా మేనేజరుగా చేస్తున్నారు. ప్రస్తుతం మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్‌గా కంభం వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వుల్లో మార్కాపురం సబ్ కలెక్టర్ పోస్టును మార్పు చేస్తూ మళ్లీ ఆర్డీవోగా ప్రభాకర్‌ను నియమించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి మార్కాపురంలో రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) పోస్టు ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన చేసిన సమయంలో మార్కాపురంను జిల్లా చేయకుండా మార్కాపురం ఆర్డీవో పోస్టును సబ్ కలెక్టర్‌గా అప్‌గ్రేడ్‌గా మార్పు చేసింది. దీంతో 2022 అక్టోబర్ 13వ తేదీ నుంచి మార్కాపురం సబ్ కలెక్టర్‌గా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కాపురంను జిల్లా చేశారు. తాజాగా ప్రభుత్వం మార్కాపురానికి ఆర్డీవో పోస్టును కేటాయించింది.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

నాయకులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ కోరారు. ఈ నెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం [illegible] రాత్రి స్థానిక రవిప్రియ మాల్‌లో ముఖ్య నాయకులు, క్రియాశీలక సభ్యత్వ సాధకులతో సమావేశమయ్యారు. ప్రకాశం జిల్లా పరిశీలకుడిగా ఎమ్మెల్యే కొణతల రామకృష్ణను నియమించారని, త్వరలోనే ఆయన జిల్లాకు వచ్చి కార్యక్రమాలను సమీక్షిస్తారన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కంది రవిశంకర్, పర్వతరెడ్డి కిషోర్, నగర ఉపాధ్యక్షుడు పిల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శి పల్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి ఇంటి పన్ను వసూలు చేయాల్సిందే

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మార్చి 15వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీఎల్‌డీవో సువార్త సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని డీఎల్‌పీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ అభివృద్ధి అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజువారీ పన్నుల వసూళ్ల పురోగతిని డిప్యూటీ ఎంపీడీవోలు సమీక్షించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన పీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎల్‌పీవోలు పద్మ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత అమరావతి నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ జిల్లాలోని అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఆందోళన

ఒంగోలు కలెక్టరేట్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్ నుంచి చర్చి సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ.. పీజీ విద్యార్థులకు ఉపకార వేతనాలను దూరం చేసే జీవో నం.77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 4,200 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం, ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలో మౌలిక వసతుల కల్పన నిమిత్తం నిధులు కేటాయించాలన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారంతోపాటు, ఫీజు బకాయిలు చెల్లించకుంటే త్వరలోనే సీఎం చంద్రబాబునాయుడి ఇంటిని ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వి.కోటి, బెంజిమెన్, వెంకటేష్, తిరుమలరావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలని డిమాండు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగర పరిధిలో నిలిచిపోయిన టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. కొప్పోలు గ్రామ సమీపంలోని టిడ్కో గృహ సముదాయాలను మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు, నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2018లో తెదేపా ప్రభుత్వం ప్రారంభించిన టిడ్కో ప్రాజెక్ట్‌ను ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే ఇళ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి, రెండేళ్లుగా జాప్యం చేస్తూ లబ్ధిదారులను మోసగిస్తుందని ఆరోపించారు. గృహాలు పూర్తి కాకుండా స్వాధీనం చేయకముందే లబ్ధిదారులు వడ్డీ భారం మోయాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, ఎస్డీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, నాయకులు

ఆర్టీసీ డిపోలను ప్రైవేటు పరం చేస్తే ఉద్యమం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఒంగోలు డిపో గ్యారేజీ గేటు వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ ఒంగోలు డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో జిల్లా కార్యదర్శి ఆర్.అంజయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశ పెడుతూ డిపోలను ప్రైవేటు వారికి అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.క్రిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ధర్నాలో ఎన్‌వీఎస్.కుమార్, షాహిద్, బాషా, క్రిష్టా, కార్మికులు పాల్గొన్నారు.

ఒంగోలు డిపో గ్యారేజీ గేటు వద్ద ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ సభ్యులు, కార్మికులు

మిగులు ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా ఉన్న 165 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్వత స్థానాలు కేటాయించాలని ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘం టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, ప్రభాకరరెడ్డి కోరారు. జీవో నంబర్ ఒకటి ప్రకారం మిగులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సెలింగ్ జరపనందున విద్యార్థులు తగినంతమంది లేని పాఠశాలల్లో పనిలేకుండా కొనసాగాల్సి వస్తుందన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 127, రిటైల్ లైవ్ - 154, చికెన్ విత్ స్కిన్ - 223, చికెన్ స్కిన్‌లెస్- 254

26న వీర బ్రహ్మేంద్ర మఠాధిపతి పట్టాభిషేకం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: కడప జిల్లా కంది మల్లయ్య పల్లె శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం 8వ తరం 12వ మఠాధిపతిగా వీరధర్మజ వెంకటాద్రిస్వాముల వారి పట్టాభిషేకం మహోత్సవం ఈ నెల 26న జరుగనుంది. ఈ కార్యక్రమానికి బ్రహ్మంగారి భక్తులు తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తులూరి మల్లికార్జున చారి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం ప్రాంతం నుంచి ఎక్కువ సంఖ్యలో కందిమల్లయ్యపల్లె కు తరలి రావాలని కోరారు. ఆ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

పెద్దారవీడు, న్యూస్‌టుడే: ఎస్సీలు రుణాలను తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దేవరాజుగట్టులో తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మార్కాపురం జిల్లా చేశారని, వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలనే ఆకాంక్షతో నిధులు విడుదల చేసి, పనులను చేస్తున్నారని అన్నారు. ముంపు ప్రాంతంలోని నిర్వాసితులకు కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. త్వరలోనే ఎస్సీ కార్పొరేషన్ నుంచి నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, నక్కా శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యార్డు నిధులు కేటాయించేందుకు కృషి

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారనీ.. దానిలో భాగంగానే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు అన్నారు. నేడు మార్కాపురంలో జరిగే సీఎం బహిరంగ సభ ఏర్పాట్లుపై పరిశీలకులుగా వచ్చిన ఆయన వై.పాలెంలోని తెదేపా కార్యాలయంలో మాట్లాడారు. ఎండు మిరప ధరలు ఆశాజనకంగా ఉన్నాయనీ, ఈప్రాంత అభివృద్ధికి యార్డు నిధులు కేటాయించేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా, సభకు వస్తామనడం సంతోషంగా ఉందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి మరో చారిత్రక ఘట్టానికి నాంది పలుకుతామని ఘంటాపథంగా చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, కన్వీనర్ వెంగళరెడ్డి, మంత్రునాయక్, వేగినాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మిర్చియార్డు ఛైర్మన్ అప్పారావు

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి మృతి

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: లారీ..ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన త్రిపురాంతకం మండలం ముడివేముల బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్త అన్నసముద్రం గ్రామానికి చెందిన పి.ఆంజనేయులు (47) ద్విచక్ర వాహనంపై వినుకొండ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముడివేముల బస్టాండ్ సమీపంలోకి రాగానే ముడివేముల గ్రామంలోకి వెళ్లే లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆంజనేయులు.. తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఇక తమకు దిక్కెవరంటూ మృతుడి కుటుంబ సభ్యులు బోరున విలపించడం స్థానికులకు కలచివేసింది.

ఆంజనేయులు

ఉల్లి పాయల వ్యాన్ బోల్తా

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఉల్లిపాయల లోడుతో అతి వేగంగా వెళుతున్న వ్యాన్ బోల్తా పడిన సంఘటన సోమవారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి ఒంగోలు వైపు ఉల్లిపాయల లోడుతో వెళుతున్న ఈ వాహనం మద్దిపాడు వంతెనపై అదుపు తప్పింది. వాహన చోదకుడికి ఎటు వంటి గాయాలు కాలేదు. ఉల్లిపాయల బస్తాలు చెల్లాచెదురుగా రహదారిపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు, హైవే సిబ్బంది స్పందించి వెంటనే ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

ఆచార్యనాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం నిర్వహిస్తున్న M.Sc (అన్నికోర్సులు), M.A (అన్నికోర్సులు) MBA, MCA, M.Com, MLiSc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. గీతం డిగ్రీకాలేజి, ఒంగోలు. సెల్: 9849124970, 9030568558.

REAL ESTATE

FLAT FOR SALE

B.K ఎన్‌క్లేవ్ ఎన్‌క్లేవ్ (గేటెడ్‌కమ్యూనిటీ), రాంనగర్, ఒంగోలులో 3-BHK ఫ్లాట్, 1705Sft. NEకార్నర్ అమ్మకమునకు కలదు. సంప్ర: 99499 11577.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500 Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

SITUATION VACANT 1. STAFF NURSE (MALE&FEMALE) with Experience in OP/WARD/ICU/OT/NIGHT Duties. 2. Receptionist: Degree with Exp. 3. Security Staff/Watch Man. Cont: 94916 66047, 94409 42757.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు స్త్రీలు మరియు పురుషులు కావలెను. జీతం: 10000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజన వసతి కల్పించబడును). విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సం||లపైన ఉండవలెను. వివరాలకు సంప్ర||. ఫోన్ నెం: 90593 22491.

Tally అకౌంటెంట్ బిల్లింగ్ పర్సన్ (ఒంగోలు టౌన్‌లో చేయుటకు) కావలెను. ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722

హౌస్‌కీపింగ్ స్టాఫ్ కావలెను. ఒంగోలు ప్రముఖ జ్యూవెలర్ మాల్‌లో పనిచేయుటకు. జీతం: 9500/-. డ్యూటీ 8 గం., 4 వీక్ ఆఫ్స్. ✆ 7285963951, 9392272725.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను: ఒంగోలు అద్దంకి బస్టాండ్ ఏరియాలో పనిచేయుటకు. జీతం: 14000/-, ఇతర సదుపాయాలు కలవు. ✆ 7285963951, 9392272725

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

చంద్రన్న ఆగమనం... ప్రజల్లో ఆనందం!

- కొత్త జిల్లాపై వరాలు కురిపిస్తారని గంపెడాశలు

న్యూస్‌టుడే, మార్కాపురం, పెద్దదోర్నాల

మార్కాపురం కేంద్రం ఆవిర్భవించిన కొత్త జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలిసారిగా బుధవారం పర్యటించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లాకు ప్రత్యేక నిధులతోపాటు వరాల జల్లు కురిపిస్తారని జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. తొలుత పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద సొరంగాలను సీఎం పరిశీలిస్తారు. అనంతరం గంటవానిపల్లె గ్రామసమీపంలో రూ.450 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడరు కాలువ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటల మార్కాపురం చేరుకుని మార్కాపురం- తర్లుపాడు రహదారిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం తిరిగి సాయంత్రం 4.40 గంటలకు హెలీకాప్టరులో ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. పర్యటనలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడర్ కాలువ, బహిరంగ సభ వద్ద ఏర్పాట్లను మంగళవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజా బాబు, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు ముత్తమల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తెదేపా వైపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, వెలిగొండ ప్రాజెక్టు సీఈ రమేష్, ఎస్ఈ అబూతాలీం, జేసీ కల్పనాకుమారి, కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ తదితరులు పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాజీ మంత్రులు దేవినేని ఉమ, ఉండవల్లి శ్రీదేవి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

మార్కాపురంలో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి,ముత్తుముల అశోక్‌రెడ్డి, తదితరులు

ఫీడరు కాలువ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు, అధికారులు

పూర్తయిన ఏర్పాట్లు

ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు జిల్లాకు చెందిన అధికారులు రెండు రోజులుగా సర్వం సిద్ధం చేశారు. సీఎం బహిరంగ సభావేదిక ముందు భారీ సంఖ్యలో ప్రజలు కూర్చునే విధంగా వేదికను రౌండుగా నిర్మాణం చేశారు. వేదిక ముందు నుంచి 150 అడుగుల మేర ర్యాంపు నిర్మాణం చేశారు. దీనిపై నుంచి సీఎం ప్రజలకు అభివాదం చేయనున్నారు. మహిళలు, సాధారణ ప్రజలు, వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు ఏర్పాటు చేశారు. దూరంగా కూర్చున్న ప్రజలు వీక్షించేందుకు వీలుగా భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, భోజన వసతితో పాటు మొబైల్ మరుగుదొడ్లు సిద్ధం చేశారు.

పటిష్ఠ పోలీసు బందోబస్తు

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ మేరకు ఇద్దరు ఏఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 90 మంది ఎస్.ఐ.లతో పాటు 1,167 మంది పోలీసు సిబ్బందితో భద్రత ఉంటుందన్నారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలు, అధికారులు ఎంపిక చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను పార్క్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. సాధారణ ప్రజల వాహనాలు ఎల్.వి.ప్రసాద్ వైద్యశాలకు ఉత్తర వైపు, వైద్యశాల ఎదురుగాన్న ఖాళీ స్థలంలో, ప్రభుత్వ అధికారుల వాహనాలు సాయిబాలాజీ పాఠశాల ఉత్తర వైపు, వీఐపీ వాహనాలు సాయిబాలాజీ పాఠశాల దక్షిణ వైపు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే పార్క్ చేసుకోవాలన్నారు. సీఎం ప్రయాణించే హెలీకాప్టర్‌తో మంగళవారం సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడరు కాలువ కట్టపై ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌పై హెలీకాప్టర్ దిగి అక్కడ నుంచి మార్కాపురం వెళ్లింది.

పది పూర్తయితే పక్క జిల్లాలకే..!

- జిల్లా కేంద్రంలో ఏర్పాటుకాని జూనియర్, డిగ్రీ కళాశాలలు
- ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని ప్రజల వినతి

జిల్లా కేంద్రం మార్కాపురం పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం గమనార్హం. కొత్త జిల్లాకు బుధవారం తొలిసారిగా వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి కళాశాలల ఆవశ్యకతను ప్రజాప్రతినిధులు తీసుకెళ్లాలని జిల్లా వాసులు కోరుతున్నారు. పదోతరగతి అనంతరం పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్థోమత లేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇక్కడ ప్రైవేటు కళాశాలల్లో చదువుకునేందుకు అవకాశం లేక చాలామంది పదో తరగతితోనే చదువు ఆపేస్తున్నారు. చదువులో చక్కగా రాణిస్తున్న బాలికలు సైతం ప్రభుత్వ కళాశాల అందుబాటులో లేక ఉన్నత విద్య గురించి ఆలోచించే పరిస్థితి ఉండడంలేదు. బడి చదువు పూర్తయిన వెంటనే పెళ్లి చేసేస్తే బాధ్యత తీరిపోతుందని భావించి చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసేస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక బాల్య వివాహాలు సైతం ఇక్కడే జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఉన్న కళాశాలలూ కనుమరుగు: ఇక్కడ ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాలలు సైతం గత వైకాపా ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ప్రైవేటు కళాశాలలుగా మారి పోయాయి. ఇక్కడ 10 ప్రైవేటు జూనియర్, 7 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. మొత్తం అన్ని ప్రైవేటు కళాశాలల్లో సుమారు 10 వేల మంది చదువుతున్నారు. జిల్లాకు మారు మూలగా ఉన్న యర్రగొండపాలెంలోనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉండగా, పురపాలక సంఘం, కొత్తగా జిల్లా కేంద్రంగా మారిన మార్కాపురంలో మాత్రం ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలు లేకపోవడం ఇక్కడ నాయకుల అలసత్వానికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో సమస్యను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

- ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, మార్కాపురం

వన్య ప్రాణుల సంరక్షణకు పెద్దపీట

- వేసవిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు
- 'న్యూస్‌టుడే'తో అటవీ శాఖ డీడీ నిషా కుమారి

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

జిల్లాలోని గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డివిజన్ పరిధిలో వేసవిలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో తెలిపారు. వేసవి సమీపిస్తుండడంతో అటవీ ప్రాంతంలో తరచూ అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో సమీప అటవీ ప్రాంతాల ప్రజలకు ప్రమాదాల నివారణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భూగర్భ జలాల సంరక్షణ చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా చెక్‌డ్యాంలు, చిన్నచిన్న కుంటల నిర్మాణం చేపట్టామని వివరించారు.

ట్రాప్ కెమెరాల ఏర్పాటు

గిద్దలూరు టైగర్ ప్రాజెక్టు డివిజన్ పరిధిలో పులుల గణనకు ఈ నెల 20వ తేదీ నుంచి ట్రాప్ కెమెరాలు అమర్చాం. వీటిని 40 రోజుల పాటు నిత్యం సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. వీటిల్లోని చిత్రాలు, సమాచారం ఎన్‌టీసీఏకు పంపిస్తాం. అక్కడ పరిశీలించి పులుల గణనను ప్రకటిస్తారు. ఇది నిరంతర ప్రక్రియగా చేపడుతున్నాం.

అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ వాచర్లను నియమించాం. మంటలు వ్యాపించకుండా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశాం. అగ్ని ప్రమాదాల సమయంలో ఫారెస్ట్ ఫైర్ మానటరింగ్ సిస్టం ద్వారా అధికారుల నుంచి సిబ్బంది వరకు సమాచారం వస్తుందని, వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయం

అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు నీరు తాగేందుకు వీలుగా సాసర్ పిట్ల నిర్మాణం చేపట్టాం. సమీపంలో డీప్‌బోర్లు వేసి సౌర ఫలకాలతో పనిచేసేవిధంగా మోటార్లు ఏర్పాటు చేశాం. ట్యాంకర్లతో నీటిని తరలించి కుంటలను నింపుతున్నాం.

అందుబాటులోకి వనవిహారి

గిద్దలూరు మండలం దిగువమెట్టలో వనవిహారిని అందుబాటులోకి తీసుకొచ్చాం. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు సౌకర్యాలు కల్పించాం. అడవుల ప్రాధాన్యం, వృక్షాలు, వన్యప్రాణుల వివరాలను తెలియజేసేందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. వనవిహారిని సందర్శించినవారికి జంగిల్ సఫారీని త్వరలో అందుబాటులోకి తీసుకు రానున్నాం.

పాలు... పాపాలు!

- కుటీర పరిశ్రమగా మారిన కల్తీ వ్యాపారం
- అక్రమార్కులతో ప్రమాదంలో ప్రజారోగ్యం

ఉమ్మడి ప్రకాశం జిల్లా సంతమాగులూరు, అద్దంకి, దర్శి, ముండ్లమూరు తదితర మండలాల్లో కల్తీ పాలను కుటీర పరిశ్రమలా ఇళ్లల్లోనే తయారు చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. రాజమహేంద్రవరంలో పలువురు మృతి చెందిన నేపథ్యంలో కల్తీ పాలను కట్టడికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

-ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, దర్శి, సంతమాగులూరు, అద్దంకి, తాళ్లూరు

ఇటీవల అద్దంకిలో కల్తీ పాలు తయారు చేస్తున్న దంపతులను పట్టుకున్న పోలీసులు

సంతమాగులూరు మండలం ఏల్చూరులో ఓ పాల కేంద్రం నిర్వాహకుడిపై గతంలో కేసు నమోదైనప్పటికీ ఇప్పటికీ కల్తీ పాల వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇటీవల జరిగిన దాడుల్లో కేసు నమోదు చేసినా ఎలాంటి మార్పు రాలేదు. అద్దంకిలో దంపతులు ఇంట్లోనే కృత్రిమ పాలు తయారు చేయడంపై గతంలో కేసు నమోదు కావడంతోపాటు ఇటీవల జరిగిన దాడుల్లో పట్టుబడినా కల్తీ పాల వ్యాపారం మాత్రం మానలేదు. కేసులు నమోదు చేసి వదిలేయడం తప్ప ఎలాంటి శిక్షలు లేకపోవడంతో అక్ర మార్కులు చెలరేగిపోతున్నారు. ఇళ్లల్లోనే కల్తీ పాలను తయారు చేసి ప్రజారోగ్యాన్ని గుల్ల చేస్తున్నారు. దీనిని పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం దాడులతో సరిపుచ్చడంతో వీరి వ్యాపారానికి అడ్డే లేకుండా పోయింది. అధికారులు ఎవరైనా దాడులకు వస్తున్నారని తెలిస్తే నిమిషాల వ్యవధిలోనే అక్రమార్కులకు సమాచారం అందుతోంది. వెంటనే తమ వద్ద ఉన్న కల్తీ పాలను పారబోస్తున్నారు. దాడుల నుంచి తప్పించుకోవడానికి ఏ స్థాయిలో వీళ్ల నెట్‌వర్క్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

పాల శీతలీకరణ కేంద్రాలే కీలకం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 50 వరకు పాల శీతలీకరణ కేంద్రాలను నడుపుతున్నారు. వీటిలో చాలావాటికి అనుమతుల్లేవు. ఇక్కడకు ఎవరెవరు ఎన్ని లీటర్ల మేర పాలు తీసుకొస్తున్నారు.? వారికి ఉన్న పశువులున్నాయి? తదితర వివరాలు ఆరా తీస్తే సులువుగా కల్తీకి అడ్డుకట్ట వేయవచ్చు. ఈ దిశగా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నెమ్మదిగా దేహం గుల్ల

యూరియా, పామాయిల్, క్రీమ్, డిటర్జెంట్ పౌడర్లు వినియోగిస్తూ కల్తీ పాలను తయారు చేస్తున్నారు. ఇవి రోజు తీసుకుంటే ఉదరకోశ వ్యాధుల బారిన పడతామే కాకుండా ప్రత్యుత్పత్తి వ్యవస్థ దెబ్బతిని పిల్లలు పుట్టే అవకాశం కోల్పోతామని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎవరైనా సరే నాలుకపై ఒక చుక్క పాలు పోసుకుని రుచి చూస్తే ఉప్పగా గానీ, వగరుగా గానీ అనిపిస్తే కల్తీ జరిగినట్లు అనుమానించాలి. [illegible] డాక్టర్ రవి పేర్కొన్నారు.

ఉక్కుపాదం మోపుతాం

రెండు నెలల వ్యవధిలో ముగ్గురిపై కేసులు నమోదు చేశాం. పాల శీతలీకరణ కేంద్రాలపై దృష్టిసారించాం. ఎంతమంది పాలు పోస్తున్నారో దానిపై జాబితా కోరాం. ఇళ్లల్లో తయారయ్యే కల్తీ పాల విషయమై ప్రభుత్వ శాఖలతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహిస్తాం. కల్తీకి పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతాం. - వేణుగోపాలరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధ సా.6-23

సహరీ : గురు ఉ.5-09

పోలేరమ్మకు ప్రణామం

మార్కాపురం గ్రామదేవత శ్రీ పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పొంగళ్ల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. -న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఒంగోలు నగరం, మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మంగళవారం సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 67 కేంద్రాల్లో తొలిరోజు జనరల్ కోర్సుల్లో 17,807 మంది విద్యార్థులకు 17,231 మంది, ఒకేషనల్ కోర్సులో 1,586 మందికి 1,488 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒంగోలు నగరంలోని ఆరు కేంద్రాలను ఆర్ఐవో కె.ఆంజనేయులు తనిఖీ చేయగా, 32 కేంద్రాలు స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణతో చూసిరాతలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో తెలిపారు.

చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

చిరుత సంచారంపై భయాందోళన

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సీఎస్‌పురం మండలం డీజీపేట-తుంగూడు ఘాట్ రోడ్డులో చిరుతపులి సంచారంతో స్థానికులు, వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. కనిగిరి ఎఫ్ఆర్‌వో తుమ్మా ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎస్‌పురం మండలం తుంగూడు, వెంకటాయచెరువు, బొంతవారిపల్లి, చెన్నపునాయునిపల్లి, మైలుచర్ల తదితర అటవీ ప్రాంతాల్లో చిరుతపులులు సంచరిస్తున్నట్లు తాము ఏర్పాటుచేసిన కెమెరాల ద్వారా తేలిందన్నారు. పశువులు, గొర్రెల కాపరులు అడవుల్లోకి వెళ్ల రాదని సూచించారు. తుంగూడు ఘాట్ రహదారిలో సాధ్యమైనంతవరకు రాత్రి వేళల్లో ప్రయాణించవద్దని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు.



చెన్నపునాయునిపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత పులి

మరో డీఎస్సీకి సిద్ధం!

- ముందుగా రేషనలైజేషన్, ఉద్యోగోన్నతులకు ఏర్పాట్లు
- నేడు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి మరో డీఎస్సీ ప్రకటించి నియామకాలు జరపాలని నిర్ణయించి కసరత్తు చేస్తోంది. అన్ని జిల్లాల నుంచి ప్రస్తుతమున్న ఖాళీలతోపాటు రానున్న మే, జూన్ నాటికి ఉద్యోగ విరమణ ఖాళీలను కేటగిరీ వారీగా సేకరిస్తున్నారు. ఆ మేరకు ప్రకాశం, మార్కాపురం జిల్లాల ఎంఈవోల నుంచి సమాచారం సేకరించారు. ఆ వివరాలు మదించి డైరెక్టర్ కార్యాలయానికి పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి డీఎస్సీ ద్వారా జిల్లాలో 680 పోస్టులను భర్తీ చేశారు. ఏటా డీఎస్సీ జరుపుతామని విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ప్రకటించిన విషయం తెలిసిందే. గత డీఎస్సీలో ఎస్‌జీటీ పోస్టులు కేవలం జిల్లాకు 93 మాత్రమే మంజూరు కాగా, ఈ సారి ఆ కేటగిరీ పోస్టులు సంఖ్య పెరుగుతుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

పశ్చిమాన ఉపాధ్యాయుల కొరత

మార్కాపురం జిల్లా పరిధిలోని మండలాల్లో ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. ఈ సారి ఆ జిల్లాను యూనిట్‌గా తీసుకుని పోస్టులు భర్తీ చేస్తే మారుమూల గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత తీరే అవకాశం ఉంది. త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దోర్నాల, పుల్లలచెరువు మండలాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. గతేడాది బదిలీల కౌన్సెలింగ్‌లో అన్ని ఖాళీలు చూపించడంతో పట్టణాలకు దగ్గరగా ఉన్న పోస్టులు కోరుకున్నారు. దీంతో దూర ప్రాంతాల్లోని నాలుగో కేటగిరీ పోస్టులు మిగిలిపోయాయి. డీఎస్సీలో ఎస్టీటీ పోస్టులు తక్కువగా మంజూరు కావడంతో సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. గడిచిన మూడు నెలల్లో జరిగిన ఉద్యోగ విరమణలు, రానున్న నాలుగు నెలల్లో జరిగే ఉద్యోగ విరమణలు వెరసి వందల సంఖ్యలో పోస్టులు ఖాళీ కానున్నాయి.

పక్కా జాబితాల తయారీలో...

ఈ సారి వివాదాలు, గ్రీవెన్స్, కోర్టు కేసులకు అవకాశం లేని ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను రూపొందించడానికి ఇప్పటి నుంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి ఉపాధ్యాయుని నుంచి వ్యక్తిగత సర్వీసు వివరాలు ఆన్‌లైన్ ద్వారా సేకరించారు. వారిచ్చిన వివరాలను ఆయా ఉపాధ్యాయులు ధ్రువీకరించాలి. ముందుగా రేషనలైజేషన్, అనంతరం ఉద్యోగోన్నతులు ప్రక్రియ తరువాత డీఎస్సీ నిర్వహిస్తారు. వీటన్నింటికి ఉపాధ్యాయుల వివరాలే ప్రధానం. దానిని పక్కాగా రూపొందించే పనిలో ఉన్నారు. బుధవారం తొలివిడత జాబితా ప్రకటిస్తారు. అభ్యంతరాలుంటే సరిచేసి మార్చి 15న రెండో విడత, 30న తుది జాబితా ప్రకటిస్తారు. ఉన్న ఖాళీల్లో 70 శాతం ఉద్యోగోన్నతుల ద్వారా, 30 శాతం పోస్టులు డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయనున్నారు.

పగిలిన కనిగిరి తాగునీటి పైపులైను

రామతీర్థం జలాశయం నుంచి కనిగిరికి తాగునీటిని సరఫరా చేసే పైపులైను చీమకుర్తి మండలం బక్కిరెడ్డిపాలెం సమీపంలో పగిలిపోయింది. అమరావతి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే కింద ఉన్న గొట్టాలు దెబ్బతినడంతో పది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు లీకవుతున్న ప్రాంతంలో మట్టి కొట్టుకుపోతోంది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించడంతోపాటు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చీమకుర్తి

మోకాళ్లపై కూర్చుని ఉద్యోగుల నిరసన

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురంలో మంగళవారం సహకార సంఘాల ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు అందరూ ఖాళీ ప్లేట్లు చేత పట్టుకుని తమ సమస్యలు పరిష్కరించాలని మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బొప్పరాజు కాశయ్య, ఎర్రారెడ్డి, రంగయ్య, శ్రీనివాసరెడ్డి, బాషా, మహమ్మద్ రఫీ, శేషిరెడ్డి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతులో గరళం!

- తరాలు మారినా వదలని ఫ్లోరైడ్ రక్కసి
- వెలిగొండ నీళ్లకు ఎదురుచూపులు

చచ్చుబడిన కాళ్లు, చేతులు... ఎముకల గూడులా మారిన శరీరాలు... రంగు మారిన దంతాలు.. ఇదీ కనిగిరి ప్రాంతంలోని చాలా మంది దయనీయ పరిస్థితి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 135 పంచాయతీలుండగా, దాదాపుగా 80 శాతం గ్రామాల్లోని తాగునీటిలో 1.5 పీపీఎం నుంచి 11 పీపీఎం వరకు ఫ్లోరైడ్ ఉందని కేంద్ర, రాష్ట్ర బృందాలు వివిధ సందర్భాల్లో చేయించిన సర్వేల నివేదికలు చెబుతున్నాయి. ఇవి ప్రమాద తీవ్రతను తెలుపుతున్నప్పటికీ మహమ్మారిని తరిమికొట్టేందుకు ఇప్పటివరకు తీసుకున్న పటిష్ఠ చర్యలు శూన్యం. కేవలం తాగునీటికి రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నా పూర్తయిన పథకం ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. ఒక్క కనిగిరి ప్రాంతానికే కాకుండా మార్కాపురం, పొదిలి, యర్రగొండపాలెం, గిద్దలూరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

-న్యూస్‌టుడే, కనిగిరి

ఫ్లోరైడ్ ఉచ్చులో వేలాది మంది...

ఊరికో తాగునీటి పథకం... ఇంటింటికో కుళాయి అని గత వైకాపా పాలకులు గొప్పలు చెప్పారు. శుద్ధ జలాలు అందిస్తున్నామని చెప్పి మధ్యలోనే మంచినీటి పథకాలు నిర్మాణాలు నిలిపేశారు. పలుమార్లు కనిగిరికి వచ్చిన నాయకులు సమ్మర్ స్టోరేజీ నిర్మిస్తామని, ఇంటింటికి కుళాయిలు వేయిస్తామని హామీలు గుప్పించారే తప్ప పూర్తి స్థాయిలో శుద్ధ జలాలు అందించిన దాఖలాల్లేవు. ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులు వచ్చి రామతీర్థం నీటిని కనిగిరి నియోజకవర్గానికి సరఫరా చేసి ఫ్లోరైడ్ బాధలు తీరస్తామని చెప్పినా అది కూడా ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికే వందలాది మంది మృత్యువాత పడగా, అదే స్థాయిలో ఫ్లోరైడ్ ప్రభావంతో మూత్రపిండాల వ్యాధితో మంచానికి పరిమితమయ్యారు.

కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కోసం వేచి ఉన్న డయాలసిస్ రోగులు

ప్రాజెక్టు నీరు రాకతోనే అడ్డుకట్ట

జిల్లా కేంద్రం మార్కాపురం ప్రాంతంలోని కాకర్ల సమీపంలో నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా కనిగిరి నియోజకవర్గం హనుమంతునిపాడు మండలం నుంచి ప్రారంభమయ్యే కాలువలను సుమారు పదేళ్ల కిందట రూ.కోట్లతో 50 కిలోమీటర్లకు పైగా నిర్మించాలని పనులు కూడా చేపట్టారు. లక్ష ఎకరాలకు పైగా సాగునీరందించే తూర్పు ప్రధాన కాలువ కనిగిరి, పామూరు, హనుమంతునిపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల మీదుగా నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని పెద్దిరెడ్డిపల్లి మీదుగా వెళ్తుంది. నిధుల లేమి కారణంగా ఇప్పటికే నిర్మించిన కాలువలు శిథిలమయ్యాయి. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటిస్తుండడంతో కనిగిరి ప్రాంతానికి వచ్చే మేజర్, మైనర్ కాలువలను పూర్తి చేసి వెలుగొండ జలాలతో ఫ్లోరైడ్ రక్కసికి అడ్డుకట్ట వేస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

కనిగిరిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, తెదేపా నాయకులు

రాచర్లలో ఇంటింటికీ వెళ్లి సభకు ఆహ్వానిస్తున్న తెదేపా శ్రేణులు

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

కంభం, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. తురిమెళ్ల, కంభంలోని ప్రభుత్వ, వాసవీ, గౌతమి జూనియర్ కళాశాలల కేంద్రాలను ఒంగోలు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు పర్యవేక్షించారు. ● సి.ఎస్.పురం: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం కేంద్రాన్ని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రమణారెడ్డి, కోటేశ్వరరావు పరిశీలించారు. కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 79 మంది విద్యార్థులకు గానూ 74 మంది హాజరైనట్లు ముఖ్య పర్యవేక్షకులు గుత్తి రమణయ్య, డీవో బ్రహ్మయ్య తెలిపారు.

జయహో చంద్రన్నను విజయవంతం చేయండి

▫ ఇంటింటికీ వెళ్లి తెదేపా శ్రేణుల ఆహ్వానం

కనిగిరి, న్యూస్‌టుడే: 'జయహో చంద్రన్న... సాహో వెలిగొండ' పేరిట మార్కాపురంలో బుధవారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు ప్రజలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, తెదేపా ఒంగోలు పార్లమెంటరీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. ఆయనతో మైదానంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. * నెల్లూరు జిల్లా ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శాంతకుమారి, ఎన్విరాన్‌మెంట్ బోర్డు చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే ఉగ్రను కలిసి... బహిరంగ సభ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, తెదేపా మండల అధ్యక్షుడు ఫిర్దోస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● సి.ఎస్.పురం: రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్ చైర్మన్ ఎం.శ్రీనివాసరెడ్డి... మండల తెదేపా అధ్యక్షుడు బి.రమేష్, నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు బి.వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ● పి.సి.పల్లి: ముఖ్యమంత్రి సభకు ప్రజలంతా స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతికుమారి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పి.సి.పల్లిలో తెదేపా నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ●పామూరులో... పరిశీలకుడు శ్రీనివాస్, నరసింహారావు, యారవ శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి, కోటిరెడ్డి, కంభం, రాచర్లలో... కటికె యోగానంద్, పుల్లారెడ్డి, సిరివెళ్ల రవికుమార్, వేప్పనగుంటపల్లెలో... పరిశీలకుడు, కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, కొమరోలులో... రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జలీల్ అహ్మద్, సొసైటీ అధ్యక్షుడు ముత్యముల సంజీవరెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు బోదిని వెంకటేశ్వర్లు, సుభాని, హనుమంతునిపాడు: తెదేపా మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణరెడ్డి, నరసయ్య, తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను సభకు ఆహ్వానించారు.

సారూ... ట్రిపుల్ ఐటీ సాకారం చేయరూ!

☛ సీఎం పర్యటన నేపథ్యంలో కనిగిరి వాసుల ఆశలు

న్యూస్‌టుడే – కనిగిరి

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో విద్యాపరంగా చాలా వెనుకబాటు ఉంది. ప్రభుత్వ పరంగా చెప్పుకోదగ్గ విద్యాసంస్థలేవీ లేవు. కనిగిరిలో పరిస్థితి మరీ దయనీయం. ఈ లోటును భర్తీ చేసేందుకు ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేస్తామని అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం స్థలం మార్చి హడావుడి చేసి చేతులు దులుపుకొంది. ఈ నేపథ్యంలో మార్కాపురం పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... నిధుల కొరత తీర్చి తమ చిరకాల వాంఛ నెరవేర్చాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

అన్ని విధాలా అనుకూలం...

కనిగిరిలో ట్రిపుల్ ఐటీ నిర్మించనున్నట్లు అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పామూరు మండలం దూబగుంటలో ఏర్పాటుకు రూ.1,200 కోట్ల కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు 2018 ఆగస్టు 7న స్వయంగా శంకుస్థాపన చేశారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేసింది. కనిగిరి మండలం బల్లిపల్లిలో ఏర్పాటు చేస్తామంటూ హడావుడి చేసినా పైసా విదల్చలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం కల సాకారం దిశగా కొంత కసరత్తు చేసింది. రైలు, రోడ్డు మార్గాల అనుసంధానం... అన్ని ప్రాంతాలకు అందుబాటులో ఉండటంతో బల్లిపల్లిలో 256 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించింది. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్థలం పరిశీలన చేయించారు. ఆర్‌జీయూకేటీ వీసీ... రెండు సార్లు పరిశీలించి అన్ని వసతులు ఉన్నందున ఈ ప్రాంతం అనుకూలమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

సానుకూల నిర్ణయానికి ఎదురుచూపు...

గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకపోతే ఇప్పటికే నిర్మాణం పూర్తయి తరగతులు కొనసాగేవి. ఉత్తుత్తి హామీలతో హడావుడి చేసి వదిలేయడంతో నేటికీ చిక్కులు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక... గత ఏడాది అసెంబ్లీ సమావేశాల్లో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పి.సి.పల్లి పర్యటనకు వచ్చిన విద్యాశాఖ మంత్రి లోకేశ్ సైతం బల్లిపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణం జరుగుతుందని... ముఖ్యమంత్రే శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అన్నీ సానుకూలంగానే ఉన్నా నిధుల విడుదలలో జాప్యంతో సమస్య నెలకొంది. ఆలస్యమయ్యే కొద్దీ కొత్త చిక్కులు ఉత్పన్నమవుతున్నందున... వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

దూబగుంటలో ట్రిపుల్ ఐటీ నిర్మాణ శిలాఫలకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు (పాత చిత్రం)

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114
గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: అర్ధవీడు: కాకర్ల ఎస్సీపాలెంలో కాలువలు లేక సీసీ రోడ్లపై మురుగు పారుతోంది. – ధన్‌రాజు
✓:ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే కాలువలు నిర్మిస్తాం. – కాశీరావు, పంచాయతీ కార్యదర్శి

?: అర్ధవీడు: పెద్ద కందుకూరు శంకరాపురం రహదారిలోని మినీ ట్యాంకు వద్ద మురుగు చేరి నీళ్లు పట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. – రాము
✓:పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. – సుజాత, పంచాయతీ కార్యదర్శి

?: రాచర్ల: ఆకవీడులో మంచి నీటి బోరు మరమ్మతులకు గురై స్టేట్ బ్యాంకు బజారులో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – శ్రీనివాసులు
✓: బోరు మోటర్లను బాగు చేసేందుకు మెకానిక్‌కు అప్పగించాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. – శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి

?: హనుమంతునిపాడు: ఎస్సీ కాలనీలోని కుళాయిలకు నియంత్రికలు లేక సాగర్ నీరు వృథాగా పోతోంది. – కాలనీవాసులు
✓:సర్పంచితో మాట్లాడి నియంత్రికలు ఏర్పాటు చేయిస్తాం. – శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ధర్నా విజయవంతానికి వినతి

పామూరు, న్యూస్‌టుడే: జులై 2023 నుంచి పన్నెండో పీఆర్‌సీ అమలుతో పాటు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్న డిమాండ్‌తో... 26న కనిగిరిలో నిర్వహించనున్న ధర్నాలో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ పామూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకల శ్రీనివాసులు, షేక్ ఖాజా మస్తాన్ విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ రద్దు, ఖాళీల భర్తీ తదితర డిమాండ్ల సాధనకు దశల వారీగా ఉద్యమించనున్నట్లు తెలిపారు.

వైభవంగా కుంభ కలశాల ఊరేగింపు

కంభం, న్యూస్‌టుడే: హరేకృష్ణ ఆధ్యాత్మిక సభ్యుల ఆధ్వర్యంలో సీతారామ గృహ రక్షణ పత్రం, అహోబిలం నరసింహస్వామి కుంభ పూజ, కలశాల ప్రదర్శనను కంభంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. పట్టాభి రామాలయం నుంచి చౌక్ సెంటర్, అమ్మవారిశాల, శీలం వీధి మీదుగా బాలిక ఉన్నత పాఠశాల సమీపంలోని రామాలయం వరకూ కుంభ కలశాలతో ఊరేగింపు చేపట్టారు. నగర సంకీర్తన, పుష్పాభిషేకం, విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కలశాలతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు

విగ్రహ ప్రతిష్ఠ పూజలు...

రాచర్ల, న్యూస్‌టుడే: జేపీ చెరువు గ్రామంలోని పట్టాభి సీతారామస్వామి నూతన ఆలయ, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలను వేదపండితులు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అఖండ దీపారాధన, విశ్వక్సేనపూజ, రక్షా బంధనం, కలశ, అగ్ని ప్రతిష్ఠ తదితరాలు నిర్వహించారు. గ్రామోత్సవాన్ని వైభవంగా చేపట్టారు.

త్వరలో శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పప్పుశనగ సాగు రైతులు పంట ఉత్పత్తి విక్రయానికి రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో కె.రాజశ్రీ తెలిపారు. కొమరోలులో త్వరంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రెడ్డిచెర్ల, బ్రాహ్మణపల్లెలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీతో కలిగే ప్రయోజనాలను వివరించారు. విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సహాయకులు నబీ యూనస్, సంధ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు. ● గిద్దలూరు పట్టణం: ప్రభుత్వమే మద్దతు ధరకు శనగలు కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయబాస్కర్ రెడ్డి తెలిపారు. ఎల్లుపల్లెలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. శనగ అమ్మకాలకు రైతులు వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సహాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటు పరం తగదు

కనిగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం తగదని ఎన్ఎంయూఏ కనిగిరి ఆర్టీసీ డిపో కార్యదర్శి జగదబి మాల్యాద్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12 ఆర్టీసీ డిపోల తొలగింపును వ్యతిరేకిస్తూ డిపో ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ప్రైవేటు సంస్థలకు విక్రయించడం అన్యాయమన్నారు. ఇది రాష్ట్ర ప్రగతికి గొడ్డలిపెట్టని విమర్శించారు. ఈ చర్యలను విరమించుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. నాయకులు పి.మల్లికార్జునరావు, సుబ్బారావు, సమీర్, వెంకట్రావు, చెంచులు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

గ్రూప్ -2 విజేతకు సన్మానం

వెలిగండ్ల, న్యూస్‌టుడే: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూనే మొన్నటి గ్రూప్-2 ఫలితాల్లో విజయం సాధించిన సి.ఎస్.పురం మండలం అంబవరానికి చెందిన చెవుల నవీన్‌ను... వెలిగండ్ల తెదేపా నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మరింత ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. తెదేపా మండల అధ్యక్షుడు ఇంద్ర భూపాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నవీన్‌ను అభినందిస్తున్న తెదేపా నాయకులు

పారదర్శకంగా కుటుంబ సర్వే

పామూరు, న్యూస్‌టుడే: ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా ఏకీకృత కుటుంబ సర్వే చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో షేక్ హజరత్ అలీ పేర్కొన్నారు. పామూరులో నిర్వహిస్తున్న సర్వేను మంగళవారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు వివరాలు అందజేసి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నిర్మించి.. నిరుపయోగంగా వదిలేసి!

గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వెనుక వైకాపా హయాంలో నిర్మించిన సచివాలయం-2, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలివి. భవనాలు పూర్తయినా సాంకేతిక చిక్కులతో నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఇప్పటికే విద్యుత్తు సామగ్రి దెబ్బతిన్నాయి. ప్రస్తుతం సామాజిక భవనంలో అరకొర వసతుల మధ్య సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి భవనాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

పైపులు తీశారు... బాగు మరిచారు!

దిగువమెట్ట చెక్‌పోస్టు సమీప కాలనీలోని చేతిపంపు ఇది. మరమ్మతుల కోసం కొద్ది నెలల క్రితం బోరులోని పైపులు బయటకు తీశారు. తరువాత కొత్తవి వేస్తామని చెప్పి పైన రాయిపెట్టి వెళ్లినా నేటికీ ఆ దిశగా చర్యలు లేవు. వేసవి ఆరంభం కావడంతో నీటి కోసం స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బోరును వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

దారంతా బురద.. వెళ్లేదెలా?

రాచర్ల మండలం ఆకవీడులో చిన్నయ్యస్వామి ఆర్చి సమీపంలో ఆరవీటి కోటకు వెళ్లే దారిలో పరిస్థితి ఇది. రోడ్డుపైనే మురుగు పారుతుండడంతో ఇటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని వారు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ స్పందిస్తూ... స్థానికులతో మాట్లాడి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, రాచర్ల

మరమ్మతులు చేయక మూలకు!

వెలగలపాయ ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్ల పరిస్థితి ఇది. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టక పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో ఇక్కడ చదువుతున్న నలభై మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసరమైతే ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. వాటిని బాగు చేసి వినియోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అర్ధవీడు

గొయ్యి... చూసి అడుగెయ్యి!

కనిగిరి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కాలువ కల్వర్టు శిథిలమైంది. పై మూతలు దెబ్బతినడంతో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. రాత్రి వేళ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. పురపాలక అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, కనిగిరి

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

గిద్దలూరు పట్టణం: ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి నడుచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. గిద్దలూరు సబ్‌జైలును మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విచారణ ఖైదీలు కేసులు పూర్తయ్యే వరకు ప్రతి వాయిదాకు కోర్టుకు హాజరు కావాలని సూచించారు. నేర పవృత్తికి దూరంగా ఉండాలన్నారు. పేదలు ఉచిత న్యాయసేవలు పొందవచ్చని తెలిపారు. ముందుగా సబ్ జైలులో ఖైదీలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. జైలు ఇన్‌ఛార్జ్ పర్యవేక్షకుడు ఎ.ఖాదర్‌బాషా, లీగల్ ఎయిడ్ న్యాయవాది షేక్ ఫజీల్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఇబ్రహీం షరీఫ్

గ్రాసం కొరత... పశువుల వలస

కనిగిరి నియోజకవర్గంలో వేసవికి ముందే గ్రాసం కొరత మొదలైంది. దీంతో పోషకులు ఆవుల మందలను కురిచేడు ప్రాంతంలోని సాగర్ కాలువల వద్దకు తీసుకెళ్తున్నారు. గత నెలలోనే చాలా వరకు జీవాలను దర్శి, నెల్లూరు జిల్లా ప్రాంతాలకు తరలించారు. వర్షాభావంతో చెరువులు ఎండిపోయాయని... మేత, నీరు లేకపోవడంతో పశు సంపదను బతికించుకొనేదుకు వలసబాట పట్టాల్సి వస్తోందని పోషకులు వాపోతున్నారు. దిగువ చిత్రంలో సి.ఎస్.పురం మండలం వెంకటాచలం నుంచి హెచ్.ఎం.పాడు మీదుగా పచ్చిక మైదానాలకు తరలుతున్న గోవులను చూడవచ్చు. - న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

సీడీపీవో కార్యాలయం ఎదుట రిలే దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సంఘం నాయకురాలు డి.స్వర్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని... ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గతంలో చేపట్టిన సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రత్న, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం

కంభం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంభం బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అల్పాహారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు తన్నీరు బాలరంగారావు, సంఘం జిల్లా ఛైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్ ఆర్థిక సహకారంతో పరీక్షలు ముగిసే వరకు... రోజూ సాయంత్రం స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అమూల్య, క్లబ్ కార్యక్రమాల ఛైర్మన్ సయ్యద్ జాకీర్‌హుస్సేన్, సభ్యులు గుండయ్య, కేశవ, సత్యరామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు బాలరంగారావు

షేక్‌ల సంక్షేమానికి కృషి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని షేక్‌ల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర షేక్ సంక్షేమం, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి.ఎస్.ముక్తార్... ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని మంగళవారం కలిసి విన్నవించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను షేక్‌లకు చేరువయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి , తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న రాష్ట్ర షేక్ సంక్షేమం, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ముక్తార్

కారుకు దుండగుల నిప్పు

కంభం, న్యూస్‌టుడే: రావిపాడు రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న అర్ధవీడు మాజీ ఎంపీపీ రాజేశ్వరరెడ్డి ఇంటి ఆవరణలోని కారు సోమవారం అర్ధరాత్రి దగ్ధమైంది. దుండగులు నిప్పు పెట్టడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని బాధితులు ఫిర్యాదు చేయడంతో... ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నారాయణ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై పరిశీలించారు.

వెలిగొండ... మది నిండా!

● ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు నేడు ముఖ్యమంత్రి శంకుస్థాపన

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

మార్కాపురం జిల్లాకు వరప్రసాదమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేడు (బుధవారం) భూమి పూజ చేయనున్నారు. రూ.456 కోట్లతో 21.8 కి.మీల కాలువకు లైనింగ్‌తో పాటు 5.6కి.మీలు రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. ఈ పనితో ఎలాంటి ఆటంకాలు లేకుండా నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలు చేరనున్నాయి..

శిథిల కాలువ పటిష్ఠం దిశగా...

కరవు ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించాలనే లక్ష్యంతో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మితమవుతోంది. కృష్ణా నది నుంచి సొరంగాల ద్వారా ఫీడర్ కాలువ నుంచి నల్లమల సాగర్‌కు జలాలు అందుతాయి. ఇంతటి ప్రాధాన్యమున్న కాలువను నాటి వైఎస్ హయాంలో రూ.105 కోట్లతో తవ్వించారు. 21.8 కి.మీలు ఉన్న కాలువ నిర్మాణంలో లోపాలు చోటు చేసుకోవడంతో పాటు కరకట్ట నిర్మాణంలో నాణ్యత లోపించింది. దీంతో చిన్నపాటి వర్షాలకే కాలువ కట్ట తెగి పంట పొలాలకు, గ్రామాల్లోకి వరద నీరు చేరుతోంది. భారీ వర్షాలు పడ్డాయంటే దోర్నాల మండలం గంటవానిపల్లె, కడపరాజుపల్లె, కటకానిపల్లె గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు కరవవుతోంది. కృష్ణా జలాలు వదిలితే ఆయా గ్రామాలు కొట్టుకుపోయే దుస్థితి నెలకొంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలువ పటిష్ఠతపై దృష్టి సారించింది. అందులో భాగంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో పటిష్ఠతకు ప్రభుత్వం రూ.456 కోట్లు మంజూరు చేసింది. కాలువ వెడల్పు 23 మీటర్లు, ఎత్తు 7 మీటర్ల చొప్పున 21.8కి.మీల లైనింగ్, కరకట్ట బలహీనంగా ఉన్న 5.6 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. ఈ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఫీడర్ కాలువ పనుల ప్రారంభానికి కట్టకు వేసిన లైనింగ్

తురిమెళ్లకు ఫ్రీజర్ పెట్టె వితరణ

కంభం, న్యూస్‌టుడే: మానవత సేవా సంస్థ సహకారంతో తురిమెళ్ల గ్రామానికి మంగళవారం... ఫ్రీజర్ పెట్టెను సమకూర్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దీనిని అందుబాటులో ఉంచారు. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను సర్పంచి మాదా సుభద్ర, మాజీ సర్పంచి నారిశెట్టి వీరమ్మ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ పెట్టె వద్ద నాయకులు, గ్రామస్థులు

(c) eenadu

పెద్దదోర్నాలలో కరపత్రాలు అందజేస్తున్న సుబ్బారెడ్డి తదితరులు

గొట్లగట్టులో కరపత్రాన్ని ఆవిష్కరించిన తెదేపా నాయకులు

మార్కాపురం
•మార్కాపురం •యర్రగొండపాలెం

సీఎం సభ విజయవంతానికి పిలుపు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: మార్కాపురంలో నేడు జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభ జయప్రదానికి అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. కొనకనమిట్ల మండల నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం జయహో చంద్రన్న సాహో వెలిగొండ కరపత్రాన్ని ఆవిష్కరించారు. **పొదిలి, న్యూస్‌టుడే:** పొదిలిలో ఏఎంసీ ఛైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మండల పార్టీ అధ్యక్షులు అంజిరెడ్డి తదితరులు కరపత్రాలు పంచారు.

◗ చంద్రబాబు నాయుడు సభను జయప్రదం చేయాలని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం పొదిలి వచ్చిన ఆయన తెదేపా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెదేపా నాయకులు ఎం.ఖుద్దూస్, ఒగ్గు వెంకట్రామయ్య, కె.నారాయణబాబు, శ్రీదేవి, గౌస్‌బాషా తదితరులు ఉన్నారు.

తర్లుపాడు, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా కేంద్రంలో బుధవారం జరిగే ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమ తెదేపా నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. మంగళవారం తర్లుపాడులోని శ్రీవీరబ్రహ్మం స్వామిని నాయకులతో కలిసి దర్శించుకున్న దేవినేని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిన్నపరెడ్డి, నాయకులు వెంకటయ్య, కాశంగి శ్రీను, కాశీశ్వరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని ఉమ

పుల్లలచెరువు (యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో కన్వీనర్ పోట్ల గోవింద్ ఆధ్వర్యంలో పట్టణ కన్వీనర్ మేడికొండ అనిల్ తదితరులు కరపత్రాలు పంచారు.

◗ పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కోరారు. ఆయన మంగళవారం దోర్నాల మండలంలో పర్యటించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు షేక్ మాబు, సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వై.పాలెం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

పొదిలి: ప్రచారపత్రాలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో ప్రభుత్వ, శ్రీవీరిశెట్టి, శ్రీవివేకానంద జూనియర్ కళాశాల కేంద్రాల్లో మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఒక్కొక్క కేంద్రంలో 220 నుంచి 230 మంది విద్యార్థులను పరీక్షలకు కేటాయించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మార్కాపురం : 8008613313
యర్రగొండపాలెం : 8008552658

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని బీసీ కాలనీలో పలుచోట్ల వీధి దీపాలు పనిచేయడంలేదు. రాత్రివేళ ఇబ్బందిగా ఉంటోంది. వెంటనే కొత్తవి ఏర్పాటు చేయండి. – కోటేశ్వరరావు, స్థానికుడు

✓: సిబ్బందిని పంపించి పాత వాటికి మరమ్మతులు చేయిస్తాం. కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. – రామసుబ్బయ్య, ఏఈ

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: పెదారికట్ల గ్రామంలో కాలువలు లేక వీధుల్లో మురుగు నిలిచి అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు నిల్వతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. – శ్రీనివాసులు, స్థానికుడు

✓: కాలువ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే కాలువలు నిర్మిస్తాం. – శ్రీదేవి, ఈవోఆర్డీ.

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: స్థానిక ప్రభుత్వ వైద్యశాల్లో రక్త పరీక్షలు సక్రమంగా జరగడం లేదు. దీంతో వైద్యశాలకు వచ్చిన వారు ప్రైవేటు రక్త పరీక్షల కేంద్రాలకు వెళ్లాల్సివస్తోంది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి. – కోటి, స్థానికుడు

✓: వైద్యశాల్లో పరీక్షలకు సంబంధించిన (టెస్ట్) రావడం లేటైనందున కొంత అంతరాయం ఏర్పడింది. పర్యవేక్షించి సమస్య లేకుండా చేస్తాం. – యదిద్య, వైద్యశాల ఇన్‌ఛార్జి

పొదిలి, న్యూస్‌టుడే:

సమస్య: పొదిలి బ్యాంక్ కాలనీలోని సైడు కాలువల్లో మురుగు పేరుకు పోయింది. దీంతో దుర్గంధం వ్యాపించి ఇబ్బంది పడుతున్నాం. కాలువల్లో మురుగును తొలగించాలి. –స్థానిక ప్రజలు.

సమాధానం: సిబ్బందిని పంపి మురుగు కాలువను శుభ్రం చేయిస్తాం. చెత్త, చెదారం తొలగించి ఇబ్బంది లేకుండా చూస్తాం. – షేక్షావలి, కమిషనరు, పొదిలి

అసౌకర్యాలకు నిలయం.. క్రీడా వికాస కేంద్రం..

న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

వై.పాలెం ప్రాంతంలో యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గత తెదేపా ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు క్రీడా వికాస కేంద్రానికి రూ.2కోట్లు మంజూరు చేయించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దీనిని నిర్మించారు. నిర్వహణ సరిగ్గా లేక దీని లక్ష్యం నెరవేరకుండా పోతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీన్ని అభివృద్ధి చేయాలని ఔత్సాహిక క్రీడాకారులు కోరుతున్నారు.

ఆడాలంటే నెలకు రూ.400 కట్టాలి

ఈ కేంద్రంలో ప్రస్తుతం రోజుకు పది జట్లతో యువత బాడ్మింటన్ సాధన చేస్తున్నారు. ఆట ఆడేవారు ఒక్కొక్క జట్టు నెలకు రూ.400లు లెక్కన చెల్లించాల్సి ఉంది. ఉదయం 7గంటలు మొదలు కొని రాత్రి 9 వరకు జట్లు ఆడుతుంటాయి. దీంతో గ్రామీణ ఔత్సాహికులకు ఆర్థిక భారంగా ఉంటోంది. ప్రభుత్వం దీన్ని తగ్గించాలని కోరుతున్నారు.

❑ ప్రత్యేక పర్యవేక్షణ అవసరం

వైకాపా ప్రభుత్వంలో పరికరాలు చోరీ

మొదట్లో యువత కోసం ఇక్కడ సెస్ బోర్డు ఏర్పాటు చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ కేంద్రంలో పరికరాలు చోరీకి గురయ్యాయి. ఇందులో ఉన్న సెస్‌బోర్డు, డంబుల్స్, డిప్స్ స్టాండ్, క్యారమ్ బోర్డు, కాయిన్స్ కొందరు ఎత్తు కెళ్లారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు కేంద్రం అద్దాలు, తలుపులు పగలగొట్టి పరికరాలు దొంగిలించుకుపోయారు. ప్రస్తుతం ఉన్న కమిటీ తాత్కాలికంగా అద్దాలు, తలుపులు ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారిన తరువాత ప్రస్తుత తెదేపా ప్రభుత్వంలో బ్యాడ్మింటన్ ఆటలు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రంలో జిమ్ చేసేందుకు పరికరాలు ఏర్పాటు చేయాలని, ఈ వికాస కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని యువకులు కోరుతున్నారు.

❑ ప్రస్తుతం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ఈ క్రీడా వికాస కేంద్రానికి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు, మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చేసేందుకు కృషి చేస్తానన్నారు.

బ్యాడ్మింటన్ సాధనలో యువత

ముంపు బాధితులను ఆదుకోవాలి

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టును ప్రజల ఆకాంక్షల మేరకు పూర్తి చేయాలని. వెంటనే ముంపు బాధితులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు అందె నాసరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల కిందట ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందన్నారు. నేటికీ ప్రాజెక్టు పూర్తికాకపోవడానికి పాలకుల నిర్లక్ష్యం కారణమని స్పష్టం అవుతుందన్నారు. కృష్ణా జలాల కోసం ఉమ్మడి జిల్లా ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురు చేస్తున్నారన్నారు. ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు షేక్ కాశిం, కాశయ్య, కేశవరావు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు అందె నాసరయ్య

మిరప, వేరుసెనగ పంటల పరిశీలన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పెద్దబొమ్మలాపురం, బోడేనాయక్ తండాలో సాగు చేసిన మిరప, వేరుశనగ పంటలను మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

మిరప పంట పరిశీలిస్తున్న ఏవో జవహర్‌లాల్‌నాయక్

డిజీ లావాదేవీలు.. పాటించాలి జాగ్రత్తలు

పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అధికారులు డిజిటల్ అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. కళాజాత బృందం నాటికలు, పాటల ద్వారా బ్యాంకింగ్ సేవల వినియోగం, డిజిటల్ లావాదేవీలలో పాటించాల్సిన జాగ్రత్తలు, సైబర్ భద్రతల గురించి వివరించారు. బ్యాంకు మేనేజర్ శ్రీకృష్ణ బ్యాంకింగ్‌పై విద్యార్థులకు ఉన్న పరిజ్ఞానాన్ని పరిశీలించారు. సరైన సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్యాంప్రసన్నతాంజలి, క్యాషియర్ నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాయంత్రం యడవల్లిలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై మేనేజర్ శ్రీకృష్ణ అవగాహన కల్పించారు. – న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

బహుమతులు అందజేస్తున్న ఏపీ జీబీ మేనేజర్ శ్రీకృష్ణ తదితరులు

పోర్టల్‌లో పేర్ల నమోదు తప్పనిసరి

పొదిలి, న్యూస్‌టుడే: రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి డి.శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం అక్కచెరువు, మల్లవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. త్వరలో కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8 వేలు నిర్ణయించినట్లు చెప్పారు. కంది సాగుచేసే రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. అనంతరం కంది కల్లంచేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

వెలిగొండ ఫీడర్ కాలువ ఆధునికీకరణ

● నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల: మార్కాపురం జిల్లాకు వరప్రసాదమైన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు (బుధవారం) భూమి పూజ చేయనున్నారు. రూ.456 కోట్లతో 21.8 కి.మీల కాలువకు లైనింగ్‌తో పాటు 5.6కి.మీలు రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. ఈ పనితో ఎలాంటి ఆటంకాలు లేకుండా నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలు అందనున్నాయి.

ఫీడర్ కాలువ పనుల ప్రారంభం కోసం కట్టకు వేసిన లైనింగ్

శిథిల కాలువ పటిష్ఠం దిశగా...

కరవు ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించాలనే లక్ష్యంతో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మితమవుతోంది. కృష్ణా నది నుంచి సొరంగాల ద్వారా ఫీడర్ కాలువ నుంచి నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు అందుతాయి. అంత ప్రాముఖ్య ఉన్న ఈ కాలువను నాటి వైఎస్ హయంలో రూ.105 కోట్లతో తవ్వించారు. 21.8 కి.మీలు ఉన్న ఈ కాలువ నిర్మాణంలో లోపాలు చోటు చేసుకోవడంతో పాటు కరకట్ట నిర్మాణంలో నాణ్యత లోపించింది. దీంతో చిన్నపాటి వర్షాలకే కాలువ కరకట్ట తెగి పంట పొలాలకు గ్రామాల్లోకి వరద నీరు ప్రవహిస్తోంది. భారీ వర్షాలు పడ్డాయంటే దోర్నాల మండలం గంటవానిపల్లె, కడపరాజుపల్లె, కటకానిపల్లె గ్రామాల ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. కృష్ణా జలాలు వదిలితే గ్రామాలు కొట్టుకుని పోయే పరిస్థితి దాపురించింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలువ పటిష్ఠతపై దృష్టి సారించింది. అందులో భాగంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించారు. దాని పటిష్ఠతకు ప్రభుత్వం రూ.456 కోట్లు మంజూరు చేసింది. కాలువ వెడల్పు 23 మీటర్లు, ఎత్తు 7 మీటర్ల చొప్పున 21.8కి.మీల లైనింగ్, కరకట్ట బలహీనంగా ఉన్న 5.6 కి.మీలు రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. ఆ పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టుపై రంధ్రం.. చూడకుంటే ప్రమాదం

పొదిలి మండలం, పాతూరులోని సాయిబాబా దేవాలయానికి వెళ్లే ప్రధానమార్గంలో ఆర్చి వద్ద ఉన్న కల్వర్టుకు కన్నం పడటంతో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తవ్యక్తులు ఏమాత్రం గమనించకపోయినా గుంతలో పడి ప్రమాదాల పాలయ్యే వీలుంది. ఈ మార్గం కల్యాణమండపం, ప్రైవేటు పాఠశాలలకు, సాయిబాబా మందిరానికి వెళ్లే భక్తులు, ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రంధ్రానికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదిలి

కనుల పండువగా రుక్మిణీ కల్యాణం

పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో గల శ్రీదేవీ భూదేవీ సమేత అమలక లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రుక్మిణీ సత్యభామా సమేత శ్రీకృష్ణ స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దంపతులు, వికాస తరంగిణి మహిళా సేవకులు, భక్తులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ ఆధ్వర్యంలో తగు చర్యలు చేపడుతున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు వరలక్ష్మీ, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

నిధులు లేక.. భవనం పూర్తికాక

కొనకనమిట్ల మండల ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. భవనం పైకప్పు పెచ్చులూడుతూ ప్రమాదభరితంగా మారడంతో వైకాపా నాడు-నేడులో నిధులు మంజూరు చేసింది. అంతలో ప్రభుత్వం మారడంతో నిధులు కొరతతో పాఠశాల భవనం, మరుగు దొడ్ల మధ్యలోనే నిలిచి పోయాయి. పాఠశాల్లో 30 మంది విద్యార్థులు ఉన్నారు. అధికారులు స్పందించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొనకనమిట్ల

కాంగ్రెస్ తీరుపై భాజపా ఆగ్రహం

పొదిలి, న్యూస్‌టుడే: ఏఐ ఇంపాక్ట్ జాతీయ సదస్సులో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, అనుచరులు వ్యవహరించిన తీరుకు నిరసనగా పొదిలిలో మంగళవారం భాజపా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి బి.విజయలక్ష్మి మాట్లాడారు. దేశ అభివృద్ధి, కృత్రిమ మేధస్సు వినియోగం, యువత భవిష్యత్తు వంటి కీలక అంశాలపై చర్చించేందుకు ప్రాధాన్యతతో కూడిన సదస్సు ఏర్పాటు చేశారన్నారు. ఇలాంటి వేదికల్లో రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆమె వెంట భాజపా నాయకులు రమణారెడ్డి, ఖాదర్ బాషా, రామయ్య, ఎస్కే బాషా, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఎస్కే రఫీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న భాజపా నాయకులు

ఘనంగా ప్రింటర్స్ డే వేడుకలు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రింటర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కాపురం జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు కూడలి నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ప్రింటర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రింటర్ పితామహుడు గుటెన్ బర్గ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రింటర్స్ అసోసియేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ప్రింటర్ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

గుటెన్ బర్గ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

సమస్యల లోగిళ్లు.. శివారు వార్డులు

● మౌలిక సదుపాయాలు లేక ప్రజల అవస్థలు

న్యూస్‌టుడే, పొదిలి:

పొదిలి నగర పంచాయతీలోని శివారు వార్డులు సమస్యలకు నిలయంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ జీవితాలు మారడంలేదని ఆయా వార్డుల నివాసితులు వాపోతున్నారు.

పిచ్చిరెడ్డి కాలనీలో కర్రలతో లాగిన విద్యుత్తు తీగలు

రహదారులు, మురుగు కాలువలు ఎక్కడ

నగర పంచాయతీలోని పిచ్చిరెడ్డి కాలనీ, విరాట్‌నగర్, టైలర్స్ కాలనీ, బీసీకాలనీ, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో ప్రజలు సమస్యలతో నానా పాట్లు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, మురుగు నీటి కాలువలు లేవు. వర్షాలు పడినప్పుడు కాలువలు పొంగి మురుగంతా రోడ్లపై పారుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ❖ పిచ్చిరెడ్డికాలనీలో విద్యుత్తు స్తంభాలుసైతం అన్ని వీధులకు లేవు. ఆ ప్రాంతంలో ఎక్కువమంది నిరుపేదలు నివసిస్తున్నారు. తాగునీరు అస్సలు అందడం లేదు. ఈ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి నిర్మలా కాన్వెంట్‌ముందు పడిన గుంతలు అధ్వాన్నంగా ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోని వార్డు ప్రజలకు తాగునీరు అందకపోవడంతో వారంతా డబ్బా నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏళ్లుగా నిధుల మాటే లేదు

గడిచిన ఐదేళ్లుగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మా ప్రాంతాలు మరింత వెనుకబడ్డాయని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు-కర్నూలు ప్రధాన రహదారిపక్కనే ఉన్న టైలర్స్‌కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సుమారు 15 ఏళ్ల క్రితం టైలర్స్‌కాలనీలో పట్టణంలోని దర్జీలకు, పేదలకు ఇళ్లస్థలాలు మంజూరుచేశారు. కాలనీలో ఎనిమిది వీధుల్లో సుమారు 300 గృహాలు ఉన్నాయి. కాలనీలో పూర్తిస్థాయిలో మురుగునీటి కాలువలు, అంతర్గతరోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోలేదని, కనీసం కూటమి ప్రభుత్వం అయినా స్పందించి శివారు వార్డుల్లో అభివృద్ధి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వేసవిలో నీటి ఎద్దడిని పకడ్బందీగా అధిగమించేలా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా నీటి, పరిశుభ్రత కమిటీ సమావేశాన్ని ఆమె నిర్వహించారు.

- ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం తాత్కాలిక తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు.
- ప్రధాన కూడళ్లు, సిగ్నల్ ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో కేవలం బ్లీచింగ్‌కే పరిమితం కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు.

వెంచర్‌కు పొలం బాట

ఆత్మకూరు మండలం.. కరివేన గ్రామంలోని చెరువుకు పిల్ల కాలువ ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. ఈ కాల్వకు ఇరువైపులా 45 అడుగుల చొప్పున స్థలం వదిలారు. రైతులు ఎడ్ల బండ్లపై పంట పొలాలకు వెళ్లటానికి.. మట్టి రహదారిగా వినియోగించుకునేందుకు ఈ స్థలం కేటాయించారు. ఈ మార్గాన్ని కమర్షియల్, రియల్ ఎస్టేట్ అవసరాలకు ఉపయోగించకూడదు. గత ఏడాది ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సిద్ధాపురం పిల్లకాల్వ పక్కన ఉన్న స్థలంలో బిలుకు తరలించి వెంచరుకు రహదారిగా వినియోగించుకునేందుకు ప్రయత్నం చేశాడు. ఈ విషయంపై చిన్న నీటిపారుదలశాఖ, రెవెన్యూశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారి రహదారి ప్రయత్నం విరమించుకున్నారు.

ఇటీవల కొత్తగా నిర్మిస్తున్న వెంచరు రహదారి కోసం సిద్ధాపురం పిల్ల కాల్వను ఉపయోగించుకుంటున్నారు. కాల్వకు ఇరువైపులా కంకర, మట్టి తరలించి రోడ్డు రోలర్‌తో చదును చేయించారు. ఈ వెంచరు జాతీయ రహదారి 340సి ఆనుకొని ఉన్నప్పటికీ, అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

అతివల ఉపాధికి అండాదండ

◆ ఎగ్‌మార్ట్‌ల ఏర్పాటుకు కసరత్తు
◆ నెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్న మెప్మా

మహిళలను వ్యాపారులు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మెప్మా ద్వారా మహిళలకు ర్యాపిడో బైక్‌లు, ఆటోలు ఇప్పిస్తున్నారు. అతివలు తయారు చేసిన ఆహార, ఇతర ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. డిజి లక్ష్మి, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు, తృప్తి క్యాంటీన్లు ఇలా పలు వినూత్న వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నారు. తాజాగా నగర, పట్టణ పొదుపు మహిళలతో ఎగ్ మార్ట్‌లు ఏర్పాటు చేయించి, ఉపాధికి బాటలు వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

రద్దీ కూడళ్లలో దుకాణాలు

నగరాలు, పట్టణాల్లో గృహిణులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎగ్ మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మెప్మా, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్‌ఈసీసీ) ఆధ్వర్యంలో వీటిని నిర్వహించనున్నారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు ప్రభుత్వం రూ.50 వేల విలువైన ఆధునికమైన వ్యాపార సామగ్రిని అందించనుంది. ప్రధాన రహదారులు, రద్దీ కూడళ్లలో ఎగ్‌మార్ట్‌లు ఏర్పాటు చేయించడం.. స్థిరమైన ఆదాయం వచ్చేలా చూస్తారు. వీటిని అల్పాహార విక్రయ కేంద్రాలుగా రూపొందిస్తున్నారు. వినియోగదారులను ఆకర్షించేలా తక్కువ స్థలంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

అర్హులు వీరే..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళై ఉండాలి. నగర, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద మహిళలు.. స్వయం సహాయ సంఘాల సభ్యులకు ప్రాధాన్యం ఉంటుంది. వితంతువులు, ఒంటరి మహిళలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వారిలోనూ వివిధ ఉత్పత్తుల తయారీలో అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

రెండు జిల్లాల్లో 20 కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో పదికి పైగా పురపాలక సంఘాలు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో పది చొప్పున ఎగ్ మార్ట్‌లు ఏర్పాటు చేయాలని మెప్మా లక్ష్యం నిర్దేశించింది. మెప్మా నుంచి ఇంకా విధివిధానాలు రాలేదు. స్వయం సహాయ సంఘాల్లోని మహిళలను ఎంపిక చేసి వారి ద్వారా త్వరలో కోడిగుడ్ల ఆధారిత ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా మెప్మా అధికారులు తెలిపారు. ఎంపికైన మహిళలకు.. వ్యాపారం ఎలా నిర్వహించాలి, వినియోగదారులతో ఎలా వ్యవహరించాలి, లాభాలు ఎలా రాబట్టాలో నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పించనున్నారు.

పాపాలే అధికం.. ఆరోగ్యం భద్రం

- ఉమ్మడి జిల్లాలో తగ్గిన క్షీర ఉత్పత్తి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాలు, పాల పదార్థాల కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రజల అవసరాలకు తగ్గట్టు పాల ఉత్పత్తి లేకపోవడంతో విపరీతమైన డిమాండు ఉంటోంది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు అక్రమార్జన కోసం కల్తీకి పాల్పడుతున్నారు. వీటివల్ల ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉన్నా అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతుండటం శాపంగా మారింది. కాకినాడలో కల్తీ పాలు పలువురి ప్రాణాలను తీసిన నేపథ్యంలో.. జిల్లా అధికారులు అక్రమార్కుల పని పట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈనాడు, కర్నూలు
– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్, వైద్యాలయం

తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి..

- 2024 మే 24న ఎ.క్యాంపు ప్రాంతంలో ఆహార తనిఖీ అధికారులు దూద్‌పేడ ప్యాకెట్లను తనిఖీ చేసి అందులో ఫంగస్ ఉన్నట్లు గుర్తించారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు.
- 2025 డిసెంబరు 27న నగరంలోని సాయి ఈశ్వర్ హోటల్‌లో, జనవరి 31న లాస్య రెస్టారెంట్‌లో తనిఖీలు చేసి పెరుగులో నాణ్యత లేనట్లు నిర్ధారించారు.
- గతేడాది జులై 22న స్వీట్‌రాజ్ హోటల్‌లో నెయ్యిని తనిఖీ చేసి నాసిరకమని గుర్తించారు. 2024 అక్టోబరు 24న ఓ నెయ్యి ట్యాంకరును పోలీసులు పట్టుకుని ఆహార తనిఖీ అధికారులను పిలిపించి నాణ్యత పరీక్షలు నిర్వహించగా అందులోని నెయ్యిలో నాణ్యత లేదని తేలింది.
- నంద్యాల జిల్లాలో 24 పాల నమూనాలను సేకరించగా రెండింటిలో నీరు ఎక్కువగా కలిపినట్లు గుర్తించారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టానికి అనుగుణంగా లేవని తేలింది.
- కోవెలకుంట్లలో స్థానిక పాల విక్రయదారులు నీళ్లు కలిపినట్లు వెల్లడైంది.

ఉత్పత్తిలో వెనుకబాటు

- కర్నూలు జిల్లాలో 3.36 లక్షల పశువులు ఉన్నాయి. వీటిలో 70 వేల పశువులు మాత్రమే పాలు ఇస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పాల ఉత్పత్తి లక్ష్యం 2,45,600 మెట్రిక్ టన్నులు. కాగా గతేడాది డిసెంబరు నెలాఖరు వరకు 1,68,767 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి జరిగింది.
- నంద్యాల జిల్లాలో 4.14 లక్షల పాడి పశువులు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం 4 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. 3.15 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేయగలిగారు.

స్థానిక విక్రేతల అడ్డదారులు

- కొందరు చిరువ్యాపారులు ఎలాంటి బ్రాండు లేకుండా పాలు, పెరుగు, నెయ్యి తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఆయా ఉత్పత్తులు నాణ్యంగా ఉండటానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రజలకు నాసిరకం పాల ఉత్పత్తులు అంటగడుతున్నారు.
- పల్లెలో పాడి రైతుల నుంచి పాలు కొనుగోలు చేసి సమీప పట్టణాల్లో విక్రయించే చిరు వ్యాపారులు మార్గ మధ్యలో కాలువల్లో నీటిని కలిపేస్తున్న ఉదంతాలున్నాయి. వారు కలిపే నీళ్లు శుభ్రంగా లేకపోతే ఆయా పాలను వినియోగించిన వారు అనారోగ్యాల బారినపడే ముప్పు ఉంది.
- కొందరు రైతులు కృత్రిమ పద్ధతుల్లో పాల దిగుబడిని పెంచేందుకు పశువులకు నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఔషధ వ్యాపారులు వీటిని గుట్టుగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పాలు తాగిన వారికి హార్మోన్ల సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. కొందరు పాలలో నీళ్లు కలుపుతున్నారు. చిక్కదనం కోసం గంజి పొడి కలుపుతున్నారు.

అనుమానమొస్తే ఫిర్యాదు చేయండి

– కూర్మనాయకులు, సహాయ ఆహార నియంత్రణాధికారి, ఉమ్మడి కర్నూలు జిల్లా

ఆహార ఉత్పత్తుల్లో కల్తీ జరిగినట్లు ఎలాంటి అనుమానాలున్నా 9441439787 నంబరుకు ఫోన్ చేయవచ్చు. అధికారుల బృందాలను పంపి ఆయా ఆహార పదార్థాల నమూనాలను సేకరించి రాష్ట్ర ప్రయోగశాలకు పంపించి నాణ్యత పరీక్షలు చేయిస్తాం. నాణ్యత లోపించినట్లు గాని, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమైందిగా గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

కర్నూలులో స్వామి నారాయణ్ గురుకులం

- భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం

ఈనాడు, కర్నూలు: కర్నూలులో స్వామినారాయణ్ అంతర్జాతీయ గురుకుల పాఠశాల ఏర్పాటుకానుంది. ఆమేరకు మంగళవారం అమరావతిలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో భూకేటాయింపునకు ఆమోదముద్ర వేశారు. ఆ సంస్థకు కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని సర్వే నెంబరు 818లో ఉన్న పది ఎకరాలను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరానికి రూ.71.36 లక్షల చొప్పున ఆ సంస్థ ప్రభుత్వానికి చెల్లించనుంది.

- ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు క్లస్టర్లో సింథటిక్ ఆర్గానిక్ రసాయనాలు, ఏపీఐ తయారీ పరిశ్రమ ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చిన సిగాచి ఇండస్ట్రీస్‌కు, విరూపాక్ష ఆర్గానిక్ సంస్థలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఆలూరు, చిప్పగిరి, హొళగుంద మండలాల పరిధిలో ఎన్టీపీసీ రెనెవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ 900 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్రాజెక్టును ఏర్పాటుచేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

హంస వాహనంపై ప్రహ్లాదవరదుడు

ఎగువ అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా జ్వాలా నృసింహస్వామివారు మంగళవారం యోగ నృసింహస్వామి అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. రాత్రి స్వామివారు విశేష అలంకరణలో హనుమంత వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. గరుడాద్రి పర్వతాన కొలువుదీరిన అహోబిలేశుడు రాముని రూపంలో కారంజ నృసింహస్వామిగా ఆంజనేయస్వామికి దర్శనమిచ్చారు. దీనికి సూచికగా హనుమంతుడిపై జ్వాలా నృసింహస్వామి దర్శనమిచ్చారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదుడు హంస వాహనంపై విహరించారు.

ఉత్సవంలో భాగంగా మఠానికి చేరుకున్న స్వామిని పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ప్రత్యేకంగా ఆరాధించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం జరిపారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

రాఘవుడి జన్మదినం భక్తజన సంబరం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 431వ జన్మదిన వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి మూల బృందావనానికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అభిషేకం నిర్వహించారు. మూల బృందావనాన్ని అలంకరించి స్వామివారికి ప్రత్యేక హారతినిచ్చారు. అనంతరం ప్రాకారంలో ఉన్న డోలోత్సవ మండపంలో ఏర్పాటు చేసిన ప్రతిమకు ప్రత్యేక అలంకరణ చేశారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రుని చరిత్ర, మహిమలపై ఉపన్యసించారు. అనంతరం నవరత్నాల రథంపై స్వామి బంగారు ప్రతిమను ఉంచి పీఠాధిపతి హారతినిచ్చారు.

– న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం

ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనం

నవరత్నాల రథంపై రాఘవేంద్ర స్వామి

నిర్లక్ష్యం దహిస్తోంది

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో క్రిమిటోరియం పనులు ముందుకు సాగడం లేదు. గ్యాస్ ఆధారిత దహన సంస్కారాలు చేసుకొనేందుకు, కేంద్రం 14వ ఆర్థిక సంఘం కింద పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఒక్కో నిర్మాణానికి రూ.70-80 లక్షలు, సివిల్ పనులకు రూ.40 లక్షలు, యంత్రాల ఏర్పాటుకు రూ.33-35 లక్షలు మంజూరు చేసింది. సివిల్ పనులు పురపాలికలకు, యాంత్రీకరణ పనులు ప్రజారోగ్య విభాగానికి అప్పగించారు. ఐదేళ్లలో పనులు పూర్తి చేయకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదు. కర్నూలు, నంద్యాలలో చివరి దశలో ఉన్నాయి. కొద్ది పాటు పనులు పూర్తిచేసి ట్రయల్ రన్ చేసి పరీక్షించాల్సి ఉంది.

–న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

తక్కువ ఖర్చుతో..

- ప్రస్తుతం దహన సంస్కారాలు చేయాలంటే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భారం ఉంటోంది. ఇక కర్రలతో సంప్రదాయబద్ధంగా దహనం చేయాలంటే రూ.50 వేలు వెచ్చించాల్సిందే.
- ఆర్థిక భారం తగ్గడంతో పాటు కాలుష్యం లేకుండా.. మున్ముందు స్థల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు క్రిమిటోరియం సేవలు తెరపైకి తెచ్చారు.
- ఒక్క శవం దహనం చేసేందుకు గంట సమయం పడుతుంది, రెండు వాయుబండలు అవసరమవుతాయి. నిర్వహణ బాధ్యతలు పూర్తిగా పురపాలికలకే అప్పగించారు. నామమాత్రపు సేవా రుసుం చెల్లిస్తే సరిపోతుంది. క్రిమిటోరియం సేవల కోసం ముందుకొచ్చే వారితో పాటు అనాథ శవాల దహన క్రియలకు ఉపయుక్తంగా ఉంటుంది.

ఆదోని పట్టణం బండమెట్ట ప్రాంతంలోని శ్మశాన వాటికలో ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. ఇందుకు కావాల్సిన యంత్ర సామగ్రిని రాంజల చెరువు ప్రాంతంలో నిల్వ చేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ.. తుప్పు పట్టి రూపు కోల్పోయాయి. 14వ ఆర్థిక సంఘం కాలం ముగిసింది. నిలిచిన పనులు ఎలా పూర్తిచేయాలో అధికారులకు అంతు చిక్కడం లేదు.

చుక్క తొలగదు.. హక్కు దక్కదు

కదలని 22ఎ(1)సీ దస్త్రం ● పెండింగ్‌లో వందలాది వినతులు

రెవెన్యూ అధికారులు సకాలంలో సమస్య పరిష్కరించకపోవడంతో పలువురు రైతులు 'చుక్క'లు చూస్తున్నారు. రెవెన్యూ శాఖల్లో అత్యధికంగా ఫిర్యాదులు అందుతున్న వాటిలో 22ఎ భూముల సమస్య కాగా.. ఇందులో 22ఎ(1)సీ ప్రధానంగా ఉంది. ఈ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు నివేదికలు తీసుకుని ఆర్డీవో స్థాయిలో పరిష్కరించాలని ప్రభుత్వంతో పాటు సీసీఎల్‌ఏ ఆదేశాలు జారీ చేశారు. రెండు జిల్లాల్లో ఈ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. సమస్యకు పరిష్కారం ఎలా చూపాలో తెలియజేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మార్గదర్శకాలు జారీ చేసినా వాటిని ఉమ్మడి జిల్లాలో అమలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, కర్నూలు సచివాలయం

నంద్యాల పట్టణం ఎన్జీఓ కాలనీలో కొంత విభాగం సర్వే నంబరు-2279లో విస్తరించి ఉంది. బహుళ అంతస్తులు, విల్లాలు, ఇళ్లు వెలుస్తున్నాయి. ఇక్కడ సెంటు రూ.30 లక్షలు పలుకుతోంది. ఇక్కడ 24 ఎకరాలు సర్వీసు ఇనాం కింద చూపిస్తోంది. దీంతో స్థలం కొనుగోలు చేసిన యజమానులు అవస్థ పడుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన కొంతమంది రెవెన్యూ క్లినిక్‌లో విన్నవించుకొన్నారు. ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు.

బాధితుల గోడు

- ఉమ్మడి జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య 22ఎ(1)సీ. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రీసర్వే సమయంలో పట్టా భూముల్ని ఇందులో చేర్చారు. అంతకుముందు మున్సిపాల్టీలు, పట్టణాల్లోని వివిధ ప్రాంతాలనూ దీనిలోకి చేర్చారు. సమస్యను పరిష్కరించాలని ఈ ఏడాది జనవరి 1న ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆర్డీవోలే వీటిని పరిష్కరించాల్సి ఉంది.
- 22ఎ భూముల జాబితా నుంచి తొలగించాలని యజమానులు విన్నవించుకొంటున్నా అధికారుల నుంచి స్పందన కొరవడింది. తొలగిస్తే ఏమవుతుందోనన్న భయం కొందరు అధికారులను వెన్నాడుతుండటం గమనార్హం.

జిల్లా	22ఎ(1)సీ వినతులు	పరిష్కారం
నంద్యాల	246	0
కర్నూలు	182	0

ఆర్డీవోలకు అధికారం ఇచ్చినా...

- 22ఎ కింద వివిధ రకాల భూములు ఉన్నాయి. ఇందులో ఐదు రకాల భూముల్ని 22ఎ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం ఆర్డీవోలకు అధికారం ఇచ్చింది. ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు.
- రెవెన్యూ క్లినిక్‌లలో వినతులు పోటెత్తుతున్నాయి. పట్టా భూములతో పాటు, స్థలాలు పొరపాటున ఈనామ్ భూమిగా చూపిస్తూ 22ఎ జాబితాలో ఉంటే 15 రోజుల్లోగా వాటిని తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు ఆర్డీవోలకు ఇచ్చారు. కానీ ఇంత వరకు ఒక్క దరఖాస్తు ఆ స్థాయిలో పరిష్కారం కాకపోవడం గమనార్హం.
- కర్నూలు జిల్లాలో చుక్కల భూముల సమస్యలు రెవెన్యూ క్లినిక్‌లు పెట్టక ముందు పరిష్కారం కాగా ఆ తర్వాత ఒక్కటీ పరిష్కారం కాలేదు. వినతులు పరిష్కారం కాకపోవడంతో ఆర్డీవో కార్యాలయాలతో పాటు పీజీఆర్ఎస్‌లో వినతులు రీఓపెన్ అవుతున్నాయి. దీంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల వివాహాలు పెట్టుకుని ఈ సమస్యతో వాటిని విక్రయించలేక, బదిలీ చేయించలేక అవస్థలు పడుతున్నారు.

జొన్నకు దక్కని మద్దతు

ఆళ్లగడ్డ, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జొన్న సాగుతో లాభాలు కళ్లజూద్దామనుకున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ఈ ఏడాది వేలాది ఎకరాల్లో పంట సాగవుతోంది. రైతులు పెట్టుబడులు సైతం భారీగా పెట్టారు. దిగుబడులు చేతికొచ్చే సమయంలో కనీసం మద్దతు ధర లభించక ఇబ్బందులు పడుతున్నారు.

- జిల్లావ్యాప్తంగా రబీలో 92,664 ఎకరాల్లో రైతులు జొన్న సాగు చేశారు. అత్యధికంగా గడివేముల మండల పరిధిలో 14 వేల ఎకరాలు, దొర్నిపాడు మండలంలో 10 వేల ఎకరాల్లో సాగవుతోంది. చాలామంది రైతులు జొన్న సాగుపై మొగ్గు చూపారు. ఒక్కో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు.
- మద్దతు ధరను గమనిస్తే ఈ ఏడాది సైతం దాదాపు రూ.700 తక్కువ ధరకు రైతులు దిగుబడులు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చివరికి దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మద్దతు ధర క్వింటా రూ.3,749 ఉండగా ప్రస్తుతం క్వింటా రూ.2,900-3,000 మధ్య మాత్రమే పలుకుతోంది.
- మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి జొన్నలు వెల్లువెత్తడంతో ధర ఒక్కసారిగా తగ్గిపోయింది. మద్దతు ధరకు దరిదాపుల్లోనైనా అమ్ముకోవచ్చన్న ఆశతో చాలామంది రైతులు ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ ఉంచుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా ధరల పెరుగుదలలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో మహేంద్ర, మిల్క్ వైట్ రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. మహేంద్ర జొన్నలు క్వింటా ధర రూ.3 వేల దరిదాపుల్లో ఉండగా మిల్క్ వైట్ మాత్రం కొంచెం ఎక్కువ ధరకు విక్రయించుకుంటున్నారు.

26న ఆత్మకూరులో ఉద్యోగమేళా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరులో ఈనెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ మైదాన ప్రాంగణంలో నిర్వహించే ఈ మేళాలో 14 ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నట్లు మంగళవారం ఆయన పేర్కొన్నారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చునని చెప్పారు. ఇతర వివరాల కోసం 9154830386, 9951400588 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాలువ చెంత.. సాగునీటికి చింత

గత ఏడాది అనుకున్న స్థాయిలో వర్షపాతం నమోదైంది. దీంతో బీడు భూములు సాగులోకి తీసుకొచ్చి వరి, జొన్న, మిరప పంటలను అధికంగా సాగుచేశారు. ఆల్వకొండ గ్రామ సమీపంలోని పాలేరు వాగు పక్కనే ఉన్న పంట పొలాలకు కాలువల ద్వారా నీరు అందకపోవడంతో విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకొని రైతులు పైపుల ద్వారా నీరందించే ప్రయత్నం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

రంజాన్ వేళలు

పట్టణం	ఇఫ్తార్ (బుధ)	సహెరీ (గురు)
నంద్యాల	6:26	5:16
ఆళ్లగడ్డ	6:25	5:20
బనగానపల్లి	6:28	5:12

అతుకుల దారి.. అవస్థగా మారి

ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం వెళ్లే దారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై నిత్యం 20 గ్రామాల ప్రజలు ఆత్మకూరు, కొత్తపల్లి మండల కేంద్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలతో ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కొత్తపల్లి

ప్రకృతి సాగు.. పత్రంలో సేద్యం

- అధికారుల లెక్కలపై పలు అనుమానాలు
- మట్టి పరీక్షలతో నిగ్గు తేల్చాలని ప్రభుత్వం ఆదేశం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.. మరి ప్రకృతి సాగు ఇంతలా పెరిగితే ఎరువుల వినియోగం తగ్గాలి.. కానీ 3.75 లక్షల టన్నుల వినియోగంతో నంద్యాల రాష్ట్రంలోనే మొదటి స్థానంలో, దేశంలో రెండో స్థానంలో నిలవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల జాబితా కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు పంపించారు. సేద్యం చేస్తున్న రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్షించి ఫలితాలు పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 17,945 నమూనాలు సేకరించారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం, ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయం

పొలం బాట చూడని సిబ్బంది

- ప్రకృతి సాగు పెంచాలని ప్రభుత్వం ఓ విభాగాన్ని ఏర్పాటు చేసింది. 790 మంది పొరుగు సేవల సిబ్బందిని నియమించారు. వీరికి ఏటా వేతనాల కోసం రూ.9 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. వీరిని పర్యవేక్షించడానికి ఏడీఏ స్థాయి అధికారి డీపీఎంగా, మరో ఏవో స్థాయి అధికారి ఉన్నారు. ప్రస్తుతం ఏవోనే ఇన్‌ఛార్జి డీపీఎంగా విధులు నిర్వహిస్తున్నారు.
- ఈ విభాగంలో పనిచేసే గ్రామస్థాయి ఉద్యోగి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ ప్రకృతి సాగు చేపట్టాలి. ఐసీఆర్‌పీలు ఎకరా, ఎల్-1 కేడర్‌వారు ఐదెకరాలు, ఎల్-2 కేడర్‌వారు రెండెకరాలు, మాస్టర్ ట్రైనర్లు 10 ఎకరాలు, ఎన్ఎఫ్ఏలు 20 ఎకరాలు సాగు చేయాలని రైతు సాధికార సంస్థ చెబుతోంది. ఏ ఒక్కరూ పాటించడం లేదు.

పది మందికి పంచరు

- ఐసీఆర్‌పీలు ప్రకృతి సాగులో పంటలు సాగు చేయడంతోపాటు 25 సెంట్ల పొలంలో ఏటీఎం మోడల్ పద్ధతిలో కూరగాయల సాగును పది మంది రైతులతో చేయించాలి.
- 1.10 ఎకరాల్లో ఏ గ్రేడ్ పద్ధతిలో పత్తి, కంది, మొక్కజొన్న, ఆముదాలు, మినుములు తదితర పంటలను ఎరువులు.. పురుగు మందులు లేకుండా సాగు చేయడంతోపాటు పది మంది రైతులతో ఈ పద్ధతిలో సాగు చేయించాలి.
- ఉమ్మడి జిల్లాలో 490 మంది ఐసీఆర్‌పీలు ఉండగా.. ఇందులో పది శాతం మంది కూడా అనుసరించడం లేదు.

ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు			
జిల్లా	పాక్షికంగా	పూర్తిగా	సాగు(ఎకరాల్లో)
కర్నూలు	39,500	3,200	64,141
నంద్యాల	54,272	7,015	74,652

నిధులు బొక్కేస్తున్నారు

- గ్రామస్థాయి సమావేశాలకు సంబంధించి ఒక్కో గ్రామానికి రూ.5 వేలు మంజూరు చేస్తే అందులో రూ.500 ఖర్చు చేసి మిగిలిన సొమ్ము అధికారులు స్వాహా చేస్తున్నారు. మండల స్థాయి సమావేశాలకు రూ.15 వేలు మంజూరైతే అందులో కనీసం రూ.5 వేలు కూడా ఖర్చు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.
- గ్రామస్థాయిలో కనీసం ఎకరా సొంత పొలం లేదా.. కౌలుకు తీసుకున్న పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగుచేసే వారిని ఐసీఆర్‌పీలుగా ఎంపిక చేయాలి. వీరిలో 80 శాతం మందికి సొంత పొలాలు లేవు. కానీ వీరంతా ప్రకృతి సాగు చేస్తున్నామని చెప్పి నెలకు రూ.6 నుంచి రూ.8 వేల వరకు వేతనాలు తీసుకుంటున్నారు.



(c) eenadu

శ్రీగిరిలో నృత్య సిరులు

శ్రీశైలం, నంది సర్కిల్, న్యూస్‌టుడే: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహా క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న కళారాధన మంగళవారం భక్తులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన కళానికేతన్ బృందం పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు.

అదుపుతప్పితే అపాయంలోకి దిగుడే

గోనెగండ్లలో ఎమ్మిగనూరు- కర్నూలు రహదారి నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి రోడ్డులో పాత బస్టాండు వద్ద రహదారి పక్కనే దిగుడు బావి ప్రమాదకరంగా ఉంది. వాహనాలు అదుపు తప్పితే ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డు చిన్నగా ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదకరంగా ఉన్న బావిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోనెగండ్ల

దాతల సాయం.. చిన్నారి పునర్వికాసం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తికి చెందిన సురేష్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్వికశ్రీ పేరు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రచారం సాగుతోంది. పునర్వికా గత ఏడాది ఏప్రిల్ 12న జన్మించింది. పుట్టిన మూడు నెలల అనంతరం పాపలో కదలికలు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కోట్లలో ఒకరికి ప్రబలే ఎస్‌ఎమ్‌ఏ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి నివారణకు రూ.16కోట్లు విలువ చేసే ఔషధం అవసరం. చిన్నారి వైద్యసేవలకు దాతలు సహకరించాలని తల్లిదండ్రులు సురేష్, పుష్పావతి కోరారు. నిత్యం పడుతున్న యాతనపై గత ఏడాది నవంబరు 29న 'ఈనాడు'లో 'అందితే సాయం.. మోములో పునర్వికాసం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో పాప పరిస్థితి తెలుసుకున్న దాతలు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. వీటితో పాటు సామాజిక మాధ్యమాల్లో సైతం ఈ విషయం చెక్కర్లు కొట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సైతం స్పందించి.. విరాళాలు సేకరించడం మొదలు పెట్టారు.

చేయి చేయి కలిపారు

చిన్నారి పునర్వికా వేదనను దిన పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో చూసిన పలు సేవా సంస్థలు సైతం సాయం చేసేందుకు ముందుకొచ్చాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని యువత, విద్యార్థులు, దాతలు సాయం చేయడంతో పాటు వారికి తెలిసిన వారి నుంచి సైతం విరాళాలు సేకరించారు. మరి కొందరు రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపడుతూ.. కదిలారు. ఇంపాక్ట్ గురు యాప్ నుంచి 95 రోజుల్లో 72,705 మంది సుమారు రూ.1,91,54,068 విరాళాలు వచ్చాయి. వీటితో పాటు పాప బ్యాంకు ఖాతాకు సైతం ఇప్పటిదాకా రూ.2.45 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది.

రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తీసుకోండి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు తరచూ నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు

పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

తీసుకురావాలన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మంద జావళి, డీఎస్పీలు రామంజినాయక్, శ్రీనివాస్, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివురుగప్పిన ముప్పు

☛ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు అవసరం

కర్నూలు నేరవిభాగం, వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: వేసవికాలం ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. కర్నూలు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. జనవరి మాసం నుంచే అగ్ని ప్రమాదాలు పెరిగిన నేపథ్యంలో రానున్న మూడు మాసాల్లో అగ్నిప్రమాదాలు మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. అగ్నిప్రమాదంతో ఆస్తితో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు స్పందన అగ్నిమాపకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

ఇక్కడే అధికం..

జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో ఉంచిన పంట నిల్వల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. 2025 జనవరి నుంచి 2026 జనవరి వరకు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలు-291, ఇళ్లు-28, దుకాణాలు-15, ఫ్యాక్టరీలు-10, వాహనాలు-15, పొలాలు-13, అటవీ ప్రాంతాలు-7, ఆసుపత్రులు-3 అగ్నిప్రమాదాలు జరిగాయి.

జనవరి-మే మధ్య ఎక్కువ

కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరు అగ్నిమాపకశాఖ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో జనవరి నుంచి మే మధ్యకాలంలోనే ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. 2025 జనవరి-80, ఫిబ్రవరి-139, మార్చి-129, ఏప్రిల్-84, మే-50, జూన్-14, జులై-13, ఆగస్టు-13, సెప్టెంబర్-9, అక్టోబర్-17, నవంబర్-33, డిసెంబర్-33 జరిగాయి. 2026 జనవరి-41 అగ్నిప్రమాదాలు జరిగాయి.

అప్రమత్తంగా ఉండాలి

● బాలరాజు, ఇన్‌ఛార్జి విపత్తు స్పందన అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి వేసవికాలంలో గాలి, అధిక ఉష్ణోగ్రతల వల్ల అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. సదస్సులు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. ప్రజలు మంటలు ఆర్పే విధానం పట్ల అవగాహన పెంచుకుంటే నష్టం తగ్గించుకోవచ్చు. ఫ్యాక్టరీల నిర్వాహకులు అగ్నిమాపక పరికరాలు పునఃపరిశీలించుకోవాలి. జిల్లాలోని ఆరు అగ్నిమాపకశాఖ కేంద్రాల సిబ్బందిని నిత్యం అప్రమత్తం చేస్తున్నాం. ప్రజల అగ్నిప్రమాదం గుర్తించిన వెంటనే అగ్నిమాపకశాఖ డయల్ 101కు సమాచారం ఇవ్వాలి.

నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు

● జిల్లాలో అత్యధికంగా నిర్లక్ష్యంగా పొగతాగి పడేసే వారి వల్లే ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బీడీ, సిగరెట్ సరిగా ఆర్పకుండా పడేయడం వల్ల గడ్డివాములు, గుడిసెలు నిప్పంటుకొని కాలిపోతున్నాయి. అందువల్ల రైతులు గడ్డివాములు, గుడిసెలు, పంటలను ఉంచే చోట నీరు ఎక్కువగా నిల్వ ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ● విద్యుదాఘాతం వల్ల కూడా అధికంగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఇళ్లలో ఉపయోగించే ఎలక్ట్రికల్ ఉపకరణాల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వ్యవహరించటం వల్ల అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ● అవిశ్రాంతంగా సుదూరం ప్రయాణించే వాహనాలు సైతం ఎక్కువగా కాలిపోతున్నాయి. ● వేసవికాలంలో ఏసీలు ఎక్కువగా ఉపయోగించుకునే నేపథ్యంలో విద్యుదాఘాతం సంభవించి అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉంది. పదేళ్లు పైబడితే వైరింగ్ మార్చుకోవాలని, తీగలు అతుకులు లేకుండా ఉంచుకోవాలని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు. ● 2025 జనవరి నుంచి 2026 జనవరి వరకు జిల్లా వ్యాప్తంగా నిర్లక్ష్యంగా పొగతాగి పడేయటం వల్ల 305, విద్యుదాఘాతంతో 57 అగ్నిప్రమాదాలు జరిగాయి. ఇళ్లలో గ్యాస్ సిలిండర్ వల్ల నాలుగు ప్రమాదాలు జరిగాయి.

నియోజకవర్గ అభివృద్ధిపై లోకేశ్‌తో చర్చ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: శ్రీశైల నియోజకవర్గ అభివృద్ధిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చర్చించినట్లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వెలగపూడి క్యాంపు కార్యాలయంలో మంగళవారం లోకేశ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించానన్నారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల బ్రహ్మోత్సవాల ప్రత్యేక ప్రసాదం అందజేసినట్లు తెలిపారు.

నారా లోకేశ్‌కు ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డీపీఎం శ్రీనివాసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పడకలను, మెడికల్ స్టాక్ దస్త్రాలతో పాటు టీకాలు, గర్భిణీలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డా.శ్వేత, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డీపీఎం శ్రీనివాసులు

పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు

☛ తొలి ప్రయత్నంలోనే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యువతి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: క్రీడల్లో మహిళలు రాణించి సత్తా చాటుతున్నారు. క్రీడల్లో శిక్షణ పొందేందుకు, సాధన చేసేందుకు మహిళలకు సరైన సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో రాణించడమంటే కత్తిమీద సామే. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూనే ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు.

మనీషా

నంద్యాల పట్టణం భరత్‌సింగ్ కాలనీకి చెందిన మనీషాకు క్రీడలపై ఆసక్తి ఉండేది. ఉన్నత చదువులు చదువుతూనే జిమ్‌కు వెళ్లేవారు. ఈ క్రమంలో 2025 నుంచి పవర్ లిఫ్టింగ్‌లో హాజీ అనే శిక్షకుడి వద్ద శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని తొలి ప్రయత్నంలోనే జిల్లాస్థాయిలో బంగారు పతకం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

● జనవరి 27న కర్నూలులో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 63 కిలోల విభాగంలో 210 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు.

● ఈనెల 15న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57 కిలోల విభాగంలో 205 కిలోల బరువు ఎత్తి వెండి పతకం సాధించారు.

● త్వరలో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నారు.

రైతుల జాతర..

గూళ్యం (హాలహర్వి), న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఇలవేల్పుగా కొలిచే గాది లింగేశ్వరస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

ప్రత్యేక పూజలు అందుకుంటున్న గాదిలింగేశ్వరస్వామి

ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వహణాధికారి రాధకృష్ణ తెలిపారు. జాతరలో ఎద్దులు పరుషలో అన్నదాతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రకాల జాతులకు చెందిన ఎడ్లను ప్రదర్శనకు ఉంచారు. ఒక్కో జత ఎద్దు ధర రూ.లక్షలు పలికింది. వ్యవసాయానికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. నేటితో జాతర ముగింపు కార్యక్రమం ఉంటుందని ఈవో తెలిపారు. గ్రామంలో భక్తులకు సలహాలు, సూచనలు అందిచేందుకు ఆలయ అభివృద్ధి సేవా సమితి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దిగువ అహోబిలం హుండీ ఆదాయం రూ.28.57 లక్షలు

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో హుండీ సొమ్మును ఆలయ నిర్వాహకులు మంగళవారం లెక్కించారు. ఆలయానికి రూ. 28.57 లక్షల ఆదాయం సమకూరింది. 14.3 గ్రాముల బంగారం, 443 గ్రాముల వెండి లభించినట్లు సీఏవో రామానుజన్ తెలిపారు. మూడు నెలలపాటు భక్తులు కానుకల రూపంలో హుండీలో నగదు, నగలు సమర్పించగా ఈ మొత్తం వచ్చిందని పేర్కొన్నారు. పార్వేట ఉత్సవం హుండీ లెక్కించగా రూ.9.14 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. 1.8 గ్రాముల బంగారం, 80 గ్రాముల వెండి వచ్చినట్లు రామానుజన్ చెప్పారు.

సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

జగజ్జననికి సహస్ర కలశాభిషేకం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని జగజ్జనని ఆలయ వార్షికోత్సవంలో భాగంగా 2వ రోజు అమ్మవారికి సహస్ర కలశ క్షీరాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రభాతపూజ, అభిషేకాలు, మహా మంగళ హారతులు వంటి కార్యక్రమాలు జరిపించారు. దుర్గ ఫ్రెండ్స్ యూనిట్, జగజ్జననీ దేవాలయం సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు.

కలశాలతో పాలు తీసుకువస్తున్న భక్తులు

మిద్దె కూలి వృద్ధురాలి దుర్మరణం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పిండి గిర్ని మట్టి మిద్దె కూలి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కొణిదెల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొణిదెల గ్రామంలోని కురువపేటలో జిలాని బాషా అనే వ్యక్తి మట్టి మిద్దెలో పిండి గిర్ని నిర్వహిస్తున్నారు. గ్రంధే లక్ష్మీదేవమ్మ(80), కురువ సాలమ్మ మరో ఇద్దరు మహిళలు గిర్ని వద్దకు వెళ్లారు. గిర్ని ఆడుతుండగా మిద్దె పై కప్పు మట్టి రాలుతున్నట్లు శబ్దం వస్తుండటంతో ఇద్దరు మహిళలు, జిలానీబాషా బయట చూసేందుకు వెళుతుండగా ఒక్కసారిగా కూలింది. దాంతో లక్ష్మీదేవమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెంది. సాలమ్మ అనే మహిళ చేతికి తీవ్రగాయం కావడంతో నందికొట్కూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కూలిన మట్టి మిద్దె

కాలిన గాయాలతో వివాహిత మృతి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణం అల్లూరు రహదారిలో నివాసం ఉంటున్న వివాహిత కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19వ తేదీ మద్యం మత్తులో భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన తెలిసిందే. అల్లూరు రహదారిలో మల్లికార్జున, కల్యాణి(28) దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త మద్యానికి బానిసయ్యాడు. దీంతో ప్రతి రోజూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. మల్లికార్జున మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనానికి తెచ్చుకున్న పెట్రోల్‌ను కల్యాణి ఒంటిపై పోసి నిప్పు పెట్టాడు. కాలిన గాయాలతో నందికొట్కూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కల్యాణి తండ్రి శేఖరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

దొంగతనం కేసులో నలుగురికి రిమాండ్

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. దొంగతనం కేసులో కుమ్మరి హరినాథ్, షేక్ మసూద్, చాకలిరాజు, షేక్ ఇమ్రాన్ అనే నలుగురు వ్యక్తులను అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. గత ఏడాది వేసవి సెలవుల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రొజెక్టర్, స్పీకర్లు అపహరణకు గురయ్యాయి. డిసెంబరులో పట్టణంలోని పగ్గాల రాముడు ఇంట్లో రూ.లక్ష నగదు చోరీ జరగడంతో అప్పట్లో కేసు నమోదైంది. నలుగురు వ్యక్తుల నుంచి పోయిన సొమ్మును రికవరీ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురిపై కేసు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బాలుడిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఆలూరు ఎస్సై మన్మథవిజయ్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. రెండు రోజుల కిందట అరికెర గురుకులంలో బాలుడిపై అర్ధరాత్రి తనతోపాటు చదువుకునే వారు లైంగికదాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారమే లక్ష్యం

భీమవరం(నంద్యాల గ్రామీణం), నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఏపీఎస్‌పీడీసీఎల్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్య అన్నారు. నంద్యాల మండలం భీమవరం గ్రామంలో మంగళవారం విద్యుత్తుశాఖ అధికారులతో కలిసి కరెంటోళ్ల జనబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్యలు, ఎత్తు తక్కువగా ఉన్న స్తంభాలు, నియంత్రికల గురించి గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పరిష్కరించాలని రూరల్ ఏఈ సుధాకర్‌ను ఆదేశించారు. నంద్యాలలో సూర్యఘర్ సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకున్న గృహాలను పరిశీలించారు. సాయంత్రం జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ పథకంలో నంద్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, మొదటి స్థానానికి తీసుకురావడానికి అధికారులంతా కృషి చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సుధాకర్ కుమార్, ఈఈ శ్రీనివాసుల రెడ్డి, జిల్లాలోని ఈఈలు, డీఈఈలు, సౌర కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

భీమవరం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆదిశేషయ్య

బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను ఎటువంటి లోపాలు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ యుగంధర్‌బాబు, ఆర్డీవో విశ్వనాథ్, ఆలయ పరిపాలనాధికారి రామానుజన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎగువ, దిగువ అహోబిలాల్లో జరిగే కల్యాణోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. టోల్ రుసుం మినహాయింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. నీటి కుంటల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. క్యూలైన్లలో భక్తులకు తాగు నీరు, మజ్జిగ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.

సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ఆదాయ లక్ష్యాలను సాధించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రధాన ఆదాయ వనరులైన ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా తదితర శాఖలకు కేటాయించిన వార్షిక ఆదాయ లక్ష్యాలను వంద శాతం సాధించడమే కాకుండా అధిగమించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆదాయ వనరుల పెంపుపై సమీక్షించారు. సమావేశంలో డీఆర్వో రామునాయక్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్సైజ్ ఆదాయం రూ.1,105 కోట్లు ఆదాయ లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.803 కోట్లు సాధించిందని మిగతా లక్ష్యం పూర్తి చేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రెవెన్యూ ఆదాయంలో స్పష్టమైన వృద్ధి కనిపించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

జన గణన గణాంకాలే దేశాభివృద్ధికి పునాది

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: దేశాభివృద్ధి ప్రణాళికకు జనగణన గణాంకాలు బలమైన పునాది వంటివని కలెక్టరు రాజకుమారి పేర్కొన్నారు. మండలంలోని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జనగణన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కచ్చితమైన, సమగ్రమైన, పారదర్శక సమాచార సేకరణ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో ప్రతి అధికారి అత్యంత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఇంటింటి సమాచారాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేసి సేకరించిన గణాంకాల ఆధారంగానే విద్య, వైద్యం, ఉపాధి, గృహనిర్మాణం, మౌలిక వసతులు, ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయని అన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా చేయాలని సూచించారు. ఒకే వ్యక్తి వివరాలు రెండు సార్లు నమోదు కాకుండా చూడాలన్నారు. హాస్టళ్లు, ఆశ్రమాలు, ఎన్జీవోలు నిర్వహించే వసతి గృహాల్లో నివసించే వారిని ఇన్‌స్టిట్యూషన్ కింద నమోదు చేయాలన్నారు. ఈ జనాభా గణనలో 33 అంశాలు ఉంటాయన్నారు. శిక్షణ కార్యక్రమంలో సంయుక్త ఉప సంచాలకులు జగన్నాద్ మజ్జి, డిప్యూటీ డైరెక్టరు దిబ్బకర్ బరిహ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

☛ రూ.11 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి రూ.11 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు పట్టణ ఇన్‌ఛార్జి సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక ఠాణాలో విలేకరులతో కేసు వివరాలు వెల్లడించారు. గత నెల 30న జమ్మలమడుగు మండలం ధర్మాపురానికి చెందిన వెంకట శివారెడ్డి తన బైక్ అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మంగళవారం కోవెలకుంట్ల బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, పేరుసోముల గ్రామానికి చెందిన మహమ్మద్ అలీ అక్బర్ బాషా, జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడుకు చెందిన హరిప్రసాద్ పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా జమ్మలమడుగు, పెద్దముడియం, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, బనగానపల్లి, కొలిమిగుండ్ల, తాడిపత్రి, ముద్దనూరు, పోలీసు స్టేషన్‌లలో కేసులున్నట్లు గుర్తించారు. జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడ్డారు. ఎస్ఐ హైమావతి, కానిస్టేబుళ్లు నాగేంద్ర, కృష్ణారెడ్డిని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

పెద్దహోతూరు.. మేడలు లేని ఊరు

■ హుచ్చు వీరప్పతాత ఉత్సవాలకు సిద్ధం ■ ఈ నెల 26న రథోత్సవం

ఆలూరు, న్యూస్‌టుడే: ఆ ఊరిలో ఎటు చూసినా.. మేడ ఉన్న ఇల్లు కనిపించదు. నిర్మించుకొనే ఆర్థిక స్థోమత లేక కాదు. . ఆ ఊరి కట్టుబాటు కాదనలేక. గ్రామంలో కర్ణాటక, రాయలసీమ ప్రాంతంలో పేరెన్నికగన్న హుచ్చు వీరప్పతాత ఆలయం ఆవరణలో ఉన్న మేడపై మరో నిర్మాణం చేపట్టాకే.. రెండంతస్తుల మేడ నిర్మించుకోవాలనేది తరతరాలుగా వస్తున్న కట్టుబాటని గ్రామస్థులు చెబుతున్నారు. అలా మేడలు కట్టేందుకు ప్రయత్నించిన వారు ఇబ్బందుల పాలయ్యారని ఆ ఊరి జనం విశ్వాసం. ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామస్థులు కుల దైవంగా భావించే హుచ్చు వీరప్పతాత ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 26న ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం రథోత్సవం జరపనున్నారు. 27న జాతరతో ఉత్సవాలు ముగియనున్నాయి. గ్రామంలోనే సజీవ సమాధి అయిన ఆయనకు గ్రామస్థులు ప్రత్యేకంగా ఆలయం నిర్మించి ఆరాదిస్తున్నారు. ఏదైనా అనారోగ్యం సోకితే.. ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటే వెంటనే తగ్గిపోతుందని గ్రామస్థుల విశ్వాసం. ఏటా హుచ్చు వీరప్పతాత ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పుష్పాలంకరణలో హుచ్చువీరప్పతాత విగ్రహం

అలంకార ప్రియుడిగా..

ఏటా సెప్టెంబరులో ఏడు రోజుల పాటు పంచాక్షరి జప యజ్ఞంతో పాటు సప్త భజనలు చేస్తారు. అందులో భాగంగా ఏడు రోజుల పాటు హుచ్చు వీరప్పతాతకు ప్రత్యేక పుష్పాలంకరణ చేపడతారు. ఒక్కో రోజు ఒక్కో కులానికి చెందిన వారు బెంగళూరు నుంచి సుమారు రూ.లక్షకు పైగా విలువ చేసే వివిధ రకాల పూలు తెప్పించి అలంకరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. రోజూ సుమారు వెయ్యి మందికి పైగా అన్నదానం చేస్తారు. హంపీకి పాదయాత్రగా వెళ్లి అక్కడ నదీ జలాలు తెచ్చి ఆలయంలో జలాభిషేకం నిర్వహిస్తారు.

ఆ పేర్లే అధికం

గ్రామంలో ఉచ్చీరప్ప, హోతూరప్ప, ఉచ్చీరమ్మ పేర్లు ఉన్న వారే అధిక సంఖ్యలో ఉన్నారు. పూర్వం కొంత మంది ఇళ్లలో పిల్లలు తీవ్ర అనారోగ్యంతో ఉండటం వల్ల తల్లిదండ్రులు ఆలయానికి వెళ్లి మొక్కుకున్నారు. దీంతో పిల్లల ఆరోగ్యం కుదటపడింది. ఇలా తమ పిల్లల ఆరోగ్యం కుదటపడటంతో వారికి హుచ్చు వీరప్పతాత పేరు కలిసొచ్చేలా నామకరణం చేశారు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు గ్రామంలో ఆ పేరునే కొనసాగిస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Network Leaders for New Network plan in EV - Bike rentals for details what'sapp: 90001 86267.

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని 73821 14647.

JOBS

KUN United Hyundai Kurnool. Wanted Accountants/ Service Advisors/ Sales Executives/ Team Leaders. Attractive Salary, Incentives. Contact: 98858 21222, 70936 85777, 97030 76555, 98855 37222, 91333 14336, 91601 14474. Experienced will be Preferred.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

కొండ అంచున ప్రమాదం

నంద్యాల జిల్లా సంజామల మండలం ఆల్వకొండ గ్రామం వద్ద ప్రధాన రహదారి మలుపులో ఉన్న కొండ వద్ద బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సి వస్తోంది. వర్షానికి మట్టి కరిగి రాళ్లు జారిపడటం సాధారణంగా మారింది. వాహనదారులకు రాత్రివేళ సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా, తగిన భద్రత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపల్ మారెన్న మంగళవారం తెలిపారు. శ్రీశైలం మండలంలో మొత్తం విద్యార్థులు 350 మందికి గాను 341 మంది హాజరైనట్లు చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ జి.సుబ్బారావు బందోబస్తును నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు: 94403 61729
ఆత్మకూరు: 90149 09024
నంద్యాల: 98853 28120

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: అప్పలరాపువీధిలో నియంత్రిక చుట్టూ రక్షణ కంచె లేదు. ఈ మార్గంలో రోజూ వందల సంఖ్యలో జనం, వాహనాలు తిరుగుతున్నాయి. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. - ఓబులేసు, స్థానికుడు. ✓: నియంత్రిక చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేస్తాం. -జయశంకర్, ట్రాన్స్‌కో ఈఈ. ?: ఏకలవ్యనగర్‌లో వంతెన వద్ద వీధి దీపం వెలగడం లేదు. రాత్రి వేళలో చీకటిగా ఉంది. -సంతోష్, స్థానికుడు. ✓: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. -షామీర్‌బాషా, పురపాలక ఏఈ.

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: నూనెపల్లె మండి నీళ్లవాగు వెనుక కాల్వలు శుభ్రం చేయడం లేదు. -తిరుమలయ్య, స్థానికుడు. ?: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో కుక్కల బెడద అధికమైంది. - శంకర్, స్థానికుడు. ?: నడిగడ్డలో దోమల బెడద ఎక్కువగా ఉంది. -సలీం, నడిగడ్డ. ?: పట్టణంలోని సరస్వతీ నగర్‌లో కోతులతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. చిన్న పిల్లలను గాయపరుస్తున్నాయి. -లక్ష్మీదేవి, స్థానికురాలు. ✓: కాల్వలను శుభ్రం చేయిస్తాం. దోమల మందును పిచికారి చేయిస్తాం. త్వరలోనే కుక్కలను, కోతులను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం. - లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఈ క్రాప్ నమోదు ఆధారంగా కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం రైతు సంఘాల నాయకులు ధర్నా కొనసాగించారు. భూ యజమానులకు సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి, రూ.2 లక్షల వరకు రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ అధికారులు కళ్యాణ్‌కుమార్, అయూబ్ బాషా, రమేష్‌కుమార్, నరసింహ, బాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మద్దులు, లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, వెంకటలింగం, బాల వెంకట్, వసంత, నాగరాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కోతలు లేకుండా.. మెరుగైన సరఫరా

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్తు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎప్పటికప్పుడు సమస్యలను అధికారులు పరిష్కరిస్తున్నారు. దీంతో జిల్లాలో విద్యుత్తు కోతలు గణనీయంగా తగ్గాయి. బిల్లులు సైతం ట్రూయాప్ నుంచి ట్రూ డౌన్ అవుతున్నాయి. నంద్యాల జిల్లాలో విద్యుత్తు సరఫరా గురించి శాఖాపరమైన సేవలు ఎలా అందుతున్నాయని వినియోగదారుల నుంచి ప్రభుత్వం ఆరా తీస్తోంది. తాజాగా విద్యుత్తు సరఫరా, పంపిణీ, సిబ్బంది పనితీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఫిబ్రవరి 21న ర్యాంకులు విడుదల చేసింది.

● ఉత్తమ విద్యుత్తు సేవలో జిల్లాకు రెండో స్థానం

ఎలాంటి ఇబ్బందులు రాకుండా..

ప్రజల సంతృప్తి విషయంలో ఏపీఎస్‌పీడీసీఎల్ సర్కిల్‌లోని 9 జిల్లాల్లో నంద్యాల జిల్లా 2వ స్థానంలో నిలిచింది. వినియోగదారులకు మూడు ప్రశ్నలు అడిగారు. నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా అందడంలో నంద్యాల జిల్లా మొదటి స్థానం, ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందడంలో 4వ స్థానం, విద్యుత్తు సిబ్బంది మీకు అందుబాటులో ఉన్నారా? అంశంలో 2వ స్థానం దక్కింది. జిల్లాలో ప్రజలకు ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, నూతన విద్యుత్తు ఉప కేంద్రాల నిర్మాణం, సౌర విద్యుత్తు ఉత్పత్తికి మెరుగైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్‌ఈ సుధాకర్ కుమార్ తెలిపారు.

జిల్లాలో సర్వీసులు

నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ విద్యుత్తు డివిజన్లు ఉన్నాయి. వీటిలో గృహ కనెక్షన్లు 5,28,093, వాణిజ్య 57,197, పారిశ్రామిక 4,568, వ్యవసాయ 1,10,294, ఇతర 12,490 కనెక్షన్లు ఉన్నాయి. అన్నీ కలిపితే 7,12,642 కనెక్షన్లు ఉన్నాయి.

	అవును (శాతాల్లో)	కాదు
మీకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరాల జరుగుతోందా?	80.43	19.57
మీ ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందుతోందా?	76.10	23.90
విద్యుత్తు సిబ్బంది మీకు అందుబాటులో ఉన్నారా?	75.25	24.75

కేసీ కాలువకు నీటి విడుదల

పగిడ్యాల, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదేశాల మేరకు మంగళవారం ముచ్చుమర్రి ఎత్తిపోతల రెండో పంపు ద్వారా 270 క్యూసెక్కుల నీటిని కేసీ కాలువకు విడుదల చేశారు. ఈసందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కుసుమ్ పథకానికి స్థల పరిశీలన

మిడుతూరు, న్యూస్‌టుడే: మిడుతూరులో పీఎం కుసుమ్ పథకం ఏర్పాటు కోసం డీఈ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్య, ఎస్‌ఈ సుధాకర్‌లు స్థల పరిశీలన చేశారు. ఫీడర్ సోలరైజేషన్ త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఈ శ్రాంతకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించాలి

మహానంది, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 10% నిధులు కేటాయించాలని మండల సీపీఐ సహాయ కార్యదర్శి పి.రాజు అన్నారు. మహానందిలోని రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బారావుకు పలువురు నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి ఆర్.సామేల్, సీనియర్ నాయకులు మిద్దె రాజేశ్వరయ్య, చల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేయొద్దు

డిపోలో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఆస్తులను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయొద్దని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీకాంత్, డిపో కార్యదర్శి సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. నంద్యాల ఆర్టీసీ డిపోలో మంగళవారం భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల నిర్వహణ పేరు చూపించి ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు రవి, యోగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ స్థలాలు, విద్యుత్ బస్సులను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక నందికొట్కూరు డిపో గేటు వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఏపీపీటీడీ, ఎన్ఎంయూ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా చేపట్టామన్నారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జీవీ రత్నం, ఆర్.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలని దీక్ష

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో అంగన్‌వాడీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. వారు మాట్లాడుతూ...ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షురాలు కామమ్మ, కోశాధికారి వరలక్ష్మి, ఏఐటీయూసీ నాయకులు ఓబులయ్య, అన్వర్‌బాషా, మల్లికార్జున, అంగన్‌వాడీ కార్యకులు శివమ్మ, జయమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకులు

అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలి

పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా పరిశ్రమల అధికారి మహబూబ్‌బాషా

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించి నంద్యాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా పరిశ్రమల అధికారి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైక్లింగ్ అండర్-18 షాప్ లీగ్ పోటీలను ప్రారంభించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

కూలీలకు ఉపాధి కల్పించండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: జూపాడుబంగ్లా మండలంలోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఐ నాయకులు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల స్థాయి ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఏపీవో రేష్మాకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దులేటి బాబు, తిరుపతయ్య, నాగన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య సేవలు మరవలేనివి

మహానంది, న్యూస్‌టుడే: మహానంది దేవస్థానానికి రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన లక్ష్మయ్య సేవలు మరవలేనివని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం లక్ష్మయ్య స్వగృహంలో మృతదేహానికి నివాళులు అర్పించి అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు రూ.25 వేల విలువైన చెక్‌ను అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధరరెడ్డి, నీలకంఠేశ్వరరాజు, సుబ్బారెడ్డిలు సంతాపం తెలిపారు.

మైదానంలో మట్టి కుప్పలు

నంద్యాల పట్టణంలోని కేఎస్ఎం పురపాలక పాఠశాల మైదానం అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వంలో నాడు-నేడు పనుల వ్యర్థాలను మైదానంలోనే పడేశారు. అవి గుట్టలుగా పేరుకుపోయాయి. వాటిపై పిచ్చి మొక్కలు పెరిగి విద్యార్థులు ఆడుకునేందుకు వీలు లేకుండా మారింది. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని క్రీడాకారులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల విద్య

మార్కింగ్ చేసి.. తగ్గించి వేసి

సున్నిపెంటలోని బస్టాండ్ సర్కిల్ నుంచి రింగు పార్కు, సీసీ రహదారి పనులకు రూ.8 కోట్లు మంజూరు చేశారు. మొదటి సారి ఇచ్చిన కొలతల ప్రకారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆక్రమణ దుకాణాలను తొలగించారు. బస్టాండ్ సర్కిల్ నుంచి రింగుపార్కు సెంటర్ వరకు 20 మీటర్ల రహదారి వేయాలని మార్కింగ్ వేశారు. కానీ ఓ వ్యక్తి దుకాణాల కోసం 20 మీటర్ల నుంచి 18 మీటర్లకు తగ్గించారని స్థానికులు చర్చించుకుంటున్నారు. –న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్

ఈత కొలను కాదు.. మురుగు కుంట

జిల్లా కేంద్రం నంద్యాల నడిబొడ్డున ఉన్న ఖాళీ స్థలాలు ఈత కొలనులను తలపిస్తున్నాయి. మురుగు పోయే మార్గం లేక నివాసాల మధ్యనే చేరిపోయి తటాకాలను తలపిస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున టెక్కెలో ఖాళీ స్థలాల మధ్య ఉన్న మురుగు కుంటలో దోమలు వృద్ధి చెంది దుర్వాసన వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారుల నుంచి కనీస చర్యలు మాత్రం లేవు. –న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

నాడు నేడు.. నిర్లక్ష్యం చూడు..

మండల పరిధిలోని పడమర ప్రాతకోట జడ్పీ పాఠశాల మైదానంలో నాడు-నేడు కింద నిధుల కింద పనులు చేపట్టి నిర్లక్ష్యంగా ఉంది. అయితే సిమెంట్ సరఫరా, నిధుల చెల్లింపుల్లో జాప్యం కావడంతో పనులు నిలిచిపోయాయి. వాస్తవంగా అదనపు గదులు, వంట గదుల నిర్మాణాలు చేపట్టారు. కానీ అదనపు గదుల నిర్మాణాలు ఇంకా తుది రూపునకు చేరలేదు. కనీసం పాఠశాల పునఃప్రారంభానికైనా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పగిడ్యాల

సంక్షిప్త సమాచారం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: తుగ్గలి మాజీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు పేర్కొన్నారు.

మిడుతూరు, న్యూస్‌టుడే: భర్త మృతి చెందడంతో రూ.2 లక్షల బీమా చెక్కును భార్యకు అందజేసినట్లు గార్గేయపురం ఏపీజీబీ బ్యాంకు మేనేజరు అన్వర్‌బాషా తెలిపారు.

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని టెక్కెలో ఉన్న నాగుల కట్ట గౌరి సమేత స్పటిక లింగేశ్వర అభయాంజనేయస్వామి ఆలయంలో నూతన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలనునిర్వహించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మహానంది, న్యూస్‌టుడే: సమన్వయంతోనే శివరాత్రి మహోత్సవాలు విజయవంతమయ్యాయని జనసేన నాయకులు కాకర్ల శివయ్య పేర్కొన్నారు. మహానందిలో మంగళవారం దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, మండల విద్యుత్తు శాఖ ఏఈఈ ప్రభాకరరెడ్డి, ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డిలను ఆయా కార్యాలయాల్లో విడివిడిగా కలిసి జనసేన నాయకుల ఆధ్వర్యంలో సన్మానం, బహుమతి ప్రదానం కార్యక్రమాలను నిర్వహించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండటంతో పాటు శక్తియాప్ ద్వారా అత్యవసర సమయంలో సమాచారం ఇవ్వాలని శక్తిటీం సభ్యులు వివరించారు. కొణిదేడు గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోనవరం గ్రామంలో బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బనగానపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషన్‌ను ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దానం వివరించారు.

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని బిలకలగూడూరు రహదారిలో లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో లారీ డ్రైవర్ వెంకటేశ్వర్లు గాయపడ్డారు.

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బాల అకాడమి సిల్వర్‌ఓక్స్ పాఠశాల డైరెక్టర్ రవీంద్రనాథ్, కరస్పాండెంట్ మాధవిలత పేర్కొన్నారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న నాజీయా, 4వ తరగతి చదువుతున్న జీవన్‌కృష్ణ విజేతలుగా నిలవడం అభినందనీయం అన్నారు.

ఘనంగా ప్రింటర్స్ డే

జాన్ గూటెన్ బర్గ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నంద్యాల ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రింటర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం గాంధీచౌక్‌లోని కాళికాంబ ఆలయంలో సమావేశం నిర్వహించారు. ప్రింటింగ్ పితామహుడు జాన్ గూటెన్ బర్గ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయం నుంచి కల్పనా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవిశేఖర్, కార్యదర్శి మద్దిలేటి, కోశాధికారి జమాల్‌బాషా, కార్యనిర్వహణ కార్యదర్శి ఓబులేష్, ఉపాధ్యక్షులు వెంకటరమణ, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రింటింగ్

ఓబులేసును సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రెస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, కాదరబాద్ నరసింగరావు జీవిత చరిత్ర, సుబ్రహ్మణ్యశాస్త్రి పుస్తకాలను ఇతర కవి, రచయితల వంద పుస్తకాలకు పైగా ముద్రించిన ఓబులేసును ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అంతర్జాతీయ శాస్త్రవేత్త కె.రవీంద్రనాథ్, మాజీ పురపాలక ఛైర్‌పర్సన్ దేశం సులోచన తదితరులు పాల్గొన్నారు.

చిత్రం.. భళారే సందేశం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: కుంచెతో చిత్రానికి ప్రాణం వస్తుంది. మనసులోని భావాలను పేపర్‌పై అందంగా చూపించ గల సత్తా ఆ చిన్నారిది. గీసిన చిత్రంలో అద్భుతాలే కనిపిస్తాయి. అందుకే చిన్న వయస్సులోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు అందుకుంటున్నాడు. నంద్యాల పట్టణానికి చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమారుడు సాయిహవిష్ చిత్ర లేఖనంలో రాణిస్తున్నారు.

సాధించిన పతకాలతో సాయిహవిష్

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు. చిన్నతనం నుంచి చిత్రలేఖనంపై ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు స్థానిక కోటేష్ ఆర్ట్ అకాడమిలో శిక్షణ ఇప్పిస్తున్నారు. కాలుష్యం వల్ల ఏర్పడే నష్టం, ప్లాస్టిక్ భూతం, పర్యావరణ కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలపై చిత్రాలు గీసి జాతీయ స్థాయిలో పతకాలు అందుకున్నాడు.

లభించిన పతకాలు

- 2023 గుంటూరు క్రియేటివ్ ఫైన్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ పోటీల్లో బంగారు పతకం.
- డిసెంబర్‌లో నాసిక్‌లో స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనలో ఉత్తమ అవార్డు.
- నెల్లూరులోని అమీర్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం.
- పల్నాడు జిల్లా వినుకొండలో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం.
- 2024 హైదరాబాద్‌లో ప్రొగ్రెస్ ఆఫ్ ఆర్ట్ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళ ప్రదర్శన పోటీల్లో బంగారు పతకం.
- బొట్టు బిళ్లలతో డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని తయారు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించాడు.
- 2025లో విజయవాడలో డ్రీమ్ ఆర్ట్ అకాడమి నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం అందుకున్నాడు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

అందుకున్న చెక్కులతో లబ్ధిదారులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి చెందిన 36 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ.ఫిరోజ్ పంపిణీ చేశారు. రూ.23,25,962 విలువ చేసే ఈ చెక్కులను ఆయన సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఏపీవోపై పలువురి దాడి

గడివేముల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఏపీవో వెంకటరమణపై కొందరు దాడి చేశారు. మంగళవారం ఏపీవో సిబ్బందితో సమావేశమయ్యారు. మహిళ సిబ్బందిని రికార్డుల గురించి ఆరా తీయగా ఇద్దరికి వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మహిళ సిబ్బంది బంధువులకు చెప్పడంతో వారు వచ్చి ఏపీవోను చితకబాదారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దాడిని నిలువరించారు.

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని శ్వేత మొదటి బహుమతి అందుకున్నట్లు కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థినికి బహుమతి అందించి అభినందించారు.

ధర్మాన్ని ప్రతి ఒక్కరూ రక్షించాలి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని రక్షించాలని నైమిశారణ్య శ్రీవారాహి పీఠాధిపతి హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు బాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు. మంగళవారం ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో రామకృష్ణ, అర్చకులు సురేష్‌శర్మ, సిబ్బంది సుబ్బారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



పీఠాధిపతిని సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

ఉత్సవాలను జయప్రదం చేయండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో ఏప్రిల్ 14 నుంచి 17 వరకు జరిగే నంది సాంస్కృతిక, కార్మిక ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం అధ్యక్షతన నిర్వహించారు. మురళి మాట్లాడుతూ ఏప్రిల్ 17 నుంచి 19వ తేదీ వరకు నంద్యాలలో సీఐటీయూ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, ఎల్లయ్య, కేఎండీ గౌస్, తిరుపతయ్య, రమణ కుమారి, బాల వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నంద్యాలకు చెందిన ఐదుగురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు శిక్షకుడు హాజీ తెలిపారు. మంగళవారం పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. నరసింహారావు 83 కిలోల విభాగంలో

పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ హాజీ

బంగారు, రేణుక కాంస్య, మనీషా వెండి, మౌలాలి వెండి, కిషోర్ వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

అన్న క్యాంటీన్లలో రుచికరమైన భోజనం

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5లకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని పురపాలక కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. అన్న క్యాంటీన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం పేద ప్రజలకు రుచికరమైన భోజనాన్ని అందిస్తుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని

ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

అన్నారు. పురపాలక కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన వస్తువులను కమిషనర్ శేషన్న, ఛైర్‌పర్సన్ మాబున్నిసా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్‌లు శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్ కలాం, శానిటరీ సూపర్‌వైజర్ మురళీధర్, లక్ష్మీనారాయణశర్మ పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో నైపుణ్యాభివృద్ధి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: క్షేత్ర పర్యటనల్లో

క్షేత్ర పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు

పరిశ్రమలను సందర్శించడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని జిల్లా బాలిక అభివృద్ధి అధికారిణి నాగసువర్చల అన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ విద్యార్థులు నంద్యాల సుజల పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను మంగళవారం సందర్శించారు. ఒకేషనల్ విభాగం విద్యార్థులకు పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించేందుకు విహారయాత్ర చేపట్టినట్లు తెలిపారు. పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ సుజల విద్యార్థులకు పైపుల తయారీలోని మెళకువలను వివరించారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇస్లాంపేటలో ఉన్న మదీన కాలనీలో అతా రసూల్ మసీదు ప్రాంతంలో సిమెంటు రహదారి నిర్మాణానికి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీదు మంగళవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సహకారంతో రూ.10 లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పురపాలక ఏఈ షాహీర్‌బాషా, గౌస్, రాజేశ్, వెన్నా శ్రీధర్‌రెడ్డి, నూర్ మహ్మద్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

బ్యాంకు అధికారులతో సమావేశమైన న్యాయమూర్తులు

రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఆర్థిక లావాదేవీలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలకు మేలు జరుగుతుందని సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎన్.శైలజ అన్నారు. న్యాయస్థాన ప్రాంగణంలో బ్యాంకు అధికారులతో న్యాయమూర్తి మంగళవారం సమావేశమయ్యారు. వచ్చే నెల 14న లోక్ అదాలత్ జరుగుతుందని.. ఇందులో ఆర్థిక కేసులను ఉభయ పార్టీలకు మేలు చేసే రీతిలో పరిష్కరించుకోవచ్చన్నారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తి టి.భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.శివరామిరెడ్డి, ఏజీపీ కె.బాలగుర్రెడ్డి, బ్యాంకు న్యాయ సలహాదారు మహబూబ్ బాషా, పి.సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

శిరివెళ్ల, న్యూస్‌టుడే : సమగ్ర భూసర్వే నేపథ్యంలో రైతులు తమ పొలం విస్తీర్ణంలో ఏవైనా అభ్యంతరాలుంటే గ్రామ రెవెన్యూ అధికారి దృష్టికి లేదా తహసీల్దారు కార్యాలయంలో అర్జీలు అందించాలని తహసీల్దారు విజయశ్రీ తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ మండలంలోని శిరివెళ్ల, వెంకటేశ్వరపురం తదితర గ్రామాల్లో భూసర్వే సాగుతోందని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

?: బనగానపల్లె వెళ్లే ఆర్డీదారి నుంచి సుబ్బారెడ్డి నగర్ వరకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - **కాలనీవాసులు, సుబ్బారెడ్డినగర్**
✓: సీసీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. - **మధుతేజరెడ్డి, మున్సిపల్ ఏఈ**
?: బేతంచెర్ల నుంచి సిద్ధేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. - **కాలనీవాసులు, దురావేట**
?: కాలువను శుభ్రం చేయించేలా పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు ఇస్తాం. - **మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, బేతంచెర్ల**
?: ఆళ్లగడ్డలోని బాలాజీ గ్రామంలో శుద్ధజల కేంద్రం సమీపంలోని కాలువ పూడికతో నిండిపోయింది. - **ఓబులేసు, బాలాజీ**
✓: శుభ్రత పనులు చేయిస్తాం. - **నూర్‌భాన్, ఎంపీడీవో - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం**
?: పట్టణంలో రాజా థియేటర్ పక్కన దిల్లీ బజారు ప్రాంతంలో రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. - **సునీల్, కొత్తపేట**
✓: కాలువలో వ్యర్థాలను తొలగించి మురుగునీరు రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం. - **రంగస్వామి, శానిటరీ ఇన్‌ఛార్జి అధికారి**
?: ఇందిరానగర్‌లో ఆంజనేయస్వామి గుడికి ఎదురుగా ప్రధాన రహదారి పక్కన కాలువలోని చెత్తను తీసి పక్కనే వేశారు. దుర్గంధం వస్తోంది. - **విజయశర్మ, ఇందిరానగర్**
✓: కాలువ పక్కన వేసిన వ్యర్థాలను వెంటనే తొలగించి శుభ్రం చేయిస్తాం. - **రంగస్వామి, శానిటరీ ఇన్‌ఛార్జి అధికారి - న్యూస్‌టుడే, డోన్ పట్టణం**
?: బనగానపల్లె వెళ్లే దారిలో జబుకల బట్టి సమీపంలో రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది ఇబ్బందులు పడుతున్నాం. తగిన చర్యలు అవసరం. - **గణేశ్, స్థానికుడు**
✓: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - **ప్రకాశ్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో - న్యూస్‌టుడే, కొవెలకుంట్ల గ్రామీణ**

ప్రైవేటుకు అప్పగిస్తే ఊరుకోం

నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు తదితరులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే : ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేటు వారికి అప్పగించే ప్రయత్నాన్ని మానుకోవాలని ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి ఆర్. బాలమద్దయ్య డిమాండు చేశారు. ఆ సంఘం పిలుపు మేరకు నాయకులు, కార్మికులు తదితరులు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఉమ్మడి జిల్లాలోని 12 డిపోలను ప్రైవేటు వారికి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం సరికాదని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులనూ ఆర్టీసీనే నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటుకు అప్పగిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పెద్దరాజులు, గ్యారేజీ అధ్యక్షుడు జి. మల్లికార్జున, కార్యదర్శి మాధవస్వామి, నాయకులు శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు జాగారమే

• స్థలాలను క్రమబద్ధీకరించుకోవడంలో నిర్లక్ష్యం
• ఇంటి పనులకు అనుమతులు కరవు

బనగానపల్లి, న్యూస్‌టుడే : బనగానపల్లి పరిసర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు గతంలో పెద్దఎత్తున స్థలాలు అమ్మకాలు చేపట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్లాట్లుగా మార్చి అమ్మకాలు సాగించారు. నిబంధనలకు తిలోదకాలిచ్చిన రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ఇదే అదనుగా స్థిరాస్తి వ్యాపారులు స్థలాలు అమ్ముకుని రూ.కోట్లు వెనకేసుకున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మించుకునేందుకు స్థల యజమానులు దరఖాస్తు చేసుకోగా అనుమతులు రావడం లేదు. దీంతో వారు ఆందోళనచెందుతున్నారు.


బనగానపల్లి సమీపంలో వేసిన లేఅవుట్

దరఖాస్తు చేసుకోకనే..

పట్టణానికి ఆనుకుని పొలాలు ఉన్న కొందరు రైతుల నుంచి వ్యాపారులు ఒక్కో ఎకరాను సుమారు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు కొనుగోలు చేశారు. నిబంధనల ప్రకారం వ్యవసాయేతర భూమిగా మార్పు కునేందుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. అలా చేయకనే ప్లాట్లుగా వేసి అమ్మేసుకున్నారు. ఒక్కో సెంటు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు అమ్ముకోవడం గమనార్హం. గతంలో అక్రమాలు జరిగినా అధికారులు దృష్టి సారించలేదు. వారి నిర్లక్ష్యం.. స్థిరాస్తి వ్యాపారుల దనదాహంతో స్థలాలు కొనుగోలు చేసినవారి పరిస్థితి దయనీయంగా మారింది.

ప్రభుత్వం అవకాశమిచ్చినా..

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలో వేసిన లేఅవుట్లలో అక్రమాలు ఉంటే.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చలానా రూపంలో నగదు చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తామని చెప్పింది. అయినా చాలామంది స్పందించడం లేదు. నియోజకవర్గ పరిధిలో 20కిపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. క్రమబద్ధీకరణకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం. చాలామందికి అవగాహన లేకపోవడం.. దీనికితోడు అధికారులు దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాల కోసం పలువురు దరఖాస్తు చేసుకుంటున్నా అనుమతులు రావడం లేదు.

● నంద్యాల రోడ్డు, పాపిలి రోడ్డు, తాడిపత్రి రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రధాన మార్గాల పక్కనే కొందరు వెంచర్లు వేశారు. వీటిల్లో పలువురు స్థలాలు కొనుగోలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకనే ప్లాట్లు వేసి అమ్మేశారు. పలు ఇళ్లు తాము అడ్డిదారులు పరిస్థితి దయనీయంగా మారింది.

● 'అక్రమ లేఅవుట్లను గుర్తించి తాఖీదులు జారీ చేస్తాం. అనుమతులు లేని ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేయొద్దని చెప్పినా చాలామంది పట్టించుకోలేదు. ప్రస్తుతం స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం అవకాశమిచ్చినా ఎవరూ స్పందించలేదు' అని ఈవో సతీశ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

మురుగు నిలిచి.. రోగాలు ముసిరి

మండల పరిధిలోని నల్లగట్ల గ్రామంలో అర్ధునాపురం రస్తాలోని తగ్గు బజార్ అధ్వానంగా ఉంది. రహదారిపై మురుగు నీరు నిలవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దోమల బెడద అధికంగా ఉండటంతో రోగాల బారిన పడుతున్నామని జనం పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, నల్లగట్ల (ఆళ్లగడ్డ గ్రామీణం)

బిల్లులు రాక.. పనులు సాగక

మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో భవనం మంజూరైంది. వైకాపా అధికారంలోకి వచ్చిన సమయంలో గుత్తేదారులు పనులు ప్రారంభించారు. బిల్లులు రాకపోవడంతో పనులను మధ్యలోనే ఆపేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, బేతంచెర్ల

గుంత.. ప్రమాదాలతో చింత

మండలంలోని బాచేపల్లె గ్రామంలో ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. అహోబిలానికి వెళ్లే దారిలోని నీటి ట్యాంకు సమీపంలో రహదారి దెబ్బతిని గుంత ఏర్పడింది. పలువురు గుంతల్లో పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. అహోబిలం బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో భక్తులు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. – బాచేపల్లె (ఆళ్లగడ్డ గ్రామీణం)

నియంత్రిక.. ముప్పు గుర్తించక

డోన్ నుంచి వెంకటాపురం వెళ్లే మార్గంలో సుంకులమ్మ ఆలయం సమీపంలో విద్యుత్తు స్తంభానికి నియంత్రికను ఏర్పాటు చేశారు. దీని చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగి నియంత్రికకు తగులుతున్నాయి. బలమైన గాలులు వీస్తే పెను ప్రమాదం జరిగే అవకాశముంది. వెంటనే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, డోన్

చర్యలు తీసుకోవాలని వినతి

డోన్, న్యూస్‌టుడే: పట్టణ సీపీఐ ఇంచార్జ్ బాషాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్‌కు సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. సీపీఐ మండల కార్యదర్శి నారాయణను కొట్టారని, దీనిపై విచారణ జరపాలంటూ అందజేశారు. తిమ్మాపురం గ్రామంలో ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని.. దీనిపై ప్రశ్నించిన నాయకులపై జరిగిన దాడిని ఆయనకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యకాస రాష్ట్ర గౌరవాధ్యక్షుడు విల్సన్, కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కె.ఎస్.జవహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

క్రేన్ ఢీకొని వృద్ధుడి మృతి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ పట్టణ శివారులోని శిల్ప కళామందిరాల వద్ద మంగళవారం క్రేన్ ఢీకొన్న ఘటనలో వృద్ధుడు మృతి చెందారు. రామాంజనేయులు అనే వ్యక్తి క్రేన్‌ను అజాగ్రత్తగా నడుపుతూ నడుచుకుంటూ వెళ్తున్న నంద్యాల దేవనగర్‌కు చెందిన టి.అగస్టీన్ (76)ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఆళ్లగడ్డ సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. పట్టణ ఎస్సై చిన్న పీరయ్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

దొంగల అరెస్టు

★ రాగితీగల స్వాధీనం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : రుద్రవరం మండల పరిధిలోని పంట పొలాల్లో విద్యుత్తు మోటార్ల వద్ద విద్యుత్తు తీగలు అపహరించే దొంగలను పట్టుకున్నారు. రుద్రవరం, కొండమాయపల్లె, వెలగలపల్లె గ్రామాల్లోని పంట పొలాల్లో రాత్రి వేళల్లో గత వారం రోజులుగా విద్యుత్తు మోటార్ల వద్ద తీగలు చోరీకి గురవుతున్నాయి. ఇదే విషయమై రైతులందరూ రుద్రవరంలోని అమ్మవారిశాల చర్చించుకుంటుండగా.. కొందరు వ్యక్తులు సంచులతో బస్సు ఎక్కుతుండటాన్ని గమనించారు. అనుమానంతో పోలీసుల సాయంతో మంగళవారం సంచులను తనిఖీ చేయగా.. రాగితీగల ముద్దలు బయట పడ్డాయి. ఇద్దరు వ్యక్తులు పరారవ్వగా.. నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వ్యక్తికి గాయాలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : డోన్ జాతీయ రహదారి ప్రాంతంలోని కొత్తకోట వద్ద రహదారి దాటుతున్న ఓ వ్యక్తిని మంగళవారం లారీ ఢీకొంది. బంధువులు దేవర చేస్తుండటంతో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రంగస్వామి కొత్తకోట గ్రామానికి వచ్చారు. తిరిగి గార్లదిన్నె వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా లారీ ఢీకొంది. ఆయన్ను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ శాసనవ్యవస్థ ఆటవిడుపు కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి వివిధ క్రీడా కార్యక్రమాలకు హాజరయ్యారు. క్రీడలు దేహదారుఢ్యానికి, శారీరక, మానసిక ప్రశాంతతకు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన చెప్పారు.

సమన్యాయం జరిగేలా చూడాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే : హిందూ దేవాలయాలపై అన్యమత పోస్టర్లను అతికిస్తుండటంతో హిందువులు ఆందోళన చెందుతున్నారని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భాజపా నాయకులు మంగళవారం కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని వర్గాలకు సమానంగా న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. భాజపా మండల శాఖ అధ్యక్షుడు రవికుమార్, నేతలు విజయ్‌భాస్కర్, ఎ.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాజపా నేతలు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

డోన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీల నిరసనదీక్షలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది కూర్చుని నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు అబ్బాస్, శ్రీకాంత్ మాట్లాడారు. సువర్ణ, రహమత్‌బీ, నాగలక్ష్మి, గుల్జర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రాం తాళ్లూరిని ఇరిగెల సోదరులు మంగళవారం కలిశారు. ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఆయన సోదరులు.. రాం తాళ్లూరిని మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు చేస్తున్న కృషిని వివరించారు. రానున్న రోజుల్లో ప్రజలతో మరింతగా మమేకమై పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని ఇరిగెల సోదరులకు సూచించారు.

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శితో ఇరిగెల సోదరులు

హిందీ భాషపై పట్టు తప్పనిసరి

ప్యాపిలి, న్యూస్‌టుడే: హిందీ భాషపై ప్రతి విద్యార్థి పట్టు పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయుని పార్వతి, సమితి ఉపాధ్యక్షుడు రామాంజినేయులు కోరారు. అనంతపురంలోని హిందీ సేవా సదన్ మహా విద్యాలయం ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు హిందీ భాషపై పరీక్ష నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థానిక శిశుమందిరం పాఠశాలలో ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రీడాకారులకు చేయూత అవసరం

డోన్, న్యూస్‌టుడే : యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి అన్నారు. స్థానిక కోట్లవారిపల్లె వద్ద బావిపల్లెకు చెందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. మండలంలోని చనుగొండ్ల గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరకు బుగ్గన అర్జున్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని పెద్దయ్యస్వామిని దర్శించుకున్నారు.

సంక్షిప్త సమాచారం

బేతంచెర్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో ప్రధాన రహదారిపై వీధి దీపాలు లేకపోవడంతో జనం ఇబ్బందులు పడేవారు. కాలనీవాసులు సమస్యను మున్సిపల్ ఛైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఏఈ మధుతేజరెడ్డి దగ్గరుండి సమస్యను పరిష్కరించారు.

గోవిందపల్లె (శిరివెళ్ల), న్యూస్‌టుడే: మండలంలోని వీరారెడ్డిపల్లె గ్రామంలో నానో యూరియా వినియోగంపై ఏవో సుధాకర్ మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని అన్నదాతలకు సూచించారు.

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే : గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారిణి భవ్యశ్రీ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు తదితరులకు మంగళవారం అవగాహన కల్పించారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమిస్తామని డిపో వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎన్ఎన్ వలి, రీజనల్ ఉపాధ్యక్షుడు కేఆర్ ఎల్లయ్య హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బనగానపల్లి ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తే గుర్తింపు లభిస్తుందని జేకేఆర్ సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందాచారి అన్నారు. పోస్టుమాస్టర్ భాస్కర్ ప్రసాద్ ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోస్టుమాస్టర్‌గా ఎంపికవడంతో జిల్లెల్ల గ్రామంలో మంగళవారం సత్కరించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని వాసవీ జూనియర్ కళాశాలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వాసవీ విద్యాసమాజం అధ్యక్షులు శివప్రసాదు, కళాశాల కరస్పాండెంటు రమణ గుప్తా కోరారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో కోవెలకుంట్ల యువ సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, రాంపుల్లయ్య, నజీర్, శేఖర్, నారాయణ పాల్గొన్నారు.

అవుకు, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు ఆది గ్రంథాలు ఉపయోగపడతాయని, రామాయణ, భాగవతంలోని అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. తితిదే ఆధ్వర్యంలో కొండమనాయునిపల్లెలో మూడురోజుల పాటు నిర్వహించనున్న ధార్మిక కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే : నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని.. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెంచి న్యాయం చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, ప్రాజెక్టు కార్యదర్శి రోజారమణి కోరారు. బనగానపల్లిలో మంగళవారం రెండోరోజు సైతం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య, సుజాత, సరస్వతమ్మ, భాగ్యలక్ష్మి, సుకన్య, చంద్రకళ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి

భక్తిశ్రద్ధలతో దీక్ష విరమణ పూజలు

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నృసింహ దీక్ష విరమణ పూర్వాంగ పూజ ఘనంగా నిర్వహించారు. దీక్ష విరమణ బుధవారం ఉండటంతో స్వామి మాల ధారులు ఇరుముడులతో అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా దిగువ అహోబిలంలో నవనారసింహ పడిపూజ చేసి అన్నదానం చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటం, చెక్కభజనలు తదితరాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కోలాటం ఆడుతున్న చిన్నారులు

నైపుణ్యాలతోనే ఉద్యోగావకాశాలు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు వివిధ కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, నైపుణ్యాలతోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగకేశాలు అన్నారు. పట్టణంలోని పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులకు సంబంధించి వృత్తి విద్యాకోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు.. పారిశ్రామిక పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ఒకేషనల్ ఉపాధ్యాయులు మహేష్, అల్లీపీరాతో కలిసి మంగళవారం సందర్శించారు. అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐటీఐలోని డిజిటల్ తరగతులు, ట్రేడులు తదితరాలను వివరించారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎత్తిపోతల పథకానికి నిధుల మంజూరు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి సమీపంలో ఎస్సార్బీసీ వద్ద నున్న జుర్రేరు ఎత్తిపోతల పథకానికి రూ.41.65 లక్షలు మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సార్బీసీ పరిధిలో 93.160 కిలోమీటరు వద్ద నుంచి జుర్రేరు ఎత్తిపోతల పథకం వరకు నీరు వెళ్లేందుకు తూము ఏర్పాటు చేస్తారు. దీంతో కాలువ నుంచి సాగునీరు సులువుగా ఎత్తిపోతల పథకానికి వెళ్లేందుకు వీలుంటుంది. త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

చెత్తేసి.. రోగాలు కుప్పేసి

★ కలుషితమవుతున్న వాగులు, వంకలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపిస్తోంది. దీనికి తోడు వాగులు, వంకలు సైతం వ్యర్థాలతో నిండిపోయి నీరంతా కలుషితమవుతోంది. ఫలితంగా జనం రోగాలబారిన పడుతున్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో ఆళ్లగడ్డ పట్టణంతోపాటు మండలాలు, గ్రామాల్లో ప్రతిరోజూ 110 మెట్రిక్ టన్నుల వరకు చెత్త పోగవుతూ ఉంటుంది. వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేయకుండా అన్ని గ్రామాల పరిధిలో చెత్త సంపద కేంద్రాలను గతంలో ఏర్పాటు చేశారు. గత వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణను గాలి కొదిలేసింది. ఫలితంగా ఆయా పంచాయతీల పరిధిలో రహదారుల పక్కన, వాగులు, వంకల్లో వ్యర్థాలను పడేస్తున్నారు. నీరంతా కలుషితమవుతోంది.

ఆళ్లగడ్డ పట్టణంలోని గని గుంతల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

మురికి కూపాలను తలపిస్తూ..

ఆళ్లగడ్డ మండలం.. ఓబులంపల్లె గ్రామంలోని రాళ్ల వాగు, యాదవాడ రస్తాలోని తుండ్ల వాగులో వ్యర్థాలు పడేస్తున్నారు. ఫలితంగా వాగు పరిసరాలు మురికి కూపాన్ని తలపిస్తున్నాయి. నీటి ప్రవాహం వచ్చినప్పుడు చెత్తంతా వాగులో కలిసిపోయి నీరు కలుషితమవుతోంది.

● పాతకందుకూరు గ్రామంలో ఊర కుంట సమీపంలో చెత్త వేస్తున్నారు. ఊరికి ప్రధాన జలవనరైన ఈ కుంటలో నీరు సమృద్ధిగా ఉంటుంది. పొలాలకు, పశువులకు దాహం తీర్చేందుకు ఈ నీటిని వినియోగిస్తుంటారు. ఇక్కడ వ్యర్థాలు వేస్తున్నా చర్యలు శూన్యమే.

● చాగలమర్రి మండలంలోని తోడేళ్లపల్లె గ్రామ కుంట చెత్తకు నిలయంగా మారింది. శెట్టివీడు గ్రామ సమీపంలోని ఎర్రవంక, అడ్డవాగు వద్ద సైతం ఇదే దుస్థితి నెలకొంది.

వరద ముంచెత్తి..

ఓబులంపల్లెలోని తుండ్ల వాగు వద్ద చెత్త వేయడంతో నీటి ప్రవాహానికి అడ్డుపడి గతేడాది ఊర్లోకి వరద నీరు చేరి ప్రధాన వీధులు జలమయమయ్యాయి. మరోవైపు ప్లాస్టిక్ వ్యర్థాలంతా భూమిలో చేరుతుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ● శిరివెళ్ల మండలంలోని రుద్రవరం రహదారిలో వక్కిలేరు వాగు సమీపం, గోవిందపల్లెలోని కుంట వద్ద వ్యర్థాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శ్మశాన స్థలం కాపాడాలని ఆందోళన

నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ముత్యాలపాడు (చాగలమర్రి), న్యూస్‌టుడే: ముత్యాలపాడు గ్రామంలోని అంకాలమ్మ దేవాలయ సమీపంలోని స్థలంలో గత కొన్నేళ్లుగా వివిధ కులాలకు చెందినవారు చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేవారని.. ప్రస్తుతం ఆ స్థలం తమదంటూ కొందరు శ్మశాన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామానికి చెందిన పెద్దమస్తానయ్య, నరేష్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు తదితరులు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఆందోళన చేశారు. శ్మశాన స్థలం అలానే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి ట్యాంకుల ఏర్పాటు

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో జంతువుల దాహార్తి తీర్చేందుకుగాను అటవీ ప్రాంతంలో నూతనంగా నాలుగు నీటి ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు సబ్ డీఎఫ్‌వో శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జంతువుల దాహం తీరేందుకుగాను రుద్రవరం రేంజ్ పరిధిలో 29, చెలిమ రేంజ్‌లో ప్రస్తుతం 26 నీటి గుంతలు ఉన్నాయని చెప్పారు. రుద్రవరం రేంజ్‌లో నాలుగు నీటి ట్యాంకులు ఉన్నాయని.. మరో నాలుగింటిని రూ.. 4 లక్షలతో నిర్మించామన్నారు. రుద్రవరం రేంజ్ పరిధిలో 8, చెలిమ రేంజ్ పరిధిలో నలుగురు ఫైర్ వాచర్లను నియమించామన్నారు. చెలిమ రేంజర్‌గా నాగభూషణం బాధ్యతలు స్వీకరించినట్లు సబ్ డీఎఫ్‌వో చెప్పారు.

ఒత్తిడిని దూరం చేసుకోవాలి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : విద్యార్థులు ఒత్తిడిని దూరం చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. కోవెలకుంట్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఒత్తిడికి గురైతే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు టీం తరఫున శిక్షకులు ప్రసాదరెడ్డి, వాలంటీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొని పలు అంశాలను వివరించారు.

(c) eenadu

నిర్ణీత వ్యవధిలో పంచాయతీ ఎన్నికలు

మంత్రి రబినారాయణ నాయక్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది లోనే ముందస్తుగా పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్న వార్తలు నిరాధారమని, 2027 ఫిబ్రవరిలో నిర్ణీత వ్యవధి లోనే జరుగుతాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రబినారాయణ నాయక్ మంగళవారం శాసనసభలో లిఖితపూర్వక సమాధానంగా చెప్పారు. తర్వాతాయన విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీలు, సమితుల పునర్విభజన ఎన్నికల ముందు సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం ఈ దిశగా ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) జనగణన కార్యక్రమం చేపడుతున్నందున స్థానిక సంస్థలకు సంబంధించి పునర్విభజన సాధ్యం కాదని స్పష్టం చేశారు.

2.81 లక్షల మందికి పక్కా ఇళ్లు: 2025-26 సంవత్సరంలో పేద కుటుంబాలకు 2.81 లక్షల పక్కా ఇళ్లు కేటాయించామని, ఇళ్ల స్థలాలు లేని 306 కుటుంబాలకు పట్టాలూ ఇచ్చినట్లు నాయక్ చెప్పారు.

ఏడుగురిని పొట్టన పెట్టుకున్న అమో బస్సులు: సభ్యులడిగిన మరో ప్రశ్నకు పట్టణాభివృద్ధి శాఖ కృష్ణచంద్ర మహాపాత్ర్ సమాధానమిస్తూ గత ఏడాది కాలంలో అమో బస్సులు 7 మందిని పొట్టన పెట్టుకున్నాయన్నారు.

114 ఏనుగుల మృతి: అసెంబ్లీలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి గణేశ్‌రామ్‌సింగ్ ఖుంటియా సభ్యులడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో గడిచిన 18 నెలల్లో రాష్ట్రంలో 114 ఏనుగులు వివిధ కారణాలతో మృతి చెందాయని పేర్కొన్నారు. విద్యుత్తు తీగలు తగిలి 42 వన్యప్రాణులు మృతి చెందాయన్నారు.

మహిళా ఖైదీ అనుమానాస్పద మృతి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లా నిమపడ సబ్‌జైలులో మధుస్మిత బరాల్ అనే మహిళా ఖైదీ సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె ఆత్మహత్య చేసుకుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూరీ జిల్లా డెలాంగ్ గ్రామానికి చెందిన ఆమె ఒక హత్య కేసులో కారాగారంలో ఉంది. మధుస్మిత తాను ధరించిన చీర సాయంతో ఉరేసుకుందని జైలు అధికారవర్గాలు తెలిపాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. నివేదిక అందిన తర్వాత వాస్తవాలు బహిర్గతమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

1,754 గ్రామాలకు అందని అంతర్జాలం సేవలు

వివరాలు వెల్లడిస్తున్న మహాలింగ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 1,754 గ్రామాలకు మొబైల్, అంతర్జాల సేవలు లేవని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖల మంత్రి ముఖేష్ మహాలింగ తెలిపారు. శాసనసభలో సోమవారం పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్రకడం అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 6,798 పంచాయతీలు ఉండగా, 6,785 పంచాయతీలకు అంతర్జాల అనుసంధానం జరిగింది. పంచాయతీల పరిధిలో మొత్తం 51,176 గ్రామాల్లో 49,422 మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉంది. మిగతా 13 పంచాయతీల్లోని 1,754 గ్రామాలకు అనుసంధానం జరగాల్సి ఉంది.

కొరాపుట్‌లో రత్నకుమార్ పట్నాయక్ పర్యటన

కొరాపుట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ రత్నాకర్ పట్నాయక్

కొరాపుట్(మాచ్‌ఖండ్), న్యూస్‌టుడే: బీమాశాఖ ఆధునికీకరణ అనంతరం ప్రారంభోత్సవానికి జీవితబీమా సంస్థ ఎండీ రత్నాకర్ పట్నాయక్ మంగళవారం కొరాపుట్ వచ్చారు. స్థానిక సర్క్యూట్ కార్యాలయం నుంచి సంప్రదాయ ధింసా నృత్యం నడుమ ఎల్ఐసీ కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. అనంతరం నూతనంగా ఆధునికీకరించిన కార్యాలయాన్ని ప్రారంభించారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధితో ఎల్ఐసీ ముందుకు సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీతో పాటు ఈడీ ఇంజినీరింగ్ పి.కె.జె డుంగ్ డుంగ్, డిప్యూటీ సీఈ జయద్‌ఖాన్, బరంపురం ఎస్‌డీఎం సుశాంత్‌కుమార్ పాణిగ్రహి, సంబల్‌పూర్ ఎస్‌డీఎం రబినారయణ్ పూజారి, కొరాపుట్ సీనియర్ బీఎమ్ శ్రీనివాస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంపద లెక్కింపునకు అంతా సిద్ధం

శ్రీక్షేత్ర పాలనాధికారి పాఢి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జగన్నాథుని రత్నభాండాగారంలోని సంపద లెక్కింపునకు అంతా సిద్ధమైందని, ప్రభుత్వం 14 పేజీల నియమావళి శ్రీక్షేత్ర యంత్రాంగానికి పంపించిందని పాలనాధికారి అరవిందపాఢి చెప్పారు. మంగళవారం పూరీ శ్రీక్షేత్ర కార్యాలయంలో అధికారుల సన్నాహక సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మార్చి నుంచి రథయాత్ర వరకు 135 రోజుల వ్యవధిలో పండగలు, పర్వదినాలు, శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవులు మినహాయిస్తే లెక్కింపునకు 24 రోజుల వ్యవధి మిగిలి ఉంటుందని చెప్పారు. సెలవులు, ఉత్సవాల సమయాల్లో స్వామి దర్శనానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తారని, జగన్నాథుని ప్రత్యేక సేవలు కొనసాగుతాయని, ఈ సమయంలో ఆభరణాల లెక్కింపు సాధ్యం కాదని ఎస్ఓపీలో పేర్కొనడంతో సమయానుకూలంగా తేదీలు నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలో శ్రీక్షేత్ర పాలకవర్గం పూరీ గజపతి దివ్యసింగ్‌దేవ్ అధ్యక్షతన జరుగుతుందని, లెక్కింపు తేదీలు అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఈ ప్రక్రియ కోసం పరిశీలన, సమన్వయ సంఘాలు ఏర్పాటయ్యాయని, ఉన్నతాధికారులు సభ్యులుగా నియమితులయ్యారన్నారు. ఈ రెండు సంఘాల ఆధ్వర్యంలో లెక్కింపు జరుగుతుందని, రిజర్వ్‌బ్యాంకుకు చెందిన ఇద్దరు అధికారులు, పసిడి, రత్నాలు, వజ్రాలు, మణులు అంచనా వేసే నిపుణులు, అనుభవజ్ఞులైన నలుగురు సేవాయత్‌లు, శ్రీక్షేత్ర పాలనాధికారి, పూరీ పాలనాధికారులు ఉంటారన్నారు. భద్రతా రంగా భాండాగారం తాళం చెవులు ఖజానాలో ఉంటాయని, లెక్కింపు సమయంలో మేజిస్ట్రేట్ సమక్షంలో తెరుస్తామన్నారు. లెక్కింపు ప్రక్రియంతా డిజిటలైజేషన్ జరుగుతుందని చెప్పారు. పూర్తవడానికి ఎన్నాళ్లు పడుతుందన్నది ఇప్పుడే చెప్పలేమని, ఇదంతా జగన్నాథుని అనుగ్రహమని పాఢి తెలిపారు.

మాటలతో కాలక్షేపం... అన్నిరంగాల్లో విఫలం

రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టిన నవీన్‌పట్నాయక్

ప్రసంగిస్తున్న నవీన్

సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పాలకులు మాటలతో మభ్యపెట్టకుండా ప్రజలకు మేలు చేయాలని, వారంతా చేతలు కోరుకుంటున్నారని, డబుల్ ఇంజిన్ పాలనలో దగా జరిగిందని విపక్ష నేత, బిజద అధినేత నవీన్ పట్నాయక్ ధ్వజమెత్తారు. మాటలతో కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. అన్నదాతల ఇబ్బందులపై 7 రోజులుగా శాసనసభా కార్యక్రమాలను స్తంభింపజేసిన బిజద మంగళవారం భువనేశ్వర్‌లో భారీ ర్యాలీ, బహిరంగసభ నిర్వహించింది. 30 జిల్లాల నుంచి బిజద నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సీఎం మోహన్ హాయ్.. హాయ్ అంటూ ఎద్దేవా చేశారు. అనంతరం లోయర్ పీఎంజీ కూడలి వద్ద జరిగిన బహిరంగ సభలో నవీన్ మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ పాలనకు త్వరలో రెండేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో రాష్ట్రానికి ఒరిగిందేమిటని ప్రశ్నించారు.

అన్నదాతల రోదన వినిపించదా?

అధికోత్పత్తులు సాధించిన అన్నదాతలు పంట విక్రయించుకోలేక రోదిస్తుండగా, భాజపా పెద్దలు ధాన్యం కొనుగోళ్లు సవ్యంగా జరుగుతున్నాయని చెప్పుకోవడం దురదృష్టకరమన్నారు. 193.06 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులకుగాను ఇంతవరకు 60.09 లక్షల టన్నుల సేకరణ జరిగిందన్నారు. పంట విక్రయిస్తున్న రైతులు బ్యాంకు ఖాతాలకు 15 రోజుల వరకు సొమ్ము జమ కావడం లేదన్నారు. ఒక రైతు నుంచి 1,500 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని 'సీలింగ్' పెట్టడం అన్యాయమన్నారు. మండీల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, క్వింటా ధాన్యానికి 10 నుంచి 15 కిలోలు కోత విధించడం, సకాలంలో టోకెన్లు కేటాయించకపోవడం దారుణమన్నారు.

మహిళలకు రక్షణ కరవు

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, బాలికలపై జరుగుతున్న అత్యాచార ఘటనలు ఆవేదనకు గురి చేస్తున్నాయని, ప్రతిష్ఠ దిగజారుస్తున్నాయని పేర్కొన్నారు. క్షీణించిన శాంతిభద్రతలపై పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని, వలసలు తీవ్రరూపం దాల్చాయన్నారు.

ఏదీ చిత్తశుద్ధి?

ఎన్నికల సమయంలో ఎన్నో చెప్పిన భాజపా పెద్దలు ఏం సాధించారో చెప్పగలరా? అంటూ నవీన్ ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలపై బిజద ఉద్యమిస్తుందని, సభ లోపల, వెలుపల ప్రతిఘటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజద ఉపాధ్యక్షులు దేవీప్రసాద్ మిశ్ర, సంజయ్ దాస్‌వర్మ, విపక్ష ఉపనేత ప్రసన్న ఆచార్య, చీఫ్‌విప్ ప్రమీలా మల్లిక్, పార్టీ ఎమ్మెల్యేలు, మహిళా, యువ, ఛాత్ర విభాగం నేతలు మాట్లాడారు. సమావేశానంతరం ప్రసన్న ఆచార్య విలేకర్లతో మాట్లాడుతూ అన్నదాతలకు న్యాయం చేయడానికి బిజద చేపట్టిన ఉద్యమం కొనసాగుతుందని, సబ్ డివిజన్, సమితి కేంద్రాల్లోనూ ఆందోళనలు చేపడతామని తెలిపారు.

మంగు లొంగిపో

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులకు తోడుగా ఉంటూ మావోయిస్టుగా మారిన కన్న మంగు పోలీసుల ఎదుట లొంగిపోవాలని వాళ్ల తల్లిదండ్రులు కోరుతున్నారు. అడవి బాట పట్టిన తన బిడ్డ గురించి ఏ క్షణం ఎలాంటి వార్త వినాల్సి వస్తోందోనని ఆందోళన చెందుతున్నారు. కాశీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పంచాలి గ్రామానికి చెందిన నీలేయ్ మాఝి కుమారుడైన మంగు మాఝి పశువుల కాపరిగా జీవనం కొనసాగిస్తూ 15 ఏళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయి అడవి బాట పట్టాడు. నాటి నుంచి నేటి వరకు ఆయనను చూడలేదని గ్రామస్థులు తెలిపారు.

మావోయిస్టులపై ఆసక్తి

కాశీపూర్ సమితిలో బాసంగిమాలిలో జరిగిన భారీ ఎన్‌కౌంటరు తరవాత మావోయిస్టులంటే ఆసక్తి పెంచుకొని ఇంటిని వదిలి వెళ్లిపోయాడు. ఉద్యమ నేత నిఖిల్, అజాద్‌తో కలిసి కేకేబీఎన్, వంశధార, నాగావళి డివిజన్‌లలో ఎసీఎమ్‌గా పనిచేశాడు. కేడర్‌ను బలోపేతం చేసే పనిలో కాశీపూర్ సమితిలో గ్రామాల్లో తిరుగుతూ యువతీయువకులను దళంలో చేర్చే ప్రయత్నం విఫలం కావడంతో నియమగిరి ప్రాంతానికి వెళ్లిపోయాడు. మంగు దళంలో ఉంటూనే కలహండికి చెందిన కున్ని మాఝిని వివాహం చేసుకున్నాడు. ఆమె కూడ దళంలో సభ్యురాలిగా పనిచేస్తోంది. దళ నాయకులు నిఖిల్, అజాద్ వంటి వారు పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. మావోయిస్టులంతా మార్చి 31లోగా లొంగిపోవాలని ప్రభుత్వం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా మంగుపై జిల్లాలో పలు పోలీసుస్టేషన్‌లలో కేసులు ఉన్నట్లు పోలీసు వర్గాల తెలిపాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 40 మంది మావోయిస్టులు ఉన్నారు. ఇందులో రాయగడ జిల్లాలో 12 మంది ఉన్నట్లు తెలిపారు. వీరంతా ప్రాణ భయంతో లొంగుబాటు ప్రయత్నాలు చేస్తున్నారు. మంగు, ఆయన భార్య కున్ని లొంగిపోవాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఎక్కడ ఉన్నామన్నది తెలియజేస్తే తామే పోలీసులకు సమాచారం ఇస్తామని అంటున్నారు.

మంగు తల్లిదండ్రులు

ఓ ఇంటిపై నుంచి ఎగిరిపడిన రేకులు

భారీ వర్షానికి మూడిళ్లు ధ్వంసం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పొట్టంగిలో, రాత్రి సిమిలిగుడలో, మంగళవారం ఉదయం మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజా జీవనం స్తంభించిపోయింది. మరోపక్క పొట్టంగి సమితి పుకిలి గ్రామపంచాయతీకి చెందిన మాలిగుడలో వర్షానికి రాధిక పామియా, రబీ, అరుణ్ హంటల్‌ల ఇళ్ల పైకప్పులు ఎగిరి పడి తీవ్రనష్టం కలిగించాయి. ఇళ్లల్లో ఉన్న ఆహార గింజలు తడిచి ముద్దయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కురవడంతో కూరగాయల పంటలకు నష్టం జరిగే అవకాశం ఉన్నట్లు రైతులు భయాందోళన చెందుతున్నారు. వర్షానికి జరిగిన నష్టానికి సంబంధించిన సమాచారం అందిందని, రెవెన్యూ అధికారులు దీనిపై సర్వే జరిపి నివేదిక అందజేస్తే బాధితులను ఆదుకుంటామని పొట్టంగి తహసీల్దార్ దేవేంద్ర బహదూర్ సింగ్ అన్నారు.

న్యాయం చేయండి

బ్రహ్మపుర సబ్‌కలెక్టరు కార్యాలయం బయట ధర్నా చేస్తున్న కృషక్ సభ నాయకులు, కౌలు రైతులు తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి తహసీల్దార్ పరిధిలో మందిరం పేరిట ఉన్న భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని కౌలు రైతులు విన్నవించారు. ఒడిశా కృషక్ సభ ఆధ్వర్యంలో పలువురు రైతులు, కౌలు రైతులు మంగళవారం బ్రహ్మపుర సబ్‌కలెక్టరు కార్యాలయం బయట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టరు పేరిట ఓ వినతిపత్రాన్ని కార్యాలయం అధికారులకు అందజేశారు. సంబంధిత భూముల్లో తరతరాలుగా ఇరవై కుటుంబాలు కౌలు చేస్తూ పండించిన ధాన్యంలో ఎక్కువ మొత్తం మందిరం నిర్వహణకు ఇస్తున్నామని వివరించారు. 1998లో అప్పటి తహసీల్దారు తమను కౌలు రైతులుగా గుర్తించారని వారు పేర్కొన్నారు. ఇటీవల మందిరం ట్రస్టీ పేరిట ఒకరు తమకు తెలియకుండా ఆ భూముల్లో చాలాభాగం అక్రమంగా విక్రయించారని వారు ఆరోపించారు. ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని తెలిపారు. దీనిపై దర్యాప్తు చేయించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఈ ధర్నాలో పి.హరికృష్ణ రెడ్డి, పి.శివశంకర్, కైలాస్ షడంగి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ ప్రమోద్‌కు ఘన స్వాగతం

ప్రమోద్ భగత్‌కు పుష్పగుచ్ఛాలందజేస్తున్న క్రీడాశాఖ అధికారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బెహ్రయిన్‌లో జరిగిన బీడబ్ల్యూఎఫ్ పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ పోటీల్లో వరుసగా ఆరోసారి పసిడి పతకం సాధించి ప్రపంచ ఛాంపియన్‌గా ప్రమోద్ భగత్ నిలిచిన సంగతి తెలిసిందే. ఆయన మంగళవారం మధ్యాహ్నం రాష్ట్రానికి చేరుకున్నారు. భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడా శాఖ అధికారులు, రాష్ట్ర పారా క్రీడల సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. యువ క్రీడాకారులు ప్లకార్డులు, ఫ్లెక్సీలతో విమానాశ్రయం బయట సందడి చేశారు. పారా క్రీడల సంఘం కార్యదర్శి సునీల్ ప్రధాన్, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు ప్రమోద్‌కు అభినందనలు తెలిపారు.

మజ్జిగౌరి ఆలయంలో పూజల వివరాలు

ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి సర్వ దర్శనం. 12.30 నుంచి 2.00 గంటల వరకు మహానైవేద్యం, ఆలయం మూత. 2.00 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనం. సాయంత్రం 6.00 గంటలకు ప్రత్యేక హారతి.

– న్యూస్‌టుడే, రాయగడ

క్రాంతి కవి లక్ష్మీకాంతకు శ్రద్ధాంజలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సాహితీరంగానికి ఎనలేని సేవలందించిన క్రాంతికవి లక్ష్మీకాంత మహాపాత్ర్ ఉత్కళ జననీ గర్వించే ముద్దుబిడ్డ అని, ఆయన రచనలు భావితరాల వారికి దిక్సూచిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. మంగళవారం క్రాంతికవి వర్ధంతిని పురస్కరించుకుని భువనేశ్వర్‌లో గల అసెంబ్లీ ఆవరణలో ఆ మహనీయుని విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. సీఎంతోపాటు ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్‌సింగ్‌దేవ్, సభాపతి సురమాపాఢి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



క్రాంతికవి విగ్రహం వద్ద సీఎం మోహన్, ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, సభాపతి సురమాపాఢి శ్రద్ధాంజలి

సర్ప ప్రేమికుడు స్వాధీన్ సాహు కాపాడిన అరుదైన జాతి సర్పం

బ్రహ్మపురలో అరుదైన 'అల్బినో కామన్ వుల్ఫ్' పాము

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో బెజ్జిపురం రథొ వీధిలోని నళినీ పండా అనే వ్యక్తి ఇంటి ప్రహరీపై సోమవారం అరుదైన 'అల్బినో కామన్ వుల్ఫ్' జాతి పాము కనిపించింది. రాత్రి సుమారు 11 గంటలకు సమాచారం అందుకున్న స్నేక్ హెల్ప్‌లైన్ సమన్వయకర్త స్వాధీన్ కుమార్ సాహు హుటాహుటిన చేరుకొని పామును పట్టుకున్నారు. దానిని మంగళవారం సమీపంలోని రిజర్వు అడవుల్లో సురక్షితంగా విడిచిపెట్టారు.

ప్రేమికుడే అపహరించుకుపోయాడు

బొలంగీర్‌లో నవవధువు కిడ్నాప్ కేసులో వీడిన చిక్కుముడి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: బొలంగీర్‌లో సంచలనం రేపిన నవవధువు అపహరణ కేసులో చిక్కుముడి వీడింది. సినీపక్కీలో జరిగిన ఈ ఘటనలో ప్రేమికుడే వధువును తీసుకెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వధువు రశ్మి, ఆమె ప్రియుడిని మంగళవారం సంబల్‌పూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. పెళ్లి జరిగిన తరువాత తనని తీసుకెళ్లిపోవాలని రశ్మి ప్రియుడికి సూచించింది. దీంతో కారులో వెళుతున్న కొత్త జంటను మధ్య దారిలో అడ్డగించి, వరుడిని తుపాకీతో బెదిరించి రశ్మిని వేరే కారులో తీసుకెళ్లిపోయినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. విచారణ జరుగుతోందని, పూర్తి వివరాలు తరువాత వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

మహిళ మెడపై కత్తిపెట్టి దోపిడీ

నవరంగపూర్, న్యూస్‌టుడే: మారణాయుధాలతో బెదిరించి నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్న ఘటన నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్ సమితిలో జరిగింది. ఠాణాధికారి బిపిన్ కుమార్ బాగ్ తెలిపిన వివరాల ప్రకారం.. చికలపొదర్ పంచాయతీ కచనియాంబ గ్రామానికి చెందిన అమూల్య జెన్నా రెండు రోజుల కిందట పొలం అమ్మిన నగదు రూ.70 లక్షలు బీరువాలో ఉంచింది. విషయం తెలుసుకున్న దుండగులు సోమవారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి ఆమె చేతులు, కాళ్లు కట్టేసి మెడపై కత్తులు పెట్టి బెదిరించి నగదుతోపాటు రూ.10 లక్షల జ్యువెలువైన బంగారు ఆభరణాలు దోచుకొని పారిపోయారు. అమూల్య పోలీసులను ఆశ్రయించగా అక్కడికి పోలీసులు, డాగ్ స్క్వాడ్ చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

భువనేశ్వర్ మార్ట్‌లో భారీ అగ్ని ప్రమాదం

మంటలు నియంత్రించడానికి 40 ఫైరింజన్లు

మంటలు నియంత్రిస్తున్న అగ్నిమాపక జవానులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో గల లింగిపూర్ పరిధిలోని అయిదంతస్థుల మార్ట్‌లో సోమవారం రాత్రి 11.30 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. 3వ అంతస్థులోని ప్లాస్టిక్, రబ్బరు సామగ్రి గోదాములు, దుకాణాల్లో వ్యాపించిన మంటలు అంతకంతకు తీవ్రమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు నియంత్రించడానికి రాత్రంతా ప్రయత్నించి విఫలమయ్యారు. మంగళవారం ఉదయానికి మంటలు నాలుగో అంతస్థులోని గదులకు వ్యాపించాయి. 40 ఫైరింజన్లు అత్యాధునిక యంత్రాలతో మంటల నియంత్రణకు కృషి చేశారు. అగ్నిమాపక డీజీ డాక్టర్ సుధాంశు షడంగి దగ్గరుండి పర్యవేక్షించారు. 40 లక్షల లీటర్ల నీరు వినియోగించినా మంటలు అదుపులోకి రాలేదు. అనంతరం ఫోం పిచికారీ చేయడానికి నిర్ణయించారు. ప్రవేశ, తిరిగి వచ్చే మార్గం ఒక్కటే కావడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. దీంతో భారీ క్రేన్ సాయంతో మూడో అంతస్థు గోడ కోసి ఫోం, నీరు పిచికారీ చేశారు. డీజీ షడంగి సాయంత్రం మాట్లాడుతూ మంటలు నియంత్రణలోకి వచ్చాయన్నారు. భవనం వినియోగించడానికి పనికిరాదన్నారు.

షార్ట్‌సర్క్యూట్ కారణం కావచ్చు: అగ్ని ప్రమాదానికి కారణం విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణం కావచ్చని అగ్నిమాపక జవానులు అంచనా వేశారు. ఈ ఘటన వల్ల రూ.5 కోట్ల సంపద కాలి బూడిదైందని మార్ట్ యాజమాన్యం తెలిపింది.

ఎన్ఐటీలో గజరాజులు

క్యాంపస్‌లో ఏనుగు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రవుర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) క్యాంపస్ లోపలికి సోమవారం రాత్రి రెండు ఏనుగులు ప్రవేశించాయి. మంగళవారం ఉదయం వరకు ఇవి వీరవిహారం చేశాయి. విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. అటవీ సిబ్బంది చేరుకుని గజరాజులను నేర్పుగా అడవి బాట పట్టించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆదిమ గిరిజనులకు మోక్షం... పథకాలకు మరింత ఊతం

పీవీటీజీ ప్రాంతాల్లో ఇంటింట సర్వేకు సర్కారు సన్నద్ధం

రాయగడలో డొంగిరియా మహిళలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నివసిస్తున్న ఆదిమ గిరిజన తెగ(పీవీటీజీ)కు చెందిన ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత చేరువ కానున్నాయి. పీవీటీజీ ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించేందుకు సర్కారు సన్నద్ధమైంది. దీంతో ఇకపై సకాలంలో వారికి పథకాల లబ్ధి చేకూరనుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఇందుకోసం మొబైల్ ఆధారిత డేటా బేస్‌ను వినియోగించి పీవీటీజీ నివాసాలు, వారి వివరాలను సేకరించనుంది. ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు దేశవ్యాప్తంగా 75 పీవీటీజీలు ఉండగా, వారిలో అత్యధికంగా 13 తెగలు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. వీటిలో డొంగిరియా, బొండా, లంజియా సవర, జువాంగ్, కుటియా కొంధొ, సవర, చుక్టియా భుంజియా, పపుడి భుమాన్, బిరోర్, హిల్ ఖారియా, మంకిడియా, లొధా, దిదాయి ఉన్నాయి. ఆయా తెగల ప్రజల సమగ్ర వివరాల కోసం ఎస్టీ, ఎస్సీ అభివృద్ధి, మైనారిటీలు, వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ సర్వే బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించే ప్రక్రియలు మొదలు పెట్టినట్లు సమాచారం.

14 జిల్లాల్లో 3.11 లక్షల మంది

పీఎం-జన్‌మన్ కింద నిర్వహించిన డేటా వివరాల ప్రకారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో పీవీటీజీ జనాభా ఉన్నారు. ఆయా జిల్లాల్లోని 68,702 కుటుంబాలకు చెందిన 3,11,760 మంది జనాభా ఉన్నారు. వీరిలో అత్యధికంగా కేంఝర్‌లో 91,384 మంది ఉండగా, రాయగడ జిల్లా తరవాత స్థానంలో ఉంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం...పీఎం-జన్‌మన్ కింద రాష్ట్రంలో 41,138 కుటుంబాలను అర్హులుగా గుర్తించగా, 41,182 ఇళ్ల నిర్మాణానికి లక్ష్యం నిర్దేశించారు. ఇందులో భాగంగా 41,138 నివాసాలు మంజూరు కాగా, వాటిలో ఇప్పటివరకు 28,383 ఇళ్లు పూర్తయ్యాయి.

గుణుపూర్ సబ్-డివిజన్‌కు చెందిన లంజియా సవర ప్రజలు

జిల్లాల వారీగా పీవీటీజీ జనాభా వివరాలను పరిశీలిస్తే...

జిల్లా	జనాభా
కేంఝర్	91,384
రాయగడ	45,419
కలహండి	37,994
గజపతి	34,362
మల్కాన్‌గిరి	22,872
ఢెంకనాల్	14,324
గంజాం	14,163
కొంధమాల్	12,497
మయూర్‌భంజ్	9,665
సుందర్‌గఢ్	9,370
అనుగుల్	8,686
నువాపడ	5,061
దేవగఢ్	4,264
జాజ్‌పూర్	1,699

(c) eenadu

శాసనసభలో మళ్లీ విపక్షాల ఆందోళన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభలో మంగళవారం (7వ రోజు) మళ్లీ ఉద్రిక్తత కొనసాగింది. సభాపతి సురమాపాడి ప్రశ్నోత్తరాలు చేపట్టారు. పట్టణాభివృద్ధి, గృహనిర్మాణశాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్ర సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్న తరుణంలో బిజద, కాంగ్రెస్ సభ్యులు (విపక్షాలు) పోడియం వద్దకు చేరుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. రైతులకు అన్యాయం చేసిన ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర ప్రసాద్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విపక్ష సభ్యులు సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించడంతో సభాపతి కొంత పట్టించుకోలేదు. దీంతో తొలుత సభా కార్యక్రమాలు 11.30 వరకు వాయిదా వేశారు. తర్వాత కొలువుదీరిన సభలో యథాస్థితి కొనసాగడంతో సాయంత్రం వరకు వాయిదా పడింది. కాంగ్రెస్ సభ్యులు అధ్యక్షుడిని సంబంధించి సభాపతికి వాయిదా తీర్మానం ఇచ్చారు. చర్చకు సురమాపాడి అంగీకారం తెలిపినా బిజద సభ్యుల నిరసనతో చర్చ సాధ్యం కాలేదు.

అసెంబ్లీ పోడియం వద్ద విపక్ష సభ్యులు

సంబల్‌పూర్‌లో జాతీయ ఫుట్‌బాల్ పోటీలు

బ్రహ్మపుర (క్రీడలు), న్యూస్‌టుడే: సంబల్‌పూర్‌లోని వీర్ సురేంద్రసాయి స్టేడియంలో నిర్వహిస్తున్న 14వ జాతీయ ఫుట్‌బాల్ కప్ పోటీలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. మైదానంలో ఏర్పాటైన ప్రారంభ వేడుకల్లో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ ముఖ్యఅతిథిగా హాజరై వీటికి శ్రీకారం చుట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పలు జట్ల క్రీడాకారులతో ఆయన కరచాలనం చేసి పోటీల్లో బాగా ఆడాలని ప్రోత్సహించారు. అనంతరం మంత్రి ఫుట్‌బాల్‌ను గోల్‌పైపు కొట్టి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సంబల్‌పూర్ ఎమ్మెల్యే నారాయణ మిశ్ర, ఇతర అధికారులు, రిఫరీలు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సూర్యవంశీ

జలం లేనిదే జీవనం లేదు

● కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం జాతీయ జలాశయం మ్యాపింగ్, నిర్వహణ కార్యక్రమ వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్ అధ్యక్షతన ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ అక్షయ్ మాట్లాడుతూ గజపతి జిల్లాలో భూగర్భ జలాలు నిల్వ స్థానం తక్కువ ఉంటుందని, ఏ విధంగా అందుబాటులో ఉన్న భూగర్భజల వనరులను లెక్కించవలసి ఉన్న స్థాయిలో జలాశయాలను గుర్తించి మ్యాప్ చేయడం ఈ కార్యక్రమ లక్ష్యమని, భూగర్భ జల నిర్వహణ ప్రోత్సాహం చడం కూడా దీని లక్ష్యమని తెలిపారు. సీనియర్ సైంటిస్ట్ చిరోష్మిత మహంతి, ఇంజినీర్ సింహాచలం శత్పథి, బీటీడీఓ పీపీ అన్నపూర్ణ మహాపాత్ర, అదనపు జిల్లా కార్యనిర్వాహణ అధికారి పృథ్వీరాజ్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జలాశయ మ్యాపింగ్ పుస్తకాన్ని చూపిస్తున్న కలెక్టర్ అక్షయ్ తదితరులు

నియోజకవర్గ సమస్యలపై సీఎంకు వినతి

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లక్ష్మీపురం నియోజకవర్గంలో పలు సమస్యలపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే పవిత్రశాంత ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి మోహన చరణ్ మాఝి, ఆర్డీసీ సంగ్రామ్ కేశరి మహాపాత్రలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో హిందాల్కో, దమన్‌జోడిలో గల కర్మాగారాల పరిధిలో తీవ్రంగా నష్టపోయిన గ్రామాలను ఆదుకోవాలని, ఆయా గ్రామాల్లో అర్హత గల యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.

ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీపురం ఎమ్మెల్యే పవిత్రశాంత, నియోజకవర్గ ప్రతినిధులు

వేంకటాచలపతికి సహస్ర కలశ జలాభిషేకం

రాయగడ, న్యూస్‌టుడే: తిరు వేంకటాచలపతి దేవాలయంలో మహాకుంభాభిషేకం వేద మంత్రాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య 16 రకాల సుగంధద్రవ్యాలు, ఔషధ మూలికలు వేసిన 108 కలశాలతో జలాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. పారిశ్రామిక వాడ జేకే పూర్ కల్యాణ వేంకటేశ్వర ఆలయం 50 వసంతాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, వేద పఠనం, అభిషేకాలు జరిగాయి. వేద పండితులు కలశాలతో జలాలను తెచ్చారు. గోవింద నామాలతో ఈ ప్రాంతం మారుమోగింది.

కలశాలతో జలాలను తెస్తున్న వేద పండితులు

అడవులకు నిప్పుతో పర్యావరణానికి ముప్పు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతాలకు నిప్పుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, వాటి నియంత్రణకు అందరూ సహకరించాలని డివిజనల్ అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) సచిన్ అన్నా సాహెబ్ అన్నారు. డివిజనల్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం అడవులకు నిప్పు ఘటనలు అంశమై అవగాహన సదస్సు నిర్వహించారు. రాయగడ డివిజన్ పరిధిలో ఈ తరహా ఘటనలు బాగా తగ్గుముఖం పట్టాయని సచిన్ పేర్కొన్నారు. 2022లో 2,989 ఘటనలు చోటు చేసుకోగా, 2023లో 3,002, 2024లో 2930, గతేడాది 2104 అడవులకు నిప్పు ఘటనలు నమోదైనట్లు ఆయన స్పష్టం చేశారు. ఏసీఎఫ్ అధికారులు అశోక్‌కుమార్ ప్రధాన్, సందీప్ కుమార్ షఫ్తి, సంతోష్‌కుమార్ దరువా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సచిన్. పక్కన అశోక్, సందీప్, కామేశ్వర్

కలహండి కప్ క్రికెట్ పోటీలకు గంజాం జట్టు

బ్రహ్మపుర (క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధచోట్ల జరుగుతున్న కలహండి కప్ క్రికెట్ పోటీలకు గంజాం జిల్లా జట్టు సిద్ధమైంది. ఈమేరకు ఇటీవల కొద్ది రోజుల కిందట ఒడిశా క్రికెట్ సంఘం (ఓసీఏ) శిక్షణ శిబిరం నిర్వహించి జట్టు క్రీడాకారులను ఎంపిక చేసింది. ఎంపికైన క్రీడాకారులు మంగళవారం భవానీపట్న వెళ్లారు. జట్టు ఈ నెల 25న సెంచూరియన్ మైదానంలో జరుగనున్న మొదటి మ్యాచులో రూర్కెలా జట్టుతో, 27న నిమపూర్ మైదానంలో కటక్ జట్టుతో, మార్చి ఒకటిన రెవెన్యూ మైదానంలో గజపతి జట్టుతో, మార్చి 5న (డ్రీమ్స్) మైదానంలో పురీ జట్టుతో తలపడనుందని జీసీపీఏ నిర్వాహకులు సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

గంజాం జట్టు క్రీడాకారులు. చిత్రంలో ఓసీఏ ప్రతినిధులు

జయపురం ఎస్‌డీపీవోగా అర్చిత

జయపురం, న్యూస్‌టుడే: యువ ఐపీఎస్ 2022 బ్యాచ్ అధికారి అర్చిత మిథాల్ జయపురం నూతన ఎస్‌డీపీవోగా నియమితులయ్యారు. ప్రస్తుత ఎస్‌డీపీవో పార్థజగదీష్ కశ్యప్ కొరాపుట్ పోలీసు కార్యాలయానికి బదిలీ అయ్యారు. అర్చిత బాలేశ్వర్ నుంచి ఇక్కడికి వచ్చినట్లు శాఖాధికారులు పేర్కొన్నారు.

అర్చిత మిథాల్

జ్ఞానజ్యోతితో చిన్నారులకు లబ్ధి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: వేదాంత పరిశ్రమ నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా 600 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోంది. రాయగడ, కలహండి జిల్లాలకు చెందిన 6 ప్రాథమిక పాఠశాలల్లో జ్ఞానజ్యోతి కింద స్మార్ట్ డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. వేదాంత సీఈఓ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ తరగతులతో పాటు మరో 12 పాఠశాలలకు వసతులు మెరుగుపరుస్తున్నామన్నారు. దీంతో ఆయా స్కూళ్లకు చెందిన 1,300 మందికి పైగా విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందన్నారు.

మహిళా క్రికెట్ పోటీలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఐఐటీ, ఖరగ్‌పూర్ క్యాంపస్‌లో గల టాటా స్టీల్ మైదానంలో సోమవారం మహిళా క్రికెట్ పోటీలు మొదలయ్యాయి. బానీ కానుంగో స్మారక క్రికెట్ పోటీలు బిబూ కానుంగో నిర్వహిస్తున్నారు. మూడు రోజులు జరిగే ఈ మహిళా క్రికెట్ పోటీల్లో నాలుగు ప్రఖ్యాత మహిళా క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివాసీ భాషపై వర్క్‌షాప్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: జిల్లాలో ఉన్న ఐదు సమితుల్లో గల ఆదివాసీ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మన భాషలోనే చదువుదాం అనే దానిపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అనుప్ పండా పాల్గొని మాట్లాడుతూ సవర భాషలో అంగన్‌వాడీల్లో పిల్లలకు ప్రారంభ విద్య అందించడం ద్వారా వారి చదువు మెరుగుపడుతుందని అన్నారు. జిల్లా సామాజిక సంక్షేమ అధికారి ప్రతిమా రౌత్, జిల్లా సంక్షేమ అధికారిణి మనోరమా దేవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అనుప్ పండా

మౌలిక సదుపాయాలు సమకూర్చడమే లక్ష్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రజలకు మౌలిక సదుపాయాలను సమకూర్చడమే లక్ష్యమని పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్ర అన్నారు. మంగళవారం ఉదయం 1, 2వ వార్డుల్లో ఆయన పర్యటించారు. అక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించారు. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్థానికులతో మాట్లాడుతున్న రాజేంద్ర

కొట్పాడ్ సమితిలో కలెక్టర్ పర్యటన

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కొట్పాడ్ సమితిలో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ జిల్లా అధికారులతో పర్యటించారు. ఇందులో డొంగిరిగూడ గ్రామంలో చేనేత కార్మికులతో మాట్లాడారు. తాజాగా యువత సంప్రదాయ చేనేతలను ఉపాధిగా మలచుకుంటూ ఆసక్తి కనపరుస్తుండటం అభినందనీయమని అన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున చేనేతలకు అవసరమైన అన్ని మౌలిక ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న పాలనాధికారి మనోజ్ సత్యవాన్

'ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి'

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎప్పుడైనా విధానసభ ఎన్నికల తేదీ ప్రకటించవచ్చని పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని వార్డు 28లో జరిగిన ఓ సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుజయ్ హజ్రా పిలుపునిచ్చారు. కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికపథం అనుసరణీయం

బ్రహ్మానంద సరస్వతీ మాతను సత్కరిస్తున్న డాక్టర్ తిరుపతి పాణిగ్రహి, ఇతర ప్రముఖులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికపథం అనుసరణీయమని, సత్కర్మలు చేయడానికి, శాంతి, సమత, మమతలకు బాటలు వేస్తుందని భువనేశ్వర్‌లోని హైటెక్ వైద్య, విద్యాసంస్థల గ్రూపుల అధినేత డాక్టర్ తిరుపతి పాణిగ్రహి చెప్పారు. మంగళవారం భువనేశ్వర్‌లోని క్రౌన్ సమావేశ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో స్వామి బ్రహ్మానంద సరస్వతీ, పూరీ రాధావల్లభ మఠాధిపతి మహంత రామకృష్ణదాస్, స్వామి శంకరానంద గిరి, స్వామి సత్యానంద మహారాజ్, స్వామి సుబల మహారాజ్ తదితర సిద్ధయోగులు పాల్గొని జగన్నాథ సంస్కృతి, భగవద్గీత సారం తదితరాలపై విపులంగా వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తిరుపతి పాణిగ్రహి ప్రముఖులను సత్కరించారు.

మద్యం విక్రయాలు నిలిపివేయండి

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో మద్యం విక్రయాలు నిలిపివేసేందుకు మహిళలు నడుం బిగించారు. నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి సమితికి చెందిన మహిళా సంఘ సభ్యులు మద్యం విక్రయాలు నిలిపివేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈమేరకు సబ్ కలెక్టర్ ప్రకాష్‌కుమార్ మిశ్ర, ఆబ్కారీ అధికారి దిలీప్‌దాస్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

హిందూ సంస్కృతి కాపాడండి

అదనపు కలెక్టర్ మాఝికి వినతి పత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్తు సభ్యులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని గజపతి క్రీడా మైదానంలో జరుగుతున్న సుభద్రశక్తి మేళాలో జరిగిన జగన్నాథ భజన పాటపై ఫ్యాషన్ షో నిర్వహించడంపై హిందూ సభ్యులు మండిపడ్డారు. మళ్లీ ఇలాంటి ఘటనలు రానున్న రోజుల్లో జరగకుండా చూడాలని విశ్వహిందూ పరిషత్తు సభ్యులు అదనపు కలెక్టర్ ఫాల్గుణ మాఝిని కలిసి వినతిపత్రం అందజేశారు. సభ్యులు లోకనాథ్ మిశ్ర, కైలాష్ చంద్ర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పద్మపూర్ కాంట్రాక్టర్ల సంఘ సమావేశం

బరగఢ్, న్యూస్‌టుడే: పద్మపూర్ డాక్‌బంగ్లాలో మంగళవారం కాంట్రాక్టర్ల సంఘం ప్రెస్‌మీట్ నిర్వహించింది. సంఘ ఉపాధ్యక్షుడు దినేష్ పాణిగ్రహి అధ్యక్షతన సంఘ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన అపరిమిత లెస్ టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 40-50 శాతం తక్కువ రేట్లకు టెండర్లు వేయడం వల్ల నిర్మాణ పనుల నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వేదికపై దినేష్ పాణిగ్రహి, ప్రకాశ్ సాహు తదితరులు

మాతృభాషలో విద్యాబోధన

మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో మీనతి

రాయగడ, న్యూస్‌టుడే: చిన్నారులకు మాతృభాషలో పాఠాలు బోధించడంతో వారు సులభంగా అర్థం చేసుకుంటారని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశభవనంలో పిరామిల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. జిల్లాలో 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు కుయ్యి భాషలో బోధించడం వారి వికాసానికి దోహదపడుతుందన్నారు. 'మాతృభాషలో బోధించండి, మాతృభాషలోనే చదవండి' అన్న పోస్టర్లు ఆవిష్కరించారు.

ఎల్లమ్మ తల్లికి జేజేలు

పుట్ట వద్ద ఎల్లమ్మ తల్లికి పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని శ్రీ నీలకంఠేశ్వరాలయం ఆవరణలోని జామి ఎల్లమ్మ తల్లి మందిరంలో మంగళవారం యాత్ర కోలాహలంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మందిరంలోని పుట్ట వద్ద తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మపురతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తల్లి దర్శనానికి వచ్చిన భక్తులతో మందిర పరిసరాలు కిటకిటలాడాయి. పలువురు భక్తులు వంటలు వండి ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు.

బరగఢ్‌లో శ్రీశ్యామ్ జాగరణ

ఫాల్గుణ దశమి సందర్భంగా శ్రీశ్యామ్ ప్రభువుకు అంకితంగా జాగరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్వయం సిద్ధ భవన్‌లో సాయంత్రం 6 గంటలకు పూజలు జరుగుతాయి. ఫిబ్రవరి 27 ఉదయం 3 గంటల వరకు నిశాన్ పాదయాత్ర నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, బరగఢ్

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

గుణుపురం, న్యూస్‌టుడే: గుణుపురం పట్టణంలో గ్రామదేవత పాలపోలమ్మ అమ్మవారి ఆలయం పునర్నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. పలువురు దాతలు విరాళాలు ఇస్తున్నారు. గుణుపురం పట్టణం పయికొ వీధిలో ఉంటున్న రైతు పి.బి.శ్రీరాములు అనే వ్యక్తి రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. డబ్బును ఆలయం నిర్మాణ కమిటీ అధ్యక్షులు బాబాప్రసాద్, పుర సంస్థ ఉపాధ్యక్షుడు శివప్రసాద్ గౌడొ చేతుల మీదుగా అందజేశారు.

విరాళం అందజేస్తున్న దాత

ఆదేశాలు పాటించకుంటే చర్యలు

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ జిల్లాలో ఇటీవల జరిగిన ఓ వివాదాస్పద ఘటనపై మంగళవారం కాంగ్రెస్ జిల్లా కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు హర్‌దీప్ సింగ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

గిరి గ్రామాల్లో బీమాపై చైతన్యం

కొరాపుట్, న్యూస్‌టుడే: ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ రత్నాకర్ పట్నాయక్ మంగళవారం కొరాపుట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొరాపుట్ జిల్లా లాంటి గిరిజన సంతతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో జీవన బీమాపై అవగాహన కల్పించడం, వారిలో చైతన్యం నింపడం లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల తొలగింపుపై ఆగ్రహం

బరగఢ్, న్యూస్‌టుడే: బుర్లానగర పంచాయతీ కార్యాలయం నుంచి ఎలాంటి కారణం లేకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండానే 25 మంది పారిశుద్ధ్య కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడంపై భీమ్ ఆర్మీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. గత నాలుగేళ్లుగా నగరంలోని డ్రెయిన్లు, రహదారులు, మురుగునీటి కాలువలు శుభ్రం చేస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించిన మహిళా కార్మికులను తొలగించడం అన్యాయమని భీమ్ ఆర్మీ పేర్కొంది. మంగళవారం భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో కార్మికులు బుర్లా నగర పంచాయతీ అధికారి మాయాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ ఏజెన్సీకి పనులను అప్పగించడం సరైన నిర్ణయం కాదని వారు పేర్కొన్నారు.

బుర్లానగర్ పంచాయతీ అధికారి మాయాధర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మహిళా చేనేతకారుల శిక్షణ శిబిరం

బరగఢ్, న్యూస్‌టుడే: మహిళా చేనేతకారులు 30 మందికి బరగఢ్‌లో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా కార్మికుల ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, అనుకూలత తద్వారా వారు తమ నైపుణ్యాలను కొత్త అవకాశాలతో అనుసంధానం చేసుకోగలరని నిర్వాహకులు తెలిపారు. సంజయ్ మెహర్ అధ్యక్షత వహించగా సంబల్‌పూరి వస్త్రాలయ డైరెక్టర్ అనన్య సాహు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అనన్య సాహు

కాంట్రాక్ట్ విధానాన్ని మార్చాలని ఆందోళన

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్‌లో ప్రభుత్వ నూతన కాంట్రాక్ట్ విధానాన్ని వ్యతిరేకిస్తూ కాంట్రాక్టర్లు మంగళవారం స్థానిక ప్రభుత్వ నిర్మాణశాఖ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. కొత్త విధానాన్ని రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆదేశించిన మార్గదర్శకాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.

కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నవరంగపూర్ జిల్లా ఉమర్‌కోట్ సమితిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భామిని పంచాయతీ బైపారభట్టా గ్రామానికి చెందిన అజయ్ రాజ్‌గండ్(20) సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి గదిలోకి పడుకోవడానికి వెళ్లాడు. తెల్లవారే సరికి ఇంటికి సమీపంలో ఉన్న మామిడి చెట్టుకు ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

కొట్లాటలో ఒకరి దుర్మరణం

నవరంగపూర్, న్యూస్‌టుడే: వ్యాన్ కొనుగోలుకు సంబంధించి రెండువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరు మృతి చెందిన ఘటన పపదహండి సమితి మైదల్‌పూర్ ఠాణా పరిధిలో అవులి గ్రామంలో జరిగింది. ఠాణాధికారి జుగల్ శబర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన త్రినాథ్‌కుర్మి(కును), నీలకంఠ అగ్రియా, పవిత్ర జానీ మంగళవారం కొత్త వ్యాన్ కొనుగోలు చేసి గ్రామానికి తీసుకొచ్చారు. అదే సమయంలో త్రినాథ్ నాయక్(34) అతని బావ వంశీ కుర్మిని చూసి ఇబ్బందికరంగా మాట్లాడారు. దీంతో ఇరువర్గాల మధ్య కొట్లాట జరగ్గా, త్రినాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాన నిందితులు పరారయ్యారని తెలిపారు.

వ్యక్తిని ఢీకొన్న అమో బస్సు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని పలాసపల్లి వద్ద సోమవారం రాత్రి రమేష్‌పాత్ర్ (64) అనే వ్యక్తిని అమో బస్సు ఢీకొంది. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఆగ్రహించిన ప్రజలు బస్సును ధ్వంసం చేశారు. ఉద్రిక్తత వల్ల రెండు గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చేరుకుని పరిస్థితి నియంత్రణలోకి తెచ్చారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించారు.

సీతలా మందిరంలో చోరీ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా దాంతన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల అంగువా ప్రాంతంలో బంగారు వెండి ఆభరణాలు దొంగతనం జరిగాయని పోలీసులు సోమవారం తెలిపారు. దొంగలు సీతలా మందిరం తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి అమ్మవారికి అలంకరించిన బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఏడుగురి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం పోలీసు జిల్లా ఆధ్వర్యంలో ఆపరేషన్ 'సైబర్ కవచ్' కింద సోమవారం మరో 29 మ్యూల్ బ్యాంకు ఖాతాల్ని గుర్తించారు. తొమ్మిది కేసులు నమోదు చేశామని, రూ.4.81 లక్షలు స్వాధీనం చేసుకుని ఏడుగుర్ని అరెస్టు చేసినట్లు గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో 20 మందికి శ్రీముఖాలు జారీ చేశామని వారు పేర్కొన్నారు. ఆయా మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా రూ.93.37 లక్షల సైబర్ మోసాల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని ఆ ప్రకటనలో తెలిపారు.

చోరీ కేసులో మరో ఇద్దరు..

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ డివిజన్‌లో సంత్రాగాచి స్టేషన్‌లో మహిళా ప్రయాణికురాలు మెడలో బంగారు గొలుసు తెంచుకుపోయిన ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో సల్మంత్ ఘాజి, మిజానుర్ ఘాజి అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని, వారు దక్షిణ 24 పరగణా జిల్లాకు చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు.

ముగ్గురు వేటగాళ్ల అరెస్టు

రాయగడ గ్రామీణం, మునిగుడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా చంద్రపూర్ పోలీసులు మంగళవారం ముగ్గురు వేటగాళ్లను అరెస్టు చేశారు. వారిలో జితుపాకి, గోవింద కిన్నెడె, చక్రధర టకిరిలు ఉన్నారు. వీరి వద్ద నుంచి మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఐఐసీ మనోరంజన్ బిశ్వాల్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపూర్, మునిగుడ ప్రధాన రహదారిలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు డంగపడ వంతెన వద్ద తుపాకులతో తిరుగుతూ వీరు కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని తుపాకులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఐఐసీ తెలిపారు.

సంబల్‌పూర్‌లో సెక్స్ రాకెట్ గుట్టురట్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సంబల్‌పూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న సెక్స్ రాకెట్ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర్ మెహర్ విశ్వవిద్యాలయం సమీపంలో ఓ అద్దె ఇంట్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించి ఓ మహిళతో సహా ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మలిపొడ ప్రాంతంలోని మరో అద్దె ఇంట్లోనూ వ్యభిచారం జరుగుతోందని, దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కలప స్వాధీనం - నిందితుల పరారీ

జయపురం, న్యూస్‌టుడే: అక్రమంగా కలప రవాణా చేస్తుండగా కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ అటవీశాఖ అధికారులు అడ్డగించి కలపను స్వాధీనం చేసుకోగా, నిందితులు పరారయ్యారు. శాఖాధికారి సందీప్‌కుమార్ పాణిగ్రహి తెలిపిన వివరాల ప్రకారం.. శాఖ తరఫున సోమవారం రాత్రి దలపూర్-తెంతులిపొదర్ గ్రామాల మధ్య తనిఖీలు నిర్వహించగా, అధికారుల రాకను గమనించి నిందితులు పరారు కాగా, వ్యాన్‌లో కలప స్వాధీనం చేసుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో భారీ అవకతవకలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో కలెక్టర్ మంగళవారం ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయగా, మరో ఉద్యోగికి నోటీసు జారీ చేశారు. ఎంట్రీల్లో అవకతవకలు ఉన్నాయని వచ్చిన ఆరోపణలపై బీజాపూర్ బ్లాక్‌లోని బడా బాసిన్ వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) డేటా ఎంట్రీ ఆపరేటర్ రంజన్ సాహు, కర ముండా ఇన్‌ఛార్జి మీన కేతన్ సాహును సస్పెండ్ చేశారు. ప్యాక్స్ కార్యదర్శి దీపక్‌కుమార్ సాహూకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విచారణకు ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు. విచారణ కమిటీ నివేదికను కలెక్టర్‌కు సమర్పించింది. ఆరోపణలు నిజమని నిర్ధారణ కావడంతో సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

(c) eenadu

అకాల వర్షం

పార్వతీపురం, పట్టణం, గరుగుబిల్లి గ్రామీణం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం: జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం రాత్రి గాలితో కూడిన వర్షం కురిసింది. పార్వతీపురంలో 40 నిమిషాలపాటు జోరుగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటలు పాడవుతాయేమోనని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

వసతి గదుల్లోనే చదువులు

పార్వతీపురం మండలంలోని రావికోన గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గదులు చాలక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ 168 మంది చదువుతున్నారు. ఏడు గదులుండగా, ఒకదాంట్లో వసతి గృహం సామగ్రి, మరొకటి ఉపాధ్యాయుల విశ్రాంతి, కార్యాలయం కోసం వినియోగిస్తున్నారు. ఐదింటిలోనే 8 తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు, అయిదు తరగతుల విద్యార్థులకు వసతిగృహంలో మంచాల పక్కనే పాఠాలు చెబుతున్నారు. ఐటీడీఏ ఏఈ గౌరునాయుడు మాట్లాడుతూ పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

గాత్రం.. రమణీయం

పాట పాడుతున్న బౌరోతు వెంకటరమణ

ఆయనో హోంగార్డు. పేరు బౌరోతు వెంకటరమణ. స్వగ్రామం వంగర మండలం కోణంగిపాడు. వంగర పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరలో ఉన్నారు. ఆదివారం రాత్రి ప్రముఖ గాయకులు ధనుంజయ్, శ్రీలత తదితరుల ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. పాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా.. గ్రామీణ సీఐ ఉపేంద్ర సహకారంతో వేదికపైకి వెళ్లారు. అంతే 'శ్రీతుంబర నారద నాదామృతం' గీతాన్ని అలవోకగా పాడి శ్రోతలను అలరించారు. – న్యూస్‌టుడే, రాజాం

ప్రత్యేక పూజలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: రైతు బజారు సమీపంలోని రాధాకృష్ణ మందిర ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వానరాల బెడద

వీర గున్నమ్మపురం, కుంటి కోట, మకర జోల గ్రామాలకు వెళ్లే రహదారులపై వానర మూకలు సంచరిస్తున్నాయి. దీంతో ఈ దారిలో ప్రయాణం భయానకంగా మారింది. ఒంటరిగా వెళ్లేవారు, చిన్నపిల్లలపై అవి దాడులు చేస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. వానరాలు కనిపించాక వాటిని కవ్వించే చర్యలు చేయకుండా ఉంటే వాటి నుంచి ఎలాంటి ప్రమాదం ఉండదని మందస అటవీ శాఖ అధికారి రాము తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

మౌలిక వసతుల కరవు

అంపురం ఎస్సీ కాలనీ వెనక ఖాళీ స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 20 మందికి పైగా ఇంటి స్థలాలు కేటాయించింది. మౌలిక వసతులు లేని కారణంగా చాలా ఏళ్లు లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టలేదు. ఇటీవల ఆరుగురు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కాలువలు, రహదారి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని వారు వాపోతున్నారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామిని వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పల్లెలు మురిసేలా పండగ వచ్చింది

మరోసారి పల్లెకు పండగొచ్చింది. సిమెంటు రోడ్లతో అంతర్గత రహదారులకు నూతన కళ తెచ్చింది. వైకాపా హయాంలో అంతగా ప్రాధాన్యం దక్కని సీసీ రోడ్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వంలో విడతల వారీగా పనులు సాగుతున్నాయి. సీసీ రహదారులతో గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్ద పీట వేసి, అనుబంధంగా పక్కా మురుగు కాలువలు నిర్మిస్తే రోడ్ల నాణ్యత పెరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రూ.15.7 కోట్ల అంచనాతో రెండో విడత పనులు

ప్రభుత్వ విప్ సూచనలతో..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గతేడాది పల్లె పండగ మొదటి విడతలో పెద్ద ఎత్తున సీసీ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో కనీస గ్రావెల్‌తోనూ అభివృద్ధికి నోచుకుని రోడ్లు కొత్త రూపు సంతరించుకున్నాయి. మొదటి విడతలో కేటాయించిన నిధులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచనలతో ఒక్కో మండలానికి సుమారు రూ.5 కోట్ల వరకు పనులు విభజించారు. దీంతో ఇబ్బందికరంగా ఉన్న రహదారులకు తొలి విడతలోనే మోక్షం కలిగింది.

* ఇప్పటికే గ్రామాల్లో ప్రధాన అంతర్గత మార్గాలు సీసీ రహదారులుగా మారగా, రెండో విడతలో ఇరుకు దారులకు విముక్తి కలగనుందని అధికారులు పేర్కొంటున్నారు. అందులో భాగంగానే రెండో విడతలో ఒక్కో మండలానికి సుమారు రూ.3.85 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. చెల్లింపుల్లో కొంత జాప్యంతో నిదానంగా మొదలైనా ప్రస్తుతం ఆయా పనులు ఊపందుకున్నాయి.

పనుల పూర్తికి చర్యలు

మొదటి దశ పనులు కొన్ని పెండింగ్ ఉన్నాయి. పూర్తయిన వాటికి సంబంధించి దాదాపు 90 శాతానికి పైగా బిల్లులు చెల్లింపు చేశారు. రెండో విడత పనులు జనవరిలోనే మొదలయ్యాయి. మార్చి చివరి నాటికి పనులన్నింటిని పూర్తి చేయాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేశాం.
– ఎ.సూర్యప్రకాష్, డీఈ, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇలా..	మొదటి విడత అంచనా : రూ.94 కోట్లు, మొదలు పెట్టిన పనులు : 1,019, పూర్తయిన పనులు : 430, నిర్మాణ విస్తీర్ణం : 56 కి.మీ
	రెండో విడత అంచనా : రూ. 15.-7 కోట్లు, పనుల సంఖ్య : 201, నిర్మాణ విస్తీర్ణం : 27 కి.మీ.

కాలమేదైనా యాతనే

కాలమేదైనా గుక్కెడు నీటికి మహిళలు బిందెలు పట్టుకుని పరుగులు తీయాల్సిందే. దుర్భర పరిస్థితి ఏటా ఇదే సమయంలో నెలకొంది. జోరున వర్షం కురుస్తున్నా, చలి వణికిస్తున్నా నీళ్ల మోత తప్పడం లేదు.. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నా సరిపోని పరిస్థితి. పురుషోత్తపురం, ఎఎస్‌పేట ప్రాంతాల ప్రజల నీటి కష్టాలు తీరడం లేదు. మూడు వార్డుల్లో సుమారు 4 వేల మంది దాహార్తితో అల్లాడుతున్నారు. ట్యాంకర్ వచ్చే సమయానికి బిందెలతో సిద్ధంగా ఉండాలి. పోటీ ఎదుర్కొనే శక్తి ఉంటేనే నీరు లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రూ.62 కోట్ల అంచనా వ్యయంతో తాగునీటి పథకం నిర్మించాలని నిర్ణయించింది. ఏడాదిన్నరగా అడుగులు పడలేదు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

స్తంభం కూలితే ప్రమాదం

ఇచ్ఛాపురం పురపాలిక ఉప్పలవీధి నుంచి కొండవీధి, డబ్బూరివీధికి వెళ్లే మార్గంలో వీధి కూడలి వద్ద ఉన్న విద్యుత్తు స్తంభం ఊగిసలాడుతూ, ఓ వైపు వాలి ఉంది. పాత ఇనుపస్తంభం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పుర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇనుప స్తంభం పటిష్ఠంగానే ఉందని, పరిశీలించి ప్రమాదకరంగా మారితే మార్పు చేస్తామని విద్యుత్తు ఉపకేంద్ర ఏఈ గోవిందరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

న్యూస్‌టుడే, సోంపేట

యువ సంకల్పం.. దుర్గ చెరువు ఆహ్లాదం

సోంపేటలో సేద తీరే కేంద్రాలు కనుమరుగవడంతో స్థానిక లయన్స్‌క్లబ్ ప్రతినిధులు దుర్గ చెరువు వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి తమ ఆలోచనను పంచుకోగా ఆయన ప్రోత్సహించడంతో పంచాయతీ అనుమతి తీసుకొని పనులు ప్రారంభించారు.

★ అభయాంజనేయ విగ్రహం, నాగదేవత ఆలయం, ఇతర నిర్మాణాలతో విజయదుర్గ ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. చెరువుకు సంబంధించిన మిగిలిన రెండు గట్లు వినియోగించుకొని ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటుకు లయన్స్ క్లబ్ యువత చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు సుమారు రూ.3 లక్షల వ్యయంతో రాతి కట్టడం, ఇతర నిర్మాణాలు చేపట్టారు.

★ మెజార్టీ భాగం యువకులే క్లబ్‌లో సభ్యులుగా ఉండటంతో అన్ని వర్గాలకు ఉపయోగపడేలా సేదతీరే కేంద్రం ఏర్పాటుకు సొంత నిధులతో పనులు మొదలు పెట్టారు. అందులో భాగంగా పొదలు, పనికిరాని మొక్కలు తొలగించి చెరువు గట్లను చదును చేశారు. మట్టి లోపలకు జారకుండా ఇరువైపులా రాళ్లను పేర్చి రక్షణ గోడ నిర్మించారు.

★ ఉత్తర గట్టుపై ఉన్న దుర్గమ్మ ఆలయాన్ని మోటారు యూనియన్ సభ్యులు అన్నివిధాలుగా తీర్చిదిద్ది ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చారు. అమ్మవారి ఆలయం గట్టు నుంచి వంతెన ఏర్పాటు చేశారు.

★ రూ.20 లక్షలతో వాకింగ్‌ట్రాక్, పార్కు, చుట్టూ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యాయామశాలతోపాటు చిన్నపిల్లలు ఆడుకోవడానికి పరికరాలు, కూర్చోడానికి బల్లలు ఏర్పాటు చేస్తున్నారు. ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

★ క్లబ్ అధ్యక్షుడు వైశ్యరాజు గోపీకిరణ్ మాట్లాడుతూ పట్టణంలో సేదతీరే కేంద్రం లేకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న అంశాన్ని గుర్తించామని, క్లబ్‌లో ఉన్న యువత ఆలోచన మేరకు చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

స్టేషన్ల చుట్టూ తిప్పించొద్దు

సమస్యలు వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఫిర్యాదుదారులు పదేపదే పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, సత్వరమే సమగ్ర దర్యాప్తు చేపట్టి చట్టపరిధిలో చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పార్వతీపురంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భార్యాభర్తల గొడవలు, అన్నదమ్ములు, బంధువుల ఆస్తి తగాదాలు, అత్తింటి వేధింపులు, అధిక వడ్డీలు, ప్రేమ పేరిట మోసాలు, కుటుంబ కలహాలపై అర్జీలు ఎక్కువ ఉన్నాయి. దర్యాప్తు చేసి వాస్తవమైతే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం తొమ్మిది వినతులు వచ్చాయి. డీసీఆర్బీ సీఐ ఆదాం, ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం గట్టే దిక్కు..!



కొండపురం పంచాయతీ తుంబవానిపేటకు నేటికీ రహదారి సౌకర్యం లేదు. స్థానికులు దశాబ్దాలుగా పొలం గట్టునే వెడల్పు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. 108, 104 వంటి సేవలు దూరమవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదని, రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. పీఆర్ జేఈ నాగమాధవిని వివరణ కోరగా రహదారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

గంజాయి విక్రయాలు.. ముఠా అరెస్టు

స్వాధీనం చేసుకున్న గంజాయి. నిందితులు (కూర్చున్నవారు)

గోషామహల్, న్యూస్‌టుడే: ధూల్‌పేట కేంద్రంగా వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న అయిదుగురిని ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం అరెస్టు చేసింది. ఎస్టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు తెలంగాణలోని హైదరాబాద్‌లో గల ఎల్‌కే నగర్, అమలాపూర్, కార్వాన్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో దాడులు జరిపి పవన్‌సింగ్, కేదార్‌నాథ్‌సింగ్, ఠాకూర్ ఆకాశ్‌సింగ్ అలియాస్ బోలూ, హెచ్.రాజు, ఎస్.రాహుల్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి 6.55 కిలోల ఎండు గంజాయితో పాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ధూల్‌పేటకు చెందిన రాజుసింగ్, ఒడిశాకు చెందిన సుశాంత్‌కుమార్ స్వైన్, ధూల్‌పేట నివాసి దుర్గేశ్‌సింగ్ అలియాస్ బజరంగ్, ఆసిఫ్‌నగర్‌కు చెందిన మైత్రి రాహుల్‌లు పరారయ్యారు. నిందితుల్లో ఠాకూర్ ఆకాశ్‌సింగ్, రాజూసింగ్‌లు గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లినప్పుడు అక్కడ ఒడిశాకు చెందిన సుశాంత్‌కుమార్ స్వైన్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో వీరి మధ్య సాన్నిహిత్యం పెరిగి సుశాంత్‌కుమార్ స్వైన్‌ను బెయిలుపై విడుదల చేయిస్తే తక్కువ ధరకు ఒడిశా నుంచి గంజాయి సరఫరా చేయిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు నిందితులు ఠాకూర్ ఆకాశ్‌సింగ్, రాజూసింగ్‌లు గత అక్టోబరులో సుశాంత్‌కుమార్ స్వైన్‌ను బెయిలుపై విడుదల చేయించేందుకు న్యాయవాదిని పెట్టి బయటకు తీసుకొచ్చారు. అనంతరం జైలులో కుదిరిన ఒప్పందం మేరకు గంజాయి తెప్పించి కేజీ రూ.3 వేల చొప్పున ఆకాశ్‌సింగ్ అలియాస్ బోలూ బృందానికి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. తదుపరి విచారణ నిమిత్తమై కేసును ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

క్షయపై అవగాహన అవసరం

పాలకొండ గ్రామీణం: క్షయ వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని టీబీ యూనిట్ జిల్లా సమన్వయ కర్త పి.వెంకటదుర్గ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో సదస్సు నిర్వహించి వ్యాధి లక్షణాలు వివరించారు. ప్రధాన, ఉప ప్రధానాచార్యులు ఎం.శ్యాంబాబ్, బి.జయమణి పాల్గొన్నారు.

వేసవి వస్తోంది.. సమస్య వెంటాడుతోంది

హిరమండలం పరిధిలోని పలు గ్రామాల్లో చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని ఎం.అవలంగి, గొట్టా బ్యారేజీ కూడలి, సుభలయ ఆర్అర్ కాలనీ రోడ్-7, గులుమూరు ఎస్సీ వీధి, హిరమండలం మేజర్ పంచాయతీ వాసులు వాపోతున్నారు. ఎం.అవలంగిలో నిరుపయోగంగా మారిన బోరును చిత్రంలో చూడొచ్చు. సిబ్బందికి తెలియజేస్తామని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, హిరమండలం

పాడైంది.. శుద్ధజలం అందకుంది..

మందసలోని పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలోని శుద్ధ నీటి ప్లాంటు ఇది. వారం రోజులుగా మరమ్మతులకు గురైంది. విద్యార్థులు కాచిన నీరు తాగుతున్నారని, మరమ్మతులకు గురైన ప్లాంటును బాగు చేయిస్తామని వసతి గృహ అధికారి బి.అప్పారావు తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

– న్యూస్‌టుడే, సోంపేట

ఉద్యానోదయం..

ఉద్యాన సాగువైపు యువ రైతుల ఆసక్తి

జిల్లాలో యువ రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. సాగునీటి ఇబ్బందులున్న సముద్ర తీర, ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో పొలాలను కొబ్బరి, జీడి తోటలుగా మార్చుకుంటూ మెరుగైన ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆరేడేళ్లకు ఫలసాయం అందుకునే అవకాశం ఉండటంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని కష్టాలు అధిగమిస్తున్నారు.

★ సోంపేట మండలం ఎకువూరుకు చెందిన రైతు ఈశ్వరరావు ఎకరా పొలంలో వరి సాగు చేస్తే పెట్టుబడి కూడా రాక నష్టపోయేవారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలు వినియోగించుకుంటూ పొలంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఏడేళ్ల తర్వాత దిగుబడులు రావడంతో రెండు నెలలకు రూ.10 వేలకు పైగా ఆదాయం వస్తోంది.

సోంపేట మండలం ఎకువూరు వద్ద కొబ్బరి తోటగా మారిన పంట పొలం

★ ఈ ఏడాది జిల్లాలో 14,195 ఎకరాలను ఉద్యాన తోటలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పొలాల్లో నీటి కుంటలు తవ్వుకోవడానికి ఉపాధి పథకంలో అవకాశం కల్పించారు. తక్కువ నీరు వినియోగించి ఉద్యాన పంటల సాగుకు వీలుగా 90 శాతం రాయితీపై మొక్కలు, బిందు, తుంపర పరికరాలు సమకూర్చుతున్నారు. జీడి విస్తరణ పథకం కింద హైబ్రీడ్ మొక్కలు సరఫరా.. మూడేళ్ల పాటు చీడపీడల నివారణ, నిర్వహణకు పూర్తిస్థాయిలో సాయం అందిస్తున్నారు. ఈక్రమంలో ఏటా 5 వేల ఎకరాలకు పైగానే పంట పొలాలు తోటలుగా మారుతున్నాయి.

పెరిగిన విస్తీర్ణం

కొబ్బరి, జీడి విస్తరణ, పునరుద్ధరణ పథకాల ద్వారా జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లాలో లక్ష ఎకరాలకు పైగానే తోటలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు పెంచుకోవచ్చు.
- రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి

★ సోంపేట మండలం రుషికుద్ద, గొల్లగండి, బారువ, ఉప్పలాం, ఎర్రముక్కాం, కవిటి మండలం మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, జగతి, బెజ్జిపుట్టుగ, బొరివంక కంచిలి మండలం కుత్తుమ, ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు, కేశుపురం, ఈదుపురంలో వ్యవసాయ భూముల్లో మూడో వంతు కొబ్బరి తోటలుగా మారాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 3వేల ఎకరాలకు పైగా పొలాలు తోటలుగా మారాయి.

★ జిల్లాలో సాగు భూమి 8 లక్షల ఎకరాలుండగా 5.5 లక్షల ఎకరాల్లో పంటలు పండించే పరిస్థితి ఉంది. గిరిజన, ఉద్దానం ప్రాంతాల్లో ఏటా వ్యవసాయం తగ్గుతోంది.

★ ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు తీర మండలాల పరిధిలో వివిధ కారణాలతో వ్యవసాయ పంటల విస్తీర్ణం తగ్గుతోంది. భూములు ఖాళీగా ఉంచకుండా కొబ్బరి, జీడి తోటలు పెంచుతున్నారు.

★ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు రాయితీలు అందిస్తోంది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కేంద్ర ఆయిల్‌పామ్, ఉపాధి హామీ, కొబ్బరి అభివృద్ధి బోర్డు పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యాన తోటల విస్తరణకు చర్యలు చేపట్టారు.

విద్యుత్తు తీగలు.. యమపాశాలు..!

కొత్తూరు అఫీషియల్ కాలనీకి వెళ్లే దారిలో నివాసాల పక్కన విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను ట్రాన్స్‌కో ఏఈ నిరంజన్ దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందితో మాట్లాడి తీగలు సరిచేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

మురుగు తిష్ఠ

రత్తకన్న ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగు నిలిచిపోతోంది. బడికి పశ్చిమ వైపు ఉన్న ఖాళీ స్థలంలోకి వాడుక, వర్షపునీరు వెళ్లేది. అలానే కాలువలు నిర్మించారు. నాడు నేడు పనులు ఏళ్ల తరబడి సాగడంతో క్రమపద్ధతి లేకుండా పోయింది. పశ్చిమం వైపు ఉన్న ఖాళీస్థలాన్ని యజమాని మట్టి పోసి ఎత్తుచేయడంతో మురుగు పాఠశాలలో తిష్ఠ వేస్తోంది. కమిషనర్ రమేష్‌ను వివరణ కోరగా పాఠశాల కమిటీతో సమావేశమై పరిష్కార చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, అయ్యన్నపేట, పార్వతీపురం పట్టణం

తెల్లనివన్నీ పాలు కావు!

మన దగ్గరా రాజమహేంద్రవరం తరహా పరిస్థితులు

కల్తీపై కానరాని నియంత్రణ చర్యలు

ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు చాలా ఇళ్లలో టీ, కాఫీ లేనిదే ఏ పనీ కదలదు. చిన్నారుల నుంచి పెద్దల వరకు రోజులో ఏదో ఒక సమయంలో పాలు వినియోగిస్తారు. వంటకాలు, తినుబండారాల తయారీ.. తదితర వాటిల్లోనూ పాలు కీలకమే. దీంతో రోజురోజుకూ వినియోగం పెరుగుతోంది. దీనిని తమకు అనుకూలంగా మార్చుకుని కల్తీ వ్యాపారం సాగిస్తున్నారు కొందరు. రసాయనాలు కలిపి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా రాజమహేంద్రవరంలో జరిగిన ఘటనతో ఇక్కడి అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉంది.

రాష్ట్రంలో పాల ఉత్పత్తిలో ఉమ్మడి జిల్లా అయిదో స్థానంలో ఉంది. ప్రస్తుతం 4.90 లక్షల పాలిచ్చే పశువులున్నాయి. రోజూ 4.27 లక్షల లీటర్ల పాలు ఇస్తున్నాయి. ఇందులో 3.22 లక్షల లీటర్లను డెయిరీలు తీసుకుంటున్నాయి. పాల వ్యాపారులు 45 వేల లీటర్ల వరకు అమ్ముతున్నారు. మిగిలిన వాటిని గృహ వినియోగదారులు తీసుకుంటున్నారు. డెయిరీలు నిబంధనల మేరకు ప్యాకింగ్, సరఫరా, అమ్మకం చేపట్టాల్సిందే. వీటిపై నిఘా ఉంటుంది. వ్యాపారుల ముసుగులో కొందరు లాభాల కోసం కల్తీ చేస్తున్నారు.

పార్వతీపురంలోని జగన్నాథపురంలో ఓ కుటుంబం రోజుకు లీటరు పాలు వాడతారు. ఒక్కోసారి మరిగించేటప్పుడు దుర్వాసన రావడం, జిగటలా తేలడంతో అనుమానం వచ్చి వ్యాపారిని ప్రశ్నిస్తే.. ఏమీ లేదండి అని బదులిచ్చారు. రెండు, మూడు రోజుల పాటు బాగానే అందించారు. ఆ తరువాత అదే పరిస్థితి. దీంతో ఆ వ్యాపారి వద్ద పాలు తీసుకోవడం మానేశారు.

ఇవి కలిపేస్తున్నారు..

ప్రోటీన్ స్థాయి ఎక్కువగా ఉండేందుకు యూరియా, నురగ వచ్చేలా డిటర్జెంట్, చిక్కగా ఉండేందుకు స్టార్చ్, నిల్వ ఉండేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపేస్తున్నారు. కొందరు వివిధ రసాయనాలను వాడి పూర్తిగా నకిలీ పాలను అంటగట్టేస్తున్నారు. గృహాలతో పాటు కార్యాలయాలు, టీ దుకాణాలకు అందిస్తున్నారు. మరికొందరు శీతల పానీయాల తయారీలోనూ వినియోగిస్తున్నారు.

ఇలా గుర్తించవచ్చు..

ఓ గ్లాసులో పాలు తీసుకుని అర టీస్పూన్ సోయాబీన్ వేసి అయిదు నిమిషాల తరువాత అందులో ఎర్ర లిట్మస్ పేపరును ఉంచాలి. నీలం రంగులోకి మారితే యూరియా కలిపినట్లే. అయోడిన్ ద్రావణాన్ని అయిదు చుక్కలు వేశాక.. ఎక్కువ నురగ ఏర్పడితే డిటర్జెంట్లు వాడినట్లే. నీలం-ఎర్ర లిట్మస్ పేపర్లు రెండూ రంగుమారితే రసాయనాలు వినియోగించినట్లు గుర్తించాలి.

తీవ్ర ముప్పు..

కల్తీ పాలతో కిడ్నీలో రాళ్లు ఏర్పడడం, క్రమేణా పాడవడం, కాలేయం వాపు, గ్యాస్ట్రిక్, పేగు పూత, కొవ్వు పెరగడం, ఒక్కోసారి గుండె పోటు, నరాల వ్యవస్థపై ప్రభావం పడుతుంది. పిల్లల్లో హార్మోన్ల సమతౌల్యత దెబ్బతింటుంది. క్యాన్సర్లు వెంటాడుతాయి. ముందుగానే గుర్తించాలి. కడుపులో నొప్పి, విరోచనాలు, కళ్లు తిరగడం, కాళ్లు, చేతుల వాపు ఉంటే వెంటనే అప్రమత్తం కావాలి. పాలు వేడి చేసి తాగాలి.
- రామ్మోహన్, వైద్య నిపుణుడు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

చర్యలేవీ..: ఏడాదికి రూ.12 లక్షల వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలి. పాల వ్యాపారులు విధిగా పంచాయతీల నుంచి ఎన్‌వోసీ పొందాలి. వినియోగించే పరికరాలను స్థానిక అధికారులతో పాటు ఆహార కల్తీ నియంత్రణ శాఖ సిబ్బంది తనిఖీ చేయాలి. ఆ చర్యలు కానరావడం లేదు. గతేడాది శీతల పానీయాలు, నిల్వ కేంద్రాల నుంచి 284 నమూనాలు సేకరించారు. ఇందులో 26 కేంద్రాలపై కేసులు సైతం పెట్టారు. అనంతరం ఆ విషయాన్ని వదిలేశారు.

సాగర్ నీటిమట్టం 539.20 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం సాయంత్రం 6 గంటలకు 539.20 అడుగులకు చేరింది. ఇది 186.6644 టీఎంసీలకు సమానం. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 28,514 క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయం నుంచి ప్రధాన జల విద్యుత్తు కేంద్రానికి 28,846, సాగర్ కుడి కాలువకు 8,831, ఎడమ కాలువకు 7,768, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2,000, లోలెవల్ కెనాల్‌కు 300.. మొత్తం 47,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలకు 15,522 మంది హాజరు

జిల్లాలో సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 49 కేంద్రాల్లో మొత్తం 16,807 మంది విద్యార్థులకు 15,522 మంది హాజరయ్యారు. 565 మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణి నీలావతీదేవి పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో తనిఖీ చేశారు.
- న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (బుధవారం) సాయంత్రం: 6.21
సహరి: (గురువారం) ఉదయం: 5.13

రైతేరాజు 8లో

ఇసుక నేల.. పుచ్చసాగు భళా
వేసవిలో గేదెల సంరక్షణ చర్యలు
పెసర సాగుకు అనుకూలం

తెల్లనివన్నీ పాలు కావు!

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్, సత్తెనపల్లి

వ్యాపారులు కొందరు అడ్డదారిలో డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో పాలను కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాల్ని పణంగా పెడుతున్నారు. యూరియా, హైడ్రోజన్, డిటర్జెంట్లు వంటివి కలుపుతున్నారు. రెండు లీటర్ల పాల్లో బియ్యం పిండి, సోడా వంటివి కలిపి ఐదు నుంచి ఆరు లీటర్లుగా తయారు చేస్తున్నారు. రైతులు మంచిపాలనే సేకరణ కేంద్రాలకు పోస్తుండగా.. వ్యాపారులు కొందరు కల్తీ చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..
పాలిచ్చే గేదెలు: 1,21,445
ఆవులు: 10,900
రోజువారీ పాల సేకరణ: 18.50 లక్షల లీటర్లు

పరీక్ష కేంద్రాలేవీ?.. గ్రామాల్లో సేకరించే పాలను పరీక్షించే కేంద్రాలు లేకపోవడం అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇదే అదనుగా కొందరు కల్తీ పాలు తయారుచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వెన్న శాతం కోసం యూరియా వాడుతున్నారు. మరో వైపు పాల సేకరణ కేంద్రాల్లోనూ కల్తీ నిర్ధారణ పరికరాలు లేకపోవడంతో పరీక్షించకుండానే డెయిరీలకు తరలిస్తున్నారు.

కల్తీ చేస్తున్నారు జాగ్రత్త

పాల కల్తీ ఆరోపణలపై 2024-25 సంవత్సరంలో ఆహార తనిఖీ, భద్రత అధికారులు నరసరావుపేటతో పాటు చుట్టుపక్కల 20 శాంపిళ్లు సేకరించి అందులో ఒకటి కల్తీగా తేలింది. రూ.లక్ష జరిమానాను విధించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10 పాల శాంపిళ్లు తనిఖీ చేస్తే అందులో రెండు కల్తీగా నిర్ధారణ అయ్యింది. కల్తీ తక్కువగా ఉండటంతో ఒకరికి మొదటి తప్పుగా హెచ్చరికలు చేశారు. మరో కేసు జేసీ వద్ద విచారణ దశలో ఉంది. గత ఆరేళ్లుగా తరచూ కల్తీ పాల గుట్టు నరసరావుపేటలో రట్టవుతూనే ఉంది.

❖ ఐదేళ్ల కిందట నరసరావుపేట మండలం రెడ్డినగర్, ఉప్పలపాడు గ్రామాల్లో కల్తీపాల వ్యాపారం గుట్టు రట్టయింది. డెయిరీలకు పాలు సరఫరా చేసే వ్యాపారులు యూరియా, పాలపొడి కలిపినట్లు అధికారులు గుర్తించారు. రెడ్డినగర్ వ్యాపారి ఒకరు జైలుకు కూడా వెళ్లారు. నరసరావుపేట చుట్టుపక్కల ప్రాంతాలైన అల్లూరివారిపాలెం, ఉప్పలపాడు, రెడ్డినగర్‌లలో కల్తీపాల వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది.

❖ రెంటచింతల మండలం రెంటాలలో ఐదేళ్ల కిందట కల్తీపాల వ్యవహారం బయటపడింది. వెన్న శాతం 10 కంటే ఎక్కువ ఉండటంతో అనుమానం వచ్చి ప్రైవేటు ల్యాబ్‌లో పాలను పరీక్షించారు. వివిధ రకాల నూనెలు, యూరియా, డిటర్జెంట్ కలిపినట్లు నిర్ధారించారు. రెండేళ్ల కిందట ఇదే రెంటాలలో కల్తీ వ్యవహారం వెలుగు చూసింది. నకరికల్లు మండలంలోనూ ఈ తరహా ఘటనలు బయటపడ్డాయి.

ఇలా గుర్తించొచ్చు

✦ పాల నమూనాలో లిట్మస్ పేపర్ ముంచినప్పుడు నీలంగా మారితే యూరియా కలిపారని అర్థం.
✦ వేలి వెలిని పాలలో ముంచితే జిడ్డుగా అనిపిస్తుంది. నాణ్యమైన పాలు అంటుకుంటాయి. కానీ పిండి పదార్థం కలుస్తున్నారు. పాల నమూనాలో అయోడిన్ చుక్క వేస్తే నీలం రంగులోకి మారుతుంది. అంటే పిండి కలిపినట్లే.
✦ నున్నటి గచ్చు, టైల్స్ మీద రెండు చుక్కల పాలు వేస్తే వెంటనే చెదిరిపోతే నీళ్లు కలిపినట్లు. అదే స్వచ్ఛమైన పాలు నెమ్మదిగా జారుతాయి. అక్కడ తెల్లటి మచ్చ కూడా ఏర్పడుతుంది.
✦ పాల కల్తీ నిర్ధారణకు జిల్లాలో పరీక్ష కేంద్రాలు లేవని.. హైదరాబాద్‌కు పంపి నిర్ధారించుకుంటున్నామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీకాంత్ తెలిపారు. పాల కల్తీ నిర్ధారణకు త్వరలో చర్యలు చేపడతామన్నారు.

ఆటలాడించాల్సిందే!

ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలన్న ప్రభుత్వం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే

తెల్లారి లేచింది మొదలు ఉరుకులు పరుగులు.. పుస్తకాలతో కుస్తీలు.. ఆ పై సెల్‌ఫోన్‌లో ఆటలు, చదువులు.. చాలా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల ప్రస్తుత పరిస్థితి ఇది. శారీరక శ్రమ లేక అనారోగ్యం బారిన పడుతున్న బాలల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కచ్చితంగా వ్యాయామ విద్య అమలు చేయాలంటూ ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలుచేస్తున్నారు. దీనిలో భాగంగా రోజూ ఓ గంటసేపు ఆటలాడేందుకు సమయం కేటాయిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం విరామ సమయాల్లోనూ పిల్లలకు చాలావరకు ఆటలాడుతుంటారు. ప్రైవేటు బడుల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. కొన్ని పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య అమలు చేస్తున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేలా ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను ఆటలు ఆడించాల్సిందే నంటూ విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది.

❖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2,021 ఉండగా.. ఒకటి నుంచి 10వ తరగతి వరకు 2,98,903 మంది విద్యార్థులు చదువుతున్నారు. నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట ప్రాంతాల్లో ప్రైవేటు బడులు అధికం. ఇక్కడ అన్ని పాఠశాలల్లోనూ గంటపాటు ఆటలు ఆడించాల్సిందే.

ఆరోగ్య విద్యకూ ప్రాధాన్యం.. ప్రతి విద్యార్థికి వారానికి ఆరు పీరియడ్లు కొత్తగా ఆటలాడించాలి. ఉదయం అసెంబ్లీ సమయంలో పది నిమిషాలు ధ్యానం తప్పనిసరి. ప్రతిరోజూ కచ్చితంగా ఆటలు ఉండాలి. వారంలో ఒక పీరియడ్ ఆరోగ్య విద్యకు కేటాయించాలి. ఇందులో ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

❖ ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగానే ప్రైవేటు బడుల్లో విద్యార్థులకు క్రీడలను నిత్యకృత్యం చేయడం చాలా అవసరమని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

చెత్త తొలగదు.. స్వచ్ఛత కానరాదు!

పారిశుద్ధ్య నిర్వహణలో వెనుకబాటు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్ని పరిశుభ్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక సంఘం నిధులు పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చుచేసే అవకాశమిచ్చింది. ఉపాధి నిధులతో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించుకునేలా నిధులు అందజేస్తోంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఘనవ్యర్థాల నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణకు హరిత రాయబారుల నియామకం, జీతభత్యాల చెల్లింపు, ఈ-ఆటోల పంపిణీ, ఆధునిక సాంకేతిక శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతోంది. ఇంత చేస్తున్నా చాలా గ్రామాల్లో స్వచ్ఛత కానరావడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణలో వెనుకబాటే కనిపిస్తోంది.

శిక్షణలో పంచాయతీల బాధ్యులు

అంశం (ఐవీఆర్ఎస్‌లో గ్రామీణుల మనోగతం.. శాతాల్లో)	అవును	లేదు
మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా?	67.5	32.5
వారానికి రెండు సార్లయినా చెత్త సేకరిస్తున్నారా?	64.2	35.8

❖ పారిశుద్ధ్య నిర్వహణపరంగా అట్టడుగున ఉన్న 50 పంచాయతీలను (ఒక్కో జిల్లాలో) గుర్తించి వాటి బాధ్యులకు ఇటీవల పల్నాడు జిల్లాలోని నందిగామ, బాపట్లలో శిక్షణ ఇచ్చారు. అయినా చాలాచోట్ల తీరు మారలేదు. స్వచ్ఛతలో కీలకమైన చెత్త సేకరణలోనే తడబాటు కనిపిస్తోంది. ❖ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం తాజాగా నిర్వహించిన సర్వేలో రాష్ట్రస్థాయిలో పల్నాడు జిల్లాకు 9, బాపట్లకు 11వ స్థానం లభించింది. పొరుగునున్న గుంటూరు జిల్లా రాష్ట్రంలో 1వ స్థానంలో నిలిచింది. అక్కడి విధానాలు అమలు చేసినా స్వచ్ఛతలో రెండు జిల్లాలు మెరిసే అవకాశముంది.

పత్రం సమర్పిస్తేనే పెన్షన్

మరో నాలుగు రోజులే గడువు

నరసరావుపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్లు) సమర్పించేందుకు సమయం సమీపిస్తోంది. ఈ నెల 28లోపు జీవన ప్రమాణ పోర్టల్ లేదా నేరుగా ఖజానా శాఖ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. పత్రం సమర్పిస్తేనే ఏప్రిల్ 1న పెన్షన్ అందుతుంది. లేదంటే పెన్షన్‌తో పాటు అన్ని రకాల ప్రోత్సాహకాలు ఆగిపోయే అవకాశం ఉంది. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సమర్పించినవి చెల్లుబాటు కావు. అనారోగ్య కారణాలతో నడవలేని పింఛనుదారులు ఖజానా అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్తే సిబ్బందిని ఇంటికి పంపిస్తారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉంటే కూర్చున్న చోటు నుంచే చరవాణి, ట్యాబ్, కంప్యూటర్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే వెసులుబాటు ఉంది. జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో జీవన ప్రమాణ పత్రాలు స్వీకరించేందుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఖజానాశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు చెప్పారు. గడువులోపు పత్రాలు సమర్పించి అన్ని రకాల ప్రయోజనాల్ని అందుకోవాలని ఆయన కోరారు.

☛ జిల్లాలోని తొమ్మిది సబ్ ట్రెజరీ కార్యాలయాల పరిధిలో 9,903 మంది పెన్షనర్లు ఉన్నారు. వారిలో 8,912 మంది ఇప్పటికే పత్రాలు సమర్పించారు. 991 మంది సమర్పించాల్సి ఉంది.

14వ వర్ధంతి నివాళులు

గౌరవమర్యాదలు, మంచితనం, మమకారం
మా అందరికి అలవర్చి, మా అభివృద్ధికి
ఎంతగానో పాటుపడిన
శ్రీ పోలినేని నాగేశ్వరరావు గారి
14వ వర్ధంతి సందర్భంగా
అశ్రునివాళులు అర్పిస్తున్నాం.
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

కీ॥శే॥ పోలినేని నాగేశ్వరరావు, B.A., B.L.
జననం : 01-07-1932, మరణం : 01-03-2012
భార్య : పోలినేని వెంకట సుబ్బమ్మ (సుబ్బాయమ్మ)

కుమారులు - కోడళ్ళు
పోలినేని బాలశ్రీనివాస్ - పోలినేని శైలజ
పోలినేని సుబ్రహ్మణ్య ప్రసాద్ - పోలినేని అన్నపూర్ణ

కూతురు - అల్లుడు
నల్లమోతు దుర్గారాణి - నల్లమోతు మధుకర్

మనుమలు, మనుమరాండ్రు :
జ్యోత్స్న, మధుల్లిక, జ్ఞానప్రసూన, విఘ్నేష్, పూర్ణ యశస్వి, మోనిక, శివవెంకటసాయి జగన్నాథ్

KALYANIADS : 9849983659

అంగన్‌వాడీలకు బీమా ధీమా

పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై వర్తింపు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

మాతాశిశు సంరక్షణలో కీలకంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు బీమా ధీమా కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వైకాపా ప్రభుత్వంలో అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయలేదు. అధిక ఆదాయం పొందుతున్నారనే సాకుతో నవరత్నాల్ని వారి కుటుంబాలకు దూరం చేశారు. అనుకోని ప్రమాదం వాటిల్లి.. అనారోగ్య సమస్యతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందితే ఎలాంటి సహాయం అందేది కాదు. విధుల్లో ఉండి మరణించిన వారికి కూటమి ప్రభుత్వం సాయం అందించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకుంది. తద్వారా అంగన్‌వాడీల కుటుంబాలకు బీమా రక్షణ కలగనుంది. ★ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై)కు జిల్లాలో 1,524 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు (18 నుంచి 50 ఏళ్ల లోపు వారు) అర్హులుగా గుర్తించారు. వారు ఏడాదికి రూ.436 నగదు బ్యాంకు ఖాతా లేదా తపాలా శాఖ ద్వారా చెల్లిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందినా, సహజ మరణం పొందినా బీమా నగదు అందుతుంది. 50 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇది వర్తించదు. ★ పద్దెనిమిది నుంచి 70 ఏళ్లలోపు వారికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎస్‌బీవై) వర్తింపజేయనున్నారు. పథకం లబ్ధికి వార్షిక ప్రీమియంగా రూ.20 నగదు చెల్లిస్తే సరిపోతుంది. ఇది ప్రమాదవశాత్తు మరణానికి వర్తిస్తుంది. మృతి చెందినా, పూర్తి వైకల్యం పొందినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష అందిస్తారు. ఏటా జూన్ 1వ తేదీ నుంచి మరుసటి ఏడాది మే 31 వరకు బీమా కవరేజి ఉంటుంది. ఆటో డెబిట్ ద్వారా ప్రీమియం నగదు చెల్లించవచ్చు.

★ జిల్లాలోని 2,031 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సేవలందిస్తున్నారు. అందరితో బీమా ప్రీమియం కట్టించి వారితోపాటు కుటుంబాలకు రక్షణ కల్పించేలా స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారులు చొరవ చూపిస్తున్నారు. అర్హులందరూ ప్రీమియం చెల్లించి బీమా పథకాల్లో చేరాలని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి కోరారు.

9 నుంచి ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

గుంటూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మహిళ, పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మార్చి 9వ తేదీ నుంచి గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ)లో ప్రారంభమవుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూటింగ్ డైరెక్టర్, వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ అలీ మాట్లాడుతూ మార్చి 9, 10 తేదీల్లో బాలికలకు, 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురుష అభ్యర్థులకు, 15, 16 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర పురుష అభ్యర్థులకు ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు. 2005 జులై 2 నుంచి 2009 జనవరి 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కనీస ఎత్తు 152 సెం.మీ, ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష, మూడేళ్ల డిప్లొమా ఇంజినీరింగ్, రెండేళ్ల ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆయా విద్యార్హతల్లో మొత్తం మార్కుల్లో 50 శాతం, ఆంగ్లంలో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోనవసరం లేదని, నేరుగా ర్యాలీకి హాజరుకావచ్చన్నారు. ఒరిజినల్ లేదా డిజీలాకర్ ద్వారా ధ్రువపర్చిన విద్యార్హత ధ్రువపత్రాలు, నివాస పత్రం, ఎన్‌సీసీ సర్టిఫికెట్ (ఉంటే), ఆధార్ కార్డు, ఇ-మెయిల్ నంబర్, ఇటీవల తీసుకున్న 10 పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు, ప్రతి ధ్రువపత్రానికి సంబంధించిన 6 నకళ్ల కాపీలు తెచ్చుకోవాలని సూచించారు.

చూసిన కనులదే భాగ్యం

మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవీ సమేత శ్రీలక్ష్మీ నృసింహ స్వామి అభయ ప్రదాత హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని రంగురంగుల పూలదండలతో అలంకరించి మంగళగిరి పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, తాడేపల్లి, మంగళగిరి

ఆరోగ్య సంరక్షణలో రెండవ వార్షికోత్సవం

2nd ANNIVERSARY | శ్రేష్ఠ హాస్పిటల్స్®

శ్రేష్ఠ హాస్పిటల్స్‌తో మీ అనుబంధానికి రెండేళ్లు పూర్తయ్యాయి.
గత రెండు వసంతాలుగా మీ ఆరోగ్య నేస్తంగా సేవలందిస్తూ,
వేలాది మంది నమ్మకాన్ని అందుకున్నాం. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,
మీ సంరక్షణ కోసం ఇదే నిబద్ధతతో ముందుకు సాగుతామని హామీ ఇస్తున్నాం.

మీ ఆరోగ్య సంరక్షణలోనే సదా మా ప్రయాణం...

డా॥ యడ్లపల్లి లక్ష్మణ స్వామి
ఫౌండర్ ఛైర్మన్ & చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్

డా॥ నాగార్జున గొట్టిపాటి
డైరెక్టర్ & ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

నగదు రహిత సౌకర్యం | 24/7 ఎమర్జెన్సీ సర్వీస్

0863 352 5252, 77999 88108 | జెకెసి కాలేజ్ రోడ్, గుజ్జనగుండ్ల, గుంటూరు | www.sreshtahospitals.in

KALYANI ADS

ఉద్యోగ మేళా 27న

గుంటూరు: జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరులోని డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేఫ్ కాఫీ డే సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి, వయసు 18-35 సంవత్సరాల్లోపు యువత మేళాకు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 63020 96189 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అమృతమూర్తికి అశ్రుతాంజలి



కీ॥శే॥ అక్కిశెట్టి అన్నపూర్ణమ్మ గారు
(W/o. కీ॥శే॥ అక్కిశెట్టి వెంకయ్య గారు)
కాకానివారిపాలెం(గ్రా.), కారంపూడి(మం.), పల్నాడు జిల్లా.
జననం : 01-01-1927 ★ మరణం : 11-02-2026

మీ జీవన గమనంలో
ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని,
మా అందరి శ్రేయస్సు కోసం
అహర్నిశలు శ్రమించి, మా ఇంటి ఇలవేల్పుగా,
మాకు తోడు నీడగా నిలచిన మీరు
భౌతికంగా మా నుండి దూరమైనా...
మీ అనురాగ స్మృతులను ఎన్నటికీ మరువలేము.
దివి నుండి మీరందించే దీవెనలే
మాకు శుభాశీస్సులు.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు : అక్కిశెట్టి బాల గురవయ్య-అనంతరాములు; అక్కిశెట్టి బాబూరావు-సుజాత; అక్కిశెట్టి కొండలరావు-జ్యోతి
కుమార్తెలు - అల్లుళ్ళు : ఆవుల కుమారి-రామకోటయ్య; గాజుల సుజాత-సైదులు

మనుమలు & మనుమరాళ్ళు : చిల్లర వెంకట రమణ (లేటు); శింగంశెట్టి వెంకాయమ్మ;
అక్కిశెట్టి రామారావు M.Sc.(Ag.)-త్రివేణి B.Com.; అక్కిశెట్టి రమాశ్రీ M.B.B.S.,; అక్కిశెట్టి వెంకటకృష్ణ శేషసాయి B.B.A., LLB;
అక్కిశెట్టి వైష్ణవి B.B.A.,; అక్కిశెట్టి విష్ణుదేవరాయలు; తన్నీరు ఫణీంద్ర B.Tech.-విజయభారతి M.Sc. (Bio.Tech.);
అక్కిశెట్టి విజయభార్గవ్ M.Sc.,-స్వరూప B.Tech.; ఆవుల ప్రకాష్-సువర్ణ; ఆవుల సుధాకర్ (లేటు)-శైలజ;
పసుపులేటి కొండలరావు-విజయమాధవి; ఆకుల శ్రీనుబాబు M.S. (USA)-శైలజ M.S. (USA);
గాజుల సైదారావు M.S. (USA)-నీరజ B.Tech.(USA); గాజుల ఝాన్సీరాణి M.B.B.S., D.Ch. (Pediatrics)

మునిమనుమలు & మునిమనుమరాళ్ళు : అక్కిశెట్టి చేతన్ వెంకట రాయలు, అక్కిశెట్టి దేవాన్ష్ రాయలు, చిల్లర వేణుగోపాల్ B.Sc. (Ag.), ఆవుల భార్గవ్ మనోజ్ B.Sc. (Pharma Science), ఆవుల సాయిరాజేష్, ఆవుల నాగనందిని B.Tech., శింగంశెట్టి నిఖిత B.Tech, శింగంశెట్టి యశ్వంత్ B.Sc. (Ag.), పసుపులేటి నాగజ్యోతిర్మయి, పసుపులేటి నాగసుధా శ్రీరామ్ చరణ్, ఆకుల శ్రీజై నిధిన్, గాజుల స్మృతి ఆద్య, గాజుల సాధ్విశ్రీ ఆర్వా, తన్నీరు లాలిత్య, తన్నీరు నాగ రేయాన్ష్

పెద్దకర్మ : ది.25-02-2026 బుధవారం
పల్నాడు జిల్లా, కారంపూడి (మం.), కాకానివారిపాలెం, బ్రహ్మనాయుడు కాలనీ లోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియపరచడమైనది. సెల్ : 9912165194

(c) eenadu

సహాయకులు కాదు భోక్తలు

స్త్రీనిధి, ఉన్నతి రుణాల చెల్లింపుల్లో చేతివాటం

★ యడ్లపాడు మండలం తిమ్మాపురంలో ఆరు డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన వీవోఏలు సభ్యులకు తెలియకుండా బ్యాంకుల్లో రూ.60 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. రుణాలకు సంబంధించిన నగదు చెల్లించాలని సభ్యులకు బ్యాంకు నుంచి సమాచారం రావడంతో వీవోఏలు చేసిన అక్రమం వెలుగుచూసింది. ఇదే పరిస్థితి నాదెండ్ల మండలం ఇర్లపాడులోనూ చోటు చేసుకుంది.

★ చిలకలూరిపేట, నాదెండ్ల, వినుకొండ, ఈపూరు, బొల్లాపల్లి, నూజండ్ల, శావల్యాపురం, నరసరావుపేట, రొంపిచర్ల తదితర మండలాల్లో బ్యాంకు లింకేజి, స్త్రీనిధి, ఉన్నతి రుణాలు ఇప్పించేందుకు వీవోఏలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రూ.10 లక్షల రుణం ఇప్పిస్తే రూ.10 వేలు, రూ.20 లక్షలకు రూ.20 వేల చొప్పున వసూలు చేస్తున్నారు.

వీవోఏల అక్రమ రుణాల వ్యవహారంపై తిమ్మాపురంలో ఇటీవల మహిళల ఆందోళన

గణపవరం, సాతులూరు, నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), బోయపాలెం (యడ్లపాడు), న్యూస్‌టుడే

స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజి, స్త్రీనిధి, ఉన్నతి, ఆసరా తదితర పథకాల లబ్ధిని అందించడంలో గ్రామ సంఘం సహాయకులు (వీవోఏలు) చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో 36,620 స్వయం సహాయక సంఘాలుండగా.. స్త్రీనిధి, ఉన్నతి పథకాల కింద 75 శాతం మంది సభ్యులు రుణాలు తీసుకున్నారు. ఒక్కో గ్రూపునకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేశారు. ఒక్కో సభ్యురాలు రూ.50 వేల చొప్పున తీసుకున్నారు. వారు నెలకు రూ.2500 చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. వీవోఏలు ప్రతినెలా గ్రామ సంఘం సమావేశం రోజు రుణం, వడ్డీ, పొదుపు.. ఇలా అన్ని రకాల రికవరీకి సంబంధించి సభ్యుల నుంచి నగదు వసూలు చేస్తున్నారు. ఆ నగదు బ్యాంకుల్లో జమచేయాలి. కానీ సభ్యుల నుంచి వసూలు చేసిన నగదులో కొంత మాత్రమే జమ చేసి మిగతాది స్వాహా చేస్తున్నారు. గ్రూపు లేదా గ్రూపు సభ్యులకు జమ చేసిన నగదు రశీదులు ఇవ్వడం లేదు. ఏపీఎంల పర్యవేక్షణ లోపంతోనే ఈ తంతు మొత్తం జరుగుతున్నట్లు సమాచారం. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన ఏపీఎం, సీసీలు కూడా వారితో కుమ్మక్కై విషయాలు బయటకురాకుండా తొక్కిపెడుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయని సంఘాల సభ్యులు అంటున్నారు.

దీనికి సంబంధించి డీపీఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా తిమ్మాపురంలో సభ్యులకు తెలియకుండా రుణాలు పొందిన విషయమై ముగ్గురు వీవోఏలపై కేసు నమోదు చేశామన్నారు. ఇర్లపాడులో అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇసుక నేల.. పుచ్చసాగు భళా

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం ఇసుక నేలల్లో మామిడి తోటలో అంతర పంటగా పుచ్చకాయల సాగు చేస్తున్నారు. చినగంజాం, పూలవారిపాలెం, పెదగంజాం, మోటుపల్లి తదితర ప్రాంతాల్లో రైతులు పుచ్చకాయల సాగుపై దృష్టి పెట్టారు. మామిడి తోటలో రెండుసార్లు రోటావేటర్‌తో దుక్కి దున్ని, ఎకరం విస్తీర్ణంలో కిలో విత్తనాలు నాటారు. వారం రోజులకు మొక్క మొలిచి, 20 రోజులకు తీగలు అల్లుకున్నాయి. 45 రోజులకు దిగుబడి ప్రారంభమైంది. 90 రోజులకు మూడు నుంచి 10 కిలోల బరువు వరకు కాయలు పెరిగాయి. ఎకరాకు పంట కాలంలో రెండు సార్లు దుక్కికి రూ.3 వేలు, విత్తనాలు రూ.3 వేలు, ఇతర ఖర్చులు రూ.30 వేలు వ్యయం చేశారు. టన్ను రూ.13 వేల వరకు పలుకుతోంది. ఎకరానికి సుమారు అరు టన్నుల దిగుబడి వస్తుంది. ఆరు టన్నులకు రూ.78 వేలు వస్తుంది.

ఆదాయం బాగుంది

ఎకరం మామిడి తోటలో అంతర్ పంటగా పుచ్చకాయల సాగు చేపట్టా. విత్తనం వేసినప్పట్నుంచి 90 రోజులు పంట కాలం. ఇసుక నేలల్లో బాగా కాయలు ఊరతాయి. ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం టన్ను ధర రూ.13 వేలు పలుకుతోంది. అన్ని ఖర్చులు పోను రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది. **- పోలయ్య, రైతు, చినగంజాం**

రైతేరాజు

వేసవిలో గేదెల సంరక్షణ చర్యలు

దాచేపల్లి, న్యూస్‌టుడే: వేసవిలో గేదెలకు చూలు కట్టించడం, అధిక వేడి బారిన పడకుండా పాటించాల్సిన మెలకువలు, లాభదాయక పాడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను దాచేపల్లి పశు సంవర్ధకశాఖ అధికారి చెన్నయ్య వివరించారు. వేసవి ఎండలతో గేదెల్లో ఎద ఆగిపోతుంటుంది. ఈ లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపించవు. ఎద కొచ్చినవి మాత్రం తెల్లవారుజాము రెండున్నర నుంచి నాలుగు గంటల మధ్య మడి నుంచి తీగలు వేస్తాయి. ఇవి గేదెలు దైనందిన కార్యక్రమాల్లోకి వెళ్లాక కనిపించవు. వీటిని గుర్తించిన కొందరు అభ్యుదయ రైతులు చూలు కట్టిస్తారు. ఇలా చేసి పాల కొరత ఉన్న వేసవిలో పాడితో ఎక్కువ ఆదాయం పొందుతారు. వేడి తట్టుకోలేనివి అజీర్తితో బాధపడుతుంటాయి. వీటికి ప్రథమ చికిత్స కింద అల్లం, సొంటి, వామును ముద్ద చేసి పెట్టాలి. ఈ మోతాదు పశువు ఆకృతి మేరకు అందించాలి. ఎండాకాలంలో శరీర నిర్మాణ ప్రకారం పచ్చిమేత 25 నుంచి 40 కిలోలు, రెండుసార్లు ఎండుగడ్డి ఇచ్చి అధిక పాలదిగుబడి పొందొచ్చు. వీటిని కొట్టాల్లో ఉంచడం సురక్షితం. ఎండల్లో విప్పడం వల్ల వాతావరణంలోని వేడికి డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. గేదెలను ఉదయం ఏడు నుంచి పది, సాయంత్రం 4 నుంచి ఆరు గంటల సమయంలో విప్పడం మంచిది.

పెసర సాగుకు అనుకూలం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: పెసర సాగుకు ఇదే సరైన సమయమని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. పత్తి, వేరుసెనగ, కంది, మిరప పంటల అనంతరం బోర్లు, బావులు ఉన్న రైతులు పెసర, మినుము సాగు చేయవచ్చు. సకాలంలో విత్తితే పూత, పిందె దశలో అధిక ఉష్ణోగ్రతల వల్ల దెబ్బతినకుండా దిగుబడులు పొందవచ్చు. తటస్థ నేలలు, తేలికపాటి నుంచి మధ్యస్థ నేలలు పెసర పంటకు, బరువైన నేలలు మినుము సాగుకు అనుకూలం. పల్లాకు తెగులును తట్టుకునే డబ్ల్యూజీజీ-37, డబ్ల్యూజీజీ-42, ఎల్‌బీజీ-787, టీబీజీ-104 మినుము రకాలు అనుకూలమైనవి. ఎకరానికి 6-8 కిలోలు అవసరం. తొలిదశలో తెగుళ్లను అరికట్టడానికి కిలో విత్తనానికి 5 గ్రాములు ఇమిడాక్లోప్రిడ్ లేదా థయోమిథాక్సామ్ 5 గ్రాములతో మాంకోజెబ్ 2.5 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేయాలి.

సంప్రదించొచ్చు.. సలహా పొందొచ్చు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రైతులకు డిజిటల్ సేవలు అందించేందుకు వీలుగా 'ఫార్మర్ చాట్' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకువచ్చింది. డిజిటల్ గ్రీన్ ట్రస్టు సహకారంతో రూపొందించిన ఈ యాప్ ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, కోళ్ల, మేకల పెంపకం, మత్స్య సాగుకు సంబంధించిన మెలకువలు, తెగుళ్ల నివారణ తదితర వివరాలు తెలుసుకోవచ్చు. స్థానిక భాషలో సమాచారం అందించడం దీని ప్రత్యేకత. గూగుల్ ప్లేస్టోర్‌లో వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ❖ మొబైల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా ఆదే రోజు, వచ్చే నాలుగైదు రోజుల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియజేస్తుంది. ❖ సాగు చేసే పంటలకు సంబంధించిన ఎలాంటి సలహాలు కావాలన్నా వాయిస్ రూపంలో సంక్షిప్త సందేశం పంపడం ద్వారా పొందవచ్చు. ❖ పంటలకు సోకే చీడపీడల గుర్తింపు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ పంటకు ఏ ఎరువు వేయాలి. నీరు ఎప్పుడు పెట్టాలి వంటి సలహాలు ఇస్తుంది.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

గుంటూరు, న్యూస్‌టుడే

ప్రశ్న: పండు మిర్చి కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?: **- మోహన్‌రావు, బడేపురం, తాడికొండ మండలం**

సమాధానం: మిరప కాయలు రంగు, ఘాటు నాణ్యతను నిర్దేశిస్తాయి. మిర్చి నాణ్యతాప్రమాణాల్లో తేమ ప్రముఖ పాత్ర వహిస్తుంది. కాయలు కోసినప్పుడు 75-80 శాతం తేమ ఉంటుంది. దీనిని 10 నుంచి 11 శాతం వచ్చే వరకు ఆరబెట్టుకోవాలి. మిరపకాయలు పొడవుగా ఉండి గింజలు బరువు, కాయ మంచి రంగు ఘాటు ఉంటే అవి నాణ్యమైనవి. నాణ్యమైన ఎండు మిర్చిని పొందడానికి కోతకు ముందు, కోత సమయంలో, కోత అనంతరం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

కోతకు ముందు జాగ్రత్తలు.. కోతకు ముందే పంటకు నీటి తడులు ఇవ్వాలి. కోతకు 15 రోజుల ముందు నుంచి ఎటువంటి సస్య రక్షణ మందులు పిచికారీ చేయకూడదు. దీనివలన పురుగు మందుల అవశేషాలు లేకుండా మిర్చి ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

కోత సమయంలో.. మొక్కల మీద పూర్తి పక్వానికి వచ్చి రంగు తిరిగిన వెంటనే కాయలను పొడి వాతావరణంలో కోయాలి. ఇందు వల్ల కాయలు ఎండిపోవడం ముడతలు పడక మంచి నిగారింపు వస్తుంది. మొక్కల మీద ఎక్కువగా లేక అర పండినట్లైతే కాయలు ముడత పడి ఎండ కారణం రంగు తగ్గి నాణ్యత పోతుంది. కాయ నాణ్యత, దిగుబడులు పెరగాలంటే సరైన తేమ వచ్చేవరకు కోయాలి. కాయలను 7-8 సార్లు కోస్తే మంచి నాణ్యత వస్తుంది. కాయలను కోసిన తరువాత జాగ్రత్తగా ఒక రోజు రాశిగా పోసి పట్టాలు కప్పి సమానంగా పండేలా చూడాలి. కాయలను పట్టాలపై లేదా కాంక్రీటు కల్లాలపై ఆర బెట్టుకోవాలి. 10 శాతం తేమ వచ్చే వరకు 15-20 రోజుల వరకు కాయలను తిరగేస్తూ ఎండ బెట్టుకోవాలి.

- డాక్టర్ ఎం.నగేష్, ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త

కల్లంలోని ఎండు మిర్చిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

సైకిల్ తొక్కు.. ఆరోగ్యం దక్కు

శాప్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు

జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, శిక్షకులు

నరసరావుపేట (క్రీడలు), న్యూస్‌టుడే: సైక్లింగ్ ఆరోగ్యకర క్రీడ అని కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. శాప్ లీగ్స్‌-26లో భాగంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. సైకిల్ తొక్కితే గుండె ఆరోగ్యం మెరుగు పడుతుందని, శరీరం చురుగ్గా ఉంటుందన్నారు. మానసిక ఒత్తిడి తగ్గి ఉత్సాహం పెంపొందుతుందన్నారు. శాప్ లీగ్స్‌లో భాగంగా నిర్వహించే క్రీడా పోటీల్లో సత్తా చాటాలని సూచించారు. ★ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు అండర్-18 విభాగంలో 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 28, మార్చి 1న ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి తెలిపారు. పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్, మహిళా విభాగం జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి.పద్మావతి, క్రీడా శిక్షకులు పర్యవేక్షించారు. ★ అండర్-18 బాలుర విభాగం విజేతలు.. జె.దేవప్రసన్నకుమార్, ఎ.సన్నీ, జి. వెంకట నరేంద్ర, సీహెచ్ శ్రీనాగసతీష్, పి. వెంకట కార్తీక్, పి.రామ్‌చరణ్, షేక్.జబ్బార్, ఓర్సు వరుణ్ ★ అండర్-18 బాలికల విభాగం. . వై.తేజశ్విని, ఎన్.సింధు, జి.శ్రీవిద్య, యు. కోటేశ్వరమ్మ, కె.పవిత్ర, యు.లక్ష్మీప్రసన్న, జి. షర్మిల, ఎన్.హరికమల.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

రికార్డులు పరిశీలించి వైద్యులకు సూచనలు ఇస్తున్న బీసీకే నాయక్

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, వైద్యులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విజిలెన్స్ అధికారి బీసీకే నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అన్నిరకాల పరీక్షలు ఆసుపత్రిలో ఉచితంగా చేయాలని, ఓపీ, ఐపీ విభాగాల్లో సేవలు నాణ్యంగా ఉండాలన్నారు. ఓపీ టికెట్ స్కాన్ అండ్ షేర్ పద్ధతిలో రోగులకు సేవలందించాలని ఆదేశించారు. ఈ-ఆసుపత్రి విధానాన్ని మరింత పటిష్ఠం చేయాలన్నారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయని రోగుల్ని ఆరా తీశారు. ఆసుపత్రిలో థైరాయిడ్ పరీక్ష పరికరాలు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు విజిలెన్సు అధికారి దృష్టికి తీసుకెళ్లగా వాటిని సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సీఎస్ఆర్ఎం డాక్టర్ కృష్ణమూర్తి, వైద్యులు సుజాత, సుమన్, నర్సింగ్ సూపరిండెంట్ రాధ పాల్గొన్నారు.

'పది' పరీక్షలు పారదర్శకంగా నిర్వహిద్దాం

సమావేశంలో డీఆర్వో నారదముని, డీఈవో రామారావు తదితరులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, అవకతవకలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో నారదముని, డీఈవో రామారావు అన్నారు. 'పది' పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని కలెక్టరేటలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 470 పాఠశాలల నుంచి 26,515 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. 128 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. డీఆర్వో మాట్లాడుతూ అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటల భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సమర్థంగా పనిచేసేలా చూసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, అన్ని కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్తు సరఫరా ఉండాలన్నారు. అత్యవసర వైద్య సేవలు ప్రతి పరీక్ష కేంద్రంలో అందుబాటులో ఉంచాలని డీఆర్వో కోరారు. పరీక్షలకు సంబంధించిన బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. వదంతులు, అపోహలు వ్యాప్తి చెందకుండా సమాచార, ప్రసార శాఖ విభాగం విస్తృత ప్రచారం చేయాలన్నారు.

మతోన్మాద శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: మతోన్మాద శక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ కోరారు. చిలకలూరిపేట సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటైన జిల్లా సమితి సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధానాలు అనుసరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపి చట్టాలను బలోపేతం చేయాలన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబూరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుబ్బారావు, షేక్ సుభాని, నాయకులు చెరుకుపల్లి నిర్మల, కె. రాంబాబు, శ్రీనివాసరావు, మందపాటి రమణారెడ్డి, ముసునూరు రమేష్, ఉలవలపూడి రాము, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

BUILDING CONSTRUCTION

BOREWELLS

నాగార్జున బోర్‌వెల్స్: బోర్‌వెల్స్ వేయబడును. గ్రౌండ్ వాటర్ సర్వే చేయబడును. సంప్రదించండి. దేవినేని ప్రసాద్: గుంటూరు 94901 14326.

JOBS

EXP. Designers with Security features in Printing for Parjanya paper production Guntur ✆ 96768 11066, 90594 05366.

PROs, Marketing Managers Required. Salary: 27,500/-., NTR Circle, Vijayawada. ✆ 63043 28479

కావలెను. స్థానిక లక్ష్మీపురం 4వ లైన్ మాంటిస్సోరి స్కూల్ నందు పని చేయుటకు వాచ్ మెన్ ఫ్యామిలి (వసతి కలదు), ఆయమ్మలు కావలెను. ✆ 8121400100.

MNY ఫామ్ ల్యాండ్స్ కోసం గుంటూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం + Inc. ఇవ్వబడును. వయస్సుతో పనిలేదు. సంప్ర: 10am-6pm. ✆0863-4616071.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ నందు Senior Civil Engineersగా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము 50,000/- నుండి 60,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 8978480429.

నిరుద్యోగ యువతకి సువర్ణావకాశం. డా.రెడ్డీస్ ఫౌండేషన్ వారిచే కమ్యూనికేషన్ ఇంటర్వ్యూ, స్కిల్స్, కంప్యూటర్ కోర్స్‌లో 60 రోజుల ఉచిత శిక్షణ, ఉద్యోగం కల్పించబడును. వ: 18-28, 9063817157

కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ మరియు సెంట్రల్ ఎంప్లాయీస్, టీచర్స్, రియల్ ఎస్టేట్ వారు కావలెను. వ: 35-70, Q:10th, జీ: 12-15 వేలు ✆ 63041 81391

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

పల్లపాడు, బెజాత్‌పురం, రావెల, పొన్నెకల్లు, జొన్నలగడ్డ, మల్లాది, అమరావతి, కర్లపూడి, మోతడక, నిడుముక్కల, తుళ్ళూరు, బడేపురం, తాడికొండ, నంబూరు, కంతేరు, కొప్పురావూరు, వెనిగండ్ల, దొండపాడు, అనంతవరప్పాడు, నెక్కల్లు మరియు పరిమి గ్రామాలలో ప్రముఖ విద్యాసంస్థ కోసం పని చేయుటకు టీమ్ లీడర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్. సంప్ర: 8712618882, గుంటూరు.

SECURITY GUARDS

ప్రముఖ బ్యాంకులలో పని చేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21to45, అర్హత: 10th. PF+ESI కలదు. ✆ 96522 40528, 97049 64931, 94918 84025.

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్, 50 సం. వయసు, 12hr డ్యూటీ. జీతం 14000/-. ✆ 7288004466.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటన ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఇళ్లు కాదు పొగాకు పాకలు



పొగాకు ఆరబెట్టిన పాకలు

ఈ చిత్రంలో కన్పిస్తున్నవి ఇళ్లు కాదు పొగాకు పాకలు. ఆకును ఆరబెట్టేందుకు గ్రామాల్లో వందల సంఖ్యలో వీటిని ఏర్పాటు చేశారు. చెట్టు నుంచి తీసిన ఆకును తాళ్లకు గుచ్చి ఇందులో ఆరబెడతారు. తెల్ల బర్లీ పొగాకు సాగుకు పెట్టింది పేరైన వినుకొండ ప్రాంతంలో ఇటువంటి పాకలు వందల సంఖ్యలో వెలిశాయి. తిమ్మాయిపాలెం, కుమ్మరిపాలెం గ్రామాల్లో ఖాళీ స్థలం కనిపించకుండా కర్రలు పాతి రాత్రి వేళ మంచు, పగలు అధిక ఎండ పడకుండా రక్షణ కోసం పట్టలు కప్పుతారు. పచ్చి ఆకు తెచ్చి 25-30 రోజుల వరకు ఆరబెట్టి ఆ తర్వాత మండెలుగా వేస్తారు. వారానికోసారి వాటిని తిరగేసి గ్రేడింగ్ అనంతరం నాణ్యమైన ఆకును బేళ్లుగా కట్టి విక్రయ కేంద్రాలకు తరలిస్తారు.

- న్యూస్‌టుడే, వినుకొండ

శనగ నూర్పిడిలో జాగ్రత్తలతో మంచి దిగుబడులు

రైతులకు సూచనలిస్తున్న డీఏవో జగ్గారావు, పక్కన ఏడీఏ, ఏవోలు

సాతులూరు, గొరిజవోలు(చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే: శనగ పంట నూర్పిడిలో తగిన జాగ్రత్తలు తీసుకుని మంచి దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు అన్నారు. నాదెండ్ల మండలం సాతులూరు, గొరిజవోలు గ్రామాల్లో శనగ నూర్పిడులు జరగనున్న పంట పొలాలను మంగళవారం పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. జిల్లాలో 30వేల ఎకరాల్లో శనగ సాగు చేశారని ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గంలోనే సగానికి పైగా పంట వేశారన్నారు. ప్రభుత్వం శనగలు క్వింటాలుకు రూ.5875 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శనగ పంట సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రైతు స్వయంగా కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందన్నారు. నమోదు చేసుకున్న రైతులకు ఉత్పత్తి పరిమాణం, పంట తీసుకు రావాల్సిన తేదీ, మోతాదు, కేంద్రం వివరాలు సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) ద్వారా సమాచారం అందుతుందన్నారు. ఎస్ఎంఎస్ అందుకున్న రైతులు కేటాయించిన తేదీన సంబంధిత కొనుగోలు కేంద్రానికి పంట తెచ్చుకోవాలన్నారు. శనగ పంట నూర్పిడి చేసి బాగా ఆరబెట్టి శుభ్రం చేయాలని, తేమశాతం 14 లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. తమ సొంత గోనె సంచుల్లో రైతులు పంట తీసుకురావాలన్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న శనగలను తూకం వేసి, మార్క్‌ఫెడ్ సరఫరా చేసిన కొత్త గోనె సంచుల్లో నింపుతామన్నారు. కొనుగోలు కేంద్రంలో లోడింగ్ వరకు అయ్యే ఖర్చును రైతులు భరించాల్సి ఉంటుందన్నారు. ఈ-పంటలో రైతులు శనగను తప్పనిసరిగా నమోదు చేసి ఉండాలన్నారు. అలాంటి రైతుల నుంచే పంట కొనుగోలు చేస్తామన్నారు. ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంక్ ఖాతా నంబరు (ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో), పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు పూర్తయిన తర్వాత బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. జిల్లాలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు, ఏవో శ్రీలత ఉన్నారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఆసుపత్రిలో చెప్పకుండా వచ్చి.. కాలువలో దూకి..

వృద్ధుడి బలవన్మరణం

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో గుంటూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఎవరికీ చెప్పకుండా వచ్చారు. సొంతూరికి సమీపంలో బస్సు దిగి నేరుగా కాలువలో దూకి బలవన్మరణం చెందారు. ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన వృద్ధుడు కటికల పెద్ద కాశయ్య(65) గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో ఎవరికి చెప్పకుండా ఆయన మంగళవారం తన గ్రామానికి బస్సులో వచ్చారు. స్థానిక గుంటూరు బ్రాంచి కాలువ (జీబీసీ)లో దూకారు. స్థానికులు గమనించి రక్షించే ప్రయత్నం చేయగా లోతులోకి వెళ్లి మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించి సంఘటనపై విచారణ చేశారు. పెద్ద కాశయ్య బలవన్మరణంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పు తీర్చలేదని మహిళా కండక్టర్ దుశ్చర్య

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సహచర ఉద్యోగి తన వద్ద తీసుకున్న అప్పులు తీర్చలేదని ఆర్టీసీ మహిళా కండక్టర్ దుశ్చర్యకు పాల్పడింది. అతని కుమారుడు, కూతురు ఫొటోలను అసభ్యంగా చిత్రీకరించి వేధింపులకు పాల్పడడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... విజయవాడ శివారు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఇతనికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. భార్య 20 సంవత్సరాల క్రితం విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి పిల్లలతో కలిసి ఉంటున్నారు. నరసరావుపేట డిపోలో పని చేసే సమయంలో.. అక్కడే కండక్టర్‌గా పని చేస్తున్న సైదాబి వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నారు. కొంత తిరిగి చెల్లించారు. ఆరోగ్యం సరిగా లేక.. మిగతా మొత్తం చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో గన్నవరం బదిలీ అయ్యారు. సైదాబి అక్కడకు వచ్చి.. ఆయనతో గొడవపడింది. అధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగం ఊడగొట్టింది. అతని కొడుకు, కూతురు ఫొటోలను ఏఐతో అసభ్యంగా చిత్రీకరించి.. అతనికే వాట్సాప్ చేసింది. పైగా ఆ ఫొటోలతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు తెరిచి.. అందరినీ డబ్బులు అడుగుతోంది. అసభ్యంగా చిత్రీకరించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరింపులకు దిగడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి ఫిర్యాదు చేయగా.. ఆమెపై కేసు నమోదైంది.

ప్రేమపేరిట విద్యార్థినికి వేధింపులు

యువకుడిపై కేసు

మల్లమ్మసెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని రామిరెడ్డిపేటలో ఓ కళాశాలలో పీజీ చదువుతూ వసతిగృహంలో ఉంటున్న ఓ విద్యార్థిని వెంటపడుతూ ప్రేమపేరిట వేధిస్తున్న నకరికల్లుకు చెందిన లక్ష్మీనారాయణపై పోలీసులకు ఫిర్యాదు అందింది. అతని వేధింపులు తాళలేక బాధితురాలు ఒకటో పట్టణ పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, రిటైల్ ధర - 154, చికెన్ విత్‌స్కిన్ - 223, చికెన్ స్కిన్‌లెస్ - 254.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

(c) eenadu

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఒర్వకల్లు(అచ్చంపేట): మండలంలోని ఒర్వకల్లులో రూ.2 కోట్లతో నిర్మించిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మాచర్లలో ఉద్యోగ మేళా నేడు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఎస్.కె.బి.ఆర్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 18 నుంచి 35 ఏళ్ల వయసులోపు వారు పది నుంచి పీజీ చదివిన వారు అర్హులన్నారు. జాబ్ మేళాలో పాల్గొనేవారు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్టుతో హాజరు కావాలని కోరారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

26న రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న అచ్చంపేటలోని ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా మినీ సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి దానియేలు తెలిపారు. 2013 నుంచి 2015 మధ్యలో జన్మించినవారు ఎంపికలో పాల్గొనేందుకు అర్హులన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు చరవాణి నంబరు 9182774886లో సంప్రదించాలని కోరారు.

డ్రగ్స్ వద్దు బ్రో

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ఎన్నారై కళాశాల విద్యార్థులు పట్టణంలోని తాలుకా సెంటర్‌లో మంగళవారం మానవహారం నిర్వహించి ఆకట్టుకున్నారు. డ్రగ్స్‌తో కలిగే హానికర ప్రభావాలు, చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని మాజీ సభాపతి డాక్టర్ కోడెల కార్యాలయం బజారులో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. **- స్థానికులు, రఘురామ్‌నగర్**

✔ మురుగు కాలువల శుభ్రతకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. సమస్య ఉన్న చోట కాలువలను వెంటనే శుభ్రం చేయిస్తాం. **-విజయసారథి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

ప్రైవేటు బడుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

అచ్చంపేట, గురజాల గ్రామీణ, దాచేపల్లి న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు అర్హతగల విద్యార్థులు మార్చి 10 లోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని అచ్చంపేట, గురజాల మండలాల ఎంఈవోలు ప్రసాదరావు, సత్యనారాయణ, దాచేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ బుధవారం పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తారన్నారు. సర్వ గ్రామ సచివాలయాలు, ఎంఈవో కార్యాలయంలో వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

రెంటాల ఆలయాలకు విరాళాలు

రెంటచింతల, న్యూస్‌టుడే: రెంటాల లక్ష్మీ చెన్నకేశవ, శివాలయాల పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు ఇచ్చినట్లు ఆలయ ఈవో రామిరెడ్డి తెలిపారు. జగుటూరి నాగిరెడ్డి, నస్సెగంట గోపాలాచార్యులు, పూరేమెట్ల శేషభట్టాచార్యులు, గార్లపాటి సాంబశివశర్మ రూ.5.16 లక్షల చొప్పున రూ. 15.48 లక్షలు ఆలయ ఖాతాలో జమచేసినట్లు వెల్లడించారు. ఇటీవల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి రెంటాల ఆలయాల పునర్నిర్మాణానికి రూ.2.20కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులకు ప్రజల నుంచి రూ. 73 లక్షల సొమ్ము కంట్రిబ్యూషన్ ఇవ్వాలని దేవాదాయశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో అయిదుగురు రూ.5.16 లక్షల చొప్పున విరాళాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆలయానికి ఉన్న 60 ఎకరాల సాగు భూమికి కౌలుదార్లు చెల్లించిన రూ.30 లక్షలు బ్యాంకు ఖాతాలో జమై ఉన్నాయి. మొత్తం సొమ్ము జమచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే నిర్మాణ పనులు టెండర్ దశకు చేరుకుంటాయి.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం చేయండి

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

క్రోసూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్చి7న విజయవాడలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం క్రోసూరులో ప్రభుత్వ ఉద్యోగులు సంఘం ప్రతినిధులు గోడపత్రికలు ఆవిష్కరించారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శ్యాంసన్, ప్రధాన కార్యదర్శి బి.రత్తయ్య, నాయకులు పాల్గొన్నారు.

అందిపుచ్చుకోండి.. ఆదా చేసుకోండి

పీఎం సూర్యఘర్‌తో పేద, మధ్య తరగతికి మేలు

అమరావతి, అచ్చంపేట, న్యూస్‌టుడే

పేద, మధ్య తరగతి కుటుంబాలు భారంగా భావించే విద్యుత్తు ఛార్జీల మోత తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం ఉపశమనంగా మారింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటే ఏటా వేలల్లో వచ్చే విద్యుత్తు బిల్లుల సొమ్ము ఆదా చేసుకోవచ్చు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇంటి పైకప్పుపై సోలార్ యూనిట్లు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ పథకం అందుబాటులోకి తీసుకురావడంతో ఇప్పటికే చాలా చోట్ల వీటిని మంజూరు చేసి అమర్చి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్తు సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. నెలకు రూ.3వేలు విద్యుత్తు బిల్లు వచ్చే వినియోగదారుడు 3కేవీ సామర్థ్యం గల యూనిట్‌ను అమర్చుకుంటే బిల్లు కట్టనవసరం లేదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు.

లింగాపురంలో అమర్చిన సోలార్ యూనిట్

వీరికి పూర్తి రాయితీ: ప్రభుత్వం అందిస్తున్న సోలార్ యూనిట్ల వాడకం పెరగాలని వాటి ద్వారా ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి జరగాలని రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రధానంగా ఎస్సీ ఎస్టీల్లో సొంత ఇళ్లు ఉన్న వారికి 2 కిలోవాట్ల పూర్తి రాయితీపై సోలార్ యూనిట్లు అమరుస్తున్నారు. వారి గృహ సామర్థ్యానికి అనుగుణంగా సోలార్ యూనిట్లు అమర్చడం ద్వారా వారు నెలవారీగా చెల్లించాల్సిన బిల్లులు చెల్లించే పనిలేకుండా వారికి భారం తప్పుతుంది. మిగతా గృహ వినియోగదారులకు కూడా సామర్థ్యాన్ని బట్టి రాయితీలు అందజేస్తున్నారు. రాయితీ పోను మిగతా సొమ్ము చెల్లిస్తే వారికి సోలార్ యూనిట్లు అమరుస్తున్నారు. ఇంటి అవసరాలకు 100 యూనిట్లు అవసరమైతే 120 యూనిట్లు సోలార్ ద్వారా ఉత్పత్తి అయితే మిగిలిన 20 యూనిట్లకు ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది.

యూనిట్ వివరాలు..

కేవీ	మొత్తం ఖర్చు	ప్రభుత్వ రాయితీ
1	70,000	30,000
2	1,40,000	60,000
3	2,10,000	78,000

మండలం	అమర్చినవి
అమరావతి	214
పెదకూరపాడు	111
అచ్చంపేట	80
క్రోసూరు	46

✪ కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాలతో అమరావతి మండలం అత్తలూరును సోలార్ మోడల్ గ్రామంగా విద్యుత్తు శాఖ ఎంపిక చేసింది. గ్రామం మొత్తం సోలార్ యూనిట్లను మార్చాలని ఇప్పటికే గ్రామస్థులకు పలుసార్లు విద్యుత్తు అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఎక్కువ మంది వెండర్లకు గ్రామాన్ని అప్పగించి వీలైనంత త్వరగా సోలార్ యూనిట్లు అమర్చాలని విద్యుత్తు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు గ్రామంలో 40 సోలార్ యూనిట్లు అమర్చినట్లు ఏఈ రవికిరణ్ తెలిపారు.

'ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా'

పొడపాడు (పెదకూరపాడు), న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్య, పంట రోడ్ల అభివృద్ధి వంటి మౌలిక వసతుల కల్పనకు దశల వారీగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రజల కోసం ప్రవీణ్ కార్యక్రమం 47వ రోజు మంగళవారం రాత్రి పెదకూరపాడు మండలం పొడపాడులో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో 7.91కోట్లు వెచ్చించి సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జల్‌జీవన్ పనులు తమకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయని గుక్కెడు నీటికోసం అవస్థలు పడుతున్నామంటూ పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు అందించారు. అనంతరం రూ.20 లక్షలతో గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి శంకుస్థాపన నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, నేతలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

సభ్యత్వ నమోదులో ముందంజలో నిలపాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తర్వాత అంతటి క్రేజ్ ఉన్న నాయకుడు పవన్ కల్యాణ్ అని కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే, జనసేన పార్టీ సభ్యత్వ నమోదు నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు పంతం నానాజీ అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లలో పవన్ కల్యాణ్ గ్రాఫ్ వంద రెట్లు పెరిగిందన్నారు. ఆయనతోపాటు పార్టీ ఆశించిన విధంగా ఎదగలేదన్నారు. పార్టీ ఎదిగితేనే మనం అనుకున్నది సాధించవచ్చన్నారు. పవన్ కల్యాణ్ స్థాయికి జనసేనను తీసుకెళ్లే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదులో పల్నాడును ముందంజలో నిలపాలన్నారు. పార్టీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు జిలానీ, రాజారమేష్, రామాంజనేయులు, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే నానాజీ

ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, మారణాయుధాల వద్ద పోలీసులు

'అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం'

లింగంగుంట్ల (పెదకూరపాడు), న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని, గంజాయి సరఫరా చేసే వ్యక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. సోమవారం పెదకూరపాడు మండలం లింగంగుంట్లలో ఇంటింటికీ తిరిగి సోదాలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను, సరైన పత్రాలు లేని 20కు పైగా ద్విచక్ర వాహనాలు, మారణాయుధాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక శక్తుల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కార్డన్‌సెర్చ్ చేపడుతున్నామని ఎవరైనా మారణాయుధాలు, పేలుడు పదార్థాలు కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలంతా ఐకమత్యంగా ఉండి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. క్రోసూరు సీఐ ప్రత్తిపాటి సురేష్ పెదకూరపాడు ఎస్సై గిరిబాబు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల జాగ్రత్తలపై అవగాహన

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: అనుకోని అగ్ని ప్రమాదంలో చిక్కుకుంటే ఎలా బయట పడాలో తెలియజేసే మాక్‌డ్రిల్‌ను అగ్నిమాపకశాఖ సిబ్బంది మంగళవారం సత్తెనపల్లి, పిడుగురాళ్ల పట్టణాల్లోని జడ్పీ సుగాలి ఉన్నత పాఠశాల, ఆదిత్య పబ్లిక్ పాఠశాలలో నిర్వహించారు. విపత్తుల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి రూ.3 లక్షల సాయం

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ ఒప్పంద ఉద్యోగి షేక్ మస్తాన్ మృతి బాధాకరమని ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మాచర్ల డివిజన్ కార్యాలయంలో మస్తాన్ అకాలంగా మరణించడంతో కుటుంబాన్ని పరామర్శించారు. మాచర్ల డివిజన్‌లోని తోటి ఉద్యోగులు మస్తాన్ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్ కుమార్ చేతుల మీదుగా అందించారు. డీఈ సింగయ్య, రామయ్య, ఆనందరావు, చంద్రశేఖర్, కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదు

మాచర్ల పట్టణం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ఉపసంహరించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. యూనియన్ నాయకుడు మురారి మాట్లాడుతూ ప్రభుత్వం 12 డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రజలకు సేవలు అందించే సంస్థను ప్రైవేటు పరం చేయడం సరికాదన్నారు.

సీసీ రోడ్డు నిర్మించరూ..

పిన్నెల్లిలోని వీరభద్ర స్వామి ఆలయం నుంచి సుగాలీ కాలనీ వరకు ఉన్న మట్టి రోడ్డు గ్రామస్థులను ఇబ్బంది పెడుతోంది. రహదారిపై ఎత్తుపల్లాలు ఉన్నాయి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి, కంప చెట్లు ఉండటంతో రాత్రిపూట విషపురుగుల వస్తున్నాయని వాపోతున్నారు. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారి కాలనీ వాసులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా పట్టించుకోవాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మాచవరం

దారికి అడ్డంగా నిర్మించిన గృహం తొలగించాలి

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: రహదారి నిర్మాణానికి అడ్డంగా దారిలో నిర్మించిన గృహాన్ని తహసీల్దారు కిరణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. వివరాల్లోకెళ్తే మాచర్ల పట్టణంలోని 7వ వార్డులో ఎరుకల కాలనీలో రహదారి నిర్మాణానికి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కానీ రహదారి మధ్యలో నిర్మించిన గృహం వల్ల రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. ఇంటి నిర్మాణాన్ని చేపట్టిన ఇంటి యజమానికి కమిషనర్ వేణు బాబు ఇప్పటికే పలు మార్లు హెచ్చరించినా స్పందించక పోవడంతో తహసీల్దార్ కిరణ్ పరిశీలించారు ఇంటి యాజమానితో పిలిపించి మాట్లాడారు. స్వచ్ఛందంగా ఇంటిని తొలగించాలని లేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు మీద నిర్మించిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్,కమిషనర్

ఆధ్యాత్మిక జీవితం గడపాలి

అచ్చంపేట, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరు శాంతి సమాధానాలతో ఆధ్యాత్మిక జీవితం గడపాలని ఏఈఎల్‌సీ సంస్థ సెక్రటరీ టు కంట్రోలర్ రెవరెండ్ ఏసురత్నకుమార్ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని ఏఈఎల్‌సీ చర్చి ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని దైవ సందేశం ఇచ్చారు. పాస్టర్లు ఎం.రవికుమార్, సతీశ్‌బాబు చర్చి ప్రతిష్ఠ గురించి వివరించారు. అచ్చంపేట, క్రోసూరు మండలాల నుంచి విశ్వాసులు, సంఘ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వార్షికోత్సవంలో విశ్వాసులు

దేవాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

బెల్లంకొండ, న్యూస్‌టుడే: కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనుల్లో కొంత కాలయాపన జరిగిందని, జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని దేవాలయ నిర్మాణ దాత డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అరుణాచల్ ప్రదేశ్) రామ్ గోపాల్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతంలో ఉద్యోగ బాధ్యతల నిమిత్తం కొంత దేవాలయ నిర్మాణ పనులు ఆగిపోవడం జరిగిందని, వెంటనే దేవాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆయన ఈవో కోటిరెడ్డికి సూచించారు. ప్రస్తుతం దేవాలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి దేవాలయ కమిటీకి ప్రత్యేక సూచనలు చేశారు.

పనులు పరిశీలిస్తున్న దాత రామ్ గోపాల్ నాయక్

చిరుజల్లులతో అన్నదాతల్లో ఆందోళన

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో మంగళవారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అపరాలు ఇంటికి చేరే సమయంలో వర్షంతో ఇబ్బందులుంటున్నాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్ పట్టాలు కొనుగోలు చేస్తున్నారు.

విద్యార్థినులకు ఉద్యోగాల కల్పన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల, శ్రీ బాబా గురుదేవ్ డిగ్రీ, పీజీ కళాశాలలో టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ బాధ్యులు మంగళవారం విద్యార్థినుల కోసం ప్రత్యేక ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టారు. 89 మంది విద్యార్థినులు హాజరవ్వగా రాత పరీక్ష, మౌఖిక పరీక్షలో ప్రతిభతో వారిలో 39 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని ఆయా కళాశాలల యాజమాన్యం అభినందించారు.

'చర్లగుడిపాడు గ్రామస్థుల హత్యలు దారుణం'

దాచేపల్లి, న్యూస్‌టుడే: గురజాల మండలం చర్లగుడిపాడులో చోటుచేసుకున్న పద్మశాలి కులానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్యలను తీవ్రంగా ఖండిస్తూ దాచేపల్లి పట్టణంలోని పద్మశాలి నాయకులు మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన భువనగిరి శ్రీనివాసరావు, కాకుమాను భావన ఋషి అనే ఇద్దరు వ్యక్తులను అగ్రవర్ణాలకు చెందిన వారు అతి దారుణంగా హత్య చేసి అడిగొప్పల సమీపంలో పెద్ద కాలువలో పడేసిన ఘటన అమానుషమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలపై ఇలాంటి దారుణాలు పునరావృతం కావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అన్నదాన కమిటీ మాజీ ఛైర్మన్ మృతికి నివాళి

రెంటచింతల: పుణ్యక్షేత్రమైన సత్రశాల రెడ్ల అన్నదాన కమిటీ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి(78) అనారోగ్య సమస్యలతో మంగళవారం మృతిచెందారు. ఆయన మృతికి కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, ఓబుల్ రెడ్డి, వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి నివాళి అర్పించారు.

సేవలు నిలిచి.. కార్యకలాపాలు స్తంభించి

పట్టణ ప్రణాళికా విభాగంలో ఈ నెల ఒకటి నుంచి ఇబ్బందులు

న్యూస్‌టుడే, సత్తెనపల్లి

పట్టణానికి గుండెకాయలాంటి ప్రణాళికా విభాగం సేవలు సత్తెనపల్లి పురపాలక సంఘంలో దిక్కుమొక్కూలేని విధంగా మారాయి. ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌ల అమలుకుతోడు జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉంటటంతో పుట్టగొడుగుల్లా అనధికార లేఔట్లు వెలుస్తున్నాయి. భవన నిర్మాణాలకు అనుమతుల కోసం దరఖాస్తులు ఎక్కువగా దాఖలవుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉంటడంతో ప్రచార బోర్డుల ద్వారా రావాల్సిన ఆదాయంపై కూడా ఈ విభాగం దృష్టి సారించాల్సి ఉంది. ఇక అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ ప్రకారం మార్గం చూపించేది కూడా ప్రణాళికా విభాగమే. ఇంత కీలకమైన, అక్రమాలపై నిఘా పెట్టే విభాగం సేవలపై ఉన్నతాధికారులు అశ్రద్ధ చూపించడం విమర్శలకు తావిస్తోంది.

✦ పట్టణ ప్రణాళికా విభాగం అధికారి(టీపీవో) రాధాకృష్ణను సరెండర్ చేస్తూ గత నెలాఖరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులందరూ ఏకాభిప్రాయంతో తీర్మానం చేశారు. ఈ నెల 1 నుంచి టీపీవో రావట్లేదు. ఆయనను వేరేచోటకు డిప్యూటేషన్‌పై పంపించినట్లు తెలుస్తోంది. టీపీవో లేని పక్షంలో ఆ బాధ్యతల్ని టీపీఎస్(టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు) చూస్తారు. పురపాలక సంఘంలో రెండు టీపీఎస్ పోస్టులు ఉండగా రెండూ ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయాలని చాలా రోజులుగా కౌన్సిల్ ఉన్నతాధికారుల్ని కోరుతున్నా పట్టించుకోవట్లేదు. టీపీవోను సరెండర్ చేస్తూ ప్రణాళికా విభాగం సేవలకు ఇబ్బంది లేకుండా వేరే అధికారిని నియమించాలని కోరినా ఇప్పటివరకు స్పందన లేదు. దీంతో ఆ విభాగం తలుపులు కొన్ని రోజులుగా తెరచుకోవట్లేదు. సచివాలయాల ప్లానర్ల నుంచి కార్యాలయానికి పంపిన అనుమతుల దస్త్రాలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రజలు కార్యాలయానికి వచ్చి వెనుతిరుగుతున్నారు. బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌ల గడువు ముగియబోతున్న తరుణంలో ప్రజల్ని చైతన్యవంతం చేసే చర్యలు కూడా లోపించాయి. పట్టణ ప్రణాళికా విభాగం పర్యవేక్షణకు టీపీవో లేదా టీపీఎస్‌ను నియమించాలని ఉన్నతాధికారుల్ని కోరినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి తెలిపారు.

ఖాళీగా ఉన్న పట్టణ ప్రణాళికా విభాగం అధికారి కుర్చీ

గుంతల దారితో అవస్థలు

గురజాల- కారంపూడి రహదారి చర్లగుడిపాడు ఎర్రవాగు సమీపంలో గుంతలతో అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేసినా మూణ్నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. రాత్రి సమయాల్లో రహదారిపై ఏర్పడిన గోతులను తప్పించబోయి అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే గురజాల గ్రామీణ

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తహసీల్దారు వరకుమార్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో మాల్‌ప్రాక్టీసు జరుగుతుందా, విద్యార్థులకు తాగునీరు, విద్యుత్తు, తదితర సౌకర్యాలు ఉన్నాయా అని పరిశీలించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం రోజు 172మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మీ దేవి తెలిపారు.

ఏపీఆర్‌జేసీలో ..

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ విజయపురిసౌత్‌లోని ఏపీఆర్‌జేసీలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది. స్థానికంగా ఏపీఆర్‌జేసీలో సోషల్ వెల్ఫేర్, ఏపీఆర్‌జేసీ విద్యార్థులు 234 మందికిగాను 231 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సీసీ కెమెరాల ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

సంరక్షకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నరసరావుపేటలో శిశు సంరక్షణ కేంద్రం-02, పిడుగురాళ్ల బాలల సంరక్షణ నిలయం-01లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థినులు మార్చి 2 లోగా బరంపేటలోని జిల్లా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

వృద్ధుడి ఆత్మహత్య

కారంపూడి, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉంటున్న వృద్ధుడు అనారోగ్య కారణాలతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి గ్రంథాలయ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యడవల్లి గురవయ్య (76) గ్రంథాలయ సమీపంలో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉండటం, ఒంటరిగా ఉండటంతో మనస్థాపానికి గురై పూరి గుడెసెలోని పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వేధింపులపై కేసులు నమోదు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో అత్తింటి వేధింపులు, అదనపు కట్నం కోసం భార్యలపై వేధింపులకు పాల్పడుతున్న వారిపై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. చినమక్కెన గ్రామానికి చెందిన సీర్ణం కల్యాణికి ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డితో వివాహం జరిగింది. కొన్నేళ్లు సజావుగా సాగిన వీరి కాపురంలో అదనపు కట్నం కోసం భర్త, అతని బంధువులు వేధిస్తుండటంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాపట్లకు చెందిన షేక్ ముబీనాను పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామానికి చెందిన జిలానీ సాహెబ్‌తో 2003లో వివాహం జరిగింది. ఆమె భర్త, కుటుంబ సభ్యులు మాటలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ పోలీసులను ఆశ్రయించారు.

వ్యక్తిపై దాడి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: జూలకల్లులో ఓ వ్యక్తిపై జరిగిన దాడిపై నలుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన బి.రామిరెడ్డి, ఓ మహిళ ఇంటికి సోమవారం అర్ధరాత్రి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రత్యర్థులు కాళ్లు చేతులపై కర్రలతో దాడిచేసినట్లు తెలిపారు. అతను ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.

ద్విచక్రవాహనాలు దహనం

దుర్గి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తేరాలలో స్థానిక మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన నాగరాజు, శ్రీనివాసరావుకు చెందిన ద్విచక్రవాహనాలను ఉంచారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ వాహనాలకు పెట్రోలు పోసి నిప్పంటించారు. ఓ వాహనం పూర్తిగా, మరొకటి పాక్షికంగా దెబ్బతింది. వీటితోపాటు పాఠశాలకు చెందిన గది తలుపులు కూడా దెబ్బతిన్నాయి. పాఠశాల హెచ్ఎం కిషోర్ ఫిర్యాదు మేరకు ఎస్సై సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

(c) eenadu

నరసరావుపేట

వినుకొండ పట్టణ ఎస్సైగా నరేష్‌కుమార్

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ పట్టణ ఎస్సైగా నరేష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్సైగా పనిచేస్తున్న... బదిలీపై వినుకొండ వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో బాపట్ల పోలీస్ స్టేషన్‌లో ఆరు నెలల పాటు శిక్షణ ఎస్సైగా పనిచేసిన రెండు నెలల క్రితం అమరావతి పోలీస్ స్టేషన్‌లో నియమితులయ్యారు. అక్కడి నుంచి వినుకొండకు బదిలీపై వచ్చారు.

26న మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట పురపాలక సంఘ భవనంలో ఈనెల 26న గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ షేక్ రఫాని మంగళవారం తెలిపారు. సమావేశంలో అజెండాలో పొందుపరచిన 25 అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట పట్టణంలో డైకెమెన్ కాలనీ నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిలో మురుగు నీరు నిల్వ ఉండి నానా పట్టి పచ్చగా మారాయి. దుర్వాసన వస్తోంది. **- రామకృష్ణ**

✔ పరిశీలించి ఆ దారిలో నిల్వ నీటిని మళ్లిస్తాం. ఇకపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వరరావు, పారిశుద్ధ్య అధికారి - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

? నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఓ విద్యుత్తు స్తంభానికి పిచ్చిమొక్కలు తీగలు అల్లుకున్నాయి. విద్యుత్తు తీగల వరకు పాకాయి. దీంతో తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. **- స్థానికులు** ✔ వెంటనే క్షేత్రస్థాయి సిబ్బందిని పంపి స్తంభానికి అల్లుకున్న మొక్కలు తొలగిస్తాం. సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తాం. **- సురేంద్ర, ఏఈ, విద్యుత్తు శాఖ - న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**

వైభవంగా పువ్వాడ అమ్మవారి తిరునాళ్ల

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నూజండ్ల, న్యూస్‌టుడే: పువ్వాడ అమ్మవారి తిరునాళ్ల మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. చుట్టుపక్కల గ్రామాలైన కొండలరాయునిపాలెం, ములకలూరు, పాత, కొత్తపాలెం, కొండప్రోలు, గొల్లపాలెం, పువ్వాడ, ప్రకాశం జిల్లా జమ్మలమడక, మక్కెనవారిపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. రైతులు పశువులను దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించి పాడి, పంటలతో లోగిళ్లు కళకళలాడాలని అమ్మవారిని వేడుకున్నారు. మేళతాళాలతో ముక్కుబడి ప్రభలను దేవాలయం వద్దకు తరలించారు. రాత్రికి భారీ విద్యుత్తు ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బృందావన భజనలు, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కృష్ణపావని ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సెలక్షన్ గ్రేడ్‌తో మెరుగైన పాలన

మాట్లాడుతున్న ఛైర్మన్ రఫాని

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేసిన కృషి ఫలితంగానే సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ రూపాంతరం చెందిందని పురపాలక సంఘ ఛైర్మన్ షేక్ రఫాని అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సెలక్షన్ గ్రేడ్‌తో మరిన్ని నిధులు మంజూరై పుర ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది సంఖ్య పెరుగుతుందన్నారు. దీని ద్వారా పరిపాలన సౌలభ్యం పెరిగి వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు.

హోదా పెంచి.. అక్రమాలకు తెరదీసి..

వినుకొండ పురపాలికలో నిబంధనలకు తిలోదకాలు

వినుకొండ, న్యూస్‌టుడే: పురపాలికలో పొరుగు సేవల విభాగం అక్రమార్జనకు ఆదాయ వనరుగా మారింది. సిబ్బంది నియామకం నుంచి వేతనాల పెంపు వరకు అన్నింటిలోనూ నిబంధనలను నీరుగారుస్తున్నారు. వినుకొండ పురపాలక సంఘంలో బదిలీ అయిన ఓ అధికారి హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇందుకు సంబంధించిన ఆధారిత నిరోధక శాఖలో పాటు మున్సిపల్ పాలకులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

ఉత్తీర్ణులైనవారిని పరిశీలించి లేదని వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌(డీఈవో)గా... (అప్కాస్)కు సిఫారసు చేసిన తర్వాత మాత్రమే ఆమోదింపజేస్తారు. ఇక్కడ ఆమోదం లేకుండానే కొంత మందికి ఉద్యోగ స్థాయిని పెంచడంతో జీతాలు పెరిగి ఆ భారం పురపాలికపై పడింది. ఉదాహరణకు నెల వేతనం రూ.21500 ఇచ్చే డేటా ఎంట్రీ ఆపరేటర్‌(డీఈవో)ను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌(డీపీవో)గా మార్చడంతో రూ.24500 చెల్లించాల్సి వస్తుంది. ఈ హోదాలో గతంలో ముగ్గురు ఉండగా హోదా మార్పుతో ఏడుగురయ్యారు. దీంతో ఆరుగురు కార్మికులు... శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కేటగిరీ-2 నుంచి ఒకటిలో అటెండర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా మార్చారు. ఇంకా పరిశీలిస్తే ఇలాంటి లీలలు అనేకం వెలుగు చూడనున్నాయి.

ఎలాంటి తీర్మానాలు లేకుండా..

పొరుగు సేవల సిబ్బంది నియామకాల నుంచి వేతనాల పెంపు వరకు అన్ని అంశాలు మున్సిపల్ పాలకవర్గం...

జీతాలెక్కువ.. పని ఎక్కడో..

ఈ మున్సిపాలిటీలో వేతనం తీసుకుంటూ జిల్లా ముఖ్య అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న వారు ఏడుగురు ఉన్నారు. ఇందులో ఆయుధధర పారిశుద్ధ్య కార్మికులు కాగా ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ మరొకరు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ ఉన్నారు. వీరందరికి నెల వేతనం రూ.1.72లక్షలు ఇక్కడి పురపాలిక నుంచి చెల్లిస్తున్నారు. వీరికి జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారులు జారీ చేసినట్లు దృష్టికి వస్తుందని చూపుతున్నారు. అందులో కొన్ని పేర్లు బదిలీ అయిన అధికారి బంధువులవని తెలుస్తోంది. సమీప నరసరావుపేట మున్సిపాలిటీలో సిబ్బందిని కాకుండా వినుకొండ నుంచి కేటాయించడం విశేషం. ఆయా ఆరోపణలను మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి దృష్టికి తేగా ఆ ఆరోపణలతో తనకు ఫిర్యాదులు అందాయని వాటిని కమిషనర్ కె.శివరామప్రసాద్‌కు పంపి కచ్చితమైన సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

ఉప్పలపాడు సమస్యల పరిష్కారానికి వినతి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పలపాడులో శ్మశాన సమస్య ఉందని, టిడ్కో కోసం స్థలం, కోతుల బెడద, మురుగు తదితర సమస్యలపై ప్రజలు వినతిపత్రం అందించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనవాణిలో అర్జీ అందించారు. శ్మశానవాటికకు స్థలం సరిపోవడం లేదని, ఎకరా స్థలం కేటాయించాలని, తాగునీరు సమస్యపైనా సరఫరా లేదని... వినతిపత్రం అందించారు. స్పందించిన కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో కృష్ణకుమారికి ఫోన్ చేసి తాగు, మురుగు నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వీరవల్లి వంశీ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ఈవోకు విరాళం అందిస్తున్న దాతలు

ఇస్సపాలెం(నరసరావుపేట సెంట్రల్), న్యూస్‌టుడే: మండలంలో ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పెద్దిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన అలవర్తి వెంకటేశ్వర్లు, అన్నపూర్ణమ్మ దంపతులు రూ.1,01,116 నగదును విరాళంగా ఈవో మాధవిదేవికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దాతల బంధువులు వెంకట్రావు, రూపాదేవి, జస్వంత్, ఉన్నతి, ఆలయ ఛైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు నీడ కరవు

స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారంపై ప్రయాణికులకు నిలువ నీడ కరవైంది. వినుకొండను అమృత్ స్టేషన్‌గా గుర్తించిన రైల్వేశాఖ 2024లో రూ.10కోట్లు కేటాయించింది. వివిధ అభివృద్ధి పనులతో పాటు రెండో ప్లాట్‌ఫారంపై సగం మేర షెడ్డు నిర్మాణం మొదలు పెట్టారు. గత ఆర్థిక సంవత్సరం చివరికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా స్తంభాలు ఏర్పాటు చేసి పైకప్పు పూర్తి చేయకుండా వదిలేశారు. ఈ మార్గంలో రోజూ పదికి పైగా ప్రయాణికుల రైళ్లు నడుస్తున్నాయి. సుమారు 5వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న వేసవిలో ప్రయాణికులకు మరింత ఇబ్బంది తప్పదని సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయాన్ని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు దృష్టికి తెస్తామని స్టేషన్ అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, వినుకొండ**

బాల్య వివాహాలతో అనర్థాలెన్నో

నరసరావుపేట: ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో కాంతకుమారి

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), చిలకలూరిపేట పట్టణం: ఆడపిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేస్తే శారీరక దుష్ఫలితాల బారిన పడి జీవితాంతం అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీడీపీవో కాంతకుమారి అన్నారు. బాల్య వివాహ రహిత భారత్ ప్రచారోద్యమంలో భాగంగా 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్ సెక్టార్ పరిధిలో బాల్యవివాహాల వల్ల అనర్థాలు, మంచి, చెడు స్పర్శలపై మంగళవారం ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లలకు విద్య బుద్ధులతో పాటు ఆత్మరక్షణ విద్యల్లోనూ తర్ఫీదు అందించాలన్నారు. ఆడపిల్లలను భారంగా భావించి బాల్యంలో వివాహం చేయాలని చూస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు జ్యోత్స్న మేరీ గోల్డ్, గౌసియా, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, హసీనా, తదితరులు పాల్గొన్నారు. చిలకలూరిపేట పట్టణంలో ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు సీడీపీవో జి.శాంతకుమారి, వైద్యురాలు భవాని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. గర్భిణులు, బాలింతలు, 7 నెలల నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయకుమారి, హనుమాయమ్మ, ప్రసన్నకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి, హుస్సేన్‌బీ, నాజియా తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

నరసరావుపేట: మంటలు ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తూ..

వినుకొండ: విపత్తుల సమయంలో ప్రాణాలు ఎలా కాపాడాలో చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), వినుకొండ, వినుకొండ రూరల్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, ఆందోళనకు గురికాకుండా పౌరుల ప్రాణాలు కాపాడటానికి సురక్షితమైన పద్ధతి ఎంచుకోవాలని నరసరావుపేట, వినుకొండ అగ్నిమాపక శాఖాధికారులు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు అన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నరసరావుపేట, వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలల్లో వేర్వేరుగా మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రిలో మంటలు వ్యాపిస్తే పైఅంతస్తులో రోగులను ఎలా రక్షించాలి, గ్యాస్ సిలిండర్ల వద్ద మంటలు ఎలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా మెలగుతూ భద్రత నియమాలు పాటించాలన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యులు రమేష్, లీడింగ్ ఫైర్‌మేన్ మురహరిరావు, అగ్నిమాపక సిబ్బంది వెంకటేశ్వర్లు, సైదారావు, ప్రశాంత్ రెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు దెబ్బతీయొద్దు

వినుకొండ, న్యూస్‌టుడే: నేషనల్ మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు ఆర్టీసీ కార్మికులు వినుకొండ డిపో వద్ద మంగళవారం ధర్నా చేశారు. విద్యుత్తు బస్సులను ఆర్టీసీ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థల అద్దెగావడంతో దీని వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరారు. ధర్నాలో సంఘం నాయకులు ఆర్.శ్రీనివాసరావు, బూదాల సౌబాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు మబ్బులతో కలవరం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: పల్నాడు ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై మంగళవారం ఉదయం పలుచోట్ల జల్లులు పడ్డాయి. ప్రస్తుతం మిర్చి పంట అధికంగా కల్లాల్లో ఆరబోసి ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. రొంపిచర్ల మార్కెట్‌యార్డులో ధాన్యం, మిరప రాశులు ఉండటంతో పట్టలు కప్పేందుకు పరుగులు తీశారు. వాతావరణంలో వచ్చిన మార్పులు అన్నదాతలను కలవరానికి గురిచేశాయి. ఇంటర్ పరీక్షలకు బయల్దేరిన విద్యార్థులు కొంత ఆందోళనకు గురైనా జల్లులు నిలిచిపోవడంతో శాంతించారు.

తొలిరోజు సజావుగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు

నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

చివరి నిమిషంలో పరుగులు

వినుకొండ, వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ద్వితీయ ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. వర్షపు జల్లులు పడటంతో విద్యార్థులను ముందుగానే లోపలకు అనుమతించారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 384 మందిని కేటాయించగా 13 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ బాజమ్మ తెలిపారు. బొల్లాపల్లి మోడల్ పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. చీకటీగలపాలెం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ ఏడాది విద్యార్థులు నలుగురు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. మొత్తం 251 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 247 మంది మాత్రమే హాజరైనట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల 2026 క్రీడాపోటీలు విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభాపతి అయ్యన్నపాత్రుడు బెలూన్లు వదిలి ఈ పోటీలు ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఉన్న చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, వాలీబాల్ పోటీలో నేలపై పడిన నరసరావుపేట శాసనసభ్యుడు చదలవాడ అరవిందబాబును చిత్రాల్లో చూడొచ్చు.

- ఈనాడు, అమరావతి

రోడ్డుపై పంపు.. పొంచిన ముప్పు

నాదెండ్ల మండలం గణపవరం సినిమాహాళ్ల సెంటర్ వద్ద ఓ చేతి పంపు దాదాపు ప్రధాన రహదారిపైను ఉంది. దీంతో రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణించే వారు చీకట్లో పంపు కనబడక తరచూ పంపును ఢీకొని గాయాలపాలవుతున్నారు. రోడ్డుపై చేతి పంపును తొలగించి మరోచోట వేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యను కార్యదర్శి మారుతీబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ)

ప్రణాళికాబద్ధంగా చదవండి

విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జయమ్మ

మురికిపూడి(చిలకలూరిపేట గ్రామీణ): విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పది పరీక్షలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, ఒయాసిస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ సూచించారు. మండలంలోని మురికిపూడి కందిమళ్ల శారదాంబ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఒయాసిస్ సంస్థ కార్యవర్గ సభ్యులు కందిమళ్ల నారాయణమూర్తి, కరణం విజయలక్ష్మి, వి.సుబ్బారావు, డాక్టర్ బిందు మాధవి, కందిమళ్ల హరిబాబు సహకారంతో ప్రతిరోజూ సాయంత్రం అల్పాహారం అందించే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయుల సూచనలతో ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. హెచ్.ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ వరకు ఉచిత విద్య

ఈపూరు, రొంపిచర్ల: మండల కేంద్రం ఈపూరు, రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఆయా మండలాల పరిధిలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్స్ పుల్లా పద్మజ, డా.బి.రవినాయక్ కోరారు. ఈపూరులో మొత్తం 100 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రతిభా పరీక్ష ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. 2025-26 సంవత్సరంలో ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇక్కడ ఇంటర్ వరకు ఉచిత విద్య పొందవచ్చన్నారు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.125 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు.

శుద్ధ జలం.. అయిదు కి.మీ. దూరం

పసుమర్రు(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలో మేజర్ పంచాయతీ అయిన పసుమర్రులో పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న శుద్ధ జల కేంద్రంలో యంత్రాలు ఆరు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో 8 వేల జనాభా ఉన్న గ్రామంలో సురక్షిత నీటి కోసం అయిదు కి.మీ దూరంలో ఉన్న చిలకలూరిపేటకు వెళ్లి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2005లో నాంది ఫౌండేషన్ ద్వారా ఇక్కడ రక్షిత నీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి చెరువు నుంచి పైపులైన్ ద్వారా శుద్ధ జల కేంద్రానికి నీటిని తరలించి గ్రామస్థులకు రక్షిత నీటిని అందజేసేవారు. అప్పట్లోనే ఒకసారి మరమ్మతులకు గురికావడంతో అసిస్ట్ సంస్థ బాగు చేయించింది. కొద్ది రోజుల తరువాత తిరిగి నిర్వహణ లోపంతో పూర్తిగా మూతపడిపోయింది. యంత్రాలు పాడయ్యాయి. వాటిని బాగు చేయించి నిర్వహణ బాధ్యతను స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే ప్రజలకు రక్షిత నీరు అందుతుందని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి కార్యదర్శి జరీనాను సంప్రదించగా ఈ కేంద్రం నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి ప్రజలకు రక్షిత నీరు అందేలా చూస్తామన్నారు.

పనిచేయని యంత్రాలు

రహదారిపై దర్జాగా నిలిపేస్తున్నారు

వినుకొండలో కొందరు జాతీయ రహదారిపైనే వాహనాలను నిలిపేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేయడం తప్ప కళ్లెదుటే నిబంధనలు తుంగలో తొక్కుతున్నా పట్టించుకునే అధికారులే కరవయ్యారు. పట్టణంలో ఎన్నెస్పీ కాలువ వద్ద అనంతపురం-గుంటూరు జాతీయ రహదారికి ఇరువైపులా టీస్టాళ్లు, దుకాణాల ముందు వాహనదారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు తమ పరిధి దాటి ముందుకొస్తున్నారు. ఈమార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఆక్రమణలతో రహదారి ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆ మార్గంలో నడిచేందుకు ఇబ్బందిగా ఉందని మహిళలు వాపోతున్నారు. దీనిపై పట్టణ సీఐ ప్రభాకర్‌ను సంప్రదించగా ఆ ప్రాంతంలో పార్కింగ్ వ్యవస్థను సరిదిద్దుతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, వినుకొండ**

కలెక్టర్ ఆదేశాలు.. గుత్తేదారుల గుండెల్లో రైళ్లు

వెంటాడుతున్న వైకాపా నిర్వాకం ★ పునాదుల్లో నిలిచిన 1168 ఇళ్ల నిర్మాణాలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: పేదల కాలనీల్లో ఆప్షన్-3 విధానంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయని గుత్తేదారులను బ్లాక్ లిస్టులో చేర్చాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో సదరు గుత్తేదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. నరసరావుపేట అర్బన్ పరిధిలో ఆప్షన్-3 కింద మొత్తం 1868 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా కేవలం 700 ఇళ్లు నిర్మించారు. మిగిలిన 1168 అలాగే వదిలేయడంతో సదరు కాంట్రాక్టర్లను గుర్తించే పనిలో గృహనిర్మాణ శాఖ అధికారులు ఉన్నారు.

హడావుడి నిర్ణయాలతోనే..

గత వైకాపా ప్రభుత్వం పేదల మన్ననలు పొందేందుకు హడావుడిగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలను ఆప్షన్-1, 2, 3 కేటగిరీలుగా విభజించింది. ఆప్షన్ 1, 2 కేటగిరీల కింద లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించుకునేలా, ఆప్షన్-3లో గుత్తేదారు నిర్మించేలా నిర్ణయించారు. ఈ విధానంలో ఒక్కో కాంట్రాక్టర్ 200 నుంచి 300 చొప్పున ఇళ్ల నిర్మాణం చేపట్టేలా పనులు అప్పగించారు. మొత్తం ఏడుగురు కాంట్రాక్టర్లకు ప్రభుత్వం 1868 ఇళ్లు నిర్మించాలని అప్పగించింది. కొందరు కాంట్రాక్టర్లు 700 ఇళ్లు పూర్తి చేశారు. ఇంటికి రూ.10వేలు చొప్పున అప్పటి ప్రభుత్వం అడ్వాన్సుగా నిధులు విడుదల చేసింది. దీంతో కొందరు కాంట్రాక్టర్లు మట్టి తోలకుండా పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. వారంతా ఇక్కడ ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టకుండా తెలంగాణలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న కలెక్టర్ కృతికాశుక్లా అలాంటి కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టు చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.

నోటీసులు పంపుతాం

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు పంపుతాం. అప్పటికీ వారు స్పందించకుంటే లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గృహనిర్మాణ శాఖ ఈఈ శివలింగం తెలిపారు. మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో మానవసేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్యురాలు శాంతిశ్రీ శిబిరాన్ని ప్రారంభించి వందకు పైగా ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న వారికి చుక్కల మందు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ట్రస్ట్ అధ్యక్షుడు వంకాయలపాటి రవి, సభ్యులు అబ్దుల్ సలాం, రవికుమార్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంరక్షకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నరసరావుపేటలో శిశు సంరక్షణ కేంద్రం-02, పిడుగురాళ్ల బాలల సంరక్షణ నిలయం-01లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళ, శిశుసంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థినులు మార్చి 2 లోగా బరంపేటలోని జిల్లా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

'ఉపాధి' అక్రమాలు బహిర్గతం

ప్రజావేదికలో నిగ్గుతేల్చిన తనిఖీ బృందం

నూజండ్ల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రజా వేదికలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన పనులను తనిఖీ చేశారు. రూ.12.41 కోట్ల విలువైన 669 పనులకు సంబంధించి పరిశీలన జరిగినట్లు వివరించారు. స్థానికంగా లేని వారి పేరుతో జాబ్‌కార్డులు సృష్టించి పనులు చేసినట్లు నమోదు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తనిఖీ బృందం నిగ్గు తేల్చింది. అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వీఏవోలు, చివరకు మృతులకూ జాబ్ కార్డులు ఉండటం గమనార్హం. కంభంపాడు, తిమ్మాపురం, అప్పాపురం, చెరువుకొమ్ముపాలెం తదితర గ్రామాల్లో అవినీతి జరిగినట్లు గుర్తించారు. తిమ్మాపురం క్షేత్ర సహాయకుడిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. డ్వామా పీడీ సిద్దలింగమూర్తి, ఏపీడీ బూసిరెడ్డి, విజిలెన్స్ సహాయాధికారి హీరాలాల్, విజయకుమారి, ఎంపీడీవో ఉమాదేవి, ఎస్ఆర్‌పీ ఆవులయ్య, నాణ్యత నియంత్రణ విభాగం అధికారి ప్రభాకర్, ఏపీవో ఆంజనేయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ సిద్దలింగమూర్తి

(c) eenadu

Gిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య చేరువ చేసేందుకు ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు మూణ్నాళ్లముచ్చటగా మారుతున్నాయి. ప్రభుత్వాలు మారడం.. బోధకులు లేకపోవడం.. విలువైన పరికరాల విషయంలో జిల్లాస్థాయిలో అధికారులు పూర్తి బాధ్యత తీసుకోకపోవడం.. ఇలా కారణమేదైనా రూ.లక్షలు పోసి కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లు బీరువాల్లో అలంకారప్రాయమయ్యాయి. ఇందులో పనిచేస్తున్నవి ఎన్నో.. మరమ్మతులకు గురైనవెన్నో లెక్కాపత్రం లేని పరిస్థితి.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం, పాచిపెంట

సాంకేతిక విద్య..

బ్యాగులు.. బీరువాల్లో భద్రంగా!

మరమ్మతులకు గుర్వవడం, శిక్షకులు లేకపోవడంతో పాచిపెంట బాలుర ఆశ్రమ పాఠశాలకు అందించిన ల్యాప్‌టాప్‌లను ఇలా బీరువాలో భద్రపర్చారు

పాఠశాల స్థాయిలో గిరిజన విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన పెంపొందించాలని ఏడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని 25 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 40 చొప్పున ల్యాప్‌టాప్‌లు అందించింది. శిక్షకులను నియమించి తొలి రోజుల్లో విద్యార్థులకు ఎంఎస్ ఆఫీస్ నేర్పించారు. రెండేళ్లు బోధన సజావుగా సాగింది.

బోధకుల సేవలు కొనసాగక..

కంప్యూటర్ విద్యతోపాటు ఆంగ్లం బోధించేందుకు నియమించిన శిక్షకుల సేవలను గత కొన్నేళ్ల నుంచి కొనసాగించక విలువైన ల్యాప్‌టాప్‌లు నిరుపయోగంగా మారి బీరువాలకే పరిమితమవుతున్నాయి. దీంతో గిరిజన విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షలా మారింది.

చాలావరకు పాడైపోయాయి..: ఆశ్రమ పాఠశాలల్లో ఒక సంస్థ ద్వారా కంప్యూటర్లు ఏర్పాటు చేసి, శిక్షకులను నియమించారు. కొంత కాలం మాత్రమే పనిచేశారు. ల్యాప్‌టాప్‌లకు ఛార్జింగ్ పెట్టకపోవడంతో చాలావరకు పాడైపోయాయి. అందజేసిన అన్ని పాఠశాలల్లో ఇవి భద్రంగానే ఉన్నాయి. పనితీరును పరిశీలిస్తాం.

- విజయశాంతి, గిరిజన సంక్షేమ ఉప సంచాలకురాలు

నేలవాలిన ఆశలు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం రాత్రి గాలివాన రైతులకు ఆవేదన మిగిల్చింది. కొత్తవలస, కురుకుట్టి, మరిపల్లి, కందులపదం, కరాసువలస, మామిడిపల్లి పంచాయతీల్లో అరటి, మొక్కజొన్న పంట నేలకొరిగింది. 60 ఎకరాల మేర మొక్కజొన్న దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారిణి శిరీష తెలిపారు.

నేలవాలిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

రైతేరాజు 6 లో

వ్యవసాయానికీ సౌర సేవలు

★ త్వరలో విద్యుత్తు గ్రిడ్లు ★ మొదటి విడతలో 6,884 పంపుసెట్లకు

న్యూస్‌టుడే, పార్వతీపురం

సౌర విద్యుత్తును అన్నిటికీ వినియోగించుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గృహ వినియోగానికి సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లే వ్యవసాయ పంపుసెట్లకు అందించేందుకు పీఎం కుసుమ్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. దీనికోసం సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే గ్రిడ్లు ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో కొమరాడ, సీతానగరం మండలం బూర్జి గ్రామాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

రెండింటికి అనుమతి

★ జిల్లాలో 6,884 వ్యవసాయ కనెక్షన్లున్నాయి. వీటికి రెండు ప్రాంతాల్లో గ్రిడ్లు ఏర్పాటు చేయనున్నారు. సౌర విద్యుత్తు అందించాలంటే 21.69 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా కొమరాడలో 8.4 మెగావాట్లు ఉత్పత్తి చేసి, దుకాణాలు, సబ్ స్టేషన్లకు అనుసంధానిస్తారు. వాటి పరిధిలోని 2,385 వ్యవసాయ పంపుసెట్లకు అందిస్తారు.

★ బూర్జిలో 8.97 మెగావాట్ల సౌరవిద్యుత్తు ఉత్పత్తి చేసి.. సీతానగరం, నర్సిపురం, బూర్జి సబ్ స్టేషన్ల పరిధిలోని 2,591 పంపుసెట్లకు అందిస్తారు.

★ మిగిలిన 908 కనెక్షన్లకు సౌర విద్యుత్తు పంపిణీ వ్యవస్థతో అనుసంధానించాలంటే 4.32 మెగావాట్లు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఇతర మండలాల్లో మరో గ్రిడ్ ఏర్పాటు చేయాలి.

★ గ్రిడ్ ఏర్పాటుకు ముందుకొచ్చేవారు ఒక్కోదానికి 40 ఎకరాల స్థలం సమకూర్చుకోవాలి. ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికి రూ.1.05 కోట్లు ప్రాతిపదికన అందిస్తారు. సౌరశక్తితో విద్యుత్తు ఉత్పత్తి చేసి, పంపిణీ చేసేందుకు యూనిట్‌కు రూ.3 చొప్పున చెల్లిస్తారు.

తొమ్మిది గంటల సరఫరా..

వ్యవసాయానికి ఉదయం 9 గంటలపాటు విద్యుత్తును అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే గృహ, వ్యవసాయానికి తగ్గట్టు లైన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశాం. ఇప్పుడు గ్రిడ్లు పెడుతున్నాం. పీఎం కుసుమ్ కింద అమలవుతాయి. కొమరాడ, బూర్జిలో స్థలాలు గుర్తించారు. మరో ఆరు నెలల్లో సరఫరా ప్రక్రియ ప్రారంభమవుతుంది.

– మల్లికార్జునరావు, ఎస్ఈ, బాలాజీ, డీఈ (ట్రాన్స్‌కో)

ప్రస్తుతం ఇలా.. ● జిల్లాలోని వ్యవసాయ పంపుసెట్లు **20** వేలకుపైగా ● మొదటి విడతలో ఇచ్చేందుకు గుర్తించినవి **6,884**

మా అమ్మే.. ఎంత బాగా చేశావో

కురుపాం ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినుల థింసా నృత్యం

విద్యార్థిని శాస్త్రీయ నృత్యం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నాన్న చేయూత అందిస్తే తప్ప నడవలేనివారు కొందరు.. అమ్మ గోరుముద్దలు తినిపిస్తే తప్ప ఆకలి అని చెప్పలేనివారు మరికొందరు.. వాళ్లంతా వేదికపై ఆటలాడి.. పాటలు పాడి.. బొమ్మలు గీసి అబ్బో అనిపించారు. తమ పిల్లలను చూసి మా బాబే... మా అమ్మే... నీలో ఎంత ప్రతిభ ఉందో అంటూ కన్నవారు మురిసిపోయారు. పార్వతీపురంలోని చర్చి కూడలి వద్ద కల్యాణ మండపంలో మంగళవారం సందడిది. ప్రత్యేక అవసరాల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాస్థాయిలో తొలిసారిగా వారికి వివిధ రకాల పోటీలు నిర్వహించాలని సూచించింది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సహిత విద్య పిల్లలకు సీఆర్ఈ(కంటిన్యూస్ రీహేబిలిటేషన్ ఎడ్యుకేషన్) పోటీలు ప్రారంభమయ్యాయి. కోలాటం, శాస్త్రీయ, జానపద నృత్యాలు, పాటలు, చిత్రలేఖనంతో బాలబాలికలు ఆకట్టుకున్నారు. కురుపాం ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినులు థింసా నృత్యంతో బాలలకు స్వాగతం పలికారు.

వ్యవసాయ పరివర్తనతో ఆర్థిక ప్రగతి

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో వ్యవసాయ పరివర్తనతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశించారు. మన్యం గ్రామీణ వ్యవసాయ పరివర్తన(మార్ట్) కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేయనున్న నేపథ్యంలో మంగళవారం వ్యవసాయం, అనుబంధ శాఖలు, ఐటీడీఏ, డీఆర్‌డీఏ, జీసీసీ, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. సాగు, పాడి రైతులు, గ్రామీణ వృత్తిదారుల ఆదాయాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా దీన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి రెండింతలు కావాలన్నారు. పొరుగు రాష్ట్రాల్లో అనుసరిస్తున్న మేలైన విధానాలను ఇక్కడ అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. శాఖల వారీగా ముందస్తు ప్రణాళికలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, పశు సంవర్ధక శాఖ అధికారి మన్మథరావు, సీతంపేట ఏపీవో చినబాబు, పార్వతీపురం ఏపీవో మురళీధర్, ఉద్యానాధికారి క్రాంతి, బిందు, సూక్ష్మ సేద్యం విభాగం పీవో రాధాకృష్ణ, మత్స్యశాఖ అధికారి సంతోష్, జీసీసీ డీఎం రామారావు, కృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఆటల బడికి ఆకాశమే హద్దు

లాంగ్.. జంప్

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: సాధించాలన్న తపనకు శ్రమను జోడిస్తున్నారు. ఎలాగైనా క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందాలన్న లక్ష్యంతో వందల మీటర్ల దూరం పరుగు పెడుతున్నారు. శక్తిని కూడగట్టుకుని వెర్టికల్, లాంగ్ జంప్ చేస్తున్నారు. నువ్వా నేనా అని పోటీల్లో తలపడుతున్నారు. జిల్లాలో క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు బ్యాటరీ టెస్ట్ ఈవెంట్లు మంగళవారం నర్సిపురం ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగాయి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల నుంచి 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికల్లో విద్యార్థుల ఎత్తు, బరువు కొలవడంతో పాటు 800 మీటర్ల పరుగు, నిలబడిన చోటు నుంచి గెంతడం(స్టాండింగ్ బ్రాడ్ జంప్), వెర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో తదితర పోటీలు నిర్వహించి.. క్రీడా ప్రతిభను గుర్తిస్తున్నారు.

స్టాండింగ్ వెర్టికల్ జంప్ చేస్తున్న విద్యార్థి

రండి.. అవకాశాలు అందిపుచ్చుకుందాం..

జేఎన్‌టీయూ గురజాడ ఉద్యోగ పోర్టల్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం ముందడుగు వేసింది. ఎక్కడైనా పనిచేయాలన్న తపన ఉన్నవారికి కొలువులు కల్పించాలన్నది లక్ష్యం. నిర్మాణ్ సంస్థతో కలిసి ఇందుకోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో 'ఆపర్చ్యునిటీస్ పోర్టల్'ను ప్రారంభించింది. మంగళవారం నుంచే ఇది అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. పరిశ్రమ డిమాండ్లకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కోర్సులు నిర్వహిస్తారు. మంగళవారం విద్యాలయంలో సంబంధిత గోడప్రతులను జీవీ ఉపకులపతి ఆచార్య వి.వి.సుబ్బారావు, నిర్మాణ్ సంస్థ సీఈవో మయూర్ పట్నాల ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రధానాచార్యుడు ఆర్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీకృత వేదిక..: ఈ పోర్టల్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. ఇందులో నమోదు చేసుకున్న దరఖాస్తులను నెలకోసారి పరిశీలించి, అవకాశాలు కల్పిస్తారు. ఎవరికైనా నైపుణ్యం తక్కువ ఉంటే, ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలిస్తారు. నమోదు కోసం https://uyopportunities.jntugv.edu.inను సంప్రదించాలి.

అర్హులు వీరే..: ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మ్, బీటెక్, బిఫార్మ్, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీబీఎం, డిప్లొమా, ఐటీఐ అర్హతలు గలవారు సద్వినియోగం చేసుకోవచ్చు. ఉత్తీర్ణతతో సంబంధం లేకుండానే అవకాశాలు కల్పిస్తారు. విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గించి, పరిశ్రమ సహకారాన్ని పెంపొందించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వీసీ సుబ్బారావు తెలిపారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూజీవీ, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు

(c) eenadu

పోలిపల్లి పైడితల్లి దర్శనానికి వచ్చిన భక్తులు

మనసు పరవశించె.. తనువు పులకించె

జిల్లాలో జాతర్ల సందడిలో భక్తజనం

చీపురుపల్లి, రాజాం పట్టణం, శంబర(మక్కువ), న్యూస్‌టుడే: చీపురుపల్లి కనకమహాలక్ష్మి, రాజాం పోలిపల్లి పైడితల్లి జాతరలో మంగళవారం చివరి రోజు భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఘటోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శంబర పోలమాంబ అమ్మవారి అయిదోవారం జాతర భక్తిశ్రద్ధల మధ్య సాగింది.

కనకమహాలక్ష్మి దేవస్థానం ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద పూజలు

జామి ఎల్లారమ్మ జాతర

జామి, న్యూస్‌టుడే: జామి ఎల్లారమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి తల్లిని ఆవహించిన పూజారులు గద్దె నుంచి బయలుదేరారు. జముకుల పాటలతో ఊరేగించారు. మంగళవారం జాతరకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 200 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అలంకరణలో శంబర పోలమాంబ

ఎల్లమ్మ సిరిమానోత్సవం

విజయనగరం కంటోన్మెంట్, గంట్యాడ గ్రామీణం: విజయనగరం సంగీత కళాశాల ప్రాంతంలో ఎల్లమ్మ తల్లి సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. సాయంత్రం సిరుల ఉత్సవం చేపట్టారు. పూజారి త్రినాథ్ తేజ సిరులు ఎక్కే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తదితరులు తల్లిని దర్శించుకున్నారు.

★ బుడతనాపల్లి ఎల్లారమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో బి.రాజేరు నుంచి చినమానాపురం కూడలి వరకు జనసంద్రంగా మారింది. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విజయనగరంలో ఎల్లమ్మ తల్లి పుట్ట

తండ్రి స్ఫూర్తి.. తనయుల కీర్తి

వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో ప్రతిభ

కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరు శ్రీనివాసరావు ఆర్మీలో సుబేదార్ కేడర్‌లో పని చేస్తూ 2024లో ఉద్యోగ విరమణ పొందారు. ఈయన వెయిట్‌లిఫ్టింగ్ క్రీడపై ఆసక్తితో చిన్న తనం నుంచి శిక్షణ తీసుకుని రాణించారు. 2010లో దిల్లీలో నిర్వహించిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో కాంస్యం సాధించారు. మూడు సార్లు పోటీల్లో పతకాలు సాధించారు. క్రీడ ప్రతిభతో అప్పట్లో ఇండియన్ ఆర్మీలో కొలువు సాధించారు. ఆయన స్ఫూర్తితో కుమారులు అజయ్‌బాబు, అఖిల్‌లు విద్యార్థి దశ నుంచే వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకున్నారు. స్థానికంగానే చదువుతూ ఈ క్రీడలో శిక్షణ తీసుకుని సత్తాచాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి పతకాలు సాధిస్తున్నారు.

తండ్రి స్ఫూర్తితో క్రీడల్లో రాణిస్తున్నారు. ఆయన సూచనలతో శిక్షణలో రాటుదేలుతున్నారు. ఆయన లక్ష్య నిర్దేశం చేయిస్తూ జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్నారు. పతకాల వేటలో నాన్నను మరిపిస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాల పంట పండిస్తున్నారు నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన వల్లూరు అజయ్‌బాబు, అఖిల్.

- న్యూస్‌టుడే, జరజాపుపేట(నెల్లిమర్ల)



బరువు ఎత్తుతున్న అజయ్‌బాబు

అన్న అడుగుజాడల్లో..

తండ్రి, అన్న చెబుతున్న మెలకువలు పాటిస్తూ.. శిక్షణలో రాటుదేలుతున్నాడు అఖిల్. రాష్ట్ర స్థాయి వరకు వివిధ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించాడు. జాతీయస్థాయిలో రాణించడమే లక్ష్యంగా దృష్టి సారించాడు. తల్లి వెంకటలక్ష్మి గృహిణిగా బాధ్యతలు నిర్వహిస్తూ.. వీరికి ప్రోత్సాహం అందిస్తున్నారు.

గర్వంగా ఉంది..

తనలాగే కుమారులిద్దరూ ఈ క్రీడలో రాణిస్తూ.. పతకాలు సాధించడం గర్వంగా ఉంది. దేశం కీర్తిని ఇనుమడింప చేయడం ఆనందాన్ని ఇస్తోంది. - వి.శ్రీనివాసరావు, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు

విజయం 'అజేయ'o..

కామన్‌వెల్త్, ఏషియన్ గేమ్స్‌లో పతకాలే లక్ష్యంగా అజయ్ తీవ్ర సాధన చేస్తున్నాడు. గతేడాది నవంబర్‌లో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన సీనియర్ కామన్‌వెల్త్ పోటీల్లో 79 కిలోల కేటగిరీలో 152 కిలోల స్నాచ్, 183 కిలోల క్లీన్ అండ్ జర్క్ కలిపి 355 కిలోల బరువును ఎత్తి స్వర్ణం సాధించాడు. ★ 2023లో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగిన జూనియర్ కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం సాధించాడు. ★ 2024లో ఫిజి దేశంలో నిర్వహించిన సీనియర్ కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లోనూ బంగారు పతకం అందుకున్నాడు. జాతీయస్థాయిలో ఆరు స్వర్ణాలు, రెండు రజత, రెండు కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. ప్రస్తుతం ఇండియన్ ఆర్మీలో హవాల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అజయ్ ప్రస్తుతం అహ్మదాబాద్‌లో వెయిట్‌లిఫ్టింగ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో పంజాబ్ పటియాలా తరపున అంతర్జాతీయ క్రీడలో ఆడేందుకు శిక్షణ తీసుకుంటున్నాడు.

తండ్రి శ్రీనివాసరావు, తల్లితో కుమారులు అజయ్, అఖిల్

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ నిపుణులు కీలకం

మాట్లాడుతున్న విశాఖ పోలీస్ కమిషనరు శంఖబ్రత బాగ్చీ

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: శాస్త్రీయ నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారని విశాఖపట్నం పోలీస్ కమిషనరు శంఖబ్రత బాగ్చీ అన్నారు. మంగళవారం టెక్కలి సమీపంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ అండ్ మూట్ కోర్ట్ కాంపిటేషన్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో సైబర్, ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేర నిరూపణ, సాక్ష్యాలు సేకరించడంలో ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రశాంత్‌కుమార్, డీన్ రవికుమార్, వైద్యులు నాగ జోగయ్య, ఆశిష్, సౌమ్య పాల్గొన్నారు.

గురుకులం ప్రవేశపరీక్ష తేదీ మార్పు

వేపాడ: ఉమ్మడి విజయనగరం జిల్లాలో అంబేడ్కర్ గురుకులాల్లో ఆరు నుంచి పది తరగతుల ప్రవేశపరీక్ష తేదీలో మార్పు చేసినట్లు జిల్లా సమన్వయకర్త మాణిక్యం మంగళవారం తెలిపారు. మార్చి 2న జరగాల్సిన పరీక్షను అదే నెల 8కి మార్చినట్లు చెప్పారు. అయిదు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్షలు మార్చి ఒకటిన జరుగుతాయన్నారు.

ప్రారంభించకముందే ఆటో చోరీ

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్త ఆటో కొన్న ఆనందాన్ని ఆ చోదకుడు ఇంకా అనుభవించకుండానే వాహనాన్ని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం రెల్లికాలనీలో చోటుచేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. బంగారి అప్పలరాజు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్య కుమారి డ్వాక్రా రుణం రూ.2 లక్షలు, తాను దాచుకున్న సొమ్ము కలిపి రూ.3.18 లక్షలతో ఈ నెల 5న ఆటో కొనుగోలు చేశాడు. దీన్ని ఇంటి దగ్గర భద్రపర్చాడు. ఉదయం వాహనం కనిపించలేదు. నిన్న అర్ధరాత్రి 2.05 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి వాహనాన్ని గండిగుండం వైపు తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో ఆధారాలు లభ్యమయ్యాయి. దర్యాప్తు చేస్తున్నామని, నిందితుల్ని పట్టుకుంటామని సీఐ వివరించారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా సత్తిబాబు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ విభాగంలో పలువురు తహసీల్దార్లకు ఉప కలెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. వీరికి మంగళవారం స్థానాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి కొందరు బదిలీ, పదోన్నతిపై ఇక్కడకు రానున్నారు. డీఆర్వోగా సి.హెచ్. సత్తిబాబు నియమితులయ్యారు. విశాఖలో గృహ నిర్మాణ శాఖ పీడీగా పనిచేస్తున్న ఆయన ఇక్కడకు వస్తున్నారు. గతంలో డీఆర్వోగా పనిచేసిన శ్రీనివాసమూర్తి పదవీ విరమణ తర్వాత ఆ పోస్టు ఖాళీగా ఉంది. కేఆర్‌సీసీ ఉప కలెక్టర్ ఇ. మురళీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. మన్యం జిల్లా డీఆర్డీఏ పీడీ సుధారాణి చీపురుపల్లి ఆర్డీవోగా నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తహసీల్దారు కె.రాములు తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు యూనిట్- 2(చీపురుపల్లి విభాగం) ఎస్‌డీసీగా నియమితులయ్యారు.

పోస్టుల కేటాయింపు..

అయిదుగురు తహసీల్దార్లకు ఉప కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టులు కేటాయించారు. వీరిలో ఇద్దరు కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు కాగా, మిగిలిన ముగ్గురు మండలాల్లో పనిచేస్తున్నారు. కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకుడు టి.గోవింద విశాఖలోని ప్రకృతి విపత్తుల యాజమాన్యం విభాగం డీపీఎంగా వెళ్లనున్నారు. సాలూరు మండల అధికారి బొండాడ నీలకంఠరావు అల్లూరి సీతారామరాజు జిల్లా కేఆర్‌సీసీ విభాగానికి ఉప కలెక్టర్‌గా, గజపతినగరం తహసీల్దారు బి.రత్నకుమార్ ఏపీ సీఆర్‌డీఏ ఎస్‌డీసీగా, మెంటాడ అధికారిణి మరడాన అరుణకుమారి విజయనగరం పౌరసరఫరాల కార్పొరేషన్ విజిలెన్స్ విభాగానికి డిప్యూటీ కలెక్టర్‌గా, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకురాలు వి.పద్మావతి ఏపీ సీఆర్‌డీఏ ఎస్‌డీసీగా నియమితులయ్యారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కురుపాం గ్రామీణం: తండ్రి మందలించాడని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురుపాం మండలం తోటగూడ గ్రామానికి చెందిన ఆరిక లక్ష్మణరావు(28) జీలుగు కల్లు తాగి ఇంటికిరావడంతో అతని తండ్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరానికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి సాగు పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీపీ) గోపీనాథ్ జట్టి అన్నారు. మంగళవారం రేంజ్ పరిధిలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆ విషయాలను ఎస్పీ మాధవరెడ్డి వివరించారు. 2024 జులైలో గంజాయి సున్నా సాగుకు చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ ఏడాది జనవరికి దాన్ని చేరుకున్నామన్నారు. ఒడిశా అధికారులతో చర్చించి అమలు చేసిన ప్రత్యామ్నాయ పంటల సాగు మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. 2021-22లో 7,515.15 ఎకరాల విస్తీర్ణంలో పండించిన గంజాయిని 2024-25నాటికి 93.01 ఎకరాలకు తగ్గించామన్నారు. గిరిజన యువతను గంజాయి కార్యకలాపాలకు దూరంగా ఉంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్, స్వయం ఉపాధికి సంబంధించి 415 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. 2024 జూన్ నుంచి నేటికి 976 కేసులు నమోదు చేసి, 2405 మందిని అరెస్టు చేశామన్నారు. 14 మంది నిందితులకు సంబంధించి రూ. 9,19,17,290 విలువైన ఆస్తులను జప్తు చేశామన్నారు.

వీసీలో ఎస్పీ మాధవ రెడ్డి, ఏఎస్పీ వెంకటేశ్వరరావు

EENADU e Classifieds

REPAIRS

TV REPAIR

భాస్కర్ ఎలక్ట్రానిక్ 32" LEDTV రూ.8,999/- 2సం॥లు వారంటీతో S.కోట నుండి 30కి॥మీ॥లోపు LEDTV ఇంటికి వచ్చి బాగు చేయబడును. C:8500188608.

JOBS

Haier Exclusive Service Centerలో M.S.ఆఫీస్ సాఫ్ట్ స్కిల్స్ అనుభవజ్ఞులైన Female కావలెను. VZM © 9381973800.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైన స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

5 లైన్ల ప్రకటన కేవలం 315/- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

డిప్యుటేషన్లు రద్దు చేయండి

పార్వతీపురం: రీసర్వే విధుల్లో ఉన్న ఉప తహసీల్దార్లు, సర్వేయర్ల డిప్యుటేషన్లను రద్దు చేసి, ఆ విధుల్లోనే కొనసాగించాలని జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సీసీఎల్‌ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో దూరదృశ్యశ్రవణ సమావేశాన్ని నిర్వహించారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో సర్వేయర్లు తప్పనిసరిగా అక్కడ ఉండాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఐవీఆర్‌ఎస్‌లో సంతృప్తిస్థాయి ఎక్కువ ఉండేలా సేవలు అందించాలన్నారు. అనంతరం జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ ప్రభాకరరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులందరికీ ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. డీఆర్వో హేమలత, సబ్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

2 నుంచి ఇంటర్ సార్వత్రిక పరీక్షలు

పార్వతీపురం: మార్చి 2 నుంచి సార్వత్రిక విద్యలో ఇంటర్మీడియట్ చదువుతున్న వారికి పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ ప్రభాకరరెడ్డి వెల్లడించారు. ఏర్పాట్లపై డీఆర్వో హేమలతతో కలిసి సమావేశం నిర్వహించారు. సార్వత్రిక విద్యలో పది పరీక్షలకు 568 మందికి గానూ 7 కేంద్రాలు, ఇంటర్‌కు 356 మందికి రెండు కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌ల నియామకం పూర్తయిందన్నారు.

229 మంది గైర్హాజరు

పార్వతీపురం పట్టణం: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ ఏడాది పరీక్ష మంగళవారం ప్రశాంతంగా సాగిందని డీఐఈవో నాగేశ్వరరావు తెలిపారు. 33 కేంద్రాల్లో 229 మంది గైర్హాజరు, జనరల్, వృత్తి విద్యా కోర్సులకు 8,407 మంది హాజరయ్యారన్నారు.

అంటుకట్టిన టమాటా మొక్క

అంటుకట్టు సాగు.. దిగుబడులు బాగు

ఈ విధానంలో పండిస్తే.. హెక్టారుకు రూ.24వేల రాయితీ

రేగిడి, న్యూస్‌టుడే: ఏ పంటకైనా దిగుబడే ప్రామాణికం. కూరగాయల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే అంటుమొక్కల విధానమే మేలు. తొలినాళ్లలో దేశవాళీ విత్తనాలు, ఆ తర్వాత సంకరజాతి విత్తనాలు వేసి రైతులు సాగుచేపట్టేవారు. అంటుకట్టిన సాగు విధానం కూరగాయల రైతులకు లాభసాటిగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వ రాయితీ...

గత రెండేళ్లుగా అంటుకట్టు కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు గతంలో రాయితీగా హెక్టారుకు రూ.20వేలు అందించేది. తాజాగా ఈ ఏడాది దీన్ని రూ.24వేలకు పెంచింది. మిగతా కూరగాయల విషయంలో రాయితీని ఒక్కసీజన్‌కు పరిమితం చేయగా అంటుమొక్కల విధానానికి అన్ని సీజన్లలోనూ రైతులకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వంగ, టమాటా, మిరప వంటి పంటలకు ఇది మేలు. సాధారణ సాగులో మూడునెలల్లో కాపు అంతరిస్తే.. ఈ పద్ధతితో 6నెలలు అంతకంటే ఎక్కువ కాలం దిగుబడి వస్తుంది. కాయల నాణ్యత, బరువు ఎక్కువగా ఉంటుంది.

ఎకరాకు 4వేల మొక్కలు..

అంటుకట్టు విధానంలో మొక్కలు ఎకరాకు సుమారు 3500 నుంచి 4000 వరకు మొక్కలు అవసరం అవుతాయి. ప్రస్తుతం అంటుమొక్క ఖరీదు రూ.12 వరకు ఉంది. అంటే ఎకరాకు పెట్టుబడి రూ.48,000 ఉంటుంది. ఉదాహరణకు సాధారణ పద్ధతిలో టమాటా ఎకరాకు 20 నుంచి 27 టన్నుల వరకు దిగుబడి వస్తే ఇందులో 50 టన్నుల నుంచి 65టన్నుల వరకు వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి ఈ మొక్కలకు ఉంటుంది.

రైతులు ముందుకు రావాలి

ఈ విధానంలో సాగుకు రైతులు ముందుకు రావాలి. క్షేత్రస్థాయిలో మా అధికారులు అన్ని విధాలా అవగాహన కల్పిస్తారు. ఈ ఏడాది వీటి సాగు విస్తీర్ణం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. -బి.చిట్టిబాబు, డీడీ, ఉద్యాన శాఖ

ఆకుమచ్చ అరికట్టాలంటే..!

కొబ్బరితోటల్లో ఆకుమచ్చ తెగులు వ్యాపిస్తే.. పంట దిగుబడి తగ్గుతుంది. తోటలకు సరైన పోషకాలు అందకపోవడం, పొటాషియం, సల్ఫర్, జింకు ధాతు లోపాల కారణంగా తెగులు వస్తుందని రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డా.అమృతవీణ తెలిపారు. నివారణ చర్యలు వివరించారు. సాధారణంగా ఎకరాకు 60 మొక్కలు నాటుకోవాలి. కొంతమంది రైతులు 70, 80 వరకు నాటడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొక్కల మధ్య దూరం తగ్గడం వల్ల సూర్యరశ్మి సరిగా తగలదు. అంతర పంటలు వేసే సమయంలో ఈ తెగులుపై దృష్టి సారించాలి. ఇది సోకిన చెట్ల ఆకులపై పాము పొడలాంటి మచ్చలు ఏర్పడి క్రమంగా పెద్దవి కావడంతో పూర్తిగా ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటిలో హెగ్జాకొనజోల్ లేదా ప్రొఫికొనజోల్ 2 మిల్లీలీటర్లు కలిపి ఆకులపై పిచికారీ చేయాలి. తెగులు సోకిన ఆకులను సేకరించి కాల్చేయాలి.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

రైతేరాజు

ప్లాస్టిక్ షీట్‌తో నీటి కుంటలకు రక్షణ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటలకు అత్యవసర తడులు అందించి రక్షణగా నిలిచే చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు నేల రకాలను బట్టి భూమిలో ఇంకిపోతాయి. వీటి నివారణకు సిమెంటుతో లైనింగ్ వేస్తుంటారు. దీనికి ఖర్చు అధికం, మన్నిక తక్కువగా ఉంటుంది. నీటి కుంటలకు ప్లాస్టిక్ షీట్(ఫిల్మ్)తో లైనింగ్ వేసి నీరు ఇంకే నష్టాన్ని 98-100 శాతం అరికట్టవచ్చని విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త తేజేశ్వరరావు తెలిపారు.

● షీటు నలుపు లేదా నీలం రంగులో 250 మైక్రాన్లు మందం ఉంటుంది. ఇవి 7-9 మీటర్ల వెడల్పుతో లభిస్తాయి. ఒక కిలో 250 మైక్రాన్ల ఫిల్మ్ 4.2 చ.మీ విస్తీర్ణం కలిగి, కిలో రూ.275 ఉంటుంది.

ప్రయోజనాలు..: ● నీటిని భూమిలోకి ఇంకడాన్ని 100 శాతం తగ్గిస్తుంది. నీరు కుంటలో చాలా రోజులు నిల్వ ఉంటుంది. ● ఇసుకతో కూడిన గరపనేల ప్రాంతాల్లో ఇవి చాలా ఉపయోగంగా ఉంటాయి. ● ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటుంది. నిర్వహణ ఖర్చు తక్కువ. అధిక ఉష్ణోగ్రతలకు కాస్తుంది. కాలుష్యం ఉండదు.

లైనింగ్ వేసే విధానం...: తొలుత కుంటను అనుకున్న సైజులో నిర్మించాలి. కుంట లోతు, వాలు నిష్పత్తి 1:2.5 ఉండేటట్లు చూడాలి. కుంట అడుగు భాగంలో 5 సెం.మీ మందంలో ఇసుక పరచాలి. దీనిపై అగ్రిఫిల్మ్‌ను బిగుతుగా, అడుగు నుంచి పైకి పరచుకుంటూ రావాలి. కుంటపై నలువైపులా 30×30 సెం.మీ. షీటు గాడిలోకి వేసి మట్టితో కప్పాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

జీడి, మామిడి పూత, పిందె దశలో ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మంచు ప్రభావానికి పూత రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాల కోసం 87908 28484 నంబరును సంప్రదించాలని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు తెలిపారు.

వేసవిలో పశుపోషణలో మెలకువలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: వేసవిలో పశువులకు సరైన పోషణ అందించాలని కురుపాం పశుసంవర్ధకశాఖ ఏడీ **టి.శ్రీసంధ్య** తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు.

ప్రశ్న: వేసవి కాలంలో పశువుల ఆహారంలో ఎలాంటి మార్పులు చేపట్టాలి? **- రాధాకృష్ణ, పాలెం**

సమాధానం: వేసవిలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచాలంటే మేత ద్వారా అందించే పోషణ ముఖ్యం. సాధారణంగా పశుగ్రాసం, దాణా 70:30 నిష్పత్తిలో అందించాలి. వేసవిలో పచ్చిమేత, దాణా లభ్యత పరిమితంగా ఉండి, ఎండుగడ్డి ఎక్కువగా ఉంటుంది. ఎండుగడ్డిలో పోషక విలువలు, జీర్ణక్రియ తక్కువగా ఉంటుంది. ఉదయం పచ్చగడ్డి, రాత్రి ఎండుగడ్డి ఇవ్వాలి. అధిక పాలనిచ్చే పశువులకు దాణా నీటితో కలిపి రాత్రి, తెల్లారక ముందే ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు దాణాలో కలిపి శనక్కాయ కట్టలు పెట్టడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది.

ప్రశ్న: వేసవిలో పశువులకు ఎంత నీరు అందించాలి? **- మిన్నారావు, జోగులడుమ్మ**

సమాధానం: వేసవిలో వేడి వాతావరణం పశువుల శరీర ఉష్ణోగ్రత పెరుగుదలకు కారణమవుతుంది. అప్పుడు అవి ఎక్కువగా చెమట, మూత్రంతో నీటిని నష్టపోతాయి. ప్రతి పశువుకూ రోజుకు సుమారు 20-25 లీటర్ల నీరు అవసరం. ఎప్పటికప్పుడు శుద్ధమైనది అందించడం మంచిది. తక్కువ నీరు తీసుకున్న పశువులు రోగాలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

సాయానికి వెళ్తే ప్రాణం పోయింది

గ్యాస్ మంటల్లో చిక్కుకొని వివాహిత దుర్మరణం

భవానీ (పాతచిత్రం)

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: పక్కింటి వాళ్లు గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ పెట్టమంటే సాయానికి వెళ్లిన ఓ వివాహితను మృత్యువు వెంటాడింది. రెగ్యులేటర్ సరిగా లేక గ్యాస్ సిలిండర్ నుంచి చెలరేగిన మంటల్లో చిక్కుకున్న ఆమె మృతిచెందారు. ఈ విషాదకర ఘటన విజయనగరంలో మంగళవారం చోటుచేసుకుంది.

నగరానికి చెందిన భవానీ(31)కి విజయవాడ వాసి ప్రభుతో వివాహమైంది. పిల్లలు శ్యామ్, సంజయ్‌తో కలిసి స్థానికంగా ఉన్న హుకుంపేట సాయిబుల కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రభువు కారు చోదకుడు. మంగళవారం మధ్యాహ్నం పక్కింట్లో ఉన్న ఫాతిమా అనే మహిళ గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను అమర్చడానికి పిలిచారు. సరిగా బిగించకపోవడంతో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఫాతిమాను స్థానికులు బయటకు తీసుకురాగా.. తన ప్రాణాలను కాపాడుకునేందుకు భవానీ వంట గదిలో ఓ మూలకు వెళ్లి అక్కడే ఇరుక్కుపోవడంతో కాలిపోయారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేసరికే ప్రాణాలు కోల్పోయారు.

భర్త కళ్లెదుటే..

పిల్లలు 4, 5 తరగతులు చదువుతున్నారు. ఉదయం లేచి పాఠశాలకు వెళ్లిపోయారు. ప్రభువు ఇంటి వద్దే ఉన్నాడు. మంటలు రావడం, కేకలు వినిపించడంతో ఒక్కసారిగా పరుగు తీశాడు. స్థానికుల సాయంతో కాపాడేందుకు ప్రయత్నించినా.. ఫలితం దక్కలేదు. తన కళ్లెదుటే భార్య ప్రాణాలు కోల్పోవడంతో కన్నీరుమున్నీరయ్యాడు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన చిన్నారులు అమ్మ ఏదని అడగ్గా.. అక్కడున్నవారంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో.)	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

అయ్యో.. అక్షిత

యువతి దుర్మరణంతో విషాదం

అక్షిత (పాత చిత్రం)

గజపతినగరం, న్యూస్‌టుడే: ఆమె మూడేళ్ల వయసులోనే తండ్రి మృతి. తల్లి అన్నీ తానై పెంచారు. అన్నయ్య.. నాన్నలా బాధ్యతలు చూసుకుంటూ ఆసరాగా నిలిచాడు. కష్టం విలువ తెలిసిన ఆమె.. విదేశాలకు వెళ్లి కుటుంబాన్ని ఉన్నతంగా చూసుకోవాలని ఆశ పడింది. లారీ రూపంలో మృత్యువు తనను కబళిస్తుందని ఊహించలేదు. రోడ్డు ప్రమాదంలో ఆమె మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదం నింపింది.

గజపతినగరానికి చెందిన కె.అక్షిత(22) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి రెండేళ్లుగా ఉద్యోగం చేస్తోంది. వారం కిందట ఇంటికి వచ్చిన ఆమె తనకు మలేషియాలో ఉద్యోగం వచ్చిందని కుటుంబ సభ్యులకు చెప్పింది. హైదరాబాద్ వెళ్లిన ఆమె ఆదివారం స్నేహితురాలి ఇంటి వద్ద ఉన్నారు. సోమవారం మెడికల్ ధ్రువపత్రాల కోసం ర్యాపిడో వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని సోమవారం రాత్రి విజయనగరం తీసుకువచ్చి, అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆమె మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

గడువులోగా రీసర్వే పూర్తిచేయాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో రీసర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈకేవైసీ, ఐవీఆర్‌ఎస్‌లో సంతృప్తి స్థాయిని పెంచడం, ప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. అంతకుముందు అమరావతి నుంచి సీసీఎల్‌ఏ ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి నిర్వహించిన దూరదృశ్య సమావేశంలో పాల్గొన్నారు.

పరిశోధన కార్యక్రమాలకు అండ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్య, పరిశోధన, పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు జేఎన్‌టీయూ జీవీ, ప్రభుత్వ వైద్య కళాశాలల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం జేఎన్‌టీయూజీవీ ఉపకులపతి వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచారిణి, అదనపు వైద్య విద్య సంచాలకురాలు డా.బి.దేవిమాధవి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. విద్యార్థులకు శిక్షణ, సంయుక్త పరిశోధన కార్యక్రమాలు, శాస్త్రీయ సదస్సులు, శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని వీసీ వెల్లడించారు.

అభియోగాల ఉపసంహరణ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీసీహెచ్‌ఎస్‌గా, పీవోడీటీటీగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన డా.కె.ప్రభాకరరావుపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో చీపురుపల్లిలో పీవోడీటీటీగా పనిచేసిన సమయంలో ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణిని విచారణ అధికారిణిగా ప్రభుత్వం నియమించింది. ఆమె నివేదిక అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జీవోలో పేర్కొంది.

(c) eenadu

చివరిలో నిలిచిపోయింది.!

బలిజిపేట మండలంలోని పలగర గ్రామంలో మూడేళ్ల కిందట ప్రారంభించిన గ్రామ సచివాలయ భవనం ఇలా చివరి దశలో ఆగిపోయింది. రూ.40 లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. శ్లాబ్ వరకు పూర్తి చేశారు. అధికారులు ఈ పనులకు బిల్లులు చెల్లించారు. పలు కారణాలతో ఆగిపోయాయి. దీంతో రెండేళ్లుగా ఇలానే దర్శనమిస్తోంది. రూ.15లక్షలు అవసరం ఉంది. ఇంజినీరింగు సహాయకుడు శివను వివరణ కోరగా.. గుత్తేదారు అనారోగ్యానికి గురవడంతో పనులు నిలిచాయని, తగ్గిన తర్వాత పనులు పూర్తి చేస్తామన్నారని తెలిపారు. - న్యూస్‌టుడే, బలిజిపేట

పశువుల కోసమే బడి కట్టారేమో.!

పాచిపెంట మండలంలోని పెద్దవలస మండల పరిషత్ పాఠశాల ఇది. పాత భవనం శిథిలమవడంతో గత ప్రభుత్వం హయాంలో నాడు-నేడు రెండో విడతలో రూ.24.98 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించారు. రూ.10 లక్షలు మాత్రమే రావడంతో మిగతా పనులు ఆగిపోయాయి. వినియోగంలోకి రాక స్థానికులు ఇలా పశువులు కడుతున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంలో బడి కొనసాగుతోంది. దీనిపై కార్యదర్శి రాంప్రసాద్ మాట్లాడుతూ.. చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, పాచిపెంట

శౌచాలయాలకు తాళం

మండలంలోని మేజర్ పంచాయతీ ఆవరణలో కొత్తగా నిర్మించిన శౌచాలయాలకు తాళం వేసి ఇలా నిరుపయోగంగా వదిలేశారు. వీటిని సుమారు 8 నెలల క్రితం నిర్మించారు. ఈ ప్రాంగణంలో ఒక గ్రంథాలయం, 4 సచివాలయాలున్నాయి. దాదాపు 40 మంది వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు. మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో బి.వెంకటరమణ మాట్లాడుతూ.. సంబంధిత కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, వీరఘట్టం

ఎప్పుడు తొలగిస్తారో?

మక్కువ మండల కేంద్రంలోని గంట్యాడ వీధిలో కాలువల్లో పేరుకుపోయిన పూడికలను ఈవో శ్రీనివాస్ సిబ్బందితో తొలగింపజేసి శుభ్రం చేయించారు. తీసిన పూడికను రోడ్డు పక్కన వేసేశారు. రెండు వారాలు పూర్తవుతున్నా అలానే ఉంది. అక్కడి నుంచి తొలగించలేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, రాకపోకలకు ఆటంకం తప్పడం లేదని స్థానికులు వాపోయారు. వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఈవో శ్రీనివాస్ తెలిపారు. - న్యూస్‌టుడే, మక్కువ

సంకేతాలందక.. అవస్థలు

మన్యంలో సంకేతాల సమస్య వెంటాడుతోంది. దీంతో ఆన్‌లైన్ కార్యకలాపాలు చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీతంపేట మండలంలోని చింతాడ పంచాయతీ పరిధిలో ఈకేవైసీ, ఇంటి పన్నుల వసూలు, ఇతరత్రా ఆన్‌లైన్ సేవలకు సచివాలయ, ఆయా విభాగాల అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఇలా మెట్టుగూడ ప్రయాణికుల విశ్రాంతి భవనం వద్ద చేస్తూ కనిపించారు. తమ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సీతంపేట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: పాలకొండ మండలం నవగాం గ్రామ కూడలిలో గ్రామాల పేర్లతో సూచిక బోర్డులు లేవు. - **నారు రామినాయుడు, ఎం.సింగుపురం** ● రోడ్డు పూర్తయింది. బోర్డులు ఏర్పాటు చేస్తాం. - **సర్వేశ్వరరావు, ర.భ. శాఖ ఏఈ** - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: దండిగాం రోడ్డు నుంచి తెలగావీధికి వెళ్లే దారిలో కల్వర్టు పలక విరిగిపోయింది. - **టి.రాజేష్,** ● పరిశీలించి పలకలు వేస్తాం. -**అలేక్ కుమార్, పుర ఏఈ,** -న్యూస్‌టుడే, సాలూరు

?: వైకాపా హయాంలో రీసర్వే చేసిన భూములకు అడంగల్‌లు రావడం లేదు. భూమి క్రయ, విక్రయాలకు ఇబ్బందులు పడుతున్నాం. - **అప్పలనాయుడు** ● మళ్లీ రీసర్వే చేసి, సరిచేస్తాం. - **రాజేశ్వరరావు, మండల సర్వేయర్** - న్యూస్‌టుడే, భామిని.

?: కోసలి- కీసర మధ్య రహదారి పక్కనే వ్యర్థాలు పేరుకుని దోమల బెడద ఎక్కువైంది. - **కీసర గ్రామస్థులు** ● పారిశుద్ధ్యం పనులు చేయిస్తాం. - **జగన్నాథం, ఈవోపీఆర్‌డీ** - న్యూస్‌టుడే, భామిని

?: కోసలోని దాకేటి వీధిలో బోరుబావి మరమ్మతులకు గురై తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ● బాగు చేయిస్తాం. - **అజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్** - న్యూస్‌టుడే, మక్కువ

?: సీతానగరం సుంకరివీధి నుంచి శ్మశానవాటిక రోడ్డు అధ్వానంగా ఉంది. - **రామారావు** ● చర్యలు తీసుకుంటాం. - **సురేష్, ఈవో** - న్యూస్‌టుడే, సీతానగరం

?: కారాడవలస ఎస్టీ కాలనీలో కాలవ పలకలు విరిగిపోయాయి. ప్రమాదాలకు గురవుతున్నాం. - **నాగయ్య,** ● కార్యదర్శిని అప్రమత్తం చేస్తాం. - **కె.సత్యం, ఎంపీడీవో** - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

నీరిస్తారా.. ఊరిస్తారా?

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ మంజూరు చేసింది. ఇందులో భాగంగా 2021లో నిధులు విడుదల చేసింది. పాలకొండ నియోజకవర్గం పరిధిలో మంజూరైన తాగునీటి పథకాలు నేటికీ ఊరిస్తూనే ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి కాక గ్రామీణులకు రక్షిత నీరు కరవవుతోంది. ఈ వేసవికైనా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని వారు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

నిర్మాణంలోనే రక్షిత పథకాలు

పాలకొండ మండలంలో 2021లో రూ.8.50 కోట్ల నిధులతో 51 పనులు మంజూరయ్యాయి. గత అయిదేళ్లలో 16 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 32 కొనసాగుతున్నాయి. బెజ్జి, గోపాలపురం, బడ్డుమాసింగి గ్రామాల్లో పథకాల నుంచి అదనపు పైపుల విస్తరణ ప్రారంభం కాలేదు. సీతంపేట మండలంలో 513 పనులకు గాను రూ.25 కోట్లు నిధులు కేటాయించారు. వీటిలో 137 పూర్తికాగా, 287 కొనసాగుతున్నాయి. మరో 89 ప్రారంభం కావాల్సి ఉంది. భామిని మండలంలో 108 పనులకు గాను రూ.77 కోట్లు వచ్చాయి. వీటిలో 37 పూర్తికాగా, 71 వివిధ దశల్లో ఉన్నాయి. బురుజోల కొండపై 14 గ్రామాలకు తాగు నీరందించేందుకు మెగా రక్షిత పథకం నేటికీ నిర్మాణంలోనే ఉండడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీరఘట్టం మండలంలో 66 పనులకు గాను రూ.9.50 కోట్లు నిధులు రాగా 51 అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. వీరికి ఆధారమవుతున్న చేతిబోర్లు సైతం మరమ్మతులకు గురవుతుండడంతో అవస్థలు తప్పడం లేదు.

పాలకొండ మండలం టీకే రాజపురం గ్రామంలో నిలిచిన రక్షిత పథకం

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వం..

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామాల్లో క్రాష్ ప్రోగ్రాం అమలు చేస్తున్నాం. బోర్లు మరమ్మతులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. - జి.మధుసూదనరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

పోటీలతో ప్రతిభకు పదును

బహుమతులు అందుకున్న చిన్నారులతో డీఈవో బ్రహ్మాజీరావు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి పిల్లాడిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, ఆ ప్రతిభకు పదును పెట్టాలంటే పోటీలు దోహదపడతాయని డీఈవో, సమగ్ర శిక్షా ఏపీసీ బ్రహ్మాజీరావు అన్నారు. మంగళవారం చర్చి వీధి కల్యాణ మండపంలో సహిత విద్య పిల్లలకు వివిధ రకాల పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటే ప్రత్యేక అవసరాల పిల్లల భవితకు మంచి బాటలు వేయవచ్చన్నారు. అధికారులు భానుమూర్తి, శంకరరావు, ఐఈ ఆర్టీలు, ప్రత్యేక అవసరాల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ★ పార్వతీపురం పట్టణం: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్ట్స్ అండ్ కల్చరల్ పోటీల్లో విజేతలకు డీఈవో బ్రహ్మాజీరావు చేతుల మీదుగా బహుమతులు మంగళవారం అందజేశారు. మొదటి రోజు నృత్యాలు, చిత్రలేఖనం, ఫ్యాన్సీడ్రెస్, స్కిట్ తదితర పోటీలు జరిగాయి. విశ్రాంత ఏఈవో రామచంద్రరావు, లయన్స్ క్లబ్ సెక్రటరీ బీవీఎస్ నాయుడు, ట్రెజరర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జంఝావతిపై దృష్టిసారించండి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలోని జంఝావతి కాలువ పనులపై దృష్టిసారించాలని గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ నాయుడు కోరారు. మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గత తెదేపా హయాంలో మొదలైన ఈ పథకం ఎగువ కాలువ పనులు కొన్నాళ్లకు నిలిచిపోయాయన్నారు. దృష్టిసారించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పరిస్థితులను ఆయనతో మాట్లాడారు. కాలువ పనులకు సంబంధించిన నివేదికను అధికారులకు ఇవ్వాలని సూచించారన్నారు.

గోవా గవర్నర్ అశోక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయుడు

ఆటల సందడి

పార్వతీపురం, పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంగళవారం అమరావతిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర పరుగు, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. పరుగులో, టగ్ ఆఫ్ వార్‌లో ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు జట్టు తరపున ఆడి విజయం సాధించారు.

విద్యార్థుల కేరింత

నృత్యం చేస్తున్న బాలికలు

కొమరాడ, న్యూస్‌టుడే: కోటిపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు సూచనలు చేశారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. సీతానగరం: ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ శిర్లిపోతన్నవీధిలో ఎల్లమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిక్కిరిసింది. భక్తుల సౌకర్యార్థం సత్యసాయి భక్తులు మూడు చోట్ల చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాన్ని పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్యూలైన్లలో వేచివున్న భక్తులు

ల్యాప్‌టాప్ వితరణ

గుమ్మలక్ష్మీపురం: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలన్న ఉద్దేశంతో గుమ్మలక్ష్మీపురం మండలం కె.శివడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజేష్ సుమారు రూ.30 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను అందించారు.

చెరువును రక్షించండి

వీరఘట్టం: మండలంలోని కడకెల్లలో సర్వే నంబర్ 28లో 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు రూపురేఖలు లేకుండా చేశారని గ్రామస్థుడు చిట్టి చెప్పాడు. 500 ఎకరాలకు సాగునీరు అందించే దీన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని, విచారించి రక్షణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సాయికామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

జాగ్రత్తలతో క్షయ దూరం

పాలకొండ గ్రామీణం: జాగ్రత్తలు పాటించి క్షయను పారదోలుదామని ఆ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ పి.వెంకట దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. క్షయ నివారణ వారోత్సవాల్లో భాగంగా పాలకొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను వాలంటీర్లుగా నియమించారు. క్షయ యూనిట్ బాధ్యుడు ఎ.సురేష్ ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం: బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లిన యువకుడిపై ఏఎస్పీ మనీషా రెడ్డి పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై రాజేష్ తెలిపారు. అడ్డాపుశీల పంచాయతీకి చెందిన ఓ బాలిక కొన్నిరోజులుగా కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మంగళవారం అదే గ్రామానికి చెందిన శంకరరావు బాలికతో వచ్చి స్టేషన్‌లో లొంగిపోయాడు. ఆమె మైనర్ కావడంతో ఆయనపై కేసు నమోదు చేసి, బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో దొంగ

పార్వతీపురం పట్టణం: జిల్లాలో పలు చోట్ల మహిళల మెడలో గొలుసులు దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బస్సు దిగి ఒంటరిగా వెళ్తున్న మహిళలను కొత్తబెలగాంకు చెందిన ఓ వ్యక్తి తమను గ్రామంలో విడిచిపెడతామని నమ్మించి, నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి గొలుసులు తస్కరించేవాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. బుధవారం ఎస్పీ పూర్తి వివరాలు వెల్లడిస్తారన్నారు.

ట్రాక్టర్ బోల్తా

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మండలంలోని కొసగూడ సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడింది. బత్తిలి నుంచి ఎల్విన్‌పేటకు ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పింది. ఘటనపై కేసు నమోదు కాలేదు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు

సాలూరు: పోస్టాఫీసులో బుధవారం నుంచి ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని పోస్టుమాస్టర్ రత్నకుమార్ తెలిపారు. కొత్త ఆధార్‌తో పాటు చిరునామా, పుట్టిన తేదీ మార్పులు, చేర్పులు చేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మక్కువ: తెర్లాం మండలం రంగపువలస గ్రామానికి చెందిన దేవరకొండ కృష్ణ, ఎం.అప్పన్న సోమవారం రాత్రి మక్కువ నుంచి బొబ్బిలి వైపు ట్రాక్టర్‌పై వెళ్తుండగా, మేలాపువలస-ఎ.వెంకంపేట మధ్య ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వాహనం బోల్తా పడింది. ఇద్దరికీ గాయాలవడంతో స్థానికులు బొబ్బిలి ఆసుపత్రికితరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

వనరులు సమకూర్చుకోవాలి

పార్వతీపురం గ్రామీణం: పంచాయతీల పరిధిలో సొంత వనరులు సమకూర్చుకోవాలని డీఆర్పీ, ఎంపీడీవో కె.సత్యం తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో ప్రత్యేక వనరుల సమీకరణ సదస్సు నిర్వహించారు. ఎమ్మార్పీ రామకృష్ణ, ఏవో మూర్తిలు పలు అంశాలపై మాట్లాడారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి

పాలకొండ గ్రామీణం: పోలీసులకు ఉద్యోగోన్నతులను కల్పించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం శాసనమండలిలో ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మంది ఏఎస్సైలు గత పదేళ్లుగా విధుల్లో ఉన్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు.

బాధితులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ప్రాంగణం: బలిజిపేట మండలం అంపావల్లి క్లోరిన్ గ్యాస్ లీకేజీ బాధితులను ఆదుకోవాలని అఖిలపక్ష నాయకులు గంగునాయుడు, మన్మథరావు కోరారు. కలెక్టరేట్ వద్ద బాధితులతో కలిసి నిరసన చేపట్టారు. బాధితులకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండు చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

భామిని, పాలకొండ, సీతంపేట, కురుపాం గ్రామీణం, పార్వతీపురం గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యకర్తలు మంగళవారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. పనికి తగ్గ వేతనం అందించాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలన్నారు. భామినిలో సిటూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు, నాయకులు కన్యాకుమారి, అప్పలనర్సమ్మ ఉన్నారు. పాలకొండలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.అమరవేణి తదితరులు పాల్గొన్నారు.

భామినిలో రిలే దీక్షల్లో అంగన్‌వాడీలు

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: పల్లెలకు మంజూరైన ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ బి.సురేష్ అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. వివిధ గ్రామాల్లో 233 పనులకు రూ.11 కోట్లు మంజూరయ్యాయని, వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. 4500 ఎకరాలకు ఈ-క్రాప్ చేశామని, రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య 8,926 మందికి నమోదు చేయగా, 954 పెండింగులో ఉన్నాయని వ్యవసాయాధికారి విజయభారతి చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు పెండింగులో ఉన్నాయని, చెల్లించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. చినబుడ్డిడిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అంకవరం సర్పంచి ఎ.నారాయణరావు కోరారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని 74 మంది మాత్రమే వినియోగించుకున్నారని ఏఈ శంకరరావు తెలిపారు. కురుపాం ఏఎంసీ ఛైర్‌పర్సన్ కె.కళావతి, వైస్ ఎంపీపీలు జి.సంపత్‌కుమార్, బి.నరేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సోములు, తహసీల్దారు అప్పారావు, ఎంపీడీవో కె.ధర్మారావు, ఇతర అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ కళావతి

పుట్టినూరు పట్టుచీర

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బాలగుడబ పంచాయతీ పాలకవర్గం వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం గ్రామంలో పెళ్లిళ్లు చేసుకున్న ఆడపిల్లలకు పట్టుచీర, గాజులకు రూ.200 వంతున సర్పంచి పోలమ్మ, ఉపసర్పంచి సింహాచలం, యువజన సంఘ ప్రతినిధి సూర్యనారాయణ వధువులకు అందించారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బొడ్డవలసలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10 తరగతి వరకు ఖాళీల భర్తీకి మార్చి 2న నిర్వహించనున్న పరీక్ష వాయిదా వేసినట్లు ప్రిన్సిపల్ పి.ఎస్.ఎన్.మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షల కారణంగా దీన్ని మార్చి 8న నిర్వహిస్తామని, అయిదు, జూనియర్ ఇంటర్‌కు మార్చి 1న యథాతథంగా ఉంటుందన్నారు.

డిపోల మూసివేత దారుణం

పాలకొండ ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పాలకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం 12 ఆర్టీసీ డిపోలను మూసి వేసేందుకు యత్నించడం దారుణమని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ పాలకొండ డిపో కార్యదర్శి వి.రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం డిపో వద్ద ఎరుపు రంగు బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం కాలుష్య నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో మొదటి విడతగా 750 విద్యుత్తు బస్సులు నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి, ఇప్పటికే 4 డిపోల మూసివేతకు ఆదేశాలు జారీ చేసిందని ఆరోపించారు. డీజీరావు, పీఎల్‌రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నివేదిక వచ్చేవరకు పనులు చేయొద్దు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జమదాల పంచాయతీ లక్ష్మీపురం సమీపంలోని వివాదాస్పద స్థలాన్ని మంగళవారం అధికారులు పరిశీలించారు. అటవీ శాఖ పరిధిలోని ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు పలువురు యత్నిస్తున్నారని, తమకు పట్టాలు ఉన్నాయని గిరిజన రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మక్కువ అటవీశాఖ సెక్షన్ అధికారి అవతారం, సిబ్బంది పరిశీలించి, సర్వే చేశారు. పూర్తి నివేదిక వచ్చే వరకు ఈ భూమిలో ఎవరూ ఎటువంటి పనులు చేయొద్దని ఆయన హెచ్చరించారు.

ఎగువ దాగరవలసలో సర్వే

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తవలస పంచాయతీ ఎగువదాగరవలసలో మంగళవారం అధికారులు సర్వే నిర్వహించారు. తమ పిల్లలకు ఆధార్‌కార్డులు లేక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారని గ్రామస్థులు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేపట్టారు. 29 కుటుంబాలకు గాను 150 మంది జనాభా ఉన్నారు. 2025లో పుట్టిన పది మంది చిన్నారులకు ఆధార్‌లు లేవని గుర్తించారు. అయిదుగురు ఆయా ఆసుపత్రుల్లో జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నా ఆధార్ కేంద్రాలకెళ్లి నమోదు చేసుకోలేదు. మిగతావారు జనన ధ్రువపత్రాలు తీసుకోలేదు. వారికి సూచనలు చేశారు. వీఆర్వో సతీష్, సంక్షేమ సహాయకురాలు మంగ ఉన్నారు.

నిధులున్నాయి.. పనులు చేయండి

హాజరైన ఇంజినీరింగ్ సిబ్బంది

కొమరాడ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి నిధులున్నాయి... పనులు చేయండని ఉపాధి హామీ శాఖ పీడీ రామచంద్రరావు అన్నారు. మంగళవారం కొమరాడలో వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలో గిరిజన ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్లతో పాటు, కాలువలకు సంబంధించి 232 పనులకు అంగీకారం ఉందన్నారు. మార్చి 10లోగా పనులు పూర్తి చేసి ఎంబుక్ రికార్డు పూర్తి చేయాలన్నారు. లేదంటే కేటాయించిన నిధులు వెనక్కి మళ్లిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉన్నత స్థాయి అధికారులుగా ఎదిగి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని సీఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గ్రూప్1, గ్రూప్2, సివిల్స్ వంటి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నతమైన స్థానాలు అధిరోహించాలని కోరారు. వీటన్నిటికీ పదో తరగతి పునాదన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

విజేతకు వీడ్కోలు.. పాలకొండ: ఇటీవల గ్రూప్-2కు ఎంపికైన ఉపాధ్యాయుడు రాంబాబును మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. విద్యా కమిటీ ఛైర్మన్ గోపాల్, తెదేపా నాయకుడు బాబ్జీ ఉన్నారు.

ఉపాధికి వరం ఉద్యోగ మేళా

సాలూరు, న్యూస్‌టుడే: పారిశ్రామిక శిక్షణ పొంది ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్న యువతకు ఉద్యోగమేళాలు వరంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మూడు నెలలకోసారి ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాలు జరుగుతున్నాయి. పలు రాష్ట్రాల నుంచి కంపెనీలు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వస్తున్నాయి. మన్యం జిల్లాలో పరిశ్రమలు లేనప్పటికీ ఇతర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు దక్కడంతో యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయిదేళ్ల కిందట శిక్షణ పొందిన నిరుద్యోగులకు వీటిల్లో అవకాశాలు దక్కుతున్నాయి.

ఏడాదిలో 211 మంది యువత ఎంపిక

ఉద్యోగ మేళాకు హాజరైన యువత (పాతచిత్రం)

అవకాశాలు మెండు

ప్రభుత్వ ఐటీఐ సాలూరులో గతేడాది నుంచి ఇప్పటి వరకు మూడు ఉద్యోగ మేళాలు జరిగాయి. 11 కంపెనీలలో సుమారు 600 వరకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ఒక్కో మేళాకు 150 నుంచి 200 మంది హాజరయ్యారు. రాత, మౌఖిక పరీక్షల ద్వారా 211 మందిని ఎంపిక అయ్యారు. రూ. 15 నుంచి 20 వేల వరకు కనీసవేతనం పొందుతున్నారు. ఇవే కాకుండా ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రఖ్యాత కంపెనీల్లో అప్రెంటిస్ షిప్ చేసే అవకాశాలు దక్కాయి. ఏటా 342 మంది వీటికి ఎంపికై నైపుణ్య శిక్షణలు పొందుతున్నారు.

సద్వినియోగం..: జిల్లాలోని నిరుద్యోగ యువతకు అప్రెంటిస్, జాబ్‌మేళాలతో ఉపాధి, ఉద్యోగావకాశాలు బాగా పెరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో శిక్షణ పూర్తి చేసుకున్నవారంతా వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. మరింత మందికి ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయం. - శ్రీనివాసాచారి, కన్వీనర్ ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ సాలూరు

(c) eenadu

తప్పుల్లేకుండా జనాభా గణన

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, న్యూస్‌టుడే: పోలవరం జిల్లాలో జనాభా గణన తప్పులు లేకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జేసీ శుభం నొఖ్వాల్‌తో కలిసి స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో 12 మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిజిటల్ అసిస్టెంట్లతో జనాభా లెక్కల సర్వేపై సమీక్షించారు. మే 1 నుంచి 31 వరకు ఇంటింటికి తిరిగి జనాభా లెక్కలు సేకరించాలన్నారు. పదేళ్లకు ఒకసారి ఈ సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టాన్ని పరిగణనలోకి తీసుకొని జనాభా లెక్కల సర్వే చేయాలన్నారు. తహసీల్దార్లు బాలాజీ, సత్యనారాయణ, శ్రీనివాసరావు, దొరకయ్య, సత్యనారాయణ, వేణుగోపాల్, జనాభా లెక్కల అధికారులు త్రిమూర్తులు, జయరామ్, జగదీష్‌పూరి, శివకుమార్, ఎంపీడీవోలు శ్రీనివాసుదొర, రవికిషోర్, సాల్మన్‌రాజ్, బాపన్నదొర, యాదగిరి, ఈశ్వరరావు, కుమార్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్. చిత్రంలో జేసీ నొఖ్వాల్

పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

మారేడుమిల్లి: మన్యంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మారేడుమిల్లిలో పర్యటించి 'ది ఉడ్స్' రిసార్టులో ఖాళీ స్థలాలను పరిశీలించారు. మారేడుమిల్లిలో పర్యాటక అభివృద్ధికి 37 కాటేజీలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకు అనువైన స్థలాలను ఎంపిక చేస్తామని చెప్పారు. మన్యంలో పర్యాటకాన్ని విస్తృతపరిస్తే గ్రామాలు అభివృద్ధి చెందడంతోపాటు గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్, తహసీల్దారు కె.అమ్మాజీ, ఆర్ఐ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టం.. వర్షార్పణం

● కల్లాల్లో తడిసిన మిరప పంట

గౌరిదేవిపేటలో తడిసిన మిరపకాయలను ఆరబోస్తున్న రైతు

ఎటపాక, న్యూస్‌టుడే: అన్నదాతల రెక్కల కష్టం వర్షార్పణం అయింది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తెగుళ్ల బెడదను అధిగమించి కోసిన మిరప పంటను కల్లాల్లో ఆరబెట్టారు. వర్షానికి మొత్తం తడిసిపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. ఎటపాక మండలంలోని తోటపల్లి, నందిగామ, ముసుమురు, నెల్లిపాక, గౌరిదేవిపేట, గన్నవరం, గుండాల, రాయనపేట, బొడవరం, కృష్ణవరం, నల్లకుంట, రామావుపురం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో భారీగా మిరప పంట తడిసింది. ఒక్కసారిగా కుండపోతగా వర్షం కురవడంతో మిరప రాశులపై టార్పాలిన్లు కప్పే సమయం కూడా లేదని రైతులు వాపోతున్నారు. పంట చేతికి వచ్చి విక్రయించే సమయానికి నష్టానికి గురికావడంపై ఆవేదన చెందుతున్నారు. పొగాకు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. పొగాకు కోసి బద్దీలు కట్టి ఆరబెట్టారు. వర్షానికి మొత్తం తడిసి ముద్దవడంతో గిట్టుబాటు ధర కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గడువు పదహారు నెలలే!

● వేగం పుంజుకున్న పునరావాస ప్రక్రియ
● తొలుత తాడ్వాయికి వెయ్యి కుటుంబాల తరలింపు

న్యూస్‌టుడే - కూనవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టులో కీలకమైన పునరావాస ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పోలవరం ప్రాజెక్టుతో ప్రధానంగా కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లో ముంపు ఎక్కువగా ఉంటుంది. ఈ గ్రామాల్లో 41.15(టీ) కాంటూరులోని నిర్వాసితుల జాబితాలను ఇప్పటికే పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించి అభ్యంతరాలను తీసుకున్నారు. ఇప్పటికే అభ్యంతరాలున్న వాటిని పక్కనబెట్టి సక్రమంగా ఉన్న నిర్వాసిత కుటుంబాలను తరలించేందుకు యత్నాలు మొదలుపెట్టారు. ఐటీడీఏ కూనవరంలో నిర్వాసితులతో ప్రాజెక్టు ఏవో అభిషేక్ గ్రామసభ నిర్వహించి వచ్చే ఏడాది పుష్కరాల నాటికి 41.15(టీ) కాంటూరులోని గ్రామాలను ఖాళీ చేయిస్తామని తెలిపారు.

ఏలూరు జిల్లాలో పునరావాసం..

కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లోని ముంపు గ్రామాలకు ఏలూరు జిల్లా తాడ్వాయిలో పునరావాసం చూపిస్తున్నారు. ఏడాది కాలంగా నిర్వాసితులను బస్సుల్లో పునరావాస కేంద్రాలకు తీసుకువెళ్లి అధికారులు చూపించారు. ఎక్కువ మంది తాడ్వాయిలోనే పునరావాసం కోరుకోవడంతో ఖరారు చేశారు. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి ముంపు గ్రామాలను ఖాళీ చేయించాలని పాలకుల ఆదేశాల మేరకు ఇంటి స్థలాలను సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే తాడ్వాయిలో 1000 ప్లాట్లను సిద్ధం చేసినట్టు ఏవో అభిషేక్ తెలిపారు. మూడు మండలాల్లో కలిపి తొలి దశలో తరలించేందుకు 14 వేల కుటుంబాలను గుర్తించినప్పటికీ నాలుగు వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

నిర్వాసితుల వివరాలు ఇవీ..

మండలం	గ్రామాలు	కుటుంబాలు
కూనవరం	9	4,355
వీఆర్‌పురం	16	5,795
చింతూరు	6	3,667

తాడ్వాయిలో స్థలాలను జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం

పునరావాసంలో యువతకు ఉపాధి కల్పించేందుకు ఒక పరిశ్రమ నిర్మాణంలో ఉండగా... మరొకటి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. తొలుత ఆమోదం తెలిపిన వెయ్యి కుటుంబాలకు వచ్చే నెల 15లోగా ఇంటి స్థలాలు కేటాయించనున్నారు. అనంతరం పునరావాస పరిహారాల చెల్లింపులు జరుగుతాయి. గిరిజనేతర నిర్వాసితులకు ప్రభుత్వం మూడు ప్రతిపాదనలు చేసింది. స్థలం తీసుకుని ఇల్లు కట్టుకోవడం, స్థలం, ఇల్లు ప్రభుత్వం కట్టించి ఇవ్వడం, ఇవేమీ లేకుండా నగదు తీసుకోవడం.. నిర్వాసితులు ఏది కోరుకుంటే అది వారికి చేకూరుతుంది. గడువు సమీపిస్తుండడంతో నిర్వాసితుల్లోనూ ఆందోళన మొదలైంది.

ద్వితీయ ఇంటర్ పరీక్షకు 94 మంది గైర్హాజరు

రంపచోడవరం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: జిల్లాలోని పది కేంద్రాల్లో మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం-2, ఒకేషనల్ జీఎఫ్‌సీ-2 పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 94 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు తెలిపారు. జనరల్ పరీక్షకు సంబంధించి 1,994 మంది విద్యార్థులకు గాను 1,929 మంది, ఒకేషనల్ (జీఎఫ్‌సీ) పరీక్షకు 334 మందికిగాను 305 మంది హాజరయ్యారు. సాధారణ పరీక్షకు 65 మంది, ఒకేషనల్ పరీక్షకు 29 మంది గైర్హాజరయ్యారు. జిల్లా ప్రధాన కేంద్రం రంపచోడవరంలోని కేంద్రాల వద్ద సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎస్సై వెంకటరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎట్టకేలకు రహదారి నిర్మాణం

▲ 'ఈనాడు' కథనాలకు స్పందన ▲ మూడు మండలాల గిరిజనులకు మేలు

న్యూస్‌టుడే - రంపచోడవరం

రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం మండలాలకు చెందిన గ్రామాల ప్రజలకు ఉపయోగపడే బీటీ రహదారి నిర్మాణం ఎట్టకేలకు మొదలయింది. పదేళ్ల క్రితం రంపచోడవరం మండలం పందిరిమామిడి నుంచి వై.రామవరం మండలం చవిటిదిబ్బల వరకు 29 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. రహదారితోపాటు మార్గమధ్యలో ఉన్న కొండవాగులపై వంతెనలు నిర్మించేందుకు ఆర్ అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు పనులు చేపట్టారు. పందిరిమామిడి నుంచి తాళ్లపాలెం మీదుగా భీమవరం వరకు, వాడపల్లి నుంచి చవిటిదిబ్బల వరకు రోడ్డు, వంతెన నిర్మాణాలు పూర్తయ్యాయి. భీమవరం నుంచి వాడపల్లి వరకు 10 కిలోమీటర్ల మేర రహదారి పనులు అటవీ అధికారుల అభ్యంతరాలతో నిలిచిపోయాయి. అటవీశాఖ నష్టపోయిన పది కిలోమీటర్ల రహదారికి పరిహారం కింద ఆర్అండ్‌బీ అధికారులు రూ.90 లక్షలు చెల్లించారు. భూమికి పరిహారంతోపాటు కాకినాడ సమీపంలోని కరపలో భూమిని చూపించారు. దీనికి సర్వే నంబరు కేటాయించడంలో తీవ్ర జాప్యంతో ఏళ్లతరబడి పనులు నిలిచిపోయాయి.

కొండవాగుపై వంతెన నిర్మాణానికి జేసీబీతో పనులు

స్పందించారు.. పనులు చేపట్టారు..

రహదారిపై కంకర వేసిన తరువాత అటవీశాఖ అభ్యంతరాలతో పనులు నిలిపివేయడంతో గిరిజనులు నాలుగేళ్లుగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి అవస్థలపై 'ఈనాడు' పలుమార్లు కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి పనులతోపాటు కొండవాగుపై వంతెన నిర్మాణానికి ఇటీవల శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి.

త్వరలో నిర్మాణం పూర్తిచేస్తాం..

అటవీశాఖకు ఇచ్చిన భూమికి సర్వే నంబరు కేటాయించకపోవడంతో అనుమతులు రాక రహదారి నిర్మాణంలో జాప్యం జరిగింది. అటవీశాఖ అధికారులకు నష్టపరిహారం కింద రూ.90 లక్షలు చెల్లించాం. ఆటంకాలు తొలగినందున త్వరితగతిన రహదారి, వంతెన నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాం.

- భవాని, డీఈ, ర.భ.శాఖ, రంపచోడవరం

పెద్దపులి సంచారంపై అప్రమత్తం

● డీఎఫ్‌వో శివకుమార్ గంగల్

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ ఫారెస్ట్ అధికారి శివకుమార్ గంగల్ తెలిపారు. మండలంలో పులి సంచారంపై మంగళవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా కూర్మాపురంలో పట్టుకొన్న పెద్దపులిని విశాఖపట్నం జూపార్క్‌లో ఐదు రోజులు ఉంచిన తర్వాత ఈ నెల 19న దేవీపట్నం గోదావరి పరివాహక ప్రాంతమైన పాపికొండల అభయారణ్యంలో విడిచిపెట్టారన్నారు. పులి యోగక్షేమాలను తెలుసుకునేందుకు జియోట్యాగ్ (కెమెరా)ను మెడలో తగిలించారని తెలిపారు. రంపచోడవరం మండలం కింటుకూరు బేస్ క్యాంపు మీదుగా కాకవాడ, మారేడుమిల్లి మండలం రామన్నవలస గ్రామ సమీపం నుంచి రంపచోడవరం మండలం పెదగెద్దాడ, చెరువుపాలెం మీదుగా పులి సోమవారం రాత్రి రంప, మర్రివాడ చేరుకొందని తెలిపారు. ఇప్పటివరకు ప్రజలకు ఎటువంటి హాని చేయలేదని, కొండల మార్గంలోనే పయనిస్తోందన్నారు. పులి సంచరిస్తున్న గ్రామాల్లో అటవీశాఖ అధికారుల బృందం ద్వారా సమావేశాలు ఏర్పాటు చేసి అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. రాత్రి 7.30 గంటలు దాటిన తర్వాత ఎవరూ ఇళ్లనుంచి బయటకు రావొద్దని సూచిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఆదేశాలతో పాపికొండల అభయారణ్యంలోని నేషనల్ పార్క్‌లో పులిని విడిచిపెట్టారని డీఎఫ్‌వో తెలిపారు. శ్రీశైలం నల్లమల అటవీప్రాంతంలో 69 పులులు ఉన్నాయన్నారు. అభయారణ్యంలో విలువైన వృక్ష సంపద సంరక్షణ ఉద్దేశంతోనే పులిని ఈ ప్రాంతంలో వదిలారన్నారు. ప్రస్తుతం ఆడ పులి కోసం వెదుకుతూ వివిధ ప్రాంతాల్లో సంచరిస్తోందన్నారు. ఆడపులి ఉంటే ఒకే ప్రాంతంలో కలిసి ఉంటాయన్నారు.

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం

-6లో

ఎప్పటికప్పుడు లైసెన్సులు నవీకరించుకోవాలి

గంగవరం, అడ్డతీగల, న్యూస్‌టుడే: వాహనాలకు సంబంధించిన దస్త్రాలను ఎప్పటికప్పుడు నవీకరించుకొంటూ సక్రమంగా నిర్వహించుకోవాలని రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్ వాహనదారులకు సూచించారు. మంగళవారం ఉదయం గంగవరం వైజంక్షన్‌లో స్థానిక ఎస్సై ఎస్.వెంకయ్యతో కలిసి తనిఖీలు నిర్వహించారు. చోదకులు డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, విధిగా శిరస్త్రాణాలు ధరించాలన్నారు. యువతకు, స్థానికులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఏఎస్సై మహర్షి, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● అడ్డతీగల మండలం వేటమామిడిలో ఆర్టీవో రాజేష్‌కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని ఆరు వాహనాలకు సంబంధించి చోదకులకు రూ.32 వేలు అపరాధరుసుము విధించినట్లు తెలిపారు. చోదకులు లైసెన్స్, బీమా, ఫిట్‌నెస్ పత్రం, రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.

గంగవరం వైజంక్షన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్టీవో రాజేష్‌కుమార్, ఎస్సై వెంకయ్య

మన్యం అందాలు ఆకట్టుకున్నాయ్

మార్కెట్ సెంటర్లో విదేశీయులు

ఆస్ట్రేలియాకు చెందిన యాత్రికులు ఎం.దుమైన్, జాబీబెన్ మంగళవారం చింతూరు మండలం మోతుగూడెం మార్కెట్ సెంటర్లో సందడి చేశారు. ఈ నెల 16న ద్విచక్ర వాహనంపై దిల్లీ నుంచి బయలుదేరి విజయవాడ, విశాఖపట్నం మీదుగా అరకులోయ, లంబసింగి, సీలేరు అందాలను చూసి మోతుగూడెం చేరుకున్నారు. భారతీయ సంస్కృతి, గిరిజనుల ఆచార సంప్రదాయాలు చూసేందుకు ఈ యాత్ర చేపట్టామన్నారు. మన్యంలో ప్రకృతి అందాలు మనసు పులకించేలా ఉన్నాయన్నారు. గిరిజనుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఆకట్టుకున్నాయన్నారు. మోతుగూడెం నుంచి మారేడుమిల్లి, రంపచోడవరం మీదుగా రాజమహేంద్రవరం వెళ్తున్నట్లు చెప్పారు.

- న్యూస్‌టుడే, మోతుగూడెం

బొమ్మూరు సైన్స్ సెంటర్‌కు విశేష ఆదరణ

బొమ్మూరు, హుకుంపేట, న్యూస్‌టుడే: బొమ్మూరులోని సైన్స్ సెంటర్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలోనే రెండో సెంటర్‌గా ప్రారంభమైన ఈ కేంద్రాన్ని 6 నెలల్లో 50కు పైగా పాఠశాలలు, కళాశాలల నుంచి 10వేల మంది విద్యార్థులు సందర్శించారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇక్కడకు వస్తున్నారు.

ఎన్నెన్నో విశేషాలు..

● కేంద్రంలో భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి సుమారు 50కు పైగా ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయి. గ్రీన్‌పార్క్‌లో డైనోసార్, సముద్ర అలలు, సంగీత ధ్వనులు, సూర్యమండలం వంటి 18 విషయాలు చూడొచ్చు. ● కేంద్రంలోని కింద గదుల్లో సైన్స్‌తో సరదా ఆటలు, నీరు, కాంతి, విద్యుత్తుతో ప్రయోగాలు వంటివి ఉంటాయి. ● సెంటర్ పైభాగంలో అంతరిక్ష విశేషాలు, యాక్టివిటీ హాల్, ఇన్నోవేషన్ హబ్ వంటివి చూడొచ్చు. ఆటోరియంలో కొన్ని ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి వివరిస్తారు. మరికొన్నింటినీ విద్యార్థులూ చేయచ్చు.

సందర్శన నియమాలు..

● సోమవారం నుంచి శనివారం వరకు. ఆదివారం సెలవు. ఉదయం 9.30 నుంచి 5 గంటల వరకు సందర్శించవచ్చు. ● ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు రూ.25, ప్రైవేటు విద్యార్థులకు రూ.40, పెద్దవారికి రూ.50 ప్రవేశ రుసుం. ● ఆసక్తి ఉన్నవారు ఎవరైనా వెళ్లొచ్చు. ● కేంద్రానికి వచ్చే ఆదాయం విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి చేరుతుంది.

ఐటీడీఏ ఎదుట ఏఎన్ఎంల నిరసన

పనిఒత్తిడి తగ్గించాలని ఆందోళన

రంపచోడవరం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలపై పనిఒత్తిడి తగ్గించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఎ.రత్నరాజు డిమాండ్ చేశారు. ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ మండల అధ్యక్షురాలు సత్యవతి, ఉపాధ్యక్షుడు దుర్గారావు అధ్యక్షతన మంగళవారం నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. విధి నిర్వహణలో యాప్‌ల ద్వారా పనిభారం పెరిగిందన్నారు. సచివాలయాల్లో కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని, జీతాలు నిలుపుదల చేస్తామని ఎంపీడీవోలు బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏళ్లతరబడి ఖాళీగా ఉన్న మల్టీపర్పస్ సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి రాఘవ, కోశాధికారి విజయకుమారి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు చీకట్ల శ్రీనివాసరావు, కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కల్తీ పాపాలు.. తీస్తున్నాయ్ ప్రాణాలు!

● యూరియా, డిటర్జెంట్, నూనెలతో తయారయ్యే సింథటిక్ పాలతో ప్రమాదం

ఈనాడు, కాకినాడ

కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లు పాల నుంచి తినే ఆహారం వరకు అన్నీ కలుషితం చేస్తున్నారు. అక్రమార్జనలో సంపాదన కోసం ప్రజారోగ్యాన్ని బలిపెడుతున్నారు. విరివిగా రసాయనాలు, రంగులు కలిపి అన్నపానీయాలను విషతుల్యం చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో అధునాతన ప్రాణాలు కోల్పోగా మరికొందరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో కల్తీ పాల మాట నల్లపై ఆహార భద్రత ప్రమాణాలశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. నీళ్ల కలిపే పాలు కొంత పర్వా లేదు కానీ ఆవులు, గేదెలని కాకుండా రసాయనాలతో తయారు చేసే సింథటిక్ పాలతోనే ప్రాణాలకు ప్రమాదమంటున్నారు. పాల కల్తీలను ముందే గుర్తించవచ్చని చెబుతున్నారు.

పాలల్లో వీటి ఆధారంగా నాణ్యత పరీక్షిస్తారు (శాతం)

	ఫ్యాట్	ఎస్ఎన్ఎఫ్
ఆవు పాలు	3-5	8-8.5
గేదె పాలు	8-9	8.5-9

ఫిర్యాదు చేయండి.. ఆహార కల్తీలపాటు పాలు, నిత్యావసరాలు కల్తీ జరిగినట్లు అనుమానం వస్తే ఆహార భద్రత తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేయండి. నమూనాలు తీసుకుని కల్తీ పరీక్షలు చేయించుకోవచ్చు. 7702999946 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు. గతంలో కొన్ని కల్తీ పాలకేసులపై జేసీ కోర్టులో అపరాధ రుసుము విధించిన ఘటనలు ఉన్నాయి. - నందాజీ, సహాయ నియంత్రణ అధికారి, ఆహార భద్రత ప్రమాణాల శాఖ

ఫార్మాలిన్ వాడి.. ● అసలు ఆవులు, గేదెల నుంచి పిండి పాలు సేకరించిన తర్వాత... నీళ్లు, డిటర్జెంట్, వెజిటబుల్ ఆయిల్, యూరియా, ఇతర రసాయనాలన్నీ కలిపి సింథటిక్ పాలు తయారుచేస్తారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండడానికి ఫార్మాలిన్ వాడుతారు. ఈ పాలను వినియోగిస్తే కొద్ది రోజుల్లోనే మంచాన పడడం ఖాయమని కాకినాడకు చెందిన పశుసంవర్థకశాఖ ఏడీ డా. వరప్రసాద్ చెబుతున్నారు.

నీళ్లు కలిపి.. ● పాల పరిమాణం పెంచడానికి ఎక్కువగా నీళ్లు కలుపుతుంటారు. వీధుల్లో, పాల కేంద్రాల వద్ద లీటర్, అర లీటర్ చొప్పున అమ్మేవారు ఇటువంటి చర్యలకు పాల్పడతారు. కలిపిన నీళ్లు మంచివి కాకుంటే ఆ పాలు తాగేవారిలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

గుర్తించవచ్చిలా.. ఈ కల్తీని గుర్తించాలంటే నున్నటి గచ్చు, టైల్స్ మీద రెండు చుక్కలు పాలు వేస్తే వెంటనే చెదిరి పోతే నీళ్లు కలిపినట్లే. అదే స్వచ్ఛమైన పాలు నెమ్మదిగా జారుతాయి. అక్కడ తెల్లటి మచ్చకూడా ఏర్పడుతుంది.

పిండి పదార్థం.. ● నీళ్లు కలిపిన పాలు పలచగా ఉంటాయి. చిక్కదనం కోసం స్టార్చ్ అనే పిండి పదార్థాన్ని పాలల్లో కలిపేస్తారు. చేతి వేలను పాలల్లో ముంచితే చిక్కగా అనిపిస్తుంది. నాణ్యమైన పాలు అనుకుంటారు.
● చిన్న పాల నమూనాలో ఆయోడిన్ చుక్క వేస్తే నీలం రంగులోకి మారింది అంటే పిండి కలిపినట్లే లెక్క.

యూరియా.. ● పాలలో ప్రొటీన్ ఎక్కువగా ఉందని చూపడానికి యూరియా కలిపేస్తుంటారు. దీనివల్ల పాలల్లో ఎస్ఎన్ఎఫ్ రీడింగ్ ఎక్కువగా చూపి మంచి రేటు పలుకుతుంది. ఈ పాలను వినియోగిస్తే దీర్ఘకాలంలో కిడ్నీ సమస్యల బారిన పడతారు.
● పాల నమూనాలో లిట్మస్ పేపర్ ముంచినప్పుడు నీలంగా మారితే యూరియా కలిపారని అర్థం.

కాటన్ అక్విడక్టుకు ఏదీ ఆ వైభవం!

పందులను కట్టేసిన చిత్రం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాల్సిన అపురూప కట్టడం పందులదొడ్డిగా తయారైంది. గత వైభవాన్ని కోల్పోతున్న ఈ కట్టడాన్ని పట్టించుకునే వారు కరవయ్యారు. పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై 1852లో కాటన్, 1948 ప్రాంతంలో మద్రాసు ప్రభుత్వం ఒకటి చొప్పున మొత్తం రెండు అక్విడక్టులు నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరుకోవడంతో 2000 సంవత్సరంలో కొత్తగా సీతమ్మ అక్విడక్టు అందుబాటులోకి వచ్చింది. కాటన్ నిర్మించిన అక్విడక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. తరువాత కూడా పలువురు ఎమ్మెల్యేలు హామీలు ఇచ్చారు. ఇంతటి నేపథ్యం ఉన్న కాటన్ అక్విడక్టు పాత కట్టడాల చెంతన ఓ వ్యక్తి పందులను కట్టేసి నిర్వహిస్తున్నాడు. ఈ కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా తయారై దుర్వాసన వస్తోంది. జలవనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతేరాజు

మీ కోసం

పసుపు నాణ్యతలో జాగ్రత్తలిలా..

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పసుపు పంటను సాగుచేసే రైతులు కొన్ని మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు పొందొచ్చని ఆత్రేయపురం ఉద్యానాధికారి కోటేశ్వర రావు సూచించారు. పొలంలో తవ్వి తెచ్చిన పచ్చి కొమ్ములను త్వరగా ఉడికించి ఆరబెట్టాలి. ఆలస్యమైతే నాణ్యత తగ్గుతుంది. దుంపలు, కొమ్ములను వేర్వేరుగా ఉడికించాలి. ఉడికబెట్టే సమయంలో అవి మునిగే వరకు నీరు పోయాలి. సమంగా మంట పెట్టాలి. 45-60 నిమిషాలకు తెల్ల నురగ పొంగుతో మంచి సువాసన, పొగలు వస్తాయి. అప్పుడు చేతితో ఒత్తితే మెత్తగా ఉంటాయి. ఈ దశలో బయటకు తీసేయాలి. ఎక్కువసేపు ఉడికిస్తే ఆరబెట్టిన తర్వాత రంగు తగ్గిపోతుంది.

ఆత్రేయపురంలో ఉడక బెట్టేందుకు సిద్ధం చేసిన పచ్చికొమ్ములు

ఉడికించడం ఇలా..

తల్లి, పిల్ల దుంపలను జల్లెడ రంధ్రాలున్న ఇనుప తొట్టెలో వేయాలి. ఇరువైపులా పట్టుకొని దీని కంటే కొంచెం పెద్ద పరిమాణం ఉన్న ఇనుప కళాయిలో దించాలి. దుంపలు మునిగే వరకు నీరు పోయాలి. మెత్తబడే వరకు ఉడికించాలి. తర్వాత దుంపలున్న తొట్టెని పైకెత్తి పట్టుకుంటే నీరు కళాయిలోకి దిగిపోతుంది. ఉడికిన పసుపు కొమ్ములను పరిశుభ్రమైన నేలపై పోయాలి.

ఆరబెట్టండి ఇలా..

సమంగా ఉడికిన కొమ్ములను పరిశుభ్రమైన సమాంతరంగా ఉన్న నేలపైన లేదా టార్పాలిన్ లేదా సిమెంటు ప్లాట్‌ఫారం పైన పోయాలి. 24 గంటల తర్వాత రెండు, మూడు అంగుళాల మందం ఉండేలా పరచాలి. పలుచగా పరిస్తే ఎండిన పసుపు రంగు చెడిపోతుంది. 10-15 రోజులకు పసుపు తయారై కొమ్ములన్నీ ఒకే మాదిరిగా కనిపిస్తాయి. అప్పుడప్పుడు తిరగబెట్టి ఆరిన తర్వాత ఒబ్బిడి చేసుకోవాలి.

తోటలలో... అట్టలతో మేలు

ఆలమూరు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పసుపు రంగు అట్టలను వివిధ పంటలను ఆశించే రసంపీల్చే పురుగులను అదుపులో ఉంచవచ్చని ఆలమూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డా.సి.హెచ్.కె.వి.చౌదరి తెలియజేశారు. ముఖ్యంగా వంగ, మిరప, టమాట వంటి కూరగాయలు, పొద్దుతిరుగుడు తదితర వాణిజ్య పంటలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. మొక్కల కన్నా ఎత్తులో వీటిని ఏర్పాటు చేయాలి. తెల్ల, పచ్చదోమ, పురుగుల ఉద్ధృతిని అరికట్టడానికి బాగా పనిచేస్తాయి. వీటికి జిగురు లేదా గ్రీజు పూస్తే తెల్లదోమ, పచ్చదోమ, ఎర్రనల్లి, తామర పురుగులు అంటుకుని చనిపోతాయి. ముడత తెగులు సైతం తగ్గుతుంది. ఎకరాకు సుమారు 25 నుంచి 30 వరకు పసుపు రంగు అట్టలు అమర్చుకోవాలి.

చొప్పెల్లలో వంగతోటలో పసుపు అట్టలు

పశుసంపద వృద్ధికి మెలకువలు

కరప, న్యూస్‌టుడే: పాడి పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై కరప ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్ బాబు వివరించారు.

పాడి పశువులు

✦ సాధారణంగా గేదెలు చలి ఎక్కువగా ఉండే శీతాకాలంలో ఎదకు వస్తాయి. ఫిబ్రవరిలోనే ఈ కాలం ముగుస్తుంది. ఈ నెలలో గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయించకపోతే మళ్లీ జులై, ఆగస్టు వరకు సరిగా ఎదకు రావు. ఎద లక్షణాలను గమనించి వెంటనే గర్భధారణ చేయించాలి.

తెలుసుకుందాం..

✦ 90 శాతం పెయ్యి దూడలు పుట్టడానికి అవకాశం ఉన్న మేలుజాతి వీర్యాన్ని రాయితీపై కేవలం రూ.150కే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పాడి రైతులు వినియోగించుకోవాలి. తద్వారా పశుసంపదను త్వరితగతిన వృద్ధి చేసుకోవచ్చు.

పశువులు పాలు ఇస్తుండగానే చూడు కట్టినట్లయితే పాడి లాభదాయకంగా ఉంటుంది. ✦ నవంబరు లేదా అంతకంటే ముందుగా కృత్రిమ గర్భధారణ చేయించిన పశువులకు ఫిబ్రవరిలో చూడి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. ఒకవేళ చూడి కట్టకపోతే మందులు వాడాలి. లేదంటే 6 నెలల కాలం వృథా అవుతుంది. ✦ వేసవిలో పశుగ్రాసం కొరత నివారించుకోవడానికి ఇప్పటినుంచి సన్నద్ధంగా ఉండాలి. నీటివసతి ఉన్న భూముల్లో గ్రాసం పెంచుకోవడానికి ఏర్పాటు చేసుకోవాలి. అవకాశం లేనివారు యూరియాతో ఊరవేసిన వరిగడ్డిని తయారు చేసుకోవడం మంచిది.

వనామి సాగుకు సన్నద్ధమవుదాం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఆక్వా సీజన్ ప్రారంభమైంది. రొయ్యల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరంభం నుంచి ప్రణాళికాబద్ధంగా సాగాలని ఉప్పలగుప్తం మత్స్యశాఖ అధికారి బి.హేమానంద్ సూచిస్తున్నారు.

రొయ్యల సాగుకు సిద్ధం చేసిన చెరువు

● ముందుగా చెరువును నెర్రలు తీసేలా ఎండగట్టి ట్రాక్టరుతో దున్ని పైపొరను తొలగించి శుభ్రం చేయాలి. ఊటలు పడకుండా గట్లను పటిష్ఠం చేసుకోవాలి. అవసరం మేరకు చెరువులో సున్నం చల్లాలి. దీంతో వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులు, అవశేషాలు నశిస్తాయి.
● గత ఏడాది పంటలో ఈహెచ్‌పీ వ్యాధి సోకినట్లయితే మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. ఎకరా చెరువుకు మూడు టన్నుల రాతిసున్నం చల్లి నేల పీహెచ్‌ను 12 వరకు పెంచాలి. రెండు అడుగుల మేర నీటిని నింపి రెండు రోజులు ఉంచి తిరిగి బయటకు తోడేయాలి. దీంతో సంబంధిత వ్యాధి కారకాలు చాలావరకు నశిస్తాయి. తిరిగి తగిన మోతాదులో పొటాషియం పర్మాంగనేట్(పీపీ) వంటి ద్రావణాన్ని చల్లి పీహెచ్‌ను 7.5కు తగ్గించడానికి చర్యలు చేపట్టాలి.
● పాములు, తాబేళ్లు, పీతలు, కప్పలు, పక్షులు సమీప వ్యాధిగ్రస్త చెరువుల నుంచి రాకుండా బయో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి.
● చెరువులో ఐదు అడుగుల మేర నీరు నింపి ఉప్పదనానికి అనుకూలమైన రొయ్య పిల్లలను సీఏఏ అనుమతి పొందిన హేచరీల నుంచి సేకరించాలి. ప్రయోగశాలల్లో ప్రాముఖ్యమైన ఈహెచ్‌పీ, డబ్ల్యూఎస్ఎస్‌వీ, విబ్రియో వంటి పరీక్షలు నిర్వహించి ఈ వ్యాధులు లేని సీడు ఎంచుకుని తగిన సాంద్రతతో సాగు చేపట్టాలి.

వృక్ష మిత్రమా.. వీడిపోతున్నా!

వైనతేయ నదీ తీరంలో పచ్చదనంతో కళకళలాడుతున్న కొబ్బరిచెట్లకు నదీకోత పెనుముప్పుగా మారింది. ఒక్కోచెట్టు నదీ గర్భంలో కలిసిపోతోంది. మామిడికుదురు మండలం పాశర్లపూడిబాడవలో వారధి సమీపంలో చింతలమెరకలోని ఓ చెట్టు కోతకు గురై మొదలుతో సహా నదిలోకి జారిపోతోంది. రాతికట్టుతో ఒడ్డుకు రక్షణ కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే ప్రతిపాదనలు చేసి పంపామని, నిధులు వచ్చిన వెంటనే రక్షణ పనులు చేస్తామని సంబంధిత హెడ్‌వర్క్స్ అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

మెట్రో రైలు బోగీలు వచ్చాయోచ్..

రావులపాలెం మండలం రావులపాడు శివారు సుందర్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై కోల్‌కతా నుంచి బెంగళూరు వెళుతున్న మెట్రో రైలు బోగీల ట్రాలీ లారీలు మంగళవారం కనిపించాయి. ఆరు ట్రాలీలపై వచ్చిన కొత్త బోగీలకు పూర్తిగా సీలువేసి తరలిస్తున్నారు. వీటిని చూసిన పలువురు కొంసేపు మన రైలు రాకపోయినా.. మెట్రో రైలు బోగీలు వచ్చాయంటూ చమత్కరించారు. - న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

నీటిపిల్లిని కాపాడుకోవాలి

మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వరప్రసాద్

తాళ్లరేవు, న్యూస్‌టుడే: వన్యప్రాణుల్లో ఒకటైన నీటి పిల్లిని కాపాడుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.వి. వరప్రసాద్ అన్నారు. కోరింగ జీవవైవిధ్య కేంద్రంలో ప్రపంచ నీటిపిల్లి దినోత్సవం ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నీటి పిల్లి సంరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోరింగ అభయారణ్యంలో నీటి పిల్లుల సంతతి ఎక్కువగానే ఉందన్నారు. ఇది చేపలను ఆహారంగా తీసుకుంటుందన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ, ఎఫ్‌బీవోలు జి.గోపీనాగేంద్రకుమార్, కె.ధనంజయరావు పాల్గొన్నారు.

వైభవం.. భక్తవత్సలుని బ్రహ్మోత్సవం

సర్వాభరణాలతో స్వామివారు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం సామూహిక కుంకుమార్చన వైభవంగా సాగింది. ఈ సందర్భంగా స్వామివారికి పారిశ్రామికవేత్త పాతపాటి వెంకటసత్యనారాయణరాజు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు విలువైన సర్వాభరణాలు చేయించారు. వాటికి సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరించారు. రాత్రి శ్రీవారు పురవీధుల్లో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు.

పంచాయతీల్లో ఖాళీలు భర్తీ చేయాలి

మలికిపురం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో జూనియర్ అసిస్టెంట్ల ఖాళీలను డిజిటల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని ఎన్జీవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడి ఏసుబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లుతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణలకు మంగళవారం విజయవాడలో వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. పంచాయతీల్లో భవిష్యత్తులో ఏర్పడే జూనియర్ అసిస్టెంట్ల ఖాళీలను ప్రాధాన్య క్రమంలో డిజిటల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని, పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న వెటర్నరీ అటెండర్లకు టైంస్కేలు ఇవ్వాలని, వీరి సర్వీసును రెగ్యులర్ ప్రాతిపదికన లేదా కాంట్రాక్టు ప్రాతిపదికగా పరిగణించాలని కోరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించి అభినందించారు. జిల్లా బాధ్యులు మోటూరి రామారావు, జేఏసీ కోశాధికారి, ఎన్.వి.రామారావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

ఎంపీ, మాజీ సీఎం బృందానికి చేదు అనుభవం

నిలదీసిన నాలుగు గ్రామాల ప్రజలు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి లోక్‌సభ ఎంపీ వి.వైతిలింగం, మాజీ సీఎం వి.నారాయణ సామి బృందానికి దరియాలతిప్పలో చేదు అనుభవం ఎదురైంది. గత ఏడాది ఆగస్టు 22న జరిగిన గ్యాస్‌పైపులైన్ లీకేజీ, అగ్నిప్రమాదం నేపథ్యంలో తమకు పరిహారం ఇవ్వాలంటూ దరియాలతిప్ప, బాలయోగికాలనీ, సీతారాంనగర్, దొమ్మేటి పేట ప్రజలు 134 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. మంగళవారం యానాం పర్యటనకు వచ్చిన వైతిలింగం బృందం మాట్లాడేందుకు వారి వద్దకు వెళ్లగా నిరసన వ్యక్తమైంది. రెండు పర్యాయాలు వినతిపత్రాలు ఇచ్చిన ఈ అంశం గురించి పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేని మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు ఎంపీని నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీకి, గిడ్లకు మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సీఎం, మల్లాడి ఏం చేస్తున్నారని వైతిలింగం ప్రశ్నించారు. ఆందోళనకారుల శిబిరం వద్ద ఎంపీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేయడంతో వారు వెనుతిరిగారు. గ్రామస్థుల నిరసన నేపథ్యంలో ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమై వారిని నియంత్రించారు.

శిబిరం వద్ద నుంచి వెనుతిరుగుతున్న వైతిలింగం, నారాయణసామి బృందం

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

JOBS

Wanted DTP Operator (Male/Female). Part Time Work. Location: Nagamallithota Junction, Kakinada. Contact Cell: 99489 14446.

ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

REAL ESTATE

HOUSE FOR SALE
RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి కోర్లమ్మపేట, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ దగ్గరలో D.No:21-7-1 సౌత్ ఫేసింగ్ 150 చ॥గ॥ ఇల్లు అమ్మకం. Contact Cell:94400 00214

LAND FOR SALE
JAGGAMPETA
రాజమండ్రికి 30 కి.మీ. దూరములో మురారి, గండేపల్లి మధ్య NHకి చేర్చి 100 అ॥ల రోడ్డు ఫేసింగ్‌తో 60 సెంట్లుభూమి అమ్మబడును. (నోబ్రోకర్స్), ✆ 9032988265.

PLOT FOR SALE
RAJAMAHENDRAVARAM CITY
రాజమండ్రి నారాయణపురంలో KSN ఇండోర్ స్టేడియం దగ్గర నార్త్ ఫేసింగ్ 500 వదరపు గజాలు అమ్మకమునకు కలదు. Cont: ఫోన్/వాట్సాప్: 80748 57055.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-80 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	125-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని వినతి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తమను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ నాయకులు కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు సరైన వేతనాలు ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ, ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా మార్చి 6న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీకి అందజేశారు.

ఏపీసీ మమ్మీకి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

ప్రమాదంతో.. పరీక్ష రాయలేకపోయిన ఇంటర్ విద్యార్థిని

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ముందు రోజు రాత్రంతా చదువుకుని పరీక్ష రాయడానికి వెళ్తున్న ఆ విద్యార్థి ఆశలను రహదారి ప్రమాదం చిదిమేసింది. వివరాల ప్రకారం.. యు.కొత్తపల్లి మండలం అమినాబాదుకు చెందిన కారే జెస్సీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష రాసేందుకు అన్నయ్య జాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం పిఠాపురంలోని కేంద్రానికి బయలుదేరింది. వాకతిప్ప శివారు సూరప్ప చెరువు సమీపంలో ప్రమాదకర మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో జాన్ తీవ్రంగా గాయపడడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జెస్సీకి స్వల్పగాయాలైనప్పటికీ మానసిక ఆందోళనకు గురైంది. దాంతో పరీక్షకు వెళ్లలేక తిరిగి ఇంటికి చేరుకుంది.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

గోకవరం: బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వివరాలివీ.. ఓ గ్రామానికి చెందిన కాళ్ల రాజేష్ (19) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో ఆపి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనిపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం ఒకటో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ట్రాన్స్‌కో ఏఈ ఫోన్ హ్యాక్

తుని, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ లక్ష్మణరావు ఫోన్‌ను సోమవారం అర్ధరాత్రి హ్యాక్ చేశారు. ఆయన వినియోగిస్తున్న ప్రభుత్వం అందించిన సిమ్ నంబరు హ్యాక్ అయ్యింది. వాట్సాప్ ద్వారా గ్రూపుల్లో ఎస్‌బీఐ కేవైసీ అప్‌డేట్ లింకును ఏఈ పంపినట్లు ఏపీకె ఫైల్‌ను నేరగాళ్లు వేశారు. అంతేకాకుండా ఆయన ఉన్న వివిధ వాట్సాప్ గ్రూపుల ఐకాన్లు కూడా ఎస్‌బీఐ యోనో లోగోతో, ఎస్బీఐ గ్రూపులుగా ఏఈ లక్ష్మణరావు మార్చినట్లు సమాచారం వచ్చేలా పన్నాగం పన్నారు. దీన్ని మంగళవారం ఉదయం గమనించిన ఆయన తక్షణం బంధుమిత్రులు, సహోద్యోగులకు జాగ్రత్తగా ఉండాలని సమాచారం ఇచ్చారు. దీనిపై ఎవరూ స్పందించవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. గతంలో తునికి చెందిన ఓ ఉద్యోగి ఇలా ఏపీకె ఫైల్‌ను ఓపెన్ చేయడంతో రూ.60 వేలు పోగొట్టుకున్నారు.

స్వగ్రామానికి గల్ఫ్ బాధితులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఇద్దరు మహిళలను సురక్షితంగా స్వగ్రామాలకు తీసుకువచ్చినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. రాజోలు మండలం తాటిపాకకు చెందిన క్రిరి సౌజన్య, కాట్రేనికోన మండలం కందికుప్ప ప్రాంతానికి చెందిన బొజ్జ లక్ష్మీ దుర్గ గతేడాది ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. వారికి అక్కడ సరైన ఉపాధి చూపకుండా ఇబ్బందులకు గురిచేశారు. స్వదేశాలకు పంపాలంటే నగదు చెల్లించాలని ఏజెంట్ చెప్పడంతో అప్పులు చేసి కొంత మొత్తం ఇచ్చారు. మరికొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితులు కుటుంబ సభ్యులు కలెక్టరేట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అధికారులు స్పందించి బాధితులను ఇద్దరినీ మంగళవారం స్వగ్రామాలకు తీసుకువచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అమలాపురంలోని డీఎస్‌ఏ స్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైక్లింగ్ లీగ్ పోటీల్లో ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బృంద విభాగంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.. 9వ తరగతి విద్యార్థులు ఎస్.ధనుష్, జె.ధనుష్‌బాబు, బాలికల విభాగంలో ఎం.రూపా ప్రత్యూష ప్రతిభ కనబరిచారు. వీరు ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు కోన సందీప్ తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు అభినందించారు.

'పరిశ్రమతో ప్రజలకు సమస్య రాకుండా చూడాలి'

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కంపెనీ కార్యకలాపాల ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు సూచించారు. తాళ్లరేవులోని రెడ్డివారిపాలెం సమీపంలో 2025, అక్టోబరులో గమిని భాస్కర్ ఐస్, కోల్డ్ స్టోరేజ్ ఫ్యాక్టరీ నుంచి అమ్మోనియం గ్యాస్ లీకైంది. గాలి, నీరు, పంట పొలాలు కలుషితంపై రెడ్డివారిపాలెం గ్రామస్థులు అప్పట్లో ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం సకాలంలో స్పందించక పోవడంపై గ్రామస్థులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భశాఖ, మత్స్య, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఐస్ ఫ్యాక్టరీని పరిశీలించారు. కంపెనీకి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని అధికారుల బృందం రెవెన్యూ శాఖకు నివేదిక అందించింది. దీంతో ఆరు నెలల పాటు కంపెనీ మూతపడింది. ఈ సమస్యపై తాళ్లరేవు రెవెన్యూ కార్యాలయంలో గ్రామస్థులు, కంపెనీ ప్రతినిధులతో డిప్యూటీ తహసీల్దారు సూరిబాబు మంగళవారం సమావేశం నిర్వహించారు. కంపెనీ నుంచి వచ్చే నీరును డ్రెయిన్ ద్వారా బయటకు తరలించాలని, గాలి, నీరు, పంట పొలాలు దెబ్బ తినకుండా చూడాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కంపెనీ ప్రతినిధులు ఎటువంటి సమస్య రాకుండా చూస్తామని రెవెన్యూ అధికారుల సమక్షంలో హామీ ఇచ్చారు. దీంతో తిరిగి కంపెనీని నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. కంపెనీ వల్ల ఎటువంటి సమస్య వచ్చినా గ్రామస్థులు ఫిర్యాదు చేయవచ్చునని డిప్యూటీ తహసీల్దారు తెలిపారు.

ముంపులోనే పోశమ్మగండి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి క్రమంగా తగ్గుతోంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రానికి సుమారు అడుగు మేర నీటిమట్టం తగ్గిందని స్థానికులు తెలిపారు. అమ్మవారి ఆలయంతోపాటు స్థానికుల దుకాణాలు వరద ముంపులోనే ఉన్నాయి. దండంగి-పి.రాచిలంక గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద నీరు తగ్గకపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పి.గొందూరు వద్ద వరి చేలు ముంపులోనే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీతపల్లి వాగులో గోదావరి ప్రవాహం కొద్ది తగ్గుముఖం పట్టడంతో సీతారం వద్ద గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు.

పి.గొందూరు వద్ద వరద నీటిలో వరి చేలు

పింఛన్ల పంపిణీ 28న

వై.రామవరం, న్యూస్‌టుడే: ఈ నెల 28వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. మార్చి 1న ఆదివారం కావడం వల్ల ఒకరోజు ముందే పింఛన్లు అందజేస్తామన్నారు. 28న ఉదయం 7 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి పింఛన్లు అందజేస్తారని తెలిపారు. గుర్తేడు, వై.రామవరం మండలాల్లోని పింఛనుదార్లు ఇంటి వద్ద సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ మూడు రోజులు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సచివాలయ సిబ్బంది 27న సంబంధిత బ్యాంకుకు వెళ్లి పింఛను నిధులు డ్రా చేయాలని ఆదేశించారు. ఈ మేరకు డబ్బులు సిద్ధం చేయాలని బ్యాంకు మేనేజర్లను కోరారు.

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మారేడుమిల్లి, రాజవొమ్మంగి, కూనవరం న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం, జీవీఎస్ పరీక్షలు మన్యంలోని మారేడుమిల్లిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మూడు కళాశాలలకు చెందిన 267 మంది విద్యార్థులు మంగళవారం పరీక్షకు హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేశారని పరీక్షల నిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు.

● కూనవరంలో ఐదు కళాశాలల నుంచి మొత్తం 228 మందికి 214 మంది పరీక్షలకు హాజరయ్యారని ప్రధానాచార్యుడు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

● రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 281 మందికి 276 మంది హాజరైనట్లు అయిదుగురు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ షీలా తెలిపారు.

రాజవొమ్మంగి గురుకుల కళాశాల పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థినులు

మారేడుమిల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పర్యవేక్షకుల ఖాళీలను భర్తీ చేయండి

కూనవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలోని పీహెచ్‌సీల్లో పర్యవేక్షకుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ మంగళవారం ఆదివాసీ మెడికల్ హెల్త్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని రీజనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు జోగారావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని కోరారు. పర్యవేక్షకుల నియామకాల విషయంలో న్యాయం చేయాలన్నారు. పూనెం వెంకటేశ్వరరావు, సున్నం శ్రీరాములు, చంద్రమ్మ, రోజారమణి, సువర్ణ, వెంకటలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

డిమాండ్లు వెల్లడిస్తున్న జోగారావు, సభ్యులు

సీసీ రోడ్డు సౌకర్యం కల్పించరూ..

దేవీపట్నం, న్యూస్‌టుడే: మండలంలో పెద్దరమణయ్యపేట నుంచి ఇందుకూరు పేట వైపు మట్టి రహదారి అధ్వానంగా మారడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అనారోగ్యంగా ఉన్నవారిని ఇందుకూరు పేట ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా ఆటోలు సైతం రావడం లేదన్నారు. పెద్దరమణయ్య పేట గ్రామం సమీపంలోనే పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన కచ్చులూరు గ్రామానికి పునరావాసం కల్పించారని, రెండు గ్రామాలకు సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

సుందర భవనం.. చూస్తే దైన్యం..!

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంతో పాటు, వాటి గత వైభవాన్ని కాపాడడంలో సంబంధిత ప్రభుత్వ శాఖలు తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా ఎంతో విలువైన భవనాలు శిథిల స్థితికి చేరి క్రమంగా అన్యాక్రాంతం అవుతున్నాయి. మారేడుమిల్లి ప్రాంతంలో అడవుల పరిరక్షణలో భాగంగా అటవీశాఖ, దాని అనుబంధ శాఖల కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. 1975లో అటవీ విభాగం ఆధ్వర్యంలో సుమారు 24 గదులతో పెద్ద భవనాన్ని నిర్మించారు. పక్కనే ఎత్తైన కొండలు, దట్టమైన తోటలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చెందింది. అప్పట్లోనే అనేక సినిమాల చిత్రీకరణలు ఈ ప్రాంతంలో జరిగాయి. అయితే కాలక్రమంలో భాగంగా అటవీ విభాగాన్ని ఇక్కడి నుంచి తరలించడంతో దీనిపై పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా శిథిల స్థితికి చేరడం మొదలైంది.

పైకప్పు పూర్తిగా శిథిలమై, లోపల నుంచి ఆకాశం కనిపిస్తున్న వైనం

వృత్తి విద్యా శిక్షణ కేంద్రం తరలిపోవడంతో..

నిరుపయోగంగా ఉన్న భవనాన్ని గమనించిన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి జయేష్ రంజన్ దీనికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని చర్యలు చేపట్టారు. 1997లో గిరిజన యువతకు వృత్తి విద్యలో శిక్షణ ఇవ్వడానికి ఈ భవనం అనుకూలంగా ఉంటుందని భావించి, ఇందులో ప్రారంభించారు. చాలాకాలం పాటు శిక్షణ కార్యక్రమం ఇక్కడే కొనసాగింది. అనంతరం వీటీఐకి సొంత భవనాన్ని నిర్మించడంతో అక్కడకు తరలించారు. అప్పటి నుంచి దీని నిర్వహణ పట్టించుకునే వారు లేకపోవడంతో పూర్తిగా శిథిలమైంది.

వసతిగృహంగా వినియోగిస్తే ప్రయోజనం..

భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టడం ద్వారా వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. సమీపంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంతో విద్యార్థులకు అవసరమైన హాస్టల్‌గా దీనిలో ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం కళాశాల విద్యార్థులకు గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లోనే వసతి కల్పిస్తున్నారు. అరకొర సదుపాయలతో చాలా దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ భవనంలో హాస్టల్ ఏర్పాటు చేసే దిశగా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. దీని వల్ల భవనం పరిస్థితి మెరుగు పడడంతో పాటు, గిరిజన విద్యకు ప్రోత్సాహాన్ని అందించినట్లు అవుతుంది.

మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే జీవనోపాధి శిక్షణను అందిపుచ్చుకుని మహిళా పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సూచించారు. ఆ సందర్భంగా కడియంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సుగంధ ద్రవ్యాల కొవ్వొత్తుల తయారీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ డీఆర్‌డీఏ నగేష్, ఏపీఎం సత్యనారాయణ మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధికి అడుగులు వేయాలని సూచించారు. అనంతరం స్థానిక బుర్రిలంక నగర్‌లో నెలకొల్పిన కొబ్బరిపీచు పరిశ్రమను సందర్శించి వాటి తయారీ విధానాన్ని పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఏపీఎం నాగభూషణం, సిబ్బంది తిలక్, నాగేశ్వరరావు, కొండేటి ప్రసాద్, మహిళా పారిశ్రామిక వేత్త అల్లం గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
రంపచోడవరం 9490877172 | అడ్డతీగల 9491575045
దేవీపట్నం 7673936638 | గంగవరం 9493541083

సమస్య: మారేడుమిల్లి మండలం దొరచింతలపాలెంలోని పాఠశాల భవనం శిథిల స్థితికి చేరింది. దీంతో విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. భవనానికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.
– ఊలుగుల చినసోమిరెడ్డి, స్థానికుడు

పరిష్కారం: పాఠశాల భవనానికి అవసరమైన మరమ్మతులు చేయడానికి చర్యలు చేపడతాం. – వి.ముత్యాలరావు, ఎంఈవో–2, మారేడుమిల్లి

- న్యూస్‌టుడే, మారేడుమిల్లి

సమస్య: చింతకర్రపాలెం గ్రామంలో వీధి రోడ్డు నిర్మాణం చేపట్టాలి. వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం.
– బొడ్డయ్య, స్థానికుడు.

పరిష్కారం: వీధి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తాం. నిధులు వచ్చిన వెంటనే నిర్మాణం చేపడతాం.
– సతీష్, పంచాయతీ కార్యదర్శి, వై. రామవరం

- న్యూస్‌టుడే,వై.రామవరం

బాధిత కుటుంబాలకు వితరణ

నిత్యావసరాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, నాయకులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మొద్దులగూడెం అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు మంగళవారం మూడు బృందాల నుంచి వితరణలు అందాయి. సోడే శరత్, సరోజిని కుటుంబాలకు జమాల్ ఖాన్ ట్రస్టు పంపిన ఇంటి నిర్మాణ సామగ్రి రేకులు, పైపులను జడ్పీటీసీ సభ్యులు వాళ్ల రంగారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు బొర్రా నరేశ్ అందించారు. రాజుపేట మాజీ సర్పంచి రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లీలాకృష్ణ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాద్రి జటాయువు ఆధ్వర్యంలో వంట పాత్రలు నిత్యావసరాలు, దుప్పట్లు అందజేశారు. ముత్యాల రామారావు, బొర్రా నరసింహారావు, చంద్రశేఖర్, రాజు, నక్కా వెంకన్న, సూర్యనారాయణ, నరసింహారావు, విజయ్ రెడ్డి, చైతన్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం, పశ్చిమగోనగూడెం, కోరుకొండ ప్రాంతాల్లోని పలు పాల సేకరణ కేంద్రాలను ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాల సేకరణ విధానం, కొలతల పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, అక్రమాలు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుస్వాగతం, ఆర్ఐ రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోరుకొండలో పాలకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

అధికారులు రారు.. సమస్యలు తీరవు!

నులకమద్ది, దారలోవలో గిరిజనం అవస్థలు

వై.రామవరం మండలం నులకమద్ది, దారలోవ గ్రామాల్లో గిరిజనులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. వ్యవసాయం చేసేందుకు పంట భూములు లేవు. జీవనోపాధికి కూలి పనులు ఉండవు. అడవిని నమ్ముకొని అక్కడ లభించే అటవీ ఉత్పత్తులతోనే జీవనం సాగిస్తుంటారు. కాలానుగుణంగా పండే చింత పండు, అడ్డాకులు వంటి అటవీ ఫలసాయాన్ని సేకరించి, వాటిని అమ్ముకొని జీవనోపాధి పొందుతుంటారు. ఇటువంటి గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్డు వేసినప్పటికీ కొండ కాలువలపై వంతెన నిర్మాణాలు చేపట్టక పోవడంతో పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యం అందుబాటులోకి రాలేదు. గృహనిర్మాణ శాఖ ద్వారా గృహాలు మంజూరయినప్పటికీ రహదారి సౌకర్యం లేకపోవడంతో నిర్మాణ సామగ్రిని మోసుకొని వెళ్లాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. వ్యయ ప్రయాసలతో కూడుకోవడంతో గృహాలు నిర్మించుకునేందుకు గిరిపుత్రులు ముందుకు రాని పరిస్థితి ఉంది. ఆ గ్రామం వరకు రిగ్ వెళ్లే సౌకర్యం లేక బోరు నీరు అందడం లేదు. కాలువ నీటినే వాడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో స్తంభాలు వేసి విద్యుత్తు సౌకర్యం కల్పించినప్పటికీ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. గాలివానలకు స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోవడంతో నేటికీ విద్యుత్తు సౌకర్యం లేక అగ్గి నెగడల మధ్య జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామాన్ని ఉన్నతాధికారులు సందర్శించిన సందర్భాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని గిరిజనం కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వై.రామవరం

గిరిజన కుటుంబం నివాసం ఉంటున్న ఇల్లు

బ్యాంకు మేనేజర్ తీరుపై ఖాతాదారుల ధర్నా

ఎటపాక, న్యూస్‌టుడే: సీతాపురం గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్ తీరును నిరసిస్తూ పలువురు ఖాతాదారులు మంగళవారం బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. పలు గ్రామాలను నుంచి వచ్చిన ఖాతాదారులు మేనేజర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తిరిగి చెల్లించకపోతే వారికి సంబంధించిన బంధువులు, కుటుంబ సభ్యుల ఖాతాలను హోల్డ్ చేస్తున్నారని, అప్పు చెల్లిస్తేనే పునరుద్ధరిస్తామని మేనేజర్ తెలిపారని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో రైతుమిత్ర గ్రూపు ద్వారా రుణం తీసుకున్న సీతాపురం గ్రామానికి చెందిన పాపారావు ఇటీవల మరణించాడు. అన్ని ధ్రువపత్రాలు ఇచ్చినప్పటికీ ఆయన ఖాతాలో ఉన్న నగదు ఇచ్చేందుకు నెలలతరబడి బ్యాంకు చుట్టూ తిప్పుతున్నారని ఆయన కుమార్తె రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఖాతాల్లో నగదును హోల్డ్‌లో ఉంచి పాత అప్పులకు జమ చేసుకుంటున్నారని కుసుమానపల్లికి చెందిన రైతు పూసం రాఘవయ్య వాపోయారు. పావలా వడ్డీ రుణాలకు ఈ విధంగానే లింకులు పెట్టి వ్యక్తిగత ఖాతాలను నిలిపి వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని డ్వాక్రా మహిళలు ఆరోపించారు. మేనేజర్ తీరు మార్చుకోకపోతే చింతూరు ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఖాతాదారులు హెచ్చరించారు.

వీధి కుక్కల దాడిలో అయిదుగురికి గాయాలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో మంగళవారం వీధి కుక్కలు అయిదుగురిపై దాడి చేశాయని స్థానికులు తెలిపారు. అందరూ స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందారు. ఆ ప్రాంతంలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉందని, ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటే వెంబడిస్తున్నాయని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా

గంగవరం, న్యూస్‌టుడే: గంజాయి, డ్రగ్స్ రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం గంగవరం-గోకవరం ప్రధాన రహదారిలో గంగవరం ఎస్సై వెంకయ్య, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. యువత గంజాయి రవాణాకు, వినియోగానికి బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమాయక గిరిజనులను వాడుకుని వ్యాపారులు సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. కేసుల్లో నిందితులుగా మన్యంలోని గిరిజన యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గ్రామాల్లో ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరిగినా ఆ సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలని యువతకు సూచించారు.

ఏడు కేజీల గంజాయి పట్టివేత

చింతూరు, న్యూస్‌టుడే: ఒడిశా నుండి అక్రమంగా తరలిస్తున్న ఏడు కేజీల గంజాయిని చింతూరు పోలీసులు పట్టుకుని అయిదుగురిని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చింతూరు ఏఎస్పీ హేమంత్ పర్యవేక్షణలో మంగళవారం ఇన్‌ఛార్జి సీఐ కన్నపరాజు, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని మోటు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రెండు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా ఏడు కేజీల గంజాయి దొరికింది. గంజాయి విలువ సుమారు రూ.3 లక్షల 50 వేలు ఉంటుందని పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో ఒడిశాకు చెందిన ఆరంగి లక్ష్మణ్, తెలంగాణ, మెదక్ జిల్లాకు చెందిన పత్రిబాల మురుగన్ రాజు, మత్తారి వినయ్ కుమార్, శ్రీకాకుళంకు చెందిన పోలాకి సాయికుమార్, రట్టి విష్ణులను అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

'ఐక్యంగా పోరాడండి.. విజయం సాధించండి'

ఎటపాక, కూనవరం, వరరామచంద్రాపురం, రాజవొమ్మంగి, గంగవరం, న్యూస్‌టుడే: ఐక్యంగా పోరాడండి..విజయం సాధించండి అని ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్షను రెండో రోజు మంగళవారం ఆమెతో పాటు సీఐటీయూ నాయకులు తోట శ్రీను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2023 డిసెంబర్‌లో చేసిన 42రోజులు సమ్మె ద్వారా సాధించిన విజయాలను ఆచరణలోకి తేవాలంటే పోరాటం తప్పదన్నారు. అనంతరం సీఐటీయూ నాయకుడు ఐవీ మాట్లాడారు. కార్యక్రమంలో సూర్యకుమారి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఎటపాకలో రెండో రోజు దీక్షను ప్రారంభిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ

● కూనవరంలో అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షా శిబిరాన్ని సీపీఎం నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. మేకల నాగేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాసరావు, బాబు బొర్రయ్య, కృష్ణ, వెంకమ్మ, అమ్మాజీ పాల్గొన్నారు.

● వరరామచంద్రాపురంలోని రేఖపల్లి ప్రధాన కూడలి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న దీక్షలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సోడే నాగేశ్వరరావు, రేఖపల్లి సర్పంచి పూనెం సరోజిని శిబిరంలో మంగళవారం మాట్లాడారు. సున్నం రంగమ్మ, పులి సంతోశ్, శ్రీరామ్ మూర్తి, సుబ్బారావు, సోయం చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

● రాజవొమ్మంగిలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద దీక్షలను ప్రారంభించారు. నిర్మల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామరాజు, జిల్లా నాయకురాలు కె.వెంకటలక్ష్మి, తదితరులు మాట్లాడారు. కార్మిక చట్టాల ప్రకారం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కుమారి, సత్యవతి, మేరి పాల్గొన్నారు.

● గంగవరంలో అంగన్‌వాడీలు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం ఐసీడీయస్ కార్యాలయం వద్ద కొనసాగాయి. ప్రాజెక్టు లీడర్లు పి.శిరీష, కె.జ్యోతి, రాణి, లక్ష్మీసుజాత, నాయకులు నాగదేవి, వెంకయమ్మ, రమణమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

గంగవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద దీక్షలో అంగన్‌వాడీలు

శాశ్వత కార్యదర్శిని నియమించాలి

కూనవరం, న్యూస్‌టుడే: పెదార్కూరు పంచాయతీకి శాశ్వత కార్యదర్శిని నియమించాలని కోరుతూ సర్పంచి నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ, సీపీఎం నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం ఆలస్యం అవుతుండడం, వార్షిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో శాశ్వత కార్యదర్శి అవసరం చాలా ఉంటుందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, నాగేశ్వరరావు, వెంకమ్మ పాల్గొన్నారు.

ఉర్లాకులపాడులో వైద్య శిబిరం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడులో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. జడ్డంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పావని తొమ్మిది మందిని పరీక్షించి వారికి మందులు అందజేశారు. నలుగురి నుంచి రక్తపూతలు సేకరించారు. ఉర్లాకులపాడు గ్రామంలో గిరిజనులు కిడ్నీ, తదితర వ్యాధులతో అల్లాడుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పంచాయతీలో గత అయిదు రోజులుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

కోరుకొండ తీర్థానికి ఏర్పాట్లు సిద్ధం

కోరుకొండ: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు ఈనెల 26న శ్రీకారం చేయనున్నారు. 27 నుంచి అయిదు రోజుల పాటు కల్యాణోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఆలయం ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ప్రత్యేక కల్యాణ వేదికను సిద్ధం చేస్తున్నారు. ఆలయానికి, మెట్ల మార్గానికి రంగులు అద్దుతున్నారు. ఉత్సవాలకు అవసరమైన షామియానాలు, బందోబస్తు, బారికేడ్లు, విద్యుద్దీపాలంకరణ, కల్యాణం, రథోత్సవం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

రాజానగరం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ నిర్వహించిన జిల్లాస్థాయి భాషోత్సవ పోటీల్లో కలవచర్ల విద్యార్థికి ప్రథమస్థానం లభించిందని ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వై. హేమేశ్వర్ ఆంగ్ల విభాగంలో ప్రతిభ కనబరిచాడన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో వాసుదేవరావు విద్యార్థికి పతకం, ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎస్‌డీవో వాసుదేవరావు

తెగుళ్ల నివారణకు కవర్లు వినియోగించాలి

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: మామిడికాయలకు చుట్టే కవర్లు రాయితీతో అందిస్తున్నామని, వీటిని వినియోగించడం వల్ల పురుగులు, వాతావరణ మార్పులు వల్ల వచ్చే తెగుళ్లను నివారించవచ్చని విశ్రాంత శాస్త్రవేత్త ఇ.విజయప్రసాద్ సూచించారు. మంగళవారం సీతానగరం మండలం నల్గొండలో ఉద్యానశాఖాధికారిణి పి.రిని ఆధ్వర్యంలో రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మామిడి, కూరగాయల పంటల విషయంలో పూత నిలబడి, పిందెగా మారి పెరగడానికి చేపట్టవలసిన చర్యలు వివరించారు. రైతులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త విజయప్రసాద్

అధ్వానంగా రహదారి

రాజవొమ్మంగి మండలంలోని అప్పలరాజుపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి విద్యానగర్‌కు వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. రాళ్లుతేలి, గోతులతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

ఏ రోడ్డు ఎటుపోతుందో..

సూచిక బోర్డులు లేక ఇక్కట్లు

ఎటపాక, న్యూస్‌టుడే: విలీన మండలాల్లో జాతీయ, ప్రధాన రహదారి కూడళ్లు, ప్రమాదకర మలుపుల్లో సూచికలు కరవయ్యాయి. ప్రధానంగా ఎటపాక సరిహద్దులోని పురుషోత్తపట్నం(కొల్లుగూడెం) నుంచి చింతూరు మండలం చట్టీ వరకు 30వ జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని నెల్లిపాక శివారులో జాతీయ, ప్రధాన రహదారి కూడలి గందరగోళంగా మారింది. ఏ దారి ఎటు వెళ్తుందో తెలియక వాహనదారులు తికమక పడుతున్నారు. ఆ కూడలి నుంచి ఒక వైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు చింతూరు వెళ్తుంటే మరో వైపు కూనవరం, వరరామచంద్రాపురంతో పాటు పాపికొండల సందర్శనకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రెండు దారులు విడిపోతున్న నెల్లిపాక సమీపంలో సూచికలు లేకపోవడం వల్ల పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా ప్రదేశాల్లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల శాఖ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కూడళ్ల వద్ద రహదారి ఎక్కడ వరకు వెళుతుంది. ఎంత దూరం ఉందనే సమాచారాన్ని తెలుపుతూ గతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసేవారు. దీంతో ప్రయాణికులు సాఫీగా రాకపోకలు సాగించేవారు. కానీ ఇప్పుడు కూడళ్లలో సూచిక బోర్డులు లేక కొత్తగా వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రయాణికులతో పాపికొండలు వెళ్లాల్సిన వాహనాలు దారి తప్పి చింతూరు వరకు వెళ్లిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా అయినా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నెల్లిపాక సమీపంలో సూచిక బోర్డులు లేకుండా జాతీయ రహదారి

జీజీయూలో మార్కెటింగ్‌పై కార్యశాల

రాజానగరం, న్యూస్‌టుడే: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'ఫొటోగ్రఫీ మార్కెటింగ్ టూల్' అనే అంశంపై విద్యార్థులకు ఆర్‌కే బ్లాక్‌లో కార్యశాలను మంగళవారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్‌గా మార్కెటింగ్ మేనేజర్ సిద్దార్థ్ పండా, వీవో రిటైల్ మేనేజర్ శ్రీహరి హాజరయ్యారు. ఏ.ఐ ఆధారిత టూల్స్ మార్కెటింగ్ రంగంలో తీసుకువస్తున్న మార్పులపై అవగాహన కల్పించారు. స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ వల్లీమాధవి, బీబీఏ విభాగాధిపతి వెంకటేశ్వర్లు, ఎమ్‌బీఏ విభాగాధిపతి రాజా పాల్గొన్నారు.

మన్యంలో మట్టి తవ్వకాలకు మంతనాలు

దేవీపట్నం, న్యూస్‌టుడే: మైదాన ప్రాంతాల్లో కొన్ని రోజులుగా ఎర్ర మట్టి రవాణాపై మైనింగ్ అధికారుల తనిఖీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దళారుల కన్ను మన్యంపై పడింది. దేవీపట్నం మండలంలో ఇప్పటికే కొన్ని భూముల్లో ఉన్న ఎర్ర మట్టి నర్సరీల్లో మొక్కలు పెంచడానికి అనువుగా ఉండటంతో ఏదోలా తవ్వకాలను ప్రారంభించడానికి దళారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులు మాత్రం ససేమిరా అనడంతో ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి తెచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

(c) eenadu

ఈనాడు



ఒంగోలు 25-2-2026 బుధవారం సిటీ సంపుటి 24 సంచిక 236

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Ongole, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Mahaboobnagar, Chennai, Bengaluru

(c) eenadu

15 నాటికి ఇంటి పన్ను వసూలు చేయాల్సిందే

ఒంగోలు గ్రామీణం: మార్చి 15 నాటికి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీపీవో సూర్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలాల డీఎల్పీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ అభివృద్ధి అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజువారీ పన్నుల వసూళ్ల పురోగతిని డిప్యూటీ ఎంపీడీవోలు సమీక్షించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన ఈవోలు, డిప్యూటీ ఎంపీడీవోలపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎల్పీవోలు పద్మ, కృష్ణమోహన్ పాల్గొన్నారు. తొలుత అమరావతి నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
PBB బ్రాంచ్ ఒంగోలు, గాయత్రీ మందిరం దగ్గర, మంగమూరు రోడ్డు, ఒంగోలు.

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణమును సకాలంలో తిరిగి చెల్లించలేదు. కావున **తేది.27.02.2026 శుక్రవారం, సా॥ 5 గం.లకు** బ్యాంకు ఆవరణలో బహిరంగ వేలం జరుపబడును. ఈ ప్రకటన నిమిత్తం అయిన ఖర్చును ఖాతాదారుడే భరించవలెను. వేలంలో పాల్గొనదలచినవారు **రూ.10,000/-** ధరావత్తు సొమ్ము చెల్లించవలెను. వేలం పాడినవారు వెంటనే పూర్తి సొమ్ము చెల్లించి నగలను స్వాధీనం చేసుకొనవలెను. వేలంలో బంగారు నగలు ఎలా ఉన్నవి అలా అనే షరతుపై నిర్వహించబడును. వేలందారులు చిరునామా నిర్ధారించు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా పాన్‌కార్డును జతపర్చవలెను. ఒకసారి వేలం పూర్తి అయిన తరువాత నగల నాణ్యత, బరువులకు సంబంధించిన ఏ విధమైన ఫిర్యాదులు బ్యాంకు అనుమతించదు. బకాయి నోటీసులు అందనివారు లేక తిరస్కరించినవారు ఈ ప్రకటనను ఆఖరి నోటీసుగా భావించి వేలం తేదీలోపుగా సొమ్ము చెల్లించగలరు. ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వాయిదా వేయుటకు, నిలుపుదల చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు. ఇతర వివరములకు బ్రాంచ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు.

ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు & చిరునామా	స్థూల బరువు
44064482302	శ్రీమతి గూనుగుంట్ల భాగ్యలక్ష్మి, C/o తూనుగుంట్ల నరసింహా రావు, 11-237, శ్రీనివాస నగర్, టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274.	31.33 గ్రా॥లు

తేది: 24.02.2026, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సీఎం సారూ.. మమ్మల్నీ పట్టించుకోండి!

న్యూస్‌టుడే, మార్కాపురం

☛ వెలిగొండ నిర్వాసితుల వినతి

ఉమ్మడి ప్రకాశం పరిధిలోని వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు బుధవారం (నేడు) సీఎం చంద్రబాబు నాయుడు వస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు తమ గోడు వినాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

మూడు దశాబ్దాలుగా పడిగాపులతో సరి

మూడు దశాబ్దాలుగా సీఎంలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో పర్యటించి హామీలిచ్చి వెళ్లారే తప్ప నిర్వాసితులకు ఏమీ చేయలేదని వాపోతున్నారు. పరిహారం కోసం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, పీడీల చుట్టూ ఇలా ప్రతి ఒక్క అధికారి చుట్టూ 30 ఏళ్లుగా తిరుగుతున్నామని, నేటికీ పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముంపు ప్రాంతాల్లో తిరిగారే కానీ కనీసం వంద మందికి కూడా పరిహారం ఇవ్వలేదని వాపోతున్నారు.

ఇవే ముంపు గ్రామాలు..

మార్కాపురం జిల్లాలో ముంపు గ్రామాలైన మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతండా, పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, కాటంరాజు తండా, చింతలముడిపి, అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, కృష్ణనగర్, సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం తదితర గ్రామాలు.

● వెలిగొండ ప్రాజెక్టులో ముంపు గ్రామాలైన 11లో పరిహారం కోసం ఇంకా 7,200 మంది నిరీక్షిస్తున్నారు. ప్రాజెక్టులో నిర్వాసితులకు కీలకమైన పునరావాసం. మొత్తం ఏడు పునరావాస కేంద్రాల్లో అయిదు మాత్రమే పూర్తి చేశారు.

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామం గొట్టిపడియ

సౌకర్యాలు కల్పిస్తేనే వెళ్తాం

ఇప్పటికి ఇప్పుడు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం తీసుకుని పశువులతో పాటు పిల్లల, అందరూ ఏ ఊరికి వెళ్లాలి. పునరావాసంలో ఇళ్లు నిర్మాణం చేసి, కాలనీలో సౌకర్యాలు కల్పించిన తర్వాతే ఖాళీ చేసి వెళ్లిపోతాం.
- పుల్లా గౌరెయ్య, నిర్వాసితుడు, గొట్టిపడియ

అయిదు నెలల సమయం ఇవ్వాలి

పునరావాసం కల్పించే కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాత ఇళ్లు నిర్మాణం చేసుకోవడానికి కనీసం అయిదు నెలల సమయం ఇవ్వాలి. ప్రభుత్వం నిర్వాసితుల పట్ల ఆలోచన చేసి మంచి నిర్ణయం తీసుకోవాలి.
- పి.శ్రీనివాసులు, నిర్వాసితుడు

చట్టాలను ఎవరూ అతిక్రమించొద్దు

మార్కాపురం: మార్కాపురం సబ్ జైలును మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టాలను ఎవరూ అతిక్రమించకూడదన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఖైదీలకు ఉచిత న్యాయం, బెయిల్ పొందడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.అన్వర్, షేక్ జబీర్ సలీమ్, సబ్ జైలు పర్యవేక్షణాధికారి ఎం.విజయకుమార్, పి.ఎల్.వి. షేక్ బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్

మార్కాపురం ఆర్డీవోగా పెంచల ప్రభాకర్ నియామకం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా పెంచల ప్రభాకర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాకర్ ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలో పౌరసరఫరాల జిల్లా మేనేజరుగా చేస్తున్నారు. ప్రస్తుతం మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్‌గా కంభం వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వుల్లో మార్కాపురం సబ్ కలెక్టర్ పోస్టును మార్పు చేస్తూ మళ్లీ ఆర్డీవోగా ప్రభాకర్‌ను నియమించింది. గతంలో మార్కాపురం రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) పోస్టు ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన చేసిన సమయంలో మార్కాపురంను జిల్లా చేయకుండా మార్కాపురం ఆర్డీవో పోస్టును సబ్ కలెక్టర్‌గా అప్‌గ్రేడ్ మార్పు చేసింది. దీంతో 2022 అక్టోబర్ 13వ తేదీ నుంచి మార్కాపురం సబ్ కలెక్టర్‌గా కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కాపురంను జిల్లా చేశారు. తాజాగా ప్రభుత్వం మార్కాపురానికి ఆర్డీవో పోస్టును కేటాయించింది.

26న వీర బ్రహ్మేంద్ర మఠాధిపతి పట్టాభిషేకం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: కడప జిల్లా కంది మల్లయ్య పల్లె శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం 8వ తరం 12వ మఠాధిపతిగా వీరధర్మజ వెంకటాద్రిస్వాముల వారి పట్టాభిషేకం మహోత్సవం ఈ నెల 26న జరుగనుంది. ఈ కార్యక్రమానికి బ్రహ్మంగారి భక్తులు తరలి వచ్చి పూజ కార్యక్రమాల్లో పాల్గొనాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తులూరి మల్లికార్జున్ నగారా పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం ప్రాంతం నుంచి ఎక్కువ సంఖ్యలో కందిమల్లయ్యపల్లెకు తరలి రావాలని కోరారు. ఆ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, సికింద్రాబాద్, ఇ.నెం.5-9-76, 2వ అంతస్తు, ప్రభాత్ టవర్స్, అమరావతి LHO ఎదురుగా, చాపెల్ రోడ్డు, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్ - 500001. E-mail ID: team1samb.sec@sbi.co.in, Tel: 040-23251921
సంప్రదించవలసిన అధీకృత అధికారి యొక్క మొబైల్ నెం.: 9676057436 & 9912551100

[See to rule 8 (6) & R/w 9(1)]

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8(6) & R/W 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తి అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) వారికి ఋణగ్రహీత: మెస్సర్స్ సాయి గ్లోబల్ యార్న్‌టెక్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మరియు హామీదారులు: 1. శ్రీ దేసు కాశీ విశ్వనాథ్, తండ్రి : శ్రీ వెంకటేశ్వర్లు, 2. శ్రీ మాలెపాటి మోహన వెంకట శ్రీనివాసరావు, తండ్రి : శ్రీ ఎమ్. ముక్కంటి, 3. శ్రీ మోతకట్ల చక్రపాణి రెడ్డి, తండ్రి : శ్రీ నాసర రెడ్డి, 4. శ్రీ దేసు శ్రీనివాసరావు, తండ్రి : శ్రీ వెంకటేశ్వర్లు (లేటు), 5. శ్రీ దేసు సుబ్రహ్మణ్యం, తండ్రి : శ్రీ వెంకటేశ్వర్లు (లేటు), 6. శ్రీ గార్లపాటి బదరి నారాయణ, తండ్రి : శ్రీ ఆంజనేయులు, 7. శ్రీ గంటా వేణు గోపాల్ రెడ్డి, తండ్రి : మహంధ రెడ్డి, 8. శ్రీ దేసు తేజ, తండ్రి : శ్రీ దేసు కాశీ విశ్వనాధం, 9. శ్రీ దేసు వీర ప్రకాశరావు, తండ్రి : శ్రీ వెంకటేశ్వర్లు (లేటు), 10. శ్రీమతి మాలెపాటి దేవీ సుష్మ, తండ్రి : శ్రీ మోహన వెంకట శ్రీనివాసరావు, 11. శ్రీమతి గంటా మాధవి, భర్త : శ్రీ వేణుగోపాల్ రెడ్డి వారి నుండి రావలసిన తేది.31-01-2026 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము రూ.23,64,04,771/- (అక్షరాల ఇరవై మూడు కోట్ల అరవై నాలుగు లక్షల నాలుగు వేల ఏడు వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే) + తేది.01.02.2026 నుండి ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/ఛార్జీలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతిపై" తేది: 16-03-2026న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

ఇ-వేలం తేదీ : 16-03-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 10 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : తేది:25-02-2026 నుండి 15-03-2026 వరకు ఉ॥11.00 గం॥ల నుండి మ॥ 02.00 గం॥ల వరకు

షెడ్యూలు ఆస్తి వివరములు: ప్రకాశం జిల్లా, పేర్నమిట్ట గ్రామం & గ్రామ పంచాయితీ వద్ద ఆర్.ఎస్.నెం. 115/1ఎ లోని 672.44 చ॥గ॥లు (174 చ॥గ॥లు + 174 చ॥గ॥లు + 324.44 చ॥గ॥లు) విస్తీర్ణం గల ఇంటి స్థలం యావత్తు ఆస్తి సంతనూతలపాడు ఎస్ఆర్ఓ వద్ద రిజిష్టరు కాబడిన 1.రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం.413/2008, తేది.25.02.2008, 2. రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం. 414/2008, తేది.25.02.2008 & 3. రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం.346/2008, తేది.18.02.2008 ప్రకారం శ్రీ దేసు కాశీ విశ్వనాథం, తండ్రి : వెంకటేశ్వర్లు గారికి చెందినది. రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం.413/2008 ప్రకారం గల 174 చ॥గ॥ల విస్తీర్ణముకు హద్దులు: తూర్పు : పోకల వెంకటస్వామి గారి ఆస్తి, దక్షిణం : 20 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర : దేసు కాశీ విశ్వనాధం గారి ఆస్తి, ఉత్తరం : 25 [illegible]

రిజర్వు ధర : రూ.1,01,00,000/- ధరావత్తు : రూ.10,10,000/- బిడ్ పెంపుదల : రూ.50,000/-

[illegible]

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 19-02-2026, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SAM బ్రాంచ్, సికింద్రాబాద్

జనసేన సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ కోరారు. ఈ నెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం నగరంలోని స్థానిక రవిప్రియ మాల్‌లో ముఖ్య నాయకులు, క్రియాశీలక సభ్యత్వ సారథులతో సమావేశమయ్యారు. ప్రకాశం జిల్లా పరిశీలకుడిగా ఎమ్మెల్యే కొణతల రామకృష్ణను నియమించారని, త్వరలోనే ఆయన జిల్లాకు వచ్చి కార్యక్రమాలను సమీక్షిస్తారన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కంది రవిశంకర్, పర్వతరెడ్డి కిషోర్, నగర ఉపాధ్యక్షుడు పిల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శి పల్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్

టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలని డిమాండు

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, నాయకులు

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు నగర పరిధిలో నిలిచిపోయిన టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. కొప్పోలు గ్రామ సమీపంలోని టిడ్కో గృహ సముదాయాలను మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు, నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2018లో తెదేపా ప్రభుత్వం ప్రారంభించిన టిడ్కో ప్రాజెక్టును ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే ఇళ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి, రెండేళ్లుగా జాప్యం చేస్తూ లబ్ధిదారులను మోసగిస్తుందని ఆరోపించారు. గృహాలు పూర్తి కాకుండా స్వాధీనం చేయకముందే లబ్ధిదారులు బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, ఎస్.కె.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)
నెక్‌ఫాం: బ్రాయిలర్ ఫారం ధర - 127, రిటైల్ లైవ్ - 154, చికెన్ విత్ స్కిన్ - 223, చికెన్ స్కిన్‌లెస్ - 254

దేవాదాయ ధర్మాదాయ శాఖ - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానము
మిట్టపాలెం గ్రామం, కోవిలంపాడు పోస్టు, సి.యస్.పురం మండలం, మార్కాపురం జిల్లా.

మార్కాపురం జిల్లా, సి.యస్.పురం మండలం, కోవిలంపాడు పోస్టు, మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానములో ఈ క్రింది పేర్కొనబడిన ఐటెములకు 01.04.2026 నుండి 31.03.2027 వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు లీజు హక్కులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ కం- సీల్డు టెండరు కం- బహిరంగ పాటలు తేది. 02.03.2026 సోమవారం ఉదయం 11.00 గం.లకు సదరు దేవస్థానము వద్ద దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో కార్యనిర్వహణాధికారి వారిచే పాటలు నిర్వహించబడును. ఐటెం నెం. 1, 2లకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ కం-సీల్డు టెండరు కం- బహిరంగ పాటలు జరుగును. ఐటెం నెం. 3 నుండి 13 వరకు సీల్డు టెండరు కం-బహిరంగ పాటలు జరుగును. సీల్డు టెండర్లు తేది. 02.03.2026 సోమవారం ఉదయం 10.00 గం.లోపల దేవస్థానము వద్దకు పంపవలెను. మిగిలిన షరతులు కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో పని వేళలలో తెలుసుకొనవలెను. ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు www.apeprocurement.gov.in endowments department marketing నందు చూడగలరు.

వ.సం.	ఐటెము పేరు	డిపాజిట్
1.	తలనీలాలు పోగు చేసుకొను హక్కు	రూ.10,00,000/-
2.	కొబ్బరికాయలు, పూజాద్రవ్యములు, పండ్లు, పూలు అమ్ముకొను హక్కు	రూ.5,00,000/-
3.	ప్యాకేజీ ఐటమ్స్ అమ్ముకొను హక్కు	రూ.3,00,000/-
4.	వాహన పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను హక్కు	రూ.3,00,000/-
5.	కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను హక్కు	రూ.3,00,000/-
6.	కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ అమ్ముకొను హక్కు	రూ.1,00,000/-
7.	గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకొను లైసెన్సు హక్కు	రూ.1,00,000/-
8.	ఫలహారాలు నడుపుకొను, మిఠాయిలు అమ్ముకొను హక్కు	రూ.1,00,000/-
9.	గాజులు అమ్ముకొను హక్కు	రూ.1,00,000/-
10.	చిల్లర సరుకులు అమ్ముకొను హక్కు	రూ.1,00,000/-
11.	పడి బియ్యం పోగు చేసుకొను హక్కు	రూ.50,000/-
12.	భక్తుల పాదరక్షలు భద్రపరుచుకొను హక్కు	రూ.5,000/-
13.	గోరింటాకు అమ్ముకొను హక్కు	రూ.5,000/-

గమనిక:- షాపులను దేవస్థానము వారు కేటాయించిన స్థలములో మాత్రమే పెట్టుకొనవలెను.

శ్రీస్వామివారి సేవలో వ్యవస్థాపక ధర్మకర్త | మిట్టపాలెం, తేది:-21.02.2026 | శ్రీస్వామివారి సేవలో కార్యనిర్వహణాధికారి

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India — A Government of India Undertaking
ఒంగోలు మెయిన్ బ్రాంచ్ -2
డోర్.నెం. 337-1-350, ట్రంక్‌రోడ్, ఒంగోలు, ఫోన్ : 08592-233033, 280067, ఇ మెయిల్ :ubin0804002@unionbankofindia.bank.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ వేలం అమ్మకం నోటీసు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల అమ్మకం నోటీసు.

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు ఋణగ్రహీత(లు) & హామీదారు(లు) లకు ప్రత్యేకంగా తెలుపునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్ తనఖాలో/ ఛార్జీలో ఉన్న దిగువ తెలిపిన స్థిరాస్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒంగోలు మెయిన్ బ్రాంచ్ -2 (సెక్యూర్డ్ క్రెడిటర్) అధీకృత అధికారిచే దిగువ ఋణగ్రహీతలు & హామీదారుల నుండి భౌతికంగా స్వాధీనం తీసుకొనబడినవి, వాటిని సెక్యూర్డ్ క్రెడిటర్ "ఎక్కడ ఉన్నది అలాగే", "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నా అలాగే" పద్ధతి ద్వారా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయిసొమ్ము దిగువ తెలిపిన మొత్తము ప్లస్ వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారుల నుండి రాబట్టుకొనుటకు తేది.13.03.2026న ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర మరియు ధరావత్తు వివరములు దిగువ తెలుపబడినవి.

1) ఋణగ్రహీత(లు)/ సహపూచీదారు(లు)/ తనఖాదారు(లు)/ హామీదారు(లు) : మెస్సర్స్ శ్రీ ప్రభ లైఫ్ సైన్సెస్, మేనేజింగ్ పార్టనర్ 1 : శ్రీ లక్కింశెట్టి కృష్ణ చైతన్య, ఎపిఐఐసి గ్రోత్ సెంటర్, ప్లాట్ నెం.422, ఎస్.నెం.435, 437, అన్నంగి గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523211, మేనేజింగ్ పార్టనర్ 2 : శ్రీ లక్కింశెట్టి ప్రభావతి, ఎపిఐఐసి గ్రోత్ సెంటర్, ప్లాట్ నెం.422, ఎస్.నెం.435, 437 అన్నంగి గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523211, 2) శ్రీ లక్కింశెట్టి కృష్ణ చైతన్య, తండ్రి: రామారావు, 1-30, సహస్ర ఎస్టేట్, మన్‌సూరాబాద్, ఎల్‌బి నగర్, హైదరాబాద్, తెలంగాణ-500068, 3) శ్రీ లక్కింశెట్టి ప్రభావతి, భర్త: లక్కింశెట్టి కృష్ణ చైతన్య, 1-30, సహస్ర ఎస్టేట్, మన్‌సూరాబాద్, ఎల్‌బి నగర్, హైదరాబాద్, తెలంగాణ-500068.

బకాయి మొత్తము : ది.31-01-2026 నాటికి రూ.6,82,92,453.35 పై. (అక్షరాల ఆరు కోట్ల ఎనభై రెండు లక్షల తొంభై రెండు వేల నాలుగు వందల యాభై మూడు రూపాయల మరియు ముప్పై ఐదు పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు : ఆస్తి నెం.1 : ప్రకాశం జిల్లా, ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్, అద్దంకి సబ్ రిజిస్ట్రేషన్, మద్దిపాడు మండలం, అన్నంగి గ్రామము, అన్నంగి గ్రామము మరియు పంచాయతీ, యస్.నెం.435, 437 ప్లాట్ నెం.422, ఎ.పి.ఐ.ఐ.సి. ఐలా గ్రోత్ సెంటర్ నందు మెస్సర్స్ శ్రీ ప్రభ లైఫ్ సైన్సెస్ తరఫున పార్టనర్ : 1) శ్రీ లక్కింశెట్టి కృష్ణ చైతన్య, 2) లక్కింశెట్టి ప్రభావతికి చెందిన [illegible]

రిజర్వు ధర: రూ.4,55,00,000/- ధరావత్తు ధర 10%: రూ.45,50,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.4,55,000/-

ఆస్తి నెం.2: [illegible]

రిజర్వు ధర: రూ.49,26,000/- ధరావత్తు ధర 10%: రూ.4,92,600/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.49,260/-

ఈ- వేలం తేది మరియు సమయం : 13.03.2026, మధ్యాహ్నం 12.00 గం॥ల నుండి 5.00 గం॥ల వరకు

[illegible] https://baanknet.com [illegible] www.unionbankofindia.co.in [illegible] 8291220220 [illegible] website BAANKNET@psballiance.com [illegible] 8008735345, e-mail : ubin0804002@unionbankofindia.bank.in [illegible]

[illegible]

ప్రదేశం : ఒంగోలు, తేది : 20.02.2026 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒంగోలు మెయిన్ బ్రాంచ్ - 2

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

ఆచార్యనాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం నిర్వహిస్తున్న M.Sc (అన్నికోర్సులు), M.A (అన్నికోర్సులు) MBA, MCA, M.Com, MLiSc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. గీతం డిగ్రీకాలేజి, ఒంగోలు. సెల్: 9849124970, 9030568558.

REAL ESTATE

FLAT FOR SALE

B.K ఎన్‌హాటింగ్ ఎన్‌క్లేవ్ (గేటెడ్‌కమ్యూనిటీ), రాంనగర్, ఒంగోలులో 3-BHK ఫ్లాట్, 1705Sft, NEకార్నర్ అమ్మకమునకు కలదు. సంప్ర: 99499 11577.

JOBS

SITUATION VACANT 1. STAFF NURSE (MALE&FEMALE) with Experience in OP/WARD/ICU/OT/NIGHT Duties. 2. Receptionist: Degree with Exp. 3. Security Staff/Watch Man. Cont: 94916 66047, 94409 42757.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌చార్జీస్‌గా పనిచేయుటకు స్త్రీలు మరియు పురుషులు కావలెను. జీతం: 10000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజన వసతి కల్పించబడును). విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సం॥లపైన ఉండవలెను. వివరాలకు సంప్ర॥. ఫోన్ నెం: 90593 22491.

Tally అకౌంటెంట్ బిల్లింగ్ పర్సన్ (ఒంగోలు టౌన్‌లో చేయుటకు) కావలెను. ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722

హౌస్‌కీపింగ్ స్టాఫ్ కావలెను. ఒంగోలు ప్రముఖ జ్యూవెలర్ మాల్‌లో పనిచేయుటకు. జీతం: 9500/-. డ్యూటీ 8 గం., 4 వీక్లీ ఆఫ్స్. ✆ 7285963951, 9392272725.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను: ఒంగోలు అద్దంకి బస్టాండ్ ఏరియాలో పనిచేయుటకు. జీతం: 14000/-, ఇతర సదుపాయాలు కలవు. ✆ 7285963951, 9392272725

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 500 Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మిగులు ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా ఉన్న 165 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్వత స్థానాలు కేటాయించాలని ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘం టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, ప్రభాకరరెడ్డి కోరారు. జీవో నంబర్ ఒకటి ప్రకారం మిగులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సెలింగ్ జరపనందున విద్యార్థులు తగినంతమంది లేని పాఠశాలల్లో పనిలేకుండా కొనసాగాల్సి వస్తుందన్నారు.

ఉల్లిపాయల వ్యాన్ బోల్తా

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఉల్లిపాయల లోడుతో అతి వేగంగా వెళుతున్న వ్యాన్ బోల్తా పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . గుంటూరు నుంచి ఒంగోలు వైపు ఉల్లిపాయల లోడుతో వెళుతున్న ఈ వాహనం మద్దిపాడు వంతెనపై అదుపు తప్పింది. వాహన చోదకుడికి ఎటువంటి గాయాలు కాలేదు. ఉల్లిపాయల బస్తాలు చెల్లాచెదురుగా రహదారిపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు, హైవే సిబ్బంది స్పందించి వెంటనే ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి మృతి

ఆంజనేయులు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: లారీ.. ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన త్రిపురాంతకం మండలం ముడివేముల బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్త అన్నసముద్రం గ్రామానికి చెందిన పి.ఆంజనేయులు (47) ద్విచక్ర వాహనంపై వినుకొండ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముడివేముల బస్టాండ్ సమీపంలోకి రాగానే ముడివేముల గ్రామంలోకి వెళ్లే లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆంజనేయులు.. తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఇక తమకు దిక్కెవరంటూ మృతుడి కుటుంబ సభ్యులు బోరున విలపించడం స్థానికులకు కలచివేసింది.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ఆఫీస్ చిరునామా: డి.నెం: 9-333, పెంట్యాల ప్లాజా, బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన, గీతా మందిర్ ఎదురుగా, అద్దంకి, ప్రకాశం జిల్లా-523201.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II, చెన్నై, తేది: 09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది. మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా: అద్దంకి, డి.నెం.9-333, పెంట్యాల ప్లాజా, బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన, గీతా మందిర్ ఎదురుగా, అద్దంకి, ప్రకాశం జిల్లా-523201. లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్.బి.ఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు). ఇందుమూలముగా ఈ క్రింది నోటీసు జారీ చేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

[illegible]

ఎన్.పి.ఏ తేది: 30.04.2020
డిమాండ్ నోటీసు తేది: 24.01.2026
ఋణం మొత్తం: రూ. 8,00,000/- [illegible]
బకాయి మొత్తం: ది. 24.01.2026 నాటికి రూ. 26,24,441/- [illegible]
ఎంటర్‌ప్రైజెస్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. ADDAKTF1802280005

[illegible]

ప్రదేశం: అద్దంకి అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

పాలు... పాపాలు!

- కుటీర పరిశ్రమగా మారిన కల్తీ వ్యాపారం
- అక్రమార్కులతో ప్రమాదంలో ప్రజారోగ్యం

ఉమ్మడి ప్రకాశం జిల్లా సంతమాగులూరు, అద్దంకి, దర్శి, ముండ్లమూరు తదితర మండలాల్లో కల్తీ పాలను కుటీర పరిశ్రమలా ఇళ్లల్లోనే తయారు చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. రాజమహేంద్రవరంలో పలువురు మృతి చెందిన నేపథ్యంలో కల్తీ పాలు కట్టడికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

-ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, దర్శి, సంతమాగులూరు, అద్దంకి, తాళ్లూరు

ఇటీవల అద్దంకిలో కల్తీ పాలు తయారు చేస్తున్న దంపతులను పట్టుకున్న పోలీసులు

సంతమాగులూరు మండలం యేల్చూరులో ఓ పాల కేంద్రం నిర్వాహకుడిపై గతంలో కేసు నమోదైనప్పటికీ ఇప్పటికీ కల్తీ పాల వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. ఇటీవల జరిగిన దాడుల్లో కేసు నమోదు చేసినా ఎలాంటి మార్పు రాలేదు. అద్దంకిలో దంపతులు ఇంట్లోనే కృత్రిమ పాలు తయారు చేయడంపై గతంలో కేసు నమోదు కావడంతోపాటు ఇటీవల జరిగిన దాడుల్లో పట్టు బడినా కల్తీ పాల వ్యాపారం మాత్రం మానలేదు. కేసులు నమోదు చేసి వదిలేయడం తప్ప ఎలాంటి శిక్షలు లేకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఇళ్లల్లోనే కల్తీ పాలను తయారు చేసి ప్రజారోగ్యాన్ని గుల్ల చేస్తున్నారు. దీనిని పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం దాడులతో సరిపుచ్చడంతో వీరి వ్యాపారానికి అడ్డే లేకుండా పోయింది. అధికారులు ఎవరైనా దాడులకు వస్తున్నారని తెలిస్తే నిమిషాల వ్యవధిలోనే అక్రమార్కులకు సమాచారం అందుతోంది. వెంటనే తమ వద్ద ఉన్న కల్తీ పాలను పార బోస్తున్నారు. దాడుల నుంచి తప్పించుకోవడానికి ఏ స్థాయిలో వీళ్ల నెట్‌వర్క్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

పాల శీతలీకరణ కేంద్రాలే కీలకం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 50 వరకు పాల శీతలీకరణ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో చాలావాటికి అనుమతుల్లేవు. ఇక్కడకు ఎవరెవరు ఎన్ని లీటర్ల మేర పాలు తీసుకొస్తున్నారు.? వారికి ఉన్న పశువులున్నాయి? తదితర వివరాలు ఆరా తీస్తే సులువుగా కల్తీకి అడ్డుకట్ట వేయవచ్చు. ఈ దిశగా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నెమ్మదిగా దేహం గుల్ల

యూరియా, పామాయిల్, క్రీమ్, డిటర్జెంట్ పౌడర్‌ను వినియోగిస్తూ కల్తీ పాలను తయారు చేస్తున్నారు. ఇవి రోజు తీసుకుంటే ఉదరకోశ వ్యాధుల బారిన పడడమే కాకుండా ప్రత్యుత్పత్తి వ్యవస్థ దెబ్బతిని పిల్లలు పుట్టే అవకాశం కోల్పోతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎవరైనా సరే నాలుకపై ఒక చుక్క పాలు పోసుకుని రుచి చూస్తే ఉప్పగా గానీ, వగరుగా గానీ అనిపిస్తే కల్తీ జరిగినట్లు అనుమానించాల్సిందేనని చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రం పర్యవేక్షకుడు డాక్టర్ రవి పేర్కొన్నారు.

ఉక్కుపాదం మోపుతాం

రెండు నెలల వ్యవధిలో ముగ్గురిపై కేసులు నమోదు చేశాం. పాల శీతలీకరణ కేంద్రాలపై దృష్టిసారించాం. ఎంతమంది పాలు పోస్తున్నారనే దానిపై జాబితా కోరాం. ఇళ్లల్లో తయారయ్యే కల్తీ పాల విషయమై ప్రభుత్వ శాఖలతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహిస్తాం. కల్తీకి పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతాం. - వేణుగోపాలరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

సర్కారు బడి.. ఒక్కడికే మరి!

తాళ్లూరు మండలం రామభద్రాపురంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదివే ఒకే ఒక్క విద్యార్థి ఉన్నాడు. ఉపాధ్యాయురాలు రోజూ అతడికే చదువు చెబుతున్నారు. ఈ విద్యార్థి కోసమే కూటమి ప్రభుత్వం ఈ సంవత్సరం పాఠశాల కొనసాగిస్తోంది. ఒక్క విద్యార్థి ఉన్నా.. టీచర్‌ను నియమిస్తామని, పాఠశాలను మూతవేయబోమని గతంలోనే ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందు కనుగుణంగానే బడికి వచ్చే విజయ్ అనే విద్యార్థి కోసం గత సంవత్సరం జూన్‌లో జరిగిన బదిలీల్లో ఉపాధ్యాయురాలిని నియమించింది.

-ఈనాడు, ప్రకాశం, న్యూస్‌టుడే, తాళ్లూరు

మరో డీఎస్సీకి సిద్ధం!

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

- ముందుగా రేషనలైజేషన్, ఉద్యోగోన్నతులకు ఏర్పాట్లు
- నేడు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల

ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి మరో డీఎస్సీ ప్రకటించి నియామకాలు జరపాలని నిర్ణయించి కసరత్తు చేస్తోంది. అన్ని జిల్లాల నుంచి ప్రస్తుతమున్న ఖాళీలతోపాటు రానున్న మే, జూన్ నాటికి ఉద్యోగ విరమణ ఖాళీలను కేటగిరీ వారీగా సేకరిస్తున్నారు. ఆ మేరకు ప్రకాశం, మార్కాపురం జిల్లాల ఎంఈవోల నుంచి సమాచారం సేకరించారు. ఆ వివరాలు మదించి డైరెక్టర్ కార్యాలయానికి పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి డీఎస్సీ ద్వారా జిల్లాలో 680 పోస్టులను భర్తీ చేశారు. ఏటా డీఎస్సీ జరుపుతామని విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ప్రకటించిన విషయం తెలిసిందే. గత డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులు కేవలం జిల్లాకు 93 మాత్రమే మంజూరు కాగా, ఈ సారి ఆ కేటగిరీ పోస్టులు సంఖ్య పెరుగుతుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

పశ్చిమాన ఉపాధ్యాయుల కొరత

మార్కాపురం జిల్లా పరిధిలోని మండలాల్లో ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. ఈ సారి ఆ జిల్లాను యూనిట్‌గా తీసుకుని పోస్టులు భర్తీ చేస్తే మారుమూల గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత తీరే అవకాశం ఉంది. త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దోర్నాల, పుల్లలచెరువు మండలాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. గతేడాది బదిలీల కౌన్సెలింగ్‌లో అన్ని ఖాళీలు చూపించడంతో పట్టణాలకు దగ్గరగా ఉన్న పోస్టులు కోరుకున్నారు. దీంతో దూర ప్రాంతాల్లోని నాలుగో కేటగిరీ పోస్టులు మిగిలిపోయాయి. డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులు తక్కువగా మంజూరు కావడంతో సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. గడిచిన మూడు నెలల్లో జరిగిన ఉద్యోగ విరమణలు, రానున్న నాలుగు నెలల్లో జరిగే ఉద్యోగ విరమణలు వెరసి వందల సంఖ్యలో పోస్టులు ఖాళీ కానున్నాయి.

పక్కా జాబితాల తయారీలో...

ఈ సారి వివాదాలు, గ్రీవెన్స్, కోర్టు కేసులకు అవకాశం లేని ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను రూపొందించడానికి ఇప్పటి నుంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి ఉపాధ్యాయుని నుంచి వ్యక్తిగత సర్వీసు వివరాలు ఆన్‌లైన్ ద్వారా సేకరించారు. వారిచ్చిన వివరాలను ఆయా ఉపాధ్యాయులు ధ్రువీకరించాలి. ముందుగా రేషనలైజేషన్, అనంతరం ఉద్యోగోన్నతులు ప్రక్రియ తరువాత డీఎస్సీ నిర్వహిస్తారు. వీటన్నింటికి ఉపాధ్యాయుల వివరాలే ప్రధానం. దానిని పక్కాగా రూపొందించే పనిలో ఉన్నారు. బుధవారం తొలివిడత జాబితా ప్రకటిస్తారు. అభ్యంతరాలుంటే సరిచేసి మార్చి 15న రెండో విడత, 30న తుది జాబితా ప్రకటిస్తారు. ఉన్న ఖాళీల్లో 70 శాతం ఉద్యోగోన్నతుల ద్వారా, 30 శాతం పోస్టులు డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయనున్నారు.

బోర్డు ఉంది.. కారిడారే లేదు!

- పుష్కర కాలంగా ప్రజల ఎదురు చూపులు
- దొనకొండ ఎంఎస్ఎంఈ పార్కు దుస్థితి

జిల్లాలోని దొనకొండ ఎంఎస్ఎంఈ పార్కు బోర్డుకే పరిమితమైంది. పుష్కర కాలం కిందట కారిడార్‌గా ప్రకటించారే తప్ప ఇంత వరకు ఒక్క కంపెనీకి నోచుకోలేదు. తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశలు చిగురించినా అనంతరం పట్టించుకోకపోవడంతో స్థానికులు నిరాశ చెందుతున్నారు. వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు బుధవారం సీఎం నారా చంద్రబాబునాయుడు వస్తున్న సందర్భంగా దొనకొండపై నిర్ణయం తీసుకుంటారని అంతా ఆశిస్తున్నారు.

-న్యూస్‌టుడే, దొనకొండ

గతంలో ప్రకటించిన కంపెనీలు : రాష్ట్రంలో పది భారీ పారిశ్రామిక పార్కులు కేటాయించగా, అందులో దొనకొండ బహుళ ఉత్పత్తుల పార్కుగా ఆమోదించారు. సుమారు 7 నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ● దొనకొండ మండలం రుద్రసముద్రం, భూమనపల్లి, మంగినపూడి గ్రామాల్లో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు 5 వేల ఎకరాలు అవసరమని సోలార్ పవర్ కార్పొరేషన్ కోరింది. దీనిపై గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటన సైతం చేశారు. ● క్షిపణుల తయారీకి బాదాపురంలో 1,400 ఎకరాల్లో రూ.1,200 కోట్ల పెట్టుబడితో తయారు చేసేందుకు బీడీఎల్ ముందుకొచ్చిందన్నారు. ● సుమారు 8 నెలల కిందట 25 ఎకరాల్లో రూ.4,260 కోట్లతో ప్రపంచ స్థాయి క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించేందుకు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం ఛైర్మన్ పీటర్ చున్ వెల్లడించారు. చల్లా గ్రూపు ఒమెక్సా బయాలజీస్, మేస్, ఐ హోల్డింగ్ సంస్థల భాగస్వామ్యంతో ఈ సెంటర్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ● సుమారు 8 ఏళ్ల కిందట అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు ఎంఎస్ఎంఈ పార్కులో సౌకర్యాలు కల్పించి కంపెనీల స్థాపనకు 43.79 ఎకరాలు కేటాయించి రూ.8 కోట్లు మంజూరు చేసి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. అనంతరం వైకాపా అధికారంలోకి రాగా పార్కు పనులను పూర్తిచేయకుండా వదిలేసింది. తక్షణమే జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా ఇక్కడ కంపెనీల నిర్మాణం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయలే.. గుంతా పూడ్చలే

మద్దిపాడులో జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా గుంత

మద్దిపాడు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఆయిల్ మిల్లు సమీపంలో ఓ గుంత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ వేసిన తాగునీటి పైపులకు లీకులు ఏర్పడి నీరు వృథా అయి సదరు మార్గంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు మరమ్మతుల నిమిత్తం పెద్ద గుంత తీయించారు. సుమారు ఇరవై రోజులైనా మరమ్మతులు మాత్రం చేయలేదు. గుంతనూ పూడ్చలేదు. ప్రస్తుతం ఇది దారి పక్కనే ఉండడంతో ప్రమాదాలను ఆహ్వానిస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. దీని వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంది. రాత్రి సమయంలో ఎవరైనా ఆదమరచి ఆటు వెళితే మృత్యు కుహరంలోకి దూకినట్లే. పశువులు సైతం అందులో పడితే పైకి రావాలంటే ఇబ్బందికరమే. దీనిపై పంచాయతీ కార్యదర్శి నూర్లాను వివరణ కోరగా.. తక్షణమే సిబ్బందిని పంపించి గుంతను పూడ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- న్యూస్‌టుడే, మద్దిపాడు

తొలగించారు... ప్రమాదాలకు తెర తీశారు

పదహారో నంబరు జాతీయ రహదారిపై అత్యవసరంగా తొలగించిన డివైడర్లు ప్రమాదకరంగా మారాయి. నిబంధనలు అతిక్రమించి వాహన చోదకులు డివైడర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. గతేడాది నవంబరులో కురిసిన భారీ వర్షాలకు వల్లూరు, పెళ్లూరు చెరువులు పొంగిపొర్లాయి. దీంతో వల్లూరు, పెళ్లూరు సమీపంలోని జాతీయ రహదారితోపాటు పంటపొలాలు నీటమునిగాయి. ఈ క్రమంలో చెన్నై-ఒంగోలు మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నీటిని తరలించేందుకు పోలీసులు, హైవే సిబ్బంది తీవ్రంగా శ్రమించి నాలుగు చోట్ల డివైడర్లను అత్యవసరంగా తొలగించారు. అనంతరం హైవే నిర్వహణ యాజమాన్యం వాటిని తిరిగి నిర్మించ కుండా వదిలేసింది. దీంతో సమీపంలోని రెండు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు, వల్లూరు గ్రామస్థులు అండర్ పాస్‌లు ద్వారా రాకపోకలు సాగించకుండా డివైడర్లను దాటి ప్రయాణాలు సాగిస్తున్నారు. అదే ప్రాంతంలో గతంలో భారీ రహదారి ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలున్నాయి. ఇప్పటికైనా డివైడర్లను నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, టంగుటూరు

పగిలిన కనిగిరి తాగునీటి పైపులైను

రామతీర్థం జలాశయం నుంచి కనిగిరికి తాగునీటిని సరఫరా చేసే పైపులైను చీమకుర్తి మండలం బక్కిరెడ్డిపాలెం సమీపంలో పగిలిపోయింది. అమరావతి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే కింద ఉన్న గొట్టాలు దెబ్బతినడంతో పది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు లీకవుతున్న ప్రాంతంలో మట్టి కొట్టుకుపోతోంది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించడంతోపాటు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చీమకుర్తి

చిరుత సంచారంపై భయాందోళన

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సీఎస్ పురం మండలం డీజీపేట-తుంగూడు ఘాట్ రోడ్డులో చిరుతపులి సంచారంతో స్థానికులు, వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. కనిగిరి ఎఫ్ఆర్ఓ తుమ్మ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎస్‌పురం మండలం తుంగూడు, వెంకటాయచెరువు, కొంతవారిపల్లి, చెన్నపునాయునిపల్లి, మైలవరం తదితర అటవీ ప్రాంతాల్లో చిరుతపులులు సంచరిస్తున్నట్లు తాము ఏర్పాటుచేసిన కెమెరాల ద్వారా తేలిందన్నారు. పశువులు, గొర్రెల కాపరులు అడవుల్లోకి వెళ్ల రాదని సూచించారు. తుంగూడు ఘాట్ రహదారిలో సాధ్యమైనంతవరకు రాత్రి వేళల్లో ప్రయాణించవద్దని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు.

చెన్నపునాయునిపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత పులి

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఒంగోలు నగరం, మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మంగళవారం సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 67 కేంద్రాల్లో తొలిరోజు జనరల్ కోర్సుల్లో 17,807 మంది విద్యార్థులకు 17,231 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1,586 మందికి 1,488 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒంగోలు నగరంలోని ఆరు కేంద్రాలను ఆర్ఐవో కె.ఆంజనేయులు తనిఖీ చేయగా, 32 కేంద్రాలు స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణతో చూసిరాతలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధ సా.6-23

సహరీ : గురు ఉ.5-09

పోలేరమ్మకు ప్రణామం

మార్కాపురం గ్రామదేవత శ్రీఅల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పొంగళ్ల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

-న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

చంద్రన్న ఆగమనం... ప్రజల్లో ఆనందం!

- మార్కాపురంపై వరాలు కురిపిస్తారని గంపెడాశలు

న్యూస్‌టుడే, మార్కాపురం, పెద్దదోర్నాల

మార్కాపురం కేంద్రం ఆవిర్భవించిన కొత్త జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలిసారిగా బుధవారం పర్యటించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లాకు ప్రత్యేక నిధులతోపాటు వరాల జల్లు కురిపిస్తారని జిల్లా ప్రజలు ఆశగా ఎదరు చూస్తున్నారు. తొలుత పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద సొరంగాలను సీఎం పరిశీలిస్తారు. అనంతరం గంటవానిపల్లె గ్రామసమీపంలో రూ.450 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడరు కాలువ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటల మార్కాపురం చేరుకుని మార్కాపురం- తర్లుపాడు రహదారిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం తిరిగి సాయంత్రం 4.40 గంటలకు హెలీకాప్టరులో ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. పర్యటనలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడర్ కాలువ, బహిరంగ సభ వద్ద ఏర్పాట్లను మంగళవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజా బాబు, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు ముత్తమల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, తెదేపా వైపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, వెలిగొండ ప్రాజెక్టు సీఈ రమేష్, ఎస్ఈ అబూ తాలీం, జేసీ కల్పనాకుమారి, కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ తదితరులు పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాజీ మంత్రులు దేవినేని ఉమ, ఉండవల్లి శ్రీదేవి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

ఫీడరు కాలువ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు, అధికారులు

మార్కాపురంలో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి,ముత్తుముల అశోక్‌రెడ్డి, తదితరులు

పూర్తయిన ఏర్పాట్లు

ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇన్‌ఛార్జి కలెక్టర్ రాజాబాబు, ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు జిల్లాకు చెందిన అధికారులు రెండు రోజులుగా సర్వం సిద్ధం చేశారు. సీఎం బహిరంగ సభావేదిక ముందు భారీ సంఖ్యలో ప్రజలు కూర్చునే విధంగా వేదికను రౌండుగా నిర్మాణం చేశారు. వేదిక ముందు నుంచి 150 అడుగుల మేర ర్యాంపు నిర్మాణం చేశారు. దీనిపై నుంచి సీఎం ప్రజలకు అభివాదం చేయనున్నారు. మహిళలు, సాధారణ ప్రజలు, వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు ఏర్పాటు చేశారు. దూరంగా కూర్చున్న ప్రజలు వీక్షించేందుకు వీలుగా భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, భోజన వసతితో పాటు మొబైల్ మరుగుదొడ్లు సిద్ధం చేశారు.

పటిష్ఠ పోలీసు బందోబస్తు

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ మేరకు ఇద్దరు ఏఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 90 మంది ఎస్.ఐ.లతో పాటు 1,167 మంది పోలీసు సిబ్బందితో భద్రత ఉంటుందన్నారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలు, అధికారులు ఎంపిక చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను పార్క్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. సాధారణ ప్రజల వాహనాలు ఎల్.వి. ప్రసాద్ వైద్యశాలకు ఉత్తర వైపు, వైద్యశాల ఎదురుగాన్న ఖాళీ స్థలంలో, ప్రభుత్వ అధికారుల వాహనాలు సాయిబాలాజీ పాఠశాల ఉత్తర వైపు, వీఐపీ వాహనాలు సాయిబాలాజీ పాఠశాల దక్షిణ వైపు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే పార్క్ చేసుకోవాలన్నారు. సీఎం ప్రయాణించే హెలీకాప్టర్‌తో మంగళవారం సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని ఫీడరు కాలువ కట్టపై ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌పై హెలీకాప్టర్ దిగి అక్కడ నంచి మార్కాపురం వెళ్లింది.

కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఆందోళన

ఒంగోలు కలెక్టరేట్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి చర్చి సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ.. పీజీ విద్యార్థులకు ఉపకార వేతనాలను దూరం చేసే జీవో నం.77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 4,200 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం, ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలో మౌలిక వసతుల కల్పన నిమిత్తం నిధులు కేటాయించాలన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారంతోపాటు, ఫీజు బకాయిలు చెల్లించకుంటే త్వరలోనే సీఎం చంద్రబాబునాయుడి ఇంటిని ముట్టడించనున్నట్లు హెచ్చరించారు.

ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ సభ్యులు, కార్మికులు

ఆర్టీసీ డిపోలను ప్రైవేటు పరం చేస్తే ఉద్యమం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఒంగోలు డిపో గ్యారేజీ గేటు వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ ఒంగోలు డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో జిల్లా కార్యదర్శి ఆర్. అంజయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశ పెడుతూ డిపోలను ప్రైవేటు వారికి అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.క్రిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ధర్నాలో ఎన్‌వీఎస్.కుమార్, షాహిద్, బాషా, క్రిష్టా, కార్మికులు పాల్గొన్నారు.

(c) eenadu

కందుకూరు

• కందుకూరు • కొండపి

విద్యుత్తు ఉపకేంద్రం సందర్శన

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం వృత్తి విద్యలో భాగంగా కోవూరు రోడ్డులో ఉన్న విద్యుత్తు ఉపకేంద్రాన్ని సందర్శనకు వెళ్లారు. ఏఈ ఎం. శోభారాణి మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఉపకేంద్రం పనితీరును సమగ్రంగా పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఈ సందర్శనలు విద్యార్థులకు సత్వరంగా జ్ఞానం సమకూర్చుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడంతో పాటు వృత్తి విద్య పట్ల ఆసక్తిని మరింతగా పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిలారు వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉపకేంద్రం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

పోలీస్ కార్యాలయాలు.. పచ్చందాలకు నిలయాలు

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం:

వాతావరణంలో కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ప్రభుత్వం పేర్కొంటోంది. పచ్చని చెట్టు ప్రగతికి మెట్టుగా ప్రకృతి ప్రేమికులు అన్వయిస్తారు. మొక్కల పెంపకం ద్వారా సకాలంలో వర్షాలు కురుస్తాయి. వర్షాలు విరివిగా కురవడం ద్వారా ప్రజలకు తాగు, సాగు నీరు పుష్కలంగా లభించి చెరువులు నిండి రైతులు పంటలు పండిస్తారు. దీనిలో భాగంగా ఆరు నెలల నుంచి స్థానిక పోలీసు స్టేషను, సర్కిల్ కార్యాలయం ఆవరణల్లో సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర వివిధ రకాల మొక్కలను నాటి నిత్యం సంరక్షిస్తున్నారు.

విధులతో పాటు దినచర్యగా..

పోలీసులు 24 గంటలు తమ విధుల్లో తీరిక లేకుండా ఉంటారు. వారు మొక్కల సంరక్షణ కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత సమయాన్ని కేటాయించి నీరందిస్తున్నారు. ప్రత్యేకంగా ముగ్గురు సిబ్బంది శ్రీను, రమేష్, బాలరాజు నాలుగు నెలల క్రితం వివిధ ప్రాంతాల నుంచి పూలు, కూరగాయలు, ఆకుకూరలు, కొబ్బరి చెట్లు, తదితర మొక్కలను తరలించి నాటారు. వీటికి సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ ప్రాంతమంతా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నారు.

పూల మొక్కలతో సుందరం..

సర్కిల్ కార్యాలయంలో వివిధ రకాలు పూల మొక్కలు నాటడంతో ప్రాంతమంతా సుందరంగా ఉందని పలువురు పేర్కొన్నారు. గతంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఆవరణమంతా చిట్టడవిని తలపించి విషపు పురుగులు సంచరించేవి. పోలీసు స్టేషను, సర్కిల్ కార్యాలయాల్లో విద్యుత్తు స్తంభాలకు జాతీయ జెండా రంగుల ఎల్‌ఈడీ దీపాలను అమర్చడంతో రాత్రుల సమయంలో కాంతులీనుతున్నాయి. నాలుగు నెలల క్రితం మంత్రి స్వామి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆవరణలో మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయి.

పోలీస్ స్టేషన్లో పూల మొక్కలకు పాదులు తీస్తున్న సిబ్బంది

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కందుకూరు పట్టణం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కె.రియాజుద్దీన్ తెలిపారు. 'పర్చేజ్ అసిస్టెంట్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ కమోడిటీ, కస్టమర్ కేర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్' కోర్సులపై పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన విద్యార్థులకు శిక్షణతో పాటు ధ్రువపత్రాలు అందజేసి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న యువత మార్చి 3వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కాలానుగుణ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

టంగుటూరు, న్యూస్‌టుడే: పశువుల్లో కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ, వాటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం టంగుటూరులోని పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పశుపోషకులకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు, సలహాలు, సూచనలు అందించాలన్నారు. కార్యాలయంలో అందుతున్న సేవల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు దస్త్రాలను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ జయచంద్ర, ఏడీ కసుకుర్తి సుధీర్‌బాబు, వైద్యులు ధనలక్ష్మి, శ్రావణి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ వెంకటేశ్వరరావు

పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాలు

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మండలంలోని పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాలను కేటాయించినట్లు ఎంపీడీవో శంకరరావు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో 13 పంచాయతీలకు 14 రిక్షాలను పంచాయతీ కార్యదర్శులకు ఆయన అందజేశారు. వాహనాలను సక్రమంగా వినియోగిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరుకు కొత్త శోభ!

❑ పట్టణంలో రూ.6.2 కోట్లతో రహదారుల సుందరీకరణ పనులు

-న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

కందుకూరు పట్టణం కొత్తరూపు సంతరించుకుంది. సుమారు 30 ఏళ్ల కిందటి పురపాలక సంఘంగా రూపాంతరం చెందినా.. ఇప్పటి వరకు అందుకు తగిన వాతావరణం కల్పించలేదు. మేజరు, నగర పంచాయతీల్లోనూ ప్రధాన రహదారులపై డివైడరు, సెంట్రల్ లైటింగ్ ఉండగా, ద్వితీయ శ్రేణి పురపాలక సంఘంగా ఉన్న కందుకూరులో మాత్రం ఇంత వరకు సౌకర్యాలు సమకూరలేదు. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఓవీరోడ్డులో డివైడర్లతోపాటు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.. ఆ తరవాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు రూ.6.2 కోట్లతో పట్టణంలోని పామూరు రోడ్డు, ఓవీరోడ్లలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు చేశారు.

అభివృద్ధి పనులు ఇలా...: కందుకూరు పట్టణాభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2025, ఫిబ్రవరిలో కందుకూరు పర్యటనకు వచ్చిన సందర్భంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తున్నారు. ఇందులో భాగంగా టీఎస్, ఎల్ఈడీఎస్ నిధులు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆ నిధులతో పాటు సాధారణ నిధులు మరో రూ.1.5 కోట్లు జోడించి తొలివిడతగా పట్టణ పరిధిలోని పామూరు రోడ్డు, ఓవీరోడ్లను వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పామూరు రోడ్డు వెడల్పునకు రూ.1.7 కోట్లు, డివైడర్‌కు రూ.47 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేసి గత జనవరిలో ప్రారంభించారు. ఓవీరోడ్డు వెడల్పునకు రూ.2 కోట్లు, డివైడర్‌కు రూ.1.28 కోట్లతో ప్రతిపాదించారు. పామూరురోడ్డు, ఓవీరోడ్లలో సెంట్రల్ లైటింగ్‌కు రూ.75 లక్షలు వెచ్చించారు. ప్రస్తుతం ఓవీరోడ్డు పనులు చివరి దశలో ఉండగా, ఈ నెల 28న ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాన రోడ్ల అభివృద్ధి చెందడంతో పట్టణానికి అర్బన్ వాతావరణం రావడంతో కొంతమేర పట్టణ వాసుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కాగా రెండో విడతగా జనిగిరి రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు సమాచారం. మరోవైపు పట్టణంలోని 32 వార్డుల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి సుడా నుంచి సుమారు రూ.10 కోట్లు మంజూరు కాగా.. సంబంధిత పనులకు సంబంధించి ఇటీవల టెండర్లు పిలిచారు. త్వరలోనే అవి కార్యరూపం దాల్చనున్నాయి.

ఓవీ రోడ్డులో ఏర్పాటైన డివైడరు, సెంట్రల్ లైటింగ్

ఈ-పంట నమోదు తప్పనిసరి

జరుగుమల్లి, న్యూస్‌టుడే: రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని ఏవో కాశీవిశ్వనాథ్ తెలిపారు. నందనవనం, రామచంద్రాపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పొగాకు బార్నులను సందర్శించి క్యూరింగ్‌లో జాగ్రత్తలు తెలియజేశారు. నందనవనంలో రెవెన్యూ, సర్వే శాఖలతో కలిసి ఈ-పంట నమోదును పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నందనవనంలో పొగాకు తోటను పరిశీలిస్తు న్న ఏవో కాశీవిశ్వనాథ్

పల్లె రహదారులకు మహర్దశ

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏళ్ల తరబడి రహదారులు అధ్వానంగా ఉన్నా.. కనీస మరమ్మతులు చేయించలేదు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలంలో పలు రోడ్లు మరింత అధ్వానంగా మారడంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడేవారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామాల్లోని అంతర్గత రహదారులు, లింక్ రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజల కష్టాలు తొలగించేలా ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండగ-1 కింద వివిధ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలను ఇప్పటికే పూర్తి చేసింది. ప్రస్తుతం పల్లె పండగ-2 కింద పనులు కొనసాగుతున్నాయి. ఈ పథకంలో సీసీ రహదారులు, తారురోడ్డు పనులను ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పల్లెల్లో అంతర్గత రహదారులకు రూ.3.50 కోట్లతో 43 పనుల కింద 5,550 మీటర్ల సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్నాయి. నాలుగు లింకు రహదారులకు రూ.4.50 కోట్లతో 3,900 మీటర్ల తారురోడ్లు, రోళ్లపాడు సమీపంలో తూమలేరుపై వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. 13 చోట్ల సీసీ రహదారుల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, నాలుగు చోట్ల తారురోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. 9 పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు.

శింగమనేనిపల్లె, పోకూరు మధ్య లింకు రోడ్డు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?:మర్రిపూడి: చిలంకూరు బీసీకాలనీలో వీధి దీపాలు వెలగక రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – బాలగురవయ్య

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
– నాగుర్‌వలీ, ఎంపీడీవో

?:జరుగుమల్లి: బిట్రగుంటలో గత కొన్నాళ్లుగా పారిశుద్ధ్య పనులు చేపట్టక రహదారుల వెంబడి చెత్త పేరుకుపోయింది. – సూరి

✓: త్వరలోనే వ్యర్థాలను తొలగించి సమస్య లేకుండా చూస్తాం.
– షఫీ, పంచాయతీ కార్యదర్శి

?:ఉలవపాడు: ఉలవపాడు మండలం భీమవరం పంచాయతీలోని మాదిగపల్లె చివరి వీధిలో విద్యుద్దీపాలు సక్రమంగా వెలగడం లేదు. పక్కనే కాలువ ఉండటం వల్ల రాత్రి పూట విషపురుగులు వచ్చే అవకాశాలున్నాయి.
–కొండయ్య, స్థానికుడు

✓: పరిశీలించి రెండు రోజుల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
–అంజయ్య, పంచాయతీ కార్యదర్శి

?: కందుకూరు పట్టణం: ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో కందుకూరు నుంచి ఎడ్లూరుపాడు మీదుగా తిమ్మపాలెం వరకు ఉదయాన్నే బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి. – కె.వెంకటేశ్వర్లు, తిమ్మపాలెం

✓: ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే 8 ప్రత్యేక సర్వీసులు తిప్పుతున్నాం. ఇంకా అవసరమైన వారు సంబంధిత ప్రిన్సిపల్ నుంచి లేఖ తెచ్చుకుంటే బస్సులు ఏర్పాటు చేస్తాం.
– శ్రీనివాసరావు, ఆర్టీసీ డీఎం

పైపులైన్ల మరమ్మతులకు శ్రీకారం

ఈనాడు కథనానికి స్పందన

కందుకూరు పట్టణం: చాకలిపాలెం కాలనీవాసులు ఆరు నెలలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని పలు చోట్ల తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, పైపులైన్లకు లీకులు పడుతున్నా వాటికి మరమ్మతులు చేపట్టడం లేదనేదానిపై ఈ నెల 22న 'నిండా నీరు..మారని సరఫరా తీరు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు మంగళవారం ఇంజినీరింగ్ సిబ్బందిని పంపించి పైపులైన్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ముదిరాజ్‌పాలెం, డంపింగ్‌యార్డు ప్రాంతాల్లో నీటి చౌర్యం జరగకుండా మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న ఎంఈవో నాగేంద్రవదన్

పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ

జరుగుమల్లి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మన రైతన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఎడ్లూరపాడు నుంచి వెంకటాద్రిపాలెం వరకు సుమారు 4.5 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించనున్నట్లు సంస్థ సభ్యులు బాశం కోటేశ్వరరావు, పొన్నగంటి సురేష్ తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేంద్రవదన్, ఎడ్లూరపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుల్తాన్ పాల్గొన్నారు. మామిడి, నేరేడు, బాదం తదితర మొక్కలు నాటారు.

సొసైటీలో కందులు, శనగల కొనుగోళ్లు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల ద్వారా కందులు, శనగలు కొనుగోలు చేయనున్నట్లు కొండపి వ్యవసాయ అధికారి మల్యాద్రి తెలిపారు. కట్టవారిపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. కొండపి, చోడవరం సొసైటీల పరిధిలోని గ్రామాల నుంచి కందులు క్వింటా రూ.8 వేలు, శనగలు రూ.5,875 చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. ఇందుకోసం రైతులు ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, చరవాణి వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈవో కుమార్, వీఏఏ శ్రుతి, రైతులు పాల్గొన్నారు.

ఆకు ముడతతో బొప్పాయికి నష్టం

మర్రిపూడి: ఆకుముడత తెగులుతో బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని ఇన్‌ఛార్జి ఉద్యాన అధికారిణి బి.ధనలక్ష్మి తెలిపారు. పన్నూరులో తెగుళ్లతో దెబ్బతిన్న తోటలను మంగళవారం పరిశీలించి.. రైతులతో మాట్లాడారు. తెగులు సోకిన తోటల్లో చెట్ల ఎదుగుదల తగ్గి, ఆకులు ముడుచుకు పోతాయని తెలిపారు. తెల్లదోమ ద్వారా ఇది వ్యాప్తి చెందుతుందన్నారు. నివారణ చర్యలు సూచించారు. ఉద్యానశాఖ సహాయకురాలు హర్షిణి, స్థానిక రైతులు పాల్గొన్నారు.


సస్యరక్షణ చర్యలు తెలియజేస్తున్న హెచ్‌వో ధనలక్ష్మి

ఈ రహదారి ఎవరి కోసం..?

కందుకూరు గ్రామీణం: కొండికందుకూరు గ్రామంలోని ఎస్టీ కాలనీ సమీపంలో ఇటీవల హడావుడిగా సిమెంట్ రహదారిని నిర్మించారు. ఇక్కడ రహదారి ఎందుకు నిర్మిస్తున్నారో గ్రామస్థులకే తెలియని పరిస్థితి. గ్రామానికి చెందిన కుంటభూమిలో కొందరికి పట్టాలు ఇచ్చారని వారికి రహదారి ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. రహదారిని నిర్మించారే కాని దానిపై రాకపోకలు సాగించేందుకు వసతి లేదు. రెండు వైపులా కల్వర్టులు లేకపోవటంతో కాలువ దాటే వీలులేక అక్కడ నివాసాలు ఉండే వారు యథావిధిగా పక్కనే ఉన్న కాలిబాటలో నడకసాగిస్తున్నారు.

ఎస్టీ కాలనీ సమీపంలో వేసిన సిమెంటు రహదారి

దారి ఇలా.. వెళ్లేదెలా?

వలేటివారిపాలెం మండలంలోని శాఖవరం బీసీ కాలనీలోని పలు అంతర్గత రహదారుల్లో పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారాయి. రాత్రివేళల్లో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పిచ్చి మొక్కల మధ్య విషపురుగులు సంచరించే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పాలకులు స్పందించి అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

హాకీ అభివృద్ధికి కృషి అభినందనీయం

మైనంపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: హాకీ క్రీడాభివృద్ధికి ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి చేసిన కృషి అభినందనీయమని జిల్లా హాకీ సంఘం కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి, మైనంపాడు హాకీ సంఘం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిరంజన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆయన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల జీవితాల్లో వెలుగులు నింపిన నిస్వార్థ హాకీ సేవకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు హాకీ క్లబ్ అధ్యక్షుడు గొడుగు కాలేషా, ఆకుల బ్రహ్మయ్య, తిరుమలశెట్టి రవికుమార్, చంద్రశేఖర్, రవి, పీడీ వనజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లపై సమీక్ష

టంగుటూరు, న్యూస్‌టుడే: పొగాకు వేలం కేంద్రంలో సకాలంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని కేంద్రం నిర్వహణాధికారి ముదపాక సత్యశ్రీనివాస్ తెలిపారు. 2025-26 సీజన్ పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులు, ఫ్లోర్ కమిటీ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయనమాట్లాడారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మార్చి మొదటి వారంలో ప్రారంభించాలని కొందరు చెప్పగా... మూడో వారంలో నిర్వహించాలని మరికొందరు సూచించారు. కొనుగోళ్లు ఆలస్యమైతే కూలీలకు నగదు చెల్లింపులో జాప్యం చోటుచేసుకుంటుందని... పొగాకు పక్కదారి పట్టే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. మార్చి నెలాఖరుకు కొనుగోళ్లు ప్రారంభించేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని... వారి సూచనల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రైతు సంఘం నాయకులు పోతుల నరసింహారావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని దీక్ష

ఉలవపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్యకర్తలు, ఆయాలు తమ డిమాండ్ల సాధనకు రెండో రోజు మంగళవారం రిలే నిరాహారదీక్ష చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఉలవపాడులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆయాలు దీక్షలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు కుమార్, అంగన్‌వాడీ హెల్పర్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మి, సుమ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి పథకాల్లో బ్యాంకు లింకేజీ రుణాలను నూరుశాతం వసూళ్లకు చర్యలు చేపట్టాలని వెలుగు ఏపీఎం బాబూరావు సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. నారీ సభ్యులు తమ సర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని సూచించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.మేరిమ్మ, కార్యదర్శి కె.పద్మావతి, సీసీలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఫైబర్ నెట్ తీగలు

మర్రిపూడి, న్యూస్‌టుడే: గ్రామాల్లో అంతర్జాలం, కేబుల్ ప్రసారాల మెరుగుకు ఏర్పాటు చేసిన ఫైబర్ నెట్ కేబుల్ తీగలు నిర్వహణ లేక పలు చోట్ల ప్రమాదకరంగా మారాయి. ఈదురగాలులకు తీగలు జారి చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. అగ్రహారం సమీప పొలాల్లో కేబుల్ దిగువగా ఉండడంతో ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేసుకునేందుకు అంతరాయం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. మర్రిపూడిలో ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వాహనదారులు చెబుతున్నారు. విద్యుత్తు ఉపకేంద్రం వద్ద తీగలు తెగిపడ్డాయి. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని... ఉన్నతాధికారులైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్తు ఉప కేంద్రం వద్ద నేలపై పడిన కేబుల్

బాల్య వివాహాలతో అనర్థం

పొన్నలూరు, న్యూస్‌టుడే: చిన్నతనంలో వివాహాలు చేయడం వల్ల సదరు బాలికలు భవిష్యత్తులో తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా పేర్కొన్నారు. పొన్నలూరు మండలం ముప్పాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మంచి, చెడు స్పర్శ గురించి తెలియజేశారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి విషయం తీసుకెళ్లాలన్నారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని... వీటికి సహకరించేవారు సైతం చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఆదాము, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పద్మావతి, జి.గోవర్ధనమ్మ, ఎ.పద్మ పాల్గొన్నారు.

'కులాల మధ్య చిచ్చుపెట్టే వారిని బహిష్కరించాలి'

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపాలోనే ఉంటూ ఎస్సీ కులాల మధ్య చిచ్చుపెడుతున్న వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని పార్టీ పొన్నలూరు మండల మహిళా అధ్యక్షురాలు గుత్తికొండ కల్యాణి పేర్కొన్నారు. టంగుటూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోటి ఆధ్వర్యంలో సింగరాయకొండలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త సురేష్‌కు వర్గాలను అంటకట్టడం తగదన్నారు. పార్టీ టంగుటూరు మండల అధ్యక్షుడు హరిబాబుపై అట్రాసిటీ కేసు పెట్టినవారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. రవీంద్ర, ఝాన్సీ, సునీల్, విజయ్‌బాబు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రానికి 298 మంది విద్యార్థులను కేటాయించగా 287 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉలవపాడు: స్థానిక జీవీఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో రోజు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 184మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 183మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ గోపీచంద్ తెలిపారు.

కొండపి కేంద్రంలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ఎలికేరు... పారించరూ!

● మోటార్లతో నీటిని సరఫరా చేయాలని డిమాండు

న్యూస్‌టుడే, కందుకూరు, గుడ్లూరు

ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరిస్తామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శాసనసభలో ప్రకటించారు. దీంతో మండలంలోని స్వర్ణాజిపురం రైతుల్లో ఆశలు చిగురించాయి. గ్రామం పక్కనే ఎలికేరు ప్రవహిస్తుంటుంది. వృథాగా సముద్రానికి పోతున్న నీటిని కాలువ ద్వారా చెరువుకు మళ్లించి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు ఇవ్వాలంటూ మండల రైతులు కోరుతున్నారు. దీంతో 300 ఎకరాలు ఆయకట్టుకు సాగునీరుతో పాటు మరో 200 ఎకరాల మామిడి తోటలకు సమృద్ధిగా నీరందుతుంది. ఎలికేరు నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉండే స్వర్ణాజిపురం చెరువుకు మోటార్లు ఏర్పాటు చేసి గొట్టాల ద్వారా నీటిని తరలిస్తే ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుంది.

ఇది పొజర్ల- స్వర్ణాజిపురం మధ్య ఎలికేరు మార్గం. చప్టా లేకపోవడంతో గ్రామానికి చెందిన కొందరు రైతులు నేల చప్టాను నిర్మించడానికి ఇలా చదును చేస్తున్నారు. ఇక్కడ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అడ్డుకట్ట వేస్తే రెండు గ్రామాల మధ్య రాకపోకలకు వీలుంటుంది.

చిత్రంలో కనిపిస్తోంది స్వర్ణాజిపురం-పొజర్ల మధ్య నున్న ఎలికేరు. గుడ్లూరు మండలం అమ్మవారిపాలెం నుంచి ప్రారంభమయ్యే ఎలికేరు వర్షాకాలంలో ఆగస్టు నుంచి మార్చి వరకు నీటితో నిండి ఉంటుంది. ఈ నీరు ఉలవపాడు మండలం చాగల్లు చెరువుకు చేరుతుంది. చెరువు నిండిన అనంతరం మిగులు జలాలు సముద్రం పాలవుతాయి.

ప్రభుత్వానికి నివేదిస్తాం

ఎలికేరు నుంచి కాలువ ద్వారా చెరువు వరకు నీటిని తీసుకుని రావడం సులభం. అయితే చెరువు ఎగువ ప్రాంతంలో ఉండడంతో మోటార్లు ఉపయోగించాల్సి ఉంటుంది. నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిస్తాం.
–సీతారామయ్య, జేఈ, జలవనరులశాఖ

(c) eenadu

అద్దంకి
• అద్దంకి • దర్శి

నకిలీ విత్తనాలపై శాస్త్రవేత్తల ఆరా

మొక్కజొన్న కండెను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ఈ నెల 17న ఈనాడు దినపత్రికలో నకిలీ విత్తనాలతో రోడ్డునపడి... శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు వ్యవసాయ అధికారి డి. సుబ్బారెడ్డి గుంటూరు లాం శాస్త్రవేత్తలను సమాచారచ్చారు. దీంతో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, ఎంటమాలజీ శాస్త్రవేత్త డాక్టర్ డయానా గ్రేస్, ఏవో సుబ్బారెడ్డితో కలిసి మంగళవారం పంగులూరులో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ మేరకు అక్కడి రైతుల నుంచి పలు విషయాలపై ఆరా తీశారు. కొన్ని మొక్కజొన్న కండె నమూనాలను తీసుకెళ్లారు. వాటిని పరీక్షించిన అనంతరం లోపం ఎక్కడ చోటు చేసుకుందో వెల్లడిస్తామన్నారు. వారి వెంట అడ్వాంట ప్రతినిధి సాయి సుమంత్, మక్కెన శ్రీనివాసరావు, రైతులు తల్లపనేని శ్రీను, చిలుకూరి శ్రీనివాసరావు ఉన్నారు.

శనగ రైతుల్లో గుబులు

❒ వానజల్లులతో బిక్కుబిక్కు

బొమ్మనంపాడు దారిలో శనగ పంట తరలింపు

అద్దంకి, న్యూస్‌టుడే : శనగ రైతులకు వరుణ భయం వెంటాడుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం జల్లులు పడటంతో వారు బెంబేలెత్తారు. వారం రోజులుగా ఎండలు కాస్తుండటంతో శనగ కోతలు ఊపందుకున్నాయి. మండలంలోని బొమ్మనంపాడు, కొంగపాడు, తిమ్మాయపాలెం, మణికేశ్వరం, నాగులపాడు, వెంకటాపురం, కుంకుపాడు, తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున సాగు చేశారు. ప్రస్తుతం అద్దంకిలో రెండు శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. క్వింటా శనగ ధర రూ.5,875లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఎకరాకు గరిష్ఠంగా 8-10 క్వింటాళ్ల వరకు దిగుబడులు రానున్నాయి. ఈ నేపథ్యంలో త్వరగా శనగ కోతలు ముగించుకుని నూర్పిళ్లు చేసేందుకు రైతులు సిద్ధపడ్డారు. అయితే వర్షాలు పడుతుండటంతో వారంతా ఉరుకులు తీశారు. కొందరు పట్టలు కప్పగా..మరికొందరు వేరే ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

జె.పంగులూరు: మండలంలోని చందలూరు, పంగులూరు, బూదవాడ, తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్లపాడు, కోటపాడు, గ్రామాల్లో సుమారు 5200 ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. పంట ఎక్కువ భాగం కోత కోసి నూర్పిడి పనుల్లో ఉన్నారు. మంగళవారం జల్లులు పడటంతో వారు ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షం పడితే పంట ఎందుకూ పనికిరాదని వారు భయపడుతున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

దర్శి, న్యూస్‌టుడే: నడిచి వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఏఎస్సై బాజీబాబు తెలిపిన వివరాల మేరకు..దర్శి పట్టణం హ్యాపీ హోమ్స్ కాలనీలో నివసిస్తున్న పోలక ఆదెమ్మ ప్రైవేట్ పాఠశాలలో వంట ఆయాగా పని చేస్తున్నారు. ఈ నెల 21న పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలో స్కూటీపై వచ్చిన ఆగంతకుడు ఆదెమ్మ మెడలోని గొలుసు లాక్కొని పరారయ్యాడు. దాని విలువ రూ.1.44 లక్షలుంటుందని బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

నిర్వహణ నీరుగారి.. మొక్కలు మోడువారి..

❒ దర్శిలో గాడితప్పిన సుందరీకరణ

న్యూస్‌టుడే, దర్శి

పొదిలి రోడ్డులో ఎండిపోతున్న మొక్కలు

దర్శిలో సుందరీకరణ పనులు నీరుగారాయి. నిర్వహణ, నాణ్యతా లోపంతో మొక్కలన్నీ మోడువారాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయిందని పట్టణవాసులు వాపోతున్నారు.

పట్టణంలో ప్రధాన మార్గాలైన పొదిలి, కురిచేడు, అద్దంకి రోడ్లలో విభాగినుల మధ్యలో గతంలో ఏపుగా పెరిగిన కోనాకార్పస్ మొక్కలు తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటేందుకు గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. విభాగినులను రంగులతో తీర్చిదిద్దాలని యోచించారు. మొక్కలు నాటడానికి రూ.4 లక్షలు, రంగులకు రూ.8 లక్షలను పాలకవర్గం కేటాయించింది. ఎర్రమట్టి పోసి మంచి పుష్పజాతుల మొక్కలు, వాటి మధ్యలో పచ్చదనం నిమిత్తం మరికొన్ని మొక్కలను నాటారు. నిర్వహణ లేక మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. మిగతావి నీరులేక వాడిపోయి కాండాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇక పట్టణంలో రాజకీయ పార్టీల ఏ చిన్న సమావేశం జరిగినా డివైడర్లను గోడపత్రాలతో నింపేస్తున్నారు. కొందరు ఆ మొక్కలకే ఫ్లెక్సీలు కడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇక కలుపు మొక్కలు సైతం తొలగించని పరిస్థితి. మందుబాబులు విభాగినులపైనే సేదతీరుతూ ఉన్న మొక్కలను చిందరవందర చేస్తున్నారు.

రూ.లక్షలు దిగమింగి..

సుందరీకరణ పేరుతో గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. విభాగినులపై ఏర్పాటుచేసిన విద్యుత్తు స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సీతాకోకచిలుక ఆకారంలో ఉండే వాటిని నెలకొల్పారు. తొలగించిన పాత స్తంభాలను పట్టణంలో పుచ్చలమెట్ట, తూర్పుచౌటపాలెం రోడ్డులో ఏర్పాటుచేసి కొత్తవి బిగించామని బిల్లులు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. అప్పట్లో సుందరీకరణ పేరిట భారీగా నిధులు దిగమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కమిషనర్ శ్రీరామమూర్తిని వివరణ కోరగా ఇటీవల మొక్కల మధ్యలో ఎర్రమట్టి పోసి నిర్వహణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మొక్కల సంరక్షణకు శ్రద్ధ తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

అద్దంకి మేదరమెట్ల, న్యూస్‌టుడే:

?: మేదరమెట్ల గ్రామంలో పాత గుంటూరు రోడ్డులో కూడలి వద్ద వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. – సురేష్, స్థానికుడు

✓: ర.భ.అధికారులతో మాట్లాడి వేగ నిరోధకాలు ఏర్పాటు చేయిస్తాం.
– మహమ్మద్ రఫీ, ఎస్సై, మేదరమెట్ల

కురిచేడు, న్యూస్‌టుడే:

?: మండలంలోని దేకనకొండ పంచాయతీలోని మర్లపాలెం గ్రామంలో పలు వీధుల్లో ఉన్న పక్కా కాలువల్లో మురుగు పేరుకుపోయింది. కాలువల్లో మురుగును తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.
– సుమంత్, స్థానికుడు

✓: రెండు రోజుల్లో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.
– రమేష్, పంచాయతీ కార్యదర్శి

అద్దంకి మేదరమెట్ల, న్యూస్‌టుడే:

?: మేదరమెట్లలోని మిద్దెలడొంకలో విద్యుత్తు పరివర్తకానికి పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సమస్యను పరిష్కరించగలరు.
– కోటేశ్వరరావు, స్థానికుడు

✓: వెంటనే పరివర్తకానికి అల్లుకున్న మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసరావు, ఏఈ, కొరిశపాడు మండలం

ముండ్లమూరు, న్యూస్‌టుడే:

?: మక్కెనవారిపాలేనికి తాగునీటి సరఫరా చేసేందుకు వేసిన పైపులైన్‌ను పూరిమెట్ల గ్రామం వరకు నిర్మించి వదిలి వేశారు. సమస్యను పరిష్కరించాలి. – ఎన్.ప్రసాదు, గ్రామస్థుడు

✓: గ్రామానికి తాగునీటి సరఫరా చేసేందుకు ప్రత్యేక నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులు మొదలుపెట్టి మార్చి చివరికి పూర్తి చేస్తాం.
– హనుమాన్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ముండ్లమూరు

ఉత్తమ ఫలితాలకు కృషి

పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

అద్దంకి, న్యూస్‌టుడే : పదో తరగతి విద్యార్థులు కష్టించి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అన్ని జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్ని చీరాల ఉప విద్యాధికారి డి. గంగాధర్‌రావు, ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ప్రతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధంగా చూసుకోవాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్నారు.

గుంతల దారితో అవస్థలు

పోలేరమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో రహదారిపైన పడిన గుంత

కురిచేడు: కురిచేడు నుంచి వినుకొండ వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశం, పల్నాడు జిల్లాల సరిహద్దులో ఉన్న పోలేరమ్మ అమ్మవారి ఆలయం నుంచి చింతలచెరువు గ్రామం వరకు ఉన్న ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో ఉన్న భారీ గుంతలు పడ్డాయి. దీంతో ఆ మార్గంలో వెళుతున్న వాహనాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా గుంతలకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

హాకీ అభివృద్ధికి కృషి అభినందనీయం

మైనంపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: హాకీ క్రీడాభివృద్ధికి ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి చేసిన కృషి అభినందనీయమని జిల్లా హాకీ సంఘం కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి, మైనంపాడు హాకీ సంఘం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిరంజన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆయన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల జీవితాల్లో వెలుగులు నింపిన నిస్వార్థ హాకీ సేవకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు హాకీ క్లబ్ అధ్యక్షుడు గొడుగు కాలేషా, ఆకుల బ్రహ్మయ్య, తిరుమలశెట్టి రవికుమార్, చంద్రశేఖర్, రవి, పీడీ వనజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా సర్వే పూర్తి చేయండి

కొత్తపట్నం: యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఇంటి పన్ను వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్పీవో ఆర్.పద్మ ఆదేశించారు. మంగళవారం కొత్తపట్నం మండలం మడనూరులోని సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. . ఇప్పటికే గ్రామాల్లో ఇంటి పన్నుల విషయంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. త్వరగా వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. యూఎఫ్ఎస్‌ను కూడా ఈ నెల చివరి నాటి పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవోలు వేణుగోపాల కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, బాలాజీనాథ్ పాల్గొన్నారు.

మరమ్మతులన్నీ.. మమ

కొండాయపాలెం ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డు పై వేసిన తారు

బల్లికురవ, న్యూస్‌టుడే: రహదారుల నిర్మాణంలో నాణ్యత ఎంతో ముఖ్యం. అయితే మొక్కుబడిగా చేస్తున్న పనులతో ప్రయోజనం లేకుండాపోతోంది. చెన్నుపల్లి - కొండాయపాలెం గ్రామాల మధ్య రోడ్డు శిథిలమవ్వగా..ఇటీవల ఈనాడులో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టారు. కొండాయపాలెం పాఠశాల సమీపంలో సోమవారం సాయంత్రం పనులు చేశారు. అయితే మంగళవారం మధ్యాహ్ననికే తారు రోడ్డు అంచుల్లోకి కారిపోయింది. కొన్నిచోట్ల తారు లేచి అధ్వానంగా మారింది.

మొక్కలు నాటిన విద్యార్థులు

తాళ్లూరు: బొద్దికూరపాడులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థిని పోలంరెడ్డి జ్యోషికా సాయి తన పుట్టినరోజు సందర్భంగా స్కూలు ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటింది. హెచ్ఎంలు పి.సుబ్బారావు, కె.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు శర్మ, విజయకుమారి, హరిత, రేవతి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రయాణమే ఓ సాహసం

ఆ మార్గంలో ప్రయాణమంటేనే వాహన చోదకులకు ఓ పరీక్ష. కొండాయపాలెం - మల్లాయపాలెం గ్రామాల మధ్య గ్రానైట్ క్వారీల ప్రాంతం నుంచి వెళ్లాలంటే ప్రయాణికులకు నరకమే. గ్రానైట్ టిప్పర్లు వెళితే దుమ్మూ, ధూళి కమ్మేస్తుంది. వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులకు రోడ్డు కనపడకపోవడంతో అదుపు తప్పి పడిపోతున్నారు. క్వారీల నిర్వాహకులు రోడ్ల పై నీరు చల్లించాలని ఇటీవల తహసీల్దార్ ఆదేశించినా ఫలితం లేదు. –న్యూస్‌టుడే, బల్లికురవ

త్రుటిలో తప్పిన ముప్పు

వరి పొట్టు లారీ ఒక్కసారే బోల్తాపడటంతో ఆ మార్గంలో వెళుతున్న వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో పొట్టు లారీ పక్కన వాహనాలేవీ లేకపోవడంతో ముప్పు తప్పింది. మంగళవారం తెల్లవారుజామున అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిలో వైదన సమీపంలో ఈ ఘటన జరిగింది. ఏల్చూరి వైపు నుంచి అద్దంకి వెళుతున్న వరి పొట్టు లారీ అదుపుతప్పి రోడ్డు అంచువైపు దూసుకుపోయి బోల్తాపడగా డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. –న్యూస్‌టుడే, బల్లికురవ

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనబాట

ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సంతమాగులూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు దీక్షలను ప్రారంభించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని ఆయనన్నారు. నాగమణి, నాగమల్లి, మస్తాన్‌బీ, కోటేశ్వరి, చిన్నమ్మాయి, పావని కార్యకర్తలు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, సంతమాగులూరు:

దర్శిలో చురుగ్గా అభివృద్ధి పనులు

దర్శి పట్టణంలో ఇటీవల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య వాటిని పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో జోము కాలువ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. రూ.50.5 లక్షలతో చేపట్టిన పనుల పరిశీలనలో ఛైర్మన్‌తో పాటు కమిషనర్ శ్రీరామమూర్తి, అధికారులు పాల్గొన్నారు.
–న్యూస్‌టుడే, దర్శి

ఇళ్లు కూల్చి.. వంతెన మరిచి..

కొరిశపాడు మండలం తిమ్మనపాలెం సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద వాహనాల రద్దీ దృష్ట్యా జాతీయ రహదారిపై వంతెన నిర్మించాలని గతంలో హైవే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. నివాస స్థలం, ఇళ్లు కోల్పోయే వారికి అవార్డు అందించారు. ఆరు నెలల క్రితం ఇళ్లను కూడా కూల్చివేశారు. అయితే ఇప్పటికీ వంతెన పనులు ప్రారంభించలేదు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. హైవే అధికారులు స్పందించి జాతీయ రహదారిపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, మేదరమెట్ల

ఆర్టీసీ డిపోల ప్రైవేటుపరం తగదు

ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద ఎన్ఎంయూ సిబ్బంది నిరసన

అద్దంకి, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు డిపోలను ప్రైవేటు పరం చేసి ఓ సంస్థకు నిర్వహణ అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎన్ఎంయూ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎంయూ నాయకత్వం పిలుపు మేరకు మంగళవారం ఉదయం 5 గంటల నుంచి ఎర్రబ్యాడ్జీలు ధరించి సిబ్బంది విధులకు హాజరయ్యారు. అనంతరం గేట్‌మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, డిపో కార్యదర్శి ఆంజనేయులు, కేబీ ప్రకాష్, ఏంకే రావు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిసలు కావొద్దు

ప్రతిజ్ఞ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు, కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపకులు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దని బాపట్ల ఎక్సైజ్ సహాయ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు కోరారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి.మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉంటే మంచి జీవితం సొంతమవుతుందన్నారు. మత్తు పదార్థాల వినియోగించడం, లేదా విక్రయించడం నేరమన్నారు. అద్దంకి ఎక్సైజ్ సీఐ భవానీ, అధ్యాపకులు రాజశేఖర్, వి.రామకృష్ణ, డాక్టర్ ఎస్‌కే మస్తాన్‌వలీ, డాక్టర్ బి.అశోక్‌కుమార్, డాక్టర్ వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కరించరూ!

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మోదేపల్లి ఎస్సీకాలనీ వాసులు

అద్దంకి, న్యూస్‌టుడే: తమ శ్మశానవాటిక సమస్య పరిష్కరించాలని మోదేపల్లి ఎస్సీ కాలనీవాసులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గుండ్లకమ్మ జలాశయం ఏర్పడక పూర్వం చిలకలేరు ఆవలి వైపున ఖనన సంస్కారాలు నిర్వహించే అవకాశముండేదన్నారు. ఈ నెల 16న ఎస్సీ కాలనీకి చెందిన వ్యక్తి మృతిచెందగా, ఖననం చేసేందుకు వెళ్లగా గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. చివరకు వీఆర్వో జోక్యంతో ఆ వివాదం సద్దుమణిగిందని, ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఇరు వర్గాలపై కేసుల నమోదు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ఘర్షణపై ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బృందావం తండాకు చెందిన వడితే తులసీనాయక్, బూక్యా ఏడుకొండలు నాయక్ కుటుంబాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న వడితే విజయ గేదెలు తోలుకుని వెళుతుండగా, నీళ్ల పైపులు దెబ్బతింటాయని బూక్యా ఏడుకొండలు అడ్డుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో శ్రీనునాయక్, చక్రవర్తి నాయక్ కలసి తులసీనాయక్‌పై దాడి చేశారు. ఘటనపై ఇరు వర్గాలు ఫిర్యాదులు చేయడంతో మంగళవారం రెండు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై హనుమంతరావు తెలిపారు.

గొంతెండుతోంది మహాప్రభో !

❖ రెండు నెలలుగా నీటికష్టాలు

న్యూస్‌టుడే, దొనకొండ:

నిండా నీరు ఉన్న చందవరం-1 చెరువు

వేసవి రాకుండానే పల్లెల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బిందెనీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు. నీటి వనరులు కళకళలాడుతున్నా తమ దరికి చేరడం లేదని వారు వాపోతున్నారు.

దొనకొండ ప్రాంతంలో నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. అక్కడి 11 గ్రామాలకు 90 ట్రిప్పుల ట్యాంకర్ల నీటి సరఫరాను గుట్టుచప్పుడు కాకుండా గత రెండు నెలల క్రితం ఆపేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకర్లు నిలిచిపోయినట్లు సమాచారం. భూగర్భజలాలు అడుగంటిపోవటంతో చేతిపంపులు, డీప్‌బోర్లకు నీరు రావటం లేదు. చందవరం-1 చెరువు వద్ద గత 40 రోజుల నుంచి రూ.2.55 కోట్లతో పనులు జరుగుతుండటంతో సరఫరా ఆపారు. మరో నెల వరకు ఇవి జరిగే అవకాశముంది. దీంతో అప్పటి వరకు ఆ నీరు కూడా అందదు. దీంతో స్థానికులు పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. పనులు మానుకొని వెళ్లాల్సి వస్తోందని, దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని పేదలు వాపోతున్నారు. సంగాపురం గ్రామానికి సాగర్ నీరు నిలిచి ఏళ్లు గడుస్తోంది. ప్రస్తుతం ట్యాంకర్ నీరు కూడా ఆగిపోవడంతో వారికి దిక్కుతోచడం లేదు. 12 సంవత్సరాల క్రితం హైలెవల్ ట్యాంక్ నిర్మించారే తప్ప ఇంతవరకు చుక్క నీటికి కూడా వదల్లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను వెంటనే తీర్చాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ట్యాంకర్ల నీరు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్ చెప్పారు. మంచినీటి చెరువు వద్ద పనులు జరుగుతున్నాయని, పూర్తయిన వెంటనే సాగర్ నీరు సరఫరా చేస్తామన్నారు.

పక్కా ఏర్పాట్ల మధ్య ఇంటర్ పరీక్షలు

అద్దంకి : ప్రభుత్వ జూనియర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

అద్దంకి, న్యూస్‌టుడే : ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు మంగళవారం పక్కా ఏర్పాట్ల నడుమ ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వభారతి, శ్రీచైతన్య జూనియర్ కళాశాల కేంద్రాల వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. మొత్తం 911 మందికి గానూ 38 మంది గైర్హాజరయ్యారు. నిర్ణీత గడువు ముగుస్తుండటంతో కొంతమంది ఉరుకులు, పరుగులతో పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చారు. కళాశాల సిబ్బంది హాల్‌టికెట్ నంబర్లను చూసి విద్యార్థులను పరీక్షగదికి పంపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. వైద్య సిబ్బంది సేవలు అందించారు.

దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద..

తాళ్లూరు: తాళ్లూరులోని వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన తెలుగు పరీక్షకు ఇద్దరు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి వై.వేణుగోపాల్ తెలిపారు. 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. చరవాణుల ప్రవేశానికి వీల్లేకుండా ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు.

దర్శి: దర్శి పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో 1,503 మంది విద్యార్థులకు గానూ 1,437 హాజరయ్యారు. అధికారులు, పోలీసులు పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్‌లను మూసివేయించారు. మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు ఆపసోపాలు పడుతూ ఆటోల్లో పరీక్షా కేంద్రాలకు వచ్చారు. పరిమితికి మించి ప్రమాదకరంగా వచ్చారు.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తిలోని రెండు కేంద్రాల్లో ద్వితీయ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి 185 మంది విద్యార్థులను కేటాయించగా అయిదుగురు హాజరు కాలేదు. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రానికి 240 మందిని కేటాయించగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల అధికారులు తెలిపారు. ❖ నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉప్పుగుండూరులోని రెండు ఒకేషనల్ కళాశాలలు, అమ్మనబ్రోలు ఎమ్ఎస్ఆర్ జూనియర్ కళాశాల, నిడమానూరు ఉన్నత పాఠశాల ప్లస్‌టూ, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మొత్తం అయిదు కళాశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 163 మందికి 154 మంది హాజరుకాగా, 9 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారి సురేష్ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ఆఫీస్ చిరునామా: డి.నెం: 9-333, పెంట్యాల ప్లాజా, బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన, గీతా మందిర్ ఎదురుగా, అద్దంకి, ప్రకాశం జిల్లా-523201.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II, చెన్నై, తేదీ: 09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది. మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా: **అద్దంకి, డి.నెం.9-333, పెంట్యాల ప్లాజా, బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన, గీతా మందిర్ ఎదురుగా, అద్దంకి, ప్రకాశం జిల్లా-523201.** లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్.బి.ఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు). ఇందుమూలముగా ఈ క్రింది నోటీసు జారీ చేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండా తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/ సహ ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) పేర్లు:
1. **షేక్ అబ్దుల్లా,** తండ్రి: షాజహాన్, డి.నెం: 17-25-705, ఇస్లాం పేట-2, 1వ లైన్, ఒంగోలు పోస్ట్ మరియు మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523001.
2. **షేక్ షాజిదా,** భర్త: అబ్దుల్లా, డి.నెం: 17-25-705, ఇస్లాం పేట-2, 1వ లైన్, ఒంగోలు పోస్ట్ మరియు మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523001.
3. **బెంగళూరి సురేష్ కుమార్,** తండ్రి: జలయ్య, డి.నెం: 24-33, కృష్ణ వీధి, కోర్టు సెంటర్, ఒంగోలు పోస్ట్ మరియు మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523001.

ఎన్.పి.ఎ తేది: 30.04.2020

డిమాండ్ నోటీసు తేది: 24.01.2026

ఋణం మొత్తం : రూ. 5,00,000/- (అక్షరాలా ఐదు లక్షల రూపాయలు)

బకాయి మొత్తం : ది. 24.01.2026 నాటికి రూ. 22,30,971/- (అక్షరాలా ఇరవై రెండు లక్షల ముప్పై వేల తొమ్మిది వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే)

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. ADDAKTF1905280015

ఆస్తి వివరములు: ADDAKTF1905280015 – స్థిరాస్తి యొక్క వివరణ: షేక్ షాజిదా, భర్త: అబ్దుల్లా, వైడ్ డాక్యుమెంట్ నెం. 4613/2019 ద్వారా, ఒంగోలు సబ్-రిజిస్ట్రార్.
ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, ఇస్లాం పేట-2, వార్డు నెం.3, బ్లాక్ నెం.1, టి.ఎస్.నెం.17, డి.నెం. 37-1-160 (44) కి సమీపంలో గల ఖాళీ స్థలం. **హద్దులు: తూర్పు:** షేక్ షమీమున్నీసా, భర్త షేక్ వలి యొక్క ఆస్తి – 44 అడుగులు, **పడమర:** అల్లాభక్షుకు అమ్మబడిన భూమి – 44 అడుగులు, **ఉత్తరం:** షేక్ మూసా గారి భూమి – 13 అడుగులు, **దక్షిణం:** 10 అడుగుల వెడల్పు గల బజారు – 13 అడుగులు. ఈ హద్దుల మధ్య గల 572 చదరపు అడుగులు లేదా 7 గదులు 68 చదరపు అడుగులు లేదా 63.5/9 చదరపు గజాలు లేదా 53.34 చదరపు మీటర్ల ఖాళీ స్థలం, మరియు దానితో కూడిన అన్ని సులభతర హక్కులు మరియు అనుబంధ హక్కులతో కలిపి.

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటిని అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: అద్దంకి — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ఆఫీస్ చిరునామా: డి.నెం: 9-333, పెంట్యాల ప్లాజా, బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన, గీతా మందిర్ ఎదురుగా, అద్దంకి, ప్రకాశం జిల్లా-523201.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

[illegible]

వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండా తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/ సహ ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) పేర్లు:
1. **చిన్నదొరై సామ్సన్,** తండ్రి: చిన్నదొరై, ఫ్లాట్ నెం: 401, ప్రకాశం టవర్స్, ఒంగోలు పోస్ట్ మరియు మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523001.
2. **నిరూప సామ్సన్,** భర్త: చిన్నదొరై సామ్సన్, ఫ్లాట్ నెం: 401, ప్రకాశం టవర్స్, ఒంగోలు పోస్ట్ మరియు మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523001.
3. **సింగం భాస్కర్ రెడ్డి,** తండ్రి: చిన్న నాగి రెడ్డి, డి.నెం: 16-145, పాటిమీదపాలెం, బండ్లమూరు గ్రామం, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523226.

ఎన్.పి.ఎ తేది: 30.09.2019

డిమాండ్ నోటీసు తేది: 24.01.2026

ఋణం మొత్తం : రూ. 10,00,000/- (అక్షరాలా పది లక్షల రూపాయలు)

బకాయి మొత్తం : ది. 24.01.2026 నాటికి రూ. 34,91,251/- (అక్షరాలా ముప్పై నాలుగు లక్షల తొంభై ఒక్క వేల రెండు వందల యాభై ఒక్క రూపాయలు మాత్రమే)

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. ADDAKTF1709260001

ఆస్తి వివరములు: ADDAKTF1709260001 – స్థిరాస్తి యొక్క వివరణ: చిన్నదొరై సామ్సన్, తండ్రి: చిన్నదొరై, డాక్యుమెంట్ నెం. 6955/2017 ద్వారా, ఒంగోలు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం.
ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్-జిల్లా, టంగుటూరు మండలం, సూరారెడ్డిపాలెం గ్రామ పంచాయతీ, వల్లూరు గ్రామ ఖాతా పరిధిలోని, సర్వే నెం.284/1 లో ఎకరా 0.23 సెంట్లు, సర్వే నెం.248/2 లో ఎకరా 0.40 సెంట్లు మరియు సర్వే నెం.284/5 లో ఎకరా 0.30 సెంట్లు, మొత్తం కలిసి ఒకే చోట ఉన్న ఎకరా 0.93 సెంట్ల భూమిని లేఅవుట్ ద్వారా ఇంటి స్థలాలుగా మార్చబడిన దానిలో ప్లాట్ నెం.లు 138, 139, 150 మరియు 151. **హద్దులు: తూర్పు:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు – 60 అడుగులు, **పడమర:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు – 60 అడుగులు, **ఉత్తరం:** ప్లాట్ నెం.132 మరియు 152 లోని స్థలం – 80 అడుగులు, **దక్షిణం:** ప్లాట్ నెం.140 మరియు 149 లోని స్థలం – 80 అడుగులు. ఈ హద్దుల మధ్య గల 4800 చదరపు అడుగులు లేదా 66 గదులు 48 చదరపు అడుగులు లేదా 533.39 చదరపు గజాల ఖాళీ స్థలం మరియు దానితో కూడిన అన్ని సులభతర హక్కులతో కలిపి.

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటిని అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: అద్దంకి — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

లీకులు.. కలుషితమవుతున్న జలాలు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

వేసవి చెరువుల్లో తాగునీరు పుష్కలంగా ఉన్నా.. పంపిణీలో లోపాలు ఒంగోలు నగర ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వేసవిలో సరిగా నీరు విడుదల చేయడం ఒక సమస్య అయితే, పైపులైన్లకు పడుతున్న లీకుల వల్ల కలుషిత నీరు సరఫరా కావడం మరో ఇబ్బంది. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం వీటిని అరికట్టడానికి మీనమేషాలు లెక్కిస్తోంది. కుళాయిలకు నీరు విడుదల చేసినప్పుడు ఆయా ప్రాంతాల సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు లీకులు పరిశీలించాలి. ఎక్కడైనా నీరు రాకపోతే వెంటనే సమస్య పరిష్కరించడానికి కమిషనర్ కార్యాలయానికి తెలియజేయాలి. నిర్ణీత సమయంలో నీరు విడుదల చేయకపోతే ఏ సమయంలో ఇస్తారనేది ఆయా ప్రాంతాల ప్రజలకు తప్పనిసరిగా తెలియజేయాలి. ఇవన్నీ సక్రమంగా అమలు కావడంలేదు. మరోవైపు లీకుల రిపేరులో తీవ్ర జాప్యం జరుగుతోంది.

గుర్తించడమే అసలు సమస్య..

ఒంగోలులోని అన్నవరప్పాడు కాలనీ రెండో లైన్‌లో వారం నుంచి కుళాయిల్లో కలుషిత నీరే వస్తోంది. ఎక్కడ లీకు ఉందో ఇంతవరకు గుర్తించలేకపోయారు. అక్కడి ప్రజలు బయట ప్లాంట్ల వద్ద క్యాన్లు కొనుగోలు చేసి వాడుకుంటున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో పోతురాజుపాలెం వద్ద పైపులైన్ దెబ్బతిని కలుషిత నీరు సరఫరా అవుతోంది. అంజయ్య రోడ్డు బృందావన్ నగర్‌లోనూ కలుషితమైన నీరే వస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ మస్తానమ్మ కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీ కాలనీలో ఎయిర్ వాల్వు వద్ద లీకై నీరు వృథా అవుతోంది. ఇలా నగర వ్యాప్తంగా పైపులైన్లకు పదుల సంఖ్యలో లీకులు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఎయిర్ వాల్వులు లేకపోవడంతో..

నగరంలో ప్రస్తుతం ఉన్న పైపులైన్లకు కాలం చెల్లింది. పురపాలక సంఘం ఏర్పడినప్పుడు వేసిన పైపులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వాటిని మార్చి కొత్తవి వేయడానికి నిధుల కొరత వల్ల పట్టించుకోవడం లేదు. నీరు వదిలినప్పుడు ఒత్తిడికి పైపులు పగిలిపోతున్నాయి. అక్కడక్కడ ఎయిర్‌వాల్వులు ఏర్పాటు చేస్తే గాలి బయటికి పోయి లీకులు రాకుండా ఉంటాయని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. వాటిపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. కేవలం లీకుల రిపేరుకు ఏడాదికి రూ.30 లక్షలు ఖర్చుపెడుతున్నారు. దీనిపై మున్సిపల్ ఇంజినీర్ ఏసయ్యను వివరణ కోరగా అమృత్-2 నిధులతో పాత పైపులైన్ల మొత్తం తొలగించి కొత్తవి వేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీనగర్‌లో పైపులైన్ మరమ్మతు కోసం గుంత తీస్తున్న కూలీ

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

మద్దిపాడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా ఈ నెల 17న మండలంలోని 1 నుంచి 19 సంవత్సరాల లోపు వారికి మాత్రలు మింగించారు. ఆ రోజు అందుబాటులో లేని వారికి వైద్య సిబ్బంది మాత్రలను అందజేశారు. ఇనమనమెళ్లూరు నేతాజీ పాఠశాలలో డీపీఎంవో వరప్రసాద్ మాత్రలు పంపిణీని పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం: 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు: 8247324766
కొత్తపట్నం: 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: ఒంగోలు నగరంలోని జడ్పీ కాలనీ నాలుగో లైన్‌లో మురుగుకాలువ ఒక వైపు నిర్మించి, రెండో వైపు నిర్మించలేదు. మురుగునీరంతా ఇక్కడే నిలిచిపోతుంది. - ఉపేంద్రరావు, స్థానికుడు

✓: నిధుల లభ్యతను బట్టి ఈసారి టెండరు పిలిచినప్పుడు ఆ కాలనీలో సమస్య పరిష్కరిస్తాం. - ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: వారం రోజులుగా అన్నవరప్పాడు కాలనీలో నీరు దుర్వాసనతో వస్తుంది. -స్థానికులు

✓: రెండు రోజుల్లో వాటర్‌వర్క్స్ విభాగం సిబ్బందిని పంపించి పరిశీలించి లీకులు ఉంటే అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: కొత్తపట్నం బీసీ కాలనీలో కొన్ని వీధుల్లోకి చెత్త సేకరణ వాహనాలు రావడం లేదు. దీంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇంటిలో ఉండటంతో దుర్వాసన వస్తుంది. అధికారులు స్పందించి ప్రతి వీధికి వాహనాలు వచ్చేలా చూడాలి. -సురేష్, స్థానికుడు

✓: వెంటనే పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. -ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

?: మద్దిపాడు ఇందిరమ్మ కాలనీకి నీరు వెళ్లే పైపులు లీకయ్యాయి. దీనివల్ల శివారున ఉన్న ఇళ్లకు నీరు సక్రమంగా అందడం లేదు. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలి. -షేక్ హసీనా, ఇందిరమ్మ కాలనీ

✓: పైపులైన్‌కు మరమ్మతులు చేయించి, ప్రతి ఇంటికి నీరు అందేలా చూస్తాం. -నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

-న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, కొత్తపట్నం, మద్దిపాడు

దోమ తెరతో ఆందోళన చేపట్టిన ఐద్వా నాయకులు

దోమల నివారణ చర్యలు తీసుకోవాలని నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక డిపోబండ్డులో మంగళవారం దోమ తెరతో వినూత్న నిరసన ప్రదర్శన చేపట్టారు. ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు కుడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు శుభ్రం చేయకపోవడం కారణంగానే వాటి ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. వీటి నివారణకు నిధులు కేటాయించడంతోపాటు, నిరంతరం ఫాగింగ్ చేయాలని కోరారు. పోతురాజు కాలువ ఆదునికీకరణ చేయడంతోపాటు, రోజూ మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రమేష్, ఐద్వా నాయకురాలు బి.రంగమ్మ, జి.కల్యాణి, ఆంజనేయదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

చీమకుర్తి: చీమకుర్తి- దిన్నేపురం కూడలిలో విగ్రహాల ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య తలెత్తిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. తహసీల్దారు ఆర్. బ్రహ్మయ్య, సీఐ ఎం.ప్రసాద్ సంయుక్తంగా ప్రాంతాన్ని పరిశీలించారు. విగ్రహాల ఏర్పాటు విషయమై తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో స్థానికంగా ఉన్న ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలిగించ వద్దని సూచించారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే తప్ప ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఉంటే లిఖిత పూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. పురపాలక సంఘం నుంచి తగిన అనుమతులు లభించిన తర్వాత మాత్రమే పనులు చేసుకోవాలని సూచించారు. సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితులతో ఆ ప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

❖ **కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన..**

దిన్నేపురం కూడలిలో విగ్రహాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని, ఈ విషయమై పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక మహిళలు పురపాలక సంఘంలో అర్జీ ఇచ్చారు. తాము వచ్చిన సమయంలో కమిషనర్ కార్యాలయంలో లేకపోవడంపై వారు కొంత సేపు కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్త్రీ నిధి, సీఐఎఫ్, ఉన్నతి పథకాల్లో బ్యాంకు లింకేజీ రుణాలను నూరుశాతం వసూళ్లకు చర్యలు చేపట్టాలని వెలుగు ఏపీఎం బాబూరావు సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. నారీ సభ్యులు తమ సర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని సూచించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.మేరిమ్మ, కార్యదర్శి కె.పద్మావతి, సీసీలు పాల్గొన్నారు.

రహదారులకు నిధులు కేటాయించండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అమరావతిలోని సచివాలయంలో మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూర్వోదయ పథకం కింద రాయలసీమతో పాటు, వెనుకబడిన ప్రకాశం జిల్లా యూనిట్‌గా ఉద్యాన హబ్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిన నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని కొత్తపట్నం, ఒంగోలు మండలాల నుంచి మిరపతోటలు, ఇతర ఉద్యాన పంటల మార్కెటింగ్‌కు అనుసంధానంగా గ్రామ రోడ్ల అభివృద్ధికి రూ.28 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరుపైనా విన్నవించారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

జేఈఈ మెయిన్స్ పేపర్-2లో విద్యార్థుల సత్తా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్ పేపర్-2 (బీఆర్క్, బీప్లానింగ్) ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఒంగోలు నగరంలోని శ్రీప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించారు. యెరువ వెంకట అమర్‌నాథ్‌రెడ్డి 98.5 పర్సంటైల్, కుమ్మర వెంకట కల్యాణ్‌రామ్ 97.72 పర్సంటైల్ సాధించారని కళాశాల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించారు. వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్ నారాయణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకట అమర్‌నాథ్‌రెడ్డి

వెంకట కల్యాణ్‌రామ్

మణిపాల్ క్లినిక్

ఇప్పుడు మన ఒంగోలులో
మణిపాల్ హాస్పిటల్ విజయవాడ నుండి
కాలేయ & జీర్ణకోశ వ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు
డా॥ బత్తిని రాజేష్
Consultant - Medical Gastroenterologist
ప్రతి నెల 2వ & 4వ శుక్రవారం మ॥ 2.00గం॥ల - సా॥ 4.00గం॥ వరకు అందుబాటులో ఉంటారు.
శాంతి నర్సింగ్ హోమ్
సుందరయ్యభవన్ రోడ్, ఒంగోలు. ✆ 70933 52666
మణిపాల్ హాస్పిటల్ విజయవాడ
వారధి దగ్గర, తాడేపల్లి - 522 501
ఫోన్ : 08645 669966
https://www.manipalhospitals.com/vijayawada/
manipalhospitals LIFE'S ON

సారూ.. చెత్త తొలగించరూ..!

సంతనూతలపాడు: తమ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి దుర్వాసనతోపాటు, రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని సంతనూతలపాడులో స్థానికులు మంగళవారం నిరసన చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, జడ్పీ ఉన్నత పాఠశాల, వీఐపీ రహదారి, ఆశ్రమానికి వెళ్లే మార్గాల్లో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయిందన్నారు. దీనిని తీయకపోవడంతో దుర్వాసన వస్తుందని, దోమల ప్రభావం ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. దాతల సహాయంతో చెత్త కుండీలను ఏర్పాటు చేసినా.. వాటిని పగలగొట్టారని వాపోయారు. పేరుకుపోయిన చెత్త విషయంపై పలు మార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా.. వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

చెత్తను చూపుతున్న మహిళలు, స్థానికులు

మద్దతు ధర దక్కాలంటే ముందస్తు నమోదు తప్పనిసరి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: శనగ, కంది పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు ఏవో పి.పావని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రుద్రవరం, గురవారెడ్డిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శనగ పంటకు క్వింటాకు రూ.5,875, కందికి రూ.8 వేలకు ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనే రైతులు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు సాగు చేసిన పంటను ఈ పంట నమోదును చేసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, వివరాలతో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ముందుగా శనగ పంటను పరిశీలించారు. ఏఈవోలు కె.వి.సుబ్బారెడ్డి, సహాయకులు వి.బాలసుబ్రహ్మణ్యం, డి.సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన

చీమకుర్తి: చీమకుర్తి పురపాలక సంఘం పరిధిలోని ఎన్టీఆర్ అర్బన్ కాలనీలో తాగునీటి వసతుల కల్పన కోసం అమృత్ పథకం కింద రూ.3.76 కోట్లు మంజూరయ్యాయి. పురపాలక సంఘం పరిధిలోని కె.వి.పాలెం, గంగవరం రహదారి, నాయుడుపాలెం రోడ్లలోని కాలనీల్లో తాగునీటి ట్యాంకులు, సంపులు నిర్మాణం కోసం ఈ నిధులు వెచ్చించారు. ఈ పనులను చేపట్టేందుకు టెండరు ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆయా కాలనీల్లో అనువైన స్థలాల కోసం మంగళవారం అధికారులు పరిశీలన చేశారు. నాలుగు కాలనీలను సందర్శించి వివిధ ప్రాంతాలను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, ప్రజారోగ్య విభాగం డీఈ తిరుపతిరావు, ఏఈ మరియదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ అభివృద్ధికి కృషి అభినందనీయం

మైనంపాడు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: హాకీ క్రీడాభివృద్ధికి ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి చేసిన కృషి అభినందనీయమని జిల్లా హాకీ సంఘం కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి, మైనంపాడు హాకీ సంఘం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిరంజన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆయన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల జీవితాల్లో వెలుగులు నింపిన నిస్వార్థ హాకీ సేవకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు హాకీ క్లబ్ అధ్యక్షుడు గొడుగు కాలేషా, ఆకుల బ్రహ్మయ్య, తిరుమలశెట్టి రవికుమార్, చంద్రశేఖర్, రవి, పీడీ వనజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వార్షిక వేడుక.. ఆనంద వీచిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని నాగార్జున డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ విద్యాసంస్థల ఛైర్మన్ వి.రాంప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఏ-1 కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ సి.వసంతలక్ష్మి అధ్యక్షత వహించారు. గత ఏడాది ఏకేయూ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మిగిలిన వారు తోటి విద్యార్థులను కేరింతలతో ఉత్సాహపరిచారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

నెలాఖరుకల్లా సర్వే పూర్తి చేయండి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఇంటి పన్ను వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్పీవో ఆర్.పద్మ ఆదేశించారు. మంగళవారం కొత్తపట్నం మండలం మడనూరులోని సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామాల్లో ఇంటి పన్నుల విషయంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. త్వరగా వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. యూఎఫ్ఎస్‌ను కూడా ఈ నెల చివరి నాటి పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవోలు వేణుగోపాల కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బాలాజీనాథ్ పాల్గొన్నారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచ్ : డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్-523001, (ఎ.పి), వెబ్‌సైట్ : www.shriramfinance.in

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం **2002** లోని సెక్షన్ **13 (2)** క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో '**శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్**' గా పిలువబడేది. ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా** తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు **ఒంగోలు-1 నందు బ్రాంచి ఆఫీస్** కలిగి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ/ఋణదాతగా సూచిస్తారు)

ఋణగ్రహీతలు/ సహ-ఋణగ్రహీత(లు) / హామీదార్లు /దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు/ హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3 తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు/ హామీదారులకు/ తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/ సహ- ఋణగ్రహీత(లు)/ హామీదార్ల యొక్క పేర్లు :
1) **తన్నీరు గురవయ్య, తండ్రి: అంజయ్య,** మెయిన్ రోడ్, మర్లపాడు (గ్రామం), టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523272.
2) **తన్నీరు గోవిందమ్మ, భర్త: గురవయ్య,** మెయిన్ రోడ్, మర్లపాడు (గ్రామం), టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523272.
3) **వల్లెపు వెంకటేశ్వర్లు, తండ్రి: రామయ్య,** డి.నెం. 4-123, వడ్డిపాలెం, మంగమూరు గ్రామం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా, పిన్:523225.
లోను అగ్రిమెంట్ నెం. **ONGL2TF1803280007**

NPA తేది	30-09-2019
డిమాండ్ నోటీసు తేది	27-01-2026
బకాయి మొత్తం	రూ. 23,10,208/- (అక్షరాల ఇరవై మూడు లక్షల పది వేల రెండు వందల ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు రావలసిన మొత్తం పూర్తిగా అందేవరకు దానిపై అయ్యే తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర వ్యయాలతో కలిపి.
లోను ఋణం మొత్తం	రూ. 10,00,000/-

ONGL2TF1803280007 - షెడ్యూలు ఆస్తి ఒంగోలు జాయింట్ సబ్-రిజిస్ట్రార్‌లోని దస్తావేజు నెం. **2658/2018** ప్రకారం **తన్నీరు గోవిందమ్మ, భర్త: గురవయ్య పేరుతో** కలదు.
ప్రకాశం రిజిస్ట్రేషన్ జిల్లా, ఒంగోలు సబ్ జిల్లా, టంగుటూరు మండలం, మర్లపాడు గ్రామ పంచాయితీ, మర్లపాడు గ్రామ కంఠం సర్వే నెం.333, ఇందులో మొత్తం విస్తీర్ణం ఎకరాలు 19.00 సెంట్లు. **దీనికి హద్దులు: తూర్పు:** పంచాయితీ రోడ్డు, **పడమర:** వై.చిన్న కొండయ్య గారి కాంపౌండ్ వాల్, **ఉత్తరం:** అమ్మకందారుడు వదిలిపెట్టిన 12 1/2 లింకుల వెడల్పు గల దారి, ఈ దారిని ఉపయోగించుకోవడానికి వై.చిన్న కొండయ్యకు మాత్రమే హక్కు కలదు. **దక్షిణం:** ఎమ్. వెంకటేశ్వర్లు గారి ఆస్తి.
ఈ పరిహద్దుల మధ్య గల ఎకరాలు 0.03 1/2 సెంట్లు లేదా 169.4 చదరపు గజాల లేదా 141.61 చదరపు మీటర్లు విస్తీర్ణం గల స్థలం మరియు అందులో నిర్మించిన ఆర్.సి.సి భవనం, దీని డోర్ నంబర్ 4-88 మరియు భవన నిర్మాణ విస్తీర్ణం 750 చదరపు అడుగులు.

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.
సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం: ఒంగోలు — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

సమ్మెలో 'సహకారం'.. అన్నదాతకు భారం

సంగం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు చేస్తున్న సమ్మె అన్నదాతల పాలిట శాపంగా మారింది. తొమ్మిది రోజులుగా ఎలాంటి పరిష్కారం లభించకపోవడంతో.. త్వరలో జరగనున్న ధాన్యం సేకరణపై ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ధాన్యం సేకరణ ఎలా?

ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా క్లస్టర్ విధానంలో 161 కేంద్రాలను ఎంపిక చేయగా.. అత్యధికం సహకారశాఖ పరిధిలోనే ఉన్నాయి. డీసీఎంఎస్‌తో కలిసి 149 నిర్వహించాల్సి ఉండగా.. సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయింది. తీరా ఉద్యోగులు ఇప్పుడు సమ్మెకు దిగారు.

తగ్గిన లావాదేవీలు

సహకార సంఘాల లావాదేవీలన్నీ కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 23 శాఖల ఆధ్వర్యంలోనే జరుగుతాయి. సమ్మె ప్రభావం బ్యాంకు శాఖలపై పడి.. లావాదేవీలు తగ్గాయి. రుణాలు పొందిన రైతుల నుంచి సెప్టెంబరు, మార్చి నెలల్లో తిరిగి వసూలు చేస్తుంటారు. ఇప్పుడు అవి నిలిచిపోయాయి. రుణ చెల్లింపులకు గడువు దాటితే.. అపరాధ రుసుం పడే అవకాశం ఉంటుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఈ విషయమై జిల్లా సహకారశాఖ అధికారి గుర్రప్పతో మాట్లాడగా.. త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆది దంపతులకు ఏకాంత సేవ

మనుబోలు మండలం చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలోని విశ్వనాథుని ఆలయంలో సోమవారం రాత్రి ఆదిదంపతులకు ఏకాంతసేవ కనుల పండువగా జరిగింది. అర్చకులు శ్రీనివాసులు వేదమంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్లు, పలహారాలు నైవేద్యంగా సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. – న్యూస్‌టుడే, మనుబోలు

ఒక్క ప్రమాదం.. తలకిందులైన జీవితం!

బాధ్యులు.. బాధితులకు తప్పని కష్టాలు

ఏడాదిగా మంచానికే..

మాది మర్రిపాడు. నా పేరు మహబూబ్‌బాషా. కారు డ్రైవరుగా వెళ్లేవాణ్ని. ఏడాది కిందట బాడుగకు నెల్లూరు వెళ్లి తిరిగొస్తుండగా.. మార్గమధ్యంలో కారు అదుపు తప్పి డివైడరును ఢీకొంది. ప్రమాదంలో కాలు, ఛాతి ఎముకలు విరిగాయి. ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు.. ఉన్నత వైద్యం చేయించుకునే స్తోమత లేకపోవడంతో.. ఏడాదిగా మంచానికే పరిమితమయ్యా. కనీస అవసరాలకూ ఎవరో ఒకరు తోడు ఉండాల్సిందే. కుటుంబాన్ని పోషించే బాధ్యత నా భార్య తీసుకుంది. హోటల్‌లో పని చేస్తూ.. అందరినీ చూసుకుంటోంది.

ఈనాడు, నెల్లూరు: ఒక్క ప్రమాదం.. అప్పటి వరకు ఆనందంగా సాగిన కుటుంబాల తలరాతను తలకిందులు చేస్తోంది. కొందరు చనిపోతే కుటుంబ సభ్యులకు తీరని క్షోభను మిగుల్చుతుంటే.. మరికొందరు తీవ్ర గాయాలతో బయటపడుతున్నా, వారి చికిత్సకు అయ్యే ఖర్చులు భరించలేక ఆ కుటుంబం అప్పుల పాలవుతోంది. అప్పటి వరకు ఆసరాగా ఉన్న కుటుంబ పెద్ద ఇంట్లో ఎటూ కదలలేని స్థితిలో ఉండిపోతే.. ఇంటిని చూసుకున్న ఇల్లాలు ఉపాధి నిమిత్తం గుమ్మం దాటాల్సి వస్తోంది. కాగా.. అత్యధిక ప్రమాదాలకు రోడ్డు భద్రతా సూచనలు పాటించకపోవడం.. మద్యం మత్తులో వాహనాలు నడపడం.. కారణాలుగా కనిపిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో 3,512 ప్రమాదాలు జరగ్గా.. 3,861 మంది క్షతగాత్రులయ్యారు. వీటిలో 1500 మందికి పైగా ఇప్పటికీ మంచానికే పరిమితమవడం.. సొంత పనులు చేసుకోలేని స్థితిలో ఉండటం.. నష్టాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

పరిమితి ఎంత..? పోతున్నదెంత?

రహదారి	గరిష్ఠ వేగ పరిమితి	దూసుకెళ్తున్నది
4 వరుసలు	80	100–120
6 వరుసలు	100	120–130
రాష్ట్ర రహదారులు	60	80–100

గడిచిన నాలుగేళ్లలో..
ప్రమాదాలు: 3,512
మరణాలు: 1,774
క్షతగాత్రులు: 3,861

ఓ ఆటో డ్రైవర్ తప్పిదంతో..

నా పేరు మల్లికార్జున్. మాది కోట మండలం గూడలి. నా భార్యతో కలిసి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై గూడూరు బయలుదేరాను. కోవూరు సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో మమ్మల్ని వేగంగా ఢీకొంది. తప్పించుకునే అవకాశం రాలేదు. ఆ దుర్ఘటనలో నా భార్య అక్కడికక్కడే చనిపోగా.. నాకు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నైలోని ఓ ఆసుపత్రిలో కాలర్‌బోన్ ఆపరేషన్ చేయించుకున్నా. రూ.14 లక్షల వరకు ఖర్చయింది. అప్పటి నుంచి పనులకు వెళ్లలేక ఇంట్లోనే ఉంటున్నా. దూరం తగ్గుతుందని ఆటో డ్రైవరు చేసిన తప్పిదం మాకు శాపమైంది.

బీపీఎస్‌లో.. కాసుల వేట!

ప్లానింగ్ కార్యదర్శుల చేతివాటంపై ఫిర్యాదు

"నెల్లూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కష్టార్జితంతో ఇక్కడ ఓ ఇంటిని నిర్మించుకున్నారు. భవన క్రమబద్ధీకరణ పథకం(బీపీఎస్)కు దరఖాస్తు చేసుకునేందుకు ఓ ప్లానింగ్ సెక్రటరీని సంప్రదించగా.. రూ. 70వేలు డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇవ్వలేనని చెప్పినా.. వినకపోవడంతో.. వాయిస్ రికార్డు చేసి ఇన్‌ఛార్జి మేయర్‌కు పంపారు. ఆయన దాన్ని కమిషనర్‌కు పంపి.. విచారణకు ఆదేశించారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు."

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే

అనధికార భవనాలు.. నిబంధనల ఉల్లంఘనలను సరిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన బీపీఎస్ పథకంలో గృహ యజమానులకు ఎంత ఊరట కలుగుతుందో ఏమోగానీ.. అధికారులకు మాత్రం కాసుల మార్గంగా మారింది. నగరంలో 54 డివిజన్లు ఉండగా.. 1.56 లక్షల గృహాలు ఉన్నాయి. గత అయిదేళ్లలో కనీస నిబంధనలు పాటించకుండా పెద్దఎత్తున భవనాలు నిర్మించారు. ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకుంటే.. అనుమతులు దక్కితే.. నగర పాలక సంస్థ మార్ట్‌గేజ్ బాండ్(తనఖా) విడుదల చేస్తుంది. ఇది జరిగితే భవిష్యత్తులో అదనపు అంతస్తుకు సులువుగా అనుమతి దక్కుతుంది. దాంతో పాటు బ్యాంకు రుణాలకు అవకాశం ఉంటుంది. దాంతో దరఖాస్తుకు ముందుకొస్తున్నారు. ప్లానింగ్ కార్యదర్శుల మామూళ్ల కారణంగా వెనకడుగు వేస్తున్నారు. బీపీఎస్‌కు అయ్యే ఖర్చు కన్నా.. వీరికిచ్చే మామూళ్లే ఎక్కువ అని వాపోతున్నారు. అధికారులు తగిన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దీనిపై కమిషనర్ వైవో నందన్ వివరణ కోరగా.. బీపీఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు మా దృష్టికి వస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ప్రతివారం ఈ అంశాలపై కార్యదర్శులతో సమీక్షిస్తామన్నారు.

ఇదీ సంగతి | వచ్చిన దరఖాస్తులు: 2039 | అప్రూవల్, షార్ట్‌ఫాల్స్: 1299 | పెండింగ్: 740

మైదానంలోనూ సై

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాపోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో భాగంగా పరుగు పందెంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తదితరులు.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు – న్యూస్‌టుడే, విజయవాడ

దీక్షగా పరీక్షకు..

566 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 81 కేంద్రాల్లో మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. కేంద్రాల వద్దకు ముందుగానే చేరుకున్న విద్యార్థులు.. తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు రాశారు. మొత్తం 26,034 మంది హాజరుకావాల్సి ఉండగా.. 566 మంది గైర్హాజరైనట్లు జిల్లా కన్వీనరు, ఆర్ఐవో టి.వరప్రసాదరావు తెలిపారు. నగరంతో పాటు మనుబోలు, వెంకటాచలంలోని పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రత్యేక అధికారి డీవీఈవో కృష్ణారెడ్డి మూడు, జిల్లా పరీక్షల కమిటీ 8, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు 36 కేంద్రాలను తనిఖీ చేశాయి. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వెల్లడించారు.

ఆ బిడ్డ స్ఫూర్తి.. ఆ తల్లి ప్రయత్నం

లక్ష్మీగణేశ్‌ను ఆటోలో పరీక్ష కేంద్రానికి తీసుకువస్తున్న తల్లి గాయత్రి

న్యూస్‌టుడే, పొదలకూరు: చిన్నప్పటి నుంచి అచేతనంగా ఉన్న కుమారుడిని అలాగే వదిలేస్తే భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళనలో ఆ తల్లిదండ్రులు ఉండగా- 'అమ్మా.. నేను చదువుకుంటా' అన్న బిడ్డ మాటలు వారిలో ఆనందాన్ని.. అంతకు మించిన ఆశలను రేకెత్తించాయి. అప్పటి నుంచి బిడ్డతో పాటు.. బిడ్డ చదువే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారు ఆ తల్లి.

మెదడు పాదరసం

పొదలకూరు పట్టణ పరిధిలోని చిట్టేపల్లికి చెందిన మహేశ్, గాయత్రీ దంపతులకు ముగ్గురు సంతానం. రెండో కుమారుడు లక్ష్మీగణేశ్‌కు పుట్టినప్పటి నుంచి కాళ్లు, చేతులు పని చేయకపోయినా.. మెదడు చురుగ్గా పని చేస్తుంది. దాంతో 1 నుంచి పదో తరగతి వరకు చదివించారు. ఆపై అతడికి చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించి ఇంటర్మీడియట్‌లో చేర్చారు. ఎంపీసీ చదువుతున్నారు. ప్రథమ సంవత్సరంలో 300కు పైగా మార్కులు సాధించారు. అతడి చదువును కొనసాగించాలనే ధ్యేయంతో మంగళవారం బిడ్డను ఇలా ద్వితీయ సంవత్సరం పరీక్షకు తీసుకొచ్చారు. ఆ బిడ్డ స్ఫూర్తిని.. ఆ తల్లి ప్రయత్నాన్ని అందరూ కొనియాడారు.

ఇద్దరు రౌడీ షీటర్లపై పీడీ యాక్ట్

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: పదే పదే నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు రౌడీషీటర్లపై చిన్నబజారు పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. వివరాలను చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వర రావు వెల్లడించారు. నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్ ప్రాంతానికి చెందిన షేక్ ఖైసర్‌పై చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటు ఉంది. నిత్యం అతనికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా మార్పులేదు. హత్య కేసుతో పాటు పలు కేసులు ఉన్నాయి. అలాగే జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన షేక్ ఉస్మాన్ అలియాస్ దావూద్ ప్రస్తుతం నెల్లూరు గ్రామీణ మండల పరిధిలోని వైఎస్సార్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతనిపై హత్య కేసుతో పాటు వివిధ కేసులు ఉన్నాయి. ఎన్‌డీపీఎస్ కూడా ఉంది. కలెక్టరు అనుమతితో ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఉత్తరక్రియలు

శ్రీ శింగాల రమణయ్య గారు

తేది 15-02-2026 ఆదివారం ఉదయం గం॥ 8-30 ని॥లకు స్వర్గస్థులైనారు. తేది 25-02-2026 బుధవారం ఉదయం 10-00 లకు నెల్లూరు, నవాబుపేట, రాయల్ రెసిడెన్సి అపార్ట్మెంట్ నందు మా స్వగృహము నందు పెద్దకర్మ జరుగును, కావున తెలియజేయడమైనది.
కుటుంబ సభ్యులు: లక్ష్మీ కాంతమ్మ, భార్య,
కొడుకులు: శింగాల నాగేశ్వరరావు, గంగాధరరావు యాదవ్ నాగార్జున యాదవ్, శరత్ బాబు యాదవ్
కోడలు: సుధా రాణి, ఉమా
మనమళ్లు: మురారి యాదవ్, మహీధర్ యాదవ్ హేమంత్ యాదవ్, చెరిష్ యాదవ్

ఏం జరిగినా... అలా సర్దుకుపోతారంతే!

చర్చనీయాంశంగా ప్రభుత్వ వైద్య కళాశాల వ్యవహారాలు

న్యూస్‌టుడే, నెల్లూరు(జీజీహెచ్)

- రెండేళ్ల కిందట ప్రభుత్వ వైద్య కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, క్లర్క్ కమ్ టైపిస్టు, ఇతర ఉద్యోగాల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. ఆర్డీ స్థాయిలో రెండు రోజులు ఇద్దరు అధికారులు, 46 మంది వైద్యులను విచారించారు. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారంటే.. ఇప్పటికీ సమాధానం లేదు. విచారణ రోజే ఎక్కడికక్కడ.. ఎవరికి వారు సర్దుకుపోయారన్న ఆరోపణలు వచ్చాయి.
- నెల రోజుల కిందట ఓ జూనియర్ అసిస్టెంట్ చెక్కుల్లో చేతివాటం ప్రదర్శించారు. రూ. 19 లక్షలు స్వాహా చేశాడు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుతో సరిపెట్టారు.
- తాజాగా అదనపు ఫీజుల పేరుతో వసూళ్ల విషయం వెలుగులోకి వచ్చింది. ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2వేల చొప్పున వసూలు చేశారని ఎన్టీఆర్ వైద్య వర్సిటీకి ఫిర్యాదు అందింది. నలుగురు ప్రొఫెసర్లను విచారణాధికారులుగా నియమించారు. సోమవారం విచారణ జరిగింది. తొలి రోజు విద్యార్థులను, రెండో రోజు మంగళవారం సిబ్బందిని విచారించారు. వసూళ్లు వాస్తవమని నిర్ధారించారు. బాధ్యులపై చర్యలు ఉంటాయా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.

అడ్డుకట్ట పడేనా?

అవినీతి, అక్రమాలు వెలుగు చూడటం.. విచారణలు జరపడం.. తర్వాత ఎక్కడికక్కడ సర్దుకుపోవడం.. తమ అనుకున్న వారిని కాపాడుకునేలా చక్రం తిప్పడం.. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సర్వసాధారణమైందన్న విమర్శలు నెలకొన్నాయి. అందుకు నిదర్శనం.. ఇప్పటి వరకు ఎన్ని విచారణలు జరిగినా.. బాధ్యులపై తీసుకున్న చర్యలు మాత్రం కానరావడం లేదు. ఏటా 175 మంది విద్యార్థులకు ప్రవేశాలు, సిబ్బంది కొరత లేదు. ఎక్కడా లేని వసతులు ఉన్నాయి. ఇంతటి కీలకమైన కళాశాలలో తరచూ ఏదో ఒకటి చోటు చేసుకోవడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని.. ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విచారణ జరుగుతోంది

విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే అంశంపై రెండు రోజులుగా విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు ఉంటాయి.
– డాక్టర్ రాజేశ్వరి, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల

హవ్వ.. మృతులే హక్కుదారులంట!

రీసర్వేలో మాయాజాలం

బిట్రగుంట, న్యూస్‌టుడే: రీసర్వే మాయాజాలంలో వందేళ్లనాటి, మరణించిన వారు కూడా హక్కుదారులుగా రికార్డుల్లో ప్రత్యక్షమయ్యారు. ఆ విషయం తెలిసి.. ప్రస్తుత అనుభవదారులు తల పట్టుకుంటున్నారు. పరిష్కారానికి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వివరాల్లోకి వెళితే... బోగోలు మండలం తాళ్లూరు, జక్కేపల్లి గూడూరు, కోవూరుపల్లి, ఉమామహేశ్వరపురం, మల్లాయిపాలెం, ముంగమూరు, సాంబశివపురం, సిద్ధవర వెంకటేశుపాలెం గ్రామాల్లో కొన్నాళ్ల కిందట రీసర్వే జరిగింది. అందులో తాళ్లూరులో రైతుల హక్కులు తారుమారయ్యాయి. గ్రామంలో 2,806 ఎల్‌పీఎం నంబర్లు ఉండగా.. 3701.74 ఎకరాల భూమి ఉంది. ఎక్కువ మందికి వారసత్వంగా భూములు సంక్రమించాయి. కాగా.. రీసర్వేలో చనిపోయిన వారు హక్కుదారులుగా ప్రత్యక్షమయ్యారు. పూర్వీకుల నుంచి వచ్చాయని అధికారులకు చెబుతుంటే.. ఆధారాలు చూపమనడంతో.. వీరి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వారసత్వ ధ్రువపత్రం తీసుకోవడానికి చుక్కలు కనిపిస్తున్నాయి. అగ్రిమెంట్ల ద్వారా కొనుగోలు చేసిన వారు కూడా ఎక్కువగానే ఉన్నారు. 'చుక్కల' చిక్కులు ఉన్నాయి. ఒకరి భూములు మరొకరి పేరుతో నమోదయ్యాయి. గతంలో ఓ తహసీల్దారు చట్టబద్ధం చేస్తానని నమ్మించి.. రికార్డులు మార్పులు చేశారని.. ఇప్పుడు దస్త్రాల్లో ఆ పేర్లు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై బోగోలు తహసీల్దారు శ్రీనివాసులురెడ్డి స్పందిస్తూ తాళ్లూరులో రీసర్వే అనంతరం సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనన్నారు. వచ్చిన విజ్ఞప్తులు పరిశీలించి.. రికార్డులు సక్రమంగా ఉన్నవాటిని పరిష్కరిస్తున్నామన్నారు.

ఉద్యోగం వస్తేనే.. ఇంటికొస్తానని చెప్పా..

'ఈనాడు'-ఈటీవీతో గ్రూపు-1 విజేత ఉదయ్‌శంకర్

న్యూస్‌టుడే, దుత్తలూరు

సమున్నత లక్ష్యం.. సాధనలో ఎన్నో ఆటుపోట్లు.. మరెన్నో సవాళ్లు.. ఓటమి ఎదురైనా వెనుకంజ వేయలేదు. గెలుపే ధ్యేయంగా పోరాడారు. గ్రూప్-1 సాధించి భళా అనిపించుకున్నారు దుత్తలూరుకు చెందిన భరతాల ఉదయ్‌శంకర్. వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికైన ఈయన తన విజయ ప్రస్థానాన్ని 'ఈనాడు-ఈటీవీ'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

'ఈనాడు' వ్యాసాలతో...

నా విజయానికి 'ఈనాడు' ఎంతో ఉపయోగపడింది. పరీక్షలకు సన్నద్ధత సమయంలో ఎడిటోరియల్ పేజీలోని వ్యాసాలు రోజూ చదివా. వాటిలోని ముఖ్యాంశాలను పాయింట్లుగా రాసుకున్నా. తద్వారా నా విజయం సులువు అయింది. నా విజయంలో తండ్రి గంగాధర్, తల్లి లలితా రాజ్యలక్ష్మి, అక్క సునందిని, తమ్ముడు ఉమాశంకర్ పాత్ర ఎంతో కీలకం.

వాటిని కాదనుకొని..

పదేళ్ల కిందట ఇంజినీరింగ్ పూర్తి కాగానే.. పలు సంస్థల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు వచ్చాయి. వాటిలో చేరినా.. నా మనసులో మాత్రం గ్రూప్-1 సాధించాలనే కోరిక అలాగే ఉండేది. దాంతో పరీక్షలు రాశాను. యూపీఎస్సీకి ఎంపిక కాకపోవడంతో కొంత నిరుత్సాహపడ్డా. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పారు. గ్రూప్-1లోనూ రెండు సార్లు విఫలమయ్యా. 2020-23 మధ్య కాలంలో మళ్లీ నోటిఫికేషన్ విడుదలైంది. అప్పటికే ఎల్అండ్‌టీ కంపెనీలో ఇంజినీరుగా పనిచేస్తున్నా. ఆ ఉద్యోగాన్ని వదిలేశా. ఈసారి గ్రూప్-1 కొడితేనే ఇంటికొస్తానని తల్లిదండ్రులకు చెప్పా. సాధన నిమిత్తం హైదరాబాద్ వెళ్లా. సామాజిక మాధ్యమాలకు, రెండున్నరేళ్లు కుటుంబానికి దూరంగా ఉన్నా. రోజుకు 6 నుంచి 8 గంటలు చదివా.

కావలిలో భారీ దొంగతనం

28 సవర్ల బంగారు నగలు అపహరణ

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. పాతూరులోని పూనూరువారి వీధిలో ఉంటున్న పేరూరు రమేశ్, కల్పన దంపతులు రాత్రి మేడపై నిద్రిస్తుండగా- దొంగలు దిగువ భాగంలోని గదుల తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచిన 28 సవర్ల బంగారు నగలు, రూ. 50వేల నగదు అపహరించారు. మంగళవారం ఉదయం తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు.. లోపలికి వెళ్లి చూశారు. బీరువా తెరిచి ఉండటం.. అందులోని వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించారు. దొంగతనం జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ పి.శ్రీధర్, ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది.

జిల్లాకు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: జిల్లాకు ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా బి.సోమల, జిల్లా విపత్తు నిర్వహణ విభాగం అధికారిగా బి.రజనీకాంత్‌ను నియమించింది.

గనుల్లో అక్రమాల ఫిర్యాదుపై పరిశీలన

సైదాపురం, న్యూస్‌టుడే: సైదాపురం ప్రాంతంలోని పలు గనుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదు మేరకు పరిశీలిస్తున్నట్లు జిల్లా గనులశాఖ డీడీ శ్రీనివాసరావు తెలిపారు. సైదాపురం సమీపంలోని సిద్ధలకొండ, మొలకలపూండ్ల ఏరియాలోని పలు గనులను మంగళవారం అధికారులు పరిశీలించారు. ఇక్కడి గనుల్లో బ్లాస్టింగ్ వల్ల రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తెలుగు గంగ కాలువలను పూడ్చి మైనింగ్ చేస్తున్నారని పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదు మేరకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఆశాఖ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

కెనరా బ్యాంక్ Canara Bank

భారత ప్రభుత్వ రంగ సంస్థ / A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : నెల్లూరు
రికవరీ సెక్షన్, రిత్విక్ ఎన్‌క్లేవ్, ఎ.కె.నగర్, నెల్లూరు-4.
ఫోన్: 0861-2326707, మొబైల్: 9440905330

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9 నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద ఆస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 17.03.2026న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 17-03-2026, ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 01.00 గం.ల వరకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 16.03.2026, సా॥ 04.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

కెనరా బ్యాంక్, స్పెషలైజ్డ్ ఎస్.ఎమ్.ఇ బ్రాంచ్ (13503), ఫోన్: 70089 00027

1. ఋణగ్రహీత: మెస్సర్స్ YPL బ్రాయిలర్స్ మరియు ప్రొప్రయిటర్: శ్రీ యద్దల పెంచలయ్య.
తేది 31.08.2025 నాటికి బకాయి మొత్తం: రూ.18,66,078.49 + తదుపరి వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
ఐటెం-1: డాక్యుమెంట్ నెం.1738/2013 కలిగిన ఆస్తి: ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, ఆత్మకూర్ సబ్-రిజిస్ట్రేషన్ ఆఫీసు, ఎ.ఎస్.పేట, గ్రామపంచాయతీ, ఎ.ఎస్.పేట గ్రామం, పట్టా నెం.171, సర్వే నెం. 140-1 నందు మొత్తం ఎ. 5.02 సెంట్లు భూమిని లేఅవుటు ప్లాను ప్రకారం ఇంటి ప్లాట్లుగా వేసిన లేఅవుటు "ఎ.ఎస్. పేట టౌన్‌షిప్ లేఅవుటు", ప్లాట్ నెం.9 లోని 25 అంకణములు లేదా 200 చ॥గ॥ స్థలం. హద్దులు:- తూర్పు: రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.8 స్థలం, పడమర: వెండర్ యొక్క స్థలం, ఉత్తరం: ప్లాట్ నెం.10 స్థలం. ఈ హద్దులలో గల 25 అంకణములు లేదా 200 చ॥గ॥ స్థలం అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు.
ఐటెం-2: డాక్యుమెంట్ నెం.1736/2013 కలిగిన ఆస్తి: ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, ఆత్మకూర్ సబ్-రిజిస్ట్రేషన్ ఆఫీసు, ఎ.ఎస్.పేట, గ్రామపంచాయతీ, ఎ.ఎస్.పేట గ్రామం, పట్టా నెం.171, సర్వే నెం. 140-1 నందు మొత్తం ఎ. 5.02 సెంట్లు భూమిని లేఅవుటు ప్లాను ప్రకారం ఇంటి ప్లాట్లుగా వేసిన లేఅవుటు "ఎ.ఎస్. పేట టౌన్‌షిప్ లేఅవుటు", ప్లాట్ నెం. 10 లోని 25 అంకణములు లేదా 200 చ॥గ॥ స్థలం. హద్దులు:- తూర్పు: రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.9 స్థలం, పడమర: వెండర్ స్థలం, ఉత్తరం: రోడ్డు.ఈ హద్దులలో గల 25 అంకణములు లేదా 200 చ॥గ॥ స్థలం అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు.
రిజర్వు ధర: రూ. 9,90,000/- | **ధరావత్తు సొమ్ము: రూ. 99,000/-**

2. ఋణగ్రహీత: శ్రీమతి రామసీత చుక్కపల్లి, సహ-ఋణగ్రహీత శ్రీ. క్రాంతి కుమార్ చుక్కపల్లి మరియు హామీదారు శ్రీ. ఎదల భాస్కరయ్య.
తేది 09.02.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 3,70,719.87 + తదుపరి వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
ఎ-షెడ్యూల్ : నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు సబ్-రిజిస్ట్రేషన్, వేదాయపాలెం ఏరియా, సర్వే నెం. 69/1, 69/3, 73/2, 72/2, గ్రామ పంచాయితీ యొక్క ఆమోదిత ప్లాన్ ప్రకారం విభజించబడిన ప్లాట్లు, మున్సిపల్ వార్డు నెం. 26-1, సమీప డి నెం.1565, ప్లాట్ నెం.31 నందు విస్తీర్ణం 40 అంకణములు. హద్దులు : తూర్పు : 30 అ॥ల రోడ్డు, దక్షిణం : ప్లాట్ నెం.32, పడమర : ప్లాట్ నెం.17, ఉత్తరం : ప్లాట్ నెం.30. అవిభాజ్యమైన విస్తీర్ణం 5 అంకణములు.
బి-షెడ్యూల్ : షెడ్యూల్-ఎ ఆస్తి నందు ఆర్‌కె రెసిడెన్సీ అను అపార్ట్‌మెంట్ భవనం 1వ అంతస్తులోని విస్తీర్ణం 1150 చ॥అ॥లుతో కామన్ ఏరియాతో కలిపి ప్లాట్ నెం.102 తో కలదు. హద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : కామన్ కారిడార్, మెట్లు, లిఫ్ట్, ఉత్తరం : ఓపెన్ టు స్కై.
రిజర్వు ధర: రూ. 23,89,000/- | **ధరావత్తు సొమ్ము: రూ. 2,39,000/-**

3. ఋణగ్రహీత: M/s. SJ జ్యువెలర్స్ అండ్ వర్క్ షాప్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ : శ్రీ షేక్ ఇబ్రహీం.
తేది 09.02.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 20,56,635.10 + తదుపరి వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు జిల్లా రిజిస్ట్రేషన్, బుజ బుజ నెల్లూరు సబ్-రిజిస్ట్రేషన్, కాకుటూరు గ్రామ పంచాయితీ, చెముడుగుంట మజారం, కాకుటూరు గ్రామం, సర్వే నెంలు. 82/1, 82/2, 82/3, 83/1, 83/3, ఆమోదించబడిన లే-అవుట్ ప్లాన్ క్రింద ఇంటి ప్లాట్లుగా మార్చబడిన భూమి, ఇందులో ప్లాట్ నెం.152 నందు 30 అంకణములు లేదా 240 చ॥గ॥ల స్థలం కలదు. హద్దులు : తూర్పు : లే-అవుట్ రోడ్డు, దక్షిణం : ప్లాట్ నెం.151, పడమర : ప్లాట్ నెం.149, ఉత్తరం : ప్లాట్ నెం.153.
పై హద్దుల యందు విస్తీర్ణం 30 అంకణములు లేదా 240 చ॥గ॥లులోని స్థలం అన్ని ఈజిమెంటరీ హక్కులతో కలదు.
రిజర్వు ధర: రూ. 10,20,000/- | **ధరావత్తు సొమ్ము: రూ. 1,02,000/-**

కెనరా బ్యాంక్, నెల్లూరు మెయిన్ బ్రాంచ్ (0628), ఫోన్: 99723 78970

4. ఋణగ్రహీత: బట్టా వెంకట సుజాత మరియు హామీదారు బట్టా వెంకట నిలయ్ కుమార్.
తేది 09.02.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 30,42,960.87 + తదుపరి వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
యస్‌పియస్ఆర్ నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ఇందుకూరుపేట సబ్-రిజిస్ట్రేషన్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గుడిపల్లిపాడు మజరా నారాయణరెడ్డిపేట గ్రామం, పట్టా నెం. 409, సర్వేనెంలు. 348/2, 347, 346/2, 345, 346 లో విస్తీర్ణం ఎ. 3.25 సెంట్లు భూమి, ప్రస్తుతం సబ్-డివిజన్ ప్రకారం సర్వేనెంలు. 346/2-ఎ లో విస్తీర్ణం ఎ. 0.75 సెంట్లు, సర్వేనెం. 346/2-B లో విస్తీర్ణం ఎ. 2.03 సెంట్లు, సర్వేనెం. 346/2-C లో విస్తీర్ణం ఎ. 0.13 సెంట్లు, సర్వేనెం. 347-1 లో విస్తీర్ణం ఎ. 0.34 సెంట్లు, మొత్తం విస్తీర్ణం ఎ. 3.25 సెంట్లు మరియు సర్వే నివేదిక ప్రకారం సర్వే నెం. 346/2-A లేఅవుట్ ప్లాన్ శ్రీ లేఅవుట్ ఎక్స్‌టెన్షన్ అను పేరు మరియు స్టైల్ నందు ఇంటి ప్లాట్స్‌లో పక్కపక్కనే ఉన్న భూమిలో ప్లాట్ నెం. 21 లోని 17.36 అంకణములు లేదా 138.88 చ॥గ॥ల విస్తీర్ణంలో పడమర వైపున 10.42 అంకణములు లేదా 83.36 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్ 720 చ॥అ॥ల ఆర్‌సిసి ఇల్లు కలదు. హద్దులు: తూర్పు: ఈ ప్లాట్‌లో మిగిలిన స్థలం రామిరెడ్డి కీర్తికి చెందినది, ఇంటి ప్రహరీ గోడ, ఈ దిశలో 25'-00" కొలతలు, దక్షిణం: చకిరాల శేషయ్య స్థలానికి ఆనుకుని ఉన్న ఈ ఆస్తి యొక్క ఇంటి ప్రహరీ గోడ, ఈ దిశలో 30'-00" కొలతలు, పడమర: 30 అ॥ల వెడల్పు లేఅవుట్ రోడ్డు, ఈ దిశలో 25'-00" కొలతలు, ఉత్తరం: ప్లాట్ నెంబర్ 22 లో ఇంటి ప్రహరీ గోడ, ఈ దిశలో 30'-00" కొలతలు.
ఈ హద్దుల లోపల 10.42 అంకణములు లేదా 83.36 చ॥గ॥ల స్థలం నందు అందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో 720 చ॥అ॥ల ఆర్‌సిసి ఇల్లు అన్ని అనుషంగిక హక్కులుతో కలదు.
రిజర్వు ధర: రూ. 24,10,000/- | **ధరావత్తు సొమ్ము: రూ. 2,41,000/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్ మేనేజర్ గారిని లేదా కెనరా బ్యాంక్, నెల్లూరు ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారి గారిని బ్యాంకు పనివేళలలో సంప్రదించగలరు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ http://baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 10.02.2026, ప్రదేశం: నెల్లూరు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

(c) eenadu

26న నెల్లూరుకు జగన్ రాక

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్ ఈ నెల 26న నెల్లూరు రానున్నారు. రైల్వే కోడూరుకు చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ ఛైర్మన్ అజయ్‌రెడ్డి కుమారుడి వివాహం స్థానిక వీపీఆర్ కన్వెన్షన్ సెంటరులో జరగనుంది. కార్యక్రమానికి ఆయన హాజరు కానున్నారు. కనుపర్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం పది గంటలకు చేరుకుని.. అక్కడి నుంచి వివాహానికి హాజరవుతారు. తిరిగి 10.45 గంటలకు బెంగళూరు వెళతారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, APEWIDC డిపార్ట్‌మెంట్, నెల్లూరు

షార్ట్ టెండరు నోటీసు

NIT నెం. 49/2025-2026, తేది: 24.02.2026

APEWIDC, నెల్లూరు డివిజన్ పరిధిలో, రాపూరు గ్రామమునందు బాలికల వసతి గృహమునందు Bathrooms, Toilets నిర్మాణము కొరకు అంచనా Rs. 14.70 లక్షలతో (3వ పిలుపు) టెండర్లు కోరబడుతున్నవి. టెండరు డాక్యుమెంట్లు 26.02.2026 నుండి అందుబాటులో ఉండును. ఇతర వివరములు www.apeprocurement.gov.inలో లభ్యమగును. ఫోన్ నెం. 94409 62617

సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, APEWIDC DIVISION, నెల్లూరు.

చదువులపై మమకారం.. బడికి ఉపకారం

సొంత నిధులతో అభివృద్ధి

పాఠశాలకు వచ్చి.. చదువు చెప్పడంతోనే విధులు పూర్తయ్యాయన్న ఆలోచనలో ఎక్కువమంది ఉపాధ్యాయులు ఉంటున్నారు. అందుకు భిన్నంగా కొందరు విద్యార్థులకు బోధనతో పాటు బడి బాగుకు కృషి చేస్తున్నారు. అందుకు సొంత నిధులు వెచ్చిస్తున్నారు. అలాంటి వారిలో మాలేపాటి మధు, వెలుగోటి నరేష్ ఉన్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), సంగం

విద్యార్థులకు ఉపయోగకరంగా..

బాగుపడిన పాఠశాల ఆవరణం ..అంతర చిత్రంలో మధు

జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం వాసవీనగర్‌కు చెందిన మాలేపాటి మధు 1996లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. వివిధ పాఠశాలల్లో పనిచేసి ప్రస్తుతం సంగం మండలం గాంధీజన సంఘం ఎంపీఎస్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సొంత నిధులు రూ.36వేలతో పాటు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మాచవరం వెంకటప్రసాద్ సహకారంతో స్కూల్ ఆవరణంలో పిచ్చిమొక్కలను తొలగించారు. మైదానం అభివృద్ధికి 36 ట్రాక్టర్ల మట్టిని తోలించారు. విద్యార్థులకు రూ.10వేలతో క్రీడా పరికరాలు అందించారు. నిరుపేద పిల్లలకు దుస్తులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. సీఐ వేణుగోపాల్‌రెడ్డి సహకారంతో పిల్లలకు అవసరమయ్యే ప్లేట్లు, గ్లాసులు అందించారు. పాఠశాల ఉద్యోగి రాజమ్మ సహకారంతో స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను పాఠశాలలో ఏర్పాటు చేయించారు. దూర ప్రాంత విద్యార్థులు పాఠశాలకు రావడానికి తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఆటో ఏర్పాటు చేశారు. దానికి ప్రతినెలా రూ.4వేలు చెల్లిస్తున్నారు.

ప్రత్యేక వసతులు

ఏఎస్‌పేట మండలం చౌటభీమవరానికి చెందిన వెలుగోటి నరేష్ 2008లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ ఇటీవల సంగానికి బదిలీ అయ్యారు. 40 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో మౌలిక వసతులు నామమాత్రంగా ఉండేవి. ప్రాంగణంలో మట్టి కనబడకుండా టైల్స్ వేయించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు హ్యాండ్ వాషింగ్‌స్టేషన్ పేరిట ఆరు కుళాయిలతో ప్రత్యేక వసతి కల్పించారు. మరుగుదొడ్లకు నీటి వసతి, విద్యుత్తు సదుపాయం ఏర్పాటు చేయించారు. తరగతి గదుల్లో విద్యుత్తు దీపాలు అమర్చారు. రాగి జావ తాగేందుకు గ్లాసులు, మధ్యాహ్న భోజనం తినేందుకు పళ్లాలు అందుబాటులో ఉంచారు. ఇలా వసతుల కల్పనకు సొంత నిధులు రూ.1.65 లక్షలు వెచ్చించారు. ఆయన పనిచేసిన పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు.

కుళాయిల వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న బాలికలు.. అంతరచిత్రంలో వెలుగోటి నరేష్

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: కర్నూలులో న్యాయవాది పవన్‌కుమార్‌పై అక్కడి సీఐ దాడిని ఖండిస్తూ నెల్లూరు న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు విధులకు హాజరు కాకపోవడంతో నగరంలోని వివిధ కోర్టుల్లో విచారణలు నిలిచి కేసులు వాయిదా పడ్డాయి.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032,వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
జోనల్ కార్యాలయం : డి.నెం.14/16, 1వ అంతస్తు, ఐసిఎస్ రోడ్డు, గూడూరు, తిరుపతి జిల్లా- 524101 మరియు శాఖ కార్యాలయం గూడూరు

శ్రీమతి కాటంరెడ్డి నిర్మలమ్మ గారికి చెందిన స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ-వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము **తేది: 07.10.2022 నాటికి రూ.52,86,569/- లను + తేది:07.10.2022** నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు **తేది: 07.10.2022** న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై **తేది: 30.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల** మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు.

అగ్రిమెంటు నెం.:GUDRBTF2101160011, రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా:- 1) **కాటంరెడ్డి సురేంద్రా** తండ్రి **సుధాకర్‌రెడ్డి,** డి.నెం.4-88, టిటిడి కళ్యాణ మండపం ప్రక్కన, విద్యానగర్, కోట మండలం, నెల్లూరు జిల్లా - 524413 2) **కాటంరెడ్డి నిర్మలమ్మ,** భర్త సుధాకర్‌రెడ్డి, డి.నెం.4-88, టిటిడి కళ్యాణ మండపం ప్రక్కన, విద్యానగర్, కోట మండలం, నెల్లూరు జిల్లా -524413 3) **కాటంరెడ్డి స్వరూప,** భర్త సురేంద్రారెడ్డి, డి.నెం.4-88, టిటిడి కళ్యాణ మండపం ప్రక్కన, విద్యానగర్, కోట మండలం, నెల్లూరు జిల్లా - 524413 4) **తూపిలి మదన్‌మోహన్‌రెడ్డి,** తండ్రి వెంకురెడ్డి, డి.నెం.33015, 3వ అంతస్తు, జయప్రియ ఉథోపియా అపార్ట్‌మెంట్స్, రాజేంద్ర నగర్, అత్తాపూర్, హైదరాబాద్, తెలంగాణ- 500048

స్థిరాస్తుల యొక్క వివరణ: (కాటంరెడ్డి నిర్మలమ్మ గారికి చెందిన ఆస్తి వివరములు):- శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా,కోట సబ్ జిల్లా, కోట మండలం, గూడలి గ్రామ పంచాయతీ, హెచ్/ఓ. విద్యానగర్ గ్రామ లెక్కదాఖలా మెట్ట సర్వేనెం.241 లో ఎ.14.70 సెంట్లలో ఎ.1.54 సెంట్లు ఇందున 49 అంకణములు లేదా 392 చ.గ. స్థలం మరియు ఇందున నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ హద్దులు:తూర్పు: రోడ్డు, పడమర: అల్లారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి భూమి, ఉత్తరం: విక్రయదారులు వేమారెడ్డి నారాయణమ్మ మరియు ఇతరుల భూమి, దక్షిణం: పొనక కోటారెడ్డి స్థలం ఈ హద్దుల మధ్య స్థలం పూర్తి విస్తీర్ణం 49 అంకణములు లేదా 392 చ.గ. స్థలం మరియు ఇందున నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ 576 చ.అ. మరియు ఏసిసి రూఫ్ గల బాత్‌రూం విస్తీర్ణం 52చ.అ. మరియు తూర్పువైపునున్న దారిలో హక్కు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతోసహా. **తాకట్టు రుణభారాలు: లేవు.**

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది
GUDRBTF 2101160011	రూ.44,78,000/-(నలభై నాలుగు లక్షల డెబ్బై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే)	రూ.4,47,800/-(నాలుగు లక్షల నలభై ఏడు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే)	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.25,000/-	30.03.2026	28.03.2026	27.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు మెస్సర్స్ **శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి** సెల్: **9833922941,** ఈమెయిల్ **<gaurav.n@samil.in>** మరియు ఆస్తి సంబంధిత వివరాలకై **అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,** బి.శ్రీనివాసులుసెల్: **+91 7013073475** సంప్రదించగలరు.

అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ రియు వేలము కొరకు వెబ్‌సైట్ **https://eauctions.Samil.in/home** ను చూడగలరు.పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు **https://www.shriramfinance.in/auction** ను చూడగలరు.

గమనిక : ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము:గూడూరు **తేది:23.02.2026** సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032,వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
జోనల్ కార్యాలయం : డి.నెం.14/16, 1వ అంతస్తు, ఐసిఎస్ రోడ్డు, గూడూరు, తిరుపతి జిల్లా- 524101 మరియు శాఖ కార్యాలయం గూడూరు

మెస్సర్స్ రేవతి అక్వా ఫీడ్స్ మరియు కెమికల్స్ ప్రొప్రయిటర్ మేకల రేవతి గారికి చెందిన స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ-వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్‌అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2022 ప్రకారం **తేది: 20.01.2026 న జారీ చేసిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన** జారీ చేసిన గడువు ముగిసిన అనంతరం జారీ చేస్తున్న స్థిరాస్తుల అమ్మకం ఈవేలం నోటీసు. దిగువ తెలిపిన వారందరూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 - చట్టంలోని 54/2002 క్రింద 8(6)తో చదువబడే సెక్షన్ 13(8) క్రింద ఉద్దేశించిన మీ యొక్క విమోచన హక్కును వినియోగించుకోవడంలో విఫలమైనందున ఈ ఈ-వేలం అమ్మకం నోటీసు జారీ చేయబడినది. ఈ నోటీసు రుణగ్రహీతలకు/ గ్యారంటార్లకు / తనఖాదారులకు / సహ-రుణగ్రహీతలకు/ కో-అప్లికెంట్లకు తెలియజేయడమైనది.

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము **తేది: 26.09.2023 నాటికి రూ.1,11,46,473/- లను + తేది:27.09.2023** నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు **తేది: 26.09.2023** న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై **తేది: 31.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల** మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు.

అగ్రిమెంటు నెం.:GUDRBTF2109140001, రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా:- 1) **మెస్సర్స్ రేవతి అక్వాఫీడ్స్ & కెమికల్స్, ప్రొప్రయిటర్ మేకల రేవతి,** తండ్రి అమాసయ్య, ఎన్‌సిఆర్‌నగర్, కోట (గ్రామం,పోస్ట్ &మండలం, నెల్లూరు జిల్లా- 524411 2) **మేకల రేవతి** తండ్రి అమాసయ్య, ఎన్‌సిఆర్‌నగర్, కోట గ్రామం, పోస్ట్ & మండలం, నెల్లూరు జిల్లా- 524411 3) **అప్పంగారి మురళి** తండ్రి ఎ.తిరుపాల్, డి.నెం.2, తూపిలిపాలెం, వాకాడు మండలం, నెల్లూరు జిల్లా - 524415 4) **వంజివాక వేణుగోపాల్** తండ్రి వెంకటయ్య, తిన్నెలపూడి గ్రామం మరియు పోస్ట్, కోట మండలం, నెల్లూరు జిల్లా - 524413

స్థిరాస్తుల యొక్క వివరణ: (రేవతి ఆక్వా ఫీడ్స్ & కెమికల్స్ ప్రొప్రయిటర్ మేకల రేవతి గారికి చెందిన ఆస్తి వివరములు):- శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కోట సబ్ జిల్లా, కోట మండలం, వెంకనపాలెం గ్రామపంచాయతీ, కోట బిట్-1 గ్రామ లెక్కదాఖలా పట్టా నెం.315 మెట్ట సర్వేనెం.1211-ఎ1లో ఎ.23.36 సెంట్లు మరియు ఇందున ఎ.0.74 సెంట్ల భూమిని మార్పు చేసి వేసిన ఇంటి లేఔట్ ప్లాట్లలో ప్లాటు నెంబర్లు 3,4,15 & 16 హద్దులు:తూర్పు: 20అ. వెడల్పు గల లేఔట్ రోడ్డు -80అ. , పడమర: 20అ. వెడల్పు గల లేఔట్ రోడ్డు, ఉత్తరం: కట్టా దేవినాథ్ యొక్క ప్లాటు నెం.5 & 14- 90అ. దక్షిణం: 12అ. వెడల్పు గల డొంక - 90అ. ఈ హద్దుల మధ్య ప్లాటు నెం.3 విస్తీర్ణం 16.67 అంకణములు, ప్లాటు నెం.4 విస్తీర్ణం 16.67 అంకణములు, ప్లాటు నెం.15 విస్తీర్ణం 33.33 అంకణములు, ప్లాటు నెం.16 విస్తీర్ణం 33.33 అంకణములు, వెరశి మొత్తం 100 అంకణములు లేదా 800 చ.గ. ఖాళీ స్థలం అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా. **తాకట్టు రుణభారాలు: లేవు.**

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది
GUDRBTF 2109140001	రూ.1,27,50,000/-(ఒక కోటి ఇరవై ఏడు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)	రూ.12,75,000/-(పన్నెండు డెబ్బై ఐదు వేల రూపాయలు మాత్రమే)	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.25,000/-	31.03.2026	30.03.2026	28.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు మెస్సర్స్ **శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి** సెల్: **9833922941,** ఈమెయిల్ **<gaurav.n@samil.in>** మరియు ఆస్తి సంబంధిత వివరాలకై **అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,** బి.శ్రీనివాసులుసెల్: **+91 7013073475** సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ రియు వేలము కొరకు వెబ్‌సైట్ **https://eauctions.Samil.in/home** ను చూడగలరు.పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు **https://www.shriramfinance.in/auction** ను చూడగలరు. **గమనిక :** ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము:గూడూరు **తేది:23.02.2026** సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance
Website: http://www.shriramfinance.in./auction

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్, గుండి, చెన్నై - 600032.
ఆఫీస్ చిరునామా : డి.నెం. 26-2-7, 3వ అంతస్తు, పద్మావతి ప్లాజా, కెనరా బ్యాంక్ ప్రక్కన, ఎ.కె. నగర్, నెల్లూరు (జిల్లా) - 524004 మరియు బ్రాంచి ఆఫీస్ : నెల్లూరు -2.

శ్రీ / శ్రీమతి అంబటి చిరంజీవి & అంబటి కస్తూరయ్య గార్లకి చెందిన స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, **2002** యొక్క రూల్ **8 (6) & 9 (1)** నందలి నిబంధనలతో చదువకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, **2002** క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయునది ఏమనగా **డిమాండ్ నోటీసు తేది : 30-01-2023** ప్రకారం, సర్ఫేసీ చట్టంలోని సబ్ సెక్షన్ 13 (2) ప్రకారం జారీ చేయబడిన సెక్యూరిటీ క్రెడిటార్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెల్లించాల్సిన బకాయి ది. 30-01-2023 నాటికి **మొత్తం రూ. 2,70,93,582/-** లను తిరిగి పొందుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన / చార్జ్ చేసిన క్రింద వివరించిన స్థిరాస్తుల మొత్తాన్ని **ది. 30-03-2026న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల మధ్య** "ఎక్కడ ఏది "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"ప్రాతిపదికన విక్రయించబడుతుందని సాధారణ ప్రజలకు ముఖ్యంగా తనఖాదారునికి మరియు హామీదారునికి నోటీసు ఇవ్వబడుతోంది. క్రింద పేర్కొన్న ఋణగ్రహీత / హామీదారునికి సర్ఫేసి చట్టంలోని సబ్ సెక్షన్ 13 (2) ప్రకారం జారీ చేయబడిన సెక్యూర్డ్ క్రెడిటార్‌లకు ది. 29-01-2023 నుండి వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మరియు ఖర్చులతో సహా వడ్డీలో చెల్లించగలరు.

అగ్రిమెంట్ నెం.: NELL3TF1207310012

ఋణగ్రహీత / హామీదారుల పేర్లు మరియు చిరునామా :

1) **శ్రీ అంబటి చిరంజీవి,** తండ్రి : రమణయ్య, డి.నెం. 13-418, పంతులవారి వీధి, ఎసి సుబ్బారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర, చిన్న బజారు, నెల్లూరు జిల్లా - 524001
2) **శ్రీ అంబటి కస్తూరయ్య,** తండ్రి : రమణయ్య, డి.నెం. 13-418, పంతులవారి వీధి, ఎసి సుబ్బారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర, చిన్న బజారు, నెల్లూరు జిల్లా-524001 (హామీదారు)
3) **శ్రీ ఉద్దంటి చంద్రాచారి,** తండ్రి : వెంకయ్య ఆచారి, డి.నెం. 13-641, బేస్తవీధి, అనిత హాల్ రోడ్డు, నెల్లూరు జిల్లా - - 524001 (హామీదారు)

స్థిరాస్తి యొక్క వివరములు : (శ్రీ అంబటి చిరంజీవి & శ్రీ అంబటి కస్తూరయ్య గారికి చెందినది)

ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా, నెల్లూరు సబ్ డిస్ట్రిక్ట్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం, నెల్లూరు నగరం, కొరాడ వీధి ప్రాంతం, వార్డ్ నెం: 12, డి.నెం. 1195, అసెస్‌మెంట్ నెం: 1021014911 కి చెందిన 14 అంకణాలు లేదా 112 చ॥గ॥లు విస్తీర్ణంలోని ఆర్‌సిసి ఇల్లు అందలి 4 అంకణాలు లేదా 288 చ॥అ॥ల విస్తీర్ణంలోని ఆర్‌సిసి బిల్డింగ్ దానికి చెందిన తలుపులు, తలుపు ఫ్రేములు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్లు, 101707 మరియు 101063 తో సహా అన్ని ఈజిమెంటరీ హక్కులతో సహా. **హద్దులు : తూర్పు:** పి. పద్మావతి మరియు ఎం. నామ్‌దేవ్‌ల రాజవీధి ఇల్లు; **పడమర :** ఉమ్మడి గోడ మరియు కె రత్నాచారి గారి ఇల్లు; **ఉత్తరం:** ఉమ్మడి గోడ మరియు షేక్ ఇబ్రహీం మరియు ఇతరుల ఇల్లు; **దక్షిణం:** ఉమ్మడి గోడ మరియు షేక్ అఫ్సర్ బేగం గారి ఇల్లు. **ఏదైనా అప్పులు ఉంటే : లేవు.**

అగ్రిమెంట్ నెం.	ఆస్తి రిజర్వుధర	EMD మొత్తం	EMD చెల్లింపు ధర	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేది	EMD చెల్లించడానికి చివరితేది	ఆస్తి తనిఖీ తేది
NELL3TF1207310012	రూ. 42,20,000/- (నలభై రెండు లక్షలు ఇరవై వేలు రూపాయలు మాత్రమే)	రూ. 4,22,000/- (నాలుగు లక్షలు ఇరవై రెండు వేలు రూపాయలు మాత్రమే)	డిడి రూపంలో 'శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్' పేరిట తీయవలెను	రూ. 50,000/-	30-03-2026	28-03-2026	27-03-2026

ఆసక్తిగల బిడ్డర్‌లకు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను రూపొందించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొ॥ వాటి కొరకు సంప్రదించండి. **మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించాల్సిన వ్యక్తి శ్రీ గౌరవ్ నంబూద్రి మొబైల్ నెం. 9833922941, Mr.GAURAV NAMBOODIRI <gaurav.n@samil.in>** మరియు ఆస్తికి సంబంధించిన వివరముల కొరకు ఆఫీస్ పని వేళలలో **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, టి. విజయ్‌కుమార్, మొబైల్ నెం. +91 9949940787** నందు సంప్రదించగలరు.

బకాయి శేషం ఏదేని ఉన్నచో ఏ కారణం చూపకనే తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ **"శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్"** యొక్క వెబ్‌సైట్ **(https://eauctions.Samil.in/home)** పై నిర్వహించబడును. టెండరు దాఖలు / బిడ్ ఫారం పొందు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ **https://eauctions.Samil.in/home** ను చూడండి. అమ్మకం యొక్క నియమ నిబంధనల వివరాలకై "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింక్ **https://www.shriramfinance.in/auction** ను చూడండి.

గమనిక : శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, చెన్నైలోని ఎన్‌సిఎల్‌టి యొక్క ఆర్డర్ ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్'తో విలీనం చేయబడిందని సమాచారం. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్' పేరు ది. 30-11-2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా అమలులోకి వచ్చేలా మార్చబడినది. ది. 30-11-2022 నాటి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్‌ను చూడగలరు)

ప్రదేశం : నెల్లూరు, తేది : **24-02-2026** సం/- (అధీకృత అధికారి)

మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

పాఠశాలల్లో పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని కనుపర్తిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు గుంటూరు సీజీఎస్‌టీ ఆడిట్ విశాఖపట్నం జోన్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా పాఠశాలలో 5కేవీ సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.2.90 లక్షలతో అమలు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా పాఠశాలలో విద్యుత్తు సరఫరా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్‌ను ఆచరణలో పెట్టే దిశగా ప్రభుత్వ పాఠశాలల్లో పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం నగరంలోని ఓ హోటల్‌లో వ్యాపారులు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రెండు అండర్ బ్రిడ్జీల నిర్మాణానికి అనుమతులు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కల నెరవేరింది. రూరల్ పరిధిలోని కొండాయపాలెం గేటు, బీవీనగర్ రైల్వే గేటు ప్రాంతాల్లో వాహనాల రద్దీ పెరిగిపోతున్న నేపథ్యంలో రైల్వే అండర్ బ్రిడ్జీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు రాష్ట్ర ఉన్నతాధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనా అనుమతులు లభించాయి. నెలరోజుల్లో టెండర్ ప్రక్రియ మొదలు కానుంది.

హడ్కో రుణం చెల్లింపునకు రూ.30.64 కోట్లు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: హడ్కో రుణ చెల్లింపుల కోసం నెల్లూరు నగరపాలకసంస్థకు రూ.30.64 కోట్లు పరిపాలనా అనుమతిని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంగళవారం ఉత్తర్వు జారీ చేసింది. కార్పొరేషన్ తీసుకున్న హడ్కో రుణానికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో వాయిదా మొత్తాన్ని చెల్లించనుంది.

వీఎస్‌యూలో ముగిసిన ఐఎస్‌వో బృంద పర్యటన

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో రెండు రోజుల పాటు జరిగిన ఐఎస్‌వో ప్రతినిధుల బృంద తనిఖీలు మంగళవారంతో ముగిశాయి. రెండో రోజు విద్య, వసతి, పరిపాలన విభాగాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. విద్యార్థిని, విద్యార్థుల వసతిగృహాల్లో సౌకర్యాలను పరిశీలించారు. భోజన వసతి, తాగునీటి శుభ్రత, గదుల పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలపై సమీక్షించారు. సోషల్ వర్క్, భౌతిక, రసాయనశాస్త్ర తదితర విభాగాలను సందర్శించి.. బోధన ప్రణాళికలు, ప్రయోగశాలల్లో సదుపాయాలు, మూల్యాంకన విధానం తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల అనంతరం ప్రాథమిక నివేదిక సమర్పించారు. వీఎస్‌యూకు అయిదు అంతర్జాతీయ ఐఎస్‌వో ధ్రువపత్రాలను ప్రదానం చేయాలని నిర్ణయించడంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

దస్త్రాలను పరిశీలిస్తున్న అధికారులు

గత మేయర్ పాలనలో ఎంతో అవినీతి

రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(టౌన్): అధికారాన్ని అడ్డు పెట్టుకుని రూ.కోట్లు దోచుకున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ నేడు గిరిజన మేయర్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని.. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి మేయరును కనీసం తన నియోజకవర్గంలో అడుగు పెట్టనీయలేదన్నారు. గతంలో ఉన్న మేయర్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని, విద్యార్థులకు ఇచ్చే స్కూల్ కిట్ రూ.150 ఉంటే రూ.550 బిల్లులు పెట్టారని, సిరాజ్ పేరుతో అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. పదో తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఇచ్చే స్నాక్స్‌లో కూడా అవినీతికి పాల్పడ్డారన్నారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అధికారి కమిషనర్‌కు టెక్నికల్ శాలరీకోసం వస్తే డబ్బు డిమాండ్ చేశారని, కొంత నగదు ఫోన్‌పే చేయించుకుని కమిషన్ పెట్టారని ఆరోపించారు. ఇలాంటి వారిని మాజీమంత్రి అనిల్‌కుమార్ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

భూ స్వాధీన అవార్డు ప్రక్రియలో అక్రమాలపై విచారణ

నెల్లూరు(టౌన్): వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామ సర్వే నంబరు 47-3లో భూ స్వాధీన అవార్డు ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు తలెత్తాయి. డ్రాఫ్ట్ అవార్డు, తుది అవార్డు జారీ సమయంలో విధివిధానాలు పాటించలేదని ప్రభుత్వం గుర్తించింది. 2013 భూ స్వాధీన చట్టం సెక్షన్76 ప్రకారం వివరాన్ని ఎల్ఏ, ఆర్ అండ్ ఆర్ అథారిటీకి పంపకపోవడమే ప్రధాన అభియోగం. అప్పటి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.మోహన్ (అనంతపురం డీఆర్వో), విశ్రాంత తహసీల్దారు ఎం.సరేశ్వర శ్రీనివాసులపై విచారణకు మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. జేసీ మొగిలి వెంకటేశ్వర్లును విచారణాధికారిగా నియమించారు. ప్రభుత్వం తరపున డీఆర్వో ఎన్.విజయకుమార్‌ను నియమించారు. ఆరు వారాల్లోగా విచారణ నివేదికను అందించాలన్నారు.

జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

నెల్లూరు(క్రీడ విభాగం), న్యూస్‌టుడే: శాప్ లీగ్ పోటీల్లో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు జరిగాయి. వీటిని జిల్లా ఇన్‌ఛార్జి క్రీడాభివృద్ధి అధికారి ఎకేటీ జనీమ్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 29 మంది పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

1న గురుకులంలో ప్రవేశాలకు పరీక్ష

చేజర్ల, న్యూస్‌టుడే: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు మార్చి ఒకటిన పరీక్ష నిర్వహించనున్నట్లు ఆదూరుపల్లి గురుకులం ప్రిన్సిపల్ పద్మజ తెలిపారు. ఆయిదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు మార్చి నెల ఒకటిన, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి మార్చి 8న పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. బుధవారం నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

101 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యం

వింజమూరు: జిల్లాలో పీఎం కుసుమ్ పథకంలో 101 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యమని జిల్లా నోడల్ అధికారి జి.చక్రపాణి వెల్లడించారు. మండలంలో ఏర్పాటు చేయనున్న సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులకు స్థలాలను మంగళవారం పరిశీలించారు. తమిదపాడు, చాకలికొండలో 32 ఎకరాలు చొప్పున పరిశీలించామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీటి ద్వారా 21 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తామన్నారు. ఈఈ భానునాయక్, డీఈలు మునిరెడ్డి, కృష్ణమోహన్, ఏఈ నాగూర్‌వలీ, ప్రతిమ పాల్గొన్నారు.

17మందికి ఉద్యోగోన్నతి

నెల్లూరు(మార్కెట్ సెంటర్): జడ్పీ యాజమాన్య పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 17మందికి ఉద్యోగోన్నతి లభించింది. ఆఫీసు సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. మంగళవారం వీరికి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి ఆదేశాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

(గ్రాముకు) మేలిమి	రూ. 15,908
(3 శాతం జీఎస్టీ కలిపిన ధర) సవరం ధర	రూ. 1,22,464
వెండి (గ్రాము)	రూ. 277.60

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	139
లేయర్	90
బ్రాయిలర్	248
బ్రాయిలర్ స్కిన్‌లెస్	274
లేయర్ మాంసం	153

మాజీ మంత్రి కాకాణి విచారణ వాయిదా

కోవూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విచారణ మరోసారి వాయిదా పడింది. మంగళవారం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో విచారణకు రావాలని నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన ఈ నెల 27న వస్తానని లేఖ రాసినట్లు పోలీసులు తెలిపారు. కోవూరు మండలంలో బాలిక మృతికేసులో నిరాధార ఆరోపణలు చేశారని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇప్పటికే రెండుసార్లు విచారణ వాయిదా పడిన విషయం విదితమే.

66 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు

సీతారామపురం: జిల్లాలో 66 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తున్నట్లు ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కలిసెల కన్నయ్య తెలిపారు. మండలంలోని బసినేనిపల్లెలో ప్రకృతి వ్యవసాయ సాగు క్షేత్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 49,629 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వంగ, మిర్చి, బంతి, మామిడి, ఆకుకూరలు పండిస్తున్నారని వివరించారు. పంటలకు తెగుళ్లు ఆశించకుండా కషాయాలు, ద్రావణాలు వాడుతున్నారని, నీలి రంగు జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ఒక్కో సీజన్‌లో 10 నుంచి 15 పంటలు వేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగు చేసే రైతులను ప్రోత్సహించాలని సూచించారు. మండలంలోని పొంగూరులోనూ క్షేత్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీనివాసులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఎంపీడీవో

ఉదయగిరి: ఎంపీడీవో బి.శ్రీనివాసులును కొండాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యుటేషన్‌పై ఏడాది పాటు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూనే కమిషనర్‌గా పనిచేస్తారు.

బెట్టింగ్ విషయమై తురిమెర్లలో ఇద్దరి అరెస్టు

దగదర్తి: మండలంలోని తురిమెర్లలో బెట్టింగ్ మూలాలు బయటపడ్డాయి. ఈవిషయమై గ్రామానికి చెందిన యువకులు అమీర్, కార్తీక్‌ను నెల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈవ్యవహారంలో కీలకమైన బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన వ్యక్తితో వీరికి సంబంధాలు ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు మరికొంత మంది యువకుల పాత్ర ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

EENADU Classifieds

BUILDING CONSTRUCTION

House Constructions:10 సం|| వారంటీతో మీ ఇంటిని కట్టించి ఇవ్వబడును. ప్రారంభ ధర అం|| 99 వేలు.98499 99280, 97009 21539

REAL ESTATE

FLAT FOR SALE

అల్లీపురం పెద్దచెరుకూరు, సిరిగార్డెన్స్ A బ్లాక్‌లోని 2 BHK అపార్ట్‌మెంట్ అమ్మబడును. Contact: 80740 98354, 63046 06678

JOBS

Wanted MBA, B.Com, B.Sc, Graduates for Marketing and Office Work and Drivers. ✆ 95027 38983

నెల్లూరులో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు క్రింది డిపార్ట్‌మెంట్‌లకు 40 సం||లోపు స్టాఫ్ కావలెను. అడ్మినిస్ట్రేషన్, ఫొటోషాప్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, స్టాఫ్ అసిస్టెంట్స్, డ్రైవర్లు. 8555993478

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ప్రైవేట్ కంపెనీలో పనిచేయుటకు అనుభవం కల్గిన వారు కావలెను. జీతం+ఇన్సెంటివ్స్, నెల్లూరు టౌన్. ✆ 97049 48491

ఆక్వాకల్చర్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవము కలిగి Tally తెలిసిన Accountant కావలెను. ✆ 99850 61669, 63035 99129

రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు కొంత కంప్యూటర్ తెలిసిన స్త్రీలు పార్ట్‌టైమ్ ఒకరు, ఫుల్ టైమ్ ఒకరు, ఇద్దరు కావలెను. సంప్ర: 9966505777

నెల్లూరు వేదాయపాళెం Duroguard Steel Door Showroom నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్+ టెక్నీషియన్లు కావలెను. జీ: 15000/-. 9959440883

DRIVERS

డ్రైవర్లు కావలెను: అర్హతలు: భారీ మోటర్‌వాహనాలు (HMV) నడపడంలో కనీసం 5 సం॥ల అనుభవం ఉండాలి. జీతం+ ప్రయోజనాలు: 30,000+ వసతి, బత్తెము మరియు అదనపు ప్రయోజనాలు కల్పించబడును. Cont: 9491711144, 9491811144.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. నెల్లూరులో 50 సం. వయసు, 12hr డ్యూటీ. జీతం 14000/-. ✆ 72880 04466, 72880 04477, 89852 73775

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు నరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

వివరాలకు..

నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

విద్యుత్తు సమస్యల గుర్తింపు

వింజమూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఎ.కొత్తపురంలో మంగళవారం నిర్వహించిన కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో పలు సమస్యలు గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. డిస్కం నోడల్ అధికారి జి. చక్రపాణి, ఎస్‌ఈ కె. రామచంద్ర అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్థులకు పలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఈ భానునాయక్, డీఈలు మునీంద్ర, కృష్ణమోహన్, ఏఈ నాగూర్‌వలి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో రాణింపు

కావలి, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రెండో పట్టణ సీఐ వి.గిరిబాబు అన్నారు. మంగళవారం రాత్రి ఆర్టీవో కార్యాలయ ప్రాంగణంలో వసతిగృహాల విద్యార్థులకు పరీక్షల సామగ్రి వితరణ చేశారు.

బిట్రగుంట తిరునాళ్లకు ఉచిత బస్సులు

కావలి, న్యూస్‌టుడే: బోగోలు మండలంలోని కొండబిట్రగుంటలో జరుగనున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు స్త్రీశక్తి పథకంలో కావలి నుంచి ఉచిత బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈనెల 26 నుంచి వీటిని నడుపుతామన్నారు. ముంగమూరుతోటలు నుంచి బిట్రగుంటకొండ వరకు కూడా బస్సు ఏర్పాటుచేస్తామన్నారు. నెల్లూరు నుంచి వచ్చే భక్తులు కావలికి టిక్కెట్ తీసుకుంటే ముంగమూరుతోటలులో దిగి అక్కడి నుంచి బస్సుల్లో బిట్రగుంటకు వెళ్లవచ్చన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!
(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు : 8008573949

సమస్య: అనంతసాగరం మండలం ఏనుగుపల్లి గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో గ్రామస్థులు తిరగాలంటే ముళ్ల చెట్ల కారణంగా విష కీటకాలు, సర్పాలతో ఇబ్బంది పడుతున్నాం. –సాయి కృష్ణ, గ్రామస్థుడు

సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. –తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి

? మర్రిపాడు మండలం, డీసీపల్లిలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలక దుర్వాసనతోపాటు దోమల వ్యాప్తి అధికమైంది. – శ్రీను, స్థానికుడు

✓ కాలువలు శుభ్రం చేయాలని కార్యదర్శికి సూచిస్తాం. – నాగేశ్వరప్రసాద్, ఎంపీడీవో

? ఏఎస్‌పేటలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 35 సంవత్సరాల కిందట నిర్మించిన అద్దె గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని తొలగించి కొత్తవి నిర్మించి దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా నిర్మించాలని కోరుతున్నాం. –వెంకటయ్య, గ్రామస్థుడు

✓ ఎస్సీ కార్పొరేషన్ నిర్మించిన అద్దె గదులు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటిని తొలగించేందుకు ఆ శాఖ అధికారులతో మాట్లాడతాం. –షరీఫ్, పంచాయతీ కార్యదర్శి

? సంగం మండలం తరుణవాయి గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.
–ఎం ఆనందరావు, తరుణవాయి

✓ వాటిని పట్టించి గ్రామానికి దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.
– ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి

? కావలి పట్టణం మూడో వార్డు పరిధిలో చాలా చోట్ల పైపులైన్లు లీకవుతుండటంతో నీటి సరఫరా సరిగా లేదు. – ముజాయిద్దీన్, స్థానికుడు

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.
– సాయిరాం, డీఈఈ, కావలి పురపాలక సంఘం, –న్యూస్‌టుడే, కావలి

? చేజర్ల - ఓబులాయపల్లి రహదారి కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. ఎదురుగా వాహనాలు వస్తే పక్కకు తొలగడం ఇబ్బందికరంగా ఉంది. –ప్రసాదరెడ్డి, పాతపాడు

✓ పరిశీలించి ఆ మార్గంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. – అన్వేష్, ఏఈ, ర.భ –న్యూస్‌టుడే, చేజర్ల

మోకాళ్లపై నిల్చొని నిరసన

ఉదయగిరి, న్యూస్‌టుడే : న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది మంగళవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలని, నెలలో సెలవులు ప్రకటించి జీవో ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె. రమణయ్య, నాగేశ్వరరావు, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ఆత్మకూరు : ఆత్మకూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన రిలేదీక్షలు రెండో రోజు కొనసాగాయి. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాధ, పద్మావతి, విజయలక్ష్మి, కె.లక్ష్మి, హజరత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

కావలి: పట్టణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రిలే దీక్షలు చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, తదితరులు వీరికి మద్దతు తెలిపారు.

మాటేసి.. దోచేసి

● సోమవారం రాత్రి కావలిలోని పాతూరులోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి రూ.లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

● కొద్దిరోజుల క్రితం పట్టణంలోని జనతాపేట, గాయత్రినగర్‌లో మహిళల మెడల్లో బంగారు నగలు దొంగిలించారు. తుఫాన్‌నగర్‌లో సుమారు 30 పాడి కుటుంబాలకు చెందిన గేదెలు ఇటీవల అపహరణకు గురయ్యాయి.

న్యూస్‌టుడే, కావలి

దొంగలు పేట్రేగిపోతున్నారు. పక్కాగా రెక్కీ చేసి ఇళ్లను లూటీ చేస్తున్నారు. ఇంటికి తాళం వేస్తే చాలు దోచేస్తున్నారు. మేడపై నిద్రిస్తున్నా.. కింద గదుల్లో సొత్తంతా ఎత్తుకెళుతున్నారు. వీధుల్లో నడిచి వెళుతున్న మహిళల ఆభరణాలు లాక్కెళుతున్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీటిని నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. ఇదీ కావలిలో చోరీల తీరు.

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి డివిజన్‌లో చోరీల వివరాలు

	2023	2024	2025
పగలు జరిగినవి	69	55	83
రాత్రిళ్లు	157	132	179
సాధారణ దొంగతనాలు	258	274	396

దొంగలతో పోలీసుల దోస్తీ

పట్టణంలో పలువురు పోలీసులు, దొంగలకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇలాంటి వ్యవహారంలో పోయిన జిల్లా పోలీసు అధికారి పట్టుకోవడంతో ఓ కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించారు. వీరి కారణంగానే దొంగలు జరుగుతున్నాయని ప్రజలు అనుమానిస్తున్నారు. చోరీ చేసిన ఆభరణాలను ఓ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

కేసుల నమోదుతో సరి!

పదేళ్ల క్రితం పాతూరు పోలేరమ్మ ఆలయానికి సమీపంలో కేతిరెడ్డి రామకోటిరెడ్డి ఇంట్లో రూ.కోట్ల విలువైన బంగారు నగలు, నగదు చోరీ జరిగ్గా.. దర్యాప్తులో ఇంతవరకూ పురోగతి లేదు. రెండున్నరేళ్ల క్రితం బృందావన కాలనీలో రూ.1.8 కోట్ల విలువైన బంగారు నగల చోరీ దర్యాప్తు అటకెక్కింది. మొండిదిన్నెపాలెంలో బ్రాంచి పోస్ట్‌మాస్టర్, గౌరవరంలో రైతు ఇంట్లో దొంగతనాలు జరిగాయి. గత ఏడాది ముసునూరు రామచంద్రా కాలనీలో ఉపాధ్యాయ దంపతుల గృహంలో రూ.15 లక్షల విలువైన బంగారు నగలు అపహరించారు. అంతకుముందు ప్రగతినగర్, తుమ్మలపెంట, రుద్రకోట, రామ్మూర్తిపేట, వైకుంఠపురం, కలుగోళమ్మపేట తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఘటనలే జరిగాయి.

సీసీ కెమెరాలు పెట్టుకోవాలి

పి.శ్రీధర్, డీఎస్పీ, కావలి

ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలి. చోరీల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. తాజా చోరీపై పాత నిందితులను విచారిస్తున్నాం. ముసుగులో ఉన్న ఇద్దరు ఇందులో పాల్గొన్నట్లు గుర్తించాం.

ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు: పీవో

కావలి, న్యూస్‌టుడే: ఆందోళన పడకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీవో సుజాత సూచించారు. మంగళవారం ముసునూరులోని గిరిజన బాలికల గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వారితో కలిసి భోజనం చేశారు.

బాలిక పట్ల నూడుల్స్ విక్రేత అసభ్య ప్రవర్తన

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల నూడుల్స్ విక్రేత శ్రావణప్రసాద్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆమె నూడుల్స్ కొనేందుకు వెళ్లగా అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై తొలుత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం తల్లిదండ్రులతో కలసి వెళ్లి నిందితుడిపై పోలీసులకు వివరించారు. ఈ విషయమై కావలి రెండో పట్టణ సీఐ వి.గిరిబాబును 'న్యూస్‌టుడే' అడగ్గా.. ఆలస్యంగానైనా కేసు నమోదు చేస్తామని వివరించారు.

సాగు నీరు అందించాలని రైతుల ఆందోళన

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: తమ పొలాలకు నీరు వచ్చే చెరువు కాలువకు అడ్డంగా మట్టి వేయడంతో నీరు పారక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మండలంలోని కాకర్లపాడు గ్రామ రైతులు తెలిపారు. గ్రామంలోని దశబంధం చెరువు కింద 60 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నామని చెరువుకు నీరందించే కాలువకు జమ్మవరం గ్రామానికి చెందిన కొందరు జేసీబీతో మట్టిని తవ్వి అడ్డుగా వేశారన్నారు. దాంతో చెరువులోకి నీరు రావడం లేదన్నారు. ప్రస్తుతం వెన్నుదశలో ఉన్న వరిపైరుకు నీరు లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అంటున్నారు. కాలువకు వేసిన అడ్డుకట్టను తొలగించి, నీరు సజావుగా చెరువుకు, పొలాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు.

కాలువకు అడ్డుగా వేసిన మట్టికట్ట

ఉద్యం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

సీతారామపురం, న్యూస్‌టుడే : పారిశ్రామికవేత్తలుగా రాణించాలనుకునే వారు ప్రభుత్వ రాయితీలు పొందేందుకు ఉద్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని వెలుగు డీపీఎం రత్నమ్మ సూచించారు. సీతారామపురంలోని స్త్రీశక్తి భవనంలో ఉద్యం కార్యక్రమంలో రిజిస్ట్రేషన్‌పై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు శామ్యూల్, శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రత్నమ్మ

మరుగుదొడ్లు.. ఉపయోగించలేరు

గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల సముదాయంలో ఒకటి నీటి సదుపాయం లేక నిరుపయోగమైంది. మరమ్మతులు చేయించి నీరు సరఫరా చేస్తే ఉపయోగంలోకి తీసుకురావచ్చు. ప్రస్తుతం పాఠశాలలో 374 మంది విద్యార్థులకు రెండు సముదాయాలు మాత్రమే ఉండగా, వారి అవసరాలకు అవి సరిపోవడం లేదు. – న్యూస్‌టుడే కలిగిరి

ప్లాస్టిక్ సంచులు.. పర్యావరణానికి తూట్లు

ఇది పట్టణంలోని తుమ్మలపెంట బస్టాండ్ కూడలిలో కొన్ని దుకాణాల్లో పట్టుకున్న ప్లాస్టిక్ కవర్లు. నిషేధమున్నా వ్యాపారులు యథేచ్ఛగా విక్రయిస్తున్నారనడానికి నిదర్శనమిది. వీటితో పర్యావరణం కలుషితమవుతుంది. ఈ విషయమై పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ స్పందిస్తూ ఇకపై పట్టణంలో ఎక్కడా విక్రయం కాకుండా చూస్తామన్నారు. –న్యూస్‌టుడే, కావలి

లోతట్టు వంతెన.. వాహనదారుల యాతన

బోగోలు మండలంలోని జువ్వలదిన్నెకు వెళ్లే ర.భ రోడ్డు అల్లూరు స్వాంపుపై నిర్మించిన వంతెన రోడ్డుకు సమాంతరంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిళ్లు ద్విచక్ర వాహనాలు పడిపోతున్నాయి. ర.భ అధికారులు స్పందించి పాత వంతెన స్థానంలో ఎత్తైన వంతెన నిర్మించాలని ఈప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

జారిపడితే.. అంతే సంగతులు!

మండలంలోని యాకర్లపాడు గ్రామంలో రెండు నెలలుగా తాగునీటి పైపులైన్లో లీకేజీ కారణంగా తాగునీరు వృథా అవుతోంది. దీని కారణంగా స్థానికంగా ఉన్న సిమెంటు రోడ్డుపై నీరు చేరడంతో పాచిపట్టి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.
– అనంతసాగరం, న్యూస్‌టుడే

అవును ఇది పాఠశాలే..

ఇవి పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలు. నిరుపయోగంగా ఉండడంతో కొందరు తమ అవసరాలకు వినియోగించుకొంటున్నారు. ప్లాస్టిక్ గోతాల పట్టాలు, పేడ దిబ్బలు వేస్తున్నారు. ట్రాక్టర్లు కూడా ఇక్కడే పెడుతున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు

నిర్మాణంపై స్థల వివాదం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వక్ఫ్ బోర్డు స్థలాల్లో నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావాన్ అన్నారు. పట్టణంలోని లక్ష్మణరావుపల్లి సర్వే నంబరు 852లో నిర్మాణం ఆపేసినట్లు వక్ఫ్ బోర్డు అధికారులు తెలిపారు. ఇవి గతంలో ఆర్యవైశ్యుల ఆధీనంలో ఉండేవి. అయితే ఈ స్థలం వక్ఫ్‌బోర్డుదని దానిలో నిర్మాణం చేపట్టడాన్ని స్థానిక టేక్ కేర్ దస్తగిరి, ముజావర్లు సలీం, రహమతుల్లాలు ఆపేశారు. ఈ విషయం ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పొక్లెయిన్‌తో తొలగించాలని ఆదేశించారు. దాంతో దీన్ని తీసుకుపోగా యజమాని అడ్డుకొన్నారు. మాకు లింక్ డాక్యుమెంటు ఉన్నాయని, సర్వేలో ఆస్థలం వక్ఫ్‌బోర్డుదని తేలితే వదిలేస్తామని తెలిపారు. పట్టణంలో సుల్తాన్‌షహీద్ దర్గా, ఈద్గాకు సంబంధించిన స్థలాలు 13 ఎకరాల 47 సెంట్ల భూమి ఉందని వాటిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేసినా వెంటనే తొలగిస్తామని ఆయన అన్నారు. మొత్తం ఉమ్మడి సర్వే చేసి నిర్ధారణ చేస్తామని తెలిపారు.

రోడ్లు నిర్మించారు.. కాలువలు మరిచారు

ఇది మండలంలోని జమ్మలపాలెం సత్రం సెంటర్ నుంచి సుబ్బమ్మ బావి మీదుగా రామాలయం వరకు నిర్మించిన సిమెంట్ రోడ్డు. దీనికి ఇరువైపులా కాలువలు ఏర్పాటుచేయలేదు. దీంతో నివాసాల నుంచి వచ్చే మురుగునీటితో పాటు వర్షం కురిస్తే రహదారిపై రోజుల తరబడి నీరు నిలిచిపోతుంది.

న్యూస్‌టుడే, జలదంకి

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆర్థిక సంఘం, ఉపాధి నిధులతో అంతర్గత వీధుల్లో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. దీంతో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయని ప్రజలు సంతోషించారు. కానీ వీటికి అనుసంధానంగా కాలువలు లేకపోవడంతో కష్టాలు పడుతున్నారు. నివాసాల నుంచి వచ్చే మురుగునీరు ఇళ్ల ముందే నిలిచిపోతుంది. అందులోనే నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. దోమలు ఉద్ధృతమవడంతో రాత్రిళ్లు నిద్రపోలేకున్నారు. ప్రాణాంతక డెంగీ, గన్యా, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని జమ్మలపాలెం, బ్రాహ్మణక్రాక, చినక్రాక, చామదల, జలదంకి, కేశవరం, అన్నవరం, గట్టుపల్లి తదితర పంచాయతీల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లతో ప్రజలు నిత్యం నానాఇబ్బందులు పడుతున్నారు.

జమ్మలపాలెంలో కాలువలు లేకుండా నిర్మించిన సిమెంట్ రోడ్డు

నిర్మించేలా చర్యలు

– ఎం.బ్రహ్మయ్య, ఎంపీడీవో, జలదంకి

నివాసాల నుంచి వచ్చే మురుగు రోడ్లపై నిల్వ కాకుండా కాలువలు నిర్మిస్తాం. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం.

శాస్త్రీయ దృక్పథంపై జేవీవీ ప్రచారం

కావలి, న్యూస్‌టుడే: సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెరిగేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక కావలి పట్టణ కమిటీ గౌరవాధ్యక్షులు బెజవాడ రవికుమార్, అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. సైన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా రామచంద్రయ్య, లక్ష్మీప్రసన్న, చాకలికొండ శారద, లక్ష్మీప్రశాంతి వ్యవహరించారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్, కోశాధికారి సుబ్బరామశర్మ పాల్గొన్నారు.

జలాశయానికి 1,391 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయానికి మంగళవారానికి ఎగువ ప్రాంతాల నుంచి 1,391 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 66.527 టీఎంసీలు నిల్వ ఉండగా 324.810 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. 17, 18 రివర్స్ స్లూయిస్‌ల ద్వారా 50, క్రస్ట్‌గేట్ల లీకేజీల నుంచి 50, పవర్ టన్నెల్‌కు 2,850 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. కండలేరు వరద కాలువకు 150, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 700 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు. రోజుకు సగటున 261 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు అధికారులు వివరించారు.

యువకులు - ప్రగతికి మార్గదర్శకులు

న్యూస్‌టుడే, దగదర్తి

గ్రామీణ ప్రాంత యువకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి తమవంతు సాయం చేస్తున్నారు. కాలనీల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్నారు... దగదర్తి, శ్రీరామపురానికి చెందిన వెంకట రమణయ్య, మహేశ్.

కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న యువకులు

గ్రామాల్లో పచ్చదనం నింపుతూ...

మండలంలోని శ్రీరామపురానికి చెందిన మహేశ్ గ్రామాభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నారు. ప్రిన్స్ యూత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి గ్రామంలోని ఉన్నత పాఠశాల మైదానం, కాలనీల్లో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఇంకుడు గుంతలు తవ్వి నీటి సంరక్షణకు పాటు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తున్నారు. పంచాయతీలో ఎక్కడ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తున్నారు. స్థానిక యువకులతో కలిసి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు.

సేవలతో ఆదర్శం

దగదర్తిలోని నిరుపేద కుటుంబానికి చెందిన ధర్మయ్య, ధనమ్మల కుమారుడు వెంకటరమణయ్య.. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. న్యాయ విద్యతో పాటు పీజీ పూర్తి చేశారు. డిగ్రీ చదువుతున్నప్పుడే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. జాతీయ సేవా పథకంలో చేరి ఉత్తమ వాలంటీరు అవార్డు అందుకున్నారు. కాలనీల్లో మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తున్నారు. తన సేవలకు జిల్లా కలెక్టర్లు చక్రధర్, హిమాన్షుశుక్లా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అంతేగాకుండా పలు స్వచ్ఛంద సంస్థల నుంచి అవార్డులు పొందారు.

ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లు స్వాధీనం

జలదంకి, న్యూస్‌టుడే : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తప్పవని రీజనల్ విజిలెన్సు స్క్వాడ్ మైనింగ్ ఏడీ బి.రామచంద్ర హెచ్చరించారు. మంగళవారం జలదంకి జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమతులు, బిల్లులు చెల్లించకుండా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని జలదంకి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ప్రైవేటు సంస్థకు అప్పగించడాన్ని మానుకోవాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని 12 డిపోల్లో ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు స్థానిక ఆర్టీసీ డిపోలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బస్సుల నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించడం ఉద్యోగుల కడుపు కొట్టడమేనన్నారు. ఎన్ఎంయూఏ, ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి గేట్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మురళి, సలాం, శంకర్, వెంకటేశ్వర్లు, కాశీవిశ్వనాథ్, యస్దానీబాషా, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

పాలు కల్తీ చేస్తే కఠిన చర్యలు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: జిల్లాలో పాల విక్రయదారులు కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాల్లో పాల విక్రయాలను తనిఖీ చేసి నమూనాలను సేకరించారు.

కారు ఢీకొని బాలికకు గాయాలు

గాంధీజనసంఘం (సంగం), న్యూస్‌టుడే: మండలంలోని గాంధీజనసంఘంలో ముంబయి జాతీయరహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో పడమటిపాలెం గ్రామానికి చెందిన సి.హెచ్.భాగ్యేశ్వరికి గాయాలయ్యాయి. బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రైవేటు పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న ఈమె బస్సు దిగి తన తల్లి నీలిమతో కలిసి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా.. వెనుకగా వచ్చిన కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్పృహ కోల్పోయిన బాలికను నెల్లూరుకు చికిత్సకు తరలించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో..

వింజమూరు, న్యూస్‌టుడే : ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టరును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కావలి- ఉదయగిరి 167 బీజీ హైవేలో మండలంలోని నందిగుంటలో మంగళవారం రాత్రి ఈఘటన జరిగింది. దుత్తలూరు మండలంలోని నందిపాడు నుంచి కలిగిరి మండలం పెద్దఅన్నలూరుకు ఇటుకలతో ట్రాక్టరు వెళుతోంది. దుత్తలూరు మండలంలోని కట్టకిందపల్లె నుంచి వింజమూరు వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో జరుగుతున్న వివాహానికి వెళుతున్న కారు నందిగుంట వద్ద ట్రాక్టరును ఢీకొట్టింది. దీంతో ఇటుకల ట్రాక్టర్ బోల్తా పడింది. కారులో ఉన్న కట్టకిందపల్లెకు చెందిన దుగ్గినేని రమణయ్యకు తీవ్రగాయాలవగా.. అంబులెన్సులో పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని కృష్ణంపల్లికి చెందిన పేరుబోయిన శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. గ్రామానికి చెందిన కల్లూరి రాజారెడ్డి మంగళవారం ఆ కుటుంబానికి రూ. 10 వేల నగదు అందజేశారు.

విద్యాలయాలకు కాసుల కష్టాలు

విడుదల కాని నిర్వహణ నిధులు

న్యూస్‌టుడే, దుత్తలూరు

పాఠశాలల నిర్వహణకు మళ్లీ కష్టాలు వచ్చాయి. నిధులు విడుదల కాకపోవడంతో సుద్దముక్కలు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నిర్వహణ నిధులను ఒకేసారి జమ చేస్తామని పేర్కొంది. ఈమేరకు కొన్నాళ్లు వచ్చాయి. చివరి విడత రాకపోవడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో 362 ప్రాథమిక పాఠశాలలతోపాటు 49 ప్రాథమికోన్నత, 51 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నాలుగు చొప్పున కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలున్నాయి. వీటిలో 33 వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. నిర్వహణ నిధులతోనే మరుగుదొడ్ల శుభ్రత, బోధనోపకరణాల కొనుగోలు, పాఠశాలల్లో చిన్న చిన్న మరమ్మతులు, విద్యుత్తు సరఫరా, తాగునీటి ప్లాంట్ల నిర్వహణ తదితర వాటికి ఈ నిధులనే వినియోగించుకోవాలి. ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వీటిని కేటాయిస్తోంది. 20 మంది లోపు ఉంటే రూ. 10 వేలు, 20-50 వరకు రూ. 25 వేలు, 50-100 మంది ఉంటే రూ. 50 వేలు, 100-500 మంది అయితే రూ. లక్ష వరకు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు సగం విడుదల చేసింది. మిగిలినవి రాకపోవడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంత నిధులు వెచ్చిస్తున్నారు.

దుత్తలూరు: ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు

త్వరలోనే జమ : బాలాజీరావు, డీఈవో

గతంలో సగం నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన వాటి విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో వస్తాయి. రాగానే ఆయా పాఠశాలల ఖాతాలకు జమ చేస్తాం. అప్పటివరకు ఇబ్బందులు లేకుండా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.

మూలకు చేరుతున్న ఆర్వో ప్లాంట్లు

గతంలో పాఠశాలల్లో తాగునీటికి ఆర్వో ప్లాంట్లు ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కొన్ని చోట్ల వినియోగిస్తుండగా చాలా వాటిలో మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేసేందుకు కాసులు లేకపోవడంతో నీటి క్యాన్లు అందుబాటులో ఉంచి దాహార్తి తీరుస్తున్నారు. మరుగుదొడ్ల నిర్వహణతోపాటు స్టేషనరీ కొనుగోలు చేయడం భారంగా మారుతోందని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పరిశ్రమకు భూమి కేటాయింపుపై ఆందోళన

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని జి.చెర్లోపల్లిలో మేత పోరంబోకు భూమిని బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి కేటాయించవద్దని మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు కె.వెంకటయ్య మాట్లాడుతూ పంచాయతీలోని వడ్డెపాలెం సమీపంలో సర్వే నంబరు 250లోని 200 ఎకరాల మేత పోరంబోకు భూమిని పరిశ్రమకు కేటాయించడం దారుణమన్నారు. పంచాయతీ ప్రజలు మూగజీవాల పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. దీన్ని పరిశ్రమకు కేటాయిస్తే పశువుల మేతకు పోషకులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమ్మ, బండి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

వడ్డెపాలెంలో ఆందోళన చేస్తున్న రైతులు

ఇంటర్ పరీక్షలకు 298 మంది హాజరు

సంగం, న్యూస్‌టుడే: సంగంలో మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు డా.బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో ప్రశాంతంగా జరిగాయి. తెలుగు, హిందీ, సంస్కృతం భాషలకు చెందిన పరీక్షలకు 307 మంది హాజరు కావాల్సి ఉండగా 298 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ సుమతమ్మ, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజేశ్వరి పర్యవేక్షించగా, ఎస్సై పి.రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. **చేజర్ల:** గ్రామంలోని కేంద్రంలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 84 మంది హాజరైనట్లు ముఖ్య పర్యవేక్షకులు టి.శ్రీధర్ తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది.

(c) eenadu

గూడూరు

• గూడూరు • కోవూరు • సర్వేపల్లి

పశు వైద్యశాలలను ఆధునికీకరించండి

మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం, పాడి పరిశ్రమ రెండు కళ్లని వాటిని అభివృద్ధి చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం శాసనసభలో ఆమె మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలలను ఆధునికీకరించాలని, వైద్య సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. 24 గంటల ఎమర్జెన్సీ మొబైల్ వెటర్నరీ యూనిట్ ఏర్పాటు చేయాలని శాసనసభలో ఆమె పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి, పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. అమరావతిలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంతాల ప్రజలకు మరీ ఎక్కువ నీటి సమస్య ఉందని, నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ర.భ రహదారులు దెబ్బతిని ప్రజలు రాకపోకలు అవస్థలు పడుతున్నారని, కొన్ని చోట్ల నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేక వేయలేదని, అధికారులతో మాట్లాడి సహకరించాలని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం

వేసవి సెలవులివ్వాలని ఆందోళన

గూడూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి బృందం, న్యూస్‌టుడే: ఏడాది అంతా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు సేవలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు, సిబ్బందికి వేసవిలో మే నెలలో సెలవులు మంజూరు చేసేలా ప్రభుత్వం జీవో విడుదల చేయాలని అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన చేశారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గూడూరు అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రావతి, ప్రభావతి ఆధ్వర్యంలో మంగళవారం రెండో రోజు ధర్నా నిర్వహించారు. కోటలో నినాదాలు చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మార్చి 2న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముత్తుకూరులో పలువురు మాట్లాడుతూ న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కోవూరులో పలువురు అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, రాపూరులో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి.

ఎస్ఈఐఎల్ ఎనర్జీ సీఈవోకు అవార్డు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ సంస్థ సీఈవో జన్మేజయ మహాపాత్రకు 'డిస్టింగ్విష్డ్ లీడర్‌షిప్ అవార్డు' లభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. టైమ్స్ ఫౌండేషన్, టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం దిల్లీలో జరిగిన జాతీయ సీఎస్ఆర్ సమ్మిట్ 2026 కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ సమక్షంలో అవార్డు అందుకున్నారు.

రోడ్డు మరమ్మతులు చేయాలని నిరసన

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు నుంచి మిట్టాత్మకూరు మీదుగా ఉన్న గిద్దలూరు రోడ్డు మరమ్మతులు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని రైతుబజార్ వద్ద విద్యార్థులతో కలిసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు.

ఉదయకళేశ్వరస్వామి హుండీ కానుకల లెక్కింపు

కొడవలూరు, న్యూస్‌టుడే: గండవరంలోని ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.18.27 లక్షల కానుకలు వచ్చాయని ఆలయ ఛైర్మన్ మాలకొండయ్య తెలిపారు. మంగళవారం దేవస్థానం వద్ద ఈవో ఉమాబాబు, అర్చకులు, ట్రస్టీల ఆధ్వర్యంలో లెక్కించామని పేర్కొన్నారు.

మైపాడులో మట్టి తరలింపు వివాదం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మైపాడు సముద్ర తీరం ఒడ్డున ఉన్న మట్టి తరలింపుపై మంగళవారం వివాదం చోటుచేసుకుంది. బీచ్ సమీపంలో ఒకరు తన పొలంలోకి టిప్పర్ల ద్వారా తరలిస్తుండగా మత్స్యకారులు అడ్డుకున్నారు. రొయ్యల గుంత తీసిన మట్టిని తాము వాడుకుంటున్నామని అనుమతులు లేకుండా మీరెలా తరలిస్తారని ప్రశ్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ముగుస్తున్న సమయం.. నమోదుతో ప్రయోజనం

అయ్యగారిపాలెంలో నమోదు చేయిస్తున్న వ్యవసాయాధికారులు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ప్రభుత్వ పథకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఫార్మర్ రిజిస్ట్రీ' నమోదు ప్రక్రియ చేపట్టింది. అసైన్డ్ పొలాలు మినహా సాగు భూమి ఉన్న ప్రతి రైతుకు పదకొండు అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య జారీచేస్తున్నారు. పీఎం కిసాన్‌తో పాటు భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు ఇది తప్పనిసరి కానుంది. గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో ఆర్ఎస్‌కే పరిధిలో ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది.

● ఏడీఏ శివనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు వర్తించేందుకు 'ఫార్మర్ రిజిస్ట్రీ' తప్పనిసరిగా పేర్కొన్నారు. భవిష్యత్తులో దీనినే ప్రమాణికంగా తీసుకుని పథకాలు అమలు చేసే అవకాశముందని రైతులంతా తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేస్తున్నారని సంబంధిత పత్రాలతో సంప్రదించాలని సూచించారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో మండలాల వారీగా వివరాలు

మండలం	లక్ష్యం	నమోదు	చేయాల్సినవి
పొదలకూరు	11374	7200	4174
మనుబోలు	8759	4900	3859
వెంకటాచలం	5145	3153	1992
ముత్తుకూరు	4920	3925	995
టీపీ గూడూరు	5638	3638	2000

ఇవీ ఉపయోగాలు..

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, ఎరువుల రాయితీలు, పంట బీమా, దిగుబడుల విక్రయాలతో పాటు అవసరమైన పంట దిగుబడులు గిట్టుబాటు ధరకు విక్రయించేందుకు ఈ సంఖ్య తప్పనిసరి. అతివృష్టి, అనావృష్టి సమయాల్లో పంట దెబ్బతింటే పరిహారం పొందాలన్నా అవసరమని, ఈ నెల 28 లోగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రైతుసేవా కేంద్రాలు, మండల వ్యవసాయ కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఆధార్ కార్డు నంబరు, పట్టాదారు పాసు పుస్తకం, చరవాణి నంబరు తీసుకొని ఆయా కార్యాలయాలకు వెళితే సిబ్బంది లేదా అధికారులు నమోదు చేస్తారు. అనంతరం రైతులకు 11 అంకెల గుర్తింపు సంఖ్య వస్తుంది.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

మనుబోలు, న్యూస్‌టుడే: వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందితే దేశ, విదేశాల్లో ఉపాధిని పొందవచ్చని చెన్నై టీజీఈఎస్ ఇంజినీరింగ్ కళాశాల సహాయ ఆచార్యులు గీత అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ ట్రేడ్‌లో ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద పాఠశాలలను ఎంపిక చేసి వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయిని అమ్ములు కుమారి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, రంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో చెన్నై టీజీఈఎస్ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు గీత, ఉపాధ్యాయినులు

చేనేతల సమస్యలు పరిష్కరించండి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న చేనేతల సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబును ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు కేవీ శేషయ్య కోరారు. అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం కలిసిన వీరు చేనేత కార్మికుల సమస్యలను తెలియజేశారు. వారితో సీఎం మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి చేనేతలకు 200 యూనిట్ల విద్యుత్తు రాయితీ ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చామని పేర్కొన్నారు. ఆ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు కేవీ శేషయ్య

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి :80085 73980

సమస్య: తోటపల్లిగూడూరు మండలం ఆంజనేయపురం వద్ద కోడూరు ప్రధానరోడ్డు మార్గంలో వ్యర్థాలు పడేస్తుండడంతో పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. – చంద్రశేఖర్,
సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – మంజుల, పంచాయతీ కార్యదర్శి

? బుచ్చిలోని 11వ వార్డు ఐదో వీధిలో వీధి దీపం వెలగడం లేదు. – హరీష్, స్థానికుడు
✓ వీధి దీపం వేయిస్తాం. – బాలకృష్ణ, కమిషనర్

? కొడవలూరు దళితవాడలో వద్ద దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. – బాలయ్య
✓ దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. – వెంకటసుబ్బారావు, ఎంపీడీవో, కొడవలూరు

? గూడూరు జానకీరామ్‌పేటలో రోడ్డుపై వ్యర్థాలు వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. – జనార్దన్, స్థానికులు
✓ సిబ్బందిని పంపి వెంటనే తొలగిస్తాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు

? ఇందుకూరుపేట మండలం కుడితిపాలెంలో నీటిపారుదల కాలువలో అడ్డుగా ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలి. – చంద్రశేఖర్, స్థానికుడు
✓ తొలగిస్తాం.– విజయభాస్కర్, డీఈఈ.

? కోటలో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుంది. వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.– కుమార్, కోట
✓పరిశీలించిపరిష్కరిస్తాం.–అనంతరావు, ఏఈ

? గూడూరు పట్టణంలోని బొగ్గులదిబ్బలో మురుగు కాలువ సక్రమంగా లేక మురుగు నీరు ముందుకు కదలడం లేదు. స్థానికంగా ఉండే ప్రజలు, పాదచారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. – చరణ్, గూడూరు.
✓శుభ్రం చేస్తాం.– వెంకటేశ్వర్లు, కమిషనర్

? పొదలకూరు మండలం భోగసముద్రంలో పొలాలకుసోమశిల కాలువ నుంచి నీరందక అవస్థలు పడుతున్నాం. – రమణయ్య, రైతు
✓ పరిశీలించి సిబ్బందితో చర్యలు తీసుకుంటాం.– సుధీర్, సోమశిల కాలువ డీఈఈ

? తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడి సమీపంలో కాలువకు ఇరు వైపులా గోడ లేదు. – శ్రీనివాసులు, స్థానికుడు
✓గోడ నిర్మిస్తాం – రమేశ్, పీఆర్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం పారుదల కాలువలో గుర్రపుడెక్క పేరుకపోయింది –సుధాకర్, స్థానికుడు
✓ తొలగిస్తాం – అలీ, ఇరిగేషన్ ఏఈ

వ్యాధులమయం

కోవూరు ఇనమడుగు పంచాయతీ పరిధిలోని ఎర్రగుంట గిరిజన కాలనీ సమీపంలో మురుగు కాలువలు ధ్వంసమై వందల అడుగుల మేర పూడిక తీయడం లేదు. నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని గృహాల వారు చిన్నపిల్లలు, వృద్ధులు వ్యాధుల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

పొంచి ఉన్న ప్రమాదం

చిల్లకూరు సమీపంలోని దళితవాడలో వ్యర్థ జలాలు ప్రవహించేందుకు సిమెంట్ రోడ్డుపై మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. దానికి మూత లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. అటువైపు రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మూత ఏర్పాటు చేయాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు. – న్యూస్‌టుడే, చిల్లకూరు

పాఠశాల చెంతనే వ్యర్థాలు

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో పారిశుద్ధ్య చర్యలు అధ్వానంగా ఉన్నాయి. ముత్యాలమ్మ ఆలయం ఉండడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. చెత్త చెదారాలు ఎక్కువగా పేరుకు పోతున్నాయి. ప్రాథమిక పాఠశాల ఆవరణలో వ్యర్థాలు డంపింగ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, చిల్లకూరు

విద్యార్థులకు క్రీడా పోటీలు

గూడూరు పట్టణ పరిధిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీసిటీ సహకారంతో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో మినీ కబడ్డీ క్రీడా పోటీలు మంగళవారం నిర్వహించారు. పది జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో జడ్పీ బాలుర పాఠశాల జట్టు, బాలికల విభాగంలో జడ్పీ బాలికల జట్టు విజేతలుగా నిలిచాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులిచ్చి అభినందించారు. – న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

బజారు కూడలిలో నీడ కరవు

కోవూరు బజారు కూడలిలో ప్రయాణికులకు కనీస నీడ కరవైంది. మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు టీఎన్‌సీ కళాశాల వద్ద, బజారు కూడలిలో రోడ్లపై బస్సులు, ఆటోల కోసం ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి ప్రయాణికుల కోసం బస్సుషెల్టర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోవూరు, విడవలూరు

వ్యవసాయాధికారిపై విచారణ

కోట, న్యూస్‌టుడే: కోట వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం ఏవో సుచేంద్రప్రసాద్‌పై వచ్చిన ఫిర్యాదులపై నాయుడుపేట ఏడీఏ నాగార్జునసాగర్ విచారించారు. ఆయన నుంచి పలు వివరాలు సేకరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాధుపేట సెంటర్ సమీపంలో టిప్పరు ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ వివరాల మేరకు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన శ్రీనివాసులు(31) సాధుపేట సెంటర్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న సమయంలో పట్టణంలో నుంచి జాతీయ రహదారి వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొనడంతో శ్రీనివాసులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న డీఎస్పీ గీతాకుమారి, పట్టణ ఎస్సై మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పట్టణ పరిధిలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడం తగదు

విడవలూరు కోవూరు, న్యూస్‌టుడే: ఎలక్ట్రికల్ బస్సు నిర్వహణ పేరుతో ఆర్టీసీని ప్రైవేట్ కంపెనీకి అప్పజెప్పడాన్ని నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. ఇనమడుగు కూడలి వద్ద ఉన్న ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో మంగళవారం ఆ సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, షాజుద్దీన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో 12 డిపోలను ప్రైవేట్‌పరం చేయడం దారుణమని పేర్కొన్నారు. యూనియన్ సభ్యులు సుధాకర్‌రావు, భాస్కరరావు, ఆదినారాయణరెడ్డి, దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇనమడుగు కూడలిలో జోనల్ వర్క్‌షాప్ వద్ద కార్మికుల నిరసన

సీఐడీ విచారణను స్వాగతిస్తున్నాం

కలువాయి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అసెంబ్లీలో మాట్లాడుతూ కలువాయిలో భూ కుంభకోణం జరిగిందని దానిపైన సీఐడీ విచారణ జరపాలని మాట్లాడారని, దానిని మేము స్వాగతిస్తున్నామని వైకాపా జడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు కలువాయిలోని వైకాపా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడాలి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం క్లస్టర్ వైద్యశాలలో ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేస్తే చర్యలు

మనుబోలు, న్యూస్‌టుడే : చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు వేస్తే చేపల చెరువుల లైసెన్సులు రద్దు చేస్తామని మత్స్యశాఖ సహాయ పరిశీలకుడు సంజయ్ స్టీఫెన్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కాగితాలపూరు, కొమ్మలపూడి, గురివిందపూడి గ్రామాల్లో చేపల చెరువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోళ్ల వ్యర్థాలను చెరువుల్లో వేస్తే నీటి కాలుష్యం పెరిగి చేపల నాణ్యత తగ్గిపోవడంతో పాటు మానవ ఆరోగ్యానికి హానికరమన్నారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం..!

న్యూస్‌టుడే, చిల్లకూరు

మండలంలోని దాదాపు 30 కి.మీ పరిధిలోని 20 గ్రామాలకు రాకపోకలు సాగించే రోడ్డు అధ్వానంగా ఉంది. వాహనచోదకులకు ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అత్యవసర సమయాల్లో గమ్యానికి చేరుకునేందుకు ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. చిల్లకూరు వరగలి అడ్డరోడ్డు జాతీయ రహదారి కూడలి నుంచి తూర్పు కనుపూరు దాకా సాగరమాల నాలుగు వరుసల రోడ్డు నిర్మిస్తున్నారు. సంబంధిత పనులకు వస్తుసామగ్రిని తరలించే భారీ వాహనాలు, గ్రావెల్, సిలికా టిప్పర్ల రాకపోకలతో గతంలో ఉన్న రోడ్డు నామరూపాల్లేకుండా పోయింది. అడుగుకో గుంత ఏర్పడడంతో ద్విచక్రవాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీనికి తోడు ఒళ్లు, వాహనాలు గుల్లవుతున్నాయని పలువురు వాపోతున్నారు. రెండేళ్లుగా సమస్య ఉన్నప్పటికీ మరమ్మతులు చేయకుండా సంబంధితశాఖ అధికారులు తాత్సారం చేస్తున్నారు. రోడ్డు అధ్వానంగా ఉన్నప్పటికీ టిప్పర్లు మితిమీరిన వేగంతో దూసుకెళుతున్నాయి. దీంతో దుమ్ములేవడమే కాకుండా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల తిక్కవరం వద్ద ఓ ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందారు. ఇక మూగజీవాల సంగతి సరేసరి. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. వాటి వెనుక వెళుతున్న ద్విచక్రవాహన చోదకులు, ఆటోల్లో ప్రయాణించే వారు దుమ్ము కొట్టుకుపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీళ్లు చల్లుతున్నారు. ఎక్కడ గుంత ఉందో తెలియని ద్విచక్రవాహనదారులు వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

చేడిమాల సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డుపై వస్తున్న టిప్పర్

శ్మశాన స్థలం ఆక్రమిస్తున్నారని ఆగ్రహం

కలువాయి, న్యూస్‌టుడే: మండలంలోని చింతలాత్మకూరు ఎస్టీలకు చెందిన శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీలంతా ఒక చోట చేరి మంగళవారం ఆందోళన చేపట్టారు. శ్మశాన వాటికకు ప్రభుత్వం రెండెకరాల భూమిని తమకు కేటాయించిందన్నారు. ఆక్రమణకు గురికాకుండా రెవెన్యూ అధికారులు పరిశీలించాలని పేర్కొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

స్వచ్ఛ రథం వినియోగించుకోండి

పొదలకూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ గ్రామ రూపకల్పనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ రథం సద్వినియోగం చేసువాలని ఎంపీడీవో నరసింహారావు కోరారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. తెదేపా నాయకులు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో ప్రారంభిస్తున్న అధికారులు

పూత పూసింది.. ఆనందం విరిసింది

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

వేసవి కాలం వచ్చిందంటే మామిడికి మంచి గిరాకీ. ఈ ఏడాది మామిడి పంటలో ఆశించిన స్థాయిలో పూత కనిపించకపోవడంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. పిందె దశలో ఉండాల్సిన మామిడితోటల్లో ఇప్పుడిప్పుడే పూత మొదలైంది. గూడూరు డివిజన్‌లో 50 నుంచి 60 శాతం తోటల్లోనే పూత కనిపిస్తోంది. దీనికి కారణం వాతావరణంలో వచ్చిన మార్పులు ఒకటైతే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం మరో కారణం. మామిడి చెట్లకు పూత మొదలైనప్పటి నుంచి పంటపై రైతులు శ్రద్ధ పెడుతున్నారు. దీంతో అన్నదాతల్లో ఆనందం కనిపిస్తోంది. ఆలస్యంగానైనా పంట వస్తుందనే ఆశలు చిగురిస్తున్నాయి.

పూత దశలో మామిడి చెట్లు

ఉద్యానశాఖ ద్వారా ప్రోత్సాహకాలు: గూడూరు, చిల్లకూరు, కోట మండలాలతో పాటు మనుబోలు, పొదలకూరు, రాపూరు, కలువాయి, సైదాపురం 20 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు సాగు చేస్తున్నారు. రైతులు నిమ్మ, బొప్పాయి పంటలతో పాటు మామిడి వేస్తుండగా ప్రభుత్వం ఉద్యానశాఖ అధికారులు సూక్ష్మసేద్యం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. పంటల విస్తీర్ణం ప్రతి ఏటా పెరుగుతోంది. ధరలు తగ్గుముఖం పట్టడం, దిగుబడులు లేకపోవడం పూత దశ నుంచి చీడపీడలు ఆశించడంతో సాగుదారుల్లో ఆందోళన నెలకొంది. సాధారణంగా రెండు నెలలు ముందే రావాల్సిన పూత ఇంత వరకు 80 శాతం కూడా రాలేదు. కూటమి ప్రభుత్వం పండ్ల నాణ్యతకు రాయితీపై కవర్లు అందిస్తోంది. పిందె దశలోనే కడితే నాణ్యతతో పాటు అధిక ధరలకు విక్రయించుకునే అవకాశముంది. 50 శాతం రాయితీతో కవర్లు అందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి మామిడి సాగు చేసే వారు పొందొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

●గూడూరు ఉద్యానశాఖ అధికారిణి సునీత మాట్లాడుతూ...రైతులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూత వచ్చినప్పుడు నుంచి సస్య రక్షణ చర్యలు విధిగా పాటించాలని పేర్కొన్నారు.

Union Bank of India
A Government of India Undertaking
అసెట్ రికవరీ బ్రాంచి
మూడవ అంతస్తు, సిఒ అనెక్స్ బిల్డింగ్, పాండేశ్వర, మంగళూరు- 575001,
ఇ-మెయిల్: arb.hubballi@unionbankofindia.bank.in
ఎం: 9164146425
यूनियन बैंक ऑफ इंडिया
Union Bank of India

అనుబంధం - IV-A

(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8 (6) లోని నిబంధనను చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 హామీగల స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల నోటీసు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 (6) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(ల)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ఛార్జిచేయబడిన మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి, మంగళూరు యొక్క అధీకృత అధికారిచే స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి, బ్యాంక్/సెక్యూర్డు క్రెడిటార్‌కు చెల్లించవల్సిన దిగువతెలిపిన బకాయిలతోపాటు తదుపరి వడ్డీ మరియు ఇతర చట్టబద్ధ ఖర్చులను దిగువతెలిపిన రుణగ్రహీత(ల) నుండి రాబట్టుకోవటానికి 13-3-2026 మ.12.00 గం.నుండి సా.5.00 గం.వరకు (10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో) "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతిపదికన విక్రయించబడును. ఆస్తి రిజర్వు ధర మరియు ధరావతు మరియు ఆస్తి వివరాలు దిగువనివ్వబడినవి:

రుణగ్రస్తుడు: శ్రీ కె.వి.అమర్‌నాథ్, తండ్రి: కెవిఆర్ నాయుడు, నివాసం: ఫ్లాట్ నెం.టిఎఫ్-402, రాఘవేంద్ర రెసిడెన్సీ, సన్‌సిటీ ఎస్టేటు, సూళ్ల రోడ్, కేశ్వాపూర్, హుబ్బళ్లి - 580029. మరియు **గ్యారంటీదారులు: 1) శ్రీమతి కంచర్ల ప్రభావతి, భర్త: శ్రీ వెంకటరమణయ్య నాయుడు,** నివాసం: వవ్వేరు గ్రామం, బుచ్చిరెడ్డి పాలెం మండలం, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా - 524305, **2) శ్రీమతి కంచర్ల వాణి, భర్త: శ్రీ అమర్‌నాథ్ నాయుడు,** నివాసం: ఇ.నెం. 47, బనశంకరి, మయూరి ఎస్టేటు, హుబ్లి - 580023. మరియు **3) శ్రీ ఎం.సంపత్‌కుమార్, తండ్రి: ఎంఎస్ఎన్ ప్రసాద్ సంపత్ మైనేని,** నివాసం: ప్లాటు నెం. 14, 4వ క్రాస్, ఆకాష్ పార్కు, కుసుగల్ రోడ్, హుబ్లి - 580023.

బకాయి సొమ్ము 31-1-2026 నాటికి రూ.55,22,482.48 (యాభైఐదు లక్షల ఇరవైరెండు వేల నాలుగువందల ఎనభైరెండు రూపాయల నలభై ఎనిమిది పైసలు మాత్రమే)+ భవిష్యత్ వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

హామీగల స్థిరాస్తుల వివరం: 1) ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు ఉప రిజిస్ట్రేషన్, ప్రస్తుతం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరులో బిట్-1, కొత్తూరు గ్రామం సర్వే నెం. 1881 నుంచి 1888 వరకు భూమి లేఅవుట్ ప్లాట్లుగా మార్చబడి, సర్వే నెం.1883, ప్లాట్ నెం.247, విస్తీర్ణం 33.33 అంకణాలు (లేదా) 266.64 చ.గ.లు ఉమ్మడి స్వంతదారులుగా శ్రీమతి కంచర్ల ప్రభావతి మరియు శ్రీమతి కంచర్ల వాణి గార్ల మరియు దీని **హద్దులు: తూర్పు:** ప్లాటు నెం.260, **పడమర:** 30.0 వెడల్పు రోడ్, **ఉత్తరం:** ప్లాటు నెం.248, **దక్షిణం:** ప్లాటు నెం.246.

రిజర్వు ధర: రూ. 18,40,000/- | ఇఎండి రూ. 1,84,000/-

2) ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుచ్చిరెడ్డి పాలెం, ఉప - రిజిస్ట్రేషన్ ఏరియా, బుచ్చిరెడ్డి పాలెం మండలం, వవ్వేరు గ్రామం, కోరు మాగాణి భూమి స.నెం.882ఎలో మరియు విస్తీర్ణం ఎక 2-25 సెంట్లు భూమి, ఎక 5-40 సెంట్లు నుంచి శ్రీ కె.వి.అమరనాథ్ గారి స్వంతం, మరియు **హద్దులు: తూర్పు:** ఎర్రచెరువు, **పడమర:** పి.డబ్ల్యూ.డి. ట్యాంక్‌బండ్, **ఉత్తరం:** కంచర్ల రవీంద్ర నాయుడు భూమి, **దక్షిణం:** కె.వెంకటరామయ్య నాయుడు గారి భూమి. స.నెం.881లో.

రిజర్వు ధర: రూ.23,00,000/- | ఇఎండి రూ.2,30,000/-

పైనతెల్పిన ఆస్తులు "ఆన్‌లైన్"లో విక్రయించబడతాయి.ఆన్‌లైన్ ఇ-వేలం పైనతెల్పిన తేదీన, సమయానికి 10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్‌పోర్టల్/వెబ్‌సైట్ https://baanknet.com పై జరుగును.ఆసక్తిగల బిడ్డర్లు/కొనుగోలుదార్లు తమ మొబైల్ నెంబరు మరియు చెల్లుబాటగు ఇమెయిల్ ఐడి ఉపయోగిస్తూ https://baanknet.com పై నమోదు చేసుకొనవలెను. అంతేగాక వారు కెవైసి డాక్యుమెంట్లు మరియు బ్యాంక్ వివరాలను అప్‌లోడ్ చేయవల్సి ఉంటుంది.ఆస్తి తనిఖీ మరియు వేలం వివరాలను పొందుటకు ఔత్సాహిక బిడ్డరు పైనతెల్పిన చిరునామాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎఆర్‌బి శాఖ, మంగళూరును, మెయిల్ ఐడిని మరియు చీఫ్ మేనేజర్ (బ్రాంచ్ హెడ్), శ్రీ లక్ష్మీశ కె.భార్గవ్‌గారిని సంప్రదించవచ్చును, కాంటాక్ట్ నెం.9164146425 .ఔత్సాహిక బిడ్డర్లు మా బ్యాంక్ వెబ్‌సైట్: https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx ను కూడా చూడవచ్చును.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 15 రోజుల విక్రయ నోటీసు

పైనతెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీతలకు మరియు గ్యారంటర్లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)రూల్ 9(1) క్రింద దీనిని ఒక నోటీసుగా కూడా పరిగణించవచ్చును.

తేది: 17-2-2026
ప్రదేశం: మంగళూరు

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

నెల్లూరు
• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

దాడి చేశారని ఫిర్యాదు

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: ఇద్దరు కలిసి వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నెల్లూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుగ్రామీణ మండలంలోని జన్నత్ హుస్సేన్ నగర్‌కు చెందిన హాజీ, ముబారక్ ఈ నెల 23న తమ ఆటోలను నసీర్ ఇంటికి అడ్డుగా పార్కింగ్ చేశారు. నసీర్ తన తమ్ముడు సమీర్‌లు ఆటోలను పక్కన పెట్టాలని వారికి తెలిపారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. హాజీ, ముబారక్ వారిపై కర్రలతో దాడి చేశారు. బాధితుడు నెల్లూరుగ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కనిపించని కాటా..
అక్రమాల బాట!

కానరాని ధర్మకాటా

న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల మోసాలు అరికట్టేందుకు పలు చర్యలు తీసుకుంటున్నా.. అమలు కావడం లేదు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారానికి మార్కెట్ ప్రసిద్ధి. ఆవరణంలో సుమారు 150కిపైగా దుకాణాలుండగా మరో 200 మంది చిరువ్యాపారులు ఉన్నారు. నెల్లూరు నగరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి కూరగాయలు, ఆకుకూరల కొనుగోలు నిమిత్తం వచ్చే రిటైల్ వ్యాపారులు, కొనుగోలుదారులతో మార్కెట్ ఆవరణం ఎప్పుడూ కిటకిటలాడుతుంది. రోజు వారీ 80 టన్నుల వరకు వివిధ రకాల కూరగాయల అమ్మకాలు జరుగుతుంటాయి. మొత్తంగా ఒక్కరోజులో రూ.కోటి వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.

తూకం తూచ్..

కొనుగోలుదారులు వ్యాపారుల చేతిలో మోసపోకుండా మార్కెట్‌లో దుకాణాల మధ్య ధర్మకాటా ఏర్పాటు చేశారు. కొన్న కూరగాయలను ధర్మకాటా వద్ద తూకం చూసుకోవచ్చు. దాని పక్కనే ఓ పుస్తకం పెడతారు. తూకం వేసుకున్న వారు అందులో పేరు, ఫోన్ నంబర్‌తో పాటు ఏమైనా ఫిర్యాదులు ఉంటే రాయొచ్చు. లేదంటే నేరుగా నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లొచ్చు. కొందరు దుకాణదారులు వేసే తూకంలో 50గ్రా, 100 గ్రాముల తేడా ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో అనేక మంది మోసపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ సమయంలో ధర్మకాటా ప్రాముఖ్యత ఎంతో ఉంది. ఇప్పటికే దుకాణాల మధ్య ఎవరికి కనపడకుండా ఉందనే విమర్శలు ఉన్నాయి. అప్పుడప్పుడు కానరాక ఫ్లెక్సీ మాత్రమే ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు ధర్మకాటాను మార్కెట్ లోపలకి వచ్చే మొదట్లో ఏర్పాటు చేయడం, ప్రతిరోజూ ఉండేలా చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

- వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు మాట్లాడుతూ కాటా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: హరనాథపురంలో కుక్కలు అధికంగా ఉన్నాయి. ప్రతి వీధిలో గుంపులుగా తిరుగుతున్నాయి. పిల్లలను బయటకు పంపాలంటేనే భయమేస్తోంది. – సుదర్శన్‌రావు

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్ మోహన్, వెటర్నరీ అధికారి

? టైలర్స్‌కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – రబ్బానీబేగం

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ దినేష్, ఆరోగ్యాధికారి

? నగరంలోని పాత ములుమూడి బస్టాండ్ కూడలి వాహబ్‌పేట రాజా టీ దుకాణం రోడ్డులో ఆరు స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. – నరసింహారావు

? నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ప్రకాష్‌నగర్- ఉడ్‌హౌస్ సంఘం మధ్య రోడ్డులో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళ ఇబ్బందిగా ఉంది. – పద్మ

✓ వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. – ముజాహిద్దీన్ నగరపాలక సంస్థ డీఈ

- న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, స్టోన్‌హౌస్ పేట)

సిబ్బందిని పక్క డిపోలకు పంపడం తగదు

ఆర్టీసీ ప్రాంగణంలో యూనియన్ నాయకుల నిరసన

నెల్లూరు(ఆర్టీసీ), న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సుల నిర్వహణ పేరుతో డిపో స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం నెల్లూరు-1 డిపో గ్యారేజీ ఎదుట ఎన్ఎంయుఏ, 2 డిపో గ్యారేజీ ఎదుట జేఏసీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల కోసం రాష్ట్రంలో 12 డిపో స్థలాలను ప్రైవేటుపరం చేస్తూ అక్కడ సిబ్బందిని పక్క డిపోలకు పంపుతామని అధికారులు చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పద్మారావు, మురళీమోహన్‌రెడ్డి, చెంచయ్య, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, గౌస్‌బాషా, సునీల్‌బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పేరుకుపోతున్న వ్యర్థాలు

నగరంలోని అల్లీపురం డంపింగ్ యార్డు వద్ద పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేయడం, బయోమైనింగ్, రీసైక్లింగ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పనులు చేస్తున్న గుత్తేదారు ముందస్తు జాగ్రత్తలు చేపట్టకపోవడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై చెత్తాచెదారాలు, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పెద్దఎత్తున దుమ్ము లేస్తోంది.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

లీకులతో వృథాగా తాగునీరు

నగరంలోని పొదలకూరు రోడ్డు పద్మావతి సెంటర్ నుంచి రాజరాజేశ్వరి అమ్మవారి గుడికి వెళ్లే దారిలో పైపులైను నుంచి నీరు లీకై పెద్ద ఎత్తున వృథాగా పోతోంది. ఇంత జరుగుతున్నా.. నగర పాలక అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేసి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు మూర్ఖులు

జస్టిస్ జీఆర్ స్వామినాథన్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు దుర్మార్గులు, మూర్ఖులు, అవివేకులని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు. తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దర్గాపై ఉన్న రాతిస్తంభంపై మురుగన్ భక్తులు కార్తీకదీపం వెలిగించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించి, అమలుచేయలేదు. డీఎంకే నేతలు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ స్వామినాథన్ మాట్లాడుతూ.. గురువు అంటే భగవంతుని స్వరూపమన్నారు. భగవంతుని పాదాలు తాకలేమని, అయితే గురువు పాదాలను తాకడం సులభమని చెప్పారు. తమిళనాడులో హేతువాదులు గురువును భగవంతునిగా చూస్తున్న మనల్ని దుర్మార్గులు, మూర్ఖులు, అవివేకులుగా భావిస్తున్నారన్నారు. కానీ నిజమైన దుర్మార్గులు, మూర్ఖులు, అవివేకులు వారేనని తెలిపారు. గురువు అనుగ్రహం వల్ల ధైర్యం, సాంత్వన లభిస్తాయన్నారు. గురువుల దగ్గరకు వెళ్లినప్పుడు వారి ప్రకారం భక్తుల బలహీనతలను తొలగించడానికి సహాయపడుతుందని చెప్పారు. తన పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉందని, మరింత ధైర్యంతో పనిచేయాలని అనుకుంటున్నట్లు జస్టిస్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు.

పులివెందుల చేరుకున్న జగన్

ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: మూడురోజుల పర్యటనలో భాగంగా వైకాపా అధ్యక్షుడు జగన్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల చేరుకున్నారు. మంగళవారం ఆయన బెంగళూరు నుంచి పులివెందుల సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు స్వాగతం పలికారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సాయంత్రం జగన్ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. గతంలో కార్యకర్తల మధ్య తోపులాట జరిగిన నేపథ్యంలో గోడలపైనా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజాదర్బార్ అనంతరం జగన్ తన స్వగృహానికి వెళ్లారు. బుధవారం ఉదయం వేంపల్లె మండలం నందిపల్లెలోని నందీశ్వరాలయం ప్రారంభోత్సవానికి ఆయన హాజరు కానున్నారు.

అక్రమ మైనింగ్‌తో ఖజానాకు ఎంత నష్టం జరిగిందో చెప్పండి

- జస్టిస్ సుధాంశు ధులియా కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దుల్లోని ఏపీ భూభాగంలో ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి ఇచ్చిన ఇనుప గనులు, అక్కడి అటవీప్రాంత హద్దులను ఖరారు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నాలుగు విషయాలను తన నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. తవ్వకాలకు అనుమతి పొందిన సంస్థలు రిజర్వ్ ఫారెస్టును ఆక్రమించాయా? లేదా? అక్రమ మైనింగ్, ఇతర అనధికార కార్యకలాపాల తీవ్రత ఎంతమేర ఉంది? ప్రభుత్వ ఖజానాకు ఎంతమేర నష్టం జరిగిందన్నది చెప్పాలని నిర్దేశించారు. ఓఎంసీ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు 2009 నవంబరు 19న సమ్మిరెడ్డి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఖనిజం తవ్వకాలను సస్పెండ్ చేయగా, ఆ ఉత్తర్వును కొట్టేస్తూ ఏపీ హైకోర్టు 2010 ఫిబ్రవరి 26న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. దానిపై మంగళవారం జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చితో కలిసి విచారించిన సందర్భంగా సీజేఐ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. గత ఏడాది సెప్టెంబరు 19న జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో సుప్రీం ధర్మాసనం ఏర్పాటుచేసిన కమిటీ మరో ఆరువారాల గడువు అడగడంతో మంగళవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అందుకు అంగీకరించారు.

సీబీఐ నుంచి ఏం ఆశించగలం?

కర్ణాటకకు చెందిన సమాజ పరివర్తన సముదాయ తరఫు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ వాదనలు వినిపిస్తూ 'అంతర్రాష్ట్ర సరిహద్దులో పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరిగింది. దీనిపై దర్యాప్తు జరిపిన సీబీఐ 2014 వరకే రిపోర్టు దాఖలుచేసింది. తర్వాత జరిగిన దర్యాప్తు ఏమైందో తెలియదు. ఇక్కడ ఆరు గనుల లీజుదారులు సరిహద్దులు, కొండలు, ఆలయాలను ధ్వంసం చేశారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ 'సరిహద్దుల అంశం చాలా సున్నితమైనది. దురదృష్టవశాత్తు 11 ఏళ్లుగా ఏమీచేయని సీబీఐ నుంచి మనం ఇప్పటికిప్పుడు ఏం ఆశించగలం? ఇప్పుడు జస్టిస్ సుధాంశు ధులియా కమిటీ సరిహద్దుల ఆవల మైనింగ్ జరిగినట్టు చెబితే సీబీఐ దర్యాప్తు మళ్లీ మొదలుపెట్టవచ్చు' అని పేర్కొన్నారు. కర్ణాటకలోని మైనింగ్ సంస్థల తరఫు న్యాయవాది బసవప్రభు పాటిల్ వాదనలు వినిపిస్తూ 'ఇప్పుడు లీజు హద్దులను ఖరారుచేయడం ఒక్కటే మిగిలింది. ఆ బాధ్యతనే జస్టిస్ ధులియా కమిటీకి అప్పగించారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ అక్రమంగా దండుకున్నవారి సంగతేంటని ప్రశ్నించారు. 'ఉదాహరణకు మీరు ఆంధ్రావైపు లీజు ఇచ్చారు. కానీ లీజు పొందిన వ్యక్తి అది కర్ణాటక కిందికి వస్తుందని చెప్పి తవ్వకాలు చేపట్టి ఉండొచ్చు. అలాగే కర్ణాటక వైపు లీజులు ఉంటే అది ఆంధ్రా వైపని చెప్పి తవ్వి ఉండొచ్చు. వాళ్లు తమ పని చక్కబెట్టుకొని వెళ్లిపోయారు' అని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా 'నిజాలు బయటకురావాలన్న ఉద్దేశంతో స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలని మేం కోరాం. ఆ కమిటీ ఆరు వారాల సమయం అడిగినందున అంత వరకు వేచిచూడటం మంచిది' అన్నారు. దీంతో సీజేఐ ఆ కమిటీకి ఆ గడువునిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

7 వేల ఆయా పోస్టులు భర్తీ చేస్తాం

మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు కొత్తగా 7 వేల ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు మంత్రి సంధ్యారాణి శాసనమండలిలో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 'రాష్ట్రంలో 257 ఐసీడీఎస్ ప్రాజెక్టులు.. 55,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. గత ఏడాదిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు 70 శాతంగా ఉండేది. ప్రస్తుతం అది 96 శాతానికి పెరిగింది' అని మంత్రి వెల్లడించారు.

విచారణార్హతపై వాదనలు వింటాం

చంద్రబాబు ముందస్తు బెయిలు రద్దుపై వేసిన పిటిషన్ విషయంలో ఆళ్లకు స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారంలో నమోదుచేసిన కేసులో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంజూరుచేసిన ముందస్తు బెయిలును రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ విచారణార్హతపై వాదనలు వింటామని పిటిషనర్, వైకాపా మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టు స్పష్టం చేసింది. సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది మాధవ్ ఖురానా వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు విచారణార్హత లేదన్నారు. అభ్యంతరం ఉంటే ఏసీబీ కోర్టులో పిటిషనర్ ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలుచేసుకోవాలి తప్ప.. బెయిలు రద్దు కోసం హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. మొదట వ్యాజ్య విచారణార్హతపై వాదనలు వింటామని స్పష్టం చేస్తూ మార్చి 10కి వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

శ్రీకాకుళంలో విజృంభిస్తున్న అతిసారం

- 3 రోజుల్లో 76 కేసులు, ఒకరి మృతి
- మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేత

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో అతిసారం ప్రబలుతోంది. మూడు రోజుల్లో 76 కేసులు నమోదయ్యాయి. దీంతో సీఎం చంద్రబాబు మంగళవారం రెండుసార్లు జిల్లా అధికారులతో సమీక్షించారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక బృందాలు నియమించారు. బాధితుల్లో మొండేటివారి వీధికి చెందిన ఎం. సురేష్(43) మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబానికి సీఎం చంద్రబాబు ఆదేశం మేరకు ఎమ్మెల్యే శంకర్ రూ.10 లక్షల పరిహారం అందజేశారు. మరొకరు కూడా ప్రాణాలు కోల్పోగా అతిసారంతోనా లేక మరేదైనా కారణం ఉందా అనే విషయంపై స్పష్టత లేదు.

కలుషిత నీరే కారణమా?

అతిసారం ప్రబలడానికి తాగునీరు కలుషితం కావడమే కారణమని అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని వీధుల్లో రోడ్డువిస్తరణ పనులు చేపట్టారు. పైపులైన్లు పగలడంతో వాటిలోకి మురుగునీరు చేరిందని భావిస్తున్నారు. ఎక్కువగా దమ్మల వీధి, గుడి వీధి, మంగువారితోట, కాకివీధి ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. దీంతో మురుగునీటి కాలువల్లో పైపు లైన్లు, లీకేజీల గుర్తింపునకు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య బృందాలను రంగంలోకి దించారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు విశాఖలోని ల్యాబ్‌కు పంపారు. ప్రభావిత ప్రాంతాల్లో రెండురోజులుగా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు.

శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజారోగ్య రక్షణలో వైఫల్యం: జగన్

ఈనాడు, అమరావతి: ప్రజల ప్రాణాలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. శ్రీకాకుళంలో అతిసారం వ్యాప్తితో పలువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రక్షణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడి హత్య

ఒడిశాలో ఓ బాలిక ఘాతుకం

జయపురం, న్యూస్‌టుడే: తన ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడిని ఓ బాలిక హత్యచేసింది. ఈ ఘటన ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బొరిగుమ్మలో చోటుచేసుకుంది. ఎస్‌డీపీవో సత్యబ్రత లెంకా తెలిపిన వివరాల ప్రకారం.. సదరు సమితికి చెందిన 16 ఏళ్ల బాలిక తన ప్రేమను అంగీకరించలేదని తల్లి అనుష్క పరిదా(45), సోదరుడు అహం పరిదా(14)లను ప్రియుడితో కలిసి కాళ్లు, చేతులు కట్టేసి కడుపులో కత్తితో పొడిచి హత్య చేసింది. అనంతరం స్థానిక కాలువలో పడేసింది. సోమవారం ఈ ఘటన జరగ్గా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అహం మృతదేహాన్ని కాలువ ఒడ్డున గుర్తించగా, అనుష్క మృతదేహం కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ గాలింపులు ప్రారంభించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అనుష్క పరిదా

అహం పరిదా

తమిళనాట కొత్త పార్టీ ప్రారంభించిన శశికళ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు, దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త పార్టీని ప్రారంభించారు. రామనాథపురం జిల్లా కముదిలో మంగళవారం రాత్రి జరిగిన జయలలిత జయంతి వేడుకల్లో ఆమె పార్టీ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జయలలిత మరణం తర్వాత పార్టీలో చాలా సమస్యలు తలెత్తాయని, తాను ముఖ్యమంత్రిగా నియమించిన వ్యక్తి తనకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తొమ్మిదేళ్లు మౌనంగా ఉన్నానని, ఇకపై ఉండటం కుదరదని, ఇంకా మౌనంగా ఉంటే కార్యకర్తలకు, ప్రజలకు ద్రోహం చేసినట్లు అవుతుందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండా మధ్యలో అన్నా, ఎంజీఆర్, జయలలిత చిత్రాలున్నాయి. పార్టీ పేరు తర్వాత ప్రకటిస్తామని శశికళ పేర్కొన్నారు.

పార్టీ జెండాను చూపుతున్న శశికళ

వాటికి మించింది లేదు

మీ మానసిక, శారీరక ఆరోగ్యం కంటే మీకు ముఖ్యమైంది ఏదీ లేదు. ఈ విషయంలో డబ్బు, స్నేహితులు, ఆఖరికి మీ కుటుంబం కూడా తర్వాతే. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడుకునేందుకు సూర్యరశ్మి, పౌష్టికాహారం, వ్యాయామాన్ని వదలకండి.

– స్టీవ్, కంటెంట్ క్రియేటర్

వైకాపా పాపాన్ని వైఎస్‌కు చుట్టడం తగదు

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: తిరుమల పవిత్రత విషయంలో వైకాపా చేసిన పాపాన్ని వైఎస్సార్‌కు చుట్టడం కూటమి ప్రభుత్వానికి భావ్యం కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. వైకాపా కల్తీ పనులు వైఎస్ హయాం నుంచే ప్రారంభమయ్యాయని సీఎం చంద్రబాబు అనడం సబబు కాదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అసెంబ్లీ వేదికగా వైఎస్‌పై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. ఆ వ్యాఖ్యలు సభ రికార్డుల నుంచి తొలగించి, చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి. వైఎస్ ఏడుకొండలను రెండు కొండలు చేయాలని ఏనాడూ అనుకోలేదు. ఏడుకొండలూ వేంకటేశ్వరస్వామివేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చింది వైఎస్సే. వైకాపా అరాచకాలకు ఆయనకు ఎలాంటి సంబంధం లేదు' అని షర్మిల అన్నారు.

ఫోర్జరీ సంతకాల పాపం వారిద్దరిదే

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇన్‌ఛార్జి మేయర్ కుర్చీ పోతుందన్న ఒత్తిడిలో రూప్‌కుమార్ యాదవ్ ఉన్నారని గిరిజన నాయకుడు జయవర్ధన్ అన్నారు. నగరంలోని జిల్లా జర్నలిస్టు భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇన్‌ఛార్జి మేయర్‌గా 60 రోజుల్లో అభివృద్ధి చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్పొరేషన్‌లో ఫోర్జరీ సంతకాల పాపం నీది, గిరిధర్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. మీరు చేసిన పాపానికి తాను శిక్ష అనుభవించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బోండాలు, బజ్జీలు అంటూ చిల్లర రాజకీయాలకు దిగడం రూప్‌కుమార్ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను విమర్శించే స్థాయి రూప్‌కుమార్‌ది కాదన్నారు.

కాలువ రక్షణ గోడలకు రూ.9.62 కోట్లు మంజూరు

నెల్లూరు(పద్మావతి సెంటర్), న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ మండలం పెద్ద చెరుకూరు వద్ద ఉన్న పాత నరుకూరు కాలువ రక్షణ గోడల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసి.. రూ.962.20 లక్షలతో పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ ప్రతిపాదన మేరకు ఈ పనులు రెండు విడతల్లో చేయనున్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన పేరం శ్రీనివాసులురెడ్డి మరియు దేవరకొండ జగదీష్ వారి అనుమతి మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం, ఆనం వెంకటరెడ్డినగర్, నెల్లూరు-2 నందు నెల్లూరు మున్సిపల్ కార్మికులకు డిఫారం పట్టాలు ఇచ్చి ఉన్నారు. గవర్నమెంట్ అనుమతి లేకుండా Incred ఫైనాన్స్ వారు సదరు డిఫారం పట్టాలో నిర్మించి ఉన్న ఇళ్ళకు అధిక వడ్డీతో లోన్లు ఇచ్చి 03-03-2026 తేదీన 20-7-353 కురిచేటి సంపూర్ణమ్మ ఇంటిని బహిరంగ వేలం చేయుట చట్ట విరుద్ధం. Act 7/77 ప్రకారం గవర్నమెంట్ వారు అనగా జిల్లా కలెక్టరు, నెల్లూరు RDO, నెల్లూరు అర్బన్ MRO సదరు డిఫారం పట్టా విక్రయాలు గురించి విచారణ చేయుచున్నారు. AP హైకోర్టులో రిట్ నెం: WP నెం: 4420/26పై ఫైనాన్స్ వారిపై విచారణ చేయుచు అర్జెంట్ ఆర్డర్స్ ఇచ్చి ఉన్నారు. కావున సదరు ఎవరు వేలంలో పాల్గొని ఎవ్వరు మోసపోవద్దని తెలియజేయడమైనది.

Counter Signed by
పేరం శ్రీనివాసులురెడ్డి
దేవరకొండ జగదీష్

Y.హరిహరనాథ్‌బాబు, B.A.L., B.L.,
Advocate
ముకుందాపురం, నవాబుపేట, నెల్లూరు-2. Cell: 9346833748



అనుకూల మార్పులు.. మెరుగైన మార్కులు

పరీక్షల వేళ నిద్ర, పౌష్టికాహారం ముఖ్యం

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

పరీక్ష రాయనున్న పదో తరగతి విద్యార్థులు :27931 ● పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థులు :53,404

ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తైతే పరీక్షల సమయంలో చదవడం మరో ఎత్తు.. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా, 20 రోజుల్లో పదో తరగతి పరీక్షలు మొదలు కానున్నాయి. ఏడాదంతా చదివింది మార్కుల రూపంలోకి మరల్చుకునేందుకు విద్యార్థుల్లో ఒకింత భయం ఉంటుంది. ఈ సమయంలో తెలివైన విద్యార్థులు సైతం ఒత్తిడికి లోనవుతుంటారు. పరీక్షలు ఎలా రాస్తామో.. మంచి మార్కులు వస్తాయో లేదోనన్న బెంగ సహజం. ఈ కారణాలతో కొందరు విద్యార్థులు తినరు. నిద్రపోరు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదని ఆహార నిపుణులు చెబుతున్నారు.

ఇలా చేయండి..

జాగ్రత్తలు : పరీక్షల సమయంలో తగినంత ఆహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోవాలి. అప్పుడే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. పాఠ్యాంశాలను గుర్తించుకోవాలంటే భయాన్ని వీడి మళ్లీ మననం చేయడం ముఖ్యం.

తినాల్సినవి : తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. అల్పాహారం తినకుండా ఉండకూడదు. మాంసాహారం, నూనెతో చేసిన పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. అన్నం తక్కువ మోతాదులో తీసుకుంటూ పప్పుధాన్యాలు సోయాగింజలు, పెరుగు, పాల పదార్థాలు ఆహారంలో భాగం చేసుకోవాలి. జొన్న, సజ్జ, గోధుమ, రొట్టెలు తీసుకుంటే మంచిది. ఆకుకూరలు, రాగిజావ, నువ్వులు, బాదం, ఉసిరికాయలు తినొచ్చు. నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. నిమ్మకాయ, గ్లూకోజ్, పండ్ల రసాలు తీసుకోవచ్చు.

వీటిని దూరం పెట్టండి : చిప్స్, శీతల పానీయాలు, తీపి పదార్థాలను అతిగా తింటే నిద్ర ఎక్కువగా వస్తుంది. వీటిని తీసుకోకపోవడం మంచిది. కాఫీ, టీలకు దూరంగా ఉండాలి.

అలవాట్లు మార్చుకోవాలి

– మన్మిత, పోషకాహార నిపుణురాలు

పరీక్షల సమయంలో ఆహారపు అలవాట్లు మార్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించగలరు. మెదడు చురుగ్గా పనిచేసేందుకు దోహదపడే బి కాంప్లెక్స్, విటమిన్ సి, జింక్, ఐరన్ వంటివి పదార్థాల్లో ఉండేలా చూసుకోవాలి. వీటిని తీసుకుంటే హార్మోన్లను సమతుల్యం చేస్తాయి. జ్ఞాపకశక్తి పెరిగేందుకు సెనగ, నువ్వులు వంటి గింజలు తీసుకోవచ్చు.

నిరుద్యోగ యువతకు శిక్షణ కోర్సులు

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా పదో తరగతి ఆపైన చదివిన నిరుద్యోగ యువతకు షార్ట్‌టర్మ్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని స్కిల్ హబ్ సెంటర్లున్న నెల్లూరు వెంకటేశ్వరపురం ప్రభుత్వ పురుషుల ఐటీఐ, నెల్లూరు గ్రామీణం డీకే మహిళా డిగ్రీ కళాశాల, కోవూరు వైకేఆర్ అండ్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విక్రమ సింహపురి వర్సిటీ, గొలగమూడి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ టూరిజం, ట్రావెల్స్ మేనేజ్‌మెంట్ కళాశాల, ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఉదయగిరిలోని ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కావలిలో విక్రమ సింహపురి వర్సిటీ పీజీ సెంటర్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు.

మసీదుకు పార్కింగ్ స్థలం కేటాయించండి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలోని మద్రాసు బస్టాండు వద్ద గల మస్జీద్ ఏ ఖుద్దూస్‌లో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు వెయ్యి మంది మసీదులో ఇఫ్తార్‌లో పాల్గొంటారని, అందరికీ చక్కగా ఏర్పాట్లు చేశారని తెలిపారు. మసీదు పక్కనే కాలువ ఉందని, పార్కింగ్ లేక వాహనాలు రోడ్డుపై పెట్టడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కొంత స్థలం కేటాయించాలని అడిగారని పేర్కొన్నారు. మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో చర్చించి పార్కింగ్‌కు స్థలం కేటాయించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ఆక్రమణలు జరగకుండా ప్రహరీ నిర్మాణం

నెల్లూరు(నగరపాలకసంస్థ): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 24వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు రూ.6.81 కోట్లు కేటాయించిందని తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. కనుపర్తిపాడులో రూ.22.50 లక్షలతో 2.60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎస్టీ కాలనీ శ్మశాన వాటికలో జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు.

పాల విక్రయాలపై నిరంతరం తనిఖీలు

పాల విక్రయాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: జిల్లాలో పాల విక్రయదారులు కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాల్లో పాల విక్రయాలను తనిఖీ చేసి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాల విక్రయాలపై నిరంతరం తనిఖీలు చేపడతామని తెలిపారు.

అధికారులు స్మార్ట్ మీటర్లు అమర్చుకోవాలి

జిల్లా అధికారులతో మాట్లాడుతున్న డిస్కం నోడల్ అధికారి చక్రపాణి

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: జిల్లాలో ముందస్తుగా అధికారులు, సిబ్బంది స్మార్ట్ మీటర్లు అమర్చుకోవాలని డిస్కం నోడల్ అధికారి జి. చక్రపాణి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్తుపై.. విద్యుత్తు శాఖ ట్రేడ్ యూనియన్లు, అసోసియేషన్ నాయకులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని తెలిపారు. స్మార్ట్ మీటర్లపై ఎటువంటి అపోహలు అవసరం లేదన్నారు. వీటిపై ఉన్న సందేహాలు తీర్చి వినియోగదారుల్లో అవగాహన పెంచాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.రాఘవేంద్రం, ఈఈలు ఎం.శ్రీధర్, భాను నాయక్, పలు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: నగరంలోని శెట్టిగుంట రోడ్డు సీవీఆర్ వీధిలో పి.సుజాత(51) కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కొంతకాలంగా మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 22న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమెను కుమార్తె గాయత్రి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి..

తడ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో నెల్లూరుకు చెందిన పేట వెంకటసాయి(35) మృతి చెందారు. ఈ ఘటన తడలో సోమవారం రాత్రి పెట్రోలు బంకులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నవాబుపేటకు చెందిన వెంకటసాయి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. స్థానిక పెట్రోలు బంకులో విద్యుత్తు పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మంగళవారం మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొండపనాయుడు తెలిపారు.

అద్దె చెల్లించకుంటే.. దుకాణాలు మూతే

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్‌ల మొండిబకాయిలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఏళ్ల తరబడి అద్దెలు చెల్లించకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు సకాలంలో చెల్లించని దుకాణాలకు తాళాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ వైవో నందన్ ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీవీఎస్ కిరణ్ ఆధ్వర్యంలో ఏసీ బొమ్మ షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఏసీ భవన్‌లో దుకాణాలు మూసి వేశారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

నెల్లూరు(టౌన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 6, 7 తేదీల్లో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నగరంలోని ఎన్జీవో భవనంలో మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులంతా పాల్గొని క్రీడా పోటీలను, 8న జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా వింగ్ ఛైర్‌పర్సన్ ఎల్.నవోదయ, కన్వీనర్ జి.లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ అరుణమ్మ, సంయుక్త కార్యదర్శి వి.రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు

మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(నగరపాలకసంస్థ): పన్ను వసూళ్లకు నెల రోజులే గడువు ఉందని, నూరుశాతం లక్ష్యాలను ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో రెవెన్యూ విభాగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇంకా పన్ను పరిధిలోకి రాని ఇళ్లు, వాణిజ్య భవనాలు, ఖాళీ స్థలాలను గుర్తించి వెంటనే తీసుకురావాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాటికి జియో ట్యాగింగ్ ద్వారా అనుసంధానం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్‌వో వాసుబాబు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జన గణనపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు (విద్య): జన గణనపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా అధికారులకు మూడు రోజుల పాటు జరగనున్న జన గణనపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మాట్లాడుతూ 2011 తరువాత చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శిక్షణకు హాజరుకాని జిల్లా అధికారుల వివరాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్‌వో విజయకుమార్, అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

ఎక్కడి పనులు అక్కడే!

- అధికారుల మధ్య సమన్వయ లోపం
- జిల్లా కేంద్రంలో అభివృద్ధి తీరు

చిత్రావతి బైపాస్ రహదారి విస్తరణలో భాగంగా హారతి ఘాట్ నుంచి దుర్గాదేవి ఆలయం వరకు రూ.80 లక్షలతో పనులు చేపట్టారు. మట్టి తొలగించి.. కంకర వేసి వదిలేశారు. మూడు నెలలుగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. భక్తులు, పర్యాటకులు, స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు.

✣ ఎనుములపల్లి ఎస్సీ వసతిగృహం సమీపంలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన మార్కెట్ పనులు ఆగిపోయాయి. ఆర్టీసీ డిపో వద్ద రూ.20లక్షల వ్యయంతో ప్రారంభించిన పార్కు పనులది ఇదే పరిస్థితి.

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో మూడు నెలలుగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల సమయంలో చేపట్టిన పనులను గుత్తేదారులు నిలిపివేశారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఈ దుస్థితి తలెత్తిందన్న ఆరోపణలు వస్తున్నాయి. శతజయంతి వేడుకల నేపథ్యంలో త్వరితగతిన పనులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు ఆదేశించడంతో గుత్తేదారులు రంగంలోకి దిగి ప్రారంభించారు. తరువాత నీటిపారుదల శాఖ అధికారులు... ఇక్కడ పనులు చేపట్టరాదని నోటీసులు జారీ చేశారు.

సమస్యల వలయంలో..

పుట్టపర్తిలో ఎక్కడ చూసిన సమస్యలే దర్శనం ఇస్తున్నాయి. తాగునీటి పైపులైన్లు లీకేజీలను మరమ్మతులు చేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. వివేకానందనగర్‌లో పది రోజులుగా రెండు తాగునీటి పథకాలు మరమ్మతులకు గురయ్యాయి. నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. భూగర్భ పైపులైన్ దెబ్బతినడంతో నదిలోకి మురుగు చేరి కలుషితం అవుతోంది. మరమ్మతులు చేసేందుకు రెండు పర్యాయాలు టెండర్ ప్రక్రియ నిర్వహించినా స్పందన లేదు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. పారిశుద్ధ్యం పడకేసింది. మున్సిపాలిటీ అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తగిన చర్యలు తీసుకుంటాం..

అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని.. సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాం. ఆగిన అభివృద్ధి పనులు పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

- క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

రానున్న ఐదు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుదల

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వచ్చే ఐదు రోజులూ పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణ స్వామి తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 35.3 నుంచి 37.0 డిగ్రీలు గాను, రాత్రి 23.0 నుంచి 24.0 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 5 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 62 శాతం, మధ్యాహ్నం పూట 35 శాతం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

అందరినీ ప్రేమించాలి.. సేవించాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: అందరినీ ప్రేమించు... అందరినీ సేవించు.. ఆచరణలో పాటించాలనే శ్రీసత్యసాయి సందేశాన్ని నృత్య రూపం ద్వారా తెలియజేశారు. ఈమేరకు మంగళవారం సాయికుల్వంత్ మందిరంలో చైనా, సింగపూర్, థాయిలాండ్ బాలవికాస్ చిన్నారుల నృత్యప్రదర్శన అలరించింది. సేవలో దైవత్వం దాగివుందనే సత్యాన్ని గ్రహించాలన్నారు. చైనీస్ సంప్రదాయ రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సాయికీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సతీమణి హిమవాహిని... భక్తులకు వస్త్రాలను అందజేసి అభినందించారు. వేలాది మంది సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పనితీరు మెరుగుపరుచుకోండి: సీఎం

ఈనాడు, అనంతపురం: శ్రీసత్యసాయి జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు పనితీరు మెరుగుపరుచుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. మంగళవారం రాత్రి అమరావతిలో జిల్లా ప్రజాప్రతినిధులు, ఎస్పీ, కలెక్టర్, ఇన్‌ఛార్జి మంత్రితో సమావేశమయ్యారు. కొందరు ఎమ్మెల్యేల పనితీరు ఆశాజనకంగా లేదన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నానని, సమస్యల పరిష్కారంలో చొరవచూపించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాలున్నాయని, ఇప్పటికే కియా ఏర్పాటుతో జిల్లా రూపురేఖలు మారిపోయాయని, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నామన్నారు. హంద్రీనీవా పథకాన్ని పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని హామీఇచ్చారు.

ఎస్పీ, కలెక్టర్‌కు దిశానిర్దేశం: ప్రజాసమస్యల పరిష్కారం, శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీపడొద్దని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకోవాలి. పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంలోనూ మెరుగైన ఫలితాలు సాధించాలని హితవుపలికారు.

● అనంత నగరంలో ఐస్ తయారుచేస్తున్న పెద్ద ఫ్యాక్టరీలు మూడు ఉన్నాయి. ఇళ్లల్లో తయారుచేస్తున్నవారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. వాటిలో ఏ ఒక్కదానికీ అనుమతులు లేవు. ఆహార భద్రత అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయాల్లో చేపలు, రొయ్యల స్టోరేజీకి మాత్రమే ఐస్‌ను వినియోగిస్తున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు. నగరంలో జ్యూస్ దుకాణాలకు ఇక్కడి నుంచే ఐస్ సరఫరా చేస్తున్నారు.

● కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో స్థానిక బ్రాండ్ల పేరుతో నిర్వహిస్తున్న ఐస్‌క్రీం తయారీ యూనిట్లలో నిబంధనలు పాటించడం లేదు. ఐస్‌క్రీంల తయారీకి కలుషిత నీటిని వినియోగిస్తున్నట్లు క్షేత్రస్థాయిలో పరిశీలనలో తేలింది.

ఐస్ అయిపోవద్దు!

✦ కలుషిత నీటితో తయారు చేస్తున్న అక్రమార్కులు

ఈనాడు, అనంతపురం: వేసవి సమీపిస్తోంది. ప్రస్తుతం ఎండవేడిమి ప్రభావం కనిపిస్తోంది. పండ్ల రసాలు, నన్నారీ వంటి పానీయాలు సేవిస్తుంటారు. జ్యూస్ షాపులు, రోడ్డు పక్కన తోపుడు బండ్లల్లో చల్లదనం కోసం పానీయాల్లో వినియోగిస్తున్న ఐస్ ఎక్కడ తయారవుతోంది? అందులో వాడే నీరు మంచి దేనా అనే పర్యవేక్షణ కొరవడింది. ఉమ్మడి జిల్లాలో 120 వరకు ఐస్ తయారీ యూనిట్లు ఉన్నాయి. ఏ ఒక్కదాంట్లోనూ నిబంధనలు పాటించడం లేదు. 90 శాతం మేర అనుమతులే లేవు. తుప్పు పట్టిన బాక్సుల్లో బోరు నీటిని నింపి ఐస్ తయారు చేస్తున్నారు. స్టోరేజీ కోసం వినియోగించాల్సిన ఐస్‌ను రెండు జిల్లాల్లోని జ్యూస్ షాపులకు సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

పిల్లలపై తీవ్ర ప్రభావం

కలుషిత నీటితో తయారుచేసిన ఐస్‌లోని సూక్ష్మజీవుల వల్ల అతిసారం, టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లు, గ్యాస్ట్రిక్ సమస్యలు, గొంతు ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. ఐస్ తయారీకి వినియోగించే నీటిలో ఫ్లోరైడ్ ఉంటే ఫ్లోరోసిస్, నైట్రేట్ వల్ల చిన్న పిల్లల్లో బ్లూబేబి సిండ్రోమ్‌కు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బోరు నీటితోనే.. : ఐస్ తయారుచేసే వ్యాపారులు క్వింటాలు రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. బోరు నీటిని శుద్ధి చేయకుండానే వినియోగిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండటంతో దుకాణాల నిర్వాహకులు ఒక్కొక్కరు నిత్యం 20 నుంచి 30 కిలోలు కొనుగోలు చేస్తున్నారు. చాలా సందర్భాల్లో ఐస్‌లో చెక్క, ఇనుప ముక్కలు వస్తున్నాయని జ్యూస్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు.

ఏం చేయాలి.. ఎలా చేస్తున్నారు?

✣ శుద్ధజలంతోనే ఐస్ తయారుచేయాలి. మలినాలను తొలగించడానికి రివర్స్ ఆస్మాసిస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. నీటి నాణ్యతను తరచూ పరీక్షించాల్సి ఉంటుంది. ✣ బాక్సులను ప్రతిసారీ శుభ్రం చేయడంతో పాటు శానిటేషన్ చేయాలి. కార్మికుల చేతులకు గ్లౌజులు తప్పనిసరి. ✣ అనంత నగరంతో పాటు, హిందూపురంలోని ఐస్ ఫ్యాక్టరీల నిర్వాహకులు ఇవేమి పాటించడం లేదు. ✣ గోనె సంచుల్లో వరిపొట్టును నింపేసి ఐస్‌ను తరలిస్తున్నారు.

(c) eenadu

ఇద్దరికి ఉప కలెక్టర్లుగా కొలువులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో తహసీల్దార్లుగా పని చేస్తున్న ఇద్దరికి పదోన్నతి కల్పించి ఉప కలెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 50 మంది ఉప కలెక్టర్లకు పోస్టింగ్ కల్పించగా.. ఇందులో అనంత జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లు ఉన్నారు. మూడు మాసాల క్రితమే ఉప కలెక్టర్లుగా పదోన్నతి కల్పించినా పోస్టింగ్ ఇవ్వలేదు. తాజాగా ఉరవకొండ తహసీల్దారు మహబూబ్‌బాషాను సీసీఎల్ఏలో సహాయ కార్యదర్శిగా, రాయదుర్గం తహసీల్దారు జి.నాగరాజును వైఎస్సార్ కడప జిల్లా కేఆర్ఆర్సీ ఎస్‌డీసీగా నియమించారు.

మాజీ సైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో ఖాళీగా ఉన్న పాయింట్స్‌మెన్ పోస్టుల భర్తీ కోసం మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎండీ రజాక్ తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసే 16 పోస్టులకు కనీస విద్యార్హత పదో తరగతి లేదా ఐటీఐ ఉత్తీర్ణులై ఏ2 మెడికల్ ఫిట్‌నెస్ ఉండాలని ఆయన వివరించారు. వయస్సు 55 ఏళ్లలోపు ఉండాలన్నారు. రైల్వేబోర్డు ఆదేశాల మేరకు రెగ్యులర్ అభ్యర్థులు చేరే వరకు మాత్రమే వీరిని కొనసాగిస్తారు. ఎంపికైన వారికి నెల జీతం రూ. 18వేలతో పాటు ఇతర భత్యాలు చెల్లిస్తారు. దరఖాస్తులు జిల్లా సైనిక సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే నెల 6లోగా గుంతకల్లు రైల్వే డివిజన్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

అమ్మాయిలు.. క్రికెట్‌లో ఆదిశక్తులే

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: క్రికెట్ ఆటలో మెరికల్ని గుర్తించాలంటే లీగ్ పోటీలు కీలకం. ఆంధ్ర క్రికెట్ సంఘం ఇదే ప్రయోగం చేయడానికి సిద్ధమైంది. జిల్లాల్లో లీగ్ పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చాటిన వారిని గుర్తించడానికి సన్నద్ధమైంది. చిరుప్రాయంలోనే ప్రతిభావంతుల్ని గుర్తించి సానబెడితే భవిష్యత్తులో దేశానికి కలికితురాళ్లుగా తయారవుతారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల అండర్-15 విభాగంలో లీగ్ పోటీలు నిర్వహించారు. అందులో ఇద్దరు బాలికలు అద్వితీయమైన ఆటతీరుతో ఆకట్టుకున్నారు. బంతితో వికెట్లు, బ్యాటుతో పరుగుల వరద పారించారు.

పేరు: ఈ.పూర్ణచంద్రిక
తరగతి: తొమ్మిది
బ్యాటింగ్ శైలి: కుడిచేతి వాటం బ్యాటింగ్, వికెట్ కీపింగ్
సాధన: రోజు 3 గంటలు
పరుగులు: రెండు లీగ్ పోటీల్లో 172 పరుగులు
అత్యధికం: 136* పరుగులు, రాప్తాడు ఏఎస్‌వీ జట్టుపై
ప్రాతినిధ్యం: ఆంధ్ర అండర్-16 జోన్ జట్టుకు
లక్ష్యం: భారత సీనియర్ మహిళా జట్టులో చోటు



పేరు: ఎ.మాన్విత
తరగతి: తొమ్మిది
బౌలింగ్ శైలి: ఎడమ చేతి వాటం స్పిన్నర్, కుడి చేతి వాటం బ్యాటరు
సాధన: అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో.
వికెట్లు: రెండు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు
ఉత్తమ ప్రతిభ: ఒకే మ్యాచ్‌లో ఆరు వికెట్లు
ప్రాతినిధ్యం: అండర్-15 విభాగం ఆంధ్ర బి జట్టుకు, రెండేళ్ల నుంచి జోన్ పోటీలకు ఎంపిక
భవిష్యత్తు లక్ష్యం: మహిళా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో ఆడాలని..

వైభవం... పీఠాధిపతి అడ్డపల్లకీ ఉత్సవం

విరాజిత వాహనంపై ఊరేగుతున్న చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ, న్యూస్‌టుడే: గవి గజ లక్ష్మి ముందు నడువగా... మంగళ వాద్యాలు... భారీ భక్త జనం మధ్య ఉరవకొండ గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామి అడ్డపల్లకీ ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది. చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పీఠాధిపతిని అడ్డపల్లిలో కూర్చోబెట్టి పల్లకిని మోశారు. ప్రత్యేక వేషధారణలు, కళాకారుల నృత్యాలు పల్లకీ ఉత్సవంలో ప్రత్యేకంగా నిలిచాయి. దారి పొడవునా జనం పీఠాధిపతిని దర్శించుకుంటూ పాదాభివందనం చేశారు. అనంతరం చంద్రమౌళీశ్వరస్వామి ఊరేగింపు వేడుక ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోనికి చెందిన మఠం కళ్యాణ స్వామి, ఆలయ సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఈవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అడ్డపల్లకీలో ఊరేగుతున్న పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి

విభిన్న ప్రతిభావంతులకు మౌఖిక పరీక్ష

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: ఏపీ స్టేట్ సర్కిల్ కార్యాలయంలో జేసీ విష్ణు చరణ్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లోని విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల పెట్రోల్ వాహనం అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించారు. 132 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో హాజరైన వారిని వైద్యుల బృంద సభ్యులు పలు అంశాలపై నిశితంగా పరిశీలించారు. ఎంపికైన వారికి ఉచితంగా వాహనాలను అందజేయనున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ పరిధిలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఎంబీఏ ఒకటి, రెండు సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు, ఎంసీఏ ఒకటి, రెండు సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. వీసీ, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పరీక్షల విభాగం అధికారులు నాగప్రసాద్‌నాయుడు, శివకుమార్, శారద, అంకారావు, శ్రీధర్ కార్యాచరణ పూర్తి చేశారు.

పీజీ ప్రవేశాల పెంపునకు కృషి చేయండి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ ప్రవేశాలు పెరగడానికి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గేయానంద్ విజ్ఞప్తి చేశారు. ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత మంగళవారం ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విశ్వవిద్యాలయం కళకళ లాడుతూ ఉండేదన్నారు. ఇటీవల ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. 1100 సీట్లు ఉండగా కేవలం 300 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయన్నారు. జేవీవీ నాయకులు భాస్కర్, చిత్తప్ప, వీరరావు, మహమ్మద్‌జిలాన్, తిరుపాలు, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గేయానంద్, జేవీవీ నాయకులు

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

భవ్యశ్రీకి చెక్కు అందజేస్తున్న విశ్రాంత డీజీపీ జేవీ రాముడు, ఐఆర్ఎస్ నరసింహప్ప, డీఎస్పీ హేమంత్‌కుమార్ తదితరులు

తాడిమర్రి, న్యూస్‌టుడే: విద్య విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలుస్తుందని విశ్రాంత ఏపీ డీజీపీ జేవీ రాముడు, విశ్రాంత ఐఆర్ఎస్ నరసింహప్ప తెలిపారు. మండలంలోని నార్శింపల్లిలోని జేవీఎంఆర్టీ పాఠశాల 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా జేవీ రాముడు, నరసింహప్పతో పాటు డీఎస్పీ హేమంత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. లక్ష్య సాధనలో ఓటమి ఎదురైనా వెనుకంజ వేస్తే ఏం సాధించలే మన్నారు. మరోసారి గట్టిగా ప్రయత్నం చేస్తే విజయం వరిస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో విశ్రాంత డీజీపీ జేవీ రాముడు అత్యాధునిక పాఠశాలను ఏర్పాటు చేసి, ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు చక్కటి విద్య అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి.

విద్యార్థులకు నగదు పురస్కారాలు: తొలుత పలువురు ప్రతిభావంత విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. 2025 విద్యా ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన భవ్యశ్రీకి రూ.20వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచిన దాసరి భవితకు రూ.15వేలు, ఎం.భవితకు రూ.10వేలు ఇచ్చారు. అదే ఏడాది పదో తరగతి పరీక్షల్లో తెలుగులో వంద, సోషల్‌లో 99, హిందీలో 98 మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు సుకన్య, చరణ్‌తేజ, మహిమ స్వరూపకు చెరో రూ.10వేలు చొప్పున అందజేశారు. విద్యార్థి ఇమ్రాన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించినందుకు రూ.10వేలు, బెస్ట్ విద్యార్థిని తనూజకు రూ.20వేలు, ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన సాయి వెంకట్, సాయి పూజితకు చెరో రూ.10వేలు పంపిణీ చేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాం. గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ 7382114647.

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3kmలో ఉద్యానవనం చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్రూమ్ హౌస్. సం: 6281824204

JOBS

WANTED
AXIS BANK కొరకు
అనంతపురం నందు పనిచేయుటకు
కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి.
లలితా ఫైనాన్స్ లింక్స్
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ.
7729989278

ప్రముఖ ఎడ్యుకేషన్ ఆఫీసు ATPలో జాబ్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qua: ఇంటర్ పైన Ph: 9515671633, 9391075143.

తెలుగు ఇంగ్లీష్ టైప్ రైటింగ్ మరియు కంప్యూటర్ స్కానింగ్ కలిగిన స్త్రీ/పు వ్యక్తి కావలెను. జీతం నెలకు 30,000/- సంప్ర: జయరాములు డాక్యుమెంట్ రైటర్, హిందూపురం. 9440248010.

FACULTY/ TEACHERS

Wanted: Jr & Sr Lecturers in Maths, Physics, Chemistry, Botany, Zoology, English, Sanskrit ATP 6302037812.

అధ్వాన సేవలు.. అందులోనూ ఆఖరు!

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు అందుతున్న సేవలపై ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో సేవలు అధ్వానంగా ఉన్నాయని తేలిపోయింది. అనంతపురం జిల్లా 25, శ్రీసత్యసాయి జిల్లా 24 ర్యాంకుల్లో ఉండటంపై ఉద్యోగుల సేవలు చాలా దయనీయ స్థితిలో ఉన్నాయని అర్థం అవుతోంది.

సర్వే ఎప్పుడు చేశారు: గత ఏడాది జూన్ 24 నుంచి మే 25, జూన్ 25 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 26 వరకు.

కారణాలివే: ఎస్పీడీసీఎల్ పరిధిలో కొన్ని డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు స్థానికంగా ఉండటంలేదు. పర్యవేక్షణ గాలికి వదిలేసి చుట్టపు చూపుగా కార్యాలయాలకు వస్తున్నారు. కార్యాలయాల్లో పని చేయాల్సిన జేఈలకు క్షేత్రస్థాయిలో రెండు మూడు సెక్షన్ల బాధ్యతలు అప్పగించటంతో వారు రెండు చోట్ల పని చేయలేకపోతున్నారు. కొంతమంది అధికారులు పర్యవేక్షణ మరిచిపోవడంతో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు ఇదే అదునుగా ప్రైవేటు వ్యవహారాలు సాగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

వెనుకబడిన సెక్షన్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అమరాపురం, కంబదూరు, గోరంట్ల, ఎస్.కె.యూ, కళ్యాణదుర్గం రూరల్, శెట్టూరు, కందుర్తి, అనంతపురం డీ-5, బుక్కరాయసముద్రం, గుడిబండ, మడకశిర, పుట్టపర్తి రూరల్, ఆత్మకూరు ఉన్నాయి.

వినియోగదారులను అడిగిన ప్రశ్నలు

శ్రీ సత్యసాయి జిల్లాలో (శాతంలో)	అవును	లేదు
1. మీకు నిరంతరాయ సరఫరా జరుగుతుందా?	74.7	25.3
2. మీ ఇంటికి నాణ్యమైన విద్యుత్తు అందుతోందా?	71.5	28.5
3. సిబ్బంది అందుబాటులో ఉన్నారా?	70.5	29.5

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 323 మంది గైర్హాజరు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 42 పరీక్షా కేంద్రాల్లో మంగళవారం జరిగిన ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 323 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 10,346 మందికిగాను 10,080, ఒకేషనల్‌లో 1305 మందికిగాను 1248 మంది హాజరయ్యారు. రాష్ట్ర పరిశీలకులు సౌజన్య నల్లమాడ, కదిరి పట్టణాల్లోని వివిధ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చెన్నకేశవప్రసాద్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లావ్యాప్తంగా వివిధ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

దక్షిణ భారతస్థాయి ఆర్చరీ పోటీలకు శ్రీలేఖ

శ్రీలేఖను అభినందిస్తున్న ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ

అనంతపురం క్రీడలు: పుదుచ్చేరిలో జరగనున్న దక్షిణ భారతస్థాయి ఖేలో ఇండియా ఓపెన్ ఆర్చరీ పోటీలకు జిల్లా నుంచి జి. శ్రీలేఖ ఎంపికైంది. అనంతపురానికి చెందిన ఈ బాలిక ఆర్డీటీ సహకారంతో సాధన చేసింది. ఇప్పటికే ఐదుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన ఆమె ఈసారి అద్భుత ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీలేఖను ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ పి.సాయికృష్ణ, ఆర్చరీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.శివశంకర్, శిక్షకురాలు ఎస్.లక్ష్మీదేవి ఆమెను అభినందించారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని మాధవనగర్‌కు చెందిన వివాహిత విజయలక్ష్మి(38) మంగళవారం ధర్మవరం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఒకటో మరువ సమీపంలో చెరువు నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మాధవనగర్‌కు చెందిన విజయలక్ష్మిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు
8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

నిల్వ ఉంచిన పేలుడు పదార్థాల స్వాధీనం

పేలుడు పదార్థాలను చూపుతున్న సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై లావణ్య, సిబ్బంది

మడకశిర, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని శివాపురం సమీపంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శివాపురంలో బాలాజీ అనే వ్యక్తి వ్యవసాయ భూమిలో అక్రమంగా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జెలిటిన్ స్టిక్స్ 450, ఎలక్ట్రికల్ డిటోనేటర్లు 22వేలు, సేఫ్టీ ఫ్యూజ్ వైర్ 12 బాక్సులు, యూరియా తదితర పేలుడుకు సంబంధించిన వాటిని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కోర్టులకు మూడోసారి బాంబు బెదిరింపు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే : జిల్లాలోని పలు కోర్టులకు ముచ్చటగా మూడోసారి మంగళవారం బాంబు బెదిరింపు లేఖలు ఈ-మెయిల్ ద్వారా పంపారు. అనంతపురంతో పాటు హిందూపురం, కదిరి, ఉరవకొండ కోర్టులకు బాంబు పెట్టినట్లు బెదిరింపు లేఖలు వచ్చాయి. కోర్టు సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు కోర్టు భవనాల్లో తనిఖీలు చేశారు. ఈ సారి రజియా హుస్సేన్ పేరుతో ఈ లేఖలు కోర్టులకు చేరాయి. అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో పోలీసులకు అంతు పట్టడం లేదు. ఓ డీఎస్పీ స్థాయి అధికారి కోర్టుకు చేరుకొని భద్రతా చర్యలు తీసుకుంటే బాగుంటుందా? అనే కోణంలో ఆలోచిస్తే బాగుంటుందని న్యాయవాదులు అంటున్నారు. పోలీసులు కోర్టులపై దృష్టి సారించి బాంబులు పెట్టడానికి అవకాశం లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరుతున్నారు.

అనంత కోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పార్టీ నుంచి వెళ్లి తిరిగొస్తే ఊరుకోను..

వైకాపా కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి హెచ్చరిక

మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: 'శత్రువునైనా పార్టీలోకి రానిస్తానేమోగాని, ఇక్కడ డబ్బులు సంపాదించుకుని, దాన్ని నిలబెట్టుకునేందుకు వేరే పార్టీలోకి వెళ్లిన వారు మళ్లీ తిరిగి వస్తామంటే, గేటు దగ్గరే వారిని చెప్పు సైజు నంబర్ ముద్ర పడేలా కొడతా' అంటూ వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఇటీవల కొత్తగా పదవులు పొందిన నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో ఆయన మంగళవారం పట్టణంలోని వైకాపా కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. బంధుప్రీతి, స్నేహ సంబంధాలను ఉపయోగించి మళ్లీ పార్టీలోకి వస్తామంటే వారిని రానిచ్చేది లేదన్నారు. క్యారెక్టర్‌లెస్ ఫెలోస్‌ను, అర్హత లేనివారిని పార్టీలోకి తిరిగి తీసుకోమన్నారు. సూరి (వరదాపురం సూర్యనారాయణ) కాలంలో పార్టీ కార్యక్రమాలకు వెళ్తే పటాకులు, డప్పులు, పూలదండలు, మేకలు, మసాలాలు ఆయనే ఇచ్చేవారన్నారు. తనకు ఆ దుస్థితి కలగ లేదని, పార్టీ నాయకులే భోజనం పెట్టేవారన్నారు. పార్టీకి కష్టకాలంలో నిలబడిన కార్యకర్తలు, నాయకులకు అన్నివిధాలుగా అండగా ఉంటానని స్పష్టం చేశారు. సమావేశంలో వైకాపా పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు నారాయణరెడ్డి, సాయికుమార్, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికల జిల్లా సైక్లింగ్ జట్ల ఎంపిక

జట్లకు ఎంపికైన ఆటగాళ్లు వీరే..

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే చక్కటి భవిష్యత్తు లభిస్తుందని జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి కిశోర్ తెలిపారు. మంగళవారం పట్టణంలో అండర్-13, 14 విభాగంలో బాలబాలికల సైక్లింగ్ జట్లను ఆయన ఎంపిక చేశారు. తొలుత ఎంపిక పోటీలు జరిపారు. పట్టణంలోని కాలేజీ కూడలి నుంచి ప్రియదర్శిని పాఠశాల వరకు నిర్వహించిన సైక్లింగ్ పోటీలను వన్‌టౌన్ ఎస్సై ఉమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా జట్లకు ఎంపికయ్యారు. ఈ జట్లు మార్చి 1న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో తలపడతారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, శిక్షకులు ఓంప్రకాష్, ప్రతాప్, హసేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల సునీత

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : రాప్తాడు నియోజకవర్గంలోని తాగునీరు, రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఛాంబర్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి పథకాల నిర్వహణ కోసం రూ.50 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతపురం గ్రామీణ ప్రాంతాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును, పైప్‌లైన్ మరమ్మతులు చేయడంతో పాటు 2 ఎంఎల్‌డీ స్లో సాండ్ ఫిల్టర్ల స్థానంలో 6 ఎంఎల్‌డీ రాపిడ్ సాండ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. శ్రీసత్యసాయి పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని అన్ని గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం గొల్లపల్లి జలాశయం నుంచి సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేయాలని కోరారు. రామగిరి, కనగానపల్లి, సీకేపల్లి, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లోని రహదారుల పునఃనిర్మాణంకు రూ.11.50 కోట్లు మంజూరు చేయాలన్నారు.

● ఆత్మకూరులోని జూనియర్ కళాశాల ఆడిటోరియం, ప్రహరీ నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు కేటాయించాలని, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల మంజూరు చేయాలని, నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల దస్త్రం ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉందని మంత్రి లోకేశ్ దృష్టికి ఎమ్మెల్యే సునీత తీసుకెళ్లారు. రామగిరిలో జూనియర్ కళాశాల కోసం వసతి గృహం మంజూరుకు రూ.2.50 కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు.

కట్టుకున్నోడే నరకం చూపించాడు!

● కానిస్టేబుల్ వివాహేతర సంబంధం ● మనోవేదనతో భార్య ఆత్మహత్య

తొమ్మిదేళ్ల కుమారుడి ఎదుటే కన్నతల్లి బలవన్మరణానికి పాల్పడింది. అమ్మా చనిపోవద్దని వేడుకున్నా ఆ మాతృమూర్తి వినకుండా ఉరిబిగించుకొని జీవితాన్ని చాలించింది. భర్త వేరొకరితో వివాహేతర సంబంధం కొనసాగించడాన్ని తట్టుకోలేకపోయింది. కట్టుకున్నోడే సర్వస్వమనుకొని బతికిన ఆమెకు నరకం చూపించాడు. అతను చేసిన మోసం ముందు కన్నపేగు గుర్తుకు రాలేదు. కళ్లనిండా నీరు పెట్టుకొని లోకం విడిచింది.

లలిత

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : భర్త చేసిన మోసాన్ని తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన అనంతపురంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి ఆజాద్‌నగర్‌లో మంగళవారం జరిగింది. సీఐ జగదీశ్ తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మోహన్‌కృష్ణ నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ముచ్చుకోటకు చెందిన లలిత(30)ను పదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ధర్మయోగి ఉన్నాడు. వీరు కళ్యాణదుర్గం రోడ్డులో నివాసం ఉంటున్నారు. సదరు కానిస్టేబుల్ ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం భార్యకు తెలియడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. కొంతకాలంగా ఇద్దరూ విడిగా ఉంటున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు రెండు రోజుల కిందట 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో లలిత మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ సమయంలో కుమారుడు వారించినా వినకుండా అఘాయిత్యానికి పాల్పడింది. సీఐ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. మృతురాలి తండ్రి సాయిప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పౌరసరఫరాల శాఖలో సీఎస్‌డీటీల బదిలీ

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలోని పౌరసరఫరాలశాఖ, పౌరసరఫరాల సంస్థలో పని చేస్తూ ఐదేళ్లు దాటిన సీఎస్‌డీటీలను బదిలీ చేస్తూ సంయుక్త కలెక్టర్ విష్ణుచరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాయదుర్గం ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఐదేళ్లుగా పనిచేస్తున్న సీఎస్‌డీటీ టి.సుబ్రహ్మణ్యం మాతృశాఖ అయిన పౌరసరఫరాలశాఖకు బదిలీ అయ్యారు. డి.హీరేహాళ్ మండలంలో జి.సురేఖ గుత్తి, పెద్దవడుగూరు మండలాల సీఎస్‌డీటీగాను, అనంతపురం అర్బన్, అనంతపురం గ్రామీణంలో పని చేస్తున్న బి.ఎం.బాషాను శింగనమల, నార్పల సీఎస్‌డీటీగాను, గుత్తి, పెద్దవడుగూరు మండలాల్లో పనిచేస్తున్న సీఎస్‌డీటీ జి.ప్రవీణ్‌కుమార్, డి.హిరేహాళ్ మండలంలో పనిచేస్తున్న సీఎస్‌డీటీ జి.రమాదేవిని జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ చేసిన సీఎస్‌డీటీలంతా తక్షణమే విధుల్లో చేరాలని జేసీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గంజాయిని చూపుతున్న పోలీసులు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో పది మంది గంజాయి విక్రేతలు పట్టుబడ్డారు. సీఐ రామారావు, ఎస్.ఐ సురేశ్, అమీర్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం గుత్తి మండలం టి.కొత్తపల్లికి చెందిన నవీన్.. ముఠాను ఏర్పాటు చేసుకుని గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఇతడిపై గుత్తి, అనంతపురంలో గంజాయి, దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గుత్తి ఆర్.ఎస్.కు చెందిన గోవర్ధన్‌తోపాటు మరో 8మందితో కలిసి గంజాయిని విక్రయిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గుత్తిలోని ఎస్సీకాలనీ, రాయల్‌టాకీస్, చర్చిరోడ్డులో నివాసం ఉంటున్న నిందితులు ముంబయి నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు చేసి తురకపల్లిరోడ్డులోని రైల్వేట్రాక్ వద్ద పది మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 2 తులాల బంగారు నగలు, నగదుతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టుకు హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

మల్లిస్వామి

బెళుగుప్ప: రోడ్డు ప్రమాదం తల్లిదండ్రుల ఆశలను చిదిమేసింది. కొడుకు ఉన్నత చదువులు చదువుకుని ప్రయోజకుడు అవుతాడని సంబరపడిన ఆ తల్లిదండ్రుల కలలు టిప్పర్ రూపంలో కబళించివేయడంతో వారి రోదనలు మిన్నంటాయి. రమణేపల్లికి చెందిన వెంకటేశులు- రత్నమ్మల కుమారుడు మల్లిస్వామి(22) కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డబళ్లాపూర్‌లో గీతం కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లిస్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆరు నెలల్లో ఉద్యోగం వస్తుందని తల్లిదండ్రులకు చెప్పిన కుమారుడు ప్రమాదంలో మృతిచెందటంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

స్టార్ హోటళ్లలో బస.. పబ్బుల్లో జల్సా

రూ.56 లక్షలతో పరారైన వ్యాన్‌డ్రైవర్ అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణ గౌడ్, చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు

గచ్చిబౌలి (హైదరాబాద్), న్యూస్‌టుడే: గోపనపల్లిలో రూ.56 లక్షలతో పరారైన ఏటీఎం క్యాష్ డిపాజిట్ వ్యాన్ డ్రైవర్‌ను గచ్చిబౌలి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ.34.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన డబ్బుతో నిందితుడు పుణె, బెంగళూరు, ముంబయి, సోలాపూర్ ప్రాంతాల్లో సంచరిస్తూ జల్సాలు చేసి రూ.21 లక్షలు ఖర్చు చేశాడు. సోమవారం గచ్చిబౌలి ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో నార్సింగి ఏసీపీ రమణ గౌడ్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ బాలరాజు, డీఐ నరేశ్ వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్‌కు చెందిన బడిగెరె అజిత్‌కుమార్ (34) కొంతకాలంగా సికింద్రాబాద్‌లో ఉంటున్నాడు. ఏటీఎంలో నగదు నిర్వహణ పనులు చూసే సంగం సెక్యూరిటీ ఏజెన్సీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12న కస్టోడియన్లు రామకృష్ణ, అబ్దుల్ మాలిక్, సెక్యూరిటీ గార్డు పెరుమాల్.. అజిత్ నడిపే వ్యానులో డబ్బులతో బయలుదేరారు. వివిధ ప్రాంతాల్లోని ఏటీఎంలో నగదు డిపాజిట్ చేస్తూ సాయంత్రం 4.30 సమయంలో గచ్చిబౌలి గోపనపల్లికి వచ్చారు. అక్కడ మిగతా సిబ్బంది కన్నుగప్పి, అజిత్ డబ్బుల వ్యాన్‌తో పారిపోయాడు. తోటి సిబ్బంది ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

మొదట బళ్లారికి చేరి..

తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వద్ద వ్యాన్‌ను వదిలేసిన అజిత్.. నగదుతో ఆటోలో ఆర్టీసీ క్రాస్ రోడ్డుకు వెళ్లాడు. అక్కడో లాడ్జిలో బస చేసి, యాక్సా బ్లేడ్‌తో నగదు పెట్టె తెరిచి డబ్బును సంచిలోకి మార్చుకున్నాడు. అనంతరం అదే రాత్రి బస్సు ఎక్కి బళ్లారి చేరుకున్నాడు. రెండు రోజులు తర్వాత బెంగళూరు, తర్వాత ముంబయి, సోలాపూర్ వెళ్లాడు. అనంతరం అనంతపురంలోని సోదరి ఇంటికి చేరాడు. ఇలా క్యాబ్‌లో ప్రయాణిస్తూ స్టార్ హోటళ్లలో బస చేస్తూ.. పబ్బులకు వెళ్తూ.. పది రోజుల్లో రూ.20 లక్షలు ఖర్చు చేశాడు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు ఇతరుల పేర్లతో సిమ్‌లు తీసుకొని ఫోన్ ఉపయోగించాడు. ఈ క్రమంలో వైజాగ్‌లో ఉంటున్న ప్రియురాలికి పలుమార్లు ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

గ్రామదేవత ముత్యాలమ్మ ఊరేగింపు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని గొంగటిపల్లిలో వెలసిన గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారిని మంగళవారం గ్రామస్థులు ఊరేగించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు ఒడిబియ్యం అందించి మొక్కులు చెల్లించారు.

అమ్మవారి ఊరేగింపులో భక్తులు

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలి

పెనుకొండ: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని డీఎస్పీ నరసింగప్ప, ఎంవీఐ ఉదయ్‌కుమార్ సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని 44వ జాతీయ రహదారి కూడలి వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న 15మంది చోదకులకు కొత్తవి కొనుగోలు చేయించారు. శిరస్త్రాణం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సీఐ రాఘవన్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిరస్త్రాణంపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, సీఐ సిబ్బంది

ఘనంగా జ్యోతుల ఉత్సవం

గుడిబండ, న్యూస్‌టుడే: జమ్ము లబండలో కొల్లాపు రమ్మ అమ్మవారు, రామయ్యనహళ్లిలో గుండమల కరియమ్మ, దేవరహళ్లి మారెమ్మ, హెచ్.కో హళ్లిలో మారెమ్మ అమ్మవార్లకు మంగళవారం మహిళలు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి హారతులిచ్చి సమర్పించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మాజీ సర్పంచులు శ్రీనాథ్, సన్నమారెప్ప తదితరులు హాజరయ్యారు.

ప్రత్యేక అలంకరణలో కరియమ్మ, మారెమ్మదేవి అమ్మవార్లు

సామాజిక ఆర్థిక సర్వే నిర్వహణ

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మడకశిర వృత్తి సాయ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా మంగళవారం మెళవాయి గ్రామంలో సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించారు. సామాజిక ఆర్థిక సర్వే ద్వారా అభివృద్ధి ప్రణాళికను తయారుచేసుకోవచ్చని డీన్ సరోజినీదేవి అన్నారు. విద్యార్థులు గ్రామ రైతులు, ప్రజలకు విలువ ఆధారిత ఉత్పత్తులపై, సజ్జలద్దు తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు మురళీకృష్ణ, మంజుళ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సజ్జలద్దు తయారీపై అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

స్థలం కొంటున్నారా.. జర జాగ్రత్త!

లేపాక్షిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్

గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న లేఅవుట్లు

హిందూపురం
మొత్తం లేఅవుట్లు : 178
నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవి : 134

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: లేపాక్షికి చెందిన జగదీష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అతను తన స్వగ్రామంలో ఇంటిని నిర్మించాలనే తలంపుతో స్థానిక లేఅవుట్‌లో రూ.18లక్షలు వెచ్చించి స్థలం కొన్నారు. ఇంటి నిర్మాణానికి బ్యాంకులో రుణం మంజూరు చేయాలని అధికారులను సంప్రదించగా అక్కడ అతనికి వింత అనుభవం ఎదురైంది. తాను కొన్న స్థలం నిబంధనల ప్రకారం సరిగ్గా లేనందున రుణం ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారు. దీంతో నాగేంద్ర ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి అప్పుచేసి ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇలాంటి పరిస్థితి ఒక్క జగదీష్‌కే కాదు. హిందూపురం నియోజకవర్గంలోని 182 గ్రామాల్లో చాలా మంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. ఆరుగాలం శ్రమించి పోగు చేసుకున్న డబ్బును కొందరు రియల్టర్ల ఊబిలో చిక్కుకుని లేఅవుట్లలో అధిక ధరలకు స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వీటిని కట్టడి చేయడంలో విఫలం అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పాటించాల్సిన నిబంధనలు ఇలా..

- ✦ మొదట వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలి. ఇందుకు ప్రభుత్వానికి చలానా రూపంలో నగదు చెల్లించాల్సి ఉంది.
- ✦ ఎకరానికి 10 సెంట్లు ప్రజా ప్రయోజనార్థం భూమిని వదలాల్సి ఉంటుంది.
- ✦ ప్రధాన రహదారి 30 అడుగులు, అంతర్గత రహదారులు 20 అడుగులు తప్పనిసరి
- ✦ డ్రైనేజీలు, నీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- ✦ తర్వాత లేఅవుట్‌కు సంబంధించిన బ్లూప్రింట్‌ను పంచాయతీ అధికారులకు అందించి పన్నులను చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంది.
- ✦ ఎకరం పైబడితే అహుడా అనుమతులు తీసుకోవాలి.
- ✦ ఎకరానికి 21-22 ఇళ్ల స్థలాలు వేయాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా 23-25 వరకు వేస్తున్నారు.
- ✦ నియోజకవర్గంలో చాలా పంచాయతీల్లో ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో ఇవి కనపడక కొన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆయా మండలాల డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాస్, శివకుమార్‌లను వివరణ కోరగా పరిశీలించి నిబంధనలు పాటించని లేఅవుట్లను తొలగిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: సింగేపల్లిలోని రక్షిత నీటి పథకం బోరులో నీరు అడుగంటింది. - మల్లికార్జున
సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - హరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ
సమస్య: తిమ్మలాపురంలోని బీసీ కాలనీలో వీధి దీపాలు లేవు. - శివన్న
సమాధానం: వెంటనే ఏర్పాటు చేస్తాం.
- అమరేశ్, పంచాయతీ కార్యదర్శి, తాళకెర
సమస్య: సింగంపల్లి రోడ్డు బాలయేసు కళాశాల నుంచి విద్యార్థుల పాఠశాల వెళ్లే దారిలో కాలువలు శుభ్రం చేయలేదు. - రమేశ్
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. -శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం
- న్యూస్‌టుడే, గుడిబండ, హిందూపురం సాంస్కృతికం
సమస్య: తూముకుంటలో దోమల ప్రభావం ఎక్కువగా ఉంది. - లక్ష్మీనరసమ్మ
సమాధానం: కాలువలు శుభ్రం చేయించి ఫాగింగ్ చేయిస్తాం. -తిందరాయప్ప, కార్యదర్శి
సమస్య: కొటిపి గ్రామ శివారులో వీధి దీపాలు పనిచేయడం లేదు. - అంజనప్ప
సమాధానం: రెండురోజుల్లో ఏర్పాటు చేస్తాం. - మహేశ్, విద్యుత్తు ఏఈ
- న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

భక్తిశ్రద్ధలతో అనఘాదేవీ వ్రతం

హిందూపురం గ్రామీణం: కిరికెర పంచాయతీలోని వీవర్స్ కాలనీలో శ్రీరామదేవాలయ ప్రాంగణంలో హిందూపురం అనఘాదత్త ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం శ్రీదత్తాత్రేయస్వామి సతీమణి అనఘాదేవి వ్రత పూజలను భక్తులు నిర్వహించారు. మైసూరు దత్తపీఠం వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద ఆశీస్సులతో బెంగళూరు రోడ్డులో దేవరపల్లి వద్ద శ్రీదత్తాత్రేయ ఆశ్రమం నిర్మిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు విశ్వేశ్వరయ్య, రాజేశ్వరి పేర్కొన్నారు.

అమెరికాలో మృతి.. స్వగ్రామంలో అంత్యక్రియలు

చందమూరి నరసింహారెడ్డి

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలం జవుకులదిన్నె గ్రామానికి చెందిన చందమూరి నరసింహారెడ్డి(79) సుమారు నాలుగు దశాబ్దాల క్రితం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఆయన భారతదేశంలో వ్యవసాయ ఎంఎస్సీ పూర్తిచేసి యూఎస్‌ఏలో పీహెచ్‌డీ చేశారు. ఈ క్రమంలో జనవరి 13న అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో సాధారణ మరణం పొందారు. చెమ్‌టెక్ పేరుతో పర్యావరణ ప్రయోగశాల ఏర్పాటుచేసి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. మరణం తరువాత సొంతూరులోనే అంత్యక్రియలు చేయాలన్న ఆయన కోరిక మేరకు సోమవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి మంగళవారం ముగించారు.

నీరు నింపితే ఉపయోగం

కోరేపులోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న నీటి ట్యాంకు వృథాగా ఉంది. ప్రస్తుతం గ్రామంలో ఉన్న తాగునీటి పథకం బోరులో నీటి మట్టం తగ్గడంతో ఎత్తైన ప్రదేశంలో ఉన్న కూళాయిలకు నీరు రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ట్యాంకు నీరు నింపితే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై సర్పంచి తిప్పేస్వామి మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తాగునీటిని అందిస్తామన్నారు. - న్యూస్‌టుడే, అమరాపురం

అడుగడుగునా వేగ నిరోధకాలు!

స్థానిక గీతానగర్ విజ్ఞాన్ పాఠశాల రహదారిలో అడుగడుగునా వేగ నిరోధకాలు ఏర్పాటు చేశారు. ఇక్కడి సిమెంటు రహదారిపై 200 మీటర్ల దూరంలోనే పది చోట్ల ఉండటం.. కొన్ని ఎత్తుగా నిర్మించడంతో సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులు కిందపడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సోమందేపల్లి

ఆదమరిస్తే ప్రమాదమే..!

పరిగి నుంచి శ్రీరంగరాజుపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో పరిగి సప్లయ్‌ఛానల్‌పై నిర్మించిన వంతెనకు రక్షణ గోడ లేదు. వాహన చోదకులు ఆదమరిస్తే 8 అడుగుల లోతున్న కాలువలోకి వాహనం దూసుకెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని చోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అమరాపురం

కదలని మురుగు.. వదలని కంపు

హేమావతి ఎస్సీ కాలనీలో ప్రధాన రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే దారిలో మురుగు నీరు నిలిచి కంపు కొడుతోంది. 10 రోజులుగా గ్రామంలో బ్రహ్మోత్సవాల కారణంగా ఇళ్లల్లో నీటి వాడకం ఎక్కువ కావడంతో రోడ్డంతా మురుగుమయంగా మారింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి కార్యదర్శి ఈరన్నను వివరణకోరగా కాలువలు శుభ్రం చేయించి మురుగునీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అమరాపురం

మూడు చక్రాల ఆటో మూలకు..

గ్రామాల్లో చెత్త సేకరణకు వైకాపా ప్రభుత్వ హయాంలో మూడు చక్రాల ఆటోలను పంచాయతీలకు ఒకటి చొప్పున అందించారు. వాటిని తెచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కదలకుండా ఓ మూలన ఉంచారు. ఆటోకు బ్యాటరీలు ఇవ్వకపోవడంతో వృథాగా ఉంటూ తుప్పు పడుతున్నాయి. ఈ విషయంపై ఎంపీడీవో నాగేశ్వరశర్మను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపయోగంలోకి తెస్తామన్నారు. - న్యూస్‌టుడే, రొళ్ల

నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని రత్నగిరి గ్రామంలో నీటి కోసం మంగళవారం రోడ్డుపై బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ ప్రాంతంలోని వారికి నీరు అందడం లేదు. వచ్చే నీటిని పల్లపు ప్రాంతంలోని వారే ఉపయోగించుకుంటున్నారని, అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి నరసింగప్ప వచ్చి రెండు రోజుల్లో గేట్‌వాల్వు ఏర్పాటు చేసి సక్రమంగా నీరందిస్తామని తెలపడంతో శాంతించారు.

రత్నగిరిలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న ప్రజలు

పరిగి : పరిగిలోని సచివాలయం ప్రాంతం, 90 ఇళ్ల కాలనీలకు 25 రోజులుగా నీటి సరఫరా కావడం లేదని మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో హిందూపురం మడకశిర రహదారికి అడ్డంగా నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకుడు లింగారెడ్డి, వడ్డెర సంఘం నాయకుడు శ్రీకాంత్ వారికి మద్దతు తెలిపారు. ఎస్సై రంగుడుయాదవ్ వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పించరాదని చెప్పడంతో మహిళలు స్థానిక పంచాయతీ కార్యాలయం చేరుకొని పంచాయతీ అధికారులకు నీటి సమస్యపై వినతి పత్రం అందించారు. సాయంత్రం లోగా నీటి సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు వెనుదిరిగి వెళ్లారు.

విద్యుత్తు బస్సులు ఆర్టీసీకే కేటాయించాలి

పెనుకొండ, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సుల పేరుతో ఆర్టీసీ డిపోల మూసివేత ఆపాలని, ఆ బస్సులను నేరుగా ఆర్టీసీకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు గేట్ ధర్నా నిర్వహించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు వాహనాల కంపెనీకి ఆర్టీసీ బస్సు రూట్లు, గ్యారేజీలు ఇవ్వకూడదని, పికెకిల్ ప్రైవేట్ కంపెనీ బారినుంచి డిపోలను కాపాడుకుందామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కమిటీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హిందూపురం సాంస్కృతికం: విద్యుత్తు బస్సులను ఆర్టీసీ నేతృత్వంలోనే నడపాలని మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు స్థానిక డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా రీజనల్ వర్కింగ్ అధ్యక్షుడు రామాంజనేయులు, డిపో అధ్యక్షుడు బాబా పక్రుద్దీన్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు రంగనాథ్, వెంకటేశ్ మాట్లాడుతూ విద్యుత్తు బస్సుల పేరిట రాష్ట్రంలో 12డిపోలలో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వలీసాబ్, రామ్‌ప్రసాద్, రవికుమార్, కిరణ్‌కుమార్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

'పురం' డిపో ఎదుట నిరసన తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్మికులు

బి.ఎస్.శ్రీధర్‌రావు సేవలు మరువలేనివి

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణానికి చెందిన బి.శ్రీధర్‌రావు ట్రాన్స్‌పోర్ట్ సంస్థ అధినేత బి.ఎస్.శ్రీధర్‌రావు (79) ఈ ప్రాంతానికి అందించిన సేవలు మరువలేనివని బ్రాహ్మణ సేవాసంస్థ కార్యదర్శి ఇంజినీర్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 20న ఆయన మరణించారని, బ్రాహ్మణ విద్యార్థుల వసతిగృహానికి 30 సంవత్సరాలపాటు అద్దె చెల్లించారని గుర్తుచేశారు. బి.ఎస్.టి. పేరుతో ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల్లో 35 బస్సులు ఏర్పాటుచేసి పేద విద్యార్థులకే కాదు ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఉచితంగా బస్‌పాస్ సౌకర్యం కల్పించారని, బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి ఆర్థికసాయం చేయడంలో ఇతను ముందుండేవారని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

యావన్మంది తెలియజేయడం ఏమనగా మా క్లైంటురాలు నూర్ అఫ్జాన W/o లేట్ ఆఫ్తర్ పాషా, S.K గార్డెన్, బెంగళూర్ అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని K.రామాంజనేయులు S/o K.చిన్నబోయప్ప, హిందూపురం గ్రా, పెనుకొండ మం, శ్రీ సత్యసాయి జిల్లా అనువారి నుండి కొనుగోలు చేయదలచారు. ...

షెడ్యూలు

కొట్టు	సర్వే నెంబరు	విస్తీర్ణం
స.ఖప్కు	641-2	A. 4.89 సెంట్లు

C.నరేంద్ర రెడ్డి, అడ్వకేట్, పెనుకొండ. సెల్: 9490858690

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొడిగెనహళ్లి(పరిగి), న్యూస్‌టుడే: పరిగి సమీపంలో కొడికొండ-శిర జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో పరిగి సిండికేట్ రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డితో పాటు, శివప్ప గాయపడ్డారు. 108 వాహన సిబ్బంది చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయస్థానానికి బాంబు బెదిరింపు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం న్యాయస్థానంలో ఆర్డీఎక్స్ బాంబులు పెట్టినట్లు, వాటిని పేల్చివేస్తున్నట్లు మంగళవారం కార్యాలయ మెయిల్‌కు సమాచారం వచ్చింది. వెంటనే సిబ్బంది జడ్జిలకు, న్యాయవాదులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కోర్టుల్లో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు అంతా బయటకు పరుగులు తీశారు. హిందూపురం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ అబ్దుల్‌కరీం, వన్‌టౌన్ పోలీస్టేషన్ ఎస్ఐ శ్రీధర్‌ల నేతృత్వంలో పోలీసులు అన్ని కోర్టు భవనాలను, అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని, ఆకతాయి చర్య అని పోలీసులు తేల్చి చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తుత్తి బెదిరింపు కారణంగా రెండు గంటలు న్యాయసేవలు నిలిచిపోయాయి.

వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

26న ఉపాధిహామీ ప్రజావేదిక

గోరంట్ల: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈ నెల 26న ఉపాధి హామీ పనుల తనిఖీపై ప్రజావేదిక ఉంటుందని ఎంపీడీవో కమలాబాయి, ఏపీవో నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని 20 పంచాయతీల పరిధిలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వరకు చేసిన ఉపాధిహామీ పనులకు సంబంధించి చేపట్టిన 19వ సామాజిక తనిఖీలో భాగంగా నిర్వహిస్తున్నామన్నారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన గర్భిణులకు వైద్యాధికారి ఓంకార్ ఆధ్వర్యంలో పర్యవేక్షకులు పార్వతి, రవీంద్ర, ఆరోగ్య-ఆశా కార్యకర్తలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు మధ్యాహ్నం స్థానిక జామియా మసీదు కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు మేస్త్రీలు అక్రమ్ బాషా, చాంద్‌బాషా, ముతవల్లి మహమ్మద్, మసూద్, షేక్షావలి పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలి

అమరాపురం: గ్రంథాలయాల్లో నిరుద్యోగ యువతీ యువకుల కోసం పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కమ్మన్న తెలిపారు. మంగళవారం అమరాపురం శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయంలో ఉన్న విలువైన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శివారు కాలనీల్లో మట్టిరోడ్లే దిక్కు

గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో సమస్యల వెల్లువ

మార్కండేయనగర్‌లో దెబ్బతిన్న తాత్కాలిక మట్టిరోడ్డు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రేడ్‌వన్ మున్సిపాలిటీగా హిందూపురాన్ని గుర్తించి సంవత్సరాలు గడుస్తున్నా పట్టణంలోని పలు కాలనీల్లోని శివారు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తాత్కాలిక మట్టిరోడ్లు, డ్రైనేజీలే శరణ్యం అవుతున్నాయి. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ముద్దిరెడ్డిపల్లి చేనేత పట్టుచీరల తయారీ పరిశ్రమలకు ప్రసిద్ధి కావడంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది వచ్చి చేనేత కార్మికులుగా పనిచేస్తున్నారు. అనుకూలం, సౌలభ్యంగా ఉన్న కాలనీల్లో కొందరు అద్దె ఇళ్లల్లో, కొందరు కట్టుకున్న సొంతిల్లలో చీరల అల్లిక పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడే ఉన్న స్థానికులు, ఇతరులు పెద్దభవనాలను నిర్మించుకున్నారు. ప్రధానమైన చోట్ల మాత్రమే సిమెంటు రోడ్లు, కాలువలు ఉన్నాయి. ఇవి కూడా గతంలో ఆరేళ్ల క్రితం నిర్మించినవే తప్ప శివారు ప్రాంతాల్లో మట్టితో కూడిన దెబ్బతిన్న రోడ్లే ఉన్నాయి. ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు నిల్వుండటంతో దోమలు, పందుల ప్రభావంతో పాటు విద్యుత్తు వీధిదీపాల సదుపాయం లేదు. వర్షాకాలం వస్తే ఇవన్నీ బురదమయమై కనీసం పాదచారులు నడవలేని స్థితి. సంబంధిత అధికారులు ఆ పన్నూ, ఈ పన్నూ అంటూ ప్రజల నుంచి కట్టించుకుంటున్నా కనీస సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఏయే కాలనీల్లో సమస్య ఉందంటే...

- ✦ దండురోడ్డులోని వెంకటేశ్వరనగర్, మార్కండేయనగర్, సుల్తాన్‌నగర్, వినాయకనగర్‌లో ప్రధాన సిమెంటురోడ్లు, డ్రైనేజీలు మినహా ప్రజలు నివసించే శివారు ప్రాంతాల్లో లేవు.
- ✦ ప్రధానరోడ్డు పక్కల ఉన్న అరవిందనగర్, లక్ష్మీనగర్, పిరమిడ్‌నగర్, చౌడేశ్వరిదేవీ ఆలయం పక్కన కాలనీల్లో ఏనాడో వేసిన రోడ్లు దెబ్బతిన్నాయి. శివారు ప్రాంతాలుగా ఉన్న వీధుల్లో మట్టిరోడ్లు ఆపై కంపచెట్లు పెరగడంతో అధ్వానంగా ఉంది. ✦ పాఠశాలలు, దేవాలయాలు ఉన్నచోట్ల అపరిశుభ్రత వాతావరణం ఉండటంతో ప్రజాజీవనానికి ఇబ్బందిగా ఉంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

ఇప్పటికే పట్టణంలో పలుచోట్ల సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మాణదశలో ఉన్నాయి. కొన్ని పూర్తయ్యాయి. ముద్దిరెడ్డిపల్లిలో ఉన్న కాలనీలను పరిశీలించి సమస్యను తెలుసుకొని శివారు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటాం.

రహదారులు, కాలువల నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలో నూతన రహదారులు, కాలువల నిర్మాణానికి మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డా.సురేంద్ర, బాలాజీలు భూమి పూజ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ గ్రాంట్ కింద 8వ వార్డు శ్రీకంఠపురంలో రూ.22లక్షలతో శ్మశానవాటిక, ప్రహరీ, గది నిర్మాణం, 27వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో రూ.14లక్షలతో రహదారులు, కాలువలు, 4వవార్డు త్యాగరాజనగర్, 33వ వార్డు మేళాపురం వద్ద పూజలు చేశారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు..

గోరంట్ల: ఉగ్రారంపల్లిలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు మంగళవారం భూమిపూజ చేశారు. మంత్రి ఆదేశాలతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులు సీసీ రోడ్లుగా మారుతున్నాయని తెదేపా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి పేర్కొన్నారు. రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్ సోమశేఖర్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

పుట్టపర్తి
●పుట్టపర్తి ●ధర్మవరం ●కదిరి ●రాప్తాడు

బడ్జెట్‌లో అన్నదాతలకు మొండిచేయి: సీపీఐ

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నదాతలకు ప్రయోజనం చేకూర్చేలా లేదని సీపీఐ మండల కార్యదర్శి రాజారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బడ్జెట్‌లో రైతులకు అన్యాయం జరిగిందంటూ సీనియర్ అసిస్టెంట్ షెక్షావలికి వినతిపత్రం అందజేశారు. ఇది కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా ఉందన్నారు. రైతులకు అందాల్సిన రాయతీలను నిలిపివేశారని ఆరోపించారు. ఉచిత పంట బీమా పథకాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సూర్యనారాయణరెడ్డి, సభ్యుడు రమణ తదితరులున్నారు.

ఉద్యోగులకు ఐటీపై అవగాహన

కదిరి, న్యూస్‌టుడే: కదిరి డివిజన్ పరిధిలోని 720 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐటీ సేవలందించినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఇక్కడి ఎన్జీవో హోంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 23 రోజుల పాటు యూటీఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక స్పృహలో భాగంగా సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఐటీ అసెస్మెంట్‌లకు ఇంటర్నెట్ పోర్టల్‌లో ఎక్కువ రుసుం వసూలు చేయడమే కాకుండా, లోపాలతో రెండు, మూడుసార్లు తిరిగాల్సిన పరిస్థితి ఎదురవుతోందన్నారు. అసెస్మెంట్లను ఒకేసారి ఆమోదించేలా తాము ఉచిత సేవలు అందించినట్లు వెల్లడించారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు మల్లికార్జున, రవివర్ధన్‌రెడ్డి, తాహిర్‌వలి, సునీల్‌కుమార్, మధుసూదన్, సంతోష్‌కుమార్, ఆజమ్‌బాషా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: న్యామద్దల చెరువు నుంచి నాగసముద్రం గ్రామ చెరువుకు నీరు వెళ్లే కట్టుకాలవ పలు చోట్ల ఆక్రమణకు గురైంది. **- రామచంద్ర, దామాజిపల్లి**

సమాధానం: కాలువను పరిశీలించి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుని, నీటి పారుదలకు అడ్డంకులు తొలగిస్తాం. **- మురళి, ఇరిగేషన్ ఏఈ**

సమస్య: చెన్నేకొత్తపల్లి-ముష్టికోవెల మార్గంలో న్యామద్దల గ్రామ సమీపంలో చెరువు కట్ట కింద ఉన్న దారి శిథిలావస్థకు చేరుకుంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. **- బాలకృష్ణ, న్యామద్దల**

సమాధానం: రహదారి సమస్యను ఇప్పటికే గుర్తించాం. సీసీ రోడ్డు నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదించాం. **- అబ్దుల్ ఖాదర్, పంచాయతీ రాజ్ మండల ఇన్‌ఛార్జి ఏఈ**

– న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

బాగుపడిన గ్రామీణ రహదారులు

కూటమి సర్కారు పాలనలో ప్రగతి పరుగు

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లోని పలు ప్రధాన రహదారులు నిర్లక్ష్యానికి గురవడంతో గుంతలు పడి రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలువురు చోదకులు కాళ్లూచేతులు విరగ్గొట్టుకొని ఇళ్లకే పరిమితమవగా, కొందరు మృత్యువాత పడ్డారు. అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని అప్పటి ప్రతిపక్షాలు ధర్నాలకు దిగినా నాటి సర్కారు స్పందించలేదు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. కూటమి నాయకులు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారు. మంత్రి సత్య కుమార్‌యాదవ్, తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ చొరవతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని గుంతల రోడ్లు కొత్త రూపు సంతరించుకున్నాయి.

రూ.5కోట్ల నిధులతో 14 కిలోమీటర్లు

మండలంలోని తాడిమర్రి నుంచి నార్సింపల్లి మీదుగా అనంతపురం, ధర్మవరం వెళ్లే దారి దారుణంగా ఉండేది. దాదాపు 7 కిలోమీటర్ల మేర రోడ్డులో వందకు పైగానే గుంతలు, మలుపులు ప్రమాదకరంగా మారాయి. పట్టణాలకు దగ్గర దారి కావడంతో చాలామంది వాహనచోదకులు, ప్రయాణికులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు. కూటమి ప్రభుత్వం నార్సింపల్లి దారితో పాటు పిన్నదరి రోడ్డుకు నాబార్డు ద్వారా ఆర్ఐడీఎఫ్(రూరల్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్) పథకం కింద 14 కిలోమీటర్లు కొత్త రహదారుల నిర్మాణానికి గతేడాది రూ.5కోట్ల నిధులు విడుదల చేసింది. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో పనులు చకచక పూర్తవడంతో కొత్త రహదారులు రాకపోకలకు సిద్ధమయ్యాయి. త్వరలో వీటిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇకపై నరక ప్రయాణం తప్పుతుందని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అద్దంలా మెరుస్తున్న నార్సింపల్లి-తాడిపత్రి రోడ్డు

న్యాయస్థానాలకు బాంబు బెదిరింపులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి న్యాయస్థానాల ఆవరణలో బాంబు పెట్టామంటూ మంగళవారం న్యాయాధికారులకు వచ్చిన మెయిల్ కలకలం రేపింది. న్యాయమూర్తులు జయలక్ష్మి, లోక్‌నాథ్, కక్షిదారులు, న్యాయవాదులతో పాటు సిబ్బంది కోర్టు నుంచి బయటకు వచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ సభ్యులు, కదిరి పట్టణ పోలీసులు న్యాయస్థానాల ఆవరణలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బాంబు లేదని తేలడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని న్యాయవాదులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కోర్టుల ఆవరణలో బాంబులు పెట్టామని బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో పుట్టపర్తి పోలీసులు ఎనుములపల్లిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్‌తో కోర్టు పరిసర ప్రాంతాల్లో అణువణువునా గాలించారు. చివరికి ఉత్తుత్తి బెదిరింపుగా తేల్చామని, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని డీఎస్పీ వెల్లడించారు.

బెదిరింపు మెయిల్‌పై చర్చిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు

మందులతో క్షయ వ్యాధి నివారణ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకుంటే నివారణ తేలికవుతుందని క్షయ నివారణ విభాగం సూపర్‌వైజర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం మొటుకుపల్లిలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తున్నా, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపించినా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయను నయం చేయవచ్చని, బాధితులకు మందులతో పాటు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.1000లు వారి ఖాతాకు జమ చేస్తారన్నారు.

రైతులకు కష్టమొస్తే అండగా నిలవండి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: రైతులకు ఎలాంటి కష్టమొచ్చినా అండగా నిలవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కొత్త డైరెక్టర్లకు తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పరిటాల శ్రీరామ్ సూచించారు. బత్తలపల్లి పీఏసీఎస్ డైరెక్టర్లుగా గరిశేనపల్లికి చెందిన బసికొండ రవీంద్ర, వేల్పుమడుగు గ్రామస్థుడు నాగార్జునరెడ్డి నియమితులయ్యారు. వీరు అనంతపురంలోని పరిటాల శ్రీరామ్ ఇంటికి వెళ్లి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీరామ్ వారిని సన్మానించి పలు సూచనలు చేశారు. సకాలంలో కర్షకులకు ప్రభుత్వం నుంచి రాయితీ ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణరెడ్డి, అయ్యప్ప, సురేంద్ర, శ్రీనివాసులు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి, న్యూస్‌టుడే: అన్నదాతలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేయాల్సిన బాధ్యత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డైరెక్టర్లపైనే ఉందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు పరిటాల శ్రీరామ్ సూచించారు. తాడిమర్రి మండల పీఏసీఎస్ అధ్యక్షుడిగా కునుకుంట్లకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన అనంతపురంలో శ్రీరామ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాటికోటేశ్వర క్షేత్రం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించినందుకు చిల్లవారిపల్లి గ్రామస్థులు శ్రీరామ్‌కు అభినందనలు తెలిపి సన్మానించారు.

కొత్త డైరెక్టర్లు రవీంద్ర, నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న పరిటాల శ్రీరామ్

అధిక రక్తపోటున్నా మత్తు ఇచ్చారు

● దేవి నర్సింగ్‌హోమ్ ఘటనపై కమిటీ విచారణ

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని దేవి నర్సింగ్‌హోమ్ వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య జ్యోతి అపస్మారకస్థితికి చేరి ఏడాదిగా మంచానికి పరిమితమైందని భర్త ప్రసాద్ మంగళవారం విచారణ కమిటీ ఎదుట తెలిపారు. గతేడాది ఫిబ్రవరి 4న పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లికి చెందిన జ్యోతికి గర్భసంచి శస్త్రచికిత్స చేసేందుకు మత్తుమందు ఇవ్వడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిందని ప్రసాద్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాలతో విచారణకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేశారు. ఈక్రమంలో సాయినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.చెన్నారెడ్డి, ముగ్గురు వైద్యుల బృందం ప్రసాద్‌తో వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. గతేడాది ఫిబ్రవరి 2న జ్యోతిని దేవి నర్సింగ్ హోమ్‌లో చేర్పించామని, డా.పద్మావతి సూచనలతో పలు పరీక్షలు చేశారన్నారు. 4న ఆపరేషన్ గదికి తీసుకెళ్లారని, అధిక రక్తపోటున్నా పరిగణలోకి తీసుకోకుండా మత్తుమందు ఇచ్చారని ప్రసాద్ చెప్పిన వివరాలను నమోదు చేసుకున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

ప్రతిఒక్కరికీ పని కల్పించాల్సిందే: ఉపాధి పీడీ

తలుపుల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికి పని కల్పించాలని పీడీ విజయేంద్రప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. తలుపుల మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. గతేడాదితో పోల్చితే ఈసారి పనిదినాలు తక్కువగా ఉన్నాయని కొంతమంది సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు అవగాహన కల్పించి రోజూ పనికి వచ్చేలా చూడాలన్నారు. మార్చిలోపు పనిదినాలు రెట్టింపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారదర్శకతకు పెద్దపీట వేయాలని, కూలీలు పనికి రాకపోయినా వచ్చినట్లు చూపి బిల్లులు చేస్తే ఊరుకొనేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీవో రమణారెడ్డి, టీఏలు, ఎఫ్‌ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ విజయేంద్రప్రసాద్

రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభం

కదిరి-తలుపుల ప్రధాన రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. కుమ్మరపేట బాబా షర్ఫుద్దీన్ ఔలియా దర్గా వద్ద ఇనుము విద్యుత్తు స్తంభాన్ని తొలగించకుండానే గుత్తేదారులు గతంలో సీసీ రోడ్డు వేశారు. పలు స్తంభాలను మార్చడానికి కొన్ని నెలల క్రితం కొత్తవి నాటినా తీగలు మార్చడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ శివతేజను వివరణ కోరగా పది కొత్త విద్యుత్తు స్తంభాలు పాతించామన్నారు. తీగలు, ఇతర సామగ్రి రావాల్సి ఉందన్నారు. –న్యూస్‌టుడే, తలుపుల

వేసవి వస్తోంది.. మరమ్మతులు చేయించండి

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని చేతిపంపును మరమ్మతులు చేయించి మంచినీరు అందించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు. కొన్ని నెలలుగా అది పాడైనా పట్టించుకునే నాథులు లేరని మండిపడుతున్నారు. త్వరలో వేసవి రానున్న నేపథ్యంలో వెంటనే బాగు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు దృష్టికి తేగా స్పందించారు. త్వరలోనే చేతిపంపును బాగుచేయించి ప్రజలకు నీటిని అందుబాటులోకి తెస్తామన్నారు. –న్యూస్‌టుడే, నంబులపూలకుంట

ఎప్పుడు కూలుతుందో..ఎవరికి మూడుతుందో

కదిరి మండలం వరిగిరెడ్డిపల్లి సమీప వ్యవసాయ పొలాల్లోని విద్యుత్తు స్తంభం పూర్తిగా దెబ్బతింది. ఓవైపు ఒరిగిపోవడంతో ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చు. ఈ ప్రాంతంలో రైతులు, పశువులకాపరులు తిరుగుతుంటారు. భారీ గాలికి స్తంభం విరిగిపోయి ఎవరిమీదైనా పడితే ప్రాణాలు పోయే అవకాశం ఉందని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు దాన్ని తొలగించి కొత్తది వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కదిరి పట్టణం

ఈ భవనానికి మోక్షమెప్పుడో?

ఈ చిత్రంలో కనిపిస్తోంది మామిళ్లపల్లిలోని అసంపూర్తి మినీ అంగన్‌వాడీ భవనం. గత వైకాపా ప్రభుత్వంలో తొలుత పనులు వేగంగా సాగినా, నిధుల కొరతతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఫలితంగా ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలోనే మినీ అంగన్‌వాడీ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు ప్రశాంతి దృష్టికి తేగా, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, కనగానపల్లి

పచ్చిక బయలు అనుకుంటే పొరపాటే..

ఈ చిత్రంలో పచ్చదనం పరచుకుని ఆహ్లాదంగా కనువిందు చేస్తున్నది పచ్చిక బయలు అనుకుంటే మీరు పొరపడినట్లే. ఇది పుట్టపర్తికి సమీపాన ప్రవహిస్తున్న చిత్రావతి నది. అందులో మొలిచిన అంతరగంగ జాతి మొక్కలు ఇలా నీటిని కప్పేస్తూ తెలియాడుతూ ఉన్నాయి. ఆ మార్గంలో వెళ్లే పాదచారులు, ప్రయాణికులు మైదానం అనుకునే విధంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బుక్కపట్నం

పకడ్బందీగా జనగణనకు ఆదేశం

మాట్లాడుతున్న జేసీ మౌర్యభరద్వాజ్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి విధుల్లో తప్పులు దొర్లకుండా అధికారులు పకడ్బందీగా జనగణన నిర్వహించాలని జేసీ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం సంస్కృతి విద్యాసంస్థల ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే జనగణన సన్నాహక శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి పలు సూచనలు చేశారు. డేటా సేకరణలో సాంకేతికత వినియోగం, క్షేత్రస్థాయి నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జనగణన ప్రక్రియలో డేటా సేకరణ కీలకమని, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సూర్య నారాయణరెడ్డి, డీఎఫ్‌వో చక్రపాణి, జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్, ఆర్డీవోలు సువర్ణ, ఆనంద్, మహేష్, తహసీల్దార్లు, కమిషనర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహాయ కమిషనర్‌కు స్వాగతం: కేంద్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శి (పీఎంశ్రీ పాఠశాలల పరిశీలకుడు) సచ్చిదానందప్రసాద్ మంగళవారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఆయనకు శాంతిభవన్ అతిథిగృహంలో జేసీ మౌర్యభరద్వాజ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సచ్చిదానంద ప్రసాద్ జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల పనితీరు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై ఆరా తీశారు.

విద్యార్థి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : ధర్మవరం మండలం ఉప్పినేసనపల్లి గ్రామానికి చెందిన సోమర లక్ష్మీనారాయణ మృతి చెందాడు. ఆయన కూతురు సోమర అర్చన బెంగళూరులోని గీతం యూనివర్సిటీలో బీటెక్ నాలుగో ఏడాది చదువుతోంది. చదువుకునేందుకు ఆర్థికంగా తోడ్పాటునందించేందుకు కమ్మ సంఘం నాయకులు ముందుకొచ్చారు. సంఘంలో సభ్యులంతా చందాలు వేసుకుని రూ.లక్ష వసూలు చేశారు. మంగళవారం కమ్మభవన్‌లో విద్యార్థి తల్లి లలితమ్మకు ఆర్థిక సాయంగా చెక్కును అందజేశారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాంబేడైయింగ్ నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, సీవీ కొండయ్య, రామకృష్ణ, శ్రీరాములు, వెంకటనారాయణ, కోనంకి రామయ్య పాల్గొన్నారు.

లలితమ్మకు చెక్కు అందజేస్తున్న నాగన్న, సూర్యనారాయణ, తదితరులు

బీసీ కాలనీవాసిగా మృతుడి గుర్తింపు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు రైల్వే టన్నెల్ దగ్గర రైలు పట్టాలపై లభించిన మృతదేహాన్ని బీసీ కాలనీలో నివసించే షేక్ షామీర్‌వలి (50)గా గుర్తించినట్లు హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం జరిపి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

ఆర్టీసీ బస్టాండుకు బస్సులొచ్చాయి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు ఆర్టీసీ బస్టాండ్‌కు పుట్టపర్తి డిపో అధికారులు బస్సు సర్వీసులు నడిపారు. 'కట్టారు...వదిలేశారు' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఇటీవల కొంతకాలంగా కదిరి-నల్లమాడ బస్సు సర్వీసు ఒక్కటే బస్టాండు వరకు వచ్చేది. మంగళవారం కదిరి, ముదిగుబ్బకు వెళ్లే రెండు బస్సులు ఒకేసారి రావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు. బస్టాండులో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చోదకులకు శిరస్త్రాణం తప్పనిసరి

ధర్మవరం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనచోదకులు కచ్చితంగా శిరస్త్రాణాలు ధరించాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ కోరారు. ఆయన మంగళవారం పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురం వద్ద పుట్టపర్తి-ధర్మవరం మార్గంలో వాహనచోదకులకు హెల్మెట్ ధరించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. శిరస్త్రాణం ధరించని వారికి జరిమానా విధించే బదులు వాటిని కొనుగోలు చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ ఉమాదేవి, పోలీసులు పాల్గొన్నారు.

పాముకాటుతో గృహిణి మృతి

తనకల్లు, న్యూస్‌టుడే: పాము కాటుతో చికిత్స పొందుతూ గృహిణి ముకుందమ్మ (42) మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని ఈతోడు పంచాయతీ రాకుంటపల్లికి చెందిన ముకుందమ్మ ఆదివారం పొలంలో పని చేసుకుంటుండగా పాము కాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కదిరి ప్రాంతీయ వైద్యశాల, అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన

కదిరి, న్యూస్‌టుడే: తమ సమస్యలు తీర్చాలంటూ అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద వేర్వేరు శిబిరాల్లో దీక్షలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు సమస్యల పరిష్కారానికి మార్చి 2న చలో విజయవాడ చేపడుతున్నట్లు తెలిపారు.

నల్లచెరువు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ ఉద్యోగులు సీఐటీయూ నాయకులు రామకృష్ణ, శ్రీరాములు ఆధ్వర్యంలో స్థానిక వేమన్నస్వామి ఆలయం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ తమకు కనీస వేతనంగా రూ.26 వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్బన్, రూరల్ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి అందజేయాలని కోరారు.

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు, సహాయకుల సంఘం జిల్లా నాయకురాలు సరస్వతి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. వారు పట్టణంలోని సీడీపీవో కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. గతంలో 42 రోజులు సమ్మె చేసినపుడు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కదిరి: దీక్షలో కూర్చున్న ఆందోళనకారులు

జంతువులు, పక్షులకు ఆపద కలిగించొద్దు

తాడిమర్రి, న్యూస్‌టుడే: వేసవిలో జంతువులు, పక్షులు ఆహారం కోసం పొలాల వద్దకు వస్తే వాటికి ఎలాంటి హానీ తలపెట్టవద్దని అటవీ శాఖ విభాగం అధికారి మల్లికార్జున సూచించారు. మండలంలోని పుల్లంపల్లి గ్రామ సమీపంలో కొందరు రైతులకు నెమలి పిల్ల కంటబడటంతో వారు అటవీ శాఖాధికారులకు అప్పజెప్పారు. దాని రెక్కకు గాయం కావడంతో అటవీ శాఖాధికారులు తాడిమర్రిలోని పశు వైద్యశాలకు తెచ్చి చికిత్స చేయించారు. అనంతరం అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. కార్యక్రమంలో అటవీ శాఖ బీట్ అధికారులు వెంకటరమణ, గిరీష్వా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీటీఎఫ్ ధర్నా

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అడిట్ కన్వీనర్ ముత్యాలప్ప తెలిపారు. ఆయన మంగళవారం ఇక్కడ మాట్లాడుతూ నిరసన తెలిపిన తర్వాత అధికారులకు తమ సమస్యలపై వినతి పత్రం అందజేస్తామన్నారు.

చిక్కఒడెయరు మాతృమూర్తి సమాధి గుర్తింపు

మేడాపురం (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో విజయనగర రాజుల కాలం నాటి శాసనాలను గుర్తించినట్లు చరిత్రకారుడు బుక్కపట్నం గోపి పేర్కొన్నారు. చరిత్ర అధ్యాపకుడు తొండూరు అహ్మద్‌తో కలిసి ఆయన గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా 14, 15 శతాబ్దాలకు చెందిన రెండు శాసనాలను గుర్తించామన్నారు. ఇందులో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శాసనాన్ని క్రీ.శ 1551లో శ్రీకృష్ణరాయుల అల్లుడు అళియరామరాయలు వేయించారన్నారు. చెరువు తూము వద్దనున్న రెండవది అయిన వీరగల్లు శాసనాన్ని 14వ శతాబ్దంలో మొదటి బుక్కరాయల ప్రధాని చిక్కఒడెయర్ వేయించారన్నారు. ఆయన తల్లి మేడమ్మ ఇదే గ్రామంలో మరణించడంతో చెరువు తూము వద్ద అంత్యక్రియలు జరిపి సమాధి ఏర్పాటు చేశారన్నారు.

'విద్యుత్తు బస్సులను ఆర్టీసీయే నడపాలి'

కదిరి, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సులను ఆర్టీసీ సంస్థతోనే నడిపించాలని ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 12 డిపోల్లో ఆర్టీసీ స్థలాలు, విద్యుత్తు బస్సులను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నేషనల్ మజ్దూర్ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుతో కదిరి డిపో గ్యారేజీ ఆవరణలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విద్యుత్తు బస్సులను సంస్థనే నడిపి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. నిరసన తెలిపిన వారిలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు, సభ్యులు అజీజ్, రామకృష్ణ, బైరిశెట్టి, అలాం, ఆంజనేయులు, మల్లికార్జున, లక్ష్మీప్రసన్న, లక్ష్మీదేవి తదితరులున్నారు.

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం ఆర్టీసీ డిపో వద్ద ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సభ్యులు, నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన తెలిపారు. 12 డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులను పినాకిల్ సంస్థ ద్వారా నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోందని ఆరోపించారు. ఆయా డిపోల్లో సర్వీసులు ఎత్తివేసి సిబ్బందిని ఇతర డిపోలకు బదిలీ చేయడానికి యత్నిస్తున్నారని జోనల్ నాయకుడు ఏఎస్ రావు మండిపడ్డారు. ఆర్టీసీకే విద్యుత్తు బస్సులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం రీజనల్ నాయకుడు మోహన్, సభ్యులు శంకరయ్య, దుర్గాప్రసాద్, నాగప్ప, డిపో కార్యదర్శి మధుసూదన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

కిసాన్ మోర్చా గ్రామ కమిటీల ఏర్పాటు

ముదిగుబ్బ: మండలంలోని ముక్తాపురం పంచాయతీలో భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కమిటీల నియామకం చేపట్టినట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో భాజపా జెండా ఎగర వేయడమే ధ్యేయంగా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు జయచంద్రారెడ్డి, వెంకటేష్, అశోక్, లక్ష్మీపతి, రైతులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌తో విద్యుత్తు ఖర్చుల ఆదా

కదిరి, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకంతో వినియోగదారులు విద్యుత్తు ఖర్చులు తగ్గించుకోవాలని ఆ శాఖ ఏఈ కృష్ణదేవ కోరారు. ఆయన మంగళవారం ఇక్కడ మాట్లాడుతూ పట్టణంలో సూర్యఘర్ పథకం కింద వందమందికి విజయవంతంగా సౌర విద్యుత్తు అందించినట్లు చెప్పారు. వీరి ఖాతాలకు రాయితీ మొత్తం జమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన 20మంది చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు.

(c) eenadu

అతిసారం..కల్లోలం..!

- నగరంలో పెరుగుతున్న కేసులు
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం..

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం, బలగ

అతిసారం.. జిల్లా కేంద్రాన్ని కలవరపెడుతోంది.. అంతకంతకూ వ్యాధి తీవ్రత పెరుగుతోంది. బాధితుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది.. అంబులెన్స్‌ల రణఘోష.. రోగుల ఆర్తనాదాలు.. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నాయి.. ఒక్కరోజులో 50 మంది ఆసుపత్రుల పాలయ్యారంటే తీవ్రత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు..

..శ్రీకాకుళం నగరంలోని దమ్మలవీధి, గోల్కొండ రేవు, కాకివీధి, మంగువారితోట పరిసర ప్రాంతాల్లో అతిసారం విజృంభిస్తోంది.. అధికారిక లెక్కల ప్రకారం 76 మంది ఆసుపత్రుల పాలయ్యారు. ఒకరు మృతి చెందగా, మరొకరిది అనుమానాస్పద మృతిగా అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొంది. మరోపక్క యంత్రాంగం అప్రమత్తమైంది. బాధితులకు జీజీహెచ్, జెమ్స్, కిమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఇంటింటా సర్వేలో భాగంగా స్వల్ప లక్షణాలతో బాధపడేవారిని గుర్తించి వారికి స్థానికంగానే వైద్య శిబిరాల్లో సేవలందిస్తున్నారు.

బాధితులు పెరిగే అవకాశం..

శ్రీకాకుళం సర్వజనాసుపత్రి ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్న బాధితులు

అతిసారానికి కారణమయ్యే బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన రెండు, మూడు రోజుల్లో లక్షణాలు బయటపడతాయని వైద్యులు పేర్కొంటున్నారు. కలుషిత నీరు, ఆహార పదార్థాలు తీసుకున్న రోజులను బట్టి రోగుల సంఖ్య పెరిగే ఆస్కారముందని చెబుతున్నారు. గత ఆది, సోమవారాలతో పోల్చితే మంగళవారం ఒక్కరోజులోనే 50కి పైగా కేసులు నమోదైనట్లు వైద్యులు నిర్ధారిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.

మింగేసిన మాయదారి రోగం..

మండల సురేష్ (43) అనే వ్యక్తి అతిసారం బారిన పడి మంగళవారం ఉదయం మృతి చెందారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆదివారం వైద్యం పొందారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సురేష్ ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇంతలోనే అనుకోని ఘటన జరగడంతో కుటుంబ సభ్యులు దుఃఖంలో మునిగిపోయారు. ఇతనికి ఇద్దరు పిల్లలు. ఆర్థిక సమస్యలతో వారి చదువు మధ్యలోనే ఆపేశారు.

తీసుకున్న చర్యలు ఇవీ..

- కలెక్టర్ ఆదేశాలతో వైద్య, నగర పాలక అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.
- ఆయా ప్రాంతాల్లో ఆదివారం నుంచి కుళాయి నీరునిలిపివేసి ట్యాంకర్ల ద్వారా ఇస్తున్నారు.
- ప్రత్యేక బృందాల ద్వారా ఇంటింటా సర్వే చేపట్టి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్యసేవలు అందిస్తున్నారు.
- వీధుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ వెదజల్లారు. నీటి నమూనాలు సేకరించి క్లోరిన్ పరీక్షల కోసం విశాఖలోని ప్రాంతీయ ల్యాబ్‌కు పంపించారు.
- అత్యవసర సమయంలో ఆసుపత్రులకు తరలించేందుకు వీలుగా నాలుగు అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు.

ఆందోళన వద్దు : కలెక్టరు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అతిసారంపై ఆందోళన వద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలను కోరారు. కాచి వడబోసిన నీటినే తాగాలన్నారు. నగరపాలిక అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశాలిచ్చాం. రోగులకు అవసరమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 24 గంటలు సేవలందించేలా చర్యలు తీసుకున్నాం. తాగునీటి పైపులైన్ల లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేపడుతున్నాం' అని తెలిపారు.

గూడు చూడండి.. గోడు వినండి..!

జిల్లాలో హుద్‌హుద్ తుపాను ప్రభావానికి నిలువనీడ కోల్పోయిన బాధితుల కోసం అప్పట్లో తెదేపా ప్రభుత్వం కవిటి, సోంపేట మండలాల పరిధిలో దాదాపు 200 గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. సౌకర్యాలు కల్పించలేదు. లబ్ధిదారులకు అందజేయకపోవడంతో వినియోగంలోకి రాలేదు. ఆయా పరిసరాలు పనికిరాని మొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి. ఆ భవనాలు పాములు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. దీనిపై గృహనిర్మాణ ఏఈ రఘును వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

అక్కడ నిర్లక్ష్యమే విశ్రాంతి తీసుకుంటోంది..!

- ట్రక్ లే బైల్లో సదుపాయాల కరవు
- చేసేది లేక రోడ్డుపైనే వాహనాల నిలిపివేత

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జాతీయ రహదారిపై సుదీర్ఘ ప్రయాణంలో వాహన చోదకులు విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగించుకునే ట్రక్ లే బైలు నిరుపయోగంగా మారాయి. రూ.కోట్లు వెచ్చించి కట్టిన భవన నిర్మాణాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. కొన్నిచోట్ల అసలు అందుబాటులోకి తీసుకురాలేదు. ఫలితంగా ఆయా స్థలాల వద్ద వాహనాలు నిలిపేందుకు చోదకులు ఆసక్తి చూపడం లేదు. నచ్చినచోట నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపివేయడం, విశ్రాంతి లేకుండా నడపడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

- జిల్లాలో 16వ నంబరు జాతీయ రహదారి 175 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ప్రతి 30 కి.మీ ఒక ట్రక్ లే బైలు ఉండాలి. ఇందుకనుగుణంగా 13 చోట్ల ఏర్పాటు చేశారు.

లావేరు: బెజ్జిపురం వద్ద తాళాలు వేసి నిరుపయోగంగా ఉన్న విశ్రాంతి భవనం. లారీలు నిలిపేందుకు స్థలమున్నా సేద తీరే అవకాశం లేదు

చెన్నై- కోల్‌కతా రహదారి కావడంతో జిల్లా మీదుగా హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖ, భువనేశ్వర్, కోల్‌కతా నగరాలకు నిత్యం వేలసంఖ్యలో సరకు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆయా గమ్యస్థానాలకు చేరేందుకు రోజుల సమయం పడుతుంది. సుదీర్ఘ ప్రయాణంలో చోదకులు తీవ్ర అలసటకు గురవుతుంటారు. ఇలాంటి వారు కాస్త విశ్రాంతి తీసుకునేందుకు ట్రక్ లే బైలు ఏర్పాటు చేశారు. ఎంతో ప్రాధాన్యం కలిగిన విశ్రాంతి స్థలాల్లో సదుపాయాలను గాలికి వదిలేశారు.

కనీస సౌకర్యాలకు దూరంగా..

విశ్రాంతి తీసుకునేందుకు భవనంలో దుప్పటి, దిండు, విద్యుదీకరణ, భోజనశాల, దాబా, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, భద్రతపరంగా సెక్యూరిటీ, తాగునీరు, వాడుకనీరు వంటి సదుపాయాలు నిత్యం ఉండాలి. కానీ టెక్కలి, మందస, లావేరు, రణస్థలం, కాశీబుగ్గ ట్రక్ లే బైలులో ఇవేమీ ఉండకపోవడం గమనార్హం. శ్యామసుందరపురం, నెమలి నారాయణపురంలో మరుగుదొడ్లు లేవు. రణస్థలం, జిల్లేడిమాకివలస, శ్యామసుందరపురంలో విద్యుత్తు వెలుగులు లేవు.

ఎక్కడా భద్రత.?

13 ట్రక్ లే బైలులో ఎక్కడా భద్రతపరమైన చర్యల్లేవు. ఎక్కువగా డీజిల్ చోరీ చేస్తున్నారని వాహన చోదకులు ఫిర్యాదులు చేస్తున్నారు. కనీసం సెక్యూరిటీ గార్డులు లేరు. ఈ కారణంతోనే చెట్ల కింద, రహదారి పక్కనే నిలిపేస్తున్నారు. దీనివల్ల వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనాలు ఢీకొని ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోంది. జిల్లాలో జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో ఇవే అధికంగా చోటుచేసుకుంటున్నాయి.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

- జేఆర్‌పురం (రణస్థలం)
- బెజ్జిపురం (లావేరు)
- అల్లినగరం (ఎచ్చెర్ల)
- జడూరు (పోలాకి)
- జిల్లేడిమాకివలస (కోటబొమ్మాళి)
- శ్యామసుందరపురం (టెక్కలి)
- ఆదిఆంధ్రా వీధి (కాశీబుగ్గ)
- నెమలి నారాయణపురం (ఎల్‌హెచ్‌ఎస్, ఆర్‌హెచ్‌ఎస్)
- మందస మదనాపురం (ఎల్‌హెచ్‌ఎస్, ఆర్‌హెచ్‌ఎస్)
- బారువ లక్కవరం (ఎల్‌హెచ్‌ఎస్, ఆర్‌హెచ్‌ఎస్).

రోజుకు 14 వేల వాహనాల రాకపోకలు..

జిల్లా పరిధిలో జాతీయ రహదారిపై మూడు టోల్‌గేట్లు ఉన్నాయి. వీటి ద్వారా దాదాపు రోజుకు సగటున 14 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వీటి ద్వారా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. అయినా వీటి నిర్వహణపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్యలు తీసుకోలేదు.

నిర్వహణకు నీళ్లొదిలేశారు..!

- నగరంలో అస్తవ్యస్తంగా తాగునీటి వ్యవస్థ
- మురుగు కాలువల్లో పైపులైన్లు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ఉంది శ్రీకాకుళం నగరపాలక సంస్థ అధికారుల తీరు.. మురుగు నీటి కాలువల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ప్రజల ప్రాణాల మీదకు వచ్చాక హడావుడి చేస్తున్నారు. రెండు రోజుల్లో 76 కేసులు నమోదు కావడం, బాధితుల్లో ఒకరు మృతిచెందడం, మరొకరు అనుమానాస్పద మృతిగా నమోదు కావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

నిర్లక్ష్యానికి పరాకాష్ట..

జిల్లా కేంద్రంలో తాగునీటి పైపులైన్లు, ఇంటింటి కుళాయిలు 50 శాతానికి పైగా మురుగు కాలువల్లో ఉన్నాయి. మూడు ప్రధాన నీటి సరఫరా కేంద్రాలు, రిజర్వాయర్ల నుంచి వీధులకు సరఫరా చేసే పైపులైన్లు వేర్వేరుగా ఉంటే లీకులు ఏర్పడినా, పగిలిపోయినా మరమ్మతులు చేపట్టడానికి వీలుంటుంది. చాలావరకు పైపులైన్లు కాలువల్లో ఉండటంతో ఎక్కడ లీకవుతున్నాయో తెలియని దుస్థితి. మురుగు నీరు వాటిలో చేరుతుండటంతో తరచూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

మంగువారితోట నుంచి మొండేటి వారి వీధికి వెళ్లే మార్గంలో కాలువలోనే పైపులైన్లు

సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలు

- ఆదివారంపేట ప్రధాన నీటి సరఫరా కేంద్రం నుంచి గొంటి వీధి, అరసవల్లి రిజర్వాయర్లకు నీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ ఇల్లీసుపురం అంబేడ్కర్ విజ్ఞాన మందిరం వద్ద మురుగు కాలువలో ఉంది.
- పీఎన్ కాలనీ రిజర్వాయరు నుంచి భైరివానిపేటకు వెళ్లే పైపులైన్ వాల్వు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉంది. దీనికి ఆనుకుని మురుగు కాలువ ఉంది. ఇక్కడి వాల్వు తరచూ లీకై మురుగు నీరు పైపులైన్‌లో కలుస్తోంది.
- పుణ్యపు వీధి, ఇల్లీసుపురం, రెల్ల వీధి, చిన్నబరాటం వీధి, గూనపాలెం, బలగ హడ్కో కాలనీ, రైతు బజారు, సానా వీధి, కొన్నా వీధి, వన్ వే ట్రాఫిక్ రహదారి, జాలరి వీధి, దమ్మల వీధి, పుణ్యపు వీధి, బలగ పొందర వీధి, మేదర వీధి, పాండురంగ వీధి, ఇప్పిలి వీధి, కత్తెర వీధి, హయాతీనగరం, గుజరాతీపేట గొల్ల వీధి, గుడి వీధిలో కుళాయిల పైపులైన్లు మురుగు నీటిలో ఉన్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ శ్రీకాకుళం పేరిట శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మిగిలిన రోజుల్లో పర్యవేక్షించే వారు కరవయ్యారు. కాలువల్లో ఎక్కడికక్కడ చెత్త, మట్టి పేరుకుపోయినా, మురుగు నీరు పొంగి రోడ్లపై పారుతున్నా పట్టించుకోవడం లేదు. నగరంలో ఏ కాలనీకి వెళ్లినా అధ్వాన పరిస్థితులు కనిపిస్తాయి.

పరీక్షలేవీ..?

- తాగునీటి నాణ్యత పరీక్షలను నగరపాలక సంస్థ అధికారులు పూర్తిగా విస్మరించారు.
- రిజర్వాయర్ వద్ద తొలుత పరీక్షించి సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించుకున్నాక పైపులైన్ల ద్వారా నీరు విడుదల చేయాలి.
- శివారు ప్రాంతంలో కుళాయి వద్ద మరోసారి తనిఖీ చేయాలి.
- ఇబ్బంది తలెత్తితే ఆ ప్రాంత ప్రజల్ని అప్రమత్తం చేసి నీరు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవస్థ పూర్తిగా అటకెక్కింది. పరీక్షలు చేసే ల్యాబ్ లేకపోవడం గమనార్హం.

సర్వే చేస్తాం..

నగరంలో అన్ని డివిజన్లలో సర్వే చేపట్టి మురుగు నీటిలో ఉన్న పైపులైన్లను గుర్తించేలా చర్యలు తీసుకుంటాం. వాటిని ప్రాధాన్య క్రమంలో మార్చేలా ప్రణాళిక రూపొందిస్తాం. వ్యక్తిగత, వీధి కుళాయిల పైపులైన్లు, వాల్వుల లీకులకు సంబంధించి సమాచారాన్ని నగరపాలకసంస్థకు అందించి సహకరించాలి. కచ్చితంగా క్లోరినేషన్, నీటి పరీక్షలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. – హెచ్.కూర్మారావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

నగరంలో కుటుంబాలు	జనాభా	వీధి కుళాయిలు	వ్యక్తిగత కనెక్షన్లు	పైపులైన్ల విస్తీర్ణం	నీటి సరఫరా కేంద్రాలు	రోజుకు సరఫరా చేస్తున్న నీరు
37,500	1.50 లక్షలు	1,652	21,506	195 కి.మీ.	బలగ (శాంతినగర్ కాలనీ), ఆదివారంపేట, ఖాజీపేట	19.45 ఎంఎల్‌డీ

బీఆర్ఏజీ సెట్ వాయిదా

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన బీఆర్ఏజీ సెట్-2026 వాయిదా పడింది. గురుకుల పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి మార్చి 2న పరీక్ష జరగాల్సి ఉండగా, దాన్ని మార్చి 8కి వాయిదా వేస్తున్నట్లు దుప్పలవలస, ఎచ్చెర్ల గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు బి.చిట్టిరాజు, ఎస్.పద్మజ మంగళవారం తెలిపారు. ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మార్చి 1న జరగాల్సిన పరీక్ష అదే రోజు జరుగుతుందన్నారు.

పలాస ఆర్డీవోగా అప్పలరాజు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా ఆర్.అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కోటబొమ్మాళి తహసీల్దారుగా పనిచేస్తున్న అప్పలరాజు ఉద్యోగోన్నతి పొంది ఇక్కడికి రానున్నారు. ప్రస్తుతం జి.వెంకటేశ్ ఆర్డీవోగా వ్యవహరిస్తున్నారు.

డెక్క.. చేరదు నీటి చుక్క..!

సరుబుజ్జిలి మండలం కొత్తకోట వద్ద పెద్ద చెరువు మినీ జలాశయం ఇది.. దాదాపు 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. రెండో పంటకు వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా నీరు విడిచిపెట్టే జలాశయంలోకి గుర్రపుడెక్క వచ్చి పేరుకుపోతోంది. దీనివల్ల తగినంత నీరు నిల్వ ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై వంశధార జేఈ జగదీశ్వరరావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

స్కాన్ చేయండి.. సమాచారం తెలుసుకోండి

- 16వ నంబరు జాతీయ రహదారిపై క్యూఆర్ కోడ్ బోర్డులు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ప్రభుత్వం చేపడుతున్న రహదారి నిర్మాణాల్లో పారదర్శకత పెంచడంతోపాటు వీటిలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు జాతీయ రహదారి వెంబడి పట్టణ ప్రాంతాల వద్ద క్యూఆర్ కోడ్ పలకలు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి పనులు, ఇతర విషయాలు తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతాయి. ఆంగ్లం, తెలుగు, హిందీ, ఒడియాతో పాటు 23 ప్రాంతీయ, జాతీయ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుంది. దీని గురించి తెలుసుకుందాం రండి..

ఇచ్ఛాపురం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

- జాతీయ రహదారి వెంబడి ప్రయాణించే వారికి రోడ్డు పక్కన అక్కడక్కడ క్యూఆర్ కోడ్‌తో ఉన్న నీలం బోర్డులు కనిపిస్తుంటాయి. వాటిని చరవాణితో స్కాన్ చేస్తే ప్రాజెక్టుల వివరాల పూర్తి సమాచారం తెరపై కనిపిస్తుంది.
- రహదారి నిర్మాణం, దానికైన ఖర్చు, గుత్తేదారు వివరాలు, సమీపంలో ఉండే పట్టణం, రోడ్డు నిర్వహణాధికారి పేరు, ఫోన్ నంబరు తెలుస్తాయి. సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా, వాటి మేనేజర్ల పేర్లు, వివరాలు, వాటి సమీపంలో ఉండే సదుపాయాలు, వైద్య సేవలు, ఛార్జింగ్ పాయింట్లు, మరుగుదొడ్లు, పోలీసు స్టేషన్, దాని అధికారి పేరు, వాహనాలు నిలిపే స్థలం, వాహన మరమ్మతు కేంద్రాలు, టైర్లలో గాలి తనిఖీ కేంద్రాలు, అత్యవసర విభాగాధికారులు, వారి పేర్లు, ఆసుపత్రులు, వైద్యులు, ఫోన్ నంబర్లు, దేవాలయాలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాలు.. ఇలాంటి వివరాలు క్యూఆర్ కోడ్‌లో నిక్షిప్తం చేశారు.
- ప్రాజెక్టుల్లో తేడాలున్నా, సేవా లోపాలు కనిపించినా నేరుగా సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

రైతేరాజు
- రాగులు.. డబ్బులు మిగులు
- మందుల పిచికారీ జాగ్రత్త హలధారి..
6లో



(c) eenadu

దివ్యాంగ ధ్రువపత్రం ఇప్పించరూ..

పోలియో బాధిత కుమారుడికి సదరంలో దివ్యాంగ ధ్రువపత్రం జారీ చేయాలంటూ ఓ కుటుంబం మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రిని ఆశ్రయించింది. ఎల్ఎన్ పేట మండలం కరకవలస పంచాయతీ పరిధి శ్యామలాపురం గ్రామానికి చెందిన ఆబోతుల గోవింద్, పుష్ప దంపతుల కుమారుడు మోహన్ (15) పుట్టుకతోనే పోలియో బాధితుడని వారు తెలిపారు. అతనికి సదరం ధ్రువపత్రం కోసం గతంలో రెండు, మూడు సార్లు ఆసుపత్రికి వచ్చినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలిసిన వారి ద్వారా మాట్లాడిస్తే వైద్యులు రూ.30 వేలు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం సదరంలో హాజరు కావాలని సమాచారమిచ్చారని తెలిపారు. కుమారుడికి న్యాయం జరిగేలా ధ్రువపత్రం జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. - న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం (ఎనిమిదో రోజు) కొనసాగాయి. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న శిబిరంలో పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎర్రన్న పాపినాయుడు మాట్లాడుతూ 2019, 2024 వేతన సవరణ చేపట్టాల్సి ఉన్నా ఇప్పటివరకు అమలు చేయలేదని ఆక్షేపించారు. సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి బల్లెడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న పీఏసీఎస్ ఉద్యోగులు

మెరుగైన వైద్య సేవలందించండి

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో అతిసారంతో బాధపడుతూ మృతి చెందిన మండల సురేష్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారం చెక్కును మంగళవారం రాత్రి ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అందజేశారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని... ఎక్కడా లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైన చోట ప్రత్యేక బృందాలను నియమించి పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. మందులు, ఐవీ ద్రావణాలు, పడకలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు తాగు నీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... అతిసార లక్షణాలు గుర్తించగానే సమీప ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని కోరారు.



బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సహాయక చర్యల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారుల నియామకం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని అతిసార ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల పర్యవేక్షణకు ఐదుగురు జిల్లా స్థాయి అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నియమించారు. డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డీఎంఎస్ పీడీ శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, ఉద్యాన శాఖ ఏడీ ఆర్వీ రత్న ప్రసాద్, పశు సంవర్థక శాఖ జేడీ కె.రాజగోపాలరావు నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఎర్రయ్య (పాత చిత్రం)

పొలాకి, న్యూస్‌టుడే: అంపలాం పంచాయతీ పరిధిలోని రాజారాంపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు మైలపల్లి ఎర్రయ్య (42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. భార్య సూరమ్మతో తరచూ గొడవ పడేవారు. మంగళవారం ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. ఆ తర్వాత అతను అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వారికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎర్రయ్య మెడ చుట్టూ నల్లగా కమిలి ఉందని, మృతికి గల కారణాలు పోస్టుమార్టం అనంతరం తెలుస్తాయని ఎస్సై రంజిత్ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగి దుర్మరణం



జీవీ నాయుడు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మంగళవారం విశాఖపట్నంలోని జాతీయ రహదారి పంజాబ్ హోటల్ వద్ద చోటుచేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాతపట్నం ప్రాంతానికి చెందిన జోగుల పైడినాయుడు (51) నగరంలో గత కొన్నేళ్లుగా మీనాగర్ ఎనిమిదో వార్డులో ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్నారు. నేవీలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం కెనరా బ్యాంకు సీతమ్మధార శాఖలో క్లర్క్‌గా పని చేస్తున్నారు. మంగళవారం ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తుండగా పంజాబ్ హోటల్ కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద రామచంద్ర వరం నుంచి విశాఖపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఎయిర్‌పోర్టు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బస్సును స్టేషన్‌కు తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

వృద్ధురాలి బలవన్మరణం

పొలాకి, న్యూస్‌టుడే: పొలాకి గ్రామానికి చెందిన కరణం చిన్నమ్మడు (73) మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డారు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 22న తలకు రాసుకునే నూనె తాగారు. కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దేవాలయంలో చోరీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలోని సంతోషిమాత దేవాలయంలో చోరీ జరిగినట్లు మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఆలయ కమిటీ ప్రతినిధుల కథనం మేరకు ఆలయానికి వచ్చేసరికి తలుపుల తాళాలు ఊడదీసి ఉండటంతో లోపలకు వెళ్లి చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సుమారు తులం బంగారు ఆభరణాలు కాజేశారని ఫిర్యాదు చేశారు.

కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడిపై వేధింపుల కేసు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన ఓ విద్యార్థినిని ప్రేమ పేరిట వేధిస్తున్నాడని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు మద్దువలస అలియాస్ సుమిత్‌పై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విద్యార్థిని కంప్యూటర్ కోర్సు నేర్చుకునేందుకు కాశీబుగ్గ వెళ్లింది. కొంతకాలంగా ఆ సెంటర్ నిర్వాహకుడు ప్రేమ పేరిట తన వెంటపడుతూ వేధిస్తున్నాడని బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం కాశీబుగ్గ గ్రామీణ సీఐ తిరుపతి పర్యవేక్షణలో విచారణ చేపట్టి నిందితుడిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిహార్ తెలిపారు.

విద్యుత్తు తీగల చోరీ కేసులో నిందితుడికి జైలు

శ్రీకాకుళం నేరవార్త విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ పోలీసుస్టేషన్ పరిధి శాస్త్రులపేట వద్ద సంస్థాగత పొలాల్లో, మహాలక్ష్మీనగర్ కాలనీలో ఓ ఇంట్లో విద్యుత్తు తీగలు చోరీకి పాల్పడిన కేసుల్లో పెద్దపాడుకు చెందిన కలగ రామయ్యకు ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష, రూ.10 వేలు అపరాధ రుసుం విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కేఎంజే బేగం మంగళవారం తీర్పు వెల్లడించారు. రెండు కేసుల్లో శిక్షను ఖరారు చేస్తూ ఏక కాలంలో అనుభవించాలని ఆదేశించారు. అపరాధ రుసుం చెల్లించలేక పోతే అదనంగా మరో రెండు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. ఆయా కేసులకు విచారణాధికారిగా గ్రామీణ సీఐ పైడపునాయుడు వ్యవహరించారు. గ్రామీణ ఎస్సై రాము ఛార్జిషీట్ దాఖలు చేశారు.

రాగులు.. డబ్బులు మిగులు..!

- న్యూస్‌టుడే, జలుమూరు

రబీ సాగులో 15 ఏళ్లుగా రాగులు పండిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు బోర అప్పన్న. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో 60 సెంట్ల విస్తీర్ణంలో సాగు ప్రారంభించారు.

◆ విత్తనాలు, దమ్ముచేయడం, నాట్లు వేయడం, ఎరువులు, చీడ పీడల నివారణకు మందులు, పంట నూర్పిడి వేసే వరకు రూ.7 వేలు పెట్టుబడి అవుతుందన్నారు.

◆ 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని మార్కెట్లో కిలో రాగులు రూ.35 పలుకుతుంది. బహిరంగ మార్కెట్లో క్వింటా ధర రూ.3,500 ఉంది. ఈ లెక్కన పంట రూ.35 వేలకు వస్తుంది. పెట్టుబడి మినహా రూ.28 వేలు ఆదాయం వస్తుందని అప్పన్న తెలిపారు.

◆ జిల్లాలో 7600 ఎకరాల వరకు ఈ-పంట నమోదు చేయడం జరిగిందని వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి తెలిపారు. ప్రస్తుతం మద్దతు ధర రూ.3578 ఉందన్నారు.

రామచంద్రాపురంలో పెరిగిన చోడి పంట

సస్య రక్షణ చర్యలు ఇలా

రాగుల పంటకు చీడ పీడలు అంతగా ఆశించవు. ఎకరా విస్తీర్ణానికి మూడు కిలోల విత్తనాలు అవసరం, కిలో విత్తనాలకు 2 గ్రాముల కార్బండజైమ్ పొడుతో విత్తన శుద్ధి చేసుకోవాలి. అవసరం మేరకు నీటి తడులు అందించాలి. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాముల 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోప్యూరాన్ - 2 గ్రాముల ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి తెలిపారు.

'సేంద్రియ ఎరువుల వినియోగిస్తాం. పాడి పశువులు, గొర్రెల మేకల వ్యర్థాలే పొలంలో ఎక్కువగా వేస్తాం. నీటి వసతి ఉన్నచోట పండించడం సులభం. నాలుగు సార్లు తడి అందించేంత నీరు ఉంటే చాలు పంట చేతికి అందుతుంది.' అని బోర అప్పన్న తెలిపారు.

రైతేరాజు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ఆరుతడి పంటలకు ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యల్లో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఆముదాలవలస వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.జ్యోతిబసు అన్నారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

పొద్దు తిరుగుడు పంటలో కలుపు ఎక్కువగా ఉంది

? : ప్రశ్న: మొక్కజొన్న విత్తి 55రోజులు(పూత దశ) అవుతోంది. ఎకరానికి మూడో దఫా ఎరువులు ఏ మోతాదులో వేసుకోవాలి.
-సింహాచలం, బూర్జ

☛ : సమాధానం: పూతదశ అత్యంత కీలకమైన సమయం. ఎకరానికి 72 కిలోల యూరియా, 29 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. అనంతరం తప్పనిసరిగా తేలికపాటి తడిని పొలానికి అందించాలి.

? : నువ్వుల సాగు 25-30 రోజుల దశలో ఉంది. మొక్కల ఎదుగుదల లేదు. - డి.రమణ, పొందూరు

☛ : నువ్వుల పంట 30 రోజుల దశలో ఎకరాకు 15- 20 కిలోల యూరియా వేసి స్వల్పంగా తడి అందించాలి. ఆఖరి దుక్కిలో గంధకం వేయకపోతే ఎకరాకు 10 కిలోల బెంటోనైట్ సల్ఫర్ వేయడం మంచిది. మొక్కలు దృఢంగా ఉండాలంటే లీటరు నీటికి 5 గ్రాముల ఫార్ములా-4 (సూక్ష్మపోషకాల మిశ్రమం) అలాగే 10 గ్రాముల యూరియాను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే అధిక దిగుబడి సాధించొచ్చు.

? : పొద్దుతిరుగుడు పంటలో గడ్డి జాతి మొక్కలు, కలుపు ఎక్కువగా ఉంది. నివారణ చర్యలు తెలపండి
-కె.అప్పలనాయుడు, ఎచ్చెర్ల

☛ : కలుపు నివారణకు ఎకరాకు 400 మి.లీ క్విజలోఫాప్-పి-ఇథైల్ లేదా 250 మి.లీ ఫైనాక్సాప్రాప్-పి-ఇథైల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు
వచ్చే వారం సాగులో చీడపీడల నివారణ, కొత్త వంగడాలు, ఇతర సమస్యలపై తొగరాం పాలిటెక్నికల్ వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నీలవేణి 7702394824 చరవాణి నంబరును సంప్రదించాలి

మందుల పిచికారీ.. జాగ్రత్త హలధారీ..!

రబీ సీజన్ వరి సాగు పిలక దశలో ఉంది. ఈ సమయంలో ఆశించే తెగుళ్ల నుంచి పంటను రక్షించుకునేందుకు నెలలో రెండు, మూడు సార్లు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పిచికారీ చేసే వేళ రైతులు, కూలీలు ఎలాంటి రక్షణ లేకుండా పని చేస్తున్నారు. గాలికి ఎదురుగా మందులు పిచికారీ సమయాల్లో వాసన పీల్చడం, శరీరంపై పడటంతో వారి ఆరోగ్యం దెబ్బతింటోంది.
★ పిచికారీ సమయంలో ముఖానికి మాస్క్ వేయాలి. ★ చేతులు పూర్తిగా కప్పేలా వస్త్రాలు ధరించాలి. ★ కళ్లకు రక్షణగా కళ్లద్దాలు వేస్తే మేలు ★ గాలికి ఎదురుగా పిచికారీ చేయకూడదు. ★ గుళికలు చల్లే సమయంలో ఎగిరే సన్నటి దుమ్ము పీల్చితే ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ★ పిచికారీ చేసిన తరువాత సంబంధిత రసాయనాల డబ్బాలను పొలంలో, కాలువల్లో పడేయకూడదు పశువులు, పిల్లలకు అందుబాటులో ఉండకుండా గోతుల్లో పూడ్చాలి.

'ప్రస్తుతం మార్కెట్లో లభించే మందులు అత్యంత శక్తివంతమైనవి. జాగ్రత్తలు పాటించకపోతే ఊపిరితిత్తులు, క్యాన్సర్ బారిన పడతారు. ముక్కు, నోరు, శరీరానికి తగిన రక్షణ ఏర్పాట్లు చేసుకుని పిచికారీ చేయాలి' అని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎల్వీ మధు సూచించారు.
-న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

గొనపపేటలో వరి సాగుకు పిచికారీ చేస్తున్న రైతు

తామర పురుగు.. మిరపకు చేటు

సారవకోట, న్యూస్‌టుడే: మిరప మొక్కలకు తామర పురుగు వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దిగుబడి తగ్గిపోతుంది. దీన్ని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించొచ్చని ఉద్యానవన శాఖాధికారిణి మంగమ్మ తెలిపారు. ఫిప్రోనిల్ 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి మొక్క తడిసే విధంగా పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు.

తెగులు ప్రభావంతో ఎదుగుదల లోపించిన మిరప మొక్క

ANDHRA PRADESH MEDICAL SERVICES AND INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION SRIKAKULAM DIVISION
Floor of Central Medicine Store, Govt. Hospital Compound RIMS, Balaga, Srikakulam- 532001.
Short Tender Notice No.13/DB/EE-SKLM/ APMSIDC/2025-26/ Dt.24.02.2026
e-procurement Short Tender is invited for 1 Electrical work and 6 Civil Works 2nd call in APMSIDC Division, Srikakulam.
Bid Document Download starts from 26.02.2026 @ 3:00 PM onwords to bid document download end date is 04.03.2026 up to 3:00 PM.
Last date and time for uploading of bid documents are 04.03.2026 upto 4.00 PM
Technical Bid Opening date: 04.03.2026 after 05:00 PM.
The details of Notice inviting Tender and Bid documents can be downloaded through https://tender.apeprocurement.gov.in Other details can be obtained from the Office of the Executive Engineer, APMSIDC Division, RIMS Govt. Hospital Campus, Srikakulam (Phone No.8978680779)
Sd/- Executive Engineer, [FAC]
APMSIDC Division,Srikakulam

5న బీఆర్ఏయూలో యూత్ పార్లమెంట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5న యూత్ పార్లమెంట్ నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2026 పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యూత్‌పార్లమెంట్‌తోపాటు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో 18 నుంచి 25 ఏళ్ల లోపు యువత పాల్గొనవచ్చన్నారు. మార్చి 2లోగా మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 'భారత అత్యవసర పరిస్థితి-భారత ప్రజాస్వామ్యం నేర్చుకున్న పాఠాలు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు పెడతామన్నారు. జిల్లా స్థాయిలో పదిమందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న వీసీ రజని తదితరులు

శ్రీకాకుళం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్., నెం. ఎ. 353, శ్రీకాకుళం
69వ ద్వితీయ మహజన సభ నోటీసు
గౌరవ మహజన సభ సభ్యులందరికీ తెలియజేయునది ఏమనగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (డి.సి.ఎం.ఎస్) యొక్క 69వ ద్వితీయ మహజన సభ తే 24-03-2026ది మంగళవారం ఉదయం 11.00 గం.లకు డి.సి.ఎం.ఎస్. ప్రధాన కార్యాలయం అరసవిల్లి నందు జరుపుటకు నిర్ణయించబడినది. కావున గౌరవ మహజన సభ్యులందరూ మహజన సభకు తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనది.

శ్రీకాకుళం, తే 24-2-2026.	శ్రీ మార్పు జగ్గునాయుడు బిజినెస్ మేనేజర్ (ఎఫ్.ఎ.సి) సెల్ నెం. 8919832014	శ్రీ చౌదరి అవినాష్ పర్సన్ ఇన్‌ఛార్జ్ డి.సి.ఎం.ఎస్., శ్రీకాకుళం

గమనిక: మహజన సభకు సంఘ అధ్యక్షులు లేదా ఛైర్‌పర్సన్‌లు మాత్రమే హాజరగుటకు అర్హులు.

టెండర్ నోటీసు
విషయం:- ఇచ్ఛాపురం పురపాలక సంఘములో జనరల్ నిధుల మరియు 15వ ఆర్థిక సంఘ పనుల గూర్చి టెండర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఈ క్రింది విధముగా పిలువబడుచున్నవి.
I. టెండర్ నోటీసు నెంబర్ 70/2017-18/ఇ I తేదీ 24.02.2026

మొత్తం పనులు సంఖ్య	: 11 (15వ ఆర్థిక సంఘం)
అంచనా విలువ	: రూ. 45.60 లక్షలు
మొత్తం పనులు సంఖ్య	: 5 (సాధారణ నిధులు)
అంచనా విలువ	: రూ. 4.25 లక్షలు
బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభం	తేదీ 26-02-2026 ది సాయంత్రం 5 గంటలకు
బిడ్ క్లోజింగ్	తేదీ 13-03-2026 సాయంత్రం 3 గంటల వరకు
బిడ్ రిసీవ్ ఆఖరు	తేదీ 13-03-2026 సాయంత్రం 4 గంటల వరకు
బిడ్ ప్రైస్ ఓపెనింగ్	తేదీ 13-03-2026 దీ సాయంత్రం 5 గంటల వరకు

మిగిలిన వివరములకు https:www.e-procurement.gov.in నందు చూడగలరు. మరియు ఫోను నెంబర్ 08947 - 231176 మరియు సెల్ నెం. 9640574201
సం/- xxx కమిషనర్
ఇచ్ఛాపురం పురపాలక సంఘము

ఆటో డ్రైవర్ నిజాయతీ

కంచిలి, న్యూస్‌టుడే: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి, కంచిలి కంచమ్మతల్లి ఆటో యూనియన్ సభ్యుడు దుదిష్టి సాహు ఓ ప్రయాణికురాలు తన ఆటోలో మరిచిపోయిన సంచిని అందజేసి నిజాయతీ చాటుకున్నారు. కంచిలి మండలం మద్యపుట్టుగకు చెందిన మజ్జి శకుంతల ఉపాధి పనుల నిమిత్తం భువనేశ్వర్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతర, ఇతర శుభకార్యాల కోసం సోంపేట వచ్చారు. రైలు నిలయం వద్ద కంచిలి గుడియా దుదిష్టి సాహు ఆటోలో ఇంటికి చేరుకున్నారు. డ్రైవర్ తిరిగి సోంపేట వెళ్తున్న సమయంలో వాహనంలో సంచిని గమనించారు. అందులో రూ.8 వేల నగదు, రెండు తులాల బంగారం ఉన్నాయి. వెంటనే శకుంతల ఇంటికి చేరుకుని ఆమెకు అందజేశారు.

బంగారం, నగదు అందజేస్తున్న డ్రైవర్ దుదిష్టి సాహు

ద్వితీయ ఇంటర్ పరీక్షకు 318 మంది గైర్హాజరు

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు 71 కేంద్రాల్లో నిర్వహించారు. 19,158 విద్యార్థులకు 318 మంది గైర్హాజరయ్యారు. 98.34 శాతం హాజరు నమోదైంది. సాధారణ కోర్సులకు సంబంధించి 18,057 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 291 మంది గైర్హాజరయ్యారు. వృత్తివిద్య కోర్సులకు సంబంధించి 1,101 మందికి 27 మంది హాజరు కాలేదు.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	155	265	285

యువికా..విజ్ఞాన వేదిక!

న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

27 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

మీరు తొమ్మిదో తరగతి చదువుతున్నారా? అంతరిక్ష పరిజ్ఞానం గురించి తెలుకోవాలనుందా? ఉపగ్రహాలను ఎలా ప్రయోగిస్తారో చూడాలని ఉందా? శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం పొందాలనుకుంటున్నారా? భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)లో పాల్గొనడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ఈ నెల 27న ప్రారంభం కానుంది. వచ్చే నెల 31 వరకు కొనసాగనుంది.

పరిశోధనల్లో భాగం చేయడానికే..

అంతరిక్ష పరిశోధనల్లో మన దేశం అద్భుతాలు సృష్టిస్తూ అగ్రరాజ్యాల జాబితాలో చేరింది. ఈ విజ్ఞానాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లి వారిలో స్ఫూర్తి నింపాలనే ఉద్దేశంతో ఏటా ఇస్రో యువికా పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన వారికి యువికాలో భాగస్వాములను చేస్తే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

ఎంపికయ్యాక ఏం చేస్తారు..?

ఎంపికైన వారిని మేలో 14 రోజుల పాటు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ శాస్త్ర, సాంకేతికతకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ అందిస్తారు. శాస్త్రవేత్తలతో విద్యార్థులు ముఖాముఖి మాట్లాడే అవకాశం కల్పిస్తారు. అంతరిక్షంలో సాధిస్తున్న ప్రగతి, సవాళ్లు, శాస్త్రవేతలుగా ఎదగాలంటే ఏం చేయాలి? అనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. ప్రయోగశాలల సందర్శన, నిపుణులతో చర్చాగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అర్హులు వీరే..

● సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్‌లో ఎనిమిదో తరగతి పూర్తి చేసి ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న వారు www.isro.gov.in లో దరఖాస్తు చేయాలి.

● ఎనిమిదో తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. స్పేస్, సైన్స్ క్లబ్‌ల్లో ఉంటే 5, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి 10, క్రీడల్లో సత్తా చాటిన వారికి 10, ఎన్‌సీసీ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉండే వారికి 5, పల్లె ప్రాంతానికి చెందిన వారికి 20 శాతం వెయిటేజీ కల్పించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనొచ్చు. పరిశోధనలపై ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం. అర్హత కలిగిన బాలలు సద్వినియోగం చేసుకోవాలి.
- ఎన్.కుమార్‌స్వామి, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

జనగణన సకాలంలో పూర్తి చేయాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: అన్ని మండలాల్లో నిర్దేశించిన సమయానికి జనగణన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ జనగణన కార్యకలాపాల సంయుక్త డైరెక్టర్ బీవీఎల్ సాయి శేఖర్ ఆదేశించారు. చిలకపాలెం సమీపంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జనగణన-2027 నిర్వహణపై 30 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనగణనకు సంబంధించిన ప్రక్రియ మే 1 నుంచి 31 లోగా పూర్తి చేయాలన్నారు.

నేటితో ముగియనున్న ఈ-పంట నమోదు.. ఎల్ఎన్‌పేట: రబీ పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియ బుధవారం ముగుస్తుందని వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి పేర్కొన్నారు. పెద్దకోట-1 రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

శ్రీకాకుళం టౌన్ మండలవీధి, సచివాలయం దరి KVMG అపార్ట్‌మెంట్ ఆనుకుని 30 ఫీట్స్ రోడ్డుప్రక్క 45x13 స్థలం అమ్మకం ✆ 7989280721.

JOBS

FACULTY/ TEACHERS

Wanted teachers for primary and high school Maths, Physics and English qualification B.Sc., B.Ed., B.Tech and B.A, B.Ed., ✆9441707763, 7702490940.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే వాక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
పలాస బ్రాంచ్, డి.నెం.15-2-167/9, కె.టి.రోడ్డు, కాశీబుగ్గ, పలాస-532222, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ నెం.7259291608 & 7995565180, E Mail :palasa@bankofbaroda.co.in
స్కాన్ చేయగలరు
నియమ నిబంధనల కొరకు

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన (APPENDIX- IV-A [See proviso to Rule 6 (2) & 8 (6)])

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) లోని నిబంధనలు ప్రకారం స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)లకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా/ఛార్జ్‌డ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తగిన వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఏదైతే ఉన్నదో అదే" ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/సెక్యూర్డ్ ఆస్తు(లు)/బకాయి మొత్తము/రిజర్వు ధర/ఇ-వేలం బిడ్ పెంపుదల మొత్తము వివరములు ఈ దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత/హామీదారు/ తనఖాదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరములు	మొత్తము బకాయి	ఇ-వేలం తేది మరియు సమయం	రిజర్వు ధర, ధరావతు మరియు బిడ్ పెంపుదల
మెస్సర్స్ శ్రీ వారాహి బేవరేజస్(ఋణగ్రహీత) ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక ప్రొప్రయిటర్: శ్రీ మర్రి వెంకటేష్ , తండ్రి: రాజేశ్వరరావు, సర్వే నెం.143/1ఎ, ఎన్‌హెచ్ 16 హైవే ఎదురుగా, రామకృష్ణాపురం గ్రామం, గురుదాస్‌పురం మండలం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532243. శ్రీ పొట్నూరు వెంకటరావు (హామీదారు), తండ్రి: పొట్నూరు కూర్మస్వామి, 3-1-91, పద్మనాభపురం, పలాస, కాశీబుగ్గ, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్-532222	శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్, కాశీబుగ్గ మునిసిపాలిటీ, నారాయణపురం, పద్మనాభపురం గ్రామం, రెండవ వార్డు, సర్వే నెం.405/10లోని 150 చ॥గ॥లు లేదా 126.00 చ॥మీ॥ల విస్తీర్ణంలో సమీప డోర్ నెం.2-1-120తో గల నివాస ఖాళీ స్థలం యావత్తు ఆస్తి. కొలతలు: తూర్పు నుండి పడమర : 22.5 అ॥లు లేదా 6.86 మీ॥లు ఉత్తరం నుండి దక్షిణం : 60 అ॥లు లేదా 18.30 మీ॥లు. మొత్తం విస్తీర్ణం 150.00 చ॥అ॥లు లేదా 126 చ॥మీ॥లు. ఆస్తికి హద్దులు: తూర్పు : సాసనపురి పర్మిలాదేవి గారి స్థలం, దక్షిణం: 15 అ॥ల రోడ్డు, పడమర : నా స్థలం కొలతలు 22.5*60 అ॥లు, ఉత్తరం: వల్లభ నారాయణ పాత్రో గారి స్థలం. సేల్ డీడ్ నెం. 4871/2019, తేదీ: 11-12-2019 ప్రకారం శ్రీ పొట్నూరు వెంకటరావు, తండ్రి: పొట్నూరు కూర్మస్వామి (హామీదారు) గారికి చెందినది.	తేది:30.04.2025 నాటికి రూ. 23,07,472.00 (అక్షరాల ఇరవై మూడు లక్షల ఏడు వేల నాలుగు వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే) + వర్తించని వడ్డీ రూ. 10,897.76 (అక్షరాల పది వేల ఎనిమిది వందల	30-03-2026 మ॥ 02.00 గం॥ల నుండి సా॥ 06.00 గం॥ల వరకు (వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)	రిజర్వు ధర: రూ. 22,50,000/- ధరావతు : రూ.2,25,000/- బిడ్ పెంపుదల : రూ. 10,000/-
			స్వాధీనత స్వభావం: భౌతిక	
			ఆస్తులను తేది.25-02-2026 నుండి 29-03-2026 వరకు ఉ॥11.00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు తనిఖీ చేసుకోగలరు.	

తొంబై ఏడు రూపాయల డెబ్బై ఆరు పైసలు మాత్రమే) + ఇంకా సర్వీస్ కాని వడ్డీ రూ. 40,118.17 (అక్షరాల నలభై వేల నూట పద్దెనిమిది రూపాయల పదిహేడు పైసలు మాత్రమే) + కాంపౌండింగ్ వడ్డీ రూ. 436 (అక్షరాల నాలుగు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే) + తేదీ:01.05.2025 నుండి వర్తించని వడ్డీ, లీగల్ ఇతర ఛార్జీలు మొదలగునవి

అమ్మకం పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా వెబ్ సైట్ :https://bankofbaroda.bank.in/e-auction నందలి మాచే ఇవ్వబడిన లింకును చూడండి మరియు ఆన్‌లైన్ వేలం పోర్టల్ https://baanknet.com కూడ చూడవచ్చును. అర్హత గల బిడ్డర్లు అధీకృత అధికారి, ఫోన్ నెం.08945-240108, మొబైల్ నెం. 7259291608 & 7995565180ను సంప్రదించగలరు.

తేది : 24-02-2026, ప్రదేశం : విశాఖపట్నం
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

ఆహ్లాదమన్నారు.. నిర్లక్ష్యంగా వదిలారు

ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ముఖద్వారంలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గతంలో మినీ పార్కు నిర్మించారు. దీన్ని కాంప్లెక్స్ భవనానికే వన్నె తెచ్చేలా తీర్చిదిద్దారు. కొన్నేళ్లుగా దీన్ని నిర్లక్ష్యంగా వదిలేయడంతో మొక్కల ఆచూకీ లేకుండా పోయింది. అందం మాట అలా ఉంచితే.. ఆపద తెచ్చేలా మారిందని ప్రయాణికులు మండిపడుతున్నారు. కాంప్లెక్స్ అభివృద్ధి పనుల్లో భాగంగా దీన్ని బాగు చేస్తామని పలాస డిపో మేనేజర్ ఎస్‌వీఎస్ నాయుడు తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఘనంగా అగ్నిగుండం

పలాస, న్యూస్‌టుడే: పలాస పట్టణంలో జామి ఎల్లమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలో ఉదయం కొల్లకోట కుటుంబీకులు పందిరి రాట వేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో పూజలు చేసి మేళతాళాల మధ్య ఎల్లమ్మ జంగిటతో తర్లాకోట చేరుకుని రాజవంశీయుల ఇంట అగ్నిగుండం తొక్కి తొలి పడి అందుకున్నారు. తిరిగి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పూజలు చేశారు.

జంగిటతో తర్లాకోటకు బయలుదేరిన కొల్లకోట కుటుంబీకులు

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఎల్లమ్మ తల్లి జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కాశీబుగ్గ డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ ఆలయ కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. మంగళవారం సాయంత్రం ఆలయ పరిసరాలు పరిశీలించారు. జాతర సందర్భంగా జంట పట్టణాల్లో ట్రాఫిక్ మళ్లించినట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 నుంచి ఆర్టీసీ బస్సులు పలాస కాంప్లెక్స్‌కు కాకుండా కాశీబుగ్గ పాత బస్టాండ్ వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. పలాస ఇందిరా చౌక్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మధ్య ఎలాంటి వాహనాల రాకపోకలకు అనుమతి లేదని పేర్కొన్నారు.

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు హరిశంకర్: హే బల్‌వంత్, భాస్కరరామ: ఎర్రచీర ఇచ్ఛాపురంలో.. మణికంఠ ఎల్ మ్యాక్స్: హే బల్‌వంత్, పూర్ణ: మన శంకర వరప్రసాద్‌గారు సోంపేటలో.. ఎస్ఎస్‌మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు, శివ: హే బల్‌వంత్
– న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM) 8008574279 9063144707

సమస్య: ఇచ్ఛాపురం పట్టణంలో వాహనాలు పలు చోట్ల రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - కె.నారాయణమూర్తి, ఇచ్ఛాపురం సమాధానం: రోడ్డుపై వాహనాలు నిలిపినా, ఆక్రమించినా చర్యలు తీసుకుంటాం.
- ఎం. చిన్నంనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? బెండిగేటు నుంచి పూండి మధ్య రహదారికి ఇరువైపులా బెర్ములు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - కోనేటి రాజు, మాజీ సైనికుడు, పీఎంపురం ★ నిధులు మంజూరయ్యాయి. జీవో విడుదల కావాల్సి ఉంది. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తాత్కాలిక బెర్ములు ఏర్పాటు చేస్తాం.
- జగదీష్, జేఈ, ఆర్అండ్‌బీ శాఖ, పలాస
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

డ్వాక్రా రుణాలు వ్యాపార పెట్టుబడులు
ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం, మందస

గ్రామీణ మహిళల ఆత్మ విశ్వాసానికి డ్వాక్రా రుణాలు బలమైన పునాదులు వేస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతున్న రుణాలు వారిని చిన్న చిన్న వ్యాపారాల వైపు నడిపిస్తున్నాయి. ఒకప్పుడు ఇంటి పనులకే పరిమితమైన వారు స్వయం ఉపాధితో కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేలు

స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందుకున్న అతివలు పలు రంగాల్లో రాణిస్తున్నారు. పల్లెల్లో పశుపోషణ, పాల ఉత్పత్తి, కూరగాయలు, జీడి, కొబ్బరి పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి, మసాలా పొడుల తయారీ, టైలరింగ్ కేంద్రాలు, చిన్న కిరాణా దుకాణాలు, బేకరీ, గాజుల దుకాణం, మిల్లుల నిర్వహణ, చెప్పుల దుకాణాలు తదితర వ్యాపారాలు పెట్టుకుని నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదిస్తున్నారు. వీటితో కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

✤ వజ్రపుకొత్తూరు మండలం బైపల్లికి చెందిన పట్నాన మాలతి సాయికృప స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. ఈమె గతేడాది డిసెంబరులో రూ.2 లక్షలు రుణం తీసుకున్నారు. ఈ నగదుతో అదే గ్రామంలో పిండి మిల్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు నెలకు సుమారు రూ.15 వేల వరకు సంపాదిస్తున్నారు.

✤ పలాస మండలం చిన్న గురుదాసుపురానికి చెందిన రెయ్య పద్మావతి శివశక్తి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. ఈమె గతేడాది నవంబరులో రూ.లక్ష రుణం తీసుకుని కాంక్రీట్ మిక్సర్ కొనుగోలు చేశారు. దీని ద్వారా నెలకు రూ.20 వేలు ఆదాయం పొందుతున్నారు.

✤ మందస మండలం సిరిపురానికి చెందిన వి.సరోజిని జగదాంబ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. ఈమె గతేడాది జులైలో రూ.లక్ష రుణం తీసుకుని సిరిపురం కూడలి వద్ద దుస్తుల దుకాణం పెట్టుకున్నారు. నెలకు రూ.20 వేలు సంపాదిస్తున్నారు.

పలాస నియోజకవర్గ వివరాలు

మండలం	సంఘాలు	సభ్యులు	గతేడాది రుణం తీసుకున్నవారు	వ్యాపారం చేస్తున్నవారు
పలాస	1,111	11,892	5,314	1,207
వజ్రపుకొత్తూరు	1,998	22,146	11,024	7,265
మందస	2,023	22,715	7,736	6,814

వజ్రపుకొత్తూరు మండలం బైపల్లిలో పిండి మిల్లు నిర్వహిస్తున్న మాలతి

ఆదాయం పెంచుకోవాలి

రుణాలు పొందిన మహిళలు ఏదో ఒక చిన్న వ్యాపారం ప్రారంభించి కుటుంబానికి అండగా నిలవాలనేదే ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు జీవన ప్రమాణాలు పెంపొందించుకునేలా మహిళలందరికీ అవగాహన కల్పిస్తున్నాం.
– పైడి కూర్మారావు, వెలుగు ఏపీఎం, మందస

మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి

పలాస, న్యూస్‌టుడే: పలాస నియోజకవర్గంలో బ్రిటిష్ కాలం నాటి కాజ్‌వేల మరమ్మతులకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపడుతున్నా వర్షాకాలంలో గెడ్డలు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని, ఇటీవల ఓ వృద్ధుడు కొట్టుకుపోగా ఆయన మృతదేహం మూడు రోజుల తర్వాత బయటపడిందన్నారు. శాశ్వత ప్రాతిపదికన వంతెనల నిర్మాణానికి రూ.26 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక అందించామని, కాలం చెల్లిన వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కూలితే ప్రమాదమే

ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలి నుంచి ఆసుపత్రి రోడ్డుకు వెళ్లే మార్గంలో సీసీ రహదారి ప్రమాదకరంగా మారింది. గతేడాది కురిసిన వర్షాలకు వచ్చిన వరదకు రహదారి కిందనున్న మట్టి కొట్టుకుపోయింది. ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పరిశీలించి, ప్రతిపాదనలు చేస్తామని పుర కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బోరు వేశారు.. ట్యాంకు మరిచారు

కొన్నాయిపుట్టుగ గ్రామంలో స్థానికుల దాహార్తి తీర్చేందుకు బోరు, మోటారు ఏర్పాటు చేసి ట్యాంకు నిర్మించడం మరిచారు. దీంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఉషాజ్యోతిని వివరణ కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ట్యాంకు నిర్మాణంతోపాటు ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కంచిలి

నిరుపయోగం.. భవనం శిథిలం

పాత శాసనంలో నిర్మించిన మహిళా మండలి భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. దీంతో గచ్చులు పెచ్చులూడటంతోపాటు లోపల భాగాలు చెదలు పడుతున్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కె.రామారావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

నడవాలన్నా.. నరకయాతనే

మందస మండలం పాత జాతీయ రహదారి నుంచి సువర్ణపురం వెళ్లే రోడ్డు ఇది. గతేడాది అభివృద్ధి పనులు ప్రారంభించి తారు తొలగించారు. అనంతరం వెట్ మిక్స్ పొర వేసి పనులు నిలిపేశారు. దీంతో రాళ్లు తేలి అధ్వానంగా తయారై కాలినడకకూ కష్టంగా మారింది. బిల్లులు అందక పనులు ఆగాయని, బకాయిలు విడుదల కాగానే తదుపరి పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ శాఖ డీఈ జి.రవిబాబు తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

ఇలాగేనా సంపద సృష్టి

కిడిసింగి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. దీంతో పరిసరాలు పనికిరాని మొక్కలతో అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా సంపద తయారీ కేంద్రం పూర్తి చేసి పరిసరాలు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి నిర్మాణ పనులు జరిగేలా చొరవ తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో తిరుమలరావు తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

భారతీయ విద్యాకేంద్రం స్థాపనకు స్థల వితరణ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో మెరుగైన విద్యను అందించే భారతీయ విద్యాకేంద్రాన్ని ఇచ్ఛాపురంలో నెలకొల్పాలని వ్యాపారవేత్త, భాజపా నాయకుడు **వల్లంపాటి కృష్ణప్రసాద్** ఆశించారు. ఈ మేరకు జగతిలోని భారతీయ విద్యాకేంద్ర నిర్వాహకులను సంప్రదించారు. పాత జాతీయ రహదారి పక్కనే ఏఎస్‌పేట వద్ద ఉన్న 4 ఎకరాల సరుగుడు తోటను విద్యాలయం ఏర్పాటుకు వితరణ చేశారు. ఈ విషయాన్ని విశ్వహిందూ పరిషత్తు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రావి జయకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి దానపత్రాన్ని విద్యాకేంద్ర ప్రతినిధులకు అందించారన్నారు. వీహెచ్‌పీ ప్రధాన్ ఆర్‌వీకేఎస్ రామప్రసాద్ పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

పలాస, కాశీబుగ్గ, మందస, సోంపేట, న్యూస్‌టుడే: తమపై రాజకీయ వేధింపులు ఆపాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కాశీబుగ్గ, మందస, సోంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద రెండోరోజు నిరాహార దీక్షలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శులు గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు హేమలత, హైమావతి, మంజుల, సరస్వతి, చామంతి, జగన్మోహిని, బి.సునీత, భానుమతి, గీతాంజలి, దివ్య, కళావతి పాల్గొన్నారు.

సోంపేటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వైభవంగా డోలోత్సవాలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయ ధర్మకర్త కృష్ణారావు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, పూజలు చేశారు. పొందల నారాయణమూర్తి సౌజన్యంతో గరుడ వాహన సేవ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు తిరువీధి నిర్వహించారు.

చక్రధర స్వామిని గరుడ వాహనంపై ఊరేగిస్తున్న గ్రామస్థులు

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: కొండవూరుకు చెందిన భువన్ విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించింది. ఎంపీటీసీ సభ్యుడు చిట్టిబాబు, సంఘ వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్, ప్రతినిధులు కమల, మోహిని, సంతోష్, కేశవ్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని టెక్కలి డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు అన్నారు. ఉద్యోగోన్నతి పొందిన పలాస పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న రవికృష్ణను మంగళవారం సత్కరించారు. ఇన్‌ఛార్జి సహాయ సంచాలకుడు పి.చంద్రశేఖర్, వైద్యులు పాపారావు, శ్రీకాంత్, ఉమాభారతి, మధుబాబు, చైతన్య, శిరీష, ఊహ, పలాస, నందిగాం సబ్ డివిజనల్ సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం (పురుషోత్తపురం), రాజపురం ఆదర్శ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వైకుంఠరావు, గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు రూ.125, ఓసీ, బీసీలు రూ.200 రుసుం చెల్లించి మార్చి 31 లోగా ఆన్‌లైన్‌లో www.apms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు నకలు పాఠశాలకు అందించాలన్నారు. ఏప్రిల్ 12న పాఠశాల వద్ద ప్రవేశ పరీక్ష ఉంటుందని, మరింత సమాచారానికి 95538 32032, 91335 81693 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతిభా పరీక్ష విజేత ఇందిరమ్మపేట

సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో ఇందిరమ్మపేట ప్రాథమిక పాఠశాల విజేతగా నిలిచింది. సోంపేట ఉన్నత పాఠశాలల స్కూలు కాంప్లెక్స్‌లు మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన పోటీలో 20 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించి 50 మార్కులకు పరీక్ష నిర్వహించగా.. లక్కవరం, మొగలికొత్తూరు, శివాజీనగర్, ఇసకలపాలెం పాఠశాలలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. విజేతలకు కాంప్లెక్స్ ఛైర్మన్లు బి.మల్లేశ్వరరావు, పుష్పాంజలి బహుమతులు అందజేశారు. సీఆర్పీ వి.ఢిల్లీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

నైపుణ్య కోర్సుల్లో ప్రవేశాలు

పలాస, న్యూస్‌టుడే: పలాస డాక్టర్ కణితీస్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఉద్యోగ, ఉపాధి నైపుణ్య కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.జవహర్ తెలిపారు. అసిస్టెంట్ కన్‌స్ట్రక్షన్ ఫిట్టర్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ అండ్ పెరిఫెరల్స్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, వివరాలకు 63010 46329 నంబరులో సంప్రదించాలని కోరారు.

జయక్క వర్ధంతి సభ.. పలాస గ్రామీణం: బొడ్డపాడులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జయక్క ఆరో వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు సంతాపం తెలిపారు. గిరిజన రైతుల కోసం జయక్క చేసిన పోరాటాలను నాయకులు కొనియాడారు.

మురుగు ప్రవాహం.. దారి అధ్వానం..

– న్యూస్‌టుడే, సోంపేట

పాత జాతీయ రహదారి నుంచి ఎకువూరు వరకు ఇటీవల నిర్మించిన రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో అంచులు ధ్వంసం అవుతున్నాయి. రహదారి పరిధిలోని గ్రామాల్లో కాలువలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా 12, పరోక్షంగా 30 గ్రామాలకు రవాణా సదుపాయం అందుతోంది. తరచూ మరమ్మతులకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

టి.శాసనాం వద్ద రహదారిపై నిలిచిన మురుగు నీరు

★ తురకశాసనాం, గొల్లూరు, ఉప్పలాం పంచాయతీలో బట్టిగళ్లూరు, నడుమూరు, ఎకువూరు గ్రామాల్లో కాలువలు లేకపోవడంతో వాడుకనీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. వర్షం పడితే వరద నీరు పారడంతో రహదారి మూణ్నాళ్లకే ముక్కలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కొన్ని గ్రామాల్లో నడిచేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉద్దానం రోడ్డు కూడలి ప్రాంతం కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్డు తొందరగా పాడవుతోంది.

★ టి.శాసనాం, గొల్లూరు, ఉప్పలాం పంచాయతీ పరిధి గ్రామాల మధ్య నిర్మించిన ఈ రోడ్డు పనులు ఎనిమిదేళ్ల కిందట ప్రారంభించగా వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. మంజూరైన నాబార్డు నిధులు వెనక్కి మళ్లాయి. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక తీరం, ఉద్దానం గ్రామాల ప్రజల ఒత్తిడి, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కృషి మేరకు ఉపాధి నిధులు మంజూరు కాగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

కాలువల ఏర్పాటుకు యత్నం

ఆయా పంచాయతీల కార్యదర్శులతో కాలువల ఏర్పాటు విషయమై చర్చించి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. స్థానికులు వాడుక నీరు, ఇతర వ్యర్థాలు రోడ్డుపై వేయకుండా సహకరించాలి. ఈ విషయమై సిబ్బందితో మాట్లాడి అవగాహన కార్యక్రమాలు చేపడతాం.
– ఎ.వెంకటరావు, డిప్యూటీ ఎంపీడీవో, సోంపేట

★ నడుమూరు ఉన్నత, ఎకువూరు ప్రాథమిక పాఠశాలల వద్ద పరిస్థితి మరింత ఇబ్బందికరంగా తయారైంది. డొంకలూరు నుంచి ఎకువూరు వరకు అభివృద్ధి పనులు ఇంకా చేపట్టలేదు. ఎకువూరు వంతెనతోపాటు తోటూరు మీదుగా ఎర్రముక్కాం వరకు పనులు జరుగుతుండటంతో పాత రోడ్డు అభివృద్ధి పనులు, కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కంచిలి : విద్యార్థులు ఉన్నతంగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఎంపీపీ పైల దేవదాసురెడ్డి ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.చాణిక్య ఆధ్వర్యంలో కంచిలి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జగదీష్‌కుమార్, జడ్పీటీసీ ప్రతినిధి బంగారు కురుమయ్య, కె.శేఖర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపాలి

ఆర్టీసీ డిపోల్లో ప్రైవేటు సంస్థల సిబ్బంది ద్వారా బస్సులు నడిపే విధానాన్ని ఆపాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.వాలి అన్నారు. పలాస ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వమే బస్సులు కొనుగోలు చేసి నడపాలని కోరారు. – న్యూస్‌టుడే, పలాస

ఆదర్శ పాఠశాల విద్యార్థుల విజ్ఞాన యాత్ర

సోంపేట, న్యూస్‌టుడే: విజ్ఞాన విహారయాత్రలో భాగంగా సోంపేట ఆదర్శ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు ఒడిశాలోని చంద్రగిరి ప్రాంతాన్ని సందర్శించారు. ప్రిన్సిపల్ డి.చిన్నాజీవర్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చంద్రగిరిలో టిబెటిన్ల జీవన విధానం, ఇతర అంశాలు వివరించారు. అక్కడ నిర్వహించే కార్యకలాపాల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. కొండ జలపాతం సందర్శించి ఆనందంగా గడిపారు.

బౌద్ధారామం వద్ద విద్యార్థులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో పి.శ్రీదేవి సూచించారు. మంగళవారం బొరివంకలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. వరిలో జింకు లోప నివారణకు 12 శాతం జింక్ పొడిని ఎకరానికి 400 గ్రాముల 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరికి ఆశించే కాండం తొలుచు పురుగు, ఆకుముడత నివారణకు మందులు పిచికారీ చేయాలన్నారు. వీహెచ్‌పీ శంకర్, ఏఈవో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

హోరాహోరీగా క్రికెట్ పోటీలు.. కవిటి, న్యూస్‌టుడే: పాత కొజ్జిరియాలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఎల్‌వీఎస్ మెమోరియల్ మెగా క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం కేశపురం, బెజ్జిపుట్టుగ జట్లు తలపడగా కేశపురం జట్టు 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మెడిని ENT సెంటర్
MEDINI ENT CENTRE
చెవి, ముక్కు, గొంతు హాస్పిటల్
గాంధీనగర్ ఆంధ్రాబ్యాంకు రోడ్డు, కాశీబుగ్గ, సెల్: 7888057666
పలాస-కాశీబుగ్గ మరియు ఉద్దానం పరిసర ప్రాంతాల ప్రజల మన్ననలను పొందిన మా హాస్పిటల్ నేటితో 2 సంవత్సరాలు పూర్తిచేసుకొని 3వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా మా హాస్పిటల్‌కి సహకరిస్తున్న మిత్రులకు, శ్రేయోభిలాషులకు అందరికీ కూడా పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.
For Appointments :7888057666

• వినికిడి లోపం
• తల తిరగడం
• చెవి పోటు
• చెవిలో దురద
• చెవి నుండి నీరు లేక చీము కారటం
• జలుబు, తుమ్ములు
• తల నొప్పి
• వాసన తెలియకపోవడం
• గురక సమస్యలు
• గొంతు నొప్పి
• టాన్సిల్స్
• పొడి దగ్గు
• గొంతు బొంగురుపోవడం
డా॥ అమర్‌నాథ్ దేవరశెట్టి
MBBS DNB(ENT) MNAMS
Former Consultant Madras ENT Research Foundation Chennai
Trained at Lausanne, Switzerland
శ్రీమతి పావని దేవరశెట్టి
Administration
MEDINI ENT Centre

నిర్యాణం

నా సహధర్మచారిణి అయిన
శ్రీమతి సత్యమణి గారు
తే 15-02-2026 దీ ఆదివారం ఉదయం 6-20 నిమిషాలకు మమ్ములందరిని దుఃఖసాగరంలో ముంచి స్వర్గస్తులైనారని తెలియజేయుటకు మిక్కిలి చింతించుచున్నాము.
పెద్దకర్మ: తే 25-02-2026 ది బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుండి సోంపేట, టౌన్ హాల్ వీధిలో మా స్వగృహమందు జరుగును.
ఇట్లు
భర్త: వినయ్ చంద్ర పట్నాయక్, న్యాయవాది
మరియు కుటుంబ సభ్యులు
సోంపేట, శ్రీకాకుళం జిల్లా.

టెక్కలి

● టెక్కలి ● నరసన్నపేట ● పాతపట్నం

చలో విజయవాడ విజయవంతం చేయండి

ఆశా కార్యకర్తలు మార్చి 5న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఆశా కార్యకర్తల సంఘం మండల శాఖ నాయకులు గౌరమ్మ, జయలక్ష్మి, పూర్ణిమ పిలుపునిచ్చారు. కొత్తూరులో మంగళవారం కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనంతోపాటు అన్ని రకాల సెలవులను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. - న్యూస్‌టుడే, కొత్తూరు

ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వొద్దు

టెక్కలి, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూ నాయకులు స్థానిక డిపో ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. విద్యుత్తు బస్సులు, ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ మూర్తి, పీవీకే రాజు, సూరిబాబు పాల్గొన్నారు.

డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి

టెక్కలిలో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

అంగన్‌వాడీలకు శ్రమకు తగిన వేతనం ఇచ్చి, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం టెక్కలి, కొత్తూరులోని ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నంబూరు షణ్ముఖరావు, ఆదిలక్ష్మి, రమణమ్మ, దనలక్ష్మి, హేమలత పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, టెక్కలి, కొత్తూరు

రెండు తులాల బంగారం చోరీ

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు బీసీ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన పిన్నింటి హేమలత సరుబుజ్జిలి మండలంలోని కొత్తకోట గ్రామానికి ఈ నెల 21న వెళ్లారు. మంగళవారం ఇంటికి చేరుకుని తలుపులు తెరిచేందుకు చూడగా.. అప్పటికే తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని రెండు తులాల బంగారు ఆభరణం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఆమె వాపోయారు. హెచ్‌సీ వి.కోటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి జామి యాత్ర

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం పెరికివీధిలో జామి యాత్ర మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే యాత్ర మహోత్సవాల్లో సిర్లి పోతన్న, ఎల్లమాంబలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. మెళియాపుట్టి మండలంలో 19 రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మునగ మొక్కల పెంపకం, ప్రకృతి సిద్ధంగా చేపడుతున్న ఉద్యాన పంటల సాగును పరిశీలించారు. డీపీఎం నారాయణరావు, ఏపీఎం త్రినాథమ్మ, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉద్యానాధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

అడ్డగోలు.. అయినా అడ్డుకోరు..!

- పట్టణం పేరు: టెక్కలి
- జనాభా: 40 వేలకు పైగా
- ప్రధాన మార్గాలు: 6
- రద్దీ కూడళ్లు: 5

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

టెక్కలి పాతజాతీయ రహదారిలో ఓ హోటల్ ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు

రోడ్లపై యథేచ్ఛగా పార్కింగ్

రెవెన్యూ డివిజనల్ కేంద్రం టెక్కలిలో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, వాహనాల తాకిడితో ప్రధాన రహదారులు, కూడళ్లు రద్దీగా మారుతున్నాయి. వాహనాలు నిలిపేందుకు ప్రత్యేకంగా స్థలాలు లేకపోవడంతో ఎవరికి నచ్చినట్లు వారు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఉదయం, సాయంత్రం అధిక రద్దీ

ప్రధానంగా పాత జాతీయ రహదారిలో తెంబూరురోడ్డు, ఇందిరా, కచేరీవీధిలో చిన్న బజారు, అంబేడ్కర్ కూడళ్లు, పాతబస్టాండు, తొలుసూరుపల్లి, కండ్రవీధి రహదారులు ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే సమయం కావడంతో మార్గాలు కిటకిటలాడుతుంటాయి. చిన్నబజారు ప్రాంతంలో నిత్యావసర వస్తువులు కొనేందుకు వచ్చేవారు సైతం ఫుట్‌పాత్ వ్యాపారాలు, తోపుడు బండ్లతో అవస్థలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

దుకాణాల ఎదుటే పార్కింగ్

పట్టణంలో అల్పాహార, టీ, కాఫీ దుకాణాలకు వచ్చే వారు రహదారులపైనే వాహనాలు నిలిపేయడంతో ఇబ్బందికరంగా మారుతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో పరిస్థితి మరింత జటిలంగా తయారైంది. పాత జాతీయ రహదారిలోని షాపింగ్‌మాల్స్‌కు వచ్చేవారు డివైడర్ పక్కనే పార్కింగ్ చేస్తున్నారు.

గేటు పడితే అంతే సంగతి

ప్రధానంగా ఇందిరా, తెంబూరురోడ్డు కూడళ్లు పక్కపక్కనే ఉండటం, మధ్యలో ఉన్న రైల్వే గేటుతో రైళ్ల రాకపోకల సమయంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. పోలీసులు అందుబాటులో లేని సమయాల్లో పరిస్థితి చేదాటి పోతోంది.

పార్కింగ్ స్థలాలు కనుమరుగు

పట్టణంలో పదేళ్ల క్రితం పార్కింగ్ కోసం స్టేట్‌బ్యాంకు ఎదురుగా, పాతజాతీయ రహదారి పక్కన ఖాళీ స్థలాలను కేటాయించి, బోర్డులు ఏర్పాటు చేయించారు. క్రమేపీ అవన్నీ కనుమరుగయ్యాయి.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పట్టణంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. రైల్వేగేటు వద్ద రైళ్ల రాకపోకల సమయంలో సిబ్బందిని ఉంచుతున్నాం. షాపింగ్ మాళ్లు, హోటళ్లు, టీ, టిఫిన్ పార్లర్ల వద్ద వాహనాలు ఇబ్బందికర రీతిలో నిలపకుండా చూస్తాం. వైట్‌లైన్ మార్కింగ్ చేయిస్తాం. - **విజయ్‌కుమార్, సీఐ, టెక్కలి**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపించు. లేదా ఫోన్ ద్వారా వివరించొచ్చు. వాటిని బాధ్యతగా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: కొత్తపేట- కోటబొమ్మాళి రహదారిలో ప్రకాశ్‌నగర్ కాలనీ వద్ద నాలుగురోడ్ల కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి. - శ్రీనివాస్, కోటబొమ్మాళి

● సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. - పాలనాథ్, ఏఈఈ, ర.భ.శాఖ - న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

డీఆర్ డిపో పరిశీలన

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: బందపల్లిలో శిథిలమైన డీఆర్ డిపోను ఐటీడీఏ ఏఈ ఆదినారాయణ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పాతపట్నంలో ఎమ్మెల్యే గోవిందరావు, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భైరిసింగి దినకర్ అందించిన వినతి మేరకు ఐటీడీఏ అధికారులు స్పందించారు. కొత్త డిపో నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

అదే దారి.. అవే అవస్థలు..!

నందిగాం మండలం వేణుగోపాలపురం నుంచి సమీప కూడలి వరకు సుమారు 2 కి.మీ. బీటీ రోడ్డు నిర్మాణాన్ని 2023లో ప్రారంభించారు. కంకర వేసి పనులు ఆపేయడంతో రాళ్లు తేలి రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పీఐయూ శాఖ జేఈఈ సౌజన్య మాట్లాడుతూ.. నిధులు మంజూరైతే పనులు చేపడతామని స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, నందిగాం

నిధుల వ్యయం.. నెరవేరని లక్ష్యం

ఎల్‌ఎన్‌పేట మండలం దబ్బపాడు గ్రామంలో కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో రహదారిపై నుంచి మురుగు ప్రవహిస్తోంది. దోమల బెడద, దుర్వాసనతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో పైడి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. తక్షణమే పంచాయతీ అధికారులతో మాట్లాడి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

నీరు లేదు.. దాహం తీరదు

కొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులతో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మించారు. పనులు చేపట్టేందుకు ఒక్కో దానికి రూ.40 వేలు చొప్పున వెచ్చించారు. మండల వ్యాప్తంగా ఎక్కడా వీటిని ఉపయోగిస్తున్న దాఖలాలు లేవు. నిర్మించిన సమయం నుంచి నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఉపయోగించేలా చూస్తామని ఎంపీడీవో బీవీఆర్ ప్రసాదరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

వాలింది.. వణికిస్తోంది..!

నందిగాం మండలం మొంద్రాయివలస పంచాయతీ ఆకుల రఘునాథపురం, సుబ్బమ్మపేట గ్రామాల మధ్య విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ మార్గంలో రాకపోకలు చేసేవారు, సమీప పొలాలకు పనికి వచ్చే రైతులు భయాందోళన చెందుతున్నారు. సమస్యను విద్యుత్తు శాఖ జేఈఈ నేతాజీ దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందికి తెలియజేసి, స్తంభాన్ని సరిచేయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, నందిగాం

చెరువు.. నిర్వహణ కరవు

కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో వంశధార ప్రధాన కాలువను ఆనుకుని ఉన్న పాతకోనేరులో గుర్రపుడెక్క, పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, పంటలకు సాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. నీటిపారుదల అధికారులు స్పందించాలని విన్నవిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ అన్నారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

వైకాపా నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో ఏనాడైనా హిందూ సంప్రదాయాలకు విలువ ఇచ్చారా? అంటూ మాజీ సీఎం జగన్, ఆ పార్టీ నాయకులపై తెదేపా నేతలు ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కళింగ కోమట్ల కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, సహకార సంఘ సభ్యుడు రామ్‌కుమార్, నాయకులు మంగి రమణ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైకాపా నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నరసన్నపేటలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మారుతీ నగర్‌కు చెందిన మానసిక దివ్యాంగుడు ఎం.చందు తల్లి సుజాతతో ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి చేరుకున్నారు. సహాయకుడి సాయంతో పరీక్ష రాశారు.

విశిష్ట సంఖ్యతో మేలు

నందిగాం: విశిష్ట గుర్తింపు సంఖ్యతో అన్నదాతలకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు. నౌగాం, చిన్నలవునిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

సారవకోట, న్యూస్‌టుడే: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్పిరిట్యువల్ టాబ్లెట్స్ సీఈవో (విశాఖపట్నం) శ్రీదేవి పేర్కొన్నారు. అలుదు గ్రామంలోని రామాలయం ప్రాంగణంలో మంగళవారం స్థానికులు ఏర్పాటు చేసిన ధ్యాన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. విజయాంబికా యువజన సంఘం అధ్యక్షుడు చల్ల ఆనందరావు పాల్గొన్నారు.

శక్తి టీం సాయం తీసుకోండి

పోలాకి, న్యూస్‌టుడే: పిన్నింటిపేట గ్రామంలోని చాణిక్య పాఠశాలలో టెక్కలి డివిజన్ శక్తి పోలీస్ బృందం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. టీం లీడర్ రామారావు మాట్లాడుతూ.. అత్యవసరం అయితే శక్తి టీంను సంప్రదించాలని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ వైకుంఠరావు పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాల లోపాన్ని గుర్తించాలి

జలుమూరు, న్యూస్‌టుడే: భూమిలో సూక్ష్మ పోషకాల లోపాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజరు పి.తవిటినాయుడు తెలిపారు. బొడ్డపాడులో నక్క అప్పలనాయుడు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం మట్టి నమూనాలను సేకరించారు.

సేవలతోనే గుర్తింపు

పోలాకి: ఉపాధ్యాయులకు సేవలతోనే గుర్తింపు లభిస్తుందని బొద్దాం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతాడ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కాంతారావు, సూర్యారావు, అమ్మోరు, శ్రీనివాసరావును స్థానికుల సమక్షంలో మంగళవారం ఘనంగా సన్మానించారు.

కళాశాల రజతోత్సవానికి సహకారం

టెక్కలి, న్యూస్‌టుడే: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల రజతోత్సవ కార్యక్రమానికి 2006-10 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సహకారం అందించారు. రూ.1,80,673 చెక్కును కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ ఏఎస్ శ్రీనివాసరావుకు అందించారు. పూర్వ విద్యార్థులు పంచిరెడ్డి రమణ, సనపల ఉమామహేశ్వరరావు, నారాయణరావు, అధ్యాపకులు ఉన్నారు.

అధ్యాపక బృందానికి చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

దత్తాత్రేయ స్వామికి పూజలు

సారవకోట, న్యూస్‌టుడే: సత్రాం గ్రామంలో కొలువైన దత్తాత్రేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో వేలాడదీసిన అరటి గెలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అభయాంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: పట్టుపురం పంచాయతీ మణినాగేశ్వరపురం (కొండపేట)లో మంగళవారం అభయాంజనేయుని ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తిరువీధి, వినాయక పూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహిళలు అమ్మవారికి ముగ్రాటలు సమర్పించారు. అన్న సమారాధన జరిగింది.

వైద్య శిబిరానికి స్పందన

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్నం) వైద్యురాలు అరుణ పరీక్షలు చేశారు. పలువురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమట్ల కార్పొరేషన్ ఛైర్మన్ గోవిందరాజులు, ఆ సంస్థ జిల్లా ప్రతినిధులు అనాది గుప్తా, నాగేశ్వరరావు, కన్వీనర్ ఆనందరావు పాల్గొన్నారు.

బీమాతో కొండంత అండ

బాధిత కుటుంబానికి పింఛను మంజూరు పత్రాన్ని అందిస్తున్న బీమా సంస్థ ప్రతినిధులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: బీమాతో ఉద్యోగుల కుటుంబాలకు కొండంత అండ లభిస్తుందని ఈఎస్ఐసీ (ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ) ప్రతినిధులు తెలిపారు. మడపాంలో వంశధార పేపర్ మిల్లులో మంగళవారం ఈఎస్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన వంశధార పేపర్‌మిల్లుకు చెందిన ఉద్యోగి వాసుదేవరావు కుటుంబానికి నెలవారీ పింఛన్ మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ప్రజ్ఞ, బొడ్డేపల్లి రమేష్, శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

సత్ప్రవర్తన అలవర్చుకోండి

నరసన్నపేట, పాతపట్నం, న్యూస్‌టుడే: ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సూచించారు. నరసన్నపేట, పాతపట్నం ఉప కారాగారాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, ఖైదీలతో సమావేశమయ్యారు. వచ్చేనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఉచిత న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నరసన్నపేట: ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

రామకృష్ణాపురంలో బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

జలుమూరు, న్యూస్‌టుడే: అంధవరం పంచాయతీ రామకృష్ణాపురంలో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. ఘటనలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఎస్సీ కాలనీకి చెందిన వాడాన శాంతమ్మ, భోగమ్మ, మారెళ్ల లచ్చెమ్మకు చెందిన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఆర్ఐ జగదీశ్, వీఆర్వో సుజాత బాధితులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

చెత్త సేకరణ బండ్లు సిద్ధం

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలానికి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ కోసం 12 బండ్లు కేటాయించారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద వీటిని పంపిణీకి సిద్ధం చేసినట్లు ఎంపీడీవో బి.చిన్నమ్మడు తెలిపారు. కొమనాపల్లి, జోణంకి, సవిరిగాం, శ్రీముఖలింగం పంచాయతీలకు వీటిని అందిస్తామని పేర్కొన్నారు. ఒక్కొక్క బండికి నాలుగు బకెట్లు చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు.

CHANGE OF NAME

I, **ANDAVARAPU SANTOSHKUMAR** S/o ANDAVARAPU RAMARAO, Previously called as **ANDAVARAPU SANTHOSH KUMAR**, residing at 8-120, Vidyanagar, Pathapatnam village and Mandalam, Srikakulam District, I have changed my name from **ANDAVARAPU SANTHOSH KUMAR** (Old name) to **ANDAVARAPU SANTOSHKUMAR** (New name). Henceforth i will be called as **ANDAVARAPU SANTOSHKUMAR** for all purposes.

స్వయం సమృద్ధి.. అతివల ఆర్థికాభివృద్ధి

స్త్రీశక్తి పథకం ద్వారా అందుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో అతివలపై కథనం. – న్యూస్‌టుడే, పాతపట్నం

ఇంటి వద్దనే ఉపాధి

త్రినాథ స్వయం శక్తి సంఘంలో చేరి, గ్రామైక్య సంఘం ద్వారా రూ.లక్ష రుణం తీసుకుని, టైలరింగ్ యూనిట్ నిర్వహిస్తున్నారు. ఇంటి వద్దనే ఉంటూ పని చేస్తున్నాను. - **బి.మాధురి, తెంబూరు, పాతపట్నం**

వ్యాపారాన్ని మరింత విస్తరిస్తా

మణికంఠ స్వయం శక్తి సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. స్త్రీనిధి రుణం రూ.1.5 లక్షలు తీసుకుని గ్రామంలోనే బట్టల దుకాణం ఏర్పాటు చేశాను. వ్యాపారాన్ని మరింత విస్తరిస్తాను. - **గుణలక్ష్మి, పెద్దకోట, ఎల్‌ఎన్‌పేట**

ఇబ్బందులు తీరాయి

మంజునాథ స్వయం శక్తి సంఘంలో చేరాను. గ్రామైక్య సంఘం ద్వారా రూ.లక్ష రుణం తీసుకున్నాను. ఇంటి వద్దనే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాను. ఆర్థిక ఇబ్బందులు తీరాయి. - **ఎ.సునీత, తెంబూరు, పాతపట్నం**

కుటుంబానికి ఆసరా

శ్రీదుర్గా స్వయం శక్తి సంఘం సభ్యురాలిగా ఉన్నాను. స్త్రీనిధి ద్వారా రూ.లక్ష రుణం తీసుకుని పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ ప్రారంభించాను. వాయిదాలు సకాలంలో చెల్లిస్తున్నాను. నెలకు రూ.15 వేల వరకు ఆదాయం వస్తోంది. కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాను. - **సీహెచ్.మనోజి, అడవి కొత్తూరు, కొత్తూరు**

ప్రోత్సాహం అందిస్తున్నాం: స్వయంశక్తి సంఘాల సభ్యులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రోత్సాహం అందిస్తున్నాం. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చిరు వ్యాపారాలు చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు స్వయం ఉపాధితో అభివృద్ధి బాటలో పయనిస్తున్నారు. - **ఎస్.రవిరాజ్, ఏపీఎం, పాతపట్నం**

సెస్సు బకాయిలు రూ.3 కోట్లు

సారవకోట, న్యూస్‌టుడే: సెస్సుల రూపంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.3 కోట్లు బకాయిలు ఉన్నట్లు సంబంధిత శాఖ కార్యదర్శి వి.వి.శంకరరావు పేర్కొన్నారు. సారవకోట శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, 104 మంది ఉద్యోగులకు గాను 34 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. గ్రంథ పాలకుడు జె.నాగేశ్వరరావు ఉన్నారు.

నిబంధనలు పాటించండి

హిరమండలం, న్యూస్‌టుడే: మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించాలని కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్‌మణీశ్వరి ఆదేశించారు. మండలంలోని మద్యం దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు.

ఆదర్శమూర్తికి అశ్రుతాంజలి

మంచితనానికి, ఆప్యాయతానురాగాలకు మారుపేరుగా నిలిచి, ఉపాధ్యాయునిగా ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్ది, ఎల్లవేళలా అందరిని చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ... కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమిస్తూ... మాకు దశ, దిశ, మార్గనిర్దేశకులై ముందుకు నడిపిస్తూ... మాకు సమాజంలో గౌరవస్థానం కల్పించి, అందరి మనస్సులలో "ఆదర్శ మాస్టారు"గా... మా అందరి హృదయాలలో "స్టార్"గా చెరగని ముద్రవేసిన మీరు మానుండి భౌతికంగా దూరమై ఆ పరమశివునికి ప్రీతికరమైన మహాశివరాత్రి పర్వదినం నాడు శివైక్యం చెందిన మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ...

శోకతప్త హృదయాలతో...

సదా మీ జ్ఞాపకాలతో... మీరు నడిచిన బాటలో పయనిస్తూ... ఎన్నటికీ మిమ్మల్ని మరువలేని మీ కుటుంబ సభ్యులు

కీ॥శే॥ శ్రీ గుర్రం అప్పారావు (మాస్టారు) గారు

రిటైర్డ్ LFL HM, కొత్తపోలవలస, నరసన్నపేట మండలం, శ్రీకాకుళం

జననం: 01-07-1944 మరణం: 15-02-2026

భార్య: గుర్రం కృష్ణవేణి

కుమారులు - కోడళ్ళు: డా॥ గుర్రం నవీన్‌కుమార్ - సౌజన్య, గుర్రం ఆనంద్‌కుమార్ - కావ్య

కుమార్తె - అల్లుడు: రొతు సుధారాణి - అంజలప్పన్న

వదిన: గోశెట్టి లక్ష్మీదేవి W/o రామయ్య (లేటు)

బావమరిది: మట్టా జగ్గారావు - సత్యబాల

తోడల్లుళ్ళు: పిన్నింటి ఫల్గుణరావు - ప్రమీల, సాత్రబోయిన నాగరాజు - భారతి, దూసి అప్పారావు - అనసూయ

మనుమరాళ్ళు: స్వాతి, నిరీష, వెన్నెలరాణి, ప్రసూన, జ్యోత్స్న మనుమడు: ఇషాన్

పిల్లలు: ప్రసాద్, చంద్రమౌళి, సతీష్, మధు, సుధీర్, సంగీత, జితేంద్ర, రాఘవేంద్ర, త్రివేణి, రమ్య, ప్రత్యూష, ఊహ, కిషోర్, తనూజ, వేద కుమార్, బుజ్జి, రాము మరియు ఇతర కుటుంబ సభ్యులు

పెద్దకర్మ: తేది. 25-02-2026 బుధవారం ఉదయం 11 గం॥ల నుండి

నరసన్నపేట మండలం, ముషిడిగట్టు పంచాయతీ, రఘురాంపురం (ఉప్పరపేట) గ్రామంలో మా స్వగృహము నందు జరుపబడును. సెల్: 80084 70667

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

బాధితురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

నీటి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

పారిశుద్ధ్య పనులు.. నీటి నమూనాల సేకరణ

నగరంలో అతిసారం విజృంభణ కలకలం రేపింది. అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం దమ్మల వీధి, గోల్కొండ రేవు, కాకి వీధి, మంగువారితోట పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎప్పటికప్పుడు సమస్య పర్యవేక్షించి అతిసారం అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు నగరపాలక సిబ్బంది నీటి నమూనాలు సేకరించి పరీక్షకు పంపించారు. బాధితులను ప్రజాప్రతినిధులు పరామర్శించి జాగ్రత్తలు చెబుతున్నారు. –న్యూస్‌టుడే, బృందం

పర్యవేక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో) ✧ టమాటాలు 10 ✧ వంకాయలు 26/34 ✧ బెండ 40 ✧ పచ్చిమిర్చి 64 ✧ కాకర 40 ✧ బీర 44 ✧ కాలీఫ్లవర్ 15/20 ✧ క్యాబేజీ బుట్ట 20 ✧ క్యారెట్ 34 ✧ దొండ 28 ✧ బంగాళదుంపలు 16 ✧ ఉల్లిపాయలు 20/24 ✧ గోరుచిక్కుడు 40 ✧ ఆనప 16 ✧ అరటికాయ(జత) 16 ✧ గోల్కొండ చిక్కుడు 24 ✧ అల్లం 80 ✧ వెల్లుల్లి 120 ✧ బీట్రూట్ 30 ✧ క్యాప్సికమ్ 70 ✧ కీరదోస 46 ✧ పప్పుదోస 26 ✧ బరానీ 40 ✧ ముల్లంగి 20 – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు తదితరులు

అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావులు డిమాండు చేశారు. శ్రీకాకుళం నగరంలో ఎచ్చెర్ల వీధి, కాకి వీధి, బోడెమ్మ కోవెల, గోల్కొండరేవు రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం వారు పర్యటించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతిసారం బారిన పడిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. రక్షిత నీరు సరఫరా చేయాలని.. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, ఆర్.ప్రకాశరావు, ఎల్.రామప్పడు, ఎం.రమణ, తవిటయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంతింతై.. ఇంటికి వెలుగై..!

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం, ఎచ్చెర్ల

ప్రభుత్వం మహిళలకు ఆర్థిక జవసత్వాలు చేకూరేలా చేయూతనందిస్తోంది. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందిస్తూ.. కుటీర పరిశ్రమలు, దుకాణాలు, ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు సాయం చేస్తోంది.

★ ఆమదాలవలస పురపరిధిలోని ప్రతి వార్డు నుంచి ఓ మహిళా సంఘానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. వారి ఆలోచన, అందించే రుణం, అప్పు, పొదుపు వంటి విషయాలు నమోదు చేసుకుంటారు. అనుమానాలను నివృత్తి చేస్తారు. ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి, ఇతర కార్యక్రమాలపై అవగాహన కలిగిస్తారు. మహిళల ఆసక్తి గమనించి రూ.లక్ష నుంచి ఐదు లక్షల వరకు రుణం అందిస్తారు.

● రుణాలు పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ రాణిస్తున్నారు. టీ దుకాణం, కిరాణా, పాల వ్యాపారం, తినుబండారాల తయారీ, కాగితపు ప్లేట్ల పరిశ్రమ, మిశ్రమ పంటలు, జొన్న, రాగుల సాగు, చెప్పుల దుకాణం, మిఠాయిల తయారీ వంటి వ్యాపారాలు చేస్తూ విజయ పథంలో దూసుకెళ్తున్నారు.

తినుబండారాలను తయారుచేస్తున్న స్వాతి

‘ప్రతి నెల పిల్లలు ఫీజులు, ఇంటి ఖర్చులు భారంగా ఉండేది. నేను స్వయం శక్తి సంఘంలో సభ్యురాలిగా ఉండి రుణం పొందాను. ఇంట్లోనే తినుబండారాలు తయారీ ప్రారంభించాను. చుప్పులు, అరిసెలు విక్రయిస్తున్నాను. ప్రస్తుతం వ్యాపారం బాగుంది. కుటుంబానికి ఆసరాగా నిలిచాను’. అని ఆమదాలవలసకు చెందిన స్వాతి చెప్పారు.

‘మహిళలను ఆర్థికంగా బలోపేతం కావడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. చేయాలనుకున్న వ్యాపారాలపై అవగాహన కల్పిస్తున్నాం. పుర పరిధిలో ఉన్న మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి పొందుతూ ఆనందంగా ఉంటున్నారు.’ అని పురపాలిక సంఘం ఉన్నతాధికారి ఎస్.వి.రత్నం తెలిపారు.

★ పుర పరిధిలో స్వయంశక్తి సంఘాలు: 741 ★ స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు: 3000

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో ‘ఈనాడు’ మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: శ్రీకాకుళం పాలకొండ ప్రధాన రహదారి పైవంతెన కింద ఉదయం, సాయంత్రం బస్సుకోసం వేచి చూస్తున్న విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తున్నారు. –రేష్మ, స్థానికురాలు

సమాధానం: నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాం. – బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

రోడ్లు వేయండి.. కాలువలు నిర్మించండి

ఆమదాలవలస మండలం రామచంద్రాపురం గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని గ్రామస్థులు విన్నవించుకుంటున్నారు. ఇళ్లలో వాడుక నీరు రోడ్లపైకి చేరి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరు అయినా వెంటనే నిర్మిస్తామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు. –న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

వాలింది.. వణికిస్తోంది

ఎచ్చెర్ల మండల కేంద్రంలోని స్థానికంగా ఉన్న చెరువు గట్టుపై వేసిన విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగిపోయింది. నేలలో కూలిపోయే స్థితిలో దర్శనమిస్తోంది. విద్యుత్తు అధికారులు స్పందించి సరిచేయాలని స్థానికులు తెలిపారు. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని విద్యుత్తుశాఖ ఏఈ హరికృష్ణ హామీ ఇచ్చారు. –న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

పూర్తి చేస్తే.. ప్రయోజనం

పొందూరు పట్టణం నెహ్రూ పార్కు ఆవరణలో వైకాపా ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రారంభించిన తాగునీటి ట్యాంకు అసంపూర్తిగా మిగిలిపోయింది. కూటమి హయాంలో పనులు పూర్తి చేస్తే ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు కోరారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. –న్యూస్‌టుడే, పొందూరు

రోడ్డుపైనే తిండి.. నిద్ర

ఆమదాలవలస పట్టణ ప్రధాన రహదారిలో పదుల సంఖ్యలో ఆవులు సంచరిస్తుండంతో ప్రయాణికులు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కూరగాయల వ్యర్థాలను రహదారిపై పడేస్తుండటంతో వాటిని తినేందుకు అలవాటు పడి అక్కడే ఉంటున్నాయి. చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పశువుల యజమానులకు హెచ్చరించామని మరో సారి చెబుతామని మున్సిపల్ కమిషనర్ టి.రవి, అన్నారు. –ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే

శిథిలం.. కూలుతుందని భయం

పొందూరు మండలం బురిడి కంచరాం గ్రామంలోని నివాసాల నడుమ తాగునీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. కూలక ముందే అధికారులు కూల్చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాయుడు మాట్లాడుతూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

❖ సరస్వతి: వంకీ ❖ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): మన శంకరవరప్రసాద్ గారు ❖ సన్‌మ్యాక్స్: హే బలివంత్ ❖ మారుతి: బూకీ ❖ కిన్నెర: వితిఅవ్ ❖ కీర్తన: ఆల్ఫా ❖ కోర్కె: నవాబ్ కేఫ్ ❖ సూర్య: కుఫ్లల్ డెవిల్ – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

నేడు అవతార్ మెహర్‌బాబా జయంతి

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి పెద్దరెల్లి వీధిలో బుధవారం అవతార్ మెహర్‌బాబా జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెహర్‌బాబా చిత్రపటానికి 132 కొవ్వొత్తులతో అర్చన అనంతరం కేకు కోస్తారని పేర్కొన్నారు. సప్తవర్ణ పతాకావిష్కరణ, ప్రేమికుల సత్సంగం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా ఎల్లమ్మ సిరుల మహోత్సవాలు



కెల్ల వీధి ఆలయంలో పూజలందుకున్న ఎల్లమ్మ తల్లి

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఎల్లమ్మ సిరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కెల్ల వీధి ఎల్లమ్మ ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. గుడి వీధి, రెడ్డిక వీధిలో ఉత్సవాలు జరిగాయి. రెడ్డిక వీధిలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. ఈ నెల 26 వరకు ఉత్సవాలు జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

26 నుంచి నీలమణి దుర్గ ఆలయ ప్రారంభోత్సవాలు: శ్రీకాకుళం నగర పరిధి విశాఖ ఏ కాలనీలోని నీలమణి దుర్గ ఆలయ ప్రారంభోత్సవాలు ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నారు. 28 వరకు కొనసాగుతాయని సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ కరుణించు

జాతరలో పాల్గొన్న పలు గ్రామాల ప్రజలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో రేణుక ఎల్లమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని తిరువీధి నిర్వహించి అమ్మవారి గుడిలో ఉన్న పుట్ట వద్ద బారులు తీరారు. కుటుంబ సమేతంగా మొక్కులు తీర్చుకున్నారు. సరుబుజ్జిలి, నరసన్నపేట, జలుమూరు, సారవకోట ఇతర మండలాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కనులపండువగా అసిరితల్లి ఉత్సవం

గార మండలం నిజామాబాద్‌లో మంగళవారం గ్రామదేవత అసిరి తల్లి అమ్మవారి ఘటాల ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. మహిళలు ఘటాలతో ప్రదర్శనగా వెళ్లారు. తొలుత గ్రామ పొలిమేరలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అసిరితల్లి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. – న్యూస్‌టుడే, గార (నిజామాబాద్)

మద్యం దుకాణంలో చోరీ

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండల కేంద్రం సమీపంలోని చీపురుపల్లి వెళ్లే రహదారిలోని ఆర్.ఆర్. మద్యం దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

సీసీ టీవీ దృశ్యాలను పరిశీలిస్తున్న ఎస్సై కె.అప్పల సూరి

ఎస్సై కె.అప్పలసూరి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుకాణంలో నగదు, మద్యం సీసాలు, అంతర్జాల పరికరాలు కలుపుకొని సుమారు రూ.లక్ష వరకు చోరీ జరిగిందని యజమాని తెలిపారు. ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

సీసాలు ధ్వంసం

ఆబ్కారీ సిబ్బంది 2022 నుంచి 2026 వరకు పట్టుకున్న మద్యం సీసాలను మంగళవారం శ్రీకాకుళం ఆబ్కారీ డీఎస్పీ పి.రామచంద్రకుమార్ సమక్షంలో ధ్వంసం చేశారు. సరకు విలువ రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

క్రమశిక్షణతోనే ఉన్నతి

డీఎస్పీలుగా ఎంపికైన సుందరరావు, రాజేశ్వరరావులకు జ్ఞాపికలు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం శాస్త్రులపేటలోని ఎంజేపీ బీసీ సంక్షేమ బాలుర పాఠశాలలో సోమవారం వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల డీఎస్పీలుగా ఎంపికైన పైల సుందరరావు, నూక రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అతిథులను పాఠశాల సిబ్బంది సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపల్ జయశ్రీ, ఎస్ఎంసీ ఛైర్మన్ పినిమింటి యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచండి

ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు

రణస్థలం, న్యూస్‌టుడే: వేతనాలు పెంచాలని మంగళవారం రణస్థలంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో అతిసార ప్రభావిత ప్రాంతాలైన దమ్మల వీధి, గోల్కొండ రేవు, మంగువారితోట, కంద్ర వీధి, కాకి వీధిలో మంగళవారం మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి పర్యటించారు. బాధితులను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలపై నగరపాలక సంస్థ అధికారులను సంప్రదించి ఆరా తీశారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పర్యవేక్షణలో లోపాలతోనే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. వెంటనే సహాయ చర్యలు చేపట్టాలని కోరారు.

అధికారులతో మాట్లాడుతున్న పురపాలక మాజీ అధ్యక్షురాలు పద్మావతి

వైకాపా నాయకుల పర్యటన..

అతిసార ప్రభావిత ప్రాంతాల్లో వైకాపా నాయకుడు ధర్మాన రామమనోహరనాయుడు పర్యటించారు. బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నగరపాలక సంస్థ యంత్రాంగం, జిల్లా అధికారులు తగిన శ్రద్ధ చూపాలని.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారికి చిట్టి చేతుల సాయం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం మలకాం పాఠశాల విద్యార్థులు పెద్ద మనసు చాటుకున్నారు. పునర్విక అనే బాలిక స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (వెన్ను కండర క్షీణత) బారిన పడటంతో ఆమె చికిత్స నిమిత్తం తమ వంతుగా రూ.8,000 అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.

బాధితుడికి చేయూత

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలంలోపెంట గ్రామానికి చెందిన ముసలయ్య అగ్ని ప్రమాదంలో చిక్కుకున్నారు. మంగళవారం వైకాపా రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి కంది సురేంద్రనాథ్ బాధితుడిని పరామర్శించి, చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలంలోని ఆదర్శ పాఠశాల 6వ తరగతిలోని ప్రవేశాలకు విద్యావిభాగం ప్రకటన విడుదల చేసిందని ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుందని మార్చి 30వ తేదీలోగా వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పథకాలు తెలుసుకోండి..!

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ గ్రామంలో మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి హాజరయ్యారు. రబీ సాగులో పండించే పంటల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం కర్షకులకు అందించే పథకాలు, ప్రయోజనాలు తెలియజెప్పారు. గతంలో బూర్జ మండలంలో చెరకు ఎక్కువగా సాగు చేసేవారని ప్రస్తుతం విస్తీర్ణం తగ్గిందన్నారు. కారణాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అన్నదాతలు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

విద్యార్థుల్లో మానసిక సామర్థ్యం పెంపొందించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: విద్యార్థుల్లో మానసిక సామర్థ్యం పెంపొందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆదిత్య బిర్లా ట్రస్టు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా మెంటల్ అవేర్నెస్ ఫర్ యూత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగినప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. సైకాలజిస్టు డి.సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సూర్యచంద్రరావు

ప్రతి అంశంపై అవగాహన అవసరం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులు ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని కొత్తకోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, ముకుందరావు అన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులతో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. తపాలా కార్యాలయం, బ్యాంకు, పశువైద్యశాల, ఆయుర్వేద ఆసుపత్రి చూపించారు.

నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన అప్పలసూర్యనారాయణ

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ మృతికి సంతాపం తెలుపుతూ సభాపతి అయ్యన్నపాత్రుడు తీర్మానం ప్రవేశపెట్టారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన భర్తను స్మరించుకుంటూ సంతాప తీర్మానం పెట్టిన సభాపతి, సభ్యులకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా జీవితంలో నీతి, నిజాయతీలే ముఖ్యమని..నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడి అందరి అభిమానాన్ని చూరగొన్నారని వెల్లడించారు.

సిగ్నల్ పాయింట్ల వద్ద యాచన వద్దు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రద్దీ ప్రాంతాలు, సిగ్నల్ పాయింట్ల వద్ద యాచన కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. ఆయా ప్రదేశాల్లో యాచన చేయొద్దని ట్రాఫిక్ సీఐ వి.రామారావు సూచించారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద మంగళవారం హిజ్రాలు, యాచకులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా నిలుస్తుండటంతో సిగ్నల్ కనిపించడం లేదన్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. బాధ్యతయుతంగా మెలగాలని, పునరావృతమైతే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా ప్రాంతాల్లో యాచన మానుకోవాలని సూచించారు.

అక్షర వికాసం.. ఆలోచన ఘనం

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం, పొందూరు, రణస్థలం

❖ గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యత ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి అడ్డు కట్ట వేస్తోంది. ఈ అంశంపై ఆలోచన చేసిన కూటమి ప్రభుత్వం మహిళలను విద్యావంతులుగా మార్చే బాధ్యత తీసుకుంది. ‘అక్షరాంధ్ర’ పేరిట వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ (వెలుగు)సహకారంతో చదువు చెబుతోంది.

❖ గతేడాది సెప్టెంబరులో తరగతులు ప్రారంభించగా ఇప్పుడిప్పుడే మహిళలు చదవడం, రాయడం, లెక్కించడం వంటి అంశాలపై పురోగతి కనిపిస్తోంది. గ్రామాల్లోని సహాయ సంఘాలు, వీవోఏలు పర్యవేక్షిస్తున్నారు.

❖ పది మంది మహిళలకు ఒక వాలంటీరు 100 గంటల పాటు తరగతులు నిర్వహిస్తారు. అక్షరాంధ్ర పేరుతో పాఠ్యపుస్తకాలను అందజేశారు. బొమ్మలతో కూడిన చిత్రాలు ప్రచురించి అర్థమయ్యే రీతిలో అక్షర జ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఈ నెల 28న ముందస్తు పరీక్ష (ప్రీఫైనల్) నిర్వహించనున్నారు

షళంత్రిలో అభ్యర్థులకు పాఠాలు బోధిస్తున్న వాలంటీరు శిరీష

నియోజకవర్గంలో తరగతులకు హాజరవుతున్న మహిళల వివరాలు

మండలం	వాలంటీర్లు	అభ్యర్థులు
సరుబుజ్జిలి	169	1690
ఆమదాలవలస	123	1235
పొందూరు	286	2860
బూర్జ	259	2575

చదువు రాక లెక్కలు చేయడం ఇబ్బందిగా ఉండేది. అక్షరాంధ్రతో చదువు నేర్చుకుని అంకెలు గుర్తుపట్టి స్వయం సహాయక సంఘంలోని నేను వాడుకున్న లింకేజీ అప్పు ఇతర వివరాలు తెలుసుకుంటున్నా’. అని కోవిలాపు ఈశ్వరమ్మ తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యం. మహిళలు చక్కగా నేర్చుకుంటున్నారు. అక్షరాంధ్రతో అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నాం.’ అని నాలుగు మండలాల ఏపీఎంలు గోవిందరాజులు, నారాయణరావు, రమణమూర్తి, బాబూరావులు తెలిపారు.

సిల్వర్ జూబ్లీ శుభాకాంక్షలు

తిరుమల మెడికల్స్

గణేష్ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు, పోలీసుస్టేషన్ దగ్గర రణస్థలం, సెల్: 9000935861

★ గత 25 సం॥లుగా మీ అందరి ఆదరాభిమానాలు పొందుతున్న "తిరుమల మెడికల్స్" ప్రారంభించి నేటికి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మా ప్రియమైన ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున మా వార్షికోత్సవ శుభాకాంక్షలు

మా 2వ బ్రాంచ్ అడ్రస్: రాజాం రోడ్డు, పాత పోలీసుస్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్డు, రణస్థలం, సెల్: 6309705861

ప్రొ॥ తమ్మినేని శ్రీనివాసరావు
సెల్: 9441320122

(c) eenadu

కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మాసి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం ఉదయం బంగారు సూర్య ప్రభ వాహనంపై లక్ష్మి, సరస్వతి సమేతంగా ఊరేగుతున్న కామాక్షమ్మ - **న్యూస్‌టుడే, కాంచీపురం**

కలెక్టర్లు సహా 8 మంది ఐఏఎస్‌ల బదిలీ

చెన్నై, న్యూస్‌టుడే: ఇద్దరు కలెక్టర్లు సహా 8 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక, గణాంకాలశాఖ కమిషనరు ఆర్.జయ ప్రత్యేక ప్రయత్నాలశాఖ అదనపు కార్యదర్శిగా, కాంచీపురం కలెక్టరు కలైసెల్వి మోహన్ ఆర్థిక, గణాంకాల శాఖ సంచాలకులుగా, చెంగల్పట్టు కలెక్టరు స్నేహ కాంచీపురం కలెక్టరుగా, చెంగల్పట్టు సబ్ కలెక్టరు మాలతి హెలెన్ చెంగల్పట్టు కలెక్టరుగా, తిరువళ్లూర్ సబ్ కలెక్టరు రవికుమార్ కరూర్ కలెక్టరుగా, కేంద్ర ప్రభుత్వ సర్వీస్ నుంచి వెనక్కు వచ్చిన చంద్రశేఖర్ శాఖమూరి సీఎండీఏ సీఈవోగా, షణ్ముగ సుందరం తమిళనాడు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శిగా, పొన్నయ్య ఈరోడు వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనరుగా నియమితులయ్యారు.

మందుల ఖర్చు మితిమీరకుండా..

☛ ధరలను 30శాతం తగ్గిస్తున్న ప్రభుత్వం ☛ ప్రత్యేకంగా ప్రస్తావించిన లాన్సెట్ జర్నల్

జబ్బులొస్తే సాధారణ కుటుంబాలు హడలెత్తే పరిస్థితి వస్తుంది. అదే క్యాన్సర్ సోకితే ఆ కుటుంబానికి అప్పుల గతి అన్నట్లుగా దేశంలోని చాలా కుటుంబాలు ఉదాహరణగా ఉన్నాయని పరిశోధకులు అంటున్నారు. ఔషధాల ధరలను తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభావవంతమైన పాలసీలు తీసుకొస్తే, వారికి అండగా ఉండాల్సిన పరిస్థితుల్ని ప్రభుత్వాలు కల్పించాలని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కోణంలో మెరుగైన విధానాలు తమిళనాడు ఓ నమూనాగా ఉందని 'ది లాన్సెట్ రీజనల్ హెల్త్.. సౌత్‌ఈస్ట్ ఆసియా' జర్నల్ తెలిపింది. **- ఈనాడు-చెన్నై**

పెద్ద మొత్తంలో కొనుగోలు

దేశంలోనే మందుల కొనుగోళ్లలో తమిళనాడు కేంద్రీయ ఔషధాల కొనుగోలు వ్యవస్థ ప్రభావవంతంగా ఉన్నట్లు పరిశోధకులు మైలిక్ బోళ్, ఓషియా గార్డ్ తెలిపారు. ఔషధాల కొనుగోలులో వ్యూహాలు, క్యాన్సర్ ఔషధాల ధరల్ని ప్రభుత్వ అందుబాటులో ఉంచేలా దేశంలో ఉన్న పరిస్థితులపై వీరు అధ్యయనం చేశారు. తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ (టీఎన్‌ఎంఎస్‌సీ) విభాగం రూపొందించిన ఔషధ బల్క్ కొనుగోళ్ల విధానం, కేంద్రీయ టెండర్ల ప్రక్రియ, సరఫరా వినూత్నంగా ఉందని పరిశోధకులు కొనియాడారు. ఫలితంగా క్యాన్సర్ ఔషధాల ధరల్ని 30శాతం తగ్గించేలా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రులు అవసరమైన మందుల్ని సకాలంలో సరఫరా చేయగలుగుతున్నారని వివరించారు. ఇది రోగులకు, ప్రత్యేకంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉపశమనంగా ఉంటున్నాయని.

60శాతం వ్యయం వాటికే..

పరిశోధకులు చెప్పే వివరాల ప్రకారం.. క్యాన్సర్ రోగులకు అయ్యే మొత్తం ఖర్చులో కేవలం ఔషధాలకే ఏకంగా 60శాతం వ్యయాన్ని కేటాయించాల్సి వస్తోంది. జబ్బుతో కుటుంబాలు కుదేలవడానికి ఇదే ప్రధాన కారణం. దేశంలోని చాలా కుటుంబాలు నెలకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వెచ్చించాల్సి వస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ సరఫరా కాదని, ప్రైవేటుగా మందులు కొనే పరిస్థితి రోగుల కుటుంబాలకుందని చెప్పారు. క్యాన్సర్ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మందుల వినియోగం తీరు ప్రభావాన్ని విస్తరించాల్సిన అవసరముందని వారు సూచించారు. దీనిపై దేశంలోని మిగిలిన రాష్ట్రాలూ అప్రమత్తమవ్వాల్సి ఉందన్నారు.

ఇదే బాటలో మరికొన్ని రాష్ట్రాలు

ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఔషధ కొనుగోళ్ల విధానాలు చూస్తే.. సేకరణ ప్రక్రియ సరిగా లేకపోవడం, ప్రత్యేకించి క్యాన్సర్ మందుల ధరల్ని తగ్గించి కొనుగోలు చేసేలా విధానాల్ని ఏర్పాటు చేసుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పరిశోధకులు వివరించారు. నాణ్యత విషయంలోనూ తమిళనాడు రాజీ పడటంలేదని ఉదాహరణగా పేర్కొన్నారు. క్యాన్సర్ ప్రభావిత రాష్ట్రాలకు తమిళనాడు మోడల్ బాగా సరిపోతుందని వారన్నారు. ఇక్కడొచ్చే ఫలితాలు చూసి.. కేరళ, రాజస్థాన్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, అసోంతో పాటు దిల్లీలో కూడా ఈ విధానాన్ని అందిపుచ్చుకున్నారని వివరించారు.

శ్రీలంక తమిళుల కోసం మా గళం ధ్వనిస్తూనే ఉంటుంది

☛ ముఖ్యమంత్రి స్టాలిన్

శ్రీలంక తమిళులతో ముచ్చటిస్తున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: శ్రీలంక తమిళులకు భారత పౌరసత్వం కల్పించేవరకు వారి కోసం తమ గళం ధ్వనిస్తూనే ఉంటుందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. కన్నియాకుమరి జిల్లా పెరుమాళ్‌పురంలోని శ్రీలంక తమిళుల పునరావాస శిబిరంలో కొత్తగా నిర్మించిన 90 ఇళ్లను మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించిన సందర్భంగా తన 'ఎక్స్‌'లో... శ్రీలంక తమిళ బంధాల కోసం శాశ్వత నివాసాలను అందించామని, శాశ్వత పౌరసత్వం కల్పించడానికి పోరాడుతామని పిలుపునిచ్చారు. శ్రీలంక తమిళుల నివాసాలు, వారి పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి 3 విద్యా సంవత్సరాల్లో 5,771 మంది విద్యార్థులకు రూ.11.07 కోట్ల ఉపకార వేతనాలు, స్వయం సహాయక బృందాలకు ఆర్థిక సాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటివి అందించి వారి జీవనాధారాన్ని ద్రావిడ మోడల్ ప్రభుత్వం పరిరక్షిస్తోందని తెలిపారు. దీర్ఘకాలంగా భారతదేశంలో నివసిస్తున్న శ్రీలంక తమిళులకు న్యాయంగా లభించాల్సిన పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం త్వరగా అందిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అప్పటివరకు వారి కోసం తమ గళం ధ్వనిస్తూనే ఉంటుందన్నారు.

90 గృహాలు ప్రారంభం

పారిస్: కన్నియాకుమరి జిల్లా పెరుమాళ్‌పురంలోని శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రంలో రూ.7.85 కోట్ల వ్యయంతో అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మించిన 90 గృహాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సభాపతి అప్పావు, మంత్రి మనో తంగరాజ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా కన్నియాకుమరి పాత బస్టాండు రౌండ్ రాణా వద్ద నిర్మించిన తిరువళ్లువర్ విగ్రహం సిల్వర్ జూబ్లీ ఆర్చ్‌ను ప్రారంభించారు.

నల్లకన్ను ఆరోగ్య పరిస్థితి విషమం

☛ కృత్రిమ శ్వాస అందిస్తున్న వైద్యులు

చెన్నై, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ సీనియర్ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు నల్లకన్ను ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో ఆయన్ను ఐసీయూకు మార్చి కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. డిసెంబరు 26న 101వ పుట్టినరోజు వేడుక జరుపుకున్న నల్లకన్ను రక్తపోటు, మూత్రపిండాల సమస్య, ఆహారం మింగలేకపోవడం తదితర సమస్యలతో చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 2 నెలలుగా చికిత్స పొందిస్తున్నారు. సోమవారం రాత్రి ఆయన ఆరోగ్య పరిస్థితి అకస్మాత్తుగా క్షీణించడంతో ఐసీయూకు మార్చి కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి స్టాలిన్, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, సీపీఐ అధ్యక్షుడు వీరపాండియన్, మాజీ అధ్యక్షుడు ముత్తరసన్ తదితర పలువురు నేతలు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ద్రావిడర్ కళగం అధ్యక్షుడు కె.వీరమణి, సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, ఆ పార్టీ

నల్లకన్ను వద్ద తిరుమావళవన్

సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ, ఎండీఎంకే ప్రధానకార్యదర్శి వైగో తదితరులు ఆస్పత్రికి చేరుకుని నల్లకన్ను కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన్ను 24 గంటల పర్యవేక్షణలో ఉంచినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

వైద్యుడితో మాట్లాడుతున్న స్టాలిన్

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నారాయణ

ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు

☛ అన్నాడీఎంకే మూడో విడత మేనిఫెస్టో విడుదల

మేనిఫెస్టో విడుదల చేసి విలేకర్లతో మాట్లాడుతున్న పళనిసామి

సైదాపేట, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా అన్నాడీఎంకే మూడో విడత ఎన్నికల మేనిఫెస్టోను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి మంగళవారం విడుదల చేశారు. దీని గురించి ఈపీఎస్ మాట్లాడుతూ.. ప్రస్తుత డీఎంకే పాలనలో నిత్యావసరాల ధరలు, వివిధ పన్నులు, ఛార్జీల పెరుగుదలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కుటుంబానికి రూ.10,000 అందజేస్తామని తెలిపారు. అలాగే మేనిఫెస్టోలోని అంశాలను చూస్తే.. ఉపాధి కల్పన కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న నిరుద్యోగులకు నెలకు రూ.2 వేలు, ప్లస్‌టూ చదివిన వారికి నెలకు రూ.1,000, చేపల వేట నిషేధ కాలంలో జాలర్లకు ప్రస్తుతం అందించే సహాయం మొత్తం రూ.8 వేల నుంచి రూ.12 వేలకు పెంపు, ఏటా పొంగల్‌కు కానుకతో పాటు, రూ.1000 నగదు, చేనేత కార్మికులకు ఇచ్చే ఉచిత విద్యుత్ 300 యూనిట్ల నుంచి 450 యూనిట్లకు పెంపు, పవర్‌లూమ్ కార్మికులకు అందించే విద్యుత్ 1000 యూనిట్ల నుంచి 1400 యూనిట్లకు పెంపు, నగర ప్రాంతాల్లో వీధి వ్యాపారులు సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాల రద్దు మొదలగు హామీలు చోటుచేసుకున్నాయి. ఈ హామీలన్నీ ఆదాయాన్ని పెంచడం ద్వారా పూర్తిగా అమలు చేస్తామని ఎడప్పాడి పళనిసామి తెలిపారు.

భాజపాకు ఏఐటీఎఫ్ మద్దతు

నయినార్ నాగేంద్రన్‌కు మద్దతు పత్రం అందిస్తున్న సీఎంకే రెడ్డి

సైదాపేట, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐటీఎఫ్ (అఖిల భారత తెలుగు సామాఖ్య) భాజపాకు మద్దతు ప్రకటించింది. సామాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సీఎంకే రెడ్డి నేతృత్వంలో ఏఐటీఎఫ్ నిర్వాహకులు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు మద్దతు లేఖను అందజేశారు. చెన్నై టీనగర్‌లోని భాజపా ప్రధాన కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఏఐటీఎఫ్ తరపున రాష్ట్రంలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఎన్డీయే విజయానికి కృషి చేస్తామని ఏఐటీఎఫ్ నిర్వాహకులు తెలిపారు.

ఎన్టీకే అభ్యర్థుల జాబితాపై భిన్నాభిప్రాయాలు

చెన్నై, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా నామ్ తమిళర్ కట్చి అభ్యర్థుల పేర్లను వెల్లడించడంపై రాజకీయ నేతల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. తిరుచ్చిలో 21న జరిగిన మహానాడులో తన పార్టీ తరపున రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేయనున్న అభ్యర్థుల పేర్లను ఎన్టీకే చీఫ్ కో-ఆర్డినేటరు సీమాన్ ప్రకటించారు. వారిలో 117 మంది (50శాతం) మహిళలు ఉన్నారు. అభ్యర్థుల్లో అనుషా (త్యాగరాయనగర్-చెన్నై), అరుణ్ (మయిలాపూర్-చెన్నై), శ్రీవిద్య (సైదాపేట్టై-చెన్నై), మహాలక్ష్మి (ఆలందూర్), రేవతి (మధురవాయల్), కాశిరామన్ (మయిలాడుతురై) బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందినవారు కావడంతో దానిపై రాజకీయ నేతల నుంచి భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇది సీమాన్ సామాజిక న్యాయమని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నటుడు ఎస్వీ శేఖర్ ప్రశంసించారు. సామాజిక, సాంస్కృతిక ఔన్నత్యం కలిగిన బ్రాహ్మణుల ఓట్లను భాజపా-అన్నాడీఎంకే నుంచి చీల్చి తన వైపునకు తెచ్చుకోవడానికి సీమాన్ చేపట్టిన ప్రయత్నంగా హిందూ మక్కళ్ కట్చి అధ్యక్షుడు అర్జున్ సంపత్ తెలిపారు.

టీవీకేతో ఎంజీఆర్ అన్నాడీఎంకే పొత్తు

☛ బన్రుట్టి రామచంద్రన్

మాట్లాడుతున్న బన్రుట్టి రామచంద్రన్

కాంచీపురం, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగంతో ఎంజీఆర్ అన్నాడీఎంకే పొత్తు కుదుర్చుకొని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ఎంజీఆర్ అన్నాడీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు బన్రుట్టి రామచంద్రన్ ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం మద్దతుదారుడైన కాంచీపురం జిల్లా కార్యదర్శి ఆర్వీ రంజిత్‌కుమార్ తన మద్దతుదారులతో కలిసి పన్నీర్‌సెల్వం నుంచి విడిపోయి మాజీ మంత్రి బన్రుట్టి రామచంద్రన్ ప్రారంభించిన ఎంజీఆర్ అన్నాడీఎంకేలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం కాంచీపురం సమీపం వాలాజాబాద్‌లో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న బన్రుట్టి రామచంద్రన్.. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆర్వీ రంజిత్‌కుమార్‌ను పరిచయం చేసి మాట్లాడారు. విజయ్ నటించిన జన నాయగన్ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వ చర్యలను తమ పార్టీ తరపున ఖండిస్తున్నామని తెలిపారు. విజయ్ పార్టీ విధానాలను తాము గౌరవిస్తామని, వచ్చే ఎన్నికల్లో ఆపార్టీతో పొత్తు పెట్టుకుని పోటీ చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్వీ రంజిత్‌కుమార్ పార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ కార్యకర్తలు మృతి చెందడంతో వారి కుటుంబాలకు తలా రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించి అందుకుగాను చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వాలాజాబాద్ యూనియన్ కౌన్సిలర్ ప్రేమా రంజిత్ కుమార్, పంచాయతీ మాజీ అధ్యక్షురాలు జోయతి అమ్మాళ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం

టీనగర్, న్యూస్‌టుడే: తమిళనాడు ప్రభుత్వం సూక్ష్మ, లఘు, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ప్రకటన మేరకు.. తమిళనాడు ఆహార శుద్ధి, వ్యవసాయ ఎగుమతుల ప్రోత్సాహక సంస్థ (టీఎన్‌ఏపీఈఎక్స్) ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతులు, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం వహించేందుకు 'వారపు వ్యాపార సలహా' ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధర కల్పించడం, ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడం, ఎగుమతులను పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ప్రతీ వారం బుధవారం నిర్వహించే ఈ ఆన్‌లైన్ సెషన్లలో, ప్రభుత్వ నిపుణులు, సాంకేతిక నిపుణులు నేరుగా పాల్గొని సందేహాలను నివృత్తి చేస్తారు. కార్యక్రమంలో రైతులు, ఆహార శుద్ధి పారిశ్రామికవేత్తలు, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, యువ పారిశ్రామికవేత్తలు ఎవరైనా పాల్గొనవచ్చని ప్రభుత్వం పేర్కొంది. వివరాలకు 95002 61727, 95002 61827 సెల్‌ఫోన్ నెంబర్ల ద్వారా అధికారులను సంప్రదించవచ్చని తెలిపింది. తమిళనాడు ప్రభుత్వం చేపట్టిన ఈ ముందడుగుతో వ్యవసాయం కేవలం సాగుకే పరిమితం కాకుండా లాభదాయకమైన వ్యాపారంగా మారుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జంతు సంరక్షణ కేంద్రాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

టీనగర్, న్యూస్‌టుడే: తమిళనాడు జంతు సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఆరు జంతు సంరక్షణ కేంద్రాలను నిర్వహించడానికి, పర్యవేక్షించడానికి అనుభవం ఉన్న స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. వీధుల్లో గాయపడిన, ఆదరణ లేని జంతువులకు ఆశ్రయం కల్పించి, వాటికి మానవతా దృక్పథంతో వైద్య సేవలు, మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు పని చేయనున్నాయి. ఈ సంరక్షణ కేంద్రాలను వృత్తిపరంగా నిర్వహించేందుకు జంతు సంక్షేమ రంగంలో గుర్తింపు పొందిన ప్రభుత్వేతర సంస్థలు ముందుకు రావాలని బోర్డు కోరింది. www.tnawb.tn.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారం, పూర్తి వివరాలు పొందవచ్చని సూచించింది.

రాష్ట్రానికి రానున్న 50 కంపెనీల పారా మిలటరీ దళాలు

చెన్నై, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని 50 కంపెనీల పారా మిలటరీ దళాలు రాష్ట్రానికి రానున్నాయి. రాష్ట్ర శాసనసభకు త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ముమ్మరంగా సన్నాహాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు దళాలకు చెందిన 50 కంపెనీలు మార్చి 10న రాష్ట్రానికి రానున్నాయి. ఈ కంపెనీలను కేంద్ర హోం మంత్రిత్వశాఖ నియమించింది.

డీఎంకేలో చేరుతానంటే ఓపీఎస్‌ను ఆహ్వానిస్తాం

☛ తిరుమావళవన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం డీఎంకేలో చేరుతానంటే ఆహ్వానిస్తామని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. తిరుచ్చి విమానాశ్రయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే అధికారంలోకి వస్తే రూ.10వేలు ఇస్తామని ఈపీఎస్ ప్రకటించారని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు నెరవేర్చలేకపోయిన వాగ్దానాలను ఇప్పుడు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రంలో డీఎంకే కూటమి బలంగా ఉందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆకర్షణీయమైన హామీలు ఇచ్చినా డీఎంకే కూటమి విజయాన్ని ప్రభావితం చేయలేవన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ విజయ్ చదువుతున్నారని ఆరోపించారు. పన్నీర్‌సెల్వం దృఢ సంకల్పం కలిగిన వ్యక్తి అని, ఆయన డీఎంకేలోకి వస్తానంటే స్వాగతిస్తామని తెలిపారు.

విజయ్ పిట్టకథపై నటి జూలి విమర్శలు

చెన్నై, న్యూస్‌టుడే: వేలూర్ సభలో విజయ్ చెప్పిన పిట్టకథపై నటి జూలి విమర్శలు గుప్పించారు. వేలూర్ జిల్లా అగరంచేరిలో ఆదివారం జరిగిన టీవీకే నిర్వాహకుల సమావేశంలో విజయ్ ఓ పిట్టకథ చెప్పారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రోశంగా ఉన్న ఓ జల్లికట్టు ఎద్దును అణచడానికి ధైర్యంగా ముందుకు వస్తున్న బాలుడిని చూసి కొందరు జాలి పడ్డారని, మరి కొందరు అవహేళన చేశారని తెలిపారు. చివరకు ఆ బాలుడు ఎద్దు దగ్గరకు వెళ్లి జేబుల నుంచి గడ్డిపరకలను తీసి చూపించడంతో అది అతనిని ప్రశాంతంగా వెంబడించిందని పేర్కొన్నారు. ఈ పిట్టకథపై నటి జూలి విమర్శలు చేస్తూ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. అందులో... పిట్టకథను విన్న తర్వాత మాట్లాడకుండా ఉండలేకపోయానని తెలిపారు. దానిని విన్న టీవీకే అభిమానులు ఎవరైనా జల్లికట్టు ఎద్దు దగ్గరకు గడ్డిపరకలతో వెళ్లి ఏమైనా జరిగితే ఏమవుతోందని ప్రశ్నించారు.

ఆశావహునిగా మంత్రి పీటీఆర్ దరఖాస్తు

చెన్నై, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల్లో ఆశావహుల నుంచి డీఎంకే అధిష్ఠానం దరఖాస్తు ఫారాలు పొందుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు దరఖాస్తు ఫారాలు పూర్తిచేసి అన్నా అరివాలయంలో సమర్పించారు. ఈ నేపథ్యంలో మంత్రి పళనివేల్ త్యాగరాజన్ మదురై మధ్య నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు ఫారాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన తన 'ఎక్స్' లో... 30ఏళ్లుగా విదేశాల్లో ప్రపంచస్థాయి విద్యా సంస్థల్లో అభ్యసించి, కార్పొరేట్ సంస్థల్లో ఉన్నత బాధ్యతలు వహించిన తర్వాత తన పూర్వీకులు చూపించిన మార్గాన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు.



దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న పళనివేల్ త్యాగరాజన్

అతివలే గెలుపు నిర్ణేతలు

☛ రాష్ట్రంలో వారి ఓట్లే అధికం

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర ఓటర్లలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఐదేళ్ల డీఎంకే ప్రభుత్వ ఎత్తుగడలు ప్రస్తుత ఎన్నికల్లో ఫలిస్తాయా? అనే విశ్లేషణలు రాజకీయ తెరపైకి వస్తున్నాయి. ప్రతి ఎన్నికలకు రాష్ట్రంలో పురుషుల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం పరిపాటి. సోమవారం వెలువడిన తుది ఓటర్ల జాబితాలోనూ మహిళల సంఖ్య ఎక్కువగానే ఉంది. రాష్ట్రంలో 5,67,07,380 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 2,77,38,925, మహిళలు 2,89,60,838 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాలో మహిళలు 51.07శాతం కావడం గమనార్హం. గత శాసనసభ ఎన్నికలకు ఇది 50.7 శాతంగా ఉంది. అప్పటి ఓటర్ల జాబితాలో పురుషులు 3.09 కోట్ల మంది ఉండగా మహిళలు 3.19 కోట్ల మంది. అప్పట్లో 10 లక్షల మంది మహిళలు ఎక్కువగా ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 12.21 లక్షలకు పెరిగింది. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 'కలైజ్ఞర్ మగళిర్ ఉరిమై' పథకం కింద ప్రతి నెలా రూ.వెయ్యి, ఉద్యోగాలు నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే మహిళల సంక్షేమం దృష్ట్యా 'తోళి' వసతి గృహాలు, మహిళా స్వయం సహాయక బృందాలకు రాయితీలు, ప్రసూతి సెలవులు ఏడాదికి పెంపు, పుదుమై పెణ్ పథకం వంటివి అమలు చేశారు. ఓటర్లలో సగానికిపైగా మహిళలు ఉండటంతో తమ ప్రభుత్వం అమలు చేసిన మహిళా సంక్షేమ పథకాలు ప్రస్తుత ఎన్నికల్లో అది తమకు లాభిస్తోందని డీఎంకే అధిష్ఠానం గట్టిగా నమ్ముతోంది.

తొలగిన ఓట్లతో ఎవరికి నష్టం?

గత శాసనసభ ఎన్నికల నాటికి 6.19 కోట్ల మంది ఓటర్లు ఉండగా గత ఏడాది అక్టోబరు 27 నాటికి అది 6.41 కోట్లకు చేరింది. 'సర్' పనులతో ఓటర్లను భారీ సంఖ్యలో తొలగించి ఎన్నికల్లో తమ విజయావకాశాలను దెబ్బతీయడానికి ఎన్నికల కమిషన్ ద్వారా భాజపా ప్రయత్నిస్తోందంటూ అప్పట్లో డీఎంకే, దాని కూటమి పార్టీలు బహిరంగంగా ఆరోపించాయి. ప్రస్తుతం తుది ఓటర్ల జాబితాలో 74 లక్షల మంది ఓటర్లు గల్లంతయ్యారు. డబుల్ ఎంట్రీలు, నియోజకవర్గాలు మారి ఉన్న ఓటర్లు, మృతులు తదితరుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల కమిషన్ వర్గాలు వివరణ ఇచ్చాయి. డీఎంకే, దాని మిత్రపక్షాలు మాత్రం భాజపాపై విమర్శలు గుప్పిస్తున్నాయి. రానున్న శాసనసభ ఎన్నికల్లో ప్రస్తుతం గల్లంతైన ఓటర్ల వల్ల ఏ పార్టీకి నష్టం వాటిల్లుతుందనే విషయంపైనా రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి.

'ఐఐటీఎం' ఆచార్యుడికి కీలక బాధ్యతలు

బి.రవీంద్రన్

వడపళని, న్యూస్‌టుడే: సమాజంపై ఏఐ ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఐక్యరాజ్య సమితి స్థాపించిన ఇండిపెండెంట్ ఇంటర్నేషనల్ సైంటిఫిక్ ప్యానెల్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు 'ఐఐటీ మద్రాస్' ఆచార్యులు బి.రవీంద్రన్ సభ్యుడిగా నియమితులయ్యారు. రవీంద్రన్ ఐఐటీలోని 'సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ ఏఐ(సీఈఆర్ఏఐ)', 'వాధ్వాని స్కూల్ ఆఫ్ డాటా సైన్స్ అండ్ ఏఐ(డబ్ల్యూఎస్ఏఐ)' హెడ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ఏఐ పరిశోధనలో అనుభవాన్ని గడించారు. రవీంద్రన్ నియామకంపై ఐఐటీ డైరెక్టర్ ఆచార్యులు కామకోటి హర్షం వ్యక్తం చేశారు.

(c) eenadu

రంజాన్ వేళలు
ఇఫ్తార్: బుధవారం (సా) 6.21
సహర్: గురువారం (ఉ) 5.03

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: ఐఐటీలో ప్రవేశాలకు తొలి మెట్టును ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ మోడల్ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు అధిరోహించిన నేపథ్యంలో ఇదే ప్రేరణతో ఇంకా పలువురు విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. ఆయన తన 'ఎక్స్'లో... విద్యలో రాష్ట్రం కొత్త ఉన్నత శిఖరాలను చేరుకోవడం గర్వ కారణంగా ఉందన్నారు. 2021-22 ఏడాది విద్యలో వెనకబడిన 10 జిల్లాల్లో మోడల్ పాఠశాలలు ప్రారంభించినట్టు తెలిపారు. నేడు 38 జిల్లాల్లోనూ విద్యార్థుల కోసం రూ.50 కోట్ల చొప్పున గురుకులం, హాస్టల్ వసతులను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఫలితంగా నాలుగేళ్లలో ప్రభుత్వ మోడల్ పాఠశాలలకు చెందిన 2,358 మంది విద్యార్థులు, ఎస్సీ(37), ఎస్టీ(169) పాఠశాలలకు చెందిన 206 మంది విద్యార్థులు 93 దిగ్గజ ఉన్నత విద్యాసంస్థల్లో 50 విభాగాల్లో పైచదువులు చదువుతున్నారని వెల్లడించారు. వారిలో 41 మంది ఐఐటీల్లో, 22 మంది పూర్తి ఉపకార వేతనంతో విదేశాల్లో చదువుతున్నారని తెలిపారు. ఇదే క్రమంలో ఈ ఏడాది ఐఐటీలో ప్రవేశాలకు తొలి మెట్టును ప్రభుత్వ మోడల్ పాఠశాలలకు చెందిన 448 మంది విద్యార్థులు, ఎస్సీ(13), ఎస్టీ(55) పాఠశాలలకు చెందిన 68 మంది విద్యార్థులు విజయవంతంగా అధిరోహించారని పేర్కొన్నారు. ఇదే ప్రేరణతో ఇంకా పలువురు విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

అన్నాడీఎంకే కార్యక్రమంలో మహిళల ఘర్షణ

సంక్షేమ సాయం అందజేస్తున్న మాజీ మంత్రి సీవీ షణ్ముగం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతిని పురస్కరించుకుని మంగళవారం విల్లుపురం పట్టణంలోని కల్లెక్టర్ కార్యాలయం ఎదుట అన్నాడీఎంకే తరఫున పేదలకు సంక్షేమ సాయం పంపిణీ కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి సీవీ షణ్ముగం పాల్గొని సాయం అందజేస్తుండగా ఫ్రంట్‌లైన్ వర్కర్ అయిన ఓ మహిళ సాయం పొందడానికి జనంలోకి చొచ్చుకురావడంతో ఆమె వెంట వచ్చిన మరో మహిళ ఫ్రంట్ లైన్ వర్కర్‌పై దాడి చేసింది. దీంతో ఉద్రిక్త నెలకొంది. విషయం తెలుసుకున్న నిర్వాహకులు ఇద్దరు మహిళలను పక్కకు తీసి పరిస్థితిని చక్కదిద్దారు. వారు దాడి చేసుకుంటున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

పురాతన శిలాశాసనం గుర్తింపు

శాసనంపై అధ్యయనం చేస్తున్న దృశ్యం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లా పాప్పారపట్టి సమీపం మలైయూర్ గ్రామంలో పురావస్తు విభాగ ఇన్‌స్పెక్టర్, ప్రైవేట్ కళాశాల చరిత్ర విభాగ ఆచార్యులు తిరుసెల్వన్ నేతృత్వంలోని చరిత్ర విభాగ విద్యార్థులు కవియరసు, గౌతమ్ తదితరులు పరిశోధనలు జరిపారు. మలైయూర్ సమీపం వారక్కోలై ప్రాంతంలో బండరాయిపై శాసనాన్ని గుర్తించారు. అది 19వ శతాబ్దానికి చెందినదిగా తెలిసింది. దానిపై తమిళం, తెలుగు భాషలలో అక్షరాలు ఉన్నాయి.

వేగంగా ఎగ్మోర్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ

- న్యూస్‌టుడే, వడపళని

చెన్నైలోని నాలుగు ప్రధాన ఇంటర్ సిటీ టెర్మినళ్లలో ఒకటైన ఎగ్మోర్ రైల్వే స్టేషను పునరభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దక్షిణ భారత రైల్వే కంపెనీ ఆధ్వర్యంలో 1906-08 మధ్య కాలంలో ఎగ్మోర్ టెర్మినల్‌గా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఎగ్మోర్ చెన్నై నగరానికి ల్యాండ్ మార్క్‌గా మారింది. దశాబ్దాలుగా ప్రయాణికుల రద్దీ పెరిగి పోతుండటంతో మౌలిక సదుపాయాల కల్పనలపై ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ సౌకర్యాలు మెరుగుపరిచి, ప్రయాణికుల అవసరాలు తీర్చడానికి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది.

అధునాతన వసతులు

గాంధీ ఇర్విన్ రోడ్డులో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తుల్లో ఈ టెర్మినల్ భవనం నిర్మాణం జరుగుతోంది. వచ్చే రైళ్లకు, వెళ్లేవాటికి వీలుగా సువిశాలమైన స్థలం ఉండటానికి చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు, విశ్రాంత గదులు, రిటైల్ దుకాణాలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పూందమల్లి హైరోడ్డు వైపు నుంచి ప్రవేశద్వారం వద్ద టెర్మినల్ భవనం గ్రౌండు ఫ్లోర్, రెండు అంతస్తులతో నిర్మాణం చేపట్టారు. ఈ టెర్మినల్ భవనం ఎగ్మోర్ మెట్రో స్టేషనుకు పైన ఉంటుంది. భూగర్భంలో ద్విచక్ర వాహనాల పార్కింగు ఏర్పాటు చేస్తున్నారు. గాంధీ ఇర్విన్ రోడ్డులో మాదిరిగానే పూందమల్లి టెర్మినల్ భవనంలో కూడా అన్ని సదుపాయాలు రానున్నాయి.

బహుళ అంతస్తుల పార్కింగ్ భవనం

గాంధీ ఇర్విన్ రోడ్డులో నిర్మాణం జరుగుతున్న బహుళ అంతస్తుల పార్కింగు భవనంలో గ్రౌండ్, మొదటి అంతస్తులు వాణిజ్య అవసరాలకు, 3, 4 అంతస్తులు వాహనాల పార్కింగుకు వినియోగిస్తారు. ఐదో అంతస్తులో హోటల్, హాలు, కెఫెటేరియా వంటివి ఉంటాయి. వాహనాల పార్కింగు అంతస్తుల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన అంతస్తుల్లో పనులు జరుగుతున్నాయి. పూందమల్లి హైరోడ్డులో కూడా గాంధీ ఇర్విన్ రోడ్డు మాదిరిగానే నిర్మాణం జరుగుతోంది. గ్రౌండ్ కాకుండా రెండంతస్తుల్లో నిర్మాణం జరిగిన భవనంలో రైల్వే మెయిల్ సర్వీస్ (ఆర్ఎంఎస్), పోస్టల్ సేవలకు కేటాయించారు. మొదటి అంతస్తు ఆర్ఎంఎస్‌కు అప్పగించారు. లిఫ్టులు, పార్సిల్ సేవలు త్వరలో ఇక్కడికి మారుతాయి. కొత్త టెర్మినల్ భవనాలకు, హాళ్లు, ప్లాట్‌ఫారాలు, ఇతర ప్రాంతాలకు విదుత్తు సరఫరా కోసం 11 కేవీతో కూడిన సబ్ స్టేషను ఏర్పాటు చేశారు. ఇక్కడ సివిల్‌కు సంబంధించిన పనులు జరుగుతున్నాయి.

పూందమల్లి హైరోడ్డులో నిర్మాణంలో ఉన్న పార్కింగు భవనం

ప్లాట్‌ఫారాలపై ఎస్కలేటర్లు, లిఫ్టులు

పూందమల్లి హైరోడ్డును అనుసంధానించే విధంగా 18 మీటర్ల వెడల్పుతో కాలినడక వంతెనతో పాటు అన్ని ప్లాట్‌ఫారాలకు చేరుకునేందుకు వీలుగా ఎస్కలేటర్లు, లిఫ్టులు అందుబాటులోకి రానున్నాయి. 11 ప్లాట్‌ఫారాలకు పైన ఎత్తుగా షీట్లు, ప్లాట్‌ఫారాల మీద కొత్తగా రాళ్లతో కనువిందు చేయనున్నాయి. అన్ని పనులు పూర్తయ్యాక ఎగ్మోర్ స్టేషను వారసత్వ కట్టడానికి భంగం వాటిల్లకుండా అధునాతన హంగులతో ప్రయాణికులకు దర్శనమివ్వనుంది.

మార్చి 29 నుంచి తిరుచ్చి, చెన్నై మధ్య
రోజుకు ఆరు 'ఇండిగో' విమాన సర్వీసులు

వడపళని, న్యూస్‌టుడే: ఇండిగో విమాన సంస్థ తిరుచ్చి, చెన్నై మధ్య మార్చి 29వ తేదీ నుంచి రోజుకు ఆరు సర్వీసులను నడపనుంది. గతంలో మాదిరిగా ఆరు సర్వీసులను నడపనున్నట్టు సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. కొన్ని నెలల క్రితం ఆరు సర్వీసులను రెండుకు తగ్గించి ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ సర్వీసులను నడిపింది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి తిరుచ్చి, చెన్నై మధ్య ఏటీఆర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను పునఃప్రారంభించి రోజులో మూడు సర్వీసులను నడిపింది. ఈ క్రమంలో మార్చి 29 నుంచి రోజులో ఆరు సర్వీసులను నడిపేందుకు నిర్ణయించింది.

తపాలా శాఖ ఉద్యోగులకు అవార్డులు

వడపళని, న్యూస్‌టుడే: గత ఆర్థిక సంవత్సరంలో చెన్నై రీజియన్‌లోని తపాలా శాఖలో అత్యుత్తమ సేవలందించిన ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు. 'రీజినల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2024-25' పేరిట సోమవారం జరిగిన కార్యక్రమానికి చెన్నైలోని విక్టోరియా పబ్లిక్ హాలు వేదికైంది. తమిళనాడు టెక్స్ట్‌బుక్స్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ కార్పొరేషన్(టీఎన్‌టీఈఎస్‌సీ) గౌరవ సలహాదారు, సీఈసీసీ ప్రిన్సిపల్ డాక్టర్ టి.శంకర శరవణన్ ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాలు అందజేశారు. చెన్నై సిటీ రీజియన్, డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్ మేజర్ మనోజ్ ఎం ఆహూతులకు స్వాగతం పలికారు. చెన్నై సిటీ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ జి.నటరాజన్ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. 77 కేటగిరీలకు చెందిన మొత్తం 262 మందికి పురస్కారాలు దక్కాయి.

పాంబన్ మత్స్యకారుల సమ్మె

ప్యారిస్, న్యూస్‌టుడే: రామనాథపురం జిల్లా పాంబన్‌కి చెందిన జాలర్లను సోమవారం శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. గత 5 రోజుల్లో నేరామేశ్వరం, పాంబన్, మండపంకి చెందిన 34 మంది జాలర్లను సరిహద్దులు దాటి వచ్చారన్న అభియోగంపై శ్రీలంక నావికా దళం అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా అరెస్టయిన 12 మంది జాలర్ల విడుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పాంబన్ మత్స్యకారులు మంగళవారం సమ్మెకు దిగారు.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ అవినీతి వ్యవహారం
ఈడీ కెవియట్ పిటిషన్ దాఖలు

ప్యారిస్, న్యూస్‌టుడే: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖలో ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవినీతి వ్యవహారమై సుప్రీంకోర్టులో అన్నాడీఎంకే ఎంపీ ఇన్బదురై, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫున కెవియట్ పిటిషన్లు దాఖలయ్యాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖలో ఉద్యోగ నియామకాలకు లంచం తీసుకున్న వ్యవహారమై ఈడీ ఇచ్చిన ఆధారాల ప్రాతిపదికన మంత్రి కేఎన్ నెహ్రూ మొదలైన వారిపై కేసు నమోదు చేయాలని అవినీతి నిరోధకశాఖకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ మంత్రి కేఎన్ నెహ్రూ తదితరులు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌ను విచారించేటప్పుడు తమ తరఫు అభిప్రాయం తెలుసుకోవాలని కోరుతూ అన్నాడీఎంకే ఎంపీ ఇన్బదురై, ఈడీ తరఫున కెవియట్ పిటిషన్లు దాఖలయ్యాయి.

హైకోర్టు అదనపు భవనంలో మార్చి 2 నుంచి విచారణలు

ప్యారిస్, న్యూస్‌టుడే: మద్రాసు హైకోర్టు అదనపు భవనంలో ఉన్న అన్ని న్యాయస్థానాలు మార్చి 2వ తేదీ నుంచి తమ రోజువారీ కార్యకలాపాలు కొనసాగిస్తాయని హైకోర్టు రిజిస్ట్రేషన్ శాఖ సోమవారం ప్రకటించింది. మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో ఉన్న పాత న్యాయ కళాశాల పని చేసిన పురాతన భవనాన్ని పునరుద్ధరించి హైకోర్టుకి అదనపు భవనంగా గతేడాది ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ అదనపు భవనంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పాత సివిల్, క్రిమినల్, రిట్ కేసులను విచారించనున్నారు.

తిరుమావళవన్‌పై కేసు కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో 2014లో జరిగిన బహిరంగ సభలో రెండు వర్గాల మధ్య హింసను ప్రేరేపించేలా మాట్లాడినట్లు వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను పుదుచ్చేరి కోర్టు గతేడాది కొట్టివేసింది. అనంతరం ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ తిరుమా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ జగదీశ్‌చంద్ర..ఈ కేసులో సూచించిన కాలంలో అభియోగపత్రం దాఖలు చేయలేదని తెలుపుతూ కేసు కొట్టివేశారు.

తిరుచ్చి 'ఐఐఎం'కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

మంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఆచార్యులు సతీష్ ఎస్.మహేశ్వరప్ప

వడపళని, న్యూస్‌టుడే: ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఐపీఎంఏ) అనుబంధ సంస్థ 'ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసోసియేట్స్ ఇండియా(పీఎంఏ)' నుంచి తిరుచ్చిరాపల్లిలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్'కు 'ఇన్‌స్టిట్యూషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్-2025' లభించింది. ఈ నెల 13న 'ఐపీఎంఏ గ్లోబల్ ప్రాజెక్ట్ ప్రొఫెషన్ ఫోరం 2026' పేరిట జరిగిన కార్యక్రమంలో పురస్కారం లభించిందని పీఐబీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఐఐఎం తిరుచ్చి తరఫున ఆచార్యులు సతీష్ ఎస్.మహేశ్వరప్ప తమిళనాడు ఐటీ శాఖ మంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. ఐఐఎం తిరుచ్చిరాపల్లి డైరెక్టర్ డాక్టర్ గాడ్విన్ టెన్నిసన్ మాట్లాడుతూ.. తమ సంస్థ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన కోర్సులను ఎంబీఏ కోర్సులో ఒక ఎలక్టివ్ సబ్జెక్టుగా అందిస్తోందని అన్నారు. ఈ నెల 22న 'పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్' కోర్సును ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

తాంబరం రైల్వే స్టేషన్‌లో రద్దీ

ప్రయాణికులతో కిక్కిరిసిన స్టేషన్

మామల్లపురం, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మోర్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై పునరుద్ధరణ పనులు జరుగుతున్న కారణంగా చెన్నై బీచ్-చెంగల్పట్టు-తాంబరం మధ్య పరిమిత సంఖ్యలో సబర్బన్ రైళ్లను నడుపుతున్నారు. దీంతో తాంబరం రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఈ మార్గంలో సాధారణంగా 208 సబర్బన్ రైళ్లు నడుస్తుండగా సోమవారం రాత్రి వరకు 164 రైళ్లు నడిచాయి. మంగళవారం నుంచి సర్వీసులను 115కు తగ్గించడంతో ఉద్యోగాలకు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కేంద్ర పథకాల లబ్ధికి సేవా శిబిరం

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నయినార్ నాగేంద్రన్

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ సేవా శిబిరం, వైద్య శిబిరం చెన్నై టీనగర్‌లో మంగళవారం జరిగాయి. ఇందులో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పాల్గొని ప్రజలకు సంక్షేమ సాయం అందజేశారు. కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ఎల్‌సీఐఎల్'లో ముగిసిన కార్యశాల

వడపళని, న్యూస్‌టుడే: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్)లో జరిగిన కార్యశాల, ప్రాజెక్టుల సమీక్ష కోసం నైవేలి విచ్చేశారు. ఎన్ఎల్‌సీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి ఆయనకు స్వాగతం పలికారు. గోశాల వద్ద గిరిజన లబ్ధిదారులకు కేంద్ర మంత్రి గోవులను దానం చేశారు. అనంతరం బటర్‌ఫ్లై పార్కును ప్రారంభించి లిగ్నైట్ హాలులో పిల్లల కోసం ఎకో టూరిజం బస్సును ప్రారంభించారు. 'మూవింగ్ బియాండ్ ఎక్స్‌ట్రాక్షన్ మైన్ క్లోజర్ అండ్ రీపర్పసింగ్' అనే అంశంపై రెండు రోజుల కార్యశాలను సోమవారం ప్రారంభించారు. మంగళవారం జరిగిన పత్ర సమర్పణలో పలువురు నిపుణులు వివిధ అంశాలపై చర్చలో పాల్గొన్నారు. ఎన్ఎల్‌సీ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి అధికారిక లోగోను ఆవిష్కరించారు.

కోవై విద్యార్థిని సామూహిక అత్యాచారం కేసు
చివరి దశ విచారణ ప్రారంభం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో కళాశాల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో చివరి దశ దర్యాప్తు మంగళవారం ప్రారంభమైంది. కోయంబత్తూరు విమానాశ్రయం వద్ద గత నవంబరులో కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈ కేసులో నిందితులు సతీశ్, అతని సోదరుడు కాళీశ్వరన్, తవసి అనే వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ కోయంబత్తూరులోని ఆల్ ఉమెన్ కోర్టులో జరుగుతోంది. ఈ క్రమంలో బాధితురాలు, ఆమె ప్రియుడు, బంధువులు, దర్యాప్తు అధికారులు సహా 113మంది సాక్షుల విచారణ పూర్తయింది. ప్రస్తుతం చివరి దశ విచారణ మంగళవారం ప్రారంభమైంది. ఇందుకోసం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. మంగళవారం ప్రభుత్వం తరఫున, బుధవారం నిందితుల తరఫున వాదనలు వినిపించనున్నారు. ఆ తర్వాత తుది దశ విచారణ నిర్వహించి తీర్పు తేదీని ప్రకటించనున్నారు.

మార్చి 1న తిరుప్పరంకుండ్రం ఆలయాన్ని దర్శించనున్న ప్రధాని

భక్తులతో కలిసి స్కందషష్టి పారాయణం చేస్తున్న రామ శ్రీనివాసన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 1వ తేదీ దర్శిస్తారని భాజపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామ శ్రీనివాసన్ తెలిపారు. దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయం ఎదుట సోమవారం రాత్రి స్థానికులు.. తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించాలన్న నినాదంతో ముగ్గులు వేసి మురుగన్ చిత్రపటం ఉంచి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పాల్గొన్న రామ శ్రీనివాసన్ భక్తులతో కలిసి స్కందషష్టి పారాయణం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం అడ్డుపడిందన్నారు. మురుగన్ శత్రువులను నాశనం చేస్తారని చెప్పారు. మార్చి 1న మదురైలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్న ప్రధాని మోదీ తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయాన్ని దర్శిస్తారని తెలిపారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై గిండి రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద సీఐటీయూ అధ్యక్షుడు కబాలి, ప్రధానకార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారి దేవారం నేతృత్వంలో మంగళవారం ఆందోళన జరిగింది. 26వ తేదీ వరకు కొనసాగనుంది. 13ఏళ్లుగా పెంచని మీటర్ ఛార్జీలను వెంటనే నిర్ణయించాలని, ఓలా, ఉబర్‌లకు ప్రత్యామ్నాయంగా కొత్త యాప్‌ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలని తదితర డిమాండ్లతో పోరాటం చేస్తున్నారు. వెయ్యి మందికి పైగా ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. అధికారులు సీఐటీయూ నిర్వాహకులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆందళన కొనసాగింది.

భాజపా నేతను అరెస్టు చేయాలని రాస్తారోకో

రాస్తారోకోలో మహిళలు

చెన్నై, న్యూస్‌టుడే: ఎంపీ జ్యోతిమణిని కించపరిచేలా మాట్లాడిన భాజపా నేతను అరెస్టు చేయాలంటూ కాంగ్రెస్ మహిళా విభాగం తరఫున రాస్తారోకో నిర్వహించారు. కరూర్‌లో ఫిబ్రవరి 10న భాజపా తరఫున జరిగిన ఆందోళనలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సెంథిల్‌నాథన్.. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిని తన 'ఎక్స్' ఖాతా ద్వారా జ్యోతిమణి ఖండించడంతో పాటు సెంథిల్‌నాథన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాయపేట్టైలోని సత్యమూర్తి భవన్ ప్రాంగణంలో తమిళనాడు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు హసీనా సయ్యద్ అధ్యక్షతన ఆందోళన జరిగింది. సెంథిల్‌నాథన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

కల్యాణ మండపాలు ప్రారంభం

ట్రిప్లికేన్ రాజాజీ నగర్‌లో కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఉదయనిధి

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై చేపాక్కం- ట్రిప్లికేన్ నియోజకవర్గంలో నిర్మించిన బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, రాజాజీనగర్‌లో నిర్మించిన అంబేడ్కర్ కల్యాణ మండపం, చింతాద్రిపేట్టైలో నిర్మించిన కలైజ్ఞర్ కల్యాణ మండపాన్ని మంగళవారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. అదేవిధంగా ఆదికేశవులు వీధిలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల్లో నిర్మించిన అదనపు భవనాన్ని ప్రారంభించారు. ట్రిప్లికేన్ శివరాజపురానికి చెందిన షణ్ముగం అనే వ్యక్తి అనారోగ్యంతో ముఖ్యమంత్రి వైద్య బీమా పథకం కింద చికిత్స పొందగా ఆయనకు అత్యాధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలును అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీ దయానిధి మారన్, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

శునకాన్ని వేటాడేందుకు వచ్చిన చిరుత
అడ్డుకోవడానికి యత్నించిన వ్యక్తిపై దాడి

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా పాపనాశం సమీపం అగస్త్యర్ కాణి ప్రాంతానికి చెందిన గౌతమ్(33) కూలీ. ఈయనకు భార్య విజిత, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం గౌతమ్ ఇంటి బయట శునకాన్ని కట్టేసిన చోట నిద్రిస్తుండగా ఓ చిరుతపులి కుక్కను వేటాడేందుకు వచ్చింది. కుక్క అరుపులు విన్న గౌతమ్ మేల్కొని చిరుతను అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో చిరుత గౌతమ్‌పై దాడి చేసింది. అతను గట్టిగా కేకలు వేయడంతో చిరుత అడవిలోకి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు అంబసముద్రం ఆస్పత్రికి తరలించారు.

మరణించిన పోలీసు కుటుంబానికి
రూ.కోటి బీమా నగదు అందజేత

రాజు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దశ్యం

అన్నానగర్, న్యూస్‌టుడే: చెన్నై పోలీసు సాయుధ దళంలో పనిచేస్తున్న రాజు(54) గతేడాది మే 4న రోడ్డు ప్రమాదంలో మరణించారు. విధుల్లో మరణించిన పోలీసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి బీమా సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం చెన్నై పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాజు కుటుంబానికి రూ.కోటి చెక్కును పోలీసు అధికారులు అందజేశారు. ఆయన భార్య చిత్రాదేవి, కుమారుడు కేశవసుబ్రమణి చెక్కు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మహేశ్వరన్, ఉప కమిషనర్లు సుబ్బులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నటి తండ్రి హత్య కేసు
చెన్నైలో పోలీసుల దర్యాప్తు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కొడైకెనాల్‌లో సినీ సహాయ నటి విష్ణుప్రియ తండ్రి సూర్యనారాయణన్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆయన గెస్ట్‌హౌస్‌లో పర్యాటకుల ముసుగులో వచ్చి బస చేసిన ఐదుగురు యువకులు సూర్యనారాయణన్‌ను హత్య చేసి నగలు, నగదు దోచుకెళ్లారు. ఈ ఘటనపై కొడైకెనాల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు చెన్నైకు చెందినవారిగా గుర్తించారు. దీంతో పోలీసులు చెన్నైకు వచ్చి దర్యాప్తు జరుపుతున్నారు.

జీఎస్టీపై ముగిసిన కార్యశాల

కార్యక్రమంలో విద్యార్థులు, నిర్వాహకులు

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై ప్యారిస్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి కళాశాలలో వస్తు, సేవా పన్ను(జీఎస్టీ)పై ఏర్పాటైన రెండు రోజుల కార్యశాల మంగళవారంతో ముగిసింది. కళాశాలలోని ఐక్యూఏసీ, కామర్స్ విభాగం సంయుక్తంగా జీఎస్టీ ప్రొఫెషనల్స్ సొసైటీ సహకారంతో సోమవారం నుంచి మంగళవారం వరకు కార్యశాల నిర్వహించాయి. జీఎస్టీ ప్రొఫెషనల్స్ సొసైటీ కమిటీ సభ్యులు బాలాజీ అరుణాచలం, షెన్బగం తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

పలు సబర్బన్ రైళ్ల సేవల్లో మార్పులు

వడపళని, న్యూస్‌టుడే: ఎగ్మోర్ స్టేషనులో 10, 11 ప్లాట్‌ఫారాలపై పునరాభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా మంగళవారం నుంచి పలు సబర్బన్ సర్వీసుల్లో మార్పు చేసినట్టు దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ ఓ ప్రకటన విడుదల చేసింది. ● **49003/49004/49005/49006** చెన్నై బీచ్-తాంబరం-చెన్నై బీచ్ సర్వీసులు రద్దీ కాని సమయంలో పనిదినాల్లో రద్దు చేశారు. ఏసీ సబర్బన్ రైళ్లు ఆదివారం కూడా నడవవు. ● ఎగ్మోర్, సెయింట్ థామస్ మౌంట్ వైపునకు వెళ్లే రైళ్లు నిర్వహణ పనుల కారణంగా పల్లావరం, కోడంబాక్కం, నుంగంబాక్కం చేట్‌పేట్ స్టేషన్లలో ఆగవు. ● ఎగ్మోర్, గూడువాంజేరి, చెంగల్పట్టు వైపు వెళ్లేవి చేట్‌పేట్, కోడంబాక్కం, నుంగంబాక్కంలో ఆగవు. ● **42522/42521** గుమ్మిడిపూండి-తాంబరం-గుమ్మిడిపూండి (సోమ నుంచి శనివారం వరకు) తాత్కాలికంగా చెంగల్పట్టు వరకు పొడిగించారు. ● **40802** తిరుమాల్‌పూర్-అరక్కోణం, **40903** చెన్నై బీచ్-అరక్కోణం ఫాస్ట్ రైలు సెయింట్ థామస్ మౌంట్‌లో ఆగుతుంది. ● **40402** సెమి ఫాస్ట్, **40404** సెమీ ఫాస్ట్ చెంగల్పట్టు-చెన్నై ఎగ్మోర్ రైలు సెయింట్ థామస్ మౌంట్‌లో నిలుస్తుంది.

తింబం కొండ మార్గంలో కనిపించిన చిరుత

రెయిలింగ్ గోడపై పడుకుని ఉన్న చిరుత

విల్లివాక్కం, న్యూస్‌టుడే: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతున్న సత్యమంగళం-మైసూరు జాతీయ రహదారి 27 సూది మలుపులతో ఉంది. తింబం కొండ మార్గంలో రాత్రిళ్లు వన్యప్రాణులు సంచరిస్తుంటాయి. ఇదిలా ఉండగా 12వ సూది మలుపు వద్ద రోడ్డు పక్కన రెయిలింగ్ గోడపై సోమవారం రాత్రి ఓ చిరుత పడుకుని ఉండటాన్ని వాహన చోదకులు గమనించారు. దీంతో భయాందోళన చెందారు. చిరుత ఎవరికీ హాని తలపెట్టకుండా కాసేపటి తర్వాత అడవిలోకి వెళ్లిపోయింది. తింబం కొండ మార్గంలో వన్యప్రాణుల సంచారం పెరిగిందని, వాహన చోదకులు జాగ్రత్తగా వెళ్లాలని, వాహనాలు ఆపి కిందకు దిగకూడదని అటవీశాఖ సూచించింది.

ఇలుప నూనె నింపి పాతిపెట్టిన కుండ
48ఏళ్ల తర్వాత వెలికితీత

భూమిలోంచి బయటకు తీసిన కుండ

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తిరుక్కళికుండ్రం సమీపం నత్తం గ్రామంలో సుమారు 500ఏళ్ల క్రితం నాటి అత్యంత పురాతనమైన సన్యాక్షి అమ్మవారి ఆలయం ఉంది. గ్రామంలోని ప్రజలు, పశుపక్షాదులకు ఎలాంటి వ్యాధులు సంక్రమించకుండా, ఏడాదిలో మూడుసార్లు వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థిస్తూ గ్రామస్థులు సుమారు 48ఏళ్ల క్రితం ప్రత్యేక పూజలు నిర్వహించి మూలవిరాట్టు విగ్రహం ఎదుట 3 అడుగుల గొయ్యి తవ్వి ఓ మట్టి కుండను ఉంచి దాని నిండుగా ఇలుప నూనె పోసి మూత బిగించి పాతిపెట్టారు. ఈ నేపథ్యంలో పాతిపెట్టిన కుండను వెలికితీయడానికి 1000 మంది గ్రామస్థులు గత వారం రోజులుగా ఉపవాసాలు ఉంటూ సోమవారం సాయంత్రం వెలికితీసి అమ్మవారి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'వీఐటీ'లో 26 నుంచి 'రివేరా ఆర్ట్స్ ఫెస్టివల్'

బ్రోచర్లు విడుదల చేస్తున్న జి.విశ్వనాథన్ తదితరులు

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ సమీపం కాట్పాడి వద్ద ఉన్న వీఐటీ విశ్వవిద్యాలయంలో ఈనెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు 23వ 'రివేరా ఆర్ట్స్ ఫెస్టివల్' జరుగనుందని వర్సిటీ కులపతి జి.విశ్వనాథన్ మంగళవారం తెలిపారు. ఇందుకుగాను బ్రోచర్లు విడుదల చేశారు. క్రీడలు మినహా 136 ప్రాథమిక, ప్రీమియం ఈవెంట్లు జరుగుతాయని పేర్కొన్నారు. దేశంలోని వివిధ విద్యా సంస్థల నుంచి 18వేల మంది విద్యార్థులు, 28 దేశాల నుంచి 120 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. 26వ తేదీ మారథాన్‌తో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. మహిళా క్రికెటర్ మిథాలి రాజ్ అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు.

(c) eenadu

కమల్ చెప్పిన మాట ఇంకా గుర్తుంది

వేదికపై చిత్రబృందం

రాధిక

చెన్నై: వర్ధమాన దర్శకుడు శివకు మార్ మురుగేశన్ దర్శకత్వంలో సీని యర్ నటి రాధిక ప్రధానపాత్రలో నటించిన 'తాయ్ కిళవి' ముందస్తు విడుదల కార్యక్రమం చెన్నైలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ... తాను నటించిన 'ఆళ్', రాధిక నటించిన 'తాయ్ కిళవి' ఈ నెల 27న విడుదలవుతున్నాయని తెలిపారు. తన భార్య గెలిస్తే తాను గెలిచినట్టేనన్నారు. సినీ రంగంలో 50ఏళ్లను చేరుకుంటున్న ఆమెలో శ్రమ, అంకితభావం, ఆత్మవిశ్వాసం వంటివి ఉండటం వల్లే ఈ చిత్రంలో ధైర్యంగా నటించారని తెలిపారు. ఒకటిగా నిజానికి మహిళ తనకు ఎదురయ్యే కష్టాలను ఎలా ఎదుర్కోవాలనే విషయాన్ని దర్శకుడు చక్కగా చెప్పారన్నారు. నటి రాధిక మాట్లాడుతూ... అందరి పట్ల ప్రేమ, నమ్మకం, గెలవాలనే లక్ష్యం తనను 48ఏళ్లుగా చిత్రసీమలో నిలదొక్కుకునేలా చేసిందన్నారు. సినిమాల్లోకి రావాలంటే అదృష్టం ఉండాలని, నిలదొక్కుకోవాలంటే కృషి ఉండాలని తెలిపారు. వాస్తవానికి చిత్రంలోని కథాపాత్ర రజనీకాంత్ కోసం సృష్టించిందని, ఆలాంటి క్యారెక్టర్‌లో ఆయన నటించే అవకాశం లేకపోవడంతో ఆ క్యారెక్టరును మహిళగా మార్చి తనతో నటింపచేసినట్టు వివరిస్తున్నారని తెలిపారు. ఈ చిత్రంలో 'హెవీ మేకప్'తో 4 గంటలపాటు నటించడానికి తనకు కమల్‌హాసన్ ప్రేరణగా ఉన్నారని పేర్కొన్నారు. తెరపై కథాపాత్ర మాత్రమే కనిపించాలని ఎప్పుడో ఆయన చెప్పిన విషయం ఇంకా తన మనసులో పదిలంగా ఉందన్నారు. కార్యక్రమంలో నటులు శివకార్తికేయన్, సూరి, అరుళ్‌దాస్, సింగం పులి, ఇళవరసు, ముత్తుకుమార్, రేవతి, దర్శకుల శరవణన్, అరుళ్‌రాజా కామరాజ్, శివ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

పారి ఇళవళగన్ సినిమా చిత్రీకరణ పూర్తి

చిత్రబృందం

చెన్నై: పారి ఇళవళగన్ కథ, స్క్రీన్‌ప్లే రాసి దర్శకత్వం వహించి కథానాయకుడిగా ఓ చిత్రంలో నటించగా రమ్య రంగనాథన్ నాయికగా నటించారు. ఇందులో సీనియర్ నటి రోజా, యూట్యూబర్ పరితాపంగో గోపి, ఇస్మత్ భాను, సుదర్శన్ గాంధీ తదితరులు ముఖ్యపాత్రల్లో నటించారు. చెన్నైలోని పెరంబూర్‌ను కేంద్రంగా చేసుకుని అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించినట్టు చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం చిత్రీకరణ పనులు పూర్తయినట్టు పేర్కొంది. ఈ వేసవి సెలవుల్లో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

హైకూ తొలి షెడ్యూల్ పూర్తి

సెట్స్‌పై దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: యువరాజ్ చిన్నసామి కథ రాసి దర్శకత్వం వహించిన చిత్రం 'హైకూ'. 'జో' చిత్ర దర్శకుడు హరిహరన్ రామ్ రాశారు. ఏగన్, శ్రీదేవి, అదిర్ అరుణ్, కలైవాణి భాస్కర్ తదితరులు ముఖ్య తారాగణం. చిత్రం తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయినట్లు నిర్మాణ సంస్థ విజన్ సినిమా హౌస్ ప్రకటించింది. త్వరలో రెండో చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుందని, ఇందులో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు వెల్లడించింది. చిత్రానికి డాక్టర్ అరుణాచలం, మేఘ్నా అరుణాచలం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సొగసైన సైకిల్ కారవాన్

కుటుంబంతో కేరళ నుంచి కశ్మీర్ పయనం

సైకిల్ కారవాన్ వద్ద భార్య, కుమారుడితో రేజిస్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కేరళకు చెందిన ఓ వ్యక్తి సైకిల్ కారవాన్ ఏర్పాటు చేసుకుని కుటుంబంతో కశ్మీర్ వరకు ప్రయాణం సాగిస్తున్నారు. కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతానికి చెందిన రేజిస్(36) సొంతఖర్చుతో నడిచే సైకిల్ కారవాన్ తయారు చేశారు. అందులో తన భార్య రజిని(31), కుమారుడు రియాతో కలిసి కశ్మీర్ వరకు ప్రయాణం చేపట్టారు. రోజుకు 20 నుంచి 30 కి.మీ ప్రయాణిస్తున్నారు. అందులోనే గ్యాస్ స్టౌ, విశ్రాంతి గది ఉన్నాయి. చార్జింగ్ తక్కువగా ఉంటే కాలితో తొక్కే సౌకర్యం ఉంది. వీరి ప్రయాణాన్ని గత జనవరి 6వ తేదీ కేరళ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి గణేశ్‌కుమార్ ప్రారంభించారు. ప్రయాణం తమిళనాడులోని కన్యాకుమారి, తిరునెల్వేలి, విరుదునగర్ మీదుగా సాగి సోమవారం దిండిగల్ జిల్లా నత్తం చేరుకుంది. సైకిల్ కారవాన్‌ని అక్కడి ప్రజలు ఆశ్చర్యంగా తిలకించారు. దీని గురించి రేజిస్ మాట్లాడుతూ.. భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం ఉందని, ప్రజల జీవనశైలి ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటుందని, వారి జీవన స్థితిగతులను తెలుసుకోవడం, దివ్యాంగులకు వీల్‌ఛైర్లు సహాయం చేయాలనే ఉద్దేశంతో ప్రయాణం చేస్తున్నట్లు తెలిపారు. రాత్రివేళ సురక్షితమైన చోటును ఎంపిక చేసుకుని నిద్రిస్తామని పేర్కొన్నారు.

ఎల్‌టీటీఈపై నిషేధాన్ని తొలగించాలన్న వైగో పిటిషన్ కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 1991లో శ్రీపెరంబుదూర్‌లో హత్యకు గురైన తర్వాత ఎల్‌టీటీఈపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిషేధాన్ని రెండేళ్లకోసారి పొడిగిస్తున్న నేపథ్యంలో 2012లో ఐదేళ్లకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అనంతరం నిషేధాన్ని తొలగించాలని కోరుతూ 2013లో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు జస్టిస్ అనిత సుమంత్, జస్టిస్ సుధీర్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున.. నిషేధ ఉత్తర్వులను సమర్థించే ట్రైబ్యునల్ విచారణలో తనను ఓ వాదిగా చేర్చాలని కోరుతూ వైగో దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు కొట్టివేసిందని, పిటిషనరుకి ఈ కేసుని దాఖలు చేసే అధికారం లేదని తెలిపారు. అనంతరం అన్ని తరఫు వాదనలు విన్న న్యాయమూర్తులు వైగో పిటిషన్‌ను కొట్టివేశారు.

సైదాపేట: జయలలిత విగ్రహానికి నివాళులర్పిస్తున్న పళనిసామి తదితరులు ● సైదాపేట: కార్యకర్తలకు మిఠాయిలు పంచుతూ...

ఘనంగా జయలలిత జయంతి

సైదాపేట, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలిత 78వ జయంతి సందర్భంగా మంగళవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలోని జయలలిత విగ్రహానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి, పార్టీ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ పుస్తకాలను విడుదల చేశారు. 78 కిలోల కేకు కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పేదలకు సాయం అందజేశారు. అదేవిధంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మహిళా విభాగం తరఫున అన్నదాన కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై ఐటీ ల్యాండ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈపీఎస్ పాల్గొన్నారు. * చెన్నై: దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా చెన్నై కామరాజర్ రోడ్డులోని తమిళనాడు ఉన్నత విద్యా మండలి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఆమె నిలువెత్తు విగ్రహం వద్ద అలంకరించిన చిత్రపటాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున తమిళాభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, పలువురు ఉన్నతాధికారులు పుష్పాంజలి ఘటించారు. * కాంచీపురం: అన్నాడీఎంకే కాంచీపురం దక్షిణ జిల్లా తరఫున జయలలిత జయంతిని మంగళవారం జిల్లా కార్యదర్శి వి. సోమసుందరం నేతృత్వంలో కాంచీపురం నగరంలో నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. * పళ్లిపట్టు: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో అన్నాడీఎంకే మధ్య యూనియన్ కార్యదర్శి జి.కృష్ణమనాయుడు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శులు పీడీ శ్రీనివాసన్, రవి, పట్టణ కార్యదర్శులు వేలు, ఏజీ రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు. * రాణిపేట జిల్లా సోళింగర్ పట్టణంలో అన్నాడీఎంకే కార్యకర్తలు, ప్రముఖులు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బస్టాండు వరకు చేరుకుని అక్కడున్న ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మాజీ ఎంపీ గోపాల్, జిల్లా కార్యదర్శి పార్తిబన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై: రాష్ట్ర ప్రభుత్వం తరఫున అంజలి ఘటిస్తున్న అధికారులు

ఘనంగా హయగ్రీవస్వామికి లక్షార్చన

లక్షార్చన నిర్వహిస్తున్న భట్టాచార్యులు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం విలక్కొలి పెరుమాళ్ ఆలయం సమీపంలోని ప్రసిద్ధ లక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయంలో ఏటా పది, ప్లస్‌టూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు బాగా రాయాలని స్వామివారికి లక్షార్చన నిర్వహిస్తారు. ఆ మేరకు మంగళవారం పరకాల మఠాధిపతి శ్రీమత్ పరకాల స్వామి అనుగ్రహంతో లక్షార్చన జరిపారు. పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 18మందికి గాయాలు

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా తిరుప్పణి కరిసల్‌కుళం ప్రాంతంలో ఓ పిచ్చికుక్క సోమవారం చిన్నపిల్లలు, మహిళలు సహా 18మందిని కరిచింది. ఇందులో 10ఏళ్ల బాలుడు హరితో పాటు చిత్ర, రోహిణి, సామి, కృష్ణన్ తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. భయాందోళనకు గురైన గ్రామస్థులు. . వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

సముద్రంలో గల్లంతై ఇద్దరు యువకుల మృతి

మామల్లపురం, న్యూస్‌టుడే: మహారాష్ట్రకు చెందిన ముగ్గురు యువకులు చెన్నైలోని ఓ ఐటీ కంపెనీలో శిక్షణ పొందుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం ముగ్గురు మామల్లపురం సమీపంలోని బీచ్‌కు వెళ్లారు. సముద్రంలో దిగి స్నానం చేస్తుండగా ముగ్గురు అలల్లో చిక్కుకుని గల్లంతయ్యారు. అందులో ఓ యువకుడు ప్రాణాలతో ఒడ్డుకు చేరుకోగా మయూర్ చౌదరి(21) అనే యువకుడు మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. మరో యువకుడు నరేంద్ర పటేల్ ఆచూకీ తెలియలేదు. సమాచారం మేరకు కోస్ట్ గార్డు సిబ్బంది డ్రోన్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నరేంద్ర పటేల్(23) మృతదేహం చెన్నై సమీపంలో తీరానికి చేరింది. ఆ ప్రాంతంలో పట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ సహా ఇద్దరు...

ట్రిప్లికేన్: తేని జిల్లా సీలైయంపట్టికి చెందిన చెల్లపాండి(36) డీఎంకే చిన్నమనూరు అర్బన్ యూత్ లీగ్ నిర్వాహకుడిగా ఉన్నారు. ఈయన ఉత్తమపాళైయానికి చెందిన స్నేహితురాలు వైదీశ్వరితో కలిసి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఉత్తమపాళైయం బయల్దేరారు. బైపాస్ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ప్రైవేటు బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వైదీశ్వరి అక్కడికక్కడే మృతిచెందింది. చెల్లపాండిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రాణాలు కోల్పయారు. ఉత్తమపాళైయం పోలీసులు బస్సు డ్రైవర్ తిరుచ్చి మణపారైకి చెందిన మురుగేశన్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో మందుల దుకాణం యజమాని...

వేలూర్: వేలూర్ జిల్లా అడుకంపారై సమీపం మూంజూరుపట్టు ప్రాంతానికి చెందిన ప్రశాంత్(34) స్థానికంగా మందుల దుకాణం నడుపుతున్నారు. సోమవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. మార్గంమధ్యలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను స్థానికులు అడుకంపారై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించాడని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏనుగు దాడిలో రైతు...


మాతేసామి (పాతచిత్రం)

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం కేర్‌మాళం ప్రాంతానికి చెందిన మాతేసామి(65) రైతు. ఈయన తన పొలంలో కోసిన మొక్కజొన్నను కుప్పగా పేర్చి ఉంచారు. ఆదివారం రాత్రి కాపలాకు వెళ్లారు. అర్ధరాత్రి అక్కడకొచ్చిన అడవి ఏనుగును తరమడానికి యత్నించగా ఏనుగు మాతేసామిపై దాడి చేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది సోమవారం ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కడంబూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్తు స్తంభాన్ని బైక్ ఢీకొట్టడంతో యువకుడు...

సంతోష్ (పాతచిత్రం)

గుమ్మిడిపూండి: తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం బిళ్లాకుప్పానికి చెందిన సంతోష్(19) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల కొనుగోలు చేసిన కొత్త ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి గుమ్మిడిపూండికి బయలుదేరాడు. సిప్కాట్ ప్రాంతంలో అదుపుతప్పిన వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. కిందపడి తీవ్రంగా గాయపడిన సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సిప్కాట్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పులి దాడిలో వ్యక్తి...

విల్లివాక్కం: నీలగిరి జిల్లా ఊటీ సమీపం చిన్నకాడిమందు ప్రాంతానికి చెందిన పుస్తాన్‌కుట్టన్(57) అనే వ్యక్తి మంగళవారం ఉదయం ఆ ప్రాంతంలోని అడవికి వెళ్లారు. పులి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న అటవీశాఖ సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఈ క్రమంలో వన్యప్రాణుల దాడులను అరికట్టాలని స్థానికులు సోలూర్ రోడ్డులో రాస్తారోకో చేపట్టారు.

వ్యాను ఢీకొని వృద్ధురాలు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూర్ జిల్లా తిరునింద్రవూరుకు చెందిన కలియనాయకి(87) సోమవారం రాత్రి అక్కడి వడివుడైఅమ్మవారి ఆలయానికి వెళ్లింది. దర్శనం అనంతరం ధ్వజ స్తంభం వద్ద కూర్చుని ఉండగా విద్యుత్తు దీపాల లోడుతో వెళ్తున్న వ్యాను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఆలయ సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. తిరునింద్రవూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను కళాశాల బస్సు ఢీకొట్టిన ఘటనలో విద్యార్థిని...

సెల్వబాల (పాతచిత్రం)

టీనగర్: తిరునెల్వేలి జిల్లా సుత్తమల్లి సమీపం నడుకల్లూరుకు చెందిన ఆటో డ్రైవర్ పెరుమాళ్ గత శుక్రవారం పాఠశాల విద్యార్థులను తన ఆటోలో ఎక్కించుకుని వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ కళాశాల బస్సు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటోను ఢీకొట్టింది. ఆటో రోడ్డు పక్కన బోల్తాపడగా అందులోని విద్యార్థినులు యశ్విని, సెల్వబాల, ముత్తు అరుళ్‌తో పాటు డ్రైవర్ పెరుమాళ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని తిరునెల్వేలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సెల్వబాల మరణించింది. పోలీసులు కళాశాల బస్సు డ్రైవరు ఇసక్కియప్పన్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో కారులో యువకుడు...

ఆర్కేనగర్: తంజావూర్ జిల్లా పేరావూరణి సమీపం కురువిక్కరంబై మడత్తువాసల్ ప్రాంతానికి చెందిన రాజన్ కుమారుడు మిథున్‌కుమార్(30). ఈయన సోమవారం ఉదయం తన కారులో పేరావూరణి దుకాణ వీధిలోని ఓ హోటల్‌కు వెళ్లారు. హోటల్ ముందు కారు ఆపి చాలాసేపయినా మిథున్‌కుమార్ కిందకు దిగలేదు. ఇంజిన్ చాలాసేపు ఆన్‌లోనే ఉండటాన్ని గమనించిన స్థానికులు దగ్గకు వెళ్లి చూడగా.. కారులో మిథున్ కుమార్ స్పృహకోల్పోయి ఉన్నాడు. వెంటనే పేరావూరణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి ఏడాది క్రితమే పెళ్లైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వ్యవహారంలో బాలిక, నానమ్మ హత్య

యువకుడి కోసం గాలింపు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూర్ జిల్లా పొళ్లాచ్చి సమీపం కొండేకొండన్‌పాళైయానికి చెందిన భూపతి మెకానిక్. ఈయనకు భార్య కలైయరసి, 16, 17ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలున్నారు. తల్లి తిరుమాత్తాళ్(65) వీరితోపాటే ఉంటోంది. నెగమం కంబళాంకరైకి చెందిన అభిషేక్(24), భూపతి కుమార్తె 16ఏళ్ల బాలిక మూడేళ్లుగా ప్రేమించుకున్నట్లు తెలుస్తోంది. అభిషేక్ తన తల్లిదండ్రులతో బాలిక ఇంటికెళ్లి పెళ్లి గురించి మాట్లాడాడు. అయితే బాలిక తల్లిదండ్రులు వారికి పెళ్లి వయసు రాలేదని, ప్రస్తుతం వద్దని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అభిషేక్ తనను పెళ్లి చేసుకోమని బాలికను వేధించసాగాడు. సోమవారం ఉదయం భూపతి పనికి వెళ్లారు. సాయంత్రం వారి ఇంటికెళ్లిన అభిషేక్.. తనను పెళ్లి చేసుకోమని బాలికతో వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహంలో బాలికను కత్తితో పొడిచాడు. అడ్డుకోబోయిన నానమ్మ, బాలిక అక్కపై కూడా దాడి చేసి పారిపోయాడు. కేకలు విన్న స్థానికులు అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ పొళ్లాచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు 16ఏళ్ల బాలిక, తిరుమాత్తాల్ మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

యాచకురాలిని హత్య చేసి అత్యాచారం

అన్నానగర్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో మహిళను హత్యచేసి అత్యాచారం చేసిన ఘటన ఈస్ట్ ముగపేర్‌లో చోటుచేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదురైకి చెందిన 26ఏళ్ల వ్యక్తి మద్యం మత్తులో తనతో శారీరకంగా గడపాలని ముగపేర్‌లోని చర్చ్ వీధిలో భిక్షాటన చేస్తున్న మహిళను ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో దాడి చేసి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. తీవ్రంగా గాయపడిన మహిళ స్పృహకోల్పోయింది. తర్వాత ఆమె మరణించినా దుండగుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. సమాచారం మేరకు మరుసటి రోజు ఉదయం పోలీసులు అక్కడకు వెళ్లగా మహిళ మృతదేహం పక్కనే దుండగుడు పడుకుని ఉన్నాడు. అతన్ని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటక వ్యాన్ బోల్తా.. 13మందికి గాయాలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో పర్యాటక వ్యాన్ బోల్తాపడి 13 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పుదుచ్చేరి తిరువండార్ ఆలయం ప్రాంతంలోని విలుపురం-దిండివనం హైవేలో వంతెన ఉంది. ఈ వంతెనపై రోడ్డు పాడవడంతో మరమ్మతు పనుల కోసం రోడ్డు మధ్యలో బారికేడ్లను ఉంచారు. ఇదిలా ఉండగా పుదుచ్చేరి నుంచి విలుపురం మీదుగా కోవైకు సోమవారం అర్ధరాత్రి ఓ పర్యాటక వ్యాన్ బయలుదేరింది. తిరువండార్ ఆలయం వంతెన వద్ద వస్తుండగా అదుపుతప్పిన వ్యాను బారికేడ్లను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న ఇద్దరు చిన్నారులు సహా 13మంది గాయపడ్డారు. వారిని స్థానికులు పుదుచ్చేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విల్లియనూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాన్లీ ఆస్పత్రిలో పైకప్పు కూలి డీన్ సహాయకురాలికి...

ఆర్కేనగర్: చెన్నై రాయపురం ప్రాంతంలోని ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న పాత భవనాలను పునరుద్ధరించే పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రి డీన్ గదిలోని పైకప్పు సోమవారం సాయంత్రం ఉన్నట్టుండి కూలింది. దీంతో డీన్ సహాయకురాలు కావ్య గాయపడింది. వెంటనే ఆమెను చికిత్స కోసం తరలించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ఈరోడు జిల్లా తాళవాడికి చెందిన మహేశ్ అనే యువకుడు కోయంబత్తూరులో నివాసం ఉంటూ గాంధీపురంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. అదే దుకాణంలో కోయంబత్తూరుకి చెందిన 20ఏళ్ల దివ్యాంగురాలు, ఆమె తల్లి పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా యువతికి ఆదివారం సెలవు కావడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం ఇంటికెళ్లిన మహేశ్ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కోయంబత్తూరు సెంట్రల్ ఉమెన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి మహేశ్‌ను మంగళవారం అరెస్టు చేశారు.

డిజిటల్ అరెస్టు పేరిట మోసాలకు పాల్పడుతున్న ఆంధ్రాకు చెందిన ఐదుగురు...

క్రైం కార్నర్

అరెస్టయిన నిందితులు

అరక్కోణం: డిజిటల్ అరెస్టు పేరిట మోసానికి పాల్పడిన కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు నిందితులను రాణిపేట జిల్లా క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ అయ్యామాన్ జమాల్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... డిజిటల్ అరెస్టుల పేరుతో ఓ ముఠా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను, పలు ప్రైవేటు కంపెనీల మేనేజర్లను బెదిరించి రూ.లక్షల్లో మోసానికి పాల్పడినట్లు గత ఏడాది డిసెంబరు 16వ తేదీ తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఆ మేరకు 5 ప్రత్యేక పోలీసు బృందాలు, సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా... 542 సిమ్‌కార్డులను ఉపయోగించి మోసానికి పాల్పడినట్లు తేలిందన్నారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సానాపతి ప్రసాద్(28), చల్లా సందీప్‌కుమార్(27), తాళ్ల రామకృష్ణన్(29), సింగంపల్లి గణేశ్(36), పప్పాల కిశోర్‌కుమార్(36)ను అరెస్టు చేశామని, ఈ కేసులో సంబంధమున్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఎవరైనా బెదిరిస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబరు 1930ని సంప్రదించాలని సూచించారు.

నగదు మోసం కేసులో ఇద్దరు నిందితులు...

సురేష్‌కుమార్, అరుళప్పన్

ఆవడి: చెన్నై ఆవడి సమీపం గోవర్ధనగిరి ప్రాంతానికి చెందిన మస్తాన్ షరీఫ్ అనే వ్యక్తి వాట్సాప్‌లో వచ్చిన ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రకటన చూసి అందులో పెట్టుబడి పెట్టి రూ.64లక్షలు పోగొట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో ఆవడి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి విళ్లుపురం జిల్లా దిండివనంకు చెందిన అరుళప్పన్, తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోటకు చెందిన సురేష్ కుమార్‌ను సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు తరలించారు. ఈ కేసులో సంబంధమున్న మరికొందరి కోసం గాలిస్తున్నారు.

దోపిడీకి పాల్పడిన ముగ్గురు...

గుమ్మిడిపూండి: తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం పెద్ద పులియూరులో ప్రైవేటు కర్మాగారం ఉంది. బిహార్‌కు చెందిన లలిత్ నారాయణన్, సంజిత్ మండల్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మాదరపాక్కం బయలుదేరారు. పూవలంబేడులో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు దాడి చేసి రూ.5 వేల నగదు, 2 సెల్‌ఫోన్లు దోపిడీ చేసి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పాదిరివేడు పోలీసులు దర్యాప్తు చేపట్టి అమరంబేడుకు చెందిన దినకరన్, సిరువాడాకు చెందిన గౌతమ్, తానిపూండికి చెందిన గౌతమ్‌ను మంగళవారం అరెస్టు చేశారు.

పరారీ నిందితుడు...

ఆవడి: చెన్నై సైదాపేట పోలీస్ స్టేషన్‌లో 2022లో నమోదైన హత్యాయత్నం కేసులో సైదాపేటకు చెందిన గౌతమ్ సహా పలువురు నిందితులు అరెస్టయ్యారు. వారిలో బెయిల్‌పై విడుదలైన గౌతమ్ కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో కోర్టు అతనికి ఈ నెల 4న అరెస్టు వారెంటు జారీ చేసింది. ఆ మేరకు పోలీసులు గాలించి గౌతమ్‌ను సోమవారం అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో ఎర్రచందనం దుంగల స్వాధీనం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ జిల్లా కుళిత్తలై సమీపం శివయం పంచాయతీ కోడంగిపట్టి గ్రామానికి చెందిన తిరువేంగడం(64) విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి. ఇదిలా ఉండగా ఆయన ఇంట్లో ఎర్రచందనం దుంగలు దాచినట్టు సోమవారం సంబంధిత అధికారులకు సమాచారం అందింది. ఆ మేరకు 10మందితో కూడిన అధికారుల బృందం తిరువేంగడం ఇంట్లో తనిఖీ చేపట్టింది. ఇంటి ప్రాంగణంలో నిలిపిన లారీలో ఉన్న టన్నుల బరువున్న ఎర్రచందనం దుంగలను గుర్తించారు. లారీ సహా స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఆరుగురికి రెండు జీవిత ఖైదు శిక్షలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా తేన్‌గనికోట సమీపం కండగానప్పళ్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణన్(34) రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈయన వద్ద స్నేహితుడు అదే ప్రాంతానికి చెందిన మహేష్‌కుమార్ రూ.30 లక్షలు అప్పు తీసుకున్నట్లు తెలుస్తోంది. చెప్పిన సమయానికి అప్పు తిరిగి చెల్లించకపోవడంతో లక్ష్మీనారాయణన్ ఒత్తిడి చేసినట్టు సమాచారం. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. 2017లో లక్ష్మీనారాయణన్‌ని ఓ ముఠా కారులో కిడ్నాప్ చేసి తేన్‌గనిక్కోట కోర్టు సమీపంలో హత్య చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి మహేష్‌కుమార్ సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు సోమవారం హోసూర్‌లోని అదనపు జిల్లా బెంచ్ కోర్టులో విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో మహేష్‌కుమార్, రాజ్‌కుమార్, వెంకటాచలపతి, హరీష్, సురేష్, మరో సురేష్‌కి రెండు జీవిత ఖైదు శిక్షలతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో దోషికి 20ఏళ్ల జైలు...

అన్నానగర్: చెన్నై అన్నానగర్ ప్రాంతానికి చెందిన 9ఏళ్ల బాలికపై 2020లో 55ఏళ్ల వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అన్నానగర్ ఆల్ ఉమెన్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో కేసు విచారణ సోమవారం పోక్సో కోర్టులో పూర్తయింది. నేరం రుజువు కావడంతో దోషికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా, నేరానికి సహకరించిన అతని కుమారుడికి రూ.1000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

వీసీకే నేతపై హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఏడేళ్లు...

ఆర్కేనగర్: పుదుచ్చేరి కరియమానిక్కం ప్రాంతానికి చెందిన విల్లెంది(40) వీసీకే నిర్వాహకుడిగా వ్యవహరించారు. ఈయనకు అదే ప్రాంతానికి చెందిన రౌడీ వినాయకమూర్తి(42)తో గొడవలున్నాయి. ఇదిలా ఉండగా విల్లెంది 2008 జులై 9న బంధువులతో కలిసి నొట్టపాక్కం ప్రాంతంలో నిలబడి ఉండగా వినాయకమూర్తి, అతని అనుచరులు భాగ్యరాజ్, శ్రీధర్, కృష్ణన్, కుప్పన్ మారణాయుధాలతో దాడి చేశారు. ఈ కేసులో వినాయకమూర్తి సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పుదుచ్చేరి క్రిమినల్ కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలో విచారణ సోమవారం ముగిసింది. నేరం రుజువు కావడంతో వినాయకమూర్తికి ఏడేళ్ల జైలు శిక్ష రూ. 5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. ఈ కేసులో మిగిలిన నలుగురిని విడుదల చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

ప్రమాణాలు పెంపు..
పరిశోధనలు బలోపేతం

'న్యూస్‌టుడే'తో మహిళా వర్సిటీ వీసీ వి.ఉమ

ఉమ

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో వందలోపు స్థానం సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, విద్యా ప్రమాణాలు, పరిశోధనల బలోపేతం, విద్యార్థినుల ప్రవేశాల పెంపు, అకడమిక్ ప్రతిష్ఠ పెంచడం వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.ఉమ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించేలా

వర్సిటీలో చాలామంది గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. మంచి ఉద్యోగాలు సాధించాలంటే ఆంగ్ల భాషపై పట్టు ఉండాలి. ఇంటర్వ్యూలను ఎదుర్కొనడానికి అమెరికా నుంచి ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఫెలో ఒకరు వర్సిటీలో పని చేస్తున్నారు. ఆమె శిక్షణతో ఎంతో మార్పు వచ్చింది.

నాణ్యమైన జర్నల్స్‌కు అవకాశం

విదేశీ విద్యార్థినులు వర్సిటీలో చదువుకోడానికి, పరిశోధనలు కొనసాగించడానికి అవకాశం కల్పిస్తున్నాం. ఇంటర్నేషనల్ హాస్టల్ నిర్మిస్తున్నాం. జర్నల్స్‌ను ప్రోత్సహించేందుకు, పబ్లికేషన్లను పెంచేందుకు గతేడాది గ్యానవి, గమనం పేరుతో జర్నల్స్ ప్రారంభించాం. మన దేశంతోపాటు ఇతర దేశాల నుంచి ప్రచురణ కోసం జర్నల్స్ వస్తున్నాయి.

నూతన భవనాలు

సెరికల్చర్, బోటనీ, జువాలజీ అధ్యాపకులు, విద్యార్థినులు పరిశోధనలు చేసుకోవడానికి వీలుగా నానో టెక్నాలజీ భవనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఫార్మసీ, బయోటెక్నాలజీ విభాగాల కోసం డ్రగ్ డెలివరీ, డ్రగ్ డిస్కవరీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవనం, సోషల్ సైన్సెస్ పరిశోధనల కోసం సోషల్ ఇన్నోవేషన్ సెంటర్ అండ్ ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ భవనం అందుబాటులోకి రానుంది. పరిశోధనలు చేసుకోవడానికి రూ.20 కోట్ల విలువైన పరికరాలు కొనుగోలు చేయనున్నాం.

పీహెచ్‌డీలు త్వరగా పూర్తయ్యేలా..

గతంలో పలు కారణాలతో వర్సిటీలో పీహెచ్‌డీలు పూర్తిచేయడానికి ఎక్కువకాలం పట్టేది. చాలామంది వివాహాలు, కుటుంబ బాధ్యతలు తదితర కారణాలతో పీహెచ్‌డీలు త్వరగా పూర్తిచేయడం లేదు. వారితో మాట్లాడి సమయానికి పూర్తయ్యేలా గతేడాది నుంచే చర్యలు తీసుకున్నాం. పరిశోధకులు, గైడ్లతో సమావేశం నిర్వహించి ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలనే నిబంధన పెట్టాం. దీంతో 2025లో 78 మంది పూర్తిచేశారు.

పబ్లికేషన్ల పెంపునకు చర్యలు

గతేడాది నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో వర్సిటీ 101-150 ర్యాంకు సాధించింది. 2027లోగా వందలోపు ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో వీసీగా బాధ్యతలు తీసుకోగానే సమీక్షించాం. ప్రాజెక్టులు, పబ్లికేషన్లు, పీహెచ్‌డీల్లో వెనుకబడ్డాం. దీన్ని అధిగమించేందుకు పీఎం ఉష సాఫ్ట్ కాంపోనెంట్ యాక్టివిటీ-12 కింద రూ.5.50 కోట్లు ప్రాజెక్టులకు మంజూరు చేశాం.

ఇంటర్ ద్వితీయ పరీక్షలకు 29,152 మంది హాజరు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 84 కేంద్రాల్లో జరిగిన 28,516 మంది విద్యార్థులకుగాను 28,096 మంది హాజరయ్యారు. మరో 14 కేంద్రాల్లో జరిగిన ఒకేషనల్ పరీక్షలకు 1,056 మంది హాజరయ్యారు. బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లం పరీక్ష జరగనుంది.

పరీక్షా కేంద్రంలోకి వెళ్లడానికి విద్యార్థుల బారులు

మృత్యువు మాటేసి..
జీవితాలను కాటేసి

రహదారులపై మృత్యుఘోష • మూడేళ్లలో 1,500 మందికి పైగా బలి

ఈనాడు డిజిటల్, తిరుపతి: పుణ్యక్షేత్రాల దర్శనానికి వచ్చే భక్తులు, నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులతో కళకళలాడాల్సిన ఉమ్మడి జిల్లా రహదారులు రక్తంతో తడిసి ముద్దవుతున్నాయి. ఎటు చూసినా మృత్యువు మాటువేసిన 'బ్లాక్ స్పాట్లు'. . ఎటు వెళ్లినా 'యమపాశాల్లాంటి' మలుపులు. ఏటా వందలాది మంది మృత్యువాత పడుతూనే ఉన్నారు. ఇవి కేవలం ప్రమాదాలు కాదు.. వ్యవస్థీకృత నిర్లక్ష్యం..

• 2023 నుంచి 2025 వరకు జిల్లాలో ఏకంగా 3,368 ప్రమాదాలు జరగగా, 1,600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాదాలకు ప్రధాన కారణాలు..

- హైవే మధ్యలో డివైడర్లను ఇష్టానుసారంగా తొలగించి ద్విచక్ర వాహనాలు దాటడం.
- భాకరపేట ఘాట్ రోడ్డు వంటి చోట్ల సరైన రేడియస్ లేని మలుపులు, దెబ్బతిన్న క్రాష్ బారియర్లు.
- రాత్రి వేళల్లో జంక్షన్ల వద్ద సరైన వెలుతురు లేక రోడ్డు దాటే పాదచారులు ప్రమాదానికి గురవ్వడం.
- హైవే పక్కన హోటళ్ల (దాబాల) వద్ద లారీలను నిలపడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొట్టడం.

నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో వకుల మాత ఆలయ మార్గంలో బ్లాక్ స్పాట్

తిరుపతి జిల్లా బ్లాక్ స్పాట్లలో ..

	2023	2024	2025
ప్రమాదాల సంఖ్య	141	140	73
మరణాలు	85	73	28

పౌర స్పృహ పెరగాలి!

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యం. పౌర స్పృహ ఉండాలి. 10 ప్రమాదాల్లో కనీసం 4 నుంచి 5 రోడ్డు డిజైన్ లోపాల వల్లే జరుగుతున్నాయి. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక మొబైల్ వెహికల్, అంబులెన్స్ ఉండాలి. పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు, ప్రజలు కలిసి బాధ్యతగా ఉంటేనే ఈ మరణాలను అరికట్టగలం.

– సుబ్బరాయుడు, ఎస్పీ, తిరుపతి

మానవ తప్పిదాలే ఎక్కువ..

• అతి వేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనం నడపడం ఇలా 60-70 శాతం ప్రమాదానికి కారణాలు. • గత మూడేళ్లలో జరిగిన మరణాల్లో దాదాపు 50 శాతం ద్విచక్ర వాహనదారులవే. పది మందిలో ఎనిమిది మంది యువకుల ప్రాణాలే గాల్లో కలిసిపోతున్నాయి.

• జిల్లాలో చాలా చోట్ల గ్రామీణ రోడ్లు నేరుగా హైవేలోకి కలుస్తున్నాయి. 100 కి.మీ వేగంతో వచ్చే వాహనాన్ని 20 కి.మీ వేగంతో వచ్చే స్కూటర్ ఢీకొట్టడం ఇక్కడ సాధారణమైపోయింది.

• గూడూరు రూరల్, నాయుడుపేట, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి పరిసరాల్లో ఏకంగా 48 ప్రధాన బ్లాక్ స్పాట్లను గుర్తించారు. వీటిలో ఆర్.సి. పురం జంక్షన్, భాకరపేట ఘాట్ రోడ్డు, తిరుచానూరు క్రాస్ వంటివి నిత్యం రక్తమోడుతున్నాయి.

ఎక్కడెక్కడంటే..

• ఈ ప్రాంతాల్లో గత మూడేళ్లలో 354 ప్రమాదాలు జరగ్గా..186 మంది మృత్యువాత పడ్డారు.

• ఎన్ హెచ్ -16 (కోల్‌కతా హైవే)లో చిల్లకూరు బైపాస్, ఆదిశంకర కాలేజీ, వరగాలి క్రాస్, పండ్లూరు, శ్రీసిటీ 'వీ' పాయింట్, తడ చెక్ పోస్ట్.

• ఎన్ హెచ్-71(నాయుడుపేట హైవే), ఎన్ హెచ్-140 (చిత్తూరు రోడ్)లో, ఎన్ హెచ్-716 (చెన్నై రోడ్) లో .. తదితర ప్రాంతాల్లో ఉన్నాయి..

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: నేరుగా వచ్చే భక్తులకు పది గంటల్లో, రూ.300 టికెట్లు కలిగినవారికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద మంగళవారం 12 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి పది గంటల వరకు దర్శనం కానుంది.

పది పరీక్షలు సమర్థంగా నిర్వహించాలి: కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: మార్చి 16 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రశ్నపత్రాలను తీసుకెళ్లేటప్పుడు, కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు కేంద్రాల వద్ద 144 అమలు చేయాలని ఆదేశించారు. చూచిరాతలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు తగినన్ని ఉండాలని, కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్‌లు, విద్యుత్ సౌకర్యం, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

నగరి ఆర్డీవోగా అనుపమ

ఈనాడు– తిరుపతి, నగరి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతి పొందిన పలువురు డిప్యూటీ కలెక్టర్లతో పాటు మరికొందరిని బదిలీ చేస్తూ సీఎస్ విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేస్తోన్న అనుపమను నగరి ఆర్డీవోగా నియమించారు. ప్రస్తుతం నగరి ఆర్డీవోగా ఉన్న భవానీ శంకరికి పోస్టింగ్ ఇవ్వలేదు. 2018 గ్రూప్- 1 బ్యాచ్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్లు.. ప్రాధాన్యత ఉన్న పోస్టుల్లో పనిచేస్తుంటే వారిని బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈమెను బదిలీ చేశారు. పరిశ్రమల శాఖలో విధులు నిర్వర్తిస్తోన్న జి.విజయలక్ష్మిని విశాఖ- చెన్నై పారిశ్రామిక నడవా (వీసీఐసీ) ఎస్‌డీసీగా నియమించారు. పదోన్నతి పొందిన ఎన్.చంద్రశేఖర్‌రెడ్డిని మదనపల్లెలోని కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ, ఎంవీఎస్ నారాయణరెడ్డిని పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మాధవ కృష్ణారెడ్డికి మదనపల్లె హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతిలోని లీగల్ సెల్ ఎస్‌డీసీగా అనురాధను నియమించారు.

ప్రియుడితో కలిసి రెండున్నరేళ్ల కుమార్తె హత్య

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: రెండో పెళ్లికి అడ్డుగా ఉందని కుమార్తెను ప్రియుడితో కలిసి కడతేర్చింది ఓ తల్లి. తిరుపతి ఆటోనగర్‌కు చెందిన నాగరత్నమ్మ కుమార్తె ఆశాలత (19)కు నాలుగేళ్ల కిందట రాజేష్‌తో వివాహమైంది. వారికి రెండున్నరేళ్ల కుమార్తె దుర్గ ఉంది. భర్తతో మనస్పర్థల కారణంగా విడిపోయి ఆశాలత కుమార్తెతో కలిసి స్థానిక పోస్టల్ కాలనీలో ఉంటుంది. అదే సమయంలో ఏర్పేడు మండలం చెన్నంపల్లికి చెందిన రెడ్డికుమార్‌తో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. వారిద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అడ్డుగా ఉన్న మొదటి భర్త కుమార్తె దుర్గను అడ్డు తొలగించుకోవాలని అనుకున్నారు. పథకం ప్రకారం చిన్నారిని హతమార్చి రెడ్డికుమార్ స్వగ్రామానికి సమీపంలోని నదిలో పూడ్చి వేసినట్లు సమాచారం. అప్పటి నుంచి ఆశాలత కనిపించకుండా పోయింది. ఈ నెల 19న ఆశాలత తల్లి నాగరత్నమ్మ తన కుమార్తె, మనవరాలు కనిపించడం లేదని తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు అసలు విషయం వెలుగులోకి తెచ్చారు. పూర్తి వివరాలు బుధవారం వెల్లడించే అవకాశం ఉంది.

విహారిద్దాం.. విందారగిద్దాం

తిరుపతి నగరంలో సాయంత్రమైతే చాలామంది ఆహ్లాదం కోసం కుటుంబ సభ్యులతో పార్కులు, ఆలయాలు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు ఏదైనా హోటల్‌కి వెళ్లాలని అనుకుంటారు. ఇలాంటి వారి కోసమే నగరపాలక సంస్థ తాత్కాలిక కార్యాలయం ఎదురుగా అచ్యుత దేవరాయల మాస్టర్ ప్లాన్ మార్గంలో రూ.1.38 కోట్లతో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తోంది. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంతా సవ్యంగా జరిగితే 20 రోజుల్లో అందుబాటులోకి వస్తుంది. 14 కంటైనర్లు.. 6 టెన్సిల్స్ రూఫింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వాటర్ ఫౌంటెయిన్, సెల్ఫీ పాయింట్, ఆర్చి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇంజినీర్లు శరత్, మహేష్ తెలిపారు. – ఈనాడు, తిరుపతి

3న కాణిపాకం ఆలయం మూసివేత

కాణిపాకం, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా... చిత్తూరు కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయాన్ని మార్చి 3న మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో పెంచల కిశోర్ మంగళవారం తెలిపారు. గ్రహణం నేపథ్యంలో 3వ తేదీ ఉదయం 6.20 నిమిషాలకు ఆలయాన్ని మూసివేసి.. గ్రహణ మోక్షానంతరం సాయంత్రం 6.47 నిమిషాలకు ఆలయాన్ని తెరచి సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యాహవచనం కార్యక్రమాలను ఏకాంతంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మార్చి 4న ఉదయం నుంచి ఆలయంలో స్వామివారి దర్శనం, ఆర్జిత సేవలు, ఇతర కార్యక్రమాలను యథావిధిగా నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రహణ కాలానికి 9 గంటలకు ముందు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమేల?

• సీఎస్ఎస్‌లో వెనుకంజలో చిత్తూరు
• తిరుపతి జిల్లాలో 93 శాతం ఖర్చు

ఈనాడు– చిత్తూరు: 'కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్)ను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోండి.. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను ఎప్పటికప్పుడు విడుదల చేస్తాం.. ఈవిషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించొద్దు.. తరచూ ఈ అంశంపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తా' ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. అధికారులతో సమావేశాలు నిర్వహించినప్పుడల్లా చేసే వ్యాఖ్యలు. ఏ శాఖ వెనుకపడిందో ఆయన తరచూ పరిశీలిస్తున్నారు. జిల్లాల స్థాయిలోనూ తరచూ కలెక్టర్లకు దీనిపై దిశానిర్దేశం చేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఏటా అధిక సంఖ్యలో నిధులు వస్తోన్నా గత వైకాపా ప్రభుత్వంలో వీటి వినియోగంపై దృష్టి సారించలేదు. వచ్చిన నిధులను వేర్వేరు కార్యక్రమాలకు మళ్లించి చోద్యం చూశారు. తర్వాతి దశ నిధుల విడుదలకు వినియోగ ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉండగా అవి పంపడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు తరచూ సమీక్ష జరుపుతున్నా తిరుపతి జిల్లా ఈవిషయంలో ముందంజలో ఉండగా చిత్తూరు కొంత వెనుకపడింది. వీలైనంత త్వరగా ఖర్చు చేస్తే అభివృద్ధి కార్యకలాపాలు జోరందుకునే అవకాశముంది.

వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	నిధులు	ఖర్చు	శాతం
తిరుపతి	188	175	93
చిత్తూరు	199	146	73

పంచాయతీరాజ్ విభాగంలోనే తక్కువగా

చిత్తూరు జిల్లాలో గ్రామీణ జనాభా ఎక్కువ. వ్యవసాయ, అనుబంధ రంగాలపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. పారిశ్రామిక, సేవా రంగాల నుంచి వచ్చే ఆదాయమూ తక్కువే. కల్పించే ఉపాధీ నామమాత్రమే. తిరుపతి జిల్లాలో సేవా రంగం ద్వారా ఎక్కువ మందికి ఉద్యోగాలు వస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో పంచాయతీరాజ్ విభాగంలోనే నిధుల ఖర్చు తక్కువగా ఉంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి మరో రూ.21కోట్ల వరకు వెచ్చించే అవకాశముంది. వచ్చే నెల 15లోపు వీటిని ఖర్చు చేస్తామని ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు.

బోధన రుసుము విడుదల

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉన్నత విద్య అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు బోధన రుసుమును కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇప్పటికే బోధన రుసుం విడుదల కాగా.. తాజాగా చిత్తూరు, తిరుపతి జిల్లాలోని బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ విద్యార్థులు 36,735 మందికి రూ.70.96 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తం త్వరలో కళాశాలల ఖాతాల్లో జమ కానుంది. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశాయి. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో మంత్రి లోకేశ్ ఉన్నత విద్యా, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించి బోధన రుసుం విడుదల చేయించారు.

వివరాలిలా..

జిల్లా	విద్యార్థులు	విడుదలైంది (రూ.కోట్లలో)
చిత్తూరు	14544	27.69
తిరుపతి	22191	43.26

ఎస్సీ విద్యార్థులకు గతంలోనే..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బోధన రుసుమును కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఎస్సీలకు 60 శాతం, ఎస్టీలకు 75 శాతం విడుదల చేస్తుంది. గతంలో కేంద్రం విడుదల చేసే మొత్తానికి రాష్ట్ర వాటాను సకాలంలో విడుదల చేయకుండా ఇతర పథకాలకు మళ్లించే వారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఇస్తే గానీ, తమ వాటాను విడుదల చేయబోమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఎప్పటికప్పుడు రాష్ట్ర వాటాను అందిస్తోంది.

శ్రీకాళహస్తి ఈవో బాపిరెడ్డి బదిలీ

ఛైర్మన్‌తో స్పర్థలే కారణమా..! • నూతన ఈవోగా బి.కె.వెంకటేశులు

బాపిరెడ్డి | వెంకటేశులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయిన వెంటనే ఆలయ ఈవో టి.బాపిరెడ్డి బదిలీ కావడం చర్చనీయాంశమైంది. ఈయన్ను విజయవాడలోని ఏపీసీఆర్‌డీఏకు పంపారు. ఆయన స్థానంలో గాలేరు-నగరి సుజల స్రవంతి స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.కె.వెంకటేశులును ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర స్థాయిలో గుర్తింపు..

ఆలయ ఈవోగా బాపిరెడ్డి 2024 నవంబరు 3న బాధ్యతలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం నిర్దేశిత సూచనల మేరకు 16 నెలల కాలంలో సంతృప్తికర దర్శనం, ప్రసాదాల తయారీ, పారిశుద్ధ్య నిర్వహణ, కనీస వసతుల కల్పన విభాగాలకు సంబంధించి నెలవారీ గ్రేడింగ్‌లో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ప్రథమ స్థానంలో నిలుపుతూ వచ్చారు. రెండు దఫాలు వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఇంట గెలవక..

బోర్డు ఛైర్మన్‌తో సఖ్యత లేకపోవడమే.. బాపిరెడ్డి బదిలీకి ప్రధాన కారణమని అంటున్నారు. ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం అయ్యాక ప్రత్యేక గది, వసతుల కల్పనపై దృష్టిసారించలేదు. ఛైర్మన్ ఛాంబర్‌కు ఉన్న నిఘా కెమెరాల పర్యవేక్షణను తొలగించారు. ఈ ఘటన ఛైర్మన్, ఈవోకు మధ్య స్పర్థలకు ప్రధాన కారణమైంది. అప్పట్లోనే ఈ అంశం రాష్ట్ర పౌరసరఫరాలు, దేవాదాయ శాఖ మంత్రుల వద్దకు వెళ్లింది. వారు స్వయంగా ఛైర్మన్‌ను పిలిచి మాట్లాడారు. ఈ వ్యవహారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి కూడా వెళ్లింది. అప్పట్లోనే బదిలీ అవుతారని విస్తృతంగా ప్రచారం జరిగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు దగ్గరపడిన నేపథ్యంలో ప్రభుత్వం బదిలీ చేపట్టలేదు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన వెంటనే బదిలీ కావడంతో అప్పటి వార్తలకు బలం చేకూరింది.

WANTED
తిరుపతిలో ప్రముఖ విద్యాసంస్థకి కౌన్సిలర్స్ & ఫీల్డ్ అనుభవం కలిగిన PROలు కావలెను. జీతం + ఇన్సెంటివ్
No.6, PDS Complex, Prakasam Road, TIRUPATI
70131 19918

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

Grand Inauguration
25.02.2026 Wednesday Time : 10.29 am
UDAY HELIOS HOSPITALS
PATIENT FIRST
Opp. Devendra Theatre (CS Cinemas), Ashok Nagar, Tirupati - 517501.
0877-2226369
7997776369
రాయలసీమలోనే మొట్టమొదటి సారిగా ఆర్థో విభాగంలో అత్యాధునిక ఫుల్లీ ఆటోమేటెడ్ మిస్సో రోబోటిక్ ద్వారా ఎముకలు, నరముల సంబంధిత వైద్యముతో పాటు అధునాతన వైద్య సదుపాయాలతో మన తిరుపతిలో
ఉదయ్ హీలియోస్ హాస్పిటల్స్
ద్వారా అందుబాటులోకి తీసుకువస్తున్న సందర్భంగా ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న అతిరథ మహారథులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, మా హృదయపూర్వక ఆహ్వానము

Dr. Udaya Bhaskar Tupakula
MBBS., MS(Ortho), (NIMS,Hyd)
FIJR (Sunshine, Hyd),
FIRJR (Germany)
Managing Director,
Chief Robotic Joint Replacement & Orthopaedic Surgeon

OUR CORE TEAM
Dr. Udaya Bhaskar Tupakula, MBBS, MS (Ortho) (NIMS, Hyd), FIJR (SunShine Hyd), FIRJR (Germany)
Dr. Hrudayesh Adini, MBBS, MD, IDCCM, Critical Care & Anaesthesiology
Dr. Lakshmi Tilak S., MBBS.MS.MCh(Neurosurgery. SRMC. Chennai), Critical Neurosurgeon
Dr. Siva Sankar Menigi, MBBS, DNB, Consultant Anaesthesiologist
Dr. Lokeshwara Prasad R., MBBS, MD (General Medicine), Consultant General Physician
Dr. Haritha Pemma, MBBS, Duty Medical Officer

అందుబాటులోని విభాగాలు
ఆర్థోపెడిక్స్ • న్యూరో సర్జరీ • ఐసీయూ & క్రిటికల్ కేర్ • జనరల్ మెడిసిన్ • జనరల్ & ల్యాపరోస్కోపిక్ సర్జరీ • గైనకాలజీ & ప్రసూతి విభాగం • ప్లాస్టిక్ సర్జరీ • యూరాలజీ • న్యూరాలజీ • మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ • మెడికల్ ఆంకాలజీ • రుమటాలజీ • రేడియాలజీ • డెర్మటాలజీ • ప్యాథాలజీ • డెంటిస్ట్రీ
24/7 Emergency Services

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

కుమార్తెతో హీరోయిన్ రవీనా టాండన్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని ప్రముఖ వ్యాపారవేత్త లగడపాటి రాజగోపాల్, పుదుచ్చేరి ఎస్‌ ఆర్ముగం, తెదేపా ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, హీరోయిన్ రవీనాటాండన్ కుమార్తె రషా టాండన్ తదితరులు దర్శించుకున్నారు.

ఐసర్‌లో పరిశోధనలపై అవగాహన

మూడురోజుల పాటు సైన్స్ వేడుకలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్)లో ఈ నెల 28 నుంచి మార్చి 2వరకు జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. పదేళ్లుగా జరుపుకొన్నట్లుగానే ఈ ఏడాది సైతం దేశవ్యాప్తంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 200కు పైబడి ఇంటరాక్టివ్ కార్యకలాపాలు, ఆకర్షణీయమైన ప్రయోగాలు ప్రదర్శించనున్నారు. గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, భూమి, వాతావరణ శాస్త్రాలు, కంప్యూటర్ సైన్స్‌పై ప్రదర్శనలు ఉంటాయి. ప్రముఖ శాస్త్రవేత్తల ప్రసంగాలు, పరిశోధన అవకాశాలు, విమర్శనాత్మక ఆలోచనలు, అభిప్రాయాలు వివరించనున్నారు. బోస్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కౌస్తవ్ సన్యాల్, ఐఐటీ బాంబే రసాయనశాస్త్ర డీన్ ప్రొఫెసర్ ..., ఎన్ఎస్ఐటీ ప్రభుత్వ వైద్య కళాశాల సర్జరీ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ధనంజయశర్మ హాజరు కానున్నారు.

భూసేకరణ, అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఇతర పారిశ్రామిక అభివృద్ధి పనులతోపాటు భూసేకరణ పనులను నిర్ణీత గడువులో పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం జేసీ ఆర్.గోవిందరావుతో కలిసి సమీక్షించారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591)
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్-530020, ఫోన్: 8332956773, 7095199455

హైపొథికేషన్ (P& M / STOCK) క్రింద డిమాండ్ నోటీసు

టు:
ఋణగ్రహీత : M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి మల్లిన శ్రీ దేవి, #12-1-10, ఇండస్ట్రియల్ ఏరియా, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
హామీదారులు/పార్టనర్స్ : 1) శ్రీమతి మల్లిన శ్రీ దేవి, భర్త : వెంకట శ్రీహరి రావు, 5-3-18, మెరక వీధి, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
2) శ్రీమతి మల్లిన లక్ష్మి తులసి, భర్త : ఎమ్. సత్యనారాయణ, 5-3-18, మెరక వీధి, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
3) శ్రీమతి పెమ్మసాని అన్నపూర్ణ, భర్త : మధు ప్రతాప్, డి నెం.18-03-62/29, న్యూ శాంతి నగర్, తిరుపతి-517502.
4) శ్రీమతి పి. ప్రశాంతి, భర్త : వెంకట రమణ, డి నెం.73-22-1/26, వెంకట రామయ్య నగర్, గెయిల్ ఆఫీస్ దగ్గర, వి ఎ రోడ్, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా-533101.
5) శ్రీ మల్లిన సత్యనారాయణ రావు, తండ్రి : వెంకటరావు, 5-3-18, మెరక వీధి, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350.
డియర్ సర్/మేడమ్,

విషయం: మా బ్యాంకుకు అనుకూలంగా ఋణగ్రహీత M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ వారిచే సృష్టించబడిన హైపోథికేషన్ యొక్క ఇన్వోకేషన్.

మా కెనరా బ్యాంక్ నుండి శ్రీమతి మల్లిన శ్రీ దేవి, శ్రీమతి మల్లిన లక్ష్మి తులసి, శ్రీమతి పెమ్మసాని అన్నపూర్ణ, శ్రీమతి పి. ప్రశాంతి, శ్రీ మల్లిన సత్యనారాయణ రావు వారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ప్రస్తుత తేది నాటికి బకాయి మొత్తం వడ్డీతో	వడ్డీ రేటు
Synd MSE A/c No. 32517910000685	02.09.2015 తేదీన రూ.4,50,00,000/-	రూ.10,01,65,182.24/- తేది.21.02.2026 నాటికి	13.85%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని 29.06.2017 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన బకాయి రూ.10,01,65,182.24 (అక్షరాల పది కోట్ల ఒక లక్ష అరవై ఐదు వేల నూట ఎనభై రెండు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డుల్లో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

P&M/Stock వివరములు : పశ్చిమ గోదావరి జిల్లా-534350, కోవూరు, ఇండస్ట్రియల్ ఏరియా, # 12-1-10 వద్ద మ్యానుఫాక్చరింగ్ ఆఫ్ క్యాటిల్ ఫీల్డ్‌కు చెందిన మెషినరీ M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ పేరున కలదు.
ఐటమ్ యొక్క పేరు : HARD CASE make animal feed plant poultry / Animal feed milling Plant, capacity 60 to 65 T/shift (08 hrs per shift)

1) Auto Batch weighing section -01 Nos	21) Transfer conveyor 02
2) Intake dumping hopper with magnetic grill - 02 Nos	22) Bucket elevator 2
3) Godown Chain Conveyor - 01 Nos	23) Batch Binn above the mixer -01
4) Bucket elevator - 01	24) Feed mixer -01
5) Cascading magnetic sapperator - 01 Nos	25) Variable freeqency drive-01
6) 3 way flap gate -01 Nos	26) Surge bin below the mixer -01
7) Distribution conveyor - 01 Nos	27) Transfer conveyor 3
8) Slide gate Pnuematically operated - 01	28) Bucket elevator 3
9) 2 way flap gate pneumatically operated - 02 Nos.	29) 2way flap gate pneumatic operated
10) Batching Binns -06.	30) Bin above molasis mixer
11) Discharges/screw feeders - 06 Nos.	31) Slide gate Pnuematic operated
12) Way hopper - 01 No.	32) Mollasis dosing system
13) Surge Hopper - 01.	33) Molasis mixer -01
14) Transfer conveyor.	34) Baging bin -01
15) Process control electronic -01 Nos.	35) 2way flap gate pneumatically operated -01
16) Connecting chutes & Hoppers	36) Automatic weiging & bagging machine -01
17) Main feed plant processing section.	37) Bage stiching machine
18) Bucket elevator -01	38) Mixing cycle monitoring
19) Bin above grinder with paddle feeder	39) MCC
20) Feed grinder -01	40) Cable & Motors
	41) Molasis tank with loading pump with motor

Total : Rs. 20,41,200/-
Remark if any : As per valuation dated 03/08/2025 issued by Er.Srinivasa Rao.
టైటిల్ హోల్డర్ : M/s. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్
గమనిక: సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13 (2) ప్రకారం తేది.17.01.2026 నాటి మా ముసుపటి డిమాండ్ నోటీసును రద్దు చేస్తూ ఈ నోటీసున జారీ చేయబడినది.

తేది : 21.02.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం కెనరా బ్యాంక్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ప్రాంతీయ కార్యాలయం : డి.నెం.8-115/1, 4వ అంతస్తు, కెనరా బ్యాంక్ పైన, ఎమ్ఎమ్ కాంప్లెక్స్, రాయల్ నగర్, ఆర్‌సి రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా -517501
బ్రాంచ్ కార్యాలయం : డి.నెం.8-119, 2వ అంతస్తు, ఆర్‌సి రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా -517501 వెబ్‌సైట్ : http://www.shriramfinance.in./auction

శ్రీ కె. నరేంద్రనాథ్ చౌదరి గారికి చెందిన స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

రూల్ 9(1) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్‌తోచదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన 23-08-2025 తేదీ గల ఉద్దేశపూర్వక అమ్మకం నోటీసు 30 రోజుల గడువు తీరిన తర్వాత ఇప్పుడు జారీచేయబడినది. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)లో చదువబడు చట్టం 54/2002లోని సెక్షన్13(8) క్రింద పేర్కొన్న విడిపించుకునే హక్కును మీరు వినియోగించుకోవడంలో విఫలమైనందున ఇ-వేలం అమ్మకం కోసం ప్రకటన జారీ చేయబడింది. ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు/సహ-దరఖాస్తుదారులు/సహ-ఋణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు/సహ-దరఖాస్తుదారులు/సహ-ఋణగ్రహీతలకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, సర్ఫేసి యాక్ట్, సెక్షన్ 13(2) ప్రకారం, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి జారీచేసిన డిమాండ్ నోటీసు తేదీ.25.07.2024 ప్రకారం, తేదీ.25.07.2024 నాటికి రూ.55,44,980/- మరియు 26.07.2024 నుండి వర్తించు వడ్డీ మరియు కాస్ట్స్ మరియు చార్జీలు మరియు ఖర్చులు రాబట్టుకొనుటకు సెక్యూర్డు క్రెడిటార్‌కు తనఖా పెట్టిన / ఛార్జీ చేసిన దిగువ తెలిపిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా తేదీ.30-03-2026 న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది.

అగ్రిమెంట్ నెం : TRPTITF2305190012

ఋణగ్రహీత/ హామీదారు(లు): 1) కె. నరేంద్రనాథ్ చౌదరి, తండ్రి: ఆంధ్రకేసరి చౌదరి, డి.నెం. 2-29, కొత్త చెర్లోపల్లి, తిరుపతి, చిత్తూరు జిల్లా - 517505.
2) కె. లక్ష్మి, భర్త: నరేంద్రనాథ్ చౌదరి, డి.నెం. 2-29, కొత్త చెర్లోపల్లి, తిరుపతి, చిత్తూరు జిల్లా - 517505.
3) కె. బిందు మాధవి, తండ్రి: ఆంధ్రకేసరి చౌదరి, డి.నెం. 2-29, కొత్త చెర్లోపల్లి, తిరుపతి, చిత్తూరు జిల్లా - 517505.

స్థిరాస్తి వివరములు: (డాక్యుమెంట్ నెం.3240/2023 ప్రకారం కె. నరేంద్రనాథ్ గారికి చెందిన ఆస్థి)
తిరుపతి జిల్లా, పూర్వపు చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, రేణిగుంట సబ్-జిల్లా, రేణిగుంట మండలం, నెం.20 తూకివాకం గ్రామ ఖాతాలు, సర్కార్ డ్రై, సర్వే నెం. 9బి/1సి1 లోని ఎ.0.56 1/2 సెంట్లు మరియు దానిలో పడమర భాగం విస్తీర్ణం ఎ.0.28 1/4 సెంట్ల భూమి.
హద్దులు: తూర్పు: కె. చంద్రశేఖర్ గారి ఆస్తి, పడమర: దొరస్వామి గారి భూమి, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: వాగు. వీటిలో ఎ.0.28 1/4 సెంట్ల భూమి లేదా 1367.3 చ॥గ॥ల స్థలం మాత్రమే.

ఎన్‌కంబరెన్స్‌లు ఏమైనా : లేవు

ఆస్థి రిజర్వు ధర	ధరావత్తు మొత్తం	ధరావత్తు సమర్పించు విధానం	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేది	ధరావత్తు సమర్పించుటకు చివరి తేది	ఆస్థి తనిఖీ తేది
రూ.93,51,000/-	రూ.9,35,100/-	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున డి.డి సమర్పించాలి	రూ.25,000/-	30.03.2026	26.03.2026	25.03.2026

ఆసక్తిగల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్ సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణలో మొదలగున వాటి సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి : గౌరవ్ నంబూదిరి, మొబైల్ నెం. 9833922941, గౌరవ్ నంబూదిరి <gaurav.n@samil.in> నందు సంప్రదించగలరు.
ఆస్తికి సంబంధించిన ఏదైనా సందేహాల కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, వి. గోపి గారిని కార్యాలయ పని దినాలలో 8309124131 సందు సంప్రదించవచ్చు.
అధీకృత అధికారికి ఏవైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్‌లో (https://eauctions.Samil.in/home) నిర్వహించబడుతుంది. టెండర్ సమర్పణ స్థలం/ బిడ్ ఫారమ్ / టెండర్ ఓపెన్ & వేలం పొందడానికి, దయచేసి https://eauctions.Samil.in/home వెబ్‌సైట్‌ను సందర్శించండి మరియు అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో అందించిన https://www.shriramfinance.in/auction లింక్‌ను చూడండి.
గమనిక: చెన్నైలోని NCLT ఆదేశం ప్రకారం "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" ను "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"లో విలీనం చేసినట్లు తెలియజేయడమైనది. తదనంతరం 30-11-2022 నాటి పేరు మార్పుకు సంబంధించిన విలీన ధృవీకరణ పత్రం ప్రకారం, 30.11.2022 నుండి "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరును "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా మార్చడం జరిగింది.

తేదీ.24.02.2026, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

విలీన ముడి వీడేనా..!

'పుర' ఎన్నికలు జరిగేనా

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పురపాలక సంఘ ఎన్నికలు జరిగేనా.. విలీనం పూర్తవుతుందా. మళ్లీ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్నది ఇంకనూ సంశయంగానే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలకు ఆయా పురపాలక సంఘాల్లో ఓటర్ల జాబితాలు సిద్ధం చేయడం తదితర పనుల్లో బిజీగా ఉన్నారు. శ్రీకాళహస్తిలో అలాంటి పరిస్థితులు కన్పించడం లేదు. ఎన్నికల నిర్వహణ విషయమై ఇంకనూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు రాకపోవడమే ఇందుకు కారణం మరి.

పంచాయతీల పరిధిలో పీటముడి

శ్రీకాళహస్తి పురపాలక సంఘం ద్వితీయ శ్రేణి నుంచి ఐదేళ్ల క్రితం ప్రథమ శ్రేణిగా మారింది. ఆ సమయంలో జనాభా పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం సమీపంలోని పంచాయతీలను విలీనానికి వీలుగా వెసులుబాటు కల్పించింది. ఇందు కోసం అప్పట్లో ఉత్తర్వులు కూడా జారీ చేసింది. తొలుత వచ్చిన ఉత్తర్వుల్లో పలు పంచాయతీల పేర్లు ఉండటం, తీరా విలీన సమయానికి వేర్వేరు కారణాలతో అప్పటి వైకాపా నేతలు వారికి అనుకూలమైన వాటిని పక్కనబెట్టి.. తెదేపా బలమున్న పంచాయతీలను విలీనం చేయడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగ్రామమైన ఊరందూరు, నారాయణపురం పంచాయతీలను పురపాలక సంఘంలో విలీనం చేశారు. వీటికంటే దగ్గరిగా ఉన్న పంచాయతీలను వదిలిపెట్టారు. ఈ విషయంపై అప్పట్లో హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విలీన ప్రక్రియ ఓ క్రమపద్ధతిలో చేపట్టకపోవడంపై అప్పట్లో హైకోర్టు తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో 2022లో స్థానిక సంస్థల ఎన్నికలు ఇక్కడ జరగలేదు.

పురపాలక సంఘ కార్యాలయం

ఏళ్లుగా ప్రత్యేక పాలన..: వైకాపా చేపట్టిన అసమగ్ర విలీన ప్రక్రియ నేపథ్యంలో ఇక్కడ ఎన్నికలకు అవకాశం లేకుండా పోయింది. సాధారణంగా ఆర్నెలు ప్రత్యేకాధికారుల పాలన ఉంటుంది. అయితే ఇక్కడ ఏళ్లుగా ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది. ఎన్నికలు నిర్వహించని కారణంగా అభివృద్ధి, సంక్షేమ నిధులు పక్కదారిపట్టాయి. కౌన్సిల్ లేకపోవడంతో పురపాలక సంఘ కార్యాలయ పర్యవేక్షణ తరచూ విమర్శలకు తావిస్తోంది. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఎన్నికల నిర్వహణ అన్నది ప్రభుత్వ పరంగా స్పష్టమైన ఆదేశాలు వస్తే తప్ప జరిగే అవకాశం లేదు.

తితిదేలో తుక్కు తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ

తిరుమల, న్యూస్‌టుడే: భక్తులు విరాళాలు అందించేందుకు వీలుగా స్థానిక అశ్విని ఆసుపత్రిలో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేయాలని తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆదేశించారు. మంగళవారం స్థానిక పద్మావతి అతిథిగృహంలోని సదర్న సమావేశ మందిరంలో తితిదే విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఏళ్లుగా పేరుకుపోయిన తుక్కు తొలగింపుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, 15 రోజుల్లో నివేదికను అందించాలని ఆదేశించారు. ... భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలతో తిరుమలలో ప్రజారవాణా, అన్నప్రసాదం, పారిశుద్ధ్య సేవలు మెరుగుపరుచుకున్నామని, ... సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు. సీఈ సత్యనారాయణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక అమలు

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి గ్యారంటెడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ సాధించేలా 75 రోజుల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాయచోటిలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం నిర్వహించిన రాయలసీమ జిల్లాల ఎంఈవోలు, డైట్ అధ్యాపకుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ... డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సిగ్నల్స్ పనిచేయక పలు రైళ్లు ఆలస్యం

రేణిగుంట, న్యూస్‌టుడే: తిరుపతి- రేణిగుంట మార్గంలో సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయకపోవడంతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. సమస్య తలెత్తడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫాంలపైనే పడిగాపులు కాశారు. మంగళవారం రేణిగుంట రైల్వేస్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ప్రధాన కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో తిరుపతి నుంచి వచ్చే నారాయణాద్రి, వెంకటాద్రి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుచానూరులోనే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రయాణికులు ఆరోపించారు. రెండు, మూడు గంటల తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రైళ్లను పంపారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్ష తేదీలో మార్పు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అంబేడ్కర్ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి మార్చి 2న నిర్వహించాల్సిన పరీక్షను మార్చి 8వ తేదీ ఆదివారానికి మార్పు చేసినట్లు గురుకుల పాఠశాలల చిత్తూరు, తిరుపతి జిల్లాల సమన్వయకర్త పద్మజ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కల్తీనెయ్యిపై శాసనసభలో ఏకపక్ష చర్చ : భూమన

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: కల్తీనెయ్యిపై శాసనసభలో ఏకపక్ష చర్చ జరిగిందని, పనిగట్టుకుని అబద్ధాలు వల్లెవేస్తూ వై.ఎస్.జగన్, తనపై నిందారోపణలు చేశారని తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతిలో మంగళవారం ఆయన మాట్లాడారు. సిట్ రిపోర్టులో తనతోపాటు వై.వి.సుబ్బారెడ్డి ప్రస్తావన లేనప్పటికీ మమ్మల్ని అరెస్టు చేయాలని శాసనసభలో మాట్లాడ్డం విడ్డూరంగా ఉందన్నారు.

సెలవులో పలువురు తితిదే ఉన్నతాధికారులు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదేలోని పలు విభాగాల ఉన్నతాధికారులు సెలవులో వెళ్లారు. మిగిలిన విభాగాల అధికారులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో వారు పనిఒత్తిడితో ఆందోళనలో ఉన్నారు. కల్తీనెయ్యి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎఫ్ఏ అండ్ సీఏవో వ్యవహారంలో ... 20 రోజులపాటు సెలవులో వెళ్లడంతో ... నాగరత్న 45 రోజులపాటు సెలవు పెట్టడంతో ... స్థానిక ఆలయాల్లో పాలనాపరమైన ఇబ్బందులు తప్పడం లేదు. ... ఈనెల 23 నుంచి సెలవులో వెళ్లారు. ... ఏఈవో ... ఈనెల 22 నుంచి 15 రోజులపాటు ఆనారోగ్య కారణంగా సెలవు పెట్టారు. ... భర్తీకాకపోవడంపై ఉద్యోగుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్

నూతన జిల్లాకోర్టు నిర్మాణానికి భూమిపూజ

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో న్యాయసేవలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా నూతన సముదాయ నిర్మాణం కీలక మైలురాయిగా నిలుస్తుందని, భూమిపూజ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. ... మార్చి 1న జిల్లా కోర్టు నిర్మాణానికి భూమిపూజకు సీజేఐతోపాటు రాష్ట్ర హైకోర్టు, జిల్లా న్యాయమూర్తులు, వీవీపీలు రానున్న నేపథ్యంలో పక్కాగా వ్యవహరించాలన్నారు. మూడో అదనపు న్యాయమూర్తి ఎం. గురునాథ్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ ఆర్.గోవిందరావు తదితర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థల విస్తీర్ణం, రహదారి సౌకర్యం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, విద్యుత్తు, తాగునీటి సదుపాయాలు వంటివాటిపై సమీక్షించారు.

ఒకరికొకరు తోడుగా..!

వీరంతా కంటిచూపు లేని ప్రత్యేక ప్రతిభావంతులు. నిత్యం ఒకరికి ఒకరు తోడుగా నిలిచారు. పట్టువదలక విద్యను కొనసాగించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సన్నద్ధమయ్యారు. మొదటి రోజు మంగళవారం తెలుగు పరీక్ష రాయడానికి అలిపిరి గరుడ కూడలి వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర బధిరుల పాఠశాల కేంద్రానికి వస్తూ ఇలా కనిపించారు. **- ఈనాడు, తిరుపతి**

వైద్యచికిత్సల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వైద్య చికిత్సల్లో నిర్లక్ష్యం వహించిన ఆసుపత్రులపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలకు ఆదేశించారు. ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థి జ్వరంతో రేణిగుంటలోని ఓ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వేసిన సూది మందుతో చేయి వాచింది. తీరా హాస్టల్‌కు వెళ్లాక జ్వరం పెరగడంతో మళ్లీ అదే ఆసుపత్రికి వచ్చారు. మాత్రలు ఇచ్చి పెద్ద ఆసుపత్రికి వెళ్లమని చెప్పి వదిలేయడంతో సూది మందు వికటించి విద్యార్థి మృతి చెందినట్లు ఆరోపణలు రావడంతో ఘటనపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యశాఖను కలెక్టర్ ఆదేశించారు. నగరంలోని మరో కంటి ఆసుపత్రిలో ఇంజినీరుకు చేసిన కంటి వైద్యం వికటించినట్లు సీపీఎం నేతలు ఆరోపిస్తూ ధర్నా చేశారు. దీంతో రెండు కమిటీలతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

గోవిందరాజ స్వామి ఆలయం ఎదుట కళాకారులు

ఘనంగా తిరునగరి ఆవిర్భావోత్సవం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరునగరి 897వ ఏడాదిలోకి అడుగిడిన సందర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీగోవిందరాజ స్వామి ఆలయం వద్ద కోలాటాలు, పండరి భజనలు చేపట్టారు. అనంతరం నాలుగు మాడవీధుల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కూలి పనులకు వెళ్తూ మృత్యుఒడికి

రాధయ్య (పాత చిత్రం)

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఉదయం కూలి పనులకు వెళ్తూ ద్విచక్రవాహన ప్రమాదంలో ఓ కుటుంబ యజమాని మృతి చెందారు. ఘటన శ్రీకాళహస్తి పట్టణ సమీపంలోని రేణిగుంట-నాయుడుపేట జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ నాగార్జునరెడ్డి వివరాల మేరకు.. జైహింద్‌పురానికి చెందిన పాసి రాధయ్య (55) అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్‌తో ఇటుక బట్టీలో పనులకు వెళ్లేందుకు కాలినడకన రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన కిరణ్ భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై కాణిపాకం ఆలయానికి వెళ్తూ అదుపుతప్పి రాధయ్యను ఢీకొన్నారు. ప్రమాదంలో అతను తలకు తీవ్ర గాయమై అక్కడే మరణించారు. దంపతులిద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

వెంకటసాయి (పాత చిత్రం)

తడ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో నెల్లూరుకు చెందిన పేట వెంకటసాయి(35) మృతిచెందాడు. ఈ సంఘటన తడలో సోమవారం రాత్రి పెట్రోలు బంకులో చోటు చేసుకుంది. నెల్లూరు నవాబుపేటకు చెందిన వెంకటసాయి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. స్థానిక పెట్రోలు బంకులో విద్యుత్తు పనులు చేస్తుండగా ఘటన జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొండపనాయుడు తెలిపారు.

ఎంత పనిచేశావు భువనా!

- చదవడం.. చావడానికేనా?
- ఉరికి వేలాడిన బీటెక్ విద్యార్థిని

ఏం చెబుతున్నాం బిడ్డలకు?
ఏం నేర్పుతున్నాం విద్యార్థులకు?
కష్టం వచ్చినప్పుడు ఎదుర్కొనే
ధైర్యం చెప్పలేని చదువులెందుకు?
బాధ కలిగినప్పుడు తట్టుకునే
ఓర్పునివ్వని విద్యలెందుకు?
ఆర్థిక స్థితిని అర్థం చేసుకోవాలని
వివరించని వ్యవస్థలెందుకు?
బీటెక్ చదువుతుండగానే ఉద్యోగం
సాధించిన విద్యార్థిని కారణాలు
చెప్పకుండానే ఉరికి వేలాడింది

చిన్న చిన్న కారణాలకే
ప్రాణాలు తీసుకుంటే తప్పెవరిది?
ఆలోచన నేర్పని పుస్తకాలదా?
అణుకువను చెప్పని పెద్దలదా?
ఆవేశం ఇచ్చిన సమాజానిదా?

ఏం నేర్చుకుంటున్నారు?
ఏం చదువుతున్నారు?
అన్ని అవయవాలు సక్రమంగా
లేకున్నా చక్కటి జీవితాన్ని
గడుపుతున్న వారిని చూడరా!
... మనకే ఈ ప్రశ్నలు

తల్లిదండ్రులు సర్వం
ధారపోసినా..
ప్రాణం పోయాక
బతకలేమన్న స్పృహ
కలగడం లేదా?
చచ్చి ఏం
సాధిస్తారు..
బతికి కోరుకున్నది
పొందాలన్న ఆలోచన
చేయడం లేదా?
....విద్యార్థులారా
మీకే ఈ ప్రశ్నలు

పుంగనూరు మండలం మంగళం గ్రామానికి చెందిన భువన (22) తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రంగంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ నాలుగో ఏడాది చదువుతోంది. సోమవారం సాయంత్రం గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సురేంద్రరెడ్డి, జానమ్మలకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె భువన బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. కొన్నిరోజుల క్రితం కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికైంది. ఈ ఏడాది మే నెలలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. రెండు రోజుల క్రితం ఇంటికి వెళ్లి అందరితో ఎంతో సంతోషంగా గడిపి, ఉద్యోగం వచ్చిందన్న ఆనందాన్ని అందరితో పంచుకుంది. సోమవారం మళ్లీ కళాశాలకు వెళ్లిన ఆమె ఏం జరిగిందో తెలియదుగానీ గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కుమార్తె మృతదేహాన్ని చూసి హృదయం ద్రవించేలా కన్నీరు మున్నీరయ్యారు. ఎంతో చలాకీగా ఉంటు పది, ఇంటర్‌లో టాప్, రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభావంతురాలైన కుమార్తె చనిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు బోరున విలపిస్తున్నారు. చేతికొచ్చిన బిడ్డ బలవన్మరణానికి పాల్పడడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక తల్లడిల్లుతున్నారు.
- న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ, తిరుపతి (వైద్యవిభాగం)

గంజాయి స్వాధీనం.. ఏడుగురి అరెస్టు

వరదయ్యపాలెం, న్యూస్‌టుడే: మండలంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు వివరాలను ఎస్సై మల్లికార్జున్ వెల్లడించారు. కొన్నాళ్లుగా మండలంలో గంజాయి క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నిఘా వేసిన పోలీసులు రహస్య సమాచారం మేరకు సోమవారం ఇందిరానగర్ పంచాయతీ అవంతికా లనీ వద్ద దాడులు చేపట్టారు. సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరునకు చెందిన ముద్దు హరికృష్ణ, తొండా ప్రసాద్, తుపాకుల ప్రతాప్, నాగలాపురం చరణ్‌తేజ, కోటపోలూరుకు చెందిన సత్యవేటి సామ్యేల్, సూళ్లూరుపేటకు చెందిన మహ్మద్ ఖలీమ్‌తోపాటు 17 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారని వారిని పట్టుకుంటామని వివరించారు. నాలుగు సెల్‌ఫోన్లు, రెండు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేణిగుంటలో అంతర్రాష్ట్ర దొంగ..

రేణిగుంట, న్యూస్‌టుడే: పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి, రూ.14 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా వంగత్తూరుకు చెందిన ప్రభాకరన్ దొంగ. గతంలో ఇతన్ని మూడుచోట్ల అరెస్టు చేశారు. జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి చోరీలకు పాల్పడేవాడని తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక వేణుగోపాలపురం క్రాస్ వద్ద సీఐ జయచంద్ర, ఎస్సై ధర్మారెడ్డి, సిబ్బందితో కలిసి ప్రభాకరన్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి 97 గ్రాముల బంగారం, 110 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారని డీఎస్పీ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న బంగారం, అరెస్టు చేసిన దొంగను చూపుతున్న పోలీసులు

EENADU Classifieds

AUTO
VEHICLES FOR SALE
AP-40-AU-9502 New Maruti Nexa Fronx Alpha - 2023 Model Vehicle for Sale. Sundaram Finance LTD, TPT. ✆ 9490166247, 9440909784.

FINANCIAL SERVICES
WANTED
Need Finance/loan for apartment project in tirupati work in progress Rs. 20 to 50 Lakhs. ✆ 9963029295

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL
తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు AB AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

JOBS
JOB OPENINGS at Unit Run Canteen NCC Tirupati. For more information. ✆ 83280 15125.

WANTED CHEMIST: (Male/ Female) B.Sc., Chemistry/ B.Pharmacy M/s Coastal Laboratories, Akkampeta Post, Tada M. Ph: 70133 32427 E Mail: info@coastal-labs.com
అడ్మినిస్ట్రేటివ్ పర్సన్స్ కావలెను. Qly: డిగ్రీ/ MBA అనుభవం, ఉత్సాహవంతులైన వారు తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు. ఆకర్షణీయమైన జీతం. ✆ 9703402722
ఆటో డ్రైవర్ కావలెను. అనుభవం, లైసెన్స్ కలిగి ఉండవలెను. (తిరుపతి టౌన్‌లో పనిచేయుటకు) ఆకర్షణీయమైన జీతం. Cont: 97034 02722

SECURITY GUARDS
ప్రముఖ బ్యాంకులలో పని చేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21 to 45, అర్హత: 10th. PF+ ESI కలదు. ✆ 96522 40528, 97049 64931, 94918 84025.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సన్మానిస్తున్న జనసేన నేతలు

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన జనసేన నేతలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తిరుపతికి చెందిన జనసేన నేతలు మంగళవారం అమరావతిలో కలిసి సన్మానించారు. జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు బాబ్జి నాయకులు వినోద్ రాయల్, రాజమోహన్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

గంగమ్మకు కుంకుమార్చన వేడుకలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మార్చి 6, 7, 8 తేదీల్లో అమ్మవారికి లక్ష కుంకుమార్చన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్, ఈవో జయకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

అర్జీలకు పరిష్కారం చూపాలి

తిరుపతి(కలెక్టరేట్) న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపేలా అధికారులు దృష్టి పెట్టాలని జేసీ గోవిందరావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో వర్చువల్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి డీడీవో నారాయణ రెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ కొఆర్డినేటర్ జగదీష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డీఆర్‌డీఏపీడీ శోభన్ బాబు, వ్యవసాయ శాఖాధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్చి 5న ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. దేవస్థాన పరిపాలన కార్యాలయ ఆవరణలో జరిగే సమావేశానికి విశ్రాంత ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

ఇటు పొలం.. అటు శిథిలం

రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. వారు కట్టించిన కట్టడాలు.. తవ్వించిన చెరువులు.. బావులు నేటికి చరిత్రకు సాక్ష్యంగా దర్శనమిస్తున్నాయి. రాయలవారు చంద్రగిరి కోట చుట్టూ రక్షణ కోసం విశాలమైన పొడవైన గుంతను తవ్వించి.. శత్రువులు ప్రవేశించడకుండా మొసళ్లు ఉండే విధంగా చేసిన ఏర్పాటే ఈ కందకం. నేడు వరి పొలంగా మారింది. అయితే కోట ప్రహరీ ముళ్లకంపలతో శిథిలావస్థకు చేరుతోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

వ్యర్థాల దహనం.. కాలుష్యంలో నగరం!

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వం సంకల్పిస్తే తిరుపతి నగరంలో దానికి పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తను పోగుచేసి కాల్చివేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి.

ఎక్కడెక్కడంటే..

జలవనరుల శాఖ కార్యాలయం ఆవరణ, ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల, తితిదేకి చెందిన శ్వేత భవనం ఆవరణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎదురుగా, ఎస్వీయూలోని పలు విభాగాల వెనుక పోగైన చెత్తను కుప్పలుగా పోసి అంటిస్తున్నారు. వాణిజ్య సముదాయాలు, ప్రైవేటు సంస్థల చుట్టూ ఇదే తంతు. నగరపాలక సిబ్బంది నిర్లక్ష్యంతో శివారు ప్రాంతాల్లో చెత్తను దహనం చేస్తుండేవారు.

నిర్వహణ లోపం!

తిరుపతి నగరపాలక సంస్థ పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తోంది. ఇంటింటా చెత్త సేకరణ, వీధులు, మురుగు కాలువలను శుభ్రం చేయడం, చెత్త తరలింపు వంటి నిరంతర ప్రక్రియలు సాగుతున్నా.. నగరంలో శుభ్రత కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తుంటే స్వచ్ఛత లక్ష్యం నీరుగారిపోతోంది.

చెత్త సేకరిస్తున్నారా?

నగర పాలక సిబ్బంది చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదని ప్రజలు అంటున్నారు. సేకరించిన దాన్ని కూడా సంపద కేంద్రాలకు తరలించడంలేదు. ఒకచోట పోగుచేసి కాల్చేస్తున్నారు. దీని వల్ల కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. చెత్త నుంచి ఎరువులు తయారు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

జలవనరుల శాఖ కార్యాలయం ఆవరణలో వ్యర్థాలకు నిప్పు

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ బాలురు, బాలికల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా నిర్వహించామని కస్టోడియన్ కౌముది వివరించారు. తొలిరోజు మొత్తం 2,380 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

పలుకుబడితో వస్తారు.. అక్రమార్కులను వెనకేసుకొస్తారు

హథీరాంజీ మఠం ఆస్తులకేదీ భద్రత?

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎంతో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన హథీరాంజీ మఠం ఆస్తుల పరిరక్షణ, రోజువారీ పాలనా వ్యవహారాలను వివాదాలు ఎంతకూ వీడటం లేదు. పలుకుబడితో మఠం కస్టోడియన్‌లుగా వస్తున్న వివిధ శాఖల ఉన్నతాధికారుల వ్యవహారశైలి అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లు ఉంటోంది తప్పితే వారు నిక్కచ్చిగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వెంటాడుతున్నాయి. కొంతకాలంగా మఠం పాలనను నిర్లక్ష్యం ఆవహించిందని, ఆక్రమణకు గురైన మఠం ఆస్తులు, భవనాలు, భూముల స్వాధీనంపై పట్టీపట్టనట్లు వ్యవహరించినట్లు మఠం ఉద్యోగులే చెబుతున్నారు. ముంబయి, చెన్నైలో విలువైన ఆస్తుల పట్ల నిర్లక్ష్యం చూపారని, రూ.కోట్ల విలువైన భూములు, భవనాల స్వాధీనంలో అక్రమార్కులనే వెనకేసుకొచ్చారనే ఆరోపణలున్నాయి. అక్కడి న్యాయవాదులను మార్చడంపైనా విమర్శలు ఎదురయ్యాయి. తిరుపతి పరిసర ప్రాంతాల్లో 317 ఎకరాల భూముల స్వాధీనంలో కొందరికి వత్తాసు పలికారని, రికార్డులను న్యాయస్థానంలో సమర్పించడంలో, వాదనలు వినిపించడంలో, ప్రభుత్వానికి వివరణ ఇవ్వడంలో విఫలమయ్యారని, మరోవైపు మఠానికి రావాల్సిన రూ.కోట్ల అద్దెలు రాబట్టడంలోనూ మెతకవైఖరి చూపారని, ప్రతి మాసం రూ.లక్షల అనవసర ఖర్చులు ఖాతాల్లో చూపినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. తాజా మార్పుల నేపథ్యంలోనైనా మఠం పాలనను చక్కదిద్దాలని, ఆక్రమణలను అడ్డుకోవడానికి నిఖార్సయిన అధికారులను నియమించాలని హథీరాంజీ బాబా భక్తులు విన్నవిస్తున్నారు.

భూగోళశాస్త్ర విభాగం స్వర్ణోత్సవాలు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో భౌగోళిక విభాగంలో మంగళవారం స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎస్పీ సుబ్బారాయుడు హాజరై ప్రసంగించారు. భౌగోళిక శాస్త్రాన్ని కృత్రిమ మేధతో అనుసంధానించాలని రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షుడిగా సీడీసీ డీన్ ఆచార్య చంద్రాయుడు వ్యవహరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు నాగభూషణం, వాసుదేవ రెడ్డి, కృష్ణయ్య, వై.వి. రమణయ్య, ఎస్కేయూ ప్రొఫెసర్ సి. రామచంద్రయ్య, రామచంద్రయ్య, జయచంద్రరెడ్డి బోధనలో తమ అనుభవాలను పంచుకున్నారు.

వేదికపై ప్రసంగిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

లోగోను ఆవిష్కరిస్తున్న స్విమ్స్ సంచాలకులు

ఈఎస్ఐసీ లోగో ఆవిష్కరణ

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ)తో కార్మిక వర్గాలకు ఆరోగ్య భీమా సాధ్యమని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్వీ కుమార్ పేర్కొన్నారు. ఈఎస్ఐసీ ఉప ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం స్విమ్స్ ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఎస్ఐ ఎంఎస్ డాక్టర్ శ్యామ్‌బాబు, డీపీఎంవో డాక్టర్ చక్ర ప్రకాష్‌రెడ్డి, ఈఎస్ఐసీ జాయింట్ డైరెక్టర్ రాధాకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాల లోగోను ఆవిష్కరించారు.

దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: దంత సమస్యలపై ప్రతిఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ లక్ష్మయ్య అన్నారు. కళాశాల ఆవరణలో తిరుపతికి చెందిన హరిప్రియ దంత వైద్యశాల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శరవన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలపై సంతకాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: పనపాకం పంచాయతీ జక్కులవారిపల్లిలో సర్వే సంఖ్య 652/4ఎ లోని13 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశామని దీనికి సంబంధించి ఒప్పంద పత్రాలపై అధికారుల సమక్షంలో సంతకాలు చేశారని యజమాని చెంగ్రాయశెట్టి(రమేష్) నాటి పత్రాలను బహిర్గతం చేశారు. జాతీయ రహదారి విస్తరణతో రోడ్డు పక్కన ఉన్న స్థలం విలువ పెరిగిపోవడంతో సదరు భూమిని తమకే ఇవ్వాలని కొందరు గొడవలు చేస్తున్నారని, వారిపై చట్టపరంగా పోరాటం చేస్తామన్నారు.

మునగ సాగుతో అధిక లాభాలు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: మునగ ఆకు సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏపీఎం ద్రాక్షాయణి తెలిపారు. దీంతో రైతుకు సంవత్సరానికి రూ.2 నుంచి 3 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా రైతులకు పట్టలు, పాలపిండి మిషన్, స్ప్రేయర్లు తక్కువ ధరకు ఇస్తున్నట్లు తెలిపారు. ఏపీఎంలు తిరుమలరాజు, సీతారామయ్య, సీసీలు శివశంకర్‌రెడ్డి, నారాయణమూర్తి, నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో సీఐ హరిప్రసాద్, ఎంవీఐలు

అలిపిరిలో రూ.2.40 లక్షల జరిమానాలు

తిరుమల, న్యూస్‌టుడే: అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద తిరుమల ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారులు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులతో పాటు డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు. సరైన పత్రాలులేని, పన్నులు చెల్లించని 26 వాహనాలకు రూ.2,40,000 జరిమానా విధించారు. మద్యం మత్తులో తిరుమలకు వెళ్తున్న చోదకులను గుర్తించి ఐదు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, ఎంవీఐ వి.శ్రీనివాసరావు, వెంకటరమణ, అంజనేయప్రసాద్, మోహన్‌కుమార్, ప్రసాద్ వర్మలు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

చంద్రగిరి, న్యూస్‌టుడే: తొండవాడలో వెలసిన శక్తిస్వరూపిణి శ్రీఉగ్రప్రత్యాంగిరాదేవి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారి మూలమూర్తితోపాటు సపరివారదేవతలకు విశేష అభిషేకం, అలంకరణలు చేపట్టారు. శ్రీలక్ష్మీదేవి స్వరూపంతో అలంకృతులైన అమ్మవారు చిన్నశేషపై కొలువుదీర్చి సంకల్ప పూజలు నిర్వహించారు.

జంప్‌రోప్ పోటీల్లో మంగళం విద్యార్థుల సత్తా

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన ఆరో రాష్ట్రస్థాయి జంప్ రోప్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 23 పతకాలు సాధించారు. విజేతలను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు మురళి, రిటైర్డ్ హెచ్‌ఎం కేశవనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

నగరపాలిక: 80080 20003, తిరుపతి (విద్య, తితిదే): 93936 28003
తిరుచానూరు: 80082 30008, మంగళం-జీవకోన: 80080 40005
తిరుపతి గ్రామీణ: 80085 74564, చంద్రగిరి: 80085 74561

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: **సమస్య:** వెస్ట్ చర్చి నుంచి పద్మావతి కళాశాలకు వెళ్లే మార్గంలో రైల్వే స్టేషన్ ప్రహరీ కూలిపోయింది. అందులో స్థానిక వ్యాపారాలు వ్యర్థాలు పడేయడంతో అవి కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. **- సాయిచరణ్, ఎస్వీనగర్**

సమాధానం: నిఘా ఏర్పాటు చేసి వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. **- డా.యువ అన్వేష్, నగరపాలిక వైద్యాధికారి**

సమస్య: పద్మావతీ మహిళా వర్సిటీ నుంచి తుమ్మలగుంటకు వెళ్లే కూడలి వరకు వీధిదీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేస్తున్నట్లు చెబుతున్నా పరిష్కారం కావడం లేదు. గుబురుగా చెట్లు ఉండటంతో చీకటిగా ఉంటోంది. **- శరణ్య, శ్రీకృష్ణనగర్**

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. **- శ్యాంసుందర్, నగరపాలిక ఎస్‌ఈ**

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: **సమస్య:** సి.రామాపురం ప్రధాన కూడలి నుంచి గ్రామ సచివాలయానికి, అడపారెడ్డిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలు పడ్డాయి. ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **-సుభాష్, వాహన చోదకుడు**

సమాధానం : సమస్యను పరిశీలించి రెండురోజుల్లో పరిష్కారానికి కృషి చేస్తాం. **- చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో**

సమస్య: రామచంద్రాపురంలోని పెట్రోల్ బంక్ సమీపంలో తిరుపతి - పచ్చికాపల్లం ప్రధాన రహదారిలో రోడ్డు కోతకు గురైంది. గతంలో తాత్కాలికంగా మట్టి పోసి చేతులు దులుపుకొన్నారు. **- స్థానికులు**

సమాధానం : సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం. **-శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో**

బాధ్యతలు స్వీకరించకనే తిరుగుపయనం

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే : ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించానికి మంగళవారం కార్యాలయానికి విచ్చేసిన మస్తాన్‌వలి వెనుదిరిగారు. అంతకుముందు ఆయనకు ఏవో రంగనాథం, సిబ్బంది స్వాగతం పలికారు. ఛాంబర్‌లోని కుర్చీలో కూర్చున్నారు. అనంతరం ఎంపీపీ మాధవరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతలో ఫోన్ రావడంతో ఈ ఘటన ఎదురైంది. ఈయన మదనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు. మరో ఆరు నెలల్లో పదవీ విరమణ చేయాల్సి ఉంది.

ఉత్సాహంగా జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శాప్ లీగ్ పోటీల్లో భాగంగా తిరుపతిలోని శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయం ఆవరణలో అండర్- 18 జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. 16 మంది బాలబాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు శాప్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ తెలిపారు.

అంతర్జాతీయ ముద్రణ దినోత్సవం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తిరుపతి ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ముద్రణ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రింటింగ్ ప్రెస్ పితామహుడు గుటెన్‌బర్గ్ స్మారకంగా కార్యక్రమం నిర్వహించినట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయచంద్ర, అధ్యక్షుడు తులసీరాం తెలిపారు. సురేష్, హేమచంద్ర, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ చదును చేసి.. ఎర్రచందనం నాటేసి

రూ.కోట్ల విలువ చేసే భూమి అన్యాక్రాంతం

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. కంచె నాటి హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆక్రమణకలకు కాదేది అనర్హం అన్నట్లు కాలువను ఆక్రమించి ఓ వ్యక్తి ఏకంగా ఎర్రచందనం మొక్కలను పెంచుతున్నాడు. కాలువపై ఉన్న కల్వర్టును సైతం జేసీబీతో పూడ్చేశాడు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. లక్షలు విలువచేసే భూమిని వ్యక్తికి కట్టబెడుతున్నారు.

కాలువ చదునుచేసి నాటిన ఎర్రచంద్రం మొక్కలు

ఆక్రమణల గురించి తెలిసినా

ఈ ఆక్రమణపై 'ఈనాడు'లో గత నెలలో వార్త ప్రచురితమయ్యింది. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటామని చెప్పినా.. అవి నోటి మాటలకే పరిమితమయ్యాయి.

సర్వే చేయిస్తాం..

సిబ్బందిని పంపించి కాలువ పోరంబోకును సర్వే చేయిస్తాం. ఆక్రమణ జరిగి ఉంటే స్వాధీనం చేసుకుంటాం. అతడిపై చర్యలు తీసుకుంటాం. **- జనార్దన్‌రాజు, తహసీల్దారు, తిరుపతి గ్రామీణ మండలం**

అధికారుల అండదండతో

నగరం శరవేగంగా విస్తరిస్తోంది. శివారు గ్రామాల్లోని భూములకు డిమాండు ఏర్పడింది. ఈ నేపథ్యంలో చిగురువాడ పంచాయతీలోని సర్వే నం.215, 216, 217లో 50 అడుగుల వెడల్పుతో పెద్ద కాలువ ఉంది. దీని పక్కనే పొలమున్న ఓ వ్యక్తి కాలువను చదును చేశాడు. ఎర్రచందనం మొక్కలు నాటి డ్రిప్‌తో నీరు పారిస్తున్నాడు. ఈ కాలువ సమీపంలో స్థిరాస్తి వ్యాపారం విస్తరించింది. ఇక్కడ ప్రైవేట్ మార్కెట్ విలువ ప్రకారం ఒక అంకణం రూ.50వేలు పలుకుతోంది. ఈ లెక్కన రైతు ఆక్రమించిన భూమి విలువ సుమారు రూ.కోటి పైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఈ పని చేశాడని స్థానికులు అంటున్నారు.

కైలాసధామం నిర్మాణానికి సహకరిస్తాం

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్వర్ణముఖినది ఒడ్డున నిర్మిస్తున్న కైలాసధామం నిర్మాణ పనులకు సహకరిస్తామని పట్టణంలోని వర్తక, వాణిజ్య సంఘాల ప్రతినిధులు తెలిపారు. మంగళవారం నిర్మాణ కమిటీ ఛైర్మన్ వీరంగారి రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజనాయుడు, కోశాధికారి ఓంకార్ భరద్వాజ్‌తో కలిసి నిర్మాణ పనులు పరిశీలించారు. సంఘ ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, గుణశేఖర్, మునిరత్నంరాయల్, రూపారామ్, ఓంప్రకాష్, పూసారామ్, విష్ణుప్రకాష్, దినేష్‌కుమార్, ముఖేష్, కైలాసధామం ఇంజినీర్ మనోహర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణపై రగడ

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసం మధ్య ఉన్న ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన అరకు కాఫీ దుకాణం అనుకుని మరో కంటైనర్ ఏర్పాటును స్థానిక వ్యాపారులు వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. భారీ కంటైనర్ దుకాణం ఏర్పాటుతో ఉపాధి కోల్పోతామని కొందరు వ్యాపారులు, ప్రైవేటు వాహనాలు ఆపేందుకు స్థలం ఉండదని మరికొందరు.. అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పనులు తాత్కాలికంగా ఆపేశారు.

పంచాయతీ స్థలం పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

తిరుచానూరు, న్యూస్‌టుడే: దామినేడులో కబ్జాకు గురైన పంచాయతీ స్థలాన్ని ఇన్‌ఛార్జి కార్యదర్శి మణి పరిశీలించారు. మంగళవారం 'ఈనాడు'లో 'కబ్జా పెట్టినా కదలరంతే!' శీర్షికన వార్త ప్రచురించగా స్పందించిన పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో వెళ్లి భూమిని పరిశీలించారు. అక్కడ నిర్మాణ పనులు చేపట్టొద్దని కబ్జాదారులను ఆదేశించారు.

ప్రమాదం పక్కనే ప్రయాణం

పూతలపట్టు-నాయుడుపేట జాతీయమార్గం ప్రమాదాలకు కేంద్రంగా మారింది. ఎం.కొత్తపల్లి సమీపంలో భారీ వాహనాలు ఆపడానికి ఏర్పాటు చేసిన స్థలంలో (ట్రక్‌లే-బై) మూడు రోజుల క్రితం ఓ వాహనం తగిలి బాక్స్‌డ్రైన్ కాలువ పగిలి గుంత ఏర్పడింది. నాసికరంగా పనులు చేపట్టడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు అంటున్నారు. ప్రమాదమని తెలిసి గుంత పక్కనుంచే వాహనచోదకులు వెళుతున్నారు. **- న్యూస్‌టుడే, చంద్రగిరి**

వైద్య శిబిరం విజయవంతం

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: కోర్టు ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైనట్లు తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గొట్టి గజేంద్ర, ప్రధాన కార్యదర్శి వి.విద్యానాథరెడ్డి తెలిపారు. సంకల్ప ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు.

పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి ఎం.గురునాథ్

న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: సీనియర్ న్యాయవాది నైనారు భక్తవత్సలం(70) మృతి చెందడంతో న్యాయమూర్తులు మంగళవారం సంతాపం తెలిపారు. తిరుపతి మూడో అదనపు జిల్లా సెషన్సు కోర్టు పబ్లిక్ హాలులో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సెషన్సు కోర్టు జడ్జి ఎం.గురునాథ్, అదనపు జిల్లా సెషన్సు జడ్జిలు జి.అర్చన, టి.రామచంద్రుడు, ఎ.నరసింహమూర్తి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి డి.విజయసారథిరాజు జూనియర్ డివిజన్ సివిల్ జడ్జిలు బి.వాణిశ్రీ, సీకేవీ సత్యకాంత్‌కుమార్, పి.కోటేశ్వరరావు, ఎస్.శ్రీకాంత్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గొట్టి గజేంద్ర, ప్రధాన కార్యదర్శి వి.విద్యానాథరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురికి జైలుశిక్ష

తిరుపతి (లీగల్), పాకాల : పాకాల పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు శిక్షపడింది. 2018లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఎన్.ఆర్.కమ్మపల్లికి చెందిన కొడవాటికంటి శేఖర్‌నాయుడు, కసింగడ్డ ప్రాంతానికి చెందిన నక్క గౌతమ్, మారుతినగర్ రఘు వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేరం రుజువు అవ్వడంతో ఒక్కొక్కరికి అయిదేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతిలోని ఎర్రచందనం కోర్టు ప్రత్యేక అదనపు జిల్లా సెషన్సు న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు.

పంటలపై ఏనుగుల దాడులు

చిన్నగొట్టిగల్లు: ఏనుగుల దాడులు సోమవారం రాత్రి కొనసాగాయి. ఎగవూరు గ్రామం బొగ్గలవారిపల్లికి చెందిన నాగసిద్ధమనాయుడు, అమరేంద్ర, విశ్వనాథ, చంద్రశేఖర్‌నాయుడులకు చెందిన వరి, మామిడి, కొబ్బరి చెట్లను, పైపులు, రాతి కూసాలను ధ్వంసం చేశాయి.

(c) eenadu

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

వైభవంగా చక్రస్నానం

చక్రస్నానం పూజల్లో వేదపండితులు

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు): తొండమానుపురం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మహా చక్రస్నానం నిర్వహించారు. పెద్దగంగానాన్ని ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి చక్రస్నానం చేపట్టారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి వద్ద దుకాణదారులు ఆలయానికి పంచెలు వితరణగా అందజేశారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి



చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జయచంద్ర, చిత్రంలో ఎస్సై ధర్మారెడ్డి

రేణిగుంట, న్యూస్‌టుడే: ఆటో చోదకులు ప్రయాణికులు, యాత్రికులతో మర్యాదగా ప్రవర్తించాలని రేణిగుంట పట్టణ సీఐ జయచంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద ఆటోచోదకులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో ఇక్కడికి యాత్రికులు వస్తుంటారని తెలిపారు. ప్రధానంగా రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎస్సై ధర్మారెడ్డి పాల్గొన్నారు.

కాలభైరవునికి విశేషాభిషేకాలు

కాలభైరవుని ఉత్సవమూర్తికి విశేష హారతులు ఇస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన కాలభైరవునికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. మంగళవారం, అష్టమి కలిసి రావడంతో ప్రధానమూర్తితో పాటు ఉత్సవమూర్తికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ధూప, దీప, నివేదనలు సమర్పించిన ఆలయంలో ప్రాకారోత్సవాన్ని జరిపారు.

శ్రీవాణి నిధులతో శివాలయ అభివృద్ధి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తితిదే శ్రీవాణి నిధులతో చుక్కలనిడిగల్లు గ్రామ శివాలయం అభివృద్ధికి సన్నాహాలు జరుగుతున్నాయి. దక్షిణకాశీగా పేరున్న ఈ ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కృషితో తితిదే నిధులు సమకూరాయని, 26న తితిదే ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా అక్కడి పూజారులతో పాటు గ్రామస్థులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

వీధికో జులాయి.. గంజాయితో లడాయి

★ పల్లెల్లో విచ్చలవిడిగా విక్రయాలు ★ వలస కార్మికులు, యువతే లక్ష్యం

గంజాయి రవాణాను అరికట్టాలని సీఐకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ‘అందుగల దని.. ఇందులేదని సందేహం వలదు.. ఎందెందు వెతికినా అందందే కలదు’ గంజాయి భూతం అన్నట్లు.. తయారైంది పరిస్థితి. గంజాయి మత్తు పల్లెలకు విస్తరించింది. పరిశ్రమలు విస్తరించిన చోట ఉండే వలస కార్మికులను బానిసలుగా మార్చుతున్నారు. చివరికి ఇటు ఉన్నత శిక్షణాలకు చేరుకోవాలని కలలు కనే యువత.. కుటుంబాలకు చేదోడుగా ఉండాల్సిన కార్మికులు మత్తులో చిత్తవుతున్నారు. గత వైకాపా పాలనలో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు కేంద్రంగా విచ్చలవిడిగా గంజాయి రవాణా సాగింది. అప్పట్లో ఆ పార్టీకి చెందిన వారి అండదండలు ఉండటంతో పోలీసులు మౌనం దాల్చారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత గంజాయి వాసన గుప్పుమంటుండటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సూళ్లూరుపేట టు శ్రీసిటీ

సూళ్లూరుపేట ప్రధాన కేంద్రంగా తడ, శ్రీసిటీల మీదుగా వరదయ్యపాళెం, సత్యవేడు, బీఎన్‌కండ్రిగ వంటి ఇతర ప్రాంతాలకు రవాణా జరుగుతోంది. ఇక్కడి కార్మికులు, ఉద్యోగులే గంజాయి వ్యాపార విస్తరణకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. బిహార్, ఒడిశా నుంచి పనిచేసే నిర్మాణ రంగ కార్మికులు తొలి నుంచి వీటికి అలవాటుపడగా, వారి నుంచి ఈ ప్రాంత ఉద్యోగులకూ సైతం అలవాటైంది. గ్రామాల్లో మద్యంలు, గొడవలు గంజాయి మత్తే ప్రధాన కారణం. ఈ మాటలతో స్పేస్షల్ పన్నె రాజీ చేయడమా.. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపణలున్నాయి. గంజాయి రవాణా అడ్డుకట్టకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు వివరణ కోరగా.. నిఘా ఏర్పాటు చేశామని, ఇకపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

నాటి పాలనలో దారుణాలు.. మచ్చుకు కొన్ని

❖ 2022 సెప్టెంబరులో తడలో గంజాయి వ్యాపారులైన రెండు ముఠాల మధ్య ఆధిపత్య పోరు జరిగింది. దీంతో వరదయ్యపాళెం మండలంలోని రాచకండ్రిగ వద్ద ఇద్దరు యువకులను మరో వర్గం దారుణంగా హత్య చేసింది.

❖ 2023 అక్టోబరులో బత్తులవల్లంలో గంజాయికి బానిసైన కాటయ్య అనే యువకుడు తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను గొంతు కోసి హత్య చేశాడు.

❖ రెండేళ్ల కిందట శ్రీసిటీకి సమీపంలోని వలస కార్మికులు గంజాయికి అలవాటు పడి సరిహద్దు సెజ్ గ్రామాల్లో నివసిస్తూ విద్యార్థులు, యువతను ఆటు వైపు మళ్లించారు. ఆ గ్రామాలకు చెందిన పెద్దలు దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

❖ గతేడాది డిసెంబరులో మండలంలోని మిట్ట ఎస్సీకాలనీకి చెందిన పోలూరు హరి (33)ని సందీపులు గంజాయి మత్తులో హత్య చేశారని తేలింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి : 80085 74555
నాగలాపురం : 98854 43308
ఓబులవారిపల్లె : 99664 67525
రైల్వేకోడూరు : 97035 72572

తొట్టంబేడు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని శివనాథపాలెంలో పలుచోట్ల వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంది. రాత్రి వేళల్లో చీకట్లు కమ్ముకున్న రోడ్లపై అడుగు పెట్టాలంటే భయపడుతున్నాం. - కిరణ్‌కుమార్, స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో చర్చించి, వీధి లైట్లు అమర్చుతాం. - సురేంద్రనాథ్, ఎంపీడీవో, తొట్టంబేడు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: సమస్య: చిన్నంపల్లె పంచాయతీలో వీధి దీపాలు సక్రమంగా వెలగట్లేదు. పలు చోట్ల అంధకారం నెలకొంది. - కుమార్‌రాజా, చిన్నంపల్లె

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం. -రామ్మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో

వీధి దీపాల ఏర్పాటు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద దక్షిణకి చేరిన వీధి దీపాల స్తంభాలలో వెలుగులు లేనట్లు గుర్తించారు. రెండు విద్యుత్తు స్తంభాలకు దీపాలు వెలగకపోవడంపై ‘మేమున్నాం’ మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. కమిషనర్ భవానీప్రసాద్ సూచనలతో ఎలక్ట్రికల్ విభాగం వారు దీపాలు అమర్చారు. **వృద్ధుల తొలగింపు.** పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఇక్కడ వ్యర్థాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సమస్య ప్రచురితమవ్వగా అధికారులు స్పందించారు.

పారిశుద్ధ్య పనులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని జె.వడ్డిపల్లె, ముదినేపల్లెలో వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడి సమస్యలపై ‘మేమున్నాం..మీకు తోడుగా’లో వార్తలు వచ్చాయి. స్పందించిన పంచాయతీ సిబ్బంది పనులు చేపట్టారు.

రహదారి వెంట శుభ్రం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన పేరుకు పోయిన వ్యర్థాలను అధికారులు తొలగించారు. పవర్ సమీపంలో ప్రధాన రహదారి వెంబడి కొళ్ల వ్యర్థాలు ఉండటంతో నిత్యం దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ‘మేమున్నాం- మీకుతోడుగా’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మంగళవారం శుభ్రం చేయించారు.

రాతిబండల ఏర్పాటు

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పోలీసు లైన్ వీధిలోని మిరియాల బాబా క్రాస్ కూడలి వద్ద దెబ్బతిన్న కల్వర్ట్ సమస్యపై ‘కూల్చారు... మరమ్మతులు మరిచారు’ శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు ఇక్కడ రాతి బండలు అడ్డుగా ఏర్పాటు చేయించారు.

కార్యకర్తలకు నామినేటెడ్ బహుమానం

నామినేటెడ్ పదవులను రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కలసి ఖరారు చేస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నేతలకు పార్టీ వరంగా తగిన గుర్తింపు ఇవ్వాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి క్రమిస్తున్నారు. విజయవాడలో నిర్వహించిన ఆనంద్ క్రీడా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస యాదవ్‌తో సమావేశం అయ్యారు. పలు నామినేటెడ్ పదవులకు సంబంధించి ఆయన నుంచి ఆమోదం పొందారు. అలాగే వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ క్రీడల్లో పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు సంజీవని

చెక్కును పంపిణీ చేస్తున్న బొజ్జల రిషితారెడ్డి తదితరులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఆర్థిక స్తోమత సరిగా లేని వారికి సీఎం సహాయనిధి కష్టకాలంలో సంజీవనిలా పనిచేస్తోందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి పేర్కొన్నారు. తొట్టంబేడు మండలానికి చెందిన 19 మందికి రూ.12,29,918 విలువ చేసే చెక్కులను మంగళవారం ఆమె లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. తెదేపా మండలాధ్యక్షుడు మునిరాజానాయుడు, వెంకటాచలం పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం

రహదారి నిర్మాణంలో కార్మికులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని ఇసుకతాగేలికి నూతనంగా తారురోడ్డును ఏర్పాటు చేశారు. ఏళ్లతరబడి గ్రామానికి తారురోడ్డు లేకపోవడంతో నిరుకుపడినా బురదగా మారుతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం వీవీ - జీ రామ్‌జీ పథకం ఆధ్వర్యంలో రూ. 46లక్షలతో రేణిగుంట- నాయుడుపేట ప్రధాన రహదారి నుంచి ఇసుకతాగేలి వరకు తారు రోడ్డు, 120 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కూటమి నేతలు మంగళవారం పనులు ప్రారంభించారు.

పెరగనున్న అర్జిత సేవా టికెట్ల ధరలు

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: మండల రామగిరిలోని శ్రీవాలీశ్వర స్వామి ఆలయంలో ఆర్జిత సేవా టికెట్ల ధరలు పెంచనున్నట్లు ఆలయ ఈవో హేమచంద్రరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆదాయం తక్కువగా ఉన్నందున ప్రత్యేక దర్శన రుసుము రూ.10, కారు పార్కింగ్ రూ.20కు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. పెంపుపై అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా రాత పూర్వకంగా తెలియజేయాలని ఆయన కోరారు.

కోడి చీరల పంపిణీకి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం సందర్భంగా భక్తులు సమర్పించిన కోడి చీరలు పంపిణీకి ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. త్రినేత్ర అతిథి గృహంలో ఇందుకోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేసి చీరలు సమర్పించిన భక్తుల రసీదులను పరిశీలించి వాళ్లకు అందజేసే విధంగా ఏర్పాట్లు చేపట్టారు. గురు, శుక్ర వారాల్లో పంపిణీ ప్రారంభించే అవకాశముంది.

మామిడి రైతులకు రాయితీతో కవర్లు

నారాయణవనం, న్యూస్‌టుడే: మామిడి రైతులకు రాయితీపై కవర్లు ఇస్తున్నట్లు ఉద్యాన అధికారి సౌజన్య మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, వన్‌బీ, ఆధార్, బ్యాంకు ఖాతా నకళ్లతో రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సాగు ఖర్చు తగ్గించే దిశగా అవగాహన

రేణిగుంట, న్యూస్‌టుడే: రోజురోజుకు పెరుగుతున్న సాగు ఖర్చును తగ్గించే దిశగా రైతులకు అవగాహన కల్పించాలని శాస్త్రీయ సలహా మండలి సభ్యులు తెలిపారు. మంగళవారం స్థానిక రాస్ కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సుమతి మాట్లాడుతూ కేవీకేలు జిల్లా రైతుల సమస్యలను, అవసరాలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు పలు కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ విశాఖ్, డాక్టర్ తనూజ, కేవీకే శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రాలు పరిశీలిస్తున్న సభ్యులు, శాస్త్రవేత్తలు

నాడు కూలగొట్టి.. నేడు ఉగ్గబట్టి..!

మండలంలోని చిలకావారి కండ్రిగలోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థుల స్థితి దయనీయంగా మారింది. ఇక్కడ 20 మంది చదువుతున్నారు. పాఠశాలలో గతంలోని మరుగుదొడ్డిని వైకాపా ప్రభుత్వంలో కూలగొట్టారు. కొత్తది తామే నిర్మిస్తామంటూ గొప్పలకు పోయి మొండిగోడల వరకు తెచ్చారు. ఆపై నిధుల్లేక ఆపేశారు. దీంతో విద్యార్థులు ఉగ్గబట్టుకోవాల్సిన పరిస్థితి కల్పించారు. కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ప్రాంగణం దాటాల్సిందే. - న్యూస్‌టుడే, తొట్టంబేడు

భవనం సిద్ధం.. ఎప్పుడో ప్రారంభం..?

శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసు స్టేషన్ దశాబ్దాల తరబడి అద్దె భవనంలో కొనసాగింది. పక్కా భవనానికి రూ.1.80 కోట్ల అంచనాలతో పనులు పూర్తిచేశారు. భవనం సిద్ధమై నెలలు గడుస్తున్నప్పటికీ నిరుపయోగంగా ఉంచారు. ప్రారంభించడానికి అధికారులకు సరైన ముహూర్తం కుదరలేదేమోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీలైనంత త్వరలో భవనాన్ని ప్రారంభించి అద్దె ఇక్కట్లు తప్పించే దిశగా పోలీసుశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. - న్యూస్‌టుడే, తొట్టంబేడు

చేతి పంపు.. మరమ్మతులు అవసరం

మండల పరిధిలోని నారాయణనెల్లూరు గ్రామంలో గ్రామ సచివాలయం సమీపంలో తాగునీరు కోసం ఏర్పాటు చేసిన చేతి బోరు మరమ్మతులకు గురైంది. ఈ పరిస్థితి వచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసవికి ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో తాగునీరు సమస్య మొదలవుతుంది. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెనగలూరు (పుల్లంపేట)

ఇసుక లారీ.. ప్రమాదానికి దారి

మండల పరిధిలోని జాతీయ రహదారి మీదుగా ఇతర ప్రాంతాలకు చెయ్యేరు నుంచి భారీ ఇసుక లారీలు వెళ్తుంటాయి. అవి అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో ద్విచక్రవాహనదారులు బెంబేలెత్తుతున్నారు. లారీలపై పట్టలు కట్టుకోకుండా వెళ్తుండటంతో గాలికి వెనుక వచ్చే వారి కళ్లల్లో పడుతూ ఇబ్బంది పెడుతుంది. ఇలాగే పలువురు ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. అధికారులు ఇసుక రవాణాపై తనిఖీలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుల్లంపేట

కిటికీలు విరిగి.. పంకాలు పనిచేయక

విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతిగృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఓబులవారిపల్లె, రైల్వేకోడూరులోని వసతిగృహాల్లో ప్రవేశాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల పాత భవనాలే ఉన్నాయి. కిటికీలు, తలుపులు విరిగిపోయాయి. ఓబులవారిపల్లె మండలంలోని సంజీవపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సమస్యలు బోలెడు ఉన్నాయి. కిటికీలకు మెస్‌కూడా లేకపోవడంతో దోమలు అధికంగా వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ప్రిన్సిపల్ మన్సూర్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదించామన్నారు. - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

కరస్పాండెంట్‌పై ఏఎస్‌డబ్ల్యూవో విచారణ

విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విచారిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో చందన

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని హెచ్ ఎంఎం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ దేవసుందరంపై మంగళవారం స్థానిక పాఠశాలలో విచారణ చేపట్టారు. సాంఘిక, సంక్షేమ శాఖ సహాయ అధికారిణి చందన, వార్డన్ కిరణ్ ఆధ్వర్యంలో ఆయనపై విచారణ చేశారు. ఈనెల 5న ఎనిమిది, తొమ్మిది తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థులను కరస్పాండెంట్ తన ఇంటికి తీసుకెళ్లి పనులు చేయించుకోవడం, ఆపై వారిని కొట్టడం, తిట్టినట్లు స్థానికులు కొందరు కలెక్టరుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు.. పిల్లలు, వారి తల్లిదండ్రులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులను విచారించారు. నివేదికలను కలెక్టరుకు అందజేస్తామని వివరించారు.

మార్చి 2న కనకరుద్రమ్మ తిరునాళ్ల : పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పీవీజీపల్లె, రామసముద్రం పంచాయతీల నడుమ వెలసిన దేవరకొండలో మార్చి 2న కనకరుద్రమ్మ తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

విద్యార్థి దశ నుంచే పొదుపు మంచిది : బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే నగదు పొదుపు అలవాటు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించడం ద్వారా ఉత్తమ కాలేజీలలో ఉచిత ప్రవేశాలు పొంది తల్లిదండ్రులపై ఆర్థిక బారాన్ని తగ్గించ వచ్చన్నారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్‌ఎం రమణయ్య, ఏబీఎంలు శరత్‌వేద, సుకరాజు పాల్గొన్నారు.

కరెంటోళ్ల జనబాట : సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని పాలగుంట గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు కరెంటోళ్ల జనబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్తు సమస్యలపై అధికారులు ఆరా తీసి పలు సమస్యలు పరిష్కరించారు. ఏఈ వాసుదేవయ్య, లైన్‌ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై అప్రమత్తత అవసరం : సత్యవేడు: గంజాయి వాడకంతో అనేక దుష్పరిణామాలు వస్తాయని శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం జడ్పీ హైస్కూల్లో గంజాయి వినియోగం- అనర్థాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీచక్ర చిత్రీకరణ : పిచ్చాటూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓం శక్తి ఆలయంలో మంగళవారం శ్రీచక్ర చిత్రీకరణ కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీచక్రాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో గీశారు. అనంతరం గురుపోత్రి మహామంత్రాన్ని పఠిస్తూ కోటి అర్చన చేశారు.

పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదు

తొట్టంబేడు: సీడీపీవో కార్యాలయం వద్ద కొనసాగుతున్న అంగన్ వాడీల రిలే నిరాహార దీక్షలు

రేణిగుంటలో..

తొట్టంబేడు, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు తమ పోరాటాన్ని ఆపబోమని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ స్పష్టం చేసింది. మంగళవారం శ్రీకాళహస్తి ప్రాజెక్టు సీడీపీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ సంఘం ఏపీ అంగన్ వాడీ, వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రెండో రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. **రేణిగుంట:** సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు రెండోరోజు కొనసాగాయి. **రైల్వేకోడూరు:** పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహారదీక్ష మంగళవారం రెండవరోజుకు చేరింది. **సత్యవేడు:** అంగన్‌వాడీ మినీ వర్కర్లు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి రిలే నిరహారదీక్ష చేపట్టారు.

మున్సిపాలిటీ హోదా ఎప్పుడో..?

★ పెరుగుతున్న జనాభా, నివాసాలు
★ అర్హతలున్నా అందని వనరులు, వసతులు

పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగుతున్న రైల్వేకోడూరుకు మున్సిపాలిటీ హోదా కల్పించాలని ప్రజలు చాలాకాలంగా కోరుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో 20 వార్డులు ఉన్నాయి. 14,700 నివాసాలు, 43,000 జనాభా, 22,122 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీకి ఏటా ఇంటి పన్నుల రూపంలో రూ. 1.19 కోట్లు, ఇతర పన్నులు, అనుమతులు (అప్రూవల్స్) నుంచి మరో రూ. 1.50 కోట్ల ఆదాయం సమకూరుతోంది. గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చడానికి ఇవన్నీ అర్హతలే. కానీ ప్రజల ఆశలు, ఆకాంక్షలను సక్రమంగా ప్రభుత్వానికి నివేదించగలిగే నాయకత్వమే కొరవడింది.

సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఇక్కడి సమస్యల్లో మార్పు రావడంలేదు. పట్టణ పరిధిలో పారిశుద్ధ్యమే ప్రజల ప్రధాన సమస్యగా ఉంది. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతినిత్యం 43 మంది పారిశుద్ధ్య కార్మికులు, 30 మంది గ్రీన్ అంబాసిడర్లు సేవలందిస్తున్నా చెత్తాచెదారాలు, మురుగు తరగడం లేదు. ప్రభుత్వం స్థానిక సమస్యలపై నిర్వహించే ఐవీఆర్ కాల్స్‌లో ప్రజలు ఎక్కువగా ఈ అంశాలపైనే ఫిర్యాదు చేస్తున్నారు.

పురపాలికగా మారితే..

మున్సిపాలిటీగా మార్చగలిగితే అభివృద్ధి పనులకు ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరవుతాయి. కేంద్ర ప్రభుత్వ చట్టాలు అమలవుతాయి. పారిశుద్ధ్య కార్మికులు, వాహనాల సంఖ్య పెరుగుతుంది. పంచాయతీకి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది. తద్వారా సమస్యల పరిష్కారం తేలికవుతుందన్నది ప్రజాభిప్రాయం. 2014 - 19 మధ్య తెదేపా హయాంలో రైల్వేకోడూరును మున్సిపాలిటీగా మార్చాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కానీ నాయకుల మధ్య సఖ్యత లేకపోవడంతో అది మరుగున పడిపోయింది. ఇప్పటికైనా రాజకీయ నాయకులు ఈ విషయాన్ని ప్రభుత్వానికి వివరించి కోడూరుకి మున్సిపాలిటీ హోదా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద మృతి కేసుగా మార్పు

రేణిగుంట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని జ్వరంతో మృతి చెందారు. ఈ ఘటనపై సోమవారం గాజులమండ్యం పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. అయితే విద్యార్థిని తల్లి ఫిర్యాదుతో కేసును అనుమానాస్పద మృతిగా మార్చినట్లు సీఐ మంజునాథ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థిని తల్లి ఫిర్యాదులో పేర్కొన్న వివరాలను ఆయన అందులో వివరించారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలానికి చెందిన బాలిక ఇక్కడ కళాశాలలో విద్యనభ్యసిస్తోంది. ఈ నెల 20న ఆమెకు జ్వరం రావడంతో కళాశాల వార్డెన్ స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు ఇంజక్షన్ వేసి తిరిగి కళాశాలకు పంపారు. ఆదివారం తెల్లవారుజామున ఆమెకు జ్వరం తీవ్రత పెరిగింది. ఇంజక్షన్ వేసిన చోట బొబ్బలు వచ్చి తీవ్రమైన నొప్పి మొదలైంది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మధ్యాహ్నం కళాశాలకు చేరుకున్న తల్లి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు అక్కడి నుంచి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈ వ్యవహారంపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నివేదిక తర్వాతే అసలు విషయాలు వెల్లడవుతాయని సీఐ తెలిపారు.

ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: రోడ్డుప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కందాడ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కందాడకు చెందిన పార్థసారథి(24) ఈ నెల 15న రోడ్డుదాటుతుండగా రాచపాళెంకు చెందిన యువకుడు ద్విచక్రవాహనంతో వేగంగా ఢీ కొట్టాడు. పార్థసారథి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యుత్తు నియంత్రికల చోరీపై కేసు

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల వ్యవసాయ విద్యుత్తు నియంత్రికలు పెద్దఎత్తున చోరీకి గురికావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎండీపుత్తూరు, సదాశివపురంలో ఐదు నియంత్రికలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి విలువైన రాగి తీగలను అపహరించుకుని వెళ్లారు. దీనిపై పాపానాయుడుపేట విద్యుత్తుశాఖ ఏఈ వంశీకృష్ణ సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), SRIKALAHASTI

I.P.No: 2/2026

Bet: S.Vijaya Kumar Reddy ...**Petitioner**

And: 1) P.Surendra Babu, S/o P.Raghavaiah, Chodavaram (Vi), Thottambedu (M). **2)** S.Subramanyam Reddy, S/o Jeeva Karunya Reddy, Chodavaram (Vi), Thottambedu (M). **3)** G.Subramanyam Reddy, S/o Gurava Reddy, Chamuru (Vi), Thottambedu (M). **4)** K.Rajitha, W/o Ravindraiah, Chodavaram (Vi), Thottambedu (M). **5)** N.Mohan Kumar Reddy, S/o Nagaraja Reddy, Chodavaram (Vi), Thottambedu (M). **6)** N.Banu Prakash Reddy, S/o Nagaraja Reddy, Chodavaram (Vi), Thottambedu (M). **7)** N.Sudhakar Reddy, S/o Venkata Reddy, Chodavaram (Vi), Thottambedu (Mandal). **8)** N.Janardhan Reddy, S/o Srinivasulu Reddy, Chodavaram (Vi), Thottambedu (M). **9)** N.Subbarami Reddy, S/o Chinna Subba Reddy, Chodavaram (Vi), Thottambedu (M). **10)** C.Vijaya Kumar Naidu, S/o C.C.Naidu, D.No:18-860, S.R.N.Colony, Srikalahasti. **11)** S.Narendra, S/o Naga bhushanam, Dommerapalle (Vi), Srikalahasti (M).

...**Respondents**

General Notice

పై కనిన పిటీషనరు తనను దివాలాకోరుగా ప్రకటించమని పై కోర్టు నందు సదరు పిటీషన్ దాఖలు చేసియున్నాడు. పై తెలిపిన ప్రతివాదులకే తప్ప మరెవ్వరికైననూ సదరు పిటీషన్‌పై అభ్యంతరములు ఉన్న యెడల 03-03-2026 తేదీన ఉదయం 10.30 గంటలకు సదరు కోర్టునందు ప్రత్యక్షంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరై తమ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనియెడల కేసుని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

ఇట్లు

పసుపులేటి పార్థసారథి, న్యాయవాది, శ్రీకాళహస్తి

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

వరుస చోరీలతో జనం బెంబేలు

పోలీసులకు సవాలుగా మారిన వైనం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వరుస చోరీలతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇళ్లు వదిలి బయట ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. కష్టపడి సంపాదించుకున్న బంగారు ఆభరణాలు, వెండి, నగదును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కూడలి ప్రాంతమైన నాయుడుపేటలో చోరీలను కట్టడి చేయడం పోలీసులకు కత్తిమీద సాములా మారింది.

● మూడు వారాల క్రితం నాయుడుపేట బేరిపేటలోని ఓ పాస్టర్ నివాసంలో పట్ట పగలు తాళాలు పగులగొట్టి ఎనిమిది సవర్ల బంగారు నగలు చోరీ చేశారు. కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇంటికి ఉదయం ఓజిలి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి చోరీ చోటు చేసుకుంది.

● రాజగోపాలపురంలోని ఓ రెండంతస్తుల భవనంలోని రెండిళ్లలో పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంటి బయట గేటుకు తాళం వేసి ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని వెనుక నుంచి ఎక్కి ఇళ్లలోకి ప్రవేశించి రెండు ఇళ్లలో నాలుగైదు సవర్లు చొప్పున బంగారు ఆభరణాలు, నగదు, వెండి చోరీకి పాల్పడ్డారు. బంధువుల ఇళ్లకు వెళ్లి మరుసటి రోజు తిరిగి చేరుకునేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బేరిపేటలో ఇంట్లో పగలగొట్టిన బీరువా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నాయుడుపేట పట్టణం కూడలిగా జాతీయ రహదారుల్ని ఆనుకుని ఉంది. చుట్టూ దారులు ఉన్నాయి. బయట ప్రాంతాల వ్యక్తులు ఇక్కడికి వచ్చి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో సీసీ కెమెరాల పనితీరుపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది. కొన్ని చోట్ల పని చేయడంలేదు, మరి కొన్ని చోట్ల నిరుపయోగంగా మారడం, కెమెరాలకు అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

పోలీసులకు సవాల్

పేటలో జరిగే చోరీలు కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు, సిబ్బందికి సవాల్‌గా మారింది. సిబ్బందిని గాడిన పెడితే చోరీలు కట్టడి చేయవచ్చు. పట్టణం చుట్టూ ఉండే ప్రాంతాలకు వచ్చే కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయాల్సి ఉంది. మేనకూరు సెజ్, చుట్టు పక్కల కంపెనీల్లో పని చేసే పరాయి రాష్ట్రాల వారిపై దృష్టి సారించాల్సి ఉంది. చోరీలపై ప్రజల్ని చైతన్య పరచాలి. ఈ విషయమై డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ చోరీలపై నిఘా పెంచి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే జనబాట

ఓజిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఈ అనీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఓజిలి మండలంలోని కొత్తచెరువు గ్రామంలో విద్యుత్తు స్తంభాలకు వేలాడుతున్న తీగలు, సక్రమంగా వెలగని వీధి దీపాలు, నియంత్రికలకు మరమ్మతులు చేపట్టారు. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సోలార్‌ను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. గ్రామాల్లో అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తామన్నారు. లైన్‌మెన్ అమీర్‌మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
ప్రతిరోజు 10 AM TO 1 PM

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండుకు ఉదయం బస్సులు రావడం లేదు. నేరుగా జాతీయ రహదారిపై వెళ్లి, తిరుపతికు వెళ్తున్నాయి. - బలరాం, వ్యాపారి

సమాధానం: బస్సులు ఉదయం పూట బస్టాండుకు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. - కళ, ఆర్టీసీ డీఎం, సూళ్లూరుపేట

వాకాడు, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక ఎస్సీకాలనీ సమీపంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. నివారణ మందును పిచికారీ చేయాలి. - సంతోష్

సమాధానం: దోమల నివారణ ఫాగింగ్ చేయించేలా చర్యలు తీసుకుంటాం. - దేవదానం, డిప్యూటీ ఎంపీడీవో

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. - రవీంద్ర, స్థానికుడు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - చిన్నయ్య, కమిషనర్

మౌలిక వసతులు కల్పించాలి: ఎమ్మెల్యే

వెంకటగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతి పత్రం అందించారు. మంగళవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. అటవీ ప్రాంతంలోని ఆలయాలకు రహదారుల నిర్మాణానికి ఇబ్బందిగా ఉందన్నారు. వెంకటగిరి నుంచి రైల్వేకోడూరుకు అటవీ మార్గంలో రహదారి నిర్మాణానికి సహకరించాలని కోరారు. సోమశిల-స్వర్ణముఖి లింక్ కాలువ కొంత మేర అటవీ అనుమతులు అవసరమన్నారు. దీన్ని పూర్తిచేస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమల ప్రాంతాలకు తాగునీరు అందించవచ్చన్నారు. నిధుల కొరతతో నిలిచిన ఈ పనులకు నిధులు మంజూరు చేసి తక్షణ అనుమతులు ఇప్పించాలని కోరారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో పరిశ్రమ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి విరాళాలు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: బాలాయపల్లిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహ స్థాపనకు అంబలపూడికి చెందిన మొరవనేని రమేష్ రూ. 51,116, బైరవగానిపల్లికి చెందిన దాసరి వెంకటేష్ రూ. 50 వేల చొప్పున మంగళవారం సంబంధిత బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు మండల తెదేపా అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదుకు పిలుపు

మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: జనసేన సభ్యత్వ నమోదు గురువారం నుంచి మొదలవుతుందని ఆ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ పేర్కొన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూ. 400 చెల్లించి ఉద్యమ సభ్యత్వం నమోదు చేసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు సురేష్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తీగల చంద్రశేఖర రావు, నాయకులు కృష్ణారావు, మోహన్, స్థానిక ఏఎంసీ డైరెక్టర్ సతీష్, పోలేరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి: ఎమ్మెల్యే

వాకాడు, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గంలోని వాకాడు, చిట్టమూరు మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో ఉపాధి హామీలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. మంగళవారం ఆయనను అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల అనంతరం కలసి విన్నవించారు. రెండు మండలాల్లోని సముద్ర తీర గ్రామాల్లో తాగునీటికి పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీటి పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. వీటన్నింటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విన్నవిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రభుత్వ స్థలం ఆక్రమించకుండా చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం ఎదుట విన్నమాల కాల్వ ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించకుండా రెవెన్యూ, పుర అధికారులు మంగళవారం చర్యలు తీసుకున్నారు. ఈనాడులో ప్రచురితమైన మేమున్నాం మీకు తోడుగాలో సమస్య ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ స్థలానికి కంచె ఏర్పాటు చేశారు.

కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని వెదురుపట్టు సమీపంలోని పొలాల్లో మంగళవారం విద్యుత్తు అధికారులు కొత్త విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యుత్తు స్తంభం దెబ్బతిని తీగలు వేలాడుతుండటంతో స్థానిక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం సోమవారం ఈనాడులో కరెంటోళ్ల నిర్లక్ష్యం రైతులకు శాపం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ సమస్యను పరిష్కరించడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో తుమ్మూరు పాత చెక్‌పోస్టు సమీపంలోని శ్రీకోదండ రామాంజనేయస్వామి ఆలయ నూతన శిఖర ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శ్రీగణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసనతో వేదపండితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం యాగశాల ప్రవేశం శ్రీకోదండరామాంజనేయస్వామి నవగ్రహ అష్ట దిక్కుల మండపారాధన, గణపతి హోమం నిర్వహించారు.

అపరిశుభ్రంగా ప్రాంగణం

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది. కార్యాలయానికి పక్కనే ఉన్న ఆవరణంలో గతంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేశారు. జన్మభూమి పథకంలో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయ అధికారులు నిర్వహణను పట్టించుకున్న దాఖలాలు లేవు. కార్యాలయానికి వచ్చే ప్రజలు మంచి వాతావరణంలో సేదతీరే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నాయుడుపేట

రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలు

పట్టణంలో దర్గావీధిలో ఆక్రమణలకు అడ్డులేకుండా ఉంది. గతంలో ప్రధాన రోడ్డు వైపు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేశారు. కొంత కాలంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారులు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆక్రమిస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు తప్పడంలేదు. పోలీసు, పురపాలిక సంఘ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నాయుడుపేట

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



సూళ్లూరుపేట మండలం మంగళంపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. భవనం లోపల పైకప్పు పెచ్చులూడి చువ్వలు బయట పడ్డాయి. పిల్లలపై పెచ్చులూడి ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని పిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

ప్లాస్టిక్‌తో ఇబ్బందులు

పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడులోని మద్యం దుకాణం ఎదుట, చెత్తతో సంపద తయారీ కేంద్రం వెనుక ప్రాంతంలో ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు పేరుకు పోతున్నాయి. మద్యం బాబులు వాడిన వాటిని ఇక్కడ పడేస్తున్నారు. ప్లాస్టిక్ పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని ప్రచారం చేస్తున్నా పట్టించుకున్నదాఖలాలు లేవు. ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రం వద్దనే వీటిని పడేస్తున్నారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

గుంతల రోడ్డు.. గంటల ప్రయాణం

అత్తివరం, కాకూరు, హర్మేనిపాడు, కుందాం, భువనగిరిపాళెం, భట్లకనుపూరు, బత్తలాపురం, తదితర గ్రామాలకు వెళ్లే ర.భ రోడ్డు అధ్వానంగా మారింది. ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్ర వాహనాలు అధికంగా ప్రయాణిస్తుంటాయి. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారి రూపురేఖలు కోల్పోయింది. దీంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఓజిలి

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

చిట్టమూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగుంట లోని టీఎంఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సౌమ్య, వెంకటలక్ష్మిలకు ఉపాధ్యాయురాలు పద్మజ, కానిస్టేబుల్ సతీష్‌బాబు ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ రహంతుల్లా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శీనయ్య, గురుప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు అందజేస్తున్న దాతలు

అరకొర జీతాలతో ఇబ్బందులు

ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అరకొర జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ పేర్కొన్నారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రెండో రోజు మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సీఐటీయూ ఆధ్వర్యంలో రిలేనిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేస్తే హామీలు నెరవేరుస్తామన్న వాగ్దానాలు నెరవేర్చడం లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని, వస్తుసామగ్రి అందించాలని నినదించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ముకుంద, ప్రాజెక్టు మహిళా అధ్యక్షురాలు విజయనాగమ్మ, వాణి, రమణమ్మ, పుష్ప, జమీల, ఆదెమ్మ, బంగారమ్మలు పాల్గొన్నారు.

నేడు పెళ్లకూరులో ప్రత్యేక విద్యుత్తు అదాలత్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పెళ్లకూరు విద్యుత్తు కార్యాలయం వద్ద బుధవారం ప్రత్యేక విద్యుత్తు అదాలత్ ఏర్పాటు చేసినట్లు నాయుడుపేట ఈఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేశామన్నారు. అదాలత్ ఛైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయస్వామిమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, సాంకేతిక సభ్యులు శ్రీనివాసబాబు, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరుకానున్నట్లు తెలిపారు.

అక్రమ కట్టడాలు క్రమబద్ధీకరించుకోవాలి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: అక్రమ భవన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ ఫజులుల్లా పేర్కొన్నారు. నాయుడుపేట శ్రీరామ్‌నగర్, పరిసర ప్రాంతాల్లోని అక్రమ కట్టడాలను మంగళవారం పరిశీలించి యజమానులకు సూచనలు చేశారు. మార్చి 31వరకు అక్రమ కట్టడాల్ని క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. నిర్మాణాలను తొలగించకముందే యజమానులు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. నిర్మాణాల్లో అవకతవకలు ఉంటే సాంకేతిక పరిజ్ఞానంతో తెలుసుకుంటున్నారన్నారు. ఆయన వెంట స్వర్ణవార్డు సిబ్బంది ఉన్నారు.

అక్రమ కట్టడాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

ఏఎంసీలో టమాటాల విక్రయం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో టమాటాలు విక్రయిస్తున్నట్లు ఏఎంసీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర ప్రాంతాలకు చెందిన టమాటా రైతులు ఇక్కడకు తీసుకొచ్చి కిలో పది రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ప్రయత్నంలో యార్డులో 300 కేజీలు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ జేఏసీ కార్యవర్గం ఏర్పాటు

కార్యవర్గంతో వీఆర్వోలు, వీఆర్‌ఏలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండల తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఏలు మండల రెవెన్యూ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. మండల జేఏసీ ఛైర్మన్‌గా సుబ్బయ్య, వైస్ ఛైర్మన్లుగా అనిత, దివ్యభారతి, మునస్వామి, చందు, కన్వీనర్‌గా పోలయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజా, కోశాధికారిగా హరిబాబు, కార్యదర్శులుగా పూర్ణ, మునిరాజ, లహరిప్రియలు ఎంపికైయ్యారు. ఈ సమావేశంలో చిట్టేటి మనోజ్‌కుమార్, గూడూరు జేఏసీ అధ్యక్షుడు గిద్దలూరు రమణయ్య, ఎన్నికల అధికారి రమేష్‌లు పాల్గొన్నారు.

స్టేషన్‌కు చేరిందా తుప్పు పట్టాల్సిందే

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలో ఎక్కడైనా ప్రమాదాలు, హత్యలు, చోరీలు, ఘర్షణ కేసుల్లో వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. ఆ వాహనాలను తిరిగి వాహన దారులకు సకాలంలో చేరడంలేదు. దీంతో లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, కార్లు, బస్సులు ఆయా పోలీస్ స్టేషన్‌లో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు విముక్తి లభిస్తుందని వాహన దారులు ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటికీ పోలీస్ స్టేషన్‌లలో కొన్ని వాహనాలు పనికి రాకుండా పోతున్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆయా పోలీసు స్టేషన్‌లలో ఈ పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గంలో... నియోజకవర్గ పరిధిలోని ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, శ్రీహరికోట, తడ, పోలీస్ స్టేషన్‌లలో ఒక్కో స్టేషన్‌లో సుమారు 50 నుంచి 100వరకు వాహనాలు తుప్పు పడుతున్నాయి. ఈ వాహనాలకు సకాలంలో వేలం నిర్వహించి వచ్చిన నగదును ప్రభుత్వానికి చెలానా రూపంలో చెల్లించాల్సి ఉండగా పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. ఏళ్ల తరబడి వాహనాలు స్టేషన్‌లోనే తుప్పుపడుతూ పనికిరాకుండా పోతున్నాయి.

తుప్పు పడుతున్న ద్విచక్ర వాహనాలు

● ఈ విషయమై ఓజిలి ఎస్సై శ్రీకాంత్ వద్ద ప్రస్తావించగా వాహనాలను కోర్టులో అప్పగిస్తామన్నారు. వాహనాలకు పత్రాలు సక్రమంగా ఉంటే వాహన దారులకు అందజేస్తాం. పత్రాలు లేని వాహనాలను ఉన్నతాధికారుల అనుమతితో వేలం నిర్వహిస్తామన్నారు.

సరిహద్దులు ఏర్పాటు చేయండి

తిరుపతి(కలెక్టరేట్) న్యూస్‌టుడే: తీర ప్రాంతంలో సరైన సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఆంధ్ర, తమిళనాడు పులికాట్ ఫిషర్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వాసు కోరారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మన ప్రాంతంలోకి గతంలో ఏర్పాటు చేసిన హద్దులను చెరిపేసి తమిళనాడు ప్రజలు వచ్చారని, 197 మంది ఆంధ్ర మత్స్యకారులపై తమిళనాడు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారని అన్నారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అధికారులను కలిసి వినతి పత్రం అందించారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

చాగంటికి పెన్సిల్ చిత్రం బహూకరణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: చాగంటి కోటేశ్వర రావుకు వెంకటగిరికి చెందిన పెన్సిల్ కళాకారుడు శంకర్ బాబు తాను గీసిన పెన్సిల్ చిత్రాన్ని బహూకరించారు. సోమవారం రాత్రి శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు హాజరైన చాగంటికి తన చిత్రాన్ని గీసి మర్యాద పూర్వకంగా కలిసి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ పాల్గొన్నారు.

చాగంటి కోటేశ్వరరావుకు చిత్రాన్ని బహూకరిస్తున్న శంకర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

డక్కిలి, న్యూస్‌టుడే: ఈనెల 13వ తేదీన మోపూరుక్రాస్‌లోని ఇంట్లో పూజ చేస్తున్న సమయంలో మంటలు వ్యాపించి సరస్వతమ్మ(60) తీవ్రంగా గాయ పడింది. మంగళవారం నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శివశంకర్‌రావు తెలిపారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ ఆలయ సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళుతున్న లారీని బైక్ ఢీ కొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరికి..

తడ: శ్రీసిటీ కూడలి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో శ్రీను గాయ పడ్డాడు. శ్రీసిటీ నుంచి తడకు ద్విచక్ర వాహనంపై శ్రీను వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

అల్లుకున్న పొగ.. ప్రయాణానికి సెగ

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట పురపాలక సంఘ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పలు ప్రాంతాల్లో వ్యర్థాలు రోజుల తరబడి తొలగించడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో 45 వేల మందికి పైగా నివాసముంటున్నారు. రోజుకు 8 టన్నులకు పైగా తడి, పొడి వ్యర్థాలను డంపిగ్ యార్డుకు తరలిస్తున్నారు.

పొగతో జాతీయ రహదారి

తగలబడుతన్న డంపింగ్‌యార్డ్:

పట్టణ పరిధిలోని డంపింగ్‌యార్డ్ తగలపడడంతో యార్డ్ నుంచి వచ్చే పొగతో సమీపంలోని కాలనీవాసులతో పాటు ఆ మార్గంలోని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దట్టంగా పొగ రావడంతో సెగ తగులుతోంది. వారం రోజులుగా చెత్త మండుతూనే ఉంది. ఫలితంగా ఈ ప్రాంతంలో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కారణంగా పొగ రోడ్డంతా కమ్ముకు పోవడంతో వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్యను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలం చూపాలని రెవెన్యూ అధికారులను కోరాం. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని తెలియజేశాం. త్వరలోనే డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

సిబ్బంది కొరత.. సమస్యలు తీరక

● పురపాలక సంఘంగా మారినా పెరగని పోస్టులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంగా నాయుడుపేట పదోన్నతి పొందింది. పట్టణం వేగంగా విస్తరిస్తోంది. అయినా కార్యాలయ అధికారులు, సిబ్బంది నియామకం జరగడం లేదు. భవిష్యత్తు అవసరాలకు అనువుగా వసతుల కల్పన దిశగా అడుగులు వేసేందుకు సిబ్బంది కొరత పట్టి వేధిస్తోంది. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, రాబడిపై దృష్టి, తాగునీటి సమస్యల పరిష్కారం తదితర సమస్యల పరిష్కారంలో అధికారులు పర్యవేక్షణ కొరవడుతోంది.

భర్తీ చేయాల్సిన పోస్టులు

ఇంజినీరింగు డీఈ, ఏఈలు, డ్రాఫ్ట్‌మెన్, టీపీబీ, టీపీఎస్, టీపీవో, శానటరీ ఇన్‌స్పెక్టరు, హెల్త్‌అసిస్టెంట్, ట్రేసర్, ఆర్ఐ, రెవెన్యూ ఆఫీసర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు, సీనియర్ అసిసెంట్లు ముగ్గురు, జూనియర్ అసిసెంట్లు ముగ్గురిని నియమించాల్సి ఉంది.

విధుల్లో ఉన్న ఉద్యోగులు

పురపాలక సంఘంగా పదేళ్ల క్రితం పురోగతి పొందినా సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. కమిషనర్, మేనేజరు, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. మిగిలిన పోస్టుల భర్తీ జరగలేదు. ఇంజినీరింగ్ విభాగంలో ఏఈలుగా ఇద్దరు సచివాలయాల సిబ్బంది విధులు చేపట్టారు. ఇక్కడి ఏఈ పదోన్నతిపై వెళ్లడంతో ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. డీఈ మూడు రోజులు చొప్పున నాయుడుపేట, సూళ్లూరుపేటల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రైవేటు సిబ్బందిచే విధులు

పురపాలక సంఘం పరిధిలో ఎక్కువగా తాత్కాలిక సిబ్బందిచే పనులు చేయిస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది సంబంధిత రికార్డులను తయారు చేస్తున్నారు. సచివాలయాలు, ఇతర సిబ్బందితో పనులు చేస్తూ నెట్టుకొస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నా సిబ్బంది నియామకాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.

● ఈ విషయమై కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లాను వివరణ కోరగా సిబ్బందిని నియమిస్తే ప్రజలకు మెరుగైన సేవలుఅందుతాయన్నారు.

(c) eenadu

విజేతలతో రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ విశాఖ బ్రాంచి మేనేజర్ వీవీఎస్ రాఘవేంద్రరావు, న్యాయ నిర్ణేతలు,తదితరులు

ఆలోచనల ప్రభంజనం..
అమోఘ ప్రయో‘జనం’!!

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సీతంపేట, కార్పొరేషన్: సమాజంలో నిత్యం ఎదురయ్యే ప్రధాన సమస్యలపై విద్యార్థులు దృష్టి సారించారు. తమ సృజనాత్మకతను జోడించి ఆధునిక పరిజ్ఞానంతో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 77 ప్రాజెక్టులు రూపొందించారు. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘ఈనాడు- గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ’ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు అనూహ్య స్పందన వచ్చింది. సుస్థిరాభివృద్ధి విధానాలు, పర్యావరణ హిత ప్రాజెక్టులపై ఎక్కువ మంది విద్యార్థులు దృష్టి పెట్టారు.

● నగరంలోని రామాటాకీస్ సమీప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ భవన్‌లో.. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వాటిలో మూడు ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించగా.. నాలుగింటికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

● ప్రదర్శనలను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ తదితరులు పరిశీలించి పలు సూచనలు చేశారు

సీపీ శంఖబ్రత బాగ్చీకి ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థి

విద్యార్థులకు కలెక్టర్ దిశానిర్దేశం..: ఈ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ ప్రాజెక్టులను తిలకించారు. ‘స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’, ఘన వ్యర్థాలు, అపార్ట్‌మెంట్లలో మురుగు నీటి నిర్వహణ తదితర ప్రాజెక్టులను పరిశీలించి వాటిని ఎలా మెరుగుపరచుకోవచ్చో సూచించారు. వ్యవసాయ రంగానికి మేలు చేసే అంశాలపై దృష్టిసారించాలన్నారు.

GGU
GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారాలు

‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

ప్రాజెక్టు: నెక్సెన్ అథేరియా
పాఠశాల: మాలతాంబ విద్యానికేతన్, పీఎంపాలెం
విద్యార్థులు: పి.హార్షిత్, రాము
ఉపయోగం: కూలిపోయిన ఇళ్ల వ్యర్థాలతో ప్లాస్టిక్‌ను కలిపి త్రీడీ ప్రింటింగ్ ద్వారా కొత్త ఇళ్ల నమూనా తయారు చేసి గృహాలు నిర్మిస్తారు. ఇందులోని అంశాలను పరిశీలిస్తే.. భూకంపాలు వచ్చినపుడు బేస్ ఐసొలేషన్ వల్ల భవనాలు కూలిపోకుండా రక్షిస్తుంది. 1

పీజియో ఎలక్ట్రికల్ సామగ్రితో మనుషుల అడుగుజాడలను ఎనర్జీగా మారుస్తుంది.
వైర్‌లెస్ కార్ ఛార్జింగ్ స్టేషన్ : పార్కింగ్ వద్ద ట్రాన్స్‌మీటర్లు ఏర్పాటు చేస్తారు. అవి ఎలక్ట్రో మాగ్నెటిక్ వేవ్స్‌ను కారులోని రిసీవర్‌కు పంపించడం వల్ల వాటి సాయంతో వాహన బ్యాటరీ ఛార్జింగ్ అవుతుంది.
టెస్లాకోయిల్ : ఇది తీగలు లేకుండా విద్యుత్తును పంపిస్తుంది.

శిరస్త్రాణంతో రక్షణ
శిరస్త్రాణాలు ధరించాలని అవగాహన ర్యాలీని మంగళవారం ఏయూలో నిర్వహించారు.
6లో

బ్యాంక్ ఆఫ్ బరోడా
హైదరాబాద్ జోనల్ ఆఫీస్, 3-6-289, 1వ అంతస్తు, కరీమ్ మంజిల్, హైదరాబాద్, హైదరాబాద్-500029.
లీజుపై ప్రాంగణం కొరకు ప్రకటన
బ్యాంక్ ఆఫ్ బరోడా, జోనల్ కార్యాలయం, హైదరాబాద్ వారు విశాఖపట్నంలోని [illegible] లేదా అంతకు ముందుగా “టెక్నికల్ బిడ్” మరియు “ప్రైస్ బిడ్” రెండు వేర్వేరు సీల్డ్ కవర్‌లలో సమర్పించవలెను. పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ / గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్స్‌కు చెందిన ప్రాంగణాలకు ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కోసం దయచేసి మా వెబ్‌సైట్: www.bankofbaroda.com లోని టెండర్ల విభాగంలో లాగిన్ అవ్వగలరు. ఎటువంటి కారణాలను చూపకుండానే ఏదైనా ఆఫర్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించే హక్కు బ్యాంకుకు కలదు.
అప్లికేషన్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 12-03-2026 మ॥ 3.00 గం॥ల వరకు.
సం/- జనరల్ మేనేజర్, జోనల్ ఆఫీస్, హైదరాబాద్

ప్రోత్సాహక బహుమతుల విజేతలు

ప్రయోగం : **వ్యర్థాల నుంచి కాగితం తయారీ**
విద్యార్థులు : **ఆర్.వైష్ణవి(8వ తరగతి), డి.పార్థసారథి(6వ తరగతి), జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల, బుచ్చిరాజుపాలెం**

★ దేశంలో కాగితం తయారీకి చెట్లు నరకాల్సి వస్తుంది. దీంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుంది. ఈ సమస్యను అధిగమించేలా ఇంట్లో సేకరించే కాయగూరలు, పండ్ల వ్యర్థాల నుంచి కాగితం తయారు చేసే విధానాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఎలా చేయొచ్చో వివరించారు.

ప్రయోగం: **ట్రాలీ సూట్‌కేసును మెట్లు ఎక్కించేలా...!**
విద్యార్థులు : **ఆర్.దీక్షిత, ఎస్.దీపిక(6వ తరగతి), జడ్పీహెచ్‌ఎస్, వెంకటాపురం**

★ రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో ట్రాలీ సూట్‌కేస్‌లు తీసుకెళ్లే ప్రయాణికులు మెట్లు ఎక్కే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ సమస్యను పరిష్కరించేలా... ట్రాలీ సూట్‌కేస్ వెనుక వైపు రెండు ఇనుప రాడ్లను ‘ఎక్స్’ ఆకారంలో అమర్చారు. మెట్లు ఉన్నచోట ఆయా రాడ్లను తెరిచి వాటి సాయంతో సూట్‌కేసును పైకి ఎక్కించేలా ఏర్పాట్లు చేశారు. మెట్లు ఎక్కగానే, తిరిగి వాటిని మడిచే వీలుంటుంది.

ప్రాజెక్టు: **స్మార్ట్ సిటీ**
పాఠశాల: **సంస్కృతి గ్లోబల్ స్కూల్, పరవాడ**
విద్యార్థులు: **జి.జతిన్‌చౌదరి, పి.ఆష్మాన్ గుప్త**

2

ఉపయోగం: ఇందులోని సోలార్ ట్రాకర్ వల్ల సూర్య కిరణాలు ఎటువైపు ఉంటే సోలార్ ప్యానల్ అటు వైపునకు తిరుగుతుంది.
స్మార్ట్ డస్ట్‌బిన్ : డస్ట్‌బిన్ నిండితే బెల్ మోగుతుంది.
వైర్‌లెస్ కార్ ఛార్జర్ : ఛార్జింగ్ ప్లాట్‌ఫాంపై కారు కింది భాగంలో కాపర్ కాయిల్ ఏర్పాటు చేసి విద్యుత్తు అందిస్తే... దాని నుంచి ప్రత్యేక పరికరాల ద్వారా విద్యుత్తు ట్రాన్స్‌మిట్ అవుతుంది. **వర్టికల్ విన్ టర్బైన్ :** రహదారిపై వాహనాలు వెళ్లేటప్పుడు వచ్చే గాలితో టర్బైన్‌లు తిరిగి విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాన్ని స్టోరేజ్ చేసుకోవచ్చు. **స్మార్ట్ వీధి దీపం:** చీకటి పడినప్పుడు దానంతటదే వెలిగి, సూర్యరశ్మి పడగానే ఆగిపోతుంది.

ప్రయోగం : **పంట ఉత్పత్తులు తడవకుండా...!**
విద్యార్థులు : **సీహెచ్.రఘువీర్, టి.జ్ఞానేశ్వరి, ఎస్.దేవన్ (9వ తరగతి), జడ్పీహెచ్‌ఎస్, వేపగుంట**

★ పొలాల్లో ఆరబెట్టిన పంటలు తడవకుండా రక్షించే ప్రాజెక్టు ఇది. ప్రత్యేకంగా పైకప్పు తెరిచి ఉన్న గదిని తయారు చేసి, అందులో ధాన్యం, ఇతర పంట గింజల్ని ఆరబోస్తారు. పైకప్పునకు సెన్సర్లు ఏర్పాటు చేస్తారు. వాటిపై ఒక్క చుక్క వర్షం పడినా, వెంటనే తెరిచి ఉన్న పైకప్పు పూర్తిగా మూసుకుపోయేలా సెన్సర్లు పని చేస్తాయి.

ప్రయోగం : **సమస్యలకు ‘సాంకేతిక’ పరిష్కారం**
విద్యార్థులు : **ఎస్.హర్ష, కె.ఆదిత్య (9వ తరగతి), సీహెచ్.నవనీత్ (8వ తరగతి), ప్రతిభా విద్యాలయం, సబ్బవరం.**

★ గాలిలో కాలుష్య కారకాలు గుర్తించడం, సౌర పలకల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయడం, వాణిజ్య సముదాయం సెల్లార్లు వాహనాలతో నిండితే, బయట నుంచి లోపలకు వచ్చే వాహనచోదకులకు ఆ విషయాన్ని తెలియజేయడం...ఇలా పలు సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించిన ప్రదర్శన ఇది. అలాగే చెత్తను మండించి, ఆ వేడి నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం ఆకట్టుకుంది.

ప్రాజెక్టు: **స్మార్ట్ హెల్మెట్**
పాఠశాల: **జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడుపూరు**
విద్యార్థి: **టి.ఉదయ్ కిరణ్**

3

ఉపయోగం: శిరస్త్రాణం ధరించక ఎంతో మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి పరిష్కారమే స్మార్ట్ హెల్మెట్. ★ హెల్మెట్, ట్రాన్స్‌మీటర్, సెన్సర్, రిసీవర్, 298 ఎన్ మోటార్ రిసీవర్ మాడ్యుల్, డీసీ మోటార్, బ్యాటరీ.. వీటిని వినియోగించి స్మార్ట్ హెల్మెట్ తయారు చేశారు. తలకు హెల్మెట్ తగిలిస్తేనే మోటార్ సైకిల్ ఇంజిన్ స్టార్ట్ అవుతుంది. దీనివల్ల వాహన చోదకులు తప్పనిసరిగా ధరించాల్సి వస్తుంది.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, నాగరిపాలెం గ్రామంలో ఉన్న Sy.No.11/7Bలోని Ac. 2.89Cts, Sy.No. 11/5లోని Ac. 0.16Cts, Sy.No.12/1 లోని Ac.0.04Ctsతో సహా మొత్తం 3.09cts వ్యవసాయ భూమిని కొనుగోలు చేయాలను కుంటున్నారు. ఉత్తరం: అవంతి ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్ & పొరుగువారి భూమి, దక్షిణం: అవంతి ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్ & పొరుగువారి భూమి, తూర్పు: అవంతి కళాశాల ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్, పశ్చిమం: నేషనల్ హైవే దాని యజమానులు మరియు యజమానులు శ్రీమతి యెనిగల్ల ఉమా రాణి W/o.Sri Y.G.K.మూర్తి, R/o.H.No. 48-18-66, తులసిపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ నుండి అమ్మకానికి ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు తేదీ: 12-02-2026 తేదీ నాటికి అమ్మకానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి(లు) సదరు ఆస్తిపై ఏదైనా హక్కు, టైటిల్ క్లెయిమ్, ఆసక్తి కలిగి ఉంటే, వారి పబ్లిక్ నోటీసు తేదీ నుండి పదిహేను రోజులలోపు వారి హక్కు, టైటిల్, క్లెయిమ్ లేదా ఆసక్తిని దానికి మద్దతుగా ఉన్న అన్ని డాక్యుమెంటరీ ఆధారాలతో కింద సంతకం చేసిన వ్యక్తికి తెలియజేయవచ్చు, సదరు తేదీ నాటికి ఎటువంటి అభ్యంతరాలు అందకపోతే, నా క్లయింట్లు పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించిన అవసరమైన పత్రాల అమలు మరియు నమోదును కొనసాగిస్తారు మరియు ఆ తర్వాత వచ్చిన ఏవైనా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోరు.

Sd/- ఎన్. వెంకటేశ్వర రావు, వి.నంద కిషోర్, Ch. సోనియా
అడ్వకేట్స్ & అసోసియేట్స్
#304, ఆషియానా అపార్ట్మెంట్స్, ఆనంద్ నగర్ కాలనీ, ఖైరతాబాద్,
హైదరాబాద్-500 004, Ph.9912111249, ఇమెయిల్: nlvraoin@gmail.com

కాలుష్యం కట్టడే కీలకం

గంగవరం పోర్టు వద్ద ఇనుప ఖనిజ మిశ్రమ కేంద్రం

ఈనాడు-విశాఖపట్నం: పోర్టుల కాలుష్యం కట్టడి చేయకుంటే ‘కాలుష్యస్థాయి’లో దిల్లీని విశాఖ మించి పోయేలా ఉంది. తాజాగా గంగవరం పోర్టులో ఇనుప ఖనిజ మిశ్రమ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న తరువాత ఈ విషయం మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఈ ఒప్పందంతో అదానీ గంగవరం పోర్టు సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరుతుంది. మేజర్ పోర్టు విశాఖ, ఆ పక్కనే 20 కి.మీ. దూరంలో గంగవరం పోర్టు, ఇటీవల అనుమతులిచ్చిన నక్కపల్లిలో ఆర్సెలార్ మిత్తల్‌కు క్యాప్టివ్ పోర్టు, ఇలా మూడింటి నుంచి వచ్చే కాలుష్యం కట్టడి ఎలా? అనేది అందరిని వేధిస్తున్న ప్రశ్న. బల్క్‌గా బొగ్గు, ఇనుప ఖనిజాల రవాణా జరిగే పరిస్థితి ఉండటమే ఇందుకు కారణం.

★ ఇప్పటికే గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యం గాజువాక, కూర్మన్నపాలెం, కణితి రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్రభావం చూపుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

విశాఖ ఉక్కుకు ఉపయోగమని చెప్పి..

పెల్లెట్ ప్లాంటు పెడితే విశాఖ ఉక్కుకు ఉపయోగమంటూ గతేడాది జనవరిలో స్టీలు ప్లాంటుకు చెందిన 1,100 ఎకరాలను ఎన్ఎండీసీకి అప్పగించారు. ఈ భూముల రిజిస్ట్రేషన్ కూడా పూర్తవగా ఏడాదిగా ఖాళీగానే ఉన్నాయి. అదానీ, వేల్, ఎన్ఎండీసీకి మధ్య ఒప్పందం జరగడంతో ఆ ఇనుప ఖనిజ నిల్వలు పెట్టేందుకు ఎన్ఎండీసీ ప్లాంటు నుంచి తీసుకున్న భూములనే ఉపయోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదానీ పోర్టుకు వచ్చే ఇతర నిల్వలు సైతం ఇక్కడే ఉంచే అవకాశం ఉందని, భవిష్యత్‌లో పోర్టు సామర్థ్యం పెరిగితే విశాఖ ఉక్కు భూముల వైపే చూస్తారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వంలో జగన్ రూ.3 వేల కోట్ల విలువైన రాష్ట్ర వాటాను అదానీకి రూ.600కోట్లకే కట్టబెట్టారు. అప్పటి నుంచి స్టీలు ప్లాంటుకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. గంగవరం పోర్టు పూర్తిగా అదానీ చేతుల్లోకి వెళ్లాక పరిస్థితులు మారిపోయాయి. స్టీలు ప్లాంటు కోసం ప్రత్యేకంగా ఉండే బెర్త్ రద్దు చేశారు. కన్వేయర్ ఛార్జీలు పెంచడం, మార్జిన్ (డ్యూ) లేకుండా పాతబకాయిలు చెల్లిస్తేనే అనే నిబంధన పెట్టడం, నౌకల్లో సరకు సకాలంలో దించని పరిస్థితుల్లో డెమరేజ్ ఛార్జీలు ప్లాంటుపై పడటం, పోర్టులో కార్మికుల సమ్మె... ఇలాంటి ఎన్నో అంశాలతో విశాఖ ఉక్కుకు ఇబ్బందులు తలెత్తాయని కార్మిక సంఘాలు గుర్తు చేస్తున్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: బుధవారం 6:05 గం॥లకు
సహరి: గురువారం 5:01 గం॥లకు

సూపర్‌బజార్‌లో రాయితీపై సరకులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఉగాది నేపథ్యంలో పాతనగరంలోని మెయిన్‌రోడ్డు చెంతనే ఉన్న సూపర్‌బజార్‌లో రూ.800 విలువ చేసే 12 రకాల సరకుల్ని రూ.499కే విక్రయించనున్నట్లు సంస్థ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నగర పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామీణుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సింధియా, న్యూస్‌టుడే: టొయోటా కిర్లోస్కర్ ఇండియా లిమిటెడ్ (టీఆర్ఈఐ) ఆర్థిక సహకారంతో ఇవ్వనున్న ఉచిత వసతి, శిక్షణ, ఉపాధి అవకాశాలకు గ్రామీణ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సెట్స్ సీవోవో కమాండర్ (ఆర్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ దరఖాస్తులను ఫిబ్రవరి 28వ తేదీలోగా పంపాలని పేర్కొన్నారు. సంబంధిత కోర్సుల్లో రెండు నెలల శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సింధియా దరి సెట్స్ కార్యాలయంలోగాని, 7794840934, 8331901237, 0891-2704010 నెంబర్లలోగాని సంప్రదించాలన్నారు.

వైద్య సేవలకు అంతరాయమేనా..?

★ ముగిసిన హౌస్ సర్జన్ల గడువు
★ కేజీహెచ్‌పై తీవ్ర ప్రభావం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్ జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్)లో వైద్య సేవలకు అంతరాయం కలిగే పరిస్థితి తలెత్తింది. ఏడాది నుంచి విధులు నిర్వహిస్తున్న దాదాపు 200 మంది హౌస్‌సర్జన్ల గడువు మంగళవారంతో ముగిసింది. కొత్త వాళ్లు (బ్యాచ్) రావడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. అప్పటివరకు వైద్య సేవలపై ప్రభావం పడుతుంది.

ఏటా 250 మంది..!: ★ ఏటా ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసిన 250 మంది ఏడాది పాటు హౌస్‌సర్జన్లుగా సేవలు అందిస్తారు. గత ఏడాది వచ్చిన వారి గడువు పూర్తవడంతో, వారంతా బయటకు వెళ్లిపోనున్నారు.

★ కొత్త బ్యాచ్‌కు ఏప్రిల్ నెలలో థియరీ పరీక్షలు, ఆ తర్వాత ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ఇవన్నీ పూర్తయ్యాక తుది ఫలితాలను ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం ప్రకటిస్తుంది. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని హౌస్‌సర్జన్లుగా నియమిస్తారు.

★ వారంతా కేజీహెచ్‌తో పాటు ఏఎంసీకి అనుబంధంగా నగరంలో ఉన్న ఏడు ఆసుపత్రుల్లో సేవలు అందించాల్సి ఉంటుంది. ఎక్కువ మంది కేజీహెచ్‌లోనే విధులు నిర్వహిస్తుంటారు.

★ రోజూ కేజీహెచ్ క్యాజువాల్టీలోని మూడు షిఫ్టుల్లో, వివిధ వార్డుల్లో, రక్త సేకరణ కేంద్రంలో, రక్తనమూనాల సేకరణ, తదితర విభాగాల్లో హౌస్‌సర్జన్ల సేవలు కీలకం. ఇప్పుడు ఆయా పనులు చేయడానికి పీజీలు ససేమిరా అంటున్నారు.

★ ఈ పరిస్థితిని అధిగమించేలా ఆసుపత్రి వైద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

ముందుచూపు ఏది..?

★ ఈ సమస్యను ఎలా అధిగమించాలనే విషయమై ఆసుపత్రి వైద్యాధికారులు ముందస్తుగా దృష్టి సారించలేదు. హౌస్‌సర్జన్లు అందించే సేవల్ని పీజీ(పోస్టు గ్రాడ్యుయేట్)లు చేయాలని వైద్యాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో, పని భారం పెరుగుతుందని పీజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ ప్రస్తుతం విదేశాల్లో చదువుకుని కేజీహెచ్‌లో శిక్షణ పొందుతున్న 16 మందిని హౌస్‌సర్జన్ల స్థానంలో నియమించారు. సుమారు 200 మంది అందించే సేవల్ని 16 మందితో ఎలా చేయించాలని వైద్యులు తలలు పట్టుకుంటున్నారు.

(c) eenadu

మార్చి నెలాఖరుకి చందనోత్సవం ఏర్పాట్లు పూర్తి కావాలి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై ఏప్రిల్ 20న జరగనున్న అప్పన్న స్వామి నిజ రూప దర్శనం చందనోత్సవం సందర్భంగా మార్చి నెలాఖరు నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ దేవస్థానం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఈవో జె.వెంకటరావుతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్తులకు సంతృప్తికరంగా నిజరూప దర్శనం కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం, జిల్లా యంత్రాంగం పని చేస్తున్నాయన్నారు. వేకువజామున 3 నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతరాయంగా దర్శనాలు కల్పించేందుకు తీసుకోబోతున్న సదుపాయాలపై చర్చించామన్నారు. ★ రూ.300, రూ.1000, రూ.1,500 టికెట్ల వరుసలు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రారంభమవుతాయన్నారు. ★ గత పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. క్యూలైన్లు శాశ్వత షెల్టర్లలోనే ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసినట్లయితే వాటిని ర.భ.శాఖ, ఇంజినీరింగ్ విభాగాలు, విద్యుత్తు, అగ్నిమాపక ధ్రువీకరణలు చేయిస్తామన్నారు. ★ వీఐపీలకు దర్శనం స్లాట్ల విషయంపై ప్రజా ప్రతినిధులతోనూ చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వేకువజామున 3 నుంచి 5 గంటల మధ్య వారికి సమయం కేటాయించాలని అనుకుంటున్నామన్నారు. ★ ఈ ఏడాది వారం రోజులు ముందుగానే టికెట్లు పంపిణీ కార్యక్రమం పూర్తి చేసేలా ప్రణాళిక వేస్తున్నామన్నారు. ఈ ఏడాది రూ.1,500 టికెట్లు ఎవరికి వారే ఫొటో ఐడీ ద్వారా బ్యాంకులో తీసుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ★ అంతరాలయ దర్శనాల అంశంపై ప్రజా ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ★ గత కొన్నాళ్లుగా నిజరూప దర్శనం వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్న నేపథ్యంలో కఠిన నిబంధనలు అమలు చేస్తామన్నారు. ★ కలెక్టర్ వెంట ఈవో జె.వెంకటరావు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఈఈలు సీహెచ్.రమణ, రాంబాబు, రామకృష్ణ, గోపాలపట్నం సీఐ ఎల్.ఎస్.నాయుడు, పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ హరేంధిరప్రసాద్ స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

సింహగిరిపై ఏర్పాట్ల ప్రణాళికను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నగర ప్రజల్లో శిరస్త్రాణం(హెల్మెట్) ధారణపై అవగాహన కల్పించడానికి మంగళవారం ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'హెల్మెట్ ఫర్ లైఫ్' ర్యాలీ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఏయూ పరిపాలనా భవనం నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ సిరిపురం కూడలి, రేడియో కేంద్రం, ఆర్కే బీచ్ మీదుగా ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు కొనసాగింది. సీపీ మాట్లాడుతూ ప్రజోపయోగ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏయూ యాజమాన్యాన్ని, ఉద్యోగులు, అధికారులను అభినందించారు. ఇప్పటికే 'నో హెల్మెట్.. నో ఫ్యూయల్' నిబంధన అమలు చేస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల 40 శాతం మరణాలు తగ్గుతాయన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య జాలాది రవి, కె.సీతామాణిక్యం, డి.నగరాజ కుమారి, జి.గిరిజా శంకర్, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.హరనాథ్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగం అభివృద్ధికి చర్యలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: వ్యవసాయరంగంలో నాణ్యమైన కూలీల కొరతను అధిగమించాలంటే వ్యవసాయ యాంత్రీకరణ ఒక్కటే సరైన మార్గమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ వేదికగా భారతీయ వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి అనే అంశంపై మంగళవారం జాతీయ కార్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ వ్యవసాయం అవసరాలకు అనువుగా యంత్ర పరికరాల అభివృద్ధిలో కీలక పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఏపీలో ప్రత్యేకంగా వ్యవసాయ ఇంజినీరింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎన్ ఝా సూచించారు. రోబోటిక్స్, ఏఐ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయం రంగంలో భాగం చేయాలన్నారు. అనంతరం సంబంధిత సావనీర్‌ను ఆవిష్కరించారు. పలు రాష్ట్రాల శాస్త్రవేత్తలు డాక్టర్ కె. నర్సయ్య, డాక్టర్ ఆర్‌కే విశ్వకర్మ, డాక్టర్ సచికేత్ కొత్వాలివాలే, డాక్టర్ పీవీ సత్యనారాయణ, డాక్టర్ ఎ.మణి, డాక్టర్ ముకుందరావు పాల్గొన్నారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి, తదితరులు

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

కోటనరవ(వేపగుంట), న్యూస్‌టుడే: పెందుర్తి మండల పరిధి కోటనరవ గ్రామంలో ఓ వృద్ధురాలి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆ వివరాలిలా.. గ్రామంలోని మళ్ల ధనలక్ష్మి (70) తన ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తోంది. ఆమె మృతి అనుమానాస్పదంగా ఉందని, దగ్గరి బంధువులే ఆమెను హతమార్చినట్లు మంగళవారం ఉదయం 5గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. ఎస్.ఐ.లక్ష్మీ, ఇద్దరు కానిస్టేబుళ్లు, క్లూస్‌టీం ఘటనా స్థలానికి వెళ్లగా.. ఆమె అనారోగ్యంతో చనిపోయినట్లు కుటుంబీకులు చెప్పారు. అయినప్పటికీ గ్రామస్థుల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా..ధనలక్ష్మికి ఇటీవల మెడపై దెబ్బ తగిలింది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఆయాసం రావడంతో ఆమెను స్థానిక ప్రయివేటు వైద్యుడికి చూపించారు. తర్వాత నగరంలోని ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధపడి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. సంబంధిత వాహన సిబ్బంది ఆమెను పరీక్షించి.. అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు.

'విశ్రాంత డీసీపీ'పై చర్యలు ఉపసంహరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ విశ్రాంత ఉప నగర ప్రణాళికాధికారి బాలాజీపై తదుపరి చర్యలు ఉపసంహరిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వివరాలు...బాలాజీ విధుల్లో ఉన్నప్పుడు, మధురవాడ సర్వే నెంబరు 243/3లో చేపట్టిన నిర్మాణాలు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అనుమతులు జారీ చేశారని విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఆ నివేదికపై ఇటీవల బాలాజీ ఇచ్చిన వివరణకు సంతృప్తి చెంది, చర్యలను ఉపసంహరించారు. ★ అలాగే కార్యస్థలాల సర్వే నెంబర్ 23/1లో ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా గుర్తిస్తూ పత్రాలు జారీ చేసిన నాటి గాజువాక తహసీల్దార్ వీఎస్.మాధవి (విశ్రాంత అధికారిణి) పింఛను నుంచి 3 శాతం మినహాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ANDHRA UNIVERSITY VISAKHAPATNAM
No.UE/e-PTN (15)/AU/VSP/2026-27. Date:24-02-2026
TENDER NOTICE
Short time and Normal e-tenders are invited through e-procurement for Civil, Electrical works and procurement of Lab equipment at Andhra University, Visakhapatnam. Last Date for Short tenders : 28-02-2026, Normal e-tenders:06-03-2026.
respectively for details visit: https://tender.apeprocurement.gov.in.
Sd/- Registrar

'దురంతో' బోగీల కూర్పులో మార్పులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ- సికింద్రాబాద్ (22203/22204) దురంతో రైలు బోగీల కూర్పులో మార్పులు చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ 22 వరకు విశాఖ-సికింద్రాబాద్, మార్చి 26 నుంచి ఏప్రిల్ 23 వరకు సికింద్రాబాద్-విశాఖ దురంతో రైళ్లు ఓ ఫస్ట్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, 12 థర్డ్ ఏసీ, 3 స్లీపర్, 2 సెకండ్ క్లాస్ లగేజీ కమ్ దివ్యాంగుల బోగీలతో రాకపోకలు సాగిస్తాయన్నారు. ఏప్రిల్ 25 నుంచి సికింద్రాబాద్-విశాఖ, ఏప్రిల్ 26 నుంచి విశాఖ-సికింద్రాబాద్ దురంతో రైళ్లు 2 ఫస్ట్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, 14 థర్డ్ ఏసీ, 2 లగేజీ కమ్ దివ్యాంగుల బోగీలతో నడిచేలా మార్పు చేశామన్నారు.

హోంగార్డు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జిల్లాలో హోంగార్డు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీపీ శంఖబ్రతబాగ్చీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 32 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రోజుకు రూ.700 వేతనంతో పురుష, స్త్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు విశాఖకు చెందిన వారై ఉండాలని, [illegible] పూర్తి చేసి, 21 నుంచి 50 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు.

Rc.No.87/ITDA/2026 Dated. 24-02-2026. O/o Project Officer ITDA, Paderu
TENDER NOTICE
(FOR SUPPLY OF AMENITIES TO PREGNANT WOMEN HOSTEL's / BIRTH WAITING HALL'S)
Sealed Tenders are invited on or before 05-03-2026 by 3.00 Pm from the Manufacturing Firms /Suppliers for supply of certain amenities to Pregnant Women Hostel/ Birth waiting Halls ITDA, Paderu as per the specified terms and conditions prescribed in the tender document. **The Tender document can be taken from the office of the Project Officer, I.T.D.A., Paderu, Alluri Sitharama Raju District in any working day from 25.02.2026 to 05.03.2026 before 1.00 Pm** manually on production of DD for Rs.5000/- drawn in the name of Project Officer, ITDA, Paderu towards cost of Tender document (Non-refundable). The filled in Tender Document should be submitted along with EMD of Rs.50,000/- by way of DD drawn in the name of Project Officer, ITDA, Paderu and put the sealed tender manually in the tender box kept in ITDA, Paderu before due date.
The last date & time for submission of sealed tenders are 05.03.2026 by 3.00 Pm. Tenders without EMD will summarily be rejected. The tenderers should attend in person on through authorized representative on 05.03.2026 along with samples. The committee constituted will verify the sample and also open the tender box on the same day at 4.00 Pm. The decision of the Project Officer is the final and binding either to cancel any tender, all the tenders or postpone or alter changes in requirement. No tenders through post or email will be entertained.
(Contact Sri S.SANJEEV KUMAR. Cell No. 9492825282 of Section Assistant)
Sd/- TIRUMANI SRI POOJA,
PROJECT OFFICER, ITDA, PADERU.

రెండోరోజూ హోరాహోరీ..

ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య పోటీలో పాల్గొన్న దివ్యాంగులు

సబ్బవరం, న్యూస్‌టుడే : జాతీయ దివ్యాంగుల వీల్ ఛైర్ క్రికెట్ పోటీలు రెండో రోజు మంగళవారం కూడా అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గుల్లేపల్లి సమీపంలోని ఓ ప్రైవేటు స్టేడియంలో కొనసాగాయి. ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య పోటీ హోరాహోరీ సాగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 201 పరుగులు చేసింది. రేవతి శ్రీను 42 బంతుల్లో 82 పరుగులు, ప్రద్యుమ్న 39 బంతుల్లో 52 పరుగులు, సంతోష్ 30 బంతుల్లో 34 పరుగులు చేసి జట్టు స్కోరుకు తోడ్పడ్డారు. రెండో బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 155 పరుగులు సాధించింది. దీంతో ఆంధ్ర జట్టు 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శ్రీను నిలిచాడు. మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తెలంగాణ 20 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 282 పరుగులు భారీ స్కోర్ చేసింది. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు దిగిన ఒడిశా జట్టు 20ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేయడంతో తెలంగాణ జట్టు విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వేద్ మోను నిలిచారు. దివ్యాంగుల కమిటీ ఛైర్మన్ రమాన్ సుబ్బారావు, దివ్యాంగుల కమిటీ కార్యదర్శి ఎల్లపల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు.. సింహాచలం దేవస్థానం భూ పరిరక్షణ విభాగం ఎస్‌డీసీగా ఉన్న గీతాంజలిని స్టేట్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఎస్డీసీగా నియమించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి డీఆర్వోగా ఉన్న సీహెచ్.సత్తిబాబును విజయనగరం జిల్లా డీఆర్వోగా బదిలీ చేశారు. పద్మనాభం తహసీల్దార్ కె.ఆనందరావును ఎస్‌డీసీగా పదోన్నతి కల్పించి, రాజధానిలో సీఆర్‌డీఏకు బదిలీ చేశారు. జిల్లాకు సంబంధించి ప్రకృతి విపత్తుల సంస్థ డిప్యూటీ మేనేజర్‌గా ఎస్‌డీసీ పి. గోవింద్, పోర్టు డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్‌గా డి.పుష్పమణిని నియమించారు. అయితే కీలకమైన ఆర్డీఓ, డీఆర్వో పోస్టులను భర్తీ చేయకపోవడంపై జిల్లా రెవెన్యూ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

ఉత్సాహంగా 'యూసీసీ క్రికెట్ పోటీలు'

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : యూసీసీ క్రికెట్ పోటీలు రెండో రోజైన మంగళవారం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో ఉత్సాహంగా కొనసాగాయి. తొలి మ్యాచ్‌లో గెలాక్సీ సీసీ జట్టు 140 పరుగుల తేడాతో రేమండ్ బ్లూస్ జట్టుపై గెలుపొందింది. తొలుత గెలాక్సీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. జట్టులో బి.కృష్ణ 106, కె.భరత్‌కృష్ణ 45 పరుగులు చేశారు. తర్వాత రేమండ్ బ్లూస్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 పరుగులు చేసింది. జట్టులో సచిన్‌శర్మ 54 పరుగులు చేశారు. గెలాక్సీ జట్టు బౌలర్ వి.ప్రశాంత్ 5 వికెట్లు తీసి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కించుకున్నారు. రెండో మ్యాచ్‌లో వైజాగ్ బ్లూస్ జట్టు 88 పరుగుల తేడాతో సిటీ పోలీసు జట్టుపై విజయం సాధించింది. వైజాగ్ బ్లూస్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసింది. డి.హార్దిక్ 137 పరుగులు చేశారు. ఈ అనంతరం సిటీ పోలీసు జట్టు 20 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది.

'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకుంటున్న ప్రశాంత్

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

దివ్యాంగ విద్యార్థిని సంధ్యను ఎత్తుకొని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చిన తల్లి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 85 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 39,644 మంది విద్యార్థులకు 39,291 మంది (99.11శాతం) హాజరయ్యారని ఆర్.ఐ.ఒ. పి.మురళీధర్ తెలిపారు. నగరంలో పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్‌కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలువురు దివ్యాంగులు పరీక్షలు రాశారు. ఎంవీపీకాలనీలోని ఎ.ఎస్.రాజా మహిళా కళాశాల నుంచి దివ్యాంగ విద్యార్థిని ఉమ్మడి సంధ్య పరీక్షకు హాజరైంది. తల్లి ఆమెను ఎత్తుకుని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు.

బహిరంగ ప్రకటన (PUBLIC NOTICE)

ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం, తులసీపేట, ఇంటి నంబర్: 48-18-66 నివాసి అయిన నా క్లయింట్ శ్రీమతి యేనిగల్ల ఉమారాణి W/o శ్రీ వై.జి.కె. మూర్తి గారు నాకు ఇచ్చిన భోగట్టాపై సమస్తమైన వారలకు తెలియజేయునది యేమనగా: నా క్లయింటు తేదీ 16-02-2026న భీమునిపట్నం ఎం.ఆర్.ఓ (M.R.O) కార్యాలయం నుండి చిట్టివలసకు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ క్రింద పేర్కొన్న రిజిస్టర్డ్ క్రయ దస్తావేజులు పోగొట్టుకున్నారు. ఎంత వెతికినప్పటికీ ఆ దస్తావేజులు లభించలేదు. ఎవరికైనా సదరు డాక్యుమెంట్లు దొరికిన యెడల క్రింద పొందుపరిచిన ఎడ్రసునకు వెంటనే తెలయపరచగలరు. క్రింది తెలిపిన ఆస్తికి సంబంధించిన ఓరిజినల్ సేల్ డీడ్, టైటిల్ డీడ్లు, మరియు లింక్ డాక్యుమెంట్ల ఆధారంగా చేసే ఎటువంటిలావాదేవీలైనా నా క్లయింట్కు గాని ఆమె తరపున ఎవరైన ఎగ్రిమెంట్లుగాని, ఎమైనలావాదేవీలుగాని అవి చెల్లవని మరియు నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులుకాగలరని యావన్మందికి తెలియజేయుచున్నాము.

పోగొట్టుకున్న పత్రాల వివరాలు:

నెం.	తేదీ	వివరణ	డాక్యుమెంట్ నంబర్	ఎస్.ఆర్.ఓ (S.R.O)
1.	19-08-1980	ఒరిజినల్ సేల్ డీడ్	1978/1980	భీమునిపట్నం, విశాఖపట్నం
2.	29-05-1961	ఒరిజినల్ సేల్ డీడ్	1282/1961	భీమునిపట్నం, విశాఖపట్నం
3.	18-05-1959	ఒరిజినల్ సేల్ డీడ్	1006/1959	భీమునిపట్నం, విశాఖపట్నం
4.	19-05-1959	ఒరిజినల్ సేల్ డీడ్	1007/1959	భీమునిపట్నం, విశాఖపట్నం

షెడ్యూల్
ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, నాగరిపాలెం గ్రామంలో ఉన్న Sy.No.11/7Bలోని Ac. 2.89Cts, Sy.No. 11/5లోని Ac. 0.16Cts, Sy.No.12/1 లోని Ac.0.04Ctsతో సహా మొత్తం 3.09cts వ్యవసాయ భూమి హద్దులు: ఉత్తరం: అవంతి ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్ & పొరుగువారి భూమి, దక్షిణం: అవంతి ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్ & పొరుగువారి భూమి, తూర్పు: అవంతి కళాశాల ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్, పశ్చిమం: నేషనల్ హైవే
Sd/- S. ARUN DEV, Advocate
Flat No: GF A-2, Dolphin Apartments, Nethaji Street, Behind Hotel Taj, Maharanipeta, Visakhapatnam-2, 9848566903 (M)

పేదల ఆర్థిక ప్రగతికి చేయూత

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పేదల ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేసి, చేయూత ఇవ్వాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు రుణాలు సమకూర్చాలన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రుణాలు మంజూరు చేయాలన్నారు. మార్చి 8న నిర్వహించే మహిళా దినోత్సవం నాటికి ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు రుణాలు అందించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ... జిల్లాలో రూ.74,317 కోట్ల రుణ లక్ష్యానికి మించి రూ.81వేల కోట్ల రుణాలు అందజేశామన్నారు. వివిధ బ్యాంకుల అధికారులు శ్రీనివాసరావు, సమంతకుమార్, నవీన్‌కుమార్, జిల్లా అధికారులు లక్ష్మీపతి, సరోజిని, ఆదిశేషు, అప్పలస్వామి, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో... ఆధిపత్య పోరు..!

ఆసుపత్రి అడ్మిన్‌పై ఆర్ఎంఓలు ఫిర్యాదు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖలోని కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో ఆధిపత్య పోరు పతాకస్థాయికి చేరింది. ఆసుపత్రి సివిల్‌సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, సహాయ ఆర్ఎంఓ(రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)లకు, ఆసుపత్రి అడ్మిన్‌కు మధ్య సమన్వయం కొరవడింది. గత కొన్నాళ్ల నుంచి లోలోపల ఉన్న వివాదాలు మంగళవారం బహిర్గతమయ్యాయి.

సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు...!

తమ విధుల్లో అడ్మిన్ జోక్యం చేసుకుంటూ, ప్రతి విషయంలో ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయన్ను నిలువరించాలని సీఎస్ఆర్ఎంఓ, ఆర్ఎంఓలు కోరారు. మంగళవారం వారంతా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం గతంలో జారీ చేసిన జాబ్‌చార్ట్ ప్రకారం ఎవరి విధులు వారికి కేటాయించాలని విన్నవించారు. ★ ఆర్ఎంఓలు (వైద్యాధికారులు) నేరుగా అడ్మిన్‌పై ఫిర్యాదు చేయడం... ఆసుపత్రి వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ అశోక్‌కుమార్ ఉన్న సమయంలో ఇలాంటి పరిస్థితి తలెత్తడంతో అప్పట్లో డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓను ప్రభుత్వం ఆరోగ్యశాఖకు సరెండర్ చేసింది.

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి వినతిపత్రం అందజేస్తున్న సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శ్రీహరి, ఇతర ఆర్ఎంఓలు

కలెక్టర్ సూచించినా..!: ★ ఆసుపత్రిలో ఉన్న వైద్యాధికారులు వివిధ పద్దుల కింద చెల్లించిన బిల్లుల విషయంలో భారీ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో కలెక్టర్ హరేంధిరప్రసాద్ స్పందించారు. గతంలోనే వైద్యాధికారులు, పరిపాలన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమన్వయంతో పని చేయాలని హితబోధ చేశారు. అయినా వైద్యాధికారుల్లో మార్పు రాలేదు. ★ ప్రభుత్వ ఆదేశాల మేరకు తనకు కేటాయించిన విధులను నిర్వహిస్తున్నానని, మరొకరి విషయంలో కలుగజేసుకోవడం లేదని అడ్మిన్ చెబుతున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES
లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

INDUSTRY
INDUSTRIAL SHED
పెందుర్తి MSME ఇండస్ట్రియల్ పార్క్‌లో అద్దెకు షెడ్‌కలదు. సైజు (65x150) సంప్ర॥ 9848294957, 9494126429.

REAL ESTATE
PLOT FOR SALE
KOTHAVALASA
కొత్తవలస-రాయపూర్ హైవేకి1KMలో 516E పెందుర్తి-అరకు రానున్న హైవేకి 2KMలో VMRDA PLOTS గజం: 12వేలు. 7416862947, 9182857713.

TO LET
MADHURAWADA
3BHK, 3rd ఫ్లోర్, 304, శ్రీవెంకటేశ్వర రెసిడెన్సీ, FCI లేఅవుట్ PM పాలెం, మధురవాడ, వైజాగ్. 24 గం॥ వాటర్, కార్ పార్కింగ్. ✆ 9490557700.

WANTED
GENERAL
RK బీచ్‌రోడ్డుకు దగ్గరగా 2BHK (or)3BHK Full Furnished House required 3Months ఇల్లు అద్దెకు కావలెను. ✆ 9848299619.

JOBS
Required a Female Tele caller and Office Boy in Vechile Finace Company 2-3Years Experience. Ph: 9182018251.
Required Sr. Accountant (F) Experience in GST Filing and Tally & MS Office for our Granite Export Comp., VSP. 9908664521.
Urgent Requirement following Senior Positions * Chief Administration Managers: 5 No's, M/F, Experienced / Retd. in any field. Interviews on: 11th & 12th Feb.26. ✆ 9553021026, 7702999763.
Wanted South Indian Cook for Home. Salary 12,000/- Near Narsimhanagar ✆ 9912464444.
Vacancy for Cashier cum Manager (Female), Near Dolphin Hotel, Auto Crate India. Ct: 9885445286.
గాజువాకలో ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు లేడి PRO's కావలెను. Qlf: Degree. జీతం॥ 10K. ✆ 9848677745.
ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, all (డిగ్రీ, B.Tech., Dip. & ITI) కావలెను. Sal: 18-25K, Age 35 లోపు, స్పాట్ జాయిన్ ✆ 7995439539
ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్టర్స్‌వద్ద సూపర్‌వైజర్స్ కం॥ ఆపరేటర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ, స్టాఫ్ ఇన్‌ఛార్జ్, ఫైర్ & సేఫ్టీ. 10th- డిగ్రీ, ITI, BTech జీ॥ 20K-35K. 9573635594, 9121044796
మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో B.టెక్, డిప్లమో, ITI, డిగ్రీ సిస్టంఆపరేటర్స్ సేఫ్టీ సూపర్‌వైజర్స్ స్టోర్స్ 45సం॥ Sr.ఇంజినీర్స్, 8019647888, 8341177761.

DRIVERS
పరవాడ ప్లాస్టిక్ కంపెనీకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & డ్రైవర్స్ (హెవీ/లైట్) మరియు హెల్పర్స్ కావలెను. జీతం॥ 15 నుండి 20వేలు సంప్ర 9493969749/ 9848899279

SECURITY GUARDS
సెక్యూరిటీగార్డ్స్:- మధురవాడ ఏరియాలో చేయుటకు గార్డ్స్ కావలెను. 8 గం॥ డ్యూటీ, వ: 25-45, 10th, మంచి జీతం, ✆ 9440387815, 0891-2721672
సెక్యూరిటీ గార్డులు కావలెను. మధురవాడ, కొమ్మాది, ఎండాడ, వైజాగ్ సిటీలలో పనిచేయుటకు. జీతం : 14,000 నుండి. ✆ 73967 46222, 78421 81184

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సర్క్యులర్ ఎకానమీ పార్కులు

- విజయవాడలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఏర్పాటు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విశాఖ బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి-సీఐఐ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో 'సర్క్యులర్ ఎకానమీ అండ్ గ్రీన్ కంపెనీస్' అంశంపై మంగళవారం కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. త్వరలో విజయవాడలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేస్తాం. 107 వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం. సర్క్యులర్ ఎకానమీ భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారనుంది. 2050నాటికి దేశంలో ఈ ఎకానమీ విలువ సుమారు 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. తద్వారా 10 మిలియన్లకు పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయి. దేశంలోనే తొలిసారిగా సమగ్ర సర్క్యులర్ ఎకానమీ పాలసీ, మార్గదర్శకాలను విడుదల చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదే. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి, సాంకేతిక ఆధారిత పరిపాలనతో ఈ వినూత్న పాలసీ రూపుదిద్దుకుంది. విశాఖపట్నం, గుంటూరులో రోజుకు 100 టన్నుల సామర్థ్యం గల జంతు వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నాం. రాష్ట్రంలో రోజుకు 1300 నుంచి 1400 టన్నుల పౌల్ట్రీ వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. వాటిని శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు విలువైన ఉప ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలు ఉన్నాయి. విజయవాడలో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా శిక్షణ, పరిశోధన, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.' అని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. ★ ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, పరిశ్రమలశాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎన్.యువరాజ్, సీఐఐ విజయవాడ ఛాప్టర్ పూర్వ ఛైర్మన్ వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యశాలలో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

మేకపాలతో తయారు చేసిన సబ్బులను ప్రదర్శిస్తున్న ఓ సంస్థ ఉద్యోగిని

ఆరుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: అమాయకుల బ్యాంకు ఖాతాలు అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయల సైబర్ నేరాలకు పాల్పడుతున్న దొంగల ముఠా కార్యకలాపాలను సైబర్ క్రైం పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో మూడు ప్రధాన కేసులకు సంబంధించిన వివరాలను సీపీ శంఖబ్రతబాగ్చీ మంగళవారం వెల్లడించారు. నగరానికి చెందిన ఓ విశ్రాంత ప్రొఫెసర్‌ను సుప్రీంకోర్టు, సీబీఐ అధికారులమని భయపెట్టి డిజిటల్ అరెస్టు పేరుతో రూ.1.05 కోట్లు దోచుకున్నారు. ఈ కేసులో మురళీనగర్ హిల్‌పార్క్ అపార్టుమెంట్లో ఉంటున్న కొలుకుల వీరేంద్రనాథ్ (40), తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు సమీప సమిశ్రగూడెం వాసి మహమ్మద్ ఇమ్దాద్‌హుస్సేన్ (39), నిడదవోలు కోటమ్మవారి వీధికి చెందిన గారిగె రాజేష్‌కుమార్ (32)లను అరెస్టు చేశారు. అలాగే మరో కేసులో 84 ఏళ్ల విశ్రాంత బ్యాంకు ఉద్యోగి నుంచి డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి మూడు విడతలుగా రూ.89.30 లక్షలు కాజేశారు. ఈ మోసంలో విజయనగరానికి చెందిన చింతా రవిని నిందితుడిగా గుర్తించారు. హాంప్టన్ స్కై రియాలిటీ లిమిటెడ్ పేరుతో నకిలీ సంస్థల పేరిట వాట్సాప్ గ్రూపుల ద్వారా నమ్మించి ఓ బాధితుడి నుంచి రూ.48.21 లక్షలు వసూలు చేశారు. సంబంధిత కేసులో రాజమహేంద్రవరానికి చెందిన బిక్కిన రఘువంశీ, కాకినాడ గ్రామీణ ప్రాంత వాసి మలగాల సుబ్బారావు (43) అరెస్టయ్యారు. వీరి నుంచి పోలీసులు ల్యాప్‌టాప్‌లు, స్వైపింగ్ మెషిన్లు, క్యూఆర్ కోడ్ స్కానర్లను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా అధిక కమీషన్‌కు ఆశపడి కంబోడియా, మయన్మార్ తదితర దేశాల్లోని సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు అందించి నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఆపరేషన్ లంగ్స్-3.0లో భాగంగా నగరంలోని పలు భవనాల సెల్లార్లలో ఆక్రమణల తొలగింపు కొనసాగుతుందని పట్టణ ప్రధాన ప్రణాళికాధికారి ఏ.ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం గాజువాక, ఎండాడ, అనకాపల్లిలో ఆక్రమణలు తొలగించామన్నారు. అలాగే నోటీసులు అందుకున్న భవన యజమానులు స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగిస్తున్నారన్నారు. వాహనాల పార్కింగ్ కోసం మాత్రమే సెల్లార్లను వినియోగించాలని ఆయన సూచించారు.

సెల్లార్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	విత్‌స్కిన్	బ్యాగ్
ఫారం గేటు	125	115
లైవ్	152	135
డ్రెస్డ్	220	240
స్కిన్‌లెస్	251	250

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్
స్క్రీన్-1: హే బలవంత్
స్క్రీన్-2: ఆల్ఫా

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పరవాడ, సబ్బవరం, న్యూస్‌టుడే: పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఈ కేంద్రానికి 477మందిని కేటాయించగా 471మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపల్ వినోద్‌బాబు పేర్కొన్నారు. * సబ్బవరంలో ద్వితీయ ఇంటర్ తొలి పరీక్షకు ఆరుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పి.సూర్యశ్రీ, డిపార్టుమెంటల్ అధికారి బి.మురళీధర్ తెలిపారు.

ఆర్టీసీతోనే ఎలక్ట్రిక్ బస్సులు నడపాలి

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ బస్సుల (బ్యాటరీ బస్సులు) నిర్వహణ కోసం పినాకిల్ ప్రయివేటు సంస్థకు ఆర్టీసీ స్థలాలను ఇవ్వాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఎన్ఎంయూ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు గేటుమీటింగ్ చేపట్టాక ధర్నా నిర్వహించారు. డిపో కార్యదర్శి జేఎస్ఎన్.రాజు, గ్యారేజీ కార్యదర్శి బి.ఎస్.రాజు, జోనల్ కార్యాలయం బ్యారర్ ఎం.ఎస్.ఎస్.రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సింహాచలం డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ సభ్యులు

నిర్వాహకులకు చెక్కును అందజేస్తున్న రాధాకృష్ణ

ఆలయ నిర్మాణానికి చేయూత

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ శ్రీపైడిమాంబ ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం స్థానిక బీసీకాలనీకి చెందిన పైలా రాధాకృష్ణ దంపతులు రూ.1,00,116 మొత్తాన్ని విరాళంగా అందించారు. ఈమేరకు ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో విరాళానికి చెందిన మొత్తాన్ని చెక్కు రూపంలో మంగళవారం సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు తదితర నాయకులకు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: చీమలాపల్లి గెడ్డలో పూడికలు పేరుకుపోయాయి. –రాజేశ్వరరావు, వెంకటరావు, స్థానికులు ✓: వెంటనే పరిశీలించి సిబ్బందితో పూడిక తీయిస్తాం. –రమణమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడలో కుక్కల బెడద వెంటాడుతోంది. –శ్రీనివాసరావు, పరవాడ ✓: మీప్రాంతంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం. –మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

అవీ ఇవీ

నేడు 50వేల కిలోల మత్తు పదార్థాల దహనం

పరవాడ,, న్యూస్‌టుడే: విశాఖ రేంజ్ పరిధిలోని వివిధ జిల్లాల్లో పట్టుబడిన సుమారు 50వేల కిలోల గంజాయి తదితర మత్తు పదార్థాలను దహనం (ధ్వంసం) చేసే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని రాంకీ కోస్టల్ వేస్టు మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (సీడబ్ల్యుఎంపీ)లో చేపట్టనున్నట్లు అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటిని ఉన్నతాధికారుల సమక్షంలో అధునాతన శాస్త్రీయ పద్ధతులలో దహనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

భవనాల కేటాయింపునకు విన్నపం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయం, జిల్లా గ్రంథాలయాలకు ప్రభుత్వ భవనాలు కేటాయించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సతీష్‌కుమార్, కార్యదర్శి కుమార్‌రాజు కోరారు. మంగళవారం వారు జిల్లా సంయుక్త కలెక్టర్ విద్యాధరిని కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ సంస్థకు దండుబజార్‌లో ఉన్న సొంత స్థలంలో నూతన నిర్మాణం చేపట్టే వరకు ప్రత్యామ్నాయంగా వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ భవనాలు కేటాయించాలన్నారు. గ్రంథాలయ సెస్ కింద జీవీఎంసీ భారీ మొత్తంలో బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆయా నిధులు విడుదలయ్యేలా చూడాలని, గ్రంథాలయాల్లో డిజిటల్ పాఠ్యాలు, హైస్పీడ్ ఇంటర్నెట్, నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షల తాజా పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి జేసీ హామీ ఇచ్చారు.

రేషన్ డిపోల్లో సమయపాలన తప్పనిసరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని రేషన్ డిపో డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచించారు. జేసీ విద్యాధరి ఆదేశాలతో డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు సూచనల మేరకు సహాయ సరఫరా అధికారులు కల్యాణి, శ్రీహరి తమ పరిధిలోని డీలర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరిచే ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అర్హులైన కార్డుదారులకు మాత్రమే సరకులు పంపిణీ చేయాలన్నారు. గత నెలలో అవకతవకలకు పాల్పడిన 61 మందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, వారిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందన్నారు.

‘భవిత’కు భరోసా..

■ ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఎన్టీపీసీ చేయూత
■ ఆటపాటలతో కూడిన డిజిటల్ విద్య

పరవాడ, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత కేంద్రాలు ఎంతో అండగా నిలవడంతో పాటు భరోసా ఇస్తున్నాయి. ముఖ్యంగా బుద్ధి మాంద్యం, వినికిడిలోపం, అభ్యసనలో వెనుకబడడం, దృష్టిలోపం, వైకల్యం తదితర ప్రత్యేక అవసరాల పిల్లలకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చి సాధారణ విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దేందుకు ఈ కేంద్రాలు విశేష సేవలు అందిస్తున్నాయి. వీరికి విద్య, ఫిజియోథెరపీ ఇతర ఆరోగ్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు ఆటపాటలతో కూడిన డిజిటల్ బోధన చేస్తున్నారు. ప్రభుత్వ సర్వ శిక్షా అభియాన్ విభాగం ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ప్రతి కేంద్రంలో ఇద్దరు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్ (ఐఈఆర్పీ)లు, ఒక ఆయా, ఒక ఫిజియోథెరపిస్టును ఉన్నతాధికారులు నియమించారు. వీరు ప్రత్యేక అవసరాల పిల్లలను... సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ఈ తరహా చిన్నారులపై తల్లిదండ్రులు కొంత శ్రద్ధ వహిస్తే వారిలో అనూహ్య మార్పులు చూడవచ్చునని ఆయా కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు.

పరవాడ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న సిబ్బంది

అందుబాటులో సేవలు: ■ ఈ పిల్లలకు ఒక రోజు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ శిబిరం ఏర్పాటు ■ వైకల్యాన్ని బట్టి ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు తదితర యంత్రాల పంపిణీ ■ మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్న వారికి సిబ్బంది వారానికొకసారి ఇంటికెళ్లి బోధన, ఆరోగ్య సేవలు అందిస్తారు. ■ చిన్నారులను కేంద్రాలకు తెచ్చేందుకు ఏడాదికి ఎస్కార్ట్ అలవెన్స్ రూ.6వేలు, రవాణా ఛార్జీలు రూ.6వేలు ఇస్తారు. ■ కేంద్రాలకు రాలేని పిల్లలకు హోమ్‌బేస్డ్ అలవెన్స్ కింద రూ.3వేలు అందిస్తారు. ■ పరవాడ భవిత కేంద్రానికి సొంత గూడు లేకపోవడంతో ఎన్టీపీసీ యాజమాన్యం అన్ని సౌకర్యాలతో కూడిన సొంత భవనం సమకూర్చింది. పిల్లల రక్షణకు భవనం చుట్టూ మరో రూ.10లక్షలతో ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించింది. కావాల్సిన ఫర్నీచర్, ఆట పరికరాలను అందించింది. గత ఏడాది మార్చిలో జిల్లాలోని 24 భవిత కేంద్రాలకు, ఆరు రిసోర్స్‌రూమ్‌లకు రూ.13లక్షలతో ఉపకరణాలు సమకూర్చింది. గత డిసెంబరులో జిల్లాలోని 90 మంది దివ్యాంగులకు రూ.9.25 లక్షలు వెచ్చించి వీల్ ఛైర్లు, వినికిడి పరికరాలు, స్టాండింగ్ ఫ్రేమ్స్, వాకింగ్ స్టిక్స్ అందించి అండగా నిలిచింది.

■ మండలాల వారీగా ప్రత్యేక అవసరాల పిల్లల గణాంకాలు పరిశీలిస్తే.. పెందుర్తిలో 171, పరవాడ-169, సబ్బవరం-171 మంది ఉన్నారు.

■ భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించి సాధారణ విద్యార్థులకు దీటుగా రాణిస్తున్నారు. ఈ కేంద్రంలో సౌకర్యాల కల్పనకు, దివ్యాంగులకు ఎన్టీపీసీ యాజమాన్యం అందిస్తున్న సహకారం మరువలేనిది.
–టి.కుమారి, సహిత విద్య ప్రత్యేక ఉపాధ్యాయిని, పరవాడ భవిత కేంద్రం

తెలుగు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్వహించిన తెలుగు భాష పోటీల్లో చినముషిడివాడలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చేశారని ప్రధానోపాధ్యాయిని చైతన్య తెలిపారు. పద్య భావం, తెలుగు అక్షరాలతో చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు, తెలుగు ప్రసంగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ప్రతిభ చూపిన బాలలతో ప్రధానోపాధ్యాయిని చైతన్య, ఉపాధ్యాయులు

ప్రాంగణ ఎంపికల్లో కొలువులు

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 13 మంది విద్యార్థులు కొలువులు సాధించినట్లు ప్రిన్సిపల్ ఫ్లోరా తెలిపారు. ఈపీఎల్ లెవ్వ, హానర్ ల్యాబ్ సంస్థల హెచ్ఆర్‌లు జి.వెంకటనరేంద్ర, కె.పవన్‌కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. నైపుణ్యాలున్న వారికే ఉద్యోగావకాశాలు లభిస్తాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ థియోఫిలస్, ప్లేస్‌మెంటు అధికారి కమలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్ఆర్ వెంకట నరేంద్ర

అట్టహాసంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో బండారు ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసస్వామి సారథ్యంలో జరిగిన ఈ వేడుకల్లో 95వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, తదితర నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చక్రస్నానం వేడుకలో పాల్గొన్న భక్తులు

ఘనంగా దుర్గమాంబ తీర్థం

సబ్బవరం న్యూస్‌టుడే: సబ్బవరం గ్రామదేవత శ్రీదుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, పంచకర్ల వెంకటేశ్వరరావు తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అమ్మవారి సన్నిధిలో పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, తదితరులు

పోలమాంబకు జేజేలు

దేశపాత్రునిపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం గ్రామాల్లో మంగళవారం శ్రీపోలమాంబ అమ్మవార్ల అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఘటాలను ఊరేగించారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సిరులతల్లి సన్నిధిలో సామూహిక పారాయణం

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రి క్షేత్రంలో జరుగుతున్న మహాలక్ష్మి అమ్మవారి దివ్యోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు, సామూహిక పారాయణలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీవారికి, మహాలక్ష్మి అమ్మవారికి విశేష ఆరాధనలు, ధూపదీప సేవలు నిర్వహించారు. శ్రీసూక్త సహిత కుంకుమార్చన జరిపారు. భక్తులు జగన్నాథ హోతలిచ్చి కొలిచారు. అనంతరం సామూహిక లక్ష్మీ స్తోత్ర పారాయణంలో పాల్గొన్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

కల్యాణం.. కమనీయం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లోని స్వయంభూ లింగాల మల్లికార్జున స్వామి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దేవతామూర్తులను సేవించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పరవాడ పైడిమాంబ జాతర

పూజలందుకున్న అమ్మవారు

దర్శనానికి బారులు తీరిన భక్తులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శ్రీపైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ పైల వెంకటపద్మావతి, నాయకులు సిరిపురపు అప్పలనాయుడు, పైలా శ్రీనివాసరావు, మట్ట రామునాయుడు, పైలా అప్పారావు(పెదబాబు), పైలా సన్యాసిరావు, కాండ్రేగుల సోమునాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలు యువజన సంఘాల సహకారంతో ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి గరగతో బోనాలను ఊరేగించాక అనుపోత్సవం చేపట్టారు. రాత్రి 7 భారీ వేదికలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోస్తు నిర్వహించారు.

వేడుకగా త్రిపురాంతక స్వామి గ్రామ తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి క్షేత్ర పాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయంలో జరుగుతున్న ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామ తిరువీధి వేడుకగా జరిగింది. ఉదయం అర్చకులు, వేదపండితులు వాస్తు పూజ, హోమం నిర్వహించారు. ధ్వజస్తంభం నమూనాకు జలాధివాసం, జలాధివాసాంగ హోమం నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల గ్రామ తిరువీధి నిర్వహించారు. భక్తులు వేడుకలను తిలకించారు.

చెత్త నుంచి సంపద సృష్టికి ప్రత్యేక కార్యాచరణ

గ్రీనింగ్ ఇండస్ట్రియల్, బిల్డింగ్స్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలెస్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు-సీఐఐ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ‘సర్క్యులర్ ఎకానమీ అండ్ గ్రీన్ కంపెనీస్’ అంశంపై మంగళవారం కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో పేర్కొన్న 10 కీలక సూత్రాల్లో స్వచ్ఛాంధ్ర కీలకమైందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రీ సైక్లింగ్ పరిశ్రమలకు ముడి పదార్థాల కొరత రాకుండా త్వరలో ప్రత్యేక రియల్ టైమ్ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ రీసైక్లింగ్ విధానాలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సువర్ణావకాశంగా మారుతుందన్నారు. తద్వారా యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పెరుగుతున్న పర్యావరణ సవాళ్లను సర్క్యులర్ ఎకానమీ సాయంతో సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం విశాఖలో సముద్ర మట్టం సుమారు 98 సెంటీమీటర్లు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. గాలి నాణ్యత కూడా ఆందోళనకరంగా మారుతోందన్నారు. నగరంలో పేరుకుపోతున్న భవన నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయడం సవాల్‌గా మారిందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐఐ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (బిజినెస్ సెంటర్) ముత్తు సెజియన్, ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, పరిశ్రమలశాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎన్.యువరాజ్, సీఐఐ విజయవాడ ఛాప్టర్ పూర్వ ఛైర్మన్ వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరదేశిమాంబ పండగ

తానాంలో బోనాల ఊరేగింపు

తానాం(పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం గ్రామంలో మంగళవారం శ్రీపరదేశిమాంబ పండగ కనులపండువగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, సర్పంచి కన్నూరు దేవి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, స్థానిక నాయకులు పైలా జగన్నాథరావు, పైలా సన్యాసిరాజు, కన్నూరు వెంకటరమణ, రొంగలి గోపాలకృష్ణ, వర్రి పరదేశినాయుడు, చీపురుపల్లి శ్రీను తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఘటాలతో పాటు బోనాల ఊరేగింపు చేపట్టాక అనుపోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తవ్వవానిపాలెంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం తవ్వవానిపాలెం గ్రామదేవత పరదేశిమాంబ పండగను స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ తదితర పోటీలను, గుర్రాల పరుగు పందాలను కూటమి నేతలు పంచకర్ల వెంకటేశ్వరరావు, చొక్కాకుల వెంకట్రావు ప్రారంభించారు. విజేతలకు బోకం శ్రీను బహుమతులు అందజేశారు. సాయంత్రం బాణసంచా కాల్పుల పోటీలు, అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎడ్ల బండ్ల పరుగు పందాలను, గుర్రపు బండ్ల పరుగు పోటీలను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పోటీలను ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు

పెందుర్తి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు వద్దు - ఆరోగ్యం, జీవితమే ముద్దు అన్న నినాదంతో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. పెందుర్తి రైతుబజార్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ కె.వి.సతీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలు, వ్యాపారులనుద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత ఆరోగ్యవంతమైన జీవితం గడపాలన్నారు. మత్తు పదార్థాల గురించి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ గోపాలపట్నం జోన్ కార్యదర్శి ప్రభుదేవా, సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

30.51 చ.కి.మీ విస్తీర్ణంలో కంబాలకొండ ‘ఈఎస్‌జెడ్’

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కంబాలకొండ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై కీలక భాగస్వాముల సంప్రదింపుల సమావేశం మంగళవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధ్యక్షత వహించారు. లియా అసోసియేట్స్ సౌత్ ఏసియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన కన్సల్టెంట్లు పర్యావరణ, అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ జారీ చేసిన ఈఎస్‌జెడ్ మాస్టర్ ప్లాన్‌ను సమర్పించి అభిప్రాయాలను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్‌జెడ్ నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 30.51 చదరపు కి.మీ. విస్తీర్ణానికి జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారిణి వి.శిల్ప, వి.ఎం.ఆర్.డి.ఎ. ఎస్టేట్ అధికారి దయానిధి, డీఎఫ్‌సీ శిరీష, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తేజ్ భరత్

‘సారథి’పై కమిషనర్ సమీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అమలు చేస్తున్న ‘సారథి’ ప్రాజెక్టుపై కమిషనర్ కేతన్‌గార్గ్ సమీక్ష నిర్వహించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరంలోని 90 కూడళ్లలో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టంను అమల్లోకి తీసురానున్న నేపథ్యంలో ప్రాజెక్టు టెండర్లపై కమిషనర్ ఆరా తీశారు. ముగ్గురు ఔత్సాహికులు టెండర్లు దాఖలు చేసి, ప్రాథమికంగా అర్హత సాధించారని కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు వివరించారు. టెండర్లలో పాల్గొన్న వారికి మూడు కూడళ్ల బాధ్యతలు అప్పగించి, నిర్వహణ తీరును పరిశీలిస్తామని పేర్కొన్నారు. సమీక్షలో అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, స్మార్ట్ సిటీ అధికారి కేవీఎన్.రవి, ప్రధాన ఇంజినీర్ పీవీవీ.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో కలిసి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ కేతన్‌గార్గ్

26 నుంచి జనసేన సభ్యత్వాలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జనసేన ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు జనసేన గాజువాక ఇన్‌ఛార్జి, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు అన్నారు. మంగళవారం గాజువాక భాగ్యలక్ష్మి ఫంక్షన్ హాల్లో జనసేన సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ్యత్వ గోడపత్రికను ఆవిష్కరించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

కొమ్మాది, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శాప్ లీగ్స్ పేరిట మారికవలస ఏపీ గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల వద్ద మంగళవారం చేపట్టిన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ ఎల్.శివప్రసాద్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అండర్-18 విభాగంలో బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వి.దేవన్‌దీక్షిత్, కె.మౌర్య, షేక్ మెహబూబ్‌భాషా నిలిచారు. బాలికల విభాగంలో పి.తనూజ, ఇమంది పూజిత, డి.రమ్య తొలి మూడు స్థానాల్లో రాణించారు. వీరు ఈ నెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జూన్ గాల్లోయట్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ శివప్రసాద్



(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: గజేశ్ - మన శంకర వరప్రసాద్ గారు; రామమూర్తి - భర్త మహాశయులకు విజ్ఞప్తి; తాతా - హే బలవంత్!; సప్తగిరి - కపుల్ ఫ్రెండ్లీ.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: మజ్జివలస గ్రామదేవత శ్రీరామపోలమ్మను కాగడ పూలతో మంగళవారం అలంకరించారు. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

తల్లిదండ్రుల సహకారంతోనే ఉత్తమ ఫలితాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తల్లిదండ్రుల సహకారంతోనే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధ్యమని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ అన్నారు. చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తద్వారా శతశాతం ఉత్తీర్ణత వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శివరాణి, ఎంఈవో-2 ఉమాప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పి. జగన్నాథస్వామి, రామారావు, పైడిరాజు, జిల్లా కామన్ ఎగ్జామ్స్ బోర్డు కార్యదర్శి కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో ప్రేమకుమార్, కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: సినీపోలిస్ (మధురవాడ) ఎదురుగా పరిసరాల్లో రాత్రివేళ ఆకతాయిల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు ✓: గస్తీ చేపట్టి తగు చర్యలు తీసుకుంటాం. - పీఎంపాలెం పోలీసులు

?: శిరుగుడినగర్(ఎండాడ)లో పందుల బెడద తీవ్రంగా ఉంది. - కొండలరావు ✓: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: పీఎంపాలెంలో వివిధ సూపర్‌మార్కెట్ కూడలిలో స్పీడ్‌బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. -రాజు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు

?: తిరిజే ఆలయం (రుషికొండ) ముఖద్వారంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - రమ్మెన్‌నాయుడు ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: గాయత్రీనగర్ (పీఎంపాలెం)లో వీధి దీపాలు వెలగడం లేదు. - గాయత్రీనగర్ వాసులు ✓: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. - వేణు, విద్యుత్ ఏఈ

?: పీఎంపాలెం ఆఖరి బస్‌స్టాప్ నుంచి బాబా కాలాల వరకు రోడ్డు గుంతలమయంగా ఉంది. - స్థానికులు ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, ఏఈ.

వచ్చేలోపు అంతా బూడిదే..

దూరాభారంగా అగ్నిమాపక శకటం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ పరిసర ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో సమస్యగా మారింది. ఏదైనా ప్రమాదం జరిగినా మంటలార్పేందుకు సమయానికి వాహనం రావడం లేదు. ఈ ప్రాంతాలకు అగ్నిమాపక శకటం రావాలంటే నగరంలోని సూర్యాబాగ్, తాళ్లవలస కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. రెండు కేంద్రాలు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల ప్రమాద ఘటన జరిగిన వెంటనే చేరుకోవడానికి ఆలస్యమవుతోంది. మరోవైపు ట్రాఫిక్ ఇబ్బందులను దాటుకుని శకటాలు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంతలో ప్రమాద నష్టం తీవ్రంగా ఉంటోంది.

- మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, ఎండాడ తదితర ప్రాంతాల్లో నివాసాల సంఖ్యతో పాటు చిన్నతరహా పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార సముదాయాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో ఎప్పటికప్పుడు ఏదో ప్రాంతంలో చిన్న, పెద్ద ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గడచిన రెండేళ్లలో సుమారు ఆరు అగ్నిప్రమాదాలు సంభవించాయి. ఈ ఘటనల్లో సమయానికి మంటలు అదుపులోకి రాకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఏదైనా ప్రమాదం జరిగితే శకటం వేరే ప్రాంతం నుంచి రావడానికి కనీసం గంటకు పైగా సమయం పడుతోంది.
- ఇటీవల జరిగిన ప్రమాదాలు..: స్వతంత్రనగర్ కాలనీలోని ఓ కిరాణా సూపర్‌మార్కెట్‌లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి వస్తువులన్నీ కాలిపోయాయి. మారికవలస డంపింగ్‌యార్డ్ దగ్గరలో ఆరు నెలల వ్యవధిలో రెండు స్క్రాప్ దుకాణాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుని తీవ్ర నష్టం వాటిల్లింది. మిథిలాపురి వుడా కాలనీలో ప్రధాన రహదారి పక్కన ఓ ప్రైవేటు ఇంటర్ కళాశాలలో అగ్నిప్రమాదం జరగడంతో పెను ప్రమాదం తప్పింది. రామానాయుడు స్టూడియో సమీప సముద్ర తీరం వద్ద రెండు మార్లు తాటిచెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వుడా కాలనీలో ప్లాస్టిక్ సెంటర్‌లో ప్రమాదం జరిగి దుకాణం మొత్తం కాలిపోయింది.
- నిర్మాణానికి భూమి పూజ..: ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ పక్కన అర ఎకరా స్థలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు రెండు నెలల క్రితం భూమి పూజ జరిగింది. ఇంత వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ కేంద్రం నిర్మిస్తే నిర్ణీత సమయంలోగా ఘటనాస్థలికి శకటం చేరుకుంటుంది. ప్రాంతాల్లో ఏ ప్రమాదం జరిగినా అరగంట లోపే అగ్నిమాపక శకటం చేరుకునే అవకాశం ఉంటుంది. తద్వారా ప్రమాదాన్ని నిలువరించి నష్ట తీవ్రత తగ్గించేందుకు వెసులుబాటు కలుగుతుంది.

నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

కొమ్మాది, న్యూస్‌టుడే: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వస్తున్న సాంకేతిక పద్ధతులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రవితేజ ఇన్నోవేషన్ హబ్ సెంటర్ ప్రతినిధి సురేష్‌కుమార్ అన్నారు. పీఎంపాలెంలో ఉన్న బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బీఐటీఎస్) ఇంజినీరింగ్ కళాశాలలో రవితేజ ఇన్నోవేషన్ హబ్ సహకారంతో ఐదురోజుల పాటు 'స్పార్క్ ఇన్నోవేషన్ ఇమర్జన్' పేరిట బూట్‌క్యాంప్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రింగ్, డిజైన్, ఇన్నోవేట్ అనే నినాదంతో ఈ బూట్‌క్యాంప్‌ను చేపడుతున్నామన్నారు. విద్యార్థులంతా సృజనాత్మక ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. మరో అతిథి రవితేజ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలని ఇటువంటి వేదికలు దోహదపడతాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ ఎం.రాజన్‌బాబు, అధ్యాపక సమన్వయకర్త డాక్టర్ జి.అశ్వినీకుమార్ ప్రసంగించారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సురేష్‌కుమార్

కృష్ణాపురంలో 'పొలం బడి'

పద్మనాభం, న్యూస్‌టుడే: కృష్ణాపురం గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. భీమిలి వ్యవసాయ శాఖ ఏడీఏ బి.విజయ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై రాగి పంట సాగుపై రైతులకు మెలకువలు చెప్పారు. ముఖ్యంగా ఎరువుల యాజమాన్యం, సస్య రక్షణ చర్యలు, పంట కోత, నూర్పిడి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రాగి పంటలో అగ్గి తెగులు గుర్తించిన ఏడీఏ నివారణకు రైతులు ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఈ మందు రైతు సేవా కేంద్రాల్లో యాభై శాతం సబ్సిడీపై అందుబాటులో ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి ఎంపీఎస్.చలం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పద్మనాభం పీఏసీఎస్ అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయ్‌ప్రసాద్

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.



అప్పన్న స్వామి నిత్య కల్యాణ ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం

వేడుకగా త్రిపురాంతక స్వామి గ్రామ తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరి క్షేత్ర పాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయంలో జరుగుతున్న ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామ తిరువీధి వేడుకగా జరిగింది. ఉదయం అర్చకులు, వేదపండితులు వాస్తు పూజ, హోమం నిర్వహించారు. ధ్వజస్తంభం నమూనాకు జలాధివాసం, జలాధివాసాంగ హోమం నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల గ్రామ తిరువీధి నిర్వహించారు. భక్తులు వేడుకలను తిలకించారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర మహోత్సవాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి రెల్లివీధి వద్ద వేం చేసిన పురాతన ఎల్లమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి తొలేళ్ల వేడుకను నిర్వహించారు. మంగళవారం అనుపోత్సవం పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. దేవాలయ ఉత్సవ కమిటీ ప్రతినిధి వెదురుకాశ శేఖర్ ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని పొడుగుపాలెం గ్రామంలో కొలువుదీరిన ఎల్లమ్మ అమ్మవారి జాతర తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవారికి చీరసారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంతర విశ్వవిద్యాలయ కరాటే పోటీలకు ఎంపిక

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న దొంక వనిత అంతర విశ్వవిద్యాలయాల కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్ తెలిపారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జేఎన్‌టీయూజీవీ ఈ నెల 23వ తేదీన నిర్వహించిన కరాటే పోటీల్లో 50 కిలోల విభాగంలో సత్తాచాటారని తెలిపారు. దీంతో మార్చి 17 నుంచి 21వ తేదీ వరకు భోపాల్‌లోని సేజ్ విశ్వవిద్యాలయం వేదికగా జరగనున్న పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. మంగళవారం కళాశాలలో వనితను ప్రిన్సిపల్, ఫైనాన్స్ డైరెక్టర్ పి.మాధవి, వ్యాయామ అధ్యాపకులు బి.ప్రసన్నకుమార్, పి.వేణుగోపాలరావు, తదితరులు అభినందించారు.

వనితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సురేష్, తదితరులు

మాట్లాడుతున్న ఏడీ శ్యాంప్రసాద్, చిత్రంలో సామేంద్రకుమార్ తదితరులు

ఘనంగా ఇ.ఎస్.ఐ.సి. వ్యవస్థాపక దినోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఇ.ఎస్.ఐ.సి. వ్యవస్థాపక దినోత్సవాన్ని నరసింహనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపప్రాంతీయ కార్యాలయం ఇన్‌ఛార్జి, డిప్యూటీ డైరెక్టర్ సామేంద్రకుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.ఫణీంద్ర, ఇ.ఎస్.ఐ.సి. అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యాంప్రసాద్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇ.ఎస్.ఐ. పథకంతో సుదీర్ఘ అనుబంధం ఉన్న వారిని సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. వివిధ ప్రమాదాల్లో చనిపోయిన బీమా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పింఛను పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.దినేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని కోర్టుల పరిధిలో మార్చి 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా తోడ్పాటు అందించాలని భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి డి.సౌజన్య కోరారు. కోర్టు ప్రాంగణంలో మంగళవారం భీమునిపట్నం, పద్మనాభం, పోతినమల్లయ్యపాలెం, ఆనందపురం స్టేషన్ల పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సౌజన్య మాట్లాడుతూ కోర్టులో ఉన్న కాంపౌండ్‌బుల్ కేసులను ఇరువర్గాల మధ్య రాజీ కుదర్చడం ద్వారా సులువుగా పరిష్కరించవచ్చన్నారు. ఇందు కోసం ఉద్దేశించిన లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకుని కేసుల సంఖ్యను తగ్గించేందుకు సహకరించాలన్నారు.

పోలీసు అధికారులు, న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సౌజన్య

26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 26 నుంచి వచ్చే నెల పదో తేదీ వరకూ ఉద్యమంలా నిర్వహించనున్నట్లు పార్టీ భీమిలి మండల శాఖ అధ్యక్షుడు నక్కా శ్రీధర్ అన్నారు. తగరపువలస సమీపంలోని నగరపాలెంలో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి రోజు అన్నవరం, టి.నగరపాలెం గ్రామాల్లో సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. జనసేన శ్రేణులు సభ్యత్వ నమోదు విజయవంతానికి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎరుసు సూర్రెడ్డి, గిడిజాల పాపారావు, కొయ్య శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీధర్, తదితరులు

'జీరో స్థాయికి గంజాయి సాగు'

పెదవాల్తేరు: గంజాయి సాగును జీరో స్థాయికి తెచ్చినట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా అంతర రాష్ట్ర సమన్వయ వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించడంలో సఫలీకృతులయ్యామని చెప్పారు. 2021-22లో ఎ.ఎస్.ఆర్. జిల్లాలో 7,515 ఎకరాల్లో గంజాయి సాగు ఉండగా 2024-25 నాటికి 93.05 ఎకరాలకు, 2026 జనవరి నాటికి జీరో స్థాయికి తీసుకొచ్చామన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి పీఎంపాలెం దరి ఆర్‌కేనగర్‌కు చెందిన అయ్యలసోమయాజుల సుబ్రహ్మణ్యం కుటుంబం మంగళవారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో ప్రొటోకాల్ పర్యవేక్షకుడు త్రిమూర్తులు, వీఆర్వో నాయుడుకి అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకులు త్రిమూర్తులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

కొమ్మాది, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శాప్ లీగ్స్ పేరిట మారికవలస ఏపీ గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల వద్ద మంగళవారం చేపట్టిన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ ఎల్.శివప్రసాద్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అండర్-18 విభాగంలో బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వి.దేవన్‌దీక్షిత్, కె.మౌర్య, షేక్ మెహబూబ్‌భాషా నిలిచారు. బాలికల విభాగంలో పి.తనూజ, ఇమంది పూజిత, డి.రమ్య తొలి మూడు స్థానాల్లో రాణించారు. వీరు ఈ నెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిణి జూన్ గాల్లోయట్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ శివప్రసాద్

రేషన్ డిపోల్లో సమయపాలన తప్పనిసరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని రేషన్ డిపో డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచించారు. జేసీ విద్యాధరి ఆదేశాలతో డీసీఎస్‌ఓ వి.భాస్కర్‌రావు సూచనల మేరకు సహాయ సరఫరా అధికారులు కల్యాణి, శ్రీహరి తమ పరిధిలోని డీలర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరిచే ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అర్హులైన కార్డుదారులకు మాత్రమే సరకులు పంపిణీ చేయాలన్నారు. గత నెలలో అవకతవకలకు పాల్పడిన 61 మంది షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, వారిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందన్నారు.

డీలర్లతో మాట్లాడుతున్న సహాయ సరఫరా అధికారిణి కల్యాణి

ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్యాయత్నం

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: వ్యాపార వివాదాల నేపథ్యంలో కక్ష పెంచుకుని ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపడానికి ప్రయత్నించిన వ్యక్తిపై భీమిలి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలిలా.. కాపులుప్పాడ పరిధి కె.గొల్లలపాలెం గ్రామానికి చెందిన కోడిబోయిన రాజు (40) ఉదయం నడక ముగించుకుని ఇంటికి వస్తుండగా కె.నగరపాలేనికి చెందిన తొత్తడి శ్రీను (45) ట్రాక్టర్‌తో వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. పైకి లేవడాన్ని గమనించి తిరిగి వచ్చి మళ్లీ గుద్దించాడు. అదృష్టవశాత్తు ప్రాణపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్న ఆయనపై జాకీరాడ్‌తో దాడికి ప్రయత్నించగా బాధితుడు కేకలు వేస్తూ సమీపంలోని ఓ లేఅవుట్‌లోకి పరుగులు తీశారు. అక్కడున్న వాచ్‌మెన్ రావడంతో శ్రీను ట్రాక్టర్‌తో పరారయ్యాడు. బాధితుడి అన్నయ్య వరహాలు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేశారు. నిర్మాణ పనులకు ట్రాక్టర్లు, లారీలతో మెటీరియల్ సరఫరా చేసే వీరి మధ్య పాత గొడవలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హత్యాయత్నం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: అనారోగ్య పరిస్థితి కారణంగా ఒక వ్యక్తి మృతి చెందాడు. భీమిలి అప్పికొండవీధికి చెందిన చిప్పాడ అప్పలరాజు(45) గతంలో వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. అనారోగ్యంతో ఏ పని చేయలేని పరిస్థితి కారణంగా ఇంటివద్దే ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం భీమిలి ఎగువపేట వద్ద ఉన్న బస్‌షెల్టరులో పడుకుని కదల్లేని స్థితిలో ఉన్న ఈ వ్యక్తిని స్థానికులు సీహెచ్‌సీలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమిలి ఎస్.ఐ.గౌరీ తెలిపారు.

2 నుంచి అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు

అల్లిపురం, న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు మార్చి 2 నుంచి 4 వరకు విజయవాడలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తారని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ కేసుల నిమిత్తం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తుల్ని మదింపు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బినామీ పేర్లతో ఉన్న రూ.4వేల కోట్ల ఆస్తిని వేలం వేసి, బాధితులకు రూ.20 లక్షల చొప్పున అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంఘం సభ్యులు, బాధితులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగినంటూ మోసం.. ఒకరి అరెస్టు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సచివాలయం ఉద్యోగినంటూ మోసంచేసి.. నగలు కాజేసిన వ్యక్తిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణి ఈ వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని పీఎం పాలేనికి చెందిన ఎల్లమెల్లి వెంకటరమణ గత ఏడాది డిసెంబరు నెలలో అనకాపల్లి కరణాలవీధిలో ఇల్లు అద్దెకు కావాలని వచ్చాడు. తాను సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నానని పింఛను ఇప్పిస్తానని ఇంటి యజమానురాలైన మహిళను నమ్మించాడు. ఫొటో తీయడానికి బంగారు వస్తువులు మెడలో నుంచి తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఎస్ రాయవరం మండలం కొరుప్రోలులో కూడా సచివాలయం ఉద్యోగినంటూ కొత్త పథకం కింద డబ్బులు వచ్చాయని మహిళను నమ్మించాడు. ఆధార్‌కార్డు, ఫొటో కావాలని చెప్పి ఫొటో తీయడానికి బంగారు వస్తువులను తీసేయాలని చెప్పి వీటిని కాజేశాడు. ఇలా రెండు చోట్ల 87.70 గ్రాములు బంగారు వస్తువులను కాజేశాడు నిందితుడు వెంకట రమణను మంగళవారం అనకాపల్లిలో అరెస్టుచేసి కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సైలు సంతోష్‌కుమార్, అల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

భవనాల కేటాయింపునకు విన్నపం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయం, జిల్లా గ్రంథాలయాలకు ప్రభుత్వ భవనాలు కేటాయించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సతీష్‌కుమార్, కార్యదర్శి కుమార్‌రాజు కోరారు. మంగళవారం వారు జిల్లా సంయుక్త కలెక్టర్ విద్యాధరిని కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ సంస్థకు దండుబజార్‌లో ఉన్న సొంత స్థలంలో నూతన నిర్మాణాలు చేపట్టే వరకు ప్రత్యామ్నాయంగా వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ భవనాలు కేటాయించాలన్నారు. గ్రంథాలయ సెస్ కింద జీవీఎంసీ భారీ మొత్తంలో బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆయా నిధులు విడుదలయ్యేలా చూడాలని, గ్రంథాలయాల్లో డిజిటల్ సౌకర్యాలు, హైస్పీడ్ ఇంటర్నెట్, నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షల తాజా పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి జేసీ హామీ ఇచ్చారు.

జేసీ విద్యాధరికి వినతి అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సతీష్‌కుమార్, కార్యదర్శి కుమార్‌రాజు

నూతన హంగులతో కల్యాణ మండపాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో కొమ్మాది, సాయిరాంకాలనీ ప్రాంతాల్లో ఉన్న రెండు కల్యాణ మండపాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. నాడు స్థానికులు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో రూ.1.66 కోట్ల నిధులను జీవీఎంసీ కేటాయించింది. దీంతో వాటిని పూర్తిస్థాయిలో ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. మూడు నెలల విరామం తర్వాత శుభకార్యాల కళ రావడంతో వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా కల్యాణమండపం

అసంపూర్తి పనులతో అవస్థలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ నుంచి జాతీయరహదారి (ఎండాడ) ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గమధ్యలో భూగర్భ విద్యుత్తు పనుల్లో భాగంగా తవ్విన మట్టితో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సుభాష్‌నగర్ కూడలి నుంచి దసపల్లా లేఅవుట్ శివారు వరకు ఇదే మాదిరిగా ఉంది. ముఖ్యంగా బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు వచ్చే సమయంలో పలువురు వాహనదారులు త్రుటిలో ప్రమాదాల నుంచి తప్పించుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

← రోడ్డుపై మట్టికుప్పలు ఇలా..

30.51 చ.కి.మీ విస్తీర్ణంలో కంబాలకొండ 'ఈఎస్‌జెడ్'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కంబాలకొండ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై కీలక భాగస్వాముల సంప్రదింపుల సమావేశం మంగళవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధ్యక్షత వహించారు. లియా అసోసియేట్స్ సౌత్ ఏసియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన కన్సల్టెంట్లు పర్యావరణ, అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ జారీ చేసిన ఈఎస్‌జెడ్ మాస్టర్ ప్లాన్‌ను సమర్పించి అభిప్రాయాలను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్‌జెడ్ నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 30.51 చదరపు కి.మీ. విస్తీర్ణానికి జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారిణి వి.శిల్ప, వి.ఎం.ఆర్.డి.ఎ. ఎస్టేట్ అధికారి దయానిధి, డీఎఫ్‌సీ శిరీష, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ తేజ్ భరత్

PUBLIC NOTICE (DOCUMENT LOST)

Public is hereby informed that Koyye Chandra Mohan S/o Late Koyye Mohan residing at D.No. 9-402/A, Sriram Nagar, Vishalakshi Nagar, Visakhapatnam - 530043, lost the below mentioned original sale deed i.e A registered sale deed dated 25-09-1973 bearing document registration No 2083/1973 SRO, Visakhapatnam is lost while he was travelling from Vishalakshi Nagar to Naidu Thota on 12-08-2025. The document is lost beyond recovery public are requested to that anyone found the above mentioned lost document to handover the same to the below mentioned addressee.

SUNKARA GANDHI
Advocate
50-50-26/4, Balaji Hills,
B.S.Layout, Seethammadhara,
Visakhapatnam-530013.
Mobile No: 9440643227

(c) eenadu

విశాఖ తూర్పు

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

కేఆర్ఎంకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని డాక్టర్ వీఎస్‌కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. మంగళవారం కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగం, హెల్ప్‌ది బ్లైండ్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ (వాల్తేరు) ఆధ్వర్యంలో విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాల్లో నిలవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ వాల్తేరు ప్రెసిడెంట్ భాస్కరరావు, కళాశాల అధ్యాపకులు సి.హెచ్.లక్ష్మీ, సుభాషిని విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

ఎంఎంటీసీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: 15వ వార్డు ఎంఎంటీసీకాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ ప్రాంతాల్లో రహదారిపై చెత్త పోగులు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. – నవీన్‌కుమార్, ఎంఎంటీసీకాలనీ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం. – కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆటోమోటివ్(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: 22వ వార్డు న్యూరేసపువానిపాలెంలో పది రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదు. – శ్రీను, న్యూరేసపువానిపాలెం. ✓: త్వరలో దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – ఆశ, వర్కు ఇన్‌స్పెక్టర్

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : ?: పదోవార్డు ఇందిరానగర్, రాజీవ్‌నగర్‌లలో ఇటీవల దోమలు పెరిగిపోయాయి. దోమకాటుతో జ్వరాలు వస్తున్నాయి. – సరిత, ఇందిరానగర్. ✓: పరిశీలించి మీ ప్రాంతంలో ఫాగింగ్ చేయిస్తాం. – శ్రీనివాస్,మలేరియా అధికారి.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ?: విశాలాక్షినగర్ పరిధి రామాలయం వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుళ్లు వీధి కుక్కల బెడద అధికంగా ఉంది.– స్థానికులు ✓: దీపాలకు మరమ్మతులు చేయించి సమస్య లేకుండా చూస్తాం. – రాజేష్, ఏఈ

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు సింహాద్రికాలనీ సేవా మార్గంలో రెండు వీధి దీపాలు వెలగటం లేదు. – శ్రీనివాసరావు, పెదగదిలి. ✓: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – రామకృష్ణ, వీధి దీపాల పర్యవేక్షకులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: ఎంవీపీకాలనీ సెక్టార్-8 సత్యసాయి ప్రాథమిక పాఠశాల గేటు ఎదురుగా ఉన్న ఓ ఇంటి వద్ద పైపులైనుకు లీకు పడి తాగునీరు వృథాగా పోతోంది. - బి.కృష్ణారావు, స్థానికులు ✓: రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. – శంకరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

సుందర్‌నగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : పదోవార్డు సుందర్‌నగర్ కొండచివరి భాగంలో భవన నిర్మాణ వ్యర్థాలు తీసుకొచ్చి పడేస్తున్నారని మంగళవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివస్వామి నాయుడు స్పందించారు. సిబ్బందితో తొలగింపు ప్రారంభించారు. అధికంగా ఉన్నందున విడతల వారీగా తొలగిస్తామని చెప్పారు.

ఆటోమోటివ్‌కూడలి (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 22వ వార్డు పీతలవానిపాలెం, ఆరుకుళాయిల వీధి ప్రాంతాల్లోని కాలువల్లో వ్యర్థాలు తొలగించడం లేదని మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పందించారు. సిబ్బంది చేత కాలువల్లో పూడిక తీయించి పరిసరాలను శుభ్రం చేయించారు.

దారపాలెం (ఆరిలోవ), న్యూస్‌టుడే: 13వ వార్డు పైనాపిల్ కాలనీ ప్రధాన రహదారిలో మూడు వీధి దీపాలు వెలగడం లేదని శుక్రవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి జీవీఎంసీ విద్యుత్తు విభాగ ఏఈ రాజేష్ స్పందించారు. సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

● పైడితల్లి అమ్మవారి అనుపు ఉత్సవం

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: శివాజీపాలెంలోని వేపచెట్టు పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షిక జాతర మంగళవారం పైడితల్లి అమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పులివేషాలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● ఆర్టీసీ సిబ్బంది సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆర్టీసీ వై.ఎస్.ఆర్.ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య అన్నారు. వాల్తేరు డిపోలో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే జోన్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇటీవల జిల్లా యాజమాన్యం ఇచ్చిన పదోన్నతుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.ఎల్.రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ దారం ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

● 'జీరో స్థాయికి గంజాయి సాగు'

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: గంజాయి సాగును జీరో స్థాయికి తెచ్చినట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా అంతర రాష్ట్ర సమన్వయ వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించడంలో సఫలమైనట్లు చెప్పారు. 2021-22లో ఎ.ఎస్.ఆర్. జిల్లాలో 7,515 ఎకరాల్లో గంజాయి సాగు ఉండగా 2024-25 నాటికి 93.05 ఎకరాలకు, 2026 జనవరి నాటికి జీరో స్థాయికి తీసుకొచ్చామన్నారు. ప్రత్యామ్నాయ పంటల కింద ఇప్పటి వరకు 1.59 కోట్ల మొక్కలు, 37,567 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇప్పించి 415 మందికి, సీఈఎంఎస్ ద్వారా శిక్షణ ఇప్పించి మరో 360 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి డి.ఐ.జి. కన్వర్ విశాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య సాధన.. ఉపాధి కల్పన..!

❖ వృత్తివిద్యల్లో మహిళలకు ఉచిత శిక్షణ
❖ అండగా నిలుస్తున్న మహిళా ప్రాంగణం

దారపాలెం(ఆరిలోవ), న్యూస్‌టుడే

పేద మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి తమకాళ్లపై తాము నిలబడేలా తోడ్పాటు ఇస్తోంది పైనాపిల్ కాలనీలోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం). 10వ తరగతి వరకు చదువుకుని 18 నుంచి 40ఏళ్ల లోపు మహిళలకు ఇక్కడ హ్యాండ్ ఎంబ్రాయిడరీ (మగ్గం వర్కు), అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు (బ్యూటీషియన్) కోర్సులతోపాటు బాలికలకు నర్సింగ్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు.

కోర్సులు..ఉపాధి అవకాశాలు

★ బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలు వర్ణ సౌందర్యం, చర్మ సంరక్షణ తదితర అంశాలను నేర్చుకుంటున్నారు. అనంతరం అవసరమైన ఆర్థిక సహాయం బ్యాంకుల ద్వారా పొందుతూ ఇంటి వద్దే బ్యూటీషియన్లుగా స్వయం ఉపాధి పొందుతున్నారు. కుట్టు మిషన్, మగ్గం వర్కులో శిక్షణ పొందిన మహిళలు చీరలకు పాల్స్, వివిధ డిజైన్లలో జాకెట్లు రూపొందిస్తూ ఉపాధి పొందుతున్నారు. తద్వారా కుటుంబ పోషణతోపాటు పిల్లలను చదివించుకుంటున్నారని మహిళా ప్రాంగణం మేనేజర్ పి.విమల తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న మహిళలు

★ ఈ ఏడాదిలో ఇలా..: జనవరిలో ప్రారంభమైన నర్సింగ్ కోర్సులో 60 మంది, బ్యూటీషియన్ కోర్సులో 15 మంది శిక్షణ పొందుతున్నారు. టైలరింగ్‌కు సంబంధించి ఎంపికలు జరుగుతున్నాయి.

సంవత్సరం	శిక్షణ పొందినవారు	ఉపాధి
2023	150	139
2024	240	207
2025	210	196

★ నర్సింగ్‌లో..: 10వ తరగతి వరకు చదివి ఉన్నత చదువులకు వెళ్లలేని పేద బాలికలకు నర్సింగ్ కోర్సులో 3 నెలలు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కాలంలో నెల రోజులు హెల్త్‌సిటీ, విమ్స్ ఆసుపత్రిల్లోనూ ప్రాక్టికల్ తర్ఫీదు ఇస్తున్నారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌లు(జీడీఏ) అర్హత పత్రాలు ఇచ్చి వివిధ ఆసుపత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల నుంచి విద్యార్థినులు వచ్చి ఈ నర్సింగ్ కోర్సు చేస్తున్నారని మహిళా ప్రాంగణం మేనేజర్ తెలిపారు. మూడు నెలలూ ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

చెత్త నుంచి సంపద సృష్టికి ప్రత్యేక కార్యాచరణ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలెస్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు-సీఐఐ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో 'సర్క్యులర్ ఎకానమీ అండ్ గ్రీన్ కంపెనీస్' అంశంపై మంగళవారం కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో పేర్కొన్న 10 కీలక సూత్రాల్లో స్వచ్ఛాంధ్ర కీలకమైందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రీ సైక్లింగ్ పరిశ్రమలకు ముడి పదార్థాల కొరత రాకుండా త్వరలో ప్రత్యేక రియల్ టైమ్ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ రీసైక్లింగ్ విధానాలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సువర్ణావకాశంగా మారుతుందన్నారు. తద్వారా యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పెరుగుతున్న పర్యావరణ సవాళ్లను సర్క్యులర్ ఎకానమీ సాయంతో సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం విశాఖలో సముద్ర మట్టం సుమారు 98 సెంటీమీటర్లు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. గాలి నాణ్యత కూడా ఆందోళనకరంగా మారుతోందన్నారు. నగరంలో పేరుకుపోతున్న భవన నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయడం సవాలుగా మారిందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐఐ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (బిజినెస్ సెంటర్) ముత్తు సెజియన్, తదితరులు పాల్గొన్నారు.

27న ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక నేషనల్ కెరీర్ సెంటరులో ఈనెల 27న ఉదయం 10గంటలకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి ఎన్.శ్యామ్‌సుందర్ తెలిపారు. వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న 120 ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఫార్మసీ విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారు విశాఖలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఏడాదికి రూ.3.6 లక్షల వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

బీచ్‌రోడ్డును సీఆర్‌జెడ్-2లోకి తేవాలి: ఎమ్మెల్యే

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: భీమిలి నుంచి తిమ్మాపురం వరకు అభివృద్ధి చేయడానికి బీచ్‌రోడ్డును సీఆర్‌జెడ్-3 నిబంధనల నుంచి సీఆర్‌జెడ్-2లోకి మార్చాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఆర్‌జెడ్-3 కారణంగా బీచ్‌రోడ్డులో 9మీటర్లపైన నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నాయన్నారు. ఈ కారణంగా అభివృద్ధి చేయలేకపోతున్నామన్నారు. జోడుగుళ్లపాలెం వద్ద ఫ్రెండ్లీ పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనికి గతంలో ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు. విశాఖలో పర్యాటకులు పెరుగుతున్న దృష్ట్యా ఈ స్టేషన్ అవసరం ఉందని పేర్కొన్నారు.

అస్తవ్యస్త పనులు.. రాకపోకలకు అవస్థలు

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెం, జేఆర్ నగర్ ప్రాంతాల్లో చేపట్టిన భూగర్భడ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తయిన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో గుంతలను పూడ్చక పోవడంతోపాటు మట్టికుప్పలు అడ్డుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు సత్వరమే పూర్తి చేసేలా చూడాలని కోరుతున్నారు.

కృత్రిమ అవయవాల పనితీరు పరిశీలన

కృత్రిమకాలు అమర్చుతున్న జేసీ విద్యాధరి, ఏడీ కవిత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు రాణీచంద్రమణి ఆసుపత్రి ఆవరణలోని విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.విద్యాధరి మంగళవారం సాయంత్రం సందర్శించారు. కృత్రిమ అవయవాలు, క్యాలిపర్స్‌ల తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ దివ్యాంగుడికి కృత్రిమ కాలు అమర్చి దాని పనితీరును పరిశీలించారు. అనంతరం ఆర్సీడీ ఆసుపత్రిలో ఆధునికీకరించిన భవనాన్ని పరిశీలించారు. అందులో ఏయే విభాగాలు ఏర్పాటు చేస్తారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

30.51 చ.కి.మీ విస్తీర్ణంలో కంబాలకొండ 'ఈఎస్‌జెడ్'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కంబాలకొండ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై కీలక భాగస్వాముల సంప్రదింపుల సమావేశం మంగళవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధ్యక్షత వహించారు. లియా అసోసియేట్స్ సౌత్ ఏసియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన కన్సల్టెంట్లు పర్యావరణ, అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ జారీ చేసిన ఈఎస్‌జెడ్ మాస్టర్ ప్లాన్‌ను సమర్పించి అభిప్రాయాలను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్‌జెడ్ నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 30.51 చదరపు కి.మీ. విస్తీర్ణానికి జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారిణి వి.శిల్ప, వి.ఎం.ఆర్.డి.ఎ. ఎస్టేట్ అధికారి దయానిధి, డీఎఫ్‌సీ శిరీష, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తేజ్ భరత్

వ్యసనాలతో భవిష్యత్తు నాశనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆరిలోవ నేరవిభాగ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం తోటగరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో 'వ్యసనాలు, నేరప్రవృత్తితో అనర్థాలపై' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ హరికృష్ణ మాట్లాడుతూ కొంతమంది నేరస్థులు విద్యార్థులకు డబ్బులిస్తామని ఆశ చూపి గంజాయి, డ్రగ్స్ సరఫరాకు ఉపయోగించుకున్నారన్నారు. వారి ఉచ్చులో పడవద్దని సూచించారు. పట్టుబడితే జైలు తప్పదన్నారు. గంజాయి, గుట్కా, ఖైనీ లాంటివి కొంతమంది విద్యార్థులు వినియోగిస్తున్నట్లు సమాచారం ఉందని వాటికి బానిసైతే జీవితం నాశనం అవుతుందన్నారు. ప్రధానోపాధ్యాయిని దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరికృష్ణ

వివాహిత అనుమానాస్పద మృతి

దుర్గ (పాతచిత్రం)

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఆరిలోవ బాలాజీనగర్‌లో ఓ వివాహిత మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరిలోవ రెండో సెక్టార్ బాలాజీ నగర్‌లో బుదరపాటి దేముడు, దుర్గ(33) ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. నగరంలోని ఓ ప్రైవేటు దుకాణంలో పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యభర్తల మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. మంగళవారం వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో దుర్గ తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు విమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యార్థులకు నేత్ర వైద్యపరీక్షలు

విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ అంతర్జాతీయ సేవాసంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ సర్వీస్ కిడ్స్ సైట్ పేరుతో మంగళవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 1170 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 138 మందికి కళ్లద్దాలు అవసరమవుతాయని వైద్యులు గుర్తించారని సంస్థ ఉపాధ్యక్షుడు మార్క్‌లైన్ తెలిపారు. వీరందరికి అద్దాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

ఇ.ఎస్.ఐ.సి. వ్యవస్థాపక దినోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఇ.ఎస్.ఐ.సి. వ్యవస్థాపక దినోత్సవాన్ని నరసింహనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపప్రాంతీయ కార్యాలయం ఇన్‌ఛార్జి, డిప్యూటీ డైరెక్టర్ సౌమేంద్రకుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.ఫణీంద్ర, ఇ.ఎస్.ఐ.సి. అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యాంప్రసాద్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇ.ఎస్.ఐ. పథకంతో సుదీర్ఘ అనుబంధం ఉన్న వారిని సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. వివిధ ప్రమాదాల్లో చనిపోయిన బీమా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పింఛను పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.దినేష్‌కుమార్, లఘు ఉద్యోగ భారతి కార్యదర్శి పవన్ జైస్వాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు న్యాయసేవాధికార సంస్థ సేవలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం విశాఖ కేంద్రకారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఖైదీలకు అందించే చట్టపరమైన సేవలు, చట్టసేవల క్లినిక్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ అందిస్తున్న సేవలు, బెయిల్, పిటీషన్ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వంటశాలను తనిఖీచేసి ఆహారం, మంచినీటి నాణ్యతను పరిశీలించి సూచనలు చేశారు. ఖైదీలకు అందిస్తున్న వైద్యసేవలు, బ్యారక్ శుభ్రతను పరిశీలించారు. అనంతరం ముడసర్లోవ వద్ద గల బాలుర పరిశీలనా గృహాన్ని సందర్శించి జువైనల్ జస్టిస్ బోర్డు ద్వారా అందుతున్న సేవలను వివరించారు.

జైలు అధికారులతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

భగవంతుడి స్మరణే గొప్ప యోగం

ప్రవచిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ప్రతి జీవుడు నిజానికి ఒంటరివాడే, ఎక్కడ ఉంటే అక్కడ గొప్పగా ఉండటమే యోగమని ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. విశాఖ రుషిపీఠం, సత్సంగం ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్కులో శ్రీమద్భాగవతం ప్రవచన యజ్ఞం ఆరో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ప్రవచిస్తూ భగవంతుడి స్మరణలో ఉండటమే గొప్ప యోగమన్నారు. పలు రూపాల్లో కనిపించినా భగవంతుడు ఒక్కడే అన్నారు. సనాతన ధర్మం గొప్పదనాన్ని వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో సమయపాలన తప్పనిసరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని రేషన్ డిపో డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచించారు. జేసీ విద్యాధరి ఆదేశాలతో డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు సూచనల మేరకు సహాయ సరఫరా అధికారులు కల్యాణి, శ్రీహరి తమ పరిధిలోని డీలర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరిచే ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అర్హులైన కార్డుదారులకు మాత్రమే సరకులు పంపిణీ చేయాలన్నారు. గత నెలలో అవకతవకలకు పాల్పడిన 61 మంది షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, వారిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందన్నారు.

డీలర్లతో మాట్లాడుతున్న సహాయ సరఫరా అధికారిణి కల్యాణి

పునశ్చరణ శిక్షణతో అదనపు సామర్థ్యాలు

ఏఆర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ కైలాసగిరి ఏఆర్ క్రీడామైదానంలో పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక పునశ్చరణ శిక్షణ (డీ మొబలైజేషన్) మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఏఆర్ పోలీసుల కవాతును అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా పరిశీలించి సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తర్ఫీదులో నేర్చుకున్న అంశాలను అమలులోకి తెచ్చి పోలీసు విధులను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అదనపు ఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహనరావులను అభినందించారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, సంజీవరావు, ఆదినారాయణ తదితరులు పర్యవేక్షించారు.

అదృశ్యమైన బాలుడి గుర్తింపు

బాలుడు, తల్లితో పోలీసులు

బీచ్‌రోడ్డు (పెదవాల్తేరు), న్యూస్‌టుడే: అదృశ్యమైన ఆరిలోవ ప్రాంతానికి చెందిన బాలుడిని మూడో పట్టణ పోలీసులు తల్లిచెంతకు చేర్చారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ టీఐసీ పాయింట్‌కు చెందిన స్వాతి మంగళవారం ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లారు. ఆమె కుమారుడు(10) నడుచుకుంటూ బీచ్‌రోడ్డు వై.ఎం.సి.ఎ. వద్దకు చేరుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు కనిపించకపోవడంతో 112కు కాల్ చేయడంతో అన్ని స్టేషన్ల అధికారులు అప్రమత్తమయ్యారు. వై.ఎం.సి.ఎ. వద్ద బాలుడు తిరుగుతున్నాడని సమాచారం అందడంతో కానిస్టేబుల్ పి.పోలారావు అక్కడికి చేరుకొని బాలుడ్ని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తల్లి స్వాతికి అప్పగించారు.

చురుగ్గా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో సచివాలయాల సిబ్బంది నగరంలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం బాలాజీనగర్‌లో యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యురాలు కిరణ్ లలిత, టీబీ యూనిట్ పర్యవేక్షకురాలు లక్ష్మి ఆధ్వర్యంలో అనుమానితులకు కళ్లె, రక్తం, బీపీ, మధుమేహం పరీక్షలు చేశారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సమతా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎం.బి.ఎ. విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె మట్లాడుతూ విద్యార్థులు భావవ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జానపద, తదితర నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ సారాబంది, వైస్ ప్రిన్సిపల్ శిల్ప పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

ఎంబీఏ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు మంగళవారం సాయంత్రం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం జరగనుంది. దీనికి సూచనగా ఈ ఫ్లాష్‌మాబ్ చేపట్టినట్లు విద్యార్థులు తెలిపారు.

ఆధారాలను పరిశీలించిన శాంతి కమిటీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఇటీవల ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల వివాదానికి సంబంధించి మంగళవారం సాయంత్రం శాంతికమిటీ(పీస్‌కమిటీ) సమావేశం జరిగింది. సమావేశానికి ఉపకులపతి, ఆర్డీవో, ఏసీపీలు హాజరు కాలేదని తెలిసింది. రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఆధ్వర్యంలో ప్రిన్సిపాళ్లు ఇతర ఏయూ అధికారులు సమావేశమయ్యారు. సోమవారం నాటికి రిజిస్ట్రార్‌కు విద్యార్థి సంఘాల నాయకులు అందించిన ఆధారాలను పరిశీలించినట్లు తెలిసింది. అలాగే సంఘాలు వీడియోలు సమర్పించినట్లు సమాచారం. వీటిని పరిశీలించి నివేదికను తయారు చేసి వీసీకి అందించనున్నారు.

నాణ్యత నిర్ధారణలో బీఐఎస్ కీలకపాత్ర

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్(బీఐఎస్) స్టూడెంట్ ఛాప్టర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో భారతీయ ప్రమాణాలపై 'నో యువర్ స్టాండర్డ్స్(మీ ప్రమాణాలను తెలుసుకోండి)' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.శశి ప్రారంభించి మాట్లాడారు. ఇంజినీర్ల మెటీరియల్స్ డిజైన్ ప్రక్రియలకు సంబంధించిన భారతీయ ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సీఎన్‌వీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో నాణ్యత, భద్రత, విశ్వసనీయతను నిర్ధారించడంలో బీఐఎస్ ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. ఆచార్య ఐ.శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు

సదస్సు ప్రారంభంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎం.శశి తదితరులు

సీఆర్ రెడ్డిని మరిచిన అధికారులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉపకులపతి ఆచార్య సీఆర్ రెడ్డి వర్ధంతిని ఏయూ అధికారులు మంగళవారం నిర్వహించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఏటా డిసెంబరు 10న సీఆర్ రెడ్డి జయంతి, ఫిబ్రవరి 24 వర్ధంతిని ఏయూలో నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనం వద్ద ఉన్న విగ్రహంతో పాటు సిరిపురం కూడలిలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది దీన్ని ఏయూ అధికారులు విస్మరించారని చెబుతున్నారు. దీనిపై రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబుని ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

'కొత్త మార్గదర్శకాలు అమలు చేయాలి'

ఛైర్మన్ కృష్ణయ్యకు వినతి అందిస్తున్న ప్రతినిధులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : హోటల్స్, రెస్టారెంట్ల నిర్వహణకు 2016 నాటి మార్గదర్శకాలను అమలు చేస్తున్నారని, 2025 కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తీసుకురావాలని హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు కోరారు. మంగళవారం వారంతా నగర పర్యటనకు వచ్చిన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్యను కలిసి వినతి అందించారు. హోటల్స్ రంగానికి సంబంధించి వివిధ అంశాలను పరిష్కరించాలని కోరారు. సంఘం ప్రతినిధులు పవన్ కార్తీక్, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహికులకు రుణాలు ఇవ్వాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వార్షిక ప్రణాళికను రూ. 64745.81 కోట్లుగా నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్ పాల్గొని.. వార్షిక ప్రణాళిక ప్రతులను విడుదల చేశారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే వారికి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.

రుణ ప్రణాళిక ప్రతులు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : ?: ✓:

అల్లిపురం, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 33వ వార్డు అమ్మవారి వీధిలో దీపాలు వెలగడం లేదు. –రాజేశ్వరి, స్థానిక మహిళ ✓: సిబ్బంది పంపి దీపాలను బాగు చేయిస్తాం. –ఎం. మల్లయ్యనాయుడు, జేఈ

గురుద్వారా, న్యూస్‌టుడే : ?: ✓:

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార ప్రధాన గెడ్డ పూర్తిగా చెత్తతో నిండి ముసురుకుని నిలిచిపోతోంది. –ఎస్.వి.రాజేష్ ✓: సంబంధిత సిబ్బందిని పంపించి గెడ్డను శుభ్రం చేయిస్తాం. –వి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 31వ వార్డు దాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీప డ్రైనేజీపై మూత శిథిలావస్థకు చేరింది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. –జయప్రకాశ్, స్థానికుడు. ✓: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. –కామేశ్వరరెడ్డి, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

నడిరోడ్డుపై నిలిపేస్తున్నారు..!

అడ్డదిడ్డంగా ఆటోలు, ఇతర వాహనాల పార్కింగ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ నగరంలో ఆటో చోదకుల వ్యవహారశైలితో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు నిలపాల్సిన బస్‌స్టాపుల్లో ఆటోలను అడ్డంగా నిలిపేసి.. ప్రయాణికులను పిలిచి మరీ ఎక్కించుకుంటున్నారు. దీంతో ఆయా రహదారులపై రాకపోకలు సాగించే ఇతర వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.

రోడ్డు మధ్యలో నిలిపేసిన ఆటోలు, ఆ పక్కనే ఆర్టీసీ బస్సు

ఇదీ పరిస్థితి..: ★ నగరంలో ఎక్కడికక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను, ఇతర వాహనాలను నిలుపుతున్నా... ట్రాఫిక్ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదు. ప్రధాన కూడళ్లతో పాటు, రద్దీగా ఉండే బస్‌స్టాపుల వద్ద ఇష్టానుసారంగా ఆటోలను నిలుపుతున్నారు. జాతీయ రహదారిపై మద్దిలపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబకూడలి, పూర్ణమార్కెట్, డాబాగార్డెన్స్ ప్రాంతాల్లో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

➤ జగదాంబ బస్‌స్టాపు వద్ద రెండు వైపులా ఆటోలను నిలిపేస్తుండడంతో... ఆర్టీసీ సిటీ బస్సులు వాటి మధ్యలోకి వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకోవాల్సి వస్తుంది. మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ➤ కొన్ని కూడళ్లలో సిగ్నల్స్ పడిన వెంటనే వాహనాలు ముందుకెళ్లే వీల్లేకుండా, అడ్డంగా ఆటోలు నిలిపేస్తున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించడం లేదు. వారంతా నెలవారీ మామూళ్లు తీసుకుంటూ, ఆటోచోదకులకు సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

➤ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గురుద్వారా వైపు వెళ్లే మార్గంలో ఎక్కడికక్కడ వాహనాలను నిలిపేయడంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. వీజేఎఫ్ బస్‌స్టాపు వద్ద ఆటోల రద్దీ ఎక్కువగా ఉంటోంది.

➤ ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి... బస్‌స్టాపుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిలుపుతున్న ఆటోలు, ఇతర వాహనాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటక అభివృద్ధితో గుర్తింపు

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పర్యాటక అభివృద్ధితోనే రాష్ట్రానికి గుర్తింపు వస్తుందని, విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలని విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. పర్యాటకంగా విశాఖలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, సరైన మౌలిక వసతులు లేవకపోవడం పలువురు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సౌకర్యాలపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పర్యాటక రంగంలో ఎక్కువ పెట్టుబడులు పెట్టే వారికి రాయితీలు ఇవ్వాలని సూచించారు. విశాఖ నుంచి అరకు వెళ్లే రహదారిని విస్తరించాలని విన్నవించారు. ఎండాడ నుంచి భీమిలి వరకు ఉన్న సీఆర్‌జెడ్ నిబంధనలతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. బీచ్‌రోడ్డును పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలన్నారు.

ఘనంగా ఇ.ఎస్.ఐ.సి. వ్యవస్థాపక దినోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఇ.ఎస్.ఐ.సి. వ్యవస్థాపక దినోత్సవాన్ని నరసింహనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపప్రాంతీయ కార్యాలయం ఇన్‌ఛార్జి, డిప్యూటీ డైరెక్టర్ సౌమేంద్రకుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.ఫణీంద్ర, ఇ.ఎస్.ఐ.సి. అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యాంప్రసాద్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇ.ఎస్.ఐ. పథకంతో సుదీర్ఘ అనుబంధం ఉన్న వారిని సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. వివిధ ప్రమాదాల్లో చనిపోయిన బీమా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పింఛను పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.దినేష్ కుమార్, లఘు ఉద్యోగ భారతి కార్యదర్శి పవన్ జైస్వాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, బీఎంఎస్, ఐ.ఎన్.టి.యు.సి. నేతలు వి.నాగభూషణం, ఆర్.కె.వి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏడీ శ్యాంప్రసాద్, చిత్రంలో సౌమేంద్రకుమార్ తదితరులు

● చెత్తకుండీ.. రోడ్డెక్కే..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 29వ వార్డు కేజీహెచ్ దిగువ రోడ్డు నుంచి ప్రకాశరావుపేటకు వెళ్లే మార్గంలో చెత్తకుండీ రోడ్డుకు అడ్డంగా ఉంది. అక్కడ పోగయ్యే వ్యర్థాలను తరలించే పారిశుద్ధ్యం సిబ్బంది... ఎప్పటికప్పుడు చెత్తకుండీని నిర్లక్ష్యంగా రహదారికి మధ్యలో వదిలేస్తున్నారు. రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో పలువురు ద్విచక్ర వాహనచోదకులు పొరపాటున కుండీని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తకుండీని రోడ్డు పక్కకు తరలించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● పూడిక వ్యర్థాల తరలింపు ఎప్పుడో..?

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : జ్ఞానాపురం బీఆర్టీఎస్ ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువల్లో పూడికలు తీసిన జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది, వాటిని తొలగించకుండా వదిలేశారు. రోజులు గడుస్తున్నా... తరలించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా వ్యర్థాలు ఎండిపోయి చెల్లాచెదురవుతున్నాయి. దీంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● తొలగించి.. వదిలేశారు..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 31వ వార్డు ద్వారకాబజార్ వీధిలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఏడాది కిందట విద్యుత్తు స్తంభాలను తొలగించి, రహదారి పక్కనే ఉంచారు. వాటి స్థానంలో భూగర్భ విద్యుత్తు వ్యవస్థ అమర్చారు. అలా తొలగించిన స్తంభాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో అవి శిథిలమయ్యాయి. ఎక్కడికక్కడ ఇనుప చువ్వలు బయటకు చొచ్చుకుని వచ్చి ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో రాకపోకలు సాగించే వారు బిక్కుబిక్కుమంటున్నారు. వెంటనే స్తంభాలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

● కుక్కల స్వైర విహారం

మాధవధార, న్యూస్‌టుడే: జాతీయ రహదారి బిర్లాకూడలి నుంచి ఊర్వశీ జంక్షన్ సేవా రహదారి, ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చీకటిపడిన తర్వాత సేవా రహదారిలో ప్రయాణించే వాహనచోదకులు, ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులు అటుగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● బీమా సదుపాయానికి వినతి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : మర పడవలకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద బీమా సదుపాయం కల్పించాలని తూర్పు కోస్తా బోటు యజమానుల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ కోరారు. ఈ మేరకు దిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసినట్లు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీమా సదుపాయం లేక బోటు ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు.

● కనకమహాలక్ష్మికి స్వర్ణపుష్పార్చన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టాదళ పాద పద్మారాధన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి 108 బంగారు పుష్పాలు నివేదించి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

● 27న ఉద్యోగ మేళా

కంచరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక నేషనల్ కెరీర్ సెంటరులో ఈనెల 27న ఉదయం 10గంటలకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి ఎన్.శ్యామ్‌సుందర్ తెలిపారు. వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న 120 ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఫార్మసీ విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారు విశాఖలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఏడాదికి రూ.3.6 లక్షల వేతనం ఇస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

పునశ్చరణ శిక్షణతో అదనపు సామర్థ్యాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్ కైలాసగిరి ఏఆర్ క్రీడామైదానంలో పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక పునశ్చరణ శిక్షణ (డీ మొబలైజేషన్) మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఏఆర్ పోలీసుల కవాతును అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా పరిశీలించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తర్ఫీదులో నేర్చుకున్న అంశాలను అమలులోకి తెచ్చి పోలీసు విధులను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అదనపు ఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహనరావులను అభినందించారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, సంజీవరావు, ఆదినారాయణ తదితరులు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

కొమ్మాది, న్యూస్‌టుడే: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శాప్ లీగ్స్ పేరిట మారికవలస ఏపీ గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల వద్ద మంగళవారం చేపట్టిన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ ఎల్.శివప్రసాద్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అండర్-18 విభాగంలో బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వి.దేవన్‌దీక్షిత్, కె.మౌర్య, షేక్ మెహబూబ్‌భాషా నిలిచారు. బాలికల విభాగంలో పి.తనూజ, ఇమంది పూజిత, డి.రమ్య తొలి మూడు స్థానాల్లో రాణించారు. వీరు ఈ నెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిణి జూన్ గాల్లోయట్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ శివప్రసాద్

భవనాల కేటాయింపునకు విన్నపం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయం, జిల్లా గ్రంథాలయాలకు ప్రభుత్వ భవనాలు కేటాయించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సతీష్‌కుమార్, కార్యదర్శి కుమార్‌రాజు కోరారు. మంగళవారం వారు జిల్లా సంయుక్త కలెక్టర్ విద్యాధరిని కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ సంస్థకు దండుబజార్‌లో ఉన్న సొంత స్థలంలో నూతన నిర్మాణాలు చేపట్టే వరకు ప్రత్యామ్నాయంగా వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ భవనాలు కేటాయించాలన్నారు. గ్రంథాలయ సెస్ కింద జీవీఎంసీ భారీ మొత్తంలో బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆయా నిధులు విడుదలయ్యేలా చూడాలని, గ్రంథాలయాల్లో డిజిటల్ సౌకర్యాలు, హైస్పీడ్ ఇంటర్నెట్, నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షల తాజా పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి జేసీ హామీ ఇచ్చారు.

జేసీ విద్యాధరికి వినతి అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సతీష్‌కుమార్, కార్యదర్శి కుమార్‌రాజు

రేషన్ డిపోల్లో సమయపాలన తప్పనిసరి

డీలర్లతో మాట్లాడుతున్న సహాయ సరఫరా అధికారిణి కల్యాణి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని రేషన్ డిపో డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచించారు. జేసీ విద్యాధరి ఆదేశాలతో డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు సూచనల మేరకు సహాయ సరఫరా అధికారులు కల్యాణి, శ్రీహరి తమ పరిధిలోని డీలర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరిచే ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అర్హులైన కార్డుదారులకు మాత్రమే సరకులు పంపిణీ చేయాలన్నారు. గత నెలలో అవకతవకలకు పాల్పడిన 61 మందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, వారిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందన్నారు.

'సారథి'పై కమిషనర్ సమీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అమలు చేస్తున్న 'సారథి' ప్రాజెక్టుపై కమిషనర్ కేతన్‌గార్గ్ సమీక్ష నిర్వహించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరంలోని 90 కూడళ్లలో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టంను అమల్లోకి తీసురానున్న నేపథ్యంలో ప్రాజెక్టు టెండర్లపై కమిషనర్ ఆరా తీశారు. ముగ్గురు ఔత్సాహికులు టెండర్లు దాఖలు చేసి, ప్రాథమికంగా అర్హత సాధించారని కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు వివరించారు. టెండర్లలో పాల్గొన్న వారికి మూడు కూడళ్ల బాధ్యతలు అప్పగించి, నిర్వహణ తీరును పరిశీలిస్తామని పేర్కొన్నారు. సమీక్షలో అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, స్మార్ట్ సిటీ అధికారి కేవీఎన్.రవి, ప్రధాన ఇంజినీర్ పీవీవీ.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సిబ్బందితో కలిసి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ కేతన్‌గార్గ్

పని చేసే వారికి గుర్తింపు

శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సుధాకర్, తదితరులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : తెలుగుదేశం పార్టీ విశాఖ దక్షిణం బీసీ సెల్ అధ్యక్షునిగా కొణతాల శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొని మాట్లాడారు. తెదేపాలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని, పార్టీ కోసం పని చేసే వారికి పదవులు వరిస్తాయన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, నాయకులు బి.రామిరెడ్డి, కె.లక్ష్మి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు

అల్లిపురం, న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు మార్చి 2 నుంచి 4 వరకు విజయవాడలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తారని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ కేసుల నిమిత్తం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తుల్ని మదింపు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బినామీ పేర్లతో ఉన్న రూ.4వేల కోట్ల ఆస్తిని వేలం వేసి, బాధితులకు రూ.20 లక్షల చొప్పున అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంఘం సభ్యులు, బాధితులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

ఆసుపత్రికి ఉపకరణాల అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కేజీహెచ్ విశ్రాంత వైద్యాధికారి, యూకేలో యూరాలజిస్టుగా సేవలు అందిస్తున్న విశాఖకు చెందిన డాక్టర్ ఐకే.రాజు కేజీహెచ్ యూరాలజీ విభాగానికి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందించారు. మంగళవారం ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణిని కలిసి డీజే స్టంట్లు, గైడ్‌వైర్లు, క్యాథెటర్లు తదితర కీలక సామగ్రిని అందించారు. యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కేవీ.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి వాణికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ ఐకే రాజు

వేతనాలు పెంచాలని డిమాండ్

నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘం సభ్యులు కె.పద్మావతి, బృందావతి, శ్రీదేవి, కోమలి, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ కె.వి.రమణ, తదితరులు

ఘనంగా ఐఐఎం స్థాపన దినోత్సవం

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఐఐఎం(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్) స్థాపన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యులు కె.రత్నకుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థల్లో ఐఐఎం ప్రాధాన్యతను వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ మాట్లాడుతూ మెటలర్జికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, విభాగాధిపతులకు ఐఐఎం స్థాపన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు.

వీధి దీపాల నిర్వహణపై ఆరా

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో వీధి దీపాల నిర్వహణ మెరుగుపరచాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన పాతనగరంలో పర్యటించారు. కొన్ని ప్రాంతాల్లో దీపాలు వెలగకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులు పూర్తి స్థాయిలో విధులకు హాజరయ్యారా..? లేదా..? అనే అంశాన్ని పరిశీలించారు. కొంతమంది కార్మికులు గైర్హాజరు కావడంపై తీవ్రంగా ఆగ్రహించారు. ప్రతి కార్మికుడు విధులకు రావాలని, లేనిచో వేతనాల్లో కోత ఉంటుందని హెచ్చరించారు. పారిశుద్ధ్య పనులు మెరుగు పరచాలని సూచించారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

30.51 చ.కి.మీ విస్తీర్ణంలో కంబాలకొండ 'ఈఎస్‌జెడ్'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కంబాలకొండ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) ముసాయిదా జోనల్ బృహత్ ప్రణాళికపై కీలక భాగస్వాముల సంప్రదింపుల సమావేశం మంగళవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధ్యక్షత వహించారు. లియా అసోసియేట్స్ సౌత్ ఏసియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన కన్సల్టెంట్లు పర్యావరణ, అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ జారీ చేసిన ఈఎస్‌జెడ్ మాస్టర్ ప్లాన్‌ను సమర్పించి అభిప్రాయాలను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్‌జెడ్ నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 30.51 చదరపు కి.మీ. విస్తీర్ణానికి జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు.

విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి స్టేడియంలోకి వస్తున్న ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు (పైచిత్రంలో..) –న్యూస్‌టుడే, మాధవధార

భూములు లాక్కుంటున్నారని ఫిర్యాదు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామానికి చెందిన దళిత రైతుల భూముల్ని అక్రమంగా లాక్కుంటున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మంగళవారం నగర పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాంను ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కలిసి వినతి పత్రం అందించారు. మొత్తం 18 మంది రైతులకు 2.77 ఎకరాల చొప్పున భూములు ఉన్నాయని, వాటికి సంబంధించి ఎన్నో ఏళ్ల కిందటే పాస్ పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. అయితే గత ఏడాది డిసెంబరులో ఆయా భూముల్ని తీసుకుంటున్నట్లు తహసీల్దార్ నోటీసులు జారీ చేశారన్నారు. ఈ అంశంపై విచారణ జరిపి, తగిన న్యాయం చేయాలని వారు కోరారు.

సీతారాంకు వినతిపత్రం అందిస్తున్న దళిత రైతులు

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

మాధవధార, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మంగళవారం విశాఖపట్నంలోని జాతీయ రహదారి పంజాబ్ హోటల్ వద్ద చోటుచేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రాంతానికి చెందిన బొనుల పైడినాయుడు (51) నగరంలో గత కొన్నేళ్లుగా షీలానగర్ వేంకటేశ్వరకాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్నారు. నేవీలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం కెనరా బ్యాంకు సీతమ్మధార బ్రాంచిలో క్లర్క్‌గా పని చేస్తున్నారు. మంగళవారం ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తుండగా పంజాబ్ హోటల్ జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు హ్యాండిల్‌ను తాకగా బస్సు వెనుక చక్రాల కింద పడిపోయారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఎయిర్‌పోర్టు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి డ్రైవరును అదుపులోకి తీసుకొని బస్సును స్టేషన్‌కు తరలించారు. ఎయిర్ పోర్టు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

బి.పి.నాయుడు

అదనపు ఓపీ భవనం ప్రారంభం

సీతంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో కొత్త ఓపీ బ్లాక్‌ను జిల్లా సంయుక్త కలెక్టర్ జి.విద్యాధరి మంగళవారం ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఈఆర్ నిధులు రూ.76లక్షలతో దీన్ని నిర్మించారు. జేసీ మాట్లాడుతూ సంబంధిత కార్పొరేషన్ పేద ప్రజల వైద్యం కోసం అందించిన సహకారం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికార ప్రతినిధులు నిశాంత్, బుచ్చయ్య, సాగర్, ప్రాంతీయ నేత్రశాల వైద్యులు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రేమలత, ఆర్ఎంవో డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో జేసీ విద్యాధరి, తదితరులు

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

ఆర్టీసీ డిపోలను ప్రైవేటుపరం చేయడం తగదు

సింధియా, న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొచ్చి ప్రజా రవాణా డిపోలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వజూపడం తగదని ఏపీటీడీ గాజువాక డిపో యూనియన్ (ఎన్ఎంయూ) కార్యదర్శి పిళ్లా శంకరరావు అన్నారు. మంగళవారం డ్రైవర్లు, కండక్టర్లు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్తు బస్సులను తెచ్చినా ప్రజారవాణా డిపోల ద్వారానే నడపాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు వీఎస్సార్ మూర్తి, అధ్యక్షులు పీఎస్ రావు, ఛైర్మన్ బోసుబాబు, జీవీ రమణ, కేవీ లక్ష్మి, కిశోర్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రోగులకు మెరుగైన చికిత్స అందించాలి

అగనంపూడి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన చికిత్స అందించడానికి సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఏపీవీవీపీ జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ కోరారు. మంగళవారం ఆయన అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. వైద్య విభాగాలను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. గోపీకృష్ణ, ఏవో రవిరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న నరేంద్రసింగ్

ఘనంగా అంతర్జాతీయ ముద్రణాదినం

గాజువాక, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ముద్రణాదినం సందర్భంగా గాజువాకలో మంగళవారం దక్షిణ విశాఖ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత ముద్రణ యంత్రాన్ని కనిపెట్టిన గుటెన్‌బర్గ్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జగన్నాథరావు, ముఖ్య సలహాదారు బొడ్డేడ వెంకటరావు, సంఘం నాయకులు మహ్మద్ ముర్తజా, కేవీ శ్రీహరి, ఆర్.అప్పలరాజు, గురునాయుడు, భాస్కర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ 76వ వార్డు బర్మాకాలనీలో ఖాళీ స్థలాల పరిరక్షణకు ఉక్కు భూసేకరణ విభాగం, పెదగంట్యాడ మండల రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టారు. మంగళవారం కాలనీలో అయిదు చోట్ల హెచ్చరిక బోర్డులను పాతారు. బర్మా కాందిశీకుల సంఘం ప్రతినిధులు బోర వేణుగోపాల్‌గౌతం, గుణుపూడి అరుణ్‌బాబు, సమ్మింగ అప్పలరాజు ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంటు ఎస్‌డీసీ సునీత నేతృత్వంలో రెవెన్యూ బృందాలు రంగంలోకి దిగి బోర్డులు ఏర్పాటు చేశారు.

ధైర్యం నింపుతూ.. బోధన సాగిస్తూ..

కేవీల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

మల్కాపురం, న్యూస్‌టుడే : దివ్యాంగ విద్యార్థులకు కొన్ని రకాల అభ్యసనా సమస్యలు ఉంటాయి. కొందరు చదవడంలో, మరి కొందరు రాయడంలో ఇబ్బందులు పడుతుంటారు. లోతైన విశ్లేషణలు, క్లిష్టమైన గణంకాలు చేయాలంటే అవస్థలు పడతారు. అలాంటి విద్యార్థులకు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయాల్లో 'స్పెషల్ ఎడ్యుకేషన్' పేరుతో వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. ముందు వారిలో మానసిక స్థైర్యం నింపి తర్వాత బోధన పద్ధతులు అవలంబిస్తున్నారు.

ప్రత్యేక తరగతి గదిలో దివ్యాంగులకు విద్యాబోధన

అందరితో కలిపి..: దివ్యాంగ విద్యార్థులకు వేరుగా కూర్చోబెట్టి బోధన చేస్తే వారు ఆత్మన్యూనతా భావానికి లోనవుతారు. అందుకే ఈ విద్యార్థులు కూడా ఎవరికీ తీసిపోరు అనే విధంగా సాధారణ విద్యార్థులతో కలిసి వారిని కూర్చోబెడతారు. అక్కడ అందరు విద్యార్థులతో కలిసి వీరికి బోధన కొనసాగుతుంది.

ఆటలతో..

ఇష్టమైన అంశాల్లో..: సాధారణ విద్యార్థులతో కలిసి బోధించిన తర్వాత దివ్యాంగ విద్యార్థులందరికి మళ్లీ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. చెప్పిన పాఠాన్నే మళ్లీ బోధిస్తారు. దీనివల్ల వారికి సులభంగా అర్థమవుతుంది. ఈ పాఠాలు బోధించడానికి వీరికి ప్రత్యేక ఉపాధ్యాయులు ఉంటారు. ★ విద్యతో పాటు ఆటలు నేర్పిస్తారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు పెడతారు. ★ దివ్యాంగ విద్యార్థులకు వారికి ఇష్టమైన అంశాలను గుర్తించి వాటిలో శిక్షణ ఇస్తారు. మ్యూజిక్, పాటలు, ఆటలు ఎందులో ఆసక్తిఉన్నా.. అందులో రాణించేలా ప్రోత్సహిస్తారు. ★ దివ్యాంగ విద్యార్థులు పాఠశాలల్లో చేరినప్పుడు.. చదువు పూర్తిచేసుకొని బయటకు వెళ్లేటప్పటికి వారిలో ఎంతో మెరుగుదల కన్పిస్తోంది.

★ ఈ ఏడాది కేవీల్లో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బోధనకు శాశ్వత నియామకాలు చేపడుతున్నారు.

ఏటా దరఖాస్తు చేసుకోవాలి :

దివ్యాంగ విద్యార్థులకు పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. తల్లిదండ్రులకు కూడా వారిని ఇంటి వద్ద ఎలా పర్యవేక్షించాలో అవగాహన కల్పిస్తున్నాం. ఇలాంటి విద్యార్థులు ప్రధాన విద్యాస్రవంతిలో భాగస్వాములను చేస్తున్నాం. ఇది సమగ్ర విద్యను మరింత బలోపేతం చేయడంలో సహాయపడుతోంది. వీరు కేవీల్లో ప్రవేశాలకు మిగతా విద్యార్థుల మాదిరిగానే ఏటా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

–సత్యజిత్ మిశ్రా, ప్రిన్సిపల్, మల్కాపురం పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం

నగర పరిధిలో పీఎంశ్రీ కేవీల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలు..

కేవీ పేరు	విద్యార్థుల సంఖ్య
మల్కాపురం పీఎంశ్రీ కేవీ	11
నౌసేనాబాగ్ పీఎంశ్రీ కేవీ-2	20
నౌసేనాబాగ్ పీఎంశ్రీ కేవీ- 1	15
ఐఎన్ఎస్ కళింగ పీఎంశ్రీ కేవీ	05
స్టీల్‌ప్లాంట్ పీఎంశ్రీ కేవీ	11
ఎన్ఏడీ పీఎంశ్రీ కేవీ	12
ఎస్‌వీఎన్ పీఎంశ్రీ కేవీ-2	15

'వేతనాలు పెంచమని కోరాం'

సింధియా, న్యూస్‌టుడే : బయట మార్కెట్‌లో కనీస ధరలకు సరిపడేలా వేతనాలు చెల్లించాలని విశాఖ లేబర్ కాంట్రాక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం 61వ వార్డు గ్రామ మండలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు పెంచాలని కోరుతూ కాంట్రాక్టర్లు, యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు, భద్రతా యూనిఫాం అందించాలని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లతో అంగీకారించినా యాజమాన్యం మౌనం దాల్చడం తగదన్నారు. మరోసారి జనరల్ బాడీ మీటింగ్ ద్వారా యాజమాన్యంతో చర్చలు జరిపేందుకు సమ్మె ఆమోదం పొందామన్నారు. యూనియన్ అధ్యక్షులు చుక్క సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీఎస్ ప్రసాద్, గొండెం మహాలక్ష్మి, కోలాటి రామకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

ప్రశిక్షణ తరగతులకు సిద్ధం: భాజపా

గాజువాక : వచ్చే నెల 7 నుంచి ఏప్రిల్ 14 వరకు ప్రతి మండలంలో జరగనున్న ప్రశిక్షణ తరగతులను విజయవంతం చేయాలని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో గాజువాక ప్రతినిధులతో ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు కృష్ణంరాజు, నూకరాజు, రోహిణీ, లలిత, పద్మ పాల్గొన్నారు.

దుర్గానగర్ రహదారి మూసివేత

కుర్మన్నపాలెం (ఉక్కునగరం): రైల్వేలైన్ వెంట స్లాబ్ నిర్మాణ పనులు చేపడుతున్నందున కణితి రోడ్డు నుంచి దుర్గానగర్ మీదుగా రాజీవ్‌నగర్ రహదారిని రెండు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించాలని సూచించారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని గోపాలపట్నం పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపించారు. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన నంద కిశోర్‌సింగ్ అలియాస్ చోటు (31) గంజాయి రవాణా తరలింపు కేసులో నిందితుడు. 2022 నుంచి పరారీలో ఉన్నాడు. ఎట్టకేలకు ఇటీవల హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సి.ఐ. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: వుడాకాలనీ, గొంతెనవానిపాలెంలో వీధి దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయి. చీకటి కష్టాలను తీర్చాలి. –సన్యాసిరావు, గాజువాక, వసంత్, వుడాకాలనీ, **సమాధానం:** సిబ్బందిని పంపి దీపాలను పునరుద్ధరిస్తాం. –శివ, వీధిదీపాల నిర్వాహకుడు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెంలో పారిశుద్ధ్యం పట్టుతప్పింది. – రాజా, మర్రిపాలెం, ✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ?: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్.బ్లాక్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. – ప్రసన్న, లక్ష్మీనగర్ ✔: దీపాలు మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

కాలువలు శుభ్రం

స్పందనకు వందనం

గాజువాక, న్యూస్‌టుడే : పూడిక నిండి అధ్వానంగా ఉన్న పంతులుగారి మేడ, చట్టివానిపాలెం కాలువల శుభ్రతకు జీవీఎంసీ సిబ్బంది కదిలారు. 'ఈనాడు'లో 'మేమున్నాం మీకుతోడుగా'లో వచ్చిన వార్తలకు సంబంధిత అధికారులు స్పందించారు. అదనపు సిబ్బందిని రంగంలోకి దింపి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఆయా పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించారు.

26 నుంచి జనసేన సభ్యత్వాలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జనసేన ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు జనసేన గాజువాక ఇన్‌ఛార్జి, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు అన్నారు. మంగళవారం గాజువాక భాగ్యలక్ష్మి ఫంక్షన్ హాల్లో జనసేన సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ్యత్వ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గడసాల అప్పారావు, జిల్లా నాయకులు తిప్పల రమణారెడ్డి, గంధం వెంకటరావు, పలువురు వీర మహిళలు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జనసేన ఇన్‌ఛార్జి కోన తాతారావు, తదితరులు

వైభవంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం (కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలోని దుర్గానగర్‌లో శ్రీదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పుష్పాలతో అలంకరించారు. పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసంతర్పణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులతోపాటు స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, స్థానిక పీఏసీఎస్ ఛైర్మన్ విజయ్‌కుమార్, దాడి సురేశ్ పాల్గొన్నారు.

అమ్మవార్ల విగ్రహాలకు పూజలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెంటమాంబ ఆలయ ఉపదేవతల విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం విగ్రహ పూజలు ఘనంగా జరిగాయి. పురోహితులు ఉదయం పంచగవ్య ఆరాధన, వాస్తుపూజ, చండీ హోమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పైడిమాంబ జాతర

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 85వ వార్డు పరిధి దిబ్బపాలెం, ఏదురువానిపాలెం కాలనీల్లో శ్రీ పైడిమాంబ అనుపు జాతరలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రేపు అభయాంజనేయస్వామి...

రిక్షాకాలనీ(గాజువాక), న్యూస్‌టుడే : గాజువాక 76వ వార్డు రిక్షాకాలనీలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యుడు దేనిశెట్టి చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం పరస, తెదేపా నాయకుడు కాతా బాలకృష్ణ ఆర్థిక సాయంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మానవత సేవలు విస్తృతం

శ్రామికనగర్ (గాజువాక): రాజకీయాలకు అతీతంగా మానవత సంస్థ సేవలను విస్తృత పరుస్తున్నట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం గాజువాకలో సామాజిక సేవలో భాగంగా దివ్యాంగులకు వీల్ ఛైర్స్ అందజేశారు. గాజువాక అధ్యక్ష కార్యదర్శులు బలవాడ సత్యారావు, గుండ్రెడ్డి లక్ష్మి, డైరెక్టర్ సుబ్బరాజు, జిల్లా అధ్యక్షుడు దీనం కొండ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గొయ్యి... చూసి అడుగెయ్యి !

దర్పణం

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక శివాలయం నుంచి యూనియన్ బ్యాంకుకు వెళ్లే అనుసంధాన మార్గంలో కల్వర్టు స్లాబు విరగడంతో గొయ్యి ఏర్పడింది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఆదమరిచి వెళితే ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉంది. జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కదలని మురుగు

ఫోకస్

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం మసీదు సమీప కాలువ శిథిలావస్థకు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలువ పాడవడంతో మురుగునీరు నిల్చిపోవడం, అటుగా వెళ్లే చిన్నపిల్లలు, వృద్ధులు ప్రమాదాలకు గురి కావడం జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువను అభివృద్ధి చేసి నీరు కిందకు పోయేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'రంగు'పడింది..

నేటి చిత్రం

కరాస, న్యూస్‌టుడే : కంచరపాలెం నుంచి ఊర్వశి కూడలి వైపునకు వెళ్లే బీఆర్టీఎస్ రహదారిలో వాహనాలు వేగంగా వెళ్లడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం దుర్గానగర్ ఎదురుగా ఉన్న బీఆర్టీఎస్ రహదారిని దాటుతూ ఒక యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలను కోల్పోయాడు. ఈ నేపథ్యంలో స్థానిక తెదేపా నేతలు చొరవ తీసుకొని బీఆర్టీఎస్ రహదారిలో మంగళవారం వేగనిరోధకాలకు తెల్లరంగులు వేయించారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛను పత్రాల అందజేత

అక్కయ్యపాలెం: ఇ.ఎస్.ఐ.సి. వ్యవస్థాపక దినోత్సవాన్ని నరసింహనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపప్రాంతీయ కార్యాలయం ఇన్‌ఛార్జి, డిప్యూటీ డైరెక్టర్ సౌమేంద్ర కుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.ఫణీంద్ర, ఇ.ఎస్.ఐ.సి. అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యాంప్రసాద్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇ.ఎస్.ఐ. పథకంతో సుదీర్ఘ అనుబంధం ఉన్న వారిని సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. వివిధ ప్రమాదాల్లో చనిపోయిన బీమా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పింఛను పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.దినేష్‌కుమార్, లఘు ఉద్యోగ భారతి కార్యదర్శి పవన్ జైస్వాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, బీఎంఎస్, ఐ.ఎన్.టి.యు.సి. నేతలు వి.నాగభూషణం, ఆర్.కె.వి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏడీ శ్యాంప్రసాద్, చిత్రంలో సౌమేంద్రకుమార్ తదితరులు

'వైకాపా నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించండి'

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డు తెదేపా సమావేశం మంగళవారం షీలానగర్ రామాలయం సమీపంలో జరిగింది. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు అలమండ రాజు మాట్లాడుతూ.. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడి వైకాపా నాయకులు దొరికిపోయి తప్పించుకునే ప్రయత్నం చేస్తుండడం బాధాకరమన్నారు. తప్పును ఒప్పుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైకాపా నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని రామాలయంలో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు ఎ.గోవిందరావు, వంకినేని జీవన్‌బాబు, రాజు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అయోడిన్ లోపంపై సర్వే

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల నుంచి అయోడిన్ లోపంపై సర్వే నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 6 నుంచి 12 సంవత్సరాలలోపు పిల్లల నుంచి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, వైద్య సిబ్బంది రత్నాలు, ఏఎన్ఎం భారతి, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయుల బృందం పాల్గొంది.

విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మనోహర్, చిత్రంలో ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ

ఎమ్మెల్యేల ఆట అదరహో...

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రజాప్రతినిధులకు మంగళవారం జరిగిన పలు క్రీడల్లో గాజువాక, పశ్చిమ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ చిత్రాలే ఇవి.. –న్యూస్‌టుడే, గాజువాక, గోపాలపట్నం

పారదర్శకంగా పథకాలు అందాలి

ఎన్ఏడీకూడలి : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, చంద్రనగర్, నాగేంద్రకాలనీ సచివాలయ సిబ్బందితో స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ వేర్వేరుగా మంగళవారం సమీక్ష నిర్వహించారు. అర్హులైనవారికి పారదర్శకంగా పథకాలు అందేలా చూడాలన్నారు.

వేతన బకాయిలు చెల్లించేలా కృషిచేయాలి

ఉక్కునగరం, న్యూస్‌టుడే : ఉక్కు ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించేలా కృషిచేయాలని రాష్ట్ర భాజపా మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామ్మూర్తి, ఉక్కు కార్మిక సంఘాల నాయకులు బి.కామేశ్వరరావు ఎస్.సత్యన్నారాయణ, శ్రీనివాస్‌లు రాష్ట్ర భాజపా అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌కు విన్నవించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉక్కు సమస్యలు నివేదించారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మాధవ్ తెలిపారు.

ఎల్అండ్‌టీ సహకారంతో ఉచిత శిక్షణ

సింధియా, న్యూస్‌టుడే: లార్సన్ అండ్ టుబ్రో సహకారంతో సెమ్స్‌లో ఉచిత సాంకేతిక శిక్షణ ఇస్తున్నట్లు సెమ్స్ సీవోవో, కమాండర్ (ఆర్) గోపీకృష్ణ శివ్వం తెలిపారు. 25 ఏళ్లలోపు ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులకు 45 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పన జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9948183865, 9948666052, 0891-2704010 ద్వారా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ డిపోల్లో సమయపాలన తప్పనిసరి

డీలర్లతో మాట్లాడుతున్న సహాయ సరఫరా అధికారిణి కల్యాణి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని రేషన్ డిపో డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా పౌరసరఫరాల అధికారులు సూచించారు. జేసీ విద్యాధరి ఆదేశాలతో డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు సూచనల మేరకు సహాయ సరఫరా అధికారులు కల్యాణి, శ్రీహరి తమ పరిధిలోని డీలర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరిచే ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అర్హులైన కార్డుదారులకు మాత్రమే సరకులు పంపిణీ చేయాలన్నారు. గత నెలలో అవకతవకలకు పాల్పడిన 61 మందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, వారిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందన్నారు.

వేతనాలు పెంచాలని డిమాండ్

నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘం సభ్యులు కె.పద్మావతి, బృందావతి, శ్రీదేవి, కోమలి, తులసి తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటకో దండం.. అడుగడుగునా గండం..!

పైపులైను గొయ్యి

చినగంట్యాడ (గాజువాక), న్యూస్‌టుడే : అక్షరాలా రూ. లక్షలు ఖర్చు చేశారు. నడక దారి అందుబాటులోకి వచ్చిందని పాదచారులు సంబరపడ్డారు. హాయిగా వెళ్లొచ్చనుకుంటే అడుగడుగునా గండాలు ఎదురవుతున్నాయి. ఆదమరిస్తే ప్రమాదాలు పలకరిస్తుంటాయి. ఈ పరిస్థితి మహా విశాఖ నగరపాలక సంస్థ గాజువాక జోనల్ కార్యాలయం రోడ్డులో కాలిబాటలో కనిపిస్తోంది.

గుండెల్లో గుబులు..: గాజువాక పోలీసుస్టేషన్ కూడలి నుంచి జగ్గుసెంటర్‌కు వెళ్లే 1.05 కిలోమీటర్ల వందడుగుల మార్గంలో కాలిబాటల పనులకు గతంలో రూ.25 లక్షల నిధులు మంజూరు చేశారు. ఇటు గంగవరం పోర్టు, ఆటోనగర్, స్టీల్‌ప్లాంటు నుంచి లోడింగ్, అన్‌లోడింగ్‌కు వెళ్లే భారీ వాహనాలు, ఉక్కు ఉద్యోగులు, వందలాది కార్మికులు ఈ దారినే వినియోగించుకుంటారు. దారికి ఇరువైపులా జోనల్ కార్యాలయం, కోర్టు సముదాయం, పీహెచ్‌సీ, తహసిల్దార్ కార్యాలయం, సబ్‌స్టేషన్, పలు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలతో నిత్యం ట్రాఫిక్‌తో కిక్కిరిసి ఉంటోంది. విశాలమైన కాలిబాటలు అందుబాటులోకి తెచ్చినా అవి నిరుపయోగమయ్యాయి. సిమెంటు పలకలు ఊడిపోయి, గుంతలు పడిపోయి ఇటీవల వర్షాలకు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, గుబురు చెట్లతో ఇబ్బందికరంగా మారాయి.

★ గత ఏడాది డిసెంబర్లో కాలిబాటలను పునరుద్ధరిస్తామంటూ జోనల్ ఇంజినీరింగ్ అధికారులు హామీ ఇచ్చారు. వీటిని పరిశీలించి అంచనాలు రూపొందించి మిన్నకున్నారే తప్పా ఇటు కన్నెత్తయినా చూడడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తాగునీటి పైపులైను మెయిన్‌వాల్వు ఫుట్‌పాత్ మధ్యలో ఉంది. దీంతో జీవీఎంసీ సిబ్బంది గొయ్యి తవ్వి వదిలేశారు. ఎవరైనా స్థానికేతరులు ఫుట్‌పాత్‌లేక దాని ముందుకు అడుగేశారో పగిలిన గుంతల్లో పడి గాయాల పాలుగాక తప్పడం లేదు. ఈ పరిస్థితిపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి వివరణ కోరగా.. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి వినియోగానికి తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

నడక దారిపై స్తంభాలు

'సారథి'పై కమిషనర్ సమీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అమలు చేస్తున్న 'సారథి' ప్రాజెక్టుపై కమిషనర్ కేతన్‌గార్గ్ సమీక్ష నిర్వహించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరంలోని 90 కూడళ్లలో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకొస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టు టెండర్లపై కమిషనర్ ఆరా తీశారు. ముగ్గురు బిడ్డర్లు టెండరు దాఖలు చేసి, ప్రాథమికంగా అర్హత సాధించారని కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు వివరించారు. టెండర్లలో పాల్గొన్న వారికి మూడు కూడళ్ల బాధ్యతలు అప్పగించి, నిర్వహణ తీరును పరిశీలిస్తామని పేర్కొన్నారు. సమీక్షలో అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, స్మార్ట్ సిటీ అధికారి కేవీఎన్.రవి, ప్రధాన ఇంజినీర్ పీవీవీ.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

మాధవధార: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మంగళవారం విశాఖపట్నంలోని జాతీయ రహదారి పంజాబ్ హోటల్ వద్ద చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రాంతానికి చెందిన బొంగు పైడినాయుడు (51) నగరంలో గత కొన్నేళ్లుగా షీలానగర్ వెంకటేశ్వరకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. నేవీలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం కెనరా బ్యాంకు సీతమ్మధార బ్రాంచిలో పని చేస్తున్నారు. మంగళవారం ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తుండగా పంజాబ్ హోటల్ జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద హనుమంతవాక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. [illegible]

అయిదు గంటల పాటు పైలపేటలోనే సీఎం

28న చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌ ఖరారు

గరివిడి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 28న చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీ పైలపేటలో పర్యటించనున్నారు. మొత్తంగా అయిదు గంటలపాటు గ్రామంలో గడపనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం విడుదల చేసింది.

9:30 ఉదయం ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో సీఎం బయలు దేరుతారు.

11:00 చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీ పైలపేట హెలీప్యాడ్‌ వద్దకు చేరుకుంటారు.

11:10 ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు.

11:20 రోడ్డు మార్గంలో పైలపేటలోని ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు.

మధ్యాహ్నం 1:30 వరకు ప్రజా వేదికలో స్థానికులతో ముఖాముఖి నిర్వహిస్తారు.

1:40 ఎన్టీఆర్‌ భరోసా పింఛన్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడతారు.

2:25 లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు.

2:30 పార్టీ శ్రేణులతో సమావేశం

4:10 హెలికాప్టర్‌లో ఉండవల్లికి తిరుగు ప్రయాణం.

ఏర్పాట్లు పరిశీలించిన సీఎంవో అధికారి

వివరాలు తెలుసుకుంటున్న అధికారి ధనుష్‌

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో సీఎంవో కార్యాలయాధికారి ధనుష్‌.. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం రావివలస పంచాయతీ పైలపేట గ్రామంలో పర్యటించారు. ప్రజావేదిక చదును పనులపై పలు సూచనలు చేశారు. సర్పంచి పనన మణికంఠ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు పైల త్రినాథ్‌తో పలు అంశాలపై మాట్లాడారు. అంతకుముందు జేసీ సేధుమాధవన్‌ తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తదితరులతో పర్యటన వివరాలపై చర్చించారు. తెదేపా పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో మల్లికార్జునరావు, చీపురుపల్లి ఇన్‌ఛార్జి ఆర్డీవో ప్రమీలాగాంధీ, డీఎస్పీ రాఘవులు గ్రామాన్ని సందర్శించారు.

ఊపిరి నిలిపే సాయం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: శ్వాసకోశ రోగుల చికిత్స కోసం 'డాక్టర్స్‌ ఫర్‌ యూ' ఎన్జీవో సంస్థ మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సుమారు రూ.3 లక్షల విలువైన వైద్య పరికరాన్ని అందజేసింది. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ అల్లు పద్మజ మంగళవారం ప్రారంభించారు. రోగికి అవసరమైన ఆక్సిజన్‌, గాలిని కచ్చితమైన పరిమాణంలో ఇది అందిస్తుందని చెప్పారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు శ్రీరామ్‌ సుబ్రహ్మణ్యం, ఎ.దీపక్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పరికరం ప్రారంభ కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ పద్మజ, తదితరులు

రండి.. అవకాశాలు అందిపుచ్చుకుందాం..

జేఎన్‌టీయూ గురజాడ ఉద్యోగ పోర్టల్‌

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం ముందడుగు వేసింది. ఎక్కడైనా పనిచేయాలన్న తపన ఉన్న వారికి కొలువులు కల్పించాలన్నదే లక్ష్యం. నిర్మాణ్‌ సంస్థతో కలిసి ఇందు కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో 'అపర్చ్యునిటీస్‌ పోర్టల్‌'ను ప్రారంభించింది. మంగళవారం నుంచే ఇది అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. పరిశ్రమ డిమాండ్లకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కోర్సులు నిర్వహిస్తారు. మంగళవారం విద్యాలయంలో సంబంధిత గోడప్రతులను జీవీ ఉపకులపతి ఆచార్య వి.వి.సుబ్బారావు, నిర్మాణ్‌ సంస్థ సీఈవో మయూర్‌ పట్నాల ఆవిష్కరించారు. రిజిస్ట్రార్‌ జి.జయసుమ, ప్రధానాచార్యుడు ఆర్‌.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీకృత వేదిక..: ఈ పోర్టల్‌ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. ఇందులో నమోదు చేసుకున్న దరఖాస్తులను నెలకోసారి పరిశీలించి, అవకాశాలు కల్పిస్తారు. ఎవరికైనా నైపుణ్యం తక్కువ ఉంటే, ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలిస్తారు. నమోదు కోసం https://uyopportunities.jntugv.edu.inను సంప్రదించాలి.

అర్హులు వీరే..: ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మసీ, బీటెక్‌, బిఫార్మసీ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీబీఎం, డిప్లొమా, ఐటీఐ అర్హతలు గలవారు సద్వినియోగం చేసుకోవచ్చు. ఉత్తీర్ణతతో సంబంధం లేకుండానే అవకాశాలు కల్పిస్తారు. విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గించి, పరిశ్రమ సహకారాన్ని పెంపొందించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వీసీ సుబ్బారావు తెలిపారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూజీవీ, నిర్మాణ్‌ సంస్థ ప్రతినిధులు

ఆర్టీసీ బస్సులో పొగలు

ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఉన్నట్టుండి పొగలు వచ్చిన ఘటన రేగిడి మండలం సంకిలి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. జాతర నేపథ్యంలో రాజాం నుంచి పాలకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో 50 మంది వరకు ప్రయాణికులున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సంకిలి వద్దకు చేరిన బస్సు ముందుభాగంలో ఉన్నట్టుండి పొగలు రావడంతో చోదకుడు వాహనాన్ని ఆపేశారు. స్థానికుల సాయంతో నీళ్లు పోయడంతో పొగలు ఆగాయి. ప్రయాణికులను మరో బస్సులో పాలకొండ తరలించారు. బ్యాటరీ వద్ద సాంకేతిక సమస్యతో పొగలు వచ్చినట్లు భావిస్తున్నట్లు పాలకొండ డిపో మేనేజర్‌ వెంకటేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, రేగిడి

పైడితల్లి జాతరలో నకిలీ వీఐపీ పాస్‌లు?

● 2 గంటల పాటు దర్శనాలకు అంతరాయం

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన వీఐపీ పాస్‌ దర్శనాలను అధికారులు మంగళవారం ఉదయం నిలిపివేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టణంలోని ఓ షాపింగ్‌మాల్‌ పేరిట పబ్లిసిటీ కోసం పాస్‌లు ముద్రించి పంపిణీ చేశారు. ఉదయం వందలాదిమంది ఇవి పట్టుకుని రావడంతో రూ.100 దర్శనం లైన్‌ ఖాళీ అయ్యింది. దీంతో అప్రమత్తమైన దేవాదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు సుమారు రెండు గంటల పాటు వీఐపీ దర్శనాలు నిలిపివేశారు. పాస్‌లలో కొన్ని నకిలీవి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆలయం వద్ద కొంత గందరగోళం ఏర్పడింది. విషయం ఈవో మాధవరావు వద్ద ప్రస్తావించగా.. ఇంత పెద్ద మొత్తంలో ఇచ్చినట్లు తమకు తెలియదని, వాస్తవంగా వీఐపీ పాస్‌లకు స్టాంపులు వేసి ఇచ్చామని, లేనివి పెద్దమొత్తంలో రావడంతో దర్శనం నిలుపుదల చేశామన్నారు. అనంతరం స్టాంపులు ఉన్నవారికి మాత్రమే అమ్మవారి దర్శనం కల్పించామని ఆయన చెప్పారు.

రైతేరాజు 6లో

జీవీ చిట్టిరాజు

సీఈవోగా మెప్మా పీడీ చిట్టిరాజు : విజయనగరం పట్టణం: మెప్మా పీడీ జీవీ చిట్టిరాజుకు సీఈవోగా పదోన్నతి లభించింది. జడ్పీ సీఈవో సత్యనారాయణ, డిప్యూటీ సీఈవో రామన్‌కు పదోన్నతి లభించింది. వీరిద్దరిదీ ప్రస్తుతం డీసీఈవో కేడర్‌.

ఐసీడీఎస్‌ పీడీగా బాలామణి: విజయనగరం అయ్యన్నపేట: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత జిల్లా అధికారిణిగా కేవీ బాలామణి(పూర్తి అదనపు బాధ్యతలు)ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో ఏసీడీపీవోగా పనిచేస్తున్న ఈమె పదోన్నతిపై ఇక్కడకు రానున్నారు.



బీసీ కార్పొరేషన్‌ ఈడీగా పెంటోజీరావు: విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: బీసీ కార్పొరేషన్‌ విజయనగరం ఈడీగా పెంటోజీరావు నియమితులయ్యారు. 60 ఏళ్ల వయసు పూర్తి కావడంతో గతేడాది నవంబరులో పోస్టును వదిలేశారు. కార్పొరేషన్లలోనూ ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో పెంటోజీరావు తిరిగి విధుల్లో చేరారు.

పవన్‌ సారూ.. మా గ్రామానికి రోడ్డు వేయించరూ!

ఉప ముఖ్యమంత్రికి గిరిజన విద్యార్థుల వేడుకోలు

'గ్రామానికి 12 కి.మీ. దూరంలో ఉన్న పాఠశాలకు రహదారి సదుపాయం లేదు. దారంతా కొండలు, గుట్టలు, రాళ్లే ఉన్నాయి. ఎండైనా.. వానైనా.. ఇబ్బంది పడుతూ నడుచుకుంటూనే రోజూ వెళ్తున్నాం. మా గ్రామానికి రహదారి నిర్మించరూ...' అంటూ ఎస్‌.కోట మండలంలోని గిరిశిఖర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉపముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌ను వేడుకున్నారు. దారపర్తి పంచాయతీ శివారు రాయపాలెం, మునుపురాయి, చప్పనిగడ్డ, విప్పమానువలస, పల్లపుదుంగాడ గిరిజన గ్రామాలకు చెందిన విద్యార్థులు మంగళవారం పాఠశాలకు వెళ్తూ మార్గమధ్యలో కోతకు గురైన రోడ్డు వద్ద పవన్‌ చిత్రాలను పట్టుకుని నినాదాలు చేశారు. సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక మీ దృష్టికి తీసుకొస్తున్నామంటూ వేడుకున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో సోమవారం చక్కర్లు కొట్టింది.

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

పీఎంశ్రీ పాఠశాలల నోడల్‌ అధికారిగా నీరజ్‌కుమార్‌

కలెక్టర్‌తో నీరజ్‌కుమార్‌

జిల్లాలో ఉన్న పీఎంశ్రీ పాఠశాలలకు నోడల్‌ అధికారిగా నీరజ్‌కుమార్‌ గయాగి నియమితులయ్యారు. మంగళవారం ఆయన జిల్లాకు వచ్చారు. ముందుగా కలెక్టరేట్‌ సమావేశమందిరంలో ఆయా పాఠశాలల ప్రధానాచార్యులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్‌ ఎస్‌.రాంసుందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని డీఈవో యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా ఏపీసీ రామారావు తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

పబ్లిక్‌ నోటీసు

నా క్లయింట్‌ ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, నాగరిపాలెం గ్రామంలో ఉన్న Sy.No.11/7Bలోని Ac. 2.89Cts, Sy.No. 11/5లోని Ac. 0.16Cts, Sy.No.12/1 లోని Ac.0.04Ctsతో సహా మొత్తం 3.09cts వ్యవసాయ భూమిని కొనుగోలు చేయాలను కుంటున్నారు. ఉత్తరం: అవంతి ఇంజనీరింగ్‌ కళాశాల కాంపౌండ్‌ వాల్‌ & పొరుగువారి భూమి, దక్షిణం: అవంతి ఇంజనీరింగ్‌ కళాశాల కాంపౌండ్‌ వాల్‌ & పొరుగువారి భూమి, తూర్పు: అవంతి కళాశాల ఇంజనీరింగ్‌ కళాశాల కాంపౌండ్‌ వాల్‌, పశ్చిమం: నేషనల్‌ హైవే దాని యజమానులు మరియు యజమానులు శ్రీమతి యెనిగల్ల ఉమా రాణి W/o.Sri Y.G.K.మూర్తి, R/o.H.No. 48-18-66, తులసిపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్‌ నుండి అమ్మకానికి ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు తేదీ: 12-02-2026 తేదీ నాటికి అమ్మకానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి(లు) సదరు ఆస్తిపై ఏదైనా హక్కు, టైటిల్‌ క్లెయిమ్‌, ఆసక్తి కలిగి ఉంటే, వారి పబ్లిక్‌ నోటీసు తేదీ నుండి పదిహేను రోజులలోపు వారి హక్కు, టైటిల్‌, క్లెయిమ్‌ లేదా ఆసక్తిని దానికి మద్దతుగా ఉన్న అన్ని డాక్యుమెంటరీ ఆధారాలతో కింద సంతకం చేసిన వ్యక్తికి తెలియజేయవచ్చు, సదరు తేదీ నాటికి ఎటువంటి అభ్యంతరాలు అందకపోతే, నా క్లయింట్లు పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించిన అవసరమైన పత్రాల అమలు మరియు నమోదును కొనసాగిస్తారు మరియు ఆ తర్వాత వచ్చిన ఏవైనా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోరు.

Sd/- ఎన్‌. వెంకటేశ్వర రావు, వి.నంద కిషోర్‌, Ch. సోనియా
అడ్వకేట్స్‌ & అసోసియేట్స్‌
#304, ఆషియానా అపార్ట్మెంట్స్‌, ఆనంద్‌ నగర్‌ కాలనీ, ఖైరతాబాద్‌,
హైదరాబాద్‌-500 004, Ph.9912111249, ఇమెయిల్‌: nlvraoin@gmail.com

(c) eenadu

మనసు పరవశించె.. తనువు పులకించె

జిల్లాలో జాతర సందడిలో భక్తజనం

పోలిపల్లి పైడితల్లి దర్శనానికి వచ్చిన భక్తులు

కనకమహాలక్ష్మి దేవస్థానం ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద పూజలు

చీపురుపల్లి, రాజాం పట్టణం, కంబర(మక్కువ), న్యూస్‌టుడే: చీపురుపల్లి కనకమహాలక్ష్మి, రాజాం పోలిపల్లి పైడితల్లి జాతరలో మంగళవారం చివరి రోజు భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఘటోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం జాతర భక్తిశ్రద్ధల మధ్య సాగింది.

జామి ఎల్లారమ్మ జాతర

జామి, న్యూస్‌టుడే: జామి ఎల్లారమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి తల్లిని ఆవాహించిన పూజారులు గద్దె నుంచి బయలుదేరారు. జముకుల పాటలతో ఊరేగించారు. మంగళవారం జాతరకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 200 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అలంకరణలో ఎల్లారమ్మ

ఎల్లమ్మ సిరిమానోత్సవం

విజయనగరంలో ఎల్లమ్మ తల్లి పుట్ట

విజయనగరం కంటోన్మెంట్, గంట్యాడ (గ్రామీణం): విజయనగరం సంగీత కళాశాల ప్రాంగణంలోని ఎల్లమ్మ తల్లి సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. సాయంత్రం సిరిమాను ఉత్సవం చేపట్టారు. పూజారి శ్రీనివాస్ తేజ సిరిమాను ఎక్కి కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తదితరులు తల్లిని దర్శించుకున్నారు. ★ బుడతనాపల్లి ఎల్లారమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బి. రాజేరు నుంచి చినమానాపురం కూడలి వరకు జనసంద్రంగా మారింది. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

తండ్రి స్ఫూర్తి.. తనయుల కీర్తి

వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో ప్రతిభ



బరువు ఎత్తుతున్న అజయ్‌బాబు

కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరు శ్రీనివాసరావు ఆర్మీలో సుబేదార్ కేడర్‌లో పని చేస్తూ 2024లో ఉద్యోగ విరమణ పొందారు. ఈయన వెయిట్‌లిఫ్టింగ్ క్రీడపై ఆసక్తితో చిన్న తనం నుంచి శిక్షణ తీసుకుని రాణించారు. 2010లో ఢిల్లీలో నిర్వహించిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో కాంస్యం సాధించారు. మరిన్ని పోటీల్లోనూ పతకాలు సాధించారు. క్రీడ ప్రతిభతో అప్పట్లో ఇండియన్ ఆర్మీలో కొలువు సాధించారు. ఆయన స్ఫూర్తితో కుమారులు అజయ్ బాబు, అఖిల్‌లు విద్యార్థి దశ నుంచే వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచారు. స్థానికంగానే చదువుతూ ఈ క్రీడలో శిక్షణ తీసుకుని సత్తాచాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి పతకాలు సాధిస్తున్నారు.

తండ్రి స్ఫూర్తితో క్రీడల్లో రాణిస్తున్నారు.. ఆయన సూచనలతో శిక్షణలో రాటుదేలుతున్నారు.. ఆయన లక్ష్య నిర్దేశంతో జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్నారు.. పతకాల వేటలో నాన్నను మురిపిస్తున్నారు.. వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాల పంట పండిస్తున్నారు నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన వల్లూరు అజయ్‌బాబు, అఖిల్. – న్యూస్‌టుడే, జరజాపుపేట(నెల్లిమర్ల)

అన్న అడుగుజాడల్లో..

తండ్రి, అన్న చెబుతున్న మెలకువలు పాటిస్తూ.. శిక్షణలో రాటుదేలుతున్నాడు అఖిల్. రాష్ట్ర స్థాయి వరకు వివిధ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించాడు. జాతీయస్థాయిలో రాణించడమే లక్ష్యంగా దృష్టి సారించాడు. తల్లి వెంకటలక్ష్మి గృహిణిగా బాధ్యతలు నిర్వహిస్తూ.. వీరికి ప్రోత్సాహం అందిస్తున్నారు.

గర్వంగా ఉంది..

తనలాగే కుమారులిద్దరూ ఈ క్రీడలో రాణిస్తూ.. పతకాలు సాధించడం గర్వంగా ఉంది. దేశం కీర్తిని ఇనుమడింపచేయడం ఆనందాన్నిస్తోంది. – వి.శ్రీనివాసరావు, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు

విజయం 'అజేయ'o..

కామన్‌వెల్త్, ఏషియన్ గేమ్స్‌లో పతకాలే లక్ష్యంగా అజయ్ తీవ్ర సాధన చేస్తున్నాడు. గతేడాది నవంబరులో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన సీనియర్ కామన్‌వెల్త్ పోటీల్లో 79 కిలోల కేటగిరీలో 152 కిలోల స్నాచ్, 183 కిలోల క్లీన్ అండ్ జర్క్ కలిపి 355 కిలోల బరువును ఎత్తి స్వర్ణం సాధించాడు. ★ 2023లో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగిన జూనియర్ కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం సాధించాడు. ★ 2024లో ఫిజి దేశంలో నిర్వహించిన సీనియర్ కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లోనూ బంగారు పతకం అందుకున్నాడు. జాతీయస్థాయిలో ఆరు స్వర్ణాలు, రెండు రజత, రెండు కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. ప్రస్తుతం ఇండియన్ ఆర్మీలో హవాల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అజయ్ ప్రస్తుతం అహ్మదాబాద్‌లో వెయిట్‌లిఫ్టింగ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో పంజాబ్ పటియాలా తరపున అంతర్జాతీయ క్రీడలో ఆడేందుకు శిక్షణ తీసుకుంటున్నాడు.

తండ్రి శ్రీనివాసరావు, తల్లితో కుమారులు అజయ్, అఖిల్

అంటుకట్టు సాగు.. దిగుబడులు బాగు

ఈ విధానంలో పండిస్తే.. హెక్టారుకు రూ.24వేల రాయితీ

అంటుకట్టిన టమాటా మొక్క

రేగిడి, న్యూస్‌టుడే: ఏ పంటకైనా దిగుబడే ప్రామాణికం. కూరగాయల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే అంటుమొక్కల విధానమే మేలు. తొలినాళ్లలో దేశవాళీ విత్తనాలు, ఆ తర్వాత సంకరజాతి విత్తనాలు వేసి రైతులు సాగుచేపట్టేవారు. అంటుకట్టిన సాగు విధానం కూరగాయల రైతులకు లాభసాటిగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వ రాయితీ...

గత రెండేళ్లుగా అంటుకట్టు కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు గతంలో రాయితీగా హెక్టారుకు రూ.20వేలు అందించేది. తాజాగా ఈ ఏడాది దీన్ని రూ.24వేలకు పెంచింది. మిగతా కూరగాయల విషయంలో రాయితీని ఒక్కసీజన్‌కు పరిమితం చేయగా అంటుమొక్కల విధానానికి అన్ని సీజన్లలోనూ రైతులకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వంగ, టమాటా, మిరప వంటి పంటలకు ఇది మేలు. సాధారణ సాగులో మూడునెలల్లో కాపు అంతరిస్తే.. ఈ పద్ధతితో 6నెలలు అంతకంటే ఎక్కువ కాలం దిగుబడి వస్తుంది. కాయల నాణ్యత, బరువు ఎక్కువగా ఉంటుంది.

ఎకరాకు 4వేల మొక్కలు..

అంటుకట్టు విధానంలో మొక్కలు ఎకరాకు సుమారు 3500 నుంచి 4000 వరకు మొక్కలు అవసరం అవుతాయి. ప్రస్తుతం అంటుమొక్క ఖరీదు రూ.12 వరకు ఉంది. అంటే ఎకరాకు పెట్టుబడి రూ.48,000 ఉంటుంది. ఉదాహరణకు సాధారణ పద్ధతిలో టమాటా ఎకరాకు 20 నుంచి 27 టన్నుల వరకు దిగుబడి వస్తే ఇందులో 50 టన్నుల నుంచి 65టన్నుల వరకు వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి ఈ మొక్కలకు ఉంటుంది.

రైతులు ముందుకు రావాలి

ఈ విధానంలో సాగుకు రైతులు ముందుకు రావాలి. క్షేత్రస్థాయిలో మా అధికారులు అన్ని విధాలా అవగాహన కల్పిస్తారు. ఈ ఏడాది వీటి సాగు విస్తీర్ణం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. –బి.చిట్టిబాబు,డీడీ, ఉద్యాన శాఖ

ఆకుమచ్చ అరికట్టాలంటే..!

కొబ్బరితోటల్లో ఆకుమచ్చ తెగులు వ్యాప్తిస్తే.. పంట దిగుబడి తగ్గుతుంది. తోటలకు సరైన పోషకాలు అందకపోవడం, పొటాషియం, సల్ఫర్, జింక్ ధాతు లోపాల కారణంగా తెగులు వస్తుందని రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డా.[illegible] తెలిపారు. నివారణ చర్యలు వివరించారు. సాధారణంగా ఎకరాకు 60 మొక్కలు నాటుకోవాలి. కొంతమంది రైతులు 70, 80 వరకు నాటడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొక్కల మధ్య దూరం తగ్గడం వల్ల సూర్యరశ్మి సరిగా తగలదు. అంతర పంటలు వేసే సమయంలో ఈ తెగులుపై దృష్టి సారించాలి. ఇది సోకిన చెట్ల ఆకులపై పాము పొడలాంటి మచ్చలు ఏర్పడి క్రమంగా పెద్దవి కావడంతో పూర్తిగా ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటిలో హెగ్జాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ 2 మిల్లీలీటర్లు కలిపి ఆకులపై పిచికారీ చేయాలి. తెగులు సోకిన ఆకులను సేకరించి కాల్చేయాలి. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

రైతేరాజు

ప్లాస్టిక్ షీట్‌తో నీటి కుంటలకు రక్షణ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పంటలకు అత్యవసర తడులు అందించి రక్షణగా నిలిచే చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు నేల రకాలను బట్టి భూమిలో ఇంకిపోతాయి. వీటి నివారణకు సిమెంటుతో లైనింగ్ వేస్తుంటారు. దీనికి ఖర్చు అధికం, మన్నిక తక్కువగా ఉంటుంది. నీటి కుంటలకు ప్లాస్టిక్ షీట్(ఫిల్మ్)తో లైనింగ్ వేసి నీరు ఇంకే నష్టాన్ని 98-100 శాతం అరికట్టవచ్చని విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త తేజేశ్వరరావు తెలిపారు.

- షీటు నలుపు లేదా నీలం రంగులో 250 మైక్రాన్ల మందం ఉంటుంది. ఇవి 7-9 మీటర్ల వెడల్పుతో లభిస్తాయి. ఒక కిలో 250 మైక్రాన్ల ఫిల్మ్ 4.2 చ.మీ విస్తీర్ణం కలిగి, కిలో రూ.275 ఉంటుంది.

ప్రయోజనాలు..:
- నీటిని భూమిలోకి ఇంకడాన్ని 100 శాతం తగ్గిస్తుంది. నీరు కుంటలో చాలా రోజులు నిల్వ ఉంటుంది.
- ఇసుకతో కూడిన గరపనేల ప్రాంతాల్లో ఇవి చాలా ఉపయోగంగా ఉంటాయి.
- ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటుంది. నిర్వహణ ఖర్చు తక్కువ. అధిక ఉష్ణోగ్రతలకు కాస్తుంది. కాలుష్యం ఉండదు.

లైనింగ్ వేసే విధానం...: తొలుత కుంటను అనుకున్న సైజులో నిర్మించాలి. కుంట లోతు, వాలు నిష్పత్తి 1:2.5 ఉండేటట్లు చూడాలి. కుంట అడుగు భాగంలో 5 సెం.మీ మందంలో ఇసుక పరచాలి. దీనిపై అగ్రిఫిల్మ్‌ను బిగుతుగా, అడుగు నుంచి పైకి పరచుకుంటూ రావాలి. కుంటపై నలువైపులా 30×30 సెం.మీ. షీటు గాడిలోకి వేసి మట్టితో కప్పాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

జీడి, మామిడి పూత, పిందె దశలో ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మంచు ప్రభావానికి పూత రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాల కోసం 87908 28484 నంబరును సంప్రదించాలని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు తెలిపారు.

వేసవిలో పశుపోషణలో మెలకువలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: వేసవిలో పశువులకు సరైన పోషణ అందించాలని కురుపాం పశుసంవర్ధకశాఖ ఏడీ **టి.శ్రీసంధ్య** తెలిపారు. రైతుల ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు.

ప్రశ్న: వేసవి కాలంలో పశువుల ఆహారంలో ఎలాంటి మార్పులు చేపట్టాలి? **- రాధాకృష్ణ, పాలెం**

సమాధానం: వేసవిలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచాలంటే మేత ద్వారా అందించే పోషణ ముఖ్యం. సాధారణంగా పశుగ్రాసం, దాణా 70:30 నిష్పత్తిలో అందించాలి. వేసవిలో పచ్చిమేత, దాణా లభ్యత పరిమితంగా ఉండి, ఎండుగడ్డి ఎక్కువగా ఉంటుంది. ఎండుగడ్డిలో పోషక విలువలు, జీర్ణక్రియ తక్కువగా ఉంటుంది. ఉదయం పచ్చగడ్డి, రాత్రి ఎండుగడ్డి ఇవ్వాలి. అధిక పాలనిచ్చే పశువులకు దాణా నీటితో కలిపి రాత్రి, తెల్లారక ముందే ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు దాణాలో కలిపి శనక్కాయ కట్టలు పెట్టడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది.

ప్రశ్న: వేసవిలో పశువులకు ఎంత నీరు అందించాలి? **- మిన్నారావు, జోగులదుమ్మ**

సమాధానం: వేసవిలో వేడి వాతావరణం పశువుల శరీర ఉష్ణోగ్రత పెరుగుదలకు కారణమవుతుంది. అప్పుడు అవి ఎక్కువగా చెమట, మూత్రంతో నీటిని నష్టపోతాయి. ప్రతి పశువుకూ రోజుకు సుమారు 20-25 లీటర్ల నీరు అవసరం. ఎప్పటికప్పుడు శుద్ధమైనది అందించడం మంచిది. తక్కువ నీరు తీసుకున్న పశువులు రోగాలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ నిపుణులు కీలకం

మాట్లాడుతున్న విశాఖ పోలీస్ కమిషనరు శంఖబ్రత బాగ్చీ

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: శాస్త్రీయ నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారని విశాఖపట్నం పోలీస్ కమిషనరు శంఖబ్రత బాగ్చీ అన్నారు. మంగళవారం టెక్కలి సమీపంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ అండ్ మూట్ కోర్ట్ కాంపిటేషన్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో సైబర్, ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేర నిరూపణ, సాక్ష్యాలు సేకరించడంలో ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రశాంత్‌కుమార్, డీన్ రవికుమార్, వైద్యులు నాగ జోగయ్య, ఆశిష్, సౌమ్య పాల్గొన్నారు.

గురుకులం ప్రవేశపరీక్ష తేదీ మార్పు

వేపాడ: ఉమ్మడి విజయనగరం జిల్లాలో అంబేడ్కర్ గురుకులాల్లో ఆరు నుంచి పది తరగతుల ప్రవేశపరీక్ష తేదీలో మార్పు చేసినట్లు జిల్లా సమన్వయకర్త మాణిక్యం మంగళవారం తెలిపారు. మార్చి 2న జరగాల్సిన పరీక్షను అదే నెల 8కి మార్చినట్లు చెప్పారు. అయిదు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్షలు మార్చి ఒకటిన జరుగుతాయన్నారు.

ప్రారంభించకముందే ఆటో చోరీ

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్త ఆటో కొన్న ఆనందాన్ని ఆ చోదకుడు ఇంకా అనుభవించకుండానే వాహనాన్ని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం రెల్లికాలనీలో చోటుచేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. బంగారి అప్పలరాజు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్య కుమారి డ్వాక్రా రుణం రూ.2 లక్షలు, తాను దాచుకున్న సొమ్ము కలిపి రూ.3.18 లక్షలతో ఈ నెల 5న ఆటో కొనుగోలు చేశాడు. దీన్ని ఇంటి దగ్గర భద్రపర్చాడు. ఉదయం వాహనం కనిపించలేదు. నిన్న అర్ధరాత్రి 2.05 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి వాహనాన్ని గండిగుండం వైపు తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో ఆధారాలు లభ్యమయ్యాయి. దర్యాప్తు చేస్తున్నామని, నిందితుల్ని పట్టుకుంటామని సీఐ వివరించారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా సత్తిబాబు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ విభాగంలో పలువురు తహసీల్దార్లకు ఉప కలెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. వీరికి మంగళవారం స్థానాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి కొందరు బదిలీ, పదోన్నతిపై ఇక్కడకు రానున్నారు. డీఆర్వోగా సి. హెచ్. సత్తిబాబు నియమితులయ్యారు. విశాఖలో గృహ నిర్మాణ శాఖ పీడీగా పనిచేస్తున్న ఆయన ఇక్కడకు వస్తున్నారు. గతంలో డీఆర్వోగా పనిచేసిన శ్రీనివాస మూర్తి పదవీ విరమణ తర్వాత ఆ పోస్టు ఖాళీగా ఉంది. కేఆర్‌సీసీ ఉప కలెక్టర్ ఇ. మురళీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. మన్యం జిల్లా డీఆర్‌డీఏ పీడీ సుధారాణి చీపురుపల్లి ఆర్డీవోగా నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తహసీల్దారు కె.రాములు తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు యూనిట్- 2(చీపురుపల్లి విభాగం) ఎస్‌డీసీగా నియమితులయ్యారు.

పోస్టుల కేటాయింపు..

అయిదుగురు తహసీల్దార్లకు ఉప కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టులు కేటాయించారు. వీరిలో ఇద్దరు కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు కాగా, మిగిలిన ముగ్గురు మండలాల్లో పనిచేస్తున్నారు. కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకుడు టి.గోవింద విశాఖలోని ప్రకృతి విపత్తుల యాజమాన్యం విభాగం డీపీఎంగా వెళ్లనున్నారు. సాలూరు మండల అధికారి బొండాడ నీలకంఠరావు అల్లూరి సీతారామరాజు జిల్లా కేఆర్‌సీసీ విభాగానికి ఉప కలెక్టర్‌గా, గజపతినగరం తహసీల్దారు బి.రత్నకుమార్ ఏపీ సీఆర్‌డీఏ ఎస్‌డీసీగా, మెంటాడ అధికారిణి మరడాన అరుణకుమారి విజయనగరం పౌరసరఫరాల కార్పొరేషన్ విజిలెన్స్ విభాగానికి డిప్యూటీ కలెక్టర్‌గా, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకురాలు వి.పద్మావతి ఏపీ సీఆర్‌డీఏ ఎస్‌డీసీగా నియమితులయ్యారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591)
మెలొడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం. ఫోన్: 8332956773

హైపోథికేషన్ క్రింద స్వాధీనత ప్రకటన (చరాస్తి కొరకు)

కెనరా బ్యాంక్, ARM విశాఖపట్నం బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు హైపోథికేషన్ ఒప్పందం ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత : M/s. పర్ఫెక్ట్ బైండ్స్, ప్రొప్రయిటర్ : శ్రీమతి మిడతాన పావని మరియు శ్రీమతి మిడతాన పావని & హామీదారు : శ్రీ చిటిమిరెడ్డి మహేష్ వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము రూ.98,25,179.16/- (అక్షరాల తొంభై ఎనిమిది లక్షల ఇరవై ఐదు వేల నూట డెబ్బై తొమ్మిది రూపాయల పదహారు పైసలు మాత్రమే) ఈ నోటీస్ అందిన తేది నుండి 15 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది 17.01.2026 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, మీరు/ మీ కంపెనీ/ సంస్థ/ LLP ద్వారా మా బ్యాంక్ ఒప్పంద ప్రకారం తేది 16.05.2018 నాటి హైపోథికేషన్ ఒప్పందం/ ఋణ ఒప్పందం పరంగా దాని హక్కును వినియోగించుకుని, ఈ దిగువ ఆస్తిని సంతకందారు అధికారి తేది. 21.02.2026 న భౌతికంగా స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీత మరియు యావన్మంది ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత మరియు యావన్మంది ప్రజానీకమునకు హైపోథికేటెడ్ వాహనం/ P&M/ స్టాక్‌తో వ్యవహరించవద్దని మరియు చరాస్తులతో జరిగే ఏవైనా లావాదేవీలు అయిన కెనరా బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి రూ.99,63,411.32/- (అక్షరాల తొంభై తొమ్మిది లక్షల అరవై మూడు వేల నాలుగు వందల పదకొండు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే) + వడ్డీ మొత్తమునకు లోబడివుంటాయి (హైపోథికేషన్/ప్లెడ్జ్). ఈ నోటీసు తేదీ నుండి 15 రోజులలోపు ఋణగ్రహీతలు హైపోథికేటెడ్ ఆస్తులను తిరిగి పొందవచ్చని దయచేసి గమనించండి.

హైపోథికేటెడ్ వాహనం/P&M/స్టాక్ యొక్క వివరములు: (హైపోథికేటెడ్ ఆస్తుల షెడ్యూల్)
P&M/Stock యొక్క వివరములు : విజయనగరం జిల్లా, కొత్తవలస, శ్రీ వాసవి టైల్ వర్క్స్ & పోలీస్ స్టేషన్ దగ్గర M/s. పర్ఫెక్ట్ బైండ్స్ పేరున ఉన్న మెషినరీ.

Sl No.	Name of Item	Unit	Amount at the time Sanction/ Last Stock Statement
1.	Double Colour Printer	01	18,98,388/-
2	Mega bond Pinter	02	6,46,758/-
3	Stitching machine	01	58,516/-
4	Heat Sealing Machine	01	70,835/-
5	Mega Bound	01	9,33,179/-
6	L Sealer with shrink tunnel machine	01	1,83,556/-
7	Hydraulic Press	01	4,04,069/-
	TOTAL		41,95,302/-

Remark if any : As per Valuation report dt 08.04.2025.

తేది : 21.02.2026
ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి
కెనరా బ్యాంక్

బహిరంగ ప్రకటన (PUBLIC NOTICE)

ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం, తులసీపేట, ఇంటి నంబర్: 48-18-66 నివాసి అయిన నా క్లయింట్ శ్రీమతి యేనిగల్ల ఉమారాణి W/o శ్రీ వై.జి.కె. మూర్తి గారు నాకు ఇచ్చిన భోగట్టాపై సమస్తమైన వారలకు తెలియజేయునది యేమనగా: నా క్లయింటు తేదీ 16-02-2026న భీమునిపట్నం ఎం.ఆర్.ఓ (M.R.O) కార్యాలయం నుండి చిట్టివలసకు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ క్రింద పేర్కొన్న రిజిస్టర్డ్ క్రయ దస్తావేజులు పోగొట్టుకున్నారు. ఎంత వెతికినప్పటికీ ఆ దస్తావేజులు లభించలేదు. ఎవరికైనా సదరు డాక్యుమెంట్లు దొరికిన యెడల క్రింద పొందుపరిచిన ఎడ్రసునకు వెంటనే తెలయపరచగలరు.క్రింది తెలిపిన ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్, టైటిల్ డీడ్లు, మరియు లింక్ డాక్యుమెంట్ల ఆధారంగా చేసే ఎటువంటిలావాదేవీలైనా నా క్లయింట్కు గాని ఆమె తరఫున ఎవరైన ఎగ్రిమెంట్లుగాని, ఎవైనలావాదేవీలుగాని అవి చెల్లవని మరియు నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులుకాగలరని యావన్మందికి తెలియజేయుచున్నాము.

పోగొట్టుకున్న పత్రాల వివరాలు:

నెం.	తేదీ	వివరణ	డాక్యుమెంట్ నంబర్	ఎస్.ఆర్.ఓ (S.R.O)
1.	19-08-1980	ఒరిజినల్ సేల్ డీడ్	1978/1980	భీమునిపట్నం, విశాఖపట్నం
2.	29-05-1961	ఒరిజినల్ సేల్ డీడ్	1282/1961	భీమునిపట్నం, విశాఖపట్నం
3.	18-05-1959	ఒరిజినల్ సేల్ డీడ్	1006/1959	భీమునిపట్నం, విశాఖపట్నం
4.	19-05-1959	ఒరిజినల్ సేల్ డీడ్	1007/1959	భీమునిపట్నం, విశాఖపట్నం

షెడ్యూల్

ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, నాగరిపాలెం గ్రామంలో ఉన్న Sy.No.11/7Bలోని Ac. 2.89Cts, Sy.No. 11/5లోని Ac. 0.16Cts, Sy.No.12/1 లోని Ac.0.04Ctsతో సహా మొత్తం 3.09cts వ్యవసాయ భూమి హద్దులు: ఉత్తరం: అవంతి ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్ & పొరుగువారి భూమి, దక్షిణం: అవంతి ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్ & పొరుగువారి భూమి, తూర్పు: అవంతి కళాశాల ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ వాల్, పశ్చిమం: నేషనల్ హైవే

Sd/- S. ARUN DEV, Advocate
Flat No: GF A-2, Dolphin Apartments, Nethaji Street, Behind Hotel Taj, Maharanipeta, Visakhapatnam-2, 9848566903 (M)

సాయానికి వెళ్తే ప్రాణం పోయింది

భర్త కళ్లెదుటే..

గ్యాస్ మంటల్లో చిక్కుకొని వివాహిత దుర్మరణం

భవానీ (పాతచిత్రం)

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: పక్కింటి వాళ్ల గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ పెట్టమంటే సాయానికి వెళ్లిన ఓ వివాహితను మృత్యువు వెంటాడింది. రెగ్యులేటర్ సరిగా లేక గ్యాస్ సిలిండర్ నుంచి చెలరేగిన మంటల్లో చిక్కుకున్న ఆమె మృతిచెందారు. ఈ విషాదకర ఘటన విజయనగరంలో మంగళవారం చోటుచేసుకుంది.

నగరానికి చెందిన భవానీ(31)కి విజయవాడ వాసి ప్రభువుతో వివాహమైంది. పిల్లలు శ్యామ్, సంజయ్‌తో కలిసి స్థానికంగా ఉన్న హుకుంపేట సాయిబుల కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రభువు కారు చోదకుడు. మంగళవారం మధ్యాహ్నం పక్కింట్లో ఉన్న ఫాతిమా అనే మహిళ గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను అమర్చడానికి పిలిచారు. సరిగా బిగించకపోవడంతో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఫాతిమాను స్థానికులు బయటకు తీసుకురాగా.. తన ప్రాణాలను కాపాడుకునేందుకు భవానీ వంట గదిలో ఓ మూలకు వెళ్లి అక్కడే ఇరుక్కుపోవడంతో కాలిపోయారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేసరికే ప్రాణాలు కోల్పోయారు.

పిల్లలు 4, 5 తరగతులు చదువుతున్నారు. ఉదయం లేచి పాఠశాలకు వెళ్లిపోయారు. ప్రభువు ఇంటి వద్దే ఉన్నాడు. మంటలు రావడం, కేకలు వినిపించడంతో ఒక్కసారిగా పరుగు తీశాడు. స్థానికుల సాయంతో కాపాడేందుకు ప్రయత్నించినా.. ఫలితం దక్కలేదు. తన కళ్లెదుటే భార్య ప్రాణాలు కోల్పోవడంతో కన్నీరుమున్నీరయ్యాడు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన చిన్నారులు అమ్మ ఏదని అడగ్గా.. అక్కడున్నవారంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

అయ్యో.. అక్షిత

యువతి దుర్మరణంతో విషాదం

అక్షిత (పాత చిత్రం)

గజపతినగరం, న్యూస్‌టుడే: ఆమె మూడేళ్ల వయసులోనే తండ్రి మృతి. తల్లి అన్నీ తానై పెంచారు. అన్నయ్య.. నాన్నలా బాధ్యతలు చూసుకుంటూ ఆసరాగా నిలిచాడు. కష్టం విలువ తెలిసిన ఆమె.. విదేశాలకు వెళ్లి కుటుంబాన్ని ఉన్నతంగా చూసుకోవాలని ఆశ పడింది. లారీ రూపంలో మృత్యువు తనను కబళిస్తుందని ఊహించలేదు. రోడ్డు ప్రమాదంలో ఆమె మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదం నింపింది.

గజపతినగరానికి చెందిన కె.అక్షిత(22) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి రెండేళ్లుగా ఉద్యోగం చేస్తోంది. వారం కిందట ఇంటికి వచ్చిన ఆమె తనకు మలేషియాలో ఉద్యోగం వచ్చిందని కుటుంబ సభ్యులకు చెప్పింది. హైదరాబాద్ వెళ్లిన ఆమె ఆదివారం స్నేహితురాలి ఇంటి వద్ద ఉన్నారు. సోమవారం మెడికల్ ధ్రువపత్రాల కోసం ర్యాపిడో వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని సోమవారం రాత్రి విజయనగరం తీసుకువచ్చి, అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆమె మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

గడువులోగా రీసర్వే పూర్తిచేయాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో రీసర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈకేవైసీ, ఐవీఆర్ఎస్‌లో సంతృప్తి స్థాయిని పెంచడం, ప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. అంతకుముందు అమరావతి నుంచి సీసీఎల్ఏ ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి నిర్వహించిన దూరదృశ్య సమావేశంలో పాల్గొన్నారు.

పరిశోధన కార్యక్రమాలకు అండ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్య, పరిశోధన, పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు జేఎన్‌టీయూ జీవీ, ప్రభుత్వ వైద్య కళాశాలల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం జేఎన్‌టీయూజీవీ ఉపకులపతి వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధానాచారిణి, అదనపు వైద్య విద్య సంచాలకురాలు డా.బి.దేవిమాధవి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. విద్యార్థులకు శిక్షణ, సంయుక్త పరిశోధన కార్యక్రమాలు, శాస్త్రీయ సదస్సులు, శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని వీసీ వెల్లడించారు.

అభియోగాల ఉపసంహరణ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీసీహెచ్ఎస్‌గా, పీవోడీటీటీగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన డా.కె.ప్రభాకరరావుపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో చీపురుపల్లిలో పీవోడీటీటీగా పనిచేసిన సమయంలో ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణిని విచారణ అధికారిణిగా ప్రభుత్వం నియమించింది. ఆమె నివేదిక అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జీవోలో పేర్కొంది.

EENADU Classifieds

REPAIRS

TV REPAIR

భాస్కర్ ఎలక్ట్రానిక్ 32" LEDTV రూ.8,999/- 2సం||లు వారంటితో S.కోట నుండి 30కి||మీ||లోపు LEDTV ఇంటికి వచ్చి బాగు చేయబడును. C:8500188608.

JOBS

Haier Exclusive Service Centerలో M.S.ఆఫీస్ సాఫ్ట్ స్కిల్స్ అనుభవజ్ఞులైన Female కావలెను. VZM ✆ 9381973800.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైన స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315/- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

(c) eenadu

బొబ్బిలి
● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

? వాసవీనగర్ 3వ లైన్‌లో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దోమలు, దుర్వాసన బెడద అధికంగా ఉంది. **- స్థానికులు** ✦ మురుగు తొలగింపజేస్తాం. **- ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – రాజాం పట్టణం**

? సిరిపురంలో మంచినీటి పథకం ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. **- స్థానికులు** ✦ వృథాను అరికట్టి పూర్తిస్థాయిలో సరఫరా చేస్తాం. **- నానీబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ప్రహరీ నిర్మించారు
స్పందనకు వందనం

బొండపల్లి: దేవుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేక పరిసరాల్లో పశువులు, విషసర్పాల సంచారంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. దీనిపై వార్త ప్రచురితమవడంతో నిధులు రూ.35 లక్షలతో గోడ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

గోపాలరావుకు సూర్యకాంతం పురస్కారం

రాజాం: ప్రముఖ రంగస్థల కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు సహజ నటి సూర్యకాంతం పురస్కారాన్ని అందుకున్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పి.సత్యనారాయణ రాజు కళావేదిక వారి ఆధ్వర్యంలో మంగళవారం ఈ పురస్కారం ప్రదానం చేశారు.

అప్రమత్తతతోనే హెచ్‌ఐవీ దూరం
బొబ్బిలి, న్యూస్‌టుడే: అప్రమత్తతతోనే హెచ్‌ఐవీని నియంత్రించవచ్చని ఫైల్డ్ ఫౌండ్ ఇండియా లింక్ వర్కర్స్ సంస్థ జిల్లా ప్రబంధకుడు అప్పలనాయుడు అన్నారు. మంగళవారం బొబ్బిలిలోని ఎన్‌జీవో హోంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అయిదేళ్లుగా హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసీ రాజు దంపతులను సత్కరించారు.

● **నియోజకవర్గం:** రాజాం ● పంచాయతీలు: **123** ● రెవెన్యూ గ్రామాలు: **158** ● అనుబంధ గ్రామాలు: **217**

పథకాలు పూర్తిచేస్తాం.. పల్లెలకు తాగునీరిస్తాం
ముఖాముఖి

న్యూస్‌టుడే – రాజాం

రాజాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీరు **కడగల రాజేష్** తెలిపారు. ఉన్న నీటి పథకాలను చాలావరకు పూర్తి చేశామని, కొత్త వాటి పనులు చేసి, నీటిని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వివరించారు.

157 బోర్లు వినియోగంలోకి తీసుకొచ్చాం..
క్రాష్ ప్రోగ్రామ్ ఫిబ్రవరి 2న మొదలైంది. ఈనెల 25 వరకు కొనసాగుతుంది. ప్రతి గ్రామంలో బోరు, తాగునీటి పథకాన్ని పరిశీలించి, వినియోగంలో లేకపోతే వెంటనే మరమ్మతులు చేయడం దీని ఉద్దేశం. ఇప్పటివరకు 157 బోర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చాం.

ఎనిమిది మండలాల దాహార్తి తీర్చేలా
వాటర్ గ్రిడ్‌లో భాగంగా మద్దువలసను ప్రతిపాదించాం. రాజాం రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లోని ప్రతి ఇంటికీ నీటిని సరఫరా చేసేలా రూపకల్పన జరిగింది. రూ.830 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ◇ సమ్మతిస్తే వంగర మండలం మగ్గూరు వద్ద 35 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ◇ ప్లాంట్ నిర్మిస్తాం. దీనికి అనుబంధంగా 20 క్లస్టర్లలో ఓవర్‌హెడ్ బ్యాలెన్స్ రిజర్వాయర్లు (ఓహెచ్‌బీఆర్) అందుబాటులోకి వస్తాయి.

అందుబాటులోకి రానున్నవి ఇవీ..
- జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.44 లక్షలతో రాజాం మండలం సోపేరులో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ ట్యాంకు నిర్మాణం జరుగుతోంది. మార్చి నాటికి కుళాయిల ద్వారా నీళ్లిస్తాం.
- రేగిడి మండలం కొండవలసలో 440 ఇళ్లకు రూ.67.10 లక్షలతో డిస్ట్రిబ్యూషన్ పైపులైను ఏర్పాటు చేసి నీళ్లిచ్చాం. వన్నలిలో రూ.58.30 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్‌ఆర్ అందుబాటులోకి తెచ్చాం.
- ఉప్పరనాయుడువలసలో రూ.47.30 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంకు, డిస్ట్రిబ్యూటరీ పైపులైను పనులు జరుగుతున్నాయి. లక్ష్మీపురంలో తాగునీటి పథకం నెల రోజుల్లో అందుబాటులోకి వస్తుంది.
- మొగిలివలసలో రూ.68.20 లక్షలతో ఓహెచ్‌ఆర్ నిర్మించి సుమారు 400 వరకు కుళాయిలు ఏర్పాటు చేశాం.

నియోజకవర్గంలోని తాగునీటి వనరులు

మండలం	బోర్లు	పథకాలు	డైరెక్ట్ పంపింగ్ ఓపెన్‌వెల్
రాజాం	416	50	59
రేగిడి	499	89	67
సంతకవిటి	425	85	61
వంగర	358	32	57

తాగునీటికి సంబంధించి ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయొచ్చు..
● రాజాం: 91001 20750 ● రేగిడి: 91001 20625 ● సంతకవిటి: 91001 20623 ● వంగర: 91001 20757

క్రీడా పోటీల్లో ప్రజాప్రతినిధుల సత్తా

సహచర ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ గ్రీష్మ

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాపోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని, తమ క్రీడా ప్రతిభ చూపారు. ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. నాయకులు అభినందించారు. – ఈనాడు, అమరావతి

ఓవరాల్ ఛాంపియన్‌గా పెంట విద్యార్థులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన భాషా ఉత్సవాల పోటీల్లో బొబ్బిలి మండలం పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. 22 మంది విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, హిందీ విభాగాల్లో పోటీ పడ్డారు. ఆంగ్లభాష వక్తృత్వంలో ప్రథమ, తెలుగు భాష రచనలో ద్వితీయ, ఆంగ్లం కథా రచనలో తృతీయ, హిందీ జాతీయ భాష ప్రాముఖ్యంపై రచనకు ద్వితీయ, ఆంగ్లం, తెలుగు భాషల్లో దేశభక్తిని పెంపొందించే అంశంపై నిర్వహించిన నాటకాలకు ప్రథమ స్థానాలు దక్కాయి. ఆధ్యాత్మిక కోలాటం, తండ్రీ కుమార్తెల అనుబంధాన్ని చాటే 'ఐ మిస్ యు డాడీ' ప్రదర్శనకు ప్రథమ స్థానం దక్కింది. ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచారని ఉపాధ్యాయుడు విజయమోహన్ తెలిపారు. బొబ్బిలి పట్టణంలోని తారకరామకాలనీకి చెందిన రెండో తరగతి విద్యార్థి యశ్వంత్‌కుమార్‌కు భగవద్గీత శ్లోకాల్లో ప్రత్యేక బహుమతి దక్కినట్లు హెచ్‌ఎం ఉషారాణి తెలిపారు.

గ్రంథాలయ అభివృద్ధికి సహకారం

వివరాలు తెలుసుకుంటున్న స్వాతిదేవ్, వల్లీదేవి

బాడంగి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ గ్రంథాలయశాఖ సహకారంతో నడుస్తున్న 200 గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు శిక్షణ ఫౌండేషన్ డెల్ టెక్నాలజీ సంస్థ ఎంపిక చేసింది. వీటిలో బాడంగి గ్రంథాలయం ఒకటిగా ఉంది. ఈ నేపథ్యంలో డీఐసీ ప్రాజెక్టు మేనేజర్ స్వాతిదేవ్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల డీఎంటీ వల్లీదేవిల బృందం మంగళవారం బాడంగి గ్రంథాలయాన్ని సందర్శించారు. ఒక కంప్యూటర్, ఇతర సాంకేతిక పరికరాలు అందిస్తామని తెలిపారు. పనితీరు, విద్యార్థులకు కంప్యూటర్ నేర్పే విధానం, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించడం బాగుందని అభినందించారు. గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ ఉన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులివ్వండి.. బొబ్బిలి: బొబ్బిలి పట్టణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే బేబీనాయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. మంగళవారం అమరావతిలో కలిసి బొబ్బిలి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఏడాది మే నెలలో దాడితల్లి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని రహదారుల అభివృద్ధికి రూ.2 కోట్లు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

ఉపాధి పనుల కొలతల్లో అవకతవకలు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో 19వ విడత ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను అధికారులు మంగళవారం నిర్వహించారు. 30 గ్రామ పంచాయతీల్లో 2024-2025 ఏడాదికి రూ.27.36 కోట్లతో జరిగిన 1,485 పనులపై క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన అంశాలను సమీక్షించారు. కూలీల మస్టర్లలో అవకతవకలు, పనుల కొలతల్లో తేడాలున్నట్లు గుర్తించారు. కోనూరు గ్రామానికి చెందిన క్షేత్రసహాయకుడు పనులకు హాజరుకాని వారి పేరిట దొంగ మస్టర్లు వేసి సరిసగం పంచుకుంటున్నారని వేతనదారులు ఆరోపించారు. బొండపల్లి క్షేత్రసహాయకుడు కూలీలకు వందశాతం పనిదినాలు కల్పించడాన్ని అధికారులు అభినందించారు. డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, అంబుడ్స్ పర్సన్ ఎం.ఏ యాకుబ్ బాషా, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం హాజరయ్యారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి
గజపతినగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని బాధితులు, ఏజెంట్ల సంక్షేమ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం గజపతినగరం మండలం దావాలపేటలో అగ్రిగోల్డ్ లేఅవుట్‌ను పరిశీలించారు. మార్చి 2 నుంచి విజయవాడలో రిలే నిరాహార దీక్ష ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు ఈవీ నాయుడు, తిరుపతిరావు, ఆరేమ్మ, అప్పారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ✦ రామభద్రపురం: ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు ఆరికతోటలో అగ్రిగోల్డ్‌కు సంబంధించిన 42 ఎకరాల భూములను పరిశీలించారు. అగ్రిగోల్డ్ భూముల్లో ఎర్రచందనం, జీడి, మామిడి, టేకు తోటలు ఉన్నాయన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

వంగర, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం వంగరలోని వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పింఛనర్ల సంఘం మండలశాఖ ఎన్నిక
గరివిడి: రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ మండల శాఖ అధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు వై.సత్యం ఎన్నికయ్యారు. మంగళవారం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా బి.మోహనరావు, కోశాధికారిగా కె.పైడినాయుడు, గౌరవాధ్యక్షుడిగా జె.మహాలక్ష్మునాయుడు, సహాయ అధ్యక్షుడిగా గుప్త, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మీసాల వెంకటరమణ ఎన్నికయ్యారు. సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు పి.అప్పారావు పాల్గొన్నారు.

చిన్నారికి అండగా యువత

ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని, చందాలు సేకరిస్తున్న యువకులు

రాజాం, రాజాం పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాకు చెందిన చిన్నారి పునర్విక అరుదైన వ్యాధి బారిన పడింది. దీన్ని నయం చేయాలంటే రూ.కోట్లు ఖర్చవుతుందని నిపుణులు తేల్చారని, తలా ఓ చేయి వేయాలని సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయి. పునర్వికకు పునర్జన్మ ఇవ్వాలని రాజాం మండలం పెనుబాక, సంతకవిటి మండలం కృష్ణశాస్త్రులపేట గ్రామాలకు చెందిన యువత కదిలారు. పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరలో పెనుబాక గ్రామానికి చెందిన సీహెచ్.సాయికుమార్, హరి, రాంప్రసాద్, బి.సాయి, గూనాం చెందిన భవాని, చిన్న కలిసి రూ.79,950 విరాళాలు సేకరించారు. వీటిని బాధిత కుటుంబానికి అందించే పనిలో ఉన్నారు. ✧ సంతకవిటి మండలం కృష్ణశాస్త్రులపేట యువత మొదటి రోజు సంతకవిటిలో రూ.22,500.. రాజాం జాతరలో రూ.30 వేలు సేకరించారు. ఇదే క్రమంలో కొంతమంది మాయగాళ్లు నగదు కాజేసేలా వల పన్నుతున్నారని, విరాళాల సేకరణ నిలిపేయాలనే సమాచారంతో సేకరణ నిలిపేసినట్లు యువత చెబుతున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం
తెర్లాం, న్యూస్‌టుడే: తెర్లాం మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలులకు చినగొలుగువలస, గొలుగువలస గ్రామాల మధ్య పొలాల్లో రావిచెట్టు విద్యుత్తు స్తంభంపై పడింది. పక్కనే ఉన్న మరో ఏడు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. విజయరాంపురం, అప్పలపేట, గొలుగువలస, చినగొలుగువలస, కొరటం, కొల్లివలస గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న ఏఈ తెంటు శ్రీనివాసరావు, ఏడీఈ ఉదయభానునాయుడు సిబ్బందితో మంగళవారం కొత్త స్తంభాలు వేయించారు. సాయంత్రం వరకు ప్రక్రియ కొనసాగింది.

ఘనంగా గ్రామదేవత ఉత్సవం
రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం చిన్నమ్మతల్లి గ్రామదేవత ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గద్దె వద్ద భక్తులు బారులుదీరారు. ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. పంచాయతీ పాలకవర్గం, కమిటీ సభ్యులు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. గ్రామపెద్ద చింతల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు తదితరులు దర్శించుకున్నారు.

దర్శనానికి బారులుదీరిన భక్తులు

అమ్మరూపం.. దివ్య తేజం
రాజాం, పట్టణం, గ్రామీణం, చీపురుపల్లి, న్యూస్‌టుడే: రాజాం పోలిపల్లి పైడితల్లి, చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవార్ల జాతర చివరిరోజు మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. పైడితల్లి ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. పుసుపు కుంకుమ, ముర్రాటలు ఆలయం ఎదుట సమర్పించారు. రాష్ట్ర ఉత్సవంగా మూడురోజుల పాటు నిర్వహించిన జాతర ఘటోత్సవంతో ముగిసింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెదేపా జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన కిమిడి నాగార్జున

ప్రత్యేకాలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

పాడుతున్న రేలారేలా ఫేమ్ జానకీరామ్

కొండంపేటలో ఘటాల ఊరేగింపు

రాజాం పట్టణంలో భక్తజన సందోహం

పెంపకందారులకు నోటీసులు ఇవ్వండి
బొబ్బిలి: రహదారులపై పశువులు విచ్చలవిడిగా తిరగడంతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారని, పెంపకందారులకు నోటీసులు ఇవ్వాలని పుర కమిషనర్ రామలక్ష్మి పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు. ఖాళీ స్థలాల్లో చెత్త గుట్టలుగా కనిపిస్తోందని, శుభ్రం చేయాలని సూచించారు.

మొక్కజొన్న సాగుతో ఆదాయం
రామభద్రపురం: మొక్కజొన్న సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందని ఏవో అమరశివ అన్నారు. రామభద్రపురం మండలం తారాపురంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులు పురుగు మందులు తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని కోరారు.

కింతలివానిపేటలో మేకల చోరీ
బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కింతలివానిపేటలో ఉమాశంకర్‌కు చెందిన అయిదు మేకలు చోరీకి గురైనట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొత్త పోలమ్మ ఆలయం సమీపంలోని షెడ్డులో 13 మేకలు ఉంచగా.. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అయిదు మేకలను తీసుకెళ్లిపోయారని, వీటి విలువ రూ.50 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

బొండపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన ఘటన మంగళవారం బొండపల్లి మండలంలో చోటుచేసుకుంది. గజపతినగరం అగ్నిమాపకశాఖ అధికారి ఎం.ఎస్.వి రవి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాచకిండాం గ్రామంలో పాలవలస నూకాలు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించి, ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.3 లక్షలు నగదుతో పాటు రూ.2 లక్షల విలువచేసే బంగారు నగలు బూడిదయ్యాయని తెలిపారు. స్థానికులు వెంటనే సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశామని అగ్నిమాపక శాఖ అధికారి పేర్కొన్నారు. ఘటన జరిగినప్పుడు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందన్నారు. పెళ్లి కోసం దాచుకున్న డబ్బులు, బంగారం అగ్నికి ఆహుతవడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం
దత్తిరాజేరు: టి.బూర్జవలసలో ఉమారామలింగేశ్వర ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కె.ఎ.నాయుడు పాల్గొని పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు
రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండలం తారాపురం పెట్రోల్ బంకు వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై ప్రసాదరావు తెలిపారు. పాచిపెంట గ్రామానికి చెందిన నాగరాజు, మోహన్‌రావు, వెంకన్న ద్విచక్రవాహనంపై రామభద్రపురంలో జరుగుతున్న పండగకు వస్తూ.. పురోహితునివలస గ్రామానికి చెందిన శ్రీనివాస్ నడిచి వెళ్తుండగా ఢీకొట్టారు. నలుగురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సాలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పురపాలిక: బొబ్బిలి ● వార్డు: **1** ● నివాస గృహాలు: **600** ● జనాభా: **5** వేలు
● ప్రాంతాలు: పల్లెం, కంచర, నాయుడు, కూరాకుల, ముర్దాన వీధులు, ప్రసాద్‌నగర్ కాలనీ

పాత బొబ్బిలి.. సమస్యల లోగిలి
న్యూస్‌టుడే – బొబ్బిలి

బొబ్బిలి పురపాలికలో అతిపెద్దదైన ఒకటో వార్డులో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామీణ వాతావరణాన్ని తలపించే పాతబొబ్బిలి ప్రాంతంలో ప్రజల ఇబ్బందులు లెక్కలేనివి. రహదారులు, కాలువలు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవు. ఇటీవల కొన్ని పనులకు నిధులు కేటాయించారు. పూర్తి కావాల్సి ఉంది.

ప్రసాద్‌నగర్ కాలనీలో తాగునీటికి నిత్యం ఇలా వేచి ఉండాల్సిందే..

తీర్చాల్సిన ఇక్కట్లు ఇవీ..
- ప్రసాద్‌నగర్ కాలనీలో అరకొరగా కుళాయిలు ఉన్నాయి. వాటి నుంచి సక్రమంగా నీరు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- గణపతి కోనేరుగట్టుపై తాగునీటి ట్యాంకు నిర్మించాల్సి ఉంది.
- నాయుడు, కూరాకుల వీధుల్లో రహదారి సమస్య ఉంది. సీసీ రోడ్లు వేయాల్సి ఉంది.
- పాత కమ్యూనిటీ హాలు సందులో సీసీ రోడ్డు లేదు. డ్రైనేజీలు లేక మురుగునీరు నిల్వ ఉంటోంది.
- కూరాకులవీధి సందులో కాలువ ఎత్తు లేక మురుగునీరు నిల్వ ఉంది.
- వార్డు శివారులో మురుగునీటి శుద్ధి ప్లాంటు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం.. పురపాలికలో మిగులు పనుల పూర్తికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు సీసీ రహదారులు, కాలువలకు కేటాయించాం. ప్రాధాన్యతా క్రమంలో మిగిలిన పనులు పూర్తిచేస్తాం. – ఎల్.రామలక్ష్మి, పుర కమిషనర్, బొబ్బిలి

జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపిక

బహుమతులు పొందిన మండలస్థాయి విజేతలు

గజపతినగరం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు గండ్రేటి లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం గజపతినగరంలో నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. బుధవారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గజపతినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత, మరుపల్లి ఆదర్శ, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎ.జాహ్నవి, జి.హరి, వేణుగోపాల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించి, జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు. మరుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థి మోక్షిత్ వెంకటసాయికి కన్సోలేషన్ బహుమతి వచ్చిందన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి జి.అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి బి.పోలినాయుడు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు.. బొబ్బిలి: మద్యం తాగి వాహనం నడిపిన పసుపురెడ్డి రామ్మోహనరావుకు బొబ్బిలి స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్ క్లాస్ ఇన్‌ఛార్జి మేజిస్ట్రేట్ రోహిణీరావు మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారని సీఐ నారాయణరావు తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై జ్ఞానప్రసాద్ పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రామ్మోహనరావు దొరికారన్నారు. తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



(c) eenadu

విజయవాడలో జరిగిన ప్రజాప్రతినిధుల ఆటల పోటీల్లో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ గ్రీష్మ, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తదితరుల సందడిది. – ఈనాడు, అమరావతి

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

తెరపై ఈనాడు

★ ఎస్వీఎస్: పంచ్ ★ శ్రీకృష్ణ: కపుల్ ఫ్రెండ్లీ ★ ఆదిత్య: నిలవే ★ లీలామహల్: నారీ నారీ నడుమ మురారీ, మనసంతా నువ్వే ★ రంజనీ స్క్రీన్-1: హేయ్ బల్వంత్ ★ శివరంజనీ స్క్రీన్-2: మన శంకరవరప్రసాద్‌గారు, నవాబ్ కాఫీ ★ హిమగిరి: మన శంకరవరప్రసాద్‌గారు ★ సప్తగిరి: హేయ్ బల్వంత్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఉన్నత లక్ష్యాలు అవసరం

మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం విద్యాభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నతనం నుంచే నిజాయతీ, క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. నగరంలోని డా.బీసెంట్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాలలతో ముచ్చటించారు. పాఠశాల అధ్యక్షుడు డా.సతీష్, డైరెక్టర్లు సి.ఎ.శ్రీనివాస్, వింధ్య తదితరులు ఆయన్ను సత్కరించారు.

ఆంధ్ర జలాశయం నీటి విడుదల

విజయనగరం పట్టణం: ఆంధ్ర జలాశయం నుంచి మంగళవారం 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రామతీర్థం, నెల్లిమర్ల, కుదిపి తదితర తాగునీటి పథకాలకు అందించనున్నారు. 15 రోజుల పాటు సరఫరా సాగనుంది. దీంతో విజయనగరంతో పాటు పరిసర ప్రాంతాల వారికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. 45 రోజుల వరకు సరిపోతాయని డీఈఈ బి.నరసింహారెడ్డి తెలిపారు. అవసరం మేరకు మళ్లీ విడుదల చేయిస్తామన్నారు.

మైనర్ డ్రైవింగ్ తీవ్రనేరం

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: బాలలకు వాహనాలు ఇచ్చినా, వెనక్కి కూర్చుని వారితో నడిపించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్‌ను తీవ్ర నేరంగా పరిగణిస్తామన్నారు. గతేడాది 1,300 కేసులు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పక్కవారు సైతం ప్రమాదాల బారినపడే ముప్పు పొంచి ఉందని, ఇకనుంచి వాహన యజమానులు, తల్లిదండ్రులపైనా కేసులు పెడతామన్నారు.

జామి ఎల్లారమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులు

జరజాపుపేటలో అమ్మవారు

సిరుల తల్లి.. భక్తజన కల్పవల్లి

ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జామిలో జరిగిన జాతరకు వేలాది మంది తరలివచ్చారు. పరిసర ప్రాంతాలు కిక్కిరిశాయి. ❖ విజయనగరంలో మంగళవారం జరిగిన సిరుల ఉత్సవం ఆధ్యాత్మికతను నింపింది. పుర వీధుల్లో సిరిమానోత్సవం సందడిగా సాగింది. జరజాపుపేటలో అమ్మవారికి తెల్లవారుజాము నుంచి మొక్కులు చెల్లించారు. రాత్రి రేలారే రేలా ప్రదర్శన ఆకట్టుకుంది. ❖ పెదతాడివాడలో బుధవారం ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. – న్యూస్‌టుడే, జామి, కంటోన్మెంట్, నెల్లిమర్ల, డెంకాడ

విజయనగరం జిల్లా కేంద్రంలో సిరిమానోత్సవం

కాలువలే రూ.కోట్లు తినేస్తున్నాయ్!!

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో కాలువల నిర్మాణానికి ఏటా రూ.కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. అయినప్పటికీ మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగానే దర్శనమిస్తోంది. పనుల్లో నాణ్యత లేకపోవడం, కల్వర్టుల ఏర్పాటులో లోపాలు, సకాలంలో వ్యర్థాలను తొలగించక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మరోవైపు అపార్టుమెంట్లు, గ్రూపు ఇళ్ల నుంచి వచ్చే అవుట్‌లెట్ల పరిస్థితి మరింత ఘోరం. రోజుల తరబడి నిల్వ నీరు ఉంటుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి.

వినాయకనగర్ సమీపంలో పేరుకుపోయిన మురుగు

ఇంకా అదే..

ఇక్కడ ఏళ్లనాటి పురాతన డ్రైనేజీ వ్యవస్థ ఇంకా కొనసాగుతోంది. చాలాచోట్ల ప్రధాన కూడళ్లు, రోడ్ల కిందనుంచి కాలువలున్నాయి. వ్యర్థాలు పేరుకుపోవడంతో చిన్నపాటి వర్షం పడినా మురుగు రోడ్డెక్కుతోంది. భూగర్భ డ్రైనేజీ ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. సమగ్ర కాలువ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే డిమాండు ఉన్నా చర్యలు కానరావడం లేదు.

అంచనాలతో సరి..

పెద్దచెరువు అదనపు నీటి పారుదల కాలువ ట్యాంక్‌బండ్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి వినాయకనగర్, పద్మావతినగర్, సింహాద్రినగర్, భగవాన్‌నగర్, నటరాజ్ కాలనీ, ధర్మపురి మీదుగా వెళ్తోంది. దీని ద్వారానే పెద్దఎత్తున చెరువులోకి వ్యర్థజలాలు చేరుతున్నాయి. ఈ ప్రధాన కాలువ బాగు కోసం గతంలో 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.50 కోట్లతో ప్రతిపాదన చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో భారీ వర్షాలు కురిస్తే ఆయా ప్రాంతాలన్నీ మునిగిపోతున్నాయి. జాప్యం కారణంగా కాలువ నిర్మాణ వ్యయం రూ.34 కోట్లకు చేరింది.

ఖర్చు ఇలా.. (రూ.కోట్లలో)	
2022- 23	3.26
2023- 24	8.61
2024- 25	4.17
2025- 26	5.00

(ఈ ఏడాదిలో ఇప్పటివరకు)

ఇక్కడే ఎక్కువ..

శివారు కాలనీలు, విలీన పంచాయతీల్లో సమస్య తాండవిస్తోంది. సిద్ధి వినాయకనగర్, సుబ్రహ్మణ్యం కోవెల, హనుమాన్‌నగర్, మంగళవీధి, పూల్‌బాగ్, పీవీజీనగర్, బాబామెట్ట, సీఆర్‌నగర్, సుంకరివీధి, నానాజాతుల పేట, స్టేడియం కాలనీ, గెడ్డవీధి, అశోక్‌నగర్, జొన్నగుడ్డి, రాజీవ్‌నగర్, ధర్మపురి, వినాయకనగర్, నరసింహానగర్, బాలాజీనగర్, బ్యాంకు కాలనీ, ప్రదీప్‌నగర్ తదితర ప్రాంతాలవారు ఇబ్బందులు పడుతున్నారు.

అయినా కదలని మురుగు

కాలువల వ్యవస్థ మెరుగుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని **కమిషనరు కె.బాలస్వామి** 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టి ముంపు బెడద లేకుండా చూస్తామన్నారు. దోమల నివారణపై దృష్టిసారించామని పేర్కొన్నారు.

కాలువల విస్తీర్ణం(కి.మీలలో)	చిన్న తరహా	మధ్య	మేజరు	కచ్చా
	291	163	12	70

రూ.20 లక్షలు నిరుపయోగం

విజయనగరం నుంచి చింతలవలస గ్రామానికి వెళ్లే మార్గంలో బియ్యాలపేట సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవనమిది. గత ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షల వరకు ఖర్చు చేశారు. 60 శాతం పనులు పూర్తయ్యాక గుత్తేదారు వదిలేశారు. బిల్లులు రాకపోవడంతో మధ్యలో ఆపేసినట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చుట్టూ తుప్పలు పెరిగాయి. లోపలికి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా మారింది. పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జి.వెంకటరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

ప్రధాన వీధుల్లో పందుల సంచారం

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో పందుల సంచారం ఎక్కువవుతోంది. ప్రధాన దారుల్లోనూ కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి బయటే పెంచుకోవాలని, స్థానికంగా వదలవద్దని నిషేధించినట్లు అధికారులు చెబుతున్నా.. చర్యలు మాత్రం కానరావడం లేదు. రాజుల కోట, అంబటిసత్రం తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రమాదాలకు గురవుతున్నామని, వ్యర్థాలను చిందరవందర చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పెంపకందారులతో మాట్లాడతామని ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి తెలిపారు. వాటి సంచారాన్ని పూర్తిస్థాయిలో అరికడతామన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

మట్టిదారులతో ఇబ్బందులు

విజయనగరం.. నగరపాలక సంస్థగా మారినప్పటికీ ఇంకా చాలా మట్టిదారులు దర్శనమిస్తున్నాయి. శివారు ప్రాంతాలు, కాలనీలు, విలీన పంచాయతీల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వర్షం పడితే అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. కొన్నేళ్లుగా తమ కాలనీలో ఈ సమస్య ఉన్నా, ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రదీప్‌నగర్ వాసులు చెబుతున్నారు. నిధుల లభ్యత మేరకు ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు వేస్తామని కమిషనరు కె.బాలస్వామి తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పొంచిఉన్న ముప్పు

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని ధామస్‌పేట ప్రాంతంలో చంపావతి నదీ తీరం కోతకు గురవుతోంది. గతంలో తాగునీటి నిల్వ కోసం నది మధ్యలో రాతికట్ట నిర్మించారు. దీంతో ఏటా వరదల సమయంలో నదీ ప్రవాహానికి ఒడ్డున ఉన్న మట్టి కొట్టుకుపోతోంది. ఈ క్రమంలో సమీపంలో భారీ గుంత ఏర్పడింది. ఇటీవల జరజాపుపేటకు చెందిన ఓ వ్యక్తి స్నానానికి దిగి మృతి చెందారు. సమస్యను ఏఈ శివకుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. తాగునీటి కోసం రాతికట్ట నిర్మించామని, కోతకు గురికాకుండా చూస్తామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

ఇదీ పశు వైద్యశాల

నెల్లిమర్ల మండలంలోని మొయిద గ్రామంలో ఉన్న పశు వైద్యశాల దుస్థితి ఇది. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పశు పోషకులకు సేవలు దూరమవుతున్నాయి. భవనంతో పాటు రక్షణ గోడ శిథిలస్థితికి చేరాయి. పశువులను కట్టేందుకు ఏర్పాటు చేసిన ఇనుప చట్రం మరమ్మతులకు గురైంది. ప్రాంగణమంతా వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో ఇక్కడకు ఎవరూ రావడం లేదు. ఈ పరిస్థితిపై పశువైద్యాధికారి చక్రవర్తిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

భోజనంలో నాణ్యత తప్పనిసరి

విజయనగరం పట్టణం: అన్న క్యాంటీన్లలో నాణ్యమైన భోజనం అందించాలని కమిషనరు కె.బాలస్వామి తెలిపారు. ఘోషాసుపత్రి సమీపంలోని క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ❖ నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు.

విద్యార్థులకు అవగాహన

ఉడాకాలనీ: మాతృభాష ముందుకు నడిపే సారథి అని దిల్లీకి చెందిన శ్రీవాగ్దేవి కళా పీఠం వ్యవస్థాపకుడు శ్రీనివాసమూర్తి అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సమితి అధ్యక్షుడు గురుప్రసాద్ పాల్గొన్నారు.

విజ్జీలో సైక్లింగ్ ఎంపిక పోటీలు

బాబామెట్ట: శాప్ ఆధ్వర్యంలో అంతర జిల్లాల సైక్లింగ్ పోటీలు ఎన్టీఆర్ జిల్లాలో ఈనెల 28 నుంచి జరగనున్నాయి. ఇందులో భాగంగా జిల్లా జట్ల ఎంపికలను విజ్జీ మైదానంలో నిర్వహించారు. ఎనిమిది మంది చొప్పున బాలురు, బాలికలను ఎంపిక చేసినట్లు డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు తెలిపారు.

జిల్లా క్రీడాకారులకు పతకాలు

బాబామెట్ట: విశాఖపట్నంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 21, 22వ తేదీల్లో జరిగిన 31వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులు 45 పతకాలు సాధించారు. 30 స్వర్ణాలు, 15 రజతాలు దక్కాయని కరాటే సంఘం తెలిపింది.

పదోన్నతులు కల్పించాలి

అయ్యన్నపేట: పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి డిమాండు చేశారు. ఈడీ జి.విజయగీత, డిప్యూటీ సీపీఎం సుధాబిందుతో సమావేశమయ్యారు.

అవీ..ఇవీ..అన్నీ

సైబర్ నేరగాళ్ల అరెస్టు

ఎండాడ: అమాయకుల నుంచి రూ.కోట్లు దోచేస్తున్న అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. 84 ఏళ్ల విశ్రాంత ఉద్యోగిని డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి మూడు విడతలుగా రూ.89.30 లక్షలు కాజేసిన విజయనగరానికి చెందిన రవి సైతం ముఠాలో ఉన్నాడు.

అనాథాశ్రమానికి తరలింపు

ఎస్.కోట: బొడ్డవరలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఇద్దరు మహిళలను రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు స్థానిక పోలీసుల సహకారంతో మనోబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలోని సొసైటీ హోంలెస్ షెల్టర్‌కు తరలించారు.

విద్యుత్తు బస్సులను అప్పగించాలి

శృంగవరపుకోట: విద్యుత్తు బస్సుల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు కాకుండా ఆర్టీసీ ఉద్యోగులకు అప్పగించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు డిపో ఎదురుగా ధర్నా చేపట్టారు. కార్యదర్శి ఎ.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలగింపునకు డిమాండు

డెంకాడ, అయ్యన్నపేట: కొండ్రాజుపేటలోని సాగునీటి చెరువులో అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని జనసేన నాయకులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ❖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన నాయకుడు అవనాపు విక్రమ్ పిలుపునిచ్చారు. నగరంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి

శృంగవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గంలో ప్రధాన రహదారుల అభివృద్ధి, విస్తరణ, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే లలితకుమారి కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి వినతిపత్రం అందజేశారు

సమస్యలపై చర్చించాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పి.కామేశ్వరరావు డిమాండు చేశారు. విజయనగరంలోని కోట కూడలిలో మంగళవారం జరిగిన ఆందోళనలో మాట్లాడారు.

జామి: జామి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1981- 82 మధ్య 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్థానికంగా సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

కోటమ్మ సిరిమానోత్సవానికి శ్రీకారం

ఎస్.కోట, న్యూస్‌టుడే: మండలంలోని కొట్టాం కోటమ్మ సిరిమానోత్సవాన్ని మార్చి 9, 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో అమ్మవారిని సోమవారం రాత్రి వనంగుడి నుంచి గద్దె గుడికి తరలించారు. రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు తెల్లవారుజాము వరకు సాగింది. ఇక్కడ 16 రోజుల పాటు పూజలు చేశాక సిరిమానోత్సవం అనంతరం తిరిగి వనంగుడికి తరలిస్తారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ట్రస్టు మాజీ ఛైర్మన్ రమణబాబు తెలిపారు.

భాషలపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిత

విద్యార్థినికి బహుమతి ఇస్తున్న అధికారి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: భాషలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, సరైన విధంగా పట్టు సాధిస్తే ఉజ్వల భవిత సొంతమవుతుందని ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటరమణ పేర్కొన్నారు. దాసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి భాషోత్సవంలో మాట్లాడారు. పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. వివిధ పాఠశాలల నుంచి 890 మంది విద్యార్థులు పాల్గొని, వివిధ పోటీల్లో సత్తా చాటారు. విజేతలకు ఆయన బహుమతులు అందించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ఉడాకాలనీ, భోగాపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగాయి. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, సీఐటీయూ జిల్లా కోశాధికారి జగన్‌మోహన్‌రావు మాట్లాడారు. పదోన్నతులు కల్పించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, పథకాలు అమలు చేయాలని డిమాండు చేశారు. ❖ భోగాపురంలోనూ కార్యకర్తలు నిరసన తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

దేశ ప్రతిష్ఠను దిగజార్చడం సరికాదు

నిరసన తెలుపుతున్న భాజపా నాయకులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: దేశ రాజధాని దిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు దారుణమని, దేశ ప్రతిష్ఠను దిగజార్చడం సరికాదని భాజపా మండిపడింది. మంగళవారం విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ మాట్లాడుతూ ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పతివాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసింది బాటలు.. తీసింది బీటలు

సీసీ రహదారిపై బీటలు

రోడ్డు కుంగిపోయిన చోట తారు వేసిన దృశ్యం

ఆకివీడు మండలం దుంపగడప గ్రామ పరిధిలోని ఉప్పుటేరు నుంచి మందపాడు గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన సీసీ రోడ్డు దుస్థితి ఇదీ. దీన్ని గతంలో రూ.2 కోట్లతో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం నాణ్యత లోపాలు ఇలా బయటపడ్డాయి. ఆర్అండ్‌బీ జేఈ కె.శ్రీహరిరాజు మాట్లాడుతూ మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆకివీడు

22ఏ భూములపై విచారణ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 22ఏ భూములకు సంబంధించి వచ్చిన 30 దరఖాస్తులపై కలెక్టరేట్‌లో మంగవారం కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి విచారణ నిర్వహించారు. పట్టాభూములుగా నమోదై క్రయవిక్రయాలు జరిగిన భూములు ఆన్‌లైన్‌లో 22ఏ జాబితాలో ఉండటం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారని వారు పేర్కొన్నారు. అందుకే వాటికి సంబంధించి వచ్చే దరఖాస్తులు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సెలవు రోజు మినహా ప్రతి మంగళవారం వాటిపై విచారణ జరిపి పరిష్కరించడం జరుగుతుందన్నారు. గతంలో రెండు దఫాలుగా తొమ్మిది కేసులు పరిష్కరించామన్నారు. తాజాగా వచ్చిన 30 కేసుల్లో 14 పరిష్కరించామని, భూసంబంధిత రికార్డులు సమర్పించనందున మిగిలిన 16 వచ్చే వారానికి వాయిదా వేశామన్నారు.

అనిశా వలలో అటవీ అధికారి

రూ.4 లక్షలు తీసుకుంటూ చిక్కిన వైనం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఓ సామిల్లు యజమాని నుంచి రూ.4 లక్షలు లంచంగా తీసుకుంటున్న నరసాపురం అటవీ శాఖ సెక్షన్ అధికారి (ఎఫ్ఎస్‌వో) ఎస్.సురేష్‌కుమార్‌ను అనిశా అధికారులు పట్టుకున్నారు. భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇంట్లోనే అతన్ని పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనిశా డీఎస్పీ జి.వి.కృష్ణారావు, సీఐలు ఎం.బాలకృష్ణ, కె.శ్రీనివాసు, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఇంట్లో, కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.

ఏం జరిగిందంటే!.. పాలకోడేరు మండలం శృంగవృక్షం ప్రాంతంలోని సామిల్లు పునరుద్ధరణ నిమిత్తం యజమాని ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. దానిపై గత నెలలో వివరాలను అటవీ అధికారులు తీసుకున్నారు. పునరుద్ధరణ చేయకపోగా రూ.4 లక్షలు ఇవ్వాలని అడగడంతో బాధితుడు అనిశా అధికారులను ఆశ్రయించారు.

దస్త్రం దాచి పెట్టి.. కొన్ని రోజుల కిందటే మిల్లు వివరాలను అటవీ అధికారులు తీసుకున్నట్లు తెలుస్తుంది. అప్పట్నుంచి దస్త్రం దాచిపెట్టి నగదుకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రస్తుతం పట్టుబడిన తీరును బట్టి వెల్లడవుతుంది. రూ.6 లక్షలు డిమాండ్ చేయగా విసుగుచెందిన బాధితుడు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించినట్లు సమాచారం. మంగళవారం ఉదయం అనిశా అధికారులు భీమవరం చేరుకున్నారు. భీమవరం ఇన్‌ఛార్జిగా ఉన్న ఎఫ్ఎస్‌వో సురేష్‌కుమార్ నగదును బాధితుడి నుంచి తీసుకుంటుండగా నేరుగా పట్టుకున్నారు.

కూపీ లాగితే?.. అటవీ అధికారి ఒకరు అనిశా అధికారులకు పట్టుబడ్డారన్న సమాచారంతో పలువురు ఉలిక్కిపడ్డారు. తీగ లాగితే డొంక కదులుతుందేమోనని అటవీ అధికారులు ఆందోళన చెందారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరి పాత్ర అయినా ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలు తీసుకున్న తర్వాత కొన్ని రోజుల పాటు దస్త్రం బహిర్గతం కాకుండా ఉంచడం వెనుక ఇంకెవరిదైనా హస్తం ఉందా అనేది విచారణలో తేలాల్సి ఉందనే వార్తలు గుప్పుమంటున్నాయి.

మేమింతే.. ఇవ్వాల్సింది అంతే!

దోచుకుంటున్న కొందరు అధికారులు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, తణుకు,ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉన్నత ఉద్యోగం, రూ.వేలల్లో వేతనం.. అయినా బల్ల కింద చెయ్యి పెడతారు. అడిగినంత ఆ చేతిలో పెట్టనిదే దస్త్రం కదపరు.. ఏ పనీ చేయరు.

☛ ఇటీవల తణుకు పట్టణ పోలీసు స్టేషన్ రైటర్ ఒక కేసు విషయమై రూ.25 వేలు లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు.

☛ ఈ నెల 21న మందుల (ఔషధ) దుకాణం అనుమతుల కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌కుమార్, సహాయకుడు శివరామకృష్ణ అనిశాకు పట్టుబడ్డారు.

ఉమ్మడి జిల్లాలోని కొందరు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో అవినీతి పెరిగిపోతోంది. లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడి కేసుల్లో చిక్కుకుని జైళ్లకు వెళ్తున్నా మార్పు రావడం లేదు. ప్రతి పనికీ ఓ రేటు పెడుతున్నారు. అడిగింది ఇవ్వకుంటే చేయాల్సిన పనులపై జాప్యం చేస్తున్నారు.

● ఇటీవల ఏ పని చేయాలన్నా లంచం డిమాండ్ చేస్తున్నారని, ఇలాగైతే అనిశా అధికారులకు పట్టిస్తానని భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు పురపాలక ఉద్యోగులను ఉద్దేశించి అన్నారు. దీన్ని బట్టి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రధాన శాఖలివే.. ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. ప్రధానంగా పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్యం, మున్సిపల్, నీటి పారుదల, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ తదితర శాఖల్లో కొందరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.. ప్రభుత్వాధికారులు పనులకు డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా అనిశాకు ఫిర్యాదు చేయాలి. టోల్‌ఫ్రీ నంబరు 1064 లేదా 94404 46157, 94404 46158, 94404 46159 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

– జి.వి.కృష్ణారావు, అనిశా డీఎస్పీ

నేడు రాజగోపాలస్వామి కల్యాణోత్సవం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని వశిష్ఠ గోదావరి తీరానికి సమీపాన కొలువైన రుక్మిణి, సత్యభామ సమేత రాజగోపాలస్వామి కల్యాణోత్సవం బుధవారం జరగనుంది. ఈ వేడుక కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయం అష్ట బుధవార ప్రదక్షిణ దీక్షలకు ప్రసిద్ధి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ప్రతి బుధవారం తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి అటుకులు, తులసి మాలలు సమర్పిస్తారు.

3న మద్ది ఆలయం మూసివేత

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మార్చి 3వ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం మూసివేస్తామని ఆలయ ఈవో ఆర్వీ చందన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి 4వ తేదీ ఉదయం నుంచి స్వామి దర్శనం, పూజా కైంకర్యాలు ప్రారంభమవుతాయని వివరించారు.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై టీకా అస్త్రం!

14 ఏళ్లు దాటిన బాలికలకు ఉచితంగా పంపిణీ

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: అన్ని ప్రాంతాల్లోనూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీని బారిన పడుతున్న మహిళల సంఖ్య ఏటేటా పెరుగుతూ వస్తోంది. దీనిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 14 ఏళ్ల దాటిన బాలికలకు ఉచితంగా టీకా వేయించాలని నిర్ణయించింది.

ఒక్క డోసు రూ.4 వేలు

జిల్లాలో 9, 10 తరగతుల బాలికలు: 34,000

ఇంటర్మీడియట్ విద్యార్థినులు: 39,536

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్ నివారణకు గార్డసిల్ టీకా 2006లో అందుబాటులోకి వచ్చింది. దీనిపై తగిన ప్రచారం లేకపోవడం, ధర ఎక్కువగా ఉండటంతో వినియోగం నామమాత్రంగానే ఉంది. బాలికల వయసును బట్టి ఈ టీకాను పలు డోసుల్లో వేయాల్సి ఉంటుంది. ఒక డోసు ధర సుమారు రూ.4 వేల వరకు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 14 ఏళ్లు, ఆపై వయసున్న బాలికలందరికీ దశల వారీగా ఈ టీకాను ఉచితంగా వేస్తారు. క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ టీకా పంపిణీపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉందని డీఎంహెచ్‌వో జి.గీతాబాయి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఆడేస్తాం.. గెలిచేస్తాం

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ఉల్లాసంగా ఆటల పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చూపారు.

– ఈనాడు, విజయవాడ

అభయారణ్యంలో 140 ట్రాప్ కెమెరాలు

పోలవరం, న్యూస్‌టుడే: పులుల సంచారం నేపథ్యంలో పాపికొండల అభయారణ్యంలో అటవీశాఖ అధికారులు మరిన్ని ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. బేస్ క్యాంపులు పటిష్ఠం చేయడంతో పాటు రేడియో కాలర్ ద్వారా పులి కదలికలు పరిశీలించేందుకు ప్రతి రేంజ్ పరిధిలోని పది మంది సిబ్బందికి రాజమహేంద్రవరంలో శిక్షణ ఇచ్చినట్లు పోలవరం రేంజర్ ఎస్కే.వలీ చెప్పారు. ఉడతపల్లి, మెత్తప్పకోట గ్రామాల పరిధిలోని అభయారణ్యంలో వన్యప్రాణి విభాగం అధికారులు గుర్తించిన పాయింట్లలో ట్రాప్ కెమెరాలు అమర్చే పనులు మంగళవారం ప్రారంభించారు. ఇందుకోసం 140 కెమెరాలు కొత్తగా తీసుకొచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో అభయారణ్యంలో ఉండేందుకు రూ.3 లక్షలతో సున్నాలగండిలోని వన సంరక్షణ సమితి కమ్యూనిటీ హాల్‌ను క్యాంపు స్టేషన్‌గా పునఃనిర్మించారు. ప్రస్తుతం అభయారణ్యంలో వదిలిన పులి పోలవరం జిల్లా పరిధిలో సంచరిస్తోంది. దాని కదలికలను ఎప్పటికప్పుడు అటవీ శాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు రేంజర్ ఎస్కే.వలీ పేర్కొన్నారు.

పల్లె పోరుకు సన్నద్ధం

ఓటర్ల జాబితా తయారీలో నిమగ్నమైన సిబ్బంది

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : పల్లె పోరు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రావడంతో ఆ దిశగా జిల్లా పంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఓటర్ల జాబితాల తయారీలో పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గ తాజా జాబితాలను కలెక్టరేట్ నుంచి మండలాలకు పంపారు. వీటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు జాబితాల్లో పేర్లు, చేర్పులు, మార్పులు, సవరణలు తదితర అంశాలను పరిశీలించి కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు.

జిల్లాల విభజన తర్వాత తొలిసారిగా.. జిల్లాల విభజన తర్వాత తొలి పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ఏలూరు జిల్లాలో 544, పశ్చిమగోదావరి జిల్లాలో 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 909 గ్రామ పంచాయతీలకు, 9,588 వార్డు స్థానాలకు సంబంధించి నాలుగు విడతల్లో గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయా పాలకవర్గాల పదవీకాలం గడువు సమీపిస్తుండంతో దీనికి ముందుగానే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాల ఆధారంగా పంచాయతీ, వార్డుల వారీ జాబితాలను విభజించనున్నారు. జనవరి 1వ తేదీ అనంతరం ఓటుహక్కు పొందిన వారి పేర్లను చివరి వార్డులో కలుపుతారు.

9న ప్రదర్శన.. గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా మార్చి 9లోగా ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఇప్పటికే కలెక్టర్లతోపాటు డీపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీ అనంతరం పంచాయతీ సర్పంచి, వార్డు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా తయారీపై దృష్టి సారించినట్లు డీపీవో కె.అనురాధ తెలిపారు.

జీతాల పెంపుతో.. లస్కర్లకు ఊరట!

పంట కాలువలో వ్యర్థాల తొలగింపు పనుల్లో లస్కర్లు

పాలకొల్లు, న్యూస్‌టుడే: వానైనా.. వరదైనా రేయింబవళ్లు ఏటిగట్టు పొడవునా కాపలా కాసేది లస్కర్లు. సాగునీటి ఎద్దడి వేళ జల చౌర్యాన్ని అరికట్టి చివరి మడి వరకు నీరందించి పంటలను గట్టెక్కిస్తుంటారు. గత వైకాపా ప్రభుత్వం వీరికి రెండేళ్ల పాటు జీతాల బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి తగిన వేతనం అందించడం ద్వారా గౌరవించాలని నిర్ణయించింది. తాజా బడ్జెట్‌లో రూ.12 కోట్లు కేటాయించింది.

వచ్చే ఖరీఫ్ నుంచి అమలు

ధవళేశ్వరం ఆనకట్ట పరిధిలో ఉభయ గోదావరి జిల్లాల్లో 610 మంది లస్కర్లు పనిచేస్తున్నారు. వీరికి దినసరి వేతనం రూ.350 చొప్పున నెలకు రూ.10,500 వరకు వస్తుంది. వచ్చే ఖరీఫ్ నుంచి రోజుకు రూ.550 చొప్పున నెలకు రూ.16,500 వరకు చెల్లించనున్నట్లు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శాసనమండలిలో మంగళవారం వెల్లడించారు. పాత బకాయిలను కూడా త్వరలో చెల్లిస్తామని చెప్పారు.

కొత్త సిబ్బంది నియామకం

కొన్నేళ్ల కిందట పశ్చిమ డెల్టా పరిధిలో వేల సంఖ్యలో లస్కర్లు పని చేసేవారు. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో ఈ సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలో ఒప్పంద పద్ధతిలో 300 మంది మాత్రమే పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,517 మంది లస్కర్లు పనిచేస్తుండగా గోదావరి డెల్టాలో 610 మంది వరకు ఉన్నారు. వచ్చే సీజన్ నాటికి మరో 1,033 మంది ఒప్పంద ఉద్యోగుల నియామకానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

ఖరీఫ్‌లో సన్న విత్తనం మేలు

కిలో, రెండు కిలోల చొప్పున మేలో అందజేస్తాం ● 'న్యూస్‌టుడే'తో మార్టేరు ఏడీఆర్ శ్రీనివాస్

ఉండి, న్యూస్‌టుడే: గోదావరి జిల్లాల ప్రజలు తినడానికి ఇష్టపడే సన్నరకాల విత్తనోత్పత్తిలో ఎంటీయూ 1426 రకం మంచి ఫలితాలు ఇస్తోందని మార్టేరు వరి పరిశోధన స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడిని ఇస్తున్న ఈ రకం రానున్న ఖరీఫ్ సీజన్ సాగుకు లాభసాటి అని 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వెల్లడించారు.

➤ ఎంటీయూ 1426 చిరు ప్రదర్శనల్లో ఉంది. దోమపోటు, అగ్గితెగులుతో పాటు పురుగులు, తెగుళ్లను తట్టుకోగలదని నిరూపితమైంది. ఎంటీయూ 1121 శ్రీధృతి మధ్యస్థ సన్నగింజ రకం. దానికి ప్రత్యామ్నాయంగా ఈ విత్తనాన్ని తెచ్చాం.

మే నెలలో తమ పరిశోధన స్థానాన్ని సంప్రదిస్తే 1,2,4, కిలోల ప్యాకెట్ల చొప్పున విత్తనాలు అందిస్తాం.

➤ ఎంటీయూ 1010 (కాటన్ దొరసన్నాలు)లో గింజ రాలిక ఎక్కువగా ఉండటంతో దానికి ప్రత్యామ్నాయంగా 2015లో ఎంటీయూ 1121 (శ్రీధృతి) మార్టేరు నుంచి విడుదలైంది. గింజ పక్వానికొచ్చిన తర్వాత కోత ఆలస్యమైనా గింజ రాలిక ఉండదు. దిగుబడి 50 బస్తాలకు పైమాటే. ముడిబియ్యంగా వినియోగిస్తున్నారు.

➤ రబీ వరి చేలల్లో జింకుధాతు లోపం, దుబ్బు కుళ్లు తెగులు, సల్ఫైడ్ ఇంజూరీ, చౌడు సమస్యలు ఉన్నాయి. దుబ్బు కుళ్లు తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. మందు లీటరు నీటిలో కలిపి రెండుసార్లు చల్లి అరికట్టవచ్చు. సల్ఫైడ్ కలిగిన కాంప్లెక్స్ ఎరువులు చల్లకూడదు. సల్ఫైడ్ ఎక్కువైన చోట్ల నీటిలో బుడగలు వస్తాయి. వేరు వ్యవస్థ నల్లబడి మొక్కలు మాడిపోయి దెబ్బతింటున్నాయి. చౌడు నివారణకు మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుచుకోవాలి. జీలుగ, పిల్లిపెసర, జనుము పచ్చిరొట్ట ఎరువులు వేసవిలో చల్లుకొని అంతర సేద్యం చేస్తే సరిపోతోంది.

నల్లగా మారిన వరి దుబ్బు

అదిరేటి.. జలధార!

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలో తహసీల్దారు కార్యాలయం కూడలిలో కనువిందు చేస్తున్న కప్పుసాసర్ ఫౌంటెయిన్ ఇది. పట్టణంలో పలు ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్లు పనిచేయక నిరుపయోగంగా మారిన తీరుపై 'ఆహ్లాదం.. ఆమడ దూరం' శీర్షికతో ఈ నెల 6న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వాటికి ఇటీవల మరమ్మతులు చేయించారు.

ఉండిలో గ్యాస్ లీకై నలుగురికి గాయాలు

వృద్ధురాలి పరిస్థితి ఆందోళనకరం

6లో

అన్న క్యాంటీన్లు అదుర్స్

80 శాతానికి పైగా జైకొట్టిన ప్రజలు

తాడేపల్లిగూడెంలో భోజనం చేస్తున్న ప్రజలు

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్.. దీనికి పేద, ధనిక తేడా లేదు. ఆకలి మాత్రమే చూస్తోంది. అల్పాహారమైనా, భోజనమైనా రూ.5కు అందిస్తోంది. రోడ్డు పక్కన ఉంటే చిన్న బడ్డీ దుకాణంలో టీ తాగితే రూ.10కి తక్కువ తీసుకోవడం లేదు. అన్ని వర్గాల ప్రజల ఆకలి తీరుస్తున్న 'అన్న క్యాంటీన్ల'కు ఆదరణ పెరుగుతోంది. 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో వీటిని అందుబాటులోకి తీసుకొస్తుంది. తాజాగా అన్న క్యాంటీన్ల నిర్వహణపై ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించింది. 80 శాతానికి పైగా అన్న క్యాంటీన్లకు జైకొట్టారు.

వీటిపై ఆరా.. అన్న క్యాంటీన్లలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఎలా ఉంటుంది, ఆహార నాణ్యత ఎలా ఉంటుంది, సమయానికి తెరుస్తున్నారా వంటి అంశాలపై ప్రభుత్వం ఆరా తీసింది. సంతృప్తి శాతంలో రాష్ట్రంలో ఏలూరు జిల్లా 85.2 శాతంతో 12వ స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా 83.8 శాతంతో 16వ స్థానంలో నిలిచాయి. పశ్చిమలో 12, ఏలూరు జిల్లాలో 10 అన్న క్యాంటీన్లు ఉన్నాయి.

అవును / లేదు	జిల్లా ఏలూరు		పశ్చిమగోదావరి	
పారిశుద్ధ్యం, పరిశుభ్రత	86.9	13.1	82.5	17.5
ఆహారం నాణ్యత	84.2	15.8	83.9	16.1
సకాలంలో తెరుస్తున్నారా	85.4	14.6	84.8	15.2

ఆ 'పైన ఏం జరిగిందో'!

● కొండపై 3వ అంతస్తు నిర్మాణంలో మతలబు

● రూ.10 కోట్లకు పైగా పనులకు టెండర్లు లేవు

నిర్మాణంలో ధర్మ అప్పారావు నిలయం

ఈనాడు-ఏలూరు: వైకాపా ప్రభుత్వ హయాంలో ద్వారకాతిరుమల దేవస్థానంలో చోటుచేసుకున్న బాగోతమిది. ఆలయంలో ధర్మ అప్పారావు నిలయాన్ని (కాటేజీ) 2012లో జీ+1గా నిర్మించారు. దీనిపై 2023లో రెండో అంతస్తు నిర్మాణం(3792 చ.మీ) కోసం రూ.6.98 కోట్లతో ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. రివర్స్ టెండరింగ్‌లో 13 శాతం తక్కువకు ఓ గుత్తేదారు దక్కించుకున్నారు. ఆ పనులు చేస్తుండగానే దానిపై మూడో అంతస్తును ప్రతిపాదించారు.

పనులు రివైజ్డ్ పేరుతో దీనికి టెండర్లు పిలవకుండానే రెండో అంతస్తు నిర్మిస్తున్న అదే గుత్తేదారుకే దేవదాయ శాఖ కమిషనర్ అప్రూవల్ తీసుకుని ఇచ్చారు. 2, 3 అంతస్తుల నిర్మాణం, రంగులకు కలిపి రూ.17 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇందులో రూ.6.98 కోట్ల పనులకే టెండర్లు పిలిచారు. మిగిలిన వాటికి టెండర్లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారు. టెండర్లు పిలిస్తే గుత్తేదారులు పోటీ పడి ఎక్కువ లెస్‌కు వెళ్తారు. దీనివల్ల శ్రీవారికి ఎంతో మిగులుతుంది. దీనిపై అనిశా, విజిలెన్స్ దృష్టి సారిస్తే అసలు టెండర్లు పిలవకుండా పనులు ఇవ్వడం వెనుక ఏం జరిగిందో బయటకు వస్తుంది.

జీవో 94కు తూట్లు జీవో నంబరు 94 ప్రకారం పురోగతిలో ఉన్న పనులకు ఏమైనా మార్పు, చేర్పులు చేయాల్సి వస్తే అదీ నిర్దేశిత అంచనా వ్యయంపై 10 శాతం లోపు పూర్తవుతాయనుకుంటే టెండర్లు లేకుండా ఇవ్వొచ్చని స్పష్టంగా ఉంది. అంతకు మించి వ్యయంతో చేసే ఏ పనులకైనా టెండర్లు తప్పనిసరి. లేదా మంత్రి మండలి ఆమోదం పొందాలని ఇంజినీరింగ్ అధికారులే చెబుతున్నారు.

పనుల సాగతీత.. 18 మాసాల్లో పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ గడువు పూర్తయింది. రెండు సార్లు పొడిగించినా పూర్తికాలేదు. ఆఖరుకు మార్చి నాటికి చేయాలని గడువు పొడిగించారు. రెండు, మూడు అంతస్తుల్లో కొత్తగా 94 గదులు నిర్మిస్తున్నారు. వాటిలో వైరింగ్, మరుగుదొడ్ల సామగ్రి, టైల్స్, రంగులు వేసే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. నాలుగు లిఫ్టులు అమర్చాలి. ఇవన్నీ పూర్తి కావాలంటే మరో 2-3 మాసాలు పడుతుంది.

ఎందుకో గోప్యత? పౌరులు కోరితే నోట్ ఫైల్స్‌తో సహా పనుల వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం చెబుతోంది. కానీ దేవస్థానంలో రూ.కోట్ల విలువైన పనులను ఏ ప్రాతిపదికన కేటాయించారని ఇంజినీరింగ్ విభాగం ఈఈ భాస్కర్‌ను ప్రశ్నిస్తే దేవదాయ శాఖ కమిషనర్ ఆమోదంతో టెండర్లు పిలవకుండా పనులు కేటాయించామని చెప్పారు. ఆ పనుల కేటాయింపు ఒప్పంద పత్రం (అగ్రిమెంట్) అడిగితే బయటకు ఇవ్వకూడదన్నారు. కనీసం దస్త్రమైనా చూపించండి అందులో ఏం రాశారో చూస్తామంటే దానికి ససేమిరా అన్నారు. నిబంధనలు పాటిస్తే అగ్రిమెంట్ కాపీ ఇవ్వటానికి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదు.

భూసేకరణ వేగవంతం చేయాలి : జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: నవాబుపాలెం, ప్రత్తిపాడు, ఆరుగొలను వద్ద మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా చేయాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. రైల్వే, రెవెన్యూ, ర.భ.శాఖల అధికారులతో ఆయన మంగళవారం గూగుల్‌మీట్ నిర్వహించారు. ఆర్‌యూబీలను వేగంగా నిర్మించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భూసేకరణలో ఎటువంటి అభ్యంతరాలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఆయా శాఖలు, స్థానిక సంస్థల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవోలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, ఖతీబ్‌కౌసర్ బానో, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

మామిడి ఆశలపై వర్షం జల్లులు

తెగుళ్ల ఉద్ధృతితో ఆందోళనలో అన్నదాతలు

నూజివీడు, న్యూస్‌టుడే: మామిడి రైతులకు ఈ ఏడాది నిరాశ తప్పేలా లేదు. కొన్నేళ్లుగా సరైన దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం పూత బాగానే వచ్చినప్పటికీ పిందె దశకు వచ్చే సరికి రాలిపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో తెగుళ్ల ఉద్ధృతి పెరుగుతుందేమోనని రైతులు భయపడుతున్నారు.

ఇలా చేయాలి.. **పక్షి కన్ను తెగులు:** 3గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బెండజిమ్ 1 గ్రాము, మ్యాంకోజెబ్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సస్య రక్షణ చర్యలతో మేలు.. ప్రస్తుత వర్షంతో పక్షి కన్ను, మసి మంగు తెగుళ్లు వచ్చే అవకాశం ఉంది. రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా పూత, పిందెలను కాపాడుకోవచ్చని ఉద్యానశాఖ అధికారి ఆర్. హేమ, మామిడి శాస్త్రవేత్త జేకేఎం లక్ష్మి తెలిపారు.

మసి మంగు: ఆకులపై మసిని తొలగించడానికి 2 కిలోల గంజి పొడి 3 లీటర్ల గోరు వెచ్చటి నీటిలో కలిపి ఉడికించాలి. తర్వాత నీరు పోసి 100 లీటర్ల గంజి ద్రావణం తయారు చేసి తెగుళ్లు కనిపించిన భాగాలపై ఎండ బాగా ఉన్న రోజుల్లో పిచికారీ చేయాలి. 4-5 రోజుల తర్వాత నీటిని పిచికారీ చేస్తే మసి మంగు మాయమవుతుంది.

జిల్లా	మామిడి సాగు (ఎకరాలు)	దిగుబడి (టన్నులు)
ఏలూరు	39,000	1,50,000
పశ్చిమ	2,609	13,200

26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ఆశయాలతో నిండిన మహాయజ్ఞమని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అన్నారు. ఉద్యమ పేట నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదుపై భీమవరం నియోజకవర్గ సమావేశం భీమవరంలోని త్యాగరాజ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఉద్యమ సభ్యత్వ నమోదు ఎంతో కీలకమన్నారు. భీమవరం అంటే పవన్‌కల్యాణ్‌కు ఎంతో ఇష్టమన్నారు. భీమవరం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తానని పవన్ చెప్పారన్నారు. ప్రతి నెలా జనసైనికులతో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యక్రమంలో పాల్గొన్న గోవిందరావు, రామాంజనేయులు తదితరులు

హామీని నిలబెట్టుకోకపోతే ఆందోళన ఉద్ధృతం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. బలరాం అన్నారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రం భీమవరంలో చేపట్టిన 36 గంటల దీక్ష మంగళవారం కొనసాగింది. తెల్లవారు జామున దీక్ష శిబిరం వద్దకు బలరాం చేరుకుని రైతులకు సంఘీభావం తెలియజేశారు. సీనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజరాజామోహనరావు రైతులకు సంఘీభావం తెలిపి దీక్షను విరమింపచేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రామాంజనేయులు, నాయకులు పి. నరసింహమూర్తి, కె. శ్రీనివాస్, నాగిరెడ్డి, ఎం. అంజనేయులు, విజయ్, వెంకటేశ్వరరావు, రాము, గోపాలరావు, నాగేశ్వరరావు, నాగరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బలరాం

26న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 9.30 గంటలకు ఏలూరు సమీపంలోని టీటీడీసీలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివి, 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన వారు హాజరు కావచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు 92476 30162 నంబరులో సంప్రదించవచ్చని తెలియజేశారు.

డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీగా మడకం సావిత్రి ఉద్యోగోన్నతిపై నియమితులయ్యారు. ఇదే జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎంగా పనిచేస్తున్న పెంచల ప్రభాకర్ మార్కాపురం ఆర్డీవోగా, ఏలూరు జిల్లా ఆర్‌ఎంసీ యూనిట్-2 ఎస్‌డీసీగా జీవీ సత్యవాణి నియమితులయ్యారు.

బోధనలోనే విశ్రాంతి..

పాలకొల్లు, యలమంచిలి, భీమవరం పట్టణం, పోడూరు, న్యూస్‌టుడే: సమాజం మనకేమి ఇచ్చింది అని కాకుండా.. మనకు ఎన్నో ఇచ్చిన సమాజానికి తిరిగి ఏమివ్వగలమని ఆలోచించే ఉపాధ్యాయులు వారు. సర్వీసు అంతా నిజాయతీతో పని చేసి వేలాది మంది విద్యార్థుల జీవితాలకు బాటలు వేశారు. ఉద్యోగ విరమణ చేశాక కూడా అవసరం ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి పాఠాలు బోధిస్తున్నారు. పరీక్షలు సమీపించిన తరుణంలో ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తూ పేద విద్యార్థుల ప్రగతికి పాటుపడుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రత్యేక పాఠాలు

పిల్లల బాగు కోసం.. యలమంచిలి మండలం వైద్యులంకకు చెందిన బోలి శెట్టి శివన్నారాయణ హిందీ సబ్జెక్టు బోధించే వారు. ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. బాడవ యూపీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు లేరని తెలుసుకుని నిత్యం 8 కిలోమీటర్లు రాకపోకలు సాగిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. తనకు ఓపిక ఉన్నంత వరకు అవసరం ఉన్న పాఠశాలలకు వెళ్లి బోధన కొనసాగిస్తానని శ్రీమన్నారాయణ చెబుతున్నారు.

స్వచ్ఛందంగా.. పోడూరు మండలం మట్లపాలెంకు చెందిన బండి సుదర్శనరావు 2017లో ఉద్యోగ విరమణ చేశారు. తన స్వగ్రామం మట్లపాలెంలోని ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు నేటికీ సాంఘిక శాస్త్రం పాఠాలను స్వచ్ఛందంగా బోధిస్తూ ఆదర్శ గురువుగా నిలుస్తున్నారు. గతేడాది ఈ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడు జయప్రకాశ్ ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత ఆ పోస్టు భరీ కాలేదు. దీంతో సుదర్శనరావు గతేడాది జూన్ నుంచి క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ ఎనిమిది నెలల కాలంలో ఆయన ఒక్క రోజు కూడా సెలవు పెట్టలేదంటే విద్యార్థుల భవిష్యత్తుపై ఆయనకున్న శ్రద్ధను తెలియజేస్తోంది.

బోధిస్తున్న సుదర్శనరావు

30 పాఠశాలల్లో.. గురుతర బాధ్యతతో అవిశ్రాంతం పనిచేస్తానని చెబుతున్నారు భీమవరానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కలిగితి గోపాలశర్మ. ఆరేళ్ల కిందట ఉద్యోగ విరమణ పొందిన ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లోని 30 పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. పదో తరగతి తెలుగు పరీక్షలో మార్కులు సాధించడం, అక్షర దోషాలు లేకుండా రాయడంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న గోపాలశర్మ

ఉపాధి పనుల్లో మస్తర్ల మాయ

- చనిపోయిన వారి పేరిట నమోదు
- రూ. 31 వేలు రికవరీకి ఆదేశం

వీరవాసరం, న్యూస్‌టుడే: ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా పథకాన్ని వీబీజీరాం జీగా మార్పు చేసిందని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అన్నారు. వీరవాసరం మండల పరిషత్ కార్యాలయం వద్ద 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. డ్వామా పీడీ అప్పారావు మాట్లాడుతూ ఉపాధి పథకంలో అవినీతికి పాల్పడినవారు గతంలోలా తప్పించుకునే వీలు లేదన్నారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా రూ.6.76 కోట్లతో మొత్తం 659 ఉపాధి పనులు, మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేపట్టారు. ఇందులో కూలీల వేతనం కింద రూ.4.12 కోట్లు చెల్లించారు. సామాజిక తనిఖీలో సిబ్బంది రికార్డులు సరిగా నిర్వహించకపోవడం, మస్తర్లలో కొట్టివేతలు, సంతకాలు లేకుండా చెల్లింపులు చేయడం తదితర అంశాల్లో రూ.9.06 లక్షలు దుర్వినియోగం జరిగిందని తనిఖీ సిబ్బంది ప్రజావేదికలో వెల్లడించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.8.75 లక్షల పనికి సంబంధించి మరోమారు ఏపీడీ విచారణకు పీడీ అప్పారావు ఆదేశించారు. మెంటేపూడి గ్రామంలో చనిపోయిన వ్యక్తులు, గ్రామంలో లేనివారు పనులు చేసినట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఇదే గ్రామంలో ఒక చోట బదులుగా మరో చోట రహదారి నిర్మాణం చేసినట్లు వెల్లడించారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ సిబ్బంది నుంచి రూ.31 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవీవో మల్లికార్జునరావు, ఎంపీడీవో కేఎం వైభవతి, క్యాలిటీ కంట్రోల్ అధికారి కేవీ రమణ, సిబ్బంది వర్మ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

విజేతలతో దాతలు, నిర్వాహకులు

ముగిసిన టోర్నమెంట్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో ద్వారకా స్పోర్ట్స్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నాన్ మెడలిస్ట్ షటిల్ టోర్నమెంట్ సోమవారం రాత్రి ముగిసింది. సింగిల్స్ విభాగంలో భీమవరానికి చెందిన విజయ్, డబుల్స్ విభాగంలో కాకినాడకు చెందిన ప్రవీణ్, నాని విజేతలుగా నిలిచారు. వీరికి దాతలు మొగతడకల శ్రీనివాసరావు, మొగతడకల ఓం ప్రకాశ్ చౌదరి, ఇమ్మడి రత్నాజీ, మల్లిపెద్ది రాజేంద్ర, మహంకాళీ గంగాధర్, గువ్వల మావుళ్లు, గోరింట్ల చంద్రం, ఇమ్మడి శ్రీను నగదు బహుమతులు అందజేశారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విన్నర్స్‌కి రూ.15 వేలు, రన్నర్స్‌కి రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

సక్రమ నిర్వహణతో సత్ఫలితాలు

పెదకాపవరంలో యునిసెఫ్ బృందం పర్యటన

పెదకాపవరం(ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలం పెదకాపవరంలో మంగళవారం యునిసెఫ్ అధికారుల బృందం ప్రతినిధులు ఎ. వెంకటేశ్, సీహెచ్ భానుప్రకాష్, గ్రేస్ రాజు పర్యటించారు. తొలుత రక్షిత నీటి పథకానికి సంబంధించి ఓహెచ్ ఆర్ఎస్ ట్యాంకులు, పంపు హౌస్, ఫిల్టర్‌బెడ్లు, మైక్రో ఫిల్టర్లు వాటి నిర్వహణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు అవలంబిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమకూర్చిన వసతులు, విద్యా బోధన తదితర అంశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని సమావేశ మందిరంలో గ్రామస్థులు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లతో సమావేశమై గతానికి ప్రస్తుతం తాగునీరు, విద్యా, ఆరోగ్య తదితర విషయాలలో వచ్చిన మార్పులు, ప్రగతిపై వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం తదితర అంశాలపై వివరాలు అడిగారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని, అసంపూర్తిగా ఉన్న బాలసదనం భవనాన్ని పరిశీలించారు. అభివృద్ధి చేసిన వాటిని సక్రమంగా నిర్వహిస్తేనే నాణ్యమైన సేవలు గ్రామస్థులకు పూర్తిస్థాయిలో అందుతాయని ఆ దిశగా యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని బృందం ప్రతినిధులు సూచించారు. వారి వెంట ఎంపీపీ కఠారి జయలక్ష్మి, డీఎల్‌డీవో వై. దోసిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కె. శ్రీనివాసరావు, డీఈఈ టి. శ్రీనివాసరావు తదితర అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామస్థులతో సమావేశమైన ప్రతినిధులు

ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఛైర్మన్‌గా చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శిగా టి. రామారావు, కో-ఛైర్మన్లుగా ఆర్. రవికుమార్, ఎన్. రామారావు, కేఆర్ పవన్, పి. ఆంజనేయులు, జి. మోహన్, జీవీ గణేశ్ నియమితులయ్యారు. మొత్తం 27 మందితో నూతన కార్యవర్గాన్ని నియమించారు.

పొన్నూరు ఎమ్మెల్యే తల్లి ఇంట్లో చోరీ కేసులో...

ఐదుగురు సభ్యుల ముఠా అరెస్టు

నిందితుల్లో వైకాపా సర్పంచి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తల్లి ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో వైకాపాకు చెందిన ఏలూరు జిల్లా చాటపర్రు సర్పంచి గుడిపూడి రఘు ఉన్నారు. నిందితుల నుంచి 42 సవర్ల బంగారు ఆభరణాలు, 10.50 కిలోల వెండి, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలు వెల్లడించారు. ఏలూరు జిల్లాకు చెందిన సత్తెనపల్లి రాకేష్ చోరీలు చేయడంలో దిట్ట. ఇతనిపై 34 కేసులున్నాయి. ఇతని స్నేహితులు ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కలపాలేనికి చెందిన కొక్కిలిగడ్డ ఆశీర్వాదం, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన జల్లి డెయిన్‌కుమార్ అలియాస్ ఆశిష్, ఏలూరుకు చెందిన నక్కల దుర్గాప్రసాద్, పమ్మి కృపాశామ్యూల్ అలియాస్ బన్నీ, దగ్గుమల్లి చినబాబు అలియాస్ విక్కీలు ఈ నెల 15న చీరాల బీచ్‌కు వెళ్లి కారు దొంగతనం చేశారు. 16న ఎమ్మెల్యే నరేంద్ర తల్లి ప్రమీలాదేవి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి.. అదే రోజు ఇంట్లోకి ప్రవేశించి 42 సవర్ల బంగారు ఆభరణాలు, 10.50 కిలోల వెండి, రూ.లక్ష నగదు చోరీ చేశారు.

వెండి కరిగించిన సర్పంచి.. ముఠా సభ్యులు తమకు పరిచయం ఉన్న ఏలూరు జిల్లా చాటపర్రు సర్పంచి గుడుపూడి రఘుకు వెండి ఆభరణాలు విక్రయించారు. ఇతను వాటిని కరిగించి వెండి ఇటుకలా మార్చాడు. ఐదు దశాబ్దాల కిందటి సరస్వతీ విగ్రహాన్ని కరిగించలేదు. ఇతనిపై రౌడీషీట్‌తోపాటు ఎనిమిది కేసులున్నాయి. కొన్ని బంగారు ఆభరణాలను రాకేష్ తల్లి దాచిపెట్టింది. ఘటనాస్థలిలో లభించిన వేలిముద్రలు, సాంకేతిక ఆధారాలతో డీఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో సీఐ కృష్ణయ్య ఎస్సైలు శ్రీహరి, వీరనారాయణ బృందం ముఠాను పట్టుకుంది. సత్తెనపల్లి రాకేష్, ఆశీర్వాదం, డెయిన్‌కుమార్, దుర్గాప్రసాద్, రఘులను అరెస్టు చేశామని ఎస్పీ చెప్పారు.

ట్రిపుల్ ఐటీలో లింగ్విస్టిక్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కార్యశాల

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈ నెల 25, 26 తేదీల్లో లింగ్విస్టిక్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కార్యశాల నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ వర్క్ షాపులో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, కథలు రాయడం, అనువాదం చేయడం వంటి పనులు సులభంగా చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ప్రధాన వక్తలుగా ఆచార్య దేవిరెడ్డి విజయలక్ష్మి(సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్), రహీమునిద్దీన్(గ్నోరెక్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్) నేరుగా ప్రసంగిస్తారన్నారు. డా. తొట్టెంపూడి గణేశ్(హిడెల్బెర్గ్ యూనివర్సిటీ, జర్మనీ), ఎర్రా చిరంజీవి(ఐఐటీ, హైదరాబాద్) ఆన్‌లైన్‌లో విద్యార్థులతో మాట్లాడతారని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే కార్యశాలకు తెలుగు శాఖ విభాగాధిపతి ఉడుము ఝాన్సీ కన్వీనర్‌గా, ఇతర ఆచార్యులు కో కన్వీనర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అదనపు కట్నం కోసం వివాహితను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అత్తిలి మండలం బల్లిపాడుకు చెందిన చెన్నంశెట్టి శివకు గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన చెన్నంశెట్టి మధు(25)కి ఏడేళ్ల కిందట వివాహమైంది. వివాహమైన నెల రోజులకే భర్త శివ కువైట్‌కు వెళ్లాడు. అనంతరం భార్యను కూడా తీసుకెళ్తానని చెప్పి తీసుకువెళ్లలేదు. భర్త కువైట్ నుంచి వచ్చిన తర్వాత అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్తతోపాటు అత్త నాగమణి, ఆడపడుచు ఉరదాళ్ల సత్యవతి, చిన్న ఆడపడుచు తిరుమలశెట్టి దేవి తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసి పుట్టింటికి పంపించేశారని బాధితురాలు చెన్నంశెట్టి మధు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ రాజు తెలిపారు.

బైక్ చోరీలు చేస్తూ దొరికిన ర్యాపిడో రైడర్

సైదాబాద్, న్యూస్‌టుడే: ర్యాపిడో రైడర్‌గా కొనసాగుతూ విలాసవంత జీవితం కోసం ద్విచక్రవాహన దొంగగా మారాడు. ఏడాది వ్యవధిలో నాలుగు ఠాణాల పరిధుల్లో 12 బైకులు చోరీ చేసి తప్పించుకుని తిరుగుతూ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. సహకరించిన మరో వ్యక్తిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మలక్‌పేట ఠాణాలో ఏసీపీ కె. సుబ్బరామిరెడ్డి.. ఇన్‌స్పెక్టర్ పి. నరేశ్, డీఎస్సై కిరణ్ లాల్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. మలక్‌పేట ఠాణా ఎదుట మూసారాంబాగ్ మెట్రో రైల్ స్టేషన్ లిఫ్ట్ ఎదుట జనవరి 4న సైదాబాద్ నివాసి మహమ్మద్ ఉమర్ షరీఫ్(మిధానిలో ఉద్యోగి) తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి వెళ్లాడు. తిరిగి వచ్చాక బైక్ కనిపించలేదు. పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి.. దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం మూసారాంబాగ్-అంబర్‌పేట మార్గం మోర్ సూపర్ మార్కెట్ సమీపాన వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు దొంగలించిన బైకు మీద అనుమానాస్పదంగా ఉన్న తమ్ముు వీర వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీల విషయాలు బయట పెట్టాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం దుంపగడప పల్లెపాలెం ప్రాంతానికి చెందిన ఆయన కొన్నాళ్లుగా నాగోల్ డీమార్ట్ దగ్గర దేవేందర్‌నగర్ కాలనీలో నివసిస్తూ... ర్యాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. విలాసవంత జీవితం కోసం మారు తాళాలతో మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించేవాడు. వాటిని అంబర్‌పేట దేవేందర్‌నగర్ కాలనీలోని సయ్యద్ అన్వర్ వద్ద ఉంచేవాడు. మలక్‌పేట ఠాణా పరిధిలో 4, ఎల్బీనగర్ ఠాణా పరిధిలో 3, చైతన్యపురి, ఉప్పల్ ఠాణాల పరిధుల్లో రెండు చొప్పున ద్విచక్ర వాహనాలు దొంగిలించాడు.

ఇద్దరు నిందితులు, స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

పారిశ్రామికవేత్త రామచంద్రరావు కన్నుమూత



తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, గౌతమి సాల్వెంట్స్ పరిశ్రమ అధినేత మల్లిన రామచంద్రరావు (93) మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య భద్రమ్మ, కుమారులు వెంకట రాయుడు, రవికాంత్, కుమార్తె ఇందిరాదేవి ఉన్నారు. 1970లోనే పరిశ్రమలు స్థాపించడం ప్రారంభించారు. తణుకు, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో ఆయిల్, స్పిన్నింగ్, పవర్ తదితర పరిశ్రమలు స్థాపించారు. కరోనా సమయంలో పట్టణంలోని 27, 28, 29, 30 వార్డులను దత్తత తీసుకొని కూరగాయలు, నిత్యావసర సరకులు అందించడంతోపాటు రోటరీ క్లబ్, రామకృష్ణ సేవా సమిత ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీఎస్ఆర్ నిధులతో పట్టణంలోని సెంటర్ లైటింగ్‌తో పాటు వివిధ అభివృద్ధి పనులకు విరాళాలు అందజేసి పట్టణాభివృద్ధికి తోడ్పడ్డారు. ఆయన మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతోపాటు పలువురు సంతాపం ప్రకటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ఉండిలో గ్యాస్ లీకై నలుగురికి గాయాలు

వృద్ధురాలి పరిస్థితి ఆందోళనకరం

ఉండి, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉండి చిక్కాలవీరన్ననగర్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒకింట్లో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో నలుగురు గాయాలపాలయ్యారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు మహిళలు, గ్యాస్ డెలివరీ బాయ్ గాయపడగా.. వీరిలో వృద్ధురాలి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిక్కాల వీరన్ననగర్‌లో నివాసముంటున్న మాసాబత్తుల లక్ష్మి కొన్నిరోజుల క్రితం కంటికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆమె తల్లి బగ్గ సుబ్బాయమ్మ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం కేసనపల్లి నుంచి వచ్చి 20 రోజుల నుంచి ఉండిలో ఉంటున్నారు. వియ్యపురాలిని పలకరించేందుకు ఏలూరులోని తంగెళ్లమూడికి చెందిన ఇమ్మంచి జయ మంగళవారం వచ్చారు. మూడు రోజుల కిందట ఒక ఏజెన్సీ సరఫరా చేసిన గ్యాస్ బండ సరిగా పని చేయకపోవడంతో లక్ష్మి ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం.1.30 గంటల ప్రాంతంలో డెలివరీ బాయ్ తాడిచర్ల ప్రసాద్ వచ్చి గ్యాస్ కనెక్షన్ పరిశీలించారు. ఆయన సూచన మేరకు గ్యాస్ వెలిగించగానే మంటలు ఎగసి పడి ముగ్గురు మహిళలతోపాటు ప్రసాద్‌కు గాయాలయ్యాయి. ప్రసాద్ మరో ద్వారం నుంచి గ్యాస్ బండను బయటకు నెట్టారు. గ్యాస్ తాకిడికి ఆ తలుపు తునాతునకలై చెల్లాచెదురుగా పడింది. మంటలను ఆర్పడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గాయపడిన వారిని 108 అత్యవసర వాహనంలో భీమవరంలోని ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విజయవాడలోని ఆసుపత్రికి తరలించారు. సుబ్బాయమ్మకు కాలిన గాయాలు ఎక్కువగా ఉండటంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు వివరించారు. ఎస్సై నసీరుల్లా సంఘటనా స్థలిని, క్షతగాత్రులను పరిశీలించి కేసు నమోదు చేశారని తెలిపారు.



దెబ్బతిన్న తలుపు

గాయపడి చికిత్స పొందుతూ..

రోగుల నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రి సిబ్బంది రోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. వైద్యఆరోగ్యశాఖాధికారులు, ప్రభుత్వ వైద్యులతో ఆమె మంగళవారం కలెక్టరేట్ నుంచి దూరదృశ్య సమావేశం నిర్వహించారు. సర్కారు ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తగ్గడంపై వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన వైద్య సేవలందించాలని స్పష్టం చేశారు. నూరు శాతం లక్ష్యాలు సాధించేలా శాఖాపరమైన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అత్యవసర వైద్యం కోసం వచ్చేవారిని వివరాల కోసం ఆలస్యం చేయకుండా తక్షణమే వైద్యం చేయాలన్నారు.

✦ ప్రతిష్ఠాత్మంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన డిసెంబరు 29 నుంచి ఇప్పటి వరకు 394 దరఖాస్తులు రాగా 65 పరిష్కరించామన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.

✦ భీమవరంలోని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈనెల 27 నిర్వహించబోయే మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దానికి సంబంధించిన గోడపత్రాన్ని ఆమె మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు https:///naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9492885556 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

పోలీసు శాఖలో సాంకేతికతను వినియోగించండి : ఎస్పీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సాంకేతికత, డిజిటల్ విధానాలను పోలీసుశాఖలో ఉపయోగించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. మంగళవారం జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో సాక్ష్యాధారాల సేకరణ, సమన్ల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలపట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పది, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో గోప్యత పాటించాలన్నారు. మార్చి 14న జరిగే లోక్ అదాలత్‌లో గరిష్ఠంగా కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు సూచించాలన్నారు. డీఎస్పీలు రఘువీర్ విష్ణు, డి. విశ్వనాథ్, జి. శ్రీవేద, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కె. వి. వి. ఎన్. సత్యనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా పాల్గొన్నారు.

గుత్తేదారుపై మోసం కేసు

కలిదిండి, న్యూస్‌టుడే : డబ్బు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించక పోవడంతో బాధితురాలి ఫిర్యాదుమేరకు మోసం కేసు నమోదు చేసినట్లు కలిదిండి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన రామ్మోహనరావు రైల్వేలో పని చేస్తున్నారు. ఆయన కార్యాలయం వద్ద గుత్తేదారుగా పని చేస్తున్న కోరుకొల్లుకు చెందిన బాలాజీ అయిదేళ్లుగా రామ్మోహనరావు కుటుంబానికి సన్నిహితంగా ఉంటున్నారు. ఈ క్రమంలో బాలాజీకి అవసరం అయినప్పుడల్లా రామ్మోహనరావు భార్య రాజ్యలక్ష్మి వద్ద అప్పు తీసుకుని తిరిగి ఇచ్చేసేవారు. బాలాజీపై వాళ్లకు నమ్మకం కుదరడంతో భార్యాభర్తల క్రెడిట్ కార్డులు కూడా ఆయనకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో దఫదఫాలుగా రూ.87.55 లక్షల వరకు బాలాజీ అప్పు తీసుకునట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మొత్తం డబ్బు చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినా.. బిల్లులు వచ్చాక ఇస్తానంటూ కాలయాపన చేస్తుండటంతో రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని వినతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి. ప్రకాశం మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా విద్యారంగంలో అనుభవం ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలనడం సబబు కాదన్నారు. రెండేళ్లలోపు ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగ అర్హత కోల్పోతారని, పదోన్నతి రాదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. టెట్ నుంచి మినహాయించేలా పార్లమెంటులో చట్ట సవరణ చేసేలా కృషి చేయాలని కోరారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

JOBS

WANTED AXIS BANK కొరకు ఏలూరు నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. లలితా ఫైనాన్స్ లింక్స్ కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ. ✆7729989278

ఉద్యోగం: E&W జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు కావలెను. జీతం, రూం+భోజనం ఫ్రీ. R.S.సర్వీసెస్, RJY, 9963327756.

పాలకొల్లులో ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ నందు ★సేల్స్ ఆఫీసర్స్ ★ సేల్స్ మేనేజర్స్‌గా పనిచేయుటకు యువతి/యువకులు కావలెను. Fresh/Exp. Qul: 10th to డిగ్రీ. 86398 28914.

SECURITY GUARDS

ప్రముఖ బ్యాంకులలో పని చేయుటకు అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 21to45, అర్హత: 10th. PF+ESI కలదు. ✆ 96522 40528, 97049 64931, 94918 84025.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

REAL ESTATE

HOUSE FOR SALE

ఏలూరు సత్రంపాడు MRC కాలనీకు ఆనుకొని వెంకటకృష్ణ నగర్‌లో ఈస్ట్, వెస్ట్, నార్త్ ఫేస్‌గల ఇండివిడ్యువల్ బిల్డింగ్స్ అమ్మకమునకు కలవు. ✆ 90598 45535, 90595 24018.

LAND FOR SALE

ఏలూరు చాటపర్రు మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సుమారు 7 ఎకరముల పొలం అమ్మకమునకు కలదు. సంప్ర॥ శ్రీమతి ఆచంట రజని, ✆ +16303867373.

PLOT FOR SALE

ఏలూరు నిమ్మకాయల యార్డ్ SMR ఇంటి దగ్గర ప్లాట్‌నెం. 183 240 చ॥గ॥ ఇంటి నిర్మాణమునకు అనువైన స్థలము అమ్మకము. ✆ 93810 31966.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 4.80 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం
• భీమవరం • ఉండి

సామాజిక తనిఖీ పారదర్శకంగా సాగాలి : ఎంపీడీవో

కాళ్ల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామాల్లో పారదర్శకంగా జరగాలని ఎంపీడీవో స్వాతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీలు నిర్వహించేందుకు సమన్వయ సమావేశం జరిగింది. ఉపాధి పనుల నిమిత్తం ఖర్చు చేసిన నిధుల వివరాలు ఆడిట్ అధికారులకు సక్రమంగా అందజేయాలన్నారు. నిజనిర్ధారణకు అన్ని శాఖల సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ నెల 25 నుంచి అన్ని గ్రామాల్లో ఆడిట్ బృందాలు తనిఖీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకోసం మార్చి 2వ తేదీ వరకూ గ్రామ సభలు జరుగుతాయని వెల్లడించారు. సమావేశంలో పీఆర్ ఏఈ రమేష్‌బాబు, ఈసీ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీఎస్ మీరావల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపాకు బలం కార్యకర్తలే

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: తెదేపాకి కార్యకర్తలే బలమని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు మద్దుల రాము అన్నారు. పార్టీ పట్టణ కార్యాలయంలో మంగళవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో ఐదేళ్ల పాటు రాష్ట్రం నాశనమైందని కార్యకర్తల కృషితో మళ్లీ అధికారంలోకి వచ్చామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. సమావేశంలో తెదేపా పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, సంయుక్త కార్యదర్శి గంధం రాధ, నాయకులు యలమంచిలి శ్రీనివాస్, యాళ్ల సురేష్, చెరుకూరి తిరుపతిరావు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం:	80085 74471	గునుపూడి:	80085 74474
భీమవరం మండలం:	80085 74533	వీరవాసరం:	80085 74475
పాలకోడేరు:	80085 74467	ఉండి:	80085 74526
ఆకివీడు:	80085 74525	కాళ్ల:	94401 04042

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? 6వ వార్డు పారిశ్రామికవాడలో ప్రధాన రహదారి నుంచి నర్సయ్యఅగ్రహారం వచ్చే మార్గంలో డ్రెయిన్లలో పూడికతీయడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది.- **ఎం.శ్రీనివాసరావు, స్థానికుడు.**

✔ ఆ ప్రాంతాలు పరిశీలించి శుభ్రం చేయిస్తాను. - **కె.సూర్యనారాయణరాజు, పురపాలక పారిశుద్ధ్య అధికారి**

దొడ్డనపూడి(కాళ్ల), న్యూస్‌టుడే: ? గ్రామానికి వెళ్లే దారిలో చెత్త నిల్వ చేస్తున్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లి రావాలంటే ఆ ప్రాంతంలో దుర్వాసన విపరీతంగా ఉంటుంది. - **సత్యనారాయణ, స్థానికుడు.**

✔ గతంలో ఈ సమస్య అధికంగా ఉండేది. ప్రస్తుతం చెత్తను తొలగించి మిగిలిన వర్థాలను కాల్చేస్తున్నాం. మరోసారి అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. - **పోలయ్య, కార్యదర్శి, దొడ్డనపూడి.**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పాలకోడేరు శివారు పంతొట్టి సమీపంలో శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు.
- **కె.శ్రీను, పాలకోడేరు.**

✔ చర్యలు తీసుకుంటాం. **-బి.గోపి, కార్యదర్శి**

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? తాడేరు పరిధిలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. **-నాగేశ్వరరావు**

✔ పరిష్కారానికి చర్యలు చేపడతాం.
-పార్వతి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

డ్రెయిన్లు శుభ్రం.. **భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే :** 19వ వార్డు, పెద మసీదు నుంచి భీమేశ్వరస్వామి ఆలయం వైపు వచ్చే రహదారిలోని డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉందని ఆదివారం ప్రచురితం కాగా పురపాలక పారిశుద్ధ్య అధికారి చంటి స్పందించి డ్రెయిన్లు శుభ్రం చేయించారు.

నాడు వృథా.. నేడు వ్యధ!

ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల తీరు

ఉండి, భీమవరం గ్రామీణ, వీరవాసరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నాడు .. నేడు పథకంలో పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణాలు నేడు అక్కరకు రాని పరిస్థితులు కొన్ని చోట్ల నెలకొంటున్నాయి. అవసరమైన కొన్ని ప్రాంతాల్లో తరగతి గదుల నిర్మాణాలు ఈనాటికీ చేపట్టని పరిస్థితులు ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో పలు చోట్ల ఉన్నాయి. దీంతో అరకొర వసతుల మధ్య అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

చినపుల్లేరులో అభివృద్ధి పరిచిన ప్రాథమిక పాఠశాల. విద్యార్థులెవరూ చేరకపోవడంతో 2025లో మూసేశారు. ఈపనుల కోసం వెచ్చించిన ప్రజాధనం వృథాగా మారి నిరుప యోగమైంది.

రెండేళ్ల నుంచి మూతపడుతూ..

✦ ఉప్పులూరు ప్రధాన పాఠశాలలో విద్యార్థుల చేరిక నిలిచిపోవడంతో రెండేళ్ల కిందటే మూతపడింది. ఇక్కడ భవనం నిరుపయోగమే. ✦ చినపుల్లేరు, ఉండి తోట పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో వాటిని మూసేశారు. ఆ భవనాలు నిరుపయోగమయ్యాయి. ✦ వీరవాసరం మండలంలో రాయకుదురు-1, గాంధీబజార్, ఎల్లమ్మచెరువు పాఠశాలలను అభివృద్ధి పరిచారు. ఇక్కడ నేడు కేవలం 10 మందిలోపు విద్యార్థులున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో గత ప్రభుత్వం విఫలమైంది. ✦ భీమవరం మండలం తాడేరు ప్రత్యేక పాఠశాలను రెండంతస్తులుగా అభివృద్ధిపరిచినా పిల్లలు చేరకపోవడంతో దాన్నీ మూసేశారు. అక్కడ అంగన్వాడీ కేంద్రానికి వినియోగిస్తున్నారు. మిగిలిన గదులు అలంకారప్రాయంగా ఉండిపోయాయి.

వచ్చే విద్యా సంవత్సరానికైనా.!

● వీరవాసరం మండలం జొన్నలపాలెం ఒకటో ప్రాథమిక పాఠశాల భవనం స్లాబ్ పూర్తిగా దెబ్బతింది. నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు. ● పాందువ్వలో ఉన్నత పాఠశాలలో 128 విద్యార్థులున్నారు. నాలుగు అదనపు గదులు అత్యవసరం. ● వాండ్రంలో రెండు, పడవలవానిపేట, బొక్కావారిపాలెం, పాందువ్వ ప్రత్యేకం, ఉత్తరపాలెంల్లో ఒక్కొక్క గది చొప్పున నిర్మించాలనే ప్రతిపాదనలు వెళ్లాయి.

ప్రతిపాదనలు సిద్ధం : తరగతిగదులు అవసరమైనచోట్ల ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతారు. పిల్లలు లేనిచోట్ల పాఠశాలలు మూతపడిన విషయం వాస్తవమే. రాబోయే విద్యా సంవత్సరానికి ముందుగానే చేరికలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. **- వినాయకుడు, ఎంఈవో-2, ఉండి.**

పవనపుత్రునికి పంచామృతాభిషేకాలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఫాల్గుణమాసం తొలి మంగళవారం సందర్భంగా కొత్త బస్టాండ్ వెనుక ఉన్న దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారికి వివిధ రకాల పుష్పాలు, తమలపాకులతో నేత్రపర్వంగా అలంకరించి సింధూర్చన, సహస్ర నామ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వృత్తి నైపుణ్యాలతో ఉత్తమ అవకాశాలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొంటే ఉత్తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సురేశ్‌కుమార్ అన్నారు. కళాశాలలో ఏపీ ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండో-యూరో సిక్రోనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నైపుణ్యవృద్ధి సదస్సులో ఆయన మాట్లాడారు. రీసోర్స్‌పర్సన్ కొప్పర్తి వంశీ మణితేజ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మెప్మా నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మెప్మా జిల్లా తాత్కాలిక పీడీ జి.హెప్సిబా తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ జిల్లా స్థాయి సిబ్బంది సమావేశం భీమవరంలో మంగళవారం జరిగింది. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమంలో అర్హులను ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణ సదుపాయాలతో పాటు వ్యాపార అభివృద్ధికి సూచనలు చేయాలన్నారు. జీవనోపాధులు విభాగ అధికారి సీహెచ్ నానిబాబు, ఐబీ స్పెషలిస్ట్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన బాగుపడేదెప్పుడో..

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణం బైపాస్ రోడ్డులో అనాకోడేరు పంట కాలువపై ఉన్న వంతెన ఇది. గతంలో దీన్ని నిర్మించినప్పుడే అదనపు వ్యయంతో ఇరుపక్కలా పాదచారుల కోసం బాటను ఏర్పాటు చేశారు. అవి కొన్నేళ్ల కిందటే శిథిలమయ్యాయి. వంతెన రెయిలింగ్‌లు ధ్వంసమయ్యాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి దీన్ని బాగు చేయించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలతో ఎక్కడి మురుగు అక్కడే

గొల్లలకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే: గొల్లలకోడేరు పంచాయతీ పరిధిలో పలుచోట్ల డ్రెయిన్లు ఆక్రమణలతో నిండిపోవడంతో స్థానికులు మురుగు నీటి సమస్యలతో తీవ్రంగా సతమతమవుతున్నారు. ముఖ్యంగా లూథరన్ దేవాలయ సమీపంలో మురుగుకాలువలో కలిసేలా డ్రెయినేజీని పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. వర్షం కురిస్తే మురుగంతా రోడ్డుపై తిష్ఠ వేస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చర్యలు తీసుకుంటామని కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు.

చర్చి సమీపంలో నిలిచిపోయిన మురుగు

సేల్స్‌మెన్స్ కావలెను
తణుకు చందన సిల్క్ శారీస్ షాపుకు శారీస్ సెక్షన్‌కు అనుభవజ్ఞులైన సేల్స్‌మెన్స్ కావలెను.
భోజనం + వసతి, మంచి జీతం ఇవ్వబడును.
9885591188
9052581869

అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

ఉపసభాపతి రఘురామకృష్ణరాజుతో విద్యార్థులు, అధ్యాపకులు

దుంపగడప(ఆకివీడు), న్యూస్‌టుడే: దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులు మంగళవారం అమరావతిలోని అసెంబ్లీని సందర్శించారు. గ్యాలరీ నుంచి అసెంబ్లీలో జరిగిన చర్చలను ప్రత్యక్షంగా చూసి అవగాహన చేసుకున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణరాజుని కలిసి అసెంబ్లీ ప్రొసీడింగ్స్ గురించి తెలుసుకోవడం జరిగిందని ప్రిన్సిపల్ కె.సుజాత తెలిపారు.

26 నుంచి సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్ర

వీరవాసరం, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి మార్చి 23 వరకు ప్రజా సమస్యలపై సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా పార్టీ సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఉత్తరపాలెం గ్రామ శాఖ సమావేశంలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర గోడ పత్రికను నాయకులు ఆవిష్కరించారు. జిల్లాలో 20 మండలాల్లో 600 కిలోమీటర్ల మేర యాత్ర జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు కేతా జ్యోతిబసు, కొలాపి సత్యనారాయణ, పాలా ఆజాద్, కోటేశ్వరరావు, కోడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వరిచేలకు నీటి సరఫరా

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం చెరుకుమిల్లిలో వరిచేలకు సాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులు, అవస్థలు, ఆందోళన తీరుపై ఈ నెల 23న 'ఈనాడు'లో 'సాగునీరు కరవు.. రైతు గుండె బరువు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయిల్‌ఫెడ్ సంస్థ అధ్యక్షుడు మంతెన మురళీరాజు స్పందించారు. మంగళవారం నాలుగు పెద్ద విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసి మేజర్ కాలువ వెంకయ్యవయ్యేరులోని నీటిని పంటకాలువలకు మళ్లిస్తున్నారు.

దస్తావేజులు పోయినవి
భీమవరం పట్టణం గునుపూడి వార్డు నెం. 2, డోర్ నెం. 15-3-6 కాపురస్తులు (లేటు) బాలం వీర్రాజు గారి కుమారుడు బాలం రాజేష్ గారి పేరుతో గల ఒరిజినల్ దస్తావేజు నెం. 5940/2016 ది. 14-2-26 ... ఒరిజినల్ దస్తావేజు నెం. 5940/2016 పోయినది.
బాలం రాజేష్
కాంటాక్ట్ నెంబర్ - 72078 08115

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: లోసరిలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు ఉపకేంద్రానికి లైన్ల ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు ఆ శాఖ ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోసరి ఇండస్ట్రియల్ ఫీడర్‌తో పాటు లోసరి, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం, తోకతిప్ప, బర్రెవానిపేట, గరవళ్లదిబ్బ గ్రామాలతో పాటు ఆక్వాచెరువులకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వ సహకారం

మహదేవపట్నం(ఉండి), న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తోందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్.మోహన్‌దాస్ తెలిపారు. మహదేవపట్నం ఉన్నత పాఠశాల నుంచి 165 జాతీయ రహదారి వరకూ బాలికలకు 8 కేఎం, బాలురకు 10 కేఎం సైకిల్ పోటీలు మంగళవారం నిర్వహించారు. సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి ఈ పోటీలను ప్రారంభించారు. మోహన్‌దాస్ మాట్లాడుతూ కలెక్టర్ నాగరాణి ఆదేశాల ప్రకారం రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. విజేతలు ఈనెల 28న ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు జాన్‌బాబు, తెదేపా అధికార ప్రతినిధి వనిమా శ్రీనివాస్, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీ, పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైకిల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

'సోమగుండం చెరువు' చుట్టూ వెలగని వీధి దీపాలు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయం ఎదుట ఉన్న 'సోమగుండం చెరువు' చుట్టూ ఉన్న రహదారిలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం సమయంలో ఆకతాయిలు చేసిన పనులకు వీధి దీపాలు పలుచోట్ల వెలగడం లేదు. దీంతో తెల్లవారు జామున, సాయంత్రం సోమగుండం చెరువు చుట్టూ నడిచేవారు ఇబ్బందులు పడుతున్నట్లు వాకర్స్ ప్రతినిధులు సత్యనారాయణ తదితరులు తెలిపారు. పురపాలక విద్యుత్తుశాఖ ఏఈ సాంబశివ ఆ ప్రాంతాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

వీఆర్వోల సంఘ మండల అధ్యక్షుడిగా చిన్నారావు

ఉండి, న్యూస్‌టుడే: వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా మహదేవపట్నం వీఆర్వో ఎస్.చిన్నారావు ఎన్నికయ్యారు. ఆసంఘ సమావేశం మంగళవారం ఉండిలో నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా పాములపర్రు వీఆర్వో డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా చిలుకూరు వీఆర్వో సీహెచ్ విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా వీడీకృపాంజలి, కోశాధికారిగా కలిగొట్ల, ఆరేడు వీఆర్వో బి.శ్రీనివాసరావును ఎన్నుకున్నామని నూతన అధ్యక్షుడు చిన్నారావు తెలిపారు. నూతన కమిటీని రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు.

Reliance SMART
WE ARE HIRING
FULL/PART TIMERS
Qualification: SSC Pass
Age : 19 to 30 Years
Interview Dates :27.2, 28.2, 1.3.2026
Old Padmasri Theatre BHIMAVARAM
7780348096,8309973647

పూడికతీయక.. మురుగు కదలక..

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: బ్యాంకు కాలనీలో కరారి నగర్ -3వ వీధిలో డ్రెయిన్లు అధ్వానంగా మారాయి. పూడిక ఎక్కువగా ఉండడంతో మురుగు ముందుకు కదలడం లేదు. కరారి నగర్‌లో పలు వీధుల్లో డ్రెయిన్లు దుర్వాసనతో పాటు దోమల ఉద్ధృతి ఎక్కువైంది. ఈ విషయమై పురపాలక పారిశుద్ధ్య అధికారి చంటి మాట్లాడుతూ ఆ ప్రాంతాలు పరిశీలించి శుభ్రం చేయిస్తున్నామన్నారు.

వృథాగా తాగు నీరు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పట్టణం పరిధిలో మంచినీటి చెరువులు, ఫిల్టర్‌బెడ్లు తదితర వనరుల నిర్వహణ మొక్కుబడిగా ఉంటుంది. మంగళవారం సాల్టేట్ ప్రాంతంలో ఉన్న ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు నుంచి పైప్‌ద్వారా తాగునీరు వృథాగా పోతున్న దృశ్యం కనిపించింది. ఈ విషయాన్ని ఏఈ నిమ్మల విజయకుమార్ దృష్టికి తీసుకెళ్లగా తాగునీటి వృథా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సగం పనులతో తిప్పలు

శృంగవృక్షం(పాలకోడేరు), న్యూస్‌టుడే: శృంగవృక్షం నుంచి వేండ్ర వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సుమారు 4 కిలో మీటర్ల మేర ఉన్న ఈ రహదారి పలు గ్రామాలకు దగ్గర మార్గంగా ఉండటంతో వాహనాల రద్దీ అధికం. గత ప్రభుత్వ హయాంలో రహదారి అభివృద్ధికి సుమారు రూ.2 కోట్లు మంజూరు కాగా పనులు మాత్రం చేపట్టలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం సుమారు రెండు కిలో మీటర్ల మేర చేపట్టి.. శృంగవృక్షం పంట కాలువ నుంచి ఓఎన్‌జీసీ రిగ్గు వరకు వదిలేయడంతో భారీ సంఖ్యలో గుంతలు పడి అధ్వానంగా తయారైంది. రోడ్డు పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో వి.రెడ్డియ్య తెలిపారు.

అధ్వానంగా రహదారి

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), BHIMAVARAM
E.P.No. 4/2023 in O.S.No. 133/2014

DHRs: 1. Boyidi Suresh Babu
2. Boyidi Subhadra

JDR: Cheeday Prabhavathi, W/o. Srinivasa Rao, Door No. 1-82, Machipuripalem, Veeravasaram Mandal, W.G.Dist.

పై నెంబరు E.P. Schedule దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట ది. 19-3-2026 సం॥ తేదీన ఉదయం 10.30 లకు బహిరంగ వేలం జరుపబడును. కావున ఆసక్తిగలిగిన వారు పాటలో పాల్గొని పాడుకొనవలెను.

SCHEDULE

An extent of 121 Sq.yards house site with a Daba House (Building) bearing Door No. 1-82 and bearing R.S.No. 29/2 in Machipuripalem Panchayat area of Veeravasaram Mandal, Veeravasaram Sub-Registry and West Godavari District. Situated with in the following boundaries.

East: Land sold by the Kurella Mutheswara Rao to others 24'-6", **South:** Site of Kandulapati Venkateswara Rao 45'-6", **West:** Joint way Kandulapati Kondayya and others 22'-6", **North:** House of Kandulapati Suryarao 47'-0".

DHR Value: 5,00,000/-
Amin Value: 6,00,000/-

Sd/- **B.TRIMURTHULUU**
భీమవరం DHR తరపు అడ్వకేట్
ది. 23-02-2026 భీమవరం, సెల్: 95738 67899

చికిత్స పొందుతూ మృతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఒకటో పట్టణానికి చెందిన అవివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గరువుపేటకు చెందిన కె.సుజాత(30) అనారోగ్యంతో బాధపడుతూ ఉంటున్నారు. ఈ నెల 15న తలుపు వేసుకుని [illegible] నిప్పు అంటించుకున్నారు. ఆమె తండ్రి చూసి తలుపు పగులగొట్టి మంటలు ఆర్పి చికిత్సకు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ్నుంచి ఏలూరు జిల్లా ఆసుపత్రికి పంపించారు. అక్కడ్నుంచి మెరుగైన చికిత్సకు ఈ నెల 16న విజయవాడ తీసుకెళ్లగా సోమవారం రాత్రి మృతి చెందినట్లు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ల్యాబ్‌అసిస్టెంట్‌పై ఫిర్యాదులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ మండలంలోని ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల్యాబ్ అసిస్టెంట్ డేవిడ్‌రాజుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అసభ్యకర వీడియోలను కూడా చూపిస్తున్నారని పలువురు బాలికల తల్లిదండ్రులు మంగళవారం ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 21న ఎనిమిది మంది బాలికలు నేరుగా ప్రధానోపాధ్యాయుడును కలిసి డేవిడ్‌రాజుపై ఫిర్యాదు చేశారు. చేతులు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేయడంతో మంగళవారం సమగ్రశిక్ష అధికారులు వచ్చి బాలికల నుంచి వివరాలు సేకరించారని హెచ్ఎం తెలిపారు. తాజాగా బాలికల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదును కూడా డీఈవో దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డేవిడ్‌రాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పిల్లల ఆరోపణలు అవాస్తమని, క్రమశిక్షణపరంగా కఠినంగా వ్యవహరించడంతో కావాలనే తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు.

వేతనాలు పెంచే వరకూ ఉద్యమం కొనసాగిస్తాం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: వేతనాలు పెంచే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా విస్సాకోడేరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పి.నాగరత్నం, కుమారి, నిర్మల, నాగపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో దీక్షా శిబిరం వద్ద నినదిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆకివీడు, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆకివీడు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. కె.విజయ, ఆర్.పద్మావతి, ఎం.నాగలక్ష్మి, జి.మణి తదితర అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పేరుకే సంపన్నం... సమస్యలే అధికం

చినఅమిరం(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలంలోని చినఅమిరం పంచాయతీకి సుమారు రూ.2.50 కోట్ల వార్షికాదాయమున్నా సమస్యలు మామూలే అన్నట్లు ఉన్నాయి. పట్టణాన్ని ఆనుకుని ఉన్న దీనికి ఎన్నో అంశాల్లో ప్రత్యేకత ఉంది. పారిశుద్ధ్య నిర్వహణ నుంచి పచ్చదనం పెంపు వరకు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజి నుంచి సీసీ కెమెరాల ఏర్పాటు వరకు ఒకప్పుడు ఎంతో పేరుగాంచింది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డును దక్కించుకుంది. ఇప్పుడు చూస్తే అనేక సమస్యలకు నిలయంగా మారింది.

ఆరేళ్లకు పైగా పాలకవర్గం లేక ప్రత్యేకాధికారులు పాలనలో కొనసాగుతుంది. ఎప్పుడో ఓసారి వచ్చి సంతకాలు చేసిపోయే అధికారుల వల్ల చిన్న సమస్య కూడా తక్షణం పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. చెరువు, డింపింగ్‌యార్డు సమస్యల్ని పరిష్కరించేలా మా వంతు చర్యలు చేపడతాం' అని గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో మురళీగంగాధరరావు తెలిపారు.

ఒకప్పుడు గ్రామానికి తాగునీటిని అందించిన ప్రధాన చెరువు నిర్వహణ కొరవడి నిరుపయోగంగా మారిపోయింది.

✦ గ్రామంలో నిత్యం సేకరించిన చెత్తను కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సంపాదించి పెట్టిన ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రం డంపింగ్‌యార్డుగానే మిగిలిపోయింది. మహిళా సమాఖ్య భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఇలాంటి సమస్యలెన్నో ఉన్నాయి.

సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణకు కృషి

అజ్జమూరు(ఆకివీడు), న్యూస్‌టుడే: సీబీసీఎన్‌సీ ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్ కౌన్సిల్ సమావేశాన్ని అధ్యక్షుడు కూరెళ్ల రవిప్రకాష్ ఆధ్వర్యంలో మంగళవారం అజ్జమూరులోని కల్వరి చర్చిలో నిర్వహించారు. సీబీసీఎన్‌సీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించడానికి కృషితోపాటు నూతన సంఘాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. మార్చి 13న సీబీసీఎన్‌సీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ప్రతి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇంటి దావీదు, బొడ్డు వజ్రం, లాజరు, యాకోబు తదితర నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వం అని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ అన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న గునుపూడికి చెందిన వ్యక్తి వైద్యం నిమిత్తం రాజ్ ట్రస్టు తరపున రూ.20 వేలు అందించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు గంటా రాజ్‌కుమార్, పాస్టర్ ఎస్.పుష్పరాజ్, కెనడి, ఇందిరా పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నడిచి వెళ్తున్న చేకూరి కాశీవిశ్వనాథరాజు అనే వృద్ధుడ్ని గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయమై చికిత్స పొందుతున్నారని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ రైటర్ కె.మల్లేశ్వరరావు తెలిపారు. విస్సాకోడేరు వంతెన సమీపంలోని 4 సీజన్స్ ఎదురుగా ఈ నెల 19న ప్రమాదం జరగడంతో కాలికి తీవ్ర గాయమై పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు మంగళవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఆరుగురికి రూ.60 వేల జరిమానా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వ్యక్తులకు రూ.60వేలు జరిమానా విధిస్తూ భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మంగళవారం తీర్పు చెప్పారని సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

ఫిర్యాదుపై విచారణ

అజ్జమూరు(ఆకివీడు), న్యూస్‌టుడే: అజ్జమూరు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ భూముల నిరుపయోగం, పంటబోదె ఆక్రమణపై అందిన ఫిర్యాదు మేరకు దేవాదాయ తనిఖీ అధికారి వి.వెంకటేశ్వరరావు గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన భాజపా నాయకుడు వర్ధినీడి లక్ష్మీవరప్రసాద్ ముఖ్యమంత్రి ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార విభాగానికి ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని విచారణకు హాజరై నిరసన తెలిపారు. ఆకివీడు దేవాలయాల ఈవో అల్లూరి సత్యనారాయణరాజు సర్పంచి చెలంకూరి చలపతిరావు, నంద్యాల చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రాయలంలో అన్నసమారాధన

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రాయలంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ నిర్మాణకర్త, మాజీ సర్పంచి కోళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచి సోమరాజు, మాజీ ఎంపీటీసీ తోరం వినాయక గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

ఆదాయ వనరులు పెంచేలా చర్యలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ యార్డు ఆదాయ వనరులను పెంచేలా దిశగా పాలకవర్గం కృషి చేస్తోందని ఏఎంసీ ఛైర్మన్ శ్రీమన్నారాయణ తెలిపారు. మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో చిట్టవరం, దారతిప్ప, వెంప, జగన్నాథపురం చెక్ పోస్టుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు.

కృతజ్ఞతాభివందనములు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బుధవారం మార్కెట్ శాఖ, భీమవరం
మా SBI బుధవారం మార్కెట్ శాఖ, భీమవరం
33వ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియచేసిన
మా విలువైన ఖాతాదారులందరికీ ప్రతీ ఒక్కరికి పేరుపేరునా
మా హృదయపూర్వక కృతజ్ఞతలు.
మీ సహకారం మా బ్యాంకుపై ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని
మనసారా కోరుకుంటూ..

వేము వంశీ కృష్ణ
బ్రాంచి మేనేజర్
మరియు సిబ్బంది
SBI బుధవారం మార్కెట్ శాఖ, భీమవరం

(c) eenadu

సాగునీటి ఎద్దడితో ఇబ్బందులా..?

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో రబీ వరి సాగుకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదా? వంతుల్లోనూ నీరందక చేలు ఎండుతున్నాయా..? శివారు ప్రాంతాలకు నీరు సక్రమంగా చేరడం లేదా? ఇలాంటి సమస్యలను జలవనరుల శాఖ డీఈఈ సీహెచ్ వెంకటనారాయణ దృష్టికి తీసుకువెళ్లే అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు ఫోన్‌చేసి పేరు, ప్రాంతం వివరాలతో పాటు సమస్యను క్లుప్తంగా తెలియజేయడమే.

నేడు జలవనరుల శాఖ డీఈతో ఫోన్ ఇన్

తేదీ: 25.2.2026 (బుధవారం)	సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు	ఫోన్ నంబరు 99894 98676

నరసాపురం

● నరసాపురం ● పాలకొల్లు ● ఆచంట

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వాసవీ పెనుగొండ: కేంద్రం లోనికి వెళ్తున్న విద్యార్థులు

వాసవీ పెనుగొండ, నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం స్థానిక ఎస్‌వీకేపీ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. ఎ- కేంద్రంలో 397కు 377 మంది, బి- కేంద్రంలో 301కు 288 మంది పరీక్షలకు హాజరైనట్లు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కొల్లి వెంకట రామసూర్యనారాయణ తెలిపారు. ★ నరసాపురం పట్టణ పరిధిలోని అయిదు కేంద్రాల్లో 1,895 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 100 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట:	90631 44737
పాలకొల్లు	: 80085 74510	వాసవీ పెనుగొండ:	80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర:	91212 29087

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ? రుస్తుంబాద శివారు మంగలగుంటపాలెం లేసు అల్లికల భవనం వద్ద విద్యుత్తు పరివర్తకానికి పాదులు అల్లుకున్నాయి. తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.- **గుబ్బల సత్యనారాయణ**

✔ చర్యలు చేపడతాం. - **కొల్లి సుధాకర్, విద్యుత్తు ఏఈ**

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? జవదాల పేట కాలువ గట్టుపై చెత్త వేస్తున్నారు. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం.- **జగదీశ్, నరసాపురం.**

✔ చర్యలు తీసుకుంటాం.- **పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? లంకలకోడేరులో వినాయకుడి ఆలయం వద్ద విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. - **ప్రసాద్, స్థానికుడు**

✔ పాదులు తొలగిస్తాం. - **శ్రీనివాసరావు, విద్యుత్తుఏఈ**

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? త్సవటపల్లి వారి వీధిలో డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - **చందు, స్థానికుడు**

✔ శుభ్రం చేయిస్తాం. - **లక్ష్మణ్, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? గ్రామంలో చెరువు వద్ద విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకున్నాయి. - **చిన్న**

✔ పాదులు తొలగిస్తాం. - **ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి ఏఈ**

నరసాపురం, న్యూస్‌టుడే: ? ప్రాంతీయ ఆసుపత్రి సమీపాన చెత్తను సక్రమంగా తరలించడంలేదు. - **దొరబాబు**

✔ చెత్తను ఎప్పటికప్పుడు సక్రమంగా తరలించేలా సిబ్బందికి ఆదేశాలు ఇస్తాం. - **కృష్ణబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పల్లెల్లోనూ అడ్డగోలుగా లేఅవుట్లు!

వాసవీ పెనుగొండ గ్రామీణ, ఆచంట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా లే అవుట్లు వేసి స్థలాలు విక్రయిస్తున్నారు. ఆచంట మండలం కొడమంచిలిలో వేసిన అనధికార లేఅవుట్‌లో స్థలాలు విక్రయిస్తున్నట్లు బోర్డులు పెట్టారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో పంచాయతీ అధికారులు అక్కడ హెచ్చరిక ఫ్లెక్సీ నోటీసు కట్టారు. ఆచంటతో పాటు పరిసర ప్రాంతాల్లో కొందరు గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేశారు. వీటిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు నిర్మాణాలకు అనుమతులు, రుణాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాసవీ పెనుగొండ మండలం రామన్నపాలెంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా లే అవుట్ వేసి స్థలాల విక్రయాల పేరిట బోర్డు ఏర్పాటు చేశారు. దీనిపై ఆలస్యంగా స్పందించిన పంచాయతీ అధికారులు ఆ బోర్డు దిగువన ఇలా హెచ్చరిక ఫ్లెక్సీ పెట్టి చేదులు దులుపుకొన్నారు.

☛ వాసవీ పెనుగొండ మండలంలో రామన్నపాలెం, మరికొన్ని గ్రామాల్లో ఇటీవల అనధికారికంగా లే అవుట్ వేసి స్థలాలు విక్రయాల కోసం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించి ఈ ప్రాంతం ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వస్తుందని, ఎల్ఆర్ఎస్ ద్వారా అనుమతులు తీసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సూచిస్తూ హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇలాంటి లేఅవుట్లలో స్థలాలు కొంటే భవిష్యత్తులో నిర్మాణాలకు అనుమతులు మంజూరు కావని, విద్యుత్తు, తాగు వసతి, ఇతర సదుపాయాలు కల్పించే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతంలో కొలువైన విజయగోపాల స్వామి, మాధవ స్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఈవో ముత్యాల సత్యనారాయణ మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి 7 గంటలకు కోలాట భజన, 26న రాత్రి కల్యాణోత్సవం, అనంతరం గరుడోత్సవం జరుతాయన్నారు. 4న పుష్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీ పెనుగొండలో శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి కల్యాణ మహోత్సవాలను బుధవారం నుంచి మార్చి 4వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. తొలిరోజు స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లకు పెండ్లి కుమార్తెలుగా అలంకరణలు, 26న కల్యాణ మహోత్సవం, 27న రథోత్సవం, 3న గ్రామోత్సవం, 4న శ్రీపుష్పయాగోత్సవం జరుగుతాయని తెలిపారు.

వృత్తి నైపుణ్యాలతో ఉత్తమ అవకాశాలు

మాట్లాడుతున్న సురేశ్‌కుమార్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొంటే ఉత్తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్. సురేశ్‌కుమార్ అన్నారు. కళాశాలలో ఏపీ ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండో-యూరో సిక్రోనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నైపుణ్యవృద్ధి సదస్సులో ఆయన మాట్లాడారు. టీవోట్స్‌పర్స్ కోఆర్డినేటర్ వంశీ మణితేజ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కె. వెంకటేశ్వర స్వామి, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి

సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న రామరాజు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్ చదలవాడ నాగరాణికి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి వినతిపత్రం అందించారు. భీమవరంలో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కలెక్టర్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలు వివరించారు. ఆయన వెంట మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తెదేపా మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

పోడూరు, న్యూస్‌టుడే: జగన్నాథపురంలో నూతనంగా నిర్మించిన శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మంగళవారం గోపూజలు చేశారు. అనంతరం విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

జిల్లేడు పత్రాల అలంకరణలో హనుమ

మార్టేరు, న్యూస్‌టుడే: మార్టేరు జడ్ వంతెన కూడలి వద్ద ఉన్న ఆలయంలో ఆంజనేయస్వామిని మంగళవారం జిల్లేడు పత్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధి మొగల్తూరు రోడ్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పంచామృతాభిషేకాలు, తమలపాకుల పూజలు చేశారు.

గ్రంథాలయ సందర్శన

దస్త్రాలు పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

నరసాపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు మంగళవారం పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దస్త్రాలను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయాన్ని తరలించేందుకు వీలుగా ఉన్న భవనాలను పరిశీలించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు జేజేఎల్ కుమారి, కమిటీ సభ్యుడు పండా శ్రీనాథ్, విశ్రాంత శాస్త్రవేత్త సుబ్బారావు, సుధీర్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణకు ఉద్యమిస్తాం

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ స్థలాలు, బస్సులను ప్రైవేటు సంస్థకు అప్పగించే యోచన విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నరసాపురం డిపోలో ఆ సంఘం సభ్యులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ పరిరక్షణకు ఉద్యమిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సతీశ్ బాబు పేర్కొన్నారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు పరం చేయవద్దని, విద్యుత్తు బస్సులను సంస్థ ఆధ్వర్యంలోని నిర్వహించాలని కోరారు.

ఘనంగా ప్రింటర్స్ దినోత్సవం

ఛాంబర్ అధ్యక్షుడిని సత్కరిస్తున్న సభ్యులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కేవీఎల్ నరసింహారావు అన్నారు. స్థానిక మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రింటర్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. సంఘ సభ్యులు ముత్యాల రామారావు, మంగపతిరావు, కాగిత సూర్యనారాయణ, రేఖపల్లి విజయకుమార్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'యువజన కాంగ్రెస్ తీరు సరికాదు'

నరసాపురం, న్యూస్‌టుడే: దేశ రాజధాని దిల్లీ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఏఐ సమ్మిట్‌లో అభ్యంతరకరంగా ప్రవర్తించిన యువజన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భాజపా మహిళామోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో మంగళవారం నిరసన ప్రదర్శనని నిర్వహించారు. మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి మాట్లాడుతూ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా యువజన కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం సరికాదన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి లక్ష తమలపాకుల పూజ చేశారు. ప్రాంగణంలో 54 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద శాంతి, ఐశ్వర్య హోమాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, పలువురు నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

పట్టణంలో ఆకస్మిక వర్షం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం హఠాత్తుగా మబ్బులు కమ్ముకొని తేలికపాటి వర్షం కురిసింది. చల్లని గాలులు వీయడంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది.

నిర్మించి.. గాలికి వదిలేసి!

ఆగర్రులో గత వైకాపా ప్రభుత్వ హయంలో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని మూడున్నరేళ్లుగా నిరుపయోగంగా వదిలేశారు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీనిని ఇలాగే వదిలేస్తే నిర్మాణం నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శి సుధారాణి స్పందిస్తూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. - **న్యూస్‌టుడే, పాలకొల్లు గ్రామీణ**

వ్యర్థాలే.. అవరోధాలు

వాసవీ పెనుగొండలో పంట కాలువలో ఇలా వ్యర్థాలు పేరుకుపోయి సాగు నీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. సమీప ఇళ్లు, దుకాణాల్లో చెత్త, ఖాళీ సీసాలు, ఇతర వ్యర్థాలను స్థానికులు ఈ కాలువలో వేస్తున్నారు. వీటి కారణంగా శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో సాగునీరు చేరడం లేదని రైతులు చెబుతున్నారు. పంట కాలువలో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తామని పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణారెడ్డి తెలిపారు. - **న్యూస్‌టుడే, వాసవీ పెనుగొండ**

స్వచ్ఛత.. వట్టిమాటే!

పెనుమంట్ర మండలంలో మాముడూరు గ్రామంలో పెఆరవల్లి రహదారి వెంబడి ఇలా వ్యర్థాలు పేరుకుపోయాయి. గ్రామంలో సేకరించిన చెత్తను ఈ మార్గంలో గోస్తనీ కాలువ గట్టున వేస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకుని ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నిసార్లు చెత్తకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ వెలువడి సమీప నివాసితులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇదే గ్రామంలో హైస్కూల్‌కు సమీపాన చెరువు స్థలంలో సైతం భారీగా చెత్త పేరుకుపోయింది. - **న్యూస్‌టుడే పెనుమంట్ర**

కూలితే పెను ముప్పే..

మాముడూరులో జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపాన చెరువు గట్టుపై ఉన్న విద్యుత్తు నియంత్రిక ఓ పక్కకు ఒరిగి ప్రమాదకంగా మారింది. ఇక్కడ గట్టు కుంగిపోవడంతో సిమెంటు దిమ్మె చెరువు వైపు ఒరిగిపోయింది. ఈ మార్గంలో నిత్యం మందిలాది మంది రాకపోకలు సాగిస్తారు. పరివర్తకం కూలి తీగలు తెగిపడితే పెను ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరివర్తకాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని విద్యుత్తు ఏఈ నాగరాజు తెలిపారు. - **న్యూస్‌టుడే, పెనుమంట్ర**

మురుగులోనే సంపు వాల్వు!

మల్లవరంలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల సమీపాన తాగునీటి ట్యాంకు కింద సంపు వాల్వు లీకేజీతో నీరు నిలిచి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. రోజుల తరబడి మురుగు నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ స్పందిస్తూ వాల్వు లీకేజీని అరికట్టేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. - **న్యూస్‌టుడే, నరసాపురం గ్రామీణ**

ఆదాయ వనరులు పెంచేలా చర్యలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ యార్డు ఆదాయ వనరులను పెంచే దిశగా పాలకవర్గం కృషి చేస్తోందని ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ తెలిపారు. మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో చిట్టవరం, దారతిప్ప, వెంప, జగన్నాథపురం చెక్ పోస్టుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సెస్సు వసూలు చేసేలా సిబ్బందికి తగు సూచనలిస్తున్నామన్నారు. ప్రహరీ నిర్మాణం, కార్యాలయ ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు పేర్కొన్నారు.

కొనసాగిన రిలే దీక్షలు

పెనుమంట్ర: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెనుమంట్ర, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలంటూ మార్చి 2న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నేతల చిత్తరంజన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

మొగల్తూరు, పోడూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు, పోడూరులలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది నిరసన తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి.. **నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారం కోరుతూ సహకార సంఘాల ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. నరసాపురం పట్టణం, మొగల్తూరులలోని డీసీసీబీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన శిబిరాల్లో ఉద్యోగులు నిరసన తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.

26 నుంచి సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్ర

వీరవాసరం, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి మార్చి 23 వరకూ ప్రజా సమస్యలపై సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఉత్తరపాలెం గ్రామ శాఖ సమావేశంలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర గోడ పత్రికను నాయకులు ఆవిష్కరించారు. జిల్లాలో 20 మండలాల్లో 600 కిలోమీటర్ల మేర యాత్ర జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు కేతా జ్యోతిబసు, కిలాడి సత్యనారాయణ, పాలా అజయ్, కోటేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు లీకులు.. నేడు లాకులు!

అమర్చిన కొత్త తలుపులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం లక్ష్మీపాలెంలో బ్యాంకు కెనాల్‌పై ఉన్న లాకు పశ్చిమడెల్టాకు ఆయువు పట్టు లాంటిది. నక్కల డ్రెయిన్ వశిష్ఠ గోదావరిలో కలిసే ప్రాంతానికి చేరువలోనే ఈ లాకు ఉంది. గతంలో వరదల సమయంలో నక్కల డ్రెయిన్ పోటెత్తినప్పుడు ఎగదన్నే మురుగు ఈ లాకులు సరిగా పనిచేయకపోవడంతో బ్యాంకు కెనాల్‌లోకి ప్రవేశించి చేలను ముంచేత్తేది. 2009 నుంచి ఈ సమస్య ఉండగా 2020 నాటికి తీవ్రమైంది. యలమంచిలితో పాటు పోడూరు, ఆచంట మండలాల్లోని 25వేల ఎకరాల్లో చేలు మునిగి అన్నదాతలు ఏటా నష్టపోయేవారు. ఇంత జరుగుతున్నా వైకాపా ప్రభుత్వం కనీసం మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రి రామానాయుడు రూ. 91 లక్షలు మంజూరు చేయడంతో కొత్త లాకులు నిర్మాణం చేపట్టారు. ఈ పనులు చాలా వరకు పూర్తయ్యాయి.

పశువుల అక్రమ రవాణాపై కేసు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: వాహనంలో అక్రమంగా పశువులు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పకారం పట్టణ పరిధిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రహదారిలో సోమవారం అర్ధరాత్రి ఆవులను తరలిస్తున్న వ్యానును వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు అడుకున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వాహనంతో పాటు ఆరు ఆవులను స్వాధీనం చేసుకున్నారు.

కళల్లోనూ అదరహో..!

జిల్లా స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: చదువుతో పాటు కళల్లోనూ సత్తాచాటుతున్నారు. వాసవీ పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో మండలం దూబచర్లలోని విద్యాశిక్షణ సంస్థలో జనవరి 21న నిర్వహించిన జిల్లా స్థాయిలో రంగోత్సవ్‌లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. వీరికి డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎం. కమల్‌కుమారి ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా స్థాయిలో అర్హత సాధించడంతో విజయవాడలో జనవరి 23న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న బాలికలు

సరదాగా ప్రారంభించి.. చిత్రలేఖనం, రంగువల్లులు వేయడం అంటే ఎంతో ఇష్టం. మా పాఠశాలలో ప్రతి సంవత్సరం రంగువల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడంతో వాటిపై నాకు ఆసక్తి పెరిగింది. నేను, నా స్నేహితులు కలిసి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడటమే నా లక్ష్యం. - **డి.గీతిక**

చిత్రలేఖనంపై ఆసక్తి.. 9వ తరగతి చదువుతున్నా. చిన్ననాటి చిత్రలేఖనం అంటే ఇష్టం. ఖాళీ సమయంలో బొమ్మలు గీయడం, పెయింటింగ్ సాధన చేస్తున్నా. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం. - **విన్య**

పాఠశాలలో శిక్షణ.. మా పాఠశాలలో చదువు, క్రీడలతో పాటు కళల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. నాతో పాటు తోటి విద్యార్థులు పాఠశాల తరపున పలు పోటీల్లో పాల్గొని విజయం సాధించాం. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మరింత పేరు తీసుకువస్తా. - **జి.అక్షయ**

కార్యరూపం దాలిస్తే.. మహర్దశ

జాతీయ రహదారి విస్తరణకు తొలగిన అవరోధాలు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: సముద్ర తీర ప్రాంత గ్రామాలను అనుసంధానం చేస్తూ గతంలో ఏర్పాటు చేసిన 216 జాతీయ రహదారికి మహర్దశ కలగనుంది. బీఆర్ అంబేడ్కర్ జిల్లా శివకోడు నుంచి రామేశ్వరం, రాజుల్లంక మీదుగా సీతారామపురంలో 216 జాతీయ రహదారి వరకు బైపాస్ నిర్మాణానికి అవరోధాలు తొలగిపోయాయి.

తొలగిన అపోహలు.. ఈ రహదారిని నాలుగు వరుసలు విస్తరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. బైపాస్ రోడ్డుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉండటంతో డీపీఆర్ ప్రక్రియ సాగలేదు. చిట్టవరం నుంచి నరసాపురం మీదుగా నాలుగు వరుసల రహదారి నిర్మాణం జరగనుందని ఇటీవల ప్రచారం జరిగింది. గతంలో రహదారిని రెండు వరుసలుగా అభివృద్ధి చేసిన సమయంలో పట్టణంలో పలు భవనాలు తొలగించాల్సి వచ్చింది. అప్పట్లో వాటికి భారీగా పరిహారం అందించారు. ప్రస్తుతం భూములు, భవనాల ధరలు పదిరెట్లు పెరిగాయి. ఇప్పుడు మళ్లీ రహదారి విస్తరణతో రూ. కోట్ల విలువైన ఆస్తులు కోల్పోతామనే భయం పట్టణవాసుల్లో నెలకొంది. ఇంకా నిర్ణయం వెలువడకుండానే ఉద్యమాలకు సిద్ధమయ్యారు. ఇలాంటి తరుణంలో బైపాస్ నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగిపోయాయి.

త్వరలోనే డీపీఆర్.. రహదారి విస్తరణకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేసే పనులను ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించాల్సి ఉంది. ఈ దిశగా చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుంది. - **వి.సాయి శ్రీనివాస్, పీడీ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ**

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మెప్మా నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మెప్మా జిల్లా తాత్కాలిక పీడీ జి.హెప్సిబా తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ జిల్లాస్థాయి సిబ్బంది సమావేశం భీమవరంలో మంగళవారం జరిగింది. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమంలో అర్హులను ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణ సదుపాయాలతో పాటు వ్యాపార అభివృద్ధికి సూచనలు చేయాలన్నారు. జీవనోపాధులు విభాగ అధికారి సీహెచ్ నానిబాబు, ఐబీ స్పెషలిస్ట్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

గ్రామసభలో మాట్లాడుతున్న వెంకటరత్నం

ప్రత్తిపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య వంతమైన జీవనం సాగించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు గద్దె వెంకటరత్నం సూచించారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడులో మండల ప్రకృతి వ్యవసాయదారులకు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గ్రామ జనసేన అధ్యక్షుడు చెరకూరి పండు, ప్రకృతి సాగు రైతులు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆదాయ మార్గాలు మెరుగుపరచుకోవాలి

మాట్లాడుతున్న చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పంచాయతీలు ఆదాయ మార్గాలను మెరుగు పరచుకోవాలని ఎంపీడీవో వి.చంద్రశేఖర్ సూచించారు. తాలూకాఫీసు కూడలిలోని మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం పంచాయతీల ఆదాయాలు పెంచుకునే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పంచాయతీ కార్యదర్శులు రావిపాటి వీరబ్రహ్మం, బి.శ్రీనివాస చంద్రరాజు, బచ్చు ఫణికుమార్, డి.నాగదేవి పాల్గొన్నారు.

26లోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: రబీ సాగు చేసే రైతులు తమ పంటను ఈ నెల 26లోగా ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు అన్నారు. మండలంలో ఇంకా 1200 మంది రైతులు నమోదు కావాల్సి ఉందన్నారు. ఈ-క్రాప్ నమోదు చేయకుంటే ధాన్యం విక్రయించడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు.

వైభవంగా పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు అమ్మవారికి 11 ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. జనసేన నాయకుడు పవన్‌కుమార్, బొమ్మిడి సొసైటీ అధ్యక్షుడు గోపాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు.

సారథులూ.. నిర్మించండి వారధులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విద్య, వాణిజ్యపరంగా పట్టణం ఎంతో అభివృద్ధి చెందింది. చుట్టూ విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. 35 వార్డులున్న పట్టణంలో విద్యా, రియల్, వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగాయి. గతంతో పోలిస్తే వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. మరోవైపు దశాబ్దాలుగా సేవలందిస్తున్న చిన్నవంతెనతోపాటు వార్ఫ్ రోడ్డు, కేఎన్ రోడ్డు వారధులు శిథిలావస్థకు చేరాయి. గత వైకాపా పాలకులు వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో మరింత దారుణంగా తయారయ్యాయి.

శిథిలావస్థకు చేరిన వార్ఫ్‌రోడ్డు వంతెన

ట్రాఫిక్ సమస్య తీవ్రం.. ఇటు పడాల నుంచి అటు జువ్వలపాలెం వరకు పట్టణం సుమారు 7 కిలోమీటర్ల మేరకు విస్తరించింది. రహదారులు, కాలువలు, ఇతర మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ శిథిలమైన వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు పట్టణ ప్రణాళికా విభాగం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. ముఖ్యంగా ఆదివారం, పండగల రోజుల్లో సమస్య మరింత జటిలంగా ఉంటోంది.

● ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో చిన్న వంతెన, వార్ఫ్‌రోడ్డు, కేనాల్ రోడ్డు వారధులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. చిన్న వంతెన గోడలు శిథిలమై ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. వార్ఫ్ రోడ్డు శిథిలావస్థకు చేరడంతో భారీ వాహనాల రాకపోకల్ని అధికారులు నిలిపివేశారు. కెనాల్ రోడ్డులో వార్ఫ్ సమీపంలో పెచ్చులూడి ఇనుప ఊచలు బయటపడ్డాయి. పిట్టగోడల వెంబడి పిచ్చిమొక్కలు మొలిచి గోడలు బీటలు వారాయి.

చిన్న వంతెన కీలకం.. తాడేపల్లిగూడెం పట్టణానికి రైల్వే స్టేషన్ మీదుగా తొలినాళ్లలో ఏలూరు పశ్చిమ డెల్టా కాలువపై చిన్న వంతెన నిర్మించారు. రెండో పట్టణం ప్రజలతో పాటు సమీప గ్రామాల వారు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు సైతం రైల్వేస్టేషన్, సబ్‌రిజిస్ట్రార్, కోర్టు, మండల కార్యాలయాలకు పలువురు రాకపోకలు సాగించేందుకు ఈ వంతెనే కీలకం. **- గణేష్, స్థానికుడు**

పలు వార్డులవారికి ఇదే ఆధారం.. పట్టణంలోకి రాకపోకలు సాగించేందుకు యాభై సంవత్సరాలుగా చిన్న వంతెనే ఆధారం. పలు వార్డుల వారికి ఇప్పటికీ ఇదే నడక మార్గం. **- లక్ష్మి, స్థానికురాలు**

అభివృద్ధి చేస్తాం.. పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. అందులో భాగంగా వంతెనల నిర్మాణంపై కూడా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టి సారించారు. ఆయన సహకారంతో వార్ఫ్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తాం. **- ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 99488 53114
తణుకు	: 85558 50851
తణుకు గ్రామీణం	: 63005 79402
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? సత్యవతినగర్‌లో పురపాలక కుళాయి మరమ్మతుల కోసం తవ్విన గుంత సరిగా పూడ్చక ప్రమాదకరంగా మారింది **- రాజా**

✔ గుంతను పూడ్చేలా చర్యలు చేపడతాం. **- వెంకటేశ్వరరావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్**

? కడకట్ల టీచర్స్‌కాలనీలో భూగర్భ మురుగు కాలువ లీకై రహదారిపైకి రావడంతో భరించలేని దుర్వాసన వస్తోంది **- శ్రీనివాస్, స్థానికుడు**

✔ మరమ్మతులు చేసి లీకులు అరికడతాం. **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? కొబ్బరితోట ఈవీఎం పాఠశాల వెనుక రోడ్డులో మురుగు కాలువ పేరుకుపోయి భరించలేని దుర్వాసన వస్తోంది **- విక్రమ్, స్థానికుడు**

✔ వ్యర్థాలు తొలగించి నీరు సాఫీగా ముందుకు సాగేలా చేస్తాం. **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ నుంచి విశ్వదుర్గేశ్వరిపేటకు వెళ్లే మార్గంలో డంపర్‌బిన్ రహదారిపై ఉండటంతో ప్రమాదకరంగా మారింది. **- శంకర్**

✔ డంపర్‌బిన్ తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **- ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

వైభవంగా మదనగోపాలుడి కల్యాణోత్సవాలు

విశేష అలంకరణలో మదనగోపాలుడు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలం బల్లిపాడులోని రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. లక్షపత్రి పూజతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 25న కుంకుమ పూజలు, 26 రాత్రి 3.15 గంటలకు స్వామివారి కల్యాణం తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. 27న విష్ణు సహస్రనామ పారాయణం, అన్నసమారాధన అనంతరం రథోత్సవం, 28న పొన్నవాహనోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలంకరణతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు.

పూజలో పాల్గొన్న భక్తులు

బాలికా సంరక్షణ బీమా నిధులు మంజూరు చేయించండి

మాట్లాడుతున్న రవీంద్రనాథ్

తణుకు, న్యూస్‌టుడే: బాలిక సంరక్షణ బీమా మొత్తాన్ని తల్లిదండ్రులకు చేరేలా సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శాసనమండలి సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. పేద ఆడపిల్లల చదువు, వివాహం, సంక్షేమం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 2005 బాలికా సంరక్షణ బీమా పథకాన్ని ప్రారంభించారన్నారు. అప్పట్లో నమోదు చేసుకున్న వారికి బాండ్లు కూడా ఇచ్చారు. బాలికకు 18 సంవత్సరాలు నిండి, ఒకే అమ్మాయి అయితే రూ.5 లక్షలు, ఇద్దరుంటే రూ.60 వేలు బీమా చేయించారన్నారు. ప్రస్తుతం బాండ్ల కాల పరిమితి ముగిసి ఐసీడీఎస్ కార్యాలయాల చుట్టూ బాలికల తల్లిదండ్రులు తిరుగుతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బాలిక సంరక్షణ పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి బీమా సొమ్ము మహిళలకు వచ్చేలా కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిని కోరారు.

ఘనంగా గూటన్‌బర్గ్ జయంతి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అచ్చు యంత్రం పితామహుడు జాన్ గూటెన్ బర్గ్ జయంతిని ఏటా ఫిబ్రవరి 24న నిర్వహిస్తామని తాడేపల్లిగూడెం ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఊరేగింపు నిర్వహించి జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఎస్.జగదీష్ రెడ్డి, పి.టి.వెంకన్న, సాయి, వి.సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

తణుకు, న్యూస్‌టుడే: తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మానవత జిల్లా అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిట్టూరి సుజాత ఆర్థిక సహాయంతో పైడిపర్రు, తేతలి, మండపాక, కొమరవరం జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ కోడూరి రాధాపుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవకుండా ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అధ్యక్షుడు కె.రాజరాజేశ్వరరావు అధ్యక్షతవహించగా జిల్లా శాంతి ర్యాలీ ఛైర్మన్ గమిని రాంబాబు, జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ ఛైర్మన్ బి.రామలక్ష్మి, కార్యదర్శి కటారి విశ్వనాథరాజు, ఛైర్మన్ శారదాదేవి, డైరెక్టర్లు శివన్నారాయణ, జనతరాజు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి బస్టాండు కూడలిలోని హృదయాంజనేయ స్వామికి మంగళవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి..

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కృత్తికా నక్షత్రం సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణం ఏలూరు రోడ్డులోని వాసవీ కన్యకాపమేశ్వరి అమ్మవారి పంచాయతన క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో విశేష అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నున్న బాలా త్రిపుర సుందరరావు, పేరూరి కాశియ్య, ఉప్పల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సిద్దేశ్వరస్వామి సేవలో రేణుక దంపతులు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పాతవూరులోని ఉమాసిద్దేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక దంపతులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దంపతులిద్దరు భక్తులతో కలిసి స్వామివారి ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

సుబ్బారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెం 7, పెంటపాడు-1 చొప్పున పరీక్ష కేంద్రాల్లో 2,585 మంది విద్యార్థులకుగాను 2,541 మంది పరీక్ష రాశారు.

తణుకు, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గంలో ఇంటర్ రెండో సంవత్సర పరీక్షలు మంగళవారం సజావుగా సాగాయి. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. పట్టణంలో మొత్తం 3,074 మంది విద్యార్థులకు 8 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. తొలి రోజు జరిగిన తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలకు 3029 విద్యార్థులు హాజరవ్వగా, 45 మంది గైర్హాజరయ్యారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతులు, నిర్వహణ కోసం బుధవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజినల్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇరగవరం మండలంలోని తూర్పు విప్పరు, కె.కె.వల్లి, ఆర్.ఖండ్రిక, కె.ఇల్లింద్రపర్రు, సూరంపూడి గ్రామాలకు సరఫరా ఉండదని వివరించారు.

రహదారి.. గుంతలమయంగా మారి

తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు మండలాలను కలుపుతూ జట్లపాలెం-యాగర్లపల్లి రహదారి ఏడేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోక పూర్తిగా ధ్వంసమైంది. గత వైకాపా ప్రభుత్వం రహదారులను విస్మరించడంతో పరిస్థితి దారుణంగా మారింది. రహదారిపై గుంతలు పడి రాళ్లు తేలాయి. లోడు వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము రేగుతుండటంతో వెనుక వచ్చే వాహన చోదకులు, పాదచారులకు దారి కనిపించడం లేదు. ఈ మార్గంలో జట్లపాలెం, ఉమామహేశ్వరం, కె.పెంటపాడు, మౌంజిపాడు, వెస్ట్‌విప్పర్రు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై పంచాయతీరాజ్ జేఈ అల్లిసన్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా త్వరలో పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, యాగర్లపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)**

ఆదమరిస్తే.. అటో ఇటో

రేలంగి నుంచి మండపాక వెళ్లే రహదారిలోని పంట కాలువ వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ విరిగిపోయింది. అధికారులు రెయిలింగ్ ఏర్పాటు చేయకుండా వంతెనకు ఇరువైపులా ప్రమాద సూచికలు మాత్రమే ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లోని కర్మాగారాలకు పనికి వెళ్లి రాత్రి వేళల్లో ఇంటికి వచ్చే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నామని, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇరగవరం**

ఎట్టకేలకు కేఎన్ రోడ్డు నిర్మాణం ప్రారంభం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో ఏకైక పొడవైన మార్గం కేఎన్‌రోడ్డు. చాలాచోట్ల గుంతలు పడి పాదచారులు, వాహనదారులకు దీర్ఘకాలం నుంచి ఇబ్బందికరంగా మారింది. తరచూ ప్రమాదాల బారిన పడి ఎంతో మంది గాయపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎట్టకేలకు ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. పైవంతెన నుంచి మాగంటి కల్యాణ మండపం సమీపంలోని అమ్మవారి ఆలయం వరకు ఈ రోడ్డును ఇరువైపులా పునర్నిర్మిస్తున్నారు. సుమారు 2.9 కిలోమీటర్ల పొడవున ఈ రోడ్డు పునర్నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ ఏఈ రవిబాబు మంగళవారం తెలిపారు. దీంతో సోమవారం నుంచి పనులు ప్రారంభించామన్నారు.

స్పందించారు.. ముప్పు తప్పించారు

కోడేరు-నల్లజర్ల రోడ్డులో మార్కెట్ ప్రాంగణంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభం, దానికి ఆనుకొని ఉన్న నియంత్రిక ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందారు. దీనిపై గత డిసెంబరు 24న 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమైంది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. పాడైపోయిన సిమెంట్ దిమ్మను, స్తంభాన్ని తొలగించి పక్కనే కొత్త దిమ్మ నిర్మించి దానిపైన నియంత్రిక అమర్చి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. **- న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్**

కల్తీ ఆహారంపై పర్యవేక్షణ అవసరం

తణుకు, న్యూస్‌టుడే: ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కల్తీపాలు, ఆహార పదార్థాల తయారీ సంస్థలపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ.ప్రతాప్ అన్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు ఘటనను నిరసిస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో తణుకులో పాలు, ఆహార పదార్థాలపై నిరంతరం పర్యవేక్షించాలని కోరుతూ తహసీల్దార్ అశోక్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ప్రతాప్, అజయకుమారి మాట్లాడుతూ ప్రజల జీవన పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో తేనీరు నుంచి భోజనాల వరకు బయట తినడం పరిపాటిగా మారిందన్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు తినే ఆహారాన్ని కూడా కల్తీ చేస్తూ అనారోగ్యానికి గురిచేస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. సీపీఎం నాయకులు మునిస్వామి, గోపి, వెంకటేశ్వరరావు, హర్షవర్ధన్, జయకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తణుకులో నినదిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తణుకు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగా రెండో రోజు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతాప్‌తోపాటు నాయకులు అజయకుమారి, కామన మునిస్వామి, ఎం.మధుశీల మాట్లాడుతూ పథకం ప్రకారం ఐసీడీఎస్ నిర్వీర్యం చేయడానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తున్నారని విమర్శించారు. సీపీఎం తరపున జిల్లా కార్యదర్శి కేతా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బళ్ల చినవీరభద్రం వారికి మద్దతు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి.. **పెంటపాడు, తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** జీతాలు పెంచాలని, కేంద్రాలకు ప్రభుత్వమే గ్యాస్ అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడులో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాల కార్యకర్తల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సిరపరపు రంగారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలని కోరారు. కె.ఝాన్సీలక్ష్మి, ఉప్పుల శారదా తదితరులు మాట్లాడారు.

ప్రత్తిపాడులో..

అయ్యా నమస్కారం.. చూపిస్తారా పరిష్కారం

తణుకు, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా 9వ రోజు మంగళవారం నడిరోడ్డుపై సాష్టాంగ నమస్కారం చేస్తూ నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని.. లేకుంటే ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. శేఖర్, విష్ణుమూర్తి, సత్యనారాయణ, అజయకుమార్ రాజు, గోపాలరావు, కుమారి, అన్నపూర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, సొసైటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు సీహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గు చేటన్నారు. వారి సమస్యల పరిష్కారం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదని తెలిపారు.

బోర్లా పడుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నినదిస్తున్న యూనియన్ నాయకులు

బదిలీల ప్రక్రియ ఆపాలని నిరసన

తణుకు, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సుల నిర్వహణ పేరుతో ఆర్టీసీ డిపో సిబ్బందిని బదిలీ చేయడం దుర్మార్గమైన చర్య అని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆరోపించారు. ఈ బదిలీలను వ్యతిరేకిస్తూ మంగళవారం తణుకు డిపోలో సంఘ సభ్యులు ఎర్రబ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సరిదే ఏసుబాబు, మునగాల రత్నం, గ్యారేజ్ సెక్రెటరీ దుర్గారావు, సభ్యులు పాల్గొన్నారు.

బి.కొండేపాడులో రక్షణ సువార్తసభలు

పెంటపాడు, న్యూస్‌టుడే: బి.కొండేపాడు గ్రామంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఏసుక్రీస్తు రక్షణ సువార్త సభలు నిర్వహిస్తామని పాస్టర్ కె.అబ్రహం తెలిపారు. హైదరాబాద్, కాకినాడ, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన దైవ సేవకులు పాల్గొంటారని తెలిపారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వ సహకారం

రాష్ట్ర స్థాయి సైకిల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

మహదేవపట్నం(ఉండి), న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తోందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్.మోహన్‌దాస్ తెలిపారు. మహదేవపట్నం ఉన్నత పాఠశాల నుంచి 165 జాతీయ రహదారి వరకూ బాలికలకు 8 కేఎం, బాలురకు 10 కేఎం సైకిల్ పోటీలు మంగళవారం నిర్వహించారు. సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి ఈ పోటీలను ప్రారంభించారు. మోహన్‌దాస్ మాట్లాడుతూ కలెక్టర్ నాగరాణి ఆదేశాల ప్రకారం రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. విజేతలు ఈనెల 28న ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు జాన్‌బాబు, తెదేపా అధికార ప్రతినిధి వనిమా శ్రీనివాస్, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీ, పోలీసులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిములపై పోరాటం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభలో లేవనెత్తడంపై పశ్చిమ గోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం, ఏఐటీయూసీ అనుబంధం తాడేపల్లిగూడెం ఏరియా తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్‌బెండింగ్ కార్మికుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వెల్ఫేర్ బోర్డులో దాదాపు 46 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండిపోయాయని వాటికోసం ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా క్లెయిమ్‌ల సొమ్ములను లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు డి.సోమసుందర్ కోరారు. బొల్లాడ నాగరాజు, పోలిరాతి ఆదినారాయణ, మైలవరపు శ్రీరాంబాబు, ఏడిద వాసు, అంకం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిములు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవర ప్రసాద్ కోరారు. మంగళవారం ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు బండి దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిములు పరిష్కరించాలన్నారు. బి.దుర్గాప్రసాద్, జమితార చంద్రశేఖర్, డి. పాండురంగ, ఎం.ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేసిన మోహనరావు తదితరులు

నైతిక విలువలతో కూడిన విద్య నేర్చుకోండి

పరిమెళ్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థీ పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవత పర్యావరణ పరిరక్షణ ఛైర్మన్ మోహనరావు సూచించారు. పెంటపాడు మండలం పరిమెళ్లలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నండూరి సూర్యచంద్రరావు అధ్యక్షతన మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన కెరీర్‌గైడెన్స్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఇష్టపడి చదువుతూ కష్టపడినట్లైయితే తప్పని సరిగా విజయం సాధిస్తారన్నారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలను ఆదర్శంగా చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు.

పింఛనుదారుల సమస్యలపై చర్చ

మాట్లాడుతున్న హరికుమార్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం కార్యాలయంలో మంగళవారం సంఘ అధ్యక్షుడు బి.హరి కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. వార్షిక నివేదికను సంఘ కోశాధికారి ఎండీ.ముస్తఫా ప్రవేశపెట్టగా కార్యదర్శి మూర్తి ఆమోదించారు. సంఘం నూతన ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దానం వెంకటరమణను ఎన్నుకున్నారు. సహాధ్యక్షులు కె.బాలకృష్ణ, ముత్యాల అర్జునరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఎం.డి.బాషా, సంఘ కార్యవర్గ సభ్యులు పి.నాగరాజు, దాసం వెంకటరమణ, పి.రామకృష్ణ, కె.సత్యనారాయణ, పి.వి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS 309/2025

Between:

చిటికిన రామచంద్రరావు - వాది

మరియు

మద్దాల ఉదయ్‌భాస్కర్ - ప్రతివాది
S/o. వెంకట సుబ్బారావు, D.No. 1-32, కడకట్ల రోడ్డు, తాడేపల్లిగూడెం.

పై నెంబరు దావాలో మీరు రూ. 15,12,000/- వాది గార్కి నోటు బాకీ ఇవ్వనందున మీపై దావా వేయగా మీరు సమనులు తీసుకోకుండా తప్పించుకొనుచున్నందున ఈ ప్రకటన ద్వారా సమనులు అమలుజరుపుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినారు. వాయిదా 12-03-2026న ఉన్నది. పై తేదీన మీరు స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ పై కోర్టులో హాజరు అయి అభ్యంతరములు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

Sd/- **Mutta Rama Rao**
Advocate, Subbraopeta
Tadepalligudem Tadepalligudem
Dt. 21-2-26 Cell: 94411 71612

(c) eenadu

శాండల్‌వుడ్‌కూ గండికోట ఘనత

జమ్మలమడుగు (గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గండికోటలో 'రామ్ రహీమ్' కన్నడ సినిమా చిత్రీకరణ మంగళవారం సందడిగా సాగింది. ఇక్కడి పెన్నాలోయ, జుమ్మామసీదు, మాధవరాయస్వామి తదితర ప్రాంతాల్లో పలు సన్నివేశాలను తెరకెక్కించారు. జుమ్మామసీదులో 'రామ్ రహీమ్' పాత్రధారుల ప్రార్థనలు చేస్తున్నట్లు, పెన్నాలోయ వద్ద కథానాయకుడు, కథానాయికపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రం తెలుగు, కన్నడ తదితర భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

పులివెందుల సీఐ ఇంట్లో మద్యం సీసాలు

స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, బంగారు ఆభరణాలు

ఈనాడు, కడప- న్యూస్‌టుడే, సింహాద్రిపురం: దొంగను వదిలేసి.. వ్యాపారిని బెదిరింపులకు గురి చేశారు పులివెందుల సీఐ, సింహాద్రిపురం ఎస్సై అనిల్ కుమార్. కేసు కట్టకుండా ఉండాలంటూ బేరసారాలకు దిగారు. వివరికి ఏసీబీ అధికారులు సోమవారం దొరికిపోయారు. వీరిద్దరిని ఏసీబీ డీఎస్పీ సీతారామారావు నేతృత్వంలోని అధికారుల బృందం రెండో రోజైన మంగళవారం కూడా సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో విచారించారు. పలు అంశాలపై ఆరా తీశారు. ఇలాంటి వ్యవహారాలు ఇంకా ఎక్కువున్నట్లు చేశారనే దిశగా వివరాలు రాబట్టారు.

డూప్లెక్స్ ఇళ్లు.. ఆభరణాలు

పులివెందులలోని సీఐ ఇంట్లో సోమవారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సోదాలు చేశారు. 200 గ్రాముల బంగారు ఆభరణాలు, విలువైన ఆస్తి పత్రాలు, 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతనికి నంద్యాలలో డూప్లెక్స్ ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. వీరిద్దరినీ కడపకు తీసుకొచ్చారు. కర్నూలు ఏసీబీ కోర్టులో బుధవారం హాజరుపర్చనున్నారు.

తరలివచ్చిన బాధితులు

సీఐ, ఎస్సైలను విచారించే క్రమంలో సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌కు పలువురు బాధితులు తరలివచ్చారు. సింహాద్రిపురం, తొండూరు మండలాలకు చెందిన వీరు గతంలో తమను కేసుల పేరుతో ఎలా బెదిరించిందీ వివరించారు.

చల్లని తల్లి పెద్దమ్మ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పెద్దమ్మ దేవర ఉత్సవాలను పురస్కరించుకుని చల్ల వితరణ కార్యక్రమాన్ని జమ్మలమడుగులో మంగళవారం వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మ, గంగమ్మ, పెద్దమ్మ ఆలయాల నుంచి పొలిమేర వరకు సుమారు 400 మంది భక్తులు చల్ల బానలతో ప్రదర్శన నిర్వహించారు. పోలేరమ్మ, గంగమ్మ, పెద్దమ్మ వేషధారణలోని కళాకారులను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవర కమిటీ అధ్యక్షుడు తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కడప.. కానుంది అంకురాల వేదిక

చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు

● ఎక్కడంటే!: అంకుర కేంద్రాన్ని రూ.9 కోట్ల అంచనాతో నిర్మిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయం- రిమ్స్ ఆసుపత్రి మార్గంలో వంద అడుగుల రహదారి పక్కన 26 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+3 ఆకృతుల్లో ఏర్పాటు చేస్తున్నారు.

ఈనాడు, కడప: ఆశించే స్థాయి నుంచి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతి ఇంటి నుంచి ఒకరు స్టార్టప్ రూపకర్తగా ఎదగాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం విశేష కృషి చేస్తోంది. అందులో భాగంగా అంకుర కేంద్రాన్ని కడపలో ఏర్పాటు చేస్తోంది. ఔత్సాహికులు నవ్యమైన ఆలోచనలతో వస్తే సంస్థల స్థాపనకు ఊతమివ్వనుంది. పది మందికి ఉపాధి కల్పించేందుకు అండగా నిలవనుంది. ఇందుకుగాను అత్యాధునిక వసతులతో స్టార్టప్ కేంద్రం కడపలో రూపుదిద్దుకుంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఈ నిర్మాణాన్ని తలపెట్టారు.

ఎలా ఉండనుందంటే!

● కేంద్రంలో సౌకర్యవంతమైన కార్యస్థలాలు, సమావేశ గదులు, ఎగ్జిక్యూటివ్ క్యాబిన్‌లు, 250 మంది నిపుణులు పని చేసేలా అత్యాధునిక మౌలిక సదుపాయాలుంటాయి. ● శిక్షణతో పాటు ఆవిష్కరణలు, వ్యాపారాభివృద్ధి మార్గాలు, ఆర్థిక వనరుల లభ్యతావకాశాలను సూచించేందుకు నిపుణులుంటారు. ● మరో రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ● అంకుర కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'తో అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు నిపుణులతో ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ● జిల్లాలోని ఎన్‌ఆర్‌ఐల వివరాలు సేకరించి వారు జిల్లాకు వచ్చిన సమయంలో ఈ కేంద్రాన్ని సందర్శించడం, వారి పరిధిలో సహాయ సహకారాలు, యువతకు తోడ్పాటునందించే కార్యక్రమాలు నిర్వహించేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

వచ్చారు.. కూర్చున్నారు.. వెళ్లారు

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ రామగోవిందరెడ్డి.. హాజరైన సభ్యులు, అధికారులు

నిమిషాల్లో ముగిసిన స్థాయి సంఘ సమావేశాలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: ప్రతి మూడు నెలలకు ఒకసారి జడ్పీ సర్వసభ్య సమావేశాల్లో అన్ని అంశాలపై క్షుణ్నంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవడం వీలుకాదు. ఈ నేపథ్యంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి జడ్పీ స్థాయి సంఘ సమావేశాలను నిర్వహిస్తుంటారు. అందుకుగాను ప్రణాళిక-ఆర్థిక స్థాయి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య-వైద్యసేవలు, స్త్రీ-శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పనుల స్థాయిల్లో నిర్దేశించిన జడ్పీటీసీ సభ్యులు సమస్యలపై క్షుణ్నంగా చర్చించాల్సి ఉంటుంది. కడప జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటైన స్థాయి సంఘ సమావేశం అందుకు భిన్నంగా సాగింది. కేవలం 40 నిమిషాల్లోనే మమ అనిపించారు. సమస్యలపై అయిదారుగురు మినహా ఇతర జడ్పీటీసీ సభ్యులెవరూ నోరు మెదపలేదు. గత కొంతకాలంగా జడ్పీ సమావేశాలు ఇదే రీతిన సాగుతుండటం శోచనీయం.

● వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని జడ్పీ ఛైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో గుర్తించామని, పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు బదులిచ్చారు.

● పింఛన్లపై పలువురు జడ్పీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు డ్వామా పీడీ బదులిచ్చారు.

● మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు తగదని, వీబీజీరామ్‌జీ వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై అధిక భారం పడుతుందని పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ అన్నారు. జడ్పీ ఛైర్మన్ రామగోవిందరెడ్డి స్పందిస్తూ.. వీబీజీరామ్‌జీ పథకంపై ప్రజల్లో ఉన్న అపోహలను సంబంధిత అధికారులు తొలగించాలని సూచించారు.

● వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ మాట్లాడుతూ... గండిలో ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు.

● గత జనరల్ బాడీ సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను జాప్యం లేకుండా సంబంధిత అధికారులు పంపాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ సూచించారు.

ఇఫ్తార్ విందు.. మత సామరస్యంతో పసందు

జామియా మసీదు వద్ద వెజిటబుల్ బిర్యానీ వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చూపిన మత సామరస్యం ఇప్పుడు పలువురిని ఆలోచింపజేస్తోంది. జమ్మలమడుగు పట్టణంలో ప్రస్తుతం పెద్దమ్మ దేవరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 23, 24, 25 తేదీల్లో కోళ్లు, జీవాల వధ, మాంసాహారాన్ని నిషేధించారు. ఆ మేరకు దేవర కమిటీ నిర్వాహకులు మసీదు పెద్దలను సంప్రదించి ఆ మూడు రోజులతో పాటు 28న మాంసాహారం నిషేధించాలని కోరారు. దీంతో ముస్లిం సోదరులకు ఉపవాసం అనంతరం జామియా మసీదులో వెజిటబుల్ బిర్యానీ, పండ్లు, తాగునీరు, మజ్జిగతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆ మూడు రోజులపాటు సహరీ, ఇఫ్తార్‌లో మాంసాహార నిషేధంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాపాల భైరవుల తప్పులు ఉడకనీయం

హోటళ్లు, విక్రయ కేంద్రాల్లో తనిఖీలు

పాల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రామచందర్, హరిత

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జిల్లాలో కొందరు పాల కల్తీకి పాల్పడుతున్నారంటూ 'ఈనాడు'లో 'కడప గడపనా పాపాల భైరవులు' శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ శ్రీధర్ తనిఖీలకు ఆదేశించారు. ప్రజారోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆ మేరకు అదనపు ఆహార నియంత్రణాధికారి రామచందర్, ఆహారభద్రత అధికారి హరిత ఆధ్వర్యంలో సిబ్బంది కడపలోని పలు పాల కేంద్రాలు, రెస్టారెంట్లను తనిఖీ చేశారు. కల్తీకి పాల్పడుతున్న కొందరిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో మంచి ఆహారాన్ని అందించాలని హోటల్, హలీం నిర్వాహకులకు సూచనలు చేశారు. రసాయనాలు, మితిమీరిన రంగులు కలపొద్దన్నారు.

జిల్లాకు 884 టన్నుల యూరియా

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాకు మరోసారి యూరియా వచ్చింది. ర్యాక్‌లో కడప రైల్వే స్టేషన్‌కు ర్యాక్‌లో వచ్చిన 884 టన్నులను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ మంగళవారం పరిశీలించారు. ఇందులో ప్రైవేట్ డీలర్లకు 442, మార్క్‌ఫెడ్‌కు 442 టన్నులు కేటాయించినట్లు తెలిపారు.

మాండవ్యను మేస్తున్నారు

◆ నదిని కొల్లగొడుతున్న ఇసుకాసురులు
◆ వంతెనలు, కల్వర్టుల చెంతనే తవ్వకాలు

పుల్లగూగండి వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన సమీపంలో ఇసుకను ట్రాక్టర్‌కు నింపుతున్న జేసీబీ

వీరబల్లి, న్యూస్‌టుడే: మాండవ్యను ఇసుకాసురులు మేసేస్తున్నారు. ప్రజలకు చెందాల్సిన సహజ వనరులను ఉచితం మాటున మట్టుబెడుతున్నారు. యంత్రాలతో నిరంతరాయంగా తవ్వకాలు సాగిస్తూ నమిలి మింగేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి తమ ఇనప్పెట్టెలు నింపుకొంటున్నారు. వంతెనలు, కల్వర్టుల చెంతనే తవ్వకాలు సాగిస్తూ ప్రజోపయోగ కట్టడాలకు కష్టకాలం తెస్తున్నారు. ప్రకృతి మాతకు మానని గాయాలు మిగిలిస్తూ భావితరాలకూ భద్రత లేకుండా చేస్తున్నారు.

● అడ్డుకుంటే బెదిరింపులు: ప్రభుత్వం కల్పించిన ఉచిత ఇసుక విధానాన్ని కొందరు తమ అక్రమాలకు అనుగుణంగా మార్చుకున్నారు. వీరబల్లి మండలంలోని వీరబల్లి, పెద్దివీడు, రాగిమానుదిన్నెపల్లె, వంగిమళ్ల, ఓదివీడు, మట్లి తదితర గ్రామాల్లో మాండవ్య నది నుంచి రోజూ వందల ట్రిప్పులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సమీప ప్రాంత రైతులు అడ్డుకుంటున్నా వీరి ఆగడాలు ఆగడం లేదు. కొన్నిసార్లు దౌర్జన్యానికి దిగి భయపెడుతున్నారు.

● సబ్ కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు: ఇసుక తవ్వకాలపై అందిన ఫిర్యాదుల మేరకు రాజంపేట సబ్ కలెక్టర్‌కు భావన ఇటీవల మాండవ్య నదిని పరిశీలించారు. ఇసుక అమ్ముకుంటున్న వారిపై కేసులు నమోదు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆ తర్వాత కూడా పరిస్థితిలో మార్పు లేదు. వంగిమళ్ల మార్గంలోని పుల్లగూర గండి వద్ద రూ.7 కోట్లతో ఇటీవల వంతెన ఏర్పాటు చేశారు. ఆ నిర్మాణం సమీపంలోనే యంత్రాలతో తవ్వేశారు. కల్వర్టుల సమీపంలోనూ పెద్ద గోతులు పెట్టారు. ఈ విషయమై తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ.. యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

48 గంటల్లోనే జాబ్‌కార్డు

ముకోసం

జిల్లాలో బ్లాకులు	35
పంచాయతీలు	562
జాబ్‌కార్డున్న కుటుంబాలు	1.47 లక్షలు
అందులోని సభ్యుల సంఖ్య	2.39 లక్షలు
వంద రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు	5,060

కొండాపురం, గోపవరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పలు మార్పులు తెచ్చింది. పథకం పేరును వికసిత్ భారత్ గ్రామీణ రోజ్‌గార్ మిషన్(వీబీ జీ రామ్ జీ)గా మార్పు చేసింది. పనిదినాలనూ 125 రోజులకు పెంచింది. గతంలో జాబ్‌కార్డు పొందాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికింది. కొత్త కార్డు కావాలనుకునే వారికి దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మరోవైపు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈకేవైసీనీ అమల్లోకి తెచ్చింది. రెండు, మూడుచోట్ల పేర్లు నమోదు చేయించుకోవడం, ఒకరికి బదులు మరొకరు పనులు చేయడం.. పనులకు రాని వారి పేర్లపై మస్టర్లు వేసి నగదు తీసుకోవడం వంటి అక్రమాలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్టవేసింది. కొత్త జాబ్‌కార్డు కావాలనుకునేవారు నేరుగా ఉపాధి హామీ క్షేత్రసహాయకుడిని సంప్రదిస్తే ఈకేవైసీ పూర్తిచేసి దరఖాస్తు చేస్తారు. ఉన్నతాధికారులు పరిశీలించి జారీ చేస్తారు.

ముచ్చట.. నడి రోడ్డుపై ఇదేం పోకడ

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ఓ వైపు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు కలవర పెడుతున్నాయి. అదే సమయంలో మరోవైపు కొందరి తీరు ఏమాత్రం మారడం లేదు. అందుకు నిదర్శనం ఈ చిత్రం. ద్విచక్ర వాహనాలపై పరిమితికి మించి యువకులు ప్రయాణిస్తున్నారు. ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదు. పైగా రోడ్డుపై వెళ్తూ వెళ్తూనే ముచ్చట్లు పెట్టుకున్నారు. ఓ యువకుడు వేరే ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి చేతిని కూడా పట్టుకున్నారు. ఈ తీరుపై అటుగా వెళ్తున్న పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దృశ్యం జమ్మలమడుగు - ముద్దనూరు ప్రధాన రహదారిలో 'న్యూస్‌టుడే' కంటికి మంగళవారం కనిపించింది.

మొదలైన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు

కడప నగరంలోని శ్రీహరి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా 62 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పేపర్- 2 పరీక్షకు జనరల్ విభాగంలో 14,011 మందికి గాను 13,691 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,148 మందికి గాను 1,086 మంది రాశారు. మొత్తంగా 15,159 మంది విద్యార్థులకు 14,777 మంది హాజరవ్వగా.. 382 మంది గైర్హాజరయ్యారు. పలు కేంద్రాలను ఆర్ఐవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఏదైనా సమస్య ఉంటే 08562 244171 నంబర్‌కి ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

ఆర్ఆర్ఆర్ రివర్స్!

◆ సందిగ్ధంలో రూ. 13.68 కోట్లు
◆ వెనక్కి పంపేలా డీసీసీబీ చర్యలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: సంఘాల పునరుద్ధరణ, సంస్కరణ, పునఃనిర్మాణం(ఆర్ఆర్ఆర్) పేరుతో చేనేత సహకార సంఘాల అభివృద్ధికి నాబార్డు దాదాపు ఆరేళ్ల క్రితం నిధులిచ్చింది. వీటిని సహకార సంఘాల అధికారులు ఇప్పటి వరకు సర్దుబాటు చేయలేదు. దీంతో ఆ నిధులను వెనక్కి పంపాలని నాబార్డు సూచించింది. ఆ మేరకు జిల్లా సహకార కేంద్రబ్యాంకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. తద్వారా గతంలోని నిర్లక్ష్యంతో ఇప్పుడు ఉమ్మడి కడప జిల్లాలోని 110 చేనేత సంఘాలకు నష్టం వాటిల్లే పరిస్థితి తలెత్తింది.

ఇదీ విషయం

సంఘాల అభివృద్ధికి ఆర్ఆర్ఆర్ నిధులను 2020లో అప్పటి ఉమ్మడి జిల్లా పరిధిలోని 110 సంఘాలకు కేటాయించారు. జిల్లా విభజన అనంతరం జిల్లాలో 103 సంఘాలు మిగలగా, అన్నమయ్య జిల్లా(రాయచోటి)లోకి 7 వెళ్లాయి. జిల్లా పరిధిలోని సంఘాలకు రూ. 13.24 కోట్లు, అన్నమయ్య జిల్లాకు రూ. 44.24 లక్షల నిధులు సర్దుబాటు చేయాల్సి ఉంది.

శాపంగా మారిన విచారణపర్వం

పలు ఆరోపణల కారణంగా 2019లో జిల్లాలోని చేనేత, సహకార సంఘాలపై అప్పటి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీఐడీ అధికారులు విచారణ చేపట్టడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఆర్ఆర్ నిధుల సర్దుబాటు నిలిపేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సర్దుబాటు చేయకుండా ఉంచారు.

సర్దుబాటు చేస్తేనే ప్రయోజనం

డీసీసీబీలో ఆర్ఆర్ఆర్ నిధులు వినియోగించకుండా ఉంచిన వైనాన్ని నాబార్డు బృందం ఇటీవల గుర్తించింది. వెనక్కి పంపాలని సూచించింది. తమకు బకాయి ఉన్న 18 సంఘాలకు సంబంధించి రూ. 2,22,44,000 డీసీసీబీ జమ చేసుకోగా.. మిగిలిన రూ. 11,46,02,000 వెనక్కి పంపేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏ సంఘాలకు అర్హత ఉందో వాటికి నిధులు సర్దుబాటు చేసేలా చర్యలు చేపడితే ఎంతో మేలు.

అదిగో ముహూర్తం.. ఏదీ పనుల్లో వేగం!

మాడ వీధిలో ఏర్పాటు చేస్తున్న చలువ పందిరి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు మార్చి 26న అంకురార్పణ చేయనున్నారు. ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు తితిదే ఉన్నతాధికారులు ఇప్పటికే అనుమతిచ్చారు. ఈ నేపథ్యంలో పరిపాలన, సివిల్, విద్యుత్తు, అటవీ, ఉద్యాన, పారిశుద్ధ్యం, భద్రతా, వాహనాల పార్కింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో వసతులు కల్పించాల్సి ఉంది. జిల్లా యంత్రాంగం తరపున కొన్ని పనులు చేయాల్సి ఉంది. రామయ్య క్షేత్రం, మాడ వీధులు, కాలిబాటలు, అన్నదానం, కల్యాణ వేదిక ప్రాంగణంలో చలువ పందిళ్లు, షామియానాలు, క్యూలైన్లు, బారికేడ్లు వేయాల్సి ఉంది. ఈ పనులు నిదానంగా సాగుతున్నాయి.

ఇవీ చేపట్టాల్సిన పనులు

● ఉత్సవాల సమాచారంపై ముద్రించిన కర, గోడ పత్రాలు, ఆహ్వాన పత్రికలు, పుస్తకాలు ఇంకా రాములోరి సన్నిధికి చేరలేదు. ● ఉత్సవాల వేళ రాములోరి దివ్యాలయం, పరిసర ప్రాంతాలు దేదీప్యమానంగా ప్రకాశించేలా విద్యుద్దీపాలతో అలంకరణ చేయాల్సి ఉంది. రంగులు కొట్టి ఉత్సవ శోభ తీసుకురావాలి. ● రథానికి మరమ్మతులు చేయాలి. ● ప్రచారం కోసం పెద్ద కటౌట్లు, ఫ్లెక్సీలు తయారు చేయించి తీసుకురావాలి. ● కల్యాణ వేదిక, వాహన మండపం వద్ద సిమెంటు అచ్చులు పరిచే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ● అన్న ప్రసాదం తయారీకి వసతులు కల్పించాల్సి ఉంది. ఉద్యాన వనాలకు హరిత శోభ తేవాల్సి ఉంది.

పూర్తిస్థాయి అధికారి లేరు

ఒంటిమిట్ట పరిపాలన విభాగంలో డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న పీవీ.నటేష్‌బాబు గతేడాది జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి రెగ్యులర్ అధికారిగా ఎవరినీ నియమించలేదు. తితిదే పాలకమండలి విభాగం డిప్యూటీ ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.ప్రశాంతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర అధికారిక హోదా గుర్తింపు పొందిన రామయ్య క్షేత్రానికి డిప్యూటీ ఈవోను నియమించకపోవడం పనుల పురోగతిపై ప్రభావం చూపుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు
ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు.
ఆకాంక్షించండి వారి భావి జీవితం, సుఖమయం కావాలని
తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
ప్రకటనపై జీ.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

ఆయుష్ పోసేందుకు నిధులు

బద్వేలు కోటవీధిలోని ఓ అద్దె గృహంలో నడుస్తున్న ఆయుర్వేద ఆసుపత్రి

బద్వేలు, న్యూస్‌టుడే: ఆయుష్ ఆసుపత్రులు వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. నిధుల కేటాయింపు లేక సమస్యలతో కునారిల్లాయి. కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటికి జవసత్వాలు తెచ్చేలా కృషిచేస్తోంది. శిథిల భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అవసరమైన చోట కొత్తవీ నిర్మించనుంది. జిల్లాకు సంబంధించి రూ.5.70 కోట్ల మేర నిధులు అందనున్నట్లు అంచనా. ● కడప ఆయుష్ రీజినల్ డైరెక్టర్ పరిధిలో ఎనిమిది జిల్లాలున్నాయి. వీటిలో ఆయుర్వేద, యునాని, హోమియో ఆరోగ్య కేంద్రాలు 187 వరకు ఉన్నాయి. ● వైద్యుల్లేక 49 మూతపడగా.. మిగిలిన 138 చోట్ల అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ● జిల్లాలోని తొట్టిగారిపల్లె, తాళ్ల ప్రొద్దుటూరు, కమలాపురంతో పాటు మరో ఆరు ఆయుర్వేద ఆసుపత్రులు వైద్యుల కొరతతో సేవలు అందించడం లేదు. వీటన్నింటికీ అవసరమైన సిబ్బందిని త్వరలో నియమించనున్నారు. ● తొట్టిగారిపల్లె హోమియో ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ● బద్వేలులో సొంత భవనం లేక కోటవీధిలోని ఓ అద్దె గృహంలో కొనసాగిస్తున్నారు. ● బ్రహ్మంగారిమఠంలోనూ ఓ సత్రంలో నడుస్తోంది. వీటన్నింటికీ మరమ్మతులతో పాటు వైద్యులు, సిబ్బంది, భవనాలు సమకూరనున్నాయి. ● ఈ విషయంపై కడప ఆయుష్ రీజినల్ డైరెక్టర్ కుమార్‌బాబు మాట్లాడుతూ.. త్వరలో ఆయుర్వేద ఆసుపత్రుల ద్వారా సేవలందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

రంజాన్ వేళలు	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
కడప	6.28	5.18
ప్రొద్దుటూరు	6.29	5.22

విజ్ఞాన ఉద్యోగ ఉపాధి వనరుగా తీర్చిదిద్దుదాం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప స్టార్టప్ కేంద్రం విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా మారేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ శ్రీధర్ సూచించారు. స్టార్టప్ కడప ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కేంద్రం నిర్మాణ పనులపై కడప కలెక్టరేట్‌లో జేసీ నిధి మీనాతో కలిసి ఆయన మంగళవారం సమీక్షించారు. యువతకు నైపుణ్య నిధిగా కేంద్రాన్ని తీర్చిదిద్దాలని జిల్లా యంత్రాంగానికి నిర్దేశించారు. యువతకు కలలకు రూపురేఖలిచ్చే వేదికగా ఎదిగేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం స్టార్టప్ కేంద్ర భవన నిర్మాణాలను పరిశీలించారు.

శ్రీరస్తు ఓం నమో వీరబ్రహ్మణే శుభమస్తు
జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠం
కందిమల్లాయపల్లె గ్రామం & పోస్ట్ - 516503, బ్రహ్మంగారిమఠం మండలం, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 08569 - 286023, 25: 9502986023, 9652216023

8వ తరం 12వ మఠాధిపతుల వారి పట్టాభిషేక మహోత్సవ ఆహ్వానము
తేదీ: 24.02.2026 మంగళవారం నుండి
తేదీ: 26.02.2026 గురువారం వరకు త్రయాహ్నిక దీక్షతో
సహాయ నిర్వాహకులు
నొస్సం వీరభద్రయ్య స్వామి
నొస్సం దత్తాత్రేయ స్వామి
పిపిఎన్ ప్రసాద్
కన్వీనర్/మేనేజర్
నార్సమంగళం ఈశ్వరాచారి

మఠాధిపతులు
శ్రీశ్రీశ్రీ వీరభద్రస్వామి వేంకటాద్రిస్వాముల వారు
జై వీరబ్రహ్మ జై గోవిందమాంబ జై

(c) eenadu

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ పెంచాలి

అసెంబ్లీలో మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు కనీస పింఛన్ అమలుచేయాలనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవి కోరారు. అసెంబ్లీ సమావేశంలో ఆమె ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల గురించి మంగళవారం చర్చించారు. 2014కు ముందు ఆర్టీసీలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు వృద్ధాప్య పింఛను కంటే తక్కువగా పింఛను వస్తోందని దీంతో వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో సుమారు ఆరు వేల మందికి పైగానే విశ్రాంత ఉద్యోగులున్నారని నేపథ్యంలో వారికి కనీస పింఛన్ రూ.6 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దివ్యాంగులకు సమానమైన పింఛన్ ఇవ్వాలని చూడాలన్నారు. స్పందించిన రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని సమాధానమిచ్చారు.

నేడు బి.మఠానికి మందకృష్ణ మాదిగ రాక

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: బ్రహ్మంగారిమఠానికి బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నారు. మండల పరిధిలోని దళిత యువకుల మృతిపై అనుమానాలున్నాయని సమగ్ర విచారణ కోరుతూ నిర్వహించే మాదిగల ఆత్మ గౌరవ నిరసన ప్రదర్శనలో పాల్గొననున్నారు.

చిన్నబోతున్న గుడ్డు!

● చిన్నారులకు అందని పౌష్టికాహారం

కమలాపురం, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించాలనే ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చుచేసి చిన్నారులు, విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు ప్రతి నెలా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నాయి. అయితే వీటి పంపిణీపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో గుత్తేదారు కుట్రపూరితంగా తక్కువ బరువు ఉన్న గుడ్లను సరఫరా చేస్తున్నా ఇటు వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి.

ఇదీ పరిస్థితి: జిల్లాలో 2,758 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఒక్క కమలాపురం నియోజకవర్గంలోనే 326 అంగన్‌వాడీ కేంద్రాలు, 295 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు గురుకుల, బీసీ, ఎస్సీ సమీకృత వసతిగృహాల్లో విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతి నెలా లక్షల్లో కోడిగుడ్లను ప్రభుత్వం అందిస్తున్నా వీటిపై పర్యవేక్షణ మాత్రం తక్కువగా ఉందనే అభిప్రాయం లబ్ధిదారులు, అంగన్‌వాడీ, ఉపాధ్యాయుల్లో నెలకొంది.

● గుడ్ల నాణ్యత, బరువులో తేడాలుండటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకీకృత టెండర్ విధానాన్ని అమలు చేసి పంపిణీ బాధ్యత ఒక్కరికే అప్పగించింది. ఇలా జిల్లా వరకు సదరు టెండర్ దక్కించుకుని సరఫరా చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా ఈ సరఫరాలో మిగిలిన వ్యాపారులు కలిసి గుడ్లు సరఫరా చేస్తున్నారు.

జిల్లా	: వైఎస్సార్ కడప
అంగన్‌వాడీ కేంద్రాలు	: 2,758
మొత్తం పాఠశాలలు	: 4,582

కమలాపురంలో సరఫరా చేసిన చిన్నసైజు గుడ్లు

నాణ్యమైనవి సరఫరా చేసేలా చర్యలు

ఒక్కో గుడ్డు తప్పకుండా 50 గ్రాముల బరువు ఉండాలి. 30 కేజీలు ఉన్న అట్ట తప్పకుండా 1.5 కేజీలు బరువు ఉండేలే తీసుకోవాలని పాఠశాల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించాం. లేదంటే వెనక్కు ఇవ్వాలని చెప్పాం. నాణ్యమైనవి సరఫరా చేసేలా దృష్టి సారించాం.

- శాంతమ్మ చెన్నూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి మండలాల సీడీపీవో

తూకంలో తేడాలు

● ఒక్కో గుడ్డు 45 నుంచి 50 గ్రాముల వరకు ఉండాలి. ఇలా 30 గుడ్ల అట్ట 1.5 కేజీల బరువు ఉండాల్సి ఉండగా దాదాపు అది 1.2 కేజీలలోపే ఉంటోంది. నిర్దేశించిన బరువు ఉండేలే లేని కోళ్ళు ఉన్న క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు. విద్యాసంస్థలకు తీసుకొచ్చే అట్టల్లో బయటకు కనిపించే గుడ్లు పెద్దవిగా, కింద అట్టల్లో చిన్నవి పెట్టి తీసుకొస్తున్నట్లు ఇలా అనేక ఆరోపణలున్నాయి. తూకం వేసే పరిస్థితి ఎక్కడా లేకపోవడంతో కొంత కాలంగా ఈ దందా కొనసాగుతోంది.

పక్కాగా అటవీ సంరక్షణ నిబంధనల అమలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అటవీ సంరక్షణ, వన్య ప్రాణుల పరిరక్షణ చర్యల్లో భాగంగా రూపొందించిన నిబంధనలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లో మంగళవారం డీఎఫ్‌వో వినీత్‌కుమార్‌తో కలిసి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ పార్కు, లంకమల్లేశ్వరం వైల్డ్‌లైఫ్ శాంక్చువరీ జోనల్ మాస్టర్ ప్లాన్‌పై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఈఎస్‌జెడ్ విషయాల్లో అభివృద్ధి కార్యక్రమాల సంబంధించి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో పరిపాలన, కొత్తచట్టాల విషయంలో ఆయా పరిధిలోని పట్టణ ప్రాంత పాలక యంత్రాంగం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ.. ఎకో సెన్సిటివ్ జోన్స్ ఏర్పాటులో భాగంగా కొన్ని నిబంధనలు వచ్చాయని వాటిని కచ్చితంగా అమలు చేస్తున్నారు.

సమీక్ష చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో డీఎఫ్‌వో వినీత్‌కుమార్

● పీఎంశ్రీ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపిక చేసిన వివిధ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ రకాల అభివృద్ధి పనులను ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో షంషుద్దీన్, ఎస్‌ఎస్ఏ ఏపీసీ ప్రేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జోన్ ఈయూ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణకుమార్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడపలో ఇటీవల జరిగిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యవర్గ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా కడపకు చెందిన కె.కృష్ణకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ తెలిపారు. కడపలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మొన్నటి వరకు కృష్ణకుమార్ జోనల్ అధ్యక్షులుగా పని చేస్తూ కార్మికుల పక్షాన పోరాటం చేశారన్నారు. డిపో స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగారని కొనియాడారు.

సాగులో అధిక దిగుబడి వచ్చేందుకు కృషి

మైదుకూరు, న్యూస్‌టుడే: పరిశోధన ఫలాలను రైతుల ముంగిటకు చేర్చి పంటల సాగులో అధిక దిగుబడికి కృషి చేయాలని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు సి.ఆర్.రూత్ తెలిపారు. మంగళవారం మైదుకూరు మండలం వనిపెంట కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త బాలకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విస్తరణ సంచాలకులు మాట్లాడుతూ పంటల సాగులో వచ్చే నూతన యాజమాన్య పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులకు వివరించి చైతన్యవంతులను చేయాలని సూచించారు. రైతు శిక్షణ కార్యక్రమాలకు పెద్ద పీట వేయాలన్నారు. మైదుకూరు ప్రాంతంలో పండిస్తున్న కృష్ణాపురం ఉల్లి, పసుపు రకాలను భౌగోళిక సూచిక ట్యాగ్ సాధించేలా కృషి చేయాలని సూచించారు. తిరుపతికి చెందిన అసోసియేట్ డైరెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ పట్టు పరిశ్రమ విస్తరణతోపాటు అరటి, నిమ్మ, బత్తాయి పంటలపై శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. నాబార్డు ఏజీఎం బి.విజయవిహారి మాట్లాడుతూ మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, స్వయం ఉపాధి మార్గాలను వివరించి ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో అధికారులు ఎం.నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు సీఆర్ రూత్ చిత్రంలో అధికారులు

జిల్లాలో పలువురు అధికారులకు కీలక పోస్టింగ్‌లు

ఈనాడు, కడప: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా బదిలీ ఉత్తర్వుల్లో జిల్లాకు సంబంధించి పలు కీలక పోస్టింగ్‌లు చోటు చేసుకున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు, కేఆర్‌ఆర్సీ యూనిట్లలో అధికారుల నియామకాలు జిల్లాలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తెలుగుగంగ ప్రాజెక్టు యూనిట్-11(కడప)లో స్పెషల్ కలెక్టర్‌గా ఆర్.శివరాముడిని నియమించారు. సోమశిల ప్రాజెక్టు యూనిట్-4లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బి.శివరామిరెడ్డి (ప్రస్తుత కమలాపురం తహసీల్దార్) బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యాలయం కడపలోని కలెక్టర్ కార్యాలయంలో ఉంటుంది. కేఆర్‌ఆర్సీ స్పెషల్ కలెక్టర్‌గా జె.నాగరాజును నియమించారు. భూసేకరణ, పునరావాస చర్యల్లో ఈ విభాగం కీలకంగా ఉంటుంది. అన్నమయ్య జిల్లా మదనపల్లె, పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్లకు వీఎస్ నారాయణరెడ్డి (ప్రస్తుత కడప తహసీల్దార్), మాధవకృష్ణారెడ్డి(కడపలో కలెక్టర్ కార్యాలయ తహసీల్దార్)లను ఎస్‌డీసీలుగా నియమించారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఎస్.హరిప్రసాద్‌ను జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజరుగా నియమించారు. విపత్తుల నిర్వహణలో సమన్వయానికి ఈ నియామకం కీలకంగా ఉండనుంది. ముద్దనూరు జీఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఎస్‌డీసీగా పని చేస్తున్న బీకే వెంకటేశులను బదిలీ చేసి శ్రీకాళహస్తి దేవస్థానం ఈవోగా నియమించింది. బి.అనురాధ (ప్రస్తుత పెండ్లిమర్రి తహసీల్దార్) తిరుపతి జిల్లా లీగల్ సెల్ ఎస్‌డీసీగా నియమితులయ్యారు.

కల్యాణం.. కమనీయం తరలివచ్చిన భక్తజనం

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం మన్నూరులోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తెలవారితో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, ఆకేపాటి గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బి.మఠంలో పట్టాభిషేక మహోత్సవాలు ప్రారంభం

ప్రత్యేక పూజలు చేస్తున్న వెంకటాద్రిస్వామి, ఉమాదేవి దంపతులు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: వీరబ్రహ్మేంద్రస్వామి మఠాధిపతి వెంకటాద్రిస్వామి పట్టాభిషేక మహోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మఠాధిపతి దంపతులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఉత్సవాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వీరంభట్లస్వామి, దత్తాత్రేయస్వామి, ప్రసాద్, మేనేజర్ ఈశ్వరయ్యాచారి తెలిపారు.

అమ్మ.. ఇచ్చింది పునర్జన్మ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : మూత్రపిండాలు విఫలమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న.. కుమారుడికి తన కిడ్నీ ఇచ్చి పునర్జన్మ ప్రసాదించారు ఏడు పదుల వయసు గల తల్లి ఖాదర్‌బీ. ఇందుకు సంబంధించి కర్నూలు మెడికవర్ ఆసుపత్రి యూరాలజీ సర్జన్ డాక్టర్ అబ్దుల్ సమద్, నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్ధార్థ్ హెరూర్ వెల్లడించారు. మండల కేంద్రమైన నరసాపురం గ్రామానికి చెందిన మహబూబ్ బాషా మూత్రపిండాల వైఫల్యంతో ఈ నెల మొదటి వారంలో కర్నూలులోని ఆసుపత్రిలో చేరారు. ఇతనికి కిడ్నీ మార్పిడి చేయాల్సిందేనని వైద్యులు తేల్చారు. కుమారుడికి కిడ్నీ దానం చేసేందుకు తల్లి ఖాదర్‌బీ ముందుకొచ్చారు. దీంతో ఈ నెల 15న ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద శస్త్రచికిత్స చేసి తల్లి నుంచి ఓ కిడ్నీ సేకరించి కుమారుడికి అమర్చారు. శస్త్రచికిత్స చేయించుకున్న మహబూబ్ బాషా, ఖాదర్‌బీ ఇద్దరూ ఆరోగ్యంగా ఉండటంతో మంగళవారం డిశ్చార్జి చేశామని వైద్యులు తెలిపారు.

మహబూబ్‌బాషా, ఖాదర్‌బీతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

విమానాశ్రయంలో ట్యాక్సీల నిర్వహణపై వివాదం

బిల్టప్, కడప న్యూస్‌టుడే: కడప విమానాశ్రయంలో అద్దె వాహనాల ఆపరేటర్ల మధ్య మంగళవారం చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. విమానాశ్రయం నుంచి ప్రయాణికులను నగరంలోని ఇతర ప్రాంతాలకు చేర్చడం.. వివిధ ప్రాంతాల నుంచి విమానాశ్రయానికి తీసుకు రావడం కోసం ట్యాక్సీలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వాటి నిర్వహణ విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం జరిగిందని తెలిసింది.

రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : : కడప

E.P.No. 181/2020

O.S.No. 832/2019

1. కొడతల వెంకట రమణారెడ్డి, తండ్రి లేట్ నారాయణరెడ్డి గతించించినందున వారసులు అయినటువంటి వారి భార్య మరియు కుమారుడు
2. కొడతల ఓబులమ్మ, భర్త లేట్ వెంకట రమణారెడ్డి, వయస్సు 52 సంవత్సరాలు, హిందూ,
3. కొడతల నరేష్ కుమార్‌రెడ్డి, తండ్రి లేట్ వెంకట రమణారెడ్డి, వయస్సు 37 సంవత్సరాలు, హిందూ, ఇరువురు కడప జిల్లా, కడప నగరం, మారుతీనగర్, ప్లాట్ నెం.205, లక్ష్మీ టవర్స్ నందు నివాసం. ... **పిటిషనర్స్ / డి.హెచ్.ఆర్.ఎస్**

Vs

పి.శివకుమార్‌రెడ్డి, తండ్రి సాంబశివారెడ్డి, వయస్సు 50 సంవత్సరాలు, కాంట్రాక్టర్, కడప జిల్లా, కడప నగరం, ఇంటి నెం. 7/347-11, సింహపురి కాలనీ నందు నివాసం. **...రెస్పాండెంట్ /జె.డి.ఆర్**

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా పై దావాలోని పిటిషనర్లు / D.Hrs వారికి రావలసిన డిక్రీ మొత్తమును రాబట్టుకొనుటకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము వేసి విక్రయించి ఇవ్వవలసినదిగా రాజశ్రీ కోర్టు వారిని కోరియున్నారు. అందులకు రాజశ్రీ కోర్టు వారు షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టునందు బహిరంగ వేలము వేయుటకు **12.03.2026**న ఉదయం 10.30 గంటలకు నిర్ధారించి ఉన్నారు. కావున యావన్మందికీ ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా, వేలంలో పాల్గొనదలిచిన వారు కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును. కావున వేలంలో పాల్గొనదలిచిన వారు ఎవ్వరైనా తేదీ **12.03.2026**న ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ పై కోర్టులో హాజరై వేలంలో పాల్గొనవచ్చును.

SCHEDULE

1. కడప జిల్లా, కడప డి., కడప రూరల్ సబ్.డి., వల్లూరు మండలం, గోటూరు గ్రామ పంచాయతీకి చేరిన గోటూరు గ్రామ పొలంలోని సర్వే నెం. 367 య 6.84 సెంట్లు గల పూరా భూమికి **హద్దులు :- తూర్పు:** సవితా వెల్ఫేర్ సొసైటీ వారి భూమి, **పడమర :** పి.రాజేంద్ర రెడ్డి గారి భూమి, **ఉత్తరం :** సవితా వెల్ఫేర్ సొసైటీ వారి భూమి, **దక్షిణం :** యం.బాలనాగిరెడ్డి గారి భూమి.
2. కడప జిల్లా, కడప డి., కడప రూరల్ సబ్.డి., వల్లూరు మండలం, గోటూరు గ్రామ పంచాయతీకి చేరిన గోటూరు గ్రామ పొలంలోని సర్వే నెం.363 య 4.39 సెంట్లు గల పూరా భూమికి **హద్దులు :- తూర్పు :** పి.వీరన్న గారి భూమి, **పడమర :** పి.బాలిరెడ్డి గారి భూమి, **ఉత్తరం :** భద్రయ్య గారి భూమి, **దక్షిణం :** పి.బాలిరెడ్డి గారి భూమి.

(By Order of the Court)

D.Hr Value - 35,93,600/-

Ameena Value - 15,00,000/-

శ్రీ జి.రామలింగారెడ్డి, అడ్వకేట్, కడప.

జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపికలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప డీఎస్‌ఏ స్టేడియంలో మంగళవారం శాప్ లీగ్ జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపికలను డీఎస్‌డీఏ షేక్ గౌస్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన అహ్మద్‌ఖాన్, సాకేత్, సాయిహర్ష, రాహుల్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలు విజయవాడలో జరుగుతాయన్నారు.

జెండా ఊపి ఎంపికలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో గౌస్‌బాషా

డోలీలలో తీసుకెళ్లే పరిస్థితులు రానివ్వం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గిరిజనులను డోలీలలో తీసుకెళ్లే పరిస్థితులు రాకుండా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు అన్నారు. కడప ఎన్జీవో కాలనీలోని భాజపా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయన్నారు. వారికి అన్ని రకాల వసతులను కల్పిస్తున్నాయని చెప్పారు. భాజపా జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీమోహన్, రాష్ట్ర కార్యదర్శి శివానాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, మహిళా మోర్చా నాయకులు సుష్మా, లక్ష్మీదేవి, సుబ్బరాజు, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

మాట్లాడుతున్న ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు, చిత్రంలో భాజపా జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి

ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LIMITED
(An undertaking of A.P. Govt.)
Office of the ZONAL MANAGER : INDUSTRIAL ESTATE : KADAPA - 516004

'e' Procurement Notice

Zonal Manager, APIIC Limited, Kadapa invites bids for the following work:
Tender Notice No. 05/ZO/APIIC/KDP/2025-26, Dt.23.02.2026.
Name of Work: Preparation of DPR for Water Distribution System of North Block MIP Kopparthy, Kopparthy (V), CK Dinne (M), YSR Kadapa District in Andhra Pradesh.
ECV: Rs. 9,00,000.00/-
Bid download start date : 23.02.2026, 08:00 PM
Last date for submission of bids : 10.03.2026, 01:00 PM
The details of tender notice and bid documents can be downloaded from website www.apeprocurement.gov.in
Sd/- ZONAL MANAGER, APIIC LTD: KADAPA

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటం

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ టీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటం సాగిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలును కూటమి ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. 2023 జులై నుంచి 12వ పీఆర్సీ రావాల్సి ఉన్నా కనీసం 12 పీఆర్సీ కమిషన్‌ను కూడా నియమించలేదన్నారు. ఇప్పటి వరకు మూడు విడతల బకాయిలను చెల్లించాల్సి ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26, 27 తేదీల్లో తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు నరసింహులు, మునివర్ధన్‌కుమార్, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక అమలు

● రాయలసీమ జిల్లాల ఎంఈవోలు, డైట్ అధ్యాపకులకు శిక్షణ

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి గ్యారెంటెడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ సాధించేలా 75 రోజుల కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో డాక్టరు కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాయచోటిలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం నిర్వహించిన రాయలసీమ జిల్లాల ఎంఈవోలు, డైట్ అధ్యాపకులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కడప డీఈవో షంషుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యాచరణ ప్రణాళిక అమలులో తెలుగు, ఇంగ్లిషు, గణిత అంశాలపై దినసరి కార్యకలాపాలు సమగ్రంగా పొందుపరుస్తామని వివరించారు. క్లస్టర్ కాంప్లెక్స్ హెడ్‌లు, ఉపాధ్యాయులు పాఠశాలలకు పంపిణీ చేసిన టీఎల్‌ఏలను సమర్థంగా ఉపయోగించి రోజువారీ బోధించాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి, మదనపల్లె, చిత్తూరు, తిరుపతి, పుత్తూరు ఉప విద్యాశాఖాధికారులు నాగయ్య, లోకేశ్వర్‌రెడ్డి, ఇందిర, ఇందిరాదేవి, మహేశ్వర్, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా డీఈవో సుబ్రహ్మణ్యం

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప బిల్టప్ కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నగరంలోని రామరాజుపల్లెకు చెందిన నాగూరు దస్తగిరమ్మ (55) మంగళవారం బిల్టప్ కూడలి వద్ద ఉన్న పోలేరమ్మ గుడి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

కాశినాయన: పంటకు ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచె తగిలి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన కాశినాయన మండలం రంపాడులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన వరరాజు(52) గొర్రెల మేపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో సాయంత్రం వాటిని షెడ్డులోకి తోలిన ఆయన ఒక గొర్రె రాకపోవడం గమనించి వెతుక్కుంటూ పొలాల్లోకి వెళ్లారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన రైతు పంటకు ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచె తగిలి మృతి చెందారు. ఘటనా స్థలాన్ని ఎస్సై యోగేంద్ర పరిశీలించారు.

వీఆర్‌కు హెడ్ కానిస్టేబుల్

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించారు. మండలంలోని కొండమాచుపల్లె బండారు రత్న సభాపతి జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష జరిగింది. బందోబస్తు నిమిత్తం హెడ్ కానిస్టేబుల్ దస్తగిరితో పాటు మహిళా కానిస్టేబుల్‌ను నియమించారు. ఈ క్రమంలో హెడ్ కానిస్టేబుల్ అల్పాహారం చేసేందుకు అక్కడి నుంచి కొత్తమాధవరానికి వెళ్లారు. అదే సమయంలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేయడానికి వస్తున్న పోలీస్ అధికారికి తారసపడ్డారు. కళాశాల వద్ద విధుల్లో ఉండలేదనే కారణంతో ఆయన్ను ఒంటిమిట్ట ఠాణా నుంచి వీఆర్‌కు పంపారు.

అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

● రూ.11 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి రూ.11 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు పట్టణ ఇన్‌ఛార్జి సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక ఠాణాలో విలేకరులతో కేసు వివరాలు వెల్లడించారు. గత నెల 30న జమ్మలమడుగు మండలం ధర్మాపురానికి చెందిన వెంకట శివారెడ్డి తన బైక్ అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మంగళవారం కోవెలకుంట్ల బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, పేరు సోముల గ్రామానికి చెందిన మహమ్మద్ ఆలీ అక్బర్ బాషా, జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడుకు చెందిన హరిప్రసాద్ పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా జమ్మలమడుగు, పెద్దముడియం, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, బనగానపల్లె, కొలిమిగుండ్ల, తాడిపత్రి, ముద్దనూరు, పోలీసు స్టేషన్‌లలో కేసులున్నట్లు గుర్తించారు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు చోరీలకు పాల్పడ్డారు. ఎస్ఐ హైమావతి, కానిస్టేబుళ్లు నాగేంద్ర, కృష్ణారెడ్డిని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

నిందితులతో సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ హైమావతి, సిబ్బంది

బతుకులు కూలి పోతాయమ్మా జాగ్రత్త!

సామర్థ్యానికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కళ్లముందే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ఆటో చోదకులు, ప్రయాణికుల్లో మార్పు రాలేదు. జమ్మలమడుగు నుంచి ముద్దనూరు, తాడిపత్రి, ప్రొద్దుటూరుకు వెళ్లే మార్గాల్లో ఆటోల్లో కూలీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని తిరుపతి దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ సాంకేతిక విభాగం డైరెక్టర్ కె.గురవయ్య అన్నారు. ఒంటిమిట్టలో మంగళవారం కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సౌర పలకల ఏర్పాటుతో ఒనగూరే ప్రయోజనాలు, రాయితీ వివరాలను ప్రజలకు వివరించారు. వ్యవసాయ సర్వీసుల మంజూరులో ఎస్పీడీసీఎల్ మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలని తెలిపారు. అనధికారిక నియంత్రికలను ఏర్పాటు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కడప డివిజన్ ఈఈ హరిసేవ్యానాయక్, ఒంటిమిట్ట డీఈ సుబ్రహ్మణ్యం, ఏఈ జయ కేశవ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దరపల్లిలో విద్యుత్తు తీగలను పరిశీలిస్తున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య తదితరులు

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలందించాలని ఆందోళన

సీకేదిన్నె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. చింతకొమ్మదిన్నె అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలోని ఆందోళన కార్యక్రమం చేపట్టారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు భరోసా ఇచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వెంటనే కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీకేదిన్నె, చెన్నూరు, వల్లూరు, పెండ్లిమర్రి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

Sukun పర్ఫ్యూమ్ నందు పని చేయుటకు లేడీ సూపర్ వైజర్లు కావలెను. ఆల్మాస్ పేట, కడప. Cont: 9949237857.

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనుగోలు. (రిటైర్డ్) పోలీస్ ఉద్యోగి గోల్డెన్ జువెలర్స్ 7382114647.

గమనిక

[illegible]

JOBS

Pace Engineering College Office Branch Kadapa Wanted Female Employees Q: Any Degree Pass / Fail Cont: 8332925147.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 330/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

(ప్రకటనలకు జి.ఎస్.టి. 5% అదనం)

రాజంపేట

•రాజంపేట • బద్వేలు

పరీక్ష సామగ్రి అందజేత

పరీక్ష సామగ్రితో పదో తరగతి విద్యార్థులు, లయన్స్‌క్లబ్ నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం లయన్స్‌క్లబ్ నాయకులు పరీక్ష సామగ్రిని అందజేశారు. దాతలు లయన్స్‌క్లబ్ నాయకులు వెంకటసుబ్బయ్య, శ్రీనివాస్, అతిగారి కృష్ణ సహకారంతో పరీక్షలకు కావాల్సిన వస్తువులు అందజేశారు. మరిన్ని పాఠశాలల్లో అందజేస్తామని క్లబ్ నాయకులు తెలిపారు.

యూరియా.. నిరీక్షణకూ దక్కేనా!

కొత్త మాధవరం ఆర్‌ఎస్‌కే వద్ద రైతుల పడిగాపులు

ఒంటిమిట్ట: యూరియా పంపిణీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడి అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు మొక్కుబడి తనిఖీలతో మమ అనిపిస్తున్నారు. అన్నదాతలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. కర్షకుల వెతలను పట్టించుకునే వారు కరవయ్యారు. మంగళవారం 93 మందికి 227 బస్తాలను పంపిణీ చేశారు. మండల అధికారి కూపన్లు ఇచ్చినా.. యూరియా పంపిణీ మాత్రం చేపట్టలేదు. దీంతో రైతులు నిరీక్షిస్తూ.. తాగేందుకు గుక్కెడు నీరు లేక దాహంతో తల్లడిల్లిపోయారు. కూపన్లు ఇచ్చి యూరియా పంపిణీలో ఎందుకు జాప్యం చేశారని ఏవో మంజులరాణితో 'న్యూస్‌టుడే' మాట్లాడగా ఈ పంట నమోదు చేయాల్సి రావడంతో సిబ్బంది అక్కడికి వెళ్లడంతో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని తెలిపారు. ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఏళ్లనాటి వంతెన.. శిథిలపుటంచున

కడప-ప్రకాశం సరిహద్దులో ప్రధాన వంతెన దుస్థితి

కలసపాడు, న్యూస్‌టుడే: కడప-ప్రకాశం జిల్లాల సరిహద్దులోని కలసపాడు వద్ద గిద్దలూరు ప్రధాన రహదారిలోని ప్రధాన వంతెన శిథిలావస్థకు చేరింది. 50 ఏళ్ల కిందట నిర్మించడంతో పలు చోట్ల ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. రహదారి కూడా పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● వంతెన స్తంభాల పటిష్ఠత కోసం నిర్మించిన రాతికట్టడాలు వరద ఉధ్ధృతికి ధ్వంసమయ్యాయి. గతంలో 12 స్తంభాలు ఉండగా వాటిలో చాలా వరకు దెబ్బతిన్నాయి. వంతెనపై పలుచోట్ల గుంతలు పడ్డాయి. భారీ వాహనాలు వెళ్లే సమయంలో వంతెన కూలే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులు నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇటీవల కలసపాడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామసుబ్బయ్య మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. శంఖవరం, బద్వేలు-సిద్దవటం రహదారుల్లో ఆర్టీసీ బస్సులు వెళ్లేప్పుడు ఒక్కసారిగా వంతెనలు కూలి ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే.. ఈ క్రమంలో అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఉపయోగకరంగా ఉంటుంది.

శిథిలమై కూలేస్థితిలో ఉన్న వంతెన

రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు

కలసపాడు శిథిల వంతెన స్థానంలో కొత్త వంతెన కోసం నాలుగు నెలల కిందట రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. గతంలోనూ పలుమార్లు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు కేటాయించి అనుమతి వస్తే చర్యలు తీసుకుంటాం. **- సలీం, ఆర్అండ్‌బీ డీఈ, బద్వేలు**

జాతీయ స్థాయిలో విద్యార్థుల సత్తా

సిద్దవటం, న్యూస్‌టుడే: ఐఐటీ, నీట్ ఒలింపియాడ్ పరీక్షల్లో రాణించి జాతీయ, రాష్ట్రస్థాయిలో సిద్దవటంలోని ఓ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అపెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథ్స్ అండ్ సైన్సు ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన ఐఐటీ, నీట్ ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థులు యగ్నేశ్వర్‌రెడ్డి, కీర్తి, స్వానికశ్రీ, ప్రవీణ, పద్మజల్లు ప్రతిభ చాటి జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు హైదరాబాదులోని భారతీయ విద్యా భవన్‌లో విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులను పాఠశాల ప్రతినిధి బాలుగారి వెంకటసుబ్బయ్య, పాఠశాల పరిపాలన అధికారి వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు

భక్తిశ్రద్ధలతో బాలాంజనేయునికి ఆకుపూజ

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలికలోని పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న బాలాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం, అర్చనలు, ఆకు పూజ నిర్వహించారు.

బద్వేలులో ప్రత్యేకాలంకరణలో బాలాంజనేయస్వామి

సుండుపల్లి: చెన్నంశెట్టిపల్లిలోని యల్లమ్మ తల్లి తిరునాల ఉత్సవంలో భాగంగా కుంకుమార్చన పూజలు జరిగాయి. రాత్రి ఆసాదివారితో కథాకాలక్షేపం కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి జంగమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

సుండుపల్లి: చిన్నగొల్లపల్లి పంచాయతీలోని పాతజంగంపల్లెలో జంగమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఈనెల 25 నుంచి 27 తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, మహాగణపతిపూజ రాత్రి పీలేరు వెంకటేశ్వర నాట్యకళామండలి వారిచే హిడింబాసురవధ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. గురువారం గ్రామోత్సవం, 27న యంత్ర ప్రతిష్ఠ మధ్యాహ్నం స్వామి కల్యాణం జరుగుతుందని తెలిపారు.

కాశినాయన: ప్రసిద్ధ జ్యోతి క్షేత్రంలో 26వ తేదీ నుంచి 28వ తేది వరకు జ్యోతి లక్ష్మి నరసింహస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మి నరసయ్య తెలిపారు. 26న ఉదయం గణపతి, వరుణపూజ, రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. శనివారం స్వామి వారి కల్యాణం ఉంటుందని తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

సుండుపల్లి: మండలంలోని మహల్ రహంతున్నిసాకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.2,41,900 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం తెదేపా మండల అధ్యక్షుడు సి.రమేష్‌నాయుడు అందజేశారు.

ఈ-స్టాంపుల కొరతతో ఇబ్బందులు

రాజంపేట, న్యూస్‌టుడే: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-స్టాంపుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని భాజపా ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి రమణయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం సబ్‌రిజిస్ట్రార్‌ని కలిసి సమస్యను విన్నవించారు. కార్యాలయంలో స్టాంపులు దొరకకపోవడంతో బయట ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రమణ, రమణయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంలో మెలకువలు అవసరం

వీరబల్లి, న్యూస్‌టుడే: లేగదూడల పెంపకంలో పశు పోషకులు మెలకువలు పాటిస్తే ఎదుగుదల బాగుంటుందని పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు మాలకొండయ్య అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని మండలంలోని పుత్తవాండ్లపల్లెలో మంగళవారం నిర్వహించారు. జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కార్యనిర్వహణ అధికారి తిమ్మారెడ్డి పశు లింగ నిర్ధారణపై రైతులకు వివరించారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు విజయకుమార్ దూడల పోషణపై యజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశు వైద్యుడు గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు మాలకొండయ్య

జిల్లా కలెక్టర్‌కు వినతి

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు మంగళవారం కడప కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సుండుపల్లి-పీలేరు మార్గంలో శాశ్వత రహదారులు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయం పరిధిలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

రాజంపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు రిలే దీక్షలు చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 164 అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేయాలని, వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

రాజంపేటలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తలకు వేతనాలు పెంచాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట రెండో రోజు దీక్షలు కొనసాగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. యూనియన్ నాయకురాలు దస్తగిరమ్మ, జ్యోతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను పట్టించినందుకు సన్మానం

బాలయ్య

బద్వేలు, న్యూస్‌టుడే: బి.కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 21న జరిగిన గొలుసు చోరీ యత్నంలో నిందితులను పట్టుకోవడంలో స్థానిక ప్రజల సహకారం ప్రశంసనీయమని మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. దొంగలను అడ్డుకుని పట్టుకోవడంలో కీలక పాత్ర వహించిన పాయలకుంట్లకు చెందిన బాలయ్యను మంగళవారం బద్వేలు గ్రామీణ పోలీసు సర్కిల్ కార్యాలయంలో సత్కరించారు. ప్రశంసాపత్రం అందజేశారు. గ్రామీణ సీఐ కృష్ణయ్య, బి.కోడూరు ఎస్సై సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మోటార్ల తీగల చోరీలపై ఆందోళన

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ మోటార్ల కేబుల్‌వైర్ల వరుస చోరీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెడ్డెన్నగారిపల్లి సమీప అటవీ ప్రాంతంలోని ఎనిమిది మంది రైతుల మోటార్లకున్న కేబుల్‌వైరును దొంగలు కత్తిరించుకెళ్లారని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్లారెడ్డిగారిపల్లి సమీపంలోని పొలాల్లో నాలుగు రోజుల కిందట ఓ మోటారు కేబుల్‌వైరు కత్తిరించి తీసుకెళ్లారు. వాటిని తిరిగి అమర్చుకునేందుకు అదనంగా రూ.వేలల్లో ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు ఈ చోరులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పెద్దకర్మ

మంచితనానికి మారుపేరుగా నిలిచి అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, ఎందరో పేద విద్యార్థులకు అక్షరజ్ఞానాన్ని అందించి, విద్యా వ్యవస్థకు ప్రతీకగా నిలిచిన మా తల్లి గారైన కీ॥శే॥ అవ్వారు సుబ్బమ్మ గారి మరణం మాకు తీరని లోటు. వారి పవిత్రాత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ అవ్వారు సుబ్బమ్మ గారు
కరస్పాండెంట్, "రామదాసు బడి" (A.V.S. O & G హైస్కూల్)
మరణం : 11.02.2026

కుమారుడు: ఎ.వి.వరప్రసాద్ కోడలు: కీ॥శే॥ వెంకటలక్ష్మమ్మ
మనుమడు: ఎ.గురుసాయి రాకేష్
మనుమరాలు: శ్రీమతి ప్రత్యూష - దినేష్
కుమారుడు: ఎ.గోపాలకృష్ణమూర్తి - కృష్ణకుమారి
మనుమడు: డా॥ శైలేష్‌కుమార్
మనుమరాలు: శ్రీమతి మౌనిక - సుబ్బనరసింహులు
కుమార్తె: శ్రీమతి చెన్నా సుజాత, అల్లుడు: శ్రీ చంద్రమూర్తి
మనుమడు: డా॥ సత్యసాయిగణేష్
మనుమరాలు: లక్ష్మీవాణి - డా॥ శివకృష్ణ మరియు కుటుంబసభ్యులు

గమనిక : 25-02-2026వ తేదీ బుధవారం ఉ॥ 10 గం॥లకు ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలోని మా స్వగృహం నందు పెద్దకర్మ జరుగును.

సైబర్ నేరాలపై అందరం అప్రమత్తంగా ఉందాం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నేటి యువత, ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ దక్షిణ భారత అధ్యక్షుడు జయవర్మ అన్నారు. రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయులకు, విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చరవాణిని నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఫిషింగ్, హ్యాకింగ్, ఐడెంటిటీ దోపిడీ, ఆన్‌లైన్ మోసాలు, వంటి నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విశ్వవిద్యాలయం వీసీ సాయిబాబారెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ టి.నవనీత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ మదనకుమార్, పీజీ ప్రిన్సిపల్ సమతనాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జయవర్మ.. పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పీఎం జీవన జ్యోతి బీమాతో లబ్ధి

బాధితురాలికి చెక్కు అందజేస్తున్న మేనేజర్ సంతోష్

అట్లూరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనతో ఆర్థిక లబ్ధి చేకూరుతుందని స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సంతోష్ తెలిపారు. మండలంలోని కమలకూరులో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన రామాంజనేయులు కుటుంబానికి రూ. 2 లక్షల విలువ గల చెక్కును మంగళవారం అందజేశారు. దాంతో వారికి ఆర్థిక లబ్ధి చేకూరిందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి స్రవంతి, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు నాగలక్ష్మి, సిద్దారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించడానికి బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె. సుజాతమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పన్నువసూలు వేగవంతం చేయండి

పోరుమామిళ్ల: పన్ను వసూలును వేగవంతం చేయాలని డీడీవో వెంకటశేషయ్య అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీలలో బుధవారం నుంచి ప్రత్యేక గ్రూపులుగా ఏర్పాటు చేసి వసూలు చేయిస్తామన్నారు. ప్రజలు పన్నును సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం దారుణం

రాజంపేట: ఆర్టీసీలోని 12 డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దారుణమని రాజంపేట ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ కన్వీనర్ కె.హెచ్.ప్రసాద్ అన్నారు. దీనికి నిరసనగా స్థానిక డిపో గ్యారేజీ ఎదుట మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీలో ప్రైవేటీకరణ విధానాన్ని విరమించుకోవాలని, విద్యుత్తు బస్సులను ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడపాలని డిమాండ్ చేశారు.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

కలసపాడు, న్యూస్‌టుడే : మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్సై సుభాన్ తెలిపారు. మండలంలోని తెల్లపాడులో సోమవారం మహిళల భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, మహిళల భద్రత, అత్యవసర సేవలు డయల్ 112, 1090 మహిళా హెల్ప్ లైన్, సైబర్ నేరాలపై వారికి అవగాహన కల్పించారు.

సోమశిల నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: సోమశిల ముంపు గ్రామాల్లోని నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. సోమశిల ప్రాజెక్టు కింద నాలుగు మండలాల పరిధిలో 105 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురైనట్లు తెలిపారు. 2015లో అప్పటి ప్రభుత్వం ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని చెప్పి మరిచిపోయిందన్నారు. వారికి న్యాయం చేయాలని కోరారు.

రాయితీపై అరటి రైతులకు కవర్లు

రాజంపేట గ్రామీణ: నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో అరటి రైతులకు పంట నాణ్యత, దిగుబడి, తెగుళ్ల సోకకుండా రక్షణ కల్పించే విధంగా రూపొందించిన కవర్లను రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో ఇస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి సునీల్ మంగళవారం తెలిపారు. ఎకరం అరటి సాగుకు 1,000 కవర్లు అవసరం అవుతాయని.. అవసరాన్ని బట్టి అందజేస్తామని చెప్పారు. గరిష్ఠంగా రూ.25 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. రైతులు ముందుకు రావాలని కోరారు.

చిన్నారి సహాయార్థం విరాళాల సేకరణ

కలసపాడు, న్యూస్‌టుడే: అరుదైన వ్యాధితో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి పునర్వికను (ఎనిమిది నెలలు) కాపాడేందుకు ప్రజల నుంచి మంగళవారానికి రూ. 83 వేలు విరాళం సేకరించామని మండలంలోని రాజుపాళెం యువత జాన్‌బాబు, రాజశేఖర్, నాని, విక్రమ్, రాజేష్ తదితరులు తెలిపారు. పుల్లారెడ్డిపల్లె, రాజుపాళెం, కలసపాడు పంచాయతీలో విరాళాలు సేకరించామన్నారు. వీటిని చిన్నారి కుటుంబసభ్యులకు అందజేస్తామని వారు వివరించారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌ల సేవలు ప్రశంసనీయం

బద్వేలు, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా పలు ఆలయాల్లో నిర్వహించిన ఉత్సవాల్లో ఎన్‌సీసీ క్యాడెట్‌ల సేవలు ప్రశంసనీయమని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. బద్వేలు శ్రీరాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల యాజమాన్యం ఎన్‌సీసీ నియామకాలను ప్రోత్సహిస్తూ సమాజంపట్ల బాధ్యత పెంచడం హర్షనీయమన్నారు. గ్రామీణ సీఐ కృష్ణయ్య, పట్టణ గ్రామీణ, అట్లూరు, బి.కోడూరు, ఎస్సైలు కొండారెడ్డి, రంగారావు, నాగ కీర్తన, సూర్యనారాయణరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ కృష్ణయ్య తదితరులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

శ్రద్ధాంజలి

జననం : 01.07.1944

మరణం : 15.02.2026

స్వర్గీయ కూండ్ల ఓబుల్‌రెడ్డి గారు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్
నలంద స్కూల్ దగ్గర, మెహర్‌బాబానగర్, రాజంపేట.

ఉన్నతమైన వ్యక్తిత్వం.. మరపురాని మంచితనం..
ఎల్లప్పుడూ ఇతరులకు సహాయపడే దయాగుణం కలిగిన మా పెద్దాయన
"కీ॥శే॥ కూండ్ల ఓబుల్‌రెడ్డి గారి" అకాల మరణానికి చింతిస్తూ..
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ...
వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

సిద్దా శివశంకర్‌రెడ్డి (పెద్దబాబు)
కువైట్

నాగినేని సురేష్
శ్రీ సుబ్రమణ్యేశ్వర పెయింట్స్, రాజంపేట.

సిద్దా మధుసూదన్‌రెడ్డి (చిన్నబాబు)
కువైట్

సన్నపునేని వెంకటేష్
South Africa

పెద్దకర్మ : 25.02.2026 వ తేదీ బుధవారం మెహర్‌బాబానగర్ (నలంద స్కూల్ దగ్గర), రాజంపేట నందలి వారి స్వగృహం నందు జరుపబడును. కావున అందరికీ తెలపడమైనది.

ప్రొద్దుటూరు

•ప్రొద్దుటూరు •జమ్మలమడుగు •మైదుకూరు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జమ్మల పరమేశ్వరి

అంకాలమ్మ

రామచంద్రస్వామి

ప్రొద్దుటూరు పట్టణం, గ్రామీణ, ఖాజీపేట, న్యూస్‌టుడే: వివిధ ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రొద్దుటూరు దొరసాని పల్లె రోడ్డులోని జమ్మల పరమేశ్వరి ఆలయంలో జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు బోనాలు సమర్పించారు. పట్టణంలోని వసంతపేట వీధిలో రామచంద్రస్వామి జయంతి వేడుకల సందర్భంగా బృందావనాన్ని పూలతో అలంకరించారు. ఖాజీపేట మండలం కొత్తపేటలో అంకాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, చిన్నారులు కోలాటం ఆడారు.

పేదలకు మెరుగైన వైద్యమందించడమే ధ్యేయం

జమ్మలమడుగు: పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ప్రధాన ఉద్దేశమని మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంగళవారం 26 మంది లబ్ధిదారులకు రూ.17,39,342 విలువైన చెక్కులను అందజేశారు.

లబ్ధిదారుకి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

యూరియా పంపిణీ 26న

కొండాపురం: మండలంలోని నాలుగు రైతు సేవా కేంద్రాల పరిధిలో 39.6 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైనట్లు ఏవో రామాంజులరెడ్డి మంగళవారం తెలిపారు. తాళ్లప్రొద్దుటూరు, బెదుదూరు, ఏటూరు సచివాలయాల పరిధిలో గురువారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం కొండాపురంలోని శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఎద్దుల వేణుగోపాల్‌రెడ్డి, తండ్రి ఎద్దుల పెద్ద వెంకటరెడ్డి, 2-14, తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం మండలం, కడప జిల్లా. వీరికి సంబంధించిన ఒరిజినల్ పొలం డాక్యుమెంట్స్ నెం. 515, 450 ఇవి మారుతుండగా పోయినవి. దొరికిన వారు సంప్రదించండి : 9441651690.

సీనియర్ సివిల్ జడ్జి, ప్రొద్దుటూరు వారి న్యాయస్థానం సమక్షంలో
ఐ.ఏ. 30/2025

[illegible]

ప్రతివాదులు నెం 2 నుంచి 3 నోటీసు

[illegible]

సం/- ఎ.వి.రాజేంద్రప్రసాద్, B.L.,
D.R. ప్రతాపరెడ్డి, M.A., B.L.,
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.

అద్దె భవనంలో ఇంకెన్నాళ్లు?

సహకార శిక్షణ కేంద్రానికి సొంత కార్యాలయం కరవు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిధిలో ప్రొద్దుటూరులో సహకార శిక్షణ కేంద్రం 1985-86లో ప్రారంభించారు. ప్రతి ఏటా జులై నుంచి డిసెంబరు వరకు ఆరు నెలల వ్యవధిలో 32 నుంచి 40 మంది చొప్పున ఇక్కడ శిక్షణ తీసుకుని ధ్రువపత్రాలు పొందుతారు. వీటి ఆధారంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్), అర్బన్ బ్యాంకు, డీసీసీబీలో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తారు.

● ప్రొద్దుటూరులోని ఈ కేంద్రాన్ని 2005లో కడప నగరానికి తరలించడంతో ఇక్కడున్న కట్టడాలు శిథిలావస్థకు చేరాయి. పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. ఈ క్రమంలో 2022-23లో కడప నుంచి సహకార శిక్షణ కేంద్రాన్ని తిరిగి ప్రొద్దుటూరుకు మార్పు చేశారు. ప్రస్తుతం పురపాలక పరిధిలోని నాగేంద్రనగర్‌లో నెలకు రూ.14,500 చొప్పున అద్దె గదుల్లో తరగతులను కొనసాగిస్తున్నారు. కడప, అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని సహకార శాఖ అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది ఈ శిక్షణ కేంద్రంలో కోర్సులో ప్రవేశం పొందేందుకు అర్హులు.

సొంత స్థలంలో కూలిపోయిన సహకార శిక్షణ కేంద్రం నిర్మాణాలు

శిథిలావస్థలో కట్టడాలు

పట్టణంలోని రామేశ్వరం బ్యాంకు బజారు రోడ్డులోని గతంలో సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్, సిబ్బందితో పాటు పార్మాలు బోధనకు మూడు తరగతులు ఏర్పాటు చేశారు. ఇక్కడి కేంద్రాన్ని 2005లో కడప నగరానికి తరలించడంతో శిథిలావస్థకు చేరింది. సొంత స్థలంలో శాశ్వత భవన ఏర్పాటుకు గత వైకాపా పాలనలో పైసా నిధులు మంజూరు కాలేదు. దీంతో అద్దె చెల్లింపు ఆర్థిక భారమవుతోంది.

ప్రతిపాదనలు పంపాం

సహకారశాఖలోని పీఆర్ విభాగం నుంచి రూ. 80 లక్షలు, రూరల్ ఎడ్యుకేషన్ కార్పొరేషన్ నుంచి రూ. కోటి చొప్పున వేర్వేరుగా సొంత స్థలంలో శాశ్వత కట్టడాలకు ఇటీవల ప్రతిపాదనలు పంపాం. తాజాగా కేంద్ర ప్రాయోజిత పథకంలోని త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయం నిర్దేశించిన సౌకర్యాల ఏర్పాటుకు త్వరలోనే మరో ప్రతిపాదన పంపుతాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణాలు ప్రారంభిస్తాం. - **శ్రీనివాస్, ప్రిన్సిపల్, సహకార శిక్షణ కేంద్రం**

లోక్‌అదాలత్ విజయవంతం చేయండి

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఖాజామొయినుద్దీన్

మైదుకూరు, న్యూస్‌టుడే: మార్చి 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి షేక్ ఖాజామొయినుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కోర్టులో మంగళవారం డీఎస్పీ రాజేంద్రప్రసాద్, మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, చాపాడు మండలాల పోలీసు అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌పై చర్చించారు. రాజీమార్గంలో సివిల్, క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేలా చూడాలన్నారు.

యువకుల మృతిపై విచారణకు డిమాండ్

మైదుకూరు: బ్రహ్మంగారిమఠంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇద్దరు యువకుల మృతిపై సమగ్ర విచారణ జరిపి అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరపోగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మైదుకూరులో డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమితి ప్రతినిధులు బ్రహ్మయ్య, కొత్తపల్లి ఎల్లయ్య, టి.హరిబాబు తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రయోజనం

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఖాజీపేట కేజీబీవీ విద్యార్థినులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఒంటిమిట్ట రామాలయం, కల్యాణమండపం, బాకరాపేట, మరియాపురం చర్చిలు, నగరవనం ప్రాంతాలను సందర్శించారు. యాత్రను సమగ్ర శిక్షా జీసీడీవో రూత్ ఆరోగ్య మేరీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న జీసీడీవో రూత్ ఆరోగ్య మేరీ

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థం

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగంతో సామాజిక, ఆరోగ్య, కుటుంబ పరంగా తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రధానోపాధ్యాయులు గురుభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎర్రగుంట్లలో జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

శ్మశాన స్థలంలో పంట తొలగింపునకు చర్యలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: శంకరాపురం శ్మశానవాటిక స్థలంలో సాగుచేసిన పంట తొలగింపునకు చర్యలు చేపట్టాలని పెద్దశెట్టిపల్లె పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డికి మంగళవారం తహసీల్దారు గంగయ్య స్పష్టం చేశారు. ఎంత మేరకు శ్మశాన స్థలం ఉందో రోవర్ పరికరం ద్వారా హద్దులు గుర్తించారు. మొత్తం 7.44 ఎకరాలుండగా ప్రస్తుతం 2.50 ఎకరాల స్థలంలో ఖననం చేస్తున్నారు. మిగిలిన స్థలం అన్యాక్రాంతమైందని విచారణ చేశామన్నారు. వీఆర్వో రమణారెడ్డి, సుధీర్, సర్వేయరు గీతారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447

?: ప్రొద్దుటూరు జిన్నారోడ్డులో సెంట్రల్ లైటింగ్‌కు చెందిన వీధిదీపాలు వెలగలేదు. - **ఖాదర్, స్థానికుడు**

✓: జిన్నారోడ్డులో వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - **సురేంద్రనాథరెడ్డి, ఏఈ, పురపాలక సంఘం** - **న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం**

స్పందించారు.. పరిష్కరించారు

- గోపవరం బీసీ కాలనీలో పగటి వేళలో ఎల్ఈడీ దీపాలు వెలుగుతున్నాయని ఈ నెల 5న మేమున్నాం మీకుతోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్‌రెడ్డి రాత్రి వేళల్లో ఎల్ఈడీ దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకున్నారు.
- నాగేంద్రనగర్‌లో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఉన్నాయని ఈ నెల 5న మేమున్నాం మీకు తోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి కంప చెట్లు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.
- కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో తాగునీటి కనెక్షను మరమ్మతులు చేపట్టాలని. దీనిపై ఈ నెల 17న మేమున్నాం మీకు తోడుగాలో ప్రచురితమైంది. స్పందించిన ఎనర్జీ అసిస్టెంట్ మధు తాగునీటి కనెక్షన్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు.
- మైదుకూరు రోడ్డు విస్తరణ మార్గంలో కుంగిన రహదారిపై గుంతను తారు, కంకర మిశ్రమంతో పూడ్చేశారు. దీనిపై ఈ నెల 20న 'ఈనాడు'లో 'రోడ్డు కుంగింది జాగ్రత్త' శీర్షికతో చిత్రకథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులు చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ
- ప్రొద్దుటూరు తిలక్ కల్యాణమండపం సమీపంలోని కాలువలో పూడికతీత పనులు చేపట్టలేదని ఈ నెల 20న మేమున్నాం మీకుతోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారి ప్రసాద్ చర్యలు తీసుకున్నారు.
- ఎస్‌పీజీ చర్చి ముందు ఉన్న కాలువల్లో పూడిక తొలగించలేదని సమస్య ప్రచురితమైంది. అధికారులు చర్యలు తీసుకున్నారు.
- టీబీ రోడ్డు అన్నక్యాంటీన్ సమీపంలో వీధిదీపం వెలగలేదని సమస్య ప్రచురితం కాగా ఏఈ సురేంద్రనాథ్‌రెడ్డి స్పందించి చర్యలు తీసుకున్నారు. - **న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం**

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

[illegible]

లాంఛనంగా స్వాధీనత ప్రకటన

[illegible]

రుణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) ఎస్.కరీముల్లా, తండ్రి ఎస్.పీరాసాహెబ్, వార్డునెం.10, మోడంమీదపల్లి, కొత్తపల్లి పంచాయతీ, ప్రొద్దుటూరు, కడప జిల్లా
2) కె.శేఖర్ తండ్రి సత్యనారాయణ, డి.నెం.17/2223, లింగారెడ్డి కొట్టాలు, గోపవరం గ్రామం, ప్రొద్దుటూరు, కడపజిల్లా

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.70,19,240/- (డెబ్బై లక్షల పంతొమ్మిది వేల రెండు వందల నలభై రూపాయలు మాత్రమే)
రుణ ఖాతా నెంబరు : PRDTRTF04170001 డిమాండ్ నోటీసు తేది: 21.11.2025

స్థిరాస్తుల వివరములు

ఐటంనెం-1:- వైయస్ఆర్ జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లి గ్రామ పంచాయతీ, వార్డునెం.10, జేమ్స్‌పేట ఏరియా, మోడంమీదపల్లి గ్రామ ఫీల్డ్ సర్వేనెం.395/1లో ఎ.0.035 సెంట్లు లేదా 0.014 హెక్టార్లలో ఎ.0.09 సెంట్లు ఖాళీ స్థలం, హద్దులు: తూర్పు: షేక్ మహబూబ్ సాహెబ్‌కు చెందిన షెడ్యూలు-డిలోని ఐటం నెం.1, పడమర: శాంతినగర్‌లోని ప్లాటు నెం.52& 53 గల స్థలం ఉత్తరం షేక్ ఖాసిం పీరాకు చెందిన షెడ్యూలు-సిలోని ఐటంనెం.3, దక్షిణం షేక్ గౌస్ మొహిద్దీ స్థలం ఈ హద్దుల మధ్య స్థలం పూర్తి విస్తీర్ణం ఎ.0.03 1/2 సెంట్లు లేదా 0.014 హెక్టార్లు లేదా 169.4 చ.గ. అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.

ఐటంనెం-2:- వైయస్ఆర్ జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లి గ్రామ పంచాయతీ, వార్డునెం.10, జేమ్స్‌పేట ఏరియా, మోడంమీదపల్లి గ్రామ ఫీల్డ్ సర్వేనెం.395/2లో ఎ.0.025 సెంట్లు లేదా 0.40 సెంట్లలో ఎ.0.10 సెంట్లు ఖాళీ స్థలం, హద్దులు: తూర్పు: షేక్ మహబూబ్ సాహెబ్‌కు చెందిన షెడ్యూలు-డిలోని ఐటం నెం.2, పడమర: షేక్ గౌస్ మొహిద్దీన్‌కు చెందిన స్థలం మరియు షేక్ మహబూబ్ బాషాకు చెందిన షెడ్యూలు-డిలోని ఐటంనెం.1, ఉత్తరం: షేక్ ఖాసిం పీరా మరియుఅమీరున్ స్థలం, దక్షిణం: షేక్ గౌస్ మొహిద్దీ స్థలం. ఈ హద్దుల మధ్య స్థలం పూర్తి విస్తీర్ణం ఎ.0.02 1/2 సెంట్లు లేదా 0.010 హెక్టార్లు లేదా 121 చ.గ. ఖాళీ స్థలం అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ SFL వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: కడప /జోనల్ కార్యాలయం
తేది:24.02.2026
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సంక్షిప్త సమాచారం

రుద్రభూమి కేటాయించాలని వినతి: ప్రొద్దుటూరు గ్రామీణ: పెద్దశెట్టిపల్లె పరిధిలో హిందూ శ్మశానానికి స్థలం కేటాయించాలని భాజపా జిల్లా కార్యదర్శి బొర్రెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. పీఎం ఆవాస్ యోజనలో సొంతింటి నిర్మాణాలకు అనుమతి మంజూరు కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ : మైదుకూరు: కడపలో ఆదివారం నిర్వహించిన వేదిక్ గణిత పోటీల్లో మైదుకూరు బ్లూ బెల్స్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచారు. మూడో మాడ్యూల్‌లో రిహాన్, ఐదో మాడ్యూల్‌లో రక్షిత ప్రథమస్థానంలో నిలిచారు.

బాధిత కుటుంబానికి పరామర్శ: రాజుపాళెం: కేసీ కాలువ దగ్గిరెడ్డి చంద్రారెడ్డి తల్లి వెంకటసుబ్బమ్మ (70) మంగళవారం మృతి చెందారు. ఆమె మృతిపై తెదేపా నాయకుడు జి.ప్రదీప్ కుమార్‌రెడ్డి, నాయకులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇరువర్గాల ఘర్షణ: పెద్దముడియం: మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామంలో ఇరువర్గాల మధ్య విద్యుత్తు విషయమై ఘర్షణకు పాల్పడ్డారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

ఎన్ఎంయూపీ ఉద్యోగుల నిరసన

మైదుకూరులో ఆందోళన చేస్తున్న సంఘం నాయకులు

జమ్మలమడుగు, మైదుకూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు బస్సులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనే నిర్ణయాన్ని ఎన్ఎంయూఏ నాయకులు వ్యతిరేకించారు. ఈ మేరకు మంగళవారం జమ్మలమడుగు, మైదుకూరు డిపోల ఎదుట ఆందోళన చేశారు. ఉద్యోగులు ఎర్రపట్టీలు ధరించి నిరసన తెలిపారు.

పట్టు తప్పితే ప్రమాదమే

ప్రమాదాలు జరుగుతున్నా చోదకులు, ప్రయాణికులు నిర్లక్ష్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. మైదుకూరు మండలం వనిపెంటలో వాహనంపై కూలీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. వాహనం ఏ మాత్రం అదుపు తప్పినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. - **న్యూస్‌టుడే, మైదుకూరు గ్రామీణ**

రహదారి.. అధ్వానంగా మారి

కడప-కర్నూలు జాతీయ రహదారి నుంచి రామాపురం మీదుగా చల్లబసాయపల్లె వరకు ఉన్న రహదారి అధ్వానంగా ఉంది. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. రహదారి పనులకు రూ.2.30 కోట్లు నిధులను మంజూరు చేసినా గుత్తేదారు ఇప్పటి వరకు పనులను చేపట్టలేదు. అధికారులు చర్యలు చేపట్టి పనులను ప్రారంభించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, దువ్వూరు**

చెత్త.. తొలగించక అవస్థ

ప్రొద్దుటూరులోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పట్టణంలోని 21వ సచివాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోయింది. వెంగళరెడ్డిపేట దళితకాలనీ పురపాలక ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న చెత్తను సకాలంలో తొలగించలేదు. దీంతో దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - **న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం**

ఉపాధి లక్ష్యం నెరవేరేనా?

మైదుకూరు, న్యూస్‌టుడే: ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు దాదాపు నెల రోజులే మిగిలింది. మార్చి నెలాఖరు నాటికి మైదుకూరు నియోజకవర్గంలో 16,17,700 పనిదినాలకు 13,04,508 పనిదినాలు పూర్తి చేశారు. ఇంకా 3,13,192 పనిదినాలను కల్పించాల్సి ఉంది. నిర్దేశించిన లక్ష్యం చేరుకునేందుకు రోజుకు 9,211 మందికి ఉపాధి కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం 300 మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నారు.

● వలసల నివారణకు ఉపాధి పథకం ద్వారా నియోజకవర్గంలో ఎక్కువగా కాలువల్లో పూడికతీత, చెరువు గట్ల పునరుద్ధరణ, కందకాలు, ఇంకుడు గుంతలు, పండ్లు, పూల తోటల పెంపకం, రోడ్డు ఇరువైపులా మొక్కల పెంపకం, పశువుల పాకలు, పశువుల నీటి తొట్టెలు, సీసీ, కంకర, తారు రహదారులు, మురుగుకాలువల, శ్మశానవాటికల నిర్మాణం వంటి పనులు చేస్తున్నారు.

గంజికుంటలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

● **497 కుటుంబాలకే వంద రోజుల పని:** మైదుకూరు నియోజకవర్గంలో 33,330 కుటుంబాలు ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్నాయి. ప్రతి కుటుంబానికి వందరోజుల ఉపాధి కల్పించాల్సి ఉంది. అయితే నియోజకవర్గంలో కేవలం 497 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల ఉపాధి కల్పించారు. కనీస కూలి రూ.307కాగా సగటున రూ.290 దక్కుతోంది. కూలీ పరంగా ప్రగతి బాగున్నా వందరోజుల ఉపాధిలో వెనుకబడ్డారు.

చర్యలు తీసుకుంటాం

కూలీలకు పనిదినాల కల్పనలో నిర్దేశించిన లక్ష్యం చేరుకునేలా చర్యలు తీసుకుంటాం. మండలాల వారీగా కూలీల సంఖ్యను పెంచాలని ఏపీవోలకు సూచిస్తున్నాం. ప్రతిరోజూ సమీక్షించుకుని ముందుకు సాగుతున్నాం. మార్చి నెలలో కూలీల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. - **మైథిలి, ఏపీడీ, బద్వేలు**

గొర్రెల సంరక్షణపై అవగాహన

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పెంపకందారులు గొర్రెల ఆరోగ్య సంరక్షణ, పోషణలో వైద్య సేవలను వినియోగించుకొని మెరుగైన జీవనోపాధులను సుస్థిరం, బలోపేతం చేసుకోవాలని తిరుపతి పశువైద్య కళాశాల పరాన్నజీవ శాస్త్ర అధిపతి డాక్టరు చెంగల్రాయులు, అసోసియేట్ డీన్ డాక్టరు శ్రీనివాస ప్రసాదు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పశువైద్య కళాశాలలో గొర్రెల మంద ఆరోగ్య, మాంసాహార ఉత్పాదకత ఎలా పెంచుకోవాలో అవగాహన కల్పించారు. సకాలంలో నట్టల నివారణ మందులు, టీకాలను వేయించాలన్నారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, చాపాడు మండలాల నుంచి వచ్చిన గొర్రెల పెంపకందారులకు ప్రయోగశాలలోని మాంసాహార జంతువుల అవశేషాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సమన్వయకర్త శ్రీనివాస నాయక్, జ్ఞాని చరిత, తదితరులు పాల్గొన్నారు.

జంతువుల అవశేషాల గురించి పెంపకందారులకు వివరిస్తున్న పశువైద్య కళాశాల అధ్యాపకులు

కనీస వేతనమివ్వాలని ఆందోళన

జమ్మలమడుగు గ్రామీణ, మైదుకూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జమ్మలమడుగు, మైదుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు కొనసాగించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మైదుకూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం అవసరమని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.పద్మ విద్యార్థులకు సూచించారు. స్థానిక లింగాపురంలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల బాస్కెట్ బాల్ పోటీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె విద్యార్థులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవిశంకర్, జాతీయ క్రీడాకారుడు స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ చిత్రంలో ప్రిన్సిపల్ రవిశంకర్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Union Bank of India)
గాంధీ రోడ్డు ప్రొద్దుటూరు బ్రాంచ్ (04371), గాంధీ రోడ్డు ప్రొద్దుటూరు - 516359, ఫోన్: 9324988353

ఇ-వేలం అమ్మకం ప్రకటన (చర/స్థిరాస్తుల అమ్మకం కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 ప్రకారము హామీగా పెట్టిన స్థిర ఆస్తుల విక్రయానికి 15 రోజుల నోటీసు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6) తో చదివే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 కింద స్థిర ఆస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకపు నోటీసు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి స్వాధీనంలోకి తీసుకోబడినటువంటి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టు పెట్టిన/ఛార్జి చేయబడిన ఈ కింద పేర్కొన్న స్థిర ఆస్తిని, సంబంధిత రుణగ్రహీతల నుంచి బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయిపడిన మొత్తాన్ని ఈ దిగువ తెలిపిన విధంగా భవిష్యత్తు వడ్డీ మరియు లీగల్ ఇతర ఖర్చులతో కలిసి తిరిగి రాబట్టుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే", "అక్కడ ఏమి ఉన్నది అదే" మరియు "అక్కడ ఏదీ ఉన్నా" అను ప్రాతిపదికపై తేదీ:13-03-2026, మధ్యాహ్నం 12.00 గం.ల నుంచి 5:00 గం.ల వరకు బహిరంగ ఇ-వేలం ద్వారా సెక్యూరిటీ క్రెడిటార్ విక్రయించెదరని ప్రత్యేకించి ఈ కింద పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు): 1. మెస్సర్స్ శ్రీ రామతులసీ ట్రాక్టర్ ఏజెన్సీ, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రైటర్: శ్రీ గుడ్డేటి రాజారాం, ప్లాట్ నెం. 25, యం.జి. ఆటో నగర్, మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటరు, వై.యస్.ఆర్. కడప జిల్లా - 516360.
2. శ్రీ గుడ్డేటి రాజారాం (ప్రొప్రైటర్), తండ్రి: జి. రామసుబ్బారెడ్డి, డి.నెం.2/253, 2వ వార్డు, ఏరువపాళెం గ్రామం, రాజుపాళెం మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా - 516359.
3. శ్రీ గుడ్డేటి రామతులసీ రెడ్డి, తండ్రి: జి. రాజారాం, డి.నెం.2/253, 2వ వార్డు, ఏరువపాళెం గ్రామం, రాజుపాళెం మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా - 516359.
బకాయి మొత్తం: తేది.01-01-2026 నాటికి రూ.24,71,577.92 పై. + తదుపరి వడ్డీ, కాస్ట్స్ & ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను.

స్థిరాస్తి వివరములు: వై.యస్.ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరు తాలూకా, రాజుపాళెం మండలం, ఏరువపాళెం గ్రామంలోని సర్వే నెం. 182/1 లో ఉన్న ఖాళీ భూమిలోని దాదాపు 3.06 సెంట్లు మరియు అందలి భాగాలు హామీదారు అయిన శ్రీ గుడ్డేటి రామతులసి రెడ్డి పేరున కలవు. హద్దులు: తూర్పు: గుడ్డేటి కృష్ణరాం గారి స్థలం, పడమర: చెమికల కొండారెడ్డి మరియు ఇతరుల స్థలం, ఉత్తరం: పబ్లిక్ రోడ్డు, దక్షిణం: చెమికల కొండారెడ్డి మరియు ఇతరులకు చెందిన భూమి.

రిజర్వు ధర : రూ.51,00,000/- ధరావత్తు : 5,10,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.51,000/-

బ్యాంకు వారికి తెలిసిన తాకట్టు ఋణభారములు: లేవు

ఇ-వేలం తేది మరియు సమయం : 13-03-2026, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు
(వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

వేలం విక్రయం వివరణాత్మక నిబంధనలు మరియు షరతులు రిజిస్ట్రేషన్ & లాగిన్, బిడ్డింగ్ రూల్స్ కొరకు దయచేసి వెబ్‌సైట్: https://baanknet.com మరియు https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx ను సందర్శించగలరు.

తేది: 20.02.2026, ప్రదేశం: కడప
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన క్యాలెండర్లను అన్ని శాఖల్లో ఉంచాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్లను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ నిధిమీనా, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఏలాండర్ ఏడీ పద్మజలతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరికి ఇందులో ఉన్న సమాచారం తెలియాలని సూచించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ నిధిమీనా, ఆర్డీవో జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి

నీటి ఆదా అందరి బాధ్యత

మాట్లాడుతున్న భూగర్భ శాస్త్ర విభాగం హెచ్‌వోడీ డాక్టర్ రామకృష్ణ

కడప విద్య: నీటిని ఆదా చేయడం అందరి బాధ్యత అని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్) భూగర్భశాస్త్ర విభాగం హెచ్‌వోడీ డాక్టర్ రామకృష్ణ అన్నారు. స్థానిక శివానందపల్లెలోని పాఠశాలలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా విద్యార్థులకు జలసంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగరాజు, అధ్యాపకులు చెన్నప్రసాద్ పాల్గొన్నారు.

పసివాళ్లకు దాత చేయూత

బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ సుభాన్‌బాషా

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఖలీల్‌నగర్‌లో దయనీయ స్థితిలో ఉన్న కరీం, బీబీజాన్ దంపతుల కుమారుల ఆరోగ్య పరిస్థితిని చూసి దాతలు చలించిపోయారు. 'ఈనాడు'లో మంగళవారం 'పాపం పసివాళ్లు' అనే శీర్షికతో మానవీయ కథనం ప్రచురితమైంది. దీంతో నగరంలోని వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ సుభాన్‌బాషా స్పందించారు. ఖలీల్‌నగర్‌లోని బాధిత కుటుంబాన్ని కలిసి నిత్యావసరాలతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేయాలని ఆయన కోరారు.

వేంపల్లె.. ట్రాఫిక్‌తో తల్లడిల్లె

విస్తరణ పనులతో చోదకులకు అవస్థలు

చక్రాయపేట(వేంపల్లె), న్యూస్‌టుడే: వేంపల్లె పట్టణంలో ఓ వైపు రహదారి పనులు వేగంగా జరుగుతుండగా, మరోవైపు ట్రాఫిక్ సమస్యలు వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం భవిష్యత్తులో సౌకర్యం కలిగించినా ప్రస్తుతం మాత్రం ట్రాఫిక్, దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుపైనే నిలిపేస్తున్నారు: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండటంతో వాహనాల రాకపోకలు సాగించడానికి అనువుగా లేదు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. అంతేగాక నాలుగు రోడ్ల సర్కిల్‌లో పులివెందుల, కడప రహదారుల్లో దుకాణాలు, తోపుడుబండ్లు, వాహనాలు నిలపడంతో ఈ సమస్య తలెత్తుతోంది. రోడ్డు పనులు చాలా కాలం పాటు సాగడంతో దుమ్ము, ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమైపోయాయని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం కోసం జరుగుతున్న ఈ పనులు తాత్కాలికంగా ట్రాఫిక్ పెంచి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. రోడ్డు పనులు జరుగుతున్నా భద్రతా చర్యలు పాటించడం లేదు. ఈ మార్గంలో రక్షణ కరవైందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. ఈ విషయమై పులివెందుల ఆర్‌అండ్‌బీ ఏఈ మనోహర్‌రెడ్డి వివరణ కోరగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు పోలీసుల సహాయం కోరామన్నారు.

వేంపల్లెలో నిలిచిన ట్రాఫిక్

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణి అయిన విజయ దుర్గాదేవి అమ్మవారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. వేదపండితులు వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం రాహుకాల పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పూజలకు హాజరైన భక్తులు

విద్యతోనే మహిళా సాధికారత

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యే స్త్రీ సాధికారతకు మూల స్తంభమని యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షురాలు ప్రొఫెసర్ వినోదిని అన్నారు. స్థానిక కేఎస్ఆర్ఎం (ఎస్‌కేఆర్, ఎస్‌కేఆర్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా అధ్యక్షతన తెలుగు శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

జనసేనను బలోపేతం చేద్దాం

మాట్లాడుతున్న జనసేన పార్టీ నేత టీసీ వరుణ్

మారుతీనగర్, న్యూస్‌టుడే: జనసేనాని పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు జనసైనికులు అవిశ్రాంత కృషి చేయాలని జనసేన పార్టీ కడప పార్లమెంట్ సమన్వయకర్త టీసీ వరుణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి తాతంశెట్టి నాగేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ఐఎంఏ సమావేశ మందిరంలో మంగళవారం జనసేన సభ్యత్వ నమోదు సన్నాహక సభ నిర్వహించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలను ప్రజలను తీసుకెళ్తామన్నారు. చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు రంజిత్‌కుమార్, నియోజకవర్గ నేతలు సుంకరశ్రీనివాస్, జీవీ రమణ, తుంగా రమణయ్య పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

పెండ్లిమర్రి: ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య (ఫార్మర్ ఐడీ) తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ అన్నారు. మిట్టమీదపల్లెలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాబోయే రోజుల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారంగానే అందిస్తుందన్నారు. ఆయన వెంట టెక్నికల్ ఏవో విజయభారతి, మండల ఏవో అరవింద నాయక్, ఏఈవో గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిపోల ప్రైవేటీకరణ రద్దుకు డిమాండ్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉన్న డిపోల్లో 12 డిపోలను కంపెనీకి ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి డిమాండు చేశారు. డిపోల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కడప డిపో ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఎర్ర పట్టీలు ధరించి ధర్నా నిర్వహించారు. కొత్తగా వస్తున్న ఎలక్ట్రికల్ బస్సుల కోసమని రాష్ట్రంలోని 12 డిపోలను ఖాళీ చేయాలనే ఆర్టీసీ యాజమాన్య నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ ఆర్టీసీ వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షులు నాగముని, జోనల్ నాయకులు సుబ్బారావు, డిపో కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కడప డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గం ఎంపిక

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఏఐటీయూసీ జిల్లా మహాసభల్లో భాగంగా ఏఐటీయూసీ నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులను మంగళవారం ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఎల్ నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాల్, జిల్లా కార్యదర్శిగా బాదుల్లా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గంగాసురేష్‌తో పాటు 19 ఆఫీస్ బేరర్స్‌గాను, 95 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. సీపీఐ నాయకులు లింగన్న, రాంమూర్తి, శ్రీనివాసులురెడ్డి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు

బాదుల్లా, జిల్లా కార్యదర్శి

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 9381465490
కమలాపురం : 8008573475

? : నగరంలోని ఆర్టీసీ కాలనీలో రోడ్డుపైన చెత్త పేరుకుపోయింది. అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- శ్రీనివాసులు, ఆర్టీసీ కాలనీ

☑ : పారిశుద్ధ్య కార్మికులను అక్కడికి పంపించి శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - రాకేష్, అదనపు కమిషనర్, కార్పొరేషన్, కడప, - న్యూస్‌టుడే, అరవిందనగర్ (కడప)

? : నాగరాజుపేటలోని పాతబస్టాండుకు వెళ్లే మార్గంలో రోడ్డుపక్కనే ద్విచక్రవాహనాలు నిలుపుదల చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోండి. - పురందేశ్వర్ రెడ్డి, నాగరాజుపేట, కడప

☑ : పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- సురేష్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ,
- న్యూస్‌టుడే, జిల్లా సచివాలయం

లీకేజీలు అరికట్టండి

పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: లీకేజీలను అరికటాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీప్రసాద్ అన్నారు. 'లీకేజీల మయం.. తాగునీరు కలుషితం' అనే శీర్షికతో మంగళవారం ఈనాడులో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి నల్లపురెడ్డిపల్లెలో ఆయన మంగళవారం పర్యటించారు. లీకేజీ పైపును గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు.

కార్గో సేవలు విస్తరించాలి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్గో సేవలు విస్తరించాలని ఆర్టీసీ ఈడీ రాఘవకుమార్ పేర్కొన్నారు. కడప ఆర్టీసీ జోన్ పరిధిలో కార్గోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, సిబ్బందికి మంగళవారం తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్గో కార్యాలయానికి బుకింగ్ కోసం వచ్చిన వినియోగదారు తిరిగి వెనక్కు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. సామగ్రిని సురక్షితంగా గమ్యస్థానం చేర్చాలని చెప్పారు.

సిబ్బందికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఈడీ రాఘవకుమార్

ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో సత్యసాయి ఏటీఎం మోతిలాల్, కడప ఏటీఎం జనార్దన్, ఆర్ఎంఈ రామచంద్ర, డీఎంఈ వెంకటరమణ, వెంకట సురేంద్ర, మహమ్మద్ యూసఫ్‌లున్నారు.

ఉద్యోగ సాధనకు శిక్షణ అవసరం

కడప విద్య, న్యూస్‌టుడే : విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి. . ఉద్యోగ సాధనకు శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని వక్తలు అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో 'ఎ వ్యూ ఆన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టం' అంశంపై సమావేశం నిర్వహించారు. విద్యార్థులంతా ఏ విషయంలోనైనా నైపుణ్యం సాధించడంపై దృష్టి సారించాలన్నారు. జీ ఎంపీ ఎన్ ఏబీఎల్ వంటి వాటిపై శిక్షణ తీసుకుంటే పరిశ్రమలలో సులువుగా ప్రవేశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో తిరుపతి పాత్ జీన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రహంతుల్లా, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ రమేష్, డీబీటీ కోఆర్డినేటర్ సావిత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

కాలువల్లో పూడిక తొలగింపు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: మోడమీదపల్లెలో మురుగు కాలువల దుస్థితిపై 'ఈనాడు'లో 'కాలువలు ఇలా మురుగు పారేదెలా' అనే శీర్షికతో 16వ తేదీ చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే మాధవి తక్షణమే పూడిక తీత పనులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది కాలువలో పూడికతో పాటు పరిసరాల్లో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు.

వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటు అడ్డుకోవడం అన్యాయం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహం ఏర్పాటు చేయకుండా కొందరు అధికారులు ఇబ్బందులు పెట్టారని భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. కడప ఎన్జీవో కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటుకు ఎలాంటి నిధులు కేటాయించలేదని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో మట్టి, మద్యం, ఇసుక మాఫియా రెచ్చిపోతోందని.. వైకాపాలో వారే కూటమిలో చేరి దందాలు చేస్తున్నారని విమర్శించారు.

పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా బంద్

పులివెందుల: పులివెందులకు నీటి సరఫరా చేసే నక్కలపల్లె సమ్మర్ స్టోరేజీ వద్ద పైపులైన్ మరమ్మతులకు గురైన నేపథ్యంలో పులివెందులలోని పలు ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో నీటి సరఫరా ఉండదని పులివెందుల పురపాలక కమిషనర్ మునికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కాలనీ, బాకరాపురం, గుంతబజార్, రాజీవ్‌కాలనీ, నగరిగుట్ట, తదితర ప్రాంతాల్లో సరఫరాకు ఆటంకం ఏర్పడిందన్నారు.

భవిష్యత్తు ఉద్యమానికి కార్యాచరణ

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కార్మిక, ఉద్యోగుల హక్కుల కోసం రానున్న రోజుల్లో ఉద్యమాలు చేయాలని ఇటీవల జరిగిన ఏఐటీయూసీ 12వ జిల్లా మహాసభల్లో కార్యాచరణ రూపొందించామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి తెలిపారు. కడప ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో విస్తారమైన ఖనిజ సంపద ఉందన్నారు. ఉద్యానపంటల ఆధారంగా పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కొప్పర్తిలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, బాదుల్లా, వర్కింగ్ అధ్యక్షులు గంగాసురేష్, రామ్మూర్తి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆరవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు : కడప

G.O.P No. 5/2026

నామతీర్థం బాబు, తండ్రి ఎన్.బాబయ్య, వయస్సు సుమారు 42 సం॥లు, హిందూ, డో.నెం. 43/398, నిరంజన్ నగర్, ఎర్రముక్కపల్లె, కడప సిటీ. - పిటీషనరు

మరియు

-నిల్- - రెస్పాండెంటు

నోటీసు

పై కేసులో వాది తన కొడుకు మైనర్ అయినందున క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తిని అమ్ముటకు గాను రాజశ్రీ కోర్టు వారి అనుమతి కొరకు పై నెంబరు కేసును దాఖలు చేసినందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో 27.02.2026వ తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ, వకీలు వారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేని యెడల సదరు విషయమై పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు

Kadapa District, Kadapa Rural Sub-District, Kadapa Municipal Corporation, Utukur Village fields, Land Situated in Sarkar punji, D.No. 636-3, Ac. 0.21 Cents, Sarkar Punji D.No. 635, Ac. 0.28 Cents Out of the above two survey Numbers Ac. 0.49 Cents or 0.198 Hectors, within the boundaries : East : Bandla Rastha, West : Rastha, North : land of Akula Reddamma & Akula Pullaiah, South : Land previously Settled in favour of NMD Shaheed by way of Settlement deed.

Sd/- M.NAGI REDDY, B.Com, B.L.,
Advocate
Flat No. 504, Seshadri Residency,
A.P.H.B. Colony, Kadapa.

సిమెంట్ లారీ బోల్తా

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని కదిరి రోడ్డులో కంకర మిషన్ వద్ద అదుపుతప్పి సిమెంటు మూటలతో వెళ్తున్న లారీ మంగళవారం బోల్తా పడింది. యర్రగుంట్ల నుంచి మదనపల్లెకు సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ మస్తాన్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.

కందుల కుటుంబానికి పరామర్శ

కడప గ్రామీణ, జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కందుల రాజమోహన్‌రెడ్డి భార్య మహేశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డిలు మంగళవారం నగరంలోని వారి నివాసంలో ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహేశ్వరి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

ఆర్థో సమస్యలకు మెరుగైన వైద్యం

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఆర్థోపెడిక్ సమస్యలకు నగరంలోని జేబీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందని ఆసుపత్రి వైద్యుడు జహంగీర్‌బాషా తెలిపారు. స్థానిక ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. క్లిష్టమైన ఆపరేషన్లు సైతం ఆసుపత్రిలో చేస్తున్నామన్నారు.

కేకు కోస్తున్న వైద్యులు జహంగీర్‌బాషా దంపతులు

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా...బంగాళదుంప-35, క్యాబేజి-25, క్యారెట్-35, బీన్స్-45, బీట్‌రూట్-35, కీర-35, దోస-35, దొండకాయలు-40, ముల్లంగి-30, అల్లం-90, కాలీఫ్లవర్-25, క్యాప్సికం-60, టమాట-12, మిరపకాయలు 40, వంకాయలు-20, బెండకాయలు-30, బీర-35, కాకర-35, మటిక్కాయ-40, చిక్కుడు-30, అలసందకాయలు-30, అనపకాయలు-35, ఉల్లిపాయలు-25.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

సంక్షిప్త సమాచారం

● అన్యాయంగా చీనీ చెట్లు తొలగించారని ఆరోపణ : వీరపునాయునిపల్లె : పవర్ గ్రిడ్ స్తంభాలు ఏర్పాటు చేయాలనే కారణంతో ఇందుకూరు కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు కొమ్మా శివనాగేశ్వరరెడ్డికి చెందిన చీనీ తోటలో సంబంధిత గుత్తేదారు వందల చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా బాధితుడు మంగళవారం మాట్లాడుతూ.. ఈ వ్యవహారం న్యాయ స్థానంలో నడుస్తున్నా అన్యాయంగా 250 చీనీ చెట్లు తొలగించారని ఆరోపించారు.

● శనగల కొనుగోలు కేంద్రం సందర్శన : వేముల : రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని షరతులులేకుండా శనగలను కొనుగోలు చేయాలని రాష్ట్ర కాంగ్రెసుపార్టీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. పెర్నపాడు గోదాములో ఏర్పాటుచేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు.

● వేడుకగా లక్ష్మీగణపతిహోమం: చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: నూతనంగా నిర్మించిన నందీశ్వరాలయంలో రెండో రోజు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఆలయంలో మంగళవారం వేదపండితులు క్షీరాధివాసం, పారాయణములు, మూలమంత్రహోమం తదితర పూజాకార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎంపీ తులసిరెడ్డి పాల్గొన్నారు. బుధవారం జరిగే ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పాల్గొంటున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

● ఆర్టీసీ ఈడీకి సత్కారం : కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప ఆర్టీసీ జోన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆర్టీసీ ఈయూ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు షౌకత్‌ఖాన్, రాజశేఖర్‌లు అన్నారు. ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో మంగళవారం ఈడీ రాఘవకుమార్‌ను వారు సన్మానించారు.

● తాగు నీటికి విద్యార్థుల ఇక్కట్లు : అరవిందనగర్ (కడప) : నగరంలోని ప్రకాశ్‌నగర్‌లోని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో తాగేందుకు నీరు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారంటూ ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి విద్యార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుమంత్ మాట్లాడుతూ.. పది రోజులుగా నీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.

● సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ : అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని కడప ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితో కలిసి మంగళవారం రాఘవేంద్ర టౌన్‌షిప్‌లో సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

● దీక్ష విరమించిన నగరపాలక కార్మికులు : బిల్టప్, కడప: సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నగరపాలక కార్మిక సంఘం నాయకులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను మంగళవారం సాయంత్రం విరమించారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను నిబంధనలు అనుసరించి తిరిగి విధుల్లోకి తీసుకోవటానికి కమిషనర్ మనోజ్ అంగీకరించడంతో దీక్ష విరమించామని వారు తెలిపారు.

ప్రజాప్రతినిధుల ఆటవిడుపు

ఈనాడు, కడప: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆటవిడుపులో భాగంగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని దీక్ష

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: సమాజంలో కీలక బాధ్యతలు మోస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్‌యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి అంజని డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం చేస్తున్న నిరసనలో భాగంగా మంగళవారం కడప మారుతీనగర్‌లోని ఐసీడీఎస్ కడప అర్బన్ కార్యాలయం ఎదుట కడప, సిద్దవటం పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు దీక్ష చేపట్టారు. తక్షణమే కనీస వేతనాలు అమలు చేసి వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కమలాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్‌ హెల్పర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి కోరారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరి పాల్గొన్నారు.

ముఖ్య బహిరంగ ప్రకటన

మా కక్షికర్తయగు Y.S.R. కడప జిల్లా, ప్రొద్దుటూరు టౌన్, Y.M.R. కాలనీలో కాపురం వుండే పెదబల్లి శివారెడ్డి గారి కుమారుడు పెదబల్లి వినయ్‌కుమార్‌రెడ్డి గారి తరపున యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా...

పెదబల్లి శివారెడ్డి మరియు అతని భార్య పెదబల్లి శాంతమ్మ ఇరువురు కలసి ప్రొద్దుటూరు టౌన్‌లో కాపురం వున్నారు. అట్టి పెదబల్లి శివారెడ్డికి పెదబల్లి వినయ్‌కుమార్‌రెడ్డి అను ఏకైక కుమారుడున్నూ మరియు ఇరువురు కూతుర్లు అనగా చెన్నక్కగారి బ్రహ్మానందరెడ్డి గారి భార్య అయిన శ్రీలత అను కనిష్ఠ కుమార్తెయున్నూ మరియు అనిత అను జ్యేష్ఠ కుమార్తెయున్నూ కలిగి యున్నారు. పై తెలిపిన అనిత అను జ్యేష్ఠ కుమార్తె 1995 సం.రంలో మరణించినారు. ప్రస్తుతము దివంగత అనిత కుటుంబీకులు వారి జీవనోపాధి నిమిత్తము అమెరికా దేశములో స్థిరపడియున్నారు. కనిష్ఠ కుమార్తె అయిన శ్రీలత చెన్నక్కగారి బ్రహ్మానందరెడ్డితో వివాహము జరిగినది. మా కక్షికర్త తండ్రి అయిన పెదబల్లి శివారెడ్డి వివాహానంతరము చెడు అలవాట్లకు లోనై తన సంసారం జీవితమును గడపలేక 30-08-2016వ తేదీన ప్రొద్దుటూరు టౌన్‌లో గతించియున్నాడు. మా కక్షికర్త తండ్రి బ్రతికి వుండగా అతనికి తన తండ్రి అయిన చిన్న సుబ్బయ్య ద్వారా స్థిరాస్తులు చెన్నూరు మండలం, దాఖలా చెన్నూరు గ్రామంలో పొందియుండినాడు. అట్టి ఆస్తులను పై తెలిపిన పెదబల్లి శివారెడ్డి తన కుటుంబము పోషించగా మరియు లెక్క చేయకుండా తమ దుర్వ్యసనములకు గాను ఇతరాదుల పేర కుటుంబంలోని సభ్యులను సంప్రదించకుండా మరియు లెక్క చేయక ఇతరాదుల పేర అనగా కుటుంబంతో సంబంధం లేని వారి పేర తప్పుడు పత్రాలు కృత్రిమమైన సంగతులతో సంసారంలోని సభ్యులను సంప్రదించకుండా తన స్వలాభం కోరి దొంగ పత్రములు మరియు చట్ట సమ్మతం లేని పత్రములు విక్రయదారులతో కుమ్మక్కై సృష్టించియున్నాడు.

ఈ క్రింది గల షెడ్యూలు ఆస్తి కూడా మా కక్షికర్తకు పెదబల్లి చిన్న సుబ్బయ్య ద్వారా కలిగియుండిన ఆస్తిని కూడా చెన్నూరు మండలం మరియు చెన్నూరు గ్రామంలో గల ఆస్తిగా వున్నది. కానీ పి.శివారెడ్డి సంతతికి షెడ్యూలు ఆస్తి పిత్రార్జితంగా వున్నది.

మా కక్షికర్త మరియు అతని కుటుంబీకులు, శ్రేయోభిలాషులు వగైరాలు పెదబల్లి శివారెడ్డిని మార్చుటకు చేసిన అనేక ప్రయత్నములు విఫలమైనవి. పై కనపరచిన విషయములు... తండ్రి పెదబల్లి శివారెడ్డి చెన్నూరు మండలం మరియు గ్రామంలో కాపురం వుండే వెంకటరెడ్డి కుమారుడైన వెంకటసుబ్బారెడ్డి పేరయున్నూ మరియు సదరు చెన్నూరు గ్రామం కనపర్తి గ్రామం మజరా బలసింగాయపల్లెలో కాపురం వుండే లేవాకు చిన్నసుబ్బారెడ్డి గారి కుమారుడు నారాయణరెడ్డి పేర కుటుంబ సభ్యుల సమక్షంలో వ్రాయించి ఇచ్చిన 10-11-1995 మరియు ఇతర పత్రములు గురించి O.S. No. 327/2008 అను దావాను 24-10-2008వ తేదీన రాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కడప వారి కోర్టులో తగు పరిహారం గురించి మరియు బాగపరిష్కారములు గురించి చెన్నక్కగారి శ్రీలత, శీలం వెంకటసుబ్బారెడ్డి, తండ్రి వెంకటరెడ్డి సీలాపు చెన్నసుబ్బారెడ్డి అయిదుగురు ప్రతివాదులుపైన దాఖలు చేసియున్నారు. O.S. No.327/2008 దావా రాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కడప వారి కోర్టులో పెండింగులో వుండగా చెన్నక్కగారి శ్రీలత, భర్త చెన్నక్కగారి బ్రహ్మానందరెడ్డి, తండ్రి సుబ్బారెడ్డి, భర్త అయినందువలన O.S. No.327/2008 దావాలో వారసుడిగా రికార్డులలో రెండవవాదిగా చేరి విచారణలో పాల్గొనియున్నాడు. దురదృష్టవశాత్తూ O.S. No.327/2008లో దావా ద్విరర్తగా విచారణ జరిగి 31-03-2023వ తేదీన త్రోసివేయబడినది. అటు తర్వాత మా కక్షికర్త పెదబల్లి వినయ్‌కుమార్‌రెడ్డి (దావాలో 2వ ప్రతివాది) A8 29/2024 అప్పీల్ దావాను దాఖలు చేసివున్నాడు. సారూ అప్పీలు దావా ఈ రోజు సరికి రాజశ్రీ కడప మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టులో పెండింగులో వున్నది. O.S. No.327/2008 దావా పెండింగు కాలంలో 3వ ప్రతివాది అయిన నీలం వెంకటసుబ్బారెడ్డి, తండ్రి వెంకటరెడ్డి మరియు 4వ ప్రతివాది అయిన లేవాకు నారాయణరెడ్డి, తండ్రి వెంకటసుబ్బారెడ్డి ఏవిధమైన సాక్ష్యాదారాలను, రికార్డులను హాజరుపరచి యుండలేదు. మరియు సదరు 3, 4 ప్రతివాదులకు కోర్టు వారు ఎక్స్ పార్టీ సహా చేసియున్నారు. పై విషయములు అన్నియూ సంపూర్ణముగా గుర్తెరిగి మరియు AS 29/2024 అప్పీలు దావా పెండింగులో ఉన్న విషయం సహా మరుగుపరచి వారిరువురు ఇతరాదులు పేర చట్ట సమ్మతం కానీ మరియు చెల్లుబాటు కానీ నామకర్తపు దస్తావేజులను కృత్రిమ విషయములతో సృష్టించి ముఖ్య కర్తకు మరియు ఇతరాదులగు బంగం వాటిల్లునట్లు నడుచుకున్నారు. కానీ పై యన్.వెంకటసుబ్బారెడ్డి (2వ ప్రతివాది) మరియు లేవాకు నారాయణరెడ్డి (4వ ప్రతివాది) నుండి ఎవ్వరి నుంచి ఏవిధమైన క్రయవిక్రయాలు గానీ లేక పత్రాలు వగైరాలు గానీ సృష్టించుకున్న యెడల లేక ఇదివరకే సృష్టించి యుండిన యెడల (పై విషయములు ఒప్పుకోక) అని ఎంత మాత్రం చట్ట పరిధిలో చెల్లుబాటు కాదనిన్నీ మరియు చట్ట సమ్మతం కాదనిన్నీ మా కక్షికర్త ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసియున్నాడు. ఇందులకు అతిక్రమించి ఎవ్వరిని భిన్న వైఖరితో ప్రవర్తించిన యెడల లేక నడుచుకొని పత్రాలు వగైరాలు సృష్టించిన సదరు చర్యలు మా కక్షికర్త, వీరి కుటుంబం ఇతర సభ్యులును గానీ ఎంత మాత్రం "బైండు" చేయువానిన్నీ మరియు మా కక్షికర్త చట్ట పరిధిలో ఉండగల మరియు భవిష్యత్తులో సివిల్, క్రిమినల్ చర్యలకు సంపూర్ణ బాధ్యులు మరియు కష్ట నష్టములకు, దావా ఖర్చులకు బాధ్యత కాగలరు. విజ్ఞతతో నడుచుకొని A8 29/24 రాజశ్రీ మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు కడప, అప్పీల్ దావా పెండింగు విషయములు గౌరవించి నడుచుకోవలెను. ఇందుకు తప్పినంతట మా కక్షికర్తకు కాగల యాపత్తు చర్యలకు సంపూర్ణ బాధ్యులు కాగలరు.

-: షెడ్యూలు :-

కడప డి., కడప Y.S.R. డి., చెన్నూరు మండలం చెన్నూరు రెవెన్యూ గ్రామం సర్వే నెం. 610/1Aలో య 0-64 సెంట్లు మరియు సర్వే నెం.603/1లో య 0-20 సెంట్లు సంపూర్ణ విస్తీర్ణముగల ఆస్తి [O.S. No.327/2005 మరియు AS 25/2024 అప్పీల్‌లో 1వ అయిటం హద్దులతో సహా చూపిన ఆస్తి] మరియు చెన్నూరు రెవెన్యూ దాఖలా చెన్నూరు మండలం, కలిపిన సర్వే నెం.791/5లో య 0-35 సెంట్లు, సర్వే నెం.791/1లో య 0-28 సెంట్లు, సర్వే నెం.792/4 లో య 0-17 సెంట్లు మరియు సర్వే నెం.792/5లో య 0-16 సెంట్లు విస్తీర్ణములు నిఖచ్చి హద్దులతో పై దావాలో 2వ అయిటంగా చూపబడి యున్నది.

కడప సిటీ. యం.అయ్యవారప్ప, సీనియర్ అడ్వొకేట్,
తేదీ: 24.02.2026. కడప, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.